# భారత కార్మికోద్యమ చరిత్ర

1830-2010

సుకోమల్ సేన్



ప్రజాశక్తి బుక్‌హౌస్

సుకోమల్‌సేన్

# భారత కార్మికోద్యమ చరిత్ర

1830-2010

సుకోమల్‌సేన్

# భారత కార్మికోద్యమ చరిత్ర

## 1830-2010


రచన

**సుకోమల్‌సేన్**

తెలుగు

కె.కె.డి. హనుమంతరావు

ఎస్. ధనుంజయరావు



**ప్రజాశక్తి బుక్‌హౌస్ తెలంగాణ**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

109189

ప్రచురణ సంఖ్య : 1354

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2015

వెల : ₹ 500/-

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్** తెలంగాణ

ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్,

ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు

హైదరాబాద్ (చిక్కడపల్లి), బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.

నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం

విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి, ఒంగోలు, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

**website : www.psbh.in**

# విషయసూచిక

ముందుమాట ...................................................................... 7

రచయిత గురించి.................................................................. 9

1. అంతర్జాతీయ పరిస్థితులు ...................................................... 11

2. ప్రాచీన భారతీయ ఆర్థికవ్యవస్థ విచ్ఛిన్నం.................................... 25

3. భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి : కార్మికవర్గ అవతరణ... 33

4. పరిశ్రమాభివృద్ధి – కార్మికవర్గ స్థితిగతులు.................................... 47

5. శ్రామికుల వలస – ప్లాంటేషన్ కార్మికుల స్థితి............................... 65

6. కార్మికోద్యమ ప్రారంభదశ (1850–1900)................................. 85

7. సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలో తొలిదశ (1900–1914) ............ 103

8. మొదటి ప్రపంచ యుద్ధం – కార్మికవర్గ రాజకీయ చైతన్యం
సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధి (1914–1920)......... 127

9. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపన (1920).............. 181

10. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు రెండవ మహాసభ (1921)..................... 205

11. ప్రప్రథమంగా భారతదేశంలో మార్క్సిజం అవతరణ
అంతర్జాతీయ శ్రామికవర్గ సమీకరణ ....................................... 213

12. ఆర్థిక మాంద్యం :
కార్మికవర్గ ఆత్మరక్షణా పోరాటం (1922–1926) ....................... 227

13. పోరాటాల ఉధృతి - వ్యాప్తి (1926-29) ................................... 255

14. ఎ.ఐ.టి.యు.సి.లో చీలిక - సామ్రాజ్యవాదుల దాడి (1929-31)........ 299

15. ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో పోరాటాలు (1931-36)................ 337

16. ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి కాలంలోనూ, రెండవ ప్రపంచ
యుద్ధ ప్రారంభంలోనూ (1937-39) సాగిన తీవ్ర పోరాటాలు ............ 375

17. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో
కార్మికవర్గ పోరాట క్రమం (1939-45)...................................... 393

18. జాతీయోద్యమంలో చివరిదశ : భారత కార్మికవర్గం (1945-47) ......... 421

19. ఆఫీసు, ప్రభుత్వ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్లు.............................. 451

20. నూతన పరిస్థితుల్లో కార్మికవర్గం (1947-1970)........................... 467

21. కార్మిక వర్గంపై ప్రభుత్వ దమనకాండ (1971-1977) ................... 493

22. విభిన్న రాజకీయ దృశ్యం
1977-84లో కార్మిక వర్గ పోరాటాలలో కొత్త పుంతలు..................... 539

23. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం - పెల్లుబికిన కార్మికవర్గ ప్రతిఘటన (1985-1990)............. 581

24. నూతన పరిస్థితి - సమస్యలు, అవకాశాలు
అంతర్జాతీయ పరిణామాల ప్రకంపనలో
అపూర్వమైన ఐక్య కార్మిక పోరాటాలు ........................................ 637

25. సోవియట్ యూనియన్ మరియు తూర్పు యూరప్ దేశాల్లో
సోషలిస్టు వ్యవస్థ పతనం (1991-95)....................................... 661

26. సామ్రాజ్యవాద దురాక్రమణ
భ్రమలుగా రుజువైన సామ్రాజ్యవాదుల జోస్యం ............................... 703

27. తీవ్రమవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ
యుపిఎ ప్రభుత్వ ఏర్పాటు మరియు కార్మికుల ఐక్య ప్రతిఘటన............ 717

28. తీవ్ర ఆర్థిక దుస్థితిలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ....................... 753

# ముందుమాట

ప్రముఖ ట్రేడ్‌యూనియన్ నాయకులు, ప్రసిద్ధ రచయిత సుకోమల్ సేన్ బృహత్తర రచన 'భారత కార్మికవర్గం – ఆవిర్భావం, ఉద్యమం, 1830–2010' క్షుణ్ణంగా సవరించి, విస్తరించిన తృతీయ ప్రతికి తెలుగు అనువాదం ఇది. రచయిత తొలి ప్రతి ముందుమాటలో పేర్కొన్నట్లు ఇది సంప్రదాయసిద్ధమైన ట్రేడ్ యూనియన్ చరిత్రలకు భిన్నమైనది. విస్తృతమైన జాతీయ, అంతర్జాతీయ నేపథ్యంలో భారత కార్మికవర్గ పోరాటాలను రాజకీయాలు, ఆర్థికాంశాల పరస్పర ప్రభావాలను గమనంలోకి తీసుకొని సాగిన రచన ఇది.

భారతదేశంలో కార్మికవర్గ ఆవిర్భావం, సంపన్న దేశాలలో కార్మికవర్గ ఆవిర్భావానికి భిన్నమైన రీతిలో వలసపాలకుల పూర్తి ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో జరిగింది. అందుచేత భారత కార్మికవర్గం పుట్టిన దగ్గర నుండి ఒకవైపున వలసవాదుల రాజకీయ పాలనను, రెండో వైపున దేశ, విదేశీ పెట్టుబడిదారుల ఆర్థిక దోపిడిని ఎదుర్కొవలసి వచ్చింది. ఈ విధంగా భారత కార్మికోద్యమం జాతీయ విముక్తి ఉద్యమంతో పెనవేసుకొని సాగింది. ఈ రకమైన సంబంధం 1947, ఆగస్టులో స్వాతంత్ర్యం లభించేవరకు కొనసాగింది. ఆ తర్వాత బడాబూర్జువావర్గ ఆధిపత్యంలో భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణం జరుగుతున్న సమయంలో భారత కార్మికోద్యమం ముందుకు సాగింది. 1970 వరకు కొనసాగిన ఈ దశను తొలిప్రతి వివరిస్తుంది. 1970వ దశకం తర్వాత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో చోటుచేసుకున్న మార్పుల పర్యవసానంగా ప్రపంచ కార్మికోద్యమ స్వరూప, స్వభావాలలో కూడ మార్పులు సంభవించాయి. దీనితోపాటు శాస్త్ర సాంకేతిక విప్లవం ఫలితంగా కూడ కార్మికవర్గ నిర్మాణం మరింతగా మారిపోయింది. ఈ అంశాలను 1995 వరకు ద్వితీయ ప్రతిలో రచయిత వివరించారు.

ఇప్పుడు మీ ముందున్నది తృతీయ ప్రతి. ఇది 2010 వరకు పరిణామాలను వివరిస్తుంది. నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాలు ఉధృతంగా కొనసాగుతున్న ఈ కాలంలో ప్రపంచ కార్మికవర్గంతో పాటు భారత కార్మికవర్గం కూడ అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది. భారత ప్రభుత్వ కార్మికవర్గ వ్యతిరేక వైఖరి, విధానాలు, దానికి ప్రతిగా కార్మికవర్గ పోరాటాలు, ఉద్యమాలను తగు వివరాలతో రచయిత విశ్లేషించారు. అంతేకాదు, ఈ ప్రతి క్షుణ్ణంగా సవరించబడింది. భారత కార్మికోద్యమం తొలిరోజుల్లో కేరళ ట్రేడ్ యూనియన్ ఉద్యమం గురించి భారత దేశంలో కీలక పరిశ్రమల్లో ఒకటయిన బొగ్గుగనుల రంగంలో కార్మికవర్గ ఉద్యమ ఆవిర్భావం గురించి కూడ వివరాలను రచయిత దీనిలో పొందుపరిచారు.

ఈ పుస్తకం మొత్తాన్ని ఎల్ఐసి ఉద్యమ నాయకులు కెకెడి హనుమతరావు, ఎస్. ధనుంజయరావులు అనువదించారు. వీరిరువురికి ప్రత్యేక ధన్యవాదాలు. భారతకార్మికోద్యమ చరిత్రను దాని ప్రత్యేకతలను ప్రతిబింబించే ఇంతటి సమగ్ర గ్రంథం తెలుగులో లేదు. అలాంటి అపురూపమైన ప్రచురణను పాఠకులకు అందిస్తున్నందుకు ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎంతో గర్విస్తున్నది. మా ఈ కృషిని ఆదరించి సద్వినియోగం చేసుకోగలరని ఆశిస్తున్నాము.

**ప్రజాశక్తి బుక్‌హౌస్,**

**హైదరాబాద్**

# రచయిత గురించి

పారిశ్రామిక విప్లవం ప్రారంభం కావడంతో, పెట్టుబడిదారీ వర్గంతో పాటే ఆధునిక కార్మిక వర్గం అవతరించింది. ఇది ఎంతో శ్రమకోర్చి రచించిన పరిశోధనా గ్రంథం. 1830 నుండి 2010 వరకు దేశంలో కార్మికోద్యమ అవతరణ, పురోగమనానికి సంబంధించి చరిత్రని ఈ గ్రంథం చక్కగా విశ్లేషిస్తుంది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం, నయా ఉదారవాద దశలో ప్రవేశించిన తర్వాత కార్మిక వర్గ కార్యాచరణనీ ప్రత్యేకంగా విశ్లేషించడం జరిగింది. భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో విప్లవ కార్మికోద్యమానికి, సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి మధ్య తలెత్తిన సంఘర్షణలనీ ప్రత్యేకంగా వివరించింది. గతంలో 1995 వరకు వివరించిన పరిణామాలను 2010 వరకు తాజాపరచినది ఈ గ్రంథం.

కలకత్తా యూనివర్శిటీ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన ఈ గ్రంథ రచయిత శ్రీ సుకోమల్‌సేన్, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సుదీర్ఘకాల అనుభవం గల్గిన నాయకుడు. 80 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (A.I.S.G.E.F.) ప్రారంభించబడిన 1960 నుండి దానితో మమేకమై పని చేశారు. 1982లో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఆయన 2008 డిసెంబర్ వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు.

ఆయన అంతర్జాతీయ కార్మికోద్యమంలో కూడా ఎనలేని కృషి చేశారు. 1982లో నాటి జెకోస్లోవేకియాలోని ప్రేగ్ నగరంలో జరిగిన ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్ సంస్థ డైరెక్టివ్ కమిటీ సమావేశంలో పాల్గొనడంతో, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ఆయన కృషి ప్రారంభమైంది. 1996లో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి, ఆ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కోల్‌కతాకు మార్చి, దానిని పునర్నిర్మించే కృషి చేశారు. 2009 చివరి వరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. 2011 వరకు డబ్ల్యు.ఎఫ్.టి.యు. అధ్యక్ష వర్గంలో సభ్యునిగా వున్నారు. సి.ఐ.టి.యు. అఖిల భారత ఉపాధ్యక్షునిగానూ,

A.I.S.G.E.F. సీనియర్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీ సుకోమల్‌సేన్ ఇతర అన్ని రంగాల్లోని ట్రేడ్ యూనియన్ ఉద్యమంతో సన్నిహిత సంబంధాలు కల్గివున్నారు.

భారత కార్మికోద్యమ చరిత్ర మీద ఆయన గత గ్రంథం దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడింది.

అంతర్జాతీయ కార్మికోద్యమ ఆరంభం నుండి 2011 వరకు నడిచిన "అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్రను" రచించారు. "భారతదేశంలో మేడే మరియు 8 గంటల పని దినం కోసం పోరాటం", "కమ్యూనిస్టు ప్రణాళిక – ఒక విప్లవ సిద్ధాంతం – 150 సం॥ల సందర్భంగా నివాళి", A.I.S.G.E.F. చరిత్ర వంటి గ్రంథాలు రచించారు. అంతేగాక, "భారతదేశంలో సంస్కృతి మరియు సామాజిక విప్లవానికి సంబంధించిన సమస్యలు", "ఫాసిజం", "భారత జాతీయోద్యమంలో కార్మిక వర్గ పాత్ర", "కులం, మతం మరియు భారతీయ సమాజం" వంటి అంశాల మీద తన మాతృభాష అయిన బెంగాలీలో అనేక గ్రంథాలు రచించారు. అనేక పత్రికలకు వ్యాసాలు రాస్తున్నారు.

"భారతదేశంలో మేడే ఆవిర్భావం" గురించి రాసిన సుకోమల్‌సేన్, ప్రపంచవ్యాప్తంగా మేడే గురించి ఆయన అతి పెద్ద సంకలన గ్రంథాన్ని ఇటలీలోని మేడే ఇన్‌స్టిట్యూట్ ప్రచురించింది. ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్. అధికార పత్రిక 'ఎంప్లాయీస్ ఫోరం" 1979లో అవతరించిన నాటి నుండి దానికి ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. 1982 నుండి 1994 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరఫున రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు.

# 1

# అంతర్జాతీయ పరిస్థితులు

పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఆధునిక కార్మికవర్గ ఉద్యమం అవతరించింది. సరిగ్గా ఇంగ్లాండు కేంద్రంగా పారిశ్రామిక విప్లవం ఆసియాఖండంలో విస్తరిస్తున్న సమయంలోనే భారతదేశం వలస పాలనలోనికి నెట్టబడింది. అందువలన పారిశ్రామిక విప్లవం ఈ గడ్డ మీద జరగడానికి బదులుగా ఇంగ్లండు దేశానికి వలస దేశంగా వున్న ఇండియా పాలకదేశమైన ఇంగ్లండ్, పారిశ్రామిక విప్లవాన్ని త్వరితం చేసింది. ఇదే సమయంలో భారతదేశంలో తరతరాలుగా కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమయింది. కనుక ఇండియాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి చాలా ఒడిదుడుకులతో కూడి చాలా ఆలస్యంగా జరిగింది. ఈ కారణంగానే భారతదేశంలో కార్మిక వర్గ ఉద్యమం కూడా చాలా ఆలస్యంగానే అభివృద్ధి చెందసాగింది. భారతదేశంలో కార్మికవర్గ ఉద్యమాన్ని గురించి పరిశీలన జరిపేముందు యూరప్‌లో కార్మికోద్యమం పుట్టుక, దానిలోని ప్రధాన ధోరణులను, నిర్మాణపరంగానూ, సిద్ధాంతపరంగానూ వచ్చిన పరిణామాలను స్పష్టంగా అర్థం చేసుకొనవలసిన అవసరం ఎంతయినా వున్నది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రాచీనమైన ఫ్యూడల్ ఆర్థిక విధానం నుండి ఆధునిక పెట్టుబడిదారీ విధానం వరకు వచ్చిన మార్పును పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిగా చెప్పుకుంటున్నాం. ఈ సుదీర్ఘమైన పరిణామ క్రమానికి 16వ శతాబ్దం మధ్య భాగంలోనే బీజాలు పడ్డాయి. 16వ శతాబ్దం మధ్య భాగం నుండి సుమారు 18వ శతాబ్దం చివరి వరకు దాదాపు రెండు వందల సంవత్సరాల సుదీర్ఘకాలం విస్తరించిన ఈ పరిణామ క్రమంలో వస్తువుల ఉత్పాదన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ప్రధాన లక్షణంగా వుండేది. ఇంతకు ముందు కూడా కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకొనే జీవనం సాగిస్తుండేవారు. కాని వారు స్వతంత్రులయ్యే అవకాశాలు మాత్రం వుండేవి.

సరుకుల అవసరం ఎక్కువై ఉత్పత్తి ఎక్కువ చేయవలసి రావడంతో అనేకమంది కార్మికులు ఒకచోట చేరడం మొదలయింది. వీరిలో పని విభజన కూడా ప్రారంభమయింది. ఈ సామాజిక శ్రమ విభజన వలన కొందరు కొన్ని రకాల పనులలో నైపుణ్యం సంపాదించడంతో వ్యక్తుల విలువ తగ్గి, ఉత్పత్తి క్రమం నుండి వేరు చేయబడి అనేక ఆంక్షలకు గురిచేయబడ్డారు.

ఒక కళాకారునిగా తన సాధారణ నైపుణ్యాన్ని, స్వతంత్రంగా పనిచేసే శక్తి సామర్థ్యాలను కోల్పోయి కార్మికుడు ఉన్నత స్థాయి నైపుణ్యాన్ని సంపాదించవలసి వుండేది.

సరుకుల ఉత్పత్తి ప్రారంభం కాకముందు అనుభవజ్ఞులైన వృత్తి కళాకారులు చేసిన ఉత్పత్తినే తరువాత రోజుల్లో కొద్ది మంది నైపుణ్యం గల్గిన పనివారు, అనేకమంది నైపుణ్యం లేని పనివారి సమిష్టి కృషి ఫలితంగా సాధించారు. 18వ శతాబ్ది చివరి భాగంలోనూ, 19వ శతాబ్దం ప్రారంభంలోనూ సాగిన పారిశ్రామిక విప్లవం ఈ పరివర్తనను పరిసమాప్తి చేసింది. శారీరక శ్రమ ద్వారా ఉత్పత్తి కొనసాగే చేతివృత్తుల స్థానంలో యంత్రాలను విస్తృతంగా ఉపయోగించే భారీ పరిశ్రమలు అవతరించాయి. ఈ పరిణామదశలో నూతన విషయాలు కనుగొనబడడం, నూతన యంత్రాలు ప్రవేశపెట్టబడడం జరిగింది. అంతేగాక యీ దశలోనే రెండు ప్రధాన వర్గాలవతరించాయి. ఫ్యాక్టరీలతో సహా ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం వహించి కార్మికులను దోపిడీ చేసే బూర్జువా వర్గం, ఉత్పత్తి సాధనాలు ఏ మాత్రం తమ ఆధీనంలో లేక కేవలం జీతాల కొరకు రెక్కలమ్ముకునే శ్రామికవర్గం అవతరించాయి.

యూరపు దేశాలన్నింటిలోనూ ఇంగ్లండే ప్రప్రథమంగా పారిశ్రామిక విప్లవాన్ని చవిచూసింది. దీనికి రెండు ప్రధాన కారణాలు చెప్పుకోవచ్చు. ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా విజయవంతంగా పోరాటం సాగించి దేశాన్ని (ఇంగ్లండ్‌ను) ఫ్యూడలిజం సంకెళ్ళ నుండి విముక్తి చేయడంలో ఇంగ్లండ్‌లోని పెట్టుబడిదారీ వర్గం నాయకత్వ స్థానంలో వుంది. ఇంతేగాక బ్రిటిషు వలసవాదులు ఇండియా తదితర వలస దేశాలను కొల్లగొట్టి ఆ సంపదను ఇంగ్లండ్‌కు తరలించారు. ఈ సంపద ఇంగ్లండులో పెట్టుబడిదారీ పరిశ్రమలను నిర్మించడంలో ప్రముఖ పాత్ర వహించింది. వాస్తవానికి 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం తర్వాత భారతదేశం నుండి అశేష ధనరాసులు ఇంగ్లండ్‌కు తరలించబడ్డాయి.

బ్రిటన్ దేశంలో ప్రాచీనమైన ఫ్యూడల్ వ్యవస్థకు, ఆధునాతనమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు మధ్య సాగుతున్న బలవత్తరమైన పోరాటం 1640 విప్లవంతో పరాకాష్టకు చేరుకుంది. బ్రిటన్ రాజు ప్రజలపై పన్నులు వేయడానికి ప్రయత్నించడంతో రాజుకు, పార్లమెంట్‌కు మధ్య వైషమ్యాలు, విభేదాలు ఏర్పడ్డాయి. ఈ విభేదాలే బ్రిటన్‌లో అంతుర్యుద్ధానికి తక్షణ కారణాలయ్యాయి. ఈ పోరాటంలో పరిశ్రమలతో సంబంధాలున్న పెట్టుబడిదారులు పార్లమెంట్‌తో పూర్తిగా సహకరించారు. కాని నిజానికి రాజ్యాధికారం "పురోగమిస్తున్న పెట్టుబడిదారీ వర్గం" చేతిలో వుండాలా లేదా "ఫ్యూడల్ పాలకవర్గాలు, వారి మద్దతుదారుల" చేతుల్లో వుండాలా అనేదే ప్రధాన సమస్య. ఈ పోరాటంలో విజయం సాధించి పెట్టుబడిదారీవర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుంది.

సరిగ్గా ఇదే సమయంలో శాస్త్ర విజ్ఞానం పురోగమించి అనేక నూతన విషయాలు కనుగొనబడ్డాయి. ఈ పరిణామం పారిశ్రామిక విప్లవానికి మరింత దోహదం చేసింది. మొట్టమొదటిసారిగా నూలు పరిశ్రమలో యంత్ర పరికరాలు ప్రవేశపెట్టబడ్డాయి. 1765లో

హార్‌గ్రీవ్స్ 'స్పిన్నింగ్ జెన్నీ'ని కనుగొనడంతో యంత్ర యుగం ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆ తరువాత జేమ్స్‌వాట్ ఆవిరి యంత్రం, రిఛార్డ్ ఆర్క్‌రైట్, శామ్యూల్ క్రాంప్టన్ కనుగొన్న జౌళిమిల్లు యంత్రాలు, ఎలీవైట్నీ కనుగొన్న కాటన్ జిన్ యంత్రం, ఫిల్టన్ కనుగొన్న ఆవిరితో నడిచే పడవ మొదలైన యంత్ర పరికరాలు కనుగొనబడటంతో పారిశ్రామిక విప్లవం మరింత పురోగమించింది. ఈ విప్లవాత్మకమైన పరిశోధనలతోబాటు, త్వరత్వరగా విస్తరించిన బొగ్గు, ఇనుము, టెక్స్‌టైల్ పరిశ్రమలు, రైలు మార్గాలు పారిశ్రామిక విప్లవానికి సాంకేతిక పరమైన పునాదులు వేశాయి.

అంటే పారిశ్రామిక విప్లవానికి రెండు ప్రధానమైన కారణాలు కన్పడుతున్నాయి. ఒకటి సాంకేతిక పరమైనది. అంటే యంత్ర పరికరాలు కనిపెట్టబడి విశేషంగా ఉపయోగంలోకి రావడం. రెండవది సామాజికమైనది. అంటే పాత ఫ్యూడల్ వ్యవస్థ అంతరించి దాని స్థానే నూతనంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడడం. నూతనంగా రూపుదిద్దుకుంటున్న ఈ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో బూర్జువా వర్గం, శ్రామిక వర్గం అనే రెండు ప్రధానమైన వర్గాలేర్పడడం జరిగింది.

పారిశ్రామిక విప్లవం విస్తరించడంతో మానవశక్తి పరిమితులను మించి యంత్రశక్తి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది. దీనితో ఉత్పత్తి క్రమము పూర్తిగా మారిపోయింది. సరుకుల ఉత్పత్తి ప్రారంభించబడిన తొలిదశలో ఉత్పత్తిలోని వివిధ ప్రక్రియలను సమన్వయం చేయవలసి రావడంతో సామాజిక శ్రమను సమీకరించవలసిన అవసరం ఏర్పడింది. కానీ, అప్పటికే ఉత్పత్తి క్రమంలో వున్న భౌతిక పరిస్థితుల వలన కార్మికుడు కేవలం ఉత్పత్తే ధ్యేయంగా గల భారీ పరిశ్రమలలోని యంత్రాలకు పూర్తిగా బానిస అయ్యాడు. దీని వలన వినాశనకరమైన పరిస్థితులేర్పడ్డాయి. పెట్టుబడిదారీ విధానం ఫలితంగా కార్మికులు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. పెట్టుబడిదారీ విధానం పురోగమించడంతో ఈ నూతన ఉత్పత్తి విధానంలో శరీర దారుఢ్యంతో పనిలేదు. కష్టపడి నైపుణ్యాన్ని సంపాదించవలసిన అవసరం లేదు. అందువలన స్త్రీ, బాల కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వలన శ్రామిక ప్రజానీకం శారీరకంగానూ, మానసికంగానూ దుష్ప్రభావానికి లోనయింది. మానవశక్తి మీద యంత్రశక్తి ఆధిక్యత సంపాదించడంతో పెట్టుబడిదారుల లాభాపేక్షకు అంతూపొంతూ లేకుండా పోయింది. ఈ పెట్టుబడిదారుల అత్యాశ ఫలితంగా కార్మికుల పనిగంటలు పెరిగాయి. ఈ యంత్రాల వలన కార్మికులు ఎక్కువ శ్రమ తీవ్రతకు లోనవడం జరుగుతున్నది. అంటే ఒకే కాలపరిమితిలో ఎక్కువ శ్రమ చేయవలసివస్తుంది. అంతేకాక కార్మికులు నికృష్టమైన వేతనాలకు కూడా పనిచేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

కార్మికోద్యమం జాతీయ స్థాయి ఉద్యమంగా అభివృద్ధి చెందడానికి పారిశ్రామిక విప్లవమే కారణమైనప్పటికీ, ఇంగ్లండ్‌లో 1752వ సం॥ నుండే ట్రేడ్ యూనియన్లు ఆవిర్భవించడం ప్రారంభమయింది. దీనికి పూర్వమే శ్రామికులందరు కలసి మెలసి వుండటం ఇంగ్లీషు వారి జీవన విధానంలో అతి సామాన్యమైన విషయంగా వుండేది.

సరుకుల ఉత్పత్తి ప్రారంభమైన తొలిరోజుల్లో కూడా కార్మికుల, పెట్టుబడిదారుల ప్రయోజనాలు పరస్పర విరుద్ధమైనవయినప్పటికీ, కార్మికులు ఈ వ్యవస్థను సహించి వూరుకున్నారు. పేద రైతుల విషయంలో యిది స్పష్టంగా అవగతమౌతుంది. బలసంపన్నులైన భూస్వాములు పేద రైతులను వారి భూముల నుండి బలవంతంగా వెళ్ళగొడితే, వీరందరూ కొత్తగా ఏర్పాటు గావించబడిన పరిశ్రమలలో తమ జీవనాధారం చూసుకోసాగారు. కాని అనతికాలంలోనే ఈ నిర్లిప్తత తీవ్రమైన సంఘర్షణలకు దారి తీసింది. వాస్తవానికి మధ్యయుగంలో (సుమారు క్రీ.శ. 600–1500 మధ్యకాలంలోనే) చెదురుమదురుగా ఈ సంఘర్షణలు జరిగాయి. 18వ శతాబ్దం నాటికి ఈ తిరుగుబాటు తీవ్రతరమై, వివిధ పారిశ్రామికవాడలలోని నిపుణులైన కార్మికులను ఏదో కొంతమేరకైనా ప్రభావితం చేయగల్గాయి.

పెట్టుబడిదారీ విధానం ప్రారంభమై, భారీ పరిశ్రమలు నెలకొల్పబడని రోజుల్లో నైపుణ్యం అవసరమున్న అనేక పరిశ్రమలలో, అప్రెంటిస్‌లు నిపుణులైన పనివారుగా తయారవడం కూడా చాల కష్టసాధ్యంగా వుండేది. అందువలన కూలీలుగా పనిచేస్తున్న అప్రెంటీస్‌లు జీవితంలో ప్రగతిని సాధించడం అసాధ్యమని గుర్తించారు. దీనితో నిపుణులైన వీరు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకునేందుకు ట్రేడ్ క్లబ్‌లను ట్రేడ్ యూనియన్‌లుగా వినియోగించుకొనడం ఉధృతం చేశారు. ఉన్ని పరిశ్రమలో నేతపనివారు కూలీల స్థాయికి దిగజార్చబడ్డారు. ఈ పరిస్థితులలో తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకొనేందుకు కార్మికులు ఏకం కావడం ప్రారంభించారు కాని భారీ పరిశ్రమలలోని కార్మికులలో ఐక్యత తక్కువ స్థాయిలో వున్నది. ఏ ఒక్క బొగ్గుగనిలోనూ గని కార్మికులకు సరియైన సంఘమంటూ ఒకటి లేదు. ఇంజనీరింగ్, ఇనుము పరిశ్రమలలో ట్రేడ్ యూనియన్లు నిపుణులైన కార్మికులకు మాత్రమే పరిమితమయ్యాయి. నైపుణ్యం లేని కార్మికులు యూనియన్లలో లేరు. ఉత్పత్తి పురోగమించటంతో నైపుణ్యం కలిగిన పనివారికి డిమాండ్ పెరిగింది. దీనితో పట్టణాలలో నైపుణ్యం కలిగిన పనివారి ట్రేడ్ క్లబ్‌లు మరింత శక్తివంతంగా తయారయ్యాయి. మధ్యయుగాల నాటి నుండే పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలు గల్గిన పెట్టుబడిదారీ, శ్రామికవర్గాల సంబంధాల విషయంలో “చట్టం” కూడా యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తోంది (14వ శతాబ్దంలో తీవ్రమైన వ్యాధులకు గురయి, కార్మికులు అసంఖ్యాకంగా మృత్యువాతబడ్డారు) . కొన్ని పరిశ్రమలలోని కార్మికులకు ఈ పరిస్థితులకు ముందున్న స్థాయిలోనే జీతాలు నిర్ణయించడానికి 1349లో ఒక ఆర్డినెన్స్ జారీ చేయబడింది. 1640 నాటికి న్యాయాధికారులు తమ ఇష్టానుసారం జీతాలను నిర్ణయించే విధానం అన్ని రంగాలకు విస్తరించబడింది. నిపుణులైన పనివారి జీవన ప్రమాణాలను క్రమబద్ధం చేయడానికి ఎలిజిబెత్ రాణి శాసనం చేసిననాటి నుండే ప్రభుత్వమే శ్రామికుల స్థితిగతులను క్రమబద్ధం చేయాలనే సాంప్రదాయం కొనసాగుతోంది. ఎలిజిబెత్ శాసనంలో పేర్కొనబడిన విధంగా జీతాలు తక్కువగా వున్నాయని గాని, పని గంటలు ఎక్కువగా వున్నాయనిగాని, అప్రెంటిస్‌షిప్ నిబంధనలను యజమానులు పాటించని సందర్భాలలోనూ, తన సమస్యలను నేత పనివాడు లేక నైపుణ్యం కలిగిన ఏ పనివాడైనా పార్లమెంట్‌కు గాని, ప్రభుత్వానికి గాని విన్నవించు కోవచ్చు. ప్రారంభంలో కొన్ని సందర్భాలలో పార్లమెంట్ కార్మికుల సమస్యలను పరిశీలించి కొన్నింటిని పరిష్కరించినప్పటికీ, రాను రాను

భవిష్యత్తులో కార్మికులు సంఘటితమయ్యే ప్రాథమిక హక్కుపైనే పరిమితులు విధించటానికి పూనుకున్నది. శాసనంలోని నిబంధనలు కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉద్దేశించినవి కాదని, వాటివలన ప్రయోజనం లేకపోగా మిక్కిలి ప్రమాదకరమైనవని యజమానులు వాదనలు చేయడం ప్రారంభించారు. తమ ప్రయోజనాల పరిరక్షణ కొరకు కార్మికులు చేస్తున్న విజ్ఞప్తుల కంటే యజమానుల వాదనలకే పార్లమెంట్ ఎక్కువ విలువ యిచ్చింది. దీనితో క్రమక్రమంగా ఒక్కొక్క పరిశ్రమ మీద నియంత్రణలు తొలగించబడ్డాయి.

నిజానికి మధ్యయుగాంతానికే కార్మికుడు ఐక్య పోరాటాల ద్వారా తన పనిని, జీవితాన్ని నిర్ణయించుకునే హక్కు, మార్పు చెందని ప్రకృతి సూత్రాల మీద ఆధారపడిన ఉదారవాద సిద్ధాంతం మీద ఆధారపడిన చట్టాల ద్వారా కాలరాయబడింది. ఈ ధోరణులు కేవలం ఇంగ్లండ్‌కే పరిమితం కాక ఫ్రాన్స్, జర్మనీ, తదితర పశ్చిమ దేశాలలో కూడా వ్యక్తమయ్యాయి. పవిత్రమైన రోమన్ సామ్రాజ్యమంతటా అప్రెంటిస్ యూనియన్లపై నిషేధం విధిస్తూ 1731లో చట్టం చేయబడింది. ఈ విధమైన చట్టాలను అన్ని యూరోపియన్ రాజ్యాలూ అమలు పరిచాయి. అనేకమంది చిన్న చిన్న ఉత్పత్తిదారుల మధ్య పోటీని ప్రోత్సహించడం ద్వారానూ, ఆస్తి సంబంధాలను గ్యారంటీ చేయడం ద్వారా మాత్రమే స్వాతంత్ర్యం, సమానత్వం సాధించడం సాధ్యమవుతుందని, ప్రకృతి సూత్రాలు మార్చవీలులేనివని, మధ్యయుగం నాటి భావాలను సమర్థించే ఉదారవాద ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రచారం సాగించారు. ఈ ఉద్దేశ్యంతోనే కొన్ని వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన సంఘాలను నిషేధించాలని వీరుకోరారు. ఈ వర్గ సంఘాలు కొనసాగినట్లయితే ఇతరుల స్వాతంత్ర్యానికి భంగం వాటిల్లుతుందని వీరు భయం వ్యక్తం చేశారు. యూరపును ఉగ్రూతలూగించిన బూర్జువా విప్లవాలు కూడా ఈ పరిస్థితులను మార్చలేకపోయాయి. కార్మికులు కూడా తమను తాము తక్కువగా అంచనా వేసుకుని తక్కువ జాతివారుగా భావించడంతో ఉదారవాద భావాలకు బానిసలుగా వుంటూ వచ్చారు. కాని, ఈ పరిస్థితులు కలకాలం కొనసాగలేదు. రాజకీయంగా సమాన హక్కులు కోరడం ద్వారాను, అల్పసంఖ్యాకులైన దోపిడీ వర్గప్రయోజనాల పరిరక్షణకు రాజ్యాధికారం దుర్వినియోగం కాకుండా అడ్డుకొనడం ద్వారా మాత్రమే తమ హక్కులను తిరిగి పొందగలమని కార్మికులు, మేధావులు గుర్తించడం జరిగింది. అందువలననే ఫ్రాన్స్ వెలుపల నుండి ఫ్రెంచి విప్లవానికి మద్దతునిచ్చిన వారిలో కార్మికవర్గాన్ని, విప్లవ భావాలను సంతరించుకున్న మేధావి వర్గాన్ని ప్రధానంగా పేర్కొనాలి.

ఫ్రెంచి విప్లవానికి మద్దతుగా సాగుతున్న ప్రజాస్వామిక, మానవ హక్కుల పోరాటాలకు అంతర్జాతీయంగా సంఘీభావం, సౌహార్ద్రత సంపాదించాలనే అవగాహనకు ఇంగ్లీషు కార్మికవర్గం సామాజిక పునాది వేసింది.

బ్రిటన్‌లోని కార్మికులలో ఐక్యత, ప్రతిఘటనాశక్తి నానాటికి అభివృద్ధి చెందసాగాయి. దీనితోబాటు 18వ శతాబ్దం చివరి దశకంలో ఇంగ్లండు, ఫ్రాన్స్ దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో సమ్మెపోరాటాలు ఉధృతంగా సాగాయి. 1789లో ఫ్రాన్స్‌లో సాగిన ఫ్రెంచి విప్లవం కార్మికవర్గాన్ని మరింత ఉత్తేజపరిచింది. ఈ పరిస్థితులను గాంచిన బ్రిటిషు ప్రభుత్వం హడలిపోయి

కార్మికులు సంఘటితమయ్యే హక్కును కాలరాస్తూ 1799–1800 కాంబినేషన్ చట్టాలు చేసింది. ఈ చట్టాలతోబాటు 1794లోనే హెబియస్ కార్పస్ (నిర్బంధించిన వ్యక్తిని 24 గంటల్లో న్యాయస్థానంలో హాజరుపరచడం)ను కూడా రద్దుచేయడంతో కార్మికులు ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేసుకునే ప్రాథమిక హక్కును కూడా కోల్పోయారని చెప్పవచ్చు.

1799–1800 కాంబినేషన్ చట్టాలు చేయడం, కార్మికులు సంఘటితం కావడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం నూతనంగా అవలంభించిన విధానమేమీ కాదు. వాస్తవానికి యీ చర్య వేతనాల పెంపుదల, పని గంటల తగ్గింపు కోరుతూ కార్మికులు సంఘటితంగా కార్యాచరణకు పూనుకోకుండా చేయడానికి, 1548లో పార్లమెంట్ "హోటల్ కార్మికులు (భోజన సామాగ్రి అందించువారు) ఇతర కార్మికుల కుట్రలకు" వ్యతిరేకంగా చేసిన చట్టానికి కొనసాగింపు మాత్రమే. సాధారణ మేజిస్ట్రేట్ కోర్టులలోనే నిందితులపై విచారణను సులభతరం చేయటమే, ఈ తాజా చట్టాల ప్రధాన ఉద్దేశం.

సమాజపు చరిత్ర పుటలు తిరగేస్తే "పెట్టుబడి" పుట్టిననాటి నుండే పెట్టుబడిదారునికి – కార్మికునికి మధ్య వైరుధ్యాలు ప్రారంభమైనాయని స్పష్టమౌతుంది. సరుకుల ఉత్పత్తి విధానం కొనసాగుతున్నంత కాలం యీ వైరుధ్యాలు చెలరేగుతూనే ఉంటాయి. ఉత్పత్తి క్రమంలో యంత్రాలు ప్రవేశపెట్టబడడంతో మానవ శ్రమ స్థానాన్ని యంత్రశక్తి ఆక్రమించింది. తమ దుస్థితికి యంత్రాలే కారణమనే ఊహతో జీవనాధారం పోగొట్టుకున్న వృత్తిపనుల వారు యంత్రాన్ని "పెట్టుబడి"కి ప్రతిరూపంగా భావించి వాటిని నాశనం చేయడం ప్రారంభించారు. అందువలన 17వ శతాబ్దంలో యూరపులో రిబ్బను, లేస్‌లు అల్లే గృహాలకు వ్యతిరేకంగా కార్మికులు తిరుగుబాటు చేశారు. ఒక డచ్చి దేశస్తుడు గాలి సహాయంతో నడిచే రంపపుకోత మిల్లును లండనుకు సమీపంలో నిర్మించుకున్నాడు. 1630 లో దీనిని ప్రజలు సర్వనాశనం చేశారు. 1758లో ఎవరెట్ జలశక్తితో నడిచే ఉన్నిని కత్తిరించే యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కాని పనులు పోగొట్టుకున్న సుమారు 10 లక్షల మంది ప్రజలు ఈ యంత్రాన్ని భస్మీపటలం చేశారు. ఉన్నిని చిక్కు తీసి దానిని ఏకడం ద్వారా జీవనోపాధిని సంపాదించుకుంటున్న సుమారు 50 వేలమంది కార్మికులు, ఉన్ని పరిశ్రమలో ఆర్క్‌రైట్ కనిపెట్టిన యంత్రాలను ప్రవేశపెట్టడాన్ని నిరోధించవలసిందిగా పార్లమెంటుకు విజ్ఞప్తి చేశారు.

యంత్రాలను బహిష్కరించవలసిందిగా కార్మికులు అనేకసార్లు పార్లమెంటుకు విజ్ఞప్తి చేశారు. దీనికి బదులుగా "యంత్రాలను, ఫ్యాక్టరీలను విధ్వంసం చేసేవారికి ఉరిశిక్ష విధించాలని" పార్లమెంటు చట్టాన్ని చేసింది. ఈ చట్టం చేయబడినప్పటికీ 19వ శతాబ్దం ప్రారంభంలో కార్మికులు యంత్రాలను విధ్వంసం చేయడం మరింత తీవ్రరూపం దాల్చింది. కొన్ని సందర్భాలలో యంత్రాల విధ్వంసంతో పాటు సమ్మె పోరాటాలు కూడా కొనసాగాయి. కాని ఈ చర్యలు చెదురుమదురుగా సాగి కేవలం టెర్రరిస్టు చర్యలకు సంకేతాలుగా మాత్రమే నిలిచాయి. ఇదిలా వుండగా "లుడయిట్‌లు" (1811–1816 మధ్య కాలంలో యంత్రాలను నాశనం చేయడానికి పూనుకున్న టెక్స్‌టైల్ కార్మికులు) మాత్రం యంత్రాల విధ్వంసానికి పద్ధతి ప్రకారం ప్రచారం సాగించారు.

1815 నాటికి ఈ "లుడయిట్' ఉద్యమాలు మిడ్‌లాండ్స్, యార్క్‌షైర్, లాంక్‌షైర్, చెషైర్‌లలో కొనసాగాయి. యంత్ర విధ్వంసకులకు మరణశిక్ష విధించడాన్ని, 1812లో లార్డ్‌బైరన్ ప్రభువుల సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్)లో తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం ఆ చట్టాన్ని ప్రయోగించడానికే పూనుకొన్నది. 1813లో యార్క్‌షైర్‌లో 18 మంది కార్మికులు ఉరితీయబడ్డారు. చివరకు భయోత్పాతాన్ని సృష్టించి ప్రభుత్వం ఈ తిరుగుబాటును అణచగలిగింది. కాలం గడుస్తున్న కొద్దీ కార్మికులలో ఉద్రేకం స్థానంలో ఆలోచన చోటు చేసుకొనడం ప్రారంభమైంది. దీనితో అప్పటివరకు యంత్రాలే తమ దుస్థితికి మూల హేతువుగా భావించిన కార్మికులు, వాస్తవానికి తమ దురవస్థకు కారణాన్ని, తాము దాడిని ఎవరిపైన కేంద్రీకరించవలసింది గుర్తించసాగారు. మార్బ్ మాటల్లో చెప్పాలంటే "యంత్రాలకు, వాటి స్థాపనకు కారణమైన పెట్టుబడికి మధ్య తేడాను గుర్తించి తమ దాడులను ఉత్పత్తి పరికరాలపై గాక, ఉత్పత్తి విధానం పైకి మళ్ళించాలని శ్రామిక ప్రజానీకం కాలక్రమేణా తన అనుభవం ద్వారానే గ్రహించగల్గింది."

19వ శతాబ్దం రెండవ అర్ధభాగంలో మరల యంత్ర విధ్వంసం మరొకసారి చెలరేగింది. 1865లో షఫీల్డులోని లోహాలను కోసే కార్మికులు యంత్ర విధ్వంసానికి తలపడ్డారు. ఇదే విధంగా పారిశ్రామికీకరణ స్థాయిని బట్టి యితర దేశాలలో కూడా యీ విధ్వంసక చర్యలు ప్రత్యక్షమైనాయి. 1831లో లైయన్ పట్టు పరిశ్రమలోని కార్మికులు, 1844లో సైలీషియన్ నేత పనివారు తిరుగుబాటు చేశారు.

యంత్ర విధ్వంసం, లుడైయిజంలు విస్తృతంగా వ్యాప్తి చెంది వాస్తవానికి ఒక చరిత్రనే సృష్టించాయని చెప్పవచ్చు. కాని ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రగతికి యీ పద్ధతులు ఏమాత్రం దోహదం చేయలేకపోయాయనేది కూడా వాస్తవం.

ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల మధ్య యుద్ధాలు జరిగిన తరువాతి కాలంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం అనేక కష్టాలనెదుర్కొంది. సమిష్టి సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకొనేందుకు యజమానులు నిరాకరించడంతో సమ్మెలు తరచుగా హింసాత్మక చర్యలకు దారితీయడం, కార్మికులు ఓటమి పొంది యజమానుల వేధింపులకు గురవడం, తాత్కాలికంగా యూనియన్లు విచ్ఛిన్నం గావడం సంభవించేది. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఇంతటి గందరగోళ పరిస్థితులేర్పడినప్పటికీ గత (18వ) శతాబ్దంలో సాగిన ఫ్రెంచి విప్లవం, యూరోపియన్ కార్మికవర్గ భవిష్యత్తుకు బాట వేసిందని చెప్పక తప్పదు. మానవ హక్కుల కొరకు సాగే పోరాటంలో అంతర్జాతీయ స్థాయిలో సంఘీభావం, ప్రజాస్వామ్యాల అవసరాన్ని కార్మిక వర్గం గుర్తించేందుకు ఈ పరిణామం మూలహేతువనడంలో సందేహం లేదు. ఫ్రాన్స్, జర్మనీలలో పారిశ్రామికీకరణ చాలా త్వరితంగా విస్తరించింది. దీనితో పురోగమిస్తున్న బూర్జువా వర్గం ఆర్థికంగా శక్తివంతం కావడం, పారిశ్రామిక కార్మికుల సంఖ్య గణనీయంగా పెరగడం, అక్కడి రాజకీయ పరిణామాలలో ప్రధాన పాత్ర వహించాయి. ఫ్రాన్స్‌లో మితవాద అభివృద్ధి నిరోధకులు విజయం సాధించడంతో, పురోగమిస్తున్న బూర్జువా వర్గానికి కార్మికులను పోరాటంలో తమ మిత్రులుగా ఎంచి, కార్మికవర్గంతో మిత్రత్వం నెరపడం తప్పనిసరి అయింది. కార్మికవర్గంలో రాజకీయ చైతన్యం పెంపొందడానికి

ఈ రాజకీయ పరిణామాలు చాలా దోహదం చేశాయి. ఆర్థికంగా శక్తివంతమైన ఇంగ్లీషు పారిశ్రామిక బూర్జువా వర్గానికి, భూస్వామ్య అభివృద్ధి నిరోధకులకు మధ్య రాజకీయ అధికారం కోసం జరిగిన పోరాటం ప్రజాతంత్ర ఉద్యమానికి ఉన్న అవకాశాలను బహిర్గతం చేసింది. దీనితో కార్మికవర్గం సంస్కరణోద్యమాన్ని తిరిగి ప్రారంభించడానికి ఆస్కారం కలిగింది. 1819 ఆగస్టు 16వ తేదీన పీటర్‌లూ వద్ద జరిగిన బ్రహ్మాండమైన ప్రదర్శనలో కార్మికవర్గం తన సాంఘిక, రాజకీయ కోర్కెలను మొట్టమొదటిసారిగా ప్రకటించింది. ఈ ప్రదర్శన చాలా ప్రశాంతంగా కొనసాగుతున్న తరుణంలో ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా ఈ ప్రదర్శనను విచ్ఛిన్నం చేయడానికి పూనుకొని తీవ్రమైన హత్యాకాండను సాగించింది. కార్మికవర్గం చేపట్టిన ఈ సంస్కరణోద్యమాన్ని ఆదిలోనే నాశనం చేయాలని ప్రభుత్వం కంకణం కట్టుకొంది. ఈ సంఘటన ఇంగ్లీషు కార్మికవర్గ ఉద్యమంలో ఒక నూతన దశకు నాందిపలికిందని చెప్పవచ్చు.

ఆనాటి వివిధ సామాజిక బలాబలాల పొందిక, పాలకవర్గంలోని వివిధ రాజకీయ, ఆర్థిక గ్రూపుల మధ్య నెలకొన్న తీవ్రమైన వైరుధ్యాల ఫలితంగా 1824లో కాంబినేషన్ చట్టాలు రద్దుపరచబడ్డాయి. ఆ తరువాత అనేక ట్రేడ్ యూనియన్లు స్థాపించబడ్డాయి. ఇంతేకాక, అప్పటివరకు రహస్యంగా వున్న కార్మిక సంఘాలు, మిత్ర సంఘాలుగా వ్యవహరించబడుతున్న సంఘాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. చట్టపరమైన అనేక నిర్బంధాల నుండి స్వతంత్రులయిన కార్మికులు తమ జీవన పరిస్థితులను మెరుగు పరచుకునేందుకు ట్రేడ్ యూనియన్ ఉద్యమ పురోభివృద్ధికి కృషి చేయడం ప్రారంభించారు. అప్పటి వరకు తీవ్ర నిర్బంధాల ద్వారా అణచివుంచబడిన కార్మికుల అసంతృప్తి దొమ్మీలు, రక్తపాతంతో కూడిన అనేక సమ్మె పోరాటాలకు, పారిశ్రామిక అశాంతికి దారితీసింది.

యజమానులకు వ్యతిరేకంగా విజయవంతంగా పోరాటాలు సాగించి, వారి వద్ద నుండి రాయితీలు సంపాదించుకునేందుకు గాను అన్ని యూనియన్లను ఏకం చేయడం ద్వారా కార్మికులను ఏకం చేసే లక్ష్యంతో 1830లో "కార్మిక సంక్షేమం కొరకు జాతీయ స్థాయి అసోసియేషన్" (నేషనల్ అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ లేబర్) ఏర్పాటుకు ప్రయత్నాలు సాగాయి. ఇదిలా వుండగా, యజమానులను త్రోసిరాజని అన్ని సరుకులను, సేవలను ప్రజలకు అందజేయడానికి ఉత్పత్తిదారుల సహకార సంఘాలను నెలకొల్పడం ద్వారా వస్తువుల ఉత్పత్తిని కొనసాగించాలని రాబర్ట్ ఓవెన్ ఒక ప్లాను వేశాడు. ఈ ఉద్దేశ్యంతోనే ఓవెన్ 1834లో లండన్ నగరంలో ట్రేడ్ యూనియన్ ప్రతినిధుల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి "గ్రాండ్ నేషనల్ కన్సాలిడేటెడ్ ట్రేడ్స్ యూనియన్"ను స్థాపించారు. గ్రాండ్ నేషనల్‌లో భారీ సంఖ్యలో సభ్యులు చేరడంతో ఇప్పటి వరకు పరోపకారం, సంస్కరణవాద భూయిష్టంగా వున్న "ఓవెనిజమ్", కార్మికవర్గ ఉద్యమానికి ఒక సైద్ధాంతిక మూలస్థంభమైంది. ధనిక వర్గాలు కుమ్మక్కయి 1832 సంస్కరణల బిల్లు ద్వారా కార్మికులకు రాజకీయ హక్కులు లేకుండా చేశాయి. అయినప్పటికీ ఎన్నికల సంస్కరణల విషయంలో బూర్జువా వర్గానికీ, ఉన్నత వంశీయులైన భూస్వాములకు మధ్య సంఘర్షణ తలెత్తడంతో, బూర్జువా వర్గం కార్మికవర్గాన్ని తన మిత్రునిగా పరిగణించవలసి రావడంతో సహకార సంఘాలు, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల పురోగతికి అనుకూల వాతావరణం ఏర్పడింది.

ఊహాజనితమైన్పటికీ "కో-ఆపరేటివ్ సోషలిజం" ద్వారా రాజకీయ ప్రజాస్వామ్యం కోసం, సామాజిక మార్పు కోసం జరిగే పోరాటాల్లో పాల్గొనేందుకీ పరిణామాలు ఉత్తేజాన్నిచ్చాయి. ఓవెన్ మాత్రం ఏనాడు వర్గపోరాటాన్ని గురించి కనీసం ఆలోచించనన్నాలేదు. కాని, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ముమ్మరం కావడంతో ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి కంకణం కట్టుకున్నది. అదేవిధంగా ఈ ఉద్యమాలను అణచివేయడానికి యజమానులు కూడా తీవ్ర చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. దీనితో గ్రాండ్ నేషనల్ యూనియన్ విచ్ఛిన్నమై ఓవెన్ పలుకుబడి, దానితోపాటు ఆయన ప్రతిపాదించిన సహకార సిద్ధాంతాలు అచిర కాలంలోనే కుప్పకూలిపోయాయి.

కేవలం ఆర్థిక పరమైన కోర్కెలకే తమ కార్యకలాపాలను పరిమితం చేయడం ద్వారా శాశ్వత పురోభివృద్ధిని సాధించడం అసాధ్యమని కార్మికవర్గం అనుభవం ద్వారా గుర్తించింది. అందువలననే బ్రిటిష్ కార్మికోద్యమ తదుపరి దశలో ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు జరపాలనేది కార్మికవర్గపు ప్రధానమైన కోర్కె అయింది. 1836లో లండన్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ స్థాపించబడింది. తరువాత సంవత్సరం (1837)లోనే విలియమ్ లోవెట్ తదితరుల చొరవతో ఈ అసోసియేషన్ రాజకీయ సంస్కరణల కొరకు ఆరు అంశాల కార్యక్రమంతో ఒక ప్రజా హక్కుల పత్రాన్ని (పీపుల్స్ చార్టర్) రూపొందించింది. ప్రభుత్వ విధానాల వలన తీవ్రంగా అసంతృప్తి చెంది యున్న వివిధ శక్తులను త్వరితంగా సమీకరించడానికి యీ హక్కుల పత్రం (ఛార్టర్) చాలా ఉపకరించింది. 1838 ఆగస్టులో బర్మింగ్ హోమ్‌లోని న్యుహోల్ హిల్ వద్ద జరిగిన పెద్ద సమావేశానికి వివిధ గ్రూపుల నాయకులు హాజరయ్యారు. ముక్క చెక్కలుగా వున్న ఉద్యమాన్ని ఏకం చేసి, ఛార్టర్‌పై ఏకోన్ముఖంగా ప్రచారం సాగించడానికి వీరందరూ అంగీకరించారు. ఈ చార్టరులో యీ క్రింది ఆరు అంశాలు పొందుపరచబడ్డాయి. 1.21 సంవత్సరాల వయస్సున్న వారందరికీ ఓటు హక్కు యివ్వాలి. 2. రహస్య బాలెట్ ద్వారా ఎన్నికలు జరగాలి. 3. పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యేందుకు ఆస్తిపాస్తులతో సంబంధం వుండడానికి వీలులేదు. 4. నియోజకవర్గాలు సమానంగా వుండాలి. 5. పార్లమెంట్‌కు ప్రతి సంవత్సరం ఎన్నికలు జరగాలి. 6. పార్లమెంటు సభ్యుల వేతనాల గురించి కూడా ఈ ఛార్టరులో ఒక అంశం పొందుపరచబడింది.

ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతులలో సాగాలని, పార్లమెంటుకు ప్రాతినిధ్యం న్యాయబద్ధంగా వుండాలన్న డిమాండ్‌ను ఒక్క మాటలో చెప్పాలంటే ఇంగ్లండ్‌ను ఒక ప్రజాస్వామ్యంగా మార్చడమే ఈ చార్టరులోని అంశాల ముఖ్యోద్దేశమని తేలికగా బోధపడుతుంది.

తీవ్రమైన ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్న ఈ సమయంలో ఛార్టర్‌పై ఉద్యమానికి పిలుపు ఇవ్వబడడంతో ఇంగ్లీషు కార్మికుల ఆలోచనాశక్తి మరింత పదునెక్కింది. ఈ ఉద్యమం సందర్భంగా 30 లక్షలకు పైగా సంతకాలు సేకరించడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

లక్షలాది మంది ప్రజలు సంతకాలు చేసి సమర్పించిన హక్కుల విజ్ఞాపన పత్రాన్ని అభివృద్ధి నిరోధక పార్లమెంటు అల్పబుద్ధితో తిరస్కరించింది. దీనితో తిరుగుబాట్లు, బ్రహ్మాండమైన సమ్మెలు ఉవ్వెత్తున చెలరేగాయి. ఈ విధమైన ఆందోళనల ద్వారా ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ చార్టిస్టుల (ఛార్టరును సమర్పించిన వారు) నాయకత్వంలో రెండు పరస్పర విరుద్ధమైన గ్రూపులు ఏర్పడ్డాయి. దీనిలో 'మోరల్ ఫోర్సు పార్టీ' ఉదార భావాలు గల్గిన బూర్జువా వర్గంతో చేతులు కలిపి సుదీర్ఘ పోరాటం సాగించాలని కోరింది. ఇందుకు భిన్నంగా "ఫిజికల్ ఫోర్సు పార్టీ" పెద్ద ఎత్తున సమ్మె పోరాటాలు సాగించడమే నిర్ణయాత్మకమైన విధానమని భావించసాగింది. ఈ వైరుధ్యాల మూలంగా కార్మికుల ఐక్య కార్యాచరణ కొంత మేరకు కుంటుపడిందని చెప్పకతప్పదు. ఐనప్పటికీ ఉద్యమాలు విస్తృతంగానూ, అతి తీవ్రంగానూ సాగడంతో పార్లమెంటు కూడా కొన్ని రాయితీలు ఇవ్వడం తప్పనిసరయింది.

ఈ ఉద్యమం పది సంవత్సరాల పాటు కొనసాగింది. కాని నిర్మాణ రీత్యాను, ఉద్యమం నడపడంలోనూ కార్మిక వర్గానికి అనుభవం లేకపోవడంతో ఛార్టరులో ప్రతిపాదించబడిన ప్రాథమిక కోర్కెలకు సంబంధించినంతవరకు ఈ ఛార్టిస్టు ఉద్యమం విఫలమయిందనే చెప్పాలి. చిట్టచివరగా 1848 ఏప్రిల్‌లో ఛార్టిస్టులు చేసిన బ్రహ్మాండమైన ప్రదర్శన వెల్లువ కూడా ఫలితాలను సాధించడంలో విఫలమైంది. ఈ సంవత్సరంలో యూరపు ఖండంలో సాగిన విప్లవాలు కూడా అపజయం పాలయ్యాయి. ఇదే ఛార్టిస్టు ఉద్యమానికి అంత్యదశగా పేర్కొనవచ్చు.

ఎన్ని బలహీనతలు వున్నప్పటికీ ఈ ఛార్టిస్టు ఉద్యమం ఇంగ్లండ్‌లోని కార్మిక వర్గాన్ని సమరశీలంగా తయారు చేయడంలో సఫలీకృతమైంది. ఇంతేగాక చివరకు ప్రపంచ కార్మికోద్యమ గమనమే యీ ఉద్యమ ప్రభావానికి తీవ్రంగా లోనయింది. వాస్తవానికి విస్తృతంగా ప్రచారం పొందిన ఛార్టరులోని ఆరు కోర్కెలూ చట్టపరంగానే అమలు జరగడాన్ని, ఈ కోర్కెల సాధనకై పోరాటం సాగించిన తరం కార్మికులే గాంచగలిగారు. అనేక సంవత్సరాలుగా ట్రేడ్ యూనియన్లకు ఛార్టిస్టు ఉద్యమానికి "పది గంటల పనిదినం" ప్రధానమైన ఆర్థిక లక్ష్యంగా వుండేది. 1847లో ఒక చట్టం ద్వారా స్త్రీ, బాల కార్మికుల పని దినాన్ని పది గంటలకు పరిమితం చేయడంతో పై లక్ష్యం పాక్షికంగానైనా సఫలీకృతమైంది. కాని ఆచరణలో కొన్ని సందర్భాలలో ఈ "పది గంటల పని దినం" పురుష కార్మికులకు కూడ వర్తింపచేయడం జరిగింది. పదిగంటల పనిదినాన్ని సాధించడంలో గల చారిత్రక ప్రాముఖ్యతను కారల్‌మార్క్స్ చాలా నిశితంగా ఎత్తిచూపాడు. "పైకి కన్పడనప్పటికి ఈ సమంజసమైన పని దినం (పది గంటల పని దినం) పెట్టుబడిదారీ వర్గానికి – కార్మిక వర్గానికి మధ్య సుదీర్ఘకాలం సాగిన అంతర్యుద్ధం ఫలితంగా సాధించబడినదే. పెట్టుబడిదారీ విధానాన్ని ప్రప్రథమంగా సవాలు చేసిన ఖ్యాతి ఇంగ్లీషు కార్మికవర్గాన్ని నడిపించిన సిద్ధాంతకర్తలకే దక్కుతుంది. అందువలన ఇంగ్లండ్‌లోని ఫ్యాక్టరీ కార్మికులు ఒక్క ఇంగ్లీషు కార్మికవర్గానికే గాక ఆధునిక కార్మికవర్గం మొత్తానికే ఛాంపియన్‌లు" అని కారల్‌మార్క్స్ ఇంగ్లీషు కార్మికవర్గాన్ని అభినందించాడు.

విస్పష్టమైన రాజకీయ హక్కులతో తమ వర్గానికి విశాల ప్రాతిపదికన ఒక జాతీయ పార్టీని నిర్మించుకొనడానికి కార్మికవర్గం చేసిన ప్రథమ ప్రయత్నంగా చార్టిస్టు ఉద్యమాన్ని పేర్కొనవచ్చు. అందువలన ఈ చారిస్టు ఉద్యమం ప్రపంచ శ్రామికవర్గ ఉద్యమ చరిత్రలోనే ఎన్నదగిన మహత్తర ఉద్యమం. "విస్తృతమైనది, నిజమైన ప్రజాపునాది కలిగినది, రాజకీయంగా విస్పష్టమైన, సమరశీల శ్రామికవర్గ ఉద్యమాన్ని మొదటిసారిగా ఇంగ్లండ్ ప్రపంచానికందించింది" అని లెనిన్ అన్న మాటలలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

విపరీతమైన దోపిడీకి గురౌతున్న బ్రిటిష్ కార్మికులు దారుణంగా వున్న తమ జీవన పరిస్థితులను మెరుగుపరచుకునేందుకు పోరాటం సాగించడంతోబాటు, పెట్టుబడిదారీ విధానంలోని హానిని గుర్తించి ఆ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమం సాగించారు. ఛార్టిస్టు ఉద్యమ నాయకులలో సుప్రసిద్ధుడైన జేమ్స్ బ్రాంటెరెఓబ్రెయిన్ స్వతస్సిద్ధమైన తన మేధాశక్తితో వర్గ పోరాటాన్ని, పెట్టుబడిదారీ ప్రభుత్వ స్వభావాన్ని చక్కగా అర్థం చేసుకోగలిగాడు. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్‌మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికను తయారు చేయడానికి 15 సంవత్సరాల పూర్వమే బ్రెయిన్ ఈ అవగాహన కల్గి వున్నాడు. ఓ బ్రెయిన్ రచనలు చాలా గందరగోళపరచేవిగానూ, ఊహాజనితమైనవిగానూ వున్నప్పటికీ, ఆ రచనలు మార్క్స్ వర్గపోరాటాల విశ్లేషణకు చాలా దగ్గరగా వున్నాయి.

పెట్టుబడిదారీ దోపిడీ ఎంత అమానుషంగా కొనసాగుతున్నదంటే - పెట్టుబడిదారీ, మధ్య తరగతి వర్గాలలోనే కొందరు ఈ విధానాన్ని తీవ్రంగా నిరసించే పరిస్థితులేర్పడ్డాయి. ఈ నిరసన వివిధ రకాల ఊహాజనిత సోషలిస్టు భావాల రూపం దాల్చింది. అంటే యీ అమానుషమైన పెట్టుబడిదారీ దోపిడీని గాంచిన పెట్టుబడిదారీ, మధ్యతరగతి వర్గాలలోని కొన్ని సెక్షన్లు వూహాజనిత సోషలిస్టు భావాలవైపు ఆకర్షితులయ్యారు. బ్రిటన్‌కు చెందిన రాబర్టు ఓవెన్ (1771-1858)తో బాటు ఫ్రాన్సుకు చెందిన క్లాడ్ H. సెయింట్ సైమన్ (1760-1825), ఛార్లెస్ ఎఫ్.ఎం. ఫోరియర్, (1772-1837) ఎటైన్ కాబెట్ (1788-1856)లు ఊహాజనిత సోషలిస్టులలో పేరెన్నికగన్నవారు. రాబర్ట్ ఓవెన్ వలెనే ఈ ఊహాజనిత సోషలిస్టులు కూడా సామాజికాభివృద్ధిని శాస్త్రీయంగా ఆలోచించక, తమ వూహల్లో ఉన్న ఒక ఆదర్శప్రాయమైన సమాజ నిర్మాణానికి ప్రణాళికలు వేయడం ప్రారంభించారు.

జర్మనీలో తాత్కాలికంగా దర్జీ పనిచేసే విల్ హెల్మ్‌వైట్లింగ్ పెట్టుబడిదారీ విధానంపై తీవ్రంగా దాడిచేయడమే కాక ఒక మేరకు కమ్యూనిజాన్ని వివరించాడు. జర్మనీ నుండి వలసపోయి లండన్‌లో స్థిరపడిన కార్మికులు, ప్రవాస సమితి (ఎక్జయిల్స్ లీగ్) (1834 - 1836) ఫెడరేషన్ ఆఫ్ జస్ట్ (1836 - 1839) లను స్థాపించారు. విల్‌హెల్మ్ వైట్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ జస్ట్‌కు ఒక నాయకుడు.

ఇదే విధంగా అమెరికాలో థామస్ స్కిడ్‌మోర్ అనే మెషినిస్టు పెట్టుబడిదారీ విధానాన్ని తీవ్రంగా ఆక్షేపించి, ఈ వ్యవస్థను ఎదుర్కొని పోరాడవలసిందిగా కార్మికులకు పిలుపునిచ్చాడు.

ఊహాజనిత సోషలిస్టులు తమ స్వంత పద్ధతులో పరిశోధనలు కొనసాగించారు. ఓవెన్ నెలకొల్పిన పద్ధతిలోనే కో-ఆపరేటివ్ కాలనీలు స్థాపించబడ్డాయి. ఫోరియర్ అనుచరులతోబాటు హోరేస్‌గ్రీలీ, నథానియల్ హాతార్న్, జేమ్స్ రస్సెల్ లోవెల్, ఇతర ప్రముఖులు ఈ భావవాద ఉద్యమానికి అంకితమయ్యారు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలోని రుగ్మతలను నయంచేయడంలో ఈ పెటీ బూర్జువాల విధానం విఫలమైందని స్పష్టమవుతోంది. కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు శాస్త్రీయ సోషలిజాన్ని అభివృద్ధి చేయడంతో పాటు చరిత్రలో మొదటి ఇంటర్నేషనల్ అవతరించడంతో ఊహాజనిత ఉద్యమాలు అంతిమ దశకు చేరుకున్నాయి.

మార్క్స్ తన విప్లవ సిద్ధాంతంలో పేర్కొన్న శాస్త్రీయ సోషలిజాన్ని కార్మిక వర్గం సాధించేంతవరకు ఈ ఊహాజనిత భావాలతో పాటు ట్రేడ్ యూనియన్లు కేవలం కార్మికుల సమస్యలకే పరిమితం కావడం, బ్లాంక్విజం, ప్రౌథోనిజం, లాస్సెవేయిజం, బకూనినిజం వంటి వివిధ సామాజిక ధోరణులు చరిత్రలో చోటుచేసుకొన్నాయి. పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో అతి ఘోరంగా దిగజారుతున్న తమ జీవన ప్రమాణాలను నిలబెట్టుకొనడానికి కార్మికవర్గం తన ఉద్యమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నెమ్మదిగా తన స్వంత ఆలోచనను, ఒక శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకున్నది. అయితే చట్టసభలు, న్యాయ వ్యవస్థలతో బాటు నూతన పాలక వర్గాలకు, కార్మికవర్గానికి మధ్య సాగిన నిరంతర పోరాట ఫలితంగా మాత్రమే 19వ శతాబ్దంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమ అభివృద్ధి ఆచరణ సాధ్యమైంది. ఈ సమయంలోనే ఫ్యాక్టరీలు స్థాపించబడడంతో ట్రేడ్ యూనియన్లు యజమానులతో సమిష్టి సంప్రదింపుల పద్ధతి ఏర్పాటు చేసుకున్నాయి. 1867, 1884 ప్రజా ప్రాతినిధ్య చట్టాల ద్వారా ఇంగ్లండులోని పారిశ్రామిక కార్మికులు ఓటు హక్కును సంపాదించుకున్నారు. 1868 సం॥లో ఇంగ్లీషు కార్మిక వర్గానికొక కేంద్ర కార్మిక సంస్థ, ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపించబడింది. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల విషయమై 1867లో నియమించబడిన రాయల్ కమిషన్ నివేదికను అనుసరించి 1871లో చార్టర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పేరిట ఒక ట్రేడ్ యూనియన్ చట్టం ఆమోదించబడింది. అనేక సవరణ చట్టాల ద్వారా ట్రేడ్ యూనియన్ ఉద్యమం మంచి పురోగతి సాధించింది. ట్రేడ్ యూనియన్ల లక్ష్యాలను నేరాలుగా పరిగణించే విధానానికి స్వస్తి చెప్పడం జరిగింది.

పార్లమెంటుకు మొదటిసారిగా ఇద్దరు కార్మికవర్గ ప్రతినిధులు ఎన్నికకావడం, గ్లాడ్‌స్టన్ ప్రభుత్వం పతనమై డిజ్రెయిలీ నాయకత్వంలో టోరీలు అధికారంలోకి రావడం చట్టాలలో సంస్కరణలు ప్రవేశపెట్టడానికి రాజకీయ కారణాలుగా భావించవచ్చు. ఈ విధంగా అనేక సంవత్సరాల పోరాటం అనంతరం ట్రేడ్ యూనియన్లు చట్టపరమైన గుర్తింపును పొంది, కార్మికులు యజమానులతో సమిష్టి సంప్రదింపులు జరిపే స్వాతంత్ర్యాన్ని పొందగలిగారు.

1848లో యూరపులో విప్లవం విఫలం కావడంతో దాదాపు బూర్జువా వర్గానికి రాజకీయాధికారంలో భాగస్వామ్యంలేకుండా పోయింది. సైన్యం, "నిరంకుశ అధికార", నెపోలియన్-3 వర్గం, పోలీసులు ఫ్రాన్సును పరిపాలిస్తున్నారు. జర్మన్ సమాఖ్య రాజ్యాలలో

ఒక్కొక్క రాజ్యం రాకుమారులు, ఉన్నత వంశీయులైన ఫ్యూడల్ భూస్వాములు, బ్యూరోక్రాట్లు మొదలగువారి కంట్రోలులో వున్నాయి. విప్లవానంతరం విప్లవానికి నాయకత్వం వహించిన వారు ఉరితీయబడ్డారు. కొందరు జైలులో వేయబడగా మరికొందరు ప్రవాసానికి పంపబడ్డారు. ఈ పరిస్థితులలో యూరపులోని కార్మికవర్గం స్వతంత్ర్య కార్యాచరణకు పూనుకొనగల్గిన స్థితిలో లేదు. ఇంగ్లండులో మాత్రమే ట్రేడ్ యూనియన్లు కొద్దిమేరకైనా ఉద్యమాలను కొనసాగించగలిగాయి. 1860 నాటికి ట్రేడ్ యూనియన్లు బలాన్ని పుంజుకుని పురోగమించసాగాయి.

ఇంగ్లండులోని కార్మికవర్గం సంఖ్యాపరంగా చాలా పెద్దది. అంతేగాక చైతన్యవంతమయింది. ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రప్రథమంగా ఇంగ్లండ్‌లోనే ప్రారంభమయింది. అందువల్ల సహజంగానే ప్రపంచ కార్మిక వర్గాన్ని ఏకం చేయడానికి, అంతర్జాతీయ స్థాయిలో కార్మికవర్గ సంస్థ నొకదాన్ని ఏర్పాటు చేయడానికి ప్రాథమిక ప్రయత్నాలు ఇంగ్లండులోనే ప్రారంభమయ్యాయి. పెట్టుబడిదారీ విధానం ప్రపంచ వ్యాప్తమైనది. అదేవిధంగా కార్మికవర్గ ఉద్యమం కూడా అంతర్జాతీయమైనదే. అందువలన చరిత్ర క్రమంలో శ్రామికవర్గ చైతన్యం జాతీయ పరిధులను అధిగమించక తప్పదు. చివరకు ఛార్టిస్టు ఉద్యమం కూడా ఈ శ్రామికవర్గ అంతర్జాతీయతకు సంబంధించిన కొన్ని విశిష్టమైన లక్షణాలు కలిగియున్నది. ఆనాటి నుండే మిక్కిలి ప్రాధాన్యత సంతరించుకున్న అనేక అంతర్జాతీయ ఉద్యమాలు ఇంగ్లండు నుండే తరతమ స్థాయిల్లో అన్ని వైపులకు వ్యాప్తి చెందాయి.

ఇదిలా వుండగా, నూతన ఆర్థిక సంక్షోభం తలెత్తడంతో ఫ్రాన్సు, జర్మనీలలోని కార్మికవర్గం జాగృతమైంది. ఈ సంక్షోభానికి వ్యతిరేకంగా సామాజికంగానూ, రాజకీయపరంగానూ మున్నెన్నడూ లేనంత శక్తివంతమైన ఉద్యమాలు సాగాయి. కార్మికులను సంఘటితం కాకుండా నిరోధించే చట్టాలెన్ని అమలులో వున్నప్పటికీ, జీతాలలో కోతకు వ్యతిరేకంగా ఫ్రాన్సులో సమ్మె పోరాటాలు ఉప్పెనలా చెలరేగాయి.

ఈ సందర్భంలో కూడా కార్మికులలో శ్రామికవర్గ అంతర్జాతీయతా ధోరణులు తీవ్రంగా వ్యక్తమయ్యాయి. వాస్తవానికి 1789లో జరిగిన ఫ్రెంచి మహావిప్లవంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన విప్లవకారుడు బాబ్యూఫ్ (Bebeuf) కాలం నుండే శక్తివంతమైన శ్రామికవర్గ అంతర్జాతీయ సాంప్రదాయాలు నెలకొనివున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా వున్న శ్రామిక ప్రజానీకాన్ని ఏకం చేయడానికి జరిగిన అనేక ప్రయత్నాల ఫలితంగా 1864 సెప్టెంబరు 28వ తేదీన లండన్‌లోని సెయింట్ మార్టిన్ హాలులో వివిధ దేశాల కార్మికవర్గ ప్రతినిధులతో మొట్టమొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాల కార్మికవర్గ ప్రతినిధులేగాక, ప్రవాసంలో ఉన్న అనేక దేశాల కార్మికవర్గ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. గారిబాల్డీ అనుచరులలో ఒకరు ఇటలీ కార్మికవర్గానికి, కమ్యూనిస్టు వర్కర్స్ 'ఎద్యుకేషన్ సొసైటీ' సభ్యులు జర్మనీ దేశానికి ప్రాతినిధ్యం వహించారు.

కారల్‌మార్క్స్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈయన జర్మనీ తరపున సెంట్రల్ కమిటీకి ఎన్నుకోబడ్డారు. 1864 అక్టోబరు ప్రారంభంలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఈ అంతర్జాతీయ కార్మికవర్గ సంస్థకు "ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్" అనే పేరు పెట్టడానికి నిర్ణయం జరిగింది. ఈ సమావేశంలోనే ఒక కార్యదర్శివర్గం కూడా ఎన్నుకోబడింది.

క్రొత్తగా ఏర్పడిన ఈ ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ నిబంధనలు రూపొందించడంలోనూ, ఈ సంస్థ యొక్క రాజకీయ కార్యక్రమాలను సూత్రీకరించడంలోనూ, రాబర్ట్ ఓవెన్, మాజిని (mazzini) అనుచరుల దృక్పథం కంటే తన ఆలోచనలు సక్రమమైనవని కారల్‌మార్క్స్ రుజువు చేసుకోగలిగాడు. 1848లోనే ప్రకటించబడిన 'కమ్యూనిస్టు ప్రణాళిక" కార్ల్‌మార్క్స్ రాజకీయ, సామాజిక సిద్ధాంతాల సారాంశాన్ని ఆనాటికే స్పష్టం చేసింది. పరిమితంగానైనా అసోసియేషన్ కార్యక్రమంలో తన రాజకీయ, సామాజిక సిద్ధాంతాలను చేర్చగలగడం నిజానికి మార్క్స్ సాధించిన ఘనవిజయమే. మార్క్స్ ఇంటర్నేషనల్‌కు సమర్పించిన ముసాయిదా నిబంధనావళి, ప్రకటనలు స్వల్పమైన సవరణలతో ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. "కమ్యూనిస్టు ప్రణాళిక"లోని "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే చారిత్రక నినాదంతో ఇంటర్నేషనల్ ప్రకటన ముగిసింది.

ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ నిబంధనావళి "పీఠిక" యూరోపియన్ కార్మికవర్గ ఉద్యమానికి చరిత్ర ప్రఖ్యాతి గాంచిన ప్రామాణిక పత్రంగా వెలుగొందింది.

"కార్మిక వర్గం తన విముక్తిని తానే సాధించుకోవాలి." కార్మికవర్గ విముక్తి పోరాటమంటే కేవలం వర్గ సౌకర్యాలు, వర్గాధిపత్యం కోసం గాక సమాన కర్తవ్యాలు, సమాన హక్కుల కొరకూ, అన్నిటికంటే ముఖ్యంగా వర్గపాలన నిర్మూలన కొరకు సాగించే మహత్తర పోరాటం.

అందువలన ఆర్థిక విముక్తి సాధించడం కార్మికవర్గ మహోన్నత లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు ప్రతి రాజకీయ ఉద్యమం ఒక సాధనంగా ఉపయోగపడాలి.

శ్రామికవర్గ విముక్తి అనేది స్థానికంగానో, జాతీయంగానో వున్న సమస్య కాదు. ఆధునిక సమాజంలోని అన్ని దేశాల సామాజిక సమస్య" అని మార్మోగిన ఈ ప్రకటన భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ కార్యాచరణకు తిరుగులేని మార్గదర్శిగా లిఖించదగినది.

ఆధునిక కార్మికవర్గం ఒక సమగ్రమైన రూపాన్ని దాల్చి పురోగమిస్తోంది. ఈ క్రమంలో అనేక వైరుధ్యాలు తలెత్తుతున్నాయి. ఉద్యమంలో చీలికలు వస్తున్నాయి. మరల కలుస్తోంది. అయినప్పటికీ కార్మికవర్గ ఉద్యమం ఆటుపోట్లను తట్టుకుని పురోగమిస్తూనే వుంది. కార్మికోద్యమాలు ప్రపంచాన్నే కుదిపివేస్తున్నాయి. అందువలన భారత శ్రామికవర్గ ఉద్యమ అవతరణను ప్రపంచ కార్మికవర్గ ఉద్యమం నుండి విడదీసి చూడడానికి వీలులేదు.

# 2
# ప్రాచీన భారతీయ ఆర్థికవ్యవస్థ విచ్ఛిన్నం

## ప్రాచీన భారత ఆర్థిక వ్యవస్థ, సమాజాల స్వరూప స్వభావాలు

**33** లక్షల (3.3 మిలియన్ల) చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గలిగి 100 కోట్లకు పైగా ప్రజానీకంతో విలసిల్లుతున్న నేటి భారతదేశం ప్రపంచ చరిత్రలోనే ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తోంది. అందువలన ఆధునిక ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలు, వైరుధ్యాలు ఇండియాలో తీవ్రంగానే వ్యక్తమవుతాయి. కనుక యీ సమస్యలను పరిష్కరించుకొని, తమ చరిత్రను తామే తిరిగి రూపకల్పన చేసుకొనవలసిన బృహత్ కర్తవ్యాన్ని భారత ప్రజానీకం నిర్వహించవలసి వుంది.

భారత ప్రజల గత చరిత్ర అనేక పోరాటాలతో కూడుకొని యున్నది. భారత ప్రజానీకం ఫ్యూడల్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, విదేశీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా, అమానుషమైన దోపిడీకి, దారుణ హత్యాకాండకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలు సాగించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విశాల భారతావనిలోని సంపదను, ఆర్థిక వనరులను కొల్లగొట్టి తమ దేశానికి తరలించారు. భారత ప్రజల శ్రమశక్తిని దోచుకున్నారు. వారిపై 200 సంవత్సరాల పాటు నిరాఘాటంగా తమ ఆధిపత్యం చెలాయించారు. దీనితో భారత ప్రజానీకం దుర్భర దారిద్ర్య దశకు నెట్టబడింది. ఈ విదేశీ దోపిడీకి వ్యతిరేకంగానూ, సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగానూ తమ జీవన గతిని తామే నిర్ణయించుకొనే అధికారం కోసం భారత ప్రజానీకం అనేక తిరుగుబాట్లు సాగించింది.

సుమారుగా 19వ శతాబ్దం మధ్యకాలంలో మాత్రమే భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన ఛాయలు గోచరించాయి. ఆర్థిక, సామాజిక పరమైన చిక్కులు సంభవించినప్పటికీ, పెట్టుబడిదారీ విధానం క్రమక్రమంగా అభివృద్ధి చెందింది. ప్రపంచ చరిత్రలో వలెనే, ఆధునిక భారత కార్మికవర్గం కూడా భారతదేశంలో పెట్టుబడి విధాన అభివృద్ధి ఫలితంగా ఆవిర్భవించినదే. ప్రారంభ దశలోనే అనేక చిక్కుల నెదుర్కొని భారత కార్మికవర్గం అవతరించింది. భారత ఆర్థిక, సామాజిక వ్యవస్థలను గురించి మార్క్స్ చేసిన విశ్లేషణ, భారత కార్మికవర్గ అవతరణ

దశలో ఏర్పడిన చిక్కులు, ఈ  కార్మికవర్గ అవతరణ క్రమాన్ని గురించి పరిశీలించడానికి చక్కని మార్గదర్శిగా ఉపకరిస్తుంది.

ఈస్టిండియా కంపెనీ ఛార్టరు పునరుద్ధరణ విషయం 1853లో చివరిసారి బ్రిటిష్ పార్లమెంట్ ముందు ప్రస్తావించబడిన సమయంలో న్యూయార్క్ నుండి వెలువడే డైలీ 'ట్రిబ్యూన్'లో భారతదేశం మీద మార్క్సు వ్రాసిన అనేక వ్యాసాలు ప్రచురించబడ్డాయి. ఈ రచనలతో బాటు మార్క్సిస్టుల ప్రామాణిక గ్రంథం "పెట్టుబడి"లోని వివిధ అధ్యాయాలలో భారత్‌ను గురించి మార్క్సు చేసిన ప్రస్తావనలు భారత్‌పై ఆ మహనీయుని ఉద్దేశాల సారాంశాన్ని వివరిస్తాయి. ఆసియా ఆర్థిక వ్యవస్థ యొక్క స్వరూప స్వభావాల వివరణతో మార్క్సు విశ్లేషణ ప్రారంభమవుతుంది. బ్రిటిషు వారు భారతదేశానికి వచ్చేనాటికి ఇక్కడవున్న సామాజిక వ్యవస్థను మార్క్సు "ఆసియా వ్యవస్థ" అని వర్ణించాడు. అడుగున ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థ చిహ్నాలు గల గ్రామీణ వ్యవస్థ వుండగా పైన నిరంకుశ ప్రభుత్వం వుండే వ్యవస్థ అది.

భారతదేశంలోని అతి పురాతనమైన ఆర్థిక, సామాజిక వ్యవస్థలను గురించి మార్క్సు తన "పెట్టుబడి" గ్రంథం మొదటి భాగంలోనే చాలా సునిశితమైన పరిశీలన చేశాడు. కారల్ మార్క్సు ప్రాచీన భారత సమాజాన్ని విశ్లేషణ చేస్తున్న సమయంలోనే ఇంగ్లండులో పారిశ్రామిక విప్లవం సంభవించి, పెట్టుబడిదారీ విధానం ఇంగ్లండు నుండి ఇతర యూరోపియన్ దేశాలకు విస్తరించడం గమనించదగ్గ విషయం. సామ్రాజ్యవాదుల దోపిడీ ఫలితంగా ప్రాచీన భారతీయ ఆర్థిక, సామాజిక వ్యవస్థ నాశనమవడం ప్రారంభమైంది. తమ వలస ప్రయోజనాలను విస్తరింపజేసుకొనడానికి రైల్వేలు, తత్సంబంధిత పరిశ్రమలు నెలకొల్పడంతో ఈ ప్రక్రియ (పురాతన భారతీయ వ్యవస్థ శిథిలమవడం) పూర్తయింది. "పెట్టుబడి" గ్రంథం మొదటి భాగంలో మార్క్సు ఈ  ప్రాచీన ఆర్థిక, సామాజిక వ్యవస్థను గురించి కళ్ళకు కట్టినట్లు వివరించాడు.

భారతదేశంలోని చిన్న చిన్న అతి పురాతనమైన తెగలలో కొన్ని ఈనాటికీ కొనసాగుతున్నాయి. ఈ తెగలలో భూమిని సమిష్టిగా అనుభవిస్తూ, వ్యవసాయంతో బాటు చేతివృత్తులను మేళవించి జీవనం సాగిస్తున్నారు. అప్పటికే ఒక క్రమ పద్ధతిలో శ్రమ విభజన జరిగివుండడంతో కొత్త తెగలు ఆవిర్భవించినప్పటికీ, శ్రమ విభజన మార్చడానికి వీలుగాని పద్ధతిలో యీ తెగలున్నాయి.

వంద నుండి వేల ఎకరాల వరకు భూమిని ఆక్రమించుకొని ఒక్కొక్క తెగ తమ అవసరాలకు తామే ఉత్పత్తి చేసుకుంటూ ఒక ప్రత్యేక సంఘంగా కొనసాగుతున్నది. ఈ తెగలలో చేయబడిన ఉత్పత్తి ప్రధానంగా ఆ తెగలోని సభ్యుల అవసరాలకు మాత్రమే వినియోగించబడుతుంది. అంతేకాని, మానవ శ్రమ శక్తి వలన అమ్మకానికి ఉత్పత్తి అయిన "సరుకు" రూపం దాల్చలేదు.

అందువలన భారతీయ సమాజమంతటా సరుకుల మార్పిడి విధానం ద్వారా తెచ్చిన శ్రమ విభజన నుండి ఇక్కడ (ఈ తెగలలో) జరుగుతున్న ఉత్పత్తి విధానం స్వతంత్రంగా ఉంది. అదనపు ఉత్పత్తి మాత్రమే సరుకు రూపం దాల్చేది. ఈ అదనపు ఉత్పత్తిలో కొంత భాగం వస్తు రూపేణా పన్నుగా చెల్లించడం అనాదిగానే వస్తున్నది. ఈ పన్ను ప్రభుత్వానికి చేరనంతవరకు అదనపు సరుకుగానే పరిగణింపబడుతుండేది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలోని తెగలకు విభిన్న రాజ్యాంగాలుండేవి. వీటన్నింటిలోనూ సులభమైన పద్ధతిలో ఆ తెగలలోని వారు ఉమ్మడిగా వ్యవసాయం చేసికొని, వచ్చిన ఉత్పత్తిని పంచుకునేవారు. ఈ వ్యవసాయంతో పాటు నూలు వడకటం, గుడ్డలు నేయడం వంటి ఉపవృత్తులు చేయడం ప్రతి కుటుంబంలోనూ సర్వసాధారణంగా ఉండేది. ఈ విధంగా ఒకే రకమైన పనులు సాగించే వారితో బాటు కొన్ని ప్రత్యేకమైన విధులు నిర్వహించే కొందరు ప్రధాన వ్యక్తులు కూడా వుండేవారు. వ్యవసాయ ఉత్పత్తులను జాగ్రత్త చేసి, వాటికి సంబంధించిన లెక్కలను తయారు చేయడానికి ఒక ఉద్యోగి వుండేవాడు. నేరస్తులను విచారించి, ప్రయాణీకులకు రక్షణ కల్పించి, వారిని ప్రక్క గ్రామానికి చేర్చే బాధ్యతను వహించడానికి మరో అధికారి వుండేవాడు. పొరుగు తెగల నుండి తమ సరిహద్దులను రక్షించుకొనడానికి సరిహద్దు సంరక్షకుడు, ఉమ్మడి చెరువుల నుండి నీటిపారుదల, పంపకాలను నిర్వహించడానికి ఒక వోవర్‌సీర్, మతపరమైన కార్యాలు జరిపించడానికి బ్రాహ్మణుడు, పిల్లలకు ఇసుక మీద వ్రాయడం, చదవడం నేర్పడానికి ఒక ఉపాధ్యాయుడు, విత్తనాలు జల్లడం, నూర్పిడి తదితర వ్యవసాయ పనులకు మంచి రోజులు సూచించడానికి (ముహూర్తం నిర్ణయించడానికి) బ్రాహ్మణుడు గాని, జ్యోతిష్కుడుగాని వుండేవారు. వ్యవసాయ పనిముట్లను బాగుచేయడానికి కమ్మరి, వడ్రంగి వుండేవారు. గ్రామానికి కావలసిన మట్టి పాత్రలు (కుండలు మొదలగునవి) తయారు చేయడానికి ఒక కుమ్మరి వుండేవారు. అదే విధంగా చాకలి, మంగలి కూడా ఆ తెగలలో వుండేవారు. కంసాలి కొన్నిచోట్ల ఒక కవి కూడా వుండేవారు. కొన్ని తెగల్లో ఈ కవి కంసాలి పనిచేయడం, మరికొన్ని తెగల్లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టటం కద్దు. వివిధ వృత్తులను సాగిస్తున్న వీరందరి భారాన్ని ఆ తెగలోని సభ్యులందరూ ఉమ్మడిగా భరిస్తారు. ఈ తెగలో జనాభా పెరిగినట్లయితే ఇదే పద్ధతులలో ఆక్రమించబడిన వేరొక ప్రదేశంలో మరొక నూతన తెగ స్థాపించబడుతుంది. ఈ వ్యవస్థలో ఒక క్రమబద్ధమైన పని (శ్రమ) విభజన వెల్లడవుతుంది. కాని యీ వ్యవస్థలోని పని విభజనకు, అమ్మకం కోసం జరిగే సరుకుల ఉత్పత్తి విధానంలోని శ్రమ విభజనకు ఏ విధమైన పోలికా లేదు. ఎందువల్లనంటే కంసాలి, వడ్రంగి, కుమ్మరి మొదలయిన వారి వస్తువులకు మార్కెట్‌లో మార్పు వుండదు. ఒకవేళ అవసరమైతే గ్రామ పరిమాణాన్ని బట్టి ఒకరికి బదులుగా ఇద్దరో, ముగ్గురో ఒకేరకమైన వృత్తిని చేపడతారు. ఈ తెగలలో పని విభజనను క్రమబద్ధం చేసే నియమాలు, ప్రకృతి నియమాలు మాదిరిగానే అధిగమించడానికి వీలులేనంత కట్టుదిట్టంగా ఉన్నాయి. అదే సమయంలో కమ్మరి, వడ్రంగి మొదలయిన చేతివృత్తులవారు తమ కార్ఖానాల్లో తమ తమ వృత్తులకు సంబంధించిన పనులను స్వతంత్రంగా ఎవరి అధికారానికి లోబడి వుండక సాంప్రదాయసిద్ధంగా నిర్వహించేవారు.

స్వయంసమృద్ధమైన ఈ కమ్యూన్‌లలో సులభంగా అనుసరణ యోగ్యమైన ఈ ఉత్పత్తి విధానం వలన ఈ విధమైన కమ్యూన్ (తెగ)లు ఇదే పద్ధతిలో రూపొందసాగాయి. ప్రమాదవశాత్తు ఎక్కడైనా ఒక తెగ నాశనం చేయబడినట్లయితే అదే పేరుతో అదే ప్రదేశంలో ఈ కమ్యూన్‌లు తిరిగి ఏర్పడుతుండేవి. ఆసియాలోని సామాజిక వ్యవస్థలు మారకుండా వుండటానికి ప్రధాన కారణం, ఈ సామాజిక వ్యవస్థలలోని సౌలభ్యమేనని చెప్పవచ్చు. కాని ఇందుకు పూర్తి భిన్నంగా ఆసియాలోని ప్రభుత్వాలు మాత్రం పడిపోవడం, తిరిగి స్థాపించబడటం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే వున్నది. ఈ సందర్భంగా ఈ దేశాలను పాలిస్తున్న వంశాలు కూడా అంతులేకుండా మారుతూనే వున్నాయి. రాజకీయంగా ఎన్ని తుఫానులు చెలరేగినప్పటికీ ఆనాటి సామాజిక వ్యవస్థలోని ఆర్థిక పునాదులు చెక్కు చెదరకుండా నిలిచాయి.

ప్రాచీన భారత సామాజిక ఆర్థిక వ్యవస్థలను గురించిన మూల విషయాలను మార్క్స్ స్పష్టంగా వివరించాడు.

## సామ్రాజ్యవాదానికి లోబడిన నూతన ఫ్యూడల్ వ్యవస్థ

బ్రిటిషు సామ్రాజ్యవాదుల వలస పాలన, దోపిడీల ఫలితంగా స్వయం సమృద్ధమైన ఈ ప్రాచీన సామాజిక వ్యవస్థలోని ఉత్పత్తి విధానం పూర్తిగా నాశనమైంది. బ్రిటిషు సైన్యాలు భారత భూభాగాన్ని ఆక్రమించనారంభించాయి. 1757లో బ్రిటిషు వారికి, సిరాజ్ ఉద్దౌలాకు మధ్య ప్లాసీ వద్ద జరిగిన యుద్ధంలో, బ్రిటిషు సామ్రాజ్యవాదులు కుట్ర చేసి విజయం సాధించారు. ఫలితంగా ఈ ప్రాంతాలలోని అతి ప్రాచీనమైన ఆర్థిక వ్యవస్థ, సామాజిక శ్రమ విభజన విధానం చిన్నాభిన్నమయ్యాయి. ఈ విధంగా బ్రిటిషు వారి దురాక్రమణ ఫలితంగా ఆక్రమిత ప్రదేశాలలోని అదనపు ఉత్పత్తి ఈ వలసవాదుల హస్తగతమైంది. దీనితో వారు భారతదేశంలోని సంపదను ప్రత్యక్షంగానే కొల్లగొట్టి ఇంగ్లండుకు తరలించసాగారు. ఈస్టిండియా కంపెనీ భారతదేశంలోని వ్యాపారంపై అత్యధికంగా పన్ను విధించడం ద్వారానూ, పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారం సాగించడం ద్వారాను భారత ప్రజానీకాన్ని విపరీతంగా దోపిడీ చేయసాగింది.

ఈ ప్రత్యక్ష దోపిడీని గురించి ప్రస్తావిస్తూ, "18వ శతాబ్దం మొత్తంగా పరిశీలించినట్లయితే, భారత ప్రజానీకాన్ని ప్రత్యక్షంగా దోపిడీ చేయడం ద్వారాను, ఇతర అక్రమ పద్ధతుల ద్వారాను, భారత్ నుండి ఇంగ్లండ్‌కు తరలించబడిన ధనరాసులతో పోల్చి చూసినట్లయితే, వాణిజ్యం ద్వారా వారు సంపాదించినది అతి స్వల్పం" అని మార్క్స్ పేర్కొన్నాడు.

భారతదేశంలోని సంపదను బ్రిటన్‌కు తరలించడానికి ఈస్టిండియా కంపెనీ ఒక సాధనంగా పనిచేసింది. భారత ప్రజల శ్రమశక్తిని సంపదగా మార్చి, దానిని బ్రిటన్‌కు తరలించడం ద్వారా సామ్రాజ్యవాదులు మొదటిసారిగా "పెట్టుబడి"ని ప్రోగుచేసుకున్నారు. బ్రిటిషు వారు తక్కువ చేసి చూపిన ప్రకారమే 1757 నుండి 1812 వరకు గల 55 సంవత్సరాల కాలంలో ఇండియా నుండి బ్రిటిషు వలసవాదులు ప్రత్యక్షంగా 10 కోట్ల పౌండ్లు దండుకున్నారు.

ఈ విధంగా సైనిక కుట్రల ద్వారా యుద్ధాలలో విజయం సాధించడం, ఆక్రమిత ప్రాంతాలలోని సంపదలను కొల్లగొట్టడం కొన్ని దశాబ్దాలపాటు కొనసాగింది. తమ పరిపాలనను సుస్థిరం చేసుకొని, శాశ్వత ఆదాయాన్ని సంపాదించుకోవడం కోసం ఈ దోపిడీని క్రమబద్ధం చేసి చట్టబద్ధం చేయాల్సిన అవసరాన్ని బ్రిటిషు వలసవాదులు గుర్తించారు. అందువలన బ్రిటిషు పారిశ్రామిక పెట్టుబడుల ప్రయోజనాలను పరిరక్షించుకొనడానికి బ్రిటిషు సామ్రాజ్యవాదులు భూసంబంధమైన విషయాలలో కొన్ని మార్పులను, కొన్ని పరిపాలనా పద్ధతులను ప్రవేశపెట్టారు.

లార్డ్ కారన్‌వాలీస్ వైస్రాయిగా వున్న కాలంలో 1793లో వలసవాదులు శాశ్వతశిస్తు నిర్ణయపద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి ప్రకారం తూర్పు ఇండియాలోని జమీందారుల వద్దనుండి నిర్ణీతమైన రేటు ప్రకారం శాశ్వత ప్రాతిపదిక మీద పన్ను వసూలు చేస్తుండేవారు. 1793 శాశ్వత శిస్తు నిర్ణయ చట్టంతో సహా తదుపరి చేయబడిన చట్టాల వలన కేవలం జమీందారులకు మాత్రమే భూమిపై యాజమాన్య హక్కులు సంక్రమించాయి. గ్రామీణ ప్రాంతాలలోని కమ్యూనిటీ సభ్యుల, చిన్న చిన్న ఫ్యూడల్ భూస్వాముల వారసత్వ హక్కులు గుర్తించబడలేదు. బెంగాల్ ప్రెసిడెన్సీ ప్రాంతంలోని ప్రజలకు భూమిపై వారసత్వ హక్కులు పోయి, వీరివద్ద నుండి పన్ను వసూలు చేసే “జమీందారులకు” యీ భూమిపై యాజమాన్య హక్కులు సంక్రమించాయి.

ఈ ఫ్యూడల్ జమీందారులకు భూమిపై యాజమాన్య హక్కులు లభించినప్పటికీ వారు వసూలు చేసిన పన్నులో పదకొండింట పది వంతులు (10/11 భాగం) ఈ జమీందారులే బ్రిటిషు వలసవాదులకు చెల్లించవలసియున్నది. ఒకవేళ ఈ జమిందారులు యీ భాగాన్ని చెల్లించలేక పోయినట్లయితే, ఆ విధంగా పన్ను చెల్లించగల్గిన వారికే ఈ జమిందారీ భూమిని ప్రభుత్వమే అమ్మివేసేది. ఈ వలస పాలకులను సంతృప్తి పరచడానికి, తమ ఐశ్వర్యాన్ని పెంచుకొనడానికి, జమీందారులు రైతాంగాన్ని దోపిడీచేయడం తీవ్రతరం చేయసాగారు. అనేక సందర్భాల్లో యీ దోపిడీ అమానుషమైన పద్ధతుల్లో సాగింది. ప్రభుత్వానికి జమీందారులు చెల్లించవలసిన “పన్నులో వాటా” స్థిరంగా వున్నప్పటికీ, రైతాంగంపై పన్నులు తమ యిష్టం వచ్చినట్లు పెంచడానికి జమీందారులకు సర్వాధికారాలున్నాయి. ఈ పరిణామ క్రమంలో ప్రాచీన భారతదేశంలోని ఫ్యూడల్ ప్రభువులు అదృశ్యం కావడంతో వడ్డీ వ్యాపారస్తులు, వాణిజ్యవేత్తలు, వలసవాదాన్ని పోషించే అధికారవర్గంతో ఒక నూతన భూస్వామ్యవర్గం అవతరించింది. దీనితో వ్యవసాయదారునికి, జమీందారుకు మధ్య పరాన్నభుక్కులైన మధ్యవర్తులు పుట్టుకొచ్చారు. వారిలో ప్రతి ఒక్కరు తమ వాటాలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకొనేవారుకాదు. దీనితో రైతాంగం మీద సాగుతున్న దోపిడీకి అంతూపంతూ లేకుండా పోయింది.

దక్షిణ భారతదేశంలో రైతాంగాన్ని దోపిడీ చేయడానికి వలసవాదులు రైత్వారీపద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి ప్రకారం రైతు కొంత భూమిని శాశ్వత ప్రాతిపదికమీద కౌలుకు

తీసుకుంటాడు. అతడు ఈ భూమిలో కష్టించి పని చేయడంతో పాటు, జమిందారు పనులు కూడా చేయవల్సి వుండేది. నిజానికి రైతు భూమికి కట్టి వేయబడి ఒక బానిసగా తయారయ్యాడు.

మార్పు చేసిన ఫ్యూడల్ పద్ధతుల్లో రైతాంగాన్ని దోపిడీ చేయడానికి జమిందారీ, రైత్వారీ పద్ధతులు రెండు ప్రధాన మార్గాలయ్యాయి. ఈ విధానాలు బ్రిటిషు వలసవాదుల ప్రయోజనాలను సంపూర్ణంగా పరిరక్షించి రైతాంగాన్ని అర్ధబానిసల స్థితికి దిగజార్చాయి.

## స్వదేశీ పరిశ్రమ విచ్ఛిన్నం : గ్రామీణ ఆర్థికవ్యవస్థపై మోయలేని భారాలు

ఇంగ్లండులో పారిశ్రామిక విప్లవాన్ని విస్తరించడం కోసం భారతదేశాన్ని కొల్లగొట్టి ఆ సంపదను ఇంగ్లండుకు తరలించడంతో బాటు, ఇంగ్లండులో తయారయిన పారిశ్రామిక ఉత్పత్తులకు ఇండియాలో మార్కెట్‌ను అభివృద్ధి పరచుకొనవలసిన అవసరాన్ని బ్రిటిషు పెట్టుబడిదారులు గుర్తించారు. అంటే, ఇండియాతో వారు స్వేచ్ఛా వ్యాపారాన్ని వాంఛిస్తున్నారన్నమాట. 1757 ప్లాసీ యుద్ధకాలంనాటి నుండి వాణిజ్యంలో ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం కల్గియుండడం వలన బ్రిటిషు పెట్టుబడిదారీ వర్గం ఇండియాతో స్వేచ్ఛావ్యాపారం చేయడానికి ఆటంకంగా పరిణమించింది. తమ పారిశ్రామిక ఉత్పత్తులకు క్రొత్త మార్కెట్ల అన్వేషణలో భాగంగా ఇండియాతో వ్యాపారం విషయంలో ఈస్టిండియా కంపెనీకి వున్న సౌకర్యాలను రద్దుచేయాలని ఇంగ్లీషు బూర్జువా వర్గం ముమ్మర ప్రచారం సాగించింది. భారత్‌తో వ్యాపారం విషయంలో ఈస్టిండియా కంపెనీకి వున్న గుత్తాధిపత్యం 1813లో రద్దుచేయబడడంతో, ఇండియాతో స్వేచ్ఛా వ్యాపారానికి గేట్లు తెరవబడ్డాయి. అప్పటివరకూ భారతదేశం ఆర్థికపరంగా గురవుతున్న దోపిడీ యీ పరిణామంతో ఒక నూతన దశకు చేరింది. నాటివరకు భారతదేశంలో తయారయిన సిల్కు, నాజుకైన నూలు వస్త్రాలు తదితర విలాసవస్తువులను ఇంగ్లండుకు ఎగుమతి చేయడం ద్వారా ఈస్టిండియా కంపెనీ లాభాలార్జిస్తోంది. కాని 1813 తరువాత బ్రిటిషు పారిశ్రామిక వుత్పత్తులు స్వేచ్ఛగా ఇండియాలో మార్కెట్ చేయబడటంతో, భారతదేశానికి ఇంగ్లండు ఎగుమతులు శీఘ్రంగా అభివృద్ధి చెందాయి.

ఇంగ్లండు నుండి ఇండియాకు ఎగుమతులు 1814 సం॥లో 16 లక్షల పౌండ్లు వుండగా 1828 నాటికి 58 లక్షల పౌండ్లకు చేరుకున్నాయి. ఇది మొత్తం బ్రిటిష్ ఎగుమతుల్లో 1/8వ వంతు భారతదేశంతో వ్యాపారంలో 1828 నాటికి మొత్తం లక్షా పదివేల టన్నుల బరువుగల్గిన ఓడలు వినియోగించబడ్డాయి.

1814లో బ్రిటను రెండు లక్షల పదమూడువేల గజాల సాదా నూలు వస్త్రాలు, ఎనిమిది లక్షల గజాల రంగు వస్త్రాలు ఇండియాకు ఎగుమతి చేసింది. 1826లో బ్రిటను కోటి అరవై లక్షల గజాల సాదా నూలు వస్త్రాలను, రెండు కోట్ల అరవై లక్షల గజాల రంగు వస్త్రాలను ఇండియాకు ఎగుమతి చేసింది.

భారతదేశంలో రైలు మార్గాలను వేసి వివిధ వాణిజ్య కేంద్రాలను ఓడరేవులతో కలిపి సామ్రాజ్యవాదులు తమ ఎగుమతులను అవిచ్ఛిన్నంగా కొనసాగించారు. బ్రిటన్ నుండి భారతదేశానికి దిగుమతి అయ్యే వ్యాపార వస్తువుల మీద ఏ విధమైన పరిమితులుగాని, ఆంక్షలుగాని లేవు. దీనికి తోడు భారతదేశంలో తయారైన నేత వస్త్రాలు, పట్టువస్త్రాలపై ఇంగ్లండులో 70 నుండి 80 శాతం దిగుమతి సుంకం విధించబడుతూండేది. వ్యాపార విషయంలో యీ విధమైన వివక్షతతో కూడిన వలస విధానాల ఫలితంగా భారతీయ పరిశ్రమలు ముఖ్యంగా వస్త్రపరిశ్రమ వినాశానికి గురవసాగింది. అదే సమయంలో బ్రిటిషు పరిశ్రమలు అందునా బ్రిటిషు వస్త్ర పరిశ్రమ శీఘ్రంగా అభివృద్ధి చెందసాగింది. అందువలన భారతదేశంలో స్వదేశీ పరిశ్రమలు విచ్ఛిన్నం కావడానికి, బ్రిటన్‌లో పారిశ్రామికాభివృద్ధి జరగడానికి ఒక్క సాంకేతిక పురోభివృద్ధి మాత్రమే కారణం కాదని స్పష్టమవుతోంది. బ్రిటిషు వలస పాలకులు అనుసరించిన స్వేచ్ఛా వ్యాపార విధానం, ఇతర దేశాలకు భారతీయ ఉత్పత్తుల ఎగుమతులపై వున్న నిషేధం కూడ మన దేశంలో స్వదేశీ పరిశ్రమల విచ్ఛిన్నానికి దారితీసిందని చెప్పక తప్పదు. భారతీయ వస్త్ర పరిశ్రమకొక్కదానికే యీ దురవస్థ పట్టలేదు. దీనితో పాటు లోహ సంబంధమైన పరిశ్రమలు మరియు ఇతర పరిశ్రమలు కూడ వినాశనానికి గురయ్యాయి.

బ్రిటనులో పారిశ్రామికాభివృద్ధి ఇండియాలో జరుగుతున్న ముడి సరుకుల ఉత్పాదనపై పూర్తిగా ఆధారపడి ఉన్నది. అంటే భారతదేశం నుండి ముడి సరుకులు వెళ్ళకపోతే బ్రిటన్‌లోని పరిశ్రమలు దాదాపు పనిచేయవు. అందువల్ల భారతదేశంలోకి బ్రిటిషు పారిశ్రామిక ఉత్పత్తులను విపరీతంగా గుప్పించడం బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు చాలా అవసరం. అందువలననే మన దేశంలోని ముడి సరుకులను, వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనడం వారి తక్షణావసరంగా పరిణమించింది. సామ్రాజ్యవాదులు అవలంబిస్తున్న అతి జుగుప్సాకరమైన ఈ వాణిజ్య విధానాల పుణ్యమా అని ఇండియా ఒక వ్యవసాయిక దేశంగా మారి, పెట్టుబడిదారీ బ్రిటనుకు ముడి పదార్థాలను ఎగుమతిచేసే ఒక వలస దేశంగా మారిపోయింది. అంతేగాక సామ్రాజ్యవాదుల ఈ వలస పాలన ఫలితంగా ఫ్యూడల్ దోపిడీ విధానాలు అవిచ్ఛిన్నంగా కొనసాగాయి.

భారత్ ఇంగ్లండుకు వ్యవసాయిక ఉత్పత్తులు, ముడిసరుకులు ఎగుమతి చేసే దేశంగా బలవంతంగా మార్చబడడంతో, స్వదేశ పరిశ్రమల్లో పని విభజనపై అనేక దుష్ఫలితాలు సంభవించాయి. ముఖ్యంగా వ్యవసాయం, స్వదేశీ పరిశ్రమలు యీ దుష్పరిణామాలకు గురయ్యాయి. తరతరాలుగా కొన్ని వృత్తులనవలంబించి జీవనాధారం సంపాదించుకునే అనేకమంది చేతివృత్తులవారు తమ వృత్తులను వదిలివేసి, అసలే తీవ్ర సమస్యల నెదుర్కొంటున్న గ్రామ సీమలకు తరలిపోక తప్పలేదు. ప్రాచీన భారత ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక, వ్యవసాయిక ఉత్పత్తులను సమన్వయం చేసే ఒక విశిష్టమైన ఐక్యతాబంధం తెగిపోయింది. వెయ్యి సంవత్సరాల ఈ నాగరికత తృణీకరించబడి ప్రాచీన భారత సామాజిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది.

ఈ పరిణామాలు భారత కార్మికవర్గాన్ని అనేక కష్టనష్టాలకు గురిచేశాయి. భారతదేశాన్ని ఇంగ్లండుకు వ్యావసాయిక ఉత్పత్తులను, ముడిసరుకులను ఎగుమతి చేసే ఒక అనుబంధ రాజ్యంగా చేసిన ఈ పరిణామం చాలా బాధాకరమైనది.

పని పోగొట్టుకొన్న వారందరు తరలిపోవడంతో గ్రామసీమలలో జన సమ్మర్థం పెరిగి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమవసాగింది. ఆనాటి దుష్ఫలితాలు భారత ప్రజానీకాన్ని ఈనాటికీ వెంటాడుతూనే వున్నాయి. అందువలన ఈనాటికీ భారత ప్రజానీకం అనుభవిస్తున్న దురవస్థ, బ్రిటిషు సామ్రాజ్యవాదులు అనుసరించిన అతి క్రూరమైన వలస దోపిడీ విధానం మూలంగా ఉత్పన్నమైనదని స్పష్టమవుతుంది.

భారతదేశంలో ఆధునిక పరిశ్రమ అభివృద్ధి చెందిన తీరు, భారత కార్మికవర్గ పుట్టుక, దాని పురోభివృద్ధి, యీ అభివృద్ధి క్రమంలో తలెత్తిన అనేక సమస్యలు మొదలగువాటిని గురించి పరిశీలించేందుకు ముందుగా భారతదేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై మోపబడిన భారాలను గురించిన చారిత్రక క్రమాన్ని పరిశీలించవలసివుంది.

# 3

# భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి : కార్మికవర్గ అవతరణ

## రైల్వేలు, తదితర ప్రాథమిక పరిశ్రమలు (1850-1900)

**యూ**రపులో పెట్టుబడిదారీ విధానం ఫ్యూడల్ (వ్యవస్థ) అవశేషాలపై నిర్మింపబడి అభివృద్ధి చెందింది. కాని ఇండియాలో ఈ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి ఇందుకు భిన్నంగా వుంది. బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రాచీన భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినప్పటికి, దాని స్థానంలో ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థను స్థాపించలేదు. అందువలన భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి ఒక విభిన్న పద్ధతిలో జరిగింది. ఈ విధాన అభివృద్ధి క్రమంలో అనేక వైరుధ్యాలు, ఆటంకాలు సంభవించి భారత ప్రజానీకాన్ని తీవ్ర బాధలకు గురిచేశాయి. ఏమయినప్పటికీ బ్రిటిషు పాలన వలన భారతదేశంలో వినాశకర పరిణామాలతో పాటు మంచి పరిణామాలు కూడా సంభవించాయి.

తమ వలస దోపిడీ విధానాన్ని సుస్థిరం చేసుకునేందుకు బ్రిటిషు పాలకులు ప్రాచీన ఆసియా సామాజిక వ్యవస్థను తుడిచిపెట్టారు. బ్రిటిషు సామ్రాజ్యవాదులు తీసుకున్న కొన్ని చర్యల ఫలితంగా పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి అనివార్యమైంది. ఈ పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి అనేక అవరోధాలు సంభవించడంతో ఈ అభివృద్ధిక్రమం త్వరితగతిన కొనసాగలేదు.

పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి క్రమంలో రైల్వేలు కీలకమైన పాత్ర వహించాయి. ఇంగ్లండు నుండి దిగుమతి చేసుకున్న సరుకులను వివిధ రేవుల నుండి దేశం నలుమూలలకూ రవాణా చేయడానికి, దేశంలో వివిధ ప్రాంతాల నుండి ముడి సరుకులను రేవులకు చేర్చడానికి, భారత ప్రజానీకం సాగిస్తున్న పోరాటాలను అణచివేసేందుకు మిలటరీని శీఘ్రంగా తరలించడానికి ఒక్క మాటలో చెప్పాలంటే తమ వలస పాలనను, దోపిడీ విధానాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించుకునేందుకు బ్రిటిషు సామ్రాజ్యవాదులకు భారతదేశంలో రైళ్ళను ప్రవేశపెట్టడం తప్పనిసరి అయింది. మూడు రాజధానీ పట్టణాలను ఒకదాని నొకదానితో కలుపుతూ, అలాగే

ఈ ప్రెసిడెన్సీ పట్టణాలను వాయువ్య సరిహద్దు ప్రాంతాలతో కలుపుతూ రైలు మార్గాలను నిర్మించడం వలన సామాజికంగాను, రాజకీయంగానూ, వాణిజ్యపరంగానూ, అనేక లాభాలు ఒనగూడుతాయని 1853లో వైస్రాయిగా వున్న లార్డ్ డల్హౌసీ తన అధికార నివేదికలో పేర్కొన్నాడు.

భారతదేశంలో బ్రిటిషువారి వలసపాలన మూలంగా ఏర్పడిన పరిణామాలను గురించి సునిశితంగా పరిశీలించి మార్క్సు చేసిన విమర్శను ఈ సందర్భంలో గమనించడం మిక్కిలి అవసరం.

"ఇంగ్లండులోని మిల్లు యజమానులు తమ పరిశ్రమలకు కావలసిన పత్తి తదితర ముడి సరుకులను చౌకగా సమకూర్చుకోవాలనే సంకుచిత బుద్ధితో మాత్రమే భారతదేశంలో రైల్వేలను అభివృద్ధి చేయదలచుకున్నారని నాకు తెలుసు. కాని ఒకసారి ఒక దేశ రవాణాలో ముఖ్యంగా బొగ్గు, ఇనుము కలిగివున్న దేశాల్లో యంత్రాలు ప్రవేశ పెట్టబడినట్లయితే, ఇక వాటి విస్తరణను అరికట్టడం అసాధ్యం. రైల్వేలకు సంబంధించిన వివిధ తక్షణ అవసరాలను సమకూర్చేందుకు అవసరమైన పారిశ్రామికీకరణను చేపట్టకుండా ఒక పెద్ద దేశంలో రైలుమార్గాలను నిర్వహించడం సాధ్యంకాదు. ఈ పారిశ్రామికీకరణ వలన రైల్వేలతో ఎక్కువగా ప్రత్యక్ష సంబంధంలేని వివిధ పారిశ్రామిక విభాగాలకు కూడా ఈ యంత్రాల వినియోగం విస్తరిస్తుంది. అందువలన భారతదేశంలో రైల్వేలు ఆధునిక పారిశ్రామిక అభివృద్ధికి 'నాంది' పలికాయని చెప్పవచ్చు" అని మార్క్సు చేసిన వ్యాఖ్య ఆయన దూరదృష్టికి ప్రబల నిదర్శనం.

తమ తక్షణ వ్యాపార ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని రైల్వేలను ప్రవేశపెట్టినప్పటికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రైల్వేలకు సంబంధించిన అనుబంధ పరిశ్రమలలో కూడా బ్రిటిషు పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టక తప్పలేదు.

1845లో లండన్‌లో స్థాపించబడిన "ది గ్రేట్ ఇండియన్ రైల్వే కంపెనీ", "ది గ్రేట్ పెనిన్సులర్ రైల్వే కంపెనీ" అనే రెండు బ్రిటిషు ప్రైవేటు కంపెనీలు ఇండియాలో ప్రప్రథమంగా రైల్వేల నిర్మాణాన్ని చేపట్టాయి. 1853లో 20 మైళ్ళ నిడివి గల రైలు మార్గాలు, 1857లో 288 మైళ్ళ పొడవు గల రైలు మార్గాలు నిర్మించబడ్డాయి. 1857లో జరిగిన బ్రహ్మాండమైన తిరుగుబాటు తరువాత బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ ఆధిక్యతను నిలబెట్టుకొనడానికి రవాణా సౌకర్యాల (సమాచారాన్నందజేసే సాధనాల) ఆవశ్యకతను గుర్తించి, పెద్ద ఎత్తున రైలుమార్గాల నిర్మాణాన్ని చేపట్టారు.

భారతదేశంలో ఈ రైల్వేల నిర్మాణంతోనే ఆధునిక భారత కార్మికవర్గం అవతరించిందని చెప్పాలి. ఈ రైల్వేల నిర్మాణంలో పాల్గొన్న వందలాది కార్మికులే నేటి భారత కార్మికవర్గ అవతరణకు నాంది పలికారు.

రైళ్ళు నడవడానికి బొగ్గు అత్యవసరమైనది. అందువలన రైలు మార్గాల నిర్మాణంతో బాటు బొగ్గు పరిశ్రమ (బొగ్గు త్రవ్వకం) శీఘ్రంగా విస్తరించింది. 1770 లోనే బొగ్గు కనుగొనబడి వినియోగంలోకి తేబడింది. 1843లో బెంగాల్ కోల్ కంపెనీ స్థాపించబడింది. 1895 నాటికి ఝురియాలోని పెద్ద బొగ్గు గనులలో త్రవ్వకం ప్రారంభమైంది.

రైలు మార్గాలు, ఓడ మార్గాల వంటి మిక్కిలి ఉపయోగకరమైన రవాణా సౌకర్యాలు ఏర్పరచబడ్డాయి. ఫలితంగా ముడి సరుకులను ఎగుమతి చేసి ఇంగ్లండులో తయారైన వస్తువులను దిగుమతి చేసే వాణిజ్య సంస్థల సంఖ్య పెరిగింది. కొన్ని వస్తువులను ఎగుమతి చేసే ముందే శుద్ధి చేయవలసిన అవసరం వుండడం వలన బియ్యపు మిల్లులు, పిండిమరలు, పత్తి నుండి గింజలను వేరే చేసే జిన్నింగ్ మిల్లులు, ప్రెస్సింగ్ మిల్లులు, బంగీలుకట్టే వ్యాపారం కుక్కగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

అనుబంధ పరిశ్రమలతో బాటు బొగ్గు పరిశ్రమ గూడా భారత కార్మికవర్గ అవతరణకు దోహదం చేసింది.

ఇదిలా వుండగా టీ తోటల పెంపకం విశేషంగా అభివృద్ధి చెందనారంభించింది. 1839లో "అస్సాం టీ" పేరిట మొట్టమొదటి బ్రిటిషు టీ కంపెనీ స్థాపించబడింది. ప్రారంభంలో అనేక ఇబ్బందులు ఎదురైనప్పటికీ బ్రిటిషు పెట్టుబడులు అధికం కావడంతో, టీ పరిశ్రమ సర్వతోముఖాభివృద్ధి చెందింది. ఈ టీ తోటలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు, బానిసలకూ మధ్య పెద్ద తేడాలేదు. ఈ అర్ధ బానిసలు కూడా అభివృద్ధి చెందుతున్న భారత కార్మికవర్గంలో ఒక భాగమే.

ఇదే సమయంలో జనపనార పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. బ్రిటిషు పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలో వున్న ఈ జనపనార పరిశ్రమ బ్రిటిషు పెట్టుబడులను విశేషంగా ఆకర్షించింది. 1775లో ఈస్టిండియా కంపెనీచే కనుగొనబడిన జనపనార, 1835లో మొట్టమొదటిసారిగా ఇంగ్లండ్‌లోని దుండీ వద్ద శుద్ధి చేయబడింది. కలకత్తాకు సమీపాన వున్న రిష్రా వద్ద ఆక్లండ్ అనునాతడు 1854లో ఇండియాలోనే మొట్టమొదటి జనపనార మిల్లును స్థాపించాడు. ఈ పరిశ్రమలో పెట్టుబడుల కేంద్రీకరణ అధికం కావడంతో, 1886 నాటికి "ఇండియన్ జూట్ మిల్స్ అసోసియేషన్" ఏర్పాటు కూడా జరిగింది.

భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి భారత బూర్జువా వర్గానికి చెందిన జౌళి మిల్లుల ఆవిర్భావం ప్రధానాంశమైనది. "ఫోర్ట్‌గ్లష్టర్ మిల్స్" పేరిట కలకత్తాకు సమీపంలో బౌరియా వద్ద 1818లో భారతదేశంలో మొదటి నూలు మిల్లు స్థాపించబడింది. బెంగాలు రాష్ట్రంలో జనుము పంట అధికంగా వుండటంవలన జనపనార పరిశ్రమ బెంగాలులో కేంద్రీకరించినట్లే, మహారాష్ట్రలో నూలు పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. 1854లో బొంబాయిలో కోవాస్‌జీ నానాభాయ్ దేవర్ మొదటి నూలు మిల్లును స్థాపించాడు. 1879-80 నాటికి 58 నూలు మిల్లులు అవతరించాయి. భారతదేశంలో రెండు వ్యవస్థీకృత పరిశ్రమలు జనపనార, పత్తి పరిశ్రమలు స్థాపించబడి ఈ పరిశ్రమలలో వేలాది మంది కార్మికులు నియమించబడటంతో సంఖ్యాపరంగా భారత శ్రామికవర్గం గణనీయంగా అభివృద్ధి చెందింది.

1857 తిరుగుబాటు ఫలితంగా భారతచరిత్రలోనే బహుముఖ పరిణామాలు సంభవించాయి. ఈ తిరుగుబాటు మూలంగా బ్రిటిషువారు భారతదేశంలో రైల్వేలు, తదితర

రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయవలసి వచ్చింది. సరిగ్గా ఈ తిరుగుబాటు తరువాతనే బ్రిటిషు పారిశ్రామికవేత్తలు భారతదేశం మీద ఈస్టిండియా కంపెనీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడంలో దాదాపు కృతకృత్యులయ్యారు. భారత మార్కెట్లో తమ ఉత్పత్తులను అమ్ముకొనేందుకు, దానిని పూర్తిగా వినియోగించుకొనడానికి బ్రిటిషు పారిశ్రామికవేత్తలకు ఈస్టిండియా కంపెనీ పాలన అవరోధంగా పరిణమించినట్లు భావించబడింది. చివరకు ఈ పారిశ్రామికవేత్తల ఆందోళన కారణంగానూ, సామ్రాజ్యవాద ప్రయోజనాల పరిరక్షణ నిమిత్తమూ 1858లో భారతదేశం బ్రిటిషు రాజరికపు ప్రత్యక్ష పాలనలోనికి తేబడింది.

బ్రిటిషు బూర్జువా వర్గం ఇండియాలో వాణిజ్యాన్ని, పరిశ్రమలను విస్తరింప జేయడంతో, ఇండియాలో యూరపు సంస్థల దళారీలకు, ఇంగ్లీషువారి వ్యాపార సంస్థలలో పనిచేసే కొందరు దుబాసీలు, గుమాస్తాలు, ఆంతరంగికులు (పర్సనల్ అసిస్టెంట్లు), చీఫ్ ఏజెంట్లు మొదలగు వారితో పాటు భారతదేశంలోని జమీందారులకు కూడా విశేషంగా ధనార్జించే అవకాశాలు ఏర్పడ్డాయి. వీరిలో కొందరు పారిశ్రామిక సంస్థలలో పెట్టుబడులు పెట్టే స్థితికి కూడా ఎదిగారు. ఇండియాలోని యూరప్ సంస్థల దళారీలు, వడ్డీ వ్యాపారులు, జమిందారులు భారతదేశంలో అవతరించిన మొదటి బూర్జువావర్గం. భారత బూర్జువావర్గం అధీనంలో నడుస్తున్న ఈ పరిశ్రమల్లో పెద్ద సంఖ్యలో కార్మికులు చేర్చుకొనబడ్డారు. దీనితో భారతదేశంలో శ్రామికవర్గం సంఖ్యాపరంగా మరింత అభివృద్ధి చెందింది.

భారతదేశంలో ముడిసరుకులు సమృద్ధిగా లభిస్తున్నాయి. కార్మికులు కూడా కారుచౌకగా లభిస్తున్నారు. అందువలన బ్రిటిషు పెట్టుబడిదారులు భారతదేశంలో పరిశ్రమలు స్థాపించడానికి ఉత్సాహం చూపారు. ప్రధానంగా జనపనార, బొగ్గు గనులు, టీ తోటల పెంపకం మొదలైన పరిశ్రమలలో వీరు అధికంగా పెట్టుబడులు పెట్టారు. బ్రిటిష్ పెట్టుబడులకు కలకత్తా కూడలి కాగా, భారతీయ పెట్టుబడులకు బొంబాయి కేంద్ర స్థానమైంది.

పెద్ద పెద్ద పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో బాటు, వాణిజ్య కార్యకలాపాలు ముమ్మరం కావడంతో 19వ శతాబ్దాంతానికి కలకత్తా, బొంబాయి, మద్రాసు వంటి పెద్ద నగరాలు విస్తరించి త్వరితగతిన ఆధునికంగా తయారయ్యాయి. నగరాలు, రేవు పట్టణాలను కేంద్రంగా చేసుకొని భారత కార్మికవర్గం ఒక సంఘటిత వర్గంగా అభివృద్ధి చెందింది.

## స్వదేశీ ఉద్యమ ప్రభావం

వలస వ్యవస్థలోకి బ్రిటిషు గుత్త పెట్టుబడిదారులు చొరబడ్డారు. పరిశ్రమల్లో భారతీయ పెట్టుబడుల పాత్ర పరిమితంగా వున్నది. ఈ పరిస్థితుల వలన సామాజికం గానూ, ఆర్థికంగానూ వచ్చిన మార్పులతో బాటు, గత శతాబ్దపు 90వ దశకంలో మారకం, కరెన్సీ తదితర ఆర్థిక విధానాలలో తీవ్రమైన మార్పులు తేబడ్డాయి. ఈ పరిస్థితులు వలన భారతదేశంలో వలస

వ్యవస్థ గుణాత్మకంగా ఒక దశ నుండి వేరొక దశకు ఈడ్వబడింది. వ్యాపారం తదితర ఆర్థిక వ్యవహారాలకు పట్టణాలు ప్రధాన కేంద్రాలుగా అభివృద్ధి చెందడం కొనసాగుతూనే వున్నది. దాదాపు ఈ సమయంలోనే పట్టణ ప్రజానీకం పెరగడం, చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పారిశ్రామిక బూర్జువా వర్గంతో బాటు మేధావి వర్గం కూడా అవతరించడం జరిగింది. ఈ తరగతులకు చెందినవారు వలస బానిసత్వం వలన భారత ప్రజానీకంపై పడుతున్న భారాలను గుర్తించి, అట్టి వ్యవస్థను మార్చవలసిన అవసరాన్ని కూడా పూర్తిగా గ్రహించారు.

అందువలననే 19వ శతాబ్దం ఉత్తరార్థంలో జాతీయ పునరుజ్జీవనం ప్రారంభమైంది.

సమాజంలో నిర్దిష్టమైన ఒక వర్గంగా మేధావులు తమ కార్యకలాపాలను చాలా పరిమిత స్థాయిలో సాగించారు. తమకు ఉద్యోగాలు దొరకకపోవడంతో వీరు వలస పాలనను తీవ్రంగా వ్యతిరేకించడం ప్రారంభించారు. విజ్ఞానవంతులైన మేధావివర్గ ప్రతినిధులు కొన్ని సంఘ సంస్కరణ కార్యక్రమాలను ప్రతిపాదించారు. అంతేకాక విద్యావంతులైన వారిలో అభ్యుదయ భావాలను కల్గించడంలో ఈ మేధావి వర్గం కృషి సల్పింది. ప్రజలలో అభ్యుదయ భావాలు కల్గించడం ద్వారా జాతి పునర్నిర్మాణం చేయడానికి సాగుతున్న కృషి ఫలితంగా సంభవించే పరిణామాలను గుర్తించిన సామ్రాజ్యవాదులు, ఈ కృషిని తమ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు వినియోగించుకోవడానికి పూనుకున్నారు. ఈ లక్ష్య సాధనకు రిటైరైన ప్రభుత్వ అధికారి మరియు భవిష్యత్తులో భారతదేశంలో సంఘసేవకునిగా అవతారమెత్తనున్న అలెన్ ఆక్టేవియన్ హ్యూంను తగిన వ్యక్తిగా గుర్తించి, నాటి వైశ్రాయ్ లార్డ్ డఫ్రిన్ అందుకు ఆయనను నియమించాడు. హ్యూమ్ చొరవతోనే 1885లో భారత జాతీయ కాంగ్రెసు స్థాపించబడింది.

చరిత్రగతిని, దాని గతి తార్కిక క్రమాన్ని నిరోధించడం సామ్రాజ్యవాదులకు సాధ్యం కాలేదు. సామ్రాజ్యవాదులు తమ వలస ప్రయోజనాల పరిరక్షణకు ఏర్పాటు చేసుకున్న ఈ భారత జాతీయ కాంగ్రెస్సే చివరకు భారతీయ బూర్జువా వర్గం, సామాన్య ప్రజానీకం, సామ్రాజ్యవాదంతో ఘర్షణకు దిగి చరిత్ర గమనాన్నే మార్చడానికి వేదికగా ఉపయోగపడింది. భారతదేశ చరిత్రలోని ఈ భాగం ఈ గ్రంథ పరిధిలో లేనప్పటికీ, ఈ అంశానికున్న ప్రాధాన్యత దృష్ట్యా ఇండియాలో పారిశ్రామికీకరణ, కార్మికవర్గ అవతరణ, దాని అభివృద్ధికి సంబంధించిన ఘటనలను గురించి స్థూలంగా చర్చించడం అవసరం.

1905లో బెంగాలును విభజిస్తూ లార్డ్ కర్జన్ తీసుకున్న నిర్ణయాన్ని తిప్పికొట్టడానికి జరిగిన ఆందోళన నుండే స్వదేశీ ఉద్యమం ఆవిర్భవించింది. ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న బూర్జువా నాయకులు విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువులను కొనవలసిందిగా పిలుపు యిచ్చారు. దేశంలో తయారైన వస్తువులను కొనే ఉద్యమమే స్వదేశీ ఉద్యమంగా గుర్తించబడింది. ఈ ఉద్యమం బెంగాలు నుండి దేశం ఇతర ప్రాంతాలకు త్వరత్వరగా కార్చిచ్చువలె వ్యాపించింది. ఫలితంగా ఈ ఆందోళన ఒక ప్రక్క బ్రిటనులో

తయారైన వస్తువుల దిగుమతిని ఆపివేయడానికీ, వేరొక ప్రక్క భారత బూర్జువా వర్గం చేత పారిశ్రామిక సంస్థలను స్థాపింపజేసేందుకు సాగే ఉద్యమంగా పరిణామం చెందింది. ఈ స్వదేశీ ఉద్యమం తీవ్రంగా సాగుతున్న రోజుల్లో భారత బూర్జువా వర్గం ఆధ్వర్యంలోని వస్తు తయారీ రంగం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ తదితర పరిశ్రమలు అతి త్వరితంగా అభివృద్ధి చెందాయి. మిక్కిలి ప్రసిద్ధి చెందిన తాతా ఉక్కు కర్మాగారం 1908లో ఈ స్వదేశీ ఉద్యమం మహోన్నత దశలో వుండగా స్థాపించబడినదే. మాంఛెస్టర్‌లో తయారైన టెక్స్‌టైల్ సామానుల బహిష్కరణోద్యమాన్ని అవకాశంగా తీసుకుని భారత బూర్జువా వర్గం బొంబాయి, అహమ్మదాబాద్‌లలో విస్తృతంగానూ, బెంగాలులో కొంతమేరకు టెక్స్‌టైల్ పరిశ్రమలను సుస్థిరం చేసుకుంది.

పరిశ్రమలపై ఆధిపత్యం కోసం తహతహలాడుతున్న భారత బూర్జువా వర్గం కోరిక కొంతవరకు ఈ స్వదేశీ ఉద్యమ ఫలితంగా నెరవేరింది. కాని ఈ పారిశ్రామికీకరణ ఫలితంగా విశేషంగా అభివృద్ధి చెందిన భారత పారిశ్రామిక కార్మిక వర్గం, భారతదేశ విప్లవ పోరాట చరిత్రలో మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది.

## భారత కార్మికవర్గ అభివృద్ధిననుసరిస్తూ వచ్చిన ప్రత్యేక లక్షణాలు

19వ శతాబ్దం రెండవ భాగంలోనూ, 20వ శతాబ్దం ప్రారంభంలోనూ భారత కార్మికవర్గం అవతరించి, పురోగమించడానికి గల ప్రధాన కారణాలు పరిశీలించినట్లయితే ఇవి చాలావరకు యూరపులోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికోద్యమ అభివృద్ధిని పోలివున్నాయి. అయితే ఈ అభివృద్ధి క్రమం మాత్రం భారత కార్మికవర్గ చరిత్రనే బహుముఖంగా ప్రభావితం చేసే అనేక ప్రధాన అంశాల్లో యూరపు దేశాల్లోని పరిణామాల నుండి భిన్నంగా వుంది.

యూరపులో కూడా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి వలన పెద్ద పెద్ద పరిశ్రమల ధాటికి తట్టుకొనలేక గృహ పరిశ్రమలు నాశనమై అనేకమంది చేతి పనులవారు, వృత్తి కళాకారులు తమ వృత్తులను వదలివేయవలసి వచ్చింది. కాని ఇంగ్లండు తదితర అభివృద్ధి చెందిన యూరపు దేశాలలోని పనులు పోగొట్టుకున్న చేతి వృత్తులవారు, వృత్తి కళాకారులు పట్టణాలను వదలి పల్లె ప్రాంతాలకు తరలిపోవలసిన అవసరంగాని, పరిస్థితులుగానీ లేవు. వారందరూ పెద్ద పెద్ద పరిశ్రమలలో పనులు సంపాదించు కోగలిగారు. అతి ప్రాచీనమైన నైపుణ్యం, పట్టణవాసుల లక్షణాలు కల్గిన వీరందరూ ఆధునిక పరిశ్రమలలో శ్రామికులుగా ప్రవేశించారు. వీరు పెట్టుబడిదారీ విధాన అభివృద్ధితో బాటు వేగంగా సంఘటితమై ఆధునిక కార్మికవర్గంగా రూపొందారు.

ఈ విషయంలో భారతదేశంలోని కార్మికుల పరిస్థితి ఇంగ్లండులోని కార్మికుల పరిస్థితులకు పూర్తి భిన్నంగా వున్నది. వలసవాదుల ప్రయోజనాల కొరకు భారతదేశంలో సంప్రదాయసిద్ధంగా వస్తున్న చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు నాశనం చేయబడ్డాయి.

యూరపులో పనులు పోగొట్టుకున్న చేతివృత్తుల వారందరూ పరిశ్రమలలో తిరిగి పనులు సంపాదించుకోగలగలిగారు. కాని భారతదేశంలో యూరపులో వలె కుటీర పరిశ్రమల స్థానంలో ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి చెందలేదు. అందువలన తమ వృత్తులను కోల్పోయిన చేతివృత్తుల వారందరూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడి వ్యవసాయ కార్మికులుగానూ, దున్నుకోవడానికి భూమిలేని పేద రైతులుగానూ తమ జీవనాధారాన్ని సంపాదించుకోవలసి వచ్చింది. తరువాత రోజుల్లో దేశంలో రైల్వేలు ప్రవేశపెట్టబడటం, అక్కడక్కడ చెదురుమదురుగా పరిశ్రమలు స్థాపించబడడం జరిగింది. గ్రామాలలో దుర్భర దారిద్ర్యానికి లోనై అనేక కష్టాలనుభవిస్తూ, భారతీయ సమాజంలో అట్టడుగున ఉన్న ప్రజానీకం ఈ ఆధునిక పరిశ్రమలలో కార్మికులుగా ప్రవేశించింది.

ప్రాచీన కుటీర పరిశ్రమలు విచ్ఛిన్నం కావడానికి, పాక్షికంగానైనా వాటి స్థానంలో ఆధునిక పరిశ్రమలు స్థాపించబడడానికి మధ్య రెండు మూడు తరాల అంతరం సంభవించింది. ఫలితంగా పనులు పోగొట్టుకున్న చేతివృత్తులవారు తరతరాలుగా వస్తున్న తమ వృత్తి నైపుణ్యాన్ని కోల్పోయి, ఆధునిక పరిశ్రమలలో ప్రవేశించేనాటికి ఏ విధమైన నైపుణ్యం లేని కార్మికులుగా మిగిలిపోయారు. వీరందరు చాలా కాలంగా గ్రామాలలోని వ్యావసాయిక జీవితానికి చాలా సన్నిహితంగా వుండడం వలన, గ్రామీణ జీవితానికి సంబంధించిన అలవాట్లకు, మూఢ నమ్మకాలకు లోనైవున్నారు. ఈ స్థితిలో వారు ఆధునిక పరిశ్రమలలో కార్మికులుగా ప్రవేశించారు. భారతీయ సమాజంలో పాతుకుపోయివున్న కులతత్వం, జాతి విద్వేషం, మతమౌఢ్యం నుండి విముక్తి చెందే అవకాశం లేకపోగా వీరు మధ్య యుగాల నాటి ప్రమాదకరమైన భావాలచే తీవ్రంగా ప్రభావితమైయున్నారు. ఈ విధంగా ప్రగతి నిరోధక భావాలు, వెనుకబడిన ఆలోచనలకు తీవ్రంగా లోనైన వీరందరు భారత కార్మికవర్గ అవతరణకు మూలస్తంభాలయ్యారు. ఇందువలన భారత కార్మికవర్గం నిర్మాణరీత్యానూ, ఉద్యమపరంగానూ మిక్కిలి హానికరమైన బహుముఖ పరిణామాలకు లోనయింది. ఈ పరిస్థితులను గురించి వివరిస్తూ ఎం.ఎన్.రాయ్ యీ విధంగా పేర్కొన్నాడు.

"ఫ్యాక్టరీలు నెలకొనియున్న బొంబాయి, కలకత్తా వంటి పట్టణాలకు గత శతాబ్దం చివరి నాటికే కార్మికులు గణనీయమైన సంఖ్యలో చేరుకున్నారు.

ఈ కార్మికులలో అత్యధికులు నైపుణ్యం లేనివారే. క్రొత్తగా గ్రామాల నుండి వచ్చిన వారవడం చేత కుటుంబ బాధ్యతలుండేవి. కొద్దిగా అయినప్పటికీ భూమి కోసం పెరపెరలాడేవారు. రుణభారం అధికంగా వుండేది. నవభారతంలోని పట్టణ కార్మికుడు వృత్తులను పోగొట్టుకున్న చేతివృత్తుల వారి నుండి వచ్చినవాడు కాదు. పట్టణ కార్మికులు దాదాపు పేద రైతాంగం నుండి వచ్చినవారేనని చెప్పవచ్చు. వృత్తులను కోల్పోయిన చేతివృత్తులవారు తిరిగి భూమిని ఆశ్రయించారు. ఈ విధంగా భూమిని దున్నుకొనడానికి అలవాటుపడిన చేతివృత్తులవారు, ఆధునిక పరిశ్రమలవతరించి తిరిగి పట్టణాలకు చేరడానికి మధ్య రెండు మూడు తరాలు గతించాయి. ఇండియాలో సాధారణ పారిశ్రామిక అభివృద్ధి క్రమం నిరోధించబడింది. సాధారణంగా పరిశ్రమాభివృద్ధి చేతివృత్తులతో ప్రారంభమై వస్తువుల సామాన్య ఉత్పత్తి, కార్ఖానా

పరిశ్రమ (చిన్న ఫ్యాక్టరీల ద్వారా ఉత్పత్తి), యంత్ర పరిశ్రమ అనే వివిధ దశలను దాటి విస్తృత ఉత్పత్తి దశకు చేరుతుంది. కాని భారతదేశంలో పరిశ్రమాభివృద్ధి ఈ క్రమంలో జరగలేదు. అందువలన భారత కార్మికుడు పారిశ్రామిక శిక్షణ పొందియుండలేదు. అందుకే భారత కార్మికునిలో శ్రామికవర్గ సంప్రదాయాలు కొరవడ్డాయి."

భారత కార్మికవర్గ అవతరణలో ఇమిడివున్న ఈ ప్రత్యేక లక్షణాలు ఆధునిక దృక్పథం, రాజకీయ చైతన్యం అభివృద్ధి చేసుకొనేందుకు కార్మికవర్గానికి అవరోధాలుగా పరిణమించాయి. వాస్తవానికి ఈ ప్రత్యేకమైన లక్షణాల వలన ఏర్పడిన అవరోధాలు ఒక్క భారత కార్మికవర్గానికే గాక వలస, అర్థ వలస దేశాలలోని కార్మికవర్గానికి కూడా సర్వ సాధారణమైన విషయాలే. ఈ విలక్షణాలను, వలస అర్థవలస దేశాలలో కార్మికోద్యమంపై వీటి ప్రభావాన్ని గురించి వివరిస్తూ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఒక సైద్ధాంతిక వ్యాసంలో ఈ విధంగా పేర్కొంది.

"వలస, అర్థవలస దేశాలలోని కార్మిక వర్గాలకున్న కొన్ని ప్రత్యేక లక్షణాలు, ఆయా దేశాలలో స్వతంత్ర కార్మికవర్గ ఉద్యమం, శ్రామికవర్గ సిద్ధాంతం ఆవిర్భవించడానికి కారణభూతమయ్యాయి. ఈ వలస దేశాలలోని శ్రామికులలో అధిక సంఖ్యాకులు పేదరికంలో మగ్గుతున్న గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చేవారు. ఈ కార్మికులు పరిశ్రమలలో పనిచేస్తున్నప్పటికీ, గ్రామాలతో సంబంధాలను కొనసాగిస్తారు (షాంగాయ్, కలకత్తా, బొంబాయి వంటి కొన్ని పెద్ద పారిశ్రామిక కేంద్రాలను మినహాయించి). మొదటి తరానికి చెందిన శ్రామికవర్గం మాత్రమే విస్తృతమైన ఉత్పత్తిలో నిమగ్నం కావడం దాదాపు అన్ని వలస దేశాలలోనూ సర్వ సాధారణమైన విషయమైంది. మిక్కిలి అభివృద్ధి చెందిన వలస దేశాల్లో కూడా నానాటికీ దిగనాసిల్లుతున్న చేతివృత్తులను వదలవలసి రావడంతో వినాశనానికి గురయినవారే అధిక సంఖ్యలో వున్నారు. దారిద్ర్యాన్ననుభవిస్తున్న వృత్తికళాకారులు, కొద్దిపాటి ఆస్తులకు యజమానులుగా వున్నవారు కార్మికవర్గంలో సంకుచిత భావాలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు చేశారు. ఇందువలన వలస దేశాలలోని కార్మికవర్గ ఉద్యమంలో జాతీయ సంస్కరణవాద భావాలు చోటు చేసుకోగలిగాయి."

ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకొని భారత కార్మికవర్గ ఉద్యమ ప్రారంభ దినాల్లోనే భారతీయ బూర్జువావర్గం సంస్కరణవాద భావాలను ప్రబోధించసాగింది. దీనితో పాటు భారతీయ సంప్రదాయాల పేరిట యీ బూర్జువావర్గం భారత కార్మికవర్గంలో మూఢ నమ్మకాలను విశేషంగా ప్రచారం చేయడం ద్వారా భారత కార్మిక వర్గాన్ని విప్లవ పోరాటాల నుంచి దూరంగా వుంచడానికి తీవ్రంగా కృషిచేసింది.

## అభివృద్ధికి అవరోధంగా పరిణమించిన సమస్యలు

వలసవాదులు అతి క్రూరంగా సాగిస్తున్న దోపిడీ ఫలితంగా భారత కార్మికులు చైతన్యవంతమైన ఒక వర్గంగా అవతరించడానికి అవరోధాలేర్పడ్డాయి. అనేక ఆటంకాల నెదుర్కొని ఫ్యూడల్ వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడానికి సుదీర్ఘకాలం పట్టడం, పెట్టుబడిదారీ విధానం

త్వరితగతిన అభివృద్ధి చెందకపోవడం, పాత ఉత్పత్తి విధానం అంతరించి, దాని స్థానంలో ఒక నూతన ఉత్పత్తి విధానం అవతరించడానికి చాలాకాలం పట్టడం వలన ఉత్పన్నమైన అనేక సమస్యలు భారత కార్మికవర్గ అవతరణపై తమ ప్రభావాన్ని చూపాయి. కార్మికులలో అధిక సంఖ్యాకుల జీవన ప్రమాణాలు దారుణంగా వున్నాయి. గుత్త పెట్టుబడిదారుల ఆదేశాల ప్రకారం భారతదేశంలోని ప్రముఖ పెట్టుబడిదారీ సంస్థలు సైతం ఉద్దేశపూర్వకంగానే అదే జీవన ప్రమాణాలను కొనసాగించడానికి పూనుకున్నాయి. ఇదొక పెద్ద సమస్యగా తయారైంది. చేతివృత్తులను పోగొట్టుకుని జీవనాధారం కోల్పోయిన వారిని, గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేదలను కార్మికులుగా నియమించేటప్పుడు, గ్రామీణ స్థాయిలోనే వేతనాలు నిర్ణయించడం జరుగుతుండేది. ఈ వేతనాలు ఆ కార్మికులు వెచ్చించే శ్రమ విలువకంటే చాలా తక్కువగా వుండేవి. ఈ వాస్తవాలను నిరూపించేందుకు డాక్యుమెంట్లు వున్నాయి. 1833లో ఈస్టిండియా కంపెనీ చార్టరులో మార్పులు చేయడానికి దారితీసిన చర్చల సందర్భంగా శ్రీ రాజారామ్‌మోహనరాయ్ సమర్పించిన సాక్ష్యాధారాలు చాలా ముఖ్యమైనవి. ఒక ప్రశ్నావళికి రాజారామ్‌మోహన్‌రాయ్ ఇచ్చిన జవాబులు క్రింద ఇవ్వబడ్డాయి.

**ప్రశ్న :** సాధారణంగా పేద రైతులకు, కార్మికులకు వేతనాలు ఏ రేటున చెల్లించబడుతున్నాయి?

**జవాబు :** కలకత్తాలో కమ్మర్లు, వడ్రంగులు వంటి చేతివృత్తుల వారు మంచి పనివారైనట్లయితే (నాకు జ్ఞాపకమున్నంతవరకు) నెలకు 10 నుండి 12 రూపాయలు (సుమారు 20 నుండి 24 షిల్లింగులు) సంపాదించుకుంటున్నారు. తక్కువ స్థాయిలో పనిచేసే సాధారణ కార్మికులకు 5 లేక 6 రూపాయలు (10 లేక 12 షిల్లింగులు) వేతనంగా లభిస్తోంది. తాపీపనివారు నెలకు 5 నుండి 7 రూ॥లు వరకు (10నుండి 14 షిల్లింగులు) జీతం సంపాదిస్తున్నారు. సాధారణ కార్మికులు 3 1/2 లేక 4 రూపాయలు, తోటమాలి పనిచేసేవారు, భూమిని దున్నేవారు, పల్లకీ మోసేవారు నెలకు 4 రూపాయలు సంపాదించుకోగల్గుతున్నారు. చిన్న పట్టణాలలో ఈ జీతాలు కొద్దిగా తక్కువగా వున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మరీ తక్కువగా వున్నాయి.

**ప్రశ్న :** కార్మికుల ఆహారపుటలవాట్లు ఏ విధంగా వున్నాయి ?

**జవాబు :** బెంగాలులో కార్మికులు సాధారణంగా బియ్యం, కొద్దిగా కూరగాయలు, ఉప్పు, కారపు దినుసులు, చేపలు భుజించి జీవిస్తున్నారు. పేద వర్గాలవారు బియ్యం (అన్నం), ఉప్పు మాత్రమే భుజించి జీవితాలు గడుపుతుండడం నేను చూశాను. ఎగువ ప్రాంతాలలో కార్మికులు బియ్యానికి బదులు గోధుమపిండి వాడతారు. పేదవర్గాల వారు తరచుగా జొన్నలు వాడుతుంటారు.

**ప్రశ్న :** కార్మికులు ఏ రకమైన గృహాల్లో నివసిస్తారు ?

**జవాబు :** బెంగాలులోని పశ్చిమ ప్రాంతాలలోనూ, మరికొన్ని ప్రాంతాలలోనూ

కార్మికులు మట్టి ఇళ్ళలో నివసిస్తున్నారు. బెంగాలు తూర్పు ప్రాంతంలో గడ్డి, చాపలు, కర్రలు మొదలగువానితో నిర్మించబడిన పాకలలో నివసిస్తున్నారు. ఉన్నత వర్గాలవారు మాత్రమే ఇటుక, సున్నంతో నిర్మించబడిన గృహాలలో నివసిస్తున్నారు.

**ప్రశ్న :** వారి వస్త్రధారణ ఏ విధంగా వుంది ?

**జవాబు :** కార్మికులలో అతి పేదవారు సభ్యత కోసం కేవలం ఒక గుడ్డ ముక్కను మొలకు చుట్టుకునేవారు. అంతకుమించి వారి శరీరంపై వేరే గుడ్డ ముక్కలేక నగ్నంగా వుండేవారు.

వలసవాదులు తమ దోపిడీ విధానాల ద్వారా తీవ్రమైన భారాలు మోపడంతో, సంప్రదాయసిద్ధంగా కొనసాగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ శిథిలావస్థలోనున్న తరుణంలో శ్రీ రామ్మోహనరాయ్ ఈ విజ్ఞాపనపత్రం సమర్పించారు. భారత ప్రజానీకం దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తోంది. ప్రాచీన ఆర్థిక వ్యవస్థ శిథిలమై దాని స్థానంలో నూతన ఆర్థిక వ్యవస్థ ఏర్పడడానికి మధ్య చాలాకాలం గతించింది. అందువలన ఇండియా మానవశ్రమ అతి చౌకగా లభించే దేశంగా మార్పు చెందింది. వివిధ బ్రిటిషు వలస దేశాలలోని ప్లాంటేషన్ పరిశ్రమలకు భారత శ్రామికులు అత్యధిక సంఖ్యలో తరలించబడటం ఈ పరిణామాల ఫలితంగా సంభవించినదే.

1807లో బానిస వ్యాపారం, 1833లో అసలు బానిస విధానమే రద్దుచేయబడటంతో బ్రిటిష్‌వారి ఆధీనంలోని గయానా, వెస్టిండీస్, మారిషస్ వంటి వలసదేశాలు బానిసల శ్రమ కొరతను తీవ్రంగా అనుభవించాయి. అందువలన ఈ వలస దేశాలలోని తోటలలో భారతదేశంలోని శ్రామికులను ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు సాగాయి. దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న అనేకమంది భారత శ్రామికులు ఆయా వలస దేశాలకు చేరవేయబడ్డారు. వీరు వలసవాదుల క్రూరమైన దోపిడీకి గురయ్యారు. దీనిని గురించి కొన్ని విషయాలను తదుపరి అధ్యాయంలో పరిశీలిద్దాం.

వలసవాద దోపిడీ అనేక దుర్మార్గమైన రూపాలలో, పద్ధతులలో సుదీర్ఘకాలం కొనసాగడం, పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి సక్రమంగా సాగకపోవడం, భారత సమాజంలోని పేదవర్గాల ప్రజానీకం దేశంలోనే ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి వలసపోవడానికి దారితీసింది. తీవ్రమైన పేదరికాన్ని అనుభవిస్తున్న ప్రజలు పెద్ద పెద్ద గ్రూపులుగా తమ స్వగ్రామాలను వదలి పొట్టచేతబట్టుకొని పనుల కోసం క్రొత్తగా పెట్టుబడిదారీ పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు, గనుల త్రవ్వకం, టీ తోటలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు తరలిపోయారు. వారు కూడా స్థిర నివాసమేర్పరచుకుని, కార్మికులుగా పనిచేయనారంభించారు. భిన్న భాషలు, సంస్కృతులు, మతనమ్మకాలు, సాంప్రదాయాలతో కూడిన విశాలమైన భారతదేశం వంటి దేశంలో అధిక సంఖ్యలో ప్రజలు ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి వలసపోయి, పూర్తిగా భిన్నమైన వాతావరణం గల్గిన ప్రాంతాల్లో స్థిర నివాసం

ఏర్పరచుకొనడంతో, భారత కార్మికవర్గం అవతరణ విషయంలోనూ, కార్మికవర్గ ఉద్యమంలోనూ కొన్ని ప్రత్యేకమైన సమస్యలు తలెత్తాయి.

భారతదేశంలోని ప్లాంటేషన్‌లలో కార్మికులను నియమించే విధానం, వారి పని పరిస్థితులు, అతి క్రూరమైన వలస పాలనకు ప్రతీకగా నిలిచాయి. ఈ అసాధారణమైన సమస్యలు పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి అనుగుణంగా భారత కార్మికవర్గం ఒక నిర్దిష్టమైన స్వతంత్ర శక్తిగా రూపొందడానికి తీవ్ర సమస్యలుగా నిలిచాయి.

శ్రామిక ప్రజానీకం వలస పోవడం నానాటికీ పెరగడాన్ని పరిశీలిస్తే ఎన్ని సమస్యలెదురైనప్పటికీ దేశంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెంపొందుతూనే వున్నాయని స్పష్టమవుతుంది. పనులకోసం శ్రామికులు పెద్ద ఎత్తున వలసపోవడం, స్థిరమైన లేబర్ మార్కెట్ ఏర్పడే పరిస్థితులను సూచిస్తోంది. యునైటెడ్ ప్రావిన్సెస్ నుండి ప్రజలు వలసపోవడంపై ఒక అధికార నివేదిక ఈ విధంగా పేర్కొంది.

"శ్రామిక ప్రజలు వలసపోవడం నానాటికీ పెరుగుతూనే వున్నది. ఈ విధంగా ప్రజలు వలసపోవడం ఏ మేరకు జరుగుతున్నదీ నిర్ణయించడం సాధ్యం కాదు కాని ఒక విషయం మాత్రం చెప్పవచ్చు. బెంగాలులోని బెనారస్ డివిజన్‌లోని ఒక్క మీర్జాపూర్ తప్ప మిగిలిన జిల్లాలన్నింటిలో కనీసం కుటుంబానికొక్కరైనా వలస పోయి వుంటారనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు. ఈ (మిర్జాపూర్) జిల్లాలోని క్రింది తరగతి శ్రామికులలో అధిక సంఖ్యాకులలో హౌరా, కలకత్తా పారిశ్రామిక కేంద్రాలలో నైపుణ్యం అవసరం లేని శ్రమతో కూడిన పనులు చేస్తున్నారు. పై తరగతి వారు మిల్లులలో గేట్‌కీపర్లుగానూ, మెస్సెంజర్లుగానూ, ఓవర్‌సీర్లుగానూ ఉద్యోగాలు సంపాదించు కోగలిగారు. అస్సాంలో కొందరు టీ తోటలలో పనులు సంపాదించు కోగల్గినా, అధిక సంఖ్యాకులు సాధారణ కార్మికులుగానో, చిన్న వ్యాపారాలు సాగిస్తూనో, పడవలు నడుపుకుంటూనో తమ జీవితాలను గడుపుతున్నారు.

అనేకమందికి గనులు, ఇతర పరిశ్రమలలో ఉద్యోగాలు దొరికాయి. ఒకే రాష్ట్రంలో శ్రామికులు ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి తరలిపోతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ తరుణంలో ఈ విధంగా జరుగుతోంది.

తమ స్వగ్రామాల నుండి శ్రామికులు ఎంత అధిక సంఖ్యలో వలసపోతున్నదీ, ఈ పోకడలు ఎంత బలంగా వున్నదీ ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ విధంగా శ్రామికుల వలసపోవడం యునైటెడ్ ప్రావిన్స్‌కే పరిమితమైన సమస్య కాదు. దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ఈ విధంగానే జరిగింది.

కాని ఈ సందర్భంలో ఒక ముఖ్యమైన విషయం గమనించవలసి వుంది. గ్రామాలు జనసమ్మర్థమైనప్పటికీ జీవనాధారం వెదుక్కుంటూ శ్రామికులు వలసపోయినప్పటికీ, నూతనంగా స్థాపించబడిన పరిశ్రమలలో కార్మికుల కొరత ఏర్పడింది. 1905 జనవరి 6వ తేదీన భారత్

– శ్రీలంక ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం ఆమోదించిన తీర్మానంలోని ఈ క్రింది భాగాన్ని పరిశీలించినట్లయితే ఈ సమస్య ఎంత తీవ్రతరంగా వుందో స్పష్టమౌతుంది.

"ఇండియాలోని అనేక జిల్లాలలోని పరిశ్రమలకు చాలినంత మంది కార్మికులు లభించడం లేదు. ఈ కొరత వలన దేశంలో ఉత్పత్తి సాగిస్తున్న పరిశ్రమలలో అధిక భాగం, ఉత్పాదక శక్తిని తీవ్రంగా పరిమితం చేయవలసి వచ్చింది. ఈ సమస్యకు సత్వర పరిష్కారం కనుగొనవలసిన అవసరం ఈ సమావేశానికి ఎంతయినా వున్నది. అందువలన వ్యవసాయ వర్గాల జీవన పరిస్థితులతో పోల్చి చూస్తే ఫ్యాక్టరీ కార్మికుల పరిస్థితులు మెరుగ్గా వున్నప్పటికీ, నేటి ఈ దుస్థితికి కారణాలను కనుగొనేందుకొక గవర్నమెంట్ కమిషన్ విచారణ సాగించాలి."

పరిశ్రమల అభివృద్ధి ప్రారంభమైన నాటినుండి కొనసాగుతున్న కార్మికుల కొరత 19వ శతాబ్దాంతానికి తీవ్రతరమై, మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే నాటివరకు కొనసాగింది. ఆనాటివరకు ఒక వ్యవస్థీకృతమైన లేబర్ మార్కెట్ లేకపోవడమే ఈ సంక్షోభానికి మూలకారణం. ఈ సంక్షోభానికి గల కారణాలను గురించి విచారణ చేయడానికిగాను, 1906లో బెంగాలు ప్రభుత్వం ఫోవే అనే బ్రిటిష్ సివిల్ ఆఫీసరును నియమించింది. ఆయన సమర్పించిన నివేదిక అనేక విషయాలను వెల్లడించింది. వాస్తవానికి శ్రామికుల కొరత ఏమీలేదనీ, ఈ కృత్రిమ కొరతకు లోపభూయిష్టమైన రిక్రూట్‌మెంట్ విధానమే కారణమని ఫోవే నివేదిక ప్రకటించింది. కృత్రిమ కొరత కారణంగా త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలలో శ్రామికులకు డిమాండు ఏ విధంగా పెరుగుతున్నది ఈ క్రింది పట్టికలు స్పష్టం చేస్తున్నాయి.

**1. జూట్ (జనపనార) పరిశ్రమ**

| సం | మగ్గాల సంఖ్య | కార్మికులు |
|---|---|---|
| 1879–80 | 4946 | 27,494 |
| 1895–96 | 10,169 | 78,114 |
| 1902–03 | 17,189 | 118,904 |
| 1904–05 | 19,991 | 113,164 |
| 1906 | 23,534 | సుమారు 154,962 |

**2. బొగ్గు గనులు**

| సం ॥ | కార్మికుల సంఖ్య |
| --- | --- |
| 1894 | 30,773 |
| 1903 | 74,538 |
| 1904 | 75,749 |

**3. అస్సాంలో టీ తోటలు**

| సం॥ | కార్మికుల సంఖ్య |
| --- | --- |
| 1890 | 406,089 |
| 1900 | 664,897 |

ఒకవైపు శ్రామికులకు డిమాండు పెరుగుతూనే వుంది. వేరొక ప్రక్క గ్రామీణ ప్రజలు మరింత నిరుపేదలవడం వలన శ్రామికుల సంఖ్య పెరిగే అవకాశాలేర్పడ్డాయి. అయినప్పటికి ఫ్యాక్టరీలలో అతిదారుణంగా వున్న పని పరిస్థితులు, గృహవసతి లేకపోవడం, తదితర సమస్యల వలన ఫ్యాక్టరీలలో పనిచేయడానికి పేద ప్రజలు ఇష్టపడడంలేదు. అంతేగాక ఫ్యాక్టరీలు కావలసినదానికంటే తక్కువమంది కార్మికులతో నడుస్తుండగా, అనేక సందర్భాలలో ఈ పేదప్రజలు తమ జీవనాధారానికి ఇతర పద్ధతులవలంభించేవారు. ఈ విషయంలో ఒక రచయిత ఈ విధంగా పేర్కొన్నాడు.

"బెంగాల్ ప్రావిన్స్‌లోని శరన్, ముజఫర్‌పూర్, దర్భంగా, ఉత్తర సహబాద్, పాట్నా, ఉత్తర మాంఘీర్ జిల్లాలు, బాలసూర్, కటక్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలు 1901లో జనసమ్మర్ధమైన ప్రాంతాలుగా పరిగణింపబడుతుండేవి. అందువలన సహజంగానే కార్మికులు యీ జిల్లాల నుండే రావాలి. ప్రతి సంవత్సరం దేశంలోని ఇతర ప్రాంతాలకు శరన్ జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో కార్మికులు వలస పోతుండేవారు. 1901 సం॥లో శరన్ జిల్లా నుండి బెంగాలులోని వివిధ జిల్లాలకు మొత్తం వలసపోయిన వారి సంఖ్య 1,38,902కు చేరుకుంది. వీరిలో 35 వేల మంది తూర్పు బెంగాలకు (వీరు వ్యవసాయం పనులు చేపట్టారు), 47 వేలమంది కలకత్తా పారిశ్రామిక ప్రాంతానికి తరలిపోయారు. అదేవిధంగా ముజఫర్ పూర్ నుండి వలసపోయిన 67,325 మందిలో కేవలం 20 వేలమంది మాత్రమే కలకత్తాలో పారిశ్రామిక ప్రాంతాలకు చేరుకున్నారు.

నిరుపేదలైన ప్రజలు ఎల్లప్పుడు పారిశ్రామిక కేంద్రాలకే వలస పోలేదని ఈ వాస్తవాలు ధృవపరుస్తున్నాయి. భారతదేశంలోని కార్మికవర్గంపై సాగినంత క్రూరమైన దోపిడీ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో ఎక్కడా జరిగి యుండలేదు. ఈ అమానుష దోపిడీ వలన కార్మికుల సమస్యలు మరింత తీవ్రతరమయ్యాయి. రిక్రూట్‌మెంట్ చేసి కార్మికులకు కొంతమేరకు జీతాలు కూడా చెల్లించడానికి కార్మికులకు, యజమానులకు మధ్య “మధ్యవర్తులు” ఉండేవారు. ఈ మధ్యవర్తి దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలను బట్టి సర్దార్, మేస్త్రీ, ముఖద్దమ్, చౌదరి మొదలైన వివిధ పేర్లతో వ్యవహరింపబడేవాడు. లేబర్ మార్కెట్ సరిగా అభివృద్ధి చెందకపోవడం అస్తవ్యస్థమైన ఆర్థిక వ్యవస్థ ఈ మధ్యవర్తుల ఉనికికి ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు.

వివిధ కులాలు, మతాలు, జాతులతో కూడి భారత కార్మికవర్గం ఒక వైవిధ్యాన్ని సంతరించుకున్నది. దేశంలో పెట్టుబడిదారీ విధానం సక్రమంగా అభివృద్ధి చెందక పోవడంతో కార్మికవర్గం కూడా దేశమంతటా సరిగా వ్యాపించలేదు. కలకత్తా, బొంబాయి, అహమ్మదాబాద్, కాన్పూరు, మద్రాసు, మరికొన్ని ప్రదేశాలలో మాత్రమే కార్మికవర్గం కేంద్రీకృతమై వున్నది. దేశంలో విస్తారమైన ప్రాంతం ఆధునిక పరిశ్రమల నుండి దూరంగా వుంది.

కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలతో బాటు, ఈ ప్రత్యేక పరిస్థితులు కూడా భారతీయ కార్మికులు సంఘటితమై ఒకే శక్తిగా అవతరించడానికి ప్రతిబంధకాలయ్యాయి. కార్మికవర్గం వర్గచైతన్యాన్ని పెంపొందించుకుని, మధ్యయుగాల నాటి భావాల అవశేషాల నుండి విముక్తి చెంది, ఒక నూతన ఆధునిక విప్లవ వర్గంగా అవతరించే పరిణామ క్రమంపై ఈ సమస్యలు కొంతవరకు తమ ప్రభావాన్ని చూపాయి.

# 4

# పరిశ్రమాభివృద్ధి - కార్మిక వర్గ స్థితిగతులు

**పారిశ్రామిక పురోగతి :** ఆధునిక పరిశ్రమలకు భారతదేశంలో షుమారు 1850 – 1870 మధ్యకాలంలోనే పునాదులు పడ్డాయి. అందువలన ఈ కాలాన్ని కూడా భారత కార్మికవర్గ అవతరణలో భాగంగానే పరిగణించాలి. తరువాత కాలంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో కార్మికవర్గం కూడా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా 19వ శతాబ్దం చివరిభాగంలోనూ, 20వ శతాబ్దం ప్రారంభంలోనూ కార్మికవర్గం పురోభివృద్ధిని చవిచూచింది. ప్రారంభ దినాల్లో  కార్మికవర్గ పురోగతిని పరిశీలిద్దాం.

1890 నాటికే భారతదేశంలో భారీ పరిశ్రమలు స్థాపించబడ్డాయి. ఫ్యాక్టరీలు, గనుల్లో నియమించబడిన సుమారు మూడు లక్షలమంది, నూలు మిల్లులు, జనపనార మిల్లులు, బొగ్గు గనుల్లో రెండు లక్షలమంది పనిచేస్తున్నారు. నూలు మిల్లులు, జూట్ మిల్లులు, బొగ్గు గనుల్లో పని చేసేవారు 11 : 6 : 3 నిష్పత్తిలో వున్నారు. 1890 నుండి మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమయ్యే నాటివరకు అన్ని రంగాల్లోను ప్రగతి ఒక క్రమ పద్ధతిలో సాగింది. నూలు కదుళ్ళ ఉత్పత్తి రెట్టింపుకు పైగా పెరిగింది. విద్యుచ్ఛక్తితో నడిచే మగ్గాల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. జనపనార యంత్రాల సంఖ్య నాలుగున్నర రెట్లు పెరగగా, బొగ్గు త్రవ్వకం ఆరురెట్లు పెరిగింది. సంవత్సరానికి సుమారు 800 మైళ్ళ పొడవు గల రైలుమార్గాలు నిర్మించబడ్డాయి.

19వ శతాబ్దాంతంలో బ్రిటిషు పెట్టుబడిదారుల గుత్తాధిపత్యం క్రింద జనపనార ఫ్యాక్టరీలు అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. 1913–14 మధ్యకాలంలో ఈ ఫ్యాక్టరీల సంఖ్య 64కు చేరుకుంది. ఈ ఫ్యాక్టరీలలో సుమారు 2,16,000 మంది కార్మికులు పనిచేస్తున్నారు. బెంగాలుతో బాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా పరిశ్రమలు వృద్ధి చెందాయి. భారతీయ పెట్టుబడిదారుల గుత్తాధిపత్యం క్రింద 19వ శతాబ్దం మధ్యకాలంలోనే నూలుబట్టల పరిశ్రమ, ముఖ్యంగా బొంబాయిలో అభివృద్ధి చెందసాగింది. 20వ శతాబ్దం ప్రారంభంలో పరిశ్రమ మరింత అభివృద్ధి సాధించింది. 1886లో 95 మిల్లుల్లో 74 వేలమంది

కార్మికులు పనిచేస్తుండగా, 1905 నాటికి 197 మిల్లుల్లో లక్షా 95 వేలమంది పనిచేస్తున్నారు. ఈ అంకెలను పరిశీలించినట్లయితే 1886-1905 సం॥ల మధ్య ఇరవై సంవత్సరాల కాలంలో పరిశ్రమ ఎంతగా అభివృద్ధి చెందిందీ స్పష్టమవుతుంది.

బొగ్గు పరిశ్రమ కూడా గణనీయంగా అభివృద్ధి చెందింది. 1896-1900 మధ్య కాలంలో 61,367 మంది కార్మికులతో 191 బొగ్గుగనుల్లో త్రవ్వకాలు జరుగుతుండగా, 1901-1905 మధ్యకాలంలో 82,186 మంది కార్మికులు 279 బొగ్గు గనుల్లో త్రవ్వకాలు సాగిస్తున్నారు. 1911-1915 మధ్య కాలంలో ఈ బొగ్గు పరిశ్రమ విశేషంగా పురోగమించింది. ఈ కాలంలో 1,28,884 మంది కార్మికులు 554 గనుల్లో త్రవ్వకపు పనులు సాగిస్తున్నారు.

1901-1911 మధ్య కాలంలో గృహనిర్మాణ పరిశ్రమలో 18.2 శాతం, రవాణా రంగంలో 29.4 శాతం కార్మిక శక్తి పెరిగింది. 1894 నుండి 1914 వరకు గల 20 సంవత్సరాల కాలంలో పరిశ్రమలు, పరిశ్రమలలో సంఖ్యాపరంగా కార్మికశక్తి ఎంతగా పెరిగిందీ ఈ క్రింది పట్టిక సూచిస్తుంది.

| **సం॥** | **ఫ్యాక్టరీల సంఖ్య నియమించబడిన కార్మికులు** | **సగటున రోజుకు** |
|---|---|---|
| 1894 | 815 | 349810 |
| 1902 | 1533 | 541634 |
| 1914 | 2936 | 950973 |

జాతీయ ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలోనూ బ్రిటిష్ సంస్థలతో బాటు భారతీయ పెట్టుబడిదారీ సంస్థలు కూడా అభివృద్ధి చెందసాగాయి. ఇది దేశంలో పుంజుకుంటున్న 'నూతన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ'లో అంతర్భాగమే. భారత పెట్టుబడిదారీ విధానం దేశంలోని సామాజిక ఆర్థిక వ్యవస్థలో మార్పుకు ప్రతీకగా నిల్చింది. ఈ మార్పు బ్రిటిషు సామ్రాజ్యవాదులకు ఇష్టంలేదు.

తమ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు ఈ పరిణామాలను వక్రమార్గాన పెట్టడానికి, అడ్డుకొనడానికి సామ్రాజ్యవాదులు ప్రయత్నాలు సాగించారు. కాని ఫలితం లేకపోయింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో అంతర్భాగమైన భారతీయ పెట్టుబడిదారీ సంస్థలు స్వదేశంలోనే బ్రిటిష్ పెట్టుబడిదారీ సంస్థలతో సమానస్థాయిని, హోదాను ఏనాడు అనుభవించలేదు. భారతీయ సంస్థలకు ప్రోత్సాహం యివ్వడానికి బదులు బ్రిటిషు

పెట్టుబడిదారుల ఆదేశాల మేరకు, వలస పాలకులు భారతదేశంలోని పరిశ్రమాభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. అంతేగాక అనేక సంస్థల అభివృద్ధిని కుంటుపరిచారు.

బ్రిటిషు, భారతీయ పెట్టుబడిదారుల ప్రయోజనాల మధ్య స్పష్టమైన వైరుధ్యాలున్నప్పటికీ, బ్రిటనులోని ప్రైవేట్ పెట్టుబడిదారుల యెడల బ్రిటిషు ప్రభుత్వం బహిరంగంగానే పక్షపాత వైఖరిని అవలంబించినప్పటికీ, వివిధ రంగాలలో పరిశ్రమాభివృద్ధి జరుగుతున్నట్లు స్పష్టమవుతూనే వుంది.

ఈ కాలంలోనే రైలు మార్గాలు, రోడ్డు రవాణా, నౌకా మార్గాలు అభివృద్ధి చెందాయి. ఇది ప్రత్యేకించి గమనించవల్సిన అంశం. స్వదేశీ, విదేశీ రవాణా సౌకర్యాలు మెరుగుకావడంతో భారతీయ ఆర్థిక, సామాజిక జీవితంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. కాని దురదృష్టవశాత్తూ ఈ మార్పుల వలన ఇతర వలస దేశాల్లో వలె భారతదేశంలోని ఉత్పత్తులకు మార్కెటింగ్ గ్యారంటీ కలుగలేదు. స్వదేశీ ఉత్పత్తులకు మార్కెట్ గ్యారంటీ ఉండి వున్నట్లయితే భారతీయ ఉత్పత్తులకు విశేషమైన ప్రోత్సాహం లభించి వుండేది. రవాణా సౌకర్యాల అభివృద్ధి వలన కలిగిన ఫలితాలను గురించి క్లుప్తంగా చెబుతూ డి.హెచ్. బచనన్ "ఒక దేశంలో ఉత్పత్తి అభివృద్ధికి రవాణా సౌకర్యాలు చాలా ముఖ్యం, కాని దీనితో బాటు స్వేచ్ఛా వ్యాపారం (విదేశీ వస్తువుల దిగుమతిపై ఏ విధమైన ఆంక్షలు లేకుండుట), విదేశాలతో పోటీ అనే రెండు పరిస్థితులు అప్పటికి పరిశ్రమలలో తీవ్రస్థాయిలో నెలకొనివున్నాయి. అందువలన భారతీయ పరిశ్రమలకు బదులు యూరోపియన్ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి" అని పేర్కొన్నాడు.

1911 జనాభా లెక్కల ప్రకారం రవాణాతో సంబంధమున్న పారిశ్రామిక సంస్థలన్నింటి లోను, అత్యధిక సంఖ్యలో కార్మికులున్న రైల్వే వర్కుషాపులు ప్రథమస్థానంలో వున్నాయి. ఈ రైల్వే వర్కుషాపుల్లో మొత్తం లక్షమంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరి సంఖ్య మొత్తం ట్రాన్స్‌పోర్టు పరిశ్రమలోని కార్మికుల సంఖ్యలో 79 శాతంగా వుంది.

## పని పరిస్థితులు - జీవన పరిస్థితులు

కార్మికవర్గం అభివృద్ధి చెందుతున్న ప్రారంభదినాల్లో ఇంగ్లండు తదితర పాశ్చాత్య దేశాలలోని కార్మికులు దుర్భర పరిస్థితులలో పనిచేసి జీవనం సాగించవలసి యుండేది. జీతాలు, పనిగంటలు, బాల కార్మికుల నియామకం, కార్మికులకు గృహవసతి తదితర విషయాలలో దోపిడీ అతిదారుణంగా వుండేది. కార్మికవర్గం అవతరిస్తున్న రోజుల్లోనూ, ఆ తదుపరి దినాల్లోనూ అతి కఠినమైన వలసపాలనలో మ్రగ్గుతుండడం వలన భారత కార్మికవర్గం మరింత భయంకరమైన దోపిడికి గురయ్యింది.

ప్రారంభ దశలో ఏకబిగిన 15, 16 గంటలు పనిచేయడం సర్వసాధారణమైన విషయం. చివరకు స్త్రీలు, పిల్లలు కూడా ఈ విధంగానే పనిచేయవలసి వుండేది. మరింత

దారుణమైన విషయమేమంటే 5, 6 సంవత్సరాల మధ్య వయస్సు గల్గిన బాలలు కూడా ఎక్కువకాలం ఫ్యాక్టరీలలో పనిచేయవలసి వుండేది. యంత్రాల వద్ద పనిచేసే సమయంలో సరియైన భద్రతా చర్యలు తీసుకొనక నిర్లక్ష్యం చేయడం వలన ప్రమాదాలు జరిగి కార్మికులు అంగవైకల్యం చెందడమో లేక మరణించడమో కూడా జరుగుతూండేది. ఈ విధంగా గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించే ప్రసక్తి కూడ లేదు. దీనికి తోడుగా వీరి జీతాలు కనీస అవసరాలకు కూడా చాలనంత అధమంగా వున్నాయి.

భారత కార్మికవర్గం దారుణంగా దోపిడీ చేయబడిందనడానికి బ్రిటిష్, భారత పెట్టుబడిదారులు నికరమైన అదనపు విలువను సంపాదించడమే ప్రబల నిదర్శనం. సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు కార్మికులు ఏకబిగిన పనిచేస్తుండేవారు. అనేక సందర్భాలలో సూర్యాస్తమయం తరువాత కూడా మరింత ఎక్కువ కాలం పనిచేయవలసి వున్నదంటే, ఆనాడు కార్మికవర్గం ఎంత దారుణంగా దోచుకోబడుతున్నదో ఊహించడం కష్టం కాదు. ఆనాడు అమలులోవున్న ఫ్యాక్టరీల చట్టాలకు కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ ఫ్రిర్స్మిత్ కమిటీ చేసిన సిఫార్సులను పరిశీలించడానికి 1908లో నియమించబడిన ఇండియన్ ఫ్యాక్టరీ లేబర్ కమీషన్ అధికార నివేదిక కూడా ఈ అమానుషమైన దోపిడీని దాచలేకపోయింది. ఈ నివేదిక ప్రకారం అహమ్మదాబాదులో కార్మికులు రోజుకు సగటున 12 గంటలు పనిచేస్తుండేవారు. విద్యుత్‌తో నడిచే కొన్ని ఫ్యాక్టరీలలో సగటున రోజుకు 14 గంటలకు తక్కువ కాకుండా పనిచేస్తున్నారు. బొంబాయిలో కూడా రోజుకు కనీసం “12 గంటల పనిదినం” అమలులోనున్నది. కాని 85 నూలు మిల్లులలోని 60 మిల్లులలో కార్మికులు కనీసం 13 నుండి 15 గంటల వరకూ పనిచేయవలసి వుంది. బ్రోచ్, ఢిల్లీలలో కార్మికులు 13 1/2 గంటల నుండి 14 1/2 గంటల వరకు పనిచేస్తుండేవారు. ఇదే విధంగా ఆగ్రాలో 13 గం॥ 45 ని॥ల మేరకు, అమృత్‌సర్, లాహోర్‌లలో 13 గంటల నుండి 13 గంటల 40 నిమిషాల వరకు సగటు పనిదినంగా వుండేది. ఇదిలా వుండగా కలకత్తాలోని జూట్ మిల్లులపై యాజమాన్యం వహిస్తున్న బ్రిటిష్ పెట్టుబడిదారులు ఈ మిల్లులలోని నేత పనివారలను రోజుకు 15 గంటలు, కొన్ని సందర్భాలలో 15 1/2, 16 గంటల వరకు కూడ పనిచేయించి సరికొత్త రికార్డును నెలకొల్పారు.

ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేయడం అంటే సూర్యకాంతి వున్నంతవరకు యజమానులు కార్మికులతో పనిచేయిస్తూండేవారన్నమాట. కాని విద్యుద్దీపాలు ప్రవేశ పెట్టబడడంతో పనిగంటలు మరింత పొడిగించబడ్డాయి. ఈ వాస్తవాన్ని 1906లో ఏర్పరచబడిన టెక్స్టైల్ ఫ్యాక్టరీస్ కమిటీ కూడా అంగీకరించింది. ఇతర విషయాలతో బాటు ఈ నివేదికలో “ఇండియాలోని మిల్లులలో విద్యుద్దీపాలు ప్రవేశపెట్టడంతో ఈ మిల్లులు పరిమితులను మించి పనిచేస్తున్నాయి. కొన్ని మిల్లుల్లోని యంత్రాలు ఉదయం 5 గం॥ల నుండి రాత్రి 9 గం॥ల వరకు పనిచేస్తున్నాయి. కొన్ని మిల్లులలో యంత్రాలు కొంత తక్కువ కాలం నడుస్తున్నాయి.

కాని పని ఒత్తిడి అధికంగా ఉన్నప్పుడు యంత్రాలు పనిచేసే సమయం కూడా పెంచబడుతున్నది" అని పేర్కొనడం జరిగింది.

జిన్నింగ్ ఫ్యాక్టరీలలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ప్రత్యేకంగా ఈ విషయాలను గురించి వివరిస్తూ ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ ఈ విధంగా పేర్కొన్నది.

"జిన్నింగ్ ఫ్యాక్టరీలలోని కార్మికులు రోజుకు 17, 18 గంటలు పనిచేయడం మేము చూశాము. బియ్యపు మరలు, పిండిమరలలో అప్పుడప్పుడు 20 నుండి 22 గంటలు పనిచేయవలసివస్తోంది. ప్రింటింగ్ ప్రెస్‌లలో కార్మికులు వరుసగా ఏడురోజులు, రోజుకు 22 గంటల చొప్పున పనిచేస్తున్నారు. అంతేగాక 14 సం॥ల లోపు వయస్సు గల్గిన బాలలు కూడా ఫ్యాక్టరీ పనిచేసినంత సేపూ పనిచేయవలసిందే. అంటే వారు రోజుకు 10 నుండి 14 గంటలు పనిచేస్తున్నారు. పనికాలాన్ని రెండు లేక అంతకంటే ఎక్కువ భాగాలుగా విభజించి పార్టుటైం కార్మికులుగా, మరీ చిన్నపిల్లలను కూడా పనులకు పెడుతున్నారు."

వలస పాలనలో పెట్టుబడిదారులు సాగిస్తున్న ఈ అమానుష దోపిడీ ఫలితంగా ఏర్పడిన దారుణ పరిస్థితులను "భూతల నరకంగా" వర్ణించడం ఏమాత్రం అసమంజసం కాదు.

కాని పెట్టుబడిదారీ దోపిడీని యింకా అనేక నివేదికలు వెల్లడించాయి.

బొంబాయికి చెందిన సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్, టామ్ డ్రెవెట్ సమర్పించిన నివేదికలో ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

"జిన్నింగ్ సంవత్సరంలో సుమారు ఎనిమిది నెలలపాటు సాగుతుంది. ఈ ఎనిమిది నెలల సీజనులో 5 నెలలు కార్మికులు ఉదయం 5 గం॥ల నుండి రాత్రి 10 గంటల వరకు పనిచేస్తారు. మిగిలిన 3 నెలలు రేయింబవళ్ళు పనిచేస్తున్నారు. ఈ కార్మికులలో అధిక సంఖ్యాకులు స్త్రీలే. స్త్రీలు ఏకబిగిన ఏడురోజులు రాత్రింబవళ్ళు పనిచేస్తున్నట్లు భావిస్తున్నాను. చిన్నపిల్లలు రెండు షిఫ్టులలో పనిచేయడం ఎక్కడా లేదని నా అభిప్రాయం. అందువలన వీరు 24 గంటలలో 23 గంటలు పనిచేస్తున్నారు."

ఆర్.ఎఫ్. వాడియా అనే ఒక ఫ్యాక్టరీ యజమాని తన ఫ్యాక్టరీలోని కార్మికుల స్థితిగతులను గురించి ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

"మాములు రోజుల్లో అంటే పని ఒత్తిడి లేని రోజుల్లో ఉదయం 4, 5 గంటల మధ్య పనిచేయడం ప్రారంభించిన యంత్రాలు రాత్రి 7, 8 కొన్ని సమయాలలో 9 గంటల వరకు నిరాటంకంగా పనిచేస్తూనే వుంటాయి. యంత్రాలు పనిచేస్తున్నంత కాలం కార్మికులు విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారు. భోజనానికి కూడా ఒకరి తరువాత మరొకరు వెళ్ళి వస్తూండేవారు. పని వత్తిడి వున్న మార్చి, ఏప్రిల్ నెలల్లో జిన్నింగ్, ప్రెస్సింగ్ యంత్రాలు కొన్ని సందర్భాలలో సాయంత్రం పూట అరగంట విశ్రాంతితో రాత్రింబవళ్ళు పనిచేస్తూంటాయి. సుమారు 8 రోజులు రాత్రింబవళ్ళు ఒకే సెట్టు కూలీలు పనిచేస్తున్నారు. ఇక ఏ మాత్రం

పనిచేయడానికి సాధ్యం కానప్పుడు ఇతర సెట్లను సంపాదించడం జరిగేది. ఫ్యాక్టరీ ప్రారంభమయ్యే సమయానికి అంటే ఉదయం 4 గంటలకు కార్మికులందరు ఫ్యాక్టరీ వద్దకు చేరుకోవాలి. వారికి టైం తెలియదు. అందువలన స్త్రీలు, పురుషులు ఉదయం (తెల్లవారుఝామున) 3 గంటలకే ఫ్యాక్టరీకి వస్తారు. నా ఫ్యాక్టరీలో 40 జిన్నింగు యంత్రాలను నడపడానికి 40 మంది స్త్రీలు మాత్రమే వున్నారు. మరొక 8 మంది స్త్రీలను అదనంగా వుంచుతాము. వీరిని జిన్నింగ్ యంత్రాలను వదలి వెళ్ళనివ్వం. ఈ పద్ధతిని అనుసరించేది నేనొక్కడనే కాదు. ఇది సర్వసాధారణంగా వున్న పద్ధతే. భోజన సమయంలో తప్పితే మరే సందర్భంలోనూ కార్మికులు మారడానికి వీలులేదు. ఈ విధంగా ఎక్కువ గంటలు పనిచేసేవారు తరచుగా మృత్యువాత పడుతున్నారు."

"టానురాపు" అనే ఒక ఓవర్సీరు మరింత దారుణమైన విషయాన్ని ఇలా వెల్లడించాడు. "పని ఎక్కువగా వున్నప్పుడు కార్మికులు ఉదయం 4 గంటల నుండి రాత్రి 10, 10.30 కొన్ని సందర్భాలలో 11 గంటల వరకు పనిచేస్తున్నారు. ఒక్కొక్కప్పుడు స్త్రీ, పురుష కార్మికులు విశ్రాంతి లేకుండా వరుసగా 10 లేక 12 రోజులు రాత్రి, పగలు పనిచేస్తున్నారు" అని పేర్కొన్నాడు.

ఒక మిల్లు మేనేజర్, ఇండియన్ ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ ముందు సాక్ష్యమిస్తూ "పరిశ్రమలలో పనిగంటలను గురించి ఎవరూ ఫిర్యాదు చేయడంలేదు. ఈ పనిగంటలు విభజించిన పద్ధతే ఆక్షేపణీయంగా వున్నది. మామూలుగా పనిచేయడం ఒక ఎత్తు. ఉదయం షిప్టులో పనిచేసేవారు, ఫ్యాక్టరీలు చేరుకొనడానికి ప్రయాణం చేయవలసిన దూరాన్ని బట్టి తెల్లవారుఝామున 4, 4.30 గంటలకే నిద్ర లేవవలసి వుంటుంది. అదే సాయంత్రం షిప్టులో పనిచేసేవారు రాత్రి 9, 9.30 గంటల వరకు ఇళ్ళు చేరుకునే అవకాశం లేదు. ఆ తరువాతనే వారు వంట చేసుకోవాల్సి వుంది. ఎముకలు కొరకే చలి వున్న శీతాకాలంలోనైనా, జోరున వర్షాలు కురిసే వర్షాకాలంలోనైనా, ఆ సమయాలకు పనులు ప్రారంభం కావల్సిందే" అని పేర్కొన్నాడు!

యజమానులు ఏమాత్రం విచక్షణ, మానవతా దృక్పథం లేకుండా స్త్రీ, బాల కార్మికులను అమానుషంగా దోపిడీ చేశారు. 5, 7 సం॥ల మధ్య వయస్సు కల్గిన పసిబాలలతో సైతం దారుణంగా పనిచేయిస్తుండేవారు. 1908లో ఇండియన్ ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ జరిపిన దర్యాప్తు ప్రకారం, ఫ్యాక్టరీలలో నియమించబడిన కార్మికులలో 30 నుండి 40 శాతం వరకు అతి చిన్న వయస్సులో వున్న బాలలే. వీరు ఫ్యాక్టరీలు పనిచేసే కాలంలో సగం కాలం పనిచేస్తున్నారు. బెంగాలులోని జనపనార మిల్లుల పనితీరును గురించి వివరిస్తూ "కార్మికులు ఫ్యాక్టరీల నుండి 3 నుండి 4 మైళ్ళ దూరంలో నివసించేవారని, రాత్రి 3 గంటలకు ఫ్యాక్టరీ సైరన్ కూత విన్నవెంటనే 7 సం॥ల లోపు వయస్సు గల్గిన ఈ పసిబాలలు చీకటిలో ఈ మూడు, నాలుగు మైళ్లు నడచివచ్చి ఫ్యాక్టరీలో పనులకు హాజరవుతున్నారని" కమిషన్ పేర్కొన్నది. రాత్రి పూర్తిగా పనిచేయడం వలన మిక్కిలి అలసట చెందడంతో స్త్రీల ఆరోగ్యం దారుణంగా దెబ్బతిన్నదని ఈ

కమిషన్ పేర్కొన్నది. ఈ స్త్రీ కార్మికులలో అనేకమంది పాలు త్రాగే పసిపిల్లలను ఎత్తుకుని ఫ్యాక్టరీలలో పనులకి హాజరయ్యేవారు.

"1908లో ఫ్యాక్టరీ కమిషన్ విచారణ జరిపే నాటికే అనేక బట్టల మిల్లులు ఒకే బ్యాచ్ కార్మికులతో 13 నుండి 15 గంటల వరకు పనిచేస్తున్నాయి. అంతకు ముందు రోజుల్లో యీ పద్ధతి సర్వసాధారణమైనది" అని భారతదేశంలో కార్మికుల జీవన పరిస్థితులపై విచారణ జరపడానికి నియమించబడిన రాయల్ కమిషన్ 1931లో ధృవపరచింది.

మానవమాత్రునికి భరించశక్యంగాని ఈ శ్రమను తట్టుకొనలేక కార్మికులు ఇక ఏమాత్రం పనిచేయలేని పరిస్థితులలో వున్నప్పుడు మాత్రమే, ఈ కార్మికుల స్థానంలో క్రొత్తవారిని నియమిస్తుండేవారు. అంటే ఆనాడు యజమానులు కార్మికులను యంత్రాల వలెనే చూస్తుండేవారు. యంత్రంలోని ఒక పళ్ళ చక్రంలో ఒక పన్ను విరిగిపోయినట్లయితే కొత్త పన్నును ఏర్పాటుచేసినట్లు, కార్మికులు శక్తిహీనులయ్యేవరకు వారిని దోపిడీ చేసి, చివరకు వారు పనిచేయలేని స్థితిలో నున్నప్పుడు వారి స్థానంలో కొత్తవారిని నియమించడం జరుగుతున్నది.

బాల కార్మికులు ఎంత దారుణంగా దోపిడీ చేయబడుతున్నదీ వివరిస్తూ శ్రీ దివాన్ చమన్‌లాల్ ఒక హృదయ విదారకమైన గాధను తెలిపాడు.

"భారతదేశంలోని పారిశ్రామిక జీవనంలో బానిసత్వం ప్రధానంగా కనిపిస్తోంది. ఎక్కడో లైబీరియాలోనో, అబిసీనియాలోనో పసిపిల్లలు కూడా బానిసత్వంలో మ్రగ్గుతున్నారని చెప్పుకోనక్కరలేదు. ఈ విధానం మన భారతదేశం నడిబొడ్డునే సాగుతోంది. ఒక ప్రముఖ వ్యక్తి తాను ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రోజుల్లో తన ఇంటి ప్రక్కనేవున్న ఇంటిలో ప్రతిరోజూ అనేకమంది బాలలు పనిచేస్తుండేవారని తెలిపాడు. ఒక్కొక్కసారి రాత్రిపూట దయనీయమైన వారి ఏడుపులు విన్పించడంతో ఈ ఉపాధ్యాయుడు చాలా బాధపడుతూండే వాడు. ఆయన ఈ విషయాన్ని వెల్లడించి ఎంతోకాలం కాలేదు. ఈయన ఆ ప్రక్కన వున్న ఆ ఇల్లు ఒక పాఠశాల అని భావించి, అమాయకులైన పసివారు అమానుషంగా హింసించబడుతున్న విషయాన్ని పై అధికారులకు తెలియజేశాడు. అయితే విచారణ జరపగా ఆ ఇల్లు ఒక లేసుల ఫ్యాక్టరీ అని తెలిసింది. అక్కడ చిన్న వయస్సులోనున్న బాలలు మనం ఊహించనంత ఎక్కువ కాలం పనిచేస్తున్నారు. ఆ పసివారు మిక్కిలి అలసట చెంది, నిద్రరావడంతో పనిచేస్తూనే తూలడం చూచిన కరుణామయుడైన ఫ్యాక్టరీ యజమాని కొరడాతో కొట్టి వారిని నిద్రలేపుతుంటాడు. ఇది భరించలేని ఆ పసికందుల ఆర్తనాదాలు, కన్నీళ్ళ ద్వారా వారికి పారిశ్రామిక విద్యను గరపగలనని ఆ మహానుభావుడు భావిస్తున్నట్లుంది. ఆ ఉపాధ్యాయుడు మరెవరో కాదు గౌరవనీయుడైన శ్రీ శ్రీనివాసశాస్త్రి. పి.సి.రాయల్ కమిషన్‌తో బాటు అమృతసర్ చేరిన శ్రీ శాస్త్రి గ్రీకులు, ఆంగ్లో ఇండియన్ల యాజమాన్యంలో వున్న తివాచీ చేనేత ఫ్యాక్టరీలను సందర్శించాడు. ఈ ఫ్యాక్టరీలలో 5 సం॥ల వయసు గల్గిన పసిబాలల శ్రమతో అతి ప్రాచీన

కళారూపాలకు అందమైన ప్రతిసృష్టి జరుగుతోంది. ఈ ఫ్యాక్టరీని సందర్శించే సందర్భంలో ఒక వ్యక్తి తనతోబాటు పట్టుకుని తిరుగుతున్న ఒక లెడ్జరును శ్రీ శాస్త్రి పరిశీలించడం జరిగింది. దానిలో ఒక విషయం వెల్లడైంది. దానిలో ఈ విధంగా వ్రాయబడింది.

'అమృతసర్‌లో చౌకీదారుగా పనిచేస్తున్న చాఖి కుమారుడైన బూటా అను నేను రూ. 57/ –లు అప్పు పడియున్నాను. దానిలో సగం అంటే 28 1/2 రూ॥లు బూటీ వీవర్ వద్ద అడ్వాన్సుగా పొందాను. నా మనుమలు ఎన్. మరియు ఎఫ్. అనువారిని తివాచీ నేతకు పంపించడానికి అంగీకరిస్తున్నాను. ఎన్.కు తొమ్మిది రూ॥లు, ఎఫ్.కు 7రూ॥లు ఇవ్వబడాలి. నేను ఎవరి వద్ద నుండి అప్పు తీసుకున్నానో, వారికి సొమ్మును వాపసు చేస్తాను."

ఈ విషయాన్ని పరిశీలిస్తే ఈ వలసదేశంలో ఆధునిక పెట్టుబడిదారీ వర్గం ఎక్కువ గంటలు పనిచేయించడం ద్వారా కార్మికులను ఎంత అమానుషంగా దోపిడీ సాగిస్తున్నది సుబోధకమవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో వలసదేశమైన ఇండియాలోని కార్మికులు "అర్ధబానిస"ల స్థితికి దిగజార్చబడ్డారు.

ఈ ఆధునిక ఫ్యాక్టరీలకు దూరంగా వున్న ప్లాంటేషన్ (టీ తోటల) కార్మికుల జీవన పరిస్థితులు, పని పరిస్థితులు మరింత దారుణంగా వున్నాయి.

భరించలేనంత ఎక్కువ కాలం పనిచేయించడం ద్వారా కార్మికులను పెట్టుబడిదారులు తీవ్రంగా దోపిడీ చేస్తున్నారు. దీనికి తోడు నికృష్టమైన జీతాలు చెల్లించడం ద్వారా భారత కార్మికవర్గాన్ని దోపిడీదారులు కడు నీచంగా చూడసాగారు.

రాజారామ్మోహనరాయ్ విచారణ సంఘం ఎదుట సాక్ష్యం ఇస్తూ దేశంలోని కార్మికుల జీతాలను గురించి, వారి సాధారణ ఆర్థిక పరిస్థితిని గురించి వివరించాడు. ఆధునిక పెట్టుబడిదారీ ఫ్యాక్టరీలు స్థాపించబడిన తరువాత కార్మికుల జీతాలను నిర్ణయించడానికి సామ్రాజ్యవాదుల దోపిడీకి గురై సర్వనాశనమైన ప్రాచీన ఆర్థిక వ్యవస్థలోని గ్రామీణ ప్రజల జీవన స్థాయిని ప్రాతిపదికగా తీసుకొనడం జరిగింది. ఈ విధంగా కాలం చెల్లిన పద్ధతులలో అస్తవ్యస్తంగా వేతనాలను నిర్ణయించడం చూస్తే, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిన పశ్చిమదేశాలలో వలె కాక భారతదేశం వంటి వలసదేశంలోని పారిశ్రామిక కార్మికుల జీవన పరిస్థితులు భిన్నంగా వున్నట్లు స్పష్టమవుతుంది.

ఈ విషయాన్ని ధృవపరిచే కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం. ఇండియాలో ప్రధానంగా జనపనార, నూలు వస్త్రాల పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. అందువలన తక్కువగా వున్న మిగిలిన పరిశ్రమలను ప్రక్కనపెట్టి టెక్స్‌టైల్ పరిశ్రమకు చెందిన కార్మికుల జీతభత్యాలు, జీవన పరిస్థితులను పరిశీలిస్తే మొత్తంగా భారత కార్మికవర్గ జీవన పరిస్థితులు సుబోధకమవుతాయి.

బెంగాల్‌లోని జనపనార మిల్లులలో "సాధారణ పనిదినంలో సగభాగం", సులువైన పనులు చేసే బాల కార్మికులకు వారానికి ఒక రూపాయి,నిపుణుడైన మెకానిక్‌కు వారానికి 10

నుండి 12 రూపాయల వరకు చెల్లించబడుతున్నట్లు, 1892లో ప్రభుత్వం జరుపుతున్న విచారణ సందర్భంగా జూట్‌మిల్స్ అసోసియేషన్ కార్యదర్శి వెల్లడించాడు. బ్రిటిషు-ఇండియన్ అసోసియేషన్ లెక్కల ప్రకారం జనపనార ఫ్యాక్టరీలలోని నైపుణ్యంలేని కార్మికులకు వారానికి 14 అణాల నుండి రూ. 3 వరకు, నిపుణులైన కార్మికులకు వారానికి రూ. 5 నుండి 7 వరకు చెల్లించబడుతుండేది.

1892లో కలకత్తాలోని నూలు మిల్లులలో జీతాలను గురించి మాట్లాడుతూ, తన ఫ్యాక్టరీలో కార్మికునికి వారానికి సగటున 6 రూ॥లు చెల్లిస్తున్నట్లు ఒక మిల్లు మేనేజరు ప్రగల్భాలాడాడు. కాని నూలు తీసే పురుష కార్మికునికి నెలకు 10 రూ॥లు కూలీకి నెలకు 7 రూ॥లు ఇవ్వబడుతున్నట్లు, ఒక ప్రభుత్వాధికారి అదే సంవత్సరంలో జరిపిన దర్యాప్తులో వెల్లడైంది.

1896-1920 మధ్యకాలంలో కలకత్తాలోని ఒక జనపనార మిల్లులో చెల్లించబడుతున్న వేతనాలు ఈ క్రింది పట్టికలో యివ్వబడ్డాయి. ఇది పరిశీలిస్తే బెంగాలులోని జనపనార పరిశ్రమలో సాధారణంగా వేతనవిధానం ఏ విధంగా వున్నది స్పష్టమవుతుంది.

**బెంగాలులోని ఒక జూట్ మిల్లులో సగటు జీతాలు (రూ॥లలో)**

| ప్రతి సం॥ జనవరి నెలలో | వారానికి | | | | | | | రోజువారి | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | కార్డింగు (ఏకుట) | రోవర్లు | స్పిన్నర్లు | షిఫ్టర్లు | వైండర్లు | బీమర్లు | వీవర్లు | మేస్త్రీలు | కూలీలు |
| 1896 | 1.37 | 2.19 | 2.5 | 0.87 | 2.5 | 2.75 | 4.75 | 0.80 | 0.30 |
| 1900 | 1.44 | 2.25 | 3.0 | 1.00 | 3.0 | 3.00 | 5.25 | 0.87 | 0.31 |
| 1905 | 1.47 | 2.37 | 3.25 | 1.12 | 3.25 | 3.25 | 5.37 | 0.94 | 0.34 |
| 1910 | 1.50 | 2.75 | 3.50 | 1.25 | 3.50 | 3.75 | 5.5 | 1.0 | 0.37 |
| 1915 | 2.00 | 3.32 | 3.48 | 1.80 | 3.60 | 4.72 | 5.6 | 1.1 | 0.44 |
| 1920 | 2.75 | 5.40 | 4.33 | 2.00 | 5.88 | 7.29 | 8.75 | 1.32 | 0.61 |

ఈ పట్టికను పరిశీలించినట్లయితే 1896-1915 మధ్యకాలంలో కార్మికుల జీతాలు సగటున సుమారు 50 శాతం పెరిగినట్లు స్పష్టమవుతుంది.

నూలుబట్టల పరిశ్రమలో కూడా కార్మికుల వేతనాలు దాదాపు ఇదేవిధంగా వున్నాయి. 1877లో బొంబాయి ప్రెసిడెన్సీలోని నూలు మిల్లుల్లో సగటున పురుషులకు నెలకు 10 నుండి 20 రూపాయల వరకు, స్త్రీలకు 7 నుండి 9 రూపాయల వరకు చెల్లించబడుతుండేది. బొంబాయిలోని నూలు మిల్లుల్లో సగటు నెల జీతం పురుషులకు 12 రూ॥లు, స్త్రీలకు 9 రూ॥లు, పిల్లలకు 5 రూ॥లు వున్నట్లుగా మరొక అధికార నివేదిక తెలియజేస్తోంది. పెద్దవారికి సగటు నెలజీతం 11 రూ॥లు చెల్లించబడుతున్నట్లు శ్రీ జె.ఎన్. తాతా తెలియజేశారు. అదే అహమ్మదాబాద్ మిల్లులో సగటు నెల జీతం 10 రూ॥లు మాత్రమే వుండేది. ఆగ్రా వద్ద వున్న నూలు మిల్లులోనూ, కాన్పూరులోని మరొక నూలు మిల్లులోను సగటు నెలసరి జీతం 5 1/2 రూ॥లు వుండేది. 1890లో నియమించబడిన ఇండియన్ ఫ్యాక్టరీస్ కమిటీ బొంబాయిలో సేకరించిన సమాచారం ఈ క్రింది విషయాలను వెల్లడిస్తుంది.

**వివిధ రకాల కార్మికుల నెల జీతాలు**

| **క్యాటగిరీలు** | **నెల జీతాలు** |
|---|---|
| మైనరు బాలిక | రూ. 5/- |
| బాలుడు | రూ. 6/- నుండి రూ. 7/-వరకు |
| స్త్రీ | రూ. 6/- నుండి రూ. 10/-వరకు |
| నేత పనివారు కాక మిగిలిన పురుష కార్మికులు | రూ. 10/- నుండి రూ. 12/-వరకు |
| నేత పని చేసే పురుష కార్మికులు | రూ. 12/- నుండి రూ. 15/-వరకు |

వలస దేశాలలో కూడా పరిశీలనలు సాగించిన బ్రిటిష్ రాయల్ కమిషన్ భారతదేశంలో కార్మికుల వేతనాలు స్థిరంగా వుండడం కొనసాగుతూనే వున్నదని పేర్కొంది. 'గత ఇరవై అయిదు, ముప్పది సంవత్సరాల నుండి వేతనాలలో గమనించదగిన మార్పు లేకపోవడం చాలా విచిత్రమైన విషయం' అని ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

బొంబాయి తదితర పారిశ్రామిక కేంద్రాల మధ్య వేతనాల విషయంలో చాలా తేడాలున్నాయి. అహమ్మదాబాద్‌లోని కార్మికుల వేతనాలు దాదాపు బొంబాయి కార్మికుల వేతనాలను పోలివున్నాయి. కాని కాన్పూర్, షోలాపూర్, నాగపూర్ వంటి ప్రదేశాలలో కార్మికులు అధిక సంఖ్యలో వుండడం వలన, జీతాలు తక్కువ స్థాయిలో వున్నాయి. "1893లో వెండి నాణాలు ముద్రించడం ఆపివేయడంతో జీతాలలో పెరుగుదల ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. 1895-1914 మధ్యకాలంలో ఈ పెరుగుదల మరింత కొట్టొచ్చినట్లు కన్పడింది.

ఇప్పటి వరకు మనం జనపనార, నూలుబట్టల పరిశ్రమలలో కార్మికుల జీవన పరిస్థితులు, వేతనాల తీరుతెన్నులు చర్చించాము. మిగిలిన అనేక చిన్న చిన్న పరిశ్రమలలో కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా వున్నది. 1885లో ఏర్పాటు చేయబడిన బొంబాయి ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ ముందు విచారణకు హాజరైన జిన్నింగ్ ఫ్యాక్టరీ మేనేజర్ ఆర్.ఎఫ్. వాడియా మరింత దయనీయమైన విషయాలనెన్నింటినో వెల్లడించారు. ఈ కమిషన్ ముందు సాక్ష్యం ఇస్తూ శ్రీ వాడియా "ఉదయం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పనిచేసే కార్మికులకు రోజువారి మూడు నుండి నాల్గణాల వరకు వేతనం లభిస్తుంది. అన్ని ఫ్యాక్టరీలు ఇదే విధంగా జీతాలు చెల్లిస్తాయి. ఒక్కోసారి మా కార్మికులకు ఆరుపైసలు బోనసుగా చెల్లిస్తాము...." అని పేర్కొన్నాడు.

ఈ వేతనాలను రాజారామ్మోహనరాయ్ ఉదహరించిన వేతనాలతో పోల్చి చూసినట్టయితే 1890 దశకంలో భారతదేశంలోని పారిశ్రామిక కార్మికుల జీతాలు 1930 దశకంలో భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలో కార్మికులు సంపాదించుకుంటున్న జీతాల కంటే ఏమాత్రం మెరుగుగా లేవని స్పష్టమవుతోంది. భారతదేశ పారిశ్రామికీకరణ ప్రథమ దశలో కార్మికుల జీవన పరిస్థితులకు సంబంధించి, మిక్కిలి అసహజమైన, విచిత్రమైన పరిస్థితి నెలకొంది.

ఈ సమయంలో గృహవసతి విషయంలో కార్మికులు ఎంత నీచమైన, అసహ్యకరమైన స్థితికి దిగజార్చబడినదీ చెప్పాలంటే అది మరల ఒక పెద్ద కథ అవుతుంది. గ్రామీణ ప్రాంతాలలో తమ కొంపా గోడూ వదులుకొని, పొట్టచేతబట్టుకుని (19వ శతాబ్దపు రెండవ సగంలో) నూతనంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కేంద్రాలకు తరలి వచ్చిన కార్మికులకు గృహవసతి ఏమాత్రం కల్పించబడలేదు. 19వ శతాబ్దాంతానికి కూడ గృహవసతి కల్పించే విషయంలో కనీసం నామమాత్రమైన పురోగతి కూడా సాధింపబడలేదు. కార్మికుడు తన కుటుంబంతో సహా నివసించడానికి కనీసం ఒక గదియైన లభించలేదు. అనేక కుటుంబాలు ఒకే గదిలో ఇరుక్కుని వుండవలసివచ్చేది. ఆ గదులకు కనీసం పారిశుధ్య సౌకర్యాలు గాని, గాలి, వెలుతురు వచ్చే ఏర్పాట్లు గాని లేక చీకటి గుహలవలే వుండేవి. ఈ వలసదేశంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతున్న సమయంలో నరకప్రాయమైన జీవితాలు సాగిస్తున్న కార్మికులు ఆరోగ్యరీత్యానూ, నైతికపరంగానూ దిగజార్చబడ్డారు.

కార్మికుల స్థితిగతులను గురించి పరిశీలనలు జరిపిన అనేక అధికార సంఘాలు సైతం తిరుగుబాటుకు దారితీసేటంతటి దారుణమైన పరిస్థితులు నెలకొన్నట్లు గమనించకపోలేదు. కార్మికుల మురికివాడ నొకదానిని సందర్శించిన టెక్స్టైల్ ఫ్యాక్టరీస్ లేబర్ కమిటీ ఈ విధంగా పేర్కొనడం జరిగింది :

"పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయనే చెప్పాలి. భారతదేశంలోని కార్మికులు, వారి కుటుంబాలు ఎంత తక్కువ స్థలంలో సర్దుకోగలరని భావించినప్పటికీ ఇళ్ళు ఎప్పుడూ

క్రిక్కిరిసి వున్నాయి. గాలి, వెలుతురు రావడానికి ఏమాత్రం అవకాశం లేక చీకటిగాను, తేమగానూ వున్నాయి. కార్మికుల నివాస గృహాల చుట్టూ ఇరుకైన సందులున్నాయి. ఈ సందులగుండా మురికినీరు, చెత్తాచెదారం తీసుకువెళ్తూంటారు. ఈ గల్లీల నుండి వచ్చే దుర్గంధం వలన వాతావరణం తీవ్రంగా కలుషితమవుతోంది. సరిగ్గా ఇదేవిధంగా లేనప్పటికి, దాదాపు ఈ రకమైన పరిస్థితులే మిగిలిన పెద్ద పారిశ్రామిక కేంద్రాలలో కూడా ప్రత్యక్షమవుతున్నాయి."

1911 జనాభా లెక్కల ప్రకారం బొంబాయిలోని ప్రజానీకంలో 69 శాతం ఒకే గది వున్న గృహాల్లోనే నివసిస్తున్నారు. అంటే సగటున కనీసం 4 1/2 మంది మనుషులు గాలి కూడా చొరడానికి వీలులేని ఒక్కొక్క చీకటి కొంపలలో ఇరుక్కుని కాలం వెళ్ళబుచ్చుతున్నట్లు స్పష్టమవుతోంది. 1931 గణాంక వివరాలు మరింత ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించాయి. ఈ లెక్కల ప్రకారం పరిస్థితులు మరింత దిగజారి బొంబాయిలో ఒక గది వున్న గృహాల్లో నివసించే వారి సంఖ్య జనాభాలో 74 శాతానికి పెరిగింది. మరింత వివరంగా పరిశీలిస్తే సగటున ఒక్కొక్క గదిలో 6 నుండి 9 మంది వరకు నివసించేవారు 2,56,379 మంది వుండగా, 8,133 మంది ప్రజలు గదికి 10 నుండి 19 మంది చొప్పున, 15,490 మంది గదికి 20 మంది చొప్పున ఇరుక్కుంటున్నారు.

జనాభా లెక్కలు వెల్లడించిన ఈ చేదు నిజాలు ఒక్క బొంబాయికి మాత్రమే సంబంధించినవి కావు. కలకత్తా, హౌరా, కాన్పూరు, మద్రాసు తదితర పారిశ్రామిక కేంద్రాలలో కూడా సర్వసాధారణంగా ఈ విధమైన పరిస్థితులే నెలకొని వున్నాయి. భారత కార్మికోద్యమ తొలి రోజుల్లో మిక్కిలి ప్రసిద్ధి చెందిన కార్మిక నాయకుడు బి.శివరావు కార్మికులు నివసించే మురికివాడలను గురించి ఒళ్ళు జలదరించే విషయాలు వెల్లడించారు.

కార్మికులు నివసిస్తున్న మురికివాడలను గురించి చెబుతూ శ్రీ బి.శివరావు "మురికి, చెత్త, చెదారం, దుర్గంధం విషయంలో హౌరాలోని (కార్మికుల నివాసగృహాలు) బస్తీలు మరియు ఉత్తర కలకత్తా పరిసర ప్రాంతాలకు సాటి మరొకటి లేదు. బెంగాలు మున్సిపాలిటీల చట్టం ప్రకారం జూట్ మిల్లు కార్మికులలో అధిక సంఖ్యాకులు, ప్రైవేటు బస్తీలలో నివసించడం తప్పనిసరైంది. నిరుపేదలైన కష్టజీవుల నుండి డబ్బు గుంజి భాగ్యవంతులైన ఈ గృహాల యజమానులే చట్ట ప్రకారం ఈ మురికివాడలను అభివృద్ధి చేయవలసివుంది. కాని స్వార్థపరులైన ఈ యజమానులు చట్టం నిర్దేశించిన ఈ విధులను అమలు పర్చవల్సిన అవసరం లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడుతూనే వున్నారు. ఈ బస్తీలు వర్ణించనలవికానంత అసహ్యంగానూ, అసౌకర్యంగానూ వుంటాయి. "దుర్గంధ, రోగభూయిష్టకూపాలు"గా పిలువబడుతున్న ఈ కొంపలకు కిటికీలు గాని, పొగ పోవడానికి గొట్టాలు (చిమ్నీలు) గాని, చలి కాచుకునే స్థలంగాని వుండవు. ఈ ఇండ్ల ద్వారాలు ఎంత చిన్నవిగా వుంటాయంటే వాటిలో ప్రవేశించాలంటే మోకాళ్ళ మీద వంగి తీరవలసిందే. దీపాలు, నీటి సరఫరా సౌకర్యాలు లేవు. ఇక పారిశుధ్యానికి సంబంధించిన ఏర్పాట్లను గురించి చెప్పనే అక్కరలేదు. ఈ ఇళ్ళను చేరుకోవాలంటే సంవత్సరం

పొడుగునా ముఖ్యంగా వర్షాకాలంలో విపరీతమైన దోమలు, ఈగలకు నిలయాలుగా వుండే మురికి కాల్వల మీదగా వెళ్ళాల్సిందే. బెంగాలులోనే రెండవ పెద్ద మున్సిపాలిటీ అయిన హౌరా మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాలు కలకత్తా ఉత్తర ప్రాంతం కంటే కూడా అపరిశుభ్రంగా వున్నాయి" అని వ్రాశాడు.

బొంబాయిలో కార్మికుల నివాసాలు నరకప్రాయంగా వున్నాయని పేర్కొన్నాడు. బొంబాయి నగరంలోని స్త్రీ కార్మికుల పరిస్థితులను గురించి పరిశీలనలు జరిపిన ఒక లేడీ డాక్టరు అనుభవాలను ఆయన ఈ క్రింది విధంగా ఉదహరించాడు.

"ఒక చౌల్ (అధిక సంఖ్యలో కుటుంబాలకు గృహవసతి కల్పించడం కొరకు నిర్మింపబడిన గృహ సముదాయం – రచయిత) లోని రెండవ అంతస్తులో 15 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒక గదిలో ఆరు కుటుంబాలు నివసించడాన్ని నా కళ్ళతో నేను చూశాను. అక్కడ ఆరు వేర్వేరు పొయ్యిలు ఉండడం ఈ విషయాన్ని ధృవపరుస్తోంది. పెద్దలు, పిన్నలు కలిసి మొత్తం ముప్పదిమంది ఆ గదిలో వుంటున్నట్లు నిర్ధారణ చేసుకున్నాను. పైకప్పు నుండి గడలు వ్రేలాడదీయబడి వున్నాయి. ఒక్కొక్క కుటుంబం వేరుగా వుండడం కోసం రాత్రిపూట ఈ గడల నుండి గుడ్డలు వ్రేలాడదీస్తారు. ఆరుగురిలో ముగ్గురు స్త్రీలు కొద్దిరోజుల్లో ప్రసవించవచ్చు. ఈ ముగ్గురు బొంబాయిలోనే పురుడు పోసుకుంటామని చెప్పారు. ఆ గదిలో ఏకాంతంగా వుండే ఏర్పాటు చేయవలసిందిగా నాతో వచ్చిన నర్సును అడగగా, ప్రైవసీ కొరకు ఏర్పాటు చేసుకునే పద్ధతిలో 4 అ॥ పొడవు, 3 అ॥ వెడల్పు గల కొద్ది ప్రదేశాన్ని చూపింది. ఆ గదిలో రాత్రి పూట ఆరు పొయ్యిల నుండి వచ్చే పొగతోను, ఇతర మలిన పదార్థాలతోనూ కూడుకున్న వాతావరణం, ప్రసవించడానికి ముందూ తరువాత కూడా స్త్రీలకు శారీరక రుగ్మతలను కల్గిస్తుంది. ఇది నేను చూసిన చాలా గదులలో ఒకటి మాత్రమే."

మద్రాసులో పరిస్థితిని వివరిస్తూ "అనేక గుడిసెలలో ఒకరికంటే ఎక్కువ మంది దంపతులు నివసిస్తున్నారు. నగరంలో జనసమ్మర్ధం ఎక్కువగా వున్న ప్రాంతాలలో అనేక కుటుంబాలు వుంటున్న గదులలోనికి బయట నుండి గాలి వచ్చే అవకాశం లేదు. గాలి రావాలంటే మరొక కుటుంబం నివసిస్తున్న గది గుండా రావలసిందే. వివాహితులైన రెండు జంటలు తమ పిల్లలతో బయటి గదిలోనూ, మరో రెండు జంటలు లోపలి గదిలోనూ నివసిస్తూండటం పరిశీలకుల దృష్టికి వచ్చింది. ఏ గదిలోనూ కిటికీలు లేవు. వంట కూడా గదుల లోపలే చేసుకోవాలి" అని శ్రీ శివరావు పేర్కొన్నాడు.

1916–18 మధ్యకాలంలో ఏర్పాటు చేయబడిన ఇండస్ట్రియల్ కమిషన్ ముందు ఒక సాక్షి చేసిన తీవ్రమైన ప్రకటనను ఈ సందర్భంగా గమనించవలసి వుంది. "నా జీవిత కాలంలో అనేక దేశాలలో తీవ్రమైన పేదరికాన్ని నా కళ్ళారా చూచాను. పేదరికాన్ని గురించి ఎంతో చదివాను. కాని బొంబాయిలో పేద వర్గాల గృహాలను చూచిన తరువాత మాత్రమే పేదరికం ఎంత దుర్భరమైనదో, దుర్మార్గమైనదో అర్థం చేసుకోగలిగాను. కార్మికుని అతని

ఇంటిలో తన కుటుంబ సభ్యుల మధ్య వుండగా చూసిన వారికి నేను మానవుని చూస్తున్నానా? లేదా మాయాజాలంతో ఆత్మరక్షణ లేకుండా సృష్టించబడిన ఒక ఊహా జీవిని చూస్తున్నానా? అనే ప్రశ్న ఉదయించకమానదు" అని ఆయన చెప్పడం జరిగింది.

ఈ విధంగా పదడుగుల పొడవు, పదడుగుల వెడల్పు గలిగి కనీసం కదలడానికి కూడా వీలు లేని గదుల్లోనే కుటుంబాలకు కుటుంబాలు నిద్రపోతూనే వున్నారు. పిల్లలను కంటూనే వున్నారు. పోషిస్తూనే వున్నారు. ఈ గదుల్లోనే పిడకలతో వంట చేస్తున్నారు. కుటుంబ జీవితానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ ఇక్కడే కొనసాగుతున్నాయి. కాని ఉమ్మడిగా ఏర్పాటు చేయబడిన మరుగుదొడ్లు మాత్రం వేరుగా ఏర్పాటు చేయబడ్డాయి.

కనీసం ఒక మనిషి నిటారుగా నిలబడడానికి కూడా వీలులేక ఏటవాలుగా వున్న పై కప్పు క్రింద వున్న చిన్న చిన్న గుహలు (కంతలు), పాత ఇళ్ళలోని  పై అంతస్తులలో గదులుగా చెలామణి అవుతున్నాయి. వెనుకభాగాన వున్న గదులు గాడాంధకారంగా వుంటాయి. ఆ చీకటికి అలవాటుపడిన తరువాత చాలా జాగ్రత్తగా చూస్తేనే గాని ఆ గదుల్లో ఎవరైనా వున్నదీ, లేనిదీ కూడా కనుక్కోవడం సాధ్యం కాదు. భావిభారత చరిత్రలో విప్లవాత్మకమైన పాత్రను నిర్వహించవలసిన భారత కార్మిక వర్గంపై సుదీర్ఘమైన పనిగంటలు, అతి నికృష్టమైన జీతాలు, దారుణమైన గృహవసతి తదితర పరిస్థితులను రుద్ది వారిని దోపిడీ చేయడం ద్వారా అధోగతికి దిగజార్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే చీము నెత్తురు గల్గిన మానవమాత్రులు భరించలేని స్థితికి భారత కార్మికవర్గం దిగజార్చబడింది.

## మొదటి ఫ్యాక్టరీ చట్టం : తదనంతర పరిస్థితులు

భారత కార్మికులు ఏ విధమైన పరిమితులు లేకుండా ఎక్కువ గంటలు పనిచేయవలసిన పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా మొదటి ఫ్యాక్టరీ చట్టం అమలులోనికి రావడం ఒక చారిత్రాత్మకమైన సంఘటన. భారత కార్మిక వర్గం తీవ్రంగా దోపిడీకి గురికావడం, ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రతిఘటన కూడా పెరగడంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు కొన్ని కార్మిక చట్టాలను చేయవలసిన అగత్యం ఏర్పడింది.

సాధారణంగా పనిగంటలు తదితర పనిపరిస్థితులను ఒక విధంగా అదుపు చేయడానికి ఈ కార్మిక శాసనాలు ఉద్దేశించబడతాయి. కాని వలసపాలనలో వున్న ఇండియాలో పూర్తిగా భిన్నమైన లక్ష్యంతో ఈ కార్మిక శాసనాలు చేయడం ప్రారంభమైంది. కార్మికులకు కొన్ని సౌకర్యాలు కలుగజేయడానికీ చట్టాలు ఉద్దేశించబడలేదు. యజమానులకు అవసరమైన కార్మిక శక్తిని శాశ్వత ప్రాతిపదిక మీద ఏర్పాటు చేయడానికి మాత్రమే ఈ చట్టాలు ఉద్దేశించబడ్డాయని చెప్పవచ్చు. ప్రారంభ దశలో చేయబడిన ది అస్సాం ప్లాంటేషన్ లేబర్ ఇమ్మిగ్రేషన్ ఆక్టు (అస్సాం టీ తోటల కార్మికుల వలస చట్టం) ది మద్రాస్ ప్లాంటర్స్ యాక్టు, మాస్టర్స్ అండ్ సర్వెంట్స్ చట్టం, వర్క్‌మెన్స్ బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్టు చట్టం తదితర చట్టాలు కార్మికులను రిక్రూట్

చేయడంలోనూ, వారిని దోపిడీ చేయడంలోనూ యజమానులకు తోడ్పడడానికి మాత్రమే ఉద్దేశించబడ్డాయి. కార్మికులు విశ్రాంతి లేకుండా 15 నుండి 18 గంటల వరకు ఏకబిగిన పనిచేస్తున్నారు. ఈ శ్రమకు ఇక ఏమాత్రం తట్టుకోలేక చివరకు తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించే వారిని సైతం శిక్షించే అధికారాలు కూడా ఈ చట్టాల ద్వారా యజమానులకు సంక్రమించాయి. చివరకు భారత శిక్షాస్మృతి (1860) లోని 490, 492 సెక్షనులలో కూడా యీ విధమైన అంశాలే పొందుపరచబడ్డాయి.

1860లో యజమానులు, కార్మికుల (వివాదాల) చట్టం ఆమోదించబడింది. మొట్టమొదటిసారిగా ఈ చట్టం బొంబాయిలో అమలు జరపబడింది. ఆ తరువాత ఈ చట్టం సెంట్రల్ ప్రావిన్సెస్‌కు, ఆ తదుపరి దేశంలోని మిగిలిన ప్రాంతాలకు విస్తరించబడింది. ఈ చట్టం ప్రకారం అవిధేయత ఆరోపణతో కార్మికులకు జరిమానా, జైలు శిక్ష విధించే అధికారాలు యజమానులకు సంక్రమించాయి. అనేక పోరాటాల ద్వారా కార్మికవర్గం కొన్ని హక్కులను సాధించుకున్న ఈనాటి పరిస్థితులలో, కష్టాలను భరించలేక ప్రతిఘటించడాన్నే ఒక పెద్ద నేరంగా ఎంచి జరిమానాలు విధించే విధానానికి రూపకల్పన చేసిన ఈ "యజమానుల కార్మికుల వివాదాల చట్టం" ఊహాతీతమైనది. సామ్రాజ్యవాద దోపిడీదారులు భారతదేశాన్ని పూర్తిగా పతనావస్థకు తెచ్చిన విభిన్నమైన పరిస్థితులలో ఈ చట్టం అమలులోనికి వచ్చింది. కార్మిక వర్గం ప్రతిఘటనా శక్తిని ఇంకనూ పెంపొందించుకోని దశలో సామ్రాజ్యవాద పాలకులు అశేష లాభాలు గడించేందుకు కార్మికులతో బలవంతంగా ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారు. ఈ చట్టాలలోని దారుణమైన నిషేధాలను విధించే అనేక అంశాలను ఆనాటి చారిత్రక పరిస్థితులను దృష్టిలో వుంచుకుని అంచనా వేయవలసి వుంది.

1857 తిరుగుబాటు తరువాత తరచుగా కరువు పరిస్థితులు ఏర్పడడంవలన ప్రజలలో అసంతృప్తి చెలరేగసాగింది. భూములను పోగొట్టుకుని, దిక్కులేక పేదరైతులు గ్రామాలను వదలి పట్టణ ప్రాంతాలకు తరలిపోవడం జరిగింది. దీనివలన పట్టణ ప్రాంతాలలో సంభవించనున్న తీవ్ర పరిస్థితులను బ్రిటిషు ప్రభుత్వం ముందుగానే గుర్తించింది. ఈ పరిస్థితులలో భారత శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్‌కోడ్) 1860 అమలులోకి వచ్చింది. సరిగ్గా సామ్రాజ్యవాదుల ఈ వైఖరి, భయాల కారణంగానే యజమానులు – కార్మికుల (వివాదాల) చట్టం అమలు చేయబడింది.

"ఈ సామాజిక వ్యవస్థ నుండి కార్మికులకు రక్షణ కల్పించడంకంటే, కార్మికుల నుండి ఈ వ్యవస్థను పరిరక్షించడానికే ప్రభుత్వం తాపత్రయపడుతున్నట్లు కన్పిస్తున్నది" అంటూ ఒక అధికార ప్రతినిధి అంగీకరించాడు.

1931లో ఇండియాలో కార్మికుల జీవనపరిస్థితులపై విచారణ జరపడానికి గాను ఏర్పాటుచేయబడిన రాయల్ కమీషన్ ఈ చట్టాన్ని (యజమానుల కార్మికుల చట్టం) రద్దు చేయవలసిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అయితే అప్పటికే ఈ చట్టానికి కాలం

చెల్లింది. చివరకు 1932లో ఈ చట్టాన్ని రద్దుచేయాలని కోరుతూ ఎన్.ఎం. జోషి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత ఈ చట్టం రద్దు చేయబడింది.

కార్మికుల సంక్షేమాన్ని గురించి ఏ మాత్రం పట్టించుకొనక, యజమానుల దోపిడీని నిరంతరాయంగా కొనసాగించడానికే మొదటి ఫ్యాక్టరీల చట్టం చేయబడింది. భారతదేశంలోని నూలు పరిశ్రమాధిపతులకు శ్రమశక్తికారుచౌకగా లభించడమే గాక స్త్రీలు, పురుషులు, బాలలు అనే విచక్షణ లేకుండా అందరి శ్రమశక్తిని దోపిడీ చేయడం ద్వారా లాభార్జనకు అవకాశాలు మెండుగా వున్నాయి. లాంక్‌షైర్‌లోని నూలు బట్టల మిల్లుల అధిపతులకు, భారతదేశంలోని తమ ప్రత్యర్థుల నుండి పోటీ ఎదురవడంతో వారు కలవరపడ్డారు. కాని ఇంగ్లండులో ట్రేడ్ యూనియన్ ఉద్యమం అభివృద్ధి చెంది వుండటం, కార్మిక సంఘాలు అప్పటికే అవతరించి ఉండడం, తదితర చారిత్రక కారణాల వలన భారతదేశంలోని మిల్లు యజమానులకున్న అనుకూల పరిస్థితి లాంక్‌షైర్‌లోని మిల్లు యజమానులకు ఒనగూడలేదు. తమ వ్యాపారానికి దెబ్బ తగులుతుందేమోనని భయపడిన బ్రిటనులోని నూలు మిల్లుల యజమానులు భారతదేశంలోని కార్మికులు తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారని గొంతుచించుకొని అరవనారంభించారు. భారతదేశంలో అమానుషమైన కార్మిక విధానాలకు స్వస్తి చెప్పేందుకు చట్టాలు చేయవలసిందిగా ఈ మిల్లు యజమానులే ప్రభుత్వాన్ని కోరారు.

స్వార్థ ప్రయోజనాల నాశించి ఇంగ్లండులోని మిల్లు యజమానులు చేసిన ఆర్భాటంతో బాటు భారత, ఇంగ్లండ్ దేశాలలో దయాస్వభావం గల్గిన కొందరు నిజాయితీతో చేసిన విజ్ఞప్తులు, ప్రకటనలు ఈ పరిణామాల మీద కొంత ప్రభావాన్ని కల్గియున్నాయనడంలో సందేహం లేదు.

భారతదేశంలోని పరిశ్రమాధిపతులు కార్మికవర్గంపై సాగిస్తున్న దారుణ దోపిడీని అంతంచేసే విషయం ఇంగ్లండులోని కామన్సుసభ ముందుకు వచ్చింది. ఇండియాలోని ఫ్యాక్టరీలలో పని పరిస్థితులను క్రమబద్ధం చేయడానికి అవసరమైన శాసనాలు చేయవలసిందిగా కామన్సు సభ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌ను కోరింది. ఈ విధంగా అనేక ఒత్తుడులకు గురై బొంబాయి ప్రభుత్వం టెక్స్‌టైల్ కార్మికుల జీవనపరిస్థితులను పరిశీలించడానికి 1875లో ఒక కమిషన్‌ను నియమించింది. తొమ్మిదిమంది కమిషను సభ్యులలో ఏడుగురు, మిల్లు యజమానుల ప్రతినిధులు కావడం మిక్కిలి ఆశ్చర్యం కల్గిస్తుంది. ఇట్టి కమిషన్ కార్మికుల జీవన పరిస్థితులకు సంబంధించిన వాస్తవాలను దాచడానికి ప్రయత్నం చేయడమేమంత ఆశ్చర్యకరమైన విషయంగాదు. కార్మికుల కష్టాలను తొలగించేందుకు చర్యలు తీసికొనడానికి ప్రభుత్వం నిరాకరించింది.

సరిగ్గా అదే సమయంలో బొంబాయికి చెందిన శ్రీ సోరాబ్జీ షాపుర్జీ సి.బి.ఇ. బెంగాలీ అనే ఒక మానవతావాది బాల కార్మికుల పని పరిస్థితుల్లో మార్పు చేయవలసిందిగా ప్రభుత్వానికి నచ్చజెప్పడానికి చాలా ప్రయత్నించాడు. ఈ ప్రయత్నం విఫలం గావడంతో బాల కార్మికుల పని గంటలను నిర్ణయిస్తూ శాసనం చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ఒక ఆందోళనను లేవదీశాడు. ఈ విషయం మీద బిల్లు ముసాయిదా పత్రం తయారు చేసి 1878లో బొంబాయి ప్రభుత్వానికి సమర్పించాడు. దీనివల్ల ప్రయోజనం చేకూరలేదు. కాని శ్రీ బెంగాలీ చేసిన ప్రయత్నాలకు ఇంగ్లండులో విశేష ప్రచారం లభించింది. లాంక్‌షైర్‌లోని పరిశ్రమాధిపతులు శ్రీ బెంగాలీ చేసిన ప్రయత్నాలను తమ స్వార్థపర ప్రయోజనాల సాధనకు వినియోగించుకొనడంలో ఏమాత్రం ఆలస్యం చేయలేదు. భారతదేశంలోని బట్టల మిల్లులో పనిచేస్తున్న కార్మికుల పనిగంటలు తదితర పనిపరిస్థితులను క్రమబద్ధీకరిస్తూ చట్టం తీసుకురావాలనే తమ డిమాండును మళ్ళీ ముందుకు తెచ్చారు.

ఈ పరిస్థితులలో చివరకు 1881 సం॥లో మొదటి భారత ఫ్యాక్టరీల చట్టం అమలులోకి వచ్చింది. 7 సం॥ల లోపు బాలలను ఫ్యాక్టరీలలో నియమించడాన్ని యీ చట్టం నిషేధించింది. ఈ చట్టం ప్రకారం 7-12 సం॥ల మధ్య వయస్సుకల్గిన బాలలు 9 గంటలకు మించి పనిచేయడానికి వీలులేదు. యంత్రాలను తనిఖీ చేయాలని, కార్మికులకు రక్షణ కల్పించేందుకు యంత్రాల చుట్టూ కంచె వేయాలని ఈ చట్టం నిర్దేశించింది. అయితే 100 గాని అంతకంటె ఎక్కువ మంది కార్మికులు పనిచేస్తున్న సంస్థలకే ఈ చట్టం వర్తిస్తుంది. జిన్నింగు, ప్రెస్సింగ్ పనులు సాగించే ఫ్యాక్టరీలు సీజనల్ ఫ్యాక్టరీలుగా పరిగణింపబడడంతో ఇవి కూడా యీ చట్టం పరిధిలోకి రావు. ఈ విధమైన ఆంక్షలతో బాటు పుట్టిన తేదీని ధృవపరచే సర్టిఫికేట్లు, సరియైన వైద్య తనిఖీ లేకపోవడం వలన ఈ చట్టం తీసుకురావడం వలన కార్మికుల స్థితిగతులలో ఏ విధమైన మార్పూ రాలేదు. వాస్తవానికి 1908లో ఇండియన్ ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ తన విచారణను ప్రారంభించినప్పుడు ఏడు సం॥ల లోపు వయస్సు గల్గిన బాలల నియామకం విస్తారంగా వున్నట్లు వెల్లడయింది.

ఈ పరిణామ క్రమంలో గమనించదగిన ముఖ్య విషయం ఒకటి వున్నది. కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించడం, నికృష్టమైన జీతాలివ్వడం సర్వసాధారణమైన విషయంగా కొనసాగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే కార్మికులు అమానుషమైన దోపిడీకి గురవుతున్నారు. బ్రిటిషువారి ఆధీనంలో వున్నప్పటికి, భారతీయుల ఆధీనంలో వున్నప్పటికి, దేశవ్యాప్తంగా వున్న పరిశ్రమలలోని భారత కార్మికవర్గం దోపిడీకి గురవుతూనే వుంది.

కార్మికుల పని పరిస్థితులను క్రమబద్ధం చేయడం పేరిట తీసుకున్న చర్యలు భారతీయ పెట్టుబడిదారుల ఆధీనంలోని నూలు బట్టల పరిశ్రమకు సంబంధించినవి మాత్రమే. బ్రిటిషువారి

ఆధీనంలో వున్న బెంగాలులోని జనపనార పరిశ్రమలో కూడా నూలుబట్టల పరిశ్రమలో వలెనే కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా వుంది. డుండీ జనపనార మిల్లుల యజమానులు బెంగాలులోని తమ ప్రత్యర్థుల నుండి తీవ్రమైన పోటీ నెదుర్కొంటున్నప్పటికీ, డుండీ (స్కాట్లండ్‌లోని ఒక నగరం) పరిశ్రమాధిపతులు బెంగాలులోని జూట్‌మిల్లు కార్మికుల పని పరిస్థితులను క్రమబద్ధం చేయవలసిందిగా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకుని రాలేదు. ఇంగ్లండులోని నూలు బట్టల మిల్లుల యజమానులకూ, ఇండియాలోని బట్టల మిల్లుల యజమానులకు మధ్య ఏర్పడిన పోటీ వాస్తవానికి బ్రిటిషు, భారత పెట్టుబడిదారుల ప్రయోజనాల మధ్య ఏర్పడిన ఒక సంఘర్షణ మాత్రమే. అందువలననే భారతదేశంలో కార్మికుల జీవన పరిస్థితులను క్రమబద్ధం చేయవలసిందిగా బ్రిటిషు పెట్టుబడిదారీ వర్గం ప్రభుత్వంపై వత్తిడి తేవడం అదీ టెక్స్‌టైల్ పరిశ్రమకే ప్రముఖంగా పరిమితం కావడం సంభవించింది.

అందువలన బ్రిటిషు సామ్రాజ్యవాదులు "భారత ఫ్యాక్టరీల చట్టాన్ని" మానవతా దృక్పథంతో చేయలేదని, ఈ చర్యల వెనుక వారి "వలస ప్రయోజనాల పరిరక్షణ" ప్రధాన పాత్ర వహించిందని స్పష్టమవుతుంది.

# 5

# శ్రామికుల వలస - ప్లాంటేషన్ కార్మికుల స్థితి

## శ్రామికుల వలస

19వ శతాబ్దం మూడవ దశాబ్దం నుండి 20వ శతాబ్దం ప్రారంభం వరకు భారతదేశంలోని శ్రామికులు చెరకు సమృద్ధిగా పండే బ్రిటిష్ వలస దేశాలయిన ఆఫ్రికా, వెస్టిండీస్‌లకు వలసపోయారు. భారతదేశంలోని కార్మికులు ఈ విధంగా వలసపోవడం దేశ శ్రామికవర్గ చరిత్రలోనే ఒక వ్యథాభరిత గాథ. ప్రాచీన ఆర్థిక వ్యవస్థ క్రమక్రమంగా శిథిలమై పతనం కావడం, 1757 సం॥లో జరిగిన ప్లాసీ యుద్ధంనాటికి 13 కోట్లుగా నున్న దేశ జనాభా విపరీతంగా పెరిగి 1881 నాటికి 25 కోట్ల 40 లక్షలకు చేరుకోవడంతో భూమిలేని పేద ప్రజల్లో నిరుద్యోగం ప్రబలిపోయింది. ఈ విధంగా పనులు లేని పేద ప్రజానీకం పొట్టకూటి కోసం కాంట్రాక్టు లేబర్‌గా బ్రిటిష్‌వారి వలస దేశాలకు వలసపోయారు.

1830 సం॥లో కొందరు భారత కార్మికులు ఒక గ్రూపుగా ఫ్రెంచి వారి వలస అయిన ఐసిల్-డి-బోర్బన్ అనే ద్వీపానికి పంపబడడంతో పరిమిత స్థాయిలో వలసలు ప్రారంభమయ్యాయి. బ్రిటిష్ వారి వలస దేశాల్లో బానిస విధానం రద్దు చేయడంతో మానవ జాతి చరిత్రలో 1934వ సంవత్సరం ఒక సంఘటనా భరిత సంవత్సరంగా స్థానం సంపాదించుకోగా, అదే సంవత్సరంలో భారతదేశం నుండి పెద్ద ఎత్తున వలసలకు గేట్లు తెరవబడ్డాయి. 1834-37 సం॥ల మధ్యకాలంలో 17 వేలమంది భారత కార్మికులు దేశాన్ని వదలిపెట్టిపోయారు. భారత కార్మికులు ఈ విధంగా పెద్ద ఎత్తున ఇతర దేశాలకు వలసపోవడాన్ని భారత కార్మికవర్గం మొదటిసారిగా భూములను వదలి పారిశ్రామిక కార్మికులుగా పరిణామం చెందడంగా భావించవచ్చు.

మారిషస్, బ్రిటిష్‌వారి అధీనంలోని గయానా, ట్రినిడాడ్, జమైకా ద్వీపాలు చక్కెర ఉత్పత్తికి ప్రసిద్ధిగాంచాయి. చెరకు తోటలలోనూ, పంచదార మిల్లుల్లోనూ బానిసలే పనిచేస్తున్నారు. బానిస వ్యాపారం నిషేధించబడడంతో స్వతంత్రులైన బానిస కార్మికులు చెరకు

తోటలలోనూ, చక్కెర మిల్లులలోనూ పనిచేయ నిరాకరించారు. దీనితో ఈ పరిశ్రమలో కార్మికుల కొరత తీవ్రమై, ఈ ద్వీపాలలోని పంచదార పరిశ్రమలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. సామ్రాజ్యవాద ప్రభుత్వ సహాయ సహకారాలతో ఈ ద్వీపాలలోని పంచదార పరిశ్రమాధిపతులు, భారతదేశంలోని భూమిలేని పేద రైతాంగాన్ని ఈ వలసలలో కార్మికులుగా పనిచేయడానికి దిగుమతి చేసుకున్నారు.

ఈ విధంగా వలస వచ్చిన కార్మికులకు తమ శక్తిని తమ యిష్టం వచ్చినట్లుగా అమ్ముకునే స్వాతంత్ర్యం లేకపోవడం వలన, వీరిని "స్వతంత్ర కార్మికులు" అనడానికి వీలులేదు. వీరందరు వలస దేశాలలోని పరిశ్రమాధిపతులతో చేసికొన్న ఒప్పందం ప్రకారం పనిచేయవలసినవారే. ఈ పద్ధతిన నియమించబడిన కార్మికులను అటు స్వతంత్రులనిగాని, ఇటు బానిసలనిగాని అనడానికి వీలులేదు. త్రిశంకు స్వర్గం లాంటిది వీరి పరిస్థితి. సాధారణంగా ఈ కార్మికులు ఒడంబడిక ప్రకారం ఐదు సంవత్సరాలు పనిచేయవలసి ఉంటుంది. ఈ కాలంలో వారికి ఆహారం, బట్టలు, గృహవసతి, వైద్య సదుపాయం సమకూర్చబడతాయి. అంతేగాక నెలసరి జీతం కూడ ఇవ్వబడుతుంది.

మిక్కిలి భయంకరమైన పద్ధతులలో ఈ కార్మికుల నియామకం జరిగేది. గ్రామీణ ప్రాంతాల నుండి కార్మికులను సమకూర్చడానికి యూరోపియన్ యజమానులు భారతదేశంలోని కొందరు సంఘ విద్రోహశక్తులను ఎంచుకొనేవారు. వారు "ఆర్కాటీస్"గా ప్రసిద్ధి చెందారు. అవినీతికరమైన, మోసపూరితమైన పద్ధతుల ద్వారా ఈ "ఆర్కాటీస్" నిరుద్యోగులను, భూమిలేని నిరుపేదలను, అర్ధాకలితో కాలక్షేపం చేస్తున్నవారిని, కట్టుకునేందుకు గుడ్డలులేక అర్ధనగ్నంగా వున్న గ్రామీణ ప్రజలను అనేక విధాలుగా మభ్యపెట్టి ఇండియా నుండి ఇతర దేశాలకు పంపుతుండేవారు. ఒప్పందం కుదిరిన తర్వాత దురదృష్టవంతులైన ఈ స్త్రీ, పురుషులను ఫ్రెంచి వారి ఆధీనంలో వున్న రేవులకు ముఖ్యంగా బొంబాయి, కలకత్తా, మద్రాసు ఓడరేవులకు చేరవేసేవారు. ఈ ఆర్కాటీలు ఇండియా నుండి ఇతర దేశాలకు ప్రయాణం చేసేముందు వీరందరిని ఓడరేవులోని గోడౌన్లలో బంధించేవారు. వారికి గట్టి బందోబస్తు కూడ ఏర్పాటు చేయబడేది. తరువాత రోజుల్లో వీరు చక్కెర సమృద్ధిగా లభించే వలస దేశాలకేగాక, ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయబడ్డారు.

1870 సం॥ నాటికి పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరు కలిసి మొత్తం 5 లక్షల మందికి పైగా కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విదేశాలకు ఎగుమతి చేయబడినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. 1842-1870 సం॥ల మధ్య కాలంలో వివిధ వలసలకు వెళ్ళిపోయిన పురుషులు, స్త్రీలు, బాలల సంఖ్య యీ క్రింది విధంగా వున్నది :

| వలస | పురుషులు | స్త్రీలు | బాలలు | మొత్తం |
|---|---|---|---|---|
| మారిషస్ | 2,43,853 | 63,459 | 44,089 | 3,51,401 |
| బ్రిటిష్ గయానా | 53,323 | 16,983 | 9,385 | 79,691 |
| ట్రినిడాడ్ | 28,030 | 9,280 | 5,209 | 42,519 |
| జమైకా | 10,169 | 3,233 | 1,914 | 15,169 |
| బ్రిటిష్ వెస్టిండీస్ దీవులు, సెయింట్ క్రోయిక్స్ | | | | 7,021 |
| ఫ్రెంచి "రి యూనియన్" | | | | 15,005 |
| ఫ్రెంచి వారి ఆధీనంలోని వెస్టిండీస్ దీవులు | | | | 16,341 |
| దక్షిణాఫ్రికాలోని నాటల్ | | | | 6,448 |
| **మొత్తం** | | | | **5,33,595** |

19వ శతాబ్దాంతానికి భారతదేశం నుండి వలస పోయిన కార్మికుల సంఖ్య 70 లక్షలకు చేరుకుంది. ఉధృతి తగ్గినప్పటికి మొత్తం మీద కార్మికులు విదేశాలకు వలసపోవడం 1917 సం॥వరకు కొనసాగింది.

1870-1880 సం॥ మధ్య కాలంలో ఈ విధంగా విదేశాలకు వలసపోయే కార్మికులను రిక్రూట్ చేయడానికి దేశవ్యాప్తంగా ఏజన్సీలు వెలిశాయి. కార్మికులను రిక్రూట్ చేయడంలో ఈ ఏజన్సీల మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడడంతో, అవినీతిపరులైన "ఆర్కాతీల" కల్లబొల్లి మాటలకు అనేకమంది దిక్కులేని కార్మికులు మోసపోయారు. ఈ "అర్కాతీలలో" కూలీల వ్యాపారంతో సంబంధాలున్న కొందరు విశేషంగా ధనసంపాదన చేశారు. కార్మికులను రిక్రూట్ చేసుకోవడంలో ఎన్ని కుతంత్రాలను పన్నేదీ హుగ్రీ బిస్వాల్ అనే ఆయన అనుభవాన్ని చూస్తే స్పష్టమవుతుంది. ఆయన ఈ విధంగా పేర్కొన్నాడు.

"నేను కటక్ నివాసిని. ఉద్యోగం సంపాదించుకొనాలనే తలంపుతో మేము నలుగురం కలకత్తా వెళ్ళడానికి బయలుదేరాము. బాలాసూర్ వద్ద ఒక సత్రంలో ఒక రాత్రి బసచేశాము. మాతో బాటు వున్న మిగిలిన ప్రయాణీకులతో బాటు బ్యాడ్జి ధరించిన వ్యక్తి కూడా అక్కడనే వున్నాడు. మరునాడు ఉదయం మరల మేము ప్రయాణం ప్రారంభించాము. బ్యాడ్జి ధరించిన నౌకరు కూడా మాతోనే ప్రయాణం సాగించాడు. మాటల సందర్భంలో మేమంతా తనతోబాటు కలకత్తా వచ్చినట్లయితే మాకు పని చూపిస్తానని చెప్పాడు. నాకు మారిషస్‌లో నెలకు 10

రూ॥లు జీతం లభించే ఉద్యోగం చూపిస్తానని హామీ ఇచ్చాడు. కలకత్తా నుండి నాలుగు రోజులు ప్రయాణం చేస్తే మారిషస్ చేరుకుంటామని, నా ఇష్టం వచ్చినప్పుడు ఆ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చే స్వతంత్రం నాకు వుంటుందని చెప్పాడు.

అతడు చెప్పిన మాటలు నమ్మి, ఆ ఉద్యోగం చేయడానికి అంగీకరించి అతనితో కలకత్తా వచ్చాను. అదే విధంగా నా సహచరులు కూడ కలకత్తా వచ్చారు. మేము ప్రయాణం చేస్తున్నంతసేపూ మేము క్రొత్త వ్యక్తులతో తాము ఎక్కడకు వెళుతున్నదీ చెప్పకూడదని చెప్పి మమ్ములను మాట్లాడనీయలేదు. మేము కలకత్తా చేరుకోవడంతోనే నగరానికి ఉత్తరాన వున్న ఒక ఇంటికి తీసుకువెళ్ళి మమ్ములనందరినీ ఒకే గదిలో వుంచాడు. మేము తప్పించుకొనకుండా ఆ గదిని ఎల్లప్పుడూ ఇద్దరు, ముగ్గురు కాపలా కాస్తున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ మమ్ములను బయటికి వెళ్ళేందుకు అనుమతించలేదు. ఒకవేళ తప్పనిసరిగా వెళ్ళవలసివస్తే కాపలా వాళ్ళు వెంట వస్తూండేవారు.

ఆ విధంగా మమ్మల్ని సుమారు రెండు వారాల పాటు వుంచారు. తరువాత కలకత్తాలోనే వున్న బాంక్‌షాల్ (bank shall) లోని ఒక పెద్దమనిషి వద్దకు తీసుకువెళ్ళారు. ఆయన ఏమి అడిగినప్పటికీ తలవూపవలసిందిగా మమ్మల్ని ఆదేశించారు. ఆ పెద్దమనిషి ముందుకు తీసుకువెళ్లినప్పుడు ఆయన అడిగిన ప్రశ్నలన్నింటికీ అనుకూలంగానే జవాబిచ్చాను. మారిషస్ ఎట్లా వుంటుందో తెలియదు. అది ఎక్కడ వున్నదో తెలియదు. ఓడలో ఎటు వెళ్ళాలో తెలియదు. అయినప్పటికీ మారిషస్ వెళ్ళడానికి నా ఆమోదాన్ని తెలియజేశాను.

తరువాత ఒక బట్టల జత, ఒక టోపి, దుప్పటి, కొన్ని ఇత్తడి వంట సామానులు, ఆరురూపాయలు నాకు అందజేశారు. దానిలో నాలుగు రూపాయలు డఫేదార్ మనుషులే ఎత్తుకుపోయారు. మిగిలిన రెండు రూపాయల్లో ఒక రూపాయితో ఒక పెట్టె కొనగా మిగిలిన రూపాయి మిఠాయిలు మొదలైన వాటికి సరిపోయింది. తరువాత మిగిలిన వారితోబాటు నేను కూడ ఒక పడవలో ప్రవేశించాను. మారిషస్‌కు నీటిమీద ప్రయాణం చేయక్కరలేదని వినియుండడం వలన నేనీ పడవ ప్రయాణానికి నా అసమ్మతి తెలియజేశాను. అప్పుడు ఒక నదిని మాత్రం దాటవలసివుందని నాకు చెప్పడం జరిగింది. ఆ విధంగా చేయడానికి బదులు ప్రవాహం మధ్యలో నున్న ఒక ఓడలోనికి మమ్ములనందరను తీసుకువెళ్ళారు. మాతోబాటు ఇంకా చాలమంది ఓడ ఎక్కారు. ఇక ఓడలో ఈ అమాయిక ప్రాణుల పరిస్థితి చాలా దారుణంగా వున్నది. "కొండ ప్రాంత ప్రజలను కూలీలుగా ఎగుమతి చేయడంలో జరుగుతున్న దురన్యాయాలను" గురించి విచారణ జరపడానికి 1838లో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ "విచారణ సంఘం" ముందు ఇవ్వబడిన కొన్ని సాక్ష్యాలు క్రింద పొందుపర్చబడ్డాయి.

సాక్ష్యం యిచ్చిన వ్యక్తి : కెప్టెన్ జేమ్స్ రాప్సన్.

ప్రశ్న : మారిషస్‌కు కూలీలను ఏ ఓడలో తీసుకువెళ్ళారు?

జవాబు : సోఫియాలో.

ప్రశ్న : ఈ ఓడ ఎంత బరువు మోయగలదు ? (టన్నేజీ ఎంత?)

జవాబు : 334 టన్నుల బరువు మోయగలదు.

ప్రశ్న : సోఫియాలో ఎంతమంది కూలీలను తీసుకువెళ్ళారు?

జవాబు : పురుషులు, స్త్రీలు, పిల్లలు అందరూ కలిసి మొత్తం 366 మందిని ఓడలో ఎక్కించుకున్నాము.

ప్రశ్న : ఎంతమందిని గమ్యం చేర్చారు ?

జవాబు : 334 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, 12 మంది పిల్లలను గమ్యం చేర్చాను. ఓడలోంచి దూకి ఇద్దరు చనిపోయారు. ఎనిమిది మంది మృత్యువాతబడ్డారు. వారందరు పురుషులే వారిలో ఇద్దరు వివాహితులు.

ప్రశ్న : ప్రయాణం చేస్తుండగా ఎందరు ఓడమీదనుండి పడిపోయారు?

జవాబు : నలుగురు పడిపోగా, యిద్దరు రక్షించబడ్డారు. మిగిలిన యిద్దరు మునిగిపోయారు.

సాక్ష్యం ఇచ్చిన వ్యక్తి : కెప్టెన్ ఎఫ్.డబ్ల్యూ.బర్చ్

ప్రశ్న : 1837 సం॥లో 5వ చట్టం చేయబడడానికి ముందు మనుషులను బలాత్కారంగా ఎత్తుకొని పోయిన విశ్వసనీయమైన సంఘటనలు మీకు తెలుసా?

జవాబు : ఒక స్త్రీని స్పృహ కోల్పోయేటట్లు చేసి, ఒక పెట్టెలో పెట్టి ఆమెను ఒక మైదానం గుండా తీసుకువెళ్తున్నారు. ఆమె స్పృహలోకి రావడంతో ఆమెను వదిలి వెళ్ళిపోయారు. ఇంతకుమించి ప్రత్యేకంగా ఏమీ చెప్పలేను. బెంగాల్ ప్రావిన్స్‌లోని లోతట్టు ప్రాంతాలలో కిడ్నాపింగ్ చాలా అధికంగానే సాగుతోంది.

సాక్ష్యం ఇచ్చిన వ్యక్తి : కెప్టెన్ ఎ.జి.మెకన్జీ

ప్రశ్న : వారికి (కూలీలకు) ఎంత స్థలం కేటాయించారు ?

జవాబు : దాదాపు ఓడ పై భాగములో నున్న మధ్యస్థలం పూర్తిగా వారికే కేటాయించబడింది. దానిలో జనపనారబేళ్ళు, ఇతర సామానులున్న పెట్టెలు సుమారు 10 అడుగుల స్థలం ఆక్రమించాయి.

ప్రశ్న : వారికి (వలస పోయేవారికి) నీరు ఎంత యిస్తున్నారు?

జవాబు : ప్రతి ట్రిప్‌కు 3/4 గ్యాలను నీరు యివ్వబడుతోంది. కాని రెండవ సందర్భంలో మూడు, నాలుగు రోజులు గ్యాలనులో 9/16వ వంతుమాత్రమే యివ్వవలసి వస్తోంది.

ప్రశ్న : వారు రోజుకు ఎన్నిసార్లు భోజనం చేస్తున్నారు?

జవాబు : రోజుకు ఒకసారే భోజనం చేశారు.

ప్రశ్న : మీరు చేసిన యీ రెండు (సముద్ర) ప్రయాణాలోనూ మీ అధీనంలో వున్న అధికారులు కొడుతున్నట్లు కూలీల నుండి ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా?

జవాబు : నాకు జ్ఞాపకం లేదు.

ప్రశ్న : మీ ఆదేశాల ప్రకారం ఎవరైనా శిక్షించబడ్డారా?

జవాబు : శిక్షించబడ్డారు.

ప్రశ్న : వారికి ఏ విధమైన శిక్షలు వేస్తుంటారు ?

జవాబు : బెత్తములతో కొట్టవలసినదిగా ఆదేశించాను.

ప్రశ్న : ఎన్ని దెబ్బలు కొట్టవలసిందో కూడా ఆదేశించేవారా?

జవాబు : అవును.

ప్రశ్న : ఈ శిక్షలు ఎవరు అమలు జరిపేవారు?

జవాబు : ఆ కూలీల సర్దారులే వారిని కొడుతుండేవారు.

ఈ అధికార కమిటీ అనేక సాక్ష్యాలను పరిశీలించిన మీదట, కూలీలను ఎగుమతి చేసే వ్యాపారం చాలా అవినీతికరంగానూ, పైశాచికంగానూ వున్నదనే నిర్ణయానికి రావడం జరిగింది. అనేక దీవులలో కూలీలు బానిసల స్థితికి దిగజార్చబడిన విషయాన్ని కూడా యీ కమిటీ ధృవపరిచింది. ఈ కమిటీ రిపోర్టులోని కొన్ని భాగాలను పరిశీలిద్దాం.

11. కంపెనీలలో ప్యూనులుగానో, రోడ్డుపనుల్లోనో, తోటమాలీలుగానో, పోర్టర్లుగానో ఉద్యోగాలు సంపాదించుకొనవచ్చునని పేదప్రజలకు ఆశచూపి ఈ కూలీ వ్యాపారంలో ఉన్న దఫేదార్లు తదితరులు వారిని కలకత్తాకు చేరవేస్తున్నట్లు కనపడుతున్నది.

14. కిడ్నాపింగ్ కూడా అధికంగానే సాగుతోంది. విదేశాలకు వెళ్ళడానికి కలకత్తా పరిసర ప్రాంతాలకు వచ్చిన కూలీలు దాదాపుగా నిర్బంధంలో వుంటున్నారు.

15. కిడ్నాపింగ్, అక్రమ నిర్బంధాలు కలకత్తాలోనే తీవ్ర స్థాయిలో సాగుతున్నప్పటికీ, ఈ విషయాలను గురించి పోలీసు అధికారులకు కూడా సరిగా తెలిసినట్లులేదు. ఒకవేళ వారేమైన చర్యలు తీసుకున్నప్పటికీ ఈ అక్రమాలను అరికట్టలేకపోయారు.

19. ప్లాంటేషన్లలో అమలులోనున్న నియమ నిబంధనలు కార్మికులపై అనేక నిర్బంధాలను విధించాయి. కాంట్రాక్టులలో కూలీలకు అనుకూలంగా వున్న అంశాలనైనా సరిగ్గా అమలు చేయించడంలో న్యాయాధికారులు తగిన శ్రద్ధ చూపించలేదు.

21. భారతదేశం నుండి మారిషస్‌కు చేరుకొనడానికి ప్రయాణంలో కూలీలు తీవ్రమైన కష్టనష్టాలను భరించవలసి యుండేది. నీటిలో మునిగిపోవడం తదితర కారణాల వలన మరణాలు అధికమయ్యాయి.

ఈ అధికార కమిటీ ముందు ఇవ్వబడిన సాక్ష్యాలు, ఈ కమిటీ నిర్ణయాలు పరిశీలించినట్లయితే యూరోపియన్ ప్లాంటేషన్ల యజమానులు, కూలీ వ్యాపారం చేసేవారు భారత కార్మికుల పట్ల ఎంత పైశాచికంగా ప్రవర్తించినదీ స్పష్టమవుతుంది.

వలసపోయిన భారత కార్మికులు తీవ్రమైన దోపిడీకి, పైశాచికత్వానికి గురవుతున్నారని తెలుసుకున్న భారత ప్రజలలో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. ఇంగ్లండులో కూడా అనేక మంది తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చారు.

1838 జూన్ 15వ తేదీ "బొంబాయి గెజిట్" పత్రిక బాధ వ్యక్తం చేస్తూ ఈ విధంగా పేర్కొంది. "వంచితులైన ఈ పేద ప్రజలను ఉద్యోగాల ఆశ చూపి మోసగించారు. ఈ కూలీలు తాము పనిచేయవలసిన గమ్యాన్ని చేరుకున్నది మొదలు బానిసలవలె పెత్తందార్ల ఆధిపత్యానికి లోబడి వుంటున్నారు. బానిస విధానం రద్దు చేయబడిన వలసలకే ఈ పేద ప్రజానీకం చేరవేయబడుతున్నారు. కానీ ఇక్కడకు రావడంతోనే వీరందరూ బానిసలవుతున్నారు."

ఆనాడు కలకత్తా నుండి వెలువడే "సోమ్ ప్రకాష్" అనే వారపత్రిక ఈ విధానానికి వ్యతిరేకంగా అనేక వ్యాసాలు ధారావాహికంగా ప్రచురించింది. కార్మికులు వలసలను అదుపు చేయడానికి ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఈ పత్రిక "ప్రతి సంవత్సరం ఇండియా నుండి సుమారు 20 వేలమంది పురుషులు వలసపోతున్నారు. వారిలో చాలామంది మార్గమధ్యంలోనే మృత్యువాత పడుతున్నారు. ప్రయాణంలో అనేక కష్టాల నెదుర్కొని చివరకు గమ్యం చేరుకున్నవారు కూడా బానిసల వలె పడివుండవలసిందే. వారి దుస్థితిని గురించి విని కూడా పట్టించుకోకపోవడం దారుణం" అని పేర్కొన్నది.

పత్రికా ముఖంగా విమర్శలు రావటంతో బాటు, 1838 జూలై 10వ తేదీన కలకత్తా పురజనులు ఒక సమావేశం ఏర్పాటు చేసి ఈ కాంట్రాక్టు లేబర్ విధానానికి తమ తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు.

"కొండజాతి ప్రజలు, ఇతర భారతదేశవాసులకు తాము ఆమోదించిన ఒప్పందాలలోని వివరాలు తెలియవు. వాటిని అర్థం చేసుకునే శక్తి వారికి లేదు. అందువలన వారు మోసపూరితమైన పద్ధతుల ద్వారా ఇతర దేశాలకు పంపబడ్డారనే మా నమ్మకాన్ని ప్రకటించడం మా విద్యుక్త ధర్మంగా భావిస్తున్నాము" అని ఈ పురజనుల సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

విపరీతంగా లోడ్ చేయబడిన సామానులు చేరవేసే ఓడలలో పశువులవలె కుక్కి కార్మికులను ఇతర దేశాలకు చేరవేస్తుండేవారు. ఈ కూలీలు చాలా నీచంగా చూడబడుతూండేవారు. వీరికి కడుపు నిండా తిండి కూడా దొరికేది కాదు. ఇక వైద్య సదుపాయం గురించి చెప్పనే అక్కరలేదు. దురదృష్టవంతులైన ఈ కార్మికులలో కొందరు తమ గమ్యాన్ని చేరకుండానే మార్గమధ్యంలోనే మృత్యువాత పడుతుండేవారు. గమ్యాన్ని చేరినవారు తీవ్రంగా అలసట చెంది ఉండుటవలన శారీరకంగానూ, మానసికంగానూ దిగజారిపోయారు. వలస దేశాలలోని విచిత్రమైన పరిస్థితులకు అలవాటు పడటం వారికి ఒక అగ్ని పరీక్షగా తయారయింది.

వలసదేశాలలో ఈ కార్మికుల పని పరిస్థితులు దుర్భరంగా వున్నాయి. రోజూ కనీసం 12 నుండి 13 గంటల కాలం పనిచేయవలసి వుంది. కాని చెరకు తోటలు, చక్కెర మిల్లులలో పని చాలా కష్టాలతో కూడుకొని వుండడం వలన తమ విధులను పూర్తిగా నిర్వహించడానికి ఈ కార్మికులు రాత్రిపూట కూడా పని చేయవలసివచ్చేది. ధైర్యం కోల్పోయి, పూర్తిగా అలసిపోయి రాత్రి పొద్దుపోయిన తరువాత ఇళ్ళకు చేరుతుండేవారు. చెరకు తోటలలోనూ, పంచదార మిల్లులలోనూ పనిచేస్తున్న కార్మికులను ఓవర్సీర్‌లు వేయి కళ్ళతో కనిపెడుతుండేవారు. ఆదివారాలలో కూడా వీరిని ఏదో ఒక పనితో విసిగిస్తూండేవారు. కొన్ని వలసదేశాలలో కార్మికులు రోజుకు 18 గంటల వరకు కూడా పనిచేయవలసి వుండింది. ఈ విధంగా ఎక్కువ గంటలు పనిచేయడం వలన కార్మికులు అధిక సంఖ్యలో చనిపోతుండేవారు.

కార్మికులు సంఘటితమవుతారేమోనన్న భయంతో, వారు తప్పించుకుపోయే అవకాశాలు లేకుండా చేశారు. పై అధికారులకు ఎదురు తిరిగితే వారిని జంతువులవలె కర్రలతో కొడుతూండేవారు. అంగవికలురను, జబ్బుతో బాధపడుతున్న వారిని కూడా వదలకుండా వారిచేత కూడా పనిచేయించేవారు. బానిస యజమానులు బానిస కార్మికుల యెడల అవలంబించిన వైఖరికీ, యూరోపియన్ యజమానులు వలసదేశాలలోని కార్మికుల యెడల ప్రవర్తించిన తీరుకూ తేడా ఏమీలేదు.

యజమానుల అనాగరిక చర్యలను భారతదేశం నుండి వలసపోయిన కార్మికులు అన్ని సందర్భాలలోనూ సహించి వూరుకోలేదు. వారు తమంతట తామే సంఘటితమై ఎదురు దెబ్బలు తీసిన సంఘటనలు లేకపోలేదు. బ్రిటిషు ఆధిపత్యంలో వున్న గయానాలోని డెవాన్ షైర్‌కాసిల్ చెరకు తోటలలోని కార్మికులు తమ జీవన పరిస్థితులను గురించి పై అధికారులకు తెలియజేయడం కోసం జార్జిటౌన్‌కు తరలిపోయారు. 'న్యాయం చేకూర్చవలసిందిగా మొరపెట్టుకొన్న కార్మికులపై పోలీసులు పైశాచికంగా దాడులు చేశారు. పోలీసు కాల్పులలో ఐదుగురు కార్మికులు మృతిచెందగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు, అనేకమంది అరెస్టు చేయబడ్డారు.

తీవ్రమైన దోపిడీకి గురయిన, అణగద్రొక్కబడిన ఈ కార్మికుల జీవనం, వారు సాగించిన పోరాటాలు భారత కార్మికవర్గ చరిత్రలో నిస్సందేహంగా అంతర్భాగాలే.

## తోటలలోని కార్మికుల జీవన పరిస్థితులు

19వ శతాబ్దం ప్రారంభంలోనే భారతదేశంలో తోటల పెంపకం ఆరంభమైంది. కాని 18వ శతాబ్దాంతానికే యూరోపియన్ వాణిజ్యవేత్తల ప్రోత్సాహంతో బెంగాలు కేంద్రంగా భారతదేశంలో నీలిమందు (ఇండిగో) ఉత్పత్తి అభివృద్ధి చెందసాగింది. 19వ శతాబ్దంలో నీలిమందు తోటల పెంపకం విశేషంగా అభివృద్ధి చెందింది. కాని కృత్రిమంగా అద్దకం చేసే రంగులు వాడకంలోనికి రావడంతో నీలిమందు తోటల పెంపకం సర్వనాశనమైంది. 1831

సంవత్సరంలో 500 నుండి 1000 మంది వరకు యూరోపియన్‌లు ఈ నీలిమందు వ్యాపారంతో సంబంధాలు కల్గియుండేవారు. ఆనాడు బెంగాలులో 300 నుండి 400 వరకు నీలిమందు ఫ్యాక్టరీలు వున్నట్లు తెలియవస్తోంది. ఈ నీలిమందు తోటల పెంపకం ప్రధానంగా వ్యవసాయకమైనది. ఈ తోటలలో పనిచేసే కార్మికులు పేద రైతులే. అందువల్ల దీనికి సంబంధించిన అంశాలను ఈ పుస్తకంలో వివరించడం లేదు.

కాఫీ, రబ్బరు తోటలతో బాటు ఇండియాలో టీ తోటల పెంపకం కూడా ప్రధానమైనదే. ఈ టీ తోటల పెంపకం ప్రారంభమైన రోజుల్లో వలస పాలనలో నున్న భారతదేశంలోని, ఈ తోటలలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా వుండేది.

యూరపు దేశవాసులకు, భారతీయులకు టీ ఉత్పత్తిని గురించి తెలియనప్పటికీ 1815 ప్రాంతంలో ఈస్టిండియా కంపెనీ తన లాభాలలో అధిక భాగం చైనాతో టీ వ్యాపారం ద్వారా సంపాదించింది. 1833లో చైనాతో వ్యాపారంపై ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం అంతం కావడంతో, ఈస్టిండియా కంపెనీ టీ వాడకాన్ని ఇండియాలో ప్రవేశపెట్టడానికి ఆసక్తి చూపింది. బెంగాల్‌లో 'పాలా' వంశ పాలనా కాలంలో అతీష్ దీపాంకర్ అనే బౌద్ధ పండితుడు టిబెట్ సందర్శించినపుడు, టిబెట్ చక్రవర్తి ఆయనకు టీ ఇచ్చాడని చెప్పుకుంటారు. ఆయన ద్వారా టీ గురించి తెలుసుకున్న భారతదేశంలోని బౌద్ధులు టీ మొక్కల కోసం అడవులలో వెదకనారంభించారు. ఆ తర్వాత వీరు టీని భారతదేశంలో ప్రవేశపెట్టారు. సిన్ఫో, ఖామ్టి తెగలకు చెందినవారు టీ వినియోగంలో అనుభవం గడించారు. సిన్ఫో తెగ నాయకుడు బిసగమ్ భారతదేశంలోని బ్రిటిష్ వారికి మొట్టమొదట టీ రుచి చూపించాడని ప్రతీతి. భారతదేశంలో ఉత్పత్తియైన తేయాకు 1838 సం॥లో ప్రప్రథమంగా లండన్‌లో అమ్మబడింది. భారతదేశంలో తేయాకు ఉత్పత్తిని అభివృద్ధి చేయడం కోసం మిక్కిలి పెద్దదయిన అస్సాం కంపెనీ 2 లక్షల పౌండ్ల పెట్టుబడితో లండన్‌లో ప్రారంభించబడింది. భారతదేశంలో తేయాకు తోటల పెంపకం విస్తరించినప్పటికీ ప్రధానంగా అస్సాంలోను, బెంగాల్‌లోని డార్జిలింగ్ పరిసర ప్రాంతాలలోను ఈ తోటల పెంపకం బాగుగా అభివృద్ధి చెందింది.

1851 సం॥ నుండి తేయాకు ఉత్పత్తి క్రమబద్ధంగా కొనసాగి, 1869 సం॥ నాటికి దేశంలో తేయాకు పరిశ్రమ పూర్తిగా నిలదొక్కుకుంది.

భారతదేశంలోని ప్రాచీన వ్యవసాయక ఆర్థిక వ్యవస్థ శిథిలం కావడంలో పనులు కోల్పోయిన లక్షలాదిమంది వ్యవసాయ కార్మికులు అభివృద్ధి చెందుతున్న తేయాకు పరిశ్రమకు అవసరమైన కార్మికశక్తిగా అవతరించారు. తేయాకు ఉత్పత్తి చేయడంలో కార్మికులను వినియోగించడం, కార్మికుల నియామకం విషయాలలో అనుసరించబడు పద్ధతులు, విదేశాలలోని చెరకు తోటలలో అనుసరించబడుతున్న పద్ధతులను పోలివున్నాయి. తేయాకు తోటలు వెనుకబడిన, కొత్త ప్రాంతాలలో నాటడం వలన కొన్ని వందల మైళ్ళ దూరంలోని జనసమ్మర్ధమైన జిల్లాల నుండి కార్మికులను తీసుకురావలసిన అవసరం యేర్పడింది.

సర్దారులుగాని లేదా ఈ తోటలలో కార్మికుల పనిని పర్యవేక్షించేవారు గాని అనేకమంది స్థానిక ఏజంట్ల ద్వారా కార్మికులను సమకూర్చుతుండేవారు. కార్మికులను విదేశాలకు వలసపోయేటట్లు ప్రోత్సహించడానికి అవలంబించబడిన మోసపూరితమైన విధానాలనే స్వదేశంలోని టీ తోటలలో కార్మికుల నియమానికి ఈ స్థానిక ఏజెంట్లు అవలంబిస్తుండేవారు. డార్జిలింగ్ జిల్లాలో స్థానికంగా వున్న వ్యవసాయ కార్మికులతో బాటు నేపాల్‌లోని వ్యవసాయ కార్మికులు టీ తోటల యజమానులకు విధేయులైన ఒక బలవత్తరమైన కార్మిక శక్తిగా రూపొందారు. కాని అస్సాంలోని టీ తోటలలో ప్రధానంగా ఇతర ప్రదేశాల నుండి వచ్చిన కార్మికులే పనిచేస్తున్నారు. బీహార్ నుండి ఆదిమజాతుల వారిని, ఇతర ప్రజలను, ఆనాటి యునైటెడ్ ప్రావిన్సెస్, సెంట్రల్ ప్రావిన్సెస్ నుండి దిగుమతి చేసుకుంటూండేవారు. కాంట్రాక్టు లేబర్ పద్ధతిన మొత్తం కుటుంబాలకు కుటుంబాలే కాంట్రాక్టు పరిధిల్లోకి వస్తూండేవి. సాధారణంగా మూడు సంవత్సరాలపాటు పనిచేయడానికి ఒప్పందాలు చేసుకునేవారు. ప్రారంభంలో మనిషికి రెండు నుండి ఐదు రూపాయల వరకు నెల జీతం చెల్లించబడుతుండేది. రైల్వేల నిర్మాణం, తదితర ప్రజలకు సంబంధించిన పనులు సాగుతుండడంతో పాటు, దేశంలో ద్రవ్య ఆర్థిక విధానం ప్రవేశపెట్టబడటం వలన, వాటి ప్రభావం కార్మికుల జీతాలపై పడింది. 1857 సం॥లో నెలకు 2 1/2 రూ॥ల జీతానికే కార్మికుడు దొరుకుతుండగా, కొద్దికాలంలోనే నెలకు 4 రూ॥లు అంతకంటే ఎక్కువ జీతం ఇవ్వనిదే కార్మికులు లభించని పరిస్థితులేర్పడ్డాయి.

దుర్భర దారిద్ర్యానికి గురయిన గ్రామీణ ప్రజానీకం అవినీతిపరులు, పరమ దుర్మార్గులు అయిన రిక్రూటింగ్ ఏజంట్ల కబంధహస్తాల్లో పడింది. యజమానులకు, కార్మికులకు మధ్య దళారులుగా పనిచేస్తున్న ఈ రిక్రూటింగ్ ఏజంట్ల అవినీతి ఏ స్థితికి చేరుకున్నదంటే, ఈ పరిస్థితులను పరిశీలించడానికి చివరకు వలస ప్రభుత్వమే ఒక కమిషన్ నియమించవలసివచ్చింది. ఫలితంగా కూలీలు తాము యజమానితో చేసుకున్న ఒప్పందాలను అర్థంచేసుకోవడం, కూలీలు పనిచేయవలసిన తోటలకు చేరుకొనేందుకు చేసే సుదీర్ఘ ప్రయాణంలో మృతుల సంఖ్యను తగ్గించడమనే ప్రధాన ఉద్దేశాలతో, 1863లో ఒక చట్టం ఆమోదించబడింది. కాని ఈ లక్ష్యాలను సాధించడంలో ఈ చట్టం పూర్తిగా విఫలమైంది. ఆ టీ ఎస్టేటులలోని ఉద్యోగులే సర్దారులుగా వ్యవహరించాలని, కార్మికులను రిక్రూట్ చేసే ఏజంట్లు తప్పనిసరిగా లైసెన్సులు కలిగివుండాలని, అస్సాం లేబర్ అండ్ ఇమ్మిగ్రేషన్ చట్టం (1901) నిర్దేశించింది. ఈ చట్టం అమలులోనికి వచ్చినప్పటికి మోసపూరితమైన పద్ధతులు అప్రతిహతంగా కొనసాగుతూనే వున్నాయి. అంతేగాక వర్క్‌మెన్స్ బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్ట్ చట్టం (కార్మికులు ఒప్పందాన్ని ఉల్లంఘించినప్పుడు తీసుకొనవలసిన చర్యలను నిర్దేశించే చట్టం) భారత శిక్షాస్మృతులలోని కొన్ని అంశాల క్రింద పనులను వదిలి వెళ్ళిపోవడం (యజమానులు, వారి తాబేదారులు తమపై సాగిస్తున్న తీవ్ర దోపిడీకి తట్టుకొనలేక కార్మికులు పారిపోవడానికి ప్రయత్నించడం సహజం. అట్టి సమయాలలో ఈ చట్టాన్ని ఉపయోగించి యజమానులు కార్మికులను శిక్షించేవారు – అనువాదకుడు) తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. అట్టివారిని

నిర్బంధించి, వారికి శిక్షలు విధించే అధికారాలను కూడా ఈ చట్టాలే యజమానులకు ప్రసాదించాయి. ఎక్కువ గంటలు పనిచేయించి, తక్కువ జీతాలు ఇవ్వడం ద్వారా దారుణంగా దోపిడీ చేస్తున్న యజమానుల అక్రమ విధానాలు, కార్మికులను రిక్రూట్ చేయడంలో రిక్రూటింగ్ ఏజంట్లు అవలంబిస్తున్న మోసపూరితమైన విధానాలు, వీటితో బాటు వీరి దోపిడీని నిరాఘాటంగా కొనసాగించడానికి పరోక్షంగా తోడ్పడే చట్టాలు కార్మికులను బానిసల స్థితికి దిగజార్చాయి. చట్టాలలోని కొన్ని దుర్మార్గమైన అంశాలను తొలగించడం చివరకు సుదీర్ఘ పోరాటం ద్వారా మాత్రమే సాధ్యమైంది.

తోటల పెంపకం విస్తృతం కావడంతో యీ పరిశ్రమలో పనిచేసే శ్రామికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 1903 సం॥లో కాఫీ తోటలలో సుమారు 82 వేల మంది శ్రామికులు పనిచేస్తున్నారు. టీ తోటలలోని కార్మికుల సంఖ్య మరింత ఎక్కువగా వున్నది. టీ తోటలలో కార్మికుల సంఖ్యలో పెరుగుదలను ఈ క్రింది పట్టిక ద్వారా పరిశీలిద్దాం.

**భారత తేయాకు పరిశ్రమలో కార్మికుల సంఖ్యలో పెరుగుదల**

| సం॥ | శాశ్వత కార్మికులు | తాత్కాలిక కార్మికులు | మొత్తం |
|---|---|---|---|
| 1895 | 450926 | 102895 | 553817 |
| 1919 | 900695 | 72660 | 973351 |
| 1928 | 831438 | 75349 | 906785 |

1928 సంవత్సరంలో తేయాకు తోటలలో పనిచేస్తున్న 9,06,787 మంది శ్రామికులలో ఒక్క అస్సాంలోనే 5,44,193 మంది పనిచేస్తుండగా, బెంగాలులోని తేయాకు తోటలలో 1,85,399 మంది, పోగా మిగిలినవారు దక్షిణ భారతం తదితర ప్రాంతాలలో పనిచేస్తున్నారు.

ఈ తేయాకు తోటలన్ని పూర్తిగా బ్రిటిష్ పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంలోనే ఉన్నాయి. వీరు కార్మికులను దారుణంగా దోపిడీ చేసి విశేష లాభాలు గడించారు. ఈ బ్రిటిష్ పెట్టుబడిదారులు, వారి సర్దారులు కార్మికులను తీసుకొనివచ్చి, వారు స్త్రీలు, పురుషులు, పసిబాలలనే విచక్షణ కూడా లేకుండా చిత్రహింసలు పెట్టి వారిని దోపిడీ చేయడంలో అతి నీచమైన విధానాలకు ఒడిగట్టడానికి వారికెట్టి నీతి నియమాలు అడ్డురాలేదు. కాని కొన్ని సందర్భాలలో బాహాటంగాను, మరికొన్ని సందర్భాలలో పరోక్షంగానూ బ్రిటిషు వలస పాలనా యంత్రాంగం పూర్తి మద్దతుతోనే ఈ విధానాలు కొనసాగడం మిక్కిలి శోచనీయమైన విషయం.

ఉదాహరణకు బ్రిటిషు యజమానులు ఏ విధమైన సంబంధంలేని స్త్రీ, పురుషుల కంటె భార్యాభర్తలను తమ తోటలలో నియమించినట్లయితే లాభసాటిగా వుంటుందని భావించారు. సర్దారులు మోసపూరితమైన పద్ధతుల ద్వారా వివాహం కాని స్త్రీ, పురుషులను మత్తులో ముంచి బలవంతంగా భార్యభర్తలుగా వుండేటట్లు చేసేవారు.

ఈ విధంగా తీసుకురాబడిన ఈ కార్మికులు తేయాకు తోటలలో నిర్బంధించ బడ్డారు. అభాగ్యులైన ఈ కార్మికులు చెప్పనలవిగాని కష్టాలను అనుభవించవలసివచ్చింది. వీరిపై సాగిన పైశాచికమైన దోపిడీ వలస పాలనలో మాత్రమే ఊహించడానికి అవకాశమున్నది. 1970 ప్లాంటేషన్ చట్టం స్త్రీ, పురుషులకు 9 గంటల పనిదినాన్ని నిర్దేశించింది. 16 సంιιల లోపు వయసు గల్గిన బాలలు పనిచేయడాన్ని ఈ చట్టం నిషేధించింది. కాని ఆచరణలో ఈ అంశాలను యజమానులు నిర్లక్ష్యం చేసి చట్టాన్ని ఉల్లంఘించారు. నివాసయోగ్యం గాని ఇళ్ళలో వారు తలదాచుకొనవలసి వుండేది. తమ స్వదేశానికి దూరంగా వుండి ఇంకను ప్రజలు పూర్తిగా నివాసం ఏర్పరచుకొనని ప్రాంతాలలో నివసించవలసి రావడం, ఆహార పదార్థాల కొరత, అధిక ధరలతో బాటు నమ్మశక్యంగానంత నికృష్టమైన జీతాలు, మిక్కిలి శ్రమతో కూడిన వారి విధులు, వారి జీవితాలను మరింత దుర్భరం చేశాయి. అసలే అనారోగ్యంతో వున్న వీరు పోషకాహార లోపం, జబ్బుల కారణంగా అనేక మంది మరింత శక్తిహీనులయ్యారు. ఈ విధంగా అతి నికృష్టంగా వున్న జీవన పరిస్థితుల వలన ఈ కూలీలలో మృతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బానిస యుగాన్ని తలపింపజేసే పద్ధతిలో కూలీలను – స్త్రీలు, పురుషులు, పిల్లలు అనే విచక్షణ లేకుండా కొరడాలతో కొట్టడంతోపాటు అనేక రకాలుగా వారిని చిత్రహింసలపాలు చేయడం సర్వసాధారణంగా జరుగుతుండేది. అందువలన అనేక సందర్భాలలో శ్రామికులు పారిపోవడానికి ప్రయత్నించేవారు.

కార్మికుల శ్రమ శక్తిని దోచుకుని అశేష లాభాలు గడించాలనే లక్ష్యంతో పెద్ద మొత్తంలో సొమ్ము వెచ్చించి కార్మికులను సమకూర్చుకున్న తోటల యజమానులు, కార్మికులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకుపోకుండా కూలీలు బయటకు వెళ్ళడానికి అవకాశమున్న అన్ని మార్గాల వద్ద కాపలా కాయడానికి 'చౌకీదారుల'ను నియమించారు. కొన్ని సందర్భాలలో ఈ కూలీల నివాసగృహాల చుట్టూ ఎత్తయిన కంచెవేసి కూలీలను రాత్రిపూట కంచెదాటి బయటకు వెళ్ళనిచ్చేవారుకాదు. పారిపోతున్న కూలీని పట్టుకున్న వారికి ఐదు రూపాయలు బహుమానం ఇవ్వబడుతుండేది. విదేశాల నుండి తీసుకురాబడిన ఈ కార్మికుల యెడల స్వదేశీయుల ద్వేషాన్ని పెంచి పోషించడంతో పాటు వారికి పేరాశలు కల్పించేందుకు ఈ తోటల యజమానులు కృషి చేశారు. పారిపోతున్న కార్మికులను పట్టుకొనేందుకు అనాగరికులు, పరమక్రూరులు అయిన కొండజాతి సహాయాన్ని కూడా ఈ యజమానులు తీసుకున్నారు. కూలీలు గనుక పట్టుబడినట్లయితే, వారిని కట్టివేసి కొరడాలతో కొట్టేవారు. ఈ కూలీలను పట్టుకొన్నవారికి ఇచ్చే బహుమతి సొమ్మును జరిమానాగా పరిగణించి, పట్టుబడిన ఆ కార్మికులకు భవిష్యత్తులో చెల్లించే జీతాల నుండి మినహాయించేవారు."

కార్మికులు పారిపోకుండా చౌకీదారులు, క్రూరులైన కొండజాతి వారు కాపలా కాయడంతో పాటు, వీరి నివాసాలు భయంకరమైన మృగాలు, ప్రాణాంతకమైన విష సర్పాలతో కూడిన దట్టమైన, విస్తారమైన అడవులతో చుట్టబడి వుండేవి.

యజమానులు, వారి ప్రతినిధులు కార్మికులపై సాగిస్తున్న రాక్షస కృత్యాల వలన కార్మికులకు తరచుగా ప్రాణాపాయ పరిస్థితులేర్పడేవి. కొరడాదెబ్బలకు ఒక కార్మికుడు చనిపోయిన సంఘటన గురించి వివరిస్తూ అస్సాంలో కమిషనర్‌గా ఉన్నత పదవిలోనున్న ఒక ప్రభుత్వాధికారి ఈ విధంగా రాశాడు. "అస్సాంలో కూలీలు చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉన్నారు. కార్మికుని పీల్చి పిప్పిచేసే పరిస్థితులక్కడ నెలకొని యుండటం వలన అతడు మృత్యువాతపడడం ఆశ్చర్యపడవలసిన విషయమేం కాదు. ఇతర ప్రాంతాల్లో కొరడాలతో కొట్టి శిక్షించినట్లు ఇక్కడకూడా శిక్ష నమలు జరిపినట్లయితే అది కార్మికులను ప్రాణాపాయస్థితికి తీసుకువెళ్తుంది.

18వ శతాబ్దాంతానికి కూడా పరిస్థితి మెరుగుపడలేదు. ఈ శతాబ్దంలోని మొదటి పాతిక సంవత్సరాల కాలంలో కార్మికులపై సాగిన పాశవిక చర్యలను గురించి శ్రీ దివాన్‌చమన్‌లాల్ అనేక విషయాలు ఉదహరించాడు. వలసవాద దోపిడీలోని పైశాచికత్వాన్ని వెల్లడించడానికి శ్రీ చమన్‌లాల్ ఉదహరించిన వాటిలో కొన్ని సంఘటనలు చాలును.

1920 జూలై 20వ తేదీన తన కాంట్రాక్టు ముగియడంతో ఒక శ్రామిక వనిత తనకు డిశ్చార్జి సర్టిఫికెట్ యివ్వవలసిందిగా డిప్యూటీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ విషయం తెలిసిన మేనేజర్ మండిపడి ఆ శ్రామిక వనిత పనిని వదలి పారిపోతున్నదనే ఆరోపణతో ఆమెపై కోర్టులో దావా వేశాడు. ఫలితంగా ఆమెకు ఆరు నెలలు కఠిన కారాగారశిక్ష విధింపబడింది.

1928 జూన్ ఒకటవ తేదీతో తాము సంవత్సరకాలం పని చేయడానికి అంగీకరిస్తూ రాసుకున్న ఒప్పందం ముగియడంతో 20 మంది కార్మికుల జట్టు ఒకటి తమ స్వస్థలానికి వెళ్ళడానికి ప్రయాణ ఖర్చులు మంజూరు చేయవలసిందిగా డిప్యూటీ కమిషనర్‌ను కోరింది. దీనికి పర్యవసానంగా వారి కాంట్రాక్టు కాలపరిమితి రెండు సంవత్సరాలని, మరొక పదకొండు నెలలు ఇంకను పనిచేయవలసివుందని వారికి చెప్పడం జరిగింది. ఈ విధంగా పూర్తి మోసపూరితమైన పద్ధతుల ద్వారా మరొక 11 నెలల పాటు వారిచేత బానిసలవలె పనిచేయించారు. కాని ఆ తరువాత వారు వట్టి చేతులతో రెండు వేల మైళ్ళ దూరాన వున్న వారి స్వస్థలానికి ప్రయాణమయ్యారు. కనీసం వారేమైనదీ ఎవ్వరికీ తెలియదని ఒక అధికార నివేదికలో తరువాత కాలంలో అంగీకరించబడింది.

"వీరనతిలంగా" అనే కార్మికుడు ఒక తోట నుండి వేరొక తోటలోనికి వెళుతుండగా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సభ్యునిగా అనుమానించి, అతనిని అరెస్టు చేసి, 1928 ఆగస్టు 15వ తేదీన విచారణ జరిపి ఒక మాసంపాటు కఠిన జైలు శిక్ష విధించారు.

దశరథ్ అనే ఒక కార్మికుని చావగొట్టారు. కాని అధికారిక విచారణా నివేదిక మాత్రం 'ఒక యూరోపియన్ యజమాని నెమ్మదిగా తాకినంతనే అతని పైత్యకోశం చెడిపోయి మరణానికి దారితీసింది' అని పేర్కొంది.

ఈ తోటల యజమానులు స్త్రీలను కూడా వదలిపెట్టలేదు. ఒక తెల్లదొర సుబ్రమణి అనే ఒక స్త్రీ కూలిని దారుణంగా చంపాడు. 1928లో ఒక కూలిని తోట వెలుపలకు వెళ్ళేవరకు వెంబడించి, చావబాది అతని వస్తువులను దోపిడీ చేయడమేగాక అతని భార్యను అతనితో వెళ్ళకుండా అడ్డుపడ్డారు.

1928 సం॥లో ప్యూర్‌సెల్, హాల్స్‌వర్త్‌ల నాయకత్వంలో భారతదేశాన్ని సందర్శించిన బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధి వర్గం తయారుచేసిన రిపోర్టులో భారతదేశంలో కార్మికుల జీవన పరిస్థితులను గురించి తీవ్రంగా విమర్శిస్తూ "బహుశా మనకు తెలిసిన నాగరిక ప్రపంచంలో, అస్సాంలోని టీ తోటలలో బానిసల వలె పనిచేస్తున్న కార్మికుల వంటి నికృష్టమైన మానవజాతి మరెక్కడా కానరాదు" అని పేర్కొన్నది.

టీ తోటలలో పనిచేస్తున్న కార్మికులపై సాగుతున్న అత్యాచారాలు భారత ప్రజానీకాన్ని కలచివేశాయి. ఈ కార్మికుల సమస్యలను స్వదేశీ పత్రికలు చేపట్టి, టీ తోటల పెంపకం ప్రారంభమైన నాటి నుండే తెల్లవారి అమానుష వైఖరిని నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాయి. ఈ కార్మికులపై టీ తోటల యజమానులు సాగిస్తున్న అమానుష చర్యలను ఎండగడుతూ 'సోమ్ ప్రకాష్' అనే ఒక ప్రముఖ బెంగాలీ వారపత్రిక ధారావాహికంగా వ్యాసాలను ప్రచురించింది. ఢాకా నుండి వెలువడే మరొక పత్రిక "ఢాకా ప్రకాశ్", టీ తోటల యజమానుల దురంతాల పట్ల అసమ్మతిని కూడగట్టడంలో అగ్రభాగాన నిలిచింది.

'సోమ్ ప్రకాష్' పత్రిక 'ఢాకా ప్రకాశ్'ను ఉదహరిస్తూ "కచ్చార్‌లోని టీ తోటల యజమానులు సాగిస్తున్న అణచివేత చర్యల పట్ల గత కొంతకాలంగా వివిధ వార్తా పత్రికలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. అప్పుడీ తేయాకు తోటల యజమానులు కొంతవరకు శాంతియుతమైన వైఖరిని అవలంబించారు. కాని ఇప్పుడు వారు తిరిగి నానాటికీ మరింత క్రూరాత్ములుగా తయారవుతున్నారు" అని పేర్కొంటూ "గతంలో టీ తోటల యజమానులు కార్మికులకు నెలకు 2 1/2 రూ॥లు జీతం చెల్లించేవారు. క్రమక్రమంగా జీతాలు పెరిగి నెలకు 4 1/2లకు చేరుకున్నాయి. వాస్తవానికి ఎక్కువ జీతం పొందవలసిన ఈ కార్మికులను ఈ విధంగా నికృష్టమైన జీతాలతో పనిచేసేటట్లు చేయడం వారిని అణచివేయడం గాదా? టీ తోటల యజమానులు సాగిస్తున్న దురంతాల గురించి కచ్చార్‌లోని 'ఢాకా ప్రకాశ్' విలేకరి ఇంతకాలంగా రాస్తున్న రాతలన్నీ అబద్ధాలేనా? ఏదో ఒప్పందం వున్నది కదాయని అమర్యాదను, అక్రమాలను శ్రామికులు ఇక ఏమాత్రం సహించరు?" అని 'సోమ్ ప్రకాశ్' ఘాటుగా విమర్శించింది. వారి దుశ్చర్యల ఫలితంగా రాబోయే పరిణామాల గురించి బ్రిటిష టీ తోటల యజమానులకు జ్ఞాపకం చేస్తూ "నీలిమందు తోటల యజమానుల అడుగుజాడల్లో నడవవద్దని

మిమ్ములను హెచ్చరిస్తున్నాం.... వీరు మరికొంతకాలం నీలిమందు తోటల యజమానులనే అనుసరించ దలచుకుంటే వారు భారతదేశాన్ని వదిలివెళ్ళవలసి వుంటుంది" అని "సోమ్‌ప్రకాశ్" ధైర్యంగా ప్రకటించింది.

కలకత్తా నుండి వెలువడే మరొక బెంగాలీ పత్రిక "సంజీవని" ప్రముఖ ఆంగ్ల దినపత్రిక "ది బెంగాలీ"లలో కూడా ఇదే విధమైన వార్తలు ప్రచురించబడ్డాయి. తేయాకు తోటలలో పనిచేస్తున్న కార్మికుల హృదయ విదారక గాథలు చైతన్యవంతులైన బెంగాలు ప్రజానీకాన్ని కలచివేశాయి. కూలీల పరిస్థితుల గురించి విచారణ జరిపేందుకు 1880లో కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్, ఈ అసోసియేషన్ సహాయ కార్యదర్శి శ్రీ ద్వారకానాథ్ గంగూలీని నియమించింది. అస్సాంలో పూర్తిగా పరిశీలనలు, విచారణలు జరిపిన తరువాత శ్రీ గంగూలీ టీ తోటలలోని కార్మికుల నికృష్ట జీవన పరిస్థితులను స్పష్టంగా బహిర్గతం చేస్తూ "ది బెంగాలీ" దినపత్రికలో వరుసగా అనేక వ్యాసాలు వ్రాసాడు.

ప్రజల్లో వ్యక్తమవుతున్న ఈ తీవ్ర అసంతృప్తి ఫలితంగా 1921 సం॥లో బ్రిటిషు ప్రభుత్వం ఒక లేబర్ ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేయవలసి వచ్చింది. ఈ కమిటీ నిర్మాణాన్ని పరిశీలిస్తే ఇది వట్టి బూటకమని కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది. ఈ కమిటీలో ఐదుగురు టీ తోటల యజమానులు, ఇద్దరు ప్రభుత్వ అధికారులు, ఒక వైద్యుడు వున్నారు. మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే కూలీలతో వ్యక్తిగతంగా సంబంధాలు పెట్టుకొనరాదని ఇండియన్ టీ అసోసియేషన్ (యజమానుల సంఘం) చేసిన తీర్మానానికి అనుగుణంగా ఈ కమిటీ సభ్యులు కార్మికుల వద్ద నుండి ఏ విధమైన సాక్ష్యాలను సేకరించలేదు. వేర్వేరు కారణాలు చూపి, 1910 లోనే డువర్స్ కమిటీ ఈ విధమైన విచారణా పద్ధతికి నాందిపలికింది. "కూలీలను విచారించి వారు అందజేసిన విషయాలను రికార్డు చేయడంవలన జరిగే ప్రయోజనమేమీ లేదు. కూలీలను తీసుకువచ్చి అనేక మంది యూరోపియన్‌ల ముందు సాక్ష్యం ఇవ్వమంటే వారు కంగారు, భయాలకు లోనవుతారేగాని ఉపయోగకరమైన సమాచారన్నందించలేరు" అని ఈ కమిటీ తన రిపోర్టులో పేర్కొంది.

అందువలన ఈ బూటకపు కమిటీలు, విచారణలు దురాశాపరులైన బ్రిటిషు యజమానులు కార్మికులపై తమ నేరపూరిత చర్యలను కొనసాగించడం ద్వారా, వారిని దోపిడీ చేసేందుకు అనుమతించడానికి వలస పాలకులు ఏర్పాటు చేసిన ముసుగులు మాత్రమే.

యజమానులు తీవ్రంగా సాగిస్తున్న దోపిడీతో బాటు యుద్ధం వలన ధరలు మిన్నుముట్టడంతో పరిశ్రమాధిపతులు విపరీతమైన లాభాలు గడించారు. కొన్ని సందర్భాలలో ఈ లాభాలు 450 శాతం వరకు చేరాయి. అత్యధిక లాభాలు గడిస్తున్నప్పటికీ కార్మికుల జీతాలలో పెరుగుదల మాత్రం శూన్యం. కాని యుద్ధం అంతమై వస్తువుల ధరలు తీవ్రంగా పడిపోయినప్పుడు మాత్రం టీ తోటల యజమానులు కార్మికులకు జీతాలు యివ్వక, అలవెన్సులను కూడా తగ్గించి ఇచ్చారు. వారు మామూలుగా సంపాదించుకునే జీతాలే వారు ప్రాణాలు నిలబెట్టుకునేందుకే చాలని స్థితిలో వారి జీతం రోజుకు మూడు పైసలు తగ్గించబడింది. 1920

సంవత్సరం రెండవ సగంలోనూ, 1921 ప్రారంభంలోనూ టీ తోటలలో పనిచేస్తున్న కార్మికుల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. జీవనవ్యయం విపరీతంగా పెరిగిపోవడంతో, జీతాలను పెంచాలనే డిమాండ్ సర్వవ్యాప్తమయింది. నాసిరకం బియ్యం సరఫరాకు వ్యతిరేకంగానూ, చాలినన్ని బియ్యం కార్మికులకు అందజేయకపోవడానికి నిరసనగాను దూమ్‌డుమా కంపెనీ అధీనంలోని తోటలలోని కార్మికులు 1920 సెప్టెంబరు 6వ తేదీన పని చేయడానికి నిరాకరించడంతో మొట్టమొదటిసారిగా కార్మికులలో అసంతృప్తి ఛాయలు వ్యక్తమయ్యాయి. కార్మికులలో నెలకొని వున్న ఈ అశాంతి వ్యాపించటం ప్రారంభమై, లక్ష్మీపూర్ జిల్లాలో కొన్నిచోట్ల సంఘర్షణలకు దారితీసింది. ఈ విధంగా కార్మికులలో సహనశక్తి నశించనారంభించింది.

1921లో దేశవ్యాప్తంగా బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో టీ తోటల్లోని వేలకొలది శ్రామికులు ఈ బానిస సంకెళ్ళను త్రెంచుకుని తమ స్వస్థలాలకు చేరుకోవాలని నిర్ణయించు కున్నారు. “స్త్రీలు, పురుషులు, బాలలు కొరడా దెబ్బలు తినడంతో బాటు టీ తోటల యజమానుల అనాగరిక, అమానుష ప్రవర్తనను అనుభవించారు, చెప్పలేని దారుణాలను భరించారు. అన్ని విధాలైన అసౌకర్యాలను సహించారు, వారు తమ స్వగ్రామాలకు తిరిగి వెళ్ళలేమనే నిర్ణయానికి వచ్చారు” అంటూ శ్రీ చమన్‌లాల్ పేర్కొన్నాడు.

ఈ శ్రామికుల సమ్మెను గురించి, టీ తోటల నుండి తిరిగి రావాలనే వారి నిర్ణయాన్ని గురించి ప్రస్తావిస్తూ ‘అమృత బజార్’ పత్రిక ఒక ఉత్తేజకరమైన రిపోర్టు యిచ్చింది. “అస్సాంలోని టీ తోటలలోని కార్మికుల సమ్మె, తమను బలిపశువులుగా చేసి యజమానులు తరతరాలుగా సాగిస్తున్న నిరంకుశ, దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా వారు సాగించిన తిరుగుబాటు అనడంలో సందేహం లేదు. మోసపూరిత విధానాల ద్వారా కార్మికులను యజమానులకు అప్పజెప్పే దళారీలయిన ఆర్కటీల కబంధహస్తాల్లో పడిన నాటి నుండి తమ స్వదేశానికి, స్వస్థలానికి దూరంగా, సమాధిలో శాశ్వతంగా విశ్రాంతి పొందే నాటివరకు ఈ కార్మికుల జీవితాలు బాధామయ గాథలే. ఒక్క పురుషులేగాక, స్త్రీలు, పిల్లల జీవితాల వెనుక కూడా ఈ బాధామయ గాథలే ఉన్నాయి. నిస్సహాయుడైన కార్మికుడు ఈ తోటలలో ప్రవేశించిన నాటి నుండే అతడు నాగరికతకు, మానవత్వానికి దూరమయ్యాడని భావించవచ్చు. ఈ భూమిపై వున్న ఏ శక్తి కూడా రక్షించలేని దారుణ పరిస్థితిలోనికి కార్మికుడు తోయబడ్డాడు. క్రైస్తవ మిషనరీలు, రాజకీయవాదుల సంస్కరణ కార్యక్రమాలకు అస్సాం కూలీలు దూరంగా వున్నారు. కాని చివరకు అతడు విముక్తి సాధించాడు. ఎవరి నుండి సాధించాడు? ఏ బాహ్యా శక్తుల నుండో గాక తనంత తానే, అస్సాం కూలి విముక్తి సాధించాడు. ఈ బానిస సంకెళ్ళను శాశ్వతంగా త్రెంచుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ ప్రయత్నంలో అవసరమైతే ప్రాణత్యాగానికి కూడా సిద్ధమయ్యాడు” అని ‘అమృతబజార్’ పత్రిక పేర్కొంది.

యూరోపియన్ ఆఫీసర్లు కార్మికులను తన్నడం, గుద్దడం తదితర పద్ధతులలో శారీరకంగా చిత్రహింసలపాలు చేయడం వలన టీ తోటలలోని కార్మికులకు, యజమానులకు మధ్య తరుచుగా సంఘర్షణలు తలెత్తుతుండేవని, కూలీల సమ్మె పూర్వ రంగాన్ని గురించి చర్చిస్తూ డా॥ రజనీకాంత్ దాస్ చెప్పారు. ఒక్క 1891వ సం॥లోనే ఈ విధమైన సంఘర్షణలకు సంబంధించి 106 సంఘటనలు జరిగినట్లు డా॥ దాస్ అంచనా వేశారు.

నిజానికి యూరోపియన్ ప్లాంటర్ల (టీ తోటల యజమానుల) అణచివేత చర్యలకు కార్మికుల ప్రతిఘటనగానే ఈ సంఘర్షణలు చెలరేగాయి. తేయాకు తోటల యజమానుల దురాగతాలను ప్రతిఘటించాలనే కోరిక 1884 నుండే కార్మికుల్లో బలపడసాగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే సరియైన నాయకత్వం లేకపోవడం వల్లనే పారిశ్రామిక వివాదాలు, సంఘర్షణ రూపం దాల్చాయి. కొట్లాటలలో పాల్గొన్నారనే నేరారోపణ చేసి 1902–03 మధ్య కాలంలో 82 మంది కార్మికులకు శిక్ష విధించారు. కార్మికులకు శిక్షలు విధించడంతో ఆగక యూరోపియన్ అధికారులు వారిపై విచ్చలవిడిగా సాగించిన అత్యాచారాలను, యూరోపియన్ అధికారుల దుశ్చర్యలను అధికార నివేదిక కూడా పూర్తిగా దాచలేకపోయింది. 1899 సం॥లో అస్సాం లోనికి శ్రామికుల వలసలను గురించిన రిపోర్టు దిగ్భ్రాంతి కల్గిస్తుంది. ఆ రిపోర్టులో ఈ క్రింది విధంగా పేర్కొనబడింది. “కార్మికులకు వారి స్వదేశంలోనే సంకెళ్ళు వేయడం, గుద్దడం, తన్నడం వంటి ఖండించదగిన అలవాట్లను ఇంగ్లీషు వారు మానుకుంటారనే ఆశ ప్రధాన కమిషనర్‌కు లేదు.” ఈ రిపోర్టు ఇంకా ఇలా పేర్కొంది. “దెబ్బకు దెబ్బతీసి ప్రతికారం తీర్చుకోవాలనే ధోరణి కార్మికుల్లో నానాటికీ బలపడసాగింది. కూలీలు సంఘటితమై తాము పనిచేస్తున్న పరిశ్రమలలోని పరికరాలనే ఆయుధాలుగా స్వీకరించడంతో తీవ్రమైన పరిణామాలు ఏర్పడ్డాయి. కాని కార్మికుల్లో నానాటికీ బలపడుతున్న యీ తిరుగుబాటు ధోరణుల వల్ల దుందుడుకు స్వభావం కల్గిన యూరోపియన్లు కార్మికులకు వ్యతిరేకంగా చెలరేగకుండా చేయడంలో సత్ఫలితాలు వచ్చాయి.”

తేయాకు తోటలలో పనిచేస్తున్న కార్మికుల్లో ట్రేడ్ యూనియన్ చైతన్యం, నిర్మాణం చాలా ఆలస్యంగా అభివృద్ధి చెందాయి. కార్మికులు తమ స్వగృహాల నుండి మిక్కిలి దూరంగా వుండడం వలన ఏర్పడిన భయంకరమైన ఒంటరితనం, అజ్ఞానం, నిరక్షరాస్యత, ఈ తోటలకు వెలుపల వున్న రాజకీయవాదులతోనూ, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలతోనూ సంబంధాలు పెట్టుకొనడం కష్టసాధ్యమవడంతో బాటు, కార్మికులు సంఘటితం కావడానికి చేసే ప్రయత్నాల మీద నిఘా వేయడంతో పాటు, కక్ష సాధించే యజమానుల వలన, ఈ టీ తోటలలోని కార్మికులలో ట్రేడ్ యూనియన్ చైతన్యం అభివృద్ధి చెందడం చాల ఆలస్యమైంది. అయినప్పటికీ తమపై సాగుతున్న దోపిడీకి, అవమానాలకు, చిత్రహింసలకు, ఇంకా అనేక రకాలయిన హింసాయుత పద్ధతుల ననుసరిస్తున్న బ్రిటిషు యజమానుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన సాగించాలనే ఆలోచన వారిలో ప్రారంభమై క్రమక్రమంగా పరిణతి చెంది, సంఘటితంగా తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవాలనే ఉన్నత స్థాయి చైతన్యాన్ని వారు పొందారు.

1921 మే నెలలో కార్మికులందరు సామూహికంగా పనులు మానివేసి, తేయాకు తోటలను వదిలి వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. కార్మికులు తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవాలనే ఉన్నత స్థాయి చైతన్యానికీ సంఘటన ప్రతీకగా నిలిచింది. అదే సమయంలో 1921-22 మధ్యకాలంలో అనేక సంఘర్షణలు చెలరేగి 96 మంది కార్మికులకు కఠిన కారాగారవాస శిక్ష విధించబడింది. 1925-26 మధ్యకాలంలో 24 మంది కార్మికులు శిక్షించబడ్డారు.

8 వేల మంది కార్మికులు ఏకమై పనులు వదిలివేసి, చాలా దూరాన వున్న యునైటెడ్ ప్రావిన్సెస్, మద్రాసు తదితర ప్రాంతాలలో వున్న తమ స్వంత ఊళ్ళకు ప్రయాణమయ్యారు. కాని వారి సుదీర్ఘ ప్రయాణం సందర్భంగా మార్గమధ్యంలో కార్మికులపై సాగిన పాశవిక దాడులు వలస పాలకుల వికృత రూపాన్ని మరొకసారి ప్రదర్శించాయి.

కార్మికులు సామూహికంగా తేయాకు తోటలను వదలి వెళ్లడంతో కలవరపడిన యజమానులు పాలకులతో కలిసి, కార్మికులు తమ స్వగృహాలకు వెళ్ళకుండా చేసేందుకు పైశాచిక చర్యలకు పూనుకున్నారు. కరీంగంజ్ వద్ద రైల్వేలలోని యూరోపియన్ అధికారులు కూలీలకు టికెట్లు యివ్వవద్దని ఆదేశించడంతో, వారు కాలినడకన ప్రయాణం కొనసాగించడానికి నిర్ణయించుకున్నారు. కాని ప్రముఖ రాజకీయవేత్త, కలకత్తా మేయర్ శ్రీ జె.ఎం. సేన్ గుప్త జోక్యం చేసుకొనడంతో వారికి టికెట్లు ఇచ్చారు. కాని చాంద్‌పూర్ చేరుకోగానే వారు అక్రమంగా నిర్బంధించబడ్డారు. 1921, మే 17వ తేదీన వెయ్యిమంది కూలీలు గ్వాలండో వద్ద రైలు ఎక్కారు. కాని ఫరీద్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్ పై అధికారుల నుండి ఆదేశాలున్నాయని చెప్పి వారిని నిలిపివేశాడు. వారందరు స్టేషన్ ప్లాట్‌ఫారం మీదనే సాయుధ బందోబస్తుతో రాత్రంతా గడపవలసి వచ్చింది. మరుసటిరోజున కుష్టియా వెళ్ళడానికి జిల్లా మేజిస్ట్రేట్‌లు వారిని అనుమతించారు. మార్గమధ్యంలో అనేకమంది కలరా సోకి చనిపోయారు. కొందరు అలసట భరించలేక, మరికొంతమంది తిండిలేక ప్రాణాలు కోల్పోయారు. రోజుకు 6 అణాల వరకు జీతాలు పెంచుతారనే ఆశ చూపి వారిని తిరిగి పనులలోనికి పంపడానికి ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాని కూలీలు మాత్రం ససేమిరా అంగీకరించలేదు.

చాంద్‌పూర్ రైల్వేస్టేషన్ వద్ద మరో మూడువేల మంది కార్మికులు నిలిపివేయబడ్డారు. వారిపై సాగిన ఘాతకాలకు సాటి కానరాదు. ఎన్ని విధాలుగా నచ్చజెప్పినప్పటికీ, ఎన్ని ఆశలు చూపినప్పటికి తిరిగి పనుల్లోకి వెళ్ళడానికి కార్మికులు నిరాకరించడంతో అధికారులు ఘాతుకాలకు పూనుకున్నారు. 1921 మే 20వ తేదీన కార్మికులు, స్త్రీలు, పురుషులు, పిల్లలు

అందరూ గాఢనిద్రలో వుండగా, డివిజనల్ కమిషనర్ ఆదేశానుసారం బ్రిటిషు అధికారుల ఆధీనంలోని గూర్ఖా సైనికులు నిద్రిస్తున్న వారిపై ఆకస్మికంగా దాడిచేసి వారిని నిర్దాక్షిణ్యంగా బాయ్‌నెట్ (రైఫిల్ చివర వుండే పొడవైన పదునైనకత్తి)తో పొడిచివేశారు. వృద్ధులు, స్త్రీలు, పిల్లలకు పాలిస్తున్న తల్లులు, ఎవరినీ వదిలి పెట్టలేదు. అనేకమందిని నదిలోకి విసిరి చంపివేశారు.

బానిసత్వం నుండి విముక్తి పొంది తమ స్వగృహాలకు చేరుకోవాలని నిశ్చయించుకోవడమే ఈ కార్మికులు చేసిన 'మహానేరం'. ఈ నేరానికి వలస ప్రభుత్వం ఏ విధంగా కక్షతీర్చుకున్నదీ ఈ ఘాతుక చర్య స్పష్టం చేస్తోంది. ఈ అమానుష హత్యాకాండను గురించి విన్న చాంద్‌పూర్ ప్రజానీకం నిస్సహాయులైన బాధితులను కాపాడటానికి ముందుకువస్తే, వారిని ప్రభుత్వ యంత్రాంగం అడ్డగించింది. దీనితో బెంగాలు ప్రజానీకం కోపోద్రిక్తులయ్యారు. చాంద్‌పూర్ ప్రజలు సంపూర్ణ హర్తాళ్ పాటించారు. ఇది పరిసర ప్రాంతాలకు కార్చిచ్చులా వ్యాపించింది. ఈశ్వర్‌గంజ్, నేత్రకోనలలో న్యాయవాదులు కూడా సమ్మెచేశారు. సిల్చార్, ఖాలియాలలో సార్వత్రిక సమ్మె పాటించబడింది. బరీసాల్, సిల్హెట్, ఢాకాలలోని ప్రజానీకం కూడా వలస పాలకుల ఈ ఘాతుక కృత్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న నిరసనోద్యమంలో పాల్గొన్నారు. కాని వీటన్నింటినీ మించి అస్సాం-బెంగాలు రైల్వేలోని కార్మికులు, ఉద్యోగులు పనులు నిలిపివేయడం ద్వారా రైల్వేలను పూర్తిగా స్తంభింపచేసి, మహోన్నతమైన రీతిలో తమ నిరసనను వ్యక్తంచేశారు.

కూలీలు అధిక సంఖ్యలో పనులు వదిలివేసి గృహోన్ముఖులవడానికి సహాయ నిరాకరణోద్యమమే కారణమని బ్రిటిషు ప్రభుత్వం నిందించింది. ఈ విధమయిన నిందారోపణ ద్వారా, అవధులు మించిన దోపిడీ, నిరాదరణలతో విసుగుచెందిన కార్మికులు సహనాన్ని కోల్పోయారనే విషయాన్ని మరుగుపరచడానికి ప్రభుత్వం ప్రయత్నాలు సాగించింది. అధికారుల ఆరోపణలను సవాలుచేస్తూ శ్రీ దివాన్ చమన్‌లాల్ ఈ విధంగా పేర్కొన్నాడు. "(కార్మికుల ప్రతిఘటనకు) కారణాలు రాజకీయపరమైనవి కావు. పెట్టుబడిదారీ పత్రికలు, అధికారుల పొలికేకలు, కిరాయి రచయితల రాతలు ఈ సమస్యలను రాజకీయ పరమైన సమస్యలుగా మలచలేకపోయాయి. ఈ సమస్యకు మూలకారణాలు పూర్తిగా ఆర్థికపరమైనవి. ఒక్కమాటలో చెప్పాలంటే కటిక దరిద్రము, యజమానుల అమానుష ప్రవర్తనలే ఇందుకు కారణం." అవమానాలు, దోపిడీలకు వ్యతిరేకంగా చాలాకాలంగా అభివృద్ధి చెందుతున్న కార్మికుల ప్రతిఘటనను 1920-21 సం॥లలో సాగిన సహాయ నిరాకరణోద్యమం సానుకూల పరిస్థితులను కల్పించింది. ఈ ప్రతిఘటన సమ్మెల ద్వారాను, మూకుమ్మడిగా పనులకు

గైర్హాజరవడం వంటి చర్యల ద్వారానూ వెల్లడయింది. 1921-22 సం॥లలో ఏర్పాటు చేయబడిన అస్సాం లేబర్ ఎంక్వైరీ కమిటీ తనకు ఇష్టం వున్నా లేకపోయినా ఈ వాస్తవాన్ని ఆమోదించక తప్పలేదు.

"తేయాకు తోటలలో నెలకొన్న దయనీయ పరిస్థితుల వలన సృష్టించబడిన అసంతృప్తితో బాటు, ఈ పరిసరాలలో రాజకీయ సమావేశాలు జరగడంతో అగ్నికి ఆజ్యం తోడయినట్లయింది. ఈ కారణాల వలన కార్మికులు సామూహికంగా టీ తోటలను వదలివెళ్ళారని వారు (యజమానులు) నమ్మలేకుండా వున్నారు" అని ఆ నివేదిక పేర్కొన్నది.

కాలక్రమేణా అస్సాం, బెంగాలుల్లోని అణగద్రొక్కబడిన ప్లాంటేషన్ కార్మికులు సంఘటితమై ట్రేడ్ యూనియన్లను ఏర్పరచుకొనడంతో వారి జీవన పరిస్థితులు, పని పరిస్థితులు కొంతవరకు మెరుగయ్యాయి. కాని వారు ఆధునిక పారిశ్రామిక కేంద్రాల నుండి బహుదూరంలో వుండడం వలన ఆధునిక శ్రామికవర్గ దృక్పథం, అవగాహన అలవరుచుకొనడానికి కొంతకాలం పట్టింది. మిగిలిన ప్రాంతాలలోని కార్మికులతో పోల్చిచూసినట్లయితే వారిలో వర్గ చైతన్యం దిగువ స్థాయిలోనే వున్నది. అందువలన వీరిలో సంస్కరణవాద ట్రేడ్ యూనియనిజాన్ని ప్రవేశపెట్టడానికి అవకాశాలేర్పడ్డాయి. ఈనాటికీ వాటి ఛాయలు ప్రధానంగా అస్సాంలో ఎక్కువగా కన్పడతాయి.

# 6

# కార్మికోద్యమ ప్రారంభదశ (1850-1900)

**సామాజిక పరిస్థితులు :** 19వ శతాబ్దం చివరి భాగంలో నూతనంగా ఆవిర్భవించిన బూర్జువా వర్గ ప్రయోజనాలకు, సామ్రాజ్యవాద పాలకుల ప్రయోజనాలకు మధ్య తలెత్తిన ఘర్షణలు, 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావానికి నేపథ్యాన్ని ఏర్పరచాయి. భారత సమాజంలోని ఉన్నత వర్గాలకు చెందిన దాదాబాయి నౌరోజీ, డబ్ల్యు.సి. బెనర్జీ వంటివారు ఈ సంస్థకు నాయకత్వం వహించడం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. అప్పుడే పెంపొందుతున్న భారత బూర్జువా వర్గం యొక్క ప్రతినిధులు ప్రారంభ దశలో ఈ సంస్థలో చేరి, సంస్థను నిర్వహించారు. భారత, బ్రిటిష్ పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాల మధ్య ఘర్షణలు, అప్పుడే రూపుదిద్దుకుంటున్న విద్యావంతులైన మధ్యతరగతి ప్రజల ఆశలు, భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ప్రధానంగా దోహదం చేశాయి. కాంగ్రెస్ ప్రారంభ సమావేశంలోనూ, ఆ తర్వాత జరిగిన కొన్ని సమావేశాల్లోనూ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో భారతీయుల ప్రాతినిధ్యం, ఒకే సమయంలో భారతదేశంలో కూడా సివిల్ సర్వీస్ పరీక్షల నిర్వహణ, న్యాయ వ్యవస్థను కార్య నిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్) నుండి విడదీయడం వంటి అంశాల మీద తీర్మానాలు చేయడానికి పరిమితం కావడం చూస్తే, ఆ సంస్థ వర్గ స్వభావం స్పష్టమవుతుంది.

ఆ విధంగా ఆవిర్భవించిన భారత జాతీయవాదం, కాంగ్రెస్ మరియు విద్యావంతులైన సంపన్నులకు మాత్రమే పరిమితమైంది. జనాభాలో 80 శాతంగా వున్నప్పటికీ, రైతాంగాన్ని సంఘటితం చేసే కార్యక్రమం కాంగ్రెస్‌కు లేదు. నూతన సామాజిక శక్తిగా అభివృద్ధి చెందుతున్న కార్మిక వర్గం కాంగ్రెస్ దృష్టిలో లేకుండా పోయింది.

పెట్టుబడిదారీ విధానం, దానికి గోరీ కట్టేవారు ఒకేసారి పుడతారని మార్క్స్ చెప్పారు. అంటే పెట్టుబడిదారీ విధానాన్ని పూడ్చి పెట్టేది కార్మిక వర్గమే. కాంగ్రెస్ ప్రణాళికలో కార్మికవర్గ సమస్యలు ఏవీ చోటు చేసుకోకపోయినప్పటికీ, చరిత్ర గమనం కార్మికవర్గానికి పోరాట రంగంలో ఒక సమున్నత స్థానం కల్పించి, ఒక ప్రత్యేక వర్గంగా నిలబెట్టింది. దారిద్ర్యంలో

మగ్గుతూ ఉండటం వలన, అనేక బలహీనతలకు లోనైన గ్రామీణ ప్రజానీకం నుండి భారత కార్మికవర్గం ఆవిర్భవించింది. ప్రారంభదశలో తక్కువ సంఖ్యలో ఉండటం వలననూ, అమానుషమయిన పని పరిస్థితులు, జీవన పరిస్థితుల వలన అణగదొక్కబడి ఉండడం వలననూ భారత కార్మికవర్గం వర్గ చైతన్యం పొంది, సంఘటితం కావడానికి చాలాకాలం పట్టింది. ఇది వలసపాలనలో భారత కార్మికవర్గ అవతరణకు చారిత్రకంగా అనివార్యమైంది. దీని ఫలితంగానే జాతీయోద్యమ ప్రారంభదశలో భారత కార్మికవర్గం పెట్టుబడిదారీ వర్గం వెనుక నడవవలసి వచ్చింది. తర్వాత కాలంలో దీని ప్రభావం ప్రస్ఫుటంగా వెల్లడైంది.

1857లో జరిగిన మహోజ్వలమైన సిపాయిల తిరుగుబాటు తరువాత దేశంలో రైతులు చాలా చోట్ల తిరుగుబాట్లు చేశారు. నీలిమందు తోటల రైతులు, సంతాలులు, మహారాష్ట్ర రైతులు, మలబార్ తీరంలోని మోప్లా తెగవారు చేసిన తిరుగుబాట్లు చెప్పుకోదగ్గవి. చెదురు మదురుగా ఒకదానికొకటి సంబంధం లేకుండా జరిగిన ఈ తిరుగుబాట్లు చాలావరకు భారత ప్రజలను ప్రభావితం చేశాయి. ఈ కాలంలో బెంగాలీ సాహిత్యంలో కూడా ఆ తిరుగుబాటు ఛాయలు కనిపిస్తాయి. 1860లో ఢక్కా నుండి ప్రచురించబడిన "నీల్ దర్పణ్" (నీలిమందు దృశ్యం) అనే నాటకంలో దీనబంధుమిత్ర అనే బెంగాలీ నాటక రచయిత ఎంతో కళాత్మకంగా, హృదయాలను ద్రవింపజేసే రీతిలో రైతుల తిరుగుబాటును చిత్రీకరించారు. కనీవిని ఎరుగని హింసాకాండను, క్రూరత్వాన్ని ఎదుర్కొంటూ దృఢంగా, వీరోచితంగా రైతులు చేసిన తిరుగుబాటు ఈ నాటకంలో వాస్తవ రీతిలో చిత్రించబడింది. ఇది బెంగాల్ ప్రజలను ఆకర్షించి కదిలించి వేసింది.

భారత కార్మికవర్గం దేశ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యమైన దశలో ఆవిర్భవించింది. అందువలన పుట్టిన నాటినుండీ కార్మికోద్యమం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, నిరంతరం సంఘర్షణ కొనసాగిస్తూ నిరసన ఉద్యమాల బాటలో పయనించిందనడం అతిశయోక్తి కాదు. ప్రారంభదశలో జరిగిన పోరాటాలు చెదురుమదురుగా జరిగాయి. ఆ పోరాటాలు నిర్మాణయుతంగా జరగలేదు. ప్రారంభ దశలో కార్మికులకు ట్రేడ్ యూనియన్లు లేవు. ఆ తరువాత కొన్ని అనుభవాలు సంతరించుకుని, పోరాటాలు పురోగమించిన కొలది ట్రేడ్ యూనియన్లు ఏర్పడటం ఆరంభమయింది. కానీ, కార్మికుల చైతన్యస్థాయి చాలా తక్కువగా ఉండేది. 1914 నుండి 1918 వరకు జరిగిన మొదటి సామ్రాజ్యవాద యుద్ధం తర్వాత ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంలో వెల్లువెత్తిన చైతన్యం, రష్యా సోషలిస్టు విప్లవ ప్రభావం, వినాశకర యుద్ధానంతరం ప్రధానంగా ఐరోపా దేశాల్లో వెల్లువెత్తిన సమ్మె పోరాటాలు భారతదేశంలో చైతన్యవంతమైన సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధికి అనువైన పరిస్థితులను సృష్టించాయి. ఆనాటి నుండి భారతదేశంలో కార్మికోద్యమం క్రమంగా అభివృద్ధి చెంది నిర్మాణయుతంగానూ, చైతన్యవంతంగానూ పురోగమిస్తోంది. 1947లో రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనదేశంలో కార్మికోద్యమం గతం నుండి పూర్తిగా భిన్నమైన,

వినూత్నమైన, ఉన్నతమైన దృక్పథంతో ముందుకు సాగింది. రాజకీయ పరిపక్వత సంతరించుకున్న భారత కార్మికవర్గం ప్రస్తుతం విప్లవలక్ష్యం వైపు త్వరితగతిన పురోగమించే దశలో ఉన్నది.

ఈ పరిణామ క్రమంలో భారత కార్మికోద్యమాన్ని స్థూలంగా నాలుగు దశలుగా విభజింపవచ్చు. మొదటిదశ 1850 నుండి 1900 వరకు కార్మికోద్యమ ప్రారంభదశగానూ, ట్రేడ్ యూనియన్ల నిర్మాణ క్రమం సాగించిన 1901–1914 మధ్య కాలాన్ని రెండవ దశగానూ, కార్మిక వర్గం చైతన్యాన్ని పెంపొందించుకుని, పురోగమిస్తున్న ట్రేడ్ యూనియన్ ఉద్యమం రాజకీయ చైతన్యాన్ని కూడా సంతరించుకున్న 1915–47 మధ్య కాలాన్ని మూడవ దశగానూ పేర్కొనవచ్చు. ఈ దశ వరకు కార్మిక వర్గం ఆర్థిక పోరాటాలు సాగించడంతో పాటు, జాతీయ విముక్తి ఉద్యమం పట్ల రాజకీయ అవగాహనతో పురోగమించింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కార్మిక ఉద్యమం సుసంఘటితంగా ఆర్థిక, రాజకీయ పోరాటాలు సాగిస్తూ ఒక ఉన్నత రాజకీయ లక్ష్యం చేరుకోడానికి ప్రయాణిస్తున్న దశ నాల్గవది.

## పోరాటంలో మొదటి దశ

కొత్తగా ఉద్భవించిన భారత కార్మికవర్గం యొక్క హృదయ విదారక పరిస్థితులు కొంతమంది సంఘసేవకులు, ఉదారవాదుల దృష్టిని ఆకర్షించాయి. వారిలో ఎవరూ ఉద్యమకారులు కారు. సరిగా చెప్పాలంటే వారికి ఉద్యమాల గురించిన అవగాహనే లేదు. కానీ సంఘసేవా దృష్టితో, సానుభూతితో వారు కార్మికుల కష్టాల గురించి ప్రభుత్వానికి, ప్రజలకు తెలియచేయటానికి ప్రయత్నించారు. దానితో పాటు కార్మికుల సమస్యలు, వారి దుర్భర పరిస్థితులను గురించి ప్రచారం చేసేందుకు పత్రికలు ప్రచురించేవారు. వాస్తవాలు తెలియని నిరక్షరాస్యులైన కార్మికులకు ప్రాథమిక విద్య గరపడానికి వారు రాత్రి పాఠశాలలు నిర్వహించారు. ఇదంతా భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావానికి ముందు జరిగింది.

బెంగాల్లోని విద్యాధికులలో కొంతమంది కార్మికుల సంక్షేమం కోసం పనిచేయటానికి ముందుకు వచ్చారు. వారిలో బ్రహ్మసమాజ సభ్యులైన శశిపాద బెనర్జీ ప్రముఖులు. 1874లో ఆయన కార్మిక సమస్యల గురించి ప్రచారం చేసి, కార్మికులలో చైతన్యం తీసుకురావడానికి "భారత శ్రమజీవి" అనే బెంగాలీ మాసపత్రికను కలకత్తా సమీపంలోని బారానగర్ నుండి ప్రచురించారు. మనకు తెలిసిన సమాచారాన్ని బట్టి, ఈ పత్రిక కార్మికుల సమస్యలను, హక్కులను గురించి ప్రచురించిన మొట్టమొదటి పత్రిక అని రూఢిగా తెలుస్తోంది. నారాయణ్ మేఘాజీ లోఖుండే, బొంబాయి నుండి "దీనబంధు" అనే పత్రికను ఇదే లక్ష్యంతో నడిపారు. అయితే ఆ పత్రిక 1898లో వెలుగులోకి వచ్చింది. ఈ పత్రిక ప్రచురణ ప్రారంభం కాకముందే శశిపాద్ బెనర్జీ 1870లో "వర్కింగ్ మెన్స్ క్లబ్" స్థాపించారు. ఇది కూడ భారతదేశంలో మొట్టమొదటి ప్రయోగమే.

కలకత్తాలోని బ్రహ్మసమాజం కార్మికులలోనూ, వెనుకబడిన తరగతుల ప్రజల్లోను మతపరమైన నీతి తదితర అంశాలను ప్రబోధించటానికి 1878లో 'వర్కింగ్ మెన్స్ మిషన్‌ను' స్థాపించింది. దీనితో ఉత్తేజితుడైన శశిపాద బెనర్జీ పారిశ్రామిక కార్మికులలో ప్రాథమిక విద్యావ్యాప్తి చెయ్యడానికి 1880లో కలకత్తాకు సమీపంలో "బారానగర్ ఇన్‌స్టిట్యూట్" స్థాపించారు. 1884లో బ్రహ్మ సమాజం బారానగర్‌లోని జూట్ కార్మికుల కోసం ఒక రాత్రి పాఠశాలను, సేవింగ్స్ బ్యాంకును స్థాపించి ఆ రెండు సంస్థల బాధ్యతను బెనర్జీకి అప్పగించింది. 1872లో బెంగాల్‌కు చెందిన మరో బ్రహ్మసమాజ ప్రచారకుడు పి.సి. మజుందార్ బొంబాయిలో కార్మికులు నివసించే ప్రాంతాల్లో ప్రాథమిక విద్యావ్యాప్తి కోసం 8 రాత్రి పాఠశాలలు స్థాపించాడు.

ఆనాడున్న చారిత్రక పరిస్థితుల పరిమితుల్లో సంఘ సేవాభిలాషతో కార్మికులకు సేవచేయటానికి ముందుకు వచ్చిన వారిలో శశిపాద బెనర్జీ ప్రథముడు. కార్మికులను చైతన్యపర్చి, వారి సమస్యల పరిష్కారానికి మొదటగా కృషి చేసిన ఖ్యాతి, మొదటి కార్మిక పత్రిక నడిపిన ఖ్యాతి కూడా ఆయనకే దక్కుతుంది. 1871లో ఆయన ఇంగ్లాండు సందర్శించారు. అక్కడ అనేక సందర్భాలలో భారతీయ కార్మికుల దుస్థితి గురించి ప్రసంగించారు.

బెంగాల్‌లో ఈ ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే, మహారాష్ట్రలో కూడా అనేక మంది సంఘసేవకులు, మానవతావాదులు కార్మికుల కోసం పనిచేయటానికి ముందుకు వచ్చారు. బొంబాయిలో 1878 ప్రాంతంలో కాటన్‌మిల్ కార్మికుల పరిస్థితులను మెరుగుపర్చేందుకు సోరాబ్జీ షాపూర్జీ బెంగాలీ చేసిన ప్రయత్నాల గురించి ఈ సందర్భంలో గుర్తుచేసుకోవాలి. బొంబాయిలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి బొంబాయికి చెందిన నారాయణ్ మేఘాజీ లోఖండే కృషిని ప్రత్యేకంగా పేర్కొనాలి. 1884లో కార్మికుల సమస్యలను చర్చించి, మెమోరాండం తయారు చేయడానికి ఆయన 1884లో బొంబాయి మిల్లు కార్మికుల సమావేశం ఏర్పాటు చేశాడు. ఆయన 1890లో బొంబాయి మిల్ హాండ్స్ అసోసియేషన్ స్థాపించి, దానికి అధ్యక్షుడైనాడు. బొంబాయి మిల్ హాండ్స్ అసోసియేషన్ భారతదేశంలో పుట్టిన మొట్టమొదటిట్రేడ్ యూనియన్ అని, ఎన్.ఎమ్. లోఖండే మొదటిగా ట్రేడ్ యూనియన్ నిర్మించినవారని, కొంతమంది పొరపాటుగా అభిప్రాయపడ్డారు. బొంబాయి మిల్ హాండ్స్ అసోసియేషన్‌కి ట్రేడ్ యూనియన్‌గా చెప్పుకోతగ్గ లక్షణాలు ఏవీలేవు. దానికి సభ్యత్వంగానీ, నిధిగానీ నిబంధనావళిగానీ ఏమీలేవు. ట్రేడ్ యూనియన్ చైతన్యంతో కాక, సంఘ సేవా దృష్టితోనూ, కార్మికుల కష్టాల పట్ల సానుభూతితో ఎన్.ఎమ్. లోఖండే కార్మికుల సేవకు పూనుకొన్నారు. ఆయన కార్మికుల శ్రేయస్సు కోసం చాలా పాటుపడ్డారు. కానీ, ఆ కాలంలోని చారిత్రక పరిస్థితుల ప్రాబల్యానికి ఆయన లొంగక తప్పలేదు. చరిత్రలో కార్మికుల శ్రేయస్సు కోసం పాటుపడిన సంఘసేవా తత్పరులలో ఒక ప్రముఖునిగా ఆయనకు స్థానం లభిస్తుంది. కానీ ట్రేడ్ యూనియన్ నాయకునిగా కాదు. బొంబాయి మిల్ హాండ్స్ అసోసియేషన్ స్వభావం గూర్చి లోఖండే నిర్వహించిన పాత్ర గురించి బొంబాయి రెవెన్యూ కలెక్టర్ జె.ఎస్. క్యాంబెల్

చేసిన ప్రస్తావనల వల్ల ఆనాటి పరిస్థితి కొంతమేరకు విశదమవుతుంది. "బొంబాయి మిల్ కార్మికులకు సంఘటితమయిన ట్రేడ్ యూనియన్ లేదు. గతంలో ఫ్యాక్టరీ కమిషన్‌తో పనిచేసిన ఎన్.ఎమ్.లోఖండే తనకు తానే బొంబాయి మిల్ హాండ్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా చెప్పుకున్నారు. ఆ అసోసియేషన్‌కి ట్రేడ్ యూనియన్‌గా ఉనికి లేదు. దానికి సభ్యత్వంకానీ, నిధులు కానీ, నియమావళిగానీ లేవు. లోఖండే తన వద్దకు వచ్చిన మిల్ కార్మికులకు సలహాదారుగా వ్యవహరిస్తాడని నాకు తెలిసింది" అని కాంబెల్ చెప్పాడు. బొంబాయిలోని చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చేసిన వ్యాఖ్యలు అప్పటి పరిస్థితి గురించి మరికొంత వివరణ ఇస్తాయి. "మిల్లు కార్మికులది అని చెప్పబడే ఈ అసోసియేషన్‌కు భవిష్యత్‌లో యజమానులను ప్రతిఘటించడం కోసం కార్మికులను సమాయత్తం చేయడానికి కావలసినంత పలుకుబడి లేదు. యజమానులకు, కార్మికులకు మధ్య గల సంబంధాలను ప్రభావితం చేయడానికి ఈ అసోసియేషన్ ప్రస్తుతానికైనా ఏ మాత్రం సరిపోదు" అని ఆయన పేర్కొన్నాడు. కానీ లోఖండే కథనం ప్రకారం "చాలామంది మిల్లు పనివారు ఉద్యోగాలు పోతాయనే భయంతో అసోసియేషన్‌తో సంబంధాలు ఉన్నాయని చెప్పుకోవటానికి భయపడుతున్నారు. కార్మికులు తమ శ్రేయస్సు కోసం ఏ విధమైన కూటమిగా ఏర్పడినా యజమానులు సహించే స్థితిలో లేరు" అని లోఖండే చెప్పినదానిలో కొంత నిజం వున్నప్పటికీ అధికారుల కథనం కూడా పరిశీలిస్తే ఆనాటి వాస్తవ పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయి.

లోఖండే 1884 సెప్టెంబరు 23, 26 తేదీల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ దిగువ నుదహరించిన డిమాండ్లతో ఒక మెమోరాండం తయారుచేశారు.

1. ప్రతి ఆదివారం మిల్లు కార్మికులకు సంపూర్ణ విశ్రాంతి నివ్వాలి.

2. మధ్యాహ్న సమయాల్లో అరగంట విరామం ఇవ్వాలి.

3. మిల్లులో పని ఉదయం 6.30 గంటలకు ప్రారంభించి, సూర్యాస్తమయానికి ముగించాలి.

4. క్రితం నెలలో పనిచేసినందుకు ఇవ్వవలసిన జీతం తరువాత నెలలో 15వ తేదీ దాటకుండా చెల్లించాలి.

5. మిల్లులో పనిచేస్తూ ప్రమాదానికి గురై తాత్కాలికంగా అస్వస్థతకు గురైన కార్మికులకు వారు కోలుకుని పనిలో చేరేవరకు మొత్తం జీతం చెల్లించాలి. పూర్తిగా అంగవైకల్యం పొందినవారికి తగిన పెన్షన్ చెల్లించాలి.

ఈ పత్రంపై 5,500 మంది కార్మికులు సంతకం చేశారు. 1884లో బొంబాయి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమీషనుకు ఈ మెమోరాండం సమర్పించారు.

1890 ఏప్రిల్ 24వ తేదీన లోఖండే ఏర్పాటు చేసిన మరో సమావేశానికి 10 వేల మంది కార్మికులు హాజరయ్యారు. ఇద్దరు మహిళా కార్మికులు ఆ సమావేశంలో ప్రసంగించారు.

ఈ సమావేశం కార్మికులకు వారానికొకరోజు సెలవు ఇవ్వాలని కోరుతూ బొంబాయి మిల్ ఓనర్స్ అసోసియేషన్‌కు వినతి పత్రాన్ని పంపింది. 1890 జూన్ 10వ తేదీ సమావేశంలో మిల్ ఓనర్స్ అసోసియేషన్ ఈ కోర్కెను అంగీకరించింది. ఇది కార్మికులకొక ఘన విజయం. అయితే ఈ నిబంధన చట్టపరమైన ఒత్తిడి లేకుండా అమలు కాలేదు.

గ్రేట్ బ్రిటన్ నుండి రాయల్ కమీషన్ ఆఫ్ లేబర్ పంపిన ప్రశ్నావళికి సమాధానంగా లోఖండే 1892లో, బొంబాయిలోని చీఫ్ ఫ్యాక్టరీ లేబర్ ఇన్‌స్పెక్టర్ ద్వారా ఒక లేఖ పంపించారు. ఆయన ఆ లేఖలో ఆనాటి కార్మికుల పరిస్థితులు వారి పట్ల ప్రభుత్వం అనుసరించే వైఖరిని వివరించాడు. ఆనాటి కార్మికవర్గ స్వభావం గురించి ఆ లేఖలో పేర్కొనబడిన అంశాలను భారత కార్మికోద్యమాన్ని అధ్యయనం చేసిన ఆధునిక పరిశీలకులెవ్వరూ ఆమోదించలేరు. కానీ, ఆ రోజుల్లో కార్మిక శ్రేయస్సు కోసం పాటుపడేవారి ఆలోచనా సరళి ఏ విధంగా ఉండేదో ఆ లేఖ వలన తెలుస్తుంది. ఆ లేఖ కొంచెం సుదీర్ఘంగా వున్నప్పటికీ, అందులోని కొన్ని భాగాలను ఉదహరించటం అవసరం. ఆ లేఖలో ఈ విధంగా వుంది.

“భారతీయ మిల్లు కార్మికులు చట్టబద్ధులై శాంతియుతంగా వ్యవహరించే జాతికి చెందినవారు. ఏదైనా అన్యాయం జరిగితే దాన్ని సరిదిద్దే ప్రయత్నం చేయటానికి బదులుగా ఆ అన్యాయాన్ని ఓర్పుగా సహించే స్వభావం గలవారు. యజమానుల అధికారాన్ని వారు ప్రశ్నించరు. యజమానులు ఫ్యాక్టరీ చట్టాలు ఖచ్చితంగా పాటించి కార్మికులకు సక్రమంగా రావలసిన జీతాలను వారికి చెల్లిస్తూ, జీతాలు తగ్గించవలసివచ్చినప్పుడు ముందుగా తగు విధంగా నోటీసు ఇవ్వాలి. నా లేఖలో ప్రస్తావించిన అంశాలను కొన్నింటినైనా అంగీకరిస్తే, దేశంలో యజమానులకు, కార్మికులకు మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని ఆశించటానికి తగినంత ఆస్కారముంది.

ఫ్యాక్టరీ కార్మికులు సంపన్నులవుతున్నారని కొందరు స్వార్ధపరులు చిత్రీకరిస్తున్నారు. కాని వీరు బాగా అమాయకులు కావడంతో పాటు, నగర జీవితంలోని త్రాగుడు వంటి దుర్వ్యవసనాలకు బానిసలు కావడం వల్ల ఒక వర్గంగా వీరికి ఒరిగిందేమీ లేదు. వారికి ప్రాథమిక విద్య గరపి, మంచి ప్రవర్తనకూ, సమర్ధవంతంగా పనిచేసినందుకూ అప్పుడప్పుడూ పారితోషికం ఇస్తూ వుంటే వారి పరిస్థితి చాలా వరకు మెరుగవుతుంది. అందరికీ ఒకే విధంగా 11 గంటల పనిదినం అమలు చేసే విధంగా సంస్కరణలు తేవాల్సిన విషయాన్ని కమిషన్ పరిశీలించాలి.”

ఈ విధమైన అవగాహనతోనే బ్రిటన్‌లోని నేషనల్ సైలర్స్ యూనియన్‌తో సంబంధం ఉన్న రెవరెండ్ ఫాదర్ హాఫ్‌కిన్స్, ఐర్లండ్‌లోని ఫైర్‌మెన్స్ యూనియన్‌తో సంబంధం వున్న జె. హెన్సన్‌ల ఆధ్వర్యంలో బొంబాయిలో సీమెన్స్ క్లబ్ ప్రారంభించబడింది. ఈ అసోసియేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించే సాధనంగా మాత్రమే ఉపయోగపడింది. కానీ ఆధునిక

ట్రేడ్ యూనియన్‌కు వున్న లక్షణాలు దీనికి లేవు. తరువాత కాలంలో కార్మికులకు సేవచేయాలనే ఉదారబుద్ధితో సంఘ సేవాతత్పరతతో అనేక సంస్థలు వెలిశాయి.

ఈ విధంగా కార్మికుల బాధలు, వారు గురవుతున్న దోపిడీకి వ్యతిరేకంగా మేధావి వర్గంలోని ఒక భాగం గళం విప్పింది. కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణకు పత్రికలు నడుపుతూ, కార్మికుల్లో ఎంతో కొంత ప్రాథమిక విద్యా వ్యాప్తికి కృషి చేశారు. 19వ శతాబ్దం రెండవ అర్ధభాగంలో చెదురుమదురుగా కార్మికవర్గ పోరాటాలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ పోరాటాల వెనుక సంఘాలు గాని, నిర్మాణయుతమైన కృషిగాని వున్నట్లు కన్పించదు. దరిద్రం బారినపడి, ఆధునిక పారిశ్రామిక కార్మికులుగా మారిన పేద రైతాంగం మరియు వ్యవసాయ కూలీల్లో నిద్రాణంగా వున్న తిరుగుబాటు ధోరణులే, ఆధునిక ఫ్యాక్టరీల్లో సాగుతున్న పెట్టుబడిదారీ దోపిడీని ప్రతిఘటించేందుకు వారికి ప్రోత్సాహాన్నిచ్చాయి.

ఫ్యాక్టరీల్లో ఒకేచోట సమిష్టిగా పనిచేయడం వల్ల వారిలో పరస్పర సానుభూతి పెంపొందింది. వైవిధ్యం కల్గిన కార్మిక జన బాహుళ్యంలో కులం, జాతి, ప్రాంతాల ప్రాతిపదికన పెంపొందిన ఐక్యత కూడ, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా సమైక్య ప్రతిఘటనకు పూనుకునేందుకు దోహదం చేసింది.

ప్రారంభ దశలో ఫ్యాక్టరీల్లో పని సంపాదించటం కోసం కార్మికులు, జాబర్స్ అని పిలువబడే వ్యక్తులపై ఆధారపడేవారు. జాబర్లు సాధారణంగా తన కులానికి అందులో కూడా తరచుగా తమ గ్రామాలకు చెందిన వ్యక్తులకే పని ఇప్పిస్తుండేవారు. ఈ జాబర్లు ఫ్యాక్టరీల్లో ఉద్యోగం చేస్తూనే, కార్మికుల నుండి కమిషన్ రూపంలో డబ్బు గుంజుతుండేవారు. ఒక జాబర్ క్రింద పనిచేసే జట్టులోని కార్మికులు వృత్తిపరమైన సోదరభావంతో మెలుగుతూ, కష్టసుఖాల్లో భాగస్వాములయ్యేవారు.

జాబర్లు సాధారణంగా అవినీతిపరులు, క్రూరులు. యజమానులు, జాబర్ల ప్రయోజనాల మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు వారిని శిక్షించడం గాని, పని నుండి తొలగించడం గాని జరిగేది. అట్టి సందర్భాల్లో జాబర్ క్రింద పని చేసే కార్మికులు కట్టు కట్టుకుని పని మానేసేవారు. జాబర్‌కు కార్మికులకు మధ్య వ్యక్తిగత సంబంధాలుండటంతో పాటు, జట్టులోని కార్మికులు తమ ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు తదితర విషయాల్లో జాబర్ మీద ఆధారపడేవారు. అందువల్ల ఆ జట్లు సంఘటిత కార్యాచరణకు దిగేవి.

ప్రారంభ దశలో కేవలం ఈ సమస్యల వల్లనే సమ్మెలు జరిగాయని చెప్పడానికి వీలులేదు. చాలా సందర్భాల్లో కార్మికులు తమ డిమాండ్ల సాధనమే సమ్మెలు. ఇతర ఆందోళనలకు పూనుకునేవారు. అయితే ఆ కాలంలో జరిగిన సమ్మెల స్వభావం, సంఘటిత కార్మికోద్యమం నిర్వహించిన సమ్మెలకు భిన్నంగా వుండేదని చెప్పడంలో సందేహం లేదు. ప్రారంభ దశలో సమ్మెల స్వభావం గురించి డి.హెచ్. బచనన్ ఈ విధంగా పేర్కొన్నాడు. "మొదటి నుండి ఒక

ప్రణాళిక లేకుండా పనులు చేయ నిరాకరించడం జరుగుతుండేది. ఈ సమ్మెలు పూర్తిగా స్వల్పకాలం పాటు సాగి ఒకటి, రెండు రోజుల్లో ముగిసేవి. కొన్ని సందర్భాల్లో ఒక సమస్య మీద ఫ్యాక్టరీ మొత్తంగా గాక, కొన్ని విభాగల్లో మాత్రమే సమ్మె జరిగేది. సమ్మెలు నిర్మాణయుతంగా జరగకపోవడం వల్ల ఈ సమ్మెలు ఎక్కువ కాలం సాగేవి కావు. నిర్ణయాత్మకంగా వుండేవి కావు. ఫలితంగా కార్మికులెంతగా పోరాడినప్పటికీ, యజమానులు కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ఆసక్తి చూపేవారు కాదు. దీనికి తోడు కార్మికుల వైఖరి కూడా విభిన్నంగా వుండేది. ఫ్యాక్టరీల్లో పని చేస్తున్నప్పటికీ వారు పారిశ్రామిక కార్మికులుగా కొత్త జీవితం సాగించడానికి ఇంకా అలవాటు పడలేదు. తక్కువ జీతాలు, ఎక్కువ పనిగంటలు వుండటం వలన శాశ్వతంగా కార్మికుడిగా పనిచేయాలా వద్దా అనే మీమాంసలో వారు వుండేవారు. ఎప్పటి నుండో గ్రామీణ జీవితానికి అలవాటు పడిన వీరికి గ్రామాల్లో కొద్దో గొప్పో భూమి మిగిలి వుండటం వలన వీరి మనస్సెప్పుడూ గ్రామాలకి తిరిగిపోవడం మీదనే లగ్నమై వుండేది.

అందువల్ల అమానుష దోపిడీకి వ్యతిరేకంగా స్వల్పకాల ప్రతిఘటన తర్వాత పారిశ్రామిక కేంద్రాలను వదలి తమ స్వగ్రామాలకు వెళ్ళడం వీరిలో ఎక్కువ మందికి సర్వసాధారణమైన విషయం.

సుదీర్ఘమైన పని గంటలు, నికృష్టమైన జీతాల వల్ల కార్మికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. పసిపిల్లల నియామకం గురించి మొదటి భారత ఫ్యాక్టరీల చట్టం విధించిన నిబంధనల వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. వారంలో తప్పనిసరిగా ఒక రోజు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎన్.ఎమ్. లోఖుండే బొంబాయిలో కార్మికుల సమావేశం నిర్వహించాడు. ఇది దాదాపు అన్ని పారిశ్రామిక కేంద్రాల్లోనూ అశాంతికి మూలమైంది. 1890 సెప్టెంబర్ 25న భారత ప్రభుత్వం ఫ్యాక్టరీ లేబర్ కమిషన్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బొంబాయికి చెందిన ఎస్.ఎస్. బెంగాలీ, ఎన్.ఎమ్. లోఖుండేలు, కలకత్తాకు చెందిన బాబూరశిక్‌లాల్ ఘోష్, కాన్పూర్ ఉలెన్‌మిల్‌లో ఫోర్‌మన్, ప్రేమ్‌జీ మెకంజీలను కమిషన్ సభ్యులుగా నియమించారు.

ఈ కమిషన్ సిఫార్సుల మేరకు 1891 ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం 9–14 సం॥ల వయసున్న పిల్లలకు 9 గంటల పని దినం, స్త్రీలకు 11 గంటల పని దినం, రోజూ టిఫిన్ చేయడానికి అరగంట, వారానికి ఒక రోజు సెలవు అమలు చేయవలసి వుంటుంది. ఈ చట్టం పురుష కార్మికులకు పనిగంటలు నియమించకపోవడం గమనించదగిన విషయం. "ఈ విషయంలో ఎప్పుడైనా ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులను ఊహించలేము" అని కమిషన్ పేర్కొంది. అంతేగాక ఎక్కువ సందర్భాల్లో ఈ చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించబడ్డాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 1911లో భారత ఫ్యాక్టరీల చట్టం, నూలు మిల్లు కార్మికులకు 12 గంటల పని దినం నిర్ణయించే వరకు, పురుషుల పని గంటల సమస్య అపరిష్కృతంగానే వుంది.

అతి హీనమైన కూలి రేట్ల వల్ల కార్మికుల్లో తీవ్ర అశాంతి ప్రబలింది. ఏమాత్రం సిగ్గు, బిడియం లేని వలస ప్రభుత్వానికి ఈ సమస్యల మీద కనీసం ఒక కమిటీని గాని, కమిషన్‌ను గాని నియమించాలనే ఆలోచనే లేకపోయింది. బ్రిటిష్, భారత పెట్టుబడిదారులు ఒకరితో మరొకరు తీవ్రంగా పోటీపడి, కార్మికులకు సాధ్యమైనంత తక్కువ జీతాలిచ్చి అత్యధిక లాభాలు దండుకున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సహజంగానే కార్మికుల పోరాటాలు పనిగంటలు తగ్గించాలని, జీతాలు పెంచాలనే రెండు ప్రధానమైన సమస్యలపైన కేంద్రీకరించబడ్డాయి.

ఇంతవరకు వివిధ రకాలుగా సేకరించిన సమాచారాన్ని బట్టి భారతదేశంలోని పారిశ్రామిక కార్మికుల మొట్టమొదటి సమ్మె నూతనంగా ఏర్పడిన రైల్వేలలో జరిగినట్లు తెలుస్తోంది. 1862 ఏప్రిల్, మే నెలలలో హౌరా రైల్వే స్టేషన్లకు చెందిన 1200 మంది కార్మికులు 8 గంటల పనిదినం సమస్యపై సమ్మెలో పాల్గొన్నారు. రైల్వేలు మన దేశంలో 1853లో మాత్రమే ప్రారంభించబడ్డ విషయం గమనంలో వుంచుకుంటే. ఈ పరిశ్రమ ప్రారంభించిన 9 సంవత్సరాలలోనే సమ్మె జరగటం అత్యంత ప్రశంసనీయమైన విషయం. చికాగోలో కార్మికులు నిర్వహించిన చారిత్రాత్మకమైన మేడే పోరాటానికి 24 సం॥లు ముందుగానే భారతదేశంలోని కార్మికుల్లో ఒక భాగం 8 గంటల పని దినం కోసం పోరాటం చేయడం ఒక చారిత్రాత్మక సంఘటన.

కలకత్తా నుండి వెలువడే "సోమ్ ప్రకాష్" అనే బెంగాలీ వారపత్రిక ఈ సమ్మె గురించి ఈ విధంగా రాసింది. "ఈ మధ్యనే హౌరా రైల్వేస్టేషన్‌లో పనిచేసే 1200 మంది కార్మికులు సమ్మె చేశారు. లోకోమోటివ్ శాఖలో పనిచేసే కార్మికులు రోజుకు 8 గంటలు పనిచేస్తుండగా, తాము 10 గంటలు పనిచేయాల్సి వస్తుందని వారు చెప్తున్నారు. కొద్దిరోజులు పని ఆగిపోయింది. కార్మికుల కోర్కెను రైల్వే కంపెనీ అంగీకరించాలి, లేకపోతే వారికి పనివారు దొరకరు." అయితే, దీనిని భారత కార్మికవర్గం చైతన్యవంతంగా, నిర్మాణయుతంగా కొనసాగించిన సమ్మెగా భావించరాదు. భారత కార్మికవర్గం ఇంకా శైశవదశలో ఉండగానే ఈ సమ్మె జరగటం వలన, తప్పనిసరిగా నిర్మాణ లోపం, చైతన్యలోపం వుండి తీరుతాయి.

ఈ సమ్మెకు ముందు రెండు సమ్మెలు జరిగాయి. 1823లో కలకత్తాలో పల్లకీ బోయీలు, 1853లో నదిపై సరుకులు రవాణా చేసే విభాగంలోని పోర్టర్లు సమ్మె చేశారు. తరువాత 1862 సెప్టెంబరులో ఎద్దులబండ్లు తోలేవారు సమ్మె చేశారు. 1866లో బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్‌లో మాంసం విక్రయించేవారు సమ్మె చేశారు. 1873లో అహమ్మదాబాద్‌లో ఇటుక పరిశ్రమలోని కార్మికులు, టైలర్లు సమ్మె చేశారు. అయితే అనేక వృత్తుల్లో పనిచేసే ఈ కార్మికుల సమ్మెలను, 1862లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె వంటి ఆధునిక పారిశ్రామిక కార్మికుల సమ్మెతో పోల్చి గందరగోళ పడరాదు.

దీని తరువాత 1877లో కూలి రేట్ల సమస్యపై నాగపూర్ ఎంప్రెస్ మిల్స్‌లోని వీవర్లు పెద్ద ఎత్తున సమ్మెచేశారు. దాన్ని గురించిన వివరాలు ఇంకా అందుబాటులో లేవు.

లభించిన రికార్డులను బట్టి 1880 నుండి శతాబ్దం చివరి వరకు సమ్మెలు తరచుగా, విస్తృతంగా జరిగేవి. అప్పటి కార్మికుల పరిస్థితులను వివరిస్తూ డాక్టర్ ఆర్.కె. దాస్ "బొంబాయి, మద్రాస్‌ల్లోని వివిధ ఫ్యాక్టరీలలో 1880 నుండి 1890 వరకు 25 ముఖ్యమైన సమ్మెలు రికార్డు చేయబడినాయి. చిన్న చిన్న సమ్మెలు చాలా తరచుగా జరిగాయి" అని పేర్కొన్నారు. అహమ్మదాబాదు మిల్ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఈ సమ్మెల స్వభావం గురించి ఈ విధంగా చెప్పాడు. "పని సరిగా చేయడంలేదనే నెపంతో యజమానులు జరిమానాలు విధించడమో, జీతాలు తగ్గించడమో చేస్తే కార్మికులు చిన్న చిన్న సమ్మెలు చేసేవారు. కానీ, ఈ వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకొనేవారు." ఈ విషయాన్ని బొంబాయి రెవిన్యూ కలెక్టర్ ధృవపరిచారు. "గైర్హాజరుకు గాని, సరిగా పనిచేయలేదనే సాకుతో జరిమానా విధించినప్పుడు యజమానులు జీతాలు తగ్గించే ప్రయత్నాలు చేసిన సందర్భాల్లోనూ కార్మికులు ఒకటి, రెండు రోజులు నిలిపివేసేవారు" అని ఆయన చెప్పారు.

బొంబాయి ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎస్.ఎ. మోస్ ఈ విషయాన్ని ఈ విధంగా ధృవపరిచాడు. "సమ్మెలు చాలా జరిగేవి. ఒక్కొక్క ఫ్యాక్టరీలో సంవత్సరానికి రెండు సమ్మెలను అణచివేయాల్సి వస్తోంది. కానీ, ఈ సమ్మెలు కొద్దికాలం పాటు మాత్రమే జరుగుతుంటాయి. చివరకు ఎప్పుడూ కార్మికులే లొంగిపోవడం, కొన్ని సందర్భాల్లో జరిమానాలకు ఒప్పుకోవడం, మరికొన్ని సందర్భాల్లో తమకు రావలసిన జీతాల బకాయిలు వదులుకొని రాజీకి రావడం జరుగుతుంది. మీరు సమ్మె చేయడానికి గల కారణాలు చాలావరకు తాత్కాలికమైనవి. ఏ విధమైన నోటీసు లేకుండా జీతాలు తగ్గించడమే సర్వసాధారణమైన కారణం."

ఈ విషయంపై బొంబాయి ప్రభుత్వ అధికారి ఒకరు ఈ విధంగా చెప్పారు. "ఇంగ్లాండ్‌లో మాదిరిగా సమ్మెలు, లాకౌట్లు ఇక్కడ జరగవు. బొంబాయిలో జరిగిన సమ్మెలు ఏదో ఒక మిల్లుకో లేదా ఒక మిల్లులోని కొన్ని విభాగాలకో పరిమిత మవుతుంటాయి. ఈ సమ్మెలు మూడు రోజులకు మించి జరగలేదు. యజమానులు జీతాలు తగ్గించటానికి చేసే ప్రయత్నమే సమ్మెలు జరగడానికి సర్వసాధారణమైన కారణంగా చెప్పడం జరుగుతోంది."

బెంగాల్‌లోని కార్మికుల పరిస్థితులు కూడ బొంబాయి ప్రెసిడెన్సీలో వలెనే ఉండేవి. బెంగాల్ ప్రభుత్వ అధికారి ఒకరు ఈ విధంగా చెప్పారు. "అతి ముఖ్యమైన, సర్వసాధారణమైన సమస్యలపై సమ్మెలు గాని, లాకౌట్లు గాని జరగలేదు. ఏదైనా ఒక మిల్లులోనో, ఒక విభాగంలోని జీతాలు మరో విభాగంలోని జీతాలకన్నా హెచ్చుగా వున్నాయనో, ప్రక్క మిల్లులోకంటే తమ మిల్లులోని జీతాలు ఎక్కువగా వున్నాయనో చెప్పి యజమానులు తగ్గించడానికి ప్రయత్నిస్తే ఆ మిల్లులో ఆందోళన ప్రారంభమవుతుంది. కొన్ని సందర్భాలలో కార్మికుల ప్రయోజనాలకు భంగకరమైన వ్యక్తిగా తయారైన ఓవర్సీస్‌కు వ్యతిరేకంగా కార్మికులు ఏకమై పనులు నిలిపివేస్తుంటారు. ఒకొక్కసారి వారమంతా పని ఆగిపోతుంది. మొత్తం పరిశ్రమ స్తంభింపచేసే విధంగా గాని, లేదా ఒక మిల్లులోని కార్మికులందరూ పాల్గొన్న నిర్మాణయుతమైన సమ్మె

ఇంతవరకు జరగలేదు. యజమానులకు కార్మికులతో ఘర్షణ తలెత్తిన సందర్భాల్లో కార్మికులు సమ్మె చేసినప్పటికీ లెక్కచేయక వారు అమలు చేయదల్చుకున్న నిర్ణయాలను కృతనిశ్చయంతో అమలు చేయగల్గుతున్నారు. అన్ని సందర్భాలలోనూ వారే విజయం సాధిస్తున్నారు.”

గ్రేట్ బ్రిటన్‌లో “రాయల్ కమిషన్ ఆఫ్ లేబర్”కు సమర్పించిన ఈ స్టేట్‌మెంట్లను పరిశీలిస్తే స్వభావం ఎటువంటిదైనా, ఆ కాలంలో సమ్మెలు విస్తృతంగా జరిగాయని స్పష్టమవుతుంది. ఆధునిక పద్ధతులలో ఆ సమ్మెలు నిర్వహించలేకపోయినా, సమ్మెలు తాత్కాలికంగానే జరిగినా నిర్మాణయుతంగా లేకపోయినప్పటికీ, ఆ కాలంలో తీవ్రమైన దోపిడీని కార్మికులు తరచుగా ఎదిరించి పోరాడారనేది నిర్వివాదాంశం. బ్రిటిష్, భారతీయ పరిశ్రమలు రెండింటిలోనూ కూడ ఈ సమ్మెలు జరిగాయని గమనించాలి. బ్రిటిష్, భారతీయ పారిశ్రామికవేత్తలకు మధ్య ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ, కార్మికులను నిర్దాక్షిణ్యంగా దోచుకునే విషయంలో వారు ఒకే విధంగా ప్రవర్తించారు.

సమ్మెల ప్రభావాన్ని తక్కువ చేసి చూపేందుకు ప్రభుత్వ అధికారులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ 1880 తరువాత రెండు దశాబ్దాలలోనూ అనేక సమ్మెల పోరాటాలు జరిగాయని వారే అంగీకరించారు. అనేక డాక్యుమెంట్లలో, రికార్డులలో వున్న వివరాలు, సమాచారం ప్రకారం ఈ కాలంలో జరిగిన పెద్ద, చిన్న సమ్మెల జాబితా స్థూలంగా ఈ విధంగా వుంది.

1. 1882 సంవత్సరాంతంలో సూరత్‌లోని గలామ్‌బాబా స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్స్‌లో రెండు సమ్మెలు జరిగాయి. మొదటి సమ్మె నవంబరు 13, 14 తేదీల్లోనూ, రెండవది డిసెంబరు 19, 20 తేదీల్లోనూ జరిగింది. మిల్ మేనేజరుకూ, కార్మికులకూ మధ్య వచ్చిన తగాదా వల్ల ఈ సమ్మెలు జరిగాయని తెలుస్తోంది.

2. కుర్లాలోని స్వదేశీ మిల్స్‌లో 1887లో మూడు రోజులు సమ్మె జరిగింది. తక్కువగా వున్న తమ జీతాలను పెంచాలని కోరుతూ కార్మికులు సమ్మె చేశారు.

3. బెంగాలులోని ఘూసరీ కాటన్ మిల్స్‌లో 1881లో ఒకసారి, 1890లో మరోసారి, మొత్తం రెండు సమ్మెలు జరిగాయి. మొదటి సమ్మె 10 రోజులు జరిగింది. రెండవది 3 రోజులు జరిగింది. అధికారిక నివేదిక ప్రకారం ఈ సమ్మెలు జీతాల తగ్గింపుకు వ్యతిరేకంగా జరిగాయి. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ చివరకు ఉద్యోగులు కంపెనీ విధించిన షరతులనే అంగీకరించారు. కంపెనీవారు ఈ రెండు సమ్మెల వలన 2 వేల రూపాయలు నష్టపోయామని చెప్పారు.

4. వార్ధాలోని హింగన్‌ఘాట్ మిల్లులో 1881 నుండి 1890 వరకు గడిచిన 10 సంవత్సరాల కాలంలో నాలుగు సమ్మెలు జరిగాయి. ప్రతి సమ్మెవలన కంపెనీ రోజుకు వెయ్యి రూపాయలు నష్టపోయింది.

1886 డిసెంబర్ 26 నుండి 28 వరకు మొదటి సమ్మె జరగ్గా, రెండవ సమ్మె 1887 ఏప్రిల్ 27 నుండి 29 వరకు జరగ్గా, మూడవ సమ్మె 1888 మార్చి 26 నుండి 30 వరకు, నాల్గవ సమ్మె 1889 నవంబర్ 25 నుండి 28 వరకు జరిగాయి.

5. కోయంబత్తూర్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్లుల్లో 1891లో మే 10 నుండి 12 వరకు ఒక సమ్మె జరిగింది. మొత్తం 350 మంది కార్మికులలో 300 మంది పాల్గొన్నారు. మేనేజిమెంట్ వారు ఒక కార్మికుడిని కొట్టడం వలన సమ్మె జరిగింది.

6. 1881 నుండి 1887 వరకు ప్రతి ఏటా సగటున ఒక సమ్మె జరిగిందని, కుర్లా స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్స్ యాజమాన్యం ప్రకటించింది.

7. మద్రాసులోని సదరన్ ఇండియా స్పిన్నింగ్ అండ్ వీవింగ్ కంపెనీ మేనేజిమెంట్ వారు 1881 నుండి 1890 వరకు అయిదు సమ్మెలు జరిగాయని పేర్కొన్నారు. ప్రతి సమ్మె వల్ల సగటున 2 వేల నుండి 3 వేల రూపాయల వరకు నష్టపోయామని చెప్పారు.

8. జీతాలు తగ్గించిన కారణంగా 1881 నుండి 1890 మధ్యకాలంలో రెండు సమ్మెలు జరిగాయని బొంబాయికి చెందిన నౌరోజీ వాడియా అండ్ సన్స్ పేర్కొంది.

9. కె.ఎమ్. హీరామానెక్ అండ్ కో బొంబాయి వారి ఆధ్వర్యంలో వున్న మూడు మిల్లుల్లో 1892 అక్టోబరులో సమ్మె జరిగింది. జీతాలు తగ్గిస్తారేమో నన్న భయంతో కార్మికులు సాగించిన సమ్మె కొద్ది రోజుల తర్వాత విఫలమైంది. కానీ 1893లో కార్మికులు మళ్ళీ సంఘటితపడి నిర్వహించిన పెద్ద సమ్మె వల్ల మిల్లుల పని స్తంభించిపోయింది. కార్మికులకు సమ్మె పిచ్చి పట్టిందని మేనేజిమెంట్ నిందించింది.

10. 1892-93 మధ్య కాలంలో బొంబాయి కాటన్ మిల్లు యజమానులు జీతాల తగ్గింపుకు విఫల యత్నాలు చేశారు. దీనికి వ్యతిరేకంగా కొన్ని మిల్లుల్లో సమ్మె జరిగింది. ఆ తర్వాత అనేక మిల్లుల్లోని కార్మికులు ఏకమై బ్రహ్మాండమైన సమ్మె నిర్వహించారు. ఈ కాలంలో జరిగిన ఈ అతి పెద్ద సమ్మెలో 12 వేల నుండి 15 వేల వరకు కార్మికులు పాల్గొన్నారు.

11. అధికార నివేదికల ప్రకారం 1869లో అహమ్మదాబాదులో మొట్ట మొదటి మిల్లు స్థాపించినప్పటి నుండి అమలులో వున్న "15 రోజులకొకసారి జీతం చెల్లించే విధానానికి" బదులుగా వారానికొకసారి జీతాలిచ్చే విధానం ప్రవేశపెట్టాలన్న మిల్లు యజమానుల సంఘం నిర్ణయానికి నిరసనగా 8వేల మంది కార్మికులు పనులు నిలిపి వేశారు. మిల్లుల్లోని వీవర్లు ముందుగా సమ్మెలో చేరగా, ఇతరులు వారి ననుసరించారు. అహమ్మదాబాద్ ప్రెసిడెన్సీ ఇన్‌స్పెక్టర్, దీనిని పెద్ద సమ్మెల్లో ఒకటిగా అభివర్ణించాడు. 10 రోజులు సాగిన ఈ సమ్మె విఫలమైంది.

12. "కార్మికులు సమ్మె వల్ల ఒకే అర్ధ సంవత్సరంలో దాదాపు ఆరువారాల పాటు మిల్లులు మూతపడటంతో, కంపెనీకి రూ. 80 వేల మేరకు నష్టం వచ్చినందుకు విచారిస్తున్నానని

"బడ్జ్ బడ్జ్ జూట్‌మిల్ డైరెక్టర్ 1895 అక్టోబర్ 13న ప్రకటించాడు. మరో సమ్మె వల్ల 1896 జూన్‌లో 8 రోజులు మిల్లు మూతపడింది. 1900 సం॥ రెండు అర్ధభాగాల్లోనూ అనేక సమ్మెలు జరిగాయి.

13. 1895 బడ్జ్ బడ్జ్ జూట్ మిల్లులో జరిగిన మొదటి సమ్మె చాలా తీవ్రంగానూ, విస్తృత స్థాయిలోనూ జరిగింది. సమ్మెలో పాల్గొన్న కార్మికుల మీద కాల్పులు జరిపారు. సమ్మెను గురించిన వివరాలను "అమృతబజారు పత్రిక" పత్రిక ఈ విధంగా పేర్కొంది. గత మంగళవారం రాత్రి 8 గంటలకు బడ్జ్ బడ్జ్ వద్ద తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ మిల్లుకు చెందిన యూరోపియన్ ఉద్యోగులు నివసిస్తున్న బంగళాకు సమీపంలో దాదాపు ఏడువేల మంది కార్మికులు గుమికూడారు. సర్దార్‌తో కార్మికులకు తీవ్ర విభేదాలు తలెత్తడంతో, అతనిని తొలగించకపోతే సమ్మెకు పూనుకుంటామని కార్మికులు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. వారి ప్రార్థనను మిల్లు యజమానులు అంగీకరించకపోవడంతో యూరోపియన్ ఉద్యోగుల బంగ్లా వద్ద గుమికూడిన కార్మికులు బంగ్లా అద్దాలను రాళ్ళతో పగులగొట్టారు. యూరోపియన్లు గుంపు మీద కాల్పులు జరిపారు.

తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులతో పాటు, జనం దాడికి గురైన ఇద్దరు కానిస్టేబుళ్ళను, మిల్లు దర్వానును కూడ ఆలీపూర్ ఆసుపత్రిలో చేర్చారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌కు తంతి ద్వారా సమాచారం పంపారు. సాయుధ బలగాలతో ఆయన ఆ ప్రదేశానికి చేరకముందే గుంపు చెదిరిపోయింది. చాలామందిని అరెస్టు చేశారు.

ట్రేడ్ యూనియన్లు అభివృద్ధి చెందకముందే, శైశవ దశలోనున్న కార్మికవర్గం యూరోపియన్ పెట్టుబడిదార్ల దోపిడీని, రక్తపాతానికైనా పాల్పడి పోరాటాలను అణచివేసే వారి ప్రయత్నాలకు వ్యతిరేకంగా, మొక్కవోని ధైర్యంతో సమరశీలంగా పోరాడిందని ఈ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ కాలానికి సంబంధించి, కార్మిక వర్గ ఉద్యమ చరిత్రలో బడ్జ్ బడ్జ్ జూట్‌మిల్లు కార్మికుల పోరాటం నిస్సందేహంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న సంఘటన.

బెంగాల్‌లోని వివిధ జూట్‌మిల్లుల్లో సాగిన కార్మిక వర్గ పోరాటాలు, వారు ప్రదర్శించిన సమరశీలతను గురించిన కొన్ని వాస్తవాలు, 1895–96 బెంగాల్ అడ్మినిస్ట్రేటివ్ నివేదికలో పేర్కొనబడ్డాయి. మిల్లు కార్మికుల పట్ల యజమానుల వైఖరి, వారి ప్రవర్తనను కూడా బహిర్గతం చేసిన ఈ నివేదిక ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఆ నివేదికలోని ఈ క్రింది భాగం ఈ విషయాలను వెల్లడిస్తుంది.

"24 పరగణాల జిల్లాలో జీతాల సమస్య మీద కార్మికులు ఆందోళనకు పూనుకున్నారు. బక్రీద్ పండగ సందర్భంగా పనులకు హాజరు కాని కొందరు మహమ్మదీయ కార్మికులకు జీతాలు ఆపివేయడంతో మొదటగా జూట్‌మిల్లులో ఘర్షణ తలెత్తింది. మేనేజర్‌ను

భయభ్రాంతులకు గురిచేసే విధంగా, కార్మికులు ఆయనకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు రావడంతో ఘర్షణ జరిగింది. కార్మికులు పోలీసులకు దేహశుద్ధి చేశారు. ముగ్గురు కార్మికులను అరెస్టు చేసి శిక్షించారు. మొహరం సందర్భంగా కమర్హా టీ మిల్లులో కూడా ఇటువంటి సంఘటనే జరిగింది. అయితే, సెలవు ప్రకటించడంతో గొడవ సద్దుమణిగింది. దురదృష్టవశాత్తు యూరోపియన్ కార్మికులు ఆత్మరక్షణకు తుపాకులను ఉపయోగించాల్సి వచ్చింది. టిటాఘర్‌లో కూడ కాల్పులు జరిగాయి. అయితే అదృష్టవశాత్తు ఎవరూ గాయపడలేదు. కమర్హట్ మిల్లులో ఏదైనా గొడవ జరిగితే ఎదుర్కొనేందుకు యూరోపియన్ ఉద్యోగులు సాయుధులయ్యారు. కంకినారా మిల్లులో మేనేజర్ స్పిన్నింగ్ కార్మికుల జీతాన్ని రూ. 3.50 నుండి రూ. 3.25లకు తగ్గించడంతో సమస్య తలెత్తింది. నదీ తీర ప్రాంతాలతో పాటు షామ్‌నగర్ వద్ద కొత్త మిల్లు స్థాపించడంతో, స్పిన్నింగ్ కార్మికులు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మేనేజర్ ముఖ్య నాయకులను లాకౌట్ చేయాలని చూడటంతో ఉద్రిక్తత పెరిగింది. అయితే హింసాత్మక ఘటనలేవీ చోటు చేసుకోలేదు. పోలీసులు ముఖ్య నాయకులను అరెస్టు చేసి, ప్రశాంత వాతావరణం కల్పించడం పేరిట కొన్ని షరతుల కొప్పించారు. వారం రోజుల జీతం యజమాని బిగపట్టుకునే సాంప్రదాయం కూడా ఈ అశాంతికి ఒక కారణంగా కన్పిస్తుంది. ఒకవేళ కార్మికుడు మెరుగైన జీతానికి వేరే చోటకు పనికి వెళ్ళదలిస్తే ఒక వారం రోజుల జీతం కోల్పోవలసి వస్తుంది. అందువల్ల కార్మికులు నిస్సందేహంగా దీనినొక ప్రధాన సమస్యగా భావించారు. ఈ విషయమై కమిషనర్లు మేనేజర్లను హెచ్చరించినప్పటికి ప్రయోజనం లేకపోయింది. జూలై నెలలో గార్డెన్ రీచ్‌లోని జూట్‌మిల్లులో స్పిన్నింగ్ కార్మికులు హెచ్చు జీతాలు డిమాండ్ చేయగా, కొన్ని రాయతీలిచ్చి సమ్మెను నివారించారు. ఆగస్టు నెలలో బడ్జ్ బడ్జ్ మిల్స్‌లోని మేనేజర్ అపఖ్యాతిపాలైన ఒక ఓవర్సీర్‌ను తిరిగి నియమించడంతో స్పిన్నింగ్ కార్మికులు సమ్మెకు తలపడ్డారు. దీనితో తీవ్ర అశాంతి నెలకొని పని పూర్తిగా స్తంభించిపోయింది. మామూలుగానే మేనేజర్ ఒక వారం రోజుల జీతం బిగపట్టుకొని, కార్మికులందరినీ లాకౌట్ చేశాడు. దీనితో ఫ్యాక్టరీలోని యూరోపియన్లకు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన జరిగింది. అయితే అదృష్టవశాత్తు సకాలంలో పోలీసులు ప్రత్యక్షం కావడంతో హింసాకాండ నివారించబడింది. పదకొండుమందిని అరెస్టు చేసి శిక్షించారు. ఈ సందర్భంలో యూరోపియన్ ఉద్యోగులు ఆయుధాలు చేపట్టినప్పటికీ తీవ్ర పరిణామాలేవీ జరగలేదు. జీతం పూర్తిగా చెల్లించకుండా ఉద్యోగులను లాకౌట్ చేయటం, ఫాక్టరీ ఆవరణలో మేనేజర్‌ను నియమించకుండా కలకత్తా నుండి టెలిఫోన్ ద్వారా ఫ్యాక్టరీని నిర్వహించడం సరైంది కాదని, విచారణలో మేనేజింగ్ ఏజెంట్లను తప్పుపట్టడం జరిగింది. మిల్లు ఉద్యోగులను అణచివేయడానికి తుపాకులను ఉపయోగించే పద్ధతిని లెఫ్టినెంట్ గవర్నర్ తీవ్రంగా గర్హించాడు. ఆ విధంగా ఆయుధాలు వినియోగించాల్సిన అత్యవసర సందర్భాలు చాలా అరుదుగా తలెత్తుతాయని, యూరోపియన్ మేనేజర్లు, వారి సహాయకులు సమంజసమైన, సామరస్య ధోరణిలో నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తే మాట వినని దేశీయ కార్మికులుండరని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇది వలస ప్రభుత్వ నివేదిక అయినప్పటికీ కొన్ని వాస్తవాలను దాచలేకపోయింది. ఆ కాలంలో బెంగాల్‌లోని పారిశ్రామిక కేంద్రాల్లో ప్రధానంగా జూట్ పరిశ్రమలోని కార్మికులు అశాంతితో కుతకుతలాడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఇది సమరశీల స్వభావం సంతరించుకున్నదనేది కాదనలేని సత్యం.

1897లో బొంబాయి కార్మికుల్లో తీవ్ర అశాంతి నెలకొని వుంది. 19వ శతాబ్దం చివరి భాగంలో బొంబాయి, కాన్పూర్ తదితర పారిశ్రామిక కేంద్రాల్లో ప్లేగు వ్యాధి ప్రబలి, పెద్ద సంఖ్యలో ప్రజలను బలిగొన్నది. భారీ సంఖ్యలో కార్మికులు పనులు వదలి గ్రామాలకు తరలిపోయారు.

దీనితో బొంబాయి తదితర పారిశ్రామిక కేంద్రాల్లో కొన్నేళ్ళపాటు కార్మికుల కొరత కొనసాగింది. కార్మికుల కోసం యజమానుల మధ్య పోటీ పెరగడంతో, వీధి కూడళ్ళలో కార్మికులను వేలం వేసే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల కార్మికులకు బేరమాడే శక్తి పెరిగి హెచ్చు జీతాలు డిమాండ్ చేయడంతో, వివిధ మిల్లుల్లో పారిశ్రామిక అశాంతికి దారితీసి, ఘర్షణలు జరిగాయి. కొన్ని సందర్భాల్లో మేనేజ్‌మెంట్ల మీద ఒత్తిడి తెచ్చి జీతాలు పెంచుతున్నారు.

ఈ సమయంలోనే మిల్లు యజమానులు నెలసరి వేతనాలకు బదులు రోజువారీ జీతాల పద్ధతి మొదలుపెట్టారు. ప్లేగు వ్యాధి సమసిపోయిన తర్వాత కార్మికులు పారిశ్రామిక కేంద్రాలకు తిరిగి రావడంతో యజమానులు తిరిగి పాత నెలసరి వేతనాల పద్ధతిని ప్రవేశపెట్టారు. దీనివల్ల ఇబ్బందులకు గురైన కార్మికులు దినసరి జీతాల పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేశారు. సమ్మె విజయవంతం కాకపోగా, కార్మికులు యజమానుల నుండి ఎదురు దాడి నెదుర్కొనవలసి వచ్చింది. కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులను నియమించి, వారి ద్వారానే జీతాలు చెల్లించాలని యజమానులు నిర్ణయించారు. అంతేగాక, ప్రత్యామ్నాయ కార్మికులు జాబితా తయారుచేసి, ఒకవేళ కార్మికులు సమ్మె చేస్తే వీరిని నియమించాలని కూడా నిర్ణయించారు.

దేశంలోని వివిధ పారిశ్రామిక కేంద్రాల్లో అనేక స్వల్పకాలిక సమ్మెలు, కార్మిక వివాదాలు చెలరేగాయి. అయితే వీటిలో కొన్నింటికి సంబంధించిన వివరాలు మాత్రమే లభించాయి. "అనేక సమ్మెలు జరిగాయి. అప్పుడప్పుడు జరిగిన ఈ సమ్మెల్లో ఫ్యాక్టరీ సైజును బట్టి రూ. 300 నుండి రూ. 3000ల వరకు నష్టపోయాం" అని మద్రాసుకు చెందిన బిన్నీ అండ్ కో కంపెనీ పేర్కొంది. అప్పుడప్పుడు ఘర్షణలు జరిగినప్పటికీ ఏదీ సమ్మె రూపం దాల్చలేదని" మద్రాసుకే చెందిన మరో పారిశ్రామిక సంస్థ హార్వే అండ్ కో పేర్కొంది. "జీతాల తగ్గింపు, జరిమానాల విధింపు వల్ల ఉత్తర ప్రాంతంలోని డివిజన్లలో అప్పుడప్పుడు ఒకటి, రెండు రోజులు పని నిలిపి వేయడం జరుగుతోంది" అని నాగపూర్ ఎంప్రెస్ మిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ చెప్పారు.

## కార్మిక వర్గాన్ని సంఘటితం చేసే దిశలో తొలి యత్నాలు

1895కు పూర్వం భారత కార్మికుల్లో వర్గ చైతన్యం లోపించడం వల్ల తాము సంఘటితం కావడానికి ప్రయత్నాలేమీ చేయలేదు. అయితే ఆనాడు యూనియన్లు లేనప్పటికీ, తాము చేసిన చిన్న, చిన్న సమ్మెల వల్ల కార్మికులు ఐక్య కార్యాచరణ శక్తిని గుర్తించారు. ఈ కాలంలో ఏర్పడిన అసోసియేషన్లకు, పాశ్చాత్య దేశాల్లోని యూనియన్లతో పోలిక లేదు. లోఖండే స్థాపించిన బొంబాయి మిల్స్ హ్యాండ్స్ యూనియన్ స్వభావం గురించి ఇదివరకే చర్చించాం. 1897లో స్థాపించబడిన ఎమాల్గమేటెడ్ సొసైటీ ఆఫ్ రైల్వే సర్వెంట్స్ ఆఫ్ ఇండియా అండ్ బర్మాను, 1882 ఇండియన్ కంపెనీల చట్టం క్రింద రిజిష్టర్ చేశారు. వాస్తవానికి ఈ అసోసియేషన్ రైల్వేల్లోని యూరోపియన్, ఆంగ్లో-ఇండియన్ ఉద్యోగులకు చెందింది కావడం వల్ల, భారత కార్మికులకు ప్రాతినిధ్యం వహించలేదు. అంతేగాక ఇది ప్రధానంగా పరస్పర సహకార సంఘ స్వభావం కల్గి వుంది. అందువల్ల ఇది 20వ శతాబ్దంలో 20 సంవత్సరాల పాటు కొనసాగినప్పటికీ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహించలేదు. కనుక ఈ అసోసియేషన్ ట్రేడ్ యూనియన్ వర్గీకరణలోకి రాదు.

1908లో ఫాక్టరీస్ లేబర్ కమిషన్ (మారిసన్ కమిషన్) నియామకం జరిగి, దర్యాప్తు ప్రారంభించే నాటికి బొంబాయి మిల్స్ హ్యాండ్స్ అసోసియేషన్ దాదాపు మనుగడలో లేదు. కలకత్తాలో వున్నట్లు చెప్పబడుతున్న రెండు యూనియన్లలో ఒకటైన మహమ్మదీయ అసోసియేషన్ 1895లో స్థాపించబడింది. దీనిలో మిల్లు కార్మికులు మాత్రమే సభ్యులుగా వున్నారు. ఆ సంఘం గురించి సంఘ ప్రతినిధి ఈ విధంగా చెప్పారు. "మిల్లు పని గురించి ప్రజానీకంలో ప్రధానంగా ముస్లింలలో ప్రచారానికి ఈ సంస్థ శాయశక్తులా కృషి చేస్తోంది. సభ్యుల జాబితా లేకపోయినప్పటికీ, కొన్ని వేల మంది ఈ సంఘంలో సభ్యులుగా వున్నారు. కాని వారు సమావేశం కావడానికి ప్రత్యేకించి స్థలం కూడా లేదు. విచారణా సంఘం ప్రశ్నావళిని గురించి చర్చించేందుకు, డిసెంబర్ నెలలోని ఒక ఆదివారం నాడు వెయ్యిమంది కార్మికులు సమావేశమయ్యారు. ఈ సంఘానికి ఒక అధ్యక్షుడు, ఒక ఉపాధ్యక్షుడు, కోశాధికారి, గౌరవ కార్యదర్శి వున్నారు. ప్రస్తుతం వారి చేతిలో రూ. 100ల లోపు నగదు వుంది. ఇంతకుముందు ఒక మసీదు మరమ్మతులకు, చక్రవర్తి పట్టాభిషేకం సందర్భంగా దాన ధర్మాలకు కొంత ఖర్చయింది. దానధర్మాలకు, జబ్బు పడినవారి సహాయానికి, ఇళ్ళకు పంపబడే కార్మికుల కొరకు సంఘం చందాలు వసూలు చేస్తుంది."

కాబట్టి ఈ అసోసియేషన్ స్వభావాన్ని అర్థం చేసుకోవడం ఏమంత కష్టం కాదు. "ఇండియన్ లేబర్ యూనియన్" అని గొప్పగా పేరు పెట్టుకున్న మరో కార్మిక సంస్థను కూడా ట్రేడ్ యూనియన్ స్వభావం కల్గిన సంస్థగా పరిగణించలేము. ఆ సంస్థ అధ్యక్షుడొక స్థానిక న్యాయవాది. కార్మిక సమస్యల పట్ల ఆయనకు అవగాహన వుందా లేదా అనే విషయంతో నిమిత్తం లేకుండా, తన న్యాయశాస్త్ర ప్రావీణ్యాన్ని ప్రదర్శించుకోవడానికే అధ్యక్షునిగా తానే

స్వయంగా నియుక్తుడయ్యాడు. ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ పనికి సంబంధించి, ఆయన బడ్జ్ బడ్జ్ జూట్ మిల్లుకు చెందిన ఐదుగురు వీవర్లను, పదిమంది స్పిన్నర్లను కమిషన్ ముందు హాజరు పరచి, వారి గోడు వారినే చెప్పుకోమని చెప్పి, చేతులు దులుపుకున్నాడు. ఆ మాత్రమైనా చేశాడనుకుందామంటే కార్మికుల వాఙ్మూలాలను అధ్యక్షుల వారే నమోదు చేసినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ కార్మికులు అసలు కమిషన్ ముందు హాజరు కాలేదని, అధ్యక్షుల వారే ఇతర కేంద్రాల్లో చేసినట్లే కార్మికుల నివాస ప్రాంతాల పరిసరాల్లో వారి ఇంటర్వ్యూ చేసి సాక్ష్యాలను నమోదు చేసినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

19వ శతాబ్దం చివరి సంవత్సరాల్లోని "కార్మిక సంస్థల" స్వభావాన్ని అర్థం చేసుకునేందుకీ ఉదాహరణలు సరిపోతాయి. ఇంకా అసలు సిసలైన ట్రేడ్ యూనియన్లు అభివృద్ధి చెందని ఈ స్థితిలో భారత శ్రామికులు అట్టి సంస్థల కోసం అన్వేషణలోనే వుందని చెప్పవచ్చు.

## వలస దోపిడీ ప్రత్యేక లక్షణాలు

పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ఆర్థిక పోరాటాలు ఎంత ముమ్మరంగా సాగిస్తే అంత బాగా శ్రామిక వర్గంలో వర్గ చైతన్యం పెంపొందుతుంది. కానీ, పాశ్చాత్య దేశాలతో పోల్చితే వలస దేశాల్లో దోపిడీకి వున్న ప్రత్యేక లక్షణాల వల్ల కార్మికుల ఆర్థిక పోరాటాలకు ఆటంకాలేర్పడుతున్నాయి. ఫలితంగా కార్మికుల వర్గ రాజకీయ చైతన్యం పెంపొందడానికి అవరోధాలేర్పడుతున్నాయి.

ఈ ప్రత్యేక లక్షణాల వల్ల వలస భారతంలో పెట్టుబడిదారీ దోపిడీ, మరింత తీవ్ర అణచివేతకు దారితీసింది. మొరటుగా చెప్పాలంటే, వలస పాలనంటే సామ్రాజ్యవాదుల ఆధిపత్యంతో సాగే బహిరంగ నియంతృత్వం, అంటే వలస దేశాల్లో కార్మిక వర్గ అణచివేత ఊహించనలవి కానంత స్థాయికి పెరిగి, వికృతమైన, భయంకరమైన స్వభావాన్ని సంతరించుకుంది. వలస భారతంలో కార్మికవర్గం ప్రజలందరితో పాటు జాతీయంగా, సాంఘికంగా అణచివేతకు గురి కావడమే గాక, తీవ్రమైన పెట్టుబడిదారీ దోపిడీ భారాలను కూడా మోయవలసి వచ్చింది.

విజయవంతంగా ఆర్థిక పోరాటాలను సాగించడం ద్వారా శ్రమశక్తిని అమ్ముకునేందుకు తగిన పరిస్థితులను నిర్ణయించడానికి, పెట్టుబడిదారీ దోపిడీ తీవ్రతను అంచనా వేయడానికి సాధ్యపడుతుంది. పోటీపడి, అంతులేని లాభాల కోసం అర్రులు చాచే పెట్టుబడిదారుల దురాశకు ఈ పోరాటాలు అడ్డుకట్ట వేస్తాయి. స్వతంత్ర దేశాల్లో పారిశ్రామిక కార్మికుడు తన శ్రమశక్తి, విలువకు దాదాపు తగిన మూల్యాన్నో లేదా తన జీవనానికి కావలసిన కనీస వేతనాన్నో సంపాదించుకుంటున్నాడు. కాని వలస భారతంలో కార్మికుల సాంస్కృతిక వెనుకబాటుతనం, వారికి ప్రాథమిక విద్య కూడా లేకపోవడం, వారి (సామాజిక) పొందికలో వున్న భిన్నత్వంతో పాటు, వారు సంఘటితమవడంలో జరిగిన జాప్యం వంటి కారణాల వల్ల కార్మిక వర్గం

విజయవంతంగా ఆర్థిక పోరాటాలు నిర్వహించడంలో అవరోధాలేర్పడ్డాయి. ఫలితంగా దోపిడీ ఎంతటి తీవ్ర స్థాయికి చేరుకుందంటే, కార్మికుడు తన శ్రమశక్తి నిజ విలువలో అత్యంత స్వల్ప భాగాన్ని మాత్రమే పొందగలిగాడు.

వలస ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే కార్మిక వర్గ జీవన పరిస్థితులు మరింత దిగజారడానికి కారణభూతమైంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యం కారణంగా భారతీయ పెట్టుబడిదారులు మిక్కిలి అనాగరికమైన పద్ధతుల్లో దోపిడీ కొనసాగించవల్సిన పరిస్థితులేర్పడ్డాయి. పెట్టుబడిదారీ విధానం ఒక దశకు అభివృద్ధి చెందిన తర్వాత, మరింత అదనపు విలువను సంపాదించాలన్నదే లక్ష్యంగా వున్నపుడు, కార్మికులను దాదాపుగా మధ్య యుగపు పద్ధతుల్లో అణచివేయడం లాభసాటి కాదని, బూర్జువా వర్గానికే అనిపిస్తుంది. వలస దేశాల్లో విదేశీ గుత్త పెట్టుబడిదార్లకు యావత్ ప్రభుత్వ యంత్రాంగం మద్దతున్నపుడు, స్వదేశీ పెట్టుబడిదార్లు వారితో పోటీపడటం చాలా కష్టమైంది. ఈ పరిస్థితులను అధిగమించడానికి దేశీయ పెట్టుబడిదారులు, కార్మిక వర్గాన్ని అనైతిక పద్ధతుల్లో, విచక్షణారహితంగా దోపిడీకి గురిచేశారు.

భారతదేశంలో చేపట్టిన ఈ దోపిడీ పద్ధతుల కారణంగా కార్మిక వర్గ మనుగడకే ముప్పు వాటిల్లింది. అందువల్ల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం భారత శ్రామిక వర్గం యొక్క ప్రధాన కర్తవ్యమైంది. అయితే ఈ వాస్తవం గ్రహించి, రాజకీయ చైతన్యం పొందడానికి భారత కార్మిక వర్గం అనేక ఆర్థిక పోరాటాల ద్వారా సుదూర ప్రయాణం చేయాల్సి వచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభ దశలో కొద్దిపాటి సామాజిక పునాది, పరిమితమైన దృక్పథం కల్గి వుండటంతో కొత్తగా ప్రారంభమైన ఈ చారిత్రక క్రమాన్ని గుర్తించలేకపోయింది.

# 7

# సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణంలో తొలిదశ 1900-1914

## శతాబ్ది ప్రారంభం - ప్రధాన లక్షణాలు

**పం**తొమ్మిదవ శతాబ్దం చివరి ఇరువది ఐదు సంవత్సరాల కాలంలో భారతదేశంలో జాతీయ విముక్తి పోరాటాలకు సానుకూల పరిస్థితులేర్పడడం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా నూతన సామాజిక, ఆర్థిక సంబంధాలేర్పడి, భారత ప్రజలు విభిన్న సామాజిక వర్గాలుగా రూపొందే క్రమం అంతర్గతంగా కొనసాగింది. వలస పాలకుల అణచివేత విధానాల వల్ల సువిశాలమైన భారత ఉపఖండంలో జరిగిన అసమాన అభివృద్ధి కారణంగా ఈ క్రమం ఒకేసారి ప్రారంభం కాలేదు. పర్యవసానంగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో జాతీయ విముక్తి ఉద్యమం ఒకే స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఈ అసమాన అభివృద్ధి వల్ల కొత్తగా ఏర్పడిన సాంఘిక, ఆర్థిక సంబంధాల వలన ప్రజలలో కొన్ని కొత్త సాంఘిక వర్గాలు ఏర్పడడంతో ఈ పోరాటం ప్రారంభమైంది. విశాలమైన భారత ఉపఖండంలో వలసపాలన వలన అనేక ప్రాంతీయ అసమానతలు ఏర్పడినాయి. ఈ అసమానతల వలన మనదేశంలో అన్ని ప్రాంతాలలో ఒకేసారిగా నూతన సాంఘిక వర్గాలు ఏర్పడలేదు. బెంగాల్, మహారాష్ట్ర మద్రాస్ ప్రెసిడెన్సీలోని కొన్ని ప్రాంతాలు భారత దేశంలోని మిగతా ప్రాంతాలకంటే సాంఘికంగా, ఆర్థికంగా చాలా అభివృద్ధి చెందాయి. బెంగాల్‌లో కలకత్తా, మహారాష్ట్రలో బొంబాయి, మద్రాసు నగరాలు దేశ ఆర్థిక, రాజకీయ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రాలై బయట ప్రపంచానికి, ప్రపంచ పెట్టుబడిదారీ మార్కెట్‌కు ముఖద్వారాలయ్యాయి.

నూతన శతాబ్ది ప్రారంభం నాటికే ఈ ప్రాంతాల్లో ప్రధానంగా బెంగాల్, మహారాష్ట్రలలో జాతీయోద్యమం బాగా అభివృద్ధి చెంది, తరువాత దేశమంతటా జాతీయ చైతన్యం పెంపొందటానికి దోహదం చేసింది. 1905లో బెంగాల్ విభజన వల్ల ప్రజలలో తీవ్రమైన కోషాగ్ని రగుల్కొని, అది ఒక పెద్ద జాతీయ వెల్లువగా పరిణమించింది. జాతీయ కాంగ్రెస్ నాయకత్వం దాదాభాయి నౌరోజి, సురేంద్రనాథ్ బెనర్జీవంటి మితవాదుల నుండి అతివాదులుగా చెప్పబడుతున్న బాలగంగాధర తిలక్, లాలాలజపతిరాయ్‌ల చేతుల్లోకి వచ్చింది. ఈ రాజకీయ

పరిణామం వల్ల భారత కార్మిక వర్గం ఆర్థిక పోరాటాలను మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు, తీవ్రతరం చేయడానికి సానుకూల పరిస్థితులేర్పడ్డాయి. 20వ శతాబ్దం ప్రారంభం నుండి, మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభానికి మధ్యకాలంలో కార్మికవర్గం దేశవ్యాప్తంగా భీషణ పోరాటాలు సాగించింది. ఈ 20వ శతాబ్దపు మొదటి దశకంలో భారత కార్మికవర్గం ఆర్థిక పోరాటాలే గాక, మొట్టమొదటి విప్లవ రాజకీయ పోరాటాన్ని కూడా అత్యద్భుతంగా నిర్వహించింది. ఉన్నత స్థాయికి చేరిన ఈ పోరాటాలే భారత కార్మిక వర్గానికి వర్గ సంఘాలైన ట్రేడ్ యూనియన్ల ఆవిర్భావానికి పునాది వేశాయి.

20వ శతాబ్ది ప్రారంభంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో కార్మికుల సంఖ్యాబలం కూడా విపరీతంగా పెరిగింది. 1914 చివరి నాటికి భారతదేశంలో పారిశ్రామిక కార్మికుల సంఖ్య 9,50,973కు చేరింది.

## స్వదేశీ ఉద్యమంలో కార్మికుల పాత్ర

1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమం నుండి ఆవిర్భవించిన స్వదేశీ ఉద్యమం కేవలం బెంగాల్ సరిహద్దులకో లేదా వర్గ రీత్యా పెట్టుబడిదారులు, చిన్న పెట్టుబడిదారులకో పరిమితం కాలేదు. ఈ ఉద్యమ ప్రభావంతో బెంగాల్‌లోని కార్మిక వర్గం అనేక పోరాటాలు సాగించింది. ఈ ఉద్యమం విభజన సమస్య పరిధులను అధిగమించి, వలస పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటాలు సాగించే విధంగా కార్మిక వర్గాన్ని జాగృతం చేసింది. ఈ ఉద్యమం భారత రాజకీయ చరిత్రలో, జాతీయ బూర్జువా వర్గ నినాదాలతో నిర్వహించిన సంఘటితమైన, చైతన్యయుతమైన ప్రజా ఉద్యమంగా పరిణితి చెందింది.

బెంగాల్లోకి జాతీయవాదులు కార్మిక వర్గాన్ని కూడ ఈ ప్రజా ఉద్యమం లోనికి తీసుకురావడానికి, వారి ఆర్థిక, సాంఘిక పోరాటాలకు మద్దతునిచ్చారు. కార్మిక వర్గం ఈ ఉద్యమంలో పాల్గొనడంతో ఉద్యమం సమరశీల స్వభావాన్ని సంతరించుకొంది. ఈ కాలంలో జరిగిన సమ్మెలో కలకత్తాలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్‌లో జరిగిన సమ్మెను ప్రత్యేకంగా పేర్కొనాలి. ఈ సంస్థలో పనిచేసే దాదాపు 2,000 మంది ఉద్యోగులు సెప్టెంబరు 27 నుండి నెల రోజులు సమ్మె చేశారు. ఆదివారానికి, ప్రకటించిన సెలవు రోజులకు జీతాలు ఇవ్వకపోవడం, అనాలోచితంగా విధించే ఫైన్లు, అతి తక్కువ ఓవర్‌టైమ్ వేతనం, మెడికల్ సర్టిఫికెట్లు యిచ్చినా సెలవు మంజూరు చేయకపోవడం మొదలైన సమస్యలపై ఉద్యోగులు సమ్మె చేశారు.

“సమ్మె ప్రారంభానికి ముందే కార్మికుల ప్రతినిధులు, కార్మిక సంఘాలను నడుపుతున్న ఎ.సి. బెనర్జీ అనే కలకత్తా బారిష్టర్ సలహా కోరగా, ఆయన వారికి, సంఘటిత కార్యాచరణ ఆవశ్యకతను గురించి, అవసర సమయాల్లో ఉపయోగించుకొని సమ్మెను విజయవంతంగా నిర్వహించేందుకు ఒక కమిటీ ఆధ్వర్యంలో రక్షణ నిధిని ఏర్పాటు చేయవల్సిన అవసరాన్ని

వివరించగా వారు దాని కంగీకరించినట్లు" అమృతబజార్ పత్రిక పేర్కొంది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్‌లో సమ్మె ప్రారంభం కాగానే బెంగాల్ సెక్రటేరియట్ ప్రెస్ కార్మికులు కూడ సమ్మెలో చేరారు. బెంగాల్ ప్రభుత్వం, ఆర్థిక శాఖ అండర్ సెక్రటరీ రైనీని కార్మికుల సమస్యల మీద దర్యాప్తు చేయడానికి నియమించింది. ఈ దర్యాప్తు న్యాయంగా జరగలేదని, ఇది కార్మికులకు నిరాశ కల్గించిందని అమృతబజార్ పత్రిక రాసింది. బెంగాల్ సెక్రటేరియట్ ప్రెస్‌లో 1905 అక్టోబర్ 2న ప్రారంభమైన దర్యాప్తును గురించి "పత్రిక" ఈ క్రింది విధంగా రాసింది.

"సోమవారం ఉదయం 10.30 గంటలకు రైనీ దర్యాప్తు ప్రారంభించారు. ఆయన రాకకు ముందే ప్రెస్ గేట్ మీద ఒక నోటీసు అంటించారు. కార్మికులు తమ ఇబ్బందులను న్యాయవాది ద్వారా రిప్రజెంట్ చేసుకునే అవకాశం కల్పించాలని చేసుకున్న అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు ఆ నోటీసులో వుంది. ఈ విషయం కార్మికులు తెలుసుకునేందుకు వీలుగా ఈ నోటీసును కనీసం రెండు రోజులు ముందుగా అంటించవల్సింది. చివరి నిమిషంలో దీనిని చూసిన కార్మికులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కార్మికులీ నోటీసు చదవడానికి కూడా చామర్ అవకాశమివ్వలేదని, పైపెచ్చు అక్కడకు వచ్చేవారిని గమనించవలసిందిగా ఒక దర్వాన్‌ను నియమించినట్లు తెలిసింది.

సోమవారం రోజున కంపోజిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రెస్ వర్కర్లు మొత్తం 12 మందిని విచారించారు. రైనీ స్వయంగా ప్రెస్‌కు వెళ్ళకుండా, కార్మికులనే తన గదికి పిలిపించుకున్నారు. దుబాసీని కూడా ఆయనే ఎంపిక చేసుకున్నారు. ప్రెస్ సూపరింటెండెంట్‌కు, ప్రస్తుతమున్న ఫైనాన్స్ రిజిస్ట్రార్‌కు సన్నిహిత సంబంధాలుండటం వల్ల ఆర్థిక శాఖతో సంబంధం లేనివారినే దుబాసీగా నియమించాలని కార్మికులు కోరుతున్నారు. సోమవారంనాడు విచారించిన వారిలో సగం మందిని ఒక పద్ధతి ప్రకారం కాక, తమ ఇష్టం వచ్చినట్లు ఎంపిక చేసుకోవడంవల్ల, తమ బాధలను చెప్పుకుందామని ఆశపడిన వారికి అసలు అవకాశమే దొరకలేదు."

ఈ విచారణ ప్రహసనం, సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వెల్లడవుతుంది. ఏమైతేనేం ముందు ఈ సమస్యల మీద ఒప్పందం కుదిరింది. కాని అంగీకారం కుదిరిన వెంటనే ఏడుగురు కార్మిక నాయకులను పనుల నుండి తొలగించి, అరెస్టు చేయించారు. వెంటనే సమ్మె ప్రారంభమైంది. సమ్మెకు మద్దతుగా జరిగిన ప్రదర్శనలో స్వదేశీ ఉద్యమ నాయకులు కూడా ప్రసంగించారు. దీనిని సాకుగా తీసుకున్న ప్రభుత్వం, సమ్మె రాజకీయ ఉద్దేశాలతో ప్రేరేపించబడిందని ఆరోపించి, సమ్మె విచ్ఛిన్నానికి పూనుకుంది. "లెఫ్టినెంట్ గవర్నర్ సర్ ఆండ్రూ ఫ్రేజర్ జోక్యం చేసుకుని, తక్కువ జీతాలు పొందుతున్న నిరుపేద కార్మికులకు న్యాయం చేకూర్చగలరని, గవర్నమెంట్ ప్రెస్‌లో తలెత్తిన వివాదాన్ని శాశ్వతంగా, సంతృప్తికరంగా పరిష్కరించగలరని విశ్వాసం" వ్యక్తం చేస్తూ, అమృతబజార్ పత్రిక అక్టోబర్ 27వ తేదీ సంపాదకీయం ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేసింది.

అక్టోబర్ 27వ తేదీన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్‌కు, బెంగాల్ సెక్రటేరియట్ ప్రెస్‌కు చెందిన కంపోజిటర్లు, ఇతర ప్రెస్ కార్మికులు తమ సమస్యల గురించి చర్చించడానికి బాహిర్ సిమ్లాలోని 10, శివనారాయణ దాస్ లేన్ వద్ద సమావేశమయ్యారు. సమావేశానికి బాబు చారుచంద్ర మిత్తర్ అధ్యక్షత వహించారు. బెంగాల్ ట్రేడ్ యూనియన్ నాయకులలో మొదటి తరానికి చెందిన శ్రీ ఎ.కె. ఘోష్ ఆ సమ్మెకు నాయకులు. ఆయన ప్రసంగంలో అక్టోబరు 21న జరిగిన కార్మికుల సమావేశం గురించి ప్రస్తావిస్తూ, ఆ సమావేశంలో యూనియన్‌ను నిర్మించటానికి నిర్ణయం తీసుకున్నారనీ, బార్–ఎట్–లా, శ్రీ ఎ.కె.ఘోష్ పండిట్ బి. ఉపాధ్యాయలు గౌరవ కార్యదర్శులుగా ఒక కమిటీ ఎన్నుకున్నారనీ చెప్పారు. యూనియన్ కమిటీ పర్యవేక్షణలో కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించి పెంపొందించటం, యూనియన్ ప్రధాన లక్ష్యంగా వుంటుందని, ఇందుకు ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపటానికి, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటానికి కమిటీకి అధికారం ఇవ్వబడిందని ఆయన అన్నారు.

దేశంలో తొలిసారిగా ప్రారంభమైన ట్రేడ్ యూనియన్లలో బెంగాల్ ప్రెస్ వర్కర్సు యూనియన్ ఒకటి. ఇది 1905 అక్టోబర్ 21న ఆవిర్భవించింది. ఈ సమావేశం తరువాత కొన్ని సమస్యలు పరిష్కారమవడంతో కార్మికులు తిరిగి పనిలోకి ప్రవేశించారు. ప్రెస్ నిబంధనావళిలో బెంగాల్‌లో ప్రకటించిన సెలవులు చేర్చడం, అచ్చులు సార్టింగు చేసేపని తగ్గింపు, కంపోజిటర్ల కేసుల వద్ద పనిచేసే కూలీల సంఖ్య పెంచడం, జీతాల మీద పనిచేసే వారి ఓవర్‌టైం చెల్లింపు, ఫైన్ రిజిష్టర్లను సక్రమంగా వుంచడం, మొదలైన విషయాలపై కార్మికులు విజయం సాధించారు. పనిలోంచి తొలగించబడిన వారిని మాత్రం మళ్ళీ పనిలో పెట్టుకోలేదు.

1905లో ప్రారంభమైన సమ్మె వెల్లువ అనేక పారిశ్రామిక సంస్థలను కుదిపివేసింది. అదే ఏడాది సెప్టెంబరులో హౌరాలోని బర్న్ అండ్ కంపెనీ కార్మికులు, కలకత్తా ట్రామ్‌వే కంపెనీ కార్మికులు సమ్మె చేసారు. కలకత్తా కార్పొరేషన్‌కు చెందిన దాదాపు రెండువేలమంది కూలీలు, పారిశుధ్య పనివారు జీతాల పెంపుదల కోరుతూ సమ్మె చేసి, కొంతమేరకు విజయం సాధించారు. ఈస్టిండియా రైల్వేలోని 950 మంది గార్డులు ఆనాడు అమలులో వున్న వేతన విధానానికి వ్యతిరేకంగా 1905 అక్టోబరులో సమ్మె చేశారు. కలకత్తాకు కొద్ది మైళ్ళ దూరంలో నున్న బడ్జ్ బడ్జ్‌లోని క్లైవ్ జూట్‌మిల్లులో బ్రహ్మాండమైన సమ్మె జరిగింది. తమ పని పరిస్థితులు మెరుగుపర్చాలని, బ్రిటిష్ యాజమాన్యం కార్మికుల పట్ల అవమానకరంగా ప్రవర్తించడం మానుకోవాలడి డిమాండ్ చేస్తూ 1906 ఆగస్టులో వెయ్యి మంది కార్మికులు పనులు నిలిపివేసి సమ్మె చేసారు.

ఈ సమ్మె జరుగుతున్న సమయంలోనే జూట్ వర్కర్స్ యూనియన్ ఏర్పడింది. ఈ యూనియన్ నాయకుడు ఎ.సి. బెనర్జీ పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరైన సమావేశంలో ప్రసంగిస్తూ "మన దేశంలో యూరోపియన్ పెట్టుబడిదార్ల పొగరుబోతుతనం,

దుందుడుకుతనం పెచ్చరిల్లుతున్నాయి." "కార్మికుల స్థితిగతులు మెరుగుపర్చడానికి, వారి భౌతిక ఆధ్యాత్మిక అభివృద్ధికి సానుకూల పరిస్థితులు కల్పించాలని" కోరారు. అభ్యుదయ భావాలు కలిగిన ప్రముఖ జాతీయ నాయకుడు బిపిన్‌చంద్రపాల్ ఈ సమ్మె గురించి రాస్తూ, "ఆలోచనా శక్తిలేని మూగజీవుల్లా యూరోపియన్ల దోపిడీకి సాధనాలుగా ఉపయోగపడుతున్న భారతీయులు తమకు కూడా ఆత్మగౌరవం వుందని, దానిని వదులుకోజాలమని గుర్తించడంతో పాటు, సంఘటితమవడం ద్వారా హక్కులు సాధించుకోగలమని అర్థం చేసుకున్న మనుషులుగా మారుతున్నారు" అని పేర్కొన్నారు.

కలకత్తాలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్ సమ్మెతో పాటు 1906 జూన్‌లో కలకత్తాలోని థాకర్‌స్పింక్ అండ్ కంపెనీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రెస్‌లో కూడా సమ్మె జరిగింది. కలకత్తాలో 1905లో ఏర్పడిన ప్రింటర్స్ యూనియన్ ఈ సమ్మెను నిర్వహించింది. ఈ సమ్మెకు కలకత్తాలోని మిగతా ప్రింటింగ్ ప్రెస్‌లలో పనిచేస్తున్న కార్మికులు సమ్మె కాలంలో సంఘీభావ ప్రదర్శనలు, వూరేగింపులు జరిపి మద్దతు ప్రకటించడం విశేషం. ఈ సమ్మె జాతీయ భావాలతో ప్రేరేపితమైంది. జాతీయ ఉద్యమాన్ని ఉత్తేజితం చేసిన వందేమాతరం నినాదం, గత ఏడాదిలో గవర్నమెంట్ ప్రెస్ కార్మికుల సమ్మెను ప్రభావితం చేసినట్లే, ఈ సమ్మెలో పాల్గొన్న కార్మికులను కూడ ఉత్తేజపరచింది. ఈ సమ్మె జాతీయ స్థాయిలోనే ప్రాధాన్యత సంతరించుకున్నది. శ్రీ బాలగంగాధర తిలక్, శ్రీ కపర్ధీ, డాక్టర్ మున్‌జీ మొదలయిన ప్రముఖ జాతీయ నాయకులు కలకత్తాలో 1906 జూన్ 6న ప్రింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అతి పెద్ద కార్మికుల సమావేశంలో ప్రసంగించడానికి ఆహ్వానించబడ్డారు. శ్రీ తిలక్ ఉపన్యసిస్తూ "తాను కూడా యంత్రాలు నడిపేవాడినేనని, అందువలన అక్కడ చేరిన వారిలో తాను కూడా ఒకడినే" అని చెప్పినట్లు ది బెంగాలీ అనే పత్రిక ప్రచురించింది. ఆ తరువాత శ్రీ తిలక్ "మతాలు, విశ్వాసాలు ప్రాతిపదికగా ఏర్పడిన ప్రాచీన కులవ్యవస్థను నేటి ట్రేడ్ యూనియన్ల నిర్మాణ అవసరాలకు అనుగుణంగా ఎలా మలచుకొనవచ్చునో" వివరించారు. యూనియన్లకు బ్రహ్మాండమైన భవిష్యత్తువుందని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే బొంబాయిలో ఇటువంటి యూనియన్ ఒకటి ఏర్పాటవబోతోందని ఆయన చెప్పారు. యూనియన్‌కూ, థాకర్ స్పింక్ అండ్ కంపెనీకీ మధ్య ఒప్పందం కుదిరిన తరువాత, 1906 జూన్ 13న కార్మికులు తిరిగి పనిలోకి ప్రవేశించారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ చైతన్యంతో జరిగిన ప్రధానమైన కార్మికోద్యమాలలో, 1906 జూలై నుండి సెప్టెంబరు మధ్యకాలంలో ఈస్టిండియన్ రైల్వేలోని బెంగాల్ సెక్షన్‌లో జరిగిన పెద్ద సమ్మెను పేర్కొనవచ్చు. "ఈ సమ్మె రాజకీయ ఆందోళనకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది." అని 'లండన్ టైమ్స్' పత్రిక వాపోయింది. కొద్ది రోజులపాటే జరిగిన ఈ సమ్మెలో భారతీయ కార్మికులందరూ పాల్గొన్నారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా" కథనం ప్రకారం "స్వదేశీ కార్మికులందరు పనివదలిపెట్టారు. హౌరా నుండి అసన్‌సోల్ వరకూ బర్ద్వాన్‌తో సహా అన్ని స్టేషన్లు మూతపడ్డాయి. సరుకుల రవాణా పూర్తిగా స్తంభించిపోయింది."

ఎక్కువ జీతాలు, మెరుగైన పని పరిస్థితులు కావాలని, వర్ణ వివక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మె చేశారు. "ప్రాంతీయులు" అన్న పదం చాలా అవమానకరమైన అర్థం యిస్తోంది కాబట్టి "భారతీయులు" అన్న పదం వాడాలని కోరారు.

రైల్వేస్టేషన్లను పోలీసులు ఆక్రమించినప్పటికీ సమ్మె చేసే కార్మికులు ఏమాత్రమూ బెదరకుండా నిర్మాణయుతంగా సమ్మెలో పాల్గొన్నారు. నాయకులు అనేక స్టేషన్లు సందర్శించి సమావేశాలలో ప్రసంగించారు. కానీ వలస పాలకులు సమ్మెను అణచివేయడంలో సఫలీకృతులయ్యారు. సమ్మెలో పాల్గొన్న ముఖ్య కార్యకర్తలను, వారికి 20 నుండి 25 సంవత్సరాల సర్వీసు వున్నప్పటికీ పనిలో నుండి తొలగించడం ద్వారా కక్ష సాధింపుకు పూనుకున్నారు.

జాతీయోద్యమంలో ప్రత్యక్ష సంబంధమున్న సమ్మెల్లో బహుశా ఇది మొదటిదే కావచ్చు. కానీ, ఈ సమ్మె వృధా పోలేదు. ఇది భారతదేశంలోని మొట్టమొదటి ట్రేడ్ యూనియన్లలో ఒకటైన ఈస్టిండియన్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావానికి దారితీసింది. ఈ సమ్మెలో మిక్కిలి ప్రభావితులైన స్వదేశీ ఉద్యమ నాయకులు సమ్మెను కొత్త ప్రాంతాలకు విస్తరింపచేయడానికి అనేక బహిరంగ సభలు నిర్వహించారు. నాటి ప్రముఖ జాతీయ నాయకుల్లో ఒకరైన శ్రీ చిత్తరంజన్‌దాస్ జూలై 29న కలకత్తాలో సమ్మె చేస్తున్న రైల్వే కార్మికుల సమావేశానికి ఆధ్యక్షత వహించారు.

మరొక ప్రముఖ జాతీయోద్యమ నాయకుడు శ్రీ బిపిన్‌చంద్ర పాల్ సమ్మెకు మద్దతుగా తీర్మానాన్ని ప్రతిపాదించి, హక్కులు సాధించే సమ్మెను కొనసాగించవలసిందిగా కార్మికులను కోరారు. సమ్మెను అణచివేసిన తరువాత కూడా ట్రేడ్ యూనియన్ నాయకులు రైల్వే కార్మికులను సంఘటితం చేసేందుకు నిర్విరామంగా సాగిస్తున్న కృషిని, కార్మికుల్లో నానాటికి పెరుగుతున్న జాతీయ భావాలను గమనించిన సామ్రాజ్యవాద పాలకులు కలవరపడ్డారు. ఈ దిగువ నుదహరించిన స్పెషల్ బ్రాంచి నివేదికను పరిశీలిస్తే, ప్రభుత్వం ఎంత భయోత్పాతానికి గురైందో వెల్లడవుతుంది. "కలకత్తా ఆందోళనకారుల్లో ప్రేమ్‌తోష్ బోస్, ఎ.కె. ఘోష్, లియాఖత్ హుస్సేన్‌లు ఆగస్టు నెల నుంచి అసన్‌సోల్, రాణిగంజ్, జమాల్‌పూర్, సాహెబ్‌గంజ్ ప్రాంతాల్లో వున్న రైల్వే కేంద్రాలను తమ కుట్రలకు కేంద్రంగా చేసుకున్నారు. రైల్వే కార్మికులు చేసే పోరాటాలకు మద్దతిస్తున్నది కనుక, తాము ప్రారంభించిన రైల్వే యూనియన్‌లో చేరవలసిందిగా ఈ ప్రాంతాల్లోని కార్మికుల మీద ఒత్తిడి తెస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో ఒక వారం చొప్పున ప్రతివారం ఒక కేంద్రం తర్వాత మరొక కేంద్రంలో సభలు జరిపారు. ఈ సమావేశాల్లో హౌరా జిల్లాలోని తమ సోదరుల మద్దతు పొందేందుకు వారిని ఉద్రేకపర్చి, రెచ్చగొట్టే భాషను ఉపయోగించారు. తద్వారా కంపెనీ మీద ఒత్తిడి తెచ్చి, తమ డిమాండ్ల సాధనకు ప్రయత్నాలు సాగించారు. ఈ సమావేశాల్లో స్వదేశీ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు, బ్రిటిష్ సరుకుల బహిష్కరణకు, కార్మికులను రెచ్చగొట్టేందుకు వచ్చిన ఏ అవకాశాన్ని వీరు జారవిడుచుకొనలేదు. అసన్‌సోల్, కలకత్తాలలో రహస్య సమావేశాలు జరిపి అవకాశం వస్తే

కూలీలను  కూడా సమ్మెలో దించడానికి ప్రయత్నాలు సాగించారు. విధి నిర్వహణ నిమిత్తం రైళ్ళలో ప్రయాణం చేసే ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఆ రైలు మార్గంలోని ఇతర రైల్వే ఉద్యోగులలో ప్రభుత్వ వ్యతిరేక భావాలను వ్యాపింపజేస్తున్నారు. సమ్మెలో ఉద్యోగులు బలవంతంగా పాల్గొనేటట్లు చేయడానికి, సాంఘికంగా వెలివేయాలనే సూచన కూడా వచ్చింది" అని స్పెషల్ బ్రాంచి నివేదిక పేర్కొంది. "ఉరకలు వేస్తున్న జాతీయ ఉద్యమంతో జోడించిన రైల్వే కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు వలస పాలకులనెంతగా భయకంపితులను చేసిందీ ఈ నివేదిక తెలుపుతోంది.

అదే సంవత్సరం ఆగస్టు నెలలో జమాల్‌పూర్ రైల్వే వర్క్‌షాపులో యూనియన్ ఆధ్వర్యంలో మరొక సమ్మె జరిగింది. ఈసారి సమ్మె చేస్తున్న కార్మికులు పోలీసు దాడులను ప్రతిఘటించారు. 1906లో రైల్వే కార్మికులు చేసిన ఈ అసాధారణ సమ్మె ఇతర రైల్వేల్లోని కార్మికులను కూడా ఉత్సాహపరచింది. చివరకు యిది, 1907లో మరో అతి  పెద్ద దేశవ్యాప్త రైల్వే సమ్మె జరగడానికి దారితీసింది.

1906, డిసెంబరు రెండవ వారంలో బ్రిటిష్ యాజమాన్యంలో వున్న హుగ్లీ జూట్ మిల్లులో రాత్రి షిఫ్టులు ప్రవేశపెట్టినందుకు, జీతాలు తగ్గించినందుకు నిరసనగా సమ్మె జరిగింది. అదే సమయంలో ఒక కాటన్ మిల్లులోని కార్మికులు ఈ సమస్యపైనే సమ్మె చేశారు. ఈ ప్రాంతంలోని జూట్ మిల్లులను సందర్శించి సంఘాలు ఏర్పాటు చేయటానికి జాతీయోద్యమకారులు ప్రయత్నించారని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' రాసింది.

ఈ ఉద్యమాలు కొనసాగుతున్న సమయంలోనే సాధారణ ట్రేడ్ యూనియన్ చైతన్యం కూడ కొరవడిన బెంగాల్ బొగ్గు గని కార్మికులు కూడ దోపిడీకి వ్యతిరేకంగా సమ్మె పోరాటం నిర్వహించాలన్న ధోరణిని ప్రదర్శించారు. బెంగాల్‌లోని కార్మికుల స్థితిగతులపై ఒక నివేదిక పంపవలసిందిగా కోరుతూ 1906లో ప్రభుత్వం బి. ఫోలే అనే ఐ.సి.ఎస్. అధికారిని నియమించింది. "రోజు రోజుకీ కూలీలు లభ్యం కావడం కష్టమౌతోంది. అందువలన ఎక్కువ జీతాలు కావాలని వారు డిమాండు చేస్తున్నారు. ఏ చిన్న సాకు దొరికినా సమ్మె చేయడానికి సిద్ధమౌతున్నారు" అని ఆయన తన నివేదికలో తెలిపారు.

కార్మికుల డిమాండ్లకు మద్దతునిచ్చిన వారిలో బెంగాల్ నుండి వచ్చిన జాతీయోద్యమ నాయకులలో శ్రీ బిపిన్ చంద్రపాల్, శ్రీ చిత్తరంజన్‌దాసు ముఖ్యులు.  వారిలో శ్రీ శ్యామ్‌సుందర్ చక్రవర్తి, అపూర్వ కుమార్ ఘోష్, ఎస్ హాల్దార్, అశ్వనీ కుమార్ బెనర్జీ, ప్రేమ్‌తోష్‌బోస్ వంటి జాతీయ నాయకులు, న్యాయవాదులు, మేధావులు కూడా కార్మికులకు బాసటగా నిలిచారు. ప్రారంభ దశలో బెంగాల్‌లో ట్రేడ్ యూనియన్ వుద్యమం నిర్మించిన వీరు,  బ్రిటీషువారి అధీనంలో వున్న పరిశ్రమలలో కార్మికోద్యమాన్ని ప్రోత్సహించి, భారతీయుల యాజమాన్యంలో వున్న పరిశ్రమల విషయంలో దాదాపు మౌనం వహించారు. నవజనిత పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు భంగం కల్గించే కార్యకలాపాల పట్ల వ్యతిరేకత, బ్రిటిష్ వారి పరిశ్రమల్లోని

కార్మిక పోరాటాలకు మద్దతు తెల్పడమనే విధానం ఆనాటి జాతీయోద్యమ భావనలు, స్వదేశీ ఉద్యమ మూల సూత్రాల నుండి జనించినవే.

1905లో పెల్లుబికిన సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ పోరాట సంరంభంలో బెంగాల్ కార్మికవర్గం నిస్సందేహంగా గణనీయమైన పాత్ర నిర్వహించింది. ఇంత ప్రశంసనీయమైన పోరాటాలు సాగించినప్పటికీ, కార్మిక వర్గం తగినంత వర్గ చైతన్యాన్ని సంతరించుకోకపోవడంతో జాతీయ బూర్జువా వర్గ నాయకత్వానికి కట్టుబడి వుండవలసి వచ్చింది.

## ఇతర ప్రాంతాల్లో పోరాటాలు

మద్రాసు గవర్నమెంట్ ప్రెస్‌లోని ప్రెస్ విభాగంలోనూ, యంత్ర విభాగంలోనూ పని చేసే కార్మికులు వేతనం లేకుండా ఓవర్ టైం పని చేయించు కుంటున్నందుకు నిరసనగా 1903లో సమ్మె చేశారు. సమ్మె 6 నెలలు కొనసాగింది. ఆ సమయంలో నేరాలు చేసిన వారిని సంస్కరించేందుకుద్దేశించిన జైలులో శిక్షననుభవిస్తున్న ఖైదీల సహాయంతో ప్రెస్ నడిపారు. అనేక కష్టాలపాలైన కార్మికులు తిరిగి పనిలోకి వచ్చారు.

1905లో విద్యుద్దీపాలు రావడంతో చాలామంది మిల్లు యజమానులు పనిగంటలు పెంచడం ప్రారంభించారు. దీనికి నిరసనగా చెదురు మదురుగా చాలా సమ్మెలు జరిగాయి. బొంబాయి టెక్స్‌టైలు పరిశ్రమలో విద్యుద్దీపాలు వచ్చాక పనిగంటలు విపరీతంగా పెంచటంతో, 1905లో అనేక మిల్లుల్లో సమ్మెలు జరిగాయి. ఈ సమ్మెల సందర్భంగా సమరశీల ప్రదర్శనలు జరిగాయి. అదే ఏడాది అక్టోబరు నెలలో విస్తృతంగా జరిగిన సమ్మెలు త్రికుమ్‌దాసు మిల్లు, ఫోనిక్స్ మిల్లు తదితర అనేక మిల్లుల మీద ప్రభావం చూపాయి. సమ్మె తీవ్రత గురించి అమృతబజార్ పత్రిక ఈ విధంగా రాసింది. "ఇటీవల జరుతున్న మిల్లు కార్మికుల ఆందోళన సందర్భంగా నిన్న సాయంత్రం (అక్టోబరు 8) తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. దాదాపు మూడు, నాలుగు వేలమంది మిల్లు కార్మికులు పరేల్‌లోని డిలిస్లే రోడ్డు మీద వున్న మిల్లుల ముందు ఉద్రేకపూరిత ప్రదర్శనలు చేశారు. ఆందోళన చేసిన కార్మికులు మిల్లుల వెలుపల పెద్ద సంఖ్యలో గుమికూడి సూర్యాస్తమయం తరువాత పని చేయడానికి నిరాకరించడమేగాక, సాయంకాలం తరువాత పనిచేసే కార్మికులను పనిచేయకుండా నిరోధించడంలో కృతకృత్యులయ్యారు. ఒక సమయంలో ఘర్షణ జరిగే ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

ప్రదర్శకులలో చాలమందిని ప్రాసిక్యూట్ చేసినట్లు "పత్రిక" తరువాత పేర్కొంది. బొంబాయిలో జీతాల పెంపుదల కోసం 1907లో కూడా సమ్మెలు జరిగాయి. కొన్ని సమ్మెలు వారం రోజుల కంటే ఎక్కువ కాలం సాగాయి.

జీతాలు పెంచాలని కోరుతూ బొంబాయిలో 500 మంది పోస్టుమెన్ 1908 ఆగస్టు 17 నుండి వారం రోజులు చేసిన సమ్మె వల్ల పోస్టల్ సర్వీసులు స్తంభించిపోయాయి. సమ్మె నాయకులలో ఆరుగురిని అరెస్టు చేయడానికి ప్రభుత్వం వారెంట్లు జారీ చేసింది.

ఈ కాలంలో అహమ్మదాబాద్‌లో ఫ్యాక్టరీల సంఖ్య పెరగడంతో కూలీల కొరత

ఏర్పడింది. జీతాల పెంపుదల డిమాండ్ చేసేందుకీ పరిస్థితి అనువుగా వుందని కార్మికులు భావించారు. వేతనాల పెంపుదల కోరుతూ అనేక పాక్షిక సమ్మెలు జరిగాయి.

ఈ కాలంలో సమ్మెల సంఖ్య తీవ్రత పెరిగాయి. ప్రభుత్వ ప్రతినిధులు, యజమానులు యిచ్చిన అనేక స్టేట్‌మెంట్లు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. బొంబాయిలో ఒక మిల్లు యజమాని "చాలా సమ్మెలు నిర్మాణయుతంగా, విజయవంతంగా జరుగుతున్నాయని" ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ ముందు చెప్పాడు. "సర్వసాధారణంగా, అధిక జీతాల కోసం సమ్మెలు జరుగుతున్నాయి. యజమానులు తప్పనిసరిగా లొంగిపోవాలి, లేకపోతే ఇతర యజమానులు ఈ కూలీలను తమ వద్ద పనులకు పెట్టుకొనే ప్రమాదముంది" అని అహమ్మదాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ అన్నారు. పెట్టుబడిదారులు నానాటికి పెరుగుతున్న కార్మికుల ప్రతిఘటన నెదుర్కొంటున్నారు. అయితే బొంబాయి ప్రెసిడెన్సీ పరిశ్రమల డైరెక్టర్ శ్రీ బరూచా "యజమానులకు వ్యతిరేకంగా కార్మికవర్గం చాల శక్తివంతంగా వుంది. వారికి కార్మికసంఘాలు లేకపోయినప్పటికీ వారు ఏకమవుతున్నారు" అని పేర్కొన్నారు. వార్ధా డిప్యూటీ కమీషనర్ ఒక బ్రిటిషువాడు. ఇంకా శైశవదశలోనే వున్న భారత కార్మికవర్గం యొక్క వర్గ చైతన్యం ఆయనకు భయం కలుగజేసినట్లుంది. "పరిస్థితి పూర్తిగా కార్మికుల చేతుల్లో వుంది. వాస్తవానికి కార్మికుల కంటే యజమానులకే రక్షణ కావాలి" అని ఆయన అన్నారు. పరిస్థితి తీవ్రతను ప్రభుత్వాధికారులు, యజమానులు ఎక్కువ చేసి చూపి వుండవచ్చు. కానీ, ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ ఈ విషయంలో చేసిన పరిశీలన వాస్తవానికి దగ్గరగా వుంది." "బొంబాయి తదితర పారిశ్రామిక కేంద్రాలలో సాగిన వుద్యమాల చరిత్రను పరిశీలిస్తే, కార్మికులు స్థానిక సమ్మెల ప్రభావాన్ని అర్ధంచేసుకుని, అప్పుడప్పుడు తమ డిమాండ్లను యజమానులచేత అంగీకరింపజేయడంలో పలు పర్యాయాలు కృతకృత్యులయినప్పటికీ, వారు తమ ఉమ్మడి లక్ష్యసాధనకు విస్తృత పరిధిలో సంఘటితమై సమైక్య పోరాటాన్ని సాగించగల్గిన పరిస్థితిలో లేరు అని కమిషన్ అభిప్రాయపడింది.

కార్మికోద్యమాలు ఎక్కువగా వ్యాప్తి చెందటం ప్రభుత్వానికి తీవ్ర ఆందోళన కల్గించింది. అందువలన కార్మిక సమస్యలపై దృష్టి పెట్టవలసిన అవసరం ప్రభుత్వానికి ఏర్పడింది. తమ వ్యాపార ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని లాంక్‌షైర్‌కు చెందిన బ్రిటిష్ పెట్టుబడిదార్లు కూడ చౌక కూలిరేట్లు, ఎక్కువ పనిగంటలు తదితర దురాగతాల వల్ల భారత పరిశ్రమలలో వచ్చిన వివాదాలను, ఫిర్యాదులను పరిష్కరించవలసిందిగా ప్రభుత్వం మీద తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. దీనితో టెక్స్‌టైల్ ఫ్యాక్టరీలలోని కార్మికుల స్థితిగతులు పరిశీలించడానికి, 1906, డిసెంబరు 17న ప్రభుత్వం టెక్స్‌టైల్ ఫ్యాక్టరీ లేబర్ కమిటీని నియమించవలసి వచ్చింది. దీన్నే ఫ్రీయర్‌స్మిత్ కమిటీ అని కూడా అంటారు. ఈ కమిటీ 1907, జూన్ ఒకటిన తన నివేదికను సమర్పించింది. భారతీయ కార్మికులను నిర్ధాక్షిణ్యంగా దోపిడీ చేస్తున్నారని, వారికి గృహవసతి దయనీయంగా వున్నదని నివేదిక ధృవపర్చింది. పనిగంటలు రోజుకు 12 గంటలు, వారానికి 72 గంటలు మించి వుండరాదని కమిటీ సిఫార్సు చేసింది.

బొంబాయి, కాన్పూరు నగరాల్లోని బ్రిటిష్ యజమానులు రోజూ 12 గంటల కంటె

ఎక్కువ పని చేయించరాదన్న ప్రతిపాదనను వ్యతిరేకించారు. బొంబాయి మిల్ ఓనర్స్ అసోసియేషన్ 12 గంటల పని దినం గురించి గతంలో రెండుసార్లు చేసిన నిర్ణయాన్ని, భారతీయ మిల్లు యజమానులు ఉల్లంఘించారు. ఈ విషయంలో భారతీయ, బ్రిటిష్ పెట్టుబడిదారీవర్గ స్వార్థపర ప్రయోజనాలు ఒకటేనని తేలింది. వారు కలిసికట్టుగా పనిగంటల పరిమితిని వ్యతిరేకించారు. 1906-1907 మధ్య కాలంలో తీవ్ర స్థాయిలో సాగిన కార్మికోద్యమాల ఫలితంగా నూలు బట్టల పరిశ్రమతో పాటు, ఇతర పరిశ్రమల్లోని కార్మికుల స్థితిగతులను కూడా పరిశీలించేందుకు 1907 సంవత్సరాంతంలో మారిసన్ అధ్యక్షతన ఫ్యాక్టర్ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయవలసి వచ్చింది.

అధికారుల జోక్యాన్ని పనిగంటలు పరిమితం చేయడాన్ని, భారత పరిశ్రమాధిపతుల్లో అత్యధికులు వ్యతిరేకించారు. కార్మికులు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు పనిచేయాలని వారు పట్టుపట్టారు. కమిషన్ సభ్యునిగా వున్న ఆనాటి ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ విఠల్‌దాస్ దామోదర్ థాకర్సే భారత పెట్టుబడిదార్ల ఈ అభిప్రాయాలను అసమ్మతి పత్రం ద్వారా రాత పూర్వకంగా వ్యక్తంచేశారు. భారతదేశ పరిస్థితుల కనుగుణంగా వుండి పారిశ్రామికవేత్తలకు, కార్మికులకు ఆమోదగ్యమైన వ్యవస్థలో ప్రధానంగా 1891లో ప్రభుత్వం ఇచ్చిన హామికి విరుద్ధంగా ఈ పద్ధతిని మార్చడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవడం కేవలం అన్యాయం, అక్రమం" అని ఆయన ఉద్ఘాటించారు. పురుష కార్మికుల విషయంలో పనిగంటలు నిర్ణయించడానికి చట్టాలు చేయరాదని 1890లో ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ చేసిన సిఫార్సులను ఆయన తన వాదనలను సమర్థించుకునేందుకు ఉదహరించారు. కమిషన్ నివేదికకు డాక్టర్ టి.ఎమ్. నాయర్ రాతపూర్వకంగా నమోదుచేసిన అసమ్మతి ద్వారా, భారత పారిశ్రామికవేత్తలు కార్మికుల పట్ల అవలంబిస్తున్న వైఖరిని మరోసారి బహిర్గతం చేశారు. "నా దేశస్థులయిన యజమానులు కార్మికుల పట్ల యూరోపియన్ యజమానులకంటే కర్కశంగా వ్యవహరిస్తున్నారు. ఎంతో చదువుకుని, ఎన్నో విషయాలు తెలిసిన కొందరు పెద్దలతో పారిశ్రామిక సమస్యల గురించి చర్చించినపుడు, వారు కార్మికుల పట్ల సానుభూతితో మాట్లాడిన మాట ఒక్కటి కూడా లేదు. వృథా అయిన కాలంలో కోల్పోయిన లాభాలను పూడ్చుకొని తమ సంపదను వృద్ధి చేసుకునేందుకు వారు మిక్కిలి ఆతురతతో వున్నారు. వారి దృష్టిలో కార్మికులు కూడా ఉత్పత్తిచేసే యంత్రాలలో ఒక భాగం మాత్రమే. ఇది తెలిసిన తరువాత నా మనస్సు వికలమై, చాలా అసంతృప్తి చెందాను" అని డాక్టర్ నాయర్ పేర్కొన్నారు. శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా భారత పెట్టుబడిదారీ వర్గ ఐక్యత ఎంత గాఢంగా వుందో ఈ అంశం మరోసారి వెల్లడిస్తుంది.

బ్రిటిష్ పెట్టుబడిదారులు కూడా పనిగంటల పరిమితం చేయడాన్ని గట్టిగా వ్యతిరేకించారని వేరే చెప్పనక్కరలేదు. ఇండియన్ జూట్ మిల్స్ అసోసియేషన్ ఛైర్మన్ వారి తరఫున ఇందుకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. బ్రిటన్‌లోని ట్రేడ్ యూనియన్లకు పనిగంటల విషయంలో శాసించే అధికారం వుంటే వుండవచ్చు కానీ, అటువంటి సంఘాలు ఇండియాలో వుండటం తన కిష్టంలేదని, ఆగ్రాలోని ఒక బ్రిటిష్ ఫ్యాక్టరీ యజమాని తన అక్కసు వెళ్ళగక్కాడు.

కనుక ఈ విషయంలో భారత, బ్రిటిష్ పెట్టుబడిదారులు కలిసి వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతుంది.

## 1907 సర్వవ్యాప్త రైల్వే కార్మిక సమ్మెలు

నానాటికి దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు, పెరుగుతున్న పనిభారంతో పాటు తీవ్రతరమవుతున్న కారణంగా, వివిధ రైల్వేలలోని కార్మికులు 1907లో విస్తృత స్థాయిలో కార్యాచరణకు పూనుకొనవలసివచ్చింది.

పెద్ద రైల్వే వర్కుషాపులో యాజమాన్యం దమననీతిని కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించారు. 1907, మే 1వ తేదీన బొంబాయిలోని రైల్వే వర్కుషాపుల్లోని 3000 మంది కార్మికులు సమ్మె చేశారు. సమ్మె వారం రోజులకు పైగా కొనసాగింది. కొన్ని సదుపాయాలు సాధించుకొన్న తరువాత తిరిగి పనిలో ప్రవేశించారు.

1907లో తూర్పు భారతంలోని రైల్వే కార్మికులు ఆ సంవత్సరంలోనే అతిపెద్ద సమ్మెలు నిర్వహించారు. నవంబరు 18వ తేదీన గార్డులు, ఇంజను డ్రైవర్లు నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెలో పాల్గొన్న వారిలో అత్యధికులు యూరోపియన్లు, ఆంగ్లో ఇండియన్లు కాగా, భారతీయులు చాల తక్కువమంది. సమ్మెలో పాల్గొన్న వుద్యోగుల కోర్కెలు ఆర్థికపరమైనవే అయినప్పటికీ, ఈ సమ్మె దేశాన్ని కుదిపివేసింది. ఈ సమ్మె కార్మిక వర్గ సంఘటిత కార్యాచరణ శక్తిని చాటిచెప్పింది.

అసన్‌సోల్ రైల్వేస్టేషన్లో ప్రారంభంమైన ఈ సమ్మె త్వరలోనే అలహాబాద్‌కు ఉత్తరాన వున్న తుండులా వరకు వ్యాపించింది. జీతాల తగ్గింపుకు దారితీసే ఫైన్లు, పెనాల్టీల విధానం రద్దు, పని పరిస్థితుల మెరుగుదల, పనిగంటలను బట్టి గాక మైళ్ళ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలనే డిమాండ్లతో పాటు మొత్తం 43 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు ఈ సమ్మె ప్రారంభమైంది.

ఒక్క ట్రెయిన్ కూడా కలకత్తాకు చేరనంత స్థాయిలో సమ్మె విజయవంతమైంది. బెంగాల్, నాగపూర్ రైల్వేకి చెందిన ఒక రైలులో శ్రీ బిపిన్ చంద్రపాల్, మరి కొంతమంది ఖైదీలను అసన్‌సోల్ నుండి కలకత్తాకు తీసుకురావాలని మేనేజ్‌మెంట్ ప్రయత్నించింది. సమ్మె చేస్తున్న 200 మంది కార్మికులు రైలు పట్టాలపై కూర్చొని ఆ ప్రయత్నం భగ్నంచేశారు. హౌరాస్టేషనులో రైల్వే కార్మికులు కృతనిశ్చయంతో సమ్మె కొనసాగించి ఒక్క ట్రైన్ కూడా స్టేషన్ నుండి కదలకుండా చేశారు. వందలమంది ప్రయాణీకులు ఆగిపోయారు. గూడ్స్ రైళ్ళకు చెందిన దాదాపు 300 వాగన్లు నిలిచిపోయాయి. నవంబరు 20 నాటికి అలహాబాద్, కాన్పూరు స్టేషన్లలో పని స్తంభించిపోయింది. హౌరా – కాల్కా లైనులో ఒక్క ట్రైన్ కూడా నడవలేదు. ఈ ప్రతిష్టంభన వలన కలకత్తా మిల్లుల్లో బొగ్గుకు కొరత ఏర్పడింది. కలకత్తా రేవు నుండి బయలుదేరవలసిన ఓడలు ఆగిపోయాయి. నవంబరు 24 నాటి కలకత్తా రేవు ప్రాంతంలో 1,000 ఖాళీ వాగన్లు, 400 సరుకు నింపిన వాగన్లు నిలిచివున్నాయి. బర్ద్వాన్, అసన్‌సోల్, మొగల్‌సరాయి, అలహాబాదు,

తుండులా, కాన్పూరు, అంబాలా మొదలైన అనేక స్టేషన్లు సమ్మె తాకిడికి గురవటంతో అన్ని మార్గాల్లో రైళ్ళ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

దానితో రైల్వే అధికారులు, ప్రభుత్వం అణచివేతకు పూనుకుంది. రైల్వేస్టేషన్లలో సైన్యాన్ని, సాయుధ పోలీసులను దించారు. హౌరాస్టేషన్‌ను సైన్యం ఆధీనంలో వుంచారు. పెద్ద సంఖ్యలో అసన్‌సోల్‌కు సైన్యం పంపారు.

ఈ విధంగా కార్మికులలో భయోత్పాతం కలిగించాలనే అధికారుల ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. సమ్మె బెంగాల్ - నాగ్‌పూర్ రైల్వేకి కూడ వ్యాపించింది. ఈ లైనులో పనిచేసే ఇంజను డ్రైవర్లను వేరే మార్గంలో పనిచేయించేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు వారికి మిక్కిలి ఆగ్రహం తెప్పించాయి. గార్డులు కూడ సమ్మెలో ప్రవేశించారు. కానీ, ఈ సమ్మె 24 గంటలకు మించి సాగలేదు. రైల్వే అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులతో ఒక శాంతి కమిటీ ఏర్పాటై, సమ్మె చేసే వుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ యిచ్చింది.

ఈస్టిండియన్ రైల్వేలో సమ్మెచేస్తున్న కార్మికులు కూడా బెంగాల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతిపాదించిన కన్సీలియేషన్ బోర్డుకు తమ డిమాండ్లను నివేదించడానికి అంగీకరించారు. ఈ ప్రతిపాదనకు రైల్వే అధికారులు కూడా ఆమోదించడంతో 1907, నవంబరు 28వ తేదీన సమ్మె విరమించబడింది.

ఈస్టిండియన్ రైల్వేలో 1907 నవంబరు 18 నుండి నవంబరు 28వ తేదీ వరకు పదిరోజుల పాటు సాగిన యీ సమ్మె మూలంగా వైస్రాయ్ ప్రధాన కార్యాలయమున్న కలకత్తాకు భారతదేశంలోని యితర ప్రాంతాలతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. భారతీయ విషయాలపై పరిశీలనలు సాగిస్తున్న ప్రముఖ సోవియట్ పరిశీలకుడు ఎ.ఐ.లెవ్‌కోస్కీ "ఇది బ్రిటిష్ పాలకుల ప్రతిష్టకు తీవ్ర విఘాతం, ఈ దెబ్బతో ప్రభుత్వానికి తన అమోఘమైన శక్తి సామర్థ్యాల మీద నమ్మకం సడలింది" అని వ్యాఖ్యానించాడు.

నిజానికి ఈ సమ్మెలో పాల్గొన్నవారిలో అత్యధికులు యూరోపియన్లు, ఆంగ్లో ఇండియన్లు అయినప్పటికి, జాతీయోద్యమం నుండి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, మొత్తం మీద ఈ సమ్మె భారత కార్మికుల మద్దతును, సానుభూతిని సంపాదించుకుంది. అసన్‌సోల్‌లో జరిగిన ప్రదర్శనలో కొంతమంది జాతీయ నాయకులు ఉపన్యాసాలివ్వడమే గాక సమ్మెకు మద్దతుగా కరపత్రాలను కూడా పంచిపెట్టారు. ఈ కరపత్రాలపై "వందేమాతరం" నినాదం వుంది.

ఈస్టిండియన్ రైల్వే సమ్మె దేశవ్యాప్తంగా వున్న రైల్వే కార్మికులలో నెలకొని వున్న అసంతృప్తిని ప్రతిబింబించింది. 1907, డిసెంబరు 21న బెంగాల్ రైల్వేలో మళ్ళీ ప్రారంభమైన సమ్మెలో ఈసారి ఇంజన్ డ్రైవర్లు, ఫైర్‌మెన్, బ్రేక్‌మెన్ జీతాల పెంపుదల కోరుతూ సమ్మె చేశారు. మళ్ళీ సైన్యాన్ని దించారు. బ్రిటిష్ సైనికుల సాయంతో రైళ్ళు నడిపారు. సమ్మె చేస్తున్న రైల్వే కార్మికులపై విపరీతమైన దమనకాండ సాగింది. 600 మంది ఉద్యోగులను

పని నుండి తొలగించి, చాలామందిని వివిధ రకాలుగా విచక్షణారహితంగా శిక్షించారు. 1908 జనవరి మొదటి వారానికి సమ్మె ముగిసింది.

పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతూ 1908 జనవరిలో బొంబాయిలోని రైల్వే వర్క్‌షాపుల్లోని 8 వేల మంది కార్మికులు సమ్మె చేశారు. తమ సమస్యలు పాక్షికంగా పరిష్కారమయ్యాక సమ్మె విరమించారు.

వివిధ రైల్వేలలోని కార్మికులు విస్తృతస్థాయిలో సాగించిన ఈ సమ్మె పోరాటాలు 1905 నుండి 1908 వరకు సాగిన సామ్రాజ్యవాద వ్యతిరేక వుద్యమాలలో ఒక భాగంగా పేర్కొనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాజాలదు.

## బొంబాయిలో భారత కార్మికుల మొదటి రాజకీయ సమ్మె

### రాజకీయ, సాంఘిక పూర్వరంగం

1908, జూలై నెలలో భారత కార్మికవర్గం, బొంబాయి నగరంలో మొదటిసారిగా ప్రత్యక్ష రాజకీయ పోరాటం ప్రారంభించింది. ఈ పోరాటం ఒక చారిత్రాత్మక సంఘటన, నూతన సాంఘిక శక్తిగా ఉద్భవించిన కార్మికవర్గంలో నిబిడీకృతమైన అమోఘ విప్లవశక్తికిదొక ఉదాహరణ. ఈ రాజకీయ సమ్మె ప్రాముఖ్యాన్ని పూర్తిగా అంచనా వేయాలంటే, ఆ కాలంలో బొంబాయిలోని కార్మికవర్గం సంఖ్యని, చైతన్యాన్ని, ఉద్యమ స్థాయిని, ఆ నగరంలో రాజకీయ ఉద్యమ స్థాయి, స్వభావాలను సరిగ్గా అర్థం చేసుకోవాలి.

20వ శతాబ్ది ప్రారంభం నాటికి బొంబాయి దేశంలో రెండవ పెద్ద నగరంగానూ. దేశంలోని రెండు పెద్ద పారిశ్రామిక కేంద్రాలలో ఒకటిగానూ అభివృద్ధి చెందింది. 1911 జనాభా లెక్కల ప్రకారం ఆ నగర జనాభా 9,79,000. 1908 ఫ్యాక్టరీ చట్టం ప్రకారం నమోదయిన ఫ్యాక్టరీల సంఖ్య 168. 1906లో జనాభాలో 34 శాతం మంది పరిశ్రమలు, భవన నిర్మాణం, రవాణా సర్వీసులు మరియు వాటి అనుబంధ వృత్తుల్లో పనిచేస్తుండేవారు.

ఈ నగరంలో పరిశ్రమాభివృద్ధి వలస పోకడలలోనే జరిగింది. వివిధ పరిశ్రమలు సమానంగా అభివృద్ధి చెందలేదు. టెక్స్‌టైల్ పరిశ్రమ ప్రధానమైనది. బొంబాయిలో పనిచేసే లక్షా 80వేల నుండి 2 లక్షల మంది పారిశ్రామిక కార్మికులలో సుమారు లక్షమంది ఒక్క టెక్స్‌టైల్ పరిశ్రమలలోనే పనిచేసేవారు. వీరితోబాటు మరో లక్షమంది నైపుణ్యంలేని కార్మికులు నగరంలో కూలి పని, అదేవిధమైన ఇతర పనులు చేసేవారు.

బొంబాయి జనాభాలో వివిధ భారతీయ జాతులకు చెందిన ప్రజలున్నారు. అందులో అత్యధికంగా మరాఠీలు 51 శాతం, గుజరాతీలు 26 శాతం ఉండగా, మిగతా వారు విభిన్న భాషలు, జాతులకు చెందినవారు.

అయితే శ్రామికవర్గంలో వివిధ జాతులకు చెందినవారు ఇదే నిష్పత్తిలో లేరు. 1911 జనాభా లెక్కల ప్రకారం బొంబాయి టెక్స్టైల్ కార్మికులలో 90 శాతం మరాఠీలుండగా, మిగతా పరిశ్రమలలో కూడా సుమారు 80 శాతం మంది వీరే వున్నారు.

మరాఠీల సంఖ్య అధికమైనప్పటికీ, హిందీ, గుజరాతీ, తెలుగు తదితర భాషలు మాట్లాడే కార్మికులు, బొంబాయి శ్రామికవర్గంలో గణనీయమైన సంఖ్యలో వుండేవారు. ఆ విధంగా బొంబాయి కార్మికవర్గం బహుళజాతి స్వభావం సంతరించుకుంది. బొంబాయి శ్రామికవర్గం యొక్క బహుళజాతి స్వభావం, దేశంలో సర్వత్రా ఉద్యమాల అభివృద్ధికి దోహదం చేసింది. అదే సమయంలో మరాఠీల్లోని అత్యధికులు మహారాష్ట్రలోని జాతీయ ప్రజాతంత్ర శక్తులకు బొంబాయి కార్మికులతో సంబంధం ఏర్పరచడానికి దోహదం చేశారు. భారత కార్మికవర్గం అభివృద్ధి చెందే తొలిదశలో భాష, జాతి, మతం ముఖ్యమైన పాత్రనే పోషించాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో అభివృద్ధి చెందుతున్న జాతీయోద్యమం కూడా మత ప్రమేయం లేకుండా అభివృద్ధి చెందలేదు. రాజకీయోద్యమాల పిలుపుల్లో మతాన్ని జోడించడం ప్రారంభమైంది. బాలగంగాధర తిలక్ తదితర జాతీయ నాయకులు ప్రచారం చేసిన దేశభక్తి, రాజకీయ సిద్ధాంతాలు హిందూ మత చట్రంలోనే సాగేవి. దీనితో పాటు మహారాష్ట్రకొక ప్రత్యేకత వున్నది. మొగల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన శివాజీని మహారాష్ట్రలో జాతీయ వీరునిగా ఆరాధిస్తారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలోకి ప్రజలను కార్యోన్ముఖులను చేయడానికి, శివాజీ పట్ల ప్రజల్లో వున్న ఆరాధనా భావాన్ని వినియోగించడం వల్ల ముస్లింల కంటే హిందువులు ఎక్కువ ఉత్తేజం పొందారు. బొంబాయిలోని కార్మికుల్లో నాల్గింట మూడు వంతుల మంది హిందువులు, మిగిలినవారు ముస్లింలు. వివిధ మతాలు, జాతులకు చెంది, వివిధ భాషలు మాట్లాడే 3 లక్షల మంది కార్మికులు కలిసి మెలిసి వుండటం, ఆ కాలంలో మహారాష్ట్రలోని జాతీయోద్యమ స్వభావానికి, పరిణామ దశకు అనుగుణంగా వుంది. ఈ ప్రత్యేక స్వభావం వల్ల రాజకీయ పోరాటాల్లో పాల్గొనే విషయంలో కలకత్తా కార్మిక వర్గం కంటే బొంబాయి కార్మిక వర్గం సానుకూల స్థితిలో వుంది.

కలకత్తాలో పనిచేసే కార్మికుల్లో అత్యధిక సంఖ్యాకులు బెంగాలీ యేతరులు. బహుళ జాతులకు చెంది, బహుళ భాషలు మాట్లాడే కలకత్తా కార్మిక వర్గం వివిధ భాషలు మాట్లాడుతుండే అనేక జాతులకు చెందిన నిరుపేద రైతాంగం నుండి ఆవిర్భవించింది. వీరిలో ఎక్కువమంది యునైటెడ్ ప్రావిన్సెస్ బీహారు, ఒరిస్సా తదితర సుదూర ప్రాంతాల నుండి తరలి వచ్చారు. వారు చిరకాలంగా జీవిస్తున్న తమ నివాసస్థలాల నుండి పరిచయం లేని సరికొత్త చోట, కొత్త సాంఘిక వాతావరణంలో పనులు చేసుకొనడానికి తరలివచ్చారు. భాష, సాంప్రదాయం, సాంఘిక కట్టుబాట్లు, చివరకు ఆహారపు అలవాట్లలో కూడా చాలా తేడా వుంది. ఎక్కడో దూరం నుండి వచ్చి తెలియని చోట పనిచేస్తున్నామన్న భావనల వల్ల ఈ కార్మికులకు కలకత్తాలోను, మొత్తం బెంగాల్‌లోను సాగుతున్న జాతీయోద్యమంతో సరైన సంబంధం ఏర్పడలేదు. కార్మికుల ఆర్థిక పోరాటాలు దాదాపు సర్వ వ్యాపిత స్వరూపాన్ని దాల్చిన బెంగాలులో, 1905–

1908 మధ్యకాలంలో, భారతదేశాన్ని ఉద్రూతలూగించిన జాతీయ భావాలు మరింత ఉన్నత స్థాయికి చేరుకొన్నాయి. కాని, ఇటువంటి అనుకూల పరిస్థితు లున్నప్పటికీ, బెంగాల్లోని కార్మిక వర్గం ప్రధానంగా అనేక జాతులకు చెందినదవటం వలన, కొత్త ప్రదేశంతో వారికి సరైన పరిచయం లేకపోవడం వలన, ఆ ప్రావిన్స్‌లో ప్రబలంగా వున్న రాజకీయ ఉద్యమంలో కలవడానికి కొంత సంకోచించింది. కానీ, ఆ ప్రాంతంలో పుట్టి పెరిగిన బెంగాలీ కార్మికులు రాజకీయాలతో ప్రభావితమయ్యారు. ఈ కాలంలో వారు సాగించిన ఆర్థిక పోరాటాల్లో రాజకీయ వాసనలు గమనించవచ్చు. బెంగాలీ కార్మికులు అత్యధిక సంఖ్యలో వున్న ఈస్ట్ బెంగాల్ రైల్వే, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రెస్, తదితర సంస్థల్లో జరిగిన పోరాటాల్లో ఈ విషయాన్ని స్పష్టంగా గమనించవచ్చు. కాలం గడిచిన కొద్దీ బెంగాల్ కార్మికవర్గంలో వివిధ జాతుల వారు వుండటం వలన జాతీయ సమైక్యతా భావం బలపడింది. జాతీయోద్యమం ఉన్నత దశకు చేరుకున్న సమయంలో ఇది స్పష్టంగా కన్పించింది. వివిధ జాతుల వారు అధిక సంఖ్యలో వుండటం వలన, బెంగాల్ కార్మిక వర్గంలో విశాల రాజకీయ దృక్పథాన్నీ, ఉన్నత స్థాయి చైతన్యాన్నీ కల్పించడానికి అవకాశం ఏర్పడింది.

బొంబాయి కార్మికవర్గంలో రాజకీయ అపరిపక్వత, నిర్మాణ రాహిత్యం వున్నప్పటికీ, మొత్తం మీద అక్కడి కార్మికవర్గం, ఆనాడున్న పరిస్థితుల్లో నగరంలో పెల్లుబికిన రాజకీయ పోరాటంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించగల్గింది. కార్మికులు చేసే ఆర్థిక, రాజకీయ పోరాటాలు, వాస్తవానికి భారతదేశంలో వలస పాలనకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డాయి. అందువలన వలస పాలకుల దోపిడీకి గురైన భారత సమాజంలో కొన్ని తరగతులు ఈ పోరాటానికి సహాయ సహకారాలందజేశాయి. అదేవిధంగా వలస పాలన వలన లాభాలు పొందుతూ వలస పాలకుల ప్రయోజనాలతో తమ ప్రయోజనాలు ముడిపెట్టుకున్నవారు ఈ పోరాటాల పట్ల శత్రు వైఖరి ప్రదర్శించారు. పురోగమిస్తున్న కార్మిక వర్గ ఉద్యమం బొంబాయి కార్మికుల ప్రప్రథమ రాజకీయ కార్యాచరణ భారత సమాజంలో వున్న ఈ వైరుధ్యాన్ని బహిర్గతం చేసింది.

1905లో ప్రారంభమై, తారాస్థాయికి చేరుకున్న ప్రజా చైతన్యానికి కొనసాగింపుగా 1908లో బొంబాయి కార్మికుల రాజకీయ పోరాటం సాగింది. 1905-1907 మధ్య కాలంలో జారిస్టు రష్యాలో సాగిన బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం, ఆ విప్లవంలో రష్యా కార్మికవర్గం సార్వత్రిక రాజకీయ సమ్మెను ప్రధాన సాధనంగా ఉపయోగించటం ఈ పోరాటాన్ని ప్రభావితం చేశాయి.

1905-1907 మధ్యకాలంలో ఉద్రూతలూగించిన కార్మిక - కర్షక పోరాటాలు, ఉరకలు వేస్తున్న ప్రజా ఉద్యమం, ప్రజలలో పెల్లుబుకుతున్న విప్లవ భావాలు, భారత బూర్జువా వర్గంలో కూడా సంక్షోభాన్ని సృష్టించాయి. ఇవి 1907లో జరిగిన సూరత్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో బాహాటంగా కనిపించాయి. ఈ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్, మితవాదులు, అతివాదులు అనబడే రెండు గ్రూపులుగా చీలిపోయింది. బ్రిటిష్ ప్రభుత్వానికి

సహకారమిచ్చి, విదేశ వస్తు బహిష్కారాన్ని, హింసామార్గాన్ని విడనాడాలని మితవాదులు వాదించారు. మరోవైపు అతివాదులని పిలవబడే వర్గం ప్రధాన నాయకుడు తిలక్, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజా వుద్యమం నిర్వహించాలని వాదించాడు. తన అనుచరులతో ఆయన కార్మికవర్గం వద్దకు కూడా వెళ్ళి ప్రజా బాహుళ్య రాజకీయ పోరాటంలో పాల్గొనవలసిందిగా కోరారు. అయితే కార్మికవర్గం యొక్క విప్లవ శక్తిని గుర్తించి వారు ఈ ప్రయత్నం చేయలేదు. బూర్జువా వర్గ నాయకత్వంలో, వారి అదుపులో సాగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలోకి విస్తారంగా వున్న ఈ అసంఘటిత ప్రజలను తీసుకువచ్చి పోరాటానికి బలం సమకూర్చుకునే సంకుచిత వర్గ దృక్పథంతోనే ఈ ప్రయత్నం జరిగింది.

తన వర్గ దృక్పథం పరిధిలో పనిచేస్తున్న తిలక్ శ్రామికవర్గం యొక్క సంఘటిత విప్లవ కార్యాచరణకు ఏవిధమైన ప్రాధాన్యతనివ్వకపోగా, కార్మికవర్గాన్ని ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా పరిగణించే స్థితిలో లేదు. ఇన్ని లోపాలున్నప్పటికీ మహారాష్ట్ర ప్రజల్లోనూ, కార్మికవర్గంలోనూ తిలక్‌కు వున్న పలుకుబడి అపారం.

1908 జూన్ 24న తిలక్ అరెస్టు బొంబాయిలో చేయబడ్డాడు. స్వదేశీ ఉద్యమ తీవ్రతకు, విదేశీ వస్తు బహిష్కరణకు అనేక స్థానిక తిరుగుబాట్లకు భయపడిన బ్రిటీష్ ప్రభుత్వం, విప్లవ పోరాట వెల్లువను అరికట్టడానికి తిలక్‌పై దేశద్రోహ నేరం మోపింది. విచారణ తతంగం అయిన తరువాత తిలక్‌కు ఆరేళ్ళు జైలు శిక్ష విధించారు.

తిలక్‌ను అరెస్టు చేసి జైలు శిక్ష విధించడంతో దేశవ్యాపితంగా ప్రజానీకం తీవ్రమైన అసంతృప్తితో తిరుగుబాటు చేసింది. అనేకచోట్ల ప్రజలు సమ్మెలు, హర్తాళ్లు, ప్రదర్శనలూ నిర్వహించారు. 1908 జూలైలో బొంబాయి కార్మికులు చేసిన రాజకీయ సమ్మె, ప్రజలు నిర్వహించిన హర్తాళ్ ఈ ఉద్యమంలో ప్రధానమైన అంశాలు, బూర్జువా చరిత్రకారులు తమకున్న వర్గ పరిమితుల వలన భారత కార్మికవర్గం నిర్వహించిన ప్రప్రథమ సమ్మెకు ఏ విధమైన ప్రాధాన్యత యివ్వలేకపోయారు. కానీ భారత ప్రజల విప్లవ పోరాట చరిత్రలో ఈ రాజకీయ సమ్మెకు అత్యంత ప్రాధాన్యత వున్నది.

భారత కార్మికులు నిర్వహించిన ఈ మొదటి కార్మిక వర్గ పోరాటం గురించి డి.సి.హోమ్ వ్యాఖ్యానిస్తూ "దురదృష్టవశాత్తు స్వాతంత్ర్య పోరాటం గురించి వ్రాసిన చరిత్రలో గానీ, అనేక రచనలలో గానీ ఈ సంఘటనకు సరైన స్థానం లభించలేదు. చరిత్రను అబద్ధాలతో నింపిన సామ్రాజ్యవాదులుగానీ, బూర్జువా చరిత్రకారులుగానీ ఈ సమ్మె ప్రాధాన్యతను ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెట్టారు. కార్మికవర్గం వర్గ చైతన్యంతో చేసిన పోరాటాలంటే ఆ ఇరువురికీ వున్న విపరీతమైన భయమే అందుకు కారణం. కానీ, కార్మికవర్గం తాను ప్రథమంగా నిర్వహించిన ఉజ్వల పోరాటాన్ని, అందులో అమరులైన వీరుల జ్ఞాపకాలను సదా తమ హృదయాలలో పదిలపరచుకుంటుంది. ఈ సంఘటన గురించిన వాస్తవాలు ఇంతవరకు సమగ్రంగా ఎవరూ చెప్పలేదు" అని ఆయన అన్నారు.

సామ్రాజ్యవాదులు, బూర్జువా చరిత్రకారులు, ఈ ఘటన ప్రాముఖ్యతను దాచటానికి ప్రయత్నించినా, యీ పోరాటం లెనిన్ దృష్టిని ఆకర్షించింది. ఆయన 1908లోనే యీ సమ్మెను గురించి యీ విధంగా ప్రస్తావించారు. "భారతదేశంలో కూడా శ్రామిక వర్గం చైతన్యవంతమైన రాజకీయ ప్రజా పోరాటాలను నడిపే దశకు ఎదిగింది. అందువలన, రష్యన్ చక్రవర్తుల పద్ధతిలో సాగే బ్రిటిష్ పాలనకు అంతిమ కాలం ఆసన్నమైంది."

## ప్రారంభమైన పోరాటం

తిలక్‌పై విచారణ జరుగుతున్న సమయంలో, బొంబాయిలోని ప్రజలు తీవ్రమైన నిరసనను, కోపాన్ని వ్యక్తం చేశారు. జూన్ 29న కోర్టు బయట వేచివున్న వేలాది ప్రజలకు, సాయుధ పోలీసులకు మధ్య మొదటిసారి ఘర్షణ జరిగింది. అసలు విచారణ ప్రారంభమైన జూలై 13వ తారీఖున ఘర్షణలు తీవ్రమైనాయి. కోర్టు ప్రాంతంలో కార్మికులు చేరుకోకుండా వుండేందుకు, కోర్టుకు వచ్చే మార్గాలన్నింటినీ సాయుధ బలగాలతో నింపివేశారు. కార్మికుల ఉద్రేకాన్ని చూసిన బ్రిటిష్ పాలకులకు ధైర్యం సడలడంతో యుద్ధానికి సన్నద్ధమైనట్లుగా ఈ చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ జూలై 13వ తేదీ ఉదయాన్నే గ్రీవ్స్ కాటన్ అండ్ కంపెనీ మిల్లు కార్మికులు పనులు నిలిపివేసి బయటకు నడిచారు. ఈ సంఘర్షణ గురించి ఐ. చిచేరోవ్ ఈ విధంగా రాశారు. "తిలక్‌కు మద్దతుగా సాగిన ఉద్యమ ప్రత్యేక లక్షణాలు, విచారణ ప్రారంభమైన మొదటి రోజుననే ప్రస్ఫుటమయ్యాయి. బొంబాయి మిల్లు కార్మికులు సమ్మెలో పాల్గొని ప్రజా ప్రదర్శనలో కూడా చురుకుగా పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకున్నది. లెనిన్ మాటల్లో చెప్పాలంటే, "ప్రజలు తమకు మద్దతుగా రాసే రచయితలకు, రాజకీయ నాయకులకు మద్దతుగా నిలవడం ప్రారంభించారు. "బొంబాయి కార్మిక వర్గం నిర్వహించిన ప్రజా ప్రదర్శనలు, వారి రాజకీయ పరిజ్ఞానం పెంచే పాఠశాలలయ్యాయి. ఈ రాజకీయ పోరాటం పట్ల నగరంలోని పేదలు, మధ్యతరగతి ప్రజలు ఆకర్షితులయ్యారు.

కార్మికులు నిర్వహించిన ఈ ప్రదర్శనలలో బొంబాయి ప్రజలు అశేష సంఖ్యలో పాల్గొనడంతో భీతి చెందిన బ్రిటిష్ ప్రభుత్వం, మిల్లు ప్రాంతాల చుట్టూ సైన్యాన్ని పెట్టి కార్మికులు నగరం మధ్యలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టం చేసింది.

జూలై 14, 15, 16 తేదీలలో కూడా ఆందోళన ఇదే స్థాయిలో కొనసాగి, జూలై 17న విస్తృతరూపం దాల్చింది. మధ్యాహ్న విరామం పిదప లక్ష్మీదాసు, గ్లోబ్, క్రెసెంట్, జంషేడ్, నారాయణ్, కరీంభాయి, మొహ్మద్ భాయి, బ్రిటానియా ఫినిక్స్, గ్రీవ్స్, కాటన్ అండ్‌కో తదితర బొంబాయి మిల్లుల కార్మికులు సమ్మె చేసి ఊరేగింపుగా బయలుదేరారు. కార్మికులు భారతీయ, బ్రిటిష్ మిల్లుల్లో ఒకే విధంగా పని నిలిపిచేశారు. 20 వేల మంది కార్మికులతో సాగిన ఈ వూరేగింపు పారిశ్రామిక ప్రాంతాలలో తిరిగి అన్ని ఫ్యాక్టరీల నుండి కార్మికులను బయటకు రావలసిందిగా పిలుపునిచ్చింది. జూలై 18న కూడా ఈ విధంగానే జరిగింది. కానీ, ఆ రోజు

పోలీసులు కార్మికుల మీద కాల్పులు జరిపారు. జూలై 19న సమ్మె వెల్లువ కొత్త శిఖరాలు చేరుకుంది. 60 ఫ్యాక్టరీలకు చెందిన 65 వేలమంది కార్మికులు మహిమ్, పరేల్ పారిశ్రామిక కేంద్రాలలో సమ్మె చేశారు. జూలై 20న కార్మికులపై మళ్ళీ కాల్పులు జరిగాయి. ఇక ఉద్యమం పారిశ్రామిక కార్మికులకు మాత్రమే పరిమితం కాలేదు. పారిశ్రామిక కార్మికులతో బాటు రేవు కార్మికులు, చిన్న చిన్న వ్యాపారాలు, వృత్తులూ నిర్వహించేవారు కూడా ఉద్యమంలో చేరారు. జులై 21న సమ్మె మరింత విస్తృతమై, వేయిమంది రేవు కార్మికులు సమ్మెలో కలిశారు. జూలై 22న సమ్మెలో పాల్గొన్న ఐదుగురిని విచారించి శిక్షించారు. ఈ విచారణలు, శిక్షలను పరిశీలిస్తే వలస పాలకులు పెరుగుతున్న విప్లవ ఉద్యమం పట్ల ఎంత ప్రతీకారంతో వ్యవహరించారో స్పష్టమవుతుంది. "కఠిన శిక్షలు విధించడం ద్వారా, సమ్మె చేయడం ఎంతటి ఘోరమైన నేరమో మిగతా కార్మికులకు తెలియజేయడం అవసరమని భావించి" ఈ విచారణ నాటకం నడిపించారని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పేర్కొంది.

జూలై 22న తిలక్‌పై విచారణ ముగియనుంది. ఆ రోజున వాతావరణం మేఘావృతమైవుంది. హోరుగాలి, జోరు వానను కూడా లెక్కచేయక వేలాదిమంది ప్రజలు హైకోర్టు ప్రాంతానికి చేరారు. తిలక్‌కు ఆరేళ్ళు కారాగార శిక్ష విధించి, వెంటనే కోర్టు నుండి తరలించుకుపోయారు. ఏమి చేయాలో తెలియని అయోమయ స్థితిలో వున్న ప్రజాసందోహం ఆగ్రహావేశాలతో ఆ ప్రాంతం నుండి కదిలింది. కానీ, కార్మికులు వెంటనే ఒక కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు. డి.సి. హోమ్ మాటల్లో "వారు సమ్మె చేశారు." జూలై 23న మొట్టమొదటిసారి సంపూర్ణ సార్వత్రిక సమ్మె జరిగింది.

జూలై 23న సమ్మె పోరాటం అత్యున్నత స్థాయికి చేరుకుంది. తిలక్‌కు విధించిన శిక్షకు నిరసనగా బొంబాయి కార్మిక వర్గం మొదటి రాజకీయ సమ్మెను ఆ రోజు ప్రారంభించింది.

ఆ రోజు లక్ష మంది కార్మికులు రాజకీయ సమ్మెలో పాల్గొనగా, సాధారణ ప్రజలు హర్తాళ్ చేశారు. నగరంలోని అశేష జనసందోహం శ్రామికవర్గంతో భుజం భుజం కలిపి రాజకీయోద్యమంలోకి దిగింది.

జూలై 24 నుండి ప్రజలు సాయుధ పోలీసులనూ, సైన్యాన్నీ ఎదుర్కొని వీధి పోరాటాలలో పాల్గొన్నారు. ప్రతీకార వాంఛతో రగిలిపోతున్న బ్రిటిషు పాలకులు ప్రజలపై విరుచుకుపడ్డారు. కానీ, కార్మికులు వీరోచితంగా ప్రతిఘటించారు. వేలాదిమంది కార్మికులు వీరోచితంగా సాగించిన వీధి పోరాటాలతో యావత్ బొంబాయి నగరం అట్టుడికిపోయింది. ఆ విధంగా బొంబాయి వీధులలో భారత శ్రామికవర్గం మొదటిసారిగా "వీధి పోరాటాలలో" పాఠాలు నేర్చుకుంది. కార్మికవర్గ విప్లవ పోరాటాలలో ఈ సంఘటన నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. ఆ రోజున కార్మికుల ప్రతిఘటనా పోరాటాన్ని గూర్చి డి.సి. హోం ఈ విధంగా రాశారు. "ఏనాడూ రాజకీయ సమస్యలపై కార్మికుల ప్రతిఘటనను చవిచూడని

అధికారులు పరిస్థితిని తీవ్రంగా పరిగణించలేదు. తెల్లతోలు శాసన రక్షకులు రంగప్రవేశం చేయగానే స్వదేశీ కార్మికులు ఈగల్లా చెల్లాచెదురైపోతారని వారు విశ్వసించారు.”

అందువల్ల బ్రిటిషు ఆఫీసర్ల ఆధీనంలో వున్న ఒక సాయుధ బెటాలియన్ ముందుకు సాగి కార్మికులను వెంటనే అక్కడ నుండి వెళ్ళిపోవలసిందిగా ఆదేశించింది. డి.సి.హోమ్ ఈ విధంగా రాశారు. “తమ వర్గం యొక్క శక్తినీ, హుందాతనాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న కార్మిక జనావళిని ఎదుర్కొంటున్నామని పోలీసులకు ఏమాత్రం తెలియదు.”

కట్టలు తెంచుకున్న ఉద్రేకంలో జన సమూహం దురహంకారపూరితమైన ఈ ఉత్తర్వును నిర్లక్ష్యం చేసి వారిని ఎగతాళి చేయడంతో బ్రిటిష్ అధికారులు బిత్తరపోయారు. దీనితో ఆగ్రహించిన అధికారులు గుంపుపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. పోలీసుల నుండి తీవ్రమైన దాడిని ఎదుర్కొన్న జనసమూహం మొదట వెనక్కి తగ్గింది. కానీ, వెంటనే వారు రెండు భాగాలుగా విడిపోయి మరల గుమిగూడారు. కాసేపు శాంతించిన తరువాత ప్రజలు ముమ్మరంగా రాళ్ళ వర్షం కురిపించి ఎదురుదాడి చేశారు. మొక్కవోని ధైర్య సాహసాలతో తమ చేతులలో వున్న రాళ్ళు, రప్పలతోనే బొంబాయి కార్మికులు బ్రిటిష్ సాయుధ సైన్యాన్ని ఎదుర్కొన్నారు. కానీ, ఈ అసమాన పోరాటం ఎంతోసేపు కొనసాగలేదు. చాలమంది కార్మికులు వీర మరణం పొందారు. అనేకులు గాయపడ్డారు. వీరమరణం పాలైన కార్మికులలో గణపత్ గోవింద్ అనే కార్మికుడు ఆఖరిశ్వాస విడిచే వరకు జనాన్ని వీరోచితంగా పోరాడవలసిందిగా ప్రోత్సహిస్తూనే వున్నాడు.

తిలక్ మీద విచారణ పట్ల భారతీయ పోలీసుల్లో అసంతృప్తి గూడు కట్టుకున్నదన్న సమాచారం బ్రిటిష్ ప్రభుత్వానికి చేరినందున ఆ రోజు సంఘర్షణను అరికట్టడానికి భారతీయ పోలీసులను నియమించలేదు. ప్రజలను శిక్షించే పోలీసు శాఖతో సహా అన్ని తరగతుల భారత ప్రజానీకంలో సామ్రాజ్యవాద భావాలు పెరుగుతున్నాయన్న విషయం గమనించవలసి వుంది.

కార్మికుల సార్వత్రిక రాజకీయ సమ్మెకూ బొంబాయిలో మిగతా ప్రజలు నిర్వహించిన హర్తాళ్‌కూ మధ్య సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిస్తోంది. వ్యాపారస్తులు కార్మికులకు తక్కువ ధరకు బియ్యాన్ని అమ్మడం అందుకు ఒక ఉదాహరణ. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేసే విప్లవ పోరాటంలో శ్రామిక వర్గానికి మధ్య తరగతి ప్రజలు చిన్న వ్యాపారులకు మధ్య వెల్లివిరిసిన ఐక్యతకు ఈ సంఘటన ప్రతీకగా నిలిచింది.

భారతీయ మిల్లు యజమానులు ఈ ఉద్యమంలో నిర్వహించిన పాత్రను కూడ గమనించాలి. జరుగుతున్న పరిణామాల పట్ల కలతచెందిన పోలీసు కమీషనర్ జులై 24న మిల్లు యజమానుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించవలసిందిగా కోరాడు. వలస పాలకుల ఆజ్ఞను శిరసావహించి మిల్లు యజమానులు తమ అసోసియేషన్ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ కథనం ప్రకారం, సమావేశ

అధ్యక్షుడు "పరిశ్రమ ప్రయోజనాల దృష్ట్యా కార్మికులను సార్వత్రిక సమ్మెలో పాల్గొనకుండా చేయాలని కోరాడు. ప్రభుత్వం ఏ విధమైన చిక్కులకు లోనుగాకుండా చూడాలని, కార్మికులు ప్రభుత్వాధికారాన్నీ, చట్టాన్నీ గౌరవించి తిరిగి పనుల్లోకి వచ్చేవిధంగా చేయడానికి తమ పలుకుబడిని ఉపయోగించడం యజమానుల విద్యుక్త ధర్మం" అని అధ్యక్షులు చెప్పారు. జూలై 25న కూడా పోరాటం కొనసాగటంతో జూలై 26న సర్ విఠల్‌దాస్ దామోదర్ థాకర్సే బలవంతం మీద "నేటివ్ పీస్ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్" సమావేశమై పనివారు రాని కారణంగా జూలై 23 గురువారం నుండి మూతపడిన షాపులను అసోసియేషన్ సభ్యులు తెరవాలని" తీర్మానించింది.

ప్రజలు నిర్వహించిన దేశభక్తియుత పోరాటం పట్ల జాతీయ బూర్జువా వర్గం అవలంబించిన వైఖరిని ఈ ఘటనలు వెల్లడిస్తున్నాయి. ఒకప్రక్క చిన్న వ్యాపారస్తులు పోరాడే శ్రామిక వర్గంతో మైత్రీ భావంతో వుండగా, మరోవైపు జాతీయ బూర్జువా వర్గం అవకాశవాద ధోరణి నవలంబించింది. అంతేగాక శ్రామిక వర్గ రాజకీయ చైతన్యానికి భయపడిన బూర్జువా వర్గంలోని అత్యధికులు విప్లవోద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి వలస పాలకులకు సహాయం చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా, కొందరు సామ్రాజ్యవాద దోపిడీదార్లతో బాహాటంగానే చేతులు కలిపే స్థాయికి వెళ్ళారు. జాతీయ బడా బూర్జువా వర్గం పిరికితనంతో లొంగిపోగా, అర్ధాకలితో నకనకలాడుతూ, దరిద్రంలో మగ్గుతూ, అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న కార్మికులు మాత్రం, వలస పాలకుల అణచివేతకు, బానిసత్వానికి లొంగి వుండటానికి నిరాకరించి వీరోచితంగా పోరాడారు. ఈ పరిణామాల గురించి ఎ.ఐ. చెకరోవ్ ఈ విధంగా పేర్కొన్నారు. "శైశవ దశలోనున్న యువ బొంబాయి కార్మికవర్గం పోరాటంలో ప్రదర్శించిన దృఢ సంకల్పం, పోరాటాలు అభివృద్ధి చేయడానికి, ఎత్తుగడలు వేయడానికి వున్న శక్తి సామర్థ్యాలు, నిర్మాణయుతంగా పని చేయడం వంటివి ప్రత్యేకించి చెప్పుకోవాలి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేసిన మొదటి భీషణ పోరాటాల్లో యువ శ్రామిక వర్గం ప్రదర్శించిన దృఢదీక్ష, పట్టుదలనిది ధృవీకరిస్తోంది."

జూలై 27న కొత్తశక్తులు రంగప్రవేశం చేశాయి... ఇప్పటి వరకు ప్రక్కన వుండి కార్మికవర్గానికి సహాయమందిస్తున్న మధ్యతరగతి ప్రజలు, సాయుధ సైన్యంతో వీధి పోరాటాల్లో తలపడటానికి సిద్ధమయ్యారు. అదేవిధంగా పరిశ్రమేతర కార్మికులు కూడా పోరాటానికి సంసిద్ధమయ్యారు. చిన్న వ్యాపారాలు చేసుకునే పేద ప్రజలు కూడా ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తిలక్ చిత్రం ముద్రించిన గుజరాతీ కరపత్రాలను ప్రజలకు పంచారు. దానిలో పోరాటానికిమద్దతు ప్రకటిస్తూ, పోరాటం కొనసాగించవలసిందని విజ్ఞప్తి చేశారు.

వలస పాలకులు దీనిని సహించలేకపోయారు. వారి ఆదేశానుసారం సైన్యం వేలాదిసంఖ్యలో వున్న కార్మికులపై కాల్పులు జరిపింది. కానీ, ప్రజలు వెనుదిరగకుండా అనేక గ్రూపులుగా చీలిపోయి, సందులలోకి వెళ్ళి పోలీసులపైనా, సైన్యంపైనా రాళ్ళు, రప్పల వర్షం

కురిపించి, దృఢమైన ప్రతిఘటన నిచ్చారు. కేశవలాల్ కంజీ అనే గుజరాతీ వ్యాపారస్తుడు ఆరోజు యుద్ధానికి నాయకుడు. నిర్దాక్షిణ్యమైన పోలీసు కాల్పుల్లో మిగతా వారితోబాటు కంజీ కూడా మృత్యువును కౌగిలించుకొని అమరుడైనాడు.

జూలై 28న శ్రమజీవులలోని మరొక కొత్త తరగతి సమర రంగంలో ప్రవేశించింది. వారు ఇళ్ళలో పనిచేసేవారు. నగరంలోని ఇళ్ళలో పనిచేసి పొట్టపోసుకోటానికి రాకముందు వారు రత్నగిరిలో పొలంపని చేస్తుండేవారు. భవనాల కప్పుల నుండి, ఇరుకు సందులనుండి వారు ఎడతెరపి లేకుండా రాళ్ళ వర్షం కురిపించి సైన్యంతో పోరాడారు. ఆ రోజున కార్మికులు కూడ అత్యధిక సంఖ్యలో పెద్ద ప్రదర్శనగా వచ్చి, సాయుధులైన పదాతి దళాన్ని ఎదుర్కొన్నారు.

జూలై 23న ప్రారంభమైన సార్వత్రిక రాజకీయ సమ్మె జూలై 28న ముగిసింది. తిలక్‌కు 6 ఏళ్ళు కారాగారశిక్ష విధించబడింది. ఒక ఏడాది శిక్షకు ఒకరోజు సమ్మె చేయాలనే తమ ప్రతిజ్ఞను కార్మికులు, ప్రజలు నిలబెట్టుకొన్నారు. ఈ వీరోచిత పోరాటంలో అనేకమంది అశువులు బాశారు. కనీసం 200 మంది చనిపోయారు. పెద్ద సంఖ్యలో గాయాలపాలుకాగా, చాలామంది అరెస్టు అయ్యారు. బొంబాయిలోని అన్ని తరగతుల శ్రామిక ప్రజలు ఈ పోరాటంలో పాల్గొన్నారు. నగరంలోని ముస్లింలు ఈ సమ్మెలో పాల్గొనలేదని బ్రిటిష్ ప్రభుత్వం ప్రచారం చేసింది. కానీ, నగరంలో హిందువులకు, ముస్లింలకు చెందిన అన్ని షాపులు సమ్మెకు సానుభూతిగా మూసివేయబడ్డాయని విశ్వసనీయంగా తెలియవచ్చింది. కార్మికులలో 20 శాతంగా వున్న ముస్లింలందరూ సమ్మెలో పాల్గొన్నారు.

### గుణపాఠాలు

ఈ సార్వత్రిక రాజకీయ సమ్మె వెనుక బొంబాయి కార్మికుల ఆర్థిక దుస్థితి వలన ఉత్పన్నమైన అసంతృప్తి వుంది. వలసపాలనలో వున్న యీ కార్మికులు బ్రిటిష్ పెట్టుబడిదారులు, దేశీయ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూనే దోపిడీకి బ్రిటిష్ వలస పాలన మూలకారణమని గుర్తించారు. వారు జాతీయ విముక్తి పోరాటంలో చురుకుగా పాల్గొనటానికిది ముఖ్యమైన కారణం. తమ ప్రియతమ నాయకుడు తిలక్‌ను అరెస్టు చేసి శిక్షించడంతో, సామ్రాజ్యవాద శక్తుల క్రూర దమన స్వభావాన్ని స్పష్టంగా చూసిన కార్మికులు వెంటనే ప్రతిఘటనకు పూనుకున్నారు.

బొంబాయి కార్మికులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేసిన రాజకీయ సమ్మె, సాయుధ సైన్యాలతో తలపడిన తీరు చారిత్రక పరీక్షలకు నిలచిన కార్మిక వర్గ పోరాట పంథాకు నిదర్శనం. 1871లో పారిస్‌లోని కార్మికులు సాయుధ తిరుగుబాటు చేసి పారిస్ కమ్యూన్‌ను స్థాపించుకున్నారు. అదే విధంగా 1905లో రష్యన్ కార్మిక వర్గం సార్వత్రిక రాజకీయ సమ్మె, సాయుధ తిరుగుబాటుతో ముందుకుసాగింది. ఆ విధంగానే 1908లో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు సందర్భంగా బొంబాయి కార్మికులు కూడా

సార్వత్రిక రాజకీయ సమ్మె, బహిరంగ ప్రతిఘటనను మిళితం చేసే అంతర్జాతీయ కార్మిక వర్గ విప్లవ సాంప్రదాయాలను పాటించారు.

భారతదేశంలో ఆనాటికి కార్మికవర్గ రాజకీయ పార్టీ ఉద్భవించలేదు. కార్మికవర్గ సిద్ధాంతాల ప్రాతిపదికపై కార్మికవర్గానికి రాజకీయ మార్గదర్శకత్వం లభించలేదు. ఈ లోపం వున్నప్పటికీ బొంబాయి కార్మికులు విప్లవ మార్గం ఎన్నుకోవటంలో విఫలురు కాలేదు. నిజానికి ఇదే బొంబాయి కార్మిక వర్గం సాగించిన పోరాటంలో విలక్షణ చారిత్రక అంశంగా నిలుస్తుంది.

భారత జాతీయ కాంగ్రెస్ అప్పుడప్పుడు సామ్రాజ్యవాదంతో రాజీపడుతూ, ఊగిసలాడే పంథాను అనుసరించింది. బూర్జువా వర్గ నాయకత్వంలో వున్న కాంగ్రెస్ అనుసరించిన ఈ పంథాకు పూర్తి భిన్నమైన పంథాను ఎంచుకోవడంతో భారత బూర్జువా వర్గం బొంబాయి కార్మికుల రాజీలేని పోరాటాన్ని హృదయపూర్వకంగా అంగీకరించలేకపోయింది.

రాజకీయ పరిణతి, రాజకీయ సిద్ధాంతం, స్వంత రాజకీయ పార్టీ లేకపోయినా బొంబాయి శ్రామికవర్గం నిర్వహించిన ఈ పోరాటం భారత ప్రజలకు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అనుసరించాల్సిన సరైన పంథాను నిర్దేశించింది. భారత రాజకీయ చరిత్ర ఈ పోరాట ప్రాముఖ్యతను విస్మరించరాదు.

## మతం - దాని ప్రతికూల ప్రభావం

మధ్యతరగతి (కి చెందిన) సామాజిక మూలాలు, మత పునరుద్ధరణ దృక్పథం కల్గి, అతివాదులుగా చెలామణీ అవుతున్న జాతీయ నాయకులు, జాతీయతకు సంబంధించిన తమ భావాలు, రాజకీయ కార్యకలాపాల విషయంలో మతం పరిధి నధిగమించలేకపోయారు. వారి రాజకీయ సిద్ధాంతాలు ప్రజల మత విశ్వాసాలు, ఫ్యూడల్ భావాల పునాదిపై నిర్మితమైనాయి. “1907లో పునరుద్ధరించబడిన భారత జాతీయతా వాదం పూర్తిగా అభివృద్ధి నిరోధకమైనది, మతపరమైనది” అని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అభిప్రాయపడ్డారు. అతివాద రాజకీయ నాయకులు చేసిన రాజకీయ ప్రచారం కార్మికుల్లో వర్గ చైతన్యం పెంపొందించటానికి ఏమాత్రం దోహదకారి కాలేదు సరికదా దానికి విఘాతం కల్గించింది.

ఆందోళనల సందర్భంగా తిలక్ అనుచరులు అవలంబించిన ఎత్తుగడలు పరిశీలిస్తే వారు కార్మికులలో వున్న కుల, మత భావాలను ఎంతగా వినియోగించుకున్నదీ అర్థమవుతుంది. కార్మికులు నివసించే ప్రాంతంలో అంటించిన ఒక పోస్టరులో మధ్యాహ్న విరామం తరువాత పనికి వెళ్ళే ఏ కార్మికుడైనా ఒక స్వీపరుకు గాని, యూరోపియన్‌కు గాని పుట్టినవాడుగా పరిగణింపబడతాడని రాశారు. ఇంకొక పోస్టరులో పనికొనసాగించే కార్మికునికి గోహత్యా పాతకం చుట్టుకుంటుందని రాశారు.

కార్మికులను ఆకట్టుకోడానికి అనేక మూఢవిశ్వాసాలను ప్రేరేపించే విజ్ఞప్తులు చేశారు. కార్మికుల్లో అగ్రవర్ణాల పట్ల వున్న గౌరవాన్ని, మధ్యయుగపు కట్టుబాట్లపై వున్న అభిమానాన్ని చక్కగా వాడుకున్నారు. తిలక్, ఆయన అనుచరులలో చాలామంది బ్రాహ్మణులు కావటంతో, తక్కువ కులం వారైన కార్మికులకు వారిపై విపరీతమైన గౌరవభావం వుండేది. ఈ కుల గౌరవాన్ని తిలక్ అనుచరులు యూనియన్ కార్యక్రమాల్లో వినియోగించుకున్నారు.

అదే విధంగా బెంగాల్‌కు చెందిన అరబింద్ ఘోష్, బిపిన్‌పాల్ తదితర అతివాద జాతీయ నాయకులు కార్మికులను, ప్రజలను మతం పేరుతో ఉత్తేజపరిచేవారు. ఈ జాతీయ నాయకులు పాశ్చాత్య నాగరికతకు ప్రత్యామ్నాయంగా జాతీయతా వాదంతో హిందూ సనాతనత్వాన్ని జోడించి ఒక అభివృద్ధి నిరోధక పంథాను రూపొందించి, "హిందూ నాగరికత" లేదా మరింత విస్తృత అర్థంలో "ఆర్య నాగరికత" ఆధిక్యతను నిరూపించడానికి ప్రయత్నించారు. తిలక్ "గోసంరక్షక సంఘాన్ని" స్థాపించాడు. శివాజీ, గణపతి ఉత్సవాలు ప్రారంభించారు. అభివృద్ధి నిరోధకమైన ఈ సాంఘిక, మతపరమైన ఉత్సవాలను ఆయన రాజకీయ ప్రచార సాధనాలుగా వాడుకున్నారు. అదే విధంగా బెంగాలులో కూడా జాతీయోద్యమాన్ని మతం ప్రాతిపదికగా నిర్మించదలచారు. రాజకీయ శక్తి ప్రసాదినిగా కాళీదేవి పూజను బెంగాల్ అతివాద జాతీయ నాయకులు ప్రచారం చేశారు. అత్యంత ప్రగతిశీల పంథాలో సాగవలసిన భారత జాతీయోద్యమాన్ని సనాతన హిందూమతం, మూఢ విశ్వాసాల ప్రాతిపదికగా సాగించాలని వారు ప్రయత్నించారు. కార్మికోద్యమం అభివృద్ధి చెందుతున్న తొలి దశలో హిందూమతంలోని కుల వ్యవస్థ, అభివృద్ధి నిరోధక మత భావనల విష ప్రభావం కార్మికుల మీద తీవ్రంగా పడింది. బి.బి., సి.ఐ. రైల్వేలకు చెందిన పరేల్ వర్క్‌షాప్ కార్మికులు 1907, మేలో చేసిన సమ్మెలో ఇది వికృతంగా ప్రతిబింబించింది. ఈ సమ్మెలో 3,500 మంది కార్మికులు పాల్గొన్నారు. "టైమ్స్ ఆఫ్ ఇండియా" కథనం ప్రకారం, ఇతర కారణాలతో పాటు, "కార్మికులకు అటెండెన్స్ టిక్కెట్లు ఇచ్చే పద్ధతే సమ్మెకు తక్షణ కారణంగా కన్పిస్తుంది. బోర్డు వద్ద నుండి టిక్కెట్లు తీసుకునే కొత్త పద్ధతి వల్ల రద్దీ ఏర్పడి, వివిధ కులాల వారు ఒకరినొకరు తాకుతూ నిల్చొనవలసి వస్తున్నదనీ, అందువలన వారు తెచ్చుకున్న భోజనం మైలపడిపోతున్నదని వారు ఫిర్యాదు చేశారు." ఇది కార్మికులు ఒక పెద్ద సమ్మె చేయడానికి దారితీసింది.

రాజకీయాలలో మత ప్రమేయం వలన కలిగిన విషప్రభావం ఆరంభంలోనే కాక తరువాత కాలంలో కూడా కొనసాగింది. హిందూ జాతీయ వాదానికి, ద్విజాతి సిద్ధాంతం, ముస్లిం లీగ్ యొక్క ఇస్లామిక్ ఛాందసవాదం తోడు కావడంతో తర్వాత కాలంలో ఇది రాజకీయ ఉద్యమాలను, కార్మికవర్గ సౌహార్ద్రతను, ప్రజల చైతన్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది.

## మరికొన్ని సంఘటనలు

1908 సార్వత్రిక సమ్మె వలన ఉత్పన్నమైన రాజకీయ ఉద్రిక్తత చల్లారిన తరువాత కార్మికుల పరిస్థితులను మెరుగుపరచుకోటానికి మరలా ఉద్యమం ప్రారంభమైంది. ఆ సమయానికి

బొంబాయి మిల్ హ్యాండ్స్ అసోసియేషన్ పనిచేయడం లేదు. అదే సమయంలో మారిసన్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీస్ లేబర్ కమిషన్ కార్మికుల స్థితి గురించి తన దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ కాలంలో శ్రీ ఎస్.కె.బోలే, ఎస్.వి.టాలే కేర్కర్, శ్రీ బి.ఆర్. నారే తదితరులు 1910లో బొంబాయి కామ్‌గార్ హితవర్ధక్ సభ ప్రారంభించారు. ఇది మానవతా దృక్పథంతో కార్మికుల సంక్షేమానికి ఏర్పాటైన సంస్థ. ఇది కార్మికులకు 12 గంటల పనిదినం కావాలనీ, ప్రమాదాలవల్ల ప్రాణనష్టం జరిగితే, కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారం యివ్వాలనీ, కార్మికుల పిల్లలకు విద్యా సౌకర్యాలు కలిగించాలనీ కోరింది. అదే కాలంలో "సోషల్ సర్వీస్ లీగ్ బొంబాయి" అనే సాంఘిక సేవాసంస్థ కార్మికులలో పనిచేయడం ప్రారంభించింది.

1911 ఫ్యాక్టరీ చట్టం ప్రకారం పనిగంటలు తగ్గించినా, నాల్గో కోతను అరికట్టే నిబంధన ఆ చట్టంలో లేదు. అందువలన అనేక మిల్లులలో పనిగంటలు తగ్గించిన మేరకు వేతనాలు కూడ తగ్గించారు. దేశంలో అనేక ప్రధాన పారిశ్రామిక కేంద్రాలలో ఈ వేతనాల తగ్గింపుకు వ్యతిరేకంగా చాలా సమ్మెలు జరిగాయి.

ఈ కాలంలో జరిగిన కార్మిక పోరాటాలలో వివిధ అంశాలను విశ్లేషిస్తే, పోరాటాలు పెంపొందుతున్నప్పటికీ విజయాలు గణనీయమైనప్పటికీ, భారత కార్మికవర్గ ఉద్యమం నిర్మాణయుతమైన, బలమైన శక్తిగా రూపొందలేదని తెలుస్తుంది. కానీ పోరాటాల విస్తృతి వలన, అనేక సంస్థలు ప్రాథమిక స్వభావం గలవైనప్పటికీ ఏర్పడి నిర్మాణయుతమైన ఆధునిక కార్మికోద్యమం ఏర్పడటానికి పునాదులు వేశాయని గుర్తించక తప్పదు. కార్మికులకు ఉద్యమాలు నడిపే అనుభవం లేకపోవడంవలన, మధ్యతరగతి ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు ఈ దశలో కార్మికవర్గ పోరాటాలు నిర్వహించడంలో ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించారు. 1914 నుండి 1918 మధ్య కాలంలో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం, 1917 రష్యన్ విప్లవం, ప్రపంచ దేశాల్లోనూ, మనదేశంలోనూ తీవ్రమైన మార్పులు తెచ్చాయి. ఇది భారత కార్మికోద్యమాన్ని మరో మలుపు తిప్పాయి. వర్గ చైతన్యంతో కూడిన శ్రామిక వర్గ పోరాటాలు, నిజమైన ట్రేడ్ యూనియన్ల నిర్మానానికి ఒక నూతన శకం ప్రారంభమైంది.

# 8

# మొదటి ప్రపంచ యుద్ధం - కార్మికవర్గ రాజకీయ చైతన్యం సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధి (1914 - 20)

### మొదటి ప్రపంచ యుద్ధకాలంలో పరిశ్రమలు, పారిశ్రామిక కార్మికుల స్థితిగతులు

ప్రపంచ యుద్ధానికి ముందు భారతదేశంలో పెట్టుబడిదారీ పరిధిలో అభివృద్ధి శీఘ్రగతిన కొనసాగి గణనీయమైన స్థాయికి చేరుకుంది. జాయింట్ షో కంపెనీల సంఖ్య పెరుగుదలలో ఈ పురోగతి ప్రతిబింబిస్తుంది. 1900వ సంవత్సరంలో రిజిష్టర్ అయిన కంపెనీల సంఖ్య 1,360. ఈ కంపెనీల పెట్టుబడులు రూ. 36,28,00,000. 1907లో కంపెనీల సంఖ్య 2,661కి పెరిగి, వీటిలో పెట్టుబడుల మొత్తం రూ. 50,81,00,000కు పెరిగింది. మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైననాటికి రిజిష్టర్ అయిన కంపెనీల సంఖ్య 2,553. ఈ కంపెనీల్లో పెట్టుబడులు రూ. 72,10,00,000.

సామ్రాజ్యవాద దోపిడీ రెండు విధాలుగా కొనసాగింది. ఒకటి వలస ప్రభుత్వం ప్రత్యక్షంగా చేసేది. రెండవది బ్రిటిష్ ప్రైవేట్ పెట్టుబడుల కార్యకలాపాల ద్వారా చేసేది. ఈ రెండు పద్ధతుల ద్వారా వలస పాలకులు సాగించిన దోపిడి స్థాయిల్లో తేడాలున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం దేశంలో బాగా పాతుకుపోయిన బ్రిటిష్ గుత్త పెట్టుబడి దేశ సంపదను బాగా హరించివేసింది. ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో భారతదేశంలో వలస దోపిడీ వికృత రూపం దాల్చింది. ప్రభుత్వం యుద్ధ అవసరాల కోసం పారిశ్రామిక సామర్థ్యాన్ని బాగా ఉపయోగించుకుంది. బ్రిటిష్ జూట్ ఫ్యాక్టరీ యజమానులు మిలటరీ ఆర్డర్ల వల్ల బాగా లాభం పొందారు. అలాగే నూలు, ఉన్ని మిల్లుల్లో సైన్యానికి కావలసిన యూనిఫారాలు, దుప్పట్లు తయారయ్యేవి. మనదేశంలో నుండి ముడి సరుకులను అంతర్జాతీయ ధరకంటే చాలా తక్కువ ధరకు తరలించుకుపోవడం ఆర్థిక వ్యవస్థకు కీలకమైన రైల్వేలు, జలమార్గాలకు వినియోగిస్తున్న పరికరాలను విడగొట్టి తరలించుకుపోవడంలో దోపిడీ తీవ్రత ప్రతిబింబిస్తుంది. రైలు పట్టాలు, వంతెనలు, రైలు ఇంజన్లు, వ్యాగన్లు, రైలు పెట్టెలు మరియు భారతీయ పోస్టు

అండ్ టెలిగ్రాఫ్‌కు సంబంధించిన పరికరాలను అత్యధికంగా యుద్ధ అవసరాల కోసం దేశం నుండి తరలించుకుపోయారు.

యుద్ధకాలంలో జరిగిన ఈ ఆర్థిక దోపిడీ వలన శ్రమజీవులు అనేక కష్టాల పాలయ్యారు. పన్నుల భారం 50 శాతానికి పైగా పెరిగింది. ప్రత్యక్షంగా మిలటరీ ఖర్చు యుద్ధానికి పూర్వం కంటే రెండింతలయింది. సాధారణ పరిపాలనా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. నోట్ల ముమ్మరం వలన ద్రవ్యోల్బణం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఈ విధంగా భారత ప్రజలకు విపరీత నష్టం కలిగించి అధిక లాభాలు పొందడానికి స్పెక్యులేషన్ వ్యాపారస్తులకు స్వేచ్ఛ లభించింది. కలకత్తాలో ధరలు నూటికి నూరు శాతం పెరిగాయి. దేశంలో మిగతా ప్రాంతాల్లో కూడా ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచ యుద్ధం వలన ప్రజలు విపరీతమైన దరిద్రం అనుభవిస్తుంటే భారత పెట్టుబడిదారులు విపరీతంగా లాభాలు దండుకునేందుకు మంచి అవకాశం ఏర్పడింది. దేశంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల వలన యుద్ధానికి పూర్వం భారత పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకోవడం అనివార్యమైంది. 1905 నుండి 1908 వరకు వెల్లువెత్తిన జాతీయ ప్రజా వుద్యమం వలన బ్రిటిష్ పెట్టుబడిదారులకు కొంత ప్రతికూల పరిస్థితులు తలెత్తగా, ఉద్యమం భారత పెట్టుబడిదారుల వ్యాపారాలకు బాగా అనుకూలించింది. కానీ, ఉద్యమం ఊపు తగ్గడంతో బ్రిటిష్ పెట్టుబడిదారులు కోలుకుని నిలదొక్కుకున్నారు. భారత పెట్టుబడిదారులు బలమైన బ్రిటిష్ పెట్టుబడి శక్తి ముందు తట్టుకోలేక అనేక చిక్కుల్లో పడ్డారు. అందువలన అనేక బలహీనమైన భారతీయ కంపెనీలు కుప్పకూలాయి.

యుద్ధం ప్రారంభం కాగానే భారతీయ పరిశ్రమలు మొత్తంగానే సంక్షోభం నుండి పూర్తిగా బయటపడ్డాయి. ప్రధానమైన సామ్రాజ్యవాద దేశాల నుండి పోటీ లేకపోవడం, దేశవాళీ సరుకులకు మన దేశంలోనూ, విదేశాలలోనూ మార్కెట్టు లభించడం, యుద్ధావసరాల ఉత్పత్తికి కాంట్రాక్టులు లభించడం, పరిశ్రమలకు కావలసిన వ్యవసాయోత్పత్తులు చౌకగా లభించడం, అతితక్కువ నిజవేతనాలు, తయారైన సరకుకు ఎక్కువ ధర లభించడం వంటి కారణాల వల్ల భారతీయ పెట్టుబడిదార్లకు మిక్కిలి సానుకూల పరిస్థితులేర్పడ్డాయి.

అయితే అదే సమయంలో భారత పెట్టుబడుల అభివృద్ధిని ఆటంకపర్చే కొన్ని ప్రతికూల పరిస్థితులు కూడా నెలకొనివున్నాయి. శ్రామిక ప్రజల దారిద్ర్యం నానాటికి పెరుగుతుండడం వల్ల స్వదేశీ మార్కెట్ కుంచించుకుపోయింది. పారిశ్రామిక ముడిసరుకులు, పాక్షికంగా తయారైన సరుకులు, పారిశ్రామిక పనిముట్ల దిగుమతి తగ్గింది. దేశంలో రవాణా సౌకర్యాలు సన్నగిల్లాయి. ఈ విధమైన ప్రతికూల పరిస్థితుల వల్ల భారత పెట్టుబడులు పెరగడానికి కొన్ని అవరోధాలేర్పడ్డాయి.

ఏమైనప్పటికీ, మొత్తం మీద భారతీయ పెట్టుబడులు గణనీయమైన అభివృద్ధినే సాధించాయి. యుద్ధ సమయంలో భారత బూర్జువా వర్గ సంపూర్ణ మద్దతు పొందేందుకు బ్రిటిష్ ప్రభుత్వం, భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి గల అవకాశాలను పరిశీలించి, భారత పెట్టుబడులను, పరిశ్రమలను మరింత లాభదాయకంగా నిర్వహించే

మార్గాలనన్వేషించి, సూచనలు చేయడానికి 1906 మే నెలలో ఇండియన్ ఇండస్ట్రియల్ కమిషన్‌ను నియమించింది. ఇదిలా వుండగా యుద్ధకాలంలో రిజిష్టరైన జాయింటు స్టాకు కంపెనీల సంఖ్య 2,553 నుండి 2,789 కి పెరిగింది. వాటిలో పెట్టుబడులు రూ. 72,10,00,000 నుండి రూ. 106,61,00,000కు పెరిగాయి.

1914 - 1918 మధ్యకాలంలో భారతీయ పెట్టుబడులు విస్తారంగా వున్న పత్తి పరిశ్రమలో ఫ్యాక్టరీల సంఖ్య 271 నుండి 262కు తగ్గినప్పటికీ, మగ్గాల సంఖ్య 1,04,000 నుండి 1,16,000కు పెరిగింది. కార్మికులు 2,60,000 నుండి 2,82,000కు పెరిగారు. 1914 -15, 1917-18 మధ్యకాలంలో బట్టల ఉత్పత్తి దాదాపు మూడవ వంతు పెరిగింది.

ఉత్పాదక శక్తిని పూర్తిగా వినియోగించి టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ ఎక్కువ ఉత్పత్తిని సాధించింది. 1915లో మొదటి జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించిన టాటా కంపెనీ యుద్ధ కాలంలో గడించిన లాభాలతో 1916, 1919 సంవత్సరాల్లో మరో రెండు జల విద్యుత్ కేంద్రాలను నిర్మించింది. యుద్ధ సమయంలో మూడు సిమెంటు ఫ్యాక్టరీలు ప్రారంభించబడ్డాయి. ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీల ఉత్పత్తిని పూర్తిగా కొన్నది. రసాయనాల వుత్పత్తి కూడ ప్రారంభమయింది. యుద్ధాన్ని అవకాశంగా తీసుకుని, భారతీయ పెట్టుబడిదార్లు విపరీతంగా లాభాలార్జించారు. ఇంత ప్రగతిని సాధించినప్పటికీ, వలసాధిపత్యం వల్ల భారతీయ పెట్టుబడిదార్లకు తమ లాభాలను విస్తృతంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలో వినియోగించడం చాలా కష్టంగా ఉండేది. బ్రిటిష్ ప్రభుత్వం వద్ద నుండి పారిశ్రామికాభివృద్ధికి కావల్సిన ప్రోత్సాహం వారు పొందలేకపోయారు. ఇదివరకే చెప్పినట్టు ఇండస్ట్రియల్ కమిషన్ నియామకం చేయించడం, భారతీయ ప్రజలపై ఎక్సైజ్ సుంకాలు ఇకముందు పెరగవనే వాగ్దానం పొందడం వరకే వారు సఫలీకృతులయ్యారు.

యుద్ధకాలంలో పారిశ్రామిక ప్రగతి కారణంగా కార్మికుల సంఖ్య కూడ పెరిగింది. 1919లో దేశంలోని భారీ యంత్ర పరిశ్రమల్లో 13,65,000 మంది పనిచేసేవారు. ఇందులో 3,06,000 మంది 277 కాటన్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్స్‌లోనూ, 1,40,800 మంది, 1,940 కాటన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలలోనూ, 2,76,100 మంది, ప్రెస్‌లు, జూట్ ఫ్యాక్టరీల్లోనూ, రైల్వే వర్క్‌షాపుల్లో 1,26,100 మంది కార్మికులు పనిచేసేవారు. అంటే మూడింట రెండు వంతుల మంది ఫ్యాక్టరీ కార్మికులు మూడు ప్రధాన భారీ పరిశ్రమల్లో పనిచేసేవారు. బొగ్గుగని కార్మికులు 2,07,800 మంది వుండేవారు.

ఒక ప్రక్క కార్మికులు భయంకరమైన దారిద్ర్యంతో బాధపడుతుంటే, వేరొక ప్రక్క వలస పాలకులు, భారతదేశంలోని ఉన్నత తరగతులకు చెందిన సంపన్నులు అపారమయిన సంపదను పోగుచేసుకున్నారు. యుద్ధకాలంలో ఫ్యాక్టరీ కార్మికుల స్థితి బాగా దిగజారింది. త్వరితగతిని పనులు చేయించడం వలన కార్మికులపై జరిగే శ్రమ దోపిడీ తీవ్రతరమయింది.

ధరల పెరుగుదలవలన కార్మికుల జీవన ప్రమాణాలు దిగజారిపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పరిశ్రమల్లోనూ తయారయిన వస్తువుల ధరలు పెరిగి ప్రజలు బాధపడుతుంటే, పట్టణ ప్రాంతాల్లో ఆహార వస్తువుల ధరలు పెరిగి కార్మికులు కష్టాల పాలయ్యారు.

1918లో భయంకరమైన ఇన్‌ఫ్లూయెంజా వ్యాధి ప్రపంచమంతటా వ్యాపించింది. విదేశీప్రభుత్వం ప్రజారోగ్యం, పారిశుధ్యం పట్ల చూపిన నిర్లక్ష్యవైఖరి వలన 50 నుండి 80 శాతం వరకు భారత ప్రజలు ఈ వ్యాధికి గురయ్యారు. 1918 జూన్ నుండి 1919 వరకు ఒక సంవత్సరంలో తక్కువ చేసి చూపిన అధికారిక లెక్కల ప్రకారమే 7 లక్షల మంది చనిపోయారు. దాదాపు పది లక్షల మంది ప్రజల విషాద మరణానికి కారణం బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారత ప్రజలను అత్యంత క్రూరమైన దోపిడీకి గురిచేయడమే. ఈ పరిస్థితులను విశ్లేషించినట్లయితే మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా భారతదేశంలో అతి ముఖ్యమైన సామాజిక, ఆర్థిక పరిణామాలు సంభవించినట్లు స్పష్టమౌతుంది. వర్గ చైతన్యంతో కూడిన సంఘటిత పోరాటాలు నడపడానికి భారత కార్మికవర్గానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయని కూడా విదితమవుతుంది.

## రాజకీయ పరిస్థితి

1905-08 మధ్యకాలంలో ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్న జాతీయోద్యమం మీద తీవ్ర అణచివేతకు పూనుకున్న తర్వాత నానాటికి పెరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేకభావాలను శాంతపరచి, బుజ్జగించేందుకు బ్రిటిష్ ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలు ప్రకటించింది. వీటిని మార్లే - మింటో సంస్కరణలు అంటారు. నామమాత్రంగా చేసిన ఈ సంస్కరణలు ప్రజలకు సంతృప్తి కలిగించలేదు. ఈ సంస్కరణలను కాంగ్రెసులోని మితవాద నాయకత్వం ఆకాశానికి ఎత్తగా, అతివాదులుగా పేరుపొందిన వారు వ్యతిరేకించారు. కొన్ని చిన్న చిన్న మార్పులతో నాడు ' సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోనూ, ప్రొవెన్షియల్ కౌన్సిళ్ళలోనూ ఒక భారతీయ సభ్యుణ్ణి నియమించడంతో పాటు, చిన్న చిన్న మార్పులు చేయడం తప్ప భారతీయులకు అధికారాన్ని బదిలీ చేసే సమస్యపైన ఈ సంస్కరణల ద్వారా చేసిందేమీ లేదు. ఈ మింటో - మార్లే సంస్కరణల ప్రకారం సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికలలో పాల్గొనే మూడు ప్రధాన గ్రూపుల్లో మత ప్రాతిపదికపై ఏర్పడిన గ్రూపు కూడా ఒకటి వుంటుంది. నియోజక వర్గాలను మతపరంగా విభజించి భారత ప్రజలను మతపరంగా వేరు చేయడానికి బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వం కుటిల రాజకీయ పన్నాగం పన్నింది. ఇదిలా వుండగా ఆగాఖాన్, మొహసిన్-ఉల్-ముల్క్ మరియు ఢాకాకు చెందిన నవాబ్ సలీముల్లాల నాయకత్వంలో 1906లో ఏర్పడిన ముస్లిం లీగ్ ఈ మతపరమైన సిద్ధాంతానికి తన ఆమోదం తెలిపింది. ముస్లిం జమీందార్లు ఇతర స్వార్థపరశక్తులకు అపారమయిన లాభం సమకూరుతుంది. కనుక ముస్లిం లీగ్ బెంగాల్ విభజనను సమర్థించింది. ముస్లిం లీగ్ ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను కోరింది. మార్లే

– మింటో సంస్కరణలు ఈ కోర్కెను అంగీకరించడంతో భారత ప్రజలను హిందువులు, ముస్లింలుగా విడదీసే మత సిద్ధాంతానికి ప్రభుత్వ గుర్తింపు లభించింది.

కాంగ్రెసు మితవాద నాయకత్వం ఎంత రాజీ ధోరణి నవలంభించినా, ముస్లిం లీగ్ ఎంత విషపూరిత మత ప్రచారం చేసినా, అంతర్గతంగా ఎన్ని పరిమితులున్నప్పటికీ తిలక్, బిపిన్‌పాల్ వంటి అతివాదుల నాయకత్వంలోని ప్రజా ఉద్యమం ప్రపంచ యుద్ధ పూర్వకాలంలో భారత ప్రజల స్వాతంత్ర్య కాంక్షను ధైర్యంగా ప్రపంచం దృష్టికి తీసుకువెళ్ళడంతో గణనీయమైన విజయం సాధించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో సామ్రాజ్యవాదానికి చావు దెబ్బ తగిలింది. తీవ్ర ఆర్థిక సంక్షోభం సామ్రాజ్యవాద దేశాల్లో ప్రబలింది. 1917లో రష్యాలో జరిగిన అక్టోబరు సోషలిస్టు విప్లవం ప్రపంచ పరిణామాల మీద, భారతదేశంలో జరిగే జాతీయ విముక్తి ఉద్యమంపైన అత్యంత ప్రభావాన్ని కలుగజేసింది. భారత జాతీయోద్యమం విస్తృత ప్రజా ప్రాతిపదికపై ముందుకు సాగింది. యుద్ధం ప్రారంభం కాగానే విదేశీ సామ్రాజ్యవాద ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తేవడానికి చురుకుగా వ్యవహరించి, రాజీపడని రాజకీయ కార్యకర్తలను డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్సు తదితర ప్రత్యేక అధికారాలను వుపయోగించి నిర్బంధించింది. మితవాదుల నాయకత్వంలోని భారత జాతీయ కాంగ్రెసు 1914 నుండి వరుసగా జరిగిన నాలుగు సమావేశాల్లోనూ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి తన విధేయతను ప్రకటించి యుద్ధ ప్రయత్నాలకు సహకారాన్ని అందించింది. దక్షిణాఫ్రికా నుండి లండన్‌కు వచ్చిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ యుద్ధానికి భారత ప్రజల బేషరతు మద్దతును ప్రకటించాడు. 1915లో భారతదేశంలో ఆయన అడుగుపెట్టిన నాటి నుండి బ్రిటిష్ ప్రభుత్వానికి విశేష సహకారాన్ని అందివ్వాలనే విధానాన్ని పట్టువిడవకుండా కొనసాగించాడు. యుద్ధ విరమణ తరువాత ఢిల్లీలో సమావేశమైన కాంగ్రెస్, యుద్ధం విజయవంతంగా ముగిసినందుకు బ్రిటిష్ ప్రభుత్వాన్ని అభినందిస్తూ కేబుల్ పంపింది. ఈ మర్యాదలను బ్రిటిష్ ప్రభుత్వం ఆనందంగా స్వీకరించి కాంగ్రెసు పట్ల ప్రేమాభిమానాలను ప్రదర్శించింది. కాని, యుద్ధం తరువాత స్వయం పరిపాలన వస్తుందని మితవాదులు, గాంధీజీ కన్న కలలు విషాదంలో కరిగిపోయాయి.

అధిష్టానవర్గం ఎంత అణుకువగా వున్నప్పటికీ ప్రజల్లో తీవ్రమవుతున్న అసంతృప్తిని అదుపు చేయలేకపోయింది. పంజాబ్‌లో గదర్ ఉద్యమం, తదితర ఉద్యమాలు ప్రజల భావాలను ప్రతిబింబించాయి. ప్రభుత్వం ఏ విధమైన వ్యతిరేకతను సహించగల్గిన స్థితిలో లేదు. 1916లో తిలక్ ప్రారంభించిన హోమ్ రూల్ ఫర్ ఇండియా ఉద్యమం కూడా ప్రభుత్వానికి కంటకప్రాయమైంది. ఆ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి అనిబిసెంట్‌ను నిర్బంధించారు. 1917లో బ్రిటిషు ప్రభుత్వం "భారతదేశంలో విప్లవ కార్యకలాపాలకు సంబంధించిన విద్రోహకర కుట్రలను" గురించి దర్యాప్తు చేయడానికి రౌలట్ కమిటీని నియమించింది. ఈ కమిటీ నేరారోపణ లేకుండా నిర్బంధించడం, "అనుమానాస్పద వ్యక్తుల" కదలికల మీద ఆంక్షలు విధించడం వంటి నిరంకుశ చర్యలను పొందుపరుస్తూ ఒక చట్టం చేయాలని సూచించింది. భారత ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ వలస ప్రభుత్వం ఈ రౌలట్ బిల్లును చట్టంగా రూపొందించింది.

దక్షిణాఫ్రికాలో వలసపాలన ఫలితాలను అనుభవించిన గాంధీజీ ఆనాటికే భారత రాజకీయ రంగంలో ప్రవేశించి రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సౌమ్యమయిన పద్ధతిలో ప్రతిఘటించే కార్యక్రమాన్ని చేపట్టాడు. 1919 ఏప్రిల్ 6న దేశవ్యాప్తంగా హర్తాళ్ చేయాలని, తరువాత సత్యాగ్రహం చేయాలని ఆయన పిలుపిచ్చాడు. హర్తాళ్ బ్రహ్మాండంగా విజయవంతమైంది. కానీ, ఢిల్లీలో పోలీసులు హిందూ ముస్లిం ప్రదర్శకులపై కాల్పులు జరిపారు. గాంధీజీకి ఢిల్లీ ప్రవేశం నిరాకరించబడింది. ఆయనను బొంబాయికి పంపించివేశారు.

పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో ఏప్రిల్ 13న జరిగిన దారుణ మారణహోమంతో ఈ అసాధారణమైన దమనకాండ పరాకాష్ఠకు చేరుకుంది. జనరల్ డయ్యర్ నాయకత్వాన బ్రిటిషు సైనికులు జలియన్‌వాలాబాగ్‌లో నాలుగు గోడల మధ్య చిక్కుకుపోయిన వెయ్యిమందికి పైగా స్త్రీ, పురుషుల మీద తుపాకీ గుళ్ళవర్షం కురిపించి ఘోరంగా చంపారు. అనేక వేలమంది ప్రజలను గాయపరిచారు. దీని తరువాత మార్షల్‌లా ప్రకటించి, కర్ఫ్యూ విధించారు. అనేక మందిని విచక్షణారహితంగా అరెస్టుచేసి కొరడాలతో కొట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే భీతావహం సృష్టించారు. ఈ రాక్షసత్వానికి వ్యతిరేకంగా భారతదేశమంతటా సామ్రాజ్యవాదుల పట్ల ద్వేషంతో కూడిన కోపాగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లాయి. జిత్తులమారి బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వం ఈ దమనకాండ వలన ప్రజలలో చెలరేగిన కోపాగ్నిని చల్లార్చేందుకు, 1917, ఆగస్టు 20న ప్రభుత్వం సెక్రటరీ ఆఫ్ స్టేట్ (క్యాబినెట్ మంత్రి), మాంటేగ్ పేరిట "మాంటేగ్" ప్రకటనను హడావిడిగా విడుదల చేసింది. "బ్రిటిషు సామ్రాజ్యంలో భాగంగా భారతదేశంలో క్రమంగా బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు తమ లక్ష్యంగా" పేర్కొంటూ, అందుకు వీలయినంత త్వరలో సమగ్రమైన చర్యలు చేపడ్తామని ప్రకటన హామీ ఇచ్చింది.

భారతదేశంలో నెలకొన్న కల్లోల పరిస్థితులు సామ్రాజ్యవాదులకు మిక్కిలి కలవరపాటు కల్గించాయి. అప్పటి వరకు అప్రతిహతంగా సాగుతున్న ప్రపంచ సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేసే తీవ్ర పరిణామాలు అంతర్జాతీయ రంగంలో సంభవిస్తున్నాయి. ఈ దశలో సంస్కరణల ద్వారా భారత ప్రజల అసంతృప్తిని చల్లార్చేందుకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రయత్నించింది. 1917 నవంబరులో ప్రపంచంలోనే ప్రథమ సోషలిస్టు రాజ్యం అవతరించింది. సిన్‌ఫిన్ పార్టీ ఐరిష్ రిపబ్లిక్ ప్రకటించింది. ముస్తాఫా కమాల్‌పాషా మిత్రరాజ్యాల దురాక్రమణకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించి, టర్కీలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పరిచాడు. వర్సెయిల్స్ సంధి ఒప్పందంపై సంతకం చేయడానికి చైనా నిరాకరించింది. 1919 మే 4న చైనాలో సామ్రాజ్యవాద వ్యతిరేక సాంస్కృతిక, రాజకీయ ఉద్యమం ప్రారంభమయింది. ఈ నూతన శక్తుల ప్రోత్సాహంతో వలస అర్ధవలసల్లోని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు ఉత్తేజం కలిగింది. సామ్రాజ్యవాదుల పిడికిలి పట్టుసడలింది.

మాంటేగ్ సంస్కరణల ప్రకారం భారతీయులకు కూడ ప్రభుత్వంలో పాల్గొనే హక్కు ఇచ్చి, హోంరూలు ఉద్యమ ఖైదీలను విడుదల చేశారు. మితవాదులు దీనికి సంతృప్తి చెందారు, కానీ, అతివాదులు సంతృప్తి చెందలేదు.

గాంధీజీ ఖిలాఫత్ ఉద్యమం వైపు బాగా ఆకర్షితులయ్యారు. ఆయన సహాయ నిరాకరణోద్యమం ప్రకటించారు.

ముస్లింలీగ్ కాంగ్రెస్‌లోని ఒక సెక్షన్ అనుసరిస్తున్న మత ప్రాతిపదిక మీద ఆధారపడ్డ రాజకీయ సిద్ధాంతం, భారత కార్మికవర్గ వర్గ చైతన్యాన్ని పెంపొందించే విషయంలో ప్రతికూల ప్రభావం చూపింది. అలాగే ఖిలాఫత్ వుద్యమం ముస్లిం కార్మికుల వర్గదృక్పథాన్ని కలుషితం చేసింది. ఖిలాఫత్ వుద్యమం సాగిన తీరు, ముగిసిన విధం ఇందుకు సాక్షీభూతంగా నిలుస్తాయి.

1919లో జరిగిన శాంతి ఒప్పందాలు, మిత్రరాజ్యాల యుద్ధ లక్ష్యాలను నీరుగార్చడంతో పాటు "అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ పధ్నాలుగు అంశాల శాంతి ప్రణాళికను" భగ్నం చేశాయి. సామ్రాజ్యవాద కుట్రల్లో భాగమైనప్పటికీ జర్మనీ భారతదేశంలో విప్లవోద్యమానికి సహాయం చేయటానికి ప్రయత్నించడంతో భారతీయులలో జర్మనీ పట్ల సానుభూతి ఏర్పడింది. వర్సెయిల్స్ ఒప్పందం ప్రకారం ఓడిపోయినవారి వలసలను గెలిచినవారికి కట్టబెట్టారు. మధ్య ఐరోపా ప్రజలకు స్వయం నిర్ణయాధికారం నిరాకరించబడింది. యుద్ధ నష్టాల పరిహారం రూపంలో జర్మనీపై తీవ్ర భారం మోపబడింది. టర్కీ సామ్రాజ్యానికి ఈ ఒప్పందం వలన తీవ్రమయిన అన్యాయం జరిగింది. ఇది భారతీయుల్లో ముఖ్యంగా ముస్లింలలో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. మిత్రరాజ్యాలు ''ఒట్టమన్'' సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి నిర్ణయించుకున్నాయి. మిత్రరాజ్యాల మద్దతుతో గ్రీస్, ఇటలీ సైన్యాలు టర్కీలో ప్రవేశించి టర్కీ సామ్రాజ్యాన్ని, ఖలీఫా ఆధిపత్యాన్ని నాశనం చేయడం మొదలుపెట్టాయి. ముస్లింలు ఖలీఫాను తమ మతాధిపతిగా గుర్తించేవారు. ఖలీఫా అధికారం బలహీనపడితే సామ్రాజ్యవాద ఆధిపత్యంలోనున్న దేశాల్లోని ముస్లింల పరిస్థితి క్షీణిస్తుందని భావించారు. ఫలితంగానే ఇండియాలో ఖిలాఫత్ ఉద్యమం పుట్టింది. భారత ముస్లింలలోని ఒక సెక్షన్ బ్రిటిష్ ప్రభుత్వం టర్కీలో అనుసరిస్తున్న విధానాన్ని మార్చుకుని, టర్కీకి న్యాయం చేకూర్చడానికి బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా దేశవ్యాపిత ఉద్యమం నిర్వహించాలని నిర్ణయించింది. మౌలానా అజాద్, హకీమ్ అజ్‌మల్‌ఖాన్, హసరత్ మొహని నాయకత్వంలో 'ఖిలాఫత్' కమిటీ ఏర్పడింది. ఇది హిందువులను, ముస్లింలను ఏకంచేసే మహదవకాశమని అమాయకంగా నమ్మిన గాంధీజీ ఈ వుద్యమానికి మద్దతు నివ్వడానికి నిర్ణయించుకున్నారు. కాంగ్రెసు, ముస్లింలీగు కూడ ఈ వుద్యమానికి మద్దతిచ్చాయి. కానీ, 1922లో కమాల్‌పాషా టర్కీలో అధికారానికి వచ్చి టర్కీ లౌకిక రాజ్యమని ప్రకటించడంతో, ఖలీఫాకున్న రాజకీయ అధికారాలన్నీ తొలగించబడ్డాయి. దానితో మన దేశంలో ఖిలాఫత్ ఉద్యమం ప్రాధాన్యత కోల్పోయింది.

పట్టణాలలో నివసించే మధ్యతరగతి ముస్లింలలోని అత్యధికుల్లో బ్రిటిష్ వ్యతిరేక భావాలు కలిగించడంలో ఖిలాఫత్ ఉద్యమం సఫలీకృతమైందని నిస్సందేహంగా చెప్పవచ్చు. కానీ, ఈ ఉద్యమం మతపరమైన భావాల ప్రాతిపదికగా సాగింది. దీని కనుగుణంగానే పశ్చిమాసియాకు చెందిన ముస్లిం మత గ్రంథాల్లో చెప్పబడిన పురాణ పురుషులను ఉదహరించడం ద్వారా ఉద్యమాన్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. టర్కీ సమస్యకు

సంబంధించినంతవరకు ముస్లింలలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెరిగినప్పటికీ, మొత్తం మీద ముస్లింలలో అసలైన సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం కల్పించడంలో ఖిలాఫత్ ఉద్యమం విఫలమైంది. ఈ ఉద్యమం ముస్లింలలోని పేద తరగతులకు చెందిన రైతాంగం, కార్మికుల ప్రాథమిక ఆర్థిక, రాజకీయ సమస్యలను చేపట్టి, సామ్రాజ్యవాద, ఫ్యూడల్ అణచివేతకు మూలమైన అంశాల మీద పోరాటం సాగించడంలో విఫలమైంది. అందువల్ల ఈ ఉద్యమం కార్మిక, కర్షకుల్లో వర్గ చైతన్యాన్ని పెంపొందించడానికి బదులు, మతపరమైన భావాలతో వర్గ చైతన్యాన్ని మొద్దుబారచేసింది. దీనికితోడు, ముస్లిం లీగ్ ప్రతిపాదించిన రెండు దేశాల సిద్ధాంతం, అది ప్రచారం చేసిన మధ్యయుగాలనాటి మతపరమైన మూఢవిశ్వాసాలు ముస్లింల మీద తీవ్ర ప్రభావం చూపాయి. అందువల్ల ముస్లింలలోని అత్యధిక సంఖ్యాకులైన రైతాంగం, కార్మికులు సామ్రాజ్యవాద పాలన, వారి దోపిడీకి సంబంధించిన సమస్యల పట్ల అవగాహన లేక, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలకు దూరమై, మత రాజకీయాల ఉచ్చులో చిక్కుకున్నారు. అందువలన భారత కార్మిక వర్గంలో వర్గ చైతన్యం ఏ విధంగా పెంపొందిందో పరిశీలించే సందర్భంలో హిందూమత పునరుద్ధరణ వాదం, ముస్లింల మత మౌఢ్యం విష ప్రభావాన్ని గమనంలో వుంచుకోవాలి.

టర్కీకి న్యాయం చేకూర్చాలన్న హిందూ ముస్లిం సంయుక్త ప్రతినిధి వర్గం యొక్క రాయబారాన్ని వైస్రాయ్, బ్రిటిషు ప్రధానమంత్రి లాయిడ్ జార్జి కూడ నిరాకరించారు. అందువలన గాంధీజీ ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతుగా సత్యాగ్రహం చేయాలని నిర్ణయించి, 1920 ఆగస్టు 1 నుండి సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించారు. కానీ, ఈ ఉద్యమాలకు కాంగ్రెస్ సహాయం కూడ కావలసివచ్చింది. అదే సంవత్సరం సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో "శాంతియుత సహాయ నిరాకరణ" చేయాలని నిర్ణయించడం జరిగింది. 1920 – 1921 మధ్యకాలంలో ప్రజలలో అసంతృప్తి తీవ్రస్థాయిలో పెల్లుబికింది. 1920 సంవత్సరం మొదటి ఆరునెలల కాలంలో 15 లక్షల మంది కార్మికులు 200 సమ్మె పోరాటాలలో పాల్గొన్నారు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తట్టుకోలేని శ్రామిక ప్రజలు సమరశీల పోరాట మార్గం అనుసరించారు. సెప్టెంబరులో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ శ్రీ లాలా లజపతిరాయ్ ఈ విషయం స్పష్టంగా అంగీకరించారు. "మనం విప్లవాల యుగంలో పయనిస్తున్నామన్న వాస్తవాన్ని దాచి ప్రయోజనం లేదు.మనం స్వభావరీత్యాను, సాంప్రదాయ సిద్ధంగా విప్లవాలకు వ్యతిరేకం. మనం సహజంగానే నెమ్మదస్తులం. కానీ కదలాలని నిర్ణయించుకుంటే పెద్ద అంగలు వేస్తూ శీఘ్రంగా నడుస్తాం. ప్రాణమున్న ఏ జీవి అయినా తన జీవితకాలంలో విప్లవాల నుండి పూర్తిగా తప్పించుకోలేదు" అని రాయ్ అన్నారు.

రజనీపామీదత్ ఈ విధంగా రాశారు : "కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన విశ్లేషణ చాలా సరైనది. కాంగ్రెస్ ప్రతినిధి చేసిన ఈ ప్రకటన ప్రకారం విప్లవ పోరాట దశలో స్వభావ సిద్ధంగా, సాంప్రదాయకంగా విప్లవాలు సరిపడని నాయకత్వానికి, ఉధృతమవుతున్న పోరాటానికి నాయకత్వం వహించవలసిన పరిస్థితి ఏర్పడింది. యుద్ధం తరువాత భారతదేశంలో ఏర్పడిన

పరిస్థితులలో ఈ వైరుధ్యం వున్నది. అలాగే మిగతా దేశాల్లో కూడా ఆ కాలంలో యుద్ధం తరువాత ఏర్పడిన అనుకూల పరిస్థితుల మేరకు రాజకీయ ఉద్యమాలు పరిపక్వ స్థితికి చేరలేదు."

ఆ పరిస్థితులలో స్వరాజ్యం సాధించేవరకు, టర్కీకి న్యాయం చేకూరే వరకు శాంతియుత సహాయ నిరాకరణోద్యమం నిర్వహించాలని కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం నిర్ణయించింది. మొదటగా ప్రభుత్వం ఇచ్చిన గౌరవ బిరుదులను వదులుకోవాలనీ, తరువాత లెజిస్లేచర్లు, న్యాయస్థానాలు, విద్యా సంస్థలను బహిష్కరించాలని, రాట్నం మీద నూలు వడకాలని, చివరి దశలో ఒక సమయంలో పన్నుల చెల్లింపును నిరాకరించాలని నిర్ణయించడం జరిగింది.

మధ్యతరగతి ప్రజలు ప్రతి ఇంట రాట్నం వడకటం, శ్రామికులు బట్టలు నేయడం అనే తక్షణ కార్యక్రమం రూపొందించడం జరిగింది. మొత్తం రైతాంగాన్ని పోరాటంలోకి దించే పన్నుల నిరాకరణ ఉద్యమం భవిష్యత్ కార్యక్రమంగా నిర్ణయించబడింది. ప్రారంభంలో కౌన్సిల్ బహిష్కరించే విషయంలో నాయకత్వంలో కొద్దిపాటి భిన్నాభిప్రాయాలు తలెత్తినప్పటికి వాటిని పరిష్కరించుకున్నారు. ఈ ఉద్యమం గణనీయమైన విజయం సాధించింది. 1920 డిసెంబరులో జరిగిన నాగపూర్ సమావేశంలో అస్పృశ్యతా నిర్మూలన, మద్యనిషేధం, జాతీయ విద్యా విధానం అనే నిర్మాణాత్మకమైన కర్తవ్యాలు చేపట్టింది. ఆనాటి కాంగ్రెస్ ప్రజల్లో ఒక ప్రధానమయిన రాజకీయ శక్తిగా గుర్తింపు పొందింది.

1921వ సంవత్సరం చివరినాటికి గాంధీజీ తప్ప మిగిలిన ప్రధాన నాయకులనందరిని నిర్బంధించారు. అసంతృప్తితో రగిలిపోతున్న ప్రజలు సమరశీల కార్యాచరణ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, కాంగ్రెస్ కొన్ని షరతులతో కూడిన సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రకటించింది. ప్రజలకు కాంగ్రెసు ప్రకటించిన పరిమిత సహాయ నిరాకరణోద్యమం ఆశాభంగం కలిగించింది. 1921, డిసెంబరు 31 నాటికి స్వరాజ్యం వస్తుందని గాంధీజీ స్వయంగా హామీ ఇచ్చారు. ఈ సహాయ నిరాకరణ ఉద్యమంలో కూడా ప్రజల పోరాట ఉత్సుకత వ్యక్తమైంది. ప్రజా పోరాటాలు ఒక్క సహాయ నిరాకరణకే పరిమితం కాక, దేశంలో వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక సమ్మెల రూపంలో కూడా ప్రజ్వరిల్లాయి. ఆ రోజుల్లో అస్సాం, బెంగాల్ రైల్వేల్లో సమ్మె, మిద్నపూరులో పన్నుల నిరాకరణ ఉద్యమం, మలబారులో మోప్లా తిరుగుబాటు వంటి అనేక పోరాటాలు జరిగాయి.

ప్రజల్లో రగులుకొన్న అసంతృప్తిని ఉపశమింపజేయడానికి ప్రభుత్వం వేల్సు యువరాజు సందర్శన ఏర్పాటు చేసింది. దీనివలన అనుకున్నదానికి వ్యతిరేక ఫలితం కలిగింది. 1921 నవంబరు 17న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో ప్రజానీకం వేల్స్ యువరాజుకు స్వాగతం పలికింది. బహుశా ఇదే, భారత ప్రజలు జాతీయ స్థాయిలో నిర్వహించిన సార్వత్రిక రాజకీయ సమ్మె. ఈ సమ్మె ద్వారా భారత ప్రజానీకం సరైన సమయంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తమ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ ఉధృతమైన ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక

భావాలను వలస పాలకులు క్రూరమైన దమనకాండతో అణచివేయడానికి పూనుకోవడంతో ప్రజలకు, సాయుధ సైనికులకు మధ్య ఘర్షణలు జరిగి రక్తపుటేరులు పారాయి. ప్రజల సమరశీల పోరాటాలు సహాయ నిరాకరణోద్యమ స్వభావాన్ని మార్చివేశాయి. తాను ఆశించిన పద్ధతులకు భిన్నంగా సాగిన ప్రజల సమరశీల పోరాటాల వెలువ పట్ల గాంధీజీ కలత చెందారు. చిత్తరంజన్‌దాస్ తదితర నాయకులు నిర్బంధంలో వుండటంతో అన్ని అధికారాలు కల్గిన ఏకైక కాంగ్రెస్ నాయకునిగా (నియంత) "అహింసాయుత సహాయ నిరాకరణోద్యమం పట్టణ కేంద్రాల్లో విఫలమైంది కనుక, తన కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రీకరిస్తానని" గాంధీజీ ప్రకటించారు. అదే ఏడాది చివరలో జరిగిన అహమ్మదాబాద్ కాంగ్రెస్ సమావేశం, సామూహికంగానూ, వ్యక్తిగతంగానూ శాసనోల్లంఘన ఉద్యమాన్ని నడిపే సర్వాధికారాలు గాంధీజీకి కట్టబెట్టింది. సరిగ్గా ఇక్కడే ఉద్యమంలో తిరోగమనం ప్రారంభమైంది.

గుజరాత్‌లోని బార్డోలీ తాలూకాలో శాసనోల్లంఘనను నిర్వహించాలని గాంధీజీ నిర్ణయించుకున్నారు. కాని ఈ ఉద్యమం ప్రారంభం కాకముందే ఉత్తరప్రదేశ్‌లోని చౌరీ చౌరాలో హింసాకాండ జరిగింది. అక్కడ విచక్షణ లేకుండా పోలీసులు కాల్పులు జరిపినందుకు రైతులు ఆగ్రహావేశాలతో పోలీసు స్టేషన్‌కు నిప్పంటించారు. దీనిలో 22 మంది పోలీసులు మృతిచెందారు. దీనితో కలత చెందిన గాంధీజీ వెంటనే వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన ఒత్తిడి మేరకు "చౌరీ చౌరాలో ప్రజల అమానుష ప్రవర్తన" కారణంగా శాసనోల్లంఘన ఉద్యమం ఉపసంహరించాలని సమావేశం నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రజల్లో తీవ్ర విస్మయం కలుగజేసింది. ప్రజలతో బాటు జైలులో వున్న చిత్తరంజన్ దాసు, మోతీలాల్ నెహ్రూ, లాలాలజపతిరాయ్, సుబాష్‌చంద్రబోసు వంటి అనేకమంది ప్రముఖ కాంగ్రెసు నాయకులకు కూడా ఈ నిర్ణయం దిగ్భ్రాంతిని, విస్మయాన్ని కలుగజేసింది. దూరదృష్టి లేకుండా గాంధీజీ ఉధృతంగా సాగే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి అడ్డుకట్టవేసి, యుద్ధం తరువాత కాలంలో ప్రజానీకం చొరవతో జరుగుతున్న రాజకీయ ఉద్యమాన్ని ధనికవర్గాల పిడికిలిలో బిగించివేశారు. ప్రజాపోరాట వెల్లువ వెనక్కు తగ్గింది. సునిశిత బుద్ధిగల సామ్రాజ్యవాద పాలకులు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. ఈ అవకాశం వదులుకోకుండా ఎదురుదాడి చేశారు. మార్చి 10న గాంధీజీని అరెస్టు చేశారు.

## రష్యన్ విప్లవ ప్రభావం

సామ్రాజ్యవాద బందిపోట్ల దోపిడి వలన వినాశానికి గురై పరస్పర వ్యతిరేక వర్గాలుగా సమాజం చీలిపోయిన ప్రపంచంలో 1917, నవంబరు 7న ఒక నూతన రాజ్యం, సమాజం ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ పరిపాలన శాశ్వతం కాదని నిర్ద్వంద్వంగా నిరూపిస్తూ, తక్కువ సంఖ్యలో వున్న దోపిడీ వర్గాలపై అశేష పీడిత ప్రజానీకం ఆధిక్యతను నిరూపించే శ్రామికవర్గ నియంతృత్వంలో సోషలిస్టు ప్రభుత్వాన్ని ఏర్పరచిన రష్యన్ విప్లవం ప్రపంచ చరిత్రలో నూతనశకం ప్రారంభించింది. మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తెచ్చిన గొప్ప విప్లవకారుడు,

మహా మనీషియైన లెనిన్ సందేశాలు రష్యా సరిహద్దులు దాటి ప్రపంచంలో కాంతి పుంజాలు వెదజల్లాయి. పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికులు సోషలిస్టు విప్లవం కోసం శ్రామికవర్గ రాజ్యం కోసం చేసే పోరాటాలకు రష్యా విప్లవం ఉత్తేజాన్నిచ్చింది.

అదే విధంగా వలస, అర్ధ వలస దేశాలలోను పీడిత ప్రజలు చేసే పోరాటాలకు కొత్త శక్తిని ప్రసాదించి, విముక్తి సాధన పట్ల ఆశను చిగురింపచేసింది. ప్రపంచాన్ని ఉగ్రూతలూగించిన ఈ సంఘటన భారతదేశ జాతీయ విముక్తి పోరాటాలు ప్రత్యేకంగా దేశ కార్మికోద్యమం మీద చెరగని ముద్రవేసింది. కాని భారత జాతీయోద్యమం బూర్జువా వర్గ నాయకత్వంలో వుండటం వలన, కార్మికవర్గం యొక్క రాజకీయ చైతన్యం ఇంకా పరిపక్వం కానందువలన, కార్మికవర్గం తగినంతగా సంఘటితం కాకపోవటం వలన ఈ విప్లవ ప్రాముఖ్యత జాతీయోద్యమానికి ఆచరణ యోగ్యమైనదిగా రూపొంద లేకపోయింది. వర్గశక్తుల బలాబలాలు మరోవిధంగా వుంటే ఈ విప్లవ ప్రభావం మరింత ప్రస్ఫుటంగా వుండేది, కాని ప్రపంచ సామ్రాజ్యవాదానికి ఈ విప్లవం వినిపించిన మరణమృదంగం ప్రపంచంలోని ఇతర దేశాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటంలో నిమగ్నమైన పీడిత ప్రజలపై ప్రభావం కలుగచేసినట్లుగానే, భారతదేశ పరిస్థితుల మీద కూడా గుణాత్మకమైన ప్రభావం చూపింది.

అంతేగాక యుద్ధం తర్వాత కాలంలో భారత కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ప్రధానంగా ఈ కాలంలో సాగించిన సమ్మె పోరాటాల వెల్లువ మీద రష్యా శ్రామిక వర్గ విప్లవ ప్రభావం వున్నట్లు స్పష్టమవుతోంది. ఈ మార్క్సిస్టు సిద్ధాంత కిరణం యొక్క కాంతి ప్రభావం మన దేశంలో మొదటగా చాలా కొద్దిమంది చదువుకున్న వారిపై ప్రసరించింది. విప్లవ సిద్ధాంతంతో ప్రభావితులైన వారు మొదట్లో చాలా కొద్దిమందే అయినప్పటికీ, విప్లవ ప్రభావం మన రాజకీయరంగంపై ప్రత్యక్షంగా కనబడసాగింది.

## యుద్ధసమయంలోను, ఆ తర్వాత కార్మికోద్యమ పరిస్థితి

జాతీయోద్యమ వెల్లువ గాంధీజీ ఆదేశాలకు, కాంగ్రెసు వర్కింగు కమిటీ నిర్దేశాలకు లోబడి వెనుకపట్టు పట్టింది. అయినప్పటికీ యుద్ధం వల్ల ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో, కొన్ని సందర్భాల్లో చెదురుమదురుగానూ, మరికొన్ని సందర్భాల్లో విస్తృత స్థాయిలోనూ కార్మిక వర్గ ఆర్థిక పోరాటాలు ప్రజ్వరిల్లాయి. ఈ కార్మిక వర్గ పోరాటాలు రాజకీయ ప్రేరణతో జరిగాయి. ఇది అక్కడక్కడ స్పష్టంగానే కన్పించింది. దీనితో బ్రిటిషు ప్రభుత్వం చాలా కలవరం చెందింది. లండన్ నుంచి సెక్రటరీ ఆఫ్ స్టేట్ భారతదేశంలోని వైస్రాయ్‌కి టెలిగ్రాం పంపి కార్మికోద్యమాల పరిస్థితులను గురించి నివేదిక పంపమని కోరాడు. ఈ టెలిగ్రాం చదివితే ప్రభుత్వం స్థైర్యం ఎంతగా కోల్పోయిందీ తెలుస్తుంది.

“భారతదేశం తీవ్రమయిన పారిశ్రామిక అశాంతితో కుతకుతలాడుతున్నదని ఇంగ్లాండు

లోని వార్తాపత్రికలు తెల్పుతున్నాయి. ఈ సమాచారం ఎంతవరకు నిజం ? ప్రభుత్వాన్ని స్థంభింపజేసే వుద్దేశంతో కాంగ్రెసు పార్టీ ఈ సమ్మెలను నిర్వహిస్తోందా? ఈ సమ్మెల సందర్భంలో మీరు తీసుకున్న చర్యల గురించి సమగ్ర సమాచారం ఇవ్వగలరా? అప్పుడు ఈ విషయంలో ఏం చేయగలమో చెప్పటానికి వీలవుతుంది."

ఈ టెలిగ్రామ్‌కు వైశ్రాయ్ పంపిన సమాధానం కార్మికోద్యమ పరిస్థితిని వివరించింది. నివేదిక ఇతర విషయాలతో బాటు కార్మికుల పరిస్థితిని ఈ విధంగా తెలియచేసింది.

"భారతదేశంలో చాలావరకు పారిశ్రామిక అశాంతి వున్న మాట నిజమే. కాని మొత్తం దేశమంతటా అశాంతి ప్రబలిందని చెప్పటం అతిశయోక్తి అవుతుంది. ఇక్కడున్న పరిస్థితికి, ఇంగ్లాండులోని ప్రస్తుత పరిస్థితికి ఏ మాత్రం పోలిక లేదు. ఈ అశాంతికి ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణం.

1. ధరలు విపరీతంగా పెరగడంతో జీతాలు కూడా గత పన్నెండు మాసాల్లో బాగానే పెరిగాయి. కాని ధరలు పెరిగినంత వేగంగా జీతాలు పెరగలేదు.

2. దళారులు, చిల్లర వ్యాపారస్తులు అధికంగా లాభాలు ఆర్జిస్తున్నారనే అభిప్రాయాలు ప్రజల్లో ప్రబలంగా వున్నాయి.

3. ముఖ్యంగా మిల్లు యజమానులు, పెట్టుబడిదారులు అత్యధికంగా లాభాలు గడిస్తున్నారని కార్మికులకు అర్థమైంది.

4. కొద్దిమంది ధనికులు అనుభవిస్తున్న భోగలాలసతకు, కార్మికులు అనుభవిస్తున్న దారిద్రానికి తేడా కొట్టవచ్చినట్లు కన్పిస్తూంది. సాధారణంగానే వున్న పెరిగిన కార్మికుల డిమాండ్‌తో కార్మికుల కొరతతో బాటు పారిశ్రామిక సంస్థల సంఖ్య విపరీతంగా పెరగటం వలననూ, ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి సృష్టించిన వినాశనం కారణంగానూ పారిశ్రామిక కార్మికుల కొరత తీవ్రమైంది. ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి వలన జనసమ్మర్థంతో కిటకిటలాడే పట్టణాలకు పల్లెల నుండి కార్మికులు రావటంలేదు.

5. పరిస్థితులు విషమించిన కారణంగా ఏర్పడిన అశాంతి సమ్మె రూపం దాల్చితేనే తప్ప యజమానులు జీతాలు పెంచడానికి అంగీకరించడం లేదు.

ఈ ఆర్థిక కారణాలతో పాటు ప్రపంచ వ్యాపితంగా సాగుతున్న రాజకీయోద్యమాలు కొంతవరకు ఇంగ్లాండ్‌తో సహా ఇతర యూరప్ దేశాల్లోని కార్మిక అశాంతిని గూర్చిన వార్తలు వ్యాప్తి చెందటం, ఇక్కడి రాజకీయ ఆందోళనకారులు ఇచ్చే ప్రోత్సాహం వలన ఇక్కడి వాతావరణంలో సమ్మె జ్వరం అంటువ్యాధిగా వ్యాపించింది. భారతదేశంలో సమ్మెలు తరుచుగా జరుగుతున్నప్పటికీ అశాంతి అప్పుడప్పుడూ ఏర్పడుతూ సాధారణంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమయింది. దేశవ్యాప్తంగా పనిచేసే కార్మిక సంఘాలు లేకపోవటం వలన, యూనియన్ నిధులు లేకపోవటం వలన, కార్మికోద్యమాలు దీర్ఘకాలం కొనసాగి విజయవంతం కావటం కష్టం అవుతోంది. కాని భారతదేశంలో పట్టణాల్లో పనిచేయటానికొచ్చిన కార్మికుల్లో ఎక్కువ

భాగం పల్లె ప్రాంతాల్లోని రైతాంగానికి చెందినవారవటం వలన సమ్మెలో పాల్గొనేవారు తిరిగి తమ తమ గ్రామాలకు పోయే అవకాశం వుండటంతో, వారి ప్రతిఘటనా శక్తి అధికమయ్యే అవకాశముంది. కాంగ్రెస్ పార్టీ మొత్తంగా ఈ సమ్మెలను ప్రోత్సహిస్తోందని చెప్పటం కష్టం. కాని సహాయ నిరాకరణోద్యమం నిర్వహించే నాయకత్వం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి సమ్మె ఆయుధం బాగా పనికొస్తుందని గుర్తించింది. ఈ పార్టీ సభ్యులు వ్యక్తిగతంగా కార్మిక అశాంతిని ప్రోత్సహించడానికి చురుకుగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు రాజకీయ నాయకులు సమ్మె ప్రారంభమైనాకే కార్మికుల సహాయానికి వచ్చేవారు. బొంబాయి, మద్రాసుల్లో రాజకీయ నాయకులు ప్రోత్సహించే కొన్ని సంస్థలున్నాయి. బొంబాయికి చెందిన బాప్టిస్టా, మద్రాసుకు చెందిన వాడియా ఇందుకు ఉదాహరణ. కాని వాడియా ఈ మధ్య రాజకీయాల నుండి నిష్క్రమించినట్లు చెప్పుకుంటున్నారు. కొన్ని వార్తా పత్రికలు సమ్మెలను ప్రోత్సహిస్తున్నాయి. అందులో 'బొంబాయి క్రానికల్ ఒకటి'. ఈ నెలాఖరులో బొంబాయిలో జరగబోయే ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సమావేశంపైన, ఆ తరువాత జరిగే ప్రత్యేక రైల్వే కాన్ఫరెన్స్ పైన ఇటువంటి పత్రికలు చాలా ఆశలు పెట్టుకున్నాయి."

ఎంత దాచాలని ప్రయత్నించినా అధికార నివేదిక వాస్తవ పరిస్థితులను దాచలేక పోయింది. ఈ కాలంలో ప్రధానంగా యుద్ధం తర్వాత భారత కార్మికోద్యమ పురోగతినీ నివేదిక ధృవపర్చింది. ముఖ్యంగా ఈ ఉద్యమం వలన వలస పాలకులలో కలిగిన తీవ్రమైన ఆందోళననీ నివేదిక వెల్లడిస్తోంది. దేశంలోని ఆర్థిక పరిస్థితి జాతీయ స్థాయి రాజకీయోద్యమాలు కార్మిక పోరాటాలకు దోహదంచేసే ప్రధాన కారణాలుగా పేర్కొంటూ, ప్రపంచవ్యాప్త రాజకీయ ఆందోళనలు, ఆ కాలంలో యూరపులోను, ఇంగ్లండ్‌లోను వున్న కార్మికోద్యమాల ప్రభావాన్ని కూడా ఈ నివేదిక గుర్తించింది. "ప్రపంచవ్యాప్త రాజకీయ ఆందోళన" అంటే ఏమిటో అధికార నివేదికలో వివరించకపోయినా అదేమిటో గుర్తించటం అసాధ్యం కాదు. 1917 రష్యా విప్లవం దాని ఉత్తేజంతో ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గంలో మేల్కొన్న చైతన్యం అని దీనికర్థం. భారత కార్మికవర్గంపై ఈ చారిత్రాత్మక సంఘటనల ప్రభావాన్ని సామ్రాజ్యవాద ప్రభుత్వం సునిశిత పరిశీలనతో, సూక్ష్మబుద్ధితో గమనించింది.

పోరాటాలు స్థానికంగా, చెదురుమదురుగా జరుగుతున్నాయని నివేదికలో తెలిపినప్పటికీ, దేశవ్యాప్త కార్మిక సంఘం ఏర్పడబోతోందన్న విషయాన్ని కూడా గమనించింది. అంటే ఇన్నాళ్ళు అనుభవించిన ఒంటరితనాన్ని, బలహీనతను అధిగమించి కార్మికులు దేశవ్యాప్తంగా సంఘటితం కాబోతున్నారు. ఇది వలస ప్రభుత్వానికి శుభపరిణామం కాదు. అందువలన రాబోయే పరిణామాన్ని గ్రహించి కొంత సామరస్య వైఖరిని ప్రదర్శించింది. దీన్ని గురించి నివేదిక ఈ విధంగా తెలిపింది.

"ఈ అసంతృప్తిని తగ్గించడానికి దాదాపు ప్రభుత్వోద్యోగులందరికీ చిన్న చిన్న పనులు చేసేవారికి జీతాలు పెంచాము. దీనివలన ఏటా పది కోట్ల రూపాయలకు తగ్గకుండా అదనంగా ఖర్చవుతోంది. దీనివలన చాలావరకు సౌకర్యం కలిగినా కొన్ని సందర్భాలలో జీతాలు పెంచిన

తర్వాత కూడా విపరీతమైన కోర్కెల సాధనకై సమ్మెలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో బొంబాయి పోస్టల్ ఉద్యోగుల సమ్మెను పేర్కొనాలి. ప్రస్తుతం సాగుతున్న సమ్మెల్లో ఇది చాలా ముఖ్యమైనది. అదే విధంగా గవర్నమెంట్ ప్రెస్సుల్లో జూలైలో జీతాల పెంపుదల ప్రకటించిన తరువాత సమ్మె ప్రారంభమైంది. ఈ నిర్ణయాన్ని మార్చే విధంగా ప్రభుత్వం మీద తగినంత ఒత్తిడి తీసుకురాలేక కార్మికులు తిరిగి పనుల్లోకి వచ్చేవారు. ప్రైవేట్ పరిశ్రమల్లో జరిగే సమ్మెలను ఆయా సంస్థల్లోని పరిస్థితులను బట్టి వ్యవహరిస్తున్నాం. అటువంటి సమస్యల్లో చాలా భాగం ఉభయ పక్షాలవారు తీర్మానానికి రావడమే మంచిది. మరికొన్ని సందర్భాల్లో సరైన సమయంలో జోక్యం చేసుకొని ఉభయ పక్షాలు తమ సమస్యను మధ్యవర్తి పరిష్కారానికి వదిలివేయవల్సిందిగా ఒత్తిడి చేస్తున్నాం. ఈ పద్ధతి ద్వారా అహమ్మదాబాదు, మద్రాసుల్లో అనేక సమస్యలను పరిష్కరించటం జరిగింది. ముఖ్యంగా మద్రాసు, బొంబాయిలలో వుండే స్థానిక ప్రభుత్వాలు, ఆర్థిక అసంతృప్తికి గల కారణాలను పరిశీలించి పరిష్కరించేందుకు కొన్ని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. చాల సందర్భాలలో ఇతర చర్యలు విఫలమైన తరువాత గవర్నర్లు స్వయంగా జోక్యం చేసుకున్నారు. ఇంగ్లీష్ ఇండస్ట్రియల్ కోర్ట్స్‌యాక్ట్ పద్ధతిలో చట్టం చేసే దశ ఇంకా రాలేదని చాలామంది అభిప్రాయపడుతున్నారు. వర్క్స్ కమిటీల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలనే విధానాన్ని అనుసరించమని చాలామందికి చెప్పాం. తెలివిగల యజమానులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. వాషింగ్టన్ కన్వెన్షన్ ప్రకారం మనం తయారుచేసిన చట్టం కార్మికుల పరిస్థితులను, జీతాలను మెరుగుపరచగలదు. కార్మికుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం వల్ల ఒనగూడే ప్రయోజనాల గురించి యజమానులను చైతన్యపర్చవలసిన అవసరాన్ని గుర్తించి, అందుకవసరమైన సమాచారాన్ని సేకరించి, వారికందజేసి తగిన సూచనలు చేయడంతో మా సెంట్రల్ లేబర్ బ్యూరో చురుగ్గా పనిచేస్తోంది."

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని వివిధ పారిశ్రామిక సంస్థల్లో నెలకొంటున్న పారిశ్రామిక అశాంతి స్వభావాన్ని గురించి నివేదిక స్పష్టంగానే పేర్కొంది. ఈ అశాంతిని అదుపు చేయటానికి ఇచ్చే రాయితీలను, రాజీ చర్యలను గురించి నివేదిక పేర్కొంది. ఆర్థిక బాధలతో పాటు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో కార్మికవర్గం చేస్తున్న పోరాటాలు అనేక అవరోధాల నధిగమించి దేశమంతటా వ్యాపించాయి. ఇప్పటివరకు చెదురుమదురుగా జరుగుతున్న పోరాటాలు ఇప్పుడు నిర్మాణయుతం కాజొచ్చాయి. కార్మికుల చైతన్యస్థాయి పెరిగింది. నాయకత్వం యొక్క అవగాహన కూడా మరింత మెరుగుపడింది.

ఈ కాలంలో ప్రత్యేకించి 1920వ సంవత్సరం భారత కార్మికోద్యమాల చరిత్రలో అత్యంత ప్రాముఖ్యంగలదిగా చెప్పుకోవచ్చు. ఒకప్రక్క భారత ప్రజల తీవ్రరాజకీయ పోరాటం, వేరొకప్రక్క యుద్ధానంతర దేశవ్యాప్తంగా పెల్లుబికిన కార్మికవర్గ అసంతృప్తి నేపథ్యంలో 1920లో దేశంలోనే మొట్టమొదటి ట్రేడ్ యూనియన్ సంస్థ, అలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆవిర్భవించింది. ఈ సంఘం కొంతమంది నాయకులు, శ్రేయోభిలాషుల ప్రయత్నాల వలన ఏర్పడలేదు. భారత కార్మికుల నిరంతర పోరాటాల ద్వారా దేశంలోని పారిశ్రామిక కేంద్రాలను ఉర్రూతలూగించి సృష్టించిన సానుకూల పరిస్థితుల నుండి ఈ సంస్థ ఆవిర్భవించింది.

ఈ కాలంలో అధికార పత్రాల్లో నిరంతరం దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెల గురించి సమాచారం వున్నది. అవసరమైన విషయాల జోలికి పోకుండా క్లుప్తంగా పోరాటాల గురించి తెలిపితే ఈ విషయం స్పష్టం అవుతుంది. ప్రక్క పేజీలో సమ్మెలను గురించిన వివరాల పట్టిక వున్నది.

ఈ కాలంలో దేశవ్యాప్త స్వభావం కలిగి, నిరంతరాయంగా సాగిన పోరాటాలకు అధికార పత్రాలే సాక్షీభూతాలు. అనవసరమైన వివరాల్లోకి పోకుండా, ఈ పోరాటాల్లో కొన్నింటిని గురించి తర్వాత పేజీల్లో పొందుపర్చిన రేఖామాత్ర చిత్రణ ద్వారా ఈ విషయాలు స్పష్టమవుతాయి.

1920 ప్రాంతంలో జరిగిన మరికొన్ని సమ్మెల వివరాలు భారత ప్రభుత్వ రికార్డుల్లో నమోదై వున్నాయి. కొన్ని పెద్ద సమ్మెల గురించిన సమాచారం ఈ క్రింది విధంగా వుంది.

1920 అక్టోబర్ 16వ తేదీన ఝూన్సీలోని లోకోమోటివ్ డిపార్ట్‌మెంట్‌లోనూ, అక్టోబర్ 19న గ్రేట్ పెనిన్సులర్ రైల్వేకి చెందిన క్యారేజ్ మరియు వ్యాగన్ వర్క్‌షాపులో సమ్మె జరిగిందని యునైటెడ్ ప్రావిన్స్ ప్రభుత్వం నివేదించింది. ఈ సమ్మెలో 5వేల మంది పాల్గొన్నారు. వీరు తమ కోర్కెలను నిర్దిష్టంగా రూపొందించుకోనప్పటికీ, ఇతర డిపార్ట్‌మెంట్లలో వలె, లోకోమోటివ్ డిపార్ట్‌మెంట్ కార్మికులకు ఓవర్‌టైమ్ పనిచేసినందుకు అదనపు జీతం ఇవ్వకపోవడం ప్రధాన సమస్యగా వుందని తెలుస్తోంది. ఈ సమస్యను ఏజెంట్ దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ, ఏ విధమైన ఆదేశాలు ఇవ్వలేదు. లోకోమోటివ్ డిపార్ట్‌మెంట్ కార్మికుల పట్ల సానుభూతితోనో లేదా వారి ఒత్తిడి వల్లనో క్యారేజ్ మరియు వ్యాగన్ డిపార్ట్‌మెంట్ కార్మికులు సమ్మె చేశారు. రన్నింగ్‌షెడ్ కార్మికులు కూడా సమ్మె చేశారని అక్టోబర్ 27వ తేదీ పత్రికలు రాశాయి. ఆర్బిట్రేషన్ బోర్డు తన అవార్డు (తీర్పు)ను ప్రకటించినట్లు అక్టోబర్ 30వ తేదీ పత్రికలు రాశాయి.

## 1920లో భారతదేశంలో కార్మిక సమ్మెలు

| ప్రాంతం | సంస్థ | పాల్గొన్న కార్మికుల సంఖ్య | రిమార్కులు |
|---|---|---|---|
| మద్రాసు | మద్రాసు ట్రామ్‌వేస్ | 1400 | వేతనాల పెంపుదల ఇతర సౌకర్యాలు కల్గించిన తరువాత సమ్మె పరిష్కారం అయింది |
| మద్రాసు | మద్రాస్ మిల్స్ | అంచనా లేదు | బేషరతుగా కార్మికులు పనికి హాజరయ్యారు. |
| జమాల్‌పూర్ | ఈస్టిండియా రైల్వే వర్క్‌షాప్ | 10,300 | బేషరతుగా కార్మికులు పనికి హాజరయ్యారు. |

| | | | |
|---|---|---|---|
| పాట్నా | పాట్నా లా ప్రెస్ | 70 | వేతనాలు పెంచిన తరువాత కార్మికులు పనిలోకి వచ్చారు. |
| ముజఫర్‌పూర్ | పోస్టల్ ఉద్యోగులు | అంచనా లేదు | సామరస్యంగా పరిష్కారం అయింది |
| హింఘాఘాట్ | రామ్‌సాహిబ్‌రాక్ మెహతా మిల్స్ | 1000 | ధాన్యపు అలవెన్సు పెంచిన తరువాత సమ్మె ముగిసింది |
| నాగపూర్ | ఎంప్రెస్ మిల్స్ | 5000 | వేతనాలు పెంచిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| బరేలి | రోహికండ్ మరియు కుమాయన్ రైల్వే | 600 | వేతనాలు పెంచిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| సహరన్‌పూర్ | నార్త్ వెస్ట్రన్ రైల్వే | 1500 | సమస్యలు పరిష్కరిస్తామన్న హామీతో సమ్మె పరిష్కారం అయింది. |
| ఝాన్సీ | గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే వర్కుషాపు | అంచనా లేదు | సామరస్య పూర్వకంగా పరిష్కారం అయింది. |
| అలహాబాద్ | పయనీర్ ప్రింటింగ్ ప్రెస్ | 746 | కొన్ని రాయితీలు ఇచ్చిన తరువాత కార్మికులు పనికి హాజరయ్యారు. |
| కాన్పూర్ | ఎల్గిన్ మిల్స్, ఉలెన్ మిల్సు విక్టోరియా మిల్సు, మయూర్ మిల్సు కాన్పూర్ కాటన్ మిల్సు, గాంగెస్ జూట్ మిల్సు, ఫ్లోర్ మిల్సు, కాపర్ ఎలైన్ అండ్ కంపెనీ, ది టానరీ ఎంపయిర్ ఇంజనీరింగ్ కంపెనీ | 20000 | వేతనాల పెంపుదల, బోనస్ ఇవ్వడం, పనిగంటలు తగ్గించిన తర్వాత సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | ఎల్గిన్ మిల్స్ | 2425 | వేతనాలు పెంచిన తరువాత, కొన్ని సదుపాయాలు కల్పిస్తామన్న హామీతో సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | ఉన్ని మిల్లులు | 2000 | సామరస్య ధోరణిలో పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | విక్టోరియా మిల్సు | 500 | పక్షం రోజుల కొకసారి జీతం ఇస్తానన్న హామీతో కార్మికులు పనికి హాజరయ్యారు. |

| | | | |
|---|---|---|---|
| కాన్పూర్ | కాటన్ మిల్సు | 5500 | వేతనాలు పెంచి, బోనసు ఇచ్చిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | కాపర్ ఎలెన్ అండ్ | 5200 | వేతనాలు, బోనసు పెంచడం వలన సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | టానరీ | 600 | సామరస్య ధోరణిలో పరిష్కారం అయింది |
| కాన్పూర్ | ఎంపయిర్ ఇంజనీరింగ్ కో | 800 | వేతనాలను కొద్దిగా పెంచడంతో సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | హార్నెస్ ఫ్యాక్టరీ | 3000 | వేతనాలు పెంచడంతో కార్మికులు తిరిగి పనికి హాజరైనారు |
| కాన్పూర్ | జాజ్‌మన్ మిల్సు | 500 | వేతనాలు పెంచిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | హాఫిజ్ హాలీమ్ టానరీ | 300 | వేతనాలు పెంచిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| కాన్పూర్ | స్వదేశీ కాటన్ మిల్సు | 600 | సామరస్య ధోరణిలో పరిష్కారం అయింది. |
| కలకత్తా | మాసన్స్ | 10000 | వేతనాలు పెంచడంతో పరిష్కారం అయింది. |
| కుల్టి | బెంగాల్ ఐరన్ అండ్ స్టీల్ వర్క్సు | 11000 | వేతనాలు పెంచడంతో పరిష్కారం అయింది. |
| హౌరా | ఘూసరీ, న్యూసెంట్రల్ గాంజస్, ఫోర్టు విలియం అండ్ హౌరా జూట్ మిల్సు | 27000 | వేతనాలు పెంపుదల, ఇతర సమస్యల పరిష్కారంపై హామీతో సమ్మె పరిష్కారం అయింది. |
| హౌరా | 8 ప్రెస్సులు మరియు మెసర్స్ ప్యారీ అండ్ కో. | 300 | వేతనాల పెంపుదల ఇతర సమస్యల పరిష్కారంపై హామీతో సమ్మె పరిష్కారం అయింది. |
| కలకత్తా | టాక్సీ డ్రైవర్లు | 1200 | సామరస్య ధోరణిలో పరిష్కారం |

| | | | |
|---|---|---|---|
| కలకత్తా | రిక్షా పనివారు | 300 | సామరస్య ధోరణిలో పరిష్కారం అయింది |
| బొంబాయి నగరం | కాటన్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ | 1,35,000 | అలవెన్సులు పెంపుదల, పని గంటల తగ్గింపు ఇతర స్వల్ప సౌకర్యాలు కలిగించిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| బొంబాయి నగరం | డైవర్సు | 1842 | అలవెన్సులు పెంపుదల, పని గంటల తగ్గింపు ఇతర స్వల్ప సౌకర్యాలు కలిగించిన తరువాత సమ్మె పరిష్కారం అయింది. |
| బొంబాయి నగరం | మెకన్జీ సామిల్స్ | 350 | వేతనాల పెంపుదలతో సమస్య పరిష్కారం అయింది. |
| బొంబాయి నగరం | రాయల్ ఇండియన్ మెరైన్ డాక్ యార్డు | 4175 | వేతనాల పెంపుదలతో సమస్య పరిష్కారం అయింది. |
| బొంబాయి నగరం | బాంబే పోర్టు ట్రస్టు వర్కు షాపు | 3500 | వేతనాల పెంపుదలతో సమస్య పరిష్కారం అయింది |
| బొంబాయి నగరం | బాంబే పోర్టు ట్రస్టు వర్కు షాప్స్ ట్రాలీ గుమస్తాలు, కూలీలు క్రేన్ పనివారు | 3075 | వేతనాల పెంపుదలతో సమస్య పరిష్కారం అయింది |
| బొంబాయి నగరం | టైమ్స్ ఆఫ్ ఇండియా | 200 | అలవెన్సు ఇచ్చుటకు అంగీకరించడంతో సమ్మె పరిష్కారం అయింది |
| బొంబాయి నగరం | కొన్ని చిన్న ఫ్యాక్టరీలు | 3000 | వేతనాలు పెంపుదల, అలెవెన్సు మంజూరుతో సమ్మె పరిష్కారం అయింది |
| బొంబాయి నగరం | బొంబాయి మున్సిపాలిటీ | 300 | వేతనాల పెంపుదలతో సమ్మె పరిష్కారం అయింది |
| బొంబాయి నగరం | పి అండ్ జి మరియు బి.ఐ.ఎస్.ఎన్. కంపెనీ డాక్ యార్డ్ | 6000 | వేతనాల పెంపుదలతో బోనసు మంజూరుతో పరిష్కారం అయింది |

| | | | |
|---|---|---|---|
| బొంబాయి నగరం | ఆయిల్ ఇన్‌స్టాలేషన్ | 1688 | అలవెన్సు మంజూరుతో పరిష్కారం |
| బొంబాయి నగరం | ట్రామ్‌వే కంపెనీ వర్కుషాపు, దాదర్ | 1500 | వేతనాల పెంపుదలతో పరిష్కారం |
| బొంబాయి | రైల్వే వర్కర్స్ | 700 | వేతనాల పెంపుదలతో పరిష్కారం |
| షోలాపూర్ | కాటన్ మిల్సు | 13600 | ఇప్పటికీ పరిష్కారం కాలేదు |
| బార్సి | కాటన్ మిల్సు | 565 | ఇప్పటికీ పరిష్కారం కాలేదు |
| పూనా | కాపర్ స్మిత్స్ | 150 | వేతనాల పెంపుదలతో పరిష్కారం |
| అహ్మదాబాద్ | కాపర్ స్మిత్స్ | 4822 | వేతనాలు, బోనసు పెంచడంతో పరిష్కారం |
| గోద్రా | మునిసిపల్ స్వీపర్స్ | 113 | కంపెన్సేషన్ అలవెన్సు పెంపుదలతో పరిష్కారం |
| గోద్రా | పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ప్యూన్స్ | అంచనా లేదు | వేతనాల పెంపుదలతో సమ్మె పరిష్కారం |
| కరాచి | స్టీల్ డోర్స్ కంపెనీ | | |
| | కూలీలు : కరాచీ | 600 | సమాచారం తెలియదు |

---

"మద్రాసు గురించి నివేదిక ఈ క్రింది విధంగా పేర్కొంది :

"మద్రాసు కమిషనర్ ఆఫ్ లేబర్ ఇచ్చిన సమాచారం ప్రకారం సాధారణంగా అవిధేయులుగా వుండే కార్మికులు ప్రమోషన్లు, డిస్మినల్స్ సమస్యల విషయమై వీవింగ్ మాస్టర్ మీద దౌర్జన్యం చేయడంతో పెరంబూరులోని బకింగ్‌హామ్ మిల్సులో పనిచేసే 5,260 మంది కార్మికులను 1920 అక్టోబర్ 21న లాకౌట్ చేశారు. ప్రమోషన్ సమస్య మీద, డిస్మిస్ సమస్య మీద రెచ్చిపోయిన కార్మికులు వీవింగ్ మాస్టర్‌ను కొట్టడం వలన, వారి హింసాత్మక ప్రవర్తన వలన ఇది జరిగింది. 700 మంది కార్మికులు లాకౌట్ వలన నష్టపోయారని పత్రికలు ప్రకటించాయి. అక్టోబర్ 26న మద్రాస్ లేబర్ యూనియన్ పత్రికలకిచ్చిన ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నది. "వీవింగ్ మాస్టర్ బెంట్లే తొలగించిన శాశ్వత కార్మికుల విషయంతో పాటు, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేసిన విషయమై మాట్లాడటానికి కొందరు కార్మికులు బెంట్లే వద్దకు వెళ్ళగా, ఆయన కోపంగా రివాల్వర్ బయటకు తీశారు. దీనితో వీవర్లు బెంట్లే చేతిని గట్టిగా పట్టుకున్నారు. దీనితో ఆయన రివాల్వర్‌ను క్రింద పడవేసి అక్కడ నుంచి వెళ్ళిపోయారు. అక్కడున్న వీవర్లలో ఒకరు రివాల్వర్‌ను తీసుకొని యూనియన్ ప్రెసిడెంట్ శ్రీ వాడియాకు అప్పగించారు. శ్రీ వాడియా ఆ రివాల్వర్ తీసుకొని న్యాయ సలహా నిమిత్తం హైకోర్టుకు వెళ్ళారు."

ఈ రిపోర్టులోనే కలకత్తా, బొంబాయిలోని గ్యాస్ కార్మికులు, బొంబాయిలోని ట్రామ్‌వే పనివారు చేసిన సమ్మెలు ఉదహరించారు. కాని ఈ సమ్మెల వివరాలు దొరకలేదు. ఈ కాలంలో జరిగిన సమ్మెల తీవ్రత, విస్తృతి గురించి డాక్టర్ ఆర్.కె. దాస్ ఈ క్రింది విధంగా వివరించారు.

"1919 నవంబరు 4 నుండి డిసెంబరు 2 వరకు కాన్పూర్ వులెన్ మిల్సుల్లో 17 వేల మంది సమ్మె చేశారు. 1919 డిసెంబరు 7 నుండి 1920 జనవరి 9 వరకు జమాల్‌పూర్ రైల్వే కార్మికులు 16 వేల మంది, 1920 జనవరి 9 నుండి 18వ తారీఖు వరకు కలకత్తా జూట్ మిల్లులో 35 వేలమంది సమ్మె, జనవరి 2 నుంచి ఫిబ్రవరి 3 వరకు బొంబాయిలో సార్వత్రిక సమ్మెలో 2 లక్షల మంది కార్మికులు, జనవరి 20 నుంచి 31 వరకు 20వేల మంది రంగూన్ మిల్లు కార్మికులు, జనవరి 31వ తేదీన బొంబాయిలోని బ్రిటిష్ ఇండియా నేవిగేషన్ కంపెనీలోని 10 వేలమంది కార్మికులు, జనవరి 26 నుంచి ఫిబ్రవరి 16 వరకు 16వేల మంది షోలాపూరు మిల్లు కార్మికులు, ఫిబ్రవరి 24 నుంచి మార్చి 26 వరకు 40 వేల మంది తాతా ఐరన్ అండ్ స్టీల్ కార్మికులు, మార్చి 9న బొంబాయి మిల్లు కార్మికులు 60 వేలమంది, మార్చి 20 నుంచి 26 వరకు మద్రాసులో 17 వేలమంది మిల్లు కార్మికులు, 1920, మే లో 25 వేల మంది అహమ్మదాబాదు మిల్లు కార్మికులు సమ్మెచేశారు.

డాక్టర్ దాస్ ఇచ్చిన ఈ వివరాలు కొద్ది తేడాతో అధికార నివేదికలో కూడా ఉన్నాయి. 1920 జనవరి 2 నుంచి ఫిబ్రవరి 3 వరకు రెండు లక్షల మంది బొంబాయి కార్మికులు సుదీర్ఘమయిన సమ్మె చేసి అపూర్వమైన చరిత్ర సృష్టించారు. దానిలో 1,25,000 మంది టెక్సుటైలు కార్మికులు పాల్గొన్నారు. బొంబాయిలో వున్న 85 టెక్స్‌టైలు మిల్లుల్లో 80 మిల్లుల్లోని కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. 5,400 పని దినాలు నష్టమైనాయి.

సమ్మె సముద్ర తరంగాల్లా విజృంభించింది. రైల్వే పోర్టు అండ్ డాక్, ఇంజనీరింగ్ వర్కుషాప్స్, ఆయిల్ కర్మాగారాలు, నాణేలు, కరెన్సీ ముద్రించే ప్రభుత్వ ముద్రణాలయాలు, ప్రెస్, ట్రామ్‌వేలు, గ్యాస్, ఎలక్ట్రిసిటీ సప్లయ్ సంస్థలు, చివరకు మున్సిపాలిటీకి చెందిన కార్మికులు ఒక్క ముక్కలో చెప్పాలంటే యావత్ కార్మికవర్గం ఈ సమ్మెల్లో పాల్గొన్నది. ప్రధానంగా పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా జీతాలు పెంచాలని కోరుతూ కార్మిక వర్గం పోరాటాలు సాగించింది.

సమ్మె వెల్లువ దేశంలోని దాదాపు అన్ని పారిశ్రామిక కేంద్రాలను తాకింది. బొంబాయిలో వలెనే మద్రాసు, బెంగాల్, బీహార్ అస్సాం మొదలయిన అనేక ప్రదేశాల్లో కార్మికులు అపూర్వమైన సమ్మెల్లో పాల్గొన్నారు. ఒక్క మద్రాసులోనే ఈ కాలంలో 16 పెద్ద సమ్మెలు జరగ్గా, బెంగాల్, బీహార్, అస్సాంలలో ఒక్కొక్క ప్రాంతంలో 8 పెద్ద సమ్మెలు జరిగాయి. కలకత్తాలో 1919లో పోస్టుమెన్లు చేసిన సమ్మె ప్రత్యేకించి చెప్పుకోదగింది. నిశితంగా పరిశీలిస్తే, 1917 నుంచి సమ్మెల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 1918లో గత సంవత్సరం కన్నా ఎక్కువ సమ్మెలు

జరిగాయి. 1918 మొదటి ఆరు మాసాల్లో ఒక్క బొంబాయిలోనే 52 సమ్మెలు జరిగాయి. 1919 అక్టోబరు మాసంలోనే భారతదేశంలో 38 పెద్ద సమ్మెలు, 2 లాకౌట్లు జరగ్గా, వాటిలో 2,50,000 మంది కార్మికులు పాల్గొన్నారు. ఆ సంవత్సరం జనవరి నెలలో 1,50,000 మంది బొంబాయి టెక్స్టైల్ కార్మికులు చేసిన సమ్మె గణనీయమైనది. 1920లో సమ్మెలు చాలా తరచుగా జరిగి, కార్మికులు విశేషంగా పాల్గొనడంతో ఎక్కువ పనిదినాల నష్టం జరిగింది. ఆ ఏడాది మొదటి రెండు నెలల్లో జూట్, కాటన్ మిల్లుల్లో 110 సమ్మెలు జరిగి, 24,75,000 మంది కార్మికులు పాల్గొన్నారు. అందుబాటులో వున్న సమాచారం ప్రకారం 1920లో మద్రాసు ప్రెసిడెన్సీలో పైన పేర్కొన్న ప్రధాన సమ్మెలలో సహా మొత్తం 42126 మంది కార్మికులు పాల్గొన్న 62 సమ్మెలు జరిగాయి. అదే సంవత్సరం రెండవ అర్థభాగంతో బెంగాల్‌లో 2,11,478 మంది పాల్గొన్న 110 సమ్మెలు జరిగాయి.

జూట్ మిల్లులతో బాటు ఇతర పరిశ్రమల మీద, ముఖ్యంగా ఇంజనీరింగ్ లోహ పరిశ్రమ, రవాణా, బొగ్గు ప్రింటింగ్ ప్రెస్‌ల మీద సమ్మె ప్రభావం పడింది.

1920 జూలైలో కలకత్తాలోని గవర్నమెంటు ఆఫ్ ఇండియా ప్రెస్సులో జరిగిన సమ్మెకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉన్నది. ఈ సమ్మె ఢిల్లీ, సిమ్లాలో ఉన్న గవర్నమెంటు ప్రెస్సులకు కూడ విస్తరించింది. జీతాలు పెంచాలని, అభివృద్ధి నిరోధకమయిన సర్వీసు నిబంధనలు రద్దుచేయాలని కోరుతూ సమ్మె నిర్వహించారు.

రైల్వే కార్మికులు కూడ పెరుగుతున్న ఉద్యమ వేగానికనుగుణంగా పోరాటాలు సాగించారు. వీటిలో డాక్టర్ ఆర్.కె. దాస్ పేర్కొన్నట్లు 16 వేలమంది జమాల్‌పూర్ రైల్వే వర్కుషాపు కార్మికులు చేసిన సమ్మె ముఖ్యమైనది. ఈ కాలంలో వాయువ్య రైల్వేలో కూడా పెద్ద సమ్మె జరిగింది.

సమ్మెల గురించి పైన ఇచ్చిన సమాచారం సమగ్రమైనది కాదు. చరిత్రలో ఒక భాగంగా ఆ కాలంలో కార్మికుల్లో నెలకొన్న అసంతృప్తిని అర్థం చేసుకునేందుకిది దోహదపడుతుంది. 1920 చివరి ఆరుమాసాల్లో భారత ఉపఖండంలో సమ్మె జరగని పరిశ్రమలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. భారత శ్రామికవర్గం సాగించిన దేశవ్యాప్త సమరశీల వర్గ పోరాటాలు భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి ఆధునిక ట్రేడ్ యూనియన్ల నిర్మాణానికి గట్టి పునాదులు వేశాయి. వీటన్నింటికి మించి ప్రజాబాహుళ్యం పాల్గొన్న ఈ పోరాటాల నుండి భారత కార్మికవర్గ అఖిల భారత సంస్థ ఆవిర్భావానికి పునాదు వేసింది. ఈ విషయమే రజనీ పామిదత్తు ఈ విధంగా పేర్కొన్నారు.

ఒక ప్రక్క యుద్ధానంతరం తీవ్ర పారిశ్రామిక అశాంతి ప్రబలడంతో ధరల పెరుగుదల, తక్కువ వేతనాలు, సుదీర్ఘమైన పనిగంటలు తదితర దోపిడీ పద్ధతుల్లో తమపై రుద్దబడ్డ తీవ్ర ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా భారత కార్మికవర్గం సమరశీల నిరసన చర్యలకు పూనుకుంటుండగా, వేరొక ప్రక్క ఇందుకు పూర్తి భిన్నంగా "ఈ పరిస్థితుల్లో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం

ఆవిర్భవించింది. భారతదేశంలోని ప్రధాన పరిశ్రమల్లో, పారిశ్రామిక కేంద్రాల్లో ట్రేడ్ యూనియన్లు ఈ కాలంలోనే ఆవిర్భవించాయి. ఈ సమరశీల పోరాటాల కాలంలోనే ఆధునిక భారత కార్మిక వర్గ ఉద్యమం పురుడు పోసుకుంది.

## తీవ్ర ఆర్థిక దోపిడి

యుద్ధం తరువాత ప్రబలిన పారిశ్రామిక అశాంతితో భారత కార్మికవర్గం ధరల పెరుగుదల వలన, తక్కువ జీతాలు, ఎక్కువ పనిగంటలు తదితర దోపిడి చర్యలతో అధిక లాభాలను ఆర్జిస్తున్న బ్రిటిషు, భారతీయ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటం సాగించింది. ప్రభుత్వము భారతదేశంలో కార్మికుల స్థితిగతులను పరిశీలించడానికి ప్రభుత్వమే ఏర్పాటు చేసిన రాయల్ కమిషన్ కూడా ఈ విషయాన్ని ఒప్పుకోక తప్పలేదు. సమ్మెకు గల తక్షణ కారణాల వెనుక పనిచేస్తున్న బలమైన శక్తుల ప్రభావాన్ని గమనించవచ్చు. యుద్ధం తరువాత పెల్లుబికిన అసంతృప్తికి గల ఆర్థిక కారణాలను తేలికగానే గమనించవచ్చు. జీతాలు పెంచవలసిన సమయం అప్పటికే దాటిపోయింది. ఎక్కువ గంటలు పనిచేయటం, తదితర కారణాల వలన వచ్చే నష్టాలను కార్మికులు గుర్తించారు.

యుద్ధ సమయంలో మిల్లు యజమానులకు విశేష లాభాలార్జించే అవకాశం లభించింది. షేర్ మార్కెట్లు పెద్ద ఎత్తున వ్యాపారం సాగించాయి. పారిశ్రామిక సంస్థల షేర్లకు ఎక్కువ డివిడెంట్లు వచ్చాయి. వాటి ధర విపరీతంగా పెరిగింది. కాటన్, జూట్ మిల్లు యజమానులు ఈ ఆకస్మిక లాభాల వల్ల బాగుపడ్డారు. టెక్స్టైల్ ఉత్పత్తిదారులు 200 శాతం కన్నా అధిక లాభాలు సంపాదించారు. ఒక్కోసారి 265 శాతం లాభాలు కూడా మూటగట్టుకున్నారు.

1918లో బెంగాల్ జూట్ పరిశ్రమలోని కంపెనీల్లో 44 జూట్‌మిల్లుల్లో 33 కంపెనీలు 200%, అంతకన్నా అధిక డివిడెండ్లు ప్రకటించాయి. కొత్తగా వచ్చిన 2 కంపెనీలతో సహా మొత్తం 9 కంపెనీల్లో మాత్రం 7% కన్నా తక్కువ డివిడెండ్లు ప్రకటించాయి. ఒక సమాచారం ప్రకారం ప్రసిద్ధి చెందిన గౌరీపూర్ జూట్ మిల్సువారు 1918లో 250%, 1919లో 420% డివిడెండ్లు ప్రకటించారు. 6 మిలియన్ (60 లక్షలు) పౌండ్ల పెట్టుబడితో నడిచే 41 యూరోపియన్ జూట్ మిల్లుల వారు 23 మిలియన్ (2 కోట్ల 30 లక్షలు) పౌండ్ల లాభం సంపాదించారు. 1918 నుండి 1921 వరకు గల నాలుగు సంవత్సరాల కాలంలో మరో 19 మిలియన్ (ఒక కోటి 90 లక్షలు) పౌండ్లను రిజర్వు ఫండుకు తరలించారు. కాని వేరొక ప్రక్క కార్మికుల పరిస్థితి దయనీయంగా వుంది.

పారిశ్రామికవేత్తలు గడించిన అత్యద్భుతమైన సంపదలో కార్మికులకు వాటా లేదు. అంతేగాక, వారు అతి నికృష్టమైన పరిస్థితులలో జీవించారు. యుద్ధం, దాని పర్యవసానాల వలన కార్మికుల జీవన వ్యయం తీవ్రంగా పెరిగింది. యుద్ధం ప్రారంభం కాగానే ఆహార ధాన్యాల ధరలు సగటున 93 శాతం పెరిగాయి. ఇతర నిత్య జీవితావసర వస్తువుల్లో దిగుమతి చేసుకున్న వస్తువుల ధరలు 190 శాతం, దేశీయ సరుకుల ధరలు 60 శాతం పెరిగాయి.

కార్మికులు వీరోచిత పోరాటాల ద్వారా వేతనవృద్ధి సాధించుకున్నప్పటికీ జీతాల్లో పెరుగుదల, ధరల పెరుగుదలకు ఏమాత్రం అనుగుణంగా లేదు. కళ్ళకు కట్టినట్లు కనబడుతున్న ఈ తారతమ్యాలను కరుడుగట్టిన సామ్రాజ్యవాది సెక్రటరీ ఆఫ్ స్టేట్ అంతటివాడే అంగీకరించవల్సి వచ్చింది. "ధరలు విపరీతంగా పెరిగాయి. కాగితం మీద ఆకర్షణీయంగా కనిపించిన జీతాల పెంపుదల కార్మికుల జీవన పరిస్థితిని ఏ మాత్రం మెరుగుపరిచినట్లు కనపడదు" అని ఆయన పేర్కొన్నాడు.

పచ్చి సామ్రాజ్యవాద పాలకుడు ఈ వ్యాఖ్య చేయడం ఆశ్చర్యం కలిగించవచ్చు! అయితే ఇది పరిస్థితులు ఎంత దౌర్భాగ్యంగా వున్నాయో సూచిస్తోంది. సామ్రాజ్యవాదులు అనుసరించిన విధానాలే ఇందుకు కారణం. ఆనాటి కొన్ని ప్రధాన పరిశ్రమల్లో జీతాలను గురించిన వివరాలు పరిస్థితిని అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి.

1914లో మద్రాసులో బకింగ్‌హామ్ అండ్ కర్నాటిక్ మిల్స్‌లో పనిచేసే వారి సగటు నెల జీతం రు. 10.6 అణాలు, 1914 కంటే 1919లో జీవన వ్యయం 75 శాతం పెరగ్గా, ఈ కాలంలో జీతాలు 41.5 శాతం మాత్రమే పెరిగాయి. ఈ లెక్కలు కంపెనీ నుండి స్వీకరించినవే.

బెంగాల్‌లోని జూట్ మిల్లు పరిశ్రమలో 1914 కంటే ధరల సూచి 1920లో 100 శాతం పెరిగింది. అయితే ఆ కాలంలో జీతం సగటున 40 శాతమే పెరిగింది. ధరల పెరుగుదల ఈ విధంగా వున్నపుడు జంషెడ్‌పూర్‌లోని తాతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలో పనిచేసేవారి జీతాలు 1917లో 10 శాతం, 1920లో 40 శాతం వరకు మాత్రమే పెరిగాయి.

1919లో బొంబాయిలో జీవన వ్యయ సూచిక 75 శాతం కంటే ఎక్కువ పెరిగిందని అంచనా వేశారు. ఇది తక్కువ చేసి చూపించే అధికారుల లెక్కలకు సుమారుగా సరిపోయింది. బొంబాయి మిల్లు యజమానుల అసోసియేషన్ బొంబాయి టెక్స్‌టైల్ కార్మికులు అదే సంవత్సరంలో మొదటి సార్వత్రిక సమ్మె చేసినప్పటికీ 35 నుంచి 40 శాతం జీతాల పెంపుదలను సాధించుకున్నారని బొంబాయి మిల్లు యజమానుల సంఘం చెప్పింది. కాని వాస్తవానికి 1918లో యుద్ధం ప్రకటించిన తర్వాత 10 శాతం బోనస్ ప్రకటించినప్పటికీ జీతాల పెరుగుదల 15 శాతం మించలేదు.

ఇంతటి భారీ పరిమాణంలో వున్న దోపిడీని ఎదుర్కొనడానికి, యుద్ధానంతర కాలంలో భారత కార్మికవర్గం సంఘటిత పోరాటాలు చేసింది. ఈ పోరాటాల ద్వారా కార్మికులు సాధించిందేమీ తక్కువ కాదు. ఈ కాలంలో సాధించుకున్న జీతాల పెరుగుదల గత ముప్ఫయి సంవత్సరాలలో సాధించుకున్న మొత్తం పెరుగుదల కంటే ఎక్కువగా దానికి వుంది. కార్మికులు 10 గంటల పని దినం డిమాండ్ చేస్తూ తీవ్ర ఆందోళనలు చేశారు. ఆనాటివరకు యజమానులు ఆచరణలో పనిగంటల పరిమితిని పాటించలేదు. ఈ విషయంలో కార్మికులు బ్రహ్మాండమైన విజయం సాధించారు. వారానికి 50 పని గంటలు మాత్రమే వుండాలన్న అంశాన్ని 1922

భారత ఫ్యాక్టరీల చట్టంలో పొందుపర్చడం సమ్మె ద్వారా కార్మికులు సాధించుకున్న ఒక హక్కును అమలు చేయవలసిందిగా పరిశ్రమాధిపతుల మీద ఒత్తిడి తేవడం కంటే కాస్త మెరుగైన విషయమని డాక్టర్ ఆర్.కె. ముఖర్జీ పేర్కొన్నారు.

## ట్రేడ్ యూనియన్ల నిర్మాణము : నాయకత్వం

అప్పటివరకు నిర్మాణయుతమైన సంఘం లేకపోవడం వలన, కార్మికుల శక్తి వృధా అయిపోయి, పోరాటాలు చాలా సందర్భాలలో విఫలమవుతూ వుండేవి. 1919-20 మధ్యకాలంలో తరుచుగా సమ్మెలు జరిగి వాటిలో అనేకం విజయవంతం కావడంతో సరైన సంఘ నిర్మాణం ఆవశ్యకతను కార్మికులు, వారి నాయకులు గుర్తించి, ఆ దిశలో కృషి కొనసాగించారు. ఈ కాలంలో జరిగిన కొన్ని సమ్మె పోరాటాలను పరిశీలిస్తే నిజానికి పెద్ద ఉద్యమాలు నిర్వహించడానికి అవసరమైన సంఘ నిర్మాణం శీఘ్రగతిన ఏర్పడుతుందని స్పష్టమవుతుంది. 1919 జనవరిలో జరిగిన సార్వత్రిక సమ్మె సందర్భంగా టెక్స్‌టైల్ మిల్లు కార్మికుల నూతన తరహా సంఘ నిర్మాణ పద్ధతులు బొంబాయి పారిశ్రామిక వివాదాల కమిటీకి బాగా నచ్చాయి. బొంబాయిలోని దాదాపు అన్ని టెక్స్‌టైల్ మిల్లులకు చెందిన 1,50,000 మంది కార్మికులు 1919లో చేసిన సార్వత్రిక సమ్మె ఒక క్రమపద్ధతిలో శీఘ్రగతిన వ్యాప్తి చెందింది. ఈ సందర్భంగా కార్మికుల్లో నెలకొన్న ఐక్యతను గమనిస్తే, బొంబాయిలో వినూత్న పద్ధతుల్లో, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్న సంఘం తప్పక వుండి వుంటుందని తెలుస్తోందని కమిటీ చెప్పిన విషయాన్ని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ప్రస్తావించింది.

బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల సమ్మెతో బాటు పెద్ద సంఖ్యలో కార్మికులు చాలా తరచుగా సంఘటితంగా అనేక సమ్మెలు నిర్వహించారు. అవి ఎక్కువ సందర్భాల్లో మంచి శిక్షణతో నడిచి విజయవంతమయ్యాయి. అప్పటి వరకు ఒక ఫ్యాక్టరీలోని కొన్ని డిపార్టుమెంట్లకు, కొన్ని జట్ల కార్మికులకు పరిమితమైన సమ్మెలు, కొన్ని మిల్లులకు, ఒక్కొక్కసారి ఒక పరిశ్రమలోని అన్ని మిల్లులకు వ్యాపించడం ప్రారంభమైంది. ఆనాడు నెలకొన్న భౌతిక పరిస్థితులు నానాటికీ అభివృద్ధి చెందుతున్న బృహత్తరమైన పోరాటాలు నిర్వహించే సామర్థ్యం గల్గిన ఆధునిక ట్రేడ్ యూనియన్ల ఆవిర్భావానికి దారితీసింది. ఈ కాలంలో ఏర్పాటు చేయబడిన ట్రేడ్ యూనియన్లు క్రమం తప్పకుండా సభ్యత్వాలు చేర్పించడం, నిధి వసూలు చేయడం, కమిటీల ఎన్నిక వంటి ఆధునిక ట్రేడ్ యూనియన్ నిర్మాణ పద్ధతులను సంతరించుకున్నాయి. దీనితో భారత ట్రేడ్ యూనియన్ల వ్యవస్థాగత నిర్మాణంలో ఒక నూతన దశ ప్రారంభమైందని చెప్పవచ్చు.

ఇదివరకే చెప్పుకున్నట్లు మేధావులు మరియు సమాజంలోని మధ్యతరగతికి చెందిన వృత్తి నిపుణుల్లోని ఒక భాగం ప్రారంభం నుండే కార్మికులను సంఘటితం చేసి ఆర్థిక పోరాటాలు నిర్వహించే కర్తవ్యానికి అంకితమైంది. ఈ కాలంలో కూడా ఆ పరిస్థితి కొనసాగింది. ఈనాడు కూడా చాలా ట్రేడ్ యూనియన్లలో మధ్యతరగతి మేధావులు నాయకత్వంలో వున్నారు. కానీ పూర్వకాలానికీ, నేటికీ ఒక ప్రధానమైన తేడా వున్నది. నేడు చాలామంది మధ్యతరగతికి

చెందిన నాయకులు సమాజంలోని తమ వర్గ లక్షణాలను వదులుకొని సాధారణ ప్రజలతో మమేకమయ్యారు. వీరు వర్గపోరాట సిద్ధాంతంపైన, శ్రామికవర్గ విప్లవంపైనా దృఢవిశ్వాసం కలిగివున్నారు. వారి వర్గ దృక్పథం, శ్రామికవర్గ దృక్పథంతో ఏకీభవిస్తుంది. శాస్త్రీయ సోషలిజం పట్ల, శ్రామికవర్గ సిద్ధాంతం పట్ల నమ్మకమున్నంతకాలం, ఆ పంథా వదలనంత వరకూ చదువు, విజ్ఞానం, చైతన్యం కలిగిన మధ్యతరగతి నాయకత్వం కార్మికుల్లో విజ్ఞానం పెంపొందించి, వారి వర్గ రాజకీయ చైతన్యానికి పదును పెట్టడానికి ఉపయోగిస్తుంది. సోషలిస్టు చైతన్యం దానంతటదే పుట్టుకొనిరాదు. బయటినుండే దానిని కార్మికుల్లో కలిగించాలి. ఈ చారిత్రక పరిణామం గురించి లెనిన్ ఈ విధంగా రాశాడు.

"వివిధ దేశాల చరిత్ర పరిశీలిస్తే, కార్మిక వర్గం తన స్వయంకృషితో ట్రేడ్ యూనియన్ చైతన్యం మాత్రమే పెంపొందించుకొనగలదని తెలుస్తుంది. సంఘ నిర్మాణం చేసుకోవల్సిన అవసరం, యజమానులకు వ్యతిరేకంగా పోరాడటం ద్వారా ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి మనకనుకూలమైన చట్టాలు చేయించడం వంటి అంశాల పట్ల నిబద్ధత కలిగి వుండటమే, ట్రేడ్ యూనియన్ చైతన్యానికర్థం. విద్యావంతులైన ధనిక వర్గాల ప్రతినిధులు, మేధావులు వివరించిన తత్వశాస్త్రం, చరిత్ర, అర్ధశాస్త్రాల నుండే సోషలిస్టు సిద్ధాంతం రూపొందింది. ఆధునిక శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతకర్తలైన మార్క్స్, ఎంగెల్స్‌లు సాంఘికంగా ధనిక మేధావి వర్గానికి చెందినవారే."

కార్మిక వర్గానికి సోషలిస్టు చైతన్యం ఎందుకు కల్గించాలో లెనిన్ చెప్పారు. కాని, కార్మికవర్గంలో సోషలిస్టు భావాలకు ప్రతిస్పందన ఒకే విధంగా లేదు. ఈ విషయంలో పురోగామి కార్మిక వర్గానికి, తక్కువ అభివృద్ధి చెందిన కార్మిక వర్గానికి మధ్య తేడా వుంది. సోషలిస్టు భావాలను ఆకళింపు చేసుకోవడంలో ఈ రెండు తరగతుల కార్మికవర్గం మధ్య వున్న సంబంధాన్ని గురించి, కార్మికవర్గ చారిత్రకానుభవాలను పరిశీలించిన లెనిన్ ఈ విధంగా రాశారు. "అన్ని దేశాల కార్మికోద్యమ చరిత్రను పరిశీలిస్తే, పురోగామి కార్మిక వర్గం సోషలిస్టు భావాలను త్వరితంగా, సులభంగా అర్థం చేసుకోగలదని తెలుస్తుంది. శ్రామిక వర్గ విశ్వాసాన్ని పొందగల్గి, కార్మికులను చైతన్యవంతులను చేసి, సంఘటితపర్చేందుకు అంకితమై, సోషలిజాన్ని హృదయపూర్వకంగా అంగీకరించి, సోషలిస్టు సిద్ధాంతాల స్వతంత్రతను వివరించగల్గినవారిని కార్మికోద్యమం అగ్రభాగాన నిల్పుతుంది. చైతన్యవంతమైన ప్రతి శ్రామిక వర్గ ఉద్యమం ప్రౌధాన్, వైలాంట్, లైట్లింగ్, బెబెల్ వంటి కార్మిక నాయకులను ముందుకు తెచ్చింది."

కార్మికవర్గానికి సోషలిస్టు భావాలు కల్గించడంలోను, నాయకులు తయారు కావడంలోనూ ఈ విధమైన చరిత్రకానుభవాలు వున్నాయి. భారతదేశంలో కార్మిక వర్గ పోరాటాలు ప్రారంభమైన నాటి నుండి నాయకత్వం మధ్యతరగతి మేధావుల చేతుల్లోనే వుంది. ఈ నాయకుల దృక్పథం కార్మికుల చైతన్యం మీద తీవ్ర ప్రభావం చూపింది. సంఘసేవాభిలాషులు, జాతీయవాదులు, ట్రేడ్ యూనియన్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి మాత్రమే పరిమితం కావాలనే ట్రేడ్ యూనియన్ నాయకులు, వివిధ రకాల భావాలు కల్గిన ఉదారవాదులు ట్రేడ్

యూనియన్ ఉద్యమ ప్రారంభం నాటి నుండి కార్మిక రంగంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నారు. కానీ ప్రారంభ దశలో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధికి ఈ నాయకులు చేసిన సేవ నిస్సందేహంగా విస్మరించరానిది. ఈ దశలో వీరి చొరవను గుర్తించకపోతే భారత కార్మికోద్యమ చరిత్ర సమగ్రంగా వుండదు. అయితే దీనిని అంగీకరించినంత మాత్రాన కార్మిక వర్గాన్ని మధ్యతరగతి సంకుచిత ట్రేడ్ యూనియన్ రాజకీయాలకు కట్టిపడేసిన వాస్తవాన్ని కాదనడం కాదు. కార్మికులకు వర్గ, రాజకీయ చైతన్యం ఆర్థిక పోరాటాల పరిధిలో కలగదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే యజమాని కార్మిక సంబంధాల పరిధిలో వర్గ రాజకీయ చైతన్యం రాదు. దీనిని బయట నుండే కల్గించాలి. రాజకీయ చైతన్యం "అన్ని వర్గాలు, తరగతుల ప్రజలకూ ప్రభుత్వానికి మధ్య వున్న సంబంధాల పరిధి నుండి మాత్రమే పొందగలం. సమాజంలో వున్న వివిధ వర్గాల మధ్య అంతర్గతంగా వున్న సంబంధాలను అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే రాజకీయ చైతన్యం పొందగలం." ఇక్కడే మధ్యతరగతి ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు తప్పటడుగు వేశారు. వారు ఆర్థిక పోరాటాల పరిమితులనధిగమించ లేకపోయారు. కార్మికోద్యమాన్ని యజమాని కార్మిక సంబంధాల ఊబిలోనే వుంచారు. భారత కార్మికోద్యమ ప్రారంభదశలో వున్న ఈ వైరుధ్యం గురించి రజనీ పామీదత్ ఈ విధంగా రాశారు.

"కార్మికులు పోరాటానికి సంసిద్ధులుగా ఉన్నప్పటికీ వారికి సంఘాలను నడిపించే నాయకత్వం కార్మికేతరుల చేతిలో వుండటం అనివార్యమైంది. ఇక్కడే భారత కార్మికోద్యమ తొలిదశలోని వైరుధ్యం ఇక్కడే ప్రారంభమయింది. అప్పటి వరకు కార్మికవర్గ భావాలతో వర్గపోరాట సిద్ధాంతం పైన ఆధారపడి సోషలిజం ప్రాతిపదికగా ఏ రాజకీయోద్యమం తలెత్తలేదు. అందువలన కార్మికవర్గానికి చెందని బయటవారు కొందరు వివిధ కారణాలతో కార్మికులకు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. కానీ వారు శ్రామికోద్యమ లక్ష్యాలు, అవసరాలు తెలుసుకోకుండా మధ్యతరగతి రాజకీయ భావాలతో కార్మిక సంఘాల్లో పనిచేయడానికి వచ్చినప్పటికీ ఉద్యమం తొలిదశలో వారి సేవలు అనివార్యమైనాయి. యూనియన్ నాయకుల్లో కొందరికి సంఘ సేవాదృష్టి వుండగా, కొందరికి అదొక జీవనాధారమైన వృత్తి కాగా, మరికొందరికి జాతీయోద్యమం పట్ల నిబద్ధత ఇందుకు కారణాలుగా కన్పిస్తాయి.

కార్మిక వర్గ దృక్పథానికి భిన్నమైన వర్గ దృక్పథంలో వచ్చిన ఈ నాయకులకు అప్పటికే వర్గ పోరాటాలు సాగిస్తున్న యువ కార్మిక వర్గాన్ని, వర్గ పోరాట పంథాలో నడిపించే శక్తి సామర్థ్యాలు లేవు. ఈ దురదృష్టం చాలాకాలం భారత కార్మికోద్యమాన్ని వెన్నాడుతూ కార్మికుల అద్భుతమైన సమరశీలతకు, వీరోచిత పోరాటాలకు తీవ్ర ప్రతిబంధకంగా తయారైంది. దాని ప్రభావం ఇంకా కొనసాగుతూనే వుంది.

1920 దశకంలో సోషలిస్టు భావాలు భారతదేశంలో ప్రవేశించే వరకు ఈ విధమైన ప్రభావాల ఆధిపత్యం కొనసాగుతూనే వుంది. శాస్త్రీయ సోషలిస్టు భావాలను ఆకళింపు చేసుకోవడంతో పాటు, విజయవంతమైన రష్యన్ విప్లవంతో ప్రేరేపితులైన కొద్దిమంది భారతీయ

మేధావుల బృందం 1920 దశాబ్దంలో కార్మిక రంగంలో ప్రవేశించి వర్గ పోరాటాలకు పదునుపెట్టి, కార్మికోద్యమంలో వర్గ రాజకీయ చైతన్యం కల్గించే విధంగా, కార్మికోద్యమాన్ని పూర్తిగా భిన్నమైన దిశలో నడిపేందుకు సాహసోపేతమైన కృషి చేశారు. ఇది భారత కార్మికోద్యమ నాయకత్వ అభివృద్ధిలో గుణాత్మక మార్పుకు నాంది పలికి, ఉద్యమంలో నూతనోత్సాహాన్ని నింపింది. విప్లవ శక్తులకు, సంస్కరణవాదులకు మధ్య ఈ కాలంలో సాగిన పోరాటం మిక్కిలి చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నది.

అంతర్గతంగా పనిచేస్తున్న ఈ సామాజిక సూత్రాలను పరిగణనలోకి తీసుకుని యూనియన్లు, వాటి నాయకత్వం అభివృద్ధి చెందిన క్రమాన్ని పరిశీలించాలి.

భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎంతటి దుర్గమ మార్గం గుండా పయనించిందీ తెలుసుకోవడానికి ఈ కాలంలో రెండు ప్రధానమైన ట్రేడ్ యూనియన్లు అభివృద్ధి చెందిన తీరును ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సి వుంది.

## మద్రాసు లేబర్ యూనియన్

1918లో శ్రీ బి.పి. వాడియా స్థాపించిన మద్రాసు లేబర్ యూనియన్‌ను సాంప్రదాయకంగా భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి నాందిగా భావించడం జరుగుతోంది. ఈ రకంగా భావించడం చారిత్రకంగా సరైంది కాదనేది సుస్పష్టమే. కానీ మద్రాసు లేబర్ యూనియన్ స్థాపన భారతదేశంలో ప్రప్రథమంగా ఆధునిక ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి చేసిన క్రమబద్ధమైన కృషిగా ప్రాధాన్యత సంతరించుకుంది. శ్రీ వాడియా కార్మికరంగంలోకి ప్రవేశించడానికి గల కారణాలు చూస్తే ఆయన మానవతా దృక్పథంతో మాత్రమే కార్మికుల్లో పనిచేయడానికి వచ్చాడని, ఆయనకు కార్మికోద్యమం నిర్మించాలనే సిద్ధాంతపరమైన నిశ్చయంతో రాలేదని స్పష్టమవుతుంది. శ్రీవాడియా శ్రీమతి అనిబిసెంటు అనుచరుడు. ఆయన యాదృచ్ఛికంగా కార్మికోద్యమంలోకి ప్రవేశించాడు.

ఈ ఊహించని పరిణామం ఎలా జరిగింది శ్రీ బి. శివరావు ఈ విధంగా వివరించారు.

“1918లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసేవరకు భారతదేశంలో పారిశ్రామిక కార్మికులకు సరైన యూనియన్ లేదు. ఆ సంవత్సరం ఏప్రిల్ నెలలో మద్రాసులో అనుకోకుండా ఒక చిన్న ప్రమాదం జరిగింది. ఇది భారతదేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాలన్నిటిలోనూ కార్మికులు తమ ఆర్థిక పరిస్థితులు మెరుగు చేసుకోవడం కోసం సంఘటితం కావడానికి ప్రారంభ సూచిక అయింది. మద్రాసు టెక్స్‌టైలు కార్మికులలో సామాజిక, మతపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇద్దరు యువకులు స్వర్గీయ డా॥ అనిబిసెంట్ పత్రిక “న్యూ ఇండియా” అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్న కార్యాలయంలో అభ్యుదయ రాజకీయవేత్త బి.పి. వాడియా సలహా, సహాయాల కోసం పత్రిక కార్యాలయానికి వెళ్ళారు. పత్రిక ప్రచురణ అప్పటికే ఆగిపోయింది.

యుద్ధ చివరి అర్థభాగంలో హోంరూల్ ఉద్యమం బాగా వ్యాప్తిలోకి వచ్చిన తరువాత భారత రాజకీయోద్యమంలో అభివృద్ధి నిరోధక భావాలు ద్యోతకమైనాయి. వాడియా, ఆయన అనుచరులు సందిగ్ధంలో ఉండగా, పారిశ్రామిక కార్మికులు సహాయం కావాలని కోరడం వారి పట్ల వరమైంది. ఏమాత్రం ఆలోచించకుండా, ఆశించకుండా దొరికిన ఈ అవకాశాన్ని వాడియా అందిపుచ్చుకున్నాడు. మద్రాసు టెక్స్‌టైల్ కార్మికులతో సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. నగరంలోని "తిండికి కొద్ది నిమిషాలు" అనే కార్మిక సంఘానికి మద్దతు కోరుతూ తనను కలిసిన ఈ ఇద్దరు యువకులు కార్మికుల స్థితిగతులను గురించి చెప్పిన దాన్ని ఆయన శ్రద్ధగా విన్నాడు. కార్మికులు మధ్యాహ్నం భోజన విరామ సమయాల్లో లభించిన కొద్దిపాటి కాలంలో గబ గబా అన్నం నోట కుక్కుకొని తిరిగి ఫ్యాక్టరీకి పోవాల్సి వస్తోందని, ఆలస్యమైతే వారిని పనిలోనికి రానివ్వరని వారు చెప్పారు.

వాడియా తన ఈ కొత్త పరిచయస్తులతో మిల్లు గేట్ల వద్దకు వెళ్ళి ఈ దృశ్యం చూశాడు. ఆ కాలంలో ఫ్యాక్టరీల చట్టం ప్రకారం 12 గంటల పని దినం అమలులో వుండేది. భోజనానికి, విశ్రాంతికి అర్థగంట విరామం వుండేది. వాడియా వెంటనే ఒక నిర్ణయం తీసుకొని అదేరోజు సాయంత్రం కొద్ది వందల మంది కార్మికులను సమావేశపరచి అందులో ప్రసంగించాడు.

ఈ విధంగా మద్రాసు లేబర్ యూనియన్ 1918 ఏప్రిల్ 27వ తేదీన ఏర్పడింది. బి.పి. వాడియా అనుకోని విధంగా యూనియన్ స్థాపించి దాని మొదటి అధ్యక్షుడైనాడు. విచిత్రమేమిటంటే ఈ సంఘటన వివరించిన బి. శివరావు కూడా కార్మికోద్యమంలో యాదృచ్ఛికంగానే ప్రవేశించాడు.

"భారతదేశంలోనే ప్రప్రథమంగా స్థాపించబడిన నిర్మాణయుత ట్రేడ్ యూనియన్, మద్రాసు టెక్స్‌టైల్ వర్కర్స్ యూనియన్‌తో 1918 చివరలో నాకు యాదృచ్ఛికంగానే సంబంధాలేర్పడ్డాయి". అని శివరావు తానే స్వయంగా చెప్పుకున్నారు. వాడియాతో మాట్లాడేందుకు వచ్చిన ఆ ఇద్దరు యువకులు జి. రామానుజులు నాయుడు, చెల్వపతిశెట్టి. వీరు ఈ యూనియన్‌లో చాలాకాలం పనిచేసి, ప్రధాన కార్యదర్శి పదవి కూడా నిర్వహించారు.

శివరావు, వాడియా చేసిన కృషిని బొంబాయిలో 1880, 1890 రెండు దశాబ్దాలలో లోకుండే చేసిన కృషితో పోల్చారు. కానీ వారు పనిచేసిన కాలాల్లో నాలుగు దశాబ్దాల అంతరం వుండటం వలన భౌతిక పరిస్థితుల్లో వచ్చిన మార్పును ఆసరాగా తీసుకొని లోకుండే నిర్వహించలేని పనిని వాడియా పూర్తి చేశాడు.

ప్రారంభంలో అనేక లోపాలు జరిగినప్పటికీ మద్రాసు లేబర్ యూనియన్ భారతదేశంలో ఆధునిక ట్రేడ్ యూనియన్ ఆవిర్భావానికి నాంది పలికింది. మొట్టమొదటిసారిగా క్రమ పద్ధతిలో సభ్యత్వం చేర్పించడం, సభ్యత్వ రుసుము వసూలు చేయడం వాడుకలోకి వచ్చాయి. ఒక అణా నెల చందాగా నిర్ణయించబడింది. మొదట్లో సభ్యత్వం ఫ్యాక్టరీ కార్మికులకే పరిమితం చేశారు. ఆ తర్వాత ట్రామ్‌వే, రిక్షా కార్మికులతో సహా అన్ని పరిశ్రమల్లోని కార్మికులకు ఈ యూనియన్

సభ్యత్వం విస్తరించడం జరిగింది. అయితే యూనియన్‌లో టెక్స్‌టైల్ కార్మికులే అత్యధిక సంఖ్యలో వుండేవారు.

ఈ యూనియన్ ఇతర కేంద్రాలతో పోల్చి చూస్తే భారత కార్మికోద్యమంలో బలహీనమైన కేంద్రంలో ఏర్పడింది. మద్రాసుతో పోలిస్తే బొంబాయి, బెంగాలుల్లో కార్మికోద్యమం చాలా విస్తృతంగా వుండేది. 1921-23 మధ్యకాలంలో మద్రాసులో సమ్మె దినాల సంఖ్య 28 లక్షలుండగా, అదేకాలంలో బొంబాయిలో 6 కోట్ల రోజులు, బెంగాల్లో 2 కోట్ల రోజులు సమ్మెలు జరిగాయి. అందువల్ల మద్రాసు లేబర్ యూనియన్ కొన్ని వ్యక్తిగతమైన, ఊహించని పరిణామాల వల్ల మాత్రమే ఏర్పడింది గాని, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధి క్రమంలో భాగంగా సహజంగా ఏర్పడలేదు.

ఈ పరిస్థితులను దృష్టిలో వుంచుకుంటే యావత్ భారత కార్మికోద్యమం మీద ఈ యూనియన్ ప్రభావం చూపిందని అతిశయోక్తిగా చెప్పడం చారిత్రికంగా సరికాదు.

ఈ యూనియన్ స్థాపకులు సహకార సంఘాలు, లైబ్రరీలు, రీడింగ్‌రూమ్ ఏర్పాటు చేయడం వంటి కార్మిక సంక్షేమ చర్యల మీద దృష్టి పెట్టడమే తమ కర్తవ్యంగా పెట్టుకున్నారు. తరువాత 40 నిమిషాల మధ్యాహ్న విరామ సమయాన్ని ఒక గంటకు పొడిగించాలని, జీతాలు 25 శాతం పెంచాలని, యూరోపియన్ అధికారులు కార్మికులయెడ సక్రమంగా ప్రవర్తించాలని, వర్గ వివక్షత చూపించరాదని, జీతాలను ప్రతినెల 7వ తారీఖున చెల్లించాలని మేనేజ్‌మెంట్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సమస్యల పట్ల మేనేజిమెంట్ ఉదాసీనతతో వ్యవహరించడంతో కార్మికులు సమ్మె చేయాలని పట్టుపట్టారు. బ్రిటిష్ సామ్రాజ్యం పట్ల తనకున్న విధేయత కారణంగా వాడియా సమ్మెను వ్యతిరేకించాడు. 1918, జూలై 3 వాడియా చేసిన ఉపన్యాసం ఆయన వర్గ దృక్పథం స్పష్టం చేస్తుంది.

"సమ్మె చేయడం వలన అపారంగా డబ్బు సంపాదిస్తున్న బిన్ని అండ్ కో వారికి నష్టం వస్తే నాకేమీ బాధలేదు. కాని సమ్మె వలన మిత్ర రాజ్యాల ప్రయోజనాలు దెబ్బతింటాయి. బట్టల ఉత్పత్తి ఆగిపోతే సైనికులు అసౌకర్యానికి గురవుతారు. బ్రిటిష్ చక్రవర్తి తరపున పోరాడే సైనికులను బాధపెట్టడానికి మనకేమీ హక్కు లేదు. మిల్లులతోనూ, ఈ ప్రభుత్వంతోనూ సంబంధమున్న కొద్దిమంది యూరోపియన్ అధికారులు, ప్రభుత్వాధికారులు చెడుగా ప్రవర్తించినంత మాత్రాన మనం సమ్మె చేసి బ్రిటిష్ పాలకులకు ఇబ్బంది కలుగజేయరాదు."

వాడియా విధేయతకు ప్రతిఫలంగా 1918 అక్టోబర్‌లో యూరోపియన్ యాజమాన్యం మిల్లుల లాకౌట్ ప్రకటించింది. డిసెంబరు 10న గాంధీజీ ఆదేశానుసారం వచ్చిన రెవరెండ్ సి.ఎఫ్. ఆండ్రూస్ జోక్యంతో మిల్లులు తిరిగి కొన్ని షరతులతో తెరవబడ్డాయి. ఈ షరతుల ప్రకారం లాకౌట్ కాలానికి 7 రోజుల జీతం చట్టపరమైన హక్కుగా గాక దయాదాక్షిణ్య పూర్వకంగా ఇవ్వబడుతుంది. వివాదాస్పద అంశాలు మధ్యవర్తి పరిష్కారానికి పంపడం జరగదు. డిస్మిస్ చేయబడిన వారిని తిరిగి నియమించేది లేదు. నాయకులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి

విశ్వాసపాత్రులై సమరశీల పోరాటాలను వ్యతిరేకించడం వలన కార్మికులకు మంచి బహుమతే లభించింది.

వాడియా తన సంస్కరణవాద దృక్పథాన్ని, రాజ్యాంగం మీద ఆయనకున్న అపారమైన నమ్మకాన్ని ఈ క్రింది విధంగా ఆయనే చెప్పాడు.

"భారత కార్మికవర్గం తన ప్రతినిధులను ప్రొవెన్షియల్ కౌన్సిల్‌కు పంపి, కార్మికుల శ్రేయస్సుకు, పురోగతికి సంబంధించిన విషయాలన్నింటిని, కార్మికుల విశ్వాసం చూరగొని ఎన్నికైన బాధ్యులైన ప్రతినిధుల చేతుల్లో వుంచడం ద్వారా మాత్రమే దోపిడీ నివారించవచ్చు."

అనేక ఇతర పరిమితులతో పాటు, రాజ్యాంగ పరిధుల్లోనే పనిచేయాలన్న వారి దృక్పథం కారణంగా వాడియాతో బాటు సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రారంభ దినాల్లో నాయకత్వం వహించిన ఆయన సమకాలీనులు కూడా ఎక్కువగా జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉపన్యాసాలు ఇవ్వడం, చట్టాలు చేయించడం వంటి కార్యకలాపాల్లో నిమగ్నమై కార్మికులను సమరశీల పోరాటపథంలో నడిపేందుకు ఆసక్తి చూపలేదు. సెప్టెంబరు 17న వాడియా గ్లాస్‌గో ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు సౌహార్ద్ర ప్రతినిధిగా ఆహ్వానించబడ్డాడు. ఆయన ఆ సమావేశంలో ప్రసంగించి మద్రాసు కార్మికుల తరుపున మెమోరాండం సమర్పించాడు. ఆ సమయంలోనే లండన్‌లో జాయింట్ పార్లమెంటరీ కమిటీ భారతదేశంలో సంస్కరణల బిల్లును చర్చిస్తోంది. వాడియా భారతదేశంలోని చట్ట సభల్లో కార్మికులకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కమిటీ ముందు వాదించాడు.

## అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ : గాంధీ నమునా

స్థానికంగా మజూర్ మహాజన్ అని పేరొందిన అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్‌ను గాంధీజీ 1918లో స్థాపించారు. గాంధీజీ స్వయంగా ఏర్పాటు చేశారన్న ఖ్యాతిగల ఈ అసోసియేషన్ కార్మికుల సమస్యలపైన, యజమానికి, కార్మికునికి మధ్య వుండే సంబంధాలపట్ల, సమస్యల పరిష్కారానికి అవలంభించాల్సిన విధానాల పట్ల గాంధీ ఆలోచనావిధానాన్ని ప్రతిబింబిస్తుంది. మనదేశంలో సాంఘిక, రాజకీయ ఉద్యమాలలో గాంధీజీకి వున్న స్థానాన్ని బట్టి కార్మికులపట్ల ఆయన వైఖరి గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

దక్షిణాఫ్రికా నుంచి అప్పుడే తిరిగివచ్చిన గాంధీజీ భారత జాతీయ కాంగ్రెస్ పతాకం క్రింద మొట్టమొదటి సహాయ నిరాకరణ ఉద్యమం నడిపే కర్తవ్యాన్ని చేబట్టారు. సరిగ్గా అదే సమయంలో ఆయనకు అహమ్మదాబాద్‌లోని మిల్లు కార్మికులతో పరిచయమేర్పడింది. తాను కార్మిక సమస్యల విషయంలో ఏ పరిస్థితుల్లో జోక్యం చేసుకున్నదీ గాంధీజీయే స్వయంగా ఈ క్రింది విధంగా రాశారు.

"...ఖేడా జిల్లాలో పంటలు దెబ్బతిన్న కారణంగా పన్నులు కట్టడానికి అవస్థలు పడుతున్న రైతులకు త్రోవ చూపించవల్సిందిగా సార్జంట్ మోహన్‌లాల్ పాండ్యా, శంకర్‌లాల్ పరీఖ్‌లు

నాకు ఉత్తరం వ్రాశారు. అప్పుడే శ్రీమతి అనసూయాబాయి అహ్మదాబాద్‌లో కార్మికుల పరిస్థితి గురించి వ్రాసిన ఉత్తరం అందింది. వారి జీతాలు చాలా తక్కువ. కార్మికులు జీతాలు పెంచమని చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. నాకు చేతనైతే వారి ఉద్యమాన్ని నడపాలనే కోరిక వుంది. కానీ అంతదూరాన వుండి ఇంత చిన్న సమస్యనైనా అంతదూరాన వుండి పరిష్కరించగలననే విషయంలో నాకు నమ్మకం కలగలేదు. అందువలన అహ్మదాబాద్ వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

నేను చాలా క్లిష్ట పరిస్థితుల్లో పడ్డాను. మిల్లు కార్మికుల సమస్య చాలా న్యాయమైనది. శ్రీమతి అనసూయాబాయి ఈ విషయంలో తన స్వంత సోదరునితోనే తలపడింది. ఆమె సోదరుడు అంబాలాల్ సారాభాయి మిల్లు యజమానుల తరపున రంగంలోకి దూకాడు. మిల్లు యజమానులతో నాకు స్నేహపూరిత సంబంధాలున్నాయి. అందువలన వాళ్ళతో పోరాటం కష్టంగా పరిణమించింది. వారితో సంప్రదించి, వివాదాన్ని మధ్యవర్తి పరిష్కారానికి పంపమని కోరాను. వారు నేను చేసిన మధ్యవర్తి పరిష్కార సూత్రాన్ని తిరస్కరించారు.

అందువలన కార్మికులను సమ్మె చేయవలసిందిగా సలహా ఇవ్వవలసి వచ్చింది. అంతకుముందే నాకు వారితోనూ, వారి నాయకులతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. సమ్మె విజయవంతం కావడానికి ఈ దిగువ పద్ధతులను అవలంబించవల్సిందిగా వారికి వివరించాను.

1. ఎప్పుడూ హింసాపూరిత పద్ధతులను అవలంభించరాదు.

2. సమ్మె చేయనివారిని అవమానించరాదు.

3. విరాళాల మీద ఆధారపడరాదు.

4. సమ్మె ఎంతకాలం కొనసాగినా దృఢంగా నిలబడాలి. సమ్మె కాలంలో నిజాయితీగా శ్రమించి జీవనోపాధి సంపాదించుకోవాలి.

సమ్మె 21 రోజులు కొనసాగింది. సమ్మెకాలంలో మిల్లు యజమానులను అప్పుడప్పుడు కలుసుకొని కార్మికులకు న్యాయం చేయవలసిందిగా ప్రార్థించాను. వారు "మాకూ బాధ్యత వుంది. కార్మికులు మాకు బిడ్డల్లాంటివారు. మధ్యవర్తి జోక్యాన్ని మేమెలా సహిస్తాము? అసలు మధ్యవర్తి జోక్యానికి ఆస్కారం ఎక్కడుంది" అని జవాబిచ్చారు.

ఈ విధంగా గాంధీజీ కార్మికులతో సంబంధాలేర్పరచుకుని అహమ్మదాబాద్ లేబర్ అసోసియేషన్ స్థాపించాడు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి మధ్యవర్తి పరిష్కారమే ఏకైక ఆదర్శమని ఆయన భావించాడు. అన్ని కార్మిక సంఘాలకూ ఈ విధానమే మార్గదర్శకం కావాలని ఆయన బోధించాడు.

"నాకే గనుక వదిలివేస్తే, భారతదేశంలో ఉన్న కార్మిక సంఘాలన్నింటినీ అహమ్మదాబాద్ నమూనాలో నడిపిస్తాను" అని గాంధీజీ రాశారు. ట్రేడ్ యూనియన్లు

మామూలుగా దేశమంతటా అవలంభించే పద్ధతికి, గాంధీజీ చెప్పిన పద్ధతి పూర్తిగా భిన్నమైంది. గాంధీజీ చెప్పిన నమూనాలో మధ్యవర్తిత్వ పరిష్కారం ప్రధాన అంశం. మధ్యవర్తి పరిష్కార సూత్రాలు 1918లో అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ కార్మికుల సమ్మెల సందర్భంగాను, వాటిని పరిష్కరించే సందర్భంగా మధ్యవర్తి పరిష్కార సూత్రాలేర్పడ్డాయి.

ప్లేగు వ్యాధి వలన ఏర్పడిన కార్మికుల కొరత కారణంగా 1917 ఆగస్టు నుండి అహమ్మదాబాదు మిల్లు యజమానులు కార్మికులకు జీతంలో 70 నుంచి 80 శాతం బోనసుగా యిస్తూ వచ్చారు. జనవరి 18 నుంచి యజమానులు బోనసు చెల్లింపు ను అకస్మాత్తుగా నిలిపివేయడంతో, కార్మికులు యాభై శాతం అదనపు అలవెన్సు డిమాండు చేశారు.

గాంధీజీ కార్మికుల ప్రతినిధిగా మధ్యవర్తుల బోర్డు ఏర్పాటైంది. ఆయన మిల్లు యజమానుల వాదనలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. 35 శాతం పెంపుదలను డిమాండ్ చేయడం న్యాయమైనదనే నిర్ణయానికి వచ్చాడు. సమ్మె చాలాకాలం కొనసాగటం వలన మిల్లు యజమానులు గాంధీజీ సూచించిన మొత్తం చెల్లించడానికి రాజీ పడేందుకు అంగీకరించారు. కానీ వారొక షరతుపెట్టారు. "గాంధీజీ భవిష్యత్తులో ఎప్పుడూ కార్మికుల సమస్యల్లో జోక్యం చేసుకోనని, కార్మికులకు, యజమానులకు మధ్య తలెత్తిన సమస్యలు వారిలో వారే పరిష్కరించుకునేందుకు వదలి వేస్తాననే హామీ ఇవ్వాలి."

గాంధీజీ ఈ షరతుకు అంగీకరించకపోవడంతో, మిల్లు యజమానులు 1918 ఫిబ్రవరి 22వ తేదీన లాకౌట్ ప్రకటించారు. 20 శాతం బోనసు అంగీకరించిన కార్మికులను మాత్రమే పనిలోనికి హాజరుకానిస్తామని చెప్పారు. సహజంగానే ఈ పరిస్థితిలో సమ్మె యింకా కొనసాగించబడింది.

"మొదటి రెండువారాలు కార్మికులు ధైర్యంగా, నిబ్బరంగా వున్నారు. కానీ తరువాత వారు నిస్తేజం కావడం మొదలైంది" అని గాంధీజీ రాశారు. అప్పుడు కార్మికుల ధైర్యం నిలబెట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. దాన్ని గురించి గాంధీజీ ఈ విధంగా రాశారు.

"ఒకరోజు ఉదయం మిల్లు కార్మికుల సమావేశం జరుగుతోంది. నాకు మార్గం తెలియక సతమతమవుతున్న సమయంలో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఏమాత్రం ఆలోచించకుండా నేనొక మాట అన్నాను. "కార్మికులందరూ సంఘటితమై ఒప్పందం కుదిరే వరకో లేదా మిల్లులను పూర్తిగా వదలి వెళ్ళేవరకో సమ్మె కొనసాగించండి. అప్పటి వరకు నేను ఆహారం ముట్టను" అని చెప్పాను.

ఈ విధంగా గాంధీజీ కార్మికుల సంఘటిత శక్తి కంటే తన శక్తికి ప్రాధాన్యత ఇచ్చాడు. దిగజారుతున్న కార్మికుల స్థైర్యాన్ని నిలబెట్టేందుకు పోరాటాన్ని విస్తృతం చేసి, దానికి ప్రజల మద్దతు కూడగట్టేందుకు బదులుగా వ్యక్తిగతంగా ఉపవాసం ప్రారంభించారు. అయితే ఆయన మిల్లు యజమానులపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఉపవాసం చేయలేదు. కాని ఫలితం మాత్రం అదే వచ్చింది. గాంధీజీ ఈ విషయమై ఇలా వివరించారు.

"నా ఉపవాసంలో తీవ్రమైన లోపం ఉంది... నాకు, మిల్లు యజమానులకు మధ్య సన్నిహిత స్నేహ సంబంధాలున్నాయి. నా ఉపవాసం వారి నిర్ణయాలను మార్చగలిగింది, మిల్లు యజమానులతో నేను వాదన మాత్రమే చేయగలను. వారికి వ్యతిరేకంగా ఉపవాసం చేయడం అంటే వారిని బలవంత పెట్టటం అన్నమాట." అంటూ గాంధీజీ ఇంకా ఇలా ఈ విధంగా రాశారు.

"ఉపవాసం ఫలితంగా మొత్తం మీద సుహృద్భావ వాతావరణం నెలకొన్నది. మిల్లు యజమానుల హృదయాలు స్పందించాయి. వారు ఒక పరిష్కార మార్గం కోసం శోధించసాగారు. ఆనంద శంకర్ ధృవా ఈ విషయంలో జోక్యం చేసుకున్నాడు. చివరకు ఆయనే మధ్యవర్తిగా నియమించబడ్డాడు. కేవలం మూడు రోజులు ఉపవాసం చేయటంతోనే సమ్మె ముగిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మిల్లు యజమానులు కార్మికులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ విధంగా 21 రోజుల సమ్మె తరువాత ఒప్పందం కుదిరింది. శ్రీ ధృవా ప్రతిపాదించిన రాజీ సూత్రం ప్రకారం కార్మికులు తమ బోనసు డిమాండును $7\frac{1}{2}\%$ తగ్గించుకోవాలి. మిల్లు యజమానులు తమ ప్రతిపాదన మీద $7\frac{1}{2}\%$ పెంచాలి. ఆ విధంగా కార్మికుల నికర జీతాలు $27\frac{1}{2}\%$ పెంచాలి."

శ్రామికులకు పెట్టుబడికీ మధ్య తలెత్తే వివాదాలను మధ్యవర్తి ద్వారా పరిష్కరించాలనే సూత్రాల ననుసరించి అహమ్మదాబాద్ మిల్లు ఓనర్స్ అసోసియేషన్ 1920 ఏప్రిల్ 4న ఒక తీర్మానం చేసి, శాశ్వత మధ్యవర్తిత్వ బోర్డును ఏర్పాటు చేసింది ఈ బోర్డులో యజమానుల తరపున, కార్మికుల తరపున చెరి ఒక ప్రతినిధి ఉంటారు. భారతదేశంలో కార్మికుల జీవన పరిస్థితులపై విచారణ జరిపేందుకు నియమించబడిన రాయల్ కమిషన్ నివేదికలో యీ మధ్యవర్తిత్వం జరిపే పద్ధతులను గురించి ఈ విధంగా పేర్కొంది.

"అహమ్మదాబాద్ నూలు పరిశ్రమలోని కార్మికుల సమస్యలను గురించి ముందుగా కార్మికులు యజమానులు చర్చించుకోవాలని, అహమ్మదాబాద్ మిల్లు యజమానుల సంఘం, అహమ్మదాబాద్ లేబర్ యూనియన్ ఒక ఒప్పందానికి వచ్చాయి. ఏ కార్మికునికైనా సమస్య వచ్చినపుడు అతడు కౌన్సిల్‌లో వున్న తన మిల్లుకు చెందిన ప్రతినిధులకు చెప్పాలి. ఈ ప్రతినిధి ఆ డిపార్టుమెంటుకు చెందిన ఉన్నతాధికారితోనో, అవసరమైతే మిల్లు ఏజంట్‌తోనో మాట్లాడతాడు. సమస్య పరిష్కారం కాకపోతే లేబర్ యూనియన్ ఫిర్యాదు నమోదు చేసుకుంటుంది.

లేబర్ యూనియన్ ప్రతినిధి సాధారణంగా సెక్రటరీగాని, అసిస్టెంట్ సెక్రటరీగాని మిల్లు అధికారి వద్దకో, ఏజంటు వద్దకో వెళ్ళి సమస్య పరిష్కారానికి సంప్రదింపులు జరుపుతారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే లేబర్ యూనియన్ మిల్లు యజమానుల సంఘం వద్దకు ఈ సమస్యను తీసుకువెళ్తుంది. మిల్లు యజమానుల సంఘం కార్యదర్శి సంబంధిత మిల్లు యజమానులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తాడు. సమస్య అనేక మిల్లులకు సంబంధించినదైనా లేక ఒకే మిల్లులోని చాలామంది కార్మికులకు

సంబంధించినదైనా ఈ విధానమే అనుసరిస్తారు. మిల్లు యజమానుల సంఘానికి, లేబర్ యూనియన్ మధ్య సంప్రదింపులు జరిగిన తరువాత కూడ సమస్య పరిష్కారం కాకపోతే చివరకు ఈ సమస్యలు శాశ్వత మధ్యవర్తిత్వ బోర్డుకు పంపిస్తారు.

''గాంధీజీ కార్మికులు యజమానుల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించడానికి ఈ విధమైన ఆదర్శ పద్ధతిని సూత్రీకరించి ఆచరించారు."

అహ్మదాబాదు జౌళి (టెక్స్ టైల్) కార్మికుల సమ్మె సందర్భంగా యజమాని, కార్మికుల మధ్య సంబంధాన్ని గురించి తన అభిప్రాయాలను గాంధీజీ నిర్ధిష్టంగా వెల్లడించారు. గాంధీజీకి సన్నిహిత అనుచరులలో ఒకరైన జె.బి. కృపలానీ దీన్ని గురించి ఇలా రాశారు.

"ఆయన కార్మికులను, ప్రజా సంక్షేమం కోసం చేసే కృషిలో భాగస్వాములుగానూ, మిల్లు యజమానులను ధర్మకర్తలుగానూ భావించారు. వీరిద్దరికి మధ్య వచ్చే ఏ వివాదాన్నైనా వారిద్దరూ అంగీకరించిన మధ్యవర్తి ద్వారా పరిష్కరించుకోవాలి. ఆయన ట్రేడ్ యూనియన్ల విధులను కూడ నిర్వచించారు. కేవలం హక్కుల కోసం ఆందోళన సాగించడం, సమ్మెలు నిర్వహించడం మాత్రమే ట్రేడ్ యూనియన్ల పని కాదనేది ఆయన భావన. సభ్యులు తమ యొక్క, తమ కుటుంబం యొక్క సామాజిక ప్రగతికి పాటుపడాలి. అందుకు శిశు సంరక్షణాలయాలు, పిల్లలు చదువుకొనడానికి పగటి బడులు, వయోజనులకు రాత్రి పాఠశాలలు, మద్యనిషేధం మొదలైన కొన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

ఈ కృషిలో ఆయనకు శంకర్‌లాల్ బంకార్, ప్రఖ్యాత మిల్లు యజమాని అంబాలాల్ సారాభాయి సోదరి శ్రీమతి అనసూయాబెన్ సహాయం చేశారు. అనసూయాబెన్ ప్రఖ్యాత మిల్లు యజమాని అంబాలాల్ సారాభాయి సోదరి. వీరు చాలా సంవత్సరాలు అహమ్మదాబాదు మిల్లు మజ్దూర్ యూనియన్‌ను నిర్మించేందుకు కృషి చేశారు. అదీ దేశంలో బలమైన యూనియన్‌గా రూపొందింది. దీనివల్ల అహమ్మదాబాద్‌లోని మిల్లు యజమానులకు, జౌళి కార్మికులకు మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి."

యజమానులను గాంధీజీ ధర్మకర్తలుగా భావించారు. గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని శ్రీ కృపలానీ ఈ విధంగా రాశారు. "ఈ సిద్ధాంతం జీవితంలోని అన్ని రంగాల్లోనూ ఉపకరిస్తుంది. తల్లిదండ్రులు బిడ్డలకు ధర్మకర్తలు. ప్రభుత్వం ప్రజలకు ధర్మకర్తగా వ్యవహరిస్తుంది. లేకపోతే ఆ విధంగా వ్యవహరించాలి. ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ఎన్నుకొనబడిన ప్రతినిధులు, తమను ఎన్నుకొన్న ప్రజలకు ధర్మకర్తలు. ధర్మకర్త అంటే యజమాని కాదని అర్థం. ధర్మకర్త యజమాని యొక్క ప్రయోజనాలు కాపాడతాడు. ఇది గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతం."

అహమ్మదాబాద్ జౌళి కార్మికుల సమావేశంలో ప్రసంగిస్తూ "కార్మికులే మిల్లులకు అసలైన యజమానులని గాంధీజీ పేర్కొన్నాడు. పెట్టుబడిదారుల సంపద కంటె కార్మికుల శ్రమశక్తి మిక్కిలి విలువైనది. అయితే ధర్మకర్త అసలైన యజమాని ప్రయోజనాల కోసం పని చేయకపోతే ఏం చేయాలి? సాధారణంగా నాగరిక జీవితంలో సంరక్షకుడు తన బాధ్యతను

విస్మరిస్తే అతని సంరక్షణలో వున్నవారు న్యాయం కోసం కోర్టుకు పోవచ్చు. సంరక్షకులు వాస్తవ యజమాని ప్రయోజనాలను పరిరక్షించడం లేదని కోర్టు భావిస్తే మరో సంరక్షకుని నియమిస్తుంది. ప్రభుత్వం సాధారణ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తేనే గాని, పేద రైతులు, వ్యవసాయ కార్మికుల విషయంలో ఇది సాధ్యం కాదు. అందువల్ల రైతులు, కార్మికులను తమ హక్కుల సాధనకు సత్యాగ్రహం చేయవలసిందిగా గాంధీజీ సలహా ఇచ్చారు."

అహమ్మదాబాద్ జౌళి కార్మికుల సమ్మె సందర్భంగా మిల్లు యజమానులు తమకు, కార్మికులకు మధ్య వున్న సంబంధం తండ్రీ బిడ్డల సంబంధం వంటిదని అందువలన వారి విషయాలలో మూడవ పక్షం జోక్యాన్ని తాము సహించబోమని తనకు చెప్పినట్లు గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్న మాటలు ఇదివరకే ఉదహరించాం. యజమాని కార్మికుల మధ్య సంబంధాల విషయంలో గాంధీజీ అభిప్రాయాలు, మిల్లు యజమానుల అభిప్రాయాలు ఒకే విధంగా వున్నాయి. "గాంధీజీ అహింసావాది కాబట్టి పెట్టుబడిదార్లను, జమీందార్లను శారీరకంగా తుదముట్టించడానికి వ్యతిరేకి. కాని వారి దోపిడీ అంతం కావాలి, భూస్వాములు, పెట్టుబడిదారులు పేదవారికి ధర్మకర్తలుగా వ్యవహరిస్తే ఈ దోపిడీ అంతమవుతుందని ఆయన నమ్మారు." ఇది కేవలం ఊహ కాదు. గాంధీజీ ఏమి నమ్మినా, ఆశించినా ఆచరణలో గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతం అహమ్మదాబాదు మిల్లు యజమానులు నిర్మొహమాటంగా చెప్పిన మాటల సైద్ధాంతిక రూపమని వాస్తవాలు రుజువు చేస్తున్నాయి. ఈ కల్తీ సిద్ధాంతాన్ని యజమాని కార్మికుల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించడానికి గాంధీజీ రూపొందించిన వినూత్న పద్ధతిగా ప్రపంచమంతటా బాకా వూదారు. పెట్టుబడిదారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు సాగించే సమరశీల వర్గ పోరాటాల నుండి వారిని విముఖులను చేసి, వర్గ శాంతి, వర్గ సామరస్యాన్ని ప్రోత్సహించి, పెట్టుబడిదారీ భూస్వామ్య దోపిడీ ప్రాతిపదికగా నిర్మించబడ్డ ఈ సమాజాన్ని శాశ్వతంగా కొనసాగించడమే ఈ సిద్ధాంతంలోని కొత్తదనం. గాంధీజీ రూపొందించిన ఈ సరికొత్త సిద్ధాంతం పచ్చి అభివృద్ధి నిరోధకమైనది.

అహమ్మదాబాద్ లేబర్ అసోసియేషన్ ఈ సిద్ధాంతం పైన నిర్మించబడినదే. యూనియన్ సభ్యత్వ చందా యజమానులే కార్మికుడి జీతాల నుండి మినహాయించడం జరిగేది. యజమానులు కూడా కార్మికుల ప్రతినిధులుగా ఎన్నికయ్యే అర్హత కల్పించారు. మిల్లు మేనేజరు కూడా కార్మికుల తరపున మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేయవచ్చు. నిజానికి ఈ యూనియన్ కంపెనీ ప్రోత్సాహంతో నడిచే యూనియన్‌గా రూపొందింది. దేశంలోని అన్ని ట్రేడ్ యూనియన్లు ఈ పద్ధతిలోనే నడవాలని గాంధీజీ కలలుగన్నారు.

అలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అవతరించినప్పుడు అహ్మదాబాద్ అసోసియేషన్‌ను ఈ అఖిల భారత సంఘం నుండి దూరంగా వుంచడానికి ఆయన అన్ని ప్రయత్నాలు చేశాడు. "ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అహమ్మదాబాద్ పద్ధతి నంగీకరించే రోజు తప్పనిసరిగా వస్తుంది. కాని నేనేమీ తొందరపడడంలేదు. ఆరోజు దానంతటదే వస్తుంది" అని గాంధీ నమ్మకంగా జోస్యం చెప్పాడు.

పెద్ద సంఘాల పట్ల గాంధీజీ వైఖరిని గూర్చి శ్రీ ఎస్.ఎ.డాంగే ఈ విధంగా రాశారు. "ఆయన మజ్దూర్ మహాజన్ స్థాపించడానికి సహాయం చేశారు. అసోసియేషన్ ఎ.ఐ.టి.యు.సి.లో కలియడం ఆయనకు ఇష్టంలేదు. 'సంఘం అనివార్యంగా కార్మికులను రాజకీయాల్లోకి, వర్గ పోరాటాల్లోకి దించుతుంది కాబట్టి ఎ.ఐ.టి.యు.సి. అంటేనే ఆయనకు ఇష్టంలేదు. ఆయన దేశవ్యాప్త హర్తాళ్‌కు పిలుపు ఇచ్చినా, కార్మికులు మాత్రం సమ్మె చేయడం ఆయనకు ఇష్టంలేదు. కాని ఆయనకు ఇష్టంలేకపోయినా కార్మికులు సమ్మె చేసేవారు." గాంధీజీకి వర్గ విభజన పట్ల నమ్మకం లేదు. ఆయన దృష్టిలో కార్మికులు, యజమానులు వేర్వేరు వర్గాలకు చెందినవారు కారు. ఆధునిక పారిశ్రామిక సమాజాన్ని, గత సమాజం మీద ప్రగతిశీలమైనదిగా ఆయన భావించలేదు. దానిని కీడుగా భావించి, దాని వినాశనాన్ని కాంక్షించారు. కనుక చేతివృత్తుల మీద ఆధారపడ్డ ప్రాచీన భారత సమాజ పునరుద్ధరణను ఆయన గాఢంగా వాంఛించారు. పెట్టుబడిదారీ యజమాన్యంలో జరిగే దురాచారాలకు, పారిశ్రామిక ప్రగతి వలన వచ్చే లాభాలకు మధ్య తేడాను ఆయన గమనించలేకపోయారు. మొత్తం దుష్ఫలితాలన్నింటికీ యంత్రాలే మూలకారణమని ఆయన భావించారు. అందువలన "కులాలు, అస్పృశ్యత లేని "ప్రాచీన హిందూ వర్ణ వ్యవస్థ" పునరుద్ధరణను ఆయన కోరుకున్నారు. సమాజానికి, కార్మికులకు గల సంబంధం గురించి గాంధీజీ భావనను శ్రీ డాంగే ఈ విధంగా పేర్కొన్నాడు. "ఆయన భావనలో కార్మికవర్గమొక వర్గం కాదు అది శూద్రవర్ణలాంటిది. శ్రమించడం కార్మికుని విధి. వారికి తిండిపెట్టడం, వారిని బాగుగా చూడడం సంపన్నులు, ఆస్తిపరుల బాధ్యత. ఇరువురు ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించాలి. తన విధిని ఎవరైనా విస్మరిస్తే వారిపై ఒత్తిడి తెచ్చి సరిదిద్దుకునేటట్లు చూడాలి."

గాంధీజీ వంటి జాతీయ నాయకుడే ఇటువంటి అభివృద్ధి నిరోధక సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం వల్ల, మొత్తం దేశంలో కాకపోయినా కొన్ని ప్రాంతాలలోనైనా కార్మికోద్యమాల మీద ప్రతికూల ప్రభావం పడింది. గాంధీజీ ఆకర్షణకు లోనైన అహమ్మదాబాద్ కార్మికులు వర్గ సామరస్యం, సంస్కరణవాదం ఊబిలో చిక్కుకుని బాగా నష్టపోయారు. భారత శ్రామికవర్గం యొక్క వర్గ చైతన్యం ఈ సిద్ధాంత ప్రభావం వలన చాలావరకు దెబ్బతిన్నది.

## ఇతర కార్మిక సంఘాలు

ఎన్నో ప్రతికూల లక్షణాలతో కూడిన గాంధీజీ సిద్ధాంతం గాని, దానికి నమూనాగా వున్న అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ గాని మొత్తం కార్మికవర్గ ఉద్యమాభివృద్ధి క్రమం మీద పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిరంతర పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిన ట్రేడ్ యూనియన్లు భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి గట్టి పునాది వేశాయి. చాలా ట్రేడ్ యూనియన్‌లు ఈ కాలంలో తాత్కాలిక ప్రయోజనాలకోసం ఏర్పడి తరువాత అంతరించిపోయాయి. కాని మరికొన్ని ట్రేడ్ యూనియన్లు శాశ్వత ప్రాతిపదిక మీద ఏర్పడి అనేక అవరోధాలను అధిగమించి పురోగమించాయి. కొన్ని సందర్భాల్లో ట్రేడ్ యూనియన్లను

వేదికలుగా ఉపయోగించుకుని ప్రజాజీవితంలో నాయకత్వ స్థానాన్ని సంపాదించి, చట్టసభల్లో ప్రభుత్వం తరఫున నామినేషన్ సంపాదించడానికి, వివిధ కమిటీల్లోనూ, కమిషన్లలోనూ, చివరకు యూరపులో జరిగే అంతర్జాతీయ కార్మిక సభల్లో ప్రాతినిధ్యం పొందడానికి, ఈ నకిలీ, తాత్కాలిక సంఘాలను ప్రోత్సహించారు.

కాని మొత్తం మీద "ఈ కాలంలో ట్రేడ్ యూనియన్లు బాగా పెంపొంది బలపడ్డాయని" రాయల్ కమిషన్ అభిప్రాయపడింది. "యూనియన్లు విడివిడిగా బలం పుంజుకుని ఉద్యమానికంతకు బలం చేకూర్చాయని" ఈ కమిషన్ భావించింది.

సంఘటిత ఉద్యమాల ప్రభావాన్ని భారత కార్మికవర్గం శీఘ్రంగా గుర్తించసాగింది. నిరంతర ప్రయత్నాలు ఫలించి, 1920 నాటికి రెండు లక్షల 50 వేల మంది సభ్యులు గల 125 యూనియన్లు ఏర్పాటైనాయి. ఈ దిగువన కొన్ని ముఖ్యమైన ట్రేడ్ యూనియన్లు, అవి ఏర్పడిన సంవత్సరాలు ఇవ్వబడ్డాయి. వీటిని పరిశీలిస్తే ఆ కాలంలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ఎంత విస్తృతంగా కొనసాగిందీ తెలుస్తుంది.

---

| | | |
|---|---|---|
| 1. | ప్రెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్, కలకత్తా | 1919 |
| 2. | కలకత్తా ట్రామ్ వే ఎంప్లాయీస్ అసోసియేషన్ | 1919 |
| 3. | ఆగ్నేయ రైల్వే యూనియన్ | 1919 |
| 4. | జి.ఐ.పి. రైల్వే యూనియన్ | 1919 |
| 5. | మెకానికల్ వర్కర్స్ యూనియన్ | 1919 |
| 6. | పంజాబు ప్రెస్ అసోసియేషన్ | 1919 |
| 7. | మద్రాస్ అండ్ సదరన్ మరాటా రైల్వే యూనియన్ | 1919 |
| 8. | జంషెడ్‌పూర్ లేబర్ అసోసియేషన్ | 1920 |
| 9. | అహమ్మదాబాద్ వర్కర్స్ యూనియన్ | 1920 |
| 10. | ఇండియన్ కాలరీ ఎంప్లాయీస్ అసోసియేషన్ | 1920 |
| 11. | బి.ఎన్. రైల్వే ఇండియన్ లేబర్ యూనియన్, ఖరగ్‌పూర్; బెంగాల్ | 1920 |
| 12. | ఆలిండియా పోస్టల్ అండ్ ఆర్.యం.యస్. యూనియన్ | 1920 |
| 13. | ది ఇంపీరియల్ బ్యాంక్ ఇండియన్ స్టాఫ్ అసోసియేషన్ | 1920 |
| 14. | ది బర్మా లేబర్ అసోసియేషన్ | 1920 |
| 15. | హౌరా లేబర్ యూనియన్ | 1920 |

| | | |
|---|---|---|
| 16. | ఒరియా లేబర్ యూనియన్ | 1920 |
| 17. | బి.యన్.డబ్ల్యు. రైల్వేమెన్స్ అసోసియేషన్ | 1920 |
| 18. | బి.బి. & సి.ఐ. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ | 1920 |
| 19. | ఇ.బి. రైల్వే ఇండియన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ | 1920 |
| 20. | బొంబాయి పోర్టు ట్రస్టు ఎంప్లాయీస్ యూనియన్ | 1920 |
| 21. | బెంగాల్ మెరైనర్స్ యూనియన్ | 1920 |
| 22. | డ్రైవర్స్, ఆయిల్‌మెన్ అండ్ ఫైర్‌మెన్స్ యూనియన్ థ్రాసిల్ యూనియన్, వీవర్స్ యూనియన్ అహమ్మదాబాద్ | 1920 |
| 23. | ఇండియన్ సీమెన్స్ యూనియన్, కలకత్తా | 1920 |
| 24. | బెంగాల్ సెంట్రల్ లేబర్ ఫెడరేషన్, కలకత్తా | 1920 |
| 25. | పోర్టు ట్రస్టు ఎంప్లాయీస్ అసోసియేషన్, కలకత్తా | 1920 |
| 26. | ప్రావిన్షియల్ రైల్వేమెయిల్ సర్వీస్ అండ్ పోస్టల్ అసోసియేషన్, కలకత్తా | 1920 |
| 27. | ఇన్‌ల్యాండ్ స్టీమర్ అండ్ ఫ్లాట్ ఎంపాయీస్ యూనియన్, కలకత్తా | 1920 |
| 28. | కలకత్తా మోటార్ డ్రైవర్స్ అసోసియేషన్, కలకత్తా | 1920 |
| 29. | పోస్టల్ ప్యూన్స్ అసోసియేషన్, కలకత్తా | 1920 |
| 30. | బెంగాల్ మినిస్టీరియస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కలకత్తా | 1920 |

ఈ విధంగా భారతదేశంలో సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమ దశ ప్రారంభమైంది.

## కేరళలో ట్రేడ్ యూనియన్ ఉద్యమ తొలి దశ : కొన్ని వాస్తవాలు

ఇరవయ్యవ శతాబ్దంలోని రెండవ, మూడవ దశకాల్లోనే కేరళలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధిలో తొలిదశ ప్రారంభమైంది. ఈ ఉద్యమాభివృద్ధికి సంబంధించిన కొన్ని వాస్తవాలను పరిశీలించడం అవసరం. ఈ సందర్భంగా తిరువాన్కూరు కార్మిక సంఘం (టిఎల్ఎ) ఆవిర్భావం తదితర ప్రధానాంశాలను పరిశీలిద్దాం.

దేశ స్వాతంత్ర్యానికి పూర్వం 1946 వరకు సాగిన పున్నప్ర–వాయలార్ పోరాటం, కార్మికవర్గ చరిత్రలో మిక్కిలి ప్రసిద్ధి చెందింది. ఈ పోరాటంలో పలువురు కార్మిక వర్గయోధులు ప్రాణత్యాగాలు కూడ చేశారు. ఈ వీరోచిత కార్మిక వర్గ పోరాటాల శకానికి చెందిన కొన్ని ప్రధాన సంఘటనలను వేరుగా వివరించడం జరుగుతుంది.

టిఎల్ఎను స్థాపించడంలో చొరవ తీసుకున్న పి.కె.బావా ఆదర్శవంతమైన వ్యక్తిత్వం కల్గినవాడు. తిరువాన్కూరు ప్రాంతంలోని పల్లిక్కూడం వద్ద సంప్రదాయబద్ధమైన పాఠశాల విద్యాభ్యాసం చేశాడు. ఆయన చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో, బావాకు పని వెదుక్కోవల్సిన పరిస్థితులేర్పడ్డాయి. కె.సి.గోవిందన్ ఉపాధి కోసం మొదటిసారి బావాను కలిసినప్పుడు, తాను మొదటిసారి ఉద్యోగం కోసం ప్రయత్నించిన సందర్భంగా తన అనుభవాన్ని గోవిందన్‌తో పంచుకున్నాడు. దరాగ్ స్మెయిల్ కంపెనీలో మొదటిసారి ఉద్యోగం కోసం వెళ్తూ బావా కేవలం ధోతీ మాత్రమే కట్టుకుని వెళ్లారట. అందువల్ల యార్డు సూపరింటెండెంట్ ఆయనకు ఉద్యోగం ఇచ్చేందుకు నిరాకరించారు. కాని బావా మంచి దుస్తుల్లో మళ్ళీ వెళ్లితే ఈసారి ఆయనకు రోజుకు ఏడు చక్రాలు (తిరువాన్కూరు సంస్థానంలో అమలులో ఉన్న వెండి నాణెం, రూపాయిలో 1/32 వంతు) జీతంతో అప్రెంటిస్‌గా పనిలోకి తీసుకోవడం జరిగింది. కేరళలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఆద్యుల్లో ఒకరైన కె.సి.గోవిందన్‌కు ఇది కనువిప్పు కలిగించింది.

వడప్పురం బావా గురించి కె.సి.గోవిందన్ చక్కగా వివరిస్తారు. "ఆయన నిపుణుడైన కార్మికుడే కాక మంచి ఆర్గనైజర్ కూడా. దరాగ్ స్మెయిల్ వదిలిన తరువాత ఎమ్.ఎల్.జనార్దన్ పిళ్ళైకు చెందిన జనరల్ సప్లైస్ ఏజన్సీలో మూప్పన్ (జాబ్ కంట్రాక్టర్)గా చేరేవరకు అనేక ఫ్యాక్టరీలు మారాడు. రెచ్చగొట్టే విధంగా ఉన్న ఒక సామాజిక కరపత్రం రాయడంతో బర్తరఫ్‌కు గురయ్యేవరకు అక్కడే పనిచేశాడు. దేవాలయ ప్రవేశం గురించి టి.కె.మాధవన్ ఉద్యమం ప్రజల మీద తీవ్రంగా ప్రభావం చూపుతున్న కాలమది. బావా ఎజువా యువజన సంఘంలో చురుగ్గా పనిచేస్తున్నాడు. కులపరమైన కట్టుబాట్ల కాలుష్యాన్ని, అస్పృశ్యతను పాటించే దేవాలయాలను బహిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తూ ఈ సంఘం ఒక కరపత్రాన్ని ప్రచురించింది. "మిమ్ములను ప్రేమించేవారిని ప్రేమించండి! మిమ్ములను ద్వేషించేవారిని ద్వేషించండి!" అనేది ఈ కరపత్రం ప్రధాన ఇతివృత్తం. బావా "సుమదర్శి" అనే వారపత్రిక చందాదారునిగా ఉండి చదువుతుండేవారు. గౌరవనీయుడైన సాధుస్వభావం కలిగిన సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురువుకు నిబద్ధత గలిగిన అనుచరునిగా ఉన్న బావా కార్మికుల దయనీయ స్థితికి వారిని సమాజంలో తక్కువ స్థాయి వారిగా చూడడం పట్ల కలత చెందాడు.

1922 ప్రారంభంలో కొన్ని పరిణామాలు సంభవించాయి. అలుమూత్తిన్ కేశవన్ ఇంటి ఆవరణలో బావ సారూప్యత కలిగిన వారితో సమావేశం ఏర్పాటు చేయడానికి బావా చొరవ తీసుకున్నాడు. న్యాయవాది, సామాజిక కార్యకర్త అయిన పి.ఎస్.మొహమ్మద్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఏడుగురుతో "కార్మిక సంఘం" పాలక వర్గాన్ని ఏర్పాటు చేశారు. అలప్పూజలో వైద్యునిగా ప్రాక్టీస్ చేస్తున్న ఎం.కె.ఆంటోనీ అధ్యక్షునిగా, పి.కె.బావా కార్యదర్శిగా

ఒక బట్టల షాపు యజమాని పాల్పుఆసన్ కోశాధికారిగా ఎన్నికయ్యారు. చక్కగా సంఘటితమైన కార్మికవర్గం ఉండడం తమ ప్రయోజనాలకు కూడా మంచిదని బావా భారతీయ యజమానులను ఒప్పించడంతో యూనియన్ ఏర్పాటుకు యజమానుల నుండి వ్యతిరేకత రాలేదు. అందువల్లనే ప్రారంభంలో కొన్ని తటపటాయింపులు అనుమానాలు ఉన్నప్పటికీ వారు పి.కె.బావా ప్రయోగానికి సహకరించేందుకు నిర్ణయించారు. "కార్మిక సంఘం" ఏర్పాటుతో పి.కె.బావా చిరకాల స్వప్నం ఫలించింది.

1922 మార్చి 31న జరిగిన సమావేశంలో యూనియన్ నిబంధనావళి రూపొందించేందుకు ఎం.కె.ఆంటోనీ, పి.యస్.మొహమ్మద్, బాప్పువైద్యన్‌లతో సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. చివరి ఇద్దరు సహకరించక పోవడం వల్ల ఆంటోనీ ఒక్కడే ముసాయిదా నిబంధనావళి రూపొందించాల్సి వచ్చింది. ముసాయిదా సమగ్రంగా లేకపోవడంతో దానిని తిరస్కరించి మరలా 1922 జూలై 19న ఎ.కృష్ణ అయ్యర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. అందరు గౌరవించే సామాజిక కార్యకర్త టి.సి. కేశవన్ వైద్యన్‌కు ముసాయిదా నిబంధనావళిని రూపొందించే బాధ్యత అప్పగించడం జరిగింది. యూనియన్ పాలక వర్గంలోని వారిలో ఒక్క బావా తప్పితే మరెవ్వరూ పట్టించుకోకపోవడంతో దానిని రద్దుపరిచారు. టి.సి.కేశవన్ వైద్యన్ అధ్యక్షునిగా నూతన పాలకవర్గం ఎన్నికైంది. సంఘం పేరును "తిరువాన్కూర్ కార్మిక సంఘం(టిఎల్ఎ)" గా మార్చాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది.

కేరళ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్ర రచించిన కె.రామచంద్రన్ నాయర్ ఈ విధంగా రాశారు. "కె.సి.గోవిందన్ చేసిన పై ప్రకటన సరిగ్గా ఉందనుకోవడం లేదు. ఆర్.ప్రకాశం వివరణ కూడా అలాగే ఉంది. 1922 జూలైలో టిఎల్ఏ స్థాపించబడిందని గోవిందన్ పేర్కొనగా 1922 ఏప్రిల్‌లో (మళయాళం కేలండర్ ప్రకారం 1097, మీనం, 18వ రోజు) ఏర్పాటయ్యిందని ఆర్.ప్రకాశం చెబుతున్నారు. ప్రకాశం సేకరించిన సమాచారం ప్రకారం కందాకరన్ కులప్పురకు ఉత్తరాన ఉన్న అలుమొత్తిన్ కేశవన్‌కు చెందిన స్థలంలో సామాజిక కార్యకర్త పి.ఎస్.మొహమ్మద్ నాయకత్వంలో సమావేశం జరిగింది. వడప్పురమ్ బావా మార్గదర్శకత్వం, చొరవలతోనే ఈ సమావేశం జరిగింది. దీనిలో పీచు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ ఆంటోనీ అధ్యక్షునిగాను పి.కె.బావా కార్యదర్శిగా కార్మిక సంఘం స్థాపించాలని సమావేశం నిర్ణయించింది. నాలుగు నెలల తరువాత మరొక బహిరంగసభ నిర్వహించి "కార్మిక సంఘం" పేరును టిఎల్ఏ గా మార్చాలని నిర్ణయించడం జరిగింది. 1920 జనవరి 30న మళయాళ దినపత్రిక "మళయాళ మనోరమ" లోప్రచురితమైన వార్తను చూస్తే పై వివరాలు యథార్థం కాదని స్పష్టమవుతుంది.

## కొల్లామ్‌లో కార్మికుల సమ్మె

నానాటికీ పెరుగుతున్న ధరలతో పాటు తమకిస్తున్న తక్కువ వేతనాలకు నిరసనగా కొల్లామ్‌లోని హారిజన్స్ అండ్ క్రాస్‌ఫీల్డ్స్ ఫ్యాక్టరీలోని కార్మికులు సమ్మె చేసినట్లు పత్రికల్లో

వార్తలొచ్చాయి. కంటోన్మెంట్‌కు దగ్గరలోని ఒక ఖాళీ స్థలంలో ఎ.ఆర్.మాధవయ్యర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీయుతులు గోవిందన్ నాయర్ బి.ఎ., బి.ఎల్, కె.సి.గోవిందన్, టి.సి.కేశవన్, టి.కె.మాధవన్, టి.కె.నారాయణన్ తదితరులు పాల్గొన్నారు. తిరువాన్కూర్ లేబర్ యూనియన్ (టిఎల్‌యు) పేరిట ఒక యూనియన్ ప్రారంభించాలని పని గంటలు ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు అంటే రోజుకు 9 గంటలకు పరిమితం చేయాలని, శనివారాల్లో పనిగంటలు ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 1 గంట నుండి 3 గంటల వరకు అంటే రోజుకు 7 గంటలు పరిమితం చేయాలని, వేతనాలను 50 శాతం పెంచాలని, వేతనంలో 20 శాతం బోనస్ చెల్లించాలని, సెలవు దినాల్లో కార్మికులు పనిచేయాల్సి వస్తే వారికి చెల్లించే సాధారణ వేతనానికి రెట్టింపు చెల్లించాలన్న ప్రధాన నిర్ణయాలు ఈ సమావేశంలో చేయబడ్డాయని పత్రికలు రిపోర్టు చేశాయి. మలయాళీ పత్రిక ప్రధాన సంపాదకులు ఎ.ఆర్.మాధవయ్యర్, మళయాళం ఇండస్ట్రియల్ కంపెనీ మేనేజర్ టి.కె.నారాయణన్, సి.మొహమ్మద్ కుంజీలతో కూడిన ప్రతినిధి వర్గం యజమానిని కలవాలని నిర్ణయించబడింది.

హారిజన్ కంపెనీ మేనేజర్ మేకీ, ప్రతినిధి వర్గం లేవనెత్తిన కొన్ని డిమాండ్లను పరిశీలించడానికంగీకరించారు. బోనస్‌ను 10%నుండి 20%కు పెంచారు. పనిగంటలు ఉదయం 6.30గంటలకు బదులుగా 7 గంటలకు ప్రారంభమౌవుతాయి. పనిగంటలను తొమ్మిది గంటలకు పరిమితం చేశారు. వేతనాలను 50% పెంచగల్గినంతటి స్థాయిలో కంపెనీ లాభాలు సంపాదించడం లేదని, మేనేజర్ ప్రతినిధి వర్గానికి తెలిపారు. దీనితో సంతృప్తి చెందని కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంలోనే మేకీతో పాటు కంపెనీకి మరో మేనేజర్ క్లేయర్ మరో దఫా చర్చల కోసం ప్రతినిధి వర్గంతో సమావేశం కావాలని కోరుకున్నారు. దీనికి స్పందించిన కార్మికులు, ఆందోళన విరమించి, పనుల్లోకి వెళ్ళాలని నిర్ణయించారు.

ఈ విషయాలను పరిశీలిస్తే టిఎల్‌ఏ పేరిట కార్మిక సంఘం 1920 లో ఏర్పడినప్పటికీ, అలప్పూజలో ట్రేడ్‌యూనియన్ ఉద్యమం 1920కి కొన్నేళ్ళ ముందుగానే ప్రారంభమైందని స్పష్టమౌతుంది. కొల్లామ్‌లో కూడా, 1920 నాటికే కార్మికులు సంఘటితమయ్యారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, 1920 దశకం ప్రారంభానికే అలప్పూజ, కొల్లామ్‌లు ట్రేడ్ యూనియన్ ఉద్యమ కేంద్రాలుగా ఉన్నాయి.

## 1907 సమ్మె పోరాటాలు

1907 సంవత్సరంలోనే దరాగ్ స్మయిల్ కంపెనీలో సమ్మె జరిగినట్లు ఆర్. ప్రకాశం పేర్కొన్నారు. ఈ కంపెనీలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అంటే 12 గంటలు పని చేయవల్సి ఉండేది. కొందరు కార్మికులు తమ కష్టాలను కంపెనీ యాజమాన్యానికి చెప్పుకుందామని నిర్ణయించుకున్నారు. యాజమాన్యం వారిని బెదిరించి వెళ్ళగొట్టింది. మరుసటి రోజు ఉదయమే కార్మికులు కంపెనీ గేటు వద్ద సమావేశ మయ్యారు.

ఫ్యాక్టరీలోకి వెళ్ళవలసిందిగా సంకేతం ఇస్తూ మేనేజరు విజిల్ వూదాడు. కాని గుమాస్తాలు మరియు మూప్పన్లు (జాబ్ కాంట్రాక్టర్లు) మాత్రమే ఫ్యాక్టరీలోకి ప్రవేశించగా, కార్మికులందరు ఆగిపోయారు. దానితో కొద్దిమంది కార్మికులను పిలిచి యాజమాన్యం వారితో మాట్లాడింది. రెండుగంటల మేరకు పనిగంటలు తగ్గించాలని కార్మికులు డిమాండు చేశారు. సుదీర్ఘ చర్చల అనంతరం, గతంలో వలె ఉదయం 6 గంటలకు కాక, ఉదయం 7 గంటలకు, కార్మికులు పనిలో రిపోర్టు చేయడానికనుమతించేందుకు యాజమాన్యం అంగీకరించింది. దీన్ని కార్మికులు అంగీకరించారు. కార్మికులకు కనీసం ఒక సంఘంగాని, సరైన నాయకత్వంగాని లేని సమయంలో ఈ పరిణామం చోటు చేసుకుంది.

కార్మికులు సంఘటితమౌతున్న సంకేతాలను గమనించిన యజమానులు, కార్మికుల సంఘటిత కార్యాచరణను దెబ్బతీసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్మికుల జీతాలను తగ్గించి, దానిని కార్మికులు ప్రతిఘటిస్తే వారిని తీవ్రంగా అణచివేసేందుకు పూనుకున్నారు. యాజమాన్యాల చర్యలకు నిరసనగాని, ఆందోళన గాని చేస్తే కార్మికులను తొలగించాలని మేనేజ్‌మెంట్లు నిర్ణయించాయి. కొన్ని కంపెనీలు తమ కార్యకలాపాలను అలప్పూజ నుండి సమీపంలోని గ్రామాలకు తరలించి పెద్ద ఎత్తున కాంట్రాక్టు పద్ధతిలో పనులు చేయించేందుకు పూనుకున్నాయి. పేదల్లోనే అత్యంత పేదలైన కార్మికులకు అత్యంత నికృష్ట వేతనాలిచ్చి పనులు చేయించుకుంటున్నారు.

## టిఎల్‌ఏ కార్యకలాపాలు

ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాల్లో కార్మికులను భాగస్వాములను చేయడంతోపాటు, టిఎల్‌ఏకు నిధుల అవసరాన్ని ట్రేడ్‌యూనియన్ ఉద్యమ నాయకులు గుర్తించారు. ప్రారంభ దినాల్లో పి.కె. బావా తన సంపాదనను టిఎల్‌ఏ ఖర్చులకు ఉపయోగించేవాడు. దీనిని ఎక్కువ కాలం కొనసాగించడం సాధ్యం కాలేదు. అందువలన కార్మికుల నుండి నిధులు వసూలు చేయాలని నిర్ణయించడం జరిగింది. కొన్ని సందర్భాల్లో కార్మికులకు నచ్చ చెప్తుండేవారు. కార్మిక వర్గంలో అత్యధికులకు కార్మిక వర్గ చైతన్యం లేకపోవడం, వారి నిత్యావసరాలకు కూడా జీతాలు సరిపడని పరిస్థితుల వల్ల నిధి వసూలులో కొంత ఒత్తిడి, నిర్బంధం కూడా చోటు చేసుకునేవి. టిఎల్‌ఏ ని ఆర్థికంగా పరిపుష్టం చేసుకోవాల్సిన అవసరం గురించి బావా కార్మికులను ఒప్పించగలిగాడు. ఫ్యాక్టరీకి వచ్చిన కాయిర్ యార్న్ వ్యాపారస్తుల నుండి కూడా ఆయన విరాళాలు వసూలు చేసేవాడు. ఈ విధంగా వచ్చిన విరాళాలను నోటీసులు, కరపత్రాలు ముద్రించి, పంపిణీ చేయడానికి వినియోగించేవాడు. 1922 ఆగస్టు 7వ తేదీన ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా ఎంపైర్ కాయిర్ వర్క్స్ లోని అత్యధిక కార్మికులు సభ్యులుగా చేరారు. "విశాల దృక్పథం కలిగిన సంస్థ యజమాని, సంస్థ ఆవరణలోనే సంఘపరమైన విషయాలు చర్చించుకోవడానికి సంఘాన్ని అనుమతించాడు. అయినప్పటికీ, తమంతతాముగా, ఐచ్ఛికంగా సంఘంలో చేరేవారి సంఖ్య తక్కువగానే వుంది. అందువల్ల అనేక కంపెనీల్లో

మూప్పన్లను కూడా సంఘం మేనేజిమెంట్ కమిటీల్లోకి కో ఆప్ట్ చేసుకోవడం జరిగింది. వీరి ప్రభావం, ఒత్తిడి మూలంగా ప్రారంభంలో ఎక్కువమంది కార్మికులు సంఘంలో చేరారు.

1924–26 మధ్య కాలంలో, అప్పటి వరకు అలప్పూజ కొబ్బరిపీచు ఫ్యాక్టరీ కార్మికులకే పరిమితమైన టిఎల్‌ఏ, ఇతర ప్రాంతాలు, ఇతర తరగతుల కార్మిక వర్గం మీద ప్రభావం చూపనారంభించింది. పోలీసుల వేధింపులకు వ్యతిరేకంగా అలప్పూజలోని రిక్షా కార్మికులను సమీకరించి ఆందోళన చేపట్టి ఒక ఒప్పందానికి రావడంలో టిఎల్‌ఏ చేసిన కృషిని, సాధించిన విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. పీరుమాడేలోని తోటలలో పనిచేసే కార్మికులు ఒక శాఖను ప్రారంభించవల్సిందిగా టిఎల్‌ఏని కోరారు. అయితే సరైన నిబంధనావళి, చట్టపరమైన రిజిస్ట్రేషన్ లేకపోవడం టిఎల్‌ఏకు ఆటంకాలెదురవుతున్నాయి. టిఎల్‌ఏ రెండవ వార్షిక మహాసభ అలప్పూజ ప్రభుత్వ గార్డెన్ల సమీపంలోని ఒక తాత్కాలిక సినిమా హాలులో, 1925 జూన్ 7వ తేదీన నరేంద్రమండలం కార్యదర్శి సర్దార్ కె.ఎమ్.ఫణిక్కర్ అధ్యక్షతన జరిగింది. కన్నన్ థోడాతు, వేలాయుధన్ మీనన్, కొచ్చిన్ ఎమ్ఎల్ఏ, కె.ఎ. ఇబ్రహీం, ఎ.బి.సలేమ్ వంటి వారు పాల్గొని ప్రసంగించినట్లు కె.ఎ.గోవిందన్ పేర్కొన్నారు. టిఎల్‌ఏ ని ఏఐటియుసికి అనుబంధ సంస్థగా చేయాలని ప్రతిపాదించడం జరిగింది. కార్మికుల సహకార సొసైటీ ఏర్పాటు విషయాన్ని కూడా సమావేశం చర్చించింది. దీనికనుగుణంగానే, 1926 జూలై 18న "అలప్పూజ కార్మికుల పరస్పర సహకార సంఘం" లాంఛనంగా రిజిష్టరు చేయబడింది. ఇది ఒక కిరాణా స్టోర్స్‌ను కూడా ప్రారంభించి, స్వల్పకాలిక రుణాలు కూడా పంపిణీ చేసింది.

కార్మికులకు ఇంగ్లీషు, మళయాళం, గణితం నేర్పేందుకు, ఉపన్యాసాలివ్వడం నేర్పేందుకు టిఎల్‌ఏ ఒక రాత్రి పాఠశాలను కూడా ప్రారంభించింది. టిఎల్‌ఏకు ఒక నిబంధనావళిని రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. నాలుగు అణాలు ప్రవేశ రుసుము చెల్లించినవారందరికి సభ్యత్వం ఇవ్వడం జరిగింది. త్వరలోనే టిఎల్‌ఏ సభ్యత్వం ఇరవై వేలకు చేరుకుంది. టిఎల్‌ఏ ఆఫీసుకు వెళ్ళి, సమావేశాలకు హాజరైన వారిపై యజమానులు కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారు. దీనిని ఎదుర్కొనేందుకు టిఎల్‌ఏ మేనేజింగ్ కమిటీ వాలంటీర్ దళాలను కార్మికుల ఇళ్ళకు పంపి, వారి సామాజిక, ఆర్థిక సమస్యలను చర్చించి, వారిని సభ్యులుగా చేర్పించడం జరుగుతుండేది. ఈ క్యాంపెయిన్‌లో చాలా మంది మూప్పన్లు తమ సహకారం అందించారు.

కులపరమైనదైనా, రాజకీయపరమైన సమావేశమైనా కార్మిక సమస్యల మీద ప్రత్యేక సమావేశం నిర్వహించాలని టిఎల్‌ఏ కోరింది. కార్మికుల పనిగంటలు తగ్గించి, పని ప్రదేశాల్లో ప్రమాదాలు నివారించాల్సిందిగా కోరుతూ, 1926 మే 8, 9 తేదీల్లో కొల్లామ్‌లో జరిగిన ఎస్ఎన్‌డిపి (శ్రీ నారాయణ ధర్మపరిపాలన) మహాసభ మొట్టమొదటిసారిగా తీర్మానం ఆమోదించింది. దీనిలో కులపరమైన ఛాయలు చూచినవారు పొరపాటు వ్యాఖ్యానాలు చేశారు. ఈ పరిణామాల పట్ల టిఎల్ఎ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 1926 జూన్ 20వ తేదీన అలప్పూజలోని భాగవతీ విలాసం థియేటర్‌లో టిఎల్‌ఏ 3వ వార్షిక మహాసభ జరిగింది. మేళతాళాలతో

కార్మికులు ఆర్భాటంగా తమ ఫ్యాక్టరీలనుండి ప్రదర్శనగా సభాస్థలానికి చేరుకున్నారు. సోషలిస్టు నాయకుడు, తమిళనాడు ఆత్మగౌరవ ఉద్యమ వ్యవస్థాపకుడు ఇ.వి. రామస్వామినాయకర్ మహాసభకు అధ్యక్షత వహించారు. పట్టణంలోని ప్రముఖ వర్తకులు, పౌరులు ఈ మహాసభలో పాల్గొన్నారు. పి.కె. మాధవన్ అధ్యక్షునిగా, తోజిలాలి (కార్మికుడు) పత్రిక సంపాదకుడు ఎస్. వాసు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వారికి సహాయం చేసేందుకు పి.కె. బావా ఉపాధ్యక్షునిగాను, కెసి గౌవిందన్ సహాయ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు" అని కె.సి. గోవిందన్ వివరించారు.

టిఎల్‌ఏ తీవ్రమైన సమస్యలనెదుర్కోవడం మొదలైంది. ప్రతి ఫ్యాక్టరీ నుండి వారి సభ్యత్వం ప్రాతిపదికన కమిటీ సభ్యులు ఎన్నికవ్వాలన్న నిర్ణయం వల్ల, బాగా చురుగ్గా వున్న సభ్యులను తిరిగి ఎన్నుకోవడానికి ఆటంకంగా తయారైంది. సంఘంలో అసమ్మతి, వైరుధ్యాలు పెరిగాయి. ఆర్థిక ఇబ్బందులు తీవ్రమయ్యాయి. తోజిలాలీ (కార్మికుడు) పత్రిక ప్రచురణ తాత్కాలికంగా నిలిచిపోయింది. శాసనసభలో కార్మికబిల్లును ప్రవేశపెట్టడానికంగీకరించిన మాజీ హైకోర్టు న్యాయమూర్తి ఎన్ కుమరన్‌కు టిఎల్‌ఏ నిర్దిష్ట ప్రతిపాదనలను కూడా అందించలేకపోయింది.

అలప్పూజ ప్రాంతంలో ట్రేడ్ ఉద్యమ ప్రారంభదినాల్లో సాగిన సమ్మె పోరాటాల గురించి కె.సి. గోవిందన్ కొంత సమాచారం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధిని వెదుక్కుంటున్న ప్రజలను అలప్పూజలోని కొబ్బరిపీచు ఫ్యాక్టరీలు విశేషంగా ఆకర్షించాయి. ఈ ప్రాంతంలోకి పెద్ద సంఖ్యలో కార్మికులు వచ్చి చేరడంతో, కార్మికుల జీతాల మీద ప్రతికూల ప్రభావం పడింది. కొబ్బరిపీచు ఉత్పత్తుల ఎగుమతులకు ఆర్డర్లు పెరగడంతో పాటు, నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రవేశం వల్ల, ఈ పరిస్థితి కొంతవరకు మెరుగుపరచబడింది. ఎగుమతులు పెరిగి, పోటీ తీవ్రం కావడంతో పారిశ్రామికవేత్తలు పోటీపడి ధరలు తగ్గించారు. ఫలితంగా ధరలు పడిపోయాయి. కార్మికులకు కొరతలేకపోవడం వల్ల మూప్పన్లు, ఇతర కాంట్రాక్టర్లు అహంకారపూరితంగానూ, నిరంకుశంగానూ వ్యవహరించసాగారు. పరిస్థితులు దిగజారడం వల్ల కార్మికులు సమ్మెకు పూనుకోవల్సి వచ్చింది. టిఎల్‌ఏ కూడ జోక్యం చేసుకుంది.

## కమ్మాడీ డిపో (Commady Depot) లో సమ్మె

విలియం గుడ్‌ఏకర్ అండ్ కంపెనీకి చెందిన కమ్మాడీ డిపో యాజమాన్యం 1928 ఏప్రిల్‌లో కొబ్బరి పీచులతో పరుపులు, తదితర ఉత్పత్తులు చేసేవారి వేతనాలు తగ్గించింది. కార్మికుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించేందుకు యాజమాన్యం తిరస్కరించడంతో, కార్మికులు సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారు. టిఎల్‌ఏకు ముందుగా తెలియజేయకుండానే కార్మికులు సమ్మెకు పూనుకున్నప్పటికీ, టిఎల్‌ఏ జోక్యం చేసుకునేందుకు నిర్ణయించింది. సమస్యలు పరిష్కరించవల్సిందిగా కోరుతూ మేనేజ్‌మెంటుకు బావా లేఖలు వ్రాసినప్పటికీ, మేనేజిమెంటు లెక్కచేయలేదు. కొద్ది కాలం క్రిందటనే ఆవిర్భవించిన

టిఎల్ఏ ఈ సుదీర్ఘకాల సమ్మెను నిలబెట్టలేకపోయింది. యాజమాన్యం కమ్మాడీ డిపోను మూసివేసి కార్మికులందరినీ తొలగించింది. కార్మికులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించి, నిరసన సభ నిర్వహించేందుకు కిదంగన్ పరంబు మైదానానికి చేరుకున్నారు. అదే సమయంలో, కంపెనీ ప్రధాన కార్యాలయంలోని కార్మికులు కూడ సమ్మెలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. టిఎల్ఏ సమ్మె నిధి వసూలు ప్రారంభించింది. కమ్మాడీ డిపోలో సమ్మెను పరిష్కరించేందుకు సానుకూల నిర్ణయం తీసుకోవల్సిందిగా కోరుతూ కంపెనీ ప్రధాన కార్యాలయంలోని కార్మికులు యాజమాన్యానికి మెమోరాండం సమర్పించారు. 1929 ఏప్రిల్ 26న కె. సి. కరుణాకరన్ చట్టసభలో ఈ విషయం లేవనెత్తారు. కంపెనీకి చెందిన అన్ని యూనిట్లలోనూ సమ్మె సంపూర్ణంగా జరుగుతుందనే భయంతో, సమ్మెకు ముందున్న స్థాయికి జీతాలను పునరుద్ధరించడానికి యాజమాన్యం నిర్ణయించింది.

## థామస్ డిక్రజ్ అండ్ కంపెనీలో సమ్మె

థామస్ ఈ' క్రజ్ కంపెనీలోని కొబ్బరిపీచు పరుపులు చేసే కార్మికుల జీతాల్లో కోతవిధించడంతో, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవల్సిందిగా కోరుతూ కార్మికులు మేనేజ్‌మెంట్‌కు విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం నుండి స్పందన రాకపోవడంతో, కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. వారు టిఎల్ఏ సహకారం కోరారు. అసోసియేషన్‌తో ముందుగా సంప్రదించకుండా హఠాత్తుగా సమ్మెకు పూనుకోవడాన్ని ఆమోదించక పోయినప్పటికీ, టిఎల్ఏ జోక్యం చేసుకోవాలని నిర్ణయించింది. కార్మికులతో చర్చల తర్వాత యాజమాన్యం జీతాలను సమ్మె ముందున్న స్థాయికి పునరుద్ధరించేందుకు అంగీకరించింది. కాని దీనితో పాటు, సంఘం చురుకైన కార్యకర్తలను తొలగించడం ద్వారా యాజమాన్యం భిన్నమైన సంకేతాలనిచ్చింది.

## ఆస్పిన్ వాల్ కంపెనీలో సమ్మె

థామస్ డిక్రజ్ అండ్ కంపెనీలో సమ్మె పరిష్కారమైన తర్వాత, ఆస్పిన్‌వాల్ కంపెనీకి చెందిన ఆర్యద్ యూనిట్‌లోని కార్మికుల జీతాల్లో కోత విధించడంతో, ఆ కంపెనీ కార్మికులు సమ్మెకు పూనుకోవల్సివచ్చింది. అప్పటికే, ఆ యూనిట్‌లోని కార్మికుల జీతాలు హెడ్ ఆఫీసులో తమవలెనే పని చేస్తున్న వారి జీతాలకంటే తక్కువగా వున్నాయి. తమ వేతనాలను మరింత తగ్గించడం అన్యాయమని భావించిన కార్మికులు టిఎల్ఏ సహాయం కోరారు. అసోసియేషన్ ప్రయత్నాలు విఫలం కావడంతో, సమ్మె అనివార్యమైంది. సమ్మె మూడు వారాల పాటు కొనసాగింది. ఈ సమ్మెను గురించి కె.సి. గోవిందన్ ఈ విధంగా పేర్కొన్నారు.

“కంపెనీకి సమీపంలోనే జరిగిన బహిరంగ సభకు, ఎజువా కులానికి చెందిన ప్రముఖ నాయకుడు సి.కె.కృష్ణ ఫణిక్కర్ అధ్యక్షత వహించారు. సభాధ్యక్షుని గుఱ్ఱం మీద ఊరేగింపుగా తీసుకువచ్చారు. భారీ సంఖ్యలో కార్మికులతో సహా సుమారు ఐదు వేల మంది సభలో పాల్గొన్నారు. సమీపంలోని కంపెనీల్లోని కార్మికులు, వారానికొక రూపాయి చొప్పున సమ్మె నిధికి

విరాళాలిచ్చేందుకు అంగీకరించారు. యాజమాన్యం మొండివైఖరితో ఉంది. కార్మికులు బేషరుతుగా సమ్మె ఉపసంహరించుకునే వరకు ఫ్యాక్టరీని మూసి వుంచుతామని, ఫ్యాక్టరీ నిర్వహణకు సంబంధించి కార్మికులు చేసే ప్రతిపాదనను పరిశీలించే ప్రసక్తే లేదని, కంపెనీ మేనేజర్ స్మిత్ ప్రకటించాడు. ఈ ప్రకటన కార్మికులను కోపోద్రిక్తులను చేసింది. దీనితో అలప్పూజ పట్టణంలోని, ఆస్పిన్ వాల్ ప్రధాన ఫ్యాక్టరీలో కూడ సమ్మె ప్రకటించే విషయాన్ని తీవ్రంగా పరిశీలించాము."

"సమ్మెను భగ్నం చేసేందుకు కంపెనీ, విచ్ఛిన్న కారులను దించింది. కార్మికులు చేసే పనిని, బాగా పలుకుబడిగల్గిన వి.ఎన్. సెబాస్టియన్ అనే మూప్పన్‌కు కాంట్రాక్టుకు ఇవ్వనారంభించింది. సమ్మె విచ్ఛిన్నకారులు ఫ్యాక్టరీలో ప్రవేశించకుండా, ఫ్యాక్టరీ గేటు ముందు పికెటింగ్ జరపడం ద్వారా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవల్సిందిగా టిఎల్ఏ, కార్మికులకు పిలుపు ఇచ్చింది. అయినప్పటికీ సెబాస్టియన్ పోలీసుల సహాయంతో కొద్దిమంది సమ్మె విచ్ఛిన్నకారులను ఫ్యాక్టరీలోకి తీసుకెళ్ళగలిగాడు. టిఎల్ఎ తరపున పి. కె. బావాతో పాటు మరొక న్యాయవాది కంపెనీ యాజమాన్యాన్ని కలిసి చర్చల సందర్భంగా, కార్మికులు సమ్మెను బేషరతుగా ఉపసంహరించుకుంటే, పాత జీతాలను పునరుద్ధరించేందుకు యాజమాన్యం హామీ ఇచ్చింది. దీనితో కంపెనీ ప్రతిష్ఠను పరిరక్షించేందుకు బావా అంగీకరించారు. కార్మికులు సమ్మె ఉపసంహరించుకున్నారు. దీనితో ఇక ఏ మాత్రం అసోసియేషన్ మాట చెల్లుబాటు కానివ్వరాదని యూరోపియన్ యాజమాన్యాలు నిర్ణయించుకున్నాయి. ఇది టిఎల్ఎకి కార్మికుల్లో వున్న పలుకుబడికి నిదర్శనం.

భారత్ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలో 1928 సంవత్సరం ఒకమైలు రాయివంటిది. తిరువాన్కూర్, కొచ్చిన్, మలబార్‌లలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమం మీద ప్రభావం చూపిన దక్షిణ భారత రైల్వే ఉద్యోగుల సమ్మె, ఈ సంవత్సరంలోనే జరిగింది. అలప్పూజలోని వాణివిలాసం హాలులో 1928 జూన్3న టిఎల్ఎ నాల్గవ వార్షిక మహాసభ జరిగింది. కొట్టాయంకు చెందిన పౌరప్రభ సంపాదకులు జెడ్.ఎం. పారయెట్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఎబి సలేమ్, కన్నన్ తోడతు వేలాయుధమీనన్ మరియు కెకె ఫణిక్కర్‌లు ప్రసంగించారు. కంపెనీల నిబంధనల క్రింద టిఎల్ఎని రిజిస్టర్ చేయాలని మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. చట్టసభలో కార్మిక ప్రతినిధినొకరిని నామినేట్ చేయవల్సిందిగా మహాసభ, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై ప్రభుత్వానికి రిప్రజెంట్ చేయడానికి పికె బావ, పికె మాధవన్ మరియు పిఎస్ మొహమ్మద్‌లతో కూడిన ప్రతినిధి వర్గాన్ని పంపడం జరిగింది. టిఎల్ఏ నాల్గవ మహాసభ పిఎస్ మొహమ్మద్‌ను అధ్యక్షునిగా పికె బావాను కార్యదర్శిగా ఎ.వార్కే మూప్పన్‌ను ఉపాధ్యక్షునిగా,

కె.సి. గోవిందన్‌ను సహాయ కార్యదర్శిగా, కె.ఎ. కేశవన్ (కండాతిల్)ను టూరింగ్ కార్యదర్శిగా ఎన్నుకుంది. "తోజిలాలి" (కార్మికుడు) పత్రిక ప్రచురణను కొనసాగించాలని మహాసభ నిర్ణయించింది. చట్టసభలో కార్మికులకు ప్రాతినిధ్యం వుండాలని టిఎల్‌ఎ డిమాండ్ చేస్తున్న సమయంలోనే ప్రభుత్వం, పిఎస్ మొహమ్మద్‌ను ముస్లిం మత ప్రతినిధిగా నామినేట్ చేసింది. సమ్మెలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ బిల్లు ప్రవేశపెట్టేందుకు ఫ్యాక్టరీ యజమానుల ప్రతినిధి చేసిన ప్రయత్నాలను మొహమ్మద్ ఓడించగలిగాడు. ఆవిధంగా మొహమ్మద్ నామినేషన్ కార్మికవర్గానికి ప్రయోజనం చేకూర్చింది. ఈ విషయంలో అసెంబ్లీ డిప్యూటీ అధ్యక్షులు మొహమ్మద్‌ను సమర్థించారు.

## 1931 జూలై ఆగస్టు సమ్మె పోరాటం

అలప్పూజ జిల్లా కోర్టు న్యాయవాది ఇఎం కోవూర్ అధ్యక్షతన అలిస్సెర్రీ వెలియల్ వద్ద జరిగిన టిఎల్‌ఏ ప్రత్యేక మహాసభలో 4వేల మంది పాల్గొన్నారు. వైకో పి. చంద్రశేఖర పిళ్ళై, జార్జ్ ఎం. వర్గీస్, కె.సి. గోవిందన్, వి.కె. అచ్యుతన్‌లు ప్రధాన వక్తలుగా ప్రసంగించారు. ఐరోపాకు, భారతదేశానికి చెందిన కంపెనీలు వేతనాల్లో కోతలు ప్రకటించడంతో సమ్మె చేసే విషయమై చర్చ జరిగింది. అనేక కంపెనీల్లో ఏమాత్రం ప్రయత్నాలు లేకుండానే ఆందోళనలు చెలరేగుతున్నాయి. టిఎల్‌ఎ జోక్యం చేసుకుంది. కార్మికులు తిరిగి పనుల్లోకి వస్తే జీతాలు కొద్దిగా పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. అయితే యాజమాన్యాలు కార్మికులను మోసం చేయడంతో, టిఎల్‌ఎ పతాకం క్రిందనే ఆందోళన నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది.

ఈ సమ్మెకు కొద్దిగా ముందుగానే తిరువాన్కూర్ పర్యటనకు అలప్పూజ వచ్చిన కాంగ్రెస్ నాయకులు కె.ఎఫ్. నారిమన్‌కు టిఎల్‌ఏ బ్రహ్మాండమైన స్వాగత సత్కారాలిచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ తన కుటుంబంతో అలప్పూజ వచ్చినప్పుడు 1931 మే 29వ తేదీన కిదంగం పరంబా మైదానంలో బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఆ సభలో టిఎల్‌ఏ అధ్యక్షుడు పి.ఎస్. మొహమ్మద్ సన్మానపత్రం చదవగా, కె.సి.గోవిందన్ నెహ్రూకు బహూకరించారు. పోర్టు కార్మికులు సంఘం అవసరం గుర్తించినప్పటికీ ఇంకా సంఘం ఏర్పాటు చేసుకోలేదు. 1931లో కాంట్రాక్టర్లకు, బరువులు మోసే కార్మికులకు మధ్య వేతనాల విషయంలో వివాదం తలెత్తింది. తమ సమస్యలు వివరిస్తూ కార్మికులు టిఎల్‌ఏ మేనేజింగ్ కమిటీకి మెమోరాండం సమర్పించారు. టిఎల్‌ఏ సబ్ కమిటి పోర్టు కార్మికుల సమస్యల గురించి టిఎల్‌ఏకి వివరించి, పోర్టు కార్మికుల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని సూచించింది. దీనికి రామన్‌కుంజు చొరవతీసుకున్నాడు.

1931 జూలై – ఆగస్టు సమ్మె బొంబాయి కంపెనీలో ప్రారంభమైంది. టిఎల్ఏ అధికార ప్రతినిధి వి.కె. వేలాయుధన్‌ను కలవడానికి కంపెనీ యాజమాన్యం నిరాకరించింది. సమ్మె మూడు నెలల పాటు జరిగింది. ఆకలితో మాడినప్పటికీ సమ్మె కొనసాగిస్తామని కార్మికులు ప్రకటించారు. సమ్మె చేస్తున్న కార్మికులకు రోజూ ఉచితంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేయాలని, టిఎల్ఏ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్న వి.కె. అచ్యుతన్ మరియు సి.కె. వేలాయుధన్‌లు చివరకు మేనేజ్‌మెంట్‌తో ఒక ఒప్పందానికి రాగలిగారు. సమ్మె ముగిసిన తరువాత వీరు బొంబాయి కంపెనీలో తమ ఉద్యోగాలను వదులుకొని పియర్స్ లెస్లీ కంపెనీలో చేరారు.

టిఎల్ఏలో అంతర్గత ముఠా తగాదాల వల్ల కార్యదర్శి పదవికి టిసి గోవిందన్ రాజీనామా చేశాడు. 1932 జనవరిలో జరిగిన సమావేశంలో వి.సి. వాసువైద్యన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అయినప్పటికీ గోవిందన్ మాత్రం తన రోజువారీ ట్రేడ్ యూనియన్ మరియు సామాజిక కార్యకలాపాలను వదిలిపెట్టలేదు.

## టిఎల్ఏ ఆధ్వర్యంలో మేడే

టిఎల్ఏ అణిగి మణిగి వుండలేదు. తిరువాన్కూరు మహారాజును అగౌరవ పరుస్తున్నారనే భావనకలుగకుండా వుండే విధంగా చూచేందుకు టిఎల్ఏ జాగ్రత్త తీసుకున్నప్పటికీ, 1935 మే దినోత్సవం కార్మికవర్గ బలప్రదర్శనగానే సాగింది. తిరువాన్కూరు మహారాజుకు గౌరవసూచికంగానూ, బ్రిటిష్ సార్వభౌముడు 5వ జార్జి జయంతి పురస్కరించుకుని మే 5వ తేదీన కిదంగంపెరంబు మైదానంలో సమావేశం ఏర్పాటుచేశారు. అంటే మహారాజు, ఆయన దివాన్‌ను టిఎల్ఏ గౌరవిస్తుందని, వారి అధికారాన్ని ప్రశ్నించే ఆలోచన టిఎల్ఏకు లేదని స్పష్టమవుతుంది. ఇంకా టిఎల్ఏ ఒక నిజమైన కార్మికవర్గ సంస్థగా రూపొందలేదని, ఒక రాజకీయ అవగాహనను కూడా అలవర్చుకోలేదని కూడా స్పష్టమవుతోంది. మితవాదులు, మధ్యేవాదులు మరియు కుల సంఘాలతో సన్నిహిత సంబంధాలున్న వారి ఆధిపత్యంలో కూడ టిఎల్ఏ వున్నదని కూడ వెల్లడవుతుంది. కోజిఖోడ్‌లో అఖిల కేరళ కార్మికసభలో పాల్గొనాలని టిఎల్ఏ నిర్ణయించడంతో పరిస్థితులు మారడం ప్రారంభమైంది. ఆర్. సుగాథన్ ఆ కాన్ఫరెన్స్‌కు టిఎల్ఏ ప్రతినిధిగా పాల్గొనేందుకు ఎన్నికయ్యారు.

## అఖిల కేరళ కార్మిక మహాసభ

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) ప్రథమ సదస్సులో భాగంగా, అఖిల కేరళ కార్మిక మహాసభ కోజిఖోడ్‌లో జరిగింది. 16 కార్మికసంఘాలు దానిలో పాల్గొన్నాయి. బొంబాయికి

చెందిన ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకుడు మణిబెన్‌కారె అధ్యక్షత వహించారు. పి. కృష్ణపిళ్ళై, కె.కె. వారియర్, పి.ఎస్. నంబూదిరి, కె.పి. గోపాలన్, పి.కె. బాలన్, ఎ.కె. గోపాలన్‌లు వివిధ ట్రేడ్ యూనియన్లకు ప్రాతినిధ్యం వహించగా, సుగాతన్ సార్‌గా ప్రసిద్ధిగాంచిన ఆర్. సుగాతన్, టిఎల్ఎకు ప్రతినిధిగా ఈ మహాసభలో పాల్గొన్నారు. వీరందరూ కన్నూరు, తలసెర్రి, ఫెరోకె, కళ్ళాయి, త్రిసూర్, ఎర్నాకుళం మరియు అలప్పూజ నుండి వచ్చారు.

మహాసభ నుండి తిరిగి వచ్చిన ఆర్. సుగతన్ కిదంగంపెరంబు మైదానంలో 2000 మంది పాల్గొన్న సభలో కార్మికమహాసభ విశేషాలను వివరించారు. అలప్పూజలో పోరాటం చేస్తున్న కార్మికులకు పూర్తిసహాయం అందిస్తామని కోజిఖోడ్ మహాసభ హామీ ఇచ్చింది.

కార్మిక ప్రదర్శన (లేబర్ మార్చ్)ను విజయవంతం చేసేందుకు జరుగుతున్న ప్రచారానికి ఆటంకాలు కల్పించేందుకు ప్రభుత్వం మరియు యాజమాన్యాలు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఆందోళనలను బహిరంగంగా వ్యతిరేకించే విధంగా ఐదు సంవత్సరాలుగా టిఎల్ఎ అధ్యక్షునిగా వున్న పి.ఎస్. మొహమ్మద్‌పై ఒత్తిడి తెచ్చారు. ఆ తర్వాత టిఎల్ఎ అధ్యక్షుడు కె.పి. ఫణిక్కర్ 1935 మే 28న తన రాజీనామాను ప్రకటించారు. ప్రభుత్వ ఆగ్రహానికి గురికావడం ఆయనకు ఇష్టం లేదు. ప్రతిపాదిత లేబర్ మార్చ్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలను నిషేధిస్తూ, కొల్లాంజిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రచార కమిటీ కన్వీనర్ కె. జోసెఫ్ మరో ప్రముఖ నాయకుడు వి.కె. పురుషోత్తమన్, టిఎల్ఎ ప్రధాన కార్యదర్శి కె.సి. గోవిందన్‌లను శిక్షాస్మృతిలోని 90వ సెక్షన్ క్రింద అరెస్టు చేశారు. ఈ అరెస్టులను రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలోనే మొదటి సారిగా జరిగిన అరెస్టులుగా కె.సి. గోవిందన్ పేర్కొన్నారు. వారిని అలప్పూజలోని కమ్మర్షియల్ కెనాల్ ఒడ్డున వున్న పోలీస్‌స్టేషన్‌కు తరలించి లాకప్‌లో వుంచారు.

## కార్మిక ప్రదర్శన (లేబర్ మార్చ్)

అరెస్టు వార్త తెలుసుకున్న కార్మికులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్ ముందు గుమిగూడి ఆందోళనకు పూనుకున్నారు. న్యాయవాద వృత్తిలో వున్న ఎం.ఎస్. అనిరుద్ధన్, వి.కె. వేలాయుధన్‌లు జోక్యం చేసుకుని, రాత్రి 8 గంటల సమయంలో బెయిల్‌కోసం మేజిస్ట్రేట్ ఇంటికి వెళ్ళారు. మేజిస్ట్రేట్ వారితో సహకరించక, మరుసటిరోజు కోర్టు తెరిచేవరకు వేచివుండాలన్నారు. ఆ నాయకులిరువురు వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఆందోళనకారులను శాంతపర్చి పంపివేశారు. లాకప్‌లో వున్న ఇరువురు నాయకులను పోలీస్ స్టేషన్‌లో చాలా మర్యాదగా చూడటం జరిగింది. మరుసటి రోజు ఉదయమే జరిగిన సంఘటనను వివరిస్తూ టిఎల్ఏ ప్రకటన విడుదల చేసింది. ఘటనను ఖండిస్తూ సమ్మె, హర్తాళ్‌లకు పిలుపివ్వడం

జరిగింది. అలప్పూజ కార్మికులతో కలిసి, ముహమ్మా, కలవూర్, కాంజిక్కుజి, చెర్తాలా వంటి గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులు కూడా సమ్మె, హర్తాళ్ విజయవంతం చేశారు. పోర్టు కార్మికులు పనులకు హాజరు కాకుండా అడ్డుకునేందుకు టిఎల్‌ఎకు చెందిన కొబ్బరిపీచు కార్మికులు ప్రయత్నించడంతో స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో కార్మికులాప్రయత్నాలు విరమించుకున్నారు. తమ నాయకుల విడుదల డిమాండు చేస్తూ, మండుటెండ, ఆకలిని లెక్కచేయక కార్మికులు ధైర్యంగా మిక్కిలి క్రమశిక్షణతో ప్రశాంతంగా సత్యాగ్రహాన్ని సాయంత్రం వరకూ కొనసాగించారు. అరెస్టు చేయబడ్డ నాయకులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం జరిగింది. టిఎల్‌ఏ సెషన్స్ కోర్టుకు అప్పీలు చేసుకోవడంతో షరతులు లేని బెయిల్ మంజూరయ్యింది.

## తిరువాన్కూరు కాయిర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ (టి.సి.ఎఫ్.డబ్ల్యు.యు.)గా రూపాంతరం చెందిన తిరువాన్కూర్ లేబర్ అసోసియేషన్ (టి.ఎల్.ఏ.)

1937 తిరువాన్కూర్ ట్రేడ్ యూనియన్ చట్టం క్రింద రిజిష్టర్ అయిన మొట్టమొదటి ట్రేడ్ యూనియన్ తిరువాన్కూర్ లేబర్ అసోసియేషన్ (టిఎల్‌ఏ)ను రిజిష్టర్ చేసే సమయంలో టిఎల్‌ఏ పేరును తిరువాన్కూర్ కాయిర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ (టిసిఎఫ్‌డబ్ల్యుయు)గా మార్చడం జరిగింది. టిసిఎఫ్‌డబ్ల్యుయు ఆధ్వర్యంలో కాయిర్ (కొబ్బరిపీచుతో చాపలు), పరుపుల తయారీ పరిశ్రమలోని కార్మికుల సమ్మె, తిరువాన్కూర్ పారిశ్రామిక వివాదాల చరిత్రలో మొట్టమొదటిది. కార్మికులనుభవిస్తున్న అనేక కష్టాలను వెల్లడించుకొనేందుకు సమ్మె చాలా ఉపయోగపడింది. ఈ విషయాల మీద ప్రాథమిక విచారణ జరపవల్సిందిగా తిరువాన్కూర్ ప్రభుత్వం కొల్లామ్ జిల్లా మేజిస్ట్రేట్‌ను కోరింది. 1938 సెప్టెంబర్‌లో విచారణ నివేదిక ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది.

1938 తిరువాన్కూర్ ట్రేడ్ డిస్ప్యూట్స్ చట్టం ఆమోదం పొందడంతో కాయిర్ పరిశ్రమలోని సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు, వివాదాల గురించి సమగ్ర విచారణ నిర్వహించేందుకొక మధ్యవర్తుల బోర్డు (కన్సీలియేషన్ బోర్డు) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆనాటి ల్యాండ్ రెవెన్యూ మరియు ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్‌గా వున్న కె. జార్జి ఆధ్వర్యంలో ఈ బోర్డు నియమించబడింది. వేతనాల్లో కోత, జీతాలను డబ్బు రూపేణా కాకుండా వస్తువులరూపంలోనూ, కొన్ని సందర్భాల్లో కొన్ని నిర్దిష్ట దుకాణాల్లో వస్తువులు తీసుకొనే విధంగా టోకెన్లు ఇవ్వడం, కార్మికుల అనుమతితో నిమిత్తం లేకుండా పరోక్ష పద్ధతుల్లో జీతాల్లో మినహాయింపులు చేయడం, అక్రమ జరిమానా విధింపు, కార్మికుల నుండి బలవంతంగా

డబ్బులు గుంజడం, పని ప్రదేశాల్లో అసంతృప్తికరమైన, అనారోగ్యకరమైన పని పరిస్థితులు, ట్రేడ్ యూనియన్లకు గుర్తింపులేకపోవడం, చట్టసభల్లో కార్మికుల ప్రాతినిధ్యం వంటి అనేక సమస్యలతో కూడిన సుదీర్ఘమైన విజ్ఞాపన పత్రాన్ని టిసిఎఫ్‌డబ్ల్యుయు బోర్డుకు సమర్పించింది. ఆ రోజుల్లో ఏనాడూ జీతాలు పూర్తిగా చెల్లించకపోవడంతో, కార్మికులు తీవ్ర దోపిడీకి గురయ్యేవారు. 1934-38 మధ్య కాలంలో వేతనాలను 50 శాతం మేరకు తగ్గించినట్లు ఆరోపణలున్నాయి. యజమానులకు, కార్మికులకు మధ్య వ్యక్తిగత సంబంధాలు లేకపోవడమే కాయిర్ పరిశ్రమలో వివాదాలకు, ఘర్షణలకు ప్రధాన కారణమని జార్జి కమిటీ అభిప్రాయపడింది. అయితే తమ మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొల్పడం సాధ్యం కాదని ఇరుపక్షాలు భావించాయి.

## టిసిఎఫ్‌డబ్ల్యుయు డిమాండ్లు

ఎ) బేసిక్‌జీతంలో 25% ఇంక్రిమెంట్‌గా ఇవ్వాలి.

బి) వివిధ తరహా పనులకు సంబంధించి కార్మికుల జీతాలను ప్రమాణీకరించాలి.

సి) ఫ్యాక్టరీలో పని పరిస్థితులు మెరుగుపరచాలి.

డి) కార్మికులకు కనీస ఆదాయం గ్యారంటీ చేయాలి.

ఇ) కాంట్రాక్టు కార్మికవిధానాన్ని నిషేధించాలి.

ఎఫ్) మూప్పర్లు, కాంట్రాక్టర్లు, ఇతర దళారీలు కార్మికుల అనుమతి లేకుండా వారి జీతాల నుండి సొమ్ము మినహాయించడాన్ని నిషేధించాలి అనే డిమాండ్లతో పాటు ఇతర కోర్కెలను టిసిఎఫ్‌డబ్ల్యుయు జార్జి కమిటీ ముందుంచింది. టిసిఎఫ్‌డబ్ల్యుయు ప్రారంభించిన సార్వత్రిక సమ్మె ఇతర కాయిర్ ఫ్యాక్టరీ కేంద్రాలకు కూడా విస్తరించింది. 1938 ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 11 వరకు 26 రోజులు సాగిన ఈ సమ్మెలో సుమారు 30 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. ఫలితంగా యజమానులు కార్మికుల బేసిక్ జీతంలో 6.5 శాతం కంపాషనేట్ (కారుణ్య పూర్వకమైన) అలవెన్సు పేరిట గ్రాంట్ చేశారు. సమస్యల పరిష్కారానికి బోర్డును నియమించడం జరిగింది. ఆనాటి నుండి ఆరోగ్యకరమైన పారిశ్రామిక సంబంధాల అభివృద్ధిలో కాయిర్ పరిశ్రమ అగ్రభాగాన నిలిచింది. ఈ వివాదం పరిష్కరించడంలో తిరువాన్కూర్ దివాన్ వ్యక్తిగత శ్రద్ధ తీసుకున్నాడు.

అఖిల తిరువాన్కూర్ ట్రేడ్ యూనియన్ కమిటీ (ఎటిటియుసి) లేవనెత్తిన డిమాండ్లను పరిశీలిస్తే కార్మికవర్గం కేవలం తన ఆర్థిక ప్రయోజనాలకే పరిమితం కాక ఒక స్పష్టమైన

రాజకీయ సిద్ధాంతం, లక్ష్యాలు కలిగి ఉన్నదని స్పష్టమవుతుంది. ఈ డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాలనందుకున్న తర్వాత దివాన్ తిరువనంతపురంలో త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేశాడు. ఐతే ఇది రసాభాసగా ముగిసింది.

రానున్న పోరాటాన్ని ముందుగానే వూహించిన దివాన్, 1946 అక్టోబర్ 1వ తేదీన ప్రజల్లో అపఖ్యాతి పాలైన మొదటి నిబంధన (ఫస్ట్ రెగ్యులేషన్)ను అమలులోకి తెచ్చాడు. సి. కేశవన్ మాటల్లో చెప్పాలంటే ఈ నిబంధన ప్రజల అవసరాలైన గాలి, నీరు తప్ప, మిగిలిన వాటన్నింటిని నియంత్రిస్తుంది. సమ్మెలు, హర్తాళ్‌లలో పాల్గొన్నవారికి 5 సంవత్సరాల కఠిన జైలుశిక్ష మరియు రూ. 1000/–లు జరిమానా విధిస్తారు. ఇది కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక నల్ల చట్టం. ఈ నిబంధన ప్రకారం అధికారులు సినిమాలు, నాటక ప్రదర్శనలు, ఇతర బహిరంగ ప్రదర్శనలను నిషేధించే అధికారాన్ని అధికారులకు కట్టబెట్టడం జరిగింది. ఏ పౌరుడైనా చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నాడని అధికారులు భావిస్తే, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చు. నిజానికి దివాన్ హిట్లర్ వలె వ్యవహరిస్తున్నాడు. ఆ విధంగా భారతదేశంలో సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమ దశ ప్రారంభమైంది.

## ట్రేడ్ యూనియన్ల పట్ల ప్రభుత్వ వైఖరి

1919లో మాంటేగు – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు తెచ్చినప్పటికీ, భారతదేశంలో తీవ్రమైన, విస్తృత రాజకీయ పోరాటాలతో పాటు, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు వెలువెత్తడం బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వానికి ఆందోళన కల్గించింది. భారతదేశంలో నెలకొన్న రాజకీయ అశాంతితోపాటు, పుంజుకుంటున్న ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తాయని సామ్రాజ్యవాదులు త్వరగానే గ్రహించారు.

రష్యా విప్లవ ప్రభావంతో ఐరోపాలోని కార్మిక వర్గంలో పెల్లుబికిన చైతన్యం గురించి ఆందోళన చెందిన సామ్రాజ్యవాద ప్రభుత్వం, పెరుగుతున్న కార్మికవర్గ కార్యకలాపాలను ప్రమాదానికి సంకేతంగా గుర్తించింది, దానినొక తిరుగుబాటుగా పరిగణించింది. ఎగిసి పడ్తున్న ఈ పోరాటాల వెల్లువను నిరోధించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని భావించిన సామ్రాజ్యవాద ప్రభుత్వం రెండు మార్గాలనెంచుకుంది. పోరాటాలనణచి వేయడం మొదటి మార్గం కాగా, అధికార జోక్యం పేరిట మోసగించడం రెండవ మార్గం.

ట్రేడ్‌యూనియన్ కార్యకర్తల కార్యకలాపాల మీద నిఘావేయడం, వారిని జైలులో నిర్బంధించి, అనేక విధాలుగా పోలీసు వేధింపులకు గురి చేయడం, వంటి అణచివేత చర్యలకు పూనుకోవడంతో పాటు, ఇంగ్లీష్ ఇండస్ట్రియల్ కోర్టు తరహాలో కార్మిక చట్టాలు చేయాలని

కూడా సామ్రాజ్యవాద ప్రభుత్వం ఆలోచిస్తోంది. సమస్యల పరిష్కారానికి సంప్రదింపుల మార్గం అవసరాన్ని గుర్తించినట్లు పైకి కన్పడుతున్నప్పటికీ, ఆచరణలో కార్మిక వివాదాల్లో అధికారుల జోక్యం సర్వసాధారణంగా యాజమానులకు అనుకూలంగా ఉంటోంది. వివాదాలను పరిష్కరించడం కంటె, ప్రభుత్వం యజమానులకు సహాయపడడానికే ఎక్కువ ఆసక్తి చూపుతోంది.

మద్రాసు ప్రెసిడెన్సీలో కార్మికులు, యజమానుల మధ్య వివాదాల గురించి దర్యాప్తు చేసేందుకు కోర్ట్స్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేయాలని, మద్రాసు ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేబర్ అడ్వైజరీ బోర్డు సిఫార్సు చేసింది. కానీ త్వరలోనే ఇది ఆచరణాత్మకం కాదని తేలిపోయింది.

బెంగాల్ ప్రభుత్వం 1921లో అనేక ప్రత్యేక దర్యాప్తు బృందాలను నియమించింది. సమస్యల పరిష్కారం విషయంలో యజమానులు, కార్మికులు ఇరువురిలో సానుకూల ధృక్పథం వుంటే, ఎక్కువ కార్మిక వివాదాలు తీవ్రంకాక ముందే పరిష్కారమయ్యేవని, 1921లోనే ప్రభుత్వం నియమించిన బెంగాల్ పారిశ్రామిక వివాదాల విచారణ కమిటీ అభిప్రాయ పడింది. బ్రిటన్‌లోని వైట్లీ కమిటీ తరహాలో పరిశ్రమల్లో వర్క్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ప్రజోపయోగ పరిశ్రమల్లో సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ కన్సీలియేషన్ బోర్డుల ఏర్పాటుకు సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు లేవీ అమలు కాలేదు. కార్మికుల పరిస్థితి యథాతథంగా వుంది.

1921 నవంబరులో ఇదే విధమైన కమిటీని బొంబాయిలో కూడ ఏర్పాటు చేశారు. కార్మిక వివాదాలను నివారించేందుకు వేతనసవరణ చేయాలని, ట్రేడ్ యూనియన్లను స్వేచ్ఛగా అభివృద్ధి చెందనివ్వాలని, యూనియన్లను, యజమానులు గుర్తించాలని కమిటీ సిఫార్సు చేసింది. వర్క్స్ కమిటీల ఏర్పాటును, వివిధ కార్మిక సంక్షేమ చర్యలను, మెరుగైన గృహ వసతి ఏర్పాటును కమిటీ సిఫార్సు చేసింది. బ్రిటిష్ ఇండస్ట్రియక్ కోర్టు చట్టం పద్ధతిలో చట్టాలు చేయడంపట్ల కమిటీ సానుకూలత చూపింది. ఈ విషయమై ప్రవేశపెట్టిన బిల్లును, భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు బొంబాయి ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

బెంగాల్, బొంబాయి కమిటీలు ట్రేడ్‌యూనియన్లకు ప్రత్యామ్నాయంగానే ఈ వర్క్స్ కమిటీలను ప్రతిపాదించాయని గమనించాలి. మిక్కిలి అప్రజాస్వామికమైనవి, ట్రేడ్‌యూనియన్లకు పోటీ సంస్థల నేర్పాటు చేసేందుకు దోహదం చేసే ఈ సిఫార్సులకు సహజంగానే ట్రేడ్‌యూనియన్లు తమ అభ్యంతరాలు వ్యక్తంచేశాయి.

ఇంగ్లాండులోని కార్మిక వర్గం తమ దేశంలో, ఇదే బ్రిటిష ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, అనేక కార్మిక సంక్షేమ చర్యలు, చట్టాలు సాధించుకోగల్గింది. అయితే భారతదేశంలోని కార్మికవర్గం తమ ప్రయోజనాల పరిరక్షణార్థం ఇంగ్లండు కార్మిక వర్గం సాధించుకున్నవాటిలో

కొద్దిశాతమైనా సాధించుకునేందుకు సామ్రాజ్యవాద ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేటంతశక్తి ఆనాటి కార్మికోద్యమానికి లేదు. జాతీయోద్యమ నాయకులు కార్మిక వర్గ సమస్యల నేమాత్రం పట్టించుకోక పోవడమే, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఒక ప్రధాన కారణం. కార్మికుల న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారాన్ని మొండిగా నిరాకరిస్తున్న యజమానులకు వ్యతిరేకంగా కార్మిక నాయకులు ఎల్లప్పుడూ అధికారుల జోక్యం కోరుకుంటున్నారు. అయితే భారత్ వంటి వలస పాలనలో వున్న దేశాల్లోని ప్రభుత్వాలు, కార్మికోద్యమాన్ని కేవలం ఒక శాంతి, భద్రతల సమస్యగా భావించడం సర్వ సాధారణమైంది. అందువల్ల ప్రభుత్వ యంత్రాంగం జోక్యం అంటే, ఆచరణలో అధికార యంత్రాంగం మరియు సాయుధ బలగాలను కార్మికులకు వ్యతిరేకంగా నిలబెట్టి కార్మికోద్యమాన్ని విచ్ఛిన్నం చేయడమే.

ఈ విధంగా భారతదేశంలో నిర్మాణయుతమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రారంభమైంది.

# 9

# అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపన (1920)

**భా**రత కార్మిక వర్గానికి జాతీయస్థాయి సంస్థ, ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు 1920 సంIIలో స్థాపించబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత కార్మికవర్గ పోరాటాలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలోనూ, ప్రధానంగా రష్యాలో అక్టోబరు సోషలిస్టు మహావిప్లవం విజయవంతమైన కాలంలో ఈ సంస్థ స్థాపన జరిగింది.

భారత జాతీయ బూర్జువా వర్గం మొదటి ప్రపంచయుద్ధం తర్వాత ఆర్థికంగానూ, రాజకీయంగానూ ఒక బలవత్తరశక్తిగా రూపొందింది. యుద్ధ పరిసమాప్తి, అక్టోబరు విప్లవం విజయవంతం కావడం, పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభపు ఛాయలు పొడచూపడం వంటి పరిస్థితులు భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు, జాతీయ విముక్తి పోరాటాలకు క్రొత్త శక్తిని, ఊపును కలిగించాయి. ఈ సందర్భంగా జరిగే పోరాటాలలో కార్మికవర్గం తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే వుంది. సామ్రాజ్యవాద ఆధిపత్యానికి, పెట్టుబడిదారీ పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు కార్మికవర్గానికి ఐక్య వేదికగా ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు 1920 సంIIలో రూపుదిద్దుకుంది.

బొంబాయిలో వుండగానే కార్మికులతో సంబంధాలు కల్గివున్న బాలగంగాధర తిలక్, ఇంగ్లాండులో వున్నప్పుడు కార్మికవర్గం యెడల మరింత విశాల ధృక్పధం ఏర్పరచుకున్నాడు. బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుతోను, లేబర్ పార్టీతోను సంబంధాలేర్పడడంతో వివిధ ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలను పరిశీలించడానికి ఆయనకు అవకాశం లభించింది. బ్రిటన్‌లోని శ్రమ జీవుల ఉద్యమాలతో ఉత్తేజితుడైన తిలక్ భారతదేశంలో కార్మికోద్యమాన్ని నిర్మించవలసిన ఆవశ్యకతను గుర్తించాడు. తిలక్‌కు బొంబాయిలోని కార్మికులలోవున్న పలుకుబడి, శ్రమజీవులను సంఘటిత పరచాలన్న ఆయన క్రొత్త ఆలోచన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్థాపనకు దోహదం చేశాయి.

ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత ఉవ్వెత్తున సాగిన కార్మికవర్గ పోరాటాలను ముఖ్యంగా, యూరప్‌లో సాగిన శ్రామికవర్గ పోరాటాలను, "వర్సయిల్స్ ఒప్పందం" కూడ గుర్తించవలసిన అవసరం ఏర్పడింది. కార్మిక సంఘాలలో సభ్యత్వం మున్నెన్నడూ లేనంతగా పెరగడం, ఉద్యమాలు ఉధృతంగా సాగడం, ప్రధాన సాంఘిక, రాజకీయ అంశాలుగా ముందుకు వచ్చాయి. తమతమ దేశాలలో సాంఘిక, రాజకీయ జీవితంలో ట్రేడ్ యూనియన్ల ప్రాముఖ్యతను గుర్తించిన నానాజాతి సమితిలోని సభ్య దేశాలు, 1919లో, నానాజాతి సమితిలో ఒక భాగంగా అంతర్జాతీయ కార్మిక సంస్థను ఏర్పాటు చేశాయి. సభ్య దేశాల ప్రతినిధులతో ఏర్పడిన ఈ త్రైపాక్షిక సంస్థ, ఆయా దేశాలలో కార్మిక సమస్యలపై చర్చలు జరపడం, కార్మిక వర్గ శ్రేయస్సుకై చేయవలసిన సాంఘిక సంస్కరణల గురించిన శాసనాలు చేయించడానికి కృషి చేసింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ చార్టరు మానవత్వం, సామాజిక న్యాయం అనే సూత్రాలపై ఆధారపడి రూపొందించబడింది. దీనికి కార్మిక సమస్యల గురించి చర్చించి శ్రామికవర్గ శ్రేయస్సుకై చేయవలసిన సంస్కరణలను గూర్చి సభ్య రాజ్యాలకు సిఫారసులు చేయడమే గాని, వాటిని అమలు చేయించే అధికారం మాత్రం లేదు. అందువలన వలస పాలనలో మగ్గుచున్న ఇండియా వంటి దేశాలలో అప్పటికే వున్న శాసనాలను అమలు చేసే దిక్కులేని స్థితిలో అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానాలను ఆమోదించడం, వాటిని శ్రామికుల కనుకూలంగా అమలు చేయడమనే ప్రశ్న ఉదయించదు. కాని ఆనాటి సంస్కరణవాద కార్మిక నాయకులు ఈ అంతర్జాతీయ వేదికను కార్మికుల దీనస్థితిని ప్రచారం చేయడంతో బాటు వారి హోదాను బలపర్చుకోడానికి ఎక్కువ ఆసక్తి చూపేవారు. వలస పాలనలో భారతదేశం సాధించిన పారిశ్రామికీకరణను కొండంతలు చేసి చూపించే ఉద్దేశంతో బ్రిటిషు ప్రభుత్వం భారతదేశాన్ని ఐ.ఎల్.ఓ. వ్యవస్థాపక సభ్యరాజ్యంగా చేసి, బి.పి. వాడియాను భారత కార్మికవర్గ ప్రతినిధిగా నామినేట్ చేసి ఆ సంస్థ మొదటి సమావేశానికి పంపింది.

1920 సం॥లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ) వాషింగ్టన్ సమావేశంలో పాల్గొనేందుకు ప్రభుత్వం ఎన్.ఎమ్.జోషీని ప్రతినిధిగాను, తిలక్‌ను ఆయన సలహాదారుగాను నామినేట్ చేసింది. కాని వాషింగ్టన్ సమావేశానికి తమ ప్రతినిధిగా బొంబాయి కార్మికులు తిలక్‌ను ఎన్నుకున్నట్లుగా అప్పటి ప్రభుత్వ రహస్య నివేదిక తెల్పుతోంది. 1919 నవంబరు 29న ఎల్ఫిన్ స్టోన్ మిల్లు వెనుక సుమారు 10,000 మంది హాజరైన సమావేశంలో తిలక్ వాషింగ్టన్ లేబర్ కాంగ్రెసుకు ప్రతినిధిగా ఎన్నికయ్యారు. కార్మికులచేత ప్రతినిధిగా ఎన్నుకొనబడిన తిలక్ ప్రభుత్వంచే నామినేట్ చేయబడిన జోషీకి అసిస్టెంట్‌గా వాషింగ్టన్ లేబర్ కాంగ్రెసుకు హాజరవడానికి నిరాకరించాడు.

ఈ రిపోర్టులన్ని ఐ.ఎల్.ఓ.కు ప్రాతినిధ్యం విషయమై ఆనాటి కార్మిక నాయకుల్లో చెలరేగిన తీవ్ర భేదాభిప్రాయాలను సూచిస్తున్నాయి. కాని యీ భేదాభిప్రాయాలు భారత కార్మికవర్గానికి నిజమైన ప్రతినిధిని ఎంపిక చేయడం, ఆ ఎంపిక చేయడంలో ప్రభుత్వం

అనుసరించిన పద్ధతి వలన తలెత్తినవి మాత్రమే. అందువలననే జోషికి అసిస్టెంట్‌గా వాషింగ్టన్ సమావేశానికి హాజరవడానికి తిలక్ నిరాకరించడంతో, జోషీ నియామకంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించవలసి వచ్చింది.

వర్సెయిల్స్ ఒప్పందంలో 389వ అధికరణం ప్రకారం ఐఎల్‌ఓ స్థాపించబడింది. సభ్యదేశాల్లోని యజమానులు లేదా కార్మికుల్లో అత్యధికులకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు (సంస్థలు) న్నట్లయితే, వాటి ఆమోదంతో ప్రభుత్వంతో సంబంధం లేనివారిని ప్రతినిధులుగానూ, సలహాదారులుగాను పంపవలసిందిగా తన సభ్య రాజ్యాలను ఆదేశించింది.

ఈ అధికరణంలోని అంశాలను ప్రభుత్వం దృష్టికి తెస్తూ బొంబాయిలోని కార్మికులు 1920 జులై 7వ తేదీన పరేవ్ వద్ద సమావేశమై ఈ క్రింది తీర్మానాన్ని ఆమోదించారు.

నానాజాతి సమితి తీర్మానంలోని 389, 412 అధికరణాలను బాహాటంగా ఉల్లంఘిస్తూ అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఎంక్వైరీ కమిషన్ సమావేశాల్లో పాల్గొనే కార్మికవర్గ ప్రతినిధిని భారత ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా నామినేట్ చేయడం పట్ల, బొంబాయిలోని కార్మికులు, ఇతర కార్మిక ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశం తన తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తోంది. కార్మికులు తమ ప్రతినిధులు, సలహాదార్లకు ఎన్నుకునే తమ హక్కునీ సమావేశం ధృవీకరిస్తోంది. కార్మికులకున్న ఈ హక్కు దృష్ట్యా ఎన్.ఎమ్. జోషి నియామకాన్ని ఉపసంహరించుకుని, ఆయనకు బదులుగా భారత కార్మికులచే ఎన్నుకొనబడిన ప్రతినిధిని మాత్రమే ఈ సమావేశానికి పంపవల్సిందిగా ఈ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతోంది.

అఖిల భారత స్థాయిలో ట్రేడ్ యూనియన్ల సమావేశాన్ని బొంబాయిలో ఏర్పాటు చేయాలని, దానికి లాలాలజపత్‌రాయ్‌ని ప్రథమ అధ్యక్షునిగానూ ఎన్నుకోవాలని ఈ సమావేశం తీర్మానించింది.

ఈ నిర్ణయం చేసిన వెంటనే అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రారంభ సమావేశానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగాయి. ఈ చారిత్రక సమావేశాన్ని 1920 ఆగష్టు 22వ తేదీన జరపాలని నిర్ణయించడం జరిగింది. దానికి లాలాలజపత్‌రాయ్ అధ్యక్షునిగానూ, బాప్టిస్టా, ఆండ్రూస్, బ్రెల్వీ, లోకమాన్య బాల గంగాధరతిలక్, శ్రీమతి అనిబిసెంట్‌లు ఉపాధ్యక్షులుగాను నిర్ణయించబడ్డారు (దివాన్ చమన్‌లాల్ రచన ఆధారం).

ఐ.ఎల్.ఓ. ప్రాతినిధ్యం విషయంలో చెలరేగిన వివాదమే అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపనకు మూలకారణమని కొందరు భావించారు. కాని ఇది సరికాదు. అఖిల భారత స్థాయిలో కార్మికవర్గానికి ఒక సంస్థ ఉండవలసిన చారిత్రక ఆవశ్యకత మాత్రమే ఎ.ఐ.టి.యు.సి. స్థాపనకు దారితీసిందనడంలో సందేహంలేదు. కాకపోతే ఐ.ఎల్.ఓ.లో ప్రాతినిధ్యం విషయంలో ఏర్పడిన వివాదం ఈ సంస్థ

(ఎ.ఐ.టి.యు.సి.) స్థాపనను శీఘ్రతరం చేసింది. ఆ కాలంలో భారతదేశంలో జరిగిన రాజకీయ, ఆర్థిక పోరాటాలు ఈ సంస్థ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించాయి.

తిలక్‌కు శిక్ష విధించిన సందర్భంగా భారత కార్మికవర్గం తీవ్ర రాజకీయ పోరాటాలు సాగించిన 1905-08 మధ్యకాలం ఎఐటియుసి స్థాపనకు 1920 సంవత్సరం కంటే అనుకూలమైనదని, మరో దృక్కోణం నుండి వాదనలు జరిగాయి.

1905-1908 సం॥ల మధ్యకాలంలో జరిగిన రాజకీయ పోరాటాల పూర్వస్థితి విషయంలో ఎలాంటి భేదాభిప్రాయాలులేవు. ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదానికి పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా భారత కార్మికవర్గం ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఉధృతమైన వర్గ పోరాటాలు సాగించింది. కార్మికుల వర్గ రాజకీయ చైతన్యం దృష్ట్యా ఈ పోరాటాలకు చాలా ప్రాముఖ్యత వున్నది. అందువలన ఎ.ఐ.టి.యు.సి. స్థాపన ఆలస్యం చేయబడలేదు. పైపెచ్చు దేశంలో రాజకీయ చైతన్యం పెంపొందడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా సంచలనం కలిగించే మార్పులు సంభవించిన తరుణంలో కార్మిక వర్గానికి కేంద్ర సంస్థ అయిన ఎ.ఐ.టి.యు.సి స్థాపన సరియైన సమయంలో జరిగిందనడంలో సందేహం లేదు.

## వ్యవస్థాపకుల సామాజిక నేపథ్యం మరియు వారి రాజకీయ అవగాహన

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును స్థాపించి ఆ తరువాత దానికి నాయకత్వం వహించిన వారిలో చాలామంది జాతీయోద్యమ నాయకులే. జాతీయోద్యమ నాయకత్వం రాజకీయంగా సంస్కరణవాద బూర్జువా వర్గం చేతిలోవుంది. ఆనాటి భారత జాతీయోద్యమ నాయకులలో అతివాద దృక్పథం కలిగిన ముఖ్యులలో తిలక్ ఒకడు. ఆయన కార్మికవర్గంతో సంబంధాలు కల్గియున్నప్పటికీ, కార్మికుల సమస్యలను వర్గ దృక్పథంతో చూడలేకపోయాడు. ఊహాజనితమైన సామాజిక న్యాయానికి సంబంధించిన వూహాజనిత ఆలోచనలు మత సంబంధంగల్గిన మానవతావాదాలే కార్మిక సమస్యలపై పనిచేయడానికి ఆయనకు ప్రేరణ కలిగించాయి.

తిలక్ ఇంగ్లండు నుండి తిరిగివచ్చిన తరువాత 1919 నవంబరు, 29న బొంబాయి కార్మికుల నుద్దేశించి చేసిన ప్రసంగం కార్మిక సమస్యల యెడల ఆయన దృక్పథాన్ని అద్దం పట్టి చూపుతుంది. ఆ సమావేశంలో ఆయన చేసిన ప్రసంగం సారాంశం ఈ క్రింది విధంగా ఉంది.

"ఈ దేశంలో ప్రతి ఒక్కరిని శ్రామికునిగా పరిగణించవచ్చును. ఈ విషయంలో హిందూ, క్రైస్తవ మతాలు విభేదిస్తాయి. క్రైస్తవ మతం కష్టించడాన్ని శాపంగా భావిస్తుంది. హిందూ మతం కష్టపడి పనిచేయడాన్ని వరంగా భావిస్తుంది. తుకారాం కవి చెప్పినట్లు భగవంతుడు ఆదేశించిన పనిని పూర్తి చేయడానికి మరల మరల జన్మించడమే మానవుని

ఉన్నతమైన కోర్కె. అందువలన మానవులను శ్రామికులు, యజమానులు అని వర్గీకరించడం సరికాదు. ఈ ఆలోచనా విధానం ఇంగ్లండులో పుట్టి మన దేశానికి దిగుమతి అయింది. దీనిని వ్యాపించనీయరాదు. ఈ ఆలోచన సరియైనదికాదని ఆంగ్లేయులు కూడ ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు".

"ఆ తరువాత తిలక్ ఇంగ్లాండు, ఇండియాలలో వేతనాలను పోల్చుతూ రోజుకు రెండు అణాలు తెచ్చుకునే భారత కార్మికుడు యుద్ధం కారణంగా 12 అణాల (అనగా 1 షిల్లింగు) పొందుతున్నాడనీ, అదే సమయంలో ఇంగ్లండులోని సామాన్యమైన కానిస్టేబుల్ నెలకు రు. 150 లు ట్రామ్ కండక్టరు వారానికి 4 పౌండ్లు వేతనంగా పొందుతున్నాడనీ చెప్పాడు. ఆయన ప్రసంగం వలన బ్రిటిషు కార్మికులు విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారనే అభిప్రాయాలు సభికుల్లో ఏర్పడివుండవచ్చును. జీతం ఎంత పొందుతున్నప్పటికీ, ఆ డబ్బు యొక్క విలువ కొనుగోలు శక్తిపై ఆధారపడియుంటుందనే విషయం కూడ తిలక్ చెప్పివుంటే బాగుండేది. ఇంగ్లండులోని కార్మికులు ప్రపంచ యుద్ధం ముందు కంటె చాల పేదవారయ్యారు. కార్మికుని వేతనాలు పెంచడం కంటె అతడు శ్రమ చేయడంలోనే ఎక్కువ సంతృప్తిని పొందునట్లు చేయడం ముఖ్యమని, ఖర్చులకు తగినట్లుగా జీతాలుండాలని చెప్పడం తిలక్ ఉద్దేశం."

"భారతదేశంలోని కార్మికులందరు ట్రేడ్ యూనియన్లను స్థాపించాలని, అవి ఎంతబలంగా ఉంటే అంత వేగంగా వారు తమ హక్కులను సాధించుకోగలరని ఈ విషయంలో ఏమైనా అవరోధాలు ఏర్పడినప్పటికి చలించరాదని" ఇంగ్లండ్‌లోని కార్మికవర్గం తన (తిలక్) ద్వారా భారత కార్మికవర్గానికి సందేశం పంపిందని తిలక్ చెప్పాడు.

1920 జూలై 7వ తేదీన జరిగిన కార్మికుల సమావేశంలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఏర్పాటు చేయాలనే తీర్మానం చేయబడింది. ఈ సమావేశానికి కొద్ది రోజులు ముందుగానే తిలక్ పై విధంగా ఉపన్యసించడం ముఖ్యంగానే గమనించదగిన విషయం.

ఇంగ్లండులోని కార్మికోద్యమంతో తిలక్ కున్న అనుభవాలు చాల కొద్దికాలం క్రిందటివైనప్పటికి శ్రమను గురించి కలగాపులగమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడం గమనించాలి. 'శ్రమ' అంటే ఆ రకమైన దృక్పథం కలిగివుండడం తిలక్ ఒక్కడికే ప్రత్యేకమైన విషయం కాదు. కార్మికులతో సంబంధాలు కల్గివున్న జాతీయోద్యమ నాయకులు కొద్దో గొప్పో తేడాలతో కార్మికుల యెడల వారి దృక్పథం దాదాపు ఒకటిగానే ఉండేది.

ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశానికి లాలా లజపతిరాయ్ అధ్యక్షత వహించాడు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో కార్మికుల యెడల ఒక స్పష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

కాంగ్రెసు నాయకులలో ప్రముఖులైన మోతీలాల్ నెహ్రూ, విఠల్ భాయ్ పటేల్ కాన్ఫరెన్సుకు హాజరయ్యారు. కాంగ్రెసు నాయకులే గాక మద్రాసు లేబర్ యూనియన్‌కు చెందిన

బి.పి. వాడియా, దివ్యజ్ఞాన సమాజానికి చెందిన శ్రీమతి అనిబిసెంట్, క్రైస్తవ మతాధికారి సి.ఎఫ్. ఆండ్రూస్, బొంబాయి క్రానికల్‌కు చెందిన బి.జి. హోర్నిమాన్, సయ్యద్ అబ్దుల్లా, బ్రెల్వీ, రాడికల్ భావాలు గల్గిన పార్సీ యువకుడు కె.ఎఫ్. నారిమన్ మొదలైన ప్రముఖులు కూడ ఈ సమావేశానికి హాజరయ్యారు. డా॥ కుమారి నాగూతాయ్‌జోషీ శ్రీమతి అవంతికాబాయ్ గోఖలే (సంఘసేవిక) మొదలైన అభ్యుదయ భావాలు గల్గిన మహిళలు కూడ ఈ కాంగ్రెసుకు హాజరయ్యారు. మహమ్మదాలీ జిన్నాతోబాటు శ్రీమతి జిన్నా కూడ హాజరయ్యారు.

ధనవంతులైన వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు కూడ ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశానికి హాజరయ్యారు. వారిలో లల్లూభాయ్ శ్యామల్‌దాస్, లాల్జీ నారాయణ్‌జీ, హన్సరాజ్, పి. థాకర్సే, లల్లూభాయ్, డి. ఝువేరీ కొందరు మాత్రమే. ఎ.ఐ.టి.యు.సి. కోశాధికారిగా ఎన్నికైన లక్ష్మీదాస్ రాంజీ వంటి “జాతీయోద్యమంతో సంబంధమున్న మరికొందరు ధనికులు హాజరయ్యారు. మాల్వీ గోవింద్ జీ అనే మరో ధనికుడు కూడ ఎ.ఐ.టి.యు.సి సమావేశానికి హాజరయ్యాడు. ఈయన తిలక్‌తో కలిసి బొంబాయిలోని పరేల్ ప్రాంతంలోని కార్మికుల నుద్దేశించి ప్రసంగించాడు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి సానుభూతిపరునిగా వున్న సుభాని అనే మిల్లు యజమాని కూడా సమావేశంలో పాల్గొన్నాడు. మియాన్ మొహమ్మద్ హాజీజాన్‌మహమ్మద్ ఛోటాని అనే పెద్ద కలప వ్యాపారి, రంపపు కోత మిల్లు యజమాని ఎ.ఐ.టి.యు.సి. కాన్ఫరెన్సుకు రు. 500 విరాళంగా ఇచ్చినట్లు సమావేశం ప్రొసీడింగ్స్‌లో పేర్కొనబడింది.

బ్రిటన్‌లోని స్వతంత్ర లేబర్ పార్టీ సిద్ధాంతాలతో ఉత్తేజితుడైన జోసఫ్ బాప్టిస్టా అనే ధనవంతుడైన ఒక ప్రముఖ న్యాయవాది ఎ.ఐ.టి.యు.సి ఆహ్వాన సంఘం అధ్యక్షుడుగా వున్నాడు. భారతదేశంలో ఫాబియన్ సోషలిజం స్థాపించాలని ఈయన కోరిక. కార్మికోద్యమంతో సంబంధం కలిగిన దివాన్ చమన్‌లాల్ ఎ.ఐ.టి.యు.సి స్థాపనలో ప్రముఖపాత్ర వహించాడు. యుద్ధ సమయంలో ఇంగ్లండులో జరిగిన భారత కార్మిక సంక్షేమ సమితి (వర్కర్స్ వెల్ఫేర్ లీగ్ ఆఫ్ ఇండియా) సమావేశంలో ఈయన పాల్గొన్నాడు. 1920 లో వాయువ్య (విజూ) రైల్వే కార్మికుల సమ్మెను ఈయన బలపరిచాడు.

భారతదేశంలోని సాంఘిక, రాజకీయ జీవనంలోని వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖ కాంగ్రెసు నాయకులు, కార్మిక నాయకులు, బూర్జువా సంఘ సేవకులే గాక ధనికులైన పారిశ్రామిక వేత్తలలో ఒక సెక్షన్ కూడ ఈ ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశానికి హాజరై తమకు తోచిన విధంగా కార్మికులకు తమ సానుభూతిని వ్యక్తం చేయడం గమనించదగిన విషయం. ప్రారంభ దశలో గాంధీజీ ఈ సమావేశానికి హాజరుకాకపోగా, కనీసం సందేశమైనా పంపకపోవడం గమనార్హం. “తిలక్ మరణానికి ముందు ఎ.ఐ.టి.యు.సి. స్థాపనకు తిలక్ ప్రేరణ శక్తిగా ఉన్నప్పటికీ, మహాత్మాగాంధీని సంప్రదించడం జరుగుతుండేది”. అఖిల భారత స్థాయిలో కార్మిక వర్గానికొక కేంద్ర సంస్థ ఉండాలనే ఆలోచనను ఆయన

ఆమోదించలేదు. అందువలననే ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశానికి హాజరవడానికిగాని, సందేశం ఇవ్వడానికి గాని ఆయన నిరాకరించాడు. ఈ విషయంలో ఆయనకు కొన్ని సిద్ధాంతాలు, ఒక కార్యాచరణ విధానం ఉన్నాయి. ఇవి కార్మిక వర్గానికి, ట్రేడ్ యూనియన్లకు ఒక కేంద్ర సంస్థ వుండడానికి విరుద్ధం." అని ఎస్.ఎ. డాంగే వ్రాశాడు. ఈ రకంగా గాంధీజీ వ్యవహరించడం ఆయన రాజకీయ సిద్ధాంతాలకు అనుగుణంగానే వుంది. కార్మికవర్గం జాతీయ స్థాయిలో సంఘటితమైతే వచ్చే ప్రమాదకరమైన పరిణామాలను ఆయన ముందుగా చూడగలిగాడు పాపం !

కార్మికులలో పలుకుబడి గలిగి, వారందరినీ ట్రేడ్ యూనియన్ల ద్వారా సంఘటితం చేయడానికి అవిరళ కృషి సల్పిన బాలగంగాధర తిలక్, ఈ మహాసంస్థ స్థాపనను చూడకుండానే 1920 ఆగస్టు 1వ తేదీన కన్నుమూశాడు. సమావేశంలో విషాదం అలముకుంది.

కార్మికోద్యమాలతో సంబంధాలు గల్గి కార్మికవర్గ ప్రయోజనాలకై కృషిచేసే కొద్దిమందితో బాటు, కార్మికులు, వారి సమస్యలతో ఏ విధమైన సంబంధంలేని కోటీశ్వరులు, కాంగ్రెస్ నాయకులు తదితరులనేకమంది కాన్ఫరెన్స్ వేదిక నలంకరించారు. ఈ కాలంలో సాగుతున్న అనేక వర్గ పోరాటాల్లో నిమగ్నమై అప్పటి రాజకీయ సంక్షోభ పరిస్థితుల్లో కష్టాలననుభవిస్తున్న కార్మికులు ఈ మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయంగా చైతన్యవంతులైన ఎస్.ఎ. డాంగే, ఆర్.ఎస్ నింబ్కర్ వంటి బొంబాయి విద్యార్థులు కార్మికులకు అండగా నిలిచారు. వీరు కాన్ఫరెన్స్ విజయవంతంగా నిర్వహించడంలో వాలంటీర్ సర్వీసులతోబాటు అనేక బాధ్యతలు వహించారు.

ఎ.ఐ.టి.యు.సి. వ్యవస్థాపక సమావేశం జరిగే నాటికి కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభంగాని, కార్మికవర్గ పార్టీ నిర్మాణంగాని జరిగియుండలేదు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమ నాయకత్వం పూర్తిగా జాతీయ బూర్జువా వర్గం చేతిలో ఉన్నది. అయినప్పటికి ప్రపంచ రాజకీయాల్లో వచ్చిన మార్పులు, ప్రథమ సోషలిస్టు సామ్రాజ్యస్థాపన, దాని ఆశయాలు, భారత కార్మికుల్లోని ప్రగతిశీల తరగతుల మీద తీవ్ర ప్రభావం చూపాయి. ఒకదానికొకటి పొంతనలేని సంఘటనలు జరుగుతున్న ఈ సమయంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహిస్తున్న బూర్జువావర్గమే ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వ స్థానంలో కూడా ఉన్నది. అందువలన ఈ చారిత్రక పరిస్థితులలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట ఐక్య వేదికలో భారత కార్మికవర్గం జాతీయ బూర్జువాతో చేతులు కలిపింది.

వర్గ స్వభావం దృష్ట్యా జాతీయోద్యమ నాయకత్వంలో కొనసాగుతున్న బలహీనతలు, ఊగిసలాట ధోరణులు ఎ.ఐ.టి.యు.సి. ఆలోచనా విధాన కార్యకలాపాల మీద తీవ్ర ప్రభావం చూపాయి. చరిత్ర క్రమంలో కార్మికవర్గం రాజకీయ చైతన్యం సంతరించుకోవడం, కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభం కావడం, భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడం, వర్గ పోరాటాల ఉధృతి

హెచ్చుడం, జాతీయంగాను, అంతర్జాతీయంగాను సంభవించిన గణనీయమైన పరిణామాల కారణంగా ఎ.ఐ.టి.యు.సి.లో అనేక సిద్ధాంతపరమైన అనేక వివాదాలు ఏర్పడి పలు చీలికలకు దారితీశాయి. ఈ సైద్ధాంతిక వైరుధ్యాలు, చీలికల కారణంగా సంస్కరణవాద, రాజీ స్వభావం గల్గిన నాయకులు ఎ.ఐ.టి.యు.సి.ని వదిలి బూర్జువా సంస్కరణ వాద విధానాల అమలుకు పరస్పరం మూర్ఖంగా పోటీపడే అనేక సంస్థలను ప్రారంభించారు. ఈ పరిస్థితి 1947 వరకు కొనసాగింది. ఆ తరువాత ఎ.ఐ.టి.యు.సి.లో వ్యవస్థాపరంగానూ, సాధారణంగా కార్మికోద్యమంలోనూ కొన్ని ప్రధానమైన మార్పులు సంభవించాయి.

## ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశం

1922 ఆగష్టు 22వ తేదీన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రారంభ సమావేశం జరపాలని నిర్ణయించడం జరిగింది. కాని తిలక్ మరణం, తదితర అవాంతరాల వల్ల ఈ ప్రారంభ సమావేశాన్ని వాయిదావేసి, 1920 అక్టోబరు 31 నుండి నవంబరు 2 వరకు జరపాలని తిరిగి నిర్ణయించడం జరిగింది. కాన్ఫరెన్స్ జరిగిన తీరుపై దివాన్ చమన్‌లాల్ వ్యాఖ్యానిస్తూ "బొంబాయిలోని అంపైర్ థియేటరులో ప్రారంభించబడిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశం అందరి అంచనాలను మించి బ్రహ్మాండంగా విజయవంతమైంది. దేశం నలుమూలల నుండి 801 మంది కార్మిక ప్రతినిధులీ సమావేశానికి హాజరయ్యారు. బీహారు, బెంగాల్లోని బొగ్గుగని కార్మికుల ప్రతినిధిగా స్వామి విశ్వానంద ఈ సమావేశానికి హాజరయ్యారు. 62 యూనియన్లు ప్రారంభ సమావేశంలోనే ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడ్డాయి. మరో 42 యూనియన్లు వేర్వేరు కారణాల వల్ల తమ ప్రతినిధులను పంపలేకపోయినప్పటికి సంస్థ ఏర్పాటును హర్షిస్తూ తమ సహకారాన్ని వ్యక్తం చేశాయి. ప్రారంభ సమావేశంలో పాల్గొన్న యూనియన్ల లిస్టును పరిశీలించినట్లయితే ఈ సమావేశం దేశంలోని అన్ని ప్రాంతాల కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తుందని స్పష్టమవుతుంది. గని కార్మికుల ప్రతినిధులు సుమారు 2 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించారు. గని కార్మికులు, సహకారం వ్యక్తం చేసిన ఇతర యూనియన్లను కలుపుకుంటే కనీసం 5 లక్షల మంది కార్మికులకు ఎ.ఐ.టి.యు.సి. ప్రాతినిధ్యం వహిస్తుందని తెలుస్తోంది" అని చెప్పారు.

ప్రారంభ సమావేశాన్ని గురించి ఈ క్రింది రిపోర్టు రికార్డు చేయబడింది.

## విశ్వమానవ సౌభ్రాతృత్వం వైపు

1920 అక్టోబరు 31 ఆదివారం నాడు బొంబాయిలోని అంపైర్ థియేటరులో మిక్కిలి ఆనందోత్సాహాల మధ్య భారతదేశంలోని మొట్టమొదటి కేంద్ర కార్మికసంస్థ ఎ.ఐ.టి.యు.సి. తన సమావేశాన్ని ప్రారంభించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపుగా అన్ని శ్రామిక రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులతోను, చూడవచ్చిన వారితోను హాలు

కిక్కిరిసిపోయింది. బొంబాయిలోని ట్రేడ్ యూనియన్ల నుండే గాక, దేశం ఇతర ప్రాంతాల నుండి కూడా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పురజనులు అధికంగా పాల్గొనడంతో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన స్థలం కూడ పూర్తిగా నిండిపోయింది. ఆహ్వాన సంఘ సభ్యులతోనూ, పుర ప్రముఖులతోను వేదిక కూడ కిక్కిరిసిపోయింది.

లాలాలజపతిరాయ్ సమావేశ స్థలాన్ని చేరడంతోటే సభికులు ఆనందోత్సాహాలతో ఆయనకు ఘనస్వాగతమిచ్చారు. కల్నల్ జె.సి. వెడ్జివుడ్, జె.బాప్టిస్టాలకు హృదయపూర్వక స్వాగతం లభించింది. కార్మిక వర్గ గీతాలాపనతో మహాసభ ప్రారంభమైంది. తరువాత సభికుల హర్షధ్వానాల మధ్య ఆహ్వాన సంఘ అధ్యక్షుడు శ్రీ జోసెఫ్ బాప్టిస్టా ప్రతినిధులను ఆహ్వానిస్తూ ప్రసంగించాడు. ఆయన ప్రసంగిస్తున్నంత సేపు సభికులు కరతాళధ్వనుల ద్వారా తమ హర్షామోదాలను తెలుపుతూనే వున్నారు.

బాప్టిస్టా మాట్లాడుతూ "ఇండియాలో కార్మికులు బానిసలతో పోల్చదగిన బ్రతుకులు గడుపుతున్నారు. వేతన దాస్యం విధానంగా ఉన్న పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులకున్న వారి సర్వస్వం వారి "శ్రమ శక్తే". వారు దానిని పెట్టుబడిదారులకు అమ్ముకోవడం తప్పనిసరి. వారి శ్రమశక్తిని దోపిడీ చేయడం ద్వారా పెట్టుబడిదారులు విపరీతమైన లాభాలు సంపాదిస్తున్నారు." అన్నాడు. మార్క్సు వివరించిన విధంగా సామాజిక శాస్త్రంలోని ఈ విషయాన్ని గుర్తించనప్పటికీ, కనీసం పెట్టుబడిదారుల భాగ్యం కార్మికుల శ్రమశక్తిని దోపిడి చేయడం ద్వారా ప్రోగుబడిందేనని ఆయన తన అనుభవం ద్వారానయినా గుర్తించాడు.

సభనుద్దేశించి మాట్లాడుతూ శ్రీ బాప్టిస్టా "బానిసత్వం, వ్యవసాయిక బానిసత్వం, కాంట్రాక్టు కార్మిక విధానం, కార్మిక చట్టాలు, కాంబినేషన్ చట్టాలు కార్మికులను అధోగతికి దిగజార్చే మార్గాలయ్యాయి. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలోని క్రైస్తవ మత ప్రాబల్యంలోని ప్రభుత్వాలలో మన ప్రజల అనుభవాలను పరిశీలిస్తే శ్రామిక వర్గం ఈ దోపిడీ విధానం నుండి పూర్తిగా విముక్తి కాలేదని స్పష్టమవుతోంది. కాని ఏ విధమైన కాంట్రాక్ట్ లేబర్ ఒప్పందాలు, చట్టాలు లేనిచోట కూడ పెట్టుబడిదారీవర్గం కార్మికవర్గంపై ఆధిపత్యం చలాయిస్తోంది. పెట్టుబడిదారులు బానిసలను కొనడం మానివేసి, శ్రమశక్తిని కొంటున్నారు. దానికి పరమ దుర్మార్గమైన డిమాండు సప్లయి సూత్రం మీద ఆధారపడి మూల్యం చెల్లిస్తున్నారు. ఈ విధంగా శ్రమశక్తిని కొనడమే శ్రామికుల దీనస్థితికి మూలకారణ" మని బాప్టిస్టా చెప్పారు. కాని యీ దోపిడీని అంతం చేయడానికి పెట్టుబడిదారీ విధానాన్ని సమూలంగా నాశనం చేయాలని గుర్తించలేకపోయాడు. అందువలన "ఈ విధానం (శ్రమశక్తిని కొనే విధానం) అంతమై దాని స్థానంలో ఉన్నతమైన భాగస్వామ్య విధానం అమలులోనికి రానిదే కార్మిక శ్రేయస్సు పరిరక్షించబడదు. పెట్టుబడిదారులు, కార్మికులు భాగస్వాములు, సహచరులు మాత్రమే గాని శ్రమను కొనేవారు, అమ్మేవారు కాదు" అని బాప్టిస్టా సమస్యను తప్పుదారి పట్టించాడు.

లాలాలజపతిరాయ్ సమావేశానికి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కాంగ్రెసు నాయకునిగా ఆయనకున్న పేరు ప్రఖ్యాతులను బట్టిగాక, జాతీయోద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర, కార్మికుల తదితర పీడిత ప్రజానీకం యెడల ఆయనకున్న సానుభూతి, ఆయనకు ప్రజల్లో వున్న పలుకుబడి కారణంగా భారత కార్మికవర్గ జాతీయస్థాయి సమావేశానికి అధ్యక్షత వహించే అరుదైన, అపూర్వమైన గౌరవం శ్రీ లాలా లజపతిరాయ్‌కి దక్కింది. శ్రీ బి.పి. వాడియా ప్రతిపాదించగా, శ్రీయన్.యం.జోషీ, దివాన్ చమన్‌లాల్‌తో పాటు మరొక కార్మిక ప్రతినిధి ఆ ప్రతిపాదనను బలపరచగా ఆనందోత్సాహాల మధ్య శ్రీ లజపతిరాయ్ అధ్యక్షస్థానాన్ని అలంకరించారు.

ఆయన అధ్యక్షోపన్యాసమిస్తూ "ఇది మన దేశ చరిత్రలోనే చాలా ప్రాముఖ్యత గల్గిన ఘట్టం వేలకొలది సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కల్గిన భారతావనిలో ఈ సువిశాలమైన ఉపఖండంలోని వివిధ ప్రాంతాలకు, వివిధ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతో చాలా సమావేశాలు జరగడం, ఆ సమావేశాలలో మతం, తత్వం, వ్యాకరణము, న్యాయశాస్త్రం, మరియు రాజకీయాలకు సంబంధించిన అనేక ముఖ్య విషయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకొనడం జరుగుతుండేది. విదేశాల నుండి పండితులు, రాయబారులు, దౌత్య వేత్తలు. పాల్గొంటూండేవారు. కాని ఏ ప్రాంతానికో లేక ఏ పట్టణానికోకాక, యావద్భారతదేశంలోని కార్మికవర్గ శ్రేయస్సు, వారి ప్రయోజనాల పరిరక్షణ కొరకు సమావేశం జరిగినట్లు చరిత్రలో కానరాదు. బ్రిటిషు పాలనలో కూడ మనం రాజకీయ, మత, సాంఘిక, సాహిత్య వైజ్ఞానిక తదితర విషయాలను గురించి అఖిల భారత స్థాయిలో సమావేశాలు జరుపుతూనే ఉన్నాం. కాని కార్మికుల జీవన పరిస్థితులను గురించి, భవిష్యత్తులో వారి సంక్షేమం, వారి ప్రయోజనాల పరిరక్షణ విషయమై చర్చించి, నిర్ణయాలు తీసుకొనడానికి, కార్మికవర్గం యింతకు ముందెన్నడూ అఖిల భారత స్థాయిలో సమావేశం జరిపియుండలేదు. ఇదంతా పరిశీలిస్తే ప్రాచీన, మధ్యయుగాల నాటి భారతదేశానికేమిటి – నిన్నటికీ నేటికీ కూడ చాల తేడా ఉన్నది. ప్రపంచం ఏనాడూ కనీవినీ ఎరుగని ఒక నూతన యుగంలో మనం జీవిస్తున్నాం. అందువలన మన పూర్వీకులెవ్వరూ ఎదుర్కొనని సమస్యలను మనం ఎదుర్కొనవలసి వస్తున్నది. మనకు ఇష్టమున్నా లేకపోయినా ఈ వాస్తవాన్ని గుర్తించాలి" అని లజపతిరాయ్ పేర్కొన్నారు.

కాని లాలాలజపతిరాయ్ తన ప్రసంగంలో ఎక్కడా నూతన యుగారంభానికి దారితీసిన అక్టోబరు మహా విప్లవాన్ని గురించి గాని, ప్రథమ సోషలిస్టు సామ్రాజ్య ఆవిర్భావం గురించి గాని ప్రస్తావించి యుండలేదు. అయినప్పటికి ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గం జాగృతమవడం, భారతదేశంలో కూడ కార్మిక వర్గం సంఘటితమవడం గమనించిన రాయ్ పాత వ్యవస్థ స్థానే ఒక నూతన వ్యవస్థ చోటు చేసుకుంటుందని గుర్తించాడు. శిధిలమవుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు సరియైన విరుగుడు సంఘటిత కార్మికవర్గమేనని గూడ ఆయన చాలవరకు గుర్తించాడు. శ్రీ రాయ్ మాట్లాడుతూ "మిలిటరిజం, సామ్రాజ్యవాదం రెండూ పెట్టుబడిదారీ వ్యవస్థకు

కవలపిల్లలని, ఆ మూడు పరస్పరం విడదీయ వీలులేనివి. వీటినీడ, బెరడు, పండ్లు –అసలు నిలువెల్ల విషం. దీనికి ఆలస్యంగా ఒక విరుగుడు కనిపెట్టబడింది. అదే సంఘటిత కార్మికవర్గం అని పేర్కొన్నాడు. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం సంఘటితమవడం ఏదో ఒక దేశానికి సంబంధించిన ప్రత్యేకత కాదని, ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని ఎదిరించడానికి ప్రపంచ కార్మికులందరూ ఏకంకావాలనే భావన, ఆయన (లాలాలజపతిరాయ్) ప్రసంగాలలో కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. అంతర్జాతీయంగా కార్మికులు సంఘటితమవడాన్ని ఆయన హర్షించాడు. లాలాలజపతిరాయ్ మాట్లాడుతూ "ప్రపంచంలోని కార్మికులందరి లక్ష్యము ఒకటేనని యూరపు, అమెరికాల్లోని కార్మికులు గుర్తించారు. ఆసియాలోని కార్మికులందరూ కూడ సంఘటితమై అంతర్జాతీయంగా కార్మికవర్గంతో సంబంధాలు ఏర్పరచుకొనేవరకు వారికి విముక్తి లేదు. యూరపులోని శ్రామికవర్గం తమ యజమానుల పరిస్థితిని తారుమారు చేస్తామని హెచ్చరించింది. వారి ఉద్యమం విజయవంతం కావాలంటే యూరపు, ఆసియాలలోని కార్మికులందరూ సన్నిహితం కావాలని వారు గుర్తించారు" అన్నాడు.

శ్రామికవర్గం యెడల భారతదేశంలోని ఈనాటి పాలకవర్గాల వైఖరికి, జాతీయోద్యమం నాటి కాంగ్రెసు నాయకులలో ప్రముఖుడైన శ్రీ లాలా లజపతిరాయ్ వైఖరికి తేడా కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. ఆయన ప్రసంగిస్తూ "భారత పెట్టుబడిదారులు శ్రామికుల అవసరాలను నిర్లక్ష్యం చేసి, అశేష లాభాలు ఆర్జించడంలోనే నిమగ్నమైతే శ్రామికులు మరియు సామాన్య ప్రజానీకం నుండి వారికి సానుభూతి, సహకారాలు లభించవు. నిరక్షరాస్యులై, ఉండడానికి ఇల్లు, ఒంటినిండా గుడ్డలేక అర్ధాకలితో అలమటిస్తున్న శ్రామికులకు భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధి పట్ల ఆసక్తి వుండదు. దేశభక్తి పేరిట ఎన్ని విజ్ఞప్తులు చేసినప్పటికి ప్రయోజనం శూన్యం" అని పేర్కొన్నారు.

మార్క్సిస్టు పద్ధతిలో కాకపోయినప్పటికి, కార్మికులకు వర్గ చైతన్యం, ప్రాధాన్యతను, వారు రాజకీయ హక్కులు సాధించవలసిన ఆవశ్యకతను ఆయన గుర్తించాడు. రష్యాలోని శ్రామికవర్గ నియంతృత్వంలో కార్మికులు రాజ్యాధికారాన్ని చేపట్టడం చూడగలిగాడు. ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గ ప్రయోజనాలు ఒకటైనప్పటికి, కార్మికవర్గం యొక్క శక్తి ఆయా దేశాల్లోని స్థానిక, జాతీయ పరిస్థితులబట్టి పరిమితంగా ఉంది. యూరప్‌లోని కార్మికవర్గం శాసించే స్థానంలో ఉన్నది. శాసనాధికారాన్ని, ప్రభుత్వాధికారాన్ని ఆస్తిపర వర్గాలకు తాకట్టు పెట్టి వారి చెప్పుచేతల్లో ఉండి పరిపాలన సాగించే రాజకీయవాదుల చర్యల ద్వారా తమ హక్కులను అమలు చేయించుకొనడం గాని, తమ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకొనడం గాని అసాధ్యమని యూరప్‌లోని కార్మికవర్గం గుర్తించింది. కార్మికవర్గం తన వర్గ ప్రయోజనాలను కాపాడుకొనాలంటే కార్మికులకు ఓటు హక్కు వుండాలనీ వారు దానిని తన వర్గానికి చెందిన వానికి గాని, తనవర్గ ప్రయోజనాలను కాపాడేవానికి గాని ఇవ్వాలి. అందువలననే దాదాపు యూరపులోని కార్మికులందరు రాజకీయ చైతన్యం పొందారు. అంతేకాక యూరపులోని

శ్రామికులు ప్రత్యక్షచర్య (సమ్మెలు) అనే మరొక బలమైన ఆయుధాన్ని కనుగొన్నారు. వీటన్నింటిని మించి కార్మికవర్గ నియంతృత్వ ఆశయ సాధనకై పోరాటం సల్పుతూ రష్యా కార్మికవర్గం అగ్రభాగాన నిలిచింది" అని శ్రీ రాయ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

కార్మికుల ఐక్యతను సాధించడానికి, కార్మికవర్గం అంతర్జాతీయంగా సంబంధాలు నెలకొల్పు కోవడానికి జరుగుతున్న ప్రయత్నాల పర్యవసానాన్ని శ్రీ రాయ్ మరచిపోలేదు. "ఐక్య పోరాటాలకు మనం జరిపే ప్రయత్నాలను భగ్నపరచి, మన ఐక్యతను దెబ్బతీసి, మనలను అసంఘటితంగా వుంచేందుకు, ప్రపంచ పరిణామాల నుండి మనలను దూరంగా ఉంచడానికి ప్రభుత్వం తనకున్న మిలటరీ బలాన్నంతటినీ ఉపయోగించడానికి కూడ వెనుదీయదు." అని కార్మికవర్గాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మికుల సమ్మె పోరాటాలను నిరంకుశంగా అణచివేయడాన్ని, సోవియట్ రష్యా, లండన్ నుండి వెలువడే డైలీ హెరాల్డ్ పత్రికల దిగుమతిని నిషేధించడాన్ని శ్రీ రాయ్ ఉదాహరణలుగా పేర్కొన్నాడు. అప్పటికి సోవియట్ రష్యా ఏర్పడి మూడు సంవత్సరాలు కూడ కాలేనప్పటికి ప్రథమ సోషలిస్టు దేశానికి వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు చేస్తున్న విషపూరితమైన అసత్య ప్రచారాలను శ్రీ లజపతిరాయ్ గ్రహించడం విశేషం.

వర్గాలుగా విడిపోయిన మన సమాజంలో, నిజం పెట్టుబడిదారుల దృష్టిలో ఒక రకంగాను, కార్మికవర్గం దృష్టిలో వేరొకరకంగానూ ఉంటుందని అస్పష్టంగా నైనప్పటికి గుర్తించాడు. "ఆంగ్లో ఇండియన్ పత్రికలు రష్యాకు వ్యతిరేకంగా ఘోరమైన అసత్యాలు ప్రచారం చేస్తుండగా, భారత ప్రజలు యీ ప్రచారంలోని సత్యాసత్యాలను తెలుసుకొనకుండా ప్రభుత్వం అడ్డుపడుతోంది. యూరపులో వాస్తవాలను పరిశీలించడంలో రెండు రకాల దృక్పథాలున్నాయి.

1. పెట్టుబడిదారీ విధానానికి, ప్రభుత్వపక్షానికి ప్రాతినిధ్యం వహించే విన్‌స్టన్ చర్చిల్ వంటి వ్యక్తులు, లండన్ టైమ్స్, మోర్నింగ్ పోస్ట్ పత్రికల దృక్పథం ఒకటి, 2. సోషలిస్టు భావాలకు, శ్రామికవర్గానికి ప్రాతినిధ్యం వహించే జస్టిస్, డైలీ హెరాల్డ్, సోవియట్ రష్యావంటి పత్రికల దృక్పథం వేరొకటి. ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న సోషలిస్టు, కార్మికవర్గ ఆలోచనా విధానం నుండి భారత ప్రజానీకాన్ని దూరంగా ఉంచడానికి ప్రభుత్వం చేస్తున్న చర్యలు చాల అక్రమమైనవి. ఈ అణచివేత విధానాలను నిర్ద్వందంగా ఖండించాలి" అని లజపతిరాయ్ హర్షధ్వానాల మధ్య ప్రకటించాడు.

సోషలిస్టు భావాలను, కార్మికవర్గ సిద్ధాంతాన్ని భారత కార్మికులు తెలుసుకోవాల్సిన అవసరాన్ని గురించి శ్రీ లాలాలజపతిరాయ్ నొక్కి చెప్పారు. అదే సమయంలో యూరపు, రష్యాలలోని కార్మికుల (ఉన్నత) ప్రమాణాలను తొందరపడి భారత కార్మికవర్గానికి వర్తింపచేయవద్దని హెచ్చరించారు. ఆయన యింకా ఇలా అన్నారు. "ఈనాటి భారతదేశంలో యూరపు, రష్యాలలోని శ్రామిక ప్రమాణాలను వర్తింప చేయాలని భావించే వారుండరు. అట్టి

వారెవరైనా వుంటే, రష్యా ప్రమాణాలను తొందరపడి హంగరీలో వర్తింపజేయవద్దని లెనిన్, బెలాకున్‌కుయిచ్చిన సందేశం గుర్తుచేయదలచుకున్నాను. ఈ దేశంలో కార్మికులందరిని సంఘటిత పరచాలి. వారికి వర్గచైతన్యం కల్గించాలి. ఉమ్మడి శ్రేయస్సు, ప్రయోజనాల గురించి వారిని చైతన్యవంతులను చేయాలి".

పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీ వ్యతిరేకభావాలు కలిగియున్నప్పటికి కార్మికవర్గ ప్రయోజనాల యెడల ఆసక్తి, ఆతురత ఉన్నప్పటికి, రష్యాలో శ్రామికవర్గ నియంతృత్వంపట్ల అత్యంత గౌరవభావం వున్నప్పటికీ, శ్రీ లాలాలజపతిరాయ్ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్య సాధనకు పోరాడవలసిందిగా కార్మికవర్గానికి పిలుపు నివ్వడంలో ఘోరంగా విఫలమయ్యాడు. ఆయన తన సుదీర్ఘ ఉపన్యాసంలో దేశ స్వాతంత్ర్యానికై కనీసం డిమాండు చేయకపోవడం దురదృష్టకరం. శ్రీ రాయ్ తన ఉపన్యాసాన్ని ముగించిన తీరు ఆయన అంతకు ముందు మాట్లాడినదానికి విరుద్ధంగా వున్నది. ప్రభుత్వం పట్ల అవలంబించవలసిన వైఖరిని గూర్చి వివరిస్తూ "ఇప్పుడు ప్రభుత్వం యెడల మన వైఖరిని వివరిస్తాను. అది ప్రభుత్వాన్ని బలపరచడమూ కాదు. వ్యతిరేకించడమూ కాదు" అంటూ తన ఉపన్యాసాన్ని ముగించాడు.

ఈ విధమైన వ్యక్తిగత వైరుధ్యాలు శ్రీ లాలాలజపతిరాయ్ ఒక్కడికే పరిమితం కాలేదు. అది మొత్తం జాతీయ కాంగ్రెసులో ఉన్న లక్షణమే. స్వరాజ్య సాధనకు కాంగ్రెసు సరియైన పోరాట పంథానవలంబించక, తిరోగమన విధానాల నవలంబించడం వలన ఏర్పడినదే యీ బలహీనత. 1920 సెప్టెంబరు నెలలో కలకత్తాలో శ్రీ లాలాలజపతిరాయ్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెసు ప్రత్యేక సమావేశం గాంధీ-మోతీలాల్ నెహ్రూల అహింసాయుత సహాయ నిరాకరణోద్యమాన్ని నిర్వహించాలని తీర్మానం చేసింది. కాని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని (స్వరాజ్యాన్ని) డిమాండు చేయడం విషయంలో కాంగ్రెసు ఒక నిర్ణయానికి రాలేకపోయింది. బ్రిటిషు సార్వభౌమత్వ పరిధిలో స్థానిక స్వపరిపాలన అనే అస్పష్టమైన సంకుచితమైన కోరికకు లొంగిపోవడం వలననే కాంగ్రెసు నాయకత్వం చైతన్యరహితమైనది. సంపూర్ణ స్వరాజ్యాన్ని నిర్ద్వంద్వంగా డిమాండు చేయవలసిన సమయంలో, కలకత్తా ప్రత్యేక సమావేశానికి ముందు జరిగిన అమృతసర్ కాంగ్రెస్ సమావేశం, మాంటేగ్ - ఛెమ్స్‌ఫర్డు నివేదిక ప్రతిపాదించిన రాజ్యాంగ సంస్కరణల విషయంలో కూడా ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. తిలక్ ఆయన అనుచరులు ఈ సంస్కరణలను వ్యతిరేకించగా, గాంధీజీ, అనిబిసెంటు మొదలైనవారు వాటిని ఆమోదించాలని పట్టుపట్టడంతో ఒక రాజీమార్గాన్ని అవలంబించారు. అందువలన ఈ విషయంలో కూడ కాంగ్రెసు వూగిసలాట ధోరణినే ప్రదర్శించింది.

ఎ.ఐ.టి.యు.సి. సమావేశంలో తన ప్రసంగంలో ఉన్నతమైన చైతన్యాన్ని విశాల దృక్పథాన్ని ప్రదర్శించిన శ్రీ రాయ్ ప్రసంగాన్ని ముగించిన తీరు చాలా నిరుత్సాహకరంగా వుంది. కాంగ్రెస్ నాయకత్వం యొక్క బలహీనతలను, రాజకీయ సంధిగ్ధత వల్ల ఏర్పడిన నిర్ణయాలు తీసుకోలేని కాంగ్రెస్ నాయకత్వం దురవస్థనీ సంఘటనలు ఘోరంగా బహిర్గతం

చేశాయి. అధ్యక్షోపన్యాసం ఇచ్చిన లాలాలజపతిరాయ్‌తో సహా ఇతర కాంగ్రెసు నాయకులు కూడ స్వరాజ్య సాధన డిమాండ్‌ను దాటవేయడాన్ని బట్టి చూస్తే కాంగ్రెసు సంస్థాపకులకు పరిపూర్ణ స్వాతంత్ర్య సాధన యెడల ఆసక్తి లేదని రుజువవుతోంది. భారత కార్మికవర్గపు ఈ ప్రథమ సమావేశం స్వరాజ్య సాధనను గురించి కనీసం ఒక తీర్మానమైన చేయలేకపోవడం దురదృష్టకరమైన విషయం.

అధ్యక్షోపన్యాసం పూర్తికాగానే దివాన్ చమన్‌లాల్ సమావేశాన్ని అభినందిస్తూ బ్రిటన్‌లోని వివిధ శ్రామిక సంఘాలనుండి వచ్చిన ఉత్తరాలను, టెలిగ్రాఫిక్ సందేశాలను చదివారు. ఎఐటియుసి లక్ష్యాలకు సంఘీభావం తెలుపుతూ, డైలీ హెరాల్డ్ సంపాదకుడు జార్జి లాన్స్‌బరీ సందేశం పంపాడు. షుమారు 3 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐరిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఐరిష్ స్త్రీ కార్మికుల యూనియన్, బ్రిటన్, ఐర్లండ్‌లలోని మరికొన్ని శ్రామిక సంఘాలు సౌహార్ద్ర సందేశాలు పంపాయి. ఈ సందేశాలు సక్లత్‌వాలా కార్యకలాపాల కారణంగా భారత కార్మిక సంక్షేమ సమితి ద్వారా వచ్చాయని చమన్‌లాల్ పేర్కొన్నారు.

బ్రిటిష్ లేబర్ పార్టీ తరపున కల్నల్ వెడ్జివుడ్ సౌహార్ద్ర ప్రతినిధిగా సమావేశానికి హాజరయ్యాడు. సమావేశం ఆయనకు యిచ్చిన హార్దిక స్వాగతానికి స్పందిస్తూ ఆయన తనదైన శైలిలో భారత కార్మికవర్గానికి తన మద్ధతు తెలియజేశాడు.

శుభాకాంక్ష సందేశాలను చదివిన అనంతరం సమావేశం బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు, ఐరిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు సౌహార్ద్ర పూరిత అభినందనలు తెలియజేస్తూ తీర్మానాలు చేసింది.

సమావేశం కార్మికులకు సంబంధించిన వివిధ సమస్యలను గురించి చర్చించింది. వాషింగ్టన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్స్ ఇండియా తప్ప మిగిలిన దేశాలకు 8 గంటల పని దినాన్ని సిఫార్సు చేసింది. ఈ సమస్యను స్టాండింగ్ కమిటీకి నివేదించాలని సమావేశం (ఎ.ఐ.టి.యు.సి సమావేశం) నిర్ణయించింది. నిరుద్యోగులకు సదుపాయాలు కల్పించవల్సిందిగా యూరపులోని వివిధ ప్రభుత్వాలతో పాటు, ఇతర దేశాలకు సిఫార్సు చేసిన అంతర్జాతీయ కార్మిక సమావేశం, భారత ప్రభుత్వానికి ఈ విషయంలో ఏ విధమైన సిఫార్సు చేయలేదు. ఇతరదేశాల్లోని బాల కార్మికులకు కనీస వయస్సు 14సం॥లుగా వుండాలని సిఫార్సు చేసిన సమావేశం, భారతదేశంలోని బాల కార్మికుల కనీస వయస్సును 12 సం॥లుగా సిఫార్సు చేసింది. ఈ అంశాలను ఎఐటియుసి సమావేశం గమనంలోకి తీసుకుంది.

పాశ్చాత్యదేశాల్లోని శ్రామికులతో పోలిస్తే, భారత కార్మికులపట్ల అంతర్జాతీయ కార్మికసంస్థ చూపుతున్న వివక్షను సమావేశం తీవ్రంగా గర్హించింది. ఈ సమస్యలను కూడా స్టాండింగ్ కమిటీకి నివేదించాలని సమావేశం నిర్ణయించింది. భారత కార్మికులకు

సంబంధించిన ఈ క్రింది సమస్యలను ప్రత్యేకంగా పేర్కొంటూ సమగ్రమైన మెమొరాండం తయారుచేసే బాధ్యత ఈ స్టాండింగ్ కమిటీకి అప్పగించబడింది.

1. సమ్మెల కారణంగా కార్మికులకు కలుగుతున్న కష్టనష్టాల గురించి 2.గ్రాట్యుటీ, ప్రావిడెంటు ఫండు తదితర సౌకర్యములు కల్పించుట 3. సమ్మె విచ్ఛిన్నానికి మిలిటరీ, సాయుధ పోలీసు, స్కౌట్లును, పఠాను గూండాలను ప్రయోగించుట 4. యజమానులు కార్మికులకు శారీరక దండన విధించుట 5. బొగ్గుగని కార్మికుల జీవన పరిస్థితులు 6. కార్మికులు వేతనాలను నష్టపోవడం.

విదేశాలలో పనిచేస్తున్న భారతీయ కార్మికులపై జరుగుతున్న అణచివేతను నిరసిస్తూ సమావేశం ఒక తీర్మానం చేసింది. ఫిజీలోని భారత కార్మికులను పశువులవలె చూడడాన్ని నిరసిస్తూ పూర్తి స్థాయి స్వతంత్ర విచారణ జరిపించాలని, వారి మాతృదేశానికి తిరిగి రాగోరేవారికి అందుకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఈ తీర్మానం ద్వారా కోరడం జరిగింది. భారతదేశంలోని బొగ్గుగనుల్లో పనిచేస్తున్న కార్మికుల దీనస్థితికి తమ నిరసన వ్యక్తం చేస్తూ యీ దారుణ పరిస్థితులను తొలగించడానికి చర్యలు తీసుకోవలసిందిగా ప్రభుత్వాన్ని, బొగ్గుగని యజమానులను కోరుతూ మరొక తీర్మానం ఆమోదించడం జరిగింది.

ఎ.ఐ.టి.యు.సి. సమావేశమైన సమయానికి భారత కార్మికులకు ఓటు హక్కులేదు. కార్మికులకు ఓటుహక్కు యివ్వాలని సమావేశం డిమాండు చేసింది. మిల్లు యజమానుల సంఘాలకు, టీ తోటల యజమానుల సంఘాలకు, వాణిజ్య మండలులకు ఉన్న విధంగానే లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఎన్నికల ద్వారా కార్మిక ప్రతినిధికి కూడ ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ సమావేశం వేరొక తీర్మానం చేసింది.

స్త్రీ కార్మికులకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలని సమావేశం మరొక తీర్మానంలో కోరింది. కార్మికులపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలు, కక్ష సాధింపు చర్యలు కూడా సమావేశంలో చర్చనీయాంశాలయినాయి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ సమావేశానికి ప్రాతినిధ్యం విషయమై శ్రీ ఎస్.ఆర్. థైర్సీ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. "నానా జాతి సమితి నియమానుసారం వచ్చే సంవత్సరం జెనీవాలో జరుగవలసిన అంతర్జాతీయ కార్మికసంస్థ సమావేశానికి భారత కార్మికవర్గం తరఫున హాజరవడానికి ఈ సమావేశం ఈ క్రింది వారిని నామినేట్ చేస్తోంది. 1.ఎ.ఐ.టి.యు.సి అధ్యక్షుడు శ్రీ లాలాలజపతిరాయ్ కార్మికవర్గ ప్రతినిధి గానూ 2. శ్రీ బి.పి. వాడియా, దివాన్ చమన్‌లాల్‌లు సలహాదారులుగా నిర్ణయించి వ్యవసాయ రంగానికి ప్రాతినిధ్యం వహిస్తూన్న వారిని ఇతర సలహాదారులుగా తీసుకొనడానికి అధ్యక్షునికి అధికారమివ్వబడింది. నానాజాతి సమితి ఒడంబడిక ప్రకారం విచారణ సంఘం ప్యానెల్ కు శ్రీ ఎన్.ఎం జోషీని ఈ సమావేశం నియమిస్తోంది" అని ఒక తీర్మానం చేయబడింది.

శ్రీ బి.జి. హార్నిమాన్ శ్రామికులకు చేసిన సేవలకుగాను ఆయనను ఎ.ఐ.టి.యు.సి సమావేశం వేరొక తీర్మానం ద్వారా అభినందించింది. ఆయన వ్యక్తి గత స్వాతంత్ర్యంపై అన్యాయంగా, అర్థరహితంగా ఆంక్షలు విధించడాన్ని తీవ్రంగా ఖండించి, యీ ఆంక్షలను తొలగించాలని తీర్మానం కోరింది.

లండన్‌లోని భారత కార్మిక సంక్షేమ సమితి (ఇండియన్ వర్కర్స్ వెల్ఫేర్ లీగ్) శ్రీ షాపుర్జీ సక్లత్ వాలా జరిపిన కృషికి కృతజ్ఞతాభినందనలు తెలుపుతూ ఒక తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఇంగ్లండ్‌లోని భారత కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకై సంక్షేమ సమితి (లీగ్)తో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొనడానికి స్టాండింగ్ కమిటీకి అధికార మివ్వబడింది.

లండన్‌లోని 'డైలీ హెరాల్డ్' పత్రిక నిషేధాన్ని తీవ్రంగా ఖండిస్తూ సమావేశం మరొక తీర్మానం ఆమోదించింది.

ఎ.ఐ.టి.యు.సి. సమావేశం ముగిసిన తరువాత శ్రీ బాప్టిస్టా నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గం బొంబాయి గవర్నర్‌ను కలిసి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది.

## స్టాండింగ్ కమిటీ, ఆఫీసు బేరర్ల ఎన్నిక

ఎ.ఐ.టి.యు.సి. కార్యకలాపాలు నిర్వహించడానికి మహాసభ ఒక స్టాండింగ్ కమిటీని ఎన్నుకున్నది. శ్రీ లాలా లజపతిరాయ్ అధ్యక్షునిగా, శ్రీ జోసెఫ్ బాప్టిస్టా ఉపాధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. స్టాండింగ్ కమిటీ ప్రథమ సమావేశం 1920 నవంబరు 2,న రెండవ సమావేశం 1921 ఏప్రిల్ 5,న జరిగాయి. ఈ రెండవ సమావేశంలో శ్రీ దివాన్ చమన్‌లాల్‌ను, ఎ.ఐ.టి.యు.సి ప్రథమ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆయన జీతం రు. 500/–లుగా నిర్ణయించబడింది.

స్టాండింగ్ కమిటీ సభ్యుల సంఖ్య చాల ఎక్కువే. భారతకార్మికోద్యమ ప్రారంభ దినాల్లో ఉద్యమానికి ప్రోత్సాహం, సానుభూతి సహకారాలందించిన వారికున్న ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా, ఈ జాబితా కాస్త సుదీర్ఘమైనప్పటికి, ఈ క్రింద పొందుపర్చబడింది.

లాలా లజపతిరాయ్, బి.పి. వాడియా, జోసఫ్ బాప్టిస్టా, అనంతరామ్ వైకుంఠరామ్, దివాన్ చమన్‌లాల్, లాలా దూనీచంద్, యం.డి. డాల్వి, జె.బి.మిల్లర్, యల్.ఆర్. తైర్సీ, లాలా ఈశ్వరదాస్ సహాని, డి.డి. సత్యె, యం.ఎ.ఖాన్, యన్.డి.సావర్కర్, జి.ఆర్.సాహనీ, యం.బి.వేల్కర్, కుమారస్వామి చెట్టి, సేఠ్ మాఫ్జీ గోవిందజీ, వామన్ అనంతపటేల్, యఫ్‌జె.గిన్వాలా, డి.సి. పండిట్, యల్.జి.ఖేర్, వి. చకరయ్‌చెట్టి, యస్.ఎ.బ్రెల్వీ, మిస్త్రీకరమ్ యిల్లహై, యన్.యం.జోషీ, సుబ్రమణ్యం నాయకర్, కాల్జీ ద్వారాకాదాస్, వినాయక్ షిరోద్కర్, ఇ.ఎల్. అయ్యర్, స్వామివిశ్వానంద, యస్.యన్. హల్దర్, ఆర్.కె. మిశ్రా, దీప్ నారాయన్ సింగ్, రాజారాంగోపాల్, వి.ఎం.పావర్, గోవిందతుకారాం, శివనందన్, బి.కె.కానే, జలీల్‌ఖాన్,

జి.కె. గాడ్గిల్, అమృత్‌లాల్ శర్మ, గులాబ్ చంద్ దేవ్‌చంద్, వెంకటరామ్ రెలే, ఎస్.ఎల్. మట్కర్, జి.ఎ.ప్రధాన్, ఎ.వి.పరంజపే, అబ్దుల్లా రహమాన్ కాజి, నడకర్ణి, శంకర్ నాగ్రేకర్, తుకారాం శాంతాజి, జె.టి. గోఖలే, జె.బి.నాయక్, సి.ఎమ్.పరైరా, శ్రీమతి దీప్ నారాయణ్ సింగ్, ఎన్.జె.రావల్, కె. సంతానం, సీతారాం షివాజీ, లాలాజగన్నాథ్, ఎస్. సత్యమూర్తి, శంకర్ లడోబా, పాండురంగ సబ్జీ మసూర్కర్, ఎ.బి. కొల్వాట్కర్, కృష్ణరాం కేశవరాంభట్, కుమారి చటోపాధ్యాయ, పి.వి.సావంత్, జె.హెచ్.ఖన్నా త్రియంబక్ సీతారాం సావంత్, జి.ఎస్.కాంతి, తేజ్ సింగ్‌ఖార్, మాధవరావు, బాపు రామచంద్ర, పి.ఎల్ మాల్‌టేక్‌చంద్, ఎమ్.ఆర్, ఆర్జూ, శ్రీమతి అవంతికాబాయ్ గోఖలే, ఆర్.ఎస్.హెర్లేకర్, కుమారి రూబెన్, ఎమ్.బి.మనియార్.

1921 జూలై 30వ తేదీన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో శ్రీయుతులు తెండుల్కర్, భూకన్‌దాస్; మురారిలాల్ ఆల్‌ఫన్‌సో, దార్వీలను కూడ కమిటీలోకి తీసుకోవడం జరిగింది.

వీరిలో అత్యధికులు ఏదో మానవతావాద దృష్టితో యీ సంస్థ వైపు ఆకర్షించబడగా, కొద్దిమంది మాత్రమే కార్మికోద్యమంతో సంబంధాలు కలిగియున్నారు. అందువలననే అట్టివారు క్రమక్రమంగా యీ సంస్థకు దూరమయ్యారు.

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్మికుల కొరకు ప్రణాళిక ప్రకటించింది. భారత కార్మికవర్గాన్ని ఉద్దేశించి ప్రకటించబడిన ఈ ప్రణాళిక ఏ విప్లవాత్మకమైన సందేశం ఇవ్వనప్పటికీ, ఇది ఈ విధంగా ప్రకటించబడిన ప్రప్రథమ ప్రణాళిక కావడంతో దానికున్న చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా, ఈ ప్రణాళిక పూర్తిపాఠాన్ని ఈ క్రింద పొందుపరుస్తున్నాం.

## భారత కార్మికవర్గానికి ప్రణాళిక

భారత కార్మికులారా !

మీ దేశ భవితవ్యాన్ని నిర్ణయించే మీ హక్కును ధృవపర్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. జాతీయ జీవన స్రవంతి నుండి దూరంగా వుండి భారతదేశంలో చరిత్ర సృష్టిస్తున్న సంఘటనలలో మీరు భాగస్వాములు కాకుండా వుండడానికి వీలులేదు. సామాన్య ప్రజానీకంలో అధిక సంఖ్యాకులు మీరు. రాజకీయ చదరంగంలోని ప్రతి కదలిక, దేశ ఆర్థిక, రాజకీయ రంగాలలో వచ్చే ప్రతిమార్పు మిమ్ములను ప్రభావితం చేసినంతగా మరే యితర వర్గాన్ని ప్రభావితం చేయదు. మీ బాధ్యతలను గుర్తెరిగి మీ హక్కులను అర్థం చేసుకోవాలి. మీ భవిష్యత్తును నిర్ణయించుకోవటానికి సమాయత్తం కావాలి.

ఓ భారత కార్మికులారా! మీరు దీనస్థితిలో వున్నారు. ఈ స్థితిని మెరుగుపరచుకోవడం ఎలా? అస్సాం టీ తోటలలో పని చేస్తున్న బానిసల పరిస్థితి చూడండి. వారిలో తెగింపు వచ్చింది. ప్రభుత్వ చట్టాల ప్రకారమే మూడు అణాలుగా వుండవల్సిన వారి రోజు కూలి అంత కంటె తక్కువగా నిర్ణయించబడింది. వారు పశువులవలె చూడబడుచున్నారు. ఈ టీ తోటల యాజమాన్యాలు 20 నుండి 40 శాతం డివిడెండ్లు చెల్లింస్తుండగా వాటిలో పనిచేసే కార్మికులు మాత్రం ఏ విధమైన పరిమితులు లేకుండా ఎక్కువ గంటలు పని చేయవలసివస్తోంది. కార్మికులను కరువుకు గురిచేసి, మృత్యువుకు బలిచేసి ఈ డివిడెండ్లు చెల్లిస్తున్నారు. మీరు, మీ పిల్లలు, మీ భార్యలు ఈ దారుణాలకు అమాయకంగా బలవుతున్నారు. ఈ దోపిడీని అర్థం చేసికొని ఈ అర్థ బానిసల తరపున చాంద్‌పూర్‌లో పోరాటం సాగిస్తున్న సి.ఎఫ్. ఆంద్రూస్‌కు మీ యూనియన్ల సభ్యుల నుండి మీ శక్తి కొలది ప్రత్యేక వసూళ్ళు చేసి పంపవలసినదిగా కోరుచున్నాము.

ఓ భారత కార్మికులారా ! ఈ భూమి ప్రజలందరి వారసత్వం. ఇది రాజకీయ నాయకులకు గాని, సిమ్లాలోని బ్యూరోక్రాట్లకు, ధనిక వర్గానికి చెందిన మిల్లు యజమానులకు రిజర్వు చేయబడలేదు. మీ జాతీయ నాయకులు స్వరాజ్యాన్ని కోరుతున్నారు. స్వరాజ్య సాధనకై సాగే పోరాటంలో మీ పాత్ర గణనీయం కావాలి. ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా రాజకీయ స్వాతంత్ర్యం నిరర్థకం. అందువలన మీరు దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. మీరు ఈ ఉద్యమంలో ప్రధాన భాగస్వాములే. స్వాతంత్ర్య సాధనను నిర్లక్ష్యం చేసినట్లయితే ఇక మీకు విముక్తి లేదు.

ఓ భారత కార్మికులారా ! మీరు మా యూనియన్లలో సభ్యులుగా నున్నంత మాత్రాన మీరు భారత జాతీయ కాంగ్రెసులో చేరడానికి ఏ విధమైన అభ్యంతరంగాని, అడ్డుగాని లేదు. స్వాతంత్ర్య సాధనకై పోరాటం సాగిస్తున్న మన అస్సాం కామ్రేడ్స్‌వలె మీరు కూడ కష్టాలనెదుర్కొనవలసి వుంటుంది. కార్మికులలో అంతఃకలహాలు పెట్టడానికి తనతో సహకరించనందుకు మీ నాయకులను సర్ విలియం విన్సెంట్ బెదిరించినట్లుగా, మీ యజమానులు కూడ మీపై అక్రమ చర్యలు తీసుకొనవచ్చు. మీరు భయపడవలసిందేమీ లేదు. పశు ప్రవర్తనకు, అర్థ బానిస పరిస్థితులకు, స్త్రీలు, పిల్లల, దారుణ దోపిడీకి వ్యతిరేకతను సృష్టించడం నేరమేమీ కాదు. గత సంవత్సర కాలంగా దేశంలో జరిగిన ప్రతి పెద్ద సమ్మె పోరాటం సందర్భంగానూ, యజమానులు ఎంత అడ్డుపడినప్పటికీ మన నాయకుల పలుకుబడి వలన పారిశ్రామిక శాంతి నెలకొల్పడం, ఒప్పందాలు చేసికొనడం మీకు తెలుసు. ఎవరెంత తప్పుగా చిత్రీకరించడానికి ప్రయత్నించినా మీ ప్రయోజనాలే మానవజాతి ప్రయోజనాలు.

ఓ భారత కార్మికులారా ! మీరు ఐక్యతను సాధించడం ఒక ప్రధానకర్తవ్యం. మీ సంఘాలలో మరింత ఐక్యతను సాధించండి. ఫ్యాక్టరీ చట్టం మీకు ఏదో ఒరగబెడుతుందని ఎదురుచూడకండి! చట్టాలు మీలో ఐక్యతను సాధించిపెట్టలేవు. అవి మీలో సోదరభావాన్ని పెంపొందించలేవు. అవి మీరు సాధించుకొనవలసినవే. కార్మికులను అనైక్యంగా ఉంచడమే ఫ్యాక్టరీలోనూ, బయట కూడ పెట్టుబడిదారుల ఏకైక నినాదం ఐక్యత, సోదరభావం మీ నినాదాలు కావాలి. మీ సంఘాల బలంపైననే మీ విముక్తి ఆధారపడి యున్నది. మీలోని బలహీనతల నన్నింటిని అధిగమించండి. అప్పుడే స్వాతంత్ర్యం, అధికారం సాధించే ప్రగతి పథాన మీరు పయనించగలరు.

**దివాన్ చమన్ లాల్**

ప్రధాన కార్యదర్శి

**అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు**

**ఎ.ఐ.టి.యు.సి. స్థాపన సమయంలో అనుబంధం చేయబడిన, సానుభూతి వ్యక్తం చేసిన యూనియన్లు, వాటి సభ్యత్వం ఈ క్రింది ఇవ్వబడినాయి.**

| సీ.నెం | యూనియన్ పేరు | సభ్యత్వం |
|---|---|---|
| 1. | బొంబాయి ఆయిల్ వర్కర్స్ యూనియన్, బొంబాయి | 1761 |
| 2. | చప్రాసీ యూనియన్, బొంబాయి | 27 |
| 3. | బొంబాయి పోర్టుట్రస్ట్ రైల్వే స్టాఫ్ యూనియం | 760 |
| 4. | జిఐపి రైల్వే వర్క్‌షాప్ మెన్స్ యూనియన్ | 3700 |
| 5. | మెకానికల్ ఇంజనీర్స్ అసోసియేషన్, అమరావతి | 96 |
| 6. | ఎంప్లాయీస్ అసోసియేషన్, కలకత్తా | 2505 |
| 7. | లేబర్ అసోసియేషన్, జంషెడ్‌పూర్ | 4000 |
| 8. | బొంబాయి పోర్ట్‌ట్రస్ట్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ | 370 |
| 9. | హాండ్‌లూమ్ వీవర్స్ యూనియన్, బొంబాయి | 249 |

| | | |
|---|---|---|
| 10. | బొంబాయి ప్రెస్ వర్కర్స్ యూనియన్ | 1698 |
| 11. | ఇండియన్ రైల్వే మెన్స్ యూనియన్, భోపాల్ | 1600 |
| 12. | జిఐపి రైల్వే మెన్స్ యూనియన్, కళ్యాణ్ | 1200 |
| 13. | డాక్ వర్కర్స్ యూనియన్, బొంబాయి | 1800 |
| 14. | ఇండియన్ సీమెన్స్ యూనియన్, బొంబాయి | 12056 |
| 15. | బొంబాయి యునైటెడ్ టెక్స్‌టైల్ వర్కర్స్ యూనియన్ | 204 |
| 16. | బొంబాయి టెక్స్‌టైల్ వర్కర్స్ ఫెడరేషన్ | 82 |
| 17. | పరేవ్ లేబర్ యూనియన్, బొంబాయి | 1500 |
| 18. | బొంబాయి పోర్టు ట్రస్టు వర్కుషాపు యూనియన్ | 783 |
| 19. | బొంబాయి ప్రెసిడెన్సీ పోస్ట్‌మెన్స్ యూనియన్ | 850 |
| 20. | బొంబాయి పోస్టల్ ప్యాకర్స్ యూనియన్ | 350 |
| 21. | బొంబాయి టెలిగ్రాఫ్ మెన్స్ యూనియన్ | 300 |
| 22. | లేబర్ యూనియన్, అకోలా | 32 |
| 23. | వలోద్ లేబర్ యూనియన్, కైరా | 279 |
| 24. | మిల్ హాండ్స్ యూనియన్, షోలాపూర్ | 32 |
| 25. | మెకానికల్ అండ్ పంపింగ్ వర్క్‌షాపు యూనియన్, మద్రాసు | 81 |
| 26. | హోటల్ సర్వెంట్స్ యూనియన్, బొంబాయి | 68 |
| 27. | మిస్త్రీ అండ్ కందాస్మా అల్లైడ్ యూనియన్ | 32 |
| 28. | క్లర్కు యూనియన్, బొంబాయి | 446 |
| 29. | మద్రాసు ట్రామ్‌వేమెన్స్ యూనియన్ | 170 |
| 30. | బొంబాయి ట్రామ్‌వేమెన్స్ యూనియన్ | 2300 |
| 31. | ప్రెస్ వర్కర్స్ యూనియన్, కరాచీ | 128 |
| 32. | వర్క్‌మెన్స్ యూనియన్, ఖిర్కి | 420 |

| | | |
|---|---|---|
| 33. | నేషనల్ వర్క్‌మెన్స్ యూనియన్, బొంబాయి | 40 |
| 34. | గిర్నికాంగార్ సంఘ్ | 1200 |
| 35. | ఇండియన్ లేబర్ లీగ్ | 600 |
| 36. | ఫ్యాక్టరీ క్లర్కు యూనియన్ | 62 |
| 37. | మాండ్వీ సర్వెంట్సు అసోసియేషన్, బొంబాయి | 200 |
| 38. | బి.బి. & సి.ఐ. రైల్వే వర్క్‌మెన్స్ యూనియన్ | 2000 |
| 39. | జర్నలిస్టుల యూనియన్ | 18 |
| 40. | రాయల్ ఇండియన్ నేవి (ఆర్ఐఎన్) క్లర్కుల యూనియన్, బొంబాయి | 72 |
| 41. | మద్రాసు లేబర్ యూనియన్ | 800 |
| 42. | గ్యాస్ వర్కర్స్ యూనియన్ | 702 |
| 43. | ఎన్.డబ్ల్యు. రైల్వేమెన్స్ అసోసియేషన్ లాహోర్ | 70,000 |
| 44. | క్లర్కుల యూనియన్, రావల్పిండి | 60 |
| 45. | ఆడిట్ క్లర్కుల యూనియన్ ఎన్.డబ్ల్యు రైల్వే, లాహోర్ | 71 |
| 46. | తలాతి సంఘ్, అహమ్మద్‌నగర్ | 248 |
| 47. | కాన్పూర్ మజ్దూర్ సంఘ్ | 1800 |
| 48. | పంజాబ్ క్లర్కుల యూనియన్ లాహోర్ | 122 |
| 49. | పోస్టల్ అసోసియేషన్, అహమ్మదాబాద్ | 113 |
| 50. | బొంబాయి ప్రెసిడెన్సీ, పోస్టల్ అసోసియేషన్ | 72 |
| 51. | ఎస్.ఐ.రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, మద్రాసు | 93 |
| 52. | బొంబాయి మిల్ హాండ్స్ యూనియన్ | 52 |
| 53. | మద్రాసు కూలీ యూనియన్ | 189 |
| 54. | బి.ఒ.సి. ఎంప్లాయీస్ యూనియన్, బొంబాయి | 802 |
| 55. | ఎమ్.ఎస్.ఎమ్. రైల్వే మెన్స్ యూనియన్, మద్రాసు | 812 |

56. ఖాండ్ బసార్ సర్వెంట్స్ యూనియన్ 56

57. జిఐపి రైల్వే ఆడిట్ క్లర్కుల యూనియన్ 85

58. దక్కన్ పోస్టల్ అసోసియేషన్, సతారా 85

59. క్లర్కుల యూనియన్, పూనా

60. తలాతీస్ అసోసియేషన్, రత్నగిరి

61. కాంగార్ హితవర్ధక్ సభ

62. బొంబాయి క్లాత్ మర్చంట్స్, సర్వెంట్స్ యూనియన్

63. ది మిత్సూ ఎంప్లాయీస్ యూనియన్, మీరజ్

64. ఆర్.ఎం.ఎస్. అండ్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్, అహమ్మదాబాద్

65. బొంబాయి ఛాఫర్స్ మ్యూచ్యువల్ బెనిఫిట్ యూనియన్

66. సిలోన్ వర్కర్స్ ఫెడరేషన్, కొలంబో

67. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, రాణిఘాట్

68. ప్రెస్ వర్కర్స్ యూనియన్, ఢిల్లీ

69. మద్రాసు పోలీస్‌మెన్స్ యూనియన్

70. వర్కుమెన్స్ యూనియన్, కరాచీ

71. ఎం.ఎస్.ఎం. రైల్వే ఇంజనీరింగ్ వర్క్‌మెన్స్ యూనియన్, ఆర్కోణం

72. మద్రాస్ సెంట్రల్ లేబర్ బోర్డు, మద్రాసు

73. బి.ఎన్.రైల్వేమెన్స్ అసోసియేషన్, ఖరగ్‌పూర్

74. జిల్లా క్లర్కుల యూనియన్, అమరావతి

75. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, జంషెడ్‌పూర్

76. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, జమాల్‌పూర్

77. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, అలహాబాదు

78. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, లక్నో

79. ఆర్.ఎం.ఎస్. అసోసియేషన్, మద్రాసు

80. ఉత్తరప్రదేశ్ పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. యూనియన్, లక్నో

81. పంజాబ్ పోస్టుమెన్స్ యూనియన్, లాహోరు

82. పోస్టల్ క్లర్క్సు యూనియన్, లాహోరు

83. పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. యూనియన్, కాన్పూరు

84. మిలటరీ ఎకౌంట్సు అసోసియేషన్, పూనా

85. ది ఫ్యూన్స్ అసోసియేషన్, పూనా

86. రాజ్‌నంద్‌నగర్ మిల్‌హాండ్స్ యూనియన్, రాజ్‌నంద్‌నగర్

87. పొడనూర్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, పొడనూర్

88. కోయంబత్తూర్ లేబర్ యూనియన్, కోయంబత్తూరు

89. మజ్దూర్ సంఘ్, గమాల్‌పూర్ (సెంట్రల్ ప్రావిన్స్)

90. మద్రాస్ రిక్షావాలాస్ యూనియన్, మద్రాసు

91. బి.బి & సి.ఐ. వర్క్‌మెన్స్, యూనియన్, అహమ్మదాబాద్

92. కలకత్తా పోస్టల్ క్లబ్, కలకత్తా

93. ప్రావిన్షియల్ పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. అసోసియేషన్, లాహోరు

94. లోక్‌రాజ్ ఫ్యాక్టరీ వర్క్‌మెన్స్ యూనియన్, జబల్‌పూర్

95. మద్రాసు పోస్టుమెన్స్ యూనియన్, మద్రాసు

96. ఇండియన్ నేషనల్ సీమెన్స్ యూనియన్, కలకత్తా

97. ప్రెస్‌మెన్స్ యూనియన్, కలకత్తా

98. గవర్నమెంటు ప్రెస్ కార్మికుల శాంతి సంస్థాపక యూనియన్, ఢిల్లీ

99. ప్రెస్ వర్కర్స్ యూనియన్, లాహోరు

100. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, జగత్‌పూరి (శ్రీ ఫ్రైక్ ద్వారా)

101. రైల్వే వర్క్‌మెన్స్ అసోసియేషన్, ఝాన్సీ (శ్రీ ఫ్రైక్ ద్వారా)

**అదనంగా ఈ క్రింది యూనియన్లు కూడ ఎ.ఐ.టి.యు.సి కి**

**అనుబంధం చేయబడ్డాయి.**

| | | |
|---|---|---|
| 1. | బొంబాయి పోర్టు ట్రస్టు స్టాఫ్ యూనియన్ | |
| | (ఇంజనీరింగ్ విభాగం) | 800 |
| 2. | వాలెస్ ఫ్లోర్‌మిల్ యూనియన్ | 150 |
| 3. | సింప్లెక్స్ మిల్ యూనియన్ | 1100 |
| 4. | ఔధ్ మరియు రోహిల్‌ఖండ్ రైల్వే యూనియన్ | 10000 |
| 5. | గ్లోబ్ మిల్ యూనియన్ | 3000 |
| 6. | ఇండియన్ సీమెన్స్ యూనియన్, బొంబాయి (అదనం) | 5944 |
| | | ----- |
| | | 20944 |

---

పై సమాచారాన్ని పరిశీలిస్తే వివిధ కేటగిరీలకు చెందిన కార్మికులు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడడం గాని, లేక ఎ.ఐ.టి.యు.సి.కి మద్ధతు వ్యక్తం చేయడం గాని జరిగినట్లు స్పష్టమవుతుంది. చివరకు ప్రభుత్వోద్యోగుల యూనియన్లు కూడ ఈ సంస్థకు అనుబంధించ బడడమో లేక ఈ సంస్థతో మిత్రత్వం నెరపడమో జరుగుతున్నది. వాస్తవానికి ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభించబడిన క్రొత్తలో అనేక యూనియన్లు ఈ సంస్థకు దూరంగా వున్నప్పటికీ క్రమక్రమంగా చేరువై ఎ.ఐ.టి.యుసి.కి అనుబంధ సంఘాలయ్యాయి.

# 10

# అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు రెండవ మహాసభ (1921)

**బొంబాయి నుండి ఝరియాకు :** 1920 డిసెంబరు నాగపూర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెసు వార్షిక సమావేశం శాంతియుతము, చట్టబద్ధమైన పద్ధతుల ద్వారా స్వరాజ్యాన్ని సాధించడం లక్ష్యంగా ప్రకటించింది. "బ్రిటన్ సార్వభౌమాధికార పరిధిలో బాధ్యతాయుత పరిపాలన" అని జాతీయ కాంగ్రెస్ గతంలో నిర్దేశించుకున్న లక్ష్యం నుండి ఇది నిస్సందేహంగా కొద్ది మేరకైనా ముందడుగే. 1921 డిశంబరు 31 లోగా స్వరాజ్యాన్ని సాధిస్తానని గాంధీజీ చెప్పిన జోస్యం నిజమయ్యే అవకాశాలు కన్పించడంలేదు. పెల్లుబుకుతున్న ప్రజాఉద్యమాలను కళ్ళెంవేసి అణచివుంచాలన్న తన వైఖరిని గాంధీజీ ఏ మాత్రం సడలించలేదు. ఉద్ధృతమవుతోన్న ప్రజా ఉద్యమాలను నిరోధించడం యిక ఏమాత్రం సాధ్యం కావడంలేదు. కార్మికవర్గం సాగించిన ఆర్థిక పోరాటాలు, రాజకీయ సమ్మెలతో సహా గొప్ప మిలిటెంట్ పోరాటాలు సాగాయి. కొన్ని సందర్భాలలో తిరుగుబాటు రూపాన్ని ధరించాయి. ఈ విప్లవాత్మకమైన పోరాటాలను గాంధీజీ ఆమోదించకపోగా వాటిని పూర్తిగా వ్యతిరేకించాడు. బొంబాయిలోని కార్మికులు, ప్రజానీకం సాగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటును, చౌరీచౌరాలోని పేద రైతులు బ్రిటిషు వారికి వ్యతిరేకంగా సాగించిన సమరశీల పోరాటాలను ఖండించవలసిన అంశాలుగా మహాత్ముడు భావించాడు. రక్తపాతంతో కూడిన తిరుగుబాట్ల ద్వారా స్వరాజ్యం సాధించడం తన అభిమతంగాదని ఆయన చాలా బాధతో చెప్పాడు.

ఆయనకు బాధ కల్గినప్పటికీ, ఆమోదించనప్పటికీ చరిత్రగమనం మారుతూనే యుంది. రైతాంగ తిరుగుబాట్లు, కార్మికుల ఆర్థిక పోరాటాలు, 1921 డిశంబరు 17న దేశవ్యాప్తంగా సాగిన సార్వత్రిక రాజకీయ సమ్మె సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని అత్యున్నత స్థాయికి తీసుకుపోయాయి.

కార్మికవర్గం తన వర్గ కోర్కెల సాధనకు మరింత ఉద్ధృతంగా పోరాటాలు సాగించేందుకీ పరిస్థితులనుకూలించాయి. ఒక్క 1921వ సం॥లోనే 376 సమ్మెలు, లాకౌట్లలో సుమారు 6 లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు.

అంతర్జాతీయంగా కూడ కార్మికవర్గ రాజకీయ, ఆర్థిక పోరాటాలు గణనీయంగా పురోగమించాయి. లెనిన్ మరియు బోల్షివిక్ పార్టీల సమర్థవంతమైన నాయకత్వంలో అప్పుడే క్రొత్తగా కార్మికవర్గం రాజ్యాధికారం హస్తగతం చేసుకున్న సోవియట్ యూనియన్, అంతర్జాతీయ విప్లవ (ప్రతీప) వ్యతిరేక శక్తులను, విదేశీ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని నాశనం చేసి విప్లవ విజయాలను సంఘటితపరచుకొని పురోగమిస్తోంది. సోవియట్ యూనియన్ పురోగమనాన్ని నిరోధించడం ఎవరితరం కాకపోగా, దీని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ప్రజల మీద పడింది.

ప్రపంచ యుద్ధానంతరం యూరపులోని కార్మికవర్గం కూడ ఉధృతమైన సమ్మె పోరాటాలు సాగించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తదితర పశ్చిమ యూరపులోని పెట్టుబడిదారీ దేశాలలో కార్మికవర్గ ఉద్యమం నిలకడగా అభివృద్ధి చెందుతోంది. కాని యుద్ధానంతర రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొనడంలో వచ్చిన భేదాభిప్రాయాల వలన ప్రపంచ కార్మికవర్గ ఉద్యమం రెండుగా చీలిపోయింది. ఒక భాగానికి ఆమ్‌స్టర్ డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకత్వం వహించగా, వేరొక వర్గానికి మాస్కోలోని రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకత్వం వహించింది.

ఎ.ఐ.టి.యు.సి. రెండవ మహాసభలో ఈ జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం బాగానే కన్పించింది. విప్లవం విజయవంతమైనప్పటికి, సామ్రాజ్యవాదుల జోక్యం, ఆస్తులు కోల్పోయిన భూస్వాములు, కులక్‌లు చేసే కుట్రలు, అంతర్యుద్ధం, సోవియట్ యూనియన్‌లో కరువు పరిస్థితులకు దారి తీశాయి. ఇట్టి పరిస్థితుల్లో కూడా ఎ.ఐ.టి.యు.సి. రెండవ మహాసభ తన అంతర్జాతీయ కర్తవ్యాన్ని నిర్వహించడం గొప్ప విషయం.

ఈ రెండవ మహాసభలో జాతీయ పరిస్థితుల ప్రభావం బాగా పడింది. ఏ నిర్ణయం తీసుకోలేని ఊగిసలాట స్వభావం కల్గిన జాతీయ నాయకుల మూలంగా ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశంలో మరుగునపడిన "స్వరాజ్య సాధన"ను డిమాండు చేస్తూ ఒక తీర్మానాన్ని ఈ సమావేశం ఆమోదించింది.

ఎఐటియుసి ప్రథమ మహాసభ అనంతరం వందకు పైగా పెద్ద ట్రేడ్ యూనియన్లు ఆవిర్భవించాయి. రెండవ మహాసభకు ఆతిథ్యమిస్తున్న ఝరియా బొగ్గుగనుల ప్రాంతాన్ని కంపింపచేసిన బ్రహ్మాండమైన నిరవధిక సమ్మె, బొగ్గుగని కార్మికులు 50 శాతం వేతన పెంపుదల సాధించుకోవడంతో విజయవంతంగా ముగిసింది.

ఈ పరిస్థితుల్లో 1921 నవంబరు 30వ తేదీన ఝరియాలో ఎఐటియుసి ద్వితీయ మహాసభ ప్రారంభమైంది.

## రెండవ మహాసభ విశిష్టత

బొంబాయిలోని సర్వెంట్స్ ఆఫ్ ఇండియా హాలులో లాలాలజపతిరాయ్ అధ్యక్షతన 30-7-1921న జరిగిన కార్యవర్గ సమావేశం అదే సంవత్సరం నవంబరు మాసంలో బీహార్‌లో ఝరియాలోని బొగ్గు గనుల ప్రాంతంలో ఎ.ఐ.టి.యు.సి. ద్వితీయ మహాసభ జరపాలని నిర్ణయించింది. జోసెఫ్ బాప్టిస్టా మహాసభకు అధ్యక్షత వహించాలని, బొగ్గు గనుల కార్మిక నాయకుడు స్వామి విశ్వానంద ఆహ్వాన సంఘాన్ని ఏర్పరచాలని నిర్ణయించడం జరిగింది.

నిర్ణయించిన విధంగానే ఎ.ఐ.టి.యు.సి. రెండవ మహాసభ 30-11-1921న ప్రారంభమైంది. భారతదేశంలోని దాదాపు అన్ని తరగతుల కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తూ దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు. సభా ప్రాంగణం సందర్శకులు, గని కార్మికులు, స్త్రీలు, పురుషులు, పిల్లలతో క్రిక్కిరిసిపోయింది.

వేదిక నలంకరించిన ప్రముఖులలో స్వామి విశ్వానంద, శ్యామ్‌సుందర్, చక్రవర్తి, స్వామి దర్శనానంద, హరిదేవ్‌దాస్ అగర్వాలా, డి.డి.తాకర్, కరమ్షీ ఖోరా, కేశవ్‌జీ పీతాంబర్, మాధవ్‌జీ జీవన్, నిబరన్ సిహెచ్. సర్కార్, కె. పరేఖ్, లాలా నారాయణ్‌సింగ్, సేట్ ఛగన్‌లాల్, డా॥ దౌలత్‌రామ్, శ్రీమతి సావిత్రీదేవి, శ్రీయుతులు ఇ.ఎల్.అయ్యర్, జలీల్‌ఖాన్, ఐ.బి.సేన్, ఎం.డి.దాల్వీ, డి.చమన్‌లాల్, తెంగడి, జె.హెచ్.పాటర్‌సన్, సింప్సన్, గిల్‌క్రైస్ట్, ఆర్.ఎ.ముకదమ్, బొంబాయికి చెందిన ప్రొఫెసర్ కౌశిక్ వున్నారు.

జాతీయగీతాలు, శ్రామిక వర్గ గీతాలు, వందేమాతరం గీతాలాపనతో మహాసభ ప్రారంభమైంది. ఆహ్వానసంఘ అధ్యక్షుడు ఝరియాలోని ఒక బొగ్గుగని యజమాని శ్రీ రామ్‌జేష్ అగర్వాలా స్వాగతోపన్యాసం చేశారు.

మహాసభ ప్రాంగణమంతా ఖాదీతో అలంకరించబడడం, సమావేశానికి హాజరయినవారిలో అధిక సంఖ్యాకులు ఖాదీ, గాంధీ టోపీలు ధరించడం గమనించదగిన విషయం, ఎ.ఐ.టి.యు.సి. ప్రథమ మహాసభ కంటే ఈ మహాసభ పట్ల జాతీయ కాంగ్రెస్ నాయకుల్లోని ప్రముఖులనేకులు చాలా ఆసక్తి చూపించడం గమనించాలి. గాంధీజీ మినహా మిగిలిన ప్రముఖ కాంగ్రెసు నాయకులందరూ మహాసభకు శుభాకాంక్ష సందేశాలు పంపారు. సమావేశం ఉద్దేశాలకు తమ మద్దతును తెలియచేస్తూ మహాసభ విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ ఉత్తరాలు, టెలిగ్రాములు పంపిన కాంగ్రెసు నాయకులు తదితర ప్రముఖులలో శ్రీ చిత్తరంజన్‌దాస్, లాలా లజపత్‌రాయ్, శ్రీమతి సరోజినీనాయుడు, శ్రీమతి సరళాదేవి చౌధురాని, శ్రీమతి అవంతికాబాయ్ గోఖలే, పండిట్ మోతీలాల్ నెహ్రూ, అశ్వనీకుమార్ దత్తా, జె.ఎల్.బెనర్జీ, ఎస్. సత్యమూర్తి, బాబూ రాజేంద్రప్రసాద్, ఎస్.ఎ.బ్రెల్వీ, సేట్ జమ్నాలాల్ బజాజ్, డా॥ ఎమ్

బి. వేల్కర్, గోపాల్ ఆచారి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, లాలా గోవర్ధన్‌దాస్, సర్దార్, పి.సింగ్, వి.ఎమ్.పవార్, చండికా ప్రసాద్, కె.వి.జోషీ, సింగార్‌వేలు, ఎఫ్. జె.గిన్వాలా, ఎస్.హెచ్ ఝబ్వాలా, జి.ఎస్.కాంతి, కంజి ద్వారాకాదాస్ డా॥ ఎన్.డి.సావర్కర్ మున్నగువారున్నారు.

ఎ.ఐ.టి.యు.సి. ఝరియా మహాసభకు జాతీయ స్థాయిలోనే గాక, అంతర్జాతీయంగా కూడ ప్రాధాన్యత లభించింది. లండన్‌లోని రెడ్ ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ బ్రిటిషు బ్యూరో సభాధ్యక్షునికి సందేశం పంపడం విశేషం. ఇంతేగాక ప్రపంచ వ్యాప్తంగా ఈ మహాసభకు లండన్‌లోని వర్కర్స్ వెల్ఫేర్ లీగ్ ఆఫ్ ఇండియా, స్కాటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, డబ్లిన్‌కుచెందిన ఐరిష్ లేబర్ పార్టీ, ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, లండన్‌కు చెందిన మైనర్స్ ఫెడరేషన్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్, తరుపున బవర్‌మన్, ఎమ్.పి, లండన్‌కీ చెందిన నార్విచ్ లేబర్ పార్టీ, ఇండస్ట్రియల్ కౌన్సిల్ తరపున ఈ.ఎల్ పెల్పన్, ఎలిజిబెత్ విల్సన్ (లీసెన్సర్) జార్జికెంప్టన్ (లండన్), ఇండిపెండెంట్ లేబర్ పార్టీ (లండన్), తరుపున జి.సి. బ్రిస్టన్, జనరల్ యూనియన్ ఆఫ్ టెక్స్ టెయిల్ వర్కర్స్ (హడ్డర్స్ ఫీల్డ్), కెట్టరింగ్ ట్రేడ్ మరియు లేబర్ కౌన్సిల్ తరుపున ఆల్ఫ్రెడ్‌హిల్ (లిసెస్టర్) నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ ట్రేడ్స్, ఆపరేటివ్స్ (లండన్), తరుపున జియల్. పేజ్, ఇండియన్ ట్రేడ్ యూనియన్ (మొంబాసా) మొదలైన ప్రముఖ ట్రేడ్ యూనియన్లు, ప్రముఖులైన ఇతరుల నుండి సందేశాలు వచ్చాయి.

రెడ్ ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ బ్రిటిష్‌బ్యూరోకు చెందిన శ్రీయుతులు టామ్‌మాన్, ఎన్.వాట్‌కిన్స్‌లు రాసిన లేఖ ప్రత్యేకించి చెప్పుకోదగ్గది. మొట్టమొదటిసారిగా బ్రిటిషు కార్మికులు తమ సోదర భారత కార్మికవర్గానికి శ్రామిక వర్గ దృక్పథంతో పంపిన అసాధారణమైన సందేశం ఇది. సామ్రాజ్యవాదుల పైశాచికత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ సాటిలేని తీవ్రపదజాలంతో వ్రాసిన ఈ చారిత్రాత్మక లేఖలోని అంశాలు యీ విధంగా ఉన్నాయి.

“మా దేశపు పెట్టుబడిదారుల దురాశాపూరిత దోపిడీకి బలైన మీ ప్రజానీకం బానిసత్వానికి నెట్టబడిన బెంగాల్‌లోని ధూళితో నిండి అంధకారబంధురమైన బొగ్గు గనుల ప్రదేశంలో జరుగుతున్న మీ బ్రహ్మాండమైన మహాసభకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేస్తున్నాం. రెడ్‌ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ బ్రిటిషు బ్యూరో తరపున మేము పంపే శుభాకాంక్షలు కేవలం బ్రిటిషు కార్మికవర్గం తరపుననే గాక, ఈ బ్రహ్మాండమైన ఉద్యమంలో సమీకృతమై సంఘటితమైన వివిధ దేశాల కార్మిక వర్గం తరపున శుభాకాంక్షలందజేస్తున్నాం. కామ్రేడ్స్ మీకు విజయం చేకూరాలని ఆకాంక్షించడం ద్వారా, మా అందరికీ విజయం, స్వాతంత్ర్యం లభించాలని కోరుకుంటున్నామన్న మాట! ఇప్పటివరకు దూరదృష్టిలేని కార్మికోద్యమం స్వాతంత్ర్యానికున్న ప్రాముఖ్యతను గుర్తించలేక అమాయకులు, నిస్సహాయులు అయిన తూర్పు దేశాల ప్రజానీకంపై పాశ్చాత్యదేశాల పెట్టుబడిదారులు బానిస విధానాన్ని రుద్దడాన్ని అనుమతించింది. ఇప్పుడు మనందరం దీని ఫలితాలననుభవిస్తున్నాము.

కామ్రేడ్స్! ఒక్కసారి ప్రపంచంలో ఏం జరుగుతోందో చూడండి! ప్రపంచవ్యాప్తంగా మానవజాతి అనేక విధాలుగా విభజింపబడి, అణగద్రొక్కబడి దోపిడీ చేయబడుతోంది. ఆలోచనారహితులైన పాశ్చాత్యదేశాల కార్మికులు అగౌరవ ప్రదమైన ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్ క్రింద సంఘటితమవడం ద్వారా ప్రపంచానికీ వినాశనాన్ని తెచ్చి పెట్టారు. వారు తమ పెట్టుబడిదారీ యజమానుల చేతుల్లో పాచికలై ఒకరినొకరు హత్యలు, దోపిడీలు చేసుకునే స్థితికి దిగజారారు. ప్రశాంతంగా వున్న దూర ప్రాచ్య దేశాలలోని మానవజాతిని బానిసలుగా చేసి, ఆ దేశాల సహజ వనరులను దోపిడీ చేసేందుకు ఆయాదేశాల మీద దండయాత్రలో భాగస్వాములైన బ్రిటన్ తదితర యూరపు దేశాల సైనికులు కూడా శ్రామికవర్గంలో భాగమే. పైగా వీరందరూ ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్ సభ్యులు కూడా. వీరు తమ యజమానులు సాగించే అణచివేతల నుండి మాత్రమే స్వతంత్రాన్ని కోరుకుంటారు. అందువలన వారు తమ పెట్టుబడిదారీ యజమానులవలె సామ్రాజ్యవాద భావాలు, సంకుచితభావాలు కల్గివున్నారు.

ఈ తుప్పు పట్టిన పాత ప్రపంచంలోని దుర్గుణాలూ, దుష్టత్వాల గురించి మరింత విమర్శించి ప్రయోజనంలేదు. సామ్రాజ్యవాదజాతి (దోపిడీ చేసేజాతి), జాయించబడిన జాతులు (పీడిత జాతులు) లేని ఒక విభిన్నమైన నూతన ప్రపంచాన్నా విష్కరించేందుకు భుజం భుజం కలిపి నడుద్దాం. ఈ భూమి శ్రమజీవులదే.

ఈనాడు మీ దేశంలో పరిశ్రమల, చేతివృత్తుల ద్వారా జీవనం సాగిస్తున్న 18 మిలియన్ల (1 కోటి 80 లక్షల) సంస్కారవంతులైన ప్రజానీకాన్ని సంఘటితపరచడంలో మీకు విజయం చేకూరాలని మేము కోరుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ సంఘీభావాన్ని సాధించడానికి సాగుతున్న నూతన ప్రపంచ వ్యాప్త మహోద్యమంలో సమాన ప్రాతిపదికన చేరవలసిందిగా మిమ్ములను ఆహ్వానిస్తున్నాం. మీరు బానిసలై అస్వతంత్రులుగా ఉన్నంతకాలం పాశ్చాత్యదేశాల్లో మేము కూడ స్వతంత్రులుగా వుండజాలమని మాకు తెలుసు. అందువలన మీ ప్రయోజనాలతో పాటు మా ప్రయోజనాల కోసం మాతో సహకరించవలసిందిగా కోరడానికి సాహసిస్తున్నాం. ఈ నూతన ఇంటర్నేషనల్ యొక్క బ్రిటిష్ కౌన్సిల్‌తో సంబంధాలేర్పరచుకొనడం నూతన కమిటీ తన కర్తవ్యాలలో ఒకటిగా భావిస్తుందని విశ్వసిస్తున్నాం. మీ తరపున మాతో సంబంధాలేర్పరచు కొనవలసిందిగా లండన్‌లోని మీ శాఖ అయిన" భారత కార్మిక సంక్షేమ సమితి (వర్కర్స్ వెల్ఫేర్‌లీగ్ ఆఫ్ ఇండియా)ని నూతన కమిటీ ఆదేశిస్తుందని ఆశిస్తున్నాం. బ్రిటిష్ ట్రేడ్స్ యూనియన్ కమిటీ సభ్యులు వారి యజమానుల వలెనే సామ్రాజ్యవాద దృక్పథం కల్గియున్నారు. వారు భారతదేశంలోని బ్యూరోక్రాట్లను సంతృప్తి పరచేందుకు, మీ ఆకాంక్షలకు భిన్నంగా కామ్రేడ్స్ హర్నిమాన్, సక్లత్‌వాలాలు భారతదేశ వాస్తవ పరిస్థితులను గురించి తెలియజేసేందుకు, గత రెండేళ్ళగా తమ మహాసభకు హాజరుకాకుండా చేయడానికి వారనుసరించిన వికృతమైన పద్ధతులను మేము గమనిస్తూనే వున్నాము.

బ్రిటన్‌లో జరిగే మా సమావేశాలకు మీ ప్రతినిధిని పంపవలసిందిగా కోరుతున్నాం. కొద్దికాలంలోనే మా బ్రిటిషు కార్మికవర్గంతోబాటు, భారతీయ కార్మిక సోదరులు, మిత్రులు, కామ్రేడ్సు, మా రెడ్ ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ సమావేశాల్లో పాల్గొనడానికి వస్తారని గట్టిగా నమ్ముతున్నాం. అన్ని విధాల మా మద్దతును, సహకారాన్ని మీకు అందిస్తామని హామీ యిస్తూ మీ సమావేశం విజయవంతం కావాలని కోరుతున్నాం.

30.7.1921న జరిగిన ఎ.ఐ.టి.యు.సి. ఐదవ కార్యవర్గ సమావేశం అదే సంవత్సరం సెప్టెంబరులో జరుగనున్న బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు మహాసభకు ఎఐటియుసి ప్రతినిధులుగా బి.జి.హర్నిమాన్, షాపుర్జీ సక్లత్‌వాలాలను నామినేట్ చేయడం గమనార్హం.

బ్రిటిషు సామ్రాజ్యవాదులు భారత కార్మికులను, ప్రజానీకాన్ని బానిసలుగా చేసి ఘోరంగా దోపిడీ చేయడం ద్వారా వారి ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున సంపద సమకూరుస్తున్న తరుణంలో ఒక బ్రిటిషు కార్మికవర్గ సంస్థ నుండి సామ్రాజ్యవాదానికి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ లేఖ రావడం, భారత కార్మికవర్గ చరిత్రలోనే కాక జాతీయోద్యమ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయం. కార్మికవర్గ విప్లవాత్మక అంతర్జాతీయ అవగాహనను ఈ లేఖ చక్కగా ప్రతిబింబించింది. అన్ని దేశాలలోనున్న కార్మికులు ఒకే వర్గానికి చెందుతారని, వారి ప్రయోజనాలు కూడ వేరుకాదని, సామ్రాజ్యవాదుల పట్టునుండి వలస దేశాల ప్రజల విముక్తి, ఆ వలస దేశాల కార్మికుల ప్రయోజనాల రక్షణకే కాక పెట్టుబడిదారీ విధానంలోని వేతన దాస్యం నుండి సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గం విముక్తి పొందటానికి మిక్కిలి అవసరమన్న చారిత్రక సత్యాన్ని ఈ లేఖ స్పష్టంగా తెలియజేసింది.

ప్రపంచవ్యాప్తంగా వలసదేశాలలోని కార్మికులు, సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికులు భుజం భుజం కలిపి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించి, ఒక సుందరమైన నూతన ప్రపంచాన్ని సృష్టించాలని యీ లేఖలో రెడ్‌ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ యిచ్చిన బ్రహ్మాండమైన పిలుపు, ఆనాటి పరిస్థితుల పరిమితులను దాటిపోయింది. అంతేకాక ఈ నినాదం భారత కార్మిక వర్గంలో అంతర్జాతీయ సౌహార్ద్రత, శ్రామికవర్గ అవగాహన అభివృద్ధి చెందటానికి దోహదం చేసింది.

ఈ లేఖలోని విషయాలు, వాటి భావం ఎ.ఐ.టి.యు.సి. ప్రారంభ సమావేశంలో బ్రిటిష్ లేబర్ పార్టీ ప్రతినిధి మాట్లాడినదానికి ప్రాథమికంగానే పూర్తి భిన్నంగా వుంది. అప్పటికే విదేశీ జోక్యం, అంతర్యుద్ధప్రమాదాలను సోవియట్ రష్యా ఎదుర్కొంటున్నది. ఇది చాలదన్నట్లు తీవ్రమైన క్షామ పరిస్థితులు ఏర్పడటం, అంటువ్యాధులు ప్రబలడంతో ఈ ప్రథమ సోషలిస్టు రాజ్యం మరింత విపత్కర పరిస్థితులను ఎదుర్కొనవలసివచ్చింది. అంతర్జాతీయంగా తన బాధ్యతను గుర్తించిన ఎ.ఐ.టి.యు.సి. ఝరియా మహాసభ సోవియట్ రష్యాలో కరువు వాతబడిన ప్రజానీకానికి తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ సహాయం అందజేయడానికి నిర్ణయం తీసికొన్నది. అంతేగాక శాంతికోసం పోరాటం సాగిస్తున్న సోవియట్ ప్రజలకు అండగా ఉండవలసిందిగా ప్రపంచ కార్మికవర్గానికి యీ సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ చారిత్రాత్మకమైన

నిర్ణయం తీసుకొనడం ద్వారా భారత కార్మికవర్గం మొదటిసారిగా అంతర్జాతీయ సౌహార్ద్రతను వ్యక్తంచేసింది.

ఝరియా సమావేశం మారిన జాతీయ పరిస్థితిని కూడ ప్రతిబింబించింది. ఎ.ఐ.టి.యు.సి. ప్రథమ, ద్వితీయ సమావేశాల మధ్యకాలంలో స్వాతంత్రోద్యమం తీవ్రతరమవడం, జాతీయ కాంగ్రెసు నాగపూర్ సమావేశంలో స్వరాజ్య సాధనను తన ఆశయంగా ప్రకటించడం జరిగింది. అందువలన ఝరియా సమావేశంలో మొదటగా చర్చకు వచ్చిన తీర్మానం స్వరాజ్య సాధన మీదనే. "భారత ప్రజానీకం స్వరాజ్యాన్ని సాధించవలసిన సమయమాసన్నమైనదని ఈ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రకటిస్తోంది." అని దివాన్ చమన్‌లాల్ స్వరాజ్య సాధనపై తీర్మానం ప్రతిపాదిస్తూ చెప్పారు. శ్రామికులకు స్వరాజ్యంతో సంబంధం లేదని బూటకపు ప్రచారం చేసేవారికి సమాధానంగా, దివాన్ చమన్‌లాల్ తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ స్వరాజ్యం విలాసాలలో మునిగితేలుతూ, మోటారుకార్లలో తిరుగుతూ, ప్రభుత్వ భవనాలలో తిని, తిరిగే వారికోసం కాదని, తమ శ్రమశక్తితో సంపన్నుల సంపదను మరింత పెంచుతున్న కోటానుకోట్ల శ్రమజీవులకోసం మాత్రమేనని చెప్పారు. మనం సాధించబోయే స్వరాజ్యం పెట్టుబడిదారుల స్వరాజ్యం కాదని, కార్మికుల స్వరాజ్యమని నొక్కి చెప్పారు. ఈ తీర్మానాన్ని అనేకమంది ఇతర ఉపన్యాసకులు బలపరచగా సుదీర్ఘ హర్షధ్వానాల మధ్య ప్రతినిధులందరు చేతులెత్తి తీర్మానానికి తమ ఆమోదాన్ని తెలియజేశారు.

సమావేశం ఆమోదించిన రెండవ తీర్మానం గాంధీజీ ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించింది. "స్వదేశీ వస్తువుల నుపయోగించాలని, చేతితో నూలు వడకాలని, చేనేతను ప్రోత్సహించాలని ఈ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ భారత ప్రజానీకానికి సిఫార్సు చేస్తోంది" అనే తీర్మానాన్ని డార్జిలింగ్‌కు చెందిన శ్రీమతి సావిత్రీదేవి ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని ఆమోదించడమంటే గాంధీగారి చరఖా ఆర్థిక విధానానికి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు తన మద్దతును తెలియజేయడమే. ఒక వైపు శ్రామికవర్గ అవగాహన ప్రారంభమవుతుండగా ఆనాటి ట్రేడ్ యూనియన్ కాంగ్రెసులో, కాంగ్రెసు రాజకీయ సిద్ధాంతాల ఆధిక్యత కళ్ళకు కట్టినట్లు కనపడుతుంది.

యుద్ధానికి వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని ఆమోదించడం ఈ మహాసభ మరో విశిష్ట లక్షణం. యుద్ధాన్ని కార్మికవర్గానికి మిక్కిలి హానికరమైన దానిగా పరిగణించి ఖండించడం జరిగింది. ప్రపంచంలో యుద్ధ పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం సంఘటితంగా కృషి చేయాలని ప్రపంచ కార్మికవర్గానికి ఈ సమావేశం విజ్ఞప్తి చేసింది.

పోరాట నిధుల సేకరణ, బొగ్గుగని కార్మికుల, రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం, విదేశాలలో నున్న భారత కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ, ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్సుకు ప్రాతినిధ్యం మొదలైన అనేక సమస్యలపై తీర్మానాలు ఆమోదించడం జరిగింది. జాతి వివక్షతో జీతభత్యాలలో తారతమ్యాలు చూపించే విధానానికి స్వస్తి చెప్పాలని డిమాండు చేస్తూ ఒక ప్రత్యేక తీర్మానం ఆమోదించబడింది.

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ బొంబాయిలో స్థాపించబడినప్పటికి ఝరియా సమావేశంతో దీని స్థాపన పూర్తయింది. ఈ రెండు మహాసభల ఫలితంగానే ఎ.ఐ.టి.యు.సి. ఒక స్వరూపాన్ని సంతరించుకుంది.

ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఝరియా మహాసభ వరకు కాంగ్రెసు రాజకీయాలు ప్రధాన పాత్ర వహిస్తుండేవి. ఈ బూర్జువా వర్గ రాజకీయ సిద్ధాంతాల ఆధిక్యత మరికొంతకాలం సాగింది. ఈ మహాసభలో బాప్టిస్టా చేసిన అధ్యక్షోపన్యాసం ఆయన రాజకీయ సిద్ధాంత రాహిత్యాన్ని వెల్లడించింది.

ఎ.ఐ.టి.యు.సి. అనుసరించవలసిన విధానాన్ని వివరిస్తూ "మితిమీరిన వ్యక్తి వాదము మరియు బొల్షివిజాలను అధిగమించి ఫాబియన్ సోషలిజాన్ని అనుసరించాలి." అని చెప్పాడు. బూర్జువా రాజకీయవాదుల మూఢ రాజకీయాలనధిగమించి, విప్లవాత్మకమైన కార్మికవర్గ రాజకీయ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొనడానికి ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ బృహత్తరమైన పోరాటాన్ని సాగించవలసివచ్చింది.

ఇదిలా వుండగా నూతన సామాజిక తాత్విక ఆలోచనలు భారత రాజకీయాల్లో చోటు చేసుకొనడం ప్రారంభమైంది. మార్క్సు ప్రతిపాదించిన శాస్త్రీయ సోషలిజం యువకులైన కొద్దిమంది భారతీయ మేధావులను ప్రభావితం చేసింది. దీని ప్రభావం ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌పై పడడం అనివార్యమైంది. రాజీ సంస్కరణ వాదాలకు నిలయమైన కాంగ్రెసు పార్టీ బూర్జువా రాజకీయ సిద్ధాంతాలను ఎదుర్కొనే ఒక విప్లవాత్మకమైన సిద్ధాంతం, ఒక నూతన రాజకీయ ఆలోచన ఏర్పడడంతో ఎ.ఐ.టి.యు.సి.లో సంఘర్షణలు తలెత్తడం ప్రారంభమైంది. ఆ తర్వాత ఎ.ఐ.టి.యు.సి. నిరంతర సైద్ధాంతిక సంఘర్షణలకు గురయింది. ఫలితంగా అనేకసార్లు చీలిపోవడం, తిరిగి కలవడం జరిగింది.

# 11

# ప్రప్రథమంగా భారతదేశంలో మార్క్సిజం అవతరణ అంతర్జాతీయ శ్రామికవర్గ సమీకరణ

1920వ సం॥ తరువాత భారత కార్మికవర్గం ఎదుర్కొన్న జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకు అనేక విధాల ప్రాముఖ్యత వున్నది. తరువాత కాలంలో భారత కార్మికోద్యమం సాగిన తీరును సరిగా అర్థం చేసుకొనడానికి ఆ పరిస్థితులను సక్రమంగా అంచనా వేసుకొనవలసిన ఆవశ్యకత వున్నది. భారత శ్రామికవర్గ పురోగమనానికి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగిన ప్రధాన సంఘటనలను పరిశీలిద్దాం.

## జాతీయ పరిణామాలు

వెల్లువలా ముందుకు సాగుతున్న భారత ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాన్ని నిరంకుశంగా అణచివుంచి, జాతీయ విముక్తి ఉద్యమ నాయకత్వాన్ని బూర్జువా వర్గం చెప్పు చేతల్లో వుంచడానికి 1921 డిశంబరులో అహమ్మదాబాదు కాంగ్రెసులో తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. మిగిలిన నాయకులు జైలులో నుంచబడడంవల్ల కాంగ్రెసుకు గాంధీజీయే డిక్టేటరుగా (నియంతగా) వ్యవహరించారు. దేశ వ్యాప్త పోరాటాలకు ప్రజలెదురు చూస్తుండగా, వారి ఆశలను నిరాశచేస్తూ ఏ కార్యక్రమం లేకుండానే కాంగ్రెసు సమావేశం ముగిసింది.

భారత స్వాతంత్రోద్యమంలో తీవ్రగందరగోళ పరిస్థితులు నెలకొనివున్న సమయంలో, కొద్దిమంది భారతయువకులు నూతన రాజకీయ ఆలోచనలు చేయడం ప్రారంభించారు. అప్పుడే భారతదేశంలో ప్రప్రథమ మార్క్సిస్టు బృందాలు ఏర్పడడం ప్రారంభమైంది. ఇవి చాలా పరిమిత స్థాయితో నున్నప్పటికి భారత రాజకీయాల్లోను, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోను మార్క్సిస్టు అంతర్జాతీయ అవగాహన ఛాయలు పడడం ప్రారంభమైంది.

ఇదిలావుండగా 17.10.1920న సోవియట్ యూనియన్‌లోని తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రవాసంలో స్థాపించబడి, 1921లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ గుర్తింపు

పొందింది. భారతదేశంలో కూడ కొద్దిమందే అయినప్పటికి కమ్యూనిస్టు భావాలు కలిగిన యువకులు రచనలు, ఉపన్యాసాల ద్వారా సోషలిస్టు భావాల వ్యాప్తికి విశేషంగా కృషి చేశారు.

పెల్లుబుకుతున్న ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలను చూచిన బూర్జువా కాంగ్రెసు నాయకత్వం దిగ్భ్రాంతి చెంది, ఈ వెల్లువను ఎలాగైనా అణచి వుంచాలని ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో భారత జాతీయ కాంగ్రెసు అహమ్మదాబాదు సమావేశానికి హాజరయ్యే ప్రతినిధుల నుద్దేశించి ప్రవాసంలో నున్న భారత కమ్యూనిస్టు పార్టీ 1-12-1921వ తేదీన ఒక ప్రణాళికను ప్రకటించింది. ఈ ప్రణాళికలో భారత దేశ ప్రత్యేక పరిస్థితుల్లో బూర్జువా సంస్కరణవాద ఆలోచనా విధానానికి, మార్క్సిస్టు ప్రత్యామ్నాయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ సూచించింది.

ఈ నూతన విప్లవ పార్టీ తన ప్రణాళిక మొదటి ప్రచురణలో, భారత రాజకీయ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా కార్మికులు, కర్షకులు జాగృతమై పోరాటం సాగించవలసిన ఆవశ్యకతను ఎత్తి చూపింది. ఈ సుదీర్ఘమైన డాక్యుమెంటుకు ఉన్న చారిత్రక ప్రాధాన్యతను, శ్రామికోద్యమ చరిత్రతో దీనికున్న సంబంధాన్ని దృష్టిలో వుంచుకొని కొన్ని ముఖ్యాంశాలను ఈ క్రింద పొందుపరచటం జరిగింది.

ఈనాడు భారత జాతి రాజకీయంగానే గాక, ఆర్థికపరంగానూ, సామాజిక పరంగానూ ఒక విప్లవదశలో వుంది. ఈ ఉపఖండంలో నివసిస్తున్న అశేష ప్రజానీకం ఒక నిర్ణీత లక్ష్యం వైపు పయనిస్తోంది. ఆర్థికంగానూ, రాజకీయంగానూ అణగద్రొక్కబడిన కారణంగా శతాబ్దాలుగా స్తబ్దంగా జీవనం సాగిస్తున్న ఈ జాతి జాగృతమౌతోంది.

పట్టణాల్లో నివసిస్తున్న కార్మికులను, పల్లెల్లో అమాయకంగా జీవితాలు వెళ్ళబుచ్చుతున్న గ్రామీణ ప్రజానీకాన్ని తీసుకురానిదే ఉద్యమం శక్తివంతం కాజాలాదు. ప్రజాసంఘ నిర్మాణం కాంగ్రెసుకు ఒక సమస్యగా తయారయింది. దేశ స్వాతంత్ర్యంతో కష్టాలు అంతమవుతాయని ఫ్యాక్టరీ కార్మికులను, పొలాల్లో పనిచేసే వారిని ఎలా నమ్మించాలి? ధనికులైన భారతీయ యజమానుల మిల్లులలోనూ, ఫ్యాక్టరీలలోను పనిచేస్తున్న లక్షలాదిమందిలో కొద్దిమంది కూడ జాతీయోద్యమానికి నాయకత్వం వహించడంలేదనీ, వారి జీవితాలు దుర్భరంగా వున్నాయని, వారు తిరుగుబాటు చేసే పరిస్థితులు కల్పించే విధంగా యజమానులు, కార్మికులపట్ల అవమానకరంగా ప్రవర్తిసున్నారనేది నిజం కాదా? జాతి ప్రయోజనాల పేరుతో తెలివిగలవారు ఈ సమస్యలను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. "విదేశీ ఆధిపత్యాన్ని మొదట వదిలించుకోవాలి" అని ఈ రాజకీయ నాయకులు వాదనలు చేస్తున్నారు. వీరు తమ రాజకీయ చాతుర్యంతో ధనికవర్గాలకు బలం చేకూరుస్తున్నారు. కాని నిరుపేదలైన కార్మికులు, రైతులు ఆకలితో అలమటిస్తున్నారు. వారి

స్థితిగతులు మెరుగుపడాలంటే వారందరినీ పోరాటంలోకి తీసుకురావాలి. ప్రజానీకంలో అధిక సంఖ్యాకులకు వర్తించి, వారిని ఉత్తేజితులను చేసి ఉత్సాహంగా పోరాటంలోకి తీసుకురాగలిగిన నినాదం "రైతుకు భూమి, కార్మికునికి తిండి" అనేది.

ఎల్లప్పుడు కష్టాలననుభవించి త్యాగాలను చేయవలసిందిగా కాంగ్రెసు ప్రజలను కోరడం సరియైన పద్ధతికాదు. తరతరాలుగా వారనుభవిస్తున్న దీనస్థితిని అంతం చేసే తొలి సంకేతాలను వారిదృష్టికి తీసుకురావాలి. ఆర్థిక పోరాటాల్లో వారికి చేయూతనివ్వాలి. సాంఘిక, ఆర్థిక పునర్నిర్మాణానికి ఒక నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే విషయాన్ని కాంగ్రెసు ఇక ఏ మాత్రం వాయిదా వెయ్యలేదు. అశేష ప్రజానీకపు తక్షణ సమస్యల పరిష్కారంతో పావారి జీవన పరిస్థితుల మెరుగుదలను డిమాండు చేస్తూ, ఒక నిర్మాణాత్మక కార్యక్రమాన్ని ప్రజల ముందుంచడం 36వ కాంగ్రెసు సమావేశం ప్రధాన కర్తవ్యం.

కార్మికులు, రైతాంగం సాగించే ఆర్థిక పోరాటాలను ముందుండి నడపడానికి కాంగ్రెసు చేసిందేమిటి? ఈనాటి వరకు కాంగ్రెస్ ప్రజా ఉద్యమాలను తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నది. ప్రతి సమ్మె పోరాటంలోనూ, రైతాంగ తిరుగుబాటులోనూ, తమ రాజకీయ బలప్రదర్శన కోసం సహాయ నిరాకరణోద్యమం సాగించిన వారు ప్రతి సమ్మెపోరాటం లేదా రైతాంగ తిరుగుబాటు సందర్భంగా సమ్మెదారుల ఆర్థిక ప్రయోజనాలను బలిచేశారు.

పట్టణాలలో కార్మికులు జీతాలు పెంచాలని, పని గంటలు తగ్గించాలనీ, జీవన పరిస్థితులు మెరుగుపరచాలని డిమాండు చేస్తారు. స్వంత భూమికోసం, స్వేచ్ఛకోసం, మితిమీరిన కౌళ్ళు, అధికపన్నులకు వ్యతిరేకంగానూ, భూస్వాముల దారుణ దోపిడీ నుండి విముక్తి కోసం పల్లెలోని పేద రైతాంగం పోరాడుతోంది. ఆర్థికంగానూ, సామాజికంగానూ వారిపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా వీరు తిరుగుబాటు చేస్తున్నారు. ఇక్కడ దోపిడీదారు బ్రిటిషు జాతీయుడా లేక భారతీయుడా అనే ప్రశ్నలేదు. వారు కోరేది దోపిడీ నుండి విముక్తి మాత్రమే. వాస్తవానికి విప్లవశక్తుల స్వభావం ఆ విధంగా వుంటుంది. దేశ రాజకీయ వ్యవస్థను మార్చగల్గిన శక్తి కార్మిక, కర్షకవర్గాలకు మాత్రమే వున్నది. ఈ విషయాన్ని కాంగ్రెసు ఎంత త్వరితంగా గుర్తిస్తే అంత మంచిది.

భారతదేశాన్ని పునాదులకంటా కదిలించివేసే విప్లవానికి కాంగ్రెసు గనుక నాయకత్వం వహించదలచుకుంటే కేవలం ప్రదర్శనలతో, తాత్కాలిక ఉద్రేకాలు కలిగించే కార్యక్రమాలతో సరిపెట్టుకుందామంటే కుదరదు. కాన్పూరు కార్మికులు కోరినట్లుగా ట్రేడ్ యూనియన్ల తక్షణ కోర్కెలను కాంగ్రెసు తన కోర్కెలుగా స్వీకరించాలి. అప్పుడు కాంగ్రెసును ఏ శక్తీ అడ్డగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజలు తగినంతగా త్యాగాలు చేయలేదనే నెపంతో మనం నిర్ణయించిన వ్యవధిలో స్వరాజ్యం సాధించలేని విచారించవలసిన అవసరముండదు. తమ భౌతికావసరాల సాధనకై పోరాటం సాగిస్తున్న ప్రజానీకపు అజేయమైన శక్తి, కాంగ్రెసుకు అండగా నిలుస్తుంది.

కాంగ్రెసు తన చౌకబారు రాజకీయాలను విస్మరించి, దేశంలో అభివృద్ధి చెందుతున్న సామాజిక శక్తుల కనుగుణంగా తన విధానాలను మలచుకోవాలి. విదేశీ దోపిడీని అంతం చేయాలనీ, దేశంలోని ధనిక వర్గాలకు గుత్తాధిపత్యం సంక్రమించరాదని, భారత ప్రజానీకాన్ని రాజకీయ, ఆర్థిక సామాజిక దోపిడీ నుండి విముక్తి చేయాలని కోరుతున్నట్లు కాంగ్రెసు చేతల్లో చూపించవలసివుంది. అప్పుడు ఎవరో కొందరు నిలకడలేని వ్యక్తులు నిర్ణయించిన రోజునకాక, చైతన్యవంతమైన సంఘటితమైన ప్రజానీకం నిర్ణయించిన విధంగా స్వరాజ్యం సాధించబడుతుంది.

భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అప్పటివరకు బూర్జువావర్గ నాయకత్వం ఊహలకందని ఒక నూతన ఆలోచనా విధానాన్ని ఈ ప్రణాళిక ద్వారా ప్రవాస కమ్యూనిస్టు పార్టీ చాటి చెప్పింది. కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ప్రాధాన్యతను సరియైన దృక్పథంతో చెప్పడం ఇదే ప్రప్రథమం. ప్రజలు రాజకీయంగానూ, ఆర్థికంగానూ, సామాజికపరంగానూ విముక్తి పొందాలన్న విషయాన్ని కమ్యూనిస్టు పార్టీ మానిఫెస్టో ప్రజల ముందుంచింది. కాని బూర్జువా వర్గ నాయకత్వానికి, దాని సిద్ధాంతాలకు కట్టుబడివున్న జాతీయ కాంగ్రెసును కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ఏమాత్రం ప్రభావితం చేయలేకపోయింది. అయినప్పటికి తరువాత కాలంలో ఈ నూతన రాజకీయ, సామాజిక సిద్ధాంతం కాంగ్రెసుకు వెలుపలనున్న వారి ననేకులనాకర్షించి ముందంజ వేసింది.

బార్డోలీలో కాంగ్రెసు కార్యవర్గ సమావేశం తీసుకున్న నిర్ణయం (శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేయడం) తో పాటు అహమ్మదాబాదు సమావేశంలో కాంగ్రెసు తీసుకున్న అవివేకమైన నిర్ణయాలు జాతీయోద్యమాన్ని వెనుకంజ వేయించాయి. రాజకీయంగా దేశంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నప్పటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో మతపరమైన మారణకాండ పెచ్చురిల్లుతుంది. ముస్లింలీగు కూడా కాంగ్రెసును వదలి ఒక ప్రత్యేక సంస్థగా రూపొందించింది.

అవాస్తవికమైన, నిస్సారమైన గాంధీజీ రాజకీయ కార్యాచరణ విధానంతో మిక్కిలి విసుగు చెందిన కాంగ్రెసు వాదులలోని ఒక సెక్షను చిత్తరంజన్‌దాసు, మోతీలాల్ నెహ్రూల నాయకత్వంలో కాంగ్రెసులోనే స్వరాజ్య పార్టీని స్థాపించింది. ఎన్నికలలో పాల్గొని లెజిస్లేటివ్ కౌన్సిళ్లలో ప్రవేశించి తమ పోరాటాన్ని కొనసాగించాలని వారు నిర్ణయించుకున్నారు. క్రమక్రమంగా స్వరాజ్య పార్టీ బలం పుంజుకొని 1925 సంవత్సరానికల్లా కాంగ్రెసులో మెజారిటీని సంపాదించింది. గాంధీజీ సృష్టించిన స్తబ్ధతను తొలగించి పోరాటమార్గాన్ని సుగమం చేయాలని వీరు భావించారు. కానీ ఈ స్వరాజ్య పార్టీ నాయకత్వం కూడ ఆస్తిపరవర్గాల చేతుల్లో యుండడం వలన ఈ కర్తవ్యాన్ని నిర్వహించడం వారికి కూడ అసాధ్యమైంది. ఉద్యమంలో

ఒక (విప్లవాత్మకమైన) పెద్దమార్పు తేవాలంటే కార్మిక–కర్షక ఐక్య పోరాటాలకు మద్దతు నిచ్చి వాటిని ముందుకు తీసికొనిపోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కాని యీ విధంగా కార్మిక – కర్షక ఐక్యపోరాటాలకు మద్దతు నివ్వడమంటే ఒకే సమయంలో జాతీయ విముక్తి సాధనకు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగానూ, విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారీ వర్గాలు, ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు సాగించే పోరాటమని అర్థం. అందువలన కార్మిక, రైతాంగ విప్లవ పోరాటాలను ప్రోత్సహించి, వాటిని తీవ్రతరం చేయడం ధనిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ఈ నాయకత్వానికి సాధ్యం కాలేదు.

1923 ఎన్నికలల్లో గెలిచి కేంద్ర (సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ) విధాన సభలో ప్రవేశించిన (స్వరాజ్యపార్టీ సభ్యులు) స్వరాజ్యిస్టులు ప్రభుత్వానికి తమ సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. సామ్రాజ్యవాదంతో వీరవలంబించిన యీ రాజీ విధానం కొన్ని అనివార్య ఫలితాల నెదుర్కొనవలసి వచ్చింది. ఉద్యమం వెనుకంజ వేయడాన్ని గమనించిన బ్రిటిషు ప్రభుత్వం స్వరాజ్యిస్టులు ప్రజా ఉద్యమాలకు దూరమయ్యారని గ్రహించింది. దీనితో దేశ ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలపై తమ పట్టును మరింత బిగించింది. 1927వ సంవత్సరం చివరి భాగంలో బ్రిటిషు ప్రభుత్వం సైమన్ కమిషన్ నియామకాన్ని ప్రకటించింది. ఈ కమిషన్‌లో భారత ప్రజల ప్రతినిధే లేడు.

ఇదే సమయంలో నూతన శక్తులుదయించడం ప్రారంభమై, ప్రజలలో ఒక నూతన అవగాహన పెంపొందడం ప్రారంభమయింది. విదేశీ సామ్రాజ్యవాదుల, స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా ఒకేసారి పోరాటం సాగించవలసిన ఆవశ్యకతను ప్రజలు గుర్తిస్తున్నారు. బెంగాల్, బొంబాయి, మద్రాసు లాహోరు తదితర ప్రాంతాల్లో కమ్యూనిస్టు భావాలు గల్గినవారు చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి, వారు పరస్పరం సంబంధాలేర్పరచుకొని సోషలిస్టు భావాల వ్యాప్తికి కృషి చేయడం ప్రారంభించారు.

1922వ సంవత్సరంలో గయలో జరిగిన జాతీయ కాంగ్రెసు సమావేశం పరిశీలనకు ప్రవాస భారత కమ్యూనిస్టు పార్టీ ఒక కార్యక్రమాన్ని ప్రతిపాదించింది. కాంగ్రెసు భారత దేశ వాస్తవ పరిస్థితుల ప్రాతిపదికగా పరిపూర్ణమైన కార్యక్రమం యివ్వకపోవడమేగాక సంపూర్ణ స్వాతంత్ర్యం విషయం కూడ ప్రస్తావించలేదు. ప్రారంభంలో వలస దేశంగా వుంటూనే స్వపరిపాలన సాగించుకుంటూ క్రమంగా స్వరాజ్యాన్ని కోరాలనేది కాంగ్రెసు లక్ష్యం. స్వరాజ్యం ఎలా ఉంటుందో, దాని ఫలితాలు ఎలా ఉంటాయో స్వరాజ్యిస్టులకు తెలియదు. స్వాతంత్రోద్యమానికి నాయకత్వం వహిస్తున్న వారికి లక్ష్యం గురించి ఏ మాత్రం స్పష్టత లేని కారణంగా భారత జాతీయోద్యమం పెడదారులు పెట్టిన తరుణంలో భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్యసాధనకై ఒక స్పష్టమైన కార్యక్రమాన్ని కాంగ్రెసు సమావేశం ముందుంచింది.

**జాతీయ విముక్తికి, పునర్నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమంలో**

**భారతకమ్యూనిస్టు పార్టీ ఈ క్రింది డిమాండ్లు చేసింది :**

1. సామ్రాజ్యవాదులతో ఏవిధమైన సంబంధాలులేని, పరాయిపాలకుల పర్యవేక్షణ లేని సంపూర్ణ జాతీయ స్వాతంత్ర్యం.

2. వయోజన ఓటింగు ద్వారా జాతీయ అసెంబ్లీకి ఎన్నికలు జరపడం. ఉన్నతాధికారాలు గలిగిన ఈ జాతీయ అసెంబ్లీ ద్వారా ప్రజలు పరిపాలన సాగించాలి.

3. ఇండియాను ఒక ఫెడరల్ రిపబ్లిక్ సమాఖ్య రాజ్యంగా స్థాపించాలి.

భారత కమ్యూనిస్టు పార్టీ తన సాంఘిక, ఆర్థిక కార్యక్రమంలో ఇతర అంశాలతో పాటు భూస్వామ్య విధానం రద్దు, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ప్రవేశపెట్టడం, ప్రభుత్వ సహకారంతో ఆధునాతన పరిశ్రమలను అభివృద్ధి చేయడం, కార్మికులకు 8 గంటల పనిదినం, పరిశ్రమలన్నింటిలోనూ కనీస వేతనాన్ని చట్టబద్ధంగా నిర్ణయించడం, కార్మిక సంఘాలకు చట్టబద్ధమైన గుర్తింపు, కార్మికుల సమ్మె హక్కు గుర్తించడంతోబాటు కార్మికులు, రైతాంగం కొరకు అభ్యుదయకర చర్యలు తీసికొనడం, స్త్రీలకు పూర్తిగా సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను గ్యారంటీ చేయడం, లౌకిక తత్వాన్ని పెంపొందించడం, రిజర్వు సైన్యాన్ని (స్టాండింగ్ ఆర్మీ) రద్దుచేయడం, మరియు జాతీయ స్వాతంత్ర్య పరిరక్షణకు ప్రజానీకాన్ని సాయుధులను చేయాలని కూడా తన కార్యక్రమంలో చెప్పింది.

ఈ కార్యక్రమాన్ని అమలు జరపడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను కూడ ప్రకటించింది. దానిలో ఈ విధంగా పేర్కొన్నది.

1. భూస్వాముల అత్యాచారాలకు, మితిమీరిన శిస్తులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్న పేద రైతాంగానికి నాయకత్వం వహించాలి.

2. "పన్నులు, శిస్తులు చెల్లించం" అనే నినాదంతో దేశవ్యాప్తంగా ప్రజా ప్రదర్శనలు నిర్వహించడంద్వారా రైతాంగానికి మద్దతునివ్వాలి.

3. అధిక ధరలు, రైల్వే, పోస్టల్ ఛార్జీలు పెంపుదల, ఉప్పుపన్ను, తదితర పరోక్ష పన్నుల పెంపుదలకు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటనను నిర్వహించాలి.

4. కార్మిక సంఘాల గుర్తింపుకు, కార్మికుల న్యాయమైన కోర్కెల సాధనకు సమ్మె హక్కు కోసం పోరాటం సాగించాలి.

5. పారిశ్రామిక కార్మికులకు 8 గంటలపని దినం, కనీస వేతనం, మెరుగైన గృహ వసతి సాధించాలి.

6. విస్తృతంగా సమ్మెలు జరుగుతున్నపుడు, అవకాశం వచ్చినపుడల్లా వీటిని సార్వత్రిక (జనరల్) సమ్మెలుగా మార్చడం ద్వారా ఈ కోర్కెలను బలపరచాలి.

7. రాజకీయంగానూ, ఆర్థికపరంగా కాంగ్రెసు నిధుల నుండి యీ సమ్మెలకు సహాయ సహకారాలు అందించాలి.

8. వాక్సభా పత్రికా స్వాతంత్ర్యాల కోసం ఆందోళన చేయాలి.

9. పట్టణాలలో అధికంగా ఉన్న ఇంటి అద్దెలకు వ్యతిరేకంగా సమ్మెలు నిర్వహించాలి.

10. దేశ వ్యాప్తంగా జాతీయ వలంటీరు దళాన్ని నిర్మించాలి.

11. జీతాల పెంపుదల కోసం గవర్నమెంటు, వాణిజ్య సంస్థల ఆఫీసుల్లో పనిచేసే గుమాస్తాలు, ఇతర ఉద్యోగుల సమ్మెలను నిర్వహించాలి.

12. కౌన్సిళ్ళను చిన్నాభిన్నంచేసే ఉద్దేశంతో మాత్రమే వాటిలో ప్రవేశించాలి.

13. రాజకీయ ఖైదీల విడుదలకు విస్తృతంగా ప్రజా ప్రదర్శనలు నిర్వహించాలి.

కాని గయ కాంగ్రెసు మహాసభలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ కార్యక్రమాన్ని మహాసభ కనీసం ప్రతినిధుల పరిశీలనకు కూడ పెట్టలేదు. అయినప్పటికీ యీ కార్యక్రమం విశేష ప్రచారం పొందింది. 'రాయిటర్' వార్తా సంస్థ కూడ ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి మొత్తం కార్యక్రమాన్ని టెలిగ్రాం ద్వారా పంపింది. కలకత్తా నుండి ప్రచురించబడే 'అమృత బజార్' పత్రిక తదితర వార్తా పత్రికలీ కార్యక్రమాన్ని ప్రచురించాయి.

"చారిత్రకంగా గయ కాంగ్రెసుకు పంపిన కార్యక్రమమే భారత కమ్యూనిస్టు పార్టీ ప్రప్రథమ కార్యక్రమమని గుర్తించుకోవాలి. భారత దేశ రాజకీయాల్లో ఇది విశిష్టమైనది. ఈ విధంగా ప్రజానీకపు కోర్కెలను ముందుకు తీసుకురావడం ఇదే ప్రథమం" అని శ్రీ ముజఫర్ అహ్మద్ పేర్కొన్నారు.

1922 సం॥ నవంబరు 5 నుండి డిశంబరు 5 వరకు మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 4వ కాంగ్రెసు (మహాసభ) గయలో జరుగుతున్న జాతీయ కాంగ్రెసు సమావేశానికి సందేశం పంపింది. బ్రిటిషువారి పెత్తనానికి వ్యతిరేకంగా భారత ప్రజానీకం సాగిస్తున్న చారిత్రాత్మకమైన పోరాటానికి బ్రిటన్‌తో సహా అన్ని సామ్రాజ్యవాద దేశాల్లోని విప్లవ శ్రామికవర్గం తన సంపూర్ణ సానుభూతిని, మద్ధతును వ్యక్తం చేసిందని సందేశంలో పేర్కొనడం జరిగింది. "ప్రగతి నిరోధకశక్తులైన ఉన్నత వర్గాల నుండి పూర్తి స్వేచ్ఛను పొందాలంటే పరదేశీయుల జోక్యంలేని ప్రజాస్వామ్య రిపబ్లిక్ స్థాపననే తన రాజకీయ కార్యక్రమంగా జాతీయ కాంగ్రెసు ఖండితంగా ప్రకటించాలని సందేశం పేర్కొన్నది. విప్లవం ద్వారా ప్రజారాజ్యం స్థాపించేందుకు

ప్రజాబాహుళ్యపు విప్లవ చైతన్యాన్ని పెంపొందించవల్సి వున్నందున, రాజకీయ కార్యక్రమంతో పాటు, ఆర్థికపరమైన సమస్యలపై కార్యక్రమం కూడ చేపట్టడం అత్యావశ్యకం" అని యీ సందేశంలో కోరడం జరిగింది.

దేశంలోనూ, విదేశాల్లోనూ భారత కమ్యూనిస్టుల కార్యకలాపాలు, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో వారి సంబంధాలు బ్రిటిష్ సామ్రాజ్యవాదులను బెంబేలెత్తించాయి. కార్మికుల్లో పెంపొందుతున్న చైతన్యం, వారు సాగిస్తున్న మిలిటెంట్ ఆర్థిక పోరాటాలు చూచిన సామ్రాజ్యవాద ప్రభుత్వం కలవరపడింది. అందువలన ఈ ఉద్యమాన్ని మొగ్గలో ఉండగానే త్రుంచివేయాలనే తలంపుతో, భారతదేశంలో బోల్షివిజాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణతో 1924లో ప్రభుత్వం ముజఫర్ అహమ్మద్, యస్.ఎ. డాంగే, షౌకత్ ఉస్మానీ, నళినీ భూషన్ దాస్ గుప్తాలను నిర్బంధించింది. "కమ్యూనిస్టు కాన్పూరు కుట్రకేసు 1924" అని ప్రసిద్ధికెక్కిన ఈ కేసు విచారణలో నిందితులు భారతదేశంలో కమ్యూనిస్టు కార్యకలాపాలు సాగిస్తూ, కమ్యూనిస్టు భావాలు ప్రచారం చేస్తున్నారని, కార్మికులను, రైతాంగాన్ని సంఘటిత పరుస్తున్నారని వారిపై అనేక ఆరోపణలు మోపడం జరిగింది. గయ కాంగ్రెస్‌కు కమ్యూనిస్టు పార్టీ పంపిన కార్యక్రమాన్ని పై నలుగురిపై చేసిన నేరారోపణకు ఆధారంగా ప్రభుత్వం ఉదహరించింది. ఈ విచారణలో నలుగురిని దోషులుగా నిర్ణయించి ఒక్కొక్కరికి నాలుగు సంవత్సరాల జైలుశిక్ష విధించారు.

భారత కార్మిక వర్గ రాజకీయోద్యమాన్ని మొగ్గలో వుండగానే త్రుంచి వేయడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం బాహాటంగా చేసిన ప్రయత్నమే యీ కేసు విచారణ అని స్పష్టంగా తెలుస్తోంది. కాని ప్రభుత్వం తీసుకున్న యీ చర్య కార్మికవర్గ రాజకీయ పోరాటం మరింత ఉధృతంకావడానికి, కార్మికవర్గ సిద్ధాంతం మరింత త్వరగా దేశంలో వ్యాప్తి చెందడానికి తోడ్పడింది. సమరశీల రాజకీయ కార్యకలాపాలు సాగిస్తున్న అనేక బృందాలు త్వరత్వరగా ఏకంకావడం ఈ నూతన ఆదర్శానికొక రూపం ఇవ్వడం చూస్తే ప్రభుత్వ అణచివేత చర్యలు విఫలమవడమేగాక, ఎంతగా వ్యతిరేక ఫలితాలనిచ్చాయో అర్థమవుతుంది. కాంగ్రెసు వాదుల్లోనూ, ఇతరుల్లోనూ వామపక్షభావాలు కల్గినవారు, సోషలిజానికి కట్టుబడినవారు, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సమరశీల భావాలు గల్గిన ట్రేడ్ యూనియన్ ఉద్యమకార్యకర్తలు సన్నిహితమయ్యారు. కార్మికవర్గ రాజకీయ సంస్థలు ఏర్పడటం ప్రారంభమైంది. "వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ" (కార్మిక రైతాంగపార్టీ) అనే పేరుతో దేశంలో అనేకచోట్ల యీ రకమైన సంస్థలు ఏర్పడ్డాయి. 1925 నవంబరు 1వ తేదీన బెంగాల్‌లో మొట్టమొదటి వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ ఏర్పాటు చేయబడింది. తరువాత 1927 ఫిబ్రవరి 8వ తేదీన బొంబాయిలో ప్రారంభింపబడగా, 1928 ఏప్రిల్ 12వ తేదీన "కీర్తి కిసాన్ పార్టీ' పేరుతో పంజాబులో కూడా ఏర్పాటు చేయబడింది. 1928 సం॥ అక్టోబర్ 14వ తేదీన యునైటెడ్ ప్రావిన్సెస్‌లో కూడా పార్టీ ఆవిర్భవించింది. వివిధ ప్రాంతాలలో విడివిడిగా ఏర్పడి కార్యకలాపాలు సాగిస్తున్న

ఈ పార్టీలనన్నింటిని ఏకం చేసి 1928 డిశంబరు 21 నుండి 24 వరకు కలకత్తాలో జరిగిన సదస్సులో ఆలిండియా వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీని స్థాపించబడింది. పంజాబుకు చెందిన శ్రీ సోహన్‌సింగ్ జోష్ అధ్యక్షునిగానూ, బొంబాయికి చెందిన శ్రీ ఆర్.ఎస్.నింబ్కర్ కార్యదర్శిగానూ ఎన్నుకోబడ్డారు. ముజఫర్ అహ్మద్‌ను బెంగాల్ శాఖ కార్యదర్శిగా కొనసాగించడం జరిగింది. భారతదేశంలోని యువ కమ్యూనిస్టు కార్యకర్తలు వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీలోనే వుండి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

ఈ పార్టీ కార్మికవర్గ సిద్ధాంతాన్ని సరిగ్గా ప్రతిబింబించ లేకపోయింది. కార్మికవర్గ రాజకీయాలకు ఒక రూపకల్పన చేసే ఈ ప్రథమ ప్రయత్నంలో అనేక గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. రాజకీయ స్పష్టత లేనప్పటికి, కొన్ని లోపాలు ఉన్నప్పటికి, ఈ పార్టీ నిర్మాణం నూతన రాజకీయ శక్తుల పురోభివృద్ధికి, భారత కార్మికవర్గంలో నానాటికి పెరుగుతున్న రాజకీయ చైతన్యానికి నిదర్శనంగా నిలచింది.

## అంతర్జాతీయ పరిస్థితి

1919లో లెనిన్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (మూడవ ఇంటర్నేషనల్)ను స్థాపించిన తరువాత 1921 జూన్‌లో మాస్కోలో ఈ ఇంటర్నేషనల్ మూడవ కాంగ్రెసు (సమావేశం) జరిగింది. ఈ కాంగ్రెసు ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గ విప్లవ పోరాటాలకు మిక్కిలి సహాయపడింది.

రష్యాలో సోషలిజాన్ని నాశనం చేయడానికి అంతర్జాతీయ సామ్రాజ్యవాదం సంఘటితంగా చేసిన సాయుధ జోక్యాన్ని విజయవంతంగా త్రిప్పి కొట్టిన, సోవియట్ రష్యా, త్వరత్వరగా ప్రగతి సాధిస్తూ, పెట్టుబడిదారీ విధానం కూలిపోవడం అనివార్యమని, సోషలిస్టు సమాజ పురోభివృద్ధిని నిరోధించడం ఎవరితరం కాదని నిరూపించింది. ప్రపంచ సోషలిస్టు విప్లవానికి కంచుకోటవలె నిలిచి సామ్రాజ్యవాద దేశాలలోని శ్రామిక ప్రజానీకం, వలస దేశాలలోని పీడిత ప్రజానీకం విప్లవ పోరాటాలు సాగించడంలో సోవియట్ రష్యా మార్గదర్శి అయింది.

వలస అర్థవలస దేశాలలో జాతీయ విముక్తి ఉద్యమాలు విప్లవాలుగా పెల్లుబికినాయి. మంగోలియా ప్రజలు సామ్రాజ్యవాదానికి, ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటం 1921లో విజయవంతమై మంగోలియన్ రిపబ్లిక్ అవతరించింది.

ఒకవైపు జాతీయ విముక్తి పోరాటాలు అభివృద్ధి చెందుతుండగా, వేరొక వైపు పెట్టుబడిదారీ దేశాలలోని శ్రామిక ప్రజానీకం సాగిస్తున్న విప్లవ పోరాటాలు వెనుక పట్టుపట్టాయి. 1920 సం॥ చివరిభాగంలోనూ, 1921 సం॥ ప్రారంభంలోనూ పెట్టుబడిదారీ దేశాలలో నూతన శిఖరాలకు చేరిన కార్మికవర్గ విప్లవ పోరాటాల పురోగతిని అధికారంలో వున్న బూర్జువా

వర్గం సోషల్ డెమోక్రాట్ల సహాయంతో తాత్కాలికంగానైనా నిరోధించడంలో విజయవంతమైంది. ఉత్తర ఇటలీ, జెకోస్లావేకియా, మధ్య జర్మనీలలో శ్రామికవర్గం సాగించిన సమ్మెలు, తిరుగుబాట్లను బూర్జువావర్గం పాశవికంగా అణచివేసింది.

1920-21 మధ్యకాలంలో పెట్టుబడిదారీ దేశాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకొని పోయినప్పటికీ, ఆ దేశాలలోని కార్మికవర్గం ఆత్మరక్షణ (తమ హక్కుల పరిరక్షణ) పోరాటాలకు పరిమితం కావల్సివచ్చింది. ఈ పోరాటాలు కూడా బూర్జువా వర్గ తీవ్రదాడులకు గురై చాలవరకు విఫలమయ్యాయి.

కార్మికవర్గంలోని అత్యధికుల్లో పలుకుబడిగల్గిన సంస్కరణవాద నాయకుల మద్దతుతో యూరపు, అమెరికా దేశాల్లోని బూర్జువా వర్గం టెర్రరిస్టు (భయోత్పాతం కల్గించే) పద్ధతుల ద్వారానూ, కుట్రలు చేయడం ద్వారా కొన్ని సందర్భాల్లో రాయితీలు కల్పించడం ద్వారానూ విప్లవ పోరాటాలను అణచి వేయడం జరుగుతుండేది. పెట్టుబడిదారీ దేశాలలో విప్లవ పోరాటాలు వెనుకంజ వేసిన యీ దశలో సంఘ సంస్కర్తల సంస్థాగత పలుకుబడి, బూర్జువావర్గం చేతిలోవున్న అధికారం, వారి అనుభవం వంటి అంశాలు రాజకీయ పరిపక్వత లేని ప్రజాసామాన్యాన్ని భ్రమలకు గురిచేయడంతో దీని ఫలితంగానే బూర్జువా ప్రజాస్వామ్యంలో తమ ప్రయోజనాలు పరిరక్షింపబడతాయని ప్రజలు నమ్మసాగారు. అందువలన అనేకమంది కార్మికులు, ఇతర తరగతుల శ్రామిక ప్రజానీకం సరైన విప్లవ పంథాను గ్రహించలేక సంఘ సంస్కర్తల ననుసరించడం జరిగింది.

సంస్కరణవాదం శ్రామిక జనాన్ని ఎంతగా మోసం చేసిందంటే, 1921 సం॥లో సోషల్ డెమోక్రటిక్, సోషలిస్టు పార్టీలలో సుమారు 8 మిలియన్లు (80 లక్షలు) మంది సభ్యులుగా చేరారు. సంస్కరణవాద నాయకత్వంలోని అంతర్జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) (ఆమ్స్టర్డామ్ ఇంటర్నేషనల్) సుమారు 22 మిలియన్ల (2 కోట్ల 20 లక్షలు) సభ్యత్వం కల్గియున్నది.

సోషలిస్టు పార్టీలు, ట్రేడ్‌యూనియన్ల మితవాద అభివృద్ధి నిరోధక, సంస్కరణ వాద నాయకులు “వర్గశాంతి”ని, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెంది సోషలిజానికి దారితీస్తుందని ప్రబోధిస్తూ, ప్రపంచ యుద్ధానంతర పరిస్థితుల్లో విప్లవం లేకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా, ప్రపంచంలోని కార్మికవర్గం సోషలిజాన్ని సాధించగలదనీ, అందువలన పార్లమెంట్ ఎన్నికలలో విజయం సాధించడమే కార్మిక వర్గం తక్షణ కర్తవ్యమని ప్రకటించారు. వర్గపోరాటం ఒక నిర్ణయాత్మకమైన దశలో నున్నపుడు, సోషల్ డెమోక్రాట్లు తరచుగా విప్లవ విధ్వంసకుల పాత్ర నిర్వహించడం చూస్తే, వారనుసరించిన విధానం ఎంత ప్రమాదకరమైనదో స్పష్టమవుతుంది.

సంస్కరణవాద నాయకులు వర్గ పోరాటాలకు చేసిన హానివలన కార్మికవర్గం బలహీనపడడంతో, పెట్టుబడిదారీ దేశాలలోని బూర్జువావర్గం తాత్కాలికంగానైనా కార్మికవర్గం మీద విజయం సాధించ గల్గింది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా విప్లవ పోరాటాల ఉధృతి కొద్దిగా మందగించినప్పటికీ, బూర్జువా వర్గానికి, సంస్కరణ వాదులకు ఈ విప్లవాల నాపేశక్తి మాత్రంలేదు. పెట్టుబడిదారీ విధాన సాధారణ సంక్షోభం మరింత తీవ్రం కావడంతో విప్లవకర పరిస్థితులేర్పడ్డాయి.

ప్రపంచంలో విప్లవ పరిస్థితులు నెలకొన్న ఈ సమయంలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మూడవ కాంగ్రెసు సమావేశమై కార్మికవర్గంలో ట్రేడ్ యూనియన్లు నిర్వహించవల్సిన పాత్ర, కమ్యూనిస్టుల కర్తవ్యాలను గురించి సుదీర్ఘంగా చర్చించింది. రాజకీయ పోరాటంలో ట్రేడ్ యూనియన్లు తటస్థంగా ఉండాలనే సంస్కరణవాదుల వాదనను ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ కార్మికవర్గంలో అంతర్జాతీయ పెట్టుబడికి ప్రధాన ఆధారంగా ఉన్నదని సమావేశం పేర్కొన్నది. (కార్మికవర్గంలో అంతర్జాతీయ పెట్టుబడికి ఏజంటుగా ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్ పనిచేస్తోంది.) దీనికి వ్యతిరేకంగాను, కార్మికవర్గాన్ని చీల్చే సంస్కరణవాదుల ఎత్తుగడలకు వ్యతిరేకంగాను పోరాటం సాగించటం తన తక్షణ కర్తవ్యంగా పేర్కొన్నది.

"ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ రివల్యూషనరీ ట్రేడ్ అండ్ ఇండస్ట్రియల్ యూనియన్స్" మొదటి సమావేశం 1921 జులై 8 నుండి 18వ తేదీ వరకు మాస్కోలో జరిగింది. కొమింటర్న్ (కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) మూడవ కాంగ్రెసు కూడ ఇదే సమయంలో జరిగింది. ట్రేడ్ యూనియన్ల అంతర్జాతీయ సంస్థ సమావేశానికి లెనిన్ అత్యంత ప్రాధాన్యత నిచ్చాడు. ఈ కాంగ్రెసుకు శుభాకాంక్ష సందేశాన్ని పంపుతూ లెనిన్ "ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ప్రాధాన్యతను గురించి పూర్తిగా చెప్పడానికి మాటలు చాలవు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలోను ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు కమ్యూనిస్టు భావాలవైపు విశేషంగా ఆకర్షించబడుతున్నారు. ఇది చెదురుమదురుగా సాగుతోంది. వెయ్యి (అనేక) ఆటంకాలనధిగమిస్తోంది. ఐనప్పటికి ఈ ప్రక్రియ, (ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు కమ్యూనిస్టు భావాలవైపుకు ఆకర్షించబడడం) అప్రతిహతంగా కొనసాగుతోంది. ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఈ ఉద్యమాన్ని వేగవంతం చేస్తుంది. ట్రేడ్ యూనియన్లలో కమ్యూనిజం విజయం సాధించి తీరుతుంది. పెట్టుబడిదారీ విధానం కూలిపోకుండా ఆపడం గానీ, బూర్జువా వర్గంపై కార్మికవర్గం విజయం సాధించకుండా ఆపడంగానీ ఈ భూమిపై ఏ శక్తికీ సాధ్యం కాదు" అని చెప్పారు.

అప్పటికే అనేక దేశాల్లో ట్రేడ్ యూనియన్లు విప్లవ పంథాలో పనిచేస్తున్నాయి. వీటన్నింటినీ ఏకంచేయడం మిక్కిలి అవసరమని భావించిన ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్,

అంతర్జాతీయ స్థాయిలో ఒకే సమరశీల పోరాట సంస్థ, రెడ్ ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ (ప్రొఫింటర్న్)ను స్థాపించాలని నిర్ణయించింది. అదే సమయంలో సంస్కరణవాదుల నాయకత్వంలోని సంఘాల్లో పనిచేస్తున్న విప్లవభావాలు కల్గిన ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు ఆ సంఘాలను వదలిపెట్టడం గాని, వేరుగా సంఘాలను గాని ఏర్పాటుచేయడం గాని గాక, ఆ సంఘాలను మనవైపుకు త్రిప్పుకునేందుకు కృషి చేయవల్సిందిగా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ పిలుపునిచ్చింది.

ప్రొఫింటర్న్‌కు ఎస్.ఎ.లొజొస్కీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్‌లో లేని కేంద్ర ట్రేడ్ యూనియన్‌లను ఇతర ట్రేడ్ యూనియన్‌లను ప్రొఫింటర్న్ ఏకం చేసింది. ఆల్ రష్యా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ఆస్ట్రేలియా, బెల్జియం, బల్గేరియా, కెనడా, చిలీ, చైనా, కొలంబియా, జెకోస్లోవేకియా, ఎస్టోనియా, ఫ్రాన్సు, హాలెండ్, ఇండోనేషియా, ఐర్లండ్, కొరియా, లిథూనియా, మంగోలియా, పర్షియా, పెరు, ఉరుగ్వే దేశాలలోని జాతీయ విప్లవ కేంద్ర ట్రేడ్ యూనియన్లతో పాటు, అనేక ఇతర పెట్టుబడిదారీ దేశాలలోని సంస్కరణవాద ట్రేడ్ యూనియన్లలోని ప్రతిపక్ష గ్రూపులు, ఈ రెడ్ ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ పతాకం కిందకు వచ్చాయి.

పెట్టుబడిదారులు, ఫాసిస్టుల దాడులకు, సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా విప్లవ పోరాటాలు సాగించాలనే ప్రాతిపదిక మీద ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఏకం చేయడాన్ని కొమింటర్న్ కాంగ్రెస్ బలపరుస్తూ సోవియట్ రష్యాలోని కార్మికవర్గంతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవల్సిందిగా కోరింది.

ఒకవైపు విప్లవపంథాలో పనిచేస్తున్న ట్రేడ్ యూనియన్లతో ఒక అంతర్జాతీయ సంస్థ నేరవేర్చడంతో పాటు, ప్రపంచ కార్మికోద్యమాన్ని ఏకం చేయడం పట్ల ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం మిక్కిలి ఆసక్తి చూపింది.

1924 జూన్ 17న మాస్కోలో ప్రారంభమైన కొమింటర్న్ 5వ మహాసభ, ప్రపంచ కార్మికోద్యమ ఐక్యత మీద ప్రొఫింటర్న్ ప్రధాన కార్యదర్శి లొజోవోస్కీ సమర్పించిన నివేదిక మీద ఒక ముఖ్యమైన తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానం ఈ విధంగా పేర్కొంది.

"ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఉద్యమ ఐక్యతా సాధనకు సాగే పోరాటం, కొమింటర్న్ కార్య రూపాల్లో అత్యంత ప్రముఖ స్థానమాక్రమించింది. సంఘం ద్వారా ఏవో మహత్తులు చేయాలని కొమింటర్న్ భావించడం లేదు. ట్రేడ్ యూనియన్ల మధ్య పోరాటం సాగించడం ద్వారా కమ్యూనిస్టులు సాధారణ ప్రజలతో నిత్య సంబంధాలు

కల్గి వుండి కమ్యూనిస్టు పార్టీలు మరియు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పలుకుబడిని విస్తరింపజేస్తున్నారని కొమింటర్న్ దృఢంగా నమ్మింది. ప్రజల విశ్వాసం చూరగొనేందుకు ట్రేడ్‌యూనియన్ ఉద్యమ ఐక్యత కోసం పోరాటం సాగించడమనేది ముఖ్య సాధనం".

1924 జూలై నెలలో మాస్కోలో జరిగిన ప్రొఫింటర్న్ నాల్గవ కాంగ్రెస్ "అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ ఐక్యత" నినాదాన్ని మరింత ముందుకు తీసుకుపోయి, ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్‌తోనూ, బ్రిటిషు ట్రేడ్ యూనియన్ల జనరల్ కౌన్సిల్‌తోనూ యీ విషయమై చర్చలు సాగించాలని తీర్మానించింది. ఈ బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ల జనరల్ కౌన్సిల్‌లోని వామపక్షీయులు అప్పటికే ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఐక్యత పట్ల ఆసక్తి కలిగియున్నారు.

సరిగ్గా ఈ సమయానికే ఇటలీ ఫాసిజం కార్మికవర్గ విప్లవోద్యమాలకు పెనుముప్పుగా తయారైంది. అందువలన ఈ సమావేశం ఇటలీలో ఫాసిస్టు వ్యతిరేక పోరాట లక్ష్యాలను గురించి చర్చించి, విశాల ప్రజానీకం, – ముఖ్యంగా యావత్ కార్మికవర్గం మరియు కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల మీద ఫాసిస్టు వ్యతిరేక పోరాట ఫలితాలు ఆధారపడి వుంటాయని ఈ సమావేశం సూచించింది.

ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్య సంఘటన ఎత్తుగడలను, పోరాట పంథాను రూపొందించుకుని, అంతర్జాతీయ స్థాయిలో అమలు జరుపుతుండగా పెల్లుబుకుతున్న జాతీయ విముక్తి ఉద్యమాల వెల్లువ సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు తమ కార్యకలాపాలను మరింత ఉధృతంగా సాగించేందుకు ప్రోత్సాహమిచ్చింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న అనేక సంస్థల ప్రతినిధులు 1926ఫిబ్రవరిలో బెర్లిన్‌లో సమావేశమై "వలస దోపిడికి వ్యతిరేక సమితి" నేర్పరచారు. ప్రపంచ వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న దేశాల ప్రజల ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయిలో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేయాలని కూడా యీ సమావేశం నిర్ణయించింది.

పై నిర్ణయం ప్రకారం 1927 ఫిబ్రవరి 10వ తేదీన బ్రస్సెల్స్‌లో వలస దోపిడీకి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయస్థాయిలో సమావేశం జరిగింది. మొత్తం మీద 37 స్వతంత్ర, వలస దేశాల్లోని అణచివేతకు గురవుతున్న ప్రజలు, కార్మికవర్గం మేధావుల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బ్రిటిష్, భారత, చైనా దేశాల ప్రతినిధి వర్గాలు సంయుక్తంగా ఒక ముఖ్యమైన తీర్మానాన్ని ప్రతిపాదించగా కాంగ్రెసు దానిని ఆమోదించింది.

వర్గపోరాట సిద్ధాంతం ప్రాతిపదికగా, అణచివేతకు గురవుతున్న దేశాల్లోని పీడిత ప్రజానీకంతో భుజం భుజం కలిపి పోరాటం సాగించి, విముక్తి సాధించవల్సిందిగా తీర్మానం సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గాన్ని కోరింది.

"సామ్రాజ్యవాద వ్యతిరేక, వలసదోపిడీ వ్యతిరేక, జాతీయ స్వాతంత్ర్య సాధనసమితి" పేరిట ఒక అంతర్జాతీయ సంస్థ నేర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. 1927 జులైలో జార్జి డిమిట్రోవ్ ఇలా వ్రాశారు. "ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక అంతర్జాతీయ సమితి ప్రధానంగా పెద్దవలస దేశాలలోనూ, అర్ధవలస దేశాలలోనూ, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు ఏర్పడిన సంస్థ. బాల్కన్‌దేశాలు (ఆల్బేనియా, బోస్నియా, హెర్జ్‌గోవినా, బల్గేరియా, క్రొవేషియా, గ్రీస్, కొసోవో, మాసెడోనియా, మాన్ ట్రినెగ్రో, రుమేనియా, స్లోనేనియా, సెర్బియా, టర్కీలతో కూడిన బాల్కన్ ద్వీపకల్పం, అనువాదకుడు)ను కూడా ఈ ఉద్యమంలో కలుపుకుపోవడం

# 12

# ఆర్థిక మాంద్యం : కార్మికవర్గ ఆత్మరక్షణా పోరాటం (1922-26)

## దోపిడీకి పరాకాష్ట

భారతదేశంలో ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో 1922లో వ్రేళ్ళూనిన మాంద్య పరిస్థితులు మరింత తీవ్రతరం కావడం ప్రారంభమైంది. 1929లో సంభవించిన ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యం, ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సాధారణ సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను కుదిపివేసింది. భారత ఆర్థిక వ్యవస్థ వీటి ప్రభావానికి తీవ్రంగా గురయింది. దీనితో భారత కార్మికవర్గం క్లిష్టపరిస్థితుల నెదుర్కొనవలసి వచ్చింది. ఫలితంగా కార్మికవర్గం క్రొత్త రాయితీలను సాధించడం సాధ్యం కాకపోగా, వారు పోరాటాల ద్వారా సాధించుకున్న సదుపాయాలను పరిరక్షించు కొనడానికి నిర్ణయాత్మకమైన పోరాటాలు సాగించవలసి వచ్చింది.

తీవ్ర ఆర్థిక మాంద్యంతో పాటు, సామ్రాజ్యవాదుల దోపిడీ తీవ్రతరమవడంతో భారత ఆర్థిక వ్యవస్థలోని వలస విధాన దుర్లక్షణాలు బహిర్గత మవడం ప్రారంభమైంది. మొదటి ప్రపంచయుద్ధం వల్ల అనేక పరిశ్రమలకు తాత్కాలిక లాభాలు ఒనగూడినాయి. పరిశ్రమలు విస్తృతమయ్యే అవకాశాలేర్పడ్డాయి. పరిమితంగానయినప్పటికీ క్రొత్త పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేసింది. అయితే వాస్తవాలు పరిశీలిస్తే యుద్ధకాలంలో భారతదేశంలో పారిశ్రామికీకరణ క్రమబద్ధంగా జరగలేదని, చాల అడ్డదిడ్డంగా జరిగిందని స్పష్టమవుతుంది. మాంటెంగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల ద్వారా భారతదేశంలోని పారిశ్రామిక, వాణిజ్య, భూస్వామ్య వర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించబడినప్పటికీ, యుద్ధానంతర కాలంలో బ్రిటిషు పెట్టుబడిదారులు భారత మార్కెటును తమ వ్యాపారానికి ప్రత్యేక ప్రాంతంగా ఉంచుకోవడానికి అత్యంత ఆసక్తి చూపారు. బ్రిటిష్ ప్రభుత్వ ద్రవ్య విధానాలు సైతం బ్రిటిషు పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణకుద్దేశించబడ్డాయనేది బహిరంగ విషయం. ఇది అనివార్యంగా భారత, బ్రిటిష్ పెట్టుబడిదారుల మధ్య ఘర్షణ తీవ్రమవడానికి దారితీసింది.

ఇదిలా ఉండగా మార్కెట్లను హస్తగతం చేసుకోవడంలో పాశ్చాత్య పెట్టుబడిదారీ వర్గంతో జపాన్ తీవ్రంగా పోటీపడడంతో, భారతదేశంలో పరిశ్రమలు మరింత దెబ్బతిన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వర్గం తీవ్రంగా పోటీపడడంతో పాటు భారతదేశంలో దారిద్ర్యం రోజురోజుకూ పెచ్చరిల్లిపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి దేశీయ మార్కెట్లు కుంచించుకు పోవడం జరిగింది. ఈ ప్రతికూల పరిస్థితి నెదుర్కొనవలసి రావడంతో భారతదేశంలోని టెక్స్టైల్ మిల్లు యజమానులు స్వార్థంతో కార్మికవర్గం మీద దాడులు చేయడం ప్రారంభించారు.

కార్మికుల జీతాలు తగ్గించడానికి మిల్లు యజమానులు ప్రయత్నాలు చేశారు. సామ్రాజ్యవాద దేశాల పెట్టుబడిదారులు, స్వదేశ పెట్టుబడిదారుల మధ్య తీవ్రమైన పోటీకి దురదృష్టవశాత్తు యీ దేశంలోని కార్మికవర్గం బలి కావలసివచ్చింది. కాని కార్మికులు యీ పెట్టుబడిదారీ వర్గాల దాడులకు తలొగ్గక ప్రతిఘటించారు. భారత కార్మికవర్గం తన జీవన ప్రమాణాలను నిలబెట్టుకొనడం కోసం తీవ్రమైన పోరాటాలను సాగించవలసి వచ్చింది.

కార్మికుల మీద సాగుతున్న యీ ఆర్థిక పరమైన దాడుల వలన కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయి. బొంబాయి లేబర్ ఆఫీసు జరిపిన విచారణ ప్రకారం 1921 – 23 మధ్యకాలంలో బొంబాయి కార్మికుల రోజువారీ ఆహార వినిమయం పరిమాణంలో ఖైదీల ఆహార వినిమయంకంటే తక్కువగా ఉన్నదని బొంబాయి లేబర్ ఆఫీస్ విచారణలో తేలింది. మద్రాసు లేబర్ డిపార్టుమెంటు జరిపిన మరొక దర్యాప్తులో కూడ ఈ రకమైన సిగ్గుమాలిన విషయాలే బయటపడ్డాయి. ఈ 20వ శతాబ్దంలోని మూడవ దశాబ్దంలో కూడ (1920 – 30 సం॥ల మధ్య) కార్మికులకు గృహవసతి అమానుషంగా ఉంది. శిశు మరణాల రేటు భయం కల్గించేదిగా ఉన్నది. 1938లో అంతర్జాతీయ లేబర్ కాన్ఫరెన్సులో మాట్లాడుతూ శ్రీ ఎన్.వి.పరులేకర్ ఈ పరిస్థితిని "కార్మికవర్గపు శిశువుల సామూహిక హత్యాకాండ"గా చిత్రించారు.

మిల్లు యజమానులు పరిశ్రమల క్రమబద్ధీకరణకు పూనుకోవడంతో, అసలే క్రమక్రమంగా క్షీణిస్తున్న కార్మికుల జీవన పరిస్థితులు మరింత క్షీణదశకు చేరుకున్నాయి. దేశంలో ప్రజల కొనుగోలు శక్తి క్షీణించడంతో, దేశీయ మార్కెటు కుంచించుకు పోయింది. వస్తువుల ఉత్పత్తి అవసరాలను మించిపోయింది. ఈ సంక్షోభంతో బాటు యజమానులు చేపట్టిన పరిశ్రమల క్రమబద్ధీకరణల వలన ఉద్యోగవకాశాలు దారుణంగా పడిపోవడంతో మరో సంక్షోభం తలెత్తింది. వాస్తవాలను పరిశీలించినట్లయితే 1922 – 27 సం॥ల మధ్యకాలంలో దాదాపు అన్ని ప్రధానమైన పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య స్థిరంగా వుండగా మరికొన్ని పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. మూడు ప్రధాన పరిశ్రమలు పత్తి, జనుము, బొగ్గుగని పరిశ్రమల్లో ఆయా సంవత్సరాలలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన వివరాలను పరిశీలించినట్లయితే ఈ విషయం స్పష్టమవుతుంది.

**పత్తి పరిశ్రమ**

| సం | మిల్లుల సంఖ్య | పనివారి సంఖ్య |
|---|---|---|
| 1922 | 264 | 3,27.000 |
| 1923 | 271 | 3,24,000 |
| 1924 | 275 | 3,25,000 |
| 1925 | 281 | 3,32,000 |
| 1926 | 275 | 3,39,000 |
| 1927 | 280 | 3,45,000 |

**జనపనార పరిశ్రమ**

| సం | మిల్లుల సంఖ్య | పనివారి సంఖ్య |
|---|---|---|
| 1922 | 85 | 3,20.000 |
| 1923 | 88 | 3,27,000 |
| 1924 | 90 | 3,39,000 |
| 1925 | 88 | 3,42,000 |
| 1926 | 91 | 3,33,000 |
| 1927 | 90 | 3,32,000 |

**బొగ్గు గనులు**

| సం | గనుల సంఖ్య | రోజుకు సగటు పనివారి సంఖ్య |
|---|---|---|
| 1922 | 953 | 1,84,355 |
| 1923 | 942 | 1,82,661 |
| 1924 | 846 | 1,87,088 |
| 1925 | 810 | 1,73,140 |
| 1926 | 722 | 1,70,628 |
| 1927 | 644 | 1,65,213 |

దేశ జనాభా అతివేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పారిశ్రామిక కార్మికుల సంఖ్య స్థిరంగా ఉండడంలో నున్న ప్రాముఖ్యతను, అర్థం చేసుకోవాలి. జనాభా లెక్కల ప్రకారం 1921లో 318 మిలియన్లు (31 కోట్ల 80 లక్షలు) వున్న జనాభా 1931 నాటికి 352 మిలియన్ల (35 కోట్ల 52 లక్షలు) కు పెరిగింది. ఇలా జనాభా పెరగడం వలన సహజంగానే పనిచేయగలిగి ఉద్యోగావసరం వున్నవారి సంఖ్య కూడా పెరిగింది. అనేక భారాలకు లోనయిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గ్రామసీమల్లో పుట్టి పనిచేయగలిగిన వారికి కూడ ఏ విధమైన పని చూపలేకపోవడంతో వారు గ్రామాలను వదలి పారిశ్రామిక కేంద్రాలకు చేరడం జరిగింది. భారతదేశంలో పరిశ్రమలకు మొట్టమొదటిసారిగా పుష్కలంగా శ్రామికులు లభించారు. అంటే సంవత్సరం సంవత్సరానికి అవసరాన్ని మించి శ్రామిక సైన్యం తయారవుతోందన్నమాట.

భారతదేశంలోని లేబర్ మార్కెట్‌లో ఇది పూర్తిగా ఒక నూతన పరిస్థితి. గతంలో శ్రామికునికి మంచి డిమాండు ఉండేది. కాని నేడు ఆ పరిస్థితి తారుమారై ఉద్యోగం కోసం శ్రామికులు పోటీపడవలసిన పరిస్థితి ఏర్పడింది. భారతదేశంలో శ్రామికులను గురించి అధ్యయనం చేసిన రాయల్ కమీషన్ తన అభిప్రాయాన్ని యిలా చెప్పింది. "శాశ్వత ప్రాతిపదికన స్థాపించబడిన ఫ్యాక్టరీలలో చాలావరకు అన్ని కాలాలలోనూ శ్రామికులు అవసరాలకు సరిపడా ఉన్నారు. అంతేగాక కొన్ని ఫ్యాక్టరీలలో అవసరాలకు మించి అదనంగా కార్మికులున్నారు. ఈ మార్పు క్రమక్రమంగా జరుగుతోంది. కొన్ని కేంద్రాలలో ఈ మార్పు త్వరితగతిన సాగుతుంటే మరికొన్ని కేంద్రాలలో కొంత మందంగా సాగుతోంది. గత ఐదు సంవత్సరాల కాలంలో ఈ

మార్పు సంభవించిందనడం వాస్తవమే. ఈ పరిస్థితికి ముందు శ్రమది పై చేయిగా ఉండేది. శ్రామికులకు మంచి గిరాకీ ఉండేది. కాని తరువాత రోజుల్లో దీనికి భిన్నంగా పనికోసం శ్రామికులే పోటీ పడవలసి వచ్చింది." ముగింపులో రాయల్ కమీషన్ ఒక ముఖ్యమైన వ్యాఖ్యానం చేసింది. 'ఈ మార్పు (శ్రామికుని కోసం పరిశ్రమాధిపతులు పోటీపడే స్థితి నుండి పనికోసం శ్రామికులే పోటీపడే స్థితికి వచ్చిన మార్పు) యొక్క ప్రాముఖ్యతను కొండంతలు చేసి చెప్పడం సాధ్యం కాదు. ఇంతకు ముందు యజమానుల అధికారాలు పరిమితంగా ఉండేవి. వారి ఫ్యాక్టరీలలో చాలినంత మంది కార్మికులను ఎల్లప్పుడు ఉంచుకోవాల్సిన అవసరం వుండడంతో కొందరు యజమానులు గృహవసతి తదితర సదుపాయాలు కల్పించడం ద్వారా కార్మిక సంక్షేమానికి ఎంతో చేయవల్సివుండేది. కార్మికుల పనితనం (సామర్థ్యం) లో లోపం క్రమశిక్షణా రాహిత్యాలను యజమానులు సహించి వుండవలసివచ్చేది. ఈ నూతన పరిస్థితి కనుక కొనసాగినట్లయితే మంచిగాని, చెడు గాని యజమానులకు ఇంతకు మున్నెన్నడు లేని విశేష అధికారాలు లభిస్తాయి. అదే సమయంలో ఇప్పటివరకు అణచివేతకు వ్యతిరేకంగా ఆత్మరక్షణ చేసుకుంటున్న కార్మికవర్గానికి ఆ అవకాశాలు పోతాయి."

నిరుద్యోగులైన శ్రామిక జనంతో పారిశ్రామిక కేంద్రాలు క్రిక్కిరిసి పోవడంతోపాటు, పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు తీవ్రంగా పడిపోవడంతో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాటం సాగించే కార్మికవర్గానికి ప్రతికూల పరిస్థితులేర్పడ్డాయి. ఈ పరిస్థితులు భారత కార్మికుని జీవిత విధానంపై శాశ్వతంగానే ప్రతికూల ప్రభావం చూపాయి. ఈ విధమైన ప్రతికూల పరిస్థితులు శాశ్వతంగా కొనసాగడం వలసదేశాలలోని కార్మిక వర్గం ప్రత్యేకత. అభివృద్ధి చెందిన దేశాలలోని కార్మికవర్గం సంక్షోభ సమయాల్లో తప్పితే మరెన్నడూ ఈ రకమైన నష్టదాయకమైన పరిస్థితులను ఎదుర్కొనవలసిరాలేదు.

అందువలన భారతదేశంలోని కార్మిక వర్గం అతి క్లిష్ట పరిస్థితులలో పోరాటాలు సాగించవలసి వచ్చింది. ఈ పోరాటాలు క్రొత్త హక్కులు, సదుపాయాలకు కాక, సంపాదించుకున్న హక్కులు, సదుపాయాల పరిరక్షణకు మాత్రమేసాగాయి. 1920-21 సం॥లలో వున్న పోరాటాల ఉధృతి చాలావరకు తగ్గిపోయి 1922 - 27 సం॥ల మధ్య కాలంలో సమ్మె పోరాటాల సంఖ్య చాల తగ్గిపోయింది. అయినప్పటికీ 1927 సం॥ నుండి ఈ పరిస్థితులకు భిన్నంగా మరల విస్తృతంగానూ, ఉధృతంగానూ కార్మికవర్గ పోరాటాలు ప్రారంభమై, 1929 నాటికి 1920-21 నాటి స్థాయికి చేరుకున్నాయి. ఈ సమయంలో సాగిన తీవ్ర పోరాటాలు సుదీర్ఘకాలం సాగినప్పటికీ తరచుగా కార్మికవర్గం ఓడిపోవడం జరిగింది. 1927లో పోరాటాలు విస్తరించిన తర్వాత 1928లో సాగిన పోరాటాలు అతి తీవ్రంగానూ, సుదీర్ఘంగానూ సాగాయి.

ఈ సమ్మె పోరాటాల విషయమై, భారతదేశంలో విచారణ జరిపిన రాయల్ కమీషన్ ఈ కార్మికవర్గ పోరాటాలకు సంబంధించి సేకరించిన ఈ క్రింది గణాంకాలు పరిస్థితిని వివరిస్తాయి.

**పారిశ్రామిక వివాదాల గణాంక వివరాలు**

| సం॥ | సం॥లో ప్రారంభమైన సమ్మెల సంఖ్య | సమ్మెచేసిన కార్మికుల సంఖ్య (వేలలో) | నష్టపోయిన పని దినాల సంఖ్య (లక్షలలో) |
|---|---|---|---|
| 1921 | 376 | 600 | 70 |
| 1922 | 272 | 435 | 40 |
| 1923 | 209 | 301 | 51 |
| 1924 | 132 | 312 | 87 |
| 1925 | 133 | 270 | 126 |
| 1926 | 127 | 187 | 110 |
| 1927 | 129 | 132 | 202 |
| 1928 | 200 | 507 | 316 |
| 1929 | 134 | 531 | 122 |
| 1930 | 145 | 196 | 23 |

పై పట్టికను గమనించినట్లయితే 1921 నుండి పారిశ్రామిక వివాదాలలో తగ్గుదల, 1928 నుండి మరల పెరగడం వెల్లడవుతుంది. మొత్తం సమ్మె పోరాటాలలో మూడింట రెండు వంతులు జీతాలు, బోనసు సమస్యల మీద, మిగిలినవి రిట్రెంచ్ మెంట్స్, కార్మికులను పనిలో నుండి తీసివేయడం వంటి సమస్యలమీద జరిగినట్లు భారతదేశంలో కార్మికుల స్థితిగతుల మీద విచారణ జరిపిన రాయల్ కమిషన్ నివేదిక వెల్లడించింది. అంటే యీ హక్కుల పరిరక్షణ పోరాటాలు (ఆత్మరక్షణ పోరాటాలు) కార్మిక వర్గం సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న బోనస్, జీతాలను పరిరక్షించుకొనడంతో పాటు రిట్రెంచ్‌మెంట్లు, డిస్మిసల్స్ మొదలైన దాడులకు వ్యతిరేకంగా సాగినవే.

ఈ సమ్మె పోరాటాలలో వేర్వేరు ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమలలోని కార్మికులు పాల్గొన్నారు. ఆనాటి పరిస్థితుల స్వభావాన్ని అర్థం చేసుకొనడానికి కొన్ని అత్యావశ్యకం గాని

విషయాలను వదిలివేసి, ముఖ్యమైన సమ్మె పోరాటాల సందర్భంగా జరిగిన సంఘటనలను పరిశీలిద్దాం.

## కొన్ని ప్రధానమైన సమ్మె పోరాటాలు

జంషెడ్‌పూర్‌లోని టాటా ఇనుము ఉక్కు కర్మాగారంలో బ్రహ్మాండమైన సమ్మె పోరాటం జరిగిన రెండు సంవత్సరాల అనంతరం, మరల అదే కర్మాగారంలో 1922 సెప్టెంబరులో మరొక గొప్ప సమ్మె జరిగింది.

ఈ సమయంలోనే ఇనుము – ఉక్కు రంగంలో కొన్ని ప్రధానమైన మార్పులు సంభవించాయి. ప్రపంచవ్యాప్తంగా ఉక్కుధర పడిపోవడం, యూరపులో కార్మికుల వేతనాలు తగ్గించడం జరుగుతున్న సమయంలోనే టాటా కంపెనీ విస్తరణకు పూనుకుంది. ఈ విధానంవల్ల కంపెనీ పెట్టుబడి రెట్టింపయింది.

సరిగ్గా ఈ సమయంలోనే డిస్మిస్ చేయబడిన ఇద్దరు ఉద్యోగులను తిరిగి పనిలోకి తీసుకోవాలని, యూనియన్‌ను గుర్తించాలని, 8 గంటల జనరల్ షిఫ్టును అమలుపరచాలనీ, ఓవర్‌టైమ్ చేయాలని కార్మికులను నిర్భంధించరాదని, బోనస్ తదితర కోర్కెలతో కార్మిక సంఘం యాజమాన్యానికి ఒక విజ్ఞాపనపత్రం సమర్పించుకున్నది. 1922, సెప్టెంబరు 19న ప్రారంభమయిన సమ్మె సంపూర్ణంగా విజయవంతమైంది. కానీ యాజమాన్యపు మొండివైఖరి వలన సమ్మె సుదీర్ఘకాలం జరగడంతో, కార్మికులలో అసహనం ప్రబలింది. ఎ.ఐ.టి.యు.సి. ప్రతినిధిగా దివాన్‌చమన్‌లాల్ అక్టోబర్ 20వ తేదీన జంషెడ్‌పూర్ వచ్చి మేనేజిమెంటుతో సంప్రదింపులు జరిపి కొన్ని విషయాలలో యాజమాన్యంతో అంగీకారానికి వచ్చాడు. కార్మికుల సమస్యల పరిష్కారానికి మేనేజ్‌మెంట్, కార్మికులు ఇరుపక్షాల నుండి చెరొక పదిమంది ప్రతినిధులతో ఒక కమిటీ ఏర్పాటుచేయడం అంగీకారం కుదిరిన విషయాలలో ఒకటి. యూనియన్ గుర్తింపు సమస్య చేపట్టేందుకు ఎ.ఐ.టి.యు.సి. హామీ ఇచ్చింది. ఈ షరతులతో కార్మికులు సమ్మె విరమించి అక్టోబరు 23వ తేదీన తిరిగి పనిలో చేరారు.

కాని వెనువెంటనే యూనియన్ సెక్రటరీ శ్రీ జి. సేథీతో సహా పలువురు ఉద్యోగులను యాజమాన్యం బర్తరఫ్ చేయడంతో ఉద్రిక్త పరిస్థితులేర్పడ్డాయి. పైపెచ్చు సమ్మె చేయనివారిని కూడా సంప్రదింపుల కమిటీలో చేర్చాలని యాజమాన్యం పట్టుబట్టడంతో పరిస్థితులు మరింత విషమించాయి.

చివరకు 1924లో జంషెడ్‌పూర్‌లో ఈ తీవ్ర అశాంతి పరిస్థితుల్లోనే కన్సిలియేషన్ కమిటి చివరకు 1924లో జంషెడ్‌పూరలో సమావేశమైంది. కార్మికుల తరపున కమిటీకి చిత్తరంజన్‌దాస్ నాయకత్వం వహించగా, చమన్‌లాల్, ఎన్.ఎం. జోషీ, రెవరెండ్ సి.ఎఫ్. ఆండ్రూస్ తదితర కార్మికేతరులతో సహా కొందరు లేబర్ అసోసియేషన్ సభ్యులు కూడా ఈ కమిటీలో వున్నారు. వీరుగాక మోతీలాల్ నెహ్రూ, రంగస్వామి అయ్యంగార్ పరిశీలకులుగా

ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు అన్ని అంశాలమీద ఇరు పక్షాలకు అంగీకారం కుదిరింది. కాని యూనియన్ గుర్తింపు విషయంలోను, ప్రధానంగా శ్రీ జి. సేథీని పనిలోకి తీసుకొనే విషయాలలో ప్రతిష్టంభన ఏర్పడింది. రెవరెండ్. సి.ఎఫ్. ఆండ్రూస్‌ను అధ్యక్షునిగా యూనియన్‌ను గుర్తించడానికంగీరించడంతో ఈ విషయంలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగింది. తరువాత యాజమాన్యం అసోసియేషన్ గుర్తించి శ్రీ సేథీని తిరిగి ఉద్యోగంలోకి తీసుకొనడం జరిగింది.

ఆనాటి సమ్మె పోరాటాలలో నూలు బట్టల పరిశ్రమలోని కార్మికులు సాగించిన సమ్మెలు ప్రధానమైనవి. బోనస్ డిమాండు ప్రధాన డిమాండ్లలో ఒకటిగా వుండడం ఈ సమ్మె పోరాటాల్లో ప్రత్యేకించి గమనించదగ్గ విషయం. ఆనాటికే కార్మికులు బోనసును “వాయిదాపడిన వేతనం”గా పరిగణించడం ప్రారంభించారు.

సూరత్‌లోని 3 వేలమంది టెక్స్‌టైల్ కార్మికులు సగటు నెల జీతంలో 42 1/2 శాతం బోనసు కోరుతూ 1922 అక్టోబర్‌లో సమ్మె చేశారు. స్థానిక కలెక్టరు యీ వివాదంలో జోక్యం చేసుకుని 25 శాతం బోనసుకు అంగీకరించ వలసినదిగా కార్మికులను కోరాడు. అక్కడి కార్మికులు తగినంతగా సంఘటితంకానందున సమ్మె భగ్నమైంది. 200 మంది కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించారు.

గత సంవత్సరపు అవార్డును యజమానులు అమలు జరపక పోవడంతో అహమ్మదాబాద్‌లోని మిల్లు కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. ఇదిలా వుండగా 1-4-1923 నుండి కార్మికుల వేతనాలలో 20 శాతం కోతను విధిస్తున్నట్లు మిల్లు యజమానుల సంఘం ప్రకటించింది. ఈ జీతాలలో కోత నిర్ణయానికి నిరసనగా 56 మిల్లులలోని 43,000 మంది కార్మికులు బ్రహ్మాండమైన సమ్మె చేశారు. ఈ సమ్మె 2 నెలలపైగా సాగి 24 లక్షల పనిదినాలు నష్టంకావడానికి దారి తీసింది. అతి క్లిష్టమైన పోరాటం సాగిస్తున్న ఈ కార్మికులకు సమ్మెను మరికొంత కాలం కొనసాగించడానికి కావలసిన ఆర్థిక స్తోమతు లేదు. సుదీర్ఘకాలం సాగిన ఈ పోరాటంతో అలసిపోయిన చాలమంది కార్మికులు పారిశ్రామిక కేంద్రాలను వదిలి తమ తమ గ్రామాలకు తరలిపోయారు. చిట్టచివరకు ఆర్బిట్రేషన్ అవార్డు ప్రకారం 16 శాతం జీతాలలో కోతకు అహ్మదాబాదు టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్ అంగీకరించడంతో కార్మికులు తిరిగి పనుల్లో చేరారు.

కార్మికుల వేతనాలలో కోత విధించడంలో అహమ్మదాబాదు మిల్లు యజమానులు పొందిన విజయంతో ఉత్సాహం పొందిన బొంబాయి మిల్లు యజమానుల సంఘం అప్పటికే ఐదేండ్లుగా బోనసు పొందుతున్న బొంబాయి మిల్లు కార్మికులకు వార్షిక బోనసు చెల్లింపు నిలిపివేస్తూ 1923 జులైలో నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మిక్కిలి అసంతృప్తి చెందిన కార్మికులు ఈ ప్రయత్నాలను, ప్రతిఘటించాలని నిశ్చయించుకున్నారు. 1924 జనవరి 17 నుండి బొంబాయిలోని 1,60,000 మంది టెక్స్‌టైల్ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ

సమ్మె 2 నెలలకు పైగా సాగి 7 లక్షల 75 వేల పనిదినాలు నష్టమయ్యాయి. ఎ.ఐ.టి.యు.సి. మాజీ అధ్యక్షుడు జోసెఫ్ బాప్టిస్టా తదితర కార్మిక నాయకులు సమ్మె చేయవద్దని కార్మికులకు సలహా ఇచ్చారు. అయినప్పటికీ సమ్మె ప్రారంభం కావడంతో వీరు ఒప్పందం కుదర్చడానికి తీవ్ర కృషి చేశారు. కాని బోనస్ ఆపివేయడంతో ఆగక యాజమాన్యం వేతనాలలో కోత పెడుతుందని కార్మికులు భావించసాగారు. చివరకు సమ్మెను పరిష్కరించడానికి బాప్టిస్టా అధ్యక్షునిగా, సహస్ర బూధే కార్యదర్శిగా, ఎన్.ఎమ్.జోషీ, హెచ్.ఎస్. ఝబ్‌వాలా, ఎఫ్.జె. గిన్వాలా, కంజీ ద్వారకాదాస్‌లతో సహా మరి ఇద్దరు కార్మికులు సభ్యులుగా, ఒక కమిటీ ఏర్పాటు చేయబడింది.

ఈ సమస్యను ఆర్బిట్రేషన్‌కు సమర్పించవలసిందిగా ఈ కమిటీ గవర్నమెంటును కోరింది కాని ఆర్బిట్రేషన్‌కు పంపడానికి మిల్లు యజమానులు నిరాకరించారు. బోనసు అనేది లాభాల మీద ఆధారపడి యజమానులు తమ ఇష్టానుసారం చెల్లించే సొమ్మేగాని వేతనాలలో భాగం కాదని వాదించసాగారు. యజమానులు లాకౌట్ ప్రకటించారు. కార్మికులను లొంగతీసుకునేందుకు చేసిన ఈ ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ప్రభుత్వ సిఫారసులను గౌరవించి బోనసు సమస్యను న్యాయ పరిష్కారానికి సమర్పించడానికి మిల్లు యజమానులు అంగీకరించారు. కాని కమిటీకి నివేదించే అంశాలు ముందుగా యజమానుల ఆమోదం పొందాలన్న షరతు పెట్టారు. ప్రభుత్వం బొంబాయి ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన ఒక విచారణ కమిటీని ఏర్పాటుచేసింది. యాజమాన్యాల ఆజ్ఞలకు లోబడి వారు చెప్పిన అంశాలనే కమిటీ పరిశీలించవలసిన అంశాలుగా స్వీకరించింది. వీటి ననుసరించి "సాంప్రదాయసిద్ధంగా గాని, న్యాయం, చట్టం ప్రకారం గాని కార్మికులకు బోనసును హక్కుగా అమలు జరపాలా, గడిచిన సంవత్సరాలలో లాభాలతో పోల్చి కార్మికులు బోనసు డిమాండ్ చేయడం అన్యాయం కాదా" అనే అంశాలపై కమిటీ తన రిపోర్టు యివ్వవలసియున్నది. ఈ పరిస్థితుల్లో విచారణ సంఘం నిర్ణయాలు ఎలాగుండేదీ స్పష్టంగా తెలుస్తూనేయున్నది. యజమానులకు పూర్తిగా అనుకూలంగా ఈ కమిటీ మార్చి12వ తేదీన ప్రచురించిన నివేదికలో "కార్మికులు బోనసును హక్కుగా పొందే అవకాశం లేదనీ, వారికి బోనసు చెల్లించగల్గినంతటి లాభాలు యజమానులకు రావడంలేదని" పేర్కొన్నది.

కార్మికులు సాగించిన ఈ సుదీర్ఘ పోరాటాన్ని పరిశీలించినట్లయితే, వీరు ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా తీవ్రమైన సమ్మె పోరాటాలను సాగించడానికి దృఢనిశ్చయంతో వున్నారనేది స్పష్టమవుతుంది. చాలాకాలం జీతాలు లేకపోయినా, సమ్మె నిధులు లేకపోయినా బయటనుండి సహాయసహకారాలు లేకపోయినా వీటన్నింటికి మించి వారికొక పటిష్టమైన సంఘం లేకపోయినా, యీ కార్మికులు రెండున్నర నెలలపాటు అచంచలమైన దీక్షతో పోరాటాన్ని సాగించారు. ఈ పోరాటాలలో కార్మికులు రక్తాన్ని కూడా చిందించాల్సివచ్చింది. కొన్ని సంఘర్షణలు జరగడం, పోలీసులు సమ్మెచేస్తున్న కార్మికులపై కాల్పులు జరపడం వంటి సంఘటనలు కూడా యీ పోరాటంలో చోటుచేసుకున్నాయి. విచారణ సంఘం తమ రిపోర్టును

ప్రచురించిన పిమ్మట 1924 మార్చి 25న కార్మికులు సమ్మె విరమించిన తరువాత మాత్రమే ఫ్యాక్టరీ ఆవరణ నుండి పోలీసు బలగాలను ఉపసంహరించడం జరిగింది.

ఈ విధంగా దురాశాపరులైన మిల్లు యజమానులు యింతటితో ఆగక కార్మికులపై దాడులను తీవ్రతరం చేశారు. (1924 సం॥) అదే సంవత్సరం జూలై నెలలో ఆహారం కోసం కార్మికులకు యిచ్చే అలవెన్సులో కోత విధిస్తున్నట్లు వారుప్రకటించారు. ఈ అలవెన్సు తగ్గించడం వలన కార్మికుల వేతనాలలో 11 1/2 శాతం కోత ఏర్పడింది. బొంబాయి లేబర్ ఆఫీస్ అదే నెలలో తయారు చేసిన గణాంకాల ప్రకారం టోకు ధరల సూచి 180 పాయింట్లకు, వినిమయ ధరల సూచి 190 పాయింట్లకు (1914 = 100) పెరిగిన యీ సమయంలో కార్మికుల వేతనాలలో యజమానులు కోత విధించబూనడం గమనార్హం.

మిల్లు యజమానులు ఒకదానివెంట ఒకటిగా చేసిన ఈ దాడులు బొంబాయిలోని టెక్స్‌టైల్ పరిశ్రమలో ఒక తీవ్ర పరిస్థితిని సృష్టించాయి. ఈ పరిస్థితులపై ఎ.ఐ.టి.యు.సి. తీవ్రంగా ఆందోళన చెంది టెక్స్‌టైల్ పరిశ్రమలోని పరిస్థితిపై సమగ్ర విచారణ జరపడానికి ఒక కమిటీని ఏర్పరచాలని, ఆ కమిటీ రిపోర్టు వెలువడేవరకు యజమానులు విధించిన జీతాలలో కోతను ఆపుచేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

మోతీలాల్ నెహ్రూ నాయకత్వంలో కొందరు శాసనసభ్యులు కార్మికుల ఆహార అలవెన్సు తగ్గింపు విషయమై మధ్యవర్తిత్వానికి ప్రయత్నం చేశారు. కాని మిల్లు యజమానులు ఈ విషయంలో ఏ రకమైన మధ్య వర్తిత్వానికి అంగీకరించలేదు. ఇదిలా వుండగా ఈ వివాదంలో జోక్యం చేసుకొవడానికి బొంబాయి గవర్నరు కూడా తిరస్కరించాడు. అంతేగాక పరిశ్రమలపై ఆర్థికపరమైన భారాన్ని కొంతవరకు తగ్గించడానికి పత్తిపై ఎక్సైజ్ డ్యూటీని రద్దుచేయాలనే యజమానుల డిమాండును పరిశీలించడానికి కూడ గవర్నరు తన అశక్తతను వ్యక్తంచేశాడు.

ఈ పరిస్థితుల్లో కార్మికులు మరల సమ్మె చేయక తప్పలేదు. 1925 సెప్టెంబరు 15న కొన్ని మిల్లుల్లో మాత్రమే ప్రారంభమైన సమ్మె సెప్టెంబర్ 26 నాటికి వెల్లువలా అన్ని మిల్లులకు ప్రాకింది. 1 లక్ష 60 వేలకుపైగా కార్మికులు పాల్గొన్న ఈ సమ్మెవల్ల 11 మిలియన్ల (1కోటి 10 లక్షలు) పనిదినాలు నష్టమయ్యాయి. ఈ సమ్మె సుదీర్ఘ కాలం కొనసాగే పరిస్థితులేర్పడడంతో సమ్మె బొంబాయి టెక్స్ టైల్ పరిశ్రమలో యింతకు ముందెన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరుకొంది.

అతి క్లిష్టపరిస్థితుల్లో అనేక కష్టనష్టాల కోర్చి దృఢదీక్షతో సుమారు ఆరువారాల పాటు బ్రహ్మాండమైన పోరాటం సాగించిన కార్మికులు విజయానికి చేరువయ్యారు. ప్రత్తిపై ఎక్సైజు సుంకాన్ని తాత్కాలికంగా రద్దుచేయాలని ప్రభుత్వ నిర్ణయాన్ని డిశంబరు 1వ తేదీన భారత వైస్రాయి ప్రకటించాడు. ఈ నిర్ణయం ప్రకటించబడిన వెంటనే డిశంబరు 3వ తేదీన వేతనాలలో కోత విధించాలనే త నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ మిల్లు యజమానులు ప్రకటించారు. దీనితో కార్మికులు విజయోత్సాహంతో పనిలోకి తిరిగి ప్రవేశించారు.

డిశంబరు 1వ తేదీన తాత్కాలికంగా రద్దుచేయబడిన పత్తిపై ఎక్సైజ్ సుంకం ఆ తర్వాత పూర్తిగా రద్దుచేయబడింది. ఇక్కడ ఒక గమ్మత్తయిన విషయాన్ని గమనించాలి. కార్మికులపై ఆర్థికపరమైన దాడులు సాగించి వారు సమ్మె చేసేటట్లు చేయడం ద్వారా మిల్లు యజమానులు ప్రత్తిపై ఎక్సైజు సుంకం రద్దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

ఈ విధంగా సుదీర్ఘకాలం పోరాటం సాగించిన కార్మికుల కృత నిశ్చయం అనేకమందిని ఆశ్చర్య చకితులను చేసింది. ఈ సమ్మె కాలంలో కార్మికులలో కనీసం 60 శాతం మంది తమ తమ గ్రామాలకు చేరుకోగా అనేకమంది కాయగూరలు వగైరా అమ్మడం ద్వారా జీవనోపాధి సంపాదించుకున్నారు. సమ్మె చేస్తున్న కార్మికులకు సహాయం చేయడానికి శ్రీ ఎన్.ఎం.జోషీ అధ్యక్షతన ఒక కమిటి ఏర్పడింది. సమ్మె చేస్తున్న కార్మికులకు బొంబాయి మున్సిపల్ కౌన్సిల్ సహాయమందించింది. అంతేగాక దేశంలోని అనేక ప్రాంతాల నుండి చాలా సంస్థలు కార్మికులకు ఆర్థిక సహాయం అందించాయి.

విదేశాలలోని కార్మికులుకూడ సమ్మె చేస్తున్న బొంబాయి కార్మికులకు సహాయమందించడం మరువరానిది. బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఆమ్స్టర్ డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, లండన్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్టైల్స్ వర్కర్స్ మరియు మాస్కో టెక్స్టైల్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మె చేస్తున్న కార్మికులకు ఆర్థిక సహాయమందించాయి.

ఆనాటి భారత ప్రభుత్వ గూఢచారి విభాగం డైరెక్టర్ సర్ డేవిడ్ పేట్రీ "1924–27 సం॥ మధ్య కాలంలో భారతదేశంలో కమ్యూనిజం" అనే తన రచనలో యీ విధంగా వ్రాశాడు.

"సోషలిస్టు రష్యాలోని (సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, మాస్కో) టెక్స్టైల్స్ కార్మికులు, సమ్మె చేస్తున్న కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బొంబాయిలోని ఎఐటియుసి కమిటీకి కేబుల్ ద్వారా సందేశం పంపారు. వారి సహాయార్థం 10,000 రూబుళ్ళు వాగ్దానం చేశారు. సమ్మెచేస్తున్న కార్మికులతో సంఘీభావం తెల్పుతూ ఆమ్స్టర్‌డామ్ నుండి అనేక ప్రకటనలు వెలువడ్డాయి.

**సమ్మె చేస్తున్న కార్మికులకు విదేశాల నుండి ఈ క్రింది మొత్తాలందాయి.**

1. లండన్‌లోని బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు నుండి రూ. 6742.10.0

2. ఆమ్స్టర్ డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నుండి రూ. 17591-5-4.

3. లండన్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్టైల్ వర్కర్స్ అసోసియేషన్ నుండి రూ. 6,049/-.

ఇవేకాక ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శి శ్రీ యన్.యం. జోషీకి శక్లత్‌వాలా ద్వారా మాస్కో టెక్స్‌టైల్ వర్కర్స్ యూనియన్ రూ. 13,832 పంపింది. ఈ మొత్తంలో సమ్మె జరుగుతుండగా రూ. 2000/- సమ్మె విరమణ జరిగిన తర్వాత మిగిలిన రూ. 11,382 అందాయి. సమ్మె తదనంతరం అందిన సొమ్ము బాధ్యతను శ్రీయుతులు ఎఫ్.జె. గిన్వాలా, ఎస్. హెచ్. ఝుబ్వాలా, ఎన్.యం. జోషీ, ఆర్.ఆర్.బాఖలే, కంజీద్వారకాదాస్‌లతో ఏర్పడిన ఒక కమిటీకి అప్పగించబడింది. ప్రధానంగా ఈ మొత్తంతోనే, (బొంబాయి లేబర్ రిలీఫ్ ఆర్గనైజేషన్‌ఫండ్) బొంబాయి శ్రామిక సహాయ నిర్వహణనిధి ఏర్పాటు చేయబడింది.”

ఈ కాలంలో జరిగిన మరొక ప్రధానమైన సమ్మె 1925 మార్చి 15న రావల్పిండిలోని వాయువ్య రైల్వే (ఎన్.డబ్ల్యు.ఆర్) వర్క్‌షాపులో ప్రారంభమై త్వరత్వరగా వాయవ్య రైల్వే అంతటా వ్యాపించింది. ఈ సమ్మెను వాయవ్య రైల్వే యూనియన్ నిర్వహించింది. గతంలో గార్డుగా పనిచేసిన జె.బి.మిల్లర్, మరియు ఎమ్.ఎ.ఖాన్, హెచ్.టి.హావ్‌లు ఈ సమ్మె నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించారు. ఒక యూనియన్ కార్యకర్తపై తీసుకున్న క్రమశిక్షణాచర్యకు వ్యతిరేకంగా ఈ సమ్మె ప్రారంభమైనప్పటికీ, జీతాల పెంపుదల, 8 గంటల పనిదినం, రిట్రెంచ్‌మెంట్ నిలుపుదల, 1920 నుండి రిట్రెంచ్ చేయబడిన వారందరినీ తిరిగి పనుల్లోకి తీసుకోవాలనే అంశాలు కూడ సమ్మెలో ప్రధాన డిమాండ్లుగా వున్నాయి.

ఈ సుదీర్ఘమైన సమ్మెలో 22 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడానికి రైల్వే అధికారులు పాశవిక పద్ధతుల నవలంభించడంతో అదే సంవత్సరం (1925) జులై నెలలో సమ్మె విఫలమైంది. సమ్మె విరమణ తర్వాత మొత్తం 22 వేలమంది కార్మికుల్లో 14వేలమందిని మాత్రమే పనిలోకి తీసుకుని మిగిలిన 8వేలమందిని సర్వీసు నుండి తొలగించారు. ఈ సమ్మె ఇంగ్లండ్‌లోని ట్రేడ్ యూనియన్ల దృష్టినాకర్షించింది. లండన్‌లోని వర్కర్స్ వీక్లీ పత్రిక 1925 మే 22వ తేదీన ఈ సమ్మెను గురించి వ్రాస్తూ, “ఇది ఈ దేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమం తీవ్రంగా పరిగణించ దగిన విషయం ఈనాడు ఇండియాలో ఒక ట్రేడ్ యూనియన్ తీవ్రదాడులకు గురవుతోంది. భారతదేశంలోని శ్రామికవ్యవస్థను (Indian Labour organisation) గురించి అధ్యయనం చేయాలన్న ఉద్దేశాన్ని ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వ్యక్తం చేసింది. ఈ దిశలో కృషికిది సరైన సందర్భం”. అని పేర్కొన్నది. “సమ్మె విచ్ఛిన్నమైందని వచ్చిన పత్రికా ప్రకటనలను నిరసిస్తూ, సమ్మె చేస్తున్న వాయవ్య రైల్వేఉద్యోగులు గత నెలలో పెద్ద వూరేగింపు నిర్వహించారు. వారొక ఎఱ్ఱజెండాను పట్టుకున్నారు. దీనిలో అసహజమేమిలేదు. ఆ జెండా ఒకప్పుడు తెల్లగానే ఉండేది. కాని ఈనాడు జెండాకు సమ్మె చేస్తున్న కార్మికుల రక్తపు మరకలయ్యాయి” అని జూలై 4వ తేదీ లాన్స్‌బర్గ్ లండన్ వీక్లి వ్రాసింది. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఆనాటి గూఢచారి విభాగం డైరెక్టరు సర్‌డేవిడ్ పెట్రో “వారి లక్ష్యాన్ని సాధించేవరకు చావును కూడా లెక్కచేయక పోరాటం సాగిస్తామని తమ నిశ్చయాన్ని తెలియజేయడానికా అన్నట్లు లాహోరులో సమ్మెచేస్తున్న కార్మికులు తమ రక్తంతో తెల్లజెండాకు నాటకీయంగా ఎర్రరంగు వేశారు” అని వ్రాశారు.

ఇండియాలోని కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న లండన్‌లోని భారత కార్మిక సంక్షేమ సమితి (వర్కర్స్ వెల్ఫేర్ లీగ్ ఆఫ్ ఇండియా) వాయువ్య రైల్వేలో సమ్మెచేస్తున్న వారికి ఆర్థిక సహాయం చేసింది.

వాయువ్య రైల్వేలోనే గాక 1922లో తూర్పుఇండియా రైల్వేలోనూ, 1923లో జి.ఐ.పి. (గ్రేట్ పెనిన్సులర్ రైల్వే) రైల్వేలో కూడ సమ్మెలు జరిగాయి.

1922 ఫిబ్రవరిలో అసన్‌సోల్ కేంద్రంగా ఈస్టిండియా రైల్వేలో సమ్మె జరిగింది. జాతీయ పురావస్తు ప్రదర్శనశాలలో భద్రపరచబడిన ఆనాటి భారత ప్రభుత్వ రహస్య నివేదికలో యీ విధంగా వ్రాయబడింది. "ఈస్టిండియా రైల్వేలో సమ్మె అసన్‌సోల్ వరకు వ్యాపించింది. అక్కడ కార్మికులను సమ్మె కట్టించడంలో స్వామి దర్శనానంద ప్రధాన కారకుడు. అసన్‌సోల్‌లో ప్రజలు చాల మొరటువారు అందువలన ఆ స్టేషనును, ప్రధాన మార్గంలోని చుట్టుప్రక్కల స్టేషన్ల భద్రత కొరకు ఒక కంపెనీ స్వదేశీ సైనికులను పంపడం జరిగింది. కుల్తి లోని ఇనుము పరిశ్రమలలోని కార్మికులు కూడా రైల్వే కార్మికులతో కలిసి ఒకేసారి సమ్మె చేయాలని సంకల్పించారు. బొగ్గుగని కార్మికులను కూడా సమ్మెలోకి దించాలని విశ్వానందస్వామి ఆలోచిస్తున్నట్లుగా వదంతులు వ్యాపించాయి. అసన్‌సోల్, కుల్తి మరియు బొగ్గు గని ప్రాంతాల్లోని కార్మికుల సమ్మెతో స్వరాజ్యం వెంటనే సాధించవచ్చునని ఈ మధ్యనే జరిగిన సమావేశంలో ఆయన అధికారికంగా చెప్పినట్లుగా తెలియవస్తోంది."

ఫిబ్రవరి 22వ తేదీన సాయుధ పోలీసులు బర్ద్వాన్ రైల్వే స్టేషనులో సమ్మెదారులపై కాల్పులు జరిపి ముగ్గురుని గాయపరచినట్లుగా ఈ నివేదిక వెల్లడించింది. రైల్వే కార్మికుల సమ్మె ఇండియాలోని ఇంగ్లీషు వారిలో భీతావహాన్ని సృష్టించింది. బ్రిటిషు ప్రయోజనాలకు బహిరంగంగానే మద్ధతిచ్చే "ఇంగ్లీష్‌మన్" అనే కలకత్తా నుండి ప్రచురించబడే ఒక వార్తాపత్రిక ఆంగ్లేయ యువతులను సమ్మెదారులు అవమానపరుస్తున్నారనే ఆరోపణలతో ఒక కథనం ప్రచురించింది. ఈ రకమైన భయోత్పాతం కల్గించే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ సమ్మెలనణచివేయడానికి ప్రభుత్వం గుర్ఖాబలగాలను తరలించింది. సైనికులు రైల్వే కార్మికుల పాశవిక అణచివేతకు పూనుకున్నారు.

"మార్చి 10వ తేదీన అసన్‌సోల్‌లోని గూర్ఖా చౌకీదార్ల గృహ సముదాయాలు దహనం చేయబడ్డాయి. అది సమ్మె చేస్తున్న కార్మికులు చేసినట్లు ఏ విధమైన రుజువులులేనప్పటికి గూర్ఖాలు దగ్గరలోనున్న వారందరిపై విచ్చలవిడిగా దాడిచేశారు. కాని అదృష్టవశాత్తు యీ సంఘటన జరుగుతున్న సమయంలో సమ్మెదారులు కొంతదూరంలో ఒక బహిరంగసభ జరుపుకుంటున్నారు. అలా కానట్లయితే చాల తీవ్రమైన సంఘర్షణ చెలరేగి ఉండేది" అని ప్రభుత్వ రహస్య నివేదికే తెలుపుతోంది. ఇక్కడ విఫలమైన ఇక్కడ విఫలమైన ప్రభుత్వం సమ్మెలను యింకా ఇతర విధాలుగా భగ్నపరచడానికి ప్రయత్నించింది. "సమ్మెను విచ్ఛిన్నం

చేయడానికి రైల్వే కార్మికుల స్థానంలో మెస్సర్స్ బర్డ్ అండ్ కంపెనీ కూలీలను నియమించాలనే ప్రయత్నం కూడ జరిగినట్లు", యీ రహస్య నివేదిక అంగీకరించింది.

ఆ సంవత్సరం 1922 మార్చి నెల రహస్య నివేదికలో ఈ విధంగా ఉంది "ఈస్టిండియా రైల్వేలో సమ్మె యింకా కొనసాగుతూనే వున్నది. కాని సమ్మె అంతం కావడానికి యింకా ఎంతోకాలం పట్టదనడానికి సూచనలు కనబడుతున్నాయి. మిగిలిన రైల్వేలలోను, బొగ్గుగనుల్లోను, ఫ్యాక్టరీల్లోను ఈస్టిండియా రైల్వే కార్మికులకు సంఘీభావం తెల్పుతూ సమ్మె చేయాలనే ఉద్దేశంతో మార్చి 20వ తేదీన జరిగిన సమావేశం పూర్తిగా విఫలమైంది. సమ్మెకు క్రింది తరగతి పోలీసు ఉద్యోగుల సానుభూతిని సంపాదించడానికి తన ఉపన్యాసాల ద్వారా స్వామి విశ్వానంద కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. కాని ఇప్పటివరకు ఏమీ విజయం సాధించలేకపోయాడు."

ఇంత ఘోరమైన అణచివేత సమ్మె విచ్ఛిన్న ప్రయత్నాలను ఎదుర్కొని సమ్మె కొనసాగించడం అసాధ్యమైంది. 1922 ఏప్రిల్ 18న సమ్మె విఫలమైనట్లు అధికారికంగా ప్రకటించబడింది.

బొంబాయిలోని మాతుంగా రైల్వే వర్క్‌షాప్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు జవాబుగా జి.ఐ.పి. రైల్వే అధికారులు 1923 డిశంబరులో లాకౌట్ ప్రకటించారు. ఎక్కువమంది కార్మికులను పనిలో నుండి తొలగించాలనేది యాజమాన్యం అసలు ఉద్దేశం. పెద్దఎత్తున రిట్రెంచ్‌మెంట్ చేయాలన్న తమ విధానాన్ని అమలు చేసి కార్మికుల సంఖ్యను తగ్గించేందుకు, ఈ సమ్మెలవల్ల మెనేజిమెంట్లకు మంచి అవకాశం లభించింది. ఈ సందర్భంగా రైల్వే కంపెనీని కొన్ని వారాలపాటు పనులేమీ లేకుండా మూసివుంచడానికి కూడా యజమానులు వెనుదీయరు" అని అధికార నివేదిక పేర్కొన్నది.

మాతుంగా రైల్వే వర్క్‌షాపులో జరిగిన ఈ సమ్మె ప్రభావం బొంబాయిలోని జౌళి కార్మికులపై కూడా పడింది. ఈ సందర్భంలో అధికార నివేదిక యీ విధంగా పేర్కొన్నది "మాతుంగా కార్మికుల సమ్మె నగరంలోని మిల్లు కార్మికులను ప్రభావితులను చేసింది. బోనస్ చెల్లింపు నిరాకరింపబడిన తర్వాత జనరల్ సమ్మె చేయాలనే ఉద్దేశంతోనున్న వీరికి మాతుంగా కార్మికులు సృష్టించిన వాతావరణం మరింత ఉత్తేజాన్నిచ్చింది". 1924 జనవరిలో లాకౌట్ ఎత్తివేయబడిన తరువాత మాతుంగా కార్మికులు తిరిగి పనిలో ప్రవేశించారు.

## ట్రేడ్ యూనియన్ల అభివృద్ధి

1924, 1925 సంవత్సరాలలో విస్తృతంగా సమ్మెలు జరిగిన కాలంలో కూడ బొంబాయి లోని జౌళి కార్మికులు సరిగా సంఘటితం కాలేదు. 1922లో బొంబాయి

ప్రెసిడెన్సీలో ఎ.ఐ.టి.యు.సి. స్థాపించిన కేంద్ర లేబర్ బోర్డుకు కేవలం ఏడు యూనియన్లు మాత్రమే అనుబంధం చేయబడ్డాయి. కాని ఈ సంస్థ కూడ నిరుపయోగమని కొద్దికాలంలోనే తేలిపోయింది. 1923లో సమ్మె తరువాత మూడు యూనియన్లతో గిర్ని సంఘ్ కాంగార్ స్థాపించబడింది. కాని దీనికి అనుబంధం చేయబడిన యూనియన్లు చాల స్వల్ప సభ్యత్వం కల్గినవి, బలహీనమైనవి 1926లో ఎన్.ఎం. జోషీ, ఆర్.ఆర్. బాఖలేలు చొరవ తీసుకుని బొంబాయిలో టెక్స్టైల్ లేబర్ సంఘ్ స్థాపించారు. 1926 భారత ట్రేడ్ యూనియన్ల చట్టం ప్రకారం ఏర్పడిన మొట్టమొదటి రిజిష్టర్డ్ యూనియన్ ఇదే. దీనికి అధ్యక్షుడు ఎన్.ఎం.జోషీ, కార్యదర్శి ఆర్.ఆర్. బాఖలే 1928 సం॥నికి ఈ యూనియన్ సభ్యత్వం 8,234కు పెరిగింది. 1925-27 సం॥ల మధ్యకాలం నుండే టెక్స్టైల్, కార్మికులు సంఘటితమవడం ప్రారంభమయినప్పటికి వాస్తవానికి వారికొక బలమైన సంస్థ ఏర్పడినది 1928 సమ్మె తరువాత మాత్రమే. ఇదే 40,000 మంది సభ్యులతో ప్రారంభమైన జౌళి కార్మికుల పోరాట సంస్థ, గిర్నీకాంగార్ యూనియన్.

బొంబాయిలోని జౌళి కార్మికులలో సంస్థాపరమైన బలహీనతలున్నప్పటికి రైల్వే కార్మికులు, నావికులు, రేవు కార్మికులు, తపాలా ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ సంస్థలు ఈ కాలంలోనే అభివృద్ధి చెందడం మొదలయింది. సభ్యత్వ రుసుము, చందాలు సక్రమంగా వసూలు చేయడం, ప్రాంతీయ, జిల్లా బ్రాంచీలు తదితర శాఖల ద్వారా అవసరమైన కార్యకలాపాలు సాగించడం ద్వారా ఈ ట్రేడ్ యూనియన్లు నిర్మాణాయుతమైన సంస్థలుగా రూపొందాయి. బెంగాల్‌లోని జనపనార పరిశ్రమలలోను, బొగ్గుగనుల లోను, జంషెడ్‌పూర్‌లోని ఉక్కు పరిశ్రమలోను ట్రేడ్ యూనియన్లు అభివృద్ధి చెందాయి. కాని ఇవి నిర్మాణరీత్యా బలహీనంగా ఉన్నాయి. 1925లో బెంగాల్ జూట్ వర్కర్స్ అసోసియేషన్ ఏర్పడింది. అప్పుడే మాస్కో నుండి తిరిగి వచ్చిన శివనాథ్ బెనర్జీ ఈ యూనియన్‌కు కార్యదర్శిగా ఉన్నాడు.

1921- 25 మధ్యకాలంలో భారతదేశంలో ఎన్ని ట్రేడ్ యూనియన్లు వున్నాయో ఇదమిద్ధంగా చెప్పడం కష్టం. 1921 సం॥లో 77 యూనియన్లలో సుమారు 10 లక్షల మంది సభ్యులున్నట్లు "భారతదేశంలో కార్మికోద్యమం" అనే తన రచనలో అంచనా వేశారు. కాని 1922లో 113 యూనియన్నట్లు ఎఐటియుసి పేర్కొంది. భారతదేశంలోని ట్రేడ్ యూనియన్లను గురించిన సమాచారాన్ని సేకరించడానికి భారత కార్మికోద్యమ బలాన్ని సరిగ్గా అంచనాకట్టడానికి భారత కార్మికోద్యమ చరిత్రలోనే ప్రప్రథమంగా ఎ.ఐ.టి.యు.సి 1924లో ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నించడం జరిగింది. 167 యూనియన్లను పరిశ్రమలవారీ గ్రూపులుగా విభజించి 1925లో ఎ.ఐ.టి.యు.సి. ప్రచురించిన డైరెక్టరీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌లోని సమాచారాన్ని ఈ క్రింద పొందుపర్చడం జరిగింది.

**1924లో ఇండియాలోని ట్రేడ్ యూనియన్లు**

| గ్రూపు | మొత్తం యూనియన్ల సంఖ్య | జమా ఖర్చులు సమర్పించే యూనియన్లు | సభ్యత్వం |
|---|---|---|---|
| **1) ట్రాన్స్‌పోర్ట్ (రవాణా)** | | | |
| 1. రైల్వే | 25 | 10 | 97,702 |
| 2. ఓడ రేవులు (షిప్పింగ్) | 6 | 3 | 14,500 |
| 3. ఇతర రవాణా | 6 | 3 | 6,300 |
| **2) టెక్స్ టైల్స్** | | | |
| 1. పత్తి | 23 | 17 | 30,795 |
| 2. జనపనార | | | |
| **3) ఇంజనీరింగ్ తత్సంబంధిత పరిశ్రమలు** | | | |
| 1. రసాయనాలు, గాజు, కుమ్మరి పని మొ॥ | 3 | 1 | 500 |
| 2. ఇనుము, ఉక్కు, లోహాలు | 3 | 2 | 9000 |
| 3. తదితర ఇంజనీరింగ్ | 5 | 2 | 825 |
| **4) శారీరక శ్రమలేని పరిశ్రమలు** | | | |
| 1. బ్యాంకింగ్ | 3 | 2 | 1610 |
| 2. కరెన్సీ | 4 | 3 | 1120 |
| 3. గుమాస్తాలు, ఉపాధ్యాయులు | 4 | 1 | 500 |
| 4. వాణిజ్యం | 4 | 1 | 2600 |
| **5) ఇతరములు** | | | |
| 1. ప్రభుత్వ, మునిసిపల్ ఉద్యోగులు | 37 | 4 | 9,150 |

| | | | |
|---|---|---|---|
| 2. గనులు | 2 | 1 | 400 |
| 3. కాగితం, ప్రింటింగ్ | 5 | 3 | 710 |
| 4. తంతి – తపాలా | 18 | 14 | 37,625 |
| సాధారణ కార్మికులు | 19 | 1 | 10,000 |
| **మొత్తం** | **167** | **68** | **2,23,337** |

కాని ఇది సమగ్ర సమాచారం కాదనేది స్పష్టం. దేశంలోనే అతి ముఖ్యమైన, బాగాపాతుకు పోయిన జనపనార పరిశ్రమలలోని ట్రేడ్ యూనియన్లను గురించిన సమగ్ర సమాచారం అందించలేకపోవడం ఒక పెద్దలోపం. ఎ.ఐ.టి.యు.సి. అధికార పత్రిక అలిండియా ట్రేడ్ యూనియన్ బులెటిన్ (అక్టోబరు – నవంబరు 1924 మరియు జనవరి 1925 సంచికలు)లో దేశంలోని 183 ట్రేడ్ యూనియన్లను ప్రాంతాలవారీగా ఈ క్రింది విధంగా విభజించింది. బొంబాయి 61, బెంగాలు 51 మద్రాసు 36 ఉత్తరప్రదేశ్ 8, (సెంట్రల్ ప్రావిన్స్) 8 అస్సాం 2 పంజాబ్ – 8, బీహార్, ఒరిస్సా 2, వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ 2, ఢిల్లీ–2, బర్మా 2, సింహళం 1.

పై వివరాలను పరిశీలించినట్లయితే 1924లో ట్రేడ్ యూనియన్లు ప్రధానంగా బొంబాయి, కలకత్తా, మద్రాసు వంటి ప్రదేశాలలోనూ పత్తి, జనపనార వంటి ప్రధాన పరిశ్రమలు, సమాచార, రవాణా శాఖలు మరియు ప్రభుత్వ సంస్థల్లో మాత్రమే అభివృద్ధి చెందినట్లు స్పష్టమవుతుంది. తంతి–తపాలా శాఖ, రైల్వేలలో అభివృద్ధి చెందిన పెద్ద ఫెడరేషన్లు ఈ సందర్భంలో ప్రత్యేకంగా ఎన్నదగినవి. 1920లో అఖిల భారత తపాలా మరియు ఆర్.ఎం.ఎన్. అసోసియేషన్, 1925లో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆవిర్భవించాయి. వీటితో బాటు బెంగాల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్, బొంబాయి సెంట్రల్ లేబర్ బోర్డు, కోయంబత్తూరులోని దక్షిణ భారత రైల్వే బోర్డు వంటి ఇతర ఫెడరేషన్లు కూడ అభివృద్ధి చెందాయి. వీటిలో బెంగాల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్, బొంబాయి సెంట్రల్ లేబర్ బోర్డు, ఎ.ఐ.టి.యు.సి. ప్రాంతీయ శాఖలే. ప్రభుత్వ ఉద్యోగులు, తదితర ఆఫీసు ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ గురించి వేరుగా ప్రస్తావించడం జరిగింది.

ఈ యూనియన్ల అభివృద్ధి ఒకేవిధంగా లేదు. చాలా యూనియన్లు నిర్మాణరీత్యా పటిష్టంగా లేకపోవడమేగాక సభ్యత్వం కూడ అతి స్వల్పంగా ఉండేది. ఈ యూనియన్లలో కొన్ని ఆశ్చర్యకరమైన తేడాలు కొట్టొచ్చినట్లు కన్పడ్డాయి. రేవులోని కార్మికులు సంఘటితంగా

వున్నారు. కాని డాక్ (రేవులో ఓడలు మరమ్మతులు చేయు కార్మికులు) కార్మికులు యూనియన్‌లో సభ్యులు కారు. నిపుణులయిన కార్మికులలో ట్రేడ్ యూనియన్ చైతన్యం ఎక్కువగా వుండగా నైపుణ్యంలేని కార్మికులలో ఇది కొరవడింది. నిర్మాణరీత్యా వున్న ఈ తేడాల వలన పోరాటం యెడల వారి దృక్పథంలో కూడా చాలా తేడాలున్నాయి. సమ్మెలను విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యాలే కొత్త యూనియన్లను ప్రారంభించడం ఈ కాలపు ప్రత్యేక లక్షణం. వాయువ్య రైల్వే కార్మికులు సమ్మె చేస్తున్న సమయంలో వాయువ్య రైల్వే యూనియన్ నాయకుడు శ్రీ జె.బి.మిల్లర్‌ను అరెస్టు చేయడంతో ఆగక, రైల్వే యాజమాన్యం ఒక కొత్త యూనియన్‌ను ప్రారంభించింది. మేనేజిమెంటు ఆశీస్సులతో 1898లోనే స్థాపించబడిన ఎమాల్గమేటేడ్ సొసైటీ ఆఫ్ రైల్వే సర్వెంట్స్ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయోగించబడింది.

ఇంతకు ముందు ప్రస్తావించినట్లుగా తాతా ఇనుము – ఉక్కు కర్మాగారం యాజమాన్యం జమ్‌షెడ్‌పూర్ లేబర్ అసోసియేషన్‌ను గుర్తించ నిరాకరించడం ట్రేడ్ యూనియన్ యెడల యాజమాన్యం వైఖరికి అద్దం పడుతుంది.

మద్రాసులో కూడ మద్రాస్ లేబర్ యూనియన్‌కు వ్యతిరేకంగా యాజమాన్యమే సమ్మె విద్రోహులందరను ఒకచోట చేర్చి బకింగ్‌హమ్ మరియు కర్నాటిక్ మిల్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను ఏర్పాటుచేసింది.

ఈ కాలంలో కార్మికోద్యమంలో నెలకొన్న ఆత్మరక్షణ స్వభావం ఎ.ఐ.టి.యు.సి. సమావేశాల్లో కూడ ప్రతిబింబించింది. ఎ.ఐ.టి.యు.సి. ప్రథమ, ద్వితీయ మహాసభలలో వున్న ఆకర్షణ, కార్మికులు ఆ సందర్భాలలో చూపిన అత్యంత ఉత్సాహం అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనడం వంటి ఉత్తేజం కల్గించే అంశాలు తరువాత జరిగిన కొన్ని మహాసభలలో కొరవడ్డాయి.

1920లో జరిగిన ప్రథమ మహాసభ 10 లక్షల మందికి ఎ.ఐ.టి.యు.సి. ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకోగలిగింది. కాని 1922 నాటికే సభ్యత్వం చాలా తగ్గిపోయి 1925 నాటికి పరిస్థితి మరింత దిగజారింది.

ఈ కాలంలోనే ఎ.ఐ.టి.యు.సికి ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగల్గిన శక్తితగ్గినట్లు కనపడుతుంది. అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐ.ఎల్.ఒ) 6వ సమావేశానికి భారత కార్మికవర్గానికి, ప్రాతినిధ్యం వహించడానికి ఎ.ఐ.టి.యు.సి శ్రీ జోసెఫ్ బాప్టిస్టాను ఎన్నుకొన్నది. కాని దీనిని ఖాతరు చేయక ప్రభుత్వం ఆయనకు బదులుగా బెంగాలుకు చెందిన శ్రీ కె.సి.రాయ్ చౌధురిని పంపడానికి నిశ్చయించింది. బెంగాల్ ప్రొవిన్షియల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లు రాయ్‌చౌధురి నియామకానికి తీవ్ర నిరసన వ్యక్తంచేశాయి. అయినప్పటికి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.

## కార్మికోద్యమం - జాతీయ కాంగ్రెసు

ప్రముఖ కాంగ్రెసు నాయకుడు శ్రీ చిత్తరంజన్ దాస్ ఎ.ఐ.టి.యు.సి. మూడవ మహాసభకు అధ్యక్షత వహించాడు. ఎ.ఐ.టి.యు.సి. ప్రథమ అధ్యక్షుడు శ్రీ లాలాలజపతిరాయ్ కూడ ఒకనాడు కాంగ్రెస్ అధ్యక్ష పదవిని నిర్వహించినవాడేనని మరువరాదు.

జాతీయ కాంగ్రెసు కార్మికోద్యమాన్ని ఏనాడూ వర్గపోరాట దృష్టితో చూడలేదు. శ్రామికవర్గ ఆశయాలు వారికి విదేశీ సిద్ధాంతాలు. కాంగ్రెసులోనే అనేకమంది కార్మికవర్గ వ్యతిరేక భావాలు కల్గివున్నారు. కొందరు కాంగ్రెసువాదులు శ్రామికులను మానవతా దృక్పథంతో చూసేవారు. చాలామంది కార్మికుల ఆర్థిక పోరాటాలను నిర్వహించడం మాని నీతులు బోధించేవారు. కార్మికవర్గ ఆర్థిక పోరాటాలు ప్రధానంగా స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా సాగే కార్మిక వర్గ పోరాటాలు కాంగ్రెసు నాయకత్వానికి ఇష్టంలేదు. బూర్జువా సిద్ధాంతాలు బాగా తలకెక్కిన కాంగ్రెసు, పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించగల్గిన విప్లవశక్తిగా కార్మికవర్గాన్ని ఏనాడూ గుర్తించలేదు. అసంఘటితంగా వున్న ఈ ప్రజానీకాన్ని జాతీయ విముక్తి ఉద్యమంలో వినియోగించుకునే ఒక సాధనంగా మాత్రమే కాంగ్రెస్ పరిగణిస్తోంది.

కార్మికవర్గానికి బూర్జువావర్గం కంటే తక్కువ స్థానం ఇవ్వడానికి మాత్రమే కాంగ్రెస్ సిద్ధంగా వుంది. అందువలన కార్మికవర్గ చైతన్యం క్రమక్రమంగా పదునెక్కడంతో, విప్లవకర శ్రామికవర్గానికి, సంస్కరణవాద బూర్జువా వర్గానికీ మధ్య వైరుధ్యాలు, ఘర్షణలు అనివార్య లక్షణాలుగా బహిర్గతమయ్యాయి.

1920లో ఎ.ఐ.టి.యు.సి. ప్రథమ మహాసభ జరుగుతుందనగా, 1919లో అమృత్‌సర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెసు సమావేశం శ్రామికులను ట్రేడ్ యూనియన్ల ద్వారా సంఘటితం చేయాలని తీర్మానించింది. కాని ఈ తీర్మానం కార్మికవర్గ దృక్పథంతో కాక వారి స్వంత దృక్పథంతో మాత్రమే చేయబడింది. ఈ తీర్మానాన్ని అమలు చేయడానికి లాలాలజపతిరాయ్, చిత్తరంజన్‌దాస్, కుమారి అనసూయాబెన్, సారాభాయ్‌లతో ఒక కమిటీని ఏర్పరచవలసిందిగా ఆలిండియా కాంగ్రెసు కమిటీని నాగపూర్ కాంగ్రెస్ మహాసభ ఆదేశించింది. "ట్రేడ్ యూనియన్లు నిర్మించుకొనడం ద్వారా న్యాయ సమ్మతమైన తమ హక్కులను సాధించుకొనడం కోసం పోరాటం సాగిస్తున్న కార్మికులకు ఈ (కాంగ్రెసు) సమావేశం తన ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది. శాంతి భద్రతల పరిరక్షణ సాకుతో భారత కార్మికుని జీవితాన్ని విలువలేని దానిగా పరిగణించే పాశవిక విధానాలను ఖండిస్తున్నది. తమ జీవన పరిస్థితులను మెరుగుపరచుకొనడానికి, న్యాయమైన హక్కులు సాధించుకొనడానికి, భారతదేశంలోని శ్రామికులను దోపిడీ నుండి రక్షించడానికి, విదేశీ ఏజన్సీలు భారతదేశంలోని

వనరులను దోపిడీ చేయకుండా నివారించడానికి, భారత శ్రామికులను సంఘటితం చేయాలని కాంగ్రెసు అభిప్రాయపడుతోంది. ఈ విషయంలో సత్వర చర్యలు తీసికొనడానికి అలిండియా కాంగ్రెసు కమిటీ, ఒక కమిటీని ఏర్పరచాలని కూడా యీ సమావేశం అభిప్రాయపడింది." అని శ్రామికులకు సంబంధించి నాగపూర్ కాంగ్రెసు తీర్మానించింది.

విదేశీ ఏజన్సీలు మాత్రమే భారత కార్మికులను దోపిడీ చేయకుండా చూడాలని తీర్మానం పేర్కొన్నదే కాని, స్వదేశీ పెట్టుబడిదారులు కార్మికులను చేస్తున్న దోపిడీ గురించి ఈ తీర్మానం ఒక్క మాటైనా చెప్పకపోవడం గమనార్హం. అంతేగాక ఎ.ఐ.టి.యు.సి. స్థాపించబడిన 2 నెలల తరువాత 1920 డిశంబరులో నాగపూర్ సమావేశం జరిగింది. అయినప్పటికి భారతకార్మిక వర్గ ప్రప్రధమ అఖిలభారత సంస్థ ఎ.ఐ.టి.యు.సి.ని గురించి ఈ సమావేశం మౌనం వహించింది. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఎ.ఐ.టి.యు.సి. ద్వారా కాకుండా వేరుగా కార్మికులను సమీకరించడానికి కాంగ్రెసు ఆలోచిస్తున్నదనే అభిప్రాయానికి రావడం పొరబాటు కాజాలదు, గాంధీజీకి ఎ.ఐ.టి.యు.సి. స్థాపన యెడల వున్న విముఖత ఈ ఆలోచనకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ సందర్భంలో మరొక సంఘటనను మనం జాగ్రత్తగా పరిశీలించవలసివుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ)కు భారత కార్మికవర్గ ప్రతినిధిగా శ్రీ లాలాలజపతిరాయ్‌ని ఎ.ఐ.టి.యు.సి నామినేట్ చేసింది. కాని 31.7.1921న జరిగిన ఎ.ఐ.టి.యు.సి. కార్యవర్గ సమావేశంలో అంతర్జాతీయ కార్మికసంస్థ సమావేశానికి హాజరవడానికి ఆయన తన అశక్తతను వెల్లడించారు. అందువలన ఆయన స్థానే శ్రీ యన్.యం.జోషి ఎంపిక చేయబడ్డాడు. అనారోగ్య కారణంతో లాలాజీ ఎ.ఐ.టి.యు.సి. అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.

లాలాజీ ఐ.ఎల్.ఓ.లో భారత కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించడానికి తన అశక్తతను వెల్లడించడం, ఎ.ఐ.టి.యు.సి అధ్యక్ష స్థానం నుండి తప్పుకోవడం, ఎ.ఐ.టి.యు.సి. స్థాపన యెడల గాంధీజీ విముఖత, ఈ సంఘటనలన్నింటిని ఒకచోట చేర్చి పరిశీలిస్తే నాగపూర్ కాంగ్రెసు సమావేశం నాటి వరకు ఎ.ఐ.టి.యు.సి.ని తాముకోరుకున్న కార్మికవర్గ సంస్థగా కాంగ్రెస్ గుర్తించలేదు. ఎ.ఐ.టి.యు.సి పట్ల గాంధీజీకున్న అయిష్టత కారణంగానే లాలాజీ ఐ.ఎల్.ఒ.కి తన నియామకాన్ని తిరస్కరించడం, చివరకు ఎ.ఐ.టి.యు.సి. అధ్యక్ష పదవి నుండి కూడా రాజీనామా చేయడం జరిగిందని భావించడం అతిశయోక్తిజాలదు.

ప్రారంభంలో ఎ.ఐ.టి.యు.సి. యెడల విముఖత చూపించిన కాంగ్రెస్, త్వరలోనే వాస్తవాన్ని గుర్తించి ఎ.ఐ.టి.యు.సి.ని ఆమోదించవలసి వచ్చింది. కాంగ్రెసు తన ఎత్తుగడలను మార్చింది. 1922 సం॥ గయలో జరిగిన కాంగ్రెసు సమావేశం ఎ.ఐ.టి.యు.సి. ఉనికిని ఆమోదించడమేగాక అది కార్మికులను సమీకరించడంలో తీసుకున్న చొరవకు హర్షం వెలిబుచ్చింది. ఇంతేగాక ఎ.ఐ.టి.యు.సి. కార్యకలాపాలలో సహాయపడడానికి గాను కొందరు కాంగ్రెస్ ప్రముఖులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

"ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మరియు వివిధ (కిసాన్ సభలు) రైతు సంఘాలు ఇండియాలోని కార్మికులను సంఘటితపరచడంలో చేసిన కృషికి హర్షం తెలుపుతూ, అవసరమైన వారిని కో-ఆప్ట్ చేసుకోవడానికి అధికారం ఇస్తూ, వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక కార్మికులను సంఘటిత పరచడంలో ఎ.ఐ.టి.యు.సి. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు సహాయపడేందుకు 1) సి.ఎఫ్.ఆండ్రూస్ 2) జె.ఎం. సేన్‌గుప్తా 3) ఎస్.ఎన్.హల్దార్ 4) స్వామిధీనానాథ్ 5) డా॥ డి.డి.సత్యే 6) సింగారవేలు చెట్టియార్‌లతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తోంది" అని కాంగ్రెసు తీర్మానం చేసింది.

తమ ఇష్టప్రకారం కాంగ్రెస్‌వాదులు ఎ.ఐ.టి.యు.సి.లో పనిచేసేందుకు ఈ తీర్మానం అనుమతించడంతో చిత్తరంజన్‌దాస్, సుభాష్‌చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి ప్రముఖులైన కాంగ్రెస్ నాయకులు ఎ.ఐ.టి.యు.సి.కి సన్నిహితులయ్యారు. ఇలా చేరిన కాంగ్రెస్‌వాదులు తమ బూర్జువా, సంస్కరణవాద సిద్ధాంతాలను, ఆలోచనా విధానాన్ని ఎ.ఐ.టి.యు.సి.లో వ్యాపింపజేశారు. అందువలన కాంగ్రెస్‌వాదుల వర్గ సామరస్య సిద్ధాంతానికి, కార్మికవర్గ సిద్దాంతమైన వర్గ పోరాట సిద్ధాంతానికి తీవ్ర సంఘర్షణ ఏర్పడింది. ఈ పరిస్థితి వాస్తవంగా ప్రారంభంలో వున్న పరిస్థితులను మార్చివేయడం, తోపాటు ఈ సంఘర్షణ పరాకాష్ఠకు చేరడంతో జాతీయ కాంగ్రెసు ఎ.ఐ.టి.యు.సి.తో తెగత్రెంపులు చేసుకొని, తమ స్వంత వర్గ సిద్ధాంత ప్రాతిపదికమీద ఒక క్రొత్త కార్మిక సంస్థను ఏర్పాటు చేసింది.

## ఎ.ఐ.టి.యు.సి. 3వ మహాసభ నుండి 6వ మహాసభ వరకు

ఎ.ఐ.టి.యు.సి. 3వ మహాసభ 1923 మార్చి 24 నుండి 26 వరకు లాహోర్‌లో జరిగింది. ఆనాడు లాహోరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదు. చిత్తరంజన్‌దాస్ ఈ మహాసభకు అధ్యక్షత వహించాడు. గాంధీజీ బార్డోలీలో నిర్ణయం (శాసనోల్లంఘన ఉద్యమ విరమణ) అనంతరం చిత్తరంజన్‌దాస్ తన స్వరాజ్య పార్టీని ద్వారా జాతీయోద్యమంలో ఒక కొత్త మలుపు తెచ్చేందుకు తీవ్ర కృషిలో నిమగ్నమయ్యారు. చిత్తరంజన్‌దాస్ అంతటి ప్రముఖ జాతీయ నాయకుడు ఈ మహాసభకు అధ్యక్షత వహించడం నిస్సందేహంగా ప్రాధాన్యత సంతరించుకున్న విషయం.

ఇంతకు ముందు జరిగిన రెండు మహాసభలవలె ఈ మహాసభ విజయవంతం కాలేదు. కార్మికుల హాజరుతో సహా అనేక విషయాలలో ప్రథమ ద్వితీయ సభలతో పోల్చి చూస్తే ఈ మహాసభ వెలవెలపోయింది. ఈ సమావేశానికి సుమారు వందమంది ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. దేశ రాజకీయ, కార్మిక ఉద్యమంలో ఏర్పడిన తిరోగమనాన్ని ఈ మహాసభ చక్కగా ప్రతిబింబించింది.

యుద్ధానికి వ్యతిరేకంగా యీ మహాసభ ఒక ముఖ్యమైన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానం యీ విధంగా పేర్కొన్నది. "యుద్ధం శ్రామిక ప్రజానీకానికి నష్టదాయకమని

రుజువైనదని ఈ మహాసభ అభిప్రాయపడుతోంది. అందువలన భవిష్యత్తులో కార్మికులు యుద్ధాల్లో పాల్గొని యుద్ధ ప్రీతి గలవారికి ప్రత్యేకంగా దురాక్రమణదారులకు ఏ విధంగానూ సహాయపడరాదని సలహాయిస్తోంది. నిరుద్యోగం, ముదుసలితనం, అనారోగ్యాల వల్ల బాధపడుతున్న ప్రజలకు రక్షణ కల్పిస్తూ, చట్టం చేయవలసిందిగా ఈ మహాసభ ప్రభుత్వాన్ని కోరుతోంది".

ఎ.ఐ.టి.యు.సి. 4వ మహాసభ కలకత్తాలో 1924 మార్చి 30-31 తేదీలలో శ్రీ చిత్తరంజన్‌దాస్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచంలోని శ్రామిక ప్రజల విప్లవ నాయకుడు, ప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత లెనిన్ ఆ సమయానికి మరణించాడు. ఈ సమావేశం లెనిన్ మృతికి సంతాపం తెలియజేస్తూ ఒక తీర్మానం ఆమోదించడం విశేషం. విధాన సభలో శ్రామికులకు ప్రాతినిధ్యం కల్పించాలని, వారికి ఓటు హక్కు కల్పించాలని, రైల్వేల్లో రిట్రెంచ్‌మెంటుకు వ్యతిరేకంగానూ, కార్మికులకు పెట్టుబడిదారులకు మధ్య వచ్చిన వివాదాలలో పోలీసు, మిలిటరీ బలగాలను ఉపయోగించడానికి వ్యతిరేకంగాను వేర్వేరు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. ఎ.ఐ.టి.యు.సి. నిబంధనావళికి సవరణలు చేయడానికి శ్రీయుతులు డి.ఆర్.తేంగిడి, ముకుందలాల్ సర్కార్, షంషుద్దీన్ హసన్, శ్రీమతి సంతోష్ కుమారీ గుప్తాలతో ఒక కమిటీ ఏర్పాటు చేయబడింది. 1924 ఆగస్టు 17న సమావేశమైన ఎ.ఐ.టి.యు.సి. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సవరించబడిన నిబంధనావళిని ఆమోదించి ఎ.ఐ.టి.యు.సి. అధికార పత్రికగా "ఆలిండియా ట్రేడ్ యూనియన్ బులెటిన్"ను ప్రచురించాలని నిర్ణయించింది.

లండన్‌లోని భారత కార్మిక సంక్షేమ సమితి (వర్కర్స్ వెల్ఫేర్ లీగ్ ఆఫ్ ఇండియా)ని ఇంగ్లండులో ఎ.ఐ.టి.యు.సి. ప్రతినిధిగా ఈ మహాసభ నియమించింది. బెంగాల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ ముకుంద్‌లాల్ సర్కార్‌కు శ్రీ యం.ఎన్.రాయ్ కలకత్తా మహాసభ గురించి వ్రాసిన లేఖను సర్ డేవిడ్ పెట్రీ ప్రస్తావించాడు. పెట్రీ (గూఢచారి విభాగం డైరెక్టరు) సమాచారం ప్రకారం "ఎం.ఎన్.రాయ్ ఎ.ఐ.టి.యు.సి. మహాసభను గురించి ముకుంద్‌లాల్ సర్కార్‌కు వ్రాస్తూ కార్మికవర్గానికి వారి నాయకులు ఎంతగా ద్రోహం చేసిందీ వివరించాడు. అంతేగాక ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శి చమన్‌లాల్ చర్యలను విమర్శించాడు. కొత్త నాయకత్వం అభివృద్ధి చెందవలసిన ఆవశ్యకతను వివరించాడు. ఇంటర్నేషనల్ కాంగ్రెసుకు (అంతర్జాతీయ సమావేశానికి) ప్రతినిధులను పంపవలసిందిగా భారత కార్మికవర్గాన్ని కోరుతూ, ఎ.ఐ.టి.యు.సి. నిజమైన కార్మికవర్గ సంస్థగా రూపొందాలని కోరాడు. అనేక కష్టనష్టాలతో కూడిన విప్లవం ద్వారానే మనం మన లక్ష్యాన్ని సాధించగలమని అన్నారు."

రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్ బ్రిటిషు బ్యూరోకు ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ప్రయత్నాలను గురించి పెట్రీ ఈ విధంగా వ్రాశాడు. "రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్ బ్రిటిషు శాఖ మద్రాసులోని ఒక తమిళ పత్రికకు వ్రాసిన లేఖలో, రెడ్ ఇంటర్నేషనల్‌కు ఎ.ఐ.టి.యు.సి.నికి అనుబంధం చేయవలసిందిగా కోరింది. ప్రముఖ కమ్యూనిస్టు ఎమ్.ఎన్.రాయ్‌కి పరిచయస్తుడు, జర్మనీలో బ్రిటిషు వ్యతిరేక కార్యకలాపాలు సాగించడంలో రాయ్‌కి సన్నిహితంగా మెలిగిన జార్జి హర్డీ ఈ లేఖపై సంతకం చేశాడు. తమ బ్యూరో దూర ప్రాచ్య దేశాలలోని శ్రామిక ఉద్యమాల యెడల చాలా ఆసక్తితో యున్నదని, జావాలోని ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను, చైనాలోని నావికుల యూనియన్‌ను ఈ బ్యూరోకు అనుబంధం చేయడం జరిగిందని, అంతర్జాతీయ స్థాయిలో సంఘాలను అనుబంధం చేసే విషయంలో భారత కార్మికుల వైఖరి తెలియరాలేదని వ్రాస్తూ, తమ (భారత కార్మికుల) అభిప్రాయం తెలియజేయవలసిందిగా, హార్డీ తన లేఖలో కోరాడు. బ్రిటిష్ లేబర్ పార్టీ బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించకపోవచ్చు. అట్టి పార్టీకి సంబంధించిన ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌కు సన్నిహితం కావద్దని ఎ.ఐ.టి.యు.సి.ని హెచ్చరించింది. దీని తర్వాత రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్ బ్రిటిషు శాఖ చైర్మన్ టామ్‌మాన్ ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శికి ఒక లేఖ వ్రాశాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యం అంతమయ్యే రోజు ఇంకా ఎంతో దూరంలో లేదనీ పెట్టుబడిదారుల దోపిడీ నుండి కార్మికులను, కర్షకులను విముక్తిచేసే కర్తవ్యాన్ని నెరవేర్చడానికి భారతదేశంలోని ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు స్వేచ్ఛ లభిస్తుందన్న ఆశను ఆ లేఖలో వ్యక్తం చేశాడు. విప్లవాన్ని జయప్రదంగా నడిపిన రష్యా శ్రామికవర్గం స్థాపించిన రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించిందని ప్రశంసించాడు. భారత కార్మికులు యూరప్, అమెరికాలలోని విప్లవ కార్మికవర్గంతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొనవలసిందిగా కోరుతూ తన లేఖను ముగించాడు."

భారత కార్మికవర్గానికి అంతర్జాతీయ సంబంధాలు ఏర్పరచడానికి ప్రయత్నాలు విదేశాలనుండేగాక, ఇండియాలో కూడ ప్రారంభమయ్యాయి. వివిధ పత్రికల ద్వారా కార్మిక కర్షక వర్గ ప్రయోజనాలకు మద్దతు సంపాదించడానికి, సోషలిస్టు భావాలను ప్రచారం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కొద్దిమంది కమ్యూనిస్టులతో బాటు కొందరు కమ్యూనిస్టులు కాని కార్మిక నాయకులు కూడ ఈ పత్రికలను ప్రచురించేవారు. "సోషలిస్టు" అనే పత్రిక మొదటి సంచిక 1922లో బొంబాయిలో వెలువడింది. దీనికి శ్రీ యస్.ఎ. డాంగే సంపాదకుడు. ఈ పత్రిక సోషలిస్టు భావాల వ్యాప్తికి కృషి సల్పింది. 1926లో బెంగాలీలో "గణవాణి" అనే వారపత్రిక కలకత్తా నుండి వెలువడింది. దీనికి శ్రీ ముజఫర్ అహ్మద్ సంపాదకుడు. ఈ పత్రిక కార్మికుల, రైతుల ప్రయోజనాలను సమర్థించడానికి, సోషలిస్టు దృక్పథాన్ని పెంపొందించడానికి కృషిచేసింది. అదేవిధంగా శ్రీమతి సంతోష్ కుమారి

గుప్త ఎడిటరుగా "శ్రామిక్", కుతుబుద్దీన్ అహ్మద్ ఎడిటరుగా వెలువడిన "మజ్దూర్" అనే రెండు బెంగాలీ పత్రికలు కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణను చేపట్టాయి. దేశంలోని వివిధ ప్రదేశాల నుండి ప్రచురించబడిన కీర్తి కిసాన్, స్పార్క్, క్రాంతి తదితర అనేక పత్రికలు కార్మికవర్గ దృక్పధానికి అశేష ప్రచారం ఇవ్వడానికి, పెట్టుబడిదారీ విధానంలోని దోపిడీ స్వభావాన్ని బట్టబయలు చేయడానికి విశేష కృషిసల్పాయి.

ప్రవాసంలో వున్న భారత కమ్యూనిస్టు పార్టీ 1923లో ప్రప్రథమంగా "వాన్‌గార్డ్ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్" అనే పక్షపత్రికను బెర్లిన్‌లో ప్రచురించడం ప్రారంభించింది. దీనికి శ్రీ ఎమ్.ఎన్.రాయ్ సంపాదకుడు. ఈ పత్రిక రహస్యంగా ఇండియా చేరుతుండేది. ఈ పత్రిక పేరు తరువాతి రోజుల్లో "ఎడ్వాన్స్‌డ్ గార్డ్" గాను ఆ తరువాత "ది వాన్ గార్డు" గాను మార్చబడింది. ఈ పత్రికలు ఇండియాలో చాలా రహస్యంగా కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే అందేవి.

కార్మికవర్గంలో చైతన్యం పెంపొందించడానికి, వారి సమస్యలను ప్రజల దృష్టికి తీసుకుపోవటానికి ఈ పత్రికలు ఎనలేని కృషిసల్పాయి.

కాన్పూరు కుట్ర కేసు విచారణ తతంగం పూర్తయిన కొద్దికాలానికే బొంబాయిలో 1925 ఫిబ్రవరి 14వ తేదీన ఎ.ఐ.టి.యు.సి. ఐదవ మహాసభ జరిగింది. శ్రీ డి.ఆర్.తేంగిడీ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 66 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ తేంగిడీ అధ్యక్షోపన్యాసమిస్తూ, నిత్యావసర వస్తువులను సక్రమంగా పంపిణీ చేయాలని, పేద రైతులకు భూమి పంచాలని డిమాండ్ చేశాడు. కేంద్ర విధానసభ (Central Legislature) ప్రాంతీయ విధానసభలకు (Provincial Legislatures) వయోజన ఓటింగు పద్ధతి ద్వారా ఎన్నికలు జరపాలని ఈ మహాసభ డిమాండు చేసింది. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ సర్వీసులలో, జీవించడానికి సరిపడే కనీస వేతనం ఇవ్వాలని ఈ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ మహాసభలో ఎ.ఐ.టి.యు.సి. నిబంధనావళికి కొన్ని సవరణలు కూడ చేసింది. వీటి ప్రకారం ప్రపంచంలో ఎక్కడైనా ఇదే రకమైన లక్ష్యాలతో పనిచేసే ఇతర కార్మిక సంస్థలతో సహకరించి వారితో కలిసి పనిచేయడానికి వీలుగా ఎ.ఐ.టి.యు.సి. లక్ష్యాలను విస్తృతపరచడం జరిగింది.

సి.ఎఫ్. ఆండ్రూస్‌ను అధ్యక్షునిగా, వి.వి.గిరిని ఉపాధ్యక్షునిగా, ఎన్.ఎమ్. జోషీని ప్రధాన కార్యదర్శిగా యీ మహాసభ ఎన్నుకున్నది. రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, బ్రిటిషు శాఖ ప్రముఖ సభ్యులలో ఒకడైన పెర్సీ ఇ. గ్లాడింగ్ ఈ మహాసభకు హాజరు గావడం ప్రత్యేకించి చెప్పుకోదగ్గ విషయం. ఆయన లండనులోని "అమాల్గమేటెడ్ యూనియన్ ఆఫ్ ఇంజనీర్స్" తరపున సౌహార్ద్ర ప్రతినిధిగా ఈ మహాసభకు హాజరయ్యాడు. ఇంగ్లండులో జాతీయ మైనారిటీల ఉద్యమంతో కూడ ఈయన సన్నిహిత సంబంధాలు కల్గివున్నాడు. ఇండియాలో వున్న సమయంలో గ్లాడింగ్ చాలా కార్మికవర్గ కేంద్రాలను సందర్శించాడు.

ఎ.ఐ.టి.యు.సి. ఆరవ మహాసభ 1926 జనవరి 9,10 తేదీల్లో శ్రీ వి.వి.గిరి అధ్యక్షతన మద్రాసులో జరిగింది. ఆనాటికి ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడిన లక్షా 25 వేల సభ్యత్వం గల్గిన 52 యూనియన్లు వుండగా, 80 వేలమంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 27 యూనియన్ల నుండి 1100 మంది ప్రతినిధులు మాత్రమే ఈ మహాసభకు హాజరయ్యారు.

ఈ సమావేశం తరువాత ఎ.ఐ.టి.యు.సి. ఆఫీసు బొంబాయి నుండి కలకత్తాకు మార్చబడింది. మాస్కోలోని సెంట్రల్ కౌన్సిల్ ట్రేడ్ యూనియన్స్, రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్‌ల నుండి ఈ మహాసభకు శుభాకాంక్ష సందేశాలందాయి. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగానూ, స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగిస్తూన్న భారత ప్రజానీకానికి తమ సానుభూతిని వ్యక్తంచేస్తూ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్ ఈ విధంగా పేర్కొన్నది. భారతదేశంలోని ట్రేడ్ యూనియన్లతో నేరుగా సంబంధాలు ఏర్పడటం పట్ల యుఎస్ఎస్ఆర్ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తోంది. ఎ.ఐ.టి.యు.సి. ప్రతినిధి వర్గాన్ని సోవియట్ యూనియన్‌కు ఆహ్వానిస్తోంది. సోవియట్ రష్యా, భారతదేశాలలోని ట్రేడ్ యూనియన్లు సన్నిహిత సంబంధాలేర్పరచు కొనడంవల్ల, రెండు దేశాలలోని కార్మికులకు చాలా ప్రయోజనం చేకూర్చుతుంది" అని కూడ ఈ సందేశం పేర్కొంది. రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్ పంపిన రెండవ సందేశం చైనా, పర్షియా, ఈజిప్టు మొదలగు దేశాలలోని ట్రేడ్ యూనియన్లతో ఎ.ఐ.టి.యు.సి. సంబంధాలు ఏర్పరచుకొనవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పింది. "బొంబాయిలోని జౌళి కార్మికుల వీరోచిత సమ్మె పోరాటం విజయవంత కావడం పట్ల ఈ సందర్భంగా వ్యక్తమైన "కార్మిక వర్గ సంఘీభావానికి" భారత కార్మికవర్గాన్ని ఈ సందేశంలో అభినందించడం జరిగింది.

ఇండియాలోని కార్మికవర్గ ఉద్యమంతో అంతర్జాతీయ స్థాయిలో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవాలనే ఆకాంక్షను వ్యక్తంచేస్తూ భారతదేశంలోని ట్రేడ్ యూనియన్లకు చాల లేఖలందుతూనే వున్నాయి. 1926 మార్చి నెలలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యవర్గం కలకత్తా ప్రెస్ ఉద్యోగుల సంఘానికి ఒక టెలిగ్రాం ద్వారా స్వాతంత్ర్య సాధనకు పోరాటం సాగిస్తున్న భారతీయులకు తమ సంఘీభావం తెలియజేసింది. ఆ టెలిగ్రాం ఇంకా ఇలా పేర్కొంది. "ఆ (స్వాతంత్ర్య సాధనకై జరిగే) పోరాటంలో దేశంలోని జర్నలిస్టులు అతి ముఖ్యమైన పాత్ర వహిస్తున్నారు. సామ్రాజ్యవాదుల ప్రెస్ వారి వార్తా సంస్థలు (భారత్‌కు సంబంధించిన సమాచారం ప్రపంచానికి తెలియకుండా) చేస్తున్న వార్తా దిగ్బంధనాన్ని వారు (జర్నలిస్టులు) పటాపంచలు చేస్తున్నారు."

మాస్కోలో జరుగనున్న యుఎస్ఎస్ఆర్ ట్రేడ్ రష్యా యూనియన్ కాంగ్రెసు 7వ మహాసభకు సౌహార్ద్ర ప్రతినిధిని పంపవలసిందిగా కోరుతూ యుఎస్ఎస్ఆర్ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ 24-10-1926న ఎ.ఐ.టి.యు.సి కలకత్తా శ్రామికులు టెలిగ్రాం

పంపినట్లు ఆనాటి గూఢచారి విభాగం డైరెక్టరు డేవిడ్ పెట్రీ తన రచనలో పేర్కొన్నాడు. కాని ఆ టెలిగ్రామ్‌ను మధ్యలోనే అడ్డగించడం జరిగిందని కూడ ఆయనే వ్రాశాడు.

ఈ కాలంలో విదేశాలలోని కార్మికోద్యమంతో సంబంధాలు ఏర్పరచుకొనడానికి భారతదేశంలోని కార్మిక నాయకులు కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. 1925 ఏప్రిల్ నెలలో జెనీవాలో జరిగిన ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్సులో ఎన్.ఎమ్.జోషి. పాల్గొన్నాడు. ఆయనకు సహాయకుడుగా శ్రీ చమన్‌లాల్ హాజరయ్యాడు. మహాసభనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఇండియాలోని కార్మికులు ఎంత ఘోరంగా దోపిడీ చేయబడుతున్నదీ బట్టబయలుచేశాడు. అందుకు ఆయన ఒక ఉదాహరణ ఇస్తూ ఇలా అన్నారు. భారతదేశంలో వైస్రాయిగానున్న ఛెమ్స్ ఫర్డ్‌వంటి ఉన్నత స్థానంలో వున్న వ్యక్తి సిమ్లానుండి కొండలపైకి వెళ్ళవలసినప్పుడు ఆ గౌరవనీయుడు తన సుఖప్రయాణానికి వీలుగా రోడ్లువేయడానికి పొలాల్లో పనిచేస్తున్న పేదరైతులను బలవంతంగా యీడ్చుకొని వచ్చి వారు పనిచేసేట్లు చేశాడు." భారతదేశంలోని పరిస్థితులు తెలిసిన వారికిది బాగా అర్థమవుతుంది. ఆ తరువాత ఇండియాలో టీ తోటలు, గనులు, జనపనార, ప్రత్తి పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల హీనమైన వేతనాలను గురించి కూడ మాట్లాడాడు.

జెనీవా నుండి భారత కార్మిక నాయకులు పారిస్, లండన్ నగరాలను సందర్శించి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటాలు సాగిస్తున్న ప్రముఖులైన కార్మిక నాయకులను, రాజకీయ నాయకులను కలిశారు. 1926 అక్టోబర్ 10వ తేదీన బోర్న్‌మౌత్‌లో జరిగిన బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సమావేశానికి కూడ చమన్‌లాల్ హాజరయ్యాడు. "లక్షలాది మంది భారత కార్మికులను పారిశ్రామిక బానిసలుగా వుంచడమే బ్రిటిష్ ప్రభుత్వ ఉద్దేశ్యమైతే, ఆ సామ్రాజ్యం నాశనంకావలసిందే" అని బ్రిటిషు ప్రభుత్వం సాగిస్తున్న దోపిడీని తీవ్రంగా విమర్శిస్తూ చమన్‌లాల్ అన్నారు.

1926 సెప్టెంబరు 18,19 తేదీలలో లండన్‌లోని పో ప్లార్ టౌన్‌లో జరిగిన "జాతీయ వామపక్ష ఉద్యమ" సమావేశానికి కూడ చమన్‌లాల్ హాజరయ్యాడు. ఆయనతో బాటు పులీన్ బెహారిసీల్, క్లైమన్స్ పామీదత్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ ప్రయత్నాలేగాక లండన్‌లోని భారత కార్మిక సంక్షేమ సమితికూడ భారత కార్మికుల పరిస్థితుల గురించి ఇంగ్లండులో బాగా ప్రచారం గావించి సామ్రాజ్యవాదులు చేస్తున్న ఆర్థిక, రాజకీయ దోపిడీకి వ్యతిరేకంగా భారత కార్మికవర్గానికి మద్దతు సమీకరించేందుకు తీవ్ర కృషి చేస్తోంది.

పోరాటాలు సాగిస్తున్న భారత కార్మికులకు విదేశాల నుండి సానుభూతి సహకారాలు అందుతూనే వున్నాయి. ఇండియాలోని ట్రేడ్ యూనియన్లు కూడా తమ శక్తి మేరకు అంతర్జాతీయంగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి ప్రయత్నం చేశాయి. ఇంగ్లండులో సమ్మె చేస్తున్న గని కార్మికులకు ఆర్థిక సహాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ లండన్ నుండి

ఎ.ఐ.టి.యు.సి.కి ఒక టెలిగ్రాం అందింది. దీనికి స్పందిస్తూ, వేర్వేరు కార్మికసంఘాల నుండి సేకరించిన 600 పౌండ్ల మొత్తాన్ని ఎన్.యం.జోషి వారికి పంపారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ తరపున ముకుంద్ లాల్ సర్కార్ 35 పౌండ్ల మొత్తాన్ని పంపారు.

## ఎ.ఐ.టి.యు.సి. మహాసభల స్వభావం

ఈ కాలంలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. మహాసభలకు, మొదటి రెండు మహాసభలకు మధ్య తేడాలను కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. కార్మికవర్గ ప్రతినిధులు అధిక సంఖ్యలో అత్యుత్సాహంగా పాల్గొన్న ఝరియా సమావేశాలతో పోల్చితే ఆ తేడా మరింత కొట్టవచ్చినట్లు కనపడుతుంది. గతంలో జరిగిన రెండు మహాసభలలో వలె గాక ఈ మహాసభలలో మధ్య తరగతి ఉద్యోగ సంఘాలే ఎక్కువగా పాల్గొన్నాయి. నిర్ణయాలు తీసుకొనడంలో కూడ ఈ మహాసభలు (ఎ.ఐ.టి.యు.సి.) బలహీనతలను పరిమితులను బహిర్గతం చేయడం విచారకరమైన విషయం. ఆ తీసుకున్న నిర్ణయాలు ఎప్పుడూ ఒకేరకంగా వుండి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయడంతో సరిపెట్టుకొనడం జరిగింది. వాయువ్య రైల్వే కార్మికుల సమ్మెకు బొంబాయిలోని టెక్స్టైల్ కార్మికుల సమ్మెకు సహాయ, సహకారాలు అందించనట్లుగా 5వ మహాసభ నివేదికలో ప్రస్తావించడం జరిగింది. కాని యీ మహాసభ కార్యక్రమాన్ని గాని, సంస్థాపరమైన విషయాలు, కార్యాచరణకు సంబంధించి ఏవిధమైన ప్రణాళికను కార్మికుల ముందుంచలేదు.

ఈ కాలంలో ఎ.ఐ.టి.యు.సి. క్రింద స్థాయి కార్మికులతో సంబంధాలు పూర్తిగా కోల్పోయింది. ఇది కోట్లాదిమంది కార్మికుల పోరాట వేదికగా కాక కొద్దిమంది కీర్తికాంక్షా పరులైన రాజకీయ నాయకులకు వేదికగా ఉపయోగపడుతోంది.

నిర్మాణరీత్యా ఎ.ఐ.టి.యు.సి. బాగా దెబ్బతిన్నది. బెంగాలు, బొంబాయి, మద్రాసు ప్రాంతీయశాఖలు జరిపిన చెప్పుకోదగ్గ కార్యకలాపాలు లేవు. మహాసభలకు ప్రతినిధులను పంపడమేగాని, కేంద్రం శాఖల మధ్య రిపోర్టు చేయడం, సమస్యలను చర్చించడం జరగడం లేదు. సమావేశాలు జరపడమే అంతంత మాత్రంగా వుండగా ఆ జరిగిన సమావేశాలు కూడ లాంఛనప్రాయంగా మాత్రమే జరిగేవి. ఎ.ఐ.టి.యు.సి వార్షిక జమా ఖర్చులు పరిశీలిస్తే, మొత్తం వెయ్యిరూపాయలు దాటలేదంటే ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వాన్నంగా వున్నదీ స్పష్టమవుతుంది.

రెండవ మహాసభ తరువాత వార్షిక నివేదికలు కూడ తక్కువ పేజీలకు కుదించబడ్డాయి. సరియైన శ్రద్ధ లేకపోవడం వలన ఎ.ఐ.టి.యు.సి. కార్యకలాపాలు చాలా మందకొడిగా సాగడాన్ని చూచి నాల్గవ మహాసభలకు హాజరైన వారిలో కొందరు రాడికల్ భావాలు కల్గిన ప్రతినిధులు వ్యధ చెంది, మరల ఎ.ఐ.టి.యు.సి.ని చైతన్యవంతం చేసేందుకు కొన్ని సంస్థాపరమైన చర్యలు తీసుకోవాలనికోరారు. ఇది ఎ.ఐ.టి.యు.సి. నిబంధనావళిలో కొన్ని హర్షణీయమైన మార్పులకు దారితీసింది.

ఇంకా ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వం సంస్కరణవాదుల చేతుల్లోనే వున్నది. వారి రాజకీయ దృక్పథం, పని విధానం ఎ.ఐ.టి.యు.సి. స్వభావం, పనివిధానం మీద తీవ్ర ప్రభావం చూపాయి.మూడవ మహాసభను గురించి ప్రవాసంలోనున్న భారత కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'ది వాన్‌గార్డ్' 1923 సం॥ మే 15వ తేదీన యీ విధంగా వ్రాసింది. "లాహోరు మహాసభ పేరుకు మాత్రమే కార్మికవర్గ సమావేశం. జాతీయతావాదం, మానవతావాదం మాత్రమే అక్కడ ప్రబలంగా వున్నాయి. జాతీయ నాయకులు కార్మికవర్గం తప్ప మన సమాజంలోని మిగిలిన అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

కాని ఈ స్థబ్ధత, నిస్పృహ కేవలం రాబోయే తుఫానుకు సూచన మాత్రమే. సంస్కరణవాదం విపరీతంగా వూపివేస్తున్న ఈ తరుణంలో ఆశాకిరణాలు గోచరించడటం ప్రారంభమైంది. ఇప్పటివరకు కార్మికులను చైతన్యవంతులను చేయడానికి, ఇంటా బయటా చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వడం మొదలయింది. ఇక రాబోయే పోరాటదశ ఈ నూతన విప్లవశక్తి విజృంభణకు దృష్టాంతంగా నిలిచింది.

# 13

# పోరాటాల ఉధృతి - వ్యాప్తి (1926-29)

**భా**రత కార్మికోద్యమంలో 1926-29 మధ్యకాలం చారిత్రక ప్రాధాన్యతగల్గిన సంఘటనలతో కూడుకొనివుంది. దేశంలో ప్రజా జీవితం రాజకీయంగానూ, ఆర్థికపరంగానూ తీవ్రమైన అశాంతికర పరిస్థితులకు గురికాక తప్పని పరిస్థితులేర్పడ్డాయి. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం నిలద్రొక్కుకుని ముందంజవేసే స్థితికి ఎదిగింది. అందువలన ఆనాటి కార్మికవర్గ ఉద్యమంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం చాలా బలంగా వున్నది. ఈ సమయంలోనే బ్రహ్మాండమైన సమ్మెలు నిర్వహించబడ్డాయి. ఈ సమ్మెలన్నింటిని కమ్యూనిస్టులు చేసే కుట్రలుగా చిత్రించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ నిజానికి యెడతెగని సమస్యలతో సతమతమవుతున్న కార్మికవర్గం తమ తీవ్ర అసంతృప్తిని వెల్లడించడానికి మాత్రమే యీ సమ్మెలు నిర్వహించింది. వీటికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించారు. తీవ్రతరమైన ఈ పోరాటాలు కార్మికవర్గానికి మరింత విశాల దృక్పథం ఏర్పడడానికి ఉపయోగపడ్డాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కార్మికవర్గ కార్యకలాపాలు పరిశీలించి నట్లయితే ఈ విషయం స్పష్టమవుతుంది.

"కమ్యూనిస్టుల వలన ఏదో ఘోర ప్రమాదం" వాటిల్లనున్నదన్న సాకుతో 1929 సం॥లో ప్రభుత్వం పైశాచిక దమనకాండ జరిపి కార్మికవర్గ ఉద్యమంలోని మిలిటెంట్ సెక్షన్‌ను తుదముట్టించే ప్రయత్నాలు సాగించింది. ప్రజలను కార్మికవర్గానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే నీచమైన ఎత్తుగడలకు కూడా ప్రభుత్వం పాల్పడింది. ఒకవైపున ఉగ్రూతలూగుతూ ముందుకు సాగుతున్న కార్మికోద్యమాన్ని తమ అదుపులో వుంచుకొనడానికి "భారత ట్రేడ్ యూనియన్ చట్టం 1926" అనే శాసనాన్ని ప్రవేశపెడుతూనే, వేరొక ప్రక్క కార్మికవర్గ పోరాటాలను అణచి వేయడానికి వీలుగా నిర్బంధ అధికార యంత్రాంగాన్ని పటిష్టం చేసే లక్ష్యంతో (ది ట్రేడ్ డిస్ప్యూట్స్ యాక్టు) 'పారిశ్రామిక వివాదాల చట్టం' ప్రజా భద్రతా చట్టం అనే మరి రెండు చట్టాలు చేసింది. కార్మికవర్గ పోరాటాలను సమరశీల ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఈ చట్టాలన్నింటిని వినియోగించుకుని, బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వం ఇండియాను "కమ్యూనిస్టుల బారి" నుండి విముక్తి చేయాలనే పవిత్రమైన తలంపుతో అతి నైపుణ్యంగా కుతంత్రాలు పన్ని "మీరట్ కుట్రకేసు"ను ప్రారంభించింది.

## రాజకీయ పోరాటంలో నూతన మలుపు

గత కొన్ని సంవత్సరాలుగా "ప్రతిఘటించకపోవడం" అనే మతిమాలిన ఎత్తుగడలు అవలంబించడం వలన సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులు అనేక చీలికలకు, వూగిసలాటలకు, తీవ్ర ఆశాభంగానికి గురయ్యాయి. మతకల్లోలాలు పెల్లుబుకడం చూస్తే, సామ్రాజవాద వ్యతిరేక శక్తులు ఎంతగా బలహీనపడిందీ మరింత స్పష్టమవుతుంది.

జాతీయోద్యమంలో వున్న ఈ బలహీనతను సామ్రాజ్యవాదులు యిట్టే పసిగట్టారు. ఒక ప్లాను ప్రకారం క్రమపద్ధతిలో జాతీయోద్యమంపై దాడులు సాగించాలనే వుద్దేశ్యంతో వారు తమ ఆర్థిక, పాలనా విధానాలను అతిస్వల్ప వ్యవధిలో పునర్ వ్యవస్థీకరించుకున్నారు.

1927 సం॥లో ప్రవేశపెట్టబడిన కరెన్సీబిల్లు భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బకొట్టింది. 1925-26 సం॥లో 'హిల్టన్‌యంగ్ కరెన్సీ కమీషన్' రూపాయివిలువ తగ్గించి 1 షిల్లింగు 6 పెన్నీలుగా నిర్ణయించవలసిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. 1924 ఇండియన్ స్టీల్ ప్రొటెక్షన్ బిల్లును 1927 సం॥లో సవరించబడటం ద్వారా బ్రిటన్‌లో తయారైన ఉక్కుకు ప్రభుత్వం ప్రత్యేకమైన ధరను నిర్ణయించింది. భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసే ఉద్దేశంతో 1920 దశకం ప్రారంభంలో ప్రవేశపెట్టబడిన టారిఫ్ విధానాన్ని వదిలివేసి సామ్రాజ్యవాదులకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రభుత్వం ద్రవ్య విధానంలో మార్పులు చేసింది.

ఈ ఆర్థికపరమైన దాడులకనుగుణంగా పాలనా పరమైన సంస్కరణల గురించి సిఫార్సులు చేయడంతో పాటు భారతీయులకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సరిపడుతుందా అనే విషయాన్ని పరిశీలించడానికి సైమన్ కమిషనును నియమిస్తున్నట్లు 1927 నవంబరులో బ్రిటిష్ క్యాబినెట్ లండన్‌లో ప్రకటించింది. బ్రిటిషు రాజనీతిజ్ఞుడు సర్ జాన్ సైమన్ ఆధ్వర్యంలో భారత ప్రజల సమస్యలపై విచారణ సాగించవలసిన కమిషన్‌లో భారతీయులకే ప్రాతినిధ్యం లేకపోవడం గమనించవలసిన విషయం.

కాని, ఈ చర్యలవలన సామ్రాజ్యవాదులు ఆశించినదానికి భిన్నంగా జాతీయోద్యమానికి క్రొత్తవూపు వచ్చి, సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులన్నీ తిరిగి సంఘటితం కావడానికి ఈ ప్రకటన కారణమైంది. భారత బూర్జువావర్గం బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో సర్దుబాట్లుచేసుకొనే ఆశలు వదులుకుని, ప్రజాశక్తిని ఉపయోగించే ఆలోచనలు చేయవలసివచ్చింది. కాని యీ సమయానికి కార్మికవర్గం, ప్రజానీకం కూడ జాగృతంకావడం, యీ రాజకీయ పోరాటం సామ్రాజ్యవాదులకేకాక, స్వదేశీ దోపిడీ దారులకు కూడ వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడడంతో బూర్జువావర్గం పరిస్థితి కుడితిలోపడిన ఎలుకవలె అయింది. ఇలా నానాటికీ ఉధృతమవుతున్న ప్రజల తీవ్ర అసంతృప్తి, పోరాట స్వభావంలో వస్తున్న క్రొత్త మార్పులు వూగిసలాడుతున్న బూర్జువా నాయకత్వాన్ని చాలా కలవరపరచాయి. ఈ తరువాత కాలంలో జరిగిన రాజకీయ ఆందోళనలు బూర్జువావర్గ ద్వంద్వ స్వభావాన్ని బహిర్గతం చేశాయి.

కాంగ్రెసు ఈ సైమన్ కమిషన్‌ను తిరస్కరించి, దాని కార్యక్రమాన్ని బహిష్కరించడానికి నిశ్చయించింది. ఈ విషయమై 1927 సం॥లో మద్రాసులో జరిగిన కాంగ్రెసు సమావేశం ఒక తీర్మానం చేసింది. భారతీయులకు (స్వరాజ్యం ఇవ్వాలా లేదా) తమ దేశాన్ని తామే పరిపాలించుకొనగలరా లేదా అనే విషయాన్ని పరిశీలించేందుకు, భారతీయులకు ప్రాతినిధ్యం లేకుండా ఏర్పాటు చేయబడిన ఈ కమిషన్ జాతిని కించపరచడమేనని ప్రకటిస్తూ, యీ కమిషన్ యెడల కాంగ్రెసుకు ఎట్టి బాధ్యత లేదని యీ తీర్మానం పేర్కొన్నది. లిబరల్ ఫెడరేషన్, ముస్లింలీగులు కూడ యీ కమీషనును బహిష్కరించాలని నిర్ణయించాయి.

దేశవ్యాప్తంగా యీ కమిషన్‌కు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రజా ప్రదర్శనలు జరిగాయి. 1928 ఫిబ్రవరి 3న కమిషన్ సభ్యులు బొంబాయిలో అడుగుపెట్టగానే వేల సంఖ్యలో ప్రజలు కోపావేశంతో సైమన్ గో బ్యాక్ అంటూ నినాదాలిస్తూ ప్రదర్శనలు చేశారు.

ఏ రాజకీయ కార్యక్రమం మీదనో ఆధారపడి ప్రజలు ఏకంకాలేదు. సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదమే ప్రజలందరిని ఏకం చేసింది. ఈ రాజకీయ పోరాట వెల్లువలో కార్మిక వర్గం అత్యధిక సంఖ్యలో పాల్గొనడం గొప్ప విశేషం. కార్మికవర్గం ఒక స్వతంత్ర శక్తిగా ముందుకు రావడంతో భారత జాతీయోద్యమ పోరాటంలో నూతన చైతన్యం వెల్లివిరిసింది. కాని ఇంకా కార్మికవర్గం ఈ రాజకీయ పోరాటంలో నాయకత్వ స్థానానికి రాలేకపోయినప్పటికీ ఈ పోరాటంలో కార్మికవర్గం వీరోచితంగా పాల్గొనడం, పెద్ద సంఖ్యలో ఆర్థిక పోరాటాలను, మిలిటెంట్ ట్రేడ్ యూనియన్లను నిర్మించడం కార్మికవర్గం తన స్వంత నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకునే కార్యక్రమాన్ని త్వరితం చేశాయి. రాజకీయంగా చైతన్య వంతమైన కార్మికవర్గం తమ సిద్ధాంతమైన సోషలిజాన్ని భారతదేశంలో ఒక రాజకీయ శక్తిగా నెలకొల్పడంలో విజయవంతమయింది.

ఈ అతివాద వామపక్ష శక్తుల పురోగతి, ప్రభావం కాంగ్రెసు మీద కూడ పడింది. మద్రాసులో జరిగిన కాంగ్రెసు సమావేశంలో జాతీయోద్యమ లక్ష్యం సంపూర్ణ స్వాతంత్ర్యమని ప్రకటిస్తూచేసిన తీర్మానాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించగా, సుభాస్ చంద్రబోస్, ఆయన అనుచరులు దానిని బలపరచారు. ఈ తీర్మానం ఏ విధమైన అభ్యంతరము లేకుండా ఆమోదించబడడం చాలా అసాధారణమైన విషయం. ఇది గాంధీజీ లేనప్పుడు జరిగింది. దీనిని ఆయన "తొందరపాటు చర్య" అనాలోచిత అని ఖండించారు. క్రొత్తగా స్థాపించబడిన "సామ్రాజ్యవాదవ్యతిరేక అంతర్జాతీయ సమితి"కి కాంగ్రెసును అనుబంధం చేయాలని కూడ కాంగ్రెసు నిర్ణయించింది. వామపక్షభావాలు గలిగిన యువతకు ప్రాతినిధ్యం వహించే జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్‌లను కాంగ్రెసుకు ప్రధాన కార్యదర్శులుగా ఈ మహాసభ ఎన్నుకున్నది.

కాంగ్రెసులోని వామపక్షీయులు పైకి విజయం సాధించినట్లు కనపడినా, వాస్తవానికి వారేమీ సాధించలేకపోయారు. ఈ విషయాన్ని 1928లో జరిగిన సంఘటనలు ధృవపరచాయి. కార్మికవర్గం సాగిస్తున్న ఉధృత పోరాటాల వలన ఏర్పడిన కల్లోల పరిస్థితి, సైమన్ కమిషనుకు

వ్యతిరేకంగా ప్రజానీకం నిర్వహించిన బ్రహ్మాండమైన ప్రదర్శనలు, విద్యార్థులు, యువజనులు సాగించిన మిలిటెంట్ ఉద్యమాలు అనుభవజ్ఞులైన కాంగ్రెసు నాయకుల ధైర్యాన్ని సడలించాయి. అందువలన సంపూర్ణ స్వాతంత్ర్య సాధన డిమాండును వదలివేసి 1928 ఆగష్టులో లక్నోలో కాంగ్రెసు, ముస్లింలీగు, లిబరల్ ఫెడరేషన్‌లతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. “బాధ్యతాయుత ప్రభుత్వాన్ని” స్థాపించే లక్ష్యంతో రాజ్యాంగ ముసాయిదాను తయారుచేయడం కొరకు ఈ సమావేశం మోతీలాల్ నెహ్రూ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటుచేసింది. అనుభవజ్ఞులైన కాంగ్రెసు నాయకులు, మధ్యవాదులు, అభివృద్ధి నిరోధకశక్తుల కలయిక ఫలితంగా ఏర్పడిన ఈ కమిటీ కూడ యువకులు కోరుతున్న సంపూర్ణ స్వాతంత్ర్య సాధన డిమాండును పూర్తిగా నిర్లక్ష్యం చేయలేకపోయింది. అందువలననే సంపూర్ణ స్వాతంత్ర్య సాధన కోరికను మసిపూసి మారేడుకాయచేసి ఈ సంపూర్ణ స్వాతంత్ర్యాన్నే బ్రిటిషు సార్వభౌమాధికారపరిధిలో స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యం” అధినివేశ ప్రతిపత్తి అని నిర్వచించడానికి ప్రయత్నం చేసింది.

ఈ నివేదికలోని అభివృద్ధి నిరోధక స్వభావం (యథాతథవాదం), దానిలోని అంతర్గత లోపాలు అఖిలపక్ష సమితి పతనానికి కారణభూతమయ్యాయి. 1928 డిశంబరులో ఈ రిపోర్టును గురించి చర్చించడానికి కలకత్తాలో జరిగిన సమావేశం హిందూ, ముస్లిం, సిక్కు మతోన్మాదుల యుద్ధభూమిగా మారింది. సిక్కుమతోన్మాదులు, జిన్నా నాయకత్వంలోని ముస్లిం మతోన్మాదులు, ఈ సమావేశం నుండి వాకౌట్ చేశారు.

ఇప్పుడు ఒక భయంకరమైన సంక్షోభం తలెత్తింది. “డొమినియన్ ప్రతిపత్తి” (అధినివేశ ప్రతిపత్తి) అనే ఆలోచనకే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సంపూర్ణ స్వాతంత్ర్యం విషయమై మద్రాసు కాంగ్రెస్ ఆమోదించిన తీర్మానాన్ని అమలు చేయవలసిందిగా కాంగ్రెస్‌లోని అతివాదులు ఒత్తిడి చేయసాగారు. ఈ సమయంలో, ఆరు సంవత్సరాల రాజకీయ నిద్రావస్థ తరువాత కాంగ్రెసును తీవ్ర సంక్షోభం, అంతర్గత సంఘర్షణల ఊబి నుండి బయట పడవేయడానికి గాంధీజీ తిరిగి రంగప్రవేశం చేశాడు. ఈ సందర్భంగా రజనీ పామీదత్తు ఇలా వ్రాశారు. “పరిస్థితిని అదుపులో వుంచి పరిమితంగా ప్రజా ఉద్యమాలు సాగించి తమకు లాభసాటిగా బేరమాడేందుకు, అదే సమయంలో విప్లవ ప్రమాదం నుండి ఇండియాను కాపాడటానికి సమర్థుడైన వ్యక్తిగా గాంధీజీపై బూర్జువా వర్గం (ఆయన వ్యతిరేకులు దీనిని సామ్రాజ్యవాదుల ఆశలు అనవచ్చు) ఆశలు పెట్టుకున్నది.”

గాంధీజీ 1928 డిశంబరు కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరై మోతీలాల్ నెహ్రూ కమిటీ రిపోర్టును ఆమోదింపజేయడానికి చాలా శ్రమపడ్డాడు. అతిస్వల్పమైన మెజారిటీతో ఈ రిపోర్టు ఆమోదింపబడింది. 31.12.1928 లోగా ప్రభుత్వం యీ నివేదికను ఆమోదించకపోకపోయినట్లయితే, అహింసాయుతమైన సహాయ నిరాకరణోద్యమాన్ని కాంగ్రెసు తిరిగి చేపడుతుందని, యీసారి పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టవలసిందిగా ప్రజలను కాంగ్రెసు కోరుతుందనే హామీ మీదనే ఈ నివేదిక ఆమోదింపబడింది.

ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల అసంతృప్తి పతాకస్థాయిలో వున్న ఈ సమయంలో ఒక సంవత్సరం పూర్తిగా యీ విధంగా వ్యర్థం చేయబడింది.

కలకత్తా కాంగ్రెస్ తర్వాత సరిగ్గా ఒక సంవత్సరం తరువాత 1929 డిసెంబరులో కాంగ్రెసు లాహోరులో సమావేశమైంది. ప్రజలలో అసంతృప్తి రగుల్కొంటున్న ఈ తరుణంలో లాహోరు కాంగ్రెసు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తన లక్ష్యంగా ప్రకటించి, శాసనోల్లంఘన ఉద్యమాన్ని సాగించవలసినది గాను, పరిస్థితినిబట్టి అవసరమైతే పన్నుల నిరాకరణోద్యమాన్ని కూడ చేపట్టవలసిందిగా ఈ మహాసభ కాంగ్రెసు కమిటీకి అధికారం ఇచ్చింది. గాంధీజీ బలాబలాలను బేరీజు వేసి పరిస్థితులు ఎటు దారితీసేదీ గుర్తించాడు. అందువలన కాంగ్రెసుకు అధ్యక్షునిగా ఆయనను ప్రతిపాదించగా, దానిని తిరస్కరించి ప్రతిష్టాకరమైన ఆ పదవికి జవహర్‌లాల్ నెహ్రూను నియమించాడు.

డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి సరిగ్గా నూతన సంవత్సరంలో అడుగు పెడుతూన్న సమయంలో నెహ్రూ భారత స్వాతంత్ర్య పతాకాన్ని ఆవిష్కరించాడు. 26.1.1930న దేశవ్యాప్తంగా ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంటున్న సందర్భంలో "ఇంకా పరాయి పాలకులకు లొంగిపోయి వుండడం మనిషికి, దేవునికి ద్రోహం చేయడమే గనుక" సంపూర్ణ స్వాతంత్ర్య సాధనకై పోరాటం సాగించాలని ప్రజలు దీక్షబూనారు.

ప్రజల్లో కొత్త ఆశలు, ఉత్సాహం చిగురించాయి. స్వరాజ్య సాధనకు కృతనిశ్చయులయ్యారు.

## భారత ట్రేడ్ యూనియన్ చట్టం 1926

ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు రక్షణ కల్పించడానికి ఏ విధమయిన శాసనము చేయడం అవసరమని బ్రిటిషు సామ్రాజ్యవాదులు భావించలేదు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే భారతదేశంలో సంఘటిత కార్మికోద్యమం రూపుదిద్దుకొన్నప్పటికీ, 1926 సం॥లో మాత్రమే ఇండియన్ ట్రేడ్ యూనియన్ చట్టం చేయబడింది. ఈ చట్టం ఎంత కార్మిక వ్యతిరేకంగా వున్నదీ అంటే దీనికి ట్రేడ్ యూనియన్లు తమ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. 1913లో భారత శిక్షాస్మృతిని సవరించడంతో ట్రేడ్ యూనియన్లు చట్ట విరుద్ధమైన సంస్థల స్థితికి దిగజార్చబడ్డాయి. అప్పటివరకు ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు సాగిస్తున్న కార్యకర్తలకు రక్షణ కల్పించడానికి ఏ విధమైన చట్టములేదు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు సాగించినందులకు 1921లో వాడియాపై న్యాయ విచారణ జరపడంతో ట్రేడ్ యూనియన్ల విషయమై చట్టం చేయాలని కార్మికవర్గం డిమాండు చేసింది. వాడియాపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో, లండనులోని భారత కార్మిక సంక్షేమ సమితి ద్వారా ఈ విషయమై బ్రిటిషు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఎ.ఐ.టి.యు.సి. కృషి చేసింది. ఈ ప్రయత్నాల ఫలితంగానే షాపుర్జీ సక్లత్‌వాలా నాయకత్వంలో

బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రతినిధివర్గం భారత వ్యవహారాల బ్రిటిషు ప్రభుత్వ కార్యదర్శి మాంటేగును 22-3-1921న కలిసింది. భారత కార్మికోద్యమం బాల్యదశలో వున్న ఈ తరుణంలో కార్మిక వర్గాన్ని సంఘటితం చేసే కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న కార్యకర్తలకు సహాయపడేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఈ ప్రతినిధి వర్గం మాంటేగుకు నచ్చజెప్పడానికి ప్రయత్నించింది. కార్మికులకు సంఘాలను ఏర్పరచుకొనే చట్టపరమైన హక్కు వున్నదని, ఈ హక్కును పరిరక్షించవలసిన బాధ్యత అధికారులదని, ఈ విషయాలను ప్రభుత్వం భారతదేశంలోని తన అధికారులు గుర్తించేటట్లు చేయవలసిందిగా ఆయనను కోరింది.

ఈ విషయంలో తన వైఖరిని స్పష్టంచేస్తూ 1921లో భారత ప్రభుత్వం ఒక సర్క్యులరును జారీచేసింది. ట్రేడ్ యూనియన్లు తమ లక్ష్యాన్ని నిబంధనావళిని నిర్ణయించు కోవలసిన ఆవశ్యకతను గురించి ప్రస్తావిస్తూ, ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని సక్రమమైన, ఆరోగ్యకరమైన పంథాలో నడపాలని ఈ సర్క్యులరు నొక్కి చెప్పింది. కాని 1921-22 మధ్యకాలంలో కార్మికోద్యమ ఉధృతి తగ్గడంతో ఈ విషయంపై తదుపరి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వమే ఆసక్తి చూపలేదు.

లెజిస్లేటివ్ అసెంబ్లీకి నామినేట్ చేయబడిన ఎన్.ఎమ్.జోషి ట్రేడ్ యూనియన్లను రిజిష్టరు చేసేందుకు, సక్రమమైన ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహించే కార్యకర్తలకు సివిల్, క్రిమినల్ వ్యవహారాల నుండి రక్షణ కల్పించాలని 1921లో అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని శాంతి భద్రతల సమస్యగా మాత్రమే పరిగణిస్తున్న సామ్రాజ్యవాద పాలకులు ఈ తీర్మానానికి తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశారు. జోషీ హింసాయుత కార్యకలాపాలకు చట్టబద్ధమైన రక్షణ కోరుతున్నాడని అందువలన ఈ తీర్మానం ప్రతిపాదించడం చాలా ప్రమాదకరమైనచర్య అని చెప్పడానికి వారు ప్రయత్నించారు.

కాని, తరువాత సర్ థామస్ హాలండ్ ప్రతిపాదించిన సవరణతో ఈ తీర్మానం ఆమోదించబడింది. ట్రేడ్ యూనియన్లను రిజిష్టరు చేయడానికి మాత్రమే శాసనం చేయాలని, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించనవసరం లేదనేది ఈ సవరణ సారాంశం. దీనితో జోషీ ప్రతిపాదన ఉద్దేశం నెరవేరలేదు.

1926 భారత ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం యూనియన్లను రిజిష్టరు చేయించుకొనడం, ఆయా యూనియన్ల జమా-ఖర్చులను ఆడిట్ చేయించి ఆ లెక్కలను ప్రభుత్వానికి సమర్పించడం ట్రేడ్ యూనియన్ల బాధ్యత అయింది. యూనియన్ కార్యనిర్వాహకవర్గం (ఎగ్జిక్యూటివ్ కమిటీ)లో బయటివారి (ఆ పరిశ్రమలో పనిచేసే కార్మికులు కానివారు) సంఖ్య మొత్తం కమిటీ సభ్యుల సంఖ్యలో సగానికి మించరాదు. మిగిలిన సగంమంది కమిటీ సభ్యులు పరిశ్రమలో పనిచేసేవారై యుండాలని యీ చట్టం నిబంధన విధించింది. యూనియన్ నిధుల వ్యయంపై కూడా ఆంక్షలు విధించి నిధులను ప్రజోపయోగానికి గాని, రాజకీయ ప్రయోజనాలకు గాని వినియోగించడాన్ని ఈ చట్టం పూర్తిగా నిషేధించింది.

ఆనాడు ఇంగ్లండులో అమలులోనున్న ట్రేడ్‌యూనియన్ చట్టానికి, 1926 భారత ట్రేడ్ యూనియన్ చట్టానికి చాలా తేడా వున్నది. భారత ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం రిజిష్టరు అయిన యూనియన్లకు, రిజిష్టరుకాని యూనియన్లకు మధ్య తేడా వున్నది. కాని ఈ రకమైన వివక్ష గ్రేట్ బ్రిటన్‌లో వారికి తెలియదు. యూనియన్ కార్యకలాపాలు, యూనియన్ నిధుల వినియోగంపై తీవ్రమైన ఆంక్షలు విధించడం, ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహించే కార్యకర్తలకు సివిల్, క్రిమినల్ వ్యవహారాల నుండి రక్షణ కల్పించడానికి నిరాకరించడం పరిశీలిస్తే, భారత కార్మికోద్యమం యెడల ప్రభుత్వం అనుసరిస్తున్న వలస వైఖరి స్పష్టమవుతుంది. తమ వలస పాలన ద్వారా భారత కార్మికోద్యమంపై అనేక నిషేధాలను విధించడంతో బాటు, భారత శిక్షాస్మృతిలోని 120 బి. సెక్షన్ ద్వారా నిజానికి రిజిష్టరు చేయబడని ట్రేడ్ యూనియన్లు తమ కార్యకలాపాలను సంఘటితంగా కొనసాగించడం ఆచరణలో చట్ట విరుద్ధమని తేల్చింది. ఇండియాలోని శ్రామికుల స్థితిగతులపై విచారణ సాగించిన రాయల్ కమిషన్, రిజిష్టరు చేయబడని యూనియన్లకు చెందిన సభ్యులు, కార్యవర్గ సభ్యులపై ప్రభుత్వం చట్టరీత్యా తీసుకున్న చర్యలకు సంబంధించి సేకరించిన సాక్ష్యాలను నమోదు చేసింది.

ఈ చట్టం యొక్క ఉద్దేశాలను గ్రహించిన భారత ట్రేడ్ యూనియన్లు దీనికి తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశాయి. 1927లో ఢిల్లీలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. 7వ మహాసభ ఈ ట్రేడ్ యూనియన్ చట్టాన్ని నిశితంగా విమర్శించింది. యూనియన్ నిధుల వినియోగంపై ఆంక్షలు విధిస్తూ చట్టంలో పొందుపరచిన అంశాలను మరింత తీవ్రంగా వ్యతిరేకించింది. ఇంగ్లండులోవలెనే ఇండియాలో కూడా యూనియన్ నిధుల వినియోగంపై అధికారుల ఆంక్షలు వుండరాదని డిమాండు చేసింది.

రిజిష్టరు కాని యూనియన్లకు చట్టపరంగా సదుపాయాలు కల్పించాలని 1928లో లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఎన్.యం.జోషి ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయింది. పరిశ్రమల మంత్రి సర్ థామస్ హాలండ్ ఈ చట్టం గురించి ఏర్పడిన వివాదాలపై ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలుపుతూ, ట్రేడ్ యూనియన్లను "ఆరోగ్యకరమైన పద్ధతి"లో అభివృద్ధి చేయడమే ఈ చట్టం ముఖ్యోద్దేశమని చెప్పాడు.

ప్రభుత్వం, తాను కోరుకున్న పద్ధతుల్లో ట్రేడ్ యూనియన్లు అభివృద్ధి చెందాలని భావిస్తున్నట్లు ట్రేడ్ యూనియన్ చట్టంలోని అంశాలు, ప్రభుత్వ ప్రతినిధుల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. మూడు సంవత్సరాల తరువాత పారిశ్రామిక వివాదాల చట్టాన్ని ప్రభుత్వం ఆమోదించడం చూస్తే ప్రభుత్వం ట్రేడ్ యూనియన్లను తన అదుపులో వుంచుకోవడానికి చేసిన ప్రయత్నాలలోని ఆంతర్యం బోధపడుతుంది.

ఆనాటి కార్మిక నాయకులు రిజిష్టరు చేయబడిన, రిజిష్టరు చేయబడని యూనియన్ల మధ్య చూపుతున్న వివక్షను, ప్రత్యేకంగా రిజిష్టరు చేయబడని యూనియన్లను చట్ట విరుద్ధంగా

పరిగణించే ప్రభుత్వ ప్రయత్నాలకు తమ వ్యతిరేకతను ఎలుగెత్తి చాటారు. భారత కార్మికోద్యమం ప్రారంభదశలో వుండడంవలన రిజిష్టరుకాని యూనియన్లు వుండడం సహజసిద్ధమని, ఈ యూనియన్లకు చట్టపరమైన రక్షణ కలుగజేయడం ప్రభుత్వ కర్తవ్యమని వీరందరూ భావించారు. ఈ దృక్పథాన్ని బలపరుస్తూ లెజిస్లేటివ్ అసెంబ్లీలో లాలాలజపతిరాయ్, యన్.యమ్.జోషి తీవ్రంగా వాదించారు.

ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలను 'సక్రమమైన', 'ఆరోగ్యకరమైన' మార్గంలో పెట్టడానికి ప్రభుత్వమీ విధానాన్ని ప్రకటించిందని చెప్పి 1931లో రాయల్ కమీషన్ నివేదిక ఈ విధానాన్ని సమర్థించింది. ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రయోజనాల దృష్ట్యా ఈ చట్టాన్ని ఏనాడో ప్రవేశపెట్టవల్సిందని కూడ నివేదిక పేర్కొంది. ట్రేడ్ యూనియన్లు నిలదొక్కుకుని, ఒకస్వరూపాన్ని సంతరించుకుని, దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉద్యమాలు వెలువెత్తుడంతో భయకంపితులైన సామ్రాజ్యవాదులు, ఈ ట్రేడ్‌యూనియన్ ఉద్యమాన్ని ఆర్థిక సమస్యలకే పరిమితం చేసి, అది రాజకీయ పోరాట స్వభావం సంతరించుకోకుండా వుండే ఎత్తుగడలు అవలంబించారు. తీవ్ర ఆందోళనకు గురైన సామ్రాజ్యవాదులు కార్మికవర్గం జాతీయ విముక్తి పోరాటంలో భాగస్వామి కాకుండా వుండడానికి ఏమైనా చేయడానికి సిద్ధంగా వున్నారు. ఆ ఆలోచనతోనే ట్రేడ్ యూనియన్ చట్టంలో అనేక ఆంక్షలు విధించడానికి ముఖ్యంగా రాజకీయ ప్రయోజనాలకు యూనియన్ నిధులు ఖర్చు చేయడాన్ని నిషేధించడానికి సామ్రాజ్యవాదులు పూనుకున్నారు. ఈ చర్యలన్నీ, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం స్వతంత్రంగా అభివృద్ధి చెందకుండా చూసేందుకు సామ్రాజ్యవాదులు నగ్నంగా జోక్యం చేసుకొనడాన్ని సూచిస్తుంది.

## కార్మికవర్గ ఆర్థిక పరిస్థితి

వివిధ పరిశ్రమల్లోనూ, వివిధ పారిశ్రామిక కేంద్రాలలోనూ కార్మికుల జీతాల రేట్లకు సంబంధించిన గణాంకాలు సేకరించడానికి ఈనాటి వరకు ఒక విధానమంటూ ఏమీ లేదు. కాని వివిధ కమిటీలు కమిషన్లు, ప్రభుత్వ పరిశీలకులు కూడా కార్మికులు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని అంగీకరించారు. అనేక పత్రికలు కూడా యిదే విధమైన కథనాలు ప్రచురించాయి. 1934లో మొట్టమొదటిసారిగా బొంబాయి లేబర్ ఆఫీసు టెక్స్‌టైల్ కార్మికుల జీతాల రేట్ల వివరాలను సేకరించింది. ఈ పరిశ్రమల్లో జీతాల రేట్లు ఒక క్రమ పద్ధతిలో లేక, అయోమయంగానూ వున్నాయని యీ లెక్కలు తెలియజేశాయి. ఒకే పరిశ్రమలో, ఒకేరకమైన పనిచేస్తున్న కార్మికులకు వేతనాలలో సమానత్వం చూపడానికి బదులుగా వివక్ష చూపడం జరుగుతోంది. రాయల్ కమిషన్ విచారణ కూడా ఈ వివక్షను వెల్లడించింది. మద్రాసు, కోయంబత్తూరులో జౌళి పరిశ్రమ అతి త్వరితగతిన విస్తరిస్తున్నప్పటికీ, యిక్కడ పనిచేస్తున్న కార్మికులకు బొంబాయి, అహమ్మదాబాదులలో యిదే పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకిచ్చే జీతాలలో మూడువవంతు జీతం మాత్రమే యివ్వబడుతోంది. యునైటెడ్ ప్రావిన్సెస్‌లోని అతి పెద్ద పారిశ్రామిక కేంద్రమైన కాన్పూరులో వీవర్‌కు 33 రూ॥లు, స్పిన్నర్‌కు 25 రూ॥ల నెల

జీతం యిస్తున్నారు. ఈ వేతనం బొంబాయి, అహమ్మదాబాదు కార్మికుల జీతానికంటే చాలా తక్కువ. జీతాలు చెల్లించే విధానంలోనూ, నిర్ణయించే పద్ధతిలోనూ ఒక పారిశ్రామిక కేంద్రానికి మరో కేంద్రానికి మధ్య ఒక కేంద్రంలోనే వేర్వేరు యూనిట్ల మధ్య అనేక తేడా పాడాలున్నట్లు బొంబాయి లేబర్ ఆఫీసు నిర్వహించిన విచారణలో తేలింది.

రాయల్ కమిషన్ విచారణ మరింత తీవ్రమైన తారతమ్యాలను బయటపెట్టింది. యునైటెడ్ ప్రావిన్సెస్‌లోని నైపుణ్యంలేని కార్మికులలో 25 శాతం మంది 13 రూ॥ల కంటే తక్కువగానూ, 50 శాతం మంది రూ. 17 1/2ల కంటే తక్కువగానూ నెల జీతాలు పొందుతున్నారు. సెంట్రల్ ప్రావిన్సెస్, మద్రాసు, బీహారు, ఒరిస్సాలలో 50 శాతం మంది కార్మికులు నెలకు రూ. 17 1/2ల కంటే తక్కువగా పొందుతుండగా బెంగాలులో 50 శాతం మంది కార్మికులు 22 1/2ల కంటే తక్కువ నెల జీతం పొందుతున్నారు. జీవన వ్యయం అత్యధికంగా వుండే బొంబాయి ప్రెసిడెన్సీలో 50 శాతానికి పైగా కార్మికుల నెల జీతం రూ. 27 1/2ల కంటే తక్కువగా వుంది. ఇవి ఇతరుల జీతాలతో పోల్చితే మెరుగైన జీతాలు తెచ్చుకునే అర్థ నైపుణ్యం (సెమిస్కిల్ట్) కలిగిన కార్మికుల జీతాలతో పోల్చి, పైగణాంకాల్విడం జరిగింది. మైనరు కార్మికులు నైపుణ్యం లేని కార్మికుల జీతాలు మరీ అధ్వాన్నంగా వున్నాయి. భారతదేశంలో శ్రామికుల స్థితిగతులపై విచారణ చేసిన రాయల్ కమిషన్ యీ క్యాటగిరి ఉద్యోగుల జీతాలను గురించి ఈ విధంగా తెలిపింది.

"ఈ తరగతికి చెందిన కార్మికులలో చాల కొద్దిమంది మాత్రమే నెలకు 15 రూ॥లకు పైగా జీతం సంపాదించుకోగల్గుతున్నారు. అధిక సంఖ్యాకులు రూ.10 లు అంతకంటె తక్కువ జీతాన్ని సంపాదించుకోగల్గుతున్నారు. సెంట్రల్ ప్రావిన్సెస్‌లోని కొన్ని ప్రాంతాలు, బెంగాలు, బీహారు, ఒరిస్సా రాష్ట్రాలలో చిల్లర మల్లర పనులకు రోజువారీగానూ, పరిమిత కాలానికి మిక్కిలి అధిక సంఖ్యలో నున్న నైపుణ్యం లేని కార్మికులను నియమిస్తూండేవారు. వీరిలో పురుషులకు 8 అణాలు, స్త్రీలకు 6 అణాలు, పిల్లలకు 4 అణాలు రోజుకూలి క్రింది ఇవ్వబడుతున్నాయి. కాని మద్రాసు, యునైటెడ్ ప్రావిన్సెస్, సెంట్రల్ ప్రావిన్సెస్‌లోని కొన్ని ప్రాంతాలలో పురుషులకు రోజు 5 అణాలు చెల్లిస్తున్నారు."

జీతాలలో నున్న ఈ తారతమ్యాలు పారిశ్రామిక కార్మికుల పని పరిస్థితులు ఎంత అక్రమంగా, అసంబద్ధంగా వున్నదీ వెల్లడిస్తున్నాయి. ప్రపంచంలోని దాదాపు అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోను ఇనుము-ఉక్కు పరిశ్రమలోని కార్మికుల వేతనాలు మిగిలిన పరిశ్రమలలోని కార్మికుల వేతనాలకు రెట్టింపుగా వున్నాయి. కాని ఇండియాలో ఇనుము - ఉక్కు పరిశ్రమలోని కార్మికుల జీతాలు జౌళి కార్మికుల జీతాల కంటే 15 శాతం తక్కువగా వున్నాయి. జంషెడ్‌పూర్‌లోని ఉక్కు పరిశ్రమలోని కార్మికుల నెల జీతం రూ.20=5 కంటే తక్కువ వున్నది. గని కార్మికుల జీతాలు, తోటలలో పనిచేసే కార్మికుల జీతాలంత హీనంగా వున్నాయి. 1930లో రాణిగంజ్ బొగ్గుగనుల్లో పనిచేస్తున్న పురుష కార్మికుల వేతనం రు. 12-16ల మధ్య, స్త్రీ కార్మికుల వేతనం రు. 8-12ల మధ్య వున్నది."

జౌళి పరిశ్రమ ఒక వ్యవస్థీకరించబడిన రంగంగా స్థాపించబడటంతో పాటు, భారతదేశంలో కార్మికోద్యమం ప్రారంభమైన నాటి నుండి జౌళి కార్మికులు యీ పరిశ్రమలోని పెట్టుబడిదారుల దోపిడీని ప్రతిఘటిస్తూనే వుండడం భారతదేశంలో పరిశ్రమల విస్తరణలో గుర్తించదగిన ప్రధాన లక్షణం. వారు ఈ విధంగా నిరంతరం పెట్టుబడిదారుల దోపిడీని ప్రతిఘటిస్తుండడం వల్లనే అనేక ఇతర పరిశ్రమలలోని కార్మికుల కంటే మంచి వేతనాలు పొందగలిగారు. భారతదేశంలోని పారిశ్రామిక కార్మికుల జీతాలను పోల్చి చూచే సందర్భంలో ఈ ప్రత్యేక విషయాన్ని, కార్మికులు పెట్టుబడిదారుల దోపిడీకి ఇచ్చిన ప్రతిఘటనను పరిగణనలోకి తీసుకొనవలసి వుంటుంది.

1928లో ఇండియాను సందర్శించిన బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రతినిధి వర్గం తయారుచేసిన నివేదిక భారత కార్మికుల వేతనాలు ఎంత దారుణంగా వున్నాయో సరిగ్గా అంచనా వేసింది.

“ఇండియాలోని కార్మికులలో అత్యధిక సంఖ్యాకులు రోజుకు ఒక షిల్లింగు కంటె ఎక్కువ జీతాన్ని సంపాదించుకోలేకపోతున్నారనే విషయాన్ని అనేక దర్యాప్తులు వెల్లడిస్తున్నాయి. అత్యధిక సంఖ్యలో పారిశ్రామిక కార్మికులున్న బెంగాల్, ప్రావిన్స్‌లో పరిశీలకులు తాము ధృవీకరించకల్గినంత వరకు 60 శాతం మంది కార్మికుల్లో పురుషులకు అత్యాధికంగా రోజుకు 1 షిల్లింగ్ 2 పెన్నీల నుండి అత్యల్పంగా 7 నుండి 9 పెన్నీలు చెల్లిస్తుండగా, స్త్రీలు, పిల్లలు 3 నుండి 7 పెన్నీల జీతం పొందుతున్నట్టు తెలుస్తోంది. మా విచారణలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. రోజు కూలీ విధానం కూడ ఇక్కడ అమలులో వున్నట్లు, యీ రోజు కూలి పురుషులకు 7 పెన్నీలు అంతకంటె తక్కువగాను స్త్రీలకు 3 1/2 పెన్నీలు వున్నట్లు అనేక మంది మా దృష్టికి తెచ్చారు.

భారతదేశంలో కార్మికులు సంపాదించుకునే జీతాలు వారి కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడ చాలకపోవడంతో, కేవలం జీవితాలు వెళ్ళబుచ్చడం కోసం కార్మికుల కుటుంబాలలోని స్త్రీలు, పిల్లలు కూడా అనేక సందర్భాలలో పనిచేయవలసి వచ్చేది.

కాని ప్రభుత్వం మాత్రం కార్మికుల జీవన పరిస్థితుల విషయమై విచారణ జరిపించేందుకు ఏ విధమైన ప్రయత్నాలు చేయలేదు. కొన్ని ప్రావెన్సెస్‌లో జీవన వ్యయ సూచికను తయారుచేసే ప్రయత్నాలు జరిగాయి. కాని కార్మికుల జీవన వ్యయానికి సంబంధించిన వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకోవడం జరుగలేదు. పారిశ్రామికంగా బాగుగా అభివృద్ధిచెందిన బెంగాల్ ప్రావిన్స్‌లో జీవనవ్యయ సూచికను నిర్ణయించే ప్రయత్నం కూడ జరగలేదు. బొంబాయి లేబర్ ఆఫీసు మాత్రం అహమ్మదాబాదు, బొంబాయి, షోలాపూర్‌లలోని కార్మికుల కుటుంబ వ్యయాన్ని గురించి విచారణ జరపడానికి ప్రయత్నించింది.

మనకు లభించిన రిపోర్టులన్నీ కార్మికవర్గ జీవన ప్రమాణాలెంత అధోగతిలో వున్నదీ సూచిస్తున్నాయి. చాలీ చాలని తిండితో పాటు, వైద్య సహాయం లేకపోవడం వలన కార్మికులు దీర్ఘరోగాలకు గురికావడంతో మరణాల సంఖ్య అధికమైంది. ఈ పరిస్థితులలో కార్మికుల కుటుంబాలలో పిల్లల చదువులకు ఖర్చు చేయడమనేది ఊహకందని విషయం. అందువలన 20వ శతాబ్దంలోని రెండవ, మూడవ, దశాబ్దాలలో కూడ కార్మికవర్గ సాంస్కృతిక, విద్యాస్థాయి సమీప భవిష్యత్తులో కూడ కోలుకోలేనంతగా దిగజారిపోయింది.

కాని కార్మికవర్గ దీనస్థితి ఇంతటితో ఆగలేదు. అతి నికృష్టమైన జీతాలు పొందుతున్న ఫలితంగా వారి ఆర్థిక పరిస్థితి మరింత క్షీణించి భారతదేశంలోని పేద రైతాంగం వలెనే చివరకు వీరుకూడ అప్పులపాలయ్యారు. రైతాంగం మీదవున్న అప్పులభారం నిస్సందేహంగా అధికమైనదైనా, కార్మికుల మీదవున్న రుణభారమేమీ తక్కువగాదు. "పారిశ్రామిక కార్మికులలో అధిక సంఖ్యాకులు తమ జీవితంలో ఎక్కువకాలం అప్పులమీద ఆధారపడి వుంటున్నారు. కార్మిక వర్గంలో కనీసం మూడింట రెండు వంతుల కార్మికుల కుటుంబాలు గాని, వ్యక్తులు గాని, అప్పుల పాలయ్యారు. తరువాత పరిశీలనను బట్టి నాలుగింట మూడువంతులమంది అప్పులపాలయినట్లు తెలుస్తోంది." అని రాయల్ కమీషన్ నివేదిక తెలియజేసింది. ఇదే కమిషన్ యీ విషయమై యింకా యిలా పేర్కొంది. "అప్పులపాలవుతున్న కార్మికుల్లో అధిక సంఖ్యాకుల అప్పుమొత్తం 3 నెలల జీతాలను మించిపోయింది. అనేక సందర్భాల్లో ఇది మరింత ఎక్కువగా వుంది. తమ కనీస అవసరాలను సమకూర్చుకునేందుకే చాలని జీతాలతో కాలక్షేపం చేస్తున్న కార్మికులకు మూడు నెలల జీతానికి సరిపడిన అప్పు వుంటే అది నిజంగా మోయలేని భారమే. వారు అత్యధికమయిన వడ్డీ చెల్లించవలసిరావడంతో ఈ భారం మరింత తీవ్రమయింది. సహజంగా రూపాయికి అణావడ్డీగా చెల్లించాల్సివచ్చేది. అంటే సంవత్సరానికి 75 శాతం వడ్డీ అన్నమాట. సంవత్సరానికి 150 శాతం, అంతకంటే ఎక్కువ వడ్డీ రేటుకూడా ఆ రోజుల్లో సర్వసాధారణంగా వుండేది."

అసలే అతి నికృష్టమైన జీవనం సాగిస్తున్న కార్మికవర్గంపై మిల్లు యజమానులు తమ లాభాలు తగ్గినాయనే సాకుతో కార్మికుల మీద దాడిచేయ సంకల్పించారు. ఈ దాడుల స్వభావాన్ని ముందుగా సూచిస్తూ ఇండియన్ టెక్స్టైల్ టారిఫ్ బోర్డు 1927లో ప్రచురించిన తన రిపోర్టులో కార్మికుల మీద పెట్టే ఖర్చులు తగ్గించడానికి కొన్ని పరోక్ష పద్ధతులను ప్రతిపాదించింది.

"ఈ పరిస్థితులలో మిల్లు యజమానులకు తక్కువ లాభాలు రావచ్చు. తద్వారా వారి విలాసాలను కొన్నింటిని తగ్గించుకోవలసిరావచ్చు. కానీ కార్మికుల వేతనాలు తగ్గించడమంటే బొంబాయిలోని లక్షా 50 వేలమంది మిల్లు కార్మికులను మాడ్చి చంపడమే" అని ఎన్.ఎం.జోషి టారిఫ్ బోర్డుకు సమర్పించిన ఒక మెమోరాండంలో పేర్కొన్నారు. వాస్తవానికి మిల్లు యజమానులు ఎదుర్కొంటున్న సమస్య నష్టాలు వస్తాయన్నది కాదు. కాని వారి అశేష లాభాలలో కోత పడుతుందనేది వారి బాధ.

ఇదే విధంగా బెంగాలులోని జనపనార పరిశ్రమ యజమానులు కూడ కార్మికుల వేతనాలపై దాడి చేయడానికి రహస్యంగా ప్రయత్నాలు చేశారు. వారు వారం మొత్తం మీద పని గంటలను తగ్గించారు. 10 శాతం మగ్గాలను మూసివేశారు. కార్మికుల వేతనాల్లో రూపాయికి అణా నుండి మొత్తం వేతనంలో 15 శాతం వరకు కోత విధించారు.

భారత జనపనార పరిశ్రమ కార్మికులకు చెల్లించే జీతాల బిల్లులకు 8 రెట్లు వార్షిక లాభాలు దండుకుంటున్న తరుణంలోనే జూట్ మిల్లు యజమానులు కార్మికుల మీద దాడులకు ప్రణాళికలు రచించి, అమలుచేశారని 1925లో భారతదేశం సందర్శించిన డూండీ జూట్ ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధివర్గం అధ్యయనం ద్వారా తెలియవచ్చింది.

రైల్వే కార్మికులు కూడా ఈ రకమైన ప్రణాళిక బద్ధమైన దాడుల నుండి మినహాయింపబడలేదు. 1926 నియమించబడ్డ సర్ విన్సెంట్ రావెన్ నాయకత్వంలోని స్టేట్ రైల్వే వర్క్‌షాపు కమిటీ అధిక సంఖ్యలో రైల్వే కార్మికుల రిట్రెంచ్‌మెంట్‌కు సిఫార్సు చేసింది. తత్ఫలితంగా సుమారు 75వేలమంది కార్మికుల ఉద్యోగాలు వూడే పరిస్థితులేర్పడ్డాయి.

చాలాకాలంగా అపరిష్కృతంగా వున్న సమస్యలు, చాలీచాలని జీతాలు, కనీసవేతనం యివ్వాలని కోరుతున్న కార్మికుల న్యాయమైన కోర్కెలను తిరస్కరించటం, యూనియన్‌ను గుర్తించ నిరాకరించడం, భారత కార్మికులను యూరోపియన్ అధికారులు నీచంగా చూడడం, తదితర సమస్యలవలన రైల్వే కార్మికులలో అసంతృప్తి తీవ్రతరమవుతోంది. విన్సెంట్ రావెన్ కమిటీ చేసిన వక్రమైన సిఫార్సులు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి.

ఇక ఏమాత్రం భరించలేని యీ పరిస్థితులలో కార్మికవర్గంపై స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు ఉమ్మడిగా దాడులు సాగించడంతో పుండు మీద కారం చల్లినట్లయింది. దీనికితోడు సామ్రాజ్యవాదుల వలస కార్మిక విధానాల వలన పరిస్థితులు మరింత దిగజారడంతో, బొంబాయిలోని నూలు మిల్లులలోనూ, బెంగాలులోని జూట్ (జనపనార) మిల్లులలోనూ, జెంషెడ్‌పూర్‌లోని ఉక్కు పరిశ్రమ, రైల్వేలు తదితర పరిశ్రమలలో అసంతృప్తి జ్వాలలు రగుల్కొని అచిరకాలంలోనే దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన సమ్మె పోరాటాలు చెలరేగాయి.

## కనీవినీ ఎరుగని కార్మికవర్గ పోరాటాలు

1927 సం॥ మొదట్లో ప్రారంభమైన కార్మికవర్గ పోరాటాలు ఉధృతమై 1928-29 నాటికి పరాకాష్టకు చేరాయి. భారత కార్మికవర్గ చరిత్రలో యీ పోరాటాలకు సాటిలేదు. అంతకుముందు సంవత్సరం (1926)తో పోల్చిచూస్తే 1927 సం॥లో సమ్మెలు, వాటిలో పాల్గొన్న కార్మికుల సంఖ్య తక్కువైనప్పటికీ నష్టపోయిన పనిదినాల సంఖ్య మాత్రం అంతకుముందు సంవత్సరం నష్టపోయిన పనిదినాల సంఖ్యకు రెట్టింపుగా వున్నది. ఇది చూస్తే 1927 సం॥లో సమ్మెలు సుదీర్ఘకాలం సాగి, భారత కార్మికవర్గంలో ఐక్యత, పట్టుదల పెరుగుతున్నట్లు స్పష్టమవుతుంది.

1927 సం॥లో ప్రావిన్స్ వారీగా జరిగిన సమ్మెలను విశ్లేషిస్తే, బొంబాయి ప్రావిన్స్‌లో 54 సమ్మెలు జరుగగా, బెంగాలు ప్రావిన్స్‌లో 34 సమ్మెలు పోరాటాలు నిర్వహింపబడ్డాయి. ఈ రెండు ప్రావిన్సులలోని పారిశ్రామిక వివాదాలలో కొన్ని చెప్పుకోదగ్గ ప్రత్యేక లక్షణాలున్నాయి. బొంబాయిలో యీ సమ్మెలలో పాల్గొన్న కార్మికుల సంఖ్య 1,28,078 కాగా, బెంగాలులో సంఖ్యాపరంగా వీరిలో సగంమంది మాత్రమే పాల్గొన్నప్పటికీ, నష్టపోయిన పనిదినాల సంఖ్య దాదాపు మూడురెట్లున్నది. బొంబాయిలో 1,65,061 పనిదినాలు నష్టం కాగా, బెంగాల్‌లో 4,64.889 పనిదినాలు నష్టమయ్యాయి. మద్రాసులో కూడా 19 సమ్మెలలో 17,905 మంది కార్మికులు పాల్గొనగా 1,87,441 పనిదినాలు నష్టమయ్యాయి.

పరిశ్రమ వారి వివరాలు పరిశీలించినట్టయితే, 1927లో జరిగిన సమ్మెలలో 46.51 శాతం సమ్మెలు నూలు బట్టల పరిశ్రమలోనే జరిగాయి. ఈ పరిశ్రమలోని కార్మికులే అత్యధిక సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. మొత్తం నష్టపోయిన పనిదినాలలో 61.9 శాతం రైల్వే సమ్మె వలనే నష్టపడడం జరిగింది. బెంగాల్ – నాగపూర్ రైల్వేలోని ఖరగ్‌పూర్ వర్క్‌షాపులో రెండు దీర్ఘకాల సమ్మె పోరాటాల వలన 8,80,218 పనిదినాలు నష్టమయ్యాయి. 1928–29 సం॥లలో సమ్మె పోరాటాలు ఎంత ఉధృతంగా జరిగాయంటే, 1928 ఒక్క సం॥లోనే 35 లక్షల (3.5 మిలియన్లు) పనిదినాలు నష్టమయ్యాయి. గత ఐదు సంవత్సరాలలో కలిసి ఇన్ని సమ్మెలు జరిగియుండలేదు. అధికారిక గణంకాల ప్రకారమే, ఈ సంవత్సరంలో బొంబాయిలో 111 సమ్మెలు అంటే మొత్తం సమ్మెలలో 60 శాతం, బెంగాల్‌లో 60 సమ్మెలు, బీహారు, ఒరిస్సాలలో 8 సమ్మెలు, మద్రాసులో 7, పంజాబులో 2 సమ్మెలు జరిగాయి. దేశవ్యాప్తంగా సాగిన ఈ సమ్మె పోరాటాలలో 110 సమ్మెలు నూలు బట్ట పరిశ్రమలోను, జనపనార పరిశ్రమలో 19 సమ్మెలు, ఇంజనీరింగ్ పరిశ్రమలో 11 సమ్మెలు, రైల్వేలు, రైల్వేవర్కు షాపుల్లో 9 సమ్మెలు, బొగ్గుగనిలో ఒక సమ్మె జరిగాయి.

## ఖరగ్‌పూర్‌లో బెంగాలు - నాగపూర్ రైల్వే కార్మికుల సమ్మె

1927 సం॥లో వెల్లువెత్తిన సమ్మె పోరాటాలలో బెంగాలు – నాగపూర్ రైల్వేలో ఖరగ్‌పూర్ కార్మికులు సాగించిన రెండు దీర్ఘకాల సమ్మె పోరాటాలు ప్రముఖ స్థానం ఆక్రమించాయి. బెంగాలు – నాగపూర్ రైల్వేలో ఖరగ్‌పూర్ ఒక పెద్ద జంక్షను ఇక్కడే ఒక పెద్ద రైల్వే వర్కుషాపు కూడా వున్నది. వివిధ జాతులకు, భాషలకు చెందిన కార్మికులుండడం యీ రైల్వే కూడలి ప్రత్యేక లక్షణం. ఖరగ్‌పూర్ రైల్వేలో (పారిశ్రామిక) కార్మికులుగా పనిచేస్తున్న దివాళా తీసిన రైతులు, వ్యవసాయ కూలీలు రైల్వే అధికారుల దారుణ దోపిడీకి, అమానుషమైన అణచివేతకు గురయ్యారు. ఈ రైల్వేలో మొత్తం పెట్టుబడిలో 75 శాతం భారత ప్రభుత్వ పెట్టుబడి అయినప్పటికీ, బ్రిటన్‌లోని ప్రైవేటు పెట్టుబడిదారులే దీనికి యజమానులు.

ఈ కాలంలో వెల్లువలా సాగుతున్న రాజకీయ శ్రామికవర్గ ఉద్యమాలు ఖరగ్‌పూర్ కార్మికులపై తమ ప్రభావాన్ని చూపాయి. ఈ పోరాటాలతో ఉత్తేజం పొందిన వీరు రైల్వే

అధికారుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా అతి తీవ్రమైన ఉద్యమాన్ని సాగించారు. సర్ విన్సెంట్ రావెన్ ఆధ్వర్యంలోని స్టేట్ రైల్వే వర్క్‌షాప్ కమిటీ సిఫార్సు చేసిన రిట్రెంచ్‌మెంటు స్కీమును రైల్వే యాజమాన్యం మొదటగా బెంగాల్ – నాగపూర్ (బి.ఎన్) రైల్వేలో అమలు చేయడానికి ప్లాను వేసుకుంది. ఈ ప్లానును వ్యతిరేకిస్తూ బి.యన్. రైల్వేలోని కార్మికులు బ్రహ్మాండమైన పోరాటం సాగించారు. ఇండియాలో శ్రామికుల స్థితిగతులపై విచారణ జరుపుతున్న రాయల్ కమిషన్‌కు రైల్వే బోర్డు సమ్మె గురించి పూర్తిగా తప్పుదోవ పట్టించే ఒక నివేదికను సమర్పించింది.

రైల్వేని పునర్ వ్యవస్థీకరించడం వర్కుషాపులో పని విధానాన్ని మెరుగుపరచడానికి క్రొత్త పద్ధతులను ప్రవేశపెట్టడం వలన అధిక సంఖ్యలో కార్మికులు పనులు కోల్పోతారనే సాకుతో కంపెనీ రిట్రెంచ్‌మెంట్‌ను సమర్ధించుకోజూచింది. 1929లో మీరట్ కుట్ర కేసులో నిందితుడైన కె.ఎన్. జోగ్లేకర్ యీ వాదనతో విభేదిస్తూ యిచ్చిన ప్రకటన తదితర ఆధారాలవలన చాల సమాచారం లభించింది. జోగ్లేకర్ ఈ విధంగా పేర్కొన్నారు. “పరిశ్రమ క్రమబద్ధీకరణ, కార్మికుల రిట్రెంచ్‌మెంటుకు సంబంధించిన ప్లానులు తయారుచేసుకొని, ప్రభుత్వం బి.ఎన్. రైల్వేలో ఈ రిట్రెంచ్‌మెంట్‌ను ప్రారంభించడానికి నిర్ణయించుకున్నది. 1926 సంవత్సరం పొడుగునా ఒక పద్ధతి ప్రకారం యాజమాన్యం అప్పుడప్పుడు కార్మికులను బర్తరఫ్ చేస్తూనే వున్నది. దీనితో కార్మికులలో అసంతృప్తి నెలకొన్నది. బెంగాల్, నాగపూర్ రైల్వే ఇండియన్ యూనియన్, బి.యన్. రైల్వే ఏజంటుకు, ఇంగ్లండులోని కంపెనీ డైరెక్టర్లకు పిటిషన్ల మీద పిటిషన్లు పెట్టుకున్నది. కాని ఫలితం శూన్యం. దీనితో యూనియన్, రైల్వే అధికారుల వైఖరిని సహించలేని కార్మికులు యూనియన్ నాయకులు ఓర్పు వహించవలసిందిగా ఇచ్చే సలహాలను వినక ప్రత్యక్ష చర్యకు పాల్పడే ప్రమాదకరమైన పరిస్థితులేర్పడ్డాయి.”

ఆనాటి గూఢచారి విభాగం డైరెక్టర్ డేవిడ్ పెట్రీ ఇలా వ్రాశాడు. “1927 ఫిబ్రవరి 11న ఖరగ్‌పూర్‌లోని బెంగాల్, నాగపూర్ రైల్వే వర్కుషాపులో అకస్మాత్తుగా సమ్మె చెలరేగి ఇతర శాఖలకు చెందిన రైల్వే కార్మికులలో త్వరత్వరగా వ్యాపించింది. సమ్మెలో 26 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. వ్యాగన్‌షాపుల నుండి కొందరు కార్మికులను తొలగించడం, స్టేషన్ కమిటీ చౌకీదార్లను తొలగించడం, గ్రామాల్లోని రైల్వే స్థలంలో ఇళ్ళు నిర్మించుకొని నివసిస్తున్న కార్మికులను బలవంతంగా ఖాళీ చేయించి వారి ఇళ్ళను నాశనం చేయించడం, ఇద్దరు యూరోపియన్ ఫోరోమన్‌లు హద్దులు మీరి ప్రవర్తించడం మొదలగు సమస్యల పరిష్కారానికి ఈ సమ్మె తలపెట్టారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ జీతాలు, కార్మికులను అవమానిస్తూ, వారిని వేధింపులకు గురిచేస్తూ, జులుంచేసే సూపర్‌వైజరీ ఉద్యోగుల వైఖరి ప్రధాన సమస్యలని కొందరు ఉద్యోగులు ఆరోపించారు. కార్మికులను సమ్మెకు ప్రోత్సహించిన బి.ఎన్. రైల్వే ఇండియన్ లేబర్ యూనియన్, ఖరగ్‌పూర్ శాఖ కార్యదర్శి డబ్ల్యు.వి.ఆర్. నాయుడును బదిలీచేయడం సమ్మెకు తక్షణ కారణం.”

బెంగాలు–నాగపూర్ రైల్వే ఇండియన్ లేబర్ యూనియన్‌కు వి.వి.గిరి అధ్యక్షుడు, ఈ యూనియన్ ఎ.ఐ.టి.యు.సి.కి, ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్‌కు అనుబంధం చేయబడింది. సుదీర్ఘ కాలంగా సమస్యలు ప్రోగుపడి వుండడంతో పాటు, సమ్మె అనివార్యమన్న పరిస్థితులు నెలకొని వున్న తరుణంలో యూనియన్ కార్యదర్శి బదిలీ పరిస్థితిని ప్రజ్వలింపజేసింది. ఫిబ్రవరి 11వ తేదీన సమ్మె ప్రారంభమైంది.

"ప్రభుత్వం సమ్మెను విచ్ఛినం చేయడానికి భయోత్పాతాన్ని సృష్టించింది. సమ్మె చేస్తున్న కార్మికులపై రైల్వే ఆగ్జిలరీ ఫోర్స్‌ను ప్రయోగించింది. "కొరడాలు, లాఠీలు, రైఫిల్ మడమలతో కార్మికులను తీవ్రంగా కొట్టారు. విచ్చలవిడిగా కాల్పులు జరపడంతో అనేక మంది గాయపడ్డారు. చాలమందినీ రైఫిల్ బాయ్‌నెట్లతో (రైఫిల్ చివర వుండే పొడుగైన బాకు) పొడిచారు. సమ్మెను అణచివేయడానికి నిర్ణయించుకున్న అధికారులు సంఘవ్యతిరేక శక్తులను కార్మికులపై ప్రయోగించడమేగాక, సమ్మె నిర్వహణకు తగిన ప్రచారం చేసుకోకుండా జిల్లా మేజిస్ట్రేట్ సహాయంతో సి.పి.సి. 144వ సెక్షను క్రింద సమావేశాలను నిషేధించారు. అని జోగ్లేకర్ చెప్పారు.

బి.ఎన్.రైల్వే సమ్మె వలన ఏర్పడిన పరిస్థితిని గురించి ఈ సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి సృష్టించబడుతున్న భయోత్పాతాన్ని గురించి చర్చించేందుకు వి.వి.గిరి తండ్రి గారైన వి.వి. జోగయ్య సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించాడు. కాల్పులు జరపడంవలన, బాయ్‌నెట్‌తో పొడవటం వలన 15 మంది మాత్రమే గాయపడ్డారనీ అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది. ఫిబ్రవరి 23న బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో డా॥ విధాన్ చంద్రరాయ్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానంపై చర్చకు సమాధానంగా, కాల్పుల్లో 10మంది గాయపడ్డారని అధికారపక్షం ప్రకటించింది. అనధికార సమాచారం ప్రకారం కనీసం 40 మంది కార్మికులు బుల్లెట్లు, బాయ్‌నెట్ల వలన గాయపడ్డారు.

సమ్మె జరుగుతున్న రోజుల్లోను, సమ్మె విరమణ తరువాత బి.ఎన్.రైల్వే లేబర్ యూనియన్ ఖరగ్‌పూర్‌లో అనేక సమావేశాలు జరిపింది. ఈ సమావేశాలకు శ్రీయుతులు ముకుందలాల్ సర్కార్, అఫ్తబ్ అలీ, డబ్ల్యు.వి.ఆర్, నాయుడు, వి.వి.గిరి, శ్రీమతి సంతోష్ కుమారి గుప్త హాజరయ్యారు.

ఈ సమ్మెకు ట్రేడ్ యూనియన్లతోపాటు వివిధ తరగతులకు చెందిన ప్రజల మద్దతు కూడా లభించింది. జాతీయోద్యమంతో సంబంధాలున్న ప్రముఖులు కూడ యీ సమ్మెకు మద్దతుగా నిలిచారు. జాతీయ పత్రికలన్ని యీ సమ్మెకు తిరుగులేని మద్దతునిచ్చాయి. కలకత్తా నుండి ప్రచురించబడుచున్న 'అమృతబజార్' పత్రిక, 'దైనిక్', 'వసుమతి', 'ఫార్వర్డ్', 'సామ్య', 'మొహమ్మదీ' మరియు అనేక ఇతర పత్రికలు సమ్మె సమాచారానికి ప్రాధాన్యత నివ్వడంతో పాటు మద్దతు కూడ ప్రకటించాయి.

సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావంగా కలకత్తాలోని ఆల్బర్ట్ హాలులో జె.ఎన్.సేన్‌గుప్త అధ్యక్షతన నగర ప్రజల సభ జరిగింది. జె.ఎన్. సేన్ గుప్త, శరత్ చంద్రబాసు,

కిషోరీలాల్ ఘోష్, ఎన్.ఎమ్.జోషి తదితర ప్రముఖులతో సమ్మె సహాయక కమిటీ ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశానికి హాజరైనవారిలో మృణాల్‌కాంతి బసు, డా॥ సుందరీ మోహన్‌దాస్ మరియు భారతీయ సంతతికి చెందిన బ్రిటిష్ కమ్యూనిస్టు, పార్లమెంటు సభ్యుడు షాపుర్జీ సక్లత్‌వాలా వంటి ప్రముఖులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సక్లత్‌వాలా సమావేశాన్ని వుద్దేశించి మాట్లాడుతూ సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

బెంగాల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్, బొంబాయిలోని జి.ఐ.పి. రైల్వే వర్కర్సు యూనియన్, మద్రాసులోని ట్రామ్ కార్మికులు, ఝరియాలోని బొగ్గగని కార్మికుల యూనియన్లు మరియు దేశంలోని అనేక ఇతర ట్రేడ్ యూనియన్లు, ఈ సమ్మెకు నైతిక మద్ధతును ఆర్థిక సహాయాన్ని అందజేశాయి.

సమ్మె జరుగుతున్న సమయంలో భారతదేశంలో వున్న సక్లత్‌వాలా సమ్మెచేస్తున్న కార్మికులకు తన మద్దతు తెలియజేయడానికి ఖరగ్‌పూర్ వెళ్ళాడు. కాని ప్రభుత్వం ఖరగ్‌పూర్‌లో సభలు, సమావేశాలను నిషేధించింది. ప్రభుత్వ వైఖరికి నిరసన తెలుపుతూ సక్లత్‌వాలా గవర్నరుకు లేఖ వ్రాశాడు. సమ్మె సమయంలో రైల్వే అధికారులతో సహకరిస్తున్న తాతా ఇనుము – ఉక్కు కంపెనీ మేనేజిమెంటు వైఖరిని సక్లత్‌వాలా తీవ్రంగా విమర్శించాడు.

సమ్మె చేస్తున్న కార్మికులకు నైతికంగాను, ఆర్థికంగాను సహాయపడవలసిందిగా ఎ.ఐ.టి.యు.సి. విజ్ఞప్తి చేసింది. ఇదే విధంగా సహాయం కోరుతూ ఎఐటియుసి అంతర్జాతీయ కార్మికోద్యమ సహకారాన్ని కూడ ఆర్థించింది. ఈ సందర్భంలో సమ్మె వలన ఏర్పడిన పరిస్థితిని వివరిస్తూ ముకుందలాల్ సర్కార్ లండన్‌లోని జనరల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు, ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్‌నేషనల్ ట్రాన్సుపోర్టు వర్కర్స్ ఫెడరేషన్ టెలిగ్రాములు పంపాడు.

ఈ టెలిగ్రాంలోని అంశాలను పరిశీలిస్తే సమ్మె ముందుకాలంలోనూ, సమ్మె సమయంలోనూ నెలకొనివున్న పరిస్థితులు కొంతమేరకు స్పష్టమవుతాయి. సమ్మె జరుగుతున్నకాలంలో ఆయన లండన్‌కు పంపిన టెలిగ్రాంలో ఆయన ఈ విధంగా పేర్కొన్నాడు. “అధికారుల అమానుష ప్రవర్తన, అకారణంగా దౌర్జన్యం చేయడం, కార్మికుల క్వార్టర్లను ధ్వంసం చేయడం, అధిక సంఖ్యలో కార్మికులను పనుల్లో నుండి తొలగించడం వంటి చర్యలతోబాటు, బదిలీలు, నియామకాలు, క్వార్టర్ల పంపిణీలలో లంచాలు గుంజడం వంటి అవినీతి అణచివేత పద్ధతులతో బి.ఎన్.రైల్వే కార్మికులు విసిగి వేసారి యున్నారు.” ఈ విధానాలవలన ఖరగ్‌పూర్‌లోని 20 వేల మంది వర్క్‌షాపు కార్మికులలో తీవ్రమైన అసంతృప్తి ప్రబలింది. యీ పరిస్థితులను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తెచ్చినప్పటికి, యూనియన్ ప్రతినిధి వర్గం వివరించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. సంయుక్త విచారణ జరిపించాలనే చిన్న డిమాండును కూడా అంగీకరించలేదు. ప్రభుత్వ యంత్రాంగం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలవల్లనే కార్మికులు సమ్మెకు పూనుకోవల్సివచ్చింది. ఈ మహత్తర పోరాటంలో అంతర్జాతీయ సహకారానికై కార్మికులు ఎదురుచూస్తున్నారు. మీ సహకారం అందించి యీ

సమ్మెకు విశేష ప్రచారం యివ్వవలసిందిగా కోరుతున్నాం. పరిస్థితి అదుపు తప్పిపోతోంది. భారత రైల్వే కార్మికులను కాపాడండి.”

సమ్మె సమయంలో పంపబడిన రెండవ టెలిగ్రాము కూడ దాదాపు యీ విధంగానే వున్నది. సాయుధ బలగాలను పెద్దఎత్తున కేంద్రీకరించడంతో ఖరగ్‌పూర్ యుద్ధరంగాన్ని తలపిస్తోంది. సమ్మెనణచివేయడానికి ప్రభుత్వం భీతిగొల్పే విధంగా అణచివేత చర్యలకు పాల్పడినప్పటికీ, కార్మికులు మొక్కవోని స్థైర్యంతో నిలబడడంతో సమ్మె నిరాఘాటంగా కొన సాగడమేగాక, బెంగాలు నాగపూర్ రైల్వేను పూర్తిగా చుట్టుముట్టింది. కార్మికుల దృఢనిశ్చయంతో పాటుఈ సమ్మెకు లభించిన అశేష ప్రజల మద్దతు వలన యాజమాన్యం సమస్యల విషయమై యూనియన్‌తో చర్చలు జరపడానికి అంగీకరించవలసి వచ్చింది. యూనియన్ ప్రతినిధులు రైల్వే ఏజంటుతో సంప్రదింపులు జరిపి, అతనిచ్చిన హామీతో 10.3.1927న సమ్మెను విరమించారు. కాని తరువాత జరిగిన సంఘటనలు యాజమాన్యపు విద్రోహబుద్ధిని బయటపెట్టాయి. యాజమాన్యం కొద్ది వ్యవధిలోనే మరల తన రిట్రెంచ్‌మెంట్ పథకాన్ని అమలు చేయనారంభించింది. అంతేగాక అల్పబుద్ధితో తామిచ్చిన హామీలను తుంగలో తొక్కి సమ్మెలో పాల్గొన్నందుకు అనేకమంది కార్మికులను పనిలో నుండి తొలగించింది. ఈ పరిస్థితి కార్మికులను కోపోద్రిక్తులను చేసింది.

7.9.1927న అధికారులు ఖరగ్‌పూర్ వర్క్‌షాపులో 1700 మంది కార్మికులను రిట్రెంచ్ చేస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. దీనికి జవాబుగా కార్మికులు మరుసటి రోజు నుండే వర్కుషాపులో వుండే శాంతియుతంగా సమ్మెచేయడం ప్రారంభించారు. ఈ ప్రతిఘటనా కార్యక్రమం సెప్టెంబర్ 12వ తేదీన కంపెనీ లాకౌట్ ప్రకటించే వరకు కొనసాగింది. ఈ సందర్భంలో ఒక విషయం గమనించవలసివున్నది. మొదట (ఫిబ్రవరి 11) సమ్మె సందర్భంగా ఉదాసీనంగా వ్యవహరించిన బి.ఎన్.రైల్వే లేబర్ యూనియన్ నాయకత్వం చివరకు సమ్మె చేయవలసిందేనని కార్మికులు తెచ్చిన ఒత్తిడికి తలవంచక తప్పలేదు. యూనియన్ నాయకత్వం యొక్క పచ్చి సంస్కరణవాద స్వభావం, ద్వంద్వ స్వభావం తరువాత రోజులలో బహిర్గతమైనాయి. ఒకవైపు కార్మికులలో వర్గచైతన్యం, పోరాట దృక్పథం నానాటికి పెరుగుతుండగా వేరొక ప్రక్క నాయకత్వపు సంస్కరణవాదం, రాజ్యాంగం పరిధిలోనే పనిచేయాలన్న, దృక్పథం పోరాటం యొక్క రెండవ దశలో కొట్టవచ్చినట్లు కన్పించాయి. ఈ కాలంలో కార్మిక వర్గానికి, కార్మిక వర్గ నాయకత్వానికి మధ్య తలెత్తిన వైరుధ్యాలు భారత కార్మికోద్యమ తదుపరి దశలో మరింత తీవ్రతరమయ్యాయి.

వర్క్‌షాపులో కార్మికులు సాగించిన ప్రతిఘటనా చర్యను ఖండిస్తూ యూనియన్ నాయకత్వం సెప్టెంబరు 14న బహిరంగంగానే ప్రకటించింది. ఆ ప్రకటనలో యిలా వున్నది. “కార్మికులు వర్కుషాపులోనే వుండి యాజమాన్యానికి యిచ్చిన ప్రతిఘటన చర్యను యూనియన్ నాయకత్వం ఆమోదించడంగాని, ప్రోత్సహించడం గాని చేయలేదని యూనియన్ సెక్రటరీ స్పష్టంచేస్తున్నారు. ఈ చర్య కార్మికులు తమ స్వంత బాధ్యత మీద తీసుకున్నదే. యూనియన్

అధ్యక్షుడు వి.వి.గిరి, కార్యదర్శి నాయుడు 10వ తేదీన జరిగిన బహిరంగ సభలో దీనిని ఖండించారు." జోగ్లేకర్ మీరట్ కుట్రకేసు విచారణలో డిఫెన్స్ స్టేట్‌మెంట్‌లో యిలా చెప్పారు. "సమ్మె చేయడానికిగాని, ప్రతిఘటనా చర్యలకు గాని తాను సుముఖుడను కానని శ్రీ నాయుడు స్పష్టంగా చెప్పారు. ఆయన ఆందోళనను రాజ్యాంగ పరిధుల్లోనే నడపాలని కోరాడు. మరొక ఆశ్చర్యకరమైన విషయమేమంటే, యూనియన్ ఒకవంక "కంపెనీ ఆర్థిక ఇబ్బందుల వలన కొంత రిట్రెంచ్‌మెంట్ అవసరం కావచ్చు" నని యూనియన్ అంగీకరిస్తూనే, "యూనియన్ ప్రతినిధి వర్గం సూచించినట్లుగా దశలవారిగా కార్మికుల సంఖ్యను తగ్గించినట్లయితే కంపెనీ లక్ష్యం నెరవేరియుండేది" అని సిగ్గువిడచి చెప్పడం గమనార్హం.

లాకౌట్, రిట్రెంచ్‌మెంట్ సమస్యలపై సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఒక వాయిదా తీర్మానం ప్రవేశపెట్టబడి దానిపై చర్చ జరిగింది. అసెంబ్లీలో ఈ సమస్యపై చర్చించడం ద్వారా ప్రభుత్వం రైల్వే యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకురావచ్చునని అసెంబ్లీ సభ్యుడు ఎన్.ఎమ్ జోషీ, లేబర్ యూనియన్ అధ్యక్షులు వి.వి.గిరి ఆశలుపెట్టుకున్నారు. కాని యీ ఊహలు భ్రమలని తేలింది.

లాకౌట్‌ను పొడిగించడంతో కోపోద్రిక్తులైన కార్మికులు రైల్వే యాజమాన్యం యొక్క నిరంకుశ విధానాన్ని ఓడించడానికి ఈ సమ్మెను రైల్వేలన్నింటికీ విస్తరించాలనే నిర్ణయం తీసుకున్నారు. కాని ఈ ప్రతిపాదన సంస్కరణవాద నాయకులకు మింగుడుపడలేదు. వారింకా రాజ్యాంగ పరిధిలోనే ఆందోళనలు చేయాలనే అభిప్రాయంతో వున్నారు. అందువలన గిరి, తదితర యూనియన్ నాయకులు ఒక ప్రక్క కార్మికుల సమావేశాలలో ప్రసంగించడంలో తలమునకలవుతుండగా వేరొక ప్రక్క దివాన్ చమన్‌లాల్ తదితర ఎ.ఐ.టి.యు.సి. నాయకులు రిట్రెంచ్‌మెంట్ ఆపివేయ వలసిందిగా రైల్వే యాజమాన్యానికి విజ్ఞప్తులు చేయడం ప్రారంభించారు. కాని అధికారులు వీటన్నింటిని పెడచెవినిపెట్టి తమ నిర్ణయానికి కట్టుబడి యున్నారు.

బెంగాలు – నాగపూర్ రైల్వేలో జరిగిన మొదటి (ఫిబ్రవరి) సమ్మెలో చురుకుగా పాల్గొన్న యువ కమ్యూనిస్టులు యీ పోరాటంలో కూడా పాల్గొనడానికి ఖరగ్‌పూర్ చేరుకున్నారు. ముజఫర్ అహమ్మద్, ఎస్.ఎ.డాంగే, భూపేంద్రనాథ్ దత్, శివనాథ్ బెనర్జీ, ధరణిగోస్వామి, గోపేంద్రనాథ్ చక్రవర్తి, సింగారవేలు చెట్టియార్, తదితర ప్రముఖ కమ్యూనిస్టులు ఖరగ్‌పూర్ చేరుకొని పోరాటాన్ని విస్తృతపరచడానికి పూనుకున్నారు.

ఈ విధంగా తమంతటతాముగా పోరాటాల్లో పాల్గొని సమరశీల కార్మిక వర్గ పోరాటాలను నిర్వహించడంలో యువకమ్యూనిస్టులు ప్రథమ పాఠాలు నేర్చుకున్నారు.

ఎ.ఐ.టి.యు.సి. కాన్పూరు సమావేశానికి హాజరైన బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సౌహార్ద్ర ప్రతినిధులు ఆర్థర్ ఫార్సెర్, జోసెఫ్ హాల్స్‌వర్త్‌లు ఖరగ్‌పూర్ వచ్చిపోరాటం సాగిస్తున్న కార్మికులకు తమ మద్దతు తెలియజేశారు.

ఈ అణచివేతకు వ్యతిరేకంగా దేశంలోని ఇతర రైల్వేలకు చెందిన కార్మికులలో కూడ అసంతృప్తి జ్వాలలు వ్యాపించాయి. బి.ఎన్. రైల్వే కార్మికుల వలెనే తమను కూడ రిట్రెంచ్ చేస్తారని ఆందోళన చెందిన ఇతర రైల్వేలలోని కార్మికులు ఖరగ్‌పూర్ కార్మికుల పోరాటానికి విజయం లభించాలని ఆకాంక్షించారు.

భారత జాతీయ కాంగ్రెసు కూడ ఈ పోరాటానికి తన మద్దతు తెలిపింది. సభ్యుల అభ్యర్థనపై కలకత్తాలో 28.10.27న ఆలిండియా కాంగ్రెసు కమిటీ సమావేశమై సమ్మె చేస్తున్న రైల్వే కార్మికులకు మద్ధతు తెల్పుతూ, టి.సి. గోస్వామి ప్రతిపాదించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మాన పాఠం ఇలా వున్నది "బెంగాల్ – నాగపూర్ రైల్వే ఉద్యోగులలో అధిక సంఖ్యాకులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తూ ఖరగ్‌పూర్‌లో సమ్మె జరుపుతున్న కార్మికులకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తోంది. వారి హక్కుల సాధనలో వారికి బాసటగా నిలచి వారికి సహాయ సహకారాలు అందజేయవలసిందిగా యావద్భారత దేశంలోని ప్రజానీకాన్ని కోరుతోంది."

ఈ సమ్మెను ఇతర రైల్వేలకు కూడ వ్యాప్తి చేయడం కొరకు మిగిలిన రైల్వే కార్మిక సంఘాల ప్రతినిధులతో ఒక సదస్సు ఏర్పాటు చేయాలని భావించడం జరిగింది. అక్టోబరు 29, 30 తేదీలలో ఖరగ్‌పూర్‌లో ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయబడింది. వారం రోజులలోగా బి.ఎన్. రైల్వే కార్మికుల కనీస కోర్కెల పరిష్కారం జరగక పోయినట్లయితే అన్ని రైల్వేలలోని కార్మికులను సార్వత్రిక సమ్మెకు సన్నద్ధులను చేయాలని సమావేశం అత్యధిక మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించింది.

ఖరగ్‌పూర్ కార్మికులు ఏ విధమైన ఒత్తిడులకు లొంగక సమ్మెను నిరవధికంగా కొనసాగించాలనే పట్టుదలతో వున్నారు. ఈ సమ్మెను ఇతర రైల్వేలకు విస్తరించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనేక ట్రేడ్ యూనియన్లు, రాజకీయ సంస్థలు తమ పూర్తి సానుభూతి, సహకారాలు అందజేస్తున్నాయి. ఈ పరిస్థితుల ధాటికి తట్టుకోలేక భారత ప్రభుత్వమే దిగిరావలసి వచ్చింది. కార్మికుల సమస్యలను పరిశీలించడానికి ఒక ప్రభుత్వ ప్రతినిధితోను, బి.యన్. రైల్వేకు చెందిన మరొక ప్రతినిధితోను కమిటీని నియమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాని అదే సమయంలో రిట్రెంచ్‌మెంట్ విషయంలో తానేవిధమైన జోక్యం కలుగజేసుకోలేనని ప్రభుత్వం తన అశక్తతను వెల్లడించింది. లాకౌట్ ఎత్తివేయాలని, రిట్రెంచ్ చేయబడిన కార్మికులకు తిరిగి ఉద్యోగాల్లో నియమించాలని, లాకౌట్ కాలానికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలనీ వి.వి.గిరి తదితర నాయకులు ప్రభుత్వంతో చర్చల సందర్భంగా డిమాండు చేశారు. ప్రభుత్వం లాకౌట్ కాలానికి జీతాలు చెల్లించడానికి అంగీకరించింది. కాని రిట్రెంచ్ చేయబడిన 1700 మంది కార్మికులను తిరిగి పనిలోనికి తీసుకోవడానికి తిరస్కరించింది.

1927 డిసెంబరు 8న యూనియన్ సమ్మెను విరమించింది. రిట్రెంచ్‌మెంట్ దాడిని తిప్పికొట్టేందుకు ఖరగ్‌పూర్‌లో కార్మికులు మొదటిసారి సమ్మె జరిపారు. కాని రెండవసారి

లాకౌట్ ప్రకటించడం ద్వారా యాజమాన్యమే కార్మికులపై సమ్మెను బలవంతంగా రుద్దింది. అయినప్పటికీ ప్రభుత్వ యాజమాన్యాలు ప్రతీకారంతో చేస్తున్న దాడులను ప్రతిఘటించడానికి జరిగిన పోరాటంలో ఖరగ్‌పూర్ కార్మికులు ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని ఐక్యత, ధైర్యము, దృఢసంకల్పం ప్రదర్శించారు. కార్మికులు సమ్మెను కొనసాగించడమేకాక దీనిని విస్తరింపజేసి మరింత పెద్ద సంఖ్యలో కార్మికులను ఈ సమ్మెతో భాగస్వాములను చేయాలనే ఆలోచన పెంపొందుతున్న కార్మికవర్గ చైతన్యానికొక నిదర్శనం. కార్మికవర్గం ఎవరికివారు ఏ విధమైన ప్రణాళిక లేకుండా సమ్మెలు చేసే పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, వర్గచైతన్యంతో కూడిన ఐక్యపోరాటాలు సాగించే స్థితికి ఎదిగినదని బి.యన్. రైల్వేలో జరిగిన రెండు సమ్మెలు, ఈ సమ్మెల సందర్భంగా వ్యక్తమయిన కార్మికవర్గ సంఘీభావ వెల్లువ సూచిస్తున్నాయి.

## లీలువాలో ఈస్టిండియా రైల్వే కార్మికుల సమ్మె

ఖరగ్‌పూర్ రైల్వే కార్మికుల సమ్మె నుండి అనుభవం గడించిన యువ కమ్యూనిస్టులు కలకత్తా సమీపాన వున్న లీలువావద్ద ఈస్టిండియా రైల్వే కార్మికులలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు చురుకుగా సాగించడంలో నిమగ్నులయ్యారు. ఈ విధంగానే ఇదే సమయంలో యితర రైల్వేలలో కూడా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు సాగించటానికి కృషి ప్రారంభమైంది.

ఈ సమయంలో లక్నో, దానాపూర్‌లలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో నిమగ్నుడై వున్న రైల్వే కార్మిక నాయకుడు కిరణ్ చంద్రమిత్రా, లీలువా రైల్వే వర్కుషాపులో కార్మికులను సంఘటిత పరచడానికి పూనుకున్నాడు.

ఈ కాలంలో ఉద్యోగం సంపాదించుకోవాలంటే 30 నుండి 40 రూ॥ల వరకు, వర్క్‌షాపు ప్యాసు సంపాదించడానికి రూ. 3 నుండి 5 రూపాయల వరకు, ప్రతి సంవత్సరం ఇంక్రిమెంటు పొందేందుకు కనీసం 5 నుండి 10 రూ॥ల వరకు లంచం ఇవ్వవల్సి వుండేదని దివాన్ చమన్‌లాల్ వ్రాశారు.

జీతాల పెంపుదల సెలవు విషయంలో రాయితీలతో పాటు మరికొన్ని సదుపాయాలకల్పన కోరుతూ 1928 జనవరిలో వర్కుషాపులోని కొన్ని డిపార్టుమెంట్లలోని కార్మికులు మేనేజిమెంటుకు మెమోరాండం ఇచ్చారు. ఈ కోర్కెల సాధనకు కార్మికులు ఆందోళన సాగిస్తుండగా యాజమాన్యం ఇద్దరు యూనియన్ కార్యకర్తలను పనిలో నుంచి తొలగించింది. ఈ చర్య కార్మికులను మరింత కోపోద్రిక్తులను చేసింది. కార్మికులు ఫిబ్రవరి 29న సాధారణ సమావేశం జరిపి, (1) నైపుణ్యం లేని కార్మికులకు కనీస వేతనం రూ. 3/- లు చెల్లించాలని (2) నిపుణులైన కార్మికుల జీతాలు 25 శాతం పెంచాలనీ (3) డిస్మిస్ చేయబడిన ఇద్దరు కార్మికులను వెంటనే తిరిగి పనిలోనికి తీసుకోవాలని కార్మికులు డిమాండు చేశారు.

దీనికి జవాబుగా యాజమాన్యం మరో నలుగురు కార్యకర్తలను డిస్మిస్ చేసింది. ఈ చర్య కార్మికులను తీవ్రంగా కదిలించివేసింది. దీనితో మార్చి 5న కార్మికులందరు వర్కుషాపులో

ప్రవేశించి, డిస్మిస్ చేయబడిన తమ సహచరులను తిరిగి పనిలోకి తీసుకునేవరకు పనిచేయడానికి నిరాకరించారు. ఆ తరువాత రోజునే డిస్మిస్ చేయబడినవారిలో నలుగురికి తిరిగి ఉద్యోగం యివ్వడం జరిగింది. కాని డిస్మిస్ చేయబడిన ఉద్యోగులందరిని తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు వర్కుషాపులోనే వుండి సమ్మెను కొనసాగించారు. మార్చి 8న కంపెనీ వర్కుషాపు లాకౌట్‌ను ప్రకటించడంతో కార్మికుల సుదీర్ఘపోరాటం ప్రారంభమైంది.

ఈ ప్రతిష్టంభనను అంతంచేయడానికి జరిగిన సంప్రదింపులు విఫలం గావడంతో యాజమాన్యం మార్చి 20న ఒక రిట్రెంచ్‌మెంట్ ప్లానును ప్రకటించింది. అగ్గికి ఆజ్యం తోడైనట్లు యీ చర్యవలన సమ్మె వెంటనే హౌరా జనరల్ స్టోర్స్‌కు, హౌరా బ్లాక్ సిగ్నల్ షాపుకు, క్యారేజీ డిపార్టుమెంట్‌కు, బామున్‌గచి వర్కుషాపుకు విస్తరించింది.

వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీలోని కమ్యూనిస్టులు ఈ సమ్మె నిర్వహణలో చురుకైన పాత్ర వహించారు. కార్మికులు, కమ్యూనిస్టులు ఈ సమ్మెను ఇతర రైల్వేలకు విస్తరింప జేయాలనుకుంటుండగా, కిరణ్‌చంద్ర మిత్రా మాత్రం దీనికెలాగైన సత్వర పరిష్కారం సాధించాలనే ఉద్దేశంతో వున్నాడు. కాని యాజమాన్యం మొండివైఖరి నవలంబించడంతో కిరణ్‌చంద్ర మిత్రాకు ఈ సమ్మెను కొనసాగించడమే గాక హౌరాతోబాటు అసన్‌సోల్, జమాల్‌పూర్ ప్రాంతాలకు కూడా సమ్మెను విస్తరించక తప్పలేదు.

సమ్మెను విస్తరించడంతో బాటు మార్చి 28న 10 వేలమంది కార్మికులతో కలకత్తాలోని తూర్పు ఇండియా రైల్వే ప్రధాన కార్యాలయం ఎదుట బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించబడింది. శ్రీయుతులు కిరణ్‌చంద్ర మిత్రా, శివనాథ బెనర్జీ తదితర నాయకులు తూర్పు ఇండియా రైల్వే ఏజంటును కలిసి చర్చించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. సమ్మె చేస్తున్న కార్మికులు ప్రదర్శన తరువాత తమ తమ ఇళ్ళకు తిరిగి వెళుతుండగా బామున్‌గచి లోకోషెడ్ దగ్గర పోలీసులు హఠాత్తుగా కాల్పులు జరిపారు. కాల్పులలో ఇద్దరు కార్మికులు చనిపోయారు, పలువురు గాయపడ్డారు.

ఈ కాల్పులు జరగడంతో పరిస్థితి మరింత విషమించింది. సమ్మె ఇతర ప్రాంతాలకు విస్తరించి చివరకు ఆమ్తా – హౌరా లైట్ రెల్వేలో కూడా పని పూర్తిగా స్తంభించిపోయింది. సమ్మె చేస్తున్న కార్మికులకు సానుభూతిగా బర్న్, మార్టిన్, బర్డ్ కంపెనీలలోని కార్మికులు కూడా సమ్మెచేశారు. ఈ సందర్భంగా కలకత్తాలో జరిగిన బహిరంగసభలో వక్తలు కాల్పులను తీవ్రంగా ఖండిస్తూ సమ్మె చేస్తున్న కార్మికులకు తమ మద్దతు తెలిపారు. కిరణ్ చంద్ర మిత్రా ఈ బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఈ సమ్మెకు తమ పూర్తి సహకారం అందించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. బ్రిటిషు కమ్యూనిస్టు ఫిలిప్ స్ప్రాట్ ఈ సభలో పాల్గొన్న ప్రముఖుల్లో ఒకరు.

కలకత్తాలో అనేకచోట్ల, బర్ద్వాన్ తదితర కేంద్రాలలో సమ్మె మద్దతు తెల్పుతూ బహిరంగసభలు, ప్రజా ప్రదర్శనలు నిర్వహింపబడ్డాయి.

సరిగ్గా ఇదే సమయంలో జాతీయోద్యమ నాయకులు సమ్మెను పరిష్కరించడానికి చాల ఆసక్తి చూపారు. రివరెండ్ సి.ఎఫ్. ఆండ్రూస్, సుభాస్ చంద్రబోస్ తదితర నాయకులీ సమ్మె పరిష్కారానికి జరిపిన సంప్రదింపులు విఫలమయ్యాయి.

సమ్మె ప్రారంభమైనప్పటి నుండి దీనిని అన్ని రైల్వేలకు పూర్తిగా విస్తరింపజేయాలని కమ్యూనిస్టులు ఒత్తిడి చేస్తూనే యున్నారు. కాని ప్రజలకు అసౌకర్యం కలుగుతుందనే సాకు చెప్పి కిరణ్‌చంద్ర మిత్రా ఈ ప్రతిపాదనను వాయిదా వేస్తూ వచ్చాడు. యాజమాన్యం మొండివైఖరి ప్రదర్శించడంతో యూనియన్‌కు కూడ ఈ సమ్మెను విస్తృతపరచాలనే ఆలోచన చేయకతప్పలేదు. ఈ విషయం తెలిసి తీవ్రంగా ఆందోళన చెందిన యాజమాన్యం మే 25న లీలువా వర్కుషాపులో లాకౌట్‌ను ఎత్తివేసింది. అయినప్పటికి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు వర్కుషాపులోనే వుండి ప్రతిఘటనను ప్రారంభించారు.

ఇదిలా వుండగా యూనియన్ రైల్వేలన్నింటిలోనూ సమ్మెకు పిలుపు నిచ్చింది. పర్యవసానంగా ఓండాల్ వర్కుషాపు, అసన్‌సోల్ లోకోస్టోర్, తదితర కేంద్రాలలో పనికి తీవ్ర అంతరాయం కలిగింది. 16 వేల మందికి పైగా కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. కాని యాజమాన్యం తన మొండివైఖరిని విడనాడకపోగా బలప్రయోగం ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించింది. వేరొక ప్రక్క సుదీర్ఘకాలం కష్టనష్టాలనను భవించి, ఆకలి బాధలను భరించిన కార్మికులు అలసిపోయారు. రైల్వే కార్మికులకు సానుభూతిగా ఇతర పరిశ్రమలలో సమ్మెచేస్తున్న కార్మికులలో అనేకమంది తిరిగి పనుల్లో చేరారు. పరిస్థితులీ విధంగా ప్రతికూలంగా మారడంతో యూనియన్‌కు సమ్మెను విరమించక తప్పలేదు. జూలై 9వ తేదీన బేషరతుగా సమ్మె విరమించబడింది.

దీర్ఘకాలంగా సాగుతున్న ఈ వీరోచిత పోరాటాలను అణచడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా భయోత్పాతాన్ని సృష్టించింది. అదే సమయంలో సామ్రాజ్యవాద పత్రికలు కూడ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా దుష్ప్రచారం సాగించాయి. ఈ సమ్మె వెనుక మాస్కో హస్తం ఉన్నదని ప్రచారం చేయడానికి కూడా వీరు వెనుదీయలేదు.

అయితే జాతీయ పత్రికలన్ని సమ్మెను బలపరచాయి. ఈ సమ్మె విషయంలో జాతీయ కాంగ్రెస్ ప్రదర్శించిన ఉదాసీన వైఖరిని "అమృత బజార్" పత్రిక ఖండించేంతవరకు వెళ్ళింది.

ఈస్టిండియా రైల్వే కార్మికులు సాగించిన ఈ సుదీర్ఘ పోరాటం భారత కార్మికవర్గానికి చాలా విలువైన రాజకీయ గుణపాఠాలను నేర్పింది. కనీస ఆర్థిక కోర్కెల సాధనకు సాగుతున్న పోరాటాల నణచడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం ఎంత బహిరంగంగా తన యంత్రాంగాన్ని, సైనిక బలాలను నిర్దాక్షిణ్యంగా, నిరంకుశంగా ఉపయోగించేది కార్మికవర్గం గుర్తించింది. కార్మికుల్లో సామ్రాజ్యవాద వ్యతిరేకభావాలు, రాజకీయ చైతన్యం అభివృద్ధి చెందడానికి యీ పరిస్థితులు మరింత దోహదం చేశాయి. తాము ఆర్థికపరమైన కోర్కెల సాధనకై సాగించే పోరాటాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం రెండూ విడదీయరాని పరస్పర సంబంధమైన

విషయాలని కార్మికవర్గం గుర్తించడం సాగింది. కోర్కెలు సాధించామా లేదా అని చూస్తే యీ సమ్మె విఫలమైనట్లే, కాని రాజకీయంగా పరిశీలించినట్లయితే యిది నిస్సందేహంగా విజయమే.

## దక్షిణ భారత రైల్వేలో సమ్మె

తూర్పు ఇండియా రైల్వే సమ్మె తరువాత 20.7.1928న దక్షిణ భారత రైల్వే కార్మికులు సమ్మె చేశారు. కేవలం పదిరోజులే జరిగినప్పటికీ ఈ సమ్మె ప్రాధాన్యతను సామ్రాజ్యవాద ప్రభుత్వం పూర్తిగా కొట్టివేయలేకపోయింది.

విన్సెంట్ రావెన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రిట్రెంచ్‌మెంట్ చేయడానికి, రైల్వే వర్క్‌షాపును గోల్డెన్‌రాక్‌కు తరలించి, సంబంధిత కార్మికులనందరినీ అక్కడకు బదిలీ చేయడానికి యాజమాన్యం పూనుకొనడంతో యీ సమ్మె చెలరేగింది. జీతాల పెంపుదల ప్రధాన సమస్య కాకపోయినప్పటికి, అది ఒక డిమాండుగా వుంది.

3000 మంది కార్మికులను రిట్రెంచ్ చేయడానికి 1928 ఏప్రిల్‌లో తన నిర్ణయాన్ని ప్రకటించి, యాజమాన్యం ముందుగా స్వచ్ఛంద పదవీవిరమణ చేయవలసిందిగా కార్మికులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించింది. అలా చేయనట్లయితే ప్రావీణ్యతను పరీక్షించడంద్వారా తక్కువ సామర్థ్యం వున్నవారిని రిట్రెంచ్ చేయాలని యాజమాన్యం సంకల్పించింది.

కంపెనీ చేయతలపెట్టిన ఈ దాడులకు వ్యతిరేకంగా కార్మికులు తమంతట తామే సంఘటితమై, స్థానికంగా వున్న యూనియన్ల నన్నింటిని ఏకంచేసి అన్ని రైల్వేలకు కలిపి ఒకే కేంద్ర కార్మిక సంఘాన్ని ఏర్పరచారు. బి.శివరావు, ముకుందలాల్ సర్కార్, సింగారవేలు చెట్టియార్ వంటి వివిధ రాజకీయ, సామాజిక దృక్పథాలు గల్గిన వ్యక్తులు దీనికి నాయకత్వం వహించారు. కార్మికవర్గ అవగాహన విషయంలోనూ, పోరాటాలు నడిపే పద్ధతులలోను సర్కార్ చెట్టియార్‌లు కమ్యూనిస్టులతో సారూప్యత కల్గియున్నారు.

పదిరోజులుగా సాగుతున్న ఈ సమ్మెను హింసాకాండ ద్వారా అణచివేయడానికి ప్రభుత్వం సాయుధ దళాలను నియోగించింది. ఈ సందర్భంగా జరిగిన కాల్పులలో అనేకమంది సమ్మెచేస్తున్న కార్మికులు చనిపోవడమో, గాయపడడమో జరిగింది. ఈ పైశాచిక కృత్యాలను కార్మికులు వీరోచితంగా ప్రతిఘటించారు. అనేకమంది కార్మికులను అరెస్టు చేసినప్పటికి కార్మికులు చలించలేదు సరికదా, మద్రాసు, తదితర ప్రదేశాలలో యీ అత్యాచారాలను ఖండిస్తూ, అరెస్టు చేయబడిన తమ కామ్రేడ్స్‌ను వెంటనే విడుదల చేయవలసిందిగా కోరుతూ వేలకొలది కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపారు.

కార్మికుల్లో వచ్చిన ఈ చైతన్యాన్ని, వారి సంఘటిత శక్తిని గమనించిన ప్రభుత్వం హడలిపోయింది. పోరాడుతున్న కార్మికుల ధైర్యం సడలించాలనే ఉద్దేశ్యంతో సింగారవేలు చెట్టియార్, ముకుందలాల్ సర్కార్‌లను అరెస్టు చేసింది. సమ్మె కమిటీ కార్యదర్శి నారాయణస్వామి, యూనియన్ అధ్యక్షుడు వి. కృష్ణస్వామి పిళ్ళేలను కూడ తరువాత అరెస్టు చేసి నిర్బంధించారు.

యూనియన్ నాయకుల అరెస్టుతో ప్రభుత్వ అణచివేత చర్యలు పరాకాష్ఠకు చేరి, కార్మికులమీద ప్రతికూల ప్రభావం చూపాయి. వారు తమ ప్రతిఘటనా శక్తిని కోల్పోయారు. ఈ పరిస్థితులలో జూలై 30వ తేదీన సమ్మెను విరమించడం తప్ప యూనియన్‌కు గత్యంతరం లేకపోయింది. సమ్మె విరమణ తరువాత ముకుంద్‌లాల్ సర్కార్, సింగారవేలు చెట్టియార్‌లతో సహా అనేకమంది కార్మికులకు భారత రైల్వే చట్టం క్రింద జైలు శిక్ష విధించారు. కంపెనీ యధేచ్ఛగా తన రిట్రెంచ్‌మెంట్ స్కీమును అమలుచేసి, సంకుచిత బుద్ధితో జీతాల పెంపుదల డిమాండును కూడా నిర్లక్ష్యం చేసింది.

ఈ సమ్మె వల్ల సామ్రాజ్యవాద ప్రభుత్వం యొక్క అణచివేత, దోపిడీ స్వభావం కార్మికుల ముందుబట్ట బయలయింది. ఈ సమ్మె పర్యవసానంగానే విడివిడిగా పోరాటాలు సాగించడంవలన తరచుగా అపజయాన్నే ఎదుర్కొనవలసి వస్తోందన్న సత్యాన్ని కార్మికవర్గం కాంచగల్గింది. అనుభవం ద్వారా ఈ గుణపాఠాలను నేర్చుకున్న రైల్వే కార్మికులు దేశవ్యాప్తంగా వున్న రైల్వే కార్మికులందరికీ ఉమ్మడి ప్రమాదమైన రిట్రెంచ్‌మెంటుకు వ్యతిరేకంగా తుది పోరాటాన్ని సాగించడానికి, భారతదేశంలోని రైల్వే కార్మికులందరితో ఒక ఐక్య సంఘటనను నిర్మించాలని నిశ్చయించారు.

## గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో సమ్మె

గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో కమ్యూనిస్టుల చొరవతో ప్రారంభించిన యూనియన్ మిక్కిలి బలవత్తరమయిన యూనియన్‌గా అభివృద్ధి చెందింది. ఈ రైల్వేలో 4.2.1930న జరిగిన సమ్మె యీ యూనియన్ నాయకత్వంలోనే జరిగింది.

వేతనాల పెంపుదల, డిస్మిసల్స్ తదితర కక్షసాధింపు చర్యల నిలిపివేత, యూనియన్ కార్యకర్తలను యాజమాన్యం యధేచ్ఛగా బదిలీలు చేయడానికి, రిట్రెంచ్‌మెంటుకు స్వస్తిచెప్పాలనేవి యీ కార్మికుల ప్రధాన కోర్కెలు, వీటితో బాటు పని గంటల తగ్గింపు, వర్ణ వివక్షను రూపుమాపడం వంటి సమస్యలను కూడా పరిష్కరించాలని యూనియన్ డిమాండు చేసింది.

ఆ రైల్వేలోని సుమారు 33 వేలమందికి పైగా కార్మికులకు నెలజీతం రూ. 15/–ల కంటే తక్కువగా వున్నది. అనేకమంది కార్మికులకు అతి నికృష్టంగా 8, నుండి 9 రూ॥ల జీతాన్ని చెల్లిస్తున్నారు. ఈ రైల్వేలోని 17 వేలమందికి పైగా కార్మికులకు 30 రూ॥ల కంటే తక్కువ నెలజీతం లభిస్తోంది. అతి నికృష్టమైన వారి పరిస్థితిని మెరుగుపరచడానికి కార్మికులందరికీ ఒకే విధంగా 10 శాతం జీతాలను పెంచాలని, కనీస వేతనాన్ని నెలకు 30 రూపాయలుగా నిర్ణయించాలని యూనియన్ కోరింది.

ఈ రైల్వేలో పూర్తిగా విస్తరించిన ఈ సమ్మెకు కార్మికుల నుండి విశేష స్పందన లభించింది. కాని రైల్వే యాజమాన్యం యధావిధిగా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి భయోత్పాతాన్ని సృష్టించింది. పోలీసులను, మిలటరీని ప్రయోగించి కార్మికులను వారి క్వార్టర్ల నుండి వెళ్ళగొట్టించింది. రైల్వే కాలనీలకు నీటి సరఫరా నిలిపివేశారు. పెద్దసంఖ్యలో కార్మికులను

అరెస్టు చేశారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులకు బదులుగా కొత్తవారిని నియమించడానికి కూడా యాజమాన్యం ప్రయత్నించింది.

ప్రజానీకం నుండి ఈ సమ్మెకు బ్రహ్మాండమైన మద్దతు లభించింది. కాని దృఢసంకల్పంతో సమరశీలంగా సమ్మెను నిర్వహించడం కొందరికి యిష్టంలేదు. ముఖ్యంగా ఇదే రైల్వేలో, వున్న వేరొక యూనియన్ నాయకత్వానికి ఈ సమ్మె సుతరాము ఇష్టంలేదు. ఈ సమయంలో కార్మికుల సమస్యలను మధ్యవర్తుల పరిష్కారానికి వదిలేయాలని కొందరు సూచించారు. అలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ తరపున ఒక ప్రతినిధి వర్గం రైల్వే బోర్డు వ్యవహారాలు చూస్తున్న అధికారి జార్జి రైనీతో సంప్రదింపులు జరిపింది. ఫలితంగా రైల్వేబోర్డు ఈ క్రింది రాయితీలు యివ్వడానికి అంగీకరించింది.

1) సమ్మెలో పాల్గొన్నందుకు కక్ష సాధింపు చర్యలుండవు.

2) తక్కువ జీతాలు పొందుతున్న కార్మికుల వేతనాలను త్వరలో సవరించడం జరుగుతుంది

3) వైద్య పరీక్ష ద్వారా అర్హుడని ప్రకటించబడితే యూనియన్ ఉపాధ్యక్షుడు డి.బి. కులకర్ణిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటారు.

కాని రైల్వే బోర్డు వి.బి. పురందర్ అనే యూనియన్ కార్యకర్తను తిరిగి ఉద్యోగంలోకి తీసుకొనడానికి తిరస్కరించింది. వి.వి.గిరి, చమన్‌లాల్, ఎన్.ఎమ్. జోషి లు, ఈ ఒప్పందం ప్రకారం సమ్మె విరమించి మార్చి 15న పనిలో చేరవలసిందిగా కార్మికులను కోరారు.

యూనియన్ అధ్యక్షులు ఆర్.ఎస్. రూకర్ తదితర ముఖ్య కార్యకర్తలు, ప్రధానంగా కమ్యూనిస్టులకు ఈ ఒప్పందం ఆమోదయోగ్యం కానప్పటికి, చివరకు వీరు కూడ సమ్మె విరమణకు అంగీకరించారు.

సమ్మె విరమించిన తర్వాత మాతుంగా వర్కుషాపులో 1500 నుండి 2000 మంది కార్మికులను పనిలోనుండి తొలగించాలనే తమ నిర్ణయాన్ని రైల్వే యాజమాన్యం ప్రకటించింది. ఝాన్సీ తదితర ప్రాంతాలలో కూడ రిట్రెంచ్‌మెంట్‌కు ప్లానులు ప్రకటించబడ్డాయి. యాజమాన్యం తలపెట్టిన యీ చర్యలు కార్మికులకు తీవ్ర ఆగ్రహాన్ని కల్గించాయి. బొంబాయిలో మార్చి 24న సమావేశమైన సమ్మె కమిటీ రిట్రెంచ్‌మెంటు నిర్ణయాన్ని ఉపసంహరించు కొనేంతవరకు వేర్వేరు కేంద్రాలలో శాంతియుతంగా సత్యాగ్రహం, పికెటింగ్ జరపాలని నిర్ణయించింది.

ఏప్రిల్ 10న సత్యాగ్రహ కార్యక్రమం ప్రారంభం కావలసియున్నది. కాని ఈలోగా ఈ వివాదాన్ని పరిష్కరించడానికి గిన్వాలా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయనే వార్త కార్మికులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఏప్రిల్ 4వ తేదీన బ్రహ్మాండమైన బహిరంగసభ, ఊరేగింపులు ఆగ్రహావేశాలతో కూడిన ప్రదర్శనలు జరిపారు.

జోగ్లేకర్ ఇలా అన్నారు. "బహిరంగసభ అనంతరం రైలులో వారి ఇళ్ళకు తిరిగి

వెళదామనే ఉద్దేశ్యంతో కార్మికులు విక్టోరియా టెర్మినస్ స్టేషనుకు వెళ్ళారు. కాని కార్మికులపై దాడిచేయడానికి రైల్వే అధికారులు పోలీసు బలగాలను దించారు. కార్మికులు రైలులో తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళాలని పట్టుబట్టారు. దీనితో పోలీసులు విపరీతంగా లాఠీఛార్జీ చేసి, కాల్పులకు కూడా పాల్పడ్డారు. మొత్తం మీద లాఠీ ఛార్జీ, కాల్పుల ఫలితంగా ఇరువురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 50 మందికి పైగా సమ్మె చేస్తున్న కార్మికులు గాయపడ్డారు. ఈ ఇరువురు కార్మికుల మరణంతో ఆగ్రహించిన కార్మికులు వెంటనే చర్య తీసికొనవలసిందిగా ఒత్తిడి చేయసాగారు. సమ్మె కమిటీ నిర్ణయం కోసం గాని, వారి నాయకుల సూచనల కోసం గాని ఎదురుచూడక వారు కుర్లా స్టేషన్‌లో సత్యాగ్రహం ప్రారంభించారు. వీరు కుర్లా సియాన్ స్టేషన్ల మధ్య రైలు ఆపడంతో పోలీసులు తిరిగి సత్యాగ్రహం చేస్తున్న కార్మికులపై కాల్పులు జరిపారు. వేర్వేరు రైల్వే కేంద్రాలలో సత్యాగ్రహం జరుపుతున్న అనేకమంది కార్మికులను జైలులో వుంచారు. నిషేధపుటాజ్ఞలను ఉల్లంఘించి బహిరంగసభలలో ఉపన్యసించినందుకు యూనియన్ అధ్యక్షుడు ఆర్.ఎస్.రూకర్‌ను అరెస్టుచేసి జైలులో వుంచారు.

యూనియన్ కార్యనిర్వాహకవర్గం ఏప్రిల్ 15న బొంబాయిలో సమావేశమైంది. కార్మికులపై సర్వతోముఖంగా దాడులు సాగుతున్న ఈ సమయంలో సమావేశమై ఈ కమిటీ చివరకు సమ్మెను విరమించాలని నిర్ణయించింది.

ఈ సమ్మెను కార్మికులు క్రమశిక్షణతోనూ, ఒక పద్ధతి ప్రకారంగాను నిర్వహించారు. 22,600 మందికి పైగా కార్మికులు పాల్గొన్న ఈ సమ్మె యీ కాలంలో జరిగిన ఒక బ్రహ్మాండమైన పోరాటం. యూనియన్, సమ్మె కమిటీ క్రమపద్ధతిలో పనిచేయడంతో బాటు కమ్యూనిస్టులు చురుకుగా పనిచేయడం ఈ సమ్మెను తీవ్రతరం చేయడానికి, మిలిటెంట్‌గా నడపడానికి దోహదం చేసింది.

## నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే (హైద్రాబాదు)లో సమ్మె

తాము క్రొత్తగా ఏర్పరచుకున్న యూనియన్‌ను గుర్తించాలనే డిమాండుతో బాటు ఇతర డిమాండ్ల సాధనకు నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వేలోని లాలాగూడా వర్కుషాపులో కార్మికులు 1930 సెప్టెంబర్‌లో సమ్మె చేశారు. అలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ వి.వి. గిరి రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపారు. యూనియన్ గుర్తింపుతోబాటు మరికొన్ని సమస్యలు పరిష్కరించబడటంతో కార్మికులు తిరిగి పనులలో ప్రవేశించారు.

## బొంబాయి, బరోడా మరియు సెంట్రల్ ఇండియా రైల్వేలో వివాదం

1929లో పరేన్ వర్కుషాపును 300 మైళ్ళ దూరంలోనున్న దోహద్‌కు తరలించడానికి, కార్మికుల జీతాలలో 1/11 వంతు కోత విధించడానికి, వర్కుషాపు తరలింపుతో కార్మికులందరినీ అక్కడకు బదిలీ చేయడానికి నిర్ణయించుకున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. యూనియన్

యీ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించి, వేతనాల్లో కోత ప్రతిపాదనకు ప్రతిగా 20 శాతం వేతనాలను పెంచాలనే డిమాండును యాజమాన్యం ముందుంచింది.

ఈ సమస్య మధ్యవర్తుల పరిష్కారానికి పంపబడింది. బి.బి.ఘోష్ ఆధ్వర్యంలోని మధ్యవర్తుల కమిటీ ఇరుపక్షాల వాదనలు విన్న మీదట జీతాలలో కోతను వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఇరుపక్షాలవారికి ఆమోదయోగ్యంగా వుండడంతో సమస్య సామరస్యంగా పరిష్కరించబడి సమ్మె అవసరం లేకపోయింది.

1927-30 మధ్యకాలంలో భారత రైల్వేలలో జరిగిన సమరశీల సమ్మె పోరాటాలు భారత కార్మికోద్యమానికొక నూతన మార్గాన్ని చూపాయి. జనపనార, జౌళి పరిశ్రమల్లో జరిగిన సార్వత్రిక సమ్మె పోరాటాలు, జంషెడ్‌పూర్‌లోని ఉక్కు పరిశ్రమలో సాగిన సమ్మెలు, ఇదే కాలంలో సాగిన ఇతర పోరాటాలు భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఒక ఉన్నతదశకు చేర్చాయి.

## జౌళి కార్మికుల ప్రథమ సార్వత్రిక సమ్మె (1928)

1928-1929 సం॥లలో బొంబాయిలోని నూలుబట్టల పరిశ్రమకు చెందిన కార్మికులు జరిపిన రెండు సార్వత్రిక సమ్మెలు భారత కార్మికోద్యమ చరిత్రలో ప్రముఖ స్థానమాక్రమించాయి. ఈ సమ్మెలు ఒక పట్టణంలోని ఒకే పరిశ్రమలో జరిగినప్పటికీ, దేశవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించడమేగాక అనేక వూహించని పరిణామాలకు దారితీశాయి.

బొంబాయిలోని మిల్లు యజమానులు అమలుపరచతలపెట్టిన "రేషనలైజేషన్ స్కీము" (పరిశ్రమను పునర్ వ్యవస్థీకరణ పథకం) అన్ని మిల్లులలోను రిట్రెంచ్‌మెంట్‌కు దారితీసే తీవ్ర ప్రమాదం గోచరించింది. 1926 సం॥నుండే ఈ ప్రమాదానికి వ్యతిరేకంగా అనేక మిల్లులలోని కార్మికులు విడివిడిగా పోరాటాలు సాగిస్తున్నారు. విడివిడిగా సాగుతున్న ఈ పోరాటాలు ఏకమై ఈ పోరాట వెల్లువ ముందుకురకడం 1928లో మాత్రమే జరిగింది. ఈ పోరాటాన్ని కమ్యూనిస్టులు ముందుండి నడిపించడం విశేషం. మొట్టమొదటి సమ్మె 26.4.1928న ప్రారంభమై దాదాపు ఆరు నెలల పాటు కొనసాగింది.

పునర్వ్యవస్థీకరణ పథకం కొన్ని మిల్లుల్లో అమలు జరపబడడంతో, దీనికి గురయిన కార్మికులు అన్ని మిల్లులలోను జనరల్ సమ్మెను జరపాలని తలచారు. కాని బొంబాయి టెక్స్‌టైల్ లేబర్ యూనియన్, గిర్నికాంగార్, మహామండల్‌ల నాయకత్వం ఈ జనరల్ సమ్మె ఆలోచననే తీవ్రంగా వ్యతిరేకించాయి. అయినప్పటికీ తరువాత పరిణామాల ప్రభావం వలన ఈ జనరల్ సమ్మె చేయకతప్పలేదు. బొంబాయి మిల్లు కార్మికుల యూనియన్, వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీలు సంయుక్తంగా ఏప్రిల్ 15న బొంబాయిలో జౌళి కార్మికులతో ఒక బ్రహ్మాండమైన ప్రదర్శనను నిర్వహించాయి.

ఇదిలా వుండగా ఏప్రిల్ 16న మిల్లు యజమానులు చాలా మిల్లులను మూసివేయడంతో,

కనీసం 20 వేలమంది కార్మికులు పనులు పోగొట్టుకున్నారు. అదే రోజు సాయంత్రం జరిగిన బహిరంగసభలో బొంబాయిలోని కమ్యూనిస్టులు ఉపన్యసిస్తూ యీ దాడులను ప్రతిఘటించడానికి అన్ని మిల్లులలోను సార్వత్రిక సమ్మెను నిర్వహించవలసిన ఆవశ్యకతను పునరుద్ఘాటించారు.

ఆనాటికి దాదాపు అన్ని మిల్లులకు సమ్మె విస్తరించినప్పటికీ, ఎన్.ఎం.జోషి నాయకత్వంలోని బొంబాయి టెక్స్‌టైల్ లేబర్ యూనియన్ జనరల్ సమ్మె ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించింది. మిల్లు యజమానులు తమ మిల్లులను మూసివేయడం ప్రారంభించారు. ఈ పరిస్థితుల నెదుర్కొనడానికి కమ్యూనిస్టులు జనరల్ సమ్మె నిర్వహించడానికి పూనుకున్నారు. వీరి కృషి ఫలితంగా ఏప్రిల్ 26న సమ్మె ప్రారంభమైంది.

ప్రారంభంలో మిలిటెంట్ కార్మిక నాయకుల ఆధ్వర్యంలో ఒకటి, బొంబాయి టెక్స్‌టైల్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో మరొకటి మొత్తం రెండు సమ్మె కమిటీలు ఏర్పడ్డాయి. కాని మే 2న యీ రెండు సమ్మె కమిటీలను ఏకంచేసి ఒకే సంయుక్త సమ్మె కమిటీని ఏర్పరచారు. మే 3వ తేదీన యీ జాయింట్ సమ్మె కమిటీ 17 అంశాలతో కూడిన ఒక కోర్కెల పత్రాన్ని తయారుచేసింది. వేతనాలలో కోతను విధించరాదని, 1925 నుండి తగ్గించిన జీతాలను కార్మికులకు తిరిగి యివ్వాలని, రోజువారి పనిగంటలను పెంచరాదని, ప్రస్తుతం అమలులోనున్న సర్వీసు నిబంధనలను కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మార్చరాదని, నెలకు 30 రూ॥లకంటే తక్కువ జీతం పొందుతున్న వారి జీతాలను పెంచాలని, ధరల పెరుగుదల వలన యిచ్చే అలవెన్సును మూలవేతనంతో కలపాలని, యూనియన్ కార్యకలాపాలలో పాల్గొనే కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు తీసుకోరాదనేవి "ఈ ఛార్టరు"లోని ప్రధానాంశాలు.

మిల్లు యజమానుల సంఘం యీ ప్రతిపాదనలలో అధికభాగం తిరస్కరించి, మిల్లులను తిరిగి తెరవడానికి కొన్ని షరతులు పెట్టింది. కాని ఈ షరతులు జాయింట్ స్ట్రయిక్ కమిటీకి ఆమోదయోగ్యంగా లేకపోవడంతో కార్మికులను సమ్మె కొనసాగించ వలసినదిగా కమిటీ కార్మికులకు పిలుపు ఇచ్చింది.

గత్యంతరం లేక సమ్మెకు అంగీకరించిన ఎన్.ఎమ్.జోషీ ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు మధ్యవర్తుల బోర్డుకు నివేదించవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. సమ్మె ఉధృతిని గమనించిన ప్రభుత్వం యీ సమస్యను సత్వరం పరిష్కరించాలనే ఆతురతతో జోషీ ప్రతిపాదనను పరిశీలించడానికి తన సంసిద్ధతను వ్యక్తం చేసింది. ఆర్బిట్రేషన్ బోర్డు (మధ్యవర్తుల పరిష్కారానికి)కు నివేదించవలసిన అంశాలపై ఇరుపక్షాలు ఏకీభవించకపోవడంతో యీ ప్రయత్నం ఫలించలేదు.

సమ్మెను పరిష్కరించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఆగస్టు 15, 16 తేదీలలో రెండు రోజులు మిల్లు యజమానుల సంఘానికీ, సమ్మె కమిటీకి మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. జాయింట్ స్ట్రయిక్ కమిటీ యొక్క సంప్రదింపుల కమిటీకి మిల్లు యజమానుల సంఘం సబ్ కమిటీకి మధ్య సెప్టెంబరు నెలలో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. ఈ సంప్రదింపుల్లో

ఇరుపక్షాల మధ్య యితర విషయాలలో అంగీకారం కుదిరినప్పటికీ, నేతపనివారి జీతాలను తగ్గించే విషయంలో తాము తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొనడానికి మిల్లు యజమానుల సంఘం తిరస్కరించడంతో చర్చలు మళ్ళీ విఫలమయ్యాయి. అక్టోబరు 4వ తేదీన ప్రభుత్వం మిల్లు యజమానులతోను, సమ్మె కమిటీతోను సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కార్మికుల సమస్యలను గురించి పరిశీలించడానికి ప్రభుత్వం ఒక విచారణా సంఘాన్ని నియమించాలని ఈ సమావేశంలో నిర్ణయించబడింది. ఈ నిర్ణయానికి ఇరుపక్షాలవారు తమ ఆమోదాన్ని తెలియజేశారు.

ఈ నిర్ణయంతో పాటు సమ్మెను విరమించాలనే నిర్ణయానికి అక్టోబరు 5వ తేదీన జరిగిన సమావేశంలో కార్మికులు తమ ఆమోదాన్ని తెలియజేశారు. ఈ నిర్ణయానుసారం అక్టోబరు 6వ తేదీన కార్మికులు తిరిగి పనుల్లో ప్రవేశించారు.

అక్టోబరు 5వ తేదీ సమావేశంలో సమ్మెను విరమించాలనే నిర్ణయం తీసుకున్నప్పటికీ ఈ ఒప్పందం ఒక తాత్కాలిక సంధిలాంటిది మాత్రమేనని కొందరు నాయకులు కార్మికులను హెచ్చరించారు. విచారణా సంఘం వల్ల ఒనగూడే ప్రయోజనాల గురించి వారు బహిరంగంగానే తమ సందేహాలను వెలిబుచ్చారు. జీతాల పెంపుదలను సాధించుకొనడానికి, పని పరిస్థితులను మెరుగుపరచుకొనడానికి మరొక సుదీర్ఘ పోరాటం అవసరం కావచ్చు. అందువలన కార్మికులు మరింత సంఘటితమై రాబోయే ఆరు నెలల్లో పెద్ద ఎత్తున సమ్మెనిధులు సమకూర్చుకుని మరో సుదీర్ఘ పోరాటానికి సిద్ధంగా వుండవలసిందిగా కోరారు.

కార్మిక వర్గం చక్కని ఐక్యతను, పట్టుదలను ప్రదర్శించిన ఈ సమ్మె బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల పోరాట సంస్థ గిర్నికాంగార్ యూనియన్ ఆవిర్భావానికి దారితీసింది. సమ్మె సమయంలో కార్మికులకు ఒక పటిష్టమైన యూనియన్ లేదు. అర్జున్ ఆత్మారామ్‌అల్వే నాయకత్వంలోని గిర్నికాంగార్ మహామండల్‌తో పాటు, ఎన్‌ఎం.జోషీ ఆధ్వర్యంలోని బొంబాయి టెక్స్‌టైల్ లేబర్ యూనియన్లు నామమాత్రమైనవేగాని వీటికి కార్మికులలో ఏ మాత్రం పలుకుబడిలేదు. మరికొద్ది వారాల్లో సమ్మె జరుగుతుండనగా ఝబ్వాలా నాయకత్వంలో మరో యూనియన్ పుట్టుకొచ్చింది. సమ్మె ప్రారంభ దశలో కమ్యూనిస్టులు గిర్నికాంగార్ మహామండల్‌తో పాటు ఈ క్రొత్త యూనియన్‌లో కూడ వుండి తమ కార్యకలాపాలు సాగించారు. కార్మికుల పోరాటం వేగంగా విస్తరించడంతో పాటు, నానాటికి సమరశీలత సంతరించుకోవడంతో యీ రెండు యూనియన్ల అసమర్థత కొట్టవచ్చినట్లు కనపడింది.

ఈ పరిస్థితుల్లో పోరాటాలకు నాయకత్వం వహించి, పెంపొందించే సామర్థ్యం కల్గిన ఒక పటిష్టమైన సంస్థ అవసరాన్ని గుర్తించడం జరిగింది. గిర్నికాంగార్ యూనియన్ ఆవిర్భావం గురించి శ్రీ జోగ్లేకర్ "జౌళి కార్మికులు సమ్మె జరుగుతున్న సమయంలోనే సంయుక్త సమ్మె కమిటీ ద్వారా తమ సంస్థను నిర్మాణంచేసి, పటిష్టం చేసుకొనడం ప్రారంభించారు. సాధారణ కార్మికుల ఒత్తిడి మూలంగానే మధ్యేవాద, సంస్కరణవాద నాయకులు యీ జాయింట్ స్ట్రయిక్ కమిటీలో చేరవలసిన ఆగత్యం ఏర్పడింది. సమ్మె విరమించబడిన తర్వాతనే, ఈ అనుభవాల

నుండి జౌళి కార్మికులు తమ వర్గ సంస్థ ప్రాముఖ్యతను, అవసరాన్ని గుర్తించారు. సమ్మె దినాలలో కార్మికులు గడించిన అనుభవాల ఫలితంగా ఒక నెలరోజుల లోగానే అతిపటిష్టమైన గిర్నికాంగార్ యూనియన్ ఆవిర్భవించింది" అని వ్రాశాడు.

ఆ విధంగా సమ్మె నుండే 1928 మే 22వ తేదీన గిర్నికాంగార్ యూనియన్ ఆవిర్భవించింది. 324 మంది సభ్యులతో ప్రారంభమైన యీ సంస్థ త్వరత్వరగా అభివృద్ధి చెంది 1928 డిశంబరు నాటికి 54,000 సభ్యత్వాన్ని సంపాదించింది. 1929 మార్చి నాటికి యీ యూనియన్ సభ్యత్వం 65 వేలు. తరువాత యీ యూనియన్ పేరు గిర్ని కాంగార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్) గా మార్పుచెందింది. ఇదే కమ్యూనిస్టుల నాయకత్వంలోని జౌళి కార్మికుల పటిష్టవంతమైన యూనియన్. పునర్ వ్యవస్థీకరణ స్కీముల పట్ల కార్మికుల దృక్పధాని సరియైన విధంగా మలచడంలోనూ, యీ విధానాన్ని ఎదుర్కొనడానికి కమ్యూనిస్టులు చేపట్టిన కార్యాచరణ వారిని యీ పోరాటానికి నాయకులను చేసింది. పరిశ్రమల పునర్ వ్యవస్థీకరణ వలన కలిగే ఫలితాలను కమ్యూనిస్టులు స్పష్టంగా గుర్తించగలిగారు. పోరాటాన్ని విస్తృతపరచడం ద్వారా వారీ ప్రమాదాన్ని ప్రతిఘటించచదలచారు. కమ్యూనిస్టులు చేపట్టిన యీ కార్యాచరణ పంథా వారి నిజాయితీ, దీక్ష, క్రమశిక్షణ కార్మికులను విశేషంగా ఆకర్షించాయి.

1928 అక్టోబరు 13వ తేదీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం న్యాయమూర్తి ఫాసెట్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. 1929 మార్చిలో వెలువడిన ఈ కమిటీ రిపోర్టు కార్మికులకు ఏ విధమైన ఆర్థిక పరమైన రాయితీలను సిఫార్సు చేయలేదు. ఆరు నెలల పాటు సాగిన యీ సుదీర్ఘ పోరాటం వలన కార్మికులు 2 కోట్ల 50 లక్షల (25 మిలియన్లు) రూపాయల జీతం నష్టపోయారు. అంతేగాక కార్మికులు అప్పటివరకు ఏ రేషనలైజేషన్ స్కీముకైతే వ్యతిరేకంగా పోరాడుతున్నారో ఆ స్కీము తాత్కాలికంగా నిలుపుచేయబడిందేగాని, యాజమాన్యం దానిని పూర్తిగా వదిలివేయలేదు.

ఈ సమ్మె వలన కార్మికులు ఆర్థికపరంగా ఏ విధమైన విజయం సాధించలేకపోయారు. కాని ఈ పోరాటాల వలన కార్మికులు తమ శక్తి, సామర్థ్యాలను గుర్తించడంతో పాటు, తమ కోసం ఒక వర్గపోరాట సంస్థను నెలకొల్పడంలో విజయం సాధించారు. భారత ప్రభుత్వం ఈ సమ్మె పోరాట స్వభావాన్ని అతి జాగ్రత్తగా పరిశీలించింది. ప్రభుత్వ ప్రతినిధుల మాటల్లోనే "అనేక విధాల యీ సమ్మెకు ప్రాధాన్యత వున్నది. సమ్మె జరిగినంత కాలం కార్మికులు ఇంతకు ముందెన్నడూ లేనంత క్రమశిక్షణతోనూ, సంఘటితంగానూ వ్యవహరించారు."

## 1929లో జరిగిన రెండవ సార్వత్రిక సమ్మె

1928లో మొదటి సార్వత్రిక సమ్మె అయిన తరువాత నిండా ఆరునెలలు గడవకముందే బొంబాయిలోని టెక్స్‌టైల్ కార్మికులు 1929 సం॥రం ఏప్రిల్ 26న మరొక సార్వత్రిక సమ్మెను ప్రారంభించారు. 29 రోజులు సాగిన యీ సమ్మెలో 32 మిల్లులకు చెందిన సుమారు లక్షమంది కార్మికులు పాల్గొనగా 80 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి.

మొదటి సార్వత్రిక సమ్మె పునర్వ్యవస్థీకరణ ద్వారా యాజమాన్యం కార్మికులపై జరుపుతున్న దాడులను ప్రతిఘటించడానికి జరగ్గా యజమానుల అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ఈ రెండవ సమ్మె జరిగింది. స్ప్రింగ్ మిల్లులో మార్చి నెలలో యాజమాన్యం ఒక కార్మికుని పని నుండి తొలగించడంతో వివాదం తలెత్తింది. ఆ కార్మికుని తిరిగి పనిలోనికి తీసుకొనవలసిందిగా గిర్నికాంగార్ యూనియన్ యాజమాన్యాన్ని కోరింది. యజమానులు ఈ న్యాయమైన కోర్కెను తిరస్కరించడంతో యూనియన్ ఆ మిల్లులో సమ్మెకు పిలుపునిచ్చింది.

ఈ సంఘటనతో పాటు, ఇతర మిల్లుల్లోని యజమాన్యాలు యధేచ్ఛగా కార్మికులను పనుల నుండి తొలగించడంతో, కార్మికులు కోపోద్రిక్తులయ్యారు. కాని ఒక క్రమ పద్ధతిలో యజమానులు చేపట్టిన ఈ చర్యలను గిర్నివాంగార్ యూనియన్, పోద్రి ఏదో అ ప్రధానమైన వ్యవహారంగా గాని, రోజువారీ జరిగే సాధారణ విషయాలుగా దాన్ని భావించలేదు. అంతేగాక యీ చర్యలలో యాజమాన్యం కార్మికులపై ఒక పద్ధతి ప్రకారం దాడిచేయడాన్ని గిర్నికాంగార్ యూనియన్ గమనించగల్గింది. ఫాసెట్ కమిటీ రిపోర్టును అమలుకు సంబంధించిన సమస్యలను పరిశీలించడానికి ఏప్రియల్ 24న మిల్లు యజమానుల సంఘం, జాయింట్ స్ట్రయిక్ కమిటీల సమావేశం ఏర్పాటు చేయబడింది. కాని యూనియన్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు తమ విధానాలను మార్చుకోనిదే యీ సమావేశంలో పాల్గొనడానికి యూనియన్ తిరస్కరించింది. తమ విధానాలు కక్షసాధించేవిగా వున్నాయనే విషయాన్ని యజమానులు అంగీకరించలేదు. అంతటితో ఆగక కార్మికులను పనిలోనుండి తొలగించడాన్ని క్రమశిక్షణా చర్యగా సమర్ధించుకోజూచారు. సుమారు 6 వేలమంది కార్మికులు డిస్మిస్ చేసి వారి స్థానంలో క్రొత్త వారిని నియమించారు. డిస్మిస్ చేయబడిన 6 వేలమంది కార్మికులకు తిరిగి ఉద్యోగాలివ్వాలనే కార్మికుల న్యాయమైన కోర్కెను యజమానులు మూర్ఖంగా తిరస్కరించడంతో, బొంబాయిలోని జౌళి పరిశ్రమలో యూనియన్ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ పిలుపుననుసరించి ఏప్రిల్ 26న 41 మిల్లుల్లోని 75 వేలమంది కార్మికులు సమ్మె ప్రారంభించారు. మే 1వ తేదీ నాటికి యీ సమ్మె 64 మిల్లులకు ప్రాకింది. ఈ సమ్మెలో మొత్తం లక్షా పదివేలమంది కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెను మొగ్గలోనే త్రుంచివేయాలని ప్రభుత్వం విస్తృతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసింది. పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జీ, కాల్పులు జరపడంతో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం జరిగింది. సమావేశాలు, ప్రదర్శనలు

నిషేధించబడ్డాయి. పెద్ద సంఖ్యలో కార్మికులను అరెస్టు చేశారు. పోలీసుల అత్యాచారాలు కార్మికులను మరింత రెచ్చగొట్టాయి. వారి నాయకులైన బి.టి.రణదివె, ఎస్.వి.దేశ్‌పాండేలను అరెస్టుచేయడంతో కార్మికులు కోపోద్రిక్తులై ఈ అరెస్టులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపారు. ప్రదర్శకులపై పోలీసులు కాల్పులు సాగించారు.

చట్టవిరుద్ధంగా సమావేశాలు నిర్వహించారనే ఆరోపణపై ఈ ఇద్దరు యూనియన్ నాయకులకు ఆరు వారాల కఠిన కారాగారశిక్ష, మరియు ఒక్కొక్కరికి రూ. 200 జరిమానా విధించారు. హింసాయుత చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణపై యూనియన్ కార్యకర్తలనేకులను అరెస్టుచేశారు.

మొదటిసారి ఆరునెలలపాటు సుదీర్ఘ పోరాటం సాగించిన కార్మికులు కేవలం ఆరునెలల కాలంలోనే మరల సమ్మెచేయవల్సి రావడంతో వారు బాగా అలసిపోయారు. దీనికి తోడు రెండవ సమ్మె సమయంలో వారిపై ప్రయోగించిన తీవ్రమైన పోలీసు నిర్బంధాలు, యజమానుల మొండివైఖరి వలన కార్మికుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతిన్నది. ఆత్మస్థైర్యం కోల్పోయిన కొన్ని గ్రూపులకు చెందిన కార్మికులు కొన్ని మిల్లుల్లో పనికి హాజరయ్యారు.

అదే సమయంలో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్.జి. పియర్సన్ అధ్యక్షతన ఒక విచారణా సంఘానికి (కోర్టు ఆఫ్ ఎంక్వైరీ) ప్రభుత్వం ఈ వివాదాన్ని నివేదించింది. ఈ కోర్టు సెప్టెంబర్ 18వ తేదీన తన నివేదికను ప్రచురించింది. అనుకున్న ప్రకారం ఈ నివేదిక కార్మికులకు ఏ మాత్రం అనుకూలంగా లేదు.

సమ్మె సందర్భంగా నెలకొన్న తాజా పరిస్థితులను కార్మికుల్లో సడలిన ఆత్మవిశ్వాసాన్ని పరిగణనలోనికి తీసుకున్న గిర్నీ కాంగార్ యూనియన్ సెప్టెంబరు 19న సమ్మె విరమించింది. సమ్మె విరమించవలసిందిగా కార్మికులను కోరుతూ యూనియన్ ఈ క్రింది తీర్మానాన్ని ఆమోదించింది.

“యూనియన్, యూనియన్ సభ్యులు తమకే గాక యావత్, కార్మిక వర్గానికి అత్యావశ్యకమైన హక్కుల సాధనకు తమ శక్తిమేరకు పోరాడారు. కార్మికుల వనరులు ఎంతగా క్షీణించాయంటే ఒక స్థితిలో సమ్మెను కొనసాగించడానికి కార్మికులకు నచ్చజెప్పేందుకు ప్రచారం సాగించడంకూడ అసాధ్యమైంది. అందువలన సెప్టెంబరు 19వ తేదీ గురువారం నుండి మిల్లుల ముందు పికెటింగ్‌ను ఉపసంహరించుకొనవలసిన విచారకరమైన పరిస్థితులేర్పడ్డాయి. అంటే కోర్టు నివేదికను పాక్షికంగాగానీ, సంపూర్ణంగా గానీ యూనియన్ అంగీకరించిందని గాని యూనియన్ తన డిమాండ్లను వదులుకున్నదని గాని అర్థం కాదు”.

విచారణా సంఘం నివేదిక మోసపూరితమైన ప్రచారం సాగించడం ద్వారా గిర్నీకాంగార్ యూనియన్‌ను అప్రతిష్ఠపాలు చేసి, విచ్ఛిన్నం చేయడానికి కుతంత్రాలు పన్నేదిగా వుందని ఖండిస్తూ ఈ తీర్మానం ఇంకా ఈ విధంగా పేర్కొంది.

"రెడ్‌ఫ్లాగ్ యూనియన్ క్రింద సంఘటితమైన బొంబాయి టెక్స్‌టైల్ కార్మికులు తాము సంఘంగా కొనసాగడానికి, తమ న్యాయమైన హక్కుల సాధనకు చివరివరకు పోరాటం సాగిస్తారు. ఈ పోరాటంలో వారు విజయం సాధించడానికి ఇతర రంగాలకు చెందిన కార్మికులు సహకరిస్తారని వారు ఆశిస్తున్నారు."

సమ్మె విరమించబడడంతో మిల్లు యజమానులు క్రమశిక్షణ పేరుతో యూనియన్ కార్యకర్తలపై అణచివేతకు పూనుకోవడం ద్వారా కక్షసాధింపు చర్యలను తీవ్రతరం చేశారు. డిస్మిస్ చేయడంతోబాటు ఇతర శిక్షలు విధించడం ప్రారంభించారు. వీటితోబాటు కార్మికుల న్యాయసమ్మతమైన కోర్కెలు నిర్లక్ష్యం చేయబడడమేగాక అనేక సందర్భాలలో వారి జీతాలు తగ్గించబడ్డాయి.

## జనపనార కార్మికుల సమ్మె '1928-29'

కలకత్తా, ఆ పరిసర ప్రాంతాల్లోని జూట్ మిల్లుల్లో 1929 జూలై నెలలో సార్వత్రిక సమ్మె జరిగింది. ఇది బెంగాలు జూట్ కార్మికులు జరిపిన మొట్టమొదటి సార్వత్రిక సమ్మె.

బెంగాలు జనపనార పరిశ్రమ అమూల్యమైన సంపదకు నిలయం. అదృష్టవంతులైన బ్రిటిష్ పెట్టుబడిదారులకు యీ పరిశ్రమ అశేష లాభాలార్జించి పెట్టింది. కాని నిరుపేదలైన కార్మికులు చెప్పలేనంత దయనీయమైన స్థితికి దిగజార్చబడ్డారు. వారు మురికి కూపాలలో నివసించి, అతి నికృష్టమైన జీతాల కొరకు ఎక్కువ గంటలు పనిచేయవలసివచ్చేది. ఈ విధంగా బెంగాలు జూట్ మిల్లు కార్మికులు యూరోపియన్ పెట్టుబడిదారుల అంతులేని ధనదాహానికి నిస్సహాయులైన బలిపశువులయ్యారు. మధ్యయుగాలనాటి క్రూరత్వాన్ని గుర్తుచేసే విధంగా కార్మికులకు తరచుగా శారీరక శిక్షలు కూడా విధిస్తూండేవారు.

అయినప్పటికీ జూట్ మిల్లు కార్మికులు మాత్రం ఏనాడూ పరిస్థితులకు తలవంచలేదు. పైపెచ్చు రోజులు గడచిన కొలది వారు మరింతగా ప్రతిఘటించడం జరుగుతూనే వున్నది కాని ఇప్పటివరకు ఈ ప్రతిఘటనలు ఒకదానితో ఒకటి సంబంధం లేక వివిధ మిల్లుల్లో విడివిడిగా జరుగుతుండటంతో, జూట్ పరిశ్రమ యావత్తూ సార్వత్రిక సమ్మె ద్వారా సంఘటితంగా యజమానుల దురాగతాలను ప్రతిఘటించడానికి అవకాశం లేకపోయింది. కాని జూట్ మిల్లు కార్మికుల మనుగడకు ఐక్య కార్యాచరణ అత్యావశ్యకమైనది. ఈ విషయాన్ని ఎత్తిచూపుతూ కలకత్తా నుండి ప్రచురించబడే 'గణవాణి' అనే బెంగాలీ వారపత్రిక ఈ విషయాన్ని ఎత్తిచూపుతూ యీ విధంగా వ్రాసింది. "దాదాపు అన్ని జూట్ మిల్లులలోనూ మిల్లు యజమానులు కార్మికులపై జులుం చెలాయించి వారి రక్తాన్ని పీలుస్తున్నారు. అందువలన అన్ని మిల్లులలోని కార్మికులందరు కలసి అన్ని మిల్లులలోనూ ఏకకాలంలో పోరాటం సాగించాలి. ఇలా చేయనట్లయితే వీరు విజయం సాధించడం అసంభవం. బెంగాల్‌లోని జూట్ మిల్లులలో 3,40,000 కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరూ ఒక్కటై ఒకే సమయంలో యజమానుల నెదిరించినట్లయితే కొంతైనా సాధించగలరు. ఈ రోజు ఇక్కడొక సమ్మె – రేపు

మరొకచోట సమ్మె ఇలా ఎవరికి వారుగా సమ్మెలు చేయడం వలన ఫలితం లేదు. శ్రామికులందరు ఏకతాటి మీద నిలచి బెంగాలులోని జూట్ మిల్లులన్నింటిని స్తంభింపజేసినప్పుడు మాత్రమే వారు విజయం సాధించగలరు. అన్నివైపుల నుండి విజయాభినందనలనందుకొనగలరు.

"గణవాణి" ఈ విధంగా చేసిన అంచనా వృధా కాలేదు. దురాశాపరులైన మిల్లు యజమానుల అంతులేని దోపిడీని ప్రతిఘటించడానికి "సార్వత్రిక సమ్మె" ఒక్కటే సమర్థవంతమైన ఆయుధమని ట్రేడ్ యూనియన్ కార్యకర్తలే గాక, జూట్ కార్మికుల్లో అత్యధికులు కూడ తమ అనుభవం ద్వారానే గుర్తించారు.

1920వ దశాబ్దంలో బెంగాలులోని జూట్ మిల్లు కార్మికులలో తీవ్ర అశాంతి నెలకొని వున్నది. 1929 జూలైలో జరిగిన జనరల్ సమ్మెకు మార్గాన్ని సుగమమం చేయడానికి, దారి తీసిన పోరాటాల ఉధృతిని గమనించడానికి ఈ క్రింది పట్టిక తోడ్పడుతుంది.

**జూట్ మిల్లుల్లో సమ్మెలు**

| సం॥ సంఖ్య | సమ్మెల సంఖ్య | పాల్గొన్న కార్మికుల పనిదినాల సంఖ్య | నష్టపోయిన |
|---|---|---|---|
| 1921 | 39 | 1,86,479 | 7,06,229 |
| 1922 | 40 | 1,70,957 | 10,79,627 |
| 1923 | 29 | 90,664 | 6,44,804 |
| 1924 | 18 | 69,488 | 3,46,756 |
| 1925 | 14 | 44,940 | 2,42,906 |
| 1926 | 29 | 38,042 | 7,94,384 |
| 1927 | 9 | 34,900 | 2,18,000 |
| 1928 | 18 | 56,524 | 15,08,708 |
| 1929 జూన్ వరకు | 5 | 18,285 | 1,06,785 |
| | **201** | **1,13,279** | **56,48,199** |

జూట్‌మిల్లు యజమానుల సంఘం పనిగంటల సంఖ్యను వారానికి 54 గంటల నుండి 65 గంటలకు పెంచడం సుదీర్ఘకాలంగా జూట్‌మిల్ కార్మికులు కోరుకొంటున్న ఐక్య పోరాటానికి తక్షణ, ప్రణాళిక కారణమైంది. ఈ సమ్మె 1929 జూలై నెలలో జరిగింది. జూట్ మిల్లు యజమానులు 1929 సం॥ జూలై 1వ తేదీ నుండి పనిగంటలను పెంచుతూ ప్రకటన చేశారు. పని గంటలను పెంచడం ద్వారా దోపిడీని తీవ్రతరం చేసే యజమానుల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడమే ఈ సందర్భంగా చెలరేగిన సార్వత్రిక సమ్మె పోరాటం ప్రధాన లక్ష్యం.

1929 జూలై సమ్మెకు సరిగ్గా ఒక సంవత్సరం ముందే చెంగెల్‌లోని లాడ్లో జూట్ మిల్లులోనూ, బౌరియాలోని ఫోర్టు గ్లోష్టర్ మిల్లులోను రెండు బ్రహ్మాండమైన సమ్మె పోరాటాలు జరిగాయి. చెంగెల్, బౌరియా అనేవి హుగ్లినదికి పడమటి తీరాన కలకత్తాకు కొద్దిమైళ్ళ దూరంలోనున్న రెండు చిన్నగ్రామాలు. 1928 మార్చిలో లాడ్లో జూట్‌మిల్లులో కొద్దికాలం పాటు జరిగిన సమ్మె విఫలమైంది. లాడ్లో జూట్ మిల్లులో సమ్మె ఫలితంగా కొందరు కార్మికులు పనులు పోగొట్టుకొనడం జరిగింది. ఈ మిల్లులో పనిచేస్తున్న పదివేలమంది కార్మికుల్లో అసంతృప్తి తీవ్రతరమైంది. ఈ విధంగా అసంతృప్తికి గురైన కొందరు కార్మికులు యూనియన్ స్థాపించుకొనే ఉద్దేశ్యంతో కలకత్తాలోని బెంగాల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌తో సంబంధాలు పెట్టుకున్నారు. ఈ ప్రయత్నాల ఫలితంగానే బంకిమ్ ముఖర్జీ ప్రథమ కార్యదర్శిగా, లాడ్లో జూట్ మిల్ వర్కర్స్ యూనియన్ స్థాపించబడింది. కార్మికులు యూనియన్ పెట్టుకోవడం గిట్టని అమెరికన్ కంపెనీ మేనేజరు వాషింగ్టన్ కార్మికులను అనేక రకాలుగా వేధించడం ప్రారంభించాడు. 1928 ఏప్రిల్ 23న మిల్లు కార్మికులు ప్రారంభించిన ఈ సమ్మె 17 రోజులు కొనసాగింది. మే 10వ తేదీన కార్మికులు సమ్మె విరమించి తిరిగి పనుల్లో చేరారు. ఈ సమ్మె వలన కార్మికులు పెద్దగా ఏమీ సాధించలేకపోవడంతో ఈ సమ్మె జరిగిన కొద్దికాలానికే మరల ఒక స్వల్పకాలిక సమ్మె చేయవల్సివచ్చింది.

చెంగెల్‌లో యూనియన్ ఆవిర్భవించడం ఫోర్ట్‌గ్లష్టర్ కంపెనీ యాజమాన్యానికి ప్రమాద సూచనగా తోచింది. వారు మిల్లులో ఏ విధంగానైనా యూనియన్ ఏర్పాటును అనుమతించరాదని దృఢంగా నిశ్చయించుకున్నారు. కంపెనీ ఎంతగా యూనియన్ స్థాపనను నిరోధించినప్పటికి, కార్మికులపై హింసాకాండ సాగించినప్పటికీ చివరకు 1928 జూలై 15వ తేదీన బౌరియా చట్కల్ మజ్దూర్ యూనియన్ స్థాపించబడింది. యూనియన్ స్థాపించడం కోసం మిల్లునానుకొని యున్న మైదానంలో కార్మికుల సాధారణ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ ప్రదేశం మిల్లు వారిదవడంతో అక్కడ సమావేశం జరపడాన్ని కంపెనీ యాజమాన్యం అనుమతించలేదు. అయినప్పటికి కార్మికులు రోడ్డు మీదనే సమావేశం జరిపి యూనియన్‌ను స్థాపించుకున్నారు.

జూలై 16న కార్మికులు సమ్మె ప్రారంభించారు. 1929 సార్వత్రిక సమ్మెకు ముందు జూట్ పరిశ్రమలో సాగిన అత్యంత సుదీర్ఘమైన సమ్మె పోరాటం ఈ విధంగా ప్రారంభమైంది.

సమ్మె ప్రారంభమైన రోజున పోలీసులు, కంపెనీ కిరాయి గూండాలు సమ్మె చేస్తున్న కార్మికులపై హింసాయుత దాడులు సాగించారు.

పోలీసు కాల్పుల ఫలితంగా 28 మంది కార్మికులు గాయపడ్డారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా వున్నప్పటికీ కార్మికులు సమ్మెను కొనసాగించారు.

కంపెనీ యాజమాన్యం కార్మికులతో ఒప్పందానికి రావడానికి నిరాకరించి, ఈ సుదీర్ఘమైన ప్రతిఘటనా పోరాటంలో కార్మికులు అలసిపోయేటట్లు చేసి, వారికి గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నది.

దృఢనిశ్చయంతో వీరోచితంగా పోరాటం సాగిస్తున్న కార్మికులను లొంగదీయడంలో విఫలమైన కంపెనీ యాజమాన్యం, సమ్మె విచ్ఛిన్నకులను ప్రయోగించడానికి కుట్రలు చేసింది. ఈ పనికి కంపెనీ కొన్ని వేల రూపాయలు ఖర్చు చేసి చిట్టచివరకు అనేకమంది నిరుద్యోగులను దొడ్డిదారిన మిల్లులో ప్రవేశపెట్టగలిగింది. కాలంగా సమ్మె చేయడం వలన అలసిపోయిన కార్మికులకిది శరాఘాతంగా పరిణమించడంతో వారు మిల్లు యజమానుల ఈ చర్యలను ప్రతిఘటించ లేకపోయారు. ఆరు నెలల సుదీర్ఘకాల వీరోచిత ప్రతిఘటనా పోరాటం తరువాత 16-1-1929న ఫోర్ట్‌గ్లస్టర్ మిల్లు కార్మికుల సమ్మె విఫలమైంది.

సమ్మె చేస్తున్న కార్మికులపై సాగిన అనాగరిక అణచివేత దేశ ప్రజలందరి దృష్టినాకర్షించింది. జవహర్‌లాల్ నెహ్రూ బౌరియా వచ్చి సమ్మెచేస్తున్న కార్మికులకు ధారాళంగా సహాయం చేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. సహాయానికై విజ్ఞప్తిచేస్తూ, ఇది ఏదో స్థానికంగా జరిగిన సమ్మె కాదనీ, దీని ప్రభావం చుట్టుప్రక్కల ప్రాంతాలన్నింటిపైనా ముఖ్యంగా, భారతదేశంలోని యావత్ ట్రేడ్ యూనియన్ ఉద్యమంపై వున్నదని నెహ్రూ చెప్పాడు.

డిమాండ్ల సాధనలో యీ సమ్మె విజయవంతకానప్పటికి, భారత కార్మికవర్గంలోని ఒక భాగం యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఇచ్చిన వీరోచిత ప్రతిఘటనకు బౌరియా సమ్మె ఒక మచ్చుతునక, ఈ సమ్మె గురించి ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ, "జూట్ కార్మికులు గతంలో ఇంతటి సుదీర్ఘమైన పోరాటం సాగించియుండలేదు. ఆ రోజుల్లోనే కాదు యీ రోజు కూడా జూట్ కార్మికులు అంతటి చరిత్రాత్మకమైన పోరాటాలు సాగించలేకపోతున్నారు." అన్నారు.

సమ్మెకు నాయకత్వం వహించిన కార్మికులు కాని వారిలో శ్రీయుతులు రాధారమణ్ మిత్రా, బంకిమ్ ముఖర్జీ, ఫిలిప్ స్ప్రాట్, గోపేన్ చక్రవర్తి ప్రముఖులు, స్ప్రాట్ బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కాని, తరువాత కాలంలో ఆయన పార్టీని వదిలివేశారు. బంకిమ్ ముఖర్జీ, గోపేన్ చక్రవర్తి భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

## 1929 జూలై ప్రప్రథమ సార్వత్రిక సమ్మె

ఇంతకు ముందే చెప్పుకున్న పని గంటలను మరింత పొడిగించడానికి వ్యతిరేకంగా జూట్ కార్మికులు సార్వత్రిక సమ్మె జరిపారు. యాజమాన్యం ప్రథమ ప్రయత్నంగా పని గంటలను

60కి పెంచుతూ నోటీసు జారీ చేసింది. దీనితోబాటు రెండు షిఫ్టులలో పనిచేసే విధానానికి బదులు ఒకే షిఫ్టులోనే పని చేసే పద్ధతి ప్రవేశపెట్టడం వల్ల 60 వేల మంది కార్మికులు రిట్రెంచ్ చేయబడ్డారు. పనిగంటలు పెంచడమేగాక పని భారం కూడ పెంచబడింది.

మిల్లు యజమానులు చేస్తున్న యీ దాడులను కార్మికులు వెంటనే ప్రతిఘటించడం ప్రారంభించారు. జూలై మొదటి వారానికే కార్మికుల ప్రతిఘటన వలన అనేక మిల్లుల్లో పనికి ఆటంకం కల్గింది. అనేక మిల్లుల్లో కార్మికులు సమ్మెలు చేశారు. "జూలై 1 నుండి జూట్ పరిశ్రమలో 5 రోజులలో 55 పనిగంటల పని విధానానికి బదులు 6 దినాలలో 60 పనిగంటల పనిపద్ధతి అమలు చేయడం వలన అలయెన్స్ జూట్ మిల్లు (మేనేజింగ్ / ఏజెంట్లు, బెగ్ డన్‌లప్ అండ్ కంపెనీ), నేతపనివారు, మేఘ్నాజూట్ మిల్లుల 'మేనేజింగ్ ఏజంట్లు, : మెస్సర్స్ మాచినాన్ మెకంజీ అండ్ కంపెనీ) లోని నేత పనివారు, బారానగర్ జూట్ మిల్లు (మేనేజింగ్ ఏజంట్లు : మెస్సర్స్ జార్జి హెండర్‌సన్ అండ్ కంపెనీ) నూలువడుకు కార్మికులు, స్పిన్నర్లు, బోనసు, ఓవర్‌టైమ్ అలవెన్సులను పెంచాలని కోరుతూ జూలై 6 శనివారం నుండి సమ్మె చేశారు. ఈ మిల్లులో సుమారు 30 వేల నుండి 40 వేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. వీవర్లు, స్పిన్నర్ల సమ్మె ఫలితంగా ఈ మిల్లుల్లో పనికి ఆటంకం కల్గింది" అంటూ 'అమృతబజార్ పత్రిక' వ్రాసింది.

సమ్మె ప్రారంభమై విజయవంతంగా సాగుతున్నప్పటికి, అది యింకా సార్వత్రిక సమ్మె స్వభావాన్ని సంతరించుకోలేదు. జూలై 20 నాటికల్లా దాదాపు అన్ని మిల్లుల్లోని కార్మికులు వారానికి 54 గంటలకు మించి పనిచేయడానికి నిరాకరించారు. ఆగస్టు 5వ తేదీ నాటికి సమ్మె సర్వత్రా వ్యాపించింది. ఫలితంగా కలకత్తాలోని మిల్లులలోనూ, హుగ్లీనది కిరువైపులా కలకత్తా నుండి సుమారు 20 మైళ్ళవరకు యీ సమ్మె ప్రభావం సోకింది.

గతంలో బెంగాల్ జూట్ వర్కర్స్ అసోసియేషన్‌గా పేరుగాంచిన బెంగాల్ జూట్ వర్కర్స్ యూనియన్ యీ సమ్మెకు నాయకత్వం వహించింది. ఈ యూనియన్ భారత ట్రేడ్ యూనియన్ చట్టం కింద రిజిష్టరు చేయబడలేదు. కాని చాలాకాలం క్రిందటనే రిజిష్టరైన కంకినారా లేబర్ యూనియన్ కంటె ఈ వర్కర్స్ యూనియన్‌ను అనుసరించేవారే అధికంగా వున్నారు. కుమారి ప్రభావతీ దాస్ గుప్తా, శ్రీయుతులు బంకిమ్ ముఖర్జీ, కాళీసేన్, అబ్దుల్ మోమిన్, అబ్దుల్ హలీమ్, అబ్దుల్ రెజాక్‌ఖాన్ తదితరులు సమ్మెకు నాయకత్వం వహించారు. కమ్యూనిస్టులు బెంగాల్ జూట్‌వర్కర్స్ యూనియన్‌లోనే వుండి పనిచేసి సమ్మె కాలంలో వారు కార్మికుల మన్ననలు పొందారు.

సమ్మె కాలంలో యూనియన్ ఈ క్రింది డిమాండ్లతో కోర్కెల పత్రాన్ని తయారుచేసింది.

1. అదనంగా పనిచేసిన కాలానికి మొత్తం ఆదాయాన్ని దామాషా పద్ధతిన పెంచాలి.

2. కక్షసాధింపు చర్యలుండరాదు.

3. కార్మికులు సమ్మెచేసిన కాలానికి, మిల్లులు లాకౌట్ చేయబడిన కాలానికి కార్మికులకు జీతాలు చెల్లించాలి.

4. ఇతర సమస్యలను పరిశీలించడానికి ఒక బోర్డును నియమించాలి. దీనిలో మిల్లు యజమానులు తరపున ముగ్గురు, బెంగాల్ జూట్ వర్కర్స్ యూనియన్ తరపున ముగ్గురు ప్రతినిధులు, మరొక యిరువురు బయటివారు వుండాలి (బయటివారిలో ఒకరు యజమానుల ఇష్టప్రకారం, వేరొకరు యూనియన్ ఇష్టప్రకారం ఎంపికచేయాలి.

5. స్త్రీ కార్మికులకు ప్రసూతి సౌకర్యం కల్పించాలి.

6. శారీరక శిక్ష విధించరాదు.

ఈ కోర్కెల పత్రం మిల్లు యజమానులకు సమర్పించబడింది. ఈ డిమాండ్లను గురించి కార్మికులలోను, ప్రజలలోను విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది.

మిల్లు యజమానుల మొండివైఖరివలన ఈ డిమాండ్ల విషయమై సంప్రదింపులు జరిగే అవకాశం లేకపోవడంతో, యీ సమ్మె ఒక సుదీర్ఘ పోరాటంగా పరిణమించింది. సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు అణచివేతకు పూనుకున్నారు. కార్మిక నాయకులతో సహా అనేకమంది కార్మికులు అరెస్టు చేయబడ్డారు.

ఈ సమ్మెకు బెంగాల్ ప్రజానీకం తమ సంపూర్ణ మద్ధతు నిచ్చింది. కలకత్తాలో ఆగసు 10న శ్రీ జె.ఎమ్.సేన్ గుప్తా అధ్యక్షతన జరిగిన పురజనుల సమావేశం సమ్మె చేస్తున్న కార్మికులకు ఆర్థిక సహాయం చేయవలసిందిగా విజ్ఞప్తిచేసింది.

కార్మికుల దృఢసంకల్పం వలన మిల్లు యజమానులు తమంత తాముగా సమస్యల పరిష్కారానికి ముందుకు రావాల్సివచ్చింది. యూనియన్ ప్రతినిధులకు, ఇండియన్ జూట్ మిల్స్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య సంప్రదింపులు జరిగి ఈ క్రింది విషయాలలో ఒక ఒప్పందం కుదిరింది.

1. (ఎ) వారానికి 54 గంటలు పనిచేసే పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టడానికి, వారానికి 60 గంటలు పనిచేసే పద్ధతిని ప్రవేశపెడుతూ ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకొనేందుకు యజమానులు అంగీకరించారు.

(బి) అదనంగా పనిచేసిన కాలానికి రెట్టింపు జీతం చెల్లించడానికి

(సి) గతంలో చెల్లించినట్లుగానే ఆహార భత్యం చెల్లించడానికి.

(డి) జులై 1వ తేదీ ముందు 54 గంటల పనికి చెల్లించిన విధంగానే బోనసు చెల్లించే విషయాన్ని పరిశీలించడానికి యజమానులు అంగీకరించారు.

2. ప్రస్తుతానికి ఒకే షిఫ్టులో పనిచేసే పద్ధతి ప్రవేశ పెట్టబడదు (ఒకే షిఫ్టులో పనిచేయించడం ద్వారా సుమారు 60 వేల మంది కార్మికుల పొట్టలు కొట్టాలని గతంలో మిల్లు యజమానులు తలంచారు).

3. (ఎ) శారీరక సంబంధమైన శిక్ష విధించడం జరగదు.

(బి) లంచాలు పుచ్చుకొనే సర్దారులు, అధికారులను శిక్షించడం జరుగుతుంది.

4. కార్మికులకు గృహవసతిని మెరుగు పరచడానికి, విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా, డ్రయినేజి మొదలైన సౌకర్యాలు మెరుగుపరచడానికి తగిన చర్యలు చేపట్టడానికి మిల్లు యజమానులు అంగీకరించారు.

5. స్త్రీ కార్మికులకు ప్రసూతి సౌకర్యాలు కల్పించే విషయం పరిశీలించడం జరుగుతుంది.

6. కార్మికులు యూనియన్ ఏర్పరచుకొనడానికి యజమానులు ఏ విధమైన అభ్యంతరాలు పెట్టరు. ప్రతి మిల్లులోను యజమానులు కార్మికుల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తారు.

7. సమ్మెలో పాల్గొన్నందుకుగాను ఎవరినీ సర్వీసు నుండి తొలగిండం జరిగదు.

ఈ విషయాలపై యూనియన్ యాజమాన్యం ప్రతినిధులకు మధ్య అంగీకారం కుదిరింది. ఆగస్టు 18వ తేదీన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. కార్మికులలో కొద్దిగా గందరగోళ పరిస్థితి నెలకొనియున్నప్పటికి, మరుసటి రోజునే అన్ని మిల్లులలోని కార్మికులు పనులలో ప్రవేశించారు.

యూనియన్ తరపున సంప్రదింపులలో కమ్యూనిస్టేతర నాయకులే పాల్గొన్నారు. ఈ విధంగా తొందరపాటుగా వ్యవహరించి ఒప్పందం చేసికోక పోయినట్లయితే మరికొన్ని రాయితీలను సంపాదించుకోవడానికి అవకాశమున్నదని కమ్యూనిస్టులు అభిప్రాయపడ్డారు.

బెంగాల్‌లోని జూట్ మిల్లు కార్మికులు సాగించిన ఈ సార్వత్రిక సమ్మె పోరాటం కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలోనే కాక, కార్మికవర్గాన్ని సుసంఘటితం చేయడంలో ఒక విశిష్టతను సంతరించుకున్నది. వివిధ మతాలు, జాతులు, భాషలకు చెందిన కార్మికులు సంఘటితమై సాగించిన ఈ వీరోచిత పోరాటం భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం చరిత్రలోనే మరువలేనిది.

## తాతా ఇనుము - ఉక్కు కర్మాగారంలో సమ్మె (1928)

18 వేలమంది తాతా ఇనుము ఉక్కు కర్మాగారం కార్మికులు జరిపిన సుదీర్ఘ పోరాటం 1928 సం॥ ఏప్రిల్ 18న ప్రారంభమై అదే సంవత్సరం సెప్టెంబరు నెల మధ్య వరకు కొనసాగింది. 1922లో జరిగిన సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం కార్మికుల అసంతృప్తినే మాత్రం తగ్గించలేకపోగా కాలం గడుస్తున్న కొలది యీ అసంతృప్తి తీవ్రతరం కావడం ప్రారంభమైంది. కార్మికుల్లో రగులుతున్న అసంతృప్తి 1928 నాటికి ఒక సుదీర్ఘకాల సమ్మెగా బహిర్గతమైంది.

లేబర్ అసోసియేషన్ సంస్కరణవాద నాయకత్వం కార్మికులను జోకొట్టాలని ప్రయత్నించింది. ఈ ఉద్దేశంతోనే ఆ యూనియన్ అధ్యక్షుడు సి.ఎఫ్. ఆండ్రూస్ 1925లో యాజమాన్యంతో చర్చలు జరిపేందుకు గాంధీజీని జంషెడ్‌పూర్‌కు ఆహ్వానించాడు. యాజమాన్యంతో గాంధీజీ కుదుర్చుకున్న ఒప్పందం కార్మికులనే మాత్రం సంతృప్తి పరచలేకపోయింది.

1928లో జరిగిన సమ్మెను గురించిన వివరాలలోకి పోయే ముందు, వర్తమాన పరిస్థితులపై ప్రభావం కల్గిన గత సంఘటనలను కొన్నింటిని ప్రస్తావించడం అవసరం.

శ్రామికుల సమస్యల యెడల, వారి యూనియన్ యెడల తాతా ఇనుము – ఉక్కు కర్మాగారం యాజమాన్యం అవలంభించిన వైఖరిని గురించి గతంలో జరిగిన వివిధ సమ్మెల సందర్భంగా చర్చించడం జరిగింది. 1924లో ఒక ఒప్పందం కుదిరినప్పటికి దురాశాపరులు వివేకశూన్యులైన కంపెనీ యాజమాన్యపు కార్మిక వ్యతిరేక వైఖరి ధర్మమా అంటూ ఈ స్టీల్ ప్లాంట్‌లోని కార్మికుల సమస్యలు మరింత తీవ్రతరమవుతూ వచ్చాయి. విపరీతంగా దోపిడీ చేయబడుతున్న కార్మికుల్లో అధికమవుతున్న అశాంతి వలన జంషెడ్‌పూర్‌కు గాంధీజీ ఆగమనం అవసరమైంది. ఆయన ఉదాత్తమైన వ్యక్తిత్వం వలన యాజమాన్యం శ్రామికుల యెడల సమంజసంగానూ, మానవతా దృక్పథంతోనూ వ్యవహరిస్తుందని ఆశించారు. కాని గాంధీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకున్నప్పటికీ, ప్రముఖ భారత పెట్టుబడిదారుల బండరాతి గుండెలను మార్చడమటుంచి వారినే విధంగానైనా మెత్తబరచడానికి గాంధీజీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. గాంధీజీ జోక్యం కూడ విఫలం గావడంతో కార్మికులు యాజమాన్యం నుండి కొన్ని కనీస సదుపాయాలు సాధించుకోవడం కోసం తీవ్ర కష్టనష్టాలను భరించి సుదీర్ఘ పోరాటం సాగించారు.

కార్మికుల ప్రతినిధిగా యజమానులతో సంప్రదింపులు జరపడానికి జంషెడ్‌పూర్‌లో వుండగానే గాంధీజీ గౌరవార్థం ఏర్పాటు చేయబడిన భారీ అభినందన సభలో యజమానులు గాంధీజీకి సన్మానం చేశారు. ఈ అభినందన సభలోనే టాటాలు గాంధీజీకి పర్సుతో బాటు ఒక ఖరీదైన స్టీలు నగిషీ వస్తువును కూడా బహూకరించారు.

ఈ సంఘటనలో గల అనౌచిత్యం స్పష్టంగానే కన్పిస్తోంది. మిల్లు యజమానులైన టాటాల నుండి బహుమతి స్వీకరించి అనుచితంగా ప్రవర్తించినందుకు గాంధీజీని విమర్శిస్తూ షాపుర్జీసక్లత్ వాలా 1927లో ఆయనకొక లేఖ వ్రాశారు. తన సుదీర్ఘమైన లేఖలో సక్లత్ వాలా యిలా వ్రాశారు. "జంషెడ్‌పూర్‌లో మీకు ఘనంగా జరిగిన సన్మానపు వివరాలను, పర్సుతో సహా ఖరీదైన స్టీలు నగిషీ వస్తువును బహుమతిగా స్వీకరించినట్లు నేను లండన్‌లో చదివినట్లు జ్ఞాపకమున్నది. జంషెడ్‌పూర్‌లో కార్మికులు తినడానికి కడుపునిండా తిండి, ఉండడానికి ఇల్లు, కట్టడానికి బట్టలేక బాధపడుతున్నారనే విషయం మీ స్మృతి పథంలో లేనట్లుంది. ఆధునిక శాస్త్రీయ పద్ధతులను అమలు పరచకపోవడం వలన ప్రతినిత్యం అనేకమంది కార్మికులు తమ ప్రాణాలు పోగొట్టుకొనడం మరచినట్లున్నారు. మీ ప్రవర్తన చూస్తుంటే యజమానుల

అర్థరహితమైన మొండివైఖరి వలన కార్మికులెన్నడూ సమ్మె చేయవల్సిరాలేదేమోనని, కార్మికులపై పోలీసుదాడులు జరగలేదేమోనని మీరు భావించినట్లు అనిపిస్తోంది. ఇంత దూరం నుండి మీ ప్రవర్తనను గురించిన వివరాలను చూచిన తరువాత చాలా ఆశాభంగం కల్గిందనే విషయాన్ని అంగీకరించాను".

ఈ తీవ్ర విమర్శను గాంధీజీ త్రిప్పికొట్టిన విధం గమనించదగినది. సక్లత్‌వాలాకు గాంధీజీ యిలా వ్రాశాడు. "నేను జంషెడ్‌పూర్‌లో టాటా నుండి కాక, యజమానుల నుండి సన్మానం స్వీకరించినందులకు నా కమ్యూనిస్టు కామ్రేడ్ జంషెడ్‌పూర్ కార్మికులలో నా కార్యకలాపాలలో తప్పులెన్నుతున్నాడు. దివంగతుడైన రతన్‌తాతా అధ్యక్షత వహించడం వలన సక్లత్‌వాలా తన అసమ్మతి తెలియజేశాడని అనుకుంటున్నాను. ఏమైనప్పటికీ నాకిచ్చినఈ గౌరవానికి నేనేమీ సిగ్గు పడడం లేదు. టాటా నాకు ఒక మానవతా వాదిగా, కార్మికుల కష్టసుఖాలను గురించి విచారించగల యజమానిగా నాకు కనిపిస్తారు. నాకు తెలిసినంతవరకు ఆయన ఉద్యోగుల ప్రార్థనలన్నింటినీ వెంటనే అంగీకరించాడు. ఆ ఒప్పందాన్ని గౌరవించి అమలు చేస్తున్నట్లు ఉద్యోగుల నుండే నేను వినడం జరిగింది. (వక్కాణింపు) నా కార్యకలాపాలు సాగించడానికి ధనికులు, పేదలు అనే తేడా లేకుండా అందరిని విరాళాలు అడిగి పుచ్చుకుంటాను. ధనికులు తమ విరాళాలను సంతోషంగా ఇస్తారు. ఇది నా వ్యక్తిగత విజయం కాదు. నేను ఏ సిద్ధాంతానికి కొద్దిగానయినా ప్రాతినిధ్యం వహించడానికి కృషి చేస్తున్నానో ఆ అహింసా సిద్ధాంతానికిది విజయం."

గాంధీజీ, తాతా కుటుంబానికి ప్రశంశా వర్షం కురిపించి ఒక ఏడాది గడచీగడవక ముందే ఇదే తాతా కుటుంబం కార్మికులపై సాగిస్తున్న అణచివేత చర్యలకు, రిట్రెంచ్‌మెంటుకు, జీతాలలో కోతకు వ్యతిరేకంగా జంషెడ్‌పూర్‌లోని కార్మికులు అతి తీవ్రమైన పోరాటం జరుపవలసిరావడం ఆసక్తి కల్గించే విషయం.

మరల ప్రధాన విషయానికొద్దాము. కార్మికుల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి చల్లార్చడానికి లేబర్ అసోసియేషన్, ఆ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.ఆండ్రూస్, చివరకు గాంధీజీ చేసిన ప్రయత్నాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఒక ప్రక్క జంషెడ్‌పూర్‌లోని కార్మికులు రిట్రెంచ్‌మెంటు, జీతాలలో కోత, పనిభారం పెరుగుదల తదితర సమస్యల భారంతో కృంగిపోతుంటే, లేబర్ అసోసియేషన్ ఈ తీవ్ర సమస్యల పరిష్కారానికి మార్గాలనన్వేషించక, యాజమాన్యంతో సన్నిహితంగా సంచరించడానికి ఉత్సాహం చూపింది. వాస్తవానికి లేబర్ అసోసియేషన్ కంపెనీ యాజమాన్యానికి ఏజంటుగా పనిచేస్తోంది. యాజమాన్యపు ఔదార్యాన్ని గురించి కార్మికులకు నచ్చచెప్పి, వారు పోరాట మార్గాన్ని పట్టకుండా నిరోధించడం ఈ అసోసియేషన్ ఏకైక కర్తవ్యం. ఈ లేబర్ అసోసియేషన్ ఈ పాత్ర వహిస్తోందని నిజానికి కంపెనీ యాజమాన్యమే అంగీకరించింది. కార్మికుల్లో అసంతృప్తిని రేకెత్తిస్తున్నందుకు కమ్యూనిస్ట్ ఆందోళన కారులను నిందిస్తూ, యూనియన్ నిర్వహించిన పాత్రను ప్రస్తుతిస్తూ 1928 ఏప్రిల్ 24న కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు తీర్మానం ఆమోదించడం జరిగింది. ఈ విషయానికి

సంబంధించి బోర్డు ఆమోదించిన తీర్మానంలో "కంపెనీ యాజమాన్యపు విధానాలను కార్మికులకు వివరించి, వారిని సంతృప్తి పరచడానికి లేబర్ అసోసియేషను కష్టనష్టాలను భరించి సాగిస్తున్న కృషికి ఆందోళనకారుల మూలంగా ఆటంకం కలుగుతున్నదనే విషయం డైరక్టర్లకు స్పష్టంగా తెలుసు" అని పేర్కొనబడింది.

సి.ఎఫ్.ఆండ్రూస్ అధ్యక్షునిగా వున్న లేబర్ అసోసియేషన్ కంపెనీ యాజమాన్యం చేతిలో కీలుబొమ్మగా మారినట్లు కంపెనీ యాజమాన్యమే అంగీకరించింది.

గాంధీజీ మధ్యవర్తిత్వం నెరపి లేబర్ అసోసియేషన్‌ను గుర్తించడానికి, కార్మికుల జీతాల బిల్లు నుండే యూనియన్ సభ్యత్వ చందా నిర్బంధంగా మినహాయించేందుకు, కంపెనీని ఒప్పించాడు. అయితే నిర్బంధంగా సభ్యత్వ చందా అయితే వసూలు చేయగలిగారు గాని, కార్మికుల విధేయతను మాత్రం ఈ లేబర్ అసోసియేషన్ నిర్బంధంచేసి సంపాదించలేకపోయింది.

కార్మికులు సమ్మెచేస్తున్న సమయంలోనే కంపెనీ డైరెక్టర్ల బోర్డు 1929 ఏప్రిల్ 20న బీహారు, ఒరిస్సా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఒక రహస్య లేఖ వ్రాసింది. దానిలో ఈ విధంగా వున్నది. "సి.ఎఫ్. ఆండ్రూస్ అధ్యక్షతన వున్న ఏకైక కార్మిక సంస్థ లేబర్ అసోసియేషన్ ఆమోదం లేకుండానే, కొన్ని సమయాలలో ఆ అసోసియేషన్‌కు కనీసం తెలియకుండానే సమ్మెలు చేయడం, పనులకు అంతరాయం కల్గించడం పరిపాటి అయింది. కార్మికులు తమ సమస్యలను వెలిబుచ్చేందుకు సరియైన మార్గమని భావించి యూనియన్‌ను కంపెనీ గుర్తించింది. యూనియన్ రిప్రజెంట్ చేసిన సమస్యలను కంపెనీ ఎప్పుడూ చాలా జాగ్రత్తగానే పరిశీలిస్తూ వచ్చింది. కంపెనీ యాజమాన్యానికి ఏ సందర్భంలోను సమ్మె నోటీసు ఇవ్వబడలేదు."

ఈ లేఖలోని విషయాలు పరిశీలిస్తే కంపెనీచే గుర్తించబడిన లేబర్ అసోసియేషన్ కార్మికులకు ప్రాతినిధ్యం వహించేది కాదని, ఈ అసోసియేషన్‌పట్ల కార్మికులకు కనీస గౌరవం కూడా లేదని ధృవపరుస్తున్నాయి.

ఏప్రిల్ 18న ప్రారంభమైన సుదీర్ఘ సమ్మె పోరాటం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. కనీసం రెండు నెలలుగా సెక్షన్లలోను, డిపార్టుమెంట్లలోను సాగుతున్న కార్యకలాపాలు ఈ బ్రహ్మాండమైన సమ్మెకు సంకేతాలిస్తున్నాయి. 1928 సం॥ ఏప్రిల్ 25వ తేదీన కంపెనీ ప్రభుత్వానికి ఈ విధంగా వ్రాసింది. "జంషెడ్‌పూర్‌లోని ఉక్కు కర్మాగారంలో గత రెండు నెలలుగా అనేక సందర్భాలలో సెక్షన్లలోను, డిపార్టుమెంట్లలోను సమ్మెలు జరుగుతున్న విషయం ప్రభుత్వ దృష్టిలో తప్పక వుండే వుంటుంది. సరుకుల ఎగుమతి, దిగుమతులలో ప్రధాన పాత్ర వహించే క్రేన్ డ్రయివర్లు ఫిబ్రవరి 17న మొట్టమొదటగా సమ్మె ప్రారంభించారు. మరో పదిహేను రోజుల తర్వాత రైలుపట్టాలకు తుదిమెరుగులు పెట్టే డిపార్టుమెంటులోని కార్మికులు పని నిలుపుచేసి రైలు పట్టాల తయారీకి, వాటి రవాణాకు ఆటంకం కలిగించారు. బొగ్గు కొలుముల వద్ద పనిచేసే కార్మికులు కొన్ని గంటలపాటు పనికి అంతరాయం కలిగించారు. ఉక్కు రేకులు తయారుచేసే మిల్లు కార్మికులు అదే నెలలో 18వ తేదీన, బాయిలర్ ప్లాంటులో పనిచేసే

కార్మికులు 21వ తేదీన సమ్మె చేశారు. ఈ రెండు డిపార్టుమెంట్లలోనూ యింకా సమ్మె కొనసాగుతూనే వున్నది... (ఏప్రిల్) 17వ తేదీ నుండి స్వీపర్లు కూడా సమ్మెలో వున్నారు...”

ఆ విధంగా అన్ని డిపార్టుమెంట్లలోనూ సమ్మె ప్రారంభమైంది (1) జీతాలను కనీసం 25 శాతం పెంచాలనీ, (2) వార్షిక ఇంక్రిమెంట్లతో జీతాల స్కేళ్ళను నిర్ణయించాలని, (3) బోనసు చెల్లించాలనీ, (4) ఏ కార్మికుని నైనా బర్తరఫ్ లేదా డిశ్చార్జి చేసేముందు సంప్రదింపులు జరపడం కోసం 15 మంది కార్మికులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండు చేశారు.

ఈ సమ్మెతో తమకు ఏ విధమైన సంబంధమూలేదని లేబర్ అసోసియేషన్ ప్రకటించింది. “కంపెనీకి తెలిసినంతవరకు జంషెడ్‌పూర్‌లోనే వుంటున్న కమ్యూనిస్టులుగా పేర్కొందిన వారే కార్మికులను సమ్మెకు ప్రోత్సహించారు. అంతేగాక యీ సమ్మెకు సంబంధించిన విషయాలపై దేశంలోని యితర ప్రాంతాలలోనున్న కమ్యూనిస్టులతో తరచూ సంప్రదించడం జరుగుతోంది. సింగారవేలుచెట్టి, ముకుందలాల్ సర్కార్ వంటి కంపెనీతో ఏ సంబంధంలేని వ్యక్తులు సమ్మె చేస్తున్న కార్మికులు నిర్వహించే సమావేశాలలో ప్రసంగిస్తున్నారు” అంటూ కంపెనీ పేర్కొన్నది.

సమ్మె చేస్తున్న కార్మికుల నందరిని మూకుమ్మడిగా డిస్మిస్ చేస్తూ మే 8న యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. డిస్మిస్ చేయబడిన కార్మికులు హోమి అనే ఆయన నాయకత్వంలో మే 25న సంపూర్ణ హర్తాళ్‌ను పాటించారు. ఇంకనూ యాజమాన్యం వారి డిమాండ్లను అంగీకరించకపోవడంతో జూన్ 1,2 తేదీలలో మరల రెండు రోజులు హర్తాళ్ పాటించారు.

కంపెనీ యాజమాన్యం చాలా మొండివైఖరి నవలంబించింది. అప్పటికే డిస్మిస్ చేయబడిన కార్మికులను అలసిపోయేటట్లు చేయడానికి నిశ్చయించుకున్నది. కాని కంపెనీ వైఖరిని గమనించిన కార్మికులు పట్టుదలతో పోరాటాన్ని కొనసాగించడానికి నిర్ణయించుకున్నారు. ఆ విధంగా సంపూర్ణ ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో హోమితో పాటు లేబర్ అసోసియేషన్ నాయకత్వం ఈ వివాదం పరిష్కారానికి సుభాస్ చంద్రబోస్ జోక్యాన్ని అర్థించారు. వారు కోరిన ప్రకారం సెప్టెంబరు 3వ తేదీన కంపెనీ జనరల్ మేనేజర్‌తో సంప్రదింపులు ప్రారంభించిన బోస్ చివరికొక ఒప్పందానికి వచ్చారు. మిగిలిన విషయాలతోబాటు, యీ ఒప్పందం ప్రకారం, సమ్మె కాలంలో డిస్మిస్ చేయబడినవారిని తిరిగి పనిలోకి తీసుకొనాలని, జీతాలను అతి స్వల్పంగా పెంచడానికి, ఒక నెల జీతం అడ్వాన్సుగా ఇవ్వడానికి, సమ్మెలో చేరినందులకు యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తీసుకొనకుండా వుండగలందులకు ఇరువురు అంగీకరించారు. “యాజమాన్యానికి, కార్మికులకు మధ్య కుదిరిన ఈ ఒప్పందం కార్మికులకు మిక్కిలి అనుకూలమైనది” అని ఈ ఒప్పందాన్ని గురించి సుభాస్ చంద్రబోస్ పేర్కొన్నాడు.

కాని ఈ “మిక్కిలి అనుకూలమైన” ఒప్పందం కార్మికులకే మాత్రం సంతృప్తి కలిగించలేదు. పైపెచ్చు ఈ ఒప్పందం కార్మికులలో భిన్నాభిప్రాయాలకు దారి తీసింది. కె.ఎన్. జోగ్లేకర్ సమాచారం ప్రకారం “జంషెడ్‌పూర్ లేబర్ ఫెడరేషన్ పేరుతో హోమి ఒక పోటీ

యూనియన్‌ను ఏర్పాటు చేశాడు. ఆయన ఈ ఒప్పందంలోని విషయాలను తాను అంగీకరించలేదు. దీనినామోదించవద్దని ఆయన కార్మికులకు సలహా ఇచ్చాడు. ఈ విధంగా ఒప్పందం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమై కార్మికులకు పరస్పర విరుద్ధమైన సలహాలివ్వడంతో వారిలో చీలిక ఏర్పడింది. చివరకు కార్మికులు పనుల్లో చేరవల్సి వచ్చింది."

ఈ వివాద పరిష్కారానికి మధ్యవర్తిగా వ్యవహరించిన సుభాష్ చంద్రబోస్ వ్యక్తం చేసిన ఒక అభిప్రాయం అసలే గందరగోళంగా ఉన్న పరిస్థితిని మరింత గందరగోళ పరచింది. ఒప్పందం విషయమై సంప్రదింపులు జరిపే సందర్భంలో "జంషెడ్‌పూర్‌లోని కార్మికవర్గం రక్షింపబడాలి. కార్మికులను రక్షించాలంటే భారత ఉక్కు పరిశ్రమను దివాలా తీయకుండా కాపాడాలి" అని బోస్ పేర్కొనట్లు జోగ్లేకర్ వ్రాశారు.

ఈ విధంగా ఒక బ్రహ్మాండమైన సమ్మె పోరాటం గందరగోళంతో ముగిసింది. కార్మికులు సెప్టెంబరు 13వ తేదీన తిరిగి పనుల్లో ప్రవేశించారు.

ఆరు నెలలు సాగిన ఈ సుదీర్ఘమైన సమ్మె అనేక విధాలుగా అనేక గుణపాఠాలు నేర్పింది. ఈ సమ్మె ఒక వైపున కార్మికుల అచంచలమైన పట్టుదల, ధైర్యసాహసాలను వెల్లడించగా వేరొక ప్రక్క భారత బడా పెట్టుబడిదారుల యెడల జాతీయ నాయకుల వైఖరి, సంస్కరణవాద నాయకులు యెంతటి విశ్వాసఘాతుకానికి, నైచ్యానికి ఒడిగట్టేది స్పష్టమయ్యాయి.

ఈ సమయంలోనే ఈ సుదీర్ఘ పోరాటాలతోబాటు ప్రాధాన్యత గల్గిన అనేక సమ్మె పోరాటాలు నిర్వహించబడ్డాయి. వీటిలో కలకత్తా సమీపాన బడ్జ్ బడ్జ్ వద్ద నూనె పరిశ్రమలోని కార్మికుల సమ్మె, జంషెడ్‌పూర్‌కు దగ్గరగా వున్న గోల్‌మురి తగరం పరిశ్రమలోని కార్మికుల పోరాటం, షోలాపూర్, మద్రాసు కాన్పూరులలో టెక్స్‌టైల్ కార్మికుల సమ్మె, విశాఖపట్టణంలో జూట్ కార్మికుల సమ్మె ముఖ్యమైనవి. కలకత్తా, హౌరా, బొంబాయి మునిసిపాలిటీలలోని స్వీపర్లు కూడా సమ్మెలో పాల్గొని కొన్ని రాయితీలు సంపాదించుకోగలిగారు. ఇదే సమయంలో దేశంలోని వివిధ పారిశ్రామిక సంస్థల్లో అనేక చిన్న చిన్న సమ్మెలు జరిగాయి.

ఈ దశలో జాతీయ విముక్తి పోరాటం బహుముఖంగా వ్యాపించడంతోబాటు నూతనమైన విప్లవచైతన్యంతో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనడంతో ఈ పోరాటం నూతన రూపాన్ని సంతరించుకుంది. గతంలో ఏనాడూ జరగని విధంగా సుదీర్ఘ కాలం సాగిన కార్మికవర్గ ఆర్థిక పోరాటాలు వెల్లువెత్తుతున్న రాజకీయ పోరాటాలకు మరింత పదును పెట్టాయి.

# 14

# ఎ.ఐ.టి.యు.సి.లో చీలిక - సామ్రాజ్యవాదుల దాడి (1929-31)

1929-31 సం॥ల మధ్యకాలంలో దేశంలో పెల్లుబుకుతున్న కార్మికవర్గ ఉద్యమాలను, కమ్యూనిస్టు ఉద్యమాన్ని సమూలంగా నాశనం చేయడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం కుట్రలు చేయసాగింది. దురదృష్టవశాత్తు యిదే సమయంలో ఎ.ఐ.టి.యు.సి. రెండుగా చీలిపోవడంతో దేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం సంస్థాపరంగా అతి తీవ్ర పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ పరిస్థితులను గురించి చర్చించే ముందు ఈ ప్రమాదాన్ని ముందుగానే సూచించిన సంఘటనలను గురించి పరిశీలిద్దాం.

## ఎ.ఐ.టి.యు.సి. 7, 8, 9వ మహాసభలు

ఈ మూడు ఎ.ఐ.టియు.సి. మహాసభ చైతన్యవంతంగా, ఉత్సాహ పూరితంగా జరుగక పోయినప్పటికీ తరువాత మహాసభలో ఎ.ఐ.టి.యు.సి. చీలికకు దారితీసే కొన్ని సంఘటనలు ఈ మహాసభల్లో చోటుచేసుకున్నాయి.

ఎ.ఐ.టి.యు.సి. ఏడవ మహాసభ రాయ్ సాహెబ్ చంద్రికా ప్రసాద్ అధ్యక్షతన ఢిల్లీలోని హింద్ కాలేజీ హాలులో 1927 మార్చి 12,13 తేదీలలో జరిగింది. శ్రీయుతులు ఎ. శ్రీనివాసన్ అయ్యంగార్, బరూచా ఎ.క్లోవ్, లజపతిరాయ్, మదన మోహన మాలవ్యా, జి.డి. బిర్లా చమన్‌లాల్ రంగస్వామి అయ్యంగార్, బారుచా వంటి ప్రముఖులు ఈ మహాసభకు హాజరయ్యారు. షాపుర్జీ సక్లత్‌వాలా ప్రత్యేక ఆహ్వానితునిగా ఈ మహాసభల్లో పాల్గొన్నాడు. ఈ మహాసభకు 17 యూనియన్ల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో చురుకుదనం లోపించింది. ఈ మహాసభ జరిగే సమయానికి ఖరగ్‌పూర్‌లో బి.ఎన్.రైల్వే కార్మికులు సాగించిన వీరోచిత సమ్మె పోరాటం అప్పుడే ముగిసింది. ఈ బ్రహ్మాండమైన సమ్మెను గురించి ప్రస్తావిస్తూ రాయ్‌సాహెబ్ చంద్రికా ప్రసాద్ చేసిన అధ్యక్షోపన్యాసం ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వం యొక్క పచ్చి సంస్కరణవాద స్వభావాన్ని బహిర్గతం చేసింది. సమ్మె విరమణకు దారితీసిన పరిస్థితులపై వివరణ ఇస్తూ "రైల్వే ఏజెంట్లు చేసిన ప్రతిపాదనలు సంతృప్తికరంగా లేకపోయినప్పటికి ప్రజలకు కలిగే

అసౌకర్యం దృష్టిలో వుంచుకుని సమ్మెను విరమించడం జరిగింది. కార్మికులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు వారు (ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వం) సమ్మెను ప్రబోధించలేదు. యజమానులకు, ఉద్యోగులకు మధ్య నున్న అభిప్రాయ భేదాలను తొలగించుకొనడానికి సంప్రదింపులు జరపడం, మధ్యవర్తి ద్వారా పరిష్కరించు కొనడం లేదా కన్సీలియేషన్ బోర్డుల ద్వారా పరిష్కరించుకొనడం వారి విధానం" అని రాయ్ సాహెబ్ చెప్పినట్లు తెలుస్తోంది.

కాని ఈ మహాసభకు అతిథిగా హాజరైన షాపుర్జీ సక్లత్‌వాలా చేసిన ప్రసంగం దీనికి పూర్తిగా భిన్నంగా వున్నది. ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగ యంత్రం, మీద కార్మికవర్గం రాజకీయాధిపత్యాన్ని సాధించవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పాడు. ట్రేడ్ యూనియన్‌ల లక్ష్యాల్ని వివరిస్తూ "కార్మికులు అధికారాన్ని చేపట్టనంత కాలం స్వాతంత్ర్యమనేది వట్టి బూటకమే" ఈ లక్ష్యాన్ని ట్రేడ్ యూనియన్లు సాధించాలి." అని సక్లత్‌వాలా చెప్పాడు. ఆయన భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్వహణను మెరుగుపరచుకొనడానికి కొన్ని సూచనలు చేశాడు. ఎ.ఐ.టి.యు.సి.ని సంస్థాపరంగా ఉన్నత దశకు తీసుకుపోయేందుకు కృషి చేయవలసిందిగా ప్రతినిధులను కోరాడు. సక్రమంగా జమాఖర్చుల నిర్వహణ, ట్రేడ్ యూనియన్ సాహిత్యాన్ని సభ్యుల్లో ప్రచారం చేయడం, కార్మికుల స్థితిగతులు, పరిశ్రమలలోని పరిస్థితులపై పరిశోధనలు జరపవలసిన ఆవశ్యకతను వివరించాడు.

చమన్‌లాల్ అధ్యక్షునిగా మృణాల్ కాంతిబాసు ఉపాధ్యక్షునిగా, ఎన్.ఎమ్.జోషి ప్రధాన కార్యదర్శిగా, ఎస్.వి. ఘాటే సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గత మహాసభ ఎ.ఐ.టి.యు.సి. హెడ్‌క్వార్టర్స్ కలకత్తాకు మార్చగా, దీనిని తిరిగి బొంబాయికి మార్చాలని ఈ మహాసభ నిర్ణయించింది.

ఎ.ఐ.టి.యు.సి. 8వ మహాసభ 1927 నవంబరు 26, 27 తేదీలలో కాన్పూరులో జరిగింది. దీనికి గణేశ్ శంకర విద్యార్థి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి పార్లమెంటు సభ్యులు మార్నీ జోన్స్, ఎ.ఎ.ప్యూర్‌సెల్, పార్లమెంటు సభ్యుడు, బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు చెందిన హాల్స్‌వర్త్, బ్రిటిషు కమ్యూనిస్టు పార్టీకి చెందిన ఫిలిప్ స్ప్రాట్ వంటి విదేశీ అతిధులు హాజరయ్యారు. ఎన్.ఎమ్.జోషి, వి.వి. గిరి, ముజఫర్ అహ్మద్, ఎస్.ఏ. డాంగే, చంద్రికా ప్రసాద్, ఝూబ్‌వాలా, సి.ఎఫ్. ఆండ్రూస్, మహ్మద్ దావూద్, కేదార్‌నాథ్, కిషోరీలాల్ ఘోష్, జి. సేథీ, విశ్వనాధ ముఖర్జీ తదితర ప్రముఖులు ఈ మహాసభలో పాల్గొన్నారు.

ఈ సమావేశం జరిగే సమయానికి 1,25,000 సభ్యత్వం గల్గిన 59 యూనియన్లు ఎ.ఐ.టి.యు.సి. కి అనుబంధంగా వున్నాయి. సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలనే ప్రధానమైన నిర్ణయం ఈ సమావేశంలోనే తీసుకొనబడింది. సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలని జాతీయ కాంగ్రెసు కూడా అప్పటికే నిర్ణయించింది. భవిష్యత్తులో భారత ప్రభుత్వ నిర్వహణకు ఒక శ్రామిక రాజ్యాంగాన్ని రూపొందించాలని కూడ నిర్ణయించి ఇందుకు

ఎస్.ఎమ్.జోషి, ఎస్.ఏ. డాంగే తదితరులతో ఒక ఉప సంఘం ఏర్పాటు చేయబడింది. కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని కోరుతూ ఒక తీర్మానం ఆమోదించబడింది. "భారతదేశంలో కార్మికుల జీతాలు అతి నికృష్టంగా వున్నాయి. అంతేగాక కార్మికులకు తమ జీవితావసరాలకు తగిన వేతనం పొందే హక్కు వున్నది. అందువలన కార్మికులకు కనీస వేతనాన్ని నిర్ణయించే యంత్రాంగాన్ని ఏర్పరచడానికి ఒక చట్టాన్ని చేయవలసిందిగా ఈ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతోంది." అని ఈ తీర్మానం పేర్కొంది.

వివిధ దేశాలలోని కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘాల నుండి అసంఖ్యాకంగా సందేశాలు రావడం ఈ మహాసభ ప్రత్యేకత. గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ, బ్రిటన్ ఇండిపెండెంట్ లేబర్‌పార్టీ, ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ శుభాకాంక్షలు తెలుపుతూ సందేశాలు పంపాయి. ఐరిష్ లేబర్ పార్టీ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుల తరపున ఒక విశిష్టమైన సందేశం అందింది. భారత, ఐర్లండ్ దేశాల మధ్య పరస్పర సహకారము, ఐక్యతా బంధాల నేర్పరచుకొనాలని కోరుతూ "శ్రామిక సమస్యల పరిష్కారం సాధించడానికి ముందు రాజకీయ సమస్యలను పరిష్కరించడం తప్పనిసరి. కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కార్మికులకు నిజమైన స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెట్టలేదు" అంటూ ఈ సందేశం పేర్కొన్నది. ఈ సందేశం ముగింపులో "భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యం సాధించు కుంటుందనీ, భారత కార్మికులు సామాజిక ఆర్థిక స్వాతంత్ర్యం సాధించు కుంటారని ఆశించింది."

బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సౌహార్ద్ర ప్రతినిధి ప్యూర్ సెల్ ఈ మహాసభ నుద్దేశించి ప్రసంగిస్తూ కొన్ని ఆసక్తి కలిగించే విషయాలను ప్రస్తావించాడు. ఆయన ప్రసంగిస్తూ "బ్రిటిషు కార్మికుల్లో అధిక సంఖ్యాకులు భారతదేశాన్ని వింతలు, విడ్డూరాలతో కూడిన ఒక అందమైన దేశంగా పరిగణిస్తారు. వారు చదువుకున్న ఎలిమెంటరీ స్కూళ్ళలోనూ, వారు చదివే పత్రికలు, పుస్తకాలలో కూడా బ్రిటిషు కార్మికులకు భారతదేశంలోని వాస్తవ పరిస్థితులు గాక, ఆ దేశం గురించి తప్పుడు సమాచారమే అందజేయబడింది. పాలకవర్గాలు బ్రిటన్ కార్మికుల్లో నాటిన విషబీజాలవల్ల వారి వైఖరి ఈ విధంగా వున్నది. అందువలన మీరు బ్రిటిషు కార్మికులతో వ్యవహరించేటప్పుడు ఈ విషయాలను దృష్టిలో వుంచుకొనవలసిందిగా కోరుతున్నాను మేము తిరిగి మా దేశం వెళ్ళగానే మా కార్మికుల్లో ఇండియా గురించి ఏర్పరచుకున్న దురభిప్రాయాలను తొలగించడానికి కృషి చేయాలని మా అభిమతం" అని చెప్పాడు. ఆయన భారతదేశంలోని ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలోని ఒక ప్రత్యేక విషయాన్ని ప్రస్తావిస్తూ" మా దేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం చాలావరకు పెట్టుబడిదారీ విధానంతో బాటే అభివృద్ధి చెందింది. కాని బాల్యావస్థలోనున్న భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం దేశంలోని అనుభవజ్ఞులైన, యజమానుల సంఘటిత శక్తిని ఎదుర్కొనవలసి వచ్చింది" అని అన్నారు. "లాంక్‌షైర్‌లోని బట్టల మిల్లుల్లోని కార్మికులు వారానికి 32 గంటలు మాత్రమే పని చేస్తారు. కాని ఇండియాలో అదే బట్టల మిల్లుల్లో వారానికి 63 గంటలు పనిచేస్తున్నారు. భారతదేశంలోని

ప్రతి పరిశ్రమలోను కార్మికులు బ్రిటన్, అమెరికాలలో అదే పరిశ్రమలో పనిచేస్తున్న దానికంటే రెట్టింపు కాలం పనిచేస్తున్నారు" అని ఇతర దేశాలలో పని గంటలతో భారతదేశంలోని కార్మికుల పరిస్థితులను పోల్చాడు.

ఈ మహాసభ సోవియట్ యూనియన్‌కు శుభాకాంక్ష సందేశం పంపడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో తన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించింది. ప్రపంచంలోని ప్రథమ శ్రామిక రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి సామ్రాజ్యవాదులు జోక్యాన్ని, కుట్రలను పటాపంచలు చేసి విజయవంతంగా పదవ సంవత్సరంలో అడుగిడుతున్న సోవియట్ యూనియన్‌ను అభినందిస్తూ ఈ మహాసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

ఈ సమావేశంలో సి.ఎఫ్. ఆండ్రూస్ అధ్యక్షుని గాను, ఎన్.ఎమ్.జోషి ప్రధాన కార్యదర్శిగాను, ఎస్.ఎ. డాంగే సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఎ.ఐ.టి.యు.సి. 9వ మహాసభ 1928 సం॥ డిశంబరు 18 నుండి 20వ తేదీ వరకు ఝరియాలో జరిగింది. ఈ మహాసభలో 98 వేల సభ్యత్వం గల్గిన 42 అనుబంధ యూనియన్ల నుండి 200 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక సమితికి చెందిన జె.డబ్ల్యు. జాన్‌స్టోన్, పాన్-పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు చెందిన జె.ఎఫ్.ర్యాన్‌లు హాజరు గావడం ఈ మహాసభ ప్రత్యేకత.

తూర్పు ఇండియా రైల్వేలోని లీలువావద్ద సమ్మె జరుగుతున్నప్పుడు జాన్‌స్టోన్ కార్మికులను కలుసుకొని వారి సమావేశాలలో కూడా ప్రసంగించాడు. బౌరియాలో జూట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా జరిగిన ప్రచారంలో ఆయన చాలా చురుగ్గా పాల్గొన్నాడు. ఎ.ఐ.టి.యు.సి. ఝరియా మహాసభ ముగియగానే ఆయనను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. జె.ఎఫ్.ర్యాన్. ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. న్యూ సౌత్ వేల్స్ ట్రేడ్ అండ్ లేబర్ కౌన్సిల్ ఛైర్మన్. భారతదేశాన్ని కార్మికవర్గం నాయకత్వంలోని సోషలిస్టు రిపబ్లిక్‌గా మార్చడమే ఎ.ఐ.టి.యు.సి ధ్యేయంగా ప్రకటిస్తూ తీర్మానం ఆమోదించడం అపూర్వమైన విషయం. కలకత్తాలో 1928 డిశంబరు 22న జరుగనున్న అఖిలపక్ష సమావేశానికి ఎ.ఐ.టి.యు.సి. తరపున 50 మంది ప్రతినిధులను పంపాలని మహాసభ నిర్ణయించింది. ఈ క్రింది డిమాండ్లను సమావేశం ముందుంచాలని మహాసభ ప్రతినిధి వర్గాన్ని ఆదేశించింది.

"1) భూమి, పరిశ్రమల జాతీయం, 2) వయోజన ఓటింగు, 3) సమ్మె హక్కు, 4) సంస్థానాల్ని, భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి కార్మికవర్గ సోషలిస్టు రిపబ్లిక్ ప్రాతిపదికపై రాజ్యాంగ రూపకల్పన."

బెర్లిన్‌లోని సామ్రాజ్యవాద వ్యతిరేక సమితికి ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయాలని

మరొక తీర్మానం ఆమోదించబడింది. 1929 జులైలో పారిస్‌లో జరగనున్న ఈ సమితి సమావేశానికి ప్రతినిధులుగా హాజరయ్యేందుకు డి.ఆర్. తెంగడీ, కె.యన్.జోగ్లేకర్‌లను మహాసభ నామినేట్ చేసింది. వీలైనంత త్వరలో నియమించబడ్డారు. ఆసియాలోని శ్రామికుల సమావేశాన్ని బొంబాయిలో ఏర్పాటు చేయాలని పిలుపునిస్తూ మరొక తీర్మానం ఆమోదించబడింది. పారిశ్రామిక వివాదాల బిల్లును ఖండిస్తూ ఒకరోజు సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ యీ మహాసభ వేరొక తీర్మానం ఆమోదించింది.

సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ జాన్‌స్టోన్, ర్యాన్‌లు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలకు ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. విదేశాలనుండి సమావేశానికి హాజరైన వారిలో వీరిరువురేగాక బెంజిమన్ ఫ్రాంక్లిన్, బ్రాడ్లీ, ఫిలిప్ స్ప్రాట్, కిర్క్ తదితరులు యూరపు నుండి సౌహార్ధ ప్రతినిధులుగా ఈ మహాసభకు హాజరయ్యారు. శ్రీయుతులు జవహర్‌లాల్ నెహ్రూ, చమన్‌లాల్ ముజఫర్ అహమ్మద్, యన్.యం.జోషీ, భూపేంద్రనాధ్ దత్తా, ఆర్.ఆర్. బాఖలే, షంషుద్దీన్ అహమ్మద్, కిషోరీలాల్ ఘోష్, అఫ్జల్ ఆలీ, శ్రీమతి సంతోష్‌కుమార్ గుప్తా తదితర ట్రేడ్ యూనియన్, ప్రజా నాయకులు ఈ మహాసభలో పాల్గొన్నారు.

గ్రేట్ బ్రిటన్‌లోని జాతీయ అల్ప సంఖ్యాక వర్గాల ఉద్యమం, బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, ఐరిష్ లేబర్ పార్టీ, సోవియట్ రష్యాల నుండి సౌహార్ద సందేశాలందాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక సమితి తరపున మేడమ్ సన్-ఎట్-సెన్, సక్లత్‌వాలా, బాల్ట్‌విన్, స్కాట్, బార్బ్యూస్ తదితర ప్రముఖులు సంతకాలు చేసి ఈ మహాసభకు టెలిగ్రాం పంపారు. ఈ సందేశంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారతదేశంలోని కార్మికులు జరుపుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్ధతును తెలియజేస్తూ 1929 జులై నెలలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో జరగబోయే సమావేశానికి వారు ఎ.ఐ.టి.యు.సి.ని ఆహ్వానించారు.

ఈ మహాసభ జవహర్‌లాల్ నెహ్రూను అధ్యక్షునిగాను, శ్రీయుతులు ముజఫర్ అహ్మద్, వి.బి. కులకర్ణి, భూపేంద్రనాధ్‌దత్తా, జి. సేథీలను ఉపాధ్యక్షులుగానూ, ఎస్.ఎ. డాంగేను ఒక సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నది.

ఈ ఝరియా సమావేశంలోనే కమ్యూనిస్టులు ఎ.ఐ.టి.యు.సి.లో ఒక సంఘటితమైన చిన్న గ్రూప్‌గా ఏర్పడటం గమనించదగిన విషయం.

## మొట్టమొదటిసారిగా ఇండియాలో 'మే' దినోత్సవం

బొంబాయి తదితర అనేక ప్రాంతాలలో మేడే పాటించడం గురించి 1927 నవంబరు నెలలో కాన్పూరులో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. 8వ మహాసభకు ప్రధాన కార్యదర్శి సమర్పించిన నివేదికలో బొంబాయితో పాటు, దేశంలోని అనేక ఇతర ప్రాంతాల్లో మేడే పాటించడం

గురించి ప్రస్తావించడం జరిగింది. 1927 సం॥ నుండి మాత్రమే భారతదేశంలో మేడే ఒక పద్ధతి ప్రకారం పాటించడం ప్రారంభమయింది.

మేడే పాటించడం భారతదేశంలో చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. ఎప్పుడో 1860 సం॥నికి ముందే అమెరికాలోని కార్మికవర్గం ఎనిమిది గంటల పనిదినాన్ని కోరుతూ ప్రారంభించిన ఉద్యమం చికాగోలో 1886 మే 1వ తేదీన కార్మికుల సమ్మెతో తారాపథాన్నందుకుంది. ఈ సందర్భంగా పోలీసులు సాగించిన పైశాచిక కృత్యాలకు నలుగురు కార్మికులు బలయ్యారు. ఆ తరువాత ప్రభుత్వం ఒక బూటకపు విచారణ జరిపి అమర వీరులైన అమెరికా కార్మికవర్గ నాయకులు పార్సన్స్, స్పైజ్, ఫిషర్ మరియు ఎంగెల్స్‌లను ఉరితీసింది. ఈ చికాగో సంఘటనలు జరిగిన మూడు సంవత్సరాల తరువాత చారిత్రాత్మకమైన బాస్టిల్ పతన శత వార్షికోత్సవాన్ని జరపడానికి అనేక దేశాల సోషలిస్టు ఉద్యమ నాయకులు 1889 జులై 14వ తేదీన పారిస్‌లో సమావేశమయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో కార్మికవర్గ సంఘటిత శక్తిని ప్రదర్శించడానికి 1890 సం॥ మే 1వ తేదీన కార్మికవర్గ అంతర్జాతీయతా దినంగా పాటించవలసిందిగా పారిస్‌లో జరిగిన సోషలిస్టుల సమావేశం ఒక తీర్మానం చేసింది. దీని కనుగుణంగా యూరపులోని వివిధ దేశాల్లో 1890 సం॥లలో మేడే పాటించబడింది. ఆ సంవత్సరం నుండి ఏటేటా ప్రపంచ కార్మికవర్గం అంతర్జాతీయ సంఘీభావ సూచకంగా మే దినోత్సవాన్ని జరుపుకుంటూంది.

భారతదేశంలో ఎ.ఐ.టి.యు.సి. ఆదేశం ప్రకారం బొంబాయి, కలకత్తా, మద్రాసు మొదలైన పారిశ్రామిక కేంద్రాలలో మే దినోత్సవం జరపడం 1927లో ప్రారంభమైనప్పటికీ, అంతకుముందే అక్కడక్కడ మే దినాన్ని పాటించినట్లు ఆధారాలున్నాయి. బొంబాయిలో 1926లోనే మేడే పాటించబడింది. ఆ సంవత్సరం జరిగిన మేడే ప్రదర్శనలో మున్సిపల్ కార్మికులు ప్రధానపాత్ర వహించారు. ఈ ప్రదర్శనకు శ్రీయుతులు ఎన్.ఎం.జోషీ, ఎస్.ఎస్.మిరాజ్‌కర్, ఎస్.వి. ఘాటే తదితర కార్మిక నాయకులు నాయకత్వం వహించారు. భారతదేశంలో మార్క్సిజం పట్ల అత్యంత విశ్వాసమున్న తొలి తరం నాయకుడు సింగారవేలు చెట్టియార్ 1923లోనే మద్రాసులో మేడే ప్రదర్శన నిర్వహణకు తీసుకున్న చొరవను ప్రత్యేకంగా పేర్కొనాలి.

మద్రాసు నుండి ప్రచురితమవుతున్నా "దిహిందూ" పత్రిక, మద్రాసులో మేడే ఉత్సవాలను గురించిన వార్తలు ప్రచురించింది. "మద్రాసులో మేడే సందర్భంగా రెండు సభలు జరిగాయి. హైకోర్టుకు ఎదురుగా సముద్ర తీరాన సింగార వేలు చెట్టియార్ అధ్యక్షతన ఒక సభ జరగ్గా, రెండువది ఎస్. కృష్ణస్వామి శర్మ అధ్యక్షతన ట్రిప్లికేన్‌లో జరిగింది. శ్రామికులు అత్యుత్సాహంతో పాల్గొన్నారని పత్రిక వ్రాసింది. మద్రాసు సముద్రతీరంలో సింగార వేలు

చెట్టియార్ ప్రసంగాన్ని గురించి "ది హిందూ పత్రిక" ఈ విధంగా వ్రాసింది. 'సింగారవేలు మేడే ప్రాధాన్యతను వివరిస్తూ ప్రపంచవ్యాప్తంగా వున్నా శ్రామికులకు మే 1వ తేదీ పవిత్ర దినమనీ చెప్పారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో వున్న తమ సహచరుల (కామ్రేడ్స్) తో సంఘీభావం తెల్పుతూ ఇండియాలోని శ్రామికులు కూడ మేడే జరుపుకోవాలనికోరారు. ఒక శ్రామిక కార్యాలయానికి శంకుస్థాపన చేయాలని, అది దేశంలోని పీడితులైన శ్రామికులకు ఉత్తేజం కల్గించే కేంద్రంగా బ్రహ్మాండంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్మికులందరూ ఒకే వర్గానికి చెందినవారన్న భావం కల్గించేందుకిది దోహదం చేయాలన్నారు. ఈ క్రొత్త పార్టీ గురించి "మద్రాస్‌మెయిల్" చేసిన కువిమర్శలను ప్రస్తావిస్తూ నిజమైన శ్రామికులు మాత్రమే మేడే జరుపుకుంటున్నారు. దీనికి ఆందోళన చెందనక్కర లేదు. ఉమ్మడి లక్ష్యసాధనకు శ్రామికులను ఐక్యం చేయడమే ఈ పార్టీ లక్ష్యం శ్రామికవర్గం ఆవిర్భవించిన క్రమంలో సహజంగానే శ్రామికవర్గం బ్రహ్మాండమైన పోరాటాల ద్వారా అంతిమంగా అధికారం కైవశం చేసుకుంటుంది."

## కార్మికవర్గ ఉద్యమంలో కమ్యూనిస్టుల ఆధిక్యత : ఒక నూతన పరిస్థితి

1926-29 సం॥ల మధ్య కాలంలో ఇండియాలోని వివిధ పారిశ్రామిక కేంద్రాలలో ఉధృతంగా సాగిన కార్మికవర్గ ఉద్యమాలు కమ్యూనిస్టులు, వామపక్ష దృక్పథం కల్గిన నాయకత్వం అభివృద్ధి చెందడానికి దారితీశాయి. మిలిటెంట్ పోరాటాల (ద్వారా)లో అనేక పరీక్షలకు తట్టుకుని నిలబడిన కమ్యూనిస్టులు కార్మికవర్గంలో అధిక భాగానికి నమ్మకస్తులైన ప్రియతమ నాయకులయ్యారు. ఇండియాలోని వివిధ రైల్వేలలో సాగిన దీర్ఘకాలిక పోరాటాలు, సుదీర్ఘకాలం సాగిన బొంబాయిలోని టెక్స్‌టైల్ కార్మికుల సార్వత్రిక సమ్మె, బెంగాలులోని జూట్ పరిశ్రమలోను, జంషెడ్‌పూర్‌లోని ఉక్కు పరిశ్రమలోను, దేశంలోని అనేక ఇతర ప్రాంతాల్లో తీవ్రంగా చెలరేగిన సమ్మె పోరాటాలు కమ్యూనిస్టులకు మిలిటెంట్ పోరాటాలు నడపడంలో అమూల్యమైన పాఠాలు నేర్పాయి. చరిత్రను సంతరించుకున్న గిర్నికాంగార్ యూనియన్, రైల్వే, జూట్ తదితర పరిశ్రమలలోని శక్తివంతమైన యూనియన్లు ఈ పోరాట క్రమంలోనే ఉద్భవించాయి. ఈ యూనియన్లు ఉవ్వెత్తున సాగుతున్న కార్మికవర్గ పోరాటాలకు నాయకత్వం వహించి నడవడానికీ యూనియన్లు కమ్యూనిస్టులకు, మిలిటెంట్ భావాలు గల్గిన వామపక్షీయులకు సంస్థాపరమైన పునాదిగా పనిచేశాయి.

ఈ నూతన పరిస్థితి ఇండియాలోని ట్రేడ్‌యూనియన్లలో చైతన్యవంతమైన పరిణామాలకు మూలకారణమైనది. ఒక్క బొంబాయిలోనే 1926లో ట్రేడ్ యూనియన్లలో సభ్యత్వం 59,544

వుండగా 1929 నాటికి 2,00,335కు పెరగడం యీ పెరుగుతున్న కార్మికవర్గ చైతన్యానికి మచ్చుతునక.

భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రారంభమైన నాటినుండి జాతీయ బూర్జువావర్గ నాయకత్వం తిరుగులేకుండా కొనసాగుతోంది. కాని ఈ కాలంలో (1926–29) సాగిన తీవ్రమైన వర్గ పోరాటాలు ఈ పరిస్థితిని తారుమారుచేసి పోరాట దృక్పథం గల్గిన వామపక్షీయులను ఉద్యమ నాయకత్వంలో ఒక బలవత్తరమైన శక్తిగా నిలిపాయి. నూతనంగా ముందుకు వస్తున్న మిలిటెంట్ నాయకత్వపు వాణి ఎ.ఐ.టి.యు.సి 7,8,9వ మహాసభల్లోనే వినిపించడం మొదలయింది. ఈ విధంగా పూర్వపు సంస్కరణవాద నాయకులు ఎ.ఐ.టి.యు.సి.పై తమ ఆధిపత్యాన్ని కోల్పోయి ఒక బలహీనమైన స్థితికి నెట్టివేయబడ్డారు.

ఈ కాలంలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశాల్లో రాజకీయ కార్యకలాపాల్లో కార్మికులు పాల్గొనడంపై తీవ్రమైన వాదోపవాదాలు సాగుతూండేవి. చాలాకాలం ఎ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శ్రీ యన్.యం. జోషీ కార్మికులు రాజకీయాల్లో పాల్గొనడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆయన లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యుడుగా నున్నపుడు కార్మికుల శ్రేయస్సు కొరకు చట్టాలు చేయించడానికి పోరాటం సల్పాడు. కాని కార్మికులకు రాజకీయ సంబంధాలుండడాన్ని ఆయన ఆమోదించలేకపోయాడు. వేరొక ప్రక్క కొన్ని సందర్భాల్లో నైనప్పటికీ, జాతీయ రాజకీయ పోరాటంలో కార్మికులను భాగస్వాములను చేయాల్సిన అవసరం వుందని జాతీయ కాంగ్రెస్ భావించింది. మొదటి సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా కార్మికవర్గాన్ని జాతీయ రాజకీయ పోరాటంలోకి సమీకరించేందుకు జాతీయ కాంగ్రెస్ ప్రయత్నించింది. కాని దేశ రాజకీయ పోరాటంలో కార్మికవర్గం ఒక స్వతంత్రమైన పాత్రను నిర్వహించడం మాత్రం కాంగ్రెసుకు ఆమోదయోగ్యంగా లేదు. అనేకమంది కాంగ్రెసు నాయకులకు ఎ.ఐ.టి.యు.సి.తో సంబంధాలున్నప్పటికీ కార్మికవర్గ పోరాటాల యెడలనేగాక, కార్మికుల ఆర్థికపరమైన కోర్కెల పట్ల కూడా కాంగ్రెసు నిజాయితీ లేకుండా ఉదాసీన వైఖరి నవలంబించింది.

“భారత జాతీయ కాంగ్రెసు తదితర రాజకీయ సంస్థలు కొన్ని సందర్భాలలో శ్రామిక ఉద్యమానికి అనుకూలంగా తీర్మానాలు చేసినప్పటికి వాస్తవానికి ఈ ఉద్యమాలకు వారు ఏ విధమైన సహాయ సహకారాలూ అందించలేదు. ప్రస్తుతం యీ సంస్థలలో ఉన్నత మధ్య తరగతి వర్గంలోని ధనికులైన పెట్టుబడిదారులు ఆధిపత్యం వహిస్తున్నారు. కార్మికులకు సహాయ సహకారాలందించే విషయంలో భవిష్యత్తులోనైనా వారేమైనా చేస్తారని వూహించడం వ్యర్థం” అని రాజ్యాంగ పరిధిలోనే కార్యకలాపాలు సాగించాలని వాదించే ఎన్.ఎం.జోషీయే తీవ్రంగా విమర్శించాడు.

ఎ.ఐ.టి.యు.సి.కి నాయకత్వ స్థానాల్లో నున్న దివాన్ చమన్‌లాల్, లాలాలజపతిరాయ్ “కార్మికులకు తమ స్వంత రాజకీయాలుండాలని” తరచూ చెబుతూండేవారు.

బ్రిటిషు లేబర్ పార్టీపై వీరందరూ భ్రమలు పెంచుకున్నారు. పార్టీ పేరును చూచి మోసపోయి ఆ పార్టీ అసలు స్వభావాన్ని గుర్తించడంలో ఈ నాయకులు విఫలురయ్యారు. అందువలననే బ్రిటిషు లేబర్ పార్టీ వలెనే ఇండియాలో కూడా ఒక లేబర్ పార్టీని స్థాపించాలని లాలాలజపతిరాయ్ తలంచాడు. కాని బ్రిటిషు ప్రభుత్వం భారత ప్రతినిధులు లేకుండా లేబర్ పార్టీ తరపున సి.ఆర్.ఆట్లీ, వెర్నన్ హెర్ట్‌షన్‌లతో సైమన్ కమిషనును నియమించడంతో వారు మేల్కొని భారతీయులకు బ్రిటిష్ లేబర్ పార్టీ చేస్తున్న ద్రోహాన్ని అర్థం చేసుకున్నారు. ఫలితంగానే వారు ఇండియాలో లేబర్ పార్టీని స్థాపించాలనే ప్రయత్నాలను విరమించారు.

ఈ విధంగా జాతీయ సంస్కరణవాద కార్మిక నాయకుల గందరగోళ రాజకీయ విధానాలతోబాటు, జాతీయ కాంగ్రెసు కూడ పెల్లుబుకుతున్న శ్రామిక ఉద్యమాల యెడల అంతగా శ్రద్ధ వహించలేదు. దీనికి భిన్నంగా కమ్యూనిస్టులు, వామపక్ష భావాలు కల్గినవారు వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ ద్వారా సంఘటితమై స్వతంత్ర సమర శీల స్వభావం గల్గిన కార్మికోద్యమం పట్ల విశ్వాసంతో ముందుకుసాగారు. కార్మికులను రాజకీయంగా చైతన్యవంతులను చేసి రాజకీయ పోరాటాలను నడుపవలసిన ఆవశ్యకత వుందని వీరు భావించారు.

దీనితో దేశ కార్మికోద్యమంలో రెండు స్పష్టమైన విభిన్న కార్యాచరణ విధానాలకు మధ్య తీవ్రమైన పోరాటం ప్రారంభమైంది. ఒకటి, పోరాటానికంతగా ప్రాముఖ్యతనివ్వక రాజ్యాంగపరిధిలోనే పరిష్కార మార్గాలన్వేషించడం, దేశ రాజకీయోద్యమంలో కార్మికవర్గాన్ని ఒక అప్రధానమైన శక్తిగా పరిగణించే రాజ్యాంగ విహిత సంస్కరణ వాదం రాజకీయ పోరాటంలో కార్మికవర్గం నాయకత్వం వహించే స్వతంత్ర విప్లవ వర్గ పోరాట పంథా రెండవది.

అంతర్జాతీయ స్థాయిలో కూడా ఈ రెండు విభిన్న పంథాలకు మధ్య తీవ్రమైన ఘర్షణ తలెత్తింది. మొదటి పంథాను అనుసరించే సంస్కరణవాద నాయకులు ప్రపంచంలోని సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ల కేంద్రమైన ఆమ్‌స్టర్‌డామ్‌లోని అంతర్జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్)కు ఎ.ఐ.టి.యు.సి. అనుబంధం చేయడానికి ప్రయత్నాలు చేస్తుండగా, వీరితో విభేదించేవారు విప్లవ ట్రేడ్ యూనియన్, కేంద్రాలైన సామ్రాజ్యవాద వ్యతిరేక పాన్–పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు రెడ్ ఇంటర్నేషనల్ లేబర్ యూనియన్‌కు ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయడానికి కృషి చేశారు. ఈ అంతర్జాతీయ విప్లవ కేంద్రాలకు చెందిన విదేశీ ప్రతినిధులు ఎ.ఐ.టి.యు.సి. మహాసభలకు హాజరయ్యారు.

కమ్యూనిస్టులు తదితర రాడికల్ భావాలు కల్గినవారు నిర్వహించిన ట్రేడ్ యూనియన్ ఉద్యమాలకు ఇవ్వబడిన సిద్ధాంతపరమైన, సంస్థాపరమైన సూచనలను, 1928లో కలకత్తాలో జరిగిన ఆలిండియా పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ మహాసభ, ట్రేడ్ యూనియన్ ఉద్యమంపై ఒక సిద్ధాంతపరమైన వ్యాసంలో సమీక్షించి, ఆమోదించింది. ఈ సిద్ధాంతపరమైన పరిశోధనా వ్యాసానికి అభివృద్ధి చెందుతున్న భారత కార్మికోద్యమంలో ఒక చారిత్రాత్మకమైన స్థానమున్నది.

ఈ వ్యాసంలోని కొన్ని భాగాలు ట్రేడ్ యూనియన్ ఉద్యమం గురించి కమ్యూనిస్టులు, తదితర వామపక్షీయుల అవగాహనను, సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ల యెడల వారి వైఖరిని స్పష్టంచేస్తాయి. కొన్ని ముఖ్య భాగాలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

1. ఆధునిక పారిశ్రామికీకరణవలన అతి శీఘ్రంగా ఏర్పడిన ట్రేడ్ యూనియన్లు కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు వారి, తక్షణావసరాల సాధనకై పోరాటం సాగించడమే వాటి ప్రధాన కర్తవ్యంగా కల్గి వున్నారు. ట్రేడ్ యూనియన్లు ఈ పోరాటాలు సాగిస్తున్న సందర్భంలోనే కార్మికవర్గం రాజకీయ రంగ ప్రవేశంచేసి విప్లవలక్ష్యాలతో రాజకీయంగా ప్రత్యక్ష చర్యలకు పూనుకొనవలసిన తక్షణావసరాన్ని గుర్తించడం జరిగింది. ఈ రాజకీయ పోరాటాలలో ప్రముఖ పాత్ర వహించడానికి రాజకీయ ప్రచార సాధనం అవసరం ఏర్పడింది. రాజకీయ కార్యాచరణకు కార్మికులను సన్నద్ధులను చేయడానికి ఈ ట్రేడ్ యూనియన్లు ప్రధాన సాధనాలుగా ఉపకరించడం ద్వారా ట్రేడ్యూనియన్లు రాజకీయ రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.ట్రేడ్ యూనియన్లు ఈ పోరాటాలలో ప్రధానపాత్ర వహించడమేగాక వెనుకబడిన తరగతులను కూడ ఒక క్రమపద్ధతిలో రాజకీయ పోరాటాలలో పాల్గొనేటట్లు చేయగలవు.

2. ఆర్థిక పోరాటాలు నడపడానికి దేశవ్యాప్తంగా ఒక పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరు ఒకే యూనియన్లో వుండడం ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి శ్రేయస్కరం. దీనినే ఇండస్ట్రీయల్ యూనియనిజమ్ అంటారు. దీనివలన వృత్తి, ఉద్యోగం, ప్రాంతం తదితర అంశాల ప్రాతిపదికన కార్మికులు విభజింపబడడాన్ని నివారించవచ్చును. అంతేగాక వర్గ ఐక్యత వల్ల ఒనగూడే ప్రయోజనాలకు భంగం కల్గించే విధంగా కార్మికులు అనేక యూనియన్లుగా ఏర్పడడాన్ని అరికట్టవచ్చు, యూనియన్కు బ్రాంచి యూనిట్లు అతి ముఖ్యమైనవి. సభ్యులందరు బ్రాంచి యూనిట్ల ద్వారా సంఘటితం కాని యెడల ఆ యూనియన్కు వాస్తవానికి మనుగడలేనట్లే. ఈ యూనిట్లలోనే సభ్యులు తరచుగా సమావేశమై చర్చలు జరిపి యూనియన్ విధానాలను రూపొందించుకోవలసియున్నది. సహజంగా బ్రాంచీలు లేదా యూనియన్ శాఖలు సభ్యులు పనిచేస్తున్న ప్రదేశం, ప్రాతిపదికన లేదా అవసరాన్ని బట్టి వారి నివాసం ప్రాతిపదికన, వారికి అందుబాటులో వుండే విధంగా ఏర్పాటు చేయాలి. బ్రాంచి కమిటీలు ముఖ్యంగా దైనందిన కార్యక్రమాలు నిర్వహిస్తూ వుంటాయి. సాధ్యమైనంత వరకు యూనియన్ విధాన సమస్యలు, ఉద్యోగుల ప్రతినిధుల ఎన్నికకు సంబంధించిన విషయాలు బ్రాంచి సమావేశాల్లోనే నిర్ణయించబడతాయి.

3. రాజీలేని పోరాటం సాగించడమే యూనియన్ల ఏకైక ఆర్థిక విధానం. ముఖ్యంగా కార్మికుల జీవన పరిస్థితుల మెరుగుదల, వేతనాల పెంపుదల, పనిగంటల తగ్గింపు మొదలైన ప్రధాన సమస్యలపై నిరంతర పోరాటాలు కొనసాగించాలి. అంటే ఫ్యాక్టరీ చట్టం,

నష్టపరిహారచట్టం వంటి చట్టాలు అమలు పరచడాన్ని నిర్లక్ష్యం చేస్తామని కాదు. గణనీయమైన జీవన ప్రమాణాల మెరుగుదల ప్రాతిపదికమీద కార్మికులను ఏకం చేసి పోరాటాలు సాగించడం ప్రధాన కార్యక్రమంగా వుంటుంది. ఈ డిమాండు ప్రధానమైనవిగా వుండే విధంగా ప్రతి పరిశ్రమకు ఒక కార్యక్రమం రూపొందించి, వీటిని సమగ్రమైన అమలు చేయడానికి కార్మికులను ఏకం చేయడానికి కృషి చేయాలి. ఈ పోరాటాలు సక్రమంగా సాగడానికి అవసరమైన మేరకు ఆర్థిక వనరులు సమకూర్చుకొనకుండా, సంఘీభావం సమీకరించుకోకుండా తొందరపాటుగా కార్యాచరణకు ప్రయత్నిస్తే అవసరమైతే వారిని ఆ ప్రయత్నం నుండి విరమింపజేయవలసి వుంటుంది. కాని పోరాటానికి తగిన ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా వున్నట్లయితే కార్యాచరణకు పూనుకొనవలసిందే.

అభివృద్ధి చెందిన దేశాల్లో కూడ వినాశకరమైనదిగా నిరూపించబడిన (యజమానులతో రాజీపడైనా) "పారిశ్రామిక శాంతి" నెలకొల్పాలన్న ఆలోచనలను భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం నుండి బహిష్కరించాలి. ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రధాన లక్ష్యం యజమానులకు, కార్మికులకు మధ్య సత్సంబంధాలను నెలకొల్పడమని చెప్పి అనేకమంది కార్మిక నాయకులు కార్మికులను మోసం చేస్తున్నారు. కార్మికుల జీవన పరిస్థితుల మెరుగుదలకు యజమానులతో పోరాడడమే ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రధాన లక్ష్యం.

ట్రేడ్ యూనియన్ ఉద్యమం అంతర్జాతీయ సమస్యలపై కూడా ఒక స్పష్టమైన వైఖరి నవలంభించాలి. మితవాదులు ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐ.ఎఫ్.టి.యు) కు అనుబంధం చేయడానికి సాగిస్తున్న ప్రయత్నాలను సర్వవిధాల ఓడించవలసిందే. అంతేగాక ఐ.ఎఫ్.టి.యు ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు యూనియన్లు వేరు వేరుగా అనుబంధం చేసుకొనడాన్ని అరికట్టాలి. వీటికి భిన్నంగా ఎ.ఐ.టి.యు.సి.ని మాస్కోలోని రెడ్ ఇంటర్నేషనల్ లేబర్ యూనియన్‌కు అనుబంధం చేయాలి. జపానులోని అత్యంత ప్రగతి నిరోధక ట్రేడ్ యూనియన్లు స్థాపించిన పాన్ ఏషియాటిక్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్‌కు కాక ఎ.ఐ.టి.యు.సి.ని షాంఘైలోని పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు అనుబంధంచేయవలసిన అవసరం వున్నది. సామ్రాజ్యవాద వ్యతిరేక సమితికి కూడా ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయాలి."

ఆ విధంగా సరైన రాజకీయ సిద్ధాంత అవగాహన గల్గిన కమ్యూనిస్టులు, తదితర వామపక్ష భావాలు కల్గినవారు మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మించే బృహత్తర కర్తవ్యాన్ని చేపట్టి, రాజ్యాంగ పరిధిలోనే పోరాడాలని వాదించే వారి నధిగమించారు. ఇదే సమయంలో ఆర్థిక పోరాటాలు తీవ్ర తరంగావడంతో కార్మికులు ధైర్యంగా రాజకీయ రంగంలో కూడా ప్రవేశించి సంపూర్ణ స్వాతంత్ర్య సాధనకు గత విధానాలకు భిన్నమైన ఒక విస్పష్టమైన సక్రమమైన విధానాన్ని ఆమోదించేందుకు జాతీయ కాంగ్రెసుపై ఒత్తిడి తీసుకువచ్చారు.

కార్మికవర్గం మొదటిసారిగా ప్రత్యక్షంగా రాజకీయ పరమైన చొరవ తీసికొన్నది. 1928 డిశంబరులో కలకత్తాలో జాతీయ కాంగ్రెసు సమావేశం జరుగుతుండగా జరిగిన సంఘటన కార్మికవర్గ ప్రత్యక్ష రాజకీయ చొరవకు పరాకాష్ఠ కలకత్తా ట్రామ్‌వే మెన్స్ యూనియన్, బెంగాల్ జూట్ వర్కర్స్ అసోసియేషన్, ఈస్టిండియా రైల్వే లేబర్ యూనియన్‌తో సహా అనేక కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును పురస్కరించుకొని ముజఫర్ అహ్మద్, బంకిమ్ ముఖర్జీ, శివనాథ్ బెనర్జీ, గోపేన్ చక్రవర్తి, ధరణి గోస్వామి, రాధారమణ్ మిత్రా, కిరణ్‌చంద్ర మిత్రా తదితర కమ్యూనిస్టులు, వామపక్షీయుల నాయకత్వంలో 30 వేల మంది కార్మికులు కాంగ్రెసు సమావేశం జరుగుతున్న ప్రదేశానికి ఊరేగింపుగా వెళ్ళారు. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి!" "స్వతంత్ర భారత రిపబ్లిక్ వర్థిల్లాలి" మనం కోల్పోయేదేమీ లేదు, సంకెళ్ళు తప్ప" వంటి విప్లవాత్మకమైన నినాదాలిస్తూ కార్మికులు సమావేశ స్థలాన్ని చేరుకున్నారు. కాంగ్రెసు వలంటీర్ల ప్రతిఘటనను కూడ లెక్కచేయక వేలకొలది ప్రదర్శకులు సమావేశ స్థలంలో ప్రవేశించి బ్రహ్మాండమైన సభ జరిపారు. జవహర్‌లాల్ నెహ్రూ ఈ సమావేశానికి అధ్యక్షత వహించవలసి వచ్చింది. బంకిమ్ ముఖర్జీ, ఆర్.ఎస్. నింబ్కర్ తదితర ప్రముఖ కార్మిక నాయకులు సభనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుతూ ఒక తీర్మానం ఆమోదించబడడం అపూర్వమైన విషయం. "భారతదేశంలోని కార్మికులు కర్షకులమైన మేము సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించి పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీ అంతం చేసే వరకు విశ్రమించమని అన్ని పరిశ్రమల్లోని కార్మికులు, ఈ దేశంలోని కర్షకులు హాజరైన ఈ మహాసభ ప్రకటిస్తోంది. దీనినే (సంపూర్ణ స్వాతంత్ర్యాన్నే) తన లక్ష్యంగా పెట్టుకొని దేశంలోని వివిధ శక్తులను సమీకరించ వలసిందిగా జాతీయ కాంగ్రెసును కోరుతున్నాం" అని తీర్మానం పేర్కొన్నది.

కార్మికవర్గం భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్య సాధనయే తన రాజకీయ లక్ష్యమని 1928 లో స్పష్టంగా ప్రకటించగా, బూర్జువా వర్గ నాయకత్వంలోని జాతీయ కాంగ్రెసుకు మరో సంవత్సరం పట్టింది.

ఇండియాలో ఆర్థిక, రాజకీయ పోరాటాలలో వస్తున్న ఈ మార్పులు రెండు తీవ్ర తక్షణ పరిణామాలకు దారితీశాయి. ఒకటి కార్మికవర్గ ఉద్యమంలోని మితవాద, వామపక్షీయుల మధ్య సంఘర్షణ చెలరేగి సంస్థలో తీవ్రమైన చీలికకు దారితీసింది. రెండవది మిలిటెంట్ పోరాటాల నణచడానికి సామ్రాజ్యవాదులు కుట్రలు సాగించడం.

1929 సం॥ జనవరి నెలలో ఆనాటి వైస్రాయి లార్డ్ ఇర్విన్ కమ్యూనిస్టు సిద్ధాంతం దేశంలో విశేషంగా వ్యాప్తి చెందడం పట్ల ప్రభుత్వ తీవ్ర ఆందోళనను బహిరంగంగానే వ్యక్తం చేస్తూ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ప్రసంగించాడు. 1928-29 సం॥పు వార్షిక నివేదికలో కూడ, దేశంలోని పెద్ద పట్టణాలలోని కార్మికవర్గం కమ్యూనిస్టు సిద్ధాంత ప్రభావానికి లోనుగావడం పట్ల ప్రభుత్వం తన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది.

నానాటికి కమ్యూనిస్టుల కార్యకలాపాలు విస్తృతమవడం, దేశంలోని కార్మికవర్గంలోకి కమ్యూనిస్టు సిద్ధాంతం చొచ్చుకుపోవడం పట్ల సామ్రాజ్యవాద ప్రభుత్వమే గాక, కొన్ని జాతీయ పత్రికలు, బి. శివరావు వంటి పచ్చి సంస్కరణవాద కార్మిక నాయకులు కూడ తీవ్ర కలవరపాటుకు గురయ్యారు. ఈ విషయంలో తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తూ బి.శివరావు బహిరంగంగా చేసిన వ్యాఖ్యాలు కమ్యూనిస్టులను, రాడికల్ భావాలు గల్గిన వారిని తుదముట్టించాలనే దుష్ట తలంపుతో కుట్రలు సాగిస్తున్న ప్రభుత్వానికి బలం చేకూర్చాయి. భారత "ట్రేడ్ యూనియన్ ఉద్యమం నుండి అరాచకం సృష్టించేవారిని ఏరివేయవలసిన సమయమాసన్నమైనది. సమ్మె చేయవల్సిందిగా కార్మికులకు ప్రబోధిస్తూ కొందరు ప్రచారం చేస్తుండడం వల్ల ఒక హెచ్చరిక చేయడం ఎంతైనా అవసరం" అని శివరావు తన భయాందోళనలు వ్యక్తం చేశాడు. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తన లక్ష్యంగా ప్రకటించవల్సిందిగా కార్మికవర్గం కలకత్తాలో సమావేశమైన కాంగ్రెసుపై ఒత్తిడి తీసుకురావడంతో బాటు కాంగ్రెసు ప్రతినిధులు కూడా వామపక్షాలవైపు మొగ్గుచూపడం లార్డ్ ఇర్విన్‌కు తీవ్ర ఆందోళన కల్గించింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి చర్య తీసుకొనదలచిన సామ్రాజ్యవాదుల ప్రతినిధి ఇర్విన్ లెజిస్లేటివ్ అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీ విఠల్ భాయి పటేల్‌తో మంతనాలు జరిపాడు. "తన అభిప్రాయం ప్రకారం బ్రిటిషు వారితో సంబంధాలు గల్గియుండడం గాంధీజీకి ఆమోద యోగ్యంగా వుండడమేగాక బ్రిటిషువారి సార్వభౌమత్వానికి లోబడి స్థానిక స్వపరిపాలన (అధినివేశ ప్రతిపత్తి) ఆలోచనకు కూడా ఆయన సుముఖంగా వుంటారు. గనుక ఆయనను సంప్రదించవలసిందిగా" శ్రీ పటేల్ ఇర్విన్‌కు సలహా యిచ్చాడు.

ఈ కార్మికవర్గ పోరాటాలను త్రిప్పికొట్టడానికి సామ్రాజ్యవాదులకు ఎంతో కాలం పట్టలేదు. ఇదే సమయంలో కార్మికవర్గ ఉద్యమంలో చీలికలు సంభవించినప్పటికి కార్మికవర్గం కొద్దికాలంలోనే తిరిగి నిలదొక్కుకోగలిగిందనేది వాస్తవం. దేశంలో ప్రజా బాహుళ్యం సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం సాగించే పోరాటాన్ని ఆపడం గాని, వాయిదా వేయడం సామ్రాజ్యవాదుల దాడుల వలన, గాని రాజీ ధోరణీతో ప్రవర్తించే నాయకత్వపు కుతంత్రాలు వలన గాని ఏ మాత్రం సాధ్యంకాదని తేలిపోయింది.

## పారిశ్రామిక వివాదాల చట్టం

కార్మికవర్గ పోరాటాలను త్రిప్పికొట్టడానికి అతి నైపుణ్యంతో సామ్రాజ్యవాదులు ఈ పారిశ్రామిక వివాదాల చట్టాన్ని రూపొందించారు. రైల్వేలు తదితర కీలక పరిశ్రమలలోని కార్మికులు సాగిస్తున్న తీవ్రమైన దీర్ఘకాలిక పోరాటాలను చూచిన సామ్రాజ్యవాద ప్రభుత్వం భయపడి సెప్టెంబరు 28న సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో హడావిడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు 1929 ఏప్రిల్‌లో చట్టమయింది. 1928 పారిశ్రామిక వివాదాల చట్టంలోని అంశాలు చాలవరకు 1927 బ్రిటిష్ ట్రేడ్ డిస్ప్యూట్స్ అండ్ ట్రేడ్ యూనియన్

(బ్రిటిష్ పారిశ్రామిక వివాదాలు మరియు ట్రేడ్ యూనియన్ చట్టం) చట్టంలోని కార్మిక వ్యతిరేక నిబంధనలను పోలివున్నాయి. కాని పారిశ్రామిక వివాదాల చట్టం (1928) యొక్క ప్రగతి నిరోధకతత్వం కొట్టవచ్చినట్లు కన్పడుతోంది. 1926లో బ్రిటిషు కార్మికులు జరిపిన సార్వత్రిక సమ్మె తరువాత బ్రిటిషు ప్రభుత్వం కార్మిక వ్యతిరేక అణచివేత స్వభావం గల్గిన బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ చట్టాన్ని తీసుకువచ్చింది. 1946లో అధికారంలోకి వచ్చిన లేబర్‌పార్టీ ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దుచేసింది.

ఈ కార్మిక వ్యతిరేక పారిశ్రామిక వివాదాల చట్టం (1928) మూడు భాగాలుగా విభజింపబడింది. మొదటి భాగంలో వివాదాల పరిష్కారానికి సంప్రదింపుల సంఘాలు (కన్సీలియేషన్ బోర్డు) విచారణ కోర్టులు (కోర్టు ఆఫ్ ఎంక్వైరీ) నియమించే అంశాలున్నాయి. అత్యవసర సర్వీసులలో 14 రోజులు నోటీసు లేకుండా సమ్మెగాని, లాకౌట్ గాని చేసినట్లయితే జరిమానాగాని, జైలు శిక్షగాని లేదా రెండూ విధించే అంశాలు ఈ రెండవ భాగంలో వున్నాయి. చట్టవిరుద్ధమైన మూడవ భాగంలో బ్రిటిషు ట్రేడ్ డిస్ప్యూట్స్ చట్టంలో మాదిరిగానే సార్వత్రిక సమ్మెలను, సానుభూతి సమ్మెలను, నిషేధించే అంశాలున్నాయి. కాని ఈ చట్టంలోని అంశాలు బ్రిటిష్ ట్రేడ్ డిస్ప్యూట్స్ చట్టంలోని అంశాల కంటే మరింత కర్కశంగా వున్నాయి. చట్ట విరుద్ధమైన సమ్మెలో పాల్గొన్నవారికి, అట్టి సమ్మెలను ప్రోత్సహించినవారికి మూడు నెలల జైలు శిక్ష మరియు రూ. 200లు జరిమానా విధించేందుకు ఈ చట్టం అనుమతిస్తోంది. ఇంతేగాక సమ్మెలో పాల్గొనేందుకు నిరాకరించిన రక్షణ కల్పించడానికి, అట్టివారు యూనియన్ నుండి నష్టపరిహారం పొందేందుకు చట్ట ప్రకారం అనుమతించే అంశాలెన్నో ఈ చట్టంలో వున్నాయి.

ఈ విధంగా ట్రేడ్ యూనియన్ పోరాటాలలోనే గాక, రాజకీయ పోరాటాలలో కూడా కార్మికవర్గం సార్వత్రిక సమ్మె చేయడాన్ని యీ చట్టం నిషేధించింది.

1928లో ఝరియాలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశంతో పాటు, 1928 డిశంబరులో కలకత్తాలో జరిగిన ఆలిండియా పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ సమావేశం ఈ చట్టాన్ని తీవ్రంగా విమర్శించాయి. ఈ సమావేశం ఈ చట్టంలోని విపులంగా చర్చించి దానిని కార్మికవర్గంపై దారుణంగా దాడిచేయడాని కుద్దేశించబడిన చట్టమని ప్రకటించింది.

చట్టంలోని సంప్రదింపుల బోర్డులు, విచారణ కోర్టులకు సంబంధించిన అంశాలను తీవ్రంగా విమర్శిస్తూ "వివరాల మాట అటుంచి సూత్రరీత్యా ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలి. సంఘటిత శక్తి ప్రాముఖ్యతను తగ్గించడమేగాక బూర్జువా వర్గం తమ వర్గ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని కార్మికులకు కలుగజేసే న్యాయం మీద బూర్జువా మధ్యవర్తులు (పేదరికం పేరుతో) చూపే దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే దుస్థితికి కార్మికులను నెట్టడానికి ఈ చట్టం ఉద్దేశించబడింది" అని ఈ సమావేశం పేర్కొన్నది. రైల్వేలు, తంతి – తపాలా మొదలయిన శాఖల్లో సానుభూతి సమ్మెలను, సార్వత్రిక సమ్మెలను నిషేధించే

(చట్టంలోని) అంశాలను ప్రస్తావిస్తూ "ఇవి స్పష్టంగా కార్మిక వర్గాన్ని అణచడానికి మాత్రమే ఉద్దేశించబడినవి. కార్మికవర్గం తన శక్తినంతటిని కూడదీసుకుని వీటికి వ్యతిరేకంగా పోరాడటం తప్పనిసరి" అని సమావేశం పేర్కొన్నది.

కొన్ని భారతీయ పత్రికలు కూడా ఈ బిల్లుకు నిరసన వ్యక్తం చేశాయి. కలకత్తా నుండి వెలువడే "విశ్వమిత్ర" అనే దినపత్రిక 1928 ఆగస్టు 13వ తేదీ సంచికలో "ఈ బిల్లు కనుక శాసనమైనట్లయితే ఇండియాలోని కార్మిక సంఘాలు నాశనమై, కార్మికవర్గం పెట్టుబడిదారుల చేతిలో బానిసయ్యే స్థితికి నెట్టబడుతుంది" అని వ్యాఖ్యానించింది. కలకత్తా నుండి వెలువడే "గణవాణి" అనే రాడికల్ వారపత్రిక 1928 ఆగష్టు సంచికలో "ఈ బిల్లు కార్మికవర్గాన్ని శాశ్వతంగా బానిసను చేస్తుంది. దేశంలోని కార్మికులందరు ఏకమై ఈ బిల్లు ఉపసంహరింపబడేవరకు పోరాటం సాగించి తీరాలి" అని వ్రాసింది.

దేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికి బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వం యీ బిల్లును ఆమోదించింది.

## మీరట్ కమ్యూనిస్టు కుట్ర కేసు (1929)

ఈ విధంగా భవిష్యత్తులో కార్మికవర్గం సాగించబోయే సమ్మె పోరాటాలను నిషేధించి, అణిచివేయడానికి సర్వాధికారాలను ఈ చట్టం ద్వారా స్వీకరించిన ప్రభుత్వం కార్మికవర్గాన్ని, వారికి చైతన్యవంతమైన నాయకత్వాన్ని సమకూరుస్తున్న భారత కమ్యూనిస్టులను తీవ్రంగా దెబ్బతీయడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. 1929 మార్చి 20వ తేదీన బ్రిటిషు ప్రభుత్వం ఆకస్మికంగా దాడిచేసి దేశంలోని కమ్యూనిస్టు ఉద్యమ నాయకులను, కార్మికవర్గ నాయకులను మొత్తం 31 మందిని అరెస్టు చేసింది. తరువాత ఈ 31 మందితో బాటు మరొకరిని కూడా అరెస్టు చేశారు. ప్రపంచ చరిత్రలోనే సుదీర్ఘకాలం సాగిన ఈ విచారణ భారతదేశంలోని పారిశ్రామిక కేంద్రాల నుండి దూరంగా వున్న మీరట్ అనే చిన్న పట్టణంలో జరిగింది. ఈ విచారణ "మీరట్ కమ్యూనిస్టు కుట్రకేసుగా"గా ప్రఖ్యాతిగాంచింది.

వీరిలో కొందరు తర్వాత కాలంలో ఏ విధమైన కార్యకాలాపాలు సాగించినప్పటికి ఈ కేసులో నిందితులైన ఈ 31 మంది భారతదేశంలో సాగిన విప్లవాత్మకమైన కార్మిక కర్షక పోరాటాలలో ఆనాడు అత్యుత్తమమైన పాత్ర నిర్వహించిన వారే. వీరిలో కొందరు కమ్యూనిస్టులు కానివారు కూడా వున్నారు. మీరట్ కుట్ర కేసులో ఈ క్రింది వారు నిందితులు :1. ఎ.ఐ.టి.యు.సి. ఉపాధ్యక్షుడు, బెంగాల్ వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ కార్యదర్శి ముజఫర్ అహ్మద్.

2. ఎ.ఐ.టి.యు.సి. మాజీ సహాయ కార్యదర్శి, ఎస్.వి. ఘాటే.

3. ఆలిండియా కాంగ్రెసు కమిటీ సభ్యుడు, జి.ఐ.పి. రైల్వేమెన్స్ యూనియన్ నాయకులు కె.ఎన్. జోగ్లేకర్.

4. ఆలిండియా కాంగ్రెసు కమిటీ సభ్యుడు, ఎ.ఐ.టి.యు.సి. మాజీ అధ్యక్షుడు డి.ఆర్. తెంగడి.

5. గిర్నికాంగార్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఎ.ఐ.టి.యు.సి. సహాయ కార్యదర్శి, 1924 కాన్పూరు కుట్రకేసులో నిందితుడు ఎస్.ఎ.డాంగే.

6. బెంగాల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ కార్యదర్శి కిషోరిలాల్ ఘోష్.

7. గిర్నికాంగార్ యూనియన్ నాయకుడు, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.హెచ్. ఝాబ్వాలా.

8. యం.ఎన్.రాయ్‌తో సంబంధాలు గలిగి తాష్కెంట్, మాస్కో తదితర ప్రదేశాలు సందర్శించి భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత 1924 కాన్పూరు కుట్ర కేసు సందర్భంగా అరెస్టు చేయబడిన షౌకత్ ఉస్మానీ.

9. గిర్నికాంగార్ యూనియన్ సహాయ కార్యదర్శి ఎస్.ఎస్. మిరాజ్‌కర్.

10. యునైటెడ్ ప్రావిన్సెస్ వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ కార్యదర్శి పి.సి.జోషి.

11. 1928లో సోషలిస్టు యూత్ లీగ్ అధ్యక్షుడు గోపాల్ బసక్.

12. పంజాబ్ కీర్తికిసాన్ పార్టీ కార్యదర్శి యం.ఎ. మజీద్.

13. బొంబాయి ప్రొవిన్షియల్ కాంగ్రెసు కమిటీ కార్యదర్శి, ఆలిండియా వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆలిండియా కాంగ్రెసు కమిటీ సభ్యుడు ఆర్.ఎస్. నింబ్కర్.

14. యునైటెడ్ ప్రావిన్సెస్ వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ ముఖర్జీ.

15. బెంగాల్ జూట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రాధారమణ్ మిత్రా.

16. బెంగాల్ వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ సహాయ కార్యదర్శి ధరణి గోస్వామి.

17. ఈస్టిండియా రైల్వే వర్కర్స్ యూనియన్ నాయకుడు గోపేన్ చక్రవర్తి.

18. బెంగాల్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి షంసుల్ హుడా.

19. ఆలిండియా పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ ప్రథమ సమావేశానికి అధ్యక్షత వహించిన సోహన్‌సింగ్ జోషి.

20. యునైటెడ్ ప్రావిన్సెస్ వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ నాయకుల్లో, ఒకరు. గౌరీశంకర్.

21. జర్మనీ నుండి అప్పుడే తిరిగివచ్చిన యువ మార్క్సిస్టు, బొంబాయి నుండి వెలువడిన సోషలిస్టు పత్రిక "స్పార్క్"కు వ్యాసాలు రాసే డా॥గంగాధర అధికారి.

22. బెంగాల్ జూట్ వర్కర్స్‌యూనియన్ అధ్యక్షుడు శివనాథ్‌బెనర్జీ.

23. బెంగాల్ పెంజట్స్ అండ్ వర్కర్స్ పార్టీ నాయకుల్లో ఒకరైన అయోధ్య ప్రసాద్.

24. ఆలిండియా యూత్‌లీగ్ సభ్యుడు, పంజాబ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు కేదార్‌నాథ్ సైగల్.

25. గిర్నికాంగార్ యూనియన్ అధ్యక్షుడు అర్జున్ ఆత్మారామ్ ఆల్వే.

26. గిర్ని కాంగార్ యూనియన్ నాయకుడు గోవింద రామచంద్రకాస్లే.

27. బొంబాయి నుండి ప్రచురితమయ్యే సోషలిస్టు పత్రిక "స్పార్క్" సంపాదకుడు యం.జి.దేశాయ్.

28. ఝురియాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆర్గనైజర్ లక్ష్మణరావు కదమ్.

29. బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు, బ్రిటిష్ కార్మిక నాయకుడు, జి.ఐ.పి. రైల్వేమెన్స్ యూనియన్, మరియు గిర్నికాంగార్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు, ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల సంయుక్త సమ్మె కమిటీకి కోశాధికారి, బెంజిమిన్ ఫ్రాన్సిస్ బ్రాడ్లీ.

30. బ్రిటిషు కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు, ఎ.ఐ.టి.యు.సి. కార్యనిర్వాహకవర్గ సభ్యుడు–ఫిలిప్ స్ప్రాట్.

31. బ్రిటిషు జర్నలిస్టు, 'న్యూస్పార్క్' పత్రిక సంపాదకుడు –హ్యూ లెస్టర్ హూచిన్సన్.

మీరట్‌కు చెందిన చౌధురి ధరమ్‌వీర్‌సింగ్ కూడా అరెస్టు చేయబడ్డాడు. కానీ, విచారణ సెషన్సుకోర్టుకు నివేదించబడడంతో ఆయన విడుదల చేయబడ్డాడు. అమీర్ హైదర్‌ఖాన్ పేరు కూడా లిస్టులో వున్నది. కాని ఆయన అరెస్టుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుసుకున్న వెంటనే రహస్యంగా యూరపు చేరుకున్నాడు. తరువాత ఆయన మద్రాసు తిరిగివచ్చి కమ్యూనిస్టు కార్యకలాపాలలో నిమగ్నుడయ్యాడు. మీరట్ కుట్రకేసు విచారణ పూర్తికానున్న చివరి క్షణంలో పోలీసులు ఆయనను పట్టుకున్నారు. ఆయనపై మద్రాసులో విచారణ జరిపి రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు.

ఈ చారిత్రాత్మకమైన "మీరట్ కమ్యూనిస్టు కుట్రకేసు" విచారణ విస్తృత స్థాయిలో సుమారు నాలుగున్నర సంవత్సరాల పాటు సాగింది. సాక్ష్యాలే ఫోలియో సైజు (అరటావు

సైజు) లో 25 ముద్రించబడిన ప్రతులయింది. నిందితులకు వ్యతిరేకంగా 3,500 సాక్ష్యాధారాలు చూపబడగా, నిందితుల తరపున 1,500 పైగా సాక్ష్యాధారాలు కోర్టులో దాఖలు చేయబడ్డాయి. మొత్తం కనీసం 320 మంది సాక్షులు విచారించబడ్డారు. ఈ కేసుపై తీర్పు 676 ఫోలియోసైజు పేజీలలో రెండు ప్రతులుగా యివ్వబడింది. బ్రిటిషు ప్రభుత్వం యీ కేసు విచారణకు షుమారు లక్షా 60 వేల పౌండ్లు ఖర్చు చేసింది.

ఈ కేసు సందర్భంగా అరెస్టయినవారి పేర్లను పరిశీలించినట్లయితే, వీరందరూ భారతదేశంలో కార్మిక, కర్షక పోరాటాలలో ప్రధాన పాత్రధారులని, వీరిలో అత్యధికులు కమ్యూనిస్టు పార్టీ సభ్యులని స్పష్టమవుతుంది. కార్మికవర్గ ఉద్యమాన్ని, ప్రత్యేకించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని మొగ్గగా వుండగానే తృంచివేయడానికి బ్రిటిషు ప్రభుత్వం చేసిన యీ దారుణమైన కుట్రకు ప్రజాతంత్రవాదుల సహకారం లభించలేదు. పై పెచ్చు సామ్రాజ్యవాదుల ఈ కుట్ర దేశ, విదేశాలలో తీవ్రనిరసనకు గురై ఖండించబడింది.

ప్రొఫెసర్ హెరాల్డ్ లాస్కీ ఈ మీరట్ కుట్రకేసుపై విచారణను అమెరికాలో జరిగిన మూనీ శాకోవాంజెట్టె విచారణలతోను, ఫ్రాన్సులో జరిగిన డ్రెఫస్ విచారణ తోనూ, జర్మనీలో సాగిన రీచ్‌స్టాగ్ అగ్ని ప్రమాదం సందర్భంగా సాగిన విచారణతోను పోల్చాడు. ఈ (ఇంగ్లండ్) దేశంలో దైనందిన ప్రజాజీవితంలో భాగమైన సాధారణ ట్రేడ్ యూనియన్, రాజకీయ కార్యకలాపాలను ఇండియాలో సాగించిన “మహానేరానికి” వారిని పౌర జీవితం నుండి దూరం చేయడం జరిగింది. అని ప్రొఫెసర్ లాస్కీ పేర్కొన్నాడు. విచారణ జరిగిన తీరు, నిందితులకు విధించిన దారుణశిక్షలు అన్నివైపుల నుండి తీవ్ర నిరసనకు గురయ్యాయి. బ్రిటన్ కామన్స్ సభలో ఈ విషయమై ప్రశ్నలు కూడా వేశారు. ప్రొఫెసర్ లాస్కీతో బాటు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ప్రొ॥ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, రొమైన్ రోలండ్, హెచ్.జి.వెల్స్ మరియు యార్క్ ఆర్చిబిషప్ వంటివారు కూడ ఈ విచారణ పట్ల ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు కార్యకలాపాలలో పాల్గొనడం, శ్రామికసంఘాలను స్థాపించడం, సమ్మెలు నిర్వహించడంవంటి కార్యకలాపాలు సాగించడంవంటి నేరారోపణలు నిందితులమీద మోపారు. నిందితుల్లో ఫిలిప్ స్ప్రాట్, బెంజమిన్ ఫ్రాన్సిస్ బ్రాడ్లే, హ్యూలెస్టర్, హ్యూచిన్సన్‌లు ముగ్గురూ బ్రిటిషు జాతీయులు. వీరిలో ఫిలిప్ స్ప్రాట్, బెంజిమిన్ ఫ్రాన్సిస్ బ్రాడ్లే లిరువురు బ్రిటిషు కమ్యూనిస్టు పార్టీ సభ్యులు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆదేశాలమేరకు భారతదేశంలో ట్రేడ్ యూనియన్ సంస్థలను నిర్మించి, కార్మికోద్యమాన్ని అభివృద్ధి చేయడంలో తోడ్పడడానికి ఇండియా వచ్చారు. హ్యూలెస్టర్ హచిన్సన్ భారత కార్మికులకు మిత్రుడైన ఒక స్వతంత్ర జర్నలిస్టు. ఈ ముగ్గురు బ్రిటిషు జాతీయులు తమ భారత కార్మిక సోదరులతో కలిసి కోర్టు బోనులో నిలబడ్డారు. చివరకు వారితో కలిసి జైలు జీవితం కూడ అనుభవించారు. ఈ మహత్తరమైన సంఘటన ప్రపంచ కార్మికవర్గ చిరకాలవాంఛితమైన, ఐక్యతకు అంతర్జాతీయ సౌహార్ద్రతకు ప్రతీకగా నిలచింది.

న్యాయస్థానంలో శిక్ష తప్పించుకొనేందుకు వాదించడానికి గాక, పర్యవసానం ఏమైనప్పటికి మార్క్సిస్టు సిద్ధాంత ప్రచారవేదికగా కోర్టును ఉపయోగించుకోవాలని నిందితులు ఒక అసాధారణమైన నిర్ణయం తీసుకొనడం ఈ కేసు విచారణలోని ప్రత్యేకత. భారత కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు, మీరట్ కుట్రకేసులో నిందితుడైన ముజఫర్ అహ్మద్ యీ విధంగా వ్రాశారు. "మీరట్ కుట్రకేసులో నిందితులైన కమ్యూనిస్టులు పూర్తిగా ఒక విభిన్నమైన, విశిష్టమైన పద్ధతిలో వ్యవహరించారు. వారు సెషన్సుకోర్టులో ప్రతిరోజుచేసే ప్రకటనలు, వారికనుకూలంగా ఆధారాలు ఏర్పరచడంగాక, వారు కేసు నుండి తప్పించుకొనే అవకాశాలు లేకుండాచేశాయి. నిందితులలోని కమ్యూనిస్టులు మార్క్సిజాన్ని సిద్ధాంతపరంగాను, రాజకీయంగాను నిరూపించి భారతదేశంలో ఒక బలమైన కమ్యూనిస్టుపార్టీ నిర్మాణానికి సానుకూల పరిస్థితులు సృష్టించే ఉద్దేశంతో వారు తమ వాదనలు సాగించారు. వారి వాదనలు, ప్రకటనలు, వారికి వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న వాదనలకు మరింతబలం చేకూర్చినప్పటికీ, నిందితుల శిక్ష పెరగడానికి దారితీసినప్పటికి దానిని వారు లెక్కచేయలేదు."

నాయకత్వ స్థానంలో నున్న కమ్యూనిస్టు ఆందోళనకారులను రాజకీయ రంగం నుండి తొలగించినట్టయితే, పరిశ్రమలలో పరిస్థితులు చక్కబడతాయనీ, మరల అధికారులు తమ ఆధిక్యతను నెలకొల్పుకుంటారనీ, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో నాయకత్వ శూన్యత ఏర్పడుతుందని సామ్రాజ్యవాద ప్రభుత్వం తొందరపాటు అంచనాలకు వచ్చింది.

పాపంవారి ఆశలు ఇలా వుండగా ముజఫర్ అహమ్మద్ చెప్పినట్లు వాస్తవానికి యీ కుట్ర కేసు విచారణ సామ్రాజ్యవాదుల అంచనాలను తలక్రిందులు చేసింది. "మీరట్ కుట్రకేసు ఇండియాలోని బ్రిటిషు ప్రభుత్వానికి రాజకీయంగా చావుదెబ్బ కొట్టి, భారత కమ్యూనిస్టులకు విజయం చేకూర్చి పెట్టింది. ప్రభుత్వ ఖర్చులతో భారత కమ్యూనిస్టులు కోర్టు భవనంనుండి వారి సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన విధం చరిత్రలోనే అపూర్వమైనది. కమ్యూనిస్టులను ఉద్యమాల నుండి దూరంగా వుంచడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కార్మికవర్గ ఉద్యమంలో శూన్యత ఏర్పరచడం మాట అటుంచి, భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీని సుస్థిరమైన పునాదులతో స్థాపించడానికి తగిన ప్రచారం చేసేందుకు వారికి (కమ్యూనిస్టులకు) ఒక చక్కని అవకాశం లభించింది. కోర్టు నుండి కమ్యూనిస్టులు సాగించిన ప్రచారం, ఉగ్రవాద ఉద్యమ నాయకులలో పునరాలోచనకు దారితీసి వారు 1930 లో గానే పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీలో చేరడానికి దోహదం చేసింది."

ఈ కేసు విచారణలో ఉండగానే ఖైదీలలో ఒకరైన డి.ఆర్.తెంగడీ మరణించాడు. విశ్వనాథ ముఖర్జీ, శివనాథ బెనర్జీ, కిశోర్‌లాల్‌ఘోష్‌లు నిర్దోషులుగా ప్రకటించబడ్డారు. మిగిలిన 27 మందికి కఠిన శిక్షలు విధించబడ్డాయి.

ఈ మీరట్ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుల తరపున వాదించడానికి జాతీయ కాంగ్రెసు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షునిగా, జవహర్‌లాల్ నెహ్రూ కార్యదర్శిగా మీరట్ డిఫెన్స్ కమిటీని నియమించింది.

కాని విచారణ పూర్తికాక మునుపే ఈ కమిటీ మనుగడలో లేకుండా పోయింది. ఈ కేసును నిర్వహించడానికి నిందితులు ప్రధానంగా బ్రిటిష్ కార్మికవర్గం చేసిన ఆర్థిక సహాయం మీదనే ఆధారపడ్డారు. గ్రేట్ బ్రిటన్‌లో ఒక డిఫెన్సు కమిటీ ఏర్పాటు చేయబడింది. దేశంలోని కొన్ని ప్రాంతాల నుండేగాక అమెరికా, యూరపులోని కొన్ని దేశాలు నుండి కూడా ఆర్థిక సహాయం అందింది. కాని ప్రభుత్వం, బ్రిటిష్ కార్మికులు చేసిన ఆర్థిక సహాయాన్ని మాత్రమే నిందితులు అందుకునేందుకు అనుమతించింది.

సెషన్సు కోర్టు వేసిన దారుణ శిక్షలకు వ్యతిరేకంగా నిందితుల తరుపున హైకోర్టులో అప్పీలు చేయబడింది. సెషన్స్ కోర్టులో కఠిన శిక్షలు విధిస్తూ తీర్పు యిచ్చినట్లుగానే. హైకోర్టు కూడా అనుకోని విధంగా ఈ శిక్షలను చాలా తగ్గిస్తూ తీర్పునిచ్చింది. జైలుశిక్షను తగ్గిస్తూ హైకోర్టు యిచ్చిన తీర్పు యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన కాదు. ప్రపంచ వ్యాప్తంగా యీ విచారణపై వ్యక్తమైన తీవ్ర నిరసనవలన సామ్రాజ్యవాదులు తీవ్రమైన ఒత్తిడులకు లోనయ్యారు. సెషన్సుకోర్టు తీర్పు వలన జరుగనున్న ఫలితాలను గురించి వివరిస్తూ భారత ప్రభుత్వం లండన్‌లోని సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు రహస్య టెలిగ్రాంలో ఈ విధంగా ఉంది. రాజు కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించిన "పోరాటం సాగించిన" నేరానికి 30 మంది నిందితులు 27 మందికి శిక్ష విధిస్తూ జనవరి 15న తీర్పు వెలువడింది. 1928 జూన్‌లో ప్రారంభమై సుదీర్ఘకాలం సాగిన ఈ కేసు పత్రికల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. జాతీయ పత్రికలు ఈ కేసులోని నిందితులపై కఠిన శిక్షలు విధించడాన్ని తీవ్రంగా విమర్శించాయి. అందువల్ల ఈ కేసు ప్రాధాన్యతను ఉపేక్షించడం జరిగింది. (వక్కాణింపు చేర్చబడింది.)"

1933 ఆగస్టు 3 వ తేదీన హైకోర్టు తీర్పునివ్వడంతో యీ కేసు ముగించబడింది.

## ప్రజారక్షణ ఆర్డినెన్సు

దేశంలోని కార్మికవర్గ, కమ్యూనిస్టు ఉద్యమ నాయకులలో ప్రముఖులైన నాయకులను కుట్రద్వారా అరెస్టు చేసినప్పటికీ, తన భద్రతకు ముప్పుతొలగలేదని సామ్రాజ్యవాద ప్రభుత్వం భయపడసాగింది. 1929 మార్చినెలలో కార్మికవర్గ, కమ్యూనిస్టు ఉద్యమనాయకుల మూకుమ్మడి అరెస్టులకు పాల్పడడానికి ముందుగా 1928 లోనే ప్రభుత్వం అవాంఛనీయులుగా భావిస్తున్న బ్రిటిషు జాతీయులను ఇండియా నుండి బహిష్కరించడానికి వీలుగా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ప్రభుత్వం ఒక బిల్లును ప్రవేశపెట్టింది. సరిగ్గా ఇదే ఈకాలంలోనే అంతర్జాతీయ కార్మికవర్గ సంస్థలు సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థల నుండి సౌహార్ద్ర ప్రతినిధులు తరచుగా ఇండియా సందర్శించడం, ఇది భారత కార్మికవర్గ ఉద్యమానికి మరింత ఉత్సాహం కల్గించడం చూచాం. వీరి పర్యటనలు భారత కార్మికవర్గానికి ఇతర దేశాల కార్మిక వర్గాలతో సౌహార్ద్ర సంబంధాలు ఏర్పరచుకొనడానికి ఉపకరించాయి.

భారతదేశంలో కార్మికవర్గాన్ని సంఘటితం చేయడంలో నిమగ్నులైన బ్రాడ్లీ, స్ప్రాట్‌ల వంటి బ్రిటిష్ కమ్యూనిస్టులు, కార్మికనాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ బిల్లు తేవడం

జరిగింది. ప్రభుత్వం దృష్టిలో అవాంఛనీయులైన బ్రిటిషు జాతీయులను దేశం నుండి బహిష్కరించడానికి ప్రభుత్వానికి అధికారమిచ్చే చట్టాలు ఏమీలేవు. ఏదైనా పోరాట సందర్భంలో భారతదేశంలోని కార్మికులకు విదేశాలలోని కార్మిక సంస్థలు అందజేసే ఆర్థిక సహాయాన్ని కార్మికుల కందకుండా అడ్డుకోవడానికి కూడా ప్రభుత్వానికి ఏవిధంగానూ న్యాయపరమైన హక్కులేదు. ఈ అధికారాలను పొంది కార్మికవర్గం మీద, కమ్యూనిస్టు ఉద్యమం మీద దాడులకు సన్నద్ధమవడానికి ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది.

అప్పటికే సైమన్ కమీషన్ నియమకం ద్వారా రాజ్యాంగ సంస్కరణల ఆశచూపిన బ్రిటిష్ ప్రభుత్వం ''కమ్యూనిస్టు ప్రమాదం'' అనే భూతాన్ని చూపి కమ్యూనిస్టుల కార్యకలాపాలననణచివేయడానికి చేపట్టున్న చర్యలు భారత జాతీయ వాదుల నుండి హృదయ పూర్వక మద్దతు లభిస్తుందని ఆశలు పెట్టుకుంది. అయితే సామ్రాజ్యవాదులకు తీవ్ర ఆశాభంగం కల్గించే విధంగా, మిక్కిలి ప్రమాదకరమైన తీవ్రమైన పరిణామాలకు దారితీసే ఈ బిల్లులోని అంశాలు సమరశీల స్వభావం గల్గిన వామపక్షవాదులు, జాతీయవాదుల దృష్టి నుండి తప్పించుకోలేకపోయాయి. ట్రేడ్ యూనియన్లు, వామపక్ష దృక్పథం కల్గిన రాజకీయ నాయకులు ఈ బిల్లుకు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ దేశంలోని వివిధ కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఎవరిని లక్ష్యం చేసుకొని.... ఈ బిల్లు తేవడం జరిగిందో, ఆ బ్రాడ్లీ, స్ప్రాట్‌లను కలకత్తాలో అనేక సమావేశాల్లో ఉపన్యసించేందుకు ఆహ్వానించడం జరిగింది.

బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టబడిన తరువాత జాతీయవాదులు ఏ విధంగా స్పందించిందీ ముజఫర్ అహమ్మద్ ఇలా చెప్పారు. "పండిట్ మోతీలాల్ నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెసు పార్టీ ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఈ బిల్లును వ్యతిరేకించడానికి నిర్ణయించుకున్నది. కమ్యూనిస్టులంటే తమ కెలాంటి వ్యామోహంలేదని, కాని ప్రభుత్వమే కమ్యూనిస్టుల ప్రమాదాన్ని గురించి ప్రజలకు నచ్చచెప్పడంలో విఫలమయిందని వారు చెప్పారు. మహమ్మదాలీజిన్నా నాయకత్వంలోని ఇండిపెండెంట్ పార్టీతో సహా అన్ని పార్టీలు ఈ విషయంలో కాంగ్రెసుతో చేతులు కలిపాయి. 1928 డిశంబరు నెలలో కలకత్తాలో జరగబోయే కాంగ్రెసు సమావేశానికి ముందుగానే దేశంలో రాజకీయ వాతావరణాన్నీ ఉద్రిక్తపరచాలని పండిట్ మోతీలాల్ నెహ్రూ తలచాడు. తరువాత పరిణామాలు ఈ ఊహలను ధృవపరచాయి. బిల్లుకు నిరసనగా దేశంలోని వివిధ ప్రాంతాలలో సభలు, సమావేశాలు జరిగాయి. "కమ్యూనిస్టు ప్రమాదం" అనే భూతాన్ని చూపి, దేశ ప్రజలను భీతావహులను చేయడానికి ప్రభుత్వం అకారణంగా ప్రయత్నాలు చేస్తోందని వీరు ఈ సభల ద్వారా ప్రచారం చేశారు. సెంట్రల్ అసెంబ్లీలో రోజుల తరబడి బిల్లుపై సుదీర్ఘ చర్చ బిల్లుపై జరిగింది. ఈ బిల్లు ఆమోదం విషయంపై ఓటింగ్ జరుగగా ప్రభుత్వం ఒక ఓటు తేడాతో పరాజయం పాలయింది. వెంటనే అసెంబ్లీ శరత్కాల (Autumn) సమావేశాలు ముగియడం, బిల్లులోని అంశాలు పొందుపరుస్తూ గవర్నర్ జనరల్ ఒక ఆర్డినెన్సును జారీచేయడం జరిగింది." అని ముజఫర్ అహమ్మద్ పేర్కొన్నారు.

1929 మార్చి నెలలో మరల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే నాటికి మీరట్ కుట్రకేసులో నిందితులనందరిని అరెస్టు చేయడం జరిగింది. పూర్వపు బిల్లులోనే మరికొన్ని నూతన అంశాలను చేర్చి ప్రభుత్వం మరల బిల్లును అసెంబ్లీ ముందుంచింది. "ఆనాటి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ అధ్యక్షుడు శ్రీ విఠల్‌భాయి పటేల్ బిల్లును ఉపసంహరించుకుని విచారణను కొనసాగించవలసినదిగా ప్రభుత్వానికి సలహాయిచ్చాడు. కాని ప్రభుత్వం ఈ సలహాను పెడచెవిని పెట్టింది. అందువలన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం అనుమతి కోరినపుడు మీరట్ కుట్రకేసు కోర్టు విచారణలో నున్నది కనుక అసెంబ్లీ ఈ బిల్లును గురించి చర్చించడానికి వీలులేదని అసెంబ్లీ అధ్యక్షునిగా శ్రీ విఠల్‌భాయి పటేల్ రూలింగు యిచ్చారు." అని ముజఫర్ అహమ్మద్ వ్రాశారు.

ఈ విధంగా తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం బిల్లును శాసనంగా మార్చలేకపోయినప్పటికీ, చట్టప్రకారం అనుమతించబడినంతకాలం ప్రభుత్వం ఆర్డినెన్సును అమలులో వుంచింది.

ఈ బిల్లు వలన కలిగే ప్రమాదకరమైన ఫలితాలను గుర్తించగలిగిన స్థాయికి భారతదేశంలో ప్రజా ఉద్యమం కనుకనే, ప్రభుత్వ కుట్రపూరిత విధానాల నోడించడానికి ప్రజలు ఏకమయ్యారు. సామ్రాజ్యవాద వ్యతిరేక సమితి ప్రతినిధి జె.డబ్ల్యు జాన్‌స్టోన్ ఇండియా చేరుకోగానే ప్రభుత్వం ఆయనకు అరెస్టుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ 1928 లో ఝరియాలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశం ఒక తీర్మానం చేయడం గమనించదగిన విషయం.

## ఇండియాలో శ్రామికుల పరిస్థితిపై రాయల్ కమిషన్ విచారణ (1929)

మిలిటెంట్ కార్మికోద్యమంపై వరుసగా దాడులు సాగించిన తరువాత భారతదేశంలో కార్మికుల జీవనపరిస్థితులపై విచారణ జరపడానికి 1929 జూలై నెలలో జె.హెచ్. విట్లే అధ్యక్షతన "రాయల్ కమిషన్ ఆన్‌లేబర్" నియామకం జరిగింది. భారతదేశంలోని కార్మికుల స్థితిగతులపై విచారణ జరిపి, సిఫార్సులు చేయవలసిందిగా యీ కమిషన్‌ను ఆదేశించడం జరిగింది. 1931 మార్చి 14వ తేదీన యీ కమిషను తన రిపోర్టుతో బాటు సిఫార్సులను కూడా ప్రభుత్వానికి సమర్పించింది.

ప్రభుత్వము, పెట్టుబడిదారుల దాడులకు గురై తీవ్ర కష్టాలనుభవిస్తున్న కార్మికవర్గానికి తాత్కాలిక ఉపశమనం కల్గించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది. కార్మిక సంక్షేమం పేరిట, భారత కార్మికోద్యమంలోని మితవాద నాయకులను సుదీర్ఘకాలం సాగే కమీషన్ విచారణ తతంగంలో తలమునకలు చేయడం ద్వారా వారిని బాహాటంగా తమ వైపుకు తిప్పుకోవడం, సామ్రాజ్యవాదుల మరో ఉద్దేశం. మితవాద నాయకులు కమిటీలు, కమిషన్లు, అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొనడంలో మితవాద నాయకులకున్న అత్యుత్సాహం

బాగా తెలిసిన బ్రిటిషు ప్రభుత్వం నేర్పుతో చమన్‌లాల్, ఎన్.ఎం.జోషీలను కమిషన్ సభ్యులుగా నియమించింది. దీనిని వారు ఏ విధమైన సంకోచం లేకుండా వెంటనే అంగీకరించారు.

ఈ చర్య వలన సామ్రాజ్యవాదులకు లబ్ధిచేకూరింది. వాస్తవానికి ఈ రాయల్ కమిషను నియామకం ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వంలోని మితవాదులకు, వామపక్షీయులకు మధ్య వైరుధ్యాలను సృష్టించింది. ఈ కమిషను ఎదుట ఎ.ఐ.టి.యు.సి. అనుసరించాల్సిన వైఖరి విషయంలో ఈ రెండు వర్గాల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తి చివరకు ఎ.ఐ.టి.యు.సి.లో చీలికకు ఒక ప్రధాన కారణమైంది.

బ్రిటిష్ ప్రభుత్వం మితవాద సంస్కరణవాదులను తమవైపు తిప్పుకొనేందుకు రాయల్ కమిషన్‌లో వారిని నియమించడంతో ఆగక, వారికి మరిన్ని ఆశలు చూపి ప్రలోభపెట్టింది. 1930 లో రౌండ్ టేబుల్ సమావేశానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం ఎన్.ఎం.జోషిని ఆహ్వానించింది. జాతీయ కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించినప్పటికీ, శ్రీ వి.వి.గిరితోబాటు ఎన్.ఎం.జోషీ  కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వీరితో బాటు ఆర్.ఆర్.బాఖలే తదితర మితవాద నాయకులను నిర్వహణ, రాజ్యాంగ వ్యవహారాల కమిటీలలోను, కమిషన్‌లలోను ప్రభుత్వం నియమించింది.

ఈ విధంగా సామ్రాజ్యవాద ప్రభుత్వం దేశంలోని కార్మికోద్యమ నాయకత్వంలో తమ నమ్మకస్తులను పెంపొందించుకుని, వారికి, ప్రభుత్వానికి మధ్య సహకారాన్ని విస్తృతం చేయడానికి ప్రయత్నాలు సాగించింది.

## ఎ.ఐ.టి.యు.సి.లో మొదటి చీలిక

అతివాద, మితవాద పోకడలకు మధ్య – ముఖ్యంగా కమ్యూనిస్టులు, తదితర వామపక్ష భావాలు గల్గిన జాతీయతావాదులకు, మితవాద సంస్కరణవాదులకు మధ్య కొన్ని సంవత్సరాలుగా రాజకీయ, కార్మికోద్యమ రంగాలలో విభేదాలు, ఘర్షణలు తీవ్రతరమవుతూనేఉన్నాయి. 1929 నవంబరు 28 నుండి 30 వరకు నాగపూర్‌లో జరిగిన ఎ.ఐ.టి.యు.సి పదవ మహాసభలో ఈ వైరుధ్యాలు తారాస్థాయికి చేరుకుని చివరకు భారత కార్మికవర్గ జాతీయ సంస్థలో చీలికకు దారితీసింది.

కమ్యూనిస్టులు, మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ నాయకులలో అత్యధికులు "మీరట్ కమ్యూనిస్టుల కుట్ర కేసు" సందర్భంగా అరెస్టు చేయబడిన సమయంలో ఈ సమావేశం జరపడం గమనించదగిన విషయం.

ఈ మహాసభకు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షత వహించారు. గిర్నీ కాంగార్ యూనియన్ తమ సభ్యత్వం 55,000 మందికి తగినట్లుగా సమావేశంలో తమకు ప్రాతినిధ్యం

కల్పించాలని కోరింది. కాని మితవాద, సంస్కరణవాద నాయకులు ఆ యూనియన్ సభ్యత్వం 6000కు మించి లేదని వాదించడం ప్రారంభించారు. ఈ విధంగా ఈ సమావేశం ప్రారంభంలోనే గిర్నీ కాంగార్ యూనియన్ విషయమై ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో వివాదం ఏర్పడింది. తీవ్ర వాదోపవాదాల తరువాత అధ్యక్షునిగా వున్న జవహర్‌లాల్ నెహ్రూ తన కాస్టింగ్ ఓటుతో గిర్నీ కాంగార్ యూనియన్ సభ్యత్వం 40,000లుగా అంగీకరింపజేశాడు. "యూనియన్ 1929 ఏప్రిల్ లో సార్వత్రిక సమ్మెను ప్రారంభించినపుడు ఈ యూనియన్ సభ్యత్వం కనీసం ఏ అరడజను యూనియన్ల మొత్తం సభ్యత్వానికైనా సమానమవుతుంది. ఈ యూనియన్‌కు సుమారు రూ.64,000 నిధి ఉన్నది. 54 వేలకుపైగా తమకు సభ్యులున్నారని వారు చెప్పుకోవడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు" అని ప్రభుత్వ నివేదికే తెల్పడం ఇక్కడ గమనించదగిన విషయం.

"భారతదేశంలో శ్రామికుల పరిస్థితిపై విచారణ జరిపేందుకు నియమించబడిన రాయల్ కమిషన్" పట్ల ఎ.ఐ.టి.యు.సి. వైఖరిని చర్చించే సందర్భంలో, కమిషన్ కార్యకలాపాలను బహిష్కరించాలని ఎ.ఐ.టి.యు.సి. కార్యవర్గ సమావేశంలో శ్రీ యస్.వి. దేశ్‌పాండే ప్రతిపాదించిన తీర్మానం మెజారిటీ ఓట్లతో ఆమోదించబడింది. కాని యన్.ఎం.జోషీ, చమన్‌లాల్‌లను ప్రభుత్వం ఈ కమిషన్‌లో సభ్యులుగా నియమించిడిన విషయం ఇంతకుముందే ప్రస్తావించిచడం జరిగింది. అందువల్ల సంస్కరణవాద నాయకులు ఈ కమిషన్ నియామకాన్ని హర్షిస్తూ, ఈ కమిషన్‌తో పూర్తిగా సహకరించాలని కోరారు.

సైమన్ కమిషన్‌కు పోటీగా జాతీయ కాంగ్రెసు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన మరో కమిటీని నియమించింది. కాని శ్రీ యస్.వి. దేశ్‌పాండే ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించబడం ద్వారా మోతీలాల్ కమిటీ నివేదిక రిపోర్టును కూడా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తిరస్కరించింది. మోతీలాల్ కమిటీ వాస్తవానికి బ్రిటిషు పాలనను కొనసాగించేదిగా ఉన్నదని తీర్మానం పేర్కొన్నది. తీవ్ర వాదోపవాదాల అనంతరం మెజారిటీ అభిప్రాయం ప్రకారం ఎ.ఐ.టి.యు.సి.ని పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు అనుబంధం చేయడానికి నిర్ణయించడం జరిగింది.

అంతర్జాతీయ కార్మికసంస్థ సమావేశాలకు ఇకమీదట ఎ.ఐ.టి.యు.సి. ప్రతినిధిని పంపరాదని మెజారిటీ తీర్మానించింది. ఈ సంస్థతో సహకరించడం కార్మిక వర్గానికి ద్రోహం చేయడమేనని ఈ తీర్మానం స్పష్టం చేసింది.

ఏషియాటిక్ లేబర్ కాంగ్రెసును ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ శ్రీ ఎన్.ఎం.జోషీ చేసిన పోటీ ప్రతిపాదన వీగిపోయింది. ఇంతకు పూర్వం ఫిబ్రవరి 6న ఢిల్లీలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. కార్యవర్గ సమావేశంలో ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌కు ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయడానికి శ్రీ ఎన్.ఎం.జోషి ప్రయత్నించారు. వాస్తవానికి 1928 ఝురియా సమావేశంలోనే జి.ఐ.పి. రైల్వే మెన్స్ యూనియన్, బొంబాయి – బరోడా, సెంట్రల్ ఇండియా రైల్వే వర్క్‌మెన్స్ యూనియన్

ప్రతినిధులు ఎ.ఐ.టి.యు.సి.ని, మాస్కోలోని రెడ్ ఇంటర్నేషనల్ ఆఫ్ లేబర్ యూనియన్స్‌కు అనుబంధం చేయాలని కోరుతూ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. కాని వామపక్ష భావాలు కలిగినవారు, వారు అల్పసంఖ్యాకులుగా వుండడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు. ఝరియా సమావేశంలోనే వామపక్షభావాలు గల్గినవారు అంతర్జాతీయ కార్మిక సంస్థను (ఐఎల్ఒ) సామ్రాజ్యవాదుల చేతిలో కీలుబొమ్మగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఉద్యమం ఏ వైపుకు మళ్ళుతున్నదీ సరిగ్గా గుర్తించిన శ్రీ ఎన్.ఎం.జోషి నాగపూర్ సమావేశం వరకు ఎదురుచూడకుండానే ఎ.ఐ.టి.యు.సి.ని సంస్కరణవాద ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్‌కు అనుబంధం చేయడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు.

నాగపూర్ మహాసభలో ఓటు హక్కు గలిగిన 938 మంది ప్రతినిధులలో 350 మంది గిర్నీ కాంగార్ యూనియన్, జి.ఐ.పి. రైల్వే మెన్స్ యూనియన్ ప్రతినిధులే. 1,89,438 మంది సభ్యులు గల్గిన 51 యూనియన్ల అర్హతలను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదించింది. దీనిలో గిర్నీ కాంగార్ యూనియన్ సభ్యత్వమే 40,000. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఏ యూనియన్‌కూ ప్రాతినిధ్యం వహించలేదు. ఆయనకు వ్యతిరేకంగా విప్లవ భావాలు గల్గిన వారందరూ కలిసి శ్రీ డి.బి. కులకర్ణి అనే ఒక రైల్వే కార్మికుని అధ్యక్ష పదవికి ప్రతిపాదించారు. మహాసభ జరిగే సమయంలో శ్రీ నెహ్రూ సామ్రాజ్యవాద వ్యతిరేకసమితి కార్యవర్గ సభ్యునిగా వున్నారు. అందువలన రాడికల్స్ తమ ప్రతిపాదనను విరమించుకున్నారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కమ్యూనిస్టులు పై తీర్మానాలను ప్రతిపాదించగా జాతీయతావాదులలో వామపక్ష భావాలు కలిగిన అతివాదులు బలపరిచారు. కాని సంస్కరణ వాద నాయకులు మెజారిటీ నిర్ణయాన్ని మన్నించడానికి బదులు సమావేశం నుండి వాకౌట్‌చేసి శ్రీ ఎన్.ఎం.జోషీ నివాసంలో వేరే సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి శ్రీ యుతులు వి.వి.గిరి, బి.శివరావు, చమన్‌లాల్, ఎన్.వి.ఆర్.నాయుడు, మృణాల్ కాంతిబాసు, ఆర్.ఆర్.బాఖలే, కె.సి.రాయ్‌చౌధురి, లతాఫత్‌హుస్సేన్ తదితరులు హాజరయ్యారు. ఇకమీదట ఆ (ఎ.ఐ.టి.యు.సి నాగపూర్) సమావేశంలో పాల్గొనరాదని వారు నిర్ణయించుకున్నారు. వారు తయారుచేసిన ప్రకటనపై సంతకం చేయవలసిన అవసరాన్ని గురించి ఆలోచించుకోవడానికి బెంగాలు నుండి వచ్చిన ప్రతినిధివర్గం కొంత సమయం కావాలని కోరింది. చివరకు వారు వేరుగా ఒక ప్రకటన చేశారు.

మితవాద సంస్కరణవాదులు సమావేశం నుండి వాకౌట్ చేసిన తరువాత, ఎ.ఐ.టి.యు.సి.ని, పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు అనుబంధం చేయాలని తీర్మానాన్ని ప్రతిపాదించినవారే తిరిగి దానిని ఉపసంహరించుకున్నారు. ఎఫ్.జె. గిన్వాలాను అధ్యక్షునిగాను, శ్రీ సుభాస్ చంద్రబోస్‌ను ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకొనడంతో ఈ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ముగిసింది.

డిసెంబర్ 1వ తేదీన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. శ్రీ జోషీ, చమన్‌లాల్ తదితరులు చేసిన ప్రకటనను ముందుగా అధ్యక్షుడు సభకు చదివి వినిపించాడు. ఆ ప్రకటనలో కాంగ్రెస్ పూర్తిగా విభేధించే విధానాలను బలవంతంగా రుద్దడానికి అధిక సంఖ్యాకులు కృతనిశ్చయంతో వున్నారన్న విషయం ఎ.ఐ.టి.యు.సి. ఎగ్జెక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడైంది. విట్లీ కమిషన్‌ను బహిష్కరించాలని, సామ్రాజ్యవాద వ్యతిరేక సమితికి పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు, ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయాలని, నిర్ణయించడం ఆసియా స్థాయిలో శ్రామిక జనుల సమావేశాన్ని జరపడాన్ని వ్యతిరేకించడం, భారత కార్మికవర్గం తరపున ఇక మీదట జెనీవాలో జరిగే అంతర్జాతీయ కార్మికసంస్థకు ప్రతినిధివర్గాన్ని పంపడాన్ని వ్యతిరేకించడం, కార్మిక సంక్షేమ సమితిని గుర్తించడం, రౌండ్‌టేబుల్ సమావేశానికి బ్రిటిష్ సార్వభౌములు పంపిన ఆహ్వానాన్ని తిరస్కరించడం, మోతీలాల్ నెహ్రూ రిపోర్టును ఖండించడం, మొదలైన విషయాలపై చేసిన తీర్మానాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి” అని ఈ ప్రకటనలో ఆరోపించారు. అంతేగాక ఎ.ఐ.టి.యు.సి.మహాసభలో ఓటింగ్ హక్కువున్న 938 మంది ప్రతినిధులలో జి.ఐ.పి. రైల్వే మెన్స్ యూనియన్‌కు, గిర్నీ కాంగార్ యూనియన్‌కు చెందినవారే 350 మందికి తక్కువ గాకుండా వున్నారని, ఈ నూతన విధానాన్ని ఆమోదించడంలో ఈ రెండు యూనియన్లే ప్రముఖ పాత్ర వహించాయని కూడా ఆరోపించడం జరిగింది.

మృణాల్ కాంతిబాసు తదితరులు వేరే ప్రకటన చేసి ఎ.ఐ.టి.యు.సి.తో తమ సంబంధాలను త్రెంచివేసుకున్నారు. మరొక ప్రకటన చేసి ఇండియన్ సీమెన్స్ యూనియన్, మెరైనర్స్ యూనియన్స్, క్వార్టర్ మాస్టర్స్ యూనియన్ కూడా ఎ.ఐ.టి.యు.సి.తో తెగత్రెంపులు చేసుకున్నాయి. ఎ.ఐ.టి.యు.సి. “మూల విధానాల”లోనే మార్పు వచ్చినట్లుగా నాగపూర్‌లో జరిగిన ఎగ్జెక్యూటివ్ కౌన్సిల్ సమావేశం చేసిన తీర్మానాలు స్పష్టం చేస్తున్నాయని ఈ ప్రకటనలో వీరందరూ ఆరోపించారు. ఒకదాని తరువాత ఒకటిగా ఈ ప్రకటనలు చదువుతున్నప్పుడు సభికులు ఆవేశంతో వూగిపోయారు. ఎ.ఐ.టి.యు.సి.లో చీలిక సంభవించినట్లుగా అందరూ భావించారు.

బహిరంగసభలో ఎ.ఐ.టి.యు.సి., పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు అనుబంధం చేయాలని కోరుతూ చేసిన ప్రతిపాదనను శ్రీ ఎస్.వి. దేశ్‌పాండే లాంఛనప్రాయంగా ఉపసంహరించుకున్నారు. బహిరంగసభకు వచ్చేసరికి ఎగ్జెక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించినట్లుగా కాక క్రొత్త ఆఫీసు బేరర్ల లిస్టులో కూడా కొన్ని మార్పులు చేయడం జరిగింది. శ్రీ సుభాస్ చంద్రబోస్ అధ్యక్షునిగా, శ్రీ బంకిమ్ ముఖర్జీ ఉపాధ్యక్షునిగానూ, ఎస్.వి.దేశ్‌పాండే ప్రధాన కార్యదర్శిగానూ, శ్రీ ఎఫ్.జె. గిన్వాలా కోశాధికారిగాను ఎన్నికయ్యారు. ఈ విధంగా పదవ మహాసభలో రెండు పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాల మధ్య ఘర్షణ ఎ.ఐ.టి.యు.సి. చీలికకు దారితీశాయి.

అనేక ఒడుదుడుకులతో సాగిన ఈ మహాసభ అధ్యక్షునిగా శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఒక విశిష్టమైన పాత్రను నిర్వహించాడు. ఆయన వామపక్షభావాలు గల్గిన రాడికల్స్‌తో అనేక విషయాలలో విభేదించినప్పటికీ మొత్తం మీద వారితో సహకరించాడు. కమ్యూనిస్టులతో తనకున్న విభేదాలను ప్రస్తావిస్తూ తన అధ్యక్షోపన్యాసంలో "కమ్యూనిస్టుల అభిప్రాయాలతో నేను ఏకీభవించినప్పటికీ వారు అనుసరించే కొన్ని విధానాలను నేను అభినందించలేను. చైనా తదితర ప్రాంతాలలో గత కొద్ది సంవత్సరాలుగా చైనా తదితర ప్రాంతాల్లో సంభవిస్తున్న పరిణామాలను పరిశీలించినట్లయితే, ఈ పద్ధతులు విఫలమవడమేగాక కొన్ని సందర్భాలలో వారిలోనే అసంతృప్తికి దారితీశాయని స్పష్టమవుతుంది. మూడవ ఇంటర్నేషనల్ (పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్)కు, ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయడమంటే ఆ పద్ధతులను, విధానాలను మొత్తంగా ఆమోదించడమన్నమాట. ఇది మనకు అవసరమని నేను భావించడం లేదు. అందువలన, ఏ అంతర్జాతీయ సంస్థకు అనుబంధం చేయవలదని ఈ మహాసభకు సవినయంగా సిఫార్సు చేస్తున్నాను. అంటే అవసర పరిస్థితులలో అంతర్జాతీయ సంస్థలతో సంబంధాల నేర్పరచుకొనవద్దని నేను చెప్పడంలేదు" అని పేర్కొన్నారు.

రెండు అంతర్జాతీయ సంస్థలలో దేనివైపు మొగ్గు చూపక ఒక మధ్యేమార్గాన్ని ఎంచుకున్నప్పటికీ, ఆయన వర్గ పోరాట సిద్ధాంతాన్ని సమర్థిస్తూ ప్రసంగించాడు. "వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టి, వర్గ పోరాటాలను ప్రజ్వలింపజేసి దైవప్రసాదమైన వర్గ శాంతిని భగ్నం చేయడమే కమ్యూనిస్టుల ధ్యేయమని, అన్ని దేశాల్లోని పెట్టుబడిదారీ భజనరాయుళ్ళు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా విషప్రచారం సాగిస్తున్నారు. ఈ దుష్ప్రచారానితో బాటు పెట్టుబడిదారీ విధాన సంరక్షకులు తమలో తాము కూడబలుక్కొని సాగిస్తున్న అబద్ధ ప్రచారాలను ఆయన త్రిప్పిగొడుతూ, వర్గ పోరాటాలు పెట్టుబడిదారీ సమాజంలోంచే పుట్టుకొస్తాయని" చెప్పాడు.

ఆయన తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, "వర్గ పోరాటాలను ప్రబోధిస్తున్నామని, వర్గాల మధ్య (ధనిక, పేద) అగాధాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నామని మన మీద నిందలు వేస్తున్నారు. పెట్టుబడిదారీ విధానం ధర్మమా అని, ఈ వర్గాల మధ్య దూరం అధికంగానే వున్నది. ఈ విషయంలో ఈ విధానం అన్ని రికార్డులను అధిగమించింది. కాని మనల్ని ఆక్షేపించేవారు, నిందించేవారు, వారి చుట్టూ జరిగే విషయాలను నిర్లక్ష్యం చేస్తున్నారని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ప్రజలను వర్గాలుగా విభజించి, అసంతృప్తిని రెచ్చగొట్టేది ఒక సోషలిస్టా? లేదా కమ్యూనిస్టా? లేదా తమ సిద్ధాంతాలు, విధానాల ద్వారా మానవ జాతిలో అత్యధికులను ప్రాచీన కాలంనాటి బానిసల కంటే దుర్భర స్థితిలో వున్న వేతన బానిసలను సృష్టించిన పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులా? ఈ వర్గపోరాటం మేము సృష్టించినది కాదు, ఇది పెట్టుబడిదారీ విధానం సృష్టించినదే. ఈ పెట్టుబడిదారీ విధానం కొనసాగినంతకాలం వర్గపోరాటాలు తప్పవు. ఉన్నత స్థానాల్లో వున్న పెద్దలు ఈ విషయాలను నిర్లక్ష్యం చేసి

సామరస్యం, సుహృద్భావం అని బోధనలు చేయడం చాలా సులువైన పనే. మన శ్రేయస్సును కోరుతున్నామని చెప్పుకునే వీరి సుహృద్భావం మనమీద భారాన్ని తగ్గించడానికి పనికిరాదు. మన శ్రమతో ఈనాడు ధనవంతులైన ఈ పెద్దలందరు నీతులు మరింత గట్టిగా వల్లించడం మాత్రమే చేస్తారు.

“వర్గ పోరాటాలు ఇంతకు ముందు జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి. ఉష్ట్రపక్షి తన తలను ఇసుకలో దూర్చుకొని తననెవరు గమనించలేదని తలచినట్లుగా, మనం కూడా ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యం చేస్తే దాని నుండి తప్పించుకోలేము. వర్గపోరాటాలకు కారణభూతమైన పరిస్థితులను తొలగించడం ద్వారా మాత్రమే మనం శాంతిని సాధించగలం” అని శ్రీ జవహర్‌లాల్‌నెహ్రూ ప్రసంగించాడు.

ఈనాడు అంటే స్వాతంత్ర్యానంతరం శ్రీ నెహ్రూ ఆచరణ (పరిపాలించిన విధానాన్ని దృష్టిలో వుంచుకుంటే, 1929 లో ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు సమావేశంలో ఆయన చేసిన అధ్యక్షోపన్యాసంలోని ఈ భాగం చాలామందికి ఆశ్చర్యం కల్గించవచ్చు. మరికొందరికి మింగుడుపడకపోవచ్చు; అసౌకర్యం కల్గించవచ్చు. కాని నిప్పుకోడివలె దీనిని దాటవేస్తే చరిత్రకు ద్రోహం చేసినట్లవుతుంది.

ఎ.ఐ.టి.యు.సి.లో చీలిక తీసుకువచ్చినందుకు శ్రీ నెహ్రూ సంస్కరణ వాదులను విమర్శించాడు. కాని ఆయన సంస్కరణ వాదాన్ని విమర్శించలేదు. ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చడానికి సంస్కరణవాదులు అవలంభించిన పద్ధతులను ఆయన ఆమోదించలేదు. ట్రేడ్ యూనియన్ కాంగ్రెసులో చీలికను నివారించడానికి మధ్యేమార్గం అవలంభించాడు. కాని ఈ ఐక్యతా ప్రయత్నాలు విఫలమవడంతో ఎ.ఐ.టి.యు.సి.లో చీలికకు కారణమైన వారిని బహిరంగంగా విమర్శించాడు. ఎ.ఐ.టి.యు.సి. సమావేశ కార్యక్రమాన్ని సమగ్రంగా పరిశీలించి, మహాసభ అయిన తరువాత శ్రీ నెహ్రూ ఒక బహిరంగ ప్రకటన చేశాడు. చారిత్రాకవసరాల దృష్ట్యా సుదీర్ఘమైనదైనప్పటికీ ఈ ప్రకటనను పరిశీలించడం అవసరం. ఆ ప్రకటన పూర్తి పాఠం ఇలా వున్నది.

“అధ్యక్షోపన్యాసమిచ్చే సమయానికి నేను భయపడినట్లుగా చీలిక రాదని ఆశించాను. కాని నాకు అధ్యక్షోపన్యాసమిచ్చే అవకాశం రాకముందే బహిరంగసభ జరగడానికి ముందుగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తీసుకున్న కొన్ని నిర్ణయాలవలన అంతకుముందేవున్న భేదాభిప్రాయాలు మరింత తీవ్రతరమయ్యాయి. దీనికి చాలా చింతిస్తున్నాను. ఎందుకంటే మనదేశంలో శ్రామిక జనుల ఉద్యమం చీలికను భరించలేదని నేను గుర్తించాను. కాని ఈ దశలో ఒక చీలిక అనివార్యమైంది. అయినప్పటికీ అనుభవం, పరిస్థితుల ప్రభావాలవలన సమయం వచ్చినపుడు మరల అందరు ఏకమవుతారనే విషయంలో నాకేమాత్రం సందేహంలేదు. ఏదో ఒక పరిస్థితిలో చీలిక సంభవించడం అనివార్యమైనప్పటికీ నిస్సందేహంగా దీనికొరకు చాలామంది చురుకుగా పనిచేసి దానికి కారణభూతులయ్యారు. వామపక్ష భావాలు గల్గిన కొందరు ఉత్సాహవంతులైన

యువకులు పర్యవసానాలెలా వున్నప్పటికీ, తమ విధానాలతో ముందుకు సాగాలని కోరుకుంటుండగా, వారిని మరింత ముందుకు త్రోసి, సిద్ధాంత విభేదాలు గల్గిన ఇరువర్గాల మధ్య అగాధాన్ని తీవ్రతరం చేసి, ఎఐటియుసి నుండి తాము విడిపోవడానికి మరిన్ని సాకులు సృష్టించేందుకు సంస్కరణవాదులు ప్రయత్నిస్తున్నారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ఆమోదంపొందిన తీర్మానాలు తిరిగి మహాసభలో కూడా తప్పక ఆమోదింపబడతాయనే ఉద్దేశ్యంతో చీలికవాదులెవ్వరూ బహిరంగ సభకు హాజరుకాలేదు. వారు తొందరపాటు నిర్ణయాలకు వచ్చి పరిస్థితులను విషమింపజేసే చర్యలకు పాల్పడవల్సిన అవసరంలేదు. సమావేశం ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకు చూచి తాము సభనుండి వెళ్ళడం అంత కష్టమైన విషయమేమీకాదు. నిజానికి ఘటనలను పరిశీలిస్తే వారు సమావేశంలో పాల్గొన్నట్లయితే, తుది నిర్ణయాలు వేరే విధంగా వుండేవని స్పష్టమవుతుంది. పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు ఎఐటియుసిని అనుబంధం చేయాలన్న అంశాన్ని దేనినైతే చీలిక వాదులు, మిక్కిలి అభ్యంతరకరమైనదిగా భావించారో ఆ అంశం పరిశీలించే విషయాన్ని చీలికవాదులు సభలో లేనప్పటికీ, మరుసటి సంవత్సరానికి వాయిదా వేయడం జరిగింది.

“1,89,463 మంది సంఘటిత కార్మికులకు చెందిన 51 యూనియన్ల ప్రతినిధుల అర్హతలను కాంగ్రెసు ఆమోదించింది. నిబంధనాళి ప్రకారం ఒక డివిజనులో యూనియన్లు ఓటింగ్‌లో పాల్గొంటారు. ఒక్కొక్క ప్రతినిధి తన యూనియన్‌లోని 200 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తాడు. మొత్తంగా ఓటు హక్కు గల్గిన ప్రతినిధుల సంఖ్య 938. కాని 1000 మంది సభ్యులున్న ఒక యూనియన్ ప్రతినిధులను పంపలేదు. అందువలన ఓటు హక్కు గల్గిన ప్రతినిధులు 933మంది మాత్రమే. ఎఐటియుసి నుండి విడిపోయినవారు 30 యూనియన్లకు చెందిన 36,639 మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఓటు హక్కు గల్గిన ప్రతినిధులు 455 మంది, ఇది పరిశీలించినట్లయితే చీలికవాదులకు ఆధిక్యత కలదని, వారు తలచుకున్నట్లయితే ప్రతి తీర్మానాన్ని ఓడించగలరని స్పష్టమవుతుంది. కాని వారు ఎఐటియుసిని చీల్చడానికే నిర్ణయించుకున్నారు.

“ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఒక్క విట్లీ కమిషను బహిష్కరణ విషయమై ప్రతిపాదించబడిన తీర్మానం మీద మాత్రమే సక్రమంగా ఓటింగు జరిగింది. సుదీర్ఘమైన చర్చ అనంతరం 100 మంది సభ్యులున్న సమావేశంలో 4 ఓట్ల స్వల్ప మెజారిటీతో తీర్మానం ఆమోదించబడింది. కొందరు సభ్యులు అవతలి పక్షం వారిని, తప్పుదారి పట్టించేందుకు తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాని తీర్మానాలకు అనుకూలంగా ఓటు వేసినట్లు తర్వాత తెలిసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన చీలికవాదులనేక మంది తర్వాత, ఈ తీర్మానానికి తీవ్రనిరసన వ్యక్తం చేస్తూ ప్రకటనలు చేశారు. ఇది చాలా విచిత్రమైన విచారించదగిన ప్రవర్తన కొన్ని తీర్మానాల విషయంలో వీరోచితంగాను, పట్టుదలతోను మరికొంత మంది సభ్యులు

వ్యవహరించిన మహాసభ నుండి జారుకుని చీలికవాదులతో కలియడం చాలా ఆశ్చర్యాన్ని, విచారాన్ని కల్గిస్తోంది.

"నేను ఈ చీలికకు చాలా చింతిస్తున్నాను. అంతకంటే ఈ చీలికను తీసుకువచ్చిన పద్ధతికి చాలా విచారిస్తున్నాను. నేడో, రేపో ఇరు పక్షాల్లోని నిజమైన కార్మికులు చేతులు కలిపితీరుతారని నాకు నమ్మకముంది, మధ్యాహ్నానికే రంగులు మార్చేవాళ్ళతోనే కష్టాలు వస్తాయి. ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు నూతన అధ్యక్షుడు శ్రీ సుభాస్ చంద్రబోసు ఈ రెండు వర్గాల మధ్య గండిని పూడ్చడానికి ఐక్యతా ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభించడంపట్ల నేను చాలా సంతోషిస్తున్నాను. భవిష్యత్ కార్యక్రమం, ఐక్యకార్యాచరణ విధానాలను గురించి చర్చించడానికి లాహోరులో పూర్తి స్థాయి ఎగ్జెక్యూటివ్ కౌన్సిల్ సమావేశం వేస్తే ప్రయోజనముంటుందని నేను సూచిస్తున్నాను, పరస్పర నిందారోపణ చేయడం మాత్రం మానివేయవలసిందిగా కార్మికోద్యమంలో నున్న నా సహచరులందరిని ప్రార్థిస్తున్నాను."

నెహ్రూ చేసిన ఈ ప్రకటన వలన చీలికవాదులు ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చడానికి అవలంభించిన పద్ధతులు వెలుగులోకి వచ్చాయి. ఆ విధంగా 9 సం॥లు చరిత్ర తరువాత, పదవ సమావేశంలో ఎ.ఐ.టి.యు.సి. మొదటిసారిగా చీలికకు గురయింది. దీనితో ఎ.ఐ.టి.యు.సి. 94 వేల మంది సభ్యులున్న 21 యూనియన్లకు ప్రాతినిధ్యం వహించే సంస్థగా కుదించుకుపోయింది.

## ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్థాపన

ఎ.ఐ.టి.యు.సి. మహాసభ నుండి వాకౌట్‌చేసిన చీలికవాదులు 1929 డిశంబరు 1వ తేదీన వేరే సమావేశం ఏర్పాటుచేసి ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌గా తాత్కాలికంగా పేరిడి, ఒక క్రొత్త సంస్థను ఏర్పాటుచేయడానికి నిర్ణయించారు. ఈ ఉద్దేశంతోనే శ్రీ వి.వి. గిరి ఛైర్మన్‌గా ఒక తాత్కాలిక కమిటీని ఏర్పాటుచేసి, మూడునెలల్లో సదస్సును నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. కమ్యూనిస్టు భావాలు గల్గిన వారికి ఫెడరేషన్‌లో స్థానం కల్పించడానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పోకడలతో కార్యకలాపాలు సాగించే 'వ్యక్తులకు, యూనియన్లకు ఈ ఫెడరేషన్‌లో స్థానం కల్పించరాదని' ఈ క్రొత్త సంస్థ నిబంధనావళిలో ఒక ప్రత్యేక అంశాన్ని పొందుపరచాలని కూడా వీరు నిర్ణయించారు.

శ్రీ ఎన్.ఎం.జోషీ, చమన్‌లాల్ తదితర అనుభవజ్ఞులైన సంస్కరణలవాద నాయకుల చొరవతో స్థాపించబడిన ఈ సంస్థ ఆవిర్భావం, భారత కార్మికోద్యమంలో కల్తీలేని మితవాద అభివృద్ధి నిరోధక సిద్ధాంతాలు నెలకొని, సంఘటితపడడాన్ని సూచిస్తుంది. శ్రీ ఎన్.ఎం.జోషీ,

సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ సభ్యుడు, సంస్కరణవాద రాజకీయవాది, ఆయన సహచరులు శ్రీయుతులు వి.వి.గిరి, చమన్‌లాల్, బి.శివరావు తదితరులు జాతీయ రాజకీయాలలో బ్రిటిష వ్యతిరేక భావాలు వ్యక్తం చేసినప్పటికీ, ట్రేడ్ యూనియన్ రంగానికొచ్చేసరికి ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లకు అతి సన్నిహితంగా పనిచేశారు. ఇంతేగాక వారు పునాదుల నుండి కార్మికోద్యమాన్ని నిర్మించేందుకు కృషిచేసేందుకు బదులు, అధికార కమిషన్‌లు, సమావేశాల విషయంలో ప్రభుత్వంతో సహకరించడంలో మిక్కిలి ఉత్సాహం కన్పరచారు. రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం ద్వారా ఉవ్వెత్తున లేస్తున్న కార్మికవర్గ ఉద్యమాలపై నీళ్ళు చల్లాలని సామ్రాజ్యవాదులు నిర్ణయించుకున్నారు. ఈ విషయంలో మితవాద జాతీయ నాయకులు, కొత్తగా ఏర్పడిన లిబరల్ ఫెడరేషన్ అనుయాయులు, సైమన్ కమిషన్‌తో సహకరించటానికి సిద్ధపడిన వారితో పాటు మరికొందరు తమతో సహకరిస్తారని ప్రభుత్వం ఆశించింది. ఈ రాజకీయ వుద్దేశంతోనే 1931లో శ్రీ ఎన్.ఎమ్.జోషీని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి తిరిగి నామినేట్ చేయడం, 1930, 1931, 1932 సం॥లలో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాలకు ఆయనను ఆహ్వానించడం జరిగింది.

భారత కార్మికోద్యమంలోని మితవాద నాయకత్వం, రాజీలేని, సమరశీల వైఖరినవలంబిస్తున్న (ఎఐటియుసిలోని) ప్రగతి శీలశక్తులను చూచి భయకంపితులై, ఫక్తు మితవాద కార్మిక సంస్థ నొకదానినేర్పాటు చేయడానికి మాతృ సంస్థ ఎఐటియుసిని వదలివేసింది.

ఇది ప్రపంచంలోని సంస్కరణవాద కార్మిక సంస్థలకానందం కల్గించింది. వెంటనే ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్థాపన కోసం, బ్రిటిష్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ రూ 673-11-0, ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ రూ 3520-3-7 మేరకు ఆర్థిక సహాయం అందించాయి. వారు ఉదారంగా విరాళాలిచ్చినందుకు, ఈ నూతన ఫెడరేషన్ ప్రథమ మహాసభలోనే వారికి ధన్యవాదాలు తెల్పుతూ తీర్మానం ఆమోదించారు. 1933లోనే ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌ను, ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌కు లాంఛనంగా అనుబంధం చేయడం జరిగింది.

మిత వాద అభివృద్ధి నిరోధకుల కార్యకలాపాల వెనుక ప్రభుత్వ ప్రోత్సాహం వుండడం యాదృచ్ఛికం కాదు. మితవాదం పుట్టిందే కొందరి స్వార్థ ప్రయోజనాలు కాపాడటానికి, అందువలన వీరు సామ్రాజ్యవాదుల వలస ప్రయోజనాలను పరిరక్షించడానికి కంకణం కట్టుకున్నారు.

## ఎ.ఐ.టి.యు.సి.లో రెండవ చీలిక :
## రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అవతరణ

ఎ.ఐ.టి.యు.సి.లో పరస్పర విరుద్ధమయిన విభిన్న సిద్ధాంతాల మధ్య తీవ్రతర మవుతున్న సంఘర్షణలు, ఎ.ఐ.టి.యు.సి. 10వ మహాసభలో వచ్చిన చీలికతో అంతంకాలేదు. మితవాద సంస్కరణవాదులు ఎ.ఐ.టి.యు.సి. నుండి వైదొలగినప్పటికీ పరస్పర విరుద్ధ పోకడలు పరిష్కరించబడటానికి బదులు కొనసాగుతూనేవున్నాయి. ఇప్పుడు ఎఐటియుసిలో ప్రధానంగా కమ్యూనిస్టులు, కాంగ్రెసు పార్టీతో సన్నిహిత సంబంధం గల్గిన తీవ్రవాదులు మాత్రమే బలమైన శక్తులుగా వున్నారు. కాని ఆ రెండు తరగతుల మధ్య విస్పష్టమైన సిద్ధాంత విభేదాలున్నాయి. ప్రధానంగా కార్మికవర్గ స్వతంత్ర రాజకీయ పాత్ర విషయమై యీ రెండు గ్రూపులు పరస్పరం తీవ్రంగా విభేదించాయి. దీనితో ఎ.ఐ.టి.యు.సి.లో మరొక చీలిక సంభవించింది. ఈ విప్లవ రాజకీయ సిద్ధాంతం పట్ల విశ్వాసమున్న ఎఐటియుసిలోని ఒక సెక్షన్ చివరకు ఎ.ఐ.టి.యు.సి. నుండి వైదొలగి "రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు" అనే నూతన సంస్థను స్థాపించవలసివచ్చింది.

ఎ.ఐ.టి.యు.సి 11వ మహాసభ కలకత్తాలో 1931 జూలై 3 నుండి 7 వరకు శ్రీ సుభాస్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగింది. గిర్నికాంగార్ యూనియన్ ప్రాతినిధ్యం గురించి తలయెత్తిన వివాదం ఎ.ఐ.టి.యు.సి.లో రెండవ చీలికకు తక్షణ కారణమయింది. జులై 3వ తేదీన జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఈ వివాదం తీవ్రస్థాయికి చేరుకున్నది. గిర్నికాంగార్ యూనియన్ తరపున జనరల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడంపై శ్రీ జి.ఎల్.కండాల్కర్ గ్రూపుకు, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి శ్రీ దేశ్ పాండే నాయకత్వంలోని మరొక గ్రూపుకు మధ్య తీవ్ర విభేదాలు పొడసూపాయి. 1929 సం॥ ప్రారంభంలో 65, వేలకు చేరిన గిర్నికాంగార్ యూనియన్ సభ్యత్వం యీ సమావేశం నాటికి తీవ్రంగా పడిపోయింది. గిర్నికాంగార్ యూనియన్ అసలైన ప్రాతినిధ్యానికి సంబంధించిన వివాదాన్ని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఒక అర్హతల కమిటీకి నివేదించింది. కాని యీ అర్హతల కమిటీ ఏర్పాటుకు జరిగిన ఓటింగులో శ్రీ సుభాస్ చంద్రబోస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఒక ఓటు, అధ్యక్షునిగా మరొక ఓటు, మొత్తం రెండు ఓట్లను వేశారు. శ్రీ కండాల్కర్ వర్గానికి అనుకూలంగా అర్హతల కమిటీ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. జూలై 5వ తేదీన మరల జరిగిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో అర్హతల సంఘం రిపోర్టును ముందుగా చర్చించాలని శ్రీ సుభాస్ చంద్రబోస్ రూలింగ్ ఇచ్చాడు. అంతేగాక గోల్‌మురి టిన్‌ప్లేట్

వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఆథరైజ్ చేసిన శ్రీ సేథీ అర్హతలను నిర్లక్ష్యం చేసి, ఆ యూనియన్ కనీస సభ్యత్వం కూడా లేని ఏ విధమైన అర్హతలు లేని ఒక వ్యక్తిని గోల్‌మురి టిన్‌ప్లేట్, వర్కర్స్ యూనియన్ ప్రతినిధిగా నిర్ణయిస్తూ రూలింగ్ యిచ్చాడు. గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ (జి.ఐ.పి.) రైల్వేలో సరిగ్గా ఈ మహాసభ జరిగే సమయానికి బ్రహ్మాండమైన సమ్మె పోరాటం జరిగి ఆ రైల్వేలోని  కార్మికులు తీవ్ర నిర్బంధాలు, కక్ష సాధింపు చర్యలు ఎదుర్కొంటున్నందున ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ రుసుం విషయంలో ఆ యూనియన్‌కు కొంత రాయితీ కల్పించవలసిందిగా ఎ.ఐ.టి.యు.సి.ని కోరడం జరిగింది. కమ్యూనిస్టులకు బలమైన ఈ జి.ఐ.పి. రైల్వేమెన్స్ యూనియన్ అనుబంధ రుసుం రాయితీ కల్పించే విషయంలో ఆ యూనియన్ ప్రతినిధులు ఓటింగులో పాల్గొనరాదని శ్రీ సుభాస్ చంద్రబోస్ రూలింగు ఇచ్చాడు. కమ్యూనిస్టులు ఈ రూలింగ్‌ను అన్యాయమైనదిగానూ, దురుద్ధేశంతో కూడుకొన్నదిగాను భావించారు. ఈ రూలింగ్‌ను శ్రీ బి.టి.రణదివే సవాలుచేస్తూ అధ్యక్షునిపై (శ్రీసుభాస్‌చంద్రబోస్‌పై) అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించాడు. అయితే ఈ తీర్మానానికి అనుకూలంగా 24 ఓట్లు, ప్రతికూలంగా 26 ఓట్లు వచ్చి, 2 ఓట్ల తేడాతో ఈ తీర్మానం వీగిపోయింది. ఈ సమయంలో ఆందోళనకర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడడంతో అధ్యక్షుడు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాన్ని, బహిరంగ సభను నిరవధికంగా వాయిదా వేశాడు. చివరకి ఈ పరిస్థితులు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ చీలికకు దారి తీశాయి.

శ్రీ ఎస్.వి.దేశ్‌పాండే, ఆయన కమ్యూనిస్టు సహచరులు కలకత్తా సమీపాన వున్న మేటియాబర్జ్ వద్ద జూలై 6వ తేదీన వేరుగా సమావేశం ఏర్పాటు చేశారు. ఎఐటియుసికి అనుబంధం చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌చే నిరాకరించ బడిన దాదాపు అన్ని యూనియన్లతో సహా 12 యూనియన్లు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. శ్రీ డి.బి. కులకర్ణి అధ్యక్షునిగా, శ్రీ ఎస్.వి. దేశ్‌పాండే, బంకిమ్‌ముఖర్జీ, ఎస్.జి.సర్దేశాయ్ ముగ్గురు ప్రధాన కార్యదర్శులుగా, డా॥ భూపేంద్రనాథ్ దత్తా కోశాధికారిగా, “ఆలిండియా రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు” అనే నూతన కార్మిక సంస్థ ఆవిర్భవించింది.

వాయిదా వేయబడిన ఎ.ఐ.టి.యు.సి. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జూలై 7వ తేదీన శ్రీ సుభాస్ చంద్రబోస్ అధ్యక్షత జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.వి. దేశ్‌పాండే సమావేశంలో లేకపోవడం వలన సమావేశానికి వార్షిక నివేదిక సమర్పించబడలేదు. కాని చాలా తీర్మానాలు మాత్రం ఆమోదింపబడ్డాయి. రైల్వేలో పెద్ద ఎత్తున జరుగుతున్న రిట్రెంచ్‌మెంట్‌కు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెతో సహా ఒక ఆందోళనా కార్యక్రమం చేపట్టవలసిందిగా ఒక తీర్మానంలో ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్‌ను కోరడం జరిగింది.

శ్రీ ఆర్.ఎస్. రుయ్‌కర్ అధ్యక్షునిగా, జి.ఎల్. కందాల్కర్, వి.హెచ్. జోషీ, జె.ఎన్. మిత్రాలు ఉపాధ్యక్షులుగా ముకుందలాల్ సర్కార్ ప్రధాన కార్యదర్శిగా, సుభాస్‌చంద్రబోస్ కోశాధికారిగా ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శివర్గం ఎన్నుకోబడింది.

## కార్మికోద్యమంలో చీలికలు - విమర్శనాత్మక పరిశీలన

భారత కార్మికోద్యమం మూడు జాతీయ కేంద్రాలుగా చీలిపోవడంతో, కార్మికోద్యమం ఏనాడూ ఎదుర్కొనని ఒక తీవ్రమైన, అత్యంత శోచనీయమైన పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థే గతంలో ఏనాడూ ఎరుగని తీవ్ర సంక్షోభానికి గురై పునాదులంటా కదిలి, దాని ప్రభావం వలన భారతదేశంలో సామ్రాజ్యవాదుల వలస ఆర్థిక వ్యవస్థ నాశనమయ్యే చారిత్రాత్మకమైన పరిస్థితులు నెలకొనివున్న ఈ తరుణంలో భారత కార్మికవర్గంలోని ఈ అనైక్యత, సంస్థాపరమైన చీలికలు కార్మికవర్గానికి తీరని నష్టాన్ని కలుగజేశాయి. ఈ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఫలితంగా అతి తీవ్రమైన నిరుద్యోగం, రిట్రెంచ్‌మెంట్, వేతనాలలో కోత, ధరల పెరుగుదల కార్మికవర్గాన్ని తీవ్రమైన కష్టనష్టాలకు గురిచేశాయి. కార్మికవర్గం ఈ దాడులను శక్తివంతంగా ప్రతిఘటించాలంటే అత్యున్నత స్థాయిలో కార్మికవర్గ ఐక్యతను సాధించ వలసివుంది. కాని సరిగ్గా ఈ కీలక సమయంలోనే కార్మికవర్గంలో తీవ్రమైన అనైక్యత నెలకొని యుండటం మిక్కిలి శోచనీయమైన విషయం.

వాస్తవానికి, చీలికలకు దారితీసిన ఈ సంఘటనల పరంపర వలన కల్గిన లాభనష్టాలను ఇంతకాలం తర్వాత బేరీజు వేయడం అంత సులభమైన పనిగాదు. అయినప్పటికి మనం ఇప్పటివరకు పరిశీలించిన కొన్ని వివరాల నుండే ఈ చీలికలకు సంబంధించి చెప్పుకోదగ్గ మేరకు ఖచ్చితంగా అంచనా వేయడం పూర్తిగా అసాధ్యంకాదు. జరిగిన సంఘటనలను పరిశీలించినట్లయితే ఎ.ఐ.టి.యు.సి.లో మొదటిసారి సంభవించిన చీలిక కాకతాళీయంగా జరిగినది కాదని స్పష్టమవుతోంది. ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఆర్థికపరమైన డిమాండ్లకే పరిమితంగాక రాజకీయ పోరాటంలో పాల్గొనే దశకు ఎదగటమే ఈ చీలికకు దారితీసింది. మితవాద సంస్కరణవాదం, రాజ్యాంగ వాదానికి విప్లవాత్మకమైన వర్గపోరాట పంథాననుసరించే మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి మధ్య వచ్చిన ఘర్షణ ఎ.ఐ.టి.యు.సి.లో చీలికకు దారితీసిందని స్పష్టమయింది. భారత కార్మికోద్యమంలోని సంస్కరణవాదులు బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించడానికి, బదులుగా రాజ్యాంగపరిధిలో పనిచేయడం, అంతర్జాతీయ సమావేశాలకు హాజరుకావడం, ప్రభుత్వం ఏర్పాటుచేసిన వివిధ కమిటీలు, కమిషన్‌లకు సహకారం అందించడం, పట్ల ఈ మితవాద సంస్కరణవాద నాయకులు ఎక్కువ ఆసక్తి చూపారు. అనుభవం గడించిన నాయకత్వం వాస్తవానికి వివిధ రకాల సంస్కరణవాద శక్తులు, పదవీకాంక్షా పరులు, ట్రేడ్ యూనియను జీవనాధారంగా పరిగణించే వారి కూటమిగా పరిణమించింది.

సమరశీల ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఇక ఏమాత్రం సహించలేని వీరు ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చడానికే నిర్ణయించుకున్నారు. తమ స్వార్థ ప్రయోజనాలకు, ప్రభుత్వానికి వత్తాసు పలికే తమ వైఖరికి ఎక్కడ భంగం కల్గుతుందోనని వారు భావించారు. ఎ.ఐ.టి.యు.సి.లో మొదటి చీలికకు వ్యక్తిగత విషయాలు కూడా కొంతవరకు కారణమని ఎ.ఐ.టి.యు.సి. 10వ మహాసభకు అధ్యక్షత వహించి విషయాలను దగ్గర నుండి గమనించిన జవహర్‌లాల్ నెహ్రూ అంగీకరించారు.

"భారతదేశంలోని కార్మికుల పరిస్థితిపై విచారణ జరుపడానికి ఏర్పరచబడిన విట్లీ కమిషన్ నియామకం గురించి దేశంలోని ట్రేడ్ యూనియన్లన్నీ 1929 సం॥ పొడుగునా చాలా ఆందోళనలు నిర్వహించాయి. అతివాదులు విట్లీ కమిషన్‌ను బహిష్కరించాలని, మితవాదులు ఈ కమిషన్‌తో సహకరించాలని పట్టుబట్టారు. మితవాద నాయకులలో కొందరు ఈ విట్లీ కమిషన్‌లో సభ్యత్వం యివ్వచూపడం వలన ఇక్కడ కొంతవరకు వ్యక్తిగత అంశాలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ విషయంలో మిగిలిన విషయాలలో వలెనే నేను అతివాదులతో సహకరిస్తాను. ఎందుకంటే జాతీయ కాంగ్రెస్ వైఖరి కూడా యిదే కనుక. మనం ప్రత్యక్ష చర్యలకు పూనుకునే సమయంలో అధికార కమిషన్‌లకు మన సహకారం అందించడం సమంజసం కాదు." అని నెహ్రూ తన ఆత్మకథలో వ్రాశారు.

దీనిని బట్టి జాతీయోద్యమ పోరాటం ప్రత్యక్ష చర్య రూపాన్ని సంతరించుకునే సందర్భంలో కూడా మితవాద సంస్కరణవాదులు అధికార కమిషన్లతో సహకరించాలని కోరినట్లు స్పష్టమవుతుంది. ఎ.ఐ.టి.యు.సి. 10వ మహాసభలో ప్రధానపాత్ర వహించిన సుభాస్ చంద్రబోస్ చీలికకు దారితీసిన పరిస్థితులను గూర్చి వివరిస్తూ "నాగ్‌పూర్‌లో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశంలో మితవాదులు చీలిపోకపోయినట్లయితే, వారింకను ప్రముఖపాత్ర నిర్వహించగల్గి యుండేవారు. కాని వారికి ఒక నష్టం కల్గివుండేది. దానిని భరించేందుకు వారు సిద్ధంగా లేరు. అదే సంవత్సరానికొకసారి అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.సి.) సమావేశ సందర్భంలో జెనీవా యాత్ర" (వక్కాణింపు చేర్చబడింది) జెనీవాలో ఏటేటా జరిగే ఇంటర్నేషనల్ లేబర్ కాన్ఫరెన్సు భారత కార్మికులకు ఏ విధంగాను ఉపయోగకారిగా లేదు. అంతేగాక భారత కార్మికులకు ప్రాతినిధ్యం వహించవలసిన ప్రతినిధులను భారత కార్మిక సంస్థ ఎ.ఐ.టి.యు.సి. నియమించడం గాక, ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులను ప్రభుత్వమే నామినేట్ చేస్తోంది. అందువలన అంతర్జాతీయ శ్రామిక సమావేశాన్ని (ఐ.ఎల్.సి) ని బహిష్కరిస్తూ ఒక తీర్మానం ఆమోదించబడింది. విట్లీ కమిషన్‌ను బహిష్కరిస్తూ చేయబడిన తీర్మానం వలెనే ఈ తీర్మానం కూడ మితవాదులకు ఆమోదయోగ్యంగా లేదు. సామెత చెప్పినట్లుగా వారు దీనిని ఇక ఏ మాత్రం భరించలేకపోయారు" అని చెప్పారు.

చీలిక వాదుల తమ స్వార్థ ప్రయోజనాలకు కృషి చేయడమే గాక, ఎ.ఐ.టి.యు.సి.లో చీలిక తెచ్చేందుకు నీచమైన విధానాలకు కూడా ఒడిగట్టారు. ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చేందుకు

మితవాద సంస్కరణలవాదులు పన్నిన ఎత్తుగడలకు కొంతమేరకు ప్రగతిశీలవాదులు కూడా బలయ్యారు. చీలికను నివారించడం అసాధ్యమైనప్పటికీ చీలికవాదులు సాకు చూపడానికి అవకాశం ఇవ్వకుండా వుండవలసింది. చివరకు ఉపసంహరింపబడినప్పటికి, ఎ.ఐ.టి.యు.సి.ని పాన్ పసిఫిక్ ట్రేడ్‌యూనియన్ సెక్రటేరియట్‌కు అనుబంధం చేయాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా చీలికవాదులు ఎ.ఐ.టి.యు.సి.ని చీల్చడానికి ఒక సాకుగా వినియోగించుకున్నారు. కమ్యూనిస్టులు పాల్గొన్న సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలకు, ఎ.ఐ.టి.యు.సి.ని అనుబంధం చేయాలని కోరుతూ తీర్మానాలు ప్రవేశపెట్టబడడం వలన తాము ఎ.ఐ.టి.యు.సి. నుండి విడిపోతున్నట్లుగా యుక్తిపరులైన చీలికవాదులు చూపరులకు కనపడేటట్లు ఎత్తుగడలు వేశారు. అప్పటికే ఎ.ఐ.టి.యు.సి. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చీలికవాదులకు మెజారిటీ వున్నందున, ఈ తీర్మానాలను ఓడించదలచుకుంటే మితవాదులు తేలికగా ఓడించగలిగేవారు. కాని విట్లీ కమిషన్‌ను బహిష్కరించాలని కోరుతూ తీర్మానం ఆమోదించబడిన తరువాత మితవాదులు ఎ.ఐ.టి.యు.సి నుండి విడిపోవాలని నిశ్చయించుకున్నారు. అందువలన ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కమ్యూనిస్టుల హస్తగతమైందని ప్రచారంచేసే దురుద్దేశంతో వారు తాము వ్యతిరేకించిన తీర్మానాలకు అనుకూలంగా తామే ఓటు చేశారు. మితవాదులు చేసిన ఈ నీతిబాహ్యమైన పనులను జవహర్‌లాల్ నెహ్రూ తీవ్రంగా విమర్శించారు. ఏమైనప్పటికి భారత కార్మికవర్గ విప్లవకర చైతన్యానికి మూలకారకులు వామపక్షీయులు అనే విషయం ఒప్పుకొని తీరాలి. యువకులకు సహజమైన వారి ఉత్సాహాన్ని ఉద్రేకాన్ని చీలికవాదులు  తమ నీచమైన ఎత్తుగడలకనుకూలంగా ఉపయోగించుకుని యుండవచ్చు.

ఒకవిధంగా రెండవచీలిక మొదటి చీలికకంటే విచారించదగినది. మొదటిచీలిక అతివాద, మితవాద గ్రూపుల మధ్య సంఘర్షణ వలన జరుగగా, రెండవ చీలిక అతివాదులలో చెలరేగిన విభేదాలవల్ల ఏర్పడిన విచారకర పరిణామం. రాజకీయ పోరాటంలో కార్మికవర్గం చోదకశక్తిగా వుండాలనే విప్లవ పంథాకు కట్టుబడిన మార్క్సిస్టులకు, సమరశీల స్వభావం కల్గినవారైనప్పటికీ, భారత జాతీయ కాంగ్రెస్ యొక్క బూర్జువా జాతీయతా వాదానికి ప్రభావితులైన జాతీయ వాదులలోని అతివాదులకు మధ్య చెలరేగిన సంఘర్షణగా యీ రెండవ చీలికను పేర్కొనవచ్చు.

నాగపూర్ సమావేశం సుభాస్ చంద్రబోస్‌ను అధ్యక్షునిగా ఎన్నుకున్నది. ఆ సమయంలో జాతీయ కాంగ్రెస్‌కు విధేయత కల్గిన ఒక బలమైన సెక్షను ఎ.ఐ.టి.యు.సి.లో ఉన్నది. సరిగ్గా ఈ సమయంలోనే ఒకవైపు గాంధీ – ఇర్విన్ ఒప్పందంపై సంతకాలు జరిగి శాసనోల్లంఘన ఉద్యమం విరమింపబడగా, వేరొక ప్రక్క కమ్యూనిస్టు నాయకులు మీరట్ జైలులో మ్రగ్గుతుండడం, భగత్‌సింగ్ తదితర విప్లవ వీరులను ఉరితీయడం జరిగింది. మోసపూరితమైన ఇర్విన్ – గాంధీ రాజీ ఒప్పందాన్ని విమర్శించి దానివలన కలిగే ప్రమాదాలకు వ్యతిరేకంగా కార్మికులను

హెచ్చరించడానికి కమ్యూనిస్టులు ప్రయత్నించినప్పుడు, ఎ.ఐ.టి.యు.సి.లోని వారెవరూ కాంగ్రెస్ విధానాల పరిధిని దాటరాదని కోరుకున్న సుభాస్‌చంద్రబోస్ తదితర జాతీయవాదులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ఎ.ఐ.టి.యు.సి.ని కాంగ్రెస్‌కు జేబుసంస్థగా మార్చటానికి జాతీయవాదులు చేసిన బహిరంగ ప్రయత్నం ఎ.ఐ.టి.యు.సి. స్వతంత్ర ప్రతిపత్తికి భంగం కల్గించే జాతీయవాదుల ఈ ప్రయత్నాలు ఘర్షణకు దారితీయడం అనివార్యమైంది.

కాని కొన్ని ప్రత్యేక కారణాల వలన చివరకు ఎ.ఐ.టి.యు.సి. మరొకసారి చీలికకు గురైంది. ఆర్థిక సంక్షోభ కాలంలో కమ్యూనిస్టులు తదితర అతివాదుల నాయకత్వంలో నున్న దాదాపు అన్ని ట్రేడ్ యూనియన్‌లు ఒక సమ్మె తరువాత మరియొక సమ్మెలో తీవ్రంగా నిర్బంధానికి గురిచేయబడి అణచివేయబడ్డాయి. 1930–31 సం॥లలో కమ్యూనిస్టులు ఒంటెత్తు వాద రాజకీయ విధానం వలన కమ్యూనిస్టుపార్టీ తాను పనిచేస్తున్న ట్రేడ్ యూనియన్లలో కూడా పలుకుబడిని కోల్పోయి ఏకాకి అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఆనాడు సిద్ధాంతపరమైన నిర్ణయాలన్నీ నేరుగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ చేయడం వలన, ఈ పరిస్థితికి భారత కమ్యూనిస్టులు పాక్షికంగా మాత్రమే బాధ్యులు. చివరకు బొంబాయిలోని గిర్నీ కాంగార్ యూనియన్‌ను తిరిగి ఏకం చేయడానికి చేసిన ఐక్యతా ప్రయత్నాలను కూడ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రెస్ అవకాశవాదంగా విమర్శించింది. ఎఐటియుసి కలకత్తా మహాసభ జరిగిన రెండేళ్ళ తర్వాత మాత్రమే ట్రేడ్ యూనియన్ ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

కమ్యూనిస్టులపై దుష్ప్రచారం చేయడం ద్వారా వారిని ఏకాకులను చేసి వారి నుండి ప్రధానంగా బొంబాయి తదితర కేంద్రాల్లోని ట్రేడ్ యూనియన్లను తమ ప్రాబల్యం లోకి తీసుకురావడానికి ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరిగాయి. ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి కంకణం కట్టుకున్న ఎమ్.ఎన్.రాయ్ ముఠా కాంగ్రెస్‌తో పూర్తిగా కలిసిపోయి, ఈ ప్రయత్నాలకు నాయకత్వం వహించింది. బూర్జువా జాతీయ వాదం పట్ల కార్మికుల్లో వున్న భ్రమలను ఉపయోగించుకుని యూనియన్ సభ్యులందరూ బూర్జువా జాతీయ వాదుల బాటలో నడవాలని డిమాండు చేయసాగారు. వీరి కార్మిక వర్గ వ్యతిరేక కార్యచరణకు వ్యతిరేకంగా భారతదేశంలోని కమ్యూనిస్టులు, యువ కార్మికులు ప్రధానంగా బొంబాయిలోని వారు మిక్కిలి పట్టుదలతో సైద్ధాంతిక పోరాటం సాగించవల్సి వచ్చింది. అదే సమయంలో వీరు తమ ఆధీనంలోని ట్రేడ్ యూనియన్లను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అనుయాయుల కుట్ర పూరిత దాడులను కూడ ఎదుర్కొనవల్సివచ్చింది. ఈ రాజకీయ నేపథ్యంలో ఎఐటియుసి రెండవసారి చీలికకు గురయింది.

ఇరుపక్షాలు బలహీనంగానే ఉన్నాయి. కాని రాయ్ అనుచరులు, జాతీయవాదులు కలిసి ట్రేడ్ యూనియన్‌ల నుండి కమ్యూనిస్టులను వెళ్ళగొట్టడానికి కృత నిశ్చయంతో

వున్నారు. ఇందుకోసం వారు కమ్యూనిస్టులను, వారి మద్దతుదారుల పలుకుబడిలోనున్న యూనియన్‌ల బలాన్ని తక్కువచేసి చూపి వారి ప్రతినిధుల సంఖ్యను తగ్గించి ఏదో విధంగా తామే ఆధిక్యతతో నున్నట్లు చూపడానికి అన్ని ప్రయత్నాలు సాగించారు. ముఖ్యంగా కీలకమైన అర్హతల కమిటీ నిర్మాణం విషయంలో జరిగిన వివాదాన్ని పరిష్కరించడంలో యీ మహాసభ అధ్యక్షునిగా శ్రీ సుభాస్ చంద్రబోస్ పాత్ర వివాదాస్పదమైనదే. సాధారణ సభ్యునిగా ఒక ఓటు వేసి. తన పక్షానికి ఆధిక్యత సంపాదించడానికి అధ్యక్షునిగా మరొక ఓటు వేయడం చూస్తే జాతీయవాదులు సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయడానికి కృతనిశ్చయులయ్యారని స్పష్టమవుతుంది.

రాయిస్టులు (ఎం.ఎన్.రాయ్ అనుచరులు) తమ పలుకుబడిలో నున్న గిర్నీ కాంగార్ యూనియన్ గుర్తించబడాలని, కమ్యూనిస్టుల నాయకత్వంలోని గిర్నీ కాంగార్ యూనియన్‌ను కూలద్రోయాలని సంకల్పించారు. అందువలన ఎ.ఐ.టి.యు.సి.లో సంక్షోభాన్ని సృష్టించే దుశ్చర్యకు ప్రధాన పాత్రధారులీ రాయిస్టులే. ఇటు రాయిస్టులనుగాని, అటు కమ్యూనిస్టులుకాని రాజీ ప్రయత్నాలకు సుముఖంగా లేరు. రెండు యూనియన్లను గుర్తించాలనే సూచన చేయాలని ఎవరూ భావించలేదు. దురదృష్టకరమైన, ప్రమాదకరమైన యీ చీలికకు యివన్నీ కారణాలయ్యాయి. ఈ ప్రమాదాన్ని నివారించడానికి ఒక విధంగా ప్రయత్నాలు కూడ జరుగలేదు.

తర్వాత దశలో భారత కార్మికోద్యమం, గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని, కార్మికవర్గ ఐక్యతను పునఃప్రతిష్ఠించడానికి సర్వవిధాలా కృషి చేసింది.

# 15

# ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో పోరాటాలు (1931-36)

## ప్రపంచ ఆర్థిక సంక్షోభం

1924-28 సంవత్సరాలలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించిన స్థిరత్వము వాస్తవానికొక ప్రమాదకర పరిణామం. కాని ఈ పరిస్థితి ఎంతో కాలం కొనసాగక ప్రపంచ పెట్టుబడి విధానం సంక్షోభానికి గురయ్యే పరిస్థితులేర్పడ్డాయి.

1929 సం॥ సెప్టెంబరు, నవంబరు మధ్యకాలంలో అమెరికాలో స్టాక్ మార్కెట్ ఇంతకు ముందెన్నడూ కనీ వినీ ఎరుగని ఆందోళనకర పరిస్థితికి చేరుకుంది. ఇక్కడ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు విఫలమై, వీటి ఛాయలు ఇతర దేశాలకు కూడా వ్యాపించడంతో, ప్రపంచ ఆర్థిక సంక్షోభ ఛాయలు మొట్టమొదటిసారిగా కనపడసాగాయి.

1929-33 సం॥లలో పెట్టుబడిదారీ ప్రపంచం అతి తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. ఇంతటి తీవ్రమైన, వినాశనకరమైన ఆర్థిక సంక్షోభాన్ని అంతకు ముందెన్నడూ పెట్టుబడిదారీ విధానం చవిచూడలేదు. ఇది బూర్జువావర్గ సిద్ధాంతానికి మూలమైన రాజకీయ, ఆర్థిక మూలాలను తీవ్రంగా దెబ్బతీసింది. చివరకు పెట్టుబడిదారీ విధానం సార్వత్రిక సంక్షోభ దశకు చేరుకుంది.

ఈ సంక్షోభం వలన పరిశ్రమలు, వ్యవసాయం, బ్యాంకింగ్ రంగంతో పాటు మొత్తం ఆర్థికవ్యవస్థ, స్వదేశీ విదేశీ వాణిజ్యం, ఒకటేమిటి అన్ని విధాలా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. పెట్టుబడిదారీ ప్రపంచంలో అప్పటివరకు అత్యధికస్థాయిలో నున్న ఉత్పత్తి తగ్గిపోయే పోకడలు కనిపించాయి. 1932 నాటికి పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ ఏనాడూ లేనంత కనిష్ట స్థాయికి దిగజారింది. 1930-33 సం॥ల మధ్య కాలంలో పెట్టుబడిదారీ ప్రపంచంలో పారిశ్రామికోత్పత్తి షుమారు 38 శాతం పడిపోయింది.

పారిశ్రామిక సంక్షోభంతో బాటు, దానితో ఏమాత్రం తీసిపోని సంక్షోభం వ్యవసాయ రంగంలో కూడ సంభవించింది. ఫలితంగా మార్కెట్ల కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోరాటం తీవ్రతరమైంది. వర్సెయిల్స్ ఒడంబడికతో సహా ఇతర అంతర్జాతీయ ఒప్పందాలనన్నింటినీ సామ్రాజ్యవాదులు ఉల్లంఘించడం ప్రారంభించారు. దీనితో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం బహుముఖ సంక్షోభానికి గురయినట్లు స్పష్టమైంది.

పెట్టుబడిదారీ దేశాలలోని సామాన్య ప్రజానీకం ఈ ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభానికి బలిపశువయింది. ఈ సంక్షోభ భారాలను కార్మికవర్గం పైకి నెట్టడానికి బూర్జువావర్గం కార్మికుల జీతాలను తగ్గించడం, విపరీతంగా రిట్రెంచ్‌మెంట్‌కు పాల్పడడంవంటి చర్యలకు పాల్పడింది. అసలే సంక్షోభ భారాలకు నడుం విరిగిన కార్మిక వర్గం మరిన్ని కష్టాలకు గురయింది. నిరుద్యోగం కనీవినీ ఎరుగని తీవ్రదశకు చేరుకుంది.

పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గం, మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు దిగనాసిల్లి పోవడంతో వర్గ పోరాటాలు ఉధృతమయ్యాయి. ఈ సమయంలో సమ్మె పోరాటాలు అత్యధికంగా జరగడమే ఇందుకు నిదర్శనం. 1929-32 మధ్యకాలంలో ప్రపంచంలోని అతి పెద్దవైన 15 పెట్టుబడిదారీ దేశాలలో సుమారు 85 లక్షల మంది పాల్గొన్న 19,000 సమ్మె పోరాటాలు జరిగాయి.

ఒక ప్రక్క పెట్టుబడిదారీ ప్రపంచం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి దిక్కుతోచని స్థితిలో నుండగా, వేరొక ప్రక్క సోవియట్ సోషలిస్టు యూనియన్ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోంది. ఈ సంక్షోభ కాలంలోనే సోవియట్ యూనియన్ మొదటి పంచవర్ష ప్రణాళికను విజయవంతంగా అమలు చేసింది. పెట్టుబడిదారీ విధానంలో పారిశ్రామికోత్పత్తి తీవ్రంగా పడిపోతుండగా సోవియట్ యూనియన్ పారిశ్రామికీకరణ బాటలో బ్రహ్మాండమైన ప్రగతి సాధిస్తోంది. ఈ కాలంలో పెట్టుబడిదారీ విధానం, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థల పని తీరును పోల్చిచూచినట్లయితే సిద్ధాంతపరంగానే గాక, ఆచరణలో కూడ సోషలిస్టు వ్యవస్థ ఉన్నతమైనదని రుజువవుతోంది.

## ఫాసిస్టు శక్తుల విజృంభణ - ఫాసిస్టు వ్యతిరేక పోరాటం

ప్రజానీకంలో గూడుకట్టుకుంటున్న తీవ్ర అసంతృప్తిని మొగ్గలోనే తృంచివేసి, నియంతృత్వాన్ని స్థాపించాలని ప్రయత్నాలు సాగిస్తున్న దోపిడీ వర్గాలు, నానాటికి అభివృద్ధి చెందుతున్న కార్మికవర్గ విప్లవ పోరాటాలను కఠినంగానూ, పాశవికంగానూ అణచివేయ బూనుకున్నాయి. ఇది రాజకీయంగా ఫాసిజం ద్వారా రూపుదిద్దుకున్నది. ఈ ఫాసిజం నిలద్రొక్కుకొనడమే గాక, అనేక దేశాలలోని బూర్జువా సామ్రాజ్యవాదులకు కూడలిగా తయారైంది. ఈ ఫాసిజం గుత్తపెట్టుబడిదారుల అతినీచమైన ప్రగతి నిరోధకపోకడలకు అద్దం పట్టింది. చివరకు ఈ గుత్త పెట్టుబడిదారీ వర్గం పాశవిక పద్ధతులకు, రాజకీయ దుస్సాహసానికి పాల్పడడం

ద్వారా శ్రామికవర్గ విప్లవాన్ని ఓడించేందుకు ఆఖరి ప్రయత్నం చేసింది. ఈ పరిణామాలు అనేక దేశాల్లోని బూర్జువా ప్రభుత్వాలు క్రమక్రమంగా ఫాసిస్టు ప్రభుత్వాలుగా పరిణామం చెంది, ఫాసిస్టు, పార్టీలు త్వరత్వరగా అభివృద్ధి పొందడానికి దారితీశాయి.

ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో ఫాసిజం అత్యంత ప్రజావ్యతిరేక, అమానుషశక్తిగా రూపొంది, 1930వ దశకం ప్రారంభంలో జర్మనీలో ప్రమాదకర స్థాయికి చేరుకుంది.

ఆర్థిక సంక్షోభ తీవ్రతనర్థం చేసుకుని త్యాగాలు చేసి, తాము సాధించుకున్న సదుపాయాలను వదులుకుని, అంతర్యుద్ధాన్ని నివారించవల్సిందిగా, ఆనాడు బూర్జువావర్గంతో వర్గ సామరస్య విధానానికి కట్టుబడిన సోషల్ డెమోక్రాట్లు కార్మికవర్గాన్ని కోరారు. సోషల్ డెమోక్రసీ నాయకులు అవలంభించిన వర్గ సామరస్య, లొంగుబాటు విధానాలు ఫాసిజం అవతరణకు దోహదం చేశాయి. అంతేగాక ఈ విధానాలు కార్మికవర్గంలో చీలికలను తీవ్రతరం చేసి, అసలే ప్రగతి నిరోధకుల దాడులకు గురవుతున్న కార్మికవర్గాన్ని మరింత బలహీనపర్చాయి.

జర్మనీ దేశంలోని, సామ్రాజ్యవాద ప్రగతి నిరోధకులు, భయోత్పాతం సృష్టించి కార్మికవర్గాన్ని అణచివేసేందుకొక అవకాశంగా ఫాసిజం అవతరణను పరిగణించారు. ఈ ఫాసిస్టు ప్రమాదాన్ని ముందుగానే ప్రతిఘటించడానికి ఐక్య పోరాటాలకు జర్మనీ కమ్యూనిస్టు పార్టీ ఎన్నిసార్లు ప్రతిపాదించినప్పటికీ, జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ పదే పదే తిరస్కరిస్తూ వచ్చింది. సోషల్ డెమోక్రసీ పుణ్యమా అని జర్మనీలోని కార్మికవర్గం సుసంఘటితమై మరింత బలోపేతం కావడానికి బదులు దారుణంగా చీలిపోయి ఫాసిస్టు భయోత్పాతానికిగురై సంస్థాపరంగా నిర్వీర్యమైపోయింది. ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులతో ఐక్య కార్యాచరణకు సోషల్ డెమోక్రాట్లు అంగీకరించి యున్నట్లయితే జర్మనీ చరిత్ర మరోవిధంగా వుండేది.

అప్పటకే ఇటలీ కూడా ఫాసిజం ప్రభావానికి లోనయింది. ఈ సమయానికి జర్మనీతోబాటు ముఖ్యంగా ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, గ్రీస్, బాల్టిక్ రాజ్యాలలో ఫాసిజం వ్యాప్తి చెందడం స్పష్టంగా కన్పడింది.

గుత్తపెట్టుబడిదారుల ప్రధాన రాజకీయశక్తిగా ఫాసిజం అవతరించడంతో ప్రపంచ పరిస్థితులలో గణనీయమైన మార్పు వచ్చింది. కాని విప్లవ ప్రతీప (ప్రగతి నిరోధక) శక్తులు ఫాసిజం ప్రజల స్వాతంత్ర్యం, ప్రజాతంత్ర హక్కులపై దాడి చేయడంతో, తమ హక్కుల పరిరక్షణకు పోరాటం సాగించాలనే తపన ప్రజలలో తీవ్రతరం కావడం ప్రారంభమైంది. జర్మనీలోని కార్మికవర్గం, వ్యవసాయ కూలీలు, అభ్యుదయ వాదులైన మేధావులు మొదలైన వారిపై ఫాసిస్టులు సాగించిన పైశాచిక దాడులు, ప్రపంచ వ్యాప్తంగా విప్లవకర కార్మికవర్గానికి, అభ్యుదయవాదులకు కనువిప్పు కల్గించాయి. మధ్యయుగాల నాటి బానిసల వలె హిట్లర్ పాలనలో జర్మనీ దేశం లోని కార్మికులు పని ప్రదేశాలలోనే బందీల వలె ఎక్కువ కాలం గడపవలసి వచ్చేది. కాని కార్మికులను బానిసలుగా మార్చింది ప్రభుత్వమే గాని యజమానులు కాదు. ఇదే విధంగా

వ్యవసాయ కార్మికులను  చట్టప్రకారం గానే పొలాలకు కట్టిపడేశారు. వారు పనుల కోసం పొలాలను వదిలి పట్టణాలకు వెళ్ళడం నిరోధించడం జరిగింది.

ఫాసిస్టు శక్తుల వలన ప్రపంచ శాంతికి తీవ్ర ప్రమాదం ఏర్పడిన  ఈ తరుణంలో 1935సం॥లో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ మహాసభ, ఫాసిజాన్ని ప్రతిఘటించడానికి, ఐక్యకార్యాచరణను నిర్మించవలసిందిగా ప్రపంచ కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. ఐక్య పోరాటాలకు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఇచ్చిన పిలుపును, ఫాసిస్టు ముఠాల దాడులను ప్రతిఘటించడానికి ఆత్మరక్షణ పోరాటాలు జరపడమేగాక, భవిష్యత్తులో ఈ శక్తులపై ప్రతి దాడికి (తిరిగి దాడి చేయడానికి) ప్రారంభంగా కమ్యూనిస్టులు భావించారు.

ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాకుండా నిరోధించడం, ఒక వేళ ఫాసిజం విజయం సాధిస్తే, దానినెలా పడగొట్టాలి అనే విషయాలపై ఇంటర్నేషనల్ సమావేశంలో చర్చలు జరిగాయి. ఈ విషయమై ఈ సమావేశానికి సమర్పించిన ఒక నివేదికలో జార్జి డిమిత్రోవ్ "సత్వరమే మనం నిర్వర్తించవలసిన ప్రథమ కర్తవ్యం (ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా) ఐక్యసంఘటన నిర్మాణం, ప్రపంచవ్యాప్తంగా ప్రతిఫ్యాక్టరీలోనూ, జిల్లాలోనూ, ప్రాంతంలోనూ, దేశంలోనూ కార్మికులలో ఐకమత్యాన్ని సాధించాలి.  జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో శ్రామికవర్గ ఐక్య కార్యాచరణను సాధించడం ద్వారా ఫాసిస్టు దాడులను విజయవంతంగా ప్రతిఘటించడమేగాక, కార్మికవర్గం తనవర్గ శత్రువైన ఫాసిజంపై తిరుగుదాడి చేసేటంత అజేయమైన శక్తిగా రూపొందగలదు" అని పేర్కొన్నారు. అయితే సోషల్ డెమోక్రాటిక్ పార్టీలు, సంస్థలతో ఐక్య కార్యాచరణ సందర్భంగా, బూర్జువా వర్గంతో వర్గ సామరస్యాన్ని ప్రబోధించే సోషల్ డెమోక్రసీ సిద్ధాంతం, ఆచరణలను హేతుబద్ధంగా విమర్శించవల్సిన అవసరం మరింత ఎక్కువగా వుంది.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశంలో జార్జిడిమిత్రోవ్ నివేదికపై ఆమోదించిన తీర్మానంలోని ఐక్య కార్యాచరణ అంశంపై వివరణయిస్తూ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఇంకా యిలా పేర్కొంది. "మితవాద సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకులు ఐక్యకార్యాచరణకు వ్యతిరేకంగా చేసే విపరీత వాదనలలోని ఆంతర్యాన్ని ప్రజలకు తెలియజేయాలి. సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని ప్రగతి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయాలి, అదే సమయంలో సంస్కరణవాదాన్ని వ్యతిరేకించే వారితోనూ, కమ్యూనిస్టులతో ఐక్యసంఘటనకు అనుకూలంగా వున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని వామపక్ష భావాలు గల్గిన కార్యకర్తల తోనూ, నాయకులతోనూ, సంస్థలతోనూ కమ్యూనిస్టులు సన్నిహిత సంబంధాలేర్పరచుకొని వారితో  సహకరించాలి."

అదే సమయంలో కార్మిక వర్గం ఎదుర్కొనే దైనందిన సమస్యలమీద, ఇతర ఆచరణాత్మక డిమాండ్లమీద ఒక ఐక్యసంఘటనను రూపొందించవలసిన ఆవశ్యకతను కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ వక్కాణించింది.  కనీస, ఉమ్మడి కోర్కెల ప్రాతిపదిక మీద ఐక్య కార్యాచరణను

నిర్మించి కార్మికవర్గం ఫాసిజాన్ని ఓడించి, పురోగమించి, తన విప్లవ లక్ష్యాన్ని సాధించగల్గుతుందని కూడ పేర్కొంది.

## ప్రజాపోరాటాల పురోగమనం - జాతీయ కాంగ్రెసు తిరోగమనం

1929లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెసు సమావేశం సంపూర్ణ స్వాతంత్ర్య సాధనను తమ లక్ష్యంగా ప్రకటించింది. దేశంలోని అనేక ప్రాంతాలలో భారత ప్రజానీకం చేసిన తిరుగుబాట్లు జాతీయ కాంగ్రెసు, గాంధీజీ వేసుకున్న పథకాలు, ప్రణాళికలను తలక్రిందులు చేశాయి. కాంగ్రెసు నుండి గాని, గాంధీజీ దగ్గర నుండి గాని ఏ విధమైన సూచనలు, కార్యక్రమాల కోసం ఎదురుచూడక, ప్రజలు తమ మార్గాన్ని తామే ఎంచుకొని, దాని ప్రకారం కార్యాచరణకు పూనుకోవడం ప్రారంభించారు. ఈ విప్లవాత్మకమైన తిరుగుబాట్లతో బాటు పెషావరువద్ద గర్వాలీ సైనికులు ప్రజలపై కాల్పులు జరుపవలసిందిగా తమ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరించి, ప్రజలతో సహకరించారు. భారతజాతి విముక్తికి భవిష్యత్తులో జరుగబోయే పోరాటాల్లో ఈ సంఘటన మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది. హిందువులైన గర్వాలీ సైనికులు ముస్లిం ప్రదర్శకుల మీద కాల్పులు జరుపవలసిందిగా అధికారులు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయ నిరాకరించడమే గాక, ప్రజాసమూహంతో సోదరభావాన్ని వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితి ఎంత తీవ్రమైన మలుపు తిరిగిందంటే పెషావరు నుండి సైన్యాలను ఉపసంహరించుకోవల్సి వచ్చింది. దీనితో 1930 సం॥ ఏప్రిల్ 25 నుండి మే 4వ తేదీ వరకు పెషావరు పూర్తిగా ప్రజల చేతుల్లో వున్నది. దేశ భక్తులైన ఈ గర్వాలి సైనికులు తమ దేశభక్తికి మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. వారిపై కోర్టు మార్షల్ విచారణ జరిపి, వారికి అతి క్రూరమైన శిక్షలు విధించడం జరిగింది.

అదే సంవత్సరం (1930 సం॥) మే నెలలో ప్రముఖ ఉగ్రవాద నాయకుడు శ్రీ సూర్యసేన్ నాయకత్వంలో చిట్టగాంగ్‌లో సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా చెలరేగిన సాయుధ తిరుగుబాటు, బెంగాలు ప్రావిన్స్‌ను కుదిపివేసింది. ఇంతేగాక ఇదే నెలలో గాంధీజీని అరెస్టు చేయడంతో బొంబాయి ప్రెసిడెన్సీలో పెద్దదైన షోలాపూర్ పారిశ్రామిక కేంద్రంలో కార్మికులు తదితర కష్టజీవులు మిలిటెంట్ పోరాటం సాగించి బ్రిటిష్ ఆఫీసర్లను, స్థానిక పోలీసులను నగరం నుండి వెళ్ళగొట్టి విప్లవ ప్రభుత్వాన్ని నెలకొల్పారు. వారు సైన్యాలతో వారం రోజుల పాటు సాగించిన వీరోచిత పోరాటంలో కూడా జరిగింది.

## టైమ్స్ ఆఫ్ ఇండియా ఈ విధంగా రిపోర్టు చేసింది :

"గురువారం నాడు షోలాపూర్‌లో ఆవేశపూరితంగా వున్న ప్రజలు పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి, పోలీస్ జాకీలను, సెషన్స్‌కోర్టును దగ్ధం చేసి, అన్ని రకాల అరాచకాలకు పాల్పడడంతో అల్లర్లు చెలరేగాయి. బహిరంగంగా వీధుల్లోనే పోలిసులను చంపి దగ్ధం చేశారు. సత్యాగ్రహాలు

తాటిచెట్లు నరక కుండా అడ్డగించే ప్రయత్నాలు చేస్తున్న పోలీసు బృందం మీద సంఘటితంగా వున్న ఒక గుంపు దాడి చేసింది. కొద్ది సంఖ్యలో వున్న పోలీసుల మీద రాళ్ళురువ్వారు. గుంపును చెదరగొట్టడంలో విఫలమైన పోలీసులు గుంపు మీద రెండుసార్లు కాల్పులు జరిపారు. అయినా పోలీసులు వెనుకంజ వేయవల్సి వచ్చింది. ఎంతమందికి గాయాలైంది తెలియదుకాని, చాలామంది పోలీసులు హతులయ్యారు. దాడి చేసిన వారిలో నల్గురు మృతి చెందగా, 14 మంది గాయపడ్డారని మా విలేఖరి తెలిపాడు. అయితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా వున్నట్లు మరొక వార్త ద్వారా తెలుస్తోంది. సాయంత్రం చాలా ఆలస్యంగా నగరంలోని యూరోపియన్ మహిళలు, పిల్లలను ఖాళీ చేయించి, సుమారు 200 మందితో రాత్రిపొద్దు పోయిన తర్వాత ప్రత్యేక రైల్లో పూనా నుండి తరలించారు. పరిస్థితిని చక్కదిద్దలేకపోయిన పోలీసులు పూనా, అహ్మద్ నగర్‌ల నుండి అదనపు బలగాలను సైన్యం కోరుతూ టెలిగ్రాం పంపారు. గురువారంనాడు షోలాపూర్ నుండి బొంబాయికి అందిన ఫోన్ సమాచారం ప్రకారం 25 మంది చనిపోగా, వందమంది గాయపడ్డారు. మధ్యాహ్నం వరకు కాల్పులు కొనసాగుతున్నాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా మరొక కథనంలో ఈ విధంగా పేర్కొంది. “1827 నుండి పాత రికార్డులున్న జిల్లా జడ్జి కోర్టు భవనాలుతో పాటు నగరంలోని సివిల్ కోర్టులు పోలీస్ చౌకీలు దగ్ధమయ్యాయి.”

పత్రికా వార్తల ప్రకారం, దాడి చేసిన వారిలో, కాల్పుల్లో 50 మంది చనిపోగా, 400 మంది గాయపడ్డారు. టైమ్స్ ఆఫ్ ఇండియా చాలా దిగ్భ్రాంతితో ఇలా వ్రాసింది.

“నగరంలో నిజానికి పాలనా వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయింది. షోలాపూర్‌ను మిలిటరీ హస్తగతం చేశారు. మార్షల్‌లా ప్రకటించారు అని పేర్కొంటూ అదే ఉత్కంఠంతో ఇంకా ఇలా వ్రాసింది.

బ్రిటీషు వారి పాలన అంతమైంది, గాంధీ రాజ్యం వచ్చిందని రైతాంగం, మిల్లు కార్మికులు, షోలాపూర్‌లోని చిన్న వ్యాపారస్తుల్లో నమ్మకం కల్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయి”. హింసాయుత పద్ధతుల ద్వారా, షోలాపూర్‌లోని కార్మికవర్గం, చిన్న దుకాణదార్లు, ఇతర మధ్య తరగతి ప్రజలు, రైతాంగంతో కలిసి, షోలాపూర్ నగరాన్ని ఎలా తమ అధీనంలో వుంచుకున్నదీ ఈ పత్రిక సుదీర్ఘంగా వివరించింది. వారం రోజుల పాటు సాగిన వీరోచిత పోరాటం తర్వాత పెద్ద ఎత్తున మిలటరీ బలగాలు సమీకరించచడడంతో షోలాపూర్ ప్రతిఘటన కుప్పకూలింది.

షోలాపూర్ యుద్ధంలో ఎందరు కార్మికవర్గ యోధులు అమరులైందీ ఇప్పటికీ తెలియదు. లెక్కకు రాని ఈ భరతమాత బిడ్డల గురించిన వివరాల గురించి అధికార సమాచారం లేకపోగా, బూర్జువా చరిత్రకారులు కూడ ఈ వివరాలు సేకరించే శ్రమ తీసుకోలేదు. ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వారిపట్ల సామ్రాజ్యవాదులు, ఎంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించిందీ, వీరిపట్ల కాంగ్రెస్ ఎంత నిరాసక్తంగా వున్నదీ తరువాయి పరిణామాలు వెల్లడించాయి. ప్రజానీకం పెద్ద ఎత్తున ప్రదర్శనలు, హర్తాళ్‌ల ద్వారా నిరసన తెల్పే ప్రయత్నాలు చేసినప్పటికీ, సామ్రాజ్యవాద ప్రభుత్వం బూటకపు విచారణ జరిపి, కార్మికవర్గ యోధులను ఉరితీయడంలో విజయవంతమైంది.

ఇంత జరుగుతున్నప్పటికీ కాంగ్రెస్ కనీసం ప్రతిఘటించే ప్రయత్నం కూడ చేయలేదు. 1931 జూలై 12న, తిరుగుబాటుకు నాయకత్వం వహించిన మల్లప్పధన్ సెట్టి, ఖుర్భాన్ హుస్సేన్, శ్రీకృష్ణ సర్ధా, జగన్నాథ్ షిందేలను ఉరితీశారు.

రక్తపాతంతో కూడిన యీ తిరుగుబాట్లతో బాటు, బెంగాలు, బొంబాయిలలో కార్మికుల ప్రదర్శనలు, రైతాంగం సాగించిన పన్నుల నిరాకరణ వుద్యమం - ఇంతెందుకు దేశవ్యాప్త విప్లవ తిరుగుబాట్లు సామ్రాజ్యవాదులను తీవ్రంగా కలవరపరచాయి. ఇంతేగాక యీ విప్లవ పోరాటాల వెల్లువ గాంధీజీ మరియు కాంగ్రెసు నాయకత్వపు రాజకీయ అంచనాలను సంపూర్ణంగా తలక్రిందులు చేసింది.

గర్వాలీ సైనికులు తమ (సోదర ప్రజలపై) దేశ ప్రజలపై కాల్పులు జరపడానికి నిరాకరించిన ఘట్టం నిజమైన దేశభక్తికి మచ్చుతునకగా భారత ప్రజల హృదయాలలో చిరకాలం నిలిచిపోతుంది. కాని దురదృష్టవశాత్తు గాంధీజీ ఈ చర్యకు అసమ్మతి తెలిపారు. ఈ గర్వాలీ వీరుల వీరోచిత కృత్యాన్ని గాంధీజీ బహిరంగంగానే ఖండించారు. ఆయన యిలా చెప్పాడు; "కాల్పులు జరపవలసిందిగా ఆదేశింపబడిన సైనికుడు అట్లా చేయనట్లయితే తాను తీసుకున్న ప్రతిజ్ఞను భంగపరచి అవిధేయత అనే ఘోరమైన నేరం చేసినవాడవుతాడు."

భారతదేశ చరిత్రలో ఇది మిక్కిలి ప్రాముఖ్యత కల్గిన సమయం. ఈ సమయంలో ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష, జాతీయతాభావం ఉన్నత స్థాయికి చేరుకున్నాయి. ప్రజానీకాన్ని త్వరితగతిన పోరాటోన్ముఖులుగా చేసి, సామ్రాజ్యవాదులను ఏకాకులను చేసి స్వాతంత్ర్య సముపార్జనకు ముందడుగువేసే అవకాశాలు ఏర్పడ్డాయి. కాని ఈ పరిస్థితులు గాంధీజీ, జాతీయ కాంగ్రెస్ నాయకత్వం ఊహించిన విధంగా కాక భిన్నంగా వున్నాయి. ఈ విప్లవాత్మకమైన పురోగతిని ముందుగానే అడ్డుకోవడం గాంధీజీకి ఒక జటిల సమస్యగా తయారైంది. అందువలన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం మీద భారత బూర్జువా వర్గం ఆధిపత్యాన్ని పదిలపరచి, నానాటికి ఉధృతమవుతున్న ప్రజా పోరాటాలను అదుపు చేయడానికి గాంధీజీ తన శక్తియుక్తులతో ఒక ఉపాయం ఆలోచించాడు. శ్రామిక ప్రజానీకం ముఖ్యంగా పారిశ్రామిక కార్మికులు పాల్గొనడానికి వీలులేని విధంగా ఒక కార్యక్రమాన్ని ఆయన రూపొందించాడు. అదే దండి సత్యాగ్రహ కార్యక్రమం. చాలా పరిమితులు గల్గిన, నిరపాయకరమైన ఈ శాసనోల్లంఘన కార్యక్రమాన్ని గాంధీజీ అతి నైపుణ్యంతో తయారుచేశాడు. సముద్రతీరాన వున్న దండివద్ద సాగిన యీ సత్యాగ్రహానికి విశేష ప్రచారం ఇవ్వబడింది. కాని ఏప్రిల్ 6వ తేదీన గాంధీజీ తాను ఎంపిక చేసుకున్న కొద్దిమంది అనుచరులతో ఉప్పును ఉడికించే కార్యక్రమాన్ని ప్రారంభించడంతో ప్రేక్షకపాత్ర వహించడానికి మాత్రమే అనుమతించబడిన భారత ప్రజానీకం దేశవ్యాప్తంగా పెద్ద పెట్టున విరుచుకుపడింది. ఈ పరిణామం ప్రభుత్వాన్ని జాతీయ కాంగ్రెసును కూడా ఆశ్చర్యచకితులను చేసింది. ఈ సత్యాగ్రహాన్ని ప్రజలపై పూర్తి అదుపు గలిగిన పరిమితస్థాయి శాసనోల్లంఘనంగా గాంధీజీ భావించారు. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని "ఒక

పిచ్చివాని సాహసం"గా భావించి, ఈ ఉద్యమం పూర్తిగా విఫలమవుతుందనీ," దీనిని గాంధీజీ తనంతట తానే విరమించడమో లేక దానంతటదే, నీరసించి నశించిపోవడమో జరుగుతుందని సంపూర్ణంగా నమ్మింది.

కాని భారత ప్రజానీకం ఈ రెండు అంచనాలను పూర్తిగా తలక్రిందులు చేసింది. అదుపు తప్పిన ఈ ప్రజల తిరుగుబాటు వెల్లువను చూసి ఆందోళన చెందిన వలస ప్రభుత్వం పాశవిక అణచివేత చర్యలకు పూనుకున్నది. పోలీసులు, సైన్యాలు ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు, లాఠీచార్జీలు జరపడమేగాక, అనేక వేల మంది దేశభక్తులు జైళ్ళలో కుక్కబడ్డారు. తన అంచనాలు తలక్రిందులు గావడంతో భంగపడిన గాంధీజీ కూడ మే 5 వ తేదీన అరెస్టు చేయబడ్డాడు.

మరల ప్రజా ఉద్యమాలు తీవ్రతరమయ్యాయి. అసలే ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు తీవ్రతరమవుతున్న ఈ సమయంలో గాంధీజీ అరెస్టు వారిని మరింత తీవ్రమైన నిరసన చర్యలకు పురిగొల్పింది. ఉప్పెనలా చెలరేగిన కార్మిక వర్గ సమ్మె పోరాటాలు, హర్తాళ్ళతో దేశం అట్టుడికి పోయింది. షోలాపూర్‌లోని కార్మికవర్గం చేసిన తిరుగుబాటు కార్మికవర్గం సాగించిన మిలిటెంట్ రాజకీయ పోరాటాలన్నింటిలో ఎన్నదగినది. కాని ఈ సందర్భంలో ప్రభుత్వ చర్యలను నిరసించడానికి ప్రజలెన్నుకున్న పద్ధతి గాంధీజీ రాజకీయ నియమాలకు విరుద్ధంగా వున్నది.

ప్రజానీకం ప్రదర్శించిన ఈ తిరుగుబాటు వైఖరి సామ్రాజ్యవాదులకు గంగవెర్రులెత్తించింది. ప్రభుత్వం ప్రజలపై విచ్చలవిడిగా నిర్బంధాన్ని సాగించింది. ప్రభుత్వం సైనిక తిరుగుబాటునెదుర్కొనే సందర్భాలలో వలెనే ఈ ప్రజా పోరాటాల నణగద్రొక్కడానికి క్రూరమయిన ఆర్డినెన్సులను ఒకదానివెంట ఒకటి జారీ చేసింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 60వేలమంది ప్రజలు నిర్బంధించబడ్డారు. వాస్తవానికి ఈ సంఖ్య తప్పనిసరిగా ఎక్కువగానే వుంటుంది. మొత్తం 90 వేలమంది స్త్రీలు, పురుషులు, బాలలు అరెస్టు చేయబడి వుంటారని జాతీయ కాంగ్రెస్ అంచనా వేసింది. ఒక ప్రక్కన ప్రభుత్వం అణచివేత విధానాలను కొనసాగిస్తూనే వేరొక ప్రక్క కుటిల సామ్రాజ్యవాద రాజకీయ నాయకులు భారతీయులకు రాయితీల ఎరవేయచూచారు. 1930 సం॥ మధ్య కాలంలో సైమన్ కమిషన్ నివేదిక ప్రకటించబడింది. భారతదేశంలో "బాధ్యతాయుత స్వపరిపాలన" ఏర్పాటు చేయడానికంటూ నవంబర్ నెలలో లండన్‌లో బ్రిటిష్ ప్రధాని రామ్సే మెక్ డొనాల్డ్ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశాడు. ప్రజల మనోభావాల కనుగుణంగా జాతీయ కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది.

1931 జనవరి 26న గాంధీజీతో బాటు ఇతర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు విడుదల చేయబడ్డారు. గాంధీజీకి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్‌కు మధ్య సుదీర్ఘ కాలం సంప్రదింపులు జరిగాయి. మార్చి 5వ తేదీన గాంధీ – ఇర్విన్ ఒప్పందంపై సంతకాలు జరగడంతో పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు జాతీయ కాంగ్రెస్ ప్రకటించింది. కాని, ఒప్పందం కుదిరినప్పటికీ

ప్రభుత్వం మాత్రం తన అణచివేత విధానాలను కొనసాగిస్తూనే యున్నది. ప్రత్యేక ఆర్డినెన్స్ క్రింద అరెస్టు చేయబడిన వారు విడుదల కాలేదు."మీరట్ కుట్ర కేసు"లో శిక్ష విధింపబడిన వారిని విడుదల చేయవలసిందిగా గాంధీజీ ప్రభుత్వాన్ని కనీసం అడగనయినా అడుగలేదు. దేశ వ్యాప్తంగా ప్రజానీకం ముక్తకంఠంతో కోరినప్పటికీ విప్లవవీరుడు భగత్‌సింగ్ మరణశిక్ష రద్దు చేయబడలేదు. అంతేగాక గాంధీ ఇర్విన్ ఒడంబడికపై సంతకాలు జరిగిన వెంటనే మార్చి 23న భగత్‌సింగ్‌ను సామ్రాజ్యవాదులు ఉరితీశారు. ఈ పరిస్థితులలో ఈ ఒప్పందం విషయంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో చీలిపోయే పరిస్థితులేర్పడ్డాయి. పరిస్థితులను సరిదిద్దేందుకు గాంధీజీ చాలా శ్రమ పడవలసి వచ్చింది. మార్చి 31 న కరాచీలో హడావిడిగా కాంగ్రెస్ సమావేశాన్ని ఏర్పాటు చేసి గాంధీజీ ఆ ఒప్పందాన్ని ఆమోదింపజేశాడు. లాహోర్ మహాసభలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించిన కాంగ్రెస్‌లోని అతివాదులు ఈ విధంగా కరాచీ మహాసభలో వెనక్కి నెట్టబడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ "మానసిక సంఘర్షణకు, శారీరక అలసటకు" గురయ్యాడు. సుభాస్ చంద్రబోస్ ఈ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ మహాసభతో కాంగ్రెస్ గత రెండు మహాసభల నాటి రాజీ ధోరణులకు తిరిగి నెట్టబడింది. గాంధీజీ విజయం సాధించాడు.

1931 సెప్టెంబరు నుండి డిశంబరు వరకు లండన్‌లో జరిగిన రెండవ రౌండ్‌టేబుల్ సమావేశంలో గాంధీజీ జాతీయ కాంగ్రెస్‌కు ఏకైక ప్రతినిధిగా పాల్గొన్నాడు. బ్రిటిషు ప్రభుత్వం ఇండియా నుండి తన ఇష్టప్రకారంగా ఎంపిక చేసుకున్న కొందరు ఇచ్చకపు రాయుళ్ళతో జరిపిన ఈ సమావేశం ఒక ప్రహసనంగా ముగిసింది. భారత ప్రభుత్వ చట్టాన్ని అమలు చేసి ప్రాంతీయ స్వయం పాలనాధికారాలతో ఫెడరల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని మెక్‌డొనాల్డ్ ప్రకటించాడు. ప్రజలు యింత కాలంగా సాగించిన వీరోచిత పోరాటాల లక్ష్యమైన "స్వాతంత్ర్యసాధన" పూర్తిగా వదిలివేయబడింది.

కాంగ్రెస్‌తో ఎన్ని ఒప్పందాలు చేసుకున్నా, మరెన్ని రౌండ్ టేబుల్ సమావేశాలు జరుపుతున్నప్పటికీ ప్రభుత్వం తననిర్బంధ విధానాలను మాత్రం అప్రతిహతంగా కొనసాగిస్తూనే యున్నది. 1932-33 సం॥లో సుమారు లక్షా, ఇరవైవేల మంది స్వాతంత్ర్య యోధులు అరెస్టు చేయబడ్డారు. దీనిని బట్టి ఒప్పందాలు చేసుకుని జాతీయ కాంగ్రెసు అధికారికంగా ఉద్యమాన్ని నిలిపివేసినప్పటికీ, ప్రజలు ఉద్యమాలను నిరాఘాటంగా కొనసాగించారని స్పష్టమవుతుంది. సామ్రాజ్యవాదులు ఒప్పందాలు, రౌండ్ టేబుల్ సమావేశాల ద్వారా తమను మోసం చేస్తున్నారన్న భావనలు ప్రజల్లో నెలకొనడంతో, బెంగాల్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు మరోసారి వెల్లువెత్తాయి. 1933 మే నెలలో గాంధీజీ జైలులో వుండగానే నిరాహారదీక్ష ప్రారంభించాడు. ఇది ప్రభుత్వానికి గాని ప్రభుత్వ విధానాలకు గాని వ్యతిరేకంగా మాత్రంకాదు. హరిజనుల (అస్పృశ్యత) సమస్య మీద మరింత పట్టుదలతో పనిచేసే లక్ష్యంతో తాను, తన సహచరులు పవిత్రులు కావాలని ఈ నిరాహారదీక్ష సాగించాడు. వెంటనే ప్రభుత్వం గాంధీజీని విడుదల చేసింది. జైలు నుండి

బయటకు రాగానే గాంధీజీ శాసనోల్లంఘన (పన్నుల నిరాకరణ) ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలుపుజేయవలసిందిగా కాంగ్రెసుకు సిఫార్సుచేస్తూ ఒక ప్రకటన చేశారు. 1934 ఏప్రిల్ నెలలో అంటే సరిగ్గా ఒక సంవత్సరం తరువాత ఈ ఉద్యమం పూర్తిగా నిలిపివేయబడింది.

ఒకవైపు కాంగ్రెసు నాయకత్వం తిరోగమిస్తుండగా కరాచీలో జరిగిన ఆలిండియా వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ, ఆలిండియా యూత్ లీగ్‌ల సమావేశాలు కాంగ్రెసు నిర్ణయాలతో పూర్తిగా విభేదించాయి. కార్మికులు, రైతాంగం సమస్యల మీద ఆలిండియా పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ మహాసభ, ప్రాథమిక హక్కులు, ఆర్థిక విధానాలకు సంబంధించి కాంగ్రెస్ చేసిన తీర్మానం కంటె ప్రగతిశీలమైన కార్యక్రమం ఆమోదించింది. ఆలిండియా యూత్ లీగ్ సంపూర్ణ స్వాతంత్ర్యం (స్వరాజ్యం) వచ్చేవరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చింది. గాంధీ – ఇర్విన్ ఒప్పందాన్ని, రెండవ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాలని కాంగ్రెసు తీసుకున్న నిర్ణయాన్ని ఈ రెండు సమావేశాలు తీవ్రంగా ఖండించాయి.

ఇంతలో 1932 నవంబరు నెలలో మూడవ రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో ఏర్పాటు చేయబడింది. దీనికి హాజరు కారాదని కాంగ్రెసు నిర్ణయించింది. ప్రభుత్వ తైనాతీలు కొందరు హాజరయిన ఈ  సమావేశం కేంద్రంలో ఒక ఫెడరల్ గవర్నమెంటును ఏర్పాటుచేసి, పరిమిత స్థాయిలో స్వయం ప్రతిపత్తి గల్గిన ప్రాంతీయ ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తూ 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని మరికొన్ని సవరణలతో ఆమోదించాలనే బ్రిటిషు ప్రభుత్వ నిర్ణయాన్ని ఆమోదించింది. ఈ 1935 భారత ప్రభుత్వ చట్టం కాంగ్రెసు వారికి కూడ నిరాశ కల్గించింది. స్వరాజ్యం అరణ్యరోదనమైంది. పరిమిత స్థాయిలో జరిగిన ఓటింగు (ఆదాయం, విద్య మొదలైన వాటిపై ఆధారపడిన ఎన్నికల పద్ధతి) పద్ధతిలో ఎన్నికైన మంత్రులు భారత దేశాన్ని పరిపాలించే బ్రిటిషు మంత్రివర్గంలో చేరారు. విదేశీపాలన కొనసాగుతుంది. 1934 జూన్‌నెలలో జాతీయ కాంగ్రెసుపై నిషేధం అధికారికంగా తొలగించబడి, వెంటనే జూలై 23వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ నిషేధించబడింది. ప్రత్యేక ఎమర్జన్సీ అధికారాల చట్టం ప్రకారం కమ్యూనిస్టు నాయకులనేక మంది అరెస్టు చేయబడ్డారు.

1935 భారత ప్రభుత్వ చట్టప్రకారం జరిగిన ప్రాంతీయ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్‌కు ప్రజల నుండి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. బెంగాలు, పంజాబులతో సహా ఏడు రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రి వర్గాన్ని నిర్మించగలిగింది. మరి రెండు రాష్ట్రాలలో సంకీర్ణ మంత్రివర్గాలను ఏర్పరచగలిగింది. బెంగాలు, పంజాబు రాష్ట్రాలలో మాత్రం కాంగ్రెసేతర ప్రభుత్వాలేర్పడ్డాయి. దీనితో ఒక నూతన పరిస్థితి ఏర్పడింది.

1934 సెప్టెంబరు – నవంబరు మధ్యకాలంలో గాంధీజీ కాంగ్రెసు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాచేశారు. కాంగ్రెసు వారిలో అధిక సంఖ్యాకులు అహింసాసిద్ధాంతాన్ని అంగీకరించారుగాని దానిని ప్రాథమిక సిద్ధాంతంగా భావించలేదని తన రాజీనామాకు కారణంగా చెప్పారు.

1929 సం॥లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెసు సమావేశం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తరువాత ఈ లక్ష్యసాధనకు మూడు నాలుగు సంవత్సరాలపాటు బ్రహ్మాండమైన పోరాటాలు జరగడం, (గాంధీ–ఇర్విన్) ఒక ఒప్పందంపై సంతకాలు జరిగి ఆ లక్ష్యానికి (స్వరాజ్య సాధన) తిలోదకాలివ్వడం, పన్నుల నిరాకరణ ఉద్యమం (శాసనోల్లంఘన) విరమించబడడంతో ఇక గాంధీజీ కాంగ్రెసుకు రాజీనామా చేసి రంగం నుండి నిష్క్రమించే సమయమాసన్నమైంది. కాని ఆయన శాశ్వతంగా రాజకీయాలనుండి తప్పుకోలేదు. ఏదైనా క్లిష్టపరిస్థితులలో అవసరాన్నిబట్టి రంగప్రవేశం చేయడానికి సిద్ధంగానే వున్నాడు. అందువలననే తిరిగి 1939 - 40 మరియు 1942 సం॥లలో రాజకీయాలలో పునఃప్రవేశించి నాయకత్వాన్ని చేపట్టాడు.

1930–31 సం॥లలో ప్రారంభమైన ప్రజా పోరాటాల వెల్లువ అప్రతిహతమైనది. దానిని మధ్యలో ఆపడం ఎవరితరం కాలేదు. ప్రజానీకంతో బాటు కార్మికవర్గం కూడ భాగస్వామి కావడంతో ఈ పోరాటాలు సమరశీల స్వభావాన్ని సంతరించుకున్నాయి. తరువాత దశకంలో ప్రజానీకంతోబాటు, కార్మికవర్గం సాగించిన బృహత్తరమైన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వెల్లువ బ్రిటిష్ ప్రభుత్వాన్ని పునాదులంట కదిలించి వేసింది.

## ప్రపంచ ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మికవర్గ స్థితిగతులు

ప్రపంచ వ్యాపిత ఆర్థిక సంక్షోభం వలన భారత దేశంలోని వలస ఆర్థిక వ్యవస్థ తీవ్ర పరిణామాలకు గురయింది. వ్యవసాయోత్పత్తుల ధరలు విపరీతంగా పడిపోవడంతో 80 శాతం వరకు ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడిన భారతదేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి ఏర్పడింది. కొనుగోలుశక్తి పూర్తిగా పడిపోవడంతో రైతాంగం పరిస్థితి వూహించరానంత ఘోరంగా తయారయింది.

ఈ సంక్షోభ భారాలను ప్రజలమీదకు నెట్టడానికి బ్రిటిషు ప్రభుత్వం మరింత నష్టదాయకమయిన అనేక ఆర్థిక చర్యలు ప్రవేశపెట్టింది. సామ్రాజ్యవాదులకు (బిటిష్ వారికి) ప్రాధాన్యత ఇవ్వాలనే వివక్షతతో కూడిన విధానాన్ని భారత ఉక్కు, జౌళి పరిశ్రమలకు విస్తరింపజేశారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో తీవ్ర నిరసన ఎదురయినప్పటికీ బ్రిటిషు ప్రభుత్వం అట్టావా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేసింది. దీనితో భారతదేశ ఆర్థిక పరిస్థితి మరింత క్షీణదశకు చేరుకుంది.

భారతదేశంలోని కాటన్ టెక్స్‌టైల్ పరిశ్రమలో తీవ్ర మాంద్యం నెలకొన్నది. (నిల్వలు అధికమయ్యాయి. ప్రజల కొనుగోలుశక్తి పడిపోయింది) సామ్రాజ్యవాదులు తమ దేశంలో తయారయ్యే వస్తువులకే మార్కెటు వుండేటట్లు చేయడం వలన ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ భారాలను కార్మిక వర్గంపైకి నెట్టడం కోసం భారత పెట్టుబడిదారులు రిట్రెంచ్‌మెంట్‌కు తలపడ్డారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం నెలకొనకముందే ఆరంభించబడిన "రేషనలైజేషన్"

స్కీముల ద్వారా బొంబాయిలోని ఒక్క జౌళి పరిశ్రమలోనే లక్షా 40 వేలమంది కార్మికులలో 10,000 మందిని రిట్రెంచ్ చేశారు. కొందరు మిల్లు యజమానులు పనిగంటలు తగ్గించారు. మరి కొందరు మిల్లులను మూసివేశారు. ఒక్క 1934 సం॥లోనే బొంబాయిలో సుమారు సగం మిల్లులు మూతపడి 61 వేలమంది కార్మికులు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. మిల్లు యజమానులు కార్మికుల జీతాలను కూడ తగ్గించడం ప్రారంభించారు. 1931 మే నెలలో కొన్ని మిల్లులో ప్రారంభమైన ఈ జీతాల్లో కోత 1934 ఏప్రిల్ నాటికి దాదాపు 42 మిల్లులలోని కార్మికుల జీతాల కోతకు దారితీసింది. 1926 వేతనాలను ప్రాతిపదికగా తీసుకుంటే 1933 డిసెంబర్ నాటికి 16,94 శాతం, 1934 ఏప్రిల్ నాటికి 21 శాతం మేరకు కార్మికుల జీతాలు తగ్గాయి. దీనితో ప్రేరణ పొందిన అహమ్మదాబాద్ మిల్లు యజమానులు కార్మికుల జీతాలను 20 శాతం తగ్గించారు. దీనితో యిది ఒక పద్ధతిగా తయారై ఇతర కేంద్రాలలోని జౌళి పరిశ్రమలో కూడ జీతాలను దారుణంగా తగ్గించబడ్డాయి. ఈ కోత మద్రాసులో 15 శాతం, షోలాపూర్‌లో 12 1/2 శాతం, నాగపూర్‌లో 20 శాతం, అకోలాతో పాటు మరి ఒకటి, రెండు కేంద్రాలలో 25 శాతం మేరకు జీతాల్లో కోత విధించారు.

ఇదే రకమైన దాడులు బెంగాల్‌లోని జూట్ మిల్లు కార్మికులపై కూడ సాగాయి. 1929 సం॥లో 3,47,000 మంది జూట్ కార్మికులున్నట్లు వైట్లీ కమిషను అంచనా వేసింది. 1934లో ప్రభుత్వం ప్రకటించిన లెక్కల ప్రకారం 2,63,739 మంది మాత్రమే ఉన్నారు. అంటే యీ రెండు అంచనాల ప్రకారం తేడా వున్న యీ 83,000 మంది కార్మికులు 1929 – 1934 సంవత్సరాల మధ్య ఐదేండ్ల కాలంలో రిట్రెంచ్ చేయబడ్డారన్న మాట. దీనితో బాటు అనేక మిల్లులలో రెండు షిఫ్టులకు బదులుగా ఒకే షిఫ్టు పద్ధతిని ప్రవేశపెట్టడం ద్వారా మరో 25 నుండి 33 శాతం వరకు కార్మికులు పనులు పోగొట్టుకున్నారు.

కార్మికుల జీతాలు గూడ తగ్గించబడుతున్నాయి. భవిష్యత్తులో జూట్ కార్మికులపై జరగబోయే దాడులను గురించి 1931 లోనే "అమృతబజార్" పత్రిక హెచ్చరించింది. ఆ పత్రిక ఇలా వ్రాసింది. "జూట్ మిల్లు యజమానులు ఇప్పటికే తీసుకున్న కొన్ని చర్యలు తీసుకొనగోరుతున్న మరికొన్ని చర్యలవలన జూట్‌మిల్లు కార్మికుల పరిస్థితి చాల ఆందోళనకరంగా వున్నది. వాణిజ్యం పడిపోయింది. మిల్లు యజమానులు సుమారు 62 మిల్లులలోని 40 వేల మంది కార్మికులను తొలగించేందుకు నిర్ణయించారు. మిల్లులలో ప్రవేశపెట్టబడిన క్లిష్టమైన వేతన విధానం పుణ్యమా అని మిల్లు యజమానులు చేసే మోసం వారు చేయ సంకల్పించిన రిట్రెంచ్‌మెంటు వలన మాత్రమే స్పష్టంగావడం లేదు. సుమారు 40 వేల మంది స్త్రీ, పురుష కార్మికులు ఉద్యోగాలను కోల్పోతారు. ఉద్యోగాలలో నున్న వారు గతంలో పొందుతున్న వేతనాలను పొందుతారా? అంటే అదీ లేదు. ఇక్కడ కూడ మిల్లు యజమానులు హెషియన్ (ముతకగడ్డను నేసే) నేత పని వారికి తక్కువ జీతాలు చెల్లించ దలచుకున్నారు. ఈ హెచ్చరిక నిజమయింది. 1928–29 సంవత్సరాలలో స్పిన్నరుకు 6 నుండి 7 రూ॥ల కూలి వుండగా

1935–36 నాటికి అది 5 నుండి 6 రూపాయలకు తగ్గించబడింది. ఇదేకాలంలో 10 నుండి 12 రూపాయల వరకు వున్న వీవర్ల (నేత పనివారల) జీతాలు 7 నుండి 9 రూ॥ల వరకు తగ్గాయి. 7 నుండి 8 రూ॥ల వరకు వున్న నైపుణ్యంలేని కార్మికుల జీతాలు 2 నుండి 7 రూ॥లకు పడిపోయాయి. మొత్తం ప్రపంచం మీదనే గుత్తాధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ పరిశ్రమాధిపతులు సమంజసమైన లాభాలు సంపాదించాలనే మిషతో ఈ ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మికుల వేతనాలను దారుణంగా తగ్గించి వేశారు.”

భారత రైల్వేలలో కూడ పెద్ద ఎత్తున రిట్రెంచ్‌మెంట్ ప్రారంభమైంది. 1930 – 31లో మొత్తం 7,81,859 మంది రైల్వే కార్మికులుండగా మరుసటి సంవత్సరానికి యీ సంఖ్య 7,30,290కి పడిపోయింది. అంటే 51,569 మంది కార్మికులు పనులు కోల్పోయారు. దీనితోబాటు ఖరగ్‌పూర్, లీలువా, గోల్డెన్‌రాక్, పరెల్, అజ్మీర్ రైల్వే వర్క్ షాపుల్లో కూడ స్థానికంగా పెద్ద సంఖ్యలో కార్మికులను రిట్రెంచ్ చేశారు. క్రిందిస్థాయిలోనున్న కార్మికులను రిట్రెంచ్ చేసి,వలసవాదులు తమ స్వభావానికనుగుణంగా అత్యధిక వేతనాలు పొందుతున్న బ్రిటిషు అధికారులను మాత్రం ముట్టుకోలేదు.

ఈ వివక్షను బట్టబయలు చేస్తూ అమృత బజార్ పత్రిక ఇలా వ్రాసింది. “భారత రైల్వేలలో రిట్రెంచ్‌మెంట్ తీవ్రస్థాయిలో ప్రారంభమైంది. కాని అత్యధిక వేతనాలు పొందుతున్న తెల్ల దొరలపైన గాక నికృష్టమైన జీతాలు పొందుతున్న భారత కార్మికులపై రిట్రెంచ్‌మెంట్ వేటు వేయడం విషాదకరమైన విషయం. ఉన్నత స్థాయి అధికారులకు నిరుపేద భారత కార్మికులను బలిచేయడం రిట్రెంచ్‌మెంట్ చేయడానికి ఒక సాకు మాత్రమే. బొంబాయిలో సమావేశం కానున్న ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ఈ సమస్యను సత్వరమే చేపడుతుందని ఆశిస్తున్నాం” అని రాసింది.

1931 ఎమర్జెన్సీ రిడక్షన్ నిబంధనల క్రింద రైల్వేలు, తంతి–తపాలా శాఖలలోని ఉద్యోగులు, కార్మికుల రిట్రెంచ్‌మెంటుతో బాటు వారి వేతనాలను నిర్బంధంగా తగ్గించడం జరిగింది. ఇతర తరగతులకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు కూడా తగ్గించబడ్డాయి. ఇక్కడ కూడ ప్రభుత్వం పక్షపాత వైఖరినే అవలంబించింది. ఈచర్యలను తీవ్రంగా విమర్శిస్తూ అమృతబజార్ పత్రిక “ఢిల్లీలోని ఆఫీసు గుమస్తాలలో తీవ్ర సంచలనం చెలరేగింది. అప్పటికే పదవీ విరమణ చేయవలసిన ఆర్థిక శాఖలోని ఒక ఐ.సి.యస్. అధికారి ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను తగ్గించే స్కీమును తయారుచేసే హడావిడిలో వున్నాడని, ఈవిషయంలో ఆకాశం నుండి వూడిపడినట్లు చెప్పబడే ఐ.సి.ఎస్., ఇండియన్ పోలీసు సర్వీస్ సభ్యులు తదితర బ్రిటిష్ ఉన్నతాధికారులకు ఈ కోత వర్తించదని వదంతులు వ్యాపిస్తున్నాయి. అందువలన ఆదాయం తగ్గుతున్నదంటే దాని వలన బాధలకు గురి కావలసింది పేద గుమస్తాలే గాని, భారతదేశంలో కూర్చుని అత్యధిక వేతనాలను సంపాదించే అధికారులు మాత్రం కాదు” అని వ్రాసింది.

ఆర్థిక సంక్షోభ కాలంలో ప్రభుత్వం చేపట్టిన ఈ ఆర్థిక విధానాల వలన అన్ని తరగతుల కార్మికులు తీవ్రమైన బాధలకు గురయ్యారు. జంషేడ్‌పూర్‌లోని తాతా ఇనుము ఉక్కు కర్మాగారంలోని కార్మికుల నెల జీతాలు 1929 - 1932 సం॥ల మధ్య కాలంలో రు. 35.35 నుండి రు. 29.79 లకు తగ్గించబడ్డాయి. బొంబాయిలోని డాక్ (ఓడరేవు) కార్మికుల వేతనాలు 14 అణాల నుండి 1-8-0 మధ్య, కరాచీలోని పురుష కార్మికులకు రు. 1-2-0, స్త్రీ కార్మికులకు 13 అణాల వేతనాలు ఇస్తున్నట్లు వైట్లీ కమిషను తన నివేదికలో పేర్కొన్నది. ఈ నికృష్టమైన జీతాల్లో కూడా 30 నుండి 40 శాతం వరకు కోత విధించబడ్తోంది. అంతేగాక అనేకమంది కార్మికులకు నెలలో 10 నుండి 12 రోజులు వరకు పనికూడా దొరికేది కాదు.

రిట్రెంచ్‌మెంట్, జీతాల కోతల నుండి మున్సిపల్ కార్మికులు కూడా తప్పించుకోలేక పోయారు. కాన్పూరులో 1935 లో కార్మికుల జీతాలు 1921 నాటి జీతాలతో పోలిస్తే 40 శాతం తక్కువగా వున్నాయి.

అంటే 1930-34 లలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక మాంద్యం వలన భారత కార్మికవర్గం యావత్తూ తీవ్ర కష్టనష్టాలకు లోనయింది. కార్మికులు రిట్రెంచ్‌మెంట్, జీతాలలో కోత అనే జంట ప్రమాదాలను ఎదుర్కొనవలసి వచ్చింది.

పెద్ద ఎత్తున సాగిన రిట్రెంచ్‌మెంట్ వలన, నూతన ఉద్యోగావకాశాలు, ఉపాధికల్పన అవకాశాలు మృగ్యం కావడంతో నిరుద్యోగం ప్రబలింది. నిరాశా, నిస్పృహలకు గురయిన యువకులనేకులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వలస విధానం వలన భారత యువతరానికి ఒనగూడిన మేలు ఇదే.

## సంక్షోభానికి వ్యతిరేకంగా కార్మికవర్గ ఆర్థిక పోరాటాలు

ఈ తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి, కార్మికవర్గంపై దీనివలన కార్మికవర్గానికి కలిగే దుష్ఫలితాలకు వ్యతిరేకంగా ప్రతిఘటనను సాగించాల్సిన అవసరం గుర్తించబడింది. ఈ సమయంలో కార్మిక వర్గంలో గణనీయమైన స్థాయిలో అనైక్యత నెలకొన్నప్పటికీ, ఈ సంక్షోభానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఆర్థిక పోరాటాలను సాగించింది. కాని కార్మికవర్గ అనైక్యత వలన ఈ పరిస్థితులలో, వుండవలసినంత తీవ్రంగాను, విస్తృతంగాను ఈ పోరాటాలు సాగలేదు. ఈ సందర్భంలో మరో ప్రధానాంశాన్ని ప్రస్తావించవలసియున్నది. దేశంలోని కార్మికవర్గం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో నిమగ్నమైవుంది. కార్మికవర్గం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఎంతగా నిమగ్నమైయున్నదంటే ఆర్థిక పోరాటం కంటే రాజకీయ పోరాటం ప్రధానమై, దైనందిన ఆర్థిక సమస్యల మీదకు దృష్టి సారించడానికి కార్మికవర్గానికి వీలు చిక్కలేదు. ఈ కాలంలో దేశాన్ని కుదిపివేసిన సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ పోరాట వెల్లువలో కార్మికవర్గం ఒక బృహత్తరమైన పాత్ర నిర్వహించింది.

కాని కార్మికవర్గం రాజకీయ పోరాటాలలో ఇంత తీవ్రంగా నిమగ్నమై యున్నప్పటికి మొత్తంమీద కార్మికవర్గ ఆర్థిక పోరాటాలు నానాటికి పెరుగుతూనే యున్నాయి. 1929లో 141 పారిశ్రామిక వివాదాలు తలెత్తగా, 1930 నాటికి ఈ సంఖ్య 148 కి, 1931 నాటికి 166 కు పెరిగింది. కార్మికవర్గ ఆర్థిక పోరాటాలు నానాటికీ అధికమవుతున్నాయనడానికి ఇదే నిదర్శనం.

### 1931-36 సం॥లలో పారిశ్రామిక వివాదాలు

| సం॥ | వివాదాల సంఖ్య | పాల్గొన్న కార్మికుల సంఖ్య | నష్టపోయిన పని దినాల సంఖ్య |
|---|---|---|---|
| 1931 | 166 | 2,03,008 | 24,08,123 |
| 1932 | 118 | 1,28,099 | 19,22,437 |
| 1933 | 146 | 1,64,938 | 21,68,961 |
| 1934 | 159 | 2,20,808 | 47,75,559 |
| 1935 | 145 | 1,14,217 | 9,73,457 |
| 1936 | 157 | 1,69,029 | 23,58,662 |

1931లో జరిగిన సమ్మెలన్నింటిలోనూ, బెంగాలులోని హేస్టింగ్స్ జూట్ మిల్‌లో జరిగిన సమ్మె అసాధారణమయినది. ఈ సమ్మెలో 5,300 మంది కార్మికులు పాల్గొనగా, 2,17,323 పనిదినాలు నష్టమయ్యాయి. బొంబాయి ప్రెసిడెన్సీలోని షోలాపూర్ నూలు మిల్లులలో ఇదే సం॥లో (1934) మరొక బ్రహ్మాండమయిన సమ్మె జరిగింది. ఈ మిల్లుల్లోని కార్మికులు కరువు భత్యం రేటు పెంపుదల యూనియన్ గుర్తింపు వంటి ప్రధాన కోర్కెల సాధనకు మూడు వారాల పాటు సమ్మె సాగించారు. దీనిలో 15,000 మంది కార్మికులు పాల్గొన్నారు. మదురై నూలు మిల్లులలోనూ, కుర్లా స్వదేశీ మిల్లులలో కూడా సమ్మె పోరాటాలు జరిగాయి. ఈ సమ్మెలలో 25,800 మంది కార్మికులు పాల్గొన్నారు. 6,73,000 పని దినాలు నష్టమయ్యాయి. ఈ సంవత్సరంలో సాగిన సమ్మె పోరాటాల వివరాలను పరిశీలించినట్లయితే జూట్, నూలు మిల్లులలో అధిక శాతం అంటే సుమారు మొత్తం సమ్మెలలో 67 శాతం ఈ రెండు పరిశ్రమలలోనే జరిగాయని స్పష్టమవుతుంది. ఈ రెండు పరిశ్రమలలో కలసి మొత్తం 98 సమ్మె పోరాటాలు జరిగాయి.

1932 సం॥లో బెంగాల్ లోని జూట్ మిల్లులలోనూ, రైల్వే వర్క్‌షాపుల్లోనూ చాలా తీవ్రమైన సమ్మె పోరాటాలు జరిగాయి. రిట్రెంచ్‌మెంట్‌కు వ్యతిరేకంగా మద్రాసులోనూ, దక్షిణ మరాఠా రైల్వేలోని పెరంబూర్, ఆర్కోణం, హుబ్లీ వర్క్‌షాపుల్లో ఇదే సంవత్సరం (1932) అక్టోబర్ నెలలో సమ్మెలు ప్రారంభమయ్యాయి. 8,300 మంది కార్మికులు పాల్గొన్న ఈ సమ్మెల ఫలితంగా 4,40,000 పనిదినాలు నష్టమయ్యాయి. పదివారాల పాటు సాగిన ఈ సుదీర్ఘ సమ్మె పోరాటం, 1933 జనవరి నెలలో ముగిసింది. 1933 జనవరి నెలలో ఈ సమ్మె వలన మరో 55,000 పని దినాలు నష్టమయ్యాయి. మద్రాసు షరాఫ్ చొరవతో ఏర్పడిన పురజనుల కమిటీ కృషి ఫలితంగా 1933 జనవరి 7వ తేదీన ఒక ఒప్పందం కుదరడంతో సమ్మె విరమించబడింది. కాని ఈ ఒప్పందం 370 మంది కార్మికుల రిట్రెంచ్‌మెంట్‌కు అనుమతించింది. చివరకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కూడా తరువాత సర్వీసు నుండి తొలగించబడ్డారు.

1931 మార్చి 15 న ఆజ్మీరులో జరిగిన ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, రైల్వేలలో పెద్దఎత్తున సాగుతున్న రిట్రెంచ్‌మెంట్ సమస్యను చర్చించింది. ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిశీలించే వరకు తాము నిర్ణయించిన విధంగా రిట్రెంచ్‌మెంట్‌కు పాల్పడవద్దని ఈ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. అయినప్పటికీ, 1930 మార్చి వరకు నుండి 1931 వరకు ఒక సంవత్సరకాలంలో మొత్తం 7,28,821 మంది కార్మికులలో 40,502 మంది రిట్రెంచ్ చేయబడగా, మరో 8,392 మంది డిమోట్ (క్రింది తరగతికి లేదా ఉద్యోగంలో క్రింది స్థాయికి తగ్గించడం) చేయబడ్డారు.

ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రభుత్వంతో సాగించిన సుదీర్ఘ ఉత్తర ప్రత్యుత్తరాలతో పాటు రైల్వే కార్మికులిచ్చిన సార్వత్రిక సమ్మె పిలుపు వలన చివరకు రిట్రెంచ్‌మెంట్ సమస్యపై విచారణ జరిపేందుకొక "కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ" (విచారణ సంఘాన్ని)ని ప్రభుత్వం నియమించవలసి వచ్చింది. ఫెడరేషన్ (ఎ.ఐ.ఆర్.ఎఫ్) ఒక మధ్యవర్తుల బోర్డును నియమించవలసిందిగా చేసిన డిమాండును ప్రభుత్వం తిరస్కరించింది. ఈ విషయంపై వాఖ్యానిస్తూ శ్రీ శివరావు "భారతదేశంలోని కనీసం కొన్ని ప్రధానమైన రైలు మార్గాలలో నైనా కార్మికులు పనిని పూర్తిగా స్తంభింప చేస్తారన్న భయంతో మాత్రమే 1931లో రైల్వే బోర్డు ఒక "విచారణ సంఘాన్ని" నియమించవలసి వచ్చింది. సార్వత్రిక సమ్మె పిలుపుకు ముందుగా ఫెడరేషన్ సమ్మె బ్యాలట్ తీసుకొనడం ప్రారంభించిన తరువాత మాత్రమే రైల్వే బోర్డు ఈ విచారణ సంఘాన్ని నియమించడానికి అంగీకరించింది" అని పేర్కొన్నారు.

కాని రిట్రెంచ్‌మెంట్ సమస్యపై విచారణ జరపడానికి నియమించబడిన యీ "కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ" రిట్రెంచ్‌మెంట్‌ను నిలిపివేసే విషయమై విచారించడం కాక, రైల్వేలలో గ్రూపులు గ్రూపులుగా రిట్రెంచ్‌మెంట్‌ను నిర్వహించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయవలసిందిగా సిఫార్సు చేసింది.

ప్రభుత్వం కమిటీలను, కమిషన్లను నియమించడం నిజంగా కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కాక రాబోయే పోరాటాలను చల్లార్చడం కోసం మాత్రమేనని యీ సందర్భంగా ప్రభుత్వం అవలంభించిన వైఖరి వలన తేటతెల్లమయింది. ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ వి.వి.గిరి వంటి సంస్కరణవాద నాయకులు కూడా ప్రభుత్వం కమిటీలను, కమిషన్లలను నియమించడం "విజయవంతంగా జరగబోయే సమ్మెలను ప్రారంభంలోనే ఆపి వేయడానికి మాత్రమే కాని అంతకు మించి మరేమీ లేదు" అని ప్రభుత్వ వైఖరి పట్ల తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

రైల్వేలలో సమ్మెలతో బాటు, బెంగాల్‌లోని కెల్విన్, స్టాండర్డ్, కినిసన్ హౌరాజూట్ మిల్లులలోని కార్మికులు తమ వేతనాలలో పది శాతం కోతకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. 3,31,000 పని దినాలు నష్టం జరిగిన యీ సమ్మెలో 19,000 మంది కార్మికులు పాల్గొన్నారు.

1932లో జరిగిన సమ్మెలలో 60 శాతం వేతనాల సమస్య మీద జరిగినవే. 1921వ సంవత్సరం తరువాత యీ సంవత్సరంలోనే వేతన సమస్యపై సమ్మె పోరాటాలు రికార్డు స్థాయిలో జరిగాయి.

1933 సం॥ నుండి పరిస్థితి మరింత క్షీణించింది. భారతదేశంలోని పరిశ్రమలలో సగటున రోజుకు పనిచేస్తున్న కార్మికుల సంఖ్య 16,500లకు పైగా తగ్గిపోయింది. బొంబాయిలోని నూలు మిల్లులలో పనిచేసే కార్మికులు అధిక సంఖ్యలో పనులు కోల్పోయారు. రిట్రెంచ్‌మెంట్ ద్వారా కార్మికుల సంఖ్య తగ్గించడంతో బాటు ఈ మిల్లు యజమానులు పెద్దసంఖ్యలో కార్మికులను పార్ట్‌టైమ్ పద్ధతిపై నియమించడంతో అనేక మంది కార్మికులకు కనీసం 14 రోజులు పని కూడ దొరికేదికాదు. 1934 ఫ్యాక్టరీ చట్టం ప్రకారం పని గంటలు వారానికి 60 నుండి 54కు తగ్గించి, దానికి తగినట్లుగా కార్మికుల వేతనాలకు రక్షణ కల్పించకపోవడంతో కార్మికుల వేతనాలు తగ్గిపోయి వారు అష్టకష్టాల పాలయ్యారు.

అదే 1933 సంవత్సరంలో కార్మికుల వేతనాలను 25 శాతం తగ్గించాలని అహమ్మదాబాద్ మిల్లు యజమానుల సంఘం ప్రతిపాదించింది. అహమ్మదాబాద్‌లో గాంధీజీ ప్రవేశపెట్టిన నిర్బంధ ఆర్బిట్రేషన్ (మధ్యవర్తుల పరిష్కారానికి నివేదించడం) విధానంవల్ల వేతనాలలో కోత సమస్యపై అహమ్మదాబాద్ మిల్లు యజమానుల సంఘానికి, మజూర్ మహాజన్‌కు మధ్య సంప్రదింపులు సుదీర్ఘకాలం సాగడానికి దారితీసింది. ఫలితంగా కార్మికులలో సహనం నశించి వారు సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావడంతో చివరకు మజూర్ మహాజన్ కార్యదర్శి శ్రీ గుల్జారీలాల్ నందా, అహమ్మదాబాద్ మిల్లు యజమానుల సంఘం కార్యదర్శి శ్రీ జి.ఐ. పటేల్‌లు 1935 జనవరిలో ఒప్పందంపై సంతకాలు చేశారు. కొన్ని పరిమితులకు లోబడి కార్మికుల జీతాల్లో కోత విధించడంతోపాటు, పరిశ్రమలను క్రమబద్ధీకరించాలని (ఆచరణలో కార్మికుల సంఖ్య తగ్గింపు) ఒప్పందం నిర్దేశించింది. ఈ ఒప్పందంలోని కొన్ని అంశాలు యీ విధంగా వున్నాయి. (1) 1930 సం॥లో మంజూరు చేసిన జీతాల పెరుగుదలను

ఉపసంహరించడం జరుగుతుంది. దీనివలన అందరకు సమానంగా 6 1/4 శాతం జీతాలలో కోత పడుతుంది. కాని యీ కోతవలన రోజుకు 10 గంటల చొప్పున 26 రోజులు పనిచేసే పద్ధతిపై వీవర్ల (నేత పనివారి) జీతం రు. 41.4 తగ్గకుండా వుంటుంది. (2) నిరుద్యోగం కార్మికుల ఆరోగ్యం మీద దాని ప్రభావాన్ని దృష్టిలో వుంచుకుని కొన్ని పరిమితులతో రేషనలైజేషన్ స్కీములను అమలు చేస్తారు.

ఈ ద్వైపాక్షిక ఒప్పందాన్ని మధ్యవర్తి కూడా ఆమోదించాడు. జీతాలలో కోతను అంగీకరిస్తూ చేసుకున్న ఈ ఒప్పందం కార్మికుల తీవ్ర అసంతృప్తికి గురవుతుందని గ్రహించిన గాంధీజీ జీతాలలో కోతను "సంతోషంగా" స్వీకరించవలసిందిగా వ్యక్తిగతంగా కార్మికులకు ఉత్తరం రాశాడు. గాంధీ సంస్కరణవాద సిద్ధాంతాన్ని బట్టబయలు చేసి, పెట్టుబడికి, – శ్రమకు మధ్య (పెట్టుబడిదారుడు – కార్మికుడు) ఏర్పడిన వివాదాల విషయంలో ఈ సిద్ధాంతం ఎంతవరకు పోగలదో తెలియచెప్పే ఈ లేఖ భారత కార్మికవర్గ చరిత్రలో ఒక ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ లేఖ పూర్తి పాఠం ఇలా వున్నది. "మీ జీతాల సమస్య మీద కుదిరిన ఒప్పందాన్ని మీరు హర్షిస్తారని ఆశిస్తున్నాను. అంతేగాక మీ తరపున ఆమోదించబడిన జీతాలలో కోతను సంతోషంగా స్వీకరిస్తారని కూడా తలుస్తున్నాను. నిస్సందేహంగా మీ ప్రయోజనాలను కాపాడడం కోసమే యీ ఒప్పందం చేసుకొనడం జరిగింది. తత్ఫలితంగా మీ ప్రతిష్ట ఇనుమడిస్తుంది. చాలాకాలంగా మేము సాధించాలనుకున్న "దత్తత సిద్ధాంతాన్ని" (Policy of adoption), ఈ ఒప్పందం ద్వారా ఆమోదింపజేయడం సామాన్య విషయం కాదు. వీలయినంత త్వరగా యీ సిద్ధాంతాన్ని అమలు చేయడానికి ఒక పథకాన్ని తయారుచేయాలి. వాటిని విజయవంతంగా అన్వయించడం లక్ష్యశుద్ధి, నిజాయితీతో కూడిన మీ ప్రవర్తన మీద ఆధారపడి వుంటుంది. మిల్లు యజమానులు, కార్మికులు ఉభయుల ప్రయోజనాలు పరిశ్రమ నిర్వహణతో ముడిపడి ఉన్నాయని గుర్తించిన వారెవరికైనా యీ ఒప్పందంలోని గుణగణాలు గ్రహించడం కష్టమేమీ కాదు. మీతో కలసి పని చేయడం ప్రారంభించిన నాటి నుండి పరిశ్రమ అనేది మిల్లు యజమానుల ఒక్కరికే చెందినది కాదని నేను మీకు చెబుతూనే వున్నాను. మిల్లు యజమానులు పెట్టుబడి పెట్టారు. మీరు శ్రమను పెట్టుబడిగా పెట్టారు. ఒకరు లేకుండా రెండవదానికి విలువలేదు. మీరు ఈ నిజాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్నట్లయితే ఇరుపక్షాల ప్రయోజనాలను ఈ ఒప్పందం కాపాడుతుందని ఇట్టే గ్రహించగలరు. మనం ఇప్పటికే చాలావరకు పురోగమించాం. మనం కన్నకలలు ఫలించే రోజులు సమీపిస్తున్నాయి. అందువలన ఈ ఒప్పందాన్ని మీరు ఏకగ్రీవంగా ఆమోదిస్తారని ఆశిస్తున్నాను."

ఈ సంవత్సరంలో చెప్పుకోదగినంత పెద్ద సమ్మె ఏదీ జరగలేదు. కాని కార్మికులు చాలా చిన్న చిన్న పాక్షిక సమ్మెలను సాగించారు. మిల్లు యజమానులు, కార్మికుల మీద రిట్రెంచ్‌మెంట్, జీతాలలో కోత తదితర విధాలుగా దాడులకు పూనుకున్నారు. అయితే వీరు తెలివిగా ఈ దాడులను ఏకకాలంలో గాని, పరిశ్రమంతటా గాని చేయలేదు. వేర్వేరు సమయాల్లో, వేర్వేరుమిల్లుల్లో కార్మికులను విడదీసి దాడి చేయడం వలన మిల్లు యజమానులు సాగించే

దాడులను ప్రతిఘటించే విషయంలో కార్మికులు ప్రతికూల పరిస్థితిలో పడ్డారు. వాస్తవానికి 1931–35 సం॥ల మధ్యకాలంలో సాగిన సమ్మె పోరాటాలు ఒకదానితోనొకటి సంబంధం లేక చెదురుమదురుగా జరిగాయి.

1934లో సమ్మెల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సమ్మెలలో కార్మికులు రెట్టింపు సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం జరిగిన సమ్మెలన్నింటిలోనూ జౌళి కార్మికులు జరిపిన సార్వత్రిక సమ్మె అతి ప్రధానమైనది. బొంబాయి, కలకత్తాలలో డాక్ (రేవు) కార్మికులు సాగించిన సమ్మె పోరాటాలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

జౌళి కార్మికులు ముఖ్యంగా రిట్రెంచ్‌మెంట్‌కు, వేతనాలలో కోతకు వ్యతిరేకంగా సమ్మెచేశారు. షోలాపూర్‌లోని, జౌళి కార్మికులు తమ జీతాలలో 12 1/2 శాతం కోత విధింపుకు వ్యతిరేకంగా పని నిలిపివేశారు. 1934 ఫిబ్రవరి నుండి మే నెల వరకు సుదీర్ఘ కాలం సాగిన యీ సమ్మె వలన 4,60,000 పనిదినాలు నష్టమయ్యాయి. జీతాలలో కోతకు వ్యతిరేకంగా నాగపూర్ టెక్స్‌టైల్ యూనియన్ ఆధ్వర్యంలో నాగపూర్‌లోని 60 వేల మంది కార్మికులు 1934 మే నుండి జూలై వరకు సమ్మె చేశారు.

బొంబాయి నగరంలో జౌళి కార్మికుల సమ్మె మరింత విస్తృతంగా జరిగింది. మొత్తం ఆ సంవత్సరంలో నష్టపోయిన మొత్తం పనిదినాల్లో సగం, 90 వేల మంది కార్మికులు పాల్గొన్న యీ సమ్మె పోరాటం వల్లనే నష్టమయ్యాయి. మిల్లు యజమానులు ప్రత్యక్షంగా విధించే వేతనాలలో కోతకు, రేషనలైజేషన్ స్కీముల ద్వారా పరోక్షంగా విధించే కోతకు నిరసనగా ఈ సమ్మె నిర్వహించబడింది. మిలిటెంట్ కమ్యూనిస్టులు, మధ్యేవాద భావాలు గల్గిన సంస్కరణవాదులు కలిసి ఏర్పరచిన "కార్యాచరణ సమితి" యీ సమ్మెకు నాయకత్వం వహించింది. 1933లో కాన్పూర్‌లో జరిగిన ఆలిండియా టెక్స్‌టైల్ వర్కర్స్ కాన్ఫరెన్స్ నిర్ణయానుసారం యీ సమ్మెలు జరిగాయి. ఈ మహాసభ దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని నిర్ణయించి, ఈ లక్ష్యసాధనకు ఒక కౌన్సిల్ ఆఫ్ యాక్షన్‌ను (కార్యాచరణ సమితి) ఏర్పాటు చేసింది. కాని ఆచరణలో యీ సమ్మెలు బొంబాయి, నాగపూరు, షోలాపూరులకు మాత్రమే పరిమితమయ్యాయి.

ప్రారంభంలో శ్రీ ఎన్.ఎమ్.జోషి, శ్రీ ఆర్.ఆర్. బాఖలే తదితర సంస్కరణవాద నాయకులు ఈ సమ్మెకు విముఖతను వెల్లడించారు. కార్మికుల దుస్థితిని నివారించడానికి సమ్మెలను నిర్వహించడం కంటే, ప్రభుత్వ జోక్యం కొరకు అర్థించడం వుత్తమమని వారు వాదించారు. కాని కార్మికుల పోరాట సన్నద్ధతను గమనించిన వీరు కొన్ని షరతులతో సమ్మెకు అంగీకరించి యునైటెడ్ స్ట్రయిక్ కమిటీలో చేరారు. ఒకవైపు సమ్మెకు తమ ఆమోదం తెలిపి కమిటీలో చేరికూడా సంస్కరణవాద నాయకులు కార్మికులను సమ్మె యెడల విముఖులుగా చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. వేరొక ప్రక్క కమ్యూనిస్టులు, తదితర సమరశీల భావాలు

గల్గినవారు నిజాయితీతో నిబద్ధతతో సమ్మెను నిర్వహించడమేగాక, ఈ సమ్మెను బొంబాయిలోనే గాక ఇతర కేంద్రాలకు వ్యాపింపజేయడానికి తీవ్రమైన ప్రచారం సాగించారు. ఇదిలా వుండగా సంస్కరణవాద నాయకులు విధించిన షరతులను యునైటెడ్ స్ట్రయిక్ కమిటీ ఆమోదించకపోవడంతో శ్రీయుతులు కండాల్కర్, ఆల్వే, మనీబెన్‌కారా తదితర సంస్కరణ వాద నాయకుల ఆధ్వర్యంలో ఒక పోటీ కమిటీ ఏర్పాటు చేయబడింది. గిర్నికాంగార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్)కు పోటీగా ఏర్పడిన బటాటావాలా బిల్డింగ్, గిర్నికాంగార్ యూనియన్ కూడా పోటీ సమ్మె కమిటీతో చేతులు కలిపింది. పెట్టుబడిదారుల దాడులకు వ్యతిరేకంగా కార్మికవర్గ ఐక్య పోరాటాలను నిర్మించి, అభివృద్ధి చేసే ప్రయత్నాలను, ఈ సంఘటనలు తీవ్రంగా దెబ్బతీశాయి. అంతేగాక ఈ సమయంలో కార్మికవర్గంలో నెలకొన్న అనైక్యత అప్పుడే ప్రారంభమైన సమ్మె కొనసాగడానికి పెద్ద అంతరాయంగా పరిణమించింది.

బొంబాయిలో సమ్మె ఒక క్రమ పద్ధతిలో ప్రారంభమైంది. మిల్లు గేట్ల వద్ద స్త్రీ కార్మికుల పికెటింగ్ ఒక నూతన అపూర్వ సన్నివేశం. అధిక సంఖ్యలో కార్మికులు పికెటింగ్‌లో పాల్గొనడమేగాక, క్రమం తప్పక సమావేశాలు జరపడం, ప్రదర్శనలు మొదలైన కార్యక్రమాలతో సమ్మె మిక్కిలి చైతన్యవంతంగానూ, ఉత్సాహ పూరితంగానూ సాగింది. కాని సమ్మె ప్రారంభించిన నాటి నుండే సమ్మె నణచడానికి ప్రభుత్వం, కార్మికులపై విరుచుకుపడింది. ప్రదర్శనలు, సభలు జరపకుండా నిషేధపుటుత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఉద్యమ నాయకులనేక మంది అరెస్టు చేయబడ్డారు. ఒక సందర్భంలో పోలీసులు కాల్పులకు కూడ పూనుకున్నారు. ఈ నిర్బంధ విధానాలు కొనసాగించడంతో బాటు, ప్రభుత్వం, యజమానులతో కలిసి సమ్మె విద్రోహులను కార్మికులలో చొప్పించి సమ్మెను విచ్ఛిన్నం చేసే స్థితికి దిగజారింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభ ఫలితంగా ఇప్పటికే పెచ్చరిల్లిన నిరుద్యోగ సమస్య తీవ్రత ఈ సమ్మె సందర్భంగా వెల్లడయింది. ఈ నిరుద్యోగ సమస్యను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవటానికి బదులుగా, సామ్రాజ్యవాద ప్రభుత్వం నిరుద్యోగులైన యువకులను (సమ్మె విద్రోహులుగా) సంఘ వ్యతిరేక కలాపాలు సాగించే అవినీతికర పరిస్థితులకు దిగజార్చింది.

పెట్టుబడిదారీ వర్గం సాగించే జీతాలలో కోత, రిట్రెంచ్‌మెంట్ మొదలైన దాడులకు వ్యతిరేకంగా కార్మికులు ఒక తీవ్రమైన వర్గపోరాటంలో నిమగ్నమై యున్నారు. అయినప్పటికీ ప్రపంచ ఆర్థిక సంక్షోభం, సామ్రాజ్యవాద ప్రభుత్వపు దారుణమైన అణచివేత విధానాల వలన ఏర్పడిన తీవ్రమైన రాజకీయ పరిస్థితిని కార్మికవర్గం విస్మరించలేదు. ఇందుకు భిన్నంగా కార్మికులు ప్రారంభం నుండే తమ ఆర్థిక కోర్కెలతో బాటు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు, రాజకీయ ఖైదీల వంటి విడుదల చేయాలనే రాజకీయ పరమైన డిమాండ్లను కూడా లేవనెత్తింది. అంతేగాక ఈ సమ్మెను ఆర్థిక, రాజకీయపరమైన డిమాండ్ల సాధనకు రాజకీయ పోరాటంగా మార్చడానికి ప్రయత్నాలు జరిగాయి. కార్మికుల ప్రదర్శనలు, పోలీసులు ఆ ప్రదర్శకులను చుట్టుముట్టడం వంటి దృశ్యాలు బొంబాయి వీధులలో రోజూ సర్వ సాధారణమయ్యాయి.

అప్పుడప్పుడు ఈ ఇరుపక్షాల మధ్య ఘర్షణలు కూడ జరిగేవి. కొన్ని బలమైన రాజకీయ లక్ష్యాలను వెల్లడించిన ఈ సమ్మె పోరాటం మిలిటెంట్ స్వభావాన్ని సంతరించుకున్నది.

కాని నాయకత్వంలో ఏర్పడిన తీవ్ర అభిప్రాయ భేదాలు, ఫలితంగా కార్మికులలో నెలకొన్న అనైక్యత యీ వీరోచిత సమ్మె పోరాటాన్ని కొనసాగించడానికి అడ్డంకులుగా తయారయ్యాయి. ఇదే అదునుగా భావించిన ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మికులపై తీవ్రమైన దాడులను సాగించింది. సమ్మె పూర్తిగా విఫలమయ్యే పరిస్థితి ఏర్పడడంతో యునైటెడ్ స్ట్రయిక్ కమిటీ సమ్మెను విరమించింది. కార్మికుల ప్రయోజనాల కోసంగాక, ప్రజలను కష్టాలుపాలు చేయడానికి సమ్మె నిర్వహించారనే నేరం మోపి సమ్మెకు నాయకత్వం వహించిన ఎనిమిదిమంది నాయకులపై పారిశ్రామిక వివాదాల చట్టం క్రింద ప్రభుత్వం విచారణ జరిపింది. వారిపై మోపిన నేరారోపణలను రుజువు చేయడంలో ప్రభుత్వపక్షం విఫలమైంది. అంతేగాక ప్రభుత్వం చేసుకున్న అప్పీలును హైకోర్టు త్రోసిపుచ్చింది. ఏ సమ్మెనయినా నిషేధించడానికి వీలు కలిగించే ఒక అంశాన్ని పారిశ్రామిక వివాదాల చట్టంలో పొందుపరుస్తూ భారత ప్రభుత్వం 1936, 1938 సంవత్సరాల్లో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఒక సవరణ బిల్లును ప్రవేశపెట్టింది (స్టే ఇన్ సమ్మె) ఫ్యాక్టరీలలోనే వుండి పనిని నిలిపి వేసి సమ్మెలలో పాల్గొన్న కార్మికుల జీతాలను మినహాయించే అధికారాన్ని యజమానులకు కట్టబెడుతూ 1936 జీతాల చెల్లింపు చట్టం (పేమెంట్ ఆఫ్ వేజెస్ యాక్ట్) కూడా 1937లో సవరించబడింది.

ఈ విధంగా రిట్రెంచ్‌మెంట్, జీతాలలో కోత తదితర సంక్షోభ భారాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించిన ప్రతిఘటన తీవ్ర అణచివేతకు గురైంది. ఈ పోరాటాలను అణచివేయడానికి వలసవాదులు సర్వవిధాలా ప్రయత్నాలు సాగించారు. అధిక సంఖ్యలో ప్రజలు హాజరై తమ నిరసనను వ్యక్తం చేయకుండా బహిరంగ సభలు నిషేధించబడ్డాయి. విచక్షణారహితంగా అరెస్టులు, విచారణలు సాగించారు. ప్రజలపై పోలీసు అత్యాచారాలు మీరిపోయాయి. ఒకటేమిటి ప్రజాస్వామ్య హక్కులే పూర్తిగా కాలరాయబడ్డాయి. మధ్యేవాద సంస్కరణ వాదకార్మిక నాయకులకు కూడా ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ తీవ్రమయిన అణచివేత విధానాలను ఖండించక తప్పలేదు. శ్రీ ఎన్.ఎమ్.జోషి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ "ఇన్ని సంవత్సరాలుగా దేశంలో వేలకొలది సమ్మెలు జరుగుతుండగా "పారిశ్రామిక వివాదాల చట్టం యొక్క యంత్రాంగాన్ని ఉపయోగించిన సందర్భాలను పరిశీలించినట్లయితే ప్రభుత్వానికి పారిశ్రామిక వివాదాలను పరిష్కరించడంలో ఏ మాత్రం శ్రద్ధ లేదనేది స్పష్టమవుతుంది. భారత ప్రభుత్వం, స్థానిక (రాష్ట్ర) ప్రభుత్వాలు వివాదాలను పరిష్కరించడానికి ప్రయత్నించకపోగా కార్మికులను అణచివేయడానికి తమకున్న నిరంకుశ అధికారాల మీద ఆధారపడ్డాయి. సమ్మె ప్రారంభమైన వెంటనే 144 సెక్షను విధించడం మామూలై పోయింది. సమావేశాలు నిషేధించబడ్డాయి. సమ్మెలో పాల్గొన్నప్పటికీ, పాల్గొన్నట్టు అనుమానం వచ్చినప్పటికీ అట్టివారినందరిపై విచారణ సాగించడం పరిపాటి అయింది.

"పారిశ్రామిక వివాదాల చట్టం" ద్వారా వివాదాలను పరిష్కరించడానికి ప్రయత్నం చేయక ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి తన అధికార యంత్రాంగాన్ని ప్రయోగించడం జరుగుతోంది. ఇంతేగాక ప్రజోపయోగ సర్వీసులలో సమ్మెలు జరిపినవారిని, జనరల్ సమ్మెలో పాల్గొన్న వారిని శిక్షలకు గురిచేసే నిరంకుశపూరితమైన అంశాలు ఇంకా కార్మిక వర్గానికి హాని చేయడానికి పొంచివున్న ప్రమాదాలేనని" చెప్పారు. ప్రత్యక్ష చర్య ద్వారాకంటె సంప్రదింపుల ద్వారానే సమస్యలను పరిష్కరించడంలో సంపూర్ణ విశ్వాసమున్న సంస్కరణవాదుల అగ్రనాయకుడు శ్రీ ఎన్.ఎం.జోషి కూడా ఉద్వేగానికి గురవవలసిన పరిస్థితులేర్పడుతున్నాయన్నమాట.

1934లో బొంబాయిలో జరిగిన జౌళి కార్మికుల సమ్మెను ప్రస్తావిస్తూ శ్రీ జోషి "సమ్మెను పరిష్కరించడానికి ప్రభుత్వం తన యంత్రాంగాన్ని వుపయోగించడానికి నిరాకరించింది. అంతటితో ఆగక ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ఎమర్జెన్సీ చట్టాల క్రింద తన చేతిలోనున్న, 144వ సెక్షను, తదితర నిరంకుశ అధికారాలను చెలాయించటంలో వెనుకాడలేదు. దీనితో విజయం సాధించారు. కానీ వారు అంతటితో ఆగలేదు. సమ్మెను చట్టవిరుద్ధమని చెప్పి సమ్మెలో పాల్గొన్నవారందరికీ శిక్షలు విధించే ఉద్దేశంతో ప్రభుత్వం వారందరిపై కోర్టులో విచారణ సాగించింది." అని ప్రభుత్వంపై నేరారోపణ చేశాడు.

సంస్కరణవాద నాయకుల్లో మరొక ప్రముఖుడు, కార్మికవర్గం సాగించిన మిలిటెంట్ పోరాటాలకు భయపడి ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్థాపకుల్లో ఒకరయిన శ్రీ వి.వి.గిరి కూడా ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ కార్యకర్తల మీద గూఢచర్యం నెరపడాన్ని తీవ్రంగా విమర్శించాడు. కార్మికవర్గాన్ని చీల్చి ఏర్పరచిన మరొక పోటీ సంస్థ, ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ప్రారంభ సమావేశంలో అధ్యక్షోపన్యాసమిస్తూ "ఏదైనా పరిశ్రమలో వివాదమున్నదని అనుమానం రాగానే పోలీసులు, మేజిస్ట్రేట్లు యజమానికి బాసటగా పరుగెత్తుతారు. కాని కార్మికులు మాత్రం ఈ అణచివేతకు వ్యతిరేకంగా తమ శక్తియుక్తులతో ప్రతిఘటనను సాగించారు. పోలీసు డిపార్టుమెంటులోని నేరపరిశోధక విభాగంవారు కార్మిక నాయకుల కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఒక వివాదాన్ని గురించిన వివరాలు నేరుగా కార్మిక సంఘాల నుండి గాక పోలీసుల ద్వారానే సేకరించినట్లు వైట్లీ కమీషన్ ప్రకటించింది" అని శ్రీ వి.వి. గిరి పేర్కొన్నారు.

సంస్కరణవాద కూటమిలో మరొక ప్రముఖుడు శ్రీ బి. శివరావు మరికొంత ముందడుగు వేసి "ట్రేడ్ యూనియన్ల స్థాపనను పోలీసులు ఒక అవాంఛనీయ సంఘటనగా పరిగణిస్తున్నారు. ఒక యూనియన్ స్థాపించబడినపుడు ఆ పరిశ్రమలోని కార్మికుల దగ్గర చేరి వారిని యూనియన్లలో చేరకుండగానూ, సమావేశాలకు హాజరుకాకుండా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎప్పుడైనా సమ్మె జరిగినట్లయితే వెంటనే పోలీసులు వ్యాపారస్తులపై తమ పలుకుబడి ఉపయోగించి, ఒత్తిడి చేసి కార్మికులకు ఆహార పదార్థాలను అరువుగా

యివ్వకుండా చేస్తున్నారు. వారిలో ప్రభుత్వానికి దాసులైవారు కొందరు (పోలీసులు) అనవసరంగా కార్మికులను వత్తిడి చేసి, భయపెట్టి పనులు చేయించడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని సందర్భాలలో సమ్మె ముగిసిన తరువాత పోలీసుల సేవాతత్పరతకు మెచ్చి యజమానులు వారికి బహుమానాలివ్వడం కూడా సర్వసాధారణమైన విషయం. ఇదంతా చూస్తే పోలీసుల కార్యకలాపాలు శాంతి భద్రతల పరిరక్షణకు పరిమితమవడంగాక, ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధికి కంటకప్రాయంగా తయారయ్యాయని ఎవరైనా భావించక తప్పదు" అని ప్రకటించారు.

బ్రిటిష వలసవాదులు భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఏ దృష్టితో చూచిందీ, వారితో ఏ విధంగా వ్యవహరించిందనే విషయంలో సంస్కరణవాదుల దృక్పథం ఈ విధంగా వున్నది. ఇది నూటికి నూరుపాళ్లు వాస్తవమనడంలో సందేహం లేదు.

'కమ్యూనిస్టుల ప్రమాదాన్ని' తొలగించడానికి కమ్యూనిస్టులు, తదితర వామపక్ష భావాలు గల్గిన వారిపై ప్రభుత్వం దాడులు సాగించింది. వీరిలో అనేకమంది మీరట్ కుట్రకేసులో ఇరికించబడటమేగాక ప్రభుత్వం చివరకు భారత కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. ఐనప్పటికీ మితవాదులకు సంతృప్తి కలగలేదు. మితవాదులు తమ రాజీ విధానంతో కొంతవరకు ప్రభుత్వాధికారుల ప్రాపకం సంపాదించుకోగలిగారు. కాని అదే సమయంలో ప్రభుత్వం, యజమానుల నుండి వారు కనీస మర్యాదనైనా పొందలేకపోయారు. ఈ విధంగా ప్రభుత్వం, యజమానులు యిరుపక్షాల చేతుల్లో వీరు అవమానాలపాలయ్యారు. అంటే కేవలం వామపక్ష భావాలు కల్గిన వారే గాక, మొత్తం ట్రేడ్ యూనియన్ ఉద్యమమే సామ్రాజ్యవాద ప్రభుత్వ తీవ్ర అణచివేత చర్చలకు గురైంది.

## కార్మికవర్గంలో విప్లవ సిద్ధాంత వ్యాప్తి

రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్థాపనకు దారితీసిన ఎ.ఐ.టి.యు.సి. రెండవ చీలిక వలన భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఐక్యతకు తీవ్ర విఘాతం తగ్గింది. అయినప్పటికీ ఈ రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అతి స్వల్ప వ్యవధిలోనే కార్మికులలో విప్లవ రాజకీయ సిద్ధాంతాలను వ్యాప్తి చేయడంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. కార్మికవర్గ ఆర్థిక పోరాటాలను తీవ్రతరం చేయడంతోబాటు వారిలో రాజకీయ చైతన్యం కలిగించడానికి రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు తీవ్రంగా కృషి చేసింది. యువ కార్మికులలో విప్లవ దృక్పథాన్ని పెంపొందించే ధ్యేయంతో, 1930 సంౢ మధ్యకాలంలో యంగ్ వర్కర్స్ లీగ్ (యువకార్మిక సమితి) స్థాపించబడింది. యువ కార్మికుల్లో కల్గించే రాజకీయ చైతన్యం కల్గించే ప్రయత్నంలో ఈ సమితి స్థాపన ఒక ముందడుగు.

"ఇండియాలో కార్మిక కర్షక రాజ్యస్థాపన, సోషలిస్టు సిద్ధాంతాలపై ఆధారపడి భారత రాజ్యాంగ రూపకల్పన కార్మికుల ఆర్థికపరమైన కోర్కెల సాధన" తన ఆశయాలుగా యీ

యువకార్మిక సమితి ప్రకటించింది. ఈ లక్ష్యాల సాధనకు సమరశీల ట్రేడ్ యూనియన్లతోనూ, యితర కార్మికవర్గ పార్టీలతోనూ కలిసి పనిచేస్తామని ఈ సమితి ప్రకటించింది. ఫ్యాక్టరీలు, రైల్వేలలో పనిచేస్తున్న 25 సం॥ల లోపు వయసు గల్గిన యువకార్మికులు యీ సంస్థలో చేరడానికి అర్హులు.

1934 సం॥లో ఈ యువ కార్మిక సమితి చొరవ తీసుకుని బెంగాలు ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా బెంగాలులో అనేక చోట్ల సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ అణచివేత విధానాలను ఐక్యంగా ప్రతిఘటించ వలసిందిగా పిలుపు నిచ్చింది. 1934 మార్చి 18వ తేదీన యువకార్మిక సమితి పారిస్ కమ్యూన్ దినోత్సవాన్ని జరిపింది. ఈ సభలో శ్రీ ఎస్.వి. దేశ్‌పాండే తదితర కమ్యూనిస్టులు పారిస్ కమ్యూన్ విప్లవ ప్రాధాన్యతను వివరించి, సమ్మెకు సిద్ధంగా వుండవలసిందిగా కార్మికులను కోరారు.

1934 సం॥లో బొంబాయిలోని జౌళి కార్మికులను సార్వత్రిక సమ్మెకు సన్నద్ధులను చేయడంలో "యువ కార్మిక సమితి" ప్రముఖ పాత్ర వహించింది. కార్మికులలో అనేక కరపత్రాలు పంచడం ద్వారా వారిలో రాజకీయ చైతన్యం కల్గించడానికి ఈ సమితి అవిరళ కృషి సల్పింది. ఇదే (1934) సంవత్సరం జూలై 6వ తేదీన టెక్స్‌టైల్ కార్మికుల సార్వత్రిక సమ్మె ఉపసంహరించబడిన తరువాత ఈ సమితి విప్లవానికి పిలుపునిస్తూ కార్మికులకు కరపత్రాలు పంచింది. రష్యా విప్లవాన్ని ఉదహరిస్తూ ఈ కరపత్రం "మార్క్స్, లెనిన్‌ల బోధనలకనుగుణంగా తమ ఉద్యమాలను నడపడం వలన మాత్రమే రష్యాలోని కార్మికులు, కర్షకులు కలిసి పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోయగల్గినారు. వడ్డీ వ్యాపారస్తులు, జమీందార్లు, పెట్టుబడిదారులు సామ్రాజ్యవాదులు మొదలైనవారి దోపిడీ నుండి శాశ్వతంగా విముక్తి పొందాలంటే మార్క్స్, లెనిన్ విప్లవ కమ్యూనిస్టు ప్రబోధాలకనుగుణంగా భారతదేశంలోని కార్మికులు, కర్షకులు తమ విధానాలను రూపొందించుకోవాలి" అని పేర్కొన్నది. సార్వత్రిక సమ్మె విఫలమవడంతో నిరాశపాలైన కార్మికులను ఉత్తేజపరచడానికి ఈ కరపత్రం దృఢ నమ్మకంతో యిలా చెప్పింది. "బొంబాయిలోని మిల్లు కార్మికుల సార్వత్రిక సమ్మె తాత్కాలికంగా పరాజయం పొందినప్పటికీ, దీనితోనే కార్మికవర్గ పోరాటాలు అంతం కాలేదు. కార్మికుల రక్తాన్ని పీల్చి పిప్పిచేసి మరింత భాగ్యవంతులవుదామనుకునే పెట్టుబడిదారుల ధనదాహం ఏనాటికి తీరదు. నానాటికి పెచ్చరిల్లుతున్న సామ్రాజ్యవాదుల జులుంను అరికట్టడానికి కార్మికులు పోరాడవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నది. ఈ పోరాటాలన్నింటిలో విజయం సాధించాలంటే ఈ మధ్యనే సాగిన సార్వత్రిక సమ్మె పోరాటంలో కంటే మరింత ధైర్య సాహసాలతో నిలబడాలి."

కార్మికులలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో గిర్నికాంగర్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్) శ్లాఘనీయమైన కృషి చేసింది. మీరట్ కుట్రకేసులో నిందితులై శిక్షననుభవించి జైలు నుండి తిరిగి వచ్చిన నాయకులను గిర్నికాంగార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్) సన్మానించింది.

శ్రీ బి.టి. రణదివె అధ్యక్షత వహించిన యీ సన్మాన సభకు శ్రీయుతులు యస్.వి. ఘాటే, యస్.యస్. మిరాజ్‌కర్ కె.ఎన్. జోగ్లేకర్, బి.ఎఫ్. బ్రాడ్లే తదితర నాయకులు హాజరయ్యారు. 1934 జనవరి 21వ తేదీన "లెనిన్ జన్మదినోత్సవం" నాడు ఒక బ్రహ్మాండమైన బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో ఉపన్యసించిన నాయకులు లెనినిజమ్ ఆధారంగా విప్లవాత్మకమైన ప్రజా ఉద్యమాలను నిర్మించవలసిన ఆవశ్యకతను గురించి కార్మికులకు వివరించారు.

1933 జనవరి 21, 22 తేదీల్లో జంషెడ్‌పూర్‌లో జరిగిన రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యవర్గం, మీరాట్ కుట్ర కేసు నిందుతులకు శిక్ష విధించినందుకు నిరసనగా ఫిబ్రవరి 16వ తేదీన సార్వత్రిక సమ్మె నిర్వహించవల్సిందిగా రైల్వేలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులకు పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 16ను "మీరట్ రోజు"గా పాటించవలసిందిగా కోరుతూ శ్రీయుతులు సోమనాథ్ లాహిరి, బంకిమ్ ముఖర్జీ, యస్.జి. సర్దేశాయ్ సంతకాలు చేసి ఒక కరపత్రం విడుదల చేశారు. ఆ రోజున బొంబాయిలో జరిగిన సమావేశంలో శ్రీ బి.టి. రణదివె తదితర నాయకులు మీరట్ కుట్రకేసులో నిందితులను శిక్షించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విధంగా కార్మిక నాయకులను శిక్షించడమంటే ప్రభుత్వం ప్రత్యక్షంగా కార్మికవర్గ ఉద్యమాలపై దాడులు సాగించడం తప్ప మరేమీ కాదని వారు ప్రకటించారు. ఈ సమావేశానికి శ్రీ సర్దేశాయ్ అధ్యక్షత వహించారు. కలకత్తాలో కూడా టోలీగంజ్, మేటియాబురుజ్‌లలో "మీరట్ దినాన్ని" పాటిస్తూ సమావేశాలు జరిగాయి.

ఆలిండియా రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ గిర్నికాంగార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్)లు సంయుక్తంగా 1933 ఫిబ్రవరి 12వ తేదీన "నిరుద్యోగ దినాన్ని" పాటించాయి. ఆ రోజున బొంబాయిలో సమావేశాలు, ప్రదర్శనలు జరిగాయి. శ్రీ బి.టి. రణదివె, శ్రీ యస్.జి. సర్దేశాయ్ తదితర నాయకులీ సమావేశాలలో ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభకాలంలో దేశంలో నిరుద్యోగం, రిట్రెంచ్‌మెంట్ వలన కార్మికవర్గం తీవ్రమైన బాధలకు గురవుతున్న ఈ పరిస్థితులలో "నిరుద్యోగ దినాన్ని" పాటించడం ప్రత్యేకించి గమనించదగిన విషయం.

రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ పిలుపు మేరకు 1933 ఆగస్టు 1వ తేదీన "యుద్ధ వ్యతిరేక దినం" పాటించబడింది. ప్రప్రథమ శ్రామిక రాజ్యం సోవియట్ యూనియన్‌ను నాశనం చేయడానికి సామ్రాజ్యవాదులు పన్నుతున్న కుట్రలకు వ్యతిరేకంగా ఈ నిరసన దినం పాటించబడింది. ఆ రోజున శ్రీ వి.బి. ఖాలే అధ్యక్షతన కార్మికుల సమావేశం జరిగింది. బెంగాలులో కలకత్తా సమీపాన వున్న మెటియాబురుజ్, చాందియానగోరె తదితర ప్రాంతాలలో కార్మికులు సమావేశాలు జరపడం ద్వారా యీ "యుద్ధ వ్యతిరేక" దినాన్ని పాటించారు. శ్రామికవర్గ అంతర్జాతీయతా భావాన్ని కార్మికవర్గంలో కలుగజేయడమే ఈ కార్యక్రమ ప్రాధాన్యత.

రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు పిలుపు ననుసరించి 1934 నవంబరు 7న "రష్యా విప్లవ దినోత్సవాన్ని" పాటించడం జరిగింది. వివిధ కార్మికవర్గ కేంద్రాలలో జరిగిన సమావేశాల్లో వక్తలు "అక్టోబరు సోషలిస్టు మహావిప్లవ" ప్రాధాన్యతను వివరించారు. కలకత్తాలోని "మాన్యుమెంట్ మైదానం"లో జరిగిన కార్మికుల ర్యాలీలో బెంగాల్ జూట్ వర్కర్స్ యూనియన్, కలకత్తా ట్రామ్ వర్కర్స్ యూనియన్, డాక్ మజ్దూర్ తదితర యూనియన్లకు చెందిన కార్మికులు కూడా పాల్గొన్నారు.

1934 సం॥లో మే దినోత్సవం సందర్భంగా కార్మికుల్లో అంతర్జాతీయ దృక్పథాన్ని కలుగజేసి అంతర్జాతీయ శ్రామికవర్గ సౌభ్రాతృత్వ భావనను పెంపొందించడానికి రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కృషి చేసింది.

ఆస్ట్రియా, జర్మనీ, చైనా దేశాలను ఊపివేస్తున్న కార్మికవర్గ పోరాటాలను గురించి యీ సమావేశాల్లో వివరించి ధైర్యంగా యీ పోరాటాలకు భారత కార్మికవర్గ సానుభూతి, సంఘీభావాలను వ్యక్తం చేయడం జరిగింది. రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఆధ్వర్యంలో జరిగిన మే దినోత్సవ సభలో, సోషలిస్టు సమాజ నిర్మాణంలో రష్యా కార్మికవర్గం సాధించిన విజయాలకు వారిని అభినందించడం జరిగింది.

వర్గ సామరస్య విధానాల ననుసరించే అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్‌కు ప్రత్యామ్నాయంగా 1933లో కమ్యూనిస్టులు అహమ్మదాబాద్ మిల్ మజ్దూర్ యూనియన్‌ను స్థాపించారు. కాని 1934 నవంబరు 5వ తేదీన యీ యూనియన్‌ను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించి, ఆ యూనియన్ నాయకులలో ఆరుగురిని అరెస్టు చేశారు.

కార్మికవర్గంలో ఉన్నతమైన రాజకీయ భావాలను వ్యాప్తి చేసి విప్లవ భావాలను పెంపొందించేందుకు చేసిన ప్రయత్నాలలో కొన్నింటిని మాత్రమే ఇక్కడ ఉదహరించడం జరిగింది. కాని యిది ఏ మాత్రం సమగ్రమైన చర్చకాదు. కార్మికుల రోజువారీ ఆర్థిక పోరాటాలతో బాటే యీ ప్రయత్నాలు కూడ కొనసాగించబడ్డాయి. ఈ విషయంలో రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అగ్రగామిగా నిలిచింది.

జైలులో వున్నా, వెలుపలనున్నా కమ్యూనిస్టులు "మార్క్సిజం-లెనినిజం" యొక్క విప్లవ భావాలను వ్యాప్తి చేసిన కాలమిది. ఈ కాలంలోనే టెర్రరిస్టు ఉద్యమంతో సంబంధాలు కల్గియున్న రాజకీయ కార్యకర్తలు, అధిక సంఖ్యలో వ్యక్తిగత హింసావాదాన్ని విడనాడి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని తమ విప్లవ సిద్ధాంతంగా అంగీకరించారు. ఈ విధంగా ఈ కాలంలోనే (1930-34) మార్క్సిస్టు సిద్ధాంతం విస్తృతస్థాయిలో ఆమోదం పొందింది. ఆనాటి కార్మికవర్గ ఉద్యమంలో తీవ్రత లోపించడమేగాక ఉద్యమం విస్తరించడం కూడ జరగలేదు. ఈ లోపాల వలన కార్మికవర్గ ఉద్యమం శక్తిని కోల్పోయింది. కాని కార్మికవర్గం యొక్క వర్గ, విప్లవ చైతన్యం పెంపొందించేందుకు ఈ కాలంలోనే విశేషమైన కృషి జరిగింది.

## క్షీణించిన ఐక్యత : ఐక్యతా ప్రయత్నాలు (1931-34)

1931-34 మధ్య కాలంలో సంస్థాపరంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమం చాలా దిగువ స్థాయిలో వుంది. 1929-30, 1930-31 మధ్య సంవత్సర కాలంలో రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్య 104 నుండి 119కు పెరిగినప్పటికీ, సభ్యత్వం మాత్రం 2,42,355 నుండి 2,19,115కు పడిపోయింది. రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్య పెరుగుదల విషయంలో బెంగాలు అగ్రస్థానం ఆక్రమించింది. 1930-32 సం॥లో ఈ సంఖ్య 19 నుండి 24కు పెరిగింది. 1931 - 32 ఒక సంవత్సర కాలంలో దేశం మొత్తం మీద రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్య 131కి పెరుగగా, మొత్తం సభ్యత్వం 2,35,693కు పెరిగింది. మద్రాసులో అంతకు ముందు ఏడాది 17 ట్రేడ్ యూనియన్లుండగా ఈ సంవత్సరం (1931-32) వాటి సంఖ్య 23కు పెరిగి రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్యలో అత్యధిక పెరుగుదలను మద్రాసు సాధించింది. 1932 - 33 ఏడాదిలో దేశ వ్యాప్తంగా రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్య 170కి సభ్యత్వం 2,37,369కి చేరాయి. (1932-33) సంవత్సరంలో రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్ల పెరుగుదల విషయంలో బొంబాయి ప్రెసిడెన్సీ ప్రథమ స్థానం ఆక్రమించింది. అంతకు ముందు సంవత్సరం 32 ట్రేడ్ యూనియన్లుండగా వీటి సంఖ్య పెరిగి ఈ సంవత్సరం (1932-34 సం॥) 44కు చేరింది. 1933-34 సం॥ము దేశ వ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ల సంఖ్య 49కి పెరిగినప్పటికీ సభ్యత్వం మాత్రం 2,08,071కి పడిపోయింది. 1928-29 తర్వాత ఏనాడూ ఈ స్థాయిలో సభ్యత్వం దిగజారలేదు. కానీ ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం తగ్గినప్పటికీ గత సంవత్సరం కంటే 1934లో పారిశ్రామిక వివాదాలు గణనీయంగా పెరగడం గమనించదగిన విషయం. 1932-33లో పారిశ్రామిక వివాదాల సంఖ్య 118 వుండగా 1933-34లో ఇది 146కు చేరింది.

ఆర్థిక సంక్షోభం వలన తీవ్ర బాధలకు గురయిన కార్మికులకు సంఘటితం కావల్సిన అవసరం ఏర్పడింది. కాని సంస్థాపరంగా కార్మికుల్లో నెలకొన్న అనైక్యత, జాతీయస్థాయిలో మూడు సమాంతర ట్రేడ్ యూనియన్ కేంద్రాలు వుండడంతో కార్మికుల ఆశల మీద నీళ్ళుచల్లినట్లయింది. కార్మికవర్గంలో అనైక్యత మూలంగానే ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం తగ్గిపోతోందని స్పష్టమైంది.

1929 సం॥లో ఎ.ఐ.టి.యు.సి మొదటిసారి చీలినపుడు శ్రీయుతులు జోషి, చమన్‌లాల్ వారి అనుచరుల నాయకత్వంలోని చీలికవాదులు, తాము మెజారిటీ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకున్నారు. 1,36,639 మంది సభ్యులు గల్గిన 30 యూనియన్లు వారి ఆధీనంలో వున్నట్లు ప్రకటించారు. కాని 1930 జూలై 20వ తేదీన వారు ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్థాపించే సమయానికి 14,300 మంది సభ్యత్వం కల్గిన 7

యూనియన్లు మాత్రమే వారితో మిగిలాయి. 1932లో మద్రాసులో జరిగిన ఫెడరేషన్ ప్రథమ మహాసభలో 82,500 సభ్యత్వం కల్గిన 32 యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

1929 ఎ.ఐ.టి.యు.సి.లో మొదటిసారి చీలిక సంభవించినప్పుడు జి.ఐ.పి. రైల్వే వర్కర్సు యూనియన్ తప్ప ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్‌కు అనుబంధంగా వున్న మిగిలిన యూనియన్లన్నీ ఎ.ఐ.టి.యు.సి. నుండి విడిపోయాయి. తరువాత సీమెన్స్ యూనియన్ కూడా ఏ.ఐ.టి.యు.సిని వదలి వెళ్ళిపోయింది. పోస్టల్ ఉద్యోగుల యూనియన్, అహమ్మదాబాదులోని మజూర్ మహాజన్‌లు అప్పటికే ఎ.ఐ.టి.యు.సి.కి వెలుపల వున్నాయి. ఇప్పుడు రైల్వే యూనియన్లు కూడ యిదే పద్ధతిననుసరించడంతో, దేశంలోని ఉద్యోగులు, కార్మికులలో అధిక సంఖ్యాకులు కేంద్ర ట్రేడ్ యూనియన్ల వెలుపలనే వుండిపోయారు.

ఈ కాలంలో సాగిన బ్రహ్మాండమైన కార్మికవర్గ పోరాటాలను యీ అనైక్యత తీవ్రంగా బలహీనపరచింది. రైల్వేలలో అధిక సంఖ్యలో రిట్రెంచ్‌మెంటు జరుగుతున్నప్పటికీ, యీ దాడిని ప్రతిఘటించడానికి ఒక సార్వత్రిక సమ్మె నిర్వహించడం రైల్వే కార్మికులకు అసాధ్యమైంది. 1930 నవంబరులో కలకత్తాలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. కార్యవర్గ సమావేశం జి.ఐ.పి. రైల్వేలోనూ, ఈస్టిండియా రైల్వేలోనూ డిస్మిస్ చేయబడిన యూనియన్ కార్యకర్తలకు తిరిగి ఉద్యోగాలివ్వాలన్న, డిమాండుతో పాటు, అన్ని రైల్వేలలోను అతి ప్రమాదంగా పరిణమిస్తున్న రిట్రెంచ్‌మెంట్‌కు వ్యతిరేకంగా రైల్వేల్లో సార్వత్రిక సమ్మె జరపాలని తీర్మానించింది. కాని బెంగాల్, బరోడా, మరియు సెంట్రల్ ఇండియా రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీ జమ్నాదాస్ మెహతా, ఎ.ఐ.టి.యు.సి. అధ్యక్షుడు శ్రీ సుభాష్ చంద్రబోస్‌కు ఒక ఉత్తరం వ్రాస్తూ పారిశ్రామిక వివాదాల చట్టం క్రింద సమ్మె ప్రతిపాదన చట్ట విరుద్ధమవుతుందని చెప్తూ, సమ్మె నిర్ణయం కూడా చాలా అక్రమ పద్ధతిలో తీసుకొనబడిందని ఆరోపిస్తూ, యీ సమ్మెలో పాల్గొనడానికి తన యూనియన్ అశక్తతను తెలియజేశాడు.

ఈ కాలంలో కార్మికోద్యమంలో అనైక్యత ఎంత తీవ్రస్థాయిలో వున్నదో యీ సంఘటన వెల్లడిస్తుంది. ఈ అనైక్యతకు సంస్కరణవాద నాయకుల పోరాట వ్యతిరేక వైఖరి తోడుగావడంతో, రైల్వేలలో సార్వత్రిక సమ్మె సాగించే అవకాశాలు మృగ్యమయ్యాయి. దీనితో యజమానులు తమ ఇష్టం వచ్చినట్లు రైల్వే కార్మికులను రిట్రెంచ్ చేశారు. ఫలితంగా 1930లో జి.ఐ.పి. రైల్వే యూనియన్ నిర్వహించిన సమ్మెకు ప్రతికూల పరిస్థితులేర్పడ్డాయి.

ఇదే విధంగా బెంగాలులో జూట్ కార్మికులు, బొంబాయి, నాగపూర్, షోలాపూర్ పట్టణాలలో జౌళి కార్మికులు వీరోచిత పోరాటాలు సాగించినప్పటికీ, అనేక త్యాగాలు చేయవల్సివచ్చింది. అయినప్పటికి అగ్రనాయకుల్లో వున్న అనైక్యత అభిప్రాయభేదాల దుష్ప్రభావం సాధారణ కార్మికులపై కూడా పడడంతో, సమ్మె విజయవంతంగా ముగిసి కోర్కెలను సాధించుకోవడానికి అవరోధాలు ఏర్పడ్డాయి.

కాని ఈ తీవ్ర పోరాటాల ద్వారా కార్మికవర్గం అమూల్యమైన అనుభవాలను గడించింది. విజయసాధనకు ఐక్య పోరాటాలు తప్పనిసరనే విషయాన్ని కార్మికులు ఈ పోరాటాల ద్వారా అర్థం చేసుకోగలిగారు. తరువాత రోజుల్లో కార్మికవర్గం ఐక్య పోరాటాలకు చేసిన అవిరళ కృషి, వారు సాధించిన విజయాలు పరిశీలించినట్లయితే యీ పోరాటాల ద్వారా కార్మికవర్గం గుణపాఠాలు నేర్చుకున్నట్లు స్పష్టమవుతుంది.

ఇదిలా వుండగా, 1931లో వెలువడినవైట్లీ కమిషన్ నివేదిక కార్మికులకు పూర్తిగా ఆశాభంగం కలిగించింది. వికృతాకారం దాలుస్తున్న నిరుద్యోగ సమస్యను గాని, రిట్రెంచ్‌మెంటు సమస్యను గాని పరిష్కరించడానికి సిఫార్సులు చేయకపోగా, వలస పెట్టుబడిదారీ విధానాల వలన దోపిడికి గురవుతున్న కార్మికుల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడానికి ఈ నివేదిక ఏ సిఫార్సు చేయలేదు. ఈ కమిషన్ అతి స్వల్పమైన రాయితీలు సిఫార్సుచేసి తన పవిత్రకార్యాన్ని నిర్వర్తించింది. అయినప్పటికీ భారత కార్మికోద్యమంలోని మధ్యవాద, సంస్కరణవాద నాయకులు యీ రిపోర్టులో కూడ కార్మికుల స్థితిగతులను మెరుగుపరచే అంశాలను వెదకి పట్టుకోగలిగారు.

కలకత్తా నుండి వెలువడే "లిబర్టీ" అనే దినపత్రిక సామ్రాజ్యవాదుల కుట్రలను బహిర్గతం చేసే యీ రిపోర్టును గురించి, యీ విధంగా వ్రాసింది. "వైట్లీ కమిషన్ నివేదిక జాతీయ విముక్తి పోరాటం నుండి ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని వేరుచేయడానికి సామ్రాజ్యవాదులు చాల పకడ్బందిగా పన్నిన పన్నుగడ. ఇది భారత జాతీయ కాంగ్రెసు ఉద్దేశాల కనుగుణంగా వున్నది. ఈ కమిటీ రిపోర్టులు మితవాద ట్రేడ్ యూనియన్ నాయకుల భావాలకు, వాదనలకు బలం చేకూర్చుతాయి. సంస్కరణవాదుల నాయకత్వంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం "ఆరోగ్యకరంగా అభివృద్ధి" చెందుతుందని యీ రిపోర్టు బలంగా వాదించింది. వైట్లీ కమిషన్ నివేదికను మార్గదర్శకంగా భావించి, దాని నుండి ఉత్తేజం పొందే నాయకత్వం కార్మికులను చీకటిలోకి త్రోసివేస్తుంది. ఈ సమయంలో శ్రామికవర్గానికి ధైర్యంగా, దూరదృష్టితో మార్గదర్శకం వహించే నాయకత్వం అవసరం."

ఆనాడున్న పరిస్థితులలో భారత కార్మికవర్గానికి నాయకత్వం వహించే వారికి ధైర్యసాహసాలు, దూరదృష్టి వుంటేనే చాలదు. సామ్రాజ్యవాదానికి స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల దోపిడికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నడిపే శక్తివంతమైన నాయకత్వం అవసరమైంది. అందువలన ఆనాటి పరిస్థితులను బట్టి కార్మికవర్గం ఐక్యత కొరకు అన్ని తరగతుల నాయకుల మీద ఒత్తిడి చేయసాగింది.

1931లో భారత కార్మికోద్యమంలోని వివిధ సెక్షన్ల మధ్య సహకారం కోసం ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు శ్రీయుతులు ఆర్.ఆర్.బాఖలే, యన్.యం.జోషీ, చమన్‌లాల్‌లు ప్రయత్నం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో ఎ.ఐ.టి.యు.సి. నుండి విడిపోయిన వారందరూ తిరిగి ఎ.ఐ.టి.యు.సిలో జేరవలసిందిగా ఎ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ ముకుందలాల్ సర్కార్ విజ్ఞప్తిచేశాడు. అయితే ఈ ఐక్యతా ప్రయత్నాలు మాతృసంస్థ అయిన

ఎ.ఐ.టి.యు.సి.కి, ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌లకు మాత్రమే పరిమితమయ్యాయి. కలకత్తా మహాసభలో ఎ.ఐ.టి.యు.సి. నుండి మిలిటెంట్ గ్రూపు విడిపోవడంతో, మిగిలిన రెండు గ్రూపులు (ఎ.ఐ.టి.యు.సి., ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్లు) ఏకంకావడానికి వారి మధ్య సిద్ధాంతపరమైన విభేదాలేమీలేవు.

ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ తరుపున కూడ ఐక్యతా ప్రయత్నాలు జరిగాయి. వివిధ రైల్వేలలోని యూనియన్లన్నీ యీ ఫెడరేషన్‌కు అనుబంధం చేయబడ్డాయి. సాధారణంగా అనైక్యత నెలకొని వున్నప్పటికి భారత కార్మికోద్యమంలో ఈ ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ప్రతిష్టాత్మకమైన స్థితిలోనున్నది. ఈ పరిస్థితిని వినియోగించుకొని 1931 మే 10వ తేదీన బొంబాయిలో ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం శ్రీ జమ్నాదాస్ మెహతా అధ్యక్షునిగా, వి.వి.గిరి, బి. శివరావు తదితరులు సభ్యులుగా ఒక "ట్రేడ్ యూనియన్ ఐక్యతా కమిటీ"ని ఏర్పాటు చేసింది. భారత కార్మికోద్యమాన్ని సంస్థాపరంగా ఏకంచేసే సమస్యపై నివేదిక సమర్పించవల్సిందిగా కమిటీని కోరడం జరిగింది.

1932 మే నెలలో ఈ కమిటీ ప్రచురించిన నివేదికలోని అంశాలను గమనించవల్సివుంది. మిగిలిన విషయాలతోబాటు "కమ్యూనిస్టులు, కార్మికోద్యమంలోని మిగిలిన రెండు సెక్షన్లకు మధ్య అగాధాన్ని పూడ్చడం అసంభవం. అందువలన కమిటీ మిగిలిన రెండు సెక్షన్లకు మధ్యన మాత్రమే ఐక్యతా ప్రయత్నాలు సాగించాలని సిఫార్సు చేస్తోంది" అని ఈ రిపోర్టు పేర్కొన్నది. ఈ విధంగా ఈ ఐక్యతా కమిటీ కమ్యూనిస్టులను పూర్తిగా వేరుచేసి సంస్కరణవాదులు, జాతీయవాదులలోని వివిధ సెక్షన్ల మధ్య మాత్రమే ఐక్యతను సాధించాలని స్పష్టంగా ప్రకటించింది. అదే 1932 సం॥లో మద్రాసులో జరిగిన ఒక ప్రత్యేక మహాసభలో ఈ నివేదిక ఆమోదింపబడింది.

1932 సెప్టెంబరు 10-12 తేదీలలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. 12వ మహాసభకు శ్రీ జె.ఎన్. మిత్రా అధ్యక్షత వహించారు. ఈ మహాసభ ట్రేడ్ యూనియన్ యూనిటీ కమిటీ రిపోర్టును తిరస్కరించింది. దీనికి బదులుగా గిర్నీ కాంగార్ యూనియన్ (బటాటా వాలా బిల్డింగ్స్) ఐక్య వేదిక కొరకు చేసిన కొన్ని ప్రతిపాదనలను అంగీకరించి, వాటిని ట్రేడ్ యూనియన్ యూనిటీ కమిటీకి నివేదించింది. ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ట్రేడ్ యూనియన్ల అంతర్జాతీయ సమాఖ్య)కు అనుబంధం చేయాలన్న ఐక్యతా కమిటీ నివేదికలోని అంశాన్ని తొలగించాలని కూడా ఈ సమావేశం సిఫార్సు చేసింది.

ఇదే సమయంలో కార్మికోద్యమంలో మరికొన్ని పరిణామాలు సంభవించాయి. ఈ యూనిటీ కమిటీ సిఫార్సులు ఎ.ఐ.టి.యు.సి.కి ఆమోదయోగ్యంగా వుండవని ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు, కొందరు రైల్వే యూనియన్ల నాయకులు గ్రహించారు.

వీరు (ఈ రైల్వే నాయకులు) అప్పటికే నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ అనే సంస్థను స్థాపించి, దీని నిర్మాణ బాధ్యతలను శ్రీ వి.వి. గిరి, జమ్నాదాస్ మెహతా, గురుస్వామి తదితరులతో గూడిన ఒక తాత్కాలిక కమిటీకి అప్పగించడం జరిగింది. మరల 1932 జూలై నెలలో మద్రాసులో జరిగిన రెండవ ఐక్యతా మహాసభ ననఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌తో బాటు తమ ఆధీనంలో నున్న రైల్వే యూనియన్లతో ఒక కేంద్ర కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది. ఈ తీర్మానాని కనుగుణంగా 1933 ఏప్రిల్ 19, 20 తేదీలలో కలకత్తాలో జరిగిన ప్రత్యేక మహాసభలో కొద్ది కాలం క్రిందటనే ఏర్పడిన నేషనల్ లేబర్ ఫెడరేషన్, ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ కలిసి నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ పేరిట ఒక నూతన సంస్థగా రూపొందాయి.

బొంబాయిలో 1933 డిశంబరు 24 నుండి 26 వరకు జరిగిన నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ప్రథమ మహాసభకు శ్రీ మృణాల్‌కాంతి బోస్ అధ్యక్షత వహించాడు. 1,35,000 మంది సభ్యత్వం గల్గిన 47 యూనియన్ల ప్రతినిధులు యీ సమావేశంలో పాల్గొన్నారు. కాని మితవాద నాయకుల్లో వారిలో వారికి అనేక తీవ్రమైన అభిప్రాయబేధాలు తలెత్తాయి. ప్రథమ మహాసభలోనే 15,000 మంది సభ్యులు గల్గిన ఆరు యూనియన్ల ప్రతినిధులు ఎన్.ఎమ్.జోషీతో విభేదించి సమావేశం నుండి వాకౌట్ చేసి వేరుగా సమావేశమై ఎ.ఐ.టి.యు.సి మాజీ అధ్యక్షుడు, బెంగాల్ మెరైనర్స్ యూనియన్ నాయకుడు శ్రీ మహమ్మద్ దావూద్ అధ్యక్షునిగా ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ లేబర్ అనే మరో సంస్థను స్థాపించారు.

ఏమైనప్పటికీ ఈ మొట్టమొదటి మహాసభలోనే, నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌ను, ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్‌కు అనుబంధం చేయాలని నిర్ణయించబడటం జరిగింది.

శ్రీ యం.యన్. రాయ్ అనుచరులు కూడా మితవాద సంస్కరణవాదులతో చేతులు కలిపి భారత కార్మికోద్యమంలో చీలికలు సృష్టించడానికి తీవ్రంగా కృషి చేయడం గమనార్హం. 1920లో తాష్కెంట్‌లో ప్రవాస కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన శ్రీ యం.యన్.రాయ్. తరువాతి కాలంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించడంతో, ఆయనను పార్టీ నుండి బహిష్కరిస్తూ 1929 డిసెంబరు 4వ తేదీన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రకటించింది.

ఆయన పార్టీ నుండి బహిష్కరించబడిన తరువాత తన నాయకత్వంలో శ్రీయుతులు తాయిబ్ షేక్, సుందర్ కబాడీ తదితరులతో ఒక గ్రూపును తయారు చేయడానికి ప్రయత్నాలు చేశాడు. 1930వ సంవత్సరం చివరిలో శ్రీ రాయ్ రహస్యంగా భారతదేశం తిరిగి వచ్చి తన గ్రూపును పటిష్టం చేసుకున్నాడు. కాని 1924 కాన్పూరు కుట్రలో నిందుతుడై యున్నందున 1931లో భారత ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. రాయ్ ముఠా ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో చొరబడడానికి ప్రయత్నించింది. భారత్ కార్మికోద్యమంతో సంబంధాలు కల్గిన. శ్రీయుతులు జె.ఎన్.మిత్రా, మణిబెన్ కారా, వి.బి.కార్నిక్, రజనీముఖర్జీ తదితరులు రాయ్

ముఠాకు చెందినవారే. ఈ రాయిస్టులు మితవాద సంస్కరణవాదుల సహాయంతో భారత కార్మికోద్యమం నుండి కమ్యూనిస్టులను వేరు చేయడానికి ప్రయత్నించారు. ఈ రాయిస్టులు ఎ.ఐ.టి.యు.సి.లో చీలికను వేగవంతం చేశారు. శ్రీయుతులు వి.వి.గిరి, చమన్‌లాల్ తదితర మితవాదులు ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌ను, కమ్యూనిస్టులు రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్థాపించడంతో శ్రీయుతులు ఆర్.ఎస్.రూయికర్, ముకుందలాల్ సర్కార్, హరిహర్‌నాథ్ శాస్త్రి తదితరులకు సహాయంగా ఈ రాయిస్టు గ్రూప్ ఎ.ఐ.టి.యు.సి నాయకత్వాన్ని చేపట్టింది.

ఈ సమయానికే ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఐక్యతకు కమ్యూనిస్టులు చాలా చురుకుగా పనిచేస్తున్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ఐక్య సంఘటనను నిర్మించాలనే రాజకీయ అవగాహనతో ఎట్టి పరిస్థితుల్లోనూ వర్గపోరాటం విషయంలో రాజీపడకుండా ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఏకంచేయడానికి కమ్యూనిస్టులు కంకణం కట్టుకున్నారు. సరిగ్గా యీ సమయానికి మీరట్ కుట్రకేసు నిందితులందరూ విడుదల చేయబడడం, యీ ప్రయత్నాలలో కమ్యూనిస్టులకు మరింత సహాయకారి అయింది.

ఇదిలావుండగా, ఎ.ఐ.టి.యు.సి. 13వ మహాసభ కాన్పూరులో 1933 సం॥ డిశంబరు 3వ తేదీన శ్రీ జి.ఎల్. కండాల్కర్ అధ్యక్షతన జరిగింది. ఏ విధమైన ఉత్సాహం లేకుండా యీ మహాసభ చాలా నిస్సారంగా మొక్కుబడిగా సాగింది. ఆ తరువాత 1935 జనవరిలో ఎ.ఐ.టి.యు.సి కార్యవర్గ సమావేశం నాగపూర్‌లో జరిగింది. ఐక్యత విషయమై ఎ.ఐ.టి.యు.సి నాయకత్వం కార్యకర్తల నుండి తీవ్ర ఒత్తిడికి గురైంది. అదేసమయంలో ఐక్యతకు అవరోధాలుగా వున్న ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర ట్రేడ్ యూనియన్లను ఏకం చేయడం భ్రమ మాత్రమేనని వారు గుర్తించారు. రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌ను స్థాపించిన కమ్యూనిస్టులు, తదితర వామపక్ష భావాలు గలిగినవారు వర్గపోరాట సిద్ధాంతానికి గట్టిగా కట్టుబడి వుండగా, మితవాద సంస్కరణవాదులు ఈ వర్గపోరాటమంటేనే భయపడసాగారు. అంతేగాక వీరు పారిశ్రామిక వివాదాలను త్రైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలని కోరుతూ వచ్చారు. ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ.)లో ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా కోరుతున్నారు. ఎ.ఐ.టి.యు.సి. మొదటిసారి చీలడానికి ఈ ఐ.ఎల్.ఒ.కు ప్రాతినిధ్యం సమస్య కూడా ఒక ప్రధాన కారణమనే విషయం తెలిసిందే. కాని మిగిలిన వారు అంతర్జాతీయ కార్మిక సంస్థ, సామ్రాజ్యవాదుల అధీనంలో వున్న సంస్థ అయినందువలన భారత కార్మిక వర్గానికీ సంస్థ వలన ఏ విధమైన ప్రయోజనం చేకూరదు కనుక ఐ.ఎల్.ఒ.కు ప్రతినిధివర్గాన్ని పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మితవాద సంస్కరణవాదులీ విషయంలో రాజీకి సిద్ధంగాలేరు. నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌ను ఆమ్‌స్టర్‌డామ్ ఇంటర్నేషనల్‌కు అనుబంధం చేసే విషయాన్ని వాయిదా వేయడానికి కూడా తాము సిద్ధమని, కాని అంతర్జాతీయ కార్మిక సంస్థ సమావేశంలో పాల్గొనే సమస్య మీద రాజీ ప్రసక్తి లేదని, 1933 డిశంబరులో జరిగిన నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ప్రథమ మహాసభలో శ్రీ జమ్నాదాస్ మెహతా పేర్కొన్నారు.

ఈ విధంగా విభిన్న అభిప్రాయాలు వెల్లడవుతున్న ఈ తరుణంలో కేంద్ర కార్మిక సంఘాలను ఏకం చేయడానికి నాగపూర్‌లో సమావేశమయిన ఎ.ఐ.టి.యు.సి. కార్యవర్గం కొన్ని ఐక్యతా ప్రతిపాదనలు చేసింది. ఆ ప్రతిపాదనలిలా వున్నాయి.

1) వర్గ పోరాట సిద్ధాంతాన్ని (నిర్ద్వంద్వంగా) అంగీకరించి తీరాలి.

2) ఏ అంతర్జాతీయ సంస్థకు అనుబంధం చేయరాదు.

3) అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐ.ఎల్.ఒ.) సమావేశాలలో భారత కార్మికవర్గం పాల్గొనే విషయాన్ని ఏ సంవత్సరానికా సంవత్సరం నిర్ణయించుకోవాలి. ఆ నిర్ణయానికి అన్ని యూనియన్లు కట్టుబడియుండాలి.

4) ఒక పరిశ్రమకు ఒకే యూనియన్ సిద్ధాంతాన్ని ఆమోదించాలి.

5) భారత కార్మిక వర్గానికి ఏకైక కేంద్ర కార్మిక సంస్థగా ఎ.ఐ.టి.యు.సి.ని గుర్తించాలి.

ఐక్యత కోసం ఈ ప్రతిపాదనలను రూపొందించిన తరువాత ఎ.ఐ.టి.యు.సి. 14వ మహాసభ 1935 ఏప్రిల్ 19-21 తేదీలలో కలకత్తాలో జరిగింది. దీనికి హరిహరనాథశాస్త్రి అధ్యక్షత వహించాడు. మహాసభ ప్రారంభానికి ముందే ఆహ్వాన సంఘం యీ మహాసభలో పాల్గొనవలసిందిగా దేశంలోని అన్ని యూనియన్‌లను ఆహ్వానించింది. కమ్యూనిస్టులు వారి వామపక్ష సహచరులు ఐక్యత కొరకు అప్పటికే కృషి చేస్తుండటం వలన యీ పిలుపుకు వెంటనే స్పందించారు. రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రతినిధులు ఎ.ఐ.టి.యు.సి. సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉభయపక్షాలు ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయానుసారం ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఐక్యత కొరకు రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు రద్దు చేసి ఎ.ఐ.టి.యు.సి.లో విలీనం చేయడం జరిగింది.

ఈ సమావేశానికి ముందుగానే 1935 మార్చి నెలలో ఎ.ఐ.టి.యు.సి. తరపున శ్రీ హరిహరనాథశాస్త్రి, శ్రీ రూయికర్‌లు, శ్రీయుతులు ఎన్.ఎమ్.జోషి, వి.వి.గిరి, బి. శివరావు తదితర నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ నాయకులను కలిసి ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఐక్యత కోసం చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం 1935 మార్చి 12వ తేదీన ఏకగ్రీవంగా రూపొందించిన సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రకటన ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోని చీలికను ఖండిస్తూ, పూర్తిగా ఐక్యత సాధ్యం కాకపోయినప్పటికీ, వివిధ సంస్థలతో ఐక్య పోరాటాలు సాగించటానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. ఇందుకోసం ప్రతి సంస్థ నుండి 10 మంది ప్రతినిధులతో ఒక జాయింట్ కమిటీని ఏర్పాటుచేసి ఐక్య పోరాటాలు సాగించడానికి తగిన ప్రతిపాదనలు రూపొందించే బాధ్యతనీ కమిటీకి అప్పగించాలని, ఈ ప్రతిపాదనలు ఐక్య పోరాటాలలో పాల్గొనే సంస్థల ఆమోదంతో మాత్రమే అమలు జరపాలని ఈ ప్రకటన కోరింది.

ఈ ప్రకటనను ఎ.ఐ.టి.యు.సి., ఎన్.టి.యు.ఎఫ్. జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఆమోదించాయి. ఎ.ఐ.టి.యు.సి. 14వ మహాసభ జరిగే నాటి వరకూ ఐక్యతా ప్రయత్నాలు ఈ మేరకు పురోగతి సాధించాయి. ఎ.ఐ.టి.యు.సి.తో రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌తో విలీనమైన తరువాత ఐక్యతా ప్రయత్నాలను మరింత తీవ్రతరం చేయవలసిందిగా జాయింట్ కమిటీలోని తమ ప్రతినిధులను ఆదేశిస్తూ, ఎ.ఐ.టియు.సి 14వ మహాసభ తీర్మానం ఆమోదించింది.

ఈ ఐక్యతా ప్రయత్నాల ఫలితంగా ఎ.ఐ.టి.యు.సి. ఎన్.టి.యు.ఎఫ్.లకు అనుబంధమై యున్న యూనియన్లు ఐక్యపోరాటాలలో పాల్గొనేందుకు వీలుగా 1936లో ఒక జాయింట్ లేబర్ బోర్డు ఏర్పాటు చేయబడింది. ముక్కచెక్కలయిన భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలలో ఇదొక ప్రధాన ఘట్టం.

## ట్రేడ్ యూనియన్ పోరాట తీవ్రత (1935 - 36)

గత కొద్ది సంవత్సరాలుగా చాల బలహీనపడిన ట్రేడ్ యూనియన్ ఉద్యమం 1935–36 సం॥లలో తిరిగి బలం పుంజుకొన్నది. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఐక్యతను తిరిగి నెలకొల్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలవంతమైనవనడంలో సందేహం లేదు. ఈ ప్రయత్నాలకు, కృషికి అనుగుణంగానే ఉద్యమ బలం పెంపొందింది. అదే సమయంలో ఆనాటి రాజకీయ పరిణామాలు ఈ పెరుగుదలకు దోహదం చేశాయి. పన్నుల నిరాకరణ ఉద్యమం తదితర ప్రజా పోరాటాల వెల్లువతో పిల్ల చేష్టలకు పాల్పడిన జాతీయ కాంగ్రెస్, చివరకు బహిరంగంగానే తిరోగమించింది. కాని ఇందుకు పూర్తి భిన్నంగా కమ్యూనిస్టుల కార్యకలాపాలు చురుకుగా సాగి, కాంగ్రెస్ సోషలిస్టు గ్రూపు అవతరణకు దారితీసింది. 1934 తర్వాత కాలంలో ఆవిర్భవించిన ఈ నూతన రాజకీయ శక్తుల ప్రభావంతో ఉధృతమైన వామపక్ష రాజకీయాలు, నానాటికి బలహీనపడుతున్న భారత కార్మికోద్యమాన్ని పునరుజ్జీవింప జేసే విధంగా ప్రభావం చూపాయి.

1934 సం॥ ప్రారంభంలోనే ప్రపంచ ఆర్థిక మాంద్య పరిస్థితిల్లో మార్పు గోచరించింది. భారతదేశంలో ప్రప్రథమంగా ఈ మార్పు జూట్, నూలు పరిశ్రమల్లో కన్పడింది. ఆర్థికమాంద్యం అంత్యదశకు చేరుకున్న కొలదీ భారతదేశంలోని పరిశ్రమల్లో పనివారి సంఖ్య కూడా స్థిరంగా పెరగడం ప్రారంభమయింది. 1933లో 14,03,212 వున్న శ్రామికుల సంఖ్య 1934 నాటికి 14,87,231కి, 1935 నాటికి 16,10,932కి, 1936 నాటికి 16,52,145కి పెరిగింది.

పారిశ్రామిక ఉత్పత్తి గణనీయంగా పెరిగినప్పటికి ఆర్థికమాంద్యం పేరిట విధించిన జీతాలలో కోతను ఉపసంహరించుకొనడానికి యజమానులు నిరాకరించారు. పారిశ్రామికా

భివృద్ధిని గావించిన యజమానులకు "ఆర్థిక లాభార్జన" దాహం పట్టుకుంది. కార్మికుల శ్రమ తీవ్రతను పెంచే (కార్మికులతో వేగంగా పనిచేయించే) వివిధ పరికరాలను ప్రవేశపెట్టడం ద్వారా కార్మికులను మరింత తీవ్రంగా దోపిడీ చేయబూనుకున్నారు. అందువలన ఈ కాలంలో యజమానులు అమలుచేస్తున్న జీతాలలో కోతకు నూతన పరికరాల ద్వారా నానాటికీ తీవ్రతరమవుతున్న దోపిడీకి వ్యతిరేకంగాను జీతాల పెరుగుదల కొరకు కార్మికవర్గం తీవ్రమైన పోరాటాలలో నిమగ్నమై వున్నది.

ఈ కాలంలో జరిగిన సమ్మెలలో కలకత్తాలోని కేశోరామ్ బట్టల మిల్లులోను, అహమ్మదాబాద్‌లోని బట్టల మిల్లుల్లోను జరిగిన సమ్మెల వలన ఎక్కువ పనిదినాలు నష్టమయ్యాయి. కేశోరామ్ బట్టలమిల్లులోని 5000 మంది కార్మికుల సమ్మె వలన 1,19,000 పనిదినాలు నష్టమయ్యాయి. యజమానులు విధించిన 12 1/2 శాతం వేతనాలలో కోతకు వ్యతిరేకంగా 23 వేలమంది అహ్మదాబాద్ టెక్స్‌టైల్ (జౌళి) కార్మికుల సమ్మెవలన 93 వేల పనిదినాలు నష్టమయ్యాయి. 1935 – 36 సం॥లో జరిగిన సమ్మెలలో 63 శాతం సమ్మెలు జీతాల సమస్య మీద జరిగాయి.

మజూర్ మహాజన్ నాయకులు జీతాలలో కోతనంగీకరిస్తూ చేసుకున్న ఒప్పందాన్ని జీతాల్లో కోతకు సంతోషంగా అంగీకరించవల్సిందిగా గాంధీజీ చేసిన విజ్ఞప్తిని ఖాతరు చేయక, అహ్మదాబాద్ జౌళి మిల్లు కార్మికులు సమ్మె చేశారు.

మజూర్ మహాజన్‌ను ప్రక్కకునెట్టి కమ్యూనిస్టుల చొరవతో ఏర్పడిన సమ్మె కమిటీ ఇచ్చిన పిలుపు నందుకుని కార్మికులు 1935 జనవరి 21వ తేదీన సమ్మె ప్రారంభించారు. కాని మజూర్ మహాజన్ ఈ సమ్మెను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కార్యాచరణకు దిగడంతో ఫిబ్రవరి 5వ తేదీన సమ్మె విరమించబడింది.

కాన్పూర్‌లో కూడ జౌళి కార్మికులు సమ్మె చేశారు. వేతనాలలో కోత, రిట్రెంచ్‌మెంట్‌లకు వ్యతిరేకంగా ఆర్థర్‌టన్ వెస్టు మిల్లులో 1936 సెప్టెంబరు 10వ తేదీన సమ్మె ప్రారంభమైంది. ఈ సమ్మె 8 రోజులు కొనసాగి ఒప్పందం కుదరడంతో ముగిసింది. కాపర్ ఎల్లాయ్ మిల్లు (రాగి మిశ్రమ లోహాలమిల్లు) లోకూడ సమ్మె జరిగింది. ఈ సమ్మెకు మద్దతుగా కాన్పూరులో ఒకరోజు హర్తాళ్ కూడ పాటించబడింది. 41 రోజులు సాగిన ఈ సమ్మె, ఒప్పందం కుదరడంతో డిసెంబరు 29న విరమించబడింది.

ఇదే సమయంలో బెంగాల్‌లోని జూట్ మిల్లులలో కూడ సమ్మెలు జరిగాయి. హుకుంచంద్ జూట్ మిల్లు కార్మికులు 1936 ఏప్రిల్ 9వ తేదీ నుండి సమ్మె ప్రారంభించారు. యజమానులు కార్మికులను భయభ్రాంతులను చేసి సమ్మె విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించారు. చివరకు యజమానులు పోలీసులను పిలిపించడంతో, ఇరుపక్షాల మధ్య

ఘర్షణలు చెలరేగాయి. పోలీసుల అణచివేత చర్యలతో కార్మికులు కోపోద్రిక్తులయ్యారు. దీనితో ఈ సమ్మె ఇతర మిల్లులకు కూడ వ్యాపించింది. జగద్దల్, నైహతి, హుగ్లీ జూట్ మిల్లులలోని సుమారు 20 వేలమంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. యజమానులు అక్రమంగా విధించిన జీతాలలో కోతను రద్దుచేయాలని, పనిగంటలు వారానికి 40 నుండి 54కు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఈ సమ్మె పోరాటాలు సాగించారు.

జీతాలలో కోతను వ్యతిరేకిస్తూ 1936 జూలై నెలలో ఆజ్మీర్, మేర్వారాలోని బేవార్ కాటన్ మిల్స్‌లోని 4 వేల మంది కార్మికులు సమ్మెచేశారు. ఫలితంగా 3,75,000 పనిదినాలు నష్టమయ్యాయి. ఒక నేటివ్‌స్టేట్ (వివిధ స్థాయిల్లో బ్రిటిష్ వారి అధికారానికిలోబడి, పరిమిత స్వేచ్ఛగల్గి భారతీయులచే పరిపాలింపబడుతున్న రాష్ట్రాలు) జరగడం ఈ సమ్మె యొక్క ప్రత్యేకత. పెట్టుబడిదారులు ఫ్యాక్టరీ చట్టంలోని అంశాలను అమలు జరపకుండా తప్పించుకుని కార్మికులను అవకాశం వున్నంతవరకు దోపిడీచేసే ఉద్దేశంతో నేటివ్‌స్టేట్స్ లోని పరిశ్రమలలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. కాని వెనుకబడిన రాష్ట్రాలలోని కార్మికులు కూడా తమ జీవన ప్రమాణాలను, పని పరిస్థితులను మెరుగుపరుచుకొనడానికి సమ్మె పోరాటాలకు పూనుకున్నారు.

అన్నింటికంటే పెద్ద సమ్మె పోరాటం బెంగాల్ – నాగపూర్ రైల్వేలో జరిగింది. ఈ సమ్మెలో మొత్తం 26,500 మంది కార్మికులు పాల్గొన్నారు. 1936 డిసెంబర్ 13వ తేదీన ప్రారంభమైన ఈ సమ్మె 1937 ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరిగింది. ఫలితంగా 10 లక్షలకు పైగా పనిదినాలు నష్టమయ్యాయి.

సమ్మె ప్రారంభించడానికి ముందు బి.ఎన్. రైల్వే ఇండియన్ లేబర్ యూనియన్, రైల్వే యజమాన్యంతో సుదీర్ఘ చర్చలు జరిపింది. కాని ఈ చర్చలు సాగుతుండగానే యాజమాన్యం 27 మంది టిక్కెట్ ఎగ్జామినర్లను హఠాత్తుగా సర్వీసు నుండి తొలగించింది. ఈ డిస్మిసల్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు తమ పని స్థలాలలోనే వుండి సమ్మె చేయడం ప్రారంభించారు. రైల్వే అధికారులచే అక్రమంగా బర్తరఫ్ చేయబడిన టిక్కెట్ ఎగ్జామినర్లను తిరిగి సర్వీసు లోనికి తీసుకొనవలసింది పోయి, మరొక 1100 మందిని బర్తరఫ్ చేస్తూ ఆర్డర్లు జారీ చేసింది. ఇదే సమయంలో రైల్వే బోర్డు యూనియన్ గుర్తింపును కూడా రద్దుచేసింది. అధికారుల ఈ నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా సమ్మె ప్రారంభమై కార్చిచ్చులా రైల్వే అంతటికీ వ్యాపించింది.

సమ్మె జరుగుతున్న సమయంలో ఫైజ్‌పూర్‌లో జరుగుతున్న జాతీయ కాంగ్రెస్ సమావేశం సమ్మెచేస్తున్న కార్మికులకు తమ మద్దతును ప్రకటిస్తూ, సమ్మె చేస్తున్న కార్మికులతో సహకరించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

ఇక్కడ వివరించిన సంఘటనలు కొన్ని ప్రధానమైన పోరాటాలకు చెందినవి మాత్రమే. ఇవిగాక చిన్న చిన్న స్వల్ప వ్యవధి సమ్మెలు వివిధ పరిశ్రమలలో చాలా జరిగాయి.

## సంస్థాపరమైన అభివృద్ధి

అనేక ఆర్డినెన్సులు, శాసనాల ద్వారా సమ్మెలను చట్టవిరుద్ధమైన సమ్మెలుగా పరిగణించడానికి సామ్రాజ్యవాదులెన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, 1935 సం॥లో 145 సమ్మె పోరాటాలలో 1,44,217 మంది కార్మికులు పాల్గొన్నారు. ఫలితంగా 10 లక్షలకు పైగా పని దినాలు నష్టమయ్యాయి. 1936 సం॥లో జరిగిన 157 సమ్మెలలో 1,68,029 మంది పాల్గొనగా, మొత్తం 53,58,062 పనిదినాలు నష్టమయ్యాయి.

ఈ సమయంలో ట్రేడ్ యూనియన్ చట్టం క్రింద రిజిష్టరు చేయబడిన యూనియన్ల సంఖ్య కూడ పెరిగింది. 1935లో భారతదేశంలో 213 రిజిష్టరు చేయబడిన యూనియన్లలో 2,84,918 మంది సభ్యులున్నారు. 1927లో ట్రేడ్ యూనియన్ చట్టం అమలు లోనికి వచ్చినప్పటి నుండి రిజిష్టరు చేయబడిన యూనియన్లలో సభ్యత్వం ఈ ఏడాది (1935) లోనే అత్యధికంగా వుంది. 1936లో రిజిష్టరు చేయబడిన యూనియన్‌ల సంఖ్య మరింత పెరిగి 241కి చేరింది. అంతేగాక 1927 – 28 సం॥లో రిజిష్టరు చేయబడిన ట్రేడ్ యూనియన్లలో మహిళా సభ్యుల సంఖ్య 1166 వుండగా 1935 – 36 నాటికి ఈ సంఖ్య 7309కు చేరింది.

ఈ సమయంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం వివిధ రాష్ట్రాలలోని దాదాపు అన్ని పారిశ్రామిక కేంద్రాలకు వ్యాప్తిచెందింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన బెంగాల్, బొంబాయి, మద్రాసు రాష్ట్రాలలో ట్రేడ్ యూనియన్ల పెరుగుదల అత్యధిక స్థాయిలో వున్నది. అప్పటివరకు ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం పెరుగుదల విషయంలో బొంబాయి ప్రెసిడెన్సీ అగ్రస్థానంలో వుండేది. కాని ఆ తరువాత పరిస్థితి క్రమక్రమంగా మారి బెంగాల్‌కు అనుకూలంగా మారింది. ఈ రాష్ట్రంలో ట్రేడ్ యూనియన్ల సంఖ్య, వాటి సభ్యత్వం మిగిలిన రాష్ట్రాల నధిగమించి ఉన్నత స్థాయికి చేరుకుంది.

1933 – 34 సం॥లో బొంబాయిలో 45, బెంగాలులో 54, మద్రాసులో 38 ట్రేడ్ యూనియన్లుండేవి. కాని 1937 – 38 నాటికి బొంబాయిలో 72, బెంగాలులో 172, మద్రాసులో 54 ట్రేడ్ యూనియన్లున్నాయి. ఇది పరిశీలించినట్లయితే యీ నాలుగు సంవత్సరాల కాలంలో ట్రేడ్ యూనియన్ల సంఖ్య మూడు రాష్ట్రాలలోను గణనీయంగా పెరిగినప్పటికీ, యీ పెరుగుదల బెంగాల్ రాష్ట్రంలో మూడు రెట్లకు పైగా వున్నది.

పరిశ్రమలవారిగా ట్రేడ్ యూనియన్ల సంఖ్యలోనూ, సభ్యత్వంలోనూ పెరుగుదలను పరిశీలించినట్లయితే 1935 – 36 సం॥లో రైల్వేలకు అగ్రస్థానం లభిస్తుంది. రైల్వేలలోనున్న

50 యూనియన్లలో మొత్తం 1,49,798 మంది సభ్యులున్నారు. యూనియన్లలో జౌళికార్మికుల సభ్యత్వం 26,709కి, నావికుల సభ్యత్వం 26511కు చేరింది.

ఈ కాలంలో ప్రభుత్వం కూడా పోరాట పటిమగల్గిన ట్రేడ్ యూనియన్ల పైననే దాడులను కేంద్రీకరించింది. 1935 జనవరి 9వ తేదీన గిర్నికాంగార్ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దు చేయబడింది. కమ్యూనిస్టుల పలుకుబడిలోనున్న ఇతర యూనియన్లను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించడం కూడా జరిగింది.

1935లో నాగపూర్‌లో జరిగిన నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ రెండవ మహాసభ ఫెడరేషన్‌కు 1,47,516 మంది సభ్యులు గల్గిన 60 యూనియన్లు అనుబంధం చేయబడియున్నట్లు చెప్పుకున్నది. ఇందులో రైల్వేలు, డాక్, షిప్పింగ్‌ల్లోని యూనియన్లకు చెందిన సభ్యులే 1,06,629 మంది వున్నారు. రెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తిరిగి ఎ.ఐ.టి.యు.సి.లో విలీనమైన తరువాత ఎ.ఐ.టి.యు.సి. 15వ మహాసభ బొంబాయిలో 1936 మే 17 – 18 తేదీలలో జరిగింది. దీనికి కుమారి మణిబెన్‌కారా అధ్యక్షత వహించారు. ఈ సమావేశం నాటికి ఎ.ఐ.టి.యు.సి.కి 93,750 మంది సభ్యులు గల్గిన 71 యూనియన్లు అనుబంధం చేయబడి వున్నాయి.

ఈ మహాసభలో రాబోయే సంవత్సరానికి సంస్థ అధ్యక్షులుగా శ్రీ శివనాథ్ బెనర్జీ, ప్రధాన కార్యదర్శిగా కుమారి మణిబెన్‌కారా ఎన్నికయ్యారు.

1935 – 36 సం॥లలో తీవ్రమై విస్తరించిన ట్రేడ్ యూనియన్ ఉద్యమం, రాబోయే రోజుల్లో జరగబోయే ఆర్థిక, రాజకీయ పోరాటాలలో భారత కార్మికవర్గం ఒక ప్రధాన పాత్రను నిర్వహించడానికి రంగాన్ని సిద్ధం చేసింది. తీవ్రమైన పోరాటాల ద్వారా కార్మికవర్గం గడించిన విలువైన అనుభవాలు వారు రాబోయేకాలంలో తన వర్గ ఐక్యతను తిరిగి నెలకొల్పడానికి, వారికి శక్తి సామర్థ్యాలు కల్పించాయి.

# 16

# ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి కాలంలోనూ, రెండవ ప్రపంచ యుద్ధ ప్రారంభంలో (1937-39) సాగిన తీవ్ర పోరాటాలు

## రాజకీయ పరిస్థితి

**మొ**దటి ప్రపంచ యుద్ధం తర్వాత విస్తరించనారంభించిన భారత శ్రామికవర్గ ఉద్యమం, తదుపరి రెండు దశాబ్దాలలో త్వరితగతిన పురోగమించింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయానికి ఈ ఉద్యమం రాజకీయంగా భారత జాతీయోద్యమంలో ఒక విశిష్ట స్థానాన్నాక్రమించింది. అంతర్జాతీయంగా ఫాసిజం బలం పుంజుకుంటున్న రోజులవి. ఇటలీ, జర్మనీలు రాజకీయంగా ఫాసిజం ప్రభావంలోకి పోయాయి. అనేక దేశాలు ఈ ఫాసిస్టు శక్తుల తాకిడికి గురయ్యాయి. జర్మనీ వర్సయిల్స్ ఒప్పందాన్ని కాలదన్ని రీన్‌లాండ్ ఆక్రమించింది. ఇటలీ అబీసినియాపై దురాక్రమణ జరిపింది. స్పెయిన్‌లో ఫాసిస్టు ఫ్రాంకో ప్రజాస్వామ్య శక్తులపై యుద్ధం ప్రకటించాడు. ఈ విధంగా ప్రపంచ పరిస్థితులు వినాశన హేతువైన మరొక ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని సూచిస్తున్నాయి.

సరిగ్గా ఈ సమయానికి కార్మికవర్గం తన పోరాటానుభవం ద్వారా విలువైన పాఠాలను నేర్చుకొని, వర్గ చైతన్యాన్ని పొంది యింతకు మున్నెన్నడు లేనంత ఉన్నతమైన రాజకీయ పరిణతిని సాధించింది. ప్రపంచ చరిత్రలో యిది నిజంగా ఒక ఉత్కృష్ట దశయని చెప్పాలి.

ఈ దశలోనే సామ్రాజ్యవాదానికి, దాని ప్రగతి నిరోధక రూపమైన ఫాసిజానికి వ్యతిరేకంగా పెట్టుబడిదారీ దేశాలలో ఫాసిస్టు వ్యతిరేక ప్రజాసంఘటనలు, వలస దేశాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటనలను నిర్మించవలసినదిగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పిలుపునిచ్చింది. యూరప్ కార్మికవర్గంలోని పురోగామి శక్తులు ఈ విధంగా ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సంఘటనలకు ఒకరూపం యివ్వడానికి కృషి చేస్తుండగా, భారత

కార్మికవర్గం సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటనను నిర్మించే విప్లవ కార్యక్రమాన్ని చేపట్టింది.

ఈ విధంగా భారత కార్మికవర్గం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని సాగించవలసిన చారిత్రాత్మక బాధ్యతను వహించవలసిన ఈ తరుణంలో 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం 1937లో ప్రొవిన్షియల్ (ప్రాంతీయ) ఎన్నికలు నిర్వహించబడ్డాయి.

అన్ని తరగతులకు చెందిన భారత ప్రజానీకం, భారత ప్రభుత్వ చట్టానికి సంబంధించిన బిల్లును వ్యతిరేకించింది. కానీ ఈ వ్యతిరేకత ప్రభుత్వానిపై ఒత్తిడి తెచ్చి యీ బిల్లును తిప్పికొట్టేంత శక్తివంతంగా లేదు.

1936లో ఫైజపూర్ సమావేశంలో, 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని, దాని ప్రకారం తయారుచేయబడిన రాజ్యాంగాన్ని జాతీయ కాంగ్రెస్ తిరస్కరించింది. ఈ సమావేశం యీ చట్టాన్ని భారత స్వాతంత్ర్య ఉద్యమానికి విద్రోహం చేయటానికి ఉద్దేశించబడిన దానిగా ప్రకటించి, ఈ చట్టానికి వ్యతిరేకంగా లెజిస్లేటివ్ అసెంబ్లీలోనూ, వెలుపలనూ పోరాటం సాగించవలసినదిగా పిలుపునిచ్చింది. ఈ ప్రకటన చేసినప్పటికి కాంగ్రెస్ ఎన్నికలలో పాల్గొనవలసివచ్చింది. ఎన్నికలలో పాల్గొనడానికి గల కారణాలను వివరిస్తూ ఫైజపూర్ కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్షోపన్యాసమిస్తూ "బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలనా యంత్రాంగంతో సహకరించడానికి మనం విధాన సభల లోనికి వెళ్ళడం లేదు. ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడి, దానిని తుదముట్టించడానికి, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మనదేశంపై తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలను వమ్ముచేసి, వారు మన భారత ప్రజానీకంపై సాగిస్తున్న దోపిడీని అంతం చేయడానికి మాత్రమే మనం విధాన సభలలోనికి వెళ్తున్నాము. అంతేగాని రాజ్యాంగతా వాదాన్ని గాని, పచ్చి సంస్కరణవాదాన్ని గాని అనుసరించడానికి మేము శాసనసభలలోకి వెళ్ళడం లేదు" అని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు. ఆయన ప్రసంగంలో యింకా ఇలా అన్నారు. "కాంగ్రెస్ విధానాలను తర్కించి చూస్తే అధికారం, మంత్రి పదవులతోనూ మనకేమీ పనిలేదని నాకు గోచరిస్తున్నది. మనదేశంలోని పురోగామిశక్తులనణచివేసే అవమానకర కర్తవ్య నిర్వహణలో అనివార్యంగా ఇది సామ్రాజ్యవాదులతో భాగస్వామ్యం వహించడమేకాగలదు. సామ్రాజ్యవాదులు ఈ విధానాలనమలు చేయకుండా అవరోధాలు కల్పించే ప్రయత్నాలు సాగించే విషయాలాలోచించాలి గాని, అధికారంలో కొనసాగడం గురించి ఆలోచించ రాదు."

కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో కార్మికులు, పేద రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటానని వాగ్దానం చేసింది.

ఈ ఎన్నికలు ప్రావిన్స్‌లకు సంబంధించిన క్రొత్త రాజ్యాంగంలోని అధికరణాలకనుగుణంగా ప్రావిన్సులలో మాత్రమే నిర్వహించబడతాయి. ఈ ఎన్నికలలో అభ్యర్థులను ఎంపికచేసే విషయంలో శ్రీ సర్దార్ వల్లభాయ్‌పటేల్ అధ్యక్షతన ఏర్పడిన పార్లమెంటరీ కమిటీ ప్రగతి నిరోధక గ్రూపులు, వ్యక్తులతో రాజీపడి ఏదో విధంగా మెజారిటీ సంపాదించాలని

నిశ్చయించుకున్నది. ఫైజపూర్ కాంగ్రెస్ సమావేశంలోనే శ్రీ నెహ్రూ ఈ పోకడలను గురించి హెచ్చరించడమేగాక, ఈ ప్రమాదకర పోకడలను ఆపవలసిందిగా కోరాడు. "ప్రపంచంలో పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద శక్తులకు పేదరికాన్ని, బానిసత్వాన్ని, దోపిడీని అంతం చేయడానికి కంకణం కట్టుకున్న సోషలిస్టు శక్తులకు మధ్య జరుగుతున్న ప్రపంచ వ్యాప్త పోరాటాన్ని దృష్టిలో వుంచుకొని భారతీయులు తమ సమస్యల పరిష్కారానికి మార్గాన్ని వెదకాలని" నెహ్రూ అభిప్రాయపడ్డారు. అంటే మన సమస్యల పరిష్కారం సోషలిస్టు, సామ్రాజ్యవాద శిబిరాల మధ్య జరుగుతున్న పోరాటంతో ముడిపడి వున్నదని ఆయన అభిప్రాయపడ్డాడు. అందువలననే రాబోయే ఎన్నికలలో ఏదో విధంగా విజయం సాధించడానికి ప్రగతి నిరోధక శక్తులతో చేతులు కలపడాన్ని ఆయన వ్యతిరేకించాడు.

కార్మికులలో అత్యధిక సంఖ్యాకులకు ఈ ఎన్నికలలో పాల్గొనే హక్కు కూడా కరువైంది. 1919 సంస్కరణ చట్టంలోనే కార్మికులకు ఓటు హక్కు విషయం ప్రస్తావించబడినప్పటికీ, 1935 భారత ప్రభుత్వ చట్టం చేసే సందర్భంలోనే కార్మికులు కూడా ఎన్నికలలో పాల్గొనే విషయం ప్రాధాన్యత సంతరించుకున్నది. రిజిష్టర్ చేయబడిన యూనియన్లు మాత్రమే ఎన్నికలలో పాల్గొనడానికి అనుమతించడం ద్వారా శ్రామిక వర్గానికి నిజమైన ప్రాతినిధ్యం కలుగజేసినట్లవుతుందని రాయల్ కమిషన్ అభిప్రాయపడింది. కాని ఇండియన్ ఫ్రాంచైజ్ కమిటీ ట్రేడ్ యూనియన్ల ప్రాతిపదికన కార్మికులకు ప్రాతినిధ్యం కల్పించడాన్ని త్రోసిపుచ్చి, ప్రత్యేక శ్రామిక నియోజకవర్గాల ఏర్పాటును ప్రతిపాదించింది.

ఈ ప్రత్యేక శ్రామిక నియోజకవర్గాల గురించి దేశంలోని ట్రేడ్ యూనియన్లకు ఏ విధమైన సంబంధం లేకపోగా, వీటిపై ట్రేడ్ యూనియన్లకు ఏ విధమైన అధికారం లేదు. నిజానికి కొత్త రాజ్యాంగంలోని కార్మిక వ్యతిరేక అంశాలలో యిది ప్రధానమైంది. ఆదాయం, విద్య ప్రాతిపదికన ఓటు హక్కు కలుగజేయడం వలన అనేక మంది కార్మికులకు అసలు ఓటు హక్కే లేకుండా పోయింది.

కొత్త రాజ్యాంగం ప్రకారం మొత్తం ప్రజానీకంలో 13 శాతం మంది ప్రజలు మాత్రమే ఓటు వేయడానికి అర్హులైనప్పటికీ, జనరల్ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రగతిశీల శక్తుల (రాడికల్స్) మద్దతు కూడా వీరి విజయానికి దోహదకారి అయింది. బొంబాయి, నాగపూర్ వంటి కొన్ని కేంద్రాలు మినహా మిగిలిన చోట్ల ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను బలపరిచింది. కాని ఈ విజయం తరువాత అధికారం స్వీకరించే విషయంలో కాంగ్రెస్‌లో రెండు పూర్తిగా భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తిమయ్యాయి. ప్రావిన్సెస్‌లో మంత్రి పదవులు అంగీకరించాలా? లేదా? అనే విషయం మీద తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. రక్తపాతంతో కూడిన విప్లవాన్ని నివారించడానికి, యింతకు ముందెప్పుడూ తలపెట్టనంత పెద్ద ఎత్తున సాగుతున్న ప్రజల శాసనోల్లంఘన ఉద్యమాన్ని నివారించడానికి ఒక గట్టి ప్రయత్నంగా సూచిస్తూ, కాంగ్రెస్ మంత్రి పదవులను అంగీకరించాలని గాంధీజీ కోరారు. కాని అప్పటికే శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో పాల్గొనడాన్ని

తీవ్రంగా వ్యతిరేకించాడు. లక్నోలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్షోపన్యాసమిస్తూ శ్రీ నెహ్రూ "చట్ట ప్రకారం అధికారాన్ని, మంత్రి పదవులను అంగీకరించడమంటే అది ఇంతకు పూర్వం మనం ఈ చట్టాన్ని తిరస్కరించడాన్ని వ్యతిరేకించడమే అవుతుంది. అంతేగాక మన చర్యలను మనమే ఖండించుకున్నట్లవుతుంది. దేశంపట్ల గౌరవం, ఆత్మ గౌరవం వున్నవారు ఈ అధికారాన్ని అంగీకరించరాదు. ఎందుకంటే అలా చేయడం దేశప్రజలనణచివేసే సామ్రాజ్యవాద ప్రభుత్వ యంత్రాంగంతో ఏదో కొంతమేరకైనా సహకరించడమే అవుతుంది. అంతేగాక మన ప్రజలపై సాగుతున్న అణచివేత చర్యలలో, దోపిడీలో మనం కూడా భాగస్వాములమవుతాం" అని ఖండితంగా చెప్పారు. ఆయన తన ఉపన్యాసాన్ని ముగిస్తూ "అధికారం స్వీకరించడం విషయంలో కాంగ్రెస్ ఏమాత్రం అనుకూల ధోరణి చూపినా, కనీసం ఊగిసలాట చూపినా ఇది తీవ్రమైన తప్పిదం కాగలదని నేను విశ్వసిస్తున్నాను. ఈ తప్పు చేసి మనం ఆ గొయ్యిలో పడితే, దాని నుండి బయటపడడం చాలా కష్టమవుతుంది" అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోను, ఆలిండియా కాంగ్రెస్ కమిటీలోనూ నెహ్రూ అనుయాయులు అల్పసంఖ్యలో వున్నారు. ఎన్నికలైన తరువాత 1937 మార్చినెలలో ఢిల్లీలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ కమిటీ" కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చిన ప్రావిన్సెస్‌లో అధికారం స్వీకరించాలని తీర్మానించింది.

1937 జూలై 7వ తేదిన కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి పేరిట మంత్రివర్గాలకు చాలా పరిమితస్థాయిలో అధికారాలివ్వబడ్డాయి. కాని ఈ రెండున్నర సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ మంత్రివర్గాలు అనుసరించిన శ్రామిక విధానం, భవిష్యత్తులో స్వతంత్ర భారతంలో కాంగ్రెస్ అనుసరించబోయే విధానాలకు ప్రతీకగా నిల్చింది. కాంగ్రెసు గాని కాంగ్రెసేతర పార్టీలుగాని అధికారాన్ని స్వీకరించడం, నెహ్రూ భయపడినట్లుగా "మన ప్రజలపై సాగే అణచివేత, దోపిడీలలో భాగస్వాములు కావడమే" గాక ఆయన జోస్యాన్ని మరింత నిజం చేస్తూ యీ మంత్రివర్గాలు భారత కార్మికవర్గాన్ని అణచివేసి, వారిని దోపిడీ చేసే ప్రత్యక్ష సాధనాలుగా పరిణమించాయి.

## కార్మికవర్గ పోరాటాలు

వివిధ ప్రావిన్సులతో (ప్రాంతాలలో) మంత్రివర్గాలు ఏర్పడిన తరువాత ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు ముమ్మరంగా సాగి, కార్మికుల సమ్మె పోరాటాలు వెలువెత్తాయి. వివిధ పెట్టుబడిదారీ దేశాల మధ్య ఉన్మాదం వలే సాగుతున్న ఆయుధాల పోటీ ఫలితంగా ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తాత్కాలికంగా నిలదొక్కుకున్నది. ఈ ఆయుధాల పోటీ పెట్టుబడిదారీ ప్రపంచంలో వినూత్న కార్మికవర్గ పోరాట వెల్లువలకు దారితీసింది. ఈ ప్రపంచ పరిణామాల పరంపరలో భాగంగానే 1937 – 38లో భారత కార్మికవర్గం సమ్మె పోరాటాలు సాగించింది.

1937 – 39 మధ్యకాలంలో రిజిష్టర్ చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్య, సమ్మె చేసిన కార్మికులతో బాటు నష్టపోయిన పనిదినాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ మూడు సంవత్సరాల కాలంలో ట్రేడ్ యూనియన్ల సంఖ్య, వీటిలో సభ్యత్వం ఎంతగా పెరిగిందీ ఈ క్రింది పట్టికను పరిశీలిస్తే అర్థమవుతుంది.

| సంవత్సరం | రిజిష్టర్ చేయబడిన ట్రేడ్ యూనియన్ల సంఖ్య | యూనియన్ లెక్క ప్రకారం సభ్యత్వం |
|---|---|---|
| 1936–37 | 271 | 261047 |
| 1937–38 | 420 | 390112 |
| 1938–39 | 562 | 399159 |

ఈ రిజిష్టర్ చేయబడిన యూనియన్లతో బాటు, రిజిష్టర్ కాని యూనియన్లు చాలా వున్నాయి. అందువలన పై పట్టికలో చూపిన సమాచారం ఆ కాలంలో వున్న యూనియన్ల సంఖ్యను గాని, వాటి సభ్యత్వాన్నిగాని సరిగ్గా ప్రతిబింబించడం లేదనేది వాస్తవం. నిజానికి పెద్దసంఖ్యలో కార్మికులు రిజిష్టర్ చేయబడిన, రిజిష్టర్ చేయబడని యూనియన్ల ద్వారా సంఘటితమయ్యారు.

ఇదే సమయంలో ట్రేడ్ యూనియన్ల సంఖ్యతో బాటు, పారిశ్రామిక వివాదాలు కూడా పెరిగాయి. సమ్మె పోరాటాలలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనసాగారు. పారిశ్రామిక వివాదాల సంఖ్య, సమ్మెల్లో పాల్గొన్న కార్మికుల సంఖ్య, నష్టపోయిన పనిదినాల సంఖ్య ఈ క్రింద పట్టికలో యివ్వబడ్డాయి.

| సంవత్సరం | పారిశ్రామిక వివాదాల సంఖ్య | సమ్మెలో పాల్గొన్న కార్మికులు | నష్టపోయిన పనిదినాల సంఖ్య |
|---|---|---|---|
| 1937 | 379 | 6,47,800 | 89,82,257 |
| 1938 | 399 | 4,01,075 | 90,98, 708 |
| 1939 | 406 | 4,09,075 | 49,92,795 |

పై పట్టిక పరిశీలిస్తే, 1939లో నష్టపోయిన పనిదినాల సంఖ్య గణనీయంగా పడిపోయినప్పటికీ, 1937లో మంత్రివర్గాలు ఏర్పరచిన తరువాత సమ్మెల ఉధృతి హెచ్చినట్లుగా స్పష్టమవుతుంది.

1937–39 మధ్యకాలంలో కార్మికవర్గ పోరాటాలు ఎంత తీవ్రంగా, ఎంత విస్తృతంగా సాగింది తెలుసుకొనేందుకు యీ సమాచారం మాత్రమే చాలదు. ఈ పోరాటాలు చిన్న, పెద్ద తేడా లేకుండా అన్ని పారిశ్రామిక కేంద్రాలకు వ్యాపించాయి. అప్పటివరకు పోరాటం అంటే ఏమిటో తెలియని అనేకమంది కార్మికులు నడుం బిగించి పోరాట రంగంలోకి దూకారు. పారిశ్రామిక కేంద్రాలు కార్మికుల ప్రదర్శనలు, ఊరేగింపులతో గడగడలాడాయి. కాని యీ పోరాటాలు శాశ్వత ట్రేడ్ యూనియన్ల ఏర్పాటుకు దారితీయలేదు. అయినప్పటికీ యీ తాత్కాలిక పోరాట వెల్లువలు కూడా కొంత ప్రభావాన్ని చూపకపోలేదు. ఈ పోరాటాలతో పాటు, యీ కాలంలో సాగిన యూనియన్ కార్యకలాపాలు భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి గట్టిపునాది వేశాయని చెప్పవచ్చు.

ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొన్న యీ కాలంలో, పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల్లో సాగుతున్న నూతన పోరాట వెల్లువకు తగినట్లుగానే వేతనాల్లో కోత ఉపసంహర, వేతనాల్లో పెంపుదల కోరుతూ, ప్రభుత్వం కార్మిక వర్గం మీద సాగిస్తున్న రిట్రెంచ్‌మెంట్ తదితర దాడులకు వ్యతిరేకంగా, భారత కార్మికవర్గం కూడ సమ్మె పోరాటాలకు పూనుకుంది. ప్రొవిన్షియల్ మంత్రి వర్గాలేర్పడడంతో, కార్మికుల్లో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశలు చిగురించాయి. ఈ నూతన పరిస్థితిలో పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే పోరాటాల మీద ప్రభుత్వ పరంగా దాడులు జరగవని, కొన్ని సందర్భాల్లో కార్మికులు అమాయకంగా నమ్మారు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో కార్మికవర్గం సాగించిన వీరోచిత పోరాట గాథలు, యీ పోరాట సమయంలో వారనుభవించిన కష్టాలు నిజంగా హృదయాన్ని కదిలించివేస్తాయి. స్థలాభావం వలన యిక్కడ కొన్ని ప్రాధాన్యత గల్గిన విషయాలను మాత్రమే ప్రస్తావించడం జరుగుతోంది.

ఈ పోరాటాలన్నింటిలో 1937 ఫిబ్రవరి 26 నుండి మే 10 వరకు, 2,25,000లు మంది, బెంగాల్ జూట్ కార్మికులు 74 రోజులు సాగించిన సార్వత్రిక సమ్మె పోరాటం చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సార్వత్రిక సమ్మెతో సహా యిదే సంవత్సరంలో (1937) ఒక్క బెంగాల్‌లోనే 166 సమ్మె పోరాటాలు జరిగి, మొత్తం 60,90,883 పనిదినాలు నష్టమయ్యాయి. అంటే 1937 సం॥లో దేశ వ్యాప్తంగా సాగిన మొత్తం సమ్మె పోరాటాలలో 61.74 శాతం ఒక్క బెంగాల్‌లోనే జరగ్గా మొత్తం 3,65,699 మంది కార్మికులు పాల్గొన్నారు.

ఇతర డిమాండ్లతో బాటు, జీతాలలో కోతను ఉపసంహరించాలని, రిట్రెంచ్‌మెంట్ విధానానికి స్వస్తి చెప్పాలని, రిట్రెంచ్ చేయబడిన కార్మికులను తిరిగి పనిలోనికి తీసుకొవాలని,

అణచివేత చర్యలను నిలిపివేయాలని కోరుతూ జూట్ కార్మికులు సార్వత్రిక సమ్మె నిర్వహించారు. భిన్నాభిప్రాయాలు గల్గిన వారందరికి ప్రాతినిధ్యం వహించే సెంట్రల్ స్ట్రయిక్ కమిటీ (కేంద్ర సమ్మె కమిటీ) యీ సమ్మె పోరాటాన్ని సమైక్యంగా, సమర్ధవంతంగా నిర్వహించింది.

మాంద్య పరిస్థితులు తొలగిపోవడంతో, మిగిలిన పరిశ్రమలతో బాటు జూట్ పరిశ్రమ కూడా 1936 సం॥ నుండి మరల అభివృద్ధి చెంది, విపరీతమైన లాభాలతో యజమానుల బొక్కసాలు నింపటం ప్రారంభమైంది. పరిశ్రమ పెద్ద ఎత్తున లాభాలార్జిస్తున్నప్పటికీ యజమానులు, కార్మికుల న్యాయసమ్మతమైన కోర్కెలను నిర్లక్ష్యం చేయడంతో కార్మికులు పోరాటానికి పూనుకోవల్సివచ్చింది. కాని బెంగాల్‌లో ఆనాటి ఫజులుల్‌హక్ మంత్రివర్గం యీ సమ్మెకు ఆర్థిక కారణాలేమీ లేవని, కమ్యూనిస్టు నాయకులు ఇండియాలో విప్లవానికి మార్గాన్ని సుగమం చేయడానికి యీ సమ్మెను వాడుకుంటున్నారనే" నెపంతో కార్మికుల యీ సమ్మె పోరాటాన్ని అణచివేయడానికి సర్వ విధాల కృషి చేసింది. 144వ సెక్షన్ విధించి కార్మిక నాయకులు, జనపనార మిల్లు ప్రాంతంలోనికి రావడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అదే సమయంలో అనేక మంది కార్మికులను అరెస్టు చేయడం జరిగింది. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పోలీసు బలగాలను ప్రయోగించారు. ఈ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో కొందరు సమ్మెచేస్తున్న కార్మికులు గాయపడ్డారు. సమ్మె నాయకులను చివరకు శారీరకంగా కూడా హింసించారు.

బెంగాల్‌లో యీ జూట్ కార్మికుల సమ్మెకు ప్రజా బాహుళ్యం నుండి విశేషమైన మద్దతు లభించింది. బెంగాల్ ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కలకత్తాలో ఫిబ్రవరి 21వ తేదీన నిర్వహించబడిన బ్రహ్మాండమైన బహిరంగసభ, ప్రభుత్వ అణచివేత విధానాలను తీవ్రంగా ఖండించింది. బెంగాల్‌లోని విద్యార్థులు కూడా యీ సమ్మె చేస్తున్న కార్మికుల సహాయార్థం ఒక సహాయ నిధిని ఏర్పాటు చేసి ఉదారంగా విరాళాలందించ వల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సుభాస్ చంద్రబోస్ కూడా యీ సహాయ నిధికి విరాళాలివ్వవలసిందిగా విజ్ఞప్తి చేశాడు.

అలహాబాదులో అప్పటికే జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం సమ్మెకు మద్దతు తెలుపుతూ, ఈ పోరాటాలను అణచివేయడానికి పోలీసులను, సైన్యాన్ని వినియోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ జూట్ కార్మికులు సాగిస్తున్న యీ పోరాటాలను సంపూర్ణంగా బలపరుస్తూ, సమ్మెజేస్తున్న కార్మికులకు, వారిపై ఆధారపడిన వారికి సహాయపడ వలసిందిగా దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశాడు.

శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ కూడా యీ సమ్మెకు తన మద్దతు ప్రకటించాడు. మద్రాసులో కూడా సమ్మెకు మద్దతును సమీకరించడానికి మద్రాసు నగర మేయర్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేయబడింది.

ఈ విధంగా యీ సమ్మె జాతీయ ప్రాధాన్యత సంతరించుకోవడంతో వచ్చిన ఒత్తిడి వలన ఇండియన్ జూట్ మిల్స్ అసోసియేషన్ కొద్దిగా వెనుకంజ వేయకతప్పలేదు. సమ్మె కమిటీ నాయకులు శ్రీ ఫజులుల్‌హక్‌తో సంప్రదింపులు జరిపి కొన్ని డిమాండ్ల విషయంలో ఆయన నుండి హామీలు పొందిన మీదట చివరకు మే 10వ తేదీన సమ్మె విరమించబడింది.

కమ్యూనిస్టేతర కార్మిక నాయకులు నిజాయితీతో ప్రవర్తించినప్పటికీ, యీ సమ్మె నిర్వహణలో కమ్యూనిస్టులే ప్రధానపాత్ర వహించారు. శ్రీయుతులు బంకిం ముఖర్జీ, ముజఫర్ అహ్మద్, నిహారేందుదత్తమజుందార్ శివనాథ్ బెనర్జీ తదితర ప్రముఖ కార్మిక నాయకులు ఈ సమ్మెకు నాయకత్వం వహించారు.

ఈ సందర్భంలో ఆసక్తి కల్గించే ఒక విషయం గమనించాలి. బెంగాల్‌లో అధికారంలో వున్న ఫజులుల్‌హక్ నాయకత్వంలోని కాంగ్రెసేతర మంత్రివర్గం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అనుసరించిన అణచివేత విధానాలకు వ్యతిరేకంగా, జాతీయ కాంగ్రెస్ సమ్మెను బహిరంగంగా బలపరిచి, అణచివేత చర్యలను ఖండించింది. కాని బొంబాయిలోని కాంగ్రెస్ మంత్రివర్గం యిదే కాలంలో బొంబాయిలో కార్మికవర్గ పోరాటాలనణచడానికి చేపట్టిన చర్యలు, బెంగాల్‌లోని హక్ మంత్రివర్గ రికార్డు నధిగమించాయి

1937లో జరిగిన సమ్మె పోరాటాల తీవ్రత విషయంలో బొంబాయి ప్రెసిడెన్సీ బెంగాల్ తరువాత స్థానాన్నాక్రమించింది. ఆ సంవత్సరంలో బొంబాయిలో 88 సమ్మెలు జరగ్గా, 1,09,858 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెల ఫలితంగా 8,77,211 పని దినాలు నష్టమయ్యాయి.

సమ్మె పోరాటాల విషయంలో మద్రాసు మూడవ స్థానమాక్రమించింది. 1937 సం॥లో 61 సమ్మెలు జరగగా, 60,980 మంది కార్మికులు పాల్గొన్నారు. 6.56,404 పనిదినాలు నష్టమయ్యాయి.

అదే సంవత్సరంలో యునైటెడ్ ప్రావిన్సెస్‌లో 15 సమ్మె పోరాటాలు జరిగాయి. వీటిలో 63,350 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెలవలన 7,04,940 పనిదినాలు నష్టమయ్యాయి. ఈ సమ్మె పోరాటాలలో కాన్పూరు జౌళి మిల్లు కార్మికుల సమ్మె. ప్రధానంగా పేర్కొనదగినది. ఈ సమ్మె 1937 జూలై నాటికి పరిశ్రమ వ్యాప్త సార్వత్రిక సమ్మెగా పరిణమించింది. కత్తిరించిన జీతాలను తిరిగి యివ్వాలని, వేతనాలను పెంచాలని, రిట్రెంచ్‌మెంట్, డిస్మిసల్స్ నిలిపివేయాలని, యూనియన్ సమర్పించిన 10 అంశాల కోర్కెల పత్రంలోని యితర అంశాలను అమలు పరచాలని కోరుతూ కాన్పూర్ మజ్దూర్‌సభ ఆందోళన ప్రారంభించింది. ఈ ఆందోళన చిలికి చిలికి గాలివానై చివరకు సార్వత్రిక సమ్మెగా పరిణమించింది. ఈ సమ్మెలో 40,000 మంది కార్మికులు పాల్గొన్నారు.

ఇక్కడ కూడా శ్రీ గోవింద వల్లభపంత్ నాయకత్వంలోని మంత్రివర్గం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి, ప్రదర్శనలు, ఊరేగింపులు నిర్వహించడాన్ని నిషేధించింది. క్రిమినల్ ప్రొసీజర్

కోడ్‌లోని కొన్ని నిబంధనలను ప్రయోగించి కార్మిక నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంది. కాని ఈ అణచివేత చర్యల ద్వారా ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మికుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడంలో విఫలమైంది. చివరకు ముఖ్యమంత్రి, మిల్లు యజమానులు కార్మిక నాయకులతో చర్చలకు దిగిరాక తప్పలేదు. ఈ చర్చల ఫలితంగా ఆగస్టు 9వ తేదీన సమ్మె విరమించబడింది. ఈసంప్రదింపుల ఫలితంగా డా॥ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన లేబర్ ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు చేయబడింది.

ఇదే (1937) సం॥లో బీహార్‌లో 14 సమ్మె పోరాటాలు, సెంట్రల్ ప్రావిన్సెస్‌లో 5 సమ్మె పోరాటాలు జరిగాయి. ఈ రెండు ప్రావిన్సెస్‌లలో కలిసి 2,22,000 పనిదినాలు నష్టమయ్యాయి. పంజాబులో 14 సమ్మెలు జరిగాయి. 8,545 మంది కార్మికులు పాల్గొన్న యీ సమ్మెవలన 21 వేలపనిదినాలు నష్టమయ్యాయి. దక్షిణ భారతంలో కోయంబత్తూర్, బెంగుళూరు, పాండిచ్చేరి, మదురైలు కార్మికవర్గ ఉద్యమాలకు ఈ కాలంలో బలమైన కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.

1938 సం॥నికి వచ్చేసరికి సమ్మెల సంఖ్య అయితే పెరిగిందిగాని పాల్గొన్న కార్మికుల సంఖ్య తగ్గింది. కాని నష్టపోయిన పనిదినాల సంఖ్య మాత్రం పెరిగింది. ఈ సంవత్సరంలోనే బెంగాల్‌లోని జూట్ కార్మికులు మరల సమ్మె చేయవలసి వచ్చింది. ఫజులుల్‌హక్ మంత్రివర్గం గత సంవత్సరంలో సమ్మె విరమింపజేయడానికి యిచ్చిన హామీలను అమలుపరచకపోగా, పని గంటలను వారానికి 45 గంటలకు తగ్గిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌కు నిరసనగానూ, రిట్రెంచ్‌మెంట్‌కు వ్యతిరేకంగానూ 90వేల మంది కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. జూట్ కార్మికులతో బాటు బెంగాలులోని కుల్టీ, హీరాపూర్‌ల వద్ద భారత ఇనుము – ఉక్కు కర్మాగారంలోని 14వేల మంది కార్మికులు కూడా సమ్మె చేశారు.

ఈ (1938) సం॥లోనే కాన్పూరులోని జౌళి కార్మికులు రెండవ జనరల్ సమ్మెను జరపవలసి వచ్చింది. గత ఏడాది శ్రీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కార్మిక విచారణ సంఘం (లేబర్ ఎంక్వైరీ కమిటీ) జౌళి మిల్లుల ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వున్నట్లు పరిగణించి పరిశ్రమలలో నెలకు 15 రూపాయలు కనీస వేతనంగా ఇవ్వాలని, ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ ఇవ్వాలని సిఫార్సు చేసింది. కాని మిల్లు యజమానులు ఈ సిఫార్సును వ్యతిరేకించడమేగాక మజ్దూర్ సభ గుర్తింపును రద్దు చేశారు. దీనితో 1938 సం॥మే నెలలో 46 వేల మంది టెక్స్‌టైల్ కార్మికులు రెండవసారి జనరల్ సమ్మెకు పూనుకొనవలసి వచ్చింది. శ్రీ హరిహరనాథ్‌శాస్త్రి తదితర కార్మిక నాయకులు సమ్మెను వాయిదా వేయవలసిందిగా కోరారు. కాని కమ్యూనిస్టులు సాగించిన ముమ్మర ప్రచారం వలన యిది సాధ్యపడలేదు. సమ్మె ప్రారంభం కావడంతో యధా ప్రకారంగానే కాంగ్రెస్ మంత్రివర్గం మిల్లు పరిసరాల్లో కార్మికుల సమావేశాలను నిషేధిస్తూ 144వ సెక్షన్ విధించింది. మంత్రివర్గం కార్మికులను, యజమానులను మందలించింది. అదే సమయంలో విచారణా సంఘం సిఫార్సులను

ఆమోదించ వలసిందిగా యజమానులకు సలహా యిచ్చింది. 52 రోజులు సాగిన యీ వీరోచిత పోరాటంలో కార్మికులు లొంగిపోయే సూచనలే మాత్రం కనిపించకపోవడంతో చివరకు యజమానులు విచారణ సంఘం సిపార్సులను ఆమోదిస్తామని హామీ ఇవ్వడంతో జూలై 4వ తేదీన యీ సమ్మె పోరాటం విజయవంతంగా ముగిసింది.

కాన్పూరు జౌళి కార్మికులు సాగించిన యీ బృహత్తరమైన సమ్మె పోరాటానికి అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ, ఐరన్ ఫౌండ్రి, బర్మాషెల్ కంపెనీ తదితర పారిశ్రామిక సంస్థలలోని కార్మికులు సంపూర్ణంగా సహకరించడం ఈ సమ్మె ప్రత్యేకత. మత విభేదాలు సృష్టించడం ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి యజమానులు సాగించిన కుతంత్రాలను వమ్ముచేసి హిందూ, ముస్లిం మతాలకు చెందిన కార్మికులందరూ మతభేదాలు విడనాడి, సమ్మె విజయానికి కృషి చేశారు.

1938 సం॥లో కాంగ్రెసు మంత్రివర్గం ప్రవేశపెట్టిన పచ్చి కార్మిక వ్యతిరేక పారిశ్రామిక వివాదాల బిల్లుకు వ్యతిరేకంగా 90 వేలమంది బొంబాయి కార్మికులు సమ్మె చేశారు. రైల్వేలలో వేగాన్ని పెంచడానికి, రిట్రెంచ్‌మెంట్‌కు వ్యతిరేకంగా కార్మికులు ఆందోళన సాధించారు. రిట్రెంచ్‌మెంటుకు వ్యతిరేకంగా పోరాడడానికి సంస్కరణవాదుల నాయకత్వంలోని ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ కనీసం చొరవ కూడా చూపలేదు.

పరిశ్రమలవారీగా పరిశీలించినట్లయితే సమ్మెల వలన జౌళి, ఉన్నిపరిశ్రమల్లోనే అధికభాగం పనిదినాలు నష్టపోయినట్లు స్పష్టమవుతోంది. 1937 సం॥లో యీ రెండు పరిశ్రమలలో 25,74,037 పనిదినాలు నష్టంకాగా, 1938 సం॥లో యీ సంఖ్య 44,42,577కు పెరిగింది.

1937 సం॥లో ఇంజనీరింగ్ పరిశ్రమలో 8 సమ్మె పోరాటాలు సాగాయి. ఈ సమ్మెలలో 2311 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెల వలన 15,521 పని దినాలు నష్టమయ్యాయి, 1938 సం॥లో సమ్మె పోరాటాలు 42కు పెరిగాయి. 8,53,992 పనిదినాలు నష్టమైన ఈ సమ్మెల్లో 27,228 మంది కార్మికులు పాల్గొన్నారు. గనుల పరిశ్రమలో 1937 సం॥లో జరిగిన 6 సమ్మె పోరాటాల్లో 5938 మంది కార్మికులు పాల్గొన్నారు. 7938 పని దినాలు నష్టమయ్యాయి. కాని 1938 నాటికి యీ సమ్మెల సంఖ్య 7కు పెరిగింది. ఈ సమ్మెలలో పాల్గొన్న కార్మికుల సంఖ్య 10502కు పెరగ్గా నష్టపోయిన పనిదినాల సంఖ్య 4,96,495కు పెరిగింది. ఈ సమాచారం పరిశీలించినట్లయితే 1937 నుండి 1938 నాటికి సమ్మె పోరాటాల ఉధృతి పెరిగిందనేది స్పష్టమవుతుంది.

1937-38 సం॥లో జరిగిన సమ్మె పోరాటాలను మరింత విశ్లేషించి చూచినట్లయితే యీ క్రింది విషయాలు స్పష్టమవుతాయి.

1) సమ్మె పోరాటాలు బొంబాయి, కలకత్తా, అహమ్మదాబాదు, షోలాపూర్ మద్రాసు, కాన్పూరు వంటి నగరాలకే పరిమితం కాకుండా దేశంలోని అన్ని పారిశ్రామిక కేంద్రాలకు వ్యాపించాయి.

2) ఈ సమ్మె పోరాటాలు చిన్న చిన్న పరిశ్రమలతోబాటు, యిప్పటివరకు ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలకు దూరంగా వుంటూ వచ్చిన సీజనల్ పరిశ్రమలకు కూడ వ్యాపించాయి. తిరువాన్కూరు కొచ్చిన్‌లలోని పీచు పరిశ్రమలోని కార్మికులు, జబల్‌పూర్‌లోని మట్టిపాత్రల పరిశ్రమలోని కార్మికులు, (కుమ్మరి పనివారు) బరేలీలోని రంపపుకోత మిల్లుపనివారు, బీడీ, అగ్గిపెట్టెలు, ప్రింటింగ్ ప్రెస్, మోటారు ట్రాన్స్‌పోర్టు వంటి అసంఘటిత కార్మికులేగాక రిక్షా కార్మికులు గుర్రపుబండ్లు, ఎద్దులబండ్లు నడిపే కష్టజీవులు తదితరులు కూడ తమ తమ డిమాండ్ల సాధనకై సమ్మె పోరాటాలు సాగించారు. 1937 సం॥లో జరిగిన 397 సమ్మెల్లోనూ 143 సమ్మె పోరాటాలు యీ కార్మికులు సాగించినవే. ఈ సమ్మెలలో 74,079 మంది కార్మికులు పాల్గొన్నారు. 7,54,046 పనిదినాలు నష్టమయ్యాయి. 1938లో యీ కార్మికులు 195 సమ్మె పోరాటాలు సాగించగా, 78,631 మంది కార్మికులు పాల్గొన్నారు. నష్టపోయిన పనిదినాల సంఖ్య 13,03,433కు పెరిగింది. కార్మికులు సంఘటితం కాని ఈ చిన్న చిన్న పరిశ్రమల్లో కార్మికులు యీ కాలంలో (1937-38) సాగించిన ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు భారత శ్రామిక వర్గ చరిత్రలో నిస్సందేహంగా సువర్ణాక్షరాలతో లిఖింపదగినవి.

3) 1928-29 సం॥లలో జరిగిన ఆత్మరక్షణ పోరాటాలవలెగాక 1937-38 సం॥లలో సాగిన పోరాటాలు యజమానులపై తమ ఆగ్రహాన్ని చూపే స్వభావం కలిగి విలక్షణంగా విలసిల్లాయి. ఆర్థికమాంద్య కాలంలో కత్తిరించబడిన జీతాల పునరుద్ధరణతోబాటు జీతాల పెంపుదల కోసం, రిట్రెంచ్‌మెంట్, అణచివేత చర్యలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం సాగించారు. ప్రపంచ వ్యాప్తంగావున్న ఆర్థికమాంద్యం వలన ఏర్పడిన దుష్ఫలితాలు క్రమంగా తగ్గుముఖం పట్టినప్పటికీ, విదేశీ, స్వదేశీమిల్లు యజమానులు కార్మికుల న్యాయమైన, ఆర్థికపరమైన కోర్కెలను తిరస్కరించారు ఒక్క బోనసు, జీతాల పెంపుదలకోరుతూ 1937 సం॥లో 238 సమ్మెలు, 1938 సం॥లో 212 సమ్మె పోరాటాలు జరిగాయి.

4) ఈ కాలంలో జరిగిన సమ్మెలలో అధిక భాగం విజయవంతంగా ముగిశాయి. కనీసం 50 శాతానికి పైగా సమ్మెలలో కార్మికులకు సంతృప్తికరమైన ఒప్పందాలు జరిగాయి. ఈ పరిస్థితి గత సంవత్సరాల అనుభవానికి భిన్నంగా వున్నది.

5) ఈ కాలంలో జరిగిన సమ్మె పోరాటాలలో తమ ఆర్థిక సంబంధమైన డిమాండ్లతో బాటు కార్మికవర్గం తమ యూనియన్లను గుర్తించాలని పట్టుబట్టడం ఒక ప్రత్యేకత.

ఈ కాలంలో కార్మికవర్గం కక్ష సాధింపు అణచివేత చర్యలను దృఢ నిశ్చయంతో ప్రతిఘటించడమే గాక, యిట్టి చర్యలకు వ్యతిరేకంగా సోదర కార్మికులకు సంఘీభావం తెల్పుతూ పోరాటాలలో పాల్గొనడం ప్రత్యేకంగా చెప్పుకోదగింది. వర్గచైతన్యంతోబాటు వర్గసంఘీభావ దృక్పథం పెంపొందించుకున్న కార్మికవర్గం తమ ట్రేడ్ యూనియన్ హక్కుల పరిరక్షణకు ఏకోన్ముఖంగా పోరాటం సాగించింది. మహిళా కార్మికులు కూడా యీ

పోరాటాలలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతేగాక కార్మికుల నుండే క్రొత్త కార్యకర్తలు ముందుకు వచ్చి, వేగంగా అభివృద్ధి చెందుతున్న పోరాటాలను నిర్వహించే బాధ్యత వహించారు. కాన్పూరులో జౌళి పరిశ్రమలోని కార్మికులు, బెంగాల్‌లోని జూట్ కార్మికులు సాగించిన పోరాటాలలో ఈ హర్షించదగిన పరిణామాలు సంభవించాయి.

శక్తివంతమైన యీ కార్మికవర్గ పోరాటాలు దేశ స్వాతంత్ర్య పోరాట స్రవంతిలో కలిసి దానిని మరింత చైతన్యవంతంగానూ, శక్తివంతంగానూ చేశాయి.

పెల్లుబుకుతున్న కార్మికవర్గ పోరాటాల యెడల కాంగ్రెస్, కాంగ్రెసేతర మంత్రివర్గాల వైఖరి వాటి వర్గ పొందికకు తగినట్లుగానే వున్నది. ఈ మంత్రివర్గాలు కార్మిక వ్యతిరేక వైఖరి నవలంబించాయి. మంత్రివర్గాలు తమ మనుగడకోసం కార్మికుల, పేదరైతుల స్థితిగతులను మెరుగుపరచేందుకు సంస్కరణలు చేస్తామని యిచ్చిన హామీల అమలుకు గాని, పెట్టుబడిదారీ భూస్వామ్యవర్గాల ప్రయోజనాలకు భంగం కలిగించే ఆర్థిక కోర్కెల అమలుకుగాని, కార్మిక – కర్షకులు పోరాటాలు సాగిస్తే, ఈ పోరాటాలను అణచివేయడానికి మంత్రివర్గాలు కృతనిశ్చయంతో పనిచేశాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులనన్నింటినీ ఏకంచేసి జాతీయ విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళవలసిన తరుణంలో సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా నికరంగా నిలబడే విప్లవశక్తి అయిన కార్మికవర్గం మీద అనేక నిర్బంధాలు విధించి ఈ మంత్రివర్గాలు కార్మికవర్గాన్ని బలహీనపరచడానికి పూనుకున్నాయి.

బొంబాయి ప్రెసిడెన్సీలోని కాంగ్రెసు మంత్రివర్గం పారిశ్రామిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టడం భవిష్యత్ పరిణామాలకు సంకేతంగా భావించవచ్చు.

కాని ఈ సమయానికి భారతదేశ విప్లవ పోరాటంలో కార్మికవర్గం రాజీలేని పోరాటం సాగించే ఒక మహోన్నత శక్తిగా ఎదిగింది. కార్మికవర్గం ఒక నిర్మాణయుతమైన రాజకీయశక్తిగా ముందుకు రావడమేగాక అనేక ట్రేడ్ యూనియన్లు, జాతీయోద్యమంలోని ప్రగతిశీల శక్తులు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించవలసిందిగా డిమాండు చేశాయి. ఇదిలావుండగా కమ్యూనిస్టు పార్టీ నిషేధించబడినప్పటికీ "నేషనల్ ఫ్రంట్" అనే పార్టీ పత్రికను ప్రారంభించి సామ్రాజ్యవాదానికి, ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా ఒక జాతీయ ఐక్య సంఘటనను నిర్మించవలసిన ఆవశ్యకతను ధైర్యంగా ప్రజల ముందుంచింది.

## బొంబాయి పారిశ్రామిక వివాదాల చట్టం 1939

1937లో జాతీయ కాంగ్రెసు తన ప్రణాళికలో పొందుపర్చిన శ్రామిక విధానంలో తామనుసరించే విధానాన్ని నిర్దిష్టంగా పొందుపరచింది. దీని ప్రకారం పారిశ్రామిక వివాదాలను సంతృప్తికరంగా పరిష్కరించడానికి, సంఘ నిర్మాణం, సమ్మె హక్కు వంటి కార్మిక హక్కుల పరిరక్షణకు సమర్ధవంతమైన చర్యలు తీసుకుంటామని నిర్ధిష్ట హామీ లిచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత కూడ వివిధ ప్రాంతాలలోని కాంగ్రెసు మంత్రి వర్గాలు యీ హామీలను

పునరుద్ఘాటించాయి. కాంగ్రెసు, మంత్రి వర్గాలు ఏర్పరచిన ప్రావిన్సెస్‌లో బొంబాయి పారిశ్రామికంగా బాగుగా అభివృద్ధి చెందింది. 1937 ఆగస్టు 18వ తేదీన బొంబాయిలోని మంత్రివర్గం తమ శ్రామిక విధానాన్ని సవివరమైన ప్రకటనలో, కార్మికుల జీవన పరిస్థితులు మెరుగుపరచడం, వారికొరకు సాంఘిక సంక్షేమ చర్యలను ప్రవేశపెడ్తామని గతంలో ఇచ్చిన హామీలను పునరుద్ఘాటించడంతో బాటు "సాధ్యమైనంత వరకు సమ్మెలను, లాకౌట్లను నివారించడానికొక చట్టాన్ని ప్రభుత్వం చేయ సంకల్పించిందనే" తమ లక్ష్యాన్ని స్పష్టం జేసింది. కార్మికుల సమ్మె హక్కును పరిరక్షించుతామనే కాంగ్రెసు ఎన్నికల ప్రణాళికకిది పూర్తి విరుద్ధంగా వుంది. పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే పోరాటాల నడ్డుకోవడానికి బొంబాయి ప్రభుత్వం చేపట్ట సంకల్పించిన చర్యలనీ ప్రకటన స్పష్టం జేసింది. స్వతంత్ర భారతదేశంలో పదే పదే సమ్మెలు, లాకౌట్లు నిషేధించబడటం చూస్తే, పరాయి పాలకుల సార్వభౌమత్వానికి లొంగి బొంబాయిలోని కాంగ్రెసు మంత్రివర్గం కొద్దికాలంపాటు పాలన సాగించిన నాడే యీ ప్రభుత్వ "కార్మికవ్యతిరేక విధానాలకు" బీజాలు పడ్డాయని గమనించాలి. ఒక వలస దేశంలోగాని, స్వతంత్ర పెట్టుబడిదారీ దేశంలోగాని "సమ్మెలు, లాకౌట్లపై నిషేధం" అంటే సమ్మెలు మాత్రమే నిషేధించబడతాయి అంతేగాని లాకౌట్లు కాదు ఎందుకంటే "లాకౌట్" అనేది కార్మికులను దోపిడీ చేయడానికి పెట్టుబడిదారుల చేతిలో నున్న మిక్కిలి శక్తివంతమైన ఆయుధం. అందువలన పెట్టుబడిదారీ, వలస సమాజాలలో పెట్టుబడిదారులీపదునైన ఆయుధాన్ని వీడజాలరు.

1938లో సమ్మెలను నిషేధించాలనే ఉద్దేశంతో బొంబాయి ప్రభుత్వం ప్రొవిన్షియల్ అసెంబ్లీలో పారిశ్రామిక వివాదాల బిల్లును ప్రవేశపెట్టింది. ఇందుకు అసెంబ్లీలోను, వెలుపల కూడా ప్రభుత్వం తీవ్ర నిరసన నెదుర్కొనవలసి వచ్చింది. అసెంబ్లీలో యీ బిల్లుపై 33 రోజుల పాటు వాడి వేడి చాలా చర్చ జరిగింది. దీనితో బాటు అసెంబ్లీకి వెలుపల బొంబాయిలోని కార్మికవర్గం విస్తృతమైన సమ్మె పోరాటాల ద్వారా యీ బిల్లును తీవ్రంగా ప్రతిఘటించింది.

ఈ బిల్లులో వున్న ముఖ్యమైన కార్మిక వ్యతిరేకఅంశాలు :

1) కార్మిక వివాదంలో మధ్యవర్తియంత్రాంగం జోక్యం తప్పనిసరి చేయబడింది. 2) మధ్యవర్తి ద్వారా సమస్య పరిష్కారానికున్న అవకాశాలనన్నింటిని వినియోగించుకోకుండా చేసిన సమ్మెలను చట్టవిరుద్ధంగా ప్రకటిస్తారు. 3) మధ్యవర్తి యంత్రాంగం జోక్యాన్ని అంగీకరిస్తేనే యూనియన్ గుర్తింపు విషయం పరిశీలిస్తారు. 4) చట్టవిరుద్ధమైన సమ్మెల్లో పాల్గొన్నవారికి, 1929 పారిశ్రామిక వివాదాల బిల్లులో పేర్కొన్న 3 నెలల జైలు శిక్షను, 1939 పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా 6 నెలలకు పెంచడం జరుగుతుంది.

సామ్రాజ్యవాద ప్రభుత్వం అతి నైపుణ్యంతో మలచిన కార్మిక వ్యతిరేక "1929 పారిశ్రామిక వివాదాల చట్టా"నికే దేశ వ్యాప్తంగా తీవ్ర నిరసన, వ్యతిరేకత వ్యక్తమయ్యాయి. 1939 సం॥లో బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గం చేసిన ఈ పారిశ్రామిక వివాదాల చట్టం

అభివృద్ధి నిరోధక స్వభావంలో సామ్రాజ్యవాదుల 1929 పారిశ్రామిక వివాదాల చట్టాన్ని తలదన్నేదిగా వున్నది. కాంగ్రెసు మంత్రివర్గం కార్మికుల సమ్మె హక్కును కాలరాచి, సమ్మె చేసిన వారిని 1929 పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం కంటె మరింత కఠినంగా శిక్షించేందుకు చర్య తీసుకొనడం చూస్తే ఈ మంత్రి వర్గపు కార్మికవర్గ వ్యతిరేక వైఖరి స్పష్టమౌతుంది.

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఈ బిల్లును అభివృద్ధి నిరోధకమైనది గానూ, కార్మికవర్గ ప్రయోజనాలకు భంగం కల్గించేదిగానూ, వారి జీవన పరిస్థితులను దిగజార్చేదిగానూ పరిగణించి దానికి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ అభివృద్ధి నిరోధక బిల్లుకు నిరసనగా బొంబాయి ప్రొవిన్షియల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు 1939 నవంబరులో ఒకరోజు సమ్మె నిర్వహించింది. 90 వేలమంది కార్మికులు పాల్గొన్న ఈ సమ్మె భారత కార్మికోద్యమంలో ఒక చారిత్రాత్మకమైన సంఘటన. డా॥బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలోని ఇండియన్ లేబర్ పార్టీ కూడ ఈ సమ్మెకు తన మద్ధతునిచ్చింది. ప్రముఖ కాంగ్రెసు నాయకులు ఈ సమ్మెలో పాల్గొనవద్దని ఎంతగా సలహాలనిచ్చినప్పటికీ కార్మికులు వారిమాట మన్నించక తమ ట్రేడ్ యూనియన్ హక్కుల పరిరక్షణకు సమ్మెలో పాల్గొని బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శనను నిర్వహించారు.

ఈ విధంగా కార్మికవర్గానికి కాంగ్రెసు మంత్రివర్గాలు విద్రోహం తలబెట్టడంతో అప్పటివరకు జాతీయోద్యమ పోరాటంలో కాంగ్రెసుతో వున్న కార్మికులు కూడ ఈ విధానాలకు తమ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెసు మంత్రివర్గాలు ఈ ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక పంథా నుండి మరలడానికి బదులుగా, కార్మికుల నణచివేయడానికి పోలీసు బలగాలను ప్రయోగించాయి. ఈ పోలీసు బలగాలు నిర్దాక్షిణ్యంగా సాగించిన లాఠీచార్జీ, కాల్పులకు ఇద్దరు కార్మికులు బలయ్యారు. ఈ పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా కలకత్తా, అహమ్మదాబాద్, కాన్పూరు, మద్రాసులతో సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో కార్మికులు బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శనలు జరిపారు.

1939 పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా కాంగ్రెస్ పార్టీ యొక్క మరో ఉద్దేశం కూడా బహిర్గతమైంది. అహమ్మదాబాద్ మజూర్ మహాజన్ అంగీకరించిన కంపల్సరీ ఆర్బిట్రేషన్ (మధ్యవర్తి జోక్యాన్ని నిర్బంధం చేయడం) అంటే సంక్షిప్తంగా కాంగ్రెసు నాయకులు అప్పటివరకూ అనుసరిస్తూ వచ్చిన వర్గసామరస్య విధానమే. ఈ 1939 పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా తమ దేశ కార్మికవర్గం మీద తమ వర్గ సామరస్య సిద్ధాంతాన్ని రుద్దడానికి కాంగ్రెసు మంత్రివర్గాలు ప్రయత్నించాయి. సరిగ్గా ఇదే సమయంలో 1938 ఏప్రిల్‌లో అహమ్మదాబాద్ మజూర్ మహజన్ తరహాలో ఇండియాలో ఒక క్రొత్త శ్రామికవర్గ సంస్థను ప్రారంభించాలన్న తన లక్ష్యాన్ని అప్పుడే ముగిసిన గాంధీ సేవక్ సంఘ్ సమావేశం ప్రకటించడం గమనార్హం. ఎ.ఐ.టి.యు.సి. వర్గపోరాట సిద్ధాంతంపై పనిచేస్తున్నదని తలపోసిన సర్దార్

వల్లభాయ్ పటేల్, ఒక కొత్త కార్మికవర్గ సంస్థను స్థాపించాలనే కాంగ్రెసు ఉద్దేశాన్ని కూడ సరిగ్గా యిదే సమయంలో ప్రకటించాడు. ఈ ప్రకటనల తర్వాత సరిగ్గా 8 సం॥లకు ఇదే వల్లభాయ్‌పటేల్ అధ్యక్షతన 1947 సం॥లో జరిగిన సదస్సులో ఎ.ఐ.టి.యు.సి. కి పోటీగా భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐ.ఎన్.టి.యు.సి) స్థాపించబడింది. అంటే 1938-39 సం॥లలో జరిగిన యీ పరిణామాలు, కార్మిక వ్యతిరేక పారిశ్రామిక వివాదాల చట్టం, చేయడం, గాంధీ సేవక్ సంఘ్, సమావేశం చేసిన ప్రకటన, పటేల్ ప్రకటన మొదలయినవి 1947 సం॥లో జాతీయ స్థాయిలో ఒక వర్గ సంకర కార్మిక సంస్థ ఆవిర్భావానికి చేసిన సన్నాహాలు మాత్రమేనని స్పష్టమవుతోంది.

అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెసు కార్యకలాపాలు మంత్రి వర్గాలకు, పార్లమెంటరీ సబ్ కమిటీలకు మాత్రమే పరిమితమయ్యాయి. మజూర్ మహాజన్ నాయకుడు, గాంధీజీకి నమ్మకమైన శిష్యుడైన శ్రీ గుల్జారీలాల్ నందా బొంబాయి కాంగ్రెసు మంత్రివర్గంలో కార్మికశాఖ పార్లమెంటరీ సెక్రటరీగా నియమించబడ్డాడు. ఈవిధంగా కాంగ్రెసు మంత్రివర్గం సాగించిన కార్మికవ్యతిరేక కార్యకలాపాలలో శ్రీ నందా కూడ ప్రధాన భాగస్వామి అయ్యారు.

అసలు ఈ పరిస్థితులలో జాతీయ విముక్తి పోరాటం విజయవంతం కావాలంటే సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులన్నింటితో ఒక జాతీయ ఐక్య సంఘటనను నిర్మించవలసియుంది. కాని కాంగ్రెసు మంత్రి వర్గాలు అనుసరిస్తూన్న కార్మిక వ్యతిరేక విధానాలు, ఈ కర్తవ్య సాధనతో తీవ్రంగా విభేదించేవిగా వున్నాయి అంటే ఒకవైపు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, వేరొకప్రక్క సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులను ఐక్యంచేసి జాతీయ విముక్తి పోరాటాన్ని విజయవంతంగా సాగించడం పొసగదు.

కాని అప్పటికే రెండవ ప్రపంచ యుద్ధ ఛాయలు వ్యాపించి, అంతర్జాతీయ పరిస్థితులలో మార్పు రావడంతో, నూతన రాజ్యాంగం లోని ఫెడరల్ (సమాఖ్య) భాగాన్ని అమలు చేసేందుకు బ్రిటిషు ప్రభుత్వానికే అవకాశాలు కరువయ్యాయి.

## తిరిగి ఐక్యతా ప్రయత్నాలు

1926లో ఇండియన్ ట్రేడ్ యూనియన్ చట్టం చేయబడిన తరువాత యూనియన్లను రిజిష్టరు చేయడం తప్పనిసరి చేయబడింది. పరిశ్రమలవారీగా వర్గీకరణను పరిశీలిస్తే మొత్తం రిజిష్టరు చేయబడిన యూనియన్లలో 69,444 మంది సభ్యత్వం గల్గిన 84 యూనియన్లు ఒక్క జౌళి పరిశ్రమలోనే వున్నాయి. రైల్వేల్లో 1,58,068 సభ్యత్వంతో 57 యూనియన్లున్నాయి. జి.ఐ.పి. రైల్వేలో రెడ్‌ఫ్లాగ్ యూనియన్, సంస్కరణవాద యూనియన్ కలిసి ఒకే యూనియన్‌గా ఏర్పడ్డాయి. ఈ యూనియన్ సభ్యత్వం మొత్తం 20వేల వరకు వున్నది. ఇదే విధంగా బి.బి. అండ్ సి.ఐ., ఎం.ఎస్.ఎం అండ్ ఎస్.ఐ. రైల్వేలలో కూడ శక్తివంతమైన యూనియన్లు ఏర్పడ్డాయి. 11,698 మంది సభ్యులతో 27 మున్సిపల్ కార్మికుల యూనియన్లు, 46,057 సభ్యత్వంతో 9

నావికుల యూనియన్లు వున్నాయి. ఇదే సమయంలో రంపపుకోత మిల్లులు, మోటార్ ట్రాన్సుపోర్టు, హోటల్, క్షౌరశాలలు వంటి అనేక చిన్న, పెద్ద పరిశ్రమలలో కార్మికులు ఐక్యమై తమ యూనియన్లను రిజిష్టరు చేయించుకున్నారు.

1937–38లో రిజిష్టరు చేయబడిన యూనియన్ల సంఖ్యతో బాటు ఆ యూనియన్ల ఆర్థిక పరిస్థితి కూడ మెరుగయ్యింది. 1936–37లో యూనియన్లు కార్మికశాఖకు సమర్పించిన వార్షిక జమా ఖర్చుల ప్రకారం 4,88,431 రూ॥లుగా వున్న ఆదాయం 1937–38 నాటికి 6,93,444 రూ॥లకు చేరుకుంది. మిగిలిన అన్ని యూనియన్ల కంటే రైల్వేలలోని యూనియన్లు, అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్‌లు ఆర్థికపరంగా మంచి స్థితిలో వున్నాయి.

కాని ఈ కాలంలో విస్తృతంగా సాగిన పోరాటాల కనుగుణంగా ట్రేడ్ యూనియన్లు సంస్థాపరంగా పురోగమించలేదు. అనేక సందర్భాలలో పోరాటాలు హఠాత్తుగా పెల్లుబికినాయి గాని ఏ సంస్థ ఆవిర్భావానికి తోడ్పడలేదు. అయినప్పటికి కొంత అభివృద్ధి లేకపోలేదు. 1938–40 మధ్యకాలంలో సుమారు 6 లక్షల సభ్యత్వం గల్గిన 900 రిజిష్టరు చేయబడిన రిజిష్టరు చేయబడని యూనియన్లు వున్నట్లు ఒక అంచనా.

1938 జనవరి 1, 2 తేదీలలో ఢిల్లీలో శ్రీ శివనాథ్ బెనర్జీ అధ్యక్షతన ఎ.ఐ.టి.యు.సి. 16వ మహాసభ జరిగింది. ఈ సమావేశంలో ఎ.ఐ.టి.యు.సికి 1,22,050 సభ్యత్వం గల్గిన 98 యూనియన్లు అనుబంధం చేయబడినట్లు యీ మహాసభ చెప్పుకున్నది.

ట్రేడ్ యూనియన్‌ల ఐక్యతను సాధించే కృషిలో గణనీయమైన ప్రగతి సాధించి ఈ మహాసభ విశిష్టతను సంతరించుకుంది. నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌తో చర్చలు సాగించి, ఎ.ఐ.టి.యు.సి.తో ఆ సంస్థలు ఏకం చేసే బాధ్యత వహించడానికి, ఈ సమావేశంలోనే ఒక ఉపసంఘాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. "గిరి ప్రతిపాదనలు"గా పేరుగాంచిన, నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ సిఫారసు చేసిన ఐక్యతా ప్రతిపాదనలను కొద్ది సవరణలతో ఐక్యతా చర్చలకు ప్రాతిపదికగా ఆమోదించడం జరిగింది.

ఈ మహాసభలో శ్రీ శివనాథబెనర్జీ అధ్యక్షునిగా శ్రీయుతులు ఎస్.ఎ.డాంగే, ఎస్.వి. ఘాటేలను ఉపాధ్యక్షులుగానూ, శ్రీ బంకిమ్ ముఖర్జీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

ఐక్యతా ప్రతిపాదనలతో బాటు ఈ మహాసభ రాజకీయ ఖైదీలనందరినీ విడుదల చేయాలని డిమాండు చేస్తూ 1938 మార్చి 6వ తేదీన నిరసన దినం పాటించాలని,

భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించాలని డిమాండు చేస్తూ మార్చి 20వ తేదీన "అఖిలభారత కోర్కెల దినాన్ని" పాటించాలని మరో రెండు తీర్మానాలను ఆమోదించింది.

గిరి ప్రతిపాదనలను ఎ.ఐ.టి.యు.సి. వున్నవి వున్నట్లుగా అంగీకరించ లేకపోయింది. ముఖ్యంగా ఒక విషయంలో ఎ.ఐ.టి.యు.సి. తీవ్రంగా విభేదించింది. రాజకీయ సమస్యలు, సమ్మె సమస్యలపై నిర్ణయం తీసుకోవడానికి యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్యవర్గంలో 3/4 మెజారిటీ వుండాలని గిరి చేసిన ప్రతిపాదనతో ఎఐటియుసి తీవ్రంగా విబేధించింది. కీలక సమస్యలపై నిర్ణయాలు తీసుకొనేటప్పుడీ అంశం తీవ్ర ప్రతిబంధకంగా వుంటుందని, ఆ సమయాలలో ఈ ప్రతిపాదనవలన ఒక నిర్ణయాన్ని వీటో చేసే అధికారాన్ని కూడా కల్పించే ప్రమాదం వున్నదని ఎ.ఐ.టి.యు.సి. భావించింది. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఈ విధమైన ప్రతిపాదనలు అవాంఛనీయమైన పద్ధతులని ఎ.ఐ.టి.యు.సి. అభిప్రాయపడింది.

ఏది ఏమైనప్పటికీ 1936-37 సం॥లలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల వలన కార్మికవర్గం ఒక ఐక్య వేదికను కల్గియుండవలసిన అవసరం ఏర్పడింది. ఈ సమయంలో ఎ.ఐ.టి.యు.సి.లో కమ్యూనిస్టు కాంగ్రెసు సోషలిస్టు, రాయిస్టు (ఎమ్.ఎన్.రాయ్. అనుచరులు) సిద్ధాంతాలను అనుసరించే వారు పనిచేస్తున్నారు.

ఈ ఐక్యతా ప్రయత్నాలలో భాగంగా 1938 ఏప్రిల్ 17వ తేదీన నాగపూరులో ఎ.ఐ.టి.యు.సి., నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌ల సంయుక్త సమావేశం డా॥ సురేష్‌చంద్ర బెనర్జీ అధ్యక్షతన జరిగింది. సుదీర్ఘ చర్చల అనంతరం ఐక్యతా ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయి. ఈ సంయుక్త సమావేశం ఐక్యతకు ఈ క్రింది షరతులు ఆమోదించింది. 1) నేషనల్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ (ఎన్.టి.యు.ఎఫ్.)ను ఎ.ఐ.టి.యు.సి.కి ఒక శాఖగా అనుబంధం చేయాలి. 2) ఎన్.టి.యు.ఎఫ్. నిబంధనావళిని ఎ.ఐ.టి.యు.సి. ఆమోదించాలి. 3) ఎ.ఐ.టి.యు.సి.కి, ఎన్.టి.యు.ఎఫ్. అనుబంధం ఒక సంవత్సరకాలం అమలులో వుంటుంది. 4) ఎ.ఐ.టి.యు.సి.ని ఏ అంతర్జాతీయ సంస్థకు అనుబంధం చేయరాదు. కాని దాని శాఖలకు అంతర్జాతీయ సంస్థలకు అనుబంధం చేసుకునే స్వేచ్ఛ వుంటుంది. 5) అన్ని రాజకీయ సమస్యలు, సమ్మెలకు సంబంధించిన సమస్యలు జనరల్ కౌన్సిల్‌లో గాని వర్కింగ్ కమిటీలోగాని నాల్గింట మూడు వంతుల మెజారిటీతో నిర్ణయించబడాలి. 6) టి.యు.సి. అని వ్రాయబడిన మామూలు ఎర్రజెండా ఎ.ఐ.టి.యు.సి. పతాకంగా నిర్ణయించబడింది.

ఒప్పందం ప్రకారం ఇరుపక్షాల నుండి 44 మంది సభ్యులు చొప్పున మొత్తం 88 మంది సభ్యులతో జనరల్ కౌన్సిల్ ఏర్పాటు చేయబడుతుంది. ఎన్.టి.యు.ఎఫ్.ను ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేసిన తరువాత ఎ.ఐ.టి.యు.సి.లో 188 యూనియన్లకు చెందిన 3,66,456 మంది సభ్యులున్నారు. డా॥ సురేష్‌చంద్ర బెనర్జీ (ఎన్.టి.యు.ఎఫ్.) అధ్యక్షునిగా, శ్రీయుతులు అఫ్తాబ్ అలీ, జమ్నాదాస్ మెహతా, (ఎన్.టి.యు.ఎఫ్.) శ్రీ

ముకుందలాల్ సర్కార్‌లు (ఎ.ఐ.టి.యు.సి) ఉపాధ్యక్షులుగా, ఆర్.ఆర్. బాఖలే (ఎన్.టి.యు.ఎఫ్) కార్యదర్శిగానూ, శ్రీ ఆర్.ఎస్. నింబ్కర్ (ఎ.ఇ.టి.యు.సి) కోశాధికారిగాను, శ్రీయుతులు బంకిమ్ ముఖర్జీ, ఎస్.వి.పరులేకర్ (ఎ.ఇ.టి.యు.సి) సహాయ కార్యదర్శులుగా ఈ  సంయుక్త సమావేశంలో ఎన్నికయ్యారు.

ఒకే కార్మికవర్గ సంస్థగా ఏర్పడినప్పటికీ, యీ రెండు సంస్థలు తమ స్వయంప్రతిపత్తిని పూర్తిగా విడనాడలేదు. ప్రారంభంలో ఈ సంస్థల ఐక్యత కొంత కష్టమైనప్పటికి కాలం గడుస్తున్న కొలది వారిలో భేదాభిప్రాయాలు తొలగి 1940 నాటికి పూర్తి ఐక్యత ఒక వాస్తవ రూపాన్ని దాల్చింది.

ఈ ఐక్యత యొక్క విశిష్టతను కేవలం అనుబంధ సంఘాల సంఖ్య, సభ్యత్వాల పెరుగుదల నుండి అర్ధం చేసుకోలేము. వెల్లువెత్తిన ఆర్థిక, రాజకీయ పోరాటాల్లో భారత కార్మిక వర్గ ఐక్య కేంద్ర కార్మిక సంస్థగా ఎఐటియుసి ఒక విశిష్టమైన పాత్ర నిర్వహించడమే ఐక్యత వల్లనే సాధ్యపడింది.

# 17

# రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సంఘటనా భరిత కార్మికవర్గ పోరాట క్రమం (1939-45)

## రాజకీయ పరిస్థితి

1939 సెప్టెంబరు 3వ తేదీన రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. యూరప్‌లో యుద్ధం ప్రారంభమైన కొద్ది గంటలలోనే ఇండియా కూడ యుద్ధంలో పాల్గొంటున్నట్లు భారత ప్రజానీకంతో సంప్రదించకుండానే వైస్రాయి ప్రకటించాడు. ఈ విధంగా భారత ప్రజానీకం తన ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ఈ వినాశకరమైన ప్రపంచ యుద్ధంలోకి ఈడ్చబడింది.

ఫాసిస్టు శక్తులు తలెత్తడం వలన సంభవించనున్న ప్రమాదాన్ని గుర్తించిన జాతీయ కాంగ్రెసు స్పెయిన్, ఇథియోపియా, జెకోస్లోవేకియా దేశాల ప్రజలపై ఫాసిస్టు శక్తులు సాగించిన దారుణ మారణకాండను, రక్తపాతాన్ని తీవ్రంగా ఖండించింది. జపాన్‌లో కూడా వ్యక్తమవుతున్న ఫాసిస్టు పోకడల యెడల జాతీయ కాంగ్రెస్ తన వ్యతిరేకతను వ్యక్తం చేయడమేగాక, చైనా మీద జపాన్ దండయాత్ర చేసినపుడు జపాన్‌ను దురాక్రమణదారుగా ఖండించడంలో వెనుకాడలేదు.

భారత కమ్యూనిస్టులు ఫాసిజం వలన రాబోయే ప్రమాదాలను తేలికగానే గుర్తించగలిగారు. వాస్తవానికి అంతర్జాతీయంగా వివిధ దేశాలలోనున్న కమ్యూనిస్టులు ఫాసిజం అభివృద్ధి చెందుతున్న దశలోనే దానికి ప్రతిఘటనను సాగించారు. అందువలన ప్రపంచ ప్రజానీకానికి పరమ శత్రువైన ఈ ఫాసిజాన్ని భారత కమ్యూనిస్టులు నిర్ద్వంద్వంగా ఖండించారు. అదే సమయంలో బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించడానికి, ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటనను నిర్మించడానికి తీవ్ర కృషి సాగించారు.

ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యే వరకు జాతీయ కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ ఈ పంథానే అనుసరిస్తూ వచ్చాయి. కాని ఈ ప్రపంచ యుద్ధం ప్రపంచ శక్తుల బలాల పొందికలో మార్పును తెచ్చింది. ఫలితంగా పరిస్థితులు మారాయి. యుద్ధం మరింత ఉధృతం కావడం, నాజీ జర్మనీ సోవియట్ యూనియన్ మీద దండయాత్ర చేయడంతో యుద్ధ స్వభావమే పూర్తిగా మారిపోయింది. అందువలన అంతకుముందు జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై వేసుకున్న అంచనాలు పూర్తిగా మారిపోయాయి.

ఒకప్రక్క భారతదేశాన్ని యుద్ధంలో పాల్గొనే దేశంగా ప్రకటించిన బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఎన్నికైన ప్రతినిధులతో ఒక నేషనల్ కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ (విధాన నిర్ణయ సభ)ని ఏర్పాటు చేయాలన్న భారత ప్రజల కోర్కెను తిరస్కరించారు. అంతటితో ఆగక డిక్రీల ద్వారా భారత ప్రభుత్వం పరిపాలన సాగించడానికి, ప్రాంతీయ (ప్రావిన్షియల్) మంత్రివర్గాల అధికారాలను త్రోసిరాజనే విధంగా నిరంకుశ అధికారాలను గవర్నర్లకు కట్టపెట్టడం ద్వారా అసలే పరిమిత అధికారాలతో పరిపాలన సాగిస్తున్న ప్రావిన్షియల్ మంత్రివర్గాల పరిపాలనకు కూడా అవరోధం కల్పిస్తూ "భారత రక్షణ" (డిఫెన్స్ ఆఫ్ ఇండియా) ఆర్డినెన్సును జారీ చేయడం ద్వారా బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ నిరంకుశ స్వభావాన్ని మరోసారి బయటపెట్టుకున్నారు.

బ్రిటిషు సామ్రాజ్యవాదుల ఈ నీచవైఖరి ప్రజల్ని ఆగ్రహావేశులను చేసింది. బ్రిటిషువారి నిరంకుశ వైఖరికి నిరసనగా ప్రథమ చర్యగా ప్రావిన్షియల్ మంత్రివర్గాల నుండి జాతీయ కాంగ్రెస్ రాజీనామా చేసింది. ఈ పరిస్థితులలో భారత ప్రభుత్వ చట్టం (1935)లోని 93వ సెక్షను ప్రకారం వివిధ ప్రావిన్స్‌ల నిర్వహణను స్వీకరించిన ప్రావిన్షియల్ గవర్నర్లు తమకు సంక్రమించిన అసాధారణ అధికారాలను వుపయోగించి యుద్ధ కాలమంతా పరిపాలన సాగించారు.

ప్రపంచయుద్ధం ప్రథమ దశలో 1941 జూన్ వరకు బ్రిటిషు, ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు నాజీ జర్మనీతో యుద్ధం చెలరేగింది. ఈ సమయంలో జాతీయ కాంగ్రెసు యుద్ధంలో చిక్కుకున్న బ్రిటిషు వారిని పెద్దగా నొప్పించక అధికారం బదలాయింపుకు బేరసారాలాడే వైఖరినవలంబించింది. యుద్ధానికి సంబంధించినంత వరకు జాతీయ కాంగ్రెసు దృష్టి బ్రిటన్ మీదనే కేంద్రీకరించబడింది.

కాని 1941 జూన్ నెలలో పోలెండ్, బెల్జియం, హాలెండ్ నార్వే, ఫ్రాన్స్, తూర్పు యూరప్‌లో అధికభాగాన్ని ఆక్రమించి సోవియట్ యూనియన్, జర్మనీల మధ్య కుదిరిన నిర్యుద్ధ సంధి ఒప్పందాన్ని అతిక్రమించి ఫాసిస్టు జర్మనీ సోవియట్ యూనియన్‌పై దండయాత్ర జరిపింది. అదే ఏడాది డిసెంబర్ నెలలో పెరల్ హార్బర్‌పై మెరుపుదాడి చేసి జపాన్ కూడా యుద్ధంలో

ప్రవేశించింది. 1941 సంవత్సరాంతానికి యుద్ధ జ్వాలలు ప్రపంచమంతటా వ్యాపించాయి. సోవియట్ రష్యా, అమెరికాలు బ్రిటిష్, ఫ్రెంచి కూటమితో కలిసి దానినొక మిత్రరాజ్య కూటమిగా చేరి యుద్ధానికి దిగాయి. ఇదిలావుండగా వేరొక ప్రక్క ఆసియా రంగంలో జపాన్ విజయం తర్వాత విజయం సాధిస్తూ ఫిలిప్పైన్స్, ఇండోచైనా, ఇండోనేషియా, మలయా, బర్మాలను ఆక్రమించింది. 1942 మార్చి నాటికి జపాన్ సైన్యాలు రంగూన్ వరకు పురోగమించడంతో నేరుగా భారతదేశ సరిహద్దుల భద్రతకు ముప్పువాటిల్లింది. యుద్ధం రెండవదశలో ప్రవేశించింది.

మారిన యుద్ధ పరిస్థితుల దృష్ట్యా భారతదేశంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచే షరతుతో యుద్ధంలో తలమునకలుగా వున్న బ్రిటన్‌తో సహకరించడానికొక ప్రాతిపదిక ఏర్పరచాలని కాంగ్రెస్ భావించింది. జపాన్ దాడిని ప్రతిఘటించడానికి, యుద్ధ ప్రయత్నాలలో ఇండియా సహకారాన్ని పొందడానికి అప్పటికే బ్రిటన్ చాలా ఆసక్తితో వున్నది. 1941 డిసెంబర్ నెలలో కాంగ్రెస్ ప్రధాన నాయకులను ప్రభుత్వం విడుదల చేయడం ద్వారా యుద్ధంలో సహకారానికి బ్రిటన్ ప్రాతిపదికను కల్పించింది.

1942 మార్చి 8వ తేదీన రంగూన్ పతనం కావడంతో (రంగూన్ జపాన్ చేజిక్కడంతో) బ్రిటిషు ప్రభుత్వం క్రిప్పు రాయబారాన్ని ప్రకటించింది. బ్రిటిషు యుద్ధ క్యాబినెట్ (వార్‌క్యాబినెట్) తయారు చేసిన ముసాయిదా ప్రకటన ప్రాతిపదికగా భారతదేశ భవితవ్యాన్ని గురించి భారత రాజకీయ నాయకులతో చర్చలు జరపడానికి బ్రిటీష్ వార్ క్యాబినేట్ సభ్యుడు సన్‌స్టాఫర్డ్ క్రిప్స్ నాయకత్వంలో ఒక కమిషన్ 1942 మార్చి, ఏప్రిల్ నెలల్లో భారతదేశం సందర్శించింది.

యుద్ధం ముగిసిన తరువాత ఇండియాకు విడిపోయే అధికారంతో డొమినియన్ ప్రతిపత్తిని కలుగజేయడం, ముస్లింలీగుకు, సంస్థానాధిపతులకు వీటో అధికారాలను కల్పించే విధంగా భవిష్యత్తులో భారత రాజ్యాంగాన్ని తయారు చేయడం వంటి షరతుల వలన ఇండియాలో జాతీయ ప్రభుత్వ స్థాపన డిమాండు నిరాకరించబడింది.

క్రిప్పు రాయబారం విఫలం కావడం వలన యుద్ధ సమయంలో భారత బ్రిటిషు దేశ సంబంధాల విషయంలో నెలకొన్న సంక్షోభం మరొక మలుపు తిరిగింది. ఈ వైఫల్యం ప్రజానీకాన్ని అగ్రహావేశులను చేయడమేగాక మన రాజకీయ నాయకులకు తీవ్ర నిరాశ కలిగించింది. తీవ్రమైన ఆశాభంగం తెగింపుకు దారితీస్తుంది. 1942 ఆగస్టు 8వ తేదీన బొంబాయిలో గాంధీజీ అధ్యక్షతన జరిగిన ఆలిండియా కాంగ్రెసు కమిటీ సమావేశం, బ్రిటిషు వారిని దేశాన్ని వదిలిపెట్టి వెళ్ళవలసిందిగా డిమాండు చేస్తూ "క్విట్ ఇండియా" ఉద్యమాన్ని సాగించవలెనని, ఒక ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించింది. "భారతదేశాన్ని విముక్తి చేయండి" లేదా "ఆ ప్రయత్నంలో ప్రాణాలర్పించండి" అనే ఒక రాజకీయ నినాదాన్ని కూడా యివ్వడం జరిగింది. తరువాత రోజున అనగా ఆగస్టు 9వ తేదీన ఈ ముసాయిదా తీర్మానం చర్చకు

పెట్టబడవలసి యున్నది. కాని ఈ సమావేశం జరగకపోవడంతో ఒక సక్రమమైన కార్యక్రమం యివ్వడానికి అవకాశం లేకపోయింది.

సామ్రాజ్యవాదుల రాజకీయ చాతుర్యానికి నీతి నియమాలు లేవు. హఠాత్తుగా ఆశ్చర్యం కల్గించేట్టుగా మొదటి దాడి చేయడం విజయ సాధనకు మార్గమనే సూత్రాన్ననుసరించి బ్రిటిష ప్రభుత్వం ఆకస్మికదాడి చేయడానికి నిర్ణయించుకున్నది. ఆగస్టు 9వ తేదీ ఉదయమే గాంధీజీతో బాటు బొంబాయిలోని ఇతర వర్కింగ్ కమిటీ సభ్యులను అరెస్టు చేశారు. దేశ వ్యాప్తంగా అరెస్టులు సాగించి పెద్దసంఖ్యలో కాంగ్రెసు వారిని జైళ్ళలో క్రుక్కి బ్రిటిషు ప్రభుత్వం ప్రజల నుండి నాయకత్వాన్ని దూరం చేసింది.

"క్విట్ ఇండియా" తీర్మానాన్ని, "దేశాన్ని విముక్తి చేయండి!" లేదా "ఆ ప్రయత్నంలో ప్రాణాలర్పించండి" అనే నినాదామిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చేసిన తీర్మానంతో పాటు, కాంగ్రెసు నాయకుల అరెస్టు వార్త దేశమంతటా కార్చిచ్చులా వ్యాపించడంతో ప్రజల ఆగ్రహానికి హద్దులేకపోయింది. విసిగి వేసారిన ప్రజానీకం సరిగ్గా సమీకృతం కాకుండా, నాయకత్వం లేకుండా గుడ్డిగా తమ ఆగ్రహావేశాలను వ్యక్తం చేసింది. నాయకత్వంలేని ప్రజానీకం ఉగ్రవాదులు, విప్లవవాదులు, సుభాష్‌చంద్రబోస్ నాయకత్వంలోని ఫార్వర్డ్‌బ్లాక్, కాంగ్రెస్‌లోనే వుంటూ అహింసా సిద్ధాంతాన్ని వ్యతిరేకించే జయప్రకాష్ నారాయణ్, సోషలిస్టు అనుచరులతో సహా అవకాశం కోసం ఎదురుచూసే అనేక ఊరూ పేరూ లేని సంఘ వ్యతిరేకశక్తుల ప్రభావానికి లోనయింది. తిరుగుబాటు తత్వంతో ప్రజలు సైన్యాలతోనూ, పోలీసులతోనూ తలపడడంతో సంఘర్షణలు చెలరేగి రక్తపాతం జరిగింది. టెలిఫోన్ టెలిగ్రాఫ్, రైల్వే తదితర ప్రభుత్వ ఆస్తులను తగులబెట్టడమో లేక పీకివేయడమో జరిగింది. కొన్ని చోట్ల రైతాంగం కూడా సాయుధ దళాలతో తలపడింది.

బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ రాక్షసకృత్యాలు, భయోత్పాతం, అత్యాచారాలు సాగించడం ద్వారా, సరైన నాయకత్వంలేని ప్రజల తిరుగుబాటును తాత్కాలికంగా అణచివేయగలిగారు. కాని విప్లవ జ్వాలలను చల్లార్చడం, ప్రజల ఉత్సాహాన్ని, నిరోధించడం సామ్రాజ్యవాదుల తరం కాలేదు. విద్యార్థులు, కార్మికులు, రైతాంగం దిగువ, మధ్య తరగతి ప్రజానీకంతో సహా దోపిడీకి గురవుతున్న అన్ని తరగతుల ప్రజానీకం ఈ ప్రజా తిరుగుబాటు వెల్లువలో పాలుపంచుకున్నారు. కాని ప్రభుత్వం సాగించిన పైశాచిక కృత్యాలు అవధులు దాటి పోయాయి. కొద్దివారాలు మాత్రమే సాగిన యీ తిరుగుబాటు వెల్లువతో పిచ్చెత్తిన సామ్రాజ్యవాద ప్రభుత్వం సాగించిన పైశాచిక కృత్యాల్లో పదివేలమందికి పైగా ప్రజలు అమరత్వం పొందారు.

ఆగస్టు మాసంలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ చేసిన తీర్మానంలోని రాజకీయ విజ్ఞతను, అది చూపిన ప్రమాదభరితమైన మార్గాన్ని అనేకమంది ప్రశ్నించారు. క్రిప్సు

రాయబారం విఫలం కావడంతో కాంగ్రెసు నాయకత్వం ఒక భయంకరమైన సందిగ్ధావస్థలో పడింది. ఫాసిస్టు వ్యతిరేక, అంతర్జాతీయతా విధానాన్ని అనుసరిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకులు కూడా యీ సందిగ్ధత నుండి తప్పుకోలేకపోయారు. దేశరక్షణకై బ్రిటిషువారితో పూర్తిగా సహకరించడంలో విఫలమై, జాతీయ స్థాయిలో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు కన్న కలలు కూడా కల్లలు కావడంతో వీరు తీవ్రమైన నిరాశకు లోనయ్యారు. నెహ్రూ మదిలో విస్తృత స్థాయి సందేహాలు తలెత్తాయి. ఈ సమయంలో దేశం బ్రహ్మాండమైన తిరుగుబాటు చేసినట్లయితే అది ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా మిత్రరాజ్యాలు సాగిస్తున్న పోరాటంలో పరాజయం పాలయ్యేందుకు దోహదం చేస్తుందనే పెద్ద సందేహం నెహ్రూకు కలిగింది. ఇక్కడ రెండు ప్రశ్నలు తలెత్తాయి. భారతదేశంపై బ్రిటిషు సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడడమా, లేదా రష్యా, చైనాల ఓటమికి కారణమవడం ద్వారా ఫాసిస్టు శక్తుల విజయానికి తోడ్పడడమా అనేది భారత ప్రజలు నిర్ణయించుకొనవలసిన సమయమాసన్నమైంది. సూక్ష్మంగా చెప్పాలంటే ఆగస్టు తీర్మానం రాజకీయ లక్ష్యాన్ని సూచించడంలో తీవ్రమైన గందరగోళాన్ని సృష్టించి, కాంగ్రెస్ నాయకత్వంలో తీవ్రమైన వైరుధ్యాలకు దారితీసింది.

జాతీయోద్యమంలోని లోని ఫాసిస్టు వ్యతిరేక కార్మికవర్గ సెక్షన్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ, 1942 జూలై నెలలో ఈ తీర్మానం ముసాయిదా రూపంలో వుండగానే దానిని వ్యతిరేకిస్తూ, ఈ తీర్మానం అమలు జరపడం వలన ఒనగూడే ఫలితాలను గురించి హెచ్చరిస్తూనే వుంది. 1941 జూలై వరకు కమ్యూనిస్టులు సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకిస్తుండటమే గాక, యుద్ధ వ్యతిరేక ప్రయత్నాలలో కాంగ్రెస్‌తో సహకరిస్తూ వచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటనను నిర్మించే దశలో కృషి చేస్తూ వచ్చింది. కాని నాజీ జర్మనీ సోవియట్ యూనియన్‌పై దురాక్రమణ జరపడం, ఈ ఫాసిస్టు దురాక్రమణను ప్రతిఘటించడానికి మిత్రరాజ్య కూటమి ఏర్పడడంతో యుద్ధ స్వభావంలోనే మౌళికమైన మార్పులు వచ్చాయి సామ్రాజ్యవాద యుద్ధం "ప్రజాయుద్ధంగా" మారడంతో యుద్ధ వ్యతిరేక రాజకీయ నినాదాన్ని మార్చి, ఈ ప్రజా యుద్ధానికి పూర్తి సహకారం ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ కోరింది. ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించడానికి కాంగ్రెస్, ముస్లింలీగ్ తదితర రాజకీయ పార్టీలన్నింటిని ఏకం చేసి ఉమ్మడి వేదిక నేర్పరచి, భారతదేశంలో ఒక జాతీయ ఐక్య సంఘటనను ఏర్పాటు చేయాలని, అదే సయమంలో ఇదే ఉమ్మడి వేదిక ద్వారా జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు ఒత్తిడి తేవాలని భారత కమ్యూనిస్టు పార్టీ కోరుతూ వచ్చింది. యుద్ధ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వవలసిందిగానూ, ఫాసిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా దేశ రక్షణను పటిష్టపరచు కొనవలసిందిగానూ, కోరుతూ మన జాతీయ డిమాండ్ల సాధనకు పోరాటం

సాగించవలసిందిగా పార్టీ కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. ఇంతేగాక కాంగ్రెసు నాయకుల అరెస్టులకు వ్యతిరేకంగానూ బ్రిటిషు ప్రభుత్వం సాగిస్తున్న అణచివేత చర్యలు హింసాకాండకు వ్యతిరేకంగానూ ప్రచారం సాగించింది. పార్టీ సిద్ధాంతం సక్రమమైన దైనప్పటికీ, ప్రజల్లో తీవ్రంగా ఉన్న జాతీయ భావాలతో పాటు, జాతీయ ప్రభుత్వ ఏర్పాటును బ్రిటిషు సామ్రాజ్యవాదులు మొండిగా తిరస్కరించడం, దానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటంలో పార్టీ భాగస్వామి కాకపోవడంవల్ల పార్టీ పంథాకు జాతీయోద్యమంలోని అధికభాగం మద్దతు లభించలేదు. బ్రిటిషు వారితో ఏ విధమైన పోరాటం సాగించినప్పటికీ, అది ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న సోవియట్ యూనియన్, దాని మిత్ర రాజ్యాలను బలహీనపరుస్తుందని పార్టీ అతిగా భయపడింది. ఆ విధంగా గాక జాతీయ ప్రభుత్వ స్థాపనకు జరిగిన పోరాటంలో పార్టీ చురుకుగా పాల్గొన్నట్లయితే పార్టీ పంథాకు సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల విశేష మద్దతు లభించి వుండేది. అందువలన 1935-45 సంవత్సరాల మధ్య కాలంలో భారతదేశంలో కార్మికవర్గ ఉద్యమాన్ని పరిశీలించేటప్పుడు అత్యంత క్లిష్టతరంగా వున్న ఈ రాజకీయ పరిస్థితులను కూడా పరిగణనలోనికి తీసుకొనవలసి వుంటుంది.

## ఆర్థిక రంగంలో యుద్ధ ప్రభావం : కార్మిక వర్గ స్థితిగతులు

ఒక వలస దేశం పూర్తిగా యుద్ధంలో పాల్గొనడం వలన అనేక వినాశకర ఫలితాలకు దారితీసింది. ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడంలో బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రజల ప్రయోజనాలను విస్మరించి యుద్ధాన్ని మాత్రమే దృష్టిలో వుంచుకుని భారతదేశంలో కార్యకలాపాలను నిర్వహించడం జరిగింది. ఫలితంగా పారిశ్రామికాభివృద్ధి జరిగినప్పటికీ, అది కేవలం బ్రిటిషు వారి యుద్ధావసరాలకు ఉద్దేశించబడడంతో, కార్మికుల జీవన, పని పరిస్థితులు మెరుగుదలకు దోహదపడకపోగా, మోయలేని భారాలతో వారి జీవన పరిస్థితులు మరింతగా దిగజారాయి.

ఉత్పత్తిని అధికం చేయడానికి రెండు, మూడు షిఫ్టులలో పనిచేయించే పద్ధతి ప్రవేశపెట్టబడింది. రాత్రి షిఫ్టు పరిశ్రమల్లో సర్వసాధారణమైంది. అనేక సందర్భాలలో పని గంటలు పెంచడం, సెలవును కుదించడం సర్వసాధారణమైంది. ఫ్యాక్టరీ చట్టంలోని అంశాలను అమలు చేసే విషయంలో యజమానులను మినహాయించడం దేశ పారిశ్రామిక రంగంలో సర్వ సాధారణమైంది. ఈ విధంగా చట్టం పరిధి నుండి మినహాయించబడి శక్తివంతులైన యజమానులు నేరుగా యుద్ధావసర వస్తువులను ఉత్పత్తి చేసే ఇంజనీరింగ్, జూట్, రసాయనిక వస్తువులు, అగ్గిపెట్టెలు వంటి పరిశ్రమల్లో పని గంటలు పెంచి వేశారు. ఈ పరిశ్రమల్లోని కార్మికులు రోజుకు 10 నుండి 12 గంటల వరకు పని చేయవలసి వచ్చేది. చట్ట పరిధిలోనికి రాని అనేక ఇతర పరిశ్రమలలోని కార్మికులు వారానికి 56 నుండి 72 గంటల వరకు పని చేయవలసి వుండేది.

యుద్ధ సమయంలో ప్రారంభించబడిన అనేక చిన్న పరిశ్రమలలోని కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా వుండేది. చివరకు అనేక పరిశ్రమల నిర్వహణను మిలటరీకి అప్పగించారు. అనేక జనపనార మిల్లుల్లో బాల కార్మికులను వినియోగించే దుస్థితి కూడా దాపురించింది. గనులలో పనిచేయడానికి స్త్రీ కార్మికులను నియమించడానికి సంబందించి వున్న ఆంక్షలను కూడా ఎత్తివేయడం జరిగింది.

ఈ విధంగా పని వత్తిడి పెంచి, కార్మికుల భద్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, పరిశ్రమలలో అమలుల్లోవున్న అనేక నిబంధనలను సడలించడం లేక పూర్తిగా ఎత్తివేయడం ద్వారా, యజమానులు పరిశ్రమల్లోని కార్మికులకు ప్రమాదాలకు గురిచేశారు. 1939 నుండి పరిశ్రమల్లో ప్రమాదాల రేటు తీవ్రంగా పెరిగినట్లు స్పష్టమవుతుంది. 1939 సం॥లో 36,006గా వున్న పారిశ్రామిక ప్రమాదాలు, 1945 నాటికి 70,123కు చేరుకున్నాయి. ఫ్యాక్టరీ చట్టం పరిధిలోకి వచ్చే పరిశ్రమలలో జరిగిన ప్రమాదాలను మాత్రమే ఈ అంచనా వేయడంలో పరిగణనలోనికి తీసుకొనడం జరిగింది. ఇంకా అధిక సంఖ్యలో ప్రమాదాలు సంభవించాయనేది స్పష్టమైన విషయం. అధికార నివేదికే పరిశ్రమల్లో అత్యధికంగా పెరుగుతున్న ప్రమాదాల రేటును గురించి అంగీకరిస్తూ "ప్రమాదాల రేటులో పెరుగుదల ప్రత్యేకంగా 1939 నుండి మాత్రమే కనపడుతోంది. 1939వ సం॥లో ప్రతి వెయ్యిమంది కార్మికుల్లో 20.56 మంది ప్రమాదాలకు గురవుతుండగా, 1944 నాటికిది 26.69కు చేరుకుంది. ఈ పెరుగుదల ముఖ్యంగా యుద్ధావసరాలను ఉత్పత్తిచేసే పరిశ్రమలలో కార్యకలాపాలను ముమ్మరం చేయడం వలన సంభవించినదే. ఫ్యాక్టరీలలో చాలినంత స్థలం లేకపోవడం, అనుభవం లేని కొత్త కార్మికులను నియమించడం, పని గంటలు పెంచడం ఇందుకు ప్రధాన కారణాలు. కొన్ని ప్రావిన్స్‌లలో యంత్ర పరికరాలను భద్రం చేయడానికవసరమైన సామాగ్రి కొరత వలన అనేక కష్టాల నెదుర్కొనవలసి వచ్చింది" అని పేర్కొంది.

యంత్రాల వేగాన్ని పెంచడం, పనిగంటలు పెంచడం, కార్మికుల భద్రతను నిర్లక్ష్యం చేయడమేగాక, భారత ప్రభుత్వం కార్మికులపై యుద్ధ సమయాల్లో విధించే అనేక ఎమర్జెన్సీ నిర్బంధాలను విధించింది.

1940 జూన్ నెలలో గవర్నర్ జనరల్ జారీ చేసిన నేషనల్ సర్వీస్ (సాంకేతిక సిబ్బంది) ఆర్డినెన్స్‌కు 1940, 41, 42, 43, 44 సం॥లలో అనేక మార్పులు, చేర్పులు చేయడం ద్వారా దాని పరిధిని క్రమ క్రమంగా విస్తృతం చేయడం జరిగింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా మొదట 18 సం॥ల నుండి 50 సం॥లు మధ్య వయస్సు కల్గినవారు, తరువాత 17 నుండి 50 సం॥ల మధ్య వయస్సుగల నైపుణ్యంగల కార్మికులనైనా, నైపుణ్యంలేని కార్మికులనైనా "జాతీయ సర్వీసుల" పేరిట అనేక సంస్థలలో నిర్బంధంగా నియామకం చేసే నిరంకుశాధికారాలనీ ఆర్డినెన్స్ ప్రభుత్వానికి ధారాదత్తం చేసింది. యుద్ధానికి పనికివచ్చే

వస్తువులను తయారుచేసే ఏ ఫ్యాక్టరీనైనా జాతీయ ప్రాముఖ్యత గల్గిన పరిశ్రమగా ప్రకటించే అధికారం ప్రభుత్వానికి సంక్రమించింది. ఈ ఆర్డినెన్స్‌ను అమలు చేయడానికి సివిల్ కోర్టుకుండే అధికారాలతో ఒక నేషనల్ సర్వీస్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయబడింది. ఆర్డినెన్సును ధిక్కరించినవారు గరిష్టంగా 6 నెలల వరకు జైలు శిక్ష మరియు రు. 1000/–ల వరకు జరిమానాతో శిక్షించబడతారు.

దీనితోబాటు కార్మికులను, ఉద్యోగులను తీవ్రంగా కలవరపరచిన అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సు (1941) మోటారు వాహనాల డ్రైవర్ల ఆర్డినెన్సు (1942) ది రైల్వే ఎంప్లాయిమెంట్ మిలిటరీ పర్సనల్ ఆర్డినెన్స్ (1942)లను కూడా ప్రభుత్వం జారీచేసింది. ఈ ఆర్డినెన్సులతో బాటు డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్సు (భారత రక్షణ నిబంధనల)లోని 78 ఎ క్లాజు ప్రకారం "రక్షణ, పునరావాసాల" కొరకు నిర్ణయించబడిన మండలాలలో, నిర్ణయించబడిన వేతనానికి ఏ పురుషుడినైన నియమించే అధికారాలతో, ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది.

పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకుని, అత్యధిక ఉత్పత్తిని సాధించడం కోసం యుద్ధసమయంలో యుద్ధావసరవస్తువుల వుత్పత్తికి ఉపకరించే ఇనుము, ఉక్కు, బొగ్గు, సిమెంటు, కాగితం తదితర పరిశ్రమలను ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకున్నది. ఈ పారిశ్రామిక ఉత్పత్తుల ధరలపై ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని ఖచ్చితమైన నిబంధనలను విధించింది.

కాని ఉత్పత్తులు, వాటి ధరలను నియంత్రించిన ప్రభుత్వం కార్మికుల జీతభత్యాలు, సర్వీసు కండీషన్లను మెరుగుపరచడానికి అవసరమైన కార్మిక విధానాన్ని ప్రకటించడానికి మాత్రం శ్రద్ధ వహించలేదు. ఈ పరిస్థితులలో కార్మికులు కుట్రబుద్ధి గల్గిన పెట్టుబడిదారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసివచ్చింది. ప్రభుత్వం తమ లాభాలపై ఆంక్షలు విధించిందనే సాకుతో యీ పెట్టుబడిదారులు కార్మికుల న్యాయమైన కోర్కెలను తిరస్కరించసాగారు.

ఇంతేగాక ఈ అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సులోని మిక్కిలి నిరంకుశమైన అంశాల వలన కార్మికులు తమ ఇష్ట ప్రకారం పని వదలివేసి వేరే పని చూసుకునే స్వాతంత్ర్యం కూడా కోల్పోయారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం పనిని వదలి వేయడంగాని, గైరు హాజరు కావడం గాని శిక్షింప దగిన నేరాలుగా పరిగణించబడతాయి. ఏ సంస్థలోనైనా కార్మికులు సాగిస్తున్న సమ్మె చట్ట విరుద్ధమని యజమానులు ప్రకటించినట్లయితే, ఆ ప్రకటనను చట్టసమ్మతంగా భావించి సమ్మెచేస్తున్న కార్మికులకు జరిమానా, జైలు శిక్షలు విధించేందుకీ ఆర్డినెన్సు అవకాశం కల్పిస్తున్నది. 1945 నాటికి, యీ ఆర్డినెన్సు క్రింద 3వేలమంది కార్మికులు అక్రమ శిక్షలపాలయ్యారు.

కార్మికుల అతి విలువైన సమ్మె హక్కుపై తీవ్రమైన దాడులు సాగాయి. పారిశ్రామిక వివాదాల చట్టం (1929), మరియు బొంబాయి పారిశ్రామిక వివాదాల చట్టం (1939)

మధ్యవర్తి జోక్యం, నిర్బంధం చేయడాని కుద్దేశించబడినప్పటికీ, ప్రభుత్వం భారత రక్షణ నిబంధనల (డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్) లోని 81ఎ క్లాజును ప్రయోగించి, మధ్యవర్తి జోక్యాన్ని పూర్తిగా నిర్బంధం చేసింది. నానాటికి పెరుగుతున్న పెట్టుబడిదారుల దాడులనెదుర్కొన కుండా కార్మికుల ప్రతిఘటనాశక్తిని నిర్వీర్యం చేసేందుకీ నిబంధనలుద్దేశించబడ్డాయి.

యుద్ధానికి ముందుకాలంలోనే నికృష్టంగా వున్న కార్మికవర్గ ఆర్థిక పరిస్థితి యుద్ధం వల్ల మరింత దిగజారింది. బొగ్గు గనులు, టీ తోటలలో పనిచేస్తున్న కార్మికుల స్థితి మరీ దయానీయంగా వుంది. 1929–1936 మధ్యకాలంలో 3 లక్షల మంది బొగ్గు గని కార్మికుల వేతనాలు క్రమక్రమంగా పడిపోయాయి. 1936 సం॥ తరువాత మాత్రమే కార్మికుల జీతాల రేట్లు పెరగడం ప్రారంభమైంది. అయినప్పటికీ 1942 సం॥లో సగటు వేతనం 1929 నాటి వేతనంకంటే దిగువస్థాయిలోనే వుంది. గని కార్మికుల రోజువారీకూలి కేవలం, 8 అణాల మధ్యలో నుండి 12 అణాల వుంటూవచ్చింది.

అదే విధంగా టీ తోటలో పనిచేస్తున్న కార్మికులు బానిసల వలె పనిచేసి, జీవితాలు గడపవలసిన దుస్థితిలోకి త్రోసివేయబడ్డారు. 1945–46 సం॥లో వారి వేతనాలు, 1929–30 సం॥నాటి వేతనాలకంటే కూడా చాలా తక్కువగా వున్నాయి. 1929–30 సం॥లో వీరి జీతాలు మూడు నుండి ఎనిమిది అణాల వరకు వుండేది. అంటే మనిషి బ్రతకడానికి కూడా చాలనంతటి నికృష్ట జీతాలతో వారు పనిచేస్తూ వుండేవారు. ఇంత దయనీయంగా వున్న యీ కార్మికుల పరిస్థితి యుద్ధం వలన మరింత దిగజారింది.

యుద్ధకాలంలో కార్మికులు సంఘటితంగా వున్న పరిశ్రమల్లోని కార్మికుల వేతనాలలో పెరుగుదల వున్నప్పటికీ, ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వారి నిజవేతనాలు పడిపోయాయి. యుద్ధ సమయంలో వ్యాపారస్తులు విచ్చలవిడిగా సాగించిన బ్లాక్ మార్కెటింగ్, నిత్యావసర వస్తువుల అక్రమనిల్వల వలన ఏర్పడిన ద్రవ్యోల్బణం కారణంగా ధరలు విపరీతంగా పెరిగి, కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయి. నూలు బట్టల పరిశ్రమలో కార్మికుల సగటు వేతనం 1939లో రూ.320 లుండగా, 1946 నాటికి రూ. 721.80 లకు పెరిగింది. అంటే ఈ కాలంలో కార్మికుల సగటు వేతనాలలో 124.4 శాతం పెరుగుదల వున్నదన్నమాట. కాని యీ వేతనాలలో పెరుగుదల కంటే ధరల సూచి మరింత అధికంగా పెరిగిందనే విషయాన్ని గమనించాలి. 1939 సం॥రాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే, 1946 సంవత్సరానికి పారిశ్రామిక కేంద్రాలయిన బొంబాయి, అహమ్మదాబాదు, షోలాపూర్‌లలో ధరల సూచి వరుసగా 246, 286, 290 పాయింట్లకు చేరుకున్నది. అంటే ఈ సమయంలో (1939–46) కార్మికుల నిజవేతనాలు పడిపోయాయని స్పష్టమవుతుంది.

మద్రాసులోని జౌళి కార్మికులు ఈ కాలంలో తమ వేతనాలలో అత్యధిక పెరుగుదలను సాధించినప్పటికీ, ప్రారంభంలో వారి వేతనాలు చాల తక్కువగా వుండడంతో జీతాల విషయంలో ఇతర పారిశ్రామిక కేంద్రాలలోని కార్మికుల వేతనాలకంటే ఇంకను చాల వెనుకబడే వున్నారు.

బెంగాల్‌లోని జూట్, ప్రత్తి పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల సగటు వేతనం 1939లో సంవత్సరానికి 253 రు. లుండగా, 1946 నాటికి వీరి సగటు జీతం 88 శాతం పెరిగి, 438 రు॥ లకు చేరుకున్నది. బెంగాల్‌లోని జూట్ కార్మికుల జీతాలు మొదటి నుండి అతి నికృష్టంగా వున్నాయి. 1939 – 1946 మధ్యకాలంలో బెంగాల్‌లో ఆహారము తదితర నిత్యావసర వస్తువుల ధరలు మూడురెట్లు పెరగగా, ఈ యుద్ధ కాలంలో వీరి జీతాలలో పెరుగుదల మాత్రం నామ మాత్రంగానే వున్నది.

ఇదే కాలంలో ఇంజనీరింగ్ పరిశ్రమ, రైల్వే వర్కుషాపు, ఓడరేవులు తదితర పారిశ్రామిక కార్మికుల వేతనాలు మాత్రం సుమారు 164 శాతం పెరిగాయి. జంషెడ్‌పూర్‌లోని ఉక్కు పరిశ్రమలోని కార్మికుల కనీస వేతనం 20 రూ॥ల కంటే తక్కువగా వున్నది. 1939 సం॥నాటి వేతనాలతో పోల్చి చూచినట్లయితే 1946 నాటికి బోనసుతో సహా వీరి జీతాలు సుమారు 66 శాతం పెరిగాయి. భారతదేశంలోని కార్మికుల జీతాల పరిస్థితి ఎంత అరాచకంగా వున్నదో గమనించడానికికొక ఉదాహరణ చాలును. ఇనుము – ఉక్కు పరిశ్రమలోని కార్మికుల జీతాలు జౌళి పరిశ్రమలోని కార్మికుల జీతాలకంటే కనీసం 15 శాతం తక్కువగా వున్నాయన్న విషయం భారతదేశంలోని కార్మికుల జీతాల పరిస్థితి ఎంత అరాచకంగా వున్నదో వెల్లడిస్తోంది.

యుద్ధ కాలంలో (1939–45) భారతదేశంలోని 9 లక్షల మంది రైల్వే పనివారిలో 80 శాతం మంది క్రింది గ్రేడ్లలోనివారే. ప్రపంచ ఆర్థిక సంక్షోభకాలంలో వీరి జీతాలలో కోత విధించబడింది. 1944 సం॥లో వీరి కనీస వేతనం 10 రూ॥ల నుండి 12 రూ॥ల వరకు, గరిష్ట వేతనం 16 నుండి 34 రూ॥ల వరకు వున్నది. 1939 సం॥లో రైల్వే కార్మికుని సగటు సంవత్సర జీతం కేవలం రూ. 541లుగా వుంది. 1946 సం॥ వరకు వీరి జీతాలలో పెరుగుదల జౌళి పరిశ్రమలోని, లోహ పరిశ్రమలలోని కార్మికుల జీతాలలో పెరుగుదల కంటే తక్కువగా వున్నది.

ఇదంతా పరిశీలిస్తే ఒక విషయం బోధపడుతుంది. యుద్ధసమయంలో కార్మికుల జీతాలు మొత్తం మీద పెరిగినప్పటికీ, ధరలు విపరీతంగా పెరగడం, ద్రవ్యోల్బణ పరిస్థితి ఏర్పడడంతో, కార్మికుల జీతాలు పెరగడం వలన ప్రయోజనం లేకపోగా కార్మికుల నిజవేతనాలు పడిపోయాయి.

కాని ఒకప్రక్క కార్మికుల నిజవేతనాలు పడిపోతుండగా, ఇందుకు భిన్నంగా వేరొక ప్రక్క యుద్ధ పరిస్థితి నాసరాగా తీసుకుని జూట్, జౌళి, కాగితం, ఉక్కు, బొగ్గు, సిమెంటు తదితర కీలక పరిశ్రమలలోని స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు అత్యధిక లాభాలు దండుకున్నారు.

యుద్ధకాలంలో కార్మికుల ఆదాయాలు, పెట్టుబడిదారులు ఆర్జించిన లాభాలు ఏ విధంగా వున్నాయో యీ క్రింది పట్టికను పరిశీలిస్తే బోధపడుతుంది.

**1940-45 మధ్యకాలంలో లాభాల సూచిక (1939క్ష100)**

| సం॥ | అన్ని పరి[శమలు | జూట్ | ప్రత్తి | కాగితం | ఇనుము ఉక్కు | బొగ్గు | సిమెంటు |
|---|---|---|---|---|---|---|---|
| 1940 | 138.0 | 359.1 | 142.5 | 263.3 | 103.8 | 100.8 | 102.8 |
| 1941 | 187.0 | 344.4 | 316.6 | 284.7 | 133.7 | 82.6 | 128.8 |
| 1942 | 221.8 | 351.1 | 491.3 | 321.7 | 110.1 | 80.5 | 169.1 |
| 1943 | 245.0 | 276.3 | 640.0 | 352.8 | 111.8 | 95.6 | 147.9 |
| 1944 | 238.9 | 310.6 | 492.1 | 271.5 | 117.8 | 237.0 | 214.4 |
| 1945 | 233.6 | 327.6 | 423.3 | 279.5 | 120.2 | 258.2 | 216.6 |

యుద్ధ సమయంలో పెట్టుబడిదారుల లాభాలు రెట్టింపు కొన్ని సందర్భాలలో మూడు రెట్లు కూడ పెరిగినట్లు పై పట్టిక ద్వారా గమనించవచ్చును.

**1939-45 మధ్యకాలంలో కార్మికుల నిజ ఆదాయాల సూచిక**

| సం॥ము | ఆదాయాల సూచిక ధరల సూచిక | ఆలిండియా వినిమయదారుల సూచి | నిజ ఆదాయాల |
|---|---|---|---|
| 1939 | 100 | 100 | 100 |
| 1940 | 105.3 | 97 | 108.6 |
| 1941 | 111.0 | 107 | 103.7 |
| 1942 | 129.1 | 145 | 89.0 |

| | | | |
|---|---|---|---|
| 1943 | 179.6 | 268 | 37.0 |
| 1944 | 202.1 | 269 | 75.1 |
| 1945 | 210.5 | 269 | 74.9 |

..................................................................................................

పై పట్టికను పరిశీలించనట్లయితే 1942 సం॥ నుండి కార్మికుల నిజ ఆదాయాలు తీవ్రంగా పడిపోయినట్లు స్పష్టమవుతుంది.

పారిశ్రామిక కార్మికుల నిజవేతనాలు పడిపోవడంతోబాటు, భూ వసతిలేని వ్యవసాయ కార్మికుల వేతనాలీ యుద్ధ కాలంలో అతి నికృష్టంగా వున్నాయి. ఈ పరిస్థితిని చూస్తుంటే భారతదేశాన్ని వినాశకరమైన ప్రపంచ యుద్ధంలోకి లాగి, శ్రమజీవుల యెడల బ్రిటిషు సామ్రాజ్యవాదులు ఎంత అమానుషంగా ప్రవర్తించింది బోధపడుతుంది. ఈ విధంగా యుద్ధం వలన ఏర్పడిన దుష్ఫలితాలను భారత శ్రామిక ప్రజానీకం భరించవలసి వచ్చింది. అధిక ధరలు, నిత్యావసరవస్తువుల కొరత, నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వ, బ్లాక్ మార్కెటింగ్‌ల వలన ప్రజా జీవితం నరకప్రాయమైంది. ఈ యుద్ధ సమయంలోనే బెంగాల్‌లో సంభవించిన కరువుకు కనీసం 20 లక్షలమంది ప్రజలు బలి కావడం ఒకప్రక్కన జరుగుతుండగా, వేరొక ప్రక్కన భారతదేశంలోని స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులు అశేష లాభాలు గడించారు. మొత్తం మీద బ్రిటిషు సామ్రాజ్యవాదుల పైశాచికపాలన భారతదేశాని కొరగబెట్టినదిదే.

## కరువు భత్యం

ఇప్పటివరకు మనం చర్చిస్తూ వచ్చిన యుద్ధకాలం నాటి జీతాల పెరుగుదలలో మూల వేతనం, కరువుభత్యం, బోనసు అన్ని ఇమిడివున్నాయి. భారత కార్మికుని మూలవేతనం గతంలోగాని, ఈనాడుగాని కార్మికుని అవసరాలపై ఆధారపడి గాని లేదా ఒక శాస్త్రీయ విధానం మీద ఆధారపడి నిర్ణయించబడినది కాదు. యజమానులు తమ లాభాలను విపరీతంగా పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. కార్మికులు దిగజారిపోతున్న తమ జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి, యజమానుల దౌష్ట్యానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటం సాగిస్తూ కొన్ని సదుపాయాలు, రాయితీలు సంపాదించుకుంటూ వుంటారు. ఇండియాలో కార్మికుని మూలవేతనం కూడ కేవలం ఈ యజమానుల లాభాపేక్ష, తమ జీవన పరిస్థితులను మెరుగుపరుచుకొనడానికి కార్మికుల పోరాటం యీ రెండింటికి మధ్య తాత్కాలిక ఒప్పందం మాత్రమే. అందువలన యీ "మూలవేతనం" ఆయా పరిశ్రమల్లోని యజమానులకు వ్యతిరేకంగా కార్మికులు సాగించిన ప్రతిఘటన తీవ్రతపై ఆధారపడియున్నది. యజమానుల విధానాలను తీవ్రంగా ప్రతిఘటించి, పోరాటాలు సాగించి, వారు సాధించే విజయాలపైననే గతంలోవలెనే

ఈనాడు కూడ "మూలవేతనం" ఆధారపడియున్నది. దీనిని పరిశీలిస్తే బొంబాయి జౌళి పరిశ్రమలోని కార్మికుల జీతాల కంటే భారతదేశంలోని ఉక్కు పరిశ్రమలో జీతాలు తక్కువగా వుండడానికి కారణం అవగతమవుతుంది. (అంటే జౌళి పరిశ్రమలో కార్మికులు యజమానుల విధానాలకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటాలు సలిపి తమ జీవన పరిస్థితులను కొంత మేరకు మెరుగుపరచు కోగలిగారన్న మాట) జీతాలు పెంచడంలో యజమానులు ఈ రకమైన విధానాలనుసరించడం వలన వేతన వ్యవస్థలో అస్తవ్యస్త పరిస్థితులేర్పడి వివిధ పరిశ్రమలలోని కార్మికుల వేతనాల మధ్య తీవ్ర తారతమ్యాలేర్పడ్డాయి.

రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభానికి ముందు కార్మికుల మూలవేతనాన్ని పెంచుతుండేవారు. కాని 1939 సెప్టెంబరులో ప్రపంచ యుద్ధం చెలరేగిన తరువాత గతంలో భారతదేశంలోనూ, ఇంకను యూరపు దేశాలలోనూ అమలులోవున్న ఈ పద్ధతికి బదులు, భారతదేశంలో వినిమయ ధరల సూచి పెరుగుదలవలన పడిపోయిన నిజవేతనాల విలువను భర్తీ చేయడానికి "కరువు భత్యాన్ని" సృష్టించి, దీనిని మూలవేతనానికి కలపడం ప్రారంభించారు.

యుద్ధసమయంలో జీతాల పెరుగుదల కొరకు భారత కార్మికవర్గం విస్తృతంగా పోరాటాలు సాగించింది. ఆకాశాన్నంటుతున్న ధరలను భర్తీ చేయడానికి కార్మికుల వేతనాలను పెంచాలని ఎ.ఐ.టి.యు.సి., దాని ప్రావిన్షియల్ శాఖలు డిమాండు చేశాయి. ఇదే విధంగా ప్రభుత్వ సంస్థలు, రైల్వేలు, ఓడ రేవులు, ఓడల మరమ్మతులు చేసే డాక్‌లు, మునిసిపాలిటీలు తదితర సంస్థలలోని కార్మికులు, ఉద్యోగుల యూనియన్లు కూడ జీతాలను పెంచాలని డిమాండు చేశాయి. ధరల పెరుగుదలను భర్తీ చేయడానికి కార్మికుల జీతాలను పెంచాలని కోరుతూ పోరాటం సాగించడానికి బొంబాయిలో అనేకమంది కార్మికనాయకులతో ఎఐటియుసి ఒక కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసింది.

కరువు భత్యం కావాలని కోరుతూ భారత కార్మికవర్గం సాగించిన మొట్టమొదటి సమ్మె బొంబాయిలో జరిగింది. లక్షా 75వేల మంది బొంబాయి జౌళి కార్మికులు కరువు భత్యం కోరుతూ 1940 మార్చి 5వ తేదీన సమ్మె చేశారు. యుద్ధ సమయంలో ఏర్పడిన ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో జీతాల పెంపుదల డిమాండు సర్వవ్యాప్తమయింది. కార్మికవర్గ ఉద్యమాల ఒత్తిడి వలన యజమానులు యిచ్చిన యీ కరువు భత్యం కూడ ఒకే విధంగా లేదు. ఈ కరువు భత్యం రేటు సెంటరు సెంటరుకే గాక పరిశ్రమ పరిశ్రమకు ఫ్యాక్టరీ ఫ్యాక్టరీకి వేరు వేరుగా వుంది. కొన్ని సందర్భాలలో అధికారుల మధ్యవర్తిత్వం ద్వారా కూడా కార్మికులు కరువుభత్యం సాధించుకోగలిగారు.

ధరల సూచికను బట్టి కరువుభత్యం రేటు నిర్ణయించడంలేదు. వినిమయను కరువుభత్యాన్ని ధరల సూచితో అనుసంధానం చేసిన ఒకటి రెండు సందర్భాలలో కూడ

ధరలలో పెరుగుదల, డి.ఎ.ద్వారా పూర్తిగా భర్తీచేయబడలేదు. అందువలన కార్మికుల వేతనాలు ఏనాడు ధరలకనుగుణంగాలేవు. బొంబాయిలోని జౌళి కార్మికులు ఇతర పరిశ్రమల్లోని కార్మికులతో పోల్చుకుంటే, అధికమైన కరువు భత్యం రేటును సాధించుకోగలిగారు. 1944 సం॥లో కరువు భత్యం రూపంలో అత్యధిక మొత్తాలు సాధించుకోగలిగారు. బొంబాయిలో జీవన వ్యయ సూచి 250 పాయింట్లకు చేరినప్పటికి ఈ జౌళి పరిశ్రమలోని కార్మికులకు ఈ పెరుగుదలలో 66.67 శాతం మాత్రమే డి.ఎ. ద్వారా భర్తీ చేయడం జరిగింది.

ధరల పెరుగుదలవలన నిజవేతనాలు పడిపోవడం, ఈ ధరల పెరుగుదలను వేతనాలు పెంచడం ద్వారా భర్తీ చేయబడకపోవడంతో కార్మికుల జీవన ప్రమాణాలు దిగజారిపోయాయి. వారి కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోయింది. యుద్ధ సమయంలో ఏర్పడిన ఈ కష్టనష్టాలనిక ఏమాత్రం సహించలేని కార్మికులు ఆర్థికపరంగాను, ఇతర విధానాలుగా కూడా రాయితీలను సాధించుకొనడానికి తీవ్రమైన వర్గ పోరాటాలను సాగించారు.

## కార్మికవర్గ పోరాటాలు

యుద్ధం చెలరేగడంలో ధరలు విపరీతంగా పెరిగి, నిత్యావసరవస్తువుల కొరత సృష్టించబడడంతో కార్మికవర్గం తన జీవన ప్రమాణాలను నిలబెట్టుకొనడానికి పోరాటాలు సాగించబడవలసివచ్చింది. అందువలన కార్మికవర్గం బొంబాయి, కాన్పూరు, కలకత్తా, బెంగుళూరు, జంషెడ్‌పూర్, ధన్‌బాద్, ఝురియా, నాగపూరు, మద్రాసు, అస్సాంలోని డిగ్బోయ్‌లోను అంటే ఒక మాటలో చెప్పాలంటే దేశవ్యాప్తంగా అనేక సమ్మె పోరాటాలు సాగించింది.

ఈ క్రింది పట్టికను పరిశీలిస్తే 1939 నుండి వెల్లువలా సాగిన కార్మికుల సమ్మె పోరాటాల తీవ్రత స్పష్టమవుతుంది.

## 1939-45 లలో పారిశ్రామిక వివాదాలు

| సం॥ | సమ్మెలు, లాకౌట్ల సంఖ్య | కార్మికుల సంఖ్య | నష్టపోయిన పనిదినాల సంఖ్య |
|---|---|---|---|
| 1939 | 406 | 409,189 | 49,92,795 |
| 1940 | 322 | 452,539 | 7577281 |

| | | | |
|---|---|---|---|
| 1941 | 359 | 291,054 | 3330503 |
| 1942 | 694 | 772,653 | 5779965 |
| 1943 | 716 | 525,088 | 2342287 |
| 1944 | 658 | 550,015 | 3477306 |
| 1945 | 848 | 782,196 | 3340892 |

..................................................................................................

పై పట్టికను పరిశీలిస్తే 1940, 41 సంవత్సరాల్లో సమ్మెల సంఖ్య తక్కువగా వున్నట్లు, కన్పిస్తుంది. అయితే 1940లో సమ్మెల సంఖ్య తక్కువైనప్పటికీ నష్టపడిన పనిదినాల సంఖ్య మాత్రం అత్యధికంగా వున్నట్లు స్పష్టమవుతుంది. 1939 అక్టోబర్ 2వ తేదీన యుద్ధానికి వ్యతిరేకంగా బొంబాయిలోని 90 వేల మంది కార్మికులు సాగించిన సమ్మె, యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి సాగిన కార్మికవర్గ కార్యాచరణల్లో అత్యంత ప్రధానమైనది. బొంబాయి కార్మికులు సాగించిన యీ సమ్మె ప్రపంచ కార్మికోద్యమంలోనే యుద్ధానికి వ్యతిరేకంగా సాగిన మొట్టమొదటగా కార్మిక వర్గ కార్యాచరణగా ప్రఖ్యాతి గాంచింది.

భారత కార్మికవర్గం కేవలం తమ ఆర్థికపరమైన కోర్కెలకే పరిమితం కాక తమ అంతర్జాతీయ కర్తవ్యాలను నిర్వర్తించిందనడానికి ఈ కాలంలో బొంబాయి కార్మికులు యుద్ధానికి వ్యతిరేకంగా సాగించిన సమ్మెతోబాటు, ఇతర పోరాటాలు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలిచాయి. కార్మికవర్గం జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాల కనుగుణంగా పయనిస్తూ రాజకీయ పోరాటాల్లో ప్రముఖ పాత్ర వహించింది.

లక్షా 75 వేల మంది జౌళి కార్మికులు 1940 మార్చి 5వతేదీన బొంబాయిలో ప్రారంభించిన సమ్మె భారత కార్మికవర్గం కరువు భత్యం కొరకు సాగించిన పోరాటానికి ప్రారంభంగా భావించవచ్చు. ఈ సమ్మె సందర్భంగా కరువు భత్యం డిమాండుకు ప్రాముఖ్యత యివ్వడం జరిగింది. దీనికి కొనసాగింపుగా దేశవ్యాప్తంగా సమ్మె పోరాటాలు ప్రారంభమయ్యాయి. జౌళి కార్మికులకు డి.ఎ. చెల్లింపు సమస్యను ప్రభుత్వం మధ్యవర్తి పరిష్కారానికి నివేదించింది. కాని ఈ బోర్డు సిఫార్సులు కార్మికులకు ఆమోదయోగ్యంగా లేవు. దీంతో గిర్నీకాంగార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్) సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమ్మెను నిర్వహించడానికి ఒక కార్యాచరణ కమిటీ కూడా ఏర్పాటు చేయబడింది. మార్చి 5వ తేదీ సమ్మె అన్ని మిల్లులకు వ్యాపించడంతో ప్రభుత్వం సమావేశాలు, ప్రదర్శనలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసి, డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ (భారత తక్షణ నిబంధనలు) క్రింద శ్రీ ఎస్.ఎ. డాంగే, బి.టి. రణదివేలను అరెస్టు చేసింది. పోలీసులు విచ్చలవిడిగా అణచివేత చర్యలకు పూనుకుని, కార్మికుల మీద

కాల్పులు, లాఠీచార్జికి పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో గిర్నీకాంగార్ యూనియన్, ఈ కార్మికవర్గ పోరాటాలకు మద్దతు ఇచ్చి సహకరించ వలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సమ్మె సాగిస్తున్న కార్మికుల సహాయార్థం ఒక రిలీఫ్ కమిటీ ఏర్పాటు చేసి, ప్రజల నుండి విరాళాలు సేకరించారు. మధ్యవర్తులు యిచ్చిన అవార్డును కార్మికులు అంగీకరించలేదనే సాకుతో బొంబాయి (ప్రావిన్షియల్) ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ యీ కార్మిక వర్గ పోరాటానికి మద్దతునివ్వడానికి నిరాకరించింది. కాని జౌళి కార్మికుల సమ్మెకు మద్దతుగా బొంబాయిలో సార్వత్రిక సమ్మెకు ఎ.ఐ.టి.యు.సి ఇచ్చిన పిలుపుమేరకు మార్చి 10వ తేదీన జరిగిన సార్వత్రిక సమ్మెలో మూడు లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. ఏమైనప్పటికీ డి.ఎ. చెల్లింపు విషయంలో యజమానుల మొండి వైఖరిని ప్రభుత్వం కూడా సమర్థించి వారితో అన్ని విధాల సహకరించిన పరిస్థితులలో ఏప్రిల్ 13వ తేదీన సమ్మె విరమించవలసి వచ్చింది. ఇంతకాలంగా ఏ "ఆర్బిట్రేషన్ అవార్డు"కు వ్యతిరేకంగా కార్మికులు వీరోచిత పోరాటం సాగిస్తున్నారో, ఆ "మధ్యవర్తుల బోర్డు" సిఫార్సుల ననుసరించి అతి తక్కువ కరువుభత్యం చెల్లించడానికి యజమానులకు మంచి అవకాశం దొరికింది.

1940 సం॥లో బెంగాలులోని అనేక జూట్ మిల్లుల్లో సమ్మెలు జరిగాయి. ఫలితంగా కార్మికులు 10 శాతం మేరకు జీతాలు పెంచుకోవడంలో విజయవంతమయ్యారు.

అదే సంవత్సరం (1940) మే నెలలో కరువు భత్యాన్ని కోరుతూ 20 వేలమంది కలకత్తా కార్పొరేషన్ కార్మికులు పని స్తంభింపజేశారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించబడతాయని, కక్షసాధింపు చర్యలుండవని, కార్మికవర్గ ప్రతినిధులతో ఒక "విచారణ సంఘం" నియమించబడుతుందని హామీ యివ్వబడడంతో కార్మికులు సమ్మె విరమించారు. కాని యీ ఒప్పందం కుదిరిన తరువాత అధికారులు దీనిని ఉల్లంఘించడమేగాక ఆరుగురు కార్మికులను డిస్మిస్ చేసి మరో 76 మంది కార్మికులను సస్పెండ్ చేసే నీచానికొడిగట్టారు. కరువుభత్యం, యుద్ధ భత్యం తదితర కోర్కెల సాధనకు బెంగాలులోని జూట్ కార్మికులు 1940 నుండి 1943 వరకు సమ్మెలు సాగిస్తూనే వున్నారు. తమ జీతాల నుండి "యుద్ధనిధి"కి విరాళాల నిమిత్తం నిర్బంధంగా మినహాయించడానికి వ్యతిరేకంగా కూడా పోరాడారు. 1941 మే నెలలో బారానగర్ జూట్ మిల్లులో 9 వేల మంది కార్మికులు సాగించిన సమ్మె, జూలై నెలలో ఆంగ్లో ఇండియన్ జూట్ మిల్లులో 12 వేల మంది కార్మికుల సమ్మె పోరాటం, 1942 సం॥లో హేస్టింగ్స్ జూట్ మిల్లులలో 4500 మంది కార్మికులు సాగించిన సమ్మె, ఇదే సమయంలో ఆంద్రూయూక్ జూట్ మిల్లులో 15 వేల మంది కార్మికులు సాగించిన సమ్మె, లారెన్స్, హుకుంచంద్ మరి రెండు ఇతర మిల్లులలోని 20 వేల మంది కార్మికులు సాగించిన సమ్మె పోరాటాలు, జూట్ కార్మికులు సాగించిన సమ్మె పోరాటాలన్నింటిలోనూ ముఖ్యమైనవి.

యుద్ధభత్యం రూపంలో 25% వేతన పెంపుదల ఇవ్వాలన్న ప్రధాన డిమాండు సాధనకీ సమ్మె పోరాటాలు సాగాయి.

1939-40 సం॥లలో జరిగిన సమ్మె లన్నింటిలోనూ ఢాకా జిల్లా నారాయణ్‌గంజ్‌లోని నూలు మిల్లులో సాగిన సమ్మె పోరాటాలు ప్రధానమైనవి. 1941లో 2 వేలమంది చెప్పుల తయారీ పరిశ్రమలోని కార్మికులు, అదే ఏడాదిలో బోనసు డిమాండుతో భారతీయ ఎలక్ట్రిక్ స్టీల్ వర్క్స్‌కు చెందిన 1600 మంది కార్మికులు సాగించిన సమ్మెలు, జీతాలు 25 శాతం పెంచాలని, డిస్మిస్ చేయబడిన తమ తోటి కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండు చేస్తూ కలకత్తా ట్రాంవేస్‌కు చెందిన 2వేల మంది కార్మికులు 1942లో చేసిన సమ్మె పోరాటం, ఇదే సం॥లో కరువు భత్యం కొరకు 2 వేల మంది పోర్టు (రేవు) కార్మికులు సాగించిన సమ్మె, కరువు భత్యం నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు సప్లయి చేయాలని కోరుతూ 8 వేల మంది కలకత్తా కార్పోరేషన్ కార్మికులు సాగించిన సమ్మె పోరాటం యివన్నీ ప్రత్యేకించి చెప్పుకోదగినవి.

1940లో ఆర్బిట్రేషన్ బోర్డు (మధ్యవర్తుల బోర్డు) సిఫార్సు చేసిన ప్రకారం డి.ఏ. చెల్లించాలని డిమాండు చేస్తూ అహ్మదాబాదులోని మజూర్ మహజన్ మిల్లు యజమానులకు సమ్మె నోటీసు జారీ చేసింది. కాని చివరకు అధికారుల జోక్యంతో ఒప్పందం కుదరడంతో సమ్మె జరగలేదు. "క్విట్ ఇండియా" తీర్మానం తరువాత 1942లో గాంధీజీని బ్రిటిషు ప్రభుత్వం అరెస్టు చేసినపుడు, అందుకు నిరసనగా అహ్మదాబాద్‌లోని కార్మికులు సమ్మెచేశారు. ఈ సమ్మెను మజూర్ మహాజన్ కూడా బలపరిచింది. గాంధీజీకి గట్టి మద్దతుదారులైన మిల్లు యజమానులు కూడా కార్మికులతో సహకరించి మిల్లులు మూసివేశారు. కాని ఆగస్టు ఉద్యమం తగ్గుముఖం పట్టిన తర్వాత యజమానులు మిల్లును తెరవడంతో కార్మికులు పనుల్లో చేరారు. అహ్మదాబాదు కార్మికులు సాగించిన ఈ పోరాటం పూర్తిగా బూర్జువా వర్గం ప్రభావం క్రిందనే జరిగింది.

1941-43 మధ్య కాలంలో నాగపూర్‌లోని ఎంప్రెస్ మిల్స్, మోడల్ మిల్స్‌లోనూ వేతనాలు, కరువు భత్యం పెంచాలని డిమాండు చేస్తూ జరిగిన సమ్మెలలో 8 వేల మంది కార్మికులు పాల్గొన్నారు. బోనసు చెల్లించాలని, డిస్మిస్ చేయబడిన తమ సహచరులను తిరిగి పనిలోనికి తీసుకోవాలని కోరుతూ 1941లో బెంగళూరులోని జౌళి కార్మికులు 75 రోజులు సాగించిన బ్రహ్మాండమైన సమ్మె పోరాటం జయప్రదంగా ముగిసింది. "క్విట్ ఇండియా" ఉద్యమానికి మద్దతుగా బెంగళూరులోని కార్మికులు 1942లో కూడా సమ్మెలు చేశారు.

1942వ సం॥లో మద్రాసులోని కర్నాటిక్ మిల్స్‌లోని కార్మికులు మిల్లులోనే వుండి సిటిన్ సమ్మె చేశారు. ఇండోర్‌లోని ఏడు మిల్లులలో కార్మికులు 13 రోజులు సమ్మె చేశారు.

1939 అక్టోబర్‌లో కాన్పూర్‌లో 30 వేల మంది కార్మికులు సమ్మె చేశారు. 1940లో కరువు భత్యం కోరుతూ కాన్పూరులో కార్మికులు మరో సమ్మె చేశారు.

1939 డిగ్బోయ్‌లోని అస్సాం ఆయిల్ కంపెనీ కార్మికులు సాగించిన మహత్తరమైన సమ్మె పోరాటం ఎనిమిది నెలలపాటు సాగింది. ఈ సమయంలో అస్సాంలో అధికారంలో వున్న కాంగ్రెస్ నాయకత్వంలోని మిశ్రమ మంత్రివర్గం ఈ వివాదం గురించి విచారణ జరపడానికి "కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ"ని నియమించింది. ఈ సమ్మెను బలపరుస్తూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కూడ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1940లో టాటానగర్‌లో కార్మికులు మహత్తరమైన సమ్మె పోరాటం నిర్వహించారు.

1941 నవంబరులో ప్రారంభమైన జి.ఐ.పి (గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్) రైల్వేలోని పరేల్ వర్క్‌షాప్ కార్మికులు ఆరువేలమంది, సాగించిన సమ్మె పోరాటం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. ఈ సమ్మె 1941 నవంబరులో ప్రారంభమైంది. ఆహారధాన్యాలను సరసమైన ధరలకు సరఫరా చేయాలని కోరుతూ 1942 – 43 సంIIలలో ఇదే పరేల్ వర్క్‌షాపులోనూ, బి.బి. అండ్ సి.ఐ. రైల్వేలలోని దిగువ పరేల్ వర్క్‌షాపులోనూ సమ్మెలు జరిగాయి.

ఇవన్నీ కార్మికవర్గం సాగించిన మహత్తర కార్యాచరణలో కొన్ని మాత్రమే. ఈ కాలంలో వీటితోబాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో, వివిధ పరిశ్రమలలో అనేక మహత్తర సమ్మె పోరాటాలు సాగాయి.

## ప్రభుత్వ దాడులు

యుద్ధం చెలరేగడంతో దేశంలోని యావత్ కార్మికవర్గం పోరాట పంథాలో పురోగమిస్తోంది. ఈ పోరాటాలను మొగ్గలోనే తృంచివేయాలనే తలంపుతో సామ్రాజ్యవాద ప్రభుత్వం కార్మికవర్గంపై తీవ్రమైన దాడులకు పూనుకుంది. భారత కార్మికవర్గ ఉద్యమంలో చోదకశక్తిగా వున్న కమ్యూనిస్టులపై ప్రభుత్వం కేంద్రీకరించి దాడులు చేయసాగింది. కమ్యూనిస్టు పార్టీ పత్రిక "నేషనల్ ఫ్రంట్" నిషేధించబడింది. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టులు, యితర ప్రగతిశీల భావాలు గల్గిన వారిని అరెస్టుచేశారు. "విచారణ చేయకుండా జైలులో నుంచబడిన 700 మందిలో, కమ్యూనిస్టులు గాని, కమ్యూనిస్టుల కార్యక్రమానికి గట్టి మద్దతుదారులైన వారు గాని మొత్తం సుమారు 480 మంది వున్నారు" అని 1941 జనవరిలో హోంమెంబర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ప్రకటించాడు. దోషులుగా నిర్ణయించబడిన మొత్తం 6,466 మంది రాజకీయ, ట్రేడ్ యూనియన్ కార్యకర్తలలో 1664 మందిని దేశం నుండి బహిష్కరించడమో, దేశంలోనే వారిపై నిర్బంధం విధించడమో జరిగింది.

బొంబాయిలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలపై కేంద్ర గూఢచారి సంస్థ ఇచ్చిన రిపోర్టును పరిశీలించినట్లయితే కమ్యూనిస్టుల నాయకత్వంలో నానాటికి పెరుగుతున్న కార్మికవర్గ కార్యకలాపాల గురించి సామ్రాజ్యవాద ప్రభుత్వం ఎంతగా కలవరపడుతున్నదీ బోధపడుతుంది. "గిర్ని కామ్‌గార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్) చాలా చురుకుగా పనిచేస్తోంది. జీతంలో 25 శాతం పెంపుదల, కరువుభత్యం పెంపుదల, తదితర డిమాండ్లతో వివిధ మిల్లులకు నోటీసులు జారీ చేయబడుతున్నాయి. అదే సమయంలో సార్వత్రిక సమ్మెకు కార్మికులను ప్రోత్సహించడానికి కమ్యూనిస్టులు సమావేశాలు ఏర్పాటుచేయడంతో, పాటు రహస్యంగా ప్రచారం సాగిస్తున్నారు. పారిశ్రామిక శాంతి నెలకొల్పబడాలంటే యిక ఏమాత్రం ఆలస్యం చేయకుండా గిర్నికామ్‌గార్ యూనియన్‌లోని కమ్యూనిస్టు గ్రూపును వెంటనే అరెస్టు చేయాలని నేను గట్టిగా అభిప్రాయపడుతున్నాను. కమ్యూనిస్టులను ఇక ఏ మాత్రం అభివృద్ధి చెందనిచ్చినా అది తీవ్రమైన తప్పిదం కాగలదని నా ఉద్దేశ్యం. ఎందుకంటే కార్మిక రంగంలో ఒకసారి అశాంతి నెలకొన్నదంటే తిరిగి శాంతియుత పరిస్థితులు నెలకొల్పడానికి చాలకాలం పట్టడమే గాక, ఆ మేరకు యుద్ధ ప్రయత్నాలకు అంతరాయం కలుగుతుంది. పరిస్థితి చాల త్వరితంగా విషమిస్తోంది కనుక ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని నేను సూచిస్తున్నాను. విక్టోరియా, మధుసూదన్, సెంచురీ, దిగ్విజయ్ మిల్లులలో సమ్మెలు రాబోయే కల్లోల పరిస్థితులకు సూచనలు" అని ఈ రిపోర్టులో పేర్కొనబడింది. అందువలననే ప్రభుత్వం కమ్యూనిస్టులపై దాడులకు పూనుకుంది.

ఒక ప్రక్క ప్రభుత్వం కమ్యూనిస్టులపై తీవ్రంగా దాడిచేస్తుండగా, వేరొక ప్రక్క కాంగ్రెసు సోషలిస్టు గ్రూపు నాయకత్వం కూడ కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారంలో నిమగ్నమైంది. అదే సమయంలో అనేకమంది మిలిటెంట్ భావాలు గల్గిన సోషలిస్టు పార్టీ కార్యకర్తలు అప్పటికే నిషేధించబడిన కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

సామ్రాజ్యవాదయుద్ధం ప్రజాయుద్ధంగా మారడంతో, ఫాసిస్టుల దురాక్రమణకు వ్యతిరేకంగా యుద్ధ ప్రయత్నాలలో బ్రిటిషువారితో సహకరించాలనే విధానాన్ని చేపట్టడంతో కమ్యూనిస్టు పార్టీపై సోషలిస్టుల దాడి మరింత తీవ్రతరమైంది. యీ మారిన పరిస్థితుల దృష్ట్యా కమ్యూనిస్టుపార్టీ, కార్మికవర్గంలోని ఇతర పురోగామి శక్తులు పారిశ్రామిక సమ్మెలను సాగించడానికి బదులుగా ఫాసిస్టు దురాక్రమణకు వ్యతిరేకంగా దేశ రక్షణ కర్తవ్యాన్ని స్వీకరించారు. అయినప్పటికీ యిదే సమయంలో పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా అనేక పాక్షిక కోర్కెలపై కమ్యూనిస్టులు అనేక కార్మికవర్గ పోరాటాలు సాగించారు. కాని, జాతీయ బూర్జువావర్గం నుండి కాంగ్రెసు సోషలిస్టుల వరకు అనేక రకాలయిన ప్రభావాలకు లోనయిన కార్మికవర్గం మొత్తంగా అన్ని సందర్భాల్లోనూ "సమ్మె చేయరాదన్న కమ్యూనిస్టుల విధానాన్ని సరిగా అనుసరించలేక పోయింది. ఫలితంగా ఈ కాలంలో కార్మికవర్గంలోని, మధ్యతరగతి ప్రజానీకంలోని గణనీయమైన సెక్షన్లు కమ్యూనిస్టుల నుండి దూరమయ్యారు.

ప్రభుత్వం, జాతీయ బూర్జువావర్గం, సోషలిస్టులు ఎంతగా దుష్ప్రచారం సాగించినప్పటికీ కార్మికవర్గ అగ్రగామి శక్తిగానూ కార్మికవర్గంలో మిక్కిలి సంఘటితమైన సెక్షనుగా కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడంలో విజయం సాధించలేకపోయారు. కమ్యూనిస్టులు వివిధ తరగతుల ప్రజానీకం నుండి దూరమైనట్లు కన్పడడం తాత్కాలికమైన అంశమని. శ్రమజీవులతో కమ్యూనిస్టు పార్టీ అనుబంధం విడదీయరానిదని తర్వాత కాలంలో ఋజువైంది.

## యుద్ధ సమయంలో ఎ.ఐ.టి.యు.సి.

1938 ఏప్రిల్‌లో ట్రేడ్ యూనియన్ ఉద్యమ ఐక్యతను పునఃప్రతిష్ఠించడానికి అవకాశాలు కన్పించాయి. అప్పటి నుండి రెండున్నర సంవత్సరాలపాటు సాగిన పూర్తి స్థాయి కార్మికవర్గం కార్యాచరణ తర్వాత 1940 సెప్టెంబరు నాటికి కార్మికోద్యమ ఐక్యత పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంది.

ఎ.ఐ.టి.యు.సి. 18వ మహాసభ డా॥ సురేష్‌చంద్ర బెనర్జీ అధ్యక్షతన బొంబాయిలో 1940 సెప్టెంబరు 28 నుండి 30వ తేదీ వరకు జరిగింది. దీనికి 159 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 1938 ఏప్రిల్ నెలలో ఎ.ఐ.టి.యు.సి. ఎన్.టి.యు.ఎఫ్. ప్రతినిధుల సంయుక్త సమావేశంలో నిర్ణయించిన షరతుల ప్రకారం యీ రెండు కార్మికవర్గ సంస్థలను విలీనం చేయాలని, మహాసభ సందర్భంగా సమావేశమైన ఎ.ఐ.టియు.సి. జనరల్ కౌన్సిల్ తీర్మానించింది. విలీనం తరువాత ఎన్.టి.యు.ఎఫ్. అనుబంధ సంఘాలు ఆటోమేటిక్‌గా ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ సంఘాలయ్యాయి. ఎన్.టి.యు.ఎఫ్.కు వున్న ఆస్తులు, అప్పులు అన్ని ఎ.ఐ.టి.యు.సి.కి బదలాయింపు చేయబడ్డాయి. ఆ విధంగా పూర్తిగా ట్రేడ్ యూనియన్ల ఐక్యత సాధించబడిన తరువాత 3,74,256 మంది సభ్యులు గల్గిన 195 సంఘాలు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడ్డాయి.

ఈ మహాసభ జరిగే నాటివరకు యుద్ధానికి సంబంధించినంతవరకు ఎఐటియుసికి ఒక స్పష్టమైన విధాన నిర్ణయం లేదు. యుద్ధం యెడల కార్మికవర్గం తీసుకొనవలసిన వైఖరిని గురించి వ్యాఖ్యానిస్తూ మహాసభ అధ్యక్ష స్థానంలోనున్న డా॥ బెనర్జీ జాతీయ కాంగ్రెసుతో కార్మికవర్గం పూర్తిగా సహకరించాలని కోరాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు గాంధీజీ నాయకత్వం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. యుద్ధ సమస్యను గురించి శ్రీ వి.వి.గిరి ఈ మహాసభలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ తీర్మానం యీ క్రింది విధంగా పేర్కొన్నది. "ప్రస్తుతం గ్రేట్ బ్రిటన్‌కు ఫాసిస్టు శక్తులకు మధ్య జరుగుతున్న యుద్ధం, రాజ్య కాంక్షతో గాక స్వాతంత్ర్య, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు మద్దతుగా మాత్రమే జరుగుతున్నదని బ్రిటన్ చెప్పుకుంటోంది. భారతదేశం సామ్రాజ్యవాదానికిగాని, ఫాసిజానికిగాని

ఏమాత్రం సానుభూతి చూపరాదు. కాని యుద్ధ ప్రయత్నాలతో సహకరించే ముందుగానే భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని, ప్రజాతంత్ర ప్రభుత్వ స్థాపన జరగాలని కోరుకోవడం సహజం. భారతదేశానికి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం సాధించిపెట్టలేని ఒక యుద్ధంలో పాల్గొనడం దేశానికి ప్రయోజనకారికాదు. కార్మికవర్గానికి కూడా ఏ మాత్రం ప్రయోజనం లేదు."

యుద్ధం పట్ల జాతీయ కాంగ్రెసు వైఖరినీ తీర్మానం ప్రతిబింబించింది. శ్రీ అఫ్తబ్ అలీ ఈ తీర్మానానికీ క్రింది సవరణను ప్రతిపాదించాడు. విభిన్న అభిప్రాయాలు గల వారికి ప్రాతినిధ్యం వహించే సంస్థ. ఎఐటియుసి యుద్ధంపట్ల ఏ విధమైన వైఖరి నవలంబించాలనేది ప్రాముఖ్యత గల్గిన కీలక సమస్య. అందువలన ట్రేడ్ యూనియన్ కాంగ్రెసులో ఐక్యత, సంఘీభావాలను పరిరక్షించాలంటే సంస్థలోని విభిన్న అభిప్రాయాలు గల్గినవారు తాము కోరుకున్నట్లయితే తమ తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చును." యుద్ధ ప్రయత్నాలకు పూర్తి సహకారం అందించడానికి శ్రీ ఆఫ్తబ్ ఆలీ సుముఖంగా వున్నాడు.

కాని సుదీర్ఘ చర్చ జరిగిన అనంతరం ఈ సవరణ ఉపసంహరించబడి, శ్రీ గిరి ప్రతిపాదించిన తీర్మానం ఆమోదించబడింది. ఈ మహాసభ శ్రీ యు.ఆర్. కాలప్పను అధ్యక్షునిగాను, శ్రీ ఎన్.ఎమ్.జోషిని ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకున్నది.

ఇదిలా వుండగా నాజీ జర్మనీ సోవియట్ యూనియన్‌తో చేసుకున్న నిర్యుద్ధసంధిని అతిక్రమించి సోవియట్ రష్యాపై దురాక్రమణ జరపడంతో యుద్ధ స్వభావమే మారిపోయింది. ఈ మారిన పరిస్థితుల్లో 1941 జూలై 6వ తేదీన నాగపూరులో సమావేశమైన ఎ.ఐ.టి.యు.సి. జనరల్ కౌన్సిల్ యుద్ధ సమస్యను గురించి చర్చించింది. జనరల్ కౌన్సిల్ నాజీ జర్మనీ దురాక్రమణకు వ్యతిరేకంగా సోవియట్ యూనియన్ పట్ల సానుభూతితో వున్నప్పటికీ యీ సందర్భంగా ఎ.ఐ.టి.యు.సి. నిర్వహించవలసిన నిర్మాణాత్మక పాత్రను గురించి ఒక్క ముక్కయినా చెప్పలేదు. ఈ విధంగా సందిగ్ధావస్థలో పడిన ఎ.ఐ.టి.యు.సి. జనరల్ కౌన్సిల్, బొంబాయి సమావేశం ఆమోదించిన తీర్మానాన్ని ఏ విధమైన మార్పులు చేయకుండా ఆమోదించింది.

ఇదిలా వుండగా బొంబాయి సమావేశ తీర్మానంతో విభేదిస్తూ ఎం.ఎన్.రాయ్ ఆయన అనుచరులు కుమారి మణిబెన్‌కారా, వి.బి. కార్నిక్, తదితరులు ఎ.ఐ.టి.యు.సి.తో తెగతెంపులు చేసుకున్నారు. కలకత్తాలోని ఇండియన్ సీమెన్స్ యూనియన్ కూడ యీ విషయంలో విభేదించి ఎఐటియుసితో తెగతెంపులు చేసుకున్నది. ఎం.ఎన్.రాయ్ ఆయన అనుచరులు యుద్ధ విషయంలో బ్రిటిషు ప్రభుత్వానికి పూర్తి సహకారం ప్రకటించారు. వీరు 1941 సం॥ చివరలో లాహోర్‌లో ఫాసిస్టు వ్యతిరేక మహాసభ నేర్పాటుచేసి ఎం.ఎన్.రాయ్ కార్యదర్శిగాను, రైల్వే యాజమాన్యానికి మిక్కిలి నమ్మకస్తుడైన శ్రీ జమ్నాదాస్ మెహతా అధ్యక్షునిగా ఇండియన్ లేబర్ ఫెడరేషన్ అనే నూతన సంస్థ నేర్పాటు చేశారు.

రాయ్, అతని అనుచరులు బ్రిటిషు ప్రభుత్వానికి తైనాతీలుగా తయారై దాని దుష్కృత్యాలను సమర్థించటంలో ప్రముఖపాత్ర వహించారు. బ్రిటిషు ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం సాగించినందుకు గాను బ్రిటిషు ప్రభుత్వం వీరికి నెలకు 13 వేల రూ॥లు గ్రాంటుగా మంజూరు చేసిందనే ఆరోపణ, 1944 ఏప్రిల్ 4వ తేదీన సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ఒక ప్రశ్నకు అధికారులిచ్చిన జవాబు ద్వారా ధృవపరచబడింది. బ్రిటిషు ప్రభుత్వానికి అనుకూలంగా ఇండియన్ లేబర్ ఫెడరేషన్ సాగించిన ప్రచారంతో సంతృప్తి చెందిన అసెంబ్లీలోని కార్మిక ప్రతినిధి (లేబర్ మెంబర్), "ఏ లక్ష్యానికైతే ఈ మొత్తం గ్రాంటు చేయబడినదో ఆ లక్ష్యం సాధించబడింది" అని ఆనందాతిరేకంతో చెప్పాడు. ఫెడరేషన్ జమా–ఖర్చుల నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పిస్తుందని కార్మిక ప్రతినిధి అసెంబ్లీకి హామీ ఇచ్చినప్పటికి, ప్రభుత్వం నుండి పొందిన సొమ్ముకు ఇండియన్ లేబర్ ఫెడరేషన్ లెక్కలు చూపలేదు. ఈ విధంగా నేరుగా ధనసహాయం చేయడమేగాక శ్రీరాయ్ నడిపే దినపత్రిక కాపీలు 1500 ప్రతిరోజు ప్రభుత్వమే కొనుగోలు చేయడం ద్వారా సబ్సిడీ కల్పించడమే గాక ప్రోత్సహించింది. ప్రభుత్వం ఇంతటితో ఆగక ఇండియన్ లేబర్ ఫెడరేషన్‌కు ఎ.ఐ.టి.యు.సి.తో సమానంగా జాతీయ స్థాయిలో కార్మికవర్గ ప్రతినిధిగా గుర్తింపు మంజూరు చేసింది. ప్రభుత్వం చేసిన యీ సహాయానికి బదులుగా ఈ ఫెడరేషన్ ప్రభుత్వ అండదండలు, సహాయ సహకారాలతో అనేక చోట్ల పోటీ యూనియన్లను ప్రారంభించింది.

ఎ.ఐ.టి.యు.సి. 19వ మహాసభ 1942 ఫిబ్రవరి 8,9 తేదీల్లో కాన్పూరులో శ్రీ వి. ఆర్. కాలప్ప అధ్యక్షతన జరిగింది. శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ యీ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరయ్యాడు. ఇదిలా ఉండగా కమ్యూనిస్టులు యుద్ధం పట్ల తమ వైఖరిని మార్చుకున్నారు. అదే సమయంలో యుద్ధం విషయంలో జాతీయ కాంగ్రెసు రాజకీయ పంథాకు కట్టుబడిన వారుకూడా వున్నారు. అందువలన యుద్ధం గురించి ఎ.ఐ.టి.యు.సి. వైఖరిపై రెండు విభిన్న తీర్మానాలు ప్రతిపాదించబడడం యీ సమావేశం ప్రత్యేకత. మిత్రరాజ్యాల సంఘటన చేస్తున్న యుద్ధ ప్రయత్నాలకు బేషరతుగా మద్దతు తెలుపుతూనే, యుద్ధాన్ని ఉత్సాహపూరితంగా సాగించడానికి రాజకీయ, ఆర్థికపరమైన కొన్ని రాయితీలకొరకు జాతీయ కోర్కెల పత్రాన్ని మహాసభ ముందుంచుతూ, కమ్యూనిస్టుల తరపున శ్రీ బంకిమ్ ముఖర్జీ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. భారత కార్మికులు దేశ రక్షణలో ఉత్సాహపూరితంగానూ, శక్తివంతంగాను భాగస్వాములయ్యేందుకు, ఈ లక్ష్యసాధనకు, ఇతర దేశాలతో సహకరించడానికి, బ్రిటిషువారినుండి అధికారం భారతీయులకు బదిలీ చేయడం తక్షణావసరమని కోరుతూ శ్రీ మృణాల్ కాంతిబోస్ వేరొక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ రెండు తీర్మానాలు మహాసభ ముందుంచబడినాయి.

శ్రీ బంకిమ్ ముఖర్జీ ప్రతిపాదించిన తీర్మానానికి మెజార్టీ (ప్రతినిధుల) మద్దతు లభించినప్పటికీ, నాల్గింట మూడువంతుల మెజారిటీ లభించలేదు. 1938లో ట్రేడ్ యూనియన్ ఐక్యత కొరకు ఏర్పాటుచేయబడిన సమావేశంలో రాజకీయ సమస్యలు, సమ్మెలకు సంబంధించిన సమస్యలు, అంతర్జాతీయ సంస్థలతో అనుబంధం చేయడానికి, సంబంధించిన సమస్యలను, నాల్గింట మూడువంతుల ఆధిక్యతతో మాత్రమే ఆమోదించబడాలని నిర్ణయించబడింది. ప్రపంచ చరిత్రలోనే ఒక కీలక సమయంలో సరియైన, నిర్దిష్టమైన రాజకీయ పంథాననుసరించడానికి యీ అంశం ఎ.ఐ.టి.యు.సి.కి ప్రతిబంధకమైంది. మృణాల్‌కాంతిబోస్ ప్రతిపాదించిన తీర్మానంకూడా మరుగునపడింది. తత్ఫలితంగా (జపాన్) ఫాసిస్టు దురాక్రమణదారుల వలన భారతదేశానికి తీవ్ర ప్రమాదం వాటిల్లిన సమయంలోకూడ, యుద్ధంపట్ల ఎ.ఐ.టి.యు.సి. వైఖరి 1940లో మాదిరిగానే వున్నది. 1940లో వాస్తవ రూపం ధరించిన ఐక్యత 1942లో అసాధ్యంగా మారింది.

ఈ మహాసభ కార్మికుల కనీస అవసరాలను తీర్చాలని, ధరలనదుపు చేయాలని, పెరుగుతున్న జీవనవ్యయాన్ని భర్తీచేయడానికి బోనసు చెల్లించాలని, ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ తీర్మానాలు చేయడమేగాక, యుద్ధం వలన ఏర్పడిన అత్యవసర పరిస్థితులలో తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కార్మికులను కోరింది. ఉత్పత్తి మెరుగుపరచటంలో ప్రభుత్వానికి, యజమానులకు, ట్రేడ్ యూనియన్లకు మధ్య పరస్పర అవగాహన వుండవలసిన ఆవశ్యకతపై యీ మహాసభ వేరొక తీర్మానాన్ని ఆమోదించింది.

ప్రభుత్వం కూడ కార్మికుల సహకారాన్ని పొందడానికి చాలా ఆతురతతో నున్నది. 1942లో ప్రభుత్వం త్రైపాక్షిక సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ప్రకారం 1942 ఆగస్టులో మొట్టమొదటి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్సు ఢిల్లీలో ఏర్పాటు చేయబడింది.

యుద్ధంపట్ల ఒక నిర్మాణయుతమైన వైఖరిని అవలంబించడంలోనూ, నిర్దిష్టమైన కార్యాచరణను చేపట్టడంలోనూ విఫలమవడంతో, ఎ.ఐ.టి.యు.సి.లోని వివిధ గ్రూపులు తమ స్వంత అవగాహన మేరకు పనిచేయడం ప్రారంభించాయి. ప్రధాన సమస్యమీద నిర్ణయాలు తీసుకొనడంలో విఫలమయినప్పటికీ, ఎ.ఐ.టి.యు.సి. త్రైపాక్షిక సమావేశానికి హాజరవడానికి నిరాకరించి, ప్రభుత్వం సాగిస్తున్న అణచివేత చర్యలకు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. వ్యాపార వర్గాలు సాగిస్తున్న నిత్యావసరవస్తువుల అక్రమనిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ మొదలైన సంఘ విద్రోహ కార్యకలాపాలకు వ్యతిరేకంగానూ, సామ్రాజ్యవాద ప్రభుత్వం సాగిస్తున్న అణచివేత చర్యలకు వ్యతిరేకంగానూ, కార్మికులను, సామాన్య ప్రజానీకాన్ని సమీకరించడానికి కమ్యూనిస్టులు కృషి చేశారు. ఈ అవగాహనకనుగుణంగా ఎ.ఐ.టి.యు.సి. పిలుపు మేరకు 1942 సెప్టెంబరు 25వ తేదీన "అణచివేత వ్యతిరేక దినం" పాటించబడింది.

ఈ 19వ మహాసభ శ్రీ వి.వి. గిరిని అధ్యక్షునిగాను, శ్రీ ఎన్.ఎం. జోషిని ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకున్నది. ఈ సమయంలో మొత్తం 3,37,695 మంది సభ్యులతో కూడిన 182 యూనియన్లు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడి వున్నాయి.

1943 మే 1 నుండి 3వ తేదీ వరకు నాగపూరులో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. 20వ మహాసభకు వి.వి.గిరి హాజరుకాక పోవడంవలన మహాసభకు శ్రీ చారుచంద్ర బెనర్జీ అధ్యక్షత వహించారు. విదేశీయులను అనుమతించడాన్ని, సభ్యులు, సమావేశాలను నిర్వహించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. కనీసం యుద్ధం రెండవ దశలోనైనా యుద్ధ ప్రయత్నాలలో సహకరించకపోవడం వలన ఎ.ఐ.టి.యు.సి.లోని కాంగ్రెసు, సోషలిస్టుపార్టీ సభ్యులు ఈ కాలంలో నిర్బంధించబడ్డారు. ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘకాలం చట్ట వ్యతిరేకమని ప్రకటించబడిన భారత కమ్యూనిస్టు పార్టీపై యీ మారిన పరిస్థితులలో నిషేధం ఎత్తివేయబడింది. దీనితో కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేయసాగింది. ఈపరిణామం కార్మిక వర్గానికి ఒక విజయ సూచకంగా భావించవచ్చు.

ఈ 20వ మహాసభలో శ్రీ సోమనాథ్ లాహిరి ఒక తీర్మానాన్ని, శ్రీ వి. ఆర్. కాలప్ప వేరొక తీర్మానాన్ని ప్రతిపాదించారు. శ్రీ సోమనాథ్ లాహిరి తన తీర్మానంలో "జాతీయ ప్రభుత్వాన్ని సాధించుకునేందుకు, ముస్లింలలో వున్న సందేహాలను, అపనమ్మకాలను దూరం చేయడంకొరకు అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు స్వయం నిర్ణయాధికార సూత్రాలను ఆమోదించాలని కోరాడు. శ్రీకాలప్ప తన తీర్మానంలో "అధికారాన్ని భారతీయులకు బదిలీచేసే విషయంలో సామ్రాజ్యవాద ప్రభుత్వం యింకనూ మొండివైఖరి వహించినట్లయితే, జాతీయ కోర్కెల సాధనకు ప్రభుత్వంపై ఆంక్షలు విధించవల్సిందిగా ఎఐటియుసి అన్ని రాజకీయ పార్టీలను కోరాలని పేర్కొన్నాడు. మొదటి తీర్మానానికి అనుకూలంగా 78 ఓట్లు, ప్రతికూలంగా 57 ఓట్లురాగా, రెండవ తీర్మానానికి అనుకూలంగా 47 ఓట్లు వచ్చాయి. కాని నాల్గింట మూడు వంతుల మెజారిటీ లేకపోవడం వలన యీ తీర్మానాలు రెండూ బుట్టదాఖలా అయ్యాయి.

ఈ 20వ మహాసభ శ్రీ డాంగేను అధ్యక్షునిగా, శ్రీ ఎన్.ఎం.జోషిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నది. ఈ సమయంలో 3,32,079 మంది సభ్యులతో కూడిన 259 యూనియన్లు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడి యున్నప్పటికి మహాసభకు 155 యూనియన్లకు చెందిన 306 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఎ.ఐ.టి.యు.సి. 21వ మహాసభ 1945 జనవరి 18 నుండి 23వ తేదీ వరకు మద్రాసులో జరిగింది. ఈ మహాసభకు శ్రీ ఎస్.ఎ. డాంగే హాజరు కాకపోవడం వలన శ్రీ

ఫాజిల్ ఇల్లాహి కుర్బానీ అధ్యక్షత వహించారు. సరిగ్గా యీ సమయానికి యుద్ధం చివరిదశలో నున్నది. ఈ పరిస్థితిలో యీ మహాసభ జాతీయ విముక్తి సాధన ఆవశ్యకతను నొక్కి చెబుతూ ఏకగ్రీవంగా ఒక రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలని కోరుతూ మహాసభ మరొక తీర్మానాన్ని ఆమోదించింది. ఎన్ని సిద్ధాంత విభేదాలున్నప్పటికీ, తీర్మానాలు ఆమోదించే సందర్భంలోనూ, ఎన్నికలు తదితర కార్యకలాపాలు నిర్వహించడంలోనూ ఎ.ఐ.టి.యు.సి.లోని వివిధ గ్రూపులకు మధ్య ఏకాభిప్రాయం వ్యక్తంగావడం యీ మహాసభ విశేషం. ఎ.ఐ.టి.యు.సి. నిబంధనావళికి యీ మహాసభ కొన్ని సవరణలను ఆమోదించింది.

ఈ కాలంలో ఎ.ఐ.టి.యు.సి. అనుబంధ సంఘాల సభ్యత్వం 4,51,915.

రెండవ ప్రపంచయుద్ధం పరిసమాప్తి కానున్న తరుణంలో శాంతి ఒప్పందాల యెడల ట్రేడ్ యూనియన్ల వైఖరి, శాంతి సమావేశాలలో ట్రేడ్ యూనియన్ల ప్రాతినిధ్యం, యుద్ధానంతరం పునర్నిర్మాణం కొరకు కార్మికవర్గ తక్షణ డిమాండ్లు, ప్రపంచ ట్రేడ్ యూనియన్ల సమాఖ్య (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) స్థాపన మొదలయిన విషయాల మీద చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకొనడం కోసం ప్రపంచ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ 1945 ఫిబ్రవరిలో లండన్‌లో సమావేశం జరిపింది. ఎ.ఐ.టి.యు.సి. తరపున యీ ప్రపంచ మహాసభలో శ్రీ ఎస్.ఎ.డాంగే తదితరులతో ఒక ప్రతినిధివర్గం పాల్గొన్నది. అనంతరం అదే సంవత్సరం (1945) సెప్టెంబరు, – అక్టోబరు నెలల్లో పారిస్‌లో జరిగిన వరల్డ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సమావేశంలో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆవిర్భవించింది. అప్పటినుండి ఎ.ఐ.టి.యు.సి. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌కు అనుబంధ సంస్థగా కొనసాగుతోంది.

## సంస్థాపరమైన పురోగతి

ఈ కాలంలో భారతదేశంలో కార్మికోద్యమం గణనీయమైన ప్రగతి సాధించింది. 1926 భారత ట్రేడ్ యూనియన్ చట్టం క్రింద నమోదు చేసుకున్న యూనియన్లు 1938–39 సంులో 568 ఉండగా యీ సంఖ్య 1945–46 నాటికి 1087కు చేరుకున్నది. యూనియన్లు ప్రభుత్వానికి అందజేసిన లెక్కల ప్రకారం యీ సమయంలో యూనియన్లలో వున్న సభ్యుల సంఖ్య 3,99,159 నుండి 8,64,031కి చేరింది. ఈ క్రింద పట్టికను పరిశీలించినట్లయితే యూనియన్ల సంఖ్య, సభ్యుల సంఖ్య ఏ విధంగా పెరిగింది స్పష్టమవుతుంది.

| సం॥ | యూనియన్ల సంఖ్య | సభ్యత్వం |
|---|---|---|
| 1937-38 | 420 | 3,90,112 |
| 1938-39 | 568 | 3,99,159 |
| 1939-40 | 667 | 5,11,138 |
| 1940-41 | 727 | 5,13,832 |
| 1941-42 | 747 | 5,73,540 |
| 1942-43 | 693 | 6,85,299 |
| 1943-44 | 761 | 7,80,967 |
| 1944-45 | 865 | 8,89,388 |
| 1945-46 | 1087 | 8,64,031 |
| 1946-47 | 1225 | 13,31,962 |

ఈ పట్టికలో చూపిన సభ్యత్వ వివరాలు కేవలం ప్రభుత్వానికి జమాఖర్చులు తదితర నివేదికలు పంపిన యూనియన్లకు చెందినవి మాత్రమే. రిజిష్టరు చేయబడిన అనేక యూనియన్లు సంవత్సరాంతానికి ప్రభుత్వానికి సమాచారాన్ని అందజేయడంలో విఫలమయిన కారణంగా, యీ యూనియన్‌లకు సంబంధించిన సభ్యత్వం, పై వివరాల సేకరణ సందర్భంగా పరిగణనలోనికి తీసుకొనబడలేదు. ఉదాహరణకు 1945-46 సం॥లో రిజిష్టరు చేయబడిన యూనియన్లు 1087 వుండగా, 585 యూనియన్లు మాత్రమే. ప్రభుత్వానికి లెక్కలందజేశాయి. వీటికితోడు రిజిష్టరు కాని యూనియన్లు చాలా వున్నాయి. టీ తోటలు, చేనేత పరిశ్రమ తదితర చిన్న తరహా కుటీర పరిశ్రమలలో అనేక యూనియన్లను రిజిష్టరు చేయలేదు. అంటే రిజిష్టరు చేయబడిన, రిజిష్టరు కాని యూనియన్ల ద్వారా సంఘటితమయిన కార్మికుల సంఖ్య వాస్తవానికి ప్రభుత్వ లెక్కలను మించి వుంటుందనడంలో సందేహం లేదు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో దాదాపు అన్ని పరిశ్రమలలోనూ ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం గణనీయంగా పెరిగింది. ఇంజనీరింగ్ పరిశ్రమలో ఈ పెరుగుదల అత్యధికంగా వుండగా, ట్రాంవేస్, డాక్‌యార్డ్, పోర్టు ట్రస్టులు ద్వితీయ స్థానంలో వున్నాయి.

ఈ క్రింది పట్టికను పరిశీలించినట్లయితే పరిశ్రమలవారీగా ట్రేడ్ యూనియన్ల సభ్యత్వంలో పురోగతి స్పష్టమవుతుంది.

| | పరిశ్రమ | 1937-38 | 1944-45 |
|---|---|---|---|
| 1. | రైల్వేలతో పాటు రవాణా రంగం (ట్రాంవేస్ కాక) | 1,58,068 | 3,04,486 |
| 2. | ట్రాంవేస్ | 2,425 | 10,390 |
| 3. | జౌళి (టెక్స్ టైల్స్) | 69,444 | 2,10,712 |
| 4. | ప్రింటింగ్ ప్రెస్ | 6,566 | 13,560 |
| 5. | మున్సిపల్ | 11,698 | 11,928 |
| 6. | నావికులు | 46,057 | 79,501 |
| 7. | డాక్ యార్డులు, పోర్టుట్రస్టులు | 16,047 | 37,098 |
| 8. | లోహాలు, ఇంజనీరింగ్ | 3,505 | 35,513 |
| 9. | ఇతరములు | 76,302 | 1,86,200 |
| | | **3,90,112** | **8,89,388** |

అధికారికంగా ఇవ్వబడిన ఈ సమాచారం సంపూర్ణమయినదికాదు. అయినప్పటికీ ప్రపంచ యుద్ధం సాగుతున్న కాలంలో వివిధ పరిశ్రమల్లో ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం పెరుగుతున్న తీరునిది సూచిస్తుంది. ఇదే సమయంలో ట్రేడ్ యూనియన్‌లలో స్త్రీ సభ్యుల సంఖ్య పెరగడం గమనించవలసివున్నది. రిజిష్టరు చేయబడి వార్షిక నివేదికలను ప్రభుత్వానికి అందచేస్తున్న యూనియన్‌లలో స్త్రీ సభ్యుల సంఖ్య 1937-38 సం॥లో 14,703 వుండగా, 1944-45 నాటికి వీరి సంఖ్య 36,570కి పెరిగింది.

ఈ విధంగా భారత కార్మికోద్యమం ఉరుకులు పరుగులతో పురోగమించి, భారతదేశ కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహించే ఒక పెద్ద జాతీయ ట్రేడ్ యూనియన్‌గా ఎ.ఐ.టి.యు.సి.

ప్రతిష్ట ఇనుమడిస్తున్న ఈ సమయంలో యిందుకు భిన్నంగా వలస ప్రభుత్వంతానే పెంచి, పోషిస్తున్న ఇండియన్ లేబర్ ఫెడరేషన్‌కు ప్రాధాన్యతనివ్వ నారంభించింది. ప్రభుత్వ కృపాకటాక్షాల వల్ల ఇండియన్ లేబర్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ జమ్నాదాస్ మెహతా, ఉపాధ్యక్షుడు శ్రీ అఫ్తబ్ అలీలు 1944 మే నెలలో ఫిలిడెల్ఫియాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ) సమావేశానికి భారత కార్మికవర్గ ప్రతినిధులుగా నామినేట్ చేయబడ్డారు. భారతదేశంలోని కార్మిక వర్గానికి ప్రతినిధులుగా ఐ.ఎల్.ఓ. సమావేశంలో పాల్గొనడానికి ఎంపిక చేయబడిన వీరికి వాస్తవానికి భారతదేశ కార్మికోద్యమంలో పాత్రశూన్యం. మిక్కిలి హాస్యాస్పదంగా వున్న ఈ నియామకానికి ఎ.ఐ.టి.యు.సి. తన తీవ్ర అభ్యంతరాన్ని తెలిపింది. కాని సామ్రాజ్యవాద ప్రభుత్వం దీనిని లెక్కచేయలేదు. దీనికి ప్రభుత్వం ఒక విచిత్రమయిన సాకు చూపింది. ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎల్.ఎఫ్.లలో ఏ సంస్థ అధిక సంఖ్యాకులయిన కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తుందో నిర్ణయించడానికి సరైన యంత్రాంగం లేనందువల్ల ఐ.ఎల్.ఓ. సమావేశాల్లో ఒకరి తర్వాత మరొకరు పాల్గొనాలని, అందులో మొదటి అవకాశం ఇండియన్ లేబర్ ఫెడరేషన్‌కు యివ్వాలని ప్రభుత్వం వాదించింది.

ఇదిలా వుండగా ఇండియన్ లేబర్ ఫెడరేషన్ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందుకున్నకారణంగా కార్మికులలో తీవ్రమైన అసంతృప్తి చెలరేగడంతో సీమెన్స్ యూనియన్ (నావికుల యూనియన్) అధ్యక్షుడు శ్రీ అఫ్తబ్ అలీ 1944 నవంబర్‌లో ఇండియన్ లేబర్ ఫెడరేషన్ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేయవలసివచ్చింది. తాను రాజీనామా చేస్తూ మిగిలిన యూనియన్లు కూడా తన మాదిరిగానే ఐ.ఎల్.ఎఫ్.కు రాజీనామా చేయాలని కోరాడు. బ్రిటిష్ ప్రభుత్వానికి విశ్వాసంతో, నిజాయితీతో సేవచేసినందుకు, 1944 నవంబరులో సామ్రాజ్యవాద ప్రభుత్వం శ్రీ జమ్నాదాస్ మెహతాను బర్మాలో భారత ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా నియమించి గౌరవించింది. దీనితో ఇండియన్ లేబర్ ఫెడరేషన్ విపత్కర స్థితిలో పడడమే గాక, అనతికాలంలోనే భారతదేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమ పటం నుండి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది.

చివరకు రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే సమయానికి 7 లక్షల మంది సభ్యులతో ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఏకైక కార్మికవర్గ సంస్థగా నిలిచింది.

# 18

# జాతీయోద్యమంలో చివరిదశ : భారత కార్మికవర్గం (1945-47)

## దేశవ్యాప్త తిరుగుబాటు వెల్లువ

**రెం**డవ ప్రపంచ యుద్ధకాలంలో భారత కార్మికవర్గం సాధించిన పురోగతి, విజయాలు భారత కార్మికవర్గ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన వనడంలో సందేహం లేదు. ఫాసిస్టు శక్తుల ఓటమిచెంది, యుద్ధం పరిసమాప్తి కావడంతో భారత కార్మికవర్గం మిక్కిలి సంఘటితమైన, వర్గచైతన్యం పొందిన, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించే అసలు సిసలైన పోరాట శక్తిగా ముందుకు వచ్చింది.

ఫాసిజం పరాజయం పొందడంతో ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన ప్రజాతంత్ర శక్తులు జాతీయ విముక్తి పోరాట శక్తులు భారతదేశాన్ని కూడా కుదిపివేశాయి. దీని ఫలితంగా మున్నెన్నడూ లేని విధంగా జాతీయ విముక్తి, ప్రజాస్వామ్యాల కొరకు అప్రతిహత పోరాటాలు యావద్భారతదేశాన్ని ముంచెత్తివేశాయి. శ్రీ సుభాస్‌చంద్రబోస్ నాయకత్వంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ (భారత జాతీయ సైన్యం) విజృంభించడం, బ్రిటిష్ ప్రభుత్వం ఆ సైన్యాన్ని బంధించి, జర్మనీ, ఇటలీలు పరాజయం పొందిన తరువాత, నేతాజీ సైన్యాన్ని మిలిటరీ ట్రిబ్యునల్ ముందు విచారణ జరపడం వంటి సంఘటనలు దేశభక్తి యుత భారత ప్రజానీకాన్ని తీవ్రంగా కదిలించి వేసి వారి జాతీయ భావాలను తీవ్రంగా గాయపరచాయి.

రెండవ ప్రపంచయుద్ధం ముగియడంతో, 1935 భారత ప్రభుత్వ చట్టం పరిధిలో భారత రాజ్యాంగంలో మరికొన్ని మార్పులు ప్రవేశపెడుతూ బ్రిటిషు ప్రభుత్వం కొన్ని నూతన ప్రతిపాదనలు చేసింది. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యులందరు విడుదల చేయబడ్డారు. తరువాత 1945 జూన్ 25న సిమ్లాలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయబడింది.

వైస్రాయి లార్డ్ వేవెల్ సిమ్లా సమావేశంలో చేసిన ప్రతిపాదనలు ఎవ్వరికీ సంతృప్తికరంగా లేకపోవడమేగాక, అవి ప్రజలను రెచ్చగొట్టేవిగానూ, వేర్పాటువాదానికి తావిచ్చేవిగా వుండడంతో సిమ్లా సమావేశం విఫలమైంది. దీనికి తోడు కాంగ్రెసు – ముస్లింలీగుల మధ్య అనైక్యత,

నెలకొనడం ముస్లింలీగు మతపరమైన కోర్కెలు కోరడంతో భారతదేశంలో రాజకీయంగా స్తబ్ధత నెలకొన్నది.

ఒక ప్రక్క అగ్ర నాయకత్వంలో నెలకొన్న విభేదాలను, ఊగిసలాట ధోరణిని అదనుగా తీసుకుని యీ విభేదాలను తీవ్రతరం చేసి తన వేర్పాటువాద ఎత్తుగడలు అమలు చేయడంలో బ్రిటిషు ప్రభుత్వం నిమగ్నమైవుంది. వేరొక ప్రక్క క్రింది స్థాయిలో ప్రజలు అపూర్వమైన రీతిలో తిరుగుబాట్లు సాగించారు. ఎంతటి నీచానికైనా వెనుదీయని సామ్రాజ్యవాదుల సహాయ, సహకారాలతో అతి ప్రమాదకరమైన విషపూరితమైన మతతత్వ ప్రచారం చేయడం ద్వారా భారత ప్రజానీకాన్ని విభజించడానికి కొన్ని విచ్ఛిన్నకర శక్తులు ఒక ప్రక్క తీవ్ర ప్రయత్నాలు సాగిస్తుండగా, వేరొక ప్రక్క కోట్లకొలది శ్రమజీవులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ఐక్య కార్యాచరణను సాగించారు. శ్రమజీవులు సాగించిన యీ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో హిందువులు, ముస్లింలు, అంటరానివారుగా పరిగణింపబడుతున్న ప్రజలు ఏకోన్ముఖంగా పాల్గొన్నారు. పోలీసులు, సైన్యం విచక్షణా రహితంగా కాల్పులు సాగిస్తున్నప్పటికీ ప్రాణాలకు తెగించి కాంగ్రెసు, ముస్లింలీగ్, కొన్ని సందర్భాలలో ఎర్రజెండాలు చేబూని వేలకొలది కార్మికులు, విద్యార్థులు, మధ్య తరగతి ప్రజలు దేశానికి స్వాతంత్ర్యం కోరుతూ కలకత్తా, బొంబాయి తదితర పారిశ్రామిక కేంద్రాలు, పట్టణాలలో సాగిన బ్రహ్మాండమైన ప్రదర్శనలలో పాల్గొన్నారు.

ఇండియన్ నేషనల్ ఆర్మీ అధికారులపై సైనిక న్యాయస్థానాలలో విచారణ జరిపి వారిపై నేరాలు ధృవపరిచి వారికి శిక్షలు విధించడంతో భారత ప్రజానీకం హిందువులు, ముస్లింలనే భేదాలు లేకుండా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. సామ్రాజ్యవాదుల ఈ చర్యకు నిరసనగా ప్రజలు సాగించిన ఐక్య పోరాటం ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం భారత జాతీయ సైన్యానికి చెందిన అధికారులను విడుదల చేయవలసివచ్చింది.

దేశవ్యాప్తంగా పెనుతుఫానువలె చెలరేగుతున్న ప్రజాపోరాటాలు, భారత జాతీయ సైన్యం సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత పోరాటాలు, భారత సైన్యంలో దేశభక్తిని ఇనుమడింపజేశాయి. భారత స్వాతంత్రోద్యమ పోరాట క్రమంలో ఈ నూతన పరిణామం విప్లవాత్మకమైన ప్రాధాన్యతను సంతరించుకుంది.

అనేక సమస్యలు అపరిష్కృతంగా వుండిపోవడం వలన తీవ్రంగా అసంతృప్తి చెందిన రాయల్ ఇండియన్ నావికాదళంలోని సైనికులు బ్రిటిషు పాలకులకు వ్యతిరేకంగా బహిరంగంగానే గొప్ప తిరుగుబాటు చేశారు. 1946 ఫిబ్రవరి 18వ తేదీన బొంబాయి నావల్ బేస్‌లో యీ తిరుగుబాటుకు అంకురార్పణ జరిగింది. తిరుగుబాటు ప్రారంభమైననాటి నుండి తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్న నాయకులు కాంగ్రెసు, ముస్లింలీగు పార్టీల నాయకులను కలుసుకొని వారి మద్దతుకొరకు కృషి సాగిస్తూనే వున్నారు. కాని వారి నుండి ఏ విధమైన స్పందన లభించలేదు. ప్రభుత్వం చేతిలోనున్న సైన్యాన్నంతా ఉపయోగించి ఈ తిరుగుబాటును అణచివేస్తానని అడ్మిరల్ గాడ్ ఫ్రై బెదిరించడంతో తిరుగుబాటుసాగిస్తున్న నావికుల కేంద్ర సమ్మె కమిటీ, ఆడ్మిరల్ గాడ్ ఫ్రై బహిరంగంగా చేసిన యీ బెదిరింపుకు శాంతియుతంగా సమ్మె హర్తాళ్ ద్వారా

జవాబివ్వవలసిందిగా నగరంలోని ప్రజానీకానికి విజ్ఞప్తి చేసింది. సామ్రాజ్యవాదులను ఎదిరించి నావికులు సాగిస్తున్న దేశభక్తి యుత పోరాటాలకు జాతీయోద్యమం సంపూర్ణ సహాయసహకారాల నందించవలసిన యీ క్లిష్ట పరిస్థితిలో కాంగ్రెసు తరుపున శ్రీవల్లభాయిపటేల్ ఈ సమ్మెకు హర్తాళ్‌కు మద్దతు తెల్పడానికి నిరాకరించడమేగాక వీటిని తీవ్రంగా వ్యతిరేకించాడు. కాని సెంట్రల్ నావల్ స్ట్రయిక్ కమిటీ ఇచ్చిన ఈ పిలుపును కమ్యూనిస్టు పార్టీ, బొంబాయిలోని ట్రేడ్ యూనియన్లు పూర్తిగా బలపరచాయి. ఫిబ్రవరి 22న బొంబాయిలోని కార్మికవర్గంతో బాటు ఇతర శ్రామిక జనావళి విచక్షణారహితంగా పోలీసులు, మిలటరీ సాగిస్తున్న కాల్పుల నెదిరించి సమ్మెను, హర్తాళ్‌ను జయప్రదంగా నిర్వహించింది.

ఫిబ్రవరి 21 నుండి 23 వరకు మూడు రోజులు బ్రిటిషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగిన భీషణ ప్రతిఘటనా పోరాటంలో అధికారులు తక్కువ చేసి చూపిన అంచనాల ప్రకారమే బ్రిటిషు సామ్రాజ్యవాద హంతకుల చేతిలో 250 మంది దేశభక్తులు ప్రాణాలు కోల్పోయారు. నావికాదళం సాగించిన తిరుగుబాటుకు మద్దతుగా కలకత్తా, మద్రాసు, కరాచీ తదితర ప్రదేశాలలో బ్రహ్మాండమయిన ప్రజా ప్రదర్శనలు జరిగాయి. ఈ ఉదంతం కార్మికవర్గం, ఇతర శ్రమజీవుల రాజకీయ చైతన్యానికి, ప్రాణత్యాగానికైనా వెరవక జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించాలనే వారి బలీయమైన కోర్కెకు ప్రతీకగా నిలిచింది.

1945-46 సం॥లలో సాగిన బ్రహ్మాండమయిన ప్రజాపోరాట వెల్లువ భారతదేశ రాజకీయ రంగంలో వర్గ శక్తుల బలాబలాల పొందికలో మార్పును సూచిస్తూంది. సామ్రాజ్యవాదుల కుమ్మక్కుతో సాగిన మతపరమైన కుట్రలను వమ్ముచేసి రాజకీయ పోరాటాల్లో కార్మిక వర్గం ఐక్యతతో వ్యవహరించి రాజకీయ పోరాటంలో చురుకుగా పాల్గొన్నది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల యెడల రైతాంగం, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజానీకం రాజీలేని స్థిరమైన వైఖరి నవలంబించారు. దీనితో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం మహోన్నత దశకు చేరుకుంది. ఈ విధంగా భారతదేశంలో బ్రిటిషు వలస విధానాన్ని పునాదుకంట పెకలించి వేయడానికి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట శక్తులు మోహరించివున్నాయి. ఇప్పుడే కార్మికవర్గం, ప్రజలు సామ్రాజ్యవాదానికి తలవంచక ప్రజా పోరాట పంథాన సాగుతున్నారు. జాతీయోద్యమ ప్రారంభం నాటి నుండే అనేక సందర్భాల్లో వ్యక్తమయ్యాయి. సాయుధ బలగాల్లో సైతం తిరుగుబాటు జ్వాలలు వ్యాపిస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో ప్రజలు, సాయుధ సైన్యాలు సాగిస్తున్న సమ్మెలు తదితర విప్లవ కార్యకలాపాలను కాంగ్రెసు, ముస్లింలీగులు బహిరంగంగానే ఖండించడం ప్రారంభించాయి. తిరుగుబాటు సాగిస్తున్న నావికాదళ సిబ్బంది నుద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ అబ్దుఏల్ కలాం ఆజాద్ "సమ్మెలు, హర్తాళ్ళతో, నేటి అధికారులను ధిక్కరించడానికి ఏ మాత్రం వీలులేదు." అని ప్రకటించాడు.

పురోగమిస్తున్న ప్రజాపోరాటాలకు, సంస్కరణవాద బూర్జువా నాయకత్వానికి మధ్య వైరుధ్యాలు జాతీయోద్యమ ప్రారంభం నాటి నుండే అనేక సందర్భాల్లో వ్యక్తమయ్యాయి. ప్రజాపోరాటాల వెల్లువను గాంచినంతనే భయాందోళనలకు గురైన బూర్జువా వర్గ నాయకత్వం మరల, మరల ఈ పోరాటాలకు కళ్ళెం వేసేందుకు తొందరపాటు చర్చలకు పూనుకుంది.

స్వాతంత్ర్యం కోసం భారతజాతి ఉవ్వెత్తున ఉద్యమాలు సాగిస్తున్న యీ సమయంలో, ఈ వైరుధ్యాలన్నీ మిక్కిలి తీవ్రమై, బూర్జువా వర్గ నాయకత్వానికి, ప్రజానీకానికి మధ్య పెద్ద అగాధాన్ని సృష్టించాయి.

జాతీయోద్యమంలో నెలకొనివున్న ఈ బలహీనతలను బ్రిటిషు ప్రభుత్వం పసిగట్టగలిగింది. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో ప్రధానమంత్రిగానున్న చర్చిల్ రాజీనామా చేశాడు. తరువాత ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన క్లెమెంట్ అట్లీ భారత ఉపఖండాన్ని విభజించి రెండు భాగాలలోనూ అధికారాన్ని పెట్టుబడిదారీ – భూస్వామ్య వర్గాలకు బదిలీచేసే వరకు అధికారంలో కొనసాగాడు. దీనిని పరిశీలించినట్లయితే, భారత జాతీయోద్యమంలోని బలహీనతలను వుపయోగించుకుని భారత ఉపఖండాన్ని విభజించడంలో బ్రిటిషు వారి చాకచక్యం వెల్లడవుతోంది.

## కార్మికవర్గ ఆర్థిక పోరాటాలు

రెండవ ప్రపంచ యుద్ధానంతరం భారత కార్మికవర్గం, వెల్లువెత్తుతున్న రాజకీయ పోరాటాలతోబాటు, తీవ్రమైన ఆర్థిక పోరాటాలలో కూడ నిమగ్నం కావాల్సి వచ్చింది. యుద్ధ సమయంలో పారిశ్రామిక కార్మికుల సంఖ్య యుద్ధానికి పూర్వం వున్న పారిశ్రామిక కార్మికుల సంఖ్యలో కనీసం 50 శాతానికి పైగా పెరిగింది. వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య 1939లో 17,51,137 వుండగా, 1945 నాటికి యీ సంఖ్య 26,42,977కు పెరిగింది. అంటే సుమారు 50.9 శాతం పెరుగుదలను సూచిస్తున్నదన్నమాట. యుద్ధం ముగిసిన తర్వాత పారిశ్రామిక కార్మికులు ప్రధానంగా రెండు సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. ఒకటి యుద్ధ సమయంలో నియమించబడిన కార్మికుల రిట్రెంచ్‌మెంట్ రెండవది వేతనాలలో కోత.

యుద్ధ సమయంలో కార్మికులు అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న జీవన వ్యయ సూచికతో ముడిపడిన బోనసు కూడ ధరల పెరుగుదల కనుగుణంగాలేదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తన రిపోర్టులోనే ధృవపరచింది. 1944 అక్టోబరు – నవంబరు మాసాలలో వివిధ పారిశ్రామిక కేంద్రాలలో కార్మికుల జీవన వ్యయ సూచిక అతి స్వల్పంగా తగ్గినప్పటికి మరల పెరగడం ప్రారంభించింది. ఐనప్పటికీ కార్మికులకు చెల్లించవలసిన బోనసు తగ్గించబడింది. బొంబాయి నగరంలో 1945 జనవరి మాసంలో 218 పాయింట్ల వద్దనున్న జీవన వ్యయసూచిక నవంబరు నాటికి 230 పాయింట్లకు చేరుకున్నది. ఇదే సమయంలో అహ్మదాబాద్‌లో జీవన వ్యయ సూచిక 282 పాయింట్ల నుండి 290 పాయింట్ల వరకు, కాన్పూరులో 301 నుండి 317 పాయింట్లకు, మద్రాసులో 217 పాయింట్ల నుండి 230 పాయింట్ల వరకు పెరిగింది.

భారతదేశంలో పారిశ్రామిక కార్మికుల నుండి ప్రభుత్వ ఉద్యోగులు, సైనికులతో సహా వివిధ వృత్తి, వ్యాపారాలు, వివిధ రకాలయిన ఉద్యోగాలు చేస్తున్న సుమారు 50 నుండి 70 లక్షల మంది ప్రపంచ యుద్ధానంతరం తమ ఉద్యోగాలు కోల్పోయినట్లు లండన్ నుండి వెలువడే "ది టైమ్స్" అనే పత్రిక అంచనా వేసింది.

అతి ప్రమాదకరమైన యీ పరిస్థితిని కార్మికవర్గం పట్టుదలతో ఎదుర్కొనవలసి వచ్చింది. 1946లో సమ్మె పోరాటాలు విపరీతంగా పెరగడం కార్మిక వర్గం యిచ్చిన తీవ్ర ప్రతిఘటనకు ప్రబల నిదర్శనం. 1946లో 1629 సమ్మె పోరాటాలు జరిగాయి. వీటిలో 19,61,948 మంది కార్మికులు పాల్గొనగా 1,27,17,762 పనిదినాలు నష్టమయ్యాయి. 1945 సం॥లో 820 సమ్మె పోరాటాలు సాగాయి. 7,47,530 మంది కార్మికులు పాల్గొనగా, 40,54,999 పనిదినాలు నష్టమయ్యాయి.

ఈ పరిస్థితుల్లో కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు, రిట్రెంచ్‌మెంటును నిలిపివేయాలని, కరువుభత్యాన్ని మూల వేతనంలో కలపవల్సిందిగానూ, కార్మికులకు కనీసవేతనం, ఎనిమిది గంటల పనిదినం అమలు పర్చవల్సిందిగానూ, ఆరోగ్యబీమా సౌకర్యం, వృద్ధాప్యపెన్షన్, నిరుద్యోగభృతి వంటి సాంఘిక భద్రతా చర్యలుచేపట్టాలని ఎ.ఐ.టి.యు.సి ప్రభుత్వాన్ని కోరింది.

బెంగాలు, బీహారు, ఒరిస్సా, పంజాబు, యునైటెడ్ ప్రావిన్సెస్, బొంబాయి, మద్రాసు తదితర రాష్ట్రాల్లోని పారిశ్రామిక కేంద్రాలలోని కార్మికులు అనేక సమ్మె పోరాటాలకు పూనుకున్నారు. కార్మికవర్గం సాగిస్తున్న యీ మిలిటెంట్ పోరాటాలను అణచివేయడానికి ప్రభుత్వం విచక్షణా రహితంగా కాల్పులు సాగించడంతోబాటు యితర అణచివేత చర్యలకు పూనుకున్నది. తమవర్గ ప్రయోజనాలను కాపాడుకొనడం కోసం పట్టుదలతో పోరాటం సాగిస్తున్న కార్మికులు తమ ప్రాణాలను పోగొట్టుకోవలసి వచ్చింది. ధైర్య సాహసాలతో కార్మికవర్గం సాగించిన యీ సమ్మె పోరాటాలు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంగా పరిణామం చెందడంతో అది ప్రజానీకానికి మిక్కిలి వుత్తేజం కల్గించింది.

ఈ దశలో సాగిన పోరాటాలలో 1946 జూలై నెలలో భారత ప్రభుత్వ ఆధీనంలోని తంతి – తపాలా శాఖా ఉద్యోగులు సాగించిన నిరవధిక సమ్మె పోరాటం ఈ దశలో సాగిన పోరాటాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితి వలన వివిధ తరగతుల కార్మికవర్గంతోబాటు ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా అనేక కష్టానష్టాలకు గురయ్యారు. తంతి తపాలా శాఖ ఉద్యోగులు సాగించిన పోరాటం కార్మికవర్గం యీ పరిస్థితులకు వ్యతిరేకంగా పట్టుదలతో సాగించిన ప్రతిఘటన పోరాటంలో జీతాల స్కేళ్ళ సవరణతోపాటు, 16 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు వి.జి దాల్వీనాయకత్వంలోని లోయర్ గ్రేడ్ స్టాఫ్ యూనియన్ ఒక భాగం. చాలా తక్కువగానున్న జీతాలు, మిక్కిలి అసంతృప్తికరంగా వున్న పని పరిస్థితులు యీ డిపార్టుమెంటులోని ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి జ్వాలలను రగిల్చాయి.

ఈ ఉద్యోగులకు సంబంధించిన వివిధ ట్రేడ్ యూనియన్లలో ఏకాభిప్రాయం లోపించింది. ఈ యూనియన్‌లలో ఎక్కువ భాగంపై అధికారులకు మిక్కిలి విధేయత కలిగివుండేవి. వీటన్నింటికి మించి సంస్థాపరంగా ఐక్యత లోపించింది. దేశవ్యాప్తంగా ఒక ఐక్య ఉద్యమాన్ని నిర్మించడానికివి అవరోధాలుగా నిలిచాయి. అయినప్పటికీ వారి సమస్యలు చాలాకాలంగా

అపరిష్కృతంగా వుండటంతో అన్ని అవరోధాలను అధిగమించి తంతి–తపాలా ఉద్యోగులు సమ్మె పోరాటాలకు పూనుకొనక తప్పలేదు. 1946 జూలై 11వ తేదీ నుండి సమ్మె చేయబోతున్నట్లు ప్రభుత్వానికి నోటీసు యిచ్చింది. ఈ నోటీసును అందుకున్న తంతితపాలా శాఖ డైరెక్టర్ జనరల్ ఈ వివాదం మధ్యవర్తుల పరిష్కారానికి (ఆర్బిట్రేషనుకు) నివేదించబడడం వలన సమ్మె చట్టవిరుద్ధమవుతుందని, అందువలన అక్రమ సమ్మెలో పాల్గొనేవారు కఠిన చర్యలకు గురవుతారని ప్రకటించాడు. తంతి – తపాలా శాఖలోని వివిధయూనియన్లతో శ్రీ చమన్‌లాల్, తానే అధ్యక్షునిగా అప్పటికే యూనియన్ల సమాఖ్య (ఫెడరేషన్)ను ఏర్పాటు చేశాడు. కాని పోస్టుమన్ లోయర్ గ్రేడ్ స్టాఫ్ యూనియన్ ఈ సమాఖ్యలో చేరలేదు. ప్రభుత్వానికి వంతపాడుతూ, శ్రీచమన్‌లాల్ తంతి – తపాలా ఉద్యోగ సంఘాల సమాఖ్య తరపున సమ్మెను వ్యతిరేకించాడు.

కాని అధికారుల బెదిరింపులను, చమన్‌లాల్ ఫెడరేషన్ సమ్మె వ్యతిరేకతను లెక్క చేయక పోస్ట్‌మన్ లోయర్ గ్రేడ్ స్టాఫ్ యూనియన్ పిలుపుననుసరించి అనుకున్న ప్రకారం జూలై 11వ తేదీన సమ్మె ప్రారంభమయింది. అదే సమయంలో ఆలిండియా టెలిగ్రాఫ్ యూనియన్ కూడా యీ దేశవ్యాపిత సమ్మెలో పాల్గొనవలసిందిగా తంతి ఉద్యోగులను (టెలిగ్రాఫిస్టులను) కోరింది. బెంగాలు, అస్సాంలలోని పోస్టల్, ఆర్.ఎమ్.ఎస్. పోస్ట్‌మాష్టర్ జనరల్ ఆఫీసు సిబ్బంది, తమ తమ యూనియన్ల తరపున సమ్మెలో పాల్గొంటున్నట్లు ప్రకటించారు. కాని ఇండియన్ టెలిగ్రాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా॥ నోరోనా సమ్మెను వ్యతిరేకించాడు. దీనికి పర్యవసానంగా బెంగాలులోని యీ అసోసియేషన్ సభ్యులందరూ సామూహికంగా ఆలిండియా టెలిగ్రాఫ్ యూనియన్‌లో చేరి సమ్మెలో పాల్గొన్నారు. బెంగాలు, అస్సాంలలోని తంతి – తపాలా ఉద్యోగులు కూడా జూలై 21 నుండి సమ్మెలో చేరారు. దీంతో జూలై 11న క్రింద తరగతి ఉద్యోగులు ప్రారంభించిన ఈ సమ్మె మొత్తం తంతి – తపాలా శాఖకు విస్తరించి దేశమంతా వ్యాప్తిచెందింది ముఖ్యంగా బెంగాలు, అస్సాం, బొంబాయి, మద్రాసు, ఢిల్లీ, రాజ్‌పుటానా, సెంట్రల్ ప్రావిన్సెస్, బేరార్, సింధ్, బెలూచిస్తాన్‌లలో యీ సమ్మె మరింత విజయవంతంగా సాగింది.

భారత ప్రజానీకం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన రాజకీయ పోరాటం సాగిస్తున్న సమయంలో తంతి – తపాలా ఉద్యోగుల సమ్మె ప్రారంభమైంది. బ్రిటిషు ప్రభుత్వం అవలంబిస్తున్న కరుడుగట్టిన కార్మిక వ్యతిరేక విధానాలకు ఒక బలమైన ప్రతిఘటనగా యీ సమ్మె కొనసాగింది. అప్పటికే సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో యీ సమ్మెకు భారత ప్రజానీకం స్వాగతం పలికింది. కార్మికవర్గంతోపాటు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న ప్రజానీకం యీ సమ్మెను సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వెల్లువ నుండి విడదీయరాని ఒక మహత్తర పోరాటంగా భావించింది. అందువలననే తంతి – తపాలా ఉద్యోగులు సాగిస్తున్న యీ పోరాటానికి వీరు అందించిన సహాయ సహకారాలు, ఆర్థిక కోర్కెలపై ప్రారంభమైన యీ సమ్మెను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే జాతీయ పోరాట స్థాయికి తీసుకువెళ్ళాయి.

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు యీ సమ్మెకు తన మద్దతును ప్రకటించింది. దేశంలోని కార్మికవర్గం ఈ సమ్మె పోరాటాన్ని ఎలాగైనా జయప్రదం చేయాలని కృతనిశ్చయంతో వున్నది. బెంగాలు, అస్సాం, బొంబాయి, మద్రాసులలో యీ సమ్మెకు సంఘీభావం తెల్పుతూ కార్మికవర్గం సార్వత్రిక సమ్మెలు సాగించింది. ఈ సమ్మెకు నాయకత్వం వహించి, నేరుగా యీ పోరాటంలో భాగం పంచుకున్న నాయకులలో ఒకరైన శ్రీ కె.జి.బోస్ తంతి – తపాలా శాఖ ఉద్యోగుల పోరాటానికి మద్ధతు తెల్పుతూ బొంబాయి ప్రొవిన్షియల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు పిలుపు మేరకు బొంబాయిలోని కార్మికవర్గం జూలై 22వ తేదీన సమ్మె చేసింది. బెంగాల్ ప్రొవిన్షియల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు పిలుపు మేరకు జూలై 29న బెంగాలులో సార్వత్రిక సమ్మె, హర్తాళ్ జరిగాయి. ఇదేవిధంగా మద్రాసు ప్రొవెన్షియల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ పిలుపు ననుసరించి మద్రాసులో జూలై 23న సార్వత్రిక సమ్మె జరిగింది. అస్సాంలో కూడా జూలై 29వ తేదీన సమ్మె జరిగింది. జూలై 29వ తేదీన కలకత్తాలో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. మధ్యాహ్నం మాన్యుమెంట్ మైదానంలో జరిగిన ర్యాలీకి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. గతంలో యింత బ్రహ్మాండమైన కార్మిక ప్రదర్శన జరిగియుండలేదు. ఈ బహిరంగసభ కొరకు ప్రజలు పెద్ద పెద్ద ఊరేగింపులుగా వచ్చి మైదానానికి చేరారు. ఉత్సాహవంతులయిన ప్రజలు వీధులలో బారులు తీరి నిలబడ్డారు. ఆ సమయంలో అనేకమంది సైనికులు కూడా వున్నారు అని పేర్కొన్నారు.

కలకత్తాలో ఆనాడు జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభకు బెంగాల్ ప్రొవిన్షియల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ మృణాల్ కాంతిబోసు అధ్యక్షత వహించాడు. శ్రీయుతులు బంకిం ముఖర్జీ, అబ్దుల్ మొయిన్, శివనాధ్ బెనర్జీ, డా॥ మైత్రేయీ బోస్‌లతో బాటు యితర వామపక్ష రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్ల నాయకులు సమ్మెకు మద్దతు తెల్పుతూ ప్రసంగించారు.

వామపక్ష రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లతోబాటు వివిధ విద్యార్థి సంఘాలు తదితర ప్రజాసంఘాలు యీ సమ్మెకు తమ మద్దతును తెలియజేయడమేగాక, సమ్మె విజయానికి కృషి చేశాయి. సమ్మెను పరిష్కరించవలసిందిగా భారత ప్రభుత్వాన్ని డిమాండుచేస్తూ బెంగాలు విధాన సభలో ఒక తీర్మానం కూడా ఆమోదించబడింది. దేశంలోని శ్రామికవర్గం యావత్తూ యీ సమ్మె పోరాటానికి మద్దతుగా నిలిచింది. కాని భారత జాతీయ కాంగ్రెసు మాత్రం తంతి – తపాలా ఉద్యోగులు సాగిస్తున్న ఈ మహత్తర పోరాటాన్ని బలపరుస్తూ అధికార ప్రకటన ఏమీ చేయలేదు. ప్రజల నుండి వచ్చిన తీవ్ర ఒత్తిడికి తలవంచి, అస్సాం ముఖ్యమంత్రి శ్రీ గోపినాథ్ బార్డొలీ సమ్మె పరిష్కారాన్ని కోరుతూ భారత ప్రభుత్వానికి, జవహర్‌లాల్ నెహ్రూకు టెలిగ్రామ్‌లు పంపాడు. వాస్తవానికి జవహర్‌లాల్ నెహ్రూ ఈ సమస్యపై ఒక పత్రికా ప్రకటన చేశాడు. కాని ఈ ప్రకటనలో ఉద్యోగుల సామర్థ్యాన్ని, నిజాయితీ పరులయిన తంతి – తపాలా ఉద్యోగులు అతి తక్కువ వేతనాలు పొందుతున్నందుకు వారి యెడల సానుభూతిని వ్యక్తం చేశాడు. అంతేగాక సంతృప్తికరమయిన పరిష్కారం కోసం ఉద్యోగుల డిమాండ్లను మధ్యవర్తుల పరిష్కారానికి (ఆర్బిట్రేషన్స్‌కు) నివేదించవలసిందిగా కోరకపోగా, ఈ పోరాటానికి స్పష్టంగా

మద్దతును వ్యక్తంచేస్తూ ఒక్క మాటయినా చెప్పలేదు. ఇదిలావుండగా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ శ్రీ సత్యనారాయణ సిన్హా జూలై 19వ తేదీన ఒక పత్రికా ప్రకటన చేస్తూ, ఈ సమ్మెను "అవివేకమైన" చర్యగా అభివర్ణించాడు. తంతి–తపాలా శాఖ ఉద్యోగులలో ఒక సెక్షను తమ కోర్కెల సాధనకు సమ్మెను మరికొంత కాలం కొనసాగించాలని నిర్ణయించగా, అబ్దుల్ కలాం ఆజాద్, శరత్ చంద్రబోస్, సురేంద్రమోహన్ ఘోష్‌లు ఆగస్టు 2వ తేదీన సమ్మె చేస్తున్న కార్మికులకొక విజ్ఞప్తి చేస్తూ, కార్మికుల కోర్కెలను అధికారులు పాక్షికంగా ఆమోదించినట్లయితే ప్రజలకు కలిగే అసౌకర్యం దృష్ట్యా సమ్మెను కొనసాగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అంటే ఒక ప్రక్క ఉద్యోగులు సమ్మెను కొనసాగించడానికి కృత నిశ్చయులై వుండగా, జాతీయ కాంగ్రెసు నాయకత్వం ఈ వీరోచిత సమ్మె పోరాటానికి మద్దతు తెలియజేయక పోగా నీరు కార్చడానికి కృషి చేసింది.

అధికారుల బెదిరింపులు, శ్రీ చమన్‌లాల్, ఆయన అనుచరుల బహిరంగ వ్యతిరేకత కాంగ్రెసు నాయకత్వం యొక్క సమ్మె వ్యతిరేక వైఖరి వీటన్నింటిని అధిగమించి, ఎ.ఐ.టి.యు.సి. నుండి, దేశంలోని కార్మికవర్గంతో సహా సమరశీల ప్రజానీకం నుండి లభించిన చైతన్యవంతమైన మద్దతుతో, యీ సమ్మె ద్వారా తంతి తపాలా ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురాగలిగారు. బొంబాయి ముఖ్యమంత్రి శ్రీ బి.జి.ఖేర్, శ్రీ మంగళదాస్ పకవాసాల జోక్యం ద్వారా ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించడానికి అధికారులు తమ ఆత్రుతను వ్యక్తం చేశారు. పోస్ట్‌మన్ లోయర్ గ్రేడ్ స్టాఫ్ యూనియన్ సమర్పించిన కోర్కెల పత్రంలోని పదహారు డిమాండ్లలో, ఆ యూనియన్ నాయకుడు శ్రీ డాల్వీతో 12 కోర్కెల విషయంలో అంగీకారం కుదరడంతో, ఆగస్టు 3వ తేదీన ఈ యూనియన్ సమ్మెను విరమించింది. సమరశీల స్వభావం గలిగిన బెంగాల్ నాయకత్వం తమకు తెలియకుండా చేసుకున్న యీ ఒప్పందాన్ని తిరస్కరించింది. ఈ నాయకులను విమానంలో ఢిల్లీ తీసుకువెళ్ళడానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయబడ్డాయి. కోర్కెల పత్రంలోని 16 డిమాండ్లలోని 12 డిమాండ్లను అంగీకరించడంతోబాటు, తంతి – తపాలా శాఖ ఉద్యోగులకు "సత్ ప్రవర్తనా వేతనం" మంజూరు చేయడానికి కోటి రూపాయలు వెచ్చించడానికి నిర్ణయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. చివరకు ఆగస్టు 6వ తేదీన బెంగాల్, అస్సాంలలో కూడ సమ్మె విరమించబడింది.

జూలై 29వ తేదీన సార్వత్రిక సమ్మె, హర్తాళ్‌లను విజయవంతంగా నిర్వహించిన తరువాత కలకత్తాలో జరిగిన బ్రహ్మాండమైన ప్రజాప్రదర్శనలో సమ్మెకు మద్దతు తెల్పుతూ ఒక చారిత్రాత్మకమైన తీర్మానం ఆమోదించబడింది. ఈ తీర్మానంలోని చివరివాక్యం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది. "దేశ శ్రామికోద్యమ చరిత్రలో ఐక్యత, పోరాట చైతన్యాలకు ఈ చారిత్రాత్మకమైన సమ్మె ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించిందని ఈ ర్యాలీ దృఢంగా విశ్వసిస్తోంది" అని తీర్మానంలో చివరి వాక్యంగా చెప్పబడింది. ఈ విశ్వాసం వాస్తవమని తరువాత సంఘటనలు రుజువు చేశాయి. ఈ పోరాటం నుండి గుణపాఠాలు తీసుకున్న తంతి–తపాలా కార్మికులు వేర్వేరుగా వున్న తమ యూనియన్లన్నింటినీ ఏకంచేసి ఒకే సంస్థను స్థాపించాలని నిర్ణయించారు. ఒక పోరాటం విజయవంతంగా సాగాలంటే, దేశంలోని

యావత్ కార్మిక వర్గంతో ఏకమై పోరాటం సాగించాలని కూడా తంతి-తపాలా ఉద్యోగులు ఈ పోరాట అనుభవంతోనే గ్రహించారు. ఈ ఉద్దేశంతోనే ఆలిండియా పోస్టల్ అండ్ ఆర్.ఎం.యస్. యూనియన్, ఆలిండియా లోయర్ గ్రేడ్ స్టాఫ్ యూనియన్ తమ యూనియన్లను ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయాలని నిర్ణయించుకున్నాయి. వీరి కోరిక ననుసరించి 1947లో కలకత్తాలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. సమావేశంలో ఈ రెండు యూనియన్లను ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయాలని నిర్ణయించడం జరిగింది.

కార్మికవర్గం, ప్రజా బాహుళ్యం బ్రహ్మాండమైన పోరాటాలు సాగిస్తున్న యీ సమయంలో ఎ.ఐ.టి.యు.సి. 22వ మహాసభ 1947 ఫిబ్రవరి 13 నుండి 19 వరకు మిలిటెంట్ పోరాటాలకు కేంద్రమైన కలకత్తాలో జరిగింది. ఈ సమయంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం సాధించిన బ్రహ్మాండమైన పురోగతికి ఎ.ఐ.టి.యు.సి. మహాసభ అద్దం పట్టింది. ఈ మహాసభలో 1049 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభ నాటికి 7,96,194 మంది సభ్యులతో కూడిన 601 యూనియన్లు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడ్డాయి.

జీవించడానికి సరిపడే వేతనం, సాంఘిక సంక్షేమ చర్యలు మొదలయిన డిమాండ్లతో 1947 మార్చి 18వ తేదీన "ప్రాథమిక కోర్కెల దినం" పాటించవలసిందిగా ఎ.ఐ.టి.యు.సి. 22వ మహాసభ కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. ఉత్పత్తికి కారకులయిన కార్మికవర్గం చేతిలో అధికారం వుండి, పరిశ్రమలన్నీ జాతిపరం చేయబడి, ఒకరు మరొకరిని దోచుకునే విధానానికి స్వస్తి చెప్పి, ప్రజల అవసరాల కనుగుణంగా ఉత్పత్తిని సాగించే సోషలిస్టు రాజ్యస్థాపనను తన ధ్యేయంగా పునరుద్ఘాటిస్తూ మహాసభ అత్యంత ప్రధానమైన తీర్మానాన్ని ఆమోదించింది.

## భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు

## (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు) ఆవిర్భావం

ప్రజాపోరాటాలు వేగం పుంజుకోవడం, భారతదేశ రాజకీయ పోరాటంలో కార్మికవర్గం చైతన్యవంతమైన పాత్ర నిర్వహించడం వంటి పరిణామాలు కాంగ్రెసు నాయకత్వంపై తీవ్రమైన ప్రభావం కల్గించడంతో వారిలో కమ్యూనిస్టు వ్యతిరేకత మరింత తీవ్రమయింది. వర్గపోరాట సిద్ధాంతం కాంగ్రెసుకు సవాలుగా పరిణమించడంతో గతంలో ఎ.ఐ.టి.యు.సి. మహాసభలో వర్గపోరాట దృక్పథాన్ని గట్టిగా బలపరుస్తూ ప్రసంగించిన నెహ్రూ సైతం దీనిని సహించలేక కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ఉపన్యాసాలిచ్చాడు. కాంగ్రెసు సోషలిస్టు నాయకత్వం కూడా కమ్యూనిస్టు వ్యతిరేక, సోవియట్ వ్యతిరేక నిందా ప్రచారాన్ని విపరీతంగా సాగించి, కమ్యూనిస్టులతో బహిరంగంగానే ఘర్షణకు దిగింది.

1946 సంII ప్రారంభంలో ఎన్నికలలో విజయం సాధించిన కాంగ్రెస్ పంజాబు, సింధు, బెంగాలు మినహా మిగిలినచోట్ల ప్రాంతీయ మంత్రి వర్గాలు నెలకొల్పింది. మరల అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు మంత్రివర్గాలు, 1937లో తామనుసరించిన పచ్చి కార్మిక వ్యతిరేక వైఖరినే మరల అవలంబించాయి. కార్మికులు రిట్రెంచ్‌మెంటుకు వ్యతిరేకంగా, కరువు భత్యం కొరకు, ఇతర సమస్యల పరిష్కారానికి గత్యంతరం లేక పోరాటాలు సాగించవలసివచ్చింది.

సమస్యలతో సతమతమవుతున్న కార్మికుల కష్టాలను తొలగించడానికి చొరవ తీసుకునేందుకు బదులు కాంగ్రెసు, కాంగ్రెసేతర మంత్రివర్గాలు ఈ పోరాటాలను తీవ్రంగా వ్యతిరేకించాయి.

సమ్మెలు మానుకొనవలసిందిగా కార్మికులకు ఉచిత సలహాలివ్వడంతో ఆగక, వీరు సమ్మెల వలన కార్మికుల సమస్యలు పరిష్కరింపబడకపోగా మరింత జటిల మవుతాయని చెప్పసాగారు. కాని ఈ సలహాలను లెక్కచేయక కార్మికులు పోరాట పంథా ననుసరించినపుడు ఈ పోరాటాల నణచే ప్రయత్నంలో పోలీసులచే అత్యాచారాలు సాగింపచేయడానికి కూడా ఈ మంత్రివర్గాలు వెనుదీయలేదు.

బొంబాయిలోని కాంగ్రెసు మంత్రివర్గం చేసిన 1946 పారిశ్రామిక సంబంధాల చట్టం ఈ మంత్రివర్గపు ప్రజాస్వామ్య వ్యతిరేక, కార్మిక వ్యతిరేక వైఖరికి మచ్చుతునక, కార్మికులను ఆర్బిట్రేషన్ యంత్రాంగానికి పూర్తిగా బద్ధులను చేసి, పోరాటాలను కుంటుపరచడానికే ఈ పారిశ్రామిక సంబంధాల చట్టం ఉద్దేశించబడింది. యూనియన్లను గుర్తించడానికి యీ చట్టం నిర్దేశించిన విధానం ఈ మంత్రివర్గపు ప్రజాతంత్ర వ్యతిరేక వైఖరికి ప్రబల నిదర్శనం. రహస్య బ్యాలెటు ద్వారా యూనియన్ గుర్తింపు మంజూరుచేసే ప్రజాస్వామ్య విధానాన్ననుసరించడానికి బదులు, సభ్యత్వ రిజిష్టరుపై ఆధారపడి యూనియన్‌లను గుర్తించే అసంబద్ధ వైఖరిని యీ చట్టం అనుమతిస్తున్నది. అందువలన భారత కార్మికవర్గం ఈ ప్రజాతంత్ర వ్యతిరేక చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది.

ఈ వరస పరిణామాలను పరిశీలించినట్లయితే కార్మికవర్గ సంఘటిత శక్తిని, అభేద్యమైన వారి ఐక్యతను విచ్ఛిన్నంచేసి, కార్మికవర్గాన్ని బలహీనపరచడానికి కాంగ్రెసు నాయకత్వం అతి నేర్పుగా, చాకచక్యంతో చేసిన ప్రయత్నంగా మనం గ్రహించవచ్చు. కార్మికవర్గంలో నానాటికీ పెంపొందుతున్న రాజకీయ చైతన్యం బూర్జువా కాంగ్రెసు నాయకత్వాన్ని భయభ్రాంతులను చేసింది. అందువలన తమ రాజీ, వర్గ సామరస్య సిద్ధాంతాలను నిలబెట్టుకొనడం, కోసం కార్మికవర్గంలో వెనుకబడిన భావాలు గల్గిన వారిని తమవైపు త్రిప్పుకొనడం కాంగ్రెసు నాయకత్వానికి తక్షణ కర్తవ్యమైంది.

ఈ వర్గ రాజకీయాలు కాంగ్రెసు నాయకత్వాన్ని బహిరంగంగానే కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరినవలంబించే స్థితికి తీసుకువెళ్ళాయి. దీనికనుగుణంగానే 1946 డిశంబరు 7 నుండి 11 వరకు కలకత్తాలో సమావేశమైన కాంగ్రెసు వర్కింగ్ కమిటీ కాంగ్రెసు నుండి కమ్యూనిస్టులను తొలగించవలసిందిగా ఆదేశించింది.

కాని యీ సమయానికి భారత రాజకీయ రంగంలో కాంగ్రెసు, ముస్లింలీగ్‌ల తర్వాత కమ్యూనిస్టు పార్టీ మూడవ పెద్ద రాజకీయ శక్తిగా నిలిచింది. 1946లో ప్రొవిన్షియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ 1,12,736 కార్మికుల ఓట్లు సంపాదించుకొనగా, కాంగ్రెసు 3,21,607 ఓట్లు సంపాదించుకో గలిగింది.

ఈ పరిస్థితులలో మరే మాత్రం ఆలస్యం చేసినప్పటికీ వారి వర్గ విధానానికి తీరని హాని జరుగుతుందని భావించిన కాంగ్రెసు నాయకత్వం, తమ స్వంత రాజకీయ, సిద్ధాంత

అవగాహననుసరించి పనిచేసే ఒక ప్రత్యేకమైన కార్మిక వర్గ సంస్థను ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది.

ఈ నిర్ణయాల నమలుచేయడానికి 1947 మే 3,4 తేదీలలో ఢిల్లీలో కాంగ్రెసు మజ్దూర్ సేవక్ సంఘ్ సమావేశం ఏర్పాటు చేసింది. ట్రేడ్ యూనియన్‌లలో పనిచేస్తున్న కాంగ్రెసు నాయకులు, కార్యకర్తలు యీ సమావేశానికి హాజరయ్యారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆహ్వానాన్ననుసరించి దాదాపు ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీలన్నీ తమ ప్రతినిధులనీ సమావేశానికి పంపాయి. ఈ సమావేశంలో ప్రొవెన్షియల్ లేబర్ సబ్ కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

హిందూస్తాన్ మజ్దూర్ సేవక్ సంఘ్ అధ్యక్షుడు శ్రీ వల్లభాయి పటేల్ అధ్యక్షత వహించగా, ఆనాటి జాతీయ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ జె.బి. కృపలాని మహాసభను ప్రారంభించారు. అప్పటికే ట్రేడ్ యూనియన్లలో పనిచేస్తున్న ప్రముఖ కాంగ్రెస్ నాయకులు డా॥ సురేష్‌చంద్ర బెనర్జీ, శ్రీయుతులు గుల్జారీలాల్ నందా, ఖండూభాయ్ దేశాయ్, అబిద్ ఆలీ జాఫర్ భాయ్, హరిహరనాథ్ శాస్త్రి, శివనాథ్ బెనర్జీ, ఆర్.కె.ఖాదిల్కర్ తదితరులీ సమావేశంలో పాల్గొన్నారు. ప్రొవెన్షియల్ మంత్రివర్గ సభ్యులతో సహా శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ, జగ్‌జీవన్‌రామ్ కూడా యీ సమావేశానికి హాజరయిన వారిలో వున్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ శంకరరావుదేవ్, డా॥ రామ్‌మనోహర్ లోహియా, అశోక్‌మెహతా, శ్రీమతి అరుణా అసఫ్ ఆలీ వంటి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులు, తదితర ప్రముఖులీ మహాసభలో పాల్గొన్నారు.

అంతకుముందు ఎ.ఐ.టి.యు.సి.కి మూడుసార్లు అధ్యక్షునికిగా పనిచేసిన డా॥ సురేష్‌చంద్ర బెనర్జీ ఈ మహాసభలో ప్రధాన తీర్మానాన్ని ప్రతిపాదించాడు. “ప్రజాస్వామ్య విధానాలు, శాంతియుత మార్పులను వ్యతిరేకించే వారి నాయకత్వంలో దేశ శ్రామికవర్గ ఉద్యమం నడపబడుతున్న తీరు, ఒక బలమైన, ఆరోగ్యకరమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమ అభివృద్ధికి చాలా అవరోధంగా వుండడమేగాక దేశ ప్రజల వాస్తవ ప్రయోజనాలకు తీరని అపకారం కలిగించేదిగా వున్నది. కార్మికవర్గ శ్రేయస్సును కోరేవారందరూ ఈ కార్మికవర్గ ప్రయోజనాలను కాపాడేందుకు కార్యాచరణకు పూనుకొనడం వారి పవిత్రమైన విధి. అందువలన ఈ ఆశయసిద్ధికి ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనే (INTUC) సంస్థను స్థాపించాలి” అని ఈ తీర్మానం పేర్కొన్నది.

అఖిల భారత స్థాయిలో వేరొక కార్మికవర్గ సంస్థ ఏర్పాటును బలపరచడమే గాక యీ పని ఏనాడో చేయవలసిందని వల్లభాయ్‌పటేల్ తన అధ్యక్షోపన్యాసంలో యీ విధంగా చెప్పాడు. “కమ్యూనిస్టు యూనియన్లు బోగస్ సభ్యత్వాలు చూపించడమేగాక, వారు ఎట్టి అనైతిక పద్ధతులవలంభించడానికైనా వెనుదీయరు. అందువలన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌ను సంస్కరించి, దానిని చేజిక్కించుకునే ప్రయత్నాలు చేయడం వలన ప్రయోజనం లేదు. ఇప్పుడు తీసుకొన్న ఈ చర్య (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ స్థాపన) ఏనాడో తీసుకొనవలసింది.” కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులనన్నింటిని సమీకరించవలసిన

తక్షణావశ్యకతను గూర్చి ఆనాటి బొంబాయి మంత్రివర్గంలోని కార్మికమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా మాట్లాడుతూ "కమ్యూనిస్టులతో విభేదిస్తూ చెల్లాచెదురుగా వున్న వివిధ కార్మిక శక్తులను, సమీకరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం, ఈనాటి తక్షణావసరం" అని అన్నాడు.

కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులన్నింటినీ కూడగట్టడానికి శ్రీ వల్లభాయ్‌పటేల్, శ్రీ గుల్జారీలాల్‌నందా ఎందుకంత తొందరపడుతున్నారు అనే ప్రశ్న ఈ సందర్భంలో ఉదయించక మానదు. భారత కార్మికవర్గ ఉద్యమాన్ని గురించి వ్రాసిన కాంగ్రెస్ చరిత్రకారుడు శ్రీ పి.పి. లక్ష్మణన్ దీనికి పూర్వరంగాన్ని ఎలా వివరించాడో చూద్దాం.

"ఆర్బిట్రేషన్ విధానాన్ని (మధ్యవర్తి పరిష్కారం), కార్మికులు తమ న్యాయమైన కోర్కెల సాధనకు సమ్మె చేయడానికి వ్యతిరేకంగా ఉపయోగించే సాధనంగా ఎ.ఐ.టి.యు.సి.లో ఆధిక్యతగల్గిన సెక్షన్లు తీవ్రమైన ప్రచారం సాగించాయి. ఎ.ఐ.టి.యు.సి.లో చేరడానికి వ్యతిరేకించిన వారికిది తీవ్రమైన వ్యధ కల్గించింది. కార్మిక వివాదాలను పరిష్కారాన్ని మధ్యవర్తి నిర్ణయానికి వదిలి వేయడానికి, వీటిని ట్రిబ్యునల్స్, ఇండస్ట్రియల్ కోర్టులకు నివేదించడానికి ప్రభుత్వానికి అధికారాలిస్తూ, బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం చేయబడ్డాయనే కారణాల వల్ల కలకత్తాలో జరిగిన గత ఎ.ఐ.టి.యు.సి. మహాసభ ఈ చట్టాలను ఖండిస్తూ తీర్మానం ఆమోదించింది. 1946 ఆగస్టు 13వ తేదీన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటించిన కాంగ్రెస్ విధానాలకీ తీర్మానం పూర్తిగా వ్యతిరేకంగా వున్నది."

కార్మిక వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావం గలిగిన ఈ రెండు చట్టాల్లో పారిశ్రామిక వివాదాల చట్టాన్ని 1939లోనూ, బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టాన్ని 1949లోనూ బొంబాయి కాంగ్రెస్ మంత్రివర్గమే చేసిందనే విషయం గమనార్హం. ఈ కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా ఎ.ఐ.టి.యు.సి. ఆమోదించిన ఈ తీర్మానం "కాంగ్రెస్ ప్రకటించుకున్న విధానాలకు వ్యతిరేకంగా" వున్నది. అందువల్ల "సమ్మెలను నివారించాలనే కాంగ్రెస్ విధానాన్ని" విజయవంతంగా అమలు చేయడానికి తనకై ఒక ప్రత్యేక కార్మిక సంస్థను ఏర్పాటు చేయడం తక్షణావసరంగా కాంగ్రెస్ నాయకులు భావించారు. సమ్మెలు, చైతన్యవంతమైన కార్మికవర్గ ఉద్యమం బూర్జువావర్గ ప్రయోజనాలకు భంగకరంగా వున్నాయి. అందువలననే ఒక సమాంతర కార్మికవర్గ సంస్థ ఆవశ్యకత ఏర్పడింది. అంటే బూర్జువా వర్గ ప్రయోజనాల పరిరక్షణకే ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటు చేయబడిందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటును ప్రతిపాదిస్తూ డా॥ సురేష్‌చంద్ర బెనర్జీ ప్రతిపాదించిన తీర్మానం అత్యధిక సంఖ్యాకుల ఆమోదం పొందింది. ఈ విధంగా భారత జాతీయ కాంగ్రెస్‌కు అనుబంధంగా ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐ.ఎన్.టి.యు.సి.) అనే కార్మిక సంస్థ అవతరించింది. డా॥ సురేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షునిగా, శ్రీ ఖండూభాయ్ దేశాయ్ కార్యదర్శిగా, మరో 19 మంది సభ్యులతో ఒక తాత్కాలిక కార్యవర్గం ఈ సమావేశంలో ఎన్నుకొనబడింది. అదనపు సభ్యులను కో-ఆప్ట్ చేసుకొనడానికి

ఈ కార్యవర్గానికి అన్ని హక్కులను ఈ సమావేశం ప్రసాదించింది. ఇప్పటివరకు కేంద్ర కార్మిక సంస్థలకు దూరంగా వ్యవహరిస్తున్న గాంధీజీ స్థాపించిన అహ్మదాబాద్ టెక్స్టైల్ లేబర్ అసోసియేషన్ ఐ.ఎన్.టి.యు.సి.లో చేరింది. అంతేగాక కొత్తగా స్థాపించబడిన ఈ ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లో ప్రధాన భాగంగా వ్యవహరించింది.

దేశ కార్మికవర్గాన్ని చీల్చి, ఒక సమాంతర కేంద్ర కార్మిక సంస్థను ఏర్పాటు చేసిన తమ చర్యలను సమర్ధించుకొనడం కోసం శ్రీయుతులు వల్లభాయిపటేల్, గుల్జారీ లాల్ నందా తదితరులు కమ్యూనిస్టులపై అసత్య ఆరోపణలతో దాడి చేయడం ప్రారంభించారు. కమ్యూనిస్టులను అపఖ్యాతిపాలు చేయడానికుద్దేశించిన యీ నిందాప్రచారానికి కమ్యూనిస్టులు గాక, రాజకీయంగా కమ్యూనిస్టులతో ఏమాత్రం ఏకీభవించని అనుభవజ్ఞుడైన ఒక సంస్కరణవాద కార్మిక నాయకుడు ఘాటైన జవాబివ్వడం ఆసక్తి కల్గించే విషయం. ఆయన మరెవరోకాదు, ఆనాటి ఎ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్.ఎం. జోషి, ఆయన శ్రీ వల్లభాయి పటేల్ తదితరులు చేసిన ఆరోపణలను త్రిప్పి కొడుతూ "క్రొత్తగా ప్రారంభించబడిన యీ ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు వాస్తవానికి భారత జాతీయ కాంగ్రెసుకు జేబు సంస్థ. అందువలన ఏ విధంగా చూచినప్పటికీ యిది ఎ.ఐ.టి.యు.సి. వలే ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క రాజకీయాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించని సంస్థ కాదు. ఇది కార్మికవర్గానికి ప్రాతినిధ్యం వహించలేదు. ఎ.ఐ.టి.యు.సి.లో ఈనాడు కమ్యూనిస్టులు ఆధిక్యతలో వుండవచ్చు. కాని ఎ.ఐ.టి.యు.సి.లో తీసుకున్న అన్ని నిర్ణయాలు ఎ.ఐ.టి.యు.సి. మొత్తంగా తీసుకున్నవి మాత్రమే సమస్యలను సానుభూతితో పరిశీలించి వెంటనే పరిష్కరించడం మినహా ఈనాటి ఈ గడ్డు పరిస్థితులకు నివారణోపాయం లేదు. కాని దురదృష్టవశాత్తు, పిచ్చెత్తిన కాంగ్రెసు మంత్రివర్గాలు కార్మికవర్గాన్ని చీల్చడమే ఈ విషమ పరిస్థితులకు తరుణోపాయంగా భావిస్తున్నాయి. వాస్తవాలను చూచిన తరువాత వారు సత్యాన్ని గ్రహిస్తారు, నేర్చుకుంటారు, కాని యీలోగా జరుగవలసిన హాని జరగనే జరిగింది" అని ప్రకటించాడు.

కాంగ్రెసు పేరు ప్రఖ్యాతులను కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాల అధికార యంత్రాంగం ఇతర హంగులను, పూర్తిగా ఉపయోగించుకుని యజమానుల పూర్తి అండదండలు, ఆశీస్సులతో ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి.కి సిద్ధాంతపరంగా వ్యతిరేకమైన ఒక సంస్థగా అవతరించింది. ఐ.ఎన్.టి.యు.సి.కి యజమానుల ఆశీస్సులు, అండదండలు సంపూర్ణంగా లభించాయి. వర్గపోరాట సిద్ధాంతానికి పూర్తిగా భిన్నంగా వర్గ సామరస్య సిద్ధాంతాన్ని అవలంబించే ఐ.ఎన్.టి.యు.సి. స్థాపించబడడంతో భారత శ్రామికోద్యమ చరిత్రలో అనేక వినూత్న పరిణామాలకు దారితీసే నూతనాధ్యాయం ప్రారంభమయింది.

## చారిత్రాత్మక పున్నప్ర - వాయలార్ కార్మికవర్గ పోరాటం

కేరళలోని పున్నప్ర మరియు వాయలార్ కేంద్రాల్లో పోరాటం పతాకస్థాయికి చేరుకుంది. పున్నప్ర పశ్చిమతీరంలో సముద్రానికి దగ్గరగా వుంటుంది. 1930వ దశకం రెండవ అర్ధభాగంలో అక్కడొక పెద్ద కాథలిక్ చర్చి వుండేది. దాదాపుగా ఈ ప్రాంతంలోని కొబ్బరితోటలన్నీ ఈ

చర్చితో పాటు కొద్ది మంది ఫ్యూడల్ భూస్వాముల చేతుల్లో ఉండేవి.  ఈ తోటల్లో పనిచేసే కౌలుదార్లు విసిరివేసినట్లు దూరం దూరంగా వున్న పూరిళ్ళలో నివాసముండేవారు. చేపలు పట్టేందుకుపయోగించే పరికరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపయోగించే నాటు పడవలు భూస్వాముల అధీనంలో వుండేవి.  వీరు మత్స్యకారులకు అద్దెకిస్తుంటారు. ఈ భూస్వాములు నిరంతరం తగాదాల్లో మునిగి తేలుతుండేవారు. ఈ తగాదాలను తీర్చుకోవడానికి తమ అధీనంలోని పేద మత్స్యకారులను ఈ తగాదాల్లోకి లాగి, వారు పరస్పరం కొట్టుకునేలా చేసేవారు. భూస్వాములు వీరితో చేసుకున్న ఒప్పందాల్లోని అంశాలను కుట్ర పూరిత పద్ధతిలో మార్పులు చేసి, ఈ పేద మత్స్యకారులను ఒకరకంగా కౌలుదార్లు లేదా భూమికి కట్టుబడిన వ్యవసాయ కూలీలవలె, బానిసలుగా తమ అధీనంలో వుంచుకునేవారు. వీరు కడుపునిండా తిండికి కూడ నోచుకోక, దుర్భర జీవితం గడుపుతుండేవారు. పున్నప్రలోని వివిధ తరగతుల ప్రజల మీద, సమాజంలోని అన్ని వ్యవహారాల మీద, అత్యధిక భూమి మీద యాజమాన్యం గల్గిన చర్చి ఆధిపత్యం చెలాయిస్తోంది. 1936 ప్రారంభంలోనే తమ విధేయులందరినీ చర్చి ఆవరణలోకి రావల్సిందిగా ఆదేశిస్తూ మతాధికారి చర్చి గంటలు మ్రోగించేవాడు.  స్థానికంగా ఆయనకు ముస్లింలతో వున్న తగాదాలను తేల్చుకునేందుకు సాయుధులైవచ్చి వారి (ముస్లింల) మీద దాడి చేయమని ఆజ్ఞాపించేవాడు.  ఈ హింసాపూరితమైన దాడుల్లో అనేక మంది పేదలు ప్రాణాలు కోల్పోగా పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది.

భూస్వాముల నావల్లో మత్స్యకారులు వేటాడి తెచ్చిన చేపలను పంపిణీ చేసే విధానం చాలా అన్యాయంగా వుండేది. పదకొండు మంది మత్స్యకారుల బృందం వేటాడి తెచ్చిన వేటలో సగ భాగం నావ యజమానికివ్వాలి. మిగిలిన సగభాగం 11 మంది మత్స్యకారులు పంచుకోవాలి. అంటే పట్టి తెచ్చిన వేటలోని సగభాగాన్ని మాత్రమే 11 మంది పంచుకోవాలి.  ఈ వచ్చిన కొద్ది భాగంలోనే ప్రతి మత్స్యకారుడు వివిధ రకాలుగా చర్చి, దేవాలయాలు, చనిపోయినవారి కోసం మరియు కరణవార్ (భూస్వామి కుటుంబ పెద్ద)కు చెల్లించాల్సి వుండేది.  వీళ్ళంతా కైంకర్యం చేసిన తర్వాత మిగిలిందే కష్టపడి చేపలు పట్టిన మత్స్యకార్మికులకు దక్కేది. వేటాడిన చేపలను పంచుకోవడంలో నెలకొనివున్న ఈ అసమానమైన, అసమంజసమైన విధానం ఫలితంగా, కొంత మంది భారీ సంపద ప్రోగుచేసుకుని సమాజంలో ఉన్నత స్థాయికి చేరారు.  ఇప్పలోత్, అంత్రాప్పర్, పాలికార్ప్, పొల్లేవి కుటుంబాలు ఇందుకు ప్రబల తార్కాణాలు. మత్స్యకార్మికుల నుండి చేపలు కొనుగోలు చేసే దళారి వర్తకులు కూడ వీరిని దోచుకునేవారు.

ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త, వామపక్ష ట్రేడ్‌యూనియన్ ఉద్యమ ఆద్యుల్లో ఒకరు సైమన్ ఆసన్, భూస్వాములు, దళారి వర్తకుల దోపిడీ వల్ల తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా మత్స్యకార్మికులు ఏకం కావాల్సిన అవసరాన్ని వివరిస్తూ ఒక కరపత్రం ముద్రించి పంచాడు.  ఆ తర్వాత కొద్ది కాలంలోనే పున్నప్రలోని మత్స్యకార్మికులు, కల్లుగీత కార్మికులు, కొబ్బరిపీచు పరిశ్రమలోని కార్మికులు ట్రేడ్ యూనియన్లు ఏర్పాటు చేసుకున్నారు. సహజంగానే భూస్వాములు, చర్చి మరియు వర్తకులకు ఈ నూతన పరిణామాలు రుచించలేదు. దోపిడీకి గురవుతున్న వర్గాల నుండి క్రమంగా నిరసనలు, ప్రతిఘటనలు తలెత్తడం ప్రారంభమైంది.

## వాయలార్‌లో పరిస్థితి

చెర్తాలా పట్టణానికి సమీపంలో వున్న వాయలార్‌లోని కొబ్బరితోటల్లో చిన్న సెలయేళ్ళు (తోడు) ప్రవహిస్తుంటాయి. ఈ ప్రాంతంలో అత్యంత దారుణమైన ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకుపోయివుంది. 1943లో సంభవించిన కరువు వల్ల, ఈ ప్రాంతంలో చెప్పనలవికానంత దుర్భర పరిస్థితులేర్పడి, అనేక మంది ఆకలి చావులకు బలయ్యారు. కట్టియాట్ శివరామ ఫణిక్కర్, పట్టాతిల్ వేలాయుధన్ కార్తా, ఎ.సి.ఎం. ఆంత్రాపర్, పరయితారకన్మర్ వంటి కొద్దిమంది పెద్ద భూస్వాములు ఆ ప్రాంతంలోని భూమిని స్వంతం చేసుకున్నారు. వీరికి నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్), శ్రీనారాయణ ధర్మ పరిపాలన (ఎస్ఎన్‌డిపి), చర్చి వంటి కుల, మత పరమైన సంస్థల మద్దతు కూడ వుంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కూడ వీరికి మద్దతుగా వుంది. ఈ భూస్వాములందరూ దివాన్‌కు తైనాతీలుగా వుండి, నేరుగా సంబంధాలు కల్గి వున్నారు. పోలీసులు, ప్రభుత్వాధికారులు వీరి సేవలోనే మునిగివుండేవారు. ఎజ్వాకులస్తులు అత్యధికంగా మధ్య తరగతికి చెందివున్నారు. చిన్న రైతులు, కౌలుదార్లు, వ్యవసాయకూలీలు, కాయిర్ కార్మికులు, కల్లుగీత, కొబ్బరి కాయలు కోయడం వంటి చెట్లు ఎక్కి చేసే పనులు చేసేవారు, నేత కార్మికులు వంటి వారు సమాజంలోని అట్టడుగు స్థాయిలో వున్నారు. ప్రభుత్వ ప్రధాన కాంట్రాక్టర్‌గా వున్న ఎసిఎం ఆంత్రపర్, తిరువాన్కూర్ భూమి మరియు ఆస్తుల యజమానుల సంఘం ఉపాధ్యక్షునిగా వున్నాడు. కార్మిక వ్యతిరేక చర్యల కీయన దిట్టగా పేర్గాంచాడు. చెర్తాలా ప్రభుత్వ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా వున్న కట్టియట్ శివరామ ఫణిక్కర్ ప్రముఖ ఎన్ఎస్ఎస్ నాయకుడు, పాటత్తిల్ వేలాయుధన్ కార్తా ఆయన బావమరిది. ఆయన భార్య మొదటి భర్త కొడుకులైన చంద్రప్పన్, కృష్ణప్పన్‌లు అమాయకులైన కౌలుదారులు, వ్యవసాయ కూలీల మీద దాడులు చేయడంలో కార్తాకు మద్దతుగా నిలిచారు. ఎల్లప్పుడూ మారణాయుధాలతో సంచరించే వీరిద్దరూ క్రూరకృత్యాలకు పేర్గాంచారు. వీరు తమ ఇష్టానుసారం కౌలుదారులను భూమినుండి వెళ్ళగొట్టేవారు. కౌలుదారులు కార్తాకు చెల్లించాల్సిన బాకీల పరిష్కారం పేరిట, చిన్న సన్నకారు రైతులు తమ భూములను బలవంతంగా అమ్ముకోవడంగాని, లేదా బదిలీ చేసే విధంగా ఒత్తిడి తెచ్చేవారు. కార్తాతో పాటు ఇతర భూస్వాములకు తొత్తుగా వ్యవహరిస్తున్న కల్లు వీటిల్ కుంజచన్ పీడిత ప్రజల మీద దాడులు చేసేందుకు అరాచక ముఠాలను నిర్వహించేవాడు. ఇది వాయలార్‌లో అనేక హింసాత్మక ఘటనలకు దారి తీసింది.

రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో వాయిలార్‌కు చెందిన అజిక్కల్ ఆంటోనీ అనే వ్యక్తి తాను అధ్యక్షునిగా, ఆయన కుమారుడు కార్యదర్శిగా మత్స్య కార్మిక సంఘం స్థాపించాడు. కొబ్బరి పీచుతో దారం (కాయిర్ యార్న్) పంపిణీని మొత్తంగా తన చెప్పుచేతల్లో వుంచుకునేందుకు రక్షణ కవచంగా ఉపయోగించుకునే కుట్రపూరిత బుద్ధితోనే ఆయన సంఘం స్థాపించాడు. ఆయన ఇంటికి ఒకటిన్నర మైళ్ళ వ్యాసార్థంలో వున్న కొబ్బరి పీచును సేకరించి, దానిని శుద్ధి చేసిన తర్వాత వచ్చిన కాయిర్ యార్న్‌ను ఆయన ఏకపక్షంగా

నిర్ణయించిన ధరకే ఆ ప్రాంతంలోని కార్మికులు అమ్మే విధంగా చేయాలనేది ఆయన అసలు ఉద్దేశ్యం. అప్పట్లో అమలులో ఉన్న వేతనాల్లో కనీసం నాల్గవ వంతు కూడ ఆయన ఏనాడూ చెల్లించలేదు. కార్మికులు నిరసన తెల్పితే, వారి మీద గూండాలతో దాడులు చేయించేవాడు. ఈ నేపథ్యంలో బాధితులను సమీకరించి, ప్రతిఘటనను నిర్మించేందుకు కొందరు అభ్యుదయ వాదులు నిర్ణయించారు. తర్వాత కాలంలో కమ్యూనిస్టు పార్టీలో చేరిన సి.జి.సదాశివన్, కుమారఫణిక్కర్ (తర్వాత కాలంలో వాయలార్ స్టాలిన్‌గా ప్రసిద్ధి పొందాడు) లకు ప్రజల నుండి మంచి మద్దతు లభించింది. సహజంగానే దీనిని సహించలేని భూస్వాములు, వాయలార్‌లోని ఎన్ఎస్ఎస్ కరయోగం ఆఫీసులో సమావేశమై, వెనుక బడిన తరగతులకు చెందిన కార్మికులకు పనులివ్వరాదని, దానికి బదులుగా, భూస్వాముల పొలాల్లోనే అన్ని పనులు చేసే విధంగా నాయర్లకు శిక్షణ ఇవ్వాలని తీర్మానించారు. వారు పనిచేయడానికి 40 పారలు, 60 గంపలు, ఇతర పరికరాలు వారికి అందజేశారు. వ్యవసాయ కార్మికులీప్రయత్నాలను ప్రతిఘటించి, తమనే పని చేయనివ్వాలని, వేతనాలు పెంచాలనీ, కార్యస్థాన్‌లనబడే సూపర్‌వైజర్ల ద్వారా గాక, భూస్వాములే నేరుగా వేతనాలు చెల్లించాలనీ డిమాండు చేశారు.

అదే సమయంలో చెర్తాలా తాలూకా మత్స్య తోజిలాలీ (కార్మిక) సంఘం స్థాపించి, రిజిస్ట్రేషన్‌కు అప్లయి చేయడం జరిగింది. సమావేశం ఏర్పాటు చేయడానికి వారు చేసిన మొదటి ప్రయత్నాన్ని గూండాలు భగ్నం చేశారు. అయితే వారం రోజుల తర్వాత ఏ విధమైన ఆటంకాలు లేకుండా 600 మందికి పైగా కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ విజయం అనేక నూతన యూనియన్ల ఏర్పాటుకు ఉత్తేజాన్నిచ్చింది. చెర్తాలా, వాయలార్, అరూర్, ముహమ్మాలలో భారీ సభ్యత్వంతో ఏర్పడిన 11 ప్రధాన ట్రేడ్ యూనియన్లకు సంబంధించిన వివరాలను కె.సి.జార్జి ఇచ్చారు.

## కుట్టనాడ్ దృశ్యం

తిరువాన్కూర్ ధాన్యాగారంగా ప్రసిద్ధి గాంచిన కుట్టనాడులో శక్తివంతమైన వ్యవసాయ కార్మిక ఉద్యమం అభివృద్ధి చెందింది. దాదాపు కుట్టనాడు లోని భూమి మొత్తం నీటితో నిండి వుంటుంది. విస్తృత స్థాయిలో పొలాల నుండి నీటిని తొలగించడంతో పాటు, పొలాల చుట్టు గట్లు (కట్టలు) నిర్మించడం ద్వారా మాత్రమే అక్కడ వరి ధాన్యం పండించేవీలుంది. అందువల్ల వ్యవసాయానికి కార్మికుల అవసరం ఎక్కువగా వుండడంతో పాటు, చాలా ఖర్చుతోనూ, కష్టనష్టాలతోనూ కూడుకొని వుంది. అయితే సృజనాత్మకత గల్గిన రైతులు, ఈ అవరోధాల నధిగమించి వరి ధాన్యం సేద్యాన్ని అభివృద్ధి చేశారు. కుట్టనాడు, అలప్పూజకు చాలా సమీపంలో వుండడంతో, సహజంగానే పొలంపనుల రోజుల్లో కాయిర్ కార్మికులు (కొబ్బరి పీచు పరిశ్రమలో పని చేసే కార్మికులు) పనుల కోసం కుట్టనాడుకు వలసపోయేవారు. కార్మికులు కుట్టనాడు, అలప్పూజ మధ్య తరచుగా వచ్చి పోతుండడంతో వారు సంఘటితమవడానికి, రాజకీయ అవగాహన, వర్గ చైతన్యం, సంఘీభావ స్వభావం అలవర్చుకునేందుకు దోహదం చేసింది. కుట్టనాడులోని వరిధాన్యం పండించే భూములు పాదశేఖరం (గట్లు వున్నా లేకపోయినా నీటిని

తొలగించడంతో పాటు వ్యవసాయంతో సహా ఉమ్మడి సేద్యానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు నిర్వహించేందుకు యోగ్యమైన) యూనిట్ల పరిధిలోకి వస్తాయి. షెడ్యూల్డ్ కులాలకు చెందిన పులయకులస్తులు భూమిని సేద్యానికి యోగ్యంగా తయారు చేస్తే, ఎజ్వా కులస్తులు విత్తనాలు చల్లి, పంట నూర్చేవారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు వేతనాలు వస్తురూపేణా చెల్లించేవారు.

1942-43 మధ్య కాలంలో కుట్టనాడులో కమ్యూనిస్టు పార్టీ బలమైన శక్తిగా ఎదిగింది. అంతకుముందు కూడ కార్మికులను కులప్రాతిపదికన సమీకరించే ప్రయత్నాలు జరిగాయి. వర్గీస్ వైద్యన్ తిరువాన్కూరు కర్షకతోజిలాలీ(కార్మిక) యూనియన్‌ను స్థాపించాడు. సి.కె.దాస్ దానికి కార్యదర్శి. కుట్టనాడులో సిరియన్ క్రైస్తవులు, బ్రాహ్మణ భూస్వాముల ఆధిక్యత నెలకొని ఉంది. ఫ్యూడల్ భూస్వామ్య కాలంలో భూస్వాములకు (జెన్మీలు), కౌలుదార్లు, వ్యవసాయ కార్మికులకు మధ్య సుహృద్భావ సంబంధాలుండేవని, కమ్యూనిస్టుల ప్రవేశం తర్వాతనే సంబంధాలు దెబ్బతిన్నాయని కొందరు పాతకాలం వాళ్ళు చెప్తుంటారు. భూస్వాములు ఎదురుపడినపుడు తలకు కట్టుకున్న తుండుగుడ్డ (టవెల్)ను తొలగించేందుకు కార్మికులు నిరాకరించడం, మార్పుకు ఒక సంకేతం. భూస్వాముల అహంకారాన్ని సంతృప్తి పర్చడానికి, మీసాలు తొలగించేందుకు నిరాకరించే ధైర్యం చేయడం, వారిలో వస్తున్న మార్పుకు మరో సూచన. నిరక్షరాస్యులైన వ్యవసాయ కార్మికులను రాజకీయంగా చైతన్యపర్చడంతో వారు తమ దుర్భర పరిస్థితులనర్థం చేసుకుని, వాటి నుండి విముక్తి కోరుకుంటున్నారు. కుట్టనాడులో వ్యవసాయ కార్మికులు భూస్వాములను ఘెరావ్ చేసిన సందర్భాలు కూడ వున్నాయి. తమ ఛాతీని తుండుగుడ్డతో కప్పుకునేందుకు లేదా రవికెలు ధరించే ప్రాథమిక హక్కు కూడ నిరాకరించబడడంతో, అనేక సందర్భాల్లో ఈ చర్యలకు మహిళా కార్మికులే చొరవ తీసుకున్నారు. దీనికి ప్రతీకారంగా భూస్వాములు ఆందోళన చేస్తున్న కార్మికుల మీద తప్పుడు కేసులు బనాయించి, పోలీసులను ప్రభావితం చేసి అరెస్టులు చేయించారు.

అలప్పూజ, కుట్టనాడుల్లో అధికారులు సమావేశాలను నిషేధించడంతో కొల్లాం జిల్లాలోని పడనిలంలో సమావేశం ఏర్పాటు చేయాలని నాయకులు నిర్ణయించారు. కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపయోగించే నావలకు ఎఱ్ఱజెండాలు కట్టుకుని, నినాదాలిస్తూ సమావేశ స్థలానికి చేరుకుంటున్నారు. కొల్లామ్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్, వర్గీస్ వైద్యన్‌కు నిషేధపుటుత్తర్వులను చూపడంతో, వారి మధ్య వేడి, వాడి వాగ్వివాదం సాగింది. చివరకు వర్గీస్ వైద్యన్ డిఎస్‌పిని పట్టుకుని త్రోశాడని రిపోర్టు చేయడం జరిగింది. అదృష్టవశాత్తు పోలీసులు ప్రతీకారానికి పాల్పడకుండా, హడావిడిగా రంగం నుండి తప్పుకున్నారు. అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు సమావేశాన్ని పున్నప్రలో వ్యాపారాలు చేసుకునే మార్కెట్ ప్రదేశానికి మార్చడం జరిగింది. ఏదైనా ఆస్తినష్టం జరిగితే నష్టపరిహారం చెల్లించే షరతుమీద సమావేశం అక్కడ ఏర్పాటు చేశారు. పున్నప్రలో వున్న అప్లాన్ ఆరోజ్ కాంగ్రెసు అభిమాని కావడంతో, రాష్ట్ర కాంగ్రెస్ ఈ విషయంలో ఎంతో ఆసక్తిచూపి ఒక విచారణా బృందాన్ని అక్కడకు పంపింది. ఆ రోజుల్లో ఆరోజ్‌తో పాటు పున్నప్రలోని మరో ఇద్దరు, ముగ్గురికి మాత్రమే పక్కా పెంకుటిళ్ళు

వుండేవి. అక్కడి మత్స్య కార్మికుల్లోని పురుషులు చేపల వేటకు వెళ్ళిన సమయంలో, బోటు యజమానులు, వారి కొడుకులు, మత్స్య కార్మికులుండే పూరిళ్ళలోకి దూరి, వారి మహిళల మీద అత్యాచారాలకు పాల్పడేవారు. దీనిని ఇక ఏమ్రాతం సహించలేని మత్స్యకార్మికులు, బోటు యజమానుల ఇళ్ళు, గోడౌన్లు, ఆఫీసుల మీద దాడిచేసి తగులపెట్టడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

## ఆప్లోన్ ఆరోజ్ ఇంటిలోనే రిజర్వ్ పోలీస్ క్యాంప్

పున్నప్రకు ఒక రిజర్వ్ పోలీసు బెటాలియన్‌ను పంపాలని అధికారులు నిర్ణయించడంతో, రిజర్వ్ పోలీసులు పున్నప్రలోని ఆప్లోన్ ఆరోజ్ ఇంటిని బలవంతంగా ఆక్రమించుకుని అక్కడే తిష్టవేశారు. రానున్న ప్రమాదాన్ని పసిగట్టిన కార్మికులు పెద్ద సంఖ్యలో పున్నప్ర నుండి, అలప్పూజ పట్టణానికి ఉత్తరాన రెండు మైళ్ళ దూరంలో వున్న వట్టయాల్ వార్డుకు వలస పోయారు. ఆప్లోన్ ఆరోజ్ కూడ కుటుంబంతో పున్నప్ర వదలి వెళ్ళిపోయాడు. కొన్ని సంవత్సరాల తర్వాత కె.సి.గోవిందన్‌తో మాట్లాడుతూ పోలీస్ క్యాంపును తన ఇంటిలో పెట్టవల్సిందిగా తాను అధికారులను కోరలేదని, తనను, తన కుటుంబాన్ని కాపాడుకోవడానికే, ఇంటిని వదలి వెళ్ళిపోయానని ఆరోజ్ చెప్పాడట. పోలీస్ క్యాంప్ పెట్టిన ఈ ఇంటికి తూర్పు, పడమర దిక్కుల్లో కాలవలు వుండి, బారికేడ్ల వలె పని చేశాయి. కార్మికవర్గం నుండి వచ్చిన సాయుధ వాలంటీర్లకు రిజర్వు పోలీసులకు మధ్య బహిరంగ పోరాటం ఇక్కడే జరిగింది. ఈ పోరాటంలో రిజర్వ్‌పోలీస్ ఇన్స్‌పెక్టర్‌తో సహా, ఇరువైపుల అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనే ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు పునరుద్ధరించేందుకు దివాన్, భారీగా సాయుధ బలగాలను దించేందుకు దారి తీసింది.

## తుది దాడికి సన్నాహాలు

ఈ పరిస్థితులను గురించి చర్చించిన తిరువాన్కూర్ కమ్యూనిస్టు పార్టీ, ప్రాంతీయ కమిటీతో విషయాలను కూలంకషంగా చర్చించేందుకు కె.వి. పత్రోజ్ (ఈయనే తర్వాత కాలంలో కుంతక్కరన్ పాత్రోజ్‌గా పిలవబడ్డాడు)ను కోజిఖోడ్‌కు పంపింది. కె.సి. జార్జ్‌ని అలప్పూజలో వుండవల్సిందిగా కోరడం జరిగింది. ప్రాంతీయ కమిటీలో కొన్ని నిర్మాణ పరమైన సమస్యలుండడం వల్ల పి. కృష్ణ పిళ్ళై ఆ కమిటీని రద్దు చేశారు. మలబార్ కమిటీ బాధ్యతలు పి. కృష్ణపిళ్ళై, కొచ్చిన్ కమిటీ బాధ్యతలు కె.కె. వారియర్, తిరువాన్కూర్ బాధ్యతలు కె.సి.జార్జ్‌లకు అప్పగించడం జరిగింది. ఇక్కడి పరిణామాలను కేంద్ర నాయకత్వానికి వివరించేందుకు కె.సి. జార్జ్‌ని బొంబాయికి పంపడం జరిగింది. ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ అలప్పూజలో పరిణామాలను పరిశీలించి వచ్చి పి. కృష్ణపిళ్ళైకి వివరించారు.

ఇదిలా వుండగా కార్మికులు తమ ఇళ్ళను వదలిపెట్టి ప్రత్యేక శిబిరాలకు వెళ్ళడం ప్రారంభమైంది. ఈ శిబిరాలకు సాయుధ రక్షణ కల్పించారు. పెద్ద సంఖ్యలో వాలంటీర్లను

రిక్రూట్ చేసి, వారికి రాజకీయ అధ్యయన తరగతులు నిర్వహించడంతో పాటు, దాడులను ప్రతిఘటించడంలో శిక్షణతో పాటు తీవ్రమైన శారీరక శిక్షణ కూడా ఇచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధం అయిపోయిన తర్వాత సైన్యం నుండి తొలగించబడిన సైనికులు, యుద్ధం తర్వాత ఉద్యోగాలు లభించని వారు, ఆయుధాలను ఉపయోగించడంలో శిక్షణను ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ శిబిరాల గురించి జాగ్రత్త తీసుకొనేందుకు ట్రేడ్ యూనియన్ కౌన్సిళ్ళను ఏర్పాటు చేశారు. పున్నప్ర, ఫార్మ్, వందనూర్, వట్టయాల్, వడక్కల్, కాలర్‌కోడ్, ఓలాట్టలై, వాయలార్, ఉత్తర వాయలార్, వారక్కాడ్ మరియు కావలన్‌కోడ్‌లలో కార్యాచరణ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఈ శిబిరాల్లోని వాలంటీర్లు, తాము పోరాడి ప్రాణాలర్పించేందుకు కూడ సిద్ధమని ప్రకటించారు.

భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి పి.సి. జోషి ఆ సమయానికి కలకత్తాలో వుండడం వల్ల బొంబాయిలో వున్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు డా॥ అధికారిని కె.సి. జార్జి కలిశారు. తిరువాన్కూర్ కమ్యూనిస్టు పార్టీ తీసుకునే అన్ని నిర్ణయాలకు తమ పూర్తి ఆమోదం వుంటుందని డా॥ అధికారి తెలిపారు. తిరువాన్కూర్ పార్టీ యూనిట్ తీసుకునే కార్యాచరణ ప్రణాళికకు మద్దతుగా నిల్చేందుకు, బొంబాయి, మద్రాసుల్లో రెండు కమిటీలు ఏర్పాటు చేశారు. నాటి మళయాళ మనోరమ పత్రిక సంపాదకుడు, తిరువాన్కూర్ నేషనల్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న మామ్మెన్ మప్పిలాకు తిరువాన్కూర్ దివాన్‌కు మధ్య తీవ్ర వైరుధ్యాలున్నాయి. దివాన్, మప్పిలా అధీనంలోని బ్యాంకును కుప్పకూలే విధంగా చేసి, ఆయనను, ఆయన బంధువులను జైలులో పెట్టి, వారిని శారీరకంగా, మానసికంగా వేధించి, చిత్రహింసల పాలు చేశాడు. కె.సి. జార్జి ఈయనను కలిసి, తమ పోరాటానికి ఆర్థిక సహాయం అర్థించాడు. ఆయన జార్జికి పూర్తి మద్దతు తెల్పాడు. మొదటి విడతగా రూ. 200/-లు విరాళమిచ్చి, మరల సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు.

తిరువాన్కూర్ ప్రభుత్వం కేవలం పోలీసులనే కాక, మిలిటరీని కూడా దించింది. రాబోయే పోరాటానికి సంబంధించిన రాజకీయ అంశాల గురించి నిర్వహిస్తున్న అధ్యయన తరగతులకు ఎస్. కుమరన్, కె.సి. జార్జి మరియు ఎం.టి. చంద్రసేనన్‌లు బాధ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఒ.ఎ. గోవిందన్, సి.ఎ. భరతన్, దివాకర నాసన్, ఎ.కె. శ్రీధరన్, వి.ఆర్. మాధవన్, ఎం.కె. సుకుమారన్, నిక్లావు, ఎ.కె. చక్రపాణి, టి.సి. పద్మనాభన్, ఆర్. థంకప్పన్. టి.కె వేలాయుధన్, కోచునారాయణన్, ఎ.కె. వేలాయుధన్, కందన్ కరుణాకరణ్‌లు పున్నప్రలో కార్యాచరణ కమిటీ ప్రధాన కన్వీనర్లుగా వున్నారు.

## కార్యాచరణ కమిటీ ఈ క్రింది నిర్ణయాలు చేసింది :

1. మన్నన్ చెర్రి, ఆర్యాద్, కోమలాపురంలకు చెందిన వాలంటీర్లు, తన్నీర్ ముక్కమ్‌రోడ్డు గుండా కిదంగంపరంబు మైదానం వరకు కవాతు నిర్వహించి, నిషేధాజ్ఞలనుల్లంఘించి సమావేశం నిర్వహించి వెళ్ళిపోవాలి.

2. కలవూర్, మరారిక్కులమ్, తుంబోలీల నుండి వచ్చే వాలంటీర్లు సవకోటా బ్రిడ్జి మీదుగా పడమరగా బాపు ఉద్యాన్ జంక్షన్ వరకు కవాతుగా వెళ్ళి, అక్కడ నుండి చెదరిపోవాలి.
3. బీచ్, వడక్కల్, కుతిరప్పంతి నుండి వచ్చే వారు బీచ్ ప్రక్కన దక్షిణం వైపుగా వెళ్ళి పోలీస్ క్యాంప్ వద్దకు చేరుకోవాలి.
4. పరూర్, పున్నప్ర నుండి వచ్చే వారు తూర్పు వైపుగా వెళ్ళి పోలీస్ క్యాంప్‌ను చేరుకోవాలి.
5. వందనం నుండి వచ్చే వాలంటీర్లు దక్షిణం నుండి బీచ్ ప్రక్కనే కవాతు చేస్తూ పోలీస్ క్యాంపుకు చేరుకోవాలి.
6. మాజీ సైనికులు పరూర్ మార్కెట్ నుండి పట్టణం వైపుకు కవాతుగా వెళ్ళి అక్కడ నుండి పోలీసు బలగాల కదలికలను అడ్డుకోవాలి.
7. పోలీసులు, మిలిటరీ బలగాల తరలింపును అడ్డుకునేందుకు బ్రిడ్జిలు, చిన్నచిన్న వంతెనలను ధ్వంసం చేయడం, చెట్లు నరికి రోడ్లమీద అడ్డంగా వేయడం వంటి పనుల మీద చుంగోమ్, కాలర్‌కోడ్ జోన్లు కేంద్రీకరించాలి.

## పున్నప్ర వద్ద దృశ్యం

1946 అక్టోబర్ 22న కాయిర్ ఫ్యాక్టరీ కార్మికులు, మత్స్యకారులు, గ్రామీణ ప్రాంతాల్లో నావలు, ఆవిరితో నడిచే నావల మీద పనిచేసే కార్మికులు, ఆయిల్‌మిల్ కార్మికులు, చెట్లు ఎగబాకే పనులు చేసేవారు వంటి అన్ని తరగతుల శ్రమజీవులు వివిధ సైజుల్లో పలు రకాల రాళ్ళతో సహా చేతికందిన ఆయుధాలను దొరక బుచ్చుకుని కదిలారు. ఆహార ధాన్యాలు కూడ సమకూర్చుకుని దీర్ఘకాల పోరాటాలకు కూడ సన్నద్ధమయ్యారు. అక్టోబరు 24వ తేదీన మాజీ సైనికులు తమ సైనిక యూనిఫారాలు, టోపీలు ధరించి, కార్మికవర్గ వాలంటీర్లతో కలిసి కదం తొక్కారు. వందనం నుండి పున్నప్ర రిజర్వ్ పోలీస్ క్యాంపుకు, పారూర్ వైపు నుండి సాగిన కవాతు అలిస్సెర్రీ, బీచ్, వట్టాయల్, వడక్కల్ గుండా ప్రయాణించి కుమారనాసన్ మెమోరియల్ రీడింగ్ రూమ్ ముందున్న కుతీర పంతికి చేరుకున్నాయి. వారందరూ పోక చెట్టు కాండంతో చేసిన ఈటెల వంటి పదునైన ఆయుధాలు ధరించి వున్నారు. పోలీసులు, మిలిటరీ మీద దాడి చేసేందుకు మిలిటరీ పద్ధతుల్లో వారికి క్రమశిక్షణతో కూడిన ట్రైనింగ్ ఇచ్చారు. భవిష్యత్‌లో పోరాటాల్లో ఉపయోగించేందుకు పున్నప్ర పోలీస్ క్యాంప్ మీద దాడి చేసి అక్కడి తుపాకులు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకోవాలని ఎస్. కుమరన్ ఇంటిలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వం సాయుధ బలగాలను తరలించకుండా పున్నప్రకు దారితీసే రోడ్లమీద చెట్ల బోదెలు పడేయాలని కూడ నిర్ణయించారు.

అలప్పూజపట్టణానికి ఉత్తరం నుండి ప్రారంభమైన ప్రదర్శన టిసిఎఫ్ డబ్ల్యుయు (తిరువాన్కూర్ కాయిర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ (TEFWU) ఆఫీసుకు చేరుకునే సరికి, ప్రదర్శన రెండుమైళ్ళ పొడుగున వుంది. ప్రదర్శకులు దివాన్‌కు వ్యతిరేకంగా నినాదాలిచ్చి

వెళ్ళిపోయారు. పోలీసుల వైపు నుండి ఏ విధమైన చర్య లేదు. సాయంత్రానికి యతయన్‌వార్డులోని మత్స్యకార్మిక సంఘం ఆఫీసు నుండి పున్నప్ర పోలీస్ క్యాంప్‌కు ప్రదర్శన ప్రారంభమైంది. అప్పుడు పోలీస్ క్యాంప్‌లో 29 మంది రిజర్వు పోలీసులు, ఒక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేలాయుధన్‌నాడార్ వున్నారు. పున్నప్ర వైపు వెళుతున్న ఒక పోలీస్ వాహనాన్ని కార్మికులు రోడ్డుమీద నిలిపివేశారు. కొన్ని గంటలు ఉద్రిక్తత తరువాత పోలీసు వాహనాలను సురక్షితంగా అలప్పూజకు తీసుకెళ్ళేందుకు, కొన్ని రౌండ్లు కాల్పులు జరిపి గుంపును చెదరగొట్టడం జరిగింది.

ఈ సందర్భంగా ఇంతకు ముందే జరిగిన ఒక సంఘటనను పేర్కొనవల్సి వుంది. అలప్పూజ క్యాంపులో వున్న జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (డిఎస్‌పి) వైద్యనాథ అయ్యర్ తూర్పు ప్రాంతంలో చెల్లా చెదురుగా వున్న కార్మికుల గుడిసెల మధ్య నుండి మిలిటరీ కవాతు నిర్వహించాడు. దారిలో మిలిటరీ, హింసాకాండకు, గృహదహనాలకు పాల్పడింది. దీనితో మహిళలు, పిల్లలు ఇళ్ళు వదలి పారిపోయారు. బీచ్‌వార్డుకు పశ్చిమాన వున్న మత్స్య కార్మిక సంఘం ఆఫీసులో పెద్ద సంఖ్యలో కార్మికులు చేరుకున్నారు. వెంటనే ఆ ప్రాంతం వదలి వెళ్ళవల్సిందిగా డిఎస్‌పి వారిని కోరారు. ఆ ప్రాంతంలోని ప్రజలకు అసౌకర్యం కలుగకుండా బీచ్ ప్రక్కన మిలిటరీ కవాతు నిర్వహించుకోవల్సిందిగా ఆ క్యాంప్‌కు నాయకత్వం వహిస్తున్న మాజీ సైనికుడు కా॥ దేవస్సీ డిఎస్‌పిని కోరాడు. పెద్ద సంఖ్యలో నున్న కార్మికులందరూ దేవస్సీ వెనుక కోటవలె నిలవడంతో, కాల్పులు జరపవల్సిందిగా ఆదేశాలిచ్చేందుకు సిద్ధపడిన డిఎస్‌పి పునరాలోచనలో పడ్డాడు. చివరకు దేవస్సీతో కరచాలనం చేసి, వెనక్కుమళ్ళి బీచ్‌ప్రక్క నుండి కవాతుకు ఆదేశాలిచ్చాడు. అయితే అదేరోజున లాకప్‌లో వున్న ఖైదీల మీద పాశవికంగా దాడిచేయడం ద్వారా డిఎస్‌పి తన కోపం తీర్చుకున్నాడు.

పున్నప్ర పోలీస్ క్యాంప్‌ను చుట్టుముట్టిన సాయుధ వాలంటీర్లను చూచిన పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ వేలాయుధన్ నాడార్, ఏ విధమైన ఇబ్బందులు సృష్టించకుండా వెళ్ళి పోవల్సిందిగా మెగాఫోన్ ద్వారా ఆందోళనా కారులను కోరారు. ఆ క్యాంపు మీద దాడి చేయడానికే తాము వచ్చామని ప్రదర్శకులు బదులిచ్చారు. దీనితో పోలీసులు గాలిలోకి ఒక రౌండు కాల్పులు జరిపారు. ముందుగానే శిక్షణనిచ్చి, ఆదేశించిన విధంగా వాలంటీర్లు వెంటనే నేలపై పడుకొని, ముందుకు పాకి, హఠాత్తుగా లేచి నిలబడి ముందుకు సాగి, తమ ఈటెలు, కొడవళ్ళు, తదితర ఆయుధాలతో ఒక్కసారిగా పోలీసుల మీద దాడిచేశారు. తమ వైపుకు వస్తున్న పోలీసుల మీద కొందరు రాళ్ళు రువ్వారు. "లాల్ సలామ్" అంటూ నినాదాలిచ్చుకుంటూ వాలంటీర్లు ముందుకు సాగారు. ఎవరో పోలీస్ ఇన్స్‌పెక్టర్ వేలాయుధన్ నాయర్‌ను పట్టుకుని పదునైన ఆయుధంతో అక్కడే పొడిచి చంపారు. దీనితో కొద్ది మందిగా వున్న పోలీసులు ముందుకు చొచ్చుకు వస్తున్న వాలంటీర్ల మీద నేరుగానే కాల్పులు జరపవల్సి వచ్చింది. ఈ హింసాత్మక ఘటనలో చాలా మంది చనిపోయారు. కొద్దిమంది పోలీస్‌కానిస్టేబుళ్ళు, తమ ప్రాణాలను కాపాడుకోవడం కోసం ఒక గదిలో దూరి తాళం వేసుకున్నారు. పోలీస్ క్యాంప్ వరండాలోనూ, నేలమీద మృతిచెందిన, గాయపడిన వారి దేహాలు చిందరవందరగా

పడివున్నాయి. ఆత్మరక్షణకు పోలీసులు లోపలి గదుల్లో దాక్కోవడంతో కొంతమంది వాలంటీర్లు, పోలీసులు వదిలివేసిన కొన్ని తుపాకులను తీసుకుని పారిపోయారు. పోలీస్ క్యాంపు మీద దాడిచేసి, సాధ్యమైనన్ని ఆయుధాలను తీసుకుపోవాలనేది వారికిచ్చిన ఆదేశం.

## మరియన్ పాత్ర

పున్నప్ర ఉదంతంలో మరియన్ కూడ ఒక ముఖ్య భూమిక నిర్వహించాడు. మరియన్ కమ్యూనిస్టు పార్టీ లేదా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అభిమానిగాదు. వాలంటీర్లకు ఆయుధ శిక్షణ నివ్వడంలో సహకరించిన మాజీ సైనికుల్లో కొద్ది మంది గూండా ముఠాల్లో చేరి, ప్రభుత్వానికి మద్దతిచ్చారు. కార్మికవర్గ వాలంటీర్లు పోలీస్ క్యాంప్‌కు చేరినప్పుడు, అక్కడే వుండడం తటస్థించిన మరియన్ ఒక తుపాకి దొరకపుచ్చుకుని, తూటాలన్నీ అయిపోయే వరకు కాల్పులు జరిపాడని వదంతులున్నాయి. ఇది కార్మికులను రెచ్చగొట్టింది.

ఈ హింసాత్మక ఘటన అనంతరం, క్యాంపులో మిగిలిన పోలీసులు, డిఎస్‌పిని కలిసి, ఈ సంఘటనలను గురించి నివేదించవల్సిందిగా మరియన్‌ను ఆదేశించారు. పెట్రోమాక్స్‌లైటు కోసం వెళ్ళిన క్యాంప్ వంటవాడు తిరిగి రాలేదు. క్యాంప్, పరిసరాలు అంధకారంలో వున్నాయి. చనిపోయిన వారి శరీరాలు, క్షతగాత్రుల శరీరాలు చిందరవందరగా పడివున్నాయి. తప్పించుకునేందుకు నేలమీద ప్రాకుతున్న కొందరు క్షతగాత్రులను, మిగిలిన పోలీసులు తమ బాయ్‌నెట్లతో పొడిచి కొందరిని చంపి వేశారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.

ఈ సంఘటనల గురించి డిఎస్‌పికి వివరించేందుకు, అలప్పూజ ట్రావెలర్స్ బంగ్లాకు వెళ్ళేందుకు మరియన్ అంగీకరించాడు. పోలీసు క్యాంప్ మీద దాడి చేసిన వారిలో తాను కూడ ఒకడినని వాలంటీర్లను మోసపుచ్చే ఉద్దేశంతో మరియన్ వాలంటీర్లు వాడిన రక్తపు మరకలున్న ఈటెలను, మరొక పదునైన ఆయుధాన్ని పట్టుకుని వెళ్ళాడు. దక్షిణ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిన మరియన్‌ను చూచిన పోలీసులు, తమ మీద దాడిచేయడానికి ఆయనతో చాలా మంది వాలంటీర్లు వస్తున్నారని భయపడ్డారు. అయితే నిజ జీవితంలో దివాన్‌కు అనుకూలునిగా ఉంటూ, తమకు సమాచారం అందించే (ఇన్‌ఫార్మర్) మరియన్‌ను వారు వెంటనే గుర్తించారు. అలప్పూజ వెళ్ళి డిఎస్‌పి వేలాయుధ అయ్యర్ స్వామికి సంఘటనల గురించి నేరుగా నివేదించాల్సిందిగా, వారు మరియన్‌ను కోరారు. మరియన్ చెప్పింది విన్న డిఎస్‌పి తల తిరిగిపోయింది. అయితే వెంటనే స్థైర్యం కూడగట్టుకొని, పెద్ద సాయుధ కానిస్టేబుళ్ళ బృందంతో, చాలా పెట్రోమాక్స్ లైట్లతో పున్నప్రకు వెళ్ళాలని నిర్ణయించాడు. దారిలో కమ్యూనిస్టు వాలంటీర్లు ఉపయోగించిన (గ్రామీణులు తయారు చేసిన) ఈటెలు ఛాతిలో గుచ్చుకుని నేలమీద పడివున్న ఇద్దరు, ముగ్గురు పోలీసులను వారు చూచారు. పున్నప్ర పోలీస్‌స్టేషన్ క్యాంప్‌లోనే వారు సబ్ ఇన్‌స్పెక్టర్ వేలాయుధన్ నాడార్ మృతదేహాన్ని కనుగొన్నారు. దాడితో చనిపోయిన వారి దేహాలు

చెల్లాచెదురుగా పడివుండటంతో డిఎస్‌పి ఆయన బృందం క్యాంప్ భవనాన్ని చేరడం చాలా కష్టమైంది. ఎల్లప్పుడు ప్రభుభక్తిని చాటుకున్నందుకు మరియన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌తో సత్కరించింది. పున్నప్ర రిజర్వ్ పోలీస్ క్యాంప్ మీద జరిగిన దాడితో ఏమాత్రం సంబంధంలేని, అనేక మంది అమాయకులైన యువకులు, వృద్ధులను అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేయడం పట్ల తాను చాలా చింతిస్తున్నట్లు పశ్చాత్తాప పడ్తున్నట్లు కె.సి. జార్జ్, ఎం.టి. చంద్రసేనన్‌లతో మరియన్ చెప్పాడని వదంతులున్నాయి.

## పున్నప్ర పోరాట యోధులు

పున్నప్రలోని రిజర్వు పోలీస్‌క్యాంప్ మీద జరిగిన దాడిలో అనేక మంది నిబద్ధత గల్గిన వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ దాడి ప్రధాన వ్యూహకర్త కె.సి. జార్జ్ ఈ క్రింది వారిని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. వాలంటీర్ కెప్టెన్ పి.కె. దామోదరన్, కన్వీనర్ ఎం.టి. చంద్రసేనన్‌లతో పాటు కుట్టన్, ఒలాంత కృష్ణన్ కుంజు, రామకృష్ణన్, గంగాధరన్, వి.కె. శ్రీధరన్, సి.కె. ఒనవన్, ఎం.కె.చక్రపాణి, ఎ.ఎస్. శ్రీధరన్, కెజి నిక్లవ్, ఎన్.కె. గోపాలన్, టి.సి. పద్మనాభన్, అలిస్సెరీ రాఘవన్, కె.పి. ఫల్గుణన్, ఎం.ఎ. థామస్, కె.బి. దామోదరన్, మైకేల్, వి.వి. థామస్, కెప్టెన్ చాకో, క్రిష్టన్, గోపాలన్, ఎం.కె. లక్ష్మణన్, కె.జి. మాధవన్, జాన్‌కుట్టి, కూనన్ జలిక్కరిల్ సుకుమారన్, కుంజున్నీ, వెంగర కుమరన్, లూయీస్ ప్రేమణి, గంగాధరన్ ప్రేమణి, కందచన్, పాత్రోజ్, కక్కరియల్ కరుణాకరన్ వంటి పోరాట వీరులనీ సందర్భంగా ఈ దాడికి ప్రధాన వ్యూహకర్త కె.సి. జార్జ్ జ్ఞప్తికి తెచ్చుకున్నారు. వీరిలో ఇన్స్‌పెక్టర్ వేలాయుధన్ నాడార్‌ను చంపాడన్న ఆరోపణ మీద ఎం.కె. చక్రపాణికి 21 సంవత్సరాలు కఠిన జైలుశిక్ష విధించారు. ఆయనతోపాటు ఎ.ఎస్. శ్రీధరన్‌కు కూడా కఠిన కారాగార శిక్ష విధించారు.

## ముహమ్మా కార్యాచరణ

సి.కె. కరుణాకర ఫణిక్కర్ అధ్యక్షునిగా, ఎస్.కె.దాస్ కార్యదర్శిగా ముహమ్మాకాయిర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ పనిచేస్తోంది. అయ్యప్పన్ కన్వీనర్‌గా, కెజి చక్రపాణి వాలంటీర్ కెప్టెన్‌గా, కె. దామోదరన్, మాధవన్, టి.కె. నారాయణన్ తదితరులు ప్రధాన సభ్యులుగా కార్యాచరణ దళాన్ని నిర్మించారు. తమ కెప్టెన్ నుండి ఆదేశం వస్తే ఎంతటి సాహసానికైనా పూనుకునే సుమారు 500 మంది ఈ దళంలో వున్నారు. పోకచెట్టు కాండంతో చేసిన ముతకరకం ఈటెలతో సహా గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే ప్రాణాంతకమైన అన్ని రకాల ఆయుధాలను ఈ బృందం సమకూర్చుకుంది. పోలీసులు, మిలటరీతో కూడిన పెద్ద దళం ముహమ్మా రానున్నట్లు, స్థానిక భూస్వామి చంద్రంగదన్ ఇంట్లోనే క్యాంప్ పెట్టనున్నట్లు అక్టోబర్ 24 (కేరళ క్యాలెండర్ ప్రకారం తులం7)న సమాచారమందింది. తమ కెప్టెన్ నాయకత్వంలో క్యాంప్‌కు ప్రదర్శన నిర్వహించాలని వాలంటీర్లు నిర్ణయించారు. వీరు యాలియవెలియిల్ చేరుకునేసరికి, ఈ వార్త పోలీసులకు, మిలటరీకి తెలియడంతో వారు క్యాంప్‌ను వదలి వెళ్ళిపోయారు. ఆ విధంగా ఘర్షణ నివారించబడింది.

## కట్టూర్ క్యాంపులో కార్యాచరణ

పున్నప్ర ఉదంతం, అనేక పరిసర ప్రాంతాల్లో చెదురుమదురు సంఘటనలను రేకెత్తించింది. అక్టోబరు 24న ముహమ్మా కార్యాచరణ కమిటీ, మయితార కాయిర్ ఫ్యాక్టరీ వద్ద నున్న చిన్న వంతెనకు సమీపంలోని రహదారిని ధ్వంసం చేయాల్సిందిగా వాలంటీర్లను ఆదేశించింది. పోలీసులు కాల్పులు జరిపినప్పటికీ ఏ విధమైన నష్టం జరగలేదు. అక్టోబరు 25న అంబాలప్పూజ – చెర్తాలా తాలూకాలో మిలిటరీ పాలన విధించారు. అదే రోజున కట్టూరులో పోలీసులు, మిలిటరీ తీవ్ర గాలింపులు సాగించారు. మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో పెద్ద మిలిటరీ దళమొకటి, బీచ్ ప్రక్కన వున్న చర్చికి సమీపంలోని కట్టూరు క్యాంపు వైపు కవాతు నిర్వహిస్తోంది. కురిత్రం జోసెఫ్‌గా ప్రజలు చెప్పుకొనే జోసెఫ్ ఆ కవాతుకు అభ్యంతరం తెలియచేయగానే ఆయనను కాల్చివేశారు. పల్లిపరం బిల్ ఆంటోని, కట్టూర్ జోసెఫ్‌లు అదే రోజున అమరులయ్యారు.

## పున్నప్ర - వాయలార్ తిరుగుబాటు ముగింపు

అలప్పూజ, అంబాలప్పూజ, ముహమ్మా, చెర్తాలా, వాయలార్‌లలోని వందలాది మందిని పొట్టన పెట్టుకుని, వేలాది కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసి, పున్నప్ర – వాయలార్ తిరుగుబాటును అణచివేసేందుకు దివాన్ రచించిన వ్యూహాన్ని, ఆయన విశ్వాసపాత్రులైన ఇన్స్‌పెక్టర్ జనరల్ (ఐ.జి), జిల్లా పోలీస్ సూపరిండెంటెంట్‌ల నాయకత్వంలో తిరువాన్కూరు సైన్యం అమలు చేసింది. తగినంత శిక్షణలేని అణచివేతకు గురవుతున్న కార్మికులు, కౌలుదార్లతో ఏర్పాటైన సాయుధ వాలంటీర్స్ దళాలకు తగినంత శిక్షణ కూడా లేకపోవడంతో, ఈ దళాల దాడులను ఉన్నత స్థాయి శిక్షణ గల్గిన సాయుధ సైన్యం తుడిచిపెట్టగలిగింది. శక్తివంతమైన ప్రభుత్వ సైన్యం ముందు వాలంటీర్ దళాలు నిలవలేవని కొందరు ప్రారంభంలోనే అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ పాలకవర్గాలు సాగిస్తున్న అణచివేతను, దోపిడీని ఇక ఏమాత్రం భరించలేని స్థితికి చేరడం వల్ల వారు యుద్ధరంగంలోకి దూకారు. శత్రువును ఎదుర్కొనేందుకు తగినంత శక్తిని కూడగట్టుకునే వరకు కార్యాచరణను ఆలస్యం చేయాలని కొందరు నాయకులు తమ సహచరులను కోరారు. మిలిటరీ ఉపయోగించే తుపాకుల్లో బుల్లెట్లు వుండవు, కనుక, తుపాకుల గురించి భయపడనవసరం లేదని, అందువల్ల సైనికులను చంపడానికి పోకచెట్ల కాండంతో గ్రామాల్లో చేసుకున్న ఈటెలే సరిపోతాయని, సైనికులను చంపిన తరువాత వారి తుపాకులను, మందుగుండును స్వాధీనం చేసుకుని, వాటిని నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే సాయుధ తిరుగుబాటుకు వినియోగించవచ్చునని, అనేక వాలంటీర్ క్యాంపుల్లో సభ్యులకు చెప్పినట్లు ఆరోపణలు వచ్చాయి.

పున్నప్ర – వాయలార్ తిరుగుబాటుకు బాధ్యత వహిస్తున్న సాధారణ కార్యాచరణ కమిటీ సమావేశమై, అన్ని వాలంటీర్ క్యాంపులను మూసివేయాలని, అరెస్టుల నుండి తప్పించుకునేందుకు నాయకత్వం అజ్ఞాతవాసంలోకి వెళ్ళాలని నిర్ణయించింది. అక్టోబర్ 29వ తేదీన అలప్పూజలో బసచేసిన ఇన్స్‌పెక్టర్ జనరల్ పార్థసారథి అయ్యంగార్, ఎ.వి. థామస్

అండ్ కంపెనీ జనరల్ మేనేజర్ శ్రీనివాస అయ్యర్‌ను తన ప్రతినిధిగా టి.వి. థామస్ వద్దకు పంపి, ట్రావెలర్స్ బంగ్లాలో ఐ.జి.ని కలవవలసిందిగా కోరడం జరిగింది. అందుకు అంగీకరించిన టి.వి. థామస్, టిబికి చేరుకునేసరికి జిఒసి కూడా అక్కడే వున్నాడు. థామస్ ఐజి గదిలోకి వెళ్ళి మాట్లాడడం ప్రారంభించాడు. సరిగ్గా అదే సమయంలో ఒక పోలీస్ వచ్చి జిఒసి గదిలోకి వెళ్ళవలసిందిగా ఐజిని కోరాడు. కొద్దిసేపటి తర్వాత తిరిగివచ్చిన ఐ.జి, సంభాషణలు కొనసాగించేందుకది సరియైన సమయం కాదని తెలిపాడు. అలాంటప్పుడసలు తననెందుకు పిలిచారని థామస్ ఆయనను ప్రశ్నించాడు. సరైన సమాధానం రాలేదు. థామస్ ఇంటికి వెళ్ళిపోయాడు.

## టి.వి. థామస్ అరెస్ట్

మరుసటి రోజు ఉదయం ఒక పెద్ద మిలిటరీ బృందం టివి థామస్ ఇంటికి చేరుకుంది. ఆయనను అరెస్టు చేయనున్నామని, సివిల్ జైలుకు తీసుకెళ్ళవలసిందిగా ఆదేశాలున్నాయని ఆయనకు చెప్పారు. కొద్దిగా సమయం ఇచ్చినట్లయితే, తాను కాలకృత్యాలు ముగించుకుని, బట్టలు ధరించి ప్రయాణానికి సిద్ధమవుతానని థామస్ అధికారులకు ప్రశాంతంగా తెలియజేశారు. వారు ఆయనకందుకు అనుమతించారు. ఇంతలోనే సైన్యం టి.వి. థామస్ ఇంటిని చుట్టుముట్టి, బయటివారు లోపలికి, లోపలి వారు బయటికి వెళ్ళకుండా కట్టడిచేసింది, థామస్‌ను మిలిటరీ వాహనం వద్దకు తీసుకెళ్ళగానే, టి.వి. కుటుంబ సభ్యులను, ఇంటి నుండి బయటికి వెళ్ళవలసిందిగా ఆదేశించారు. ముగ్గురు పెళ్ళికాని సోదరీమణులతో సహా టి.వి. కుటుంబ సభ్యులను కట్టుబట్టలతో వెళ్ళగొట్టారు. టి.వి. ఇంటిని కొల్లగొట్టి తలుపులన్నీ బిగించి, గట్టి తాళం వేశారు. చివరకు పశువుల కొట్టంలోని ఆవులను వెళ్ళగొట్టి, బందెల దొడ్డిలో బంధించారు. టి.వి.కి పొరుగునే వున్న డా॥ ఎలయమ్మ టి.వి. కుటుంబానికి ఆశ్రయం కల్పించింది. ప్రజల భావాలనర్థం చేసుకోలేని దివాన్ క్రూరత్వాన్నీ ఘటన వెల్లడిస్తోంది. గతంలో భక్తివిలాస్ భవనంలో వారిరువురు కలిసినప్పుడు టి.వి.కి దివాన్ చేసిన ఆకర్షణీయమైన ప్రతిపాదనలకు గానీ, ఆయన బెదిరింపులకు గాని టి.వి. లొంగకపోవడంతో ఈ విధంగా టి.వి. థామస్ మీద దివాన్ కక్షతీర్చుకున్నాడు.

టి.వి. థామస్‌ను అలప్పూజ సివిల్ జైలుకు తరలించారు. తాను పారిపోనని థామస్ వాగ్దానం చేసినట్లయితే, జైలు లాకప్‌లో పెట్టవల్సిందిగా పోలీసులను ఆదేశించనని, జిల్లా జడ్జి మమ్మెన్ థరకన్ చెప్పారు. ఇందుకు థామస్ నవ్వి వూరుకున్నారు. మరో రెండు గంటలలోగానే పి.కె. పద్మనాభన్‌ను కూడ అరెస్టు చేసి సివిల్ జైలుకు తెచ్చారు. అర్ధరాత్రి కల్లా టి.వి. థామస్, పద్మనాభన్‌లను తిరువనంతపురంలోని పంగోడె వద్దనున్న మిలిటరీ క్యాంప్‌కు తరలించారు. మరుసటి రోజు వారిని సెంట్రల్ జైలుకు పంపారు. పదిరోజుల తరువాత మరలా వారిని అలప్పూజకు తీసుకెళ్ళారు.

నిజానికి ఒక రాజకీయ పరిష్కారానికి వచ్చేందుకు థామస్‌తో చర్చలు జరిపేందుకు, ఆయన అరెస్టును వాయిదా వేయాలని దివాన్ భావించినట్లు వార్తలొచ్చాయి. థామస్ అరెస్టు

తర్వాత ఆల్ ట్రావన్కూర్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎటిటియుసి), దాని అనుబంధ సంఘాలన్నింటిమీద ప్రభుత్వం నిషేధం విధించింది. దీని తర్వాత నవంబరు 1న (తులం 14న) సార్వత్రిక సమ్మె అధికారికంగా ఉపసంహరింపబడింది. నవంబర్ 13వ తేదీన (తులం 26న) ప్రభుత్వం మిలిటరీ పాలన నెత్తివేసింది.

కుట్టప్పన్, ఫ్రాంచీ మరియు పి.కె. దామోదరన్‌లకు ఉరిశిక్షతో పాటుమరో 27 మందికి కఠిన జైలుశిక్ష విధింపుతో నాడార్ హత్య కేసు ముగింపుకు వచ్చింది. పి.కె దామోదరన్‌ను ప్రజలు అభిమానం కోలమారమ్ దామోదరన్ అని పిలుచుకునేవారు. ఈ కేసులో నిందితులైన మరో 47 మంది విడుదలకు కోర్టు ఆదేశించింది. మరణశిక్ష విధించబడిన వారు దానికి వ్యతిరేకంగా అప్పీలు చేసుకున్నారు. వారు గెలవడంతో, వారి శిక్షను కఠిన జైలుశిక్షకు తగ్గించడం జరిగింది. అయితే 8సంవత్సరాలు జైలులో గడిపిన తరువాత అంటే 1954లో పైన పేర్కొన్న ముగ్గురు కామ్రేడ్స్‌ను విడుదల చేశారు. కోర్టుల్లో నిందితుల డిఫెన్స్ నిమిత్తం కాంగ్రెస్‌పార్టీ డిఫెన్స్ బృందాలను పంపడం గాని, నిధులు సమకూర్చడం గాని చేయలేదు. కల్లార్ – పంగోడే తిరుగుబాటు హింసాయుత స్వభావం కల్గియున్నదన్న కారణంతో రాష్ట్ర కాంగ్రెస్ తమ కేసును వదులుకోవల్సి వచ్చిందని కె.సి. జార్జి అనుమానించారు.

## కేరళలో ప్రథమ రాజకీయ సమ్మె

బాధ్యతాయుత ప్రభుత్వసాధనకు, దివాన్ పాలనకు చరమగీతం పాడేందుకు, ప్రత్యక్ష కార్యాచరణతోపాటు, అవసరమైతే పాలకులతో హింసాయుత ఘర్షణలకు కూడా పూనుకోవడం ద్వారా పోరాటాన్ని ఉధృతం చేయాలని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యకర్తలు అభిప్రాయ పడ్డారు. పోరాటాలంటే పెద్దగా ఆశక్తి చూపని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వాన్ని వీరు నమ్మడం లేదు. త్రిసూర్‌లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్టు కార్యకర్తల సమావేశానికి ఎస్‌వి ఘాటే హాజరయ్యారు. అప్పటికే నిషేధించబడిన భారత కమ్యూనిస్టుపార్టీ శాఖను పి. కృష్ణపిళ్ళై, ఇఎంఎస్ నంబూద్రిపాద్, కె. దామోదరన్, ఎన్.సి. శేఖర్‌లు కేరళలో ఏర్పాటు చేశారు. వీరందరూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సభ్యులే. కేరళలో జరుగుతున్న పోరాటం, అఖిలభారత స్థాయిలో జరుగుతున్న జాతీయోద్యమ పోరాటంలో భాగమని, దీనిలో కార్మికవర్గం నాయకత్వ పాత్ర వహించాలని, ఇందుకు కార్మికవర్గాన్ని రాజకీయంగా చైతన్యవంతం చేయాలని త్రిసూద్ సమావేశం ప్రకటించింది. ఈ నిర్ణయానికనుగుణంగా చిందన్, కె.కె. వారియర్, టి.కె.రాజు, కె. దామోదరన్, పద్మనాభన్, అజీజ్ తదితరులను అలప్పూజకు కేటాయించడం జరిగింది. పద్మనాభన్, అజీజ్‌లు రెడ్ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వవల్సి వుండగా, వీరు కొద్ది కాలంలోనే 5000 మంది రెడ్ వాలంటీర్ల దళాన్ని తయారుచేశారు. కా॥ పి. కృష్ణపిళ్ళై నాయకత్వంలో సమ్మె కమిటీలు, వార్డు కమిటీలు, ఫ్యాక్టరీ కమిటీలు, ప్రచార కమిటీలు, బహిరంగంగానూ, రహస్యంగానూ ఏర్పాటు చేయబడ్డాయి. కేరళ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే, ప్రజా పోరాటాలు సాగుతున్న దాదాపు అన్ని కేంద్రాలను బహిరంగంగానూ, కొన్ని సందర్భాల్లో అరెస్టు కాకుండా తప్పించుకునేందుకు మారు వేషాల్లోనూ సంచరించడం చూస్తే, పి. కృష్ణపిళ్ళై నిర్విరామ కృషి, పట్టుదలతో కూడిన

నాయకత్వ లక్షణాలు స్పష్టమవుతాయి. కేరళలో ప్రప్రథమ రాజకీయ సమ్మె జరగడానికి కేవలం కృష్ణపిళ్ళైనే కారకుడు. సమ్మె ప్రారంభమవడానికి రెండు నెలల ముందుగానే తిరువాన్కూర్ కాయిర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ (టిసిఎఫ్‌డబ్ల్యుయు) ప్రచురిస్తున్న తోజిలాలి (కార్మికుడు) అనే వారపత్రిక నిషేధించబడింది. కాని వారి నాయకుడు కృష్ణపిళ్ళై నోటీసులు, ఇతర కరపత్రాలు, ముద్రించి రహస్యంగా కార్మికుల్లో పంచారు. బోటు కార్మికులు, పార్వతీ మిల్స్ కార్మికులు, హెచ్‌ఎఫ్‌సి ఫ్యాక్టరీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. బాధ్యాతాయుతమైన ప్రభుత్వం కోసం సాగిన పోరాటం మరియు కార్మికవర్గ పోరాటాలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసు వంటివి. అందువల్ల ఆ రెండు ఒకదానితో ఒకటి కలిసి కొనసాగాయి.

## కార్మికుల చొరవ

చెర్తాలా, అరూర్, అంబాలప్పూజ, అలప్పూజలలో 1938 అక్టోబర్ 19న కార్మికులు ప్రదర్శనలు, కవాతులు, సమావేశాలు నిర్వహించారు. దివాన్ విధించిన నిషేధాజ్ఞలు అతిక్రమించి కదంగంపెరంబు మైదానంలో సైమన్ ఆసన్ అధ్యక్షతన బ్రహ్మాండమైన బహిరంగ సభను నిర్వహించారు. బహిరంగసభలో ప్రకటించిన ఛార్టర్ ఆఫ్ డిమాండ్లలో వయోజన ఓటింగు, బాధ్యతా యుత ప్రభుత్వం అనే అంశం ప్రథమ అంశంగా వుంది. రాష్ట్ర కాంగ్రెస్, యూత్‌లీగ్‌లకు చెందిన రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేయాలనేది రెండవ అంశం. కార్మికవర్గానికి సంబంధించి పనిగంటలు, వేతనాలు, ప్రసూతి సెలవులు తదితర అంశాలు ఇతర డిమాండ్లుగా వున్నాయి. కేరళలో మొట్టమొదటి ఎర్రజెండాను తయారు చేసిన వానిగ చెప్పబడుతున్న సైమన్ ఆసన్, 1938 అక్టోబర్ 21న రాజకీయ సమ్మెకు పిలుపు ఇచ్చారు. రెండు రోజుల తరువాతనే తిరువాన్కూర్ మహారాజా జన్మదినం అట్టహాసంగా జరపవలసి ఉన్నందున, దివాన్ ఈ సమ్మెను విచ్ఛిన్నం చేయదలిచాడు. పెట్టుబడిదారులు, ఉన్నత భూస్వామ్య వర్గం ఈ సమ్మె విఫలం కావాలని కోరుకున్నారు. మహారాజా జన్మదినం తరువాత కాలానికి సమ్మెను వాయిదా వేయించేందుకు పాలకులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ, సమ్మె అనుకున్నరోజునే ప్రారంభమైంది. కృష్ణపిళ్ళై తయారు చేసిన ప్రణాళిక ప్రకారం 5000 మంది రెడ్ వాలంటీర్లతో కలసి పదుల వేల సంఖ్యలో కార్మికులు సైనిక పద్ధతిలో క్రమశిక్షణతో అలప్పూజ బీచ్ వద్దకు కవాతు నిర్వహించారు. ఫ్యాక్టరీ గేట్ల వద్ద శాంతియుతంగా పికెటింగ్ నిర్వహిస్తున్న కార్మికుల మీద, బీచ్‌లో సభకు హాజరై తిరిగి వెళుతున్న కార్మికుల మీద పోలీసులు పాశవికంగా లాఠీ ఛార్జి చేశారు. యూనియన్ ఆఫీసులను పగులగొట్టి పేపర్లు, ఫర్నిచర్ తగులబెట్టి అరాచకం సృష్టించారు. అనేక మంది తీవ్రంగా గాయపడి, స్పృహ కోల్పోయారు. కొంతమందిని కమర్షియల్ కాలువలోనికి, దాని ఒడ్డునే వున్న దట్టమైన పొదల్లోకి విసిరివేశారు. అక్టోబర్ 24న ఆందోళన చేస్తున్న కార్మికుల మీద పోలీసులు కాల్పులు జరిపి అనేక మందిని బలితీసుకున్నారు. 25 రోజులపాటు సాగిన బృహత్తరమైన సమ్మె పోరాటం 6.14 వేతన పెంపుదలతో ముగిసింది. పని పరిస్థితులు, వేతనాలు వంటి కార్మికవర్గ సమస్యలు, అప్రధానమైన అంశాలుగా వుండి, రాజకీయ పరమైన ఈ సమ్మె చారిత్రాత్మక ప్రాధాన్యత సంతరించుకున్నది. సమ్మెకు నాయకత్వం వహించిన వారిలో అత్యధికులు

కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ యూత్ లీగ్‌ల సభ్యులే. రాజకీయ కార్యాచరణకు కార్మికవర్గాన్ని సమర్థవంతంగా సమీకరించవచ్చునని ఈ సమ్మె రుజువు చేసింది.

## రాజకీయ రంగంలో వేగవంతమైన పరిణామాలు

రాజకీయ రంగంలో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. కాంగ్రెస్‌పార్టీకి ఇష్టం లేనప్పటికీ, సమ్మెలు, హర్తాళ్‌లు ఇతర దేశవ్యాపిత ప్రజా పోరాటాలు వెల్లివిరుస్తున్నాయి. సూక్ష్మబుద్ధి గల్గిన బ్రిటిష్ ప్రభుత్వం, దీనిలో అంతర్లీనంగా వున్న తమకు రానున్న తీవ్ర ప్రమాద సంకేతాలను పసిగట్టగల్గింది. పరిస్థితి చేజారిపోతుందని సామ్రాజ్యవాదులు గ్రహించారు. ఈ పరిస్థితుల్లో గత్యంతరం లేక బ్రిటిష్ ప్రభుత్వం 1946 మార్చిలో అధికార బదిలీకి సంబంధించిన వివరాలు రూపొందించేందుకు, భారతదేశానికి బ్రిటన్ మంత్రివర్గ రాయబార సంఘాన్ని పంపింది. మంత్రివర్గ రాయబార సంఘం, కాంగ్రెస్, ముస్లిం లీగ్‌ల మధ్య సాగిన సుదీర్ఘ చర్చల పర్యవసానంగా అదే ఏడాది సెప్టెంబర్ నెలలో భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుచేయబడింది. జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన మంత్రివర్గంలో, అక్టోబర్ నెలలో ముస్లిం లీగ్ కూడా చేరింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 1948 జూలైలోగా భారతదేశానికి అధికార బదిలీ జరుగుతుందని, 1947 ఫిబ్రవరి 20వ తేదీన బ్రిటన్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ ప్రకటించారు.

దీనికనుగుణంగానే అధికార బదిలీకి తగిన ఏర్పాట్లు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం లార్డ్ మౌంట్‌బాటన్‌ను భారతదేశానికి వైస్రాయ్‌గా పంపింది. కాంగ్రెస్, ముస్లింలీగ్‌ల మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు తలెత్తాయి. కాని మౌంట్‌బాటన్ తన తెలివితేటలుపయోగించి రూపొందించిన రాజీ ప్రణాళికలను ఇరుపక్షాలు ఆమోదించాయి. భారతదేశం విభజించబడి, 1947 ఆగస్టు 15వ తేదీన స్వతంత్ర దేశంగా అవతరించింది. భారత, పాకిస్తాన్‌లుగా విభజించబడిన భారత ఉపఖండంలోని పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలకు బ్రిటిష్ ప్రభుత్వం అధికారం బదలాయించింది.

స్వాతంత్ర్యానంతర పరిణామాలు, భారత కార్మికోద్యమ చరిత్రలో పూర్తిగా ఒక నూతనాధ్యాయాన్నావిష్కరించాయి. భారత జాతీయోద్యమ పూర్వరంగంతో ప్రారంభమైన కార్మికవర్గ పోరాటాలు, ప్రాథమికంగా మారిన రాజకీయ పరిస్థితుల్లో ఒక నూతన లక్ష్యసాధనకు సాగే పోరాటంగా పరివర్తన చెందింది. భారతదేశంలోని సామ్రాజ్యవాద ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ రూపంలో వున్న భారత పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు అధికారంలోకి వచ్చాయి. ఈ ప్రధానమైన రాజకీయ మార్పు, భారత సమాజంలో తీవ్ర పరిణామాలకు దారితీసింది.

బ్రిటిష్ వారి నుండి అధికారాన్ని అందుకోవడానికి ముందే, భారత కార్మికవర్గాన్ని చీల్చి, తన సొంత కార్మికవిభాగాన్ని నెలకొల్పడంలో కాంగ్రెస్ విజయవంతం అయ్యింది. అయినప్పటికీ అనేక దశాబ్దాల కఠోర ఆర్థిక, రాజకీయ పోరాటాల ద్వారా భారత కార్మికవర్గం మరింత తీవ్రమైనవిప్లవాత్మక చర్యలకు సన్నద్ధమైన, కార్మికవర్గ చైతన్యం కల్గిన సుసంఘటిత సామాజిక శక్తిగా నిలిచింది.

భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విముక్తి ఉద్యమంలో భారత కార్మికవర్గం నిర్వహించిన బృహత్తర పాత్రను, వక్రీకరించేందుకు ప్రగతి నిరోధక చరిత్రకారులెంత ప్రయత్నించినప్పటికీ, జాతీయ స్వాతంత్ర్యానికి భారతప్రజానీకం నిర్వహించిన పోరాట చరిత్రలో భారత కార్మికవర్గం నిర్వహించిన అద్భుతమైన పాత్ర, సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయంగా సదా నిలిచిపోతుంది.

రాజకీయరంగంలో త్వరితగతిన పరిణామాలు సంభవిస్తున్నాయి. కాంగ్రెసు యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సమ్మెలు, హర్తాళ్‌లు, ప్రజల తిరుగుబాట్లు దేశమంతటా అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. బ్రిటిషు ప్రభుత్వం ఈ ప్రజా పోరాట వెల్లువ వెనుక దాగివున్న తీవ్ర ప్రమాదాన్ని గుర్తించింది. సామ్రాజ్యవాదులు తమ అధికార పీఠానికి ముప్పువాటిల్లిందని గ్రహించారు. ఈ పరిస్థితుల్లో గత్యంతరంలేక బ్రిటిషు ప్రభుత్వం అధికారాన్ని భారతీయులకు బదిలీకి సంబంధించిన వివరాలు రూపొందించేందుకు, 1946 మార్చిలో ఒక క్యాబినెట్ మిషన్ (మంత్రికవర్గ రాయబార సంఘం)ను ఇండియా పంపవలసి వచ్చింది. ఈ బ్రిటిషు క్యాబినెట్ సంఘానికి, కాంగ్రెసు, ముస్లింలీగుల మధ్య సాగిన సుదీర్ఘ చర్చల ఫలితంగా భారతదేశంలో ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయబడింది. శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన మంత్రి వర్గంలో అదే సంవత్సరం (1946) అక్టోబరు నెలలో ముస్లింలీగు కూడ భాగస్వామి అయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ 1948 జూన్ నాటికి భారతీయులకు అధికారం బదలాయించ బడుతుందని 1947 ఫిబ్రవరి 20వ తేదీన బ్రిటిష్ ప్రధానమంత్రి క్లెమెంట అట్లీ ప్రకటించాడు.

ఈ ప్రకటన ననుసరించి అధికారం బదిలీ చేయడానికి కావలసిన ఏర్పాట్లు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం లార్డ్‌లూయిస్ మౌంట్ బాటన్ ను వైశ్రాయిగా ఇండియాకు పంపింది. కాంగ్రెసుకు, ముస్లింలీగుకు మధ్య తీవ్రమైన విభేదాలు చెలరేగాయి. కాని మౌంట్ బాటన్ చేసిన రాజీ ప్రతిపాదనలను ఇరుపక్షాల వారు అంగీకరించారు. భారత ఉపఖండం విభజించబడి 1947ఆగస్టు 15 తేదీన స్వతంత్ర భారతదేశం అవతరించింది. భారత్, పాకిస్తాన్‌ల విభజించబడిన భారత ఉపఖండాలలోని పెట్టుబడిదారీ, – భూస్వామ్య వర్గాలకు బ్రిటిషు ప్రభుత్వం అధికారం బదలాయించింది.

స్వాతంత్ర్యానంతర పరిణామాలు భారత శ్రామికోద్యమ చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించాయి. భారత జాతీయోద్యమ పూర్వ రంగంతో ప్రారంభమైన కార్మికవర్గ వుద్యమం మారిన రాజకీయ పరిస్థితులలో ఒక నూతన లక్ష్య సాధనకు సాగే పోరాటంగా పరివర్తన చెందింది. భారతదేశంలోని సామ్రాజ్యవాద ప్రభుత్వం స్థానంలో రాజకీయంగా జాతీయ కాంగ్రెసు రూపంలో వున్న భారత పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాలు అధికారంలోకి వచ్చాయి. రాజకీయ రంగంలో ఏర్పడిన ఈ ప్రధానమైన మార్పు భారత సమాజంలో తీవ్ర పరిణామాలకు దారితీసింది.

బ్రిటిషు సామ్రాజ్యవాదుల నుండి అధికారాన్ని స్వీకరించడానికి ముందే, భారత కార్మికవర్గాన్ని చీల్చి, తన స్వంత కార్మిక విభాగాన్ని నెలకొల్పుకోవడంతో కాంగ్రెసు విజయం సాధించింది. అయినప్పటికీ అనేక దశాబ్దాల పాటు కఠోర ఆర్థిక, రాజకీయ పోరాటాలు సాగించిన భారత కార్మికవర్గం, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా వర్గచైతన్యం పొందిన ఒక సుసంఘటిత సామాజిక శక్తిగా మరిన్ని విప్లవ పోరాటాలు సాగించడానికి సిద్ధంగా వున్నది.

భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతీయ విముక్తి ఉద్యమంలో భారత కార్మికవర్గం నిర్వహించిన బృహత్తర పాత్రను వక్రీకరించేందుకు, తక్కువ చేసి చూపేందుకు, ప్రగతి నిరోధక చరిత్రకారులెంత ప్రయత్నించినప్పటికీ, జాతీయ స్వాతంత్ర్యం కోసం భారత ప్రజానీకం నిర్వహించిన పోరాట చరిత్రలో, భారత కార్మికవర్గం నిర్వహించిన అద్భుతమైన పాత్ర సువర్ణాక్షరాలతో లిఖింపదగ్గ అధ్యాయంగా సదా నిలిచిపోతుంది.

# 19

# ఆఫీసు, ప్రభుత్వ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్లు

దేశం మొత్తంలోను ప్రభుత్వం పెద్ద యజమాని. భారతదేశంలో పనిచేసే ఆఫీసు ఉద్యోగుల (తెల్లచొక్కా ఉద్యోగులు)లో అత్యధిక సంఖ్యాకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలోనే పనిచేస్తున్నారు.

ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధి క్రమానికి సంబంధించి, ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికుల మధ్య ప్రధానమైన తేడాలున్నాయి. పారిశ్రామిక కార్మికులు ట్రేడ్ యూనియన్లను స్థాపించుకుని, అమానుషమైన పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా నిర్విరామంగా పోరాటం సాగించి ట్రేడ్ యూనియన్ హక్కులను సాధించుకున్నారు. కాని ప్రభుత్వ ఉద్యోగులలో ఉద్యమాభివృద్ధి యిందుకు భిన్నంగా జరిగింది. ప్రభుత్వోద్యోగులలో యీ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రారంభం నుండే వలస ప్రభుత్వం సృష్టించిన అనేక తీవ్ర అవరోధాలను ఎదుర్కొనవలసి వచ్చింది. బ్రిటిషు సామ్రాజ్యవాదులు యీ ఉద్యమాన్ని మొగ్గగా వుండగానే తృంచివేయడానికి, అణచివేయడానికి ప్రయత్నాలు సాగించారు.

బ్రిటిషు వలసవాదుల పరిపాలనలో ప్రభుత్వోద్యోగులు ప్రజలను దోపిడీ చేసి, అణచివేసే ప్రజావ్యతిరేక విధానాల నవలంబించే ఒక పరిపాలనా యంత్రాంగానికి ఉపాంగాలుగా తయారయ్యారు. అంతేగాని ప్రజలకు సేవచేసే ఒక సంస్థకు చెందినవారుగా లేరు. అందువలన ఈ ప్రభుత్వోద్యోగులను సమాజం నుండి దూరం చేసి, ప్రజావ్యతిరేక, అణచివేత స్వభావం గల్గిన వలసవాదుల పరిపాలన పరి రక్షణకు ఒక సైన్యంగా తయారు చేయవలసిన అవసరం ప్రభుత్వానికేర్పడింది.

## ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనా నియమావళి పుట్టుక :

## రాజకీయ హక్కుల నిరాకరణ

ప్రభుత్వోద్యోగులను బానిసలుగాజేసి, వారిని వలసపాలకుల ప్రయోజనాలను పరిరక్షించేవారిగా చేయడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం 1904లో ప్రభుత్వ సేవకుల ప్రవర్తనా

నియమావళిని (కాండాక్ట్ రూల్స్) రూపొందించింది. ఈ నిబంధనలు 1904లో పూర్తిగా వెలువడినట్లు కన్పించినప్పటికీ, భారతదేశంలో వలస పాలన ప్రారంభమైననాడే దీనికి అంకురార్పణ జరిగింది. భారతదేశంలో ఈస్టిండియా (తూర్పు ఇండియా) కంపెనీ పరిపాలన ప్రారంభమైన నాటినుండి కంపెనీ ఉద్యోగుల ప్రవర్తనను, సర్వీసులను క్రమబద్ధం చేస్తూ అనేక అధికార ప్రకటనలు జారీ చేయబడ్డాయి. 1770, 1793, 1797 సంవత్సరాల్లో ఈస్టిండియా కంపెనీ చేసిన చట్టాలు, సేల్ ఆఫ్ ఆఫీసు చట్టం (1809) 1833 సంIIలో చేయబడిన భారత ప్రభుత్వ చట్టం, 1859లో జారీచేయబడిన సుప్రీంకోర్టు ఆఫీసర్ల చట్టం, ఇండియన్ పీనల్‌కోడ్ (భారత శిక్షాస్మృతి) చట్టం (1860), 1861 పోలీసు చట్టం, 1874 అడ్మినిస్ట్రేటర్ జనరల్ చట్టం వంటి యితర చట్టాలు ఆ రోజుల్లో ఉద్యోగుల ప్రవర్తనను క్రమబద్ధంచేస్తూ ఆఫీసులలో ఆదేశాలు యివ్వడానికి వీలుగా చేయబడిన చట్టాలు మాత్రమే.

కాని ఈ చట్టాల నాధారం చేసుకుని ఇవ్వబడిన ఆదేశాలు మాత్రం ఉద్యోగులు రాజకీయాలలో పాల్గొనడాన్ని నిషేధించలేదు. ఆ సమయంలో (అంటే ఈస్టిండియా కంపెనీ పరిపాలన భారతదేశంలో ప్రారంభమైననాడు) భారతదేశంలో అసలు రాజకీయ కార్యకలాపాలే లేకపోవడం యిందుకు ప్రధాన కారణం. 1885లో భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భవించిన తరువాత రాజకీయాలలో ప్రభుత్వోద్యోగుల పాత్రను బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే పసిగట్టింది. అందువలననే 1890లో మొట్టమొదటిసారిగా యీ సమస్యమీద కౌన్సిల్‌లో గవర్నర్ జనరల్ ఆదేశాలను జారీ చేయడం జరిగింది.

"ఒక ఉద్యోగిని గురించి తప్పుగా అర్థం చేసుకోవడానికి గాని, ఆ ఉద్యోగి వల్ల ప్రజలకు ఒనగూడే ప్రయోజనం తగ్గేందుకు గాని దారితీసే రాజకీయ ఆందోళనల్లోనూ, సమావేశాల్లోనూ ఒక ప్రభుత్వోద్యోగి పాల్గొనరాదు. ఈ ప్రభుత్వోద్యోగి చేయ సంకల్పించిన చర్య ఈ నిబంధనను అతిక్రమించేదిగా వున్నట్లు ఏమాత్రం సందేహం కల్గినా ఆ విషయాన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ప్రతినిధికి గాని, తనపై అధికారికి గాని తెలియజేయాలి" అని ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను జారీచేసింది.

ప్రభుత్వోద్యోగుల రాజకీయ కార్యకలాపాల మీద ఆంక్షలు విధిస్తూ ఈ సర్క్యులర్ జారీచేసిన తరువాత, రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనడం సహా అప్పులు తీసుకొనడం, ప్రశంసా సందేశాలు పొందడం, మొదలైన విషయాలలో ప్రభుత్వోద్యోగులను నియంత్రిస్తూ వివిధ సందర్భాల్లో జారీ చేసిన సర్క్యులర్లను, చేసిన తీర్మానాలను క్రోడీకరించి, స్థూలంగా ఒక ప్రవర్తనా నియమావళిని రూపొందించాలని భారత ప్రభుత్వం భావించింది. ఈ నిబంధనలే 1904లో "ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనా నియామావళిగా" రూపుదాల్చాయి.

భారత ప్రభుత్వం ఈ నిబంధనావళిని రూపొందించిన తరువాత వీటిని కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రాంతీయ (ప్రొవెన్షియల్) ప్రభుత్వ ఉద్యోగులకు కూడ వర్తింపచేసింది. కాండాక్ట్ రూల్స్‌లో ఉద్యోగుల రాజకీయ కార్యకలాపాలపై పరిమితులు విధించడానికుద్దేశించిన 20వ క్లాజును 1905లో సవరించి మరింత కఠినతరం చేశారు. సవరించబడిన క్లాజు ఈ

విధంగా వున్నది. "భారతదేశంలో భారతదేశ వ్యవహారాలకు సంబంధించిన రాజకీయ ఉద్యమాలలో పాల్గొనడంగాని, వాటికి సహాయపడడంగాని చేయరాదు. ఆ ఉద్యోగిని గురించి పొరపాటుగా అర్థం చేసుకోవడానికి గాని, ఆ ఉద్యోగి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం తగ్గేందుకు దోహదం చేసే ఎట్టి రాజకీయ సమావేశాలకు హాజరుకారాదు."

అప్పటి నుండి ఈ "కాండక్ట్ రూల్సు"ను లెక్కలేనన్నిసార్లు సవరించారు. ప్రభుత్వోద్యోగుల బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, సమ్మెలు తదితర కార్యకలాపాలను నిషేధిస్తూ చేసిన సవరణలతో, ఈ "కాండక్టు రూల్స్" మరింత పచ్చి అభివృద్ధి నిరోధక స్వభావాన్ని సంతరించుకున్నాయి. భారతదేశంలో 1947లో వలసవాదులకు నూకలు చెల్లి "స్వతంత్ర భారతదేశం" అవతరించిన తరువాత కూడా ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావం కల్గిన కాండక్ట్ రూల్స్ రద్దుచేయబడలేదు. ఇంతటితో ఆగక స్వతంత్ర భారతదేశ పాలకులు ఈ కాండక్టు రూల్సులోనే మరిన్ని నీచమైన, అభివృద్ధి నిరోధకమైన సవరణలు చేసి ప్రభుత్వోద్యోగులకు రాజకీయ హక్కులుగాని, ట్రేడ్ యూనియన్ హక్కులుగాని లేకుండా చేసి వారిని రెండవ తరగతి పౌరులుగా దిగజార్చారు.

ఆనాడు ప్రభుత్వోద్యోగులకు రాజకీయ హక్కులు లేకుండా చేస్తూ సామ్రాజ్యవాద పాలకులు తయారుచేసిన కాండక్టు రూల్స్ నేటికీ ప్రభుత్వోద్యోగులను వెంటాడుతూనే వున్నాయి. కాని సామ్రాజ్యవాదుల స్వంత దేశమైన బ్రిటిన్‌లో పరిస్థితి ఇలా లేదు. అక్కడ ప్రభుత్వోద్యోగులు రాజకీయ, ట్రేడ్ యూనియన్ హక్కులను చాలా మేరకు అనుభవిస్తూనే వున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని వర్సెస్టర్ కాలేజీ అధిపతి జె.సి.మాస్టర్‌మన్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కమిటీ బ్రిటన్‌లోని ప్రభుత్వ ఉద్యోగులలో అధిక సంఖ్యాకులకు సాధారణ పౌరహక్కులను వినియోగించుకునే స్వాతంత్రం ఇవ్వడం గురించి పరిశీలన జరిపింది. ఈ కమిటీ 1949లో చేసిన సిఫార్సులను ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. నేషనల్ వైట్లీ కౌన్సిల్ జాయింట్ కమిటీ నివేదికతో బాటు, దీనిమీద తన విధానాన్ని తెలియజేస్తూ 1953లో ప్రభుత్వమే శ్వేత పత్రాన్ని జారీ చేసింది.

మొత్తం సివిల్ సర్వీస్ ఉద్యోగుల్లో 62 శాతం మంది ఏ విధమైన పరిమితులు లేకుండానూ, 22 శాతం మంది అనుమతి పొంది, పార్లమెంట్ ఎన్నికల్లో తప్ప మిగిలిన అన్ని కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలుగానూ, 16 శాతం మందిని జాతీయ రాజకీయ కార్యకలాపాల నుండి నిషేధించే విధంగానూ ప్రభుత్వం ఒక స్కీమును ఆమోదించింది. చివరి రూపులోని ఈ 16 శాతం మందిలో కూడా, వారు కోరుకున్నట్లయితే వీలయినంత ఎక్కువ మందిని స్థానిక ప్రభుత్వాల్లోనూ, స్థానిక స్థాయిలో రాజకీయాల్లో పాల్గొనేందుకు అనుమతించబడతారు.

ప్రభుత్వం ఆమోదించిన ఈ స్కీము ప్రకారం పరిశ్రమలలో పనిచేయని సివిల్ సర్వీసులలోని మెస్సెంజర్లు తదితర తక్కువ గ్రేడు ఉద్యోగులు పూర్తి పౌర హక్కులకు అర్హులు. గుమాస్తాలు, టైపిస్టులు వంటి మధ్యతరగతి గ్రేడుకు చెందిన వారికి పౌర రాజకీయ హక్కులు

అనుమతించడానికి ఎక్కువగా వారు డిపార్టుమెంటులో చేసే పనిమీద ఆధారపడి వుంటుంది. ప్రభుత్వ శాసనాల నమలు చేయవలసిన ఎగ్జిక్యూటివ్‌లు, ప్రొఫెషనల్స్, సైంటిస్టులు, సాంకేతిక నిపుణులు, పాలనా నిర్వహణలో నిమగ్నులైనవారు దేశ రాజకీయాలలో పాల్గొనడానికి వీలులేదు.

ఏ విధమైన నిర్బంధాలు లేని గ్రూపుకు చెందిన ఉద్యోగి పార్లమెంటుకు పోటీచేయాలని భావించినట్లయితే నామినేషన్ చేయవలసిన రోజుకు ముందురోజునే ఆ ఉద్యోగానికి రాజీనామా చేయాలి. పార్లమెంటుకు ఎన్నుకొనబడని యెడల, ఫలితాలు ప్రకటింపబడిన వారం రోజులలోగా మరల అప్లికేషను పెట్టుకొన్నట్లయితే, రాజీనామా చేసే సమయానికి ఏ ఉద్యోగంలో వున్నాడో అదే ఉద్యోగంలో తిరిగి నియమించబడతాడు. అట్టి ఉద్యోగి ఒకవేళ పార్లమెంటుకు ఎన్నికైతే, ఈ క్రింది షరతులకు అంగీకరించినట్లయితే మరల ఉద్యోగంలో నియమించబడతాడు.

1. ఉద్యోగం వదలిన తరువాత 5 సం॥లలోగా సభ్యత్వం రద్దు అయివుండాలి.

2. ఎన్నికకు ముందు కనీసం 10 సం॥లు సర్వీసు కలిగివుండాలి.

3. సభ్యత్వం రద్దయిన తరువాత మూడు నెలల్లోగా మరల ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలి.

ఈ రాజకీయ హక్కులతో బాటు బ్రిటన్‌లోని సివిల్ ఉద్యోగులు, ఆఫీసు విధులతో సంఘర్షణ రాని విధంగా తమ యిష్టం వచ్చిన కార్యకలాపాలు సాగించుకొనవచ్చును.

ఎన్ని పరిమితులు విధించినప్పటికి బ్రిటనులోని సివిల్ ఉద్యోగులు చాల మేరకు రాజకీయ హక్కులను అనుభవిస్తున్నారు. కాని ఈ బ్రిటిష్ ప్రభుత్వమే తన వలస ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసం ఇండియాలో ఇందుకు పూర్తి భిన్నమైన విధానాన్ని అమలు జరుపుతోంది. భారత ప్రజానీకాన్ని అణచివేయడానికి, వారిని దోపిడీ చేసి తన వలస విధానాన్ని నిరాఘాటంగా కొనసాగించడానికి, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రభుత్వ ఉద్యోగులను పాచికలుగా ఉపయోగించుకున్నారు. వలసవాదుల రెండు నాలుకల ధోరణికి కారణమిదే. కాని దురదృష్టవశాత్తు ఈనాటికి కూడ భారత దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులకు రాజకీయ హక్కులు కల్పించే విషయంలో స్వతంత్ర భారత పాలకులు సామ్రాజ్యవాదుల కంటే కఠినంగానే వ్యవహరిస్తున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల గుర్తింపుకు మూల సూత్రాలు : వాటి పుట్టుక

ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు అధికారికంగా గుర్తింపు మంజూరుచేసే విషయంలో మొట్టమొదటిసారిగా 1921 అక్టోబరు 13వ తేదీన కొన్ని సూత్రాలు ప్రకటించబడ్డాయి.

గ్రేట్ బ్రిటన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు గుర్తింపు ఇవ్వడానికి కొన్ని సూత్రాలు నిర్ణయించిన నేపథ్యంలో ఇండియాలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు గుర్తింపు మంజూరు చేసే విషయం బ్రిటిషు ప్రభుత్వ పరిశీలనకు వచ్చింది.

బ్రిటన్‌లోని సివిల్ ఉద్యోగుల సంఘాలలో మొట్టమొదటగా యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ ఆఫ్ బ్రిటన్‌కు 1899లో ప్రభుత్వ (అధికార) గుర్తింపు లభించింది. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ అసోసియేషన్ డ్యూక్ ఆఫ్ నార్‌ఫోక్‌కు విజ్ఞాపన పత్రం అందజేసింది. అందుకు ఈ సమస్యలను తత్సంబంధిత అధికారి ద్వారా పంపవలసినదిగా డ్యూక్ కోరాడు. ఈ సంఘటనలతో విజ్ఞాపననయినా ఒక పద్ధతి ప్రకారం పంపబడాలనే అధికార విధానానికి పునాది పడింది. బ్రిటన్‌లో తరువాత వచ్చిన పోస్ట్‌మాస్టర్ జనరల్స్ వివిధ యూనియన్లకు గుర్తింపు ఇచ్చారు.

సంవత్సరానికి 500 పౌండ్ల కంటే తక్కువ జీతం పొందే వివిధ గ్రేడ్లకు, తరగతులకు చెందిన ఉద్యోగుల సర్వీసు నిబంధనలను నిర్ణయించడానికి ఏ పక్షానికి చెందని ఒక స్వతంత్ర వ్యక్తి మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించే పద్ధతి ప్రారంభించడంతో యూనియన్లకు గుర్తింపు మంజూరు చేయడం అధికమైంది. ఏ అసోసియేషన్‌కు చెందిన ప్రతినిధి అయినా ప్రభుత్వ ప్రతినిధితో బాటు ఈ ట్రిబ్యునల్ ముందు హాజరుకావచ్చును. చివరకు 1919లో అన్ని డిపార్టుమెంట్లలోని వివిధ తరగతులకు చెందిన ఉద్యోగుల సంఘాలతోను, వివిధ డిపార్లుమెంట్లలోని ప్రత్యేక శాఖలతోనూ విస్తృతంగా జాయింట్ కౌన్సిల్స్ ఏర్పాటు చేయబడ్డాయి. ఆఫీసు నిర్వహణ, వృత్తిపరమైన శిక్షణ, సర్వీసు నిబంధనలు, ప్రమోషను విధానం మొదలైన సమస్యలపై సమానహోదాలో చర్చలు సాగించడానికి ఉద్యోగ సంఘాలు నియమించిన సభ్యులు, ప్రభుత్వంచే నామినేట్ చేయబడిన ఉన్నతాధికారులు ఈ కౌన్సిల్స్ ద్వారా అప్పుడప్పుడు సమావేశాలు జరుపుతుండేవారు. ప్రభుత్వంచే నామినేట్ చేయబడిన ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సమాన సంఖ్యలో ఈ సమావేశాల్లో పాల్గొంటూండేవారు.

గుర్తింపు మంజూరు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని సూత్రాలను అనుసరించింది. ఏ తరగతి ఉద్యోగులకు అసోసియేషన్ ప్రాతినిధ్యం వహిస్తుందో ఆ తరగతి ఉద్యోగులలో కనీసం మూడవవంతు మంది అసోసియేషన్ సభ్యులై యుండాలి. అవకాశమున్నంత వరకు ఒక అసోసియేషన్ ఒక తరగతి ఉద్యోగులకే ప్రాతినిధ్యం వహించాలి. పని పరిస్థితులు, జీతాలు, పనిగంటలు సెలవులు, భోజన వసతి, విశ్రాంతి తదితర సాధారణ సమస్యల మీద ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడానికి ఈ అసోసియేషన్ కేంద్ర సంఘానికి మాత్రమే అర్హత వుంటుంది. యూనియన్ల గుర్తింపుకు బ్రిటిష్ ప్రభుత్వం స్థూలంగా ఈ మూడు సూత్రాలను అనుసరిస్తుండేది.

1906 సం॥లో ఇండియన్ టెలిగ్రాఫ్ అసోసియేషన్ ఏర్పాటుతో భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలకు గుర్తింపు మంజూరు చేసే విషయం భారత ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కాని 1919లో ఫోర్‌మన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు సమస్య ప్రభుత్వం (దృష్టి) పరిశీలనకు వచ్చేవరకు, యూనియన్ల గుర్తింపు విషయంలో పురోగతి లేదు. ఈ యూనియన్‌కు గుర్తింపు మంజూరు చేయడానికి ప్రభుత్వం ఈ క్రింది షరతులను విధించింది.

1. ఒక ప్రత్యేక తరగతి ఉద్యోగులకు మాత్రమే అసోసియేషన్ ప్రాతినిధ్యం వహించాలి.

2. ప్రభుత్వ ఉద్యోగి కానివారి నెవరినైనా తన వ్యవహారాలు చూచేందుకు అసోసియేషన్ నియమించరాదు.

3. ఈ అసోసియేషన్ వ్యక్తుల ప్రయోజనాలకు కాక, తాము ప్రాతినిధ్యం వహించే తరగతి ప్రయోజనాలకే ప్రాతినిధ్యం వహించాలి.

భారతదేశంలోని సైనిక సామాగ్రిని తయారు చేసే ఫ్యాక్టరీలలోని ఫోర్‌మెన్ల సంఘం, ఫోర్‌మెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన ప్రభుత్వోద్యోగ సంఘాలలో మొట్టమొదటిది. కలకత్తాకు సమీపాన వున్న డమ్‌డమ్‌లో ఈ సంఘ ప్రధాన కార్యాలయం వున్నది.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన రోజుల్లో వర్సైయిల్స్ శాంతి ఒప్పందం కుదరడంతో, ప్రపంచ వ్యాప్తంగా పెల్లుబుకుతున్న కార్మికవర్గ ఉద్యమానికి గుర్తింపుగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO), నానాజాతి సమితిలో ఒక విభాగంగా అవతరించింది. వర్సైయిల్స్ ఒప్పందానికి ప్రధాన భాగస్వాములైన (రాజ్యాలు) పక్షాలు యీ ఒప్పందంలోని 427 ఆర్టికల్‌ను ఒక తక్షణ, ప్రత్యేక ప్రాధాన్యత గల అంశంగా భావించాయి. అందువలన ఉద్యోగులు, యజమానులు చట్టబద్ధమైన లక్ష్యాల సాధనకు సంఘాలు పెట్టుకునే హక్కును గుర్తించడం జరిగింది.

ఈ ఒప్పందంపై సంతకాలు జరగడంతో, ఉద్యోగులు సంఘాలు పెట్టుకునేహక్కు గుర్తించబడింది. తరువాత ఈ శాంతి ఒప్పందంలో శ్రామికవర్గానికి సంబంధించిన అంశాలను ఆమోదించి, భారతదేశం ఈ ఒప్పందంలో భాగస్వామ్య పక్షమయింది. అందువలన ప్రభుత్వోద్యోగుల సంఘాలను గుర్తించడం ప్రభుత్వానికి తప్పనిసరి కావడంతో ఈ సమస్య అనివార్యంగా ముందుకు వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం సంఘ నిర్మాణ హక్కు ప్రైవేటు రంగానికే పరిమితం చేయబడింది. అప్పటికే ప్రభుత్వోద్యోగుల సంఘాలు అనేకం స్థాపించబడి యున్నందున సంఘాలు పెట్టుకునే హక్కును ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కలుగజేయాలని భారత ప్రభుత్వం తలచింది. అందువలన 1921 అక్టోబరు 13వ తేదీన భారత ప్రభుత్వం ఈ క్రింది ఆదేశాలను జారీ చేసింది.

"ఈ సూత్రాన్ని (సంఘ నిర్మాణ హక్కును) ధృవపరచాలనే దృష్టితో, ప్రైవేటు యజమానులవద్ద పనిచేస్తున్న ఉద్యోగుల సంఘాలకు ఏ విధమైన అవరోధాలు కలిగించరాదని భారత ప్రభుత్వం నిర్ణయించింది. అందువలన ఏ సూత్రాల మీద ఆధారపడి తమ ఉద్యోగుల సంఘాలకు గుర్తింపు మంజూరు చేసేందుకు వారు (ప్రైవేటు యజమానులు) సిద్ధంగా వున్నదీ ప్రభుత్వానికి తెలియజేయడం అత్యవసరం అని భారత ప్రభుత్వం భావిస్తున్నది." పైన చెప్పిన మూడు సూత్రాలను చేర్చి ఇండియాలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలను గుర్తించడానికి భారత ప్రభుత్వం పూర్తి నిబంధనావళిని రూపొందించింది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ప్రత్యేక తరగతులకు చెందిన ఉద్యోగులకు అవసరమైన అదనపు నిబంధనలను చేర్చుకోవడానికి ప్రొవెన్షియల్ ప్రభుత్వాలకు అనుమతినిచ్చింది.

భారత ప్రభుత్వం యీ ఆదేశాలు జారీ చేసిన తరువాతనే, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇచ్చే పద్ధతి అమలులోనికి వచ్చింది.

## సమిష్టి సంప్రదింపుల హక్కు

గ్రేట్ బ్రిటన్‌లో ప్రతిప్రభుత్వోద్యోగి తన గ్రేడు, తను చేసే పనిని బట్టి ఉద్యోగ సంఘంలోనో, ట్రేడ్ యూనియన్‌లోనో సభ్యునిగా చేరడానికి ప్రోత్సాహం లభిస్తుంది. కాని భారతదేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా లేకపోయినప్పటికీ పూర్తిగా భిన్నంగానే వున్నది. ఇండియాలో ప్రభుత్వ ఉద్యోగులు యూనియన్లు స్థాపించుకొనడం పట్ల బ్రిటిషు ప్రభుత్వం తన అసహనాన్ని వ్యక్తం చేసింది. బాహాటంగా వ్యతిరేకత వ్యక్తం చేయనప్పటికీ, ఇదే రకమైన అయిష్టత అధికారుల నుండి నేటికీ వ్యక్తమవుతూనే వున్నది. బ్రిటన్‌లో సివిల్ సర్వీసు డిపార్టుమెంట్ లేదా సంబంధిత డిపార్టుమెంట్లు గుర్తింపుకు సంబంధించిన చట్టం క్రింద మంజూరు చేసిన గుర్తింపు ద్వారా, తమ సభ్యుల తరపున ఒక అసోసియేషన్ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపే హక్కును సంపాదించుకున్నది. జాతీయ స్థాయిలో గుర్తింపు యివ్వబడినట్లయితే వివిధ డిపార్టుమెంట్లలోని ఒకే గ్రేడు, గ్రూపుకు చెందిన ఉద్యోగులకు సంబంధించిన సర్వసాధారణ సమస్యలపై చర్చలు, సంప్రదింపులు జరపడానికి, ఒప్పందాలు చేసుకొనడానికి, ఆర్బిట్రేషన్‌లో పాల్గొనడానికి హక్కు వుంటుంది.

గుర్తించబడిన అసోసియేషన్లు, యూనియన్లను ఆఫీసు ఆవరణలో సమావేశాలు ఏర్పాటు చేసుకొనే సౌకర్యంతోబాటు, పదవీ బాధ్యతలను నిర్వహించే వారికి కొన్ని సౌకర్యాలు కల్పించబడతాయి. అసోసియేషన్ పనులకు ప్రత్యేక సెలవు, ఉద్యోగుల నుండి యూనియన్ చందాల వసూలు వంటి సౌకర్యాలు కల్పించబడ్డాయి. అంతేగాక "ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లన్నీ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు అనుబంధం చేసుకొనే స్వేచ్ఛ కల్గి వుంటాయి."

సామ్రాజ్యవాదుల పాలనా కాలంలో ఇండియాలో పరిస్థితి బ్రిటన్‌లోని పరిస్థితులతో పోల్చిచూస్తే చాలా వ్యత్యాసాలు కన్పిస్తాయి. కాని నేటికీ అవి చాలావరకు కొనసాగుతూనే వున్నాయి. ఇండియాలో కూడా గుర్తింపు పొందిన అసోసియేషన్లు అధికారులతో సంప్రదింపులు, చర్చలు జరపడానికి చట్టప్రకారం అవకాశం వున్నప్పటికీ, యిది దాదాపు ఆయా అధికారుల యిష్టాయిష్టాలమీద ఆధారపడి వున్నది. భారతదేశంలో సంప్రదింపులు జరిపే హక్కు నామకః అంగీకరించబడినది. అంతేగాని ప్రభుత్వానికి యీ విషయంలో ఏ విధమైన బాధ్యతాలేదు. కనీసం పారిశ్రామిక కార్మికులు అనుభవిస్తున్న ట్రేడ్ యూనియన్ హక్కులు కూడ ప్రభుత్వ ఉద్యోగులకు లేవు. ఇండియాలో ప్రభుత్వోద్యోగుల సంఘాలు ఏ కేంద్ర కార్మిక సంఘానికీ అనుబంధం చేసుకొనడానికి వీలులేదు.

బ్రిటన్‌లో పరిశ్రమేతర (నాన్ ఇండస్ట్రియల్) సివిల్ సర్వీసులలో సమిష్టి సంప్రదింపుల విధానం రెండు పద్ధతులలో జరుగుతుండేది. ఒకటి వైట్లీ కౌన్సిల్ పద్ధతి. రెండవది ఉద్యోగ సంఘాలతో నేరుగా ప్రభుత్వ శాఖలే సంప్రదింపులు జరిపే పద్ధతి.

1917–18లో హౌస్ ఆఫ్ కామన్స్ మాజీ స్పీకరు వైట్లీ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన పునర్నిర్మాణ కమిటీ యజమానులు, ఉద్యోగుల ప్రతినిధులతో ఇండస్ట్రియల్ (పారిశ్రామిక) కౌన్సిళ్ళను ఏర్పాటుచేసే పద్ధతిని ప్రతిపాదించింది. దీనిననుసరించి 1919లో ఆయన

పేరిట బ్రిటన్‌లో సివిల్ సర్వీసు నేషనల్ వైట్లీకౌన్సిల్ ఏర్పాటు చేయబడింది. దాదాపు అన్ని డిపార్టుమెంట్లలో వైట్లీ కౌన్సిళ్ళు ఏర్పాటు చేయబడ్డాయి. సర్వ సాధారణంగా ఒక సర్వీసుకు సంబంధించిన సాధారణ సమస్యలను గురించి ఈ నేషనల్ వైట్లీ కమిషన్ పరిశీలిస్తుంది. ఈ జాతీయ (నేషనల్) కౌన్సిల్‌లో నలుగురు సెక్రటరీలతో సహా 54 మంది సభ్యులుంటారు. సాధారణంగా ప్రభుత్వంచే నియమించబడిన వివిధ శాఖల అధిపతులు, సీనియర్ అధికారులతో అధికారవర్గం ఒక పక్షంగానూ, వివిధ స్టాఫ్ అసోసియేషన్లచే నియమించబడిన ఉద్యోగుల ప్రతినిధులు ఒక పక్షంగానూ (స్టాఫ్ సైడ్ గాను) వ్యవహరిస్తారు.

జీతాలు మొదలైన సమస్యలపై సంప్రదింపుల ద్వారా ఒక అంగీకారం కుదరక పోయినట్లయితే, నేషనల్ వైట్లీ కౌన్సిల్ ఒప్పందం పరిమితుల్లో సమస్యను ఆర్బిట్రేషన్‌కు సమర్పించేందుకు ఇరుపక్షాలకు అవకాశముంటుంది. అంగీకారం కుదరని సమస్యలను పరిష్కరించడానికే సివిల్ సర్వీస్ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయబడింది. ఈ ట్రిబ్యునల్‌లో ఒక స్వతంత్ర వ్యక్తి అధ్యక్షునిగానూ, మరిద్దరు సభ్యులు వుంటారు. వీరిలో ఒకరిని ఆర్థిక మంత్రి తరపున కార్మిక మంత్రిత్వ శాఖ తయారుచేసిన పానెల్ నుండి, నేషనల్ వైట్లీ కౌన్సిల్‌లోని ఉద్యోగ ప్రతినిధుల నుండి మరొకరు ఎంచుకొనబడతారు.

ఈ ట్రిబ్యునల్‌లో యింతకు ముందు జరిగిన సంప్రదింపులలో ఉద్యోగులకు కల్పించబడిన సౌకర్యాలకు కొన్ని అదనంగా చేర్చవచ్చునుగాని, వున్న సౌకర్యాలకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు చేయడానికిగాని, వ్యక్తిగత సమస్యల మీద గాని సంప్రదింపులు జరపడానికి వీలులేదు.

1919లోనే బ్రిటనులో సమస్యల పరిష్కారానికి సంప్రదింపులు జరపడానికొక ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినప్పటికి, సుమారు మూడు శతాబ్దాల తన వలస పాలనా కాలంలో భారతదేశంలోని ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి యీ విధమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కూడా బ్రిటిషు ప్రభుత్వానికి తోచలేదు. దీనికి బదులుగా ప్రభుత్వం తన ఉద్యోగులను అణచివేసి, ట్రేడ్ యూనియన్ల ప్రగతిని కుంటుపరచే విధానాన్ని అవలంబించింది. భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చిన తరువాత 19 సం॥ల దీర్ఘకాలం పాటు ప్రభుత్వోద్యోగులు అనేక పోరాటాలు, ఆందోళనలు సాగించి, చివరకు 1960 సం॥లో ప్రభుత్వ ఉద్యోగులు దేశవ్యాపిత సమ్మె పోరాటం సాగించిన తరువాత మాత్రమే 1966 సం॥లో బ్రిటనులోని వైట్లీ కౌన్సిల్ తరహాలో భారతదేశంలో కూడ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సంప్రదింపులు జరపడానికి భారత ప్రభుత్వం జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (జె.సి.ఎం.) ని ఏర్పాటు చేసింది. భారతదేశంలో ప్రవేశపెట్టబడిన ఈ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ విధానం ప్రకారం జాతీయ స్థాయిలో ఒక జాయింట్ కౌన్సిల్, డిపార్టుమెంటు స్థాయిలోనూ, ప్రాంతీయ ఆఫీసు స్థాయిలో ఒక్కొక్క జాయింట్ కౌన్సిల్ ఏర్పాటు చేయబడతాయి.

ఈ జాతీయ కౌన్సిల్ సాధారణంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కనీస వేతనం, కరువుభత్యం వంటి సమస్యలు, వివిధ సంస్థలలోని ఒకే కేటగిరికి చెందిన

ఉద్యోగుల జీతాలు, తదితర సర్వీసు కండిషన్లకు సంబంధించిన ఉమ్మడి విషయాలను పరిశీలిస్తుంది. సీనియర్ అధికారుల నుండి ప్రభుత్వంచే నామినేట్ చేయబడిన 25 మంది సభ్యులు అధికారపక్షంగానూ, గుర్తించబడిన అసోసియేషన్లచే నామినేట్ చేయబడిన 60 మంది ఉద్యోగుల పక్షం (స్టాఫ్ సైడ్) గానూ ఈ నేషనల్ కౌన్సిల్‌లో వుంటారు.

ఈ స్కీమైనా సుమారు 20 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. కాని దేశంలోని ప్రభుత్వోద్యోగులలో ఒక పెద్ద సెక్షనుగా వున్న సుమారు 40 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ స్కీము వర్తించదు. ఇటీవలనే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు యిదే రకమైన యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాయి. ఈ స్కీమైనా ఏదో నామమాత్రంగా ఏర్పాటు చేయబడినదేగాని, దీనివలన ఉద్యోగులకు చెప్పుకోదగ్గ ప్రయోజనమేమీ చేకూరడం లేదు.

గ్రేట్ బ్రిటన్‌తో సహా అనేక పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలలో ప్రభుత్వ ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు వుండగా, భారతదేశంలోని ప్రభుత్వ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా సమ్మె హక్కు నిషేధించబడింది. భారతదేశంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు నానాటికీ పటిష్టమై, గత రెండు దశాబ్దాలుగా సాగించిన అనేక సమ్మె పోరాటాలను ప్రభుత్వం "చట్ట విరుద్ధం"గా పరిగణించి సమ్మె చేసిన ఉద్యోగుల మీద పోలీసు అత్యాచారాలకు, పెద్ద ఎత్తున కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం ద్వారా వారిని, తీవ్ర బాధలకు గురిచేసింది.

## పురోగమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లు, యూనియన్లు

20వ శతాబ్దం ప్రారంభంలోనే ప్రభుత్వోద్యోగ సంఘాల ఏర్పాటు ప్రారంభమైంది. 1906లో స్థాపించబడిన ఇండియన్ టెలిగ్రాఫ్ అసోసియేషన్‌ను ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలలో మొదటి సంఘంగా పరిగణించవచ్చు. ఈ ఇండియన్ టెలిగ్రాఫ్ అసోసియేషన్ చాలా కాలం కొనసాగింది.

ఈ శతాబ్దం ప్రారంభంలో దేశంలోని పోస్టల్ ఉద్యోగులు తమ సర్వీసు కండిషన్లకు సంబంధించి అనేక సమస్యలను ఎదుర్కొనవలసివచ్చింది. వీరి పని పరిస్థితులు వర్ణించనలవి కానంత దుర్భరంగా వుండేవి. అతి తక్కువగా వున్న వారి జీతాలు, దుర్భరమైన పని పరిస్థితులు వారిని తీవ్రంగా బాధించాయి. సరిగ్గా యిదే సమయంలో శ్రీ తారాపద ముఖర్జీ బెంగాలులోని పోస్టల్ ఉద్యోగులను సంఘటితపరచడానికి చొరవ తీసుకుని కృషి చేశాడు. పోస్టల్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీ ముఖర్జీ పోస్టల్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రారంభకునిగా చారిత్రాత్మకమైన పాత్ర నిర్వహించాడు. ఉద్యోగులు తీవ్రంగా అసంతృప్తి చెందివున్నప్పటికీ, ఉద్యోగుల్లో భయోత్పాతం నెలకొన్న యీ పరిస్థితులలో వారందరిని సంఘటితం చేయడం చాల కష్టమైంది. అందువలన నేరుగా అసోసియేషన్ ఏర్పాటు చేయడానికి బదులుగా శ్రీ ముఖర్జీ కలకత్తాలోని పోస్టల్ ఉద్యోగుల నందరిని సమావేశపరచి, 1908 మార్చిలో "పోస్టల్ క్లబ్"ను స్థాపించాడు. ఇదే సమయంలో బొంబాయిలో కూడ ఒక "పోస్టల్ క్లబ్" స్థాపించబడింది.

తరువాత కాలంలో పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. ఎంప్లాయీస్ యూనియన్‌ను స్థాపించడంలో యీ రెండు పోస్టల్ క్లబ్‌లు ప్రముఖపాత్ర వహించాయి.

యూనియన్లు ఏర్పాటు చేయడానికి ప్రారంభంలో యీ కృషి సాగుతున్నప్పటికీ, పారిశ్రామిక కార్మికులలోవలెనే ప్రభుత్వోద్యోగులలో కూడ సంఘటితమై, యూనియన్లు పెట్టుకోవాలనే ఆలోచన వాస్తవానికి మొదటి ప్రపంచ యుద్ధం తరువాత కాలంలోనే వచ్చింది.

రష్యాలో అక్టోబరు సోషలిస్టు విప్లవం విజయవంతమైంది. యుద్ధానంతరం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ఈ పరిస్థితులు నానాటికి దిగనాసిల్లుతున్న తమ జీవన ప్రమాణాలను నిలబెట్టుకోవడానికి, ఐక్యంగా ప్రతిఘటనా పోరాటం సాగించడానికి ప్రభుత్వ ఉద్యోగులను ప్రేరేపించి, ప్రోత్సాహాన్ని కలుగజేశాయి. యుద్ధానంతరం ఏర్పడిన ఆర్థిక సంక్షోభం వలన తీవ్రమైన కష్టనష్టాలకు గురైన ఉద్యోగులు ఉద్యమాలకు దూరంగా వుండడం ద్వారా తాము చేసిన తప్పిదాన్ని గుర్తించారు. దీనితో ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలనేకం ఏర్పడ్డాయి. బెంగాలు, అస్సాం సర్కిల్‌లకు చెందిన ప్రొవిన్షియల్ పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. అసోసియేషన్ 1921 ఫిబ్రవరి నెలలో ప్రచురించిన "లేబర్" అనే మాసపత్రిక తన మొదటి సంచికలో ఆనాటి పరిస్థితులను చక్కగా సమీక్షించింది. "నేటి ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో వలెనే భారతదేశంలో కూడా కార్మికవర్గం తన శక్తిని నిరూపించుకుంటోంది. ఈనాటి వరకు మౌనంగా వున్న లక్షలాదిమంది కార్మికులు నానాటికి తమ హక్కులు, సౌకర్యాలను గురించి అవగాహన చేసుకొని చైతన్యవంతులై తమ డిమాండ్లను స్పష్టంగా నినదిస్తున్నారు. ఈ విశాల భారతావనిలో ఎక్కడో ఒకచోట ట్రేడ్ యూనియన్ల ఆవిర్భావాన్ని, వాటి పురోగతిని వార్తా పత్రికల ద్వారా చూడగల్గుతున్నాం" అని ఆ పత్రిక పేర్కొన్నది.

ఈ నేపథ్యంలో పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. ఎంప్లాయీస్ యూనియన్ ప్రారంభించబడింది. ఈ యూనియన్‌ను స్థాపించడంలో శ్రీ తారాపదముఖర్జీ ప్రధానమైన పాత్ర వహించాడు. యుద్ధానంతర పరిస్థితులు ప్రభుత్వోద్యోగ సంఘాల స్థాపనకు సానుకూల నేపథ్యాన్ని సృష్టించాయని చెప్పాలి. శ్రీ తారాపద ముఖర్జీ జీవిత చరిత్ర వ్రాసిన చరిత్రకారుడు ఈ విధంగా వ్రాశాడు. "మొదటి ప్రపంచ యుద్ధం సాగుతున్న 1914-1918 మధ్యకాలంలో ఆహార ధాన్యాలు తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పోస్టాఫీసు ఉద్యోగులు తీవ్ర కష్టాలకు గురయ్యారు. అందువలన వారు తమ జీతాలను పెంచవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాని ప్రభుత్వం వీరి గోడును వినిపించుకొనక వారికి కొంత "యుద్ధ భత్యాన్ని" మాత్రం మంజూరు చేసింది. ఈ భత్యం వలన వారికేమాత్రం ఉపశమనం కలుగలేదు. దీనితో తమ లక్ష్యాన్ని సాధించుకోవడానికి ఒక శక్తివంతమైన సంఘం అవసరమని వారు క్రమక్రమంగా అర్థం చేసుకొని యూనియన్‌లో సభ్యులుగా చేరారు.

చివరకు 1920 సెప్టెంబరు 19-21 తేదీలలో కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో "ప్రొవిన్షియల్ పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. అసోసియేషన్, బెంగాలు మరియు అస్సాం సర్కిల్" ఆవిర్భవించింది. ఇండియన్ టెలిగ్రాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ హెచ్.బార్టన్ యీ సమావేశానికి అధ్యక్షత వహించాడు.

ఈ ప్రొవెన్షియల్ (ప్రాంతీయ) మహాసభ జరిగిన వెంటనే 1920 సెప్టెంబరు 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు పోస్టల్, ఆర్.ఎం.ఎస్. ఉద్యోగుల అఖిల భారత మహాసభ ఢిల్లీలో జరిగింది. కలకత్తాలో ప్రాంతీయ కాన్ఫరెన్సు ముగిసిన వెంటనే శ్రీ తారాపద ముఖర్జీ యీ అఖిల భారత మహాసభకు హాజరై ఆ మహాసభ కార్యక్రమంలో ప్రముఖపాత్ర వహించాడు.

బర్మాను కూడా కలుపుకుని ఆలిండియా పోస్టు ఆఫీసు అండ్ ఆర్.ఎం.ఎస్. యూనియన్ ఏర్పాటుతో యీ మహాసభ ముగిసింది. శ్రీ జి.ఎస్.కపర్డీ అధ్యక్షునిగా శ్రీయుతులు కె. సంతానం, పండిట్ మన్‌మోహన్‌లాల్ టోపా సహాయ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఢిల్లీ కేంద్రంగా (హెడ్‌క్వార్టర్స్) యూనియన్‌ను నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. 1924 నాటికి ఈ యూనియన్ సభ్యత్వం 70 వేలకు చేరుకున్నది. మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత కాలంలో ప్రభుత్వ ఉద్యోగులలో ట్రేడ్ యూనియన్ భావాలను, అవగాహనను కలుగజేయటంలో పోస్టల్ ఉద్యోగులు అగ్రభాగాన నిలచారు. “ఎప్పుడైనా ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమ చరిత్ర లిఖించబడినట్లయితే, ఆ చరిత్రలో ఆఫీసు ఉద్యోగులను సంఘటితపరచడంలో భారతీయ పోస్టల్, ఆర్.ఎం.ఎస్. ఉద్యోగులు నిర్వహించిన అగ్రగామి పాత్రకు, వారికి సముచిత స్థానం యివ్వవలసివుంటుంద”ని ‘లేబర్’ పత్రిక చాల చక్కగా వ్రాసింది.

కాని అన్ని తరగతుల ఉద్యోగులతో ఏర్పాటైన ఈ అఖిల భారత సంఘంలో బహుకొద్ది సంవత్సరాలలోనే చీలిక సంభవించింది. ఈ యూనియన్‌లో వుండడంవలన తమ ప్రయోజనాలు పరిరక్షించబడటం లేదని క్రింది తరగతి ఉద్యోగులు భావించడం ప్రారంభించారు. దీనితో 1929లో ఆలిండియా పోస్ట్‌మన్ అండ్ లోయర్ గ్రేడ్ స్టాఫ్ యూనియన్ పేరిట మరొక యూనియన్ ఏర్పడింది. ఇదేవిధంగా అధికజీతాలు, మరిన్ని సదుపాయాలు కావాలని కోరుకుంటున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులలోని ఉద్యోగులు ఆలిండియా ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసెస్ యూనియన్ పేరిట వేరొక యూనియన్ స్థాపించారు. తరువాత అనేక చీలికలు వచ్చి కొత్త యూనియన్లు ఏర్పడ్డాయి.

తరువాత 1929-30 సం॥లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఏర్పడినపుడు పోస్టల్ ఉద్యోగులు అధిక సంఖ్యలో రిట్రెంచ్ చేయబడ్డారు. 1931 సం॥ తర్వాత నియమించబడిన ఉద్యోగుల జీతాలు తగ్గించబడ్డాయి. నాయకత్వంలోను, ఉద్యోగులలోను వున్న అనైక్యత మూలంగా ఈ దాడులను ప్రతిఘటించలేకపోయారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం ధరలు ఆకాశాన్నంటడంతో ఉద్యోగుల జీవన ప్రమాణాలు ఘోరంగా దిగజారి చివరకు వారికి బ్రతుకు దుర్భరమైంది. ఈ పరిస్థితులలో ఉద్యోగులు ఐక్యత అవశ్యకతను గుర్తించి 1945లో వివిధ యూనియన్లకు చెందిన పోస్టల్ ఉద్యోగులు ఏకమై చమన్‌లాల్ నాయకత్వంలో తంతి-తపాలా ఉద్యోగ సంఘాల సమాఖ్య (ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ యూనియన్స్‌ను స్థాపించారు.

ఈ సమయంలోనే ఉద్యోగుల సమస్యలను పరిశీలించి తగిన సిఫార్సులు చేయవలసిందిగా ప్రభుత్వం, న్యాయమూర్తి శ్రీ రాజాధ్యక్షను అడ్జుడికేటర్ (మధ్యవర్తి)గా

నియమించింది. 1931 తర్వాత నియమించబడిన ఉద్యోగుల విషయమై మధ్యవర్తి చేసిన సిఫార్సులను ఉద్యోగ సంఘాలు అంగీకరించలేదు. ఉద్యోగులు జీతాలను సవరించాలని కోరారు. కాని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరి జీతాలను సవరించడానికి సెంట్రల్ పే కమిషన్ (కేంద్ర వేతన సంఘం)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి ప్రభుత్వం, యీ ఉద్యోగుల జీతాల సవరణ డిమాండును త్రోసిపుచ్చింది. 1946 మే 10వ తేదీన భారతదేశంలో ప్రప్రథమంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల విషయమై మొదటి పే కమిషన్ న్యాయమూర్తి శ్రీ శ్రీనివాసవరదాచారి అధ్యక్షతన ఏర్పాటు చేయబడింది.

ప్రభుత్వ వైఖరితో తీవ్రంగా అసంతృప్తి చెంది వున్న ఉద్యోగులు, ప్రభుత్వ వైఖరికి నిరసన తెల్పుతూ ఆలిండియా పోస్ట్‌మన్ అండ్ లోయర్ గ్రేడ్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపు మేరకు 1946 జూలై 11వ తేదీన సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మె చివరకు పోస్టల్ ఉద్యోగుల దేశవ్యాపిత సమ్మెగా పరిణమించింది.

ఈ సమ్మె సందర్భంగా ఉద్యోగులు సంపాదించిన విలువైన అనుభవాలు ,ఆలిండియా పోస్టల్ అండ్ ఆర్.ఎం.ఎస్. యూనియన్, ఆలిండియా టెలిగ్రాఫ్ అసోసియేషన్, ఇండియన్ పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ యూనియన్‌లు ఏకమై, యూనియన్ ఆఫ్ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ వర్కర్స్ పేరిట ఒకే సంస్థ ఆవిర్భావానికి దారితీశాయి.

శ్రీ చమన్‌లాల్ నాయకత్వంలో 1945లో ఏర్పాటు చేయబడిన ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ యూనియన్ 1946లో సమ్మెకు వ్యతిరేకంగా పనిచేసింది. యూనియన్ ఆఫ్ పి అండ్ టి వర్కర్స్ ఆవిర్భావంతో ఫెడరేషన్ ప్రాతినిధ్యం తగ్గింది. అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం ఫెడరేషన్‌నే గుర్తించసాగింది. ఇదే సమయంలో పోస్టల్ ఉద్యోగులలోనే అనేక  చిన్న యూనియన్లు పుట్టుకొచ్చాయి. కాని చివరకు పోస్టల్ ఉద్యోగుల యూనియన్ల ఏర్పాటు పద్ధతిలోనే సమూలమైన మార్పు వచ్చింది. పోస్టల్ ఉద్యోగులలో (క్యాటగిరీవైజ్) తరగతివారీ యూనియన్లు ఏర్పడ్డాయి. ఉద్యోగులలోని ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క యూనియన్ చొప్పున తొమ్మిది ఆలిండియా యూనియన్లు ఏర్పడ్డాయి. 1954లో ఈ తొమ్మిది యూనియన్లు కలిసి నేటి నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఎంప్లాయీస్ (ఎన్.ఎఫ్.పి.టి.ఇ.) గా రూపొందింది. ఈ ఫెడరేషన్‌ను, దీనికి అనుబంధమై వున్న తొమ్మిది యూనియన్లను ప్రభుత్వం గుర్తించింది.

ఇదిలావుండగా సెంట్రల్ సెక్రటేరియట్, ఆడిట్, ఇన్‌కమ్‌టాక్స్ తదితర భారత ప్రభుత్వ శాఖలలో కూడా చాలా యూనియన్లు అభివృద్ధి చెందాయి. వీటిలో చాలా యూనియన్లు 1913-1920 మధ్యకాలంలోనే ఏర్పడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ  యూనియన్లన్నీ కలిసి కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్ పేరిట పటిష్టం కాని ఒక సమాఖ్య ఏర్పాటు చేయబడింది. రైల్వేలలోని యూనియన్లు, రక్షణ శాఖలోని కార్మికులు, ఉద్యోగుల యూనియన్లు యీ కాన్ఫెడరేషన్‌కు దూరంగానే వుంటున్నాయి.

ప్రారంభంలో భారతదేశంలో రైల్వేలు ప్రైవేటు యాజమాన్యం క్రింద ప్రవేశ పెట్టబడ్డాయి. కొన్ని రైల్వేలు ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మించబడినప్పటికీ యాజమాన్యం మాత్రం ప్రైవేటు కంపెనీలకే అప్పగించబడుతూండేది. 1942లో భారతదేశంలోని రైల్వేలన్నింటిని ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకొనడంతో రైల్వే ఉద్యోగులు కూడా ప్రభుత్వోద్యోగులుగా పరిగణించబడ్డారు.

రైల్వేలు ప్రైవేటు యాజమాన్యంలో వున్నప్పటి నుండే రైల్వే కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా ప్రభుత్వోద్యోగుల సంఘాలపై వున్న ఆంక్షలు రైల్వే కార్మికుల యూనియన్లకు పూర్తిగా వర్తించవు. మిగిలిన పారిశ్రామిక కార్మికులతో సమానంగా వీరు ట్రేడ్ యూనియన్ హక్కులను అనుభవించారు. రైల్వేలను స్వాధీనం చేసుకున్న తరువాత కూడా రైల్వే కార్మికులు గతంలో సాధించుకున్న హక్కులు, సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా హరించ లేకపోయింది.

ఒక్కొక్క రైల్వే ప్రాతిపదికగా కార్మికులను ఏకం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. వేర్వేరు యూనియన్లను ఏకంచేసి ఒక సమాఖ్యను ఏర్పాటు చేసేందుకు మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత మాత్రమే ప్రయత్నాలు జరిగాయి. ఈ ఉద్దేశ్యంతో 1921లో బొంబాయిలో అఖిల భారత స్థాయిలో రైల్వే కార్మికుల సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో రైల్వే కార్మికుల యూనియన్ల సమాఖ్యను ఏర్పాటు చేసే ప్రతిపాదన మీద చర్చలు జరిగి, ఒక ముసాయిదా నిబంధనావళి కూడా తయారు చేయబడింది. కాని ఈ సమావేశం ఫలవంతం కాలేదు. ఇదేవిధంగా మరుసటి సంవత్సరంలో కూడా సి.ఎఫ్. ఆండ్రూస్ అధ్యక్షతన మరో సమావేశం జరిగింది. కానీ ఈ సమావేశం కూడా ఈ సమాఖ్యకు ఒక రూపం ఇవ్వడంలో విఫలమైంది.

ఆ తరువాత 1924లో కలకత్తాలో ఎ.ఐ.టి.యు.సి. నాల్గవ మహాసభకు రైల్వే యూనియన్ల నుండి హాజరైన ప్రతినిధులు, సమాఖ్య ఏర్పాటుకు చురుకుగా పని చేసేందుకు శ్రీ వి.ఆర్. కాళప్ప కార్యదర్శిగా, ఎన్.ఎమ్. జోషీ అధ్యక్షునిగా ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కృషి ఫలితంగా 1925 ఫిబ్రవరిలో బొంబాయిలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. 5వ మహాసభలో ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఎ.ఐ.ఆర్.ఎఫ్.) పేరిట రైల్వే కార్మికులకు ఒక కేంద్ర సంస్థ అవతరించింది. ఈ సమాఖ్యకు రాయ్‌సాహెబ్ చంద్రికా ప్రసాద్ అధ్యక్షునిగాను, ఎన్.ఎం.జోషి, వి.వి.గిరి ఉపాధ్యక్షులుగాను, ముకుందలాల్ సర్కార్ ప్రధాన కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు. 1930 సం॥లో రైల్వే బోర్డు ఈ సమాఖ్యను గుర్తించింది.

మొదటి ప్రపంచ యుద్ధానంతర పరిణామాలు రిజర్వు బ్యాంకు ఉద్యోగులను కూడా యూనియన్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించాయి. 1922–24 మధ్యకాలంలోనే యీ యూనియన్లు నిర్దిష్ట రూపం ధరించాయి. బొంబాయి, కలకత్తా, మద్రాసు వంటి సర్కిల్స్‌లో కరెన్సీ అసోసియేషన్‌ల పేరిట యూనియన్లు ఏర్పడ్డాయి. ఈ విధంగా వివిధ కరెన్సీ అసోసియేషన్లుగా ఏర్పడిన ఉద్యోగులు ఏకమై ఒకే అఖిల భారత సంఘాన్ని ఏర్పాటు

చేసుకొనవలసిన ఆవశ్యకతను గుర్తించారు. 1924 నాటి నుండే యీ దిశలో ప్రయత్నాలు ప్రారంభం కాగా, 1925లో కలకత్తాలో జరిగిన సమావేశంలో రిజర్వు బ్యాంకు ఉద్యోగుల అఖిల భారత సంఘం రూపుదిద్దుకుంది. అఖిల భారత రిజర్వు బ్యాంకు ఉద్యోగుల సంఘంగా ప్రఖ్యాతి గాంచిన ఈ సంఘం, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఒక ప్రముఖ స్థానాన్నాక్రమించింది.

యుద్ధానంతరం ఏర్పడిన విపత్కర పరిస్థితుల వలన ప్రాంతీయ ప్రభుత్వ ఉద్యోగులు కూడా యూనియన్లు ఏర్పాటు చేసుకొనవలసిన అవసరాన్ని గుర్తించారు. 1920–21 మధ్య కాలంలోనే వివిధ ప్రాంతాలలో ప్రొవిన్షియల్ (ప్రాంతీయ) ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లు ఏర్పడడం ప్రారంభమైంది. ఇదే సమయంలో బెంగాలులో కూడా ప్రాంతీయ ప్రభుత్వోద్యోగులు అసోసియేషన్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విధంగా 1920 ఫిబ్రవరిలో ఏర్పడిన అఖిల బెంగాల్ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్, బెంగాల్‌లో ఏర్పడిన ప్రాంతీయ ప్రభుత్వోద్యోగుల సంఘాలలో మొట్టమొదటిది, బెంగాలు ప్రభుత్వ ఆధీనంలోని కలెక్టరేట్లు, జిల్లా జడ్జీల కోర్టులు, రెవెన్యూ తదితర ఆఫీసులలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగుల వేతన విధానాన్ని, ప్రమోషన్ అవకాశాలను, వారి హోదాను మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో ఈ సంఘం స్థాపించబడింది. రాజకీయాలకు రాజకీయ చర్చలకు అతీతంగా ఈ సంఘం వ్యవహరిస్తుందని కూడ అసోసియేషన్ ప్రకటించింది.

ఈ అఖిల బెంగాల్ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ 1920 ఫిబ్రవరిలోనే అవతరించినప్పటికీ, 1923 నవంబర్ వరకు బెంగాల్ ప్రభుత్వం యీ అసోసియేషన్‌ను గుర్తించలేదు. ఇదే సమయంలో బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి మరో రెండు సంఘాలు ఏర్పడ్డాయి. రైటర్స్ బిల్డింగ్‌లోని రాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్, డైరెక్టరేట్ ఆఫీసులలోని ఉద్యోగులు కలిసి, 1920 జూన్ 4వ తేదీన రైటర్స్ బిల్డింగ్ అసోసియేషన్ పేరిట ఒకే సంఘంగా ఏర్పడ్డారు. కాని 1924 మార్చి 10వ తేదీన సెక్రటేరియట్ ఉద్యోగులు వేరుగా బెంగాల్ సెక్రటేరియట్ అసోసియేషన్ పేరిట ఒక కొత్త సంఘాన్ని పెట్టుకున్నారు.

నేటికి రైటర్స్ బిల్డింగ్ అసోసియేషన్ రూపుమాసిపోగా, బెంగాల్ సెక్రటేరియట్ అసోసియేషన్ రూపాంతరం చెందింది. కాని అఖిల బెంగాల్ మినిస్టీరియల్ అఫీసర్స్ అసోసియేషన్ మాత్రం నేటికీ కొనసాగుతోంది. ఈ సంఘాలతో బాటు తర్వాత కాలంలో ప్రభుత్వోద్యోగుల సంఘాలనేకం ఏర్పడ్డాయి.

ఈ అసోసియేషన్లన్నీ రాజకీయాలకతీతంగా వుంటాయని ప్రకటించు కున్నప్పటికీ, జాతీయోద్యమ నాయకత్వంతో సంబంధాలు కల్గివుంటూనే వున్నాయి. ఉదాహరణకు 1925లో జరిగిన అఖిల బెంగాల్ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ వార్షిక సమావేశం ఆనాటి జాతీయోద్యమ నాయకులలో ప్రముఖుడైన శ్రీ బిపిన్ చంద్రపాల్ అధ్యక్షతన జరిగింది. అదే సంవత్సరంలో యీ అసోసియేషన్ తరపున శ్రీ బిపిన్ చంద్రపాల్ నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గం బెంగాల్ ప్రభుత్వ రెవెన్యూ, ఆర్థిక విషయాల బోర్డు సభ్యుని కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరిపింది.

ఇదే విధంగా దేశంలోని ఇతర ప్రాంతాలలో ప్రాంతీయ ప్రభుత్వోద్యోగుల సంఘాలు అభివృద్ధి చెందసాగాయి. కాని ఈ సంఘాలు ట్రేడ్ యూనియన్ స్వభావాన్ని సంతరించుకోలేక పోయాయి. ఉద్యోగులలో ట్రేడ్ యూనియన్ అవగాహన కూడా లోపించింది. ఈ అసోసియేషన్లు తమ కార్యకలాపాలను సంప్రదింపులు జరపడం, విజ్ఞాపన పత్రాలు సమర్పించడం, వార్షిక సమావేశాలు జరపడానికే పరిమితం చేశాయి.

ప్రారంభంలో ఈ ప్రొవిన్షియల్ ప్రభుత్వ ఉద్యోగులు కేటగిరీ బట్టి అసోసియేషన్లుగా ఏర్పడ్డారు. వీరి కార్యకలాపాలు కూడా ఆయా కేటగిరీలకు మాత్రమే పరిమితమయ్యేవి. కాని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అందులోనూ ముఖ్యంగా మొదటి పంచవర్ష ప్రణాళిక చివరి కాలంలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం ప్రభావానికి గురవడంతో ఈ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లలో ఏకం కావాలనే అభిప్రాయాలు జీవం పోసుకున్నాయి. ఈ ఆలోచనలకు రూపం ఇస్తూ, 1956లో సెంట్రల్ (ప్రస్తుతం రాష్ట్ర) కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ వెస్ట్ బెంగాల్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్ ఆవిర్భవించింది. తరువాత కాలంలో (ప్రస్తుతం) ఇది పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు, యూనియన్ల రాష్ట్ర సమన్వయ కమిటీగా వ్యవహరించబడుతోంది. ఈ సమయంలోనే మిగిలిన రాష్ట్రాలలో యీ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అఖిల భారత స్థాయిలో ఒక సంస్థను ఏర్పాటు చేయడం కోసం, హైదరాబాద్‌లో 1960 జనవరి 23-24 తేదీలలో అఖిల భారత స్థాయిలో ఒక సమావేశం నిర్వహించబడింది. వివిధ రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలతో, ఆలిండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్ (అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య) రూపొందింది. తరువాత కొన్ని సంవత్సరాలు స్తబ్దతగా వున్న యీ సమాఖ్య 1965 జూన్ 11 నుండి 13వ తేదీ వరకు కలకత్తాలో అఖిల భారత స్థాయిలో సదస్సు, 1966 నవంబర్ 2 నుండి 5వ తేదీ వరకు త్రివేంద్రంలో జరిగిన ఈ సమాఖ్య అఖిల భారత మహాసభ తరువాత యీ సంస్థ చురుగ్గా పనిచేయడం ప్రారంభించింది. త్రివేంద్రం సమావేశంలో శ్రీ అరవిందఘోష్ అధ్యక్షునిగాను, శ్రీ ఎ.శ్రీరాములు ప్రధాన కార్యదర్శిగాను ఎన్నికయ్యారు.

ప్రైవేటు రంగంలోని బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ తదితర పరిశ్రమలలోని ఉద్యోగులకు అఖిల భారత సంఘాల ఏర్పాటుకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మాత్రమే ప్రయత్నాలు జరిగినట్లు కన్పడుతుంది. బొంబాయిలో 1950 జూన్ 30, జూలై ఒకటి. తేదీలలో ఇన్సూరెన్స్ ఉద్యోగుల అఖిల భారత సదస్సు జరిగింది. ఈ సదస్సులోనే ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (అఖిల భారత భీమా ఉద్యోగుల సంఘం-ఎ.ఐ.ఐ.ఎ.) ఆవిర్భవించింది. ఈ సంస్థకు శ్రీ రజనీపటేల్ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. బీమా పరిశ్రమను జాతీయం చేయాలని ఈ సదస్సు ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. 1925 సంవత్సరానికి ముందే వివిధ బ్యాంకుల్లో ఉద్యోగుల సంఘాలు ఏర్పడుతున్నప్పటికీ, 1946లోనే ఆలిండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎ.ఐ.బి.ఇ.ఎ.) అవతరించింది. అలహాబాద్ బ్యాంకు, ఇంపీరియల్ బ్యాంకు ఉద్యోగులకు చెందిన మూడు యూనియన్లు బొంబాయి, కలకత్తా సర్కిల్స్‌లో 1925 సం॥రానికి

పూర్వమే ఏర్పడ్డాయి. నేటికీ జీవిత బీమా పరిశ్రమ పూర్తిగాను, బ్యాంకింగ్ పరిశ్రమ పాక్షికంగాను జాతీయం చేయబడ్డాయి.

మొదటి ప్రపంచ యుద్ధానంతర కాలంలో ప్రయివేటు పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఘాలు కూడా అభివృద్ధి చెందసాగాయి. 1921 మార్చి 27వ తేదీన ఆల్ బెంగాల్ టీచర్స్ అసోసియేషన్ (అఖిల బెంగాల్ ఉపాధ్యాయ సంఘం) ఏర్పడింది. దాదాపు యిదే సమయంలో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ విధమైన ఉపాధ్యాయ సంఘాలు ఏర్పడ్డాయి. 1928 ప్రాంతాల్లో అఖిల భారత ఉపాధ్యాయ సమాఖ్య (ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్) అవతరించింది. ఈ సంవత్సరం (1928)లోనే పారిస్‌లోని ఎడ్యుకేషన్ వర్కర్స్ ఫెడరేషన్, ఈ అఖిల భారత ఉపాధ్యాయ సమాఖ్యతో సంబంధాలు ఏర్పాటు చేసుకొనడానికి ప్రయత్నించింది. కాని బ్రిటిషు ప్రభుత్వం ఈ ప్రయత్నాలను భగ్నం చేయడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నది.

ప్రభుత్వోద్యోగుల సంఘాలు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడలేదు. ప్రస్తుతం అమలులో వున్న ప్రభుత్వ నిబంధనలు కూడా ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలను కేంద్ర కార్మిక సంఘానికి అనుబంధం చేయడానికి అనుమతించవు. అయినప్పటికీ ప్రైవేటు యాజమాన్యంలో వున్న రైల్వే కార్మిక సంఘాలు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడ్డాయి. ప్రభుత్వ ఆంక్షలతో బాటు మిగిలిన కార్మిక వర్గానికి వీరు దూరంగా వుండడం కూడా, ఈ విధంగా ప్రభుత్వ, తదితర సంస్థల ఆఫీసు ఉద్యోగుల యూనియన్లు, కేంద్ర కార్మిక సంఘాలతో కలవక వేరుగా వుండడానికి కారణం కావచ్చు. కాని నాటికీ నేటికీ పరిస్థితి చాలా మారింది. వివిధ యూనియన్లు, సమాఖ్యల ద్వారా సంఘటితమైన ఆఫీసు ఉద్యోగులు కేంద్ర కార్మిక సంఘాలలోని పారిశ్రామిక కార్మికులతో కలిసి దేశ వ్యాప్తంగా ఐక్య పోరాటాలలో పాల్గొంటున్నారు. ప్రభుత్వ రంగంలో గాని, ప్రయివేటు రంగంలోగాని ఎక్కడ పని చేస్తున్నప్పటికీ మొత్తం మీద నేడు ఆఫీసు ఉద్యోగులు కూడా ట్రేడ్ యూనియన్‌పరంగాను, రాజకీయపరంగాను బాగా చైతన్యవంతులయ్యారు.

# 20

# నూతన పరిస్థితుల్లో కార్మికవర్గం (1947-1970)

## రాజకీయ రంగంలో ప్రధానమైన మార్పులు

1947 ఆగస్టు 15వ తేదీన అధికార మార్పిడితో భారతదేశ రాజకీయ రంగంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. జాతీయ స్వాతంత్ర్య సముపార్జనకు ముందు సాగిన రాజకీయ, ఆర్థిక పోరాటాలు సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డాయి. కార్మిక వర్గ ఆర్థిక పోరాటాలు పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు – ఇరువురికి వ్యతిరేకంగా సాగాయి. విప్లవ చైతన్య స్థాయిలో తరతమ భేదాలున్నప్పటికీ, ఇది రాజకీయంగా ఉమ్మడి లక్ష్య సాధనకు, జాతీయ బూర్జువా వర్గం నుండి కార్మిక వర్గం వరకు వివిధ తరగతుల ప్రజలందరు భాగస్వాములైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటన. ఏమైనప్పటికీ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో నిలకడైన, విప్లవాత్మకమైన పాత్ర నిర్వహించింది కార్మికవర్గం మాత్రమే. ఆర్థికంగా వివిధ తరతమ స్థాయిల్లో వున్న వివిధ తరగతుల ప్రజలీ పోరాటంలో పాల్గొనగా, వారిలో ఉన్నత తరగతులకు చెందిన వారు ఊగిసలాట ధోరణులకు గురై రాజీపడటం, చివరకు కొన్ని సందర్భాల్లో కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నిలబడటం కూడా జరిగింది. ఏమైనప్పటికీ మొత్తం మీద ఈ పోరాటం, సామ్రాజ్యవాద దాస్యం నుండి దేశాన్ని విముక్తి చేసే ఉమ్మడి లక్ష్యంతో సాగిన సమైక్య పోరాటం.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నూతన రాజకీయాధికారం భారతదేశంలోని పెట్టుబడిదారీ – భూస్వామ్య వర్గాల హస్తగతమైంది. ఈ వర్గాల ఆర్థిక ప్రయోజనాలు, తత్ఫలితంగా రాజకీయ ప్రయోజనాలు, కార్మికవర్గ ప్రయోజనాలకు పూర్తిగా భిన్నంగా వున్నాయి. ఇన్ని పోరాటాలు, త్యాగాల ద్వారా స్వాతంత్ర్యం సంపాదించుకుంటే చివరకు అల్ప సంఖ్యాకులుగా వున్న దోపిడీదారులు, మెజారిటీగా వున్న పీడిత ప్రజానీకంపై సాగించే అదే పెట్టుబడిదారీ పాలన మనకు లభించింది. అందువలన స్వాతంత్ర్యం రాకపూర్వం జాతీయ విముక్తి సాధన కార్మికవర్గ తక్షణ రాజకీయ లక్ష్యంగా వుండేది.

కాని పరాయిపాలన అంతమయిన పిమ్మట కార్మికవర్గం కష్టసాధ్యమైన, మహత్తరమైన ఒక విప్లవ లక్ష్యం వైపుకు తన దృష్టి మరల్చింది. పెట్టుబడిదారీ పాలనను మట్టుబెట్టి ఒకరిని మరొకరు దోచుకునే అవకాశం లేని దోపిడీ రహిత సోషలిస్టు సమాజ స్థాపన కార్మికవర్గ లక్ష్యమైంది. ఈ లక్ష్య సాధనకు, వర్గచైతన్యాన్ని మాత్రమే పెంపొందించుకున్న భారత కార్మికవర్గం సోషలిస్టు చైతన్యాన్ని సంతరించుకొనవలసి వున్నది.

ఈ విప్లవ లక్ష్య సాధనకు (సోషలిస్టు సమాజ స్థాపనకు) సాగించే దీర్ఘకాలిక పోరాటంలో జాతీయోద్యమ పోరాట కాలంలో ఏర్పరచిన ఐక్య సంఘటన వలన ప్రయోజనం లేదు. ఎందుకంటే ఆనాటి ఐక్య సంఘటనలోని ఒక సెక్షన్ రాజ్యాధికారం చేపట్టడమే గాక, కార్మికవర్గం కూడా వీరికి వ్యతిరేకంగానే పోరాటాలు సాగించవలసి వుంది. బలాబలాల పొందికలో మార్పు వచ్చిన ఈ తరుణంలో ప్రజానీకంలో దోపిడీకి గురౌతున్న ఇతరతరములను ప్రధానంగా రైతాంగాన్ని కార్మికవర్గం తన మిత్రునిగా చేసుకోవాలి.

కాని, ఈ పోరాటం ముందంజ వేయాలంటే కార్మికవర్గ ఐక్యత అతి ముఖ్యమైనది. దురదృష్టవశాత్తు విప్లవ శక్తిగల కార్మికవర్గం ప్రారంభంలోనే ప్రతికూల పరిస్థితులలో పడింది. 1947 ఆగస్టులో రాజ్యాధికారం చేపట్టకముందే కార్మికవర్గంలో చీలికలు సృష్టించి, బూర్జువా సిద్ధాంత ప్రభావానికి లొంగి, కాంగ్రెస్ చెప్పుచేతల్లో వుండేవిధంగా భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ పేరిట ఎ.ఐ.టి.యు.సి.కి వ్యతిరేకంగా ఒక జాతీయ కార్మికవర్గ సంస్థను ఏర్పాటు చేయడంలో జాతీయ కాంగ్రెస్ విజయవంతమైంది. అందువలన రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయి, స్వాతంత్ర్యం రాకమునుపున్న వర్గ శక్తుల బలాబలాల పొందికలో మార్పు సంభవించడంతో, కార్మికవర్గం సాగిస్తున్న పోరాట క్రమం కష్టభూయిష్టమై అనేక చిక్కులతో కూడుకొని యున్నది.

స్వతంత్ర భారతం అవతరించిన తరువాత సంభవించిన పరిణామాలను క్లుప్తంగా పరిశీలిద్దాం.

## ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో మరిన్ని చీలికలు

దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత, స్పష్టమైన రాజకీయ పంథాలతో వివిధ రాజకీయ పార్టీలు భారత రాజకీయ రంగ ప్రవేశం చేశాయి. ఈ పార్టీలు రాజకీయంగాను, సంస్థాపరంగాను తమ అస్తిత్వాన్ని నిలుపుకొనడానికి తీవ్రంగా ప్రయత్నాలు సాగించాయి. ఈ క్రమంలో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం కూడా అనేక చీలికలకు గురయ్యింది. ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన సంస్థల పలుకుబడి క్రిందకు వచ్చాయి.

ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి సంబంధించినంత వరకు కాంగ్రెస్ సోషలిస్టులు చాలా కాలంగా ఎ.ఐ.టి.యు.సి.లోనే కొనసాగుతున్నారు. కాని 1948 మార్చిలో కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకుని సోషలిస్టు పార్టీగా ఏర్పడిన వెంటనే వీరు ఎ.ఐ.టి.యు.సి.ని వదిలి "హింద్ మజ్దూర్ పంచాయత్" పేరిట ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. కాని

అనతికాలంలోనే 1948 డిసెంబర్ 24వ తేదీన సోషలిస్టుల నాయకత్వంలోని హింద్ మజ్దూర్ పంచాయత్ (హెచ్.ఎం.పి.), రాయిస్టుల నాయకత్వంలోని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ సంస్థలు కలకత్తాలో సమావేశమై ఈ రెండు సంస్థల (హెచ్.ఎం.పి., ఐ.ఎఫ్.ఎల్.)ను విలీనం చేసి, "హింద్ మజ్దూర్ సభ" పేరిట ఒక నూతన సంస్థను ఏర్పాటు చేశారు. సోషలిస్టు పార్టీ నాయకులలో ప్రముఖుడైన శ్రీ అశోక్ మెహతా యీ నూతన సంస్థకు ప్రథమ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

జాతీయ కాంగ్రెసుకు అనుబంధ సంస్థగా ఏర్పడిన ఐ.ఎన్.టి.యు.సి., కాంగ్రెసు సిద్ధాంత ప్రచారానికి, కాంగ్రెసు ప్రభుత్వ కార్మిక విధానాలు అమలుపరచడానికి ఒక సాధనంగా వినియోగపడేందుకు ఏర్పాటు చేయబడింది. అదే విధంగా సోషలిస్టుల అస్తవ్యస్తమైన రాజకీయ అవగాహనను, నానాటికీ క్షీణిస్తున్న రాయిస్టుల సిద్ధాంతాలను కార్మికవర్గంలో ప్రచారం చేయడానికి హింద్ మజ్దూర్ సభ ఒక ప్రచార సాధనంగా వుండేందుకే ఆవిర్భవించింది. "ట్రేడ్ యూనియన్ల కార్యాచరణలో నిర్మాణయుత పద్ధతుల" గురించి ప్రబోధించే వీరి అసలు ఉద్దేశ్యం వర్గపోరాట పంథాను విడనాడి, సంస్కరణవాదాన్ని ప్రోత్సహించటం మాత్రమే.

ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సంభవించిన ఈ చీలిక అనంతరం, ప్రపంచ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఏర్పడిన చీలికల మూలంగా ఏర్పడిన ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ (స్వతంత్ర ట్రేడ్ యూనియన్ల అంతర్జాతీయ కాన్ఫెడరేషన్)కు ఐ.ఎన్.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్. రెండూ అనుబంధం చేయబడ్డాయి.

1948 డిసెంబర్ 24వ తేదీన కలకత్తా సమావేశంలో పాల్గొన్న కొందరు (హెచ్.ఎం.ఎస్.) లక్ష్యాలతో ఏకీభవించలేక డిసెంబర్ 27వ తేదీన కలకత్తాలోనే సమావేశమై యునైటెడ్ ట్రేడ్‌యూనియన్ కమిటీ (యు.టి.యు.సి.)ని స్థాపించారు. 1949 ఏప్రిల్ 30వ తేదీన ఈ కమిటీ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించి, కలకత్తాలో చాలా పరిమితమైన బలం కలిగిన యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (యు.టి.యు.సి.) అనే మరొక నూతన సంస్థనేర్పాటు చేశారు. ఈ సంస్థకు శ్రీ మృణాల్‌కాంతి బోసు ప్రథమ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. కాని కొద్దికాలం తర్వాత రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.ఎస్.పి.) నుండి చాలామంది సభ్యులు విడిపోయి సోషలిస్టు యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్.యు.సి.ఐ.) అనే నూతన రాజకీయ పార్టీని స్థాపించడంతో యు.టి.యు.సి.లో చీలిక ఏర్పడి, అదే పేరుతో రెండు కేంద్ర కార్మిక సంఘాలేర్పడ్డాయి. వీటిలో ఒకటి రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ కంట్రోల్‌లోనూ, రెండవది సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధీనంలోనూ వున్నాయి.

హింద్ మజ్దూర్ సభలో కూడా ఐక్యత ఎంతోకాలం నిలవలేదు. సోషలిస్టు పార్టీలో అంతర్గతంగా అభిప్రాయ భేదాలు అధికమయ్యాయి. దీనితో హెచ్.ఎం.ఎస్.లో కూడా చీలిక ఏర్పడి సోషలిస్టు పార్టీలోని ఒక వర్గం అధీనంలో హింద్ మజ్దూర్ పంచాయత్ తిరిగి ఏర్పడింది.

1955 సంవత్సరంలో భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికరంగ ప్రవేశం చేసింది. జనసంఘ్ నాయకుడు శ్రీ డి.బి. తెంగడి ఈ భారతీయ మజ్దూర్ సంఘ్ సంస్థాపకులలో

ముఖ్యుడు. హిందూ మత పునరుద్ధరణ ప్రాతిపదిక మీద పనిచేసే అభివృద్ధి నిరోధక స్వభావం కల్గిన జనసంఘానికి కార్మిక విభాగంగా యీ బి.ఎమ్.ఎస్. స్థాపించబడింది. ఈ సంస్థకు ఈ కార్మికవర్గంలో, అందునా ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు చెందిన కార్మికులలో పలుకుబడి చాలా పరిమితంగా వున్నది. నాటి జనసంఘం పార్టీకి ప్రస్తుత రూపమైన బి.జె.పి. కార్మిక విభాగంగా తన పలుకుబడిని విస్తరించుకోగల్గింది.

వివిధ రాజకీయ పార్టీలు, గ్రూపుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న యీ వివిధ కేంద్ర కార్మిక సంస్థలు ఆయా పార్టీల రాజకీయ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి సాధనాలుగా పనిచేశాయి. ఫలితంగా ఒకరితో మరొకరు పోటీపడుతూ, కొన్ని సందర్భాలలో ఒకరి ప్రయోజనాలకు వ్యతిరేకంగా వేరొకరు పనిచేసే విధంగా వివిధ రాజకీయ, సిద్ధాంతాల ప్రభావాలకు కార్మికవర్గం గురయింది. కార్మికవర్గానికి మిక్కిలి విలువైన వర్గ ఐక్యతకు ఈ చీలికలు భంగం కల్గించాయి.

## ప్రభుత్వ ఆర్థిక విధానాలు : స్వతంత్ర్య భారతంలో కార్మికవర్గ పోరాటాలు

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి నూతన శకారంభం కావడంతో, దేశంలోని అన్ని తరగతుల ప్రజలలో అనేక ఆశలు చిగురించాయి. రెండు శతాబ్దాల వలస పాలకుల దాస్యం నుండి విముక్తి కావడంతో, అప్పటివరకు అణగద్రొక్కబడి నిద్రాణమైయున్న ప్రజల భావాలు బహిర్గతమయ్యాయి. ఎల్లెడల ఆనందోత్సాహాలు పరవళ్ళు త్రొక్కాయి.

స్వాతంత్ర్యమైతే వచ్చింది కాని దానితోబాటు మనకు ద్రవ్యోల్బణం దాపురించింది. ధరలు విపరీతంగా పెరిగాయి. కార్మికుల నిజ వేతనాలు తీవ్రంగా పడిపోతూనే వున్నాయి. ఇంతేగాక పెట్టుబడిదారీ విధానం క్షీణిస్తున్న ఆర్థిక విధానంగా రుజువయినప్పటికీ మన పాలకవర్గాలు నూతనంగా విముక్తి పొందిన మనదేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని పెంచి పోషించడానికి నడుం కట్టాయి. ఫలితంగా శ్రామిక ప్రజానీకం తీవ్రమైన కష్టనష్టాలకు గురయ్యింది. దీనితో ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం దేశవ్యాప్తంగా శక్తివంతమైన ప్రతిఘటనను సాగించింది.

ఈ ప్రతిఘటనా పోరాటాలకు ఎ.ఐ.టి.యు.సి. అగ్రభాగాన నిలవడంతో ప్రభుత్వం ఎ.ఐ.టి.యు.సి. దాని అనుబంధ సంఘాల మీద భయంకరమైన దాడులకు పూనుకుంది. ఎ.ఐ.టి.యు.సి. యూనియన్ ఆఫీసులనేకం సీలు చేయబడ్డాయి. ఎ.ఐ.టి.యు.సి. దాని అనుబంధ సంఘాల ప్రముఖ నాయకులనేకమంది నిర్బంధించబడడమో లేదా అజ్ఞాతవాసానికి వెళ్ళవలసి రావడమో జరిగింది. ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, కార్యకర్తల వేధింపుకు పూనుకున్నది. మిలిటెంట్ కార్యకర్తలననేకమందిని అమానుషంగా హింసించడంగాని, హత్య గావించడం గాని జరిగింది. 1948-50 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీతోబాటు ఎ.ఐ.టి.యు.సి. కూడా అతివాద ఒంటెత్తువాద పోకడలతో కొన్ని పొరబాట్లు చేసినప్పటికీ, వారు ఎట్టి పరిస్థితులలోనూ శ్రామికవర్గ ప్రయోజనాల విషయంలో రాజీలేని వైఖరి

నవలంబించడంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ, ఎ.ఐ.టి.యు.సి.ల శక్తి సామర్థ్యాలు వ్యక్తమవుతాయి. మొక్కవోని ధైర్యసాహసాలతోను, స్వార్థరహిత బుద్ధితోను వారు కార్మికుల, ప్రజల పక్షాన నిలిచారు.

నిజాయితీ, త్యాగనిరతి కలిగి మిక్కిలి పోరాట పటిమ గల్గిన రాజకీయ, ట్రేడ్ యూనియన్ సంస్థలుగా భారత కమ్యూనిస్టు పార్టీని, ఎ.ఐ.టి.యు.సి.ని ప్రజలు గుర్తించారు. అందువలన యీ కాలంలో ఎ.ఐ.టి.యు.సి.లో చేరడానికి తటపటాయించిన వారు కూడా తమ (కార్మికుల) ప్రయోజనాల పరిరక్షణకు నిలబడేది ఎ.ఐ.టి.యు.సి. మాత్రమేనని భావించారు.

అసలే అనేక చీలికల మూలంగా సంఖ్యాపరంగా బలహీనపడిన ఎ.ఐ.టి.యు.సి. శ్రీ ఎన్.ఎం.జోషి ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేయడంతో మరింత దెబ్బతిన్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ.)కు ఎ.ఐ.టి.యు.సి. తరపున పంపవలసిన ప్రతినిధి వర్గం విషయంలో వివాదం ఏర్పడి 1948 అక్టోబర్‌లో ఆయన ఎ.ఐ.టి.యు.సి.కి రాజీనామా చేశాడు. భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) నిషేధించబడిన సమయంలో ఒక సి.పి.ఐ. సభ్యుని పేరును ప్రభుత్వానికి సిఫార్సు చేయడం ఆయనకు ఇష్టం లేకపోవడమే ఈ రాజీనామాకు అసలు కారణం.

దాదాపు నిషేధానికి గురైన పరిస్థితులలో ఎ.ఐ.టి.యు.సి. 23వ మహాసభ 1949 చివరలో బొంబాయిలో జరిగింది. ఈ సమావేశం శ్రీ చక్రయ్య చెట్టియార్‌ను ఎ.ఐ.టి.యు.సి. అధ్యక్షునిగా ఎన్నుకున్నది.

కమ్యూనిస్టు పార్టీపై అప్రకటిత నిషేధం కొనసాగుతున్నప్పటికీ, తీవ్రంగా అణచివేత కొనసాగుతున్నప్పటికీ, కార్మికవర్గం సాగించిన నిర్ణయాత్మకమైన ఆర్థిక పోరాటాలు 1950 నాటికి తీవ్రరూపం ధరించాయి. ఈ క్రింది పట్టిక 1947-50 మధ్యకాలంలో కార్మికవర్గ కార్యాచరణను సూచిస్తుంది. ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1950లోనే అత్యధికంగా పనిదినాల నష్టం జరిగిందని తేటతెల్లమవుతుంది.

| **సం** | **సమ్మె పోరాటాల సంఖ్య** | **పాల్గొన్న కార్మికులు** | **నష్టపోయిన పనిదినాల సంఖ్య** |
|---|---|---|---|
| 1947 | 1811 | 18,40,784 | 1,65,62,666 |
| 1948 | 1259 | 10,59,120 | 78,37,173 |
| 1949 | 920 | 6,05,457 | 66,00,295 |
| 1950 | 814 | 7,19,883 | 1,28,06,704 |

భారతదేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు బలమైన పునాదిని ఏర్పరచడం కోసం పాలక వర్గాలు ఆర్థిక వ్యవస్థను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి పూనుకున్నాయి. 1951-56 సం॥లలో మొదటి పంచవర్ష ప్రణాళిక, 1956-61 మధ్య కాలంలో రెండవ పంచవర్ష ప్రణాళిక, 1961 నుండి 66 వరకు మూడవ పంచవర్ష ప్రణాళిక అమలు చేయబడ్డాయి. 1966-71లో 4వ పంచవర్ష ప్రణాళిక అమలు చేయబడింది.

సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు మహా విప్లవం విజయవంతమైన పిమ్మట సోవియట్ రష్యా తన సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకొనడానికి పూనుకున్నది. అప్పటి నుండి ఆర్థిక ప్రగతిని సాధించడానికి అన్ని సోషలిస్టు దేశాలు యిదే పద్ధతి ననుసరించసాగాయి. కాని యీనాడు యీ ప్రణాళికా విధానం సోషలిస్టేతర దేశాలకు, ముఖ్యంగా క్రొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న దేశాలకు కూడా సర్వసాధారణమయింది.

అయితే పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్వమున్న ఫ్యూడల్ అవశేషాలు గల్గిన అనేక ఆఫ్రికా దేశాలు మొదలుకుని, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కొంతమేరకు అభివృద్ధి చెందిన ఇండియా వంటి దేశాలవరకు, అనేక దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మించి, మరింత పటిష్టవంతం చేయడానికి యీ ప్రణాళికా విధానం ఉద్దేశించబడింది.

నేటి పరిస్థితులలో "మిశ్రమ ఆర్థిక వ్యవస్థ" పరిధిలో పెట్టుబడిదారీ ఆర్థిక సూత్రాల అమలును కొంత మేరకు క్రమబద్ధం చేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే పెట్టుబడిదారీ విధానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకుద్దేశించిన "స్టేట్ క్యాపిటలిజమ్"కు పెట్టుబడిదారీ ప్రణాళికలు ప్రతిరూపాలుగా నిలిచాయి. ఈ విధానాల పర్యవసానంగా ధనికులు మరింత ధనికులుగాను, పేదలు మరింత పేదలుగాను కావడం జరిగింది.

ఇండియాలో కూడా ఈ ప్రణాళికలు కార్మికవర్గంతో సహా ఇతర శ్రామిక జనావళి కనీస అవసరాలను కూడా తీర్చలేకపోయాయి. కార్మికవర్గం మీద ఈ ప్రణాళికలు ఏ విధమైన ప్రభావం చూపిందీ వివరిస్తూ దేశంలోని కొందరు ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు చేసిన పరిశీలనలను కొన్నింటిని చూద్దాం.

1960 అక్టోబర్‌లో ప్రణాళిక సంఘం నియమించిన ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ ఆధ్వర్యంలోని కమిటీ అధ్యయనం ప్రకారం, మొదటి రెండు పంచవర్ష ప్రణాళికా కాలంలో సగటు తలసరి జాతీయాదాయం ఒక శాతం మాత్రమే పెరిగింది. పంపిణీ విధానంలో నెలకొన్న తీవ్ర అసమానతల పుణ్యమా అని, సగటు తలసరి జాతీయాదాయంలో వచ్చిన యీ ఒక శాతం పెరుగుదల కూడా అందరికీ ఒకే విధంగా లేదు. ప్రజానీకంలో అత్యధికుల విషయంలో యీ పెరుగుదల చాలా తక్కువగా వున్నదన్నమాట. వేరొక అధ్యయనం ప్రకారం 1955-56 సం॥లో, 72 శాతం ప్రజానీకం ఆదాయం సగటు తలసరి జాతీయాదాయం కంటే తక్కువగా వుంది.

ఇక జీతాల పరిస్థితి చూస్తే జీతాల పెరుగుదలలో వివిధ పరిశ్రమల మధ్య అసమానతలున్నప్పటికీ, మొత్తం మీద ఫ్యాక్టరీని కార్మికుల జీతాలు 1955-56 నాటి వరకు

పెరుగుతూనే వున్నాయి. 1951, 1955, 1957 సంవత్సరాలలో వినిమయ ధర సూచి వరసగా 105,95,111 పాయింట్లుగా వుండగా, సగటు సంవత్సర జీతాలు వరసగా 1036 రూ॥లు, 1173 రూ॥లు, 1234 రూపాయలుగా వున్నాయి. అంటే 50వ దశకం (1950–60) మధ్యకాలంలో జీతాలు, ఆ దశకం ప్రారంభంలో వున్న స్థాయికి దిగజారాయి. ఆఫీసు ఉద్యోగుల (వైట్‌కాలర్ ఉద్యోగుల) జీతాలు పెరగడం మాట అటుంచి, కొంతమేరకు తగ్గడం కూడా జరిగింది.

1950–62 మధ్యకాలంలో ఫ్యాక్టరీ కార్మికుల సగటు సంవత్సర జీతాలు సుమారు 50 శాతం పెరిగాయి. కాని నానాటికి పెరుగుతున్న జీవన వ్యయం, నామమాత్రంగా వున్న వారి ఆదాయాల్లోని పెరుగుదలలో అత్యధిక భాగాన్ని కబళించివేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవన వ్యయ సూచికను తయారు చేయడంలో అవలంబించే మోసపూరితమైన పద్ధతులకు వ్యతిరేకంగా భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం అనేకమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. ప్రభుత్వం తయారు చేసిన ఈ తప్పుడు తడకల జీవన వ్యయ సూచిక ధరల పెరుగుదలను పూర్తిగాగాక పాక్షికంగానే ప్రతిబింబిస్తోంది. తప్పులు తడకలతో కూడిన ఈ సమాచారం ప్రకారమే, ధరలు కనీసం 30 శాతం పెరిగాయి. 1950లో 115.8 పాయింట్ల వద్ద వున్న ధరల సూచిక 1962 నాటికి 150.3కు చేరుకున్నది. మరొక అధికార సమాచారం ప్రకారమే, ఫ్యాక్టరీ కార్మికుల నిజాదాయాలు గత 12 సం॥ల కాలంలో సుమారు 10 శాతం మాత్రం పెరిగాయి. (1950లో రు.114లుగా వున్న ఆదాయం 1962 నాటికి రు. 126.5లకు చేరుకున్నాయి) కార్మికుల నిజ వేతనాలలో పెరుగుదల అతి తక్కువగా సంవత్సరానికి 1 శాతం కంటే తక్కువగా వున్నది. కాని ఉత్పత్తి మాత్రం సుమారు 30 శాతం పెరిగింది. 1950లో ఉత్పత్తి సూచి 94.7 పాయింట్లు వుండగా 1962 నాటికి యిది 129.7 పాయింట్లకు చేరుకున్నది. అంటే నిజ ఆదాయాల్లో వున్న ఆ కాస్త పెరుగుదలను కూడా ఉత్పాదకతను పెంచడం ద్వారా యజమానులు హరించి వేస్తున్నారన్నమాట!

మొదటి రెండు ప్రణాళికలు అమలులోనున్న కాలంలో ఫ్యాక్టరీలో కార్మికుల జీతాలను గురించి ఒక అధికార సమీక్ష క్లుప్తంగా యీ విధంగా పేర్కొన్నది. “మొదటి పంచవర్ష ప్రణాళికకు ముందు నుండే డబ్బు రూపేణా కార్మికుల తలసరి సగటు సంవత్సరాదాయం పెరుగుతున్నప్పటికీ, 1953 సం॥లో మాత్రమే కార్మికుల నిజ వేతనాలు రెండవ ప్రపంచ యుద్ధానికి ముందున్న స్థితికి చేరాయి. ఈ సంవత్సరంలోనే జీవన వ్యయ సూచికలోని పెరుగుదలను మించి కార్మికుల జీతాలు పెరిగాయి. రెండవ ప్రణాళికా కాలంలో డబ్బు రూపేణా కార్మికుల జీతాలు పెరిగినప్పటికీ, వారి నిజవేతనాలు పడిపోసాగాయి. ఫ్యాక్టరీ కార్మికులు 1956 నాటి నిజ వేతనాల స్థాయికి చేరడం 1961లో మాత్రమే సాధ్యమయింది.”

ప్రభుత్వ అధ్యయనం ప్రకారమే మొదటి ప్రణాళికా కాలంలో స్థిరంగా కాకపోయినప్పటికీ మొత్తం మీద కార్మికుల నిజవేతనాలు పెరిగాయి. కాని రెండవ ప్రణాళికా కాలంలో కార్మికుల నిజవేతనాలు నిస్సందేహంగా పడిపోయాయి. ఈ విధంగా కార్మికుల నిజవేతనాలు పడిపోతుండగా ‘‘ఉత్పత్తి, జాతీయాదాయాలలో సాధించిన అభివృద్ధి కారణంగా

పారిశ్రామికవేత్తలు, బడా వ్యాపారులు తదితర ధనికవర్గాలవారు చాలా లాభించారు” అని ప్రముఖ గాంధేయ ఆర్థిక శాస్త్రవేత్త డా॥ గ్యాన్‌చంద్ పేర్కొన్నారు.

ఈ పరిస్థితులలో కార్మికవర్గం తమ జీవన ప్రమాణాలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించవలసి వచ్చింది. ఈ ప్రతిఘటన పరిశ్రమలవారీ, ప్రాంతాలవారీ సార్వత్రిక సమ్మెలు బ్రహ్మాండమైన ప్రజా ప్రదర్శనలు తదితర రూపాలలో సాగింది.

1956 సం॥లో సరిగ్గా మొదటి పంచవర్ష ప్రణాళిక ముగియవలసి వుండగా, కార్మికవర్గ పోరాటాలు ఉవ్వెత్తున చెలరేగాయి. ఈ క్రింది సమాచారం పరిశీలిస్తే 1951–1962 సం॥ల మధ్య 12 సం॥ల కాలంలో ఇండియాలోని పారిశ్రామిక వివాదాల పరిస్థితి వెల్లడవుతుంది.

| సం | సమ్మెల సంఖ్య | పాల్గొన్న కార్మికులు | నష్టపోయిన పనిదినాలు |
|---|---|---|---|
| 1951 | 1071 | 6,91,321 | 38,18,928 |
| 1952 | 963 | 8,09,242 | 33,36,961 |
| 1953 | 772 | 4,66,607 | 33,82,608 |
| 1954 | 840 | 4,77,138 | 33,72,630 |
| 1955 | 11,666 | 5,27,767 | 56,97,848 |
| 1956 | 1,203 | 7,15,130 | 69,92,040 |
| 1957 | 1,630 | 8,89,371 | 64,29,319 |
| 1958 | 1,524 | 9,28,566 | 77,97,585 |
| 1959 | 1,531 | 6,93,616 | 56,33,148 |
| 1960 | 1,538 | 9,86,268 | 65,36,517 |
| 1961 | 1, 357 | 5,11,860 | 49,18,755 |
| 1962 | 1,491 | 7,05,059 | 61,20,576 |

1955 నుండి కార్మికవర్గ పోరాటాల సంఖ్య ఒక క్రమపద్ధతిలో వున్నదనడాన్ని పై పట్టిక రుజువు చేస్తోంది. తమ జీవన ప్రమాణాలను పరిరక్షించుకుంటూ, కొన్ని సందర్భాలలో

జీవన ప్రమాణాల్లో మెరుగుదల కోసం భారత కార్మికవర్గం నిరంతర పోరాటం సాగించినట్లు స్పష్టమవుతుంది. ఈ పోరాటాలు ఏ విధమైన మినహాయింపులు లేకుండా దేశంలోని అన్ని పారిశ్రామిక కేంద్రాలకు వ్యాపించాయి.

ప్రణాళికలు అమలు జరుగుతున్న ఈ కాలంలో భారతదేశంలో అనేక నూతన పరిశ్రమలు స్థాపించబడ్డాయి. ఉక్కు తదితర భారీ పరిశ్రమలతో పాటు, నౌకా నిర్మాణం, రైలు యింజన్ల తయారీ మొదలు మందులు, రసాయన పదార్థాల పరిశ్రమల వరకు, భారతదేశంలో కనీవినీ ఎరుగని అనేక పరిశ్రమలు స్థాపించబడ్డాయి. బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, తంతి తపాలా మొదలయిన పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. దీనితోపాటు ప్రభుత్వ యంత్రాంగం కూడా విస్తరించబడింది. పరిశ్రమలు విస్తరించడంతో సంఖ్యాపరంగా కార్మికవర్గం మరింత బలం పుంజుకున్నది. అన్ని ఫ్యాక్టరీలు, పరిశ్రమలలోనూ కొత్త యూనియన్లు అవతరించాయి. సాంప్రదాయ పరిశ్రమలా, కొత్త పరిశ్రమలా అనే తేడా లేకుండా అన్ని పరిశ్రమలలోని కార్మికులు తీవ్రమైన పోరాటాలు సాగించారు. అసంఖ్యాకంగా సాగిన ఈ కార్మికవర్గ పోరాటాలను గురించిన వివరాలు మరొక గ్రంథమవుతాయి.

ఈ సమయంలో ముఖ్యంగా 1955-56 తరువాత కాలంలో దేశ కార్మికోద్యమంలో ప్రధానంగా గవర్నమెంటు తదితర ఆఫీసు ఉద్యోగుల (ట్రేడ్ యూనియన్) ఉద్యమం వువ్వెత్తున లేవడం ఒక మహత్తర, వినూత్న పరిణామం.

జీవన వ్యయ సూచికలో పెరుగుదలను జీతాలు పెంచడం ద్వారా భర్తీ చేయడం, ప్రస్తుతం అమలులోనున్న, అర్ధరహితమైన, అసమంజసమైన జీతాల స్కేళ్లను సవరించి మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల కనుగుణంగా జీతాలను సవరించడం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న మొండి వైఖరితో విసుగెత్తి పోయిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ రంగాల్లో ప్రతిఘటనా కార్యక్రమాలకు పూనుకున్నారు. అవసరాల ప్రాతిపదిక మీద కనీస వేతనాలు చెల్లించాలనే డిమాండ్ పారిశ్రామిక కార్మికులను, ఆఫీసు ఉద్యోగులను కూడా ఉత్తేజపరిచింది. 1957 జూలై 11, 12 తేదీలలో ఢిల్లీలో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 15వ సమావేశం, అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం నిర్ణయించడానికి కొన్ని ప్రమాణాలను నిర్ధారించింది. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 15వ సమావేశం తీసుకున్న ఈ నిర్ణయం దేశంలోని కార్మికులను, ఉద్యోగులను తీవ్ర పోరాటాలకు పురిగొల్పింది.

ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 15వ సమావేశం యజమానులు, ప్రభుత్వం, కార్మికుల మధ్య జరిగిన ఒక త్రైపాక్షిక సమావేశం. ఈ సమావేశానికి కేంద్ర కార్మిక మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా అధ్యక్షత వహించాడు. అందువలన ఈ సమావేశం చేసిన సిఫార్సులు యీ సమావేశంలో పాల్గొన్నవారు అనుసరించవలసిందే. ఈ కాన్ఫరెన్స్ చేసిన ప్రధాన నిర్ణయాలు, సిఫార్సులు ఈ విధంగా వున్నాయి.

1. అవసరాల ప్రాతిపదిక మీద కనీస వేతనం ఉండాలని, ఇది పారిశ్రామిక కార్మికుల కనీస మానవావసరాలను తీర్చేదిగా వుండాలని, అంగీకరిస్తూ కనీస వేతన సంఘాలు (మినిమమ్

వేజ్ కమిటీలు), వేతన (వేజ్) బోర్డులు, మధ్యవర్తులు, తదితర వేతన నిర్ణయాధికారం గల్గిన వారందరికీ మార్గదర్శకంగా వుండగలందులకు ఈ క్రింది ప్రమాణాలు అంగీకరించబడ్డాయి.

(i) కనీస వేతనం లెక్కించడానికి కార్మికుని కుటుంబంలో సంపాదించే ప్రతి ఒక్కరిపై ముగ్గురు ఆధారపడియుంటారని భావించాలి. స్త్రీలు, పిల్లలు మొదలైన వారి సంపాదనను పరిగణనలోకి తీసుకొనరాదు.

(ii) మామూలుగా పనిచేసే యుక్తవయస్కుడైన భారతీయునికి కావలసిన శక్తి విషయమై డా॥ అక్రోయిడ్ చేసిన సిఫార్సులను ఆధారంగా చేసుకొని కనీస ఆహార అవసరాలను నిర్ణయించాలి.

(iii) సంవత్సరానికి ఒక్కొక్కరికి 18 గజాల చొప్పున నల్గురు సభ్యులు గల్గిన సాధారణ కార్మికుని కుటుంబానికి, మొత్తం 72 గజాల గుడ్డ అవసరం వుంటుందనే అంచనా ఆధారంగా గుడ్డల అవసరాన్ని నిర్ణయించాలి.

(iv) ప్రభుత్వ పారిశ్రామిక గృహనిర్మాణ పథకం ప్రకారం సమకూర్చవలసిన కనీస స్థలానికి చెల్లించవలసిన అద్దెను ఆధారంగా తీసుకుని కనీస వేతనాన్ని నిర్ణయించాలి.

(v) మొత్తం "కనీస వేతనం"లో 20 శాతం వంటచెరకు, లైటింగ్ తదితర సౌకర్యాల కొరకు కేటాయించాలి.

2. ఈ సిఫార్సుల ప్రకారం చెల్లించవలసిన కనీస వేతనానికంటే తక్కువ కనీస వేతనం ఎక్కడైనా నిర్ణయించబడితే, ఈ ప్రమాణాలకు భిన్నంగా ఏ పరిస్థితులలో వారు ఈ విధంగా కనీస వేతనం నిర్ణయించారో సమర్థించుకొనవలసిన బాధ్యత ఆయా యాజమాన్యాలమీద వుంటుంది.

భారతీయులకు "జీర్ణశక్తి" తక్కువగా వుంటుందని భావించి డా॥అక్రోయిడ్ మామూలుగా పనిచేసే యుక్తవయస్కుడైన ఒక భారతీయునికి 2700 కాలరీల శక్తి చాలుతుందని నిర్ధారించాడు.

స్వాతంత్ర్యానికి ముందు 1947 మే నెలలో మొట్టమొదటి సెంట్రల్ పే కమిషన్ (కేంద్ర వేతన సంఘం) కరువు భత్యం విషయమై కొన్ని సూత్రాలను ప్రకటించింది. మొదటి వేతన సంఘం 1939 జీవన వ్యయాన్ని 100 పాయింట్లుగా తీసుకున్నది. 1947 నాటికి ధరలు అత్యధికంగా వున్నాయని భావించి కరువుభత్యం సమస్యపై తన సిఫార్సులను చేసింది. అందువలన జీతాల స్కేళ్ళలో దిగువన వున్నవారికి జీవన వ్యయసూచిక 180 పాయింట్లు దాటితే ఆపైన ప్రతి 20 పాయింట్లకు 5 రూ॥ల చొప్పున జీతాల పెంపుదలను మంజూరు చేసింది. అదే విధంగా మిగిలిన వేతన స్కేళ్ళలో కూడా పెరుగుదల చూపింది. ఐతే జీవన వ్యయసూచిక 280 పాయింట్లు దాటిన తరువాత మాత్రమే మరల కరువు భత్యం మార్పుచేయాలని ఒక అంశాన్ని చేర్చింది. "ప్రభుత్వం ప్రైవేటు ఉద్యోగుల ననుసరించడంగాక తాను మార్గదర్శకంగా వుండాలి. ప్రైవేటు పరిశ్రమలకు ఏదైనా కనీస వేతన శాసనాన్ని చేయ సంకల్పించినట్లయితే ప్రభుత్వం అదే సూత్రాన్ని తన ఉద్యోగులకు కూడా అమలు చేయడానికి సిద్ధంగా వుండాలి" అని ఈ కమిషన్ తన రిపోర్టులో పేర్కొంది.

వేతనాలను నిర్ణయించే ఈ ప్రమాణాలు, మార్గదర్శక సూత్రాలు దేశవ్యాప్తంగా వున్న ప్రభుత్వ ఉద్యోగులను కోపోద్రిక్తులను చేశాయి. మిక్కిలి అసంతృప్తి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అనేక రూపాల్లో పోరాటాలు సాగించారు. జీతాలు, కరువుభత్యం సమస్యలతో బాటు ప్రభుత్వ ఉద్యోగులకు ట్రేడ్ యూనియన్ హక్కులు, సర్వసాధారణమైన ప్రజాతంత్ర హక్కులు లేకుండా చేస్తూ బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి (కాండక్ట్ రూల్స్) స్వాతంత్ర్యానంతరం కూడా యింకా కొనసాగడం పట్ల ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా అసంతృప్తి చెంది వున్నారు. ఈనాటి పరిస్థితుల కనుగుణంగా కాండక్ట్ రూల్స్‌ను పూర్తిగా రద్దు చేయాలని లేదా సమగ్రమైన మార్పులు చేయాలని ప్రభుత్వోద్యోగులు డిమాండు చేశారు.

1959 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం రెండవ సెంట్రల్ పే కమిషన్ రిపోర్టుతో బాటు ఈ కమిషన్ సిఫార్సులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రకటించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 15వ సమావేశం నిర్ణయించిన ప్రమాణాలు, మార్గదర్శక సూత్రాలను ఆధారం చేసుకుని 1957 సంవత్సరాంతానికి వున్న ధరలను పరిగణనలోకి తీసుకుని నెలకు 110 రూ॥లు నుండి 137 రూ॥ల వరకు కనీస వేతనం నిర్ణయించవల్సిందిగా డిమాండు చేస్తూ రెండవ వేతన కమిషన్‌కు అనేక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు మెమోరాండంలు సమర్పించాయి. అవసరాల ప్రాతిపదికమీద కనీస వేతనం నిర్ణయించాలన్న సూత్రాన్ని తిరస్కరించడానికి రెండవ వేతన సంఘం ఒక వింతైన వాదన చేసింది. "తలసరి ఆదాయం కంటే ఎక్కువగా 'అవసరాల ప్రాతిపదిక మీద కనీస వేతనం' నిర్ణయించడం, దీనిని విస్తృతంగా అమలు చేయడం మన శక్తికి మించిన పని. పొదుపు, పెట్టుబడులను పెంచవల్సిన అవసరాన్ని నిర్లక్ష్యం చేసి హెచ్చు వేతనాలు ఇచ్చినట్లయితే, యిక మనం భవిష్యత్తును గురించి ఆలోచించలేము. వ్యవస్థీకృత పరిశ్రమలలో సాధారణంగా అమలులో వున్న వేతనాల స్థాయిని మించి వేతనాలు ఇచ్చినట్లయితే, సగటు జీవన ప్రమాణాల కంటే తక్కువ స్థాయిలో జీవించేవారికి రక్షణ కల్పించడం అసాధ్యమవుతుంది" అని వేతన సంఘం వాదించింది. 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ చేసిన సిఫార్సులను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏ విధమైన బాధ్యతా వహించలేదు. ఈ విషయంలో భారత ప్రభుత్వంలోని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కమిషన్ రికార్డు చేసింది.

"లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సులను ప్రభుత్వ నిర్ణయంగా భావించడానికి వీలులేదు. ఈ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం లాంఛనప్రాయంగానైనా ఆమోదించలేదు. త్రైపాక్షిక స్వభావం గల్గిన ఈ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ చేసినవి నిర్ణయాలు కావు. ఇవి కేవలం సిఫార్సులు మాత్రమే. అంతేగాక ఈ సిఫార్సులను అమలు చేయడానికి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఎన్నడూ అంగీకరించలేదు" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణలో పేర్కొన్నది.

వినిమయ ధరల సూచి సంఖ్యను 1949లో 100 పాయింట్లుగా రెండవ వేతన సంఘం నిర్ణయించింది. అంటే వినిమయ ధరల సూచి ప్రాతిపదిక సంవత్సరాన్ని 1946కు మార్చడం జరిగింది. ధరల సూచిలో పెరుగుదలను బట్టి ఆటోమేటిక్‌గా కరువు భత్యం

చెల్లించవద్దని ఈ కమిటీ ప్రభుత్వానికి సలహా ఇచ్చింది. ఆ విధంగా చేసినట్లయితే ధరల పెరుగుదలకు కారణాలు, ఆనాడు నెలకొన్న పరిస్థితులతో సంబంధం లేకుండా కొంతమేరకు అన్ని తరగతుల ఉద్యోగులకు ధరల పెరుగుదలను భర్తీ చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద పడుతుందని ఈ కమిటీ పేర్కొన్నది.

నెలకు 300 రూపాయల లోపు జీతాలు పొందే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం కరువు భత్యాన్ని జీతంలో ఒక ప్రత్యేక భాగంగా చెల్లించడం కొనసాగించాలని ఈ కమిషన్ సిఫార్సు చేసింది. దీనితోపాటు ఈ క్రింది విధంగా కరువు భత్యం చెల్లించాలని కూడ ఈ కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

ఎ. 150 రూ॥ల లోపు మూల వేతనం కలవారికి నెలకు 10 రూ॥లు

బి. 150 రూ॥ల పైన 300 రూ॥ల లోపు మూల వేతనం పొందుతున్న వారికి నెలకు 20 రూ॥లు.

వినిమయ ధరల సూచిలో పెరుగుదల కొనసాగినట్లయితే, ఆనాటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని 400 రూ॥లు పైబడి, 1000 రూ॥లకు తక్కువ జీతం పొందుతున్నవారికి కూడా కరువుభత్యం చెల్లించే విషయం ఆలోచించవలసిందిగా యీ కమిషన్ తన నివేదికలో పేర్కొన్నది.

రెండవ వేతన సంఘం చేసిన యీ ప్రమాదకరమైన సిఫార్సులపట్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులేగాక, దాదాపు భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం యావత్తు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కమిషన్ సిఫార్సులను పూర్తిగా పునఃపరిశీలించవలసిందిగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు చేసిన విజ్ఞప్తులను ప్రభుత్వం మొండిగా తిరస్కరించింది. దీనితో ఉద్యోగ సంఘాలు తమ న్యాయమైన కోర్కెల సాధనకు పోరాటాన్ని సాగించడానికి నిశ్చయించాయి. అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం నిర్ణయించాలని, వినిమయదారుల ధరల సూచికి లింక్ చేసి కరువు భత్యం చెల్లించాలన్న రెండు ప్రధానమైన డిమాండ్ల సాధనకు కేంద్ర ప్రభుత్వోద్యోగులు బ్రహ్మాండమైన సమ్మె పోరాటం నిర్వహించారు.

1960 ఏప్రిల్ 2, 3 తేదీలలో బొంబాయిలో జరిగిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సదస్సు, ప్రభుత్వ శాఖలన్నింటిలోని, అన్ని తరగతుల ఉద్యోగులందరినీ కలుపుకొని వచ్చే విధంగా ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఎంప్లాయీస్, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయీస్‌లతో ఒక జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ (జెసిఎ) ని ఏర్పాటు చేసింది. ఈ జె.సి.ఎ.కు ఛైర్మన్‌గా ఎన్.ఎఫ్.పి.టి.ఇ. అధ్యక్షుడు శ్రీ వి.జి.దాల్వీ, కార్యదర్శిగా ఎ.ఐ.ఆర్.ఎఫ్. ప్రధాన కార్యదర్శి శ్రీ పీటర్ అల్వారిస్ ఎన్నుకోబడ్డారు.

ఆరు అంశాల కోర్కెల పత్రాన్ని ఆధారం చేసుకొని ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సదస్సు కోరింది. మొదటి వేతన సంఘం సిఫార్సుల ప్రాతిపదికగా డి.ఎ. చెల్లించాలని, 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకటించిన మార్గదర్శక

సూత్రాలననుసరించి జాతీయ కనీస వేతనం నిర్ణయించాలని, ఒకటి, రెండు, మూడు, నాల్గవ తరగతి ఉద్యోగులు, నైపుణ్యం కలిగిన, నైపుణ్యంలేని, అర్ధ (సెమీ) నైపుణ్యం గల్గిన వివిధ కేటగిరీలకు చెందిన కార్మికుల జీతాల మధ్య తేడా హేతుబద్ధంగా వుండాలన్న డిమాండ్లు ఈ ఆరు అంశాల కోర్కెల పత్రంలో చోటుచేసుకున్నాయి. ఈ సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం లభించని యెడల సమ్మె నిర్వహించడానికి సదస్సు జె.సి.ఎ.కు అధికారమిచ్చింది. ఓడరేవు పనివారికి కూడా వేతన సంఘ సిఫార్సుల ననుసరించే డి.ఎ. చెల్లించడం జరుగుతుంది. కనుక ఆలిండియా పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్‌ను కూడా సమ్మెలో పాల్గొనవలసిందిగా జె.సి.ఎ. ఆహ్వానించింది. ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎమ్.ఎస్., యు.టి.యు.సి. మొదలైన కేంద్ర కార్మిక సంఘాలతో బాటు జె.సి.ఎ.కు బయటనున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల యూనియన్ల సహకారం కూడా ఆర్థించడం జరిగింది. ఐ.ఎన్.టి.యు.సి. మాత్రం ఈ సమ్మెను తీవ్రంగా వ్యతిరేకించి, ఈ సమ్మెను 'జాతి వ్యతిరేకమైన' 'అవివేకమైన చర్య'గా నిందించింది.

ప్రభుత్వం ఉద్యోగుల కోర్కెల విషయమై సంప్రదింపులు జరపడం ద్వారా ఒప్పందం చేసుకొనడానికి విముఖత చూపించింది. ఈ పరిస్థితులలో భారత దేశాధ్యక్షుడు అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సు (1960)ను జారీ చేయడం ద్వారా ఉద్యోగులు చేయ సంకల్పించిన ఈ సమ్మె చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించారు. ఆనాటి భారత ప్రధాని శ్రీ జవహర్‌లాల్‌నెహ్రూ ఈ సమ్మెను "ప్రజల తిరుగుబాటు"గా అభివర్ణించి, ఈ సవాలును ఎదుర్కొనడానికి తన దృఢ నిశ్చయాన్ని వెల్లడించాడు.

1960 జూలై 11 అర్థరాత్రి నుండి సమ్మె ప్రారంభం కావలసి వుండగా, సమ్మెను జయప్రదం చేయడానికి కృషిచేస్తున్న అనేకమంది కార్యకర్తలు, నాయకులు ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలయ్యేసరికి అరెస్టు చేయబడ్డారు. అయినప్పటికీ సమ్మె అనుకున్న ప్రకారంగానే ప్రారంభమై, దేశమంతటా ప్రజాజీవనం దాదాపు స్తంభించిపోయింది. పెద్ద ఎత్తున అరెస్టులు సాగించటంతో బాటు, ఈ సమ్మెను భగ్నం చేయడానికి ప్రభుత్వం పోలీసుల జోక్యాన్ని తీవ్రతరం చేసింది. ఈ సమ్మెను సవాలుగా భావించిన ప్రభుత్వం దానిని ఎదుర్కొనడానికి పోలీసులు, హోమ్‌గార్డులు, సరిహద్దు దళాలను పూర్తిగా మోహరించింది. సైనిక దళాలు కూడా సిద్ధం చేయబడ్డాయి. అనేకచోట్ల సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు లాఠీచార్జీ జరిపారు. రెండు చోట్ల సమ్మెదారులపై కాల్పులు కూడా జరిగాయి. పశ్చిమ రైల్వేలోని దోహద్ వర్క్ షాపులో జరిపిన కాల్పుల్లో సమ్మె చేస్తున్న ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

ఈ సందర్భంగా 20 వేల మందికి పైగా ప్రజలు అరెస్టు చేయబడ్డారు. లాఠీచార్జీ, పోలీసు కాల్పులు విచ్చలవిడిగా జరిగాయి. ఫలితంగా అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. సమ్మెలో పాల్గొన్నందుకు కనీసం 1,500 మంది ఉద్యోగులు డిస్మిస్ చేయబడడంతో బాటు మరొక 10వేల మంది సస్పెండ్ చేయబడ్డారు. 1,500 మందికి పైగా ఉద్యోగులను దోషులుగా నిర్ణయించి జైలుశిక్ష విధించడం జరిగింది.

ఈ విధంగా ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు విచక్షణారహితంగా అధికార దుర్వినియోగానికి పాల్పడింది. ఈ పరిస్థితుల్లో విడుదల చేయబడ్డ జెసిఎ నాయకులు సమ్మె వలన ఏర్పడిన పరిణామాలను సమీక్షించడానికి జూలై 16వ తేదీన ఢిల్లీలో సమావేశమై సమ్మెను ఉపసంహరించు కొనవలసిందిగా ఉద్యోగులను కోరారు. జూలై 17వ తేదీన ఉద్యోగులు తిరిగి విధులకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 5 రోజులు సాగించిన ఈ మహత్తర పోరాటం ఈ విధంగా ముగిసింది.

ఈ చారిత్రాత్మకమైన సమ్మెకు ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి. వంటి కేంద్ర ట్రేడ్ యూనియన్లతో బాటు అన్ని ప్రతిపక్ష పార్టీలు మద్దతు యిచ్చాయి. కేంద్ర ట్రేడ్ యూనియన్లకు అనుబంధంగా లేని అనేక పరిశ్రమలలోని యూనియన్లు తమ సంపూర్ణ సహకారాన్నందజేశాయి. ఈ సమ్మెకు విదేశాలలోని అనేక ట్రేడ్ యూనియన్ల నుండి కూడా మద్దతు లభించింది. ట్రేడ్ యూనియన్స్ ఇంటర్నేషనల్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఆల్లైడ్ ఎంప్లాయీస్, ఆల్ ఇండోనేషియా ట్రేడ్ యూనియన్ సెంటర్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్ట్స్ అండ్ టెలిగ్రాఫ్స్, టెలిఫోన్ వర్కర్స్ ఆఫ్ ఫ్రాన్స్, జపనీస్ పబ్లిక్ సర్వీస్ వర్కర్స్ యూనియన్‌లు ఈ సమ్మెకు మద్దతునిచ్చాయి.

తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో కోర్కెలు సాధించకుండానే సమ్మె ఉపసంహరించబడినప్పటికీ దేశంలోని కార్మికవర్గం ముఖ్యంగా ఆఫీసు ఉద్యోగులు రాబోయే రోజుల్లో సాగించే పోరాటాలకీ సమ్మె నాంది పలికింది. ఈ పోరాట జ్వాలలు కార్మికులు, ఉద్యోగుల్లో రగిల్చిన స్ఫూర్తితో తరువాత దశాబ్ద కాలంలో కనీ వినీ ఎరుగని బ్రహ్మాండమైన ట్రేడ్ యూనియన్ పోరాటాలు యావద్భారతదేశాన్ని వూపివేసి సంచలనాన్ని సృష్టించాయి.

తన శక్తియుక్తులన్నింటిని వినియోగించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పోరాటాల నణచివేయడానికి ప్రభుత్వం సర్వశక్తులను వినియోగించడంతో ఆగక, దేశాభివృద్ధిలో కార్మికులకు న్యాయంగా రావలసిన వాటాను వారికి కాకుండా చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలను విజయవంతంగా అమలు జరిపింది. దీనిలో భాగంగానే 1962లో ప్రభుత్వం నియమించిన బోనస్ కమిషన్ 1964లో తన రిపోర్టును సమర్పించింది. ఈ కమిషన్ కనీస బోనసు 4 శాతంగానూ, గరిష్ట బోనసు 20 శాతంగానూ నిర్ణయించింది. బోనస్ కనిష్ట స్థాయిలో వుంచేందుకు వీలని యజమానులు ఆస్తి – అప్పుల పట్టిక (బ్యాలన్స్ షీట్ల)లను తయారుచేయడంలో అక్రమ పద్ధతులవలంబించేందుకు ఈ కమిషన్ అవకాశాలు కల్పించింది. ఈ బోనసు కమిషన్ సిఫారసులతోబాటు, కార్మికులకు న్యాయమైన బోనసును నిరాకరిస్తూ 1964 సెప్టెంబరులో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ప్రకటించడంతో, కార్మికులలో తీవ్రమైన అసంతృప్తి చెలరేగింది. ఇదిలా వుండగా కనీస బోనసు నిర్ణయించడాన్ని యజమానులు కూడ తీవ్రంగా వ్యతిరేకించారు. వారు కార్మికులకు అసలు బోనసు చెల్లించడానికి గాని, నిరాకరించడానికిగాని తమకు పూర్తి స్వేచ్ఛ కావాలని కోరారు.

ఆ తర్వాత ప్రభుత్వం నియమించిన నేషనల్ లేబర్ కమిషన్ 1966–68 మధ్య కాలంలో తన కార్యకలాపాలను కొనసాగించి, చివరకు "అవసరాల ప్రాతిపదికన కనీస వేతనాలు

నిర్ణయించాలన్న 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సును కూడా తిరస్కరించి, పరిశ్రమ చెల్లింపు సామర్థ్యం మీద ఆధారపడి కనీస వేతనం నిర్ణయించాలని సిఫార్సు చేసింది. ఒక ప్రక్క కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేసి, నూతన ఉద్యోగావకాశాలను మృగ్యంచేసే అతి ప్రమాదకరమైన యంత్రాలను ప్రవేశపెట్టటానికి వ్యతిరేకంగా ఎల్.ఐ.సి. ఆయిల్ (చమురు) కంపెనీలు, తదితర పరిశ్రమలలోని ఉద్యోగులు, కార్మికులు తీవ్రమైన పోరాటాలు సాగిస్తున్నారు. వేరొక ప్రక్క "యాంత్రీకరణ, క్రమబద్ధీకరణలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రముఖ పాత్ర వహిస్తాయని" బూటకపు వాదన చేస్తూ ఉద్యోగావకాశాలను నాశనం చేసే యంత్రాలు ప్రవేశపెట్టడానికి ఈ కమిషన్ గ్రీన్ సిగ్నల్ యిచ్చింది.

పారిశ్రామిక సంబంధాలకు చెందిన అన్ని విషయాల్లోనూ పూర్తి నిరంకుశ అధికారాలతో, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పారిశ్రామిక సంబంధాల కమిషన్లను ఏర్పాటు చేయాలన్న కమిషన్ సిఫార్సును చూస్తే, ఈ కమిషన్ ఆలోచనా విధానం ఎంత నికృష్టంగా వున్నదీ స్పష్టమవుతుంది. ఈ సిఫార్సు ప్రకారం ఈ పారిశ్రామిక సంబంధాల కమిషన్లకు సంప్రదింపులు జరిపి తీర్పు యిచ్చే అధికారంతో సహా ఏ యూనియన్‌ను గుర్తించవలసిందీ నిర్ణయించే అధికారం కూడా వుంటుంది.

సమ్మెలను నిషేధించే అధికారంకూడా యీ కమీషనుకున్నది. 30 రోజుల తరువాత సమ్మెను ఉపసంహరించు కొనవలసిందిగా కూడా ఈ కమిషను ఒక యూనియన్‌ను కోరవచ్చును.

దీనికితోడు ప్రభుత్వం అనేక కార్మిక వ్యతిరేక చట్టాలను చేయడం ప్రారంభించింది. సమ్మెలు, తదితర రూపాల కార్మికవర్గ కార్యాచరణను అదుపులో ఉంచడానికి ఉద్దేశించిన ఈ చట్టాలను నల్ల చట్టాలుగా పరిగణించి కార్మికులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 1960 జూలై నెలలో జరిపిన సమ్మెను, ఆ తర్వాత 1968 సెప్టెంబరు 19న వారు చేసిన లాంఛనప్రాయపు (టోకెన్) సమ్మెను చట్ట విరుద్ధమని ప్రకటించడానికనువుగా ప్రభుత్వం జారీ చేసిన అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సు, అత్యవసర సర్వీసుల నిర్వహణా చట్టంగా రాజ్యాంగంలో శాశ్వతంగానే చోటు చేసుకుంది. ఈ చట్టం చేసిన తరువాత కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను అణచి వేసేందుకు వివిధ పరిశ్రమల్లో (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సు – సిఐఎస్ఎఫ్) కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఏర్పాటు చేయబడింది.

ఒక ప్రక్క కార్మికవర్గ పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తుండగా, వేరొక ప్రక్క బడా పారిశ్రామికవేత్తలు హద్దూ పద్దు లేకుండా లాభాలు సంపాదిస్తున్నారు. "ది ఎకనమిక్ టైమ్స్" పత్రిక జరిపిన ఒక అధ్యయనం ప్రకారం దేశంలోని 101 బడా కంపెనీలకు ఆదాయపు పన్ను మినహాయించగా మిగిలిన నికరలాభం 1967–68లో 10,290 మిలియన్లు (1029 కోట్లు) రూపాయలుండగా 1968–69 నాటికి ఈ నికరలాభం 11233 మిలియన్లు (1123.3 కోట్లు) రూపాయలకు పెరిగి కూర్చుంది. అంటే ఒక సంవత్సరంలోనే నికరలాభం 10 శాతం పెరిగిందన్నమాట. పారిశ్రామికవేత్తల లాభాలిలా దిన దిన ప్రవర్ధమానమవుతుండగా, కార్మికుల నిజవేతనాలు క్రమక్రమంగా పడిపోతున్నాయని సంవత్సరానికొకసారి భారత ప్రభుత్వం ప్రచురించే ఇండియన్ లేబర్ స్టాటిస్టిక్స్ వెల్లడించింది.

1961వ సంవత్సరంలో వేతనాన్ని 100 పాయింట్లుగా అనుకుంటే కార్మికుల నిజవేతనాల సూచి 1964 నాటికి 94.9 పాయింట్లకు పడిపోగా, 1965లో 96.8 పాయింట్లకు చేరుకుని, 1966లో తిరిగి 91.3 పాయింట్లకు, 1967లో మరింత దిగజారి 80.9 పాయింట్లకు చేరుకున్నది. ఈ విధంగా ఒక ప్రక్క కార్మికుల నిజవేతనాలు నానాటికి తీసికట్టుగా వున్నాయి. వేరొకవైపు ప్రభుత్వం రేషనలైజేషన్ (క్రమబద్ధీకరణ), రిట్రెంచ్‌మెంట్ యాంత్రీకరణలవలన నిరుద్యోగం ప్రబలమవడంతో మధ్యతరగతి కుటుంబాలు, కార్మికవర్గ కుటుంబాలు చాల బాధలకు గురయ్యాయి.

ఈ దుర్భర పరిస్థితులు కార్మికవర్గాన్ని, ఆఫీసు ఉద్యోగులను నిర్ణయాత్మకమైన ప్రతిఘటనా పోరాటాల్లోకి లాగాయి. 1960తో ప్రారంభమైన దశాబ్దంలో (1960–1970 సం॥ల మధ్య కాలంలో) ఫ్యాక్టరీలవారీగానూ, పరిశ్రమలవారీగానూ, ప్రాంతీయ స్థాయిలోనూ మిలిటెంట్ సమ్మె పోరాటాలతో సహా వివిధ రూపాల్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. మహోజ్వలంగా సాగిన ఈ పోరాటాలలో కార్మికవర్గంతోబాటు ఆఫీసు ఉద్యోగులు, స్కూలు, కాలేజీ ఉపాధ్యాయులుకూడా భాగస్వాములయ్యారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సాగించిన ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలోనే ఒక వినూత్న అధ్యాయం, దేశవ్యాప్తంగా సాగిన ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమాలకు 1955–56లోనే అంకురార్పణ జరిగింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన 5 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 62 రోజులు సాగించిన సుదీర్ఘమైన సమ్మె రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పోరాటాలకు నాంది పలికింది. 40 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు సాగించిన స్వల్పకాలిక సమ్మెలు దేశమంతటా కార్చిచ్చులా వ్యాపించి యావద్భారతదేశాన్ని సమ్మె పోరాటాలతో ముంచెత్తాయి.

తమిళనాడు మినహాయిస్తే దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాలలో తరచుగా నిర్ణయాత్మకమైన, సుదీర్ఘమైన సమ్మె పోరాటాలు వెల్లువలా చెలరేగాయి. ఈ పోరాటాలలో పాల్గొన్న వారిపై కనీవినీ ఎరుగని రీతిలో కక్ష సాధింపు చర్యలు సాగాయి. ప్రభుత్వం విచ్చలవిడిగా అరెస్టులు సాగించింది. అనేకమంది ఉద్యోగులు పనుల నుండి తొలగించబడ్డారు. సర్వీసులో బ్రేకువంటి శిక్షణా చర్యలు ఎన్నో అమలు చేయబడ్డాయి. ఈ పోరాటాలన్నింటినీ సమన్వయం చేసి ఒక సమగ్రమైన రూపం ఇవ్వడంలో ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య) ఒక కీలకమైన పాత్ర నిర్వహించింది. ఈ సమాఖ్య యిచ్చిన పిలుపు ననుసరించి అనేక రాష్ట్రాలలోని ఉద్యోగులు 1967 జనవరి 5వ తేదీ నుండి సమ్మెకు పూనుకొనడం ప్రత్యేకంగా పేర్కొనవలసివుంది.

ఈ సమ్మె దేశ వ్యాప్తంగా జరగడంతో పాటు, ఈ సమ్మె సందర్భంగా లేవనెత్తబడిన డిమాండ్లు. మిక్కిలి ప్రధానమైనవి కావడంతో ఈ కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సాగించిన ఐక్య పోరాటాలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఎల్.ఐ.సి. ఉద్యోగులు ఆటోమేషన్ (యాంత్రీకరణ)కు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమం, 1967–69 మధ్యకాలంలో

పరాకాష్టకు చేరుకున్నది. ఈ మహోజ్వల పోరాటం భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి మార్గదర్శకమైనదనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

దేశవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 1968 సెప్టెంబరు 19వ తేదీన మరల మహత్తరమైన సమ్మెచేశారు.

ఈ సమ్మె దేశవ్యాప్తంగా జరగడంతోపాటు, ఈ సమ్మె సందర్భంగా లేవనెత్తబడిన డిమాండ్లు మిక్కిలి ప్రధానమైనవి కావడంతో ఈ కాలంలో సాగిన ట్రేడ్ యూనియన్ పోరాటాలలో యీ సమ్మె ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

ఉద్యోగుల సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవడంతో, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, ఆల్ ఇండియా డిఫెన్స్ ఎంపాయీస్ ఫెడరేషన్, ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ఎంప్లాయీస్‌లతో కూడిన ఐక్య కార్యాచరణ సమితి (జె.సి.ఎ.) ఏర్పాటు చేయబడింది. ఈ జె.సి.ఎ.కు శ్రీ యస్.యం.జోషి అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. ఈ క్రింది కోర్కెలపై సమ్మెను నిర్వహించే బాధ్యత ఈ "ఐక్య కార్యాచరణ సమితి"కి అప్పగించబడింది.

1) కరువు భత్యాన్ని మూలవేతనంతో కలపాలి.

2) అవసరాల ప్రాతిపదికపై కనీస వేతనం ఇవ్వాలి.

3) ధరల పెరుగుదలను (డి.ఏ. ద్వారా) పూర్తిగా భర్తీ చేయాలి.

4) నిజాయితీ, సమర్థతలు లోపించాయనే ఆరోపణలతో 50 సం॥ల వయస్సుకే ఉద్యోగులను రిటైర్ చేయాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.

ప్రభుత్వం రెండు ఆర్డినెన్సులు జారీ చేసి ఈ సమ్మెను నిషేధించింది. వీటిలో ఒకటి అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సు కాగా, రెండవది పూర్తిగా రైల్వే ఉద్యోగులపై నిర్బంధాలు విధించడానికుద్దేశించబడినది. ఈ ఆర్డినెన్స్ ప్రకారం (సమ్మెలో పాల్గొన్నవారికి, సహాయపడినవారికి, ప్రోత్సహించినవారికి) ఆరునెలల నుండి సంవత్సరం మేరకు జైలు శిక్షగాని, వెయ్యి రూపాయిల జరిమానా గాని లేదా రెంటినీ విధించవచ్చు.

కేంద్ర కార్మిక సంఘాలతో సంబంధంలేని జాతీయ సమాఖ్యలు, ట్రేడ్ యూనియన్లతో సహా ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి. వంటి కేంద్ర కార్మిక సంఘాలు యీ సమ్మెకు తమ సంపూర్ణ సహకారాన్ని అందజేశాయి. కాని ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెసు నాయకుల ఆశీస్సులతో స్థాపించబడిన భారత రైల్వే కార్మికుల జాతీయ సమాఖ్య (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ – శ్రీఓప్ఫ), ఐ.ఎన్.టి.యు.సి.లు మాత్రం యీ సమ్మెను వ్యతిరేకించాయి.

సమ్మె చేస్తున్న ఉద్యోగుల యెడల ప్రభుత్వం చాలా కఠినమైన వైఖరి నవలంబించింది. ఈ సమ్మె సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో 15 మంది తమ ప్రాణాలు కోల్పోగా,

వందలమంది తీవ్రంగా గాయపడ్డారు. సుమారు 48 వేల మంది తాత్కాలిక ఉద్యోగులను ఉద్యోగాల నుండి తీసివేస్తూ నోటీసులు జారీ చేశారు. అత్యవసర సర్వీసుల నిర్వహణా ఆర్డినెన్స్ క్రింద అరెస్టు చేయబడి, విచారణ జరుపబడిన వారి సంఖ్య 10 వేలు దాటింది. దేశవ్యాప్తంగా ఇంత విస్తృతంగా అణచివేత కొనసాగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎన్ని విధాలుగా వత్తిడులు తెచ్చినప్పటికీ, కేరళలో కమ్యూనిస్టుల నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ (ఐక్య సంఘటన) ప్రభుత్వం సమ్మెచేస్తున్న ఉద్యోగులకు వ్యతిరేకంగా చర్యలను తీసుకొనడానికి నిరాకరించడం ప్రత్యేకంగా గమనించదగ్గ విషయం. అయితే చివరకు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలను ఉపసంహరించుకోక తప్పిందికాదు. కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించిన సుదీర్ఘ పోరాటం 60 లక్షలమంది రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 1969 ఆగస్టు 19వ తేదీన పాటించిన "కక్షసాధింపు వ్యతిరేక దినం"తో మహోన్నత శిఖరాల నందుకున్నది. ఈ కాలంలో సాగిన కార్మిక వర్గ పోరాటాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సాగించిన ఈ పోరాటం వన్నెతెచ్చింది.

ఈ సమ్మె 1970 ఏప్రిల్ నెలలో మూడవ కేంద్ర వేతన సంఘం నియామకానికి దారి తీసింది. కాని యీ కమిషన్ మూడు సంవత్సరాల తరువాత 1973లో మాత్రమే తన నివేదికను సమర్పించింది.

సమ్మె పోరాటాల ప్రాముఖ్యతను, తీవ్రతను తక్కువ చేసి చూపడానికి ప్రభుత్వం ఎంత ప్రయత్నించినప్పటికీ, ఈ కాలంలో పోరాటాలు మరింత ఉధృతంగా సాగినట్లు అధికార సమాచారమే తెలుపుతోంది. ఒక్క 1966 సం॥లోనే 2556 పారిశ్రామిక వివాదాలు తలెత్తాయి. ఈ వివాదాల మూలంగా ఉవ్వెత్తున సాగిన సమ్మె పోరాటాలలో సుమారు 14 లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. 13.85 మిలియన్ (1కోటీ 38 లక్షల 50 వేల) పనిదినాలు నష్టమయ్యాయి. బెంగాలులో అత్యధిక సంఖ్యలో అనగా 38 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. ద్వితీయ స్థానం మహారాష్ట్రకు లభించింది. ఈ రాష్ట్రంలో 33 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. తరువాత స్థానం కేరళకు లభించింది. కేరళ రాష్ట్రంలో 23 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి.

1967లో పారిశ్రామిక వివాదాలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ సంవత్సరంలో 2815 పారిశ్రామిక వివాదాలు తలెత్తాయి. ఈ వివాదాల ఫలితంగా సాగిన సమ్మెలలో 15 లక్షలమంది కార్మికులు పాల్గొనగా, 17.2 మిలియన్ (1కోటీ 72 లక్షల) పని దినాలు నష్టమయ్యాయి. ఈసారి కూడా పశ్చిమ బెంగాలులోనే అత్యధిక సంఖ్యలో 59 లక్షల పనిదినాల నష్టం జరిగింది. కేరళలో 23 లక్షల పనిదినాలు నష్టం కాగా, మహారాష్ట్రలో 22 లక్షల పనిదినాల నష్టం జరిగింది.

1968లో 2776 పారిశ్రామిక వివాదాల ఫలితంగా సాగిన సమ్మె పోరాటాలలో 17 లక్షల మంది కార్మికులు పాల్గొనగా, 1 కోటీ 72 లక్షల 50 వేల పనిదినాలు నష్టమయ్యాయి. దీనిలో అత్యధిక సంఖ్యలో అనగా 73 లక్షల పనిదినాలు ఒక్క పశ్చిమబెంగాలులోనే

నష్టమయ్యాయి. కేరళలో 25 లక్షలు, తమిళనాడులో 24 లక్షలు, మహారాష్ట్రలో 17 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1969 సం॥లో పశ్చిమ బెంగాలులో పోరాటాలు మరింత ఉధృతంగా సాగి, 98 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. కేరళ, మహారాష్ట్రలలో వరసగా 14 లక్షలు, 12 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. ఈ సమ్మె పోరాటాలన్నింటిలోనూ ఇంజనీరింగ్, నూలు బట్టల పరిశ్రమ, బొగ్గుగనులు, జనపనార, రసాయనాలు, విద్యుచ్ఛక్తి, సినిమాలు, రోడ్డు రవాణా, నౌక రవాణా, ఓడరేవులు, నౌకా నిర్మాణ పరిశ్రమలు ప్రధానపాత్ర వహించాయి.

ఈ పోరాట క్రమంలో కొన్ని విశిష్టతలు వ్యక్తమయ్యాయి. (1) పశ్చిమబెంగాలు, కేరళ రాష్ట్రాలలో పోరాటాలు అత్యధిక సంఖ్యలో జరిగాయి. (2) ఈ మహత్తర పోరాటాలు సుదీర్ఘ కాలం సాగాయి. కొన్ని సందర్భాలలో ఈ సమ్మె పోరాటాలు ఏకబిగిన 7, 8 నెలల పాటు కూడా జరిగాయి. (3) కార్మికులలో ఐక్యత, పోరాట పటిమ నానాటికీ అభివృద్ధి చెందాయి. కార్మికులు అనేక కక్ష సాధింపు చర్యలను ఎదిరించి మిక్కిలి పట్టుదలతో పోరాటాలను సాగించారు. ఈ సమ్మె పోరాటాలకు వివిధ వర్గాల కార్మికుల నుండి అపూర్వమైన సంఘీభావం వ్యక్తమైంది. (4) ఈ పోరాటాలు జాతీయ స్థాయిలో వివిధ కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ ఫెడరేషన్ల మధ్య సమన్వయానికి, సంయుక్త కార్యాచరణకు బాటవేశాయి. ఉమ్మడి సమస్యల మీద ఐక్య కార్యాచరణ సాధ్యమైంది. (5) ఈ కాలంలో జరిగిన రాజకీయ సార్వత్రిక సమ్మెలు, ఇతర రాజకీయ పోరాటాలలోనూ అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్మికులు తమ రాజకీయ చైతన్యాన్ని వెల్లడించుకున్నారు.

## రాజకీయ రంగంలో బహుముఖ పరిణామాలు

స్వాతంత్ర్యానంతర కాలంలో వివిధ రాజకీయ పార్టీలు తమ అస్తిత్వాన్ని నిరూపించుకొనడానికి చేసిన ప్రయత్నాలు ఆనాడు రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వివిధ రాజకీయ పార్టీలు, గ్రూపులలో ఏర్పడిన మార్పులు, కలయికల వలన, రాజకీయ పార్టీలు రూపాంతరం చెందడం కూడా ఒక ప్రధాన పరిణామం, వివిధ ప్రతిపక్ష పార్టీలు ఈ మార్పులకు లోనయ్యాయి. కాని జాతీయ జీవనంలో చోటు చేసుకున్న ఒక ప్రధాన పార్టీగా వున్న జాతీయ కాంగ్రెసులో 1966లో ఏర్పడిన చీలిక జాతీయ జీవనం మీద ప్రభావం గల్గి వుండడంతో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. జాతీయ కాంగ్రెసులో ఏర్పడిన చీలికకు అనేక కారణాలున్నాయి. కాని దేశంలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం దీనికి ప్రధాన కారణమన్నది వాస్తవం.

కాని కార్మికవర్గం ప్రత్యేకంగా దేశంలోని పీడిత వర్గాలకు సంబంధించినంత వరకు భారత కమ్యూనిస్టు పార్టీలో ఏర్పడిన చీలిక తీవ్ర పరిణామాలకు దారితీసింది. దేశాన్ని పరిపాలిస్తున్న పాలకవర్గాల స్వభావాన్ని అంచనా వేయడంలోనూ, వారి ఎడల అనుసరించవలసిన వైఖరి విషయంలోనూ, మార్క్సిస్టు రాజకీయ సిద్ధాంతాలను ఆచరించడంలోనూ, అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమంలో వస్తున్న పరిణామాల విషయంలోనూ పార్టీలో అంతర్గతంగా విభేదాలు తలెత్తాయి. ఈ విభేదాలు తీవ్రతరమై భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం నిట్టనిలువునా చీలిపోయింది.

పార్టీ నాయకత్వంలోని ఒక పెద్ద సెక్షన్ పాలకవర్గ పార్టీని భుజాన వేసుకుని, వర్గ సంకర పంథా ననుసరించడంతో పార్టీలో చీలిక అనివార్యమయింది. బూర్జువా – భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా రాజీలేని వైఖరినవలంబించి, మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతాలకు కట్టుబడివుండి, కమ్యూనిస్టు ఉద్యమంలో జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ వస్తున్న మితవాద పెడధోరణులను తీవ్రంగా వ్యతిరేకించిన వారందరు ఒక స్వతంత్ర విధానాన్ని అవలంబించి, 1964 అక్టోబరు 31 నుండి నవంబరు 7వ తేదీ వరకు కలకత్తాలో పార్టీ 7వ మహాసభను ఏర్పాటు చేసి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ను స్థాపించారు. ఈ పార్టీ వివిధ రాష్ట్రాలలో పాక్షికంగా పలుకుబడి కల్గియుండటంతో బాటు, ముఖ్యంగా పశ్చిమ బెంగాలు, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో మంచి ప్రజాపునాది సంపాదించుకుంది.

1952, 1957, 1962, 1967 సం॥లలో జరిగిన జనరల్ ఎన్నికల ఫలితాలు భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం నానాటికీ బలం పుంజుకొనడాన్ని, కార్మికవర్గం కమ్యూనిస్టు సిద్ధాంతం వైపుకు వేగంగా ఆకర్షించబడుతున్నదన్న విషయాన్ని సూచించాయి. 1957 జనరల్ ఎన్నికలలో కేరళ రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ మెజారిటీ సంపాదించి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. కమ్యూనిస్టుల నాయకత్వంలోనున్న కేరళ రాష్ట్ర ప్రభుత్వం శ్రామిక వర్గ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఒక వినూత్నమైన కార్మిక విధానాన్ని అవలంబించింది. ట్రేడ్ యూనియన్లు గణనీయమైన ప్రగతిని సాధించాయి. కాని కొన్ని స్వార్థపర వర్గాలు యీ మంత్రి వర్గాన్ని పడగొట్టడానికి కుట్ర చేసి, అభివృద్ధి నిరోధక ఉద్యమాన్ని లేవదీశాయి. కాని వీరి ప్రయత్నాలు విఫలమవడంతో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది.

1967 జనరల్ ఎన్నికలు భారతదేశ రాజకీయాలలో గణనీయమైన మార్పులు తెచ్చాయి. మితవాద, వామపక్ష పార్టీలు వేర్వేరుగా పోటీ చేసినప్పటికీ, ఈ ప్రతిపక్ష పార్టీలను కలిపి చూసినట్లయితే అనేక రాష్ట్రాలలో మెజారిటీ సంపాదించగల్గాయి. ఈ రాష్ట్రాలలో కాంగ్రెసేతర మంత్రివర్గాలు ఏర్పడ్డాయి. ప్రధానంగా కేరళ, పశ్చిమ బెంగాలు రాష్ట్రాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రజల మన్ననలను చూరగొనిఈ రెండు రాష్ట్రాలలో ఏర్పడిన ఐక్య సంఘటన ప్రభుత్వాలలో భాగస్వామి అయింది. ఈ ఐక్య సంఘటన ప్రభుత్వాలను కూలద్రోయడానికి సాగిన కుట్రలు చాలామేరకు విజయవంతమైనాయి. కొందరు ఫిరాయింపుదారుల సహకారంతో 1967 నవంబరులో పశ్చిమబెంగాల్‌లో మొదటి ఐక్య సంఘటన ప్రభుత్వం కూల్చి వేయబడింది. అప్పటి నుండి రాష్ట్రపతి పాలన సాగిన పశ్చిమ బెంగాల్‌లో 1969 మార్చిలో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోయి మరొకసారి ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పాటు చేయబడింది. కాని కుట్రల ఫలితంగా ఈ ప్రభుత్వం పడిపోయింది. 1971లో పశ్చిమ బెంగాలులో జరిగిన మధ్యంతర ఎన్నికలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మరిన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని అసెంబ్లీలో ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. ఏమయినప్పటికీ కేరళ, పశ్చిమబెంగాలు ఐక్య సంఘటన ప్రభుత్వాలు ఈ రాష్ట్రాలలో అనుసరించిన కార్మిక విధానాలు కార్మికోద్యమానికి కొత్త బాటలు వేశాయి. ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వ యంత్రాంగం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా జోక్యం

చేసుకోకపోవడంతో, కార్మిక వర్గం తీవ్రమైన వర్గ పోరాటాలు సాగించి, పెట్టుబడిదారులకు ఏమాత్రం ఇష్టం లేకపోయినప్పటికీ, వారి నుండి అనేక సదుపాయాలు సాధించుకోగల్గింది.

**ఎ.ఐ.టి.యు.సి.**

గత మహాసభ జరిగిన తరువాత ఐదు సంవత్సరాలకు ఎ.ఐ.టి.యు.సి. 24వ మహాసభ 1954 మే 27 నుండి 30వ తేదీ వరకు కలకత్తాలో జరిగింది. 830 మంది ప్రతినిధులు, హెచ్.ఎం.ఎస్., ఐ.ఎన్.టి.యు.సి. మరియు కొన్ని స్వతంత్ర ఫెడరేషన్లు యునియన్ల నుండి మొత్తం 69 మంది సౌహార్ధ ప్రతినిధులు యీ సమావేశానికి హాజరయ్యారు. ఈ మహాసభ జరిగే సమయానికి 6,55,940 మంది సభ్యులు గల్గిన 937 యూనియన్లు ఎ.ఐ.టి.యు.సి.కి అనుబంధం చేయబడి వున్నాయి. "కార్మికులుగానే గాక మానవులుగా తమ హక్కులను పరిరక్షించుకునేందుకు ఐక్య కార్యాచరణ సాగించవలసిందిగా అన్ని తరగతులకు కార్మికవర్గానికి విజ్ఞప్తి చేస్తూ" ఒక పత్రాన్ని యీ మహాసభ ఆమోదించింది. ఈ మహాసభ శ్రీ చక్కరై చెట్టియార్‌ను అధ్యక్షునిగానూ, శ్రీ యస్.ఎ. డాంగే ప్రధాన కార్యదర్శిగానూ ఎన్నుకున్నది.

24వ మహాసభ జరిగిన నాటినుండి 25వ (రజతోత్సవ) మహాసభ జరిగేనాటికి నిర్మాణ పరంగానూ, పలుకుబడి రీత్యాను ఎ.ఐ.టి.యు.సి. బ్రహ్మాండమైన పురోభివృద్ధిని సాధించింది. 1957లో ఎర్నాకుళంలో జరిగిన ఎ.ఐ.టి.యు.సి. రజతోత్సవ మహాసభకు భారతదేశంలో ఏనాడూ హాజరవనంత అధిక సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు. 9,47,239 సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహించే 1282 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. వీరిలో 31 మంది స్త్రీలు. అయితే ఆనాడు ఎ.ఐ.టి.యు.సి. సభ్యత్వం 14 లక్షలుగా చెప్పబడింది. ఈ మహాసభకు 182 మంది సౌహార్ధ ప్రతినిధులు కూడా హాజరుకావడం విశేషం. మొట్టమొదటిసారిగా ప్రపంచ ట్రేడ్ యూనియన్ల సమాఖ్య (డబ్ల్యు.ఎఫ్.టి.యు.), సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ యు.ఎస్.ఎస్.ఆర్., ఆల్ చైనా ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, రివల్యూషనరీ ట్రేడ్ యూనియన్ మూవ్‌మెంట్ ఆఫ్ జెకోస్లోవేకియా, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, రుమేనియా, జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ ఆఫ్ ఫ్రాన్స్, జనరల్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ కొరియా, వియత్నాం కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్ తరఫున సౌహార్ధ ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఆనాడు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న శ్రీ ఇ.ఎం.యస్. నంబూద్రిపాద్ ఈ మహాసభను ప్రారంభించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ.), న్యూఢిల్లీ ఆఫీసు డైరెక్టర్ శ్రీ వి.కె.ఆర్. మీనన్ కూడా ఈ మహాసభకు హాజరై సందేశాన్నిచ్చారు.

దేశ పారిశ్రామికీకరణ రెండవ పంచవర్ష ప్రణాళిక, కార్మిక వర్గ కోర్కెలు మొదలైన విషయాలకు సంబంధించి, ఎ.ఐ.టి.యు.సి. విధానాన్ని శ్రీ ఎస్.ఎ.డాంగే తన ప్రధాన కార్యదర్శి నివేదికలో వివరించాడు. ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో ప్రభుత్వంతో సహకరించాలనీ,

ఈ ఆర్థిక వ్యవస్థలోనే కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించుకోవాలని ఈ విధాన ప్రకటనలో పేర్కొన్నారు. ఇది "టూ పిల్లర్ పాలసీ" (రెండు మూలస్తంభాల విధానం)గా ప్రసిద్ధిగాంచింది. జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కోసం, దేశ సౌభాగ్యం కోసం పంచవర్ష ప్రణాళికలోని ముఖ్యాంశాలను అమలు చేయడంతో సహా 17 అంశాల కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి నివేదిక ప్రకటించింది. ఈ మహాసభలో ఎస్.ఎస్. మిరాజ్కర్ అధ్యక్షునిగా, ఎస్.ఎ. డాంగే ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

వాస్తవానికి ఈ రజతోత్సవ మహాసభ ఎ.ఐ.టి.యు.సి. విధానంలో ఒక నూతన మలుపును సూచించింది. ఎ.ఐ.టి.యు.సి.లో వామపక్ష భావాలు గల్గిన కమ్యూనిస్టేతరులు కూడా వున్నప్పటికీ ప్రధానంగా ఎ.ఐ.టి.యు.సి. కమ్యూనిస్టుల అధిపత్యంలోనే వున్నది. సరిగ్గా ఈ రజతోత్సవ మహాసభ జరిగే సమయానికి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక తీవ్ర పరిణామాలు సంభవించసాగాయి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాద పెడధోరణులు పొడసూపాయి. ఈ రివిజనిస్టు ధోరణులు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ఒక సెక్షన్‌పై కూడా ప్రభావం చూపాయి. ఎ.ఐ.టి.యు.సి. రజతోత్సవ మహాసభలో సమర్పించబడిన విధాన ప్రకటన పత్రం ఈ మితవాద పెడధోరణులను చక్కగా ప్రతిబింబించింది. శ్రీ డాంగే ప్రతిపాదించిన ఈ "టూ పిల్లర్ విధాన" ప్రకటన పాలక బూర్జువా వర్గంతో సహకరించాలనే వారి లక్ష్యాన్ని వ్యక్తం చేయడమే. కాని కాలం గడుస్తున్న కొద్దీ ఈ విధానం మరింత నగ్నంగా బయలుపడడంతో అది కమ్యూనిస్టులలో తీవ్రమైన అంతర్గత విభేదాలకు దారితీసింది.

కమ్యూనిస్టు ఉద్యమంలో వస్తున్న మితవాద ధోరణులను తీవ్రంగా వ్యతిరేకించిన మార్క్సిస్టులు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను ఏర్పాటు చేయడంతో ఎ.ఐ.టి.యు.సి.లో విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. డాంగే, ఎ.ఐ.టి.యు.సి.లోని ఆయన అనుచరులు అనుసరిస్తున్న విధానాలు కార్మిక వర్గానికి విద్రోహకరంగా వున్నాయని, కార్మికవర్గ ప్రయోజనాలను బూర్జువావర్గానికి బలిచేసేవిగా వున్నాయని కమ్యూనిస్టులలోని ఈ సెక్షన్ తప్పు పట్టింది. అందువలన ఈ విధానాలకు వ్యతిరేకంగా ఎ.ఐ.టి.యు.సి.లోనే వుండి తీవ్ర పోరాటం సాగించారు. ఎ.ఐ.టి.యు.సి. వ్యవహారాలను నడపడంలో పచ్చి బ్యూరోక్రటిక్ పద్ధతులను అవలంబిస్తున్నారని, తమ ఆధ్వర్యంలో నడుస్తున్న వివిధ యూనియన్ల కార్యకలాపాలను వర్గ సామరస్య పంథాలో నడుపుతున్నారని, ప్రభుత్వంచే నియమించిన అనేక కమిటీలు, కమిషన్లలో కార్మికవర్గానికి నష్టదాయకము, అప్రతిష్టాకరమైన పాత్ర వహిస్తున్నారని, వీరు డాంగే, ఆయన అనుచరులను విమర్శించారు. బోనస్ కమిషన్ సభ్యునిగా డాంగే నిర్వహించిన పాత్ర, నేషనల్ లేబర్ కమిషన్ నిర్వహిస్తున్న వివిధ అధ్యయన సంఘాలలో డాంగే నియమించిన వారి పాత్ర తీవ్రమైన విమర్శలకు గురయింది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)కు చెందిన మార్క్సిస్టులు 1964 నుండి ఆరు సంవత్సరాల పాటు  ఎ.ఐ.టి.యు.సి.లోనే కొనసాగారు. కాని ఇక ఎ.ఐ.టి.యు.సి.లో కొనసాగడం వలన విప్లవాత్మకమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమ అభివృద్ధికి ఏమాత్రం ప్రయోజనం లేదని వీరు భావించారు. అందువలన విప్లవ సిద్ధాంతాల ప్రాతిపదికగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను నిర్వహించే ఒక కేంద్ర కార్మిక సంస్థను ఏర్పాటు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు.

## సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సి.ఐ.టి.యు) స్థాపన

ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వంలోని ఒక బలమైన సెక్షను అవలంబిస్తున్న వర్గ సామరస్య పంథాను వ్యతిరేకిస్తున్న కొందరు ఎ.ఐ.టి.యు.సి. జనరల్ కౌన్సిల్ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు 1970 ఏప్రిల్ 9,10 తేదీలలో గోవాలో ఒక సదస్సును ఏర్పాటు చేశారు. భారత కార్మికవర్గానికి పోరాట పంథాను అవలంబించే ఒక నూతన కేంద్ర కార్మిక సంస్థను రూపకల్పన చేయడానికి అఖిల భారత స్థాయిలో ఒక ట్రేడ్ యూనియన్ మహాసభను ఏర్పాటు చేయాలని ఈ సదస్సు నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అనుసరించి, శ్రీ జ్యోతిబాసు చైర్మన్‌గా, శ్రీ మనోరంజన్‌రాయ్ ప్రధాన కార్యదర్శిగా ఒక ఆహ్వానసంఘం ఏర్పాటు చేయబడింది. 1970 మే 28-30 తేదీలలో కలకత్తాలోని రంజీ స్టేడియం, లెనిన్‌నగర్‌లో అఖిల భారత ట్రేడ్ యూనియన్ మహాసభ నిర్వహించబడింది.

శ్రీ జ్యోతిబాసు తన స్వాగతోపన్యాసంలో భారతదేశంలో సమరశీల కార్మికవర్గాన్ని సమీకరించడానికి ఒక విప్లవాత్మకమైన పోరాట పంథాననుసరించే నూతన కేంద్ర కార్మిక సంస్థను స్థాపించవలసిన చారిత్రక ఆవశ్యకతను గురించి వివరించారు.

శ్రీ జ్యోతిబాసు ప్రసంగిస్తూ "మన దేశంలో ట్రేడ్ యూనియన్, కార్మికవర్గ ఉద్యమాల భవిష్యత్తును గురించి కొన్ని ప్రధాన నిర్ణయాలు తీసుకొనేందుకు మనందరం దేశం నలుమూలల నుండి వచ్చి ఇక్కడ సమావేశమయ్యాము. అఖిల భారత స్థాయిలో ఒక నూతన ట్రేడ్ యూనియన్ కేంద్రాన్ని స్థాపించడం ఈ నిర్ణయాలలో అత్యంత ప్రధానమైనది. దేశంలో యిప్పటికే అనేక కేంద్ర ట్రేడ్ యూనియన్లుండగా మరొక కేంద్ర ట్రేడ్ యూనియన్‌ను ఏర్పాటు చేయడం కార్మికవర్గాన్ని చీల్చే చర్యగా కన్పడవచ్చు. కాని ఇందుకు భిన్నంగా ఇండియాలోని మిలిటెంట్ కార్మికవర్గాన్ని సమీకరించడానికి ఒక నూతన ట్రేడ్ యూనియన్ స్థాపన చారిత్రకావసరమైంది. ఎ.ఐ.టి.యు.సి.ని మనమందరం అనేక కష్టనష్టాలను భరించి ఒక మహోన్నత సంస్థగా తీర్చిదిద్దడానికి కృషి చేశాం. అనేక మంది మన సాధారణ కామ్రేడ్స్ అసమాన త్యాగాలు చేశారు. అలాంటి త్యాగ సాంప్రదాయాలు గల్గిన ఎ.ఐ.టి.యు.సి. బూర్జువా వర్గానికి పాదాక్రాంతమయింది. అంతేగాక నిర్ణయాత్మక పోరాటాలు సాగించే సమరశీల కార్మిక వర్గానికి

రివిజనిస్టు నాయకత్వం గుదిబండగా తయారైంది. వీరు అప్రజాస్వామిక పద్ధతుల్లో నాయకత్వ స్థానాలను హస్తగతం చేసుకోవడంతో పాటు వాస్తవంగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రివిజనిస్టు నాయకుల పలుకుబడిలోని యూనియన్లను ఎ.ఐ.టి.యు.సి. నుండి దూరంగా వుంచడం ద్వారా ఎ.ఐ.టి.యు.సి.ని తమ జేబు సంస్థగా మార్చారు.

సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ నాయకులు, కేంద్ర ట్రేడ్ యూనియన్లు ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఆర్థిక పోరాటాలకు మాత్రమే పరిమితం చేస్తున్నాయి. ఈనాడు ఎ.ఐ.టి.యు.సి. కేంద్రం కూడా వీరి అడుగుజాడలలోనే నడుస్తున్నది. ఎ.ఐ.టి.యు.సి.లోని రివిజనిస్టు నాయకులు కార్మికవర్గ దృక్పథాన్ని విడనాడారు. మిలిటెంట్ కార్మికవర్గ పోరాటాలకు గాని, పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటం సాగించడానికి గాని వీరు కార్మికవర్గాన్ని సమాయత్తం చేయలేరు. ట్రేడ్ యూనియన్ నాయకత్వం ఒకసారి ఈ కర్తవ్యాన్ని విడనాడినట్లయితే బూర్జువావర్గానికి తోకగా తయారయ్యే దుస్థితికి దిగజారడం అనివార్యం. బూర్జువా వర్గంతో షరీకయ్యే, తమ వర్గ సామరస్య విధానాలను కార్మికవర్గంలో చొప్పించి బూర్జువావర్గ నాయకత్వాన్ని కార్మికవర్గంచే అంగీకరింపజేయడానికి ఎ.ఐ.టి.యు.సి. నాయకత్వం రేయింబవళ్ళు తంటాలు పడుతోంది" అని పేర్కొన్నారు.

వివిధ సంస్థల్లో "కార్మికవర్గ వ్యతిరేక ఒప్పందాలను" చేసుకొనడంలో ఎ.ఐ.టి.యు.సి. నిర్వహించిన పాత్రను శ్రీ జ్యోతిబాసు వివరించారు. ప్రభుత్వం చేత నియమించబడిన త్రైపాక్షిక కమిటీలు మరియు ఇతర కమిటీలలో వీరు నిర్వహించిన విశ్వాసఘాతుకమైన పాత్రను వివరించారు. ఇందుకు ఉదాహరణగా, బోనస్ కమిషన్‌లో డాంగే నిర్వహించిన పాత్ర మొదలుకొని, నేషనల్ లేబర్ కమిషన్‌కు చెందిన అధ్యయన బృందాల్లో నామినేట్ చేయబడిన యితర రివిజనిస్టు నాయకులు నిర్వహించిన పాత్రను వివరించారు.

ఈ రివిజనిస్టు నాయకులు భారతదేశ కార్మికవర్గాన్ని "కార్మిక వర్గ అంతర్జాతీయతా దృక్పథాన్నుండి దూరం"గా వుంచడానికి చేసిన ప్రయత్నాలను కూడా శ్రీ జ్యోతిబాసు వివరించారు. "ఈ పరిస్థితులలో మిలిటెంట్ ఆర్థిక పోరాటాలలో కార్మికవర్గానికి నాయకత్వం వహించడంతో బాటు, అదే సమయంలో వారిని రాజకీయంగా చైతన్యవంతులను చేసి, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు దేశవ్యాప్తంగా వారి మద్దతును సమీకరించడానికి, అధికారం హస్తగతం చేసుకొనేందుకు వారిని సమాయత్తం చేయడం కోసం, విప్లవ సిద్ధాంతాలకు కట్టుబడే నిజమైన ప్రజాతంత్ర ట్రేడ్ యూనియన్ కేంద్రం స్థాపించవలసిన అగత్యం ఏర్పడింది" అని శ్రీ జ్యోతిబాసు తన స్వాగతోపన్యాసం ముగించారు.

శ్రీ పి. రామమూర్తి ప్రధాన నివేదికను సభకు సమర్పించారు. "కార్మికవర్గ ఐక్యతా సాధనకు పోరాటం సాగించడం కోసం అఖిల భారత స్థాయిలో ట్రేడ్ యూనియన్ కేంద్రాన్ని స్థాపించవలసి వచ్చింది" అని శ్రీ రామమూర్తి తన రిపోర్టులో పేర్కొన్నారు. "ట్రేడ్ యూనియన్

ఉద్యమ ఐక్యతా సాధనకు పునాది స్థాయిలో మరింత శక్తివంతంగా పోరాటం కొనసాగించవలసిందిగా" ఆయన ఉద్బోధించారు. ఒక పరిశ్రమలో గాని, ఫ్యాక్టరీలో గాని ఒకే యూనియన్ వుండాలనే సిద్ధాంతానికి మనం కట్టుబడివున్నాం. రాజకీయ అనుబంధాల ప్రాతిపదికగా యూనియన్లను చీల్చడానికి మనం వ్యతిరేకం. యజమానులకు వ్యతిరేకంగా ఐక్యమై నిరంతరం పోరాడవలసిన కార్మికులందరి ప్రయోజనాలు ఒక్కటే. అందువలన ఆ కార్మికులందరూ ఒక ట్రేడ్ యూనియన్ ద్వారానే సంఘటితం గావాలని మేము కోరుకుంటున్నాం" అని శ్రీ రామమూర్తి తన నివేదికలో పేర్కొన్నారు.

ఈ సమావేశంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్హతల కమిటీ తరపున డా॥ యం.కె. పాంథే ఇచ్చిన రిపోర్టు ప్రకారం 8,04,637 మంది సభ్యులతో కూడిన 1759 యూనియన్లు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఈ మహాసభకు 4264 మంది ప్రతినిధులుగా హాజరయ్యారు. సోదర కార్మిక సంఘాల నుండి 116 మంది ప్రతినిధులు గానూ, 1134 మంది పరిశీలకులుగానూ ఈ మహాసభకు హాజరయ్యారు. అంటే యీ సమావేశానికి ప్రతినిధులు, పరిశీలకులతో సహా మొత్తం 5514 మంది హాజరయ్యారు.

జాతీయ, అంతర్జాతీయ సమస్యల మీద ఈ సమావేశం అనేక తీర్మానాలను ఆమోదించింది.

ఈ సమావేశంలో జరిగిన చర్చల సారాంశాన్ని శ్రీ బి.టి. రణదివే వివరించారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, దేశంలో ఒక మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆవిర్భవించవలసిన ఆవశ్యకతను గురించి విశ్లేషిస్తూ , శ్రీ రణదివే భారత్ ట్రేడ్ యూనియన్ ఉద్యమం నిర్వర్తించవలసిన కర్తవ్యాలను గురించి సవివరంగా తెలియజేశారు. "కార్మికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకొనడానికి చైతన్యవంతంగా పోరాడనంత కాలం సోషలిజం, దోపిడీ రహిత సమాజం అనేవి మాటల్లోనే మిగిలిపోతాయనేది ట్రేడ్ యూనియన్లు మరచిపోరాదు. నేటి బూర్జువా – భూస్వామ్య ప్రభుత్వ స్థానంలో సిసలైన, నిఖార్సైన ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించడం యీ దోపిడీ రహిత సమాజ స్థాపనలో తొలిమెట్టు. నేటి ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి, రైతాంగంతో భుజం భుజం కలిపి ప్రజాతంత్ర పోరాటంలో చొరవ తీసుకొని పాల్గొనడానికి, వ్యావసాయక విప్లవ కోసం జరిగే పోరాటాలకు మద్దతు నివ్వడానికి, ప్రజాతంత్ర శక్తులన్నింటినీ ఏకం చేయడానికి కార్మికవర్గం తన శక్తినంతటిని వినియోగించాలి – ఇవి ట్రేడ్ యూనియన్ ఉద్యమ తక్షణ కర్తవ్యాలు" అని శ్రీ రణదివే తన ఉపన్యాసాన్ని ముగించారు.

1970 మే 31వ తేదీన శ్రీ బి.టి. రణదివే అధ్యక్షతన కలకత్తాలోని బ్రిగేడ్ పెరేడ్ మైదానంలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభతో ఈ మహాసభ ముగింపుకు వచ్చింది. ఈ బహిరంగ సభకు సుమారు 10 లక్షల మంది కార్మికులు, సామాన్య ప్రజానీకం విచ్చేశారు.

నూతనంగా ఆవిర్భవించిన ఈ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సి.ఐ.టి.యు) కు శ్రీ బి.టి.రణదివే అధ్యక్షునిగానూ, శ్రీ పి. రామమూర్తి ప్రధాన కార్యదర్శిగానూ ఎన్నికయ్యారు.

ఆ తర్వాత భారత ప్రజల జీవితాలలో తీవ్రమైన మార్పులు తెచ్చే అనేక ప్రధాన పరిణామాలు భారత రాజకీయ రంగంలో సంభవించాయి. పాత రికార్డుల నధిగమించి కార్మికవర్గ కార్యాచరణ సాగింది. 1974 ఏప్రిల్ 9వ తేదీన 20 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లాంఛనప్రాయంగా (టోకెన్) సమ్మె చేశారు. వీటన్నింటిని మించి 1974 మే 8వ తేదీన ప్రారంభమై 20 రోజులు సాగిన 20 లక్షల మంది రైల్వే ఉద్యోగుల సమ్మె, వారికి మద్దతుగా 1974 మే 15వ తేదీన సాగిన సంఘీభావ సమ్మె అపూర్వమైనవి. ఈనాడు దేశ చరిత్రలోనే భారత కార్మికవర్గం ఒక నిర్ణయాత్మకమైన స్థితిలో వున్నది. కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్సు వివరించిన విధంగా.

"ప్రజాస్వామ్యం కోసం సాగే పోరాటంలో విజయం సాధించడానికి శ్రామిక వర్గాన్ని అధికారం హస్తగతం చేసుకొనే స్థితికి పెంచడమే విప్లవంలో కార్మికవర్గ ప్రథమ కర్తవ్యం." చైతన్యవంతమైన కార్మికవర్గం ఈ చారిత్రాత్మక కర్తవ్యాన్ని నిర్వర్తించ వలసియున్నది.

# 21

# కార్మిక వర్గంపై ప్రభుత్వ దమనకాండ 1971-1977

## 1970 తరువాత పరిణామాల ప్రత్యేకత

స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి 1970 వరకు సంభవించిన ఆర్థిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత కార్మికోద్యమంలో అనేక చీలికలు వచ్చాయి. దీనికి కారణాలేమైనప్పటికీ కార్మికుల సంఘటిత శక్తి మీద గణనీయంగా ప్రభావం చూపింది.

ఈ కాలంలో దేశంలో ఆర్థిక సంక్షోభం తీవ్రమవడం కొనసాగింది. అన్ని పెట్టుబడిదారీ ప్రభుత్వాలు వలెనే భారత ప్రభుత్వం కూడ ఈ సంక్షోభ భారాలను కార్మిక వర్గం మీద మోపడానికి ప్రయత్నాలు సాగించింది. అంతేకాక, ఈ కాలంలోనే మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో యుద్ధం జరగడం, బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా అవతరించడం సంభవించాయి. ఈ పరిణామాలు దేశ అంతర్గత పరిస్థితుల మీద, ముఖ్యంగా కార్మికుల స్థితిగతుల మీద ప్రభావం చూపాయి.

ఆర్థిక సంక్షోభంతో పాటు వివిధ విభిన్న రాజకీయ స్రవంతులు పాలక పక్షం మీద తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా కార్మికవర్గంపై మరో దాడి ప్రారంభమైంది. వేతన స్థంభన, అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం (ఎస్మా), భారత రక్షణ నిబంధనలు (డి.ఐ.ఆర్), రాజ్యాంగంలోని 311(2) బి.సి.ల రూపంలో కార్మిక వర్గం మీద మరో దాడి ప్రారంభమైంది. అంతేగాక రాజ్యాంగ నిబంధనలనే ప్రయోగించి దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి ప్రాథమిక హక్కులను హరించివేశారు.

గతంలో ఏనాడూ ఎరుగని ఈ పరిణామాలు సంభవించిన తీవ్ర పరిస్థితుల్లో కార్మికవర్గం భారీ సమ్మెలతో సహా తీవ్ర పోరాటాలకు పూనుకోవల్సి వచ్చింది. 1970కి ముందు కాలంలో

కార్మికోద్యమం వరుసగా అనేక చీలికలకు లోనై దయనీయమైన అనుభవాలను చవిచూసినా, తరువాత కాలంలో పరిస్థితుల ప్రభావం వలన, ప్రభుత్వ దాడి నెదుర్కొనటానికి వివిధ ట్రేడ్ యూనియన్‌లను సంఘటితం చేయటానికి, పటిష్టమైన కృషి జరిగింది. పాలకపక్షం ప్రోత్సాహంతో నడిచే ఐ.ఎన్.టి.యు.సి తప్ప మిగిలిన ట్రేడ్ యూనియన్లు ప్రతిఘటనా పోరాటానికి ఒక ఐక్యవేదికను ఏర్పాటు చేయటానికి కృషి చేశాయి. ఐక్యవేదికను ఏర్పాటు చేసే ఈ ప్రయత్నాలలో అనేక సమస్యలు, చిక్కులు లేకపోలేదు. అందువలన ఈ ఐక్యవేదికలు ఎక్కువకాలం నిలువలేకపోయాయి. ఒక సంఘటన ఏర్పడిన తరువాత కొంతకాలానికి అది పని చేయకపోవడంతో మళ్ళీ మరొక సంఘటన ఏర్పరచే ప్రయత్నాలు సాగాయి. అది పతనమైనాక క్రొత్త సంఘటన ఏర్పాటుకు మరల మరల కృషి జరిగింది. ఈ క్రమం నేటికీ కొనసాగుతోంది.

ఈ కాలంలో మనదేశంలో మిక్కిలి తీవ్రమైన రాజకీయ పరిణామాలు సంభవించాయి. పాలకపక్షం చీలిపోవటమే కాక అది తన గుత్తాధిపత్యాన్ని కూడా కోల్పోయింది. కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పడి కొంతకాలం కొనసాగాయి.

కమ్యూనిస్టులు, ఇతర వామపక్షాలతో సహా వివిధ రాజకీయ పార్టీలు కొన్ని రాష్ట్రాల్లో అదికారం చేపట్టాయి.

వీటన్నింటికి మించి పూర్వపు సోవియట్ యూనియన్‌లోనూ, తూర్పు యూరోపు దేశాల్లోనూ సోషలిస్టు ప్రభుత్వాలు పతనం కావడంతో సామ్రాజ్యవాదశక్తుల ఆధిపత్యంలో ఏకధృవ ప్రపంచం ఏర్పాటుకు దారితీసిన తీవ్ర పరిణామాలు, దేశంలోని ప్రగతిశీల, వామపక్షశక్తులపైన, కార్మిక వర్గ ఉద్యమం మీద స్వల్పంగా నైనప్పటికీ అనివార్యంగా వాటి ప్రభావం చూపాయి.

1970 తరువాత కాలంలో కార్మికోద్యమ స్వరూపం, ఆ వుద్యమం ఎదుర్కొన్న కఠిన పరీక్షలు అటుపోట్లు ఒక ఆసక్తికరమైన అధ్యయనాంశం.

కానీ ఈ కాలంలో అనేక సంఘటనలు జరిగాయి. దేశంలో వివిధ ప్రాంతాలలోని అనేక పరిశ్రమలలో అసంఖ్యాకంగా పోరాటాలు జరిగాయి. వీటన్నింటిని వివరించటం అంతగా ఆసక్తిదాయకంగా వుండకపోగా, ప్రయోజనకరంగా కూడా వుండదు. వాస్తవానికి పోరాటాలు, ప్రతిఘటన లేని పరిశ్రమగానీ, రంగం కానీ లేదు. అందువలన వాటి గురించి వివరించే కంటే, ఈ కాలంలో సాగిన కార్మిక వర్గ పోరాటాల స్వభావం, ఆ పోరాటాలు ప్రధానంగా ఏ దిశలో సాగిందీ సరిగా అధ్యయనం చేసేందుకు, దిశా నిర్దేశం చేసిన ప్రధాన ఘటనలను పరిశీలించడం ప్రయోజనకరంగా వుంటుంది. బంగ్లాదేశ్ ఆవిర్భావం, ఆమెరికా సామ్రాజ్యవాదులు వియత్నాంకు వ్యతిరేకంగా సాగించిన పాశవిక వలస యుద్ధం, వియత్నాం వీరోచిత వీరోచిత విముక్తి పోరాటం అంతర్జాతీయ పరిణామాలనొక కొత్త మలుపు తిప్పాయి. భారతదేశ కార్మికవర్గం వియత్నాం విముక్తి పోరాటానికి, బంగ్లాదేశ్‌కు మద్దతుగా నిలవడం ద్వారా పరిమిత స్థాయిలో నైనప్పటికీ తన అంతర్జాతీయ కర్తవ్యాలను నిర్వహించింది.

## పశ్చిమ బెంగాలులో దమనకాండకు, అణచివేతకు కార్మికవర్గ ప్రతిఘటన

కార్మికవర్గ పోరాటాల వెల్లువ నెదుర్కొనటానికి ప్రభుత్వం తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడటం ద్వారా కార్మిక వర్గంలో భీతావహం సృష్టించ పూనుకుంది. పోలీసులను, పారామిలటరీ దళాలను రంగంలోకి దింపింది. ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ప్రకారం, మీసా చట్టం ప్రకారం ట్రేడ్ యూనియన్ నాయకులను నిర్బంధించింది. ఏకపక్షంగా కార్మికులను పనిలోనుంచి తొలగించింది.

ముఖ్యంగా పశ్చిమబెంగాలులో కార్మిక వర్గ పోరాటాలు సమరశీలత సంతరించుకోవడంతో, ఈ పోరాట వెల్లువ నరికట్టడానికి ప్రభువ్వతం కార్మికులపై విరుచుకుపడింది.

ఉదాహరణకు హిందూస్థాన్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో దుర్గాపూర్ స్టీల్ సిటీలో సమ్మె ప్రారంభం కావడంతో ఆ పారిశ్రామిక నగరం సాయుధ పోలీసులకు సి.ఆర్.పి.ల సాయుధ స్థావరంగా మారింది. 1966 – 1970 మధ్య కాలంలో కార్మికుల ట్రేడ్ యూనియన్ హక్కులను, ప్రజాతంత్ర హక్కులను కాలరాచివేశారు. కార్మికుల నివాసాలపై దాడులు జరిగాయి. పి.డి. చట్టం, మీసా చట్టాల క్రింద ముఖ్యమైన ట్రేడ్ యూనియన్ నాయకులను నిర్బంధించారు. హింద్ మోటార్సులోని కార్మికులపై దారుణ దమనకాండ జరిపారు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను అణగదొక్కటానికి 144 సెక్షన్ను అమలు చేయటం అరెస్టులు చేయడం సర్వసాధారణమైంది.

ఈ కాలంలోనే 400కు పైగా ఖాయిలా పడిన ఫ్యాక్టరీలను మూసివేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చర్యల పట్ల నిరాసక్తతతో ప్రేక్షక పాత్ర వహించాయి.

ఈ పరిస్థితులలో వివిధ ట్రేడ్ యూనియన్‌లు సంయుక్తంగా 1971 ఆగస్టు 27న సార్వత్రిక సమ్మెకు, హర్తాళ్‌కు పిలుపు నిచ్చాయి. సమ్మెకు ముందు ఆనాటి కేంద్ర కార్మిక మంత్రి ఆర్.కె. ఖాడిల్కర్ ఆగస్టు 22న ఢిల్లీలో వివిధ ట్రేడ్ యూనియన్ల సమావేశం ఏర్పాటు చేసి ప్రతిపాదిత సమ్మెను విరమించుకోవల్సిందిగా కోరారు. దీనితో ఐ.ఎన్.టి.యు.సి, హెచ్.ఎమ్.ఎస్., ఎ.ఐ.టి.యు.సి. వంటి యూనియన్లు ఊగిసలాటకు గురయ్యారు. అయితే సి.ఐ.టి.యు., యు.టి.యు.సి. (లెనిన్ – సారణి) హెచ్.ఎమ్.పి., ఫార్వర్డుబ్లాక్‌కు చెందిన కార్మిక విభాగం, దృఢంగా సమ్మె నిర్ణయంతో ముందుకు సాగాయి. ఎ.ఐ.టి.యు.సి. సమ్మెను బాహాటంగా వ్యతిరేకించలేదు.

ఆ కాలంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రపతి పాలనలో వున్నది. రాష్ట్ర ప్రభుత్వ అధికార గణం ఆ సమ్మెను విఫలం చేయటానికి సర్వ విధాలా ప్రయత్నించినా వారు సఫలీకృతులు కాలేకపోయారు.

బంగ్లాదేశ్‌ను భారత ప్రభుత్వం గుర్తించాలనే అంశాన్ని సమ్మె డిమాండ్లలో చేర్చడం ఈ సందర్భంగా గమనించదగ్గ విషయం. సమ్మె నిర్వాహకులు ప్రాధాన్యత గల్గిన ఈ డిమాండ్‌ను సమ్మె డిమాండ్లలో చేర్చి భారత కార్మికవర్గం తన అంతర్జాతీయ కర్తవ్యాన్ని నిర్వహించటానికి దోహదం చేసింది. సహజంగానే సమ్మె సందర్భంగా లేవనెత్తబడిన డిమాండ్లకు ప్రజానీకం నుండి మంచి మద్దతు లభించింది.

సమ్మెకు వ్యతిరేకంగా వున్న పత్రికలు కూడా బ్రహ్మాండంగా జయప్రదమైన సార్వత్రిక సమ్మె, హర్తాళ్ గురించి వార్తలు ప్రచురించవల్సింది. బంగ్లాదేశ్ పరిణామాలను దృష్టిలో వుంచుకుని కార్మికులను సమ్మెలో పాల్గొనవద్దని ఖాడిల్కరు చేసిన విజ్ఞప్తికి స్పందన కరువైంది. నిజానికి భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని గుర్తించటానికి తటపటాయిస్తున్న సమయంలో ట్రేడ్ యూనియన్లు బంగ్లాదేశ్‌ను వెంటనే గుర్తించాలని డిమాండు చేయడం గమనించవల్సిన విషయం.

"ఎకనామిక్ టైమ్స్" పత్రిక సమ్మె గురించి ఈ విధంగా రాసింది. "కలకత్తాలో ప్రధాన వ్యాపార కేంద్రమైన డల్హౌసీ స్క్వేర్ బోసిపోయింది. రోజంతా చినుకులు పడుతూనే వున్నాయి. ప్రభుత్వ ఆఫీసులు తెరిచే వున్నా హాజరు చాలా తక్కువగా వుంది. ఫ్యాక్టరీలు, బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వేస్టేషన్‌లలో ఏ విధమైన కార్యకలాపాలు జరగలేదు."

ఆ పత్రిక ఇంకా ఇలా రాసింది. "హౌరా, సీయల్దా స్టేషన్ల నుంచి దూర ప్రాంతాలకు వెళ్ళే రైళ్ళేవీ ఈ రోజు ఉదయం బయలుదేరలేదు. సాయుధ పోలీసుల రక్షణతో కొన్ని స్థానికంగా తిరిగే రైళ్ళు మాత్రమే కన్పించాయి. డమ్‌డమ్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు లేవు."

స్టేట్స్‌మన్ పత్రిక ఈ విధంగా రాసింది. "రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు విధులకు గైర్హాజరు కారాదని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించినా రైటర్సు బిల్డింగు ఖాళీగా వుంది. విశాలమైన ఆ భవనం వరండాలు శూన్యంగా కనిపించాయి. దాదాపు అన్ని గదులకు తాళాలు వేసి వున్నాయి."

"రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతో సహా చాలామంది రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులు దళాలుగా ప్రభుత్వ వాహనాలలో సాయుధ పోలీసుల రక్షణతో ఆఫీసులకు చేరారు." అని హిందుస్థాన్ స్టాండర్డు రాసింది.

ప్రభుత్వ బెదిరింపులు పోలీసుల చర్యలను లెక్క చేయకుండా సార్వత్రిక సమ్మె, హర్తాళ్‌లను ప్రజలు, కార్మికులు విజయవంతం చేశారని పత్రికల వార్తలు ధృవపరిచాయి.

ఈ సార్వత్రిక సమ్మె, హర్తాళ్ జరిగిన వెంటనే 13 మంది పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల ఉద్యమ అగ్రనాయకులపై నిరంకుశంగా తీసుకున్న క్రమశిక్షణా చర్యలకు వ్యతిరేకంగా మరో సమ్మె, హర్తాళ్ జరిగాయి.

1971 సెప్టెంబర్ 13న రాజ్యాంగంలోని అత్యంత అప్రజాస్వామికమైన 311(2)సి అధికరణం క్రింద పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లు, యూనియన్ల సమన్వయ కమిటీలోని 13 మంది అగ్రనాయకులను ఏ కారణం చూపకుండా, వారికి సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఉద్యోగాల నుండి తీసివేశారు. రాష్ట్రపతి పాలనలో వుండగా ఈ విధంగా ఉద్యోగాల నుండి తొలగించడం వలన ప్రభుత్వోద్యోగులలోనే కాక, మొత్తం కార్మిక వర్గంలోనే తీవ్రమైన అసంతృప్తి ప్రబలింది.

ఈ తొలగింపులకు వ్యతిరేకంగా పనులు నిలిపివేయవలసిందిగా పశ్చిమబెంగాలు ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్లు, యూనియన్ల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఎనిమిది రోజులపాటు ఆఫీసుల్లో పనులు స్తంభించిపోయాయి. నిరంకుశంగా ఉద్యోగాల నుండి తొలగించినందుకు నిరసనగా వెంటనే సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వలసిందిగా సి.ఐ.టి.యు. ఇతర కేంద్ర కార్మిక సంఘాలను కోరింది. కొన్ని ట్రేడ్ యూనియన్లు ఏవో అభ్యంతరాలతో కాస్త వెనుకంజ వేసినా ఎట్టకేలకు సి.ఐ.టి.యు. చొరవతో 1971 అక్టోబరు 13న సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. యు.టి.యు.సి. రాష్ట్రీయ సంగ్రామ్ సమితి, జూలై 12 కమిటీ (పశ్చిమబెంగాలులో ఏ కేంద్ర కార్మిక సంస్థకు అనుబంధం కాని వివిధ ట్రేడ్ యూనియన్ల ఐక్యవేదిక). యు.టి.యు.సి. (లెనిన్ సారణి) ఈ సమ్మెకు మద్దతు పలికాయి. ఎ.ఐ.టి.యు.సి. ఆలస్యంగా ఒక నిర్ణయం తీసుకుని విడిగా ఒక ప్రకటన ద్వారా సమ్మెకు మద్దతు తెలిపింది. హెచ్.ఎం.ఎస్., ఐ.ఎన్.టి.యు.సి. సమ్మెను వ్యతిరేకించాయి. పోలీసులను, సి.ఆర్.పి. దళాలను పెద్ద ఎత్తున మోహరించినా, ప్రభుత్వ ప్రోత్సాహంతో అనేక ఫ్యాక్టరీలలో గూండాలు కార్మికులపై దాడులు సాగించినా ఈ నిరసన సమ్మె బ్రహ్మాండంగా జయప్రదమైంది.

ఉద్యోగుల తొలగింపుకు నిరసనగా అన్ని రాష్ట్రాలలోని ప్రభుత్వోద్యోగులు రెండు గంటలు సమ్మె చేసి “పశ్చిమ బెంగాల్ దినం” పాటించవలసిందిగా అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య పిలుపునిచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని, “పశ్చిమ బెంగాల్ దినం” పాటించారు.

## అనేక ఇతర రంగాల్లో పోరాటాలు

ఈ కాలంలో అనేక పరిశ్రమలలో బోనసు, వేతనాల పెంపుదల కోరుతూ, కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగానూ, అనేక ఇతర సమస్యల పరిష్కారానికి అసంఖ్యాకంగా పోరాటాలు వెల్లువెత్తాయి.

వస్త్ర పరిశ్రమ నడిచే ప్రధాన కేంద్రాలలో బోనస్ పెంపుదల కోసం కార్మికులు సాగించిన సమ్మె పోరాటం ఆ కాలంలో సాగిన ప్రధాన పోరాటాలలో ప్రత్యేకంగా పేర్కొనదగినది. బోనస్ పెంపుదలకు యజమానులు విముఖంగా వుండటంతో పాటు, 8.33 శాతం కనీస

బోనస్ కల్పిస్తూ, చట్టం చేస్తామన్న హామీ నుండి ప్రభుత్వం వెనక్కు తగ్గడంతో, 1971 సెప్టెంబర్ 20న కేంద్ర కార్మిక శాఖ మంత్రి ఆర్.కె. ఖాడిల్కరు బోనసు సమస్యపై ఏర్పాటు చేసిన త్రైపాక్షిక సమావేశం విఫలమైంది.

వివిధ ట్రేడ్ యూనియన్న్లు సమైక్యంగా సమ్మె పిలుపునివ్వక పోయినా సాధారణ టెక్స్‌టైల్ కార్మికులు బోనసు చట్టాన్ని రద్దు చేయాలనీ, కనీస బోనసు 8.33 శాతం వుండాలనే డిమాండ్ల సాధనకు విస్తృత స్థాయిలో సమీకృతమైనారు. నిజానికిది ట్రేడ్ యూనియన్ ఉమ్మడి డిమాండ్. బొంబాయిలోని 20 లక్షల మంది టెక్స్‌టైల్ కార్మికులు ఈ డిమాండ్ల సాధనకు అక్టోబరు 11 నుంచి 5 రోజుల పాటు ఈ సమస్యలపై సమ్మె చేసి కార్మికుల సంఘటిత శక్తిని మహోజ్వలంగా ప్రదర్శించి, ఐ.ఎన్.టి.యు.సి.ని వారి కోటలోనే బ్రహ్మాండమైన దెబ్బతీశారు. "ఐ.ఎన్.టి.యు.సి.కి అనుబంధంగా వున్న టెక్స్‌టైల్ కార్మికుల సంఘం రాష్ట్రీయ మిల్ మజ్దూర్ సంఘానికి (ఆర్.ఎమ్.ఎమ్.ఎస్.) చెందిన సభ్యులు బొంబాయి టెక్స్‌టైల్ పరిశ్రమలో కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన నిరవధిక సమ్మెలో అసంఖ్యాకంగా పాల్గొన్నారు. అని టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ప్రచురించింది. ఆ పత్రిక ఇంకా ఈ విధంగా పేర్కొన్నది. "చాలా తక్కువమంది ఆర్.ఎమ్.ఎమ్.ఎస్. నాయకులు మిల్లు గేట్ల వద్ద కార్మికులను సమ్మెలో పాల్గొనవద్దని విజ్ఞప్తి చేయటానికి వచ్చారు. దానివలన ఆర్.ఎమ్.ఎమ్.ఎస్.కు కంచుకోటలుగా భావించిన మిల్లులు మూతపడినాయి."

సి.ఆర్.పి. దళాలను, 144 సెక్షను ప్రయోగించడం వంటి నిర్భంధాలకు పూనుకొన్నప్పటికీ కార్మికులు సమ్మెపోరాటం నుంచి వైదొలగలేదు.

బోనసు డిమాండును పూర్తిగా సాధించకుండానే అక్టోబరు 16న సమ్మె విరమించినప్పటికీ అయినా బోనసు కమిషన్‌లో మెజారిటీ సభ్యుల సిఫారసుతో బోనసు చట్టం ప్రకారం లభించే దాని కన్నా ఎక్కువ బోనసు కార్మికులు పొందగలిగారు. మొత్తం మీద 58 మిల్లులకు గాను 42 మిల్లులలో 8.33 శాతం బోనసు చెల్లించగా, మిగతా మిల్లుల్లో 5 శాతం కంటే ఎక్కువ బోనసు చెల్లించారు. మిల్లు యాజమానులు అదనపు బోనసుకు అడ్వాన్సు అని పేరు పెట్టినా కార్మికులు ఈ వాదనను అంగీకరించలేదు.

బొంబాయిలోనే కాక ఇతర ప్రధాన టెక్స్‌టైల్ పరిశ్రమ కేంద్రాలైన నాగపూర్, షోలాపూర్, అకోలా, కొల్హాపూరు, కోయంబత్తూరు, కాన్పూరు మొదలైన కేంద్రాలలో సమ్మెలు జరిగాయి. సి.ఐ.టి.యు, ఎ.ఐ.టి.యు.సి., హెచ్ఎం.పి., సోషలిస్టు టెక్స్‌టైల్ వర్కర్స్ యూనియన్ల సంయుక్త అధ్వర్యంలో కోయంబత్తూరులో సమ్మె జరిగింది. డి.ఎం.కె. ప్రభుత్వం, డి.ఎం.కె. సారధ్యంలో నడిచే ట్రేడ్ యూనియన్ ఈ సమ్మెను వ్యతిరేకించాయి. 1971 అక్టోబరు 5న 40000 మంది కార్మికులు కోయంబత్తూరులో ప్రారంభించిన సమ్మె 15 రోజులు కొనసాగింది. కాన్పూరులో 25000 మంది కార్మికులు 1971 అక్టోబరు 16న ఒక

రోజు సమ్మె మాత్రమే చేశారు. అయినా దీనికి అనేక విధాలుగా ప్రాముఖ్యత వున్నది. కాన్పూరులో అనేక సంవత్సరాలుగా చీలికలకు గురైన కాన్పూర్‌లోని ట్రేడ్ యూనియన్ వుద్యమంలో ఈ సమ్మె ఒక నూతన విశ్వాసాన్ని పాదుగొల్పి, మరిన్ని ఐక్య ఉద్యమాలకు మార్గం సుగమం చేసింది.

ఈ కాలంలో కేరళ రాష్ట్రంలో కార్మికోద్యమాలు వెల్లువగా విజృంభించాయి. తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న కేరళ కొబ్బరిపీచు పరిశ్రమను రక్షించాలని, కనీస వేతనాల నివేదికను ప్రకటించాలని కోరుతూ కార్మికులు ఐక్య పోరాటాలు నిర్వహించారు. సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈ సమస్యలపై 7000 మంది కొబ్బరి పీచు పరిశ్రమలోని కార్మికులు ఎర్నాకుళం జిల్లాలో ప్రదర్శన చేశారు. పీచు పరిశ్రమలో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలనీ, న్యాయమైన వేతనాలు చెల్లించాలనీ, పీచు పరిశ్రమలో నిరుద్యోగులైన వారికి పరిహారం చెల్లించాలని కోరుతూ ఉదయం పెరూర్ పంచాయతీకి చెందిన కాయర్ స్పిన్నింగ్ కార్మికులు ఎర్నాకులం కలెక్టర్ కార్యాలయం ముందు "సత్యాగ్రహం" నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

మవూర్ రేయాన్ ఫ్యాక్టరీ కార్మికులు బోనసు కోసం చేసే పోరాటానికి మద్దతుగా 1971 అక్టోబర్ 26న కాలికట్ జిల్లాలో 1,50,000 మంది పారిశ్రామిక కార్మికులు ఒక రోజు సమ్మె చేశారు. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., ఐ.ఎన్.టి.యు.సి.లతో పాటు ఇతర స్వతంత్ర యూనియన్లు సంయుక్తంగా సమ్మెను నిర్వహించాయి. ఈ కాలంలో కేరళలోని వివిధ పరిశ్రమలలో అనేక రూపాలలో పోరాటాలు కొనసాగాయి. అంజుతంజుకాయర్ జోన్‌లోని 1,25,000 మంది పీచు పరిశ్రమ కార్మికులు ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ 1972 జనవరి 24న ఒక బృహత్తర సమ్మెను నిర్వహించారు. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి.లు ఈ సమ్మెకు సంయుక్తంగా నాయకత్వం వహించాయి.

ఈ కాలంలో జరిగిన ముఖ్య పోరాటాలలో తమిళనాడులోని సింప్సన్ గ్రూప్ పరిశ్రమలలో 18000 మంది కార్మికులు చేసిన నిరవధిక సమ్మె గమనార్హమైనది. సింప్సన్ కార్మికులు పట్టుదలతో దీర్ఘకాలిక పోరాటం సాగించారు. 1971 డిసెంబరు 27 నుండి వారు ప్రారంభించిన నిరవధిక సమ్మె తమిళనాడు ముఖ్యమంత్రికి, సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టియు.సి., హెచ్.ఎం.ఎస్. ప్రతినిధులతో ఏర్పడిన సంయుక్త కార్యాచరణ కమిటీకి మధ్య ఒక ఒప్పందం కుదరడంతో 1972 జనవరి 11న విజయవంతంగా ముగిసింది. డి.ఎం.కె. యూనియన్ గుర్తింపు రద్దు చేయటం, యూనియన్ ఎన్నికలను త్వరగా జరపటం, సింప్సన్ గ్రూప్ మేనేజ్‌మెంటుకు, డి.ఎం.కె. యూనియన్‌కు మధ్య కుదిరిన కార్మిక వ్యతిరేక ఒప్పందాన్ని రద్దు చేయటం వంటి కార్మికుల ప్రధాన డిమాండ్లను సింప్సన్ కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. దక్షిణ భారతంలో అతి పెద్ద ఇంజనీరింగు పరిశ్రమలో కార్మికులు ఈ ఒప్పందంతో మహత్తరమైన విజయం సాధించారు.

తమ కోర్కెల సాధనకు దేశంలోని వివిధ ప్రాంతాల కార్మికులు సమరశీల పోరాటాలు నిర్వహించటమే కాక, పశ్చిమ బెంగాలులో అర్థ ఫాసిస్టు దమనకాండకు వ్యతిరేకంగా గణనీయమైన సంఖ్యలో కార్మికులు వివిధ పారిశ్రామిక కేంద్రాలలో నిరసన పోరాటాల్లో భాగస్వాములయ్యారు. సి.ఐ.టి.యు. పిలుపు మేరకు 1971 జనవరి 31 నుండి 1972 ఫిబ్రవరి 6 వరకు పశ్చిమబెంగాల్ కార్మికులకు సంఘీభావం తెల్పుతూ అనేక ప్రాంతాలలోని కార్మికులు 'అణచివేత వ్యతిరేక దినాన్ని" పాటించారు. సి.ఐ.టి.యు., యు.టి.యు.సి., యు.టి.యు.సి. (లెనిన్ సారణి), రాష్ట్రీయ సంగ్రామ్ సమితి, 12 జూలై కమిటీల ఆధ్వర్యంలో కలకత్తాలోని సుబోధ్ మల్లిక్ స్క్వేర్‌లో కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు.

పశ్చిమ బెంగాలులో కేంద్రప్రభుత్వం, అధికార కాంగ్రెస్ పార్టీ సాగించిన అర్థ ఫాసిస్టు బీభత్సకాండకు వ్యతిరేకంగానూ, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు ఆ రాష్ట్రంలోని కార్మికులను సంఘటితం చేయటంలోను, పరిమితంగానైనప్పటికీ జాతీయ స్థాయిలోనూ సి.ఐ.టి.యు. చేసిన కృషి ప్రశంసనీయమైనది. 1972 మార్చిలో రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో బాహాటంగా రిగ్గింగ్‌కు పాల్పడటంతో ఈ అణచివేత పరాకాష్టకు చేరింది. ట్రేడ్ యూనియన్ కార్యకర్తల హత్యలు, యూనియన్ ఆఫీసులను బలవంతంగా ఆక్రమించటం, కార్మికులను ఇళ్ళ నుండి తరిమివేయటం, సాయుధ గూండాలు ప్రభుత్వాఫీసులలో ఉద్యోగులపై దాడి చేయటం పశ్చిమ బెంగాలులో నిత్యకృత్యాలయ్యాయి. ఇటువంటి విపత్కర పరిస్థితులలో కార్మికులను, వారి హక్కులను పరిరక్షించటానికి ట్రేడ్ యూనియన్లు పోరాటాలు సాగించవల్సి వచ్చింది. యు.టి.యు.సి., యు.టి.యు.సి. (లెనిన్ సారణి), టి.యు.సి.సి.లతో కలిసి కార్మికుల పోరాటాలు నిర్వహించటంలో సి.ఐ.టి.యు., ప్రముఖ పాత్ర వహించింది. ప్రభుత్వోద్యోగులు ఈ దమనకాండకు తీవ్ర స్థాయిలో బలయ్యారు. అందువలన పశ్చిమబెంగాలు ప్రభుత్వోద్యోగుల అసోసియేషన్లు, యూనియన్ల సమన్వయ కమిటీ, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మద్దతుతో ఉద్యోగులను సంఘటితం చేసి వారి జీవితాలు, జీవన ప్రమాణాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకై సాగే పోరాటాల్లోకి ఉద్యోగులను సమీకరించేందుకు తీవ్ర కృషి చేసింది.

ప్రభుత్వం పైశాచిక దమనకాండను కొనసాగించినప్పటికీ, పశ్చిమబెంగాలు కార్మికులు మొక్కవోని ధైర్యంతో తమ ట్రేడ్ యూనియన్ డిమాండ్ల సాధనకు పోరాటం కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో కూడా పశ్చిమబెంగాలులోని జూట్ కార్మికులు ఘన విజయం సాధించారు. బెంగాల్ చట్కాల్ మజ్దూర్ యూనియన్ (సి.ఐ.టి.యు.), బెంగాల్ ప్రొవిన్షియల్ చట్కాల్ మజ్దూర్ యూనియన్ (యు.టి.యు.సి.), బెంగాల్ జూట్‌మిల్ వర్కర్సు యూనియన్ (యు.టి.యు.సి.– లె.సా.) మే 8 నుండి జూట్ పరిశ్రమలో నిరవధిక సమ్మెకు పిలుపునిస్తూ, 1972 ఏప్రిల్ 9న సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అదే రోజున ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్. యూనియన్లు విడిగా ఒక ప్రకటనలో మే 8 నుండి

నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాయి. తరువాత టి.యు.సి.సి. కూడా అదే రోజు నుండి సమ్మెకు నోటీసిచ్చింది. 10 అంశాల కోర్కెల పత్రంలో దిగువ నుదహరించిన సమస్యలున్నాయి. జూట్ పరిశ్రమను వెంటనే జాతీయం చేయాలనీ, నెలకు రు.300 కనీస వేతనం యివ్వాలనీ, బదిలీ కార్మికులను పర్మనెంట్ చేయాలనీ, వేతనాలను పెంచాలనీ, 1939 ప్రాతిపదికగా కరువు భత్యాన్ని పాయింట్‌కు రు.0.35కు పెంచాలనీ, ప్రతి సంవత్సరం సర్వీసుకు పూర్తి నెల జీతం గ్రాట్యుటీ చెల్లించాలనీ, కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, ఉచిత గృహ వసతి కల్పించాలి లేదా 20 శాతం ఇంటి అద్దె అలవెన్సులు చెల్లించాలన్న పది అంశాల కోర్కెల పత్రంలో చేర్చడం జరిగింది.

అగ్రస్థాయి నాయకత్వంలో భేదాభిప్రాయాల వలన ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా సమ్మె పిలుపునివ్వలేకపోయినప్పటికీ, క్రింది స్థాయిలోని కార్మికులకు ఐక్య కార్యాచరణ పట్ల వున్న ఆసక్తి వల్లనే అన్ని ట్రేడ్ యూనియన్లు మే 8వ తేదీ నుండే సమ్మె ప్రారంభించాలని నిర్ణయించడం సాధ్యమైంది. 2,50,000 మంది కార్మికులు ఐక్యంగా నిరవధిక సమ్మెకు పూనుకోవటంతో జూట్ పరిశ్రమ యాజమానులు దిగిరాక తప్పలేదు. కార్మికుల డిమాండ్లలో ఎక్కువ భాగం ఆమోదిస్తూ మే 7వ తేదీన ఒప్పందంపై సంతకం చేశారు.

ముఖ్యంగా కార్మికులకు నెలకు రు. 45 లు జీతం పెంచి నెలకు రు.235 జీతం చెల్లించేందుకు, కలకత్తా ఇండెక్స్‌లో 817 పాయింట్ల నుండి (1939 ప్రాతిపదికగా) ప్రతి పాయింట్ పెరుగుదలకు రు.0.25 లు కరువు భత్యం చెల్లించేందుకు, జీతాల పెంపుదలను వెనుక తేదీ నుండి అమలు చేసి, జీతాల బకాయిలను (బ్యాక్ వేజెస్) పూర్తిగా చెల్లించేందుకు, రాత్రి షిఫ్టు అలవెన్సు, గ్రాట్యుటీ చెల్లింపుకు 90 శాతం వరకు కార్మికులను పర్మినెంట్ చేయటం వంటి అంశాలపై అంగీకారం కుదిరింది. 1969 లో పోరాటం చేసి జూట్ కార్మికులు నెలకు రు.30 ల తాత్కాలిక వేతనాల పెంపుదల (ఇంటెరిమ్ రిలీఫ్) సాధించుకున్న తరువాత వారీ మహత్తర విజయం సాధించారు. ఆ విధంగా 3 సంవత్సరాల వ్యవధిలో జూట్ కార్మికుల కనీస వేతనం నెలకు రు.75లు పెరిగింది. బెంగాలులోనే కాక దేశంలోని ఇతర చోట్ల కూడా 30 వేల మంది జూట్ కార్మికులు ఇటువంటి సదుపాయాల కోసమే పోరాడి అదే విధమైన వేతనాల పెంపుదలను సాధించారు. ఉత్తరప్రదేశ్‌లో మే 8న సమ్మె ప్రారంభం కావలసి వుండగా, యజమానులు పశ్చిమబెంగాల్‌లో మాదిరి వేతనాల పెంపుదలకు అంగీకరించారు. బీహారులో హర్‌దూత్‌రాయ్ జూట్ మిల్లు కార్మికులు నెలకు రు. 235 కనీస వేతనం సాధించారు.

దేశంలోని అన్ని ప్రాంతాల కార్మికులలో సమరశీలత వ్యక్తమవుతోంది. విభిన్న డిమాండ్ల సాధనకు, చిన్న పెద్ద పారిశ్రామిక యూనిట్లలో కార్మికులు సమ్మెలతో బాటు వివిధ రూపాల్లో పోరాటాలు కొనసాగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో భీమవరం రైస్‌మిల్లు కార్మికులు ఫ్యాక్టరీ లేబర్ యూనియన్ నాయకత్వంలో 1971 డిసెంబర్ 1 నుండి సమ్మె ప్రారంభించారు. ఈ సమ్మె వలన 18

మిల్లులలో పని నిలిచిపోయింది. 8 శాతం బోనసు, పూర్తి ప్రావిడెంట్ ఫండ్ సదుపాయం, మహిళా కార్మికులకు అధిక జీతాలు, వారాంతపు సెలవు వంటి కోర్కెల సాధనకు సాగిన సమ్మె, మిల్లు యాజమానులు ఈ డిమాండ్లను అంగీకరించడంతో 1971 డిసెంబర్ 18న ముగిసింది. 1971 డిసెంబర్‌లో 500 మంది గోదావరి బ్రిడ్జి పనివారు అధిక వేతనాల కోసం చేసిన సమ్మె కూడా విజయవంతమైంది. అదే నెలలో 1,200 మందికి పైగా రాజమండ్రి పేపరు మిల్లు కార్మికులు పోరాటబాట పట్టారు. అయితే మెజారిటీగా వున్న ఎ.ఐ.టి.యు.సి. యూనియన్‌కు, సి.ఐ.టి.యు., ఐ.ఎన్.టి.యు.సి. తదితర యూనియన్‌ల మధ్య ఐక్యత కొరవడటం వలన కార్మికులు ఎక్కువగా లాభం పొందలేకపోయారు.

దేశంలో వివిధ ప్రాంతాల కార్మికులు అధికవేతనాలు, ఎక్కువ బోనసు, కనీస వేతనాల అమలు కోసం పోరాటాలు చేస్తుండగా, కేరళలోని కార్మికులు ట్రేడ్ యూనియన్, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణ కోసం సమ్మె పోరాటాలకు పూనుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలోనూ కార్మికోద్యమాన్ని అణచివేసే చర్యలకు, ట్రేడ్ యూనియన్ హక్కులపై జరిగే దాడులకు నిరసనగా కేరళ సి.ఐ.టి.యు. కమిటీ పిలుపు మేరకు 5 లక్షల మంది కార్మికులు 1972 మే 16న సమ్మె చేశారు.

దేశంలో  వివిధ పారిశ్రామిక కేంద్రాల్లో కార్మికులు సాగించిన సమ్మెలు, వివిధ పోరాటాలు కార్మిక వర్గంలో వెల్లివిరిసిన సమరశీలతకు నిదర్శనాలు. వివిధ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంస్థల్లోని అగ్ర నాయకత్వంలో అనేక రాజకీయ, సిద్ధాంత విభేదాలున్నప్పటికీ, అనేక సందర్భాల్లో క్రింది స్థాయిలో ఇదే ట్రేడ్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో అనేక సమ్మెలు, ఇతర ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు సాగుతుండటం గమనించదగ్గ విషయం. అంటే ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో జాతీయ స్థాయి విభేదాలు కొనసాగుతున్నప్పటికీ క్రింది స్థాయి కార్మికుల్లో వున్న ఐక్యతా కాంక్ష, ఆనాటి ట్రేడ్ యూనియన్ ఉద్యమ విశిష్ట లక్షణం. అన్నిరాష్ట్రాల్లోనూ సమ్మె పోరాటాలు సాగినప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, కేరళ, మహారాష్ట్రల్లో సమ్మెలు, లాకౌట్ల వల్ల అత్యధిక స్థాయిలో పని దినాలు నష్టమయ్యాయి.

## మూడవ కేంద్ర వేతన సంఘం - ప్రభుత్వోద్యోగుల ఉద్యమం

మూడవ కేంద్ర వేతన సంఘాన్ని ఏర్పాటు చేసిన మూడు సంవత్సరాల తరువాత 1973 మార్చి 31న దాని నివేదిక విడుదలైంది. ఆ నివేదికలో అనేక తిరోగమన అంశాలున్నాయి. అందులో కొన్ని ఈ విధంగా ఉన్నాయి.

1. అమలు తేదీ 1973 జనవరి 1.
2. 15వ లేబర్ కాన్ఫరెన్స్ ప్రమాణాల ప్రకారం కనీస వేతనం జీవన వ్యయ సూచికలో 200 పాయింట్ల వద్ద రు. 314 లు వుండాలి. అయితే కమిషన్  3 యూనిట్ల

కుటుంబానికి కనీస వేతనం జీవన వ్యయ సూచికలో 200 పాయింట్ల వద్ద, రు.196లు వుండాలని లెక్క వేసి, ఉద్యోగి సర్వీసులో చేరే నాటికి బ్రహ్మచారిగా వుంటాడు కాబట్టి కనీస వేతనం రు. 185 లే వుండాలని సిఫారసు చేసింది.

3. హేతుబద్ధం కాని విధంగా వేతనాల స్కేళ్ళను 80 కి కుదించింది.
4. కరువు భత్యం శాతం తగ్గించారు. జీవన వ్యయ సూచి 12 నెలల్లో సగటున 8 పాయింట్లు పెరిగితే రు.300ల వరకు జీతం వున్న వారికి 3.5%, రు. 900 ల జీతం వరకు 2.5% కరువు భత్యం వుండాలనీ, అది కనీసం రు.7లు వుండాలని, గరిష్ట పరిమితి రు.10 వుండాలని సూచించింది.
5. జీతాలను తిరిగి నిర్ధారించేటప్పుడు (కొత్త జీతాలు నిర్ణయించేటప్పుడు) ప్రస్తుత వేతనాలకు ఆ జీతంలో 5 శాతం కలపాలనీ, అది కనీసం రు.10 లు గరిష్టంగా రు.50లకు మించరాదు.
6. ఇంక్రిమెంట్ల రేట్లు తక్కువ స్థాయిలోనే వుంచారు. కొన్ని సందర్భాల్లో ఓవర్‌టైమ్ అలవెన్స్‌లు రద్దు చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది.
7. సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్ తగ్గించారు. ఇంటి అద్దె అలవెన్స్ పెంచలేదు.

1957 లో 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం అవసరాల ప్రాతిపదికపై కనీస వేతనం ఇవ్వాలన్న సూత్రాన్ని కమీషన్ తిరస్కరించింది. వారి లెక్కల ప్రకారం నిర్ణయించిన రు.196 కనీస వేతనాన్ని కూడా కమిషన్ నిరాకరించింది. వేతన సంఘం ఈ విధంగా చేసిన తిరోగమన సిఫారసుల వలన కేంద్ర ఉద్యోగుల ఆశలన్నీ అడియాసలయ్యాయి. దేశమంతటా నిరసన పెల్లుబికింది.

దురదృష్టవశాత్తు కేంద్ర ప్రభుత్వోద్యోగుల నాయకత్వం ఈ తిరోగమన సిఫారసులను ఐక్యంగా వ్యతిరేకించలేకపోయింది. జె.సి.ఎం.లో మెజారిటీ సభ్యులు సందిగ్ధ వైఖరి నవలంబించారు. వారిలో కొందరు అవసరాల ప్రాతిపదికపై కనీసం వేతనం, ధరల సూచి ప్రకారం కరువు భత్యం, అందరికీ బోనస్ వంటి సమస్యలను గురించి ప్రస్తావించలేదు. అయితే 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం వేతన సంఘం లెక్కించిన విధంగా, అవసరాల ప్రాతిపదికన కనీస వేతనాన్ని రూ. 314/–లుగా నిర్ణయించాలని, జీవన వ్యయ సూచిక ఆరు నెలల్లో సగటున నాలుగు పాయింట్లు పెరిగితే కరువు భత్యం చెల్లించాలని, అందరికీ బోనస్ చెల్లించాలని కోరుతూ మైనారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు అప్పటి కేంద్ర ప్రభుత్యోద్యోగుల అసోసియేషన్లు, యూనియన్ల కాన్ఫెడరేషన్, సెక్రటరీ రీజనల్ ఎస్.కె.వ్యాస్ ఒక ప్రత్యామ్నాయ మెమోరాండం సమర్పించారు. ధరల సూచి 6 నెలలకు సగటున 4 పాయింట్లు పెరిగితే దాని ప్రకారం కరువు భత్యం ఇవ్వాలనీ, బోనసు అందరికీ ఇవ్వాలనీ ఆ మెమోరాండంలో డిమాండ్ చేశారు.

ఈ పరిస్థితులలో కేంద్ర ఉద్యోగుల కాన్ఫెడరేషన్ 1973 ఏప్రిల్ 15, 16 తేదీల్లో జైపూరులో సమావేశమై, ఉద్యమంలో చీలిక గురించి, అప్పుడున్న పరిస్థితుల గురించి సమావేశం అన్ని కోణాలలో చర్చించి, ప్రత్యామ్నాయ మెమోరాండంలో పేర్కొన్న డిమాండ్ల సాధనకు ఈ దిగువ కార్యక్రమాన్ని రూపొందించింది.

1. మేడే రోజున ఐక్యతాదినం పాటించాలి.

2. నల్లబాడ్జీలు ధరించి మే 9 నుండి 11 వరకు సామూహిక ధర్నా.

3. 1973 జూన్ 1 న జీతాల నిరాకరణ (పే బాయ్‌కాట్).

అయితే 1973 అక్టోబరు 8న వేతన సంఘం సిఫార్సులను ఆమోదిస్తూ సవరణలను తిరస్కరిస్తూ ప్రభుత్వం ప్రకటన చేసిన తరువాత కేంద్ర ఉద్యోగుల్లోని అన్ని తరగతులకు చెందిన యూనియన్ల నాయకత్వం ఐక్యంగా నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. 1973 డిసెంబరు 1న జీతాలను నిరాకరించే కార్యక్రమం జయప్రదంగా అమలు జరిగింది. సంవత్సరం తరువాత రైల్వే ఉద్యోగుల నూతన నాయకత్వం పోరాట రంగంలోకి వచ్చినప్పుడు మాత్రమే ఈ పోరాటం సమరశీలతను సంతరించుకున్నది.

రాజస్థాన్ ప్రభుత్వోద్యోగులు తాత్కాలిక భృతి కోసం 1972 ఫిబ్రవరి 16 నుంచి 22 వరకు చేసిన నిరవధిక సమ్మె ప్రభుత్వ సర్వీసుల్లోనూ, ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ జరిగిన ముఖ్య పోరాటాల్లో ఒకటి. ప్రభుత్వంతో ఒప్పందం కుదరడంతో సమ్మె విజయవంతంగా ముగిసింది. అదే ఏడాది ఏప్రిల్ 25న ఆలిండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిర్వహించిన మరో ప్రధానమైన సమ్మె పోరాటంలో 40,000 మంది ఎల్.ఐ.సి. ఉద్యోగులు పాల్గొన్నారు. అసోసియేషన్‌కు గుర్తింపు, మూడు నెలల మొత్తం జీతం బోనస్‌గా చెల్లింపు, ప్రమోషన్ అవకాశాల మెరుగుదల తదితర కోర్కెల సాధనకు ఈ సమ్మె జరిపారు.

## అందరికి బోనస్ కోసం పోరాటం

ఈ కాలంలో పోరాటాలను పరిశీలిస్తే కార్మికులు బోనస్ డిమాండ్ మీద తమ దృష్టి సారించారని స్పష్టమవుతుంది. కార్మికుల్లో విస్తృతంగా వున్న బోనస్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బోనస్ కమిషన్ సిఫార్సుల ప్రకారం, ప్రభుత్వం 1968 లో బోనస్ చట్టం చేసింది. ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్. ప్రతినిధులు కూడా బోనస్ కమిషన్‌లో సభ్యులుగా వున్నారు. 1968 బోనస్ చట్టం ప్రకారం సంబంధిత కంపెనీ లాభాలను బట్టి 4 శాతం కనీస బోనస్‌ను చెల్లించాలి.

ఎ.ఐ.టి.యు.సి.కి చెందిన ఎస్.ఎ.డాంగేతో సహా ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు ఈ బోనస్ సూత్రాన్ని అంగీకరించారు. పరిశ్రమ లాభాల మీద ఆధారపడి బోనస్ నిర్ణయించడంతో పాటు కనీస బోనస్‌ను చాలా తక్కువ స్థాయిలో 4 శాతంగా నిర్ణయించడం

వల్ల కార్మిక వర్గాన్ని సంతృప్తిపరచ లేకపోయింది. దీనితో బోనసును లాభాలతో ముడిపెట్టరాదనీ, కనీస బోనస్ 8.33 శాతంగా వుండాలని కోరుతూ పోరాటాలు పెల్లుబికాయి. ఈ సమయంలోనే ఉద్యోగి, అతడు / ఆమె కుటుంబ జీవనానికవసరమైన జీతానికి (లివింగ్ వేజ్), తక్కువ స్థాయిలో వున్న ప్రస్తుత జీతాలకు మధ్య వున్న వ్యత్యాసాన్ని బోనస్‌గా గుర్తించడం ద్వారా, బోనస్‌ను వాయిదా పడిన వేతనంగా గుర్తిస్తూ న్యాయ స్థానాల నుండి తీర్పులు కూడా వెలువడ్డాయి. ఈ తీర్పులు బోనసును లాభాలతో ముడిపెట్టరాదనే కార్మికుల డిమాండ్‌కు ఊతమిచ్చాయి. అంతేకాక ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, ప్రభుత్వోద్యోగులు బోనసు చట్టం పరిధిలో లేనందున వారు బోనస్‌కు అర్హులు కాకపోవడంతో, వారు కూడా ఉద్యమం ప్రారంభించారు. ఆ విధంగా అందరికీ 8.33 శాతం బోనస్ కావాలనే డిమాండ్ సార్వత్రిక డిమాండ్‌గా అన్ని రంగాలలో వ్యాపించింది. 20 మంది కంటె తక్కువ మంది కార్మికులుండే ఫ్యాక్టరీయేతర సంస్థలను బోనసు చట్టం పరిధి నుంచి మినహాయించారు.

ఈ పరిస్థితులలో బోనసుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి 1972 ఏప్రిల్‌లో ప్రభుత్వం బోనసు రివ్యూ కమిటీని నియమించింది. ఈసారి కూడా ఐ.ఎన్.టి.యు.సి, ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్.లను రివ్యూ కమిటీలో చేర్చారు. సి.ఐ.టి.యు.ని కమిటీలో చేర్చలేదు. అయితే వివిధ ట్రేడ్ యూనియన్లు బోనసు సూత్రం గురించి తమ అభిప్రాయాలను రివ్యూ కమిటీకి నివేదికల ద్వారా తెలియజేసి, 1972 జూలై 15 నాటికి మధ్యంతర సిఫార్సుల ద్వారా 8.33 శాతం బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం కూడా 8.33% కనీస బోనసును సూత్రప్రాయంగా అంగీకరించింది. పార్లమెంట్ సభ్యుడు చిత్తబసు 8.33% బోనసు చెల్లించాలని కోరుతూ ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును లోక్‌సభలో ప్రతిపాదించగా, ప్రభుత్వం 8.35 శాతం కనీస బోనస్‌ను సూత్రప్రాయంగా ఆమోదించిందని అదే విషయంపై సవరణ బిల్లును ప్రవేశపెడతామని కేంద్ర కార్మికమంత్రి హామీ ఇచ్చిన మీదట తన బిల్లును ఉపసంహరించుకొనడానికి అనుమతించారు. తమకు బోనస్ రివ్యూ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించనందుకు విచారం వెలిబుచ్చుతూ, కనీస బోనస్ 10% వుండాలనీ, దానిని రాబోయే 5 సంవత్సరాలలో ఏడాదికి 1% చొప్పున పెంచుతూ బోనస్ 15%కు చేరిన తరువాత సమీక్ష జరపాలనీ డిమాండ్ చేస్తూ సిఐటియు ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించింది.

ఐ.ఎన్.టి.యు.సి. కూడా 8.33% బోనస్ డిమాండ్ చేస్తూ బోనస్ కమీషన్ ఇదివరలో చేసిన సిఫార్సులను విమర్శించింది. "లేబర్ అపెలేట్ ట్రిబ్యునల్" ప్రతిపాదించిన సూత్రం కన్నా కమీషన్ సిఫార్సులు మరింత ప్రగతి నిరోధకంగా వున్నాయని' వారు విమర్శించారు.

ఉత్పాదకత, లాభాలతో బోనస్‌ను ముడిపెట్టడం వలన ప్రభుత్వోద్యోగులు బోనస్ చట్టం పరిధిలో లేరు. అందువలన ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్లు కూడా బోనస్ డిమాండ్‌తో ముందుకు వచ్చాయి. 1972 డిసెంబర్ 10న కేంద్ర ప్రభుత్వద్యోగుల

అసోసియేషన్లు, యూనియన్ల కాన్ఫెడరేషన్ 'అందరికీ బోనస్' కోరుతూ ఢిల్లీలో సదస్సు ఏర్పాటు చేసింది. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఎంప్లాయీస్, ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఈ సదస్సుకు హాజరు కాలేదు.

వాయిదా పడిన వేతనంగా 8.33% బోనస్ అందరికీ చెల్లించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. జీవించేందుకు అవసరమైన వేతనం (లివింగ్ వేజ్) సాధించే వరకు బోనస్‌ను వాయిదా పడిన వేతనంగా అంగీకరించటం అత్యవసరమని, బోనస్‌ను ఉత్పాదకత, లాభాలతో ముడిపెట్టడానికి వ్యతిరేకత తెలుపుతూ వక్తలందరూ ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక లేదా మున్సిపల్ వ్యవస్థలకు చెందిన ఉద్యోగులను బోనస్ చట్టం వెలుపల వుంచడానికి ఏ విధమైన కారణం లేదని వారు ఉద్ఘాటించారు. ఆ విధంగా దేశంలోని ప్రభుత్వోద్యోగులు, 'అందరికీ బోనసు'కై సాగే పోరాటంలో కలిశారు. దీనితో దేశంలోని కార్మికోద్యమానికి బోనసు ప్రధాన ఉమ్మడి డిమాండ్‌గా రూపొందింది.

ఈలోగా బోనసు రివ్యూ కమిటీ తన మధ్యంతర నివేదికలో, 8.33 శాతం కనీస బోనసుగా అంగీకరించింది. కాని పారిశ్రామిక కార్మికులకు, తప్ప ఇతర రంగాలకు దీనిని వర్తింపచేయలేదు. రెండు సంవత్సరాల తరువాత కమిటీ తన నివేదికను ప్రకటించింది. కానీ మధ్యంతర నివేదికలో వారు ప్రకటించిన దాని కన్నా ఏ విధమైన మెరుగుదల లేకపోగా బోనసు 8.33% స్థాయిలోనే ఉంచబడింది.

ప్రభుత్వోద్యోగులకు బోనసు డిమాండ్ సాధించడానికి ఇంకా కొన్ని సంవత్సరాలు పట్టింది. 1980వ దశకంలో మొదటగా రైల్వే ఉద్యోగులు, పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ఉద్యోగులు, ఆ తరువాత మిగతా రంగాల వారు బోనసు సాధించుకున్నారు. దేశవ్యాప్త ఉద్యమం తరువాత రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు బోనసు లభించింది.

## రైల్వే ఉద్యోగుల సమరశీల పోరాటం

1968 లో సమ్మె తరువాత ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ గుర్తింపు ఉపసంహరించబడింది. ఎ.ఐ.ఆర్.ఆఫ్. నాయకత్వం గుర్తింపు తిరిగి తెచ్చుకోనడానికి ఎడతెరిపి లేకుండా కృషి చేసింది. గుర్తింపు త్వరగానే లభించింది. కానీ ఈ సమయంలో నాయకత్వం రైల్వే ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం పట్ల దృష్టి సారించలేదు. అంతేకాక ఎ.ఐ.ఆర్.ఎఫ్. నాయకత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని సర్వత్రా ఫిర్యాదులొచ్చాయి. 1968 సమ్మెకు కొద్దిరోజుల ముందుగానే చిత్తరంజన్ లోకోవర్క్స్ లేబర్ యూనియన్ 1967, 1968 అనుబంధ రుసుం బకాయి వున్నదనే చిన్నసాకుతో ఆ యూనియన్ అనుబంధాన్ని ఎ.ఐ.ఆర్.ఎఫ్., నాయకత్వం రద్దు చేసింది. వాస్తవానికి, ఆ యూనియన్ అధికారిక గుర్తింపు

హక్కు కోసం 1968 జనవరిలో చేసిన సమ్మె ఎ.ఐ.ఆర్.ఎఫ్. నాయకత్వానికి ఆగ్రహం కల్గించింది. ఫెడరేషన్ నాయకత్వం తమను గురించి పట్టించుకోవడం లేదనే భావం రైల్వే ఉద్యోగులలో బాగా ప్రబలి, ఉద్యోగులలో వివిధ తరగతులకు చెందినవారు తరగతివారీగా అసోసియేషన్లు, యూనియన్లు పెట్టుకునే ధోరణి ప్రారంభమైంది. సంస్కరణవాద నాయకత్వం యొక్క నిష్క్రియాపరత్వం, నిర్లిప్తతల వల్ల కూడా నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి తరగతులవారీ యూనియన్లు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అఖిల భారత స్థాయి గల కొన్ని తరగతి వారీ యూనియన్లు ఐక్యమై 1969లో ఆలిండియా రైల్వే ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ ఏర్పాటు చేశాయి.

కానీ డివిజన్ స్థాయిలో, స్టేషన్ స్థాయిలో వివిధ కేంద్రాలలో తరగతి వారీ యూనియన్లు పెట్టుకునే ధోరణి ప్రబలింది. ఆ తరువాత ఆ అసోసియేషన్లు సమన్వయ కమిటీలుగా ఏర్పడి స్థానిక సమస్యలపై పోరాటాలు జరిపాయి. వివిధ కేంద్రాలలో స్థానిక సమస్యలపై ఐక్య పోరాటాలు కొనసాగించటం వల్ల రైల్వే ఉద్యోగులలో ఒక కొత్త ఐక్యతాభావం, ఆత్మవిశ్వాసం ఏర్పడినాయి.

కొత్తగా ఏర్పడిన తరగతి వారీ యూనియన్లలో ఆలిండియా లోకోరన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఈ కాలంలో ఒక సమరశీల పోరాటం నిర్వహించింది. పనిలోకి వచ్చి సంతకం చేసి మళ్ళీ వెళ్ళేటప్పుడు సంతకం చేసే మధ్యకాలంలో 10 గంటలు మాత్రమే పనిదినం వుండాలని ఈ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

ఆర్థిక సంక్షోభం తీవ్రమై దేశమంతటా పోరాటాలు కొనసాగుతున్న పరిస్థితులలో లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కూడా కార్యాచరణకు సిద్ధపడింది. స్థానికాధికారుల వద్దకు సామూహికంగా తరలివెళ్ళి తమ సమస్యలను వినిపించడంతో ప్రారంభించి ఆ తరువాత "నిబంధనల మేరకు పని" ఉద్యమాన్ని చేపట్టి, ఆ తరువాత మరింత తీవ్ర స్థాయిలో పోరాటం సాగించటానికి సన్నద్ధమయ్యారు. ఈ సమయంలో రైల్వే అధికారులు కక్ష సాధింపు చర్యలు ప్రారంభించారు. ఆ తరువాత లోకో రన్నింగు స్టాఫ్ అసోసియేషన్ ముందుగా నోటిసిచ్చి 1973 ఆగస్టు 1 నుంచి "సిక్ లీవు ఉద్యమాన్ని" ప్రారంభించింది. దీనితో దేశమంతటా రైళ్ళ రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయి. ఈ పరిస్థితులలో గుర్తింపులేకపోయినప్పటికీ అసోసియేషన్ నాయకత్వాన్ని రైల్వేమంత్రి చర్చలకు ఆహ్వానించారు. నాలుగు రోజుల చర్చల అనంతరం ఒక ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరి సంతకాలు చేశారు. విజయోత్సాహంతో ఆ ఉద్యమాన్ని ఉపసంహరించారు. 10 గంటల పని దినంతో బాటు ప్రభుత్వంతో సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించటానికి ఒక కమిటీ ఏర్పాటు గురించి కూడా ఒప్పందం కుదిరింది. ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఏ విధమైన ఒప్పందం కుదరకుండా అడ్డుపడినప్పటికీ ఇది సాధ్యమైంది.

లోకోమెన్ పోరాటం సాధించిన విజయంతో, ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఎన్.ఎఫ్.ఐ.ఆర్.ల నాయకత్వం అనుసరించే నిరంకుశ విధానాలు, మేనేజ్‌మెంట్ అనుకూల వైఖరి ఉద్యోగులకు వెల్లడయ్యాయి. దీనితో తరగతి వారీ యూనియన్లు తమ సమస్యలకే పరిమితమయ్యే ప్రమాదకర వైఖరి బాగా ప్రబలింది. అదొక క్లిష్టమైన పరిస్థితి. ఎ.ఐ.ఆర్.ఎఫ్. సంస్కరణవాద నాయకత్వంతో విసిగి వేసారిన రైల్వే ఉద్యోగులు తరగతుల వారీ యూనియన్లకు నాయకత్వం వహించే మరో తరహా సంస్కరణవాదుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఏర్పడింది. రైల్వే ఉద్యోగుల ఐక్యతకు తీవ్ర విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. తరగతి వారీ యూనియన్లలోని కార్మికుల ఐక్యత కోరుకునే ఒక సెక్షన్ ఈ క్లిష్ట పరిస్థితిలో గల ప్రమాదం గుర్తించి, రైల్వే ఉద్యోగుల ఐక్య పోరాట పంథా నుండి తరగతివారీ యూనియన్లు వేరుపడకుండా చేసేందుకు తీవ్రమైన ప్రయత్నాలు చేశారు.

సరిగ్గా ఈ సమయంలోనే ఎ.ఐ.ఆర్.ఎఫ్. నాయకత్వంలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి.లోకోమెన్‌ల పోరాటం జరిగిన కొద్ది కాలానికే జరిగిన ఎ.ఐ.ఆర్.ఎఫ్. వార్షిక మహాసభలో సోషలిస్టు పార్టీ, యునైటెడ్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌కు కూడా ఛైర్మన్ అయిన శ్రీ జార్జి ఫెర్నాండేజ్ ఎ.ఐ.ఆర్.ఎఫ్. ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. ఫెర్నాండేజ్ రైల్వే ఉద్యోగుల ప్రాథమిక కోర్కెల సాధనకు ఐక్య పోరాటానికి పిలుపునిచ్చాడు.

ఈ మారిన పరిస్థితులలో కార్మికుల సమస్యల పరిష్కారానికి 1974 ఫిబ్రవరి 27న ఎ.ఐ.ఆర్.ఎఫ్. రైల్వే ఉద్యోగుల యూనియన్ల సంయుక్త సదస్సును ఏర్పాటు చేసింది. సదస్సుకు బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. వందకన్నా ఎక్కువ రైల్వే యూనియన్లు సదస్సులో పాల్గొనటానికి అంగీకారాన్ని తెలిపాయి. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., భారతీయ మజ్దూర్ సంఘ్ తమ మద్దతు తెలిపాయి. ఈ సదస్సులో రైల్వే ఉద్యోగుల జాతీయ పోరాట సమన్వయ కమిటీ (ఎన్.సి.సి.ఆర్.ఎస్.) ఏర్పడింది. దీనిలో పాల్గొనే అన్ని యూనియన్లకు సమాన హక్కులు కల్పించారు. ఈ కమిటీకి జార్జి ఫెర్నాండేజ్ కన్వీనర్ అయినారు. కేంద్ర ట్రేడ్ యూనియన్లు కూడా ఈ కమిటీలో సభ్యులయ్యాయి. తమ ఆరు అంశాల కోర్కెల పత్రంలోని అంశాలను 1974 ఏప్రిల్ 10లోగా అంగీకరించకపోతే, సమ్మె పోరాటానికి ఉద్యోగులను సమాయత్తం చేయాలనే దృఢ నిర్ణయం వ్యక్తం చేశారు.

అవసరాల ప్రాతిపదిక మీద కనీస వేతనం, బోనసు, ధరల సూచిలో 6 నెలల్లో సగటున 4 పాయింట్లు పెరిగితే ప్రతిపాయింటు పెరుగుదలకు కరువు భత్యం చెల్లించాలనే సార్వత్రిక డిమాండ్ల సాధనకు 1974 ఏప్రిల్ 14/15 తేదీల నుండి వర్క్ టు రూల్ ఉద్యమం ప్రారంభించాలని అప్పటికే ఆలిండియా రైల్వే ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ మద్రాసులో నిర్వహించిన సదస్సులో నిర్ణయించడం జరిగింది. ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కూడా తమ జీతాల స్కేళ్ళ వర్గీకరణ సమస్యపై ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ సాధనకు 1974 మార్చి 18న ఒకరోజు సమ్మె

చేయాలన్న నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ పోరాటాల ప్రకటనలు ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఏర్పాటు చేసిన సదస్సు జయప్రదం కావటానికి, ఎన్.సి.సి.ఆర్.ఎస్. ఏర్పాటుకు దోహదం చేశాయి.

ఢిల్లీలో 1974 మార్చి 15న జరిగిన ట్రేడ్ యూనియన్ల సంయుక్త సదస్సుతో ఐక్య పోరాట భావన మరింత బలం పుంజుకుంది. ఈ సదస్సులో అన్ని రైల్వే యూనియన్లతో బాటు ఐ.ఎన్.టి.యు.సి. ఆధ్వర్యంలోని ఎన్.ఎఫ్.ఐ.ఆర్., కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్స్ ఆల్ అసోసియేషన్స్, దాని అనుబంధ సంస్థలైన ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఎన్.ఎఫ్.పి.టి.ఇ, ఎఫ్.ఎన్.పి.టి.ఓ.ల్లోని రెండు గ్రూపులు, ఆలిండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్‌లు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం, ధరల సూచిలో పెరుగుదలను కరువు భత్యంతో పూర్తిగా భర్తీ చేయడం, అందరికీ బోనస్, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, పూర్తి ట్రేడ్ యూనియన్ హక్కులు, కక్ష సాధింపు చర్యల రద్దు వంటి ఉమ్మడి కోర్కెల సాధనకు రైల్వే ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వోద్యోగులు దేశవ్యాప్తంగా విశాల ప్రాతిపదికన ఐక్య పోరాటాలు నిర్వహించడానికి రంగం సిద్ధమైంది.

సిఐటియు అధ్యక్షులు శ్రీ బి.టి. రణదివె ఈ సదస్సులో పాల్గొని, కార్మికులు చేయబోయే సమరశీల పోరాటానికి తమ మద్దతు తెలిపారు. అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం, అందరికీ బోనస్, ధరల సూచికలో పెరుగుదలను డి.ఎ. ద్వారా పూర్తిగా భర్తీ చేయడం తదితర కోర్కెల సాధనకు 1974, ఏప్రిల్ 9వ తేదీన దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేయాలని ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అప్పటికే నిర్ణయించింది. సదస్సు ఒక తీర్మానంలో ఈ సమ్మెకు పూర్తి మద్దతు తెల్పింది. ఆలిండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశమంతటా రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు జరిపిన సమ్మె బ్రహ్మాండంగా విజయవంతమైంది. దీనివలన రైల్వే ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వోద్యోగులు చేయబోయే ఐక్యపోరాటానికి మరింత అనువైన పరిస్థితులేర్పడినాయి.

## అమానుష అణచివేతల మధ్య సమ్మె ప్రారంభం

ఎన్.సి.సి.ఆర్.ఎస్, సదస్సు ఆమోదించిన తీర్మానాన్ని రైల్వేమంత్రిత్వశాఖకు పంపగా, ఎన్.సి.సి.ఆర్.ఎస్. గుర్తింపు పొందిన సంస్థ కాదనే సాకు చూపి రైల్వే మంత్రిత్వ శాఖ వారితో చర్చించటానికి నిరాకరించింది. గుర్తింపు పొందిన సంఘాలైన ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఎన్.ఎఫ్.ఐ.ఆర్.లతో మంత్రిత్వ శాఖ చర్చలకు సిద్ధమైంది. ఏది ఏమైనా మధ్యేమార్గంగా చర్చలు ప్రారంభమైనప్పటికీ చివరకు ఫలించలేదు. ఎన్.సి.సి.ఆర్.ఎస్.తో పాటు వివిధ రైల్వే ఉద్యోగుల, కేంద్ర ప్రభుత్వోద్యోగుల యూనియన్లు 1974 మే 8 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తామని, ఏప్రియల్ 23న నోటీసిచ్చాయి. సమ్మె ప్రారంభమైంది.

ప్రభుత్వం దమనకాండ ప్రారంభించింది. సమ్మెను నిషేధించడానికి అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సు జారీ చేసింది. ఆ ఆర్డినెన్సుతో పాటు అంతరంగిక భద్రతా నిర్వహణా చట్టం (ఎం.ఐ.ఎస్.ఎ) క్రింద 50,000 మంది రైల్వే ఉద్యోగులను, ప్రభుత్వోద్యోగులను అరెస్టు చేశారు. తూ తూ మంత్రంగా విచారణ జరిపి, చాలామంది రైల్వే ఉద్యోగులకు ఒక సంవత్సరం కఠిన కారాగారవాస శిక్ష విధించారు. కనీసం వారి వాదనలకు అవకాశం కూడా ఇవ్వకుండా 3 వేల మంది కార్మికులను రూల్ (II)/149 ప్రకారం నిరంకుశంగా సర్వీసు నుంచి తొలగించారు. రైల్వేకాలనీలో పోలీసులు భయోత్పాతం సృష్టించారు. ఇళ్ళపై దాడులు చేసి, ఆడవారిని కొట్టి, మగవారిని కసితో చిత్రహింసలకు గురిచేశారు. కార్మికులు కాలనీలో ఎక్కడికీ కదలడానికి వీలులేకుండా కర్ఫ్యూ విధించారు. 5000 మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులను సర్వీసు నుంచి తొలగించారు.

సరిగ్గా ఈ సమయంలో ఆలిండియా డిఫెన్సు ఎంప్లాయీస్ ఫెడరేషన్ కొన్ని చిన్న అంశాలపై ప్రభుత్వంతో అంగీకారం కుదుర్చుకుని సమ్మె నుంచి వైదొలగింది. కేంద్ర ప్రభుత్వోద్యోగులలో కొన్ని చీలికలున్నా, రైల్వే ఉద్యోగులు సమ్మె ప్రారంభించిన ఒక రోజు తర్వాత అంటే 1974 మే 9న వారు కూడా సమ్మెలో చేరారు. కొన్ని రాష్ట్రాలలోను, కొన్ని కేంద్రాలలోను సమ్మె చేసేవారి శాతం చాలా ఎక్కువగా వున్నప్పటికీ, ఢిల్లీతో సహా కొన్ని చోట్ల సమ్మె బాగా జరగలేదు. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో సమ్మె జరగలేదు.

రైల్వే కార్మికులు, కేంద్ర ప్రభుత్వోద్యోగులు సంఘటితంగా చేసిన సమ్మెకు అన్ని ట్రేడ్ యూనియన్ల నుండి విశాల మద్దతు లభించింది. సంఘీభావ ఉద్యమాలతోబాటు దేశంలోని అనేక ప్రాంతాలలో సమ్మె చేసేవారికి సహాయ, సహకారాలందిస్తూ చర్యలు చేపట్టారు.

దిగువ స్థాయిలో సరైన సన్నాహం లేకపోవటం తదితర అనేక లోటుపాట్ల వలన కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె ప్రారంభమైన వెంటనే దిగజారడం మొదలైంది. 1974 మే 10న కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమ్మె ఉపసంహరించారు. కానీ ఈ కాస్త సమయంలోనే పెద్ద సంఖ్యలో కేంద్ర ప్రభుత్వోద్యోగులు కక్ష సాధింపు చర్యలకు గురైనారు.

రైల్వే ఉద్యోగులు సమ్మెకు సన్నద్ధం కావటంలో కూడా కొన్ని లోటుపాట్లు స్పష్టంగా కనిపించాయి. భారీ ఎత్తున సాగిన భయోత్పాతం, కక్ష సాధింపు చర్యలు రైల్వేకార్మికుల స్థైర్యాన్ని దెబ్బతీశాయి. కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమ్మె నుంచి విరమించటం దీనికి తోడైంది. ఈ పరిస్థితులలో వివిధ ట్రేడ్ యూనియన్లు మే 15న దేశవ్యాప్త సంఘీభావ సమ్మెకు పిలుపునిచ్చాయి. మునుపెన్నడూ ఎరుగని విధంగా కక్ష సాధింపు చర్యలు సాగుతున్నప్పటికీ, విజయవంతంగా సాగిన ఈ సంఘీభావ సమ్మె రైల్వే కార్మికులు ధైర్యం పుంజుకునేందుకు దోహదం చేసింది. కానీ చివరకు పశ్చిమ రైల్వేలోను, మరికొన్ని డివిజన్లలోను సమ్మె విఫలం కావటం ప్రారంభం కావడంతో, ఆ సమయంలో జైలులో వున్న జార్జి ఫెర్నాండేజ్ 1974 మే 29న సమ్మెను ఉపసంహరించారు.

సమ్మె ముగిసే నాటికి 1,00,000 మంది ఉద్యోగులను పని నుండి తొలగించగా వారిలో 50,000 మంది టెంపరరీ, కాజువల్ కార్మికులు. మరో 30,000 మందిని అరెస్టుల కారణంగా సస్పెండ్ చేశారు. తొమ్మిది లక్షల మంది ఉద్యోగులకు సర్వీసులో అంతరాయం (బ్రేక్ ఇన్ సర్వీస్) కల్గించారు.

అంతర్గత బలహీనతల వలన కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె ప్రారంభమైన వెంటనే దెబ్బతిన్నది. అటువంటి దేశవ్యాప్త సమ్మెకు కార్మికులను మానసికంగానూ, సంస్థాపరంగానూ సన్నద్ధం చేయటంలో తీవ్రమైన లోపాలున్నాయి. కానీ రైల్వే ఉద్యోగుల సమ్మె దారుణ దమనకాండ నెదిరించి చాలాకాలం కొనసాగింది. ఈ సమ్మెలో కూడా నిర్వహణ లోపాలున్నాయి. సమ్మె జరిగే కాలంలో సంస్థాపరమైన అలసత్వం నెలకొనడంతో పాటు ఐక్య మార్గదర్శకత్వం లేకపోవడం కొట్టవచ్చినట్లు కనబడింది. అయినప్పటికీ 20 లక్షల మంది రైల్వే ఉద్యోగులు సాధించిన ఐక్యత వారిలో అధిక సంఖ్యాకులు సాహసంతో, దృఢదీక్షతో చేసిన పోరాటం భారత కార్మికోద్యమంలో ఒక నూతన చరిత్రను సృష్టించింది. స్వాతంత్ర్యానంతర భారతంలో ఆనాటి వరకు సాగిన కార్మికవర్గ కార్యాచరణలో ఇది నిజంగా అతి పెద్ద పోరాటం.

## వేతన స్థంభనకు ప్రభుత్వ యత్నం - కార్మికవర్గ బృహత్తర ప్రతిఘటన

ప్రభుత్వం తన అణచివేత యంత్రాంగాన్నంతనూ వినియోగించి తీవ్ర దాడులు సాగించినందువల్ల రైల్వే కార్మికుల సమ్మె సఫలం కాకపోయినా, ఆ పోరాట ఉధృతి, వివిధ తరగతుల కార్మికులు వారికి సంఘీభావంగా దేశవ్యాప్తంగా సమ్మెలు నిర్వహించటంలో గల ప్రమాదాన్ని ప్రభుత్వం పసిగట్టింది. రైల్వే ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వోద్యోగులు చేసిన ఈ సమ్మె, ఆ కాలంలో కార్మిక వర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యలను లేవనెత్తింది. అవసర ప్రాతిపదికపై కనీస వేతనం, ధరల సూచి పెరుగుదలననుసరించి పూర్తిగా కరువు భత్యం చెల్లించటం వంటివి ప్రధానమైనవి.

తమపై పెద్ద ఎత్తున సాగించిన కక్షసాధింపు చర్యలకు నిరసనగా కేంద్ర ప్రభుత్వోద్యోగులు రైల్వే ఉద్యోగులు, ఇతర తరగతుల కార్మికులు, ఉద్యోగుల అండతో నిరసనోద్యమాలు నడిపే తరుణంలో, కార్మికుల డిమాండ్లలోని మౌలిక అంశాలను దెబ్బతీయడం ద్వారా దేశంలోని మొత్తం కార్మికోద్యమంపైనే ప్రభుత్వం ఎదురు దాడికి సన్నద్ధమైంది.

ప్రభుత్వం అప్పటికే 1973 ఫిబ్రవరి నెలలో అప్పటి ప్రణాళికా సంఘ సభ్యుడైన డాక్టర్ సుఖమయ్ చక్రవర్తి ఆధ్వర్యంలో వేతన విధానం నిర్ణయించటానికొక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 1974 మార్చి నాటికే తయారుచేసిన మధ్యంతర నివేదికను ప్రభుత్వం చాలా గోప్యంగా వుంచింది. అయితే 1974 జూలైలో ఒక లోక్‌సభ సభ్యుడు పార్లమెంటులో ఆ నివేదికను ప్రవేశపెట్టడంతో ఆ విషయం ప్రజల దృష్టికి వచ్చింది. దీనితో దేశంలోని కార్మికోద్యమానికి, కార్మికుల వేతనాలను స్తంభింపచేయటానికి ప్రభుత్వం వేసిన ప్రణాళిక

పూర్తిగా తెలిసివచ్చింది. ప్రభుత్వం ఇక ఏమాత్రం ఆలస్యం చేయలేదు. రాబోయే 6, 7 సంవత్సరాల వరకు వేతన పెంపుదలను, కరువు భత్యంలో సగ భాగాన్ని నిలిపివేసే విధంగా నిర్బంధ డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెడ్తూ, 1974 జూలై నెల ప్రారంభంలోనే ప్రభుత్వం, రాష్ట్రపతి చేత ఆర్డినెన్స్ జారీ చేయించింది. డాక్టరు ఎస్. చక్రవర్తి నివేదిక వేతన స్తంభన దాడికి ప్రభుత్వం చేతిలో సిద్ధాంతపరమైన ఆయుధంగా ఉపయోగపడింది. ఆ నివేదికలో ఉదహరించిన వేతన విధాన లక్ష్యాలలో కొత్త అంశాలేమీ లేవు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న "జీవించడానికవసరమైన వేతనం" గురించి ఆ నివేదికలో ప్రస్తావన లేదు. 15వ లేబర్ కాన్ఫరెన్స్ నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం "అవసరాల ప్రాతిపదికపై కనీస వేతనం" అన్న సూత్రానికి కూడా ఆ నివేదిక తిలోదకాలిచ్చి, సంఘటిత రంగంలోని కార్మికులు దారిద్ర్యరేఖను దాటటానికి కావలసిన వేతనమే కనీస వేతనంగా నిర్ణయించాలని సూచించింది. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికుల ఆదాయాల మధ్య అసమంజసమైన తారతమ్యాలను క్రమంగా తొలగించాలనే సాకుతో సంఘటిత రంగంలోని కార్మికుల వేతనాలు పెరగకుండా నిలుపుదల చేయాలని ఆ నివేదిక సంకల్పించింది. దీనితో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు పరస్పరం కలహించుకునే పరిస్థితులు కల్పించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో "అధిక వేతన ఆదాయాలు" జాతీయ వేతన విధానానికి కనుగుణంగా లేవని నివేదిక సంఘటిత కార్మిక వర్గం మీద దాడికి పూనుకుంది. ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో జీతాలు పెంచటానికి నివేదిక వ్యతిరేకత తెలిపింది. అంతేకాక వేతనాలను ఉత్పాదకతతో ముడిపెట్టాలని నివేదిక సూచించింది. అంటే ఎక్కువ జీతం కావాలంటే కార్మికులు యజమానులకు ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టాలి.

సంఘటిత రంగంలో ఎక్కువమంది కార్మికులు దారిద్ర్యరేఖను అధిగమించి ఎక్కువ జీతాలు పొందుతున్నారని నివేదిక పసలేని వాదనలు చేసింది. ప్రణాళికా సంఘం దారిద్ర్యరేఖను ఏకపక్షంగా నిర్ణయిస్తూ, తలసరి నెల ఖర్చు 1960 ధరల సూచి ప్రాతిపదికగా రు. 20/–లుగా నిర్ధారించింది. 1972 అక్టోబరు ధరల ప్రాతిపదికపై దారిద్ర్య రేఖకు తలసరి నెల ఖర్చు రూ. 40/–లు గానూ, 1974 జూలైలో దారిద్ర్యరేఖకు తలసరి నెల ఖర్చు రు.74గా వుంటుంది. ముగ్గురు సభ్యులున్న కుటుంబానికి నెలకు రూ. 240లు ఆదాయం వుంటే దారిద్ర్యరేఖకు దగ్గరలో వున్నట్లు అంచనా వేశారు. వాస్తవానికి ఈ నివేదిక తయారు చేసే తరుణంలో చాలామంది అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఈ కనీస మొత్తం కన్నా తక్కువ వేతనం పొందుతున్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ఈ కనీస మొత్తం ఇచ్చినట్లయితే వారికి కావలసినంత ఊరట లభించేది. కానీ దీనికి విరుద్ధంగా, ఈ మధ్యంతర నివేదిక సంఘటితరంగ కార్మికుల వేతనాలపై 'దృష్టి' సారించి అసంఘటిత కార్మికుల గురించి పట్టించుకోలేదు. నిజానికి అసంఘటిత కార్మికుల దురవస్థను

గురించి మొసలి కన్నీరు కార్చిన నివేదిక, వారి వేతనాలు పెంచి సహాయం అందించటానికి ఏ విధమైన సిఫారసు చేయలేదు.

వేరొక ప్రక్క సంఘటిత కార్మికులు అసమంజసమైన విధంగా వేతన పెంపుదల కోరుకొంటున్నారని నివేదికలో పేర్కొనడం ద్వారా, యాజమాన్యాలు వేతన పెంపుదలను ప్రతిఘటించే విధంగా వారిని రెచ్చగొట్టడం జరిగింది. "మొత్తం ఖర్చులో వేతనాలపై పెట్టే ఖర్చు స్వల్ప భాగమైనపుడు, లేదా వేతన పెంపుదలకయ్యే అదనపు ఖర్చును వినిమయదారుల మీదకునెట్టి వేయగలిగిన పరిశ్రమల్లో యజమానులు, జీతాలు పెంచాలన్న వాదనలను ప్రతిఘటించడానికి పెద్దగా ఆసక్తి చూపరు. అటువంటి పరిస్థితుల్లో యజమానులకు, కార్మికులకు మధ్య స్వేచ్ఛగా సాగే బేరసారాల మూలంగా జాతీయ వేతన విధానానికి విరుద్ధంగా కొన్ని రంగాలలో అధిక వేతనాల స్థాయి ఏర్పడింది" అని నివేదికలో పేర్కొన్నారు.

కనిష్ట స్థాయిలో వేతనాలు పొందేవారికి మాత్రమే ధరల పెరుగుదలను పూర్తిగా భర్తీ చేయాలని నివేదిక సిఫారసు చేసింది. దానివలన అత్యధిక సంఖ్యలో కార్మికులు పెరిగే ధరల దాడి నుంచి ఏ విధమైన రక్షణ పొందని స్థితి ఏర్పడుతుంది. ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు లేకుండా జాతీయ వేతన సంఘం ఏర్పాటు చేయాలని నివేదిక అభిప్రాయపడింది. వేతనాలు, ఆదాయాల విధానంపై కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదిక వేతనాల నిర్ణయంలో నిరంకుశ విధానం ప్రవేశపెట్టడానికి, వేతనాల విషయంలో సమిష్టి సంప్రదింపుల హక్కును కాలరాయడానికి దుష్టయత్నం చేసింది.

ఆ విధంగా సిద్ధాంతపరమైన ఆయుధం చేపట్టిన ప్రభుత్వం ఇదివరలో ఉదహరించిన విధంగా రాష్ట్రపతి ఆర్డినెన్సు రూపంలో కార్మికవర్గంపై దాడికి పూనుకుంది. రు. 500 కోట్ల ధనాన్ని చలామణీలో లేకుండా చేయడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని, ధరల పెరుగుదలను అరికడతామని చెప్పడం ద్వారా ప్రభుత్వం ఆర్డినెన్సును సమర్థించటానికి ప్రయత్నించింది.

ఆర్డినెన్సు వెలువడిన తరువాత సుఖమయ్ చక్రవర్తి నివేదికలోని విషయాలు వెలుగులోకి వచ్చాయి. వెంటనే 1974 జూలై 21న అనేక కేంద్ర ట్రేడ్ యూనియన్లు, జాతీయ ఫెడరేషన్లు ఢిల్లీలో సమావేశమై ఆగస్టు 28న ఢిల్లీలో వేతన స్థంభనకు వ్యతిరేకంగా జాతీయ సదస్సు జరపాలని, అంతకు ముందుగానే ఆగస్టు 13న నిరసన దినం పాటించాలని నిర్ణయించాయి.

ఢిల్లీలో జరిగిన వేతన స్థంభన వ్యతిరేక సదస్సులో సి.ఐ.టి.యు., యు.టి.యు., టి.యు.సి.సి., హెచ్.ఎం.పి., హెచ్.ఎం.ఎస్.లోని ఒక సెక్షన్ పాల్గొన్నాయి. హెచ్.ఎం.ఎస్. నాయకుల్లో అత్యధికులు వున్న ఒక వర్గం నాయకత్వం సదస్సులో పాల్గొనటానికి నిరాకరించగా, కొందరు సదస్సులో పాల్గొనటం మంచిదని అభిప్రాయపడ్డారు. సాంకేతికపరమైన అభ్యంతరాల సాకుతో ఎ.ఐ.టి.యు.సి. సదస్సులో పాల్గొనలేదు. కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్

ఫెడరేషన్, ఆలిండియా ఇన్సూరెన్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఆలిండియా రిజర్వు బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆలిండియా ప్లాంటేషన్ వర్కర్స్ ఫెడరేషన్ తదితర ఏ కేంద్ర ట్రేడ్ యూనియన్‌కు అనుబంధం కాని పెద్ద జాతీయ ఫెడరేషన్లు సదస్సులో పాల్గొన్నాయి. సదస్సుకు సన్నాహక కమిటీ కన్వీనరుగా జార్జిఫెర్నాండెజ్ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఆయన హెచ్.ఎం.పి.కి ప్రాతినిధ్యం వహించాడు.

వేతనాల పెంపుదల వలన ధరలు పెరుగుతాయనే ప్రభుత్వవాదనను సదస్సు ఏకగ్రీవ తీర్మానం ద్వారా తిరస్కరించింది. ధరల పెరుగుదలకు బాధ్యత ప్రభుత్వానిదేనని తెలుపుతూ తీర్మానం ఈ విధంగా పేర్కొంది. "ఇటీవల చేసుకున్న దిగుమతులు, లోటు బడ్జెటు విధానం, ధరల పెరుగుదల కనుగుణంగా కార్మికులకు, జీతాలు పొందే ఇతర ఉద్యోగులకు పూర్తి పరిహారం చెల్లించకపోవటం వంటి పద్ధతుల ద్వారా ప్రభుత్వం, ఆర్థిక సంక్షోభ భారాలను కార్మిక వర్గం, సామాన్య ప్రజల మీద నెట్టే ప్రయత్నాలు చేస్తోంది. వేతనాలను, కరువు భత్యాన్ని స్థంభింపచేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సు, ఆర్థిక సంక్షోభ భారాన్ని కార్మికవర్గంపై నెట్టే ప్రయత్నాలలో మరో దుష్ట చర్య." సదస్సు మరో తీర్మానం ద్వారా కేంద్ర, రైల్వే ఉద్యోగులపై ప్రభుత్వ దమనకాండను నిరసించింది. దేశవ్యాప్తంగా ఒక శక్తివంతమైన ఉద్యమం నిర్మించవల్సిందిగా మొత్తం కార్మిక వర్గానికి సదస్సు పిలుపునిచ్చింది. స్థానికంగా, ప్రాంతీయంగా, రాష్ట్రస్థాయిలో సదస్సులను నిర్వహించి మున్ముందు జరపబోయే పోరాటానికి సన్నద్ధులు కావాలని కోరింది.వేతన స్థంభనకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించేందుకు జాతీయ ప్రచారోద్యమ కమిటీని సదస్సు ఏర్పాటు చేసింది.

వాస్తవానికి ఈ సదస్సుకు ముందు, తరువాత కూడ దేశంలోని అనేక ప్రాంతాలలో ఈ ఆర్డినెన్స్ వల్ల తీవ్రంగా నష్టపోయిన కార్మికులు, ఉద్యోగులు ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తంచేశారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలతో సహా అనేక ప్రాంతాలలో వందలమంది ఉద్యోగులు, కార్మికులు ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపి దానిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

1974 ఆగస్టు 28న జరిగిన సదస్సులో ఎ.ఐ.టి.యు.సి. పాల్గొనకపోయినప్పటికీ, స్థానిక స్థాయిల్లో ఎ.ఐ.టి.యు.సి. చివరకు హెచ్.ఎం.ఎస్. యూనియన్లు కూడా, సి.ఐ.టి.యు. తదితర యూనియన్లతో కలిసి ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగిన ఐక్య సదస్సులు, ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. ముఖ్యంగా తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో ఈ ఐక్య ఉద్యమాలు నిర్వహించబడ్డాయి.

1975 ఏప్రిల్ 9న వేతన స్థంభన వ్యతిరేక జాతీయ ప్రచారోద్యమ కమిటీ మొదటి సమావేశం న్యూఢిల్లీలో జరిగింది. హెచ్.ఎం.పి., సి.ఐ.టి.యు., యు.టి.యు.సి. (లెనిన్ సారణి), బి.ఎం.ఎస్., ప్రోగ్రెసివ్ లేబర్ ఫెడరేషన్ (డి.ఎం.కె. విభాగం), కాన్ఫెడరేషన్ ఆఫ్

సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్. ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఎన్.ఎఫ్.పి.టి.ఇ, ఎఫ్.ఎన్.పి.టి.ఓ.లతో సహా 28 యూనియన్ల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. అంటే దేశంలోని ఉద్యోగులు, కార్మికుల్లో అత్యధిక సంఖ్యాకుల ప్రతినిధులీ సదస్సులో పాల్గొన్నారు.

సైద్ధాంతికంగా సన్నిహితులుగా భావించిన ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్.లు. 1972లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్‌ట్రేడ్ యూనియన్స్ అనే కూటమిని ఏర్పాటు చేసుకున్నాయి. 1964లో సి.పి.ఐ.(ఎం) ఏర్పడిన తరువాత సి.పి.ఐ. సిద్ధాంతపరంగా ఇందిరాగాంధీ నాయకత్వంలోని పాలక కాంగ్రెస్ పార్టీకి దగ్గరైంది. ఐ.ఎన్.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్.ల విధానాలకు సంబంధించినంతవరకు అవి సిద్ధాంతపరంగా సంస్కరణవాద సంఘాలు కావడంతో వాటి మధ్య పెద్ద తేడా లేదు. అందువలన ఆ యూనియన్లలో ఉమ్మడి అంశంగా వున్న సంస్కరణవాదం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఏర్పడటానికి దోహదం చేసింది. కార్మికవర్గం తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్న సమయంలో ఈ ట్రేడ్ యూనియన్ల కూటమి సైద్ధాంతికంగా పక్షవాతానికి గురై వేతన స్థంభన ఆర్డినెన్స్ జారీ చేసినప్పుడు కూడ నిరసన వుద్యమం నడపటంలో విఫలమైంది. ఈ స్తబ్ధత వలన ఆ యూనియన్లు చైతన్యాన్ని కోల్పోయి నిర్జీవ స్థితికి చేరుకున్నాయి.

దీనికి పూర్తి భిన్నంగా సి.ఐ.టి.యు., హెచ్.ఎం.పి. యు.టి.యు.సి., టి.యు.సి.సి., యు.టి.యు.సి (లెనిన్ సారణి) సమరశీల కార్మికోద్యమం పట్ల సిద్ధాంతపరమైన అవగాహనతో హెచ్.ఎం.పి. నాయకుడు జార్జి ఫెర్నాండెజ్ కన్వీనర్‌గా యునైటెడ్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్(యు.సి.టి.యు.)ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత దీనిని మరింత విస్తృతపరుస్తూ విశాల ప్రాతిపదికన పై కేంద్ర కార్మిక సంఘాలు, అనేక స్వతంత్ర జాతీయ ఫెడరేషన్లతో 1974 ఆగస్టు 28న ఏర్పడిన వేతన స్తంభన వ్యతిరేక జాతీయ ప్రచారోద్యమ కమిటీ సమరశీల పోరాటాలకు ఐక్య వేదికగా నిల్చింది. సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ల కూటమికి ప్రత్యామ్నాయంగా సమరశీల పోరాటాలకు దేశంలోని కార్మిక వర్గం విస్తృతస్థాయిలో సమైక్యం కావాలన్న ఆకాంక్షను ప్రతిబింబిస్తూ యునైటెడ్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, వేతన స్తంభన వ్యతిరేక జాతీయ ప్రచారోద్యమ కమిటీగా ఏర్పడటం చారిత్రకంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

జాతీయ స్థాయిలో ఎ.ఐ.టి.యు.సి. జాతీయ ప్రచారోద్యమ కమిటీలో చేరకపోయిప్పటికీ వేతన స్తంభనకు వ్యతిరేకంగా కేరళ, మహారాష్ట్రలలో జరిగిన రాష్ట్ర వ్యాప్త సమ్మెల్లో పాల్గొన్నటం గమనార్హం.

1975 ఏప్రిల్ 9న సమావేశమైన జాతీయ ప్రచారోద్యమ కమిటీ వేతన స్తంభనకు వ్యతిరేకంగా చేసే పోరాటాన్ని తీవ్రతరం చేసి 1975 మే 15న 'వేతన స్తంభన, కక్ష సాధింపు

చర్యలు, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా "జాతీయ నిరసన దినం" పాటించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. 1975 జూన్ 29న న్యూఢిల్లీలో మరొక జాతీయ సదస్సు నిర్వహించి ఒకరోజు దేశ వ్యాప్త సమ్మెతో సహా తదుపరి పోరాట కార్యక్రమాన్ని గురించి నిర్ణయం తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో కమిటీ జాయింట్ కన్వీనర్లుగా జార్జి ఫెర్నాండెజ్, ఎం.కె.పాంథేలు ఎన్నికయ్యారు.

1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం సందర్భంగా దేశంలో విధించిన ఎమర్జెన్సీని, బయట నుంచి ఏ విధమైన దురాక్రమణ లేకపోయినప్పటికీ, అందుకు ఏ విధమైన అవకాశం లేనప్పటికీ, తొలగించలేదన్న విషయం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. 1962లో చైనాతో జరిగిన సరిహద్దు సంఘర్షణల సందర్భంగా విధించిన ఎమర్జెన్సీ 1967 వరకు కొనసాగింది. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలను ప్రతిఘటించే కార్మికవర్గ పోరాటాలను అణచివేయటానికి ఎమర్జెన్సీ కొనసాగింపు ప్రభుత్వానికి ఉపయోగపడిందని కార్మిక వర్గం గమనించాలి. డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్. అంతరంగిక భద్రతా నిర్వహణా చట్టం మొదలైన నిరంకుశ చట్టాలు సరిహద్దు వెలుపలి నుంచి వచ్చే ప్రమాదాల నుంచి దేశాన్ని కాపాడుకొనటానికి, దేశాన్ని వుద్దేశించినవి. కాగా, స్వేచ్ఛగా కార్మికోద్యమాన్ని అణచటానికి ప్రయోగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోనూ, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లోనూ పెద్ద ఎత్తున కక్ష సాధింపు చర్యలు కొనసాగించారు. అందువలన కార్మికోద్యమం ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా నిరసన తెలిపి దానిని వెంటనే రద్దు చేయాలని కోరింది.

జాతీయ ప్రచారోద్యమ కమిటీ నిర్ణయాలననుసరించి వేతన స్తంభన, ఆర్డినెన్స్ రద్దు చేయాలనీ, ఎమర్జెన్సీ రద్దు చేయాలని, కక్ష సాధింపు చర్యలు ఉపసంహరించాలనీ డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, సదస్సులు, ఊరేగింపులు వెల్లువెత్తాయి. అన్ని రాష్ట్రాల్లో ఏదో ఒక రూపంలో ఆందోళన జరిగింది. వేతన స్తంభనకు వ్యతిరేకంగా లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ ఉద్యోగులు 1975 ఏప్రిల్ 17న ఒక గంట వాకౌట్ సమ్మె జరిపారు.

ఈ సమయంలో ప్రతిపక్షాలు, ముఖ్యంగా వామపక్షాలు, ఎమర్జెన్సీ రద్దు చేయాలని ఉద్యమం మొదలుపెట్టాయి. ఏప్రిల్ 6న దేశంలోని వివిధ ప్రాంతాలలో ఎమర్జెన్సీ ఎత్తివేయాలని డి.ఐ.ఆర్., మీసా చట్టాలను రద్దు చేయాలని, డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 6న దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ వ్యతిరేక దినం పాటించారు. సి.పి.ఐ(ఎం), ఇతర వామపక్షాల నాయకులతో బాటు, జయప్రకాష్ నారాయణ్, జె.బి. కృపలానీ, హితేంద్రదేశాయ్, డి. గజేంద్రగడ్కర్ వంటి ప్రముఖ వ్యక్తులు, నాయకులు ఈ నిరసనోద్యమంలో భాగస్వాములయ్యారు. కలకత్తాలో జయప్రకాష్ నారాయణ్‌పై జరిగిన దౌర్జన్యాన్ని ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున ఖండించారు. 1975, ఏప్రిల్ 6న "ఎమర్జెన్సీ వ్యతిరేక దినం" సందర్భంగా జరిగిన ఈ దాడికి నిరసనగా 12 గంటల బంద్ పాటించడం జరిగింది. కలకత్తాలోని షహీద్‌మినార్

మైదానంలో జరిగిన బ్రహ్మాండమైన సభ ఈ దాడిని ఖండించింది. ఈ విధంగా ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం ఢిల్లీతో సహా దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించింది.

## రాజకీయ నేపథ్యం - సింహావలోకనం

దేశంలో అంతర్గత అత్యవసర పరిస్థితి ప్రకటన, దానికి వ్యతిరేకంగా సాగిన పోరాటం దేశ రాజకీయ జీవనం మీద ప్రభావం చూపాయి. ఈ పరిస్థితిలో ట్రేడ్ యూనియన్ ఉద్యమంపై జరిగినంత తీవ్రమైన దాడి దేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలో ఇంతకుముందెన్నడూ జరిగియుండలేదు. అందువలన కార్మికోద్యమం ఏ పంథాలో అభివృద్ధి చెందిందో పరిశీలించే ముందు దేశంలో జరిగిన రాజకీయ సంఘటనలకు సంబంధించిన అంతర్గత పరిణామాలను, గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ శక్తుల బలాబలాల్లో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవాలి. పాలకపక్షం అంతర్గత అత్యవసర పరిస్థితిని ప్రకటించి ప్రజలపై విరుచుకుపడిన పరిస్థితికి అన్ని ప్రాథమిక హక్కులను కాలరాయడానికి చేసిన ప్రయత్నాల కారణంగా వర్గ శక్తుల బలాబలాల్లో నూతనంగా వచ్చిన మార్పులకు గల ప్రాధాన్యత నర్థం చేసుకోవడానికిది అవసరం.

ఈ పరిస్థితిని క్లుప్తంగా సమీక్ష చేయాలి. బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకపక్షం 1969లో రెండు పరస్పర విరుద్ధమైన శిబిరాలుగా చీలిపోయింది. రాష్ట్రపతి ఎన్నికల్లో పాత కాంగ్రెస్, మహా కూటముల అభ్యర్థిగా వున్న శ్రీ సంజీవరెడ్డికి పోటీగా శ్రీమతి ఇందిరాగాంధీ, శ్రీ వి.వి. గిరి అభ్యర్థిత్వాన్ని బలపర్చింది. దీనివల్ల వామపక్ష శక్తుల ఐక్యతకు భంగం వాటిల్లింది.

ఈ పరిస్థితిలో కాంగ్రెస్ (ఐ) పాలనకు జాతీయ ప్రత్యామ్నాయం విషయంలో మూడు ప్రధాన వామపక్షాలు విభిన్న వైఖరులు అవలంబించాయి. వామపక్షాలకు దేశంలో కార్మికోద్యమంలో బాగా పలుకుబడి వున్నది. ఆ కాలంలో రూపొందుతున్న సమరశీల దేశ కార్మికోద్యమంలో ఈ మూడు వామపక్షాలు గణనీయమైన పలుకుబడి కల్గియుండటంతో పాటు, పెంపొందుతున్న ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి వీరి పలుకుబడి కీలకమైనది కావడంతో, ఈ నూతన రాజకీయ పరిణామాలు అభివృద్ధి చెందుతున్న ఐక్య కార్యాచరణకు తీవ్ర విఘాతం కల్గించాయి.

సోషలిస్టు పార్టీ, జాతీయ ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఒక సాధారణ ఐక్య సంఘటన ఏర్పాటుకు చాలాకాలంగా కృషి చేస్తోంది. ఈ అవగాహన ఫలితంగా ఆ పార్టీ 1967–69 మధ్య కాలంలో జనసంఘ్, స్వతంత్ర పార్టీ, భారతీయ లోక్‌దళ్ వంటి పరస్పర విరుద్ధమైన రాజకీయ అవగాహన గల్గిన పార్టీలతో అన్ని రకాల ఐక్య సంఘటనల్లోనూ, రాష్ట్ర స్థాయిలో ఐక్య సంఘటన ప్రభుత్వాల్లోనూ పాల్గొనేందుకు దారితీసింది. ఈ అవగాహన కారణంగానే 1971–72లో మితవాద ప్రతిపక్షాలతో కూడిన "మహా కూటమి"తో చేతులు కలిపింది. 1977 ప్రారంభంలో ఇతర పార్టీలతో కలిసి జనతా పార్టీగా ఏర్పడింది.

ప్రధానంగా మహా కూటమిలోని రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా ఒక సంఘటన ఏర్పాటు చేయాలని సి.పి.ఐ. వాదించింది. మితవాద అభివృద్ధి నిరోధక శక్తుల వ్యతిరేక ఫ్రంట్‌గా దానికి నామకరణం చేసింది. ఈ రాజకీయ పంథా వలన సి.పి.ఐ. ఎమర్జెన్సీ తరువాత అధికారంలోకి వచ్చిన జనతాపార్టీని కూడా వ్యతిరేకించింది. ఇదే రాజకీయ పంథా వల్ల సి.పి.ఐ., మిగిలిన మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలకు వ్యతిరేకంగా కాంగ్రెస్(ఐ)తో జట్టుకట్టి, జయప్రకాశ్ ఉద్యమాన్ని ఫాసిస్టు స్వభావం కలదని చెప్పింది.

అయితే సోషలిస్టు పార్టీ, సి.పి.ఐ.ల వైఖరులకు భిన్నంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), బూర్జువా, భూస్వామ్య వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్, జనతా పార్టీలకు సిసలైన జాతీయ ప్రత్యామ్నాయం వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన మాత్రమేనన్న అవగాహనను ముందుకు తెచ్చింది. కాంగ్రెస్ ఏకపక్ష నియంతృత్వానికి వ్యతిరేకంగా నిబద్ధతతో పోరాటం సాగిన పోరాటం సాగించిన సిపిఐ(ఎం), శ్రీమతి ఇందిరాగాంధీ, ఆమె కాంగ్రెస్ పార్టీ సాగించిన ఎమర్జెన్సీ పాలనకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటం సల్పి అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ ప్రభుత్వానికి మద్దతునిచ్చింది.

సి.పి.ఐ.కి కూడా వామపక్ష ప్రజాతంత్ర ఐక్యతలో నమ్మకం వుంది. అయితే ఆ ఐక్య సంఘటనలో వామపక్షాలతో బాటు కాంగ్రెస్ (ఐ) కూడా వుండాలని వారు భావించారు. మిగతా బూర్జువా భూస్వామ్య పార్టీలకు భిన్నంగా కాంగ్రెస్ (ఐ) ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులతో కూడుకున్న పార్టీగా వారు పరిగణించారు. ఈ రాజకీయ పంథాననుసరించి సి.పి.ఐ. పశ్చిమబెంగాలు, కేరళ రాష్ట్రాలలో 1971, 72 సంవత్సరాల్లో కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వాలలో చేరింది. మరోసారి పంథా మార్చుకుని వివిధ రాష్ట్రాలలో జనసంఘ్, భారతీయ లోక్‌దళ్ వంటి కాంగ్రెసేతర పార్టీలతో ప్రభుత్వాలలో చేరింది.

ఇటువంటి గజిబిజిగా వున్న రాజకీయ పరిణామాలు, చిక్కు పరిస్థితులలో ఐక్య కార్మికోద్యమాలు నిర్మించే ప్రయత్నాలు సాగించవల్సి వచ్చింది. కొంతమేరకైనా వామపక్ష ఐక్యత లేకుండా కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు సాగించడం కష్టసాధ్యమైన పని. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సాగిన పోరాటం ఫలితంగా మొదటిసారి 1973 ఆగస్టులోను, రెండవసారి1974 మే లో రైల్వే సమ్మె ముందు వామపక్షాల సమావేశాలు జరిగాయి. వాటిలో కొన్ని కార్యక్రమాలపై అంగీకారం కుదిరింది. వామపక్షాల ఐక్యతే 1973-74లో అనేక ఐక్య కార్మికోద్యమాలకు ప్రోత్సాహమిచ్చింది. చివరకు చారిత్రాత్మకమైన రైల్వే సమ్మెకు, ఆ పోరాటానికి మద్దతుగా దేశవ్యాప్తంగా చేసిన ఒకరోజు సమ్మెకు ఈ ఐక్యతే దోహదం చేసింది.

ఎన్నడూ ఎరగని దారుణ దమనకాండవల్ల రైల్వే సమ్మె ముగిసిన తరువాత కాలంలో దేశ రాజకీయ రంగంలో మరో ముఖ్యమైన పరిణామం చోటు చేసుకుంది. ప్రముఖ సోషలిస్టు నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ ప్రధానంగా రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా బీహార్‌లో ప్రారంభించిన ఉద్యమం వూపందుకోసాగింది. క్రమంగా ఆ ఉద్యమం కాంగ్రెస్ పాలనకు

వ్యతిరేకంగా సాగే ప్రతిఘటన పోరాటానికి కేంద్రబిందువైంది. సోషలిస్టు పార్టీ వామపక్ష సంఘటనను వదలిపెట్టి, జయప్రకాశ్ నారాయణ్ వుద్యమమే ముఖ్యమని ఆ ఉద్యమంలోకి దూకింది. వామపక్ష సంఘటన వల్ల ప్రయోజనం లేదని, జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం తప్ప వేరే మార్గం లేదని వారు వాదించారు.

జె.పి. ఉద్యమం బలం పుంజుకోవడంతో సి.పి.ఐ. కూడా వామపక్ష సంఘటన నుంచి దూరంగా తొలగి జయప్రకాశ్ నారాయణ వుద్యమం ఫాసిస్టు భావం కలదని దానిని సి.ఐ.ఎ. ప్రేరేపించినదని ఆరోపించి, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడటానికి మరోసారి కాంగ్రెస్ వైపు మొగ్గింది. ఈ సమయంలోనే సి.పి.ఐ. పాట్నాలో ఫాసిస్టు వ్యతిరేక సదస్సు జరిపింది. దానికి విదేశీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు) మొదటిగా జె.పి. ఉద్యమం గురించి ఊగిసలాటకు గురైంది. ఈ ఉద్యమం గురించి, ఆ పార్టీ ఎత్తుగడల పంథాలో లోపం వల్ల జె.పి. ఉద్యమం వెనక గల ప్రజానీకంతో ఎక్కువ సంబంధాలు పెంచుకోలేకపోయింది. పార్టీ వామపక్ష ప్రజాతంత్ర ఐక్యతా దృక్పథానికే కట్టుబడి వుంది. అయితే ఆ సమయంలో ఆ ఐక్యతకే అవాంతర మేర్పడింది. రాజకీయపరమైన ఈ చిక్కు పరిస్థితుల వల్ల కార్మికవర్గ పోరాటాలు బాగా దెబ్బతిన్నాయి.

అయితే ప్రధానంగా ఎమర్జెన్సీ విధించి ప్రజాతంత్ర హక్కులు, ప్రాథమిక హక్కులు, పౌరస్వేచ్ఛలను హరించివేసి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కూలదోస్తున్న శ్రీమతి ఇందిరాగాంధీ పాలనకు, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏ విధమైన పోరాటం సాగించాలనే ప్రశ్న ఉత్పన్నమైంది.

ఇదివరకే చెప్పుకున్నట్లు ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలను కూడా కలుపుకుని ఒక వేదికను నిర్మించాలని సోషలిస్టు పార్టీ, ఇందిరా కాంగ్రెస్‌తో కలిసి ఫాసిస్టు వ్యతిరేక సంఘటన నేర్పరచాలని సి.పి.ఐ. వాదించాయి.

ఆ విధంగా ఇందిరాగాంధీ పాలన ఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నదా లేక ఇందిరాగాంధీ, ఆమె కాంగ్రెస్ పార్టీ ఫాసిస్టు వ్యతిరేక పోరాటం జరుపుతున్నదా అనే విషయంలో వామపక్షాల్లో గందరగోళం నెలకొన్నది.

అయితే ఇందిరాగాంధీ పాలనలో పశ్చిమబెంగాల్‌లో అర్ధ ఫాసిస్టు చర్యల ద్వారా భయోత్పాతం సృష్టించినా, అత్యవసర పరిస్థితి విధించి ప్రజాస్వామ్య, పౌరహక్కులను, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను కూలదోసినా ఆమె పాలన ఇటలీ, జర్మనీ దేశాలలో అవలంభించిన ఫాసిజాన్ని పోలిలేదని తర్వాత పరిణామాలు ధృవపరిచాయి. మరోవైపు జె.పి. ఉద్యమం గాని, మితవాద అభివృద్ధి నిరోధక శక్తులతో కూడిన మహాకూటమి గాని ప్రగతి నిరోధక డిమాండ్లతో, అభివృద్ధి నిరోధక పంథాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన పోరాటం గానీ, దేశంలో ఫాసిజం పెరుగుదలకు దోహదం చేయలేదని స్పష్టమైంది.

అదే సమయంలో, అత్యవసర పరిస్థితి కాలంలో దేశ రాజకీయ రంగంలో గుణాత్మకమైన నూతన లక్షణమొకటి ప్రవేశించిన విషయం గమనించాలి. 1972లో పశ్చిమ బెంగాల్‌లో ఒక్క సి.పి.ఐ.(ఎం) మీద మాత్రమే దాడి జరగ్గా, ఎమర్జెన్సీ కాలంలో సి.పి.ఐ(ఎం)తో పాటు, భారత సమాజంలోని అనేక తరగతుల ప్రజల మీద ప్రధానంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వున్న అన్ని రాజకీయ పార్టీలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు, వాటి స్వభావం ఏమైనప్పటికీ దాడికి గురయ్యాయి. ఈ దాడులకు తోడు దేశంలో ఆర్థిక పరిస్థితి నానాటికి క్షీణిస్తోంది. కార్మిక వర్గం మరియు ఇతర శ్రామిక ప్రజల న్యాయసమ్మతమైన ఆర్థిక డిమాండ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి, భారత ప్రజల ప్రజాతంత్ర హక్కుల పునరుద్ధరణకు, అత్యంత విశాల ప్రాతిపదికన ప్రజాతంత్ర ఉద్యమం నిర్మించే అవకాశాలేర్పడ్డాయి. వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమం, కార్మికోద్యమం అభివృద్ధి ద్వారా మాత్రమే ఈ లక్ష్య సాధన సాధ్యమవుతుంది.

1974-76 మధ్యకాలంలో జె.పి. ఉద్యమం పుంజుకుని, విస్తృతంగా ప్రజానీకాన్ని సమీకరించగల్గింది. సిపిఐ(ఎం) ఈ ఉద్యమానికి షరతులతో కూడిన మద్దతు నిచ్చింది. జనతా పార్టీగా ఏర్పడిన వివిధ పార్టీల రాజకీయ విధానాల్లో వచ్చిన మార్పులను దృష్టిలో వుంచుకుని, 1977 మార్చి ఎన్నికల్లోనూ, ఆ తర్వాత జనతా పార్టీకి సహకారమిచ్చింది.

ఎమర్జెన్సీలో ప్రజాతంత్ర, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు ఈ క్రింది డిమాండ్లను ముందుకు తెచ్చాయి. 1) ఎమర్జెన్సీ ఎత్తివేయటం. 2) మీసా, డి.ఐ.ఆర్. వంటి క్రూర చట్టాల రద్దు 3) డి.ఐ.ఆర్. మీసా చట్టాల ప్రకారం నిర్బంధంలోకి తీసుకున్న రాజకీయ, ట్రేడ్ యూనియన్ కార్యకర్తల విడుదల 4) రాజకీయ, ట్రేడ్ యూనియన్ పత్రికలతో సహా పత్రికా స్వాతంత్ర్యం మీద విధించిన ఆంక్షల రద్దు 5) ట్రేడ్ యూనియన్లు, ఇతర సంఘాలు మామూలుగా పనిచేసుకునే వాతావరణం కల్పించటం 6) పార్లమెంటరీ ప్రజాతంత్ర వ్యవస్థను పునరుద్ధరించి, పార్లమెంటు సభ్యులపై ఆంక్షలు తొలగించటం.

ఎమర్జెన్సీ సంకెళ్ళ నుంచి విముక్తి పొంది, ప్రజాతంత్ర, ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు పురోగమించటానికి ఈ డిమాండ్ల సాధన అత్యావశ్యకమైంది.

అయితే జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలోని జాతీయ సమన్వయ కమిటీ, 1974-75 సంవత్సరాలలో ఇచ్చిన అస్పష్టమైన 'సంపూర్ణ విప్లవ' నినాదంలో, ఇందిరాగాంధీ పాలనకు వ్యతిరేకత మాత్రమే కాక వామపక్షాల ఐక్యతా వ్యతిరేక ధోరణి కూడా వున్నదన్న విషయం గమనించాలి. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్ (ఐ) అర్ధ ఫాసిస్టు బీభత్సం కొనసాగించిన కాలంలో జె.పి. వుద్యమం మార్క్సిస్టుల పట్ల, వారు చేసే పోరాటం పట్ల ఏ మాత్రం సానుభూతి చూపలేదు. అయితే ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి వామపక్షాలపైనే కాక, జె.పి. ఉద్యమ సమన్వయ కమిటీలోని పార్టీలపైన కూడా దమనకాండ ప్రారంభించడంతో వారికి కూడ పౌరహక్కులు, ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాటం చేయవలసిన పరిస్థితి ఏర్పడి, నిరంకుశత్వాన్ని ఎదిరించవలసిన గత్యంతరంలేని పరిస్థితులలో తమ వామపక్ష వ్యతిరేక వైఖరిని కొంత తగ్గించుకోవలసి వచ్చింది.

ఈ పరిస్థితుల్లో నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఒక విస్తృత కూటమి ఏర్పరచటానికి అవకాశం ఏర్పడింది.

1974 మే రైల్వే సమ్మె తదనంతర కాలంలో వామపక్ష ఐక్యత, ఐక్య కార్మికోద్యమం తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఎమర్జెన్సీ కాలంలోనూ, ఆ తర్వాత ప్రజాతంత్ర హక్కుల పునరుద్ధరణకు, కార్మిక వర్గ ప్రయోజనాల పరిరక్షణకు సాగించే పోరాటంలో ప్రజాతంత్ర ఉద్యమం మరియు ఐక్య కార్మికోద్యమ పురోగమనం అనేక సంక్లిష్టతలతో కూడుకొని వుంది. ఈ ప్రత్యేక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో దీనిని పరిశీలించాలి.

## అంతర్గత అత్యవసర పరిస్థితి విధింపు - పరిస్థితిలో కొత్తమలుపు - కార్మికోద్యమంపై భయంకర దాడులు

వామపక్షాలు, వివిధ ప్రజాతంత్ర పార్టీలు 1971 నుంచి కొనసాగుతున్న ఎమర్జెన్సీని రద్దు చేయాలని ఉద్యమం చేపట్టిన సమయంలోనే ప్రజలు, ముఖ్యంగా దేశంలోని కార్మికోద్యమం దారుణమైన అణచివేత ప్రమాదాన్నెదుర్కొనబోతోంది.

రాజకీయ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. ఒకవైపు కార్మికవర్గం వేతన స్తంభనకు, ప్రజాతంత్ర హక్కుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమం సాగిస్తోంది. మరోవైపు జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో అవినీతికి, దుష్పరిపాలనకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమం ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఇరుకునపెట్టాయి. ఆ సమయంలోనే గత లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీ తీవ్ర అవకతవకలకు పాల్పడటం వల్ల ఆమె ఎన్నిక చట్ట విరుద్ధమని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. ఇందిరాగాంధీ సుప్రీం కోర్టుకు అప్పీలు చేసి స్టే ఆర్డర్ తెచ్చుకొంది. అయితే సుప్రీంకోర్టు తన తాత్కాలిక ఉత్తర్వులో ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చనీ, అయితే ఆమె పార్లమెంటుకు హాజరు కాకూడదని ఆదేశించింది. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామాలు పూర్తిగా చికాకు చెంది, ఒంటరిదైపోయిన ఇందిరాగాంధీకి తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. ఆమె ప్రభుత్వం 1975 జూన్ 26న అంతర్గత అత్యవసర పరిస్థితిని ప్రకటించి ప్రముఖ ప్రతిపక్ష, ట్రేడ్ యూనియన్ నాయకులందరినీ నిర్బంధించి ప్రతీకారానికి పూనుకుంది. అంతర్గత అత్యవసర పరిస్థితి కారణంగా రాజ్యాంగంలో హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కుల అమలును నిలిపివేశారు. పూర్తి స్థాయి నియంతృత్వ పాలన ప్రారంభమైంది. ఆ విధంగా దేశ స్వాతంత్ర్యానంతర రాజకీయ చరిత్రలో అంధకారబంధురమైన అధ్యాయం ప్రారంభమైంది.

దేశంలో కార్మికవర్గానికి అదొక భయంకరమైన అనుభవం. అనేకమంది జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులను డి.ఐ.ఆర్. క్రింద నిర్బంధించారు. ఇందిరాగాంధీ ప్రభుత్వ అధికార విధానాలను అమలు చేసే ముఖ్య సలహాదారుగా వున్న ఆమె చిన్న కొడుకు, సంజయ్‌గాంధీ కమ్యూనిస్టులకు బద్ధ వ్యతిరేకి కావడంతో, ఎ.ఐ.టి.యు.సి. సి.పి.ఐ. నాయకులను కూడా

వదలలేదు. ఆయన ఒక రాజ్యాంగేతర అధికార కేంద్రంగా తయారయ్యాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘాల నాయకులను నిర్బంధించారు. మామూలుగా ఐ.ఎన్.టి.యు.సి నాయకులను ఏ మాత్రం ముట్టుకోలేదు. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా పెరుగుతున్న రాజకీయ ప్రతిఘటన, అలహాబాదు హైకోర్టు తీర్పు ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యం గొంతునులమటానికి తక్షణ కారణాలుగా కనిపించవచ్చుగాని ఆమె అనుసరించిన ఆర్థిక, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమం 1974 మేలో రైల్వే ఉద్యోగుల సమ్మెతో తారాస్థాయికి చేరుకోవటం ఆమె తొందరపాటుగా దుస్సాహసికంగా నిర్ణయం తీసుకోవటానికి కారణమైంది. పెద్ద ఎత్తున ట్రేడ్ యూనియన్ నాయకులను నిర్బంధించటం, ట్రేడ్ యూనియన్ల గొంతు నులిమివేయటం, వాటి పత్రికలపై ఆంక్షలు విధించటం, అంతవరకు కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలను రద్దు చేయడం ఈ అంశాన్ని ధృవపరుస్తున్నాయి.

పెరుగుతున్న కార్మికవర్గ ప్రతిఘటన గురించి ప్రభుత్వ రికార్డులలో కూడా స్పష్టమైన విశ్లేషణ లభిస్తుంది. ఈ విశ్లేషణ ప్రకారం భారతదేశంలో పారిశ్రామిక సంబంధాలు 1974లో చాలా హీనస్థాయికి చేరుకున్నాయి. 1974 లో 40.26 మిలియన్ (4.026 కోట్లు) పనిదినాలు నష్టమైనాయి. ఇవి 1973లో నష్టమైన 20.62 మిలియన్ (2.062 కోట్లు) పనిదినాలకు దాదాపు రెండు రెట్లు.

1974 ఏప్రిల్‌లో అత్యధిక సంఖ్యలో క్రొత్తగా 290 పారిశ్రామిక వివాదాలు నమోదయ్యాయి. 1974 మే నెలలో గరిష్టంగా కోటి 8 లక్షల పని దినాలు నష్టపోయినట్లు తెలుస్తోంది. 1973 సం॥లో గరిష్ట స్థాయిలో నూతనంగా 312 వివాదాలేర్పడినట్లు, 1973 నవంబరు, డిసెంబరు నెలల్లో 2.84 మిలియన్ (28.40 లక్షల) పని దినాలు నష్టమైనట్లు రికార్డుల్లో నమోదైంది.

1974 లో నమోదైన 2938 పారిశ్రామిక వివాదాలలో 428 లాకౌట్లని, దీనివల్ల 1,45,000 మంది కార్మికులు నష్టపోయారనీ, 66.2 లక్షల పనిదినాలు నష్టమైనట్లు నమోదైంది. మొత్తం సంవత్సరంలో నష్టపోయిన పనిదినాలలో ఇవి 16.4 శాతం. ఒక్కొక్క లాకౌటులో సగటున 15,465 పనిదినాలు నష్టం కాగా, సమ్మెల వలన సగటున సమ్మెకు 13,404 పనిదినాలు నష్టమైనాయి. దీనిని బట్టి యజమానులు కార్మికులపై చేసిన దాడి ఎంత తీవ్ర స్థాయిలో వుందో స్పష్టమవుతోంది.

కార్మికులపై యజమానులు దాడులు చేయడంలో సంఖ్యాపరంగా పశ్చిమబెంగాలు యజమానులు అగ్రస్థానంలో వున్నారు. ఆ రాష్ట్రంలో 182 లాకౌట్లు జరిగ్గా, వీటివలన 31 లక్షల పనిదినాలు నష్టమైనాయి. మొత్తం దేశంలో లాకౌట్ల ద్వారా నష్టమైన పనిదినాలలో ఇది 46.9 శాతం. తమిళనాడులో 61 లాకౌట్లలో 68.6 వేల పని దినాలు, మహారాష్ట్రలో 59 లాకౌట్లలో 10.06 లక్షల పనిదినాలు, బీహారులో 35 లాకౌట్లలో 72.2 వేల పనిదినాలు నష్టమైనాయి.

1974 లో 8 అఖిల భారత సమ్మెలు, లాకౌట్లు జరిగాయి. వీటివల్ల 8,41,626 కార్మికులు ప్రభావితం కాగా 96.9 లక్షల పనిదినాలు నష్టమైనాయి. దేశం మొత్తంగా జరిగిన సమ్మెలు, లాకౌట్లు 29.5 శాతం కార్మికుల మీద ప్రభావం చూపాయి. మొత్తం నష్టమైన పని దినాలలో ఇది 24.1 శాతం.

అధికార అంచనాల ప్రకారం 1974 మే లో జరిగిన ఒక్క రైల్వే సమ్మెలోనే 4,75,092 మంది కార్మికులు పాల్గొన్నారు. 90 లక్షలకు పైగా పని దినాలు నష్టమైనాయి. అఖిల భారత సమ్మెలు, లాకౌట్లలో ఇది 94.9 శాతం. దీని తరువాత 1974 అక్టోబరులో జరిగిన బొగ్గు గని కార్మికుల సమ్మెలో 3,29,459 మంది కార్మికులు పాల్గొన్నారు. 3,29,378 పని దినాలు నష్టమైనాయి.

అంతేగాక అధికారిక రికార్డుల ప్రకారం 1974లో 164 రాజకీయ సమ్మెలు, సానుభూతి సమ్మెలు జరిగాయి. వాటిలో 3,14,000 మంది కార్మికులు పాల్గొనగా, 4,41,000 పనిదినాలు నష్టమైనాయి. ఈ సమ్మెల్లో బీహారు, తరువాత మహారాష్ట్రలలో ఎక్కువ పని దినాలు నష్టమయ్యాయి. బీహారులో 1,99,000 పనిదినాలు, మహారాష్ట్రలో 77,000 పనిదినాలు నష్టమైనాయి.

ఈ దిగువ పట్టికలో 1974 లో రాష్ట్రాల వారీగా పారిశ్రామిక వివాదాలు, పాల్గొన్న కార్మికుల సంఖ్య, నష్టపోయిన పనిదినాల వివరాలు పొందుపరచబడ్డాయి.

**పారిశ్రామిక వివాదాలు : 1974**

| రాష్ట్రం / కేంద్ర పాలిత ప్రాంతం | వివాదాల సంఖ్య | వివాదంలో వున్న కార్మికుల సంఖ్య | నష్టపోయిన పనిదినాలు |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 126 | 1,31,431 | 6,46,233 |
| అస్సాం | 7 | 90,312 | 17,14,266 |
| బీహార్ | 278 | 3,67,165 | 21,81,339 |
| గుజరాత్ | 151 | 53,421 | 9,43,791 |
| హర్యానా | 33 | 11,036 | 2,17,672 |
| హిమాచల్ ప్రదేశ్ | 3 | 186 | 1,706 |
| జమ్ము- కాశ్మీరు | 5 | 436 | 2,789 |
| కర్నాటక | 72 | 58,004 | 4,22,941 |
| కేరళ | 237 | 2,64,038 | 36,46,532 |
| మధ్యప్రదేశ్ | 126 | 1,05,505 | 4,29,068 |
| మహారాష్ట్ర | 732 | 5,53,318 | 1,04,87,623 |

| | | | |
|---|---|---|---|
| మణిపూర్ | 4 | 684 | 4,630 |
| ఒరిస్సా | 59 | 30,335 | 2,55,198 |
| పంజాబు | 26 | 4,400 | 56,989 |
| రాజస్థాన్ | 40 | 34,923 | 7,23,452 |
| తమిళనాడు | 322 | 2,63,443 | 31,86,142 |
| త్రిపుర | 5 | 364 | 11,641 |
| ఉత్తరప్రదేశ్ | 211 | 1,53,005 | 15,06,825 |
| పశ్చిమబెంగాలు | 387 | 6,64,653 | 1,31,26,204 |
| అండమాన్ నికోబర్ దీవులు | 11 | 5,035 | 14,108 |
| చండీఘర్ | 4 | 871 | 2,206 |
| ఢిల్లీ | 37 | 25,443 | 3,18,116 |
| గోవా | 31 | 7,302 | 39,441 |
| పాండిచేరి | 12 | 29.223 | 3,23,435 |
| **మొత్తం** | **2,938** | **28,54,623** | **4,02,62,417** |

పై పట్టికను బట్టి దేశంలో అన్ని ప్రాంతాలలో పారిశ్రామిక వివాదాలు నెలకొన్నాయని స్పష్టమవుతుంది.

ఈ విధంగా దేశంలో పెరుగుతున్న కార్మికోద్యమాలు ప్రభుత్వానికి బాగా ఆందోళన కలిగించాయి. కార్మికోద్యమ ప్రతిఘటనా పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయటానికి అంతర్గత ఎమర్జెన్సీ ప్రకటన ప్రభుత్వానికొక అవకాశంగా లభించింది.

ప్రజాతంత్ర హక్కులను, పౌరహక్కులను నిరంకుశంగా అణచివేసి ప్రతిపక్ష రాజకీయ ఉద్యమాలను, ట్రేడ్ యూనియన్ పోరాటాలను అణగదొక్కటానికి రూపొందించిన ఎమర్జెన్సీ, ప్రజాతంత్రవాదులందరికీ ఒక మహా విపత్తుగా కనిపించగా, పారిశ్రామికవేత్తలు దీనికి స్వాగతం పలికారు. కార్మికులను నిర్దాక్షిణ్యంగా అణచివేసి వారిని విపరీతంగా దోచుకునేందుకీ ఎమర్జెన్సీ వారికి అవకాశాలు కల్పించింది. ఈ పరిస్థితులు పెట్టుబడిదారులకు ఎంత ఆనందం కలిగించిందీ, కార్మికులతో లావాదేవీలలో ఈ పరిస్థితి వారెలా వుపయోగించుకున్నారో తెలియచేస్తూ ఐ.ఎన్.టి.యు.సి. పత్రిక 'ఇండియన్ వర్కర్'లో ఈ విధంగా రాశారు.

"ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన యజమానుల సదస్సు డిసెంబరు 14న ముగిసింది. ఈ సదస్సు పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తూ ఎమర్జెన్సీని ఒక విపత్తుగా గాక, క్రియాశీలక పరిస్థితిలో సాధారణంగా సంభవించే ఒక మార్పుగా పరిగణించవల్సిందిగా కోరింది.

నిజానికి పారిశ్రామిక సంబంధాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుకునేందుకొక అవకాశంగా ఎమర్జెన్సీని ఉపయోగించుకోవాలి. ఇది చర్చలలో కుదిరిన ఏకాభిప్రాయం."

అందువలన పారిశ్రామిక వేత్తలకు ఎమర్జెన్సీ విపత్తుకాదు. ఇది కేవలం ఒక క్రియాశీలక స్థితిలో జరిగిన మార్పు. దానిని పారిశ్రామిక సంబంధాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుకొనటానికి ఉపయోగించాలి.

పరిశ్రమల యజమానులు ఆనందంతో వుక్కిరిబిక్కిరయ్యారు. "ఆరోగ్యకరమైన పారిశ్రామిక సంబంధాలంటే," కార్మికుల ప్రతిఘటన నణచివేసి వారిని తీవ్రంగా దోపిడీ చేస్తుంటే మెదలకుండా అంగీకరించేటట్లు చేయడమే. ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించటానికిదొక ముఖ్యమైన కారణం. తరువాత జరిగిన ఘటనలు ఈ ఉద్దేశాలను ధృవపరిచాయి. యజమానులకు ఆనందం కలుగజేసిన ఎమర్జెన్సీ ప్రకటించిన తరువాత, కనీస బోనస్‌ను 8.33 శాతం నుండి 4 శాతానికి తగ్గించడంతో పాటు, బోనస్ రివ్యూ కమిటీలో యజమానుల ప్రతినిధులు చేసిన కార్మిక వ్యతిరేక ప్రతిపాదనలతో, 1975 అక్టోబర్‌లో ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేస్తూ తీసుకున్న ప్రథమ చర్య యజమానులను ఆనందంలో ముంచెత్తింది. గత 4 సంవత్సరాల సగటు లాభాలను బట్టి కనీస బోనస్ ఇవ్వాలనే క్రొత్త అంశం మూలంగా అత్యధిక కంపెనీలు బోనసు ప్రకటించనవసరం లేకపోయింది. ఈ చర్యల వలన యజమానుల ఖజానాలో కోట్లాది రూపాయలు చేరాయి. "బోనస్ వాయిదాపడిన జీతం" అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆర్డినెన్స్ తిరస్కరించి బోనసును కంపెనీ లాభాలతో ముడిపెట్టడంతో అనేక కంపెనీలు లెక్కలను తారుమారుచేసి కార్మికులకు బోనసు ఎగకొట్టటానికి దోహదం చేసింది.

సహజంగానే ఈ ఆర్డినెన్స్ పట్ల కార్మికులలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. అయితే ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు సాగించటానికి ఎమర్జెన్సీ అవరోధంగా నిల్చింది. అయినప్పటికీ వివిధ ట్రేడ్ యూనియన్లు నిరసన సమావేశాలు నిర్వహించాయి. సి.ఐ.టి.యు., యు.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., హెచ్.ఎం.పి., బి.ఎం.ఎస్., టి.యు.సి.సి., ప్రొగ్రెసివ్ లేబర్ ఫెడరేషన్ ఆఫ్ తమిళనాడు, తమిళనాడు ట్రేడ్ యూనియన్ కాంగ్రెసులు ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

కార్మిక వ్యతిరేక చర్యలు ప్రగతి నిరోధకమైన ఈ అర్డినెన్స్ అమలుకే పరిమితం కాలేదు. వివిధ పరిశ్రమల యజమానులు కార్మికులపై దోపిడీని తీవ్రతరం చేసేందుకు కార్మిక వ్యతిరేక ఒప్పందాలను కార్మికుల మీద బలవంతంగా రుద్దే ప్రయత్నాలు చేశారు. అటువంటి సందర్భాలలో సమరశీల మెజారిటీ యూనియన్లను ప్రక్కన పెట్టి, తమ తొత్తులైన మైనారిటీ యూనియన్లను వాడుకున్నారు. 1975 డిసెంబర్‌లో కలకత్తాలోని రిట్జ్ కాంటినెంటల్ హోటల్‌లో ఈ విధంగా జరిగింది. అదే సమయంలో పశ్చిమబెంగాల్‌లోని ఖర్ధా జూట్‌మిల్లుతో పాటు, ఇతర జూట్‌మిల్లులలో కూడా కార్మిక వ్యతిరేక ఒప్పందాలను కార్మికులపై రుద్దారు. ఎమర్జెన్సీ

పరిస్థితినాసరాగా తీసుకుని కార్మికుల ప్రయోజనాలకు భంగం కల్గించే ఏ విధమైన చర్యలు చేపట్టరాదని ప్రధానమంత్రి పదే పదే చెప్పినా ఈ సంఘటనలు జరిగాయి.

అంతేకాక పబ్లిక్ రంగ కంపెనీలకు చెందిన యాజమాన్యాలు కూడా కార్మికుల సమస్యల పట్ల నిర్లిప్త వైఖరి నవలంబించడంతో పాటు, ప్రమాదకరమైన పనులు చేసే కార్మికులకు కూడా తగిన భద్రత కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. ఈ నిర్లప్తత, నిర్లక్ష్యం వలన ఈస్టరన్ కోల్‌ఫీల్డులోని చస్నాల కాలరీలో 1975 డిసెంబర్ 27న జరిగిన ఘోర ప్రమాదంలో 400 మంది గని కార్మికులు నీటిలో మునిగి మరణించారు. పబ్లిక్ రంగ కంపెనీ గనులలో రక్షణ నిబంధనలు పాటించకపోవటం వలన ఈ విపత్తు జరిగింది. ఐ.ఎన్.టి.యు.సి భద్రతా నిబంధనలు పాటించకపోతే అటువంటి ప్రమాదాలు ఎప్పుడైనా జరిగే అవకాశం వుందని, ఈ ప్రమాదానికి కొద్దిరోజుల ముందుగానే ఐ.ఎన్.టి.యు.సి. కాలరీ మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించినప్పటికీ, ఈ ప్రభుత్వ రంగ కంపెనీ భద్రతా నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ విపత్తు జరిగింది. చస్నాలా విపత్తు వంటిది భారత కార్మికోద్యమ చరిత్రలో మరో సంఘటన ఏది లేదు.

వాస్తవానికి భారతదేశంలో ప్రమాదకరమైన, ప్రమాదకరమైన పనులు చేసే కార్మికుల భద్రతకు కల్పించే సదుపాయాలు చాల తక్కువ. ఒకవేళ కొన్ని నిబంధనలున్నా వాటిని ప్రైవేటు, పబ్లిక్ రంగ సంస్థల యజమానుల నిర్లక్ష్యం వలన సరిగా పాటించరు. చస్నాల విషాద సంఘటన మేనేజ్‌మెంట్ అశ్రద్ధ, నిరాసక్తతల వల్ల జరిగిందే.

చస్నాల విషాద సంఘటన పట్ల అన్ని ట్రేడ్ యూనియన్లు, సమాజంలో వివిధ తరగతుల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పూర్తి రక్షణ చర్యలు అమలు చేయాలని, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలనే డిమాండ్‌కు బలం చేకూరింది.

ఎమర్జెన్సీ విధించి, కార్మికులకు, ఉద్యోగులకు రాజ్యాంగపరంగా సంక్రమించిన ప్రాథమిక హక్కులు చివరకు పత్రికా స్వేచ్ఛను కూడా హరించివేసి ట్రేడ్ యూనియన్లు ప్రచురించే సమాచార పత్రికలు, పీరియాడికల్స్ ఇతర పత్రికల మీద తీవ్రమైన సెన్సారింగ్ విధించడంతో కార్మికులు, ఉద్యోగుల హక్కులపై దాడి చేయడానికి, ప్రజాస్వామ్య ప్రమాణాలనుల్లంఘించడానికి ప్రభుత్వానికి మంచి అవకాశం లభించింది. భారత రాజ్యాంగానికి మరికొన్ని సవరణలను సిఫారసు చేయడానికి స్వరణ్‌సింగ్, కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది.

1976వ సంవత్సరం ప్రారంభంలో ఈ కమిటీ చేసిన సిఫారసులు అప్రజాస్వామికమైన ఎమర్జెన్సీ సంస్కృతికి అనుగుణంగానే వున్నాయి. ఎన్నికల చట్టాలను, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, తదితర విషయాల్లో తీవ్ర అప్రజాస్వామిక మార్పులకు సిఫార్సు చేసింది. రాజ్యాంగంలోని 311(2) అధికరణ ప్రకారం ప్రభుత్వోద్యోగికి లభించే రక్షణ రద్దు చేసి వారి సమస్యలను సర్వీసు ట్రిబ్యునల్స్ పరిధిలోకి తెస్తూ సిఫార్సు చేసింది. ఒక ప్రభుత్వోద్యోగిని నిరంకుశంగా ఉద్యోగం నుంచి తొలగించినా, డిస్మిస్ చేసినా, ఉద్యోగి చట్టపరమైన ప్రయోజనాలకు ఏ

విధమైన భంగం వాటిల్లినా 311(2) అధికరణం క్రింద ఉద్యోగి తనను సమర్ధించుకునే అవకాశం వుంది.

రాజ్యాంగంలోని 226 అధికరణం క్రింద "ఇతర విషయాల మీద" హైకోర్టులు ఆదేశాలిచ్చే అధికారాలను పూర్తిగా రద్దు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది.

ఈ నిబంధన ప్రకారం పౌరులకే కాక కార్మికులు, ఉద్యోగులు, రైతులు తదితరులు హైకోర్టుకు వెళ్ళి అధికారుల దుందుడుకు నిరంకుశ చర్యల గురించి విన్నవించుకునే అవకాశం వుండేది. కార్మికులకు, సాధారణ ప్రజలకు రాజ్యాంగం పరిధిలో లభించిన కొద్దిపాటి వెసులుబాటును హరించివేసి, వారిని పాలకుల దయాదాక్షిణ్యాలకు వదిలే విధంగా సిఫార్సు చేసింది.

ఈ తిరోగమన ప్రతిపాదనల పట్ల పార్లమెంటు లోపల, బయట తీవ్రమైన నిరసన పెల్లుబికింది. ట్రేడ్ యూనియన్లు, ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్లతో పాటు అన్ని ట్రేడ్ యూనియన్లు ఈ సవరణ ప్రతిపాదనల పట్ల తీవ్రమైన నిరసన వ్యక్తం చేశాయి. అందువలన ఈ సవరణ ప్రతిపాదనలు పార్లమెంట్ ఆమోదం పొందలేదు. కానీ శిక్షకు గురైన ప్రభుత్వోద్యోగి రాజ్యాంగంలోని 311(2) అధికరణం ప్రకారం రెండవసారి తనను సమర్ధించుకునే అవకాశాన్ని ఈ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రద్దు చేశారు.

ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌తో పాటు, కేంద్ర ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్లు ఈ చర్య పట్ల నిరసన వ్యక్తం చేసినప్పటికీ, 311(2) అధికరణం పునరుద్ధరించబడలేదు. ప్రభుత్వోద్యోగుల హక్కులను కాలరాయడానికి, 311(2) బి.సి. అధికరణం ఉద్యోగులను తొలగించడం, డి.ఐ.ఆర్. క్రింద వారిని నిర్బంధించడంతో పాటు ప్రభుత్వోద్యోగుల ప్రయోజనాలకు భంగం కల్గించడానికి ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది.

రాజ్యాంగ సవరణలతో ఆగక, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అమలుకై ఏ వ్యక్తి అయినా కోర్టుకు వెళ్ళే హక్కును నిలిపివేస్తూ 1976 జనవరిలో రాష్ట్రపతితో ఆర్డినెన్స్ జారీ చేయించడం ద్వారా ప్రభుత్వం సామాన్య ప్రజలు, కార్మికుల మీద విరుచుకుపడింది.

వాక్ స్వాతంత్ర్యాన్ని ప్రశాంతంగా సమావేశాలు జరుపుకునే హక్కును, ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తంచేసే స్వాతంత్ర్యాన్ని, అసోసియేషన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా తిరిగే హక్కును, దేశంలో ఏ ప్రాంతంలోనైనా నివసించే హక్కును, ఆస్తులను కొనటానికి, అమ్మడానికి గల హక్కును, వృత్తి వ్యాపారాలు చేసుకునే స్వేచ్ఛను, ఈ ఆర్డినెన్స్ ద్వారా సస్పెండ్ చేసి వాటిని కోర్టుల ద్వారా అమలు చేసుకునే అవకాశం కూడా లేకుండా చేసింది.

ఈ చట్టపరమైన నిషేధాల వలన ట్రేడ్ యూనియన్ ఉద్యమం తీవ్రమైన చిక్కుల నెదుర్కొన్నది. ఒకరకంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఒక అసాధారణ పరిస్థితి నెదుర్కొంటున్నది. దేశంలోని రాజకీయ ప్రతిపక్షాలను, ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఎదుర్కోవటమే ఈ క్రూరమైన

ఆర్డినెన్స్ లక్ష్యం. భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఆవిర్భవించిన నాటి నుండి కార్మికులను సంఘటిత పరచి, ఆనాటికి అమలులో ఉన్న కార్మిక చట్టాల ద్వారా హక్కుల సాధనకు కృషి చేస్తూ వచ్చాయి. కార్మికులకు సంఘ నిర్మాణహక్కు, సమిష్టి సంప్రదింపుల హక్కు వుండాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధన (ఐఎల్ఓ కన్వెన్షన్) నొక్కి చెప్పింది. కానీ ఎమర్జెన్సీ పరిస్థితిలో ట్రేడ్ యూనియన్ల ప్రాథమిక హక్కులను రద్దు చేయడమే గాక న్యాయస్థానాల ద్వారా పరిష్కారాన్ని కూడా నిరోధించారు. ప్రభుత్వం జారీ చేసిన నిరంకుశమైన ఆదేశాల పట్ల కార్మికులలో తీవ్ర నిరసన పెల్లుబుకింది. ఇది ఉత్పత్తి మీద తీవ్ర ప్రభావం చూపింది.

## దిగజారిన పారిశ్రామికోత్పత్తి

"ఉత్పత్తికి సంబంధించి కేంద్ర పరిశ్రమలు, పౌరసరఫరాల మంత్రిత్వ శాఖకు సమాచారం అందిన 104 పరిశ్రమలకు గాను 50 పరిశ్రమల్లో, 1975-76 మొదటి 8 నెలల్లో పారిశ్రామిక ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది" అని ఎకనమిక్ టైమ్స్ పత్రిక పేర్కొంది.

లఘు, భారీ పరిశ్రమలలో ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. నిత్యావసర సరకుల ఉత్పత్తి బాగా తగ్గింది. హరికేన్ లాంతర్ల ఉత్పత్తి 22.2 శాతం, బ్యాటరీల ఉత్పత్తి 16.9 శాతం, ప్లాస్టిక్ పాదరక్షల ఉత్పత్తి 25.9 శాతం, రసాయనిక సబ్బుల ఉత్పత్తి 12.9 శాతం, అగ్గిపెట్టెల ఉత్పత్తికి 19 శాతం తగ్గిపోయాయి. కాగితం, కాగితపు అట్టల వుత్పత్తి 2.3 శాతం, తోలు చెప్పుల వుత్పత్తి 22.2 శాతం తగ్గాయి.

8 ప్రధాన పరిశ్రమలలో అంతకుముందు సంవత్సరాల్లో ఉత్పత్తి సూచి పెరిగినా, ఈ కాలంలో పెరిగిన వాటి ఉత్పత్తి కూడా బాగా తగ్గిపోయింది. వాటిలో నూలు బట్టలు 10.7 శాతం, నూలుదారం 6 శాతం, కార్లు 32.8 శాతం, జనపనార 13.9 శాతం, న్యూస్ ప్రింట్ 5.5 శాతం ఫాస్ఫేట్ ఎరువులు 2.9 శాతం ఉత్పత్తి తగ్గినాయి.

వినిమయదారీ వస్తువులు వుత్పత్తి చేసే పరిశ్రమలతో పాటు అనేక ఇతర పరిశ్రమలలో కూడా ఉత్పత్తి పడిపోయింది. ఎయిర్‌కండిషనర్ల వుత్పత్తి గణనీయంగా 73.5 శాతం తగ్గింది. టూత్ పేస్టుల వుత్పత్తి 41.8 శాతం, ఫెనోలిక్ లామినేట్స్ 33.3 శాతం, ఎయిర్‌కండిషనింగ్, రిఫ్రిజిరేషన్ ప్లాంట్లు 25.3 శాతం, ఆప్టికల్ బ్లీచింగ్, 24.9 శాతం విస్కోస్ యార్న్ 23.6 శాతం, సోడియం హైడ్రోసల్ఫైడ్ 21.4 శాతం, ఎసిటేట్‌యార్న్ 9.1 శాతం, స్టీల్ బోల్టులు, నట్లు 8.4 శాతం, సల్ఫోనిక్ ఆసిడ్ 6.2 శాతం వుత్పత్తి తగ్గినాయి. యంత్ర పరిశ్రమలో, సిమెంటు యంత్రాల ఉత్పత్తి 43.5 శాతం తగ్గింది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలో ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. రేడియోల ఉత్పత్తి 28.9 శాతం, ఎలక్ట్రానిక్ మోటార్లు 41.6 శాతం, ఎలక్ట్రానిక్ ఫాన్లు 8 శాతం వుత్పత్తి తగ్గాయి.

ఇతర వినిమయ వస్తువుల ఉత్పత్తిలో సిగరెట్లు 12.5 శాతం, సైకిళ్ళు 15.2 శాతం, టీ 2.8 శాతం తగ్గింది. అలాగే అనేక ఇతర పరిశ్రమలలో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది.

పై వివరాలను పరిశీలిస్తే లఘు, భారీ, వినిమయ వస్తువుల పరిశ్రమలతో సహా మొత్తం ఉత్పత్తి రంగం దారుణంగా దెబ్బతిన్నట్లు స్పష్టమవుతుంది. అంతర్గత అత్యవసర పరిస్థితి, ప్రజల ప్రాథమిక హక్కులు దారుణంగా అణచివేయబడిన ఈ కాలంలో మునుపెన్నడూ లేని విధంగా కార్మికుల స్థైర్యం దెబ్బతినడం ఇందుకు ప్రధాన కారణం.

అత్యవసర పరిస్థితి, ప్రాథమిక హక్కుల అణచివేత వలన కార్మికుల స్థైర్యం దెబ్బతినటమే కాక, వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇదివరలో చెప్పినట్లుగా, పరిశ్రమల యజమానులు ఎమర్జెన్సీని ఆసరాగా తీసుకుని, దోపిడీని తీవ్రతరం చేసి, నిర్దాక్షిణ్యంగా కార్మికులకిచ్చే సదుపాయాలను నిరాకరించారు. అయితే ఎమర్జెన్సీ విధించిన అవరోధాల నధిగమించి కార్మికులు నిరసన చర్యలు చేపట్టడమే గాక చివరికి సమ్మెలు కూడా నిర్వహించారు. పాలక పార్టీకి అనుబంధంగా వున్న ఐ.ఎన్.టి.యు.సి. కూడా వివిధ రంగాలలో కార్మికుల నిరసనోద్యమాన్ని నిర్లక్ష్యం చేయలేకపోయింది. ఐ.ఎన్.టి.యు.సి. పత్రిక "ఇండియన్ వర్కర్" ఈ విధంగా రాసింది. "... ఎమర్జెన్సీ ప్రకటించిన తర్వాత మొదటి 3 నెలల్లో 15.6 లక్షల పనిదినాలు నష్టమైనాయి. జూలైలో 8.3 లక్షల పనిదినాలు, ఆగస్టులో 6 లక్షల పనిదినాలు, డిసెంబరులో 1.3 లక్షల పనిదినాలు నష్టమైనాయి."

"..... దీనిలో కేంద్ర ప్రభుత్వ అధీనంలో వున్న గనులు, రేవులు, నౌకా నిర్మాణం, ఎయిర్‌లైన్స్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వేలు, కేంద్రప్రభుత్వ సంస్థలకు సంబంధించినవి వున్నాయి. 1975 జనవరి నుంచి సెప్టెంబరు వరకు మొత్తం ఒక కోటి డెబ్బది లక్షల పనిదినాలు నష్టమైనాయి."

ఆ విధంగా ఎమర్జెన్సీ విధించిన తరువాత 3 నెలల కాలంలోనే భారీగా 15.60 లక్షల పనిదినాలు నష్టమైనాయని స్పష్టమవుతోంది. అంటే కార్మికులు ఎమర్జెన్సీకి తలవంచలేదు. పైపెచ్చు వారు అనేక రంగాలలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో కూడా ఉద్యోగులు ఎదురు దాడులకు భయపడి మౌనంగా కూర్చోకుండా ప్రతిఘటించడం, కార్మికుల ప్రతిఘటనలో ఒక ప్రధాన లక్షణం. కొన్ని సందర్భాలలో ఈ రంగాలల్లోని ఉద్యోగులు, కార్మికులు సమ్మెలు కూడా చేశారు.

## పారిశ్రామిక సంబంధాల నియంత్రణకు ప్రభుత్వ ప్రయత్నాలు

పారిశ్రామిక ఉత్పత్తి తగ్గి, కొన్ని పారిశ్రామిక కేంద్రాల్లో కార్మికుల ప్రతిఘటన పెరుగుతున్న ఈ సమయంలో ప్రభుత్వం ఎమర్జెన్సీని అవకాశంగా తీసుకుని పారిశ్రామిక సంబంధాల నియంత్రణకు, ఉత్పత్తిని తిరిగి అధికం చేయటానికి యత్నాలు చేసింది.

"ప్రైవేటు రంగంలో పారిశ్రామిక సంబంధాలకు సంబంధించిన సాధారణ సమస్యలను పరిష్కరించి ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచడంతో పాటు ప్రస్తుత ఎమర్జెన్సీ కాలంలో ఇతర సమస్యల పరిష్కారానికి కార్మికులు ప్రభుత్వానికి సహాయపడే విధంగా వారిని ప్రోత్సహించే లక్ష్యంతో భారత ప్రభుత్వం 1976 జూలై 29న ఒక నోటిఫికేషన్ ద్వారా నేషనల్ అపెక్స్ బాడీని ఏర్పాటు చేసింది."

నేషనల్ ఎపెక్స్ బాడీలోని 23 మంది సభ్యులలో 12 మంది కేంద్ర కార్మిక సంఘ ప్రతినిధులు, 11 మంది యజమానుల ప్రతినిధులు వుంటారు. ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి. గుర్తింపు పొందిన హెచ్.ఎం.ఎస్. విభాగానికి మాత్రమే ఈ సంస్థలో ప్రాతినిధ్యం ఇచ్చారు. ఏ యూనియన్‌కు ఎంతమంది ప్రతినిధులుండేది ప్రభుత్వమే నిర్ణయించింది.

దీనితో బాటు లే ఆఫ్‌లు, రిట్రెంచ్‌మెంట్లు, మూసివేతల గురించి నేషనల్ అపెక్స్ బాడీ నివేదించిన సమస్యలను పరిశీలించడానికి, నేషనల్ అపెక్స్ బాడీలోనే ముగ్గురు యజమానుల ప్రతినిధులు, ముగ్గురు ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో ఒక కాంపాక్ట్ బై పార్టైట్ కమిటీ పేరిట ఒక చిన్న కమిటీని ఏర్పాటు చేశారు.

టెక్స్‌టైలు పరిశ్రమకు సంబంధించి ప్రైవేటు రంగానికొక నేషనల్ ఇండస్ట్రీయల్ కమిటీని, నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్‌కు మరొక కమిటీని ఏర్పాటు చేశారు. బ్యాంకింగ్, ఇంజనీరింగ్, రసాయనాలు, ప్లాంటేషన్ పరిశ్రమలను ఆరోగ్యకరంగా నిర్వహించే విషయాలను పరిశీలించేందుకు ఆయా పరిశ్రమలకు వేర్వేరు కమిటీలను ఏర్పరచారు. ప్రైవేటు రంగంలో టెక్స్‌టైల్ పరిశ్రమకు సంబంధించి నేషనల్ ఇండస్ట్రియల్ కమిటీకి అనుబంధంగా ఒక 'నిపుణుల కమిటీ'ని, టెక్స్‌టైల్ పరిశ్రమకు సంబంధించి ఒక 'చిన్న (కాంపాక్ట్) ద్వైపాక్షిక కమిటీ'ని ఏర్పాటు చేశారు. నిపుణుల కమిటీలో ఒక్కొక్క యజమానుల సంఘం నుండి ఒకరు చొప్పున నలుగురు యజమానుల ప్రతినిధులు, ముగ్గురు గుర్తింపు పొందిన కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో బాటు వాణిజ్య మంత్రిత్వశాఖ బ్యాంకింగ్, రెవెన్యూ మరియు ఇన్సూరెన్స్ శాఖల నుంచి, రిజర్వు బ్యాంకు నుంచి ఒక్కొక్క శాఖ నుండి ఒకరు చొప్పున నలుగురు అధికార ప్రతినిధులుంటారు. 'చిన్న ద్వైపాక్షిక కమిటీ'లో గుర్తింపు పొందిన కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు నలుగురు, యజమానుల పక్షాన నలుగురు ప్రతినిధులు ఉంటారు. వీరు మూసివేతలు, రిట్రెంచ్‌మెంట్, లే ఆఫ్‌ల విషయంలో ఎదురయ్యే సమస్యలను పరిశీలిస్తారు. పంచదార, పేపరు, నిర్మాణ పరిశ్రమ, జ్యూట్, ఆటోమొబైల్ పరిశ్రమలకు కూడా నేషనల్ ఇండస్ట్రియల్ కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

## నిరర్థకమైన నేషనల్ ఎపెక్స్ బాడీ, యాజమాన్యంలో కార్మిక భాగస్వామ్య పథకాలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపెక్స్ బాడీ కూడా ఎమర్జెన్సీ కాలంలో లే ఆఫ్‌లు, రిట్రెంచ్‌మెంట్లు విస్తృతంగా జరిగాయని అంగీకరించింది. 1976 జనవరి 10న జరిగిన ఎన్.ఎ.బి. ఆరవ సమావేశం ఒక తీర్మానం ఆమోదిస్తూ "దేశంలో విస్తృతంగా" ప్రబలిన లే ఆఫ్‌లు, రిట్రెంచ్‌మెంట్లు, లాకౌట్లు, సమ్మెలు, గో స్లో (నెమ్మదిగా పనిచేయడం) నిబంధనల మేరకు పని వంటి వాటి పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. లే ఆఫ్‌లు, రిట్రెంచ్‌మెంట్లు, మూసివేతలు ఏకపక్షంగా వుండరాదని ఎన్.ఎ.బి నిర్ణయించింది. అయితే ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన ఈ ఎన్.ఎ.బి. ప్రభుత్వానికి వత్తాసు పలికే తన స్వభావానికనుగుణంగా ఇంకా యిలా పేర్కొంది. "సహేతుకంగా జరిగే లే ఆఫ్‌లు, రిట్రెంచ్‌మెంట్లు, మూసివేతలను ఇతర రకాల లే ఆఫ్‌లు, మూసివేతల నుండి వేరుగా చూడాలి." ఆ విధంగా యజమానుల ప్రయోజనాలు కాపాడే విధంగా ఎన్.ఎ.బి., రిట్రెంచ్‌మెంట్, మూసివేతల వంటి విషయాల్లో అక్రమమైన, సక్రమమైనవనే తేడాలను చూడగలిగింది.

న్యూఢిల్లీలో 1976 మార్చి 31న జరిగిన (కన్సల్టేటివ్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ మెంబర్స్) పార్లమెంట్ సభ్యుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో కేంద్ర కార్మిక మంత్రి లే ఆఫ్‌లు, మూసివేతలు, రిట్రెంచ్‌మెంట్ల పరిస్థితి గురించి రాష్ట్రాల వారీగా అందుబాటులో వున్న రికార్డుల నుండి ఈ క్రింది సమాచారం అందచేశారు.

**1975 జూలై నుంచి 1975 డిసెంబరు వరకు**

| రాష్ట్రం | లే ఆఫ్‌లు | రిట్రెంచ్‌మెంట్లు |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 21,467 | 517 |
| మధ్యప్రదేశ్ | 45,948 | 48 |
| మహారాష్ట్ర | 41,521 | 2,960 |
| ఉత్తరప్రదేశ్ | 19,895 | 2,655 |
| పశ్చిమబెంగాల్ | 2,21,209 | లేదు |
| ఇతర రాష్ట్రాలు | 41,681 | 3,680 |

ఈ లెక్కలలో తమిళనాడు, అస్సాం, గోవా, జమ్ము - కాశ్మీరు రాష్ట్రాల వివరాలు లేవు. పెట్టుబడిదారులు కార్మికుల మీద విస్తృత స్థాయిలో దాడి చేశారు. ఆ సమావేశానికి ముందు 3 నెలల్లో వివిధ పరిశ్రమలలో లే ఆఫ్, రిట్రెంచ్‌మెంటులకు గురైన కార్మికుల

వివరాలు తమ వద్దలేవని కార్మిక మంత్రి ఆ సమావేశంలో సమాధానమిచ్చారు. ఇచ్చిన లెక్కలు కూడా సరైనవి కావు. అనేక సందర్భాలలో, ప్రత్యేకించి పశ్చిమబెంగాల్‌కు సంబంధించినంతవరకు అవి వాస్తవానికి భిన్నంగా వున్నాయి.

మంత్రి ఇచ్చిన వివరాలను బట్టి ఎమర్జెన్సీ విధించిన తర్వాత మొదటి ఆరు నెలల్లో ఆయన చెప్పిన దానిని బట్టి 1976 జనవరి నుంచి 1976 మార్చి వరకు కార్మికులపై జరిగిన దాడి వివరాలసలు అందుబాటులోనే లేవు.

ఎన్.ఎ.బి. అనేకసార్లు సమావేశామైనా రిట్రెంచ్‌మెంట్లు, లే ఆఫ్‌లకు గురైన కార్మికులకు ఏ విధమైన ఉపకారం జరగలేదు. ఎమర్జెన్సీనవకాశంగా తీసుకుని, యజమానులు తమ దుశ్చర్యలను ఉల్లాసంగా కొనసాగించారు.

నేషనల్ ఎపెక్స్ బాడిలో ఇతర కేంద్ర ట్రేడ్ యూనియన్లకు ప్రాతినిధ్యం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. ప్రధాన ట్రేడ్ యూనియన్లలో ఒకటైన సి.ఐ.టి.యు.ను మినహాయించారు. సి.ఐ.టి.యు. ఐక్య కార్మికోద్యమం మూలంగా మాత్రమే కార్మికుల సమస్యలు పరిష్కారం కాగలవని భావించింది.

సి.ఐ.టి.యు. తన మాసపత్రిక "వర్కింగ్ క్లాస్" ఒక వ్యాసంలో ఎన్.ఎ.బి. గురించి తన వైఖరిని వివరిస్తూ ఈ క్రింది విధంగా రాసింది.

"సమావేశాల సంఖ్యను బట్టి, సాధించామని చెప్పుకునే విజయాలను బట్టి ఎన్.ఎ.బి. పనితీరును అంచనా వేయడం కుదరదు. కార్మికుల సమస్యలు పరిష్కరించటానికి ఈ సంస్థ చేపట్టిన చర్యలను బట్టి మాత్రమే ఎన్.ఎ.బి. పనితీరును నిర్ధారించాలి. ఈ సంస్థలో కార్మికుల ప్రతినిధులను నియమించిన తీరును గురించిన వివాదంలోకి పోకుండా, కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి పూనుకుంటే, కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణకు దోహదమవుతుంది." అయితే ఎమర్జెన్సీ ప్రకటన పట్ల వివిధ ట్రేడ్ యూనియన్ల రాజకీయ అవగాహనలో తీవ్ర విభేదాల వల్ల ఇది సాధ్యం కాలేదు.

ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్.లో ఒక భాగం ప్రభుత్వ ప్రాపకంతో ఎన్.ఎ.బి.లో నియమితులై ఎన్నో ఆశలు పెట్టుకుని దానిలో చేరినా ఈ ఎన్.ఎ.బి. వల్ల కార్మిక వర్గానికి ఒనగూడే ప్రయోజనాల గురించి వారికే పూర్తిగా నమ్మకం కలుగలేదు. 'ట్రేడ్ యూనియన్ల నూతన పాత్ర' గురించి ఐ.ఎన్.టి.యు.సి. వ్యవస్థాపక దినం సందర్భంగా వెలువడిన 'ఇండియన్ వర్కర్' పత్రికలో నాటి ఐ.ఎన్.టి.యు.సి. జనరల్ సెక్రటరీ జి. రామానుజం ఒక వ్యాసంలో 'కేవలం భావోద్రేకపూరితమైన విజ్ఞప్తులతో సామరస్యపూర్వక

పారిశ్రామిక సంబంధాలను నిలకడగా కొనసాగించడం సాధ్యం కాదు" అని అంగీకరించారు. "కార్మికులు, యాజమాన్యానికి మధ్య విభేదాలను సమంజసమైన విధంగా వెంటనే, న్యాయంగా, సంపూర్ణంగా పరిష్కరించటానికి, ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని" ఆయన భావించారు. ఎన్.ఎ.బి. పనితీరును శ్లాఘించటానికి ఆయన నిరాకరిస్తూ "ఎన్.ఎ.బి.ఇంతవరకు ఏమి సాధించిందో చూస్తే చాలా నిరుత్సాహకరంగా వున్నదని" ఆయన విచారం వెలిబుచ్చారు.

వర్గ సామరస్య దృక్పథంతో వున్న ఐ.ఎన్.టి.యు.సి., ఎన్.ఎ.బి. నుంచి చాలా ఎక్కువే ఆశించింది. సహజమైన ఆ సంస్థ వైఫల్యం చివరకు ఐ.ఎన్.టి.యు.సి. అధినేతకు కూడా మనస్తాపం కలిగించింది. ఆయన సంస్కరణవాది, వర్గసామరస్యవాది కావటం వలన, పెట్టుబడిదారీ వ్యవస్థలో అటువంటి యంత్రాంగం కార్మికులు, యజమానుల మధ్య వివాదాలను వెంటనే న్యాయసమ్మతంగా వుండే విధంగా పూర్తిగా పరిష్కరించలేదనే విషయాన్ని గ్రహించలేకపోయాడు. "పెట్టుబడి, కార్మికుల" చరిత్రలో పదునైన వర్గ పోరాటాల ద్వారానే కార్మికులు కొంతమేరకైనా న్యాయం పొందగలరని "పెట్టుబడి – శ్రమ" యొక్క చారిత్రక అనుభవం తెల్పుతోంది. ఈ రెండింటి మధ్య వున్న వైరుధ్యాలను పరిష్కరించడం సామాజిక విప్లవం ద్వారా సాధ్యపడుతుంది. విభేదాలను సమసిపోయేట్లు పరిష్కరించటానికి సమాజంలో విప్లవాత్మక మార్పు అవసరం. ఎన్.ఎ.బి.లో మరో ప్రతినిధి ఎ.ఐ.టి.యు.సి. కూడా నిరాశ వ్యక్తం చేసింది. ఎ.ఐ.టి.యు.సి.కి ఆధిపత్యం వహిస్తున్న భారత కమ్యూనిస్టుపార్టీ వారపత్రిక "న్యూఏజ్" ఈ క్రింది వ్యాఖ్యలు చేసింది.

"నెలలు గడస్తున్న కొద్దీ, ఎన్.ఎ.బి. పని అసమర్ధంగా తయారైంది. అక్కడ ప్రతి నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకోవాల్సి వుంది. యజమానుల మొండివైఖరి వలన అది అసాధ్యమవుతోంది. ఒకవేళ ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటి అమలుకు చట్టబద్ధమైన యంత్రాంగం లేకపోవడంతో, వాటిని యజమానుల ఇష్టానికి వ్యతిరేకంగా అమలు చేయటానికి వీలులేదు.

ఈ విషయాన్ని మరింత వివరిస్తూ న్యూ ఏజ్ ఈ విధంగా రాసింది. 'మూసివేసిన మూడు కాన్పూర్ టెక్స్‌టైల్ మిల్లులను తిరిగి తెరవాలన్న ఎన్.ఎ.బి. ఆదేశాలను యజమానులు తిరస్కరించడమీ విషయాన్ని ధృవపరుస్తోంది."

ఎన్.ఎ.బి. లాగానే అంతర్గత ఎమర్జెనీ కాలంలోనే ప్రభుత్వం 'కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామం' అనే పథకాన్ని ప్రకటించింది. ఒక ప్రక్క కార్మికుల సమావేశ హక్కును, పోరాడే హక్కును అణచివేస్తున్న ప్రభుత్వం కార్మికులను మోసగించటానికి పన్నిన

మరో పన్నాగం మాత్రమే. ఈ పథకాన్ని ఎన్.ఎ.బి. ఆమోదించినప్పటికీ, ఐ.ఎన్.టి.యు.సి.తో కలిసి సామరస్యంగా ఎన్.ఎ.బి.లో పాల్గొంటున్న ఎ.ఐ.టి.యు.సి. ఈ పథకాన్ని బాహాటంగానే విమర్శించింది. "ఎ.ఐ.టి.యు.సి. ఈ పథకం పట్ల అసంతృప్తి ప్రకటించి దానిలో వున్న లోపాలను ఎత్తి చూపింది." అని పేర్కొంటూ ఈ పథకం పట్ల ఐ.ఎన్.టి.యు.సి. వెలిబుచ్చిన నిరుత్సాహం గురించి న్యూఏజ్ ఈ విధంగా రాసింది. 'ఐ.ఎన్.టి.యు.సి. ఈ పథకాన్ని వ్యతిరేకించకపోయినా, ఆ పథకం వారిని సంతృప్తి పరచలేదు. ఈ పథకం వల్ల ఫ్యాక్టరీల నిర్వహణ విషయంలో కార్మికుల మాట చెల్లుబాటు కాదన్నది వారి విమర్శలో ప్రధానాంశం.' మొదట్లో ఐ.ఎన్.టి.యు.సి, ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్.లో ఒక సెక్షన్ ఈ పథకాన్ని ఒక ప్రగతిశీల చర్యగా ప్రశంసించినా, చివరకు దీని పట్ల వారి భ్రమలు తొలగిపోయినట్లు బహిరంగంగానే వెల్లడించుకున్నారు. దీనిని బట్టి ఈ పథకం ఎంత నిరర్థకమైనదో స్పష్టమవుతుంది.

అయితే సి.ఐ.టి.యు. మొదటి నుండీ 'యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్య' పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన రూపంలో వ్యతిరేకించింది. దానికి బదులుగా ఈ దిగువ అంశాలతో పథకాన్ని మరింత పటిష్టంగా రూపొందించాలని డిమాండ్ చేసింది.

1. కార్మికుల ప్రతినిధులను రహస్య బ్యాలట్ ద్వారా ఎన్నుకోవాలి.
2. యజమానుల "జమా - ఖర్చుల" లెక్కలను సవాలు చేసే హక్కు కార్మికుల ప్రతినిధులకుండాలి. ఈ సందర్భాల్లో వారిని క్రమశిక్షణా చర్యలకు గురి చేయరాదు.
3. అంగీకరించిన ఉత్పత్తి ప్రమాణాలను సాధించటానికి యూనియన్లు ఒప్పుకున్నా, పనిభారం తీవ్రం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించే హక్కు వారికుండాలి.
4. మేనేజ్‌మెంట్ అసమర్థతను, నిధుల దుర్వినియోగాన్ని, ఉత్పత్తి తగ్గుదలకు కారణమైన నాసిరకం ముడిసరుకు సరఫరా తదితర అంశాలను ప్రతిఘటించే హక్కు కార్మికుల ప్రతినిధులకు వుండాలి.
5. రిట్రెంచ్‌మెంట్, నిర్బంధ పదవీ విరమణ, ఉత్పత్తి అధికం కావటం వలన లే ఆఫ్ విధించడం మొదలైన వాటిపై నిషేధం విధించాలి.
6. ప్రాథమిక స్థాయికి (షాపు లెవెల్) కూడా ట్రేడ్ యూనియన్ హక్కులను విస్తరించాలి.

ఈ పథకం పట్ల, ఎన్.ఎ.బి.లో మూడవ భాగస్వామి, మూడవ ప్రధాన ట్రేడ్ యూనియన్ అయిన హెచ్.ఎం.ఎస్. వైఖరిని, ప్రతిస్పందనను వివరించటం కష్టమవుతుంది. ఎందుకంటే దాని నాయకత్వం చీలిపోయి అందులో ఒక భాగం మాత్రమే ఎన్.ఎ.బి.లో ప్రాతినిథ్యం వహిస్తోంది. ఆ సంస్థ జనరల్ సెక్రటరీ మహేశ్ దేశాయ్, ఎన్.ఎ.బి.లో

ప్రాతినిధ్యం వహిస్తున్న మఖన్ ఛటర్జీ గ్రూపు మీద కోర్టులో దావా వేయటం వలన హెచ్.ఎం.ఎస్. తీవ్ర వివాదంలో చిక్కుకొంది. హెచ్.ఎం.ఎస్. నాయకత్వంలోని మఖన్ ఛటర్జీ నాయకత్వం వహిస్తున్న గ్రూపు రాజకీయంగా కాంగ్రెసు పార్టీలో వున్నది. అదే సమయంలో 'కాంగ్రెస్ సంస్థలో వున్న కార్మిక నాయకులందరూ తమ అధీనంలోని ట్రేడ్ యూనియన్లను ఒక నెలలోగా ఐ.ఎన్.టి.యు.సి.కి అనుబంధం చేయాలి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సహజంగానే ఈ పరిస్థితుల్లో హెచ్.ఎం.ఎస్. ఒక సంస్థగా ఎన్.ఎ.బి.ని గురించి గాని, 'యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం పథకం' గురించి గానీ ఎటువంటి వైఖరిని అవలంబించలేకపోయింది.

యు.టి.యు.సి., తదితర వామపక్ష ట్రేడ్ యూనియన్లకు సంబంధించినంత వరకు, వారు ఎన్.ఎ.బి.లో చేరలేదు. వారి అభిప్రాయాలు దాదాపు సి.ఐ.టి.యు. అభిప్రాయాలను పోలివున్నాయి.

ఆ విధంగా ఎమర్జెన్సీలో ప్రాథమిక హక్కులనన్నింటినీ అణగదొక్కిన ప్రభుత్వం "యాజమాన్యంలో భాగస్వామ్యం" వంటి మోసపూరిత పథకాల ద్వారా కార్మికుల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చడానికి చేసిన ప్రయత్నాలు తుస్సుమన్నాయి.

## ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలు - ట్రేడ్ యూనియన్ల ఐక్యతా సమస్య

కార్మికులు సాంప్రదాయంగా జరుపుకునే మేడే ప్రదర్శనను కూడా వారు ఆశించిన రీతిలో జరుపుకోవటానికి అనుమతించని స్థాయిలో ఎమర్జెన్సీ కాలంలో కార్మిక హక్కుల అణచివేత కొనసాగింది. అయినప్పటికీ కార్మికవర్గం అప్పుడున్న పరిస్థితిని బట్టి వివిధ రూపాలలో 1976 మేడేని పరిమితులను బట్టి విస్తృతంగానే జరుపుకుంది. కొన్ని ముఖ్య పట్టణాలలో పెద్ద ప్రదర్శనలు కూడా జరిగాయి. సి.ఐ.టి.యు. పత్రిక 'వర్కింగ్ క్లాస్' ఈ విధంగా పేర్కొంది. పరిస్థితులకు తగిన విధంగా మేడే జరపవల్సిందిగా సి.ఐ.టి.యు., యు.టి.యు.సి., టి.యు.సి.సి., హెచ్.ఎం.ఎస్., హెచ్.ఎం.పి.లు కార్మిక వర్గానికి పిలుపునిచ్చినప్పటికి, స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి సి.ఐ.టి.యు. తదితర వామపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో మేడే సందర్భంగా ఐక్య ప్రదర్శన నిర్వహించడం సాధ్యం కాలేదు. అదే విధంగా న్యూఏజ్ పత్రిక ఈ క్రింది వార్త ప్రకటించింది. కార్మికోద్యమ చరిత్రలో మొదటిసారిగా రాజధాని ఢిల్లీలో మేడే ప్రదర్శన, ఊరేగింపు జరగలేదు, కార్మిక వర్గం, వారి యూనియన్ల పట్ల ఢిల్లీ అధికార యంత్రాంగం చూపిన పక్షపాత వైఖరికి నిరసనగా ఎ.ఐ.టి.యు.సి. తదితర యూనియన్లు తలపెట్టిన ప్రదర్శనను రద్దు చేసాయి.

ఇటువంటి పరిస్థితులలో న్యూఏజ్ ఇంకా ఈ విధంగా పేర్కొంది. “కార్మిక వర్గ ఐక్యతను పటిష్టం చేయటం నేటి ప్రధాన కర్తవ్యం. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఇందుకు కట్టుబడి వుంది.” ఐక్యతకై ఇచ్చిన ఈ పిలుపుకు సి.ఐ.టి.యు. స్వాగతం పలికింది. “కార్మికుల ప్రయోజనాలు పరిరక్షించటానికి ఐక్యంగా కృషి చేయటానికి సిద్ధంగా వున్న సి.ఐ.టి.యు.తో తదితర ట్రేడ్ యూనియన్‌లతో కలవటానికి ఎ.ఐ.టి.యు.సి. ఎందుకు వెనుకాడుతోంది’ అని ప్రశ్నించింది. సి.ఐ.టి.యు. ఇంకా ఈ విధంగా వివరణనిచ్చింది. “ఇతర యూనియన్లతో ఐక్య కార్యాచరణ పట్ల ఏమాత్రం ఆసక్తి లేని ఐ.ఎన్.టి.యు.సి.తో కలిసి ఐక్య కార్మిక వేదిక నిర్మించాలనేది ఎ.ఐ.టి.యు.సి. వైఖరిగా కన్పడుతోంది. ఇతర యూనియన్లతో కలసి ఏర్పాటు చేసి ఐక్యవేదికలో పాల్గొనేందుకు ఐ.ఎన్.టి.యు.సి. సిద్ధపడితేనే ఎ.ఐ.టి.యు.సి. కూడా భాగస్వామి అవుతుంది. ‘ఈ విధానం కొనసాగితే ఎ.ఐ.టి.యు.సి., ఐ.ఎన్.టి.యు.సి.కి తోకగా మారుతుంది.’ ఎ.ఐ.టి.యు.సి. విధానాలను ఐ.ఎన్.టి.యు.సి. శాసిస్తుంది.

ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించటంలో గల అంతర్యం, దాని ప్రభావం గురించిన రాజకీయ అవగాహనలో వివిధ ట్రేడ్ యూనియన్ల మధ్య గల విభేదాలు, ముఖ్యంగా ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు. వంటి ప్రధాన వామపక్ష కార్మిక సంస్థల మధ్య విభేదాలు, భారత రాజకీయ చరిత్రలోని ఈ చీకటి రోజుల్లో కార్మిక వర్గం మీద సాగుతున్న అణచివేతకు వ్యతిరేకంగానూ, కార్మిక వర్గానికి సంబంధించిన న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారానికి నిరాకరించే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగాను, ఒక ఐక్య కార్మిక వేదికను నిర్మించటానికి ఆటంకమైనాయి. ఈ కాలంలో పాలకవర్గంతో ఎ.ఐ.టి.యు.సి. అవలంబించిన మిత్రత్వ వైఖరి వలన అది ఐ.ఎన్.టి.యు.సి.కి దగ్గరైంది. ఎ.ఐ.టి.యు.సి. ప్రభుత్వానికి తోకగా మారి, ఐ.ఎన్.టి.యు.సి., అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్న హెచ్.ఎం.ఎస్.లు కార్మికవర్గంపై ఎమర్జెన్సీ అండతో జరిపే దుశ్చర్యలను వ్యతిరేకించే రాజకీయ స్థైర్యాన్ని కోల్పోయాయి. ఇక ఎమర్జెన్సీ దుశ్చర్యలను వ్యతిరేకించే కర్తవ్యాన్ని సి.ఐ.టి.యు. తదితర ట్రేడ్ యూనియన్లు మాత్రమే నిర్వహించవలసిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడున్న పరిస్థితుల్లో వారు ఏమీ సాధించలేకపోయారు. దేశంలో ఒక్క కేరళ రాష్ట్రంలో మాత్రమే సి.ఐ.టి.యు. తదితర వామపక్ష ట్రేడ్ యూనియన్లు అరెస్టులు, పోలీసు దమనకాండను ఎదుర్కొని ప్రభుత్వం ఎమర్జెన్సీలో సాగిస్తున్న దాడులను ప్రతిఘటించటంలో కొంతమేరకు సఫలీకృతమయ్యాయి. మితవాద ట్రేడ్ యూనియన్ కేంద్రమైన బి.ఎం.ఎస్. కూడా ఎమర్జెన్సీని వ్యతిరేకించి, ప్రభుత్వ దాడులకు గురైంది.

## తిరగబడ్డ కెరటాలు : ఇందిరాగాంధీ ప్రభుత్వ ఓటమి

దారుణమైన అణచివేతతో పాటు, ప్రాథమిక హక్కులను అణచివేసినప్పటికీ, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజల పోరాటం ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1977 జనవరి 18న జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రసంగిస్తూ, సార్వత్రిక ఎన్నికలు జరపాలన్న తన అభిప్రాయాన్ని ప్రకటించింది. అంత అకస్మాత్తుగా ఆమె ఎన్నికలు ప్రకటించేందుకు దారితీసిన పరిస్థితులను గురించి పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అంతర్గతంగా తీవ్ర ఒత్తిడులుంటే తప్ప ఏ నియంతా తన అధికారాన్ని వదలిపెట్టరు. వాస్తవానికి ఆమె పార్టీలోనే విపరీతమైన అంతర్గత కుమ్ములాటలు సాగుతున్నాయి. తన పార్టీలో అంతర్గత తిరుగుబాటు వల్లనే ఆమె ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో ముగ్గురు ముఖ్యమంత్రులను తొలగించవల్సి వచ్చింది. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిని కూడా తొలగించే ప్రయత్నం జరిగింది. ఇతర నియంతల విషయంలో జరిగిన విధంగానే ఆమె అధికార వ్యవస్థ ఒక చిన్న ముఠాకు చివరకు ఆమె కుంచించుకుపోయి కుటుంబ సభ్యులకే పరిమితమైంది. ఆమె చిన్నకొడుకు సంజయ్‌గాంధీ దౌర్జన్యాలు శృతిమించాయి. ఢిల్లీలోను, ఇతర చోట్ల షాపులను, గుడిసెలను ధ్వంసం చేయించడం, దేశమంతటా బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరపడంతో పాటు, హోంమంత్రి బన్సీలాల్ సాగించిన కక్ష సాధింపు, ప్రతీకార చర్యలు సర్వత్రా ప్రజలలో అసంతృప్తిని, ఆగ్రహాన్ని ప్రజ్వలింపచేశాయి. తన పార్టీలోనే రగుల్కొన్న విభేదాలు, సర్వత్రా ప్రజలలో నెలకొన్న అసంతృప్తి, ఎగసిపడుతున్న ప్రజాగ్రహం వలన ఇందిరాగాంధీ 1977 మార్చిలో ఎన్నికలు జరుపుతానని ప్రకటించక తప్పలేదు.

ఈ ఉద్దేశ్యంతోనే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలనందరినీ విడుదల చేశారు. కానీ ఎమర్జెన్సీ, డి.ఐ.ఆర్., మీసా వంటి రాక్షస చట్టాలు అమలులోనే వున్నాయి. ప్రజలకు తాము విజయం సాధించామన్న ధీమా కల్గింది. దీనితో సార్వత్రిక ఎన్నికల ప్రకటనతో పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. నాయకుల విడుదలతో ముమ్మరంగా రాజకీయ కార్యకలాపాలు వూపందుకున్నాయి. ఇందిరా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా, ఎన్నికల నెదుర్కోవటానికి మధ్యేవాద పార్టీలు, మితవాద పార్టీలు, జనసంఘ్‌తో సహా మతవాద పార్టీలు కలిసి జనతాపార్టీ పేరుతో ఒక పార్టీగా ఏర్పడ్డారు. ఇద్దరు ప్రముఖ కాంగ్రెస్ నాయకులు జగ్జీవన్‌రామ్, హెచ్.ఎన్. బహుగుణలు ఇందిరాగాంధీ నుండి వేరుపడి ప్రజాస్వామ్య కాంగ్రెస్‌ను ఏర్పాటు చేశారు. నియంతృత్వ

పాలనను వ్యతిరేకించే వారంతా ఏకమై ఇందిరా కాంగ్రెస్‌కు సవాలుగా నిలిచారు. నియంతృత్వ పాలన నిర్మూలించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో, క్రొత్తగా ఏర్పాటైన జనతాపార్టీకి, సి.పి.ఐ.(ఎం), తదితర వామపక్షాలు మద్దతునిచ్చాయి. ఈ ఐక్యత ప్రజలలో ఉత్తేజం కలిగించింది. ప్రజలు బాగా స్పందించారు. పాలక పార్టీకి స్థైర్యం చెదిరిపోయి ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు ఖర్చయ్యే విధంగా ఎన్నికల సందర్భంగా రాయితీలు ప్రకటించినప్పటికీ ఫలితం లేకపోయింది.

ప్రజలు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. 1977 మార్చి 21వ తేదీ అర్ధరాత్రి బి.బి.సి. రేడియో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఓటమిని ప్రకటించింది. ఆమె పార్టీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. ప్రజలు ఆమెకు, ఆమె పార్టీకి వ్యతిరేకంగా ప్రతీకారంతో ఓటు వేశారు. అయితే ఇందిరాగాంధీ 1977 మార్చి 23న మాత్రమే రాజీనామా చేశారు. ఈ రెండు రోజుల్లో ఆమె అనేక రహస్య పత్రాలను ధ్వంసం చేసిందనే ఆరోపణలు వచ్చాయి. ఆ విధంగా అన్ని తరగతుల ప్రజలు, రాజకీయవేత్తలు, మేధావులు, పత్రికా ప్రపంచం, ట్రేడ్ యూనియన్‌లకు వ్యతిరేకంగా ఆమె సాగించిన దమనకాండ, అణచివేత విధానాలు ఆమెను అప్రతిష్టాకరమైన ఓటమిపాలు చేశాయి.

# 22

# విభిన్న రాజకీయ దృశ్యం 1977-84లో కార్మిక వర్గ పోరాటాలలో కొత్తపుంతలు

ఇందిరాగాంధీ, ఆమె కాంగ్రెస్ పార్టీ 1977 మార్చి సార్వత్రిక ఎన్నికలలో ఓడిపోయిన తరువాత మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రిగా జనతా పార్టీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ నూతన ప్రభుత్వం నిరంకుశ అధికార వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ప్రాథమిక హక్కులను పునరుద్ధరించటానికి కంకణం కట్టుకున్నట్లు ప్రకటించింది. ఈ ప్రభుత్వానికి సి.పి.ఐ(ఎం), తదితర వామపక్షాలు మద్దతునిచ్చాయి.

దేశంలో రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అత్యవసర పరిస్థితిని రద్దు చేశారు. ప్రజలు కోల్పోయిన ప్రజాతంత్ర, పౌరహక్కులను, ట్రేడ్ యూనియన్ హక్కులను చాలావరకు పునరుద్ధరించారు. ప్రజలకిది ఊరట కలిగించింది.

1977 జూన్‌లో రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరపాలని జనతా ప్రభుత్వం ఆదేశించింది. అనేక రాష్ట్రాలలో ఇందిరాకాంగ్రెస్ ఓడిపోయింది. పశ్చిమబెంగాల్‌లో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష సంఘటన ఎన్నికలలో విజయం సాధించి, జ్యోతిబసు ముఖ్యమంత్రిగా ప్రభ్వుతం ఏర్పాటు చేసింది. ఇందిరాకాంగ్రెస్ ఓటమితో అనేక రాష్ట్రాలలో రాజకీయ మార్పులు చోటు చేసుకున్నాయి. ఎమర్జెన్సీ కాలంలో తొలగించిన ప్రభుత్వోద్యోగులను తిరిగి నియమించారు. కక్ష సాధింపు చర్యలు ఉపసంహరించారు. నిర్బంధంలో వున్న వారిని వెంటనే విడుదల చేశారు. ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే 311(2) సి. అధికరణం క్రింద ఉద్యోగం నుంచి తొలగించబడిన 29 మంది ప్రభుత్వోద్యోగుల ఉద్యమ నాయకులను, వామపక్ష సంఘటన ప్రభుత్వం తిరిగి ఉద్యోగాలలో నియమించింది. మరికొంతమంది డిస్మిస్ చేయబడిన, బలవంతంగా పదవీ విరమణ చేయించబడిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు.

1972 నుంచి ఉద్యోగులపై విధించిన సర్వీసులో అంతరాయం, బ్రేక్ ఇన్ సర్వీస్ వంటి క్రమశిక్షణా చర్యలనన్నింటిని ఉపసంహరించారు. గతంలో రద్దు చేసిన పశ్చిమబెంగాల్ ప్రభుత్వోద్యోగుల యూనియన్లు, అసోసియేషన్ల కో ఆర్డినేషన్ కమిటీ గుర్తింపును పునరుద్ధరించారు.

ఈ నూతన పరిస్థితుల్లో కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, కార్మికులు ఉద్యోగుల సమస్యల గురించి చర్చించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించటానికొక కోర్కెల పత్రాన్ని రూపొందించేందుకు ఒక సదస్సు ఏర్పాటుకు కేంద్ర ట్రేడ్ యూనియన్లు ప్రయత్నాలు ప్రారంభించాయి. కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల యూనియన్ల ప్రతినిధులతో కూడిన ఒక సన్నాహక కమిటీ 1977 ఆగస్టు 6న ఢిల్లీలో సమావేశమై సదస్సు ఏర్పాటుకు తుదిరూపమిచ్చింది. సన్నాహక కమిటీ నిర్ణయం ప్రకారం వేతన స్తంభనకు వ్యతిరేకంగానూ, కార్మికుల ఉమ్మడి కోర్కెల సాధనకు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 1977 సెప్టెంబర్ 18న జాతీయ సదస్సు నిర్వహించబడింది. సదస్సులో ఆరు కేంద్ర ట్రేడ్ యూనియన్లు సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి., టి.యు.సి.సి., యు.టి.యు.సి. (లెనిన్ సారణి) లతో బాటు ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ యూనియన్స్ అండ్ 'అసోసియేషన్స్' వంటి అనేక స్వతంత్ర జాతీయ ఫెడరేషన్లు సదస్సులో పాల్గొన్నాయి. ఈ యూనియన్ల నుండి 2300 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నట్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో నమోదైంది.

కార్మికవర్గం ఎదుర్కొంటున్న దిగువ నుదహరించిన ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ సదస్సు ఏకగ్రీవంగా ఒక తీర్మానం ఆమోదించింది.

1. ఎమర్జెన్సీలో జరిగిన దుశ్చర్యలను, కక్ష సాధింపు చర్యలను రద్దు చేయాలి.
2. మూసివేతలు, రిట్రెంచ్‌మెంట్లు, లే ఆఫ్‌లపై నిషేధం విధించాలి. పెరుగుతున్న నిరుద్యోగం దృష్ట్యా కార్మికులపై పనిభారం పెంచరాదు.
3. జీవన వ్యయసూచి పెరుగుదల దృష్ట్యా ప్రజా పటిష్టమైన పంపిణీ వ్యవస్థ నేర్పాటు చేసి ధరల నదుపుచేయాలి.
4. జనతా పార్టీ బోనసును వాయిదాపడిన వేతనంగా అంగీకరించింది. కాబట్టి కార్మికులందరికీ బోనసు ఇవ్వాలి.
5. నిర్బంధ పొదుపు పథకం (సిడిఎస్) లో బలవంతంగా జమచేసిన మొత్తాలు తిరిగి చెల్లించాలి.
6. ట్రేడ్ యూనియన్ హక్కులను పునరుద్ధరించాలి, యూనియన్ల అంతర్గత వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం మానుకోవాలి.

తాజా పరిణామాల గురించి సదస్సు ఒక విధాన ప్రకటనలో తన అభిప్రాయాలను

తెలియజేస్తూ, కార్మిక వర్గానికి ప్రభుత్వం చేసిన వాగ్దానాలను అమలు చేయవల్సిందిగా కోరింది. ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగానికి చేసిన సవరణలను పూర్తిగా రద్దుచేయవల్సిందిగానూ, ట్రేడ్ యూనియన్ ప్రజాతంత్ర హక్కులను పూర్తిగా పునరుద్ధరించవల్సిందిగానూ ఈ సదస్సు ప్రభుత్వాన్ని కోరింది. ఈ కోర్కెల సాధనకు దేశవ్యాప్తంగా వున్న కార్మిక వర్గాన్ని సమీకరించేందుకు 1977 అక్టోబర్ 24 నుండి 30 వరకు దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో ప్రచారం నిర్వహించి, ఐక్య ప్రదర్శనలతో ముగించే విధంగా 'కోర్కెల వారం' పాటించాలని సదస్సు తీర్మానించింది.

గతంలో కాంగ్రెస్ పాలనలో, ప్రధానంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వ దారుణ దమనకాండకు బలైపోయారు. అప్రజాస్వామికమైన 311(2) బి, సి అధికరణాన్ని, ఆ రాజ్యాంగ నిబంధనల నుండే ఏర్పడిన రైల్వే చట్టంలోని 14(II)/149 నిబంధనను విచక్షణా రహితంగా ప్రయోగించి ప్రభుత్వోద్యోగులను, రైల్వే ఉద్యోగులను ఏ కారణం చూపకుండా, వారికి సమర్థించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా సర్వీస్ నుంచి తొలగించారు. జనతా ప్రభుత్వ పాలన ప్రారంభంలో నెలకొన్న నూతన రాజకీయ పరిస్థితిలో రాజ్యాంగంలోని 311 (2) ఎ, బి, సి అధికరణాల రద్దు కోరుతూ అలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్.) 1978 ఫిబ్రవరి 5న పాట్నాలో జాతీయ సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ సదస్సులో ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్.కు అనుబంధమైన వివిధ రాష్ట్ర యూనియన్ల ప్రతినిధులు అనేక వందలమంది హాజరైనారు. కొన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు కూడా హాజరయ్యారు. దేశం నలుమూలల నుండి అనేకమంది ప్రఖ్యాత న్యాయశాస్త్ర కోవిదులు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

వలస పాలకుల వారసత్వంగా సంక్రమించిన 310 వ అధికరణాన్ని రద్దు చేయాలని సదస్సు ఆమోదించిన చర్చా పత్రంలో కోరడం జరిగింది. వలస పాలనకు వారసత్వంగా ఈ అధికరణం ప్రకారం కేంద్ర ఉద్యోగులు రాష్ట్రపతి ఇష్టానుసారం, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు గవర్నర్ ఇష్టానుసారం సేవలందించాలని ఈ అధికరణం నిర్దేశిస్తోంది. ఈ నిరంకుశ అధికరణం రద్దు కోరుతూ దేశంలో మొట్టమొదటిసారిగా జరిగిన జాతీయ సదస్సు ఇది.

ఈ సమయంలోనే 1974 ఏప్రిల్ నెలలో రైల్వే సమ్మెలో డిస్మిస్ చేయబడిన, నిర్బంధించబడిన ఉద్యోగులను జనతా ప్రభుత్వం తిరిగి ఉద్యోగాలలో నియమించింది. ఆ విధంగా 700 మంది ఉద్యోగులు మళ్ళీ ఉద్యోగాలలో చేరారు.

## కార్మిక వర్గానికి వ్యతిరేకంగా మారిన జనతా ప్రభుత్వ విధానాలు - భూతలింగం కమిటీ నివేదిక - పారిశ్రామిక సంబంధాల బిల్లు - ఆస్పత్రులు, విద్యాసంస్థల బిల్లు

కార్మికవర్గం శ్రమజీవుల మద్దతుతో కాంగ్రెస్ గుత్తాధిపత్యాన్ని అంతమొందించి 1977 మార్చిలో జనతాపార్టీ అధికారంలోకి రాగానే, నీతిగా, న్యాయంగా, ధర్మబద్ధంగా కార్మికులపట్ల

వ్యవహరిస్తానని బాస చేసింది. కానీ త్వరలోనే ఆ బాసలన్నీ మోసమని రుజువైనాయి. భూతలింగం కమిటీ నివేదిక, పారిశ్రామిక సంబంధాల బిల్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థల బిల్లు వంటి కార్మిక వ్యతిరేక చర్యలను ఒకదాని తరువాత మరొకటి ప్రవేశపెట్టడం ద్వారా, జనతా ప్రభుత్వం గద్దె నెక్కడానికి ఎంతగానో తోడ్పడిన భారత కార్మిక వర్గం మీద దాడులకు పూనుకుని, తన పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వర్గ వ్యతిరేక స్వభావాన్ని వెల్లడించుకుంది. ఈ నివేదికలు, బిల్లులు ఆమూలాగ్రం కార్మిక వ్యతిరేకమైనవి. పారిశ్రామిక కార్మికులు, ప్రభుత్వోద్యోగులు, ఆర్థిక రంగ సంస్థలతో సహా ఇతర సర్వీసు రంగ సంస్థల ఉద్యోగులు సమైక్యంగా జనతా ప్రభుత్వ అభివృద్ధి నిరోధక విధానాలను ప్రతిఘటించి ఓడించటానికి సన్నద్ధం కావలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ విధంగా భారత కార్మికవర్గం కాంగ్రెసేతర ప్రభుత్వం నుంచి కూడా మరోసారి దాడి నెదుర్కొవలసి వచ్చింది.

కాంగ్రెస్(ఐ) ప్రభుత్వం కానీ, నూతన జనతా ప్రభుత్వం గానీ, పద్ధతులు వేరైనప్పటికీ, పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తాయని స్పష్టమైంది.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే, 1977 అక్టోబర్ 13న జనతా ప్రభుత్వం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు సంబంధించిన వేతన స్కేళ్ళ నిర్మాణం విషయంలోను, కరువుభత్యం తదితర అలవెన్సుల చెల్లింపుల విషయంలోనూ నెలకొన్న తీవ్ర అవకతవకలను దృష్టిలో వుంచుకుని "వేతనాలు, ఆదాయాలు, ధరల విధానాన్ని" సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ఒక అధ్యయన సంఘాన్ని నియమించింది.

ఎస్. భూతలింగం ఈ కమిటీకి ఛైర్మన్ కాగా, డాక్టర్ ధరమ్ నారాయణ్, అరవింద్ బూచ్, హితేన్‌భయ్యాలు కమిటీ సభ్యులుగానూ, జి.సి. కటోచ్ కమిటీ కార్యదర్శిగా వున్నారు.

అధ్యయన సంఘం 1978 మే నెలలో ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించింది. అత్యంత అభివృద్ధి నిరోధకమైన ఈ నివేదిక వెల్లడైన వెంటనే, దేశంలోని యావత్ కార్మిక వర్గం ఐక్యమై ఈ నివేదిక అమలును తీవ్రంగా ప్రతిఘటించింది.

కార్మిక వర్గానికి ప్రధానమైన కనీస వేతనాలు, బోనస్, సంఘటిత కార్మికుల వేతనాలు, గ్రామీణ రంగంలో వేతనాలు, వేతన తారతమ్యాలు, కరువు భత్యం తదితర అంశాల విషయంలో కార్మిక వర్గం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న సదుపాయాలు, వివిధ కమిటీలు, కమిషన్ల ద్వారా సాధించుకున్న విధానపరమైన అభివృద్ధిని సర్వనాశనం చేసి, ఆ సమస్యలకు సంబంధించి అప్పటి వరకు వున్న అవగాహన పూర్తిగా అభివృద్ధి నిరోధకమని రుజువు చేయడానికి, ఈ అధ్యయన సంఘం సిఫార్సుల ద్వారా తీవ్రంగా ప్రయత్నించింది.

ఈ నివేదికను పూర్తిగా విశ్లేషించకపోయినా, కనీస వేతనం, బోనస్, కరువు భత్యం వంటి ప్రధాన అంశాల గురించి నివేదిక చేసిన సిఫార్సులను పరిశీలిస్తే, ఆ నివేదిక కార్మిక వ్యతిరేక స్వభావం వెల్లడవుతుంది.

మూడు యూనిట్ల కుటుంబానికి కావల్సిన ఆహారం, గృహ వసతి, వస్త్రాలు, వైద్యసదుపాయం కల్పించడానికి నెలకు రూ. 125/–లు కనీస వేతనం వుండాలని 1957లో జరిగిన 15వ త్రైపాక్షిక లేబర్ కాన్ఫరెన్స్ చేసిన ఏకగ్రీవ సిఫార్సులనీ కమిటీ తిరస్కరించింది. కనీస వేతన నిర్ణయంలో, "కనీసావసరాల ప్రాతిపదిక"నే ఈ భూతలింగం కమిటీ నిరాకరించింది. దానికి బదులుగా కమిటీ ఈ క్రింది విధంగా వివరణ ఇస్తూ ఐ.ఎల్.సి. సిఫార్సును త్రోసిపుచ్చింది.

'జాతీయ కనీస వేతనం నిర్ధారించటంలో అనేక విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు, ఆ కనీస వేతనానికి ఈ దిగువ అంశాలకు మధ్య పొంతన వుండాలి. 1) జాతీయాదాయంలో సంబంధిత తరగతుల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయించిన తలసరి జాతీయాదాయం. 2) కుటుంబంలోని ప్రతి యూనిట్ సగటు జాతీయాదాయం 3) గ్రామీణ ప్రాంతాలలో తలసరి ఖర్చు లఘు పరిశ్రమల రంగంలో లభిస్తున్న ఆదాయానికి కనీస వేతనానికి మధ్య ఎక్కువ తేడా వుండరాదు. కనీస వేతన నిర్ణయం నూతన ఉద్యోగాల కల్పనకు ఆటంకం కారాదు.

నివేదిక ఇంకా ఇలా పేర్కొంది. 'అన్ని నిత్యావసర సరుకులను పరిగణనలోకి తీసుకొని' అధ్యయన సంఘం 'ప్రస్తుత ధరల ప్రకారం జాతీయ కనీస వేతనం రు.150లకు చేరుకొనాలని, 'ఈ లక్ష్యాన్ని త్వరగా చేరుకోవటానికి ప్రయత్నాలు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఏడు సంవత్సరాల లోగా ఈ పని పూర్తికావాలి" అని కమిటీ సిఫార్సు చేసింది. అయితే వెంటనే కనీస వేతనం ఈ స్థాయిలో ఇవ్వటం వలన చిన్న పరిశ్రమలకు విఘాతం కలుగుతుందనీ, ఉద్యోగావకాశాలకు దెబ్బతగులుతుందనీ సంఘం భయపడింది. అయితే ఏం చేయాలి?

'అందువల్ల కనీస వేతనాన్ని 8 గంటల నైపుణ్యం లేని పనికి రోజుకు 4 రూపాయలు లేదా నెలకు రూ. 100/–లతో ప్రారంభించాలి. దీనిలో డబ్బుగా కాకుండా, విడిగా వస్తు రూపేణా ఇచ్చే దానిని కూడా లెక్కలోకి తీసుకోవాలి. లేక నెలకు రు.100లకు తగ్గకుండా ఈ వేతనం నిర్ణయించాలి' అని అధ్యయన బృందం సిఫార్సు చేసింది.

15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) 1957 ధరల ప్రకారం కనీస వేతనం రు.125గా నిర్ణయిస్తే అధ్యయన సంఘం ఆ వేతనాన్ని 1978 ధరలలో రు.100కి తగ్గించడం ఆశ్చర్యకరమైన విషయం. మూడవ కేంద్ర వేతన సంఘం 1972 వినిమయ ధరల సూచి (సిపిఐ) లో 200 పాయింట్లు ప్రాతిపదికగా రు.196 కనీస వేతనంగా నిర్ణయించింది. అధ్యయన సంఘం నిర్ణయించిన కనీస వేతనం దానిలో సగం కన్నా తక్కువ.

తమ సిఫారసుల ఉదారత పట్ల అచంచల విశ్వాసంతో, అధ్యయన సంఘం ఈ విధంగా ప్రకటించింది. 'ఈ విధాన ప్రకటన, కార్మిక వర్గానికి ఉత్సాహం కల్గించి, వారికి తమ హక్కుల పట్ల చైతన్యం కల్పిస్తుంది.' కానీ అందుకు పూర్తి భిన్నంగా, తీవ్ర ఆశాభంగానికి గురైన కార్మికులు తీవ్రమైన నిరసనోద్యమాలకు పూనుకున్నారు.

కార్మికోద్యమానికి మరొక ప్రధానమైన బోనసు సమస్య విషయంలో గతంలో సాధించుకున్న విధానపరమైన ప్రగతికి విరుద్ధంగా సిఫార్సులు చేయడం ద్వారా అధ్యయన సంఘం కార్మికులు అప్పటికే సాధించుకున్న సదుపాయాలను నిరాకరించింది. 1965 బోనసు చట్టానికి ముందు, సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పుల్లో బోనసును వాయిదా పడిన వేతనంగా గాని, దయాదాక్షిణ్య పూర్వకమైన చెల్లింపు (ఎక్స్‌గ్రేషియా)గా గాని పరిగణించలేదు. పరిశ్రమకు చేకూరిన లాభాలకు కార్మికులకిచ్చే పరిహారంగా మాత్రమే పరిగణించింది. అంతేకాక కార్మికులు వాస్తవంగా పొందే వేతనానికి, జీవనానికి సరిపడే వేతనానికి మధ్య గల అంతరాన్ని తగ్గించే సాధనంగా గుర్తించింది.

1961లో నియమించబడిన త్రైపాక్షిక బోనస్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రూపొందించబడిన 1965 బోనస్ చెల్లింపుల చట్టం బోనసు సూత్రంలో ఒక సమూలమైన మార్పు తెచ్చింది. లాభ నష్టాలతో నిమిత్తం లేకుండా కనీస బోనసు 4 శాతం వుండాలనీ, లాభాలతో ముడిపెట్టిన బోనసు గరిష్టస్థాయి 20 శాతం వుండాలనీ చట్టంలో పేర్కొన్నారు. భారత కార్మికవర్గం బోనసును వాయిదాపడిన వేతనంగా పరిగణించాలని సాగించిన పోరాటం ఫలితంగా మొదటిసారిగా చట్టం ఆ సూత్రాన్ని గుర్తించింది. అయితే అధ్యయన బృందం కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఆ సూత్రాన్ని పూర్తిగా రద్దు చేయబూనుకుంది.

'బోనసు సూత్రం హేతుబద్ధమైన, సక్రమమైన ప్రాతిపదికన ననుసరించి లేదని' అధ్యయన బృందం వాదించింది. "హేతుబద్ధంగా ఆలోచిస్తే, భారతదేశంలో చిరకాలంగా అమలులో వున్న బోనస్ చెల్లింపు విధానం, సాధారణంగా పోటీపడే వాతావరణంలో, మార్కెట్లో వ్యాపారానికి ఉత్పత్తి చేసే పరిశ్రమలకు మాత్రమే సరిపడుతుంది. లాభాపేక్షతో గాక, సామాజిక సంక్షేమం దృష్టితో నిర్వహిస్తూ, ప్రభుత్వ విధానాల ప్రభావంతో లాభాలార్జించే పారిశ్రామిక, తదితర సంస్థలకీ విధానం పొసగదు. అందువల్ల రైల్వేలు, తంతి – తపాలా వంటి ప్రభుత్వ సర్వీసులు, ఆర్థిక తదితర సంస్థలతో సహా వివిధ ప్రభుత్వ తదితర సర్వీసులకీ పద్ధతి సరిపడదని" అధ్యయన బృందం భావించింది. అందువల్ల "లాభాలను బట్టి బోనస్ చెల్లించే పద్ధతిని నూతన రంగాలకు విస్తరించే ప్రశ్నే లేదు. అంతేగాక ఈ విధానం సరిపడని రంగాల్లో, ఈ పద్ధతి అమల్లో వుంటే, ఆ రంగాల్లో దశల వారీగా ఈ పద్ధతికి స్వస్తి చెప్పి, దాని స్థానంలో అవసరమైతే పని తీరు (ఉత్పాదకత)కు ముడిపెట్టి, వేరే విధంగా చెల్లింపులు చేసే పద్ధతులు ప్రవేశపెట్టుకోవచ్చు" అని అధ్యయన బృందం సిఫార్సు చేసింది.

బోనస్ విషయంలో ఇప్పటికే సాధించుకున్న ప్రగతిని కాలరాచి కార్మికులు, ఉద్యోగులు పోరాడి సాధించుకున్న ఈ సదుపాయాన్ని హరించి వేసే విధంగా, ఈ సిఫార్సులు మిక్కిలి తిరోగమనదాయకంగా వున్నాయి.

ఉద్యోగులు, కార్మికుల జీతాలలో ముఖ్య భాగమైన కరువు భత్యం విషయంలో కూడా అధ్యయన సంఘం సిఫారసులు చాలా తిరోగమనదాయకంగా వున్నాయి.

దేశంలో రెండు పద్ధతుల్లో కరువు భత్యం చెల్లించడం జరుగుతోంది. ఒకటి సెంట్రల్ పే కమీషను రూపొందించినది. రెండవది పారిశ్రామిక కరువు భత్యం. ఇందులో మొదటిది ఎక్కువ లాభదాయకం. ఎందుకంటే దిగువ స్థాయి మూలవేతనం వరకైనా ధరల పెరుగుదలను డి.ఎ. ద్వారా పూర్తిగా భర్తీ చేయడం వల్ల మొదటి పద్ధతి ఎక్కువ లాభదాయకం. అందువల్ల పారిశ్రామిక కార్మికులు కూడా ఈ పద్ధతిలోనే కరువు భత్యం చెల్లించాలని డిమాండు చేస్తున్నారు.

అయితే ఈ రెండు పద్ధతులలో అధ్యయన సంఘం పారిశ్రామిక కార్మికులు వ్యతిరేకిస్తున్న రెండవ పద్ధతినే ఎంచుకొంది. అధ్యయన సంఘం ప్రకారం "కరువు భత్యం చెల్లింపు విషయమై అమలులో వున్న రెండు పద్ధతుల్లో, మూల వేతనాలతో ముడిపెట్టి, శ్లాబు పద్ధతిలో చెల్లింపు ఒకటి కాగా, సిపిఐలో ప్రతి పాయింట్ పెరుగుదలకు నిర్ణీత మొత్తం డి.ఎ.గా చెల్లించడం రెండవ పద్ధతి. ప్రతి పాయింట్‌కు ఒక నిర్ణీత మొత్తం కరువు భత్యంగా చెల్లించే పద్ధతి హేతుబద్ధంగా వుండటంతో పాటు, అందరికీ అర్థం చేసుకునేందుకు, అమలు చేసేందుకు కూడా సులువుగా వుంటుంది. మూల వేతనంతో నిమిత్తం లేకుండా కరువు భత్యం చెల్లించే సౌకర్యం ఈ విధానంలో వుంది" అని అధ్యయన బృందం పేర్కొంది.

ఆ విధంగా ప్రతి పాయింటుకు కరువు భత్యం నిర్ణయించాలనే సూత్రాన్ని 'భవిష్యత్ వేతన సవరణలకు' వర్తింప చేయాలని అధ్యయన బృందం చేసిన సిఫార్సు ప్రభుత్వోద్యోగులకే కాక, పారిశ్రామిక కార్మికులకు కూడా నష్టదాయకంగా పరిణమించింది.

అధ్యయన బృందం చేసిన కార్మిక వ్యతిరేక సిఫారసులు సహజంగానే కార్మికులు, ఉద్యోగులలో తీవ్రమైన అసంతృప్తిని రేకెత్తించడంతో, వారు ఐక్యంగా ప్రతిఘటించడం ప్రారంభించారు.

అత్యంత ప్రగతి నిరోధక, కార్మిక వ్యతిరేక భూతలింగం కమిటీ నివేదిక తరువాత, జనతా ప్రభుత్వం 1978లో సెప్టెంబరు – నవంబర్ మధ్య కాలంలో జరిగే పార్లమెంటు సమావేశాలలో అతిహేయమైన 'పారిశ్రామిక సంబంధాల బిల్లు'ను ప్రవేశపెట్టింది. ఈ బిల్లులోని ప్రమాదకరమైన నిబంధనలు పార్లమెంటు లోపలా, వెలుపలా తీవ్ర అలజడిని రేపాయి. యావత్ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించి, ఈ బిల్లును ప్రతిఘటించడానికి ఐక్యంగా పోరాటాలు సాగించింది.

సమ్మెల నిషేధానికి, కార్మికులు తమ యూనియన్‌ను ఎంచుకునే విషయంలోనూ, కార్మికుల ఉమ్మడి బేరసారాల హక్కు విషయంలోనూ అధికారుల అనుచిత జోక్యానికి అవకాశం కల్పించడం వంటి హానికరమైన అంశాలెన్నో ఈ బిల్లుల్లో చోటు చేసుకున్నాయి.

అనేక పారిశ్రామిక కార్యకలాపాలు, సర్వీసులను 'అత్యవసర సర్వీసులు'గా ప్రకటించి, ఆ రంగాలలో సమ్మెలను నిషేధించారు. ఆ రంగాలు ఇవి. 1. రక్షణ శాఖకు సంబంధించిన అన్ని విభాగాలు 2. రైల్వే సర్వీసులు భూ, జల, వాయు మార్గాలలో రవాణాకు సంబంధించిన

అన్ని విభాగాలు 3. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు సంబంధించిన అన్ని సర్వీసులు 4. ప్రధానపోర్టులు, డాక్‌యార్డులు, వాటికి సంబంధించిన అన్ని సర్వీసు విభాగాలు 5. అన్ని పారిశ్రామిక విభాగాలు, ఆ పరిశ్రమల అధ్వర్యంలో నడిచే సంస్థల భద్రతా విభాగాలు 6. పోస్టల్, టెలిఫోన్, టెలిగ్రాఫ్ సర్వీసులు, 7. ఆహారధాన్యాల కొనుగోలు, సేకరణ, నిల్వలు, సరఫరా లేదా పంపిణీ చేసే పబ్లిక్ రంగ సంస్థలు, వాటికి సంబంధించిన ఇతర సర్వీసులు 8. విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగానీ ప్రజలకు విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా నిర్వహించే పరిశ్రమలు 9. పారిశుధ్య సేవలు 10. బ్యాంకింగ్ 11.అణుశక్తి రంగం, విద్యుదుత్పాదక కేంద్రాలు 12. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ.

అంతేగాక 'అత్యవసర సర్వీసుల' జాబితాలో సమ్మెను నిషేధించదలచుకున్న పరిశ్రమలను చేర్చడానికి ప్రభుత్వానికి అధికారం కల్పించే నిబంధనలు బిల్లులో ఉన్నాయి. ఆ విధంగా అత్యధిక పరిశ్రమలను సమ్మెలు నిషేధించే అధికారాల పరిధిలోకి తెచ్చేందుకీ సిఫార్సుల ద్వారా తీవ్రంగా ప్రయత్నించడం జరిగింది.

సమ్మెల నిషేధానికి లోనుకాకుండా ఉదారంగా మినహాయించబడ్డ పరిశ్రమలలో కూడ సమ్మె చేయడానికి వీలులేకుండా ట్రేడ్ యూనియన్‌ల కార్యక్రమాలలో అధికారులు జోక్యం చేసుకునే విస్తృత యంత్రాంగం ఏర్పాటు చేశారు. లేబర్ కమిషనర్లు, కన్సీలియేషన్ (మధ్యవర్తిత్వం నెరిపే) అధికారులు, రిజిస్ట్రార్లు, కోర్ట్సు ఆఫ్ ఎంక్వైరీ (విచారణ కోర్టులు), లేబర్ కోర్టులు, ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్స్, అవసరమైన, అవసరమని భావించిన సందర్భాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన నేషనల్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ (జాతీయ పారిశ్రామిక సంబంధాల కమిషన్లు) వంటి అధికార యంత్రాంగానికి సంబంధించిన సాలెగూళ్ళ వంటి ఈ సంస్థల్లో చిక్కుకుని, సాధారణ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల నిర్వహణ కూడా దాదాపు అసాధ్యమయ్యేందుకు దోహదం చేసే అంశాలీ బిల్లులో వున్నాయి.

ఈ తతంగాన్ని అధిగమించి ఏ ట్రేడ్ యూనియన్ అయినా సమ్మెకు సాహసిస్తే కనీసం 60 శాతం కార్మికులు సమ్మెకు మద్దతునిస్తున్నారో, లేదో తెలుసుకునే అధికారం రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌కు కల్పించారు. అన్నిటినీమించి ఏది ఏమైనా ప్రభుత్వం ఏ సమ్మెనైనా చట్టవిరుద్ధంగా ప్రకటించి, నిషేధించబడిన ఆ సమ్మెలో పాల్గొన్న కార్మికులకు 3 నెలల జైలుశిక్ష విధించే అధికారం దఖలుపరచుకున్నది. కార్మిక వ్యతిరేక బిల్లులో ఆ విధమైన క్రూర నిబంధనలననేకం పొందుపరిచారు.

పూర్తిగా ప్రగతి నిరోధకమైన ఈ బిల్లును వామపక్ష సభ్యులతో పాటు, అధికార జనతాపార్టీ, పార్లమెంట్ సభ్యుడు మధూలిమయే కూడ ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే సమయంలోనే వ్యతిరేకించారు. తీవ్రమైన సంఘటిత నిరసన వలన ప్రభుత్వం చివరకు ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపవల్సి వచ్చింది.

సరిగ్గా ఈ సమయంలో సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి, ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్, బ్యాంకింగ్,

ఇన్సూరెన్స్, తదితర పబ్లిక్‌రంగ సంస్థల జాతీయ ఫెడరేషన్ల వంటి వివిధ స్వతంత్ర జాతీయ ఫెడరేషన్లు 1978 నవంబర్ 19న న్యూఢిల్లీలో బ్రహ్మాండమైన జాతీయ సదస్సు నిర్వహించాయి. దీనిలో 8000 మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పూర్తిగా కార్మిక వ్యతిరేక స్వభావం గల్గిన ఈ బిల్లును నిర్ణయాత్మకంగా ప్రతిఘటించడానికి ట్రేడ్ యూనియన్లు మహత్తర ఐక్యతను ప్రదర్శించాయి. ఈ సదస్సులో పాల్గొన్న ట్రేడ్ యూనియన్లు, జాతీయ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో ఆ మర్నాడే అంటే 1978 నవంబర్ 20న పార్లమెంటుకు బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు. ఈసారి ఐ.ఎన్.టి.యు.సి. నాయకులు కూడా సభలో పాల్గొని ప్రసంగించారు. ఒకటిన్నర లక్షలమంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్న ఈ మహా ప్రదర్శన బోట్ క్లబ్ మైదానంలో బ్రహ్మాండమైన బహిరంగసభతో ముగిసింది.

సభ ఈ బిల్లును తీవ్రంగా ఖండిస్తూ, దానిని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. "కార్మికుల ఉమ్మడి బేరసారాల హక్కులను నిరాకరించడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని" ముందు రోజు జరిగిన సదస్సు ఆమోదించిన తీర్మానం పేర్కొంది. "బిల్లు చట్టంగా రూపొందితే అది ప్రజాతంత్ర ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి చరమగీతం పాడుతుందని" తీర్మానం హెచ్చరించింది. ఈ బిల్లును సమైక్యంగా ప్రతిఘటించవల్సిందిగా, అన్ని రంగాల్లోని కార్మికులు, ఉద్యోగులకు తీర్మానం విజ్ఞప్తి చేసింది.

ఒక ప్రక్క బిల్లును ప్రతిఘటించేందుకు ట్రేడ్ యూనియన్లు సంఘటితంగా పోరాడుతుంటే, వేరొకప్రక్క బిల్లు చట్టంగా రూపొందడంతో జరిగే జాప్యం పట్ల పెట్టుబడిదారీవర్గ ప్రతినిధులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

బిల్లు చట్టంగా రూపొందడంతో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించి చట్టం తెచ్చేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి), ప్రభుత్వాన్ని కోరింది. "దిగజారుతున్న పారిశ్రామిక సంబంధాల వల్ల పారిశ్రామికాభివృద్ధి కుంటుపడింది."

సమ్మెలు, గో స్లోలు, నిబంధనల మేరకు పని, ఘెరావ్‌లు పెరగడం పట్ల ఫిక్కి 52వ వార్షిక సమావేశం రెండవ రోజు సమావేశం ఆందోళన వ్యక్తం చేస్తూ తీర్మానం ఆమోదించింది. యూనియన్ల మధ్య తీవ్రమైన తగాదాలు, ట్రేడ్ యూనియన్‌లో రాజకీయ జోక్యం ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలని భావించడం జరిగింది" అని స్టేట్స్‌మన్ పత్రిక రాసింది.

"తీర్మానాన్ని ప్రతిపాదించిన ప్రముఖ పారిశ్రామికవేత్త కె.ఎన్. మోడీ బిల్లును వెంటనే ఆమోదించవల్సిందిగా కోరారు. రాజకీయ కారణాలతో బిల్లును నీరుకార్చరాదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిల్లులో మార్పులు చేస్తే అది నిరర్థకమవుతుందని' కె.ఎన్.మోడీ పేర్కొన్నట్లు అదే పత్రిక రాసింది.

బిల్లు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం రూపొందించబడిందని, కార్మికవర్గ ప్రతిఘటన వలన చట్టం చేయడంలో జరిగే ఆలస్యం వారి కోపానికి కారణమైందని స్పష్టమవుతోంది. పెట్టుబడిదారీవర్గం దురదృష్టం వలన ప్రభుత్వమే పతనం కావటం వలన బిల్లు రద్దయిపోయింది.

ప్రభుత్వం ఇంతటితో ఆగలేదు. మొరార్జీదేశాయ్ ప్రభుత్వం పతనం కాబోయే ముందు, 1978వ సంవత్సరంలో 141 వ బిల్లుగా వున్న ఆసుపత్రులు, విద్యాసంస్థల (ఉద్యోగుల సర్వీసు నిబంధనలు, ఉద్యోగ వివాదాల పరిష్కారాల) బిల్లు, 1978 పేరిట మరొక దుర్మార్గమైన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది.

దీని ప్రకారం 20 మంది, అంతకన్నా ఎక్కువమంది ఉద్యోగులు వున్న ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ఈ బిల్లు వర్తిస్తుంది. ఈ బిల్లు చట్టంగా రూపొందిన తరువాత 20 మంది కన్నా తక్కువ ఉద్యోగులు గల ఆసుపత్రులు, విద్యాసంస్థలకు కూడా దీనిని వర్తింపచేయవచ్చు. అప్పటి కేంద్ర కార్మికమంత్రి రవీంద్రవర్మ బిల్లు లక్ష్యాలను ఈ విధంగా వివరించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, శాస్త్రీయ పరిశోధనా సంస్థల ప్రత్యేక స్వభావం దృష్ట్యా ఆందోళనలు, వివాదాలు లేని వాతావరణం ఆ సంస్థలలో నెలకొనాలి. అందువలన ఆ సంస్థలను పారిశ్రామిక సంబంధాల బిల్లు పరిధి నుండి తొలగించడం జరిగింది. కానీ ఈ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు రక్షణ కల్పించాలి. వారు వ్యక్తిగతంగా గాని, సామూహికంగా గాని ఉద్యోగంలో ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించే యంత్రాంగం వుండాలి. ఈ లక్ష్యం సాధించడమే ఈ బిల్లు ఉద్దేశ్యం. ఆ విధంగా కేంద్రమంత్రి హర్షణీయమైన లక్ష్యంతో బిల్లును ప్రవేశపెట్టారు. అయితే ఈ వాదన ఎంత నిరాధారమైనదో బిల్లును యధాలాపంగా పరిశీలించినా అర్థమవుతుంది. ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, చికిత్సా కేంద్రాలతో పాటు, యూనివర్శిటీలు, కాలేజీలు, శాస్త్రీయ పరిశోధన శిక్షణా కేంద్రాలతో సహా అన్ని విద్యా సంస్థల్లో సమ్మెల మాట అటుంచి, న్యాయమైన ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను నిషేధించటానికి ఈ బిల్లులో నిబంధన వున్నది. ఒక ఉద్యోగికి గాని, ఉద్యోగులకు యజమానులకు మధ్య వివాదాలు గాని, విభేదాలు గాని తలెత్తితే సందర్భాన్ని బట్టి సమస్యల పరిష్కార కమిటీకి లేక సంప్రదింపుల కౌన్సిల్‌కు నివేదించాలి.

అటువంటి కమిటీలు, కౌన్సిళ్ళలో గాని యజమానుల తరపున, ఉద్యోగుల తరపున సమాన సంఖ్యలో ప్రతినిధులుంటారు. కానీ ఉద్యోగుల తరపున ఎవరు ప్రతినిధులుగా వుండాల్సిందీ యజమానులే ఏకపక్షంగా నిర్ణయిస్తారు. ఈ కమిటీలు, కమీషన్లు యజమానుల వేదికగా ఉపయోగపడేటట్లు, ఉద్యోగుల ప్రయోజనాలకు హానికలిగే విధంగా యజమానుల కనుసన్నలలో వుండే వేదికలుగా వుండే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

ఈ సంస్థలలో సమ్మెలు, లాకౌట్లు నిషేధించబడినాయి. చట్టాన్ని ఉల్లఘించిన వారు శిక్షార్హులవుతారు. బిల్లులో మరో నిబంధన కూడా చేర్చారు. 'చట్ట ప్రకారం శిక్షార్హమైన

నేరం గురించి గానీ, ఆ నేరానికి దోహదం చేసే చర్యల గురించి, తగు స్థాయిలో ప్రభుత్వం, ప్రభుత్వం నుంచి అధికారం పొందినవారు గానీ ఫిర్యాదు చేస్తేనే గాని కోర్టులు పరిగణనలోకి తీసుకోరు'. దాని అర్థం ఉద్యోగుల తరపున చేసిన ఏ ఫిర్యాదు కోర్టు పరిగణనలోకి రాదు. సహజంగానే ఉద్యోగుల తరపున ప్రభుత్వం ఫిర్యాదు చేస్తుందని ఆశించటానికి ఏ అవకాశం లేదు.

నేరం చేసిన యజమానులను రక్షించటానికి బిల్లులో కొన్ని నిబంధనలు పొందుపరిచారు. యజమాని గానీ, కంపెనీ గాని నేరం తనకు తెలియకుండా జరిగినట్లుగా గానీ, దానిని నిరోధించేందుకు తగిన చర్యలు తీసుకున్నప్పటికీ అలా జరిగినట్లు రుజువు చేస్తే, వారు శిక్షార్హులు కారు.

అంతేగాక ఈ క్రింది నిబంధన ద్వారా తప్పు చేసిన యజమానులకు పూర్తి రక్షణ కల్పించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. దానికి సంబంధించిన నిబంధన ఈ విధంగా వున్నది. 'ఈ చట్టం ప్రకారం, దానిలోని నిబంధనల ప్రకారం మంచి ఉద్దేశ్యంతో ఏ పని చేసినా, చేయాలని సంకల్పించినా, వారి చర్యలను కోర్టులలో సవాలు చేయడానికి, న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి  వీలుపడదు." ఆ విధంగా అన్ని నిబంధనలు పొందుపరచారు. బిల్లు నిబంధనల ప్రకారం తప్పు  చేసిన యజమాని  చట్టపరంగా శిక్షార్హుడుకాడు. మొరార్జీ దేశాయ్ నాయకత్వంలోని జనతా ప్రభుత్వం దేశంలో కార్మికోద్యమం గొంతును నులిమివేయడానికి అవసరమైన చట్టపరమైన సన్నాహాలతో సిద్ధమైంది. కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు మొదలైనవారిలో ఆగ్రహం పెల్లుబికి అటువంటి రాక్షస బిల్లును చట్టంగా రూపొందించడానికి వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## అణచివేతకు వ్యతిరేకంగా పెల్లుబికిన పోరాటాలు

ప్రభుత్వం నుండి తీవ్రమైన దాడినెదుర్కొని రిజర్వ్‌బ్యాంక్ ఉద్యోగులు ఒక మహత్తరమైన పోరాటం చేశారు. ఆలిండియా రిజర్వ్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చార్టరు ఆఫ్ డిమాండ్స్ సాధనకు 1974 నుండి పోరాటం చేస్తోంది. వారి డిమాండ్లు ఈ విధంగా వున్నాయి. 1. పారిశ్రామిక కార్మికుల ధరల సూచిలో 200 పాయింట్ల వద్ద కరువుభత్యాన్ని, మూలవేతనంతో పూర్తిగా విలీనం చేయడం, 2. ప్రతి 4 పాయింట్ల పెరుగుదలకు (1979లో 337 పాయింట్లు - 200 = 137 పాయింట్లు) మూడు నెలలకొకసారి సమీక్షించి 1.5 శాతం కరువుభత్యం చెల్లింపును కోరుతున్నారు. కాని మేనేజ్‌మెంట్ 200 పాయింట్ల వద్ద కరువుభత్యం పూర్తిగా విలీనం చేయడానికి ఒప్పుకోలేదు. కరువుభత్యం విలీనంలో కనీసం 10 శాతం తగ్గించాలని పట్టుబట్టింది. అంతేగాక కరువుభత్యం  పై స్థాయిలో తగ్గిపోయి చివరకు వేతనాలపై సీలింగు వచ్చేటట్లు  పట్టుపట్టారు.

ఈ యాజమాన్య వైఖరికి నిరసనగా అసోసియేషన్ అనేక రూపాలలో ఆందోళన నిర్వహించింది. చివరకు 1979 మే 16 నుండి ఓవర్‌టైమ్ బాయ్‌కాట్ కార్యక్రమం చేపట్టింది.

ఆ తర్వాత 1979 మే 21 నుండి ఆందోళననుధృతం చేసి ఉద్యోగులు 'నిబంధనల మేరకు పని' ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఆందోళన వలన బ్యాంకింగ్ పరిశ్రమ మీద తీవ్ర ప్రభావం పడి, 1979 జూన్ 30 నాటికి లెక్కలు తేల్చడానికి సంబంధించిన పనిని రిజర్వు బ్యాంక్ ముగించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో ద్వైపాక్షిక చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించే ఉత్తమ మార్గాన్ని ప్రభుత్వం విడనాడి, ప్రభుత్వం 1979 జూన్ 18న వివాదాన్ని ట్రిబ్యునలుకు నివేదించింది. ఈ ఏకపక్ష చర్య వల్ల తీవ్ర ఆగ్రహం చెందిన 18000 మంది రిజర్వు బ్యాంకు ఉద్యోగులు 1979 జూన్ 19న వాకౌట్ సమ్మె నిర్వహించారు. బొంబాయి ఆఫీసులో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వివిధ కేంద్రాలలో పోలీసులు ఉద్యోగులపై విరుచుకుపడ్డారు. జైపూర్‌లో పోలీసులు ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై లాఠీచార్జి చేసి ఏడుగురు యూనియన్ కార్యకర్తలను అరెస్టు చేశారు. బొంబాయి, ఢిల్లీలో 17 మంది కార్యకర్తలను అరెస్టు చేశారు. కలకత్తాలో వామపక్ష సంఘటన ప్రభుత్వం వుండటం వలన ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై పోలీసులు చర్య తీసుకోలేదు.

రిజర్వు బ్యాంకులో సమ్మెను నిషేధిస్తూ 1979 జూలై 5న ప్రభుత్వం ఆర్డినెన్సు జారీచేయడం ద్వారా ఉద్యోగులపై తీవ్రంగా విరుచుకుపడింది. ఆర్డినెన్సులో సమ్మె అంటే, కొంతమంది పని నిలిపివేయటమే కాక, '(1) బ్యాంకు విధులను నిర్వహించటానికి అవసరమైన ఓవర్‌టైమ్ పని చేయటానికి నిరాకరించడాన్ని (2) బ్యాంకులో పని పూర్తిగా నిలిచిపోవటానికి లేదా పని గణనీయంగా తగ్గిపోవటానికి దోహదం చేసే అన్ని కార్యకలాపాలను ఈ ఆర్డినెన్స్ ద్వారా సమ్మె పరిధిలోకి తెచ్చారు.

ఆర్డినెన్సులో వున్న ఈ దుస్సాహసిక నిబంధనలను ప్రయోగించి ప్రభుత్వం రిజర్వుబ్యాంకు ఉద్యోగుల ఆందోళనను అణచటానికి పూనుకున్నది. మద్రాసు, బెంగుళూరు, ఢిల్లీ, జైపూరు, పాట్నా, కాన్పూరు నగరాలలో 100 మంది కార్యకర్తలను నిర్బంధించి 250 మందిని సస్పెండ్ చేశారు.

రిజర్వు బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న ఈ దాడికి ఆగ్రహించిన వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు, వారికి సంఘీభావంగా వివిధ కేంద్రాలలో సంఘీభావ ఉద్యమం ప్రారంభించారు. పశ్చిమబెంగాల్‌లోని వాణిజ్య బ్యాంకులు ఎల్.ఐ.సి., జి.ఐ.సి., వ్యాపార సంస్థలలో పనిచేసే ఉద్యోగులు 1979 జూలై 20న ఒక్క గంట సంఘీభావ సమ్మె జరిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చివరకు రిజర్వుబ్యాంకు మేనేజ్‌మెంటు యూనియన్‌తో చర్చలకు అంగీకరించడంతో, రిజర్వుబ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ 1979 ఆగస్టు 4న ఆందోళన విరమించింది. రిజర్వుబ్యాంకు ఉద్యోగుల ఉద్యమాన్ని అణచటానికి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో పాటు, సాగించిన దమనకాండ దేశంలోని కార్మికులు, ఉద్యోగుల మనసుల్లో ప్రగాఢమైన ముద్రవేశాయి. జనతా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక స్వభావం సుస్పష్టమైంది.

ఇదే సమయంలో ప్రభుత్వ వేతన స్తంభన విధానాలకు, ప్రభుత్వరంగ సంస్థల్లో వేతన సవరణ చర్చల్లో ప్రభుత్వం, బ్యూరో ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (బి.పి.ఇ.)ల బాహాట జోక్యానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్త పోరాటాలు నిర్వహించేందుకు ప్రభుత్వ రంగ సంస్థల (పిఎస్‌యు) ఉద్యోగులు ఏకమయ్యారు. ప్రభుత్వ రంగ ఉద్యోగుల ఐక్య పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్ళడంలో 1979 జూలై 19, 20 తేదీల్లో బెంగుళూరులో జరిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లోని ట్రేడ్ యూనియన్ల అఖిల భారత సదస్సు ఒక మైలురాయి వంటిది. 1979 ఆగస్టు 13న ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని, 1979 ఆగస్టు 29న స్థానిక అధికారులకు సామూహిక రిప్రజెంటేషన్లు చేయాలని, చివరకు 1979 సెప్టెంబర్ 14న ఒకరోజు దేశవ్యాప్త సమ్మెను నిర్వహించాల్సిందిగా ఈ సదస్సు పిలుపునిచ్చింది.

ఈ కాలంలోనే ఆలిండియా ఇ.ఎస్.ఐ.సి. ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు మేరకు 10 వేల మంది ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగులు సాగించిన నిరవధిక సమ్మె ప్రాధాన్యత సంతరించుకున్నది. సమంజసమైన వేతన స్కేళ్ళు, బోనస్ వంటి ప్రధాన డిమాండ్ల సాధనకు 1979 జూలై 3న ప్రారంభమైన ఈ సమ్మె కేంద్ర కార్మిక మంత్రితో చర్చలు జరిగిన తరువాత జూలై 21న విరమించబడింది. సుదీర్ఘ కాలం నిర్లక్ష్యం చేయబడిన ఈ డిమాండ్లలో కొన్ని పరిష్కారమైనాయి. కొన్ని ప్రధాన సమస్యలను సానుభూతితో పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ఈ కాలంలోనే ఇన్సూరెన్స్ ఉద్యోగులు కూడా మహత్తర పోరాటాలు చేశారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, మరో 4 యూనియన్ల పిలుపుననుసరించి 45,000 మంది ఎల్.ఐ.సి. ఉద్యోగులు 1979 జూలై 12న చార్టరు ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ ఒక రోజు సమ్మె చేసారు. అంతకు ముందు మార్చి 27న, మే 4వ తారీకున రెండు గంటల వాకౌటు సమ్మెలు చేశారు. చార్టరు ఆఫ్ డిమాండ్స్ పరిష్కరించటానికి బదులుగా అధికారులు అప్పుడు అమలులో వున్న కరువు భత్యం సూత్రం మార్చివేసి ఉద్యోగుల వేతనాలలో కోతబెట్టాలని, ఇతర హక్కులు, సదుపాయాలను హరించాలని ప్రయత్నం చేశారు.

దేశ పత్రికా సామ్రాజ్యాన్నేలుతున్న టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపులో పని చేసే 4500 మంది పత్రికా విలేకరులు, ఇతరులు 1978 జనవరి 1వ తేదీ నుంచి తమ వేతనాలను నెలకు రు.150 లు పెంచాలని కోరుతూ, 1979 జూలై మధ్య భాగం నుంచి నిరవధిక సమ్మె చేశారు. పత్రికా రంగంలో వేతన వ్యవస్థను ఆ సమయంలో పరిశీలిస్తున్న ట్రిబ్యునల్ అవార్డును అమలుచేసే లోగా తాత్కాలిక భృతిగా రూ. 150/- చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

## జనతా ప్రభుత్వంలో చీలిక - పతనం

సరిగ్గా ఈ సమయంలోనే మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో జనతా ప్రభుత్వంలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం నెలకొంది. దేశమంతటా కార్మికులు, ఉద్యోగులు, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించి పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వమే ఇచ్చిన హామీ మేరకు నిర్బంధ పొదుపు పథకంలో సొమ్మును వాపసు చేయటానికి ప్రభుత్వం తిరస్కరించింది. పైపెచ్చు ఆర్డినెన్సు ద్వారా నిర్బంధ పొదుపు పథకం కాలాన్ని పొడిగించింది. ప్రజలలో సర్వత్రా అసంతృప్తి నెలకొంది. చివరకు పారామిలటరీ దళాలు కూడా సమ్మెలు ఆందోళన ప్రారంభించాయి. ఉత్తరప్రదేశ్, కేరళ రాష్ట్రాలలో సెంట్రల్ రిజర్వు పోలీసులు సమ్మె చేశారు. కేరళలో వీరి సమ్మె 54 రోజులు సాగింది. ఈ పరిస్థితులు ప్రభుత్వం కొనసాగటానికి ప్రతికూలంగా పరిణమించాయి.

జనతా పార్టీ, ఆ పార్టీ నాయకత్వంలో వున్న ప్రభుత్వానికి, జనతా పార్టీలోకి భాగస్వామిగా' వున్న జనసంఘ్ యొక్క మతతత్వ వైఖరి తీవ్రమైన సమస్యగా పరిణమించింది. తీవ్ర ప్రగతి నిరోధక స్వభావం గల్గిన మతతత్వ జనసంఘ్ ద్వంద్వ సభ్యత్వ సమస్య జనతా పార్టీలోనూ, దాని ప్రభుత్వంలోనూ తీవ్ర వివాదం రేపింది. జనతాపార్టీలోని ఒక విభాగం, జనసంఘ్‌కు ఆర్.ఎస్.ఎస్.తో గల అనుబంధం గురించి అభ్యంతరం లేవదీసింది. ఈ సమస్య జనసంఘీయుల మొండివైఖరి, మొరార్జీదేశాయ్ అస్పష్ట వైఖరి వలన ఈ వివాదం పరిష్కారం కాలేదు. పార్లమెంటులో వామపక్ష సభ్యులు కూడా జనసంఘ్ వారు ఆర్.ఎస్.ఎస్.తో గల అనుబంధాన్ని తెంచుకోవాలని, డిమాండ్ చేశారు. పాలనా యంత్రాంగాన్ని మతోన్మాదపూరితం చేయడాన్ని వారు తీవ్రంగా విమర్శించారు.

చివరకు జనతాపార్టీకి చెందిన రాజ్‌నారాయణ్, కాంగ్రెస్(ఐ)కి చెందిన వై.బి.చవాన్‌తో పాటు 56 మంది వామపక్ష లోక్‌సభ సభ్యుల మద్దతుతో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాసతీర్మానం ప్రతిపాదించారు. ఇది 1979 జూలై 15న. మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. జనతా ప్రభుత్వం పడిపోయింది.

మొరార్జీదేశాయ్ ప్రభుత్వంలో హోంమంత్రిగా వున్న చరణ్‌సింగ్ ప్రధానమంత్రి పదవికి పోటీపడ్డారు. ఆయనకు మద్దతివ్వటానికి వామపక్షాలు దిగువ షరతులు పెట్టాయి.

1) రిజర్వుబ్యాంకు ఆర్డినెన్సును, ఆర్‌బిఐలో అన్ని కక్ష సాధింపు చర్యలను ఉపసంహరించాలి.

2) నిర్బంధ పొదుపు చట్టాన్ని సంవత్సరం పాటు పొడిగిస్తూ జారీ చేసిన ఆర్డినెన్సు ఉపసంహరించాలి.

3) సి.ఆర్.పి.పై అణచివేత చర్యలనుపసంహరించాలి. కేరళలో జరిగిన 54 రోజుల సమ్మె సందర్భంగా లేవనెత్తిన సమస్యలను పరిష్కరించి, కక్ష సాధింపు చర్యలనుపసంహరించాలి.

4) బోనసు ఆర్డినెన్సును రద్దుచేసి, 8.33% బోనసు ఇవ్వాలి.

5) రైల్వే ఉద్యోగులకు బోనసు చెల్లించాలి.

ఈ డిమాండ్లనన్నింటినీ చరణ్‌సింగ్ అంగీకరించారు. ఆయన ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. కానీ దేశంలో నెలకొన్న తీవ్ర రాజకీయ సంక్షోభం, అనిశ్చిత పరిస్థితి, జనతాపార్టీలో వున్న చీలిక వలన, ఆయన 24 రోజులే ప్రధానమంత్రిగా కొనసాగి, 1979 ఆగస్టు 20న రాజీనామా చేశారు. 1980 జనవరిలో సార్వత్రిక ఎన్నికలు జరపాలని ఆయన ఆదేశాలిచ్చారు (కొద్దికాలమే వున్న ఆయన మంత్రివర్గం రైల్వే ఉద్యోగులకు వుత్పాదకతతో ముడిపెట్టిన నిమిత్తం గల బోనసు ఇచ్చింది. ఆ తర్వాత పి.అండ్‌టి ఉద్యోగులకు, రక్షణ ఉత్పత్తులు చేసే ఉద్యోగులకు ఆ విధమైన బోనసునిచ్చారు).

79 ఆగస్టు 20న రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేసి, చరణ్‌సింగ్‌ను ఈ కాలంలో ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా కొనసాగవల్సిందిగా కోరారు.

## కొనసాగుతున్న కార్మిక వర్గపోరాటాలు

చరణ్‌సింగ్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరించడంతో, ఆ మంత్రివర్గం కొనసాగిన 24 రోజులలోను, ఆయన ఆపద్దర్మ ప్రధానిగా కొనసాగిన కాలంలోను, 1980 జనవరిలో సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు కార్మికవర్గ పోరాటాలు ఎడతెరిపిలేకుండా కొనసాగుతూనేవున్నాయి.

భూతలింగం కమిటీ నివేదిక, పారిశ్రామిక సంబంధాల బిల్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థల బిల్లులను ఉపసంహరించాలనీ, బోనసు చట్టం తిరిగి ప్రవేశపెట్టి 8.33 శాతం బోనసు ఇవ్వాలని, వేతన స్తంభన విధానం రద్దు చేయాలని, కక్షసాధింపు చర్యలు ఉపసంహరించాలనీ కోరుతూ పోరాటాలు కొనసాగాయి.

పై డిమాండ్ల సాధనకు 1979 ఆగస్టు 4న కలకత్తాలో ట్రేడ్ యూనియన్ల జాతీయ సదస్సు జరిగింది. సి.ఐ.టి.యు, యు.టి.యు.సి, టి.యు.సి.సి, ఐ.ఎన్.టి.యు.సి, 12 జూలై కమిటీ, వాణిజ్య సంస్థల ఉద్యోగుల యూనియన్ల ఫెడరేషన్, ఈస్ట్రన్ రైల్వేమెన్స్ యూనియన్, తదితర యూనియన్లు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

ఈ కాలంలో ఢిల్లీలోని టెక్స్‌టైల్ వర్కర్లు 1979 జూన్ 27 నుంచి చేసిన నిరవధిక సమ్మె ఈ కాలంలో సాగిన సమ్మె పోరాటాల్లో చాలా ముఖ్యమైనది. వేతన సవరణ చేయాలని, అది జరిగేలోగా అడ్‌హక్ పద్ధతి తాత్కాలికంగా వేతనాలు, కరువుభత్యం పెంచాలని, అవకతవకలతో కూడిన జీవన వ్యయ సూచీని సరిదిద్దాలనీ డిమాండు చేస్తూ 24,000 మంది కార్మికులీ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె నాలుగు నెలలు కొనసాగింది. కర్నాటకలో టెక్స్‌టైల్ కార్మికులు తాత్కాలిక భృతి కోరుతూ 1979 సెప్టెంబర్ 1న సమ్మె చేశారు.

బెంగుళూరు సదస్సులో నిర్ణయించిన ప్రకారం 1979 సెప్టెంబర్ 14న ఇరవై లక్షల మంది పబ్లిక్ రంగ కార్మికులు విజయవంతంగా ఒకరోజు సమ్మె నిర్వహించారు. దీనిలో ఎల్.ఐ.సి., జి.ఐ.సి., రిజర్వుబ్యాంకు ఉద్యోగులు కూడా పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న టెక్స్‌టైల్ కార్మికులకు మద్దతుగా 1979 అక్టోబరు 11న ఐదు లక్షల మంది పారిశ్రామిక కార్మికులు 'ఢిల్లీ బంద్' విజయవంతంగా జరిపారు. ఆ రోజున ఢిల్లీలో అన్ని ప్రధాన పారిశ్రామిక సంస్థలు, సముదాయాలు పూర్తిగా మూతపడినాయి. ఒక్క ఫ్యాక్టరీ కూడా పనిచేయలేదు. అన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్లు ఈ సమరశీల సంఘీభావ కార్యాచరణకు అన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్లు మద్దతుగా నిలిచాయి.

అనేక ఇతర పరిశ్రమలలోని కార్మికులు కూడా ఈ కాలంలో సమ్మె పోరాటాలు చేశారు. బహుళజాతి కంపెనీ అయిన గ్రిండ్లేస్ బ్యాంకు ఉద్యోగులు 1979 నవంబరు 5న ప్రారంభించిన సమ్మె రెండు నెలలు సమ్మె కొనసాగింది. పశ్చిమబెంగాలులోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు 1979 డిసెంబర్ 21న ఒకరోజు సంఘీభావ సమ్మె చేశారు. అన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్లు సంఘీభావ కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. ఎకనామిక్ టైమ్స్ ఉద్యోగులు 1979 నవంబరు 17న నిరవధిక సమ్మె ప్రారంభించారు. కలకత్తా ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీగా వున్న ఆ పత్రిక సబ్ ఎడిటర్ డిస్మిసల్‌కు నిరసనగా ఈ సమ్మె జరిగింది. కలకత్తాలో వున్న అన్ని వార్తా పత్రికలలో పనిచేసే కార్మికులు 1979 డిసెంబర్ 8న సంఘీభావ సమ్మె చేశారు.

ఈ కాలంలో రైల్వే ఉద్యోగులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు బోనస్ సాధన కోసం పోరాటం తీవ్రతరం చేశారు. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వోగులు 1979 సెప్టెంబర్ 19న బోనస్ దినం పాటించారు. 1979 నవంబరు 9న ఢిల్లీలో జరిగిన కేంద్ర ప్రభుత్వోద్యోగుల యూనియన్ల సదస్సు 8.33 శాతం బోనసు డిమాండ్ చేసింది.

ఆపద్ధర్మ మంత్రివర్గంలోని ఆర్థికమంత్రి, ఎఐఆర్ఎఫ్, ఎన్ఆర్ఐఎఫ్‌లతో ఉత్పాదకతతో ముడిపెట్టిన బోనసు గురించి చర్చించారు. 1979 నవంబరు 13న రైల్వేమంత్రి, రైల్వే ఉద్యోగులకు ఉత్పాదకత ప్రాతిపదికపై బోనసు ప్రకటించారు. అయినప్పటికీ ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్‌ల నాయకత్వం, వాయిదాపడిన వేతనంగా బోనస్ చెల్లించాలనేది బోనస్ పోరాటంలో డిమాండ్ ఉత్పాదకత ప్రాతిపదికపై బోనసు చెల్లించటాన్ని అంగీకరించాయి.

ఉత్పాదకతతో ముడిపెట్టిన ఈ క్రింది బోనసు పథకాన్ని 1979 నవంబర్ 13న రైల్వే మంత్రి ప్రకటించారు.

1. వ్యాపారం (టర్నోవర్) ఎక్కువగా వున్న 1977-78 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. (సగటు వ్యాపారం కాక, గరిష్ట వ్యాపారం పరిగణనలోకి తీసుకుంటారు).

2. ఆదాయం గానీ, వ్యాపారం గానీ 1977-78 స్థాయిలో వున్న దానిలో 90% కన్నా తక్కువ వుంటే బోనసు వుండదు. ఎక్కువ ఉత్పత్తికి ఎక్కువ బోనసు లభిస్తుంది. రైల్వేలో 1977-78 టర్నోవర్‌ను బట్టి 1979-80లో 25 రోజుల వేతనం బోనసుగా లెక్కించారు.

3. 8.33% కనీస బోనసు పొందాలంటే ఉత్పాదకత ఎక్కువగా వుండాలి. ఆ సంవత్సరం 15 రోజుల జీతం ఎక్స్‌గ్రేషియా (దయాదాక్షిణ్య పూర్వకంగా చెల్లించేది)గా చెల్లిస్తారు. ఇది రూ. 1600/- లు వేతన స్థాయి వరకు, రూ. 750/- లు జీతం మీద లెక్కించి చెల్లించబడుతుంది.

4. ఇన్సెంటివ్ స్కీము వివరాలు తరువాత చర్చిస్తారు.

రైల్వే ఉద్యోగులకు బోనసు ప్రకటించిన వెంటనే నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఎంప్లాయిస్ (ఎన్ఎఫ్‌పిటిఇ), ఫెడరల్ ఎగ్జిక్యూటివ్ సమావేశమై పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఉద్యోగులకు బోనసు ఇవ్వకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించింది. రైల్వే ఉద్యోగుల బోనసు పథకం నమూనాలోనే కేంద్ర ప్రసార శాఖా మంత్రి 1979 నవంబర్ 16న పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఉద్యోగులకు కూడా బోనస్ ప్రకటించారు.

అయితే ఇతర కేంద్ర ప్రభుత్వోద్యోగులకు బోనస్ ప్రకటించకపోవడంతో, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ పిలుపు మేరకు, 1979 డిసెంబర్ 17 నుండి రిలే నిరాహారదీక్షలు నిర్వహించి ఉద్యోగులు చివరకు, రాష్ట్రపతి భవన్ వద్ద బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌జిఇఎఫ్) కార్యదర్శి వర్గం 1979 డిసెంబర్ 9వ తేదీన న్యూఢిల్లీలో సమావేశమై, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులందరికీ బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ, 8.33 శాతం బోనస్‌ను వాయిదాపడిన వేతనంగా సాధించుకునేందుకు పోరాటం సాగించవల్సిందిగా ఉద్యోగులకు పిలుపునిచ్చింది. ఎఐఎస్‌జిఇఎఫ్ అనుబంధ సంఘాలు 1979 నవంబర్‌లో రాష్ట్ర స్థాయిల్లో సదస్సులు నిర్వహించి ఇదే డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి. ఈలోగా దేశం సార్వత్రిక ఎన్నికల సంరంభంలో మునిగిపోయింది. 1980 జనవరిలో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ తిరిగి అధికారం కైవసం చేసుకోవడంతో కేంద్రంలో కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వం ఏర్పడింది. దీనితో భారతదేశ చరిత్రలో మరొక నూతన రాజకీయ అధ్యాయం ప్రారంభమైంది.

## 1980 సార్వత్రిక ఎన్నికలు - తిరిగి అధికారం ఇందిరాగాంధీ హస్తగతం

1977 ఎన్నికలలో జనతాపార్టీ 302 స్థానాలు కైవసం చేసుకుని లోక్‌సభలో దాదాపు మూడింట రెండువంతుల స్థానాలు సంపాదించింది. అయినా అది విచ్ఛిన్నమై మెజారిటీ

కోల్పోయి ప్రభుత్వం నుంచి తొలగిపోయింది. హిందూమతతత్వశక్తులు ఈ విచ్ఛిన్నంలో ప్రధాన పాత్ర నిర్వహించాయి.

జనతాపార్టీలో చీలికలో, జనతా (ఎస్), కాంగ్రెస్‌లోని చీలిక గ్రూపులు కలిసి ఒక కూటమిగా ఏర్పడి ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. కాని ఇది తీవ్ర పరిణామాలకు దారితీసింది. జనతాపార్టీ ప్రజల నుంచి దూరం కావటానికి కారణమైన అంతర్వాహినులను మరచిపోయి, కేవలం ఏదో విధంగా అధికారంలో కొనసాగటానికి, ఈ కూటమి నాయకులు తమ మంత్రివర్గం యొక్క మెజారిటీ నిరూపించుకునేందుకు ఇందిరాగాంధీ మద్దతు కోరారు. నియంతృత్వానికి ప్రతీక అయిన ఇందిరా కాంగ్రెస్ మద్దతు కోరటం వలన జనతాపార్టీ ప్రతిష్ట దెబ్బతిన్నది. దీనికితోడు, ఏ విధమైన వ్యతిరేకత వ్యక్తం చేయకుండా, 1977 ఎన్నికల్లో ఇందిరాగాంధీ ఓటమి తర్వాత, ఎమర్జెన్సీ అత్యాచారాలపై విచారణకు జనతా ప్రభుత్వం నియమించిన షా కమిషన్ ముందు సాక్ష్యం ఇచ్చి, ఇందిరాగాంధీకి అసమ్మతిదార్లుగా తర్వాత బయటపడ్డ ప్రబుద్ధులకే మంత్రి పదవులివ్వడంతో జనతాపార్టీ ప్రతిష్ట మరింత దిగజారింది.

హేయమైన ఈ అవకాశవాద రాజకీయాలకు, జనతా ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు తోడై, ఆ పార్టీ దేశంలో ఉద్యోగులకు, కార్మికులకు దూరమైంది. మొరార్జీ దేశాయ్ ప్రభుత్వ కాలంలో అపఖ్యాతిపాలైన భూతలింగం కమిటీ ప్రగతి నిరోధక సిఫార్సులు, దుష్ట పారిశ్రామిక సంబంధాల బిల్లే కాకుండా, చరణ్‌సింగ్ కొద్దికాలం ప్రధానమంత్రిగా వున్న కొద్ది కాలంలోనే కార్మికవర్గానికి వ్యతిరేకంగా మొరటుగా దుష్ప్రచారం చేసి రైతులను వారికి వ్యతిరేకంగా రెచ్చగొట్టటం ద్వారా ప్రభుత్వం తన తీవ్ర కార్మిక వ్యతిరేక స్వభావాన్ని వెల్లడించుకుంది.

చరణ్‌సింగ్ రైతుల దుస్థితి గురించి విపరీతమైన వాగాడంబరం ప్రదర్శించాడే గాని, వారి కష్టాలను తొలగించటానికి చేసిందేమీలేదు. ఏ విధమైన విధానపరమైన చర్యలు తీసుకునేందుకు ఆయన ప్రయత్నించకపోగా, రైతుల దుస్థితికి భూకేంద్రీకరణ ప్రధాన కారణమనీ, గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక ధనికులైన 10 శాతం మంది భూస్వాముల వద్ద మొత్తం ఆస్తుల్లో సగభాగం కన్నా ఎక్కువే వుండగా, అత్యంత దారిద్ర్య పరిస్థితిలో వున్న వారి వద్ద 0.1% మాత్రమే వున్నదన్న సత్యం చెప్పటానికి ఆయన ఇష్టపడలేదు. వ్యవసాయ కార్మికులకు మెరుగైన వేతనాల గురించి గానీ, రైతుల రుణ విముక్తి గురించి గాని ఒక్క మాట కూడా ఆయన అనలేదు. నిజానికి చరణ్‌సింగ్ పేద రైతాంగం, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు గాక, కార్మిక వర్గాన్ని వ్యతిరేకిస్తూ, భూస్వామ్య వర్గ ప్రతినిధిగా వ్యవహరించాడు.

ఆ విధంగా మొరార్జీ దేశాయ్, చరణ్‌సింగ్ లిరువురు సామాన్య ప్రజల ఆశలు పూర్తిగా వమ్ము చేశారు. ఇందిరాగాంధీ నియంతృత్వపాలనకు వ్యతిరేకంగా ప్రజలు వారికి అధికారం అప్పగించారు. మొదట్లో ఈ నియంతృత్వ వ్యవస్థను కూల్చటానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ అవి పూర్తి కాలేదు. మరోవైపు జనతాపార్టీలో భాగస్వామి అయిన జనసంఘ్

పాలనా యంత్రాంగాన్ని మతోన్మాదపూరితం చేయటం, ప్రధాన మంత్రులిరువురు, అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలు, శోచనీయమైన అంతర్గత కుమ్ములాటలు ప్రజలను పూర్తిగా నిరాశపరచాయి.

ప్రజలలో ఏర్పడిన అసంతృప్తిని, భగ్నమైన ఆశలను ఇందిరాగాంధీ ఆసరాగా తీసుకుని, జాతీయ స్థాయిలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో, ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని, భగ్నమైన వారి ఆశలను ఇందిరాగాంధీ అవకాశంగా తీసుకుని తిరిగి అధికారం చేపట్టింది.

## కార్మిక వర్గ పోరాటాల్లో నూతన దశ - విస్తృత ఐక్యతకు యత్నాలు

ఇందిరాగాంధీ, ఆమె పార్టీ అధికారంలోకి రాగానే గతంలో తన హయాంలో అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలనే కొనసాగించింది. ఫలితంగా అన్ని రంగాల్లోనూ కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు పూనుకొనవల్సి వచ్చింది.

తమ ప్రయోజనాలు పరిరక్షించుకోవడానికి, అన్ని రంగాల్లోని కార్మికులు, ఉద్యోగులు తమ తమ రంగాల్లో పోరాటాలు సాగించారు. బెంగుళూరు, హైదరాబాద్ తదితర కేంద్రాల్లో నెలకొల్పబడిన హెచ్.ఎ.ఎల్., బి.హెచ్.ఇ.ఎల్., బి.ఇ.ఎం.ఎల్., ఐ.టి.ఐ., హెచ్.ఎం.టి. వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లోని యాజమాన్యాలు కార్మికులతో చేసుకున్న ఒప్పందాల అమలుకు నిరాకరించడంతో, ఆ సంస్థల్లోని కార్మికులు 1980 డిసెంబర్ 26న ప్రారంభించిన నిరవధిక సమ్మె రెండు నెలలకు పైగా సాగింది. సమ్మె ఎంత విస్తృతంగా, విజయవంతంగా జరిగిందో వివరిస్తూ బెంగుళూరు నుండి వెలువడే డెక్కన్ హెరాల్డ్ పత్రిక తన సంపాదకీయంలో ఇలా రాసింది. "కార్మికులు తాము కేవలం న్యాయసమ్మతమైన కోర్కెల సాధనకు పోరాడుతున్నామని తెలియజేయడమే గాక, మెరుగైన వేతనాల సాధనకై సాగే పోరాటంలో ఐక్యంగా వున్నామని కూడా స్పష్టం చేశారు."

1,25,000 మంది ఉద్యోగులు పాల్గొన్న ఈ సమ్మెకు సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి, హెచ్.ఎం.ఎస్., బి.ఎం.ఎస్. మద్దతునిచ్చాయి. కాంగ్రెసు అనుబంధమైన ఐ.ఎన్.టి.యు.సి. సహజంగానే సమ్మెకు దూరంగా వున్నది. తరువాత ఎ.ఐ.టి.యు.సి, సి.ఐ.టి.యు., హెచ్.ఎం.ఎస్., బి.ఎం.ఎస్..టి.యు.సి.సి. మొదలైన కేంద్ర ట్రేడ్ యూనియన్లు అనేక జాతీయ ఫెడరేషన్లు, 1981 ఫిబ్రవరి 22న ఢిల్లీలో సమావేశమై పబ్లిక్ రంగ ఉద్యోగులు రెండు నెలలుగా చేస్తున్న నిరవధిక సమ్మె గురించి చర్చించి, ప్రధానమంత్రి నివాసం ఎదుట 1981 మార్చి 3న ధర్నా నిర్వహించాలనీ, అన్ని పబ్లిక్ రంగ సంస్థలలో 1981 మార్చి 11న దేశవ్యాప్త సమ్మె చేయాలనీ నిర్ణయించాయి.

దీనితోబాటు వార్తా పత్రికల ఉద్యోగులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రైల్వే ఉద్యోగులు, ఎల్.ఐ.సి., జి.ఐ.సి., బ్యాంకు ఉద్యోగులు ఈ కాలంలో అనేక ఉద్యమాలు,

సమ్మెలు చేశారు. కొన్ని రాష్ట్రాలలో రాష్ట్ర వ్యాపిత సార్వత్రిక సమ్మెలు, బంద్‌లు జరిగాయి. 1980 నవంబరు 27న పశ్చిమ బెంగాల్‌లో విశృంఖలమైన ధరల పెరుగుదల, జాతీయ భద్రతా ఆర్డినెన్స్, వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరికి నిరసనగా 1980 నవంబర్ 27న పశ్చిమ బెంగాల్‌లో బంద్ జరిగింది. ఈ బంద్ వామపక్ష సంఘటన, వామపక్షాలకు సంబంధించిన యూనియన్లు 12 జూలై కమిటీ ఆధ్వర్యాన జరిగింది. అదే విధంగా బీహారులో సి.పి.ఐ., సి.పి.ఐ.(ఎం), కాంగ్రెసు (యు), లోక్‌దళ్, ఫార్వర్డు బ్లాక్, ఆర్.ఎస్.పి.లతో కూడిన ఆరు రాజకీయ పార్టీల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో విపరీతమైన ధరల పెరుగుదల, అత్యవసర సరకుల కొరత, జాతీయ భద్రతా ఆర్డినెన్సులకు వ్యతిరేకంగా అదే రోజున అంటే 1980 నవంబర్ 27న రాష్ట్రవ్యాప్త బంద్ జరిగింది. మహారాష్ట్రలో కూడా జాతీయ భద్రతా ఆర్డినెన్స్, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా 1980 అక్టోబర్ 15న బంద్ జరగ్గా, అదేరోజున పారిశ్రామిక కేంద్రాల్లో కార్మిక వర్గం సార్వత్రిక సమ్మె నిర్వహించింది.

జాతీయ భద్రతా ఆర్డినెన్సు, ఎల్.ఐ.సి. ఉద్యోగుల వేతనాలపై ఆర్డినెన్సు, ప్రావిడెంటు పథకంపై రామానుజం కమిటీ నివేదికలతో పాటు, వివిధ చర్యల ద్వారా ప్రభుత్వం కార్మిక వర్గం మీద దాడులు సాగిస్తున్నప్పటికీ, కార్మికులకు వ్యతిరేకంగా మరిన్ని ఆయుధాలకు పదును పట్టవల్సిందిగా యజమానులు ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నారు.

“యజమానుల సంఘాల ప్రతినిధులు నేడు కేంద్ర కార్మికమంత్రిని కలిసి, లాభాలుంటేనే తప్ప బోనస్ చెల్లించకూడదని చెప్పారు. కనీస బోనస్ చెల్లించాల్సి వున్నప్పుడు, బోనస్‌కు గరిష్ఠ పరిమితి వుండాలని వారన్నారు’ అని స్టేట్స్‌మన్ పత్రిక వార్త ప్రచురించింది. అదే పత్రిక ఇంకా ఇలా పేర్కొంది. “బోనస్‌ను ‘వాయిదాపడిన వేతనం’గా పరిగణించే విషయమై యజమానుల ఫెడరేషన్ తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసింది. ఇది చాలా అన్యాయమనీ, ప్రపంచంలో ఎక్కడా ఈ విధమైన పద్ధతి లేదని తెల్పింది.” బోనసు విషయంలో ‘ధర్మబద్ధమైన’ సూత్రాన్ని అమలులోకి తేవాలనీ, బోనసు ఎంత వుండాలనే విషయంలో వాదనలకు గాని, బేరసారాలకు గాని ఆస్కారమివ్వరాదని వాదిస్తూ, టాటా ప్రభుత్వానికొక మెమోరాండం సమర్పించారు. ‘జాతీయ ప్రయోజనాలకు’ సంబంధించిన వివాదాలను తప్పనిసరిగా న్యాయస్థానాల తీర్పులకు లోబడేటట్లు చేసేందుకు, “శాంతి భద్రతల” నిర్వహణకవసరమైన అధికారాలను ప్రభుత్వం తన వద్ద వుంచుకోవాలని, యజమానుల ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.”

యజమానుల ఫెడరేషన్ కేవలం కార్మికుల బోనస్ డిమాండ్‌ను మాత్రమే వ్యతిరేకించలేదు. సమస్యల పరిష్కారానికి న్యాయస్థానాల తీర్పులను తప్పనిసరి చేయడం, శాంతి భద్రతల నిర్వహణ ద్వారా నిరంకుశ చర్యలు చేపట్టాలని ఫెడరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. అంటే కార్మికుల న్యాయమైన పోరాటాల నణచివేసేందుకు నిరంకుశ అధికార యంత్రాంగాన్ని వినియోగించాలి.

ఆ కాలంలో వివిధ కేంద్రాలలో విస్తృతంగా సాగిన కార్మిక వర్గ పోరాటాలన్నిటి గురించి రాయాలంటే పెద్ద చరిత్ర అవుతుంది. అందువలన ఆ కాలంలో కార్మికవర్గ పోరాటాల ప్రధాన లక్ష్యం గురించి తెలుసుకోవడానికి మాత్రమే ఈ చర్చను పరిమితం చేయవలసి వుంటుంది.

ఒక ప్రక్క కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా విధానపరమైన నిర్ణయాలు చేస్తుండగా, అదే సమయంలో పశ్చిమ బెంగాలులో వామపక్ష ప్రభుత్వం అందుకు పూర్తిగా భిన్నమైన పంథాననుసరించింది. బ్రిటిష్ వారు రూపొందించిన ప్రభుత్వోద్యోగుల ప్రవర్తనా నియమావళిని రద్దు చేయాలనీ, తమకు పూర్తి ట్రేడ్ యూనియన్ హక్కులు, ప్రజాతంత్ర హక్కులు కావాలని దేశంలో ప్రభుత్వోద్యోగులు సుదీర్ఘకాలంగా డిమాండు చేస్తున్నారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఈ ప్రవర్తనా నియమావళిని రద్దు చేసి, పశ్చిమబెంగాల్ ప్రభుత్వోద్యోగుల విధులు, హక్కులు, బాధ్యతలు) నియమావళి, 1980 పేరిట కొత్త నిబంధనల ద్వారా పశ్చిమ బెంగాల్ సేవల ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కుతో సహా, పూర్తి ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పిస్తూ 1980 మే 27న ఆదేశాల జారీ చేసింది. అంతకుముందు ప్రభుత్వోద్యోగుల విషయమై ప్రతి ఏడాది తయారు చేసే రహస్య నివేదిక స్థానంలో బహిరంగ నివేదిక విధానం ప్రవేశపెడ్తూ 1980 జూన్ 11న మరొక ఆదేశం జారీ చేసింది. ప్రభుత్వోద్యోగులకు అనుకూలంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చేపట్టిన ఈ రెండు చర్యలతో పాటు ఇతర కార్మిక వర్గ అనుకూల చర్యలకు దేశవ్యాప్తంగా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. ఈ విధానాలు దేశంలోని ప్రభుత్వోద్యోగుల ఉద్యమానికి ఒక నూతన దిశా నిర్దేశం చేశాయి.

## జాతీయ ట్రేడ్ యూనియన్ల సదస్సు -
## ఐక్య ట్రేడ్ యూనియన్ కార్యాచరణకు నూతన రూపం

ఇంతకుముందే చెప్పుకున్నట్లు, నిరాఘాటంగా సాగుతున్న ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య కార్యాచరణ నిర్మించాలన్న కాంక్ష వివిధ ట్రేడ్ యూనియన్లలో బలంగా వుంది. దీనిని ప్రతిబింబించే విధంగా 1981 జూన్ 4న బొంబాయిలో "శ్రామిక ప్రజల జాతీయ సదస్సు" పేరిట వివిధ ట్రేడ్ యూనియన్ల విస్తృత ప్రాతినిధ్యంతో సదస్సు జరిగింది. 1981 మార్చి 24న ఢిల్లీలో జరిగిన వివిధ ట్రేడ్ యూనియన్ల సమావేశం నిర్ణయం మేరకు సదస్సు జరిగింది.

ఆ సదస్సులో విస్తృత స్థాయిలో పాల్గొన్న వివిధ ట్రేడ్ యూనియన్ల ప్రాతినిధ్యం సదస్సులో ప్రధాన సమస్యల మీద జరిగిన చర్చ, సదస్సు చేసిన నిర్ణయాలను బట్టి, ఈ సదస్సును దేశంలో ఐక్యట్రేడ్ యూనియన్ వుద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా పేర్కొనవచ్చును.

విస్తృత స్థాయిలో అనేక ట్రేడ్ యూనియన్లకు చెందిన 3000 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ఆ సదస్సులో ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి., యు.టి.యు.సి.(లెనిన్ సారణి), టి.యు.సి.ఎస్., బి.ఎం.ఎస్., జె.ఎస్. దారా నాయకత్వంలోని ఐ.ఎన్.టి.యు.సి.తో బాటు ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆలిండియా యూనివర్శిటీ అండ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆలిండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆర్థిక రంగానికి చెందిన అనేక ఇతర ఫెడరేషన్లు, రవాణా, బొగ్గు, విద్యుచ్ఛక్తి, తోటలు మొదలైన రంగాలకు చెందిన యూనియన్లు కూడా ఈ సదస్సులో పాల్గొన్నాయి.

ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్మిక వ్యతిరేక చర్యలను వివరిస్తూ, దశల వారీగా దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యాచరణతో కూడిన ప్రతిపాదించిన సమగ్ర తీర్మానాన్ని సి.ఐ.టి.యు. జనరల్ సెక్రటరీ పి. రామమూర్తి దానిని వివిధ కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు సమర్థించారు. వివిధ జాతీయ ఫెడరేషన్లకు చెందిన అనేకమంది ప్రతినిధులు తీర్మానానికనుకూలంగా ప్రసంగించారు. సదస్సు ఆ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. దేశంలోని కార్మికవర్గం తమ జీతాలు, ఆదాయాలపై అన్నివైపుల నుండి దాడుల నెదుర్కొంటున్న సమయంలో, దశాబ్దాలుగా భీషణ పోరాటాలు, వీరోచితమైన త్యాగాల ఫలితంగా సాధించిన ట్రేడ్ యూనియన్, ప్రజాతంత్ర హక్కులపై దాడులు జరిగే సమయంలో ఈ సదస్సు జరుగుతోందని, తీర్మానం గుర్తు చేసింది. అదుపు లేకుండా పెరిగే ధరలు, తీవ్రమవుతున్న నిరుద్యోగ సమస్య, వేతనాలపై కోత, కక్ష సాధింపు చర్యలు, రిట్రెంచ్‌మెంటు, కార్మికులపై పోలీసు చర్యలు, వివిధ పబ్లిక్ రంగ సంస్థల్లో ద్వైపాక్షిక ఒప్పందాలను తుంగల తొక్కడం, 'సంఘ స్వేచ్ఛ', 'ఉమ్మడి బేరసారాల హక్కుల'కు సంబంధించి అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ.) నిబంధన (కన్వెన్షన్)ను ప్రభుత్వం ఆమోదించకపోవడం, కాంగ్రెస్ (ఐ) నాయకత్వంలోని యూనియన్లకు అనుచిత ప్రోత్సాహం, కార్మిక వర్గంలో జాతి, మత, కుల, ప్రాంతీయ విభేదాలను విశ్లేషించి వారి ఐక్యతను విచ్ఛిన్నం చేసే స్వార్థపరవర్గాల ప్రయత్నాలను తీర్మానం తీవ్రంగా ఖండించింది.

15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐ.ఎల్.ఒ.) నిర్ణయించిన విధంగా అవసరాల ప్రాతిపదిక మీద కనీస వేతనాల నిర్ణయం, ధరల పెరుగుదలను డి.ఎ. ద్వారా పూర్తిగా భర్తీ చేయడం, వ్యవసాయ కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రతకు సంబంధించి చట్టం చేయడం, రిక్రూట్‌మెంట్ మీద నిషేధం, మూసివేతలు, నిరుద్యోగ భృతి, రహస్య బ్యాలెట్ ద్వారా ట్రేడ్ యూనియన్ల గుర్తింపు వంటి కార్మికవర్గాన్ని వేధించే సమస్యల పరిష్కారానికి పోరాడవల్సిందిగా తీర్మానం. కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. సదస్సు ఈ క్రింది దశల వారీ కార్యక్రమాన్ని అమలు చేయవల్సిందిగా పిలుపునిచ్చింది. అఖిల భారత నిరసన, కోర్కెల దినం పాటించడం,

(2) పార్లమెంట్‌కు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించడం, (3) ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లో ఒకరోజు దేశవ్యాప్త సమ్మె.

పై కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు సదస్సు ఒక జాతీయ ప్రచార కమిటీని ఏర్పాటు చేసింది. పై కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, తేదీలు నిర్ణయించడంతో పాటు, దేశ వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులను ఈ కార్యక్రమాల్లో విస్తృతంగా సమీకరించడం ద్వారా మొత్తం కార్యక్రమాన్ని జయప్రదం చేసే బాధ్యతనీ కమిటీకి అప్పగించడం జరిగింది. నిజానికి తర్వాత కాలంలో కార్మికులను, ఉద్యోగులను పోరాటాల్లోకి సమీకరించడంలో ఈ ఐక్య సదస్సు చోదక శక్తిగా పనిచేసింది.

## సమ్మె నిషేధ ఆర్డినెన్స్ - కొత్త పుంతలు తొక్కిన ప్రతిఘటన

'శ్రామిక ప్రజల జాతీయ సదస్సు' పోరాట శంఖారావం పూరించగానే, కేంద్ర ప్రభుత్వం 1981 జూలై 27న రాష్ట్రపతి చేత 'అత్యవసర సర్వీసుల నిర్వహణా ఆర్డినెన్స్'ను జారీ చేయించి ప్రభుత్వం అత్యవసర సర్వీసుగా ప్రకటించిన ఏ రంగంలోనైనా సమ్మెలు నిషేధించే విశేషాధికారాలను తన గుప్పెట్లో పెట్టుకుంది. ఆర్డినెన్స్ ద్వారా "చట్ట విరుద్ధమైన" సమ్మెలో పాల్గొన్నవారు, సహాయపడినవారు, మద్దతిచ్చిన వారిపై సంక్షిప్త విచారణ జరిపించి, వారికి జరిమానా విధించడం, డిస్మిస్ చేయడం, ఆరు నెలలు జైలు విధించడం వంటి శిక్షలు విధించే అధికారాన్ని ప్రభుత్వం దఖలు పర్చుకుంది.

త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టి, చట్ట రూపం కల్పించే ఉద్దేశ్యాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించింది.

రైల్వేలు, పోస్టు అండ్ టెలిగ్రాఫ్, టెలిఫోన్లు, రేవులు, విమానాశ్రయాలు, బ్యాంకింగ్, పెట్రోలియం ఉత్పత్తులు, పెట్రోలియం దాని ఉత్పత్తులను శుద్ధి చేసే రిఫైనరీలు, పారిశుధ్య పని, కేంద్ర ప్రభుత్వం, రక్షణ శాఖ అధీనంలోని ఆస్పత్రులు మొదలైన వాటిని ఆర్డినెన్స్‌లో అత్యవసర సర్వీసులుగా పేర్కొన్నారు. అంతేగాక ఏ ఇతర రంగాన్నైనా అత్యవసర సర్వీసుగా ప్రకటించి ఆ రంగంలో సమ్మెలు నిషేధించే అధికారాన్ని ప్రభుత్వం రిజర్వు చేసుకుంది.

1981 జూన్ 4వ తేదీన బొంబాయి సదస్సులో ఏర్పాటైన జాతీయ ప్రచార కమిటీ వెంటనే స్పందించి 1981 ఆగస్టు 17న ప్రదర్శనలు, ఊరేగింపుల ద్వారా నిరసన దినం పాటించవలసిందిగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం జయప్రదంగా అమలు జరిగింది.

బొంబాయిలో కేంద్ర ట్రేడ్ యూనియన్లు, ఇతర ఫెడరేషన్ల ఆధ్వర్యంలో లక్షమంది కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు. కలకత్తాలో నిరసన సూచకంగా 3 నిముషాల పాటు ట్రాఫిక్ నిలిపివేశారు. కార్మికులు, ఆఫీసు ఉద్యోగులు, విద్యార్థులు, మహిళా కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శనలు, ఊరేగింపులు చేశారు. శ్రీనగర్‌లో

ఆర్డినెన్స్ ఉపసంహరించాలని కోరుతూ పెద్ద ప్రదర్శన జరిగింది. అస్సాం ప్రభుత్వం కేంద్రీకృత ప్రదర్శనకు అనుమతినివ్వలేదు. ఢిల్లీ, పరిసర ప్రాంతాల నుండి వేలాదిమంది కార్మికులు ఫిరోజ్‌షా కోట్లా మైదానం నుండి బోట్‌క్లబ్ వద్దకు పెద్ద ఊరేగింపు జరిపారు. ఆ బహిరంగ సభలో సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి., బి.ఎం.ఎస్., యు.టి.యు.సి. (లెనిన్ సారణి) టి.యు.సి.సి., ఐ.ఎన్.టి.యు.సి. (దారావర్గం)లకు చెందిన నాయకులు ప్రసంగించారు. ఢిల్లీలో జూనియర్ డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించారు. ఢిల్లీలోని బోట్ క్లబ్ వద్ద ఆలిండియా లోకోరన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు ధర్నా జరిపారు. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా 1981 సెప్టెంబర్, 3న కేరళలో ఒకరోజు సమ్మెకు సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., యు.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., ఐ.ఎన్.టి.యు.సి.(యు)లు పిలుపునిచ్చాయి. తిరువనంతపురంలో ఆగస్టు 9న జరిగిన రాష్ట్ర స్థాయి ట్రేడ్ యూనియన్ల సదస్సులో ఈ నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా పశ్చిమబెంగాలులో సెప్టెంబర్ 11న, త్రిపురలో సెప్టెంబర్ 14న సార్వత్రిక సమ్మె, బంద్ జరిగాయి.

జాతీయ ప్రచార కమిటీ 1981 సెప్టెంబర్ 8న ఢిల్లీలో సమావేశమై నవంబర్ 3న అఖిల భారత కోర్కెల దినం, నిరసన దినం పాటించవలసిందిగా 1981 నవంబర్, 23న పార్లమెంట్ వద్దకు బ్రహ్మాండమైన ప్రదర్శన జరపాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వోద్యోగులు, ఎల్.ఐ.సి, తదితర ఉద్యోగులకు చెందిన వివిధ జాతీయ ఫెడరేషన్లు ఆమోదించాయి. దేశంలోని దాదాపు అన్ని కేంద్రాల్లో ఉద్యోగులు, కార్మికులు అఖిల భారత కోర్కెల, నిరసనదినం పాటించారు. నవంబర్ 23న పార్లమెంట్ వద్ద పెద్ద ప్రదర్శన జరిగింది. ఢిల్లీలోని బోట్‌క్లబ్ మైదానంలో పారిశ్రామిక కార్మికులతో పాటు, ప్రభుత్వోద్యోగులు, పబ్లిక్ రంగ ఉద్యోగులు, తమ యూనియన్ల పతాకాలతో ప్రదర్శన, ఊరేగింపుల్లో పాల్గొన్నారు. అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం (ఎస్మా), ధరల పెరుగుదల, ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవర్గ వ్యతిరేక చర్యలకు నిరసనగా దేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఐక్యంగా నిలిచింది.

బోట్ క్లబ్ వద్ద జరిగిన సభలో 1982 జనవరి 19న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరపాలని సి.ఐ.టి.యు. కార్యదర్శి సెక్రటరీ ఎం.కె. పాంధే 'ప్రతిపాదించిన తీర్మానం ఆనందోత్సాహాలతో ఆమోదించబడింది.'

కార్మిక వర్గం పార్లమెంట్ వద్దకు చేసిన ప్రదర్శన గురించి జాతీయ వార్తా పత్రికలు విశేష ప్రచారం ఇచ్చాయి. కొన్ని పత్రికలలో సంపాదకీయాలు కూడా రాశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తన సంపాదకీయంలో పార్లమెంట్‌కు ఊరేగింపు, ప్రదర్శనల ప్రాముఖ్యత గురించి ఈ విధంగా రాసింది.

"రాజధానిలో కార్మికులు చేసిన మహత్తర ప్రదర్శనను రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన తమాషాగా కొట్టివేయటానికి వీలులేదు. ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక, కార్మిక విధానాల

వలన పేద, మధ్యతరగతి ప్రజల యాతనలు తీవ్రం కావటం ఇందుకు కారణం. ప్రదర్శనలో కనపడిన అసంఖ్యాకమైన పతాకాలను బట్టి అనేక ప్రధాన యూనియన్లకు చెందిన పారిశ్రామిక కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు ప్రదర్శనలో పాల్గొన్నట్లు స్పష్టమవుతుంది. సాధారణ ప్రజల ఆర్థిక బాధలను తీరుస్తానని కాంగ్రెస్ (ఐ) చేసిన బాసలను నమ్మి రెండు సంవత్సరాల క్రితం ఆ పార్టీ బ్రహ్మాండమైన ప్రజా తీర్పు పొందటానికి వారిలో చాలామంది దోహదం చేసి వుంటారు. కానీ ప్రభుత్వ చర్యలు, విధానాలు వారి నమ్మకాలను వమ్ము చేశాయి."

ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ ఇదే పత్రిక సంపాదకీయంలో ఇంకా ఈ విధంగా రాసింది.

"ప్రభుత్వ మోసపూరిత ఆర్థిక, సామాజిక విధానాలకు తీవ్ర అసమ్మతిగా ఈ ప్రదర్శన సాగింది. సమయం మించిపోకముందే ప్రభుత్వం తన వాగ్దానాలు సత్వరం నెరవేర్చటానికి ప్రయత్నించాలి. దేశవ్యాప్తంగా జనవరి 19న కార్మికులు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె పట్ల ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేయడం కాక, ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి, సంఘ విద్రోహశక్తుల చర్యలను నిరోధించటానికి తగు చర్యలు తీసుకోవాలి."

ఒక వామపక్షేతర ప్రముఖ జాతీయ వార్తా పత్రిక సంపాదకీయం ఆనాటి (కార్మికులు, ప్రజలు) దీనస్థితిని, పారిశ్రామిక కార్మికులు, తెల్ల చొక్కా కార్మికులకు చెందిన వివిధ ట్రేడ్ యూనియన్లలో విస్తృతమవుతున్న ఐక్యతను గురించిన వాస్తవ పరిస్థితిని వివరించింది.

భారత కార్మికుల పోరాటం, ముఖ్యంగా ఎస్మాకు వ్యతిరేకంగా చేసిన పోరాటం దేశ సరిహద్దులను దాటింది. బ్రిటన్‌లోని ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్ 1981 నవంబర్ 22న 500 మంది భారతీయులతో భారత హై కమిషనర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించి, ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ హై కమిషనర్‌కు మెమోరాండం సమర్పించింది. భారతదేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి సంఘీభావ సూచకంగానూ, ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి మద్దతుగానూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ నిరసన ప్రదర్శన తరువాత లండన్‌లోని ఆఫ్రికాహౌస్‌లో జరిగిన బహిరంగ సభలో లేబర్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్, ఇతర వామపక్షాలకు చెందిన నాయకులు ప్రసంగించి, భారత ప్రభుత్వం చేసిన కార్మిక వ్యతిరేక చట్టాన్ని ఖండించారు. భారతదేశంలో ట్రేడ్ యూనియన్లు చేసే ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. సహజంగానే 1982 జనవరి 19న అఖిల భారత సమ్మె జయప్రదం కావటానికి, ఈ సన్నాహక కార్యక్రమాలు దోహదం చేశాయి. వాస్తవానికి దేశవ్యాప్త సమ్మె బ్రహ్మాండంగా జయప్రదమైంది. ఒక్క ఐ.ఎన్.టి.యు.సి. యూనియన్లు తప్ప దేశంలోని పారిశ్రామిక కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులతో సహా కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొన్నారు. అధికార పార్టీ పాలనలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మె నెదుర్కొనడానికి పెద్ద ఎత్తున పారా మిలటరీ

దళాలను, పోలీసులను మోహరించాయి. కొన్ని చోట్ల సమ్మెలో పాల్గొనే వారికి, సమ్మె విచ్ఛిన్నకులకు మధ్య ఘర్షణల సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో వ్యవసాయ కార్మికులతో సహా కనీసం పదిమంది మరణించారు.

అనేక పరిశ్రమలలోనూ, ఎల్.ఐ.సి., బ్యాంకులు, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సమ్మె సంపూర్ణంగా జరిగింది. చమురు కర్మాగారాలలో, బొగ్గు, స్టీలు, పోర్ట్సు అండ్ డాక్స్, ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, ముడి ఇనుము, తదితర గనులలోనూ సమ్మె విస్తృతంగా జరిగింది. అనేకచోట్ల మార్కెట్లు మూతపడినాయి. పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర, మహారాష్ట్ర, బీహార్, జమ్మూ-కాశ్మీర్, ఒరిస్సాలలోని రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు పూర్తిగా సమ్మెలో పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో సంపూర్ణ బంద్ జరగ్గా, మణిపూర్‌లో 12 గంటల బంద్ జరిగింది. తమిళనాడులోని కోయంబత్తూరులో బంద్ జరిగింది. వార్తా పత్రికల ఉద్యోగులు కూడా ఈ సమ్మెలో పాల్గొనటం మరో ముఖ్య విశేషం. దానివలన నేషనల్ హెరాల్డు, మరికొద్ది ఇతర పత్రికలు తప్ప అన్ని వార్తా సంస్థల ఆఫీసులు మూతపడినాయి. కేంద్ర ఉద్యోగులు, పౌరరక్షణ శాఖ ఉద్యోగులు, సమ్మెకు మద్దతుగా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణంలలో పూర్తి బంద్ నిర్వహించారు. ఆ రాష్ట్రంలో దాదాపు 3000 మందిని అరెస్టు చేశారు. కర్నాటకలోని మైసూర్, బెంగుళూరు, బెల్గాం తదితర ప్రాంతాలలో పోలీసులు లాఠీఛార్జీ చేశారు.

1982 జనవరి 19న జరిగిన అఖిల భారత సమ్మె భారత కార్మిక వర్గ పోరాటాల చరిత్రలో ఒక మహత్తర ఘట్టంగా గుర్తుండిపోతుంది. దాని ప్రాముఖ్యత ఆ సమ్మెలో పాల్గొన్న కార్మికుల సంఖ్యను బట్టి కాక, ఐ.ఎన్.టి.యు.సి. యూనియన్లు తప్ప మిగతా కార్మికవర్గం రాజకీయ హద్దులనధిగమించి ఐక్యంగా సమ్మె పోరాటాన్ని నిర్వహించటంలోనే వున్నది. అంతేకాక ఆ సమ్మె కేవలం ఆర్థిక కోర్కెలకే పరిమితం కాక, ధరల పెరుగుదల, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టం, జాతీయ భద్రతా చట్టం వంటి ప్రధాన సమస్యలపై జరిగింది. ఇది అనేక పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, అన్ని రంగాల ఉద్యోగులు బ్రహ్మాండమైన ఐక్యతతో, దేశవ్యాప్తంగా నిర్వహించిన సమరశీల ట్రేడ్ యూనియన్ కార్యాచరణ.

ఈ దేశవ్యాప్త సమ్మె తరువాత కూడా ప్రభుత్వం వేతన స్తంభనతో పాటు ఇతర కార్మిక వ్యతిరేక చర్యలను మొండిగా కొనసాగించడంతో, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, ప్రభుత్వోద్యోగులు అనేక సమ్మె పోరాటాలు నిర్వహించాల్సి వచ్చింది. 1982 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వోద్యోగులలో ఒక తరగతికి ప్రాతినిధ్యం వహించే జె.సి.ఎం.తో అక్రమ ఒప్పందం ద్వారా కేంద్ర ఉద్యోగుల కరువుభత్యం స్తంభింపచేసే ప్రయత్నాలు చేసింది. 1983 మార్చి వరకు కరువుభత్యాన్ని జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌కు జమచేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. వివిధ కేంద్ర ప్రభుత్వోద్యోగుల యూనియన్లు, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ దీనికి తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి.

## అంతర్జాతీయ కార్మికోద్యమం - ప్రపంచ ట్రేడ్ యూనియన్ల సమాఖ్య (డబ్ల్యు.ఎఫ్.టి.యు.) మహాసభ

భారతదేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిన స్థితిలో ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ, కార్మికుల ప్రతిఘటన నణచివేస్తున్న సమయంలో, అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకోవడంతో నిరుద్యోగం పెరిగి పరిస్థితి భయంకరంగా తయారైంది. 1982 ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు హవానాలో జరిగిన డబ్ల్యు.ఎఫ్.టి.యు. 10వ మహాసభ ఈ సమస్యలను చర్చించి అంతర్జాతీయ కార్మికవర్గం చేపట్టవలసిన పోరాట పంథాను నిర్ణయించవల్సి వుంది.

ఆ మహాసభలో సమర్పించిన మూడు భాగాల నివేదికలో ప్రపంచంలోని కార్మికవర్గం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను గుర్తించి చర్చించడం జరిగింది. నివేదిక మొదటి భాగంలో 1978 లో 9వ మహాసభ జరిగిన తరువాత 4 సంవత్సరాల కాలంలో ప్రపంచ శాంతి, జీవించే హక్కు, ఉద్యోగ భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కుల కోసం, పెట్టుబడిదారీ సంక్షోభ ఫలితాలకు వ్యతిరేకంగానూ, బహుళజాతి కంపెనీల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగానూ జరిగిన ఐక్య పోరాటాల గురించి వివరించారు. నివేదిక రెండవ భాగంలో 1980 దశకంలో ఎదుర్కొనే సవాళ్ళ గురించి వివరించారు. వాటిలో అమెరికా యుద్ధ ప్రయత్నాలు, శాస్త్ర, సాంకేతికాభివృద్ధిలో సాధించిన బ్రహ్మాండమైన ప్రగతిని, ప్రపంచాన్ని అణు వినాశానికి గురిచేసేందుకు దుర్వినియోగం చేసే యత్నాలు, సైనిక – పారిశ్రామిక సంస్థల కూటమి (మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్) గడించే అశేష లాభాలు, పనిచేయటానికి జీవించటానికి గల ప్రాథమిక హక్కు సమస్య, ఫాసిస్టు, వలస పాలనలో కోట్లాది ప్రజలకు మానవ హక్కుల నిరాకరణ, మొదలైన వాటిని గురించి చర్చించారు. నివేదిక మూడవభాగంలో ప్రపంచ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఐక్యతను పటిష్టం చేయటానికి, ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గ ప్రయోజనాలను నిలకడైన విధంగా పరిరక్షించడానికి చేపట్టవలసిన చర్యలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న ప్రతిఘటన గురించి వివరిస్తూ, నివేదికలో భారత కార్మికవర్గ పోరాటాలను గురించి పేర్కొంటూ, ప్రత్యేకంగా 1982 జనవరి 19న జరిగిన అఖిల భారత సమ్మెను ఉదహరించారు.

మహాసభ ప్రారంభంలో ఫైడల్ కాస్ట్రో చేసిన ఉపన్యాసంలో, కార్మికవర్గ ప్రయోజనాలకు సంబంధించి ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయుధ పోటీని, ఆమెరికన్ సామ్రాజ్యవాదుల భారీ సైనిక సన్నాహాలు, వారి దుందుడుకు చర్యలను ప్రస్తావిస్తూ, కార్మికవర్గం సత్వరం శాంతి కోసం పోరాటం చేయవల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. మూడవ ప్రపంచ దేశాల ప్రజలు ఆకలి, కరువు, నిరుద్యోగం, అనారోగ్యం వంటి సమస్యలతో బాధపడుతుంటే అమెరికా ఆయుధ పోటీ ద్వారా వనరులను దారుణంగా వృధా చేయడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బహుళజాతి కంపెనీలు శాస్త్ర సాంకేతికాభివృద్ధిని అవకాశంగా చేసుకొని కార్మికుల మీద దోపిడీని తీవ్రతరం చేసి, వారి పని పరిస్థితులను దుర్భరం చేస్తున్నాయని ఆయన అన్నారు.

మూడవ ప్రపంచ దేశాలలో అభివృద్ధి కుంటుపడిందనీ, వెనుకబడిన దేశాలలో స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల రేటు 1979లో వున్న 4.8 శాతం నుంచి 1980లో 3.8 శాతానికి, 1981లో 3.2 శాతానికి తగ్గిందని ఆయన చెప్పారు. ఇది పెట్టుబడిదారీ విధాన సంక్షోభాన్ని సూచిస్తోందని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రపంచంలోని అత్యంత తక్కువ ఆదాయాలు గల్గిన దేశాల్లో 60వ దశకంలో వార్షిక పెరుగుదల రేటు 1.8 శాతం వుండగా, 70వ దశకంలో అది 0.8 శాతానికి తగ్గిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం వలన దారుణంగా పెరిగిన రుణభారం, తీవ్రంగా పెరిగిన నిరుద్యోగం వల్ల మూడవ ప్రపంచ దేశాల్లోని ప్రజలు పడుతున్న బాధలను ఆయన ప్రస్తావించారు.

కార్మికవర్గం ఈ పరిస్థితిని ఎదుర్కొనటానికి నిర్వహించవలసిన పాత్రను గురించి వివరిస్తూ, కార్మికుల పోరాటాలను చీల్చడానికి, ప్రతిఘటించడానికి, బలహీనపరచటానికి సామ్రాజ్యవాదులు, ఇతర దోపిడీదారుల నీచపుటెత్తుగడల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్మికవర్గాన్ని ఆయన హెచ్చరించారు. ప్రపంచ దేశాల మధ్య నానాటికి పెరుగుతున్న అంతర్గత సంబంధాల వలన ప్రపంచం క్రమంగా చిన్నదవుతున్నదనీ, గుత్త పెట్టుబడిదారులు, బహుళ జాతి కంపెనీల వల్ల ఆ పరిస్థితిలో సర్వత్రా వ్యాపించే దుష్పరిణామాలను, అంతర్జాతీయంగా, పటిష్టమైన సంఘీభావంతో, సమైక్యతతో ప్రతిఘటించవలసిన అవసరాన్ని ఆయన ఉద్ఘాటించారు. ఆయుధ పోటీ, వలసవాదం, ఫాసిజం, నియంతృత్వం, బహుళజాతి కంపెనీల దోపిడీని ఒక సవాలుగా తీసుకుని కార్మికవర్గం ఒక నూతన న్యాయమైన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కోసం పోరాడాలని ఆయన అంతర్జాతీయ కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. నాటి ప్రధాన అంతర్జాతీయ పరిణామాలను, తీవ్రమవుతున్న సమస్యల నెదుర్కొనటానికి ప్రపంచ కార్మికవర్గం తక్షణం చేపట్టవలసిన చర్యల గురించిన ముఖ్యమైన అంశాలను కాస్ట్రో తన ప్రసంగంలో వివరించారు.

## వివిధ కేంద్రాల్లో కొనసాగుతున్న పోరాటాలు

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నానాటికి పెరుగుతున్న సంక్షోభం వల్ల, అంతర్జాతీయ పరిస్థితి బాగా క్షీణించింది. దీని ప్రభావం మూడవ ప్రపంచ దేశాల మీద పడటంతో, భారతదేశంలో కూడా కార్మికవర్గం జాతీయ, రాష్ట్రస్థాయిల్లోనూ, పరిశ్రమల స్థాయిల్లోనూ వివిధ రూపాల్లో పోరాటాలు సాగించింది.

ఈ పరిశ్రమ, రాష్ట్ర స్థాయిల్లో సాగిన పోరాటాల్లో 1982 జనవరి 18న ప్రారంభమై ఆరు నెలలకు పైగా సాగిన బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల సమ్మె గుర్తుంచుకోదగ్గ మహత్తర పోరాటం. స్వాతంత్ర్యానంతర కాలంలో ఇది సుదీర్ఘ కాలం సాగిన సమ్మె.

బొంబాయి టెక్స్‌టైల్ మిల్లు యజమానులు విపరీతమైన లాభాలు దండుకుంటుండగా, ఐ.ఎన్.టి.యు.సి.కి అనుబంధంగా వున్న రాష్ట్రీయ మిల్ మజ్దూర్ సంఘ్ (ఆర్.ఎం.ఎం.ఎస్.)

కార్మికులకు అతి తక్కువ సదుపాయాలు కల్పించే విధంగా యజమానులతో చేసుకున్న ఒప్పందానికి తిరుగుబాటుగా రెండున్నర లక్షల మంది బొంబాయి టెక్స్‌టైల్ కార్మికులు సమ్మెకు పూనుకున్నారు. బొంబాయి పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం 1949 నుండి ఆర్.ఎం.ఎం.ఎస్. మాత్రమే గుర్తింపు పొందిన సంఘమనే సాకు చూపి, సమ్మెకు పిలుపిచ్చిన యూనియన్లతో సంప్రదింపులు జరిపేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నిరాకరించింది.

ఆర్.ఎం.ఎం.ఎస్. చేసుకున్న అభ్యంతరకరమైన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ బొంబాయి టెక్స్‌టైల్ కార్మికులు 1981 సెప్టెంబర్ 27న ఒకరోజు సమ్మె చేశారు. ఇదే కాలంలో బొంబాయి నగరంలో ప్రధానంగా ఇంజనీరింగ్, కెమికల్ పరిశ్రమలలోని కార్మికులు నెలకు రు.200 నుంచి రు.300 వరకు వేతనాలు పెంచుకున్నారు. అందువలన టెక్స్‌టైల్ కార్మికులు తమ నెల జీతాలను రు. 300ల మేరకు పెంచాలని కోరడం అత్యంత సమంజసం. దీనితో పాటు బదిలీ పద్ధతిని రద్దు చేయాలనీ, బొంబాయి పారిశ్రామిక సంబంధాల చట్టాన్ని రద్దు చేయాలనీ కూడా కార్మికులు కోరుతున్నారు. సమ్మె జరిగే సమయానికి 60,000 మంది కార్మికులు బదిలీ పద్ధతి ప్రకారమో, తాత్కాలికంగానో పని చేస్తున్నారు.

ఐ.ఎన్.టి.యు.సి.ని వ్యతిరేకిస్తున్న సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., తదితర యూనియన్లు ట్రేడ్ యూనియన్ల ఐక్యకార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసి సమ్మెను నిర్వహించాయి. చివరకు టెక్స్‌టైల్ యజమాన్యాలు, ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరికి నిరసనగా 1982 ఏప్రిల్ 19న సమ్మె చేస్తున్న టెక్స్‌టైల్ కార్మికులకు సంఘీభావం ప్రకటిస్తూ ఈ యూనియన్లు మహారాష్ట్ర బంద్‌ను విజయవంతంగా నిర్వహించాయి. ప్రభుత్వం, యజమాన్యాలు, ఏ విధంగానూ స్పందించకపోవడంతో ఈ యూనియన్లు మళ్ళీ రాష్ట్ర వ్యాప్తంగా 1982 జూలై 8న సార్వత్రిక సమ్మె నిర్వహించాయి.

1928లో 171 రోజులు జరిగిన బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల సమ్మె కన్నా ఈ సమ్మె ఎక్కువ రోజులు కొనసాగింది. ఇది ఒకవైపు ప్రభుత్వం, మిల్లు యజమానుల సంఘటనకు, కార్మికులకు మధ్య ఘోరమైన యుద్ధాన్ని తలపించింది. కేంద్ర కార్మికమంత్రి కార్మికులకు నెలకు రు.30 ల పెంపుదల చేస్తాననీ, రు. 650 ల తిరిగి చెల్లించే రుణం మంజూరు చేస్తానని ప్రతిపాదించారు. కార్మికులు దీనిని తిరస్కరించి సమ్మె కొనసాగించారు.

దేశమంతటా ఈ సమ్మెకు సంఘీభావ ఉద్యమం ప్రారంభమైంది. జైల్‌భరో, బంద్‌ల వంటి కార్యక్రమాలు నిర్వహించే వారిపై ప్రభుత్వం విరుచుకుపడింది. అధికార పార్టీతో పాటు, మత ఛాందసవాద, దురభిమాన శక్తి అయిన శివసేన ప్రోత్సాహంతో దుండగులు రంగప్రవేశం చేశారు. ఒక ప్రక్క దౌర్జన్యాలు సాగుతుండగా, వేరొక ప్రక్క సమ్మె చేస్తున్న కార్మికుల సహాయార్థం విరాళాల సేకరణ, సంఘీభావ ఉద్యమాలు కొనసాగుతూనే వున్నాయి. ప్రభుత్వంలో ఏ విధమైన కదలిక లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. అనేక కార్మిక కుటుంబాలు ఆకలితో మలమలమాడి అనాధలయ్యారు. తరువాత సమ్మె కాలంలో 50,000 మంది కార్మికులు

బొంబాయి వదిలిపోయారని మనోహర్ కొత్వాల్ కమిటీ నివేదిక తెలియచేసింది. అంటే మిల్లులు తిరిగి తెరచిన తరువాత 50,000 మంది కార్మికులను పనిలోకి తీసుకోలేదన్న మాట. ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మికులకు న్యాయం జరగరాదనే పెట్టుబడిదారుల మొండివైఖరి వలన ఈ సుదీర్ఘమైన సమ్మె విషాదాంతమైంది. వీరోచితమైన ఈ సమ్మె పోరాటం విఫలమవడం వలన సహజంగానే బొంబాయిలోను, మొత్తం మహారాష్ట్రలోను కార్మికోద్యమం స్థైర్యం కోల్పోయింది. 'అంతకుముందు మహారాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ప్రబలిన అరాచకత్వం, దుస్సాహసిక చర్యల వలన సంఘటిత కార్మికోద్యమం కొంతమేరకు పక్కదోవ పట్టింది. దానికి తోడు సమ్మె విఫలం కావటం వలన కార్మికులలో నిస్పృహ చోటు చేసుకుంది. మహారాష్ట్రలో చాలా కాలంగా ప్రభుత్వం, యజమానులు అనుసరించే కార్మిక వ్యతిరేక ప్రతీకార చర్యల నరికట్టడానికి సంఘటిత కార్మికోద్యమం ఐక్యంగా నిబద్ధతతో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నిరాశా, నిస్పృహలతో కూడిన పరిస్థితుల ఫలితంగా సోదర కార్మిక సంఘాల మీద కూడ హింసకు పాల్పడే పూర్తి హింసాయుత, అరాచక చర్యలకు పాల్పడే బొంబాయిలోని, దత్తా సామంత్ తరహా ట్రేడ్ యూనియన్ల ఏర్పాటుకు దారితీసింది.

## జూట్, టెక్స్‌టైల్ పరిశ్రమలను జాతీయం చేయాలని డిమాండ్

బొంబాయి టెక్స్‌టైల్ పరిశ్రమలో దీర్ఘకాలం పాటు కొనసాగిన సమ్మె, బొంబాయిలోనే కాక మొత్తం దేశంలోని టెక్స్‌టైల్ పరిశ్రమ దయనీయ స్థితిని వెల్లడించింది. కార్మికుల న్యాయమైన కోర్కెలను త్రోసిపుచ్చుతున్న యాజమాన్యాలు ఆర్థిక అవకతవకలకు పాల్పడడం సర్వసాధారణమైంది. చాలా మిల్లులను సమ్మె తరువాత తెరవకపోవడంతో వేలాది కార్మికులు ఉపాధి కోల్పోయారు. అటువంటి పరిస్థితులలో, పరిశ్రమను జాతీయం చేయాలనేది, టెక్స్‌టైల్ పరిశ్రమలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రధాన డిమాండ్ అయింది.

ప్రధానంగా కలకత్తా, దాని పరిసరాల్లో కేంద్రీకృతమైన భారత జూట్ పరిశ్రమ పరిస్థితి మరీ దయనీయంగా వుంది. జూట్ పరిశ్రమ యజమానుల ఆర్థిక అక్రమాలు, పరిశ్రమను ఆధునీకరించకపోవడానికి తోడు అంతర్జాతీయంగా తీవ్రమైన పోటీ వలన పరిశ్రమ పరిస్థితి తీవ్రంగా దిగజారింది. అందువల్ల అనేక యూనిట్లు మూతపడి వేలాది మంది కార్మికులు పనులు కోల్పోయారు. ఈ పరిస్థితిలో ఆలిండియా జూట్ వర్కర్స్ ఫెడరేషన్, బెంగాల్ చత్కాల్ మజ్దూర్ యూనియన్, జూట్ పరిశ్రమలోని ఇతర యూనియన్లు, పరిశ్రమను జాతీయం చేయాలని డిమాండ్ చేశాయి. 1982 మధ్య భాగంలో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ జూట్ పరిశ్రమను జాతీయం చేయవల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి ఐ.ఎన్.టి.యు.సి. కాంగ్రెస్(ఐ) నుంచి కూడా మద్దతు లభించింది. పార్లమెంటులో ఈ సమస్యను అనేకసార్లు ప్రస్తావించినా, కేంద్ర ప్రభుత్వం జనపనార పరిశ్రమను జాతీయం చేయడానికి అంగీకరించలేదు.

అయితే బొంబాయి టెక్స్‌టైల్ కార్మికుల సుదీర్ఘ సమ్మె తరువాత 1983 మధ్య భాగంలో, బొంబాయిలోని 13 టెక్స్‌టైల్ మిల్లులను జాతీయం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. మిల్లులో యజమానుల అక్రమాల గురించి యూనియన్లు చేసిన విమర్శ సమంజసమైనదని ఆర్డినెన్సులోని అంశాలు నిరూపించాయి. ఆర్డినెన్స్‌లో ఇతర అంశాలతోబాటు ఈ విషయాన్ని ఈ విధంగా ప్రస్తావించారు. “టెక్స్‌టైల్ యజమాన్యాల అవకతవకల వలన 1982 జనవరి సమ్మెకు ముందే ఆ సంస్థల ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా లేదు. ఆ తరువాత వాటి పరిస్థితి బాగా దిగనాసిల్లిపోయింది.” “ఈ సంస్థలను లాభసాటిగా తీర్చిదిద్దాలనే దృష్టితో కొన్ని ఆర్థిక సంస్థలు వీటికి ఆర్థికంగా సాయం చేశాయి” అని ఆర్డినెన్సు పేర్కొంది. ఈ సంస్థలను పునర్వ్యవస్థీకరించి, పునరుజ్జీవింపచేయడానికి భారీ ఎత్తున పెట్టుబడులు అందజేసి ‘ఆ సంస్థల ఉత్పత్తిని’ అమ్మకాలను పెంపొందించి వాటిలో పనిచేసే కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించాలి” అని ఆర్డినెన్స్ ముగింపులో పేర్కొంది. ఈ విషయంలో తప్ప మిగిలిన ఐ.ఎన్.టి.యు.సి. యూనియన్లు అనుసరించిన వైఖరి పూర్తిగా సమంజసమని ఈ ఆర్డినెన్స్‌లోని వాక్యాలు నిరూపించాయి. 13 మిల్లులు జాతీయం చేయడం వలన ఉద్యోగాలు కోల్పోయిన 36,000 మంది కార్మికులు ప్రయోజనం పొందారు.

ఐ.ఎన్.టి.యు.సి. తప్ప ఇతర యూనియన్లు ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ, మొత్తం టెక్స్‌టైల్ పరిశ్రమను జాతీయం చేయాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించాయి.

జూట్ పరిశ్రమను జాతీయం చేసేందుకు ప్రభుత్వం ఏ విధమైన చర్యలు చేపట్టడానికి నిరాకరించడంతో, జూట్ పరిశ్రమ క్షీణించి వేలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడానికి కారణమైంది.

ఈ పరిస్థితిలో మొత్తం జూట్ పరిశ్రమలోని 3 లక్షల మంది కార్మికులు 1984 జనవరి 16 నుంచి 84 రోజులు నిరవధిక సమ్మె చేసి జూట్ పరిశ్రమ యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 1979లో జరిగిన 50 రోజుల సమ్మె తరువాత దేశంలోని జూట్ పరిశ్రమలో మొదటిసారిగా ఈ సమ్మె జరిగింది. ఈ మధ్యకాలంలో 1980 అక్టోబర్ 10, 1981 ఆగస్టు 10, 1982 ఆగస్టు 10 తేదీల్లో జూట్ పరిశ్రమలో మూడు ఒక రోజు సమ్మెలు జరిగాయి.

ఇండియన్ జూట్ మిల్ ఓనర్స్ అసోసియేషన్ (ఐజెఎంఎ) నాయకత్వంలోని జూట్‌మిల్లుల యజమానులు చివరకు జాతీయం చేయబడిన మిల్లుల్లో కూడా 1979లో 50 రోజులు జరిగిన సమ్మె తర్వాత చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయ నిరాకరించడంతో కార్మికులు నిరవధిక సమ్మె చేయవల్సి వచ్చింది. 84 రోజుల సమ్మె తర్వాత కుదిరిన ఒప్పందం ప్రకారం, వేతనాల గ్రేడ్లు, స్కేళ్ళ మీద నియమించబడిన కమిటీ సిఫార్సుల మీద, పశ్చిమ బెంగాల్ కార్మిక మంత్రి చేసిన నిర్ణయాన్ని మిల్లు యజమానులు అమలు చేయాలి. ఆలిండియా జూట్ వర్కర్స్ ఫెడరేషన్, జూట్ పరిశ్రమలోని ఇతర యూనియన్లు ఈ సమ్మెకు నాయకత్వం

వహించాయి. చివరకు గణనీయమైన విజయాలు సాధించిన అనంతరం కార్మికులు తిరిగి పనుల్లో చేరారు.

## నల్లచట్టాలకు, లాకౌట్లకు వ్యతిరేకంగా పోరాటం

1981 జూన్, 4న బొంబాయిలో జరిగిన శ్రామిక ప్రజల మొదటి జాతీయ సదస్సు తర్వాత, 1983 ఆగస్టు 4న రెండవ జాతీయ సదస్సు ఢిల్లీలోని తాల్కతోరా స్టేడియంలో జరిగింది. ఐ.ఎన్.టి.యు.సి. తప్ప ఇతర కేంద్ర ట్రేడ్ యూనియన్లు, ప్రభుత్వ, పబ్లిక్ రంగ, ప్రైవేట్‌రంగ ఉద్యోగులు, కార్మికుల జాతీయ ఫెడరేషన్లు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

సదస్సు వివిధ రంగాలలో ప్రజ్వరిల్లుతున్న కార్మికవర్గ పోరాటాలను సమీక్ష చేసి "ఇటీవల కార్మికవర్గం కొన్ని ముఖ్యమైన ప్రయోజనాలను సాధించినప్పటికీ, రాబోయే రోజుల్లో కార్మికవర్గం చాలా తీవ్రమైన పరిస్థితుల నెదుర్కొనవలసి వుంటుంది. మన ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా వల్ల దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం, ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారీ విధాన సంక్షోభం వల్ల మరింత తీవ్రతరమవుతోంది. ఇది మన ఆర్థిక వ్యవస్థ మీద, శ్రామిక ప్రజల మీద తీవ్ర ప్రభావం చూపించమంది. అని తీర్మానం హెచ్చరించింది. పారిశ్రామిక ఆర్థిక సంస్థలు నిర్వహించే పాత్రను ప్రస్తావిస్తూ తీర్మానం ఈ విధంగా పేర్కొంది. "భారీ స్థాయిలో రుణాల కోసం, అధునాతనమైనదిగా చెప్పుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి మన ప్రభుత్వం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు, వాటిప్రయోజనాలకు వూడిగం చేసే బహుళజాతి కంపెనీలు, పారిశ్రామిక ఆర్థిక సంస్థల మీద ఆధారపడుతోంది. దీన్నవకాశంగా తీసుకుని, ఈ సంస్థలు ఆయా దేశాల్లోని సంక్షోభ భారాలను భారతదేశంతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మీదకు నెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వం, పెట్టుబడిదారులు, రిట్రెంచ్‌మెంట్, అధిక పనిభారం, వేతనాల కోత, జీవన వ్యయం పెరుగుదల కనుగుణంగా పరిహారం చెల్లించ నిరాకరించడం ద్వారా ఆ భారాన్ని కార్మిక వర్గంపై మోపే ప్రయత్నాలు చేస్తారు."

కార్మికవర్గంపై జరిగే వివిధ దాడుల గురించి వివరించి, నల్లచట్టాలు, లాకౌట్లు, ధరల పెరుగుదల, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, రిట్రెంచ్‌మెంట్లు, లేఆఫ్‌లకు వ్యతిరేకంగా పోరాట కార్యక్రమాన్ని సదస్సు రూపొందించింది. దయనీయమైన పరిస్థితుల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను సంఘటితం చేయాలని సదస్సు తీర్మానించింది.

తర్వాత దశలో దేశ కార్మికవర్గం జరిపే పోరాటాలకు రెండవ జాతీయ సదస్సు మార్గదర్శనం చేసింది. ఆ దిశలోనే జాతీయ ప్రచారోద్యమ కమిటీ ఆధ్వర్యంలో లాకౌట్లకు వ్యతిరేకంగా 1984 జనవరి 20న ఢిల్లీలోని మౌలంకరు హాల్‌లో అఖిల భారత సదస్సు జరిగింది. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., బి.ఎం.ఎస్., యు.టి.యు.సి.,

యు.టి.యు.సి. (లెనిన్ సారణి), టి.యు.సి.సి., రాష్ట్రీయ మజ్దూర్ కాంగ్రెస్ (జెస్.ఎస్. దారా ఆధ్వర్యంలోని ఐ.ఎన్.టి.యు.సి. చీలికవర్గం) ఈ సదస్సులో పాల్గొన్నాయి.

పారిశ్రామిక రుగ్మతలలో 98 శాతానికి యాజమాన్యాలే పూర్తిగా కారణమని రిజర్వు బ్యాంకు నివేదిక పేర్కొన్న విషయాన్ని సదస్సులో పేర్కొన్నారు. పెరుగుతున్న పారిశ్రామిక రుగ్మతలు, రిట్రెంచ్‌మెంట్లు, లే ఆఫ్‌లు, లాకౌట్ల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ సదస్సు ఆమోదించిన తీర్మానం ఈ విధంగా పేర్కొంది.

"బహుళ జాతి కంపెనీలు, బడా వాణిజ్య కుటుంబాలు నిర్వహిస్తున్న కంపెనీలను జాతీయం చేసి, అన్ని స్థాయిల్లోనూ సమాన ప్రాతిపదికన యాజమాన్యంలో నిజమైన కార్మిక భాగస్వామ్యాన్ని నెలకొల్పడం ద్వారా మాత్రమే, పెట్టుబడిదారీ వర్గ దాడులనుండి కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడటం సాధ్యపడుతుంది. దేశంలోని కార్మికులకు నిజమైన సామాజిక భద్రత చేకూరాలంటే, భారత రాజ్యాంగంలో పనిచేసే హక్కును ప్రాథమిక హక్కుగా చేర్చాలని ట్రేడ్ యూనియన్ ఉద్యమం పోరాటం సాగించాలి."

ఖాయిలా పడిన అన్ని పరిశ్రమలను ప్రభుత్వం జాతీయం చేసి, కార్మికుల నిజమైన భాగస్వామ్యంతో వాటిని నడపాలని, సమ్మెలను, లాకౌట్లను ఒకే గాటన కట్టడం కాక, లాకౌట్ చేసిన పరిశ్రమలను వెంటనే తిరిగి తెరవాలని, రిట్రెంచ్‌మెంట్‌ను నిషేధించాలని, లే ఆఫ్‌లకు పరిహారంగా పూర్తి వేతనాలు చెల్లించాలని సదస్సు తీర్మానించింది. రాష్ట్ర స్థాయిలో కూడా ఇటువంటి సదస్సులు నిర్వహించి 1984 మార్చి 19 నుంచి 25 వరకు సదస్సులో లేవనెత్తిన డిమాండ్లపై ఒక వారం రోజులు ప్రచార కార్యక్రమం నిర్వహించాలని సదస్సు దేశంలోని కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది.

పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ సంక్షోభ ఫలితాలు కార్మికవర్గంపై పడే భారాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించడానికి ఐ.ఎన్.టి.యు.సి. తప్ప మిగతా ట్రేడ్ యూనియన్లు అఖిల భారత స్థాయిలో సంఘటితంగా చేసిన ప్రయత్నమిది. కార్మిక వ్యతిరేక బిల్లులు, లాకౌట్లు, రిట్రెంచ్‌మెంట్లు తదితర రూపాల్లో కార్మికవర్గంపై జరిగే దాడులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలకు కొనసాగింపుగా ఈ సదస్సు జరిగింది.

## ప్రభుత్వరంగ ఉద్యోగులు, ప్రభుత్వోద్యోగుల సమరశీల పోరాటాల వెల్లువ

ఈ కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రైల్వే ఉద్యోగులు, ఎల్.ఐ.సి., బ్యాంక్ ఉద్యోగులు వివిధ డిమాండ్ల సాధనకు పెద్ద ఎత్తున పోరాటాలు సాగించారు.

ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపుననుసరించి సుమారు 60 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు దేశవ్యాప్తంగా 1984 సెప్టెంబర్ 4న ఒక రోజు

సమ్మె చేశారు. 8.33% బోనస్, కేంద్ర ప్రభుత్వోద్యోగులతో సమానంగా కరువుభత్యం, తాత్కాలిక భృతి, ధరల అదుపు, ప్రభుత్వ ఆర్థిక విధానంలో సమూలమైన మార్పులు, రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక అధికారాలు వంటి ప్రధాన డిమాండ్ల సాధనకీ సమ్మె నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, బోర్డులు, కార్పొరేషన్లు తదితర సంస్థలకు చెందిన ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, బీహార్, కర్నాటక, త్రిపుర, రాష్ట్రాలలో సమ్మె పూర్తిగా విజయవంతమైంది. ఇతర రాష్ట్రాల్లో సమ్మె తరతమ స్థాయిల్లో విజయవంతమైంది.

అందరికీ బోనస్, 4 వాయిదాల కరువు భత్యం వాయిదాల విడుదల, 1984 అక్టోబర్ నాటికి పే కమిషన్ మధ్యంతర నివేదిక సమర్పణ, మొదలైన డిమాండ్ల సాధనకు కేంద్ర ప్రభుత్వోద్యోగులు, దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు 1984 ఆగస్టు 7వ తేదీన “కాల్ అటెన్షన్ డే” పాటించి, ఢిల్లీలో పే కమిషన్ ఆఫీసు ముందు 1984 ఆగస్టు 21న బ్రహ్మాండమైన ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత 1984 ఆగస్టు 31న దేశవ్యాప్తంగా ‘పే బాయ్‌కాట్’ (జీతాలు తీసుకోవడానికి నిరాకరించడం) ద్వారా నిరసన వ్యక్తంచేశారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్ పిలుపుననుసరించి కరువుభత్యం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఊరేగింపులు, ప్రదర్శనలు జరిపారు.

ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాల్గవ తరగతి, పోస్టుమెన్ ఇ.డి.ఎ. పిలుపు మేరకు 3 లక్షలమంది ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంటల్ ఉద్యోగులు, 60 వేలమంది రెగ్యులర్ పోస్టల్ ఉద్యోగులు 1984 సెప్టెంబర్ 19న ఒకరోజు సమ్మె చేశారు. ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంటల్ ఉద్యోగులు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో శాశ్వత ఉద్యోగులు చేసే పనిని చేస్తారు. వారికి ‘సమాన పనికి సమాన వేతనం’ సూత్రం ప్రకారం వారు పనిచేసే కాలానికనుగుణంగా వేతనం చెల్లించాలనీ, శాశ్వత ఉద్యోగులకు ఇచ్చినట్లు తాత్కాలిక భృతి, కరువు భత్యం చెల్లించాలన్న డిమాండ్లతో పాటు, చాలాకాలంగా అపరిష్కృతంగా వున్న ఇతర సమస్యల పరిష్కారానికి పోస్టల్ ఉద్యోగులు ఒక రోజు సమ్మె చేశారు. ఇక్కడొక విషయం గమనించాలి. ప్రభుత్వం ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంటల్ ఏజెంట్లుగా పేర్కొంటున్న ఈ 3 లక్షల మంది దేశంలోని 6 లక్షల గ్రామాల్లోని 1,25,000 పోస్టాఫీసుల్లో గ్రామీణ బ్రాంచి పోస్టుమాస్టర్లు, సబ్ పోస్టుమాస్టర్లు, పోస్టుమెన్, రన్నర్లు, మెయిల్ కొరియర్లు, ప్యాకర్లుగా తమ విధులను నిర్వహిస్తున్నారు. ఈ ఎక్స్‌ట్రా డిపార్ట్‌మెంటల్ ఏజెంట్లను శాశ్వత ప్రాతిపదికపై నియమించాలని నిరంతర పోరాటం కొనసాగుతున్నా ప్రభుత్వం అందుకు నిరాకరిస్తోంది.

గతంలో వేతన సంఘం ఏర్పాటు చేయకముందు, వేతన సంఘం ఏర్పాటు చేయాలని కోరుతూ 25,000 మంది రైల్వే ఉద్యోగులు ఆందోళన ప్రారంభించి 1983 ఆగస్టు 19న ఢిల్లీలోని బోట్‌క్లబ్ మైదానంలో ధర్నా నిర్వహించారు. రైల్వే అధికారుల గుర్తింపు లేకపోవడంతో

జె.సి.ఎం.లో లేని ఆలిండియా రైల్వే ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఇండియన్ రైల్వే వర్కర్స్ ఫెడరేషన్లు ఈ ధర్నా నిర్వహించాయి.

మరునాడు, అంటే 1983 ఆగస్టు 20న నాలుగు వేల మంది ప్రతినిధులతో ఢిల్లీలో జరిగిన రైల్వే కార్మికుల సదస్సు పోరాటాన్ని ముందుకు నడిపించేందుకు కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ పోరాటాలు నిర్వహించటానికి పోరాటంలో పాల్గొంటున్న వివిధ యూనియన్ల ప్రతినిధులతో ఒక జాతీయ ప్రచార కమిటీని ఏర్పాటు చేశారు.

ఈ కాలంలో బ్యాంకు ఉద్యోగులు సమరశీల పోరాటాలు నిర్వహించారు. 1983 ఏప్రిల్ 13న ఆలిండియా రిజర్వుబ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపుననుసరించి పని భారం పెంపుదల, యాంత్రీకరణ, కంప్యూటరైజేషన్‌కు వ్యతిరేకంగా 18 వేల మంది రిజర్వు బ్యాంకు ఉద్యోగులు 1983 ఏప్రిల్ 12న ఒక రోజు దేశవ్యాప్త సమ్మె చేశారు.

రిజర్వు బ్యాంకు ఉద్యోగుల సమ్మె తరువాత, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు దాదాపు 85 వేల మంది బ్యాంకు ఉద్యోగులు 1983 సెప్టెంబర్ 6న ఒక రోజు సమ్మె చేశారు. కక్ష సాధింపు చర్యలకు, ట్రేడ్ యూనియన్ హక్కుల అణచివేతకు, కంప్యూటరైజేషన్, యాంత్రికీకరణకు వ్యతిరేకంగానూ, చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరుతూ ఆ సమ్మె నిర్వహించారు. ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్‌కు ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అనే రెండు గుర్తింపు పొందిన యూనియన్లకు మధ్య కంప్యూటరైజేషన్ మీద జరిగిన ఒప్పందానికి వ్యతిరేకంగా ఈ సమ్మె జరిగింది. లైఫ్ ఇన్సూరెన్సు కార్పొరేషన్‌కు చెందిన 45 వేల మంది మూడు, నాల్గవ తరగతి ఉద్యోగులు జీతాల్లో కోత విధించడానికి, కరువు భత్యం పాయింటుకు రు.1.20 చొప్పున చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టే కార్పొరేషన్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా 1984 మే 8న ఒకరోజు సమ్మె చేశారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఆసోసియేషన్, నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ వర్కర్సు, ఆలిండియా లైఫ్ ఇన్సూరెన్సు ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆలిండియా ఎల్.ఐ.సి ఎంప్లాయీస్ ఫెడరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సమ్మె జరిగింది.

విమానంలోని ఎనిమిది మంది క్యాబిన్ సిబ్బంది సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా ఎయిర్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో 1984 మే 7న ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో సమ్మె జరిగింది. అప్పట్లో అమలులో వున్న కరువుభత్యం రేటుకు బదులు పారిశ్రామిక కరువుభత్యం ఇవ్వాలన్న బ్యూరో ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ ఆదేశాలకు వ్యతిరేకంగా పబ్లిక్ రంగ ఉద్యోగులు 1984 జూలై 17 నుండి 24 వరకు కోర్కెల వారం పాటించారు. ఈ పోరాట నిర్వహణకు పబ్లిక్ రంగ సంస్థల్లోని వివిధ యూనియన్ల ప్రతినిధులతో ఒక జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

## జాతీయం చేసిన బొగ్గు పరిశ్రమలో పోరాటం

జాతీయం చేయబడ్డ బొగ్గు పరిశ్రమలో ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు మరింత ప్రస్ఫుటంగా వెల్లడయ్యాయి. పరిశ్రమలో నానాటికి దిగజారుతున్న పారిశ్రామిక సంబంధాలను చూసి బెంబేలెత్తిన కోల్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం, కార్మికులపై కక్ష సాధించే ఉద్దేశంతో ఒక రోజు సమ్మె చేస్తే 8 రోజుల జీతం కోత విధిస్తామని తెలియజేస్తూ 1984 ఆగస్టు 24న మిక్కిలి నిరంకుశమైన ఆదేశాలను జారీ చేసింది.

బొగ్గుగని కార్మికులు ప్రభుత్వ నిరంకుశ నిర్లక్ష్య వైఖరికి బలిపశువులయ్యారు. వందలమంది పర్మినెంట్ కార్మికులను పనిలోంచి తొలగించారు. ఆదివారం నాడు, పండుగరోజుల్లో పనిచేయడానికి నిరాకరించిన కార్మికులకు అనేక రోజుల జీతం కోత పెట్టారు. ఆరోగ్య కారణాల వలన పనికి హాజరుకాకపోయినా 'సమ్మె'గా లేదా 'కుట్ర'గా పరిగణించనారంభించారు. ఆ విధంగా అధికారులు పగ సాధింపు చర్యలకు పాల్పడ్డారు.

గనుల్లో భద్రతా చర్యల పట్ల నిర్లక్ష్యం వహించడం వలన అనేక ప్రమాదాలు జరిగి కార్మికులు అనేక మంది దుర్మరణం పాలయ్యారు. గాయపడ్డారు. అధికారికంగా ప్రచురించిన లెక్కల ప్రకారమే పరిస్థితి ఎంత ప్రమాదకరంగా వున్నదో ఊహించవచ్చును.

## బొగ్గు గనుల్లో ప్రమాదాలు

| సంవత్సరం సంఖ్య | ప్రమాదాల వారిసంఖ్య | చనిపోయిన వారి సంఖ్య | తీవ్రంగా గాయపడిన |
|---|---|---|---|
| 1979 | 114 | 147 | 1143 |
| 1980 | 113 | 130 | 1132 |
| 1981 | 124 | 142 | 1208 |
| 1982 | 123 | 148 | 921 |
| 1983 | 124 | 157 | 748 |

జార్ఖండ్‌లోని టోపాకాలరీలో జరిగిన ప్రమాదం గురించి కోర్టు ఆఫ్ ఎంక్వైరీ నివేదిక "భద్రత గురించి ఏమాత్రం ఆలోచించని పరిస్థితి నెలకొన్నదని" పేర్కొన్నది. "బొగ్గు గనులను,

ఖనిజాభివృద్ధిని జాతీయం చేసిన తరువాత గనుల భద్రత నిర్వహించే డైరక్టరు జనరల్ అధికారాలు అనేక కారణాల వలన కుదించబడ్డాయని" నివేదిక పేర్కొంది. "ఈ పరిస్థితులను ఇక ఏమాత్రం కొనసాగించరాదని" నివేదిక తెలిపింది.

ఈ పరిస్థితులలో ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్, ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., ఐ.ఎన్.టి.యు.సి.లకు చెందిన ఇతర యూనియన్లు కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ కోల్ మైన్స్ ఏర్పాటు చేసి, తమ సమస్యలను ఒక నెలలోగా పరిష్కరించవలసిందిగా కోరుతూ కేంద్ర ఇంధన మంత్రికి ఒక విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఆ విధంగా జరుగకపోతే ఏ రోజునైనా నిరవధిక సమ్మె ప్రారంభిస్తామని ఆ విజ్ఞాపన పత్రంలో హెచ్చరించారు. జె.ఎ.సి. సమావేశం జరిగిన తరువాత 1984 జూన్ 27న ఈ విజ్ఞాపన పత్రం సమర్పించారు. కోల్ ఇండియా లిమిటెడ్ ఆధారిటీ 1984 అక్టోబరు 8న సంయుక్త ద్వైపాక్షిక కమిటీ సమావేశం ఏర్పాటు చేసింది. అయితే అదే సమయంలో ఎస్మా క్రింద బొగ్గు పరిశ్రమలో సమ్మెలను నిషేధిస్తూ ఆదేశం జారీ చేసింది. 1984 అక్టోబరు 11 నుండి సింగరేణి కాలరీలో ప్రారంభం కానున్న సమ్మెను నివారించడానికి ఈ ఆదేశం జారీ చేయడం జరిగింది. ఈ ఆదేశం ఐ.ఎన్.టి.యు.సి.తో సహా అన్ని యూనియన్లకు ఆగ్రహం తెప్పించింది. అధికారుల కార్మిక వ్యతిరేక విధానాలను అన్ని యూనియన్లు ఖండించాయి. ట్రేడ్ యూనియన్ల సంఘటితశక్తిని చూసిన కోల్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం దిగివచ్చి, పగ సాధింపు చర్యల నన్నింటినీ సమీక్షిస్తామని, అన్ని డిమాండ్ల మీద 1984 డిసెంబర్‌లో పూర్తి స్థాయి చర్చలు జరుపుతామని హామీ ఇచ్చింది. ఈ లోగా ఒక రోజు సమ్మెకు 8 రోజుల జీతాన్ని మినహాయించే పద్ధతిని కోర్టు ఆదేశాల మేరకు నిలిపివేశారు.

బొగ్గుగని కార్మికులు మూడవ నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్ (బొగ్గు గనుల్లో 3వ జాతీయ వేతన ఒప్పందం) అమలు చేయకపోవడానికి వ్యతిరేకంగానూ, ఇతర డిమాండ్ల సాధనకు 1984 జూన్ 4, 5 తేదీల్లో 48 గంటల సమ్మె నిర్వహించారనే విషయం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

## నూతన జీవన వ్యయసూచికకు ట్రేడ్ యూనియన్ల ప్రతిఘటన

ఈ కాలంలో నూతన జీవన వ్యయసూచిని ప్రవేశపెట్టే విషయమై ప్రభుత్వానికి ట్రేడ్ యూనియన్లకు మధ్య వివాదం ఏర్పడింది. 1981–82 సంవత్సరం ప్రాతిపదికగా నూతన జీవన వ్యయసూచిని ప్రవేశపెట్టాలన్న సీల్ కమిటీ నివేదికను చర్చించడానికి కేంద్ర, కార్మిక మంత్రిత్వ శాఖ 1984 ఏప్రిల్ 27న ట్రేడ్ యూనియన్ల సమావేశం జరిగింది. ఐ.ఎన్.టి.యు.సి., సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., బి.ఎం.ఎస్., యు.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి. (ఎల్.ఎస్.), ఎస్.ఎఫ్.ఐ.టి.ల యూనియన్లు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

రథ్ కమిటీ ఏకగ్రీవ సిఫార్సుల మేరకు 1960 జీవన వ్యయసూచిలోని అవకతవకలను సరిదిద్దడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని యూనియన్ ప్రతినిధులు తీవ్రంగా విమర్శించారు. సీల్ కమిటీ కేవలం యూనివర్శిటీలు, కేంద్ర కార్మిక శాఖ నుండి మాత్రమే సమాచారం సేకరించిందని, ట్రేడ్ యూనియన్లు తమ అభిప్రాయాలను వ్యక్తంచేయడానికి అనుమతించలేదని వారు తెలియజేశారు. బ్లాక్‌మార్కెట్ ధరలను, ప్రజలు వినియోగించే పదార్థాల నాణ్యతను పరిగణనలోకి తీసుకోకుండా ధరల వివరాలను సేకరించడం వంటి సీల్ కమిటీ లోపాలను వారు ఎత్తిచూపారు. ఇంటి అద్దె, వస్త్రాల ధరల విషయంలో సూచిక వాస్తవాలను ప్రతిబింబించడం లేదనీ, సీల్ కమిటీ నివేదికను ఆమోదిస్తే కార్మికుల వేతన స్థాయిని మరింత కుదించటమవుతుందని వారు వాదించారు. వస్తువుల ధరల సేకరణలోనూ, ధరల సూచిని తయారు చేయడంలోనూ కార్మిక ప్రతినిధుల భాగస్వామ్యం అన్ని స్థాయిల్లో వుండాలని రథ్ కమిటీ చేసిన సిఫార్సును సీల్ కమిటీ విస్మరించిందని వారు తీవ్రంగా విమర్శించారు. ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు అనేక ఇతర అభ్యంతరాలను ఏకగ్రీవంగా లేవనెత్తారు.

1960 జీవన వ్యయసూచిలో 1977 నాటికి 8 పాయింట్లు తేడా వుందని పేర్కొంటూ, ఈ తేడా మరింత ఎక్కువ వుండవచ్చని కొందరు సభ్యులు అభిప్రాయపడినట్లు 1978లో రథ్ కమిటీ సమర్పించిన నివేదికలో పేర్కొంది. ధరల వివరాలు సేకరించే యంత్రాంగంలోనూ, ధరల సూచి తయారు చేయడంలోనూ, ధరలు, జీవన వ్యయ గణాంకాలను తయారు చేసే సాంకేతిక సలహా కమిటీలోనూ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొనాలని రథ్ కమిటీ సిఫారసు చేసింది. చట్ట ప్రకారం రేషన్ అమలులో వున్న ప్రాంతాలలో ధరల సూచిలో వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించాలంటే బ్లాక్ మార్కెట్ ధరలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలని, రథ్ కమిటీ సిఫారసు చేసింది. కమిటీ చేసిన అనేక ఇతర సిఫారసులను ట్రేడ్ యూనియన్లు స్వాగతించినప్పటికీ, ప్రభుత్వం వాటిని తిరస్కరించింది.

ఈ పరిస్థితులలో ధరల సూచిపై సీల్ కమిటీ నివేదికను ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు తిరస్కరించారు. తదుపరి చర్చల కోసం ఈ సమస్యను వాయిదా వేశారు. 1981-82 సంవత్సరం ప్రాతిపదికగా నూతనంగా తయారు చేసిన ధరల సూచి కార్మికులకు పూర్తిగా ప్రతికూలమైనది, అంగీకారయోగ్యం కానిది, ఈ నివేదికను రద్దు చేయటానికి ట్రేడ్ యూనియన్లు పోరాటం కొనసాగించవలసి వచ్చింది.

## ట్రేడ్ యూనియన్ల సభ్యత్వ తనిఖీ విధానంపై వివాదం

1950 దశకం చివరలో క్రమశిక్షణా నిబంధనావళిని ఆమోదించిన తరువాత సభ్యత్వ తనిఖీ విధానం రూపొందించారు. ఐ.ఎన్.టి.యు.సి., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్.,

యు.టి.యు.సి.లు క్రమశిక్షణా నిబంధనావళి, సభ్యత్వ తనిఖీ విధానం రూపొందించడంలో భాగస్వాములయ్యాయి. అప్పటి నుండి మూడుసార్లు కేంద్ర ట్రేడ్ యూనియన్ల సభ్యత్వ తనిఖీ జరిగింది. తరువాత దశలో ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి.లు కేంద్ర ట్రేడ్ యూనియన్ల సభ్యత్వ తనిఖీ విధానం, అశాస్త్రీయము, నిరంకుశము, ఏకపక్షమైనదని, కొన్ని యూనియన్లకు పూర్తిగా అనుకూలంగా వున్నదని ఫిర్యాదు చేశాయి. వివిధ యూనియన్ల బలాన్ని నిర్ధారించడంలో రాజకీయపరమైన అంశాలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆరోపించారు.

ప్రభుత్వం ఈ అభ్యంతరాలను త్రోసిపుచ్చడంతో ప్రతిష్టంభన నెలకొని, 1968 నుంచి సభ్యత్వ తనిఖీ ఆగిపోయింది. ప్రభుత్వం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్సు సమావేశాలను నిర్వహించటం మానేసింది. కార్మిక వర్గానికి సంబంధించిన శాసనాలు చేసే ముందు ట్రేడ్ యూనియన్లతో సర్వసాధారణం చేసే సంప్రదింపులు కూడ చేయడం మానేసింది.

ఒక సంస్థ బల నిర్ధారణకు రహస్య బ్యాలెట్‌ను మాత్రమే శాస్త్రీయమైన పద్ధతిగా అనుసరించాలని ఐఎన్‌టియుసి తప్ప మిగిలిన యూనియన్లు డిమాండ్ చేశాయి. జాతీయ లేబరు కమిషన్ (ఎన్.ఎల్.సి.) ఈ డిమాండ్‌ను గమనంలో వుంచుకుని రహస్య బ్యాలెటు, సభ్యత్వ తనిఖీ అనే రెండు పద్ధతులు అంగీకార యోగ్యమైనవేనని, వాటిలో ఏది ఎప్పుడు అనుసరించాలో పారిశ్రామిక సంబంధాల కమిషన్ నిర్ధారించవచ్చని సిఫార్సు చేసింది. సభ్యత్వ తనిఖీ ఒక స్వతంత్ర సంస్థ ద్వారా నిర్వహించాలని కమిషన్ సూచించింది. ఈ సూచన ద్వారా సభ్యత్వ తనిఖీలో రాజకీయ స్వార్ధం చోటు చేసుకుంటోందని ఎన్.ఎల్.సి. పరోక్షంగా అంగీకరించింది.

అదే సమయంలో ప్రభుత్వం సభ్యత్వ తనిఖీ విధానంలో కొన్ని మార్పులు చేసి ట్రేడ్ యూనియన్లతో కనీసం సంప్రదించకుండా సవరించిన విధానాన్ని అమలు చేయటం మొదలుపెట్టింది. ఈ పరిస్థితుల్లో యుటియుసి, బిఎంఎస్, యుటియుసి (ఎల్.ఎస్), టియుసిసి, హెచ్‌ఎంఎస్ యూనియన్లు తమ సభ్యత్వ జాబితాలనందచేసి, సభ్యత్వ తనిఖీ విధానాన్ని సవరించాలని కోరాయి. అయితే ఇదివరకే తాము లేవనెత్తిన అభ్యంతరాల దృష్ట్యా ఎఐటియుసి, సిఐటియులు సభ్యత్వ జాబితాలు అందచేయలేదు.

సభ్యత్వ తనిఖీ విషయమై అమలులోనున్న విధానానికి అనేక అభ్యంతరాలు తెలియచేసిన జాతీయ ప్రచారోద్యమ కమిటీ, కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, చీఫ్ లేబరు కమీషనర్ (సెంట్రల్) సహకారంతో నూతన సభ్యత్వ తనిఖీ విధానాన్ని రూపొందించి, దాని ప్రకారం భవిష్యత్తులో సభ్యత్వ తనిఖీ జరపాలని కోరింది. 'ఒక ఆమోదయోగ్యమైన విధానం మాత్రమే కార్మికుల విశ్వాసాన్ని, గౌరవాన్ని చూరగొనగలదని' కమిటీ పేర్కొంది.

సభ్యత్వ తనిఖీ విధానం మెరుగుదలకు సాగిన సుదీర్ఘ పోరాటం తరువాత చివరకు 1986 జూలై 31వ తేదీన పది కేంద్ర ట్రేడ్ యూనియన్లకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య నూతన సభ్యత్వ తనిఖీ విధానంపై ఒప్పందం కుదిరింది.

సిఐటియు, ఎఐటియుసి, కొన్ని ఐఎన్‌టియుసి యేతర ట్రేడ్ యూనియన్లు ఈ విషయంలో సుదీర్ఘకాలం తీవ్రపోరాటాలు సాగించవల్సి వచ్చింది. ఏ పరిశ్రమలోనైనా కార్మికులకు ప్రాతినిధ్యం వహించే యూనియన్‌ను రహస్య బ్యాలెట్ ద్వారా నిర్ణయించే విషయమై చట్టం చేయటానికి పశ్చిమ బెంగాల్‌లోని వామపక్ష ప్రభుత్వం చేసిన కృషిని ఈ సందర్భంలో ప్రత్యేకంగా పేర్కొనాలి. 1969లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ కాలంలో పశ్చిమ బెంగాల్ శాసనసభ రహస్య బ్యాలెట్ ద్వారా ఉమ్మడి బేరసారాల ప్రతినిధిని నిర్ణయించాలనే బిల్లును ఆమోదించింది. అయితే 13 సంవత్సరాల తరువాత 1982లో రాష్ట్రపతి ఆ బిల్లును తిరస్కరించారు.

పశ్చిమబెంగాలులో వామపక్ష సంఘటన ప్రభుత్వం మరోసారి అటువంటి సవరణ బిల్లును ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపింది.

1977లో పశ్చిమ బెంగాలులో వామపక్ష ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత, రాజ్యాంగ పరిధులకు లోబడి కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్మిక విధానాలకు పూర్తిగా భిన్నమైన విధానాలను అనుసరించింది. పశ్చిమబెంగాలు వామపక్ష సంఘటన ప్రభుత్వం, కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం, త్రిపురలో వామపక్ష సంఘటన ప్రభుత్వం అన్ని అంశాలలోనూ కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించే కృషి చేశాయి.

## ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్య

1984 సంవత్సరం జాతీయంగా అనేక విషాదకర సంఘటనలతో ముగిసింది. 1984 అక్టోబరు 31న ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఆమె నివాసంలోనే ఆమె అంగరక్షకులిద్దరు హత్య చేశారు. ఖలిస్తాన్ ఉగ్రవాదులతో వారికి సంబంధం ఉన్నట్లు తరువాత దర్యాప్తులో వెల్లడైంది. ఈ అమానుష హత్య వలన దేశం దద్దరిల్లింది. ప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు.

పంజాబును భారతదేశం నుండి వేరు చేసి ప్రత్యేక ఖలిస్తాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ, ఖలిస్తాన్ ఉగ్రవాదులు గత కొన్ని సంవత్సరాలుగా పంజాబ్‌లో బీభత్సం సృష్టిస్తున్నారు. పొరుగుదేశం ప్రోత్సాహం, మద్దతుతో ఈ వేర్పాటువాద వుద్యమం కొనసాగింది. ఆమెరికా, బ్రిటన్ దేశాలు ఈ ఉగ్రవాదులకు శరణాలయాలైనాయి. సిక్కులకు పవిత్ర దేవాలయమైన అమృత్‌సర్ స్వర్ణదేవాలయంలో దాక్కున్న సిక్కు

ఉగ్రవాదులను దానిలోంచి తరిమివేయటానికి ఆపరేషన్ బ్లూస్టార్ జరిపిన తరువాత ఉగ్రవాదులు ఇందిరాగాంధీని తమ లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ ఘోరహత్యను, ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పక్షాలు, భారతదేశంలోని అన్ని తరగతుల ప్రజలు తీవ్రంగా ఖండించారు.

ప్రధానమంత్రి విశ్వాసఘాతుకంగా హత్యకు గురైన సందర్భంలో, ఢిల్లీలో వేలాది మంది సిక్కులను ప్రతీకారేచ్ఛతో భయంకరంగా హత్య చేశారు, గాయపరచారు. కార్మిక వర్గానికిది భ్రాతృ హత్యా సదృశ్యమైన విషాదకర సంఘటన.

దేశంలో ఒక భయంకర పరిస్థితి నెలకొంది. ఈ అనిశ్చిత పరిస్థితులలో ట్రేడ్ యూనియన్లు తమ కార్యక్రమాలు కొనసాగించే వీలు లేకపోయింది. ఇందిరాగాంధీ పెద్ద కొడుకు రాజీవ్‌గాంధీ తాత్కాలిక ప్రధానమంత్రిగా దేశం మొత్తం రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధమవుతోంది.

## భోపాల్‌లో వినాశం - యూనియన్ కార్బయిడ్ గ్యాస్ లీక్ విషాదం

1984 డిసెంబరు 3న భోపాల్‌లో యూనియన్ కార్బయిడు ప్లాంటులో గ్యాస్ లీకు వలన సంభవించిన మారణహోమం భారత పరిశ్రమలలో జరిగిన అత్యంత విషాదకర సంఘటన. హిరోషిమా, నాగసాకీలలో జరిగిన విధంగా కొంచెం తక్కువ స్థాయిలో ఈ వినాశం జరిగింది. 2500 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోగా, వేలాదిమంది తాత్కాలికంగానూ, శాశ్వతంగానూ, జవసత్వాలు పొగొట్టుకున్నారు. ఇదొక జాతీయ విషాదం.

యూనియన్ కార్బయిడ్ అమెరికాకు చెందిన ఒక బహుళజాతి కంపెనీ. ఈ రసాయనిక విధ్వంసం తరువాత, తమ దేశాలలో ఇటువంటి ప్రమాదకర పరిశ్రమలు నెలకొల్పటానికి అనుమతి లభించని బహుళజాతి కంపెనీలు, మూడవ ప్రపంచ దేశాలలో ప్రాణాంతకమైన పరిశ్రమలు నెలకొల్పడంలో నిర్వహించే పాత్ర గురించి అనేక ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా అటువంటి పరిశ్రమలలో అత్యవసర భద్రతా ప్రమాణాలు పాటించడం పట్ల వహించిన పూర్తి నిర్లక్ష్యం ప్రజలకు తీవ్ర మనస్తాపం కల్గించింది.

వివిధ పరిశ్రమలలో, ముఖ్యంగా ప్రమాదకరమైన పరిశ్రమలలో తగినన్ని భద్రతా చర్యలు, ప్రమాణాలు పాటించటం లేదని భారతదేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమం చాలాకాలంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే వున్నది. భారతదేశంలోని

పరిశ్రమల్లో ప్రమాదాలు హెచ్చుస్థాయిలో వున్నాయి. భోపాల్ విషాద వుదంతం భారత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి, అమెరికా బహుళజాతి సంస్థలు కార్మికుల జీవితాలతో ఆటలాడుకునే నేర ప్రవృత్తికి నిదర్శనంగా నిలిచింది.

ఈ భయంకర విషాదకర సంఘటన పట్ల దేశ ప్రజలలో తీవ్ర నిరసన పెల్లుబికింది. యూనియన్ కార్బయిడ్ యాజమాన్యం యొక్క అమానుష నిర్లక్ష్యానికి తగిన శిక్ష విధించాలని ప్రజలు, ట్రేడ్ యూనియన్ వుద్యమం డిమాండు చేశాయి. భారత ప్రభుత్వం పరిశ్రమలలో తగిన భద్రతా చర్యలు, ప్రమాణాలు నెలకొల్పేందుకు సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాశ్చాత్య దేశాలు, వాటి అధీనంలోని బహుళజాతి కంపెనీలు మూడవ ప్రపంచ దేశాల్లో వ్యర్థమైన కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తక్కువ నాణ్యతా ప్రమాణాలు గల తమ పాత యంత్రాలను వినియోగించడం ద్వారా, మూడవ ప్రపంచ దేశాలను తమ దేశాల్లోని వ్యర్థ పదార్థాలకు నిలయం (డంపింగ్ గ్రౌండ్)గా పరిగణిస్తున్నాయని, భారత కార్మికోద్యమం ప్రభుత్వం దృష్టికి తెస్తూనే వుంది. చివరకు తమ దేశాలలో హానికరమని ప్రకటించి, నిషేధించిన రసాయనాలను, పురుగు మందులను కూడా మూడవ ప్రపంచ దేశాల్లో గుమ్మరిస్తున్నారు. యూనియన్ కార్బయిడ్ విషాద సంఘటన ఈ వాస్తవాలను ధృవపరుస్తోంది.

తరువాత కాలంలో బహుళజాతి కంపెనీలు ఏ ఆంక్షలు లేకుండా దేశంలో ప్రవేశించటానికి వ్యతిరేకంగా భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం పోరాటాన్ని తీవ్రతరం చేసింది. అది సుదీర్ఘ పోరాటంగా పరిణమించింది.

# 23

# తీవ్రమైన ఆర్థిక సంక్షోభం - పెల్లుబికిన కార్మికవర్గ ప్రతిఘటన (1985-90)

## ఎన్నికలు - కాంగ్రెస్ (ఐ) విజయం

**ఇం**దిరాగాంధీ హత్యానంతరం 1984 డిసెంబర్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో రాజీవ్‌గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ (ఐ) కి బ్రహ్మాండమైన మెజారిటీ లభించింది. ఆ పార్టీకి పార్లమెంట్‌లో 4/5 వంతు సీట్లు లభించాయి. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గాని, ఇందిరాగాంధీ గాని ఏనాడూ అంతటి ఘనవిజయం సాధించియుండలేదు.

ఈ విజయం మాయాజాలంతో సమకూరలేదు. ఇందిరాగాంధీ విషాదహత్య కారణంగా కాంగ్రెస్(ఐ)కి అపూర్వమైన మద్దతు లభించింది. ఖలిస్తాన్ వేర్పాటువాదుల కుట్రల పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇందిరగాంధీని జాతీయ సమైక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో బలిదానమైన వ్యక్తిగా ప్రజలు భావించారు. అందువల్ల ఇందిరాగాంధీ పట్ల ప్రజలకున్న ప్రగాఢ సానుభూతి ఆమె కొడుకుకు, ఆమె పార్టీకి ఎన్నికలలో బ్రహ్మాండమైన మద్దతుగా రూపుదాల్చింది. తాత్కాలికంగా ప్రజలు కాంగ్రెస్(ఐ) ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని ప్రక్కన పెట్టారు. దేశ ప్రజలకు దేశ సమైక్యతా పరిరక్షణ పట్ల గల ప్రగాఢ వాంఛ కారణంగా కాంగ్రెస్(ఐ) ప్రభుత్వ దుశ్చర్యల వలన తమకు కల్గిన బాధలను, కార్మికవర్గం ఇతర తరగతుల శ్రమజీవులు మరచిపోయారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్(ఐ) పరిస్థితి మెరుగుపడింది. ఇందిరాగాంధీ హత్య వలన అటువంటి సానుభూతి వెల్లువ వచ్చింది.

## ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణ - రాజీవ్‌గాంధీ నూతన ఆర్థిక విధానాలు

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ ఆర్థిక విధానం సంక్షోభంలో చిక్కుకున్న సమయంలో, ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో భాగంగా, దుర్భర దారిద్ర్యాన్ననుభవిస్తున్న మూడవ

ప్రపంచ దేశాల్లో ఒకటిగా భారతదేశం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను, కాంగ్రెస్(ఐ)కి లభించిన భారీ ప్రజా తీర్పు ఏమాత్రం పరిష్కరించలేకపోయింది.

1980 దశకం నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్వరూపం గణనీయంగా మార్పు చెందడం ప్రారంభమైంది. 1980 దశకం ప్రారంభంలో నెలకొన్న పరిస్థితులకు, 1930 దశకం ప్రారంభం నాటి పరిస్థితులకు, కొన్ని అంశాల్లో కొట్టవచ్చినట్లు పోలికలు కన్పిస్తాయి. 1930 దశకంలో సంభవించింది కేవలం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మహా పతనమే కాదు. అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ మీద బ్రిటన్ ఒక శతాబ్ద కాలం పాటు చెలాయించిన ఆధిపత్యం తగ్గుముఖం పట్టి, అంతర్జాతీయ చెల్లింపులకు, రిజర్వు నిధుల నిర్వహణకు సాధనమైన బ్రిటన్ పౌండ్ స్టెర్లింగ్ విలువ పడిపోయింది. అదేవిధంగా 1980వ దశకంలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థ మీద దశాబ్దాలుగా కొనసాగుతున్న అమెరికా ఆధిపత్యం దిగజారడంతో, ప్రధాన అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ఆధిపత్యాన్ని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. గతంలో పెట్టుబడిదారీ దేశాల మధ్య నెలకొన్న జాతీయతతో కూడిన పోటీ (కాంపిటీటివ్ నేషనలిజం) చాలాచోట్ల తిరిగి ప్రత్యక్షమైంది. ఈ రెండు సందర్భాల్లోనూ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక మాంద్యం నెలకొని, ఆర్థిక కార్యకలాపాలు మందగించాయి. ప్రపంచబ్యాంకు "పారిశ్రామికీకరించబడ్డ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు (ఇండస్ట్రియలైజ్ మార్కెట్ ఎకానమీస్)గా నామకరణం చేసిన అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు 1950 నుండి 1973 వరకు సగటున 3.6 శాతం అభివృద్ధి సాధించగా 1973 నుండి 1989 వరకు కేవలం 2.0 శాతం అభివృద్ధిని మాత్రమే సాధించాయి. 1981--1991 మధ్య కాలంలో జపాన్ తప్ప మిగిలిన దేశాల్లో నిరుద్యోగం అత్యధిక స్థాయికి చేరిందని, ఇది అమెరికాలో 7.1 శాతం, జపాన్‌లో 2.5 శాతం, పశ్చిమ జర్మనీలో 5.7 శాతం, బ్రిటన్‌లో 9.5 శాతం వుందని 1992 ప్రపంచ బ్యాంకు వార్షిక నివేదిక పేర్కొంది. 1980 దశకం నుండి నిరుద్యోగం ప్రపంచవ్యాప్త సమస్యగా తయారైంది.

సంక్షోభం విశ్వవ్యాప్తం కావడంతో ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరణ చేయాలన్న వాదనలకు ప్రాచుర్యం లభించడం మొదలైంది. ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరణ చేయడమంటే – ప్రపంచదేశాలు వాణిజ్య, వ్యాపారాల్లోనూ, ఉత్పత్తి కార్యక్రమాల్లోనూ దగ్గర కావటమే. అయితే ఈ ప్రపంచీకరణ ఉత్తర, దక్షిణ దేశాల మధ్య అభివృద్ధి సంపదల విషయంలో నెలకొన్న తీవ్ర అగాదాన్ని పూరించలేకపోయింది. దానికి బదులుగా ప్రపంచీకరణ ఈ అంతరాలను మరింత తీవ్రం చేసింది. దక్షిణ దేశాల ప్రయోజనాలనుపణంగా పెట్టి ఉత్తర దేశాలు, తమ దేశాల్లోని ఆర్థిక మాంద్యాన్నధిగమించేందుకు చేసిన ప్రయత్నాలు మరింత బహిర్గతమయ్యాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో భారతదేశ ఆర్థికవ్యవస్థను ముడివేయడానికి రాజీవ్‌గాంధీ చేపట్టిన ఆర్థిక చర్యలను ముఖ్యంగా కార్మికవర్గంపై వాటి ప్రభావాన్ని ఈ నేపథ్యంలో అంచనా వేయాలి.

ఇందిరాగాంధీ 1980లో తిరిగి అధికారం చేపట్టినపుడే, ఆర్థిక విధానాల్లో ప్రధాన మార్పులు చేయాలని భావించింది. 1960 దశకం నుంచి అనుసరించిన ఆర్థిక విధానాలు నిలకడగా ఆర్థికాభివృద్ధి సాధించటంలో విఫలమైనాయని ఆమె ప్రభుత్వం భావించింది. 1980 నుంచి 1985 వరకు అమలు చేసే 6వ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఆర్థికాభివృద్ధి పెరుగుదలకు మంచి ప్రోత్సాహాన్నిచ్చి, కొన్ని తరగతుల ప్రజలను లక్ష్యంగా చేసుకుని దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమం చేపట్టాలని ఆమె భావించింది.

అందువల్ల అంతకు ముందు సంవత్సరాలలో ఉత్పత్తిపై విధించిన నియంత్రణలు తొలగించటం ఆమె ప్రభుత్వ విధానంగా మారింది. ఇందులో కొంతభాగం దిగుమతులపై నియంత్రణకు సంబంధించినవి. మరికొన్ని ప్రాధాన్యతల నిర్ణయానికి సంబంధించినవి.

ప్రధానంగా మార్కెట్ శక్తులపై ఆధారపడిన ఆర్థిక సరళీకరణ విధానాలు ప్రారంభమైనాయి. అయితే ఆమె చేపట్టిన ఆర్థికపరమైన చర్యలు ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టాయి. ఈ చర్యల్లో భాగంగా ఆర్థిక వ్యవస్థలో ప్రణాళికాబద్ధ విధానం నుండి, ఆర్థిక వ్యవస్థ మీద అజమాయిషీ చేసే విధానానికి మరలడం ప్రారంభమైంది. పేదరికంలో మ్రగ్గుతున్న, నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ప్రయోజనం చేకూర్చడానికి బదులుగా “అభివృద్ధి - ఆధునీకరణలు”గా వ్యాఖ్యానించబడుతున్న ఈ విధానాలు, జనాభాలో ఉన్నత స్థాయిలో వున్న 10-20 శాతం మందికి మాత్రమే మరింత లబ్ధి చేకూర్చే విధంగా మలచడం. గమనించదగ్గ విషయం. 1980 దశకం ప్రారంభంలో ఇందిరాగాంధీ ప్రారంభించిన కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ ఆ దశాబ్దం మలి విభాగంలో కొనసాగించి దేశం 21వ శతాబ్దానికి పురోగమించే “నూతన ఆర్థిక విధానాలు”గా నామకరణం చేశారు.

ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యత ఇచ్చే గత పారిశ్రామిక విధానాన్నుండి వైదొలగి ప్రైవేట్ ఉత్పత్తులు, పెట్టుబడులకు పెద్ద పీట వేసే నూతన ఆర్థిక విధానాన్ని ప్రకటించారు. స్వదేశీ, విదేశీ ప్రైవేట్ పెట్టుబడులకు స్వేచ్ఛనిచ్చేందుకు వీలుగా కంట్రోళ్ళు, నియంత్రణలను చాలావరకు ఉపసంహరించారు. సాధించిన పారిశ్రామికాభివృద్ధి కూడా జనాభాలో 10%గా వున్న సంపన్న వర్గాలు వినియోగించే వినిమయదారీ వస్తువుల తయారీ రంగంలోనే జరిగింది. వ్యవసాయ రంగంతో కలుపుకుని దేశ ఆర్థికాభివృద్ధి రేటు 5% దాటింది.

భారత ఆర్థిక వ్యవస్థ ఒక నూతన అభివృద్ధి పంథా అనుసరిస్తోందని, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్లానింగ్ కమీషన్ ప్రముఖులు, మేధావుల బృందాలు, అధికార పార్టీ నాయకులు, చివరకు ప్రభుత్వ ప్రతినిధులు పదేపదే బృందగానం చేశారు.

అయితే 1980వ దశకంలో సాధించిన ఈ అభివృద్ధి పెద్ద ఎత్తున ప్రజాదనం వెచ్చించడంతో పాటు, భారీ బడ్జెట్ లోటుకు పాల్పడటం ద్వారా మాత్రమే సాధ్యపడింది. 1978-80లో కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ. 17,800/- కోట్లుండగా, 1980-81లో ఇది రూ. 22,000 కోట్లకు పెరిగి, 1989-90 నాటికి భారీ స్థాయిలో రూ. 82,000 కోట్లకు

చేరుకుంది. ఈ భారీ ఖర్చుకు రావల్సిన సొమ్మును ప్రజల నుండి రుణాలు సేకరించడం ద్వారానూ, లోటు బడ్జెట్‌కు పాల్పడటం ద్వారాను కేంద్ర ప్రభుత్వం సమకూర్చుకుంది. దిగుమతులు, విదేశీ రుణ భారం ప్రమాదకరంగా పెరిగిపోయాయి. ఇందిరాగాంధీ హయాంలో భారత్ ఐ.ఎం.ఎఫ్. నుండి 5 బిలియన్ (500 కోట్లు) డాలర్ల ఎస్.డి.ఆర్. (ఐ.ఎం.ఎఫ్. సభ్య దేశాలు తమ విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంచుకునేందుకు ఐ.ఎం.ఎఫ్. నుండి ప్రత్యేకంగా తీసుకునే సొమ్ము) లను అప్పుగా తీసుకుంది. ఈ నూతన ఆర్థిక విధానంలో దిగుమతుల సరళీకరణ, విదేశీ వాణిజ్య రుణాలు ప్రధాన పాత్ర వహించడంతో, ప్రైవేట్ రుణాలు 1980లో 2.3 బిలియన్ (230 కోట్లు) డాలర్లుండగా, 1989 నాటికది పెరిగి 22.8 బిలియన్ (2280 కోట్ల) డాలర్లకు చేరుకుంది. సరుకులు, సర్వీసుల ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో డెట్ సర్వీసింగ్‌కు (అసలు + వడ్డీ, వాయిదా) చెల్లించేది ఈ కాలంలో 9.1 శాతం నుండి 26.3 శాతానికి పెరిగింది. ఆ విధంగా 1980 దశాబ్దాంతానికి భారతదేశం ప్రపంచంలో అత్యధిక రుణాలు పొందిన అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఒకటిగా నిల్చింది. అయితే ఈ అభివృద్ధి రేటు కూడా కొద్ది కాలమే కొనసాగింది. ఉద్యోగావకాశాల పెరుగుదల రేటు 1977-78 నుండి 1983-84 నాటికి 2.22% తగ్గింది. 1983-84 నుండి 87-88 నాటికి 1.55%కి తగ్గింది. ఈ దశాబ్దంలో వ్యవసాయ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు 1.2 శాతానికి తగ్గాయి.

ఉద్యోవకాశాలు ఈ విధంగా తీవ్రంగా తగ్గటం వల్ల అప్పటికే భయంకరంగా వున్న నిరుద్యోగ సమస్య మరింత తీవ్రతరమైంది.

సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి. తదితర ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగానూ, విడివిడిగానూ అనేక పోరాటాలు చేశాయి. దీనితోపాటు జాతీయ ప్రచారోద్యమ కమిటీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను సమీకరించటానికి చొరవ చూపింది.

మూసివేతలు, లాకౌట్లు విపరీతంగా జరుగుతున్న దృష్ట్యా 1985 ఏప్రిల్ 3న ఢిల్లీలో జరిగిన ట్రేడ్ యూనియన్ల జాతీయ ప్రచారోద్యమ కమిటీ సమావేశం, 1985, మే 15 న రిట్రెంచ్‌మెంట్లు, మూసివేతలు, లాకౌట్లు, లే ఆఫ్‌లకు వ్యతిరేకంగా అఖిల భారతదినం పాటించవల్సిందిగా కార్మికులకు పిలుపునిచ్చింది. జాతీయ ప్రచారోద్యమ కమిటీలోని సంఘాలు, వివిధ పారిశ్రామిక కేంద్రాలలో ఈ కార్యక్రమం అమలు చేశాయి. అదేరోజున ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి., టి.యు.సి.సి.ల ప్రతినిధి వర్గం కేంద్ర కార్మిక శాఖా మంత్రిని కలిసి, నానాటికి పెరుగుతున్న పరిశ్రమల ఖాయిలా, మూసివేతల వల్ల కార్మికులను రిట్రెంచ్ చేస్తున్నారనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తెస్తూ విజ్ఞాపన పత్రం అందజేసింది. ఇతర విషయాలతో పాటు, లాకౌట్లు, మూసివేతల వల్లనే గాక, పరిశ్రమల ఖాయిలా వల్ల 80 వేలకు పైగా చిన్న, పెద్ద పారిశ్రామిక యూనిట్లు మూతపడ్డట్లు అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయని, ఈ సంఖ్య ఏడాదికేడాదికి తీవ్రంగా పెరుగుతోందని, 1979 డిసెంబరులో ఈ సంఖ్య సుమారు 22 వేలుగా మాత్రమే వుందని మెమోరాండంలో పేర్కొనడం జరిగింది.

పెరుగుతున్న పారిశ్రామిక ఖాయిలా వలన కార్మికులపై ప్రమాదకర ప్రభావం పడిందని ఈ దిగువ గణాంకాలు తెలియచేస్తున్నాయి.

| | మూసివేతలు | | లే ఆఫ్‌లు | | రిట్రెంచ్‌మెంట్లు | |
|---|---|---|---|---|---|---|
| సంవత్సరం | యూనిట్ల సంఖ్య | గురియైన కార్మికుల సంఖ్య | యూనిట్ల సంఖ్య | గురియైన కార్మికుల సంఖ్య | యూనిట్ల సంఖ్య | గురియైన కార్మికుల సంఖ్య |
| 1980 | 338 | 18052 | 1603 | 300300 | 724 | 15341 |
| 1981 | 349 | 37377 | 1323 | 311308 | 726 | 17320 |
| 1982 | 286 | 26602 | 1521 | 306400 | 758 | 15922 |
| 1983 | 226 | 43234 | 1300 | 244057 | 688 | 20376 |
| 1984 | 188 | 71937 | 809 | 135481 | 485 | 9985 |

మూసివేతల వలన కార్మికులు లే ఆఫ్ , రిట్రెంచ్‌మెంట్లకు గురికాగా, సాధారణ నిరుద్యోగం కూడా ఏడాదికేడాదికి మరింత తీవ్రతరమవుతోంది. ప్రతి సంవత్సరం దేశంలో నిరుద్యోగం బాగా ప్రబలింది. ఒక వైపు నూతన ఉపాధి కల్పన నిలిచిపోగా, వేరొకవైపు నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. 1985-90 మధ్య కాలంలో కార్మిక శక్తి (ఉద్యోగార్థుల సంఖ్య) ఏడాదికి 2.56 శాతం చొప్పున పెరుగుతోందని, 7వ పంచవర్ష ప్రణాళిక పత్రం అంచనా నేపథ్యంలో ఈ పరిస్థితిని పరిశీలించాలి. దీనిని బట్టి ఉద్యోగార్థుల పెరుగుదల రేటు కన్నా ఉద్యోగావకాశాల పెరుగుదల రేటు తక్కువగా వుందని తెలుస్తుంది. అదీకాక అంతకుముందు నుంచి ఉద్యోగాల కోసం అర్రులు చాస్తున్న వారి గురించి వేరుగా చెప్పనక్కరలేదు. 1993 మానవాభివృద్ధి నివేదిక పేర్కొన్న 'ఉపాధి రహిత అభివృద్ధి'కి ఈ నూతన ఆర్థిక విధానాల అమలు ఫలితాలు మంచి ఉదాహరణగా నిలుస్తాయి. పారిశ్రామికోత్పత్తి పెరుగుదల రేటు పడిపోగా, 1980 దశకంలో ప్రారంభించిన నూతన ఆర్థిక సరళీకరణ విధానాలు ఉపాధి అవకాశాలు మృగ్యమై రుణభారం పెరుగుదలకు దారితీశాయి. ఫలితంగా కార్మిక వర్గం ఈ నూతన ఆర్థిక విధానాల భారాన్ని మోయవల్సి వచ్చింది.

పారిశ్రామిక రుగ్మత, రిట్రెంచ్‌మెంటు, లే ఆఫ్‌లు, లాకౌట్లు, భయంకరమైన నిరుద్యోగం, కార్మిక వ్యతిరేక చట్టాలు, ప్రభుత్వం అనుసరించిన నూతన ఆర్థిక కార్మిక విధానంలో ప్రధాన భాగాలయ్యాయి.

### ట్రేడ్ యూనియన్ల వ్యతిరేకత

1985–86 లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రతిపాదించిన మొదటి బడ్జెటే ఆర్థిక, కార్మిక విధానాల్లో నూతన దిశను సూచించింది. ఎమ్.ఆర్.టి.పి. (గుత్త పెట్టుబడులు, నియంత్రణ వ్యాపార విధానాల) ప్రకారం కంపెనీలకు సంబంధించి వాటి ఆస్తుల విలువ పరిమితిని అప్పుడున్న రూ. 20 కోట్లనుంచి రూ. 50 కోట్లకు పెంచవల్సిందిగా గుత్త పెట్టుబడిదారులు డిమాండ్ చేయగా, ప్రభుత్వం ఆ పరిమితిని ఏకంగా రూ. 100 కోట్లకు పెంచింది. 25 పరిశ్రమలను లైసెన్సింగ్ పరిధి నుండి తొలగించింది. దిగుమతుల సరళీకరణ, పబ్లిక్ రంగాన్ని పణంగా పెట్టి విద్యుత్, ఎలక్ట్రానిక్స్ తదితర పరికరాల ఉత్పత్తిలో విదేశీ కంపెనీలతో పెద్ద ఎత్తున మిలాఖత్ కావడం, ప్రభుత్వ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీయడం, రైల్వే సరుకు రవాణా, ప్రయాణీకుల ఛార్జీల పెంపుదల వంటివి ప్రభుత్వ బడ్జెట్, ద్రవ్య విధానంలో భాగమయ్యాయి. కార్మికులకు బోనస్ సీలింగ్‌ను రూ. 750/–ల నుండి రూ. 1600/–లకు పెంచడం, నిర్బంధ పొదుపు పథకం (సి.డి.ఎస్.) రద్దు పర్చడం ద్వారా కార్మికులకు కొద్దిపాటి ఉపశమనం కల్గించారు. కాని పరోక్ష పన్నుల భారం విపరీతంగా పెంచి మొత్తం కార్మిక వర్గాన్ని తీవ్ర కష్టాలపాలు చేశారు.

ఒకప్రక్క రిట్రెంచ్‌మెంట్లు, లే ఆఫ్‌లు కొనసాగుతుంటే, ప్రభుత్వం విచక్షణరహితంగా కార్యాలయాల్లో కంప్యూటర్లను ప్రవేశపెట్టి, కార్మిక వర్గాన్ని విపత్కర పరిస్థితులకు లోను చేసింది. ఫలితంగా, మతిలేని కంప్యూటరైజేషన్‌కు, మూసివేతలు, లే ఆఫ్‌లు, రిట్రెంచ్‌మెంట్లు, కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగానూ, పబ్లిక్ రంగ పరిరక్షణకు, కార్మిక వర్గం 1985–90 మధ్య కాలంలో నిలకడగా పోరాటాలు సాగించింది.

ఈ దిగువ అధికారిక గణాంకాలు ఉద్యోగావకాశాలలో నెలకొన్న స్తబ్ధతను తెలియచేస్తాయి.

### 1984 మార్చి 31 నాటి ఉద్యోగ పరిస్థితి

| 1983 | 1984 | |
|---|---|---|
| 1,64,56,000 | 1,68,66,000 | పబ్లిక్ రంగం |
| 75,37,000 | 73,43,000 | ప్రైవేటు రంగం |

ఉపాధి అవకాశాలలో నెలకొన్న ఈ స్తబ్ధతతో బాటు క్రొత్తగా నమోదైన నిరుద్యోగుల సంఖ్య 6వ పంచవర్ష ప్రణాళికలో ప్రతి సంవత్సరం సగటున 10 శాతం పెరిగింది. ఈ దిగువ పట్టికలో ఈ విషయం స్పష్టమవుతుంది.

**నమోదైన నిరుద్యోగుల సంఖ్య**

| సంవత్సరం | రిజిష్టరులో వున్న నిరుద్యోగుల సంఖ్య | గత సంవత్సరం మీద పెరుగుదల శాతం |
|---|---|---|
| 1980 | 162 లక్షలు | 13.0% |
| 1981 | 178 లక్షలు | 10.1% |
| 1982 | 187 లక్షలు | 10.7% |
| 1983 | 219 లక్షలు | 11.1% |
| 1984 | 235 లక్షలు | 7.3% |

నిరుద్యోగ సమస్య దేశంలో చాలా తీవ్ర సమస్యలు సృష్టిస్తున్నప్పటికీ ప్రభుత్వం విస్తృతంగా కంప్యూటర్లను ప్రవేశపెట్టి యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించింది. సేవారంగంలో ముఖ్యంగా ఆర్థిక సంస్థలలో ఈ కంప్యూటరైజేషన్ వలన తీవ్రమైన పరిణామాలు ఏర్పడినాయి. బ్యాంకింగ్ పరిశ్రమ మీద కంప్యూటరైజేషన్ చూపిన ప్రభావాన్ని గురించి ఆలిండియా రిజర్వు బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఈ విధంగా విశ్లేషించింది. బ్యాంకింగ్ పరిశ్రమలో మనుషులు చేసే పనిని కంప్యూటర్లకు అప్పగించటం వలన, "నూతన ఉద్యోగావకాశాలు పూర్తిగా నిర్మూలించబడటమే గాక, అనేక తీవ్ర పరిణామాలేర్పడతాయి. బ్యాంకింగ్ పరిశ్రమలో దిగువస్థాయిలో సబ్‌స్టాఫ్, గుమాస్తాలు వుంటారు. కార్యకలాపాల అజమాయిషీకి, జూనియర్ అధికారులు, ఉన్నతస్థాయి అధికారులు వుంటారు. వీరి విధులన్నీ ఎలక్ట్రానిక్ యంత్రాల సాయంతో పనిచేసే కంప్యూటర్ల ద్వారా నిర్వహించవచ్చును. ఇది యాంత్రీకరణలో ఒక భాగం. స్పష్టంగా కనపడే మరో విషయం ఏమిటంటే పూర్తిగా కాగితాలు కలాలతో చేసే పని ఏ మాత్రం వుండదు. ఎందుకంటే బ్యాంకు లావాదేవీలను ఎలక్ట్రానిక్ పరికరాలలో పదిలపరుస్తారు. ఆ పరిణామాల నుండి ఖాతాదారునికి గాని, బ్యాంకుకు గాని కావలసిన సమాచారం క్షణంలో పొందవచ్చును. చేతితో చేసే ఈ పనులను కంప్యూటరు వ్యవస్థకు అప్పగించటం వలన అజమాయిషీ విధులు నిర్వర్తించవలసిన అవసరం ఉండదు. అంటే హెడ్ క్లర్కులు, స్పెషల్ అసిస్టెంట్లు, జూనియర్, సీనియర్ ఆఫీసర్ల అవసరమే వుండదు."

ఈ పరిస్థితిలో బ్యాంకింగ్ పరిశ్రమలో కంప్యూటరైజేషన్ విషయంలో బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌తోబాటు ఇతర యూనియన్లకు మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఎ.ఐ.బి.ఇ.ఎ.

నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్, ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఎంప్లాయీస్, కాన్ఫెడరేషన్‌లు బ్యాంక్ మేనేజ్‌మెంటుతో 200 పెద్ద కంప్యూటర్లు, 2000 మినీ కంప్యూటర్లు, 10,000 అకౌంటింగు యంత్రాలు పెట్టటానికి ఒప్పందం మీద సంతకాలు చేశాయి. బి.ఇ.ఎఫ్.ఐ. ఆ ఒప్పందాలను వ్యతిరేకించింది. భారీ కంప్యూటరైజేషన్‌కు వ్యతిరేకంగా బి.ఇ.ఎఫ్.ఐ. పోరాటం ప్రారంభించింది. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కలకత్తాలో బ్యాంకు ఉద్యోగులు బహుళజాతి బ్యాంక్, హాంకాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ ఎదుట ఆ బ్యాంకులో కంప్యూటర్ల ప్రవేశాన్ని ప్రతిఘటిస్తూ, 1985 మే 30 నుంచి రాత్రింబవళ్ళు కాపలా కాశారు. ఈ పోరాటానికి కలకత్తాలోని ఇతర తరగతుల ఉద్యోగులు మద్దతు నివ్వడమేకాక, ఈ ప్రతిఘటనా కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. విచక్షణారహిత కంప్యూటరైజేషన్‌కు వ్యతిరేకంగా చేసే పోరాటానికి ఈ ఉద్యమం ఒక కదలిక తెచ్చింది. కంప్యూటరైజేషన్, యాంత్రీకరణల వల్ల జరిగే తీవ్ర పరిణామాలను, బి.ఇ.ఎఫ్.ఐ. సదస్సులు, సెమినార్ల ద్వారా వివరించింది.

ప్రభుత్వం బ్యాంకులతో బాటు రైల్వేలు, ఎయిర్‌లైన్సు, అనేక ఇతర పరిశ్రమలలో కూడా కంప్యూటరైజేషన్, యాంత్రీకరణలు అమలు చేయనారంభించింది. కార్మికులు, ఉద్యోగుల పోరాటం ఫలితంగా ప్రభుత్వం కంప్యూటరైజేషన్ యాంత్రీకరణ వల్ల అదనంగా తేల్చిన సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించలేకపోయింది. వారికి క్రొత్తగా శిక్షణనిచ్చి ఇతర శాఖలలో నియోగించవల్సి వచ్చింది. కంప్యూటరైజేషన్‌కు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్లు సాగించిన పోరాటానికిదొక మంచి విజయం.

వాస్తవానికి ట్రేడ్ యూనియన్లు, అవసరమైన చోట్ల ఒక క్రమ పద్ధతిలో కంప్యూటర్ల వినియోగాన్ని కోరాయి. అయితే ఉద్యోగ భద్రతను, దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టే విచక్షణారహిత కంప్యూటరైజేషన్‌ను ట్రేడ్ యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి.

ట్రేడ్ యూనియన్లు వ్యతిరేకించిన నూతన టెక్స్టైలు విధానాన్ని ప్రభుత్వం అమలు చేయటం వలన అనేక మిల్లులు మూతపడి, వేలాది మంది కార్మికులు పనులు కోల్పోయారు. దేశంలో సంప్రదాయకంగా వర్ధిల్లుతున్న పరిశ్రమ ఆ విధంగా దుస్థితిపాలైంది.

## రాజ్యాంగంలోని 310, 311(2)బి, 311(2)సి అధికరణాల రద్దు కోరుతూ ప్రభుత్వోద్యోగుల పోరాటం

కేంద్ర ప్రభుత్వోద్యోగులు రాష్ట్రపతి ఇష్టం ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు గవర్నర్ ఇష్టం మేరకు సేవలందించాలని చెప్పే మిక్కిలి అప్రజాస్వామిక స్వభావం గల్గిన "రాజ్యాంగంలోని 310వ అధికరణాల రద్దును ప్రభుత్వోద్యోగులు చాలాకాలం నుండి డిమాండ్

చేస్తున్నారు. ఏ ఉద్యోగినైనా ఏ కారణం చూపకుండా, వారు సంజాయిషీ కూడా ఇచ్చుకునే అవకాశం ఇవ్వకుండా తొలగించేందుకు 311(2) బి, సిలు అవకాశం కల్పిస్తున్నాయి. రాజ్యాంగంలోని ఈ అధికరణాలను తొలగించవల్సిందిగా, ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్లు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. వాస్తవానికి గత దశాబ్దాలలో ప్రభుత్వోద్యోగుల ఉద్యమంతో సంబంధం వున్న అనేక మంది ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించారు. అదే విధంగా ఏకపక్షంగా ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగించే అవకాశం కల్పించే రైల్వే నిబంధనల్లోని 14(2) నిబంధన క్రింద, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పాల్గొన్నందుకు వందలాదిమంది లోకో రన్నింగ్ సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించారు.

సర్వీస్ నుండి తొలగించబడిన రైల్వే ఉద్యోగులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై, సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 4–1 మెజారిటీతో తీర్పునిస్తూ, పౌర (ప్రభుత్వ) ఉద్యోగులు రాష్ట్రపతి లేదా గవర్నర్ "ఇష్టానుసారం" సర్వీసులో వుండాలన్న "సిద్ధాంతాన్ని" ఆమోదిస్తూ, ఉద్యోగులకు 311, 311(2) అధికరణాల ప్రకారం కల్పించిన రక్షణగానీ, ఆ రక్షణను 311(2) బి, 311(2) సి ల ద్వారా ఆ రక్షణల నుపసంహరించటం కానీ ప్రజాశ్రేయస్సు, ప్రజా ప్రయోజనాల కోసం అనుసరించే ప్రభుత్వ విధానంలో భాగంగా రాజ్యాంగంలో పొందుపరచారని పేర్కొంది. దేశంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పుననుసరించి ప్రభుత్వోద్యోగిని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాజ్యాంగంలో 311(2) అధికరణల్లోని బి.సి. నిబంధనల క్రింద ఎటువంటి విచారణ లేకుండా సర్వీసు నుంచి తొలగించవచ్చును. అటువంటి సందర్భాలలో విచారణ జరపకపోవటం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించినట్లు కాదనీ, తొలగించబడిన ఉద్యోగి ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లు కూడా కాదనీ కోర్టు అభిప్రాయపడింది.

ఈ తీర్పు దేశంలోని ప్రభుత్వోద్యోగులకు దిగ్భ్రాంతి కల్గించింది. అన్ని ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్లు ఈ తీర్పును తీవ్రంగా నిరసించాయి. ఇతర ట్రేడ్ యూనియన్లు కూడా ఈ తీర్పును తీవ్రంగా విమర్శించాయి. అన్ని ట్రేడ్ యూనియన్లు నిరసన వ్యక్తం చేశాయి.

ఈ తీర్పుకు వ్యతిరేకంగాను, భారత రాజ్యాంగంలోని ఈ నిరంకుశ అధికరణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులను పెద్ద ఎత్తున సమీకరించింది.

అనేక నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు నిర్వహించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు ఒక రోజు సమ్మె చేశారు.

ఈ సమ్మెకు ముందుగానే, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్.), ఇతర కేంద్ర ప్రభుత్వోద్యోగుల యూనియన్ల ఆధ్వర్యంలో,

రాజ్యాంగంలోని 310, 311 అధికరణాల మీద ఢిల్లీలో 1985 సెప్టెంబర్ 23న ప్రభుత్వోద్యోగుల అఖిల భారత సదస్సుతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. వివిధ ట్రేడ్ యూనియన్లను ఈ సదస్సుకు ఆహ్వానించారు. సి.ఐ.టి.యు. అధ్యక్షులు బి.టి. రణదివె ఈ సదస్సును ప్రారంభించారు. రాజ్యాంగంలోని 310, 311(2) బి, సి అధికరణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ సదస్సు తీర్మానం ఆమోదించింది.

ఈ పోరాటానికి కొనసాగింపుగా 1985 నవంబర్ 3 నుంచి 6 వరకు బొంబాయిలో జరిగిన ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 6వ జాతీయ మహాసభ 1986 ఫిబ్రవరి 26న ఒకరోజు దేశవ్యాప్త సమ్మె చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు పిలుపునిచ్చింది. సమ్మెకు బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. ఈ సమ్మెలో 60 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగానూ, నిరంకుశ రాజ్యాంగ అధికరణాల తొలగింపును కోరుతూ జరిగిన ఈ మహత్తర సమ్మె, ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వోద్యోగులు సాగించిన పోరాటంలో మరొక మైలురాయి.

## ఇతర రంగాల్లో పోరాటాలు

ప్రభుత్వ రంగ కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) తన కార్మికులకు న్యాయంగా చెల్లించవలసిన మొత్తాలను నిరాకరించడమే గాక, వారిపై ఏ పబ్లిక్ రంగ పరిశ్రమలలోను కానరాని విధంగా కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడంతో సిఐఎల్ కార్మికులు యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటాలు నిర్వహించవలసి వచ్చింది.

బొగ్గు పరిశ్రమల్లో అనేక సందర్భాలలో ఐ.ఎన్.టి.యు.సి.తో సహా అన్ని ట్రేడ్ యూనియన్లు ఐక్య పోరాటాలు చేయటం ఒక శుభ పరిణామం.

3వ నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ (ఎన్‌సిడబ్ల్యుఎ-3) (బొగ్గు గని కార్మికుల జాతీయ ఒప్పందం) అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని 450 బొగ్గు గనుల్లోని కార్మికులు ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు.), ఇండియన్ నేషనల్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐ.ఎన్.టి.యు.సి), ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎ.ఐ.టి.యు.సి.) హింద్ ఖాదాన్ మజ్దూర్ వర్కర్స్ ఫెడరేషన్ (హెచ్.ఎం.ఎస్.), అఖిల భారతీయ ఖాదాన్ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్)ల పిలుపు మేరకు 1986 ఏప్రిల్ 9న ఒకరోజు సమ్మె నిర్వహించారు.

క్రమక్రమంగా పబ్లిక్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పబ్లిక్ రంగ ఉద్యోగులు ఈ కాలంలో పోరాటాలు తీవ్రతరం చేశారు. మెడికల్ బెనిఫిట్లు, భద్రతా చర్యల ఉల్లంఘన, గ్రాట్యుటీ మీద సీలింగ్ పెంపుదల, పెన్షన్ పథకం, పరిశ్రమ మొత్తానికి ఒకే విధమైన స్టాండింగ్ ఆర్డర్లు, కార్మికుల మీద ఆధారపడిన వారికి ఉద్యోగ

కల్పన వంటి సమస్యలతో పాటు, ఒప్పందంలో అమలు కాని ఇతర అంశాలను 11 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లలో చేర్చడం జరిగింది. 1983 సెప్టెంబర్‌లో సంతకాలైన ఎస్‌సిడబ్ల్యుఎ-3ని 1983 జనవరి నుండి, 1986 సెప్టెంబరుల్లో అమలు చేయవలసి వుంది. 1986 మార్చి 28, 29 తేదీల్లో దుర్గపూర్‌లో జరిగిన పబ్లిక్ రంగ ట్రేడ్ యూనియన్ల అఖిల భారత సదస్సు పిలుపు మేరకు, 1986 మే 21వ తేదీన దేశంలోని వివిధ కేంద్రాల్లో పబ్లిక్ రంగ ఉద్యోగులు ప్రదర్శనలు, ఊరేగింపులు నిర్వహించడం ద్వారా "ప్రభుత్వ రంగ పరిరక్షణ దినం" పాటించారు.

నూతన జౌళి విధానం అమలు ఫలితంగా పెద్ద సంఖ్యలో మిల్లులు మూతపడటంతో టెక్స్‌టైల్ కార్మికులు ఆర్థిక డిమాండ్లు, ఉద్యోగ భద్రత అనే రెండు ప్రధాన అంశాల మీద పోరాటాలకు పూనుకున్నారు.

ఢిల్లీలోని ఐదు టెక్స్‌టైల్ మిల్లుల్లోని సుమారు 20 వేల మంది కార్మికులు రూ. 100/-లు తాత్కాలిక భృతి, రూ. 10/-ల వార్షిక ఇంక్రిమెంట్, ఇంటి అద్దె అలవెన్స్, ధరల పెరుగుదలను డి.ఎ. ద్వారా పూర్తిగా భర్తీ చేయడం, కాంట్రాక్ట్ లేబర్ విధానం రద్దు, ఢిల్లీ క్లాత్ మిల్స్‌ను తిరిగి తెరవాలని, నూతన టెక్స్‌టైల్ విధానాన్ని రద్దు చేయాలనీ, కక్ష సాధింపు చర్యలనుపసంహరించాలన్న డిమాండ్లతో పాటు మొత్తం 11 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు 1986 మే 28 నుండి సమ్మె ప్రారంభించారు.

సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, బిఎంఎస్, లలిత్ మఖన్ గ్రూపులతో కూడిన ట్రేడ్ యూనియన్ సంఘర్ష్ సమితి ఈ సమ్మెకు నాయకత్వం వహించింది. అంతకుముందు 1986 ఏప్రిల్ 4వ తేదీన కార్మికులు చేసిన సమ్మెను యాజమాన్యం పట్టించుకోలేదు.

ఈ కాలంలోనే రైల్వే కార్మికులు అనేక అన్యాయాలకు గురై ఇబ్బందుల పాలవుతున్నప్పటికీ, ముఖ్యంగా వందలాది మంది లోకో రన్నింగ్ సిబ్బంది కక్ష సాధింపు చర్యలకు గురైనప్పటికీ, రైల్వే ఉద్యోగుల ఉద్యమంలో వున్న చీలికల వల్ల ఐక్యంగా ప్రతిఘటించలేకపోయారు. లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎల్‌ఆర్‌ఎస్‌ఎ), హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలోని ఎఐఆర్‌ఎఫ్‌కు గాని, ఐఎన్‌టియుసి నాయకత్వంలోని ఎన్‌ఎఫ్‌ఆర్‌ఐకు గాని అనుబంధ సంఘం కాకపోవడం వల్ల, గుర్తింపు పొందిన ఎఐఆర్‌ఎఫ్., ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ల సంస్కరణవాద నాయకత్వం డిస్మిస్ అయిన లోకో రన్నింగ్ సిబ్బంది పట్ల ఏ విధమైన సానుభూతి వ్యక్తం చేయలేదు. అందువల్ల ఎల్‌ఆర్‌ఎస్‌ఎ తన స్వంత శక్తి మీద ఆధారపడి, ఆలిండియా రైల్వే మెన్స్ కాన్ఫెడరేషన్ మద్దతుతో పోరాటం కొనసాగించవల్సి వచ్చింది. రైల్వే కార్మికుల్లోని వివిధ కేటగిరీలకు చెందిన కార్మికులు తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి ఎఐఆర్‌ఎఫ్ తిరస్కరించడంతో ఏర్పడిన తరగతులవారీ యూనియన్ల సమాఖ్య, ఆలిండియా రైల్వే మెన్స్ కాన్ఫెడరేషన్ ఏర్పడింది.

ఎల్.ఆర్.ఎస్.ఎ. యూనిట్లు వివిధ కేంద్రాలలో 1986 జూలై 26 నుండి జనరల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్ల ఆఫీసుల వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేశాయి. ఇవి 32 నుండి 58 గంటల వరకు కొనసాగాయి. రైల్వే అధికారులకు, యూనియన్‌కు మధ్య గౌరవప్రదమైన ఒప్పందాలు కుదరడంతో ఈ పోరాటం విరమించారు. కక్ష సాధింపు చర్యలకు గురైన ఉద్యోగుల విషయం కోర్టు పరిశీలనలో వుండగా సుప్రీంకోర్టు, హైకోర్టులు ఈ ఉద్యోగులకు వేతనాలు చెల్లించవలసిందిగా ఇచ్చిన ఆదేశాల అమలు కోసం లోకో రన్నింగ్ సిబ్బంది ఈ నిరాహారదీక్షలు చేశారు.

చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ లేబర్ యూనియన్ కూడా కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా ఒక దశల వారీ కార్యక్రమాన్ని రూపొందించింది. 1986 ఏప్రిల్ 14 నుండి 20 వరకు జరిగే రైల్వే వారోత్సవాలను బహిష్కరించాలని, 1986 మే 11 నుండి 15 వరకు వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు జరపాలని కార్మికులకు పిలుపునిచ్చింది.

దాదాపు అన్ని రంగాల కార్మికులు ఈ కాలంలో వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తూనే వున్నారు. పోర్టు అండ్ డాక్ వర్కర్లు, వివిధ పబ్లిక్,ప్రైవేట్ రంగ కార్మికులు, తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాట పథాన సాగారు. ఈ సందర్భంలో ఒక పోరాటం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. గుర్ఖానేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ప్రారంభించిన హింసాత్మక ఆందోళన వలన పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో తేయాకు తోటల కార్మికులపై హత్యాకాండ, దోపిడీలు, గృహదహనాలు జరిగాయి. సి.ఐ.టి.యు., ఐ.ఎన్.టి.యు.సి, గూర్ఖాలీగ్‌కు సంబంధించిన యూనియన్ల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో తేయాకు తోటల కార్మికులు తమ చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కారం కోసం 1986 సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె చేశారు.

అత్యధిక సంఖ్యలో నేపాలీ భాష మాట్లాడే ఈ తేయాకు తోటల కార్మికులు సాగించిన సమ్మె విశిష్టమైనది. జి.ఎన్.ఎల్.ఎఫ్. హత్యాకాండ నెదుర్కొంటూ, కార్మికులందరూ వేర్పాటువాదానికి వ్యతిరేకంగా సంఘటితమై, వేర్పాటువాద శక్తులను ప్రోత్సహించే సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించారు. సమ్మె సర్వత్రా విజయవంతమైంది. దాదాపు అన్ని టీ తోటల్లో పని స్తంభించిపోయింది. జి.ఎన్.ఎల్.ఎఫ్. భయోత్పాతం సృష్టించిన కొన్ని ప్రాంతాలలో మాత్రం సమ్మె జరగలేదు.

## దేశ సమగ్రత, మత సామరస్యాల పరిరక్షణలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం

పంజాబుతో పాటు అస్సాం తదితర ఈశాన్య రాష్ట్రాలు, డార్జిలింగు, కాశ్మీరు వంటి వివిధ ప్రాంతాల్లో ఆ కాలంలో వేర్పాటువాద ఉద్యమాలు విజృంభించాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తదితర మతోన్మాద సంస్థలు దేశంలోని వివిధ ప్రాంతాల్లో మతపరమైన హింసను, ఉద్రిక్తతలను రెచ్చగొట్టాయి.

ఈ వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగులను చైతన్యవంతులను చేసేందుకు వివిధ ప్రగతిశీల ట్రేడ్ యూనియన్లు ప్రచారం నిర్వహించడంతో పాటు, అనేక కార్యక్రమాలను కూడా చేపట్టారు.

ట్రేడ్ యూనియన్ల జాతీయ ప్రచారోద్యమ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలో 1986 మే 11న మతతత్వ, వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా జరిగిన జాతీయ సదస్సు 1986 ఆగస్టు 9న దేశమంతటా ఊరేగింపులు, ప్రదర్శనలు జరిపి "జాతీయ సమగ్రతా దినం" పాటించవలసిందిగా పిలుపిచ్చింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో కార్మికులు ఈ కార్యక్రమంలో ఒక మోస్తరు సంఖ్యలో పాల్గొన్నారు. మత సామరస్యం, దేశ సమగ్రతల పరిరక్షణ కోరుతూ రాష్ట్ర స్థాయిలో సదస్సులు, సెమినార్లు నిర్వహించి ఉద్యమం కొనసాగించారు. జాతీయ ప్రచారోద్యమ కమిటీ దక్షిణాఫ్రికాలో జాతి వివక్షణకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించాలని నిర్ణయించి ఆ మేరకు ఈ సమస్యపై ప్రకటనలు కూడా చేసింది.

కేంద్ర ట్రేడ్ యూనియన్లతోబాటు, ఇతర జాతీయ ఫెడరేషన్లు జాతీయ సమైక్యత, మత సామరస్య పరిరక్షణా పోరాటానికి ఉద్యోగులను సమీకరించేందుకు చొరవ తీసుకున్నాయి. ముఖ్యంగా ఆలిండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్ 1979లో పంజాబులో వేర్పాటు ఉద్యమం తలెత్తడంతో నాటినుంచే, వేర్పాటు శక్తులకు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో అనేక కార్యక్రమాల ద్వారా ఉద్యోగులను సమీకరించేందుకు కృషి చేసింది. కేంద్ర ట్రేడ్ యూనియన్లు గానీ, జాతీయ ఫెడరేషన్లు గానీ, ఈ కార్యక్రమాలలో తగినంతమంది ఉద్యోగులను సమీకరించలేదని అంగీకరించాలి. ఆ కార్యక్రమాల నిర్వహణలో వ్యవస్థాపరమైన బలహీనతలున్నాయి. కార్మికులు, ఉద్యోగులు జాతీయ సమైక్యత గురించి తీవ్రంగా ఆందోళన చెంది వున్నప్పటికీ ఆ సమస్యపై పోరాటంలో చురుకుగా పాల్గొనడానికి తగినంత ఆసక్తి చూపలేదు. మతతత్వశక్తులు ఒక తరగతి ప్రజలపై ప్రభావం చూపాయి. తర్వాత అయోధ్య గురించి జరిగిన ఆందోళనలో కూడా ఈ రకమైన ప్రభావం కనిపించింది. మతతత్వశక్తుల ప్రభావానికి లోనైనప్పటికీ మత, కుల, జాతి విభేదాలనధిగమించి మొత్తం మీద కార్మికుల, ఉద్యోగుల ఐక్యత చెక్కు చెదరలేదు.

## అంతర్జాతీయ కార్మికోద్యమం

## ప్రపంచ ట్రేడ్ యూనియన్ల ఫెడరేషన్ (డబ్ల్యుఎఫ్‌టియు) మహాసభ

భారతదేశంలో వలెనే, ఇతర ప్రపంచ దేశాలన్నిటిలో కూడా తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మిక వర్గం పోరాటాలు కొనసాగించింది. శాంతి, నిరాయుధీకరణ, జాతి వివక్షత నంతరింపచేయటం, జాతుల అణచివేతనంత మొందించటం, సామ్రాజ్యవాద దురాక్రమణ, సోషలిజం సాధనకై పోరాటం వంటి విస్తృత సమస్యలు కూడా అంతర్జాతీయ కార్మిక వర్గ ఉద్యమ ఎజెండాలో భాగమయ్యాయి.

ఈ నేపథ్యంలో 1986 సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ ట్రేడ్ యూనియన్ల ఫెడరేషన్ (డబ్ల్యు.ఎఫ్.టి.యు.) 11వ మహాసభ అంతర్జాతీయ కార్మికోద్యమంలో ఒక ముఖ్యమైన సంఘటన.

1945లో డబ్ల్యు.ఎఫ్.టి.యు. ప్రారంభమైన నాటి నుండి అన్ని దేశాల ట్రేడ్ యూనియన్లను, వాటి అనుబంధాలు, దృక్పథాలతో నిమిత్తం లేకుండా ఏకం చేయడానికి తీవ్రంగా శ్రమించింది. ఈ ప్రయత్నాలకనుగుణంగా డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభ ప్రధాన డాక్యుమెంట్ ఈ విధంగా ప్రకటించింది.

"డబ్ల్యు.ఎఫ్.టి.యు.తో సహా అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ ఉద్యమం, ప్రపంచ ప్రజల స్థితిగతులను మరింత మెరుగుపర్చేందుకు, కార్మికుల కలలు నిజం చేయటానికి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం యుద్ధానికి, మానవాళి వినాశనానికి కాకుండా, మానవజాతి పురోగతికి ఉపయోగపడే పరిస్థితి కల్పించటానికి, మానవ వ్యక్తిత్వ వికాసానికి పూర్తి అవకాశం కల్పించటానికి, దారిద్ర్యం, అసమానత్వం, దోపిడీ వంటి తీవ్ర సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించటానికి ఐక్యతతో, పరస్పర సహకారం దృక్పథంతో కృషి చేయాలి."

డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభ అమెరికా సామ్రాజ్యవాదంతో పోరాడుతున్న కొరియా ప్రజలకు ప్రగాఢమైన సంఘీభావం వ్యక్తం చేసింది. దక్షిణ కొరియా గడ్డ మీద అమెరికా అణు స్థావరాల నేర్పరచడాన్ని, కొరియా ప్రజల అనైక్యత పెంచి పోషించే అమెరికా పన్నాగాలను మహాసభ తీవ్రంగా నిరసించింది. పాలస్తీనా విమోచనా సంస్థకు, అరబ్ దేశాలకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌కు సాయమందిస్తున్న ఆమెరికన్ కుట్రలను వ్యతిరేకిస్తూ, అరబ్ దేశాలకు మహాసభ తన సంఘీభావం ప్రకటించింది. హిందూ మహాసముద్రం, ఎర్రసముద్ర ప్రాంతంలోను, కొన్ని అరబ్ దేశాలలోనూ సామ్రాజ్యవాద దేశాలు సైన్యాలను కేంద్రీకరించడాన్ని మహాసభ నిరసించింది. అమెరికా కుట్రలను వమ్ము చేయడానికి చిలీ ప్రజలు సాగిస్తున్న పోరాటానికి మహాసభ సంఘీభావం తెల్పింది. భారతదేశంలో వేర్పాటువాద శక్తుల విజృంభణ గురించి మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. భారత కార్మిక వర్గం ఐక్యంగా ఈ వేర్పాటువాద శక్తులను సత్వరం ఎదుర్కొనవలసిన ఆవశ్యకతను మహాసభ వక్కాణించింది.

మనిషిని మనిషి దోచుకునే స్థితిని అంతం చేసి, మానవ అవసరాలను అన్నీ సమకూర్చుకుని, మంచి జీవన ప్రమాణాలు సాధించిన సోషలిస్టు దేశాల అనుభవాలను మహాసభ ప్రముఖంగా ప్రస్తావించింది.

దీర్ఘకాల ఆర్థికమాంద్యంతో, నిరుద్యోగంతో అలమటిస్తున్న పెట్టుబడిదారీ దేశాల విషాద పరిస్థితి గురించి మహాసభ ప్రస్తావించింది. మూడవ ప్రపంచదేశాలను ఆర్థికంగా దోచుకునే బహుళజాతి కంపెనీలను మహాసభ తీవ్రంగా విమర్శించింది.

పెరుగుతున్న ఆయుధ పోటీని ప్రపంచ కార్మిక వర్గం దృష్టికి తెస్తూ, ప్రపంచశాంతి కోసం చేసే పోరాటాన్ని ఉధృతం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది. వివిధ దేశాల కార్మికులు

తమ ప్రభుత్వాల ప్రగతి నిరోధక విధానాలను ప్రతిఘటించి పోరాడాలనీ, జాతి వివక్షకు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని మహాసభ విజ్ఞప్తి చేసింది.

భారతదేశం గురించి చేసిన తీర్మానంలో "వేర్పాటువాద, మతతత్వ శక్తులను ప్రతిఘటించి, కార్మికవర్గ ఐక్యతను పటిష్టం చేసి, కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించి ముందడుగు వేయడానికి, అనుబంధాలతో నిమిత్తం లేకుండా కృషి చేస్తున్న అన్ని ట్రేడ్ యూనియన్లను 11వ మహాసభ అభినందిస్తోంది. ఈ యూనియన్లు శాంతి, నిరాయుధీకరణల కోసం జరుగుతున్న పోరాటాలకు, హిందూ మహా సముద్రాన్ని సైనికీకరణ చేయడానికి వ్యతిరేకంగానూ, జాతి వివక్షతో కూడిన ప్రిటోరియా పాలనకు వ్యతిరేకంగా సమగ్ర ఆంక్షలను కఠినంగా అమలు చేయాలని కోరుతూ జరిగే పోరాటాలకు ఈ యూనియన్లు సహకరిస్తున్నాయి సమర్థిస్తున్నాయి" అని ప్రస్తా వించింది. వివిధ దేశాలల్లోని కార్మికోద్యమాలకు, వాటి మధ్య సంఘీభావం పెంపొందించేందుకు డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభ మార్గాన్ని నిర్దేశించింది.

## నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటాలు

ఈ కాలంలో వేర్పాటువాద శక్తుల ఆందోళనలు పెచ్చరిల్లి, మతతత్వ వేర్పాటువాద శక్తుల దాడులు తీవ్రమైనప్పటికీ, కార్మిక వర్గ ఐక్యత చెక్కుచెదరలేదు. అంతేగాక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలను కార్మికవర్గం అమోఘంగా ప్రతిఘటించి పోరాడింది. 1987 జనవరి 21వ తేదీ పబ్లిక్ రంగ ఉద్యోగుల బ్రహ్మాండమైన సమ్మెతో 1987వ సంవత్సరం ప్రారంభమైంది.

పబ్లిక్ రంగ సంస్థల్లోని ఐ.ఎన్.టి.యు.సి. అనుబంధ సంఘాలు, రైల్వేలో గుర్తింపు పొందిన ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఎన్.ఎఫ్.ఐ.ఆర్.లు, పౌర రక్షణ శాఖ ఉద్యోగుల యూనియన్లు మినహాయించి పబ్లిక్ రంగంలోని దాదాపు అన్ని ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా ఈ సమ్మెను నిర్వహించాయి.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ పరిశ్రమల్లోని సుమారు 25 లక్షల మంది ఉద్యోగులు తమ 11 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు ఒకరోజు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు, ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాల్లో బహుళజాతి సంస్థల ప్రవేశానికి, ఈ సంస్థల యాజమాన్యంలో నిరంకుశాధికార వర్గంతో నింపివేయడానికి వ్యతిరేకంగానూ, మేనేజ్‌మెంట్‌లో నిజమైన కార్మిక వర్గ భాగస్వామ్యం నెలకొల్పడం వంటి డిమాండ్లు ఈ 11 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్లతో చోటు చేసుకున్నాయి.

1986 అక్టోబరు 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన అఖిల భారత పబ్లిక్ రంగ యూనియన్ల సదస్సు పబ్లిక్ రంగంలో పనిచేసే దాదాపు అన్ని తరగతుల కార్మికులను పోరాట రంగంలోకి తీసుకువచ్చింది. అధికారుల అసోసియేషన్ కూడా ఈ సదస్సులో భాగస్వామి

కావటం, నూతన ఆర్థిక విధానాల దాడుల నుండి ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకునేందుకు ఉద్యోగులు – అధికారుల మధ్య విస్తృతమవుతున్న ఐక్యతకు సూచన.

ఐ.ఎన్.టి.యు.సి. ఈ సమ్మెను వ్యతిరేకించినప్పటికీ, సమ్మె ఉధృతి కారణంగా వారి స్థానిక యూనిట్లు కొన్ని సమ్మెలో పాల్గొన్నాయి. ఈ సమ్మె నిర్వహించిన తీరు, సమ్మెలో ప్రధాన డిమాండ్లు, అందులో ప్రదర్శితమైన సమైక్యత వలన ఈ సమ్మెకు మంచి ప్రాముఖ్యం లభించింది.

ప్రభుత్వ ప్రగతి నిరోధక విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వరంగ ఉద్యోగులు బ్రహ్మాండమైన సమ్మె చేసిన సమయంలోనే, ఇతర రంగాలలోని కార్మికులు, ఉద్యోగులు కూడా తమ తమ రంగాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించడానికి ఐక్యంగా కృషి చేశారు.

1987 జనవరి 9న న్యూఢిల్లీలో ఆలిండియా కెమికల్ అండ్ ఫార్మాస్యూటికల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత సదస్సు ఈ దిశలో మహత్తరమైన ముందడుగు. ప్రభుత్వ నూతన ఔషధ విధానాన్ని తిరస్కరించడంతో పాటు, హాథీ కమిటీ సిఫార్సుల ప్రకారం బహుళజాతి మందుల కంపెనీలను జాతీయం చేసి, మందుల పరిశ్రమలో ప్రభుత్వ రంగానికి ప్రముఖ స్థానం కల్పించాలని సదస్సు ఆమోదించిన తీర్మానం డిమాండ్ చేసింది. పబ్లిక్‌రంగం పట్ల, మందుల పరిశ్రమ పట్ల ప్రభుత్వం అనుసరించే తిరోగమన విధానానికి వ్యతిరేకంగా పోరాటం సాగించాలని సదస్సు ప్రతినబూనింది.

బడ్జెట్‌కు ముందు చర్చల్లో భాగంగా 1987 జనవరి 19 న కేంద్ర ఆర్థికమంత్రి ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వామపక్ష ట్రేడ్ యూనియన్లతో బాటు, ఇతర ట్రేడ్ యూనియన్లు కూడా ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను తీవ్రంగా విమర్శించాయి.

సిమెంట్ పరిశ్రమలో ఐ.ఎన్.టి.యు.సి. అనుబంధ యూనియన్ సమర్పించిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌పై రామానుజం – కపూర్‌లను మధ్యవర్తులుగా నియమించటాన్ని వ్యతిరేకిస్తూ 1987 ఫిబ్రవరి 5న దేశమంతటా సిమెంట్ కార్మికులు ఒకరోజు సమ్మె చేశారు.

1986 నవంబర్ 23, 24 తేదీల్లో ఢిల్లీలో జరిగిన సిమెంట్ పరిశ్రమల్లోని వివిధ యూనియన్ల సంయుక్త సదస్సు పిలుపు మేరకు లక్షమంది సిమెంట్ కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు.

ప్రభుత్వం సిమెంటు పరిశ్రమల్లోని వివిధ యూనియన్లు ఇచ్చిన చార్టరు ఆఫ్ డిమాండ్స్‌ను ప్రక్కనపెట్టి, పక్షపాత వైఖరితో, ఐ.ఎన్.టి.యు.సి. సమర్పించిన చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌తో పాటు, కార్మికుల పనిభారం పెంచి, కార్మికుల సంఖ్యను తగ్గించి ప్రస్తుతం సిమెంటు కార్మికులు అనుభవించే హక్కులను సదుపాయాలను కుదించి వేయాలన్న సిమెంటు ఉత్పత్తిదారుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను మధ్యవర్తిత్వ బోర్డుకు నివేదించింది.

ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు., బి.ఎం.ఎస్., అనుబంధ యూనియన్లు ఈ సమ్మెను నిర్వహించాయి.

రెండవసారి తాత్కాలిక భృతి, ప్రతి పాయింట్ పెరుగుదలకు రూ. 1.65 పై. కరువు భత్యం చెల్లింపు అన్న రెండు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐటియుసి, బిఎంఎస్, హెచ్ఎంకెపి, మహారాష్ట్రకు చెందిన రెండు పంచదార కార్మికులు ఫెడరేషన్లతో కూడిన పంచదార కార్మికుల జాతీయ సమన్వయ కమిటీ పిలుపు మేరకు 1987 జనవరి 28న పంచదార కార్మికులు ఒకరోజు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. 1986 డిసెంబర్ 28న ఢిల్లీలో జరిగిన సదస్సు ఇచ్చిన సమ్మె పిలుపులో ఐఎన్‌టియుసి భాగస్వామి అయినప్పటికీ, చివరకు సమ్మె నుండి వైదొలగింది. అయితే ఐఎన్‌టియుసి కేంద్రం ఆదేశాలను ధిక్కరించి కొన్ని ఐఎన్‌టియుసి యూనియన్లు సమ్మెలో పాల్గొన్నాయి.

న్యాయమైన కనీస వేతనం డిమాండ్ చేస్తూ వివిధ ట్రేడ్ యూనియన్లు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీలోని అన్ని ఇండస్ట్రియల్ ఎస్టేట్లలోని కార్మికులు 1987 జనవరి 16న ఒకరోజు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. ప్రభుత్వ ఉదాశీన వైఖరితో పాటు యజమానుల నిర్దాక్షిణ్య వైఖరికి బలైన అసంఘటిత కార్మికుల పట్ల ట్రేడ్ యూనియన్ల కున్న ఆందోళన నీ సమైక్య సమ్మె వెల్లడించింది.

నాల్గవ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం తమ జీతాలను పెంచాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆసుపత్రులలోని నర్సులు కూడా 1987 జనవరి 19 నుండి నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీతో సంతృప్తి చెంది జె.ఎ.సి.లోని కొందరు నాయకులు సమ్మె నుంచి వైదొలిగారు.

కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం కార్మికవర్గ ప్రతిఘటనను నిర్వీర్యం చేయటానికి ఒక నూతన కార్మిక చట్టం ప్రవేశపెట్టాలని సంకల్పించింది. 1987 ఫిబ్రవరి 3న ఢిల్లీలో సమావేశమైన జాతీయ ప్రచారోద్యమ కమిటీ (ఎన్.సి.సి.) ఆ చట్టాన్ని వ్యతిరేకించింది. పారిశ్రామిక వివాదాల చట్టానికి, ట్రేడ్ యూనియన్ చట్టానికి ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు ట్రేడ్ యూనియన్‌ల స్వేచ్ఛను, సమ్మె చేసే హక్కును ఆటంకపరిచేవిగా వున్నాయని, ట్రేడ్ యూనియన్ల సంఖ్యను తగ్గించి అప్రజాస్వామికమైన చెకాఫ్ పద్ధతి ద్వారా గుర్తింపు పొందిన యజమానుల ప్రోత్సాహంతో నడిచే యూనియన్లలో కార్మికులను బలవంతంగా చేర్చటానికి దోహదం చేస్తాయనీ, ఎన్.సి.సి. భావించింది. ట్రేడ్ యూనియన్ల నుండి బయట వ్యక్తులను తొలగించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఐ.ఎం.ఎఫ్., ప్రపంచబ్యాంకుల ఒత్తిడికి తలవంచి రూపొందించిన నూతన ఆర్థిక విధానాలు ప్రైవేట్‌రంగం, బహుళజాతి కంపెనీల పరిరక్షణ కుద్దేశించబడినందున, కార్మికులను నిర్దాక్షిణ్యంగా దోపిడీ చేసేందుకు కార్మిక చట్టాలకు ప్రగతి నిరోధక సవరణలు చేయాల్సిన అవసరం ప్రభుత్వానికేర్పడిందని, ఎన్.సి.సి. అభిప్రాయపడింది. సహజంగానే కార్మిక చట్టాల్లో చేయ సంకల్పించిన సవరణలను ఐఎన్‌టియుసి వ్యతిరేకించలేదు.

ఆ తర్వాత కార్మిక చట్టాల్లో చేయడానికి ప్రతిపాదించిన సవరణకు, సీల్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా నూతన ధరల సూచిని ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా 1987 ఏప్రిల్ 16న దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించవల్సిందిగా, 1987 మార్చి 25 ఢిల్లీలో జరిగిన ఎన్.సి.సి. సమావేశం కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది.

ఇదే సమయంలో 1987 మార్చిలో పశ్చిమ బెంగాల్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో వామపక్ష సంఘటన ప్రభుత్వం తిరిగి అధికారం చేపట్టింది. కేరళలో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అధికారంలోకి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ వామపక్షాలను అధికారంలోకి తేవడంలో కార్మిక వర్గం ప్రముఖ పాత్ర వహించింది. పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వానికి కార్మిక వర్గ మద్దతు కొనసాగగా, కేరళలో కుల, మతతత్వ శక్తుల ప్రభావాన్ని అధిగమించి వామపక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కార్మిక వర్గం విశిష్ట పాత్ర నిర్వహించింది.

ప్రభుత్వ రంగ సంస్థలను కూలదోసే ప్రయత్నాలను ప్రభుత్వం కొనసాగిస్తున్న సమయంలోనే, నూతన ఆర్థిక విధానాల దాడుల నుండి ప్రభుత్వ రంగ మందుల పరిశ్రమను కాపాడాలని కోరుతూ, 1987 జూన్ 1 నుండి 7 వరకు "కోర్కెల వారం" జరుపవల్సిందిగా, 1987 ఏప్రిల్ 19న ఢిల్లీలో జరిగిన ప్రభుత్వ రంగ మందుల పరిశ్రమలోని యూనియన్ల సదస్సు పిలుపునిచ్చింది.

1986 జనవరి 1 నుండి మొత్తం జీతంలో 20% తాత్కాలిక భృతిగా ఇవ్వాలని, ధరల సూచిలో పెరుగుదలను డి.ఎ. ద్వారా పూర్తిగా భర్తీ చేయాలనీ, ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ, 1987 జూలై 21న ఒకరోజు సమ్మె, ఆ తర్వాత అవసరమైతే నిరవధిక సమ్మె చేయాలని, 1987 జూన్ 16న ఢిల్లీలో జరిగిన పబ్లిక్ రంగ యూనియన్ల సంయుక్త సమావేశం నిర్ణయించింది.

ఈ సమ్మె హెచ్చరికతో దిగి వచ్చిన ప్రభుత్వం యూనియన్లతో చర్చించి 1987 ఆగస్టు 18న తాత్కాలిక భృతి సమస్యను పరిష్కరించింది.

సి.ఐ.టి.యు., యు.టి.యు.సి., టి.యు.సి.సి., ఎ.ఐ.టి.యు.సి. యూనియన్లు సంయుక్తంగా ఇచ్చిన పిలుపుమేరకు పశ్చిమబెంగాలులోని 60,000 మంది టెక్స్‌టైల్ కార్మికులు చాలాకాలంగా పెండింగ్‌లో వున్న తమ 15 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల పరిష్కారం కోరుతూ 1987 జూలై 22న సమ్మె చేశారు. ఐ.ఎన్.టి.యు.సి. కూడా ఈ సమ్మెకు మద్దతిచ్చింది.

జాతీయ ప్రచారోద్యమ కమిటీ 1987 జూన్ 8న ఢిల్లీలో సమావేశమై పారిశ్రామిక వివాదాల చట్టానికి, ట్రేడ్ యూనియన్ చట్టానికి చేయ తలపెట్టిన తిరోగమన సవరణలకు, నూతన జీవన వ్యయ సూచిని ప్రవేశపెట్టడానికి వ్యతిరేకంగా 1987 ఆగస్టు 3న "అఖిల భారత సత్యాగ్రహ దినం పాటించవల్సిందిగా ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాలలో కార్మికులు సత్యాగ్రహం చేసి అరెస్టయ్యారు.

ఈ పోరాటాల వెల్లువలో కాలేజీ, యూనివర్శిటీ అధ్యాపకులు కూడా ఏ మాత్రం వెనుకబడలేదు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ అండ్ కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్స్ పిలుపుననుసరించి 10 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కారం కోరుతూ 150 యూనివర్శిటీలలోని 2,30,000 మంది ఉపాధ్యాయులు 1987 ఆగస్టు 4 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఎక్కువ సంఖ్యలో వున్న వేతనాల స్కేళ్ళను తగ్గించాలని, ప్రస్తుతం వున్న ప్రమోషన్ సదుపాయాలను యధాతధంగా వుంచి, అన్ని యూనివర్శిటీలలో, కాలేజీలలో ఒకే విధంగా అమలు జరపాలని, లైబ్రేరియన్‌లను, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను నూతన వేతన స్కేళ్ళలో ఇమడ్చాలనీ తదితర అంశాలను వారు డిమాండ్ చేశారు. సమ్మె పూర్తిగా జయప్రదమైంది. ఉత్తరప్రదేశ్‌లో సమ్మె చేస్తున్న టీచర్లపై ఎస్మా ప్రయోగించారు. అయినా సమ్మె నిరాఘాటంగా కొనసాగింది. ప్రభుత్వంతో ఒప్పందం కుదరడంతో 1987 సెప్టెంబర్ 4న సమ్మె ఉపసంహరించబడింది.

1987 డిసెంబరు 15న 53,000 మంది ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు ఒకరోజు సమ్మె చేశారు. ఇన్‌కంటాక్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్లతో ఏర్పడిన సంయుక్త కార్యాచరణ కమిటీ ఈ సమ్మెను నిర్వహించింది. క్రమశిక్షణా చర్యలను, పగసాధింపు చర్యలను రద్దు చేయాలని, 311(2) బి వలె నిరంకుశమైన 19 (11) నిబంధన ప్రకారం సర్వీసు నుంచి తొలగించిన జి.ఆర్.కురిల్‌ను తిరిగి నియమించాలని, యూనియన్ ఆఫీసు బేరర్ల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని, కంప్యూటరైజేషన్ రద్దుతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి వీరు సమ్మె చేశారు. పగ సాధింపు చర్యలకు వ్యతిరేకంగా కేంద్ర ఉద్యోగులు చేసిన ఈ సమ్మె మిక్కిలి ప్రాముఖ్యత సంతరించుకున్నది.

## నాల్గవ కేంద్ర వేతన సంఘం సిఫార్సులు - దాని ప్రభావం

నాల్గవ కేంద్ర వేతన సంఘం 1987 ఏప్రిల్‌లో తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించింది. దానిని ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేయలేదు. ఉద్యోగులు, కార్మికుల పోరాటాల్లో ఇదొక ప్రాముఖ్యత గల్గిన సంఘటన. కేంద్ర ప్రభుత్వోద్యోగుల ప్రస్తుత వేతనాల వ్యవస్థను పరిశీలించి, సంబంధిత ఇతర అంశాలతో పాటు, ప్రభుత్వరంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు తదితరుల వేతన వ్యవస్థలను, దేశ ఆర్థిక పరిస్థితి, కేంద్ర ప్రభుత్వం వద్ద నున్న ఆర్థిక వనరులను, దేశాభివృద్ధి, ప్రణాళికలు, దేశ రక్షణ, జాతీయ భద్రతల మీద చేయవల్సిన వ్యయం పరిగణనలోకి తీసుకుని అవసరమైన, ఆచరణ సాధ్యమైన మార్పులు సూచించవల్సిందిగా 1983 జూలై 29న కేంద్ర ప్రభుత్వం నాల్గవ వేతన సంఘాన్ని నియమించింది.

దేశంలో అతి పెద్ద యజమానియైన కేంద్ర ప్రభుత్వం క్రింద పనిచేస్తున్న సుమారు 40 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన వేతనాల స్కేళ్ళను నాల్గవ వేతన

సంఘం సిఫార్సు చేయవల్సి వుంది. సహజంగానే వేతన సంఘం చేసే సిఫార్సులు, వాటి మీద ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, రాష్ట్రాల్లోని వివిధ తరగతుల ప్రభుత్వోద్యోగులు, క్వాజీ గవర్నమెంట్ ఉద్యోగులు సుమారు 80 లక్షల మందికి సంబంధించిన ఆర్థిక కోర్కెల మీద తీవ్ర ప్రభావం చూపుతాయి. అంతేగాక కనీస వేతనం గురించి వేతన సంఘం చేసే సిఫార్సులు అన్ని రంగాల్లోని కార్మికుల మీద తీవ్ర ప్రభావం చూపుతాయి. అయితే కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతన సవరణ విషయమై నియమించబడ్డ ఈ వేతన సంఘం సిఫార్సులు, వీరితో పాటు ఇతర తరగతుల ఉద్యోగుల ఆశలను అడియాసలు చేశాయి.

జాతీయాదాయంలో పెరుగుదలను, కేంద్ర ప్రభుత్వ వనరులను పరిశీలించిన కమిషన్ అభివృద్ధి గణనీయంగా వుందని అభిప్రాయపడింది. ఈ వాస్తవంతో పాటు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలకు మధ్య కేంద్ర ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాల మధ్య, వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లోని ఉద్యోగుల వేతనాల మధ్య తారతమ్యాలున్నాయని, అవి కాలం గడుస్తున్న కొద్దీ వేగంగా పెరుగుతున్నాయని కూడా కమిషన్ అంగీకరించింది. ఇంత చెప్పినప్పటికీ చివరకు కమిషన్ వివిధ తరగతుల ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసే సిఫార్సులు చేసింది. కేంద్ర ప్రభుత్వోద్యోగులు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల మధ్య తారతమ్యాలను తొలగించే విధంగా గాని, అవసరాల ప్రాతిపదికన కనీస వేతనం సూత్రాన్ననుసరించి గాని వేతన పెంపుదలకు సిఫార్సు చేసే ధైర్యం కూడా కమిషన్ చేయలేకపోయింది.

చివరకు 1960 వినిమయదారుల ధరల సూచిలో 608 పాయింట్ల వద్ద అట్టడుగు స్థాయిలో రూ. 750/–ల వేతనాన్ని కమిషన్ సిఫార్సు చేసింది. ఇది కనీసం 1957లో 15వ లేబర్ కాన్ఫరెన్స్ నిర్ధారించిన ప్రమాణాల కనుగుణంగా కూడా లేదు.

ఈ పరిస్థితుల్లో నిరాశాజనకమైన కమిషన్ సిఫార్సులకు ప్రధానంగా కనీస వేతనాలకు సంబంధించిన కమిషన్ చేసిన సిఫార్సులకు వ్యతిరేకంగానూ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల వేతనాలతో సమానంగా వేతనాలను సిఫార్సు చేయనందుకు, రైల్వే ఉద్యోగులతో సహా కేంద్ర ప్రభుత్వోద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

1987 ఏప్రిల్ 23న ఢిల్లీలో జరిగిన రైల్వే ఉద్యోగుల జాతీయ ప్రచార కమిటీ రెండవ సదస్సు వేతన సంఘం సిఫార్సులకు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. 1974లో సుదీర్ఘ సమ్మె పోరాటం సందర్భంగా నెలకొల్పిన సమరశీల ఐక్య పోరాటాలు సాంప్రదాయాలను కొనసాగించడానికి ఎ.ఐ.ఆర్.ఎఫ్. నిరాకరించడంతో, ఎఐఆర్ఎఫ్‌తో నిమిత్తం లేకుండా ఎన్.సి.సి.ఆర్. ఏర్పాటు చేయబడిన విషయం ఇంతకు ముందే చెప్పుకున్నాం. వినిమయదారుల ధరల సూచిలో 600 పాయింట్ల వద్ద కనీస వేతనాన్ని రూ. 1,250/–లుగా నిర్ణయించాలనీ, ధరల పెరుగుదలను డి.ఎ. ద్వారా పూర్తిగా భర్తీ చేయాలని, నిర్ణీత కాల వ్యవధిలో ప్రమోషన్లు తదితర డిమాండ్లతో కూడిన ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను సదస్సు ఆమోదించింది. వేతన సంఘం

సిఫార్సుల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమైక్యంగా ఉద్యమించవల్సిన అవసరం ఏర్పడిందని సదస్సు అభిప్రాయపడింది.

ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వోద్యోగులకు పబ్లిక్ రంగ సంస్థల్లోని ఉద్యోగులతో సమానంగా వేతనాలివ్వాలని డిమాండ్ చేస్తూ, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, ఎఐఆర్ఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో 1987 ఏప్రిల్ 28న పార్లమెంట్‌కు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించి, అనంతరం ఢిల్లీలోని బోట్ క్లబ్ వద్ద బ్రహ్మాండమైన సభ నిర్వహించడం జరిగింది.

కానీ ఈ నిరసన తీర్మానాలకు, ప్రదర్శనలకు మాత్రమే పరిమితమైంది. చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో తీవ్ర అసంతృప్తితో కేంద్ర ఉద్యోగుల యూనియన్లు పే కమిషన్ సిఫార్సులను అంగీకరించాయి.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు చాలా అసంతృప్తికరంగా వున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల జీతాలు మరింత అధ్వానంగా కేంద్ర ఉద్యోగుల జీతాల కన్నా చాలా తక్కువగా వున్నాయి. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలలోనే విభిన్న స్థాయిలో చాలా అంతరాలున్నాయి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల జీతాలను పబ్లిక్ రంగ ఉద్యోగుల స్థాయికి తేవాలని, అయితే దీనిని అమలు చేసేలోగా రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల జీతాలను కనీసం కేంద్ర ప్రభుత్వోద్యోగుల జీతాల స్థాయికి తీసుకెళ్ళాలని ఎఐఎస్‌జిఇఎఫ్., నాల్గవ వేతన సంఘానికి చేసిన డిమాండ్‌ను కమిషన్ ఆమోదించలేదు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల వేతనాల సమస్య కేంద్ర వేతన సంఘం పరిశీలనా పరిధిలో లేదు.

ఈ పరిస్థితుల్లో ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్. కేంద్ర ఉద్యోగులతో సమానస్థాయిలో రాష్ట్ర ఉద్యోగులకు వేతనాలివ్వాలనే అంశాన్ని చాలా పట్టుదలతో చేపట్టింది. తమ వేతనాల విషయంలో బాగా అన్యాయం జరిగిందనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులలో తీవ్రమైన అసంతృప్తి నెలకొన్నది.

సమాన వేతనాల కోసం అనేక రాష్ట్రాలలో సమ్మె పోరాటాల వెల్లువ ప్రారంభమైంది. ఈ సంక్షుభిత పరిస్థితిలో ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, కేంద్ర ఉద్యోగులతో సమాన వేతనాలు కోరుతూ 1988 ఫిబ్రవరి 10న ఒకరోజు దేశవ్యాప్త సమ్మెకు పిలుపిచ్చింది. 80 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, రాష్ట్రాలలోని బోర్డులు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

ఈ దేశవ్యాప్త ఆందోళనల ఫలితంగా వివిధ రాష్ట్రాలలోని రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు కేంద్ర ఉద్యోగులతో దాదాపు సమాన వేతనాలు సాధించుకున్నారు.

## కొనసాగిన పోరాటాల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల మహోజ్వలమైన సమ్మె పోరాటం తరువాత, పబ్లిక్‌రంగ యూనియన్ల కమిటీ (సి.పి.ఎస్.టి.యు) పిలుపు మేరకు 20 లక్షల మంది పబ్లిక్ రంగ ఉద్యోగులు 1988 మార్చి 14 నుంచి 3 రోజులు సమ్మె చేశారు. ఈ దేశవ్యాప్త సమ్మెవల్ల బెంగుళూరు, హైదరాబాద్, మద్రాస్, తిరుచిరాపల్లి, ఘజియాబాద్, కాన్పూర్, భిలాయ్, రాంచి, బరౌని, రూర్కెలా, దుర్గాపూర్, కలకత్తా మొదలైన ప్రాంతాలలో పబ్లిక్ రంగ సంస్థలలో పని పూర్తిగా స్తంభించిపోయింది. బి.పి.ఇ. గైడ్‌లైన్స్‌ను రద్దు చేయాలని, జీవన వ్యయసూచిలో 600 పాయింట్ల వద్ద రు.1,500 కనీస వేతనం నిర్ణయించాలనీ, తాత్కాలిక భృతి ఇవ్వాలనీ, ధరల పెరుగుదలకు కరువుభత్యం ద్వారా పూర్తిగా భర్తీ చేయాలనీ డిమాండ్ చేస్తూ, 1988 జనవరి 29న ఢిల్లీలో జరిగిన పి.ఎస్.టి.యు. సమావేశం పిలుపు మేరకీ బృహత్తర సమ్మె నిర్వహించడం జరిగింది.

దేశంలోని బొగ్గుగని కార్మికులు 1988 మార్చి 20 నుంచి 25 వరకు మరల 6 రోజుల సమ్మె చేశారు. అందులో దాదాపు 7 లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., బి.ఎం.ఎస్., యూనియన్లు కలకత్తాలో 1988 జనవరి 20న జరిపిన మూడవ అఖిల భారత బొగ్గుగని కార్మికుల సదస్సులో ఈ సమ్మె నిర్ణయం జరిగింది. ఐ.ఎన్.టి.యు.సి. ఈ సదస్సులో పాల్గొనక పోయినా చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను వారు కూడా సమర్పించారు. జాతీయ బొగ్గుగని కార్మికుల ఒప్పందం-3లో అమలు చేయని అంశాలను వెంటనే అమలు చేయాలనీ, 10 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌లో కోరారు. ఎస్మా చట్టం అమలు చేసి, 6 నెలల కారాగారవాస శిక్ష లేదా రు.1,000/-ల జరిమానా లేదా రెండు శిక్షల అమలుకు, ఒకరోజు సమ్మె చేస్తే 8 రోజుల జీతం కోత, డిస్మిసల్ వంటి అణచివేత చర్యలకు పూనుకున్నప్పటికీ సమ్మె విజయవంతమైంది.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 8 వామపక్ష ప్రజాతంత్ర పార్టీలు, 1988 మార్చి 15న భారత్ బంద్‌కు. దేశవ్యాప్తంగా ఒకరోజు సమ్మెకు ఇచ్చిన పిలుపును ప్రత్యేకంగా పేర్కొనాలి. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఈ రెండు కార్యక్రమాలు బాగా విజయవంతమయ్యాయి.

1988 మార్చి నెల మొత్తం ప్రభుత్వ కార్మిక, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సమ్మెలు, సార్వత్రిక సమ్మెలతో అట్టుడికిపోయింది.

## కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం

వివిధ పరిశ్రమల్లోనూ, జాతీయ స్థాయిలోనూ సమ్మె పోరాటాలు వెల్లువెత్తడంతో కేంద్ర ప్రభుత్వం ఈ పరిస్థితి నెదుర్కొనటానికి కార్మిక, వ్యతిరేక చట్టాలతో సన్నద్ధం కావడం ప్రారంభించింది.

ఆసుపత్రులు మరియు ఇతర సంస్థల బిల్లు, ట్రేడ్ యూనియన్ మరియు పారిశ్రామిక వివాదాల (సవరణ) బిల్లు పేరిట ప్రభుత్వం రెండు బిల్లులను రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మొదటి బిల్లును ఎగువ సభ (రాజ్యసభ)లో వెంటనే ఆమోదింపచేసుకుంది. విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, ధార్మిక, సామాజిక, సేవా దృక్పథంతో నడిచే సేవా సంస్థలు, ఖద్దరు, గ్రామీణ పరిశ్రమలు మొదలగువాటిలో పనిచేసేవారికి ట్రేడ్ యూనియన్ హక్కులు నిరాకరించడం ఈ బిల్లు లక్ష్యం. ఆ విధంగా వారికి ప్రభుత్వం సంఘ స్వేచ్ఛను, ట్రేడ్ యూనియన్ హక్కులను హరించివేయబూనుకుంది. కార్మిక వర్గం సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ట్రేడ్ యూనియన్ హక్కులను కాలరాచివేసేందుకు పారిశ్రామిక వివాదాల చట్టం 1947కు, భారత ట్రేడ్ యూనియన్ చట్టం 1926కు సవరణలు చేసేందుకు రెండవ బిల్లు ఉద్దేశించబడింది.

1969లో నేషనల్ కమిషన్ ఆఫ్ లేబర్ చేసిన సిఫార్సుల మేరకు ఏర్పాటు చేయబడిన సనత్ మెహతా కమిటీ చేసిన సూచనల ప్రాతిపదికన సవరణ ప్రతిపాదనలను రూపొందించడం జరిగింది. ప్రతిపాదిత సవరణలకు సంబంధించిన ఒక సాధారణ ప్రాతిపదికను 1986 సెప్టెంబర్‌లో స్టాండింగ్ లేబర్ కమిటీ ముందుంచడం జరిగింది. ఈ కార్మిక వ్యతిరేక చర్యలకు ఐఎన్‌టియుసి తప్ప మిగిలిన ట్రేడ్ యూనియన్లు ప్రారంభం నుండే తమ తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి.

1982 సెప్టెంబర్ 17న జరిగిన త్రైపాక్షిక సమావేశ నిర్ణయం ప్రకారం ఏర్పాటు చేయబడిన సనత్ మెహతా కమిటీని ట్రేడ్ యూనియన్ల జాతీయ ప్రచారోద్యమ కమిటీ బహిష్కరించింది. సనత్ మెహతా కమిటీ సిఫార్సులతో పాటు, బిల్లులో పొందుపర్చబడిన సవరణ ప్రతిపాదనలు, పారిశ్రామిక సంబంధాల కమిషన్ ఏర్పాటు అంశం మీదనే కేంద్రీకరించాయి. కార్మిక వివాదాలపై తీర్పునిచ్చే ఒక శాశ్వత మధ్యవర్తిత్వ సంస్థగా ఈ కమిషన్‌ను రూపొందించి, అసలు సమ్మెలే జరగకుండా నిరోధించి, కార్మికులను కార్యాచరణ నుండి మళ్ళించి, ట్రేడ్ యూనియన్లు కమిషన్ ముందు తమ సమస్యలను విన్నవించుకోక తప్పని పరిస్థితి కల్పించే అంశాలీ బిల్లులో పొందుపర్చబడ్డాయి. మధ్యవర్తి పరిష్కారాన్ని, తీర్పులను బలవంతంగా కార్మికుల నెత్తినరుద్దేందుకీ బిల్లు ప్రభుత్వం, యాజమాన్యాల చేతిలో ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. అంతేగాక, ప్రతిపాదిక పారిశ్రామిక సంబంధాల కమిషన్ విస్తృత పరిధి గల్గిన లేబర్ కోర్టులను ఏర్పాటు చేస్తుంది. ఆ లేబర్ కోర్టుల ప్రధాన విధులీ క్రింది విధంగా వుంటాయి.

1. పని నుండి తొలగింపు, డిస్మిసల్ రిట్రెంచ్‌మెంట్లు, టెర్మినేషన్ వంటి కార్మికులకు సంబంధించిన వ్యక్తిగత వివాదాలు.

2. వివిధ సంస్థల్లోని స్టాండింగ్ ఆర్డర్లను గురించి వివరించి, వాటి అమలును గురించి తెలియజేయడం, ఆ స్టాండింగ్ ఆర్డర్ల ప్రకారం జారీ చేయబడ్డ ఆదేశాల చట్టబద్ధత, సమంజసత్వాన్ని నిర్ణయించడం.

3. కార్మికుల తరఫున యాజమాన్యంతో సంప్రదింపులు జరిపే ప్రతినిధిని లేక సమితిని ధృవీకరించటం, అక్రమ కార్మిక చర్యలకు పాల్పడితే ఆ గుర్తింపు రద్దు చేసే అధికారాలు.

4. ఉద్యోగంలో పర్మనెంట్ చేయటం, సీనియారిటీ, ప్రమోషన్, సెలవు, క్రమశిక్షణా చర్యలు, రివర్షన్, పదవిలోంచి ముందుగా రిటైర్ చేయటం, పదవీకాలపరిమితి, జీతాలు, రిటైర్‌మెంట్ సదుపాయాల విషయంలో ఏర్పడే వివాదాలు.

క్లుప్తంగా చెప్పాలంటే లేబర్ కమిషనర్ నిర్వహించే కర్తవ్యాలను విధులను లేబర్ కోర్టులకు అప్పచెప్పాలని ప్రతిపాదించారు. యూనియన్ ఆఫీస్ బేరర్లలో, పరిశ్రమలో ఉద్యోగులు కాని వారి సంఖ్యను తగ్గించే నిబంధనను బిల్లులో చేర్చారు. అంతేకాక యూనియన్ల గుర్తింపు, ఆఫీసు బేరర్లను అనర్హులుగా చేయడం, ప్రవర్తనా నియమావళి, ట్రేడ్ యూనియన్ల వైపు నుండి జరిగే అక్రమ కార్మిక చర్యలు (కార్మిక వ్యతిరేక చర్యలు), సమ్మెల న్యాయబద్ధతను నిర్ణయించడం వంటి అధికారాలను లేబర్ కోర్టులకు కట్టబెట్టే అనేక తిరోగమన నిబంధనలు బిల్లులో వున్నాయి.

అటువంటి పరిస్థితిలో, ఐ.ఎన్.టి.యు.సి. తప్ప మిగిలిన ట్రేడ్ యూనియన్లు ఆ బిల్లులకు వ్యతిరేకంగా పోరాటం సాగించి చివరకు వాటిని ఓడించేందుకు పూనుకున్నాయి.

ఈ రెండు బిల్లులకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్ల జాతీయ ప్రచారోద్యమ కమిటీ ఢిల్లీలో 1988 జూలై 14న ఒక సదస్సు జరిపింది. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., హెచ్.ఎం.ఎస్., బి.ఎం.ఎస్., యు.టి.యు.సి., టి.యు.సి.సి., యు.టి.యు.సి (ఎల్.ఎస్), ఐ.ఎన్.టి.యు.సి (దారా గ్రూపు)లతో పాటు ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్., ఎ.ఐ.ఆర్.ఎఫ్., ఎ.ఐ.డి.ఇ.ఎఫ్., ఎ.ఐ.ఐ.ఇ.ఎ., ఎ.ఐ.ఎల్.ఆర్.ఎస్.ఎ., సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్, ఎ.ఐ.బి.ఇ.ఎ., బి.ఇ.ఎఫ్.ఐ., కోల్ వర్కర్స్ ఫెడరేషన్, ఎయిర్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తదితర అనేక యూనియన్లు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

సదస్సులో వక్తలు ఈ బిల్లులను తీవ్రంగా నిరసించారు. ప్రస్తుత బిల్లుల్లోని చాలా అంశాలను జనతా ప్రభుత్వ కాలంలో కాంగ్రెస్ (ఐ) వ్యతిరేకించిందనీ, ఆ అంశాలన్నీ బిల్లుల్లో చేర్చటం ఐ.ఎన్.టి.యు.సి.కి బలం చేకూర్చటానికే వుద్దేశించిందని వక్తలు పేర్కొన్నారు.

అనుబంధాలతో నిమిత్తం లేకుండా దేశంలోని కార్మిక వర్గమంతా ఈ బిల్లులు చట్టాలుగా రూపొందకుండా ఒక రోజు సమ్మె చేయాలని, ఈలోగా దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి పార్లమెంట్ వర్షాకాలపు సమావేశాలు ప్రారంభమయ్యే 1988 జూలై 27న పార్లమెంట్ ముందు ప్రదర్శన నిర్వహించాలని సదస్సు పిలుపిచ్చింది.

జాతీయ సదస్సు పిలుపు ననుసరించి, ఈ తిరోగమన బిల్లులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రాంతీయ సదస్సులు నిర్వహించబడ్డాయి.

ఈ బిల్లులకు విస్తృతంగా వ్యతిరేకత వ్యక్తమైంది. పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక మంత్రులు 1988 జూలై 30వ తేదీన కలకత్తాలో సమావేశమై ఈ బిల్లులకు తమ తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. "ఈ బిల్లులు చట్టాలుగా రూపొందితే, కార్మిక వర్గం శతాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న ప్రజాతంత్ర హక్కులకు తీవ్ర విఘాతం కల్గుతుందని" వారు ప్రకటించారు.

జాతీయ సదస్సు నిర్ణయం ప్రకారం ఈ బిల్లులకు వ్యతిరేకంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో 1988 జూలై 27న నిరసన దినం పాటించారు. ఢిల్లీలోని 15,000 మంది ఉద్యోగులు, కార్మికులు ప్రధాన వీధుల గుండా ఊరేగింపు జరిపి బోట్ క్లబ్ మైదానంలో సభ జరిపారు. పశ్చిమ బెంగాల్, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా ఈ కార్యక్రమం గురించి పత్రికలు ప్రముఖంగా వార్తలు ప్రచురించాయి.

## తిరిగి ప్రారంభమైన పబ్లిక్ రంగ ఉద్యోగుల పోరాటం

ఈ కాలంలో పబ్లిక్ రంగ ఉద్యోగులు తమ పోరాటం కొనసాగించారు. 1987 జూలైలో పాత ఒప్పందాల కాల పరిమితి ముగిసిన తరువాత కార్మికులకు తాత్కాలిక భృతి చెల్లించిన ప్రభుత్వరంగ సంస్థలు, అటువంటి చెల్లింపులు ఇక కొనసాగించరాదని, చెల్లించిన మొత్తాలను తిరిగి రాబట్టుకోవాలనీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

ఈ నిరంకుశ ఉత్తర్వు పబ్లిక్‌రంగ ఉద్యోగులలో తీవ్రమైన అసంతృప్తి కలిగించింది. 1988 నవంబర్ 18 న ఢిల్లీలో సమావేశమైన సి.పి.ఎస్.టి.యు. ఈ ఉత్తర్వును తీవ్రంగా ఖండించి, 1988 డిసెంబర్ 8న 'అఖిల భారత నిరసన దినం' పాటించవలసిందిగా పబ్లిక్ రంగ కార్మికులకు పిలుపునిచ్చింది. హెచ్.ఎం.ఎస్., సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., బి.ఎం.ఎస్. బెంగుళూరు జాయింట్ ఏక్షన్ ఫోరం, హైదరాబాద్ కో - ఆర్డినేషన్ కమిటీ, సి.పి.ఎస్.టి.యు. ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వేతన సవరణ విషయమై చర్చలు ప్రారంభించాలని, హైపవర్ పే కమిటీ (అత్యున్నతాధికారాలు గల్గిన వేతన సంఘం) మధ్యంతర నివేదిక ప్రకారం తమకు సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రైపాక్షిక కరువు భత్యం కమిటీలో ఆఫీసర్లకు కూడా స్థానం కల్పించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే ఆఫీసర్లు 1988 నవంబర్ 15, 16 తేదీల్లో 48 గంటల పాటు ఢిల్లీలో బోటు క్లబ్ వద్ద నిరాహారదీక్ష జరిపారు.

వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఆలిండియా పోర్టు అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్, ఇండియన్ నేషనల్ పోర్టు అండ్ డాక్ వర్కర్సు ఫెడరేషన్, పోర్టు, డాక్ అండ్ వాటర్ ఫ్రంట్ వర్కర్స్ ఫెడరేషన్ అనే పోర్టు అండ్ డాక్ వర్కర్స్‌కు సంబంధించిన నాలుగు జాతీయ ఫెడరేషన్లు 1988 నవంబర్ 4న ప్రభుత్వానికి లేఖ రాస్తూ కార్మికులకు తాత్కాలిక భృతి చెల్లింపును ఆపివేస్తూ, చెల్లించిన మొత్తాలను తిరిగి రాబట్టుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వును

ఉపసంహరించాలని కోరారు. అధికారులు మొండిగా తాత్కాలిక భృతిని ఉపసంహరించి తదుపరి చెల్లింపులు ఆపివేయాలనే నిశ్చయంతో వ్యవహరిస్తే దేశమంతటా పోర్టు అండ్ డాక్ వర్కర్స్ సమ్మె చేస్తారని కూడా యీ నాలుగు ఫెడరేషన్లు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి.

ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగులకు కనీస మూల వేతనం రు. 1,080/-లు చెల్లిస్తామని ఇండియన్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం ఇచ్చిన హామీని అమలు పరచనందుకు నిరసనగా, ఎయిర్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, ఇండియన్ ఎయిర్ క్రాఫ్ట్ టెక్నీషియన్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగులు 1988 నవంబర్ 22న ఒకరోజు సమ్మె నిర్వహించారు.

బ్యూరో ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ నిరంకుశ మార్గదర్శక సూత్రాల కారణంగా పబ్లిక్ రంగ సంస్థల్లో వేతన చర్యలు నిలిచిపోయిన క్లిష్ట పరిస్థితుల్లో సి.పి.ఎస్.టి.యు. మరల 1988 డిసెంబర్ 12, 13 తేదిల్లో ఢిల్లీలో సమావేశమైంది. అనేక పబ్లిక్ రంగ సంస్థల్లో వేతన ఒప్పందాల విషయంలో అసాధారణ జాప్యానికి దారితీసే విధంగా పబ్లిక్ రంగ సంస్థల వేతన సవరణ చర్చల్లో బి.పి.ఇ. మితిమీరిన జోక్యాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది.

ఈ నిరంకుశ వైఖరిని నిరసించి 1989 జనవరి లోగా ప్రభుత్వం వేతన ఒప్పందాలను పూర్తి చేయకపోతే నిరవధిక సమ్మెకు సన్నద్ధం కావల్సిందిగానూ, పబ్లిక్‌రంగ ఉద్యోగులకు సమావేశం పిలుపునిచ్చింది. తరువాత 1989 మార్చి 1న జరిగిన సమావేశంలో సి.పి.ఎస్.టి.యు. పరిస్థితిని సమీక్షించి, ప్రధాన పబ్లిక్ రంగ సంస్థల్లో వేతన చర్చలలో జరిగిన పురోగతి దృష్ట్యా నిరవధిక సమ్మె పిలుపును వాయిదా వేసింది.

## ఇతర రంగాల్లో కార్మిక వర్గ పోరాటాలు

ట్రేడ్ యూనియన్ ఉద్యమం అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏనాడూ పరిగణించబడని హర్యానా రాష్ట్రంలో కూడ పెద్ద ఎత్తున ఐక్య పోరాటాలు సాగాయంటే, కార్మిక వర్గ పోరాటాలెంత విస్తృతంగా సాగిందీ స్పష్టమవుతుంది. ఎఐటియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, బిఎంఎస్ లు పానిపట్‌లో సంయుక్తంగా నిర్వహించిన ట్రేడ్ యూనియన్ల సదస్సు నిర్ణయం మేరకు, రూ. 1,250/-ల కనీస వేతనం చెల్లించాలనీ, వినిమయదారుల సూచిలో ప్రతి పాయింట్ పెరుగుదలకు రూ. 2/-లు చెల్లించాలని కోరుతూ ఆ రాష్ట్రంలోని కార్మికులు 1989 జనవరి 16 నుండి 18 వరకు మూడు రోజులు సమ్మెకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం దిగివచ్చి ఒప్పందం చేసుకోవడంతో సమ్మె ఉపసంహరించబడింది.

నవంబర్ 22 నుంచి 28 వరకు 7 రోజులు సమ్మె చేశారు. అసంఘటిత రంగంలో కార్మికుల సమ్మెలను సి.ఐ.టి.యు. స్వతంత్రంగా నిర్వహించింది.

దేశంలోని పంచదార కార్మికులు, మూడవ వేజ్ బోర్డు సిఫార్సులను తిరస్కరించి ,నేషనల్ షుగర్ వర్కర్స్ కో–ఆర్డినేషన్ కమిటీతో ప్రభుత్వం వేతన చర్చలు ప్రారంభించాలని కోరుతూ, 1989 ఫిబ్రవరి 15న ఒక రోజు సమ్మె చేశారు. పూనాలో 1989 జనవరి 12న జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో సమ్మె నిర్ణయం తీసుకోవడం జరిగింది. సి.ఐ.టి.యు., ఐ.ఎన్.టి.యు.సి. ఎ.ఐ.టి.యు.సి. హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి. మరియు పంచదార పరిశ్రమకు సంబంధించిన ఇతర స్వతంత్ర యూనియన్లు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

ఈ కాలంలోనే దేశ ఆర్థిక కార్యకలాపాలలో కీలకపాత్ర వహిస్తున్న రంగంలో ఒక మహత్తరమైన సమ్మె జరిగింది. దేశంలోని 10 ప్రధాన ఓడ రేవులలో పోర్టు అండ్ డాక్ వర్కర్ల వేతనాలు, ఇతర సర్వీస్ కండిషన్ల విషయం చర్చలలో ప్రతిష్టంభన ఏర్పడటంతో 1989 ఏప్రిల్ 17 నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సి.ఐ.టి.యు), పోర్ట్స్ డాక్ మరియు వాటర్ ఫ్రంట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎ.ఐ.టి.యు.సి), ఆలిండియా పోర్టు అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ (హెచ్.ఎం.ఎస్), ఇండియన్ నేషనల్ పోర్టు అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐ.ఎన్.టి.యు.సి.) అనే పోర్టు అండ్ డాక్ వర్కర్ల ప్రధాన యూనియన్లు నాలుగు 1989 మార్చి 17న ఢిల్లీలో నిర్వహించిన సంయుక్త సమావేశం పిలుపు మేరకు సమ్మె నిర్వహించాయి.

ఐదు రోజుల సంపూర్ణ సమ్మె తరువాత పోర్టు అండ్ డాక్ అధికారులు దిగి వచ్చి, ప్రధాన పబ్లిక్ రంగ సంస్థల్లోని కార్మికులతో సమాన స్థాయిలో సదుపాయాలు కల్పిస్తూ నాలుగు ఫెడరేషన్లతో ఒక అవగాహనా పత్రంపై సంతకాలు చేశారు. ఈ సమ్మెతో పోర్టు అండ్ డాక్ కార్మికులు గణనీయమైన విజయం సాధించారు.

ఈ కాలంలోనే రాష్ట్రాల స్థాయిలో అనేక పోరాటాలు సాగాయి. రోహటక్, ఫరీదాబాద్ తదితర ప్రాంతాల్లో పరిశ్రమల మూసివేతలు, లాకౌట్లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్ర వ్యాప్తంగా 1989 ఏప్రిల్ 10న జరిగిన సమ్మె వీటిల్లో ముఖ్యమైనది. గత కొన్ని సంవత్సరాలుగా ఉగ్రవాదుల హింసాకాండతో తల్లడిల్లుతున్న పంజాబ్ రాష్ట్రంలో, నైపుణ్యంలేని కార్మికులకు రూ. 1,050/–లు, ఇతర కార్మికులకు మరింత హెచ్చు స్థాయిలోనూ కనీస వేతనాలు నిర్ణయించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, కాంట్రాక్టు లేబర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఇటుక పరిశ్రమలోని కార్మికులతో సహా, అన్ని పారిశ్రామిక కేంద్రాల్లోని కార్మికులు 1989 ఏప్రిల్ 19 నుండి 21 వరకు మూడు రోజులు సమ్మె నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి సంయుక్తంగా నిర్వహించిన ఈ సమ్మెలో సుమారు 1,25,000 మంది కార్మికులు పాల్గొన్నారు. పంజాబ్‌లో ఉగ్రవాదుల హత్యాకాండ సాగుతున్నప్పటికీ ఈ రెండు కేంద్ర కార్మిక సంఘాలు ధైర్యంతో చొరవ తీసుకుని ఈ సమ్మె నిర్వహించాయి.

దేశంలోని వివిధ ప్రాంతాలలో, వివిధ రంగాల్లోనూ సమ్మె పోరాటాలు సర్వసాధారణమయ్యాయి. ఫ్యాక్టరీల మూసివేతలు, లాకౌట్లు, టెక్స్‌టైల్ కార్మికులను పనుల నుండి తొలగించడం, నూతన జీవన వ్యయ సూచి ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం కార్మిక వర్గం మీద దాడులకు పూనుకోవడంతో సిఐటియు పిలుపు మేరకు బొంబాయిలో దాదాపు లక్షమంది కార్మికులు 1989 మే 17న సమ్మె చేశారు. సమ్మెలు, లాకౌట్లకు వ్యతిరేకంగానూ, మూతపడిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, జనపనార పరిశ్రమను జాతీయ ం చేయాలనీ, తదితర డిమాండ్ల సాధనకు సిఐటియు, ఎఐటియుసి, టియుసిసి, 12–జూలై కమిటీ, ఫెడరేషన్ ఆఫ్ మర్కంటైల్ ఎంప్లాయీస్ యూనియన్స్, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి)ల పిలుపు మేరకు 1989 ఆగస్టు 30వ తేదీన పశ్చిమ బెంగాల్‌లో బంద్, సార్వత్రిక సమ్మె జరిగాయి. బోఫోర్సు తుపాకుల కొనుగోలు వ్యవహారంలో అవినీతి ఆరోపణల నెదుర్కొంటున్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు అదేరోజున భారత్ బంద్ నిర్వహించడం జరిగింది. తమ 32 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ సాధనకు ఆలిండియా రిజర్వ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులు 1989 జూన్ 9న ఒక రోజు సమ్మె పాటించారు.

## రాజకీయ సంక్షోభ పరిస్థితి

ఈ కాలంలో రాజకీయ పరిస్థితి సంక్లిష్టంగా మారటం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణల గురించి, ముఖ్యంగా బోఫోర్సు తుపాకుల కొనుగోలు ఒప్పందంలో స్వీడన్‌కు చెందిన బోఫార్సు కంపెనీతో జరిగిన వ్యవహారంపై సర్వత్రా నిరసన వెల్లువెత్తింది. పార్లమెంటులో ఈ సమస్య మీద ప్రభుత్వం బాగా ఇరుకునపడింది. నేరస్తులను గుర్తించి, శిక్షించటంలో ప్రభుత్వ నిష్క్రియాపరత్వానికి నిరసనగా ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు రాజీనామా చేశారు. ఈ సంఘటన దేశంలో తీవ్ర అలజడి రేకెత్తించింది. ప్రభుత్వమే నేరస్తులను రక్షిస్తోందనే భావనతో ప్రజలలో ప్రబలి, నిరసన పెల్లుబికింది. అంతేకాక ఆర్థిక పరిస్థితి దిగజారింది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాల వలన ఫ్యాక్టరీల మూసివేత, లాకౌట్లు, రిట్రెంచ్‌మెంట్లు పెద్ద ఎత్తున జరిగాయి. బహుళజాతి కంపెనీలు భారీగా దేశంలో ప్రవేశించాయి. భారతీయ జనతాపార్టీ, ఆర్.ఎస్.ఎస్. తదితర మత సంస్థల, మత రాజకీయాలతో పరిస్థితి మరింత క్షీణించింది. బాబ్రీమసీదు, రామజన్మభూమి సమస్యపై ఈ మతసంస్థలు ప్రజలలో మతతత్వ భావనలు రెచ్చగొట్టాయి. బి.జె.పి. వారి మతతత్వ అనుయాయులు, మొగలు చక్రవర్తి బాబరు పాలనా కాలంలో రామజన్మభూమిలో బాబ్రీమసీదు నిర్మాణం జరిగిందనీ, అందువలన బాబ్రీ మసీదును కూలదోసి ఆ స్థలంలోనే రామాలయం నిర్మించాలని ఆందోళన చేశారు. ఇది కేవలం, ముస్లిం మైనారిటీల హక్కులను కాలరాయాలనే లక్ష్యంతో హిందూమత ఛాందసవాదుల రాజకీయ కుట్ర మాత్రమే. అదే కాలంలో ఖలిస్థాన్ ఉగ్రవాదులు

హత్యాకాండను తీవ్రతరం చేసి అనేక అమాయక ప్రాణాలను బలిగొన్నారు. కాశ్మీరులో పరిస్థితి కూడా అధ్వాన్నమైంది. పాకిస్తాన్ అనుకూల వేర్పాటువాదులు రాష్ట్రాన్ని తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. ఆ పరిస్థితుల్లో 1989 ఆగస్టు 30 న రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రాజీనామా చేయాలని కోరుతూ చేసిన భారత్ బంద్‌కు విశేష స్పందన లభించింది.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పూర్తిగా ఆత్మరక్షణలో పడి, పార్లమెంట్ లోపల, వెలుపల తీవ్ర ఒత్తిడికి గురయ్యింది. వీటికి తోడు రాజ్యసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచాయితీ రాజ్ బిల్ వీగిపోవటంతో ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడింది. ఇటువంటి గత్యంతరంలేని పరిస్థితుల్లో ప్రభుత్వం 1989 నవంబరు 22 న లోక్‌సభ ఎన్నికలు జరపాలని ప్రకటించింది. ఐ.ఎన్.టి.యు.సి., తప్ప మిగిలిన అన్ని కేంద్ర యూనియన్లు రాజీవ్‌గాంధీ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాయి.

## ఎన్నికలు - రాజకీయ రంగంలో మార్పు

9వ సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ (ఐ) పరాజయం పాలు కావడంతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం రాజీనామా చేసింది. 8వ లోక్‌సభలో కాంగ్రెస్ (ఐ) సాధించిన అపూర్వ మెజారిటీ ప్రజల అగ్రహంతో కరిగిపోయింది. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. అయితే జనతాదళ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం, తమిళనాడుకు చెందిన డి.ఎం.కె.లతో పాటు ఒకటి, రెండు ప్రాంతీయ పార్టీలతో కూడిన నేషనల్ ఫ్రంట్, వామపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

అప్పటికీ పార్లమెంటులో కాంగ్రెస్ పెద్ద పార్టీగా వున్నది. 144 సీట్లు సాధించిన నేషనల్ ఫ్రంట్, 52 మంది బలం వున్న సి.పి.ఎం., తదితర వామపక్షాల మద్దతుపై ఆధారపడింది. మతతత్వ ప్రభావానికి లోనైన ఒక వర్గం మద్దతుపై ఆధారపడింది. మతతత్వ ప్రభావానికి లోనైన ఒక తరగతి ప్రజల మద్దతుతో బి.జె.పి. 88 సీట్లు సాధించింది. ఆ పార్టీ కూడా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి మద్దతిచ్చింది.

పార్లమెంటులో అతి సున్నితమైన బలాబలాల పొందికతో దేశాన్ని పరిపాలించవల్సిన క్లిష్టతరమైన బాధ్యత, వి.పి. సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం మీద పడింది. 1989 డిసెంబర్ 20న జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్నుద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగం ద్వారా నూతన ప్రభుత్వం ప్రజలు హర్షించే వాగ్దానాల ననేకం చేసింది.

బోఫార్సు అవినీతి కుంభకోణం మీద సత్వర విచారణ జరుపుతామని వాగ్దానం చేసిన నూతన ప్రభుత్వం పోస్టల్ బిల్లు, అధికారిక రహస్యాల చట్ట సవరణ బిల్లు, ప్రజలకు సమాచారం అందకుండా చేసే కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్ట సవరణ బిల్లు వంటి అప్రజాస్వామిక బిల్లులనుపసంహరిస్తామని, ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలకు మరింత స్వయం ప్రతిపత్తి

కల్పిస్తామని, ఉత్పత్తి రంగంలో ఉపాధి అవకాశాలను విస్తరింప చేసేందుకు ప్రాధాన్యతనిస్తామని, పనిచేసే హక్కు కల్పిస్తామని, కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పిస్తామని, సమంజసమైన పద్ధతిలో భూపంపిణీ చేసి, దున్నేవానినే భూయజమానిగా చేసే విధంగా భూసంస్కరణలు అమలు చేస్తామని కూడా వాగ్దానం చేసింది.

ప్రజాస్వామ్యాన్ని విస్తరింప చేసి కార్మికులు, రైతాంగం ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తామన్న ప్రభుత్వ విధానాన్ని అన్ని తరగతుల ప్రజలు హర్షించారు. రైల్వే ఉద్యోగులపై అన్ని కక్ష సాధింపు చర్యలను ఉపసంహరిస్తామని, ఇంతవరకు వారికి నిరాకరించబడిన న్యాయమైన కోర్కెలను తీరుస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. దీనితో రైల్వే ఉద్యోగులతో పాటు ఇతర ట్రేడ్ యూనియన్లలో క్రొత్త ఆశ చిగురించింది. ప్రభుత్వ ప్రకటనకు స్వాగతం పలుకుతూ ఎ.ఐ.ఆర్.ఎఫ్ మాసపత్రిక ఈ విధంగా పేర్కొంది. "సార్వత్రిక ఎన్నికలైపోయాయి. అవినీతికర, వినాశకర పాత ప్రభుత్వం అంతరించింది. శ్రీ వి.పి.సింగ్ ప్రధానిగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇది "భారత ప్రజల విజయం". నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైల్వే ఉద్యోగులలో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.

రైల్వే ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలు ఉపసంహరించడం, యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పిస్తామన్న ప్రభుత్వ ప్రకటన, రాజ్యాంగంలో పనిచేసే హక్కును పొందుపరుస్తామన్న హామీ, కార్మికులలోనూ, నిరుద్యోగ యువతలో క్రొత్త ఆశలు చిగురింపచేశాయి. ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి సంబంధించిన వివిధ అపరిష్కృత సమస్యల పరిష్కారం విషయమై ఏకాభిప్రాయానికి వచ్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అనేక సెమినార్లు నిర్వహించింది.

## యాజమాన్యంలో కార్మిక భాగస్వామ్యం

అధికారం చేపట్టగానే ప్రభుత్వంలోని పరిశ్రమలు, కార్మిక మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా 1990 జనవరి 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు న్యూఢిల్లీలో యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం అనే అంశం మీద సెమినార్ నిర్వహించాయి. కేంద్ర ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పక్షాల ప్రతినిధులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి వి.పి.సింగ్ సెమినార్‌ను ప్రారంభిస్తూ, రాజకీయ ప్రాపకం ప్రాతిపదికగా వర్క్‌మెన్ డైరెక్టర్లను నియమించే గత ప్రభుత్వ విధానాన్ని విమర్శించారు. ప్రస్తుత వ్యవస్థలో "యాజమాన్యంలో కార్మిక భాగస్వామ్యానికి" సంబంధించిన స్ఫూర్తి లోపించిందని, యాజమాన్యంలో నిజమైన కార్మిక భాగస్వామ్యం వుండాలంటే ఆయా సంస్థల్లోని కార్మికుల అభిప్రాయాలకు ప్రాధాన్యత యివ్వాలని ఆయన స్పష్టం చేశారు. కార్మికుల భాగస్వామ్యం లేకుండా, సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడటం అర్థరహితమని

ఆయన నొక్కి చెప్పారు. అన్ని స్థాయిల్లో కార్మికుల ప్రాతినిధ్యాన్ని రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా నిర్ణయించాలని ఆయన చేసిన ప్రకటన సెమినార్‌లో చర్చకు దిశా నిర్దేశం చేసింది.

ఐ.ఎన్.టి.యు.సి. మరియు ప్రైవేట్ రంగంలోని యజమానులు తప్ప మిగిలిన రాజకీయపక్షాలు, యూనియన్ల ప్రతినిధులందరూ, ప్రధానమంత్రి ప్రసంగంలోని అభిప్రాయాల కనుగుణంగా ప్రసంగించారు. ఇంధన శాఖ మాజీ మంత్రి వసంత్ సాథే, యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించే ప్రభుత్వ పథకానికి మద్దతు తెల్పుతూ, కార్మికుల ప్రాతినిధ్యాన్ని నిర్ణయించేందుకు రహస్య బ్యాలెట్ పద్ధతిని వ్యతిరేకించారు.

ఆయా సంస్థల్లో కార్మికులకు వాటా కల్పించే విషయం కూడా సెమినార్‌లో చర్చకు వచ్చింది. కార్మికులు సంస్థల్లోని వాటాలు కొనుగోలు చేయాలని, ఐ.ఎన్.టి.యు.సి., బి.ఎం.ఎస్.లతో పాటు ప్రైవేటురంగంలోని యజమానుల ప్రతినిధులు వాదించారు. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., తదితర యూనియన్ల అభిప్రాయాలను వ్యతిరేకించాయి.

యూనియన్ల గుర్తింపుకు, యాజమాన్యంలో కార్మిక వర్గ భాగస్వామ్యానికి సంబంధించి కార్మికుల ప్రతినిధిని రహస్య బ్యాలెట్ ద్వారా నిర్ణయించాలని సెమినార్ సిఫార్సు చేసింది. ఫ్యాక్టరీలోని దిగువ స్థాయి (షాప్ లెవెల్) నుండి బోర్డు స్థాయి వరకు నిర్ణయాలు చేసే యంత్రాంగంలో కార్మికులు, యజమానుల ప్రతినిధులు సమాన సంఖ్యలో వుంటారు. బోర్డు స్థాయిలో ఆయా సంస్థల్లో కార్మికులు కాని కేంద్ర ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులకు కూడా ప్రాతినిధ్యం వుంటుంది. కార్మికులు గుర్తింపు సంఘాన్ని రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకుంటారు. కార్మికుల తరపున సమిష్టి సంప్రదింపుల్లో పాల్గొనే ప్రతినిధి (సోల్ బార్గెయినింగ్ ఏజెంట్)ని సమిష్టి బేరసారాల (బార్గెయినింగ్) కౌన్సిల్‌కు, దామాషా ప్రాతినిధ్య ప్రాతిపదికన తమ ప్రతినిధులను ట్రేడ్ యూనియన్లు నామినేట్ చేయాలి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు అన్నింటికి రహస్య బ్యాలెట్ విధానం వర్తించే విధంగా ఒక చట్టం చేయాలని సెమినార్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ పథకానికి, చట్టానికి సంబంధించిన వివరాలను రూపొందించడానికి కేంద్ర ట్రేడ్ యూనియన్లతో బాటు ఒక చిన్న కమిటీని ఏర్పాటు చేయాలని సెమినార్ సూచించింది. ఈ స్కీమ్‌ను సూపర్‌వైజర్లు, ఆఫీసర్లు, టెక్నీషియన్లు తదితరులకు కూడా వర్తింపచేయాలి.

యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యాన్ని, సంస్థలో కార్మికుల వాటాతో ముడిపెట్టే ఆలోచనను సెమినార్ తిరస్కరించింది. కార్మికులు సంస్థలో వాటాలు కొనుక్కునే విషయం ప్రత్యేకమైన అంశమనీ, యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యంతో ఏమాత్రం సంబంధం వుండరాదనీ సెమినార్ సూచించింది.

యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం విషయంలో గతంలో వున్న పథకాలు, అభిప్రాయాల కంటే ఈ సెమినార్ చేసిన ప్రతిపాదనలు భిన్నంగా, మిన్నగా ఉన్నాయి. వీటి గురించి ట్రేడ్ యూనియన్ రంగంలోని వివిధ స్థాయిల్లో ఆసక్తికరమైన చర్చలు సాగాయి.

## నిర్మాణ కార్మికుల జాతీయ సదస్సు

యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం గురించి సెమినార్ జరిగిన తరువాత, కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలో 1990 ఫిబ్రవరి 12న నిర్మాణ పరిశ్రమలో కార్మికుల సమస్యలను పరిశీలించి, వారి ప్రయోజనాల పరిరక్షణకు కేంద్ర చట్టం విషయాన్ని పరిశీలించడానికి ఒక జాతీయ సెమినార్‌ను ఏర్పాటు చేసింది. అత్యధిక సంఖ్యలో వున్న నిర్మాణ పరిశ్రమలోని కార్మికుల సమస్యలను గురించి చర్చించడానికి ఏర్పాటు చేసిన ఈ సెమినార్ చాలా ముఖ్యమైనది. వ్యవసాయం తరువాత, దేశ ఆర్థిక కార్యకలాపాలలో విస్తృతమైన నిర్మాణ పరిశ్రమ రెండవ అగ్రస్థానం వహిస్తుంది. 7వ ప్రణాళిక పెట్టుబడిలో సగం ఈ పరిశ్రమకు కేటాయించారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల్లోని ఆనకట్టలు, వంతెనలు, విద్యుచ్ఛక్తి కేంద్రాలు, ఓడరేవులు, రైలుమార్గాలు, విమానాశ్రయాల్లో రన్‌వేలు, ఫ్యాక్టరీలు, ఆఫీసులు, గృహ నిర్మాణం వంటి అనేక కార్యకలాపాలు ఈ పరిశ్రమ క్రిందకు వస్తాయి. ఈ పనులలో ఇటుకల తయారీ, ఇసుక త్రవ్వకం, ఇసుక మేటలు తొలగించడం, అడవుల పెంపకం వంటి కార్యకలాపాలు ఈ పరిశ్రమ పరిధిలోకి వస్తాయి. ఈ పరిశ్రమలో శాశ్వతంగా పనిచేసే కార్మికులు ఉన్నారు. కానీ వీటిలో ఎక్కువ కార్యకలాపాలు శాశ్వత స్వభావం కలిగినవి కావు. వీటిలో కట్టుబానిసలుగా పనిచేసే కార్మికులు విశేష సంఖ్యలో ఉన్నారు. అందువల్ల ఒక నిర్ధారిత సమయంలో ఈ పరిశ్రమలో ఎంతమంది కార్మికులున్నారనే విషయం అంచనా వేయటం చాలా కష్టం. కానీ ప్రభుత్వం ఉజ్జాయింపుగా వేసిన అంచనాల ప్రకారం, 1982 - 83 లో ఈ పరిశ్రమలో 1 కోటి 31 లక్షల మంది కార్మికులున్నారు. వీరిలో కార్పొరేట్ రంగంలోను, పెద్ద నిర్మాణ సంస్థలలోనూ పనిచేసే శాశ్వత కార్మికులు 11,80,000 మంది వుండగా, చిన్న నిర్మాణ సంస్థలు, ఇతర ఏజెన్సీలలో 24 లక్షల మంది, శాశ్వత కార్మికులు, 68 లక్షల మంది అప్పుడప్పుడూ పనిచేసే క్యాజువల్ కార్మికులు ఉన్నారు. ఇది ఈ రంగంలో వివిధ తరహాల కార్మికులకు సంబంధించిన ఒక అంచనాను మన ముందుంచింది.

గతంలో కూడా నిర్మాణ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు వర్తించే అనేక చట్టాలున్నాయి. కానీ ఆ పరిశ్రమ ప్రత్యేక స్వభావం వలన ఆ చట్టాలు తగినంత పటిష్టంగా లేవు. ఆ పరిశ్రమలోని కార్మికులకు కనీస వేతనం లేదు. క్రమబద్ధమైన వేతనాలు లేవు, ఉద్యోగభద్రత, గృహ నిర్మాణ పథకాలు, ఆరోగ్య పరిరక్షణ పథకాలు, భద్రతా నిబంధనలు ఏవీ లేవు. అందువలన ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించడానికి ఈ పరిశ్రమలో పనిచేసేవారికి ప్రత్యేకంగా వర్తింప చేసే కేంద్ర చట్టాన్ని రూపొందించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ అంశాన్ని ప్రత్యేకంగా చర్చించడం సెమినార్ ముఖ్యోద్దేశం.

సి.ఐ.టి.యు., ఐ.ఎన్.టి.యు.సి., బి.ఎం.ఎస్., హెచ్.ఎం.ఎస్., హెచ్.ఎం.కె.పి., ఎ.ఐ.టి.యు.సి. యూనియన్లు నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి, దాదాపు ఒకే విధమైన సూచనలు చేశాయి.

కేంద్ర కార్మిక మంత్రి తన ప్రారంభోపన్యాసంలో, గతంలో ఈ విషయమై నియమించబడ్డ అధ్యయన బృందం నివేదికను, సరిగ్గా ఎన్నికల ముందు గత కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన బిల్లును గురించి ప్రస్తావించారు. ఈ విషయమై ట్రేడ్ యూనియన్ల అభ్యర్ధనలు, అభ్యంతరాల కమిటీ (కమిటీ ఆన్ పిటిషన్ అండ్ అబ్జెక్షన్) కి అందజేసిన పిటిషన్ల మీద, కమిటీ ఇచ్చిన నివేదిక వల్ల ఈ బిల్లును ప్రభుత్వం ఆమోదింపచేసుకోలేక పోయిందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర శాసనం విషయమై సెమినార్‌లో పాల్గొన్న వారందరూ ఏకాభిప్రాయానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

సెమినార్లో పాల్గొన్న న్యాయమూర్తులు డి.ఎస్. పతి, వి.ఆర్. కృష్ణయ్యర్‌లు ప్రసంగిస్తూ, కార్మికులను నియమించి, వారి సర్వీసులను క్రమబద్ధీకరించే అధికారాలు కన్‌స్ట్రక్షన్ లేబర్ బోర్డుకు లేనట్లయితే కేంద్ర శాసనం వల్ల ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. సహజంగానే బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు దీనిని వ్యతిరేకించారు.

చివరకు కేంద్ర కార్మికమంత్రి రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర చట్టం ప్రవేశపెడతామని, కార్మికుల నియామకం, సర్వీసు నిబంధనలను నియంత్రించే అధికారాలతో కన్‌స్ట్రక్షన్ లేబరు బోర్డును ఏర్పాటు చేసామని సెమినార్‌లో పాల్గొన్న వారికి హామీ ఇచ్చారు. నిర్మాణ కార్మికులు అసంఖ్యాకంగా వుండటం వలన, వారి పని పరిస్థితులు దుర్భరంగా వుండటం వలన, సెమినార్‌లో జరిపిన చర్చలకు చాలా ప్రాముఖ్యత వున్నది.

## వ్యవసాయ కార్మికుల సమస్యలపై జాతీయ సెమినార్

కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వున్న గ్రామీణ కార్మికుల జాతీయ కమిషన్ (నేషనల్ కమిషన్ ఆన్ రూరల్ లేబర్) 1990 మార్చి 8, 9 తేదీల్లో న్యూఢిల్లీలో వ్యవసాయ కార్మికుల జాతీయ సెమినార్ ఏర్పాటు చేసింది. భూసంస్కరణలు, ఉపాధి కల్పన వంటి సమస్యలతో పాటు, వ్యవసాయ కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత, వారి ఉద్యోగాలను క్రమబద్ధం చేయడానికి, చట్టం రూపొందించడం వంటి అంశాల గురించి చర్చించడానికి ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. అనేక సంస్థలకు చెందిన ప్రతినిధులు, అనేక రంగాలకు చెందిన ప్రముఖులు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, ప్లానింగ్ కమిషన్ సభ్యులు, అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రతినిధులు, కేంద్ర ట్రేడ్ యూనియన్లు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు, యూనివర్శిటీలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, గ్రామీణ కార్మికుల జాతీయ కమిషన్ ఏర్పాటు చేసిన అధ్యయన సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించే సంస్థల ప్రతినిధులతో పాటు వివిధ సంస్థలు, వివిధ ప్రజారంగాలకు చెందిన ప్రముఖులు ఈ సెమినార్‌కు హాజరయ్యారు. కేంద్ర కార్మిక మంత్రి సెమినార్‌కు అధ్యక్షత వహించారు.

ప్రధాని వి.పి. సింగ్ సెమినార్‌ను ప్రారంభిస్తూ, దేశంలో పనిచేసే వారిలో 90% వున్న వ్యవసాయ కార్మికుల దయనీయమైన పరిస్థితుల గురించి ప్రస్తావించారు. వారి జీవన పరిస్థితులను మెరుగుపరచి, వారి ఆదాయాలను పెంచవలసిన ఆవశ్యకత గురించి వక్కాణించారు.

దురదృష్టవశాత్తు ఆయన ప్రసంగంలో గాని, కేంద్ర కార్మిక మంత్రి ప్రసంగంలో గాని, సాధారణ విషయాలను ప్రస్తావించడం జరిగిందే గాని, వాటిలో నిర్దుష్టమైన సలహాలు గాని, పరిష్కార మార్గాలు గాని లేవు. అప్పటికి అమలులో వున్న చట్టాలను ప్రస్తావిస్తూ వాటిని పటిష్టంగా అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అనుసరించిన భూస్వామ్య అనుకూల విధానాలకు వ్యవసాయ కార్మికులు బలి పశువులవుతున్నారు. ప్రధానమైన భూసంస్కరణలు ప్రవేశపెట్టడం, భూపరిమితి (సీలింగ్) చట్టాల్లోని లొసుగులను సరిదిద్దడంతో పాటు భూమి నుండి సాగుదారులను నిరంకుశంగా వెళ్ళగొట్టడం. సామాజిక, కులపరమైన అణచివేత వంటి సమస్యల పరిష్కారానికి కావల్సిన రాజకీయ దృఢ సంకల్పం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలకు లేకపోవడం వల్ల, గ్రామీణ ప్రజల్లో దాదాపు సగభాగంగా వున్న షెడ్యూల్ కులాలకు, షెడ్యూల్ తెగలకు చెందిన ప్రజలు దుర్భర స్థితికి దిగజార్చబడ్డారు. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ కార్మికుల సంఖ్య ఏటేటా పెరగడం ఒక ప్రమాదకర పరిణామం. జనాభా లెక్కల ప్రకారమే 1951లో 2 కోట్ల 75 లక్షలుగా వున్న వ్యవసాయ కార్మికుల సంఖ్య 1981 నాటికి 5 కోట్ల 55 లక్షలకు పెరిగింది. అత్యంత నిరుపేదలైన వ్యవసాయ కార్మికులు, అర హెక్టారు కంటే తక్కువ భూమి గల్గి, జీతానికి వ్యవసాయ కార్మికులుగా కూడా పనిచేసేవారిని కూడా పరిగణనలోకి తీసుకుంటే 1981లో మొత్తం వ్యవసాయ కార్మికుల సంఖ్య 11.5 కోట్లుంటుంది. నిజానికి, భూస్వాముల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి వున్న ప్రభుత్వ వర్గ స్వభావం కారణంగానే అశేష గ్రామీణ కార్మిక వర్గం దోపిడీకి, అణచివేతకు గురికావడం వ్యవస్థాపరమైంది. దాదాపు దేశంలోని అన్ని ప్రాంతాల్లో వీరు గ్రామీణ స్వార్థపరశక్తులు, చట్టాలను అమలు చేసే అధికార యంత్రాంగం దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి జీవించవల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

1980 దశకంలో చేసేందుకు తగినంత పనిలేనివారితో సహా నిరుద్యోగుల సంఖ్య 7 కోట్లకు చేరుకుంది. ప్రతి సంవత్సరం సగటున మనిషికి 120 రోజులు మాత్రమే పని దొరుకుతుంది. అనేక రాష్ట్రాలలో చట్ట ప్రకారం కనీస వేతనాలు నిర్ణయించినా, అత్యధిక రాష్ట్రాలలో కనీస వేతనాలు అమలు కావడం లేదు. వామపక్షాల పాలనలో వున్న పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలతో పాటు పంజాబ్, హర్యానా, మహారాష్ట్రలలో మాత్రమే వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం లభిస్తోంది. కాని ఈ కార్మికులకు గృహ వసతి, సామాజిక భద్రత చర్యలు అందని ద్రాక్షపళ్ళే.

ఇటువంటి దయనీయమైన పరిస్థితులలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం నిర్వహించిన సెమినార్‌కు ప్రాముఖ్యత ఏర్పడింది.

సెమినార్ లో ఏర్పాటు చేయబడ్డ రెండు కమిషన్లలో, ఒకటి కేంద్ర ప్రభుత్వ శాసనం గురించి. రెండవది భూసంస్కరణలు, ఉపాధి కల్పన గురించి చర్చించి, నివేదికలందజేశాయి. మొదటి కమిషన్ ఆహార అవసరాలతో బాటు, ఇంధనం, వస్త్రాలు, గృహవసతి మొదలైన వాటిని దృష్టిలో వుంచుకొని కనీస వేతన ప్రమాణాలను నిర్ణయించే విధంగా కేంద్ర ప్రభుత్వం శాసనం చేయాలని మొదటి నివేదిక సూచించినట్లు తెలుస్తోంది. వివాదాల పరిష్కారానికి, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ప్రసూతి సదుపాయాలు, వృద్ధాప్య పెన్షను, భద్రత, ప్రమాదాలు జరిగినప్పుడు సదుపాయాలు (యాక్సిడెంట్ బెనిఫిట్లు సమాన వేతనం, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతుల వారికి ప్రత్యేక రక్షణ అనే అంశాలను శాసనంలో చేర్చాలని ప్రతిపాదించింది. వ్యవసాయ కార్మికులకు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయాలని, వారికి సంఘాలనేర్పాటు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలని కమిషన్ సిఫారసు చేసింది.

నిర్ణీత సమయంలో సమగ్ర భూసంస్కరణలను చట్ట ప్రకారం అమలు చేయాలని, భూమిని ఆస్తిగా కాక ప్రత్యేకంగా జీవనోపాధిని కల్పించే వనరుగా భావించాలని, వ్యవసాయాభివృద్ధిలోనూ, ఉత్పాదకతలోనూ పెరుగుదల సాధించాలని, భూసంబంధమైన రికార్డులను సరిగా నిర్వహించాలని రెండవ కమిషన్ సిఫారసు చేసింది.

సెమినార్‌లో పాల్గొన్న వారిలో అత్యధికులు కేంద్ర ప్రభుత్వ శాసనానికి అనుకూలంగా అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ, ఈ విషయంపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేదని చెప్పి శాసనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వెనుకాడింది. వ్యవసాయ కార్మికుల విషయమై కేంద్ర శాసనం చేయాలన్న ప్రతిపాదన మీద, ధనిక రైతుల ప్రతినిధి శరద్‌జోషి అభ్యంతరాలు లేవదీశాడు. ఆ విధంగా సెమినార్‌లో అసంఖ్యాకమైన వ్యవసాయ కార్మికుల ప్రధాన సమస్యల గురించి చర్చించినప్పటికీ, భూస్వామ్య వర్గం నుండి వచ్చిన వ్యతిరేకతతో పాటు, ప్రభుత్వ పిరికితనం కారణంగా కోట్లాది మంది వ్యవసాయ కార్మికులు దయనీయ పరిస్థితులను మెరుగుపర్చే విషయంలో సెమినార్‌లో దృఢమైన నిర్ణయాలు తీసుకోలేకపోయింది.

## పనిచేసే హక్కుకోసం పోరాటం

కేంద్ర శాసనం ద్వారా 'పనిచేసే హక్కు'ను రాజ్యాంగపరమైన హామీగా కల్పిస్తామని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం తన విధాన ప్రకటనలో పేర్కొంది. ఇది ట్రేడ్ యూనియన్లలోనూ, అసంఖ్యాకమైన నిరుద్యోగ యువకులలో క్రొత్త ఉత్సాహాన్ని రేకెత్తించింది. అనేక ట్రేడ్ యూనియన్లు అప్పటికే 'అందరికీ ఉద్యోగాలు' కల్పించాలని కోరుతూ అనేక కార్యక్రమాలు చేపట్టాయి. నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం పోరాడటం తమ కర్తవ్యంగా అనేక ట్రేడ్ యూనియన్లు భావించాయి. ఈ నేపథ్యంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ విధాన ప్రకటన వెలువడింది.

భారతదేశ సమాజంలో ప్రధానమైన నిరుద్యోగ సమస్యపై కేవలం ప్రభుత్వం యొక్క సహృదయత పైనే ఆధారపడటం భావ్యం కాదని, 'పనిచేసే హక్కు' కోసం విస్తృతమైన ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని అనేక ట్రేడ్ యూనియన్లు భావించాయి. స్పష్టమైన ఈ అవగాహనతోనే 'పనిచేసే హక్కు' విషయంపై 1990 ఏప్రిల్ 2 నుండి 4 వరకు దుర్గాపూర్‌లో అఖిల భారత సదస్సు జరిగింది.

జాతీయ ఫెడరేషన్లు, కాన్ఫెడరేషన్లతో ఏర్పాటైన సన్నాహక కమిటీ ఈ సదస్సును నిర్వహించింది. స్టీల్ వర్కర్సు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, కన్‌స్ట్రక్షన్ వర్కర్సు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్, కాన్ఫెడరేషన్, ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆలిండియా రైల్వే ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్‌లతో పాటు, అనేక ఇతర ఫెడరేషన్లు, కాన్ఫెడరేషన్లు ఈ సన్నాహక కమిటీలో వున్నాయి. వ్యవసాయం, తోటలు, ప్రైవేటు, పబ్లిక్ రంగాలలో వున్న ఉత్పత్తి సంస్థలు, రవాణా, సేవా రంగాలలో పనిచేసే వారందరికీ ఈ ఫెడరేషన్లు, కాన్ఫెడరేషన్లు సదస్సులో ప్రాతినిధ్యం వహించాయి. కేంద్ర ట్రేడ్ యూనియన్‌గా సి.ఐ.టి.యు. ఈ సదస్సులో పాల్గొన్నది.

చాలాకాలంగా విద్యార్థులు, సంఘటిత రంగంలోని కార్మికులు 'పనిచేసే హక్కు' కోసం నినదిస్తూనే వున్నారు. "పనిచేసే హక్కు" అనే అంశాన్ని ఆచరణలో అమలు చేసే విషయమై ప్రాధాన్యత ఇవ్వనప్పటికీ, నిరుద్యోగం ప్రమాదకర స్థాయిలో పెరగటంతో ఈ సమస్యకు ప్రజలలో ప్రాధాన్యత లభించింది. ఈ నినాదంలో ఇమిడి వున్న భావం అనేక మందికి అర్థం కాకపోయినప్పటికీ ఎన్నికల ప్రచార సమయంలో అనేక రాజకీయ పక్షాల ప్రణాళికలలో ఈ అంశం చోటు చేసుకుంది.

కానీ నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడి ఈ విషయంపై విధాన ప్రకటన చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కార్మికవర్గం, నిరుద్యోగ యువత ఈ విషయాన్ని ముఖ్యమైన అంశంగా పరిగణించాయి. నిజానికి నేషనల్ ఫ్రంట్ ఎన్నికల ప్రణాళికలోనే ఈ విధంగా పేర్కొనబడింది. "ప్రతి పౌరుడు గౌరవప్రదంగా, అర్థవంతమైన జీవనం సాగించే హక్కు కల్గి వున్నాడని మేము భావిస్తున్నాము. నేషనల్ ఫ్రంట్ సామాజిక, ఆర్థిక విధానాలు భారత పౌరులకు 'పనిచేసే హక్కు'ను ప్రాథమిక హక్కుగా కల్పించటానికి నిర్దేశించబడినాయి." ఆ విధంగా నేషనల్ ఫ్రంట్ ఎన్నికల ప్రణాళికలోనే భారత రాజ్యాంగంలో పనిచేసే హక్కును పొందుపరచాలనే కర్తవ్యాన్ని నిర్దేశించుకుంది. అధికారంలోకి వచ్చాక, దీని నమలు పర్చేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది.

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు సంబంధించిన అధ్యాయంలో "పని చేసే హక్కు" అంశం పొందుపర్చబడింది. దానిలో ఈ విధంగా పేర్కొనబడింది. "ప్రభుత్వ ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధి పరిమితులకు లోబడి, పనిచేసే హక్కు, విద్య కల్పించేందుకు, నిరుద్యోగం, వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్యం, పనిచేసే సామర్థ్యం కోల్పోవడం తదితర సందర్భాల్లో ప్రభుత్వం సహాయ మందించేందుకు తగిన కేటాయింపులు చేయాలి."

రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత దశాబ్దాల పాటు ఈ నిబంధన కాగితం మీదే వున్నది. ఫలితంగా దేశంలో నిరుద్యోగం భయంకర ప్రమాణంలో పెరిగింది. దేశంలో ప్రమాదకరంగా పెరుగుతున్న నిరుద్యోగ సమస్యను గురించి వివరిస్తూ సదస్సులో ఆమోదించిన పత్రంలో ఈ విధంగా సూచించడం జరిగింది.

“తాజా సమాచారం ప్రకారం, దేశంలోని అన్ని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలలో నమోదైన మొత్తం నిరుద్యోగుల సంఖ్య పట్టణాల్లో 3 కోట్ల 10 లక్షలుగా వుంది. నేషనల్ శాంపుల్ సర్వే అందించిన గణాంకాల ప్రాతిపదికన గ్రామీణ నిరుద్యోగం భారీ స్థాయిలో 7 కోట్లకు చేరుకుందని ఆర్థికవేత్తలు అంచనా వేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం పనిచేసేవారిలో నిరుద్యోగులు 25 శాతం వున్నారు. భారతదేశంలోని 80 కోట్ల జనాభాలో 40 కోట్ల మంది 18 నుంచి 58 సంవత్సరాల మధ్య వయసులో వున్నట్లు అంచనా వేయడం జరిగింది. ఇటీవలి ప్రభుత్వ అంచనాల ప్రకారం 35 కోట్ల మంది భారతీయులు దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. దీనిని బట్టి వారికి సరైన ఉపాధి అవకాశాలు లేవని, వారు చాలా తక్కువ వేతనాలు పొందుతున్నారని అర్థమవుతుంది. వ్యవసాయ కార్మికులకు చాలా అరుదుగా సంవత్సరంలో 100 రోజుల కన్నా ఎక్కువ రోజులు పని లభిస్తుంది.”

“పనిచేసే హక్కు”ను ఒక ఆచరణాత్మక అంశంగా చేసే ఉద్దేశంతో, ఉపాధి కల్పనకు సంబంధించిన సమస్యలను గురించి కూడా సదస్సు చర్చించడం జరిగింది. అందువలన అవగాహనా పత్రం”లో ఈ విధంగా పేర్కొనడం జరిగింది.

“పనిచేసే హక్కును రాజ్యాంగంలో పొందుపరచటం వలన దేశంలో పనిచేసే సామర్థ్యం వుండి, పనిచేయాలన్న కోర్కె వున్న వారికందరికి రాజ్యాంగబద్ధమైన సహాయం వుంటుంది. ప్రభుత్వం ఎవరికైనా ఉపాధి కల్పించలేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆమె కానీ, అతడు కానీ తన కుటుంబ పోషణకు చట్టపరంగా భృతిని కోరవచ్చును. ‘పనిచేసే హక్కు’ సూత్రాన్ని పకడ్బందీగా అమలు చేయాలంటే, కొత్తగా లేబర్ మార్కెట్‌లో ప్రవేశించే ఉద్యోగార్థులతో బాటు, ఇప్పటికే నిరుద్యోగులుగా వున్న 10.10 కోట్ల మందికి నిర్ణీత కాల వ్యవధిలో, కనీసం దారిద్ర్య రేఖకు ఎగువన వుండే విధంగా కనీస వేతనంతో ఉపాధి కల్పించాలి.”

‘అందువలన ‘పనిచేసే హక్కు’ కల్పించటానికి ప్రధానంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సంబంధించి ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో సమూలమైన మార్పులు జరగాలని సదస్సు భావించింది. ఆచరణలో ‘పనిచేసే హక్కు’ను అమలు చేయటానికి దశల వారీగా తక్షణ, స్వల్పకాలిక పరిమితితోనూ, దీర్ఘకాలిక చర్యలను సదస్సు సూచించింది.

సదస్సు ఈ క్రింది తక్షణ చర్యలను సూచించింది. 1. భూ సంస్కరణలు, మిగులు భూమి పంపకం, 2. మూతబడిన, ఖాయిలా పడిన పారిశ్రామిక యూనిట్లను తిరిగి ప్రారంభించుట, 3. రిట్రెంచ్‌మెంటును నిలిపివేయటం, 4. చిన్న పరిశ్రమలకు రక్షణ కల్పించటం,

5. వ్యవసాయ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ శాసనం, కనీస వేతనం,  అమలు, 6. నిరక్షరాస్యతా నిర్మూలన, 7. నిత్యావసర వస్తువుల టోకు వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవటం, 8. రిక్రూట్‌మెంట్‌పై నిషేధాన్ని ఉపసంహరించటం, 9. మానవశక్తి వినియోగాన్ని తగ్గించే ప్రణాళికలను నిలిపివేయడం.

స్వల్పకాల వ్యవధిలో చేపట్టవల్సిన చర్యలుగా సదస్సు ఈ దిగువ అంశాలను సూచించింది. 1. సాగునీటి పథకాల విస్తరణ, 2. అడవుల పెంపకానికి ప్రోత్సాహం, 3. వ్యవసాయంపై ఆధారపడిన పరిశ్రమల అభివృద్ధి, 4. ఉపాధిలో కోత విధించడం గాక, ఉపాధి అవకాశాలు పెంచే సాంకేతిక ప్రణాళికలు, 5. పశువుల పెంపకం, చేపల పెంపకం, తదితర ఆర్థిక కార్యకలాపాలు, 6. ఫ్యాక్టరీలలో పూర్తి సామర్థ్య వినియోగం, 7. పని గంటల తగ్గింపు, 8. పబ్లిక్ రంగ ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పడం,  9. దిగుమతులపై అతిగా ఆధారపడరాదు.

దీర్ఘకాలిక చర్యలుగా సదస్సు ఈ విధంగా  సూచించింది. 1. కొన్ని బహుళజాతి కంపెనీలు, పెద్ద పరిశ్రమల జాతీయం, 2. ఫ్యూడల్ దోపిడీ రద్దు, 3. జాతీయం చేయబడిన ఆర్థిక సంస్థలు ప్రజలకు జవాబుదారీగా వుండే విధంగా పెద్ద ఎత్తున వనరుల సమీకరణకు చర్యలు, నల్లధనం గలవారు, ఆర్థిక అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు, విదేశీ రుణాల చెల్లింపు వాయిదా,  పన్నుల విధానం, ప్రభుత్వ ఖర్చుల పునః వ్యవస్థీకరణ, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువగా కేంద్ర నిధుల కేటాయింపు.

ప్రభుత్వ గ్రామీణ ఉపాధి పథకాల్లోని మోసాలను, ఉపాధి కల్పన, వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర విషయాల్లో మహిళల పట్ల చూపుతున్న వివక్షను అవగాహనా పత్రం బట్టబయలు చేసింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించే వరకు నిరుద్యోగ భృతి చెల్లించాలని పత్రం డిమాండ్ చేసింది.

పనిచేసే హక్కు సాధనకు, ప్రజల విస్తృత భాగస్వామ్యంతో కార్యాచరణను చేపట్టేందుకు సిఐటియు కార్యదర్శి డా॥ ఎం.కె. పాంథే కన్వీనర్‌గా, సదస్సు ఒక సారథ్య సంఘాన్ని (స్టీరింగ్ కమిటీ) ఏర్పాటు చేసింది.

సదస్సు  ముగింపు సందర్భంగా జరిగిన బ్రహ్మాండమైన సభలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు, స్టీల్ వర్కర్సు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు దిలీప్ మజుందార్, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ఎస్.కె.వ్యాస్, ఎ.ఐ.ఎస్.జి.ఇ.ఎఫ్. జనరల్ సెక్రటరీ సుకోమల్‌సేన్ ప్రసంగించారు.

స్వల్పకాలం సాగిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో పని హక్కు కోసం ప్రారంభమైన ఈ పోరాటంలో, దుర్గాపూర్‌లోని జరిగిన ఈ సదస్సు బ్రహ్మాండమైన సభ అపూర్వమైనవి.

దుర్గాపూర్ సదస్సు అనంతరం, పని హక్కు విషయమై రాజ్యాంగబద్ధమైన హామీ అవసరం గురించి, వివిధ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో సమావేశాలు, చర్చాగోష్టులు జరిగాయి.

నిరుద్యోగ యువతకు నిజంగా ప్రయోజనం చేకూర్చేందుకు ఈ హక్కును రాజ్యాంగపరంగా ఏ విధంగా హామీ యివ్వవచ్చో వివరిస్తూ అనేక వ్యాసాలు వెలువడ్డాయి. ఈ భావనకు నిర్దిష్ట రూపం యిచ్చేందుకు ముందస్తుగా అత్యవసరంగా చేపట్టవల్సిన "ఉపాధి కల్పన" విషయమై అనేకమంది వివిధ కోణాల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

"పనిచేసే హక్కు" విషయమై రాజ్యాంగపరమైన హామీ కోసం సాగే ప్రచారాందోళనలో భాగంగా, ఈ ఉద్యమాన్ని విస్తృతం చేయాలన్న దుర్గాపూర్ సదస్సు నిర్ణయానుసారం 1990 సెప్టెంబర్ 2వ తేదీన ఢిల్లీలో "పని చేసే హక్కు" కోసం జాతీయ సెమినార్ నిర్వహించబడింది.

ఎ.ఐ.టి.యు.సి., సి.ఐ.టి.యు., హెచ్.ఎం.ఎస్., యు.టి.యు.సి., ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, ఆలిండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ రైల్వే ఎంప్లాయీస్, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మొదలైన వివిధ జాతీయ ఫెడరేషన్లు, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి.వై.ఎఫ్.ఐ.) భారత విద్యార్థి ఫెడరేషన్స్ (ఎస్.ఎఫ్.ఐ.) అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వంటి ప్రజాసంఘాలు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

ప్రయోజనకరంగా వుండే విధంగా "పనిచేసే హక్కు"కు రాజ్యాంగపరమైన హామీ పొందేందుకు అవసరమైన ప్రజా ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు, సెమినార్‌లో పాల్గొన్న సంస్థలతో పాటు, ఈ విషయం పట్ల ఆసక్తి, సానుభూతి కల్గిన వారితో త్వరలో మరొక సమావేశం నిర్వహించాలని సెమినార్ అభిప్రాయానికి వచ్చింది. ఈ ఉద్యమం బలం పుంజుకుని ముందుకు సాగకముందే పనిచేసే హక్కుపై విధాన ప్రకటన చేసి, ఆ లక్ష్యంవైపు పురోగమించటానికి అనుకూలమైన రాజకీయ వాతావరణం కల్పించిన వి.పి.సింగ్ ప్రభుత్వం' 1990 నవంబర్ 7న పతనమైంది. దురదృష్టవశాత్తు నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం పతనం కావటంతో పనిచేసే హక్కు కోసం చేసే పోరాటంలో ఉత్సాహం, ఊపు క్రమంగా సన్నగిల్లిపోయాయి. ఈ అంశం మీద ప్రజా వుద్యమం నిర్వహించే క్రమానికి విఘాతం కలిగింది.

## ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ - 29వ సమావేశం

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం చొరవ తీసుకుని, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 29వ సమావేశాన్ని, 1990 ఏప్రిల్ 21, 22 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించింది. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం త్రైపాక్షిక చర్చల పట్ల విముఖత చూపడంతో, త్రైపాక్షిక లేబర్ కాన్ఫరెన్స్‌లకు విఘాతం ఏర్పడింది. గతంలో చివరిసారిగా 5 సంవత్సరాల క్రిందట 1985లో, 14 సంవత్సరాల విరామం తరువాత త్రైపాక్షిక లేబర్ కాన్ఫరెన్స్ జరిగింది.

ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ 29వ సమావేశం ఈ క్రింది ప్రధాన నిర్ణయాలు చేసింది :

1. యాజమాన్యంలో కార్మిక భూస్వామానికి సంబంధించి అన్ని స్థాయిల్లోనూ ప్రతినిధులను రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవాలని, 1985 జనవరిలో కార్మిక భాగస్వామ్యం గురించి జరిగిన జాతీయ సెమినార్‌లో చేసిన నిర్ణయాన్ని ఎన్.ఎల్.సి. సమావేశం పునరుద్ఘాటించింది.
2. 1988 మే నెలలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడిన పారిశ్రామిక సంబంధాల బిల్లును రద్దు చేయాలని ఏకగ్రీవంగా సిఫారసు చేయడం జరిగింది.
3. నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లు రూపురేఖలను ప్రతిపాదించటానికి నూతన త్రైపాక్షిక కమిటీ ఏర్పాటు చేయాలి.

యజమాన్యంలో కార్మికులు చురుకుగా పాల్గొనేందుకు తీసుకోవల్సిన చర్యలు, పారిశ్రామిక సంబంధాలకు సంబంధించిన చట్టాల పునస్సమీక్ష, భవన నిర్మాణ తదితర నిర్మాణ కార్మికులకు, వ్యవసాయ కార్మికుల కొరకు ప్రతిపాదించిన శాసనంలోని అంశాలను పరిశీలన, బాల కార్మికులు, మహిళాకార్మికులు, వలస కార్మికులకు సంబంధించిన చట్టాలు, విధానాల సమీక్ష వంటి అంశాలు, సమావేశపు అధికారిక ఎజెండాలో వున్నాయి. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆనాటి కేంద్ర కార్మిక మంత్రి మాట్లాడుతూ, త్రైపాక్షిక సమావేశ నిర్ణయాలను నూతన ప్రభుత్వం గౌరవిస్తుందని సభ్యులకు హామీ ఇచ్చారు. భారత ప్రధాన మంత్రి వి.పి సింగ్ సమావేశాన్ని ప్రారంభిస్తూ, "ఈ వేదికను పటిష్టపరుస్తామని, ఈ సమావేశంలో జరిగిన చర్చల ఆధారంగా, ఉత్పాదకతను పెంపుదలకు, కార్మిక సంక్షేమానికి, కావల్సిన సుహృద్భావ పూరిత కార్మిక సంబంధాలను నెలకొల్పేందుకుకనువైన వాతావరణం సృష్టించే కృషిచేస్తామని ముందుగా మీకు హామీ ఇస్తున్నాను." అని చెప్పారు.

పారిశ్రామిక సంబంధాల బిల్లుకు సంబంధించిన ఎజెండా మీద చర్చలో పాల్గొన్న సభ్యులందరు దానిని ఉపసంహరించాలని ఏకగ్రీవంగా కోరారు. దీనితో ప్రభుత్వం తన వైఖరి నుండి దిగివచ్చి, ఆ ప్రతిపాదనంగీకరించ వల్సివచ్చింది. ఈ మేరకు 19 మంది సభ్యులతో ఏర్పడిన ద్వైపాక్షి కమిటీ 1990 జులై చివరినాటికి తన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేయాలి. వాటిని ఐఎల్‌సి స్టాండింగ్ కమిటీ పరిశీలిస్తుంది. స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఐఎన్‌టియుసికి చెందిన జి.రామానుజం ఎన్నికయ్యారు. వివిధ ట్రైడ్ యూనియన్ల సభ్యత్వ సంఖ్యను నిర్ణయించడానికి సవరించిన విధానాన్ని సమావేశం ఆమోదించింది. వ్యవసాయ కార్మికుల సభ్యత్వం తనిఖీ చేసే విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. అందువలన ఆ విషయాన్ని లోతుగా పరిశీలించటానికి కేంద్ర ట్రేడ్ యూనియన్లు, ప్రభుత్వం తరువాత సమావేశం కావాలని నిర్ణయించాయి.

ఇతర అంశాలమీద వేడిగా వాడిగా వాగ్వివాదాలు సాగినప్పటికీ, చివరకు దాదాపు అన్ని అంశాలమీద ఏకాభిప్రాయం కుదిరింది. కేంద్ర ట్రేడ్ యూనియన్లు ఐక్యంగా వ్యవహరించటం వలన 29వ త్రైపాక్షిక కార్మిక సమావేశం కొన్ని సానుకూల ఫలితాలు సాధించగల్గింది. ఇది ట్రేడ్ యూనియన్ ఐక్యతకు సంబంధించి సానుకూల పరిణామం.

## ఉద్యోగాలలో రిజర్వేషన్లు - మండల్ కమిషన్ నివేదిక

విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు ప్రభుత్వోద్యోగాలలోనూ, పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగాలలోనూ 27 శాతం కేటాయింపుకు సంబంధించిన నిర్ణయాలను ప్రధానమంత్రి పార్లమెంటులో ప్రకటన చేశారు. దీనివలన దేశంలోని ప్రభుత్వోద్యోగుల, పబ్లిక్ రంగ సంస్థల ట్రేడ్ యూనియన్ వుద్యమంలోనే గాక మొత్తం సమాజంలోనే తీవ్రమైన, తీక్షణమైన పరిస్థితులేర్పడ్డాయి.

1978లో జనతాపార్టీ ప్రభుత్వం, బి.పి. మండల్ ఛైర్మన్‌గా నియమించిన రెండవ వెనుకబడిన జాతుల కమీషన్, 1980 డిశంబర్ 31న తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. పూర్తిగా దశాబ్దకాలం పాటు దుమ్ముకొట్టుకొని పోయివున్న ఈ కమిషన్‌ని వేదికను అమలు చేయవల్సిందిగా మధ్య, మధ్యన పార్లమెంటులోనూ, వెలుపలా వెనుకబడిన తరగతుల వారి సంఘాలు కోరుతూనేవున్నాయి.

చివరకు వి.పి.సింగ్ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని 1990 ఆగస్టు 7న పార్లమెంట్‌లో తమ నిర్ణయాన్ని ప్రకటించింది. వెనుకబడిన తరగతుల వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించే కమీషన్ సిఫారసులను ప్రభుత్వం అంగీకరించి ఒక అధికార ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వు ఈ ప్రకారంగా వున్నది.

1) విద్యాపరంగానూ, సామాజికంగానూ వెనుకబడిన తరగతులకు చెందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, సివిల్ సర్వీసుల్లోనూ 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

2) పైన పేర్కొన్న రిజర్వేషన్లు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే ఖాళీలకే వర్తిస్తాయి.

3) సాధారణ అభ్యర్థులకు నిర్దేశించిన ప్రమాణాలతో సమానంగా, బహిరంగ పోటీలో, ప్రతిభ ప్రాతిపదికన ఎంపికైన ఎస్ఈబిసిలకు చెందిన అభ్యర్థులను, 27శాతం రిజర్వేషన్ కోటాలో భాగంగా పరిగణించడం జరగదు.

4) మొదటి దశలో మండల్ కమిషన్ నివేదికలోనూ, రాష్ట్ర ప్రభుత్వాల జాబితాల్లోనూ ఉమ్మడిగా వున్న కులాలను ఎస్ఈబిసిలుగా పరిగణిస్తారు.

5) ఈ రిజర్వేషన్లు 1990 ఆగష్టు 7 నుండి అమలులోకి వస్తాయి. అయితే ఈ తేదీకి ముందే రిక్రూట్‌మెంట్ క్రమం ప్రారంభమైన సందర్భాల్లో, ఆ ఖాళీలకు ఇది వర్తించదు.

**మండల్ కమిషన్ నివేదిక - పరిణామాలు**

వాస్తవానికి తమిళనాడు, బీహార్, కేరళ, కర్నాటక తదితర రాష్ట్రాల్లో అప్పటికే వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు అమలులో వున్నాయి. అక్కడ ఏ విధమైన ప్రతిఘటన లేకుండా ఈ రిజర్వేషన్ల విధానం కొనసాగుతూనే వుంది. కాని, కేంద్ర ప్రభుత్వ సర్వీసులు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో విద్యాపరంగా, సామాజికంగా వెనుక బడిన కులాల వారికి ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలు విషయమై, 1990 ఆగష్టు 7వ తేదీన ఆనాటి ప్రధానమంత్రి పార్లమెంటులో ప్రకటన చేయడంతో దేశవ్యాప్తంగా ఉద్వేగపూరిత, ఉద్రేక పూరిత చర్చలు సాగాయి. హింసాకాండ, ఆత్మహత్యలు జరిగాయి. ప్రజల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు కూడ సాగాయి.

ఏ విధంగా చూచినా ప్రధాని ప్రకటన మొత్తం సమాజాన్నే కుదిపివేసింది. ఒక తరగతి ప్రజలు ప్రధానమంత్రి ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించగా, మరో తరగతి దానిని సంపూర్ణంగా బలపరిచింది. ప్రజలు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్ల మీద యీ పరిణామాల ప్రభావం పడింది. ప్రజల మనోభావాలు, ఉద్వేగాలు త్వరితగతిన కులంబాట పట్టడం ప్రారంభమైంది.

పరిస్థితి సంక్లిష్టంగానూ, మిక్కిలి ప్రమాద భరితంగా తయారైంది. అందువల్ల ఈ ఉదంతానికి సంబంధించి చారిత్రకంగా, రాజ్యంగపరంగా వున్న నేపథ్యాన్ని వాస్తవిక దృష్టితో పరిశీలించడం ఎంతో అవసరం.

భారత సమాజం ఉన్నత, నిమ్నకులాలుగా విభజితమై వున్నదనేది చారిత్రక సత్యం. చారిత్రక కారణాల వల్ల నిమ్న కులాల వారు సామాజికంగా వెనుకబడి వున్నారు. అందువల్ల ఈ విషయమై రాజ్యంగంలో కొన్ని రక్షణలు కల్పించారు. రాజ్యంగంలోని ప్రాథమిక హక్కులకు సంబంధించిన అధ్యాయం సమానత్వ హక్కును గురించి వివరిస్తుంది. 15వ అధికరణలోని 1వ నిబంధనలో ఈ క్రింది విధంగా వుంది. "మత, జాతి, లింగ, ప్రాంతాల ప్రాతిపదికన ప్రభుత్వం ఏ పౌరుడిపట్ల వివక్షతో వ్యవహరించదు." తర్వాత దానికి చేర్చిన నాలుగవ నిబంధన ఈ విధంగా వివరణ ఇస్తుంది.

"విద్యాపరంగానూ, సామాజికంగానూ వెనుకబడిన తరగతులు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పౌరుల అభివృద్ధి కొరకు ప్రత్యేక హక్కులు కల్పించడానికి ఈ 15 అధికరణలోని నిబంధనలు గాని, 29వ అధికరణలోని 4వ క్లాజులోని నిబంధనలు గాని ప్రభుత్వానికి ఆటంకంకాదు."

రాజ్యాంగం 16వ భాగంలో కొన్ని తరగతులు, అంటే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలుకు చేసే ప్రత్యేక ఏర్పాట్లు" గురించి వివరించారు. 330 నుంచి 334 అధికరణాలు లోక్‌సభలో, రాష్ట్ర శాసనసభలలో షెడ్యూల్డు కులాలు తరగతుల వారికి స్థానాల కేటాయింపు

గురించి వివరించాయి. 335 నుండి 337 వరకు వున్న అధికరణాలలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్ తెగలు, ఆంగ్లో ఇండియన్లకు సర్వీసులలో, ఉద్యోగాలలో, విద్యా విషయకమైన గ్రాంట్లలో వారికి గల హక్కుల గురించి వివరించబడింది. కానీ 1950లో అమలులోకి వచ్చిన రాజ్యాంగంలో షెడ్యూల్డు కులాలు, తెగల వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్ 10 సంవత్సరాల కాలానికి పరిమితం చేశారు. అయితే ఈ వెనుక బడిన తరగతుల వారి పరిస్థితులు తగినంత మేరకు మెరుగుపడనందువలన, తరువాత ప్రభుత్వాలు రిజర్వేషన్ల కాలపరిమితిని పెంచాయి. అది ఈనాటికి కొనసాగుతోంది.

340వ అధికరణంలో ఎస్.సి., ఎస్.టి. తరగతులే కాక, ఇతర వెనుకబడిన తరగతుల గురించి ప్రస్తావించింది. ఆ అధికరణం ఈ విధంగా అదేశిస్తోంది. “340(1) రాష్ట్రపతి ఆదేశానుసారం ఆయన అర్హులని భావించిన వ్యక్తులతో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఆ కమిషన్ భారతదేశంలో విద్యాపరంగా, సామాజికంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశీలించి, వారు ఎదుర్కొనే కష్టాలను విచారించి వారి కష్టాలను తొలగించి వారి పరిస్థితులను మెరుగు పరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యల గురించి సిఫారసు చేయడానికి, దానికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఏవిధంగా మంజూరు చేయాలో, ఏ నిబంధనలకు లోబడి మంజూరు చేయాలో నిర్ణయించాలి. ఆ కమీషన్‌ను నియమించే ఆదేశంలో కమిషన్ అనుసరించాల్సిన విధానాన్ని నిర్వచించాలి.

(2) “ఆ విధంగా నియమించిన కమిషన్ తమకు అప్పగించిన విషయాలను పరిశోధించి, రాష్ట్రపతికి తాము తెలుసుకున్న విషయాలను నివేదించి, తమకు సమంజసమని తోచిన “సిఫార్సులను చేయాలి.”

(3) రాష్ట్రపతి ఆ నివేదిక ప్రతితో బాటు దానిపై తీసుకున్న చర్యల గురించిన మెమొరాండంను ఉభయసభలలో ప్రవేశపెట్టాలి.

రాజ్యాంగ నిబంధనల ప్రకారం 22 1/2 శాతం ఉద్యోగాలు ఎస్.సి., ఎస్.టి., అభ్యర్థులకు రిజర్వు చేయబడినాయి. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయం ప్రకారం రిజర్వేషన్లు మరో 27 శాతం పెరుగుతాయి. ఆ విధంగా మొత్తం రిజర్వేషన్లు 49 1/2 శాతానికి పెరుగుతాయి. రాజ్యాంగంలోని 15(4), 16(4) అధికరణల ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించరాదనే సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది.

1953లో కేంద్ర ప్రభుత్వం కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కానీ ఆ కమీషన్ సిఫార్సులు ఏకగ్రీవంగా లేవు. అనేక కారణాలవల్ల ఆ కమిషన్ సిఫార్సులను అమలు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించింది. తరువాత 1978లో బి.పి.మండల ఛైర్మన్‌గా రెండవ కమిషన్ ఏర్పాటు చేశారు.

వెనుకబడిన కులాలకు 27% రిజర్వేషన్లు ప్రకటించిన తరువాత, ఆర్థిక ప్రమాణాలను బట్టి రిజర్వేషన్లకు అర్హతను నిర్ణయించాలని అనేక మంది సూచించారు. కొన్ని ప్రధాన

వామపక్షాలు రిజర్వేషన్లను పూర్తిగా సమర్థిస్తూ వెనుకబడిన కులాలవారి ఆర్థిక స్థితిని పరిగణనలోకి తీసుకోవాలని గట్టిగా కోరాయి.

కోట్లాది వెనుకబడిన కులాల ప్రజలు సంప్రదాయాల సంకెళ్ళలో బంధించబడి తక్కువ ఆదాయం వచ్చే వృత్తులకు పరిమితమై సాంఘిక, ఆర్థిక విద్యాపరమైన విషయాల్లో వెనుకబడి వున్నారు. అదే సమయంలో వేలాది మంది కాకపోయినా, వందలాది మంది ఈ బంధాలు తెంచుకొని ఉన్నత సాంఘిక స్థాయి కల్పించే ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొంతమంది తమ సాంప్రదాయ వృత్తుల సాంకేతిక స్థాయిని అభివృద్ధి చేసుకుని, ఎక్కువ ఆదాయాలను, సాంఘిక స్థాయిని పొందుతున్నారు. తరువాత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఈ తరగతిని రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించింది.

రిజర్వేషన్లు అత్యవసర చర్య అయినప్పటికీ దానితో సరిపోదనే విషయం గుర్తుంచుకోవాలి. ఆ సదుపాయం పొందుతున్న వారి శక్తి, సామర్థ్యాలను కూడా పెంపొందించటానికి తగిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి సమగ్ర ప్యాకేజీలతో కూడిన ప్రతిపాదనలు అవసరమైనప్పటికీ, సర్వత్రా వున్న దారిద్ర్యంపై విస్తృత ప్రాతిపదికన పోరాటం జరిపితే తప్ప ఆ చర్యలు సరిపోవు. అందువలన కావలసిందేమిటంటే పెద్దఎత్తున లొసుగులతో కూడి భూకేంద్రీకరణను కొనసాగించే పేరు కోసం చేసిన భూసంస్కరణలు కావు. రైతులు, వ్యవసాయ కూలీలు, షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన కులాలకు ప్రయోజనం కలిగించే సమూల భూసంస్కరణలు కావాలి. మిక్కిలి దురదృష్టకరమైన విషయమేమిటంటే పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో మినహా వేరే చోట ఎక్కడా చెప్పుకోదగ్గ విధంగా భూసంస్కరణలు జరగలేదు. అనేక రాష్ట్రాలలో కొన్ని కులాల వెనుకబాటుతనానికి కారణమైన భూకేంద్రీకరణను దుర్మార్గంగా కొనసాగిస్తున్నారు. పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో కూడా భారత రాజ్యాంగ పరిధులకు లోబడే భూ సంస్కరణలు జరిగాయి. మండల్ కమీషన్ కూడ ఈ విధంగా చెప్పింది. 'ప్రస్తుత ఉత్పత్తి సంబంధాల వ్యవస్థలో, అత్యధిక సంఖ్యలో వెనుకబడిన కులాలకు చెందిన చిన్నరైతులు, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ చేతివృత్తుల వారు, తమ జీవనోపాధికోసం ఎక్కువగా ధనిక భూస్వాములపైన ఆధారపడాల్సివుంది. దీని వలన ఇతర వెనుకబడిన కులాల వారు (ఒబిసి) అగ్రకులాల వారికి మానసికంగా, భౌతికంగా దాసులుగా ఉండే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఉత్పత్తి సంబంధాలలో వ్యవస్థాపరంగా సమూలమైన మార్పులు చేసి, దేశవ్యాప్తంగా సమగ్ర భూసంస్కరణలు పటిష్టంగా అమలు జరపకపోతే ఒబిసిలకు నిజమైన స్వేచ్ఛ లభించదు. అందువలన అన్ని రాష్ట్రాలో సమగ్ర భూసంస్కరణలకు ప్రాధాన్యత నివ్వాలి.'

అంతేకాక మౌలికంగా భూసంస్కరణలతోబాటు, ఆర్థిక విధానాలలో కూడా మౌలిక మార్పులు తేవాల్సిన అవసరముంది. దేశంలోని మానవశక్తిని ముమ్మరంగా వినియోగించే

విధంగా సత్వర పారిశ్రామికాభివృద్ధి జరగాలి. దానివలన త్వరితంగా పెరిగే నిరుద్యోగ సైన్యానికి ఉపాధి లభిస్తుంది. 1994లో 3.66 కోట్ల మంది నిరుద్యోగ యువకులు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లలో నమోదు చేసుకున్నారు. దీనితో బాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇంతకు రెండు రెట్లు మంది నిరుద్యోగులున్నారు. వీరి గురించి సంతృప్తికరమైన అధికారిక లెక్కలు అందుబాటులో లేవు. అందువలన కొన్ని వెనుకబడిన కులాల ప్రజల సాంఘిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగింపు అంశం. పనిచేసే హక్కు ప్రాథమిక హక్కుగా కల్పించే అంశంతో ముడిపడివుంది. ఈ చర్యలు లేకుండా రిజర్వేషన్ల గురించి మాత్రమే మాట్లాడితే సమస్య పరిధిని కూడా స్పృశించలేము. దురదృష్టవశాత్తు, మండల్ కమిషన్ సమర్ధకులు, విరోధులు కూడా ఈ అత్యవసరమైన అంశాన్ని విస్మరిస్తున్నారు.

మండల్ కమిషన్ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వోద్యోగాలలో, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాలలో ఇతర వెనుకబడిన కులాలకు ప్రభుత్వం 27 శాతం ఉద్యోగాలు రిజర్వు చేసింది. ఈ సదుపాయం పైకి చాలా గొప్పగా కనిపిస్తుంది. అయితే వాస్తవంగా ఒనగూడేదాని గురించి మండల్ అనుకూలురు, ప్రతికూలురు గమనించడం లేదు.

భారతదేశంలో ఎన్నడూ ఉద్యోగావకాశాలు బాగా లేవు. 1980 దశకంలో పరిస్థితి మరీ ఘోరమైంది. క్రింది పట్టిక పరిశీలిస్తే ఉద్యోగాల సంఖ్య ఏ విధంగా తగ్గుతున్నదీ స్పష్టమవుతుంది.

| **సమయం** | **ఉపాధి అవకాశాల పెరుగుదల (ఏడాదికి పెరిగే శాతం)** |
|---|---|
| 1970-71 నుంచి 1975-76 | 2.9 |
| 1975-76 నుంచి 1980-81 | 2.6 |
| 1980-81 నుంచి 1984-85 | 1.8 |
| 1984-85 నుంచి 1988-89 | 1.5 |

కేంద్ర మంత్రిత్వ శాఖకు సంబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఇచ్చిన సమాచారం ప్రకారం సంఘటిత రంగంలో ఉద్యోగావకాశాలు 1988 మార్చిలో 257.48 లక్షలుండగా, 1989 మార్చి నాటికి 260.34 లక్షలకు, అంటే 1.1 శాతం పెరిగాయి. సంఘటిత రంగంలోని దాదాపు 71 శాతం ఉద్యోగాలు పబ్లిక్ రంగంలో

వున్నాయి. మొత్తం 260.34 లక్షల ఉద్యోగాలలో పబ్లిక్ రంగంలో 186.61 లక్షలు, ప్రైవేట్ రంగంలో 74.73 లక్షలువున్నాయి.

పబ్లిక్ రంగంలో ఉద్యోగావకాశాల కల్పన ఇంత తక్కువగా వున్నప్పటికీ, పబ్లిక్ రంగ సంస్థలలో, కేంద్ర ప్రభుత్వంలో గత అనేక సంవత్సరాలుగా కొత్త ఉద్యోగాల నియామకంపై పూర్తి కొత్త నిషేధం అమల్లో వుంది. ఈ నిషేధం వలన నిరుద్యోగ యువకులకు పబ్లిక్ రంగంలోనూ, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఉద్యోగాలు దొరికే అవకాశాలు మృగ్యమైనాయి.

మండల్ వ్యతిరేకులు గానీ, అనుకూలురు గానీ కొత్త నియామకాలపై నిషేధం వెంటనే తొలగించాలని డిమాండ్ చేయకపోవడం చాలా ఆశ్చర్యం గొల్పే విషయం.

దీనికి తోడు 1980 దశాబ్ధంలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు చాలా తక్కువ ఖాళీలను ప్రకటించడం మొదలుపెట్టాయి. ఇది కేవలం పబ్లిక్ రంగ సంస్థలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగాల విషయంలోనే కాదు, పబ్లిక్, ప్రైవేట్ రంగ సంస్థల్లో అన్ని కేటగిరీల ఉద్యోగాల విషయంలో ఇదే పరిస్థితి నెలకొంది.

| **సంవత్సరం** | **సగటున నెలకు ప్రకటించిన ఉద్యోగాలు (మొత్తం భారతదేశంలో)** |
|---|---|
| 1970-71 | 62,900 |
| 1980-81 | 69,600 |
| 1985-86 | 54,200 |
| 1987-88 | 49,200 |
| 1988-89 | 44,800 |

అసలు ఉద్యోగాలు ఎక్కడున్నాయి? కేంద్ర సర్వీసులలోను, ప్రభుత్వరంగ సంస్థలలో మాత్రమే కాకా, ఇతర రంగాలలో కూడ ఉద్యోగావకాశాలు అతి స్వల్పంగా వున్నాయి. పట్టణాలలో నిరుద్యోగుల సంఖ్య 3.66 కోట్లున్న నేపథ్యంలో ఈ పరిస్థితి నెలకొన్నది. ఓబిసిసిలకు ప్రభుత్వం ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ ప్రకటించగానే మండల్ అనుకూలురు మిక్కిలి ఆనందించారు. వ్యతిరేకులు హింసకు పాల్పడడంతో పాటు ఆత్మహత్యలను కూడ

ప్రోత్సహించారు. ఈ రాక్షస వినోదం ఎందుకు? అని ఎవరైన ప్రశాంతంగా ఆలోచించవచ్చు! దురదృష్టకరం, విషాదకరమైన విషయమేమంటే దేశంలో నాడు, నేడు కూడా ఈ విషయంపై ఉన్మాదకర పరిస్థితి నెలకొనివున్నది.

ఆర్థిక, వ్యవసాయ విధానాలలో సమూలమైన మార్పులు చేసి దేశంలో తగినన్ని ఉపాధి అవకాశాలు కల్పించి, విద్య, సాంస్కృతిక, సమాజాకాభివృద్ధికి కృషి చేయడం ప్రధానమైన సమస్య. సమాజాన్ని ఆధునీకరించి, సర్వతోముఖాభివృద్ధి సాధించకుండా కొన్ని కులాల వెనుకబాటుతనాన్ని గాని, సమాజంలో ఫ్యూడల్ తత్వంతో కూడిన ప్రగతి నిరోధకమైన కుల విభజనలు నిర్మూలించడం గానీ సాధ్యం కాదు. భారతదేశంలోని కులవ్యవస్థ నిస్సందేహంగా ప్రగతి నిరోధమైనది, వెనుకబాటు స్వభాగం గల్గినది, మూఢనమ్మకాలతో నిండి వుంది. ఇది ప్రజలను చీల్చే స్వభావం కల్గివుంది. దానిపై సైద్ధాంతిక పోరాటం చేయాలి. అదే సమయంలో ఆర్థికంగానూ, విద్యాపరంగానూ వెనుకబడిన కులాల వారి అభ్యున్నతిని సాధించి, సమాజాన్ని కుల విభజన శాపం నుండి విముక్తి చేసి, సమసమాజదిశగా పురోగమించాలి.

భారతదేశ సామాజిక పరిస్థితుల్లో సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనుకబడిన తరగతుల ప్రజలకు కొన్ని అదనపు సౌకర్యాలు, రక్షణాలు కల్పించవల్సిన అవసరాన్ని ఎవరూ కాదనలేరు. సామాజిక న్యాయం దృష్ట్యా, మండల్ కమిషన్ నివేదికను కొన్ని సవరణలతో ముఖ్యంగా ఆర్థిక ప్రాతిపదికను చేర్చి, వెనుకబడిన కులాల్లో గణనీయమైన ఆదాయంగల్గిన వారిని (క్రీమీలేయర్), 27శాతం రిజర్వేషన్ల పరిధి నుండి మినహాయించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు సమంజసమైనది. కొన్ని, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రిజర్వేషన్ల పరిమితిని అసంబంధమైన విధంగా విపరీతంగా పెంచాయి. ఇది, కేవలం వారిని తమ రాజకీయ మద్ధతుదారులుగా మలచుకుని, తాము నిరవధికంగా అధికారంలో కొనసాగేందుకు వేసిన ప్రమాదకర రాజకీయ ఎత్తుగడ మాత్రమే. వర్గదోపిడీకి వ్యతిరేకంగా పోరాటం సాగించడానికత్యవసరమైన "శ్రామికజనుల ఐక్యత" కీ కులతత్వం విఘాతం కల్గిస్తుంది. అత్యుత్సాహంతో సాగించే ఈ కులపరమైన రాజకీయాలు, శ్రామికవర్గాన్ని వర్గపోరాటపంథానుండి ప్రక్కకు నెట్టి, దాని స్థానంలో కులఘర్షణలను ముందుకు తేవడం ద్వారా, ఐక్య ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీవ్రహాని కల్గించేందుకు ఉద్దేశించినవే.

కార్మికవర్గం తన లక్ష్య సాధనకు, అన్ని తరగతుల ప్రజలు ప్రధానంగా, ఉద్యోగులు, కార్మికులు వారు వెనుకబడిన తరగతులకు చెందిన వారైనా, ఉన్నత కులాలకు చెందిన వారైనా, వారందర్నీ ఏకం చేసి ఐక్య పోరాటాలు నిర్వహించాలి. వెనుకబడిన కులాల వారు కేవలం రిజర్వేషన్లతో సంతృప్తి చెంది మిన్నకుండిపోవడం, అర్ధరహితమేగాక భ్రమలకు గురైన

వారిగా భావించవల్సి వుంటుంది. అదే సమయంలో దీని పట్ల తీవ్రంగా ఆగ్రహించడం కూడ అంత అర్థరహితం. ఇది సమూల సామాజిక మార్పుకోసం ఉద్యమించవల్సిన సమయం. ఇందుకు ఇరువురు ఐక్యమై పోరాడాలి. ఇది నేడు భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం ముందున్న ప్రధాన కర్తవ్యం.

## జాతీయవేతన విధానం - రాజ్యాంగంలోని 310, 311 (2) బి.సి అధికరణాల రద్దు పై జాతీయ సెమినార్

జాతీయ వేతన విధానం కోసం మరియు రాజ్యాంగంలోని 310, 311 (2)ఎ బి.సి అధికరణాలరద్దు కోరుతూ ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌డబ్ల్యుఈఎఫ్) ఆధ్వర్యంలో 1990 సెప్టెంబర్ 6,7 తేదీల్లో న్యూ ఢిల్లీలో జాతీయ సెమినార్ జరిగింది. ఈ కాలంలో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో జరిగిన ప్రధాన సంఘటనల్లో ఇది ఒకటి. ఈ రెండు రోజుల సెమినార్ ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎదుర్కొంటున్న రెండు ప్రధాన సమస్యలకు ప్రాధాన్యత నిచ్చింది. జాతీయ వేతన విధానం రూపొందించవల్సిన అవసరం ఒకటి, కాగా, రెండవది పూర్తిగా ప్రభుత్వోద్యోగుల ఉద్యమానికి సంబంధించినది. ప్రభుత్వ ఉద్యోగులు తమను తాము సమర్థించుకునే అవకాశం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించేందుకు అవకాశం యిచ్చే రాజ్యాంగంలోని 310, 311 (2), ఎ,బి.సి అధికరణాలను రద్దు చేయాలని ప్రభుత్వోద్యోగులు కోరుతున్నారు.

ఈ రెండు సెమినార్లలో అనేక కేంద్ర ట్రేడ్ యూనియన్లు, జాతీయ ఫెడరేషన్లు ప్రముఖ వ్యక్తులు పాల్గొన్నారు. సి.ఐ.టి.యు., ఎ.ఐ.టి.యు.సి., బి.ఎం.ఎస్., యుటియుసి సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఇన్‌కంటాక్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆలిండియా ఆడిట్ అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆలిండియా రైల్వే ఎంప్లాయిస్ కాన్ఫెడరేషన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, సి.ఎస్.ఐ.ఆర్. ఎంప్లాయిస్ అసోసియేషన్ తదితర ట్రేడ్ యూనియన్లు ఈ సెమినార్‌లో పాల్గొన్నాయి. ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ వి.కె.బాక్సీ, మాజీ న్యాయమూర్తి ఎస్. పోతి, పార్లమెంట్ సభ్యులు సోమనాథ్ చటర్జీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మాజీ న్యాయమూర్తి వి.కె. అయ్యార్ అప్రజాస్వామికమైన 311(2) ఎ,బి,సి అధికరణంపై సెమినార్‌లో చర్చ నిమిత్తం మాజీ న్యాయమూర్తి వి.కె అయ్యర్ ఒక పత్రం పంపారు.

సెమినార్‌లో విస్తృత ప్రాతినిధ్యం, లోతైన చర్చలు, అంశాలకున్న ప్రాధాన్యతవల్ల ఈ సమస్యలకు విశేష ప్రచారం లభించింది.

ఈ రెండు సమస్యలపై చర్చల కోసం రూపొందించిన సవివరమైన డాక్యుమెంట్లు ఆ సమస్యల ప్రాధాన్యతను నిర్ధిష్టంగా పేర్కొన్నాయి.

శాస్త్రీయ ప్రమాణాలతో రూపొందించిన జాతీయ వేతన విధానం లేకపోవడం వలన దేశంలో అమలులో వున్న అరాచక వేతన నిర్మాణ వ్యవస్థ (స్కేళ్ళు) గురించి వివరిస్తూ జాతీయ వేతన విధానంపై రూపొందించిన డాక్యుమెంట్ ఈ విధంగా తెలిపింది.

"వాస్తవానికి మనదేశంలో కాలం చెల్లిన వేతన వ్యవస్థలు (స్కేళ్ళు) అమలులో వున్నాయి. పరిశ్రమకు, పరిశ్రమకు మధ్య వేతనాల్లో తీవ్ర వ్యత్యాసాలున్నాయి. పబ్లిక్ రంగ సంస్థలకు ప్రభుత్వ శాఖలకు మధ్య, కేంద్ర ప్రభుత్వోద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు మధ్య, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలోని సంస్థలు స్వయం ప్రతిపత్తి గల్గిన సంస్థలకు మధ్య వేతనాల్లో తీవ్ర వ్యత్యాసాలున్నాయి. అనేక సంవత్సరాలుగా ఒక తరగతికి చెందిన ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ వేతన వ్యత్యాసాలు వేగంగా పెరిగాయి. బ్యాంకులో పని చేసే ప్యూన్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఎఐఎల్), కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్)లలో అదే పనిచేసే ప్యూన్ కంటే తక్కువ జీతం పొందుతున్నాడు. ఈ విధమైన పరిస్థితికి తగిన సమాధానం దొరకడం చాలా కష్టం. కష్టం అయినా ఈ పరిస్థితి కొనసాగుతూనేవుంది. ఒకే విధమైన పనిచేసే 'సి' గ్రూప్ సిబ్బంది విషయంలో కూడ వివిధ పరిశ్రమలలో, స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలలో, ఆఫీసుల్లో వివిధ వేతనాలు వున్నాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే దేశంలోని కార్మిక వర్గానికి సంబంధించి వేతన వ్యవస్థలో పూర్తిగా అరాచక పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి. శాస్త్రీయ పద్ధతిలో జాతీయ వేతన విధానం రూపొందించకపోవటం వలన ఈ పరిస్థితి ఏర్పడింది. దిగువస్థాయిలో శాస్త్రీయ పద్ధతిలో వేతన నిర్ణయం జరిగితే పై తరగతుల ఉద్యోగులకు కూడా దాని కనుగుణంగా వేతన వ్యవస్థలో సమంజసమైన అభివృద్ధి లభించేది. ఆ విధంగా వేతనాల విషయంపై జాతీయ విధానం రూపొందించి దేశమంతటా అమలు చేసి వుండాల్సింది, ఆ విధంగా సమంజసమైన, శాస్త్రీయమైన పంథానవలంభించినట్లయితే అనతికాలంలోని మంచి జీవన ప్రమాణాలు కల్పించే అవకాశం వుండేది. కానీ నేడు అమలులో వున్న విధానం దీనికి పూర్తి విరుద్ధంగా వుంది. ఫలితంగా అశేష కార్మికవర్గానికి ఉద్యోగులకు చాలా తక్కువస్థాయి వేతనాలు లభిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో మనిషిగా జీవించటానికి

సరిపడని జీతాలు లభిస్తున్నాయి. అందరికీ గౌరవప్రదమైన జీవన ప్రమాణాలు కల్పించాలన్న ఆదేశం రాజ్యాంగపరంగా వున్నప్పటికీ వేతనాలలో వ్యత్యాసాలు పెరగటానికి ఈ పరిస్థితి దోహదం చేసింది. అందరికీ గౌరవప్రదమైన జీవన ప్రమాణాలు కల్పించాలన్న అంశం జాతీయోద్యమ కాలంలో ప్రాధాన్యత గల్గిన విషయంగా వుందనేది ఇక్కడ పేర్కొనవల్సివుంది."

జాతీయ వేతన విధానం ఎలా వుండాలో డాక్యుమెంట్ ఈ విధంగా వివరించింది. 'దేశ ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చే దృక్పథంతో జాతీయ వేతన విధానం రూపొందాలి. ఈ ప్రాథమిక అవసరాలను అశేష కార్మికవాహిని జీవన పరిస్థితులను విస్తృతంగా, వివరంగా పరిశీలించి నిర్ణయించాలి. ఈ పరిశీలన కేవలం తక్కువ స్థాయిలో కార్మికుడు తన అవసరాలకు వెచ్చించగలిగిన మొత్తాలకు పరిమితం కారాదు. ఈ పరిశీలనలో అవసరాలు వున్నప్పటికీ, అవసరాలను తీర్చుకోలేని స్థితిలో వున్న వారిని కూడా చేర్చాలి.'

అదే విధంగా సెమినార్‌లో రెండవ ప్రధాన అంశంపై సమర్పించిన పత్రాలు రాజ్యాంగంలో 310, 311(2) ఎ,బి,సి, అధికరణాలు 'ఇష్టానుసార సిద్ధాంతాలలో' ఇమిడివున్న ప్రమాదకరమైన ఉద్దేశ్యాలను సూటిగా వివరించాయి. ప్రభుత్వోద్యోగులను బర్తరఫ్ చేయటానికి 'ఇష్టానుసార సిద్ధాంతం' ప్రభుత్వానికి కల్పించే విశేషాధికారాలు గురించి వివరించడం జరిగింది.

రాజ్యాంగం 310 అధికరణంలోని "ఇష్టానుసార సిద్ధాంతం" 1858లో బ్రిటన్ మహారాణి ప్రకటన వెలువడిన నాటినుంచి చారిత్రికంగా మొదలైందని వివరిస్తూ ఆ పత్రం ఈ విధంగా పేర్కొంది. 'ఒక శతాబ్దం క్రితం బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టిన ఇష్టానుసార సిద్ధాంతాన్ని ఏ మాత్రం నీరుకార్చకుండా 'ప్రభువు' 'ఏలినవారు' అనే మాటలకు బదులుగా తప్పనిసరై 'రాష్ట్రపతి', 'గవర్నరు' అనే మాటలు మన రాజ్యాంగంలో పొందుపరచడం చూసి ఎవరైనా సహజంగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతారు"

311 అధికరణంలోని 2వ క్లాజులోనిని సబ్‌క్లాజులు ఎ,బి,సి ల ప్రకారం ప్రభుత్వానికి సంక్రమించిన నిరంకుశాధికారాల గురించి పత్రంలో ఈ విధంగా సూటిగా వివరించారు. 'ఇష్టానుసార' సూత్రం ప్రకారం 310వ అధికరణంలో వున్న నిరంకుశ అధికారాలతో ఉద్యోగాల నుంచి తొలగించబడిన ప్రభుత్వోద్యోగులకు రాజ్యాంగంలోని 311వ అధికరణం రక్షణ కల్పిస్తుంది. ఇవే నిబంధనలు 1935 భారత ప్రభుత్వ చట్టంలో కూడ వున్నాయి. 311వ అధికరణంలో వున్న 2వ క్లాజులో భారత ప్రభుత్వ చట్టంలో కూడ వున్న సబ్ క్లాజ్ ఎ, బి,లు ఒక్కటే 1935 భారత ప్రభుత్వ చట్టంలో సెక్షన్ 240 సబ్‌క్లాజ్ (ఎ) (బి) లు ఒక్కటి. 311వ అధికరణంలోని 2వ క్లాజులోని సబ్‌క్లాజ్ (సి)ని క్రొత్తగా చేర్చారు. ఈ సబ్‌క్లాజ్ వల్ల ఒక ప్రభుత్వోద్యోగిని ఉద్యోగం నుండి తొలగించడానికి డిస్మిస్ చేయడానికి, హోదా

తగ్గించేందుకు ప్రభుత్వానికి విశేషాధికారాలు సంక్రమించాయి. దానిని దాదాపు ప్రశ్నించే అవకాశం లేదు. 311వ అధికరణం ద్వారా ప్రభుత్వోద్యోగులకు కల్పించబడిన రక్షణలను 311 (2) (సి) కబళించివేస్తుంది. దీనివల్ల ప్రభుత్వోద్యోగులు అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వుంటుంది. తమపై క్రమశిక్షణా చర్యకు కారణం తెల్సుకునే అవకాశం గాని ఉద్యోగి తన చర్యను సమర్థించుకునే అవకాశం గాని లేని పరిస్థితి ఏర్పడింది.

ఉద్యోగులను తొలగించడానికి, డిస్మిస్ చేయడానికి ప్రభుత్వం 310, 311 (2) ఎ,బి,సి లను నిరంకుశంగా ప్రయోగించిందని, రాజ్యాంగం ఆమోదించిన తర్వాత 36 సంవత్సరాల అనుభవం వెల్లడిస్తోంది. ఈ కాలమంతా పాలక పార్టీ రాజకీయ ప్రయోజనాలకుపయోగపడే విధంగానూ, ప్రభుత్వోద్యోగుల ట్రేడ్ యూనియన్ ఉద్యమ పోరాట వెల్లువనణచివేసే లక్ష్యంతో, ప్రభుత్వోద్యోగుల మీద విచక్షణారహితంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడేందుకు సాధనంగా, ఈ విశేషాధికారాలను వినియోగించారు. రైల్వే కార్మికుల ఉద్యమాన్నణచివేసేందుకు, 311 (2) (బి) అధికరణ స్ఫూర్తితో రైల్వేల కోసం రూపొందించిన 14 (బి) నిబంధనను ఉపయోగించి రైల్వే అధికారులు వందలాది మంది రైల్వే కార్మికులను నిరంకుశంగా డిస్మిస్ చేసిన విషయం మరువరాదు.

ఈ సెమినార్‌లో చర్చించిన రెండు ప్రధాన అంశాలల్లో ఒకటి దేశంలోని అన్ని తరగతుల కార్మికులకు సంబంధించినది కాగా రెండవది, దేశంలోని లక్షలాది మంది ప్రభుత్వోద్యోగులకు సంబంధించినది. అందువల్ల ఈ సెమినార్ దేశవ్యాప్తంగా వున్న కార్మికులు, ఉద్యోగులకు సంబంధించి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

మారిన రాజకీయ పరిస్థితులలో, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేకూరుస్తానని, వారికి ప్రజాతంత్ర హక్కులను కల్పిస్తానని హామీ ఇచ్చిన సందర్భంలో, ఈ రెండు సమస్యలపై నిర్వహించిన సెమినార్లకు ఎక్కువ ప్రాముఖ్యత వచ్చింది.

అయితే 1990 నవంబరు మొదటి వారంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ పతనంతో పరిస్థితి మారిపోయింది.

1990 అక్టోబరులో దేశంలో బి.జె.పి. అధినేత ఎల్.కె.ఆద్వానీ ఆధ్వర్యంలో బాబ్రీ – మసీదు – రామజన్మ భూమి సమస్యపై జరిపిన రథయాత్ర సందర్భంగా మతకల్లోలాల వెల్లువ, మతపరమైన హత్యాకాండ జరిగింది. మతోద్రిక్త పరిస్థితులు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో వి.పి.సింగ్ ప్రభుత్వం రథయాత్రను నిలిపివేయటానికి ఎల్.కె. ఆద్వానీని, అతని అనుచరుల అరెస్టుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ చర్యల వలన ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం వున్నదని తెలిసినా ఆ నిర్ణయం తప్పలేదు. ఈ పరిస్థితిలో బి.జె.పి., కాంగ్రెసు(ఐ) సాయంతో ప్రభుత్వం మీద పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి, 1990 నవంబరు

7న వి.పి. సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టింది. జనతాదళ్ నుంచి కొద్దిమంది లోక్‌సభ సభ్యులతో విడిపోయి సమాజ్‌వాదీ జనతాపార్టీ ఏర్పరిచిన చంద్రశేఖర్ నాయకత్వంలోని మైనారిటీ ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ (ఐ) బలపరచి అధికారంలోకి నిలబెట్టింది. దేశంలో రాజకీయ అస్థిరత మరింత తీవ్రం కావడంతో, అనివార్యంగా వాటి ప్రభావం భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం మీద కూడా పడింది.

## అంతర్జాతీయ రంగంలో తీవ్ర పరిణామాలు - డబ్ల్యుఎఫ్‌టియు 12వ మహాసభ

1989-90 లో అంతర్జాతీయ రంగంలో మిక్కిలి తీవ్రమైన మార్పులు చోటు చేసుకోవడం ప్రారంభమైంది. తూర్పు యూరపు దేశాలలోని సోషలిస్టు ప్రభుత్వాలు ఒకదాని తర్వాత మరొకటి కూలిపోయాయి. 1989 జూన్‌లో బెర్లిన్ గోడను కూల్చి వేసి ఒకే జర్మనీ ఏర్పడటం ఈ పతనానికి ప్రథమ సంకేతం. విప్లవ ప్రతిఘాతం వల్ల తూర్పు యూరపులోని సోషలిస్టు ప్రభుత్వాలు కూలిపోయాయి. అమెరికా, దాని పశ్చిమ దేశాల మిత్రులు అందించిన అత్యుత్సాహకరమైన ప్రోత్సాహంతో ఆ దేశాలలో సోషలిస్టు వ్యవస్థ స్థానంలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశపెట్టడానికి పూనుకున్నారు. సోషలిస్టు ప్రభుత్వాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేసిన రుమేనియా అధ్యక్షుడు సెసెస్క్యూను, ఆయన భార్యను నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. తూర్పు యూరపు రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది.

సోవియట్ యూనియన్ మనుగడలో వుంది. అయితే అది విచ్ఛిన్నమయ్యే సంకేతాలు స్పష్టంగా కనపడుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ సోవియట్ యూనియన్ (సిపిఎస్‌యు) ప్రధాన కార్యదర్శి గోర్బచేవ్ ఎన్నికైన తర్వాత, సైద్ధాంతిక, ఆర్థిక రంగాలతో పాటు, పార్టీ, ప్రభుత్వాలకు సంబంధించి ఆయన తీవ్రంగా అమలు చేసిన విధానాలు, తూర్పు యూరప్ దేశంలోని సైద్ధాంతిక, ఆర్థిక పరిస్థితుల మీద దారుణంగా ప్రభావం చూపాయి. చివరకు ఆ దేశాల్లోని సోషలిస్టు ప్రభుత్వాల పతనానికి కారణమయ్యాయి. గోర్బచేవ్ విధానాలు సోవియట్ యూనియన్ ఉనికికి, చివరకు సోషలిస్టు వ్యవస్థ మనుగడకే ప్రమాదకరంగా పరిణమించాయి.

సోషలిజానికి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగలడానికి కారణమైన సోషలిస్టు ప్రభుత్వాల పతనానికి కారణాలను విశ్లేషించడం ప్రస్తుతం మన ఉద్దేశం కాదు. అయితే క్లుప్తంగా చెప్పాలంటే, గోర్బచేవ్ అనుసరించినవి మార్క్సిస్టు వ్యతిరేక విధానాలు, తూర్పు యూరప్ దేశాలపై వాటి ప్రభావం, వీటితో పాటు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ, సోషలిస్టు ప్రజాస్వామ్యానికి

సంబంధించి అపరిష్కృతంగా వున్న సంక్షోభ పరిస్థితులు చివరకు ఈ పతనానికి దారితీశాయి. 1989-90లో తూర్పు యూరప్‌లోని సోషలిస్టు ప్రభుత్వాలు పతనమయ్యాయి. 1991లో సోవియట్ యూనియన్ కూడా పతనమైంది. ఇది ప్రపంచంలోని కార్మిక వర్గానికి ఒక భయంకరమైన అనుభవం. ఇది పెద్ద ఆశనిపాతం, ప్రపంచ కార్మికులు స్థైర్యం కోల్పోయే సంఘటన. భారతదేశంలో కార్మికవర్గం కూడా ఈ పరిణామాల పట్ల తీవ్ర దిగ్భ్రాంతి చెందింది.

ఇటువంటి అసాధారణ అంతర్జాతీయ పరిస్థితులలో, సోవియట్ యూనియన్ ఇంకా కొన ఊపిరితో కొట్టుకుంటున్న సమయంలో, 1990 నవంబరు 13 నుంచి 20 వరకు ప్రపంచ ట్రేడ్ యూనియన్ల (వరల్డ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఫర్ డైలాగ్ అండ్ యాక్షన్) మహాసభ మాస్కోలో జరిగింది.

ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి 103 మంది మహిళా ప్రతినిధులతో సహా 1079 మంది వివిధ హోదాల్లో వున్న ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొన్నారు. అనుబంధాలతో నిమిత్తం లేకుండా 132 దేశాల నుండి జాతీయ, స్థానిక, ప్రాంతీయ, అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు 486 మంది ఈ మహసభలో పాల్గొన్నారు. అన్ని దేశాలకు చెందిన 40.5 కోట్ల మంది కార్మికులకు వీరు ప్రాతినిథ్యం వహించారు.

భారతదేశం నుంచి వివిధ ట్రేడ్ యూనియన్లకు చెందిన 40 మంది ప్రతినిధులు మహాసభకు హాజరైనారు.

ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ (ఐ.సి.ఎఫ్.టి.యు.) కు కూడా డబ్ల్యు.ఎఫ్.టి.యు. ఆహ్వానం పంపింది. కాని డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభలలో పాల్గొనరాదని ఐ.సి.ఎఫ్.టి.యు. తన అనుబంధ సంస్థలను ఆదేశించింది. అందువలన ఆహ్వానించబడినప్పటికి ఐఎన్‌టియుసి హాజరు కాలేదు. ఐసిఎఫ్‌టియు నిషేధించినప్పటికీ, వివిధ దేశాలకు చెందిన ఐసిఎఫ్‌టియు అనుబంధ సంఘాల ప్రతినిధులనేక మంది డబ్ల్యు.ఎఫ్.టి.యు. 12వ మహాసభలో పాల్గొన్నారు.

"1990 దశకంలో ట్రేడ్ యూనియన్ల వ్యూహాలు" అనే ప్రధాన డాక్యుమెంట్‌లో ఆర్థిక వ్యవస్థల్లో వ్యవస్థాగత మార్పులు జరుగుతున్న తరుణంలో కార్మికుల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి, ఉద్యోగావకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను విశ్లేషించిన తర్వాత ట్రేడ్ యూనియన్ల పాత్రను గురించి వివరించింది.

దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు, కార్మికుల స్థితిగతులను గురించి డాక్యుమెంట్ ఈ విధంగా వివరించింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన చాలా దేశాల్లో నిరుద్యోగం,

1980వ దశకంలో పెరిగినంతగా రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ఏనాడూ పెరగలేదు. ఐఎంఎఫ్ నిర్దేశించిన వ్యవస్థాగత సర్దుబాటు విధానాలు అమలుతో పాటు, విదేశీ రుణాల మీద చెల్లించాల్సిన వడ్డీ మరియు అసలు (డెట్ సర్వీసింగ్) వాయిదాల భారం పెరగడం వల్ల, అభివృద్ధి చెందుతున్న అత్యధిక దేశాల్లో నిరుద్యోగం పెరిగింది. అవకాశాలు లేక నైపుణ్యం గల్గిన కార్మికులు నైపుణ్యం లేని పనులను, పూర్తి కాలం పని చేయగల సామర్థ్యం గల్గిన వారు పార్ట్ టైమ్ కార్మికులుగానూ (అండర్ ఎంప్లాయ్‌మెంట్) పనిచేసే పరిస్థితి బాగా పెరిగిపోయింది. వీటితో బాటు దారిద్ర్యం పెరిగిపోయింది. '1980 దశకంలో నిష్ట దారిద్ర్యంలో మ్రగ్గే వారి సంఖ్య 82 కోట్ల నుండి 95 కోట్లకు పెరిగింది. ఇప్పటికే వున్న దారిద్ర్యానికి ఒక క్రొత్త తరహా దారిద్ర్యం జత చేయబడింది. తర్వాత జరిగిన పరిణామాలీ దారిద్ర్యాన్ని రూపుమాపలేకపోయాయి?

సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాగత మార్పులకు సంబంధించి డాక్యుమెంట్ ఈ విధంగా పేర్కొంది. "అసలు ఉత్పత్తి శక్తుల వ్యవస్థలోనే ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తున్నాయి. ఈ మార్పుల ప్రభావాన్ని, తీవ్రతను, పరిమాణాన్ని పారిశ్రామిక విప్లవంతో పోల్చవచ్చు" అని పేర్కొంటూ, "నూతన సాంకేతిక పరిజ్ఞానానికి "ట్రేడ్ యూనియన్లు అనుకూలమేనని, దాని అవసరం కూడా వుందని, అయితే అదే సమయంలో సామాజికంగా సానుకూల పరిస్థితులను నెలకొల్పాలని" డాక్యుమెంట్ ఖండితంగా చెప్పింది. ఈ విషయాన్నే సూటిగా పేర్కొంటూ "ప్రస్తుత పరిస్థితుల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం క్రొత్త వైరుధ్యాలను ముందుకు తెస్తుంది" అని చెప్పింది.

నూతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వలన ఏర్పడే ప్రతికూల ప్రభావాన్ని పేర్కొంటూ, దానిని సమాజానికి ముఖ్యంగా, కార్మికవర్గానికి ఏ విధంగా ఉపయోగపడేట్లు చేయాలో డాక్యుమెంటు వివరించింది.

మహాసభకు సమర్పించిన నివేదిక మీద ఆసక్తిదాయకమైన చర్చ జరిగింది. ముఖ్యంగా చర్చలలో పాల్గొన్న యూరప్ ప్రతినిధులు నివేదికను స్థూలంగా అంగీకరించారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల నుంచి చర్చలలో పాల్గొన్న అత్యధిక సంఖ్యాక ప్రతినిధులు నివేదికలో వివిధ సూత్రీకరణలను తీవ్రంగా విమర్శించారు. ఈ ప్రతినిధులు ఇతర విషయాలతో పాటు ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న దురాక్రమణపూరిత విధానాలను, పెట్టుబడిదారీ విధాన దోపిడీ స్వభావం గురించి, వర్గపోరాటాలను తీవ్రతరం చేయాల్సిన అవసరాన్ని గురించి ప్రస్తావించకపోవడం వంటి బలహీనతలను వేలెత్తిచూపారు. సోషలిజం అధిక్యతను ఉద్ఘాటిస్తూ అది లేకుండా కార్మికవర్గాన్ని దోపిడీ నుండి విముక్తి చేయటం సాధ్యం కాదని వారు దృఢమైన అభిప్రాయాలు

వెలిబుచ్చారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, అనేక ఆసియాదేశాల ప్రతినిధులు అంతర్జాతీయ కార్పొరేషన్ల పాత్ర, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంక్‌లు అవమానకరమైన, కఠినతరమైన షరతులను తీవ్రంగా దుయ్యబట్టారు. లాటిన్ అమెరికన్ ప్రతినిధులు క్యూబాను, క్యూబా సోషలిస్టు వ్యవస్థను దృఢంగా సమర్థిస్తూ, క్యూబాపై అమెరికా దాడి చేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు.

ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఆసియాలకు చెందిన అనేకమంది ప్రతినిధులు తూర్పు యూరోపులో సోషలిజం ఎదుర్కొన్న ఎదురు దెబ్బలు, సోషలిజాన్ని తిరస్కరించటం కాదనీ, సామ్రాజ్యవాదం నిర్వహించిన విద్రోహకర పాత్రను ఆ ఘటనలు రుజువు చేస్తున్నాయని వాదించారు. అంతేకాక సోషలిజం నిర్మాణంలో దొర్లిన కొన్ని లోపాలు, వక్రీకరణలు మహాసభ నిర్వహణ క్రమంలో వీటికి కారణమని వారు పేర్కొన్నారు. ఈ లోపాల నధిగమించి సామ్రాజ్యవాదుల విద్రోహ చర్యలకు వ్యతిరేకంగా పోరాడటం ద్వారా సోషలిజం శక్తిని పుంజుకుంటుందని, శ్రమజీవుల బహుముఖ సంక్షేమానికి సోషలిజం అత్యున్నత వ్యవస్థగా తిరిగి రుజువు చేసుకోగలదనీ వారు దృఢంగా తెలిపారు.

పాశ్చాత్య దేశాల ప్రతినిధులతో సహా అనేకమంది ప్రతినిధులు మార్కెటు ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా విమర్శించారు. తమ దేశాలలో మార్కెట్ ఆర్థిక వ్యవస్థ సమాజాన్ని ధనికులు, దరిద్రులుగా చీల్చిందని వారు తెలిపారు. మార్కెటు ఆర్థిక వ్యవస్థలో ఆకలి, నిరుద్యోగం, పోషకాహార లోపం అనివార్యమని వారు తెలియజేశారు. ఆర్థిక వ్యవస్థలో సమతుల్యతతో కూడిన అభివృద్ధికి, పేదల అభ్యున్నతికి, ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ మాత్రమే మార్గమని వారు పేర్కొన్నారు.

మహాసభలో నివేదికపై జరిగిన చర్చలు మహాసభ నిర్వహణ క్రమంలో డబ్ల్యు.ఎఫ్.టి.యు., దాని పాశ్చాత్య మిత్రులపై గోర్బచేవ్ రివిజనిజం ప్రభావంతో పాటు, వర్గపోరాటాల ప్రాముఖ్యాన్ని నీరుగార్చి, సామ్రాజ్యవాదంతో సామరస్యం నెరపే వైఖరిని తీవ్రంగా ప్రతిఘటించే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల వైఖరి ద్యోతకమైంది. డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభకు ఆతిథ్యం ఇచ్చిన కొద్ది మాసాలకే సోవియట్ యూనియన్ పతనం కావడం చూస్తే, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ ప్రతినిధులు, డబ్ల్యు.ఎఫ్.టి.యు. సోవియట్ ట్రేడ్ యూనియన్‌ల అధికార పంథాపై వెలిబుచ్చిన ఆందోళన, తీవ్రమైన విమర్శలు సక్రమమైనవని ధృవపడుతుంది. అయినప్పటికీ డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభ చరిత్రాత్మకమైనది. డబ్ల్యు.ఎఫ్.టి.యు. మహాసభలో విస్తృత ప్రాతినిధ్యం, ముఖ్యంగా సూటి విమర్శలు, వివిధ రకాల అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించిన తీరు, సోషలిజం దెబ్బతిన్న తరువాత ఏర్పడిన పరిస్థితిలో, సోషలిజానికి కోటగా నిలిచిన సోవియట్ యూనియన్‌లో కొద్దికాలంలోనే సోషలిజం

పతనం కానున్న దశలో వారు ఆందోళనలు, విమర్శలు వెలిబుచ్చటం వంటి అనేక కారణాల వల్ల ఈ మహాసభ చారిత్రక ప్రాముఖ్యత సంతరించుకుంది.

## దశాబ్దాంతం

1980 దశకం అంతమయ్యే దశలో మనదేశంలో  అసాధారణమైన రాజకీయ అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అధికారంలోకి వచ్చిన మైనారిటీ ప్రభుత్వం కనీసం 5 నెలల కాలం కూడా నిలబడలేకపోయింది. నూతన దశాబ్ది ప్రారంభంలోనే ఎన్నికల ప్రచారంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అమానుష హత్య దేశాన్ని విషాదకరంగా కుదిపివేసింది. ఈ కిరాతక హత్య తరువాత 1991 జూన్‌లో పి.వి.నరసింహరావు ప్రధానిగా కాంగ్రెస్ (ఐ) తిరిగి అధికారంలోకి వచ్చింది.

1985లో రాజీవ్‌గాంధీ ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాన్ని నరసింహారావు ప్రభుత్వం మరింత వేగంగానూ, శక్తివంతంగానూ అమలు చేయసాగింది. ప్రతికూలంగా వున్న విదేశీ చెల్లింపుల పరిస్థితి నధిగమించేందుకు ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి భారీగా రుణం సంపాదించింది.

అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల షరతుల ననుసరించి ప్రభుత్వం నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలను ప్రకటించింది. ఫలితంగా కార్మికవర్గం తీవ్ర దాడులనెదుర్కొనవల్సి వచ్చింది. ఈ నూతన పరిస్థితిలో నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ ఐక్యతతో ఒక నూతన పోరాట దశ ప్రారంభమైంది. కార్మికవర్గ పోరాటాలలో ఈ నూతన దశ భారత కార్మికోద్యమ పోరాట చరిత్రలో ఒక అపూర్వమైన అధ్యాయంగా నిలుస్తుంది.

# 24

# నూతన పరిస్థితి - సమస్యలు, అవకాశాలు

## అంతర్జాతీయ పరిణామాల ప్రకంపనలో

## అపూర్వమైన ఐక్య కార్మిక పోరాటాలు

**పూ**ర్తిగా మారిపోయిన అంతర్జాతీయ పరిస్థితులలో ఈ శతాబ్ది ఆఖరి దశాబ్దం ప్రారంభమైంది. భారతదేశంలోని జాతీయ దృశ్యంలో కూడ తీవ్ర మార్పులు సంభవించాయి.

1989 వ సంవత్సరం మధ్యలో బెర్లిన్ గోడ కూలివేతతో ప్రారంభమైన ప్రకంపనలు సోవియట్ ప్రభుత్వం పతనమై 1991లో సోవియట్ యూనియన్ పూర్తిగా విచ్ఛిన్నం కావటంతో పరాకాష్ఠకు చేరుకున్నాయి. సోషలిస్టు ప్రపంచంలో సంభవించిన ఈ తీవ్ర పరిణామాల ఫలితంగా సామ్రాజ్యవాద అధినేత అమెరికా ఆధిపత్యంలో ఏకధృవ ప్రపంచం ఏర్పడింది.

'సోషలిజం మరణించింది. మానవ సమాజాభివృద్ధి క్రమంలో పెట్టుబడిదారీ విధానమే అత్యున్నతదశ' అనే వికృత నినాదాలతో దశదిశలు మార్మోగుతుండగా వివిధ దేశాలలోని కార్మిక వర్గ, సోషలిస్టు ఉద్యమాలు అత్యంత క్లిష్ట పరిస్థితులలో భారంగా ముందుకు సాగవల్సిన పరిస్థితులేర్పడ్డాయి. పూర్వపు సోషలిస్టు దేశాలలోని కార్మికులు, దిగ్భ్రాంతితో అయోమయ పరిస్థితిలో పడ్డారు. పెట్టుబడిదారీ విధానాన్ని బలవంతంగా ప్రవేశపెట్టడంతో, దానిననుసరించి వచ్చే సహజ లక్షణాలైన నిరుద్యోగం పెరుగుదల, భద్రతారాహిత్యం, అరాచకత్వం, నేర ప్రవృత్తి వంటి, సోషలిజంలో కనీవినీ ఎరుగని పరిస్థితులు నెలకొనడంతో ప్రజల్లో అసంతృప్తి ప్రబలింది. అసంతృప్తి పెల్లుబికిన ప్రతిసారి పెట్టుబడిదారీ రాజ్యాంగ యంత్రాన్ని ప్రయోగించి పాశవికంగా అణచివేయడం జరుగుతోంది. పాత కమ్యూనిస్టులు సంఘటితమై సోషలిజాన్ని పునరుద్ధరించటానికి ప్రయత్నించటం కారుచీకటిలో కాంతిరేఖ వంటిది.

చైనా, వియత్నాం, లావోస్, ఉత్తర కొరియా, క్యూబా మొదలైన సోషలిస్టు దేశాలు, నూతన పరిస్థితి కనుగుణంగా సర్దుబాట్లు చేసుకుని పురోగమించేందుకు, తమ ఆర్థిక విధానాలను, అంతర్గత (ఆంతరంగిక) విధానాలకు నూతన ఒరవడి యివ్వడం ప్రారంభించాయి. అమెరికా

ఐ.రా.స. తీర్మానాన్ని కూడా లెక్కచేయకుండా క్యూబాపై విధించిన ఆంక్షలు, దిగ్బంధనం వలన కరేబియన్ ప్రాంతంలోని ఈ చిన్న సోషలిస్టు స్థావరం విపరీతమైన ఒత్తిడుల నెదుర్కొంటూ మనుగడ సాగించటానికి సాహసంతో పోరాడుతోంది.

అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ ఉద్యమం గందరగోళ పరిస్థితిలో వుంది. తిరిగి కూడదీసుకుని, నూతన పరిస్థితులకనుగుణంగా పనిచేసే ప్రయత్నాలు చేస్తోంది.కొన్ని ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాదేశాల్లో మాత్రమే ట్రేడ్ యూనియన్ ఉద్యమం చెక్కుచెదరకుండా నిలబెట్టుకోవడం జరిగింది. అయితే దేశాల్లో కొన్నిచోట్ల ఉద్యమం కుంచించుకుపోకుండానూ, లేదా పూర్తిగా విచ్ఛిన్నం కాకుండా వుంచేందుకు తీవ్రంగా పోరాడుతున్నారు. తూర్పు యూరపు దేశాల్లోనూ, పూర్వపు సోవియట్ యూనియన్‌లోనూ సోషలిస్టు వ్యవస్థ పతనం కావడంతో, సోషలిజం సంక్షోభంలో వున్నదని, పెట్టుబడిదారీ విధానమే, నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని, ఒక క్రమ పద్ధతిలో ప్రచార వెల్లువ ప్రారంభమైంది. కాని వాస్తవ పరిస్థితి యిందుకు భిన్నంగా వుంది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి వుంది. 1970వ దశకం మధ్య భాగంలో ప్రారంభమైన ఈ తీవ్ర సంక్షోభం మున్నెన్నడూ లేనంత సుదీర్ఘ కాలం కొనసాగి నూతన దశలో ప్రత్యక్షమవుతోందనేది కఠోరసత్యం. తీవ్ర ఆర్థిక మాంద్యపు వూచి నుండి పెట్టుబడి దారీ విధానం పాక్షికంగా తెలుసుకున్న మాట వాస్తవం. ఈ విధంగా పెట్టుబడిదారీ విధానం పాక్షికంగా కోలుకోవడానికి మూడవ ప్రపంచ దేశాల మీద విపరీతంగా భారాలు మోపడాన్ని ఒక మార్గంగా ఎంచుకున్నారు. ఇందుకు ఐఎమ్ఎఫ్, ప్రపంచబ్యాంకు,ల ద్వారా "వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాలను", ఇటీవలనే డంకెల్ ప్రతిపాదనల మీద చర్చలు జరిగి, కుదిరిన గాట్ (GATT) ఒప్పందాన్ని సాధనాలుగా వుపయోగించుకున్నారు. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాల మీద అడ్డూ, అదుపూ లేని ఆధిపత్యంగల్గిన బహుళ జాతి కార్పొరేషన్లు, ఆయా దేశాల్లోని స్వదేశీ పరిశ్రమలను దెబ్బతీసి, అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలకు అశేష లాభాలను తరలించుకుపోతున్నారు.

ఈ అంతర్జాతీయ నేపథ్యంలో భారతదేశంలో సంభవించిన విస్తృత పరిణామాలను పరిశీలించాలి. చంద్రశేఖర్‌ని మైనారిటీ ప్రభుత్వం పడిపోయిన తరువాత 1991 మే 21న రాజీవ్‌గాంధీ విషాదకర హత్యానంతరం 1991 జూన్‌లో నరసింహారావు ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈ నూతన ప్రభుత్వం రాజీవ్‌గాంధీ ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్థిక విధానాన్ని చాలా జోరుగా కొనసాగించింది. ఇది పబ్లిక్‌రంగ ప్రైవేటీకరణకు, విచక్షణారహితంగా విదేశీ బహుళ జాతి కంపెనీలను ఆహ్వానించడానికి, భారత ఆర్థిక స్వావలంబనకు తూట్లు పొడవడానికి దారితీసింది.

రావు ప్రభుత్వం అనుసరించిన నూతన ఆర్థిక విధానం, నూతన పారిశ్రామిక విధానం కార్మికవర్గంపై పెనుభారాన్ని మోపాయి. కార్మికవర్గం ఇతర శ్రామిక ప్రజానీకంతో కలిసి భారత కార్మికవర్గ చరిత్రలోనే అపూర్వమైన ప్రతిఘటనా పోరాటాలను చేపట్టింది.

1991 నవంబర్ 29, 1992 జూన్ 16, 1993 సెప్టెంబర్ 9, 1994 సెప్టెంబర్ 29 తేదీలలో ఈ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలను ప్రతిఘటిస్తూ, నాలుగు సంవత్సరాల్లో వరసగా నాలుగు అఖిల భారత సార్వత్రిక సమ్మెలు జరిగాయి. 1992 నవంబర్ 25న స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు ఢిల్లీలోని బోట్‌క్లబ్ వద్ద ఆశేష కార్మికవాహిని నిర్వహించిన ప్రదర్శన కార్మికవర్గంలో పెరుగుతున్న ఐక్యతకు నిదర్శనం. ఒక్క ఐ.ఎన్.టి.యు.సి. బి.ఎం.ఎస్. తప్ప దాదాపు అన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్లు జాతీయ ఫెడరేషన్లు, తమ సిద్ధాంత పరమైన విభేదాలను ప్రక్కనపెట్టి ఒకే వేదికపై నిలిచాయి. దేశంలోని ట్రేడ్ యూనియన్లు ప్రజా బాహుళ్యంతో కలిసి పోరాటం సాగించేందుకు మార్గం ఏర్పడడంతో ఈ పోరాటాన్ని మరింత వేగంగా చైతన్యవంతంగా నిర్వహించగలమనే ఆశలు కార్మికవర్గంలో చిగురించాయి.

అంతర్జాతీయ రంగంలో చూస్తే, సిరియా రాజధాని డమాస్కస్‌లో 1994 నవంబర్ 21 నుంచి 26 వరకు డబ్ల్యు.ఎఫ్.టి.యు. 13వ ప్రపంచ మహాసభ జరిగింది. అన్ని ఖండాలలోని 82 దేశాలకు చెందిన 400 మంది ప్రతినిధులు, పరిశీలకులు ఈ మహాసభలో పాల్గొన్నారు. సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగానూ, ఐఎమ్ఎఫ్ ప్రపంచ బ్యాంకుల ఆదేశాల మేరకు అమలు జరుగుతున్న వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాల అమలు ఫలితంగా ఒనగూడిన దుష్ఫలితాలు, బహుళజాతి సంస్థల దాడులకు, భయంకరంగా పెరుగుతున్న నిరుద్యోగం, ట్రేడ్ యూనియన్ హక్కుల మీద తీవ్ర నిర్బంధాలు, మతమౌఢ్యం, జాతివిక్షలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలు సాగించడానికీ మహాసభ నూతన దిశానిర్దేశం చేసింది. పూర్వపు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై తూర్పు యూరపులో సోషలిస్టు రాజ్యాలు పతనమైన తరువాత మొదటిసారిగా ఈ డబ్ల్యు.ఎఫ్.టి.యు మహాసభ జరిగింది. పూర్వపు సోషలిస్టు రాజ్యాలలో కార్మికవర్గం అనుభవిస్తున్న దయనీయ స్థితి, అదే సమయంలో ఆదేశాలలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని పునర్నిర్మించటానికి జరుగుతున్న కృషి. ప్రపంచ కార్మికోద్యమానికి ఎనలేని విలువైన అనుభవ పూర్వక పాఠాలను అందజేసింది. పెట్టుబడిదారీ విధానం ప్రస్తుత సమస్యలకు పరిష్కారం కాదనీ, అంతర్జాతీయ కార్మికవర్గం ఒక నూతన ఆర్థిక క్రమం (New Economiorder) కోసం పోరాటం తక్షణ కర్తవ్యమని ఆపరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంలో కార్మికవర్గం అనేక అడ్డంకులనధిగమించి ముందుకు సాగుతున్న తరుణంలో భారత కార్మికోద్యమ నిర్మాతలైన ఇద్దరు ప్రముఖ నాయకులు పరమపదించారు.

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షుడు, సమరశీల ట్రేడ్ యూనియన్ ఉద్యమంతో పాటు దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, జీవితంలో ఆఖరు రోజున కూడా కార్యక్రమంలో పాల్గొన్న బి.టి.రణదివే 1990 ఏప్రిల్ 6న కాలధర్మం చెందారు. భారత కార్మికోద్యమం, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, చాలాకాలం ఎఐటియుసి అధ్యక్షునిగా, జనరల్ సెక్రటరీగా పనిచేసి క్రియాశీలక రాజకీయాలు, ట్రేడ్ యూనియన్ ఉద్యమం నుంచి విరమించిన శ్రీపాద అమృత డాంగే 1991 మే 22న చనిపోయారు.

ఐక్య సమరశీల ట్రేడ్ యూనియన్ ఉద్యమం నిర్మించటం తేలికైన పనికాదు. మతపరమైన హింసాకాండ, కులాలపోరు, వేర్పాటువాదుల హింసాకాండ, పెచ్చురిల్లుతున్న మత ఛాందసవాద సమాజాన్ని నిరంతరం కుదిపివేస్తున్న సమయంలో కార్మికవర్గ ఐక్యతను పటిష్టం చేసి కార్మికవర్గాన్ని ప్రజాతంత్ర పంథాలో నడిపించటం బృహత్తరమైనపని. అందువలన ట్రేడ్ యూనియన్లు ఈ సమయంలో ఒకవైపు ఉద్యమాలను కొనసాగిస్తూ, మరోవైపు కుల, మత సామరస్యం కోసం, వేర్పాటువాదానికి, మత ఛాందసానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని చైతన్య పర్చేందుకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించవల్సివచ్చింది. ఈ ప్రచార కార్యక్రమం, జన సమీకరణ చేదోడువాదోడుగా కొనసాగిస్తూ, ప్రభుత్వ ఆర్థిక విధానాలు ఇతర ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు నిర్మించాయి. భారత కార్మికోద్యమం సాధించిన ఈ విజయం. చిన్నదేమీ కాదు.

## కార్మిక వర్గ ఐక్యత - ఐక్య పోరాటాలు

దేశం స్వాతంత్ర్యం పొందడానికి కొద్దిరోజుల ముందే ఐఎన్‌టియుసి స్థాపించడంతో, దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం విషాదకరమైన చీలిక అనుభవాన్ని చవిచూపింది. ఇంతకు ముందే చెప్పుకున్నట్లు, వివిధ రాజకీయ అభిప్రాయాలతో అనేక కేంద్ర కార్మిక సంఘాలు పుట్టుకొచ్చాయి. భారతదేశంలో నూతన పాలకవర్గాలు పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించేందుకు చేసిన ప్రయత్నాల పర్యవసానంగా, భారత కార్మికవర్గం అష్టకష్టాల పాలైంది. సరిగ్గా పెట్టుబడిదారీ వర్గం, వారి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వం సాగిస్తున్న దాడులను ప్రతిఘటించడానికి ఐక్యం కావల్సిన సమయంలో దేశ కార్మిక వర్గం వివిధ ట్రేడ్ యూనియన్ కేంద్రాలుగా చీలివుంది.

ఈ దాడులనెదుర్కొని పోరాడాలని భావించిన వివిధ ట్రేడ్ యూనియన్లు ఐక్యతకోసం తీవ్ర కృషి చేశాయి. కానీ ఇవన్నీ ఏదో ఒక ప్రత్యేక సందర్భంలో పోరాటం సాగించడానికో లేదా కొంతకాలం పాటుగానీ ఐక్య వేదికను నిర్మించటానికి, చేసిన తాత్కాలిక ప్రయత్నాలు మాత్రమే. అయితే ఈ ప్రయత్నాల వలన శాశ్వతమైన పటిష్టమైన ఐక్యత ఏర్పడలేదు. యుసిటియు, రాష్ట్రీయసంగ్రామ్ సమితి, 1981 నుంచి జాతీయ ప్రచారోద్యమ కమిటీ ఏర్పాటుకు చేసిన నిర్మాణయుతమైన ప్రయత్నాలు ఎంత హృదయపూర్వకంగా చేసినా అన్నీ పోరాట దశ వరకు కొనసాగి తరువాత అదృశ్యమయ్యాయి.

1991 నుంచి నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలను ఐక్యంగా ప్రతిఘటించేందుకు స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్లు ఏర్పాటుకు కొత్త ప్రయత్నాలు జరిగాయి. కానీ ఈ సమయంలో బిఎంఎస్ నూతన ఆర్థిక విధానాల పట్ల చాల ఆపేక్ష చూపిస్తోంది. దీని వలన బిఎంఎస్ భాగస్వామిగా వున్న జాతీయ ప్రచారోద్యమ కమిటీ దెబ్బతిన్నది. అందువలన బి.ఎం.ఎస్. లేకుండా స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌ను ఏర్పాటు చేయవల్సివచ్చింది. మొదటి నుంచి ఐఎన్‌టియుసి పాలకపక్షం ప్రోత్సహించిన ట్రేడ్ యూనియన్

గానే వుంది. కాబట్టి ఈ ఐక్యతా ప్రయత్నాలకు దూరంగానే వున్నది. అయితే కొన్ని పరిమిత, నిర్దిష్ట సందర్భాలలో కార్మికుల ప్రయోజనాల కోసం ఐఎన్‌టియుసి కూడ ఈ ఐక్యతా యత్నాలలో కలిసివచ్చింది.

ఈ తాత్కాలిక ఐక్యతా యత్నాల నేపథ్యంలో సిఐటియు 1979లో శాశ్వత, పటిష్ట కార్మిక వర్గ ఐక్యతా నిర్మాణం కోసం నిర్దిష్ట ప్రతిపాదనలు చేసింది.

మద్రాసులో 1979 ఏప్రిల్ 11 నుంచి 15 వరకు జరిగిన 4వ అఖిల భారత సిఐటియు మహాసభలో అధ్యక్షోపన్యాసంలో బి.టి.రణదివే ట్రేడ్ యూనియన్ ఐక్యత ఆవశ్యకతను గురించి వివరించి, ఒక నిర్దిష్ట ప్రతిపాదన చేశారు. అనేక సమయాలలో చేసిన ఐక్యతాయత్నాల గురించి వివరిస్తూ ఆయన ఇలా చెప్పారు.

'కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు నిర్వహించిన ఐక్య ఉద్యమాలు ఐక్యతకు అపూర్వ వాతావరణం కల్పించాయి. కేంద్ర కార్మిక సంఘాలకు అనుబంధం కాని ఉద్యోగుల సంస్థలు, కార్మికుల ఫెడరేషన్లను ఐక్యం చేయటంలో సఫలమైనాయి.'

'సమస్త ట్రేడ్ యూనియన్ల ఐక్యత" అనే అత్యంత ప్రాముఖ్యత గల్గిన అంశం మనముందున్నది. కార్మికోద్యమం తనశక్తినంతా వుపయోగించి, ప్రభుత్వ విధానపర నిర్ణయాలను నిర్దేశించ లేకపోతే కార్మికుల ప్రయోజనాలు రక్షించటంలో సాఫల్యం కాలేదు. అన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్ సంస్థలు, ఉద్యోగుల సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, టీచర్లు, ప్రొఫెసర్ల సంఘాలు కలిసి ఉమ్మడి కార్మిక విధానం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, అన్ని తరగతుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయాలని సిఐటియు పిలుపునిస్తోంది. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో నేడు నెల కొన్న మహత్తర చైతన్యం, లక్షలాది మందిని కదిలించగల్గిన శక్తిని సాధించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘాల అద్భుత పురోగమనం, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్ల సంఘాలు చూపిస్తున్న శక్తి, సామర్థ్యాలు గమనిస్తే, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలనన్నింటినీ ప్రతిఘటించి, వారి ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించగలదని, అసలు ప్రభుత్వ విధానాలనే మార్చగల్గినంత బలమైనాశక్తిగా ట్రేడ్ యూనియన్ ఉద్యమం రూపొందిందని స్పష్టమవుతుంది. ఈ సంస్థలన్నీ వెంటనే ఏకమై పరిస్థితిని సమీక్షించి, కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన కోర్కెలు, చట్టాలకు సంబంధించిన సమస్యలపై ఉమ్మడి వేదిక నేర్పరచి, కార్మికోద్యమం ఐక్యంగా వుందని, అది అవిభాజ్యమని యజమానులను హెచ్చరించాలని మనం కోరుకుంటున్నాము. ఈ ఉమ్మడి లక్ష్య సాధనకు కార్మికవర్గానికి, వారి ఉమ్మడి ప్రయోజనాలకు విధేయంగా వుండడమే ఏకైక షరతు. అందువల్ల యుసిటియు ను పునరుద్ధరించి, మరింత విస్తరించి, 1974లో సాగిన చారిత్రాత్మక వేతన స్తంభన వ్యతిరేక సదస్సు వలె సర్వ వ్యాపితం కావాలని మనం కోరుకుంటున్నాం" బి.టి రణదివే ఉపన్యాసం అనంతరం కార్మికవర్గ ఐక్య కార్యాచరణ విషయంలో గణనీయమైన ప్రగతి సాధించినప్పటికీ, శాశ్వత ప్రాతిపదికన ఐక్య సంఘటన రూపుదిద్దుకోలేదు.

ఐక్యత కోసం ఆయన తన విజ్ఞప్తిని ముగిస్తూ ఒక సూటి ప్రశ్న వేశారు. "మనందరం ఏకం కాకపోయినప్పటికి ఒక విధమైన పదునైన కాన్ఫెడరేషన్ గానో లేదా కనీసం కార్మికవర్గ సమన్వయ కమిటీ గానో ఏర్పడి, సమస్యలపై సంప్రదించుకుని, ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకోలేమా ?

బి.టి.రణదివే ఎప్పుడో 1979లోనే ఈ ప్రధానమైన సమస్యను ప్రస్తావించారు. కానీ నేడీ సమస్యకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. నేడు కార్మిక వర్గం కేవలం ఆర్థికపరమైన కోర్కెలకే పరిమితం కాక ప్రభుత్వ విధాన సమస్యలపై పోరాడుతున్న నేటి పరిస్థితిలో ఈ సమస్య అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రేడ్ యూనియన్లు శాశ్వత ప్రాతిపదికన ఏకం కావాలన్న ఆయన విజ్ఞప్తి ట్రేడ్ యూనియన్ల ఆలోచనా సరళిలో పెద్దగా మార్పు తీసుకురాలేకపోయింది.

1987 బొంబాయిలో జరిగిన 6వ సిఐటియు అఖిలభారత మహాసభ వివిధ ట్రేడ్ యూనియన్లు, జాతీయ ఫెడరేషన్లతో కాన్ఫెడరేషన్ ఏర్పాటు చేయాలన్న విజ్ఞప్తిని పునరుద్ఘాటించింది. ఈ సమస్యపై మహాసభ ఈ దిగువ తీర్మానాన్ని ప్రతిపాదించింది.

'అన్ని జాతీయ ట్రేడ్ యూనియన్లు, పారిశ్రామిక కార్మిక సంఘాలతో ఒక కాన్ఫెడరేషన్ ఏర్పాటు చేసి, కార్మిక ఆర్థిక విధానాల గురించి స్వేచ్ఛగా చర్చించి, ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకోవాలని సిఐటియు మరలా విజ్ఞప్తి చేస్తోంది. ఈ నిర్ణయం వలన ఏ కార్మికసంస్థ తన స్వయం ప్రతిపత్తిని కోల్పోకుండా, అభిప్రాయాలను చర్చించి, ఒక సమగ్ర దృక్పధాన్ని ఏర్పరచుకునే అవకాశం కలుగుతుంది. అన్ని ట్రేడ్ యూనియన్లు, ఫెడరేషన్లు సిఐటియు ప్రతిపాదనను పరిశీలించవలసిందిగా అభ్యర్థిస్తోంది. ట్రేడ్ యూనియన్ ఐక్యతను వాంఛించే వారందరూ సిఐటియు పిలుపుకు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తోంది.'

ఈ సమస్యపై సిఐటియు ఇతర ట్రేడ్ యూనియన్లకు మధ్య చర్చలు జరిగినప్పటికీ, ఈ విషయంలో ఏమీ ప్రగతి సాధించలేదు. ఈ అభిప్రాయం ఆచరణ యోగ్యతపై అనేక సమస్యలు తలెత్తాయి. అయితే అది ఈనాటికీ పరిష్కారం కాలేదు.

విలీనానికి జరిగిన ద్విపాక్షిక చర్చల ఫలితంగా మజూర్ మహాజన్, జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ ఐ.ఎన్.టి.యు.సి.లో విలీనం కావాలని ఇటీవల నిర్ణయించారు. ది స్టేట్స్‌మన్ పత్రిక ఈ విధంగా వ్రాసింది.

"రెండు దశాబ్దాల ప్రముఖ ట్రేడ్ యూనియన్ సంస్థ తరువాత మజ్దూర్ మహాజన్, జాతీయ లేబర్ ఆర్గనైజేషన్‌లు తిరిగి ఐఎన్‌టియుసిలో చేరాయి.'

'ఐఎన్‌టియుసిలో విలీనం ప్రయత్నాలు చాలా కాలంగా సాగుతున్నాయి. కానీ గాంధియన్ ట్రేడ్ యూనియన్ (ఐఎన్‌యుసి), మజూర్ సంఘ్ కార్యవర్గంలోని ముఖ్య నాయకుల మధ్య తీవ్ర విభేదాల వల్ల తుది నిర్ణయం ప్రక్కన పెట్టడం జరిగింది.

'కానీ గుజరాత్‌లో జనతాదళ్ కాంగ్రెస్‌లో విలీనం కావటం వలన ఏర్పడిన రాజకీయ అనివార్య పరిస్థితులలో సంఘ్ (టెక్స్‌టైల్ లేబరు అసోసియేషన్) మరల ఐఎన్‌టియుసిలో చేరవలసి వచ్చింది.

ఈ కాలంలో ఎఐటియుసి, హెచ్.ఎం.ఎస్. సంస్థలు విలీనం కావటానికి చర్చలు జరిపాయి. అయితే ఈ విషయం ముందుకు సాగలేదు. ఎఐటియుసి జనరల్ సెక్రటరీ ఎ.బి.బర్ధన్ విలీనం గురించి ఈ విధంగా పేర్కొన్నారు. రెండు సంస్థలు విలీనాన్ని సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఈ కోరిక మేరకు జాతీయ, రాష్ట్ర సమన్వయ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించాయి. (ఇప్పటికి 6 రాష్ట్రాలలో కమిటీలు ఏర్పడ్డాయి). రెండు కేంద్రసంఘాల విలీనం ఒక్కరోజులో జరిగే పనికాదు. అయినా దానిని నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి. ఈ ప్రయత్నం కేవలం రెండు సంస్థల విలీనం కోసం చేసే ప్రయత్నంగా పరిగణించరాదు. ఆ విధంగానైతే ప్రస్తుతం వున్న కేంద్ర సంఘాల సంఖ్యలో ఒకదానిని తగ్గించటమవుతుంది. ఉన్నత స్థాయిలో జరిగే ట్రేడ్ యూనియన్ల ఐక్యతకు అన్ని ఇతర కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ ఫెడరేషన్లు, యూనియన్లు కలిసిరావాలి.

3 సంవత్సరాల ప్రయత్నాల తరువాత, కూడ ఆ సంస్థల విలీన ప్రతిపాదన వాస్తవ రూపం దాల్చలేదు. కాని కొన్ని రాష్ట్రాలలో కలిసి పని చేయటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అంతకుముందు 1977లో జన సంఘ్‌తో సహా వివిధ పార్టీలతో ఏర్పడిన జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, కమ్యూనిస్టుల ప్రభావానికి వెలుపలవున్న హెచ్ఎమ్ఎస్, హెచ్ఎమ్‌పి లను బిఎమ్ఎస్‌లో విలీనం చేసే ప్రయత్నాలు జరిగాయి. ఈ కాలంలో దేశంలో ఏర్పడిన రాజకీయ కూటమి తరహాలోనే కార్మిక సంస్థల విలీనం జరపాలని ప్రయత్నించారు. ఈ సందర్భంగా వాల్టర్. కె. ఆండర్సన్, శ్రీధర్ డి దామ్లేలు ఈ విధంగా పేర్కొన్నారు. "జనతాపార్టీ సోషలిస్టులతో (అంత పటిష్టం కాకపోయినప్పటికి) సంబంధాలున్న రెండు సోషలిస్టు యూనియన్లు హిందూమజ్దూర్ సభ (హెచ్ఎమ్ఎస్) హిందూ మజ్దూర్ పంచాయిత్ (హెచ్ఎమ్‌పి) నాయకులతో భారతీయ మజ్దూర్ సంఘ్. (బిఎమ్ఎస్) నాయకులు 1977 ఏప్రిల్ 10,11 తేదీల్లో ఢిల్లీలో సమావేశమయారు. విలీనానికి బిఎమ్ఎస్ నాలుగు షరతులు విధించింది. 1) రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించాలి 2) వర్గపోరాట దృక్పథాన్ని తిరస్కరించాలి. 3) విశ్వకర్మ దినాన్ని జాతీయ కార్మిక దినంగా అంగీకరించాలి. 4) ఎఱ్ఱజెండాను యూనియన్ పతాకంగా అంగీకరించరాదు. సంప్రదింపుల్లో మొదటి మూడు అంశాల మీద ఏకాభిప్రాయానికి వచ్చినప్పటికీ నాల్గవ అంశం విషయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరకు బిఎమ్ఎస్ విలీనానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంది. బహుశా, జనతాపార్టీలో చీలికకు కారణమైన, జనతాపార్టీలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పదవులు చేపట్టే సమస్యకు సంబంధించిన వివాదంలోకి వారు యిరుక్కోకుండా వుండేందుకు వారీ నిర్ణయం తీసుకుని వుంటారు.

ఆ విధంగా విలీన ప్రయత్నాలు ఫలించలేదు. కానీ విలీనానికి బిఎమ్ఎస్ పెట్టిన షరతులు ఆ సంస్థయొక్క హిందూ మతపునరుద్ధరణ స్వభావాన్ని స్పష్టంగా ప్రతిబింబించాయి. హిందూమత పునరుద్ధరణ లక్ష్యంగా గల్గిన ఆర్ఎస్ఎస్‌కు కార్మిక విభాగం బిఎమ్ఎస్. దేశంలో ఆర్ఎస్ఎస్ యొక్క హిందూమత పునరుద్ధరణ విస్తరణకనుగుణంగా బిఎమ్ఎస్ తన ప్రభావాన్ని విస్తరించింది. తర్వాత కాలంలో బిజెపిగా అవతరించిన జనసంఘ్ తదితర హిందూమతోన్మాద సంస్థలను కలిపి ఆర్ఎస్ఎస్ (సంఘ్) పరివార్‌గా వ్యవహరిస్తారు.

జనతాపార్టీలో ఒక భాగస్వామిగా జనసంఘ్ అధికారంలోకి వచ్చిన తర్వాత 1977–79 మధ్యకాలంలో బిఎమ్ఎస్ తన సభ్యత్వాన్ని, 1977లో వున్న 8 లక్షల నుండి, 1980 నాటికి 16 లక్షలకు పెంచుకుందని బిఎమ్ఎస్ ప్రచురిస్తున్న ఆర్ఎస్ఎస్ వాణిగా వున్న ఆర్గనైజర్ పత్రిక పేర్కొంది.

ట్రేడ్ యూనియన్ ఐక్యత కృషిలో భాగంగా సిఐటియు 1994 డిశంబరు 19న ఢిల్లీలో ఒక సెమినార్ నిర్వహించింది. బి.టి రణదివే 90వ జన్మదినోత్సవ సందర్భంగా జరిగిన ఈ సెమినార్‌కు ఐఎన్‌టియుసితో సహా అన్ని ట్రేడ్ యూనియన్లను ఆహ్వానించారు. అయితే ఐఎన్‌టియుసి సెమినార్‌లో పాల్గొనలేదు.

ట్రేడ్ యూనియన్ ఐక్యతకు సంబంధించిన, సిఐటియు అవగాహనను వివరిస్తూ సెమినార్‌లో ఒక అవగాహనా పత్రాన్ని చర్చకు పెట్టడం జరిగింది. ట్రేడ్ యూనియన్ ఐక్యతకు సంబంధించిన సమస్యలను గురించి ఇతర విషయాలతో పాటు ఈ క్రింది విషయాలను పత్రంలో వివరించారు. ఆచరణలో ఎదురయ్యే సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా ఏర్పరచే ఐక్యత ఎంతోకాలం నిలవదు. అటువంటి విలీనం తరువాత చీలికలేర్పడే అవకాశం వున్నది. సూత్రరహితమైన అవకాశవాద విలీనం సాధించటం సులువుగా కనిపించవచ్చును. కానీ అది తాత్కాలికం దీర్ఘకాలంలో కార్మిక వర్గానికది ఏ విధంగాను ఉపయోగపడదు.'

ట్రేడ్ యూనియన్లు ప్రజాస్వామికంగా పనిచేయటం విలీనానికి అత్యవసరమని పేర్కొంటూ అవగాహనా పత్రంలో ఈ విధంగా పేర్కొనడం జరిగింది. 'దేశంలోని చాలా ట్రేడ్ యూనియన్‌లు ప్రజాస్వామికంగా పనిచేయటం లేదు. వాటిలో కొన్ని కొంతమంది నాయకుల జేబు సంస్థలుగా పనిచేస్తున్నాయి. స్థానిక యూనియన్ల విలీనానికది పెద్ద అడ్డంకి. అందువల్ల ట్రేడ్ యూనియన్లు విలీనం కావటానికి ప్రజాస్వామికంగా పనిచేయటం ఒక ప్రాతిపదిక. స్థానికంగా యూనియన్లు విలీనం కాకుండా కేంద్ర యూనియన్ల విలీనం అర్ధరహితం. విలీనం గురించి మనం శ్రద్ధగా కృషి చేయాలంటే ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి"

'రాజకీయ రహిత ట్రేడ్ యూనియన్ ఉద్యమం' అనే ముఖ్యమైన వివాదస్పదమైన అంశం గురించి పత్రంలో స్పష్టంగా వివరించారు. కార్మికవర్గం రాజకీయ పోరాటాలలో పాల్గొనక పోతే, పెట్టుబడిదారీ వర్గానికి దేశ రాజకీయ విధానాలను నిర్దేశించే అధిపత్యం లభిస్తుంది. అందువలన ట్రేడ్ యూనియన్ ఉద్యమం రాజకీయ రహిత ఉద్యమంగా

వుండజాలదు. అయితే అన్ని రాజకీయ శక్తులు ఏకమైనప్పుడు, అందరికీ అంగీకారయోగ్యమైన విధానం ట్రేడ్ యూనియన్ల రాజకీయ విధానమవుతుంది. 1926 భారత ట్రేడ్ యూనియన్ చట్టంలో ట్రేడ్ యూనియన్లు రాజకీయ నిధులను ఏర్పాటు చేసుకోవచ్చునని నిబంధన వున్నది. ట్రేడ్ యూనియన్ల రాజకీయ కార్యాచరణను ఈ విధంగా అంగీకరించారు.

అయితే అనేక రాజకీయ భావాలు కలిగినవారు ఒకటిగా పని చేస్తున్నప్పుడు, ట్రేడ్ యూనియన్ ఉద్యమం సార్వజనీనమైన ఉమ్మడి రాజకీయ వైఖరి నేర్పరచుకునే అవకాశం వుంటుంది. అప్పుడు ట్రేడ్ యూనియన్లు ఒక రాజకీయపక్షానికి అనుబంధంగా వుండవలసిన అవసరం వుండదు.

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు బి.టి.రణదివే సూచించిన విధంగా ట్రేడ్ యూనియన్లు ఒక కాన్ఫెడరేషన్‌గా ఏర్పడవలసిన సత్వర లక్ష్యం చేరుకోవలసిన ఆవశ్యకత గురించి అవగాహన పత్రం ఈ విధంగా వివరించింది.

"కేంద్ర ట్రేడ్ యూనియన్లు, ఏ యూనియన్‌కు అనుబంధం కాని జాతీయ ఫెడరేషన్లు స్వచ్ఛందంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌గా ఏర్పడతాయి. కేంద్ర ట్రేడ్ యూనియనకు అనుబంధంగా వున్న జాతీయ ఫెడరేషన్లు కూడా వాటితో బాటు కాన్ఫెడరేషన్‌కు అనుబంధంగా వుంటాయి."

ఏర్పాటు చేయదలచుకున్న కాన్ఫెడరేషన్ విధి విధానం గురించి అవగాహనా పత్రం ఈ విధంగా వివరించింది. "కార్మికవర్గం ఎదుర్కొనే అన్ని సమస్యలపై కాన్ఫెడరేషన్ అనుబంధ సంస్థలలో ఉమ్మడి అవగాహన పెంపొందిస్తుంది. అందువలన కాన్ఫెడరేషన్ నిర్ణయాలు, మెజారిటీ, మైనారిటీలను బట్టి కాక ఏకగ్రీవంగా వుంటాయి. అందరూ అంగీకరించినదే కాన్ఫెడరేషన్ విధానమవుతుంది. అవగాహన కుదరని అంశాలపై చర్చలు, సంప్రదింపుల ద్వారా ఉమ్మడి అవగాహనకు రావడానికి కృషి జరుగుతుంది.'

(కేంద్ర కార్మిక సంఘాలకు అనుబంధంగా లేని) సంస్థలు కూడా కాన్ఫెడరేషన్‌లో కొనసాగే అవకాశం వున్నందువలన ఆ సంస్థలు చర్చల ద్వారా సంతృప్తి చెందేవరకు తమ వైఖరిని విడనాడవలసిన అవసరం లేదు. విస్తృత పరిధిలో అనేక అంశాలపై ఏకాభిప్రాయం సాధించి, సంయుక్తంగా సమైక్య ట్రేడ్ యూనియన్లు ఉద్యమాలు నిర్వహించడానికి, కాన్ఫెడరేషన్ ఒక వ్యవస్థగా ఉపకరిస్తుంది.

సెమినార్ ఎఐటియుసి సమర్పించిన పత్రం కూడా ట్రేడ్ యూనియన్ ఐక్యతకు సంబంధించి వారి అభిప్రాయాలను సూటిగా ప్రస్తావించింది. ఎఐటియుసి పత్రంలో స్థూలంగా వివిధ ట్రేడ్ యూనియన్ల విలీనాన్ని కోరుతూ, యూనియన్ల విలీనం, కాన్ఫెడరేషన్ ఏర్పాటు ప్రతిపాదనల మీద చర్చల సందర్భంగా తాము కీలకమైన అంశాలుగా భావిస్తున్న ఆ కొన్ని అంశాలను ఆ పత్రంలో ఈ విధంగా తెలిపారు. దిగువ స్థాయిలో ఐక్య వ్యవస్థలో ఏర్పరచిన

అంగీకృత బైలాలు, నిబంధనల కనుగుణంగా పనిచేయడం వల్ల ప్రజాతంత్రయుతంగా వ్యవహరించటం ద్వారా వ్యవస్థాపమైన ఐక్యత సాధ్యమవుతుంది. ముఖ్యంగా ఆందోళనలు, వ్యవస్థాపరమైన వ్యవహారాలలో ఏకాభిప్రాయం లేదా సాధ్యమైనంత ఏకాభిప్రాయం సాధించాలి. గణనీయమైన సంఖ్యలోవున్న మైనారిటీ సభ్యుల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వాలి".

ఆ తరువాత ఎఐటియుసి పత్రంలో ఇంకా ఈ విధంగా చెప్పారు. 'ట్రేడ్ యూనియన్ల ఐక్యత సాధించే దిశలో ఐక్యకార్యచరణ, విస్తృత ఐక్యత కోరుతున్న ఈ వాతావరణంలో ముఖ్యంగా ఎఐటియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్‌లకు అనుబంధంగా వున్న అఖిల భారత ఫెడరేషన్లు సంయుక్తంగా కార్యక్రమం రూపొందించి, ఉమ్మడి అవగాహన కోసం చర్చలు జరిపి, సమన్వయ కమిటీలనేర్పరచి, సంయుక్తంగా సదస్సులు కూడ నిర్వహించాలి. యజమాన్యాలు, ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపే సందర్భంలో ఐఎన్‌టియుసి, బిఎమ్ఎస్ ఇతర ఫెడరేషన్లతో కూడ సంప్రదింపులు జరిపి ఉమ్మడి అవగాహనకు వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఇందుకు అవసరమైన చోట్ల ఉద్యమాలు కూడా చేపట్టాలి. నేడు అనేక ఐక్య ఫెడరేషన్లు సమర్థవంతంగా పనిచేస్తూ, మంచి ప్రభావం కలిగి వున్నాయి."

'కొన్ని కేంద్ర ట్రేడ్ యూనియన్లు, పారిశ్రామిక ఫెడరేషన్లు ప్రస్తుతం ఏర్పాటు చేయతలపెట్టిన కాన్ఫెడరేషన్‌కు దూరంగా వుండాలని భావించినట్లయితే, ప్రస్తుతం వున్న స్పాన్సరింగ్ కమిటీ, సి.పి.ఎస్.టి.యు. జె.సి.ఎలను కొనసాగించి పనిచేయించాలి. వాటిని నిర్లక్ష్యం చేయరాదు.

'దురభిమానం, పక్షపాతము, విరోధం, ఒకరే ఆధిపత్యం వహించే యత్నాలను విడనాడి, సోదర భావంతో, సహకారంతో, పరస్పర గౌరవంతో వ్యవహరించాలి. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసే కాలంలోనూ వ్యవస్థ ఏర్పడిన తరువాత అనుసరించవలసిన ప్రవర్తనా నియమావళి రూపొందించాలి.

రాజకీయాల్లో ఐక్యత గురించి ప్రస్తావిస్తూ "రాజకీయ ప్రమేయం లేని ఐక్యత సాధ్యంకాదని గుర్తించాలని" ఆ పత్రంలో ఉద్ఘాటించారు. ఈ విషయాన్ని వివరిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు. "రాజకీయాలను విస్మరించి వివిధ (ట్రేడ్ యూనియన్) కేంద్రాలు ఏకం కాజాలవు. అది (ట్రేడ్ యూనియన్) ఎదుర్కొనే సమస్యలు రాజకీయ వరమైనవి. అవి ప్రభుత్వ విధానాలు, వైఖరులను బట్టి వుంటాయి. అందువల్ల (ఐక్యంగా వున్నవాటితో సహా) ఏ ట్రేడ్ యూనియన్ కేంద్రమైనా రాజకీయ రహితంగా వుండజాలదు. "ప్రస్తుతం ప్రధాన ట్రేడ్ యూనియన్ ఉద్యమాల మీద రాజకీయ ప్రభావం వుంటుంది."

ఆ పత్రంలో ఇంకా ఇలా పేర్కొన్నారు. ''కానీ అటువంటి ఐక్యసంస్థ (ప్రస్తుత దశలో ఏ స్థాయిలో ఐక్యత సాధించినప్పటికి) ఏ ఒక్క రాజకీయ పక్షం ఆధిపత్యానికి లోబడక స్వతంత్రంగా వుండాలి. ఆ విధంగా ఏర్పడిన ఐక్యసంస్థ పరస్పర చర్చలు,

సంప్రదింపులు వ్యవస్థావేదికలపై ప్రజాస్వామిక చర్చల ద్వారా కార్యక్రమాలకు భంగం వాటిల్ల కుండా సాధ్యమైనంతవరకు ఏకాభిప్రాయంతో కార్యక్రమాలను ఎత్తుగడలను వ్యవస్థాపరమైన అంశాలను నిర్ణయించుకోవాలి.

సెమినార్‌లో హెచ్.ఎం.ఎస్.బి.ఎం.ఎస్. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ అండ్ యూనియన్స్, అలిండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయీస్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్, అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్.ఎం.ఎస్. ప్రతినిధులు కేంద్ర ట్రేడ్ యూనియన్లు వెంటనే విలీనం కావాలని కోరారు. బి.ఎం.ఎస్. ప్రతినిధులు శ్రామికవర్గం అనే పదానికి అభ్యంతరం తెలిపారు. కార్మికుల చేతుల్లోనే సంపద వుందని వారన్నారు. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ స్వతంత్ర జాతీయ ఫెడరేషన్లు అభివృద్ధి చెందుతున్నాయని, వాటలో కొన్నింటికి ఉద్యోగులను, ఉద్యమాలలో సమీకరించగలిగినశక్తి అపారమని అందువలన అటువంటి సంస్థలకు సమాన స్థాయిలో ఫెడరేషన్‌లో చేర్చుకుంటే తప్ప నిజమైన ట్రేడ్ యూనియన్ ఐక్యత సాధ్యం కాదని చెప్పారు. ఇతర యూనియన్ల, ప్రతినిధులు కూడా, కాన్ఫెడరేషన్ రూపంలోగానీ, ఏ ఇతర పద్ధతిలో నైనా గాని శాశ్వత ప్రాతిపదికపై శాశ్వత ఐక్యత అనే అభిప్రాయాన్ని బలపరచారు. శాశ్వత ప్రాతిపదికపై ట్రేడ్ యూనియన్ ఐక్యతకు చేసే యత్నాలకు ఈ సెమినార్ ఒక ముందడుగు.

వివిధ కేంద్ర ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం విషయంలో 1980 డిసెంబరు 31న ప్రభుత్వం సభ్యత్వ తనిఖీ చేసిన తరువాత, తనిఖీ చేసిన సభ్యత్వ పరిస్థితి ఈ విధంగా వున్నది.

## కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాల సభ్యత్వం -1980

| | చెప్పిన సభ్యత్వ సంఖ్య | తనిఖీ చేసిన సభ్యత్వ సంఖ్య |
|---|---|---|
| ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ | 35,09,326 | 22,36,128 |
| భారతీయ మజ్దూర్ సంఘ్ | 18,79,728 | 12,11,345 |
| హింద్ మజ్దూర్ సభ | 18,48,147 | 7,62,882 |

| | | |
|---|---|---|
| యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎల్.ఎస్) | 12,38,891 | 6,21,359 |
| ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ | 10,64,330 | 3,44,746 |
| సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ | 10,33,434 | 3,31,031 |
| యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ | 6,08,052 | 1,65,614 |
| నేషనల్ లేబరు ఆర్గనైజేషన్ | 4,05,189 | 2,46,540 |

---

కార్మిక మంత్రిత్వశాఖ 1994 సభ్యత తనిఖీ లెక్కలను వివిధ ట్రేడ్ యూనియన్ కేంద్రాలకు పంపి అభ్యంతరాలుంటే తెలియచేయమని కోరింది. దాని ప్రకారం సభ్యత్వ సంఖ్య ఈ దిగువ విధంగా ఉన్నది.

| | |
|---|---|
| BMS | 27,69,556 |
| INTUC | 25,87,378 |
| CITU | 17,58,044 |
| HMS | 13,18,804 |
| AITUC | 9,05,975 |
| UTUC(LS) | 4,33,416 |
| UTUC | 2,29,225 |
| NLO | 1,36,413 |
| TUCC | 30,792 |
| NFITU | 3,63,647 |
| HMKP | 3,516 |
| IFTU | 628 |
| | 1,05,47,194 |

ఇటీవల విడుదల చేసిన తాత్కాలిక సభ్యత్య లెక్కల ప్రకారం బి.ఎం.ఎస్. యూనియన్, ఐ.ఎన్.టి.యు.సి.ని అధిగమించింది. 1980లో సభ్యత్వ తనిఖీలో 6వ స్థానంలో వున్న

సి.ఐ.టి.యు. మూడవస్థానానికి చేరుకుని హెచ్.ఎం.ఎస్.ని, ఎ.ఐ.టి.యు.సి.ని అధిగమించింది.

అయితే తనిఖీ కార్యక్రమం యూనియన్ల వాస్తవ సభ్యత్వాన్ని ప్రతిబింబించదు. వివిధ ట్రేడ్ యూనియన్లు తనిఖీ పద్ధతిపై అభ్యంతరాలు తెలిపాయి. ఐ.ఎన్.టి.యు.సి. తప్ప మిగిలిన ట్రేడ్ యూనియన్లు రహస్య బ్యాలెట్ ద్వారా సభ్యత్వ నిర్ణయం జరగాలని కోరాయి. అయితే యూనియన్ల పోరాట పటిమ తనిఖీ చేసిన సభ్యత్వ సంఖ్య పెంపుదలపై ఆధారపడిలేదు. ప్రస్తుత పద్ధతిలో కేంద్ర ట్రేడ్ యూనియన్లు సక్రమంగా రికార్డులు నిర్వహించితే సభ్యత్వ తనిఖీ ప్రకారం లెక్కలు సరిగా వుంటాయి. భారత ట్రేడ్ యూనియన్ రంగంలో బి.ఎం.ఎస్. అగ్రస్థానానికి చేరుకోవటం ఒక నూతన పరిణామం.

బి.ఎం.ఎస్. తనిఖీ చేసిన సభ్యత్వ సంఖ్య గురించి ది స్టేట్స్‌మన్ ఈ విధంగా వ్యాఖ్యానించింది. "ఈ సంఖ్యను జాగ్రత్తగా పరిశీలిస్తే, బి.జె.పి. జాతీయ రంగంలో ఒక బలవత్తరమైన శక్తిగా అవతరించి దేశంలో రెండవ పెద్ద పార్టీగా బలపడిన సందర్భంలో, బి.ఎం.ఎస్. బలం కూడా దానికనుగుణంగా పెరిగిందని విదితమవుతుంది. ఢిల్లీలో బిజెపి బలం పుంజుకున్న దశాబ్ధకాలంలో బి.ఎం.ఎస్. బలం కూడా దానికనుగుణంగా విపరీతంగా పెరిగింది. హిందీ భాషా ప్రాంతంలోని ఐ.ఎన్.టి.యు.సి. బలం కాంగ్రెస్ (ఐ) బలంతో పాటు దిగజారిపోయింది.

జాతీయ ట్రేడ్ యూనియన్ కేంద్రంగా గుర్తింపబడాలంటే ప్రస్తుత నిబంధనల ప్రకారం కనీస సభ్యత్వం, 5,00,000 వుండాలి. అంతేగాక 4 రాష్ట్రాలలో 4 ప్రధాన పరిశ్రమలలో అనుబంధ సంఘాలుండాలి. ఈ నిబంధనల ప్రకారమే బి.ఎం.ఎస్., ఐ.ఎన్.టి.యు.సి., సి.ఐ.టి.యు., హెచ్.ఎమ్.ఎస్., ఎ.ఐ.టి.యు.సి.లు గుర్తింపుకు అర్హత పొందాయి.

మళ్ళీ ట్రేడ్ యూనియన్ ఐక్యతా సమస్యకు వద్దాం. ప్రస్తుత జాతీయ పరిస్థితులలో ఐ.ఎన్.టి.యు.సి., బి.ఎం.ఎస్.లు రెండు పెద్ద ట్రేడ్ యూనియన్ కేంద్రాలుగా అధికారిక గుర్తింపు పొందాయనే విషయం గమనించాలి. అందులో ఒకటి బూర్జువా సంస్కరణవాద పంథా అవలంబిస్తోంది. రెండవది హిందూ మతోద్ధరణ. మళ్ళీ ట్రేడ్ యూనియన్ ఐక్యతా సమస్యకు వద్దాం. ప్రస్తుత జాతీయ పరిస్థితుల్లో అధికారికంగా గుర్తింపు పొందిన రెండు పెద్ద ట్రేడ్ యూనియన్ కేంద్రాలు ఐఎన్‌టియుసి బిఎమ్ఎస్‌లలో ఒకటి (ఐఎన్‌టియుసి) నేరుగా బూర్జువా సంస్కరణవాదుల ఆధిపత్యంలో వుండగా, రెండవది (బిఎమ్ఎస్) హిందూ మత పునరుద్ధరణవాద సిద్ధాంతం ప్రాతిపదికగా పనిచేస్తోంది. సైద్ధాంతిక, రాజకీయ ఈ కారణాలవల్ల ఈ రెండు సంస్థలు ఐక్య కార్యాచరణకు దూరంగా వుండాలని నిర్ణయించుకున్నాయి. అందువల్ల అన్ని ట్రేడ్ యూనియన్ల, ఐక్యత అరణ్యరోదనమే. అయితే వామపక్షా ట్రేడ్ యూనియన్లు వామపక్షాలకు దగ్గరగా వుండే ట్రేడ్ యునియన్లు జాతీయ ఫెడరేషన్ల (వీటిలో కొన్ని ఫెడరేషన్లు

పెద్ద ఎత్తున సభ్యత్వం కల్గివున్నాయి. )తో కలిసి శాశ్వత ప్రాతిపదికన గణనీయమైన స్థాయిలో ట్రేడ్ యూనియన్ ఐక్యతను సాధించడం అసాధ్యమేమీ కాదు. నిరంతరం నిలకడగా, జాగ్రత్తగా కృషి చేయడంతో పాటు, ఆచరణాత్మక కార్యాచరణకు పూనుకుంటే ఈ లక్ష్యాన్ని చేరుకోగలం.

## కార్మికవర్గ నిర్మాణంలో మార్పులు - సమస్యలు, అవకాశాలు

ప్రపంచంలో కొనసాగుతున్న శాస్త్ర, సాంకేతిక విప్లవం, నూతన ఉత్పత్తిశక్తుల ఆవిర్భావానికి, కార్మికవర్గ సాంప్రదాయక వ్యవస్థాగత నిర్మాణంలో మార్పులకు తెరలేపింది. పారిశ్రామిక విప్లవ పర్యవసానంగా ఆవిర్భవించిన ఆధునిక పరిశ్రమల గురించి కార్ల్‌మార్క్స్ ఆ విధంగా పేర్కొన్నారు "పైకి ఒక దానికొకటి సంబంధం లేనివిగానూ, మార్పు చెందనవిగానూ కన్పడుతున్న వివిధ రకాల పారిశ్రామిక ప్రక్రియలు ప్రకృతి విచ్చినాన్ని ఒక క్రమపద్ధతిలో ప్రయోజనాత్మకంగా వినియోగిస్తున్నాయి. ఉత్పత్తిలో శాస్త్ర విజ్ఞానం కీలక పాత్ర పోషిస్తున్నందువల్ల పారిశ్రామిక విప్లవంలో సంకేతాలు వెలువడుతున్న సమయంలో, 1867లో కార్ల్‌మార్క్స్ ఈ మాటలు చెప్పారు. నిజంగా ఈ మాటలు ఎంతో ముందు చూపుతో చెప్పినవి జాగ్రత్తగా, క్రమపద్ధతిలో ప్రకృతి విజ్ఞానాన్ని వినియోగించినట్లయితే, అది ఉత్పత్తి శక్తుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, క్రొత్త సమస్యలును, నూతన అవకాశాలను సృష్టించగలదని, కొనసాగుతున్న శాస్త్ర, సాంకేతిక విప్లవం ధృవపరుస్తోంది.

కొంతమంది శాస్త్రజ్ఞులు వ్యక్తిగతంగా క్రొత్తగా కనిపెట్టిన యంత్రాలతో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. ఆ విధంగా ఆవిరియంత్రం పారిశ్రామిక విప్లవానికి ప్రధానచోధక శక్తిగా పనిచేసింది. అయితే ఆధునికయుగంలో కొత్తగా కనిపెట్టిన యంత్రాలకు ఆ విధమైన ప్రాముఖ్యత లేదు. ఆధునికయుగంలో అనేక రంగాలలో సాధించిన ప్రగతి నిరంతరం శాస్త్ర సాంకేతిక రంగంలో అపరిమితంగా వస్తున్న మార్పులతో అంతస్సంబంధం కల్గివుంది. అవి విస్తృత శాస్త్ర పరిశోధనలు పరీక్షలతో రూపొందించిన ప్రధాన సాంకేతిక ప్రక్రియలో శాఖలు. సైన్స్ మనం కోరుకుంటున్న ఆవిరి యంత్రం వంటిది. సమిష్టి కృషితో సమస్త శాస్త్ర విజ్ఞానాన్ని ఆర్జించిన శాస్త్రజ్ఞుడే ప్రధాన సాంకేతిక శాస్త్రవేత్త" అన్న వాస్తవిక విశ్లేషణ ప్రాతిపదికగా హారీ బ్రేవర్‌మన్ ఈ విధంగా పేర్కొన్నారు. "శాస్త్ర సాంకేతిక విప్లవాన్ని దాని సమగ్ర రూపంలో, కేవలం సైన్స్ విస్తృతమైన ఇంజనీరింగ్ పరిశోధనలు కలబోసిన, ఒక సాధారణ ఉత్పత్తి విధానంగా అర్థం చేసుకోరాదు. రసాయనశాస్త్రం, ఎలక్ట్రానిక్స్, వైమానిక శాస్త్రం (ఎయిరోనాటిక్స్) ఆటోమేటిక్ యంత్రాలు, అణు భౌతిక శాస్త్రం (అటామిక్ ఫిజిక్స్), శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం ఫలితంగా రూపొందిన ఇతర అంశాల్లో కూడ కీలకమైన నైతిక ఆవిష్కరణలు (క్రొత్తగా కనిపెట్టబడిన) ఏమీలేవు. శాస్త్రవిజ్ఞానాన్ని పెట్టుబడిగా పరివర్తన చేయడమే అసలు కీలకమైన నూతన ఆవిష్కరణ".

శాస్త్రీయ సాంకేతిక విప్లవం, ఉత్పత్తి శక్తులలో విప్లవాత్మకమైన మార్పులుతేవడంతో పాటు, శ్రామిక ప్రక్రియలో కూడ విపరీతమైన మార్పులు తెచ్చింది. గుత్తపెట్టుబడుల ఆధిక్యతతో

ఇప్పటికే ఒక పెద్ద గుమాస్తాల వ్యవస్థ అవతరించింది. శాస్త్ర, సాంకేతిక విప్లవం(ఎస్‌టిఆర్), అత్యున్నత నైపుణ్యం గల శ్రామికశక్తిని, సాంకేతిక నిపుణులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రత్యేక విజ్ఞానం గల్గిన కార్మికుల బృందాన్ని వినియోగించే ఒక పెద్ద సేవారంగాన్ని సృష్టించింది.

ఎర్నెస్ట్ మండెల్ ఈ విధంగా వివరించారు. "ఆధునిక పెట్టుబడిదారీ విధానానికి ఉదాహరణగా నిల్చిన పెట్టుబడిదారీ సేవారంగం విస్తరణ", పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తి క్రమంలో నెలకొన్న అన్ని కీలక వైరుధ్యాలను తనదైన శైలిలో బహిర్గతం చేస్తుంది. శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక ఉత్పత్తి శక్తుల విస్తృత వ్యాప్తిని, దీనికనుగుణంగా అభివృద్ధి చెందిన ఈ ఉత్పత్తుల వినియోగానికి సంబంధించి ప్రజల వస్తుగత సాంస్కృతిక అవసరాల పెరుగుదలను ఇది ప్రతిబింబిస్తుంది. అదే సందర్భంలో పెట్టుబడిదారీ విధానంలో ఈ విస్తరణను సాధించే క్రమంలో తలెత్తే వైరుధ్యాలను కూడ ప్రతిబింబిస్తుంది. దీనితోపాటు, సంపాదించే సామర్థ్యాన్ని మించి పెట్టుబడినతిగా సమీకరించడం (ఓవర్ క్యాపిటలైజేషన్ – స్వంత పెట్టుబడితోపాటు అప్పుగా తెచ్చుకున్న పెట్టుబడి మీద సమంజసమైన రాబడి తేవడానికి కంపెనీకి తగినంత ఆదాయం లేకపోవడం – అనువాదకుడు) (పెట్టుబడికి సంబంధించిన అతి అంచనాలవల్ల కష్టాలు), పెట్టుబడులను రాబట్టుకోవడంలో నానాటికి ఇబ్బందులు పెరగడం, ఉత్పత్తి కార్యకలాపాల్లో కార్మికులు సరిగా పాల్గొనకపోవడం, దూరంకావడం, వారి వస్తు వినియోగం తగ్గేవంటివి వస్తాయి."

ప్రతిదేశం లోనూ సేవారంగం బ్రహ్మాండంగా పెరగడం, దానితోపాటు ఆ రంగంలో కార్మికుల సంఖ్య వేగంగా పెరగడం చూస్తున్నాం. భారతదేశంలో కూడ ఇదే పరిస్థితి వుంది. ఇది వరకే చెప్పుకున్నట్లు, సేవారంగంలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద జాతీయ ఫెడరేషన్ల ఆధ్వర్యంలో సంఘటితమై, దేశ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ప్రముఖ స్థానమాక్రమిస్తున్నారు. కాని సేవారంగం ఉత్పత్తిదాయకమవునా ? కాదా ? అనే ప్రశ్న తరచుగా తలెత్తుతోంది. ఉత్పత్తిదాయకంకానట్లయితే, పెట్టుబడిదారీ సమాజంలో వర్గపోరాటం తీవ్రంగా కొనసాగుతున్న దశలో ఈ రంగంలోని కార్మికులు ఏ విధమైన పాత్ర నిర్వహించగలరు ?

ఎర్నెస్ట్‌మండెల్ కూడా ఈ ప్రశ్నను లేవదీశాడు. "సేవారంగంలో వినియోగించిన పెట్టుబడి ఉత్పత్తిదాయకమవునా కాదా? ఈ రంగంలో వేతన కార్మికులు చేసే పని ఉత్పత్తిదాయకమా, అనుత్పత్తిదాయకమా! మొత్తంగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గురించి సమగ్ర పరిశీలన జరిపే సందర్భంలో, సేవారంగంలో పెట్టుబడి పరిమితంగా వున్నట్లయితే ఈ ప్రశ్నకు పెద్దగా ప్రాధాన్యత నివ్వనక్కరలేదు. అయితే ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో సేవరంగం సామాజిక పెట్టుబడిలో గణనీయమైన భాగాన్ని ఇముడ్చుకునేటంతగా విస్తరిస్తే, ఉత్పాదక పెట్టుబడికి సంబంధించి నిర్దిష్ట పరిమితిని నిర్వచించడానికి ప్రాముఖ్యత ఏర్పడుతుంది. పెట్టుబడిదారీ విధానంలో అదనపు విలువను సృష్టించేదే ఉద్పాదక పెట్టుబడి అనే నిర్వచనం సరిపోదని మండెల్ వ్యాఖ్యానించారు. ఇది సక్రమమైన వ్యాఖ్యానం.

ఆయన చెప్పినది సరైనదే ఐనప్పటికీ, ఆయన కొత్తగా చెప్పిందేమీలేదు. ఇది ఉత్పాదక శ్రమ పరిధులు ఏమిటి అనే ప్రశ్నకు దానిలో జవాబు లేదు. దానినే వేరే విధంగా చెప్పారు.

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిశోధన, అభివృద్ధి శరవేగంతో సాగినందువలన అత్యధిక నైపుణ్యంగల మేధావులైన కార్మికుల అవసరం తీవ్రంగా పెరిగింది. కార్మిక వర్గనిర్మాణంలో వచ్చిన నూతన మార్పు గురించి మండెల్ ఈ విధంగా విశ్లేషించాడు. శాస్త్ర విజ్ఞానం, పరిశోధన – అభివృద్ధి (ఆర్ఎఫ్డి) లతో, వేగంగా సాగిన సాంకేతికపరమైన నూతన ఆవిష్కరణలు (క్రొత్త విషయాలుకనుగొనడం) వైజ్ఞానిక మేధావి కార్మికవర్గం అభివృద్ధికి దారి తీశాయి. ఈ విధంగా మేధావులు, ఉద్పాదక కార్యకలాపాలు భారీ స్థాయిలో ఏకంకావడంతో ఉత్పత్తిరంగంలో మేధావి కార్మికవర్గం ప్రవేశించింది.”

ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, టెలికమ్యూనికేషన్లు, ఆరోగ్య విద్యారంగాలు ఇతర అనుబంధ సేవా రంగ సంస్థలు భారీగా విస్తరించడంతో గుమాస్తాలు, నిపుణులైన మేధావులైన కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగి కార్మిక వర్గ వ్యవస్థాగత నిర్మాణంలో తీవ్రమార్పులు వస్తున్నాయి.

విప్లవాత్మక ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని దృష్టిలో వుంచుకున్నప్పుడు, వేగంగా పెరుగుతున్న ఈ తరగతికి చెందిన గుమాస్తాలు, నిపుణులైన మేధావి కార్మికుల పాత్ర ఏమిటి ?

ఈ నూతన కార్మికవర్గం సామాజికంగా పెటీబూర్జువా వర్గానికి చెందినదనే ప్రాతిపదికపై మార్లిన్ డిక్సన్ అనే మరో మార్క్సిస్టు మేధావి వారి పాత్రను గురించి ఈ విధంగా వివరించారు.

“పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానంలో తీవ్రమవుతున్న సంక్షోభం నూతన పెటీబూర్జువా వర్గంపై ఒత్తిడి ప్రారంభించినప్పుడు, ఆర్థికంగా కుంచించుకుపోయిన మునుపటి పెటీబూర్జువా వర్గం శ్రామిక వర్గ స్థాయికి దిగజారుతుంది. విశేష సంఖ్యలోని పెటీ బూర్జువా కార్మికులకు కూడ ఈ పరిస్థితి ఏర్పడుతుంది. దీనితో ఆ వర్గం సమీకరణ మొదలవుతుంది. ఆ పరిస్థితులు ఉత్పన్నం కాగానే పెటీబూర్జువా వర్గం ఈ మూడింటిలో ఒక మార్గాన్ననుసరించే పరిస్థితి ఏర్పడుతుంది. 1) అన్ని రంగాలకు చెందిన పెటీబూర్జువా వర్గం మొత్తంగా ఉన్మాదకరమైన నిరాశా నిస్పృహలకులోనై, పూర్వపు భౌతిక సుఖాలు, భద్రత మళ్ళీ లభిస్తాయనే పిచ్చి భ్రమతో ఫాసిస్టు, అభివృద్ధి నిరోధక శక్తులవైపు మొగ్గుతుంది. 2) మిశ్రమ ఆర్థిక విధానంతో శ్రేయోరాజ్యం ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం ద్వారా వేలాది ఉద్యోగాలు కల్పించవచ్చుననే అవకాశవాద సోషల్ డెమొక్రసీ విధానాన్ని ఎంచుకుంటారు. ఇది నూతన అమెరికన్ ఉద్యమం (ఎన్ఎమ్) లాంటిది. అమెరికాలో ప్రజాస్వామ్య సోషలిజం స్థాపనకు ఉద్దేశించిన ఉద్యమం ప్రజలందరకు భౌతిక సుఖాలు భద్రత కల్పించే సమాజాన్ని సృష్టించడం వీరి లక్ష్యం. 3) హక్కులను హరించే వారి హక్కులను హరించివేసి, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల అణచివేత, దోపిడీల నుండి, అంతిమంగా మానవజాతిని వర్గపాలన కబంధ హస్తాల నుండి

విముక్తి చేసే సమాజాన్ని స్థాపించేందుకు, జనాభాలో అత్యధిక సంఖ్యాకులుగా వున్న శ్రామికవర్గం నాయకత్వంలో, అణచివేతకు దోపిడీకి గురవుతున్న ప్రజలదీ నిజమైన ఐక్య సంఘటన ఏర్పాటు.

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో రెండవ మార్గానికి పూర్తిగా అవకాశం పోయింది. మొదటిది, మూడవ మార్గాలలో ఏదో ఒకటి అనుసరించాలి.

మనం అనుసరించాల్సిన మార్గాల ఎంపికను గురించి చర్చించే ముందు, కార్మికవర్గ పొందికలో వచ్చిన మార్పును కూడా విశ్లేషించాలి.

సేవలందించే శ్రమ గురించి మార్క్స్ ఈ విధంగా చెప్పాడు. "వస్తువు లేక శ్రమ యొక్క వినియోగపు విలువ సేవల వినియోగం వలన ఏర్పడుతుంది." కానీ వస్తువులను ఉత్పత్తి చేయటానికి నియమించబడిన కార్మికుడు పెట్టుబడిదారులకు సేవచేస్తాడు. ఈ సేవల వలన ఒక ప్రయోజనకరమైన, అమ్మటానికి వీలైన వస్తువు రూపుదాలుస్తుంది. కానీ శ్రమ వలన ఒనగూరిన ప్రయోజనకర పరిణామాలు అమ్మడానికి వీలైన వస్తురూపం దాల్చనప్పుడు భిన్నమైన పరిస్థితి ఏర్పడుతుంది. బ్రేవర్‌మాన్ ఈ పరిస్థితుల గురించి బ్రేవర్‌మాన్ ఇచ్చిన వివరణ తర్కబద్ధంగా వున్నది. ఆయన ఈ విధంగా పేర్కొన్నాడు. "శ్రమ వలన కలిగే ప్రయోజనాలు వినియోగదారునికి నేరుగా అందించలేనప్పుడు, వాటిని పెట్టుబడిదారుడికి అమ్ముతారు. అతను వాటిని తిరిగి సరుకుల మార్కెటులో అమ్ముతాడు. అప్పుడు సేవారంగంలో పెట్టుబడిదారీ విధాన తరహా ఉత్పత్తి మొదలవుతుంది."

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలలో సేవ కూడా అదనపు విలువను సృష్టించే ఉత్పాదక శ్రమ అని బ్రేవర్‌మాన్ సులభరీతిలో వివరించాడు.

"పెట్టుబడిదారీ విధాన చరిత్రలో ఉత్పాదక శ్రమ ఏదో ఒక రూపంలో కొన్ని నిర్దిష్ట రంగాలలో ఎక్కువ పాత్ర నిర్వహిస్తుంది. శ్రమలో వున్న వివిధ రూపాల మధ్య వున్న తారతమ్యాలను రూపుమాపటం దాని లక్షణం ముఖ్యంగా గుత్త పెట్టుబడిదారీ శకంలో ఆర్థిక సూత్రాలను ప్రత్యేకంగా ఎంచుకున్న శ్రామిక ప్రక్రియపై ఆధారపడి నిర్మించటం అర్థరహితమవుతుంది. వివిధ రూపాలలో వున్న శ్రామిక ప్రక్రియలు పెట్టుబడిదారీ విధానం అధ్వర్యంలో, లాభదాయకమైన పెట్టుబడుల పరిధిలోకి వస్తాయి. ఇవన్నీ సంక్షిప్తమైన, లేదా సార్వజనీన రూపంలో పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రవేశించి పెట్టుబడిని అభివృద్ధి చేస్తాయి. నేటి ఆధునిక 'కార్పొరేషన్'లలో అన్ని రకాల శ్రమను ఏ విధమైన తేడా లేకుండా నియోగిస్తారు. వివిధ ప్రక్రియలు నిర్వహించే బహుళ జాతి కార్పొరేషన్‌లలో కొన్ని విభాగాలు ఉత్పత్తిని, కొన్ని వ్యాపారాన్ని, మరి కొన్ని బ్యాంకింగ్ కార్యకలాపాలను, మరి కొన్ని గనుల త్రవ్వకాన్ని, ఇంకనూ కొన్ని 'సేవ'లను అందిస్తాయి. అన్నీ శాంతియుతంగా కలిసి వుంటాయి. చివరగా బ్యాలన్స్ షీట్లు వేసి లెక్కలు తేల్చేటప్పుడు అన్ని విధాల శ్రమ అంతర్ధానమై కేవలం విలువ రూపంలో కనిపిస్తుంది."

గుత్త పెట్టుబడిదారీ విధానం, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే బహుళజాతి కార్పొరేషన్లు ఆధిపత్యం చలాయిస్తున్న ప్రస్తుతదశలో 'సేవ' కూడా పెట్టుబడిదారులకు అదనపు విలువను సృష్టించడంలో స్పష్టమైన పాత్ర నిర్వహించి, ఉత్పాదక శ్రమలో భాగమవుతుంది.

గుమాస్తా పని చేసే వారి గురించి బ్రేవర్‌మన్ నిర్దిష్టమైన, సమంజసమైన వివరణనిచ్చాడు. 'పాతతరం మార్క్సిస్టులకు ఉద్యోగులు లేదా తెల్ల చొక్కా కార్మికులుగా పిలువబడే వారితో చిక్కు వచ్చిపడింది. మార్క్సిస్టు వ్యతిరేకులు దీనిని శ్రామిక వర్గ సిద్ధాంతం తప్పని రుజువు చేసే నిదర్శనంగా హర్షించారు. అయితే ఆఫీసులో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు జీతాలకు పనిచేసే శ్రామికులుగా ఒకే వర్గంగా ఏర్పడి శ్రామిక వర్గ సిద్ధాంతాన్ని నిర్ద్వంద్వంగా నిరూపించారు. మధ్యతరగతికి చెందిన వారు శ్రామిక వర్గేతరులుగా భావించే పోకడలు మారి, పెద్ద సంఖ్యలో నున్న వీరు క్రొత్త రూపంలో శ్రామిక వర్గంగా రూపొందారు. ఉద్యోగాల్లో నెలకొన్న పరిస్థితులవల్ల ఈ ఉద్యోగులు అనేక విషయాల్లో పారిశ్రామిక కార్మికుల మీద వున్న ఆధిక్యతను కోల్పోయి, వేతనస్కేళ్ళ విషయంలో దాదాపు అట్టడుగు స్థాయికి చేరుకున్నారు. పైన చెప్పిన వివరణ వాస్తవమైనది. పైన చర్చించి విషయాలను గమనిస్తే, పాత కాలం నుండి 'తెల్లచొక్కా, 'నీలి చొక్కా' ఉద్యోగాల మధ్య వున్న వ్యత్యాసాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని స్పష్టమవుతుంది.

నేడు అత్యంత ఆధునిక పరిశ్రమలలో అత్యున్నత సాంకేతిక నైపుణ్యత గల కార్మికుల సమస్య ఉత్పన్నమవుతోంది. నిజమే! వారికున్న నైపుణ్యం, సాంకేతిక విద్య పరిగణనలోకి తీసుకుని వారిని ఇతరులతో పోల్చుకుంటే హెచ్చు జీతాలు చెల్లిస్తున్నారు. అయితే పెట్టుబడిదారీ వుత్పత్తి సంబంధాలలో వారు కూడా అదనపు విలువను సృష్టిస్తున్నారు. అందువలన వారు చేసే శ్రమ కూడ ఉత్పాదక శ్రమ క్రిందకే వస్తుంది.

సేవారంగ కార్మికులుగా, గుమాస్తాలుగా, సాంకేతిక నైపుణ్యం గల కార్మికులుగా వివిధ తరగతులకు చెందిన కార్మికులు విప్లవాత్మక ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో సానుకూల విధమైన పాత్ర నిర్వహిస్తారా అనే అంశం మార్లిన్ డిక్సన్ చెప్పిన మూడు మార్గాలలో ఏదో ఒక దానిని అనుసరించటానికి వీలుగా వారి అభీష్టంపై ఆధారపడి లేదు. వారు కూడా దోపిడికీ, హక్కు నిరాకరణకు గురవుతున్నారా? లేదా? పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో సంక్షోభ భారం క్రింద నలిగిపోతున్నారా లేదా అనే విషయాలపై ఆధారపడి వుంటుంది. వారు ఈ విధమైన కష్టాలకు లోనవుతున్నారు. ఈ భౌతిక పరిస్థితులు వారి ఇష్టానుసారం ఏర్పడినవి కాదు. ఈ పరిస్థితులు వారిపై ఒత్తిడి కలుగచేస్తాయి. ఈ పరిస్థితుల వల్ల ఈ తరగతులకు చెందిన కార్మికులు నేడు సాధారణ ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటున్నారు. సంక్షోభం తీవ్రమయ్యే కొద్దీ, వారు మరింతగా పారిశ్రామిక కార్మికవర్గంతో ఏకమవుతున్నారు. పూర్వపు సాంప్రదాయాలు, వారసత్వం వలన ఏర్పడే సంశయాలు, అస్థిరమనస్తత్వం వలన కొంతమంది జారిపోయే అవకాశం కూడా వున్నది. కానీ సంక్షోభభారం ఈ అభ్యంతరాలను త్వరితంగా పటాపంచలు

చేస్తోంది. పారిశ్రామిక కార్మికవర్గం చేసే పోరాటంలో వారు కూడా భాగస్వాములవుతున్నారు. భారతదేశంలో మన అనుభవాలు నానాటికి అభివృద్ధి చెందుతున్న ఈ పోకడలను ధృవపరుస్తున్నాయి.

భారతదేశంలో కార్మికవర్గ నిర్మాణ పొందికలో వచ్చిన మార్పు కొన్ని వైరుధ్యాలను కల్పించింది. భారతదేశంలో ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే పరిశ్రమలతో బాటు వాటి ప్రక్కనే పురాతన సాంప్రదాయ ఉత్పత్తి పద్ధతులతో నడిచే పరిశ్రమలు కూడా వున్నాయి. ఉదాహరణకు ఆధునికీకరించబడ్డ స్టీలు పరిశ్రమ లేదా బి.హెచ్.ఇ.ఎల్. వంటి పరిశ్రమలలో ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి జరుగుతోంది. అందువల్ల ఆ పరిశ్రమలలో ఎక్కువ నైపుణ్యం గల శ్రమశక్తి కావాలి. జూట్, టెక్స్‌టైల్ పరిశ్రమలలో ఏ విధమైన ఆధునీకరణ లేకుండా పాత పద్దతులలో ఉత్పత్తి సాగుతోంది. ఈ పరిశ్రమలలో వస్తూత్పత్తిలో ఎక్కువ శారీరక శ్రమనుపయోగిస్తారు. అందువల్ల ఆధునిక ఫ్యాక్టరీలు, పురాతన సాంప్రదాయ పరిశ్రమలలోని శ్రామికశక్తికి గల తేడా స్పష్టంగా కనపడుతుంది. ఆధునిక పరిశ్రమలలో ఉన్నతస్థాయి నైపుణ్యం సాంకేతిక పరిజ్ఞానం నేపథ్యంతో పనిచేసే కార్మికవర్గానికి, ఉన్నతస్థాయి నైపుణ్యం, హెచ్చు జీతాలు, మంచి పని పరిస్థితులు వంటి ఆధునిక కార్మికవర్గానికి వుండవల్సిన లక్షణాలన్నీ వున్నాయి. ఆధునీకరణ లేని సాంప్రదాయ పరిశ్రమలలోని కార్మికులు ఎక్కువ శారీరక శ్రమ శక్తిని వినియోగించి, తక్కువ జీతాలతో, దుర్భరమైన పని పరిస్థితులలో మనుగడ సాగించవల్సి వస్తోంది.

బొంబాయిలోని ఓడరేవు, నౌకానిర్మాణకేంద్రం (పోర్ట్ అండ్ డాక్) లోని పని పరిస్థితులను, దాని ప్రక్కనే నూతనంగా నిర్మించిన నవ సేవా పోర్టులోని పనిపరిస్థితులను పోల్చి చూస్తే, ఈ తేడా కొట్టవచ్చినట్లు కన్పడుతుంది. అత్యంత ఆధునికీకరించిన క్రొత్త పోర్టులో తక్కువ మంది కార్మికులు, ఉన్నతస్థాయి నైపుణ్యంతో కంప్యూటర్ల మీద ఏ విధమైన శారీరక శ్రమ లేకుండా పని చేస్తారు. అయితే పాత పోర్టులో అక్కడున్న పని స్వభావాన్ని బట్టి, వున్నతస్థాయి నైపుణ్యం అవసరం లేనందువల్ల ఎక్కువ మంది కార్మికులు విపరీతమైన శారీరక శ్రమ చేస్తారు. ఆ విధంగా ఆధునిక కార్మిక వర్గం, సాంప్రదాయక కార్మిక వర్గం ప్రక్క ప్రక్కనే కన్పిస్తాయి. భారతదేశంలో అత్యధికంగా కార్మికులు పనిచేసే అసంఘటిత రంగంలో వేతనాలు, శారీరక శ్రమ, పనిపరిస్థితులు దుర్భరంగా వుంటాయి.

ఈ విరుద్ధ పరిస్థితులు, అసమానతలు భారత కార్మికవర్గ నిర్మాణ పొందికలో ముఖ్యమైన అంశాలు.

గుత్త పెట్టుబడిదారీ విధానం శాస్త్ర సాంకేతిక విప్లవానికి కాలాలకు సంబంధించినవే కాక, పెట్టుబడిదారీ విధానంకి పూర్వమున్న ప్యూడల్ వ్యవస్థకు సంబంధించిన కొన్ని అంశాలు కూడా భారత కార్మిక వర్గంలో ఈ కులం, జాతి, తెగ, ఆడ, మగ తేడాలతో పాటు, పాతకాలపు పితృస్వామ్య సమాజ ఆచార, సాంప్రదాయాల ప్రాతిపదికన కార్మికశక్తి విభజించబడింది. దీనివల్ల కులం, తెగ, లింగ బేధాల పాత్రిపదికన కార్మికవర్గం వివిధ రకాల అసమానతలకు గురయింది.

జాతి, కులాల ప్రాతిపదికన వేతనాలలో అసమానతలతో, బాటు లింగవివక్షత అనే ముఖ్యమైన అంశం భారత కార్మికవర్గ పొందికను ప్రభావితం చేస్తోంది. అత్యధిక సంఖ్యలో మహిళలు, చిన్నఫ్యాక్టరీలలో కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులుగా ఇంటివద్ద బీడీలు ఉత్పత్తి చేస్తూనో అతి తక్కువ వేతనం పొందుతున్నారు. పెద్ద పరిశ్రమలలో ఉన్నతస్థాయి సాంకేతిక నైపుణ్యంతో పనిచేసే మహిళా కార్మికులు దాదాపుగా లేరు.

ఈ పరిస్థితిని ఒక మేధావి ఈ విధంగా వివరించారు.

"భారతదేశ ఆర్థిక వ్యవస్థ అనేక విధాలుగా నిర్మితమైంది. ఉత్పత్తి సంబంధాలలో భూస్వామ్య విధానంతో బాటు పెట్టుబడిదారీ ముఖ్యంగా సామ్రాజ్యవాద ఉత్పత్తి సంబంధాలు కొనసాగుతున్నాయి. ఈ విధంగా బహుళ సామాజిక వ్యవస్థల పాత్రిపదికగా ఏర్పడిన ఆర్థిక వ్యవస్థ. కార్మికవర్గ నిర్మాణంలో ఏర్పడిన తారతమ్యాలకు ఒక కారణం. ఉత్పత్తి వినియోగంలోనూ సంపద సమీకరణలో నెలకొన్న విభిన్నరీతులు, కార్మికవర్గం అనేక రీతులలో వుండటానికి కారణమవుతున్నాయి.

భారత కార్మికవర్గ పొందికలో వున్న ఈ వైరుధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా, ఈ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు తగిన ఎత్తుగడలు చేపట్టకుండా విప్లవ ట్రేడ్ యూనియన్ ఉద్యమం పురోగమించజాలదు.

## పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం- ఒక సాంఘిక విస్ఫోటనం

శాస్త్ర సాంకేతిక విప్లవం వలన పెట్టుబడిదారీ దేశాలలో ఉద్యోగావకాశాలు ఎన్నడూ లేనంతగా పడిపోయాయి. నేడు భారతదేశంతో సహా మూడవ ప్రపంచ దేశాలలో నిరుద్యోగం భయంకరంగా పెరిగిపోవటం సర్వసాధారణమైంది. గత రెండు దశాబ్దాలుగా, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు కూడా పెరిగే నిరుద్యోగ ప్రభావంతో వణికిపోతున్నాయి.

యూరపులో పరిస్థితిని గురించి ఒక మేధావి ఈ విధంగా వివరించాడు. "1970 దశకం మధ్య భాగంలో వ్యవస్థాగత మార్పుల కాలం ప్రారంభమైంది. పునర్ వ్యవస్థీకరణవల్ల బొగ్గు, స్టీలు, టెక్స్ టైల్స్‌వంటి సాంప్రదాయ రంగాలు తాత్కాలికంగా ప్రభావితమవుతాయని, ఈ ఉత్పాదక రంగాల్లో అదనంగా వున్నవాళ్ళ? సేవారంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ కొద్ది కాలమే నిలబడింది. ఆ తర్వాత కూడ లాభాల వేటలో యాంత్రీకరణను విస్తరింపజేయడంతో బ్యాంకులు, ఇతర ఆఫీసుల్లో ఇదే విధమైన పరిణామాలు సంభవించాయి. అక్కడ కూడ నిరుద్యోగం ప్రబలింది. తాత్కాలికంగా వుంటుందని చెప్పిన నిరుద్యోగం శాశ్వతమైంది.

మరో మేధావి ఈ పరిస్థితి గురించి తీవ్రంగా వ్రాసాడు. "ఉత్పత్తి శక్తులకు ఆస్తి సంబంధాలకు మధ్యగల తీవ్రమైన వైరుధ్యం పశ్చిమ యూరపులో నిరంతరం తీవ్రంగా పెరుగుతున్న నిరుద్యోగం ద్వారా బాగా వ్యక్తమవుతోంది. యూరోపియన్ యూనియన్ (ఈ.యు)

దేశాలు, ఓ.ఇ.సి.డి. దేశాల్లో (ఆర్థిక సహకారం అభివృద్ధి సంస్థ దేశాలు)ని ఉన్నత స్థాయిల్లో దీనిని గురించి నిరంతరం చర్చ సాగుతూనే వుంది. ఈ రెండు సంస్థల ప్రతినిధులు ఈ పరిస్థితిని సాంఘిక విస్ఫోటనంగా మరల మరల అభివర్ణిస్తూనే వున్నారు. వోక్స్‌వాగన్ ముఖ్య అధికారి (సిఈఓ) దగ్గర నుంచి యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జాక్విస్ డెలోర్స్ వరకు ప్రతిఒక్కరు 1983లో దీనికి అనేక పరిష్కార మార్గాలు సూచించారు. తక్కువ జీతాలకు పనిని పంచుకోవటం, చిన్న కంపెనీలలో, విద్యా కార్యక్రమాల్లో పెట్టుబడులు పెట్టి ఉద్యోగాలు కల్పించటం వంటి అస్పష్టమైన అర్థరహితమైన పరిష్కార మార్గాలు సూచించారు. బహుళ జాతి కంపెనీలు తొలగించిన లక్షలాది కార్మికులకు చిన్న కంపెనీల్లో ఉద్యోగాలు దొరుకుతాయో ఎవరూ వివరించలేదు. కాని స్వీడన్‌కు చెందిన సోషల్ డెమొక్రాట్లు మాత్రం చిన్న కంపెనీలు, విద్యా కార్యక్రమాల మంత్రం వారానికి మూడు సార్లు జపిస్తున్నారు.

అనేక ఫ్యాక్టరీలు మూతపడటం వలన మరి కొన్నింటిలో కార్మికులు (అవసరానికి మించి) అధిక సంఖ్యలో అదనంగా వున్న పరిస్థితుల్లో యూరపులో ఒక కొత్త విషయం చర్చనీయాంశమైంది. రోజుకో, వారానికో పనికాలాన్ని కొంత తగ్గించి ఫ్యాక్టరీలో అదనపు షిఫ్టులు ప్రవేశపెట్టి, ఈ మిగిలిన కార్మికులకు పని కల్పించాలన్న చర్చలు పెద్ద ఎత్తున సాగాయి. ఆ విధంగా పనిచేసే కాలంతో పాటు జీతాలను కూడా తగ్గిస్తారు. ఒకే పనిని పంచుకోవటం గురించి కూడ పెద్దఎత్తున చర్చజరిగి, కొన్నిచోట్ల క్రమంగా అమలు చేస్తున్నారు. అంటే 7 లేక 8 గంటల నిర్ణీత కాలంలో ఒకే పనిని ఇద్దరు సమానంగా పంచుకొని ఒకరి తరువాత ఒకరు చేస్తారు. అయితే ఇక్కడ కూడ జీతాలు తగ్గిస్తారు. 'మంత్లీ రివ్యూ' అనే పత్రికలో ఒక వ్యాసంలో విషయాన్ని ఈ క్రింది విధంగా వివరించడం జరిగింది.

"వారంలో 4 రోజులు పనిదినాలుగా, వుండాలా, లేదా పనిగంటల సంఖ్య 35 లేక 34 లేక 32 వుండాలా అని చర్చలు సాగుతున్నాయి. ఇది లేబరు యూనియన్లు తమ సభ్యులకు ఎక్కువ విశ్రాంతిని గాని లేదా సభ్యులకు మరింత వెసులుబాటు కల్పించే ఉద్దేశంతో చేసిన ప్రతిపాదనకాదు. యజమానులు తాము తొలగించే కార్మికుల సంఖ్యను తగ్గించడానికి, తొలగింపుకు వ్యతిరేకంగా వున్న కార్మికులతో, తక్కువ జీతాలతో వారంలో తక్కువ రోజులు పనిచేసే విధంగా వారిని బలవంతంగా ఒప్పించడం జరుగుతోంది. ఇది కేవలం సంక్షోభ భారాన్ని కార్మికులపై మోపే యజమానుల ప్రయత్నం మాత్రమే. గత అనుభవాలని బట్టి చూస్తే జాతీయ స్థాయిలో వారు నిజంగా పని గంటలను బాగా తగ్గిస్తారా అనేది అనుమానాస్పదమే. యుద్ధానికి పూర్వం కంటే ఉత్పాదకత బాగా పెరిగింది. వారంలో పనిచేసే కాలం తెలియకుండానే తగ్గిపోయింది. 1936లో పాపులర్ ఫ్రంట్ ప్రభుత్వ కాలంలో ఫ్రెంచి కార్మికులు వారంలో 48 గంటలు పనిచేసే విధానాన్ని సాధించుకున్నారు. ఈనాడు పని కాలాన్ని వారానికి 39 గంటల కంటే తగ్గించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గరిష్టంగా వారానికి 48కి మించి పనిగంటలు వుండరాదని గత నెలలో ఐరోపా ఆర్థిక సమాజం (యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీ–ఈఈసి) నిర్ణయించింది. "పనిచేసే హక్కు" పేరిట

బ్రిటన్ ఆ నిర్ణయానికి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని చూస్తే ఈ హక్కును, దోపిడీకి గురయ్యే హక్కుగా మార్చుతోందన్న నా అనుమానాలు మరింత బలపడుతున్నాయి" పాశ్చాత్య దేశాల్లో సాగుతున్న ఈ దాడులకు మళ్ళీ మహిళలు, వలస కార్మికులే ప్రథమంగా బలి పశువులవుతున్నారు.

పారిశ్రామిక దేశాలలో ఏర్పడిన ఈ ఆర్థిక మాంద్యంలో ఉద్యోగ రక్షణ చట్టాలను తిరగదోడుతున్నారు. ఉదాహరణకు జర్మన్ రిపబ్లిక్‌లో ప్రతి ఉద్యోగిని తొలగించటానికి ముందు నెల రోజులు నోటీసివ్వాలి. 5 సంవత్సరాల సర్వీసున్న (తెల్లచొక్కా కార్మికునికి) ఆఫీసు ఉద్యోగులకు 3 నెలల నోటీసివ్వాలి. 8 నుంచి 12 సంవత్సరాల సర్వీసు గల వారికి 4 నుంచి 5 1/2 నెలల నోటీసు ఇవ్వాలి. శారీరక శ్రమ చేసే సాధారణ కార్మికులకు సర్వీసు కాలాన్ని బట్టి 1 నుంచి 3 నెలల నోటీసు ఇవ్వాలి. ఇతర పశ్చిమ దేశాల్లో కూడ ఇదే విధమైన నిబంధనలున్నాయి. కానీ కార్మికులను పనిలోంచి తొలగించటానికి వీలుగా దాదాపు అన్ని దేశాలలోను ఈ నిబంధనలను తిరోగమన దిశలో మార్చే చర్యలు తీసుకుంటున్నారు.

భారతదేశంలో నిరుద్యోగ పరిస్థితి మరీ భయంకరంగా వున్నది. 1993లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లలో నమోదైన నిరుద్యోగుల సంఖ్య 336 మిలియన్లు (3 కోట్ల 36 లక్షలు), కాగా అదే సంవత్సరంలో ప్లానింగ్ కమిషన్ లెక్కల ప్రకారం ఉద్యోగం చేసే వారి సంఖ్య 307.6 (3 కోట్ల 76వేలు) మిలియన్ల వున్నది. అంటే ఉద్యోగాలు చేసే వారికన్నా నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా వుంది. 1991, 1992 సంవత్సరాలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రయినింగ్ ఇచ్చిన లెక్కల ప్రకారం క్రొత్తగా ఉద్యోగాల కల్పన అసలు లెక్కలోకి తీసుకోదగింది' కాదని స్పష్టమవుతుంది.

| **సంవత్సరం** | **పెరుగుదల శాతం** | | |
|---|---|---|---|
| | **పబ్లిక్‌రంగం** | **ప్రైవేటురంగం** | **మొత్తం** |
| 1991 | 1.52 | 1.24 | 1.44 |
| 1992 | 0.80 | 2.22 | 1.21 |

భయంకరమైన ఈ నిరుద్యోగ పరిస్థితితోబాటు, పెట్టుబడిదారులు లాకౌట్లు, సమ్మెల ద్వారా కార్మికుల మీద తీవ్రమైన దాడి సాగించారని ఈ క్రింది వివరాలు స్పష్టం చేస్తాయి.

**1980లో పారిశ్రామిక సంబంధాలు (సగటున సంవత్సరానికి)**

| | 1979-81 | 1988-90 |
|---|---|---|
| పారిశ్రామిక వివాదాలు (సంఖ్య) | 2831 | 1303 |
| సమ్మెలు | 2485 | 950 |
| లాకౌట్లు | 346 | 322 |
| బాధితులైన కార్మికులు | 21,20,000 | 9,38,000 |
| సమ్మెలలో | 18,79,000 | 7,29,000 |
| లాకౌట్లు | 2,41,000 | 1,76,000 |
| పని దినాల నష్టం | 3.41 కోట్లు | 1.35 కోట్లు |
| సమ్మెలు | 2.30 కోట్లు | 80 లక్షలు |
| లాకౌట్లు | 1.11 కోట్లు | 87 లక్షలు |
| వివాదాల తీవ్రత (రోజులలో) | 16.09 | 14.39 |
| సమ్మెలు | 12.25 | 10.97 |
| లాకౌట్లు | 4.61 | 49.43 |

**గమనిక :** వివాదం వల్ల కార్మికుడు సగటున నష్టపోయిన పనిదినాలు వివాదాల తీవ్రతను సూచిస్తాయి.

పరిశ్రమల మూసివేత, లాకౌట్ల వలన ట్రేడ్ యూనియన్ల బలం క్షీణించి కార్మికుల నిజవేతనాలు, పని పరిస్థితులు దిగజారిపోవడానికి దారితీశాయి.

ఉత్పత్తి రంగంలో మొత్తం ఖర్చులో జీతాలు, బోనసుల వాటా 1970లో 14.8 శాతముండగా 1980 దశకంలో 11.5 శాతానికి దిగజారింది.

ప్రభుత్వం అనుసరించిన నూతన ఆర్థిక విధానాల వల్ల భారత కార్మికవర్గం ఈ విధంగా తీవ్రమైన దాడులకు గురైంది.

## చారిత్రక బాధ్యత

నేడు ప్రపంచం ఒక క్లిష్ట దశలో వున్నది. తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న పెట్టుబడిదారీ విధానం ప్రపంచ ప్రజల ఆ కాంక్షలు తీర్చలేదు. అది కార్మికవర్గ దోపిడీని తీవ్రతరం చేసి అభివృద్ధి చెందే వ్యవస్థ. ఇది భారతదేశానికి కూడా వర్తిస్తుంది. అందువలన అన్ని తరగతుల కార్మికులను, ఉద్యోగులను, వారి విశ్వాసాలు ఏమైనప్పటికి ఐక్యం చేసి వారిని దోపిడీ చేసే వ్యవస్థ నుండి విముక్తి చేసేందుకు, వారిని అంతర్జాతీయ కార్మికోద్యమం విశ్వవాప్తంగా సాగించే పోరాటంలో భాగస్వాములను చేయాలి. మార్క్స్ మాటలలో 'వర్గ వైరుధ్యాలను సరిచేయటం కాదు. వర్గాలనే రద్దు చేయాలి. ప్రస్తుత సమాజానికి మెరుగులు కాదు, నూతన సమాజ స్థాపన' కోసం పోరాటం చేయాలి. విప్లవ కార్మికవర్గం ఈ చారిత్రక బాధ్యతను నిర్వర్తించడానికి మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పినట్లు, "ప్రజాస్వామ్యం కోసం చేసే పోరులో విజయం సాధించటానికి, శ్రామికవర్గాన్ని, పాలక వర్గ స్థాయికి అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం, విప్లవంలో కార్మికవర్గ ప్రథమ కర్తవ్యం.

# 25

# సోవియట్ యూనియన్ మరియు తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు వ్యవస్థ పతనం (1991-95)

## భారతదేశంలో నూతన ఆర్థిక విధానాల

## ప్రవేశం - పర్యవసానాలు

**ఈ** కాలంలోనే ప్రధానమంత్రి శ్రీ రాజీవ్‌గాంధీ మే 21, 1991న పాశవిక హత్యాకాండకు గురయ్యారు. సమర్థులైన ట్రేడ్ యూనియన్ నాయకులు, అనేక మంది ప్రముఖులు అమరులయ్యారు. 6-12-1992న బాబ్రీ మసీదు కూల్చివేత అనంతర మత మారణకాండ ఈ కాలంలోనే చోటు చేసుకుంది. కేంద్రంలో ప్రభుత్వాలు మారాయి. వాటితో పాటు విధానాలు కూడా మారాయి.

కార్మికవర్గం, ఉద్యోగులతో పాటు, యావత్ భారతదేశంలోని సాధారణ ప్రజలను ప్రభావితం చేసే విధంగా, నయా ఉదారవాద ప్రపంచీకరణ ఆదేశాల మేరకు, ప్రభుత్వరంగ పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ, ప్రైవేటీకరణ, బహుళజాతి కంపెనీల ప్రవేశానికి స్వేచ్ఛ కల్పించడం, కార్మిక విధానంలో మార్పులు, వేతన స్తంభన విధానం వంటి ప్రమాదభరిత అంశాలతో కూడిన నూతన ఆర్థిక విధానాలకు 1991లోనే అంకురార్పణ జరిగింది. మండల్ కమిషన్ నివేదిక అమలుకు ప్రకటన వెలువడడం, ఆ తర్వాత దేశం అతలాకుతలం కావడం ఈ కాలంలోనే జరిగింది.

గత అధ్యాయాల్లో పేర్కొన్నట్లు నయా ఉదారవాద దాడులు, బహుళ జాతి కంపెనీల దాడులకు వ్యతిరేకం గానూ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు మన ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించే లక్ష్యంతో, శ్రామికవర్గ ఐక్యతను సాధించే ప్రక్రియలో భాగంగా స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ మరియు ప్రజాసంఘాల జాతీయ వేదిక (నేషనల్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ మాస్ ఆర్గనైజేషన్స్) ఈ కాలంలోనే ప్రారంభించబడ్డాయి.

స్థూలంగా చెప్పాలంటే, దేశ కార్మికవర్గ పోరాట చరిత్రలో ఈ కాలం మిక్కిలి ప్రాధాన్యత సంతరించుకున్న అధ్యాయంగా నిలుస్తుంది.

## అంతర్జాతీయ పరిస్థితి - సోవియట్ యూనియన్ మరియు తూర్పు యూరపు దేశాల్లో సోషలిస్టు వ్యవస్థ తిరోగమనం

గత నాలుగు సంవత్సరాల్లో సంభవించిన నాటకీయ పరిణామాలు కార్మిక వర్గానికే గాక, యావత్ మానవాళి సమస్యలను మరింత క్లిష్టతరం చేశాయి. 1990–91లో మాజీ సోవియట్ యూనియన్ మరియు తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులనెదుర్కొన్నది. సోవియట్ యూనియన్ పలు దేశాలుగా విచ్ఛిన్నమైంది. ఇది కేవలం కార్మిక వర్గానికే గాక యావత్ ప్రపంచానికే మిక్కిలి చేదు అనుభవాలు తెచ్చిపెట్టింది. ఈ పరిస్థితి ప్రపంచ శక్తుల బలాబలాలు సామ్రాజ్యవాద, అభివృద్ధి నిరోధక శక్తులకు అనుకూలంగా, తాత్కాలికంగా మొగ్గడానికి దారితీసింది. అమెరికా సామ్రాజ్యవాదం మరియు ప్రపంచ వ్యాప్తంగా వున్న అభివృద్ధి నిరోధక శక్తులు, ప్రగతిశీలశక్తుల మీద దాడులను ద్విగుణీకృతం చేశాయి. సోషలిజం మరణించిందని, మానవ సమాజ పరిణామ క్రమంలో పెట్టుబడిదారీ విధానమే అంతిమమని, అదే స్థిరమైనదని రోతపుట్టించే దుష్ప్రచారాన్ని ఈ శక్తులు ఉధృతంగా సాగిస్తున్నాయి. ప్రపంచాధిపత్యాన్ని సాధించాలనే లక్ష్యంతో సామ్రాజ్యవాదం తమ “నూతన ప్రపంచ క్రమాన్ని” (శ్రీజూఇ ఇంప్రుఉఈ ంప్రఈజూప్ర) ప్రపంచం మీద రుద్దే ప్రయత్నాలు చేస్తోంది. అంటే, మూడవ ప్రపంచ దేశాలను ఆర్థికంగా దోచుకునేందుకు వీలుగా, సామ్రాజ్యవాద దేశాల దోపిడీ విధానాన్ని కనుగుణమైన ఒక ప్రపంచవ్యాప్త విధానాన్ని ప్రపంచం మీద రుద్దడమన్న మాట! ఐక్యరాజ్యసమితిని సాధనంగా చేసుకుని ఇరాక్ మీద దురాక్రమణకు పూనుకోవడం, సోమాలియాలో అనవసర జోక్యం అమెరికా దురాక్రమణపూరిత ఆధిపత్య వ్యూహానికి ప్రబల తార్కాణాలుగా నిలిచాయి. క్యూబా మీద దిగ్బంధనాన్ని ఎత్తివేయ వల్సిందిగా అమెరికాను కోరుతూ ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ని కూడా అమెరికా ఉల్లంఘించి దిగ్బంధనాన్ని తీవ్రం చేసింది. అమెరికా సముద్ర తీరం నుండి కేవలం 90 మైళ్ళ దూరంలో వున్న ఈ సోషలిస్టు దుర్గం పట్ల అసహనం, కొరియన్ రిపబ్లిక్ (ఉత్తర కొరియా), చైనా, వియత్నాంలలోని సోషలిస్టు వ్యవస్థల మీద బెదిరింపులను కొనసాగించడం చూస్తే, సోషలిజాన్ని మొత్తంగా భూమిమీద నుండి తుడిచిపెట్టేందుకు అమెరికా చేస్తున్న దృఢయత్నాలకు సంబంధించిన వ్యూహాలకు ఇవి సాక్షీభూతంగా నిలుస్తాయి. భారతదేశంతో సహా అనేక మూడవ ప్రపంచ దేశాల మీద కత్తి ఝుళిపిస్తోంది. సామ్రాజ్యవాద వ్యూహాలు, వారి ఆర్థిక ప్రయోజనాల విస్తరణే ఈ బెదిరింపు ఎత్తుగడల లక్ష్యం.

## అంతర్జాతీయ ఆర్థిక సంస్థల దాడులు

అదే సమయంలో తన స్వార్థపూరిత ఆర్థిక ప్రయోజనాల కోసం ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంకు, గాట్ (స్త్రజుఊఊ) యంత్రాంగం ఉపయోగించి, అమెరికా మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోకి చొరబడి, వాటి మీద ఆధిపత్యం చెలాయించ చూస్తోంది. మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దోచుకునేందుకు సంక్షోభంలో కూరుకుపోయిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలకు ఈ ఎంఎన్‌సిలు తాజా సాధనాలయ్యాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఆవిర్భవించిన ఈ ఎంఎన్‌సిలు నయా ఉదారవాద ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తున్నాయి. పాత పద్ధతుల్లో సామ్రాజ్యవాద దోపిడీ ఇక ఏమాత్రం సాధ్యం కాని నేటి పరిస్థితుల్లో, ఆర్థికంగా బలహీనంగా వున్న దేశాల ఆర్థిక వ్యవస్థల్లోకి, తద్వారా ఆదేశాల రాజకీయ వ్యవస్థల్లోకి చొరబడేందుకు, ఈ ఎంఎన్‌సిలు సామ్రాజ్యవాద ఏజన్సీలుగా పనిచేస్తున్నాయి. చివరకు అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్ తదితర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల సామ్రాజ్యవాద కాంక్షలను నెరవేర్చే నిమిత్తం, ఈ దేశాలను (3వ ప్రపంచ దేశాలు) రాజకీయంగా, ఆర్థికంగా లొంగదీసుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. గత రెండు శతాబ్దాలుగా సంపన్న దేశాలు అంతర్జాతీయ రంగంలో ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. వెల్లువలా సాగిన వలస దేశాల విముక్తి అనంతరం అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ దేశాలు, గ్రూప్ ఆఫ్ 77 పేరిట ఏకమయ్యాయి. ఈ దేశాలు ఐక్యరాజ్య సమితిలోనూ, ఐక్యరాజ్యసమితి వాణిజ్యం మరియు అభివృద్ధి సంస్థ (యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) లోనూ ఒక నూతన అంతర్జాతీయ ఆర్థిక క్రమం (శ్రీజూఇ ।శ్రీఊజూప్రశ్రీజుఊ।ంశ్రీజుఉ జ్పూంశ్రీంఖ్పు ంప్రఈజూప్ర) నిర్మించే లక్ష్యంతో, పాశ్చాత్య దేశాలతో విస్తృతంగా సంప్రదింపులు ప్రారంభించాయి. 1980వ దశకంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు వినాశనకర పరిస్థితుల నెదుర్కొన్నాయి. పాశ్చాత్య దేశాల్లోని ఆర్థిక మాంద్య పరిస్థితుల వల్ల, వర్ధమాన దేశాల ప్రాథమిక సరుకుల ఎగుమతులకు ధరలు పడిపోవడంతో, ఈ దేశాలకు పెనుభారంగా మారింది. ఎగుమతుల కంటె దిగుమతులు పెరిగి చెల్లింపుల సమతుల్యం దెబ్బతిన్నది. బడ్జెట్ లోటు పెరిగింది. విదేశీ ఋణభారం పెరిగింది. దీనితో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుండి అప్పులు తీసుకోవల్సిన పరిస్థితులేర్పడి, వాటి ఆదేశాల మేరకు "వ్యవస్థాగత సర్దుబాటు" కార్యక్రమాలకు దాసోహమనవలసిన పరిస్థితి ఏర్పడింది. సరిగ్గా ఈ నేపథ్యంలోనే "డంకెల్ ప్రతిపాదనలు" రూపొందాయి. ఈ దేశాల అభివృద్ధికి సహకారాన్ని పెంపొందించడం గాని, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రవేశానికి సహకరించడం గాని ఈ ప్రతిపాదనల ఉద్దేశం కాదు. పైపెచ్చు ఇది దక్షిణాది దేశాల స్వయం నిర్ణయాధికారాన్ని కాలరాచేందుకుద్దేశించబడింది. (దక్షిణ దేశాలు : ఆఫ్రికా, లాటిన్ అమెరికా, మధ్య ప్రాచ్యంలోని దేశాలతో సహా ఆసియాలోని అభివృద్ధి చెందుతున్న దేశాలు – అనువాదకుడు), అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక సార్వభౌమత్వాన్ని, తద్వారా ఆదేశాల రాజకీయ స్వాతంత్ర్యానికి కూడ

భంగం కల్గించేందుకు అమెరికా, దాని మిత్రదేశాల క్రూరమైన ప్రయత్నాల్లో ఇది భాగం మాత్రమే. ఆ విధంగా బహిరంగ మిలిటరీ జోక్యం, ఆ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోకి చొరబాటు ద్వారా, అమెరికా, దాని మిత్రదేశాలు మిగతా ప్రపంచం మీద, ప్రధానంగా మూడవ ప్రపంచ దేశాల మీద ఎలాగైనా ఆధిపత్యం సాధించాలని కోరుకుంటున్నాయి.

## గాట్ సంప్రదింపులు, డంకెల్ ప్రతిపాదనలు

## ప్రపంచ వాణిజ్య సంస్థగా గాట్ పరివర్తన (1992-1994)

పాశ్చాత్య దేశాల ఆర్థిక ప్రయోజనాల విస్తరణ లక్ష్యంతో ఆనాటి గాట్ డైరెక్టర్ జనరల్ ఆర్థర్ డంకెల్ ప్రతిపాదనలు రూపొందించాడు. భారతదేశంతో సహా మూడవ ప్రపంచదేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక విధానాలు ఇప్పటికే వినాశకర పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఈ దేశాలు సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడికి తలవంచి గాట్ సంప్రదింపుల్లో డంకెల్ ప్రతిపాదనలను ఆమోదించినట్లయితే పరిస్థితులు మరింత విషమిస్తాయి.

భారతదేశ ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా విత్తనాల ఉత్పత్తిని నిరోధించడం, పేటెంట్ నిబంధనల్లో మార్పులు వంటి చర్యలు డంకెల్ ప్రతిపాదనల్లో చోటు చేసుకున్నాయి.

దేశవ్యాప్త నిరసనలు పెల్లుబికినప్పటికీ, భారత ప్రభుత్వం డంకెల్ ప్రతిపాదనలను ఆమోదించింది. ఫలితంగా విత్తనాలు, పురుగుమందులు, ఔషధాలు, టెక్స్‌టైల్స్ ధరలు విపరీతంగా పెరుగుతాయి. ఈ ప్రతిపాదనలు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, టెక్స్‌టైల్స్ రంగం, ఔషధరంగం, బయోటెక్నాలజీ, పరిశోధన – అభివృద్ధి రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసి, దేశం, వ్యవసాయ ముడిపదార్థాలను పాశ్చాత్య దేశాలకు ఎగుమతి చేసి, వారి నుండి తయారైన సరుకులను దిగుమతి చేసుకునే దుస్థితికి దిగజార్చేందుకే, ఈ ప్రతిపాదనలు ఉద్దేశించబడ్డాయి.

ఉరుగ్వేరౌండ్ గాట్ సంప్రదింపుల ప్రక్రియలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు ప్రధానంగా అమెరికా, ఆధిపత్య పాత్ర నిర్వహించాయి. ఈ ప్రతిపాదనల వల్ల అభివృద్ధి చెందిన దేశాలు భారతదేశంతో సహా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను అణిచివేసేందుకు దారితీస్తాయని గాట్ సంప్రదింపుల ప్రక్రియను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీసు రంగాలకు చెందిన ఆర్థిక పరమైన విధానాలు, చట్టాల్లో గాట్ ఒప్పందాని కనుగుణంగా, తీవ్రమైన మార్పులు చేయాల్సి వుంటుంది. డంకెల్ ప్రతిపాదనల్లోనూ, గాట్ ఒప్పందం కొరకు జరిగిన సంప్రదింపుల ప్రక్రియలోనూ నెలకొన్న నిరంకుశ పోకడలను దృష్టిలో వుంచుకునే, డంకెల్ ప్రతిపాదనల ఆమోదం పట్ల దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, ట్రేడ్ యూనియన్లు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. డంకెల్ ప్రతిపాదనలు సృష్టించిన భయాందోళనలతో పాటు భారత ఆర్థిక వ్యవస్థను తన అదుపులోకి తెచ్చుకునేందుకు

అమెరికా తన దేశ చట్టాల్లోని స్పెషల్ 301, సూపర్ 301లను కూడా ప్రయోగించేందుకు సిద్ధమైంది. అమెరికన్ బహుళజాతి కంపెనీలు భారతదేశాన్ని యధేచ్ఛగా దోచుకోవడానికి వీలుగా భారత ఆర్థికరంగ ద్వారాలను బార్లా తెరవాలని అమెరికా డిమాండు చేస్తోంది. ఆర్థిక సంక్షోభంతో పాటు, అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాల నుండి భారత ఆర్థిక వ్యవస్థకు వాటిల్లిన ముప్పును ఈ పరిణామాలు తీవ్రతరం చేస్తాయి. 1994 ఏప్రిల్ 1వ తేదీన, వాణిజ్య సంప్రదింపులకు శాశ్వత వేదిక, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)గా గాట్ రూపాంతరం చెందింది.

**కార్మిక సంఘాల ప్రపంచ సమాఖ్య** (WFTU),

**13వ అంతర్జాతీయ మహాసభ**

1994 నవంబరు 22 నుండి 26 వరకు సిరియా దేశంలోని డమాస్కస్‌లో జరిగిన కార్మిక సంఘాల ప్రపంచ సమాఖ్య (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్) – డబ్ల్యుఎఫ్‌టియు 13వ అంతర్జాతీయ మహాసభ ఒక చారిత్రాత్మక ఘటనగా నిలిచిపోతుంది. నాటి సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు పాలన కూలిన తర్వాత, భిన్న నేపథ్యంలో జరిగిన డబ్ల్యుఎఫ్‌టియు 13వ మహాసభ అనేక అంశాల్లో విభిన్నమైనది. ఒక మూడవ ప్రపంచ దేశంలో, అందునా ఒక అరబ్‌దేశంలో జరగడం ప్రప్రథమం. ఆల్ సిరియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభ అంతర్జాతీయ కార్మికోద్యమం ఎదుర్కొనబోతున్న ప్రమాదాలను సరిగ్గా అంచనా వేసింది. వివిధ దేశాల సార్వభౌమాధికారాన్ని హరించివేసి, ప్రపంచ దోపిడీకి బహుళజాతి కంపెనీల కుటిల ప్రణాళికలను అమలు చేసేందుకు, కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాచి, వారి దోపిడీని తీవ్రతరం చేసేందుకు, అమెరికన్ సామ్రాజ్యవాదం నాయకత్వంలో సామ్రాజ్యవాదుల కుట్రల గురించి మహాసభ పేర్కొంది. అంతర్జాతీయ కార్మికోద్యమం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను, మహాసభ ఆమోదించిన విధానపత్రం ప్రముఖంగా ప్రస్తావించింది. వర్తమాన ప్రపంచం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పెట్టుబడిదారీ విధానం పరిష్కారాలందిస్తుందన్న, సామ్రాజ్యవాదుల వాదనలను మహాసభ తిరస్కరించింది. నానాటికి పెరుగుతున్న సామ్రాజ్యవాద ఒత్తిళ్ళను, ఆధిపత్యాన్ని, తీవ్రమవుతున్న బహుళజాతి కంపెనీల దోపిడీని, ప్రతిఘటించేందుకు కార్మికవర్గం ఐక్యమై అంతర్జాతీయ స్థాయిలో తమ కార్యకలాపాలను సమన్వయం చేసుకోవాలని, విధాన పత్రం అంతర్జాతీయ కార్మిక వర్గానికి పిలుపిచ్చింది. ఈ లక్ష్యసాధనకు, పరిశ్రమలవారీ అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ సంస్థలను తిరిగి కార్యాచరణలోకి దించేందుకు, మహాసభ ప్రణాళిక రూపొందించింది. ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయిస్, జనరల్ సెక్రటరీ శ్రీ సుకొమల్ సేన్‌తో సహా భారతదేశం నుండి ప్రతినిధులు డబ్ల్యుఎఫ్‌టియు మహాసభలో పాల్గొన్నారు. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత జరిగిన మొదటి మహాసభ ఇది.

## నూతన పద్ధతుల్లో మూడవ ప్రపంచ దేశాల దోపిడీ

నూతన పద్ధతుల ద్వారా మూడవ ప్రపంచదేశాల ఆర్థిక దోపిడీకి పాల్పడడంతో పాటు, అమెరికన్ సామ్రాజ్యవాదం సైనిక జోక్యానికి కూడ పాల్పడుతోంది. ప్రధానంగా ఆసియా ప్రాంతంలోని డెమోక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఉత్తర కొరియా) తన అణు కర్మాగారాల తనిఖీకి అనుమతించలేదనే సాకుతో, ఆ దేశంపై అమెరికా ఆంక్షలు విధించడంతో పాటు, సైనికంగా జోక్యం చేసుకుంటానని హెచ్చరించింది. ఇరాక్ అంతర్గత విషయమైన కుర్దుల సమస్యను సాకుగా చూపి, అమెరికా, ఇరాక్ మీద దాడిచేసింది. అనేక సార్లు అత్యధిక ఓట్లతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాలను కూడ ఖాతరు చేయక, అమెరికా అహంకార ధోరణితో క్యూబా మీద నేరపూరిత దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. క్యూబా అంతర్గత వ్యవహారాల్లో తన కుట్రపూరిత జోక్యాన్ని కొనసాగిస్తోంది. మానవ హక్కుల సాకుచూపి, చైనా అనుసరిస్తున్న సామాజికాభివృద్ధి పంథా (సోషలిస్టు)ను మార్చుకోవాలని ఒత్తిడి తెస్తోంది. గాట్, డబ్ల్యుటిఒల్లో చైనా పూర్తిస్థాయి సభ్యత్వం పొందకుండా అడ్డుకుంటోంది. చైనా ప్రాంతీయ సమగ్రతను ప్రక్కన పెట్టి, తైవాన్‌ను అధునాతన ఆయుధాలతో సాయుధం చేసే ప్రయత్నాల ద్వారా, తైవాన్‌ను పావుగా వాడుకోవాలని చూస్తోంది. తన ప్రధాన భూభాగమైన చైనాతో హాంగ్‌కాంగ్ విలీనం విషయమై, హాంగ్‌కాంగ్‌లోని బ్రిటిష్ పాలనా యంత్రాంగం అనేక చిక్కులు సృష్టించింది. అయితే చివరకు 1997 జూలై 1వ తేదీన హాంగ్‌కాంగ్‌ను చైనాకు తిరిగి అప్పగించడం జరిగింది. అదే సమయంలో, పశ్చిమ ఐరోపా సరిహద్దులు దాటి నాటో పరిధిని విస్తరించాలని అమెరికా ఉవ్విళ్ళూరుతోంది.

వ్యవస్థాగత సర్దుబాట్లు, ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ వంటి ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంకు ఆదేశిత నివారణోపాయాల ద్వారానూ, అవధుల్లేని బహుళ జాతి కంపెనీల కార్యకలాపాలు, గాట్ ఒప్పందాలు, దాని అవతారమైన డబ్ల్యుటిఒల ద్వారా ఆర్థిక రంగంలో లోతుగా పాతుకుపోయిన సంక్షోభం నుండి బయటపడేందుకు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఒక ప్రక్క అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోనూ శ్రామికులు, పెట్టుబడికి మధ్య వైరుధ్యాలు తీవ్రమవుతుండగా, వేరొక ప్రక్క, ఆర్థిక ఆధిపత్య విస్తరణ, వాణిజ్య పోటీల విషయమై పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల మధ్య వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి.

## ప్రపంచ వాణిజ్య సంస్థ డబ్ల్యుటిఒ (WTO) - దాని పాత్ర

మూడవ ప్రపంచ దేశాల దోపిడీకి సంబంధించినంత వరకు సామ్రాజ్యవాదులు కొంత మేరకు ఐక్యంగానే వుంటున్నారు. ఆర్థిక సమస్యల పరిష్కారానికి, రాజకీయ, విదేశాంగ విధానాలకు సంబంధించిన అంశాల్లో సమన్వయం కోసం, బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల కూటమి జి-7, (అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడా) క్రమం తప్పక సమావేశాలు జరుపుతోంది. ఆర్థిక రంగంలో తమ అంతర్గత విభేదాలను

పరిష్కరించుకుని, 1994 గాట్ ఒప్పందం చేయడంలోనూ, డబ్ల్యుటిఒ స్థాపించడంలోనూ, సామ్రాజ్యవాదం విజయవంతమైంది. మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దోచుకుని, దండుకున్న లాభాలను తరలించుకుపోయేందుకు, ఈ ఒప్పందం సామ్రాజ్యవాద పెట్టుబడికి, ఎంఎన్‌సి లకు చట్టబద్ధమైన లైసెన్స్ ఇచ్చింది. తమ దేశీయ విధానాల్లో సార్వభౌమాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యాలను నీరుగార్చే మార్పులను ఈ ఒప్పందం మూడవ ప్రపంచ దేశాల మీద రుద్దుతోంది. మూడవ ప్రపంచ దేశాలమీద ఐఎంఎఫ్., ప్రపంచ బ్యాంకుల ఆధిపత్యం కొనసాగడంతో పాటు, ఆ సంస్థల షరతుల అమలు ఫలితంగా, ఆ దేశాల నుండి వనరులు అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ ప్రపంచానికి తరలుతున్నాయి. అంటే మూడవ ప్రపంచ దేశాల వనరుల దోపిడీ కొనసాగుతోంది. డబ్ల్యుటిఒ ద్వారా సామ్రాజ్యవాదుల కుతంత్రాలు ఇందుకు మరింత సహకరించాయి. 1996 డిసెంబర్‌లో డబ్ల్యుటిఒ సభ్యదేశాల మంత్రుల స్థాయి సమావేశం సింగపూర్‌లో జరిగింది. మూడవ ప్రపంచ దేశాల్లో చౌకగా లభించే శ్రమశక్తిని దృష్టిలో వుంచుకుని, కార్మిక ప్రమాణాలు పాటించే విధంగానూ (ఇది వాస్తవానికి ఐ.ఎల్.ఒ పరిధిలోని దైనప్పటికి) అభివృద్ధి చెందుతున్న దేశాలకు నష్టదాయకంగా ఉండే విధంగా పెట్టుబడులకు సంబంధించిన షరతులను (పెట్టుబడుల మీద బహుళ పక్ష ఒప్పందాలు), సమావేశ నిర్ణయాల్లో చేర్చే విధంగా సమావేశాన్ని ఒప్పించడానికి, సామ్రాజ్యవాద దేశాలు, ప్రత్యేకించి అమెరికా ఏ విధంగా ఒత్తిళ్ళు తెచ్చింది సమావేశంలో బహిర్గతమైంది. దురదృష్టవశాత్తు భారతదేశం మరియు మూడవ ప్రపంచ దేశాలు ఈ కీలక అంశాల్లో రాజీపడ్డాయి.

## బలహీనపడుతున్న అలీనోద్యమం

ఇదే సమయంలో అలీనోద్యమం గణనీయంగా బలహీనపడింది. అలీనోద్యమంతో పాటు లీగ్ ఆఫ్ అరబ్ స్టేట్స్ వంటి సంస్థలు సాధారణంగానే సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావాన్ని కోల్పోతున్నాయి. అయినప్పటికీ, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 1992లో జరిగిన ధరిత్రీ సదస్సు, 1993లో జెనీవాలో జరిగిన మానవ హక్కుల సదస్సు, 1994 సెప్టెంబర్‌లో కైరోలో "జనాభా – అభివృద్ధి" అనే అంశం మీద జరిగిన సభ, 1995 మార్చిలో కోపెన్‌హాగెన్‌లో జరిగిన సామాజిక అభివృద్ధి సమావేశం, 1996 అక్టోబరులో జరిగిన పర్యావరణ పరిరక్షణ సదస్సు, 1996 డిసెంబర్‌లో జరిగిన ఆహార సదస్సు వంటి అంతర్జాతీయ సమావేశాల్లో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు, మూడవ ప్రపంచ దేశాలకు మధ్యనున్న వైరుధ్యాలు వ్యక్తీకరించబడ్డాయి. కాని అదే సమయంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక స్థానానికి (NON-PERMANENT SEAT) 1996 అక్టోబరు 21న జరిగిన ఎన్నికల్లో జపాన్ మీద భారతదేశం 140–40 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యింది. అంటే సామ్రాజ్యవాద స్వభావం కలిగి, ప్రపంచాన్నే రక్తసిక్తం చేసిన చరిత్ర గల్గిన ఆర్థిక దిగ్గజం జపాన్‌కు వ్యతిరేకంగా మూడవ ప్రపంచ దేశాల మధ్య సంఘీభావం కొరవడిందని స్పష్టమవుతుంది. అనేక అలీన దేశాలతో పాటు, కనీసం 130 దేశాలు భారతదేశానికి ఓటు వేస్తామని వ్రాతపూర్వకంగా

హామీ ఇచ్చినప్పటికీ, ఈ విధంగా జరిగినట్లు ప్రసార సాధనాలు పేర్కొన్నాయి. ఈ ఎన్నికలో వివిధ దేశాలకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు, అధికారులకు జపాన్ ఆర్థిక సహాయం, పెట్టుబడులు, చివరకు లంచాలు కూడ ఇవ్వజూపినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. భద్రతా మండలిలో తాత్కాలిక స్థానాన్ని గెల్చుకునేందుకు జపాన్ ధన బలాన్ని వినియోగించినట్లు వచ్చిన ఆరోపణలు చూస్తే, చిన్న దేశాల ఓట్లను ధనిక దేశాలు కొనుగోలు చేసే ఒక ప్రమాదకర పోకడను నెలకొల్పినట్లు స్పష్టమవుతుంది.

## దక్షిణాఫ్రికా ప్రజల ఘనవిజయం

సామ్రాజ్యవాదులు ఎన్ని అవరోధాలు సృష్టించినప్పటికీ దక్షిణాఫ్రికా ప్రజలు ఘనవిజయం సాధించారు. నెల్సన్ మండేలా అధికారం చేపట్టడంతో దక్షిణాఫ్రికా ప్రజలకు నూతనాధ్యాయం ప్రారంభమైంది. వర్ణవివక్ష పాలనకు స్వస్తి చెప్పడం జరిగింది. న్యూ నేషనల్ పార్టీ నాయకులు డీక్లార్క్, ఇంకాతా ఫ్రీడమ్ పార్టీ నాయకులు బుతెలాజీలతో పాటు దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీతో కలిసి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్థిక వ్యవస్థ పగ్గాలను తన చేతిలో వుంచుకుని సామ్రాజ్యవాదుల మద్దతున్న శ్వేతజాతి మైనారిటీ ప్రభుత్వం, నూతన ప్రభుత్వం మీద ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ నూతన రాజ్యాంగం ఆమోదించబడింది. ప్రజా బాహుళ్యం ఆకాంక్షలు నెరవేరవల్సి వుంది.

## ఇతర ప్రధాన అంతర్జాతీయ పరిణామాలు

నేపాల్‌లో కమ్యూనిస్టుల నాయకత్వంలోని మైనారిటీ ప్రభుత్వం అధికారం కోల్పోయిన తర్వాత, వామపక్ష వ్యతిరేక శక్తులతో కూడిన నూతన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. నేపాల్ శ్రామిక ప్రజానీకం గతంలో సాధించుకున్న విజయాలను నిలబెట్టుకుని, తమజీవన పరిస్థితులు, ట్రేడ్ యూనియన్, ప్రజాతంత్ర హక్కులపై జరుగుతున్న దాడులను నిలువరించేందుకు పోరాడుతున్నారు. శ్రీలంకలో 1994 ఎన్నికల తర్వాత శ్రీమతి చంద్రికా బండారనాయకే కుమారుతుంగా అధ్యక్షులుగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. వామపక్షపార్టీ ఈ ప్రభుత్వంలో భాగస్వాములయ్యాయి. తమిళ మైనారిటీలు అధికంగా వున్న తూర్పు, ఉత్తర ప్రాంతాలకు విస్తృత స్వయం ప్రతిపత్తి, కల్పిస్తామని, అధికారాలు బదిలీ చేస్తామని నూతన ప్రభుత్వం నూతన ప్రతిపాదనలు చేసింది. సంప్రదింపుల ద్వారా ఒప్పందానికి ఎల్‌టిటిఇ నిరాకరించడంతో యుద్ధం కొనసాగుతూనే వుంది. యుద్ధం వల్ల పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరగడమేగాక, శ్రీలంక ఆర్థిక వ్యవస్థ తీవ్ర వినాశనానికి గురైంది. ప్రజలకు ప్రజాతంత్ర హక్కులు, ట్రేడ్‌యూనియన్ హక్కులను విస్తరించేందుకు నూతన ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. 1980లో సమ్మె సందర్భంగా తొలగించబడిన సుమారు 7000 మంది ప్రభుత్వోద్యోగులను, డిస్మిస్ అయిన కాలానికి కూడ బెనిఫిట్లు చెల్లించి, వారిని తిరిగి ఉద్యోగాల్లో నియమించడం జరిగింది. ఇది స్వాగతించదగ్గ విషయం. బంగ్లాదేశ్‌లో కూడ ఎన్నికలు జరిగి షేక్ హసీనా ప్రధాన మంత్రిగా అవామీలీగ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో, రాజకీయ అనిశ్చిత పరిస్థితి

తొలగింది. మన పొరుగునే వున్న మయన్మార్‌లో శ్రీమతి అంగ్‌సాన్ సూకీ నాయకత్వంలో సాగిన ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమానికి మయన్మార్ ప్రజల నుండి బ్రహ్మాండమైన మద్దతు లభించింది. అయితే ఆ దేశంలోని మిలిటరీ పాలకులు ఎన్నికల్లో ఆమె సాధించిన విజయాన్ని కూడా ఖాతరు చేయక, ఆమెకు అధికార పగ్గాలు అప్పగించ నిరాకరించారు. తద్వారా ఆమె గొంతు నొక్కి, ప్రజాస్వామ్యం కోసం ఆమె సాగిస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి ప్రయత్నాలు చేయడం, స్వాతంత్ర ప్రియులు, ప్రజాతంత్ర వాదులను తీవ్రంగా కలచివేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోని ప్రజాతంత్రవాదులకు, ఆ దేశంలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలు తీవ్ర ఆందోళన కల్గిస్తున్నాయి. కాబూల్‌ను, ఆఫ్ఘనిస్థాన్‌లోని విస్తార ప్రాంతాలను చేజిక్కించుకున్న తాలిబాన్ ముస్లిం మతోన్మాదులు, 1996 అక్టోబర్‌లో ఆఫ్ఘన్ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ నాయకులు డాక్టర్ నజీబుల్లా జుగుప్సాకర హత్య ద్వారా పాశవికత్వానికి పాల్పడ్డారు. అంతటితో ఆగక స్త్రీ, పురుషులకు సంబంధించి, ప్రధానంగా మహిళలకు సంబంధించి మధ్యయుగాల నాటి మిక్కిలి దారుణమైన సాంప్రదాయాలను ప్రవేశపెట్టడం ద్వారా, మతోన్మాదం, మత ఛాందసవాదం ఎంతగా తెగించగలవో నిరూపించారు. భారతదేశానికి ఉత్తర సరిహద్దులో వున్న ఆఫ్ఘనిస్థాన్‌లో క్రూరమైన ఇస్లామిక్ మతఛాందసవాదం ప్రబలడం, భారత్‌కు మిక్కిలి ఆందోళన కల్గించే అంశం.

## వివిధ దేశాల్లో పెచ్చరిల్లుతున్న మత ఛాందసవాదం

ఈ కాలంలో భారతదేశంలో మత ఛాందసవాదశక్తుల పెరుగుదలతో పాటు, అల్జీరియా, సూడాన్, ఈజిప్ట్, యెమెన్, టర్కీ, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో కూడ ఇస్లామిక్ మత ఛాందసవాదం విజృంభించింది. మతఛాందసవాదం, అది హిందూమత ఛాందసవాదం కావచ్చు లేదా ఇస్లామిక్ లేదా క్రైస్తవమత ఛాందసవాదం కావచ్చు. మత ఛాందసవాదం ఏదైనా వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులను బలహీనపర్చి, కార్మికవర్గ ఐక్యతను, పోరాటాలను విచ్ఛిన్నం చేస్తుంది.

## వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమ నిర్వహణ

ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు నిర్దేశించిన వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమం, ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోని కార్మికుల్లో తీవ్ర అసంతృప్తిని రగిల్చింది. వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాలకు వ్యతిరేకంగా కొన్ని సందర్భాల్లో ట్రేడ్ యూనియన్లు తమ రాజకీయ శక్తిని వినియోగించాయని ప్రపంచ బ్యాంకు రూపొందించిన 1995 ప్రపంచాభివృద్ధి నివేదిక పేర్కొంది. 1991 నుండి ఈ దిశలో భారత ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యలు విజయవంతమైనట్లు కన్పిస్తున్నప్పటికీ, ఇటీవల కాలంలో ప్రభుత్వం చేపట్టిన సరళీకరణ చర్యలను భారతదేశంలోని ట్రేడ్‌యూనియన్లు తీవ్రంగా విమర్శిస్తూనే వున్నాయి. విదేశీ పెట్టుబడులకు ప్రాధాన్యత,

ప్రభుత్వరంగ సంస్థల సంస్కరణల ధ్యేయంతో భారత ప్రభుత్వం చేపట్టిన పరిశ్రమల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన ప్రాథమిక చర్యలను వ్యతిరేకిస్తూ ట్రేడ్ యూనియన్లు దేశ వ్యాపిత జనరల్ సమ్మెలు నిర్వహించాయి. లాటిన్ అమెరికాలోని యూనియన్లు కూడ సుదీర్ఘకాలంగా వ్యవస్థాగత సర్దుబాటు చర్యలను వ్యతిరేకిస్తున్నాయి. విదేశీ అప్పులు, ద్రవ్యోల్బణ సమస్యల పరిష్కారం కోసం బ్రెజిల్లో "క్రుజాడో ప్రణాళిక", అర్జెంటైనాలో "ఆస్ట్రల్ ప్రణాళిక" వంటి సమగ్ర సంస్కరణ కార్యక్రమాలను 1980 దశకంలో సంఘటిత కార్మికోద్యమం వ్యతిరేకించింది. చివరకు తానే నిర్దేశించిన వ్యవస్థాగత సర్దుబాటు చర్యలకు పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చిందని ప్రపంచ బ్యాంకే అంగీకరించవల్సి వచ్చింది.

మూడవ ప్రపంచ దేశాల్లోనే కాక, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో సైతం ఈ వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాలు, సంక్షోభంలో కూరుకుపోయిన ఆర్థిక వ్యవస్థలను రక్షించలేకపోయాయి. ఈ దేశాల్లో తీవ్రంగా పెరిగిపోయిన నిరుద్యోగం ఈ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. తమ దేశాల్లోని శ్రమశక్తిలో 8.5% లేదా 35 మిలియన్ల (3.5 కోట్లు) మంది నిరుద్యోగులుగా వున్నారని ఒఇసిడి దేశాల మంత్రుల స్థాయి కౌన్సిల్ 1994 జూన్‌లోనే ప్రకటించింది. బాగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఏడు దేశాల్లో 24 మిలియన్ల (2.4 కోట్లు) మంది నిరుద్యోగులున్నారని, 1994 జూలైలో జరిగిన జి-7 సమావేశం అంచనా వేసింది. రెండున్నరేండ్ల క్రిందట వేసిన అంచనాను మించి నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. దీనికి తోడు నానాటికి పెరుగుతున్న నిరుద్యోగం, ఉద్యోగాలు వూడిపోవడం, పూర్తికాలం పనిలేకపోవడంతో పార్ట్‌టైమ్ పనితో సరిపెట్టుకునే వారి సంఖ్య పెరుగుదల, పెన్షన్ తదితర సామాజిక సంక్షేమ చర్యల్లో కోత, ఉద్యోగ అభద్రత కారణంగా పాశ్చాత్య దేశాల్లో, ప్రత్యేకించి పశ్చిమ, మధ్య ఐరోపా దేశాల్లోని కార్మికరంగంలో తుపాన్ చెలరేగే పరిస్థితులేర్పడ్డాయి.

## ఐరోపా నడిబొడ్డున

## ప్రపంచీకరణ వ్యతిరేక ప్రథమ తిరుగుబాటు

ఐరోపాలో అగ్ని పర్వతం వలె వున్న ఫ్రాన్స్ చివరకు బద్దలైంది. 1995 డిసెంబర్‌లో బడ్జెటులో సాంఘిక సంక్షేమ చర్యలు, పెన్షన్ బెనిఫిట్లలో కోతకు నూతన మితవాద ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా, ఫ్రాన్స్‌లోని 20 లక్షల మంది ప్రభుత్వరంగ కార్మికులు, ప్రభుత్వోద్యోగులు మూడువారాల పాటు బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె నిర్వహించారు. రైల్వే కార్మికులీ సమ్మెకు ముందు పీఠిన నిలిచారు. తమ యజమానుల నుండి వచ్చే ఎదురుదాడిని దృష్టిలో వుంచుకుని ప్రైవేటు రంగ కార్మికులు సమ్మెలో పాల్గొనలేదు. అయితే వీరిలో వేలాది మంది సమ్మె చేస్తున్న కార్మికుల ప్రదర్శనల్లో పాల్గొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతతో సహా సమాజంలోని వివిధ తరగతుల ప్రజలు ఈ సమ్మెకు మద్దతుగా నిలిచారు. నానాటికి పెరుగుతున్న నిరుద్యోగం, జీవన వ్యయంతో పాటు సాంఘిక సంక్షేమ చర్యల్లో కోతల వల్ల

అసంతృప్తి చెందిన ప్రజలు కార్మికుల సమ్మెను, వారి లక్ష్యాలను బలపరిచారు. ఈ ప్రభంజనాన్ని "ప్రపంచీకరణకు వ్యతిరేకంగా జరిగిన ప్రథమ తిరుగుబాటు"గా ఫ్రెంచి వార్తాపత్రిక "లీమాండే" చక్కగా అభివర్ణించింది. చివరకు ఈ దేశవ్యాప్త సమ్మె ఫలితంగా అల్లైన్ జుప్పే ప్రభుత్వం పెన్షన్ తదితర సాంఘిక, సంక్షేమ చర్యల్లో తలపెట్టిన కోతలను తాత్కాలికంగా నిలిపివేయవల్సి వచ్చింది. సరళీకరణ, ప్రపంచీకరణల కోసం ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకులు ఎంతగా ఒత్తిడి తెచ్చినప్పటికీ, ప్రజల విప్లవ ఆకాంక్షలు, రాజకీయ నాయకులను తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించేందుకు అనుమతించలేదు. దీనితో అంతర్జాతీయ స్థాయిలో సరళీకరణ ప్రవాహంలో కొట్టుకుపోతున్న రాజకీయ నాయకులు వాస్తవిక ప్రపంచంలోకి వచ్చారు. ఫ్రాన్స్‌లోని ఈ ప్రభంజనాన్ని ఐరోపాలో "పుంజుకుంటున్న పెనుతుపాన్"గా మరో ఫ్రెంచి వ్యాఖ్యాత పేర్కొన్నారు. బెల్జియం, ఇటలీ, జర్మనీ, తదితర ఐరోపా దేశాల్లో కూడ ఈ ఉప్పెన ప్రతిధ్వనించింది. సాంకేతిక విప్లవ నేపథ్యంలో కార్మికవర్గం తన విప్లవ స్వభావాన్ని కోల్పోతున్నదని, చివరకు కార్మికవర్గమే అదృశ్యం కానున్నదని కొందరు పెట్టుబడిదారీ విధాన సిద్ధాంతకర్తల సిద్ధాంతాలను, ఈ కార్మికవర్గ తిరుగుబాట్లు పూర్వపక్షం చేశాయి. ఈ కార్మికవర్గ పోరాటాలు నిజానికి, సోషలిస్టు శక్తులు కూడగట్టుకుని ముందుకురావడానికి దోహదం చేశాయి. ఇటలీలో వామపక్షాల పునరాగమనం, బాల్టిక్ రాజ్యాల్లోనూ, బల్గేరియా, పోలెండ్, రష్యా, యుగోస్లావియా వంటి దేశాల్లోనూ ఇటీవలి ఎన్నికల్లో మాజీ కమ్యూనిస్టుల విజయాలు, ఈ క్రమం కొనసాగుతున్నదనేందుకు తార్కాణాలు.

## జాతీయ పరిస్థితి

### రాజకీయ అస్థిర పరిస్థితి

గత మూడేండ్ల కాలంలో జాతీయ రాజకీయరంగంలో అనేక మలుపులు, ఆశ్చర్యం గొల్పే పెనుమార్పులు సంభవించాయి. 1991 మే నెలలో కేంద్రంలో అధికారం చేపట్టిన మైనారిటీ ప్రభుత్వం ఎన్నికల అవసరం లేకుండానే, కాలక్రమేణా మెజారిటీ ప్రభుత్వంగా మారిపోయింది. ప్రజాభిప్రాయాన్ని కాలరాచి, అవకతవకలు, లంచాలు, మోసం అవినీతి ద్వారా మైనారిటీ ప్రభుత్వం మెజారిటీ ప్రభుత్వంగా రూపాంతరం చెందింది. డబ్బు సంచులు, అనైతిక పద్ధతులు ఈ కాలంలో రాజకీయ రంగాన్ని కలుషితం చేశాయి.

### మారిన ప్రభుత్వాలు

భారత కార్మికోద్యమంలో ప్రముఖ నేతలు, సిద్ధాంతవేత్తల్లో ఒకరు, సిఐటియు అధ్యక్షులు కా॥ బి.టి. రణదివే 1990 ఏప్రిల్ 6వ తేదీన అశువులు బాశారు. స్వాతంత్ర సమరయోధులు, దేశ కార్మికోద్యమంలో సమున్నత నాయకుడు ఎస్.ఎ. డాంగే 1991 మే 22వ తేదీన మరణించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చలనచిత్రరంగ ప్రముఖులు శ్రీ సత్యజిత్ రే కన్నుమూశారు.

జాతీయ రాజకీయ రంగంలో గత నాలుగేండ్ల కాలం గొప్ప మలుపులు, కుదుపులు, గందరగోళాలను చవిచూసింది. కేంద్రంలో రాజకీయ అస్థిరత్వం అనేది ఈ కాలంలో ఒక లక్షణంగా కన్పిస్తుంది. 1989 నవంబరులో ఎన్నికైన శ్రీ వి.పి. సింగ్ ప్రభుత్వం 1990 నవంబరులో పడిపోయింది. ఆ తర్వాత ఒక పెద్ద రాజకీయ పార్టీ మద్దతుతో అత్యంత మైనారిటీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వం కూడా ఐదు నెలల కాలంలో కూలిపోయి, మాజీ కాంగ్రెస్ నాయకుడు శ్రీ చంద్ర శేఖర్ నాయకత్వంలో మైనారిటీ ప్రభుత్వంలో ఏర్పడింది. కొన్ని రాష్ట్రాల్లో కూడ ఎన్నికలు జరిగి ప్రభుత్వాలు మారాయి. ఈ రాజకీయ అస్థిరత్వం దేశ ప్రజల ఆర్థిక, సామాజిక జీవనం మీద ప్రభావం చూపింది.

దేశ స్వాతంత్ర్యానంతర చరిత్రలో ఈ కాలం అత్యంత క్రూరమైన మతోన్మాదాన్ని చవిచూచింది. మత మారణహోమం దేశాన్ని కుదిపివేసింది. కుల ఘర్షణలు, అనేక రాష్ట్రాల ప్రజల మీద తీవ్ర ప్రభావం చూపాయి.

## ఉన్నత స్థానాల్లో అవినీతి

బ్యాంకు కుంభకోణం జరిగిన కొద్దికాలంలోనే మిక్కిలి అవమానకరమైన విధంగా జైన్ హవాలా, హౌసింగ్, పంచదార దిగుమతి, పెట్రోల్ పంపుల పంపిణీ వంటి అనేక కుంభకోణాలు వెలుగుచూశాయి. పలువురు కేంద్ర మంత్రులు, గవర్నర్లు మరియు ప్రధాన రాజకీయపార్టీల అధినేతలతో సహా ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కుంభకోణాల్లో భాగం పంచుకున్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షులు మరియు నాటి మరో ప్రతిపక్ష నాయకుడు ఈ కుంభకోణాల్లో భాగస్వాములయ్యారు. వీరిలో అనేక మందికి వ్యతిరేకంగా సిబిఐ ఛార్జిషీటు కూడ దాఖలు చేసింది. పంచదార కుంభకోణంలో ఇరుక్కున్న ఒక కేంద్ర మంత్రి అరెస్టు కాగా, జాతి వ్యతిరేక నేరస్తులకు రక్షణ కల్పించిన నేరానికి, మరొక మంత్రి అరెస్టయ్యారు. 1984లో సిక్కు వ్యతిరేక ఊచకోతకు నాయకత్వం వహించినందుకు ఒక మాజీ మంత్రి అరెస్టయ్యారు. 1993 జూలైలో పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని ఓడించేందుకు జార్ఖండ్ ముక్తిమోర్చా పార్లమెంటు సభ్యులకు లంచం కేసులోనూ, తప్పుడు ఎఫ్ఇఆర్ఎ కేసులో మాజీ ప్రధాని శ్రీ వి.పి. సింగ్ కుమారున్ని ఇరికించేందుకు చేసిన ప్రయత్నాలకు సంబంధించిన సెయింట్ కిట్స్ ఫోర్జరీ కేసు, లఖూభాయ్ పాఠక్ అనే వ్యాపారస్తుని మోసం చేసిన కేసులోనూ నాటి ప్రధాన మంత్రి పాత్ర వెల్లడైంది. చివరి రెండు కుట్ర కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆనాటి ఒక మంత్రి, ఆయన మత గురువు చంద్రస్వామి, అతనితో చేతులు కలిపిన ఆయన వ్యక్తిగత కార్యదర్శిని సిబిఐ అరెస్టు చేసింది.

చివరకు ప్రధానమంత్రి కూడ భాగస్వామి అయినట్లు ఆరోపణలెదుర్కొంటున్న స్థాయిలో ఉన్నత స్థానాల్లో అవినీతి దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. కేవలం వామపక్ష పార్టీలు, వారి నాయకులు మాత్రమే ఈ అవినీతి కుంభకోణాలకు దూరంగా ఉండడం సంతోషించదగిన

విషయం. కనివిని ఎరుగని రీతిలో దేశం పెద్ద ఎత్తున రాజకీయ అవినీతితో కలుషితమైన నేపథ్యంలో 1996 ఏప్రిల్ – మే నెలల్లో 11వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) పరాజయాన్ని చవిచూడగా, హంగ్ పార్లమెంటు ఏర్పడింది.ఏ ఒక్క పార్టీగాని, కూటమిగాని ప్రభుత్వం ఏర్పరచేందుకు అవసరమైన మెజారిటీ పొందలేదు.

## వేర్పాటువాద శక్తులు

పంజాబు, కాశ్మీర్ ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో వేర్పాటువాద శక్తుల తీవ్రవాదం పెచ్చరిల్లి, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. అయితే అదే సమయంలో అనేక తరగతుల కార్మికవర్గాన్ని ఐక్యం చేస్తూ ఐక్య ఉద్యమాలు అభివృద్ధి చెంది ఐక్యత విస్తరించింది. ఈ కాలంలోనే కార్మికులు, ఉద్యోగులు వరుసగా మూడు దేశవ్యాప్త సమ్మెలు నిర్వహించడమే గాక, దేశరాజధానిలో బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు. నిజానికి ఈ కాలంలో మత, రాజకీయ, ఆర్థిక రంగాల్లో తీవ్ర గందరగోళంతో కూడిన అస్థిర పరిస్థితులు నెలకొని, కార్మికవర్గ ఐక్యత మీద తీవ్ర ప్రభావం చూపాయి.

కేంద్రంలో ప్రభుత్వాలు మారినప్పటికీ, కార్మికవర్గంతో పాటు ఇతర శ్రామిక జన బాహుళ్యానికి అనుకూలమైన పరిస్థితులు నెలకొనలేదు. వర్గ దృక్పథంతో చూస్తే, కార్మికవర్గం, ఇతర అణగారిన వర్గాలమీద, గుత్తపెట్టుబడిదారీ వర్గం, వారి మిత్రుల పాలన సాగుతోంది. ప్రజాపోరాటాలు ఉధృతం కావడంతో, కార్మికవర్గ పోరాటాల పట్ల వివిధ ప్రభుత్వాలు వివిధ వైఖరులనవలంభించాయి వేగంగా దిగజారుతున్న దేశ ఆర్థిక పరిస్థితిని బాగుచేసేందుకు విపి సింగ్ ప్రభుత్వంగాని, చంద్రశేఖర్ ప్రభుత్వంగాని ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని పూర్తిగా దిగజార్చింది.

## మండల్ కమిషన్

ఇతర వెనుకబడిన కులాలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించిన మండల్ కమిషన్ నివేదిక అమలుకు విపి సింగ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజానీకంలో పెద్ద ఎత్తున ఆవేశ, కావేశాలకు దారితీసింది. దురదృష్టవశాత్తు కార్మిక వర్గాన్ని, ఇతర కష్టజీవులను ఐక్యం చేయడానికి బదులు ఈ సమస్య ప్రజలను రిజర్వేషన్ అనుకూల, ప్రతికూల తరగతులుగా విడదీసింది. ప్రజానీకానికి అన్ని విషయాలు వివరించక, సానుకూల ప్రాతిపదిక ఏర్పరచక, ప్రభుత్వం హఠాత్తుగా ప్రకటన చేయడం ఈ ఆవేశకావేశాలకు ఒక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. శ్రామిక ప్రజలు, ట్రేడ్ యూనియన్లు తీవ్ర ఇబ్బందుల నెదుర్కొన్నాయి. ఈ ప్రకటనకు వ్యతిరేకంగా ఆవేశాలు రెచ్చగొట్టబడ్డ తర్వాత జరిగిన ఆత్మహత్యా ప్రయత్నాలు, దేశంలో నిరసనోద్యమాల్లో నూతన పోకడలను ముందుకు తెచ్చాయి. కార్మికవర్గాన్ని ఏకం చేయాల్సిన మండల్ కమిషన్ నివేదిక, కార్మికవర్గంలోని ఒక పెద్ద తరగతి నుండి శక్తివంతమైన,

ఆవేశ పూరితమైన ప్రతిస్పందనను తెచ్చింది. ప్రభుత్వోద్యోగ సంఘాలతో పాటు దేశంలోని ట్రేడ్ యూనియన్లు సున్నితమైన, క్లిష్టమైన పరిస్థితి నెదుర్కొనవల్సి వచ్చింది.

## రామజన్మభూమి సమస్య

1990 అక్టోబర్ – నవంబర్ నెలల్లో మతపరమైన పరిస్థితులు దారుణంగా దిగజారిన స్థితిలో కార్మికోద్యమం ఈ సమస్య మీద తీవ్ర అవాంతరాల నెదుర్కొనవల్సివచ్చింది. కొన్ని రాజకీయ పార్టీలు రథయాత్ర ద్వారా రామజన్మభూమి – బాబ్రి మసీదు సమస్యను పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. దానిని ముందుగానే ఆపివేయడానికి శ్రీ విపి సింగ్ ప్రభుత్వం ప్రయత్నం చేయడంతో, ఆ ప్రభుత్వాన్ని పడగొట్టడం జరిగింది.

## రాజీవ్‌గాంధీ హత్య అనంతరం శ్రీనరసింహారావు ప్రభుత్వం

చంద్రశేఖర్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత 1991 మే నెలలో నూతన కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నుకొనేందుకు ఎన్నికలు జరిగాయి. దురదృష్టవశాత్తు తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో వుండగా రాజీవ్‌గాంధీ దారుణ హత్యకు గురయ్యారు. ఈ విషాదకర, భయానక పరిణామాల నేపథ్యంలో ఎన్నికలు జరిగి కాంగ్రెస్ నాయకత్వంలో మరొక మైనారిటీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పని చేసే హక్కుకు, మేనేజిమెంటులో కార్మిక భాగస్వామ్యానికి చట్టబద్ధత కల్పించే బిల్లులకు గ్రహణం పట్టింది. మండల కమిషన్ సమస్య సుప్రీంకోర్టుకు నివేదించబడి, సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన తర్వాత కొన్ని మార్పులతో కమిషన్ నివేదికను అమలు పర్చడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దేశ ఆర్థిక పరిస్థితి వేగంగా దిగజారి, చెల్లింపుల సమతుల్యం (Balance of Payments Position) దెబ్బతిని, ప్రమాదకరస్థాయికి చేరుకుంది. ఈ సమయంలో నూతన ప్రభుత్వం ప్రకటించిన కీలకమైన నూతన, ఆర్థిక, పారిశ్రామిక విధానాల వినాశకర ప్రభావం నేడు మరింతగా బహిర్గతమవుతోంది. ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలనే ప్రకటిత లక్ష్యసాధనకు, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించబూనుకుంది. ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కేందుకు ప్రభుత్వం భారీ రుణం కోసం ఐఎంఎఫ్ తలుపులు తట్టింది. ఆర్థిక వ్యవస్థను సరళీకరించి, పాశ్చాత్య దేశాలను స్వేచ్ఛగా అనుమతించి, కార్మిక వ్యతిరేక చర్యలను కఠినంగా అమలు చేయాలన్న కఠిన షరతులను ఐఎంఎఫ్ విధించింది.

## అమెరికా సామ్రాజ్యవాద చలిత

## నయా ఉదారవాద ప్రపంచీకరణ భారతదేశంలో ప్రవేశం

పదేండ్ల పాటు అదుపులేకుండా పెరుగుతున్న ద్రవ్యలోటు కారణంగా, విదేశీ చెల్లింపుల విషయంలో తీవ్ర వైఫల్యం అంచుకు దిగజారడంతో 1991 జూన్‌లో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. గత దశాబ్దకాలంగా అంతర్జాతీయ వాణిజ్య నిర్వహణలో లోపాల వల్ల విదేశీరుణం అసాధారణంగా పెరిగింది. దీనికితోడు ఈ కాలంలో సాగిన నిర్లక్ష్యపూరిత ద్రవ్య విస్తరణ కారణంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిడులు, దేశాన్ని ఆర్థిక పతనం అంచుకు చేర్చాయి. పెట్రోలియం ఉత్పత్తుల వంటి అత్యవసర దిగుమతులను పెద్దగా తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కొన్ని చర్యల వల్ల 1990-91లో 5.9 బిలియన్ (590 కోట్లు) డాలర్లుగా వున్న వాణిజ్యలోటు 1991-92 నాటికి సుమారు 1.6 (160 కోట్లు) బిలియన్ డాలర్లకు తగ్గింది. కాంగ్రెసు ప్రభుత్వం చేపట్టిన సరళీకృత విధానాల ఫలితంగా తొమ్మిదినెలల కాలంలో (1991 ఏప్రిల్ నుండి డిసెంబర్) వాణిజ్యలోటు మరల 3.5 బిలియన్ (350 కోట్లు) డాలర్లకు చేరుకుంది. సరళీకృత వాణిజ్య, వర్తక విధానాల విషయంలో పాత విధానానికి తెచ్చేందుకు ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్‌లు ఒత్తిడి తెచ్చి, కేంద్ర ప్రభుత్వాన్ని తేలికగానే ఒప్పించగలిగాయి. ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐ) ఖాతాల ప్రాతిపదికగా పనిచేస్తున్న విదేశీ వాణిజ్య బ్యాంకులతో కలిసి, ఈ అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు 1992 మార్చి, జూన్ మధ్య కాలంలో ఎన్ఆర్ఐల నిధులను పెద్ద ఎత్తున ఉపసంహరించడం ద్వారా ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించి, 1992 జూలై మొదటి వారంలో రూపాయి విలువ తగ్గిస్తూ భారతప్రభుత్వం ప్రకటించే విధంగా ఒత్తిడి తెచ్చాయి. ఆ తర్వాత ప్రభుత్వం భారీ విదేశీ రుణాలు తీసుకోవడంతో పాటు, ఐఎంఎఫ్ మార్గదర్శక విధానాల మేరకు వ్యవస్థాగత సర్దుబాట్ల ద్వారా భారత ఆర్థిక వ్యవస్థను "మార్కెటుకు అనుకూలమైనదిగానూ", "అంతర్జాతీయంగా పోటీ పడేది"గా చేయడం పేరిట ఆర్థిక విధాన మార్పులను చేపట్టడం జరిగింది.

## వ్యవస్థాగత సర్దుబాటు - వివరాలు

1991 జూలైలో రూపాయి విలువను తీవ్రంగా 20-23% తగ్గిస్తూ భారత ప్రభుత్వం నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఆ తర్వాత వివిధ కంట్రోళ్ళ తొలగింపు, పరిశ్రమల స్థాపనకు లైసెన్సింగ్ విధానం ఎత్తివేత, దిగుమతుల మీద ఆంక్షల తొలగింపు, ఎగుమతిదారులకు రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర చర్యల ద్వారా విస్తృత సరళీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆమోదించింది. ప్రభుత్వ రంగ సంస్థలకు సహాయం ఉపసంహరించడం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే చర్యలను కూడ చేపట్టింది. ఆ వెనువెంటనే ఉత్పాదకతను పెంచి, పరిశ్రమల్లో ఉత్పత్తి ఖర్చును తగ్గించేందుకు కాంట్రాక్టు కార్మిక విధానం ప్రాతిపదికగా ఒక కార్మిక విధానాన్ని ప్రారంభించడం జరిగింది. అంతర్జాతీయస్థాయిలో పోటీపడే విధంగా, దేశ ఆర్థికాభివృద్ధిని "స్వేచ్ఛా మార్కెట్"కు అనుకూలంగా పునర్వ్యవస్థీకరించడమే ఈ నూతన ఆర్థిక విధానం లక్ష్యం.

ఈ విధానం ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థను సుమారు మూడు సంవత్సరాల స్వల్ప వ్యవధిలో రెండు దశల్లో అభివృద్ధి చేసి ప్రపంచీకరించాలి. మొదటి దశలో, ఏడాది, ఏడాదిన్నర కాలంలో ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుండి బయటపడేసి స్థిరీకరించాలి. రెండవ దశలో

ఎంఎన్‌సిలతో సహా విదేశీ ఏజన్సీలు, విదేశీ నిధుల సహాయంతో పెట్టుబడులను వేగవంతం చేసి, ప్రాథమికంగా ఆర్థిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధిని సాధించే లక్ష్యంతో వ్యవస్థాగత సర్దుబాటు చర్యలు చేపట్టాలి. గత దశాబ్ద కాలంగా నిరంతరం పెరుగుతున్న ద్రవ్యలోటుతో పాటు, ధరల పెరుగుదలకు దారితీస్తున్న ద్రవ్యోల్బణం సమస్య నుండి గట్టెక్కేందుకు భారత ఆర్థిక వ్యవస్థకు సహాయపడేందుకు ఈ స్థిరీకరణ చర్యలు ఉద్దేశించబడ్డాయి. అప్పుడు ఈ వ్యవస్థీకృత సర్దుబాటు చర్యలు ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లో, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తాయని ఆశించడం జరిగింది.

మొదటి దశలో సుమారు రెండేండ్ల కాలంలో ఆర్థిక వ్యవస్థ స్థిరీకరించబడిన వెంటనే, రెండవ దశ సర్దుబాటు చర్యలు ప్రారంభం కావాలి. దిగుమతులు, ఎగుమతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ఎక్సైజ్, దిగుమతి (కస్టమ్స్) సుంకాలను భారీగా తగ్గించడం ద్వారా ఈ వ్యవస్థీకృత సర్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఎంఎన్‌సి ల ద్వారా వినిమయం, దిగుమతులను ప్రోత్సహించడం ద్వారా ఈ చర్యలు అభివృద్ధికి దారితీస్తాయని భావించడం జరిగింది. విదేశీ సంస్థలు, ఎంఎన్‌సి లతో సహా ప్రైవేటు కంపెనీల ద్వారా ఉత్పత్తిని ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా దేశంలో వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధిని సాధించవచ్చుని భావించడం జరిగింది.

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మన్మోహన్‌సింగ్ 1993 ఫిబ్రవరి 23వ తేదీన బడ్జెటు ప్రవేశపెడ్తూ, భారత ఆర్థిక వ్యవస్థను గురించి తన అంచనాను వెల్లడించారు. దీని ప్రకారం నూతన ఆర్థిక విధానంలో మొదటి దశగా ఆయన పేర్కొన్న "సంక్షోభ నివారణ"లో విదేశీ ఆర్థిక సంస్థల సహకారంతో ఆయన ప్రభుత్వం విజయం సాధించింది. 1991లో జిడిపిలో 8.5%గా వున్న ద్రవ్యలోటును 1992-1993 నాటికి సుమారు 5.6% తేగలిగామని, 1993-94 నాటికి 4.7%కి తెచ్చేందుకు బడ్జెటులో ప్రతిపాదించామని చెప్పుకున్నారు. ఈ ద్రవ్య స్థిరీకరణతో ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం ఒత్తిడులు తగ్గి, ధరల పెరుగుదల గణనీయంగా తగ్గుతోందని భావించారు. ఆయా సంవత్సరాల వాస్తవ లోటును విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, ఆర్థిక మంత్రి మాటలు మోసపూరితమని స్పష్టమవుతుంది. 1991-92లో రూ.36,325 కోట్లుగా వున్న ద్రవ్యలోటు 1992-93 నాటికి రూ.36,722 కోట్లకు చేరుకోగా, 1993-94కు రూ.36,954 కోట్లుగా బడ్జెటులో అంచనాగా చూపడం జరిగింది. జిడిపిలో శాతంగా చూస్తే లోటు తగ్గినట్లు కన్పించినప్పటికీ వాస్తవ లోటు పెరుగుతున్నట్లు స్పష్టమవుతుంది. ద్రవ్యలోటు నిలకడగా వున్నట్లు పైకి కన్పిస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే చాలా ఎక్కువగా వుండి ప్రమాదకర స్థాయిలో వున్నట్లు వెల్లడవుతుంది.

## బహుళజాతి సంస్థల స్వేచ్ఛా ప్రవేశం - పర్యవసానాలు

ఐఎమ్ఎఫ్ ఆదేశాల అమలు ఫలితంగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆదాయాల్లో తారతమ్యాలు నానాటికి తీవ్రమవుతున్నాయి. పారిశ్రామికాభివృద్ధి కుంటుబడింది. ఈ పరిస్థితులు

తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. ప్రభుత్వ చర్యలు ఎగుమతి రంగం స్పందనకు అనుచిత ప్రాధాన్యతనిచ్చి, సామాజిక వ్యయం మీద ద్రవ్య విలువ తగ్గింపు ప్రభావాన్ని తక్కువ చేసి చూపింది. ఈ విధానాలు సుమారు 50% మంది నిరుపేదల మీద వినాశకర ప్రభావం చూపగా, 15%గా వున్న ధనికవర్గానికి ప్రయోజనం చేకూర్చాయి. దిగుమతుల సరళీకరణ భారత పారిశ్రామిక రంగాన్ని కుదిపివేసింది. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు దెబ్బతిన్నాయి. పెద్ద పరిశ్రమల్లోని కొన్ని యూనిట్లు మాత్రమే, తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుని, పోటీవల్ల తలెత్తిన సవాళ్ళను ఎదుర్కొన గలిగాయి. అప్పటికే నిలదొక్కుకున్న కొన్ని మధ్య తరహా పారిశ్రామిక సంస్థలు బహుళజాతి సంస్థలకు చెందిన పెద్ద యూనిట్లలో విలీనమై, తమ మార్కెట్లను, లాభాలను పరిరక్షించుకునే విధంగా మిశ్రమ సంస్థలను నిర్మించుకుని నిలబడగలిగాయి. "స్వేచ్ఛావాణిజ్యం"లో పోటీ అనేది మార్కెట్లలో అనేక లోపాలు కల్గివుండి ధరల నిర్ణయం విషయంలో కఠినంగా వుండి వెసులుబాటు లేకపోవడం వంటి అంశాలతో ముడిపడివుంది. ఫలితంగా దీర్ఘకాలంలో ధరలు, లాభాలు తగ్గకుండా నిరోధించడం జరుగుతుంది. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల అమలు వల్ల ప్రస్తుతం ఇదే జరుగుతోంది. ఎగుమతి, దిగుమతుల సుంకాలతో పాటు, ఇతర సుంకాల మీద రాయితీలిచ్చినప్పటికీ, మిక్కిలి ఖరీదైన వినిమయ వస్తువుల ధరలు తప్ప, సాధారణ ప్రజల వినియోగ వస్తువుల ధరలు తగ్గలేదు. పైపెచ్చు 1991 జూన్‌లో నూతన విధానాల ప్రవేశం తర్వాత పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిరంతరాయంగా పెరుగుతూనే వున్నాయి.

దేశ ఆర్థికాభివృద్ధి తొలిదశల్లో ఎంఎన్‌సిల వ్యాపార కార్యకలాపాలకు భారతదేశం విముఖంగా లేదు. వాస్తవానికి ఈ ఎంఎన్‌సిలు ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఉత్పత్తి పద్ధతులను ప్రోత్సహించి, పెద్ద ఎత్తున పెట్టుబడి అవసరమయ్యే ఆధునిక పరిశ్రమల అభివృద్ధికి సహాయం చేయాలని ఆశించడం జరిగింది. అయితే ఈ ఆశలు అడియాసలయ్యాయి. అయినప్పటికి, ఈ జాయింట్ స్టాక్ కంపెనీలు, ఫెరా (విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టం) చట్టం క్రింద సాధారణంగా 40% మేరకు ఈక్విటీ షేర్లను కల్గివుండవచ్చు. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం అవసరమైన సందర్భాల్లో మాత్రమే సుమారు 50% మేరకు విదేశీ ఈక్విటీ షేర్లను అనుమతిస్తారు. గుత్త పెట్టుబడిదారులు గుత్తాధిపత్యం, అభ్యంతరకరమైన వాణిజ్య పద్ధతుల్లోకి వినిమయ దారుల దోపిడీకే పాల్పడకుండా నిరోధించేందుకు, వీరికి ఖఞ్రఊఆ (మొనాపలీస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీసెస్ చట్టం) చట్టాన్ని వర్తింపజేసేవారు. అయితే నూతన ఆర్థిక విధానం ప్రకారం ఈ పరిమితులనన్నింటిని ఉపసంహరించడం జరిగింది. ప్రభుత్వ అనుమతులుగాని, కంపెనీ ప్రస్తుత వాటా దారుల ఆమోదంతో నిమిత్తం లేకుండా విదేశీ ఈక్విటీని 40% నుండి 51%కి ఆటోమేటిక్‌గా పెంచుకునే అవకాశం కల్పించారు. లాభాలు, రాయల్టీలు అపరిమిత స్థాయిలో విదేశాలకు తరలించుకు పోయేందుకు అన్ని హంగులతో 100% విదేశీ ఈక్విటీతో కంపెనీలు స్థాపించుకునే విధంగా, ఆర్థిక వ్యవస్థను మరింత సరళీకరించడం జరిగింది.

అ సంఖ్యాకమైన ఈ రాయితీలను అవకాశంగా తీసుకుని, భారతదేశంలోని కొన్ని బహుళజాతి కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరించనారంభించాయి. బాగా స్థిరపడిన కొన్ని కంపెనీలు ఎంఎన్‌సిల ఒత్తిడికి తలవంచి తన ఉనికిని కాపాడుకునేందుకు విలీనం కాగా, కొన్ని కంపెనీలు మార్కెట్‌లో ఎమ్ఎన్‌సిలతో పోటీ పడలేక దివాళా తీశాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలవంతంగా తమలో విలీనం చేయడం ద్వారానూ, దేశ వ్యాప్తంగా మార్కెట్‌లో తమ గుత్తాధిపత్యాన్ని విస్తరించేందుకు, దేశంలోని కొన్ని బడా ఉత్పత్తి సంస్థలతో మిలాఖత్ కావడం ద్వారానూ, భారత బహుళజాతి సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్నాయి. ఇటీవల జీవ సాంకేతిక పరిజ్ఞానం (బయోటెక్నాలజీ)లో వస్తున్న ప్రగతిని ఆధారంగా చేసుకుని, అధిక దిగుబడినిచ్చే నూనెగింజలు వంటి వాణిజ్య పంటలకు సంబంధించిన భారత వ్యవసాయ మార్కెట్లలోకి బహుళజాతి కంపెనీల చొరబాటు ప్రారంభమైంది. వేర్వేరు దేశాల్లో వివిధ విడిభాగాలను ఉత్పత్తి చేయించి "స్క్రూడ్రైవర్ టెక్నాలజీ"గా పేరొందిన పద్ధతిలో, వెనుకబడిన దేశాల్లో చౌకగా లభించే శ్రమశక్తిని వినియోగించి విడిభాగాలను కూర్పు చేసేందుకు, ఎమ్ఎన్‌సిలు దేశంలోని ఉత్పత్తి క్రమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రాధాన్యత నిచ్చాయి. అభివృద్ధి చెందిన దేశాల్లోని మార్కెటింగ్, అమ్మకాల విభాగాల్లో నిపుణులైన వారి సలహా మేరకు ఈ ఉత్పత్తులను ఎగుమతి చేయడం జరుగుతోంది. ఈ మొత్తం క్రమంలో ఈ ఎమ్ఎన్‌సిలు స్వదేశాల్లో భారీ లాభార్జనకు వీలుగా ఈ ప్రణాళిక రచించబడింది. అయితే అదే సమయంలో ఆర్థికంగా వెనుకబడిన దేశాల్లో కూడా క్రింది స్థాయిలో కొంత ఉపాధి అవకాశాలేర్పడతాయి. ఈ క్రమంలో వెనుకబడిన దేశాలు సాధించిన అభివృద్ధి చాలా తక్కువగానూ, అస్థిరంగానూ వుంది. ఈ అభివృద్ధిని కొనసాగించడమనేది ఆయా ఎంఎన్‌సిల దయాదాక్షిణ్యాల మీదనే ఆధారపడి వుంది.

## నూతన పారిశ్రామిక విధానం

గతంలో కొంత మేరకైనా స్వావలంబన సాధించేందుకు స్వదేశీ పరిశ్రమలకు పునాదిని నిర్మించే లక్ష్యంతో, ఆమోదించిన పారిశ్రామిక విధాన తీర్మానాలకు, ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన నూతన పారిశ్రామిక విధానం పూర్తిగా భిన్నమైనది. ఈ నూతన విధానం గత పారిశ్రామిక విధానాల మూలాలనే దెబ్బతీసి పారిశ్రామిక రంగాన్ని విదేశీ బహుళ జాతి కంపెనీలకు, భారత గుత్త సంస్థలకు ధారాదత్తం చేసింది. ఈ నూతన విధానం. ఆచరణలో ప్రభుత్వరంగానికి మరణ శాసనం వ్రాయడంతోపాటు, ఖాయిలాపడిన పిఎస్‌యుల మూసివేత, లాభాలార్జిస్తున్న వాటి సహా పిఎస్‌యుల్లో భారీ స్థాయిలో వాటాల ఉపసంహరణ కాక వాటి ప్రైవేటీకరణ, ఎమ్ఎన్‌సిల స్వేచ్ఛా ప్రవేశం వంటి చర్యలను ప్రకటించింది. ఆచరణలో నూతన పారిశ్రామిక విధానంలోని ఎగ్జిట్ విధానం, ఖాయిలాపడిన ప్రభుత్వరంగ సంస్థలు, వాటిల్లోని కార్మికులకు ఉద్వాసన చెప్తుంది. ఇది ఈ సంస్థలోని కార్మికులు, ఉద్యోగుల రిట్రెంచ్‌మెంటును, 58 ఖాయిలాపడిన పిఎస్‌యుల మూసివేతను బహిరంగంగానే

ప్రకటించింది. ఈ విధంగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశిత నూతన విధానం, భారతదేశ పారిశ్రామికాభివృద్ధిని సమాధిచేసి, దేశ పారిశ్రామిక రంగాన్ని ఎంఎన్‌సిలకు ధారాదత్తం చేసేవిధంగా రూపొందించబడింది. జాతీయ బ్యాంకులు, బీమా వంటి దేశ ఆర్థిక రంగ సంస్థలను కూడ విచ్ఛిన్నం చేసి, విదేశీ, స్వదేశీ ప్రైవేటు పెట్టుబడికి అప్పగించ కోరుతున్నారు. బ్యాంకింగ్ రంగం మీద నరసింహం కమిటీ సమర్పించిన నివేదిక, జాతీయ బ్యాంకింగ్ రంగ వినాశనాన్ని కోరుతోంది. అమెరికా చట్టంలోని సూపర్ 301 ద్వారా ఒత్తిడి తెచ్చి జాతీయ బీమారంగంలోకి అమెరికన్ ఎం.ఎన్.సి.ల ప్రవేశానికి ద్వారాలు తెరిచేందుకు కుట్రలు సాగుతున్నాయి. ఈ ప్రయత్నాలు విరమించబడక పోవడంతో, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాలు ప్రభుత్వరంగ స్వభావాన్ని కోల్పోయే ప్రమాదం కొనసాగుతోంది.

ఈ విధానం వల్ల సేవారంగం కూడా ప్రమాదంలో పడింది. టెలికం, పోస్టల్ సేవలను చాలా వరకు విజాతీయాకరణ చేసి, ఎంఎన్‌సిలతో సహా ప్రైవేటు రంగానికి అప్పగించడం జరిగింది. ఇది ఉద్యోగులకే గాక, దేశ ప్రయోజనాలకే ప్రమాదకరం.

వాస్తవానికి నూతన ఆర్థిక పారిశ్రామిక విధానం, భారత ఆర్థిక సార్వభౌమత్వం విషయంలో సిగ్గులేకుండా రాజీపడడమే.

## రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు

నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల నుండి రాష్ట్ర ప్రభుత్వోద్యోగ రంగం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఉద్యోగుల జీతభత్యాలకు స్తంభింపచేయడమే గాక, రాష్ట్రాలలోని వివిధ సాంఘిక సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేంద్ర నిధులను స్తంభింప జేయాల్సిందిగా ఐఎంఎఫ్, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తోంది. ఫలితంగా వయోజన విద్య, నీటిపారుదల, అడవుల పెంపకం, వైద్యం వంటి రంగాలకు సంబంధించి రాష్ట్రాల్లో అమలవుతున్న కేంద్ర పథకాలు ప్రమాదంలో పడతాయి. చాలా రాష్ట్రాల్లో వీటిల్లో పలు పథకాలను నిలిపివేసి, అదనంగా వున్నారనే పేరిట భారీ సంఖ్యలో ఉద్యోగులను రిట్రెంచ్ చేయడం జరిగింది. కేంద్రం నుండి నిధులు రాకపోవడంతో వివిధ రాష్ట్రాలో వేలాది మంది ఉద్యోగులకు జీతాలు అందలేదు. అంతేగాక రాష్ట్ర పిఎస్‌యులు చిక్కుల్లో పడ్డాయి. ఈ నూతన విధానం ఫలితంగా అనేక ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడడమో లేదా అమ్మివేయబడడమో జరిగింది. ఫలితంగా వేలాదిమంది ఉద్యోగులు రిట్రెంచ్‌మెంట్ ప్రమాదాన్ని ఎదుర్కొన్నారు. వేతన స్తంభన, ఇతర ఆర్థిక సదుపాయాల్లో కోతలతో పాటు ఈ ప్రమాదాలన్నీ రాష్ట్ర ఉద్యోగుల ముందు ప్రత్యక్షమయ్యాయి.

ఈ నూతన ఆర్థిక విధానం, వ్యవస్థీకృత సర్దుబాటు చర్యల అమలు వల్ల ఏర్పడిన తీవ్ర పరిస్థితుల నేపథ్యంలో కార్మికవర్గం తన మీద జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన ఎత్తుగడలను రూపొందించుకోవాల్సి వుంది.

ఆనాడు ప్రభుత్వం చేసిన ప్రకటన ప్రకారమే, బిఐఎఫ్ఆర్ (బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్) కు నివేదించబడ్డ 58 ఖాయిలా పడిన పిఎస్‌యుల మూతవల్ల 10 లక్షల మంది కార్మికులు రిట్రెంచ్ చేయబడతారు. ఇంతేగాక స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా వేలాది మంది కార్మికులను బజారున పడేస్తున్నారు. ప్రభుత్వం నియమించిన గోస్వామి కమిటీ బిఐఎఫ్ఆర్‌కు నివేదించబడిన ఖాయిలాపడిన పిఎస్‌యులను వున్న ఫళంగా మూసివేయాలని విచిత్రమైన సిఫార్సు చేసింది. చివరకు దీనికి బిఐఎఫ్ఆర్ కూడ అభ్యంతరం చెప్పింది. దీనికి తోడు నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ నియమించిన "పొదుపు చర్యల కమిటీ" ఉద్యోగుల డి.ఎ., బోనస్ తదితర ఆర్థిక సదుపాయాలను స్తంభింప చేసేందుకు అనేక సిఫార్సులు చేసింది. హెచ్.ఎన్.రే కమిటీ కూడా ఇదే విధమైన సిఫార్సులు చేసింది.

ఇదిలా వుండగా, భారతదేశాన్ని యథేచ్ఛగా దోచుకునేందుకు వీలుగా కార్మికులకున్న రక్షణలను ఉపసంహరించేందుకు వీలుగా ప్రస్తుత కార్మిక చట్టాల్లో తగిన మార్పులు చేయవల్సిందిగా బహుళజాతి కంపెనీలు ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర కార్మికశాఖా మంత్రి ప్రకటన కూడా చేశారు. ఈ నూతన బిల్లులోని అంశాలు కార్మికవర్గానికి, ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి నష్టదాయకంగా వున్నాయి. కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రాథమిక ట్రేడ్ యూనియన్ హక్కులనీ బిల్లు కాలరాయ సంకల్పించింది.

## మైనారిటీ బిజెపి ప్రభుత్వం ఏర్పాటు

## యునైటెడ్ ఫ్రంట్ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు - సంకీర్ణ ప్రభుత్వాల శకం

బిజెపి, దాని మిత్రపక్షాలు 196 మంది సభ్యులతోనూ, నేషనల్ ఫ్రంట్, వామ పక్ష ఫ్రంట్ కూటమి 180 మంది సభ్యులతోనూ, కాంగ్రెస్ (ఐ) 136 మంది సభ్యులతోనూ, మూడు కూటములు ప్రభుత్వ ఏర్పాటుకు పోటీపడ్డాయి. రాష్ట్రపతి బిజెపిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంతో శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయి ప్రధాన మంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. 1996 మే 31వ తేదీన మెజారిటీ నిరూపించుకోవాల్సిందిగా ఆయనను కోరడం జరిగింది.

బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో ఇతర అంశాలతో పాటు అయోధ్యలో రామాలయ నిర్మాణం చేపట్టడంతో పాటు, గత నరసింహారావు ప్రభుత్వం ప్రారంభించిన ఆర్థిక సంస్కరణలు కొనసాగిస్తామని ప్రకటించింది. నేషనల్ ఫ్రంట్ – లెఫ్ట్‌ఫ్రంట్ కూటమి మతోన్మాదం, మత మౌఢ్యం, హానికరమైన ఆర్థిక సంస్కరణలను పూర్తిగా వ్యతిరేకించింది. వామపక్షాలు ఆర్థిక సంస్కరణలను పూర్తిగా వ్యతిరేకించి, ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను ప్రజల ముందుంచాయి. లోక్‌సభలో విశ్వాస తీర్మానానికి మద్దతు కూడగట్టడంలో బిజెపి విఫలమవడంతో, 13 రోజుల

తర్వాత ప్రభుత్వం రాజీనామా చేసింది. 1996 జూన్ 1వ తేదీన శ్రీ హెచ్.డి. దేవెగౌడ ప్రధాన మంత్రిగా నేషనల్ ఫ్రంట్, దాని మిత్రపక్షాలు, కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదికగా యునైటెడ్ ఫ్రంట్ పేరిట ప్రభుత్వం ఏర్పరచాయి. వామపక్ష పార్టీల్లో సిపిఐ ప్రభుత్వంలో పాల్గొనగా, సిపిఎం, ఇతర వామపక్షాలు ప్రభుత్వానికి బయట నుంచి మద్దతిచ్చాయి. కాంగ్రెస్ (ఐ) కూడ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి బేషరతుగా మద్దతిచ్చింది. సంకీర్ణ కూటమి భాగస్వామ్య పక్షాలు ముందుగా సిపిఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యులు కా॥ జ్యోతిబసును మరియు సిపిఐ(ఎం) పార్టీని కూడ కలిసి, సంకీర్ణ ప్రభుత్వ ప్రధాన మంత్రిగా కా॥ జ్యోతిబసును ఒప్పించవల్సిందిగా కోరాయి. కాని సిపిఐ(ఎం) మరియు కా॥ జ్యోతిబసు ఆ ప్రతిపాదనను అంగీకరించలేదు. ప్రధాన మంత్రి పదవిని ఇవ్వజూపినప్పుడు ఒక పార్టీ తిరస్కరించడం ఒక అసాధారణ సంఘటన.

లౌకికతత్వానికి కట్టుబడి వున్నట్లు ప్రకటించిన సంకీర్ణ ప్రభుత్వాల నూతన శకానికిది ప్రారంభం. లోక్‌సభ ఎన్నికలతో బాటు, ఆరు రాష్ట్ర అసెంబ్లీలకు కూడ ఎన్నికలు జరిగాయి. కేరళలో వామపక్ష ప్రజాతంత్ర కూటమి అధికారంలోకి రాగా, పశ్చిమబెంగాల్‌లో 20 సంవత్సరాల పాటు నిరాఘాటంగా పాలన సాగించి, వరుసగా 5వ సారి వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అస్సాంలో అస్సాం గణపరిషత్, దాని మిత్రపక్షాలు, కర్నాటక, బీహారులలో జనతాదళ్ ప్రభుత్వాలు ఏర్పాడ్డాయి. లోక్‌సభతో పాటు, అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ (ఐ) ఘోర పరాజయం పాలైంది. బీహార్‌లో జనతాదళ్ ప్రభుత్వాన్ని ఏర్పరచినప్పటికీ, పశు సంవర్ధకశాఖలో కోట్ల ఖరీదైన పశుదాణాకు సంబంధించిన కుంభకోణం వెల్లడి కావడంతో బీహార్ ఖంగుతిన్నది. ముఖ్యమంత్రి లల్లూప్రసాద్ యాదవ్ చిక్కుల్లో పడ్డారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కుమారి జయలలిత తీవ్ర అవినీతి ఆరోపణలకు గురై సిబిఐ వలలో చిక్కి అరెస్టయ్యారు.

దేశ ఈశాన్య ప్రాంతం యావత్తూ, వేర్పాటువాద శక్తులు నిరాఘాటంగా సాగిస్తున్న ఉగ్రవాద కార్యకలాపాలు, హత్యాకాండతో అట్టుడికిపోతోంది. పంజాబులో ఉగ్రవాద శక్తులు అణచివేయబడి శాంతియుత, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ జరగడం, వేర్పాటువాద హింసాకాండకు సంబంధించినంతవరకు ఊరట కల్గించే అంశం. అయితే ఈ క్రమంలో పంజాబు మాజీ ముఖ్యమంత్రి ఉగ్రవాదదాడుల్లో దారుణ హత్యకు గురయ్యారు. సాయుధ ముఠాల హింసాకాండ, బలవంతపు వసూళ్ళు, అత్యాచారాలతో తల్లడిల్లుతున్న జమ్ముకాశ్మీర్ ముఖ్యంగా, కాశ్మీర్‌లోయలో ఈ కాలంలో 1996 మేలో మొదట పార్లమెంట్‌కు, తర్వాత 1996 సెప్టెంబర్, అక్టోబర్ నెలలో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. ప్రజలు ఎన్నికల్లో పాల్గొనకుండా వేర్పాటువాదుల బెదిరింపులు, హింసాకాండను ఎదిరించి కాశ్మీర్ లోయలోని మెజారిటీ ప్రజలు (సుమారు 54% మంది) 1996లో జరిగిన ఎన్నికల్లో పాల్గొనడం స్వాగతించవల్సిన విషయమే గాక మిక్కిలి వూరట కల్గించే పరిణామం ఇక జమ్మూ – లడఖ్ ప్రాంతం సంగతి వేరుగా చెప్పనక్కరలేదు. ఎండి. ఫరూక్ అబ్దుల్లా నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. సుదీర్ఘకాలం కేంద్ర పాలనలో నున్న జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రం ఎన్నికైన ప్రభుత్వపాలన

క్రిందకు వచ్చింది. వేర్పాటువాద హింసాకాండను అణచివేసి, రాష్ట్రంలో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించి, కాశ్మీరులోయ నుండి అసాధారణ పరిస్థితుల్లో వలసపోయిన మైనారిటీలకు పునరావాసం కల్పిస్తామని నూతన ప్రభుత్వం వాగ్దానం చేసింది.

## ఆర్థిక వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ నిజస్వరూపం

దేశం తీవ్ర ఆర్థిక సమస్యల నెదుర్కొంటోంది. 1991 జూన్ నుండి నరసింహారావు ప్రభుత్వం ప్రారంభించిన నూతన ఆర్థిక విధానాల అమలును నిష్పాక్షికంగా సమీక్ష చేయడం వల్ల, గత 5 సంవత్సరాలుగా అమలైన ఈ విధానం నిజస్వరూపం మన కర్థమవుతుంది.

> అధికారంలోకి రాగానే నరసింహారావు ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఖాయిలాపడిన పరిశ్రమలను పునరుద్ధరించడం కాక వాటి మూసివేత, బహుళజాతి కంపెనీల విశృంఖల ప్రవేశం, ఆర్థిక వ్యవస్థ సరళీకరణ, ప్రపంచీకరణలు ప్రధాన అంశాలుగా వున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల పూర్తి స్థాయి అమలును ప్రకటించింది. ఈ నూతనవిధానాలు పారిశ్రామికీకరణలో దేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని, ఈ శతాబ్దాంతానికి నిరుద్యోగం దాదాపు రూపుమాసిపోతుందని ప్రభుత్వం చెప్పుకుంది.

ఆ తర్వాత "ఆర్థిక సంస్కరణలు – రెండేళ్ళ తర్వాత మరియు భవిష్యత్ కర్తవ్యాలు" అనే అధికార పత్రంలో భారత ప్రభుత్వం ఈ క్రింది విధంగా ప్రకటించింది. "భారత ప్రజల జీవనస్థాయిలో వేగవంతమైన, నిలకడైన అభివృద్ధిని సాధించడం, ఆర్థిక సంస్కరణల ప్రధాన లక్ష్యం. ఇందుకు ప్రజల ఆదాయాలను వేగంగా పెంచడం మరియు ఉత్పాదకతతో కూడిన ఉపాధి, ఈ లక్ష్యానికి కీలకమైనది." అయితే నిజంగా ఈ లక్ష్యాలు సాధించాలంటే ఈ క్రింది చర్యలు చేపట్టాలి.

1. సమగ్ర భూ సంస్కరణలు.
2. గ్రామీణ ఉపాధి కల్పనకు సమర్థవంతమైన ప్రణాళిక.
3. మూతపడిన మిల్లులు, ఫ్యాక్టరీలను తెరవడం, సాంకేతిక పరిజ్ఞానం ఆధునికీకరణ, చాలినంత మేరకు నిధులను సమకూర్చడం.
4. ప్రభుత్వరంగ సంస్థల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ రిక్రూట్‌మెంట్ మీద నిషేధం తొలగింపు.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకే నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు ప్రకటించబడ్డాయి. ఆర్థిక వెనుకబాటు తనం, గణనీయంగా వున్న నిరుద్యోగం, గ్రామీణ పేదల దుర్భర దారిద్ర్యాలమీద పోరాడేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో "చక్కగా వ్యవస్థీకరించబడిన భూసంస్కరణల"ను చేపట్టాలని, వ్యవస్థాగత సంస్కరణల గురించి ప్రపంచ బ్యాంకు తన 1995 నివేదికలో పేర్కొంది.

1994-95లో కార్మిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం, 1995 డిసెంబరు నాటికి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలలో నమోదు చేయించుకున్న నిరుద్యోగ యువత సంఖ్య 4 కోట్లకు చేరుకోగా, ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల పెరుగుదల వరుసగా 0.06, 0.45 శాతంగా వుంది. 1990-94 మధ్య కాలంలో ప్రభుత్వం అనుసరించిన సంపన్న వర్గాల అనుకూల నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల గుత్త పెట్టుబడిదారీ కంపెనీల లాభాలు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఈ నేపథ్యంలో కార్మికుల దీనస్థితిని పరిశీలించవల్సి వుంది.

## దారుణంగా దెబ్బతిన్న ప్రభుత్వ, సర్వీసు రంగాలు

నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు పారిశ్రామిక కార్మికుల మీదనే గాక, ప్రభుత్వ, సర్వీసు రంగాల ఉద్యోగుల మీద కూడ వినాశకర ప్రభావం చూపాయి.

బ్యాంకింగ్, బీమా రంగాల్లో కంప్యూటర్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశపెట్టడంతో, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు అవసరానికి మించివున్నట్లు తేలింది. ప్రత్యక్షంగా రిట్రెంచ్‌మెంట్ జరక్కపోయినప్పటికీ, ఈ రంగాల్లో నూతన నియామకాలను పూర్తిగా నిలిపివేయడం జరిగింది. ఇది నిరుద్యోగ యువత సంఖ్య పెరుగుదలకు దారితీసింది. టెలికంలో పరిస్థితి మరింత దారుణంగా వుంది. టెలికం రంగ కార్పొరేటీకరణ తర్వాత రిట్రెంచ్‌మెంటు భయం వాస్తవిక రూపం ధరించింది. వివిధ రాష్ట్రాల్లోని అనేక రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో కంప్యూటరైజేషన్‌కు పూనుకోవడంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు అదనంగా వున్నట్లు చూపడం జరుగుతోంది.

కేంద్ర సర్వీసులతో పాటు, రైల్వేలలోని మూడవ తరగతి ఉద్యోగ నియామకాల మీద ప్రభుత్వం నిషేధం విధించింది. అంతేగాక రిటైర్మెంట్లు తదితర విధాలుగా ఏర్పడిన ఖాళీలను నింపకుండా, దానిలో ఎక్కువ భాగం రద్దు చేసేందుకు సిద్ధపడింది. ఆ విధంగా కేంద్ర సర్వీసులు, రైల్వేల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయి, దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుదలకు దారితీస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ రంగం కూడ తీవ్రంగా ప్రభావితమైంది. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు 1993-94లో జిడిపిలో 7%గా వున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం ద్రవ్యలోటును 1996-97 నాటికి 5 శాతానికి తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి, దీనిని మరింత తగ్గించి 1996-97 నాటికి 3%కి తగ్గించాలని యోచించింది. ద్రవ్యలోటును తగ్గించిన మేరకు సంపద సృష్టించకపోతే, పాలనా యంత్రాంగం మీద పెట్టే ఖర్చు మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రభుత్వం ఇతర చర్యలతో పాటు ఇప్పటికే సబ్సిడీల తగ్గింపు, వ్యయం మీద కంట్రోళ్ళు కఠినతరం చేయడం, ప్రభుత్వరంగ సంస్థలకు బడ్జెటు కేటాయింపులు తగ్గించడం వంటి చర్యలను ప్రకటించింది. ఈ చర్యల వల్ల విద్య, వైద్యం, నీటి పారుదల, అడవుల పెంపకం, ప్రజాపనుల శాఖ (పిడబ్ల్యుడి)ల బడ్జెట్లతో పాటు, ప్రణాళికేతర కేటాయింపుల్లో కూడ దారుణంగా కోతపడింది. ఫలితంగా ప్రజల కష్టాలు ఇనుమడించాయి. ఇది

ప్రభుత్వోద్యోగాల్లో భారీ కోతకు దారితీసింది. వివిధ రాష్ట్రాల్లోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ బడ్జెటు కోత విధానానికి బలిపశువులయ్యారు. అంతేగాక సబ్సిడీ తొలగింపుతో పాటు, ప్రైవేటీకరణ విధానం, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల మీద బలమైన ప్రభావం చూపింది. కేంద్ర బడ్జెటరీ కోతల ఫలితంగా రాష్ట్ర బడ్జెట్లలో విధించిన కోతలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఎక్కువ భాగం మూసివేయడమో లేదా ప్రైవేటీకరించడం జరిగింది. దీనివల్ల వివిధ రాష్ట్రాల్లోని రాష్ట్ర ప్రభుత్యోద్యోగులు భారీ సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారు. ఒక అంచనా ప్రకారం అస్సాంలో 10 వేల మంది క్యాజువల్, కంటింజెంట్, మస్టర్‌రోల్ ఉద్యోగులు ఈ కాలంలో రిట్రెంచ్ చేయబడ్డారు. బీహార్‌లో అత్యధిక సంఖ్యలో 30 వేల మంది బజారునపడ్డారు. బీహర్ రోడ్డు రవాణాలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చివరకు కాలేజి, విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు, ఇతర రంగాల ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు లేవు. ఉత్తరప్రదేశ్‌లో సుమారు 10 వేల మంది రిట్రెంచ్ కాగా, మధ్యప్రదేశ్‌లో 30 వేల మంది క్యాజువల్, మస్టర్‌రోల్ ఉద్యోగులు రిట్రెంచ్ అయ్యారు. ఇతర రాష్ట్రాల్లో కూడ రాష్ట్ర పిఎస్‌యులు మరియు ప్రభుత్వ శాఖల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు అధికంగా వున్నట్లు చూపడం జరిగింది.

## ట్రేడ్ యూనియన్ల ప్రత్యామ్నాయ విధానాలు

1991 నుండి పరిణామాల నొక్కసారి సింహావలోకనం చేసుకుంటే కార్మికులు ఇతర శ్రమజీవుల ప్రయోజనాల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎంతటి క్లిష్టపరిస్థితుల్లో పనిచేసిందో అర్థమవుతుంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ వినాశకర ఆర్థిక, పారిశ్రామిక విధానాలను పూర్తిగా మార్చాలని డిమాండు చేస్తూ, ట్రేడ్ యూనియన్లు జాతీయ స్థాయిలో విశాల ఐక్యతను సాధించి అపూర్వమైన విధంగా ఆందోళనలు సాగించాయి. ట్రేడ్ యూనియన్లు కేవలం ఆందోళనలతో సరిపెట్టుకోక, ప్రజలను, దేశాన్ని కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం ముందుంచాయి.

ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీలు, ప్రజలు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న సందర్భంలో "అయితే ప్రత్యామ్నాయాలేంటి?" అనే ప్రశ్నను ప్రభుత్వం, ప్రజల ముందుకు తెచ్చింది. నిజానికి అప్పటికే ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారదాడి సాగించడం ద్వారా ప్రజల్లో భయాందోళనలు పుట్టించి, ఐఎంఎఫ్‌కు తలవంచడం తప్ప గత్యంతరం లేదనే వాతావరణం కల్పించింది. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని, చంద్రశేఖర్ ప్రభుత్వం అమ్మడం దేశంలో భయాందోళనలు సృష్టించింది. తిరిగి ప్రస్తుత ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకులోని 48 టన్నుల బంగారాన్ని రూ. 1000/- కోట్ల విదేశీ మారకద్రవ్యం కోసం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండుకు తాకట్టు పెట్టడంతో, ఇక విధికి తలవంచడం తప్ప చేయగల్గిందేమీ లేదనే నిరాశా, నిస్పృహలు ఆవరించాయి.

దీనికి తోడు దేశంలో సమాంతర బ్లాక్ మనీ ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. దీనిని బయటకు లాగేమాటటుంచితే, అసలు ప్రభుత్వం ఇప్పటికీ దీనిలోతుల్లోకి కూడ వెళ్ళలేదు.

నేటినుండి 20 సంవత్సరాల క్రిందట నల్లధనం సుమారు రూ.55 వేల కోట్ల నుండి రూ.80 వేల కోట్ల వరకు వుండవచ్చని, ఇది క్రమంగా పెరుగుతూనే వుందని వివిధ అంచనాలు వెల్లడిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపద్రవం తెస్తున్న భారీ మొత్తాల్లోని ఈ నల్లధనం ద్రవ్యోల్బణం పెరుగుదలకు ప్రధాన హేతువుగా వుంది. ఈ నల్లధనాన్ని వెలికి తీసేందుకు చర్యలు తీసుకునేందుకు బదులుగా, ప్రభుత్వం బడ్జెటు ద్వారా వారికి వూహించని బహుమతులు ప్రకటించింది. దీని ప్రకారం నల్లధనం కల్గినవారు ప్రభుత్వం నిర్వహించే హౌసింగ్ బ్యాంకుల్లో నల్లధనం డిపాజిట్ చేసినట్లయితే వారికి ఏవిధమైన శిక్ష విధించబడదు. ఇది బ్లాక్‌మనీ దారులకు ప్రభుత్వ లొంగుబాటు తప్ప మరేమీకాదు. అంతేగాక పేదలమీద పన్నులు విధిస్తున్న ప్రభుత్వం, సంపన్నుల నుండి రూ.5000 కోట్ల మేరకు పన్ను బకాయిల వసూలులో దారుణంగా విఫలమైంది. పెద్ద మొత్తంలో వున్న పన్ను బకాయిలను వసూలు చేసి, నల్లధనాన్ని వెలికితీస్తే, ప్రభుత్వం తాను ఆందోళనకరమైనదిగా చెప్పుకుంటున్న సంక్షోభాన్ని అధిగమించగలిగి వుండేది.

ప్రముఖ ఆర్థికవేత్తలు అనేకమంది, ఐఎంఎఫ్ అప్పుకు, ప్రస్తుత వినాశకర పారిశ్రామిక, వాణిజ్య విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను సూచించారు. పశ్చిమబెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వం కూడ ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను ప్రతిపాదించింది.

> అనేక మంది ప్రముఖ ఆర్థిక వేత్తలు, మేధావులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, ఇతర ప్రముఖులతో "ఆర్థిక సార్వభౌమత్వ పరిరక్షణకు" 1991 జూలై 19న న్యూఢిల్లీలో జరిగిన సదస్సు అన్ని విషయాలను కూలంకషంగా చర్చించిన తర్వాత ఒక డాక్యుమెంటును ఆమోదించింది. ఐఎంఎఫ్‌కు లొంగిపోయిన ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించిన డాక్యుమెంటు కొన్ని ప్రత్యామ్నాయాలను సూచించింది.

ఐఎంఎఫ్ షరతులను ఆమోదించిన దేశాల భయంకరమైన అనుభవాలను ప్రస్తావిస్తూ డాక్యుమెంట్ ఈ విధంగా పేర్కొంది.

> "ఒత్తిడికి తలవంచి ఐఎంఎఫ్ ఆదేశిత" వ్యవస్థాగత సర్దుబాటు మరియు స్థిరీకరణ విధానాలు అనుసరించిన దేశాల అనుభవాలే ఈ ప్రమాదాలను నొక్కి జెప్తున్నాయి. ఈ విధానాలను అనుసరించటం వల్ల అర్జెంటైనా, బ్రెజిల్, జమైకా, ఇతర అనేక దేశాలు సామాజిక, రాజకీయ ప్రకంపనలకు గురయ్యాయి. వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమం అమలులో భాగంగా సంక్షేమ చర్యల్లో కోత విధించడం వల్ల నానాటికి పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగాలతో తల్లడిల్లుతున్న ప్రజలకు రక్షణ కరువైంది. ఐఎంఎఫ్ ఆదేశిత వ్యవస్థా గత సర్దుబాటు కార్యక్రమాలను అమలుచేసిన తర్వాత, కొద్దిగానైన ఆర్థిక పరమైన విజయాలు సాధించడం గాని, తమ దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రజాతంత్ర సంస్థలను చెక్కుచెదరకుండా నిలబెట్టుకున్న మూడవ ప్రపంచ దేశం మచ్చుకు ఒక్కటైనా కానరాదు." "ప్రస్తుత సంక్షోభాన్ని అధిగమించి, మన దేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గం

వుందని" ఆ డాక్యుమెంటు నొక్కివక్కాణించింది. "గత కొద్ది మాసాలుగా దిగుమతుల మీద వున్న ఆంక్షలు వాణిజ్య లోటు మీద సానుకూల ప్రభావం చూపుతున్నాయి. పొదుపు పాటించాల్సిన ఈ సమయంలో అత్యవసరం కాని దిగుమతుల మీద ఆంక్షల విధింపు, దిగుమతి ఆధారిత, తక్కువ ప్రాధాన్యత గల్గిన పెట్టుబడి ప్రాజెక్టులను వాయిదా వేయడం, రక్షణ సంబంధమైన దిగుమతులను రిషెడ్యూల్ చేయడం గాని (అవసరమైతే కత్తిరించడం) చేయవల్సి వుంది. కేవలం ధరల సర్దుబాటు దృష్టితోగాక, మన ఉత్పత్తులు మంచి స్థాయిని పొందే విధంగానూ, మార్కెటింగ్‌కు అనుకూలంగా వుండే విధంగా వ్యూహాత్మక చర్యల ద్వారా భారీ స్థాయిలో ఎగుమతుల కార్యక్రమాన్ని చేపట్టాలి. ప్రత్యేక రాయితీలనిచ్చి, విదేశాల్లో వున్న భారతీయ కార్మికులు, ఇతర ప్రవాస భారతీయ (ఎన్‌ఆర్‌ఐ) పెట్టుబడిదారుల నుండి మధ్యకాలిక రుణాలు, సేకరించేందుకు, ప్రస్తుతమున్న కొన్ని స్వల్పకాలిక రుణాలను మధ్యకాలిక రుణాలుగా మార్చేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టాలి. దేశంలోకి తీసుకురాకుండా ఎగుమతిదారులు విదేశాల్లోనే దాచుకున్న ఎగుమతి ఆదాయాన్ని, అవసరమైతే వారిని శిక్షించైనా దేశంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. (ఇండియాలో నిరంతరం పడిపోతున్న రూపాయి విలువను దృష్టిలో వుంచుకుని, ఇండియన్ కరెన్సీలో మెరుగైన మారకం రేటు కోసం ఎగుమతి దారులు, తాము సంపాదించిన విదేశీ మారక ద్రవ్యాన్ని విదేశాల్లోనే డిపాజిట్ చేస్తున్నారు.) ఇది సుమారు 100 కోట్ల డాలర్లుంటుందని అంచనా. ఈ చర్యలు విదేశీ మారకద్రవ్యం దేశం నుండి బయటకు వెళ్ళడాన్ని నిరోధించి, తక్షణ విదేశీ మారకద్రవ్య లోటును పూడ్చుకునేందు కవసరమైన 200 నుండి 300 కోట్ల డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని దేశంలోకి తెస్తాయి.

"ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు అవసరమే. ఇవి ఐఎంఎఫ్ ఆదేశిత మార్గాల్లోనే ఉండనవసరం లేదు. ఉండరాదు. ప్రత్యక్ష పన్నులు విధించడం, అత్యవసరం కాని, వృధాప్రభుత్వ వ్యయాన్ని తీవ్రంగా తగ్గించడం, ద్రవ్యలోటు తగ్గించేందుకు ప్రధాన సాధనాలు. "పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ జోక్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న బృందగానంలో పెట్టుబడిదారు లనుభవిస్తున్న వివిధ రకాల స్వేచ్ఛలు మరుగునపడ్డాయి. పెట్టుబడిని క్రమశిక్షణలో పెట్టడం కీలకమైనది. ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా గాని, ఇతర కారణల వల్ల గాని, సంస్థల నిర్వహణలో అవకతవకలకు పాల్పడడం వల్ల పారిశ్రామిక సంస్థలు ఖాయిలాకు గురైతే, అందుకు బాధ్యులైన వారిని శిక్షించి, వారి వ్యక్తిగత ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి. అవసరమైన రుణాలు ఇచ్చి, ఆ సంస్థలను కార్మికులకు అప్పచెప్పే అంశాన్ని తీవ్రంగా పరిశీలించాలి. "ప్రైవేటు పరిశ్రమలు తగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని (భారీ నిరుద్యోగ సైన్యమున్న భారతదేశ పరిస్థితులను దృష్టిలో వుంచుకుని తగిన టెక్నాలజీ) ఎంపిక చేసే విధంగానూ, యంత్ర సామాగ్రి నిర్వహణకు, ఆర్ అండ్ డి (పరిశోధన మరియు అభివృద్ధి)లో పెట్టుబడి పెట్టే

విధంగానూ, సాంకేతిక పరిజ్ఞానం స్థాయిని పెంచి, ఆధునికీకరించి అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే విధంగా ప్రభుత్వం చురుగ్గా జోక్యం చేసుకోవాలి. ఆధునీకీకరణ అవసరమైన కీలక రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం దిగుమతికి ప్రాధాన్యతనిస్తూనే, విలాసవస్తువుల ఉత్పత్తి కవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాల విచక్షణా రహిత దిగుమతుల విధానానికి స్వస్తి చెప్పాలి. కీలక వ్యూహాత్మక పరిశ్రమల్లో ప్రభుత్వ రంగ ప్రాధాన్యతను కొనసాగించాలి. వీటిలో అసమర్ధతను, యాజమాన్యంలో బ్యూరో క్రాటిక్ పద్ధతులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. అత్యవసరం కాని రంగాలను మినహాయించి, ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగం కీలక పాత్ర వహించే విధంగా, ప్రాధాన్యతా క్రమంలో విధులు కేటాయించాలి. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వాహణకు విఘాతం కల్గించే విధంగా, ప్రైవేటీకరణను తీవ్రతరం చేసేందుకు దోహదం చేసే, నూతన పారిశ్రామిక విధాన ప్రకటనను (అప్పటికే ప్రకటించడం జరిగింది) నిలిపివేయాలి.

“భూసంస్కరణల అమలుపై కేంద్రీకరణ మధ్యకాలిక లక్ష్యంగా వుండాలి. భూసంస్కరణల ప్రాతిపదిక మీదనే దక్షిణ కొరియా, తైవాన్‌లు పారిశ్రామికీకరణను విజయవంతం చేశాయి. ఐఎమ్ఎఫ్ కూడ అదే మార్గం చూపింది. అందువలన భూసంస్కరణల అమలు విషయమై ప్రభుత్వం తన కుట్ర పూరితమైన మౌనాన్ని విడనాడాలి. దీనితోపాటు, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాలను ప్రవేశపెట్టి, గ్రామీణ మౌలిక సదుపాయాలను, వ్యవసాయాభివృద్ధిని పటిష్టం చేసేందుకు వారి శ్రమను సమీకరించడం ద్వారా స్వదేశీ మార్కెట్‌ను విస్తరించే కృషి చేయాలి.

“తీవ్రంగా వున్న ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పొదుపు చర్యలు తప్పవు. అయితే ఈ పొదుపు చర్యల ఫలితంగా పడే భారాన్ని ముందుగా బడా పారిశ్రామికవేత్తలు, భూస్వాములు మరియు సమాజంలోని సంపన్న వర్గాలు భరించాలి. ఈ ఆర్థిక కష్టాల కాలంలో పేదలకు ఉపశమనం కల్గించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిత్యావసర వస్తువులను సరఫరా చేసే విధంగా ప్రజాపంపిణీ వ్యవస్థను విస్తరించి గ్రామీణ పేదలను లక్ష్యంగా చేసుకోవాలి. ఉపాధికల్పనకు, పేదరిక నిర్మూలనకు సంబంధించిన పథకాలను గణనీయంగా విస్తరింపజేయాలి. ప్రాథమిక విద్య, అక్షరాస్యత, ప్రజారోగ్యాలను ప్రధానమైన అంశాలుగా ఎంచుకోవాలి. అధికారాలను కేంద్రం నుండి రాష్ట్రాలకు, చివరకు పంచాయతీ స్థాయి వరకు వికేంద్రీకరించి, తమ జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకునేందుకు ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా మాత్రమే ఈ చర్యలను సమర్థవంతంగా అమలు చేయవచ్చు.

"చివరిగా జాతి వ్యతిరేక నూతన పారిశ్రామిక విధాన ప్రకటనను ఉపసంహరించాలి."

అయితే ప్రభుత్వం ఈ సలహాలను చెవికెక్కించుకుంటుందా లేక దేశానికే వినాశకరమైన తన విధ్వంసకర విధానాలనే కొనసాగిస్తుందా అనే అసలు ప్రశ్న.

ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు, వివిధ ప్రజాజీవన స్రవంతులకు చెందిన వారు, ప్రభుత్వ వినాశన క్రీడపట్ల మౌనంగా వుండజాలరు. ఈ ప్రత్యామ్నాయాలను ప్రతిపాదిస్తూనే, ప్రభుత్వం తన వినాశనకర మార్గాన్ని విడనాడి, ప్రత్యామ్నాయ విధానాలనమలు చేసే విధంగా ఒత్తిడి తెచ్చేందుకు శ్రామిక ప్రజలు, మేధావులు ఐక్యంగా పోరాడాలి.

## బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం తీవ్రమైన మతోన్మాదం

ఈ కాలంలోనే కార్మికవర్గం ఆర్థిక పరంగా విషమ పరిస్థితితో పాటు, దేశంలో మిక్కిలి ప్రమాదకరమైన మతోన్మాదకర పరిస్థితినెదుర్కొనవల్సి వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులు, ఉద్యోగులోని ఒక భాగంతో పాటు, ప్రజానీకంలోని ఒక పెద్ద సెక్షన్ మతపరమైన భావాలకు లోనయింది. భారతదేశం బహుళ మతాల, భాషల, జాతుల సమాహారం. ఈ చారిత్రక పరిణామాన్నెవరూ కాదనలేరు. అయితే దురదృష్టవశాత్తు ఈ చారిత్రక వాస్తవాన్ని మరుగుపర్చి, ఒక ప్రణాళిక ప్రకారం దేశంలో మతోన్మాద పూరిత వాతావరణాన్ని నెలకొల్పే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇది వివిధ మతాల మధ్య మతపరమైన విభజనకు దారితీసింది. శ్రామిక ప్రజల జీవితాల కఠోర వాస్తవాలతో సంబంధం లేని వివిధ ఊహాజనిత సమస్యలను మత దృక్కోణంతో చేపట్టడం జరిగింది. మన దేశంలోని ప్రజలకు ఆహారం, నీడ, విద్య, వైద్యం మరియు సాంస్కృతిక వికాసం కావాలి. అయితే దేశంలో మానవావసరాలకు సంబంధించిన ఈ అంశాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించి, మతోద్రేకాలను రెచ్చగొట్టేందుకు, సంబంధం లేని అంశాలను ముందుకు తేవడం విషాదకర పరిణామం. శ్రామికవర్గ ఐక్యతనిది తీవ్రంగా ప్రభావితం చేసింది. మతం, కులం, సాంప్రదాయాలతో నిమిత్తం లేకుండా కార్మికులు, ఉద్యోగులను ఐక్యం చేసి, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగానూ, గౌరవప్రదమైన జీవనం కోసం ట్రేడ్ యూనియన్లు పోరాడతాయి. ఈ కాలంలో దేశంలో మతపరమైన చిచ్చు రగల్చబడడంతో, ఈ ఉన్నతాశయానికి తీవ్ర విఘాతం కలిగింది.

దేశంలోని కార్మికులు, ఉద్యోగులు పరిస్థితి తీవ్రతను గుర్తించి, ప్రాణాంతకమైన మతోన్మాద శత్రువును ఎదుర్కొని, ఓడించేందుకు ఐక్యతను నిర్మించి, తమ శక్తినంతను సమీకరించాలి. మతోన్మాదం ఏదైనా దేశానికి, ప్రజలకు తీవ్రహాని కల్గిస్తుంది. ఈ శక్తులను శాశ్వతంగా ఓడించి, దేశాన్ని రక్షించడం శ్రామికవర్గ దేశభక్తియుత కర్తవ్యం. ఈ నేపథ్యంలో వినాశకర ప్రభుత్వ ఆర్థిక విధానాలు, అభివృద్ధి నిరోధక శక్తులు సృష్టించిన మతోన్మాద ప్రమాదాన్ని ట్రేడ్‌యూనియన్లు నిర్ణయాత్మకంగా ఎదుర్కోవాలి.

## జాతీయ వేతన విధానం మరియు రాజ్యాంగంలోని 310, 311(2) ఎ,బి,సి నిబంధనల తొలగింపు పై జాతీయ సెమినార్

ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 1990 సెప్టెంబరు 7వ తేదీన, జాతీయ వేతన విధానం మరియు 310, 311(2) ఎ,బి,సి రాజ్యాంగ నిబంధనల తొలగింపు అంశాల మీద జరిగిన జాతీయ సెమినార్ ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమంలో ఒక ప్రధాన ఘట్టం. అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వం, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, జిఐసిల్లోని ఉద్యోగుల జాతీయ ఫెడరేషన్లు, పబ్లిక్ రంగ ఉద్యోగులతో పాటు యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్లు, న్యాయశాస్త్రవేత్తలు, పార్లమెంటు సభ్యులు, ఆర్థిక శాస్త్రవేత్తలు వంటి వివిధ జన జీవన స్రవంతులకు చెందిన ప్రముఖులను సదస్సు కాహ్వానించడం జరిగింది. జాతీయ వేతన విధానం, 310, 311(2) ఎ,బి,సి రాజ్యాంగ నిబంధనల తొలగింపు మీద ఫెడరేషన్ ప్రతిపాదించిన రెండు పత్రాలు ఆహూతుల ప్రశంసల నందుకున్నాయి. జాతీయ వేతన విధానం మీద ప్రవేశపెట్టిన పత్రం, ఆ అంశానికి సంబంధించిన అవగాహనను పూర్తిగా వివరించి, దానిని ఆచరణలో పెట్టేందుకవసరమైన విధి విధానాలను కూడా వివరించింది. 310, 311(2) ఎ,బి,సి రాజ్యాంగ నిబంధనల మీద సమర్పించిన పత్రం రాజ్యాంగంలోని ఈ నిరంకుశ, అప్రజాస్వామిక నిబంధనల పుట్టుపూర్వోత్తరాలను వివరించి, ప్రజాతంత్ర, ట్రేడ్‌యూనియన్ హక్కులను పరిరక్షించేందుకు వాటిని తొలగించాల్సిన అవసరాన్ని వివరించింది. టెలివిజన్, రేడియోలతో సహా ప్రసార మాధ్యమాలు ఈ సెమినార్‌కు మంచి ప్రచారం ఇచ్చాయి.

## వివిధ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా జాతీయ సదస్సు

సిఐటియు, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, ఐఎన్‌టియుసి, యుటియుసి (లెనిన్ సారణి), టియుసిసిల సంయుక్త ఆధ్వర్యంలో 1990 సెప్టెంబర్ 19న న్యూఢిల్లీలో మతోన్మాదానికి వ్యతిరేకంగా జాతీయ సదస్సు జరిగింది. ప్రధానంగా రామజన్మభూమి – బాబ్రీ మసీదు సమస్య మీద మతోన్మాద సంస్థలు సాగిస్తున్న మతోన్మాద దాడులను ఐక్యంగా ప్రతిఘటించవల్సిందిగా సదస్సు కార్మిక వర్గానికి పిలుపిచ్చింది. జమ్ముకాశ్మీర్, పంజాబు, అస్సాం తదితర ప్రాంతాల్లో సాగుతున్న వేర్పాటువాద శక్తుల హింసాకాండకు వ్యతిరేకంగా పోరాడవల్సిందిగా సదస్సు కార్మిక వర్గానికి పిలుపిచ్చింది. ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌తో సహా వివిధ జాతీయ ఫెడరేషన్లు సదస్సులో పాల్గొన్నాయి. రథయాత్ర దేశంలోని వివిధ ప్రాంతాల్లో మతోన్మాద హింసాకాండకు దారితీయడంతో దానిని ముందుగానే అడ్డుకోవడంతో 1990 నవంబరులో శ్రీ వి.పి.సింగ్ నాయకత్వంలోని

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని దించివేయడం జరిగింది. పార్లమెంటులో అతిపెద్ద పార్టీ, జాతీయ కాంగ్రెసు మద్దతుతో శ్రీ చంద్రశేఖర్ నాయకత్వంలో పూర్తి మైనారిటీ ప్రభుత్వం ఏర్పడింది. చంద్రశేఖర్ మైనారిటీ ప్రభుత్వం పడిపోయి, నూతన కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు 1991 మే 19న సాధారణ ఎన్నికలు జరిగాయి. ఢిల్లీలో అధికార పీఠమాక్రమించిన నూతన కేంద్ర ప్రభుత్వం, చంద్రశేఖర్ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక, పారిశ్రామిక విధానాలను మరింత వేగవంతంగా కొనసాగించడంతో అవి చివరకు భీకర స్వరూపాన్ని సంతరించుకున్నాయి.

## స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు

## నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి

## ఐక్య సార్వత్రిక సమ్మె అనంతర పరిస్థితి

ఈ పరిస్థితుల్లో కేంద్రంలోని నూతన మైనారిటీ ప్రభుత్వ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు దాదాపు అన్ని ట్రేడ్ యూనియన్లు కలిసి స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అనే వేదికనేర్పాటు చేశాయి. కేంద్ర ప్రభుత్వ నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించుకునేందుకు, 1991 సెప్టెంబరు 17వ తేదీన న్యూఢిల్లీలోని సప్రూహౌస్ ఆడిటోరియమ్‌లో జాతీయ సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది. పెద్ద ఎత్తున జరుగుతున్న ఆర్థిక విధాన మార్పులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది.

నూతన కేంద్ర ప్రభుత్వ ప్రమాదకర ఆర్థిక, పారిశ్రామిక విధానాలను ఓడించేందుకు 1991 నవంబరు 29న ఒక రోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయవల్సిందిగా సదస్సు కార్మిక వర్గానికి పిలుపిచ్చింది. ఈ జాతీయ సదస్సుకు ముందే, 1991 సెప్టెంబర్ 6వ తేదీన ఢిల్లీలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గం, దేశవ్యాప్త సాధారణ సమ్మెలో చురుకుగా పాల్గొన వల్సిందిగా ఉద్యోగులకు పిలుపిచ్చింది.

వివిధ ట్రేడ్ యూనియన్లు సంయుక్త సన్నాహాల ఫలితంగా కార్మికవర్గం 1991 నవంబరు 29న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు, ఆర్థిక రంగ సంస్థల ఉద్యోగులు, ప్రభుత్వోద్యోగులతో సహా వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు వందలు, వేల సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. ఎక్కువ రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు గణనీయమైన సంఖ్యలో సమ్మెలో భాగస్వాములయ్యారు. ప్రభుత్వ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగానూ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల విషమ షరతులకు లొంగే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగానూ ప్రథమ సమరశీల దేశవ్యాప్త సాధారణ సమ్మె ఇది.

ప్రభుత్వ బడ్జెటుకు, ఆర్థిక విధానాలకు నిరసనగా స్పాన్సరింగ్ కమిటీ పిలుపు మేరకు ఢిల్లీలో 1992 ఏప్రిల్ 2న బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. వివిధ రంగాలకు చెందిన కార్మికులతో పాటు, రాజస్థాన్, హర్యానాలతో సహా పరిసర రాష్ట్రాల నుండి రాష్ట్ర ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీవ్ర ప్రమాదకరంగా ఉన్న దేశ ఆర్థిక పరిస్థితిని సమీక్షించి, ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం నిరసన వ్యక్తం చేసేందుకు తగిన కార్యాచరణ రూపకల్పనకు 1992 మే నెలలో ఢిల్లీలోని మవలంకర్ హాలులో స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో “ప్రభుత్వ ఆర్థిక, పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా” మరొక జాతీయ సదస్సు నిర్వహించడం జరిగింది.

ఆలిండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు చెందిన పెద్ద ప్రతినిధి వర్గంతో పాటు, అనేక ట్రేడ్ యూనియన్లు, జాతీయ ఫెడరేషన్ల ప్రతినిధులతో సహా మొత్తం 1500 మందికి పైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆర్థిక, పారిశ్రామిక విధానాలను, దేశ కార్మికవర్గం, ఉద్యోగుల మీద వీటి హానికర ప్రభావాన్ని గురించి విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ 14 అంశాల ప్రకటనను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. 1992 జూన్ 16వ తేదీన మరొక దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు దేశ కార్మికవర్గానికి ఉద్యోగులకు సదస్సు పిలుపు నిచ్చింది.

ప్రభుత్వ ఆర్థిక, పారిశ్రామిక విధానాల వ్యతిరేక పోరాటం దీర్ఘకాలిక స్వభావం కల్గింది కనుక, దీనిని ముందుకు తీసుకెళ్ళేందుకు, పరిశ్రమల వారీగానూ, రాష్ట్రాల స్థాయిలోనూ, స్థానిక స్థాయిలోనూ సదస్సులు నిర్వహించడం ద్వారా కార్మికులను చైతన్యవంతులను చేసే కృషి చేయాలనీ, 1992 జూలై 17వ తేదీన జరిగిన స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ సమావేశం కార్మికులు, ఉద్యోగులకు పిలుపునిచ్చింది. న్యూఢిల్లీలో 1992 సెప్టెంబరులో మరొక సదస్సు, నవంబరులో పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇదే సమయంలో మతోన్మాదానికి, వేర్పాటువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించ వలసిందిగానూ, ఈ సమస్య మీద ఢిల్లీలో ఒక అఖిల భారత సదస్సు నిర్వహించాల్సిందిగా సమావేశం పిలుపునిచ్చింది.

> 1992 సెప్టెంబరు 13న జరిగిన జాతీయ సదస్సు, 1992 నవంబరు 25న పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా అన్ని పారిశ్రామిక కేంద్రాలు, ప్రభుత్వ ఆఫీసుల్లో ఈ సమ్మెను అపూర్వమైన రీతిలో విజయవంతం చేసేందుకు విస్తృతంగా సన్నాహాలు చేశారు. పది లక్షలకు పైగా కార్మికులు ప్రదర్శన, ర్యాలీల్లో పాల్గొన్నారు. 1992 నవంబరు 25న ఢిల్లీ ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో కార్మికవర్గ సందోహాన్ని చూచింది. తమ తమ యూనియన్ల రంగు రంగుల బ్యానర్లతో, పోస్టర్లతో వివిధ రాష్ట్రాల నుండి వరదలా వచ్చిన కార్మికులు, ఉద్యోగులతో ఢిల్లీలోని బోట్‌క్లబ్ మైదానం వెల్లువెత్తింది.

ఎర్రకోట మైదానం నుండి ప్రారంభమైన మహా కార్మిక ప్రదర్శన ఢిల్లీ పురవీధుల గుండా సాగి బోట్‌క్లబ్‌కు చేరుకుంది. ఈ మానవ సముద్రాన్ని ఉద్దేశించి స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ మరియు జాతీయ ఫెడరేషన్ల నాయకులు ప్రసంగించారు. ప్రభుత్వ విపత్కర ఆర్థిక, పారిశ్రామిక విధానాల నోడించేందుకు కంకణబద్ధులైన కార్మికులు, ఉద్యోగుల మహా ఐక్య ప్రదర్శన ఇది. కార్మికవర్గంతో, రైతాంగం, ఇతర తరగతుల శ్రామిక ప్రజల ఐక్యతను విస్తరింపచేయడానికి మరొక సార్వత్రిక సమ్మెను, బంద్‌ను నిర్వహించాలని కార్మికవర్గానికి పిలుపునిస్తూ మహాప్రదర్శన ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. మతోన్మాదశక్తుల ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి దీక్ష బూనుతూ మరో తీర్మానాన్ని ప్రదర్శన ఆమోదించింది.

కాని దురదృష్టవశాత్తు, 1992 డిసెంబరు 6వ తేదీన బాబ్రి మసీదు బలవంతంగా కూల్చివేయబడడంతో, దేశంలో సంభవించిన మిక్కిలి విషాదకర సంఘటనల ఫలితంగా, సాధారణ సమ్మెకు, బంద్‌కు దేశ చరిత్రలోనే అతిపెద్ద కార్మిక ప్రదర్శన ఇచ్చిన పిలుపు కార్యరూపం దాల్చలేదు. మున్నెన్నడూ లేని విధంగా దేశంలో మతోన్మాదం చెలరేగి, దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో మతపరమైన మారణకాండ సాగింది. ఫలితంగా శ్రామిక ప్రజల ఆర్థిక సమస్యలు వెనక్కుపోయి, మతపరమైన అంశాలు అత్యంత ప్రాధాన్యత గలవయ్యాయి. ఇదొక విచిత్రమైన, విషాదకర పరిస్థితి. అనేక సంవత్సరాలుగా పోరాటాల ద్వారా నిర్మించుకుని, 1992 నవంబరు 25న ఢిల్లీలో జరిగిన చారిత్రాత్మక ప్రదర్శన ద్వారా నిరూపితమైన కార్మికవర్గ ఐక్యతను, మతోన్మాదం కప్పివేసింది. ఈ సంఘటన తర్వాత కొన్ని నెలలపాటు, కార్మికులను వేధించే ఆర్థిక సమస్యల మీద పోరాటాలు నిర్మించేందుకు సానుకూల పరిస్థితులు లేవు. పైపెచ్చు మతసామరస్యాన్ని పునరుద్ధరించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు ట్రేడ్ యూనియన్లు కొన్ని నెలల పాటు శ్రమించవలసి వచ్చింది. 1993 జనవరి 4న ఢిల్లీలో సమావేశమైన స్పాన్సరింగ్ కమిటీ, 1992 డిసెంబరు 6న అయోధ్య పరిణామాల అనంతరం దేశంలో నెలకొన్న తీవ్ర మతోన్మాద పరిస్థితులను సమీక్షించింది. మతోన్మాదానికి వ్యతిరేకంగానూ, మత సామరస్యం, ఐక్యతలను పెంపొందించేందుకు వెంటనే ప్రచారం చేపట్టవలస్సిందిగా కార్మికవర్గానికి పిలుపునిచ్చింది. మత సామరస్యం, ప్రజల ఐక్యత కోరుతూ, కోట్లాదిమందితో సంతకాలు చేయించే, భారత రాష్ట్రపతికి సమర్పించేందుకుద్దేశించిన ప్రతిజ్ఞ ముసాయిదానుకూడా కమిటీ రూపొందించింది. మహాత్మాగాంధి వర్ధంతి సందర్భంగా 1993 జనవరి 30న "మత సామరస్య దీక్షాధినం" పాటించాలని, అన్ని ఆఫీసులు, ఫ్యాక్టరీ గేట్ల వద్ద సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసి దీక్షబూనాలని పిలుపిచ్చింది. 1992 డిసెంబరు 25న ఢిల్లీ కార్మిక మహా ప్రదర్శన తీర్మానం మేరకు సార్వత్రిక సమ్మె, భారత్‌బంద్ తేదీలు నిర్ణయించేందుకు 1993 ఫిబ్రవరి – మార్చి నెలల్లో రైతాంగం, విదార్థులు, యువజనులు, మహిళా సంఘాలతో కార్మికవర్గం ఒక జాతీయ సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇదిలా వుండగానే "మత సామరస్య ప్రతిజ్ఞ" మీద మూడు కోట్లకు పైగా సంతకాలు సేకరించి, భారత రాష్ట్రపతికి సమర్పించడం జరిగింది.

## జాతీయ స్థాయిలో ప్రజా సంఘాల వేదిక ఆవిర్భావం

స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ చొరవతో రైతాంగం, యువత, విద్యార్థులు, మహిళా సంఘాలతో కలిసి జాతీయస్థాయిలో ప్రజా సంఘాల వేదికను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలను ప్రతిఘటించేందుకు ఏర్పాటైన ఈ జాతీయ వేదిక ఆధ్వర్యంలో 1993 ఏప్రిల్ 15న ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సు జనరల్ సమ్మె, భారత బంద్‌ల తేదీలను నిర్ణయించింది. వృత్తి నిపుణులు, కార్మికులు, అధికారులు, సాంస్కృతిక దళాలు, రైతాంగం, విద్యార్థులు, శ్రామిక మహిళలు, తదితరులకు చెందిన 50 ప్రజా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, ఏడువేల మందికి పైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ప్రభుత్వ హానికర ఆర్థిక విధానాలు, మతతత్వ హింసా విద్వేషాలను రెచ్చగొట్టే, మతోన్మాద శక్తుల ప్రమాదకర పెరుగుదలకు వ్యతిరేకంగా తీర్మానం, ప్రభుత్వ ఆర్థిక, పారిశ్రామిక విధానాలా ప్రమాదకర ఫలితాలను విమర్శనాత్మకంగా విశ్లేషించి, ఈ విధానాలకు వ్యతిరేకంగా 1993 సెప్టెంబరు 9న సార్వత్రిక సమ్మె, భారత్ బంద్‌లను పాటించాల్సిందిగా పిలుపునిచ్చింది. విషపూర్తి మతోన్మాదానికి వ్యతిరేకంగానూ, శ్రామిక ప్రజల ఐక్యతను బలపర్చేందుకు పోరాడవల్సిందిగా, శ్రామికవర్గం, యువజనులు, విద్యార్థులు, మహిళలకు సదస్సు పిలుపునిచ్చింది.

ఎంతో శ్రమకోర్చి, పట్టుదలతో చేసిన సన్నాహాల ఫలితంగా 1993, సెప్టెంబరు

9న సమ్మె బ్రహ్మాండంగా విజయవంతమైంది. ఈ దేశ వ్యాప్త జనరల్ సమ్మెలో ఒకటిన్నర కోట్ల మంది ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఐఎన్‌టియుసి, సమ్మెలో పాల్గొన్నారు.

కాని దురదృష్టవశాత్తు, దేశ కార్మికవర్గ మనోభావాలను, ప్రభుత్వ విధానాలకు పెరుగుతున్న ప్రతిఘటన నుండి ప్రభుత్వం ఇంకా గుణపాఠాలు నేర్చుకోవల్సివుంది. ఐఎన్‌టియుసి, బిఎమ్ఎస్‌లు ఈ సమ్మెలో లేనప్పటికీ, ఆ కేంద్ర కార్మిక సంఘాల సభ్యులు సమ్మెలో పాల్గొన్నారు. పెరుగుతున్న కార్మికవర్గ ఐక్యతకిది నిదర్శనం. అయినప్పటికీ ఈ బ్రహ్మాండమైన ప్రతిఘటనా పోరాటాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. సమ్మె జరిగిన తర్వాత, దక్షిణ కొరియా పర్యటనలో వున్న దేశ ప్రధాని, తమ ఆర్థిక, పారిశ్రామిక విధానాల నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుతిరిగేదిలేదని ప్రపంచానికి చాటిచెప్పారు. అంటే దేశ పారిశ్రామిక వ్యవస్థను విధ్వంసం చేసి, దేశాన్ని నాశనం చేసేందుకే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్న మాట! సహజంగానే 1993 సెప్టెంబరు 9న జరిగింది అంతం కాదు, ఆరంభం మాత్రమే కార్మికవర్గ ప్రయోజనాలు, దేశ ప్రయోజనాల పరిరక్షణకు స్వతంత్ర కార్మిక వర్గం రాబోయే రోజుల్లో సాగించబోయే పోరాట క్రమంలో ఈ సమ్మె గీటురాయిగా నిలుస్తుంది. మరింత తీవ్రమైన, ఐక్య పోరాటాలకు ఉద్యోగులు, కార్మికులు సన్నద్ధంగా వుండాలి.

## నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లు

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, పారిశ్రామిక విధానాల నేపథ్యంలో బహుళ జాతి కంపెనీలు భారత దేశంలోని తమ పెట్టుబడులకు పూర్తి రక్షణ కల్పించవల్సిందిగా డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు ప్రస్తుత కార్మిక చట్టాల్లో సవరణలు చేయడం ద్వారా, ఈ చట్టాలు కార్మికులకు కల్పిస్తున్న రక్షణలను ఉపసంహరించాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నాయి. కార్మిక చట్టాలకు సవరణలు సిఫార్సు చేసేందుకు ప్రభుత్వం ఐఎన్‌టియుసి నాయకులు శ్రీ రామానుజం నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. భారత కార్మికవర్గం సుదీర్ఘ తీవ్ర పోరాటాల ద్వారా సాధించుకున్న రక్షణలను కాలరాచి, యజమానుల దోపిడీకి స్వేచ్ఛ నిచ్చే విధంగా నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లు ముసాయిదా సిద్ధం చేశారు. మనదేశంలోని విదేశీ పెట్టుబడిదారులను బుజ్జగించి, గుత్తపెట్టుబడిదారులను సంతోషపెట్టేందుకు, భారత కార్మికవర్గం కష్టపడి సాధించుకున్న హక్కులను, రక్షణలను చాల వరకు ఉపసంహరించే విధంగా వున్న నూతన పారిశ్రామిక సంబంధాల బిల్లును ఆమోదింప జేసుకునేందుకు ప్రభుత్వం పట్టుదలగా వుంది. ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందితే, కార్మికులు ఏవిధమైన రక్షణ లేక నిస్సహాయులవుతారు. కార్మికులను అణచివేసి, దోపిడీని తీవ్రం చేసి విపరీతంగా లాభాలు దండుకునేందుకు గుత్త పెట్టుబడిదారులు, పెట్టుబడిదారులు బహుళ జాతి సంస్థలకు పూర్తి రక్షణ లభిస్తుంది. కాని ట్రేడ్ యూనియన్ల బలమైన ప్రతిఘటన వల్ల బిల్లు చట్టంగా రూపొందలేదు.

## 5వ కేంద్ర వేతన సంఘం

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొదుపుచర్యల కమిటీ మరియు హెచ్.ఎన్.రే కమిటీల నివేదికల మేరకు ప్రభుత్వం చేపట్టిన వేతన స్తంభన ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశంలోని కార్మికులు, ఉద్యోగులు శక్తివంతమైన ఉద్యమాన్ని నిర్మించారు. ఉద్యోగులకు వర్తింపజేసే ఆర్థిక సదుపాయలను స్తంభింపజేయడం గాక, ఆలస్యం చేసే తన కొత్త ఎత్తుగడల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 5వ కేంద్ర వేతన సంఘాన్ని నియమించే ఉద్దేశ్యాన్ని ప్రకటిస్తూ తన ఉద్యోగులకు వంద రూపాయలు ఇన్‌టెరిమ్ రిలీఫ్ తాత్కాలిక భృతీ గ్రాంట్ చేసింది. పే కమిషన్ నియామకం కేవలం ప్రభుత్వోద్యోగులకు చెందవల్సిన బెనిఫిట్ల చెల్లింపును ఆలస్యం చేయడానికేననేది గత అనుభవం. వేతన సంఘం తన సిఫార్సుల నీయడానికి కొన్ని సంవత్సరాల సమయం తీసుకుంటుంది. ఈ కాలంలో ఉద్యోగులు ఇబ్బందుల పాలవుతారు. పే కమిషన్‌లోని సభ్యులు, మార్గదర్శకాలు, సిఫార్సులు చేయడానికి నిర్ణయించిన కాలపరిమితి వంటి అంశాల మీద ఎక్కువ ఆధారపడుతుంది. అందువల్లనే రిటైరైన జడ్జీల ప్యానెల్ నుండి సభ్యులను నియమించాలని, జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (జెసిఎం)లోని స్టాఫ్ పక్షం నుండి ఇద్దరు కమిషన్ సభ్యులుగా వుండాలని, వేతనాలు, అలవెన్సులు సిఫార్సు చేయడానికే కమిషన్ పరిమితం కావాలని, కమీషన్ ఏర్పాటు చేసిన తర్వాత సంవత్సర కాలంలో కమిషన్ నివేదిక సమర్పించాలని సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్

ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. జె.సి.ఎం.తో సంప్రదింపుల తర్వాతనే కమిషన్‌కు ఇచ్చే మార్గదర్శకాలకు తుదిరూపం ఇవ్వాలని కూడా కాన్ఫెడరేషన్ కోరింది.

ఇదిలా వుండగా, ప్రభుత్వశాఖల్లోని వివిధ రకాల పనులను ప్రభుత్వం ప్రైవేటీకరించింది. ఉదాహరణకు అనేక రాష్ట్రాల్లోని ఆసుపత్రుల్లో శుభ్రం చేసే పనిని ప్రైవేటీకరించారు. ప్రభుత్వ సంస్థల్లో సెక్యూరిటీ గార్డుల వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. కంప్యూటర్ మీద చేసే పనులు, డిజైనింగ్ పనులను కాంట్రాక్టర్లకప్పగించారు. ఫలితంగా ప్రభుత్వోద్యోగుల సంఖ్య తగ్గిపోయింది.

అంతేగాక రెగ్యులర్ ఉద్యోగుల స్థానంలో క్యాజువల్, పార్ట్‌టైం ఉద్యోగుల నియామకాలు ప్రారంభమయ్యాయి. పశ్చిమబెంగాల్‌లోని వామపక్ష సంఘటన ప్రభుత్వం ఇందుకు మినహాయింపు. ఈ ప్రభుత్వం రెగ్యులర్ ఖాళీలను క్యాజువల్ ఉద్యోగులతో నింపకపోగా ఇటీవలనే క్యాజువల్, పార్ట్‌టైం, మస్టర్‌రోల్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగుల క్యాటగిరీల్లో పెట్టింది. నేటికి పశ్చిమబెంగాల్‌లోని ఏ ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ ప్రైవేటీకరించబడలేదు.

వామపక్ష ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో తప్ప మిగిలిన దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ రిక్రూట్‌మెంట్‌ను నిషేధించారు. ఈ రాష్ట్రాల్లో కూడా పెద్ద సంఖ్యలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాల్సివుంది. ఇతర రాష్ట్రాల్లో ఖాళీగా వున్న వేలాది ఖాళీ పోస్టుల్లో కొన్నింటిని రద్దు చేయడం జరిగింది. మహారాష్ట్రలో ఖాళీగా వున్న పోస్టులను రద్దు చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. దేశంలోని ప్రభుత్వోద్యోగుల మీద ఈ నూతన ఆర్థిక విధానాలు ఈ విధంగా దుష్ప్రభావం చూపుతున్నాయి. నూతన ఆర్థిక విధానాలు ఈ విధంగా ఉద్యోగులు, చివరకు యావద్దేశానికే వినాశనకరంగా తయారయ్యాయి.

## యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ శకం

వినాశకర ఆర్థిక విధానాలు, మత ఛాందసవాదం పెచ్చరిల్లడం, ఉన్నత స్థానాల్లో అసాధారణ అవినీతి నేపథ్యంలో 1996 ఏప్రిల్ చివరి వారం మే మొదటి వారం మధ్య కాలంలో లోక్‌సభకు, ఆరు రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరిగి, కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడడం, దేశ రాజకీయ చరిత్రలో కీలక ప్రాధాన్యతను సంతరించుకుంది.

మతోన్మాదం, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు ఆదేశిత హానికర ఆర్థిక విధానాల రూపంలో, దేశం జంట ప్రమాదాల నెదుర్కొంటోంది. ఈ రెండు సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాల్సిన బాధ్యత నూతన యు.ఎఫ్. ప్రభుత్వం మీద పడింది. యు.ఎఫ్. ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్న పార్టీలతో బాటు, బయటి నుండి మద్దతిస్తున్న వామపక్ష పార్టీలతో కలసి యునైటెడ్ ఫ్రంట్ స్టీరింగ్ కమిటి (సారధ్య సంఘం)ని ఏర్పాటు చేసింది. స్టీరింగ్ కమిటీలో సుదీర్ఘ చర్చల అనంతరం యు.ఎఫ్ ప్రభుత్వం ఒక కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని (సిఎమ్‌పి) ప్రకటించింది. యు.ఎఫ్. ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలు, బయటి నుండి మద్దతిస్తున్న

వామపక్షాలు దేశ సామాజిక – ఆర్థిక విధానాలతో పాటు విదేశాంగ విధానం గురించి కూడ పూర్తిగా భిన్నమైన దృక్పథాలు కల్గి వున్నాయి. ఆ విధంగా యు.ఎఫ్. వంటి సంకీర్ణానికి ఒక ఆమోదయోగ్యమైన కార్యక్రమం రూపకల్పనలో ఇబ్బందులు అర్థం చేసుకోవాలి. స్టీరింగ్ కమిటీలో తీవ్ర చర్చల అనంతరం వెలువడిన కనీస ఉమ్మడి కార్యక్రమం" ఒక రాజీ పత్రమే. ప్రభుత్వ మనుగడ పట్ల ఆసక్తి కల్గివుండడంతో పాటు, మతోన్మాద శక్తులను అధికారం నుండి దూరంగా వుంచాలనే లక్ష్యం గల్గిన వామపక్షాలు ముఖ్యంగా ఆర్థిక విధానాలతో పాటు ఇతర అంశాల మీద కూడ రాజీపడవల్సి వచ్చింది. విధానపర నిర్ణయాలతో పాటు, యు.ఎఫ్. ప్రభుత్వ పని విధానానికి సంబంధించిన ప్రాథమిక మార్గదర్శనం చేసే పత్రంగా ఈ కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) ప్రత్యేకత సంతరించుకుంది.

## కనీస ఉమ్మడి కార్యక్రమం - ఒక విశ్లేషణ

ఇప్పటికే చర్చించినట్లు ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు ఆదేశిత ఆర్థిక సంస్కరణలు, నిరుద్యోగం, ధరలు తీవ్రంగా పెరగడానికి కారణమయ్యాయి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, వాటాల ఉపసంహరణలు ఈ విధానానికి మూలస్తంభాలుగా వున్నాయి. బహుళజాతి కంపెనీల స్వేచ్ఛా ప్రవేశం వల్ల స్వదేశీ పరిశ్రమల మీద మరియు దేశంలో ఉపాధి సామర్థ్యం మీద తీవ్ర ప్రభావం పడింది. బ్యాంకులు, బీమారంగ ప్రైవేటీకరణ గత ప్రభుత్వ ఎజండాలో కూడ వుంది. ఈ నేపథ్యంలో యు.ఎఫ్. ప్రభుత్వ కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని పరిశీలించాలి. 1996లో ప్రధాన మంత్రి దేవగౌడ విడుదల చేసిన సిఎంపిలోని ప్రధాన అంశాలీ విధంగా వున్నాయి:

* రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు వికేంద్రీకరించడం.
* సర్కారియా కమిషన్ నివేదికను సమీక్షించి, తాజా పర్చేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు.
* ఎన్నికైన సంస్థలు, ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్.
* ఎస్‌సి/ఎస్టీలకు చెందిన బాధితులకు న్యాయం కల్గించేందుకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు.
* దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు.
* 2005 నాటికి పూర్తి అక్షరాస్యత సాధించాలి.
* ఉమ్మడి పౌరస్మృతి (కామన్ సివిల్ కోడ్స్) ఉండరాదు.
* అయోధ్య వివాదానికి సంబంధించిన అన్ని కేసులను 138(2) క్రింద సుప్రీం కోర్టుకు నివేదించాలి.
* ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టం పకడ్బందీగా అమలు.

* మైనారిటీలకు సంబంధించిన 15 అంశాల కార్యక్రమాన్ని సమీక్షించి, విస్తృతం జేయాలి. విద్యను ప్రాథమిక హక్కుగా చేయాలి.
* ఇండియన్ పీనల్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లను సమీక్షించి, సవరణలు చేయాలి.
* 2005 నాటికి పేదరిక నిర్మూలన.
* అందరికీ మంచినీరు.
* గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల ఉపాధి హామీ.
* అన్ని రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు.
* ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం
* వాటాల ఉపసంహరణ కమిషన్ ఏర్పాటు
* పరిశ్రమలో ప్రభుత్వరంగం ఒక ప్రధాన భాగంగా కొనసాగింపు.
* ట్రేడ్ యూనియన్ హక్కులను గౌరవించడం. రహస్య బ్యాలట్ ద్వారా యూనియన్ల గుర్తింపు.
* లోక్‌పాల్, ఎన్నికలు, న్యాయవ్యవస్థల సంస్కరణల బిల్లులు. లోక్‌పాల్ బిల్లును ప్రధానమంత్రికి కూడ వర్తింపజేయడం.
* మంత్రుల విచక్షణాధికారాలతో కోటాల రద్దు.
* రాజకీయ నాయకులు, నేర ప్రపంచానికి మధ్య సంబంధాలకు సంబంధించిన వోరా కమిటి నివేదికలోని సంబంధిత వాస్తవాలను వెల్లడించడం.
* జమ్ము–కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించడం, మరింత స్వయం ప్రతిపత్తి కల్పన.
* ఈశాన్య ప్రాంత అభివృద్ధి. తిరుగుబాట్లకు పరిష్కారం.
* అస్సాం ఒప్పందం ప్రకారం అక్రమ వలస దారుల సమస్య పరిష్కారం.
* పొరుగు దేశాలతో మంచి స్నేహపూర్వక సంబంధాలు.
* అలీనోద్యమం (ఎన్ఎఎం), దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (ఎస్ఎఎఆర్‌సి)లను బలోపేతం చేయడం.
* అణు సంబంధ విషయాల్లో స్వయం నిర్ణయం.
* ప్రసారభారతి చట్టం సమీక్ష, సవరణలు.
* విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ, పారిశ్రామిక మరియు ఆర్థిక పునర్నిర్మాణ సంస్థ (బిఐఎఫ్ఆర్)ల పనివిధానం సమీక్ష.

* రాష్ట్ర ప్రభుత్వాలను నిరంకుశంగా రద్దు చేయడానికి స్వస్తి చెప్తూ రాజ్యాంగంలోని 356 అధికరణకు సవరణ చేయాలి.

అసలు సమస్యలు పరిష్కరించడానికి యు.ఎఫ్. ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమం సరిపోదు. గత కాంగ్రెసు(ఐ) విధానాలకు భిన్నమైనప్పటికీ, గత ఆరు నెలల ఆచరణను పరిశీలిస్తే ఈ ప్రభుత్వ విధానాలు, గత ప్రభుత్వ ఆర్థిక విధానాలకు భిన్నంగా లేవని స్పష్టమవుతుంది. సాధారణ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న నూతన ఆర్థిక విధానాలను వెనక్కు మళ్ళించడం సిఎంపి లక్ష్యం కాదని స్పష్టమవుతుంది. గత ఆరు నెలలుగా ఖాయిలా పడిన పరిశ్రమలను బిఐఎఫ్ఆర్‌కు నివేదించడం తప్ప, వాటిని పునరుద్ధరించేందుకు కొత్త ప్రయత్నాలేమీ లేవు. రిట్రెంచ్‌మెంట్లు, గోల్డెన్ హ్యాండ్‌షేక్‌లు, తదితర రూపాల్లో కార్మికులను నిరుద్యోగులుగా చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగాయి. ఇంతేగాక పెరుగుతున్న ధరలను అదుపు చేసే ప్రయత్నాలు లేవు.

దీనికితోడు ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమను బలోపేతం చేస్తానని వాగ్దానం చేసిన ప్రభుత్వం అందుకు పూర్తి భిన్నంగా గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ, ఈ రంగంలోకి స్వదేశీ, విదేశీ బహుళజాతి సంస్థల స్వేచ్ఛా ప్రవేశానికి అనుమతించేందుకు ప్రయత్నించింది. గత కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వ మార్గంలోనే వాటాల ఉపసంహరణ కమిషన్ ఏర్పాటును సిఎంపి యే ప్రతిపాదించింది. సిఎంపిలో పేర్కొన్నట్లు కమిషన్ ఏర్పాటు చేయకముందే, ఒఎన్‌జిసి, విఎస్ఎన్ఎల్ వంటి లాభాలార్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహరణను ప్రభుత్వం ఆకస్మికంగా ప్రకటించింది. భారతదేశంలో విదేశీ ఈక్విటీ పెట్టుబడుల వాటాను పెంచడం ద్వారా యుఎఫ్ ప్రభుత్వం బహుళజాతి కంపెనీల ప్రవేశాన్ని మరింత సుగమం చేసింది. పొదుపు చర్యలకు సంబంధించిన మార్గదర్శకాల పేరిట 1996 జూన్ 17న యు.ఎఫ్. ప్రభుత్వ ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన దేశ కార్మికులు, ఉద్యోగులకు పిడుగుపాటుగా పరిణమించింది. 1996 – 97 బడ్జెటుకు ముందుగానే పెట్రోలు, డీజెల్, వంటగ్యాస్ తదితర పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచుతూ యు.ఎఫ్. ప్రభుత్వం ప్రకటన చేసింది. దీనికి తీవ్ర నిరసన పెల్లుబికింది. ట్రేడ్ యూనియన్లు, వామపక్ష పార్టీలు ఈ విషయమై తీవ్రంగా విమర్శించాయి. ప్రభుత్వం కొద్దిగా వెనక్కి తగ్గి ప్రకటించిన 30%, 15% పెంపుదలను కొంత తగ్గిస్తూ ప్రకటించింది. ప్రైవేటీకరణ లక్ష్యం ప్రధాన ఎజెండా ఆర్థిక సంస్కరణలను కొనసాగించాలనే ప్రభుత్వ ధృఢ నిశ్చయాన్ని, సాధారణ బడ్జెట్ ధృవీకరించింది.

ఆర్థికేతర అంశాల విషయంలో సిఎంపి కొంత మేరకు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించింది. రాష్ట్రాలకు అధికారాల వికేంద్రీకరణ, సర్కారియా కమిషన్ సిఫార్సులను తాజాపర్చడం, ఎన్నికైన సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, అగ్ర వర్ణాల అణచివేతకు గురవుతున్న ఎస్సీ/ఎస్టీ బాధితులకు న్యాయం కల్గించడం, అందరికీ మంచినీరందించడం, ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం, రాష్ట్ర ప్రభుత్వాలను నిరంకుశంగా రద్దు చేయడాన్ని నిరోధించేందుకు

356 అధికరణకు సవరణ. ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి వంటివి ఇందుకు ఉదాహరణలు. అయితే ప్రభుత్వోద్యోగుల మీద ప్రయోగిస్తున్న రాజ్యాంగంలోని 310, 311(2) బి,సి అధికరణల తొలగింపు లేదా సవరణ గురించి ప్రభుత్వం ప్రస్తావించలేదు. రాష్ట్రాలకు బడ్జెటు ద్వారా కేటాయింపులు పెంచడం తప్పితే, రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక అధికారాలు కల్పిస్తూ కేంద్ర – రాష్ట్ర సంబంధాలను పునర్ వ్యవస్థీకరించే క్రమం పట్ల ప్రభుత్వం మౌనంగా వుంది. దీనికి భిన్నంగా 1996 ఆగష్టు 15న ఎఱ్ఱకోట మైదానం నుండి ప్రధాన మంత్రి చేసిన స్వాతంత్ర దినోత్సవ ప్రసంగం సందర్భంగా ఆశ్చర్యపర్చే విధంగా ఉత్తరాఖండ్ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత జాతుల ప్రాతిపదిక మీద ఝూర్ఖండ్, బోడోల్యాండ్, గూర్ఖాల్యాండ్ వంటి ప్రత్యేక రాష్ట్రాల డిమాండ్లు వూపందుకున్నాయి. దీనిని వేర్పాటు వాద శక్తులు అవకాశంగా తీసుకున్నాయి.

ఈ కాలంలోనే కేంద్ర ప్రభుత్వం, రైల్వే ఉద్యోగుల బోనసుపై పరిమితులు తొలగించబడ్డాయి. అయితే ఇది జరిగిన తీరు యు.ఎఫ్. ప్రభుత్వ పని విధానాన్ని ప్రశంసించే విధంగా లేదు. 1996 అక్టోబర్ మధ్యకాలంలో రైల్వే ఉద్యోగులు ఆందోళన చేసి 3,4 తరగతుల ఉద్యోగులకు బోనస్ సీలింగు తొలగింపును సాధించుకున్నారు. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వోద్యోగులు, ఇతర రంగాల కార్మికులు, ఉద్యోగుల గురించి ప్రభుత్వం ఒక సమగ్ర విధానాన్ని అవలంబించలేదు. రైల్వే ఉద్యోగుల బోనస్‌పై పరిమితులు తొలగించడంతో పోస్టల్, టెలికం మరియు కేంద్ర ప్రభుత్వోద్యోగుల దేశవ్యాప్త సమ్మె రగుల్కొంది. ఐదురోజుల సమ్మె తర్వాత రైల్వేలు, కేంద్ర ప్రభుత్వోద్యోగుల విషయంలో ఒకేరకమైన విధానం అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. జాగ్రత్తగా ఆలోచించి, సమన్వయంతో వ్యవహరించినట్లయితే యు.ఎఫ్. ప్రభుత్వం ఈ గందరగోళ పరిస్థితిని నివారించగలిగేది. ఇంకా పారిశ్రామిక కార్మికుల బోనస్ సీలింగ్ విషయంలో యు.ఎఫ్. ప్రభుత్వం మౌనంగానే వుంది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల స్థితి మరింత దయనీయంగా వుంది. సహజంగానే 3,4 తరగతుల ఉద్యోగుల బోనస్ సీలింగులు ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు డిమాండు లేవనెత్తారు. అన్ని వామపక్షాలు, ఎఐఎస్‌జిఇఎఫ్‌తో సహా అన్నీ ట్రేడ్ యూనియన్ల మద్దతుతో 5 రోజులు సాగిన కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె మీద, గత కాంగ్రెస్ (ఐ) ప్రభుత్వాలవలె, యు.ఎఫ్. ప్రభుత్వం అరెస్టులు, పోలీసు అత్యాచారాల వంటి దాడులకు పాల్పడలేదు. అయితే సమ్మెను చట్ట వ్యతిరేకమని ప్రకటించి జీతాల్లో కోతను ఆదేశించిన తర్వాత, సమ్మె కాలాన్ని సెలవులకు సర్దుబాటు చేసింది.

## వామపక్షాల జోక్యం

ఈ కాలంలో అన్ని సానుకూల పరిణామాలను కల్పించే విషయంలోనూ, ప్రతికూల అంశాలను ప్రతిఘటించడంలోనూ వామపక్ష శక్తులు, ట్రేడ్ యూనియన్ల జోక్యాన్ని ప్రత్యేకంగా పేర్కొనాలి. మత ఛాందసవాద, కులతత్వ, వేర్పాటువాద శక్తుల పెరుగుదలను వామపక్షాలు

నిరంతరం ప్రతిఘటిస్తున్నాయి. గత ప్రభుత్వ, ప్రస్తుత యు.ఎఫ్. ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు, అభ్యుదయ ట్రేడ్ యూనియన్లు మాత్రమే రాజీలేకుండా పోరాడాయి. మున్నెన్నడూ లేనివిధంగా అవమాన కరమైన అవినీతి కుంభకోణాల పరంపరలో ఉన్నత స్థాయి రాజకీయ నాయకులు కళంకితులు కాగా, వామపక్ష పార్టీలు పూర్తిగా ఏ విధమైన మచ్చలేకుండా నిలిచాయి. అందువల్లనే ఉన్నత స్థానాల్లో అవినీతికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు రాజీలేని పోరాటం సాగించగల్గాయి. చట్టసభల్లో మహిళలకు 30% స్థానాలు కేటాయిస్తూ శీతాకాల సమావేశాల్లో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు అనేక పార్టీలు దానిని అడ్డుకోచూచాయి. ఒక్క వామపక్షాలు మాత్రమే వారి ప్రయత్నాలను ప్రతిఘటించేందుకు గట్టిగా ప్రయత్నించి, చట్టం చేయించేందుకు పోరాడాయి.

వామపక్ష కార్మిక సంఘాలతో పాటు కొందరు ప్రముఖులైన మేధావులు 1991 జూలైలోనే ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలను ప్రతిపాదించినప్పటికీ యు.ఎఫ్. ప్రభుత్వం గత ప్రభుత్వ హానికర విధానాలను మార్చే ప్రయత్నాలు చేయకపోవడం విచారకరమైన విషయం. పైపెచ్చు గత ప్రభుత్వ వినాశకర విధానాలను మరింత ఉత్సాహంగా అమలు చేయడం ద్వారా శ్రామిక ప్రజలకు మరింత హానికల్గించబూనుకుంది. ఈ విధానాలను ఆపడానికి దేశవ్యాప్త పోరాటాల ఆవశ్యకత ఏర్పడింది.

## ఎన్‌పిఎంఒ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

## 1994 సెప్టెంబరు 29న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ప్రజా సంఘాల జాతీయ వేదిక పతాకం క్రింద ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో 1994 జూన్ 21న జరిగిన సదస్సు భవిష్యత్తులో గుర్తుపెట్టుకోదగినది. ఎందుకంటే, ఈ సదస్సు ప్రభుత్వ వినాశకర ఆర్థిక విధానాలు, గాట్ ఒప్పందానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను ఉధృతం చేసేందుకు 1994 సెప్టెంబరు 29న ఒకరోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని నిర్ణయించింది. ఈ సదస్సులో 60 ప్రజా సంఘాలకు చెందిన 6000 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఆగస్టు 3 నుండి 9 వరకు జాతీయ నిరసన వారం, సెప్టెంబరు 20వ తేదీన దేశవ్యాప్తంగా రైల్‌రోకో, సెప్టెంబరు 27న కాగడాల ప్రదర్శన వంటి దశలవారీ కార్యక్రమాలను సదస్సు రూపొందించింది. పోరాటానికి చెందిన అంశాల గురించి వివరించేందుకు రాష్ట్రస్థాయి, ప్రాంతీయ స్థాయి సదస్సులు నిర్వహించాలని సదస్సు పిలుపిచ్చింది.

నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన సార్వత్రిక సమ్మెల్లో 1994 సెప్టెంబరు 29వ తేదీ సమ్మె, వరుసగా జరిగిన సమ్మెల్లో నాల్గవది. మొదటి సమ్మె 29.11.1991న, రెండవది 16.6.1992న, మూడవ సమ్మె 9.9.93న జరిగాయి.

ప్రభుత్వ ఆర్థిక విధానాల వంటి విస్తృత, ప్రాథమిక సమస్యల మీద 1991 నుండి నాలుగేండ్ల కాలంలో నాలుగు దేశవ్యాప్త సాధారణ సమ్మెలు జరగడం చారిత్రాత్మకం. 29.9.1994న జరిగిన సమ్మె ఫలితంగా ఐదు రాష్ట్రాల్లో పూర్తి బంద్ జరగ్గా, మరో ఏడు రాష్ట్రాల్లో సాధారణ ప్రజాజీవనం పూర్తిగా స్తంభించింది. 2.5 కోట్లకు పైగా కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. నేటి వరకు దేశంలో జరిగిన అత్యంత పెద్ద సమ్మె ఇది. దేశంలోని వ్యవసాయ కార్మికులు భారీగా ఈ సమ్మెలో పాల్గొనడం గమనించదగిన విషయం. సాధారణ సమ్మె మొత్తం మీద శాంతియుతంగా జరిగినప్పటికీ, ఆంధ్రప్రదేశ్, అస్సాం, ఒరిస్సా, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలలో నాలుగు వేల మందికి పైగా కార్మికులు, ప్రజా సంఘాల కార్యకర్తలను అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, బీహార్, త్రిపురల్లో సంపూర్ణ బంద్ జరిగింది. ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, అస్సాం, కర్నాటక, ఒరిస్సా, హర్యానా, మణిపూర్‌లలో భారీ సమ్మె జరిగింది. తమిళనాడులో స్పాన్సరింగ్ కమిటీలోని యూనియన్లతో పాటు, డిఎంకె, ఎఐఎడిఎంకెల ఆధ్వర్యంలోని యూనియన్లు కూడ సమ్మెలో పాల్గొన్నాయి. సమ్మె స్పాన్సర్ చేసిన సంఘాల్లో ఒకటైన ఎఐఎస్‌జిఇఎఫ్ సభ్యులు వివిధ రాష్ట్రాల్లో వందల వేల సంఖ్యలో ఉద్యోగులు నూతన ఆర్థిక విధానాలు, గాట్ ఒప్పందానికి వ్యతిరేకంగా సమ్మెలో పాల్గొన్నారు. కేరళ, త్రిపురల్లో 100%, తమిళనాడులో 80%, అస్సాంలో 80% మంది రాష్ట్ర ఉద్యోగులతో బాటు 50% సెక్రటేరియట్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొనగా, 158 మంది ఉద్యోగులు అరెస్టయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో సెక్రటేరియట్ ఉద్యోగులు మినహా 80% మంది ఉద్యోగులు, హర్యానాలో 50–80%, ఒరిస్సాలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. త్రిపురలో సమ్మె సంపూర్ణంగా జరిగింది. అనేక ప్రాంతాల్లో కార్మికులు, ఉద్యోగులతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యారంగంలోని ఇతర ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వ విధ్వంసకర ఆర్థిక విధానాలకు ఈ సమ్మె ఒక గట్టి జవాబు.

## 1995 జూలైలో ఎన్‌పిఎంఒ సదస్సు

నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటాలకు కొనసాగింపుగా ప్రజా సంఘాల జాతీయ వేదిక పిలుపు మేరకు 1995 జూలై 15వ తేదీన ఢిల్లీలో జాతీయ సదస్సు జరిగింది. 30 సంఘాల నుండి సుమారు 750 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన ఆర్థిక విధానాలు, గ్యాట్ ఒప్పందం పూర్తిస్థాయి అమలు నేపథ్యంలో సదస్సు 15 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను ఆమోదించింది. రాష్ట్ర, జిల్లాస్థాయి సదస్సులు, 15.9.1995న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో భారీ ప్రదర్శనలు నిర్వహించాలని దశలవారీ కార్యక్రమాలను సదస్సు రూపొందించింది. సదస్సు తీర్మానం మేరకు 15.12.1995న ఢిల్లీలో పార్లమెంటుకు సమీపంలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ప్రదర్శన జరిగింది.

మిక్కిలి సంక్లిష్టంగా వున్న నేటి పరిస్థితిలో స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, ప్రజా సంఘాల జాతీయ వేదిక ఐక్య పోరాటాలకు ఒకే పద్ధతిలో పోరాట పంథాను రూపొందించాయి. 27.8.1996న ఢిల్లీలో సమావేశమైన స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ 13 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు 27.9.1996న ఆలిండియా డిమాండ్స్ డే పాటించవల్సిందిగా పిలుపునిచ్చింది. 12.11.1996న ఢిల్లీలో సమావేశమైన ప్రజా సంఘాల జాతీయ వేదిక కార్మిక వర్గాన్ని ఐక్యపోరాట మార్గాన నడిపేందుకు, కార్మికవర్గాన్ని మరింత పెద్ద ఎత్తున సమీకరించేందుకు 18.12.1996న ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది.

పశ్చిమబెంగాల్‌లోని ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయుల ఐక్యవేదిక "జూలై 12 కమిటీ" పిలుపు మేరకు గాట్ ఒప్పందానికి వ్యతిరేకంగా 24.5.1994న కలకత్తాలో రాత్రంతా ధర్నా, జాగరణ కార్యక్రమాలు నిర్వహించారు.

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కా॥ బి.టి. రణదివే 90వ జయంతి సందర్భంగా "ట్రేడ్ యూనియన్ ఐక్యత" అనే అంశం మీద సిఐటియు 18.12.1994న ఢిల్లీలో సెమినార్ నిర్వహించింది. సిఐటియు, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, బిఎంఎస్, టియుసిసి, యుటియుసి తదితర ట్రేడ్ యూనియన్లు పాల్గొని, ట్రేడ్ యూనియన్ల ఐక్యతను సాధించవల్సిన ఆవశ్యకత గురించి, అన్ని ట్రేడ్ యూనియన్లను ఒకే వేదిక మీదకు తీసుకురావల్సిన అవసరం గురించి నొక్కి చెప్పాయి.

# 26

# సామ్రాజ్యవాద దురాక్రమణ భ్రమలుగా రుజువైన సామ్రాజ్యవాదుల జోస్యం

పూర్వపు సోవియట్ యూనియన్ మరియు తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు వ్యవస్థకు ఎదురుదెబ్బలు తగిలి పరాజయాలు సంభవించాయి. చివరకు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, అనేక స్వతంత్ర దేశాలు ఏర్పడ్డాయి. ఇది దేశ కార్మికవర్గ పోరాటాలకు, యావత్ ప్రపంచ శ్రామికులకు తీవ్ర దిగ్భ్రాంతిని, సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారీ వర్గానికి మిక్కిలి సంతోషాన్ని కల్గించింది. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు వారి తైనాతీలు సోషలిజం మరణించిందని, మానవ సమాజ పరిణామ క్రమంలో పెట్టుబడిదారీ విధానం చిట్టచివరిదని ఘోషించారు. సోషలిస్టు వ్యవస్థ పతనం తర్వాత వ్యాఖ్యానిస్తూ అమెరికా మేధావి ఫ్రాన్సిస్ ఫుకుయామా మానవ సమాజ చరిత్రలో పెట్టుబడిదారీ విధానం చివరిదని పేర్కొన్నారు.

కాని 1993 తర్వాత జరిగిన పరిణామాలు సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, వారి సిద్ధాంతకర్తల ఆశలను అడియాసలు చేశాయి. "చరిత్ర చివరిదశ" గురించి ఫుకుయామా ప్రకటించినప్పుడు, అనేక మంది ఆయనతో వాదించారు. తాజా పరిణామాల తర్వాత ఆయనను పరిహాసం చేశారు. ఇప్పుడు ఆయనను అసలు మరచిపోయారు.

గత మూడు సంవత్సరాలుగా సోవియట్ యూనియన్‌లోనే కాక, తూర్పు యూరపు దేశాలతో పాటు ఇటలీ, ఫ్రాన్స్, గ్రీస్, స్పెయిన్, సైప్రస్, పోర్చుగల్ వంటి యూరప్‌లోని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికన్ దేశాల్లోనూ సోషలిస్టులు తిరిగి పుంజుకోవడం చూడవచ్చు.

పూర్వపు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, తూర్పుయూరప్ దేశాల్లో సోషలిస్టు ప్రభుత్వాలు పతనం కావడంతో వర్గశక్తుల బలా బలాల్లో సామ్రాజ్యవాదుల కనుకూలంగా తాత్కాలిక మార్పు సంభవించింది. సాపేక్షంగా సామ్రాజ్యవాదానికి సానుకూల పరిస్థితులున్న ఈ తరుణంలో కూడా మానవాళిని వేధిస్తున్న ప్రాథమిక సమస్యలకు, పెట్టుబడిదారీ విధానం

పరిష్కారాలు చూపలేకపోయింది. పైపెచ్చు కోట్లాదిమందిని ఆకలితో మాడ్చి, దిక్కులేని దయనీయమైన స్థితికి దిగజార్చింది. ఈ పరిస్థితుల్లో అమెరికన్ సామ్రాజ్యవాదం తన ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇది రాజకీయ, ఆర్థిక, మిలిటరీ రంగాల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రష్యాలో సోషలిస్టు శక్తులు తిరిగి పుంజుకోవడం ప్రారంభమైంది. అంతర్జాతీయంగా ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి సానుకూల పరిస్థితులున్నప్పటికీ, పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తిలో అంతర్గతంగా వున్న వైరుధ్యాల రీత్యా, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సుదీర్ఘకాలం మాంద్యంలో కూరుకుపోయిన ఆ వ్యవస్థ తిరిగి పుంజుకునేందుకు తీవ్ర ఇబ్బందుల నెదుర్కొంటోంది.

పాశ్చాత్య దేశాల్లోని ఆర్థిక మాంద్యం వల్ల, అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర చెల్లింపుల సంక్షోభం, బడ్జెటు లోటు, భారీ విదేశీ రుణం వంటి సమస్యల నెదుర్కొంటున్నాయి. ఫలితంగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుండి రుణం తీసుకుని, అవి నిర్దేశించిన విధంగా వ్యవస్థీకృత సర్దుబాటు చర్యలను చేపట్టవల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రూపొందిన డంకెల్ ప్రతిపాదనలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రయోజనకరంగా వుండకపోగా, ఆ దేశాల స్వయం నిర్ణయాధికారాన్ని, ఆర్థిక సార్వభౌమత్వాన్ని, తద్వారా రాజకీయ స్వాతంత్ర్యాన్ని హరించివేసి, అమెరికా, దాని మిత్ర దేశాలు, మిగిలిన ప్రపంచం మీద ప్రధానంగా మూడవ ప్రపంచదేశాల మీద ఆధిపత్యం సాధించడాని కుద్దేశించబడ్డాయి.

ఆ విధంగా కొన్ని స్వార్థపర వర్గాలు ప్రచారం సాగించినట్లు సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం ప్రపంచానికి శాంతి తీసుకురాలేదు. పైపెచ్చు మిగతా ప్రపంచం మీద అమెరికా మిలిటరీ, ఆర్థిక, ఆధిపత్యం సాధించే విధంగా ఏక ధృవ ప్రపంచం ఏర్పాటుకు దారితీసింది. దీనికి ధీటుగా నిలిచే సోవియట్ యూనియన్ పతనం కావడంతో అమెరికా అంతర్జాతీయ పోలీసు పాత్ర ధరించింది.

మన పొరుగు దేశాలైన నేపాల్, బర్మా (మయన్మార్), బంగ్లాదేశ్‌లతో పాటు కాస్త దూరంగా వున్న ఫిలిఫైన్స్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటాలు ఈ కాలంలో పెరిగాయి. నేపాల్, బంగ్లాదేశ్‌లలో ఎన్నికలు జరిగి ప్రభుత్వాలేర్పడ్డాయి. పాకిస్తాన్‌లో కూడ ప్రజల ఆకాంక్షల మేరకు క్రొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఫిలిప్పైన్స్‌లో ప్రజా పోరాటాల ద్వారా మాజీ నియంత పదవీచ్యుతుడయ్యాడు. కాని స్వాగతించదగిన ఈ పరిణామా లన్నింటికి ప్రజలు గొప్ప త్యాగాలు చేయాల్సి వచ్చింది. శ్రీలంకలో కొనసాగుతున్న రక్తపాతం, సంక్షోభ తీవ్రతను సూచిస్తోంది. శ్రీలంక ప్రజలకు శాంతి, దేశ సమగ్రత, సుహృద్భావ వాతావరణాలు అత్యంతావశ్యకమైన విషయాలు.

దక్షిణాఫ్రికాలో జాతి వివక్షను క్రమంగా రూపుమాపడం మరో ప్రధాన రాజకీయ పరిణామం. ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్, దాని నాయకుడు నెల్సన్ మండేలా నాయకత్వంలో నల్లజాతి ప్రజల పోరాటాల ఫలితంగా శ్వేతజాతి దురహంకార ప్రభుత్వ పాలన ముగింపుకు

వచ్చింది. దక్షిణాఫ్రికాలో మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజాస్వామ్యం ఏర్పాటును, ప్రపంచం స్వాగతించింది. అక్కడ సానుకూల పరిణామాలు జరుగుతున్నప్పటికీ, కొన్ని విషాదకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్ ప్రముఖ నాయకునిగా వున్న క్రిస్‌హనీని హత్య చేయడంలో కుట్రదారులు విజయవంతమయ్యారు. శ్వేతజాతి దురహంకార శక్తుల కుట్రల వల్ల తలెత్తిన అంతర్యుద్ధంలో, దేశ వ్యాప్తంగా వందలాది మంది హతులయ్యారు. మన పొరుగునే వున్న చైనా, అమెరికా ఒత్తిడులకు లొంగక అన్ని రంగాల్లో ప్రగతి సాధించడం శుభపరిణామం. ఆక్రమిత ప్రాంతాలకు పరిమిత స్థాయిలో క్రమంగా స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు, పాలస్తీనా దళాలు, ఇజ్రాయిల్ ఒప్పందం మీద సంతకాలు చేయడం పశ్చిమాసియా ప్రాంతంలో జరిగిన నూతన పరిణామం.

ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి కా॥ బి.డి. జోషి 17.4.1999న, సిఐటియు కార్యదర్శుల్లో ఒకరు, శ్రామిక మహిళా ఉద్యమ ప్రముఖ నాయకులు కా॥ విమలారణదివే 23.7.1999న మరణించారు. భారతట్రేడ్ యూనియన్ ఉద్యమానికి వీరి మృతి తీరనిలోటు.

ఇదేకాలంలో శ్రీ గుల్జారీలాల్‌నందా 15.1.1998న, స్వాతంత్ర సమరయోధులు, వామపక్ష ఉద్యమ ప్రముఖ నాయకుల్లో ఒకరు, ప్రముఖ సిద్ధాంతవేత్త, కేరళ మాజీ ముఖ్యమంత్రి కా॥ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ 19.3.1998న, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, త్రిపుర ప్రజా విముక్తి పోరాట నాయకులు, కా॥ దశరథదేవ్ 11-10-1998న మరణించారు.

ఈ కాలంలో నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ మానవతావాది మదర్ థెరిస్సా 5.9.1997న, భారత మాజీ ప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్ తన 100వ సంవత్సరంలోనూ, నేపాల్ మాజీ ప్రధాని, అనుభవశాలియైన కమ్యూనిస్టు, ప్రజాతంత్ర ఉద్యమనాయకులు, భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న కా॥ మన్మోహన్ అధికారి 26.4.99న మరణించారు. వామపక్ష, ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రముఖ నాయకులు కా॥ ఎం. ఫరూఖీ, కా॥ చిత్తబసు, కా॥ త్రిదీబ్‌చౌదరి మరియు కా॥ నిఖాల్‌దాస్‌లు ఈ కాలంలోనే మరణించారు.

## అంతర్జాతీయ ద్రవ్య సంస్థ అధ్యయన నివేదికలు

## - కళ్ళ ముందుంచిన భయంకర దృశ్యాలు

ప్రపంచంలోని అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకు పెట్టుబడిదారీ ప్రపంచీకరణ వినాశనాన్నే తెచ్చిపెట్టింది. నూతన దశలో ప్రవేశించిన పెట్టుబడిదారీ విధాన దాడులను సమర్థించేవారు, ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రపంచీకరణ కల్పిస్తున్న వినాశనాన్ని తక్కువ చేసి చూపడంగాని లేదా నిర్లక్ష్యం చేయడం జరుగుతోంది. వేరొక ప్రక్క పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి సంబంధించిన ఈ నూతన దశలో శ్రామిక ప్రజలు ఇతర పేదల పరిస్థితుల

యొక్క చీకటి పార్శ్వాన్ని, చివరకు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యుఎన్‌డిపి), ఇంటర్నేషనల్ లేబర్ ఆఫీస్, (ఐఎల్‌ఓ) ప్రపంచ బ్యాంక్, ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఒఇసిడి) వంటి సంస్థలు కూడా దాచలేకపోయాయి. 1999 యుఎన్‌డిపి నివేదిక ఈ క్రింది విధంగా పేర్కొంది.

"20వ శతాబ్దంలో బ్రహ్మాండమైన ప్రగతి సాధించినప్పటికీ, ప్రపంచం నేడు తీవ్ర దారిద్ర్యాన్ని, అసమానతలను ఎదుర్కొంటోంది. ఫలితంగా దేశాలు, ప్రాంతాల మధ్య తారతమ్యాలు తీవ్రమవుతున్నాయి. పేదరికం అన్ని చోట్లా వుంది. మానవ దారిద్ర్య సూచి (హ్యూమన్ పావర్టి ఇండెక్స్–హెచ్‌పిఐ–1) ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని 450 కోట్ల జనాభాలో నాల్గవ వంతు కంటె ఎక్కువ మంది, అంటే 110 కోట్లకు పైగా ప్రజలకు ఇంకా అత్యంత ప్రధానమైన జీవితావసరాలు అందుబాటులో లేవు. పెద్ద సంఖ్యలోని ప్రజలకు ఆయుఃప్రమాణం 40 సం॥లకు మించిలేదు. వీరికి విద్య (విజ్ఞానం) కనీస ప్రభుత్వ, ప్రైవేటు సర్వీసులు అందుబాటులో లేవు.

* దాదాపు 130 కోట్ల మంది పరిశుభ్రమైన నీటికి నోచుకోవడం లేదు.
* ప్రాథమిక పాఠశాలకు వెళ్ళవల్సిన వయస్సున్న బాలలు ప్రతి ఏడుగురిలో ఒకరు స్కూలుకు వెళ్ళే పరిస్థితి లేదు.
* సుమారు 84 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడ్తున్నారు.
* ఒక అంచనా ప్రకారం, సుమారు 130 కోట్ల మంది రోజుకు ఒక డాలర్ (1987 కరెన్సీ విలువ ప్రకారం ఒక డాలర్ 20 రూపాయలకు సమానం) కంటె తక్కువ ఆదాయం కల్గివున్నారు.

"పారిశ్రామిక దేశాల్లో కూడా, పేదరికం, అభివృద్ధి నుండి దూరంగా వుంచడం అనే అంశాలు, విజయాలకు సంబంధించిన గణాంకాల మాటున దాచబడ్డాయి. దేశాల మధ్య పెద్ద ఎత్తున తారతమ్యాలు వెల్లడయ్యాయి. మానవ దారిద్ర్య సూచిక (హెచ్‌పిఐ–2) అంచనాల ప్రకారం ప్రపంచంలోని సంపన్న దేశాల్లోని ప్రతి ఎనిమిది మందిలో ఒకరు సుదీర్ఘ కాలం నిరుద్యోగం, 60 సంవత్సరాలకు లోపు ఆయుర్దాయం, జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన వుండడం, సమాజంలో జీవించడానికవసరమైన అక్షరాస్యత అందుబాటులో వుండకపోవడం వంటి కొన్ని మానవ దారిద్ర్యానికి సంబంధించిన అంశాల వల్ల ఇబ్బంది పడ్తున్నారు."

**నిరుద్యోగ సమస్య గురించి 1998 యుఎన్‌డిపి నివేదిక ఈ క్రింది విధంగా పేర్కొంది.**

* ఒఇసిడి దేశాల్లో కనీసం 3 కోట్ల 70 లక్షల మంది నిరుద్యోగులున్నారు. వీరు చాలినంత వేతనాలు లభించక, దేశ ప్రజా జీవనంలో భాగస్వాములు కాలేక సమాజంలో వెలివేసిన వారివలె జీవిస్తున్నారు.

* 15-24 సంవత్సరాల మధ్య వయస్సున్న యువజనుల్లో నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరుకుంది. ఫ్రాన్స్‌లో 32% యువతులు, 22% యువకులు, ఇటలీలో 39% యువతులు, 30% యువకులు, స్పెయిన్‌లో 49% యువతులు, 36% యువకులు నిరుద్యోగులుగా వున్నారు.

**ఒఇసిడి దేశాలను గురించి 1998 యుఎన్‌డిపి నివేదిక ఇంకా ఈ విధంగా చెప్తోంది :**

* సుమారు 20 కోట్ల మంది 60 సంవత్సరాలు దాటి జీవించే అవకాశం లేదు.
* సంపన్న దేశాల్లో దిగ్భ్రాంతి కల్గించే విధంగా 10 కోట్ల మంది నిరాశ్రయులున్నారు.

"ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగావకాశాల గురించి" 1998-99 అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ) నివేదిక ఈ క్రింది విధంగా పేర్కొంటోంది :

"పరిస్థితి ఘోరంగా వుంది. కొద్ది మినహాయింపులతో, ఉపాధి అవకాశాల పరిస్థితి ప్రతికూలంగా వుంది, ప్రపంచంలోని ఎక్కువ ప్రాంతాల్లో తీవ్రంగా వున్న నిరుద్యోగ సమస్య మిక్కిలి ఆందోళన కల్గిస్తోంది." 1998-99 ఐఎల్‌ఒ ప్రపంచ ఉద్యోగిత నివేదిక "ప్రపంచంలో ఉపాధి కల్పన పరిస్థితి విషమంగా వుంది. ఉపాధి కల్పనకున్న అవరోధాలనధిగమించేందుకు నూతన మార్గాలన్వేషించడం ప్రపంచవ్యాప్తంగా దేశాలన్నింటికి పెద్ద ఉమ్మడి సవాలుగా నిల్చింది. 1998-99 ఐఎల్‌ఒ అంచనాల ప్రకారం 1998 చివరినాటికి 100 కోట్ల మంది లేదా ప్రపంచ వ్యాప్తంగా వున్న కార్మికశక్తిలో మూడవ వంతు నిరుద్యోగంతోగాని, ఆదాయం చాలనంత తక్కువ ఉద్యోగాలతో గాని వుంటారు. ఆ ఏడాది చివరినాటికి పనిచేయగల్గిన శక్తిగల్గి, పనిదొరకనివారు 15 కోట్ల మంది వుంటారు. దీనితో పాటు పూర్తికాలం ఉద్యోగాలు రాక, ఇంకా పని చేయకోరుకునేవారు, లేదా జీవించేందుకవసరమైన కనీసవేతనం కంటె తక్కువ జీతం పొందేవారి సంఖ్య 70నుండి 90 కోట్లు లేదా ప్రపంచంలోని కార్మికుల్లో 25 నుండి 30%గా వుంటుంది. ఆర్థిక సంక్షోభం ప్రారంభ సమయంలో 14 కోట్లుగా వున్న ప్రపంచ నిరుద్యోగ సైన్యానికి, ఆసియా ఆర్థిక సంక్షోభం వల్ల మరో 10 కోట్ల మంది చేరతారని అంచనా. దక్షిణాసియా, ఆఫ్రికాల్లో నిరుద్యోగ సమస్య మెరుగుపడలేదు. ఆర్థికాభివృద్ధి బాగా వున్నప్పటికీ లాటిన్ అమెరికాలో నిరుద్యోగం ఉపశమించలేదు. యూరోపియన్ యూనియన్లో ఇటీవలి ఆర్థిక పరిస్థితి మెరుగుదల వల్ల, 1997 మే నెలలో 10.7%గా వున్న సగటు నిరుద్యోగం 1998 మే నాటికి 10.2%కి తగ్గింది" ప్రపంచంలో పెచ్చరిల్లుతున్న నిరుద్యోగ పరిస్థితిని ఈ విధంగా వివరించింది.

బలమైన ఆర్థిక వ్యవస్థ గలిగిన చైనా, వేగవంతమైన ఆర్థికాభివృద్ధి సాధిస్తూ వియత్నామ్, అమెరికా దిగ్బంధనం, ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ చాల వరకు ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని, నిలకడైన అభివృద్ధి నమోదు చేస్తూ క్యూబా పురోగమిస్తున్నాయి. అనేక విధాలుగా బెదిరింపులు సాగిస్తున్న అమెరికాను ప్రతిఘటిస్తూ, ఉత్తరకొరియా పురోగమిస్తోంది. దీనిని గమనిస్తే, పెట్టుబడిదారీ విధానం మీద, సోషలిస్టు వ్యవస్థ ఆధిక్యత స్పష్టమవుతుంది.

స్థానికంగా అనుసరించే పెట్టుబడిదారీ విధానాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించే "సామ్రాజ్యవాద ప్రపంచీకరణ" ద్వారా, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ప్రాధాన్యతను నొక్కి చెప్పడంలోనే, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలను ప్రపంచ వ్యాప్తం చేసే ఉద్దేశాలు స్పష్టమవుతాయి. విస్తారమైన మార్కెట్లను ఆక్రమించడం, లాభాల్లో తరుగుదలను నిర్దాక్షిణ్యంగా నిలవరించేందుకు, చౌకగా ముడిపదార్థాలు, శ్రమశక్తి సరఫరాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు, పెట్టుబడిదారీ విధానం అనుసరించే వివిధ పద్ధతుల్లో భాగంగా మిలిటరీని కూడ వినియోగిస్తుందని చరిత్ర చెప్తోంది. ఉన్మాద పూరిత కార్పొరేట్ విలీనాలు, ఆక్రమణల వెల్లువల ద్వారా వ్యక్తమైన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం, పెట్టుబడిదారీ విధానానికి గుండెకాయ వంటి అమెరికాకు గుబులు పుట్టించింది. ఈ సంక్షోభం ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ఆధిపత్యాన్ని మరింత తీవ్రతరం చేసేందుకు, అమెరికా ఇతర పద్ధతులలో పాటు యుద్ధానికి కూడా తలపడుతుంది. అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగేందుకు నిరాకరిస్తున్న క్యూబా, ఇరాక్, లిబియా, ఉత్తరకొరియా వంటి దేశాల మీద ఆంక్షలను ఉధృతం చేయడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దిగజారుడును సూచిస్తుంది. అంటే "ప్రపంచ వ్యాప్త అమితోత్పత్తి" కారణంగా ధరలు తగ్గి, పెట్టుబడిదారీ విధానం సంక్షోభాన్నునుభవిస్తోంది.

సహజ వనరుల దోపిడీకి అమెరికా దురాక్రమణపూరిత మిలటరీ చర్యలకు పాల్పడుతోంది. విధ్వంసకర బాంబింగ్ మరియు కర్కశమైన ఆర్థిక ఆంక్షల విధింపు వంటివి ఇరాక్ పట్ల అమెరికా విధానంగా వున్నాయి. ఇవి పాశవికమైన, మూర్ఖమైన కక్ష సాధింపు చర్యలు మాత్రమే. గల్ఫ్ దేశాల్లోని సంపద్వంతమైన చమురు నిల్వల మీద అత్యాశ వల్లనే, గల్ఫ్ ప్రాంతంలో చమురు నిల్వలలను అమెరికా కబళించడాన్ని దృఢంగా వ్యతిరేకించిన ఇరాక్‌కు అమెరికా సామ్రాజ్యవాదం "పాఠం నేర్పేందుకు" పూనుకుంది. "చమురును కంట్రోల్ చేసినవాడే ప్రపంచాన్ని కంట్రోల్ చేస్తాడు" అనే సిద్ధాంతమే ఇరాక్ మీద అనాగరిక, సామ్రాజ్యవాద యుద్ధానికి అమెరికాను ఉసిగొల్పింది. అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలో రెండు నెలల పాటు యుగోస్లావియా మీద ఎన్ఎటిఒ (నాటో) దళాలు అమానుష బాంబు దాడులు చేశాయి. అమెరికా ఆర్థిక ప్రయోజనాల విస్తరణకు, సామ్రాజ్యవాదుల అమానుష యుద్ధ వ్యూహాల పరంపరలో ఇది కళ్ళకు కట్టే తాజా ఉదాహరణ. 1999 ఏప్రిల్ – జూన్ మధ్య కాలంలో యుగోస్లావియా మీద నరహంతక బాంబు దాడులు ఒక స్వతంత్ర దేశం మీద సాగిన దురాక్రమణ పూరిత సామ్రాజ్యవాద యుద్ధం తప్ప మరేమీ కాదు. పిశాచం తన పాపిష్టి పనులకెల్లప్పుడూ సాకులు వెతుకుతూనే వుంటుంది. ఇరాక్ విషయంలో కువైట్ ఆక్రమణను, యుగోస్లావియా మీద దాడికి "జాతిపరమైన ప్రక్షాళన"లను సాకులుగా ఎంచుకుంది. ఇరాక్ విషయంలో చమురు ప్రయోజనాలు దృష్టిలో వుంచుకుని, యుగోస్లావియాలోని ఖనిజాలు, ఇతర సహజ సంపద మీద కన్నేసిన అమెరికా తన మాటను లక్షపెట్టని యుగోస్లావియాకు "పాఠం నేర్పడం" పేరిట ఆదేశం మీద దురాక్రమణకు పూనుకుంది. ఐక్యరాజ్య సమితి అనుమతి లేకుండా ఐరోపా నడిబొడ్డున జరిగిన ఈ ఏకపక్ష

యుద్ధానికి పశ్చిమ ఐరోపా దేశాలు మొట్టమొదటిసారిగా మద్దతివ్వడంతో పాటు, క్రియాశీలకంగా పాల్గొనడం మిక్కిలి శోచనీయం. ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో యుద్ధ తంత్రం ద్వారా సామ్రాజ్యవాద ఆర్థిక ప్రయోజనాల విస్తరణకివి ప్రబల తార్కాణాలు.

## జాగృతమైన కార్మికవర్గం

శ్రామిక ప్రజలకు సంబంధించినంత వరకు పరిస్థితి అంత నిరాశాజనకంగా లేకపోవడం సంతోషించదగ్గ విషయం. ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం, ఉద్యోగులు, మరియు ఇతర తరగతుల పేదలు కొద్దిగా ఆలస్యమైనప్పటికి, ఉన్మాదపూరితమైన పెట్టుబడిదారీ విధాన విషపుదాడిని నిలవరించాల్సిన ఆవశ్యకత గురించి జాగృతమయ్యారు. కార్మికవర్గం, పేద ప్రజలు, నిరుద్యోగులు సాగించిన ఈ ప్రతిఘటన, లాటిన్ అమెరికా నుండి ఐరోపా వరకు, ఆస్ట్రేలియా, ఆఫ్రికా నుండి ఆగ్నేయాసియా వరకు, భారతదేశంతో సహా యూరో రష్యా వరకు అంటే దాదాపు ప్రపంచం మొత్తం వ్యాపించింది.

1997 మధ్య భాగంలో ఐరోపా ఖండంలోని ఫ్రాన్స్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు మితవాద అభివృద్ధి నిరోధక ప్రభుత్వాన్ని తిరస్కరించి, వామపక్షానికి విజయం చేకూర్చారు. 1995–96 సంవత్సరాల్లో ఏ మితవాద ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఫ్రెంచి కార్మికవర్గం సమరశీల పోరాటాలు నిర్వహించిందో, ఆ ప్రభుత్వ విధానాలకు భిన్నమైన విధానాలను నూతన ప్రభుత్వం అనుసరిస్తుందన్న ఆశలు శ్రామిక ప్రజల్లో రేకెత్తాయి. కాని కార్మికవర్గం, ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత పరిస్థితులను మెరుగు పర్చడానికి తగిన చర్యలు తీసుకోవడానికి సోషలిస్టు పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం తటపటాయించింది. దీనితో నూతన పోరాటాల వెల్లువ చెలరేగి, 1998 సెప్టెంబరు నాటికి తీవ్రం కావడంతో, ప్రభుత్వం అనేక రాయితీలు ప్రకటించవల్సి వచ్చింది. సమాజంలో తీవ్రంగా అణచివేయబడ్డ ప్రజలు తమ విధి వ్రాతను తిరస్కరించి, తిరుగుబాట్లు చేయడం, ఫ్రాన్స్‌లో నెలకొన్న సామాజిక సంక్షోభానికి ఒక సంకేతంగా బహిర్గతం కావడం అనే విషయం. ఒక్క ఫ్రాన్స్‌కే కాక, ఏ యితర దేశానికైనా వర్తిస్తుంది. ఫ్రాన్స్‌లోని నిరుద్యోగులు, యువత విషయంలో ఇదే జరిగింది. 1998 సెప్టెంబరులో జర్మనీలో జరిగిన ఎన్నికల్లో ఛాన్సలర్ కోవ్ అనుసరించిన నయా ఉదారవాద, కార్మికవర్గ వ్యతిరేక విధానాలకు ప్రజలు పెద్ద ఎత్తున తమ అసమ్మతి తెలిపారు. ఆయన అధికారం నుండి వైదొలగి సోషల్ డెమోక్రటిక్ పార్టీకి (ఎస్.పి.డి)కి చెందిన ష్రోడర్, గ్రీన్స్ పార్టీ సహకారంతో నూతన ఛాన్సలర్‌గా ప్రభుత్వాన్ని ఏర్పరచారు. ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ నిరసన వెల్లువ కోల్ పరాజయానికి ప్రధాన హేతువైంది. కాని ఎస్‌పిడి ప్రభుత్వం కూడ ప్రజల ఆశల నడియాసలు చేసింది. అనేక స్థానిక ఎన్నికల్లో ఎస్‌పిడి ఓటమి పాలవడం చూస్తే ప్రజలకు ప్రభుత్వం పట్ల భ్రమలు తొలగినట్లు స్పష్టమవుతుంది.

అమెరికాలో కూడ కార్మికవర్గం మొత్తం లొంగుబాటు వైఖరినవలంభించలేదు. నిరసనలు చెలరేగుతూనే వున్నాయి. ఆటోమొబైల్ పరిశ్రమలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థికమాంద్య పరిస్థితుల్లో కార్మికుల సంఖ్యను తగ్గించేందుకు వ్యతిరేకంగా 1998 చివర్లో కార్ల తయారీ కార్మికులు మిక్కిలి చారిత్రాత్మక సమరశీల పోరాటాలు నిర్వహించారు. బ్రిటన్‌లో ఒక్క లండన్‌లోనే 50 వేల మంది కార్మికులు అవసరానికి మించి వున్నట్లు తేల్చబడే పరిస్థితి ఏర్పడింది. ఆ సంవత్సరాంతానికి ఇంజనీరింగ్ పరిశ్రమలో సుమారు 1,70,000 ఉద్యోగాలు అదృశ్యం కానున్నాయి. విద్య, వైద్యం వంటి సాంఘిక సంక్షేమ చర్యల్లో కోతపెట్టడం, ప్రభుత్వ సేవారంగ కార్మికుల్లో అసంతృప్తిని కల్గిస్తోంది. రాజీ లేకుండా సమరశీల పోరాటాలు సలిపే ట్రేడ్ యూనియన్ నాయకత్వం వుంటే, తీవ్రం కానున్న నిరుద్యోగం, సాంఘిక సంక్షేమ చర్యల్లో కోతల వల్ల బ్రిటన్‌లో కూడ పెట్టుబడిదారీ విధాన సంక్షోభ తీవ్రత వల్ల ఏర్పడిన పరిస్థితులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు వెల్లువెత్తవచ్చు. ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్ తదితర ఐరోపా దేశాల్లో కూడ వివిధ రూపాల్లో పోరాటాలు సాగుతున్నాయి.

1996లో దక్షిణ కొరియాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువతతో పాటు పబ్లిక్ సర్వీసు కార్మికులందరూ పాల్గొన్న కార్మికవర్గ పోరాట వెల్లువ అనంతరం, నయా ఉదారవాద ఆర్థిక విధాన దాడులకు వ్యతిరేకంగా కార్మికవర్గ, విద్యార్థి నిరసన చర్యలు పెద్ద ఎత్తున సాగాయి.

ఇండోనేషియాలో ఉద్యోగాలు, జీవించేందుకవసరమైన కనీస వేతనం, సంఘ నిర్మాణ హక్కులు డిమాండు చేస్తూ కార్మికులు, విద్యార్థుల సమ్మెలు, నిరసన ప్రదర్శనలు నిత్యకృత్యాలయ్యాయి. కార్మికవర్గ సమరశీల పోరాటాల వెల్లువ, నియంత సుహార్తోను పదవీచ్యుతుని చేసే స్థాయికి చేరుకుంది. శ్రామికవర్గ పోరాటాలు సాగుతుండగానే, 1964లో సైనిక కుట్ర ద్వారా జనరల్ సుహార్తో అధికారం చేపట్టిన తర్వాత మొట్ట మొదటి సారి ఇండోనేషియాలో ఎన్నికలు జరిగాయి. మేఘావతీ సుకర్నో పుత్రి నాయకత్వంలోని రాజకీయపార్టీ ఎన్నికల్లో ముందు భాగాన నిల్చింది. ఆమె ఇండోనేషియా ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కార్మికవర్గ హక్కులు, ప్రజాతంత్ర హక్కుల పునరుద్ధరణకు, ఇటీవలనే పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పిఆర్‌డి) పేరిట ఒక వామపక్ష పార్టీ కార్మికవర్గ పోరాటాలను ప్రారంభించింది.

## లాటిన్ అమెరికా కార్మికవర్గ ప్రతిఘటన

ప్రపంచ ఆర్థిక పెట్టుబడి విశృంఖల విజృంభణ కారణంగా లాటిన్ అమెరికాలోని మెక్సికోలో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం, తాజాగా బ్రెజిల్‌కు పాకింది. లాటిన్ అమెరికా దేశాల్లో జరుగుతున్న ఉత్పత్తిలో 45% బ్రెజిల్ నుండే జరుగుతోంది. ఈ సంక్షోభ ప్రభావం సహజంగానే లాటిన్ అమెరికాలోని ఇతర దేశాలన్నింటి మీద ఇప్పటికే పడుతోంది.

ఆర్థికాభివృద్ధి సాగిన కాలంలో లాటిన్ అమెరికా ప్రజలకు ఒరిగిందేమీలేదు. లాటిన్ అమెరికాలో దాదాపు 65% మంది ప్రజలు దారిద్ర్యంలో బతుకుతున్నారు. విదేశీ బహుళజాతి కంపెనీలు ఈ దేశాల్లోని ప్రైవేటు రంగ ఆర్థిక సంస్థలను కొనుగోలు చేశాయి. ఫలితంగా లాటిన్ అమెరికా దేశాల్లో అనుసరించిన ప్రైవేటీకరణ విధానాలు, ఈ దేశాల మీద సామ్రాజ్యవాదుల పట్టు బిగించడానికి దారితీసింది. అయితే కార్మికవర్గం, పేద ప్రజలు ఈ దాడులకు తలవంచి భరించేందుకు సిద్ధంగా లేరు. ప్రపంచీకరణ దాడులను ప్రతిఘటించేందుకు మెక్సికోని చియాపాస్‌లో రైతుల సంఘం జపాటిస్తాస్ ఆధ్వర్యంలో సాగిన రైతాంగ సాయుధ తిరుగుబాటు తర్వాత, ఇప్పుడు బ్రెజిల్‌లో కార్మికవర్గ సమరశీల పోరాటాలు సాగుతున్నాయి.

## పెట్టుబడిదారీ విధాన నమూనాల వైఫల్యం

పెట్టుబడిదారీ విధాన నమూనాలన్నీ ఒకదాని తర్వాత మరొకటి కుప్పకూలు తున్నాయి. గొప్పగా చెప్పుకున్న తూర్పు ఆసియా ఆర్థికాభివృద్ధి నమూనా కుప్పకూలింది. ఆ తర్వాత రష్యా ఆర్థిక వ్యవస్థ పతనం,బ్రెజిల్ కేంద్రంగా లాటిన్ అమెరికా ఆర్థిక సంక్షోభం సంభవించాయి. ఇది ఒక తూర్పు ఆసియా, లాటిన్ అమెరికా, రష్యా లేదా ఇండియా అని గాక, యావత్ పెట్టుబడిదారీ ప్రపంచమే తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. పేద, సాధారణ ప్రజలు ఈ ఆర్థిక విషాదానికి బలయ్యారు. శ్రామిక ప్రజలే కాక, వివిధ ఆశ్చర్యకరమైన (నయా ఉదారవాద సమర్ధకులు) తరగతుల నుండి ప్రపంచీకరణ మీద విమర్శలు రావడం ప్రారంభమైంది. "మానవ ముఖంతో ప్రపంచీకరణ" అని కొందరు మాట్లాడుతున్నారు. అయితే మానవులకు మాత్రమే మానవ ముఖం వుంటుంది, కాని ఇతరులకు కాదు.

## సాంస్కృతిక పతనాన్ని కోరుతున్న ప్రపంచీకరణ

రోతపుట్టించే ప్రపంచీకరణ సాంస్కృతిక విలువలను దిగజార్చి ప్రస్తుత తరాలను కలుషితం చేస్తోంది. ఈ విధానాన్ని ఇలాగే కొనసాగనిస్తే భావితరాలను కూడ పతనం చేయగలదు. ఒక మృగానికి మానవముఖం వుండదు. మృగానికి మృగం ముఖమే వుంటుంది. అది మానవతా విలువలను నాశనం చేసి, అసభ్యతను అందలమెక్కించే స్వార్ధపూరిత, అత్యాశతో కూడిన సామాజిక వాతావరణాన్ని కల్పించే ఒక సంస్కృతిని సృష్టిస్తుంది. ఈ ప్రపంచీకరణ కొనసాగి; తాత్కాలికంగా బలపడ్తున్నప్పటికీ, ఈ కాలంలో పెట్టుబడిదారీ సంస్కృతి ప్రాథమికంగా క్షీణ సంస్కృతికి నిదర్శనం. ఇది మానవుల సుందరమైన, సున్నితలక్షణాలను నాశనం చేసి వారి నైతిక స్థైర్యాన్ని, నిజాయితీని, విప్లవ స్ఫూర్తిని దెబ్బతీసి, బూటకపు, వంచనాపరులైన స్వార్థపరులను, నిర్లక్ష్యపూరితమైన ధనాశాపరులను సృష్టిస్తుంది. ఇది పర్యావరణాన్ని నాశనం చేసి ఈ భూమిని మానవ జాతి జీవనానికి యోగ్యం కానిదిగా చేస్తుంది. ప్రపంచీకరణ మానవ సమాజంలో సాంస్కృతిక, నైతిక విలువల పతనాన్ని వేగవంతం చేసి మానవాళికి ప్రమాదం తీసుకురానుంది. అందువల్ల పెట్టుబడిదారీ ప్రపంచీకరణ నుండి రానున్న ఆర్థిక,

నైతిక, సాంస్కృతిక దాడులను, అంతర్జాతీయ స్థాయిలో సమర్ధవంతంగా ఎలా ప్రతిఘటించాలన్నదే మన ముందున్న ప్రశ్న.

## ఆర్థిక సంక్షోభం - ప్రజల రాజకీయ కార్యాచరణ

ఆర్థిక సంక్షోభానికి, ప్రజల రాజకీయ కార్యాచరణకు మధ్య యాంత్రిక సంబంధమేమీ లేదు. ప్రపంచీకరణ దుష్ఫలితాల పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరగడం కనపడుతూనే వుంది. ఒక్క ట్రేడ్ యూనియన్ల స్థాయిలోనే గాక, రాజకీయ స్థాయిలోకూడ ఈ లక్షణాలు మరింత ప్రస్ఫుటమవుతున్నాయి. పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరించబడిన పూర్వపు సోషలిస్టు దేశాలతో సహా, అనేక ఐరోపా దేశాల్లోనూ, జపాన్‌లోనూ అభ్యుదయ, సోషలిస్టు శక్తులు, కొన్ని దేశాల్లో నెమ్మదిగా అయినప్పటికీ పురోగమిస్తున్నాయి. జపాన్‌లో ఈ రాజకీయ శక్తుల పురోగతి గణనీయంగా వుంది. 1990–91 తర్వాత సోషలిస్టు శక్తులు పరాజయం పాలైన దేశాల్లో, వీరు తిరిగి కూడగట్టుకుని, నిలదొక్కుకుని, పురోగమించడం ప్రారంభించారు. ఇది క్రొత్త ఆశలను చిగురింప చేస్తోంది.

చారిత్రకంగా, ఆర్థిక సంక్షోభానికి, ప్రజల రాజకీయ కార్యాచరణకు మధ్య ఏనాడూ యాంత్రికమైన సంబంధం లేదు. పోరాటాల రూపాలు, ప్రధానంగా సమయం గురించి ముందుగా వూహించడం సాధ్యం కాదు. అయితే ఆర్థిక మాంద్యం ఏర్పడి, అది కొనసాగితే, ఇటీవల కొన్నేండ్లుగా పెట్టుబడిదారీ విధానం గురించి కష్టపడి ఏర్పరచిన భ్రమలు పటాపంచలు కావడం మాత్రం తథ్యం. శ్రామిక ప్రజల్లో చైతన్యం వస్తుంది. అయితే అది దానంతటదేరాదు. ప్రగతి శీల భావాలు కల్గిన వారు మరియు వామపక్ష కార్మిక సంఘాలు శ్రమజీవులను సంఘటిత పర్చి, పెద్ద ఎత్తున ప్రతిఘటనను నిర్మించేందుకు చైతన్య వంతమైన కృషి చేయడం ద్వారా అది సాధ్యపడుతుంది. ప్రస్తుత పోరాట, ప్రతిఘటన దశ, కేవలం పెట్టుబడిదారీ విధాన రుగ్మతలు, దాని సంక్షోభ తీవ్రత వల్ల తలెత్తిన ఫలితాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట దశ మాత్రమే. ఇప్పుడు చేయాల్సిందల్లా ఒక ఆచరణాత్మక ఆర్థిక, సామాజిక ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందుంచి, దానిని వాస్తవ రూపంలోకి మార్చగలమన్న ఒక విశ్వాసాన్ని, చైతన్యాన్ని వారిలో కల్గించడమే. ఈ కర్తవ్యం మిక్కిలి కష్టతరమైనది. క్లిష్టతరమైంది, సుదీర్ఘమైంది. దేశంలోను, అక్కడ నుండి అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ కర్తవ్య నిర్వహణకు వెంటనే పూనుకోవాలి. పెట్టుబడిదారీ విధానం ప్రపంచం మీద చేస్తున్న దాడులను ప్రతిఘటించేందుకు, శ్రామిక ప్రజల ఐక్యత, అంతర్జాతీయ సంఘీభావాల సాధన నేటి మన తక్షణ కర్తవ్యం.

## సియాటిల్‌లో హింసాత్మక నిరసనలు

క్రూరమైన పెట్టుబడిదారీ పాలనకు ప్రతినిధిగా వున్న డబ్ల్యుటిఒ, ప్రపంచం మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ అమెరికాలోని

సియాటిల్‌లో డబ్ల్యుటిఒ సమావేశం ప్రారంభమైన 30.11.1999న జరిగిన భారీ నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ప్రపంచం మీద, ప్రత్యేకంగా మూడవ ప్రపంచ దేశాల మీద, సామ్రాజ్యవాద ఆర్థిక దాడులకు వ్యతిరేకంగా, ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తికి సంకేతమే ఈ ప్రదర్శన. ఈ ప్రదర్శనకు వ్యతిరేకంగానూ, అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు మద్దతుగా క్లింటన్ తలపెట్టిన ప్రదర్శన, ఆగ్రహించిన నిరసన కారుల ప్రదర్శన ముందు వెల వెల బోయింది.

## భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు

ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్ (టియుఐపిఎఇ)ను పునర్నిర్మించే లక్ష్యంతో, ఆ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని భారతదేశానికి తరలించాలని డబ్ల్యుఎఫ్‌టియు, 13వ మహాసభలో ప్రతిపాదించబడింది. ఆ తర్వాత ఫ్రాన్స్ నుండి భారత్ వచ్చిన టియుఐ ట్రేడ్ యూనియన్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు, 1995 నవంబరులో టియుఐ డైరెక్టన్ కమిటీ సమావేశాన్ని కలకత్తాలో నిర్వహించాలని, దానికి ఎఐఎస్‌జిఇఎఫ్ మరియు ఎఐబిఇఎలు ఆతిథ్యం ఇవ్వాలని ప్రతిపాదించారు. తగిన స్పందన కొరవడడంతో సమావేశం జరగలేదు. 1996 జూన్ 25, 26 తేదీల్లో డబ్ల్యుఎఫ్‌టియు ప్రతినిధుల సమక్షంలో టియుఐ డైరెక్టివ్ కమిటీ సమావేశం సిరియాలోని డమాస్కస్‌లో జరిగింది. డైరెక్టివ్ కమిటీ సభ్యులు, ఎఐఎస్‌జిఇఎఫ్ నాయకులు కా॥ సుకోమల్ సేన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టియుఐ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్‌ను క్రియాశీలకం చేసి పునర్నిర్మించేందుకు ఎఐఎస్‌జిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి కా॥ సుకోమల్ సేన్‌ను టియుఐ ప్రధాన కార్యదర్శిగానూ, సైప్రస్ గవర్నమెంట్ అండ్ మిలిటరీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కా॥ క్రిస్టోస్ ఎ క్రిస్టోను అధ్యక్షునిగానూ, ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి కా॥ తారకేశ్వరీ చక్రవర్తిని ఉపాధ్యక్షునిగానూ ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశం టియుఐని పునర్నిర్మించేందుకు చేసిన తీర్మానం మేరకు టియుఐ కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలోని డబ్ల్యుఎఫ్‌టియు, ఆసియా పసిఫిక్ కార్యాలయం నుండి పనిచేయడం ప్రారంభించింది. తర్వాత కోల్‌కతా నుండి పనిచేయడం ప్రారంభించింది. 1996 సెప్టెంబర్‌లో సెంట్రల్ టియుఐని సమర్థవంతంగా పనిచేయించడంలో భారతదేశంలోని ప్రభుత్వ, సర్వీస్ రంగ యూనియన్ల సహకారం తీసుకునే ఉద్దేశంతో 1996 సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీ అసోసియేషన్ (ఎఐఐఈఎ) బిఇఎఫ్ఐ, ఎఐబిఈఎ లతో సహా 12 యూనియన్లు పాల్గొన్నాయి.

## అడియాసలైన సామ్రాజ్యవాదుల ఆశలు

1993 తర్వాత సంభవించిన పరిణామాలు సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, వారి సిద్ధాంత వేత్తలకు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఫుకుయామా "చరిత్ర అంతాన్ని" ప్రకటించినప్పుడు ప్రజలు వాద, ప్రతివాదాలు చేశారు. తాజా పరిణామాల తర్వాత ప్రజలు ఆయనతో పరిహాసాలాడడం మొదలెట్టారు. ఇప్పుడు ప్రజలు ఆయనను పూర్తిగా మరచిపోవడం ప్రారంభమైంది.

పూర్వపు సోవియట్ యూనియన్ తూర్పు యూరపు దేశాల్లోనే గాక ఇటలీ, ఫ్రాన్స్, గ్రీస్, స్పెయిన్, సైప్రస్, పోర్చుగల్ వంటి ఐరోపాలోని వివిధ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు మరియు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోని వివిధ దేశాల్లో కూడ సోషలిస్టు శక్తులు గత మూడేండ్ల కాలంలో తిరిగి కూడగట్టుకోవడం ప్రారంభమైంది.

గత ఒకటిన్నర దశాబ్దాల పరిణామాలను పరిశీలిస్తే సంక్షోభాన్ని అధిగమించేందుకు పెట్టుబడిదారీ విధానం క్రొత్త పద్ధతుల నమలు చేస్తోందని స్పష్టమవుతోంది. బహుళజాతి బ్యాంకులు, కార్పొరేషన్ల ఆధిపత్యం ద్వారా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెద్ద ఎత్తున కేంద్రీకృతమైంది. ఆర్థిక మాంద్య పరిస్థితులు నెలకొన్నప్పటికీ, మూడవ ప్రపంచ దేశాలను పణంగా పెట్టి లాభాలను నిలబెట్టుకుని, పెంచుకునేందుకు అది దోహదపడింది. నార్త్ అట్లాంటిక్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎన్ఎఎఫ్టిఎ), ఏషియా పసిఫిక్ ఎకనమిక్ కోఆపరేషన్ (ఎపిఇసి), యూరోపియన్ యూనియన్ (ఇయు) వంటి ప్రాంతీయ కూటములు, జి-7, ఒఇసిడి వంటి ప్రధాన సంఘటనలు, పెట్టుబడిదారీ దేశాలు తమ ఆర్థిక పరిస్థితిని సుసంఘటితం చేసుకుని, విస్తరించడానికి ఉపయోగపడ్డాయి. ఈ క్రమంలో దోపిడీకి క్రొత్త పద్ధతులు పుట్టుకొస్తున్నాయి.

నూతన పద్ధతుల ద్వారా మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక దోపిడీతో పాటు, అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రధానంగా ఆసియా ప్రాంతంలో మిలిటరీ జోక్యానికి పాల్పడుతోంది. అణుకర్మాగారాల తనిఖీకి అనుమతించలేదనే సాకుతో కొరియా ప్రజాతంత్ర రిపబ్లిక్ (ఉత్తర కొరియా) మీద ఆంక్షలు విధించడంతోపాటు, సైనికంగా జోక్యం చేసుకుంటానని బెదిరిస్తోంది. ఇరాక్ అంతర్గత వ్యవహారమైన కుర్దుల సమస్య సాకుతో ఇరాక్‌మీద సైనిక దాడికి పూనుకుంది. క్యూబా మీద విధించిన ఆంక్షలను తొలగించవల్సిందిగా అత్యధిక ఓట్లతో ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాలను ఖాతరు చేయక, అమెరికా అహంకార ధోరణితో క్యూబామీద నేరపూరిత దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. క్యూబా అంతర్గత వ్యవహారాల్లో తన కుట్రపూరిత జోక్యాన్ని కొనసాగిస్తోంది. మానవ హక్కుల సాకు చూపి చైనా అనుసరిస్తున్న సామాజికాభివృద్ధి పంథా (సోషలిస్టు

పంథా)ను మార్చుకోవాల్సిందిగా ఒత్తిడి తెస్తోంది. గాట్, డబ్ల్యుటిఒల్లో చైనా పూర్తిస్థాయి సభ్యత్వం పొందకుండా అడ్డుకుంటోంది. చైనా ప్రాంతీయ సమగ్రతను ప్రక్కన పెట్టి, తైవాన్‌కు అధునాతన ఆయుధాలు సరఫరా చేయడం ద్వారా తైవాన్‌ను పావుగా వాడుకోచూస్తోంది. తన ప్రధాన భూభాగమైన చైనాతో హాంగ్‌కాంగ్ విలీనం విషయమై హాంగ్‌కాంగ్‌లోని బ్రిటిషు పాలనా యంత్రాంగం అనేక చిక్కులు సృష్టించింది. అయితే చివరకు 1997 జూలై 1వ తేదీన హాంగ్‌కాంగ్‌ను తిరిగి చైనాకు అప్పగించడం జరిగింది. అదే సమయంలో పశ్చిమ ఐరోపా సరిహద్దులు దాటి నాటో పరిధిని విస్తరించే ప్రయత్నాలు చేస్తోంది.

వ్యవస్థాగత సర్దుబాట్లు, ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ వంటి ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు నిర్దేశిత నివారణోపాయాల ద్వారాను, అవధుల్లేని బహుళజాతి కంపెనీల కార్యకలాపాలు, గాట్ ఒప్పందాలు, దానికి ప్రతి రూపమైన డబ్ల్యుటిఒ ద్వారా, ఆర్థిక రంగంలో లోతుగా కూరుకుపోయిన సంక్షోభం నుండి బయటపడేందుకు, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఒక ప్రక్క అన్ని పెట్టుబడిదారీ దేశాల్లో శ్రామికులు, పెట్టుబడికి మధ్య వైరుధ్యాలు తీవ్రమవుతుండగా, వేరొక ప్రక్క ఆర్థిక ఆధిపత్య విస్తరణ, వాణిజ్య పోటీల విషయమై పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల మధ్య వైరుధ్యాలు కూడా పదునెక్కుతున్నాయి.

పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ వల్ల రష్యాలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నా భిన్నమైంది. ఈ విషయాన్ని చివరకు ఐఎల్ఒ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు విశ్లేషకులు కూడ అంగీకరించవల్సి వచ్చింది. ఫ్యాక్టరీల మూసివేత, ప్రైవేటీకరణల వల్ల నిరుద్యోగ సమస్య తీవ్రమవడంతో పాటు, రష్యాలో గౌరవప్రదమైన జీవనానికనుగుణమైన పరిస్థితులు నాశనం చేయబడ్డాయి.

> ఆర్థిక సరళీకరణ, సంస్కరణలకు కారకులైన ప్రపంచ బ్యాంకు 1996 ప్రపంచ అభివృద్ధి నివేదికలో "పరివర్తనే మృత్యువా?" అనే శీర్షికన రష్యాలోని పరిస్థితిని ఈ విధంగా వివరించింది. "పరివర్తన దశలో ఎక్కువ మంది రష్యన్లు మృత్యువాత పడ్తున్నారు. 1990-96 మధ్య కాలంలో పురుషుల జీవన ప్రమాణం ఆరు సంవత్సరాలు, మహిళల జీవన ప్రమాణం మూడు సంవత్సరాల మేరకు తగ్గింది. 25 నుండి 54 సంవత్సరాల మధ్య వయసున్న పురుషుల్లో అత్యధికంగా 50% మంది మరణిస్తున్నారు. ఈ గ్రూపులో ఎక్కువ వయస్సున్నవారు కార్డియోవ్యాస్కులర్ (గుండె సంబంధమైన) జబ్బులతోనూ, యువకులు ముఖ్యంగా ప్రమాదాలు, ఆత్మహత్యలు, దురాచారాలు, హత్యలకు గురై మరణిస్తున్నారు. రష్యాలో మరణాల రేటు భారతదేశం కంటే 10% అధికంగా వుంది. రష్యా సోషలిజం నుండి పెట్టుబడిదారీ విధానంలోకి పరివర్తన చెందడం వల్ల, నయా ఉదారవాద విధానాల అమలు వల్ల తలెత్తిన నిరాశ, నిస్పృహలు రష్యా ప్రజల

మీద చూపే ప్రభావం గురించిన ఈ అంచనాలు భయం గొల్పే విధంగా వున్నాయి. నాటి జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ (నాటి తూర్పు జర్మనీ) పరిస్థితి కూడ అదే విధంగా వుంది." 1996 ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం "పరివర్తన (మార్పు) పూర్తిగా ఒక తరాన్ని ఆర్థిక దుస్థితికి దిగజార్చింది."

మార్కెట్ ఆర్థిక వ్యవస్థ మరియు ప్రపంచీకరణ ద్వారా ప్రజలను స్వర్ణయుగం గురించిన భ్రమల్లో ముంచెత్తడానికి సామ్రాజ్యవాద ప్రాయోజిత ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలు ఉధృత ప్రచారం సాగించాయి. ప్రజల మనస్సులను కలుషితం చేయడానికి ఈ అసాధారణ మీడియా ప్రచారం ఉద్దేశించబడింది. దీనికి తోడు, సామ్రాజ్యవాదులు, మరియు పాశ్చాత్య ప్రపంచం, దారుణమైన ఒక క్షీణ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రజల విప్లవ స్ఫూర్తిని నీరుగార్చేందుకు వారిని నైతికంగానూ, సాంస్కృతికంగానూ బలహీన పర్చేందుకే ఈ చర్యలు ఉద్దేశించబడ్డాయి. ఆర్థిక, రాజకీయ పరమైన దాడులతో పాటు పెట్టుబడిదారీ ప్రపంచం సాంస్కృతిక దాడిని జోడించింది. అంతేగాక సంస్కృతిలోని మానవత్వాన్ని నాశనం చేయడంతో పాటు, ప్రపంచాన్ని పర్యావరణ పరంగా నాశనం చేసి, క్రమంగా మానవులు నివశించడమే కష్టమయ్యే పరిస్థితిని పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తోంది.

# 27

# తీవ్రమవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుపిఎ ప్రభుత్వ ఏర్పాటు కార్మికుల ఐక్య ప్రతిఘటన

**2**001–2005 సంవత్సరాల మధ్యకాలంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మరింత తీవ్రమైంది. సామ్రాజ్యవాదం నాయకత్వంలోని నయా ఉదారవాద ప్రపంచీకరణ ప్రపంచానికి వినాశన కర ఫలితాలను చవిచూపింది. గతమూడు సంవత్సరాలుగా కార్మికుల మీద ప్రపంచీకరణ దాడులు మరింత తీవ్రమయ్యాయి. అప్రతిష్టపాలైన నయా ఉదారవాద ఆర్థిక విధానాలను కఠినంగా అమలు చేయాలని వివిధ దేశాల మీద, ప్రత్యేకంగా మూడవ ప్రపంచ దేశాల మీద ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒలు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నాయి.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో ముదురుతున్న సంక్షోభ ఫలితమే నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాలు. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఆదేశాల్లోని సాధారణ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని రక్షించేందుకే ఈ విధానాలు రూపొందించారు. ప్రపంచీకరణ పేదరికాన్ని తగ్గించలేక పోయింది. అందుకు పూర్తి వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సంక్షోభాన్ని తీవ్రం చేసి అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రమాదంలోకి నెట్టింది. సోషలిజం నుండి మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు బలవంతంగా మళ్ళిన రష్యా తదితర మాజీ సోషలిస్టు దేశాలకు, ప్రపంచీకరణ, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ప్రవేశం వల్ల సామ్రాజ్యవాదులు గొప్పగా చెప్పిన ఫలితాలేవీ రాలేదు. నూతన పెట్టుబడిదారీ విధానం వల్ల ఆదేశాలకు వూహించని సంపద వచ్చి పడ్తుందని పాశ్చాత్య దేశాలు నమ్మబలికాయి. ఇందుకు భిన్నంగా ఇది వూహించని విధంగా దారిద్ర్యాన్ని, దీనావస్థను తెచ్చిపెట్టింది.

**దీనికి సంబంధించి కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం**

ఎ) 2005–2015 సంవత్సరాల మధ్య కాలాన్ని జీవితానికి అత్యవసరమైన నీటివనరుల అన్వేషణా చర్యల అంతర్జాతీయ దశాబ్దంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ

ప్రకటించింది. నీటి కొరత మానవజాతి భవిష్యత్‌కు పెద్ద ప్రమాదాన్ని తీసుకురానున్నది. నీరు, దాని నాణ్యతలకు అనేక వ్యాధులకు తీవ్రమైన పరోక్ష సంబంధం వుంది. త్రాగునీటికి సంబంధించి కాలుష్యం సమస్య అత్యంత తీవ్రమైనది. కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు, అడవుల నిర్మూలనతో పాటు, భూమిమీద నున్న 60% ప్రధాన నదులను కలుషితం చేసి, 1950 దశకం ప్రారంభం నుండి 4నుండి 8 కోట్ల మంది నిర్వాసితులయ్యేందుకు దారితీసిన బడా ప్రాజెక్టులు ఈ పరిస్థితికి మూలకారణం. ఈ నేరపూరిత పరిస్థితికి, పర్యావరణ కాలుష్యానికి ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ మరియు బడా బహుళజాతి సంస్థలు బాధ్యత వహించాలి.

బి) అభివృద్ధి చెందని దేశాల అభివృద్ధి కోసం అభివృద్ధి చెందిన దేశాలు 2003లో అధికారికంగా 6840 కోట్ల డాలర్లు సహాయం అందించగా, మూడవ ప్రపంచ దేశాలు అప్పులు, దాని మీద వడ్డీల రూపంలో 43,600 కోట్ల డాలర్లు సంపన్న దేశాలకు చెల్లించాయి. ఇక్కడ ఎవరికి ఎవరు సహాయం చేస్తున్నారు? అని ప్రశ్నించాలి.

సి) 15 సంవత్సరాల కాలంలో అత్యధిక మెజారిటీ ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా ఆదాయాలు, వనరులు, సంపద కేవలం కొద్ది మంది వ్యక్తులు, సంస్థలు, దేశాల చేతుల్లో కేంద్రీకరించబడ్డాయి. ప్రపంచంలోని స్కూలుకెళ్ళే వయసున్న పిల్లల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు అంటే సుమారు 12 కోట్ల మంది అసలు స్కూల్ ముఖం చూడలేదు. ఇది కేవలం పేద దేశాలకు పరిమితమైన సమస్య మాత్రమే కాదు. 2004లో 4.6 కోట్ల మంది అమెరికా పౌరులు వైద్య సదుపాయం పొందే హక్కుకు దూరమయ్యారు.

డి) అత్యంత సంపన్నులైన 5వ వంతు మందికి, మిగిలిన పేదలకు మధ్య తారతమ్యాలు 1960లో 30:1గా వుండగా, నేటికిది 90:1కి చేరింది. ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన వ్యక్తుల మొత్తం సంపద, ప్రపంచంలోని 48 అత్యంత పేద దేశాలు కూడబెట్టుకున్న సంపదను మించి వుంటుంది. 100 కోట్ల డాలర్లకు పైగా సంపద కల్గిన ప్రపంచంలోనే అత్యంత సంపన్నులైన 225 మంది మొత్తం సంపద, ఈ భూమిమీద వున్న 47% మంది అత్యంత పేదల ఆదాయాన్ని దాటి వుంటుంది. ఒక్క జనరల్ మోటార్స్ సంస్థే దక్షిణాఫ్రికా లేక ఈజిప్టు జిడిపి కంటె హెచ్చు వ్యాపార లావాదేవీల మొత్తాన్ని ప్రకటించింది. ఈ సంస్థల పటిష్టమైన స్థితికెవరు బాధ్యులో వేరే చెప్పనవసరం లేదు.

ఇ) పేద దేశాల మార్కెట్లలోకి ప్రవేశించేందుకు ఒత్తిడి తెచ్చి వాణిజ్య అవరోధాల (ట్రేడ్ బ్యారియర్స్)ను తొలగించుకున్న ధనిక దేశాలు, తాము మాత్రం ఆత్మరక్షణ చర్యల నవలంబించి తమ దేశాల్లో వాణిజ్యానికున్న అవరోధాలను అలాగే వుంచుకున్నాయి. ఈ విధంగా పేదదేశాలు తమ కత్యంత అవసరమైన ఎగుమతి ఆదాయాన్ని కోల్పోయాయి. పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాల వంచనా శిల్పానికిదొక మచ్చుతునక.

ఎఫ్) ప్రపంచంలోని ఇతర దేశాల మీద రోజుకు 100 కోట్ల డాలర్ల చొప్పున ఏడాదికి 36,000 కోట్ల డాలర్ల మేరకు ధనికదేశాలు ఆత్మరక్షణ చర్యల (దిగుమతి సుంకాలు) ద్వారా భారం వేస్తున్నాయి. అమెరికా తన దిగుమతుల మీద క్రొత్త దిగుమతి సుంకాలను విధిస్తోంది. యూరోపియన్ యూనియన్ సాంకేతిక, ఆర్థిక అవరోధా (బ్యారియర్స్)లను తీవ్రం చేసింది. అయితే ఈ అవరోధాలు తన సభ్య దేశాల్లో వర్తించవు. ఐరోపాలోని పచ్చికబయళ్ళలో మేసే ఆవు సగటున రోజుకు రెండు డాలర్ల సబ్సిడీ పొందుతుండగా, ప్రపంచంలో దారిద్ర్యరేఖకు దిగువన వున్న సుమారు 200 కోట్ల మంది ఇంతకంటె తక్కువ మొత్తంతో బ్రతుకులీడుస్తున్నారు. వీరిలో 24 వేల మంది ప్రతిరోజు ఆకలితో మరణిస్తున్నారు.

జి) ఇదే సమయంలో ప్రపంచంలో అలంకరణ సామగ్రి (కాస్మెటిక్స్) మీద రోజుకు 10 లక్షల డాలర్ల మేరకు ఖర్చవుతోంది. త్సునామీ బీభత్సం జరిగిన కొన్ని నెలల తర్వాత కూడ మరమ్మతులు, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు చర్యలు వేగిరపర్చడం, పునర్నిర్మాణం వంటి చర్యల విషయంలో, అత్యంత ధనిక దేశాలు చేసిందేమీ లేదు. శ్రీలంకలో త్సునామీ వల్ల నిరాశ్రయులైన 6 లక్షల మంది ఇంకా శరణార్థుల శిబిరాల్లోనే వున్నారు.

హెచ్) ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్‌ల మీద ధనిక దేశాలు రుద్దిన యుద్ధాలు, విధ్వంసాల తర్వాత పరిస్థితి దయానీయంగా వుంది. ఇరాక్ పునర్నిర్మాణానికి 900 కోట్ల డాలర్లను కేటా యించడం జరిగింది. కాని నేటికి నిర్దిష్ట పునర్నిర్మాణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

జీతాలు, ఉద్యోగ భద్రత, ప్రజాతంత్ర హక్కుల వంటి విషయాల్లో ప్రపంచ వ్యాప్తంగా, కార్మికవర్గం మీద ఒక క్రమ పద్ధతిలో అణచివేత, దోపిడీ సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్మికవర్గం ప్రణాళికాబద్ధంగా, ఐక్యతతో సమరశీలంగా స్పందించాల్సిన తీవ్ర ఆవశ్యకత ఏర్పడింది. గత కొద్ది సంవత్సరాలుగా అనేక దేశాల్లో సాగిన సమరశీల పోరాటాల కార్మిక వర్గం ట్రేడ్ యూనియను గణనీయమైన విజయాలు సాధించాయి.

కొత్త మిషనరీ సంస్థలుగా అవతారమెత్తిన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుండి గ్రాంట్లు, అప్పుల అవసరంలో వున్న పేద దేశాల మీద తమ ఆలోచనలను బలవంతంగా రుద్దుతున్నాయి. గాట్ సంప్రదింపుల ఫలితంగా 1995 జనవరిలో ఏర్పడిన డబ్ల్యుటిఒతో ఈ రెండు సంస్థలు జత కలిశాయి.

ప్రపంచీకరణ సంస్థల విధానపరమైన చర్యలకు వ్యతిరేకంగా హింసాత్మక ఘటనలు, నిరసనలు సర్వ సాధారణమయ్యాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని ప్రజలు, తమ మీద రుద్దబడిన పొదుపు చర్యలు కఠినంగా వున్నప్పుడల్లా హింసాత్మక ఘటనలకు పూనుకున్నారు. అయితే ఈ నిరసనలు పాశ్చాత్య దేశాల్లో ప్రచారం పొందలేదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని చోట్ల నిరసనలు వెల్లువెత్తడం నూతన పరిణామం.

సామ్రాజ్యవాచలిత నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాలకు బలైన దేశాలలో భారతదేశం కూడా ఒకటి. ప్రభుత్వోద్యోగులతో పాటు కార్మికులు ఇతర తరగతులు ఉద్యోగులు ఈ పోరాటాల్లో భాగస్వాములవుతున్నారు. భారతదేశంలో ప్రపంచీకరణ విధానాల దాడులు తీవ్రతరమవుతుండడంతో, పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సి వుంది.

యూరోపియన్ యూనియన్ నూతన రాజ్యాంగం ముసాయిదా మీద 2005 ఫిబ్రవరిలో నెదర్లాండ్స్ మరియు ఫ్రాన్స్ దేశాల్లో జరిగిన రిఫరెండంలో, ఆ రెండు దేశాల్లోని ఓటర్లు రాజ్యాంగం ముసాయిదాకు వ్యతిరేకంగా నిర్ణయాత్మకంగా ఓటు వేశారు. రిఫరెండం మీద ఓటింగుకు సిద్ధమవుతున్న జర్మనీ, బ్రిటన్‌లు హడావిడిగా ఆ రిఫరెండంను ఆపివేశాయి. యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు నయా ఉదారవాద ఆర్థిక విధానాలను తప్పక అమలు చేయాలన్న నిబంధనల వల్ల రాజ్యాంగ ముసాయిదాను ప్రజలు వ్యతిరేకించారు. సామ్రాజ్యవాద దేశాల్లో కూడ ఒక ప్రక్క అమెరికాకు, వేరొకప్రక్క యూరోపియన్ యూనియన్ మరియు జపాన్‌ల మధ్య, ఇ.యు. దేశాలు మరియు జపాన్ మధ్య వైరుధ్యాలు తీవ్రమై, సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు బహిర్గతమయ్యాయి.

అమెరికా హైజాకింగ్‌కు గురైన ఐక్యరాజ్యసమితి ద్వారా అమెరికా సామ్రాజ్యవాదం, ఇరాక్‌ను విధ్వంసం చేసి లోబరుచుకుంది. యుగోస్లావియా మీద బాంబు దాడి జరిపి, ఆ దేశాన్ని విచ్ఛిన్నం చేసి, ఆ దేశ మాజీ అధ్యక్షుని అరెస్టు చేసి అంతర్జాతీయ న్యాయస్థానం ముందు విచారణకు నిలిపింది. గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలు, యుగోస్లావియాలోని ఖనిజవనరుల మీద ఆధిపత్య కాంక్షతోనే ఇరాక్, యుగోస్లావియాల మీద అమెరికా దాడి చేసింది. ఏ సమయంలోనైనా దాడి చేసేందుకు రంగం సిద్ధం చేసుకునేందుకు వీలుగా ఉత్తర కొరియా, సిరియా, ఇరాన్, సూడాన్ మరియు క్యూబాలను "దుష్టరాజ్యాలు"గా ముద్రవేసింది. అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాదులు తాము హైజాక్ చేసిన ఐక్యరాజ్యసమితిని సాధనంగా చేసుకుని సిరియా మీద దాడికి కుట్రలు సాగిస్తున్నారు. క్యూబాకు వ్యతిరేకంగా ఆర్థిక, ద్రవ్య వాణిజ్య పరమైన దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తివేయాల్సిందిగా అమెరికాను కోరుతూ 8.11.2005న ఇదే ఐక్యరాజ్యసమితిలో తీర్మానానికి అమెరికా, ఇజ్రాయిల్‌లు వ్యతిరేకించగా, 182 దేశాలు అనుకూలంగా ఓటు వేసి ఆమోదించాయి. అయినా అమెరికా క్యూబా మీద ఆంక్షల తొలగింపుకు సిద్ధంగా లేదు. ఇంతే గాక చైనాకు గురిపెట్టి అణ్వాయుధాలను ఏర్పాటు చేయడం ద్వారా బెదిరించి, లొంగదీసుకునేందుకు ప్రయత్నించి, అమెరికా సామ్రాజ్యవాదులు భంగపడ్డారు. వేరొక ప్రక్క, అణుసహకారం, సంయుక్త సైనిక విన్యాసాలు వంటి చర్యల ద్వారా అమెరికా సామ్రాజ్యవాదం భారతదేశాన్ని కూడ తమ ఉచ్చులో బిగించేందుకు ప్రయత్నిస్తోంది.

జమ్మూ–కాశ్మీర్, ఈశాన్య భారత్‌లలోనే కాక, పశ్చిమ బెంగాల్‌తో సహాకొన్ని సరిహద్దు రాష్ట్రాలు, దేశ రాజధానితో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు కోరలు చాచిన అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు పెంచి, పోషిస్తున్నారనేది వాస్తవం. అంతర్జాతీయ ఉగ్రవాదం మానవాళి మనుగడకే ప్రమాదకరం.

వివిధ దేశాల్లోని ప్రగతిశీల ప్రభుత్వాలను పడగొట్టడానికి, మొదటగా ఆఫ్ఘనిస్తాన్, ఆతర్వాత ఇతర ప్రాంతాల్లోనూ ఉగ్రవాద ముఠాలను నిర్వహించిన ప్రధాన ముద్దాయి, అమెరికా సామ్రాజ్యవాదం, ఈ నేరాలకు, ఘోరాలకు బాధ్యత వహించాలి. పేద దేశాల సహజవనరులను కబళించే దురుద్దేశంతో, తనకిష్టం లేని ప్రభుత్వాలను పడగొట్టే అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే పోరాటంతో, ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని జోడించాలి. శాంతి, ప్రజాస్వామ్యం, రాజకీయ, సామాజిక స్థిరత్వాలకు వ్యతిరేకంగా ప్రపంచంలో జరిగిన ప్రతి నేరపూరిత, అప్రతిష్ఠాకరమైన కుట్రలోనూ అమెరికా సామ్రాజ్యవాద హస్తం గోచరిస్తుంది. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ రంగాన్ని, దాని ప్రత్యేక లక్షణాలను అంచనా వేసుకోవాలి. లేనియెడల జాతీయ పరిణామాలను సరిగా గ్రహించలేము.

## జాతీయ పరిస్థితి

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, వాటి అంతర్జాతీయ ప్రభువుల ఆదేశాల మేరకు, లాభాలార్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ విభాగాలను, కేంద్ర ప్రభుత్వమే నవరత్నాలుగా ప్రశంసించిన అద్భుతమైన ప్రభుత్వ రంగ పరిశ్రమలను, వ్యూహాత్మ రక్షణ రంగ పరిశ్రమలను బరి తెగించి ప్రైవేటీకరించ బూనుకుంది.

ప్రతి ఏడాది ప్రభుత్వోద్యోగుల సంఖ్యలో 10% కోత విధింపు, అనేక ప్రభుత్వ విభాగాల కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, ఉద్యోగుల సంఖ్యను తీవ్రంగా తగ్గించడం, దేశం మొత్తం ఆదాయంలో రాష్ట్రాలకు న్యాయమైన వాటా నిరాకరించడం, బడ్జెట్‌లో ప్రణాళికా వ్యయాన్నీ, ప్రణాళికేతర వ్యయాన్ని కుదించడం వంటి చర్యలకు కేంద్రం పూనుకుంది. ఫలితంగా ప్రభుత్వాల నిర్వహణతో పాటు ప్రజా సంక్షేమ చర్యల అమలు విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందుల నెదుర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిఎ స్తంభనను కూడా ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే 18.10.2002న కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రుల సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆ ప్రతిపాదన అమలుజరగలేదు. కొన్ని రాష్ట్రాల్లో కొన్ని విభాగాలను మూసివేస్తున్నారు. కొన్నింటిని కార్పొరేషన్ల స్థాయికి దిగజార్చారు. కొన్ని శాఖల్లో రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికుల స్థానంలో కాంట్రాక్టు కార్మికులను నియమిస్తున్నారు. లక్షలాది పోస్టులను ఖాళీగా వుంచి రద్దు చేస్తున్నారు. నూతన నియామకాలను మొత్తంగా రద్దు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదు. ఆర్థిక సదుపాయాలు, సాంఘిక సంక్షేమ చర్యలను ఉపసంహరించడం గాని లేదా తీవ్రంగా కత్తిరించడం గాని జరిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఉద్యోగుల మనుగడకే ముప్పువాటిల్లింది. ఎన్‌డిఎ ప్రభుత్వం నియమించిన రెండవ జాతీయ లేబర్ కమిషన్ తన కార్మిక వ్యతిరేక సిఫార్సులను 20.06.2002న వెలువరించింది.

## కార్మిక వ్యతిరేక "కార్మిక సంస్కరణలు"

కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాచేందుకు రెండవ జాతీయ లేబర్ కమిషన్ సిఫార్సులు ప్రభుత్వానికి, పెట్టుబడిదారీ యాజమానులకు అదుపులేని అధికారాలనిచ్చాయి. కమిషన్ కార్మిక వ్యతిరేక స్వభావం రీత్యా 1999 అక్టోబరులో ఏర్పరచిన జాతీయ లేబర్ కమిషన్‌ను వామపక్ష కార్మిక సంఘాలు బహిష్కరించాయి. చివరకు కమిషన్ నివేదికను కేంద్ర కార్మిక మంత్రి 7.9.2002న ప్రకటించారు.

భయపడినట్లే కార్మికవర్గానికి వ్యతిరేకంగా నివేదిక అనేక సిఫార్సులు చేసింది. నయా ఉదారవాద ప్రపంచీకరణ లక్ష్యాలకనుగుణంగా "నూతన పని సంస్కృతి" పేరిట "స్వేచ్ఛగా కార్మికులను నియమించడానికి, తొలగించడానికి" (Hire & Fire) పెట్టుబడిదారులకు అధికారాలను కట్టబెడ్తూ కమిషన్ సిఫార్సులు చేసింది. నయా ఉదారవాద ప్రపంచీకరణ భారాలను కార్మికుల మీద మోపి, కార్మికులు, సమాజం పట్ల తమ బాధ్యతల నుండి యజమానులు తప్పించుకునే విధంగా కమిషన్ సిఫార్సు చేసింది. కమిషన్ చేసిన కార్మిక వ్యతిరేక సిఫార్సుల్లో ముఖ్యమైనవి కొన్ని :

ఎ. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా, కార్మికశాఖ అనుమతి లేకుండా, తమ ఇష్టం వచ్చినట్లు కార్మికులను రిట్రెంచ్ చేయడానికి, లేఆఫ్ చేయడానికి యజమానులకు అధికారాలిచ్చింది. ఫ్యాక్టరీలోని కార్మికుల సంఖ్య 300 దాటి, వే ఆఫ్ ఏకబిగిన (ఒకేసారిగా) 30 రోజులకు పైగా కొనసాగితే ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి పొందాలి.

బి. సెలవు దినాలు తగ్గించాలి.

సి. బహుళ యూనియన్లను ఆమోదించరాదు.

డి. వేతన బోర్డులు నియమించే పద్ధతిని రద్దు చేయాలి.

ఇ. మొత్తం కార్మికుల్లో 66% సభ్యులున్న యూనియన్‌కు మాత్రమే, కార్మికుల సమస్యల మీద సంప్రదింపులు జరిపే హక్కుండాలి. తక్కువ సభ్యత్వం కల్గిన ఇతర యూనియన్లకు సంప్రదింపులో పాల్గొనే హక్కులేదు.

ఎఫ్. ఆ యూనియన్‌కు మాత్రమే సమ్మెకు పిలుపు ఇచ్చే హక్కు వుంటుంది. రహస్య ఓటింగ్‌లో కనీసం 51% సభ్యులు ఆమోదిస్తేనే సమ్మెకు అనుమతించడం జరుగుతుంది.

జి. "గోస్లో" ఉద్యమాన్ని కార్మికుల చట్ట విరుద్ధమైన చర్యగా పరిగణించాలి.

హెచ్. రోజువారీ పని గంటలు పెంచాలి.

ఇవి రెండు సంపుటాల రెండవ జాతీయ లేబర్ కమిషన్ సిఫార్సుల్లో ముఖ్యమైనవి మాత్రమే. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు రూపొందిన "కార్మిక సంస్కరణల" పేరిట చేయబడిన ఈ సిఫార్సులు, కార్మికులు ట్రేడ్‌యూనియన్ పోరాటాల్లో పాల్గొనే హక్కును హరించివేయడానికుద్దేశించినవే.

ఇదే విధమైన కార్మిక సంస్కరణలకు వ్యతిరేకంగా ఇటలీ కార్మికవర్గం 16.4.2001న ఒక రోజు సార్వత్రిక సమ్మె జరిపిన విషయం గుర్తు చేసుకోవాలి. భారతదేశంలో కూడ ఈ కార్మిక వ్యతిరేక కుట్రలను ఓడించేందుకు ఐక్య పోరాటాలు నిర్మించడం అనివార్యం.

## కార్మిక వ్యతిరేక సంస్కరణలకు వ్యతిరేకంగా ఐక్య ప్రతిఘటన

కార్మిక వ్యతిరేక సంస్కరణలకు వ్యతిరేకంగా ఐక్య ప్రతిఘటనను నిర్మించడం తక్షణ అవసరం. 2002 సెప్టెంబర్ 28,29 తేదీల్లో జరిగిన నేషనల్ లేబర్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వామపక్ష, మితవాద కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఈ సిఫార్సులను పూర్తిగా కార్మిక వ్యతిరేకమైనవిగా ఖండించడం విశేషం. రెండవ లేబర్ కమిషన్ సిఫార్సులను సిగ్గుమాలిన కార్మిక వ్యతిరేక పత్రంగా ముందుగానే ఊహించిన వామపక్ష కార్మిక సంఘాలు, ఈ కమిషన్ ఒక వృధా ప్రయాసగా భావించి, దానిని బహిష్కరించాయి. కొన్ని మితవాద జాతీయ కార్మిక సంఘాలు దీనిలో పాల్గొన్నాయి. కమిషన్ సిఫార్సులు వెలువడిన తర్వాత ఆ సిఫార్సుల్లోని కార్మిక వ్యతిరేక అంశాలను, ట్రేడ్ యూనియన్లన్నీ ఐక్యంగా ఖండించి వ్యతిరేకిస్తాయన్న, వామపక్ష కార్మిక సంఘాల వూహలను, సిఫార్సులు వెలువడిన తర్వాత పరిణామాలు ధృవీకరించాయి.

ఈ సిఫార్సులనన్ని ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా ఆక్షేపించినప్పటికీ, నాటి ప్రధాన మంత్రి, కార్మిక మంత్రులు లజ్జారహితంగా ఈ సిఫార్సులను సమర్థించ బూనుకున్నారు. ప్రపంచీకరణయుగంలో వర్గ వైరుధ్యాలకు తావులేదని ప్రధాన మంత్రి ట్రేడ్ యూనియన్లకు ప్రబోధించారు. అంటే కార్మికులు, పరిశ్రమాధిపతులతో శాంతియుత సహజీవనం చేయాలి. అయినప్పటికీ సమావేశంలో పాల్గొన్న ట్రేడ్ యూనియన్లు ప్రధాన మంత్రి ప్రబోధాలను గాని, మరల పరిశీలించవల్సిందిగా కార్మిక మంత్రి చేసిన విజ్ఞప్తిని గాని అంగీకరించలేదు. కార్మికవర్గ హక్కుల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్లు అపూర్వమైన ఐక్యతను ప్రదర్శించాయి. వేడి, వాడి వాగ్వివాదాలతో నేషనల్ లేబర్ కాన్ఫరెన్స్ రసాభాసగా ముగిసింది.

ప్రపంచీకరణతో పెట్టుబడికి కార్మికవర్గానికి మధ్య వైరుధ్యాలు అంతమయ్యాయన్న ప్రధాన మంత్రి పరిహాసాస్పద వక్కాణింపులు కార్మికవర్గానికి ఆశ్చర్యం కల్గించలేదు. ఎందుకంటే, భారతపెట్టుబడిదారీ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం, దేశంలోని పెట్టుబడిదారులే కాక, బహుళజాతి కంపెనీల (అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గం) ప్రయోజనాల పరిరక్షణకు కూడ కట్టుబడి వుంది. ఈ విషయంలో ప్రభుత్వం చాలా విశ్వాసంతో వ్యవహరిస్తోంది.

ప్రధానమంత్రి, ప్రభుత్వంలోని ఆయన సహచరులు వర్గ వైరుధ్యాల ఆవిర్భావం గురించి అజ్ఞానంలోనే వున్నారనేది నిజం. కార్మికవర్గాన్ని దోచుకోవడం పెట్టుబడిదారీ వర్గం జన్మహక్కుని,

కార్మికులు ఏవిధమైన నిరసన వ్యక్తం చేయకుండా అంగీకరించాలని నమ్ముతున్న వీరికి వర్గ వైరుధ్యాల గురించి ఆలోచించే ఆస్కారం ఎక్కడుంది? నిజానికి 2వ జాతీయ లేబర్ కమిషన్ సిఫార్సులు తీవ్రమవుతున్న వర్గ వైరుధ్యాలను సమర్థించే ఒక ప్రత్యేకత గల పత్రం. దీనిని కార్మికులు మింగవల్సిందేనని ప్రభుత్వం భావిస్తోంది. కాని ప్రధాన మంత్రిని, ఆయన ప్రభుత్వాన్ని, వారు నియమించిన రెండవ జాతీయ లేబర్ కమిషన్ సభ్యుల మాటలు వినేందుకు కార్మికవర్గం సిద్ధంగాలేదు. భిన్న రాజకీయాభిప్రాయాలున్నప్పటికీ సహజంగానే ఈ సిఫార్సులకు వారు వ్యతిరేకంగా వున్నారు. అయితే పెట్టుబడిదారీవర్గం, బహుళజాతి కంపెనీల కుట్రలను నిర్ణయాత్మకంగా వ్యతిరేకించి, ఆ కుట్రలను ఓడించి, కమిషన్ సిఫార్సులను చరిత్ర చెత్తబుట్టలో వేసేందుకు, దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలను నిర్మించేదిగా ఈ ట్రేడ్ యూనియన్ల ఐక్యత వున్నదని అర్థం కాదు. ఇది వెంటనే సాధ్యమయ్యేది కాదు. దేశ వ్యాప్త నిరసన ద్వారా పోరాటాలకు అనువైన వాతావరణం కల్పించి నిర్ణయాత్మక పోరాటాలకు కార్మికవర్గంలో చైతన్యం కల్పించాలని పోరాట సంఘాలు భావించాయి. దీనికి కొంత సమయం పట్టినప్పటికీ అసాధ్యం మాత్రం కాదు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంయుక్త సదస్సు

భారత ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాల ననుసరించి, పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ, ఉద్యోగాల్లో కోత, రిట్రెంచ్‌మెంట్లు, ఆర్థిక సదుపాయాల్లో కోత, ట్రేడ్ యూనియన్ హక్కుల కుదింపు వంటి చర్యలకు పాల్పడడం, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల మీద కూడా ప్రభావం చూపింది. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, ప్రత్యక్ష రిట్రెంచ్‌మెంట్లు వంటి చర్యలను కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అత్యుత్సాహంగా అమలు చేయగా, కొన్ని విషయాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని కూడ అధిగమించాయి. అందువల్ల ఉమ్మడి సమస్యల మీద ఐక్య పోరాటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల మధ్య ఐక్యతను సాధించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఉద్యోగుల మీద జరుగుతున్న దాడులను త్రిప్పికొట్టేందుకు ఐక్యకార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించేందుకు ఎఐఎస్‌జిఇఎఫ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌ల జాయింట్ మీటింగ్ పిలుపు మేరకు 27.5.2001న న్యూఢిల్లీలో జాతీయ సదస్సు జరిగింది. దీనిలో ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ కార్యసభ్యులందరూ పాల్గొనగా, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, టెలికం ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. కాని ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఈ సదస్సులోగాని, కార్యాచరణలో గాని పాలుపంచుకోక పోవడానికి కారణాలు తెలియదు. ఈ సదస్సులో సిఐటియు, ఎఐటియుసి తదితర వామపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. చర్చల అనంతరం ఈ క్రింది డిమాండ్ల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 25.7.2001న దేశవ్యాప్త సమ్మె నిర్వహించాలని సదస్సు పిలుపు ఇచ్చింది.

ఎ. పర్మనెంట్ ఉద్యోగాలను కాంట్రాక్టు, క్యాజువల్ (రోజువారీ) ఉద్యోగాలుగా మార్చరాదు.

బి. ఖాళీ పోస్టులు రద్దుచేసే పద్ధతికి స్వస్తి చెప్పాలి. అన్ని ఖాళీలను భర్తీ చేయాలి.

సి. ఉద్యోగులనుభవిస్తున్న ఆర్థిక బెనిఫిట్లను కుదించరాదు. పెన్షన్ నిబంధనల్లో ఉద్యోగ వ్యతిరేక మార్పులు చేయరాదు.

డి. కార్మికుల ప్రయోజనాలకు నష్టం కల్గించే విధంగా కార్మిక చట్టాల సవరణ నిలిపివేయాలి.

ఇ. ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పాలి.

ఎఫ్. ఉద్యోగాలలో కోత, ఉద్యోగుల రిట్రెంచ్‌మెంటును నిలిపివేయాలి.

జి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటిఓ ఆదేశిత వినాశకర ఆర్థిక విధానాలను ప్రభుత్వం విడనాడాలి.

ఈ పిలుపు మేరకు సుమారు 90 లక్షల మంది రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు 25.7.2001న జరిగిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేశారు. కార్పొరేటీకరణ జరిగినప్పటికీ టెలికం విభాగంలోని గణనీయమైన భాగం సమ్మెలో పాల్గొంది. ప్రభుత్వం తన విధ్వంసకర విధానాలను మార్చుకునే విధంగా ఒత్తిడి తెచ్చేందుకు సమరశీల పోరాటాలతో పురోగమించాలన్న కార్మికవర్గ చైతన్యం, దృఢనిశ్చయాలకు, బ్రహ్మాండంగా విజయవంతమైన ఈ సమ్మె ప్రతీకగా నిల్చింది. ఐక్య పోరాటాల పట్ల కార్మికవర్గ ఆకాంక్ష నీ సమ్మె వెల్లడించింది. రోజువారీ ఆర్థిక డిమాండ్లేమీ లేకుండా, స్వాతంత్ర్యానంతర కాలంలో మొట్టమొదటిసారిగా కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొన్న ఈ సమ్మె మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంది. స్ఫూర్తివంతమైన ఈ సమ్మె ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఐక్యంగా పురోగమించడానికి ఉత్సాహాన్నిచ్చింది. ఇది చారిత్రాత్మక సమ్మె. 27.5.2001 సంయుక్త సదస్సు రూపొందించిన ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ సాధనకు జరిగిన ఈ సమ్మెలో ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ స్కూల్ టీచర్స్ పాల్గొనగా, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనవర్శిటీ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ సమ్మెకు నైతిక మద్దతు ప్రకటించింది.

## కార్మిక వ్యతిరేక సిఫార్సులను ఖండించిన ట్రేడ్ యూనియన్లు

స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ 17.10.2001న ఢిల్లీలోని హిందీ భవన్ ఆడిటోరియమ్‌లో నిర్వహించిన సదస్సులో ఈ క్రింది కమిటీలు సమర్పించిన కార్మిక వ్యతిరేక నివేదికలను ఘాటుగా విమర్శించాయి.

ఎ. ప్రభుత్వశాఖల్లోని ఉద్యోగాల్లో తీవ్ర కోతను, ప్రభుత్వోద్యోగుల రిట్రెంచ్‌మెంట్‌ను సిఫార్సు చేసిన గీతాకృష్ణన్ కమిటీ నివేదిక.

బి. ఉత్పత్తి యూనిట్లతో సహా రైల్వేలో తీవ్ర ఉద్యోగాల కోతను, పెద్ద ఎత్తున ప్రైవేటీకరణను ప్రతిపాదించిన రాకేష్‌మోహన్ కమిటీ నివేదిక.

సి. భారత ట్రేడ్ యూనియన్ చట్టానికి, పారిశ్రామిక వివాదాల చట్టానికి తిరోగమన కార్మిక వ్యతిరేక సవరణలు, పర్మినెంటు పనులను రోజువారీ కార్మికులతో చేయించడం, ప్రైవేటీకరణను సిఫార్సు చేసిన ఎం.ఎస్. అహ్లూవాలియా కమిటీ నివేదిక.

ఈ నివేదికలన్నీ ప్రభుత్వ పరిశీలనలో వుండడమే గాక, కొన్ని శాఖల్లో ఉద్యోగాలు కుదించడానికి, ట్రేడ్ యూనియన్ చట్టానికి సవరణలు చేయడానికి ప్రభుత్వం అప్పటికే కొన్ని నిర్ణయాలు చేసింది. కేంద్ర కార్మిక సంఘాలతో పాటు అనేక జాతీయ ఫెడరేషన్లు చురుకుగా సదస్సులో పాల్గొన్నాయి. ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ కార్యవర్గం గతంలో ఇచ్చిన పిలుపు మేరకు పెట్టుబడిదారీ ప్రపంచీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాల కుదింపుకు, ప్రజావ్యతిరేక కేంద్ర సాధారణ, రైల్వేబడ్జెట్ల ద్వారా ప్రజల మీద భారాలు వేయడానికి వ్యతిరేకంగా 5.3.2002న దేశవ్యాప్తంగా “అఖిలభారత నిరసన దినం” పాటించబడింది. రాష్ట్ర రాజధానుల నుండి బ్లాక్ స్థాయి వరకు రాష్ట్ర ఉద్యోగులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. ఈ సభలు, సమావేశాలు మార్చి 14వ తేదీన “జాతయ నిరసన దినం” పాటించడానికి, ఏప్రిల్ 16 సమ్మె విజయవంతం చేయడానికి ఉద్యోగులు, కార్మికులకు ఉత్సాహాన్నిచ్చాయి. ఏప్రిల్ 16న సమ్మె కొన్ని రాష్ట్రాల్లో విజయవంతం కాగా, కొన్ని రాష్ట్రాల్లో ఒక మాదిరి కార్మిక, ఉద్యోగ భాగస్వామ్యంతో ధర్నాలు జరిగాయి. కొన్ని రాష్ట్రాల్లో ఈ సమ్మె సంపూర్ణ బంద్ రూపం సంతరించుకుంది. అనేక రాష్ట్రాల్లోని రాష్ట్ర పిఎస్‌యుల్లో సమ్మె జరిగింది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వరంగ సంస్థల్లో సమ్మె విజయవంతమైంది.

## మతోన్మాద శక్తుల దాడికి వ్యతిరేకంగా ఎన్‌పిఎంఒ

56 ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలతో కూడిన ప్రజా సంఘాల జాతీయ వేదిక, గుజరాత్‌లో జరిగిన అనాగరిక మతోన్మాద వూచకోత నేపథ్యంలో 20.5.2002న ఢిల్లీలో సమావేశమైంది. మతోన్మాదం కార్మికవర్గ పోరాటాలకు, దేశ సమైక్యత, సెక్యులరిజం, ప్రజాస్వామ్యాలకు బద్ధ శత్రువు, కనుక 2002 జూన్ 19 నుండి జూలై 4 వరకు, దేశవ్యాప్తంగా అన్ని స్థాయిల్లోనూ “ప్రచారపక్షం” నిర్వహించవల్సిందిగా ఎన్‌పిఎంఒ తన సభ్య సంఘాలకు పిలుపునిచ్చింది. ఎఐటియుసి, సిఐటియు, హెచ్‌ఎంఎస్, యుటియుసి, ఎఐసిసిటియు, యుటియుసి (లెనిన్ సారణి) లతో పాటు అనేక ఉద్యోగ సంఘాలు, రైతాంగం, విద్యార్థులు, యువజనులు, మహిళా సంఘాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఎఐఎస్‌జిఇఎఫ్ తరపున కా॥ సుకోమల్ సేన్ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా

## కార్యాచరణకు వర్కర్స్ అసెంబ్లీ పిలుపు

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 15.7.2002న ఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో కార్మికుల జాతీయ సమావేశం (నేషనల్ అసెంబ్లీ ఆఫ్ వర్కర్స్) విజయవంతంగా జరిగింది. బిఎమ్ఎస్ తప్ప మిగిలిన కేంద్ర కార్మిక సంఘాలు, జాతీయ ఫెడరేషన్లకు చెందిన సుమారు 5000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్ తరుపున హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్నాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, జార్ఖండ్, పంజాబ్, మహారాష్ట్ర, బీహార్, ఆంధ్రప్రదేశ్‌ల నుండి వందమందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ సమావేశం దశలవారీ కార్యక్రమాన్ని నిర్ణయించి, ఒక ప్రకటన నామోదించింది. 2వ జాతీయ లేబర్ కమిషన్ నివేదికను ఐఎన్‌టియుసి ఆమోదించగా, కొన్ని అంశాల్లో అభ్యంతరాలతో బిఎంఎస్ కూడ ఆమోదించింది. 2003 పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సమయంలో పార్లమెంటుకు మహాప్రదర్శనతో ముగిసే విధంగా దశల వారీ కార్యక్రమాన్ని నేషనల్ అసెంబ్లీ ఆఫ్ వర్కర్స్ ఏక గ్రీవంగా ఆమోదించింది. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కా॥ గురుదాస్ దాస్ గుప్తా ప్రతిపాదించిన ప్రకటనను సిఐటియు ప్రధాన కార్యదర్శి కా॥ ఎం.కె. పాంథే బలపరుస్తూ ప్రసంగించారు. తర్వాత ఎఐఎస్‌జిఇఎఫ్ తరపున కా॥ సుకోమల్ సేన్, మహారాష్ట్ర ట్రేడ్ యూనియన్ల తరపున ఎఐఎస్‌జిఇఎఫ్ ఛైర్మన్ కా॥ ఆర్.జి. కార్నిక్, సిఐటియు నుండి డా॥ కె.హేమలత, ఎఐటియుసి తరపున కా॥ అమర్‌జీత్ కౌర్, హెచ్ఎంఎస్ నుండి ఒక మహిళా వక్త ప్రసంగించారు. ఎఐఎస్‌జిఇఎఫ్‌తో సహా వివిధ సంఘాల నుండి మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చారిత్రాత్మక ప్రాధాన్యత గల్గిన ఈ ప్రకటన పూర్తి పాఠాన్ని ఈ క్రింద పొందు పరుస్తున్నాం.

### ప్రకటన

1. దేశంలోని విస్తృత తరగతులకు చెందిన కార్మికులు, ఉద్యోగులకు చెందిన వివిధ కేంద్ర కార్మికసంఘాలు, సమాఖ్యలు మరియు స్వతంత్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 5 వేల మందికి పైగా ప్రతినిధులతో “నేషనల్ అసెంబ్లీ ఆఫ్ వర్కర్స్” 15.7.2002న న్యూఢిల్లీలోని తల్కతోరా ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సమావేశం కేంద్ర ప్రభుత్వ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ ఆర్థిక విధానాల పట్ల తన తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తోంది. వేతనాలు, ఉద్యోగాలు, ప్రస్తుత బెనిఫిట్లలో కోతలు విధించి, ఆర్థిక సంక్షోభ భారాలను పూర్తిగా కార్మికవర్గం మీద వేసి పేదరికాన్ని, నిరుద్యోగాన్ని తీవ్రం చేసే విధంగా ప్రభుత్వం చేపట్టిన నిర్లక్ష్య పూరిత సంస్కరణలను దృఢంగా వ్యతిరేకిస్తోంది.

2. ప్రభుత్వ విధానాలు ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు కల్పించడంలో విఫలమైనప్పటికీ, ఆ విధానాలను సమీక్షించి ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రత్యామ్నాయ విధానాల మీద దృష్టి పెట్టే పరిస్థితిలో కూడ ప్రభుత్వం లేదు. ట్రేడ్ యూనియన్ల నాయకత్వంలో జాతీయ స్థాయిలో భారీ నిరసనలు వెల్లువెత్తినప్పటికీ వారిని చర్చలకు పిలవాలని కూడ ప్రభుత్వం భావించలేదు. ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటిఒల ఆజ్ఞల మేరకు పనిచేస్తున్న ప్రభుత్వం తన ఆర్థిక కార్యక్రమం అమలుకు విదేశీ సహాయం కోసం అశగా ఎదురుచూస్తోంది. అందువల్ల స్పందనా రహితంగా తయారైన ప్రభుత్వం తన విధానాల వైఫల్యాలకు సంబంధించిన వాస్తవిక పరిస్థితులను ఆమోదించే పరిస్థితిలో లేదు. దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెట్టడంతో, దేశ ఆర్థిక పరిస్థితి మరింత సంక్షోభంలోకి దిగజారుతోంది. పారిశ్రామికోత్పత్తిలో దిగజారుడు అడ్డూ అదుపూ లేకుండా కొనసాగుతోంది. రిజర్వేషన్ల రద్దు వల్ల చిన్న తరహా పరిశ్రమలు దారుణంగా దెబ్బతిన్నాయి. లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులను బజారు పాలు చేసే విధంగా సాగుతున్న పరిశ్రమల మూసివేత కథనాలను తాజా ఆర్థిక సర్వే ప్రకటించింది. 31.3.2001 నాటికి 2,52,947 పెద్ద, మధ్య, చిన్న తరహా పారిశ్రామిక సంస్థలు ఖాయిలాపడగా, వాటిలో చాల వరకు మూతపడ్డాయి. పరిశ్రమల ఖాయిలా పెరుగుతోంది. వీటి పునరుద్ధరణ విషయాన్ని ప్రభుత్వం వాస్తవిక దృక్పథంతో చూడాలి. ఒక ప్రక్క పరిశ్రమలు ఖాయిలా పడ్తుండగా, ప్రమోటర్లు సంపన్నులవుతున్నారు.

3. పరివ్యాప్తమవుతున్న మాంద్య పరిస్థితులు, స్తబ్ధంగా వున్న మార్కెట్ డిమాండు, అదనపు పెట్టుబడిలో క్షీణత, తరిగిపోతున్న బ్యాంకు రుణాల వినియోగం, పెరుగుతున్న ఉద్యోగాల్లో కోత వంటి పరిణామాల కారణంగా రాబోయే రోజుల్లో ఆర్థికాభివృద్ధి మెరుగుపడ్తుందని నమ్మడం కష్టం. ఉద్యోగాలు, వేతనాల్లో కోత, పడిపోతున్న ఉపాధి అవకాశాలు, రైతాంగంలో పెరుగుతున్న పేదరికం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి డిమాండ్‌లో స్తబ్ధత ఏర్పడింది. డిమాండ్‌లో స్తబ్ధత కారణంగా ద్రవ్యోల్బణం రేటు ఏనాడు లేని స్థాయికి పడిపోయింది.

4. అదనపు ఉద్యోగావకాశాల కల్పన అతి తక్కువగా 0.5%గా వుంది. నిరుద్యోగం ప్రమాదకరంగా పెరిగి దేశ సామాజిక వ్యవస్థకు ముప్పుతెచ్చే పరిస్థితులేర్పడు తున్నాయి. మూసివేతలు, స్వచ్ఛంద పదవీ విరమణలు, ఉపాధిలో కోత ఫలితంగా లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఆర్థిక సంస్కరణల క్రమంలో సుమారు రెండుకోట్ల మంది కార్మికులు బజారున పడ్డారు. రెండేళ్ళ కాలంలో 70 లక్షల మంది ఫ్యాక్టరీ కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. ఇది కాకుండా కేంద్ర ఉద్యోగుల సంఖ్యను 10% తగ్గించాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉద్యోగాలు కోల్పోయే వారు దానికి అదనం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 40 వేల మందికి పైగా స్థాన చలనానికి గురయ్యారు. దేశంలో ఉద్యోగుల సంఖ్యలో తరుగుదల అత్యధికంగా 3% గత

సంవత్సరంలో వుండగా, ఈ ఏడాది 5%కి చేరుకుందని సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ (కేంద్ర గణాంకాల సంస్థ) తన వార్షిక నివేదికలో పేర్కొంది. రెండు సంవత్సరాల్లో 8% మేరకు ఉద్యోగాలు పడిపోవడం భయం గొల్పుతోంది.

5. రెండవ జాతీయ లేబర్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో "ఒక అంచనా ప్రకారం వచ్చే పదేండ్లలో 7 కోట్ల మంది నిరుద్యోగ సైన్యంలో చేరతారు. క్రొత్తవారిని ఇముడ్చుకోవడంలో వ్యవసాయ రంగానికి పరిమితులున్నాయి. ఆ విధంగా "ఉపాధిరహిత" అభివృద్ధికి దారితీసింది. నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) అంచనా ప్రకారం 1991 తర్వాత నిరుద్యోగం పెరిగిందని, 1993-94లో 6%గా వున్న నిరుద్యోగం 1999-2000 నాటికి 7% దాటింది.

6. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు కూడా కసితో తమ మానవ వనరులను కుదించాయి. ఒక్క టెక్స్‌టైల్ రంగంలోనే 3,90,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (ఐఐఎస్‌సిఒ), టాటా ఇంజనీరింగ్ అండ్ లోకో మోటివ్ కంపెనీ (టిఇఎల్‌సిఒ - టెల్కో), బజాజ్ ఆటో, ఓల్టాస్, అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీ లిమిటెడ్ (ఎసిసి), ఫిలిప్స్ ఇండియా, లార్సన్ అండ్ టో్బ్రో, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఏషియా బ్రౌన్ బొవేరి (ఎబిబి), యూనీలివర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు గత రెండేళ్ళలో 50 వేల మందిని తొలగించాయి. గొప్పగా చెప్పుకుంటున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో గత ఏడాది 10వేల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

7. తక్కువ జీతాలు, వివక్షత, వేధింపులు, పురుషుల కంటే తేలిగ్గా ఉద్యోగాల నుండి తొలగించబడడం వంటి పరిస్థితులవల్ల మహిళలు ఆర్థిక సంస్కరణలకు తీవ్రంగా బలయ్యారు.

8. అసంఘటిత రంగంలోని ఉద్యోగాల బదిలీ విపరీతంగా పెరిగింది. యజమానులు ఉద్యోగాల అవుట్ సోర్సింగ్ (పర్మనెంటు ఉద్యోగులు చేసే పనులు, కాంట్రాక్టు పద్ధతిలో చేయించడం)కు పాల్పడడంతో అసంఘటిత రంగం పెరుగుదలను తీవ్రం చేసింది. వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, బీడీ పరిశ్రమ, నిర్మాణరంగం, చేనేత, షాపులు, రెస్టారెంట్లు, హోటళ్ళ కార్మికులు, వలస కార్మికులు, బరువులు మోసే కార్మికులు కనీస వేతనాలు, చట్టపరమైన సదుపాయాలు లేకుండా నిర్బంధ చాకిరీ చేయవల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా అసంఘటిత కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు, వారికి సామాజిక భద్రత కల్పించేందుకు చట్టాలు చేసేందుకు ప్రభుత్వం నిరాకరిస్తోంది.

9. భారత కార్పొరేట్లను, బహుళజాతి కంపెనీలను ప్రభుత్వం సిగ్గులేకుండా బుజ్జగించడం నీతిమాలిన చర్య. అవుట్ సోర్సింగ్‌కు కార్మికుల మీద పెట్టే ఖర్చును తగ్గించేందుకు యాజమానులకు సహకరించే విధంగా ప్రభుత్వం కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) చట్టసవరణకు పూనుకుంది.

10. అత్యధిక సంఖ్యాకులైన కార్మికులు, ఉద్యోగులకు వారి వాయిదా పడిన వేతనాన్ని (బోనస్) నిరాకరించే తలంపుతో, ప్రభుత్వం బోనస్ చెల్లింపుల చట్టానికి సవరణలు చేయనిరాకరిస్తోంది. ఏడాది కేడాదికి పి.ఎఫ్. మీద వడ్డీ రేటును తగ్గిస్తోంది. లీవ్ ట్రావెల్ కన్సెషన్ (ఎల్‌టిసి) ను తాత్కాలికంగా నిలిపివేసింది. ఫ్రింజ్ బెనిఫిట్లను (వేతనాలతో నిమిత్తం లేకుండా యజమానులు కార్మికులకిచ్చే ఇతర సదుపాయాలు) ఆదాయపు పన్ను పరిధిలోకి తెచ్చారు. కనీస వేతనం చెల్లింపు, చివరకు డి.ఎ. చెల్లింపు కూడ ఉత్పాదకతతో ముడిపెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. చిన్న మొత్తాల పొదుపు మీద వడ్డీరేట్ల తగ్గింపు కార్మికులను తీవ్రంగా దెబ్బతీసింది. కార్మిక చట్టాల నతిక్రమించేవారు శిక్షలేకుండా తప్పించు కునేందుకవకాశాలు కల్పిస్తూ కార్మికులదోపిడీని తీవ్రతరం చేసి, యజమానులకు మరిన్ని లాభాలు సమకూర్చేందుకు ప్రభుత్వం కార్మిక చట్టాలను మరింత సవరించపూనుకుంది.

11. నేషనల్ అసెంబ్లీ ఆఫ్ వర్కర్స్, రెండవ జాతీయ లేబర్ కమిషన్ చేసిన కార్మిక వ్యతిరేక సిఫార్సులను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పారిశ్రామిక వివాదాల చట్టం, కాంట్రాక్ట్ లేబర్ చట్టాలను నీరుగార్చేందుకు, ఫ్యాక్టరీల్లో రోజువారీ పనిగంటల పెంపుదలకు, సెలవు దినాల తగ్గింపుకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు ట్రేడ్ యూనియన్లకు పిలుపునిస్తోంది.

12. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒ త్రయం ప్రబోధించినట్లు దేశం ఎదుర్కొంటున్న అన్ని ఆర్థిక రుగ్మతలకు ప్రైవేటీకరణే సర్వరోగ నివారిణిగా ప్రచారం చేయడాన్ని నేషనల్ అసెంబ్లీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ తీవ్రంగా ఖండిస్తోంది.

13. ఆర్థిక వ్యవస్థకు కల్గే ప్రమాదాలను లెక్కచేయక, భారత ప్రభుత్వం బాగా లాభాలార్జిస్తున్న, శక్తివంతమైన పిఎస్‌యులను కూడ అయిన కాడికి అమ్మేందుకు ఉత్సాహ పడ్తోంది. ప్రజాధనంతో, సుదీర్ఘ కాలం శ్రమించి నిర్మించుకున్న జాతీయ ఆస్తులే (ప్రజల ఆస్తులు) ఈ పిఎస్‌యులు. ఈ విలువైన జాతి సంపదను అత్యాశాపరులైన ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అప్పగించ చూస్తున్నారు. బలమైన, శక్తివంతమైన పునాదులు కల్గిన ప్రభుత్వ రంగ సంస్థలు లేకుండా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమించజాలదు. ప్రజల ప్రాథమిక సమస్యలకు పరిష్కారం లభించదు.

14. పిఎస్‌యులు ఆర్థిక పరంగా నష్టదాయకంగా వుండి, శాశ్వతంగా ప్రభుత్వ బడ్జెటు సహాయం మీద ఆధారపడి వున్నందువల్ల, వాటిని మూసివేయడమో లేదా ప్రైవేటీకరించడమో చేయాలన్న దుష్ప్రచారాన్ని ఎన్ఎడబ్ల్యు నిర్ద్వంద్వంగా ఖండిస్తోంది. ఈ ప్రచారానికి భిన్నంగా, పిఎస్‌యుల నికర లాభాలు పెరిగాయని, ఈక్విటీ మీద రాబడి పెరిగిందని, పెట్టుబడులు మెరుగయ్యాయని, చివరకు

ఈ సంస్థల మొత్తం వ్యాపారం కూడ విస్తరించిందని కూడ వెల్లడైంది. ప్రైవేటు కార్పొరేట్ కంపెనీలు రూ.62 వేల కోట్లు మేరకు పన్నులు ఎగకొట్టి దోషులుగా నిలిచాయి. అదే సమయంలో పిఎస్‌యులు ప్రభుత్వ ఖజానాకు రూ.4281 కోట్లు అదనంగా చేర్చాయి. విదేశీ మారక ద్రవ్య ఆదాయం కూడ పెరిగింది. ఈ నిర్లక్ష్యపూరిత పి.ఎస్.యు. వాటాల ఉపసంహరణ ప్రైవేటీకరణే. ఇది జాతి ప్రయోజనాలకు విద్రోహం తలపెట్టడం కాక వేరేమీ కాదు.

15. జాతీయ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం మూలాధారం. దేశంలో ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనే జనాభాలో 60% మందికి ఇదే ఉపాధి కల్పిస్తోంది. వ్యవసాయ రంగం అస్తవ్యస్తంగా వుంది. దౌర్జన్య పూరిత స్వభావం కల్గిన సరళీకరణ ఫలితంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులు తమకున్న కొద్దిపాటి రక్షణ కోల్పోయారు. అందువల్ల నిరుద్యోగం భారీ స్థాయిలో పెరిగి గ్రామీణ దారిద్ర్యానికి దారితీసింది. భారతప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలను ఉపసంహరిస్తుండగా, అభివృద్ధి చెందిన దేశాలు తమ దేశాల్లో వ్యవసాయానికి సబ్సిడీల పందేరం చేస్తున్నాయి. మన ప్రభుత్వం పరిమాణాత్మక ఆంక్షలనుపసంహరించడం వల్ల దిగుమతులు సులభమై గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు హానికలుగుతుంది. దేశాన్ని చౌకైన విదేశీ వ్యవసాయోత్పత్తులతో ముంచెత్తడం ద్వారా, భారతదేశ వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేయబూనుకున్నారు. రైతులు తీవ్ర దురవస్థలో వున్నారు. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్నాటక, చివరకు పంజాబులో కూడ రైతాంగం ఆత్మహత్యలు పరిస్థితి తీవ్రతకు సంకేతాలు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయడంలో జాప్యం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని ఎన్ఎడబ్ల్యు తీవ్రంగా ఖండిస్తోంది.

16. ప్రస్తుత ఆర్థిక విధానాలు ఇంతకు ముందెన్నడూ లేని విధంగా శ్రామికులకే గాక, దేశ ప్రయోజనాలకే తీవ్ర హాని కల్గిస్తాయని, ఆర్థిక పురోగతిని అడ్డుకుంటాయని, నిరుద్యోగాన్ని, పేదరికాన్ని సృష్టిస్తాయని, చివరికి ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయని, ఎన్ఎడబ్ల్యు భావిస్తోంది. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయి, అభివృద్ధికి వనరుల కొరత ఆటంకంగా నిలిచినప్పటికీ, అంతర్గత వనరుల సమీకరణ పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించడంలేదు. బ్యాంకింగ్ రంగంలో నిరర్ధక ఆస్తుల (పారుబకాయీలు) పెరుగుదలను, ధనికులు పన్నులు ఎగవేయడాన్ని, నల్లధనం పెంపుదలను ప్రభుత్వం అనుమతిస్తోంది. నూతన ఆర్థిక విధానం దేశానికి మరణశాసనం రాస్తోంది.

17. ఎన్ఎడబ్ల్యు ఈ క్రింది కనీస డిమాండ్లను ఆమోదించింది :

ఎ. లాభాలార్జిస్తున్న, శక్తివంతమైన పిఎస్‌యుల ప్రైవేటీకరణను ఆపివేయాలి.

బి. పారిశ్రామిక వివాదాల చట్టం, కాంట్రాక్టు లేబర్ (రెగ్యులేషన్ మరియు అబాలిషన్) చట్టంలో యాజమానులకు అనుకూలంగానూ, కార్మికవర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఏ విధమైన మార్పులు చేయరాదు.

సి. పరిశ్రమలు, వ్యవసాయం, మొత్తంగా దేశ ప్రయోజనాలకే భంగకరంగా వుండే విధంగా దిగుమతులపై ఉపసంహరించిన పరిమాణాత్మక ఆంక్షలు పునరుద్ధరించాలి.

డి. తీవ్ర నిరుద్యోగానికి, ఉద్యోగాల్లో కోతకు దారితీసే విధానాలకు స్వస్తి చెప్పాలి. దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనకు దోహదం చేసే విధానాలను, కార్యక్రమాలను రూపొందించాలి.

ఇ. నిరుద్యోగ బీమా పథకంతో సహా సామాజిక భద్రతా పథకాలను రూపొందించాలి.

ఎఫ్. వెంటనే వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసనం చేయాలి.

జి. అన్ని పరిమితులను తొలగించే విధంగా బోనసు చట్టాన్ని సవరించాలి.

హెచ్. పి.ఎఫ్. డిపాజిట్ల మీద 12% వడ్డీని పునరుద్ధరించాలి.

18. తన హక్కుల సాధనకు దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించడం భారత కార్మిక వర్గ కర్తవ్యమని ఎన్ఎడబ్ల్యు నమ్ముతోంది. ఈ అవగాహనతో ఈ క్రింది కార్యాచరణను ఆమోదించింది.

ఎ. ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటాలు సాగిస్తామని 19.8.2002న "ప్రతిజ్ఞా దినం" పాటించాలి. కార్మికవర్గ డిమాండ్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2002 ఆగస్టు 19 నుండి 24 వరకు ప్రచారం నిర్వహించాలి.

బి. జిల్లా స్థాయి సమీకరణలు.

సి. రాష్ట్ర స్థాయి జాయింట్ ర్యాలీలు.

డి. అన్ని రాష్ట్రాల్లో సామూహిక సత్యాగ్రహాలు

ఇ. 2003 బడ్జెట్ సమావేశాల 3వ రోజున పార్లమెంటుకు ప్రదర్శన.

## గుజరాత్ మారణహోమ బాధితులకు సహాయం

గుజరాత్‌లో మత మారణ హోమం జరిగిన తర్వాత, నరమేధ బాధితుల సహాయార్థం "గుజరాత్ సహాయ నిధి"కి విరాళాలివ్వవల్సిందిగా వివిధ ట్రేడ్ యూనియన్లు ఉద్యోగులకు పిలుపిచ్చాయి. వివిధ యూనియన్ల వివిధ రూపాల్లో బాధితులకు సహాయమందించాయి.

## అంతర్జాతీయ కార్యకలాపాలు, అంతర్జాతీయ సంబంధాలు

2000 మార్చి 25 నుండి 28 వరకు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (డబ్ల్యుఎఫ్‌టియు) 14వ ప్రపంచ మహాసభ జరిగింది. దీనికి

ముందుగా, తన ఆదేశాలను ధిక్కరించిన వివిధ దేశాల మీద అమెరికన్ సామ్రాజ్యవాదం విధించిన దిగ్బంధనం, ఆంక్షలకు వ్యతిరేకంగా సంఘీభావ సభ జరిగింది. ఎఐఎస్‌జిఇఎఫ్ తరపున కా॥ ఆర్.జి. కార్నిక్, అజయ్ ముఖోపాధ్యాయ్ మరియు ఎం.ఆర్. అప్పన్‌లు ఈ సభలో పాల్గొనగా, టియుఐ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీగా కా॥సుకోమల్ సేన్ పాల్గొన్నారు.

ఈ మహాసభకు ఎఐటియుసి ఆతిథ్యమివ్వగా, సిఐటియు, యుటియుసి వంటి వామపక్ష కేంద్ర కార్మిక సంఘాలతో పాటు సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్, ఆర్థిక రంగంలోని అసోసియేషన్లు, ఫెడరేషన్లు, కొన్ని ఇతర జాతీయ ఫెడరేషన్ల ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. ఆర్థికంగానూ, ఇతరత్రా నూ సిఐటియు గణనీయమైన పాత్ర నిర్వహించింది.

మానవజాతికి మెరుగైన జీవితాన్ని, మంచి భవిష్యత్తును నిర్మించాలని ప్రపంచ మహాసభ ఒక ప్రకటన నామోదించింది. భారతదేశంలో మొట్టమొదటి సారి జరిగిన డబ్ల్యుఎఫ్‌టియు ప్రపంచ మహాసభలో ఆమోదించిన ఈ ప్రకటనకు "న్యూఢిల్లీ మిలీనియం ప్రకటన"గా పేరు పెట్టడం జరిగింది. 51 దేశాల నుండి పెద్ద సంఖ్యలో పాల్గొన్న ట్రేడ్ యూనియన్ల నుండి మొత్తం 420 మంది ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. ఇతర దేశాల నుండి సుమారు 200 మంది ప్రతినిధులు పరిశీలకులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలకు వ్యతిరేకంగా 11.5.2000న ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు ఎన్‌పిఎంఒ పిలుపు ఇచ్చిన విషయాన్ని భారత ప్రతినిధులు మహాసభకు తెలిపారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక వంటి దక్షిణాశియా దేశాల్లోని ట్రేడ్ యూనియన్లు తమ తమ దేశాల్లో సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించాలని మహాసభ నిర్ణయించింది.

డబ్ల్యుఎఫ్‌టియు 14వ మహాసభ తర్వాత డబ్ల్యుఎఫ్‌టియు ప్రెసిడెన్షియల్ కౌన్సిల్ మొదటి సమావేశం 2000 అక్టోబర్ 28 నుండి 30 వరకు కువైట్‌లో జరిగింది. కువైట్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ఈ సమావేశానికి అతిథ్యం ఇచ్చింది. టియుఐ ప్రధాన కార్యదర్శిగా కా॥ సుకోమల్ సేన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. "ప్రజా సేవల మీద నయా ఉదారవాద ప్రపంచీకరణ ప్రభావం" అనే అంశం మీద టియుఐ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్, 2000 నవంబరు 3, 4 తేదీల్లో బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఆసియా, అరబ్ దేశాల సెమినార్‌ను నిర్వహించింది. ఐఎల్‌ఒ సహకారంతో నిర్వహించబడిన ఈ సెమినార్‌కు "బంగ్లాదేశ్ సర్కారీ కర్మచారీ సమన్వయ పరిషత్" ఆతిథ్యం ఇచ్చింది. ఎఐఎస్‌జిఇఎఫ్ ఛైర్మన్ కా॥ ఆర్.జి. కార్నిక్, గౌరవాధ్యక్షులు కా॥ఎం.ఆర్. అప్పన్‌ల నాయకత్వంలో ఎఐఎస్‌జిఇఎఫ్ ప్రతినిధివర్గం, టియుఐ ప్రధాన కార్యదర్శి కా॥ సుకోమల్ సేన్‌లు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. 2000 నవంబరు 10 నుండి 14 వరకు క్యూబా రాజధాని హవానాలో జరిగిన రెండవ ప్రపంచ సంఘీభావ సమావేశం 2001 సంవత్సరాన్ని "క్యూబా దిగ్బంధనం, క్యూబన్ అడ్జస్ట్‌మెంట్ చట్టం మరియు క్యూబా మీదగా సామ్రాజ్యవాదుల దాడులకు వ్యతిరేకంగా అంతర్జాతీయ సంఘీభావ సంవత్సరం"గా ప్రకటించింది. ఎఐఎస్‌జిఇఎఫ్

వైస్ ఛైర్మన్ కా॥ అజయ్ ముఖోపాధ్యాయ, పశ్చిమబెంగాల్ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ తరపున కా॥సుభాష్ గుప్తా, కేరళకు చెందిన ఎఫ్ఎస్ఇటిఒ (ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ -ఎఫ్ఎస్ఇటిఓ) నాయకులు కా॥ రషీద్ కనిచారి, కా॥ కె. వరదరాజన్‌లు పాల్గొనగా, అనేక ఇతర ట్రేడ్ యూనియన్లు తమ ప్రతినిధులను ఈ ప్రపంచ సంఘీభావ సమావేశానికి పంపాయి.

"ఆరోగ్యం ప్రాథమిక హక్కు"గా డిమాండ్ చేస్తూ మొదటి "ప్రపంచ ప్రజల ఆరోగ్య మహాసభ" బంగ్లాదేశ్‌లోని ఢాకాలో 2000 డిసెంబరు 4 నుండి 8 వరకు జరిగింది. వివిధ రంగాల నుండి హాజరైన 172 మంది భారత ప్రతినిధుల్లో ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు, వెస్ట్ బెంగాల్ స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ కి ఆనాటి జాయింట్ సెక్రటరీ, ప్రస్తుత అధ్యక్షులు కా॥ సుశీల్ బ్రహ్మ వున్నారు.

## 2003 మే 21న సార్వత్రిక సమ్మె

వరుసగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈ కాలం (2001-05) ప్రారంభంలో భారీ సార్వత్రిక సమ్మెలు జరిగాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్ల్యుటిఒ త్రయం ఆదేశిత నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐఎన్‌టియుసి, బిఎంఎస్ తప్ప మిగిలిన ట్రేడ్ యూనియన్ల సంయుక్త సమావేశం పిలుపు మేరకు 21.5.2003న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతంగా జరిగింది. ఈ కాలంలో ఎఐఎస్‌జిఇఎఫ్ నాయకత్వంలో జరిగిన సమ్మెలతో పాటు, రాష్ట్రాల్లో సమ్మెలతో సహా అనేక పెద్ద పోరాటాలు సాగాయి.

## తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మీద దాడి

కార్మిక వ్యతిరేక విధానాల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా ఎన్‌డిఎ మిత్రపక్షం ఆధ్వర్యంలోని తమిళనాడు ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరితో పాటు, ప్రపంచీకరణ యొక్క కార్మిక వ్యతిరేక సిద్ధాంతాని కనుగుణమైన అత్యున్నత న్యాయస్థానం తీర్పుకు, రాష్ట్ర ఉద్యోగులు బలయ్యారు. దీనితో లక్షలాది మంది తమిళనాడు రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు 2.7.2003 నుండి సమ్మెబాట పట్టవల్సి వచ్చింది. జయలలిత ప్రభుత్వం సమ్మె చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల మీద క్రూరంగా దాడి చేసింది. సమ్మె చేస్తున్న రెండు లక్షల మందిని పూర్తిగా తొలగించడం ద్వారా జయలలిత ప్రభుత్వం "నిరంకుశపాలనలో చరిత్రను సృష్టించింది. ఈ విధమైన భారీ నిరంకుశ అణచివేతను భారత ట్రేడ్ యూనియన్ పోరాట చరిత్రలోనేగాక, బహుశ ప్రపంచంలోనే ఎక్కడా చూసి వుండము. ఆ తర్వాత 2003 ఆగస్టులో ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె చట్టవిరుద్ధమని, సుప్రీంకోర్టు పచ్చి అభివృద్ధి నిరోధక తీర్పు నిచ్చింది. కాని వెంటనే ఆనాటి భారత అటార్నీ జనరల్‌తో సహా అనేక మంది న్యాయ శాస్త్ర కోవిదులు ఈ తీర్పును తీవ్రంగా విమర్శించారు.

2003 ఆగస్టు 17, 18 తేదీల్లో జైపూర్‌లో సమావేశమైన ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ కార్యవర్గం, ఈ దాడిని, ప్రధానంగా సర్వోన్నత న్యాయస్థానం తీర్పును కేవలం తమిళనాడు ప్రభుత్వోద్యోగుల మీద జరిగిన దాడిగా కాక, యావత్ ప్రభుత్వోద్యోగుల మీద దాడిగా పరిగణించి సమైక్యంగా ప్రతిఘటించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. సమ్మె చేస్తున్న తమిళనాడు ఉద్యోగుల మీద సాగుతున్న ఆటవిక అణచివేతకు వ్యతిరేకంగా ఒకరోజు దేశవ్యాపిత సమ్మె నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సన్నాహంగా ...

ఎ) కార్యాచరణను రూపొందించడానికి 2003 డిసెంబరు నెలలో ఢిల్లీలో జాతీయ సదస్సు నిర్వహించాలని.

బి) ఐఎల్ఓ కన్వెన్షన్ల (అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా అంగీకరించిన చట్టబద్ధ సాంప్రదాయాలు)ను, ప్రత్యేకంగా ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కుతో సహా పూర్తి ట్రేడ్ యూనియన్ హక్కులను కల్పించాల్సిందిగా అన్ని ప్రభుత్వాలను ఆదేశించే 151వ కన్వెన్షన్‌ను ఆమోదించాలని పార్లమెంటును కోరుతూ కేంద్ర ఉద్యోగులు ఇతర కార్మికులు, పౌరుల నుండి 5 కోట్ల సంతకాలు సేకరించి మహజరును పార్లమెంటుకు సమర్పించాలని.

సి) తమిళనాడులో కక్ష సాధింపు చర్యలకు గురైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహాయార్థం వెంటనే సంఘీభావ నిధి వసూలు చేయాలని జాతీయ సదస్సు నిర్ణయించింది.

ఆ తర్వాత సర్వోన్నత న్యాయస్థానం తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్రాల్లో జరిగిన భారీ సదస్సులో అనేక మంది న్యాయశాస్త్ర కోవిదులు, మాజీ న్యాయమూర్తులు ఈ అప్రజాస్వామిక తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రసంగించారు.

## సమ్మె హక్కు కోసం చారిత్రాత్మక సార్వత్రిక సమ్మె

ఎఐఎస్‌జిఇఎఫ్, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్‌ల ఆధ్వర్యంలో 25.9.2003న ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సు సమ్మె నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ మర్నాడే అంటే 26.9.2003న స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సు (ఎఐఎస్‌జిఇఎఫ్ కూడ పాల్గొన్నది.) పార్లమెంట్ బడ్జెటు సమావేశాల సమయంలో ఒక రోజు సమ్మె చేయాలని నిర్ణయించింది. ఎఐఎస్‌జిఇఎఫ్, సెంట్రల్ గవర్నమెంట్ ఎంపాయీస్ కాన్ఫెడరేషన్‌లు 11.2.2004న సమ్మె చేయాలని ముందుగా నిర్ణయించినప్పటికీ, ఐఎన్‌టియుసి, బిఎంఎస్ తప్ప మిగిలిన ట్రేడ్ యూనియన్లన్నీ కలిసి సర్వోన్నత న్యాయస్థానమిచ్చిన కార్మిక వ్యతిరేక తీర్పుకు వ్యతిరేకంగా 24.2.2004న దేశవ్యాప్త సమ్మెకు నిర్ణయించాయి.

24.2.2004న జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, అపూర్వమైన విధంగా విజయవంతమైంది. ఉగ్రవాద చర్యలతో తీవ్రంగా ప్రభావితమైన జమ్ముకాశ్మీర్‌లోని ఉద్యోగులు,

ఉపాధ్యాయులు కూడ భారీ సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్‌కు గత కొన్ని సంవత్సరాలుగా సంబంధాలు బలహీనంగా వున్నప్పటికీ, గుజరాత్‌లో పంచాయతీ స్థాయి నుండి సెక్రటేరియట్ స్థాయి వరకు సమ్మె సంపూర్ణంగా జరిగింది. సహజంగా సమ్మెల ప్రభావాన్ని తక్కువ చేసి చూపే అలవాటున్న ప్రసార సాధనలీ సారి ఆ విధంగా చేయలేక పోయాయి. సమ్మెలో 5 కోట్ల మంది పాల్గొన్నట్లు కొన్ని ప్రసారసాధనాలు పేర్కొన్నాయి. అసాధారణమైన రీతిలో ఎలక్ట్రానిక్ మీడియా సమ్మె వార్తలను పూర్తిగా ప్రసారం చేసింది. ఎవ్వరూ నిర్లక్ష్యం చేయడంగాని, తక్కువ చేసి చూపడానికి గాని అవకాశం లేని విధంగా సమ్మె విజయవంతమైంది. సుప్రీంకోర్టు ఇచ్చిన అత్యంత హానికరమైన తీర్పుకు సమ్మె ప్రత్యక్షంగా సవాలు విసిరింది.

పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి ప్రభుత్వోద్యోగులు, ఇన్సూరెన్స్ ఉద్యోగులు వివిధ తరగతుల ఉద్యోగులు, కార్మికులు, సాధారణ పౌరులతో సహా సుమారు 3 కోట్ల మంది నుండి పిటిషన్ మీద సంతకాలు సేకరించడం జరిగింది. వివిధ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఆఫీసుల నుండి వచ్చిన 50 వేల మందితో 10.12.2004న పార్లమెంటుకు ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఎఐఎస్‌జిఇఎఫ్, కేంద్ర ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పార్లమెంటు స్పీకర్‌ను కలిసి పిటిషన్ సమర్పించి, ప్రధాన మంత్రితో విషయం చేపట్టవల్సిందిగా కోరడం జరిగింది. స్పీకర్ అందుకు హామీ ఇచ్చారు.
దురదృష్టవశాత్తు వివిధ వివిధ జీవన స్రవంతులకు చెందిన ప్రముఖుల నుండి పెద్ద ఎత్తున నిరసనలు, భారీ సార్వత్రిక సమ్మె, 3 కోట్ల సంతకాలతో పార్లమెంటుకు పిటిషన్, ఐఎల్‌ఒకు టియుఐ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్ ఫిర్యాదు మీద ప్రభుత్వాన్ని ఐఎల్‌ఒ వివరణ కోరడం, పార్లమెంటులో వివిధ పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యుల ఆగ్రహ పూరిత చర్చలు – ఇన్ని జరిగినా ప్రభుత్వం మౌనం వీడలేదు. ఆ విధంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల మీద జయలలిత ప్రభుత్వ పాశవిక అణచివేత చర్యలు, సుప్రీంకోర్టు కార్మిక వ్యతిరేక తీర్పుకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన విస్తృత నిరసనలతో 2003వ సంవత్సరం ముగిసింది. ఫిబ్రవరి 24 చారిత్రాత్మక సార్వత్రిక సమ్మెతో ప్రారంభమైన 2004 సంవత్సరం, పార్లమెంటుకు బ్రహ్మాండమైన ప్రదర్శన, పార్లమెంటుకు పిటిషన్‌తో ముగిసింది. 2004 మేలో యుపిఎ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఆ సంవత్సరం చివరి వరకు వున్న సమయం బృహత్తర కార్మికవర్గ పోరాటాలమయం.

## సమ్మె హక్కుకు ఐఎల్ఒ సిఫార్సు

తమిళనాడు ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు, ఒక పిటిషన్ మీద విచారణ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ధృవీకరిస్తూ ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా టియుఐ ఆఫ్ పబ్లిక్ అండ్ అల్లైడ్ ఎంప్లాయీస్, ఐఎల్ఒకు చెందిన "కమిటీ ఆన్ ఫ్రీడమ్ ఆఫ్ అసోసియేషన్"కు ఫిర్యాదు చేసి, జోక్యం చేసుకోవాల్సిందిగా కోరింది. ఉద్యోగుల సమ్మె

హక్కును ధృవీకరిస్తూ అణచివేత చర్యలను ఉపసంహరించుకోవాల్సిందిగా ఐఎల్ఒ ప్రభుత్వాన్ని కోరింది. ఐఎల్ఒ సిఫార్సులీ క్రింది విధంగా వున్నాయి :

భారతదేశంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సమ్మె హక్కుతో సహా ట్రేడ్ యూనియన్ హక్కులను కల్పించే ఐఎల్ఓ సిఫార్సుల్లోన భాగం ఈ విధంగా వుంది. ప్రభుత్వ నిరంకుశ, అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా ఎఐఎస్‌జిఇఎఫ్ చేసిన ఫిర్యాదు మీద తుది నిర్ధారణలు : ఈ క్రింది విధంగా వున్నాయి.

## కమిటీ సిఫార్సులు (2005 నవంబరు)

ఎ. ఎంతో సమయం గడిచినప్పటికీ ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలకు ప్రభుత్వం జవాబివ్వలేదు. భవిష్యత్‌లో మరింత సహకార మందించవల్సిందిగా ప్రభుత్వాన్ని కమిటీ గట్టిగా కోరుతోంది.

బి. రాష్ట్ర పాలనా వ్యవహారాల్లో వున్న వారు తప్ప మిగిలిన ప్రభుత్వోద్యోగులకు సమిష్టి సంప్రదింపుల హక్కు వుంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన నియమ నిబంధనలకు గురించి తలెత్తిన వివాదాలను సమిష్టి సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. తమిళనాడులో ఈ సూత్రాన్ని అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తక్షణం చేపట్టవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతోంది.

సి. రాష్ట్ర ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో వున్నవారు తప్ప మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సమ్మె హక్కు వర్తింప చేసేందుకు వీలుగా తమిళనాడు గవర్నమెంటు సర్వెంట్స్ కాండక్ట్ రూల్స్ మరియు తమిళనాడు ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ చట్టాలను సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతోంది.

డి. భవిష్యత్‌లో సమ్మెల వల్ల ప్రజా జీవనానికి (ఆతిలీజిరిబీ శిజీఖిలిజీ) ఏర్పడిన ప్రమాదాని కనుగుణంగా మాత్రమే పోలీసుల జోక్యం వుండే విధంగా అవసరమైన ఆదేశాలు ఇవ్వవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతుంది.

ఇ. భారీ స్థాయిలో అరెస్టులు, ఉద్యోగాల నుండి తొలగింపుల ద్వారా సంఘ స్వేచ్ఛకు విఘాతం కలిగే ప్రమాదాలను నివారించేందుకు పోలీసులకు, సాధికార వర్గానికి తగిన ఆ దేశాలివ్వవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతోంది.

ఎఫ్. చట్టబద్ధమైన ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు ఉద్యోగులకు కల్గిన నష్టాన్ని భర్తీ చేసే ఉద్దేశ్యంతో, సంబంధిత ట్రేడ్ యూనియన్లతో సంప్రదించి, సమ్మె మూలంగా విధుల నుండి తొలగించబడిన కాలానికి జరిగిన నష్టానికి పరిహారం యిచ్చే విషయం సమీక్షించవల్సిందిగానూ, ఈ విషయమై జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతోంది.

జి. సమ్మెలో పాల్గొన్న కారణంగా గుర్తింపు ఉపసంహరించబడ్డ ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల గుర్తింపును పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

హెచ్. తమిళనాడు సెక్రటేరియట్ అసోసియేషన్ ఆఫీసు భవనాన్ని వెంటనే వారికి అప్పచెప్పవల్సిందిగానూ, ఈ విషయమై తీసుకున్న చర్యల గురించి ఎప్పటికప్పుడు తమకు తెలియజేయ వల్సిందిగానూ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

ఐ. ప్రాణాలు కోల్పోయిన 42 మంది ఉద్యోగుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా కోరుతూ వచ్చిన ఫిర్యాదు మీద తమ వ్యాఖ్యలు తెలియజేయవల్సిందిగా కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది.

జె. పటిష్టమైన, సుదీర్ఘ కాలం నిలిచే కార్మిక సంబంధాలను నెలకొల్పేందుకు, ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయుల సర్వీస్ కండిషన్ల విషయంలో అపరిష్కృతంగా వున్న సమస్యల మీద సమగ్రమైన సంప్రదింపులు ప్రారంభించవల్సిందిగా కమిటీ ప్రభుత్వాన్ని కోరుతోంది. ఈ విషయమై పురోగతిని ఎప్పటికప్పుడు తెల్పవల్సిందిగా కోరింది.

ఇది ఎఐఎస్‌జిఇఎఫ్‌కు, యావత్ భారత కార్మిక వర్గానికి ఘన విజయం. దురదృష్టవశాత్తు, భారత ప్రభుత్వం ఐఎల్‌ఓ సిఫార్సులను అలక్ష్యం చేసి, ఉద్యోగులకీ ప్రాథమిక హక్కులను కల్పించకుండా మౌనం వహించింది. అందువల్ల ఈ పోరాటం వివిధ రూపాల్లో కొనసాగించాలి.

## యుపిఎ ప్రభుత్వ ఏర్పాటు, నూతన పరిస్థితి

ఈ సమయంలోనే "భారతదేశం వెలిగిపోతోంది", "ఆర్థిక వ్యవస్థ విజృంభిస్తోంది" అని గొప్పలు చెప్పుకుని, ప్రజల నుండి పెద్ద ఎత్తున మద్దతునాశించి ఎన్‌డిఎ ప్రభుత్వం రాజీనామా చేసి, మధ్యంతర ఎన్నికలకు రాష్ట్రపతిని కోరింది. తమ బ్రహ్మాండమైన పనితీరుకు ప్రజల నుండి మరింత ఎక్కువ మద్దతు లభిస్తుందని గొప్పలు చెప్పుకుని ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ చంద్రబాబునాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం కూడా రాజీనామా చేసి మధ్యంతర ఎన్నికలను కోరుకుంది. బిజెపి అధికారంలో వున్న కర్నాటకలో కూడా మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్, కర్నాటకల్లో అధికారంలో వున్న ప్రభుత్వాలు ఓడిపోయాయి. కేంద్రంలో బిజెపి దాని మిత్రపక్షాలు ఓడిపోయి, వారి ఆశలు అడియాసలయ్యాయి. వారి "భారత్ వెలిగిపోతోంది" అనే వారి ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్, టిఆర్ఎస్‌లు, కర్నాటకలో కాంగ్రెస్, జనతాదళ్ (సెక్యులర్) పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాల నేర్పరచాయి. ఆరేండ్ల పాటు దేశాన్ని పాలించిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ స్థానంలో మన్మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిగా భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ (యుపిఎ) ప్రభుత్వం 2004 మే మొదటి

వారంలో ఏర్పాటైంది. యుపిఎ కూటమికి మెజారిటీ లేకపోవడంతో, ప్రభుత్వంలో పాల్గొనడానికి ఇష్టపడని 61 మంది లోక్‌సభ సభ్యులు కల్గిన వామపక్షాలు, కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) ప్రాతిపదికన, యుపిఎకు బయటి నుండి మద్దతిచ్చేందుకు అంగీకరించాయి. అందువల్ల యుపిఎ ప్రభుత్వ మనుగడ వామపక్షాల మీద ఆధారపడి వుంది.

## యుపిఎ ప్రభుత్వ విధానాలు - ఒక విశ్లేషణ

ఎ) భారతదేశంలోని వామపక్షాలు దేశంలోని కార్మికులు, ఉద్యోగులు, రైతాంగం, ఇతర తరగతుల పేద ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్నాయి. లౌకికవిలువలు, దేశ సమైక్యత, సమగ్రతల పరిరక్షణకు, ప్రపంచీకరణ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు ఛాంపియన్లుగా నిలిచాయి.

బి) 14వ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వాన్ని ప్రజలు దింపివేయడం, భారత చరిత్రలో ఒక ప్రాధాన్యత గల్గిన సంఘటన. ఆరు సంవత్సరాల ఎన్‌డిఎ పాలనా కాలంలో విద్వేషపూరిత మతమారణకాండ, అన్ని విధాలైన మతపరమైన, సామాజిక పరమైన అభివృద్ధి నిరోధక చర్యలు కొనసాగాయి. ఆ ప్రభుత్వం పూర్తిగా పేదల వ్యతిరేక, సంపన్నుల అనుకూల ఆర్థిక విధానాలననుసరించింది. ఈ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదం, ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒ ఒత్తిడికి తలవంచి అనుసరించిన విధానాలు సామాన్య ప్రజలను వినాశనపుటంచులకు చేర్చగా, సమాజంలోని ఉన్నత వర్గాలకు చెందిన సంపన్నులకు ఆనందం చేకూర్చింది. కాని ఈ విధానాలు దేశ ఆర్థిక, రాజకీయ సార్వభౌమత్వానికి ముప్పుతెచ్చాయి.

సి) ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒల విషమ షరతుల మేరకు పేదల వ్యతిరేక విధానాలకు శ్రీ నరసింహరావు ప్రభుత్వ హయాంలో 1991లోనే శ్రీకారం చుట్టింది. నేడు యుపిఎకు నాయకత్వం వహిస్తున్న భారత జాతీయ కాంగ్రెస్సేననేది కఠోర సత్యం. ఆనాటి నుండే ఆ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులతో సహా కార్మికవర్గం అనేక సార్వత్రిక సమ్మెలను నిర్వహించింది.

డి) నూతన ప్రభుత్వం అదే కాంగ్రెస్ నాయకత్వంలో వుంది. కనుక కార్మికులు, ఉద్యోగులు మరియు పేదలు తమ భవిష్యత్తు గురించి ఏమాత్రం భరోసాతో వుండలేదు. అయితే ప్రభుత్వం వామపక్షాల మీద ఆధారపడి వుండడం, పీడిత, తాడిత ప్రజలకు కొంత వూరట, నమ్మకం కల్గించే విషయం.

ఇ) ప్రైవేటీకరణ, వాటాల ఉపసంహరణ, కార్మికుల "నియామకాలు, తొలగింపులకు యజమానులకు స్వేచ్ఛ"నిచ్చే విధానానికి స్వస్తి చెప్పవల్సిందిగా వామపక్షాలు మొదటి నుండి ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండు చేస్తున్నాయి. వామపక్షాలతో చర్చల అనంతరం కనీస ఉమ్మడి కార్యక్రమం (సిఎంపి) మీద ఏకాభిప్రాయం సాధించిన ప్రభుత్వం సిఎంపి పరిధిలోనే పని చేస్తానని హామీ ఇచ్చింది.

ఎఫ్). అనేక అంశాల్లో అస్పష్టత వున్నప్పటికీ, వామపక్ష ట్రేడ్ యూనియన్లు మొత్తం మీద సిఎంపిని ఆమోదించాయి. ప్రభుత్వపని తీరుమీద ట్రేడ్ యూనియన్లు నిఘావేసి, సిఎంపి నుండి వైదొలగడంగాని, దానిని నీరుగార్చేందుకు గాని ప్రయత్నాలు జరిగినప్పుడల్లా శక్తివంతంగా ప్రతిఘటిస్తున్నాయి.

జి) ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించినంత వరకు ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఉద్యోగాల్లో కోతలను ఆపివేయడం, రిక్రూట్‌మెంట్ మీద నిషేధాన్ని ఉపసంహరించడం అనేవి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. రాష్ట్ర ఉద్యోగులు, ఆర్థిక రంగంలోని ఉద్యోగులకు గత కొన్నేండ్లుగా డి.ఎ. బకాయిలు, పెన్షనరీ బెనిఫిట్లలో కోత, ఇతర ఆర్థిక బెనిఫిట్లను చెల్లించకపోవడం వంటి వివిధ రూపాల్లో మొత్తం జీతాల విలువ తీవ్రంగా హరించుకు పోతోంది. నూతన ప్రభుత్వం ఈ విధంగా కార్మికులు, ఉద్యోగులకు జరుగుతున్న నష్టాలనసలు పట్టించుకోవడం లేదు. ఆదాయం పన్ను చెల్లింపునకు గరిష్ట ఆదాయ పరిమితి పెంపు, పి.ఎఫ్. లోనూ పోస్టాఫీసుల్లోనూ, బ్యాంకుల్లోనూ చిన్న మొత్తాలమీద వడ్డీ పెంపుదల వంటి అంశాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది.

హెచ్) సమ్మె హక్కు కోసం ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర తరగతుల కార్మికవర్గం 24.2.2004న. దేశ చరిత్రలోనే అత్యంత పెద్ద సమ్మె నిర్వహించినప్పటికీ, 2004 మే నెలలో అధికారంలోకి వచ్చిన యుపిఏ ప్రభుత్వం తన సిఎమ్‌పిలో సమ్మె హక్కు విషయమై ఏ విధమైన హామీ ఇవ్వలేదు. ఐఎల్ఒ కార్మిక ప్రమాణాల ప్రకారం ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కుతో సహా ట్రేడ్ యూనియన్ హక్కులను గ్యారంటీ చేయాలి. నూతన ప్రభుత్వం ఈ తక్షణ సమస్యల మీద వెంటనే దృష్టి పెట్టాలి. కోట్లాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన విషయం ఇక ఏమాత్రం ఆలస్యం చేయరాదు. అయితే దీనికి పూర్తి భిన్నంగా లాభాలార్జిస్తున్న పిఎస్‌యుల వాటాల ఉపసంహరణకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.

ఐ) ఈ అత్యవసర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడ్తుందని కార్మికవర్గం, ప్రభుత్వోద్యోగులు మరియు మొత్తం శ్రామిక ప్రజలు ఆశగా ఎదురుచూచారు. కాని పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా వుంది.

**ఆర్థిక విధానాలు**

యుపిఎ ప్రభుత్వం గత ఎన్‌డిఎ ప్రభుత్వ ఆర్థిక విధానాలనే అనుసరిస్తోంది. పైపెచ్చు వీటిని మరింతగా ప్రజలకు వ్యతిరేకంగా పదును పెడ్తోంది. విద్యార్థి రంగానికి సంబంధించి పాఠ్య ప్రణాళికల్లో మతతత్వ పోకడలను కొంతమేరకు సరిదిద్దడం జరిగింది. అయితే లాభాలార్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రభుత్వోద్యోగుల పెన్షన్ నిధుల ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల హరింపుతో పాటు విదేశాంగ విధానాలకు సంబంధించినంత

వరకు యుపిఎ ప్రభుత్వం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, డబ్ల్యుటిఒల ఆదేశాలను తు.చ. తప్పకుండా అనుసరిస్తోంది. యుపిఎ ప్రభుత్వం వాటాల ఉపసంహరణ శాఖను రద్దు చేసినప్పటికీ, బిహెచ్ఇఎల్లో వాటాల ఉపసంహరణ, ఇతర పిఎస్యుల ప్రైవేటీకరణ యత్నాలు, చివరకు నాణేలు ముద్రించే ముద్రణాలయం కార్పొరేటీకరణ, ముంబయి, ఢిల్లీ విమానాశ్రయాల ప్రైవేటీకరణ యత్నాలతో పాటు, రిటైల్ వ్యాపారంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్డిఐ)లను ఆహ్వానించేందుకు ప్రభుత్వం పూనుకుంది. ఈ విధంగా మొదట్లో తాను చేసిన ప్రకటనలను ప్రక్కన పెట్టి, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒల ఆదేశాలను గ్రుడ్డిగా అనుసరిస్తోంది. డబ్ల్యుటిఒకు సంబంధించి, 2003లో కాంకన్ (మెక్సికో)లో జరిగిన సమావేశంలో సామ్రాజ్యవాద దేశాల ఒత్తిళ్ళను ఐక్యంగా ప్రతిఘటించిన భారతదేశం, 2004లో జెనీవాలో ఫ్రేమ్ వర్క్ అగ్రిమెంట్లు రూపొందించే నాటికి చప్పగా జారిపోయింది. 2005 డిసెంబర్ 13,14 తేదీల్లో హాంకాంగ్లో జరిగే తదుపరి సమావేశంలో భారతదేశం అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాల ఒత్తిడికి ఏమేరకు లొంగుతుందో చూడవల్సి వుంది. డబ్ల్యుటిఒకు సంబంధించి కాంకన్ సమావేశంలో తీసుకున్న వైఖరిని నీరుగార్చరాదని, దాని నుండి వెనుదిరగ రాదని, ఇప్పటికే ట్రేడ్ యూనియన్లు, వామపక్షాలు ప్రభుత్వం మీద ఒత్తిడిని పెంచుతున్నాయి.

## కార్మిక సమస్యలు

కార్మికహక్కుల విషయానికి సంబంధించి, యుపిఎ ప్రభుత్వం ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కు నిరాకరించింది. చిన్న మధ్య తరగతి పరిశ్రమలతో సహా సంఘటిత రంగంలోని 80% మందికి సంఘస్వేచ్ఛ, సమ్మె హక్కులు తిరస్కరిస్తూ పార్లమెంటులో రెండు బిల్లులు ప్రవేశపెట్టారు. రెగ్యులర్ ఉద్యోగ ఖాళీలను కాంట్రాక్టు కార్మికులతో నింపుతున్నారు. దీనికి తోడు అమెరికాకు చెందిన "మెకిన్సీ క్వార్టర్లీ" అనే వాణిజ్య పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ, కార్మిక విధానానికి సంబంధించి తాను "నియామకాలు, తొలగింపులకు సంబంధించి యాజమానులకు పూర్తి స్వేచ్ఛ' కల్పించే విధానంతో పాటు, "ప్రభుత్వరంగ సంస్థల పూర్తి ప్రైవేటీకరణ" చేపట్టదల్చానని, తన ప్రభుత్వం యొక్క సంకీర్ణ స్వభావం రీత్యా తనకు ఆటంకాలేర్పడుతున్నాయని, మన ప్రధాన మంత్రి మన్మోహన్సింగ్ ఆక్రోశించారు. వీటన్నింటిని పరిశీలిస్తే ప్రపంచ పెట్టుబడిదారీ విధానం యొక్క "ట్రేడ్ యూనియన్ రహిత ప్రపంచం" అనే విధానానికి యుపిఎ ప్రభుత్వం లొంగిపోయినట్లు స్పష్టమవుతుంది. అందువల్లనే యుపిఎ ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కు నిరాకరిస్తోంది. గౌరవనీయులైన లోక్సభ స్పీకర్కు, సమ్మె హక్కును గురించి పార్లమెంటులో లేవనెత్తిన పార్లమెంటు సభ్యులకు, యుపిఎ కార్మిక మంత్రి లేఖ వ్రాస్తూ, సమ్మె హక్కును అంగీకరించడం గానీ, ప్రభుత్వోద్యోగులకు ట్రేడ్ యూనియన్ హక్కులను కల్పించే ఐఎల్ఒ కన్వెన్షన్ను ఆమోదించడం గాని, తమ ప్రభుత్వానికి సాధ్యం కాదని నిస్సిగ్గుగా ప్రకటించారు. ఇది యుపిఎ ప్రభుత్వ అపఖ్యాతికరమైన కార్మిక వ్యతిరేక వైఖరిని స్పష్టం చేస్తుంది.

ఎ) యుపిఎ ప్రభుత్వ వైఖరి, పనితీరు పూర్తిగా ఎన్‌డిఎ ప్రభుత్వం వలెనే వున్నాయనేది ఈ విమర్శనాత్మక చర్చకు అర్థం కాదు. సిఎంపి వామపక్ష కార్యక్రమం లేదా ట్రేడ్ యూనియన్ కార్యక్రమం కాదు. వామపక్షాలు, ట్రేడ్ యూనియన్ల కొన్ని అభిప్రాయాలను అంగీకరించి సిఎంపిని రూపొందించడం జరిగింది. సిఎంపి పరిధిలో విధానాల అమలుకు కూడ వామపక్షాలు, ట్రేడ్ యూనియన్లు ప్రభుత్వం మీద నిరంతరం ఒత్తిడి తేవడం జరుగుతోంది. సిఎంపి ఒక పెట్టుబడిదారీ ప్రభుత్వ కార్యక్రమమైనప్పటికీ, యుపిఎ ప్రభుత్వం తన మనుగడ కోసం వామపక్షాల మీద ఆధారపడివుంది. వామపక్షాలు ఈ కార్యక్రమాన్ని స్థూలంగా ఆమోదించాయి. అందువల్ల ఆ కార్యక్రమం సరిగా అమలు జరిగితే కార్మికవర్గానికి, పేదలకు ప్రయోజనకరంగా వుంటుంది. ఉదాహరణకు గ్రామీణ పేదలకు సిఎంపి ఉపాధి హామీ పథకాన్ని వాగ్దానం చేసింది. చాలా కాలయాపన తర్వాత, వామపక్షాల ఒత్తిడితో ప్రభుత్వం రూపొందించిన బిల్లు మిక్కిలి లోపభూయిష్టంగా వుంది. వామపక్షాలతో సుదీర్ఘ చర్చలు, వారి నిరంతర ఒత్తిడి ఫలితంగా గ్రామీణ పేదలకు కొంత మేరకైనా ఉపశమనం కల్గించే ఈ బిల్లు చట్టమైంది. సిఎంపిని అతిక్రమించి, ప్రభుత్వం బాగా లాభాలార్జిస్తూ, "నవరత్న" కంపెనీగా వర్గీకరించబడిన ప్రభుత్వరంగ బిహెచ్ఇఎల్ వాటాలను ఉపసంహరించాలని నిర్ణయించింది. వామపక్షాలు, ట్రేడ్ యూనియన్లు "నవరత్నాల"లో వాటాల ఉపసంహరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందువల్ల యుపిఎ, వామపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ప్రతిష్ఠంభన సుదీర్ఘ కాలం కొనసాగింది. వామపక్షాలు, ట్రేడ్ యూనియన్ల తీవ్ర ఒత్తిడి ఫలితంగా ప్రభుత్వం చివరకు దిగివచ్చి, బిహెచ్ఇఎల్‌లో వాటాల ఉపసంహరణ నిర్ణయాన్ని ప్రక్కన పెట్టింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాన్ని (సిజిహెచ్ఎస్) ప్రైవేటీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల మీద తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది.

## పెన్షన్ ప్రైవేటీకరణ బిల్లు

వామపక్షాలు, ట్రేడ్ యూనియన్లు ప్రత్యేకంగా ఎఐఎస్‌జిఇఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల పెన్షన్ ప్రైవేటీకరణ బిల్లును ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టలేకపోయింది. పెన్షన్ ప్రైవేటీకరణ విషయమై ఎన్‌డిఎ ప్రభుత్వం భట్టాచార్య కమిషన్‌ను నియమించడంతో, పెన్షన్ ప్రైవేటీకరణ బిల్లుకు అంకురార్పణ జరిగింది. ప్రస్తుత ఉద్యోగులను పెన్షన్ స్కీమ్ నుండి తొలగించడం పెన్షన్ ప్రైవేటీకరణ ముఖ్య ఉద్దేశ్యంగా, కమిషన్ సిఫార్సు చేయాల్సిన అంశాల్లో పేర్కొనడం జరిగింది. 1.1.2004 నుండి క్రొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారికి ప్రైవేటీకరించ బడిన పెన్షన్ స్కీమును వర్తింప చేయాలని ఎన్‌డిఎ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడ ఇదే విధమైన ఆదేశాలిచ్చాయి. ఈ పెన్షన్ బిల్లుమీద ప్రభుత్వానికి వామపక్షాలకు మధ్య పెనుగులాట సాగింది. ఎఐఎస్‌జిఇఎఫ్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. బిల్లు ముసాయిదాను కేంద్ర మంత్రి మండలి ఆమోదించింది. 2005 నవంబరు – డిసెంబరుల్లో జరిగే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిల్లును ఆమోదింప జేసుకునే ఉద్దేశ్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో బిల్లుకు తగిన మెజార్టీ సభ్యుల

మద్దతు లేకపోవడంతో ప్రభుత్వం ఈ ప్రయత్నంలో విఫలమైంది. ఈ స్కీమ్ క్రింద నిర్బంధంగా ఉద్యోగుల నుండి వసూలు చేసిన సొమ్మును ప్రైవేటు కంపెనీల్లో జమచేసి, ఆ కంపెనీల్లో 26% ఎఫ్‌డిఐని అనుమతించాలని బిల్లు నిర్దేశిస్తోంది. తీవ్రమైన ఈ అంశాన్ని ఎఐఎస్‌జిఇఎఫ్ గట్టిగా వ్యతిరేకించింది. దుర్మార్గమైన ఈ పెన్షన్ ప్రైవేటీకరణ స్కీముకు ప్రతిఘటనగా 25.9.2005న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర పిఎస్‌యుల కార్మికులు దేశ వ్యాప్త సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు మద్దతు తెల్పుతూ డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి శుభాకాంక్షలందజేశారు. పెన్షన్ ప్రైవేటీకరణ బిల్లు విషయమై ప్రభుత్వం ముందుకు సాగకుండా ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో పోరాటం కొనసాగింది.

బి) విదేశాంగ విధానం విషయంలో ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదం ఒత్తిడికి లొంగుతోంది. భారత రక్షణ మంత్రి తన అమెరికా పర్యటనలో వుండగానే భారత రక్షణ వ్యవస్థను అమెరికా రక్షణ వ్యవస్థకు తోకగా చేసే విధంగా వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందానికి అంగీకరించారు. ఆ తర్వాత ప్రధాన మంత్రి తన అమెరికా పర్యటన సందర్భంగా దానిని ధృవీకరించారు. అమెరికా సాయుధ దళాలతో సంయుక్త సైనిక విన్యాసాలకు అంగీకరించి, పశ్చిమ బెంగాల్‌లోని కలైకుండా వైమానిక స్థావరం వద్ద అమెరికా, భారత వైమానిక దళాలు సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి. ఇరాన్ పరమాణు కార్యక్రమం గురించి 2005 సెప్టెంబరులో అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) సమావేశంలో భారత్, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసింది. ఆర్థిక ఆంక్షలు విధించేందుకు అధికారాలున్న యుఎన్ భద్రతా మండలికి ఈ విషయాన్ని నివేదించేందుకు భారత ప్రభుత్వం అమెరికాకు సహకరించింది. సామ్రాజ్యవాదానికి, ప్రత్యేకంగా అమెరికా సామ్రాజ్యవాదానికి, యుపిఎ ప్రభుత్వం లొంగిపోతోందనేందుకివి ప్రబల తార్కాణాలు. ఇరాన్ నుండి పాకిస్తాన్ మీదుగా భారతదేశానికి గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం గురించి భారత ప్రభుత్వం సంప్రదింపులు సాగిస్తున్న సమయంలోనే, యుపిఎ ప్రభుత్వం ఈ లొంగుబాటు చర్యకు పాల్పడడం గమనించాలి. ఈ పైప్‌లైన్ నిర్మాణం అమెరికా సామ్రాజ్యవాదుల కిష్టం లేదు. యుపిఎ ప్రభుత్వం ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా, భారత ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే ఈ స్కీమ్ కార్యరూపం దాల్చేందుకున్న అవకాశాలను చాలా వరకు దెబ్బతీసింది. వామపక్షాల తీవ్ర ఒత్తిడి వల్ల వియన్నాలో 24.11.2005న ఈ విషయమై జరుగనున్న తర్వాత దఫా చర్చల్లో, ఇరాన్ వ్యతిరేక తీర్మానం మీద ఓటింగును నివారించి, ఐఎఇఎ పరిధిలో సమస్యను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని, యుపిఎ ప్రభుత్వం అనధికారికంగా అంగీకరించింది. భారత్–అమెరికా అణుఒప్పందం మీద సంతకాలు జరిగి, వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకునే వరకు ఇదే వైఖరి కొనసాగింది.

## సమ్మె హక్కు కోరుతూ, పెన్షన్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జాతీయ సదస్సు

2005 సెప్టెంబరు దేశవ్యాప్త సమ్మెకు ముందు 8.7.2005న ఎఐఎస్‌జిఇఎఫ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ మరియు ఉపాధ్యాయ

సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆడిటోరియమ్‌లో జాతీయ సదస్సు జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్న సుమారు 400 మంది ప్రతినిధుల్లో, 19 రాష్ట్రాల్లోని 21 సంఘాలకు చెందిన 235 మంది ఎఐఎస్‌జిఇఎఫ్ ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వోద్యోగ సంఘాల ప్రతినిధులు 130 మంది, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు 15 మంది వున్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్‌కు చెందిన కా॥ ఆర్.జి. కార్మిక్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్‌కు చెందిన కా॥ సిసి. పిళ్ళై, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ అండ్ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్‌యుసిటిఓ)కు చెందిన ప్రొఫెసర్ బి.కె. తివారీల అధ్యక్షతన జరిగిన జాతీయ సదస్సు ఈ క్రింది ప్రకటన ఆమోదించింది.

ఎ) దేశంలోని కార్మికులు, ఉద్యోగులు, గ్రామీణ పేదల యెడల యుపిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న హానికర విధానాల పట్ల ఢిల్లీలో జరిగిన కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయుల జాతీయ సదస్సు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

బి) ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కు నిరాకరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా 24.2.2004న దేశ కార్మికవర్గం చరిత్రలోనే అతిపెద్ద సమ్మె నిర్వహించినప్పటికి, ఉద్యోగులకు సమ్మె హక్కు కల్పిస్తూ నిర్దిష్ట చర్యలు తీసుకోవల్సిందిగా కోరుతూ అసాధారణమైన విధంగా 4 కోట్ల సంతకాలతో భారీ విజ్ఞాపన పత్రాన్ని 2004 డిశంబరు 7న పార్లమెంటుకు సమర్పించినప్పటికీ, ఈ డిమాండు కనుకూలంగా పెద్ద ఎత్తున ప్రజాభిప్రాయం వెల్లడైనప్పటికీ, ఉద్యోగుల ప్రాథమిక హక్కుకు సంబంధించిన అత్యంత న్యాయసమ్మతమైన ఈ డిమాండు పట్ల భారత ప్రభుత్వం మిక్కిలి ప్రగతి నిరోధక వైఖరి నవలంభించడం పట్ల సదస్సు తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది.

సి) పార్లమెంటు సభ్యులీ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తినప్పుడు, గౌరవనీయులైన లోక్‌సభ స్పీకర్ ఆదేశం మేరకు కార్మిక మంత్రి సమధానమిస్తూ, ప్రభుత్వోద్యోగులకు పూర్తి రక్షణలున్నాయని వారికి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు ఎన్నో అవకాశాలున్నందున. వారికి సమ్మె హక్కు అవసరం లేదని పరిహాసాస్పదమైన వ్యాఖ్యలు చేసి, కార్మిక మంత్రి ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కు నిరాకరించారు. భారతదేశ పరిస్థితుల్లో ఐఎల్ఒకు సంబంధించిన 87, 98, 151, 154 కన్వెన్షన్లను ఆమోదించడం సాధ్యం కాదని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

డి) ఇంత క్లిష్టమైన పరిస్థితుల నెదుర్కొంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సమ్మె హక్కు కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం తప్ప గత్యంతరం లేదు.

ఇ) సుదీర్ఘ కాలంగా ప్రభుత్వోద్యోగులకు, ఉపాధ్యాయులకు వర్తింపజేస్తున్న చట్టబద్ధమైన పెన్షన్ స్కీమ్‌ను ప్రైవేటీకరిస్తూ ప్రభుత్వం ఇదే సమయంలో ఆర్డినెన్స్‌జారీ చేసింది.

తద్వారా వారి మీద క్రూరమైన ఆర్థిక దాడికి పూనుకుంది. ఉద్యోగులకు మిక్కిలి ప్రధానమైన సాంఘిక సంక్షేమ సదుపాయమైన పెన్షన్, ఉద్యోగి మరణం తర్వాత వారి కుటుంబ సభ్యులకు వర్తించే కుటుంబ పెన్షన్‌ను హరించివేసే ఉద్దేశంతో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులకత్యంత విధేయతతో, వారి ఆదేశాల మేరకే వినాశకర పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును రూపొందించారు. ఈ బిల్లు ముసాయిదా మీద పార్లమెంటులో చర్చ జరుగుతోంది.

ఎఫ్) కొత్తగా సర్వీసులో చేరిన వారికి భారత ప్రభుత్వం తన ఆదేశాల ద్వారా ప్రైవేటీకరించిన పెన్షన్ స్కీమును 1.1.2004 నుండే ప్రవేశపెట్టింది. 7 రాష్ట్రాల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకీ స్కీమ్‌ను వర్తింప జేయడం జరిగింది. ఇది రిటైరైన వారికే గాక, సర్వీసులో వున్నవారికి కూడ హాని కల్గిస్తుంది. రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగులు చాలా కాలం జీవిస్తుండడం వల్ల పెరిగే పెన్షన్ భారాన్ని భరించడం కష్టంగా వుందని ప్రభుత్వం వాదిస్తోంది. అంటే ప్రభుత్వం ప్రస్తుతం పెన్షనర్లకు చెల్లిస్తున్న పెన్షన్‌ను, కార్మికులకు భవిష్యత్తులో చెల్లించాల్సిన పెన్షన్‌ను ఆపివేయడం ద్వారా ప్రభుత్వం చెప్పుకుంటున్నట్లు నానాటికి పెరుగుతున్న పెన్షన్ భారం సమస్యను పరిష్కరించ బూనుకుంది. ప్రభుత్వం క్రొత్త ఉద్యోగులతో ప్రారంభించి, క్రమంగా అందరిమీద వేటు వేయదల్చింది. ఈ అత్యంత ప్రమాదకర పరిస్థితులపట్ల ఉద్యోగులు మౌనంగా వుండజాలరు. ఏదో ఒక పెన్షన్ స్కీమ్ వర్తిస్తున్న బీమా, బ్యాంకింగ్ తదితర రంగాల ఉద్యోగులకు ప్రస్తుతం ఇబ్బందిలేనప్పటికీ, కాలక్రమేణా వారి మీద కూడ ప్రభావం పడుతుంది.

జి) ఇప్పటికే పెన్షన్ భారాన్ని గురించి అమెరికా, యుకెతో పాటు ఇతర ఐరోపా ప్రభుత్వాలు గగ్గోలు పెట్టగా ఇప్పుడు భారత ప్రభుత్వం వారితో జతకలిసి, ఊహాజనితమైన పెన్షన్ నిధుల సంక్షోభం పేరిట ప్రజలను భయభ్రాంతులను చేయబూనుకుంది.

హెచ్) ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుండి వస్తున్న ఈ దాడులను ఐరోపా, అమెరికాల్లోని కార్మికులు, ఉద్యోగులు దేశవ్యాపిత సమ్మెలతో సమరశీలంగా ప్రతిఘటిస్తున్నారు.

ఐ) దీనితో పాటు లక్షలాది ఖాళీలను భర్తీ చేయక యువతకు ఉపాధి నిరాకరించడం ద్వారానూ, ప్రైవేటీకరణ, ఉద్యోగాల్లో కోత, కాంట్రాక్టు నియామకాలు వంటి చర్యలతో ఉద్యోగుల మీద దాడి చేస్తున్నారు..

**ఈ నేపథ్యంలో సదస్సు ఈ క్రింది డిమాండ్లు చేస్తోంది.**

1. పార్లమెంటు చట్టం ద్వారా లేదా సంబంధిత ఐఎల్ఒ కన్వెన్షన్‌ను ఆమోదించడం ద్వారా సమ్మెహక్కు కల్పించాలి. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు రూపొందించిన గవర్నమెంట్ సర్వెంట్స్ కాండక్ట్ రూల్స్‌ను రద్దు చేయాలి.

2. ప్రభుత్వోద్యోగుల పెన్షన్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి. 2004, పిఎఫ్ఆర్డిఏ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి.

3. ప్రైవేటీకరణ, ఉద్యోగాల్లో కోత ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ కార్యకలాపాల ఔట్‌సోర్సింగ్‌ను నిలిపివేయాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కాంట్రాక్టు నియామకాలు ఆపివేయాలి.

4. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లోని లక్షలాది ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

5. జి.పి.ఎఫ్. వడ్డీరేటును ప్రస్తుతమున్న 8% నుండి గతంలోని 12%కి పెంచాలి.

6. దేశ కార్మికవర్గం, గ్రామీణ పేదలకు సంబంధించి స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ లేవనెత్తిన ఇతర కోర్కెల నామోదించాలి.

జె) కార్మిక వ్యతిరేక ప్రభుత్వ మొండి వైఖరిని దృష్టిలో వుంచుకుంటే, పైన పేర్కొన్న అత్యవసర సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు, దేశ వ్యాప్త సమరశీల పోరాటాలు నిర్వహించాలి. ఉద్యోగులను చైతన్యవంతులను పోరాటానికి, వీలయినంత త్వరలో దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధం చేసేందుకు, రాష్ట్ర స్థాయిలో, జోనల్ స్థాయిలో ర్యాలీలు, సెమినార్లు, గ్రూప్ సమావేశాలు నిర్వహించడం ద్వారా దేశ వ్యాప్త ప్రచారం నిర్వహించాలి.

కె) ఈ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు, స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ 9.7.2005న జరుపనున్న జాతీయ సదస్సులో పాల్గొనవల్సి వున్నందున, సమ్మెతో సహా ఆ సదస్సు చేసే అన్ని నిర్ణయాలను విజయవంతంగా అమలు చేసేందుకు ఇతర సంఘాలతో కల్సి పనిచేయాలి.

ఎల్) అన్ని కార్యక్రమాలను, దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు ఐక్యంగా ప్రచారం నిర్వహించేందుకు ప్రతిన బూనవల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర పిఎస్‌యుల కార్మికులు, ఉపాధ్యాయులకు సదస్సు మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తోంది.

## స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సదస్సు

కేంద్ర కార్మిక సంఘాలు, అఖిలభారత సమాఖ్యలు, బ్యాంకులు, బీమా, రైల్వేలు, పోస్టల్, టెలికం, రక్షణ, పెట్రోలియం రంగాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగ సంఘాలు తదితర రంగాల్లోని ఉద్యోగులు, కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్

ట్రేడ్ యూనియన్స్ 9.7.2005న ఢిల్లీలోని మవలాంకర్ ఆడిటోరియంలో మరొక జాతీయ సదస్సు నిర్వహించింది. 11 మంది అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో 1500 ప్రతినిధులు పాల్గొనగా, ఎఐఎస్‌జిఇఎఫ్ తరపున 151 మంది పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలతో సహా 16 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు 29.9.2005న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సదస్సు ఏకగ్రీవంగా ప్రకటించింది.

ఏడు కేంద్ర కార్మిక సంఘాలైన ఎఐటియుసి, ఎఐసిసిటియు, సిఐటియు, హెచ్ఎంఎస్, టియుసిసి, యుటియుసి, యుటియుసి(ఐఎస్) మరియు 14 జాతీయ ఫెడరేషన్లు – ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, ఎఐఎస్‌జిఇఎఫ్, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఆలిండియా ఎల్ఐసి ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆలిండియా పెట్రోలియం ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాంగార్ అగారి (మహారాష్ట్ర), జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఆలిండియా అసోసియేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బెంగుళూర్ పబ్లిక్ రంగ సంస్థలు, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఎఐ), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ యూనియన్‌లు సదస్సులో పాల్గొన్నాయి. సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు ఈ క్రింది కార్యక్రమం ఏకగ్రీవంగా ఆమోదించబడింది:

| | | |
|---|---|---|
| 2005 జూలై 20 నుండి ఆగస్టు 20 వరకు | : | రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, రంగాల వారీ సదస్సులు |
| 2005 ఆగస్టు 27 – నుండి సెప్టెంబరు 7 వరకు | : | పని ప్రదేశాలు, పారిశ్రామిక కేంద్రాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు, చివరకు జిల్లా రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు, ర్యాలీలు |
| 15.09.2005 | : | జాతీయ సమీకరణ దినోత్సవం, సమ్మె నోటీసు జారీ చేయడం. |
| 29.09.2005 | : | దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె |

## ఆర్థిక సరళీకరణకు భారత కార్మికవర్గ ప్రతిఘటన

యుపిఎ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలు, ప్రతిపాదిత కార్మిక వ్యతిరేక కార్మిక సంస్కరణలకు తమ తీవ్ర అసమ్మతి వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది

కార్మికులు, ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులు 29.9.2005న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైన నాటి నుండి జరిగిన పోరాటాల్లో అధికారుల తీవ్ర బెదిరింపులు, అరెస్టులను కూడ లక్ష్యపెట్టక 29.9.2005న జరిగిన సమ్మె అతి పెద్ద కార్మిక వర్గ కార్యాచరణ. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, చండీఘర్ కేంద్ర పాలిత ప్రాంతాలతో సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు బెదిరింపులకు పాల్పడినప్పటికి, కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొని బ్రహ్మాండంగా విజయవంతం చేశారు. మహారాష్ట్ర, కేరళ, త్రిపుర, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌ఘర్‌లలో సమ్మె సంపూర్ణంగా విజయవంతం కాగా, కాశ్మీర్, బీహార్, జార్ఖండ్, కర్నాటక, అస్సాం, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లలో సమ్మె విజయవంతం కాగా, ఒరిస్సా, తమిళనాడులలో పాక్షికంగానూ, ఉత్తరాంచల్‌లో స్వల్పంగానూ జరగ్గా, రాజస్థాన్, నాగలాండ్‌లలో కూడ సమ్మె జరిగింది. అరుణాచల్‌ప్రదేశ్, మిజోరామ్, మేఘాలయాలలో ప్రదర్శనలు, ఇతర సంఘీభావ కార్యక్రమాలు చేపట్టారు. సమ్మెరోజున దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు, ర్యాలీలు జరిగాయి. హర్యానా, పంజాబ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలోని పారిశ్రామిక కేంద్రాల్లో సమ్మె ప్రభావం బాగా పడింది. కొల్‌కతా, హాల్దియా, పరదీప్, టుటీకోరిన్, విశాఖపట్నం మరియు ముంబయి ఓడరేవుల్లో సమ్మె విజయవంతం కాగా, దేశ వ్యాప్తంగా బీమా, బ్యాంకింగ్, చమురు, టెలికం రంగాల్లో సమ్మె పూర్తిగా ప్రభావం చూపింది. ఆరు లక్షల మంది బొగ్గుగని కార్మికుల్లో 70% మంది సమ్మె చేశారు. రక్షణరంగ పరిశ్రమలు దాదాపుగా స్తంభించిపోయాయి. ఢిల్లీ, ముంబాయి విమానాశ్రయాల ప్రైవేటీకరణకు నిరసనగా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రింద వున్న 20 వేల మంది విమానాశ్రయ కార్మికులు సమ్మె చేయడంతో, స్వదేశీ విమానయాన సంస్థలు ప్రధాన మార్గాల్లో సర్వీసులను తగ్గించడమో లేదా రద్దు చేయడమో జరిగింది.

సంఘటిత, అసంఘటిత రంగాల్లోని సుమారు ఆరుకోట్ల మంది కార్మికులు పాల్గొన్న ఈ సమ్మెకు "అపూర్వమైన స్పందన" వచ్చిందని కేంద్ర కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. ఈ సమ్మెను ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు తీవ్ర హెచ్చరికగా ఇతర జాతీయ ఫెడరేషన్లు, కేంద్ర కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకోక పోయినట్లయితే మరింత బృహత్తర పోరాటాలకు పూనుకోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. విద్యార్థులు, యువజనులు, రైతాంగం, మహిళలు తదితర సోదర ప్రజా సంఘాలు కూడా సమ్మెకు మద్దతిచ్చాయి. 13 లక్షల మంది బ్యాంకు, బీమా ఉద్యోగుల్లో 95% పైగా సమ్మెలో పాల్గొని సంపూర్ణంగా విజయవంతం చేశారు.

## జాతీయ విపత్తులు

భారతదేశం నుండి శ్రీలంక, ఇండోనేషియా, థాయ్‌లాండ్ మాల్దీవులు, మయన్మార్, మలేషియా, బంగ్లాదేశ్‌లో స్వల్ప భాగంతో సహా హిందూ మహాసముద్రం చుట్టుప్రక్కల వున్న అనేక ఆసియా దేశాలతో పాటు తూర్పు ఆఫ్రికాలోని సోమాలియా వరకు విధ్వంసాన్ని

సృష్టించిన త్సునామీతో 2004 సంవత్సరం విషాదంగా ముగిసింది. చరిత్రలోనే అత్యంత దారుణమైన దుర్ఘటనగా పేర్కొనబడిన ఈ త్సునామీ భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలు, అండమాన్ – నికోబార్ ద్వీపాలతో పాటు, మరి కొన్ని ఆసియాదేశాల సముద్రతీరాన్ని హఠాత్తుగా తాకి, పెద్ద ఎత్తున ఆస్తులు, మానవ జాతి కవసరమైన సహజవనరులకు నష్టం కల్గించడంతో పాటు, కనీవినీ ఎరుగని రీతిలో మానవాళిని బలిగొంది. త్సునామీ సహాయక చర్యల నిమిత్తం అన్ని ట్రేడ్ యూనియన్లు నిధులు సేకరించి, విధ్వంసానికి గురైన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సహాయచర్యలు చేపట్టాయి.

## హిమాలయ ప్రాంతంలో భూకంపం

2005 అక్టోబర్ 8వ తేదీన కాశ్మీర్‌ను పాకిస్తాన్ వైపున వున్న కాశ్మీర్‌ను పెనుభూకంపం తీవ్రంగా కుదిపివేసింది. ఇది మౌలిక సదుపాయాలను విచ్ఛిన్నం చేసి, ప్రజల ఆస్తులను విధ్వంసం చేయడమే గాక 60 వేల మంది ప్రజల ప్రాణాలను బలిగొంది. 70 వేల మందికి పైగా తీవ్రగాయాల పాలయ్యారు. అమెరికా అత్యవసర సహాయ కార్యక్రమాల ప్రధాన సమన్వయకర్త ఈ విధ్వంసాన్ని “శీతాకాలానికి ముందే హిమాలయ పర్వతాల్లో సంభవించిన ఈ భూకంపం, ఏ విధమైన లెక్కలకు అందనంత “పీడకల” వంటిదని పేర్కొన్నారు. నేలమట్టమైన ముజఫరాబాద్‌ను సందర్శించిన తర్వాత ఆయన మాట్లాడుతూ, 2004 డిసెంబరు 26న సంభవించిన త్సునామీ కంటె ఈ భూకంపం మరింత దారుణమైన విధ్వంసాన్ని సృష్టించిందని చెప్పారు. బాధితులకు సహాయ, పునరావాసాలు కల్పించేందుకు అంతర్జాతీయ సమాజం ముందుకు వచ్చింది.

## హోండా కార్మికులపై హర్యానా పోలీసుల పాశవిక దాడి

హర్యానాలోని గుర్‌గావ్‌లోని హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ అనే బహుళ జాతి కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కైన హర్యానా పోలీసులు, 2005 జులై 25న ఆ కంపెనీ కార్మికులు శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శన మీద విరుచుకుపడ్డారు. యాజమాన్యం అభీష్టానికి భిన్నంగా ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసినందుకు డిస్మిస్ చేయబడిన తమ సహచరులను తిరిగి నియమించవల్సిందిగా కార్మికులు డిమాండు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకత్వంలోని హర్యానా ప్రభుత్వం సిగ్గులేకుండా చట్టాల నుల్లంఘించేందుకు విదేశీ కంపెనీకి సహాయం చేసింది. అకస్మాత్తుగా జరిగిన పాశవికదాడికి కార్మికులు నిర్ఘాంతపోయారు. దాడికి గురై ఒకరు చనిపోగా, 800 మందికి పైగా దారుణంగా గాయపడ్డారు. కనీసం 50 మందిపైగా కార్మికులు జాడలేకుండా పోయారు. యమయాతనలకు తాళలేక విలపిస్తున్న, దిక్కులేని కార్మికులను కూడ నిర్దయతో చావబాదుతున్న పోలీసుల అకృత్యాలను, గాయపడిన వారి రక్తంతో తడిసిన నేలను తదితర మీడియా దృశ్యాలను చూస్తే పోలీసులు కార్మికులమీద ఎంత ఘోరంగా విరుచుకు పడిందీ స్పష్టమవుతుంది. ఇది చాలదన్నట్లు, గాయపడిన కార్మికులకు వైద్య సహాయమందించేందుకు తరలించబడిన,

దగ్గరలోని ఆస్పత్రుల్లోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి, మరింత హింసించడానికి కొందరిని అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు ఈడ్చుకెళ్ళారు. వామపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు ఈ క్రూరకృత్యాలను తీవ్రంగా ఖండించి బాధితుల పక్షాన నిలిచారు.

## మతోన్మాద పూరితమవుతున్న విద్య, సంస్కృతి

గత ఎన్‌డిఎ ప్రభుత్వం తన గత పాలనాకాలం నుండే విద్యా, సాంస్కృతిక రంగాలను నిరంకుశంగా మతోన్మాద పూరితం చేయబూనుకుంది. ప్రముఖ పరిశోధనా సంస్థలను ప్రత్యేకంగా ఒక మత ఛాందస వాదానికి కట్టుబడిన వారితో నింపింది. పాఠ్యపుస్తకాలను ప్రత్యేకంగా ఒక మతం పట్ల పక్షపాతంతో తిరిగి రచించారు. ఈ విధంగా పసి మనసులను విషపూరితం గావించడమే గాక, ఉన్నత పరిశోధనల్లో కూడ ఒక ప్రత్యేక మతపరమైన వ్యక్తీకరణ చోటు చేసుకుంది. దూరదర్శన్, ఆకాశవాణిలను ప్రగతిశీల, సెక్యులర్ భావాల నుండి విముక్తిచేసి, మతపరమైన పక్షపాత వైఖరి కల్గిన వారితో నింపడానికి, ప్రసార భారతిలో ప్రముఖ పాత్ర వహిస్తున్న ఒక ప్రముఖ చరిత్ర కారుని, మరొక సాహితీ వేత్తను అనుచితంగా ముందుగానే రిటైర్ చేశారు. సాంస్కృతిక రంగంలో హేతుబద్ధంగాని మతపరమైన విషయాలను, మూఢ విశ్వాసాలను ప్రేక్షకుల మనసుల్లో నాటేందుకు దూరదర్శన్ కార్యక్రమాలను పురాణ సంబంధమైన కథలతో నింపివేశారు. లౌకిక తత్వానికి స్వస్తి చెప్పారు. ప్రధానంగా ప్రగతిశీలమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీసే లక్ష్యంతోనే ఈ ప్రగతి నిరోధక భావాలను ఒక పద్ధతి ప్రకారం వ్యాప్తి చేస్తున్నారు. మతోన్మాద, వేర్పాటువాద సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పట్టువిడువకుండా పోరాడవల్సిందిగా, వామపక్ష, ప్రగతిశీల ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన పిలుపుకు సత్ఫలితాలు లభించాయి. ఐతే మతోన్మాద సిద్ధాంతం పని అయిపోయిందని అర్థం కాదు. యు.పి.ఎ. ప్రభుత్వం ఈ విధానాలను వెనక్కు మళ్ళించేందుకు కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, ఇవి ఏమాత్రం చాలవు. ఇదింకా చురుగ్గానే వుండి, ప్రజల మనసులను కలుషితం చేస్తోంది. ఈ విద్వేష పూరిత, ప్రగతి నిరోధక సిద్ధాంతానికి వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్లు పట్టువదలక పోరాటాన్ని కొనసాగించాలి.

## ప్రపంచ సామాజిక వేదిక

"మరో ప్రపంచాన్ని సాధ్యం" చేసే దిశలో సాగే ప్రయాణంలో ప్రపంచ సామాజిక వేదిక (డబ్ల్యుఎస్ఎఫ్) 2004 ఒక మైలురాయి వంటిది. ప్రపంచీకరణకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన సమీకరణల్లోనే అత్యంత విస్తృత సమీకరణకు ముంబైలోని గోరేగావ్‌లోని విశాలమైన సెస్కో మైదానం వేదికైంది. 2004 జనవరి 16 నుండి 21 వరకు జరిగిన ఈ డబ్ల్యుఎస్ఎఫ్‌లో వందకు పైగా దేశాల నుండి లక్ష మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రపంచం నలుమూలల నుండి "మరో ప్రపంచం సాధ్యమనే" దృఢ నమ్మకంతో, ఈ లక్ష్యసాధనకు

కృషి చేయాలనే పట్టుదలతో, వీరు ఈ బహిరంగ వేదికకు చేరుకున్నారు. ఇది, సమాజంలోని వివిధ తరగతులకు ప్రాతినిధ్యం వహిస్తూ మానవ సముద్రం వలె వున్న ఈ వేదిక వివిధ రంగులు, కులాలు, జాతులకు చెందిన వారు తమ కష్ట సుఖాలను పంచుకునే ఒక గొప్ప వేదికను కల్పించింది. ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయాల ద్వారా స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు జరిగే సామాజిక సమీకరణాల క్రమంలో డబ్ల్యుఎస్ఎఫ్-2004 ఒక మైలు రాయి వంటిది. బ్రెజిల్‌కు చెందిన పోర్టో అల్లెగ్రేకు వెలుపల మొదటిసారిగా జరుగుతున్న ఈ సమావేశం డబ్ల్యుఎస్ఎఫ్ నాల్గువ సమావేశం. మానవ జాతి జీవనానికీ ప్రపంచాన్ని యోగ్యమైనదిగా చేసేందు కోసం, పెట్టుబడిదారీ ప్రపంచీకరణ ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు, ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులు తమ అనుభవాలు పంచుకున్నారు. చర్చలు సాగించారు. జనవరి 16న జరిగిన ప్రారంభోత్సవ సభలో లక్ష మంది పాల్గొన్నారు. అనేక ఇతివృత్తాలు, సమస్యల మీద జనవరి 17నుండి 20 వరకు సుమారు 1200 సెమినార్లు వర్క్‌షాపులు జరిగాయి. ప్రజా సమస్యల ప్రాతిపదిక గల్గిన డబ్ల్యుఎస్ఎఫ్-2004 సమావేశంలో అణచివేతకు గురవుతున్న తరగతులు, రైతాంగం, గిరిజనులు తదితర ప్రజాఉద్యమాల అపూర్వ భాగస్వామ్యం ఈ సమావేశం ప్రాధాన్యత, ప్రపంచాన్ని జీవనయోగ్యమైనదిగా చేయాలన్న ఆకాంక్ష గల్గినవారు చేరి, కలిసిమెలిసి చర్చించుకుని, ఆచరణాత్మకమైన కూటములనేర్పాటు చేసుకునేందుకు ఒక మంచి వేదిక ఏర్పాటు చేయడంలో డబ్ల్యుఎస్ఎఫ్ విజయవంతమైంది.

## ఆసియా సామాజిక వేదిక

నూతన సామాజిక క్రమాన్ని నెలకొల్పే లక్ష్యంతో ఆసియా సామాజిక వేదిక ఏర్పడింది. డబ్ల్యుఎస్ఎఫ్-2004కు ముందుగానే “మరో ప్రపంచం సాధ్యమే” అనే సందేశం ఇస్తూ, 2003 జనవరి 2 నుండి 7 వరకు హైదరాబాద్‌లో సామాజిక వేదిక సమావేశం జరిగింది. వందకు పైగా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 10 వేలకు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ట్రేడ్ యూనియన్లు, వామపక్ష, ప్రగతిశీల సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జిఒలు), పరిశోధనా సంస్థలు, దళిత మహిళలు, యువజన సంఘాలతో పాటు చలనచిత్ర నిర్మాతలు, కొన్ని ప్రొటెస్టెంట్ చర్చి సంస్థలు పాల్గొన్నాయి. ఈ సామాజిక వేదికలోనూ, వివిధ సెమినార్లలోనూ పాలొన్నవక్తలు నయా ఉదారవాద ప్రపంచీకరణ రహిత, మతోన్మాద రహిత, యుద్ధ రహిత ప్రపంచాన్ని కోరుకున్నారు. ఆతిధ్యం ఇస్తున్న భారతదేశంతో సహా, పాలస్తీనా, అఫ్ఘనిస్తాన్, ఫిలిఫైన్స్, అర్జెంటైనా, బ్రెజిల్, పాకిస్తాన్, బొలీవియా, దక్షిణాఫ్రికా, మలేషియా, ఇరాక్, ఇథియోపియా నుండి ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నరు. సామాజిక ఉద్యమాలకు చెందిన ప్రముఖులు ఫోరంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన మాజీ రాష్ట్రపతి శ్రీ కె.ఆర్. నారాయణన్ ప్రసంగిస్తూ, నయా ఉదారవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రజల నిరసనకు ఆసియా సామాజిక వేదిక ఒక వేదికగా కృషి కొనసాగించాలని ఆకాంక్షించారు.

1. శాంతి మరియు భద్రత
2. అప్పులు, అభివృద్ధి, – వాణిజ్యం
3. దళితులు
4. పర్యావరణం, సంస్కృతి, విజ్ఞానం
5. మౌలిక సదుపాయాలు, ప్రణాళికలు
6. దేశం – ప్రజాస్వామ్యం, మినహాయింపులు,
7. మహిళలు
8. ప్రత్యామ్నాయాలు, ప్రజా పోరాటాలు – అనే అంశాలతో పాటు మొత్తం 8 అంశాల మీద ఫోరం చర్చలు సాగించింది. ఈ ప్రతినిధుల సభలే గాక, ఫోరం కేంద్ర ఇతివృత్తం ప్రాతిపదికగా బాధితుల గళాలు వినడంతో పాటు, సెమినార్లు, వర్క్‌షాపులు, చలనచిత్రోత్సవాలు ఉపన్యాసాలు, ప్యానల్ చర్చలు, సాంస్కృతిక కళారూపాలు, చలనచిత్ర ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. 2003 జనవరి 7న జరిగిన ముగింపు సభలో 30 వేల మంది కార్యకర్తలు పాల్గొన్నారు. అదే రోజున ముంబాయి నగరంలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ భాగస్వామ్య సదస్సుకు వ్యతిరేకంగా ఆందోళన చేసినందుకు 400 మందిని అరెస్టు చేయడాన్ని ఏషియన్ సోషల్ ఫోరం ర్యాలీ తీవ్రంగా ఖండించింది.

# 28

# తీవ్ర ఆర్థిక దుస్థితిలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం

## తీవ్ర సంక్షోభంలో పయనిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం

**కా**ర్పోరేట్ శక్తుల ఆధిపత్యం అధికమైనప్పటికీ ఒక ప్రక్క ఉత్పత్తి తీవ్రంగా పెరిగి, వేరొక ప్రక్క నానాటికి తీవ్రమవుతున్న నిరుద్యోగం, పడిపోతున్న ఆదాయాల వల్ల వస్తువులకు డిమాండ్ పడిపోవడంతో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్నెదుర్కొంటోంది. నేటి పెట్టుబడిదారీ విధానంలో వ్యవస్థీకృతమైన ఈ సంక్షోభాన్ని ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అధిగమించలేదు.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పడిన తీవ్ర సంక్షోభం ఫలితమే నయా ఉదారవాద ప్రపంచీకరణ. అభివృద్ధి చెందుతున్న దేశాలు, ఆ దేశాల్లోని ప్రజల ప్రయోజనా లతో పాటు, అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని సాధారణ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి, ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిని ఈ సంక్షోభం నుండి కాపాడేందుకే ఈ నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాలు రూపొందించబడ్డాయని ఇప్పటికే గమనించాం. ప్రపంచీకరణ, పేదరికాన్ని తగ్గించడంలో జయప్రదం కాకపోగా, అందుకు పూర్తి విభిన్నంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయడంలోనూ, అన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక వ్యవస్థలకు ముప్పు తేవడంలో విజయవంతమైంది. తీవ్రమైన ఒత్తిళ్ళకు గురై, సోషలిజం నుండి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందిన రష్యా, తదితర పూర్వపు సోషలిస్టు దేశాల్లో ప్రపంచీకరణ, మార్కెట్ ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టడం వల్ల ఎంతో గొప్పగా చెప్పుకున్న ఫలితాలేమీ రాలేదు. నూతన పెట్టుబడిదారీ విధానం ఆదేశాలకు కనీవినీ ఎరుగని అభివృద్ధి తెచ్చిపెడ్తుందని పాశ్చాత్య దేశాలు ఊదరకొట్టాయి. కాని దీనికి బదులు వూహించనంత పేదరికాన్ని తెచ్చిపెట్టింది. ప్రపంచీకరణ వ్యతిరేక, ప్రగతిశీల, సోషలిజం అనుకూల ఆర్థిక వేత్తలు హెచ్చరించిన దానికంటే ఎక్కువ మంది ప్రజలకు, ఎక్కువ విషయాల్లో మార్కెట్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర వినాశన హేతువని రుజువైంది.

ద్రవ్యపెట్టుబడిని బలోపేతం చేసేందుకు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం. ప్రపంచ వ్యాప్తంగా, ప్రత్యేకంగా మూడవ ప్రపంచ దేశాల్లోని కార్మికులు ఇతర కష్టజీవులను వంచించి, పెట్టుబడిని కూడబెట్టే నూతన పద్ధతిని పట్టుదలగా అనుసరిస్తోంది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికే "తలమానికం"గా భావించే అమెరికాలో 2008లో ఏం జరిగిందో ప్రపంచం చూసింది. అమెరికా స్వయంగా తానే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పీకల్లోతు కూరుకుపోయింది. ఈ సంక్షోభం యావత్ పెట్టుబడిదారీ ప్రపంచాన్ని చుట్టుముట్టి, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత తీవ్రమైన పెట్టుబడిదారీ విధాన సంక్షోభానికి దారి తీసింది.

## పీకల్లోతు సంక్షోభంలో

## ప్రపంచ పెట్టుబడిదారీ విధానం

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం పీకల్లోతు సంక్షోభంలో కూరుకుపోయి తీవ్ర ప్రకంపనలకు గురి కావడం ప్రారంభమైంది. ఆర్థిక సంక్షోభం వల్ల తలెత్తిన నిరాశా నిస్పృహలను వ్యక్తీకరిస్తూ జర్మనీ ఆర్థిక మంత్రి పీర్ స్టెయిన్ బ్రాక్ 30.9.2008న మాట్లాడుతూ, మనందరం పాతాళం (శూన్యం) లోకి చూస్తున్నాం." అని చేసిన ప్రస్తావనను 'డెయిలీ టెలిగ్రాఫ్' పత్రిక పతాకశీర్షిక పెట్టింది. పీడకల వంటి ఈ పరిణామం 15.9.2008న అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి "వాల్‌స్ట్రీట్"ను తాకిన తర్వాత సరిగ్గా రెండు వారాల తర్వాత ఆయన తీసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యత సంతరించుకున్నది. 15.9.2008న అమెరికా ఆర్థిక వ్యవస్థ వెన్నులో వణుకు పుట్టించిన ఈ సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేసింది.

ప్రపంచంలోనే అతిపెద్ద దైన స్టాక్ బ్రోకర్ కంపెనీ మెర్రిల్‌లించ్, లేమన్ బ్రదర్స్ మరియు ఇతర బడా ఆర్థిక సంస్థలన్నీ పేక మేడల్లా కూలిపోయాయి. ప్రపంచంలోని అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీ ఎఐజితో సహా అమెరికాలోని అనేక ఇతర ఆర్థిక సంస్థలు కుప్పకూలాయి. 1929లో యావత్ పెట్టుబడిదారీ ప్రపంచాన్ని చుట్టుముట్టిన తీవ్రమైన, సుదీర్ఘమైన ఆర్థిక పతనం, మాంద్య పరిస్థితుల తర్వాత ఏర్పడిన అతిపెద్ద, సుదీర్ఘకాల స్వభావం కల్గిన ఆర్థిక దుర్ఘటనకు సంకేతాలుగా ఈ పరిణామాలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అభివర్ణించింది. వాల్‌స్ట్రీట్ కుప్పకూలి, అమెరికా ప్రభుత్వం మొదట 70 వేల కోట్ల డాలర్లు (700 బిలియన్), ఆ తర్వాత లక్షల కోట్ల డాలర్లకు పైగా బెయిలవుట్ ప్యాకేజీలు ఇచ్చినప్పటికీ, అవి తీవ్రమవుతున్న సంక్షోభపుటంచులను కూడ తాకలేకపోయాయి. యుఎస్‌ఎలోని డోజోక్స్ యుకెలోని ఎఫ్‌టిఎస్ఇలతో పాటు, ఆసియా, ఐరోపాలలోని మార్కెట్లు అత్యధిక పాయింట్లు కోల్పోయాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు, బ్యాంకులు, ఇతర సంస్థలు పేకమేడల్లా కూలిపోయి, 1.2 లక్షల కోట్ల డాలర్ల ప్రజాధనం హరించుకుపోయింది. ఈ పరిణామాలు ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని తీవ్ర అపస్మారక స్థితిలోకి నెట్టాయి.

వాల్‌స్ట్రీట్‌లో ఏర్పడిన సంక్షోభం ప్రపంచంలోని అన్ని వీధులకు సంబంధించినదే. ఇది కార్మిక వర్గాన్ని, పేద ప్రజలను తీవ్రంగా దెబ్బతీసింది. దీనిని గురించి యుఎన్‌ఒ, ఐఎల్‌ఒలు ఏవిధంగా పరిగణిస్తున్నాయో పరిశీలిద్దాం:

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద, ఆర్థిక సంక్షోభం ఫలితంగా 2009 సంవత్సరం చివరి నాటికి 2 కోట్ల ఉద్యోగాలు అదృశ్యమవుతాయని ఐక్యరాజ్యసమితి ఏజన్సీ పేర్కొంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురించి ఐఎంఎఫ్ ప్రొజెక్ట్ చేసిన అంశాల ఆధారంగా, ఐఎల్‌ఒ అంచనాల మేరకు నిర్మాణ, రియల్ ఎస్టేట్, ఆర్థిక సర్వీసులు, ఆటోరంగాలు తీవ్రంగా దెబ్బతిననున్నాయి. "ప్రజలు, ఉపాధికల్పన, వివిధ సంస్థల మీద ఆర్థిక సంక్షోభం ప్రభావం ఏ విధంగా వుంటుందో పరిశీలించాలి". అని ఐఎల్‌ఒ డైరెక్టర్ జనరల్ జువాన్ సొమాలీయా పత్రికా విలేకరులతో చెప్పారు. ప్రభుత్వాలు, యాజమానులు, కార్మికులను ఒక చోట చేర్చి, ఉపాధి కల్పనలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు నిజమైన ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు తీసుకోవల్సిన చర్యల గురించి చర్చలు సాగించాలని ఐఎల్‌ఒ కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. "సబ్ ప్రైమ్ (గృహరుణాల సంక్షోభం) సంక్షోభానికి సబ్ ప్రైమ్ (అప్రధానమైన విధానాలు) విధానాలతో, స్పందించడం విషాదకర అంశమని" ఆయన పేర్కొన్నారు. చిన్న పరిశ్రమలతో పాటు, ఉపాధి కల్పనను వేగవంతం చేసే రంగాలమీద కేంద్రీకరించి, ఆర్థిక వ్యవస్థలోకి వనరులను గుప్పించడం ద్వారా, ఆర్థిక మాంద్యాన్ని దూరంగా వుంచడం లేదా దాని ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇంతేగాక, పారిశ్రామికులకు అప్పులిచ్చే ప్రాథమిక కార్యకలాపాలకు ఆర్థిక రంగాన్ని మరల్చాలని కూడ చిలీ న్యాయవాది, దౌత్యవేత్త, ప్రస్తుత ఐఎల్‌ఒ డైరెక్టర్ జనరల్ జువాన్ సొమావియా పేర్కొన్నారు.

అమెరికా కంపెనీల లాభాల్లో ఆర్థిక రంగం వాటా 1980లో 5% వుండగా నేడది 41%కి పెరిగింది. ఫలితంగా బ్యాంకులు ఉత్పాదక రంగాలకు అప్పులివ్వడం గాక, ఆర్థిక లావాదేవీల్లో పెట్టుబడి పెట్టడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. "అందువల్ల ఈ ఆర్థిక వ్యవస్థ నిజమైన ఆర్థిక క్రమం (ఉత్పాదకరంగాలకు అప్పులివ్వడం వంటి) నుండి వనరులను బయటకు మళ్లిస్తోంది" అని ఆయన చెప్పారు. "స్టాక్ మార్కెట్లో నమోదైన ఆర్థికేతర రంగాలకు చెందిన కంపెనీలు, ఆర్థిక రంగ సంస్థలతో సమానంగా రాబడి సంపాదించాలని తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా ఈ కంపెనీలు దీర్ఘకాల పెట్టుబడులు పెట్టడంగాక, తరచుగా ఉద్యోగుల జీతాలు స్తంభింప చేయడం, లేఆఫ్ చేయడం వంటి చర్యల ద్వారా ఖర్చులు తగ్గించేందుకు పాల్పడుతున్నాయి" అని ఆయన అన్నారు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం, కారణంగా ప్రపంచ నిరుద్యోగ సైన్యానికి మరో 2 కోట్ల మంది వచ్చి చేరతారని, 2008 ఏడాది చివరలో ఐక్యరాజ్య సమితికి చెందిన ఈ ఏజన్సీ వేసిన తన అంచనాలో పేర్కొంది. దీనితో మరుసటి సంవత్సరాంతానికి ప్రపంచ నిరుద్యోగుల సంఖ్య 21 కోట్లకు చేరుకుంటుందని ఐఎల్‌ఒ పేర్కొంది.

ఈ అంకెలు గమనిస్తే ప్రభుత్వాలు బ్యాంకుల మీద కాక, ప్రజల మీద కేంద్రీకరించాలని సూచిస్తున్నాయని ఐఎల్ఓ జాయింట్ డైరెక్టర్ జవాన్ సోమాలియా పేర్కొంటూ, "ఒక విధంగా ఆలోచిస్తే ఇది ఉత్పాదకత పెరుగుదల గాను, లోతుగా పరిశీలిస్తే కార్మికుడు సరుకుగా మారినట్లు అర్థమవుతుంది" అన్నారు.

"ఆర్థిక సంక్షోభాన్ని కేవలం ఆర్థిక అంశాలుగా చూడడం సరికాదని మేము భావిస్తున్నాము. ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడేటప్పుడు, ప్రజల పరిస్థితేమిటి? ఉపాధి కల్పన పరిస్థితేమిటి? పరిశ్రమలు ఏమవుతున్నాయి? అనే అంశాలను దృష్టిలో వుంచుకోవాలి. ఆర్థిక వ్యవస్థలోకి గుప్పించడానికి చాలినన్ని వనరులున్నట్లయితే, అలా చేయడానికిది సమయం కాదు. ఎందుకంటే ప్రజల గురించి పట్టించుకునేందుకు మనకు వనరులు మి గలవు" అని సోమావియా చెప్పారు.

ముందుగా ప్రభుత్వాలు "రుణపక్షవాతాన్ని" అంతం చేయడానికి ప్రయత్నించడం సరైందే. అయితే వివిధ సంస్థల్లో ఉద్యోగాలను నిలబెట్టే విషయం మీద ఇప్పుడు శ్రద్ధపెట్టాలి. ఇతర కంపెనీలతో కలసి ఉద్యోగాలను సృష్టించే చిన్న కంపెనీలకు ప్రభుత్వాలు సహాయం చేయాలి అని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు చెల్లించే పెన్షన్లకు రక్షణ కల్పించడం కీలకమైనదని పేర్కొన్న ఆయన, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతూ నిర్మాణరంగం, హౌసింగ్ మార్కెట్, ఆర్థిక, ఇతర సర్వీసు రంగాలు, కార్ల తయారీ రంగాల్లో అత్యధికంగా ఉద్యోగాలు పోతాయని అన్నారు.

ఐఎల్ఓ చరిత్రలో మనం కీలక ఘట్టంలో వున్నామని, ఇటీవలనే ఐఎల్ఓ సెక్రటరీ జనరల్గా తిరిగి ఎన్నికైన సోమావియా 18.11.2008న వ్యాఖ్యానిస్తూ నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలను, ప్రజలను, సంక్షోభం తీవ్రంగా దెబ్బతీస్తూనే వుంది. కష్టజీవుల్లో పేదల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుత ప్రపంచీకరణ నమూనాలో సమతుల్యత, న్యాయబద్ధత, స్థిరత్వం పట్ల ఆందోళన పెరుగుతోంది." అని పేర్కొన్నారు. అయితే, సంక్షోభపు దాడులను ప్రపంచ కార్మికవర్గం ప్రపంచ వ్యాప్త కార్యాచరణ ద్వారా ఎదుర్కొనాలనే వాస్తవాన్ని మాత్రం ఆయన చెప్పలేదు. పబ్లిక్ సర్వీస్ ఉద్యోగులు, కార్మికులు తమ సామాజిక భద్రతా సదుపాయాలు, పెన్షన్ నిధులను పరిరక్షించు కునేందుకు ఐక్యంగా పోరాటాలు సాగించాలి.

## భారీ ఎత్తున ప్రభుత్వ జోక్యం ద్వారా బెయిలవుట్

ప్రభుత్వం భారీ ఎత్తున జోక్యం చేసుకుని బెయిలవుట్ ప్యాకేజీ అమలు చేయవల్సి రావడంతో స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధానం విశ్వసనీయత దిగజారింది. సంక్షోభంతో దిమ్మతిరిగిన అమెరికా ప్రభుత్వం, ఐరోపాలోని ప్రభుత్వాలు ప్రభుత్వ ఖజానా నుండి భారీ మొత్తాల్లో బెయిలవుట్ పథకాలతో ముందుకు వచ్చాయి. ఎంతో గొప్పగా చెప్పుకున్న నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానం యొక్క స్వేచ్ఛ మార్కెట్ నమూనా కుప్పకూలుతుంటే, దానిని సృష్టించిన అమెరికా ప్రభుత్వం తలక్రిందులై, చివరకు ఆ భవనం కుప్పకూలకుండా నిరోధించేందుకు భారీ బెయిలవుట్ల ద్వారా జోక్యం చేసుకుంది. అమెరికా ప్రభుత్వాలు ఒక పద్ధతి ప్రకారం పట్టుదలతో నిర్మించిన స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధాన భూతం కుప్పకూలి,

పెట్టుబడిదారీ విధానం యొక్క స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ నమూనా గుణగణాలకు సంబంధించిన బండారం బట్టబయలు కానుంది.

## ఐరోపా ద్రవ్య మార్కెట్ల మీద వాల్‌స్ట్రీట్ పతనం ప్రభావం

వాల్‌స్ట్రీట్ పతనం కావడంతో ఐరోపా ద్రవ్యమార్కెట్లలో తీవ్ర సంక్షోభం నెలకొన్నది. "ప్రపంచ రుణ సంక్షోభం, నిర్ఘాంతపర్చే విధంగా దౌర్జన్య పూరితంగా ఐరోపాలో ప్రవేశించింది. ఫలితంగా ఐదు ప్రధాన బ్యాంకులను బయట పడేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఆయాదేశాల రుణ మార్కెట్లు దాదాపు మూతపడే స్థితి వచ్చింది." అని 2008 సెప్టెంబర్ 30వ తేదీ "ది డైలీ టెలిగ్రాఫ్" పత్రిక పేర్కొంది.

డచ్-బెల్జియన్ బ్యాంకు ఫోర్టిస్, బ్రిటన్‌కు చెందిన బ్రాడ్ ఫోర్డ్ అండ్ బింగ్లే ఐస్‌ల్యాండ్‌కు చెందిన గ్లిట్‌నిర్ బ్యాంకులు స్వల్పకాల వ్యవధిలో తిరిగి చెల్లించాల్సిన రుణాలకు క్రొత్త రుణాలుగా మార్చడంలో విఫలం కావడంతో, ఆయా ప్రభుత్వాలు, ఆయా బ్యాంకులను పాక్షికంగా లేదా పూర్తిగా జాతీయీకరణకు పూనుకున్నాయి. ఫ్రాంకో బెల్జియన్ ఆర్థిక సంస్థ డెగ్జియా పెట్టుబడి కొరత వల్ల కుప్పకూలిపోవడంతో ఆ సంస్థకు ఫ్రెంచి ప్రభుత్వం తన పూర్తి మద్దతు ప్రకటించింది. జర్మనీలో వాణిజ్య ఆస్తుల మీద రుణాలిచ్చే రెండవ పెద్ద సంస్థ హైపోరియల్ ఎస్టేట్‌ను, స్థానిక బ్యాంకుల కన్సార్టియం (కూటమి) ద్వారా 3500 కోట్ల యూరోలందించి ఆదుకున్నారు. బ్యాంకుల మధ్య వాణిజ్య లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి" అవి అమెరికాకు చెందిన బిఎన్‌పి పరిబస్, కరెన్సీ చీఫ్, హనస్ రెడేకర్ అన్నారు. ప్రపంచవ్యాప్త సంక్షోభం విధ్వంసకర వేగంతో ఐరోపాను చుట్టుముడుతోందని బ్రజెల్స్ (బెల్జియం రాజధాని) లోని ఐఎన్‌జి ఛీఫ్ ఎకనమిస్ట్ కర్‌స్టెన్ బ్రెజెన్స్కి పేర్కొన్నారు. "సబ్ ప్రైమ్ సంక్షోభం కేవలం అమెరికాకు సంబంధించిన చెత్త మాత్రమేనని, దానిని అమెరికాయే శుద్ధి చేసుకుంటుందని యూరోపియన్లు భావించారు. ఇప్పుడది తమకు కూడ సంబంధించిన చెత్త అని వారు అర్థం చేసుకున్నారు" అని కూడా ఆయన పేర్కొన్నారు. యూరోపియన్ బ్యాంకులకు కూడ పెద్ద ఎత్తున వసూలు కాని గృహరుణాలున్నాయి. ఇవి అమెరికన్ బ్యాంకులకున్న వసూలు కాని గృహ రుణాల్లో 75% మేరకు వుంటాయని ఐఎమ్‌ఎఫ్ గణాంకాలు తెల్పుతున్నాయి. గృహరుణాల బుడగలు అమెరికా కంటె చాల తీవ్ర స్థాయికి చేరిన బ్రిటిష్, స్పానిష్, ఫ్రెంచ్, డచ్, స్కాండీనేవియన్, తూర్పు ఐరోపా మార్కెట్లలో యూరోపియన్ బ్యాంకులు పారు బకాయిలను కొనసాగించాయి. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకు శాఖలు గల్గిన అమెరికాకు చెందిన సిటీ గ్రూప్ బ్యాంకులు తీవ్ర ఆర్థిక సంక్షోభానికి లోనయ్యాయి. ప్రజల నుండి పన్నుల రూపేణా వసూలు చేసిన సొమ్ము నుండి భారీ మొత్తాలను సిటీబ్యాంక్ గ్రూప్‌ను రక్షించడానికి అమెరికా ప్రభుత్వం వినియోగించింది.

## స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక సాధనాల వైఫల్యం

స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక సాధనాలు గతంలోగాని, నేడు గాని పనిచేయడం లేదని అందరూ భావిస్తున్నారు. తన చర్యల ఫలితాల గురించి సింహావలోకనం చేసుకునే సమయానికి,

సంక్షోభ పరిష్కారానికి అమెరికా ఇతరుల మీద రుద్దిన పరిష్కార మార్గాలకు, తాను చేపట్టిన చర్యలకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడినట్లు స్పష్టమవుతుంది.

తమ ఆర్థిక వ్యవస్థలను ఆరోగ్యవంతమైన, స్థిరమైన మార్గంలో పెట్టుకునేందుకు, మార్కెట్ ఆధారిత విధానాలననుసరించవల్సిందిగా, 1990 దశకంలో అమెరికా పాలనా యంత్రాంగం లోని అధికారులు, అమెరికా అధీనంలోని ఐఎంఎఫ్, సంక్షుభిత దేశాల నాయకులను కోరారు. ఆ దేశాల్లో ప్రభుత్వ వ్యయాన్ని తీవ్రంగా తగ్గించడం, ప్రభుత్వ కంపెనీల ప్రైవేటీకరణ వంటి సిఫార్సుల అమలు వల్ల లక్షలాది మంది కష్టాల పాలయ్యారు. నాయకులకు రాజకీయంగా తీవ్రనష్టం కల్గింది.

2001 సంవత్సరంలో అర్జెంటైనాలో అభివృద్ధి చెందుతున్న మధ్య తరగతి ప్రజలు ముఖ్యంగా ప్రభుత్వోద్యోగులు దారిద్ర్యంలోకి నెట్టబడ్డారు. 1998లో ఇండోనేషియాలో సుదీర్ఘకాలం అధికారంలో వున్న నియంత జనరల్ సుహార్తోను పదవీచ్యుతుని చేసే ముందు, ఆందోళనకారులు రాజధాని నగరంలోని షాపింగ్ మాల్స్‌ను, ఇతర వ్యాపార సంస్థలను దగ్ధం చేశారు. అదే సంవత్సరంలో రష్యాలో స్టాక్ మార్కెట్ 3/4 వంతు విలువ కోల్పోయింది. వార్షిక ద్రవ్యోల్బణం 80%కి చేరింది.

ప్రస్తుతం ఈ దేశాల్లో నెలకొన్నటువంటి అస్థిర పరిస్థితులేర్పడతాయని భయపడే ప్రారంభంలో ఈ దేశాల్లోని అధికారులు ఈ కఠిన సంస్కరణలను వ్యతిరేకించారు. అయితే ఐఎంఎఫ్ నుండి ఆర్థిక సహాయం పొందాలనే ఏకైక ఆశతో, అంతర్జాతీయ సంస్థల షరతులను ఆమోదించడం తప్ప గత్యంతరం లేదని భావించి వారు చివరకు లొంగిపోయారు. ఈ విధమైన కఠిన మార్పులను డిమాండు చేసే సందర్భంలో ఐఎంఎఫ్, అమెరికా విధానకర్తలు "వాషింగ్టన్ కాన్సెన్సస్" అని చెప్పుకుంటున్న ఒక ఆర్థిక విధానాన్ని అనుసరిస్తున్నారు. బెర్లిన్ గోడ కూల్చివేత, మాజీ సోషలిస్టు దేశాలు మార్కెట్ ఆర్థిక విధానాలకు మరలడంతో ఉత్సాహం పొందిన సామ్రాజ్యవాదులు, సుదీర్ఘకాల, స్థిరమైన అభివృద్ధి కోరుకుంటున్న దేశాలు నియంత్రణలు తొలగించడం, ప్రైవేటీకరణ, స్వేచ్ఛా వాణిజ్య విధానాలననుసరించడమే ఏకైక మార్గమని ప్రబోధించారు.

ఈ సమయంలో కూడ కొందరు అమెరికా మేధావులు సంక్షోభ పరిస్థితుల పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే ముఖ్యమైన ఆర్థిక సంస్థలు విఫలమైనప్పటికీ, కొద్దిపాటి ప్రభుత్వ సహాయంతో మార్కెటు శక్తులు తమంత తామే పరిస్థితిని చక్కదిద్దగలవని, మార్కెట్ భాగస్వాములు, విధాన కర్తలు మరికొందరు మాత్రం గట్టిగా నమ్ముతున్నారు. నిస్సందేహంగా వారు పొరపాటు అభిప్రాయంతో వున్నారు.

## అంతంగాని ప్లేటు ఫిరాయింపు

స్వేచ్ఛా మార్కెట్ విధానాలు, ప్రభుత్వ జోక్యం వుండరాదనే తమ సూత్రాలను తుంగలో తొక్కి, అమెరికా ప్రభుత్వం, ఐరోపా దేశాల ప్రభుత్వాలు సంక్షోభం తీవ్రమవుతున్న కొద్దీ బెయిలవుట్ల మీద, బెయిలవుట్లు ప్రకటిస్తున్నాయి. 2008 అక్టోబర్ 13న జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లు తమ

ఆర్థిక రంగాలకు 7.3 లక్షల కోట్ల అమెరికన్ డాలర్లు బెయిలవుట్ ప్యాకేజీలను ప్రకటించాయి. ఒడ్డున పడి గిలగిలా కొట్టుకుంటున్న చేపలావున్న తన ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు యుకె ప్రభుత్వం 65 వేల కోట్ల డాలర్ల ప్రణాళికను ప్రకటించింది. ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడేందుకు అమెరికా ఇప్పటికే ఖర్చుచేసిన మొత్తంతో బాటు, ఖర్చు చేయడానికి ప్లాన్ చేసిన మొత్తాన్ని కలుపుకుంటే 1.7 లక్షల కోట్ల డాలర్లుంటుంది. ఈ దేశాల బెయిలవుట్ మొత్తం, భారత దేశం స్వాతంత్ర్యం సాధించుకున్న నాటి నుండి ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తానికి రెండు రెట్లకు పైగా వుంటుంది.

ఘనీభవించిన ఆర్థిక ప్రపంచంలో విశ్వాసం పునరుద్ధరించడానికి, పెట్టుబడులను అందుబాటులోకి తెచ్చేందుకు, తొమ్మిది పెద్ద బ్యాంకులు మరియు మైనారిటీ ఈక్విటీ వాటాల్లో 25 వేల కోట్ల డాలర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించి, అమెరికా ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ పాక్షిక జాతీయీకరణను చేపట్టింది. 1929లో ప్రారంభమైన "మహాపతనం" తర్వాత ఇదే ప్రభుత్వ భారీ జోక్యమని అందరూ అంగీకరిస్తున్నారు. ప్రభుత్వం తన మైనారిటీ ఈక్విటీకి బదులుగా, ప్రధానమైన నియామకాలు, డివిడెండ్ల పెంపుదల వంటి విషయాల్లో షరతులు విధించడంతోపాటు ప్రభుత్వం వ్యవస్థాపరమైన నియంత్రణలు కూడ విధిస్తున్నట్లు వెల్లడైంది. ఈ నిర్ణయాలను ప్రకిటిస్తూ, ఆనాటి అమెరికా అధ్యక్షులు బుష్, "మార్కెట్లు నిలదొక్కుకుని, ప్రైవేటు పెట్టుబడిదారుల నుండి పెట్టుబడులు సమీకరించగల్గిన శక్తి సంతరించుకున్న తర్వాత, ప్రభుత్వం నుండి తిరిగి వాటాల కొనుగోలుకు బ్యాంకులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రణాళికను జాగ్రత్తగా రూపొందించామని" ప్రకటించారు. అంటే స్వేచ్ఛా మార్కెట్ సూత్రాలను అమెరికా ప్రభుత్వం విడనాడిందని, కేవలం మరణశయ్య మీద వున్న రోగికి ప్రాణాలు కాపాడే ఇంజక్షన్ల వంటి తాత్కాలిక చర్యలే ఈ బెయిలవుట్ ప్యాకేజీలని విమర్శిస్తున్నవారికి బుష్ ఈ విధంగా హామీ ఇవ్వదలిచారన్నమాట.

అభివృద్ధి చెందిన దేశాల్లో వలెనే, కొన్ని ఇతర దేశాల్లో కూడ రుణ సౌకర్యం కుంచించుకుపోతోంది. రష్యాలో గత కొద్ది సంవత్సరాల్లో సులువైన పరపతి సౌకర్యం, నిజవేతనాల్లో పెరుగుదల వల్ల వస్తు వినియోగం పెద్ద ఎత్తున పెరిగింది. "తేలికగా లభించిన రుణాలు వస్తు వినియోగంలో విజృంభణకు ప్రధాన కారణం" అని అన్‌టాంటా పయోగ్లోబల్ అనే మాస్కోలోని బ్రోకరేజి సంస్థకు చెందిన సీనియర్ ఎనలిస్ట్ అలెగ్జాండర్ పొటాలిన్ పేర్కొంటూ "ప్రస్తుతం బ్యాంకుల నుండి అప్పులు దొరకడం కష్టం" అని అన్నారు.

అమెరికాకు ఎగుమతులు చేసే పరిశ్రమలు, గృహరుణాలు, చైనా ఆర్థిక వ్యవస్థలోని రెండు ప్రధాన బలహీనతలు. ఫలితంగా చైనా ఆర్థిక వ్యవస్థలో ఇబ్బందులకు సంబంధించిన సంకేతాలు వెలువడడంతో, ఆర్థిక వ్యవస్థను క్రమపద్ధతిలో పెట్టేందుకు చైనా ప్రభుత్వం ప్రభుత్వ ఖజానా నుండి బిలియన్ల డాలర్లు విడుదల చేసింది.

## ఐరోపా, ఆసియా దేశాధినేతల బీజింగ్ శిఖరాగ్ర సభ

గత కొద్ది సంవత్సరాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కారణమైన చైనా, ఇండియా, రష్యా, బ్రెజిల్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని వినిమయదారుల మీద, ప్రపంచ రుణ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపడం ప్రారంభమైంది.

అమెరికా మరియు ఐరోపా దేశాల ఆర్థిక వ్యవస్థల బలంతో సాధించిన ప్రపంచ ఆర్థికాభివృద్ధిమీద, ప్రస్తుత సంక్షోభం ప్రభావం చూపింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ చిక్కులో పడడంతో, ఆ దేశాల్లోని ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందకోడి పరిస్థితిని అభివృద్ధి చెందుతున్న దేశాలు అవకాశంగా తీసుకోగలవనే ఆశవుండేది. అయితే పాశ్చాత్య దేశాల ప్రభావం వినియోగదారుల మీద పడి నాలుగు పెద్ద ఆర్థిక వ్యవస్థలు (యుఎస్, యూరోజోన్, చైనా, జపాన్) మాంద్యంలోకి జారి పోవడంతో ఆ ఆశలు ఫలించలేదు.

ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లో ఆసియా, ఐరోపా దేశాల నాయకులందరూ 2008 అక్టోబరు 23 నుండి 25 వరకు బీజింగ్‌లో సమావేశమై, ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి సమన్వయంతో స్పందించవల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ పరిణామం అమెరికాకు వ్యతిరేకంగా దౌత్యపరంగా పెరుగుతున్న చైనా పాత్రను సూచిస్తుంది. అయితే సంక్షోభానికి నిర్దిష్ట పరిష్కారాలు చూపడంలో సమావేశం విఫలమైంది. ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడానికి నూతన పద్ధతుల ననుసరించడం, నియంత్రణలను పెంచడం మధ్య సమతుల్యం విషయంలో వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులు, ఇతర నాయకులు, స్పష్టంగా నియంత్రణలవైపే మొగ్గు చూపారు. దీనినెలా సాధించాలో మాత్రం సంయుక్త ప్రకటన సూచించలేదు. "సమయోచితమైన, అవసరమైన చర్యలు తీసుకోవాలని" మాత్రమే ప్రకటన చెప్పింది. అయితే ఈ ప్రకటన నూతనత్వాన్ని పూర్తిగా త్రోసిపుచ్చనప్పటికీ, హాజరైన నాయకుల ప్రాధాన్యతల గురించి ప్రస్తావిస్తూ "ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆర్థిక విధానాల్లో నూతనత్వం నియంత్రణల మధ్య సక్రమమైన సంబంధాలను (సమతుల్యం) నిర్వహించడం ద్వారా, స్థూల ఆర్థిక వ్యవస్థను ఆరోగ్య వంతంగా నడపడం అత్యవసరమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆర్థిక రంగాలన్నింటి మీద పర్యవేక్షణ, నియంత్రణలను, ముఖ్యంగా ఈ సంస్థల జవాబుదారీ తనాన్ని మెరుగు పర్చాల్సిన అవసరాన్ని గుర్తించారు" అని ప్రకటన పేర్కొన్నది.

కొన్ని అంశాల్లో మరింత నియంత్రణ అవసరమని ఆనాటి అమెరికా అధ్యక్షులు బుష్, ఆయన సలహాదారులు కూడ అంగీకరించారు. తమ వినియోగదారుల అవసరాలు తీర్చేందుకు సురక్షితమైన, సమర్ధవంతమైన పద్ధతుల ననుసరించడానికీ నియంత్రణలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు ఆటంకాలు సృష్టించరాదని బుష్ పాలనా యంత్రాంగం పేర్కొన్నది. ఐరోపా, ఆసియా దేశాలకంటే ఎక్కువగా మార్కెట్ ప్రాధాన్యత కల్గిన విధానాలను ఎక్కువ కాలం అనుసరించిన అమెరికాకు ఆయా దేశాలతో వున్న ప్రధాన తేడాను ఇది ప్రతిబింబిస్తోంది. "నిస్సందేహంగా మా ఆర్థిక వ్యవస్థను సంస్కరించుకోవల్సిన అవసర ముందని మేము అర్థం

చేసుకున్నాం” అని అమెరికా ట్రెజరీ (అంతర్జాతీయ వ్యవహారాలు) అండర్ సెక్రటరీ డేవిడ్ హెచ్. మోకార్మిక్ చెప్పారు. ఈ సభలో ఇ.యు.కు చెందిన 27 సభ్యదేశాలు, ఆగ్నేయాసియా దేశాల సంస్థ (అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్ – ఎఎస్ఈఎన్‌లోని దేశాలు : ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, బ్రూనే, కంబోడియా, లావోస్, మయన్మార్ (బర్మా, వియత్నాం) కు చెందిన 10 సభ్యదేశాలతో పాటు చైనా, జపాన్, దక్షిణకొరియా, ఇండియా, పాకిస్తాన్ దేశాల అధినేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పరిస్థితిని చక్కదిద్దేందుకు తీవ్ర యత్నాలు - వాషింగ్టన్‌లో జి-20 సమావేశం

మరో ప్రధాన అంతర్జాతీయ సంస్థ కుప్పకూలకుండా చూసేందుకు ప్రపంచ వ్యాప్తంగా జాతీయ ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ పరోక్షంగా వెల్లడించారు. అయితే ఆ చర్యల గురించి ప్రస్తావించలేదు. యూరోపియన్ యూనియన్‌లోని ఐదు పెద్ద దేశాలు, జి–7 దేశాధి నేతల మధ్య వరుసగా అనేక సమావేశాలతో పాటు, వివిధ దేశాధినేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. చివరకు దిక్కుతోచని స్థితిలో వున్న జార్జ్ బుష్ చొరవతో 15.11.2008న వాషింగ్టన్‌లో జి–20 సమావేశం ఏర్పాటు చేయబడింది. బ్యాంకులకు నగదు సమకూర్చి వాటిని దివాళా నుంచి కాపాడేందుకు అమెరికా ప్రభుత్వం, ఫెడరల్ బ్యాంకులు పెద్ద ఎత్తున నిధులు గుప్పించాయి. భారత్‌లో రిజర్వ్ బ్యాంక్‌తో సహా వివిధ దేశాల్లోని ప్రభుత్వాలు ఇదే విధమైన చర్యలు చేపట్టాయి.

2008 నవంబరు 15న వాషింగ్టన్ డిసిలో జరిగిన జి–20 ప్రథమ ఆర్థిక శిఖరాగ్ర సభలో అమెరికా నాయకత్వంలోని జి–7 దేశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమై, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల స్వరం పెరగడంతో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దృశ్యంలో మార్పులు ద్యోతకమయ్యాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల సమూల సంస్కరణల ప్రాతిపదికగా 1944 నాటి బ్రెట్టన్ వుడ్స్ ఒప్పందం వంటి మరొక ఒప్పందానికి అవకాశం లేనప్పటికీ, ప్రపంచ ఆర్థికాధిపత్యంలో స్పష్టమైన మార్పును పరిశీలకులు గమనించారు. భారతప్రధాని శ్రీ మన్మోహన్ సింగ్, చైనా అధ్యక్షులు హుజింటావో, బ్రెజిల్ అధ్యక్షులు లూలాడి సిల్వాలతో సహా శిఖరాగ్రసభకు హాజరైన నాయకులు 47 స్వల్పకాలిక, మధ్యకాలిక లక్ష్యాలతో కూడిన నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో ఒక సంయుక్త ప్రకటన జారీ చేశారు. మరుసటి ఏడాది ఏప్రిల్‌లో రెండవ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జవాబుదారీతనాన్ని, పారదర్శకతను మెరుగుపర్చడం, ఆర్థిక పర్యవేక్షణ, నియంత్రణలను సంస్కరించడం, ఆర్థిక మార్కెట్ల విశ్వసనీయతను పెంచడం, అంతర్జాతీయ సహకారాన్ని అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను సంస్కరించడం అనే ఐదు ప్రధాన సూత్రాలను జి–20 అంగీకరించింది.

ఆర్థిక వ్యవస్థలను నిలకడగా వుండేలా చేసేందుకు, అంతర్గత వినిమయాన్ని ప్రోత్సహించేందుకు ద్రవ్య పరమైన చర్యలు చేపట్టేందుకు, శక్తివంతమైన ద్రవ్య విధానాల

ననుసరించేందుకు, ఐఎంఎఫ్ నుండి స్వల్పకాలిక నగదు మద్దతును ఆహ్వానించేందుకు నాయకులు అంగీకరించారు. రాబోయే మూడు నెలల్లో జి–20 దేశాలు, బ్యాంకులు, రుణ అంచనా కంపెనీల మీద పర్యవేక్షణను పటిష్టం చేయాలని, ఉన్నతాధికారుల జీతాలమీద పరిమితులు విధించాలని, ద్రవ్య, ఆర్థిక విధానాల ద్వారా, ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలోకి జారిపోకుండా జాగ్రత్త వహించాలని నిర్ణయించాయి.

నవంబరు 15న జరిగిన జి–20 దేశాల శిఖరాగ్ర సభ ప్రకటనను విశ్లేషిస్తే, ఆర్థిక సంక్షోభం మీద జరిగిన వాషింగ్టన్ సమావేశం, ప్రధాన రుణదాతల ప్రయోజనాలను మాత్రమే పరిరక్షిస్తుందని స్పష్టమవుతుంది. ప్రపంచ వ్యాప్త సంక్షోభానికి ప్రపంచ వ్యాప్త పరిష్కారం కనుగొనేందుకుద్దేశించిన జి–20 సమావేశం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కాక, జి–20 దేశాల పరిధికే పరిమితమైంది. జి–20 సమావేశంలో సమస్యకు మవులిక పరిష్కారాన్ని కావాలనే దాటవేయడంతో, ప్రధాన పారిశ్రామిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలను ఒకచోట చేర్చిన ఈ జి–20 దేశాల వాషింగ్టన్ సమావేశం దారుణంగా విఫలమైంది.

అనాయమైన, నిలకడలేని ఆర్థిక నమూనాను ప్రోత్సహించే వారినే ఆ నమూనా ఆర్థిక వ్యవస్థలను కాపాడవల్సిందిగా కోరడం జరిగింది. ఈ సమావేశం ముందుకు తెచ్చిన పరిష్కారాలు ప్రధాన రుణదాతల ప్రయోజనాలను పరిరక్షిస్తాయి. యధావిధిగా పేద దేశాలను గాని, పేద ప్రజానీకాన్ని గాని సంప్రదించలేదు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలకు న్యాయకత్వం వహిస్తున్న దేశాలు తమ గత అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకోలేదని చెప్తూ, "గత కాలం నాటి దెయ్యాలింకా మనలను వెంటాడుతూనే వున్నాయి" అని కొందరు విమర్శకులు పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలుగా ఐఎమ్ఎఫ్ ప్రపంచ బ్యాంకులు బలవంతంగా అమలు చేసిన విధానాల వైఫల్యాల వల్ల ఈ సంస్థలు మరింతగా న్యాయబద్ధతను కోల్పోయినప్పటికీ, సమావేశం చూపిన పరిష్కారాలకు ఆ సంస్థలు చేపట్టిన చర్యలే ఆధారమయ్యాయి.

ఒక ప్రక్క స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధానం కుప్పకూలుతున్నప్పటికీ భారత ప్రధాని శ్రీ మన్మోహన్‌సింగ్, త్వరలో పదవి నుండి వైదొలగనున్న అమెరికా అధ్యక్షులు జార్జ్‌బుష్‌లు ఈ వ్యవస్థ మీద పొగడ్తల వర్షం కురిపించారు. వేరొక ప్రక్క సంక్షోభానికి "మార్కెట్ నిరంకుశత్వమే" కారణమని తీవ్ర పదజాలంతో నిందించడం ద్వారా, ఫ్రాన్స్ అధ్యక్షులు నికోలస్ సర్కోజీ "అమెరికా స్వేచ్ఛా మార్కెట్ నమూనా"ను దుయ్యబట్టారు. అమెరికాలో తయారైన సంక్షోభానికి ప్రపంచ దేశాలన్నీ గురవుతున్నాయని, రష్యా అధ్యక్షులు డిమిత్రీ మెద్వెదేవ్ ఘాటుగా విమర్శించారు. అయినప్పటికీ, స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధానమే, భారత్‌తో సహా ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలోని ఆర్థిక వ్యవస్థలను శాసిస్తుందని అమెరికా అధ్యక్షులు బుష్ ప్రకటించినప్పటికి భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆయనతో జట్టుకలిశారు.

## పెన్షన్ నిధులను తిరిగి జాతీయం చేసిన అర్జెంటైనా

పెన్షన్ నిధుల నుండి లక్షల కోట్ల డాలర్లు తుడిచి పెట్టుకుపోయినప్పటికీ, ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల ప్రభుత్వాలు గుణపాఠాలు నేర్చుకునేందుకు ఇష్టపడని నేపథ్యంలో, 3 వేల కోట్ల అమెరికన్ డాలర్ల ప్రైవేటు పెన్షన్ నిధులను జాతీయం చేస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని అర్జెంటైనా వామపక్ష ప్రభుత్వ అధ్యక్షులు క్రిస్టీనా ఫెర్నాండెజ్, 2008 అక్టోబర్ 21న బిల్లు మీద సంతకం చేశారు. ప్రపంచ మార్కెట్లు తీవ్ర సంక్షోభంలో వున్న సమయంలో కష్టజీవుల పెన్షన్లకు గ్యారంటీ ఇవ్వడం పట్ల కార్మిక నాయకులు, పాలక పెరోనిస్టు పార్టీ విధాన నిర్ణేతలు, కొన్ని ప్రతిపక్షాలు కూడ హర్షం వ్యక్తం చేశాయి. అర్జెంటైనాలోని పెన్షన్ ఖాతాలను, దేశంలోని పది పెద్ద వ్యవస్థాగత పెట్టుబడిదారుల అధీనంలోని ప్రైవేటు పెన్షన్ నిర్వాహకులే నడుపుతున్నారు. ఈ పెన్షన్ నిధులకు ఏటా 400 కోట్ల డాలర్లకు పైగా జమ చేయడం జరుగుతోంది. కనీస పెన్షన్‌కు గ్యారంటీ లేకపోవడంతో పాటు, హెచ్చు కమిషన్ల వసూలు వల్ల ప్రైవేటు పెన్షన్ వ్యవస్థ ప్రజాదరణ కోల్పోయింది.

## కొన్ని గుణపాఠాలు

## ఈ పరిణామాల నుండి ఏం నేర్చుకున్నాం ?

**మొదటిది :** అమెరికా పాలనా వ్యవస్థ, దాని ఆర్థికవ్యవస్థ ఒత్తిడితో, ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యంలో, ప్రధానంగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నయా ఉదారవాద ఆర్థిక ఎజండాలో భాగంగా అమలు చేయబడుతున్న స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధానం యొక్క నిలకడలేని, భయంకరమైన స్వభావం బహిర్గతమైంది. విద్య, వైద్యం, ఉపాధికల్పన, గృహవసతి, కల్పనతో పాటు వివిధ ప్రజాసంక్షేమ చర్యల విషయంలో ప్రభుత్వ జోక్యాన్ని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడాన్ని ఏవగించుకోవడం పరిపాటయింది. ప్రభుత్వ రంగం, ప్రభుత్వ సంస్థల పట్ల, ప్రభుత్వ సంస్థలు శ్రామికులకు సామాజిక భద్రతా చర్యలు చేపట్టడం పట్ల విద్వేషం వెళ్ళగ్రక్కడం జరుగుతోంది. మార్కెట్ శక్తుల మీద పూర్తిగా ఆధారపడాలన్న ప్రచారం ముమ్మరంగా సాగింది. ఈ విధానాల వల్ల చివరకు భారతదేశంతో సహా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నేటి అధోగతికి చేరుకుంది. అమెరికా కార్మికశాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఇప్పటికే 7,60,000ల మంది ఉద్యోగాలు కోల్పోగా, పది లక్షల మంది నిరాశ్రయులయ్యారు. అమెరికా తదితర దేశాల్లో రిట్రెంచ్‌మెంట్లు, ఉద్యోగాల్లో కోతల గురించిన వార్తలు వెల్లువెత్తుతున్నాయి. తాజా వార్త ప్రకారం, అమెరికా కేంద్రంగా పనిచేసే సిటీ బ్యాంక్ గ్రూప్ ఖర్చులు తగ్గించుకునేందుకు 53 వేల ఉద్యోగాల్లో కోత విధించనున్నట్లు తెలుస్తోంది. ఇది 2008 సంవత్సరాంతానికున్న పరిస్థితి.

**రెండవది :** 1929లో స్టాక్ మార్కెట్, బ్యాంకుల పతనంతో ప్రారంభమైన ప్రమాద భరితమైన "మహాఆర్థిక పతనం", భారీ నిరుద్యోగంతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా సాధారణ ప్రజలకు తీవ్ర ఆర్థిక అవస్థలను తెచ్చిపెట్టింది. ఆ తర్వాత నేడు సంభవించిన ఈ "వాల్ స్ట్రీట్

ఆర్థిక పతనం" అతిపెద్ద ప్రపంచ వ్యాప్త ఆర్థిక పతనాన్ని సృష్టించిందని, అమెరికా ఆర్థిక నిపుణులుసైతం బహిరంగంగా ప్రకటిస్తున్నారు. (వాల్‌స్ట్రీట్ : న్యూయార్క్‌లో అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజి తదితర ప్రధాన ఆర్థిక సంస్థలున్న ప్రదేశం).

**మూడవ పాఠం :** స్టాక్ మార్కెట్‌ను భగవంతునిగానో, లేదా పెట్టుబడి విధానం యొక్క అవతారంగానో పూజించడం ఎంత మోసపూరితమో, మూర్ఖత్వమో బట్ట బయలైంది. సెన్సెక్స్ వంటి స్టాక్ మార్కెట్ సూచీలు దేశ ఆర్థిక ప్రగతికి ఏకైక ప్రమాణంగా నిలుస్తాయి కనుక, భారతదేశంతో సహా అన్ని పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఈ స్టాక్ మార్కెట్లను బలపర్చడమే పనిగా పెట్టుకున్నాయి.

**చివరిది :** అత్యంత ప్రధానమైన పాఠం. సామ్రాజ్యవాద, ద్రవ్య పెట్టుబడి యుగంలో పెట్టుబడిదారీ విధాన సంక్షోభ కాలంలోనూ, తర్వాత" ఏవిధమైన సంక్షోభం తలెత్తనుందో వివరిస్తూ మార్క్స్ సూత్రీకరణలను అన్వయిస్తూ చేసిన పాల్ స్వీజీ వంటి ప్రముఖ మార్క్సిస్టు పండితులు వివరణలిచ్చారు. మహాపతనం తర్వాత పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికనుసరించిన పరిష్కారమార్గాలనందించిన ప్రముఖ పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్త జాన్‌మేనార్డ్ కీన్స్ ఈ అంశం మీద "ది జనరల్ థియరీ ఆఫ్ ఎంప్లాయిమెంట్, ఇంటరెస్ట్ అండ్ మనీ" (ఉపాధి, వడ్డీ, మరియు డబ్బుకు సంబంధించిన సాధారణ సూత్రం") అనే తన గ్రంథంలో వివరించారు. ఆ గ్రంథంలోకి 12వ అధ్యాయంలో "నిలకడగా వున్న వ్యవస్థాగత ప్రవాహంలో కొన్ని బుడగల వలె స్పెక్యులేటర్లు అపాయం కల్గించకపోవచ్చు. అయితే అసలు వ్యవస్థే బుడగ గా మారి స్పెక్యులేషన్ సుడిగుండంలో చిక్కుకున్న పక్షంలో పరిస్థితి ప్రమాదకరంగా వుంటుంది" అని పేర్కొన్నారు. ఈ ప్రముఖ బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్త "స్పెక్యులేషన్ సుడిగుండంలో చిక్కుకున్న బుడగ" ఏమిచేయగలదో సూచన ప్రాయంగా చెప్పాడు. ఈ బుడగ బద్దలైతే ఏం జరుగుతుందో తెలిపే ఒక విభిన్న ఉదాహరణే "వాల్ స్ట్రీట్ పతనం." ఇటీవలనే అర్థశాస్త్రంలో నోబుల్ బహుమతి పొందిన పాల్ క్రుగ్మన్ కూడ, నేడు బద్దలైన అమెరికా ఆర్థిక సంక్షోభం గురించి 2001 సంవత్సరంలోనే హెచ్చరించారు.

## ప్రపంచంలో ఆర్థిక మాంద్యం తిరుగుముఖం పడుతోందా?

అమెరికా అధికార వర్గం, పెట్టుబడిదారీ పాలకులు, కార్పొరేట్ ప్రసార సాధనాలు, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం తిరుగుముఖం పడుతోందని నమ్మబలుకుతున్నారు. వాస్తవ పరిస్థితిని పరిశీలిద్దాం. 2009 మే నెలలో అమెరికాలోని యజమానులు 3,45,000 ఉద్యోగాల్లో కోత విధించారని, గత సెప్టెంబరు నుండి చూస్తే ఇది చాలా తక్కువని అంచనా వేసిన దాని కంటె కూడ తక్కువేనని, ఆర్థిక వ్యవస్థలోని తీవ్ర బలహీనతలు తగ్గుముఖం పట్టాయని, ఇటీవలి ప్రభుత్వ నివేదిక పేర్కొంది. అయితే వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి 2009 మే నెలలో 5,20,000 తగ్గిపోయిందని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. నిరుద్యోగం 9.2 శాతానికి పెరుగుతుందని అంచనా వేయబడింది. 2009 మే నెలలో ఉద్యోగుల్లో కోత అన్ని రంగాలకు

విస్తరించిందని, అయితే గత నెలల్లో కంటే లే ఆఫ్‌ల వేగం కాస్త తగ్గించిందని కూడ అంచనా వేయడం జరిగింది.

నిర్మాణ రంగంలో 2009 ఏప్రిల్‌లో 1,08,000 ఉద్యోగాలు తగ్గిపోగా, మే నెలలో 59 వేల మేరకు తగ్గాయి. బహుశ ఇది ప్రభుత్వం అమలు చేసిన 78,700 కోట్ల డాలర్ల చారిత్రాత్మక ఉద్దీపన పథకాల ఫలితం అయివుంటుంది. సేవలందించే పరిశ్రమల్లో 2009 ఏప్రిల్‌లో 2,30,000 ఉద్యోగాలు రద్దు చేయగా, మే లో 1,20,000 మందికి ఉద్వాసన చెప్పారు. 2009 మేనెలలో ఉత్పాదక రంగంలో 1,56,000 మంది ఉద్యోగులను తొలగించగా, అదే ఏడాది ఏప్రిల్‌లో 1,54,000 మందికి ఉద్వాసన చెప్పింది. క్రిస్లర్ కార్ల కంపెనీ దివాళా ప్రకటించి, ప్లాంటును మూసివేసిన ప్రభావం ఇక్కడ కన్పడుతుంది.

మునిగిపోతున్న ఆర్థిక వ్యవస్థను గట్టుకు చేరుస్తాననే వాగ్దానంతో ఏడాది క్రితమే ఎన్నికైన అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారకుండా నివారించగల్గినందుకు ఆయనను అభినందించాలి. అయితే ఆర్థిక వ్యవస్థలో సాధించిన మెరుగుదలను, ఆయన రాజకీయ భవితవ్యాన్ని తుడిచిపెట్టగల స్థాయిలో "తీవ్ర నిరుద్యోగ సంక్షోభాన్నె"దుర్కొంటున్నాడు.

అమెరికన్ ఫెడరల్ రిజర్వు తీసుకున్న చర్యల పరంపరతో పాటు, ఒబామా ప్రభుత్వ సత్వర చర్యల ఫలితంగా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారకుండా నివారించబడిందని ఆర్థిక శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నప్పటికీ, దీని ఉపాధి రహిత స్వభావం వల్ల మరిన్ని సమస్యలు సృష్టించబడడంతో పాటు, మాంద్య పరిస్థితుల నుండి ఆర్థిక వ్యవస్థను బయటకు లాగడంలో సాధించిన ప్రగతిని ఇది వమ్ముచేయగలదని కొందరు విశ్లేషించారు. మెరుగుపడ్తున్న ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతున్నప్పటికీ ఉపాధి రాహిత్యం కొంత కాలం పాటు తీవ్రంగా పెరుగుతుందని, అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆర్థిక సలహా మండలి అధ్యక్షురాలు క్రిస్టీనా రోమర్ ఇటీవల శాసనకర్తల సమావేశంలో పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కనీసం 2.5% నిలకడైన అభివృద్ధి కీలకమైనదని చెప్తూ, రాబోయే త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థను ఆ మేరకైనా విస్తరించాల్సిన అవసరముందని, దాదాపు అన్ని అంచనాలు తెల్పుతున్నాయన్నారు. ఆర్థిక ఉద్దీపన పథకాలు లేనట్లయితే పరిస్థితి మరింత దారుణంగా వుండేదని ఆమె చెప్పారు.

దాదాపు 80 వేల కోట్ల డాలర్ల ఒబామా ఉద్దీపన పథకాలు 10 లక్షలకు పైగా ఉద్యోగాలను సృష్టించడం గాని, పరిరక్షించడం గాని చేశాయని అమెరికా ప్రభుత్వాధికారులు పేర్కొన్నారు. ఫెడరల్ రిజర్వ్‌తో కలిసి పాలనా యంత్రాంగం సంక్షోభాన్ని అదుపు చేయడంలో సహాయ పడిందని డూయిష్ బ్యాంక్ డిబి అడ్వైజర్స్, చీఫ్ ఎకనమిస్ట్ జోష్ ఫెయిన్‌మన్ అన్నారు. "ఈ విధానంలో సమస్యలు లేకుండా లేవు. కాని ఆర్థిక వ్యవస్థకు నిలకడను చేకూర్చి, ఉత్తేజాన్నివ్వడంలో ఈ విధానం మొత్తం మీద జయప్రదమైంది" అని కూడ ఆయన పేర్కొన్నారు. కోలుకున్న ఆర్థిక వ్యవస్థను నిలకడగా కొనసాగించడానికవసరమైన ఉద్యోగాల కల్పనకు క్రొత్త

ప్రోత్సాహకాల విషయమై ఇప్పుడు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. "కొన్ని లక్షిత పన్ను రాయితీల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేయవచ్చని" ఆయన అన్నారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చేందుకు 78,700 కోట్ల డాలర్ల గ్రాంటుకు సంబంధించిన బిల్లును ఒబామా ఫిబ్రవరిలో ఆమోదింప జేసుకున్నారు. ఈ ఉద్దీపన ద్వారా 6,50,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని అమెరికా అధ్యక్షభవనం వైట్ హౌస్ వర్గాలు చెప్పుకున్నాయి. 2008 మూడవ త్రైమాసికంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ 3.5% వృద్ధి రేటు సాధించింది. ప్రభుత్వ నిధులు గుప్పించడం కొంత మేరకు ఇందుకు కారణం. ప్రపంచం కనీవినీ ఎరుగని రీతిలో 68 వేల కోట్ల డాలర్ల అత్యధిక మిలిటరీ బడ్జెటును కూడ అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించింది. అధ్యక్షుడు ఒబామాను వేధించే మౌలికమైన ఉపాధి కల్పన సమస్య కొనసాగుతూనే వుంది. ఉద్యోగాలు పరిరక్షించబడ్డాయనేది వాస్తవమని, వీటి సంఖ్యను లెక్కించవచ్చని, ఇప్పటికీ నిస్తేజంగా వున్న పని ప్రదేశాల్లో ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకున్న బ్రహ్మాండమైన సామర్థ్యం వెల్లడవుతోందని ఆయన బుకాయించారు. నిలబెట్టామని చెప్పుకునే ఉద్యోగుల సంఖ్యను లెక్కించే న్యాయబద్ధమైన మార్గమేమీ లేదనే విషయం గమనంలో వుంచుకుంటే, ఇది "కేవలం ఉద్యోగాలు కల్పించకుండానే" ఆర్థిక వ్యవస్థ మెరుగు పడ్తుందనే నమ్మశక్యంగాని విషయాన్ని, మనతో నమ్మించేందుకు ఉద్దేశించిన ఎత్తుగడ మాత్రమే.

ఒబమాకు ముందు కూడ ప్రతి అధ్యక్షుడు ఉద్యోగాల కల్పన విషయంలో కష్టాలనెదుర్కొన్నారు. 1) నిరుద్యోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 8 శాతం గీత దాటనీయమని, 2) ఎకనమిక్ రికవరీ చట్టం ప్రకారం కల్పించిన క్రొత్త ఉద్యోగాల్లో 90% ప్రైవేటు రంగంలోనే వుంటాయన్న రెండుప్రధాన విషయాల్లోనూ ఒబామా ప్రభుత్వం వాగ్దాన భంగానికి కొడిగట్టింది. 2009 మధ్యకాలంలో అమెరికాలో నిరుద్యోగం 10.2%కి పెరిగింది.

## ఆర్థిక మాంద్యం తొలగిపోలేదు - జోసెఫ్ స్టిగ్లిట్జ్

కొంత మెరుగుదల వున్నప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యకరంగా లేదని, మాంద్య పరిస్థితులు ఇంకా కనుచూపు మేరలోనే వున్నాయని, 2001 సం॥లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన కొలంబియా యూనివర్శిటీ ప్రొఫెసర్ జోసెఫ్ స్టిగ్లిట్జ్ 2.11.2009న కోపెన్ హాగెన్ (డెన్మార్క్)లో ఒక పత్రికా సంపాదకుల సమావేశంలో పేర్కొన్నారు. ఆయన సోషలిస్టు ఆర్థికశాస్త్ర వేత్తకాదు. పెట్టుబడిదారీ విధానం మీద నమ్మకమున్నవాడు.

"ప్రైవేటు రంగంలో భారీస్థాయిలో వనరులు వృధా అవుతున్నాయి. పెట్టుబడులను అనుకూల సమయంలో, పొరపాటుగా కేటాయింపులు చేయడం వల్ల ప్రైవేటు రంగం విఫలమైంది. ఆ నష్టాల్లో కొంత భాగాన్ని మనం మోస్తున్నాము. సంక్షోభం తర్వాతనే సంక్షోభ భారాలధికంగా ప్రజల మీద పడుతాయి. వనరుల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోలేక పోవడం ఇందుకు మరో కారణం. ఆర్థిక సంక్షోభం యొక్క సవాళ్ళ నెదుర్కొనే క్రమంలో చాలా ప్రభుత్వాలు భారీగా అప్పులు మూటగట్టుకోవడం మిక్కిలిఆందోళన కల్గిస్తోంది. వాతావరణ మార్పుల వంటి ప్రాధాన్యత

గల్గిన అంశాలమీద ఖర్చు పెట్టడానికి వీరు వెనకాడుతున్నారు. పర్యావరణ పరిరక్షణ వంటి ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పని చేయడానికి, దూరదృష్టిలేని రాజకీయ నాయకులు ఆటంకంగా తయారయ్యారు" అని కూడ ఆయన అన్నారు.

ఈ పత్రికా ఎడిటర్లకు స్టిగ్లిట్జ్ ఇచ్చిన ఇంటర్వ్యూను అమెరికాకు చెందిన "జార్జియన్ టైమ్స్" పత్రిక ఎడిటర్–ఇన్–చీఫ్ కెటెవాన్ కాషిడ్జ్ అందజేసిన వివరాలు పొందుపరుస్తున్నాం.

**ప్రశ్న : వాతావరణ మార్పుల మీద కేంద్రీకరించడం వల్ల పేదరికాన్ని తగ్గించే విషయం నుండి దృష్టి మళ్ళుతోంది. దీనివల్ల పేదరికంలో జీవిస్తున్న కోట్లాది మందికి తీవ్ర నష్టం వాటిల్లదా?**

**జవాబు :** మొదట నష్టం జరిగినా, తర్వాత ప్రయోజనం చేకూరవచ్చు. ఇందుకు రెండు ఉదాహరణలిస్తాను. రెయిన్ ఫోర్స్ కూటమి (వర్షాలకు కారణమవుతున్న అడవుల పరిరక్షణకు కట్టుబడి) పేరిట సంఘటితమైన దేశాలతో కలిసి మేము కొలంబియా యూనివర్శిటీలో పనిచేయడం ప్రారంభించాము. ఈ కూటమి "అడవుల నిర్మూలనను" నివారించాలనే అభిప్రాయంతో ముందుకు వచ్చింది. వాతావరణంలోని కార్బన్‌ను వేరుచేసి రిజర్వాయర్‌లో నిల్వ చేయడం (కార్బన్ స్టోరేజి), కార్బన్ డయాక్సైడ్‌ను కూడా తొలగించి సుదీర్ఘకాలం నిల్వచేసే (SEQUESTRATION) ప్రక్రియ ద్వారా భూమి ఉష్ణోగ్రత పెరగకుండా వుంచేందుకు, లేదా తగ్గించేందుకు రెయిన్‌ఫోర్స్ కూటమి ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలు, ప్రపంచ ప్రజానీకానికెంతో మేలు చేస్తున్నాయి. దీనివల్ల జీవవైవిధ్యాన్ని కాపాడుకుని పర్యావరణ పరమైన ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఈ సందర్భంగా జరిగే భారీ వ్యయానికేవిధమైన నష్టపరిహారం ఆదేశాలకు లభించడం లేదు. అంటే భూమి మీద పర్యావరణానికి తీవ్ర నష్టం కల్గించైనా, "ప్రజా ప్రయోజనాలను పరిరక్షించనందుకు" ప్రోత్సహకాలు ఇస్తున్నారన్నమాట. అభివృద్ధి చెందుతున్న ఈ రెయిన్‌ఫోర్స్ కూటమి దేశాలు తమ కార్యకలాపాలకు ప్రోత్సాహకాలు పొందేందుకు వీలుగా, వారికి ఆర్థిక సహాయమందిస్తే, అది ఆ దేశాలు అభివృద్ధి చెందడానికి, వేరొక ప్రక్క వాతావరణంలో వస్తున్న ప్రతికూల మార్పులను నివారించేందుకు సహాయపడ్తుంది. వాతావరణ మార్పులు, పేదరికం తగ్గింపు అనే అంశాలు పరస్పర పూరకాలుగా వుంటాయనేందుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే. దీనిని గురించి మరింత లోతుగా పరిశోధించడం ప్రధానమైన అంశం. మనం వాతావరణ మార్పుల గురించి కొంత మేరకైనా కృషి చేయకపోతే, అది మరింత పేదరికాన్ని సృష్టిస్తుందని మనకు పూర్తిగా తెలుసు. కోపెన్‌హాగన్ చర్చల (2009 డిసెంబరులో ఐ॥రా॥స ఆధ్వర్యంలో వాతావరణ మార్పుల మీద సమావేశం డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో జరిగింది) వైఫల్యం పేదరికం మరింత పెరగడానికి ప్రధాన కారణమైంది. పేదరికం, వాతావరణ మార్పులు అనే రెండు అంశాలు సన్నిహిత సంబంధం కల్గినవి. మనం సరైన చర్యలు తీసుకుంటే అవి పరస్పర పూరకాలుగా వుంటాయి.

**ప్రశ్న: ద్రవ్య సూచీలు మెరుగుపడుతున్నందున, నూతన వ్యూహాలు రూపొందించేందుకిది సరైన సమయం కాదా?**

**జవాబు :** ఏడాది క్రితం కంటె పరిస్థితులు స్పష్టంగా మెరుగయ్యాయి. మనం కష్టాల నుండి గట్టెక్కాం. కాని వాస్తవిక దృక్పథంతో చూస్తే, ప్రపంచ వ్యాప్త ఆర్థిక మాంద్యం కనుచూపు మేరలోనే వుంది. వరుసగా అన్ని త్రైమాసికాల్లో పడిపోతున్న స్థూల జాతీయోత్పత్తి (కుంచించుకుపోతున్న ఆర్థిక వ్యవస్థ)ని బట్టి ఆర్థిక శాస్త్రవేత్తలు సంక్షోభాన్ని గురించి ప్రస్తావిస్తున్నారు. అయితే అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకు, ఆర్థిక మాంద్యం అంటే, తాము ఉద్యోగం సంపాదించుకోగలమా? లేదా? అనే భయం. గృహ యజమానులకు ఇంటి మీద తమ యాజమాన్య హక్కును గురించిన భయంతో పాటు, దాని ధర 10, 20, 30 లేదా 40% తగ్గుతుందా? లేదా? అనే ఆలోచనలు. వ్యాపారస్తులకు తాము తమ శక్తి మేరకు ఉత్పత్తి చేసిన సరుకులు అమ్ముడుపోతాయా లేదా అనే భయం. ఈ అంశాలను దృష్టిలో వుంచుకుంటే, ఆర్థికమాంద్యం ఇంకా తొలగిపోలేదు. పైపెచ్చు వివిధ విషయాల్లో ప్రధానంగా ఉపాధికల్పన విషయంలో పరిస్థితి మరింత విషమించవచ్చు.

అమెరికాలో అధికారిక నిరుద్యోగం 9.8%గా వుంది. విస్తృత స్థాయిలో పరిశీలిస్తే కనీసం ప్రతి ఆరుగురు అమెరికన్లలో ఒకరు కూడ పూర్తికాలం ఉద్యోగం పొందలేక పోతున్నారు. ఈ లెక్కలు వేసేటప్పుడు, ఉద్యోగం దొరుకుతుందనే ఆశలేనివాడు, ఉద్యోగం లేకపోయినప్పటికీ, ఉద్యోగం కోసం వెదకడం మానివేసినవారు, పూర్తికాలం ఉద్యోగాలు దొరక్కపోవడంతో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్న వారందరినీ పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఉద్యోగం లభిస్తే పని చేయగల్గిన వందలాదిమంది, అంగవైకల్యం వున్న వారికి ప్రభుత్వం చెల్లించే జీతం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అమెరికాలో లేబర్ మార్కెట్ పరిస్థితి సంక్షోభం ప్రారంభం నాటికంటే దారుణంగా వుందనేది వాస్తవం. ఈ కోణంలో చూస్తే ఆర్థిక మాంద్యం కొనసాగుతోంది.

ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటే ఉద్యోగాలు వస్తాయని, ప్రభుత్వ వర్గాలతో పాటు కొందరు చెప్తున్నారు. ఇది నిజమే కాని, ఉద్యోగాలు సృష్టించగల్గిన స్థాయిలో ఆర్థిక వ్యవస్థ కుదుటపడలేదు. కార్మికులు 1% పెరుగుతుండగా, ఉత్పాదకత 2.5% పెరుగుతోంది. అంటే వృద్ధిరేటు 3% గాని అంతకంటె ఎక్కువగాని లేదు. అంటే లేబర్ మార్కెట్‌లో ఉద్యోగం చేయడానికి ఆసక్తి వున్నవారికి ఉద్యోగాలు కల్పించేందుకు కవసరమైనంత వేగంగా పనులు సృష్టించలేకపోతున్నాం. 2010-11 నాటికి ఈ వృద్ధిరేటు సాధించగలమని ఎవరూ జోశ్యం చెప్పలేరు. 2009 మూడవ త్రైమాసికంలో వృద్ధిరేటు బాగుంటుంది. కాని అది నిలకడగా వుండదు.

**ప్రశ్న: ప్రపంచ వ్యాప్తంగా వున్న అసమతుల్యాన్ని గురించి చర్చించిన జి-20 దేశాలు, అమెరికా ఎక్కువగా పొదుపు చేయాల్సిన అవసరం వుందని చైనా ఎక్కువ ఖర్చు చేసి, తక్కువ పొదుపు చేయాలని భావించాయి. మీ దృష్టిలో ఈ వ్యూహం సరైనదేనా?**

**జవాబు :** దీనిలో కొంత వాస్తవముంది. మనం వస్తు వినియోగాన్ని ఎక్కువగా ప్రోత్సహించకూడదు. ఇదీ అసలు సమస్య. వస్తు వినియోగపద్ధతుల్లో అమెరికాను

అనుసరించాలని ప్రపంచాన్ని ప్రోత్సహించకూడదు. అమెరికాలో అమలులో వున్న ఆచరణయోగ్యం కాని వినియోగ పద్ధతులననుసరించాలని చైనా కోరుకున్నంత కాలం ఈ భూమండలానికి వినాశనం తప్పదు. చైనా తన వినియోగ పద్ధతుల్లో గుణాత్మక మార్పు తేవాలి. ప్రపంచ వ్యాప్త దృక్పథంతో చూస్తే వినియోగం పెంచడం సంక్షోభ పరిష్కార మార్గం కాదు. వాతావరణ మార్పులు, పేదరికం తగ్గింపుల వంటి సమస్యల మీద పెట్టుబడులు పెంచడమే సరైన మార్గం. మౌలిక సదుపాయాలు, విద్య, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భవిష్యత్తులో ప్రయోజనం ఉండే రంగాల్లో పెట్టుబడులు అవసరం. వీటిల్లో విద్య ఒక అంశం. ఎందుకంటే ఇది నేడు మన జీవన విధానం మీద ప్రభావం చూపడంతో పాటు, భవిష్యత్తులో ఉత్పాదకతను పెంచుతుంది.

**ప్రశ్న: ఐఎంఎఫ్ పునరుజ్జీవనం గురించి ఏవిధంగా చూడాలి?**

**జవాబు :** ఇది అర్జెంటైనాకు సంబంధించిన ప్రశ్న. ఇది చాలా సంక్లిష్ట విషయం. గతంలో అర్జెంటైనాలో వ్యవహరించిన విధంగా నేడు ఐఎంఎఫ్ వ్యవహరించడం లేదు. ఐఎంఎఫ్ తన వ్యవహార శైలిని మార్చుకునేందుకు అర్జెంటైనా అనుభవం సహాయపడి వుంటుందని అనుకుంటున్నాను. ఒక దేశం ఐఎంఎఫ్ సహాయంతో కంటే, ఐఎంఎఫ్ సహాయం లేకుండా మరింత వేగంగా ఎలా అభివృద్ధి సాధించవచ్చో అర్జెంటైనా ప్రపంచానికి చాటి చెప్పడం, ఇందుకు కొంత కారణం కావచ్చు. ఐఎంఎఫ్ ప్రాయోజిత కార్యక్రమాన్ని రద్దు చేసిన తర్వాత అర్జెంటైనా 5 సంవత్సరాలు 9% వృద్ధిరేటు సాధించింది, ఇదొక అసాధారణ విజయగాథ. అప్పుల గురించి ఇది ఒక ప్రధాన అంశాన్ని వివరిస్తుంది. ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్ కెన్నెత్ రొగొఫ్ "ప్రభుత్వాలు అప్పులు ఎగవేయడం సర్వసాధారణమని, అది పునరావృతమవుతుందని" అన్నారు. ఇవి అదృశ్యమయ్యే సమస్యలు కావు. మళ్ళీ వడ్డీ రేట్లు పెరిగి కష్టాలు పెరుగుతాయి.

అత్యంత ప్రతి కూల వాతావరణంలో కూడా, నూతన విధానాలతో ముందుకు సాగిపోవడమే సరైన మార్గమని అర్జెంటైనా అనుభవం వెల్లడిస్తోంది. దురదృష్టవశాత్తు, అంతర్జాతీయ స్థాయిలో అలా చేయలేకపోయాం. ఈ విధమైన సమస్యలు తలెత్తే అవకాశం వుంది, కనుక ఈ అంశాన్ని జి-20 సమావేశంలో చేపట్టవల్సిందిగా, నేను (స్టిగ్లిట్జ్) అధ్యక్షత వహించిన ఐక్యరాజ్యసమితి కమిషన్ సిఫార్సు చేసింది. ఈ రుణాల నలాగే వుంచడం కంటె వాటిని పునర్ వ్యవస్థీకరించడం అర్థవంతంగా వుంటుందని అర్జెంటైనా నిరూపించింది. అంటే ఒకసారి రుణవిముక్తి పొందితే పెట్టుబడి మార్కెట్లు ముందుచూపుతో వుంటాయి. పెట్టుబడిదారులు కూడా ముందుచూపేగాని, వెనక్కిమళ్ళే ప్రసక్తి వుండదు. ఆ విధంగా వారు పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి.

**ప్రశ్న: అర్జెంటైనా, తూర్పు ఆసియాల్లో అనుభవాల వల్ల ఐఎంఎఫ్‌లో కొంతపరివర్తన వచ్చిందని మీరు చెప్తున్నారు. కాని చాలా దేశాల్లో ఐఎంఎఫ్ విధానాలు వివాదాస్పదంగానే వున్నాయి. దీనిని గురించి మీరేం చెబుతారు?**

**జవాబు :** తూర్పు ఆసియా, అర్జెంటైనాలలో కంటె ఇతర దేశాల్లో ఐఎంఎఫ్ తక్కువ కఠినంగా వుందని ఒక సాధారణ అభిప్రాయం వుంది. అయితే ఆదేశాల్లో ఐఎంఎఫ్ వుండగల్గినంత సహాయకారిగా వున్నదా లేదా అనే అంశం మీద చర్చ సాగుతోంది. ఒక్కొక్క దేశం గురించి విడివిడిగా ఈ చర్చ జరుగుతుంది. కొన్ని కార్యక్రమాల విషయంలో ఐఎంఫ్ చాలా సరళంగా వ్యవహరించింది. అయితే ఒక పనికి మాలిన కార్యక్రమం కంటె అసలు కార్యక్రమం లేకపోవడమే మంచిదని అర్జెంటైనా విశ్వసించింది. అర్జెంటైనా ఏనాడూ ఐఎంఎఫ్ నుండి మంచి కార్యక్రమం పొందలేకపోయింది. కాని ఇతర దేశాలు సంప్రదింపులు సాగించి మంచి కార్యక్రమాలు సాధించుకుంటే, ఆ దేశాలు కూడ ఇది తాత్కాలిక సహాయం మాత్రమేనని, దానిని తిరిగి చెల్లించాల్సి వుంటుందని గుర్తుంచుకోవాలి. విశ్వాస పునరుద్ధరణకు ఐఎంఎఫ్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఐఎంఎఫ్ కార్యక్రమం ఈ విశ్వాసం కల్పిస్తుందని మనం నమ్ముతాం. అత్యంత పేద దేశాలు ఋణవిముక్తి పొందిన తర్వాత మరో అప్పుల భారాన్ని మోయదల్చలేదు. ఐఎంఎఫ్ ప్రధానంగా స్వల్పకాలిక అప్పులిస్తుంది. అయితే పేద దేశాలకు అప్పులివ్వాల్సిన పద్ధతి ఇది కాదు.

ఐఎంఎఫ్ చారిత్రక వారసత్వం కారణంగా చాలా దేశాలు ఐఎంఎఫ్ నుండి అప్పుతీసుకోవడానికి ఇష్టపడడంలేదు. అదనపు నిధులున్న దేశాలు తాముగా సహాయం చేయడానికి గాని, నిధులందించడానికి ఐఎంఎఫ్‌ను ఒక సాధనంగా వినియోగించు కోవడానికి గాని ఇష్టపడడం లేదు. పాలనాపరమైన మౌలిక అంశాల మీద దృష్టి పెట్టడం లేదని ఇది స్పష్టం చేస్తోంది. ప్రపంచీకరణ యుగంలో ప్రపంచ వ్యాప్త సంస్థల అవసరం వుంది. మనకు ఐఎంఎఫ్ లేకపోయినట్లయితే, ప్రత్యేకంగా సంక్షోభ సమయాల్లో ఇదే విధమైన మరో సంస్థను సృష్టించుకోవాల్సి వచ్చేది. ఐఎంఎఫ్ చేపడుతున్న పాలనా సంస్కరణల వేగం తక్కువగా వుంది. స్థాయి కూడ పరిమితంగా వుంది. సంస్కరణల ఎజెండాను చేపట్టి, నిధులను పంపిణీ చేసే నూతన సంస్థలను, యంత్రాంగాన్ని నిర్వహించే సమర్థవంతమైన సంస్థ అవసరం మనకుంది. దీనినే యుఎన్ కమిషన్ సిఫార్సు చేసింది. అయితే నిధులు సమకూరుస్తున్న దేశాలు తమ మాటచెల్లుబాటు కావాలని కోరుకుంటున్నాయి. అదీ సమంజసమే. మనం ప్రతిష్టంభనలో చిక్కుకునే అసలు సమస్య ఇప్పుడు తలెత్తింది.

బ్యాలెన్స్ షీటులో ఒక ప్రక్క అప్పులు, రెండోవైపు ఆస్తులుంటాయి. నీవు అప్పు చేస్తున్నావంటే, నీ ఆస్తులు పెరుగుతాయి. నీవు అప్పుచేసి, దానిని సరిగా ఖర్చుపెడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. నీవు ఆఫ్ఘనిస్థాన్‌లో యుద్ధం చేయడానికి, సంపన్నులకు పన్ను రాయితీలిచ్చేందుకు, బ్యాంకర్లకు బెయిల్ అవుట్ ప్యాకేజీలందజేసేందుకు అప్పులు చేస్తే ఋణభారం పెరిగి, అందుకు చూపేందుకే ఆస్తులు వుండవు. దురదృష్టవశాత్తు కొన్ని దేశాలు మొదటి పద్ధతి కంటే రెండవ మార్గాన్నే ఎంచుకుంటున్నాయి. వీరు ఈ విషయం గురించి జాగ్రత్తగా ఆలోచించాలి.

**ప్రశ్న: ఇతర దేశాల్లో ప్రస్తుత పరిస్థితిని ఎలా పరిగణిస్తున్నారు?**

**జవాబు :** ఒక్కో దేశంలో పరిస్థితి ఒక్కొక్కొరకంగా వుంది. రియల్ ఎస్టేట్ బుడగమీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థతో పాటు, వాపునే బలుపుగా చూపే ఆర్థికరంగం వున్న దేశాలు పెద్ద ఎత్తున సర్దుబాటు చర్యలు చేపట్టవల్సి వుంటుంది. సరళమైన మారకం రేట్లు కలిగిన దేశాలు మెరుగ్గా సర్దుబాటు చర్యలు చేపట్టగలవు. తన కరెన్సీ రేట్ల పతనాన్ని అనుమతించగల్గడంతో (మారకం రేటు తగ్గించుకోగల్గడంతో) భారీ ఆర్థిక పతనాన్ని చవిచూచిన ఐస్ల్యాండ్ ఇప్పుడు బాగానే వుంది. గతంలో ఆర్థిక మార్కెట్లకు మరల్చబడిన వనరుల నన్నింటిని సక్రమంగా వినియోగించడంతో, ఆదేశంలోని కొన్ని ప్రాంతాలు చాలా బాగున్నాయి.

## జాతీయ పరిస్థితి

### కార్మికవర్గం మీద తీవ్ర ప్రభావం చూపిన ఆర్థిక మాంద్యం

భారత ఆర్థిక వ్యవస్థ మూలాలు పటిష్టంగా వున్నాయి కనుక, ప్రపంచ ఆర్థిక సంక్షోభం ప్రభావం మనదేశం మీద వుండబోదని, భారత ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. అయితే ఈ ప్రకటన చేసిన తర్వాత కొద్ది రోజుల్లోనే తీవ్ర కలవరానికి గురైన వీరు, భారతీయ బ్యాంకుల్లో నగదు నిల్వలు నిలబెట్టేందుకు డిపాజిట్లను మొత్తంగా విడుదల చేయవల్సిందిగా ఆర్‌బిఐని కోరారు.

సంక్షోభం ప్రారంభంకాగానే, జెట్ ఎయిర్‌వేస్ 1500 మంది కార్మికులను తొలగించింది. బలమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రతిస్పందనతో పాటు త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇది ప్రతికూల ఫలితాలనిస్తుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి జెట్ ఎయిర్‌వేస్ అధికారులను బ్రతిమాలుకోవడంతో, తర్వాత వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగింది. ఆర్థిక మాంద్య ప్రభావంతో గుజరాత్‌లోని సూరత్, మహారాష్ట్రల్లో తదితర ప్రాంతాల్లోనూ, వేలాది మంది వజ్రాలు కత్తిరించే పరిశ్రమలోని కార్మికులు రిట్రెంచ్ చేయబడ్డారని వార్తలువచ్చాయి. మార్కెట్‌లో మాంద్యం వల్ల పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లోని డన్‌లప్‌టైర్ల పరిశ్రమలోని కార్మికులను లేఆఫ్ జేశారు. ఈకారణం చేతనే స్టీలుకు డిమాండు తగ్గడంతో భారత స్టీల్ పరిశ్రమ మీద తీవ్ర ప్రభావం పడింది. భారతదేశంలోని పౌరవిమానయానం, హోటల్ పరిశ్రమ కూడా మాంద్యం ప్రభావానికి గురయ్యాయి. కార్మికులను రిట్రెంచ్ చేయవద్దని ప్రధాన మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రి బడా కార్పొరేట్ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. దీనికి కార్పొరేట్ సంస్థల అధిపతులు కనీసం స్పందించలేదు.

కొద్ది కాలంలోనే పెద్ద ఎత్తున లే ఆఫ్‌లు వుండవచ్చని కేంద్ర కార్మిక మంత్రి శ్రీ ఆస్కార్ ఫెర్నాండెజ్ ఆందోళన వ్యక్తం చేయగా, టెక్స్‌టైల్ రంగంలో రిట్రెంచ్‌మెంటుకు

గురికానున్న దాదాపు 5 లక్షల మంది కార్మికుల భవితవ్యం గురించి కేంద్ర వాణిజ్యశాఖా మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ బ్యూరో గణాంకాల ప్రకారం ఇతర రంగాల్లో కూడ కొన్ని లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. స్టీలు, టెక్స్‌టైల్స్, ఇంజనీరింగ్, వంటి పెద్ద పరిశ్రమలు చిన్న పరిశ్రమలు, ఎయిర్‌వేస్ నిర్మాణ పరిశ్రమ వంటి అనేక పరిశ్రమలు సంక్షోభతాకిడికి విలవిలలాడాయి. ఆహార పదార్థాలతో సహా వివిధ వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగాయి.

అమెరికాలో ప్రారంభమైన తీవ్ర ఆర్థిక మాంద్యం, భారత్‌లోని ఇన్ఫోటెక్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సమాచార సాంకేతిక పరిజ్ఞానం) పరిశ్రమకే ముప్పు తెస్తుందని, ఈ పరిశ్రమలోనూ, కాల్‌సెంటర్లలోనూ పనిచేసేవారిలో భయాందోళనలు చెలరేగాయి. కార్మికులకు సంబంధించి ఈ విధమైన దుర్వార్తలు దాదాపు రోజుకుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. 9% ఆర్థికాభివృద్ధిని సాధిస్తామని గొప్పలు చెప్పుకున్న భారత ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో, భవిష్యత్ ఆర్థికాభివృద్ధి అంచనాలను తగ్గించుకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితి కార్మికవర్గానికి, నూతన ఉద్యోగార్థులకు భయం కలిగించింది.

మాంద్య పరిస్థితులు ముఖ్యంగా వ్యవసాయం, సంబంధిత రంగాలతోపాటు ఉత్పత్తి రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రధానంగా ఎగుమతి రంగంలో ఉద్యోగాల్లో కోత కొనసాగుతోంది. టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, ముడిఖనిజాలు, ఖనిజాలు వంటి రంగాల్లో 2008-09 సంవత్సరంలో 11.6 లక్షల మంది పనులు కోల్పోగా, 2009-10లో 13 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోతారని, భారత ఎగుమతులు, ఉపాధి కల్పన మీద ప్రపంచ ఆర్థిక మాంద్య ప్రభావాన్ని గురించి 2009లో యుఎన్‌సిటిఎడి రూపొందించిన ముసాయిదా నివేదిక అంచనా వేసింది.

దేశంలో దారిద్ర్యానికి సంబంధించిన భయంకరమైన దృశ్యాన్ని దేశం ముందుంచుతూ భారతదేశంలో అత్యధిక సంఖ్యలో 83.60 కోట్ల మంది ప్రజలు రోజుకు రూ.20/-ల కంటె తక్కువ తలసరి వినియోగం కల్గి వున్నారని", 'అసంఘటిత రంగంలో పని పరిస్థితులు, జీవనోపాధికి ప్రోత్సాహం' విషయమై పరిశీలించ వల్సిందిగా ప్రభుత్వం నియమించిన అర్జున్ సేన్ గుప్తా కమిటీ తన నివేదికలో పేర్కొంది. 1993-94 మరియు 2004-2005 మధ్య 10 సంవత్సరాల కాలానికి సంబంధించి ప్రభుత్వం అందజేసిన గణాంకాల ఆధారంగానే నివేదిక రూపొందించబడింది. ఈ కాలంలో పేదల సంఖ్య 10 కోట్లు పెరగ్గా, నూతన సంపన్నుల సంఖ్య కూడా 9.3 కోట్ల మేరకు పెరిగింది. నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్ ప్రైజెస్ ఇన్ అనార్గనైజ్డ్ సెక్టార్ (శ్రీబుజాఏఐ) ఛైర్మన్ అర్జున్‌సేన్ గుప్తా మాట్లాడుతూ "మా సర్వే చాలా శాస్త్రీయమైనది. పేదరికానికి సంబంధించిన ఇతర అంచనాలు కేవలం స్థూల పేదరికాన్ని మాత్రమే చూచాయి. కాని మేము వివిధ తరగతుల పేదల పరిస్థితులను పరిశీలించాము" అన్నారు. దేశం బ్రహ్మాండమైన అభివృద్ధి సాధిస్తోందని గొప్పలు చెప్పుకుంటున్న ఈ కాలంలో నిజంగా లాభం పొందిందెవరు?

"మధ్యతరగతి, ధనికులు 16.20 కోట్ల నుండి 25.3 కోట్లకు పెరగ్గా, నూతన సంపన్న వర్గం 9.1 కోట్లకు చేరుకుంది. మధ్య తరగతి 15.5% నుండి 19.3%కి పెరిగింది. అత్యంత పేదలైన 4.3 కోట్ల మంది కూడ ప్రయోజనం పొందారు. అయితే వారి రోజువారీ వినియోగం రూ.9- నుండి రూ.12/-లకు పెరిగింది. సాధారణంగా సంపన్నులు తమ వినియోగానికి సంబంధించిన వివరాలను దాచిపెడ్తారు. ఇది కూడ పరిగణనలోకి తీసుకుంటే, నివేదికలో పేర్కొన్న దాని కంటె వారు మరింత సంపన్నులు అంటే పేదలు, ధనికులకు మధ్య తారతమ్యాలు మరింత పెరిగాయని స్పష్టమవుతుంది." అని శ్రీసేన్ గుప్తా వివరించారు.

"రోజువారీ వినియోగం రూ.9/-ల కంటె తక్కువ వున్నవారిని అత్యంత పేదలుగా వర్గీకరించడం జరిగింది. అయితే రోజువారీ వినియోగం రూ.13/-లుంటే ఆవ్యక్తి దారిద్రరేఖకు ఎగువనున్నట్లే! అందువల్ల పేదరికానికి సంబంధించిన నిర్వచనాలు అర్థం చేసుకోవడం కష్టమే. సంపద అనివార్యంగా క్రమ క్రమంగా క్రింది స్థాయికి చేరుతుందని ఆశించి (ఊష్ట్రుచఉజూ ఈంఇశ్రీ) ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల పదేళ్ళ అనుభవం, కష్టనష్టాలకోర్చి జీవనం సాగిస్తున్న వారికి ఒరగబెట్టిందేమీలేదు. సంస్కరణవాదులుగా చెలామణీ అవుతున్న ఆ నాయకులు ఏనాటికీ ప్రజాదరణ పొందలేరంటే,అదేమైనా ఆశ్చర్యకరమైన విషయమా?" అని ఆయన తన రిపోర్టులో పేర్కొన్నారు.

ఆ తర్వాత, పేద ప్రజలు ప్రత్యేకంగా గ్రామీణ పేదల దురవస్థకు సంబంధించిన కఠోర వాస్తవాలను డా॥ సేన్ గుప్తా తన నివేదికలో వివరించారు. శ్రామిక శక్తిలో 93%గా వున్న అసంఘటిత రంగ కార్మికులతో సహా కార్మికులందరి సంక్షేమం, బాగోగులకు బాధ్యత వహిస్తానని "జాతీయ కనీస ఉమ్మడి కార్యక్రమం" (ఎన్‌సిఎమ్‌పి" ద్వారా యుపిఎ ప్రభుత్వం హామీ ఇచ్చింది. చేనేత కార్మికులు, మత్స్యకార్మికులు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, తోటల్లో పనిచేసే కార్మికులు, బీడీ కార్మికులు తదితరులకు సాంఘిక భద్రత, ఆరోగ్య బీమా వంటి సదుపాయాలను విస్తరిస్తామని ఎన్‌సిఎంపి హామీ ఇచ్చింది. కాని కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ వీటిని అమలు చేయడంలో విఫలమైంది. భారతదేశంలో అత్యధిక సంఖ్యాకులైన 83.60 కోట్ల మంది రోజుకు కేవలం రూ.20/-లకు మించి ఖర్చుచేయగల పరిస్థితిలో లేరని, వారిలో కొంత మంది రోజుకు రూ.12/-లు కూడ ఖర్చు చేయగల్గిన స్థితిలో లేరని, అసంఘటిత రంగాల్లోని కార్మికుల పని పరిస్థితుల మీద నియమించిన అర్జున్‌సేన్ గుప్తా కమిషన్ పేర్కొంది. ఎంత భయంకరమైన పరిస్థితి.

2005 జూలై నుండి 2006 జూన్ మధ్య కాలానికి సంబంధించిన నేషనల్ శాంపుల్స్ సర్వే 62వ నివేదిక మరింత దైన్యపరిస్థితిని మన ముందుంచుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ స్త్రీ, పురుషులు ప్రతి రూ.100/-ల్లో రూ.53/-లు ఆహార పదార్థాలు మరియు కూరగాయల మీద ఖర్చుచేస్తారు. 74% గ్రామీణ పేదలు, అడవుల్లో తెచ్చుకున్న కట్టెలను వంట చెరుకుగా వాడుతున్నారు. 42% కుటుంబాలు రాత్రిపూట కిరోసిన్ దీపాలు

పెట్టుకుంటున్నాయి. ప్రతి ఐదుగురు భారతీయుల్లో ఒకరు, రోజుకు రూ.12/–లు కూడ ఖర్చుచేయగల్గిన పరిస్థితిలో లేరని నివేదిక పేర్కొంది.

ఇటీవల ప్రచురించిన క్రైమ్ బ్యూరో రిపోర్టు, పరిస్థితులెంత దారుణంగా వున్నదీ వివరిస్తుంది. 2006 ఒక్క సంవత్సరంలోనే తీవ్ర పేదరికం, రుణభారం భరించలేక 17,060 మంది రైతులు తమ జీవితాలనుతామే అంతం చేసుకున్నారు. అంటే ప్రతి రోజు 48 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తీవ్ర అప్పులభారం, దారుణ పేదరికం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో ఇది ఒక భాగం మాత్రమే.

ఈ మూడు ప్రభుత్వ ప్రాయోజిత నివేదికలు 1990–91లో ప్రారంభమైన నయా ఉదారవాద ప్రపంచీకరణ విధానాల అమలు ఫలితంగా తలెత్తిన పేద ప్రజల దైన్య పరిస్థితిని వివరించాయి. ఈ విధానాల అమలు ఫలితంగా భారతదేశంలో అత్యధికంగా 83.60 కోట్ల మంది ప్రజలు రోజుకు కనీసం రూ.20/–లకు మించి ఖర్చు చేయలేని పరిస్థితిలో వుండగా, ఎగువ మధ్య తరగతి మరియు సంపన్నుల సంఖ్య 16.20 కోట్ల నుండి 25.30 కోట్లు పెరగ్గా, నూతన సంపన్న వర్గం 9.1 కోట్లకు చేరుకుంది. ఈ పరిస్థితి, నాటి ఎన్‌డిఎ, నేటి యుపిఎ ప్రభుత్వాల కతిప్రియమైన ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశిత నయా ఉదారవాద ప్రపంచీకరణ ఆర్థిక ఎజండా అమలు ఫలితమే. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు వర్తిస్తున్న చట్టబద్ధమైన పెన్షన్ స్కీమ్‌ను లాగివేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేయడం ద్వారా, కేంద్రంలోని యుపిఎ ప్రభుత్వంతోపాటు, దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పేదరికాన్ని సంఘటిత రంగంలోని సాధారణ మధ్యతరగతికి విస్తరింప జేసేందుకు పట్టుదలతో కృషి చేస్తున్నాయి. దీనికి తోడు నానాటికి పెరుగుతున్న నిరుద్యోగంతో దారిద్ర్యం మరింత పెరిగిపోతోంది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల వలె నేటి యుపిఎ ప్రభుత్వం, గత ఎన్‌డిఎ ప్రభుత్వం "సాంఘిక భద్రత" అంటే ఒక వ్యతిరేక భావనతోవున్నాయి.

## ప్రపంచవ్యాప్తంగా ఆకలి - భారతదేశం

ప్రపంచంలోని 33 దేశాల్లో ఆకలి బాధ తీవ్ర ప్రమాదకర స్థాయిలో వుందని, అక్టోబరు 16వ తేదీ, ప్రపంచ ఆహార దినోత్సవం రోజున విడుదల చేసిన 2008 ప్రపంచ ఆకలి సూచి (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) పేర్కొంది. సబ్ సహారన్ ఆఫ్రికా (సహరా ఎడారికి దక్షిణాన వున్న సోమాలియా, జిబోచి, కామోరాన్, మారిటేనియా దేశాలు)తో సహా దక్షిణాసియాదేశాల ప్రజలు తీవ్ర స్థాయిలో ఆకలి బాధకు గురవుతున్నారు. దక్షిణాసియాలో ఐదేండ్ల లోపు బాలల్లో అత్యధికుల్లో 'తక్కువ బరువు కలిగి వుండడం' పెద్ద సమస్యగా వుంది. మహిళల్లో పౌష్టికాహార లోపం, విద్యాస్థాయి తక్కువగా వుండడం, పౌష్టికాహారం, ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టకపోవడం, మంచినీరు, పారిశుధ్య సేవలవంటివి లేకపోవడం ఈ దుస్థితికి కారణాలు. విపరీతమైన ధరల వల్ల మార్కెట్ల ముఖం కూడ చూడలేని పేద ప్రజల తక్షణ ఆహార అవసరాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రాధాన్యత ఇవ్వాలని గ్లోబల్ హంగర్

ఇండెక్స్ (జిహెచ్ఐ) నివేదిక పేర్కొంది. అదే సమయంలో వ్యవసాయం, ఆహారోత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారానూ, బాధితులకు సకాలంలో సహాయం అదేవిధంగా విశ్వసనీయమైన విధానాలను నెలకొల్పడం ద్వారానూ వ్యవసాయ విధానాల్లో గతంలో దొర్లిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు, జాతీయ ప్రభుత్వాలు మరియు అంతర్జాతీయ సమాజం చర్యలు ప్రారంభించాలి.

## ఇండియన్ స్టేట్ హంగర్ ఇండెక్స్

### (ఐఎస్‌హెచ్ఐ - భారతదేశంలో రాష్ట్రాలవారీ ఆకలి సూచిక) 2008 కీలకాంశాలు, వాస్తవాలు

* గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జిహెచ్ఐ) 2008 ప్రకారం, 88 దేశాల్లో భారతదేశం 66వ స్థానంలో వుంది.
* జిహెచ్ఐ వలెనే, ఐఎస్‌హెచ్ఐని కూడ తక్కువ క్యాలరీలశక్తి నిచ్చే ఆహారం తీసుకునే జనాభా నిష్పత్తి, ఐదేండ్ల లోపు బాలల్లో తక్కువ బరువు కల్గివుండటం, ఐదేండ్లలోపు శిశు మరణాల రేటు ఈ మూడు సూచికలకు సమాన ప్రాధాన్యత ఇచ్చి (ఐఎస్‌హెచ్ఐ)ని లెక్కించడం జరిగింది.
* 95%కి పైగా జనాభాకు ప్రాతినిధ్యం వహించే 17 పెద్ద రాష్ట్రాల్లోని ఆకలి స్థాయిని ఐఎస్‌హెచ్ఐ లెక్కిస్తుంది.
* 20 కోట్లకు పైగా అన్నార్తులతో భారతదేశం ప్రపంచంలోనే ఆహార భద్రత లేని, అతిపెద్ద జనాభాకు నిలయంగా వుంది.
* జిహెచ్ఐలోని ఇతర దేశాలతో పోలిస్తే, భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు 34 (పంజాబు)వ స్థానం నుండి 82 (మధ్యప్రదేశ్)వ స్థానం వరకు ఆక్రమిస్తున్నాయి. అంటే వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు చాలా ఎక్కువగా వున్నాయి.
* భారతదేశంలోని ప్రతి రాష్ట్రం ఆకలి సూచికి సంబంధించిన కనీసం ఒక అంశంలోనైనా, ఇక ఏమాత్రం ఉపేక్షించరాని స్థాయిలో వుంది. ఆకలి సూచికల విషయంలో తక్కువ స్థాయిలో గాని, లేదా ఒక మోస్తరు స్థాయిలో గాని వున్న రాష్ట్రం ఒక్కటి కూడా లేదు.
* దేశంలోని 12 రాష్ట్రాలు ఆకలి విషయంలో ప్రమాదకర స్థాయిలో వుండగా, ఒక రాష్ట్రం (మధ్యప్రదేశ్) అత్యంత ప్రమాదకర స్థాయిలో వుంది.

* పిల్లల్లో అత్యధిక స్థాయిలో వున్న పోషకాహారలోపం, చాలినన్ని కేలరీలశక్తి నిచ్చే ఆహారం తీసుకోలేకపోవడం వల్ల తలెత్తిన పౌష్టికాహార లోపం కారణంగా జిహెచ్ఐ విషయంలో భారతదేశం అధమస్థానంలో వుంది.

* ఐహెచ్ఎస్ఐ గణాంకాలు పేదరికంతో సంబంధం వుండే విధంగా తయారుచేశారు. రాష్ట్రస్థాయి ఆర్థికాభివృద్ధితో సంబంధం లేదు. ఆర్థికంగా పటిష్టంగా వున్న రాష్ట్రాల్లో సైతం ఆకలి హెచ్చు స్థాయిలో వుంది.

* ఐఎస్హెచ్ఐ సూచికకు ప్రధాన ప్రాతిపదికగా వున్న పిల్లల ఆహార పోషణను మెరుగుపర్చడం దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ తక్షణావసరం. ప్రజల భాగస్వామ్యంతో, పేదల అభివృద్ధితో కూడిన ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు, చాలినంత ఆహారాన్ని అందుబాటులో వుంచేందుకు, శిశు మరణాలను తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలు తమ వ్యూహాలను మెరుగు పర్చుకోవాల్సి వుంది.

పెట్టుబడిదారీ విధానం నిలకడలేని భావనగా కార్మికవర్గం అర్థం చేసుకోవడానికి ఈ తీవ్ర సంక్షోభం దోహదం చేసింది.

## వామపక్షాల పాత్ర

అమెరికా, ఐరోపా దేశాల కంటె తక్కువ నష్టంతో భారతదేశం పెనుతుఫాను వంటి ఈ ఆర్థిక సంక్షోభాన్ని ఎలాగో తట్టుకుని నిలబడగల్గింది. భారత ఆర్థిక వ్యవస్థను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహానికి బార్లా తెరవడం ద్వారా, అమెరికా ఆర్థిక వ్యవస్థతో పూర్తిగా ముడిపెట్టడాన్ని వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించి దేశాన్ని రక్షించాయి. వామపక్షాల ప్రతిఘటన వల్ల భారత ఆర్థిక వ్యవస్థను, అమెరికా ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయాలన్న ప్రధాని మన్మోహన్సింగ్ కల సాకారం కాలేదు. ఆర్థిక, సామాజిక అంశాల్లో ముందుచూపుతో వ్యవహరించిన వామపక్షాల దేశ భక్తియుత పాత్రను, ఉద్యోగులు, కార్మికులు అవగాహన చేసుకుని వారికి మద్దతు వారికి పలకాలి. వామపక్షాలు దేశాన్ని చాలా మేరకు రక్షించగలిగాయి. 15వ లోక్సభకు ఎన్నికలు జరిగి మారిన రాజకీయ పరిస్థితుల్లో ప్రభుత్వం తిరిగి అమెరికా ఆర్థిక వ్యవస్థమీద, ఎంఎన్సిల మీద ఆధారపడడం ఎక్కువైంది.

## అమెరికా అధ్యక్ష ఎన్నికలు

ప్రపంచపెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుని, అమెరికా ఆర్థిక వ్యవస్థ పతనపుటంచుకు చేరిన పూర్వరంగంలో 2008 నవంబరు 4న అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఎలెక్టొరల్ కాలేజి (అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులనెన్ను కొనేందుకు ప్రజల చేత ఎన్నుకొనబడిన ప్రతినిధులు)కి ఎన్నికల నిమిత్తం 8 నెలల పాటు సాగిన ప్రచార పర్వానికి ముగింపుగా జరిగిన ఎన్నికల్లో ఆఫ్రికన్ అమెరికన్, బరాక్ ఒబామా అధ్యక్షునిగా

ఎన్నికయ్యారు. ఆయన 2009 జనవరిలో వైట్‌హౌస్‌లో ప్రవేశిస్తారు. అమెరికా చరిత్రలో ఒక ఆఫ్రికన్ అమెరికన్, అమెరికా అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో ఈమార్పు ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఒబామా ఎన్నిక పట్ల అంతగా పొంగిపోవాల్సిందేమీ లేదు. అమెరికాను వణికిస్తున్న ఆర్థిక సంక్షోభం ఈ మార్పుకు ఒక ప్రధాన కారణం. దాదాపుగా పతనపుటంచున వున్న అమెరికా ఆర్థిక వ్యవస్థను, ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభాన్ని ఒబామా ఎలా పరిష్కరిస్తారో ప్రపంచం ఇంకా చూడవల్సే వుంది.

## 60వ సం॥లో అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన

అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన వెలువడి 59 సం॥లు నిండి, 60వ సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంగా యుఎన్ మరియు ఐఎల్‌ఒలు ఒక నివేదికను వెలువరించాయి. వివిధ దేశాల్లో ట్రేడ్ యూనియన్ హక్కుల కల్పన, మానవ హక్కులు, ట్రేడ్ యూనియన్ హక్కులకు సంబంధించిన ప్రకటనను అమలు చేయని దేశాల్లో భారతదేశం ఒకటని వివిధ దేశాల్లో ట్రేడ్ యూనియన్ హక్కుల కల్పనకు సంబంధించిన నివేదిక వెల్లడించింది.

భారతదేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో, కార్మికోద్యమ అణచివేత, యూనియన్ ఏర్పాటు, సమ్మె హక్కులతో పాటు కార్మికుల హక్కుల ఉల్లంఘన విచ్చలవిడిగా సాగుతున్నాయి. దాదాపు అన్ని దేశాల రాజ్యాంగాలు, కార్మికులకు సంఘ నిర్మాణ స్వేచ్ఛ, సమ్మె హక్కులను పైకి గుర్తించినప్పటికి, ఆచరణలో ఆ ప్రభుత్వాలు ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిరుత్సాహపర్చడానికి, కొన్ని సందర్భాల్లో నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులతో కుమ్మక్కవుతున్నాయి. ప్రభుత్వోద్యోగులకు సమ్మె హక్కు చట్టవిరుద్ధమని, 2003లో భారత సుప్రీంకోర్టు ఇచ్చినతీర్పు ఇందుకు ఒక ఉదాహరణ. అంటే మానవ హక్కుల ఉల్లంఘనలు విస్తృతంగా సాగుతున్నాయన్నమాట. అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానం "ట్రేడ్ యూనియన్ రహిత ప్రపంచాన్ని" కోరుకుంటోంది కనుక, ఇలా జరుగుతోంది. ఈ ఉల్లంఘనలకు వ్యతిరేకంగా అన్నిచోట్లా కార్మికవర్గం పోరాడుతోంది. భారతదేశంలో ప్రపంచీకరణ దాడి తీవ్రమవుతున్నకొద్ది పోరాటాలను మరింత ఉధృతం చేయాలి.

1948లో ఐక్యరాజ్యసమితి చేసిన అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన 60వ సంవత్సరంలో ప్రవేశించింది. ట్రేడ్ యూనియన్ హక్కులను, మానవ హక్కుల్లో భాగంగా ఐఎల్‌ఒ పరిగణించింది. 2008 జూన్‌లో జరిగిన ఐఎల్‌ఒ, 97వ సమావేశం, వివిధ సభ్యదేశాల్లో ఈ తీర్మానం అమలును గురించి సమీక్షించింది. ఐఎల్‌ఒలో ఒక సభ్యదేశంగా భారతదేశం భారత కార్మికులకీ హక్కులను అమలు చేయలేదని నివేదిక పేర్కొంది.

ఈ పరిస్థితిలో ప్రభుత్వోద్యోగులకు, ఉపాధ్యాయులకు ట్రేడ్‌యూనియన్ హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం నిరాకరించడంతో సమ్మె హక్కుతో సహా పూర్తి ట్రేడ్ యూనియన్

హక్కుల అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంతే గాక కార్మికవర్గం సుదీర్ఘ పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న ట్రేడ్ యూనియన్ హక్కులను కూడ ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో హరించివేయ బూనుకుంది. చివరకు, ప్రభుత్వం తనకు పార్లమెంటులో వున్న మెజారిటీనుపయోగించి, 1926 ట్రేడ్ యూనియన్ చట్టంలో కార్మికవర్గానికి నష్టదాయకమైన సవరణలు కూడా చేసింది.

## ప్రపంచ వ్యాప్త కార్మికవర్గ పోరాటాలు

ప్రపంచీకరణ వ్యతిరేకశక్తులకు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ కోరేశక్తుల పురోగతికీ సమరశీల పోరాటాలు అత్యంత ప్రధానమైనవి. ప్రపంచీకరణ వివిధ దేశాల మీద పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యాన్ని నెలకొల్పి, ఆయాదేశాల సార్వభౌమాధికారాన్ని హరించివేస్తుంది. స్వతంత్ర దేశాల సార్వభౌమాధికారాన్ని నీరుగార్చి, వాటిని తన కాళ్ళ బేరానికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న సామ్రాజ్యవాద శక్తులకు, బ్రెజిల్ ఎన్నికలు చెంపపెట్టులా పరిణమించాయి. లాటిన్ అమెరికాలోని మరో డజను దేశాల్లో, సామ్రాజ్యవాద, ప్రపంచీకరణ అనుకూల ప్రగతి నిరోధక ప్రభుత్వాలను తిరస్కరించి ప్రజలు, వామపక్ష ప్రభుత్వాలను ఎన్నుకున్నారు. లాటిన్ అమెరికాలోని వెనెజులాలో సమరశీల ప్రజావెల్లువ, ప్రపంచీకరణ వ్యతిరేక, వామపక్ష భావాలు కల్గిన హ్యూగో ఛావెజ్‌ను అధ్యక్షునిగా నిలపడం ఎంతో ఉత్తేజం కల్గించిన అంతర్జాతీయ పరిణామం. అమెరికా విధానాలకు తలూపేందుకు తిరస్కరించినందుకు, నేరుగా ప్రజలే ఎన్నుకున్న అధ్యక్షుడినే పదవీచ్యుతుని చేసేందుకు, బరితెగించిన అమెరికా సామ్రాజ్యవాదులు, వారి అడుగులకు మడుగులొత్తేవారికి పాఠం నేర్పడంలో వెనెజులా ప్రజలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, దృఢ సంకల్పం అసాధారణమైనవి, అపూర్వమైనవి. అత్యధిక మెజారిటీతో ఛావెజ్ సాధించిన విజయాలు, సిగ్గు, లజ్జ లేని అమెరికా సామ్రాజ్యవాదుల చెంప ఛెళ్ళుమనిపించాయి. నేడు వెనెజులా అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ అమెరికా సామ్రాజ్యవాదాన్ని బహిరంగంగా సవాలు చేయడంతో పాటు, ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలోని క్యూబాతో కలసి ధైర్యంగా అమెరికన్ సామ్రాజ్య వాదాన్ని ఎదిరించడంలోనూ, సోషలిజం ఆశయాలను ఛాంపియన్ చేయడంలోనూ మార్గదర్శిగా నిలిచాడు. పెట్టుబడిదారీ విధానాన్ని తిరిగి స్థాపించలేరని ఛావెజ్ ప్రకటించగా, పెట్టుబడిదారీ విధానం 1929లో ఎదుర్కొన్న సంక్షోభం కంటే ప్రస్తుత సంక్షోభం మిక్కిలి తీవ్రమైనదని కాస్ట్రో పేర్కొన్నాడు.

## ప్రభుత్వోద్యోగుల పెన్షన్ మీద దాడి - నూతన పెన్షన్ పథకం

ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయుల చట్టబద్ధమైన పెన్షన్ సదుపాయాలను ప్రైవేటీకరించే లక్ష్యంతో యుపిఎ ప్రభుత్వం పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) బిల్లును పార్లమెంట్‌లో ఆమోదింప జేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రభుత్వోద్యోగులకు తీవ్ర నష్టం కల్గిస్తాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్‌ల ఆదేశాలను

శిరసావహించి ఎన్‌డిఎ ప్రభుత్వం ముసాయిదా బిల్లును సిద్ధం చేయగా, కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం దానిని చట్టం చేసేందుకు ఉత్సాహం చూపుతోంది.

ఉద్యోగుల నెల జీతం నుండి 10% మినహాయించి, అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా జోడించి వచ్చిన మొత్తంతో మూలనిధిని ఏర్పాటు చేసి, దీనిని స్వదేశీ, విదేశీ ప్రైవేటు కంపెనీలకందిస్తారు. ఈ భారీ నిధులన్నీ కంపెనీలు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి లాభాలు దండుకునేందుకుపయోగించుకుంటాయి. ఈ విధంగా స్టాక్ మార్కెట్లో వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని పిఎఫ్ఆర్‌డిఎ, రిటైరైన ఉద్యోగులకు పెన్షన్ చెల్లించేందుకు ఉపయోగిస్తుంది. ప్రస్తుత పెన్షన్ సదుపాయం వలె, ఈ నూతన పథకంలో పెన్షన్ ఎంత వచ్చేది నిర్దిష్టంగా తెలియదు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల భవిష్యత్తును స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులు మీద ఆధారపడేలా చేయడం జరుగుతుంది. అదే సమయంలో ఉద్యోగుల జీతంలో 10% మేరకు కోత పడ్తుంది.

ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించగా, వామపక్షాల పార్లమెంటు సభ్యులు ఈ బిల్లును పార్లమెంటులో తీవ్రంగా ప్రతిఘటించారు. యుపిఎ ప్రభుత్వం తన మనుగడకు వామపక్షాల మద్దతు మీద ఆధారపడి వుండడం వల్ల బిల్లు పార్లమెంటు ఆమోదం పొందలేదు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి గరిష్ఠ లాభాలు సమకూర్చేందుకు సంస్కరణల కార్యక్రమం పేరిట బ్యాంకులు, బీమా రంగాల్లోకి ఎఫ్‌డిఐ వెల్లువను అనుమతించే బిల్లులతో పాటు, పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును ఆమోదింప జేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తూనే వుంది.

## పారిశ్రామిక రంగం

ప్రభుత్వ విధానాల ఫలితంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో పాటు, కొన్ని పెద్ద పరిశ్రమలు కూడ తీవ్ర ప్రమాదాన్నెదుర్కొంటున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటి లోనూ, ఒకదాని తర్వాత మరొకటి స్వదేశీ పరిశ్రమలు మూతపడ్తున్నాయి. ఎంఎన్‌సిలకు బాహాటంగా ద్వారాలు తెరచినప్పటినుండి కొన్ని కంపెనీలు భారతదేశంలో ఫ్యాక్టరీలనేర్పాటు చేసి, స్వదేశీ కంపెనీలతో పోటీపడనారంభించాయి. దీనితో స్వదేశీ పరిశ్రమలు, ప్రధానంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పూర్తిగా పతనమయ్యాయి. స్టాక్ మార్కెట్ అస్తవ్యస్తంగా వుంది. స్పెక్యులేటివ్ స్వభావం కల్గిన విదేశీ నిధులతో ఉచ్చస్థితికి చేరిన స్టాక్‌మార్కెట్, ఇటీవలి ప్రపంచ పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభ ప్రభావంతో కనిష్ట స్థాయికి దిగజారింది. స్టాక్ మార్కెట్లో ఒడిదుడుకులు సర్వసాధారణమయ్యాయి.

## విదేశాంగ విధానం

యుగోస్లావియా మీద సామ్రాజ్యవాదుల ఆటవిక దాడినిగాని, ఇరాక్‌మీద బాంబు దాడిచేసి, చివరకు సద్దాం హుస్సేన్‌ను దారుణంగా ఉరి తీసినప్పుడుగాని, యుపిఎ ప్రభుత్వం

నిరసనగా ఒక్కమాట కూడ అనలేదు. దురదృష్టవశాత్తు యుపిఎ ప్రభుత్వం సామ్రాజ్యవాద అనుకూల విధానాన్నే అనుసరిస్తోంది. తమ ప్రభుత్వానికి మద్దతిస్తున్న వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ భారత్‌-అమెరికా అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని మన్మోహన్‌సింగ్‌, బుష్‌ ప్రభుత్వానికి తన విశ్వాసాన్ని ప్రకటించుకున్నారు. నిజానికి ప్రధాన మంత్రి చర్యలన్నీ వామపక్షాలను దూరం చేసుకునేందుకే కారణమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా జార్జ్‌ బుష్‌ ప్రజామోదం తీవ్రంగా పడిపోయినప్పటికీ, చివరకు ఆయన స్వంత దేశంలోనే ఆయన విధానాలను ఆ దేశ ప్రజలు తిరస్కరించినప్పటికీ "బుష్‌ భారతదేశానికి గొప్ప మిత్రుడని" ప్రధాని మన్మోహన్‌సింగ్‌ ప్రశంసించడం ఆశ్చర్యం కల్గిస్తుంది.

## భారత ఇంధన భద్రత - అణు ఒప్పందం
## యుపిఎ ప్రభుత్వానికి వామపక్షాల మద్దతు ఉపసంహరణ

వామపక్షాలు మరియు కొందరు అటామిక్‌ ఎనర్జీ కమిషన్‌ మాజీ ఛైర్మన్లతో సహా అనేక మంది అణు శాస్త్రవేత్తల నుండి గట్టి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికి, యుపిఎ ప్రభుత్వం 2008 సెప్టెంబరులో భారత-అమెరికా అణు ఒప్పందం మీద సంతకాలు చేసింది. భారతదేశాన్ని మిక్కిలి విశ్వాస పాత్రమైన, అణిగి మణిగి వుండే మిత్రునిగా చేసుకునే లక్ష్యంతో అమెరికా ప్రతినిధుల సభ, ఆ తర్వాత సెనేట్‌, అమెరికా - భారత పౌర అణు ఒప్పందాన్ని ఆమోదించాయి. అనంతరం అక్టోబరు 8వ తేదీన భారతదేశంతో అణు వాణిజ్యం మీద వున్న నిషేధాన్ని తొలగించి, అమెరికా భారత పౌర అణు ఒప్పందాన్ని చట్టం చేస్తూ అమెరికా అధ్యక్షుడు బుష్‌ సంతకం చేశారు. భారత్‌ అణుమార్కెట్‌లోకి అమెరికన్‌ కంపెనీల ప్రవేశాన్ని సుగమం చేస్తూ భారత విదేశాంగమంత్రి, అమెరికన్‌ సెక్రటరీ ఆఫ్‌ స్టేట్‌ (విదేశాంగ మంత్రి)లు పౌర అణుసహకార ద్వైపాక్షిక ఒప్పందం మీద అక్టోబర్‌ 11న సంతకాలు చేశారు.

భారతదేశం పెద్ద అణు దేశాల సరసన చేరిందని కాంగ్రెస్‌ నాయకులు, కార్పొరేట్ల అధీనంలోని ప్రసార సాధనాలు గొప్పగా ప్రచారం చేశాయి. కాని ఈ అణు ఒప్పందం ద్వారా దేశ ప్రయోజనాల నెంతగా తాకట్టుపెట్టిందీ, అమెరికన్‌ కాంగ్రెస్‌, సెనేట్‌లలో జరిగిన చర్చలు, ప్రభుత్వంలోని ప్రముఖుల ప్రకటనలే విదితం చేశాయి. భారతదేశానికి ఇంధన సరఫరాకు సంబంధించి ఏ హామీ ఇవ్వలేదని అమెరికన్‌ ప్రభుత్వం ఆమోదించిన 123 చట్టం స్పష్టం చేసింది. అణు రియాక్టర్ల జీవిత కాలంలో వాటికవసరమైన "వ్యూహాత్మక ఇంధన నిల్వల" ఏర్పాటుకు సంబంధించి కూడ ఏ విధమైన హామీ లేదు. ఇంధన సరఫరా వైఫల్యాలకు సంబంధించి భారతదేశం ఏవైనా

దిద్దుబాటు చర్యలు తీసుకున్నా, లేదా 123 ఒప్పందాన్ని అమెరికా ఏకపక్షంగా రద్దు చేసినా, పౌర అణు రియాక్టర్లను, స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్నవైనప్పటికీ ఐఎఇఎ షరతుల పరిధి నుండి ఉపసంహరించుకునే వీలు లేదు. ఏకారణం చేతనైనా అమెరికా 123 ఒప్పందాన్ని రద్దు చేస్తే, ఇతర దేశాలు భారతదేశానికి అణు ఇంధనం సరఫరా చేయకుండా అమెరికా అడ్డుకునే ప్రయత్నం చేయవచ్చు. అణు ఇంధనం సరఫరా గ్రూప్ (ఎన్ఎస్‌జి) సమావేశంలో అనధికారికంగా సాధించిన ఏకాభిప్రాయం మేరకు యురేనియంను శుద్ధిచేసి, తిరిగి వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందకుండా, భారతదేశాన్ని మినహాయించడం జరుగుతుందని అమెరికా విదేశాంగ మంత్రి కండొలీజా రైస్ అమెరికన్ కాంగ్రెస్‌కు హామీ ఇచ్చారు. మొత్తం మీద హైడ్ చట్టంలోని కీలక అంశాలతో పాటు మరింత ప్రమాదకరమైన అంశాలతో కూడిన 123 ఒప్పందాన్ని అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించింది.

అమెరికన్ కంపెనీలకు అణువిద్యుత్ కర్మాగారాలను నిర్మించేందుకు విస్తారమైన భారత మార్కెటును తెరిచేందుకు ఈ ఒప్పందం అనుమతిస్తుంది. అమెరికా నుండి కనీసం 10 వేల మెగావాట్ల అణువిద్యుత్ ఉత్పత్తి చేసే కర్మాగారాలను కొనుగోలు చేసేందుకు భారత విదేశాంగ కార్యదర్శి శివశంకర మీనన్, అప్పటికే అమెరికా రాజకీయ వ్యవహారాలశాఖ అండర్ సెక్రటరీ విలియం జోసఫ్ బర్న్సుకు లేఖద్వారా హామీ ఇచ్చారు. మరణశయ్య మీద వున్న అమెరికన్ అణువిద్యుత్ పరిశ్రమకు గత 30 సంవత్సరాలుగా ఒక్క క్రొత్త ఆర్డరు కూడా దొరకలేదు. అణు కర్మాగారాల సరఫరా దారుల వల్ల ఏవైన అణు ప్రమాదాలు సంభవిస్తే, వాటి పర్యవసానాల నుండి వాఇరిన విముక్తి (ఏ ఇబ్బంది కలగకుండా చూసే) చేయడం జరుగుతుంది. అంటే త్వరలోనే ఈ అమెరికన్ అణు విద్యుత్ పరిశ్రమ 10 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే రూ.2,80,000 కోట్ల విలువైన ఆర్డరును భారతదేశం నుండి పొందనున్నది.

ఇంధన, రక్షణ, ఆర్థికరంగాల వంటి అనేక కీలక రంగాల విషయంలో అమెరికా, భారతదేశం మీద నిరంతరం ఒత్తిడి తెచ్చేందుకు అవకాశాలు కల్పించడంతో పాటు, దేశ స్వతంత్ర విదేశాంగ విధానానికి తూట్లు పొడిచే అనేక చర్యలకు ఈ అణుఒప్పందం నాంది కాబోతోంది. ఎన్ఎస్‌జి నుండి అనుమతి వచ్చిన వెంటనే అమెరికా సందర్శించిన భారత రక్షణ మంత్రి మీద, 126 యుద్ధ విమానాల కొనుగోలుకు బుష్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చినట్లు వార్తలొచ్చాయి. భారతదేశాన్ని తన సైనిక భాగస్వామిగా సుస్థాపితం చేసే విధంగా "డిఫెన్స్ ఫ్రేమ్ వర్క్ అగ్రిమెంట్" (రక్షణ పరిధి ఒప్పందం) క్రింద అనేక ఒప్పందాలు సిద్ధంగా వున్నాయి. లాజిస్టిక్స్ (సైన్యాన్ని, సైనిక పరికరాల సరఫరా, తరలింపు) సపోర్టు అగ్రిమెంట్ (ఎల్ఎస్ఎ), కమ్యూనికేషన్ ఇంటర్ ఆపరేటబిలిటీ మరియు సెక్యూరిటీ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ (సిఐఎస్ఎంఒఎ), ఎన్డ్ యూజర్ అగ్రిమెంటు (ఇయుఎ) వంటి రక్షణ రంగ సంబంధమైన ఒప్పందాలను చేసుకునేందుకు అమెరికా తొందర పడుతోంది.

ఈ పరిస్థితుల్లో ఈ విధానాలకు నిరసనగా 2008 నవంబరులో వామపక్షాలు యుపిఎ ప్రభుత్వానికి పార్లమెంటులో తమ మద్దతు ఉపసంహరించు కోవల్సివచ్చింది. అయితే కొన్ని అవకాశవాద రాజకీయ పార్టీలు, యుపిఎ ప్రభుత్వం పడిపోకుండా అవసరమైన మద్దతిచ్చి నిలబెట్టాయి. ఆ తర్వాత పెన్షన్ ప్రైవేటీకరణతో సహా ఆర్థిక సంస్కరణల అమలుకు ప్రభుత్వాని కవసరమైన సహాయం కూడ అందించాయి. దీనికి బదులుగా ఒకరు ముఖ్యమంత్రి కాగా, మరికొందరు ఇతర విధాలుగా లాభపడ్డారు.

ఆ విధంగా తన సామ్రాజ్యవాద విధానాల అమలుకు ప్రపంచాధిపత్యానికై అర్రులు చాస్తున్న అమెరికా, భారత్‌ను కొనేసింది. భారత కీలక ప్రయోజనాలను ప్రపంచవిపణిలో అమ్మకానికి పెట్టిన ప్రధాన మంత్రి, కాంగ్రెస్ నాయకత్వం "ఈ మహా అమ్మకాన్ని, మహోత్సవం"గా జరుపుకోవడం జుగుప్స కల్గించే విషయం.

## స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో సదస్సు

కేంద్ర ప్రభుత్వ, ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 2006 జూలై 25న న్యూఢిల్లీలోని మవలంకర్ ఆడిటోరియంలో స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, జాతీయ సదస్సు నిర్వహించింది. సిఐటియు, హెచ్ఎంఎస్, టియుసిసి, యుటియుసి, యుటియుసి(లెనిన్‌సారణి) వంటి కేంద్ర కార్మిక సంఘాలు, ఎఐఎస్‌జిఇఎఫ్‌తో సహా అన్ని అఖిల భారత సమాఖ్యలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రైల్వేలు, పోస్టల్, పౌరవిమానయానం, రక్షణ, టెలికమ్యూనికేషన్లు వంటి రంగాల అసోసియేషన్లకు ప్రాతినిధ్యం వహిస్తూ 1500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సు ఆమోదించిన ప్రకటన నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, పిఎస్‌యుల ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక కార్మిక సంస్కరణలు, పెన్షన్ ప్రైవేటీకరణ, ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల్లో కోతవంటి సమస్యల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రింది కార్యక్రమాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

1. 16.8.2006 నుండి 15.9.2006 వరకు రాష్ట్ర, సెక్రటేరియట్ స్థాయి సదస్సులు.
2. 20.9.2006న ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సన్నద్ధంగా "జాతీయ సమీకరణ దినం" పాటించాలని.
3. 29.11.2006న సమ్మె నోటీసు దినం పాటించాలని.
4. 14.12.2006న అఖిల భారత సార్వత్రిక సమ్మె నిర్వహించాలని పిలుపు ఇచ్చింది.

## ప్రభుత్వోద్యోగ సంఘాల సదస్సు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రక్షణ రంగ కార్మికులు, ఉపాధ్యాయుల సంయుక్త సదస్సు 26.7.2006న న్యూఢిల్లీలోని బంగభవన్‌లో జరిగింది. ఎఐఎస్‌జిఇఎఫ్ నుండి 226

మంది, కేంద్ర ప్రభుత్వోద్యోగుల కాన్ఫెడరేషన్ నుండి 70 మంది, రక్షణరంగ ఉద్యోగుల సంఘం తరపున 25 మంది, స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) నుండి 14 మంది ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్‌యుసిటిఒ) నుండి ఒకరు సదస్సులో పాల్గొన్నారు.

పిఎఫ్ఆర్‌డిఎ బిల్లు పార్లమెంటులో చర్చకు చేపట్టినప్పుడు సమ్మె చేసే విషయమై నిర్ణయాలు చేసేందుకు సదస్సు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సదస్సు ఈ క్రింది డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించింది.

1. ప్రభుత్వోద్యోగులకు సమిష్టి సంప్రదింపుల హక్కును, సమ్మె హక్కును కల్పిస్తూ యుపిఎ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి.
2. పెన్షన్ నిధుల ప్రైవేటీకరణ యత్నాలకు స్వస్తిచెప్పి, పిఎఫ్ఆర్‌డిఎ బిల్లునుపసంహరించాలి.
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోని లక్షలాది ఖాళీలను భర్తీ చేయడం ద్వారా, లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించడంతో పాటు, ప్రభుత్వం నుండి ప్రజలు మెరుగైన సేవలు పొందేందుకు అవకాశం కల్పించాలి.
4. ప్రైవేటీకరణ, ఉద్యోగాల్లో కోత, పర్మినెంట్ ఉద్యోగుల స్థానాల్లో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్యను పెంచడం, కాంట్రాక్టీకరణ మరియు ప్రభుత్వ విభాగాల్లోని, కార్యకలాపాల అవుట్ సోర్సింగ్ వంటి చర్యలకు స్వస్తి చెప్పాలి,
5. కేంద్ర ప్రభుత్వోద్యోగులందరికీ రూ.1000/- తాత్కాలిక భృతి ప్రకటించాలి.

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే పెన్షన్ ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెడ్తారన్న అనుమానాలుండడంతో సదస్సు ఈ క్రింది కార్యాచరణను ఏకగ్రీవంగా నిర్ణయించింది.

ఎ) పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును ఆమోదించరాదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ 18.8.2006న పార్లమెంటుకు బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించాలి.

బి) యుపిఎ ప్రభుత్వం పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును ఆమోదింపజేసుకుంటే వెంటనే దేశవ్యాప్త సమ్మె చేయాలి.

14.12.2006న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో సహా, 25.7.2006న స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నిర్ణయించిన కార్యాచరణను ధృవీకరిస్తూ కార్యక్రమాన్ని సమిష్టిగా అమలు చేస్తామని సదస్సు ప్రకటించింది.

## స్పాన్సరింగ్ కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె

కోటి మందికిపైగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, బిఎస్ఎన్ఎల్, కేంద్ర ప్రభుత్వ విభాగాలు, పోర్టు

అండ్ డాక్ కార్మికులు, విమానాశ్రయాలు, రైల్వేలు, టీ, కాఫీ తోటలు, బొగ్గు గనులు, స్టీల్ పరిశ్రమ ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నింట్లో సమ్మె దాదాపుగా సంపూర్ణంగా జరిగింది. పెద్ద ఎత్తున అరెస్టులు సాగించినప్పటికీ, భయభ్రాంతులను చేయప్రయత్నించినప్పటికి, కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేశారు. రైతాంగం, విద్యార్థులతో పాటు, వివిధ తరగతుల శ్రమజీవులు సమ్మెలో భాగస్వాములయ్యారు. సమ్మెకు మద్దతుగా వామపక్ష పార్టీల పార్లమెంటు సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు. 16 పాయింట్ల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లు సాధనకు స్పాన్సరింగ్ కమిటీ ఈ సమ్మె పిలుపు ఇచ్చింది.

కర్నాటకలో ప్రభుత్వ బెదిరింపులను కూడా లెక్కచేయకుండా అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో సమ్మె బ్రహ్మాండంగా విజయవంతమైంది. మణిపూర్‌లో తిరుగు బాటుదారుల హింసాకాండ సాగుతున్నప్పటికీ సమ్మెకు మంచి స్పందన వచ్చింది. హర్యానాలో ప్రభుత్వాజ్ఞలు ధిక్కరించి కార్మికులు, ఉద్యోగులు ప్రదర్శనలు నిర్వహించారు. గుర్‌గావ్‌లో 18 మంది కార్మికులను, గోహనాలో 20 మంది కార్మికులను అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆఫీసుల్లో సమ్మె దాదాపు సంపూర్ణంగా జరిగింది. నాయకులతో సహా సుమారు 500 మంది ప్రభుత్వోద్యోగులను అరెస్టు చేసి తర్వాత వదిలివేశారు. పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో సమ్మె సంపూర్ణంగా జరగ్గా, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు సంపూర్ణంగా జరిగింది. మధ్యప్రదేశ్‌లో ఉద్యోగులు రోజంతా ధర్నాచేశారు. గోవా, మిజోరామ్‌లలో ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గుజరాత్‌లో పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల దేశవ్యాప్త సమ్మె

12 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లు, ప్రధానంగా నూతన కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని వెంటనే ఉపసంహరించాలన్న డిమాండు మీద కేంద్రీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు మరల 2007 అక్టోబరు 30వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమయ్యారు. సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్, ఎఐఎస్‌జిఇఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వరంగ ఉద్యోగుల దేశవ్యాప్త సంయుక్త సదస్సు 2007 ఆగస్టు 13న ఢిల్లీలోని ఎంపిసియు షా ఆడిటోరియంలో జరిగింది. ఎఐఎస్‌జిఇఎఫ్‌కు చెందిన అన్ని రాష్ట్ర అనుబంధ సంఘాల నుండి 622 మంది ప్రతినిధులు, మహిళా ప్రతినిధులతో సహా మొత్తం 800 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సమ్మె నిర్ణయానికి మద్దతు తెలుపుతూ ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులనేక మంది ప్రసంగించారు. ఈ క్రింది డిమాండ్లతో కూడిన ప్రకటనను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

1. పిఎఫ్ఆర్‌డిఎ బిల్లును రద్దు చేయాలి. పెన్షన్ ఫండ్ మేనేజర్ల నియామకాలను రద్దు చెయ్యాలి. నూతనంగా నియమించబడిన వారికి కూడ ప్రస్తుతం అమలులో వున్న పెన్షన్ స్కీమ్‌నే వర్తింపజేయాలి.

2. తగిన శాసనం ద్వారా ప్రభుత్వోద్యోగులందరికీ సమ్మె హక్కుతో సహా, పూర్తి ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలి.

3. (ఎ) ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల కోతను, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ ఖాళీలను తాత్కాలిక ఉద్యోగులతో నింపడం ఆపివేయాలి. ఉపాధ్యాయులు, కార్మికుల కాంట్రాక్టు నియామకాలను ఆపివేయాలి. దినసరి, క్యాజువల్, కంటింజెంట్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధం చేయాలి.

   (బి) అన్ని ప్రభుత్వశాఖలు, విద్యా సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఖాళీలను భర్తీ చేసేందుకు రిక్రూట్‌మెంట్ మీద నిషేధం తొలగించాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలి.

4. కేంద్ర ప్రభుత్వోద్యోగులందరికీ కనీసం రూ. 1000/- చొప్పున ఇంటెరిమ్ రిలీఫ్ ఇవ్వాలి. 1.1.2006 నుండి 6వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల నమలు చేయాలి.

5. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నరికట్టాలి. సబ్సిడీతో కూడిన ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలి.

6. బేసిక్ జీతానికి 50% డి.ఎ.ని కలిపి, అన్ని బెనిఫిట్లు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు డి.ఎ. వాయిదాలు పూర్తిగా చెల్లించాలి.

7. కారుణ్య నియామకాల మీదవున్న 5 శాతం పరిమితిని ఇతర ఆంక్షలను తొలగించాలి. ఇప్పటికే రద్దుచేసిన కారుణ్య నియామకాల పథకాలను పునరుద్ధరించాలి.

8. కేంద్ర ప్రభుత్వోద్యోగుల ఆరోగ్య పథకం (సిజిహెచ్ఎస్)ను మెడికేర్ ఇన్సూరెన్స్ పాలసీలతో మార్చే ప్రతిపాదనను విరమించుకోవాలి.

9. వివాద పరిష్కార బోర్డుల తీర్పులను వెంటనే అమలు చేయాలి.

10. బోనస్ మీద సీలింగును తొలగించి, అందరికీ బోనస్ చెల్లించాలి.

11. గ్రామీణ డాక్ సేవకుల (తపాలాశాఖ) వేతన సవరణకు నటరాజమూర్తి కమిటీ స్థానంలో జ్యుడీషియల్ (న్యాయమూర్తులతో కూడిన) కమిటీ ఏర్పాటు చేయాలి.

12. జిపిఎఫ్, చిన్న మొత్తాల పొదుపుమీద వడ్డీరేట్లను పెంచి, గతంలో వున్న స్థితికి పునరుద్ధరించాలి.

## కార్మికవర్గ ఉద్యమంలో మైలురాయి
## - 2008 ఆగస్టు 28 సార్వత్రిక సమ్మె

స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్ ఆధ్వర్యంలో 2008 మే 13న న్యూఢిల్లీలోని స్పీకర్స్ హాల్‌లో జరిగిన జాతీయ సదస్సులో సిఐటియు, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, ఎఐసిసిటియు, యుటియుసి, టియుసిసి వంటి కేంద్ర కార్మిక సంఘాలతో పాటు ఎఐఎస్‌జిఇఎఫ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, వివిధ జాతీయ ఫెడరేషన్లు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు 6 అంశాల చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌కు మద్దతుగా 2008 ఆగస్టు 20న సార్వత్రిక సమ్మెకు పిలుపిచ్చింది.

దీనితోపాటు 2008 జూలై 8న న్యూఢిల్లీలోని ఎంపిసియు స్టేట్ ఆడిటోరియంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్, ఎఐఎస్‌జిఇఎఫ్, వివిధ ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో వివిధ సంఘాల నుండి 800 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో కోటి మందిగా వున్న, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, రాష్ట్ర పిఎస్‌యులు, కార్పొరేషన్లు, రక్షణరంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, స్పాన్సరింగ్ కమిటీ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఇచ్చిన పిలుపుమేరకు, ఇతర ట్రేడ్ యూనియన్లతో కల్సి 2008 ఆగస్టు 20వ తేదీన సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపిచ్చింది. ఈ క్రింది ఆరు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ సాధనకు స్పాన్సరింగ్ కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది.

1. నిత్యావసర వస్తువుల ధరలనదుపుచేసేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి.
2. కార్మికచట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.
3. పార్లమెంటులో పెండింగ్‌లో వున్న అసంఘటిత రంగ కార్మికుల సాంఘిక భద్రతా బిల్లులో సవరణలు చేయాలి.
4. ప్రభుత్వ ఆఫీసుల్లో రిక్రూట్‌మెంటు మీద నిషేధం తొలగించాలి. 6వ వేతన సంఘం సిఫార్సులోని కార్మిక వ్యతిరేక, వివక్షాపూరిత సిఫార్సులను తొలగించాలి.
5. కాంట్రాక్టు కార్మికులతో సహా కేంద్ర పిఎస్‌యుల్లోని కార్మికులకు సత్వరం వేతన సవరణ చేయాలి.
6. రైతాంగానికి ఋణవిమోచన పథకాన్ని కొనసాగించాలి.

2008 ఆగస్టు 20వ తేదీ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ రాష్ట్రస్థాయి సంయుక్త సదస్సులు నిర్వహించాలని జాతీయ సదస్సు పిలుపునిచ్చింది.

కార్మికవర్గానికి, ప్రజానీకానికి సంబంధించిన అత్యంత న్యాయసమ్మతమైన డిమాండ్ల సాధనకు, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, వామపక్షేతర ట్రేడ్ యూనియన్లు, ఎఐఎస్‌జిఇఎఫ్‌తో సహా వివిధ జాతీయ ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన ఈ చారిత్రాత్మక సమ్మెలో ఒక అంచనా మేరకు 8 కోట్ల మంది భాగస్వాములయ్యారు. కోటి మందికి పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, రాష్ట్ర పిఎస్‌యులు, కార్పొరేషన్లు, పంచాయతీల కార్మికులు, కాలేజీలు, విశ్వ విద్యాలయాలు, ఇతర విద్యా సంస్థల ఉపాధ్యాయులతో సహా వివిధ రంగాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిఐటియు, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, ఎఐసిసిటియు, ఎఐయుటియుసి, యుటియుసి, టియుసిసి వంటి కేంద్ర కార్మిక సంఘాలతో పాటు, కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య, ఎఐఎస్‌జిఇఎఫ్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రక్షణ, టెలికం, విమానాశ్రయాలతో పాటు కొన్ని రైల్వే కార్మిక సంఘాలు ఈ సమ్మెలో చురుకైన పాత్ర నిర్వహించాయి. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాల పట్ల వారిలో గూడుకట్టుకున్న అసంతృప్తిని, 8 కోట్ల మంది పాల్గొన్న ఈ సమ్మె వెల్లడించింది. అంతేగాక ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశిత ప్రభుత్వ వినాశకర విధానాలను కష్టజీవులిక ఏమాత్రం సహించరని కూడ తెల్పింది. భారత–అమెరికా అణుఒప్పందం పట్ల కార్మిక వర్గానికేవిధమైన ఆసక్తి లేదని నిరూపితమైంది.

## 6వ కేంద్ర వేతన సంఘం - ప్రభుత్వోద్యోగ సమాఖ్యల వైఖరి

2008 ఆగస్టు 15వ తేదీన ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎర్రకోట బురుజుపై నుండి ప్రసంగిస్తూ 6వ కేంద్ర వేతన సంఘం సిఫార్సులను అమలు చేయనున్నట్లు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించారు. 6వ వేతన సంఘం సిఫార్సుల వల్ల ఉద్యోగులు, అధికారుల మధ్య తలెత్తిన తీవ్ర వేతన వ్యత్యాసాలను సరిదిద్దడానికి, ఈ ప్రకటన ద్వారా ప్రభుత్వం చేసేందేమీలేదు. ప్రభుత్వోద్యోగుల సంఖ్యను తగ్గించేందుకు గ్రూప్–డి ఉద్యోగాలను రద్దుచేసి, అన్ని గ్రేడ్లలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల ద్వారా భవిష్యత్ నియామకాలు చేపట్టాలన్న 6వ వేతన సంఘం సిఫార్సును తొలగించకపోవడం మిక్కిలి విచారకరం. గ్రూప్–డి క్యాడర్‌ను రద్దుచేస్తే తొమ్మిది లక్షల ఉద్యోగాలు హరించుకుపోతాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల కాన్ఫెడరేషన్ చేసిన ప్రధాన సూచనలను వేటిని ప్రభుత్వం ఆమోదించలేదు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగులను బాగా నిరుత్సాహ పర్చింది.

6వ కేంద్ర వేతన సంఘం సిఫార్సులు ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు ప్రయోజనకరంగా వుండే విధంగా, రాష్ట్ర సంఘాలు, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవాలని ఎఐఎస్‌జిఇఎఫ్ నిర్ణయించింది. 6వ వేతన సంఘం సిఫార్సుల అమలు వల్ల రాష్ట్ర ఉద్యోగులకు నష్టం వాటిల్లకుండానూ, ఆచరణలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లాభం చేకూర్చే విధంగా రాష్ట్ర సంఘాలు జాగ్రత్త వహించాలి. వివిధ రాష్ట్రాల్లో వేతన సంఘాల నియామకాలువేర్వేరు పద్దతుల్లో వుండడం వల్ల, ఆయారాష్ట్రాల్లోని సాంప్రదాయాల

కనుగుణంగా, వేతన కమిషన్లను నిర్దిష్ట కాలానికి వర్తించే విధంగానూ, మెరుగైన వేతనాల సాధనకు కృషిచేయాలి. ఈ వేతన సిఫార్సుల అమలుకు అయ్యే అదనపు ఖర్చులో 50% కేంద్ర ప్రభుత్వాలు భరించాలని ఎఐఎస్‌జిఇఎఫ్ కోరుతోంది. ప్రత్యేక కేటగిరికి చెందిన ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల అదనపు ఖర్చులో 75 శాతం కేంద్రం భరించాలి.

## కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాల పునర్వ్యవస్థీకరణ

కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీకి సంబంధించిన సమతుల్యం, ట్రేడ్ యూనియన్ ఉద్యమాభివృద్ధికి సంబంధించిన ప్రధాన అంశంగా గుర్తించాలి.

భారత రాజ్యాంగం, స్వరూపం రీత్యా సమాఖ్య (ఫెడరల్)గా వున్నప్పటికీ, కేంద్రీకృత స్వభావం కల్గివుంది. శాసనపరమైన, పాలనాపరమైన, ఆర్థికపరమైన అధికారాలు కేంద్ర ప్రభుత్వం వద్ద కేంద్రీకృతమైవున్నాయి. చాలినంత ఆర్థికపరమైన స్వయం ప్రతిపత్తి లేకుండా రాష్ట్రాలు ఎక్కువ విధులను నిర్వర్తించాల్సి వుంది. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పాలించబడుతున్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, భారతదేశ సమైక్యతను పరిరక్షించడానికి ఫెడరల్ విధానాన్ని పటిష్టపర్చవల్సి వుంది.

**ఎ) కేంద్ర పన్నులను రాష్ట్రాలకు విభజించడం :** కేంద్రంలో వసూలైన మొత్తం పన్నుల్లో 50% రాష్ట్రాలకు అందజేయాలి.

**బి) పన్ను విధించే అధికారాలు :** ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పన్ను విధిస్తున్న కొన్ని సేవలతో సహా మరికొన్ని సర్వీసులకు పన్ను వసూలు చేసేందుకు రాష్ట్రాలను అనుమతించాలి. ప్రస్తుతం ప్రతిపాదన స్థితిలో వున్న సరుకులు, సేవల పన్ను (జిఎస్‌టి)లో రాష్ట్రాలకు న్యాయమైన వాటా లభించే విధంగా, సముచితమైన నమూనాను రూపొందించాలి.

**సి) రాష్ట్రాలు మార్కెట్ నుండి అప్పులు సేకరించడం :** మార్కెట్ల నుండి రుణాలు సేకరించే విషయంలో రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించేందుకు, పద్ధతులను సరళం చేసేందుకు వీలుగా రాజ్యాంగంలోని 293 అధికరణానికి సవరణలు చేయాలి. మార్కెట్ రుణాల సేకరణ విషయంలో రాష్ట్రాల వాటాను ప్రస్తుత మున్న 15% నుండి 50%కి పెంచాలి.

**డి) రుణ విముక్తికి షరతులు :** కేంద్రం నుండి రాష్ట్రాలు తీసుకున్న అప్పుల విషయంలో, రుణ విముక్తికి షరతులు విధించరాదు. రాష్ట్రాల మీద విధించిన ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ చట్టం (ద్రవ్య బాధ్యత మరియు బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బిఎం యాక్ట్) వంటి చట్టాల ద్వారా విధించిన షరతులను తొలగించాలి. రాష్ట్రాల నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా, ప్రత్యేకంగా ఎన్ఎస్ఎస్ఎఫ్ (జాతీయ సాంఘిక భద్రతానిధి, నేషనల్ సోషల్ సెక్యూరిటీ ఫండ్) నుండి తీసుకున్న అప్పుల విషయంలో రుణవిముక్తిని లెక్కించాలి.

**ఇ) కేంద్ర ప్రాయోజిత పథకాలు :** రాష్ట్రాల పరిధి లోని అంశాలకు సంబంధించిన అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలను రూపొందించి, అమలు చేసే బాధ్యతతోపాటు నిధులను

కూడ రాష్ట్రాలకు బదిలీ చేయాలి. అయితే కేంద్రం ఆ పథకాల స్థూల మార్గదర్శకాలను, కనీస నిబంధనలను మాత్రం రూపొందించాలి. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (జెఎన్ఎన్‌యుఆర్ఎం) వంటి పథకాల మీద స్టాంపు డ్యూటీ తగ్గింపు వంటి చర్యల నుపసంహరించాలి.

**ఎఫ్) స్థానిక సంస్థల నిధుల వికేంద్రీకరణ :** స్థానిక సంస్థల ఖర్చుల నిమిత్తం, జిడిపిలో కొంత కనీస భాగాన్ని కేటాయించాలి. స్థానిక సంస్థలకుద్దేశించిన నిధులను, చట్టబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఏర్పాటు చేయాలి.

**జి)అంతర్ రాష్ట్ర మండలి :** అంతర్ రాష్ట్ర మండలిలో చేసిన నిర్ణయాల అమలును కేంద్ర ప్రభుత్వ విధిగా చేస్తూ, రాజ్యాంగంలో సవరణ చేయాలి. కేంద్ర, రాష్ట్ర సంబంధాల గురించిన ప్రధాన సమస్యలను అంతర్ రాష్ట్ర మండలిలో చర్చించి, నిర్ణయాలు చేయాలి.

**హెచ్) జాతీయాభివృద్ధి మండలి (నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ – ఎన్‌డిసి) మరియు ప్రణాళిక సంఘం :** ఎన్‌డిసికి రాజ్యాంగ బద్ధత కల్పించాలి. ప్రణాళికా సంఘం ఎన్‌డిసికి కార్యనిర్వాహక విభాగంగా పనిచేయాలి.

**ఐ) ఆర్థిక సంఘం :** ఆర్థిక సంఘం సిఫార్సు చేయవల్సిన అంశాలను రూపొందించడంలో, రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. ఈ అంశాల విషయంలో భిన్నాభిప్రాయాలు తలెత్తితే అంతర్‌రాష్ట్ర మండలిలో పరిష్కరించుకోవాలి. ప్రణాళికా సంఘం రాష్ట్రాలకు తగినంత ప్రాధాన్యత వుండాలి.

**జె) ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలు :** నాన్ ప్లాన్ గ్యాప్ గ్రాంట్ (ప్రణాళికేతర అంచనా ఆదాయం, ప్రణాళికేతర అంచనా వ్యయానికి మధ్య తేడాను భర్తీ చేయడానికిచ్చే గ్రాంట్) మరియు సాధారణకేంద్ర సహాయం రూపంలో, ఈ కేటగిరీ రాష్ట్రాల కందిస్తున్న ప్రత్యేక సదుపాయాలు కొనసాగించాలి. ఈ రాష్ట్ర ప్రభుత్వాల రుణాలను వన్‌టైమ్ సెటిల్మెంట్ వంటి పద్ధతుల ద్వారా షరతులు లేకుండా పరిష్కరించాలి. ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలకు కేంద్ర ప్రాయోజిత పథకాల క్రింద విడుదల చేసే నిధులు, నిధుల వినియోగం మీద కఠిన షరతులు విధించకుండా సత్వరం విడుదల చేయాలి.

## తుదిశ్వాస విడిచిన కామ్రేడ్ ఇ.బాలానందన్

భారత కార్మికోద్యమంలో ప్రముఖులు, సిఐటియు మాజీ అధ్యక్షులు కామ్రేడ్ ఇ. బాలానందన్ ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో 2009 జనవరి 19న కేరళలోని కోచిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో సిఐటియుకే కాక, యావత్ భారత కార్మికోద్యమానికి తీరని లోటు ఏర్పడింది.

## 15వ లోక్‌సభకు ఎన్నికలు

2009 మే నెలలో 15వ లోక్‌సభకు ఎన్నికలు జరిగి, శ్రీ మన్మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిగా యుపిఎ-2 ప్రభుత్వం ఏర్పడింది. దురదృష్టవశాత్తు లోక్‌సభలో వామపక్ష శక్తులు బలహీన పడ్డాయి. దీనితో నూతన కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేసి కార్మికవర్గాన్ని మరింత కష్టాల్లోకి నెట్టింది.

## కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల జాతీయ సదస్సు

చరిత్ర పునరావృతమైంది. సుమారు 30 సం॥ల క్రిందట శ్రీ మొరార్జీదేశాయ్ నాయకత్వంలోని జనతా ప్రభుత్వం నియమించిన భూత లింగం కమిటీ పచ్చి కార్మిక వ్యతిరేక సిఫార్సులకు వ్యతిరేకంగా దేశంలోని కార్మిక సంఘాలన్నీ తమరాజకీయ అనుబంధాలను ప్రక్కనపెట్టి ఢిల్లీలోని బోట్‌క్లబ్ వద్ద మహాప్రదర్శన నిర్వహించాయి. మళ్ళీ 2009 డిసెంబరు 16న యుపిఎ ప్రభుత్వ హయాంలో చరిత్ర పునరావృతమైంది.

కేంద్ర కార్మిక సంఘాలు, ఇతర ఫెడరేషన్లు తమసైద్ధాంతిక విభేదాలను ప్రక్కనపెట్టి, ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు 2009 సెప్టెంబరు 14న న్యూఢిల్లీలోని మవలంకర్ హాల్‌లో జాతీయ సదస్సు నిర్వహించి, ఆ తర్వాత అక్టోబరు 28న దేశవ్యాప్తంగా "నిరసనదినం" పాటించడం ద్వారా, దేశ కార్మికోద్యమం క్రొత్త పుంతలు త్రొక్కింది. ఎఐఎస్‌జిఇఎఫ్‌తో సహా అనేక జాతీయ ఫెడరేషన్లు ఈ కార్యక్రమాలన్నింటిలో పాల్గొన్నాయి.

ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ అమలుకు సత్వర చర్యలు తీసుకోవల్సిందిగా కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల నాయకులందరూ 2009 సెప్టెంబరు 17న ప్రధాన మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. కాని ప్రయోజనం లేకపోయింది. దీనితో పార్లమెంటు సమావేశాలు జరుగుతుండగానే 2009 డిసెంబరు 16న పార్లమెంటు ముందు భారీ ధర్నా నిర్వహించాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. దేశం నలుమూలల నుండి అన్ని రంగాలకు చెందిన వేలాది మంది ప్రజలు పార్లమెంటు ముందు జరిగిన ఈ ధర్నాలో పాల్గొనడం, దేశ ఐక్య కార్మికోద్యమంలో చారిత్రక ఘట్టం.

సిఐటియు అధ్యక్షులు కా॥ఎం.కె. పాంధే ప్రదర్శననుద్దేశించి ప్రసంగిస్తూ, ఆహార ధాన్యాలు, వంటనూనెల ధరలు తీవ్రంగా పెరగడానికి, ఈ సరుకుల ఫార్వార్డ్ ట్రేడింగ్ ప్రధాన కారణమని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ఫార్వార్డ్ ట్రేడింగ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేయడానికి బదులుగా, రాష్ట్ర ప్రభుత్వాలను నిందించ బూనుకుందని, నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వలను, ఫార్వార్డ్ ట్రేడింగ్‌ను అరికట్టకపోతే ప్రయోజనం లేదని ఆయన అన్నారు. దేశంలోని శ్రామికశక్తిలో 93%గా వున్న అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు ఏ చట్టాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నుల

నుండి పన్ను వసూలు చేసి, అసంఘటిత కార్మికులకు "సాంఘిక సంక్షేమ నిధి" ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తా ప్రసంగిస్తూ, చాలా సంవత్సరాల తర్వాత కార్మికవర్గం కోసం అన్ని కేంద్ర కార్మిక సంఘాలు ఏకం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సదస్సు ఆమోదించిన ప్రకటన ఆధారంగా రాష్ట్ర స్థాయి సంయుక్త సదస్సులు నిర్వహించవల్సిందిగానూ, కార్మికవర్గాన్ని భారీగా సమీకరించి, అక్టోబరు 28న దేశవ్యాప్తంగా "జాతీయ నిరసనదినం" పాటించవల్సిందిగా సంయుక్త సదస్సు పిలుపునిచ్చింది.

## సదస్సు ప్రకటన

న్యూఢిల్లీలోని మవలంకర్ హాల్‌లో 2009 సెప్టెంబరు 14న జరిగిన జాతీయ కార్మిక సదస్సు ఈ క్రింది అంశాల మీద తన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తోంది.

1. ప్రజలకు ఇక్కట్లు కలిగించే విధంగా ఆహారధాన్యాలు, కూరగాయలతో సహా అన్ని నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల పట్ల సదస్సు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.
2. ఆర్థికమాంద్యం కారణంగా అన్ని రంగాల్లోని కోట్లాది మంది కార్మికుల జీవనోపాధిని హరించివేస్తున్న ఉద్యోగాల్లో కోతల పట్ల. సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది.
3. కనీస వేతనాలు, పని గంటలు, సాంఘిక భద్రతా చర్యలు, పని ప్రదేశాల్లో భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులకు సంబంధించిన కార్మిక చట్టాలు అమలు జరగక పోగా, వాటిని తీవ్రంగా ఉల్లంఘించిన ఫలితంగా యావత్ కార్మిక వర్గానికి కలుగుతున్న కష్ట, నష్టాల పట్ల. సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది.
4. కాంట్రాక్టు కార్మికులతో సహా కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులకు అవసరమైన ఉపశమనం కల్గించే విధంగా కేటాయింపులు, పథకాలు, 2008 అసంఘటిత కార్మికుల సాంఘిక భద్రతా చట్టంలో లేవు. ఇంతేగాక ఆ వున్న సదుపాయాల అమలుకు అనేక ఆంక్షలు వుండడంతో పాటు, (అసంఘటిత రంగంలోని పరిశ్రమల మీద జాతీయ కమీషన్) మరియు ఎన్‌సిఇయుఎస్ కార్మిక సమస్యల మీద ఏర్పాటుచేసిన పార్లమెంటు స్థాయీ సంఘం సిఫార్సు చేసిన విధంగా అసంఘటిత రంగానికి జాతీయ నిధి (ఎన్‌ఎఎఫ్‌యుఎస్) ఏర్పాటు చేయకపోవడం పట్ల సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది.
5. లాభాలార్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ పట్ల సదస్సు ఆందోళన వ్యక్తం చేసింది.

కార్మికవర్గం వ్యక్తం చేస్తున్న ఈ ఆందోళనను నివృత్తి చేయడానికి ప్రభుత్వం సత్వరమే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జాతీయ సదస్సు ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకు..

1. సరుకుల మార్కెట్లో స్పెక్యులేషన్‌ను నిరోధించి, సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థ

ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు తగిన చర్యలు చేపట్టడం ద్వారా ఈ సరుకుల ధరల పెరుగుదల నరికట్టాలి.

2. ఆర్థికమాంద్యానికి గురైన సంస్థలకు ఉద్దీపన పథకాలు అమలు చేయడం ద్వారానూ, మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచడం ద్వారానూ ఆర్థిక మాంద్యానికి గురైన రంగాల్లో ఉపాధిని పరిరక్షించేందుకు చురుకైన నిర్దిష్ట చర్యలు చేపట్టాలి.

3. ఏవిధమైన మినహాయింపులు లేకుండా కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలి. చట్టాలను ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు విధించాలి.

4. అసంఘటిత కార్మికుల సాంఘిక భద్రతా చట్టం (2008) క్రింది పథకాలు వర్తింప జేసేందుకు సంబంధించిన అర్హతల విషయమై, దారిద్ర్య రేఖ ప్రాతిపదికగా విధించిన షరతులనన్నింటిని తొలగించాలి. నేషనల్ కమిషన్ ఆన్ ఎంటర్ ప్రైజెస్ ఇన్ అన్ ఆర్గనైజ్డ్ సెక్టార్ (ఎన్‌సిఇయుఎస్), కార్మిక సమస్యల మీద నియమించిన పార్లమెంటు స్థాయీ సంఘం సిఫార్సు చేసిన విధంగా, కాంట్రాక్టు, దినసరి కార్మికులతో సహా అసంఘటిత రంగ కార్మికులందరికీ క్రింది స్థాయి నుండి సాంఘిక భద్రత కల్పించేందుకు అసంఘటిత రంగ కార్మికుల జాతీయ నిధిని ఏర్పాటు చేయాలి.

5. బడ్జెటు లోటును పూడ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల (సిపిఎస్‌ఇ) వాటాల ఉపసంహరణకు పూనుకోరాదు. అంతేగాక నానాటికి పెరుగుతున్న ఈ సంస్థల్లోని రిజర్వులు అదనపు నిధులను, ఈ సంస్థల విస్తరణకు, ఆధునీకరణకు వినియోగించడంతో పాటు, ఖాయిలాపడిన ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణకు ఉపయోగించాలి.

## కార్మికవర్గాన్ని వేధిస్తున్న సమస్యలను పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు

1. రాష్ట్ర స్థాయి సంయుక్త సదస్సులు నిర్వహించాలని,
2. 2009 అక్టోబర్ 28న అఖిలభారత నిరసన దినం పాటించాలని, జాతీయ సదస్సు ఏకగ్రీవంగా ప్రకటించింది. తమ అనుబంధాలతో నిమిత్తం లేకుండా కార్మికులు, ఉద్యోగులు వారి యూనియన్లు, తమను వేధిస్తున్న పై సమస్యల పట్ల తమ ఆందోళనను సమైక్యంగా ఎలుగెత్తి చాటవల్సిందిగా జాతీయసదస్సు పిలుపు నిచ్చింది. పై డిమాండ్ల సాధనకు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు ట్రేడ్ యూనియన్లు అన్నీ సమైక్యంగా ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కూడ జాతీయ సదస్సు వారిని కోరింది.

## భ్రష్టుపట్టిన నయా ఉదారవాద విధానాల కొనసాగింపే 2009 బడ్జెటు

ఇప్పటి వరకు అనుసరిస్తున్న భ్రష్టుపట్టిన నయా ఉదారవాద నమూనా కొనసాగింపుగానే 2009-10 సంవత్సరానికి బడ్జెటు ప్రవేశపెట్టబడింది. ఇది పేదల

సమస్యలనే మాత్రం పరిష్కరించలేదు. 2008 సెప్టెంబర్ 15 వాల్‌స్ట్రీట్ పతనంతో ప్రారంభమైన పెట్టుబడిదారీ విధాన ఆర్థిక సంక్షోభం తీవ్రమైన నేపథ్యంలో 2009-10 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టబడింది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోవడంతో, పెట్టుబడిదారీ విధానం యొక్క నయా ఉదారవాద నమూనా ప్రజల విశ్వాసం కోల్పోయింది.

తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టవల్సిన ఆర్థిక చర్యలను గురించిన మార్గదర్శకాలను, బడ్జెట్‌కు ముందు ప్రకటించిన ఆర్థిక సర్వే వివరించింది. పెట్టుబడుల ఉపసంహరణ, బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాల్లో ఎఫ్‌డిఐ పెంపుదల, పెన్షన్ ప్రైవేటీకరణ, కార్మికులకు 12 గంటల పనిదినం, ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికుల రిట్రెంచ్‌మెంట్ వంటి విధానపర చర్యలను ఆర్థిక సర్వే ప్రముఖంగా ప్రస్తావించింది.

ప్రస్తుత బడ్జెటు ఈ విధానాలననుసరించే రూపొందించబడింది. ప్రభుత్వరంగ సంస్థల వాటాల ఉపసంహరణ, బడ్జెట్ "ప్రధాన నినాదం"గా మారింది. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 2001 ఫిబ్రవరిలో రాజ్యసభలో ప్రవేశపెట్టిన బాల్కోలోవాటాల ఉపసంహరణ" ప్రతిపాదనను నేటి ఆర్థిక మంత్రి, ఆనాటి రాజ్యసభలో ప్రతిపక్ష నాయకునిగా వున్న శ్రీ ప్రణబ్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వాటాల ఉపసంహరణను ఫిక్కి, అస్సోఛాం, సిఐఐలు మాత్రమే డిమాండు చేస్తున్నాయని, ప్రజలు కోరుకోవడం లేదని శ్రీ ప్రణబ్ ముఖర్జీ ఆనాడు వాదించారు. ఇప్పుడాయన అందుకు పూర్తి వ్యతిరేక పల్లవి అందుకున్నారు.

తీవ్ర వ్యతిరేకత నెదుర్కొన్న నూతన పెన్షన్ పథకాన్ని యథాతథంగా వుంచి, దాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయించారు. 2008 సెప్టెంబరు 15 వాల్‌స్ట్రీట్ పతనం తర్వాత అమెరికాలో ఒక ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్ల పెన్షన్ నిధులు హరించుకుపోయిన అనుభవం ప్రపంచం ముందుంది. ఈ నేపథ్యంలో ఈ స్కీమ్ ప్రకారం ఉద్యోగి జీతం నుండి మినహాయించిన మొత్తంలోని కొంత భాగం స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెడుతున్నారు. క్రొత్తగా ప్రభుత్వ సర్వీసుల్లో చేరినవారు నష్టపోతారు. బ్యాంకు, బీమా రంగాలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతాయని ప్రకటించిన బడ్జెట్, ఎఫ్‌డిఐ వాటా పెరుగుదలతో, వీటి ప్రభుత్వరంగ స్వభావంలో ఏవిధమైన మార్పు వుండబోదన్న హామీ ఇవ్వలేదు. ఏడాదికి 1,20,000 ఉద్యోగాలు కల్పిస్తానన్న బడ్జెట్, ఆ ఉద్యోగాలెలా సృష్టించేది చెప్పలేదు. ఆర్థిక సంక్షోభం ఫలితంగా ఇప్పటికే వివిధ రంగాల్లో రిట్రెంచ్ చేయబడ్డ కొన్ని కోట్ల మంది కార్మికుల గురించి, బడ్జెటు మౌనం వహించింది.

నయా ఉదారవాద ఆర్థిక విధానాల కొనసాగింపులో భాగంగా కస్టమ్స్ (దిగుమతి) సుంకాలను తగ్గించడం ద్వారా, మన మార్కెట్లోకి విదేశీ దిగుమతులను మరింత సుగమం చేశారు.

జిడిపి (స్థూలజాతీయోత్పత్తి) పడిపోతున్న స్థితిలో, ఖాయిలా పడిన పిఎస్‌యుల పునరుద్ధరణ గురించిగాని, ప్రభుత్వ రంగంలో నూతన పరిశ్రమల స్థాపన గురించి గాని బడ్జెట్ ఒక్క ముక్క కూడ చెప్పలేదు. పైపెచ్చు, రెవెన్యూ బడ్జెటు లోటు పెరుగుతుందని తెలిసి కూడ, కార్పొరేట్ టాక్సును ముట్టుకోలేదు. అసంఘటిత రంగ కార్మికులకు సాంఘిక భద్రతా చర్యల గురించి గాని, కార్మికులకు రిట్రెంచ్‌మెంటు వుండబోదనిగాని నిర్దిష్ట హామీ బడ్జెటులో లేదు. ఆదాయం పన్ను లెక్కించేందుకు మినహాయించే ఆదాయం పరిమితిని కొద్దిగా పెంచడం, కార్మికులు, ఉద్యోగులకు కాస్తంత వూరట కల్గిస్తుంది. ద్రవ్యోల్బణం సున్నా స్థాయికి చేరుకుందని గొప్పగా చెప్పుకున్న బడ్జెటు, అడ్డూ, అదుపూ లేకుండా పెరిగిపోతున్న ధరలను గురించి కనీసం ప్రస్తావించలేదు. రైతాంగానికి కొంత వెసులుబాటు కల్పించినప్పటికీ, భారత వ్యవసాయ రంగ సంక్షోభానికి మూలమైన సమస్యల పరిష్కారానికి బడ్జెటు ప్రయత్నించలేదు. పేదలు మరింత పేదలవుతారు.

ఈ నయా ఉదారవాద బడ్జెట్ కార్మికవర్గానికి ఆశాజనకంగా లేదు. ఈ తీవ్ర ఆర్థిక సంక్షోభం కొనసాగనుంది. దీనిని పరిష్కరించే శక్తి, సామర్థ్యాలు, చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేవు. అందువల్ల వారి జీవనం, జీవనోపాధి మరింత దెబ్బతినే పరిస్థితు లేర్పడతాయి. కనుక ఈ విధానాల నెదిరించేందుకు కార్మికవర్గం సిద్ధంగా వుండాలి.

## పెన్షన్ రంగంలో 26% ఎఫ్‌డిఐ

లోక్‌సభకు ఎన్నికలు రావడంతో పార్లమెంటు ఆమోదం పొందకుండా పెండింగులో వున్న పెన్షన్, బీమా, బ్యాంకింగ్ రంగాల సంస్కరణలు, నవరత్న కంపెనీల వాటాల ఉపసంహరణ వంటి బిల్లులను పార్లమెంటు చేత ఆమోదింప చేసుకునేందుకు, యుపిఎ-2 ప్రభుత్వం చాలా తొందరలో వుంది. పెన్షన్ రంగంలో 26%, ఎఫ్‌డిఐ అనుమతించాలన్న ప్రతిపాదనతో పాటు, ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని (49%కి) పెంచినపుడు, పెన్షన్ రంగంలో కూడా ఆ పరిమితిని ఆమేరకు పెంచాలన్న ప్రతిపాదనతో నూతన యుపిఎ-2 ప్రభుత్వం ముందుకు వచ్చింది. ప్రజల జీవితాలను, జీవనోపాధిని, అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను విచ్ఛిన్నం చేసి, భయోత్పాతం సృష్టించిన పెట్టుబడిదారీ విధాన సంక్షోభం నుండి గుణపాఠాలు నేర్చుకునేందుకు మన ప్రభుత్వం నిరాకరిస్తోంది. ఇన్సూరెన్స్, పెన్షన్, బ్యాంకింగ్ రంగాల్లో విదేశీ సంస్థల ననుమతించేందుకు అనుచితమైన తొందరపాటును ప్రదర్శిస్తోంది.

## వాటాల ఉపసంహరణను వ్యతిరేకించిన బీమా ఉద్యోగులు

ఎల్ఐసి (సవరణ) బిల్లు 2009ను, 2009 జూలై 31న లోక్‌సభలో ప్రవేశపెట్టి నందుకు నిరసనగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) పిలుపు మేరకు ఎల్ఐసి ఉద్యోగులు 5.08.2009న దేశవ్యాప్తంగా రెండు గంటల వాకౌట్ సమ్మెను విజయవంతంగా నిర్వహించారు. 1994లోనే మల్హోత్రా కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఎల్ఐసి

ప్రైవేటీకరణను సుగమం చేసేందుకు, ఎల్ఐసిలో రూ. 5/– కోట్లుగా వున్న ప్రభుత్వ పెట్టుబడిని రూ. 100/– కోట్లకు పెంచడానికి, భవిష్యత్తులో పార్లమెంటు అనుమతితో నిమిత్తం లేకుండా ఈ మొత్తాన్ని మరింత పెంచడానికి ప్రభుత్వానికి అధికారం కట్టబెడ్తూ, పట్టాదారుల బోనసు తగ్గింపుకు దారితీసే విధంగా వ్యాల్యుయేషన్ సర్ప్లస్‌లో పట్టాదారుల వాటాను ప్రస్తుతమున్న 95% నుండి 90%కి తగ్గించడానికి, ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసి జారీ చేసిన పట్టాలకు వున్న ప్రభుత్వ హామీ (సావరిన్ గ్యారంటీ)ని ఉపసంహరించేందుకు, ఎల్ఐసి ఏజంట్ల నిబంధనలను ఏకపక్షంగా మార్చేందుకు, ఈ బిల్లు ఉద్దేశించబడింది.

## బ్యాంకింగ్ రంగంలో సంపూర్ణ సమ్మె

భారత బ్యాంకింగ్ రంగంలోని బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు చెందిన తొమ్మిది ప్రధాన అఖిలభారత సంఘాలతో కూడిన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపు మేరకు, దేశవ్యాప్తంగా వున్న 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు, అధికారులు 2009 ఆగస్టు 6, 7 తేదీల్లో సమ్మె చేయడంతో, దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఈ క్రింది డిమాండ్ల సాధనకు యుఎఫ్‌బియు సమ్మె పిలుపిచ్చింది.

1. 2007 నవంబరు నుండి అపరిష్కృతంగా వున్న వేతన సవరణ సమస్య పరిష్కరించాలి.
2. గత రెండు సంవత్సరాలుగా అనేక దఫాలుగా సాగిన సంప్రదింపుల ఫలితంగా వచ్చిన అవగాహన మేరకు కంట్రిబ్యూటరీ పెన్షన్ ఫండ్ (సిపిఎఫ్) పరిధిలో వున్న ఉద్యోగులు, అధికారులకు సిపిఎఫ్‌కు బదులుగా పెన్షన్ కోరుకునే అవకాశం కల్పించాలి.
3. ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబిఏ) మరియు యుఎఫ్‌బియుల మధ్య కుదిరిన అవగాహన మేరకు, సర్వీసులో వుండగానే చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఆర్థిక సహాయం, పథకాన్ని ప్రవేశపెట్టాలి.

ప్రభుత్వ ఆదేశాల సాకు చూపి పై అంశాల మీద యుఎఫ్‌బియుతో వచ్చిన అవగాహన నుండి ఐబిఏ వెనక్కు మళ్ళడంతో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఈ సమ్మె చేయవల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు 1.1.2004 నుండి ఏకపక్షంగా అమలు చేసిన నూతన పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్)కు బ్యాంకు ఉద్యోగులు, అధికారుల మీద బలవంతంగా రుద్దేందుకు ఐబిఏ, ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఎన్‌పిఎస్‌లో ఉద్యోగి లేదా అధికారి నిర్దిష్ట మొత్తం చెల్లిస్తాడు. కాని పెన్షన్ ఎంత వచ్చేది తెలియదు. ఉద్యోగ విరమణ తర్వాత ఈ విధమైన అస్థిర పరిస్థితులను రుద్దడాన్ని యుఎఫ్‌బియు దృఢంగా వ్యతిరేకించింది. 2009 ఆగస్టు 6,7 తేదీల్లో రెండు రోజుల దేశవ్యాప్త సమ్మె జయప్రదమైన తర్వాత యుఎఫ్‌బియు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ," బ్యాంకు ఉద్యోగులు, అధికారుల న్యాయమైన ఆకాంక్షలను గుర్తించి ఐబిఏ మరియు ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే, సమీప భవిష్యత్తులో నిరవధిక సమ్మెతో సహా, ఆందోళనను తీవ్రతరం చేయడం జరుగుతుందని, దానివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పట్టాలు తప్పే పరిస్థితేర్పడితే, దానికి ఐబిఏ, ప్రభుత్వాలే బాధ్యత వహించాలని," ప్రకటించింది.

## విశాల ట్రేడ్ యూనియన్ ఐక్యతలో నూతన దశ

న్యూఢిల్లీలోని ఐఎన్‌టియుసి ప్రధాన కార్యాలయంలో జూలై 19వ తేదీన జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సమావేశం ఈ క్రింది అంశాల మీద తన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది.

1. ఆహార ధాన్యాలు, కూరగాయలతో సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల ప్రజలెదుర్కొంటున్న ఇబ్బందుల పట్ల.
2. ఆర్థిక మాంద్య పరిస్థితులవల్ల కోట్లాది మంది కార్మికులు, ఉద్యోగులు జీవనోపాధిని కోల్పోవడం పట్ల.
3. దేశవ్యాప్తంగా కనీస వేతనాలు, పనిగంటలు, సాంఘిక భద్రత, పని ప్రదేశంలో భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులు వంటి ప్రాథమిక కార్మిక హక్కులు అమలు జరగకపోగా, వాటినుల్లంఘించడం పట్ల.
4. కాంట్రాక్టు కార్మికులతో సహా అసంఘటిత రంగంలోని కోట్లాది కార్మికులకు ఉపశమనం కల్గించేందుకుద్దేశించిన (2008) అసంఘటిత కార్మికుల సాంఘిక భద్రతా చట్టంలో అందుకవసరమైన కేటాయింపులు, పథకాలు లేవు. ఇవి అనేక ఆంక్షలతో కూడి వున్నాయి. ఎన్‌సిఇయుఎస్ మరియు పార్లమెంట్ స్థాయీ సంఘం సిఫార్సు చేసినట్లు అసంఘటిత రంగానికి జాతీయ నిధి (ఎన్ఎఎఫ్‌యుఎస్) ఏర్పాటు చేయకపోవడం పట్ల.
5. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వాటాల ఉపసంహరణ ప్రయత్నాల పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.

   తమ యూనియన్ల అనుబంధాలకతీతంగా, తమను వేధిస్తున్న పై సమస్యలను గురించి ప్రభుత్వానికి తెలిసే విధంగా ఆందోళన వ్యక్తం చేయవల్సిందిగా కేంద్ర ట్రేడ్‌యూనియన్లు కార్మికులు, ఉద్యోగులకు పిలుపు ఇచ్చాయి. అదే సమయంలో పై సమస్యల పరిష్కారానికి సమర్ధవంతమైన చర్యలు చేపట్ట వల్సిందిగా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పై సమస్యల మీద ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించిన తర్వాత, కార్యాచరణను రూపొందించడానికి సెప్టెంబరు నెలలో ఢిల్లీలో ట్రేడ్ యూనియన్ జాతీయ సదస్సు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐసిసిటియులు సమావేశంలో పాల్గొనగా, బిఎంఎస్, యుటియుసి, జెయుసిసిలు సమావేశంలో పాల్గొనకపోయినప్పటికీ, ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపారు.

## సంపూర్ణ కార్మికవర్గ ఐక్యత నేటి ఆవశ్యకత

దేశంలోని కార్మిక సంఘాలన్నీ 14.9.2009న ఢిల్లీలో ఐక్య కార్మిక సదస్సు నిర్వహించి, 28.11.2009న దేశవ్యాప్తంగా ఐక్య ట్రేడ్ యూనియన్ సదస్సులను, అఖిల భారత నిరసన దినాన్ని పాటించాల్సిందిగా పిలుపు ఇచ్చిన విషయం ఇప్పటికే ప్రస్తావించడం జరిగింది. ఈ క్రింది సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటానికి పిలుపు ఇవ్వడం జరిగింది.

1. ఆహార ధాన్యాలు, కూరగాయలతో సహా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల,
2. ఆర్థిక మాంద్యం వల్ల కోట్లాది కార్మికుల ఉద్యోగాలు కోల్పోవడం,
3. కనీస వేతనాలు, పనిగంటలు వంటి విషయాల్లో కార్మిక చట్టాల ఉల్లంఘన,
4. అసంఘటిత రంగ కార్మికుల సాంఘిక భద్రతా చట్టం (2008)కి సంబంధించిన పథకంలో సరైన కేటాయింపులు లేకపోవడం.
5. పిఎస్‌యుల వాటాల ఉపసంహరణ, ఐఎన్‌టియుసి, బిఎంఎస్, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐటియుసి ఇతర వామపక్ష కార్మిక సంఘాలు పై అంశాలను సంయుక్తంగా లేవనెత్తడం మిక్కిలి ప్రాధాన్యత సంతరించుకున్న విషయం. ప్రస్తుత రాజకీయ నేపథ్యంలో పాలకవర్గ, వామపక్ష కార్మిక సంఘాలు ఒకే వేదిక నుండి విస్తృత కార్యాచరణకు పిలుపునివ్వడం చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది.

అక్టోబర్ 28న రాష్ట్ర స్థాయి సంయుక్త సదస్సులు, అఖిల భారత నిరసన దినం దేశవ్యాప్తంగా మిక్కిలి ఉత్సాహంగా, విజయవంతంగా నిర్వహించబడ్డాయి. పైన పేర్కొన్న ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, సత్వర పరిష్కారానికి కృషి చేసేందుకు, 2009 డిసెంబరు 16న పార్లమెంట్‌కు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించడం ద్వారా, కార్మికవర్గ ఐక్య పోరాటాలను ముందుకు తీసుకెళ్ళాలని నిర్ణయించడం జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొనవల్సిందిగా జాతీయ ఫెడరేషన్లన్నింటికి కేంద్ర కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

దేశం క్లిష్టపరిస్థితుల నెదుర్కొంటున్న ఈ తరుణంలో కార్మికులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలను వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి 14.9.2009న ఢిల్లీలో జరిగిన సంయుక్త సదస్సు మొదలుకొని, 16.12.2009న పార్లమెంటు ముందు విజయవంతంగా ప్రదర్శన నిర్వహించే వరకు కార్మికులు, వారి ట్రేడ్ యూనియన్ల మధ్య సాధించిన ఐక్యత, దేశ కార్మికోద్యమ చరిత్రకు ఒక నూతనాధ్యాయాన్ని జోడించింది.

## పార్లమెంటు ముందు కార్మికవర్గ అపూర్వ ధర్నా

కేంద్ర కార్మిక సంఘాలు 9.10.2009న ఢిల్లీలో ఐఎన్‌టియుసి ఆఫీసులో సమావేశమై 16.12.2009న పార్లమెంటు ముందు బ్రహ్మాండమైన ధర్నాతో పాటు, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ, పారిశ్రామిక కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించాయి. కేంద్ర కార్మిక సంఘాలు సెప్టెంబరు 14వ తేదీన జాతీయ సదస్సు నిర్వహించి 28.10.2009న దేశ వ్యాప్తంగా నిరసన దినం పాటించాయి. ఎఐఎస్‌జిఇఎఫ్‌తో పాటు అన్ని జాతీయ ఫెడరేషన్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. దేశ ఐక్య కార్మికోద్యమ చరిత్రలో ఇదొక చారిత్రక పరిణామం. సుమారు 30 సంవత్సరాల క్రిందట మొరార్జీదేశాయి నాయకత్వంలోని జనతా ప్రభుత్వ హయాంలో కార్మిక వ్యతిరేక భూతలింగం కమిటీ సిఫార్సులకు వ్యతిరేకంగా, ఆనాడు రాజకీయ అనుబంధాలున్న సంఘాలు వాటిని ప్రక్కన పెట్టి, ఏవిధమైన అనుబంధాలు లేని యూనియన్లను కలుపుకుని సంయుక్త పోరాటాలు నిర్వహించాయి. ఢిల్లీలోని బోట్ క్లబ్ వద్ద బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించాయి. 2009 మేలో సాధారణ ఎన్నికల తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన యుపిఎ-2 ప్రభుత్వం దేశానికి, దేశ ప్రజలకు వినాశనాన్ని తెచ్చిపెట్టే విధానాలను ప్రకటించడంతో, అదే చరిత్ర మరింత పెద్ద ఎత్తున పునరావృతమవుతోంది. 14.9.2009న ఢిల్లీలో జరిగిన సదస్సులోనూ, 28.10.2009న అఖిల భారత నిరసన సందర్భంగానూ, పార్లమెంటుకు ప్రదర్శన సందర్భంగానూ, అదే ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను లేవనెత్తడం జరిగింది. తమ అనుబంధాలకతీతంగా 16.12.2009న పార్లమెంటు ముందు సమైక్య ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా కోరుతూ ఇతర యూనియన్లు, జాతీయ ఫెడరేషన్లకు బిఎంఎస్, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, ఎ.ఐ యుటియుసి, టియుసిసి, ఎఐసిసిటియులు సంయుక్తంగా సంతకాలు చేసిన ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశాయి. సామాజిక స్పృహ కలిగి, భారత కార్మిక వర్గ ప్రయోజనాల పరిరక్షణకు ముందు పీఠిన నిల్చిన ఎఐఎస్‌జిఇఎఫ్, కార్మిక వర్గ ప్రయోజనాల పరిరక్షణతో పాటు, దేశ ప్రయోజనాల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన అన్ని కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటోంది. రాష్ట్ర రాజధానుల్లోనూ, పారిశ్రామిక కేంద్రాల్లోనూ 16.12.2009న ధర్నాను జయప్రదం చేసేందుకు, ధర్నా డిమాండ్ల ప్రాధాన్యతను కార్మికులు, ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి, ధర్నాకు సమీకరించేందుకు ప్రచార కార్యక్రమాలను రూపొందించుకోవల్సిందిగా ఎఐఎస్‌జిఇఎఫ్ తన అనుబంధశాఖలకు విజ్ఞప్తి చేసింది.

## జనపనార కార్మికుల ఐక్య పోరాటం

2002లో జనపనార కార్మికులు చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందం అమలు కాకపోవడంతో, ఒప్పందం అమలు కోరుతూ 4 సార్లు సమైక్యంగా సమ్మెలు నిర్వహించారు.

చివరిగా జూట్‌మిల్లు కార్మికుల సమైక్య సమ్మె 14.12.2009 నుండి 12.2.2010 వరకు 61 రోజులు సాగింది. 61 రోజుల సమ్మె తర్వాత ఈ క్రింది అంశాల మీద ఒప్పందం కుదిరింది.

ఎ) ఆరు వాయిదాల్లో డిఎ బకాయిలు చెల్లిస్తారు. ధరల వినిమయ సూచిలో ప్రతి పాయింట్ పెరుగుదలకు రూ.1.90పైసలు చెల్లిస్తారు.

బి) క్రొత్తగా రిక్రూట్ అయినవారికి ప్రారంభ జీతం గత ఒప్పందం ప్రకారం రోజుకు రూ.100/-లు వుండగా, దానిని రూ.157/-లకు పెంచడం జరిగింది.

సి) ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారమే గ్రాడ్యుటీ చెల్లించడం జరుగుతుంది.

డి) రిటైరైన కార్మికులను తిరిగి పనిలో పెట్టుకుంటే, వారు రిటైరయ్యే సమయంలో పొందుతున్న జీతాన్ని వారికి చెల్లిస్తారు.

ఇ) ప్రతి మిల్లులో సగటున రోజూ పనిచేసే కార్మికుల్లో పర్మినెంటు, స్పెషల్ బదిలీ కార్మికుల సంఖ్యను 90%, 20%గా మెయిన్‌టెయిన్ చేసే విషయాన్ని కార్మికశాఖ సంబంధిత పక్షాలతో సంప్రదించి ఒక సంవత్సరంలోగా ఒక ఒప్పందానికి వస్తుంది. ప్రస్తుతానికి స్పెషల్ బదిలీ కార్మికులను పర్మినెంట్ చేయడం ద్వారా, ప్రతి మిల్లులోనూ ప్రస్తుతమున్న కార్మికుల సంఖ్యకు అదనంగా 375 మందిని చేర్చుతారు. అదే సంఖ్యలో సాధారణ బదిలీ కార్మికులను, స్పెషల్ బదిలీ కార్మికులుగా పదోన్నతి ఇస్తారు.

జూట్ మిల్ కార్మికులు సుదీర్ఘ, సమైక్య పోరాటాల ద్వారా ఈ విజయాలు సాధించుకోగలిగారు.

## మహానాయకుడు కామ్రేడ్ జ్యోతిబసు అస్తమయం

1977 నుండి ముప్పది సంవత్సరాల పాటు పశ్చిమబెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి, పాలనాదక్షునిగా ప్రఖ్యాతి గాంచిన సిపిఐ(ఎం) పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ జ్యోతిబసు 2010 జనవరి 17వ తేదీన అస్తమించారు. ఆయన మరణం దేశ కార్మికోద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు. దేశంలో వామపక్ష ఉద్యమాన్ని, వామపక్ష ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన ప్రధాన పాత్ర నిర్వహించారు. అనారోగ్య కారణాల వల్ల కా॥ జ్యోతిబసు ముఖ్యమంత్రి బాధ్యతల నుండి 2000 నవంబరు 6న తనంతతానుగానే వైదొలిగారు. యుకెలో ఉన్నత విద్య నభ్యసించి భారతదేశానికి తిరిగి వచ్చిన కామ్రేడ్ జ్యోతిబసు రైల్వే కార్మికోద్యమ కార్యకర్తగా తన ట్రేడ్ యూనియన్ జీవితాన్ని ప్రారంభించారు. సిఐటియు ఉపాధ్యక్షునిగా తుది వరకు ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించిన ఆయన తన 93వ ఏట తుది శ్వాస విడిచారు.

## దేశవ్యాప్తంగా రంగాలవారీ ట్రేడ్ యూనియన్‌పోరాటల విస్తరణ
## నిర్మాణ కార్మికుల దేశ వ్యాప్త సమ్మె

పది అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యుఎఫ్ఐ) పిలుపుమేరకు 7 లక్షల మందికి పైగా వివిధ వృత్తులకు చెందిన నిర్మాణ రంగ కార్మికులు 8.12.2009న ఒక రోజు అఖిల భారత సమ్మె చేశారు. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లోని 175 జిల్లాల్లోనూ, 50 పెద్ద నిర్మాణ ప్రాజెక్టుల మీద సమ్మె ప్రభావం చూపింది. సిపిఐ(ఎం) పార్లమెంటు సభ్యులు, కామ్రేడ్ ఎం.డి. అమీన్ మరియు సిపిఐ(ఎం) పార్లమెంట్ సభ్యులు సిఐటియు ప్రధాన కార్యదర్శి కా॥ తపన్ సేన్‌లతో కూడిన ఆరుగురు సభ్యుల ప్రతినిధి వర్గం కేంద్ర కార్మిక మంత్రిని, విదేశాల్లో భారత వ్యవహారాల కేంద్ర మంత్రిని కలసి, నిర్మాణ రంగ కార్మికులకు సంబంధించిన పది అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల మీద చర్చించారు. రాష్ట్రాల్లో నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలు గురించి చర్చించేందుకు 22.1.2010న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తామని, వారు ప్రతినిధి వర్గానికి హామీ ఇచ్చారు. వామపక్ష కార్మిక సంఘాల కృషి ఫలితంగా అసంఘటిత కార్మికులకు మూడు నెలలలోగా సాంఘిక భద్రతా పథకాన్ని రూపొందించేందుకు ఏకవ్యక్తి సంఘాన్ని నియమించడం జరిగింది.

## దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మె

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్‌ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ), ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎఐబిఒఎ)ల పిలుపు మేరకు 16.12.2009న జరిగిన ఒక రోజు దేశ వ్యాప్త సమ్మెతో బ్యాంకింగ్ సర్వీసులు స్తంభించిపోయాయి. చిన్న బ్యాంకులను పెద్ద బ్యాంకుల్లో విలీనం చేసి, చిన్న బ్యాంకుల్లోని ఉద్యోగుల భవిష్యత్తుకు నష్టం కల్గించే ప్రభుత్వ విధానాలను బ్యాంకు ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## వాటాల ఉపసంహరణకు వ్యతిరేకంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన

లాభాలార్జిస్తున్న బిఎస్ఎన్ఎల్ వాటాల ఉపసంహరణకు, శ్యామ్ పిట్రోడా కమిటీ చేసిన సిఫార్సుల మేరకు లక్షమంది బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల రిట్రెంచ్‌మెంట్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా బిఎస్ఎన్ఎల్‌లోని ఉద్యోగులు, అధికారుల యూనియన్లు, అసోసియేషన్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు 26.3.2010న దేశవ్యాప్తంగా ఒకరోజు ధర్నా, ప్రదర్శనలు విజయవంతంగా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించకపోతే 20.4.2010న

ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు పూనుకుంటామని నోటీసు ఇవ్వడం జరిగింది. టెలికం రంగంలోని వివిధ సోదర సంఘాలు ఈ పోరాటానికి మద్దతిచ్చాయి.

## సిఐటియు 13వ అఖిల భారత మహాసభలు

సిఐటియు, తన 13వ అఖిలభారత మహాసభలను 2010 మార్చి 17 నుండి 21 వరకు చండీఘర్ నగరంలో జరుపుకుంది. క్రమశిక్షణా యుతంగా, ఉత్సాహపూరిత వాతావరణంలో సాగిన ఈ మహాసభ బ్రహ్మాండంగా విజయవంతమైంది. నయా ఉదారవాద, తిరోగమన ఆర్థికవిధానాల ద్వారా ప్రజలపై దాడులు చేస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేసి నిర్విరామంగా పోరాటాలు కొనసాగించాలని మహాసభ నిర్ణయించింది. దాదాపు అన్ని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు ఒకే వేదిక నుండి సిఐటియు మహాసభకు శుభాకాంక్షలందించడం ఒక అరుదైన సంఘటన. కేంద్ర ప్రభుత్వం ముందుంచిన తొమ్మిది అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల మీద 2010 మార్చి 5న కనీసం పది లక్షల మంది స్వచ్ఛంద అరెస్టుల కార్యక్రమంతో సహా, దేశవ్యాప్త ఐక్య కార్యాచరణను ముందుకు తీసుకువెళ్ళాల్సిన ప్రాధాన్యతను, ఇతర కార్మిక సంఘాల నాయకులందరూ నొక్కి చెప్పారు. 357 మంది మహిళా ప్రతినిధులు, 16 దేశాల నుండి 32 మంది విదేశీ ప్రతినిధులు, ఐఎల్ఓ నుండి ఇద్దరు ప్రతినిధులతో సహా మొత్తం 2410 మంది ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్ సహాయ కార్యదర్శి కా॥ ఆర్.సి. జగ్గా మహాసభలో పాల్గొని ప్రసంగించారు. మహాసభ పశ్చిమబెంగాల్‌లో మావోయిస్టుల దాడులకు వ్యతిరేకంగానూ, ట్రేడ్ యూనియన్ ఐక్యత మీద, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, వ్యవసాయ సంక్షోభం మీద కార్మిక – కర్షక ఐక్యత ప్రాధాన్యత గురించి, క్యూబా విప్లవ 50వ వార్షికోత్సవాల మీద, పిఎస్‌యులు, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాల్లో వాటాల ఉపసంహరణకు వ్యతిరేకంగా, కార్మిక వ్యతిరేక, కార్మిక చట్టాలు మొదలైన అంశాల మీద ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించింది. 60 మంది ప్రతినిధులు ప్రధాన కార్యదర్శి నివేదిక మీద జరిగిన చర్చలో పాల్గొన్నారు. నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కా॥ఎ.కె. పద్మనాభన్ అధ్యక్షునిగా, కా॥ తపన్‌సేన్ ప్రధాన కార్యదర్శిగా, మరో 16 మంది కార్యదర్శులు, 16 మంది ఉపాధ్యక్షులతో నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కా॥ఎం.కె. పాంథే, కా॥ సుకోమల్‌సేన్‌లు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

## ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త హర్తాళ్

పదమూడు వామపక్ష, ఎన్‌డిఎ యేతర లౌకిక ప్రతిపక్షాలు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా 2010 ఏప్రిల్ 27న పన్నెండు గంటల దేశవ్యాప్త హర్తాళ్‌కు ఇచ్చిన పిలుపు బ్రహ్మాండంగా విజయవంతమైంది. అస్సాం, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, జార్ఖండ్, కేరళ, మహారాష్ట్ర, ఒడిషా, తమిళనాడు, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాలలో హర్తాళ్

సంపూర్ణంగా విజయవంతం కాగా, మిగిలిన రాష్ట్రాల్లో హర్తాళ్ ప్రభావం వివిధ స్థాయిల్లో వుంది. ఈ హర్తాళ్‌కు వచ్చిన అపూర్వ స్పందన, ఆకాశాన్నంటే ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రజల్లో తీవ్రమవుతున్న అసంతృప్తికి అద్దం పడుతోంది. ధరల పెరుగుదల నరికట్టడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం పట్ల ప్రజల అసంతృప్తిని కూడా ఇది వెల్లడించింది. ఆ రోజున దేశవ్యాప్తంగా అనేక చోట్ల ర్యాలీలు, ధర్నాలు, ప్రదర్శనలు జరిగాయి. హర్తాళ్ మద్దతుదారుల మీద లాఠీఛార్జి జరిగింది. ప్రభుత్వం అరెస్టులకు కూడా పూనుకుంది.

పశ్చిమబెంగాల్‌లో ధరల పెరుగుదల తదితర డిమాండ్ల మీద ఆందోళన

పశ్చిమబెంగాల్‌లోని సంఘటిత కార్మికోద్యమ ఐక్యవేదిక "బ్రోడర్ కమిటీ" (విశాలఐక్య వేదిక) పిలుపుమేరకు, రాష్ట్ర స్థాయి నుండి బ్లాకు స్థాయి వరకు 23.4.2010 సాయంత్రం నుండి 24.4.2010 ఉదయం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 12 గంటల పాటు నిరంతరాయంగా ప్రదర్శనలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, కేంద్ర, రాష్ట్ర పిఎస్‌యులు, రైల్వే, రక్షణ, బ్యాంకులు, ఇన్సూరెన్స్, వాణిజ్య కార్యాలయాలు, భారత ఆహార సంస్థలకు చెందిన కార్మికులు, ఉద్యోగులతో పాటు, ఉపాధ్యాయులు, వేలాది మంది పెన్షనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిత్యావసర సరుకుల ధరల నదుపు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, ఆహార ధాన్యాలతో సహా నిత్యావసర వస్తువులను ఫార్వార్డ్ ట్రేడింగు నుండి మినహాయించాలని, పేదల వెన్నువిరిచే పెట్రోల్, డీజెల్, ఎరువుల ధరల పెంపుదలనుపసంహరించాలని, పిఎస్‌యుల వాటాల ఉపసంహరణను ఆపివేయాలని, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలలో ఎఫ్‌డిఐ పరిమితి పెంపుదల ప్రతిపాదనల నుపసంహరించాలని, రైల్వేలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలని, అప్రతిష్టాకరమైన పిఎఫ్‌ఆర్‌డిఏ బిల్లును ఉపసంహరించాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలో విచ్ఛిన్నకర పరిస్థితులను సృష్టించి, ప్రజాస్వామ్య వాతావరణానికి భంగం కలిగించి, కేంద్ర ప్రభుత్వ నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్ష ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని బలహీన పర్చే లక్ష్యంతో వామపక్ష వ్యతిరేక శక్తులు సాగిస్తున్న మతిలేని హింసాకాండకు కూడా కార్మికవర్గం నిరసన వ్యక్తం చేసింది.

రాష్ట్ర స్థాయిలో సాగిన ఈ ఉద్యమంలో కార్మికులు భారీసంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. కోల్‌కతాలోని రాణీరాస్‌మణి అవెన్యూలో జరిగిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో మహిళలతో సహా, పదివేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అనేక మంది మహిళలతో సహా ఐదువేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు రాత్రంతా ధర్నాలో పాల్గొని విజయవంతం చేశారు.

## బొగ్గు రంగంలో సంపూర్ణ సమ్మె

ఆలిండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్‌తో సహా ఐదు బొగ్గు కార్మికుల జాతీయ ఫెడరేషన్లు 27.3.2010న రాంచీలో నిర్వహించిన సదస్సులో 5.5.2010 నుండి మూడు రోజులు

సమ్మె చేయాలని నిర్ణయించాయి. ఈ సదస్సు తర్వాత ఏప్రిల్ 9వ తేదీన ఢిల్లీలో కేంద్ర బొగ్గుశాఖ రాష్ట్ర మంత్రితో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీనితో తమ పది అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లకు మద్దతుగా కోల్ ఇండియా, దాని అనుబంధ కంపెనీల్లోని బొగ్గు కార్మికులు 5.5.2010 నుండి సమ్మె ప్రారంభించారు. సిఐటియుతో సహా తొమ్మిది కేంద్ర కార్మిక సంఘాలీ సమ్మెకు మద్దతిచ్చాయి. కోల్ ఇండియా వాటాల ఉపసంహరణను, బొగ్గు పరిశ్రమలలోని పనులను అవుట్‌సోర్సింగ్ చేయడం, కొత్త బొగ్గు క్షేత్రాలను ఇతరులకు కేటాయించడాన్ని కోల్ ఫెడరేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. జాతీయ బొగ్గు కార్మికుల చట్టంలోని 8వ అధికరణం ప్రకారం వేతనాలు, ఇతర సదుపాయాలు కల్పించాలని, బొగ్గు పరిశ్రమను మౌలిక సదుపాయాల పరిశ్రమగా ప్రకటించాలని, కోల్ విదేశ్ సంస్థను మూసివేయాలని, కోల్ ఇండియా లిమిటెడ్ అనుబంధ కంపెనీల్లో అధికారేతర (నాన్ ఎగ్జిక్యూటివ్) కేటగిరీల్లో రిక్రూట్‌మెంట్ మీద నిషేధం తొలగించాలని, అధికారులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికులకు కూడా పనితీరుతో ముడిపడిన వేతన విధానం, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, ఇతర బెనిఫిట్లు ప్రవేశపెట్టాలని, ఇతర బెనిఫిట్లుకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలని, బొగ్గు కార్మికుల పెన్షన్‌ను 25% నుండి 40%కి పెంచాలని, ఒప్పందం ప్రకారం ఉత్పత్తి ప్రారంభించని బొగ్గు క్షేత్రాలను రద్దు పరచాలని, ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన, ప్రభుత్వ రంగ సంస్థల పరిధిలోని బొగ్గు బ్లాకుల కేటాయింపులను రద్దు చేసి, వాటిని సంబంధిత పిఎస్‌యుల కప్పగించాలన్న ముఖ్యమైన డిమాండ్లను ఈ సమ్మె సందర్భంగా లేవనెత్తడం జరిగింది.

## బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల భారీ సమ్మె

తమ డిమాండ్లకు మద్దతుగా 2010 ఏప్రిల్ 20వ తేదీన బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున సమైక్యంగా సమ్మెకు తలపడడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి సమ్మె ప్రారంభమైన రెండు గంటలలోపే సమ్మె చేస్తున్న ఉద్యోగుల నాయకులతో చర్చలు జరిపింది. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు పూర్తిగా సమ్మెలో పాల్గొనడంతో దేశవ్యాప్తంగా 3 వేలకు పైగావున్న బిఎస్ఎన్ఎల్ ఆఫీసులన్నీ బోసిపోయాయి. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులందరికీ ప్రాతినిధ్యం వహించే యూనియన్లు / అసోసియేషన్ల ఐక్యకార్యాచరణ కమిటీ దేశవ్యాప్త నిరవధిక సమ్మెకు పిలుపిచ్చింది. విఆర్ఎస్ ప్రవేశపెట్టడం, బిఎస్ఎన్ఎల్ వాటాల ఉపసంహరణ, బిఎస్ఎన్ఎల్ మౌలిక సదుపాయాలను ప్రైవేటు కంపెనీలు పంచుకోవడం తదితర అంశాల మీద నిర్ణయం తీసుకునే ముందు యూనియన్లను విశ్వాసంలోకి తీసుకుంటామని, కేంద్ర సమాచార, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి జాయింట్ యాక్షన్ కమిటీకి హామీ ఇచ్చిన తర్వాత, జెఎసి సమ్మెనుపసంహరించి, ఉద్యోగులను విధులకు హాజరు కావాల్సిందిగా పిలుపిచ్చింది.

1. బిఎస్ఎన్ఎల్ వాటాల ఉపసంహరణ / ప్రైవేటీకరణ వుండరాదని
2. రిట్రెంచ్‌మెంట్ / విఆర్ఎస్ ప్రయత్నాలను మానుకోవాలని

3. అవుట్ సోర్సింగ్‌కు స్వస్తి చెప్పాలని
4. ఇండియన్ టెలికం సర్వీసెస్ (ఐటిఎస్) కు చెందిన అధికారులను బిఎస్ఎన్ఎల్‌లో ఇముడ్చుకోవాలని.
5. బిఎస్ఎన్ఎల్‌కు అవసరమైన మొబైల్ లైన్స్ సమకూర్చుకునే అవకాశం కల్పించాలని.
6. బిఎస్ఎన్ఎల్‌లో రిటైరైనవారి పెన్షన్ సవరణ
7. బిఎస్ఎన్ఎల్ కాపర్ కేబుల్స్‌ను, మౌలిక సదుపాయాలను ప్రైవేటు కంపెనీలు వినియోగించుకునేందుకు వుద్దేశించిన కాపర్ "అన్ బండ్లింగ్"ను అనుమతించరాదనే, బిఎస్ఎన్ఎల్ మనుగడకు కీలకమైన డిమాండ్లతో ఉద్యోగులు సమ్మె బాట పట్టారు.

## ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు, వేతనాల్లో కోత

గత కొన్ని దశాబ్దాలుగా నానాటికీ తీవ్రమవుతున్న పెట్టుబడిదారీ విధాన సంక్షోభం, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో, ఇక ఏమాత్రం తాత్సారం చేయకూడని పతాక స్థాయికి చేరుకుంది.

ఈ సంక్షోభం ప్రధానంగా 2008 సెప్టెంబరు 15 వాల్‌స్ట్రీట్ పతనం తర్వాత, అగ్ని పర్వతం లావాను విరజిమ్మినట్లు ప్రజ్వరిల్లింది. పెట్టుబడిదారీ విధాన స్వభావాన్ని బట్టి ఈ సంక్షోభం కేవలం ఆర్థిక రంగానికే పరిమితం కాలేదు. మొత్తం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతో పాటు సామాజిక, రాజకీయ రంగాలను కూడ చుట్టుముట్టింది. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికవర్గం ఎల్లప్పుడూ పరాధీనమైన వర్గంగా వుండడం వల్ల సహజంగానే ఈ సంక్షోభం వల్ల కార్మికవర్గం భయంకర పరిణామాలకు గురైంది.

గత కొద్ది నెలల కాలంలో లక్షల కోట్ల డాలర్ల విలువ చేసే వనరులు విధ్వంస మయ్యాయి. ప్రపంచ ద్రవ్య విధాన సంక్షోభం, పారిశ్రామిక, వ్యవసాయ, సర్వీసు రంగాల్లో పతనం కళ్ళకు కట్టినట్లు కన్పడుతున్నాయి. 1929 తర్వాత ఇంతటి తీవ్ర సంక్షోభానికి పెట్టుబడిదారీ విధానం చూచివుండదు. పెట్టుబడిదారులు, వారి మేనేజర్లు, వారి రాజకీయ సమర్ధకుల మాటల్లో కూడ ఇది స్పష్టమవుతోంది.

పెట్టుబడిదారీ విధాన చరిత్రక్రమంలో ఆర్థిక వ్యవస్థల విస్తరణ, పెట్టుబడిదారీ వ్యవస్థకు రూపుదిద్దింది. 1960, 70 దశకాల నుండి పెట్టుబడిదారీ వ్యవస్థలో విస్తరణ, సంక్షోభం ఒక దాని తర్వాత ఒకటి సంభవించాయి. అయితే మనం ఇప్పుడు నిరంతర సంక్షోభంలో మునిగివున్నాం. ఇది పెట్టుబడిదారీ విధానం యొక్క వ్యవస్థాగత సంక్షోభాన్ని వెల్లడిస్తోంది.

మానవుల అవసరాల నిమిత్తం చేసే ఉత్పత్తికి, కేవలం పెట్టుబడి పునరుత్పత్తికి ఉద్దేశించిన ఉత్పత్తికి మధ్య అగాధం పెరిగి వినాశకర పరిణామాలు సంభవించాయి.

ఈ శతాబ్దం ప్రారంభం నుంచి ప్రపంచం మరింత తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయేందుకు కారణమైన మరొక ప్రధాన వైరుధ్యాన్ని ఇది సూచిస్తోంది. నిరుద్యోగం

పెరుగుదల రేటు ఇదే విధంగా కొనసాగితే నిరుద్యోగానికి స్వభావసిద్ధమైన సామాజిక అధోపతనం, అనాగరిక పరిస్థితులు మరింత తీవ్రమవుతాయి. వేరొక ప్రక్క ప్రపంచంలో గతంలోని వృద్ధిరేటు కొనసాగితే, అవసరాలకు మించిన, వృధాపూరిత ఉత్పత్తి పునాదిగా రూపొందిన, అధికోత్పత్తి విధానం మరింత తీవ్రస్థాయిలో ప్రకృతి విధ్వంసానికి దారితీస్తుంది. ఫలితంగా ప్రపంచంలో ఆధిపత్యం చెలాయిస్తున్న వినాశకరవాదనలకు మరింత బలం చేకూరుతుంది.

## తరిగిపోతున్న కార్మికశక్తి

విధానపరమైన, వ్యవస్థాపరమైన సంక్షోభ పరిస్థితుల్లో కార్మికవర్గం తరిగిపోవడం ఒక ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. అమెరికా తదితర పెట్టుబడిదారీ దేశాల్లో సంక్షోభం ముదిరి పాకానపడడంతో, ప్రపంచవ్యాప్తంగా కార్మిక రంగంలో తీవ్ర పర్యవసానాలను మనం చూశాం. సామాజిక హక్కుల కోసం కార్మికవర్గం శతాబ్దాలపాటు సాగించిన పోరాటాల ఫలితంగా ఫ్రెడరిక్ టేలర్, హెన్రీ ఫోర్డుల విధానాలుగా పేరొందిన "నియంత్రించబడిన మరియు కాంట్రాక్టు కార్మిక విధానం" 20వ శతాబ్దపు విధానంగా మారింది. నేడు పెట్టుబడిదారీ విధానానికి కేంద్ర స్థానంలోనే సంక్షోభపు పెనుతుపాను ప్రభావం వల్ల ఈ కార్మికవర్గం హరించుకుపోవడం స్పష్టమవుతుంది. ఈ కార్మిక విధానం స్థానంలో "పారిశ్రామిక వేత్తల చొరవ", "సహకారతత్వం", "ఇచ్ఛికంగా పనిచేయడం", "అసాధారణ పని" వంటి అనేక పని పద్ధతులు చోటు చేసుకున్నాయి. ఈ పద్ధతుల వల్ల కార్మికవర్గం అత్యంత తీవ్ర (సూపర్) దోపిడీ నుండి, చివరకు తనను తానే దోపిడీ చేసుకునే స్థాయికి చేరుకుంటోంది. ఇది అంతర్జాతీయ స్థాయిలోనే కార్మికవర్గం వ్యవస్థాపరంగా మిక్కిలి ప్రమాదకర, అభద్రతాకరమైన పరిస్థితుల నెదుర్కొనేందుకు దారితీస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో స్త్రీ, పురుష కార్మికులు, శాశ్వత, తాత్కాలిక కార్మికులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, స్వదేశీ, వలస కార్మికులు – ఒకరేమిటీ! యావత్ కార్మికవర్గం మీద ప్రభావం చూపేవిధంగా నిరుద్యోగం ప్రజ్వరిల్లింది. వీరిలో వలస కార్మికులు ముందుగా కఠిన శిక్షకు గురవుతున్నారు.

## 2008 సంవత్సరం నుండి నిరుద్యోగ సమస్య ఏవిధంగా వున్నదీ పరిశీలిద్దాం : నిరుద్యోగం మీద ఐఎల్ఓ అధ్యయనం

అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా 2007తో పోల్చుకుంటే ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం 3.40 కోట్లు పెరిగి, 2009 నాటికి 21.20 కోట్లకు చేరుకుందని, అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి కల్పనలో పోకడల గురించిన ఐఎల్ఓ నివేదిక పేర్కొంది. ప్రపంచ నిరుద్యోగం 2007 నుండి 0.9% పెరిగి 2009 నాటికి 6.6%కి చేరుకుంది. మొత్తం కార్మికశక్తిలో 16% కంటె తక్కువగా వున్నప్పటికీ, 2007 నుండి పెరిగిన నిరుద్యోగంలో అభివృద్ధి చెందిన దేశాలు మరియు ఐరోపా యూనియన్ దేశాల్లోనే ఈ పెరుగుదల 40% కంటె ఎక్కువగా వుంది.

ఐఎంఎఫ్ ఆర్థిక అంచనాల ఆధారంగా 2010 సంవత్సరం పొడుగునా ప్రపంచ నిరుద్యోగం అధిక స్థాయిలో కొనసాగుతుందని ఐఎల్ఓ అంచనా వేసింది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతో సహా ఐరోపా యూనియన్ దేశాల్లో 2010లో నిరుద్యోగం మరో 30 లక్షల మేరకు పెరుగుతుందని, ఇతర ప్రాంతాల్లో నిరుద్యోగం అదే స్థాయిలో కొనసాగడం లేదా స్వల్పంగా తగ్గడం జరుగుతుందని ఐఎల్ఓ పేర్కొంది. 2007తో పోల్చుకుంటే ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగ యువత సంఖ్య 2009 నాటికి 1.02 కోట్ల మేరకు పెరుగుతుందని కూడా ఐఎల్ఓ పేర్కొంది. 1991 నుండి ఇది అత్యధిక పెరుగుదల.

సమన్వయంతో కూడిన ఉద్దీపన పథకాల అమలు ఫలితంగా మరో పెద్ద సామాజిక, ఆర్థిక విధ్వంసం నివారించబడిందని, అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది స్త్రీ, పురుషులకు ఉద్యోగాలు లేవని, నిరుద్యోగ బెనిఫిట్లుగాని, వేరే ఏవిధమైన సామాజిక భద్రతా చర్యలు గాని అమలు కావడం లేదని నివేదిక పేర్కొంది.

ప్రజల ఉపాధిని పరిరక్షించి, వారి జీవనోపాధిని కాపాడేందుకు పాలకులు బ్యాంకులను కాపాడేందుకు వ్యవహరించినంత నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్ జువాన్ సోమావియా కోరారు. ప్రతి ఏడాది 4.50 కోట్ల మంది నూతనంగా కార్మిక సైన్యంలో చేరుతున్నారని, ఉపాధి కల్పనకు క్రొత్తగా లేబర్ మార్కెట్లో ప్రవేశిస్తున్న యువతీ, యువకులను లక్ష్యంగా చేసుకుని ఉద్దీపన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

2008లో ప్రపంచ వ్యాప్తంగా 63.30 కోట్ల మంది కార్మికులు, వారి కుటుంబాలు రోజుకు 1.25 అమెరికన్ డాలర్ల ఆదాయంతో జీవిస్తున్నారని, 2009లో మరో 21.50 కోట్ల మంది దారిద్ర్యరేఖ అంచున వుండి, దిగువకు చేరే ప్రమాదాన్నెదుర్కొంటున్నారని నివేదిక పేర్కొంది. ఆర్థిక కార్యకలాపాల్లో సంభవిస్తున్న తీవ్ర ఒడిదుడుకుల వల్ల తలెత్తుతున్న వినాశకార పరిస్థితుల నుండి పేదలకు కొద్దిగానైనా ఉపశమనం కల్గించేందుకు, పాలకులు సాంఘిక భద్రతా పథకాలను వర్తింపచేయడం అత్యావశ్యకమని నివేదిక పేర్కొంది.

ఐఎల్ఓ తన వద్ద నున్న సమాచారం మేరకు, 2009లో 5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని అంచనా వేసింది. అమెరికాలోని ఒక పెద్ద కార్ల తయారీ సంస్థ మూసివేత ద్వారా కొన్ని లక్షల మందిని నిరుద్యోగులను చేసింది. వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నట్లు ఐరోపాదేశాల్లోని వార్తా పత్రికలు రోజూ వార్తలు ప్రచురిస్తున్నాయి. ఈ కాలంలో నిరుద్యోగం పెరుగుదలతో పాటు, సుమారు 150 కోట్ల మంది కార్మికుల వేతనాల్లో కోతపడిందని ఐఎల్ఓ నివేదిక పేర్కొంది. అధికారిక గణాంకాల్లో చోటుచేసుకొనని, పైకి కన్పించని నిరుద్యోగాన్ని కనిపెట్టడంలో అంతర్జాతీయ గణాంకాలు విఫలమయ్యాయనేది నిర్ధారించబడిన అంశం. భారత్, చైనాల్లో నిరుద్యోగానికి సంబంధించిన వాస్తవ గణాంకాలను కూడా కలుపుకుంటే, ఈ సంఖ్యలు ఎన్నోరెట్లు పెరుగుతాయి. (గ్లోబల్ అన్ ఎంప్లామెంట్ ట్రెండ్స్, 2009).

అమెరికా, గ్రేట్ బ్రిటన్, జపాన్‌లలో నిరుద్యోగం 2009 సంవత్సరం మొదటి కొద్దిమాసాల్లో, గత దశాబ్దాల కంటె అత్యధికంగా వుంది. ఉద్యోగాలను నిలబెట్టేందుకు, కార్మిక చట్టాలను సరళం చేయడం తప్ప వేరే మార్గం లేదనే మోసపూరిత వాదనలు చేసి, అందుకు క్రొత్త శాసనాలు చేయించేందుకు ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య వేత్తలు పాలకుల మీద ఒత్తిడి తెస్తున్నారు. అమెరికా, గ్రేట్ బ్రిటన్, స్పెయిన్, అర్జెంటైనాల్లో ఇందుకు ఇప్పటికే తీవ్ర ప్రయత్నాలు జరిగినప్పటికీ నిరుద్యోగం పైపైకి పోతూనే వుంది.

## చైనాలో నిరుద్యోగం

అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం ఫలితంగా చైనా ఆర్థిక వ్యవస్థ గతంలో ఏనాడూ ఎరుగని తీవ్ర ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కోవల్సి వచ్చింది. సంక్షోభం ఫలితంగా విదేశాల నుండి డిమాండ్ కుంచించుకుపోవడం, కొన్ని పరిశ్రమల్లో అధికోత్పత్తి, ఆర్డర్లు తీవ్రంగా పడిపోవడం, అమ్మకాలు మందగించడం, లాభాలు తీవ్రంగా పడిపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీని ప్రభావం తీర ప్రాంతాల నుండి దేశంలోని వివిధ ప్రాంతాలకు, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల నుండి భారీ పరిశ్రమల వరకు, ఎగుమతి ఆధారిత పరిశ్రమల నుండి ఇతర పరిశ్రమల వరకు విస్తరించింది. నష్టాల బారిన పడిన సంస్థలు, పరిశ్రమల సంఖ్య పెరిగింది. పెద్ద సంఖ్యలో ఎగుమతి ఆధారిత పరిశ్రమల కార్యకలాపాలను బలవంతంగా నిలిపివేయవల్సి వచ్చింది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరుకుంది. గ్రామీణ వలస కార్మికులు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రాంతాలను వదలి తమ ఇళ్ళకు తిరిగి పోయారు. ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి ఫలితంగా 2009 మొదటి త్రైమాసికంలో జిడిపి పెరుగుదల రేటు 6.1%కి, అంటే గత 17 సంవత్సరాల కనిష్ఠ స్థాయికి చేరుకుంది. ఒక రకంగా చైనాలో ఈ శతాబ్దంలోనే ఎన్నడూ ఎరుగని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో చైనాలోనూ, ఇతర దేశాల్లోనూ వున్న కొందరిలోనూ గత మూడు దశాబ్దాలుగా చైనా సాధిస్తున్న వేగవంతమైన, నిలకడైన ఆర్థికాభివృద్ధిని కొనసాగిస్తుందనే విషయంలో అనుమానాలు రేకెత్తాయి (ప్రపంచ ద్రవ్యసంక్షోభం విషయంలో చైనా ఏవిధంగా వ్యవహరిస్తోంది? – లియూ యున్షాన్, రచన చూడండి).

## భారత్‌లో ఉద్యోగాల పరిస్థితి

భారతదేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా వుంది. కార్మిక మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు నిర్వహించిన రిజిష్టర్లలోని 2000 డిసెంబర్ గణాంకాలపై ప్రమాదకర పరిస్థితులను సూచిస్తున్నాయి. దురదృష్టవశాత్తు నేషనల్ శాంపుల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) గాని, కార్మిక మంత్రిత్వశాఖ గాని ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లలో నిరుద్యోగులకు సంబంధించి నమోదు చేసిన తాజా గణాంకాలను ఇవ్వడం లేదు. గత పది సంవత్సరాల కాలంలో ముఖ్యంగా 2008 సెప్టెంబరు 15 వాల్‌స్ట్రీట్ పతనం తర్వాత

నిరుద్యోగం కళ్ళుతిరిగేటంత తీవ్ర స్థాయికి చేరుకుందని స్పష్టంగానే తెలుస్తోంది. 2000 సంవత్సరం డిసెంబరు నాటికి ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల రిజిష్టర్ల ప్రకారం, కార్మిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలీవిధంగా వున్నాయి.

1. మొత్తం ఉద్యోగార్థుల సంఖ్య : 2000 డిసెంబరు నాటికి : 4,13,43,600
2. మహిళా ఉద్యోగార్థుల సంఖ్య, 2000 డిసెంబరు నాటికి : 1,04,57,300
3. షెడ్యూల కులాల ఉద్యోగార్థుల సంఖ్య, 1999 డిసెంబరు నాటికి : 59,48,000
4. చదువుకున్న ఎస్సీ ఉద్యోగార్థుల సంఖ్య, 1999 డిసెంబరు నాటికి : 39,61,600
5. అంగవికలురైన ఉద్యోగార్థుల సంఖ్య, 1999 డిసెంబరు నాటికి : 4,55,900
6. మైనారిటీలకు చెందిన ఉద్యోగార్థుల సంఖ్య, 1999 డిసెంబరు నాటికి : 57,26,200

2000 సంవత్సరంలో కార్మిక మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటేనే 2009 నాటికి నిరుద్యోగం విపరీతంగా పెరిగి 5 కోట్లు దాటుతుందని తేలిగ్గా వూహించవచ్చు.

ఇంతేగాక డా॥ అర్జున్‌సేన్ గుప్తా నివేదికలో పేర్కొనబడిన కొన్ని వివరాలు తప్ప, గ్రామీణ నిరుద్యోగానికి సంబంధించి గణాంకాలు అందుబాటులో లేవు. గ్రామీణ నిరుద్యోగాన్ని, గ్రామాల్లో చేయగల్గినంత పని లేనివారి సంఖ్యతో పాటు, పట్టణ ప్రాంతాల్లో రిజిష్టరు చేసుకున్న, రిజిష్టరు చేసుకోని నిరుద్యోగులను కలుపుకుంటే ఈ సంఖ్య 12 లేదా 13 కోట్లకు చేరుకుంటుంది. ఇది మిక్కిలి ఆందోళన కలిగించే విషయం.

## 2007-2008 ఆర్థిక సర్వే

2007-08 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది మాసాల్లో పారిశ్రామిక రంగం మాంద్య పరిస్థితులను చవిచూచింది. ముఖ్యంగా ఎక్కువ కాలం ఉపయోగపడే వినిమయ వస్తువుల తయారీ రంగం స్పష్టంగా మాంద్యానికి లోనయింది. ఇది వడ్డీరేట్లు కఠినతరం (ఎక్కువ) కావడానికి ముడిపడి వుండడం వల్ల, స్వదేశీ పరపతి (రుణ) రంగం లోని పరిస్థితుల మీద ఆధారపడి వుంది. దీనికి పూర్తి భిన్నంగా ఉత్పాదక వస్తువుల (వస్తువులు, సేవలనుత్పత్తి చేయడానికి వుపయోగించే యంత్ర పరికరాలు, భవనాలు వంటివి - క్యాపిటల్ గూడ్స్, పరిశ్రమ 2007-08 (ఏప్రిల్ - డిసెంబరు) మూడు త్రైమాసికాల్లో నిలకడైన, పటిష్టమైన వృద్ధిని సాధించింది.

ఒక్కొక్క రకానికి చెందిన ఉత్పత్తులు ఒక్కొక్క రకంగా వృద్ధి చెందాయని సర్వే నివేదిక పేర్కొంది. రసాయనాలు, ఆహార ఉత్పత్తులు, తోలు, జనపనార, కొయ్య ఉత్పత్తులతో సహా ఇతర ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. అదే సమయంలో ప్రాథమిక లోహాలు, యంత్రాలు మరియు ఇతర పరికరాలు, రబ్బరు, ప్లాస్టిక్ మరియు

పెట్రోలియం ఉత్పత్తులు, పానీయాలు మరియు పొగాకు వంటి ఉత్పత్తులు, 2007 ఏప్రిల్ – డిసెంబర్ మధ్య కాలంలో నెమ్మదిగా అయినప్పటికి, పటిష్టమైన వృద్ధిని సాధించాయి.

జనపనార కాకుండా ఇతర టెక్స్‌టైల్స్, మోటారు వాహనాలు, కాగితం, అలోహాలు (లోహ లక్షణాలు లేని రసాయనిక పదార్థాలు), ఖనిజ ఉత్పత్తులు, లోహ ఉత్పత్తులతో సహా ఇతర పరిశ్రమల్లో, ఈ కాలంలో అభివృద్ధి మందగించడం స్పష్టంగానే వుంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి విలువ గణనీయంగా పెరగడం (రూపాయి పటిష్టంకావడం) వల్ల ఎగుమతుల్లో వృద్ధి పడిపోవడంతో, దిగుమతి ప్రాధాన్యత తక్కువగా వున్న టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లో మాంద్యం నెలకొన్నది. మోటారు వాహనాల రంగంలోనే, పాసింజర్ కార్లు, స్కూటర్లు, మోపెడ్ల అభివృద్ధి ఉత్సాహపూరితంగా వుండగా, మోటార్ సైకిళ్ళు, మూడు చక్రాల వాహనాల ఉత్పత్తి మందగించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక రంగం మిశ్రమ ఫలితాలను చూపింది. అయితే పారిశ్రామికోత్పత్తి తగ్గుముఖం పట్టినట్లు స్పష్టమవుతోంది.

## అంతర్జాతీయ స్థాయిలో పడిపోతున్న వేతనాలు

"ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభం ప్రభావం" పేరుతో కార్మికుల వేతన పరిస్థితుల మీద ఐఎల్ఓ కొంత అధ్యయనం చేసింది. పరిస్థితి తీవ్రతను వివరిస్తూన్న ఆ అధ్యయనంలోని కొన్ని భాగాలను ఈ క్రింద పొందుపర్చడం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం కార్మికుల సగటు నెల జీతం మీద ఏ మేరకు ప్రభావం చూపింది? 2008 ఏడాది చివరి వరకు, అందుబాటులో వున్న 53 దేశాల అధికారిక వేతన గణాంకాల తాజా సమాచారంతో కూడిన "ప్రపంచ వేతన సమాచారం"ను ఐఎల్ఓ ప్రచురించింది. ఈ నమూనా ఆధారంగా పరిశీలిస్తే, ప్రపంచవ్యాప్తంగా "సగటు వేతన పెరుగుదల రేటు" 2007లో 4.3% నుండి 2008లో 1.4%కి పడిపోయింది. మొత్తం మీద మెజారిటీ దేశాల్లో వేతనాల్లో పెరుగుదల రేటు పడిపోతున్నప్పటికీ, 2008లో వేతనాలు మాత్రం పెరుగుతూనే వున్నాయి. దాదాపు నాల్గవ వంతుకు పైగా దేశాల్లో కొన్నింటిలో, వేతనాలు అదే స్థాయిలో కొనసాగగా, మిగిలిన దేశాల్లో నిజవేతనాలు పడిపోయాయి. వీటిలో అమెరికా (0%) ఆస్ట్రియా (0%), కోస్తారికా (0%), దక్షిణాఫ్రికా (–0.3%), జర్మనీ (–0.6%), స్విట్జర్లాండ్ (–0.7%), ఇజ్రాయిల్ (–0.9%) వున్నాయి.

ఈ నివేదికలో ఉద్యోగులు పొందుతున్న నెలసరి మొత్తం ప్రతిఫలాన్ని, వేతన గణాంకాల్లో పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. జాతీయ సర్వేల్లో ఆయా దేశాలు విభిన్న ప్రమాణాలు (కొలబద్దలు) చేపట్టడంతో, అంతర్జాతీయ స్థాయిలో వేతన స్థాయిలను పోల్చడం కష్టసాధ్యమని ఐఎల్ఓ పేర్కొంది.

సగటు జీతాలు, వేతనాల్లో వాటా అనేవి కార్మికులందరికీ చెల్లించిన మొత్తం వేతనాలను బట్టి లెక్కించడం వల్ల, కార్మికుల మధ్య వేతన విభజన ఏవిధంగా వున్నదీ అర్థం చేసుకోవడం

సాధ్యం కాదని నివేదిక పేర్కొంది. చాలా దేశాల్లో వేతనాల వాటా పడిపోతుండడం వల్ల, వివిధ తరగతుల కార్మికుల మధ్య వేతన విభజన ఎలా వుందనే అంశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. వేతన అసమానతలనేవి మిక్కిలి సంక్లిష్టమైన అంశం. లింగ భేదం, విద్యాస్థాయి, వయస్సు, జాతి, పౌరసత్వస్థాయి తదితర అంశాల ప్రాతిపదికగా, వేతనాల్లో తారతమ్యాలు చూపుతున్న విషయం మీద ఇటీవల కాలంలో ప్రత్యేక దృష్టిపెట్టడం జరుగుతోంది. ఈ సమస్యల్లో నెలకొన్న సంక్లిష్టత, ప్రపంచ స్థాయిలో దీనిని గురించి విశ్లేషించేందుకు అవసరమైన సమాచారం లభించకపోవడం వల్ల ఐఎల్ఓ ఈ విషయాల మీద ఈ ఏడాది నివేదిక ఇవ్వలేక పోయింది. అత్యధిక, అత్యల్ప జీతాలు పొందుతున్న వారి జీతాలను పోల్చడం, ఈ గ్రూపుల జీతాలను మధ్య స్థాయిలో జీతాలు పొందుతున్న వారి జీతాలతో పోల్చడానికి సంబంధించిన కొన్ని సూచికలను ఐఎల్ఓ పరిశీలించింది.

ఆర్థికాభివృద్ధి, లింగ ప్రాతిపదికన వున్న అసమానతల అంశాన్ని ఐఎల్ఓ పరిశీలించింది. దీనికి ముందు అసలు అసమానతల గురించి మనం ఎందుకు పట్టించుకోవాలనే ప్రాథమిక అంశాన్ని పరిశీలించాలి. ఇటీవల కాలంలో ఈ అంశం మీద తీవ్ర వాదోపవాదాలు సాగుతున్నాయి. కార్మికుడందిస్తున్న సేవలు, ఆ సేవల నాణ్యతను బట్టి వేతనం వుండాలనేది సాధారణ సూత్రంగా అంగీకరించబడింది. ఇవి వ్యక్తులను బట్టి మారుతుంటాయి. కనుక వేతన వ్యత్యాసాలు ఆర్థిక పరమైన వాస్తవిక అంశానికి సంబంధించినవి. అదే సమయంలో తీవ్ర వేతన వ్యత్యాసాలు, నైతిక, సామాజిక, రాజకీయ కారణాల రీత్యా ఆమోద యోగ్యం కాదు. "ప్రజల సంతృప్తికి సంబంధించిన వివిధ స్థాయిలను" నిర్ధారించే అంశాల మీద, ఇటీవల వివిధ అధ్యయనాలు వెల్లడించిన అంశాల వెలుగులో చూస్తే ఇది ప్రభుత్వ విధానాలకు సంబంధించిన ప్రధానాంశంగా స్పష్టమవుతోంది. తమ ఆదాయాలు వాస్తవంగా ఏ స్థాయిలో వున్నాయన్న విషయం కంటె, ఇతరుల ఆదాయాలతో పోల్చిచూసుకోవడం మీదనే వారు తమ ఆదాయాలతో సంతృప్తి పడిందీ లేనిదీ (అది వ్యక్తిగత లేదా స్వీయమానసిక ధోరణి) ఆధారపడుతుందని జనాభా సర్వేలు వెల్లడిస్తున్నాయి. అసమానతలు తీవ్రమైతే నేరాలు అధికమై, వాటి నరికట్టేందుకు ప్రైవేటు, ప్రభుత్వ భద్రతా వ్యయం పెరగడం, ప్రజారోగ్యం దిగజారడం, విద్యా విషయంలో సగటు లక్ష్యాలు సాధించడంలో వైఫల్యం వంటి పరిణామాల వల్ల వ్యయం పెరుగుతుంది. పేదరికం తగ్గించాలంటే, అసమానతల తగ్గింపు ప్రధానమని, వివిధ అధ్యయనాలు ప్రముఖంగా పేర్కొంటున్నాయి.

దీనికి సంబంధించి వివిధ ధోరణులను ఎత్తిచూపేందుకు ఐఎల్ఓ ముందుగా, అత్యధిక జీతాలు పొందుతున్న వారిని, అత్యల్ప జీతాలు పొందుతున్న వారితో పోల్చిచూచింది. అట్టడుగు స్థాయిలో నున్న 10% కార్మికుల జీతాల కంటె తక్కువ పొందుతున్న (అంటే డి1 వేతన స్థాయి కంటె తక్కువ) వారిని, అత్యధిక ఆదాయం పొందుతున్న 10% కార్మికుల కంటె ఎక్కువ వేతన స్థాయి (అంటే డి9) కంటె ఎక్కువ పొందుతున్న వారి జీతాల స్థాయితో పోల్చడం జరిగింది. 1995-97, 2004-06 రెండు కాల వ్యవధులకు సంబంధించి మొత్తం మీద వున్న వేతన వ్యత్యాసాల నిష్పత్తుల్లో వున్న తేడాలను ఈ లెక్కలు వెల్లడిస్తున్నాయి. పైన పేర్కొన్న నమూనాను

పరిశీలిస్తే, ప్రపంచంలోని మూడింట రెండు వంతుల దేశాల్లో పైన పోల్చి చూచిన వేతన స్థాయిల్లో వేతన వ్యత్యాసాలు పెరిగాయని స్పష్టమవుతుంది. బెజిల్, మెక్సికో, వెనెజులా వంటి లాటిన్ అమెరికా దేశాలు ఇందుకు మినహాయింపు. రెండు సబ్ కేటగిరీలు – అత్యున్నత, మధ్య తరగతి ఆదాయ స్థాయిల మధ్య తారతమ్యాలు (డి9/డి5), మరియు మధ్య తరగతి, కనిష్టస్థాయి ఆదాయ గ్రూపుల మధ్య అసమానతలు (డి5/డి1)లలో సంభవిస్తున్న మార్పుల కారణంగా మొత్తం మీద వేతన స్థాయిల్లో అసమానతలు తలెత్తుతున్నాయని సర్వే తెలిపింది.

వేతన తారతమ్యాలు పెరగడానికి కారణాలు ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకంగా వున్నాయి. 1995–2000 మరియు 2001–2006, రెండు కాల వ్యవధులకు సంబంధించిన గణాంకాలను ఐఎల్ఒ పోల్చిచూచింది. అసమానతలు పెరుగుతున్న దేశాలను, అసమానతలు తగ్గుతున్న దేశాలను ఐఎల్ఒ గుర్తించింది. అసమానతలు పెరిగిన అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో అత్యున్నత స్థాయిలోనివారి జీతాలు, ఇతర స్థాయిల్లోని వారి జీతాలకంటే వేగంగా పెరగడం వల్ల అసమానతలు పెరిగే (ఓజిగిరిదీవీ ఊళిచీ ఇబివీలిరీ) కేటగిరీలో చేరాయి. కాని జర్మనీ మాత్రం "కనిష్ఠ స్థాయిలో వున్న వారి వేతనాలు తీవ్రంగా పడిపోవడం వల్ల వేతన అసమానతలు పెరిగే" (ఎళిజిజిచీరిరిదివీ జౌళిశిశిళీ) కేటగిరీలో చేరింది. ఆస్ట్రేలియాలో "అత్యున్నత స్థాయిలోని వారి వేతనాలు ఇతర వేతన గ్రూపుల కంటె వేగంగా పెరగడం, కనిష్ట స్థాయిలో వున్న వారి వేతనాలు తీవ్రంగా పడిపోవడం" అనే రెండు ప్రక్రియలు చోటు చేసుకోవడం వల్ల (ఆళిజిబిజీరిరిబిశిరిళిదీ), వేతన అసమానతలు పెరిగాయి. అర్జెంటైనా, చిలీ, థాయ్‌లాండ్‌లలో మధ్య స్థాయి మరియు కనిష్టస్థాయి వేతన తరగతుల మధ్య నానాటికి పెరుగుతున్న తారతమ్యాల వల్ల మొత్తం మీద వేతన అసమానతలు పెరుగుతున్నాయి.

1995 నుండి వేతన అసమానతలు ఒక్కోదేశంలో ఒక్కో కారణం వల్ల తగ్గినట్లు కన్పడుతుంది. ఫ్రాన్స్ విషయంలో మధ్య తరగతి, కనిష్ట స్థాయి వేతన గ్రూపుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారి కంటే క్రొత్తగా చేరేవారికి ఎక్కువ వేతనాలు యివ్వడం ద్వారా (గిబివీలి బీళిళీచీజీలిరీరిరిళిదీ) ఆయా వేతన గ్రూపుల మధ్య వేతన అసమానతలను తగ్గించడం జరిగింది.

ఇందుకు భిన్నంగా బ్రెజిల్‌లో ప్రధానంగా మధ్య స్థాయి వేతన గ్రూపుల వేతనాలు వేగంగా పెరగడం వల్ల, మధ్య స్థాయి, ఉన్నత స్థాయి వేతనగ్రూపుల మధ్య తేడా తగ్గింది. అయితే మెక్సికోలో ఈ రెండు విషయాల్లోనూ అంటే, మధ్యస్థాయి, ఉన్నత స్థాయి వేతన గ్రూపుల మధ్య మరియు మధ్యస్థాయి, ఉన్నత స్థాయి వేతన గ్రూపుల మధ్య వేతన తారతమ్యాలను తగ్గించడం ద్వారా వేతన అసమానతలను తగ్గించారు.

పెట్టుబడిదారీ విధానంలో అంతర్గతంగా ఇమిడి వున్న అసమానతల ప్రాతిపదికగానే ఐఎల్ఒ వేతన తారతమ్యాలను గురించి అధ్యయనం చేసింది.

స్త్రీ, పురుష వేతనాల మధ్య వున్న తారతమ్యాలు, అసమానతలకు సంబంధించిన మరొక ప్రధానాంశం. దీనినే "లింగ ప్రాతిపదికన వేతన తారతమ్యాలు" అంటారు. ఈ అంశం

మీద ప్రత్యేకంగా దృష్టిపెట్టవల్సివుంది. దీనికి సంబంధించిన గణాంకాలు, పరిశోధనల విషయంలో వున్న పరిమితుల వల్ల, లింగ ప్రాతిపదికగా అమలు జరుగుతున్న వేతన తారతమ్యాలను, ప్రపంచ వ్యాప్త దృక్పథంతో సమగ్రంగా పరిశీలించడం కష్టసాధ్యం.

వేతన తారతమ్యాలు ఎక్కువగా వున్నాయని. ఇవి చాలా నెమ్మదిగా తగ్గుతున్నాయని, ఐఎల్ఓ అభిప్రాయపడింది. మహిళల వేతన నిష్పత్తి (పురుషుల సగటు వేతనంలో మహిళల సగటు వేతనం నిష్పత్తి) ఆధారంగా "లింగ ప్రాతిపదికన వేతన తారతమ్యాలు" పరిశీలిస్తే ఇటీవల కాలంలో మొత్తం మీద ఇది తగ్గుతోందని ఐఎల్ఓ కనుగొన్నది. సమాచారం అందుబాటులో వున్న 80% దేశాల్లో "లింగ ప్రాతిపదికన వేతన తారతమ్యాలు తగ్గాయి. అయితే ఈ తగ్గుదల కొన్ని సందర్భాల్లో స్వల్పంగా వుండగా, మరికొన్ని సందర్భాల్లో ఇది పరిగణనలోకి తీసుకోదగిన స్థాయిలో కూడ లేదు. మొత్తం మీద చూస్తే లింగ ప్రాతిపదికన చూపుతున్న వేతన అసమానతలు దాదాపు స్థిరంగా వుండడమో లేదా చాలా నెమ్మదిగా తగ్గుతున్నాయన్న ప్రస్తుత అధ్యయనాల కనుగుణంగానే ఐఎల్ఓ అధ్యయనం వుంది. విద్యా, ఉద్యోగ రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు, ఉద్యోగాలు చేస్తున్న సందర్భంలో లింగ విబేధాలు క్రమంగా తగ్గుతుండడం, సానుకూల ఆర్థిక పరిస్థితుల వంటి, ఇటీవలి పరిణామాలను దృష్టిలో వుంచుకుంటే "లింగ ప్రాతిపదికన కొనసాగుతున్న వేతన తారతమ్యాల"లో తగ్గుదల చాలా నిరుత్సాహకరంగా వుంది. అత్యధిక దేశాల్లో మహిళల వేతనాలు, పురుషుల వేతనాల్లో 70 నుండి 90% వరకు వున్నాయి. ఐరోపా దేశాల్లో ఇది సగటున 0.75 వుండగా, ప్రపంచంలోని ఇతర దేశాల్లో ప్రధానంగా ఆసియా దేశాల్లో ఇది అంటే లింగ ప్రాతిపదికన వేతన తారతమ్యాలు ఎక్కువగా వుండడం సర్వసాధారణమైన విషయం.

## పారిశ్రామిక రంగంలో సంక్షోభం

సంక్షోభాన్ని కేవలం ప్రపంచ వ్యాప్తంగా వున్న బ్యాంకింగ్ రంగానికో, ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికో లేదా రుణ సంక్షోభానికో పరిమితం చేయకుండా, పై వాస్తవాలను దృష్టిలో వుంచుకుని ఒక విభిన్న దృక్పథంతో పరిశీలిద్దాం. ఉత్పాదక సామర్థ్యం గల్గిన వివిధ పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ఆర్థిక వ్యవస్థలోని ఉత్పాదక రంగాల్లో పెట్టుబడి సమీకరణ తీవ్రంగా మందగించ (నిజానికి పెట్టుబడి సమీకరణ ఆగిపోయింది) డంతో అనేక సమస్యలు తలెత్తాయి. ప్రధానంగా గత మూడు, నాలుగు దశాబ్దాలుగా ముందుందుడుకుతనంతో విస్తరిస్తున్న భారీ స్పెక్యులేటివ్ పెట్టుబడిని, దాని స్వభావం దృష్ట్యా, ఈ పరిణామాల నుండి వేరుగా చూడలేము. పారిశ్రామికోత్పత్తి రంగంలో అనివార్యంగా సంక్షోభం ముదురుతోంది. సహజంగానే "నిజమైన ఆర్థిక వ్యవస్థ" అభివృద్ధి దోహదం చేసే రంగాల్లో సంక్షోభం తీవ్రంకావడంతో నిరుద్యోగం తీవ్రరూపం దాల్చింది. దీనితో ప్రజలు దురవస్థల పాలయ్యారు. ఈ తీవ్ర సమస్యలకు పెట్టుబడిదారీ విధాన పరిధిలో ప్రభుత్వాలు చేపడుతున్న ఉద్దీపన చర్యలు, సులువైన పరిష్కారం చూపుతాయని ఆశించడం కేవలం భ్రమ మాత్రమే.

అంచనాలకు అందని స్థాయిలో దివాళాతీసిన పెట్టుబడిదారీ వ్యవస్థను (దివాళా తీసిన సంస్థలను) జాతీయం చేసి ప్రజలను మభ్యపెట్టడం ద్వారా, నానాటికీ తీవ్రమవుతున్న సంక్షోభ లక్షణాలకు పరిష్కారం కనుగొనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకవసరమైన ప్రభుత్వ వనరులను ఇంకా కనుగొనవల్సే వుంది. విధ్వంసకర పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత నిర్లక్ష్యంగా నిర్ణయాలు చేసేది ఇది వెల్లడిస్తోంది. కేవలం భారీ ఆర్థిక సంక్షోభం మాత్రమే నేటి ప్రధాన సమస్యకాదు. చారిత్రక పరిణామంలోని ప్రస్తుత దశలో సైనికంగానూ, ప్రకృతి విధ్వంసం ద్వారానూ, తనకు తానే విధ్వంసం చేసుకోగల్గిన మానవజాతి శక్తి, సామర్థ్యాలు ప్రధాన సమస్యగా ముందుకొచ్చాయి.

పూర్తిగా ప్రైవేటు రంగం ఆధిపత్యంలో వుండే రాజ్యాన్ని (ప్రభుత్వాన్ని) ప్రతిపాదించే నయా కీన్సీషియనిజమే, పెట్టుబడిదారీ విధానంలోని వ్యవస్థాగత సంక్షోభానికి పరిష్కారమని పెట్టుబడిదారీ విధానం చెప్తోంది. ప్రైవేటు రంగం ఆధిపత్యంలో వుండి, ఆర్థిక మాంద్య పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశాలున్న మిశ్రమ ఆర్థిక వ్యవస్థను జాన్‌మేనార్డ్ కీన్స్ అనే ఆర్థిక శాస్త్రవేత్త ప్రతిపాదించారు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు 1929లో ప్రారంభమైన మహాపతనం కాలంలోనూ, రెండవ ప్రపంచయుద్ధానంతర ఆర్థిక విస్తరణ (1945–1973) కాలంలోనూ ఈ నమూనానే అనుసరించాయి. (అనువాదకుడు) కాని కార్మికవర్గంతో కూడిన సామాజిక శక్తులు మాత్రమే విధానపరమైన మౌలిక మార్పులు కోరుకుంటున్నాయి. కీన్సీషియన్ సంక్షేమ ఆర్థిక వ్యవస్థను ఈ సంక్షోభానికి పరిష్కారంగా కొందరు ప్రగతి శీలురుగా చెప్పుకునే వారు ప్రోత్సహిస్తున్నప్పటికీ, ప్రజలను భ్రమల్లో ముంచే వీరి ప్రయత్నాలు విఫలం కాక మానవు. అంటే వీరు చూపించే ప్రత్యామ్నాయం పెట్టుబడిదారీ విధానానికి ఏ విధమైన ప్రతిఘటన ఇవ్వదు.

## అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ భారీ ప్రదర్శన

ఇతర డిమాండ్లతో పాటు సాంఘిక భద్రతా సదుపాయాల సత్వర కల్పన, పెన్షన్‌స్కీమ్ రూపకల్పన, ఐసిడిఎస్ (ఇంటిగ్రేటెడ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించాలని, కనీస వేతనం అమలు చేయడం, వంటి సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా వున్న ప్రధాన డిమాండ్ల సాధనకు 2010 మే4వ తేదీ ఉదయం 20 వేలకు పైగా అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లు ఢిల్లీ నగర వీధుల్లో కదం త్రొక్కారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) పిలుపుమేరకు తమ అపరిష్కృత సమస్యల పరిష్కారం విషయంలో యుపిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి పట్ల తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి, దేశం నలుమూలల నుండి వచ్చి ప్రదర్శన (మహాపడావ్)లో పాల్గొన్నారు. వారి న్యాయమైన డిమాండ్ల నినాదాలతో ఢిల్లీ మార్మోగింది. మే వేసవి ఎండలు మాడ్చుతున్నప్పటికీ, ఎన్నో ఇబ్బందుల నెదుర్కొని తమ గృహాలను వదలి, సుదూర ప్రయాణం చేసి వచ్చిన అలసటను లెక్క చేయక, తమ హక్కులను గురించి నినదించేందుకు తరలివచ్చారు.

కామన్‌వెల్త్ క్రీడల కోసం ఢిల్లీలో పునర్నిర్మాణ పనులు జరుగుతుండడం వల్ల ఎంతో అసౌకర్యానికి గుర్రై రాత్రిళ్ళు కూడ రోడ్లమీద గడపడంతో పాటు, ఇటుక గుట్టల మీద కూర్చుని, తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎంతో ఉత్తేజంతో నినదించారు.

ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ పిలుపుమేరకు అంతకు ముందే 2010 ఫిబ్రవరి 19న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో భారీ ఎత్తున జరిగిన ప్రదర్శనల్లో 2 లక్షల మందికి పైగా అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్లు పాల్గొన్నారు. తమను వేధించే సమస్యల పరిష్కారం కోరుతూ, దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రధాన మంత్రికి స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి తదితరులకు వేలాది టెలిగ్రామ్‌లు పంపడం జరిగింది. వారి నుండి స్పందన కరువైంది. 2010 మే 4 ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రదర్శనను సిఐటియు ఉపాధ్యక్షులు ఎం.కె. పాంథే ప్రారంభించారు. ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ప్రధాన కార్యదర్శి డా॥ కె. హేమలత, ఇతర ప్రముఖ నాయకులతో కూడిన ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ ప్రతినిధి వర్గం మే 5వ తేదీన ప్రధాన మంత్రి డా॥ మన్మోహన్‌సింగ్‌ను కలిసి అంగన్‌వాడీ కార్మికులు, హెల్పర్ల ప్రధాన సమస్యలను ఆయన ముందుంచడం జరిగింది. 58–60 సంవత్సరాల వయస్సు వచ్చిన అంగన్‌వాడీ కార్మికులకు ఉద్యోగ విరమణ సమయంలో వారికి "వీడ్కోలు బహుమతి" ఇస్తానని, 2006 ఆగస్టులో ప్రధానమంత్రి ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు జరగలేదని ప్రతినిధి వర్గం ఆయనకు గుర్తుచేసింది.

ప్రధానమంత్రి ఇచ్చిన అస్పష్టమైన హామీతో సంతృప్తి చెందని ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి హామీ 2010 జూలై వరకు అమలు జరగకపోతే, అదే నెలలో సమ్మె చేయాలని నిర్ణయించి అంగన్‌వాడీ కార్మికులు,హెల్పర్లకు చెందిన అన్ని సంఘాలు, తమ అనుబంధాల కతీతంగా సమ్మెలో పాల్గొనడం ద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవల్సిందిగా విజ్ఞప్తి చేసింది. పార్లమెంటు సభ్యులు సీతారాం ఏచూరి, తపన్‌సేన్‌లు ప్రదర్శననుద్దేశించి ప్రసంగిస్తూ అంగన్‌వాడీ కార్మికుల పోరాటానికి మద్దతు తెల్పి, వారి సమస్యలను పార్లమెంటులోపల, వెలుపల లేవనెత్తుతామని హామీ ఇచ్చారు.

## ఎయిర్ ఇండియా ఉద్యోగులపై ప్రభుత్వ దాడి

ఎయిర్ ఇండియా యాజమాన్యం తీసుకున్న విధాన పరమైన నిర్ణయాలవల్ల ప్రయాణీకులకు కలుగుతున్న, కలుగనున్న అసౌకర్యాల గురించి, తమ అభిప్రాయాలను చెప్పే హక్కు ఉద్యోగులకు లేదని వారి భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కల్గించే విధంగా ఎయిర్ ఇండియా యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా యూనియన్లు సమ్మెకు తలపడడంతో ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు, ఎయిర్ ఇండియా యాజమాన్యం 17 మంది ట్రేడ్ యూనియన్ నాయకులను సర్వీసు నుండి తొలగించి, మరో 15 మంది ముఖ్య కార్యకర్తలను సస్పెండ్ చేసింది. యాజమాన్యం సమ్మె చట్టవిరుద్ధమని చేసిన తమ ప్రకటన కనుకూలంగా ఢిల్లీ హైకోర్టు నుండి ఆదేశాలు సంపాదించడంలో విజయవంతమైంది. హైకోర్టు

ఆదేశాలను, ఛీఫ్ లేబర్ కమిషనర్‌తో జరిగిన చర్చలను దృష్టిలో వుంచుకుని, 14000 మంది ఉద్యోగులు, అధికారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్లు సమ్మెను ఉపసంహరించుకున్నాయి. అయినప్పటికీ ఉద్యోగులను సస్పెండ్ చేయడం ద్వారానూ, సర్వీసు నుండి తొలగించడం ద్వారానూ యాజమాన్యం ఉద్యోగుల మీద దాడులకు పూనుకుంది.

## పెట్రోలియం ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా అపూర్వమైన హర్తాళ్

పెట్రోలు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా 2010 జూలై 5వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన హర్తాళ్ అపూర్వమైన విధంగా విజయవంతమైంది. అప్పటికే ఆహార వస్తువుల ధరలు 17% పెరిగాయి. ముఖ్యంగా డీజిల్ ధర పెరుగుదలతో, ఆహార వస్తువుల ధరలు మరింత పెరగనున్నాయి. వంటగ్యాస్ సిలిండరు ధర రూ. 35/–లు పెంచడం, పేదలు ఇంధనంగా ఉపయోగించుకునే కిరోసిన్ ధర లీటరుకు రూ. 3/–లు పెరగడంతో పేద ప్రజల జీవన వ్యయం పెరిగిపోనున్నది. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితమే ఇది. ప్రభుత్వం ఆడుతున్న ఈ క్రూరమైన క్రీడకు వ్యతిరేకంగా వివిధ ట్రేడ్ యూనియన్లు అప్పటికే కార్యాచరణను రూపొందించుకున్నాయి. కొన్ని ఈ దిశలో కృషి చేస్తున్నాయి. పశ్చిమబెంగాల్, కేరళలతో సహా మరికొన్ని రాష్ట్రాల్లో వెంటనే 2010 జూన్ 26వ తేదీన సిఐటియు రవాణా బంద్ / హర్తాళ్ నిర్వహించింది. పశ్చిమ బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. వివిధ రాజకీయ పార్టీలు, వామపక్షాలతో పాటు, యుపిఎ కూటమిలోని సెక్యులర్ పార్టీలు, 2010 జూలై 5న నిర్వహించిన దేశ వ్యాప్త హర్తాళ్ అపూర్వ విజయం సాధించింది.

## పేద, సాధారణ ప్రజల మీద భయంకరమైన ప్రభుత్వ దాడి

కేంద్ర ప్రభుత్వం 2010 జూన్ 25వ తేదీ నుండి పెట్రోల్ మీద లీటరుకు రూ. 3.50, డీజిల్ మీద లీటరుకు రూ. 2/–లు, కిరోసిన్ మీద లీటరుకు రూ. 3/–లు, వంటగ్యాస్ సిలిండరు మీద రూ. 35/– పెంచడం ద్వారా పేద, సాధారణ ప్రజల మీద భీకరమైన ఆర్థిక దాడికి పూనుకుంది. ప్రభుత్వ అధీనంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నష్టాలను నివారించి, తన సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరల మీద నియంత్రణను ఎత్తివేసి, వంటగ్యాస్ మీద ఇచ్చే సబ్సిడీని తగ్గించింది. ఈ విధంగా పెంచినప్పటికీ, ప్రస్తుతం డీజిల్ మార్కెట్ ధరకు బజారులో అమ్మకం ధరకు మధ్య 0.80 పైసల తేడా వుంది. ఈ రెండింటిని సమానం చేసేందుకు మరొక పక్షం రోజుల్లో మరోసారి డీజిల్ ధర పెంచే అవకాశం వుంది.

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఆధ్వర్యంలోని మంత్రుల బృందం తీసుకున్న ఈ నిర్ణయాలకు ప్రతిపక్షాలతో పాటు యుపిఎ మిత్రపక్షం తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, కేంద్ర రైల్వే మంత్రి మమతాబెనర్జీ నుండి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఆమె మంత్రివర్గ సమావేశానికి హాజరై ఈ పెంపుదలను గట్టిగా ప్రతిఘటించడం గాక, సమావేశానికి గైర్హాజరయ్యారు. మార్కెట్లు

అస్థిరత్వానికి గురై, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయంతో సెన్సెక్స్ 156 పాయింట్లు కోల్పోయింది. ఫలితంగా ఆర్‌బిఐ ఒత్తిడికి గురై కీలకరేట్లు పెంచవల్సి వచ్చింది.

"నవరత్న ఆయిల్ కంపెనీలు దివాళా తీయకుండా కాపాడే దేశ విశాల ప్రయోజనాలను" దృష్టిలో వుంచుకుని, ఈ నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని పెట్రోలియం శాఖా మంత్రి మురళీ దియోరా సమర్థించుకున్నారు. కిరోసిన్, వంటగ్యాస్ మీద భారీ సబ్సిడీ భారాన్ని భరించడం ద్వారా, ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను పరిరక్షించిందని ఆయన అన్నారు. "ఇంకా మేము ఎల్‌పిజి మీద రూ226/-లకు పైగానూ, కిరోసిన్ మీద రూ. 15/-లకు పైగా సబ్సిడీ ఇస్తున్నాము" అని అన్నారు.

ఈ విధంగా భారత ప్రభుత్వం, పెద్ద ఎత్తున రూ. 75,000/- కోట్ల మేరకు ధరలను పెంచి, ప్రజలను నిలువు దోపిడీ చేసేందుకు, వారి దురవస్థను మరింత పెంచేందుకు కృతనిశ్చయంతో వుందని వార్తలొస్తున్నాయి. వాహనాల ఇంధన ధరల మీద ప్రభుత్వ అజమాయిషీ తొలగడంతో, దుబాయి, సింగపూర్‌లలోని పెట్రోలియం ఉత్పత్తుల ట్రేడింగ్ సెంటర్లలో వున్న ధరలతో మన దేశంలోని అమ్మకం ధరను సమానం చేయడానికి, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు అవకాశం లభించింది. ఫలితంగా దేశంలో ఈ ఉత్పత్తుల ధరలు ప్రతి పదిహేను రోజులకు పెరగడం లేదా తగ్గడం జరుగుతుంది. "ఇదీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అసలు సిసలు స్వరూపం."

## పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెంపు : దారుణ మోసాల వెనుక అసలు నిజం

ద్రవ్యోల్బణం పెరిగి బియ్యం, గోధుమలు, పంచదార, వంట నూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల వంటి ఆహారవస్తువుల ధరలు నిరంతరం పెరిగి, ఆహార ద్రవ్యోల్బణం 17%కి చేరుకున్న సమయంలో, భారత ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాసు ధరలను పెంచడం ద్వారా ప్రజలను దారుణంగా దెబ్బతీసింది. దీని ఫలితంగా అన్ని నిత్యావసర వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగి ద్రవ్యోల్బణం రేట్లు మరింత పెరిగేందుకు దారితీస్తుంది. ధరల పెరుగుదల వల్ల ప్రజలు పడుతున్న బాధల గురించి కాస్తంత సున్నితంగా ఆలోచించే ఏ ప్రభుత్వమైనా, ఈ విధమైన ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడదు. ధరలమీద నియంత్రణ తొలగించడమంటే, ప్రజలను బడా ఎంఎన్‌సిలు, స్వదేశీ కార్పొరేట్ సంస్థల అధీనంలోని మార్కెట్ దయాదాక్షిణ్యాలకు వదలివేయడమే.

ధరల పెంపుదలకు ప్రభుత్వం చూపే కారణాలు సహేతుకంగా లేకపోవడమేగాక, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వున్నాయి. దేశ ప్రయోజనాల కోసమే ధరలు పెంచవల్సి

వచ్చిందని ప్రధాన మంత్రి సమర్థించుకో చూసారు. 77% మంది ప్రజలు రోజుకు కనీసం రూ.20/-లు కూడ ఖర్చుచేయలేని పరిస్థితిలో వున్నారు. అలాంటప్పుడు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెంపుదల వల్ల, దేశంలో ఎవరి ప్రయోజనాలు పరిరక్షించబడతాయి? ఈ సంస్కరణలను ఎప్పుడో చేయవల్సిందని, ఆలస్యమైందని ఆయన బాధ వ్యక్తంచేశారు. అంటే గత యుపిఎ ప్రభుత్వం తన మనుగడకు వామపక్షాల మీద ఆధారపడడం వల్లనూ, వామపక్ష పార్టీల తీవ్ర వ్యతిరేకతవల్ల, పెట్రోలియం ఉత్పత్తుల ధరల మీద నియంత్రణను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ధైర్యం చేయలేకపోయిందనే విషయాన్ని ఆయన అంగీకరించారన్నమాట! ఆ కాలంలో వామపక్షాల ఒత్తిడి కారణంగా కిరోసిన్ ధరను ఒక్కపైసా కూడా పెంచలేకపోయారు. ప్రభుత్వంలో భాగస్వాములుగా వున్న టిఎంసి వంటి పార్టీలు మంత్రివర్గ సమావేశాలకు హాజరై, ఆ చర్యలను ప్రతిఘటించడం గాక, సమావేశాలకు గైర్హాజరవడం విచిత్రమైన పోరాట రూపం! వాస్తవమేమంటే, ఈ పార్టీలన్నీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు ఆమోదం తెలిపేవే.

కేవలం సోనియాగాంధీ మాత్రమే ఈ తప్పుడు విధానాలను ఆపగలరని, ఒక కాంగ్రెస్ అనుకూల పత్రిక సంపాదకుడు పేర్కొన్నారు. ఆమె ఆమోదం లేకుండా ప్రధాన మంత్రి ఆవిధమైన నిర్ణయాలు చేయలేరని పసిపిల్లవాడు కూడా చెప్పగలడు. దీనికి మొత్తం కాంగ్రెస్‌పార్టీ, దాని అగ్రనాయకత్వం బాధ్యత వహించవల్సిందే. వీరు పైకి ఆమ్ ఆద్మీ (పేద ప్రజల) గురించి మాట్లాడుతారు. కాని ఖాస్ ఆద్మీ (సంపన్నులకు) అనుకూల విధానాలను అనుసరిస్తారు. ద్రవ్యోల్బణం అదుపులేకుండా పెరుగుతుండడం, ప్రజల ఆహార భద్రతకు ముప్పువాటిల్లనున్న తరుణంలో, ఇతర డిమాండ్లతో పాటు, ప్రజల ఆహార భద్రతకు హామీ ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ క్రింది చర్యలు చేపట్టాలని, అన్ని ట్రేడ్‌యూనియన్లు డిమాండు చేశాయి.

1. దారిద్ర్యరేఖకు దిగువనవున్న (బిపిఎల్) కుటుంబాలకే కాక ఆహారం ప్రజలందరి హక్కుగా గుర్తించాలి.
2. ప్రతి కుటుంబానికీ కనీసం 35కిలోల ఆహార ధాన్యాలను గ్యారంటీ చేయాలి.
3. ఆహార ధాన్యాల ధరను కిలోకు రూ.2/-లుగా నిర్ణయించాలి. మిక్కిలి పోషక విలువలు కల్గిన ఆహారంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు భావించే ముడిధాన్యాలను ఎంచుకునే అవకాశం వారికి కల్పించాలి.
4. మధ్యాహ్న భోజనం, ఐసిడిఎస్ పథకాలకు కేటాయింపులు గ్యారంటీ చేయడం ద్వారా, స్కూలుకు వెళ్ళే వయసురాని పిల్లలకు, స్కూలుకు వెళ్ళే పిల్లలకు ఆహార భద్రత విషయమై చట్టపరమైన హామీ ఇవ్వాలి.
5. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అందిస్తున్న విధంగా నియంత్రిత ధరలకు కొన్ని నిత్య జీవితావసర వస్తువులను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ అందించాలి.

భారత ప్రభుత్వం, దాని విధాన కర్తలు ప్రధానంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలకు వూడిగం చేసేవారే. అందువల్ల వారు ద్రవ్య పెట్టుబడికి ప్రయోజనం చేకూర్చే విధానాలనే చేపడతారు. కనుకనే ఇంతటి తీవ్ర ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో కూడ, సాధారణ ప్రజలకు ఉపశమనం కల్గించడం గాక, విదేశీ బహుళజాతి కంపెనీలు, స్వదేశీ సంపన్నులకు సంతోషం కల్గించేందుకే ప్రభుత్వం తహతహలాడుతోంది. అమెరికా నుండి తిరిగి వచ్చిన ఆర్థిక శాస్త్రవేత్తలతో సహా అనేకమంది ఈ ప్రజా వ్యతిరేక విధానాలే సరైన మార్గమని ప్రజల్లో ఊదరకొడుతున్నారు. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అనుకూల విధానాలకు సంబంధించిన ప్రస్తుత స్వరూపం యొక్క సారాంశాన్ని గురించి మేధావుల స్థాయిలో ప్రముఖ పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్త జాన్‌మేనార్ట్ కీన్స్ కాలానికి ముందే ప్రముఖ సోషలిస్టు ఆర్థిక శాస్త్రవేత్త, తత్వవేత్త కార్ల్‌మార్క్స్ కాలంలోనే చర్చలు సాగాయి. చిలీలో నియంత పినోచెట్‌తో పాటు, అనేక ఇతర లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ దేశాల్లో ఇదే ఆర్థిక విధానాల ఫలితంగా, ఈ దేశాలు పూర్తిపతనావస్థకు చేరుకున్నాయి. అందువల్ల ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడంతో పాటు, నయా ఉదారవాద ఆర్థిక విధానాల భావ జాలంలోని మోసాన్ని బహిర్గతం చేయడం కూడ ముఖ్యమైనదే. అన్ని ట్రేడ్ యూనియన్లు 2010 సెప్టెంబరు 7వ తేదీన ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు ఇచ్చిన పిలుపు ఈ దిశలో ఒక ముందడుగు.

## 2010 సెప్టెంబరు 7వ తేది దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

న్యూఢిల్లీలోని మవలంకర్ హాల్‌లో 2010 జూలై 15వ తేదీన జరిగిన ఐక్య కార్మిక సదస్సు 5 పాయింట్ల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ సాధనకు 2010 సెప్టెంబరు 7వ తేదీన ఒక రోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. కేంద్ర కార్మిక సంఘాలతో పాటు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, బిఎస్ఎన్ఎల్ తదితర జాతీయ ఫెడరేషన్ల నుండి ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి అధ్యక్షులు జి. సంజీవరెడ్డి ప్రకటనను సదస్సు ముందు ఆమోదానికి ప్రతిపాదించారు. ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ ఆర్థిక, కార్మిక విధానాలు అన్ని రంగాల్లోని కార్మికులు, ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. ఐఎన్‌టియుసి నాయకత్వం ప్రధాన మంత్రితో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను అనేకసార్లు కలిసి, కార్మికులకు నష్టదాయకంగా వున్న విధానాలను మార్చుకోవల్సిందిగా కోరినప్పటికి ప్రయోజనం లేకపోయిందని అన్నారు. ప్రభుత్వం వాస్తవాలు గమనించి, కార్మికులు మరియు పేద ప్రజలకు ఆర్థిక పరంగా ఉపశమనం కల్గించేందుకు, ట్రేడ్ యూనియన్ హక్కులకు భంగం కలుగకుండా చేసేందుకు, ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి దేశవ్యాప్త సమ్మె చేయడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అన్నారు. సమ్మెలో పాల్గొన వల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికం తదితర రంగాల కార్మికులు, ఉద్యోగులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆ

తర్వాత సిఐటియు నుండి ఎంకె పాంథే, ఎఐటియుసి నుండి గురుదాస్ గుప్తా, హెచ్ఎంఎస్ నుండి ఉమ్రావ్‌మల్ పురోహిత్, ఎఐఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శితో సహా వివిధ జాతీయ సంఘాల నాయకులు సమ్మెను, సదస్సు ప్రకటనను బలపరుస్తూ ప్రసంగించారు.

## సదస్సు ఆమోదించిన ప్రకటన

2010 జూలై 15న 2వ జాతీయ సదస్సులో కేంద్ర కార్మిక సంఘాలు మరియు కార్మికులు, ఉద్యోగుల జాతీయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. 2009 సెప్టెంబరు 14 చారిత్రాత్మక జాతీయ కార్మిక సదస్సు నిర్ణయించిన ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు చేపట్టిన ఐక్య కార్యాచరణ కార్యక్రమాన్ని సదస్సు సమీక్షించింది. 2009 అక్టోబరు 28న అఖిల భారత నిరసన దినం, డిసెంబరు 16న పార్లమెంటు ముందు భారీ ధర్నా, 10 లక్షల మంది పాల్గొన్న 2010 మార్చి 5 సత్యాగ్రహం / జైల్ భరో కార్యక్రమాలను, ఆ తర్వాత నెలకొన్న పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న సదస్సు, ఈ క్రింది ప్రకటనను ఆమోదించింది.

ధరలను, ప్రధానంగా ఆహార వస్తువుల ధరల పెరుగుదల నరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ట్రేడ్ యూనియన్లు ప్రభుత్వాన్ని డిమాండు చేశాయి. ఆహార వస్తువుల ధరలు తీవ్రంగా 17శాతం పెరిగినప్పటికీ, ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి చేరినప్పటికీ, కష్టజీవుల తీవ్ర బాధలకు ఉపశమనం కల్గించే చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం బెల్లం కొట్టిన రాయిలా స్పందించడం లేదు.

కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ హక్కుల ఉల్లంఘన నిరాఘాటంగా సాగుతుండడం పట్ల ట్రేడ్ యూనియన్లు తమ తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసినప్పటికీ, పరిస్థితి మరింత తీవ్రమై, అణచివేత రోజు రోజుకూ పెరిగిపోతోంది.

ఉద్యోగాల్లో కోత, తక్కువ వేతనాల చెల్లింపు, భరించలేని జీవన పరిస్థితులు, పనిగంటల పెరుగుదల, విచ్చలవిడిగా కాంట్రాక్టీకరణ, పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో తాత్కాలిక ఉద్యోగాల కల్పన, అవుట్ సోర్సింగ్‌లకు ట్రేడ్ యూనియన్లు తమ తీవ్ర నిరసన వ్యక్తం చేసినప్పటికీ, నానాటికి దిగజారుతున్న కార్మికుల జీవన పరిస్థితులను, కష్టజీవుల అమానుష దోపిడీని నివారించేందుకు ప్రభుత్వం చేసిందేమీ లేదు.

లాభాలార్జిస్తున్న పిఎస్‌యుల వాటా ఉపసంహరణ, ప్రధానంగా ఇటీవల చేపట్టిన కోల్ ఇండియా లిమిటెడ్, బిఎస్ఎన్ఎల్, ఎస్ఎఐఎల్, ఎన్ఎల్‌సి, హిందూస్థాన్ కాపర్, ఎన్ఎండిసి తదితర సంస్థల్లో వాటాల ఉపసంహరణను ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, పర్యవసానాల గురించి ఆలోచించకుండా, నిర్లక్ష్యపూరితంగా వాటాల ఉపసంహరణను ప్రభుత్వం కొనసాగిస్తోంది.

ట్రేడ్ యూనియన్ల నిరసనను లెక్కచేయకపోగా, కిరోసిన్, వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తీవ్రంగా పెరిగేందుకు దారితీసే విధంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరల మీద నియంత్రణ తొలగించింది. వాటి ధరలను అంతర్జాతీయ ధరలతో అనుసంధానం చేసే చర్యతో పాటు,

ఆహార పదార్థాల ధరల పెరుగుదలను తీవ్రం చేసే విధానాలనే ప్రభుత్వం ప్రజల మీద బలవంతంగా రుద్దుతోంది. ఈ విధానాల పట్ల సదస్సు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

**సదస్సు ఈ క్రింది డిమాండ్లను ఏకగ్రీవంగా ఆమోదించింది :**

* సార్వత్రిక ప్రజా పంపిణీ వ్యవస్థను నెలకొల్పడం, నిత్యావసర సరుకుల మార్కెట్‌లో స్పెక్యులేషన్‌ను నివారించడం వంటి దిద్దుబాటు చర్యల ద్వారా, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల నరికట్టాలి.

* ఆర్థిక మాంద్యానికి గురైన రంగాల్లో ఉపాధి పరిరక్షణను, ఆయా పారిశ్రామిక వేత్తల కందిస్తున్న ఉద్దీపన పథకాలకు ముడిపెట్టాలి. మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ పెట్టుబడిని పెంచేందుకు చొరవతో చర్యలు తీసుకోవాలి.

* ఏ విధమైన మినహాయింపులు, రాయితీలు లేకుండా ప్రాథమిక కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలి. చట్టాల నతిక్రమించేవారికి కఠిన శిక్షలు విధించాలి.

* అసంఘటిత కార్మికుల సాంఘిక భద్రతా చట్టం (2008)ని వర్తింప జేసేందుకు దారిద్ర్యరేఖకు సంబంధించి విధించిన ఆంక్షల నన్నింటిని ఎత్తివేయాలి. అసంఘటిత రంగంలోని కార్మికుల పని పరిస్థితుల మీద ప్రభుత్వం నియమించిన జాతీయ కమిషన్, కార్మిక విధానాల మీద పార్లమెంటు స్థాయీ సంఘం సిఫార్సు చేసిన విధంగా, కాంట్రాక్టు / క్యాజువల్‌కార్మికులతో సహా అసంఘటిత కార్మికులందరికి "జాతీయ స్థాయిలో కనీస సాంఘిక భద్రత" కల్పించేందుకు, ఒక "జాతీయ నిధి"ని ఏర్పాటు చేయాలి.

* ప్రభుత్వం తన బడ్జెటులోటును పూడ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సిపిఎస్ఇల) వాటాల ఉపసంహరణ చేపట్టరాదు. ఈ సంస్థల్లో నానాటికి పెరుగుతున్న రిజర్వు నిధులు, అదనపు నిధులను ఆ సంస్థల విస్తరణకు, ఆధునికీకరణకు మరియు ఖాయిలాపడిన పిఎస్‌యుల పునరుద్ధరణకు వినియోగించాలి.

కార్మికులు మరియు యావత్ సమాజ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసే ఈ పచ్చి ప్రగతి నిరోధక విధానాలను వెంటనే సరిదిద్దవల్సిందిగా జాతీయ కార్మిక సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ విధానాల పట్ల కార్మికుల్లో నానాటికి పెరుగుతున్న అసంతృప్తిని వ్యక్తం చేసేందుకు, ఆందోళనను మరింత ఉధృతం చేయాలని సదస్సు పిలుపునిచ్చింది. అందువల్ల సదస్సు 2010 సెప్టెంబరు 7వ తేదీన అఖిల భారత సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇవ్వాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా వున్న కార్మికవర్గం తమ అనుబంధాలతో నిమిత్తం లేకుండా ఈ ఐక్య కార్మిక సమ్మెను విజయవంతం చేయవల్సిందిగా సదస్సు విజ్ఞప్తి చేసింది. ఇంకా ప్రభుత్వం ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే ట్రేడ్ యూనియన్లు అన్నీ పోరాటాన్ని ఉధృతం చేస్తాయని, పార్లమెంటు ముందు ప్రదర్శనకు కూడ సిద్ధం కావల్సిందిగా సదస్సు కోరింది.

ఈ ప్రకటనను ఓటింగుకు పెట్టగా, దానిని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఐఎన్‌టియుసి సమ్మెలో పాల్గొనడానికి అంగీకరించడంతో పాటు, అసలు ఈ సదస్సు నిర్వహించడానికి ఐఎన్‌టియుసి అధ్యక్షుడే చొరవ తీసుకున్నారు. ఈ ఐక్య కార్మిక సమ్మె దేశ కార్మికోద్యమ చరిత్రలో ప్రత్యేకతను సంతరించుకోనుంది.

## అపూర్వమైన సార్వత్రిక సమ్మె

2010 సెప్టెంబరు 7వ తేదీ సార్వత్రిక సమ్మె నేటి వరకు దేశ కార్మికోద్యమ చరిత్రలో అతిపెద్ద ఐక్య కార్యాచరణగా నిలిచిపోతుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మరియు నయా ఉదారవాద విధానాలననుసరిస్తున్న పాలకులకీ సమ్మె బలమైన సందేశాన్ని పంపింది.

కార్మికవర్గానికి వ్యతిరేకంగా పాలకవర్గాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాల ద్వారా, విష ప్రచారాన్ని, వ్యాఖ్యానాలను పదే పదే గుప్పించాయి. కొందరు పనిగట్టుకుని కార్మికవర్గ వ్యతిరేక ప్రచారాన్ని సాగించారు. వీటన్నింటినీ లెక్క చేయక, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, పిఎస్‌యులు, వివిధ రంగాలకు చెందిన 100 మిలియన్ల (10 కోట్లు) మంది స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొని చరిత్ర సృష్టించారు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచీకరణ చేసేందుకు మన పాలక వర్గాలు 1991లో అంగీకరించిన తర్వాత, భారత ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారీ ప్రపంచీకరణ, నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సాగించిన సార్వత్రిక సమ్మెల పరంపరలో 2010 సెప్టెంబరు 7 అసాధారణ, చారిత్రాత్మక సమ్మె "పదమూడవది." నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా 1991 నుండి సాగుతున్న సార్వత్రిక సమ్మెల్లో కార్మికవర్గ భాగస్వామ్యం క్రమ క్రమంగా పెరుగుతూ, నేడది పతాకస్థాయికి చేరుకుంది.

పాలక పార్టీ కనుబంధంగా వున్న ఐఎన్‌టియుసి కూడ సమ్మెలో చురుకైన పాత్ర నిర్వహించడంతో సమ్మె మరింత ఐక్యంగా జరిగింది. ఇది ట్రేడ్ యూనియన్ ఉద్యమ చరిత్రలో గర్వించదగ్గ పరిణామం. మరొకపాలక పార్టీకి అనుబంధంగా వున్న బిఎమ్ఎస్ 2010 సెప్టెంబరు 7న కార్మికవర్గం సమ్మె తలపెట్టిన ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల మీద, గత రెండు మాసాలుగా ఐక్య కార్మిక వేదిక ఇచ్చిన కార్యక్రమాలను ఇతర కార్మిక సంఘాలతో కలిసి అమలు చేసింది. అయితే, చివరి నిమిషంలో సమ్మెకు దూరంగా వుండాలని నిర్ణయించింది.

తామెందుకు సమ్మెలో పాల్గొనలేదో బిఎంఎస్ వివరణ ఇచ్చుకోవాలి. అయితే ట్రేడ్ యూనియన్ల అనుబంధాలతో నిమిత్తం లేకుండా కార్మికులందరూ సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. కార్మికవర్గం ఒక వర్గంగా ఈ సమ్మెలో పాల్గొన్నదనేది సత్యం.

కార్మికవర్గం యొక్క 'వర్గ ఐక్యత' భారత కార్మికోద్యమం తరతరాలుగా ప్రోగుచేసుకున్న అమూల్యనిధి. పెట్టుబడిదారీ విధానంలో తీవ్ర సంక్షోభం నెలకొని, ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి వెన్నముక వంటి వాల్‌స్ట్రీట్ (అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్), 2008 సెప్టెంబరు 15న కుప్పకూలిపోవడంతో, నయా ఉదారవాదం అప్రతిష్టపాలైంది. అయినప్పటికీ ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, డబ్ల్యుటిఒ, నయాఉదారవాద విధానాలకు ప్రభువులైన జి–7 దేశాల అడుగులకు మడుగులొత్తే భారత పెట్టుబడిదారీ వర్గానికి, భారత ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం మరియు కార్మికవర్గం హెచ్చరిక చేసింది.

కార్మికవర్గం స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసిన బ్రహ్మాండమైన సమ్మె ద్వారా ఎలుగెత్తి చాటిన తీవ్ర నిరసనను ప్రభుత్వం, పెట్టుబడిదారీ వర్గం చెవికెక్కించుకోవాలని మాత్రమే ఆశించగలం. అంతేగాక తన పేదల వ్యతిరేక ఆర్థిక, కార్మిక విధానాలను మార్చుకుని, అన్ని ట్రేడ్ యూనియన్లు కోరిన విధంగా ఐదు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల నిర్దిష్టమైన నాలుగు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కార్మికవర్గం కోరుతోంది.

అయితే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలకు బలికావడానికి కార్మికవర్గం ఇక ఏమాత్రం సిద్ధంగా లేదని, ఈ హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తే దేశంలో తీవ్ర పరిస్థితులు నెలకొంటాయని ప్రభుత్వానికి స్పష్టం చేసేందుకు, మరిన్ని విస్తృత, సమరశీల దేశవ్యాప్త కార్యాచరణలకు కార్మికవర్గం, ప్రభుత్వోద్యోగులు, ఇతర కష్టజీవులు సంసిద్ధంగా వుండాలి.

## బీహారులో నిరవధిక సమ్మె

బీహార్ రాష్ట్ర నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌తో సహా వివిధ ఉద్యోగ సంఘాలు జాయింట్ స్ట్రగుల్ ఫోరమ్‌గా ఏర్పడి, తమ ఏడు అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు 2010 ఆగస్టు 23 నుండి నిరవధిక సమ్మె సాగించారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు 2010 జనవరి 7వ తేదీ నుండి 34 రోజులు సమ్మె చేసిన తర్వాత వారి సమస్యలు పరిశీలిస్తామని నితీష్‌కుమార్ ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వోద్యోగులతో సమానంగా వేతనాలు, డి.ఎ., పెన్షన్ చెల్లించాలని, దినసరి, తాత్కాలిక కార్మికులను పర్మనెంటు చేయడం, ఖాళీలు భర్తీ చేయడంవంటి సమస్యల పరిష్కారానికి వీరు సమ్మెకు పూనుకున్నాయి. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వారు 2010 ఆగస్టు 23 నుండి 59 రోజులు నిరవధిక సమ్మె నిర్వహించవల్సి వచ్చింది.

## ఆదాయం పన్ను ఉద్యోగుల సమ్మె

బెంగుళూరులోని సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సిపిసి)లోని కార్యకలాపాల అవుట్ సోర్సింగ్ నిలిపివేత సహా 12 అంశాల ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు ఆదాయం పన్నుశాఖ ఉద్యోగులు 2010 జూలై 15వ తేదీన ఒక రోజు దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ (జెఎసి) పిలుపు మేరకు 50 వేల మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్న ఈ సమ్మె వల్ల కార్యకలాపాలు స్తంభించిపోయాయని ప్రసారసాధనాలు పేర్కొన్నాయి.

## మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సమ్మె

ప్రాణాలు కాపాడేందుకుపయోగించే మందుల ధరలను నియంత్రించాలని, ప్రభుత్వరంగ ఔషధ కంపెనీలను పునర్ వ్యవస్థీకరించాలని, నకిలీ మందుల తయారీ దారులను కఠినంగా శిక్షించాలని, ఔషధాల మీద ఎక్సైజ్ పన్ను ఉపసంహరించాలన్న, ప్రజలకు సంబంధించిన సమస్యలు, పరిశ్రమకు సంబంధించిన ఇతర డిమాండ్లతో పాటు మొత్తం 25 శాతం ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల సాధనకు ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఎఐ) పిలుపు మేరకు, రెండు లక్షల మందికి పైగా మెడికల్ మరియు సేల్స్ రిప్రజెంటేటీవ్‌లు ఆగస్టు 17, 18 తేదీల్లో రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతంగా నిర్వహించారు. సమంజసమైన కనీస వేతనం నిర్ణయించాలని, అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలని, ఇఎస్ఐ బెనిఫిట్లు, పి.ఎఫ్, గ్రాట్యుటీ చెల్లింపు వంటి సదుపాయాలు కల్పించాలని కూడా వారు కోరుతున్నారు.

## ఉన్నత స్థానాల్లో అవినీతి పరంపర

ఉన్నత స్థానాల్లో అవినీతి పత్రికల్లో పతాక శీర్షికల్లో చోటు చేసుకుంటోంది. న్యూఢిల్లీలో నిర్వహించిన కామన్‌వెల్త్ క్రీడల్లో అవకతవకలు, మహారాష్ట్రలోని ఆదర్శ్ హౌసింగ్ సొసైటీలో భూకబ్జా, కర్నాటకలో యడ్యూరప్ప ప్రభుత్వ భూమి వ్యవహారాల్లో అవినీతి, వీటన్నింటిని తలదన్నే విధంగా ప్రభుత్వ ఖజానాకు లక్షల కోట్ల నష్టం కల్గించిన 2జి స్పెక్ట్రమ్ కేటాయింపుల కుంభకోణం, దేశాన్ని కుదిపివేశాయి. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా పి.జె. థామస్ నియామకాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానమే ప్రశ్నించింది. ప్రస్తుతం సిబిఐ నిఘానేత్రం క్రింద వున్న కొన్ని చర్యలను, టెలికమ్ డిపార్టుమెంట్ కార్యదర్శిగా థామస్ ఆనాడు సమర్థించారని కోర్టు తెలిపింది. ఈ పరిస్థితుల్లో 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం మీద సిబిఐ జరుపుతున్న విచారణను ఆయన పర్యవేక్షించవల్సి వస్తే, సివిసిగా ఆయన నియామకంలోని ఔచిత్యం పట్ల సుప్రీంకోర్టు సందేహాలు వ్యక్తం చేసింది.

కామన్‌వెల్త్ క్రీడలకు సంబంధించిన వివిధ ప్రాజెక్టుల్లో అవినీతి ఆరోపణలమీద సివిసి లోతుగా విచారణ నిర్వహించింది. టెండర్లలోనూ, ఇతర విధాలుగానూ సుమారు రూ.8000/– కోట్ల మేరకు నిధుల దుర్వినియోగం జరిగిందని సివిసి పేర్కొంది. సివిసి నుండి ఇంకా అనేక నివేదికలు రావల్సింది వుంది. కొందరిని అరెస్టు చేశారు. కామన్‌వెల్త్ క్రీడల ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్, పార్లమెంటు సభ్యులు సురేష్‌కల్మాడీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా చేయవల్సివచ్చింది. స్పెక్ట్రమ్‌కేసులో మాజీ టెలికం శాఖా మంత్రి ఎ. రాజాను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి కోసం చేసిన విజ్ఞప్తికి స్పందించడంలో "నిష్క్రియా పరత్వానికి సంబంధించిన ఆరోపణ" మీద అఫిడవిట్ దాఖలు చేయవల్సిందిగా సుప్రీంకోర్టు ప్రధాన మంత్రిని కోరింది. కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలను గురించి విచారించేందుకు ప్రధానమంత్రి మాజీ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఎజి) వికె షుంగ్లూ నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఎంత సమర్థవంతంగా అవినీతి భాగోతాలను బయటకు లాగుతుందో ఇంకా చూడవల్సే వుంది.

కార్గిల్ యుద్ధవీరులు, వారి వితంతువులకు గృహవసతి కల్పించే ఉద్దేశంతో ముంబయిలో ఆదర్శ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ క్రింద ఆరంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. అయితే దీనిలో అక్రమంగా ప్లాట్లు పొందిన అధికారులు, రాజకీయ నాయకులు, సైనికాధికారులు కుమ్మక్కైన ఫలితంగా, అది 36 అంతస్తుల టవర్‌గా రూపాంతరం చెందింది. చివరికిది పెద్దవివాదమై పత్రికల కెక్కింది. చివరకు ఈ వివాదంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్‌చవాన్‌రాజీనామా చేయవల్సి వచ్చింది. ఇంకా అనేక మంది రాజకీయ నాయకులీ భూకబ్జాలో భాగస్వాములుగా వున్నారు.

కర్నాటకలోని యడ్యూరప్ప ప్రభుత్వం కూడ అవినీతి కుంభకోణాల్లో చిక్కుకుని కొట్టుమిట్టాడుతోంది. బళ్లారిలో మైనింగ్ మాఫియా సాగిస్తున్న చట్టవిరుద్ధ త్రవ్వకాలతో పాటు, మంత్రులు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, చివరకు ముఖ్యమంత్రికి కూడ సంబంధించిన భూ అక్రమ కేటాయింపుల కుంభకోణాలు బ్రద్దలయ్యాయి. తీవ్రమైన అవినీతి ఆరోపణల్లో పీకల్లోతు కూరుకుపోయిన ముఖ్యమంత్రికి, ఎన్నికల రాజకీయాలకు సంబంధించిన అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా కొంత వూరట లభించింది. అయితే ఇదే విధమైన ఆరోపణల మీద ఆయన మంత్రివర్గ సహచరులు కొందరు రాజీనామా చేయవల్సి వచ్చింది.

2జి స్పెక్ట్రం కేటాయింపుల్లో కాగ్ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఖజానాకు రూ. 1.76 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. కాగ్ నివేదిక బహిర్గతమవడంతో, టెలికంశాఖా మంత్రి ఎ. రాజాను మంత్రి పదవికి రాజీనామా చేయించవల్సి వచ్చింది. ఈ భారీ అవినీతి కుంభకోణానికి సంబంధించిన మూలాలను బట్టబయలు చేసేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షం ముక్తకంఠంతో డిమాండు చేసింది. ఇందుకు ప్రభుత్వం మొండిగా నిరాకరించింది. జెపిసి ఏర్పాటును డిమాండు చేస్తూ ఎన్‌డిఎ యేతర, యుపిఎ యేతర పార్టీలు పార్లమెంటు వద్ద ధర్నా నిర్వహించాయి. కొద్ది కార్పొరేట్ సంస్థలు, జర్నలిస్టులు, అధికారులతో కూడిన రహస్యముఠా, కేంద్ర మంత్రివర్గంలో ఎవరు వుండాలనే విషయాల్లో ప్రభుత్వ నిర్ణయాల మీద ఎంతటి తీవ్ర ప్రభావం చూపుతుందో రుజువు చేసే నీరా రాడియా టేపుల ఉదంతాన్ని ప్రసార సాధనాలు బహిర్గతం చేశాయి. టెలికం శాఖా మంత్రి ఎ. రాజా నియామకాన్ని కూడ ఈ ముఠా ప్రభావితం చేసింది. కేంద్ర మంత్రివర్గ స్థానాల నుండి సహజవనరుల వినియోగం వరకు వివిధ విషయాల్లో లాబీయింగ్, కుట్రల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్న దారుణ పరిస్థితినీ టేపుల ఉదంతం బహిర్గతం చేసింది. అనేక రంగాల్లో పెద్ద ఎత్తున కుంభకోణాలు చుట్టుముట్టడంతో ఇప్పటి వరకు పరిశుద్ధుడన్న మంచిపేరున్న ప్రధాన మంత్రి వ్యక్తిగత ప్రతిష్ఠ, ఆయన యుపిఎ-2 ప్రభుత్వ ప్రతిష్ఠ తీవ్రంగా దిగజారాయి. గతంలో ఎవరి హయాంలోనూ జరగనన్ని కుంభకోణాలు మన్మోహన్‌సింగ్ హయాంలో జరిగాయి. యడ్యూరప్ప నాయకత్వంలోని కర్నాటక ప్రభుత్వం కూడ భూకుంభకోణాల్లో కూరుకుపోవడంతో ప్రధాన ప్రతిపక్షం ప్రతిష్ఠ కూడ దిగజారింది. ప్రైవేటు పెట్టుబడి తమ ప్రయోజనాల కనుగుణంగా, ప్రజలకు నష్టదాయకంగా వుండే విధంగా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడంతో, సంస్కరణల యుగంలో అవినీతి వూహించనంత

ఎత్తుకు చేరుకోవడం, మిక్కిలి ఆందోళన కల్గిస్తుంది. ఎంత కష్టసాధ్యమైనా దీనిని ప్రతిఘటించాలి!

## అణుఒప్పందం విషయంలో అమెరికాకు మరొకసారి భారత్ లొంగుబాటు

అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామా భారత సందర్శనకు ముందే, అణువిద్యుత్ కర్మాగారాల స్థాపనవల్ల కలిగే నష్టాలకు పరిహారం చెల్లింపు విషయమై భారతదేశం ఒక ఒప్పందం మీద సంతకాలు చేసింది. భారత అణుపరిశ్రమలోకి అమెరికాకు చెందిన "అణు ఇంధనాన్ని సరఫరా చేసే గ్రూపుల (ఎన్ఎస్‌జి)" ప్రవేశాన్ని సుగమం చేసే లక్ష్యంతోనే "అణు ఇంధన వినియోగం వల్ల జరిగే నష్టాన్ని భర్తీ చేసే అనుబంధ నష్ట పరిహార ఒప్పందం (సిఎస్‌సి – కన్వెన్షన్ ఆన్ సప్లిమెంటరీ కాంపెన్సేషన్ ఫర్ న్యూక్లియర్ డామేజ్)" మీద భారత్ సంతకాలు చేసింది. 27.10.2010న వియన్నాలో జరగనున్న అంతర్జాతీయ అణు ఇంధన ఏజన్సీ (ఐఎఇఎ) సమావేశంలో అణు కర్మాగారాల నిర్వాహకులు, ఎన్ఎస్‌జిల ఆర్థిక బాధ్యత (నష్టపరిహారం) గురించిన పరిమితులను ఈ ఒప్పందం నిర్ణయిస్తుంది. అణు ప్రమాదాలు జరిగినప్పుడు, తగిన నష్టపరిహారం చెల్లింపుకు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ఒక చట్టబద్ధమైన వ్యవస్థ నిర్మాణం, దీని లక్ష్యంగా చెప్తున్నారు. అయితే ఈ ఒప్పందం మీద కేవలం 14 దేశాలు మాత్రం సంతకాలు చేయగా, అమెరికా, అర్జెంటైనా, మొరాకో, రుమేనియా వంటి నాలుగు దేశాలు మాత్రమే ఈ ఒప్పందాన్ని తమ పార్లమెంట్‌లో ఆమోదించాయి. అందువల్ల ఈ ఒప్పందాలకు అంతర్జాతీయ సమాజం ఆమోదం లేదనేది సుస్పష్టం. కనీసం 4 లక్షల యూనిట్ల స్థాపిత అణు సామర్థ్యం కల్గిన, కనీసం ఐదు రాష్ట్రాలు ఆమోదించిన తర్వాత 90వ రోజు నుండి, ఈ ఒప్పందం అమలులోకి రావాలి. సిఎస్‌సి మీద సంతకాలు చేయడం వల్ల, అణు ప్రమాదాలకు సంబంధించిన మన చట్టాలన్నీ అన్ని విధాలుగా నిర్వీర్యం చేయబడ్తాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివేచనా రహిత తొందరపాటుతో సిఎస్‌సి మీద భారత ప్రభుత్వం సంతకాలు చేయడం, భారత పాలకవర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాద పాలకులను ప్రసన్నం చేసుకునేందుకు నిస్సిగ్గుగా చేస్తున్న ప్రయత్నాలు మాత్రమే. అమెరికా దేశాధ్యక్షునిగా ప్రప్రథమంగా భారత్ సందర్శించనున్న బరాక్ ఒబామా పర్యటనకు ముందే తమ అమెరికా ప్రభువులకు భారత పాలకులు సమర్పించుకునే "వినయ పూర్వక బహుమతి"గా దీనిని ఎవరైనా సులభంగా అర్థం చేసుకోగలరు.

## భారత ప్రజల వాస్తవ ప్రయోజనాలను విస్మరించిన అమెరికా అధ్యక్షుని భారత పర్యటన

అమెరికా తీవ్ర ఆర్థికమాంద్యం, భారీ నిరుద్యోగం వంటి జటిల సమస్యలతో సతమతమవుతున్న పూర్వరంగంలో అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామా 2010 నవంబరు 5 నుండి 9 వరకు భారత్‌లో పర్యటించారు. అమెరికా వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం, వ్యవసాయ రంగం, చిల్లర వర్తకంతో బాటు మొత్తం భారత మార్కెట్లను బార్లా

తెరవడం, రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సైనిక సంబంధాలను పటిష్ట పర్చడమే బరాక్ ఒబామా భారత పర్యటన ప్రధాన ఎజండా అన్న విషయం అందరూ వూహించిందే. వ్యూహాత్మక సంబంధాల విషయంలో అమెరికా విధానాలను పాటిస్తే, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం విషయంలో భారత్‌కు మద్దతిస్తామని ఒబామా పేర్కొన్నారు. "ఇతరుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి, భారత్ తనకు తానే అగ్రభాగాన వున్నట్లు భావించుకుంటోందని" పేర్కొంటూ, ఈ శాశ్వత స్థానానికి భారత ప్రయత్నాల మీద నిఘాకు అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్, ఆదేశించినట్లు, వికిలీక్స్ వెల్లడించిందని ప్రసార సాధనాలు పేర్కొన్నాయి. అమెరికాకు సంబంధించినంత వరకు (ఐ.రా.స.లో భారత్) ప్రస్తుత రెండేళ్ళ తాత్కాలిక సభ్యత్వ కాలాన్ని "పర్యవేక్షించే కాలం" (చీజీళిబిశిరిళిదీబిజీగి చీలిజీరిళిఖ) గా పరిగణిస్తామనే అర్థం వచ్చే విధంగా సంయుక్త ప్రకటన పేర్కొన్నది. భోపాల్ విషవాయు బాధితులకు చాలినంత నష్టపరిహారం చెల్లించాలని గాని, ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి అమెరికా పౌరుడు డేవిడ్ హెడ్లీని విచారణ నిమిత్తం భారత్‌కు అప్పగించాలని గాని, భారత సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఇతర వృత్తుల్లో నిపుణులైనవారు అమెరికాలో పనిచేయడానికున్న ఆంక్షలను ఎత్తివేయాలని గాని, భారత ప్రభుత్వం అమెరికా అధ్యక్షుని మీద ఒత్తిడి తేవడం మాటటుంచి, కనీసం కోరనైనా లేదు. విశేష ప్రచారం పొందిన అమెరికా అధ్యక్షులు ఒబామా పర్యటన సందర్భంగా, ద్వైపాక్షిక సంప్రదింపుల ద్వారా తమ వాణిజ్య, వ్యూహాత్మక లక్ష్యాలను మరింత ముందుకు తీసుకు వెళ్ళేందుకు అమెరికా కృషి చేయగా, భారత ప్రజల నిజమైన ప్రయోజనాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. దేశ ప్రయోజనాలకు విఘాతం కల్గించే అమెరికా అధ్యక్షుని పర్యటనకు నిరసనగా వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలు దేశవ్యాప్తంగా భారీ ప్రదర్శనలు నిర్వహించాయి.

## విజయవంతంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమ్మె

బిఎస్ఎన్ఎల్ కార్మికులు, ఉద్యోగులు, అధికారుల అసోసియేషన్లు, యూనియన్ల ఐక్య కార్యాచరణ కమిటీ (జెఎసి) పిలుపు మేరకు, బిఎస్ఎన్ఎల్‌లో వాటాల ఉపసంహరణకు వ్యతిరేకంగానూ, వాలంటరీ రిటైర్మెంట్ల ద్వారా లక్ష మంది ఉద్యోగులను రిట్రెంచ్ చేయాలన్న శామ్ పిట్రోడా కమిటీ ప్రతిపాదనకు వ్యతిరేకంగా 2010 డిసెంబరు 1 నుండి సుమారు మూడు లక్షల మంది బిఎస్ఎన్ఎల్ కార్మికులు దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మె ప్రారంభించారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు చాలినన్ని మొబైల్ పరికరాలను బిఎస్ఎన్ఎల్ సేకరించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని నష్టాలొస్తున్న ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చేందుకు బిఎస్ఎన్ఎల్‌కు ఆర్థిక సహాయమందిస్తానని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, తదితర డిమాండ్ల సాధనకీ సమ్మె తలపెట్టడం జరిగింది.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు అవకాశాలు కల్పిస్తూ, 1990 దశకం ప్రారంభంలోనే భారత ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ప్రారంభించింది. అదే సమయంలో సర్వీసురంగంలోకి ప్రైవేటు రంగాన్ని అనుమతించే విధానాల్లో భాగంగా,

టెలికం రంగంలోకి ప్రైవేటు కంపెనీలననుమతించింది. ఆనాడు కేంద్రంలో అధికారంలో వున్న ప్రభుత్వం, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెలికం రంగాన్ని ప్రైవేటు పరం చేయడానికి తహతహలాడుతోంది. ఆనాటి టెలికం శాఖలోని ఉద్యోగ సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, లెక్కచేయక 2000 అక్టోబరు 1వ తేదీన బిఎస్ఎన్ఎల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో బిఎస్ఎన్ఎల్ ఆర్థిక పరమైన స్థిరత్వానికి తగిన చర్యలు తీసుకునే విషయంలో, కేంద్ర ప్రభుత్వం అనేక హామీలిచ్చింది.

కాని ప్రభుత్వం అనేక సేవలను క్రమక్రమంగా బిఎస్ఎన్ఎల్ నుండి వేరు చేసి, ప్రైవేటు కంపెనీల కప్పగించింది. ఒక్కమాటలో చెప్పాలంటే, టెలికం రంగం ప్రైవేటీకరణ తర్వాత బిఎస్ఎన్ఎల్‌తో పోల్చుకుంటే, ప్రైవేటు కంపెనీలు ప్రభుత్వం నుండి ఏకపక్షంగా, బహుళ ప్రయోజనాలు పొందాయి.

మొబైల్ టెలిఫోన్ రంగంలోకి ప్రైవేటు కంపెనీల ననుమతించిన 6, 7 సంవత్సరాల తర్వాత మాత్రమే. బిఎస్ఎన్ఎల్‌ను ఈ రంగంలో కనుమతించారు. అయినప్పటికీ, నిజాయితీగా పట్టుదలతో కృషి చేసి, 2006 నాటికి మొబైల్ ఫోన్ సర్వీస్ రంగంలో బిఎస్ఎన్ఎల్ రెండవ స్థానమాక్రమించింది. బిఎస్ఎన్ఎల్‌ను బలహీనపర్చేందుకు ఈ సంస్థలోని నిధులను, ఏ విధంగానైనా, చివరకు అనైతిక పద్ధతుల ద్వారానైనా బయటకు తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. టెలికం రంగం కార్పొరేటీకరణ సమయంలో, కేంద్ర ప్రభుత్వం రూ.7500/- కోట్ల "ఊహజనిత రుణాన్ని" బిఎస్ఎన్ఎల్‌కు అందించింది. నిజానికి బిఎస్ఎన్ఎల్‌కు రుణం తీసుకోవాల్సిన అవసరం లేదు. అంతేగాక పైన చెప్పినట్లు బిఎస్ఎన్ఎల్‌కు రుణం అందించలేదు. కాని దుర్మార్గమేమిటంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం తానివ్వని రుణం మీద 2000-01 నుండి 2009-10 వరకు వడ్డీ గుంజింది. బిఎస్ఎన్ఎల్ కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్లు, పన్నులు, లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రం ఛార్జీల రూపంలో రూ.40 వేల కోట్ల భారీ మొత్తాన్ని జమ చేసింది.

టెలికం రంగంలో నెలకొన్న భయంకరమైన పోటీ ఫలితంగా 2007 నుండి బిఎస్ఎన్ఎల్‌కు వచ్చే రెవెన్యూ ఆదాయం పడిపోనారంభించింది. 2009-10 ఆర్థిక సంవత్సరంలో రూ.1823 కోట్ల నష్టాన్ని చవిచూచింది.

ఇది చాలదన్నట్లు 3జి స్పెక్ట్రమ్, వైర్లెస్ స్పెక్ట్రమ్ ఛార్జీల రూపంలో ప్రభుత్వానికి రూ. 18,500 కోట్ల భారీ మొత్తాన్ని చెల్లించవలసి వచ్చింది. అయినప్పటికి టెండర్ల ద్వారా తమకవసరమైన సర్కిళ్ళను ఎంచుకోకుండా బిఎస్ఎన్ఎల్‌ను నిషేధించారు.

దేశవ్యాప్తంగా సమ్మె విజయవంతమైంది. దాదాపు అన్ని కార్యాలయాలు మూతపడ్డాయి. ఢిల్లీ, కొల్‌కత్తా, చెన్నై, ముంబై, బెంగుళూరు, హైదరాబాదు, త్రివేంద్రం తదితర మహానగరాల్లో వందలాది మంది బిఎస్ఎన్ఎల్ ఆఫీసుల ముందు ప్రదర్శనలు నిర్వహించారు. బిఎస్ఎన్ఎల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా బ్యాంకులు, బీమా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు, ఇతర రంగాలకు చెందినవారు ప్రదర్శనలు నిర్వహించారు. టెలికంశాఖ, బిఎస్ఎన్ఎల్ అధికారులు, జెఎసిల మధ్య సుదీర్ఘంగా సాగిన చర్చల అనంతరం 2010

డిసెంబరు 2వ తేదీ ఉదయం 9.30 గంటలకు మూడు రోజుల అనంతరం సమ్మె ఉపసంహరించబడింది. జిఎస్ఎం లైన్లు సమకూర్చుకునేందు కవసరమైన పరికరాలను సేకరించుకోవడానికి అంగీకారం కుదిరింది. బిఎస్ఎన్ఎల్‌లో వాటాల ఉపసంహరణ వుండదని ఉద్యోగుల రిట్రెంచ్‌మెంట్ ఉండబోదని హామీ ఇవ్వడం జరిగింది.

## పిఎస్‌యుల వాటాల ఉపసంహరణకు తీవ్ర నిరసన

ప్రభుత్వ రంగ మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఒఐఎల్)లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్(ఐపిఒ) ద్వారా 10% వాటాలు ఉపసంహరించడం ద్వారా రూ.1260 కోట్లు సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వాటాల ఉపసంహరణకు పూనుకున్న, లాభాలార్జిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల్లో ఐదవది ఈ ఎంఒఐఎల్. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వాటాల ఉపసంహరణ ద్వారా సేకరించ నిర్ణయించిన రూ.40,000/- కోట్లలో సట్లెజ్ జల విద్యుత్ నిగమ్, ఇంజనీర్స్ ఇండియా, కోల్ ఇండియా లిమిటెడ్, పవర్‌గ్రిడ్‌లలో వాటాల ఉపసంహరణ ద్వారా ఇప్పటికే దాదాపు రూ.20,000 కోట్లు సేకరించింది. హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లలో వాటాల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. లాభాలార్జిస్తున్న పిఎస్‌యులను అమ్మే 'దారి తప్పిన అత్యుత్సాహంలో' వున్న భారత ప్రభుత్వం, భారీ స్థాయిలో వచ్చి చేరుతున్న స్పెక్యులేటివ్ స్వభావం గల్గిన ద్రవ్యపెట్టుబడి, భారత ఆర్థిక వ్యవస్థకు కల్గించనున్న అస్థిరత్వాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ఈ విధానాలకు నిరసనగా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పబ్లిక్ సెక్టార్ ట్రేడ్ యూనియన్స్, (సిపిఎస్‌టియు) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వున్న పిఎస్‌యు కార్మికులు 2010 డిసెంబరు 1వ తేదీన పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా ప్రైవేటీకరణ వ్యతిరేక దినం / వాటాల ఉపసంహరణ దినం పాటించారు.

## విద్యారంగ కేంద్రీకరణ,ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటు ముందు ప్రదర్శన

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల అధికారులు, బోధనేతర సిబ్బంది, ప్రజా సైన్స్ ఉద్యమ కార్యకర్తలు 2010 డిసెంబరు 2వ తేదీన న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానం నుండి పార్లమెంటు వీధి వరకు ప్రదర్శన నిర్వహించారు. యుపిఎ-2 ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు, విద్యారంగంలో నయాఉదారవాద సంస్కరణలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను ఆమోదించే వరకు పోరాడాలని నిర్ణయించారు. ఎఐఎఫ్‌యుసిటిఒ, ఎస్ఎఫ్ఐ, ఎస్‌టిఎఫ్ఐ, ఎఐఎస్‌బి, ఆర్‌వైఎఫ్, డివైఎఫ్ఐ, బిజివిఎస్, ఎఐయుఈసి మరియు పిఎస్‌యుల వంటి భాగస్వామ్య సంఘాల నాయకులు ప్రసంగించారు. అనేకమంది వామపక్ష పార్లమెంటు సభ్యులు కూడా ప్రసంగించారు. విద్యారంగంలో కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణలను వక్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, విద్యారంగ విస్తరణ, సమన్యాయం,

ప్రతిభను సాధించాలన్న విద్యారంగ లక్ష్యాలనీ విధానాలు తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. విద్యకు జిడిపిలో ఆరుశాతం కేటాయించాలని, ప్రీప్రైమరీస్థాయి (ప్రాథమిక విద్య కంటె ముందు నుండే) నుండి సీనియర్ సెకండరీ స్థాయి వరకు విద్యను, విద్యా హక్కు పరిధిలోకి తేవాలని, బోధన, బోధనేతర ఉద్యోగ నియామకాల స్తంభనను తొలగించాలని, ఆర్థికంగా వెనుకబడిన, వైకల్యంతో కూడిన నేపథ్యం కల్గిన విద్యార్థులకు పూర్తి సబ్సిడీ కల్పించాలని కోరడంతో పాటు విద్యారంగంలో ఎఫ్‌డిఐని అనుమతించడం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేయడం జరిగింది.

## కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలకు పశ్చిమబెంగాల్‌లో అరాచకానికి వ్యతిరేకంగా ప్రజాందోళన

యుపిఎ-2 ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వివిధ వామపక్ష, అభ్యుదయ కార్మిక సంఘాలు, యువజన, విద్యార్థి, రైతు సంఘాలు, ఉద్యోగులు, కార్మికులు, మహిళలు, రచయితలు, కళాకారులు, గాయకులు, నటీనటులు, పెయింటర్లు అందరు తమతమ సంఘాల బ్యానర్లతో కోల్‌కత్తాలోని మెట్రో ఛానల్‌వద్ద, నవంబరు 24 నుండి 30వ తేదీ వరకు, వారం రోజుల పాటు భారీ ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెంపుదల నుపసంహరించాలనీ, ప్రైవేటీకరణ, ఉద్యోగాల తగ్గింపు వంటి నయా ఉదారవాద దాడులకు, నిరుద్యోగానికి వ్యతిరేకంగానూ, ప్రధాన ప్రతిపక్షం, మావోయిస్టులతో కల్సి సాగిస్తున్న అరాచకాన్ని, విచక్షణారహిత హత్యాకాండను వ్యతిరేకిస్తూ నినదించారు. వివిధ సంఘటనలకు చెందిన నాయకులతో పాటు, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి కూడ ప్రసంగించారు.

## భారతదేశంలో ప్రత్యేక పరిస్థితి

కార్మికవర్గంలో వ్యవస్థాపరంగా వచ్చిన మార్పులు ఒక విభిన్నమైన పరిస్థితులను సృష్టించాయి. భారత్‌లో ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం (హైటెక్)తో కూడిన పరిశ్రమలతో పాటు, పాత ఉత్పత్తి పద్ధతుల్లో నడిచే సాంప్రదాయ పరిశ్రమలు కూడ పెద్ద సంఖ్యలో వున్నాయి. ఉదాహరణకు ఆధునికీకరించిన ఉక్కు పరిశ్రమలు, ఆటోమొబైల్, పెట్రో రసాయనాల పరిశ్రమలు, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ (బిహెచ్ఇఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) వంటి పరిశ్రమలు ఉత్పత్తి విధానంలో ఉన్నత స్థాయి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం వల్ల ఆ సంస్థల్లో ఉన్నత స్థాయి నైపుణ్యం కల్గిన శ్రమశక్తి అవసరం వుంది. జనపనార, టెక్స్‌టైల్స్ వంటి సాంప్రదాయ పరిశ్రమలు తగినంత ఆధునికీకరణను చేపట్టక, పాత ఉత్పత్తి పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఈ పరిశ్రమల్లో సరుకుల ఉత్పత్తిలో శారీరక శ్రమ ప్రధాన పాత్ర నిర్వహిస్తుంది. ఆ విధంగా ఆధునికీకరించిన పరిశ్రమలు, సాంప్రదాయక పరిశ్రమల మధ్య తేడా విస్పష్టంగా వుంటుంది. ఇప్పటికే ఉన్నత స్థాయి నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం కల్గిన నేపథ్యం వున్న కొన్ని పాత పరిశ్రమల్లోని శ్రామికవర్గం, ఉన్నత శ్రేణి నైపుణ్యం, హెచ్చుజీతాలు మరియు మెరుగైన పని పరిస్థితుల వంటి ఆధునిక కార్మిక వర్గ లక్షణాలను సంతరించుకుంది. ఆ విధంగా

భారతదేశంలో సాంప్రదాయ సిద్ధమైన శ్రామికవర్గంతో పాటు, ఆధునిక కార్మికవర్గం కూడ కలిసిమెలిసి వుంది.

కోట్లాది మంది పనిచేస్తున్న భారత అసంఘటిత రంగంలో వేతనాలు తక్కువగా వుండడం, మిక్కిలి శ్రమతో కూడి వుండి, విసుగుకల్గించే విధంగానూ, వుండడంతోపాటు, పర్యావరణపరంగానూ కార్మికుల పని పరిస్థితులు దుర్భరంగా వున్నాయి. భారత కార్మికవర్గంలో నెలకొన్న ఈ పరస్పర విరుద్ధ పరిస్థితులు, అసమానతలు భారత కార్మిక వర్గ నిర్మాణంలో మిక్కిలి ప్రధానమైన అంశాలు.

గుత్త పెట్టుబడిదారీ విధానం అమలులో వున్న కాలానికి సంబంధించి గాని, శాస్త్ర సాంకేతిక విప్లవ (ఎస్‌టిఆర్) కాలానికి గాని చెందక పెట్టుబడిదారీ విధానానికి ముందున్న ఉత్పత్తి సంబంధాలు, భారత కార్మిక వర్గాన్ని మరింత ప్రభావితం చేశాయి. కార్మికుడు పుట్టిన కులం, జాతి ఆధారంగానూ, పని పరిస్థితుల విషయంలో పురుషాధిక్యతతో కూడిన స్త్రీ, పురుష లింగ విభేదాలు చూపించే వివక్షా పూరిత సంబంధాలు, కార్మికవర్గంలో విభిన్నమైన అసమానతలకు దారితీశాయి. వేతనాల ప్రాతిపదికన అసమానతలతో పాటు, కులం, జాతి, లింగం ఆధారంగా నెలకొన్న ఈ అసమానతలు భారత కార్మికవర్గ నిర్మాణంలో ఒక ప్రధానమైన అంశం. చిన్న ఫ్యాక్టరీలు లేదా బీడీలు తయారు చేయడం వంటి, ఇంటి వద్దనే వుండి చేసే పనుల్లో కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులుగా తక్కువ వేతనాలు లభించే పనుల్లో, మహిళా కార్మికులు అత్యధికంగా వినియోగించబడుతున్నారు.

ఒక ప్రముఖ విద్యావేత్త భారతదేశ పరిస్థితిని వివరిస్తూ, "భారతదేశం వివిధ ఆర్థిక వ్యవస్థల సమ్మేళనం. ఇక్కడి ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడిదారీ విధానంతోనూ, ప్రత్యేకంగా పెట్టుబడిదారీ విధాన అత్యున్నత దశ ఐన సామ్రాజ్యవాద ఉత్పత్తి సంబంధాలతో పాటు, పెట్టుబడిదారీ విధానాని కంటె ముందున్న అనేక ఉత్పత్తి విధానాలతో కలగా పులగంగావుంది. భారత ఆర్థిక వ్యవస్థలో వున్న ఈ బహుళత్వం, కార్మికవర్గంలో అసమానతలుండడానికి ఒక ప్రధాన కారణమైంది. ఈ విధమైన ఆర్థిక వ్యవస్థ కారణంగానే వివిధ రకాల ఉత్పత్తి, వినియోగం మరియు పెట్టుబడి సమీకరణ కలిసి వుండడం వల్ల, వివిధ రకాల కార్మికవర్గం మనుగడలో వుంది" అని పేర్కొన్నారు.

భారతదేశం భారీ సంఖ్యలో వున్న అసంఘటిత రంగంతో పాటు, పెద్ద సంఖ్యలో కార్మిక వర్గమున్న పెద్దదేశం. దేశంలోని కార్మికవర్గంలో అనేక ప్రత్యేకతలున్నప్పటికీ, ట్రేడ్ యూనియన్ ఉద్యమం బలంగా వుంది. కులం, జాతి, మతం ప్రాతిపదికన తీవ్రంగా విభజించబడిన భారతీయ సమాజంలోని ఈ పోకడలు అప్పుడప్పుడు మతోన్మాద స్వభావం సంతరించుకోవడం, వివిధ ప్రాంతాల్లో ఉగ్రవాదమూకల కార్యకలాపాలు సాగుతున్నప్పటికీ, ట్రేడ్ యూనియన్ ఉద్యమం బలంగానే వుంది. అయితే సంఘటిత రంగం మీద, నయా ఉదారవాద ఆర్థిక విధానాల దాడుల వల్ల పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతున్నారు. వీరితో పాటు నూతన ఉద్యోగార్థులు, నికృష్టమైన జీతాలతోనైనా అసంఘటితరంగం, స్వయం ఉపాధి రంగాల్లో ఉపాధి వెతుక్కునే పరిస్థితి, భారత సమాజంలో నెలకొని వున్నదనే వాస్తవాన్ని స్పష్టం చేయవల్సివుంది.

ఈ లక్షణాలు కేవలం భారత్ తదితర మూడవ ప్రపంచ దేశాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. ఈ పరిస్థితులు మధ్యతరహా, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు కూడ వ్యాపిస్తున్నాయి. శ్రామికవర్గ పోరాటాల్లోకి వీరందరినీ సమీకరించడం, నేటి ట్రేడ్ యూనియన్ ఉద్యమం ముందున్న పెద్ద సవాలు.

కార్మికవర్గంలో నెలకొన్న ఈ పరస్పర విరుద్ధ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఆ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు అవసరమైన ఎత్తుగడలను రూపొందించుకోవాలి. లేకపోతే, విప్లవ కార్మికోద్యమం, ప్రధానంగా మూడవ ప్రపంచ దేశాల్లోని కార్మికోద్యమం పురోగమించజాలదు.

## కార్ల్‌మార్క్స్ సిద్ధాంతం వైపు చూస్తున్న ప్రపంచం

ఈ తీవ్రమైన, అదుపులేని ప్రపంచవ్యాప్త సంక్షోభం నేపథ్యంలో, దిగ్భ్రాంతి కరమైన, దిక్కుతోచని పరిస్థితుల్లో వాటికన్ క్రైస్తవ మతాధిపతి పోప్, కార్మిక వ్యతిరేక, ప్రగతి నిరోధక ఫ్రాన్స్ అధ్యక్షులు నికోలస్ సర్కోజీ, జర్మనీ ఆర్థిక మంత్రి వంటి కొందరు ప్రపంచ పెట్టుబడిదారీ నేతలు, ప్రపంచాన్నే వణికిస్తున్న, ఈ సంక్షోభానికి పరిష్కారం కనుగొనేందుకు కార్ల్‌మార్క్స్ గ్రంథం 'దాస్ క్యాపిటల్'ను అధ్యయనం చేయడం ప్రారంభించారు. సంక్షోభానికి పరిష్కార మార్గాల కోసం కార్ల్‌మార్క్స్ రచనల వైపు ప్రజలు దృష్టి సారించడంతో, కార్ల్‌మార్క్స్ జన్మించిన జర్మనీలో మార్క్స్ సాహిత్యం ప్రధానంగా, దాస్ క్యాపిటల్ గ్రంథం అమ్మకాలు అనేక రెట్లు పెరిగాయి. నేటివరకు కార్ల్‌మార్క్స్‌ను, ఆయన ప్రతిపాదించిన సోషలిస్టు సిద్ధాంతాన్ని అంటరానిదిగా భావించి, ఈ ప్రముఖులందరూ ద్వేషించారు. నేడదే వ్యక్తులు పెట్టుబడిదారీ విధాన సంక్షోభాన్ని గురించి, దానికి కారణాల గురించి మార్క్స్ ఏమీ చెప్పారో తెలుసుకునేందుకు కార్ల్‌మార్క్స్‌ను సమాధి నుండి బయటికి తీశారు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు అనివార్యం. ప్రస్తుత పరిస్థితుల్లో వాల్‌స్ట్రీట్ పతనం వల్ల సంభవించిన సంక్షోభం సాధారణమైనది కాదు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని ఈ సంక్షోభం చావుదెబ్బ తీసింది. అందువల్ల ఈ సంక్షోభం గురించి మరింతలోతుగా పరిశీలించాలి. ఈ తీవ్రమైన ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంక్షోభం యొక్క స్వభావాన్ని, దానికి మూల కారణాలను మరింత లోతుగా పరిశీలించాలి. దాని నెదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలి. స్వేచ్ఛా మార్కెట్ పెట్టుబడిదారీ విధానం కూలిపోతోంది. పెట్టుబడిదారీ విధానానికున్న శక్తి, సామర్థ్యాల వల్ల అది కొంత మేరకు కోలుకోవచ్చు. అయితే అది ఈ విధంగా ఎల్లకాలం బతికి బట్టకట్టలేదు.

## చారిత్రక బాధ్యత

తమను దోచుకుంటున్న వ్యవస్థను మార్చేందుకు, అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంతో కలిసి పోరాడేందుకు వివిధ తరగతుల కార్మికవర్గాన్ని, వారి రాజకీయ సిద్ధాంతాలతో నిమిత్తం లేకుండా ఐక్యం చేసి, సమీకరించే బృహత్తర కర్తవ్యాన్ని, భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమం చేపట్టాలి.

ముగింపులో మార్క్స్ మాటల్లో చెప్పాలంటే, "వర్గ వైరుధ్యాలను సర్దుబాటు చేయడంగాక, వర్గాలను రూపుమాపాలి. ఇప్పుడున్న సమాజాన్ని మెరుగుపర్చడం గాక, నూతన సమాజాన్ని స్థాపించాలి." విప్లవకర కార్మికోద్యమం తన చారిత్రాత్మక బాధ్యత నిర్వహించాలంటే మళ్లీ కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పినట్లు, "ప్రజాస్వామ్యాన్ని సాధించాలంటే, శ్రామికవర్గాన్ని పాలకవర్గం స్థాయికి అభివృద్ధి చేయడం, కార్మికవర్గ విప్లవంలో మొదటి మెట్టు."

## ముగింపు

ఈ విధంగా ఈ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం ఇతర శ్రామిక జనుల పోరాటాలు పెల్లుబికాయి. న్యూయార్క్‌లో 2011 సెప్టెంబర్ 17వ తేదీ నుండి 2011 సంవత్సరం చివరి నాటికీ, మాటలు రాసే నాటికి, ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్న "వాల్‌స్ట్రీట్ ఆక్రమణ ఉద్యమం" పెల్లుబుకుతున్న ఉద్యమాల్లో తాజా పోరాటం. కార్పొరేట్ దోపిడీకి, నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా, కొన్ని చోట్ల నేరుగా పెట్టుబడిదారీ విధానాన్నే వ్యతిరేకించే విధంగా ఈ ఉద్యమం ప్రపంచవ్యాప్తమైంది. "కార్పొరేట్ల పేరాశ, విప్లవానికి నాంది" అనే పోస్టర్‌లోని నినాదం ప్రపంచవ్యాప్తంగా వున్న విప్లవకారులకు మిక్కిలి ఉత్తేజాన్ని కలిగించింది.

అమెరికా స్టాక్ మార్కెట్, తదితర ప్రధాన ఆర్థిక సంస్థలన్నీ నెలకొని వున్న న్యూయార్క్‌లోని వాల్‌స్ట్రీట్, 2008 సెప్టెంబరు 15వ తేదీన పతనమైన తర్వాత, 2011 సెప్టెంబరు 17న న్యూయార్క్‌లోని జాక్కోట్టి పార్కులో "వాల్‌స్ట్రీట్‌ను ఆక్రమించండి!" అనే నినాదంతో ప్రారంభమైన ఉద్యమం ప్రధానంగా పెట్టుబడిదారీ విధాన వ్యతిరేక స్వభావం కల్గివుంది. ఈ కాలంలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములైన వర్గపోరాటాల్లో ఇది తాజా పరిణామం. పెట్టుబడిదారీ వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పెల్లుబుకిన ఈ ప్రజావెల్లువ మిక్కిలి ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం.

పారిశ్రామిక విప్లవం ప్రారంభం కావడంతో, పెట్టుబడిదారీ వర్గంతో పాటే ఆధునిక కార్మిక వర్గం అవతరించింది. ఇది ఎంతో శ్రమకోర్చి రచించిన పరిశోధనా గ్రంథం. 1830 నుండి 2010 వరకు దేశంలో కార్మికోద్యమ అవతరణ, పురోగమనానికి సంబంధించి చరిత్రని ఈ గ్రంథం చక్కగా విశ్లేషిస్తుంది. ప్రపంచ పెట్టుబడిదారీ విధానం, నయా ఉదారవాద దశలో ప్రవేశించిన తర్వాత కార్మిక వర్గ కార్యాచరణనీ ప్రత్యేకంగా విశ్లేషించడం జరిగింది. భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో విప్లవ కార్మికోద్యమానికి, సంస్కరణవాద ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి మధ్య తలెత్తిన సంఘర్షణలనీ ప్రత్యేకంగా వివరించింది. గతంలో 1995 వరకు వివరించిన పరిణామాలను 2010 వరకు తాజాపరచినది ఈ గ్రంథం.

ప్రజాశక్తి బుక్‌హౌస్